శ్రీవేదవ్యాస విరచితం

మత్స్యమహాపురాణం

ప్రథమ భాగం

(తెలుగు అనువాదంతో)

అనువాదకులు

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

సంపాదకులు

'మహామహోపాధ్యాయ'

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

పూర్వ ప్రత్యేకాధికారి

పురాణేతిహాస ప్రాజెక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2021

MATSYAMAHAPURANAM

FIRST PART
(with Telugu Translation)

Translated by
Dr. Samudrala Lakshmanaiah

Editor
Dr. Samudrala Lakshmanaiah

T.T.D. Religious Publications Series No.1389


First Print : 2021

Copies: 500


Published by:
Dr. K.S. Jawahar Reddy, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Cover Design and
D.T.P. Type Setting
Office of the Special Officer, Purana Itihasa Project,
TTD,Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507.



శ్రీపద్మావతి అమ్మవారు   శ్రీవేంకటేశ్వరస్వామివారు



వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

పురాణేతిహాస ప్రాజెక్టు

పండితపరిషత్తు

(సలహామండలి)

అధ్యక్షులు

డా॥ కె.యస్. జవహర్ రెడ్డి ఐ.ఏ.యస్.గారు
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు

సభ్యులు

శ్రీ పి. బసంత్ కుమార్ ఐ.ఏ.యస్.గారు
సంయుక్త కార్యనిర్వహణాధికారి
తి.తి.దే.,తిరుపతి

శ్రీమతి యస్. భార్గవి ఐ.ఏ.యస్.గారు
సంయుక్త కార్యనిర్వహణాధికారిణి
తి.తి.దే.,తిరుపతి

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్యకళాశాలాధ్యక్షులు
శ్రీవేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు
ఓరియంటల్ మాన్‌స్క్రిప్ట్స లైబ్రరీ
హైదరాబాద్

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్రయువతీ సంస్కృతకళాశాల, రాజమండ్రి

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు, తి.తి.దేవస్థానములు

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం, తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తిరుపతి

డా॥ కె.ప్రతాప్గారు
విశ్రాంత ఆచార్యులు, సంస్కృత విభాగం
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

కన్వీనర్

డా॥ యస్. దక్షిణామూర్తి శర్మ
ప్రత్యేకాధికారి ఐ/సి, పురాణేతిహాస ప్రాజెక్టు
తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుమల తిరుపతి దేవస్థానములు

పురాణేతిహాస ప్రాజెక్టు

పరిష్కరణ పరిషత్తు

డా॥ సముద్రాల లక్ష్మణయ్యగారు
పూర్వ ప్రత్యేకాధికారి, పురాణేతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

డా॥ కందాడై రామానుజాచార్యులుగారు
విశ్రాంత ప్రాచ్యకళాశాలాధ్యక్షులు
శ్రీ వేంకటేశ్వర వేదాంతవర్ధినీ సంస్కృతకళాశాల
హైదరాబాద్

డా॥ కొంపెల్ల రామసూర్యనారాయణగారు
విశ్రాంత ఆచార్యులు
రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం
తిరుపతి

డా॥ ఈ.ఏ.శింగరాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకులు
శ్రీవేంకటేశ్వర ప్రాచ్యకళాశాల
తిరుపతి

డా॥ వేదాల వేంకటసీతారామాచార్యులుగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఎస్.బి.ఎస్. సంస్కృతకళాశాల
పొన్నూరు

డా॥ ధూళిపాళ మహదేవమణిగారు
విశ్రాంత కళాశాలాధ్యక్షులు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
రాజమండ్రి

డా॥ ధూళిపాళ అన్నపూర్ణగారు
విశ్రాంత కళాశాలాధ్యాపకురాలు
ఆంధ్ర యువతీ సంస్కృత కళాశాల
రాజమండ్రి


డా॥ శ్రీపాద సుబ్రహ్మణ్యంగారు
విశ్రాంత సంచాలకులు
ఓరియంటల్ మాన్స్క్రిప్ట్స లైబ్రరీ
హైదరాబాద్

కన్వీనర్

డా॥ యస్. దక్షిణామూర్తి శర్మ
ప్రత్యేకాధికారి ఐ/సి, పురాణేతిహాస ప్రాజెక్టు,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

విషయానుక్రమణిక

పురాణ పురుషుడు శ్రీమన్నారాయణుడు



బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞికమ్ । వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥
ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ । మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥
భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః । బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥
లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ । స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥
కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేధః ప్రకీర్త్యతే । మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥
ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

తొలిపలుకు



మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః ।
రామో రామశ్చ కృష్ణశ్చ బుద్ధః కల్కీ తు తే దశ ॥

మత్స్యం, కూర్మం, వరాహం, నరసింహుడు, వామనుడు, పరశురాముడు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, బుద్ధుడు, కల్కి – అనేవి దశావతారాలు. ఇందు మొదటి ఐదు అవతారాలు కృతయుగానికి సంబంధించినవి. అందు మొదటివాడైన మత్స్యభగవానుడు ప్రవచించినదే మత్స్యపురాణం.

శిష్టరక్షణకూ, దుష్టశిక్షణకూ, ధర్మపరిరక్షణకూ భగవంతుడు అవతారాలు దాలుస్తాడు. ఈ విషయం భగవద్గీతలో స్పష్టంగా నిర్దేశించబడింది. బ్రహ్మపురాణంలోని ఈ క్రింది మాటలు గూడా ఈ విషయాన్నే ధ్రువీకరిస్తున్నవి.

యదా యదా త్వధర్మస్య వృద్ధిర్భవతి భో ద్విజాః! । ధర్మశ్చ హ్రాసమభ్యేతి తదా దేవో జనార్దనః ॥

సాధూనాం రక్షణార్థాయ ధర్మసంస్థాపనాయ చ । దుష్టానాం నిగ్రహార్థాయ అన్యేషాం చ సురద్విషామ్ ।

ప్రజానాం రక్షణార్థాయ జాయతేఽసౌ యుగే యుగే ॥

ఇలా ప్రతియుగంలోనూ ధర్మరక్షణకై అవతరించే భగవంతుని అవతారాలకు చెందిన కథలు వ్యాసుడు రచించిన అష్టాదశపురాణాలలో నిబంధింపబడివున్నాయి. కల్పాంతంలో ఇతరలోకాలతోపాటు భూలోకం సముద్రంలో మునిగిపోయింది. అపుడు హయగ్రీవుడనే రాక్షసుడు బ్రహ్మముఖంనుండి వేదాలను అపహరించాడు. శ్రీహరి మత్స్యరూపం దాల్చి వేదాలను ఆ దానవునినుండి రక్షించాడు. మత్స్యావతారుడైన భగవానుడు అలా ధర్మమూలకమైన వేదాలనూ, ధర్మాన్నీ పరిరక్షించాడు. ఇలా పురాణాలలో భగవదవతారాల చరిత్ర వర్ణింపబడియున్నది.

తిరుమల తిరుపతి దేవస్థానం వారు గతంలో వ్యాసుడు రచించిన శ్రీమద్భాగవతాన్నీ, వాల్మీకి రచించిన రామాయణాన్నీ వ్యాఖ్యానాలతో సహా ప్రచురించారు. తరువాత పురాణ ఇతిహాస ప్రాజెక్టు ద్వారా అష్టాదశపురాణాలను తెలుగు అనువాదంతో ప్రకటించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని అనుసరించి 18 పురాణాల అనువాదం పలువురు సుప్రసిద్ధ పండితుల సహకారంతో నిర్వహింపబడుతున్నది. ఇప్పటికి మూడులక్షల యాభైవేలకు పైగా శ్లోకాల అనువాదం పూర్తి అయినది. తక్కిన పని నిర్విరామంగా కొనసాగుతున్నది.

ప్రస్తుతం మత్స్యపురాణం ప్రథమభాగం ముద్రణకు సిద్ధం చేయడమైనది. పురాణ ఇతిహాస ప్రాజెక్టు పూర్వ ప్రత్యేకాధికారి, మహామహోపాధ్యాయ, డా॥ సముద్రాల లక్ష్మణయ్య ఇంతవరకు ఈ ప్రాజెక్టు ద్వారా వెలువడిన ప్రచురణలకు సంపాదకత్వం వహించడమేకాక, ఈ పురాణ భాగాన్ని స్వయంగా అనువదించారు. వారికి మా అభినందనలు. ప్రస్తుత ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డా॥ సింగరాజు దక్షిణామూర్తిగారినీ, మరియు పండితపరిషత్తు సభ్యులనూ, పరిష్కరణ పరిషత్సభ్యులనూ, ఇతరవిధాల సహకరించిన వారినీ అభినందిస్తున్నాము.

ఒక జ్ఞానయజ్ఞంగా కొనసాగుతున్న ఈ కార్యక్రమం త్వరలో నిర్విఘ్నంగా నెరవేరునట్లు ఏడుకొండల దేవుడు అనుగ్రహించుగాక!

డా॥ కె.యస్.జవహర్ రెడ్డి ఐ.ఏ.యస్
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

నివేదన

వేదాలు నాలుగు, వేదాంగాలు ఆరు, మీమాంసా శాస్త్రం, న్యాయ శాస్త్రం, పురాణం, ధర్మశాస్త్రం – అని పదునాలుగు విద్యలు ఆర్షవాఙ్మయంలో ప్రసిద్ధాలు. ఇందులో పదమూడవదైన పురాణవాఙ్మయం అష్టాదశపురాణాలుగా విభజింపబడింది. ఈ పురాణాలను రచించినవాడు వేదవ్యాసుడు.

వేదార్థాలు అందరికీ అందుబాటులో ఉండవు. అందువల్ల వాటిని జనసామాన్యానికి తెలియజేయడానికి ఇతిహాసాలూ, పురాణాలూ వినియోగింపబడ్డాయి. "ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్" అన్న వచనం ఈ సంగతినే నిరూపిస్తున్నది.

పురాణాలను గూర్చిన ప్రస్తావన ఉపనిషత్తుల్లో గూడా ఉన్నది కాబట్టి పురాణ వాఙ్మయాన్ని అత్యంత ప్రాచీనమైనదిగా గ్రహించాలి. శ్రుతులలో, స్మృతులలో కనిపించని విషయాలుగూడా పురాణాలలో గోచరించడం కద్దు. శాస్త్రాలన్నింటిలోనూ మొదట బ్రహ్మదేవుడు స్మరించినది పురాణమే అని చెప్పబడింది.

పురాణాలలో భగవదవతారాలకు సంబంధించిన కథలూ, ధర్మానుష్ఠానానికి చెందిన వృత్తాంతాలూ, భగవద్భక్తుల చరిత్రలూ ప్రాధాన్యం వహిస్తాయి. అతివిస్తారంగా ఈ కథలను చెప్పడంవల్ల ప్రయోజనమేమి? అన్న ప్రశ్నకు వ్యాసభగవానుడే శ్రీమద్భాగవతంలో ఇలా సమాధానం చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥

పురాణాలలోని కథలు వాగ్వైభవాన్ని చాటుకోవడానికి ఉద్దేశించబడినవి కావనీ, జనులకు విజ్ఞానాన్నీ, వైరాగ్యాన్నీ విస్తరించి చెప్పడానికి ఉద్దేంచబడినవనీ భావం.

సనాతనధర్మవ్యాప్తికి అవసరమైన నైతిక – ధార్మిక – ఆధ్యాత్మిక విషయాలను పురాణాలలో వివరించడమయింది. ప్రాచ్య – పాశ్చాత్య చరిత్రలను పరిశోధించేవారు గతచరిత్ర పరిశోధనకు పురాణజ్ఞానం ఎంతగానో ఉపకరిస్తున్నదని ముక్తకంఠంతో అంగీకరించారు.

అట్టి పురాణాలలో ఒకటైన మత్స్యపురాణం ప్రస్తుతం ముద్రణకు సిద్ధం చేయబడింది. పూర్వం భాగవతం ప్రాజెక్టు ద్వారా వ్యాసభాగవతాన్ని మూడు ప్రాచీన వ్యాఖ్యలతో పరిష్కరించి ప్రచురించడమయింది. తరువాత వాల్మీకిరామాయణాన్ని రెండు వ్యాఖ్యలతో పరిష్కరించి ప్రకటించడం జరిగింది.

తదుపరి అష్టాదశపురాణాలనూ సరళమైన తెలుగు అనువాదంతో ప్రచురించాలని దేవస్థానం వారు గైకొన్న నిర్ణయం మేరకు పురాణేతిహాస ప్రాజెక్టు ద్వారా పురాణాల అనువాదం చేపట్టబడింది.

ఈ ప్రణాళిక ప్రకారం మొదట కూర్మపురాణం ముద్రితమయింది. విష్ణుపురాణం మరియు బ్రహ్మపురాణం ప్రథమద్వితీయ భాగాలు – ఈ మూడు సంపుటాలు ముద్రణకివ్వబడి వున్నాయి. ప్రస్తుతం మత్స్యపురాణానువాదం పూర్తి కావడంతో దీనిని ముద్రణకు సిద్ధం చేశాము. 14 వేల శ్లోకాలు, 283 అధ్యాయాలు గల ఈ గ్రంథాన్ని రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్నాము. ఈ మత్స్యపురాణం ప్రథమభాగాన్ని నేనే అనువదించాను. రెండవభాగాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు డా॥ నీలకంఠంగారు అనువదించారు. దీనిని గూడా త్వరలో ముద్రణకు పంపనున్నాము.

ఈ గ్రంథాన్ని ఓపికతో సరిచూచి అవసరమైన పరిష్కరణలు గావించి ముద్రణార్హంగా రూపొందించిన పండితపరిషత్తు సభ్యులకూ, ప్రాజెక్టు కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలిస్తున్న పండిత పరిషత్తు సభ్యులకూ కృతజ్ఞతాపూర్వక వందనాలు.

అనువదించిన పురాణాలను డి.టి.పి చేసిన తరువాత అక్షరశోధన, భాషలో క్లిష్టతను తొలగించటం మొదలగు కార్యక్రమాలను నిర్వహిస్తున్న సహాయపరిశోధకులు శ్రీ యస్. బి. యస్. భట్టాచార్యకూ, డా॥ యస్. దశరథకూ, గతంలో పనిచేసిన డా॥ యస్. పూర్ణవల్లికీ, దీనిని ముద్రణయోగ్యంగా రూపొందించిన డి.టి.పి. ఆపరేటర్ శ్రీ బి.వెంకట్రాయులుకూ అభినందనలు.

ప్రాజెక్టు కార్యనిర్వహణకు తగినంత ప్రోత్సాహమిస్తూ ఈ పురాణ వాఙ్మయం ఈ రీతిగా వెలుగులోకి రావడానికి ముఖ్యకారణభూతులైన తి.తి.దే ధర్మకర్తలమండలివారికీ, విశేషించి ధర్మకార్యనిరతులైన కార్యనిర్వహణాధికారి డా॥ కె.యస్. జవహర్ రెడ్డి ఐ.ఏ.యస్. గారికీ, సంయుక్త కార్యనిర్వహణాధికారులైన శ్రీ పి. బసంత్‌కుమార్ ఐ.ఏ.యస్. గారికీ మరియు శ్రీమతి ఎస్. భార్గవి ఐ.ఏ.యస్. గారికీ, ప్రాజెక్టు పండిత పరిషత్తు సభ్యులకూ కృతజ్ఞతా పూర్వకవందనాలు.

ఈ అష్టాదశ పురాణ ప్రచురణ కార్యక్రమం త్వరలో నిర్విఘ్నంగా నెరవేరునట్లు సప్తగిరీశ్వరుడు అనుగ్రహించుగాక!

డా॥ సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు, తి.తి.దే.,

పురాణప్రశస్తి

(అష్టాదశపురాణాలు)

మహామహోపాధ్యాయ డా॥ సముద్రాల లక్ష్మణయ్య

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే ।
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః ॥
నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అతి ప్రాచీనకాలంలో గురుకులాలలో విద్యనభ్యసించే విద్యార్థులు పదునాలుగు విధాలైన విద్యల నభ్యసించేవారు. ఆ విద్యల నిలా పేర్కొనడం జరిగింది.

అంగాని వేదాశ్చత్వారో మీమాంసా న్యాయవిస్తరః ।
పురాణం ధర్మశాస్త్రం చ విద్యా హ్యేతాశ్చతుర్దశ ॥

శిక్ష,వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం–అనే ఆరు వేదాంగాలు, ఋగ్యజుస్సామా థర్వణము లనే నాలుగు వేదాలు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం–అనేవే పదునాల్గు విద్యలు.

'వేదోఽఖిలో ధర్మమూలం' అన్నట్లు వేదమంతా ధర్మమూల మైనది. వేదోక్తమైన ధర్మాలను గ్రహించడం అందరికీ సాధ్యం కాని పని. అందుచేత వేదాలను విభజించిన వేదవ్యాసుడే వేదార్థాలను సామాన్యులు గూడా గ్రహించడాని కనువుగా పురాణాలను రచించాడు. **అష్టాదశపురాణానాం కర్తా సత్యవతీ సుతః** –అను ప్రమాణవచనం కూడా పదునెన్మిది పురాణాల రచయిత సత్యవతీ సుతుడైన వ్యాసుడే అని నిరూపిస్తున్నది.

ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

అల్పజ్ఞుడు తనకు హాని కల్గిస్తాడేమో అని వేదం భయపడుతుంది. అందువల్ల ఇతిహాసాలతోనూ, పురాణాలతోనూ వేదార్థాలను విస్తరింపజేయాలి. ఈ దృష్టితోనే, అనగా అల్పజ్ఞులను దృష్టిలో పెట్టుకొనే వ్యాసుడు వేదార్థాలను పురాణాలద్వారా విస్తరింపజేశాడు. అట్లని పురాణాలు అల్పజ్ఞులకు మాత్రమే పరిమితమైనవి కావు. అధికజ్ఞులు కూడా గ్రహించవలసిన విషయాలు పురాణాలలో ఎన్నో ఉన్నాయి.

వేదం ప్రభువుతో సమానమైనది. శబ్దప్రధానమైన వేదవాణి కర్తవ్యవిషయంలో రాజాజ్ఞను పోలివుంటుంది. పురాణవచనం మిత్రతుల్యంగా వుంటుంది. అది అర్థప్రధానమై శ్రోతను కర్తవ్యానికి పురికొల్పుతుంది. కావ్యం కాంతాసమ్మితమై సరసంగా బోధించి పాఠకుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తుంది అని ఆలంకారికులు వేదార్థాలను వివరించే పురాణాలకు మిత్రసాదృశ్యాన్ని ప్రతిపాదించారు.

యద్వేదాత్ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానా చ్చిరం
యచ్చార్థ ప్రవణాత్పురాణవచనాదిష్టం సుహృత్సమ్మితాత్ ।
కాన్తాసమ్మితయా యయా సరసతామాపాద్య కావ్యశ్రియా
కర్తవ్యే కుతుకీ బుధో విరచితస్తస్యై స్పృహాం కుర్మహే ॥ (ప్రతాపరుద్రీయం)

పురాణాలలో గూడా కావ్యశైలిని పాటించి రసవత్తరంగా కర్తవ్యబోధ కావించిన ఘట్టాలెన్నో ఎడనెడా కానవస్తాయి.

పురాణాలలో పూర్వకాలానికి చెందిన అనేక కథలున్నాయి. కథా కథనం ద్వారా ధర్మ స్వరూపం అందులో నిరూపింపబడింది. పురాణ కథలు వాగ్వైభవాన్ని ప్రదర్శించడానికి చెప్పినవి కావనీ, విజ్ఞానవైరాగ్యాలను విస్తరించి చెప్పడానికే ఆ కథలను వివరించడమయిందనీ భాగవతపురాణంలో వ్యాసభగవానుడే చెప్పాడు.

కథా ఇమాస్తే కథితా మహీయసాం
వితాయ లోకేషు యశః పరేయుషామ్ ।
విజ్ఞానవైరాగ్య వివక్షయా విభో!
వచోవిభూతిర్న చ పారమార్థ్యమ్ ॥ (భాగవతం-12-3-14)

ఇక్కడ 'విజ్ఞాన' మంటే వేదవిజ్ఞానమనే గ్రహించాలి.

'వేదాః ప్రతిష్ఠితా స్సర్వే పురాణే నాత్ర సంశయః'

పురాణాలలో వేదాలు ప్రతిష్ఠితాలై ఉన్నాయి. ఇందులో సందేహం లేదు. కథల ద్వారా అవి ఆవిష్కృతాలవుతాయి.

పురాణ ప్రాముఖ్యం

యన్న దృష్టం హి వేదేషు తత్సర్వం లక్ష్యతే స్మృతౌ ।
ఉభయోర్యన్న దృష్టం హి తత్పురాణే ప్రతీయతే ॥

వేదాలలో గోచరం కానిదంతా స్మృతులలో కనిపిస్తుంది. శ్రుతి స్మృతులు రెండింటిలో కనిపించనిది పురాణం ద్వారా అవగతం అవుతుంది అన్న ప్రమాణాన్ని బట్టి శ్రుతులలోనూ, స్మృతులలోనూ లేని విషయాలను సైతం విస్తృతరచనావిధానం కల పురాణాలద్వారా గ్రహించవచ్చునని తెలుస్తున్నది. **'పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్'** అన్నట్లు శాస్త్రాలన్నింటిలోను మొదటిదిగా పురాణాన్ని విధాత స్మరించాడని విదితమవుతున్నది. యాగానుష్ఠానసమయంలో పురాణాలు పఠించే సంప్రదాయం కద్దు. ఇంకా పురాణాలలో భగవన్మహిమ, భగవదవతారాలు, భక్తిప్రబోధం, నానా విధాలైన ఆచారాలు, ధర్మాధర్మాలు, సాంఘిక -చారిత్రకాంశాలు, కళలు, వేదాంతతత్త్వాలు, నీతి ఇత్యాదిగా ఎన్నో విషయాలు నిరూపితాలయ్యాయి.

పురాణం ఐహికాముష్మిక సుఖసాధనం. మన సంస్కృతి సంప్రదాయాలను గ్రహించడానికి పురాణజ్ఞానం అవసరం.

పురాణ శబ్దనిర్వచనం

పురాణం అంటే - పురా భవం ప్రాచీన కాలంలో రచించబడినది అని అర్థం.

పురాఽపి నవం - ప్రాచీనమైనా విషయ విశిష్టతను బట్టి క్రొత్తది అని మరొక అర్థం.

పురా-అణతి-ఆగతానాగతే కథయతీతి పురాణం-అంటే జరిగిన, జరుగనున్న కాలానికి చెందిన విషయాలను వివరించునది అని వేరొక అర్థం.

పురా-పూర్వస్మిన్ జాతమితి పురాణమ్-పూర్వం ఎప్పుడో జరిగిన వృత్తాంతం పురాణం అని భావం.
పురా-అంటే పరంపరను వ్యక్తం చేసేది పురాణం అని మరొక వివరణ.
పురా-ప్రాచీన కాలోదంతం అనక్తీతి పురాణం - పురాతన కాలానికి చెందిన చరిత్రను చెప్పునది పురాణం.
ఇలా పురాణ శబ్దానికి పలు విధాల నిర్వచనం పెద్దలు చెప్పారు.

పురాణోత్పత్తి

అథర్వవేదంలో పురాణ శబ్దం ప్రయుక్తమైంది. యజ్ఞోచ్ఛిష్టంనుండి పురాణం పుట్టినదని అందులో చెప్పబడింది.

ఋచఃసామాని ఛందాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివి దేవా దివి శ్రితాః ॥ అథర్వ సంహిత (11-7-24)

నాల్గువేదాల తరువాత ఇక్కడ పురాణోత్పత్తి నిర్దేశించబడింది. పురాణాల ఉనికి వేద సమకాలికమని తెలుస్తున్నది.

అందుచేత వేదసంహితల కాలంలోనే పురాణాలకు చెందిన మూలస్వరూపం రూపొందిందని భావించవచ్చు. బృహదారణ్యకోపనిషత్తులోని ఈ క్రింది వాక్యం గమనార్హం

"అస్య మహతో భూతస్య నిఃశ్వసితమేతత్ యదృగ్వేదో, యజుర్వేద స్సామవేదోఽథర్వాఙ్గిరసః పురాణం విద్యా ఉపనిషదః శ్లోకాః సూత్రాణి".(2-4-10)

ఈ ఉపనిషద్ వాక్యం వేదాదులతోపాటు పురాణం కూడా పరమాత్మయొక్క నిఃశ్వాసరూపమైనదని వ్యక్తం చేస్తున్నది. దీనివల్ల వేదం ఎంత ప్రాచీనమో పురాణం కూడా అంతే ప్రాచీనమని గ్రహించవచ్చు. ఇక్కడ పురాణ శబ్దం ఏకవచనంలో ప్రయుక్తమైనది. అందుచేత పూర్వం సంక్షిప్తంగా ఉండిన పురాణం కాలక్రమంలో విస్తృతరూపం సంతరించుకొని వివిధ పురాణాలుగా విస్తరించిందని భావించవచ్చు.

భారతీయసంస్కృతిని ప్రతిబింబించే దర్పణాలు పురాణాలు. సామాన్య జనానీకంలో సనాతన ధర్మతత్త్వాన్ని ప్రచారం చేయడంలో అవి ప్రముఖపాత్ర వహించాయి. ఆధునికకాలంలో ప్రాచ్య పండితులేకాక పాశ్చాత్య పండితులు కూడా పురాణాల విశిష్టతను గుర్తించారు. పురాణం అన్న వ్యవహారమే ఇది అతిప్రాచీన సాహిత్యమని తెలియజేస్తుంది.

పురాణాలకంటే భిన్నంగా ఇతిహాసాలను గూడా మన పెద్దలు పేర్కొన్నారు. గతకాలంలో జరిగిన సంఘటనలను తెలిపేవి ఇతిహాసాలు. ఇతి హ+ఆస = ఇతిహాసం అనగా ఇలా పూర్వం జరిగినది-అని అర్థం. పురాణంలోని విషయాలు ఇతిహాసంలోని అంశాలకంటె వ్యాపకంగానూ, విస్తృతంగానూ వుంటాయి.

సాధారణ పురాణాల నుద్దేశించి నిర్దేశించిన సర్గం, ప్రతిసర్గం మొదలైన లక్షణాల కంటె భిన్నమైన వివిధ విషయాలు పురాణాలలో గోచరిస్తాయి. ఉదా: అగ్నిపురాణాన్ని పరిశీలిస్తే వివిధ విద్యలు, పదార్థలక్షణాలు, స్వప్నాలు, శకున ఫలితాలు, కావ్యనాటక లక్షణాలు, ప్రళయస్వరూపం, నరకం తీరుతెన్నులు, అద్వైత బ్రహ్మతత్త్వం మున్నగు అంశాలు అందులో ఉండడం గమనార్హం. అందుకే అగ్నిపురాణాన్ని 'జ్ఞానకోశం' అన్నారు.

సృష్ట్యారంభంనుండి నేటివరకు సమాజంలోని స్థితిగతులను చెప్పే పురాణాలను శ్రద్ధతో పఠించి పరిశీలించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అంతేకాని అవేవో కల్పనాత్మకమైన కథలని ఉపేక్షించడం తగదు. పురాణాలను ఏ దృష్టితో వ్యాసభగవానుడు రచించాడు? అన్న ప్రశ్నకు ఈ క్రింది శ్లోకం సమాధానమిస్తున్నది.

విష్ణోరంశో మునిర్జాతః సత్యవత్యాం పరాశరాత్ ।
పురాణసంహితాం దధ్యౌ తేషాం ధర్మవిధిత్సయా ॥

విష్ణ్వంశంతో జనించిన సత్యవతీ పరాశరుల పుత్రుడగు వ్యాసుడు ధర్మస్వరూప నిరూపణకై పురాణసంహితను రూపొందించాడని భావం.

అంతేకాక శ్రీమన్నారాయణుడు స్వయంగా వ్యాసరూపుడై వేదార్థాల విస్తృతి నపేక్షించి భూతలములో పురాణాలు రచించాడని ఈ క్రింది శ్లోకం నిరూపిస్తున్నది.

విస్తారాయ చ వేదానాం స్వయం నారాయణః ప్రభుః ।
వ్యాసరూపేణ కృతవాన్ పురాణాని మహీతలే ॥

సూతుని ద్వారా ఈ పురాణవాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. నైమిశారణ్యనివాసులైన శౌనకాది మునులు సూతునినుండి ఈ పురాణాలను విన్నారు.

విష్ణువుయొక్క అవయవాలే పురాణాలు

త్రిమూర్తులలో ఒక్కడుగా, స్థితికారకుడుగా, దుష్టశిక్షకుడుగా, శిష్టరక్షకుడుగా, ధర్మసంస్థాపకుడుగా ప్రసిద్ధుడైన శ్రీమహావిష్ణుదేవుని యొక్క అవయవాలుగా పదునెన్మిది పురాణాలను పేర్కొనడం కద్దు. దీన్నిబట్టి ధర్మప్రభువైన అచ్యుతునికీ, ధర్మస్వరూపనిరూపకాలైన పురాణాలకూ కల సామ్యాన్ని గ్రహించవచ్చు. పురాణాలు ఈ క్రిందివిధంగా విష్ణుదేవుని అవయవాలుగా పేర్కొనబడ్డాయి.

బ్రాహ్మం మూర్ధా హరేరేవ హృదయం పద్మసంజ్ఞకమ్ ।
వైష్ణవం దక్షిణో బాహుః వాయుర్వామో మహేశితుః ॥

ఊరూ భాగవతం ప్రోక్తం నాభిః స్యాన్నారదీయకమ్ ।
మార్కండేయం చ దక్షాంఘ్రిః వామో హ్యాగ్నేయముచ్యతే ॥

భవిష్యం దక్షిణో జానుర్విష్ణోరేవ మహాత్మనః ।
బ్రహ్మవైవర్తసంజ్ఞం తు వామో జానురుదాహృతః ॥

లైంగం తు గుల్ఫకం దక్షం వారాహం వామగుల్ఫకమ్ ।
స్కాందం పురాణం లోమాని త్వగస్య వామనం స్మృతమ్ ॥

కౌర్మం పృష్ఠం సమాఖ్యాతం మాత్స్యం మేదః ప్రకీర్త్యతే ।
మజ్జా తు గారుడం ప్రోక్తం బ్రహ్మాండం చాస్థి గీయతే ॥

ఏవమేవాభవద్విష్ణుః పురాణావయవో హరిః ।

దీని తాత్పర్యం ఇది-శ్రీమహావిష్ణువునకు బ్రహ్మపురాణం-శిరస్సు, పద్మపురాణం-హృదయం, విష్ణుపురాణం-దక్షిణహస్తం, వాయుపురాణం-వామహస్తం, భాగవతపురాణం-తొడలు, నారదపురాణం-నాభి, మార్కేండయ పురాణం-దక్షిణపాదం, అగ్నిపురాణం-వామపాదం, భవిష్యపురాణం-కుడిమోకాలు, బ్రహ్మవైవర్త పురాణం-ఎడమ మోకాలు, లింగపురాణం-కుడి చీలమండ, వరాహపురాణం-ఎడమ చీలమండ, స్కాంద పురాణం-కేశాలు, వామనపురాణం-చర్మం, కూర్మపురాణం-వీపు, మత్స్యపురాణం-మెదడు, గరుడపురాణం-మజ్జ, బ్రహ్మాండపురాణం-ఎముకలు. ఇలా శ్రీహరి పురాణాలే అవయవాలుగా కల్గి వున్నాడు.

పురాణ సంఖ్య

పురాణాలు మొత్తం పదునెనిమిది. వీటిని ఆయా పురాణాల పేర్లలో మొదటి అక్షరాన్ని మాత్రం పేర్కొనే ఒక శ్లోకంలో ఇలా చెప్పడమయింది.

మద్వయం భద్వయం చైవ బ్రత్రయం వచతుష్టయమ్ ।
అనాపలింగ కూస్కాని పురాణాని విదుర్బుధాః ॥

'మ' అనే అక్షరంతో ప్రారంభమయ్యే పురాణాలు రెండు-(1) మత్స్య పురాణం (2) మార్కండేయ పురాణం. 'భ' అను అక్షరంతో ప్రారంభమయ్యేవి, రెండు -(1) భాగవతం (2) భవిష్యపురాణం -'బ్ర'తో ప్రారంభమయ్యేవి -మూడు (1) బ్రహ్మ పురాణం (2) బ్రహ్మాండ పురాణం (3) బ్రహ్మవైవర్త పురాణం -'వ' కారంతో ప్రారంభమయ్యేవి నాల్గు (1) విష్ణు పురాణం (2) వాయు పురాణం (3) వామన పురాణం (4) వరాహ పురాణం -అ=అగ్నిపురాణం నా=నారదపురాణం-ప=పద్మపురాణం, లిం=లింగపురాణం, గ=గరుడ పురాణం, కూ=కూర్మపురాణం, స్కా=స్కాందపురాణం ఇలా మొత్తం పురాణాల సంఖ్య పదునెన్మిది.

పురాణ విభాగం

పురాణాలను మహాపురాణాలనీ, ఉప పురాణాలనీ రెండు విధాలుగా విభజించడం కద్దు. పైన ప్రథమాక్షర నిర్దేశంతో పేర్కొన్నవన్నీ మహాపురాణాలే. ఈ క్రింది విధంగా కూడా ఈ పురాణాలను పెద్దలు నిర్దేశించారు.

బ్రాహ్మం పాద్మం వైష్ణవం చ వాయవీయం తథైవ చ ।
భాగవతం నారదీయం మార్కండేయం చ కీర్తితమ్ ॥
ఆగ్నేయం చ భవిష్యం చ బ్రహ్మవైవర్త లింగకే ।
వారాహం చ తథా స్కాందం వామనం కూర్మ సంజ్ఞకమ్ ।
మాత్స్యం చ గారుడం తద్వద్బ్రహ్మాండాఖ్యమితి త్రిషట్ ॥

ఈ పదునెన్మిది పురాణాలనూ పద్మపురాణం సాత్త్వికాలు, రాజసాలు, తామసాలు అని మూడు వర్గాలుగా విభజించింది.

సాత్త్వికాలు-

వైష్ణవం నారదీయం చ తథా భాగవతం శుభమ్ ।
గారుడం చ తథా పాద్మం వారాహం శుభదర్శనే ॥

రాజసాలు–

బ్రహ్మాండం బ్రహ్మవైవర్తం మార్కండేయం తథైవ చ ।
భవిష్యం వామనం బ్రాహ్మం రాజసాని నిబోధత ॥

తామసాలు–

మాత్స్యం కౌర్మం తథా లైంగం శైవం స్కాందం తథైవ చ ।
ఆగ్నేయం చ షడేతాని తామసాని నిబోధత ॥

ఇందులో (1) వైష్ణవం (2) నారదీయం (3) భాగవతం (4) గారుడం (5) వారాహం (6) పాద్మం –అనునవి సాత్త్వికపురాణాలు. (1) బ్రహ్మాండం (2) బ్రహ్మవైవర్తం (3) మార్కండేయం, (4) భవిష్యం (5) వామనం (6) బ్రాహ్మం–అనేవి రాజసాలు. (1) మాత్స్యం (2) కౌర్మం (3) లైంగం (4) వాయవీయం (శైవం) (5) స్కాందం (6) అగ్నేయం అనేవి తామసాలు.

ఇలా ఒక్కొక్క వర్గంలో ఆరేసి పురాణాలు లెక్కకు వస్తాయి.

సాత్త్వికపురాణాలు శ్రీమహావిష్ణువు యొక్క ప్రాధాన్యాన్నీ, రాజస పురాణాలు చతుర్ముఖ బ్రహ్మ ప్రాముఖ్యాన్నీ, తామస పురాణాలు శివునియొక్క ఆధిక్యాన్నీ వర్ణిస్తున్నాయి. ఈ ముగ్గురు దేవతలు త్రిమూర్తులుగా ప్రసిద్ధులు.

అన్ని పురాణాలూ ఈ దేవత లందరికీ సమప్రాధాన్యాన్ని ప్రతిపాదించక కొన్ని పురాణాలు ఒక దేవతను ఇతరదేవతల కంటే అధికుడని చెప్పడం యుక్తమా? అనే సంశయం కలుగవచ్చు.

వేదం **'ఏకం సత్ విప్రా బహుధా వదంతి'** అని చెప్పింది. అంటే సద్రూపుడైన పరమాత్మ ఒక్కడే, తత్త్వజ్ఞులు ఆయనను నానానామరూపాలతో వర్ణిస్తారని భావం. పరబ్రహ్మానికి మూర్తమని, అమూర్తమని రెండు రూపాలు కలవనీ; అందులో మూర్తం క్షరం–అంటే నశించే స్వభావం కలిగినదనీ, అమూర్తం నాశం లేనిదనీ గ్రహించాలి. క్షరాక్షరాలు సకలభూతాలలోనూ సమంగా ఉన్నాయి. అక్షరం పరబ్రహ్మం కాగా, ఈ చరాచరజగత్తు క్షరం అవుతున్నది. ఈ విషయాన్ని విష్ణుపురాణం ఇలా వివరించింది. –

ద్వే రూపే బ్రహ్మణస్తస్య మూర్తం చామూర్తమేవ చ ।
క్షరాక్షరస్వరూపే తే సర్వభూతేష్వవస్థితే ।
అక్షరం తత్ పరం బ్రహ్మ క్షరం సర్వమిదం జగత్ ॥

దీనినిబట్టి పురాణాలలో వర్ణింపబడిన త్రిమూర్తులలో ఒకరు పెద్ద, మరొకరు చిన్న అనే తేడాలు లేవు. ఒకే తత్త్వం మూడు రూపాలతో విరాజిల్లుతున్నది. ఆ దేవతలు నిర్వహించే క్రియలలోని భేదమే వారిని మూడురూపాలతో నిర్దేశించడానికి హేతువైనది. ఈ సంగతినే విష్ణుపురాణం ఈ విధంగా వివరించింది.

సృష్టిస్థిత్యంతకరణాత్ బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ ।
స సంజ్ఞాం యాతి భగవాన్ ఏక ఏవ జనార్దనః ॥

ఒక జనార్దనుడే సృష్టి, స్థితి, లయం – అనే మూడు కార్యాలు నిర్వహించడంవల్ల బ్రహ్మ, విష్ణువు, శివుడు అన్న మూడు సంజ్ఞలు పొందాడని భావం.

ఈ సత్యాన్ని గ్రహిస్తే ఆయా దేవతల పట్ల వైషమ్యం తొలగి సమత్వం నెలకొంటుంది. అందువల్ల త్రిమూర్తుల ప్రభావాలను సమయానుగుణంగా వర్ణించే పురాణాల పట్ల సమన్వయదృష్టినే కలిగివుండాలి.

మహాపురాణాల లాగానే ఉపపురాణాలు గూడా పదునెన్మిది ఉన్నాయని కూర్మ పురాణం పేర్కొంటున్నది.

ఆద్యం సనత్కుమారోక్తం నారసింహం తథాఽపరమ్ ।
తృతీయం స్కంద ముద్దిష్టం కుమారేణ తు భాషితమ్ ॥

చతుర్థం శివధర్మాఖ్యం సాక్షాన్నందీశ భాషితమ్ ।
దుర్వాససోక్తమాశ్చర్యం నారదోక్తమతఃపరమ్ ॥

కపిలం వామనం చైవ తథోశనససేవితమ్ ।
బ్రహ్మాండం వారుణం చాథ కాలికాహ్వయమేవ చ ॥

మాహేశ్వరం తథా సాంబం సౌరం సర్వార్థ సంచయమ్ ।
పరాశరోక్త మపరే మారీచం భాస్కరాహ్వయమ్ ॥

ఉపపురాణాలు–(1) సనత్కుమారోక్తం (2) నారసింహం (3) స్కాందం (4) శివధర్మం (5) దౌర్వాసం (6) నారదోక్తం (7) కాపిలం (8) వామనం (మానవం) (9) ఉశనసఃప్రోక్తం (10) బ్రహ్మాండం (11) వారుణం (12) కాలికా పురాణం (13) మాహేశ్వరం (14) సాంబం (15) సౌరం (16) పరాశరోక్తం (17) మారీచం (18) భాస్కరం (భార్గవం).

కొందరి మతంప్రకారం ఉపపురాణాల సంఖ్య ముప్పదినాల్గుగా నిర్దిష్టమయింది. వీటికి తోడుగా ఔపపురాణాలు అన్న పేరుతో మరొక పదునెన్మిది పురాణాలను గూడ నిర్దేశించడం కద్దు.

పురాణ లక్షణం

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం–అని పురాణం ఐదు లక్షణాలు గల్గి యుంటుంది. వీటి సంగ్రహవివరణ ఇది.

1. సర్గం – అవ్యాకృతతత్త్వం నుండి మహత్తత్త్వం, దానినుండి అహంకారతత్త్వం, దానినుండి సూక్ష్మభూతాల సృష్టి.
2. ప్రతిసర్గం – మరీచ్యాదులవల్ల జరిగిన చరాచరసృష్టి.
3. వంశం–ఆయా ఋషుల, రాజుల వంశాలు.
4. మన్వంతరాలు– మనువుల పరిపాలనకాలంలో జరిగిన విషయాలు మరియు ఆయా మన్వంతరాలలో సప్తఋషులు, మునులు మొదలగువారి వివరణ.

5. వంశానుచరితం–ఆ యా రాజవంశీయులైన రాజుల పరిపాలన మున్నగువాటికి చెందిన కథలను వివరించడం. పక్షాంతరంలో పురాణాలకు పది లక్షణాలు గూడా నిర్దేశించడం కద్దు. పైన చెప్పిన ఐదు లక్షణాలు సాధారణ పురాణాల లక్షణం కాగా, క్రింద చెప్పబోయే పదిలక్షణాలు మహాపురాణాలకు చెందినవని పెద్దల అభిప్రాయం.

అత్ర సర్గో విసర్గశ్చ స్థానం పోషణమూతయః ।
మన్వంతరేశానకథా నిరోధో ముక్తిరాశ్రయః ॥

సర్గం, విసర్గం, స్థానం, పోషణం, ఊతులు, మన్వంతరాలు, ఈశాన కథలు, నిరోధం, ముక్తి, ఆశ్రయం–అనేవే ఈ పది లక్షణాలు.

వీటి సంగ్రహ వివరణ ఇది–

(1) సర్గం –భగవత్ప్రేరణతో సత్త్వరజస్తమోగుణాలలో క్షోభ ఏర్పడి పంచభూతాలు, పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, అహంకారం, మహత్తత్త్వం జనించడాన్ని సర్గమంటారు.

2) విసర్గం:–విరాట్పురుషునినుండి ఉదయించిన బ్రహ్మ వివిధ చరాచరాలను సృష్టిస్తాడు. ఈ సృష్టినే విసర్గమంటారు.

3) స్థానం:–వినాశోన్ముఖమైన సృష్టిని ఒక మర్యాదలో నిల్పడమే స్థానం.

4) పోషణం:–భగవానుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావిస్తాడు. జగత్తుకు మేలు గల్గించే సందేశాన్ని అందిస్తాడు. నామరూపాలతో పుష్టిని కల్గిస్తాడు. దీనిని పోషణమంటారు.

5) ఊతులు:–కర్మవాసనలను ఊతులంటారు.

6) మన్వంతరాలు:–మనువులు మారినప్పుడు మన్వంతరకాలంలో తత్కాలానికి చెందిన అధిపతులు భక్తినీ,ధర్మాన్నీ ప్రబోధించే సంఘటనను మన్వంతరమంటారు.

7) ఈశానకథలు:– భగవదవతారాలు, భక్తులు–వీరికి సంబంధించిన చరిత్రలు.

8) నిరోధం:–జీవోపాధులను తనలో లీనం చేసుకొని భగవానుడు యోగనిద్రాముద్రితుడు కావడమే నిరోధం.

9) ముక్తి:–వేరే రూపాలు వదలి స్వస్వరూపంతో వుండడమే ముక్తి. ప్రకృతినుండి విముక్తి లభించే స్థితి ఇది.

10) ఆశ్రయం:– అధిష్ఠానమే ఆశ్రయం. దీని విశుద్ధికొరకే పై తొమ్మిది లక్షణాలనూ వివరించడం జరిగింది.

పై పది లక్షణాలూ మహాపురాణమైన శ్రీమద్భాగవతానికి చక్కగా అన్వయిస్తాయి. పెద్దలు వ్రాసిన గ్రంథాలలో వాటి సమన్వయాన్ని చూడవచ్చు.

పురాణశ్లోక సంఖ్య

భాగవతంలోని ద్వాదశస్కంధమందలి పదమూడవ అధ్యాయంలో ఆయా పురాణాలలోని శ్లోకాల సంఖ్య ఈ క్రిందివిధంగా నిర్దేశించడమయింది.

బ్రాహ్మం దశ సహస్రాణి పాద్మం పఞ్చోనషష్టి చ ।
శ్రీవైష్ణవం త్రయోవింశచ్చతుర్వింశతి శైవకమ్ ॥

దశాష్టౌ శ్రీభాగవతం నారదం పఞ్చవింశతిః ।
మార్కండేయం నవాగ్నేయం దశపఞ్చ చతుశ్శతమ్ ॥

చతుర్దశ భవిష్యం స్యాత్తథా పఞ్చశతాని చ ।
దశాష్టౌ బ్రహ్మవైవర్తం లైఙ్గమేకాదశైవ తు ॥

చతుర్వింశతి వారాహమేకాశీతిసహస్రకమ్ ।
స్కాందం శతం తథా చైకం వామనం దశ కీర్తితమ్ ॥

కౌర్మం సప్తదశాఽఽఖ్యాతం మాత్స్యం తత్తు చతుర్దశ ।
ఏకోనవింశత్సౌపర్ణం బ్రహ్మాండం ద్వాదశైవ తు ॥

త్రయోదశే పురాణానాం సంఖ్యామాహ యథాక్రమమ్ । **(భాగవతం-12-13-2--9)**

1. బ్రహ్మపురాణం	-	10,000	శ్లోకాలు
2. పద్మపురాణం	-	55,000	,,
3. విష్ణుపురాణం	-	23,000	,,
4. వాయుపురాణం	-	24,000	,,
5. భాగవతపురాణం	-	18,000	,,
6. నారదపురాణం	-	25,000	,,
7. మార్కండేయపురాణం	-	9,000	,,
8. అగ్నిపురాణం	-	15,400	,,
9. భవిష్యపురాణం	-	14,500	,,
10. బ్రహ్మవైవర్తపురాణం	-	18,000	,,
11. లింగపురాణం	-	11,000	,,
12. వరాహపురాణం	-	24,000	,,
13. స్కందపురాణం	-	81,100	,,
14. వామనపురాణం	-	10,000	,,
15. కూర్మపురాణం	-	17,000	,,
16. మత్స్యపురాణం	-	14,000	,,
17. గరుడపురాణం	-	19,000	,,
18. బ్రహ్మాండపురాణం	-	12,000	,,
మొత్తం శ్లోకాలు	-	**4,00,0000**	

పురాణాలలో ముఖ్యాంశాలు

పురాణాలు మానవకర్తవ్యాలను నిర్దేశిస్తూ కొన్ని ముఖ్యమైన సందేశాత్మక ప్రబోధాలు కావించాయి. ధర్మాన్ని రక్షించవలసిన ఆవశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనాలను వివిధ కథల ద్వారా అవి విశదీకరించాయి.

విశ్వమంతా భగవన్మయమనీ, మోక్షప్రాప్తికి భక్తి ముఖ్యసాధనమనీ, వివిధ వ్రతాలను వాటికి తగిన కాలాలలో అనుష్ఠించి పవిత్రులు కావాలనీ, పుణ్యక్షేత్రాలను సందర్శించాలనీ, ఆయా క్షేత్రాలలో ప్రతిష్ఠితులైన దేవతలను ఆరాధిస్తే శుభాలు సిద్ధిస్తాయనీ, పితృదేవతలకు శ్రాద్ధవిధిని తప్పక అనుష్ఠించాలనీ, కర్మఫలం అనుభవించక తప్పదనీ ఇత్యాదిగా పురాణాలు ప్రబోధించే అంశాలు అందరికీ గమనింపదగినవై యున్నాయి.

వర్ణనాశైలి

కవితా రూపంలో గల రచనలను కవులు ఆలంకారిక ప్రక్రియలో కొనసాగిస్తారు. ఈ ప్రక్రియ పాఠకులను ఆకర్షిస్తుంది. యథాతథంగా సాగే కథాకథనంతోపాటు అవసరమైనచోట అలంకార ప్రక్రియనాశ్రయించి కవులు వర్ణన నిర్వహిస్తారు. అతిశయోక్తులను గూడా మేళవిస్తారు. ఉన్నదున్నట్లు చెప్పడం యథాతథకథనం కాగా కథనంలో ఉపమారూపకాదులను ఆశ్రయించడం ఒక విశిష్టమైన పద్ధతి. వేదాలలో గూడ ఈ పద్ధతి కనిపిస్తుంది. ఉదాహరణకు కఠోపనిషత్తులో

ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు ।
బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ ॥

ఇత్యాదిగా శరీరానికి రథరూపకల్పన చేసి ఆత్మను రథికునిగా పేర్కొనడం జరిగింది. సూర్యుని కిరణాలలోని ఏడు రంగులను ఏడు గుర్రాలుగా వర్ణించడం గూడా ఈ ప్రక్రియకు చెందిన విషయమే.

పురాణాలు గూడా ఈ శైలిని విస్తృతంగా అనుకరించాయి. అతిశయోక్తిని గూడా విపులంగా వినియోగించాయి. ఈ పద్ధతి పురాణ వాఙ్మయానికి శోభావహ మైందనడంలో ఏ మాత్రం సందేహంలేదు.

పురాణ ప్రయోజనం

యథా పాపాని పూయన్తే గంగావారివిగాహనాత్ ।
తథా పురాణ శ్రవణాద్దురితానాం వినాశనమ్ ॥

గంగాజలంలో స్నానం చేయడంవల్ల పాపాలు నశించినట్లే పురాణశ్రవణంవల్ల దురితాలు నశిస్తాయి.

సదాచారప్రబోధం

యజ్ఞాలు, దానాలు, తపస్సులు ఇత్యాదిగా ఎన్ని చేసినా – సదాచారం లేనివాడు ఆత్మోన్నతి పొందలేడు.

దురాచారో హి పురుషో నేహ నాముత్ర నందతి ।

అన్నట్లు దురాచారుడైన మనుజుడు ఇహపరలోకాలు రెండింటా సుఖానికి దూరమౌతాడు.

ఆచారహీనం న పునన్తి వేదా యద్యప్యధీతాః సహ షడ్భిరంగైః ।

సదాచారం లేనివాడిని వేదాలుగూడా పవిత్రుణ్ణి చేయజాలవు. దురాచారాలు, సదాచారాల స్వరూపాన్ని వివిధ కథల ద్వారా పురాణాలు చక్కగా నిరూపించాయి. రామాయణంలో రామాదివద్వర్తితవ్యం, న రావణాదివత్, –రామాదులవలె ప్రవర్తించాలి కాని, రావణాదులవలె ప్రవర్తించరాదు అన్న విధంగా నీతిప్రబోధం పురాణాలలో రమణీయంగా చేయబడింది.

అందువల్ల పురాణ పఠన శ్రవణాలు సమాజాభ్యున్నతి కల్గిస్తాయి. పూర్వం గ్రామసీమలలో గూడ రాత్రివేళల పౌరాణికులు పురాణ పఠనం కావించి అందలి విశేషాలను సామాన్య జనులకు బోధించేవారు. ఈ బోధ ప్రజానీకానికి సముచిత సంస్కారం కల్గించేది. తద్ద్వారా వారు ఆత్మోన్నతి కల్గించే మార్గంలో నడిచేవారు.

కాలనిర్ణయం

పురాణాల కాలనిర్ణయం అంత సుకరం కాదు. శ్రీ శంకరభగవత్పాదులు మున్నగువారు తమ రచనల్లో పురాణాల నుదాహరించియున్నారు. బాణకవి (క్రీ.శ.625) తన హర్షచరిత్రలో **పురాణేషు వాయుప్రలపితం** అని చెప్పి వాయుపురాణాన్ని ప్రస్తావించాడు.

కలియుగరాజులను నిర్దేశించిన పురాణాలు గూడా ఉన్నాయి. విష్ణు పురాణంలో మౌర్యవంశం పేర్కొనబడింది. మాత్స్యపురాణం–దాక్షిణాత్యులైన ఆంధ్రరాజులను (క్రీ.శ 225) ప్రస్తావించింది. గుప్తరాజుల ప్రస్తావన వాయుపురాణంలో కనిపిస్తున్నది.

లక్ష శ్లోకాలుగల ఇప్పటి మహాభారతం రూపొందకముందే పురాణాల ఉనికిని పరిశోధకులు గుర్తించారు. మహాభారతవక్త అయిన రౌమహర్షణి పురాణాలలో పారంగతుడు. అతని తండ్రిగూడ పౌరాణికుడుగా ప్రసిద్ధుడే. మహాభారతంలో పెక్కు శ్లోకాలు పురాణాంతర్గత శ్లోకాలతో సామ్యం కల్గి వున్నాయి. మహాభారతంలోని కొన్ని ఆఖ్యానాల ప్రాచీన స్వరూపం పురాణాలలో గోచరిస్తున్నది. దీన్ని బట్టి మహాభారతం కంటె పురాణాలు ప్రాచీనమైనవని విశ్వసించవచ్చు.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పురాణ ప్రస్తావన ఉన్నది. అపమార్గగాములైన రాజకుమారులను పురాణోపదేశం ద్వారా సన్మార్గగాములను చేయాలని కౌటిల్యుడు వచించాడు. రాజుకు సంబంధించిన అధికారులలో పౌరాణికుడు గూడా ఒకడని కౌటిల్యుడు పేర్కొన్నాడు. అంచేత కౌటిల్యుని కంటె పురాణాలు ప్రాచీనాలని భావించడం సముచితం. కౌటిల్యుడు క్రీ.పూర్వం తృతీయ శతకం వాడని అనేకుల భావన. అందువల్ల ఆ కాలానికంటె ముందే పురాణాలుండేవని భావించాలి.

గౌతమ–ఆపస్తంబ సూత్రగ్రంథాలలో గూడ పురాణప్రస్తావన వస్తుంది. రాజు శాసనవ్యవస్థలో వేదంతోపాటు పురాణాన్ని గూడా ప్రముఖంగా గ్రహించాలని గౌతముడు చెప్పాడు. అతిప్రాచీన పురాణభాగాలనుండి మూడు శ్లోకాలను ఆపస్తంబ ధర్మసూత్రాలలో ఉదాహరించడం జరిగింది. ఆ శ్లోకాలతో సామ్యం కల శ్లోకాలు నేటి పురాణాలలో లభిస్తున్నాయి. కాబట్టి సూత్రకాలంలో గూడా పురాణ గ్రంథాలుండేవని బోధపడుతున్నది.

మరొక ముఖ్యాంశ మేమంటే అతిప్రాచీనములైన ఉపనిషత్తులలో గూడా పురాణ ప్రస్తావన కలదు, ఛాందోగ్యంలో నారద సనత్కుమారుల సంవాదంలో ఇతర శాస్త్రాలతోపాటు పురాణాలను పేర్కొన్నారు.

"ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేదమాథర్వణం చతుర్థమితిహాస పురాణం పంచమం వేదానాం వేదం" (ఛాందో 7-1-2).

అందుచేత క్రీ.పూ 600 సం॥ పూర్వం పురాణాల నిర్మాణం జరిగిందని పెద్దల భావన. వాటికి మూల భూతమైన పురాణా లిప్పుడు లభించవు.

పురాణాలు ఏ ఒక్క శతాబ్దానికో చెందిన రచనలు కావు. కాలక్రమములో వాటిలో క్రొత్తక్రొత్త అధ్యాయాలు చేర్చడం జరిగింది. గుప్తకాలానికి పురాణాలు నేటిరూపం సంతరించుకొన్నాయని చెప్పవచ్చు.

పురాణ వైశిష్ట్యం

పురాణాలు సామాన్యులకు దుర్బోధమైన వేదార్థాలను వారికవగతమయ్యే రీతిలో కథలు జోడించి చెప్పాయి. ప్రాచీనకాలానికి చెందిన భారతీయసమాజస్వరూపస్వభావాలను అర్థం చేసుకోవడానికి పురాణాలే ప్రామాణికమైన ఆధారాలు. ఆనాటి ఋషుల చరిత్రలను మనం పురాణాలనుండే సమగ్రంగా గ్రహించడానికి వీలవుతుంది.

భారతభౌగోళికస్థితి, నదీనదపర్వతాల ఉనికి, వివిధ తీర్థాల స్థితిగతులు, పలువృక్షాలు, జంతువులు- వీటిని గూర్చిన విజ్ఞానం కూడా పురాణాలలో లభిస్తుంది.

పురాణాలను, శిలాశాసనాదులగు ఇతర ప్రామాణికాధారాలతో తులనాత్మకంగా పరిశీలిస్తే గత చరిత్రకు చెందిన అనేక విషయాలు తేటతెల్లమవుతాయి.

కాబట్టి భారతీయులే కాక పాశ్చాత్యులు గూడా పురాణాలను శ్రద్ధతో పరిశోధించి మానవజాతి గతచరిత్రను సమగ్రంగా అవగతం చేసుకోవచ్చు.

ధార్మికంగానూ, ఆధ్యాత్మికంగానూ సామాన్యప్రజలను చైతన్యవంతులను చేయడంలో పురాణాలు నిర్వహించిన పాత్ర ఎంతో గణనీయమైనది. మొత్తం పదునెనిమిది పురాణాలలోని శ్లోకాల సంఖ్య నాల్గు లక్షలని ముందే చెప్పుకొన్నాం. ఇంత విస్తృతమైన గ్రంథరాశి సంస్కృతభాషానిబద్ధమై లభిస్తున్నది.

వేదాలలోని నిగూఢమైన వేదాంతతత్త్వాన్ని సామాన్య జనులకు గూడా అర్థం కావాలనే దృష్టితో ఆఖ్యానాలతోనూ, ఉపాఖ్యానాలతోనూ పురాణాలు వివరించాయి.

ప్రాచీనకాలంలో యజ్ఞాలు నిర్వహించే ప్రదేశాలలో పురాణపఠనం విధిగా నిర్వహింపబడేది. పురాణపఠనం పాపనివారకమనీ, పుణ్యప్రదమనీ ప్రశంసింపబడింది. పౌరాణికులు పురాణాలను పఠిస్తూ ప్రవృత్తినివృత్తి రూపాలైన రెండు విధాల ధర్మాలనూ ప్రజలకు వివరించేవారు.

పురాణాలను ఆధారంగా చేసుకొని కవులు కావ్యనాటకాదులు విస్తృతంగా రచించారు. భారతీయుల జీవితాలకూ, విశ్వాసాలకూ పురాణాలు శతాబ్దాల తరబడి మార్గనిర్దేశకా లయ్యాయి. వేదార్థాలను అతివిస్తృతస్థాయిలో జనానీకానికి అందజేయడానికి పురాణాలు ముఖ్యసాధనా లయ్యాయి.

వేదాంతతత్త్వాన్ని బోధించడాని కవతరించిన శ్రీశంకరరామానుజాద్యాచార్యులు గూడా అవసరమైన చోట పురాణవచనాలను ప్రమాణాలుగా పేర్కొనియున్నారు.

కర్మ–భక్తి–ధ్యాన–జ్ఞాన యోగాలు మోక్షసౌధాన్ని అధిష్ఠించడానికి సోపానాలు. ఇందులో కలియుగంలో భక్తియొక్కటే సులభమైన తరణోపాయమని పెద్దలు పేర్కొన్నారు.

"కలౌ భక్తిః కలౌ భక్తిః భక్త్యా కృష్ణః పురః స్థితః" అన్నట్లు కలియుగంలో అనన్యభక్తిచేతనే భగవదనుగ్రహం కలుగుతుందన్న సత్యాన్ని భాగవతాది పురాణాలు ప్రహ్లాదచరిత్రాదికథల ద్వారా మనోజ్ఞంగా నిరూపించాయి.

అట్లే గృహస్థులు పాటించవలసిన పలురకాలైన కర్మవిధానాలూ, వ్రతాలూ, వాటివల్ల కలిగే ఫలితాలూ పురాణాలలో ఎడనెడా విశదంగా నిరూపించబడ్డాయి. ఈ విధంగా కర్మయోగ నిరూపణం గూడా పురాణాలలో కనిపిస్తుంది. వివిధ విషయాలతో కూడిన పురాణాలను విజ్ఞానసర్వస్వాలుగా, జ్ఞాననిలయాలుగా భావించవచ్చు.

పురాణాలలో వివిధ ప్రదేశాలలో గల నానాతీర్థాలు, ఆ తీర్థాల ప్రాముఖ్యం, తీర్థయాత్రలవల్ల కలిగే ప్రయోజనాలు మొదలైన విషయాలు పలుచోట్ల వివరింపబడివున్నాయి. తీర్థయాత్రలవల్ల ప్రజలలో ఏకజాతీయతాభావం పెంపొందుతుంది. గతచరిత్రకు సంబంధించిన విజ్ఞానం భావిపురోగతికి దోహదం చేస్తుంది. పురాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే భారతదేశ గతచరిత్రకు చెందిన ఎన్నో విషయాలు గోచరిస్తాయి. "పురోఽభివృద్ధి గోరువారు పూర్వవృత్తాంతమును మరువరాదు" అని శ్రీమలయాళస్వామి సూక్తి. అందుచేత చారిత్రక పరిశోధకులు పురాణాలను పరిశీలనాత్మకమైన దృష్టితో అధ్యయనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తమ పాలనలో ఎదురయ్యే సమస్యలను ఆనాటి పాలకులు పురాణవృత్తాంతాలను ప్రమాణంగా పరిగ్రహించి పరిష్కరించేవారు. అందుచేత రాజధర్మ పరిజ్ఞానానికి గూడా పురాణసారస్వతం ఉపకరిస్తుంది.

పురాణాలలో బోధింపబడిన నీతులను కేవలం హిందూజాతికి మాత్రమే పరిమితా లని భావించరాదు. ప్రపంచజను లందరికీ ఉపయోగపడే శాశ్వతనైతికబోధ లందులో ఉన్నాయి.

ఆధునిక విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు అంశాలు పురాణాలలో నిర్దిష్టములై యున్నాయని ఇప్పటి శాస్త్రజ్ఞులలో కొందరి భావన. అందుచేత వైజ్ఞానిక పరిశోధకులకు గూడా పురాణజ్ఞానం అవసరమే.

అతిప్రాచీనకాలంనుండీ నేటివరకూ అమూల్య సారస్వతరూపంలో మనకు ఉపలబ్ధమవుతున్న వాఙ్మయంలో పూర్వోక్తపద్ధతిలో పురాణాలకు గల ప్రాముఖ్యాన్ని గుర్తించి మానవజాతిపురోగతికి వాటిని వినియోగించుకొని సర్వతోముఖమైన శ్రేయస్సును పొందుదుము గాక!

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

అష్టాదశపురాణాల సంగ్రహపరిచయం

1. బ్రహ్మపురాణం

పురాణాలలో మొదటిది బ్రహ్మపురాణం. ఇది విష్ణుదేవుని మాహాత్మ్యాన్ని విశదీకరిస్తుంది. ఆ దేవుని శిరస్సుగా వర్ణింపబడిన ఈ పురాణం ధర్మార్థకామమోక్షాలనే చతుర్విధపురుషార్థాల ప్రాప్తికి తగిన ఉపాయాలను వివరిస్తుంది.

10,000 శ్లోకాలు గల ఈ పురాణంలో పలు ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు ఉన్నాయి. నైమిశారణ్య వర్ణనం, ప్రళయస్వరూపం, హరిశ్చంద్రసగరాదుల చరిత్రలు, సప్తద్వీపాలు, పార్వతీ స్వయంవరం, సాగరస్నానవిధి, గోదావరీ పవిత్రత, క్షీరసాగరమథనం, దధీచి వృత్తాంతం, వరాహాద్యవతారాలు–ఇత్యాదిగా అనేక విషయాలు ఇందులో నిబంధింపబడి వున్నాయి.

భారతావని, దండకారణ్యం, గంగాదినదుల ప్రాశస్త్యం విస్తృతంగా ఈ పురాణంలో వివరించడమయింది.

ప్రతిపురాణంలోనూ తత్త్వాన్నీ, నీతినీ, ధర్మాన్నీ బోధించే కథలు ఉంటాయి. ఈ పురాణంలోని కథలలో 'కండు' మహర్షి కథ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది. అతని తపస్సుకు భంగం కల్గించడానికి దేవతలు పంపిన అప్సరస ప్రమ్లోచ దాదాపు 900 సంవత్సరాలు అతనితో విహరించి అతని నియమానికి భంగం కల్గిస్తుంది.

చివరికి తన పొరబాటు గుర్తించిన మహర్షి పురుషోత్తమక్షేత్రమనే పూరీజగన్నాథక్షేత్రానికి వెళ్ళి శ్రీ జగన్నాథుని సేవించి ముక్తుడవుతాడు.

తరువాతి కథలలో కార్తవీర్యార్జునుని వృత్తాంతం ప్రముఖమైనది. ఇది మిక్కిలి విస్తృతమైన చరిత్ర. దత్తాత్రేయుని అనుగ్రహంతో సహస్రబాహువులు కల్గి శిష్టరక్షణ కావిస్తూ రావణాదులను జయించి ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించిన ఈ రాజు చివరికి తనకంటే బలవంతుడైన పరశురామునిచే వీరమరణం పొందుతాడు. ఏడువందల యాగాలు నిర్వహించినవాడుగా ఈతడు ప్రసిద్ధుడయ్యాడు. విష్ణుతత్త్వం బోధించే పలు విషయాలు ఇంకా ఎన్నో ఈ పురాణంలో గోచరిస్తాయి.

ఇదం యః శ్రద్ధయా నిత్యం పురాణం వేదసమ్మితమ్ ।
యః పఠేచ్ఛృణుయాన్మర్త్యః స యాతి భువనం హరేః ॥

వేదతుల్యమైన ఈ పురాణాన్ని శ్రద్ధతో చదివినవాడు, లేక విన్నవాడు హరినిలయమైన వైకుంఠం చేరుకుంటాడని ఫలశ్రుతి.

2. పద్మపురాణం

మహావిష్ణువుయొక్క హృదయస్థానంతో పోల్చబడిన పురాణమిది. సృష్టి ప్రక్రియ ఆ దేవుని నాభికమలంనుండి జన్మించిన బ్రహ్మద్వారా మొదలయింది. ఆ ప్రక్రియయే ఈ పురాణాని కాధారం. కాన ఇది 'పద్మపురాణ' మనబడింది. ఇందులో 55,000 శ్లోకాలున్నాయి.

సృష్టిఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళఖండం, ఉత్తరఖండం – అని ఐదు ఖండాలుగా విభజింప బడిన ఇందులో మొత్తం 641 అధ్యాయాలున్నాయి.

కాలపరిమాణం, క్షీరసాగరమథనం, దక్షయాగధ్వంసం, చంద్రవంశం, వామనావతారం, తారకాసుర వృత్తాంతం, నృసింహావతారం, సదాచారం – ఇత్యాదిగా పలువిషయాలను ఈ పురాణం వివరిస్తున్నది.

శరీరవర్ణనం, ఆత్మస్వరూపం, విష్ణుభక్తి మహిమ, కార్తికమాస ప్రాశస్త్యం, దీపావళీమాహాత్మ్యం పూజావిధానాలు, యుగధర్మాలు మున్నగు విషయాలను విపులంగా ఇందులో చూడవచ్చు.

ప్రపంచమంతా శ్రీహరిమయమే అని ఈ పురాణం ఘోషిస్తున్నది. ఇందులో పేర్కొన్న సదాచారాలు అవశ్యం ఆచరింపదగివున్నాయి.

తల్లిదండ్రుల విశిష్టతను ప్రశంసించి **"మాతరం పితరం తస్మాత్సర్వయత్నేన పూజయేత్"** –సకల ప్రయత్నాలతోనూ తల్లిదండ్రుల నర్చించాలి అని ఈ పురాణం బోధించింది. ఇది **'మాతృదేవో భవ, పితృదేవో భవ'** అన్న శ్రుతివచనానికి వివరణగా ఉన్నది.

ఇంకా ఉసిరికాయకు గల పవిత్రత, దాన్ని సేవించే విధానం విపులంగా ఇందులో పేర్కొనబడింది. అట్లే తులసికి గల ప్రాశస్త్యం కీర్తించబడింది.

పురాణపఠనావశ్యకత, దానివల్ల కలిగే ప్రయోజనం, కలియుగధర్మాలు, ఆ యుగంలో స్త్రీపురుషుల స్వభావాలు, జనుల విపరీతప్రవృత్తులు విశదంగా ఇందులో నిరూపింపబడియుండడం గమనార్హం.

కలియుగంలో ధర్మాత్మకమైన కర్మను మనుజుడు భక్తితో భగవదర్పితంగా ఆచరిస్తే సర్వపాప నిర్ముక్తుడవుతాడని ఈ పురాణం ప్రతిపాదించింది. ఇలా ఏ పురాణాన్ని పరిశీలించినా నానావిధములైన, ఆత్మోన్నతిహేతువులైన, మానవజీవితాని కవసరములైన పెక్కు విషయాలు విశదీకరింపబడివున్నాయి.

ఈ పద్మపురాణాన్ని చదివేవారికి, వినేవారికి కోరిన కోర్కెలన్నీ శ్రియఃపతి అనుగ్రహం వల్ల సిద్ధిస్తాయని ఫలశ్రుతి.

యద్యదిష్టం పఠంత్యేతత్ శృణ్వంతి చ ముముక్షవః ।
లభన్తే తత్తదేవాశు ప్రసాదాత్కమలాపతేః ॥

3. విష్ణుపురాణం

శ్రీ మహావిష్ణువు యొక్క దక్షిణబాహువుగా విష్ణుపురాణం వర్ణించబడింది. ఆరు అంశాలుగా విభజింపబడిన ఈ పురాణంలో 126 అధ్యాయాలున్నాయి. విష్ణు ధర్మోత్తరంతోగూడ కలుపుకొంటే ఇందలి మొత్తం శ్లోకాలు 23,000. పరాశరమహర్షి మైత్రేయునకు జెప్పిన పురాణ మిది.

ఇరవైనాలుగు తత్త్వాలు, జగదావిర్భావం, కాలస్వరూపం, వరాహావతారం, భూవిభజన, సనకాదుల జననం, స్వాయంభువమనువు పుట్టుక, దక్షపుత్రికల వివాహం, ధ్రువచరిత్ర, నృసింహావతారం, భరతవంశవర్ణన, జడభరతోపాఖ్యానం–ఇత్యాదిగా అనేకాంశాలు ఈ పురాణంలో విశదీకరింపబడ్డాయి.

మరియు బ్రహ్మజ్ఞాన ప్రాశస్త్యం, వేదవిభాగం, బ్రహ్మచర్యాద్యాశ్రమాలు, దేవాసురుల యుద్ధం, సగరవంశవర్ణన, శ్రీకృష్ణావతారం, కలి లక్షణాలు, నామసంకీర్తనప్రభావం మొదలైన విషయాలు గూడ విపులంగా ఇందులో నిరూపించడమైనది.

వైష్ణవులకు మిక్కిలిగా ఆరాధనీయమైన పురాణమిది. వైష్ణవసిద్ధాంతాలకు మూలభూతమైన గ్రంథం గాన శ్రీభగవద్రామానుజాచార్యులు ఆ సిద్ధాంతప్రచారాన్ని ఈ పురాణాన్ని ఆధారంగా స్వీకరించి నిర్వర్తించారు.

శరణాగతి, భగవద్గుణకర్మనామాల గానం, విష్ణ్వర్పణంగా కర్మల ననుష్ఠించడం మొదలగు అంశాలకు ఈ పురాణంలో ప్రాముఖ్యం ఇవ్వడమయింది.

మరియు శ్రవణం, కీర్తనం మున్నగు నవవిధభక్తి మార్గాలు ఇందులో విస్తృతంగా ప్రతిపాదింపబడి వున్నాయి. భాగవతపురాణం లాగా ఈ పురాణం గూడా భక్తియోగానికి ప్రాధాన్యాన్ని ప్రతిపాదించింది.

దేవతలను ఆరాధించేవారిలో అనేకులు శివకేశవులలో భేదాన్ని చూస్తారు. అయితే ఈ పురాణంలో–

"అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః ।
వదంతి భేదం పశ్యన్తి చావయోరన్తరం హర!" ॥

'అవిద్యామోహితులే నీకూ, నాకు భేదం పాటిస్తారు' అని కేశవుడు శివునితో చెప్పాడు. ఈ శివకేశవాభేద సిద్ధాంతం ఇక్కడ గమనార్హం.

ఈ పురాణంలో జడభరతుని వృత్తాంతం మిక్కిలి ఆసక్తిని రేకెత్తించేదిగా వర్ణితమై వున్నది. ఆతని మూడు జన్మలకు సంబంధించిన విశేషాలు గ్రహిస్తే మనలో జ్ఞానవిజ్ఞానాలు వికసిస్తాయి.

యో నరః పఠతే భక్త్యా యః శృణోతి చ సాదరమ్ ।
తావుభౌ విష్ణులోకం హి వ్రజేతాం భుక్తభోగకౌ ॥

అన్నట్లు – భక్తితో దీన్ని పఠించేవాడు, ఆదరంతో వినేవాడూ ఈ లోకంలో భోగాలనుభవించి తుదకు విష్ణుసాన్నిధ్యం చేరగలరని ఫలశ్రుతి.

4. వాయుపురాణం

వాయుదేవుడు శివలీలలను వివరించిన పురాణమిది. అందుచేత దీన్ని 'శివపురాణ' మని కూడా పేర్కొంటారు. **'చతుర్వింశతి సాహస్రం పురాణం'** –అనుటవల్ల ఇందులో 24,000 శ్లోకాలున్నాయని గ్రహించాలి. కాని ఇపుడు మనకు లభించేవి 11,000 శ్లోకాలు మాత్రమే. శ్లోకసంఖ్యలలో ఇట్టి వ్యత్యాసాలు కొన్ని పురాణాలలో కనిపిస్తున్నాయి. ఈ పురాణం మహావిష్ణువుయొక్క వామభుజంగా పేర్కొనబడింది.

ఇందులో (1) ప్రక్రియాపాదం (2) అనుషంగ పాదం (3) ఉపోద్ఘాత పాదం (4) ఉపసంహార పాదం–అని నాలుగు పాదాలున్నాయి.

భూగోళ-ఖగోళాలు, బ్రహ్మాండసృష్టి, యుగధర్మాలు మున్నగు విషయాలతోపాటు కైలాసవర్ణన, గంగావతరణవర్ణన మొదలగు వర్ణనలు గూడా ఇందు గోచరిస్తాయి.

ఇది శైవపురాణం. అయినా సందర్భానుగుణంగా మహావిష్ణువు గూడా ఇందు వర్ణింపబడినాడు.

వివేకవిజ్ఞానాలు కావాలంటే తప్పకుండా పురాణాల అధ్యయనం చేయాలని ఈ పురాణం చెబుతున్నది.

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో నరః ।
న చేత్పురాణం సంవిద్యాన్నైవ స స్యాద్విచక్షణః ॥

నాల్గువేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు చదివినా పురాణం చదువనివాడు విచక్షణుడు కాలేడని భావం. కాబట్టి పురాణాధ్యయనం ఎంత ముఖ్యమైనదో గ్రహించాలి.

ఈనాడు మనం యోగాభ్యాసాని కెంతో ప్రాముఖ్యం ఇస్తున్నాము. వాయుపురాణంలో యోగాని కవసరమైన ప్రాణాయామాన్ని గూర్చి విపులమైన వివరణ ఉన్నది. బ్రహ్మప్రాప్తికది అవసరం. శాంతి, ప్రశాంతి, దీప్తి, ప్రసాదం-అనే నాల్గు ప్రయోజనాలు దానివల్ల కల్గుతాయని ఈ పురాణం చెబుతున్నది.

ఓంకారోపాసన గూడా ఇందులో చెప్పడమయింది. ఓంకారధ్యానపరులకు శివసాయుజ్యం కల్గుతుందని ఇందులో నిరూపించబడివున్నది.

'రమణకం' అనే దేశంలోని ప్రజలు పదివేల సంవత్సరాలు, 'హిరణ్యకం' లోనివారు పదకొండు వేల సంవత్సరాలు జీవిస్తారంటూ అక్కడి ప్రకృతివిశిష్టతను ఇక్కడ చెప్పడమయింది.

అక్కడి చెట్లు ఫలాలతోపాటు వస్త్రాలనూ, ఆభరణాలను గూడా ప్రసాదిస్తాయని చెప్పడం ఆశ్చర్యావహంగా ఉన్నది. కథాకథనంకంటే ఇట్టి వర్ణనలే ఈ గ్రంథంలో ఎక్కువగా గోచరిస్తాయి.

గయాక్షేత్రప్రాముఖ్యం గూడా ఇందు చెప్పడమయింది. గయను సందర్శించిన పుత్రుడు పితరులకు రక్షకుడనీ, అతణ్ణి చూచి పితరులు హర్షిస్తారనీ ఇక్కడ పేర్కొనబడింది.

ఈ పురాణకీర్తనం శ్రవణం,ధారణ-కీర్తినీ, పూర్ణాయువునూ, పాపనాశాన్నీ కల్గిస్తాయని ఫలశ్రుతి.

ధన్యం యశస్యమాయుష్యం పుణ్యం పాపప్రణాశనమ్ ।
కీర్తనం శ్రవణం చాస్య ధారణం చ విశేషతః ॥

5. శ్రీమద్భాగవతం

శ్రీమహావిష్ణుని ఊరువుగా వర్ణించబడిన శ్రీమద్భాగవతంలో పండ్రెండు స్కంధాలు, 18,000 శ్లోకాలున్నాయి. ఇది భక్తియోగ ప్రాముఖ్యాన్ని కథలతో, ఉపకథలతో వివరించే పురాణం.

'నిగమకల్పతరోర్గళితం ఫలం'-అన్నట్లు వేదమనే కల్పవృక్షంనుండి జారిపడిన పండుగా దీన్ని కీర్తించడమయింది. భక్తితోపాటు జ్ఞానవైరాగ్యాలు గూడా ఇందు నిర్దేశించబడి వున్నాయి.

వేదాలను విభజించిన వ్యాసుడు ధర్మనిరూపకమైన ఒక లక్షశ్లోకాలతో గూడిన మహాభారతం రచించాడు. అయినా మనశ్శాంతి లేక, చింతాక్రాంతు డయ్యాడు. నారదుడాయన చెంతకు వచ్చి 'నీచింతకు కారణ మేమి?' అని ప్రశ్నించాడు! 'అదేదో నీవే చెప్పు' అని వ్యాసుడన్నాడు.

అపుడు నారదమహర్షి ఊరక ధర్మాలు చెప్పితే చాలదు, విష్ణుకథాప్రధానమైన గ్రంథం రచిస్తే కానీ నీకు మనశ్శాంతి లభించదంటాడు. ఆయన చెప్పినట్లు వ్యాసభగవానుడు భగవంతుని గుణకర్మనామాలను కీర్తించే విష్ణుకథలను వర్ణిస్తూ భాగవతం రచించాడు, మనశ్శాంతి పొందాడు. భాగవత రచనకు చెందిన వృత్తాంతమిది.

దీని కథాప్రారంభమిది–పాండవవంశంలో జన్మించిన పరీక్షిత్తు వేటకు వెళ్ళి అలసిపోయి తపోనిమగ్నుడైన శమీక మహర్షిని నీళ్ళిమ్మంటాడు. నిర్వికల్పధ్యానంలో ఉన్న ఆ ముని కతనిమాట వినిపించదు. కోపించిన రాజు అతని మెడలో సర్పశవాన్ని వేసి శృంగిశాపానికి గురి అవుతాడు. వారం దినాలలో మరణించవలసిన దుఃస్థితి పాలవుతాడు.

అంతట రాజకార్యాలు త్యజించి ప్రాయోపవిష్టుడై ఏడు దినాలలో ముక్తి పొందే ఉపాయమేమి? అని విచారిస్తాడు. అపుడు శుకుడు వచ్చి అందుకు ఉపాయం భాగవతశ్రవణమే అని చెప్పి భాగవతప్రవచనం కావిస్తాడు.

ఇందులో ధ్రువుడు, జడభరతుడు, అజామిళుడు, దధీచి, ప్రహ్లాదుడు, గజేంద్రుడు, అంబరీషుడు, రంతిదేవుడు మున్నగు భాగవతుల కథలు మనోజ్ఞంగా వివరింపబడివున్నాయి. ఆ కథల ద్వారా విజ్ఞాన వైరాగ్యభక్తివిశేషాలు నిరూపితాలయ్యాయి.

దశమస్కంధం ఇందులో అతిముఖ్యమైనది. శ్రీకృష్ణావతారప్రతిపాదకమైన ఇందులో శ్రీకృష్ణుని లీలలు, ఆయన కావించిన కంసాదుల సంహారం, రుక్మిణీ కల్యాణం, కుచేలాదుల ఉద్ధరణ–ఇత్యాదిగా పలు అంశాలు రసవత్తరంగా చిత్రించబడినాయి.

ముఖ్యంగా గోపికలు కృష్ణుణ్ణి ప్రేమించిన ఘట్టం మనోహరంగా ఉన్నది. మధురభక్తితత్త్వం ఇందులో ప్రతిపాదితమయింది.

పదకొండవ స్కంధంలోని ఉద్ధవగీత ప్రశస్తం. శ్రీకృష్ణుడు అవసానదశలో గావించిన ఆధ్యాత్మిక ప్రబోధమిది. చివరి స్కంధంలో కలిస్వరూపం నిరూపించబడింది. మార్కండేయ చరిత్రను గూడా ఇందులో చూడవచ్చు.

'విద్యావతాం భాగవతే పరీక్షా' అన్నట్లు విద్యావంతుల జ్ఞానవిజ్ఞానాలను భాగవతం ద్వారా పరీక్షించవచ్చు. భగవన్నామసంకీర్తనం సర్వపాపప్రణాశకమని భాగవతం చెప్పింది. భారతావనిలో జన్మించి గూడా భాగవతం విననివారు ఆత్మఘాతకులని పేర్కొనబడ్డారు.

భారతే మానవం జన్మ ప్రాప్య భాగవతం న యైః ।
శ్రుతం పాపపరాధీనైరాత్మఘాతస్తు తైః కృతః ॥

భాగవత శ్రవణ ఫలం ఈ క్రిందిశ్లోకంలో ఇలా పేర్కొనబడింది.

మత్కథావాచనే నిత్యం మత్కథాశ్రవణే రతమ్ ।
మత్కథాప్రీతమనసం నాహం త్యక్ష్యామి తం నరమ్ ॥

'నాకథలు పఠించేవాడు, వినేవాడు, నాకథలచే సంతోషించేవాడు అయిన జనుణ్ణి నేను వదలను' అని శ్రీకృష్ణుడు చెప్పాడు.

6. నారదపురాణం

మహావిష్ణువుయొక్క నాభిస్థానంగా కీర్తింపబడిన పురాణమిది. నారదుడు ఉపదేశించినది కావడం వల్ల 'నారద పురాణం' అనే పేరు దీనికి స్థిరపడింది. ఇందులో ఇరువదియైదువేల శ్లోకాలున్నాయి.

పూర్వఖండం, ఉత్తరఖండం అని ఈ పురాణం రెండు ఖండాలుగా విభక్తమై యున్నది. పూర్వఖండంలో 125, ఉత్తరఖండంలో 82 అధ్యాయాలు ఉన్నాయి.

పురాణాల ప్రశస్తి. శివకేశవుల అభేదం, భక్తికి గల ప్రాముఖ్యం, సదాచార ప్రాశస్త్యం, పౌరాణికుల గురుత్వం–ఇత్యాదులు ఇందులో చక్కగా కీర్తితాలయ్యాయి.

సత్యహరిశ్చంద్రుని గాథ ఇందులో ఉన్నది. అట్లే శ్రీకృష్ణుని ప్రభావం చక్కగా పేర్కొనబడివున్నది. బ్రహ్మాండోత్పత్తి ఎలా జరిగిందో ఇందులో చూడవచ్చు.

విష్ణుభక్తికి గల ప్రాముఖ్యాన్ని వర్ణించే ఈ పురాణంలోని క్రిందిశ్లోకం గమనార్హమై యున్నది–

లోకే స ధన్యః స శుచి స్స విద్వాన్ స ఏవ వక్తా స చ ధర్మశీలః ।
జ్ఞాతా స దాతా స చ సత్యవక్తా యస్యాస్తి భక్తిః పురుషోత్తమాఖ్యే ॥

పురుషోత్తమునిపై భక్తి గలవాడే లోకంలో ధన్యుడు, శుచి, విద్వాంసుడు, ధర్మశీలుడు, జ్ఞాత, దాత, సత్యవక్త అని భావం. భక్తిలేనివాని గుణాలు విలువలేనివని తాత్పర్యం.

ఒక్క భక్తినే కాక తీర్థయాత్రలో సేవించవలసిన తీర్థాల ప్రాశస్త్యాన్ని గూడా ఈ పురాణం విశదీకరించింది. అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక, ద్వారక–ఈ ఏడు నగరాలు మోక్షప్రదాలని ఈ పురాణం ఉద్ఘాటించింది.

రాజధర్మాలను గూడా ఈ పురాణం వివరించింది. ప్రజారక్షణ, శత్రుసంహారం, న్యాయబద్ధంగా పన్నులు వసూలు చేయడం, గోరక్షణ, అన్న–వస్త్ర గృహాలు అనే కనీసపు సౌకర్యాలను ప్రజలకు కల్గించడం, మద్యనిషేధం–మున్నగు రాజుల కర్తవ్యాలు గూడా ఇందులో నిర్దేశింపబడివున్నాయి.

పరులపై దౌర్జన్యం, వారిని హింసించడం మున్నగు పది పాపాలు పరిహరణీయాలు. వాటి వినాశానికే, 'దశహరా' అని పేరు. దానికి ప్రతీకగానే నేటికీ 'దశరా' పండుగ జరుపుకొంటున్నాము.

భర్తృహరిసుభాషితంవంటి గ్రంథాలలో మనం ఎన్నో సుభాషితాలు చదువుతుంటాం. వాటిని పోలిన పలు సుభాషితాలను మనం ఈ నారదపురాణంలో గూడా చూడవచ్చు.

యః శృణోతి నరో భక్త్యా శ్రావయేద్వా సమాహితః ।
స యాతి బ్రహ్మణో ధామ నాత్ర కార్యా విచారణా ॥

అని ఫలశ్రుతి. ఎవడు భక్తితో ఈ పురాణాన్ని వింటాడో, లేదా వినిపిస్తాడో, అతడు బ్రహ్మలోకం చేరుతాడు. ఇందుకు సందేహం లేదు.

7. మార్కండేయ పురాణం

మునులు తమ సందేహాలను మార్కండేయ మహర్షికి తెల్పగా ఆయన వారి సంశయాలు తొలగిస్తూ చెప్పిన పురాణమిది. విష్ణు భగవానుని దక్షిణపాదంగా ఇది కీర్తింపబడింది. ఇందులో 134 అధ్యాయాలు, తొమ్మిదివేల శ్లోకాలు ఉన్నాయి.

బలరాముని తీర్థయాత్రలు, హరిశ్చంద్రుని వృత్తాంతం, పతివ్రతాస్త్రీల ప్రభావం, కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుని అనుగ్రహం పొందడం, రాజధర్మాలు, యోగశాస్త్రవిషయాలు, ఓంకారనిరూపణ, బ్రహ్మాండోత్పత్తి, దేవీమాహాత్మ్యం, సూర్యవంశవర్ణన ఇత్యాదిగా గల వివిధ విషయాలు ఈ పురాణంలో నిరూపించడమయింది.

దుర్గాదేవి జనుల ననుగ్రహించి వారి కోర్కెలు తీర్చే దేవత. ఆ దేవిని ఆరాధించడంలో సప్తశతీపారాయణం ముఖ్యకర్తవ్యం. ఆ సప్తశతి ఈ పురాణంలోని భాగమే. దేవీనవరాత్ర్యుత్సవాలలో సప్తశతిని పారాయణం చేస్తారు.

మహిళామణులలో కొందరు మహాయోగిను లున్నారు. వారిలో మదాలసాదేవి ఒకరు. ఈమెకు సంబంధించిన అద్భుతమైన చరిత్ర ఈ పురాణంలో అతి విపులంగానూ, రమణీయంగానూ నిరూపింపబడివున్నది.

ఋతధ్వజుడనే రాజుయొక్క ధర్మపత్ని మదాలస. ఈమెకు విక్రాంతుడు, సుబాహుడు, అరిమర్దనుడు, అలర్కుడు–అని నల్గురు కుమారులు. ఆమె ఉగ్గుబాలతోపాటు మొదటి ముగ్గురికీ బ్రహ్మవిద్యను గూడా బోధించింది. వారు అధ్యాత్మవిద్యలో ఆరితేరి సంసారవిరక్తులవుతారు. ఋతధ్వజుడు నాల్గవ కుమారుణ్ణి తల్లి వద్ద అధ్యాత్మవిద్యనభ్యసింపనీకుండా లౌకికవిద్యలు బోధించే ఏర్పాటు చేస్తాడు. అవసానదశలో ఆమె అతణ్ణి కూడా సత్సంగప్రభావముతో తత్త్వవేత్తగా రూపొందేటట్లు చేస్తుంది. ఇది ఆ కథా సంగ్రహ సారాంశం.

విష్ణువుయొక్క నాల్గు రూపాలు వాసుదేవ–శేష–ప్రద్యుమ్న–అనిరుద్ధములని ప్రసిద్ధాలు. వీటికి సంబంధించిన వివరణ కూడా ఈ పురాణంలో వస్తుంది.

ఇక ధర్మపక్షులుగా ప్రసిద్ధి వహించిన పక్షుల వృత్తాంతం గూడా మార్కండేయపురాణంలో పేర్కొనబడివున్నది. జైమినిమహర్షి తనకు గల్గిన సంశయాల నన్నింటినీ ఈ పక్షులద్వారానే తొలగించుకొంటాడు.

ఈ పురాణం పుత్రులను మూడురకాలుగా విభజించింది. తండ్రినుండి సంక్రమించిన కీర్తినీ, ధనాన్నీ పెంపొందించేవాడు ఉత్తముడు, పెంపొందించకున్నా పోగొట్టకుండా ఉండేవాడు మధ్యముడు, పోగొట్టుకొనేవాడు అధముడు. ఎంతో చక్కని ప్రబోధమిది.

తండ్రిపేరు చెప్పుకొని కాలం గడపువాడు వ్యర్థజన్ముడు. తండ్రికి కీర్తి తెచ్చేవాడు ఉత్తముడు ఇలాంటి విషయాలు యుక్తియుక్తంగా ఆసక్తిజనకంగా ఇందులో వివరించబడివున్నాయి.

శ్రుత్వా తత్పూజయేద్యస్తు పురాణం సప్తమం పునః ।
సర్వపాపవినిర్ముక్తః పునాత్యేవ నిజం కులమ్ ॥

అని ఫలశ్రుతి. ఇది విని దీనిని పూజించేవాడు సకలపాపవిముక్తుడై తన కులాన్ని పావనం చేస్తాడు.

8. అగ్నిపురాణం

అగ్నిదేవుడు వసిష్ఠమహర్షికి ఉపదేశించినదే అగ్నిపురాణం. ఇది విష్ణుదేవుని ఎడమపాదంగా వర్ణింపబడింది. ఇందులో 383 అధ్యాయాలు, 15,400 శ్లోకాలు ఉన్నాయి.

దశావతారాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మరియు రామాయణ మహాభారతాలలోని కొన్ని ఘట్టాలు ఇందులో కనిపిస్తాయి.

దేవాలయ నిర్మాణం, సాలగ్రామలక్షణాలు, సూర్యపూజ, శివపూజ, వాస్తుపూజ, చతురాశ్రమధర్మాలు ఈ పురాణంలో పేర్కొనబడివున్నాయి. పలురకాల వ్రతాలు, రాజధర్మాలు, స్వప్న ఫలితాలు, స్త్రీ పురుష లక్షణాలు, ఆయుర్వేద విషయాలు, అద్వైతవేదాంతతత్త్వం ఇత్యాదిగా గల పలువిషయాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

కూర్మావతారవర్ణన సందర్భంలో విష్ణువు దేవతలకు ఎలా ఉపకరించాడో ఇక్కడ మనోజ్ఞంగా చెప్పడమయింది.

ఇక రామాయణ ఘట్టాలలో సుగ్రీవుడు సీతాన్వేషణ విషయంలో అశ్రద్ధ చూపినప్పుడు రాముడతనికి పంపిన తీక్ష్ణపదజాలంతో కూడిన సందేశం పాఠకులలో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. రామాయణంలో సీతాపహరణకు రావణుడు మారీచుణ్ణి ప్రేరేపించినప్పుడు మారీచుడు చెప్పిన ఈ క్రిందిశ్లోకం గమనార్హం.

రావణాదపి మర్తవ్యం మర్తవ్యం రాఘవాదపి ।
అవశ్యం యది మర్తవ్యం వరం రామాన్న రావణాత్ ॥

“రావణుని ఆజ్ఞ పాటించకుంటే అతనినుండి చావు తప్పదు. పాటిస్తే రామునిచేత మరణం తప్పదు. రావణునికన్న రామునిచేత మరణించడమే మేలు” అని భావం. ఇలా రామాయణభారతాదులలోని కొన్ని ఘట్టాలు ఈ పురాణాల్లో కనిపిస్తాయి.

భగవంతు డనే పదానికి ఈ క్రింది శ్లోకంలో ఇచ్చిన నిర్వచనం అర్థవంతంగా ఉంది.

ఉత్పత్తిం ప్రళయం చైవ భూతానామాగతిం గతిమ్ ।
వేత్తి విద్యామవిద్యాం చ స వాచ్యో భగవానితి ॥

సృష్టిస్థితిలయాలు, జీవుల జననమరణాలు, విద్యా విద్యల స్వరూపం సమగ్రంగా ఎరిగినవాడే భగవంతుడు.

ఇక దేవాలయ నిర్మాణానికి చెందిన విశేషాలు కూడా ఈ పురాణంలో లభిస్తున్నాయి. ఆలయనిర్మాణం వల్ల బ్రహ్మహత్యాది దోషాలు కూడా తొలగిపోతాయని చెప్పడం విశేషం.

ఈ పురాణంలో కథలకు అంతగా ప్రాముఖ్యం లేదు కాని విద్యలు, పదార్థ లక్షణాలు, శుభాశుభస్వప్నాలు, శకునాలు, ఇవి మొదలుగాగల అనేక విషయాలు నిరూపింపబడి వున్నాయి. వివిధ శాస్త్రాలకు చెందిన విషయాలు ఇందులో ఉండడం వల్ల ఇదొక విశిష్టమైన పురాణంగా ప్రశంసింపబడుతున్నది. దీని ఫలశ్రుతి యిది–

'ఆగ్నేయం పఠితం ధ్యాతం శుభం స్యాద్భుక్తిముక్తిదమ్'

ఈ ఆగ్నేయ పురాణాన్ని చదివినా, ధ్యానించినా భుక్తిముక్తులు చేకూరుతాయని, శుభం కలుగుతుందని చెప్పడమయినది.

9. భవిష్యపురాణం

విష్ణుదేవుని కుడిమోకాలితో పోల్చబడిన ఈ పురాణంలో 14,500 శ్లోకాలున్నాయి. ఇందలి అధ్యాయాల సంఖ్య 585.

సృష్టివివరణ, పురాణాల ఉత్పత్తి, షోడశసంస్కారాలు. సావిత్రీమాహాత్మ్యం, స్త్రీలక్షణాలు, వివిధ వ్రతాలు ఇందులో వివరించడమయినది. రథసప్తమీ మాహాత్మ్యం, సూర్యుని ప్రభావం, ప్రతిమాలక్షణాలు, ధర్మస్వరూపం, జీమూతవాహనాదుల చరిత్రలు, అన్నదానప్రశస్తి మున్నగు విషయాలు అతివిస్తృతంగా ఇందులో వర్ణించడం జరిగింది.

భర్తపట్ల భార్య, భార్యపట్ల భర్త ప్రవర్తించవలసిన తీరుతెన్నులు చక్కగా ప్రతిపాదింపబడినాయి. సూర్యప్రభావవర్ణనా సందర్భంలో రాజు, దొంగలు, గ్రహాలు, పాములు, పేదరికం, దుఃఖాలు–ఇవేవీ సూర్యానుగ్రహం పొందిన వారిని బాధించవు అని చెప్పడం విశేషం.

ఇక జీవితంలో అతిముఖ్యమైన వివాహాన్ని గురించి వివరిస్తూ సమస్థాయిగలవారిలో జరిగే వివాహాలు శుభకరాలని, తదితరవివాహాలు దుఃఖదాయకాలని ఈ పురాణం చెప్పింది. స్మృతులలో పేర్కొనబడిన వివిధ వివాహభేదాలు ఇందులో ప్రతిపాదింపబడివున్నాయి. సామాజిక జీవితంలో అత్యావశ్యకాలైన వివాహాది విషయాలను ఈ పురాణంలో ప్రతిపాదించడంవల్ల సంఘశ్రేయస్సుపట్ల పురాణకర్తకు కల అభినివేశమెట్టిదో వ్యక్తమవుతున్నది.

అన్నదాన ప్రాశస్త్యాన్ని పేర్కొంటూ–

"అన్నం వై ప్రాణినాం ప్రాణా అన్నమోజో బలం సుఖమ్ ।
ఏతస్మాత్కారణాత్సద్భిరన్నదః ప్రాణదః స్మృతః ॥

ప్రాణులకు అన్నమే ప్రాణం. అన్నమే ఓజస్సు, బలం, సుఖం. అందుచేత అన్నదాత ప్రాణదాతగా పేర్కొనబడినాడు. ఈ పురాణంలో మరొక విశేషం విక్రమాదిత్యుడికీ, బేతాళునికీ సంబంధించిన కథలు. ఈ కథలు మిక్కిలి లోకప్రసిద్ధి వహించాయి. కథలలో జీవితంలో ఎదురయ్యే గడ్డు సమస్యలను పరిష్కరించే నైతికసూత్రాలు మనోజ్ఞంగా నిరూపింపబడివున్నాయి.

ఈ పురాణానికి ఫలశ్రుతిని వివరిస్తూ గ్రంథకర్త ఇలా అన్నాడు–

యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే మానవో నృప! ।
అశ్వమేధఫలం ప్రాప్య గచ్ఛేద్భానుం న సంశయః ॥

ఈ పురాణం వింటే సకలపాపవిముక్తి చేకూరుతుంది. అశ్వమేధయాగ ఫలం లభిస్తుంది. చివరికి సూర్య సాయుజ్యప్రాప్తి కలుగుతుంది.

10. బ్రహ్మవైవర్తపురాణం

సావర్ణిమనువు నారదమునీంద్రునికి చెప్పిన పురాణమిది. ఇందులో వరాహమూర్తికి, శ్రీకృష్ణునికి సంబంధించిన విషయాలు ప్రధానంగా ప్రతిపాదించబడివున్నాయి. ఈ పురాణం శ్రీమహావిష్ణువుయొక్క ఎడమ మోకాలుగా కీర్తింపబడింది.

బ్రహ్మఖండం, ప్రకృతిఖండం, గణేశఖండం, శ్రీకృష్ణఖండమని నాలుగు ఖండాలుగా ఇది విభజింపబడివున్నది. అన్ని ఖండాలలోను కలిపి మొత్తం 18,000వేల శ్లోకాలున్నాయి. **'సారభూతం పురాణేషు బ్రహ్మవైవర్తముచ్యతే'** అన్నట్లు ఈ పురాణం పురాణా లన్నింటికీ సారభూతమైనదిగా ప్రశస్తి పొందింది.

బ్రహ్మఖండంలో పరబ్రహ్మవర్ణన చేయబడింది. ప్రకృతిఖండంలో దుర్గాదేవి మున్నగు స్వరూపాలతో ప్రకృతి ఆవిర్భవించడం నిర్దేశించబడింది. గణేశఖండంలో వినాయక చరిత్ర నిబద్ధమైనది. శ్రీకృష్ణఖండంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మస్థాపన మొదలగు అంశాలు పేర్కొనబడ్డాయి.

అతిథిని పూజించవలసిన అవశ్యకతను వివరిస్తూ ఈ పురాణం చెప్పిన విషయమిది-

అపూజితోఽతిథిర్యస్య భవనాద్వినివర్తతే ।
పితృదేవాగ్నయః పశ్చాద్గురవో యాన్త్యపూజితాః ॥

ఏ గృహస్థుని యింట అతిథి ఆదరింపబడడో ఆ యింటినుండి పితరులు, దేవతలు, అగ్నిదేవుడు, గురువులు పూజలను తిరస్కరించి వెళ్ళిపోతారని భావం.

ఇక జన్మకారణమైన తండ్రితోపాటు విద్యాదాత, అన్నదాత, భయమునుంచి కాపాడినవాడు, కన్యాదాత- ఈ నలుగురు కూడ తండ్రులుగానే పేర్కొనబడ్డారు. అట్లే సేవకుడు, శిష్యుడు, పోషితుడు, ఔరసుడు, శరణాగతుడు- ఈ ఐదుగురు పుత్రులుగానే పరిగణింపదగి ఉన్నారు.

ఈ గ్రంథంలో మొదటి పురుషార్థమైన ధర్మముయొక్క ప్రాశస్త్యం ఈ క్రిందివిధంగా ఉగ్గడింపబడింది-

నాస్తి ధర్మాత్పరో బన్ధుర్నాస్తి ధర్మాత్పరం ధనమ్ ।
ధర్మాత్ప్రియతరః కో వా స్వధర్మం రక్ష యత్నతః ॥

"ధర్మంకంటే శ్రేష్ఠుడైన బంధువు లేడు. మేలైన ధనం లేదు. ధర్మంకంటే ప్రియతరమైన దేదీ లేదు. కాన ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించాలి." అని భావం. అట్లే మరొక చోట గురువులో సకలదేవతలూ ఉన్నారని గురుమహిమ ప్రశంసింప బడినది.

పై విషయాలతోపాటు భగవంతుని స్వరూపం, సరస్వతీపూజ, భూదానప్రాశస్త్యం, గంగావతరణం, సంక్షిప్త రామాయణం, తులసీమాహాత్మ్యం, దుర్గోపాఖ్యానం మొదలైన విషయాలు కూడా ఈ పురాణంలో వివరింపబడి వున్నాయి.

ఈ గ్రంథంలో పేర్కొన్న కథలలో ముఖ్యంగా పేర్కొనదగినది వేదవతీ చరిత్ర. కృతయుగంలో వేదవతిగా, త్రేతాయుగంలో సీతగా, ద్వాపరయుగంలో ద్రౌపదిగా వేదవతిని పురాణం వర్ణించింది. తదుపరి పురాణాల కథలలో ఈ వేదవతియే పద్మావతిగా అవతరించి విష్ణుని రూపాంతరమైన వేంకటేశ్వరుణ్ణి చేపట్టినట్లు చెప్పడమయినది.

కశ్యపమహర్షిమానసపుత్రిక జరత్కారువుయొక్క స్తుతి కూడా ఈ పురాణంలోనే లభిస్తున్నది.

శుభదం పుణ్యదం చైవ విఘ్ననిఘ్నకరం పరమ్ ।
హరిదాస్యప్రదం చైవ పరలోకే ప్రహర్షదమ్ ॥

ఇత్యాదిగా ఈ పురాణ పఠనం శుభాన్నీ, పుణ్యాన్నీ, విఘ్నవినాశాన్నీ, హరిదాస్యాన్నీ, పరలోకంలో సంతోషాన్నీ ప్రసాదిస్తుంది అని చెప్పడమైనది.

11. లింగపురాణం

అగ్నిలింగంలో అంతర్గతుడైవున్న శివుడు ఉపదేశించినదే లింగపురాణం. ఇది విష్ణుదేవుని కుడిచీల మండతో పోల్చబడింది. శివుని ప్రభావాన్ని వర్ణించే ఈ పురాణంలో 11,000వేల శ్లోకాలున్నాయి. ఇది పూర్వార్ధమనీ, ఉత్తరార్ధమనీ రెండు భాగాలుగా ఉన్నది. పూర్వార్ధంలో 108, ఉత్తరార్ధంలో 55 కలిపి మొత్తం 163 అధ్యాయాలున్నాయి.

శివుని అవతారాలను ఈ పురాణం విరివిగా వర్ణిస్తున్నది. అందుచేత శైవులు ఈ పురాణాన్ని ప్రముఖంగా ఆదరిస్తారు. అష్టాంగయోగ సహితమైన శివారాధన, విష్ణువు కావించిన శివస్తోత్రం, బ్రహ్మజననం, లింగార్చనావిధానం, శివునికి చెందిన మానసపూజ, యుగ ధర్మాలు, సప్తద్వీపాలు, సప్తసాగరాలు, దిక్పాలకుల నగర వర్ణన, చంద్రవంశరాజుల వృత్తాంతం, త్రిపురాసురసంహారం, కైలాసగిరివర్ణన, సదాచారం ఇత్యాదిగా పలు విషయాలు ఈ పురాణంలో అతివిస్తృతంగా ప్రతిపాదింపబడివున్నాయి.

ఇందలి ఉత్తరార్ధంలో పృథివి, జలం, అగ్ని, వాయువు మొదలగు అష్టవిధాలైన శివుని మూర్తుల వివరణ వున్నది. శివభక్తిని ప్రతిపాదించే కథలు కూడా ఈ పురాణంలో చోటు చేసుకొనివున్నాయి.

మృత్యువు సమీపించిన శ్వేతుడు అనే శివభక్తుడు శివుని అనుగ్రహంచేత మరణంనుంచి తప్పించుకొనిన కథ శివారాధనవల్ల కలిగే ఫలితాన్ని వివరిస్తున్నది.

ఇక కాశీక్షేత్రమహిమ ఇందులో విస్తారంగా ప్రతిపాదితమయింది.

కామం భుంజన్ స్వపన్ క్రీడన్ కుర్వన్హి వివిధాః క్రియాః ।
అవిముక్తే త్యజేత్ ప్రాణాన్ జంతుర్మోక్షాయ కల్పతే ॥

భుజిస్తూ, నిద్రిస్తూ, క్రీడిస్తూ, యథేచ్ఛగా వివిధక్రియలాచరిస్తూ కూడ ఈ క్షేత్రంలో మరణిస్తే మోక్షం సిద్ధిస్తుందని ఇందులో చెప్పడమయినది.

అష్టదిక్పాలకులుగా ఇంద్రాదులు ప్రసిద్ధులు. వారు నివసించే నగరాలు క్రమంగా 1. అమరావతి 2.తేజస్విని 3.వైవస్వతి 4.కృష్ణవర్ణ 5. శుద్ధవతి, 6.గన్ధవతి 7.అలక 8.యశోవతి – అనేవి ఈ పురాణంలో పేర్కొనబడ్డాయి.

ఇది శైవపురాణం కాన శివపూజామాహాత్మ్యాన్ని ఘనంగా కీర్తిస్తున్నది. శివానుగ్రహంతోనే పరాశరుడు ఎన్నడో మరణించిన తన తండ్రిని, పినతండ్రులను చూస్తాడు. ఇట్టి విశిష్టమైన కథలతోను, వర్ణనలతోనూ సాగిపోయే లింగపురాణం చాలా ప్రభావోపేతమైనది.

మంచినీతులు చెప్పిన సందర్భాలు కూడా ఈ పురాణంలో లేకపోలేదు. భోగాశను నిరోధించాలనీ, విషయ విచారణచేత అది సాధ్యమనీ, మనోవాక్కాయాలతో వైరాగ్యాన్ని పాటించాలనీ చెప్పే ఈక్రింది శ్లోకం గమనార్హం–

భోగేన తృప్తిర్నైవాస్తి విషయాణాం విచారతః ।
తస్మాద్విరాగః కర్తవ్యః మనసా కర్మణా గిరా ॥

ఈ పురాణపఠన ప్రయోజనాన్ని ఈ క్రిందిశ్లోకం ఇలా చెప్పింది–

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి లైంగం పాపహరం నరః ।
స భుక్తభోగో లోకేఽస్మిన్నన్తే శివపురం వ్రజేత్ ॥

పాపహరమైన ఈ పురాణాన్ని చదివేవారు, వినేవారు ఈ లోకంలో ఉన్నంతకాలం సకల భోగాల ననుభవించి కడపట కైలాసం చేరుకోగలరు.

12. వరాహపురాణం

వరాహావతారధారియైన విష్ణుదేవుడు భూదేవికి చెప్పిన పురాణమే వరాహపురాణం. ఇందులో 24వేల శ్లోకాలున్నాయి. విష్ణువుయొక్క ఎడమ చీలమండతో ఈ పురాణాన్ని పోల్చడమయింది. ఇందలి అధ్యాయాల సంఖ్య 215.

నానావిధ సృష్టులు, నారదమునీంద్రుని పూర్వజన్మచరిత్ర, విష్ణుభగవానుని అష్టమూర్తులు, ధర్మవ్యాధుని చరిత్ర, దక్షయాగధ్వంసం, పార్వతీజననం, వినాయకుని పుట్టుక, వివిధవ్రతాలు, వాటి ఫలితాలు, నాలుగు యుగాలు, అన్నదానప్రాశస్త్యం, వరాహస్వామి భూదేవిని ఉద్ధరించడం, నాచికేతుని వృత్తాంతం ఇత్యాదిగా పలువిషయాలు ఈ పురాణంలోని అంశాలుగా ఉన్నాయి.

అష్టాదశపురాణాల క్రమమూ, వివరణ గూడా ఇందులో నిర్దేశింపబడివున్నది. మహావిష్ణువు తన భక్తులకు అంగరక్షకుడై ఉంటాడన్న విషయం ఈ గ్రంథంలో చెప్పడమయింది.

శ్రీకృష్ణుడు గీతలో **'మమ మాయా దురత్యయా'** అని అంటాడు. 'నామాయ దాటరానిది' అని దీని అర్థం. భూదేవి 'మాయ' అంటే ఏమిటి? దాని స్వరూపం వివరించుమని విష్ణువును అడుగుతుంది. అందు కాదేవుడు తన మాయాస్వరూపాన్ని ఈ పురాణంలో అతి విస్తృతంగా వివరిస్తాడు.

లోకంలో తరచు సంభవించే అతివృష్టి, అనావృష్టి మున్నగు విపరీత సంఘటనలు, మాయవల్లనే కల్గుతున్నాయనీ, సృష్టిలో క్రమబద్ధంగా జరిగే సూర్యోదయాదులు, పంచభూతాల ప్రవర్తన, మాయాప్రభావం వల్లనే ఏర్పడుతున్నాయనీ ఇక్కడ చెప్పడమయింది.

దానాలన్నింటిలో అన్నదానం ప్రశస్తమయింది. అట్లే మనం వాడే వివిధములైన లోహాలతో నిర్మించబడిన పాత్రలలో రాగిపాత్రలు మేలైనవి అని ఈ పురాణం నిరూపించింది.

ఇంకా ఈ పురాణంలో వివిధతీర్థాల ప్రభావం గూడా వర్ణింపబడివున్నది. ఏ తీర్థాన్ని ఎప్పుడు సేవిస్తే మంచిదో ఇక్కడ వివరించబడివున్నది.

విష్ణుమందిరాలలో సేవలు చేసే వారికి గలిగే ఫలమేమి? అన్న భూదేవి ప్రశ్నకు విష్ణువు అట్టి వివిధ సేవాఫలాలను వివరంగా పేర్కొంటాడు. సకల జగత్తుకు సత్యమే ఆధారం కాన, సత్యాన్ని తప్పక పాటించాలన్న సంగతి ఇందులో చెప్పడమయింది.

ఇక కఠోపనిషత్తులో నాచికేతుని వృత్తాంతం ఇందులో రమ్యంగా ప్రతిపాదితమయింది. ఇంకా ఎన్నో కథాంశాలు ఈ పురాణంలో కనిపిస్తాయి.

శ్రుత్వా తు పూజయేద్యస్తు శాస్త్రం వారాహ సంజ్ఞితమ్ ।

సర్వపాపవినిర్ముక్తో విష్ణుసాయుజ్యమాప్రజేత్ ॥

అన్నట్లు దీన్ని ఎవరు శ్రవణం చేసి భక్తితో పూజిస్తారో, వారు సర్వపాపనిర్ముక్తులై విష్ణుసాయుజ్యం పొందుతారని ఫలశ్రుతి.

13. స్కాందపురాణం

స్కందుడనగా శివుని కుమారుడైన కుమారస్వామి. ఆ దేవుని పేరుతో ఈ పురాణం ప్రసిద్ధమయింది. శివుడు స్కందుణ్ణి ఉద్దేశించి చెప్పిన విషయమే ఈ స్కాందపురాణం. తండ్రినుండి విన్న ఈ పురాణాన్ని తరువాత స్కందుడు మునుల కుపదేశిస్తాడు.

'ఏకాశీతిసహస్రం తు స్కాందం సర్వాఘకృంతనం' – అన్నట్లు సకల పాపవిచ్ఛేదకమైన ఈ పురాణంలో 81,000 శ్లోకాలున్నాయి. దీన్ని బట్టి ఇతరపురాణాలకంటె ఇది ఆకృతిలో చాలా పెద్ద పురాణమని తెలుస్తున్నది.

మహావిష్ణుని వెంద్రుకలతో పోల్చబడిన ఈగ్రంథంలో మహేశ్వరఖండం, వైష్ణవఖండం, బ్రహ్మఖండం, కాశీఖండం, అవంతీఖండం, నాగరఖండం, ప్రభాసఖండం అని ఏడు ఖండాలున్నాయి.

మహేశ్వరఖండంలో కేదారఖండం, కౌమారీ ఖండం, అరుణాచలమాహాత్మ్యం మొదలైన అంశాలున్నాయి. వైష్ణవఖండంలో వేంకటాచల–జగన్నాథక్షేత్రాల మాహాత్మ్యం, బ్రహ్మఖండంలో సేతు మాహాత్మ్యం, ధర్మారణ్య, బ్రహ్మోత్తరఖండాలున్నాయి. కాశీఖండంలో కాశీక్షేత్రప్రభావం విస్తృతంగా వర్ణింపబడి వున్నది. నాగరఖండంలో వివిధ తీర్థాల వర్ణన ఉన్నది. విశ్వకర్మోపాఖ్యానాదికథలు గూడా ఉన్నాయి.

ప్రభాసఖండంలో ద్వారకానగరపరిసరాల ప్రభావం వివరించబడివున్నది. సంహితారూపంలో గూడా ఈ స్కాందపురాణం ప్రసిద్ధమైవున్నది.

సనత్కుమారసంహిత, సూతసంహిత, శంకరసంహిత, వైష్ణవసంహిత, బ్రహ్మసంహిత, సౌరసంహిత, అనేవే ఈ సంహితలు.

సూతసంహితలో శివోపాసనాప్రాముఖ్యం కీర్తింపబడివున్నది. కాశీక్షేత్రప్రభావాన్ని వర్ణించే కాశీఖండంలో అయోధ్యాదిక్షేత్రాలలో మరణించినవారు స్వర్లోకసుఖం అనుభవించి తరువాత కాశిలో జన్మించి అక్కడ ముక్తులవుతారని చెప్పడం విశేషం. **'కాశ్యాం తు మరణాన్ముక్తిః'** అన్న మాట గూడా ప్రసిద్ధం.

జీర్ణదేవాలయోద్ధరణ చేసేవారికి కలిగే ఫలాన్ని గూడా ఈ పురాణం వివరించింది. సత్యనారాయణ వ్రతస్వరూపం ఇందలి రేవాఖండంలో నిరూపితమయింది.

ఇంకను రామావతారం, క్షీరసాగరమథనం, గిరిజా కల్యాణం, కుమారోత్పత్తి, ఓంకారప్రభావం, 14 మంది మనువుల వర్ణన ఇత్యాద్యంశాలు ఇందులో గోచరిస్తాయి. అంతే కాక వనభోజనం, కార్తికవైభవం, ఉసిరిక విశిష్టత, ఇత్యాదివిషయాలు గూడా గమనింపదగివున్నాయి.

సర్వేషామేవ ధర్మాణాం గురుపూజా పరా మతా ।
గురుశుశ్రూషయా సర్వం ప్రాప్నోతి హి న సంశయః ॥

అన్ని ధర్మాలలోనూ గురుపూజ మేలైన ధర్మం. గురుసేవచేత అన్ని ఫలితాలూ పొందవచ్చు అని గురుసేవా ప్రాశస్త్యం పేర్కొనబడింది. రుద్రాక్ష మహిమ కథాకథన పూర్వాంకంగా ఇందులో వివరించబడింది.

పురాణ శ్రవణ ఫలాన్ని ఈ పురాణం 136 శ్లోకాలతో వివరించింది. జ్ఞానదీపాలుగా, భవరోగౌషధాలుగా పురాణాలిందులో కీర్తింపబడివున్నాయి.

14. వామనపురాణం

బ్రహ్మదేవుడు వామనావతార ప్రభావాన్ని కీర్తిస్తూ చెప్పినదే వామనపురాణం. మహావిష్ణుని చర్మంతో దీన్ని పోల్చారు. ఇందలి శ్లోకాలు పదివేలు, అధ్యాయాలు 95.

వైష్ణవధర్మ ప్రతిపాదకమైన ఈ పురాణంలో విష్ణుమందిరాలు, విష్ణుభక్తుల వృత్తాంతాలు అధికంగా కనిపిస్తాయి. ఉత్పత్తి ప్రళయాలు, కామదహనం, ప్రహ్లాదవరదానం, దేవీమాహాత్మ్యం, నానావిధ తీర్థాలు, వినాయక విజయం ఇత్యాద్యంశాలు ఈ పురాణంలో వర్ణించబడివున్నాయి.

వివిధ దేవతలకు చెందిన 25 స్తోత్రాలు ఈ పురాణంలో లభిస్తాయి. దేవతలలో మహావిష్ణువు, ఆయుధాలలో సుదర్శనం, పక్షులలో గరుడుడు, సర్పాలలో వాసుకి, ఈ రీతిగా ఆయా వర్గాలలో మేలైనవారినీ, వస్తువులను కీర్తించే ఇందలి ఘట్టం ఆసక్తి జనకంగా ఉంటుంది.

లోకంలో ఎన్నో పాపాలున్నాయి, కాని అన్నింటినీ మించిన పాపం కృతఘ్నత్వమని ఈ పురాణం చెబుతున్నది.

నిత్యమూ ఉదయం లేవగానే త్రిమూర్తులు, గ్రహాలూ, సప్తర్షులూ, సప్తలోకాలూ తనకు శుభావహాలు కావాలని ప్రార్థించాలని ఈ గ్రంథం బోధిస్తున్నది.

జీవితంలో ఎన్ని విపత్తు లెదురైనా, షండుడు, మార్జారుడు, ఆఖువు, కుక్కుటుడు, పతితుడు, అపవిద్ధుడు, నగ్నుడు, చండాలుడు, అధముడు–ఇట్టివారిని ఆశ్రయించరాదని ఇందులో చెప్పడమయింది.

మనుజుడు అవశ్యం ఆచరించవలసిన సదాచారాలను 122 శ్లోకాలలో ఈ పురాణం వివరించింది.

పుత్రుడు – శిష్యుడు–వీరిరువురిలో శ్రేష్ఠు డెవరు? అన్న ప్రశ్నకు ఇందులో బ్రహ్మ పుత్రునికంటె శిష్యుడే శ్రేష్ఠుడని సమాధానం చెబుతాడు.

పున్నామ్నో నరకాత్త్రాతి పుత్రస్తేనేహ గీయతే ।
శిష్టపాపహరశ్శిష్య ఇతీయం వైదికీ శ్రుతిః ॥

'పుత్' అనే నరకం నుండి మాత్రమే రక్షించువాడు పుత్రుడు కాగా తక్కిన సకలపాపాలనుండీ కాపాడేవాడు శిష్యుడని భావం.

పాపాలను దూరం చేసుకొనే విధానాన్ని ప్రతిపాదిస్తూ దానికి ఉదాహరణంగా ఇందులో కోశకారుని వృత్తాంతం చక్కగా వర్ణించబడింది. పూర్వజన్మకృతపాపాలు తరువాతి జన్మలో స్మరణకు వస్తాయని ఈ కథ ద్వారా తెలుస్తున్నది.

యే పఠంతి చ శృణ్వంతి తేఽపి యాన్తి పరాం గతిమ్ ।

అన్నట్లు ఈ వామనపురాణం చదివేవారు, వినేవారు ఉత్తమగతిని పొందుతారని ఫలశ్రుతి.

15. కూర్మపురాణం

17000 శ్లోకాలు గల కూర్మపురాణం విష్ణువు యొక్క పృష్ఠంగా వర్ణించబడింది. పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు విభాగాలుగా ఉన్న ఈ పురాణంలో 53+46=99 అధ్యాయాలున్నాయి.

కూర్మరూపంలో ఉన్న విష్ణుదేవుడు మహర్షుల నుద్దేశించి చెప్పిన పురాణమిది. లక్ష్మి ఇంద్రద్యుమ్నుల సంవాదం, విష్ణువు–మహర్షులకు జరిగిన సంవాదం, సృష్టివిధానం, వర్ణాశ్రమాలు, భృగువంశవర్ణన, యుగధర్మాలు, కాశీప్రయాగక్షేత్రాల మాహాత్మ్యం, సదాచారాలు, ద్వాదశాదిత్యుల వర్ణన–ఇత్యాదిగా గల అనేకాంశాలు ఈ పురాణంలో ఉన్నాయి.

మరీచి, భృగువు, అంగిరసుడు, పులస్త్యుడు. పులహుడు, క్రతువు, దక్షుడు, అత్రి, వసిష్ఠుడు–అనే తొమ్మిదిమంది బ్రహ్మపుత్రులుగా ఇందు పేర్కొనబడినారు. మొదటికాలంలో ప్రజలు సుఖసంతోషాలతో వుండేవారనీ, క్రమంగా రాగద్వేషాలు కారణంగా ప్రజలకు దుఃస్థితి ఏర్పడిందనీ ఈ పురాణం చెబుతున్నది.

ధర్మం ఆచరణీయమనీ, ధర్మంవల్లనే తక్కిన పురుషార్థాలు సిద్ధిస్తాయనీ ఈ పురాణం పేర్కొంటున్నది.

ధర్మాత్సంజాయతే హ్యర్థో ధర్మాత్కామోఽభిజాయతే ।
ధర్మ ఏవాపవర్గాయ తస్మాద్ధర్మం సమాశ్రయేత్ ॥

అనగా ధర్మంనుంచే అర్థ,కామ,మోక్షాలు సిద్ధిస్తాయి. కాన ధర్మాన్ని ఆశ్రయించాలి అని భావం.

శివకేశవులకు భేదం లేదని భక్తులు ఏఏరూపాలను ఆరాధిస్తారో భగవంతుడు ఆయా రూపాలతోనే వారిని అనుగ్రహిస్తాడని ఈ పురాణంలో చెప్పిన విషయం భగవద్గీతలోని

'యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహం' అనే వచనానికి అనుగుణంగా ఉన్నది.

స్వధర్మాన్ని త్యజించి చేసే తీర్థయాత్రలవల్ల ప్రయోజనం శూన్యమనీ, దేవాలయాదులను మిక్కిలి పరిశుభ్రంగా ఉంచాలనీ, మూత్రవిసర్జనాదులతో అపరిశుద్ధం చేయరాదనీ, అలాచేయడం పాపహేతువనీ ఈ పురాణం హెచ్చరిస్తున్నది. పుణ్యక్షేత్రాల ప్రాశస్త్యం ఇందులో చక్కగా వివరించబడింది.

వేదాన్ని విభజించేవారు వేదవ్యాసు లనబడతారు. అట్టివారు 26మంది ఉన్నారనీ పరాశరపుత్రుడైన కృష్ణద్వైపాయనుడు చివరివాడనీ ఈ పురాణం చెప్పిన విషయం గమనార్హమై ఉన్నది.

ఇంకను సమాజంలో వున్నవారి కర్తవ్యాలు, గురువులవద్ద ఉండవలసిన తీరుతెన్నులు, పాపాత్ములతో చేసే సాంగత్యంవల్ల కలిగే దోషాలు-ఇత్యాది విషయాలు మిక్కిలి ఆసక్తిదాయకంగా ఈ పురాణంలో చెప్పడమయినది.

ఇందులో వామనావతారానికి సంబంధించిన చరిత్ర చాలా చక్కగా నిరూపించబడివున్నది. భక్తిప్రధానమైన దుర్జయు డనేవాని కథవంటి కొన్ని కథలు పాఠకులకు చక్కని చైతన్యం కలిగిస్తాయి. అట్టివి ఇందులో పలుకథలు వున్నాయి.

ఏతత్కూర్మపురాణం తు చతుర్వర్గఫలప్రదమ్ ।
పఠతాం శృణ్వతాం నృణాం సర్వోత్కృష్టగతిప్రదమ్ ॥

ఈ పురాణం చదివేవారికి, వినేవారికి చతుర్వర్గ ఫలాలు సిద్ధిస్తాయి. సర్వోత్కృష్టగతి కూడా కలుగుతుంది.

16. మత్స్యపురాణం

మహావిష్ణువు మత్స్యరూపుడై వైవస్వతమనువు నుద్దేశించి చెప్పిన పురాణమిది. విష్ణువుయొక్క మెదడుతో దీన్ని పోల్చడమైనది. ఇందులో 14.000 వేల శ్లోకాలున్నాయి. మొత్తం అధ్యాయాల సంఖ్య 283.

ఇందలి ముఖ్య విషయాలివి-మత్స్యావతారవర్ణన, అజాండసృష్టి, సూర్యచంద్రవంశాలు, గయాక్షేత్రవర్ణన, పురూరవుని చరిత్ర, కచదేవయానుల కథ, కార్తవీర్యార్జునుని వృత్తాంతం, కలిధర్మాలు మరియు కృష్ణాష్టమి, అక్షయ తృతీయ, కల్యాణసప్తమి మున్నగు పలువ్రతాల వర్ణన, సప్తద్వీపాల వివరణ, త్రిపురాసురవృత్తాంతం, తారక వృత్తాంతం మున్నగు విషయాలే కాక రాజధర్మాలు, చతుర్విధ దండోపాయాలు, స్వప్నఫలాలు, వామన వరాహావతారాల వర్ణన ఇత్యాదిగా గల విషయాలు ప్రతిపాదితాంశాలై వున్నాయి.

పుట్టిన ప్రతివాడూ పురుషార్థసాధనకై ప్రయత్నించాలి. అలా చేయనివాని జన్మ వ్యర్థమని ఈ పురాణం నొక్కి వక్కాణిస్తున్నది.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయే త్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథా భూతమజన్మా తు విశిష్యతే ॥

శ్రాద్ధకాలంలో పితృదేవతలకు అన్నపానాదులు సమర్పించడాన్ని గూర్చిన విశేషవివరణ యిందులో కనిపిస్తున్నది. శ్రాద్ధ కర్మలు అవశ్యాచరణీయాలని ఇక్కడ పేర్కొనడమైనది.

ఇక కాలమానం గురించి ప్రస్తావిస్తూ బ్రహ్మ, శివుడు, విష్ణువు అను త్రిమూర్తులకు చెందిన వివిధ కాలమానాల విశ్లేషణ ఇందులో చేయబడింది.

1.భృగువు 2.అత్రి 3. వసిష్ఠుడు 4. విశ్వకర్మ 5.మయుడు 6. నారదుడు 7. నగ్నజిత్తు 8. విశాలాక్షుడు 9. పురందరుడు 10. బ్రహ్మ 11. కుమారుడు 12.నందీశుడు 13.శౌనకుడు 14. గర్గుడు 15. వాసుదేవుడు 16. అనిరుద్ధుడు 17. శుకుడు 18. బృహస్పతి అనే ఈ పదునెనిమిది మంది వాస్తుశాస్త్రోపదేశకులుగా ఇందులో పేర్కొనబడినారు.

తల,లలాటం మున్నగు అవయవాల కదలికవల్ల కలిగే ఫలాన్ని కూడా భగవంతుడు ఈ పురాణంలో చెప్పియున్నాడు.

ఇక పితృశ్రాద్ధంవల్ల కలిగే ఫలాన్ని వివరించే కౌశికుడనే విద్యావంతుడు, అతని ఏడుగురు కుమారులకు చెందిన విస్తృతమైన కథ ఇందులో కనిపిస్తున్నది. భక్తిశ్రద్ధలతో ఆచరించిన పితృశ్రాద్ధం గోహత్యను కూడా పోగొడుతుందని ఈ కథలో నిరూపితమయినది. బ్రహ్మదత్తుని కథలో ఆడు చీమ, మగ చీమలమధ్య జరిగే సంభాషణ ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నది.

పతివ్రతల ప్రభావం గురించి చెప్పే ఈ క్రింది శ్లోకం వారిపట్ల గౌరవంతో వుండాలని హెచ్చరిస్తున్నది.

పతివ్రతానాం వచనం ప్రకృష్టం తాసాం తు వాక్యం భవతీహ మిథ్యా ।
న జాతు లోకేషు చరాచరేషు తస్మాత్సదా తాః పరిపూజనీయాః ॥

పతివ్రతల మాట శ్రేష్ఠమైనది. ఎప్పుడును వారి మాట మిథ్య కాదు. అందువల్ల వారు సదా పూజింపదగినవారు.

ఇక ఫలశ్రుతి –
అస్మాత్పురాణాదపి పాదమేకం పఠేత్తు యస్సోఽపి విముక్తపాపః ।
నారాయణాఖ్యం పదమేతి నూనమనంగవద్దివ్యసుఖాని భుంక్తే ॥

ఈ పురాణంలో ఒక్క పాదం చదివినా పాపనివృత్తుడై వైకుంఠం పొందగలడని, సకల దివ్యసుఖాలు అనుభవింపగలడని ఫలశ్రుతి చెబుతున్నది.

17. గరుడపురాణం

విష్ణువాహనమైన గరుడుడు అడిగిన ప్రశ్నలకు విష్ణుదేవుడు చెప్పిన సమాధానాలే గరుడపురాణం, ఇందులో 19వేల శ్లోకాలు గల పూర్వఖండం, ఉత్తరఖండం అనే రెండు ఖండాలున్నాయి.

పూర్వఖండంలో 229, ఉత్తరఖండంలో 35 కలిపి 264 అధ్యాయాలు గల పురాణమిది. విష్ణుదేవుని “మజ్జ” గా ఇది వర్ణించబడింది.

ఈ పురాణంలోని ఉత్తరఖండంలో ప్రేతకల్పం మిక్కిలి ప్రశస్తమైనది. మరణానంతరం జీవుని స్థితిగతులను విస్తృతంగా వివరించే ఘట్టమిది. అందువల్లనే మరణించిన వానియింట పదవ దినంలోగా ఈ పురాణాన్ని పఠించే సంప్రదాయమేర్పడింది.

గరుడపురాణం కేవలం యమలోకవృత్తాంతాన్ని మాత్రమే చెబుతుందని కొందరు భావించడం కద్దు. ఈ భావన తగదు. ఇందలి పూర్వఖండంలో ఈ క్రింద నిర్దేశించబడిన నానావిషయాలున్నాయి.

భగవదవతారాలు, సరస్వత్యుపాసన, విష్ణుదీక్ష, శివార్చనావిధి, సుదర్శనచక్ర పూజావిధానం, సూర్యార్చన, దేవతాప్రతిష్ఠ, నిత్యనైమిత్తిక కామ్యకర్మల వివరణ, పాపప్రాయశ్చిత్తవిధి, నవరత్నాల పరీక్ష, వివిధములైన వ్రతాలు, ఆయుర్వేద వైద్యవిధానాలు మున్నగు అనేక విషయాలు ఈ పురాణంలో గోచరిస్తాయి. పశువుల చికిత్సా విధానం కూడా ఇందులో నిర్దిష్టమైయున్నది.

మానవజీవితానికి అత్యవసరమైన పలు నీతులు గూడా ఈ గ్రంథంలో పేర్కొనబడివున్నాయి. యజమానులు నిష్కారణంగా సేవకులను నిందించరాదన్న ఉపదేశం ఇందులో ఉన్నది. ధనం, జ్ఞానం, రూపం, మిత్రులు–వీరి స్వభావా లెలా ఉండాలో ఇందులో సూచించబడింది.

అర్థేన కిం కృపణహస్తగతేన పుంసాం జ్ఞానేన కిం బహుశఠాకుల సంకులేన ।
రూపేణ కిం గుణ పరాక్రమవర్జితేన మిత్రేణ కిం వ్యసనకాలపరాఙ్ముఖేన ॥

కృపణుని చేతి ధనం, మొండి మనిషికి గలజ్ఞానం, గుణపరాక్రమాలులేని రూపం, వ్యసనకాలంలో కనిపించని మిత్రుడు ఉండీ ప్రయోజనం లేదని భావం. కష్టకాలంలో పరిచితవ్యక్తులు సైతం ఎలా తప్పించుకొంటారో సోదాహరణంగా ఈ పురాణం వివరించింది. గృహంలో వుంటూనే ముక్తిని సాధించే విధానం గూడా చెప్పడమయింది.

గరుడ పురాణంలో ఎన్నో కథలున్నాయి. కథలకంటె ఇందలి నీతివచనాలు మనోజ్ఞాలు. ఉదాహరణకు వేలకొలది గోవులలో దూడ తన తల్లిని గుర్తించి అనుసరించినట్లు మనమెంత దూరంగా ఉన్నా మనకర్మ మనల్ని విడువక వెంటాడుతూ వుంటుందని నీతిబోధ.

హయగ్రీవ పూజావిధి, పంచమహాయజ్ఞాలు, రాజలక్షణాలు, సేవకలక్షణాలు, రోగనివారణోపాయాలు మున్నగునవి కూడా ఈ పురాణంలో చూడవచ్చు.

'కీర్తితం పాపశమనం పఠతాం శృణ్వతాం నృణామ్' అనగా ఈ పురాణం చదివేవారు, వినేవారు సకల పాపాల నుండి విడుదల పొందుతారని దీనికి ఫలశ్రుతి చెప్పబడింది.

18. బ్రహ్మాండ పురాణం

బ్రహ్మదేవుని సృష్టిని వివరించే పురాణమిది. "బ్రహ్మాండం చాస్థి గీయతే" అన్నట్లు విష్ణువుయొక్క ఎముకలుగా ఇది పేర్కొనబడింది. ఇందులో 12,000 శ్లోకాలున్నాయి. బ్రహ్మాండపురాణం పూర్వభాగం, మధ్యభాగం, ఉత్తరభాగమని మూడు భాగాలుగా వున్నది. పూర్వభాగంలో 38, మధ్యభాగంలో 74, ఉత్తర భాగంలో 44, మొత్తం కలిపి 156 అధ్యాయాల గ్రంథమిది. రోమహర్షణుడనే ముని కురుక్షేత్రంలో ఋషులకు చెప్పిన పురాణమిది.

ప్రక్రియాపాదం, అనుషఙ్గపాదం, ఉపోద్ఘాతపాదం, ఉపసంహారపాదమని నాలుగు భాగాలుగా ఈ పురాణం విభజింపబడింది. నైమిశారణ్యవర్ణన, చతుర్ముఖబ్రహ్మ వర్ణనం, వరాహావతారం మున్నగు విషయాలు ప్రక్రియాపాదంలో కనిపిస్తాయి.

తరువాతి పాదంలో చతురాశ్రమ ధర్మాలు, మునుల జన్మవృత్తాంతం, దక్షుడు గావించిన శివనింద, సతీదేవి అగ్నిప్రవేశం, దక్షుడు, శంకరుడు పరస్పరం శపించుకొనడం, ప్రియవ్రతవర్ణన మున్నగు విషయాలతో పాటు సప్తద్వీపాల వర్ణన, సూర్యుని మహిమ, సూర్యుని అధీనంలో ఉండి ఇతర గ్రహాలు సంచరించడం, రాత్రింబవళ్ళు, మాసాలు, ఋతువులు, సంవత్సరాలు, యుగాలు అనబడే కాలానికి సూర్యుడే మూలకారణమని నిరూపించడం, లింగజననం, యుగధర్మాలు, మొదలగు విషయాలు ఇందులో కనిపిస్తాయి.

మూడవదైన ఉపోద్ఘాతపాదంలో సప్తర్షులజననం, నృసింహావతార వర్ణన, కుమారసంభవం, పుణ్యప్రదేశవర్ణన, శ్రాద్ధాలకు ప్రశస్తమైన నదులు, తీర్థాలు, అన్నదానం, గయలో శ్రాద్ధం, మొదలగు విషయాలు నిరూపింపబడి వున్నాయి. పరశురాముని తపస్సు, జమదగ్నిని కార్తవీర్యార్జునుడు హతమార్చడం, జమదగ్నిపునర్జననం, సగర యయాతుల చరిత్ర మున్నగు విషయాలు కనిపిస్తాయి.

చివరిపాదంలో లలితాదేవి వర్ణన, కామాక్షీ మాహాత్మ్యం, దేవీదీక్ష, మొదలైన విషయాలు ఉన్నాయి. ఈ పురాణపఠనఫలం క్రింది విధంగా పేర్కొనబడింది.

య ఇదం కీర్తయేద్వత్స! శృణోతి చ సమాహితః ।
స విధూయేహ పాపాని యాతి లోకమనామయమ్ ॥

బ్రహ్మాండపురాణం పఠించేవాడు, ఏకాగ్రతతో వినేవాడు పాపరహితుడై సర్వోత్తమలోకాలను చేరుకుంటాడు అని భావం.

సముద్రాల లక్ష్మణయ్య
పూర్వ ప్రత్యేకాధికారి
పురాణేతిహాస ప్రాజెక్టు – తి.తి.దే.

మత్స్యపురాణం – ప్రథమభాగ కథాసారాంశం

పూర్వం నైమిశారణ్యంలో శౌనకాదిమునులు దీర్ఘ సత్రయాగం నిర్వహించారు. యాగానంతరం సూతుణ్ణి చూచి "భగవంతుడు ఈ చరాచరజగత్తు నెలా సృష్టించాడు? విష్ణువు మత్స్యరూపం ఎందుకు దాల్చాడు? శివుడు పురారిగా, భైరవుడుగా ఎందుకు రూపొందాడు? ఆ దేవునికి కపాలిత్వం ఎలా వచ్చింది?" అని ప్రశ్నించారు.

అంతట సూతుడు వారితో "పూర్వం విష్ణువు చెప్పిన మత్స్యపురాణవృత్తాంతం వివరిస్తాను, వినండి" అని చెప్పి ఇలా అన్నాడు–

మనువు పూర్వం ఉత్తమమైన తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మనగా 'ప్రళయంలో చరాచరప్రాణులను రక్షించే శక్తి ప్రసాదించు' మని అర్థించాడు. అతనికా వరం ప్రసాదించి బ్రహ్మ అంతర్హితుడయ్యాడు.

ఆ పై కొంతకాలానికి మనువు పితృతర్పణం చేస్తుండగా ఒక ఆడుచేప నీటితో కూడా ఆయన దోసిటపడింది. దానినతడు కమండలుజలంలో ఉంచగా అది 16 అంగుళాల పొడవు పెరిగింది. పిదప అంతకంతకు పెరిగి పెద్దదై, మట్టి పాత్రలో, బావిలో, మడుగులో, గంగానదిలో, చివరికి సముద్రంలో విడిచిపెట్టగా సాగరమంతా వ్యాపించింది.

మనువు "నీవెవరవు? నీవు మహావిష్ణుడవే కదా!" అని నమస్కరించాడు. అందుకు ఆ దేవుడు "నీవు నన్ను సరిగా గుర్తించావు. త్వరలో ప్రళయం రానున్నది. ప్రాణిరక్షణకై దేవత లీపడవను నిర్మించారు. ప్రళయకాలంలో ప్రాణులనన్నింటినీ ఈ నౌకలో ఉంచి రక్షించు. గాలి తాకిడికిది కదిలితే నా కొమ్ముకు కట్టివేయి. నీవు ప్రజాపతి వవుతావు" అని చెప్పాడు.

ప్రళయం తీరుతెన్నులను గురించి మళ్ళీ ఇలా చెప్పాడు "ఇప్పటినుండి అనావృష్టి ఏర్పడుతుంది. రవి కిరణాల ఉష్ణోగ్రతకు అల్పప్రాణులు నశిస్తాయి. బడబానలం విజృంభిస్తుంది. శివుని మూడవ కంటినుండి అగ్ని వెలువడుతుంది. దానితో భూమి దగ్ధం కాగా ఏడు మేఘాలు పుట్టి వర్షించి భూమిని నీట ముంచివేస్తాయి. ముల్లోకాలు ఏ కార్ణవ మవుతాయి. అప్పుడు ఈ నౌకను స్వాధీనం చేసుకొని ప్రాణులను దీనిపై ఎక్కించు. దీనిని నాకొమ్ముకు కట్టివేస్తే నిన్ను నేను రక్షిస్తాను. అందరూ నశించినా నీవు మాత్రం మిగిలి వుంటావు. సూర్యచంద్రాదులు గూడా సురక్షితంగా వుంటారు." ఇలా చెప్పి భగవాను డంతర్ధానం చెందాడు.

ఆపై ఆ దేవుడు కొమ్ము గల చేపగా ఆవిర్భవించాడు. మనువు ప్రాణులను పడవపైకి చేర్చాడు. తాను కూడా ఎక్కాడు. మనువు ప్రశ్ననను సరించి మత్స్యరూప భగవానుడు ఈ పురాణం ప్రవచించాడు అని సూతుడు మునులకు వివరించాడు.

ప్రపంచోత్పత్త్యాదులను గూర్చి మత్స్యదేవుడు ఇలా చెప్పాడు–

"కల్పారంభానికి ముందు జగమంతా చీకటి మయమయింది. స్వయంభువు చీకట్లు తొలగిస్తూ ఆవిర్భవించాడు. ఆయన మొదట జలం సృష్టించి అందులో బీజరూపవీర్యాన్ని నిలిపాడు. అది బంగారు గ్రుడ్డయింది. అందులో ఆ దేవుడు ప్రవేశించాడు. అందుండి సూర్యుడుదయించాడు.

పరమాత్మ గ్రుడ్డును రెండుగా విభజించి అందుండి దివినీ, భువినీ, ఆకాశాన్నీ సృష్టించాడు. ఆపై క్రమంగా మేరువు మున్నగునవి మావినుండి ఉద్భవించాయి. మరణించిన అంగం నుండి పుట్టిన సూర్యుడు మార్తాండుడు కాగా అతని రూపమే చతుర్ముఖబ్రహ్మ అయింది. జగత్సృష్టికర్త అతడే."

పిదప బ్రహ్మకు నాల్గు ముఖాలెలా కలిగాయి? లోకుల నతడెలా సృష్టించాడు? అని మనువు ప్రశ్నించగా మత్స్యభగవాను డిలా చెప్పాడు-

"బ్రహ్మ తపస్సు చేయగా వేదాలు, పురాణాలు, మీమాంసాదిశాస్త్రాలు ఉద్భవించాయి. అతని మనస్సునుండి మరీచి మున్నగువారు ఉదయించారు. దక్షుడు, మన్మథుడు మున్నగువారు వివిధావయవాలనుండి జన్మించారు"అని చెబుతూ శబ్దస్పర్శాదుల పుట్టుకను గూడా వివరించాడు. తదుపరి బ్రహ్మ చిత్తంలో సావిత్రిని నిలిపి సమాధిస్థితి పొందాడు. అతని శరీరం స్త్రీ పురుషరూపాలతో రెండుగా విడిపోయింది. ఆ స్త్రీరూపమే శతరూప, సరస్వతి, గాయత్రి, బ్రహ్మాణి – అని వ్యవహరింపబడింది. ఆమె అందం చూచి ప్రజాపతి మోహానికి గురి అయ్యాడు. ఆమె తండ్రియగు బ్రహ్మకు ప్రదక్షిణం చేసింది. అప్పుడు నలువైపుల తిరిగి ఆమెను చూచిన బ్రహ్మకు నాలుగు ముఖాలు ఏర్పడ్డాయి. ఊర్ధ్వదృష్టిగల మరొక శిరస్సు గూడా జనించింది. పుత్రికపట్ల కామదృష్టి కలిగిన కారణంగా అతని తపస్సు నశించింది.

పిదప బ్రహ్మ తన పుత్రులను ప్రజాసృష్టి చేయమన్నాడు. వారు వివిధప్రజాసృష్టి చేయడానికై వెళ్ళారు. బ్రహ్మ గాయత్రిని పరిణయ మాడాడు. ఆమెకు మనువు సంభవించాడు. క్రమంగా 14మంది మనువులావంశంలో కలిగారు."

మనువు "బ్రహ్మ స్వపుత్రీగమన దోషం పొందకుండా ఎలా వుండగలిగాడు?" అని ప్రశ్నించగా మత్స్యదేవుడు "రజోగుణంనుండి జనించిన సృష్టి దివ్యమైనది. మాంసనేత్రం కలవారు దాన్ని చూడలేరు. బ్రహ్మ వేదాలకు అధిష్ఠాత. ఆయన శరీరంనుండి గాయత్రి జనించింది. సరస్వతీ బ్రహ్మలు దంపతులే. అందుచే బ్రహ్మకు పుత్రీగమనదోషం అంటలేదు. అయినా తనస్థితికి మన్మథుడు కారణమని బ్రహ్మ అతణ్ణి రుద్రుని కంటిమంటలో కాలిపోతావని శపించాడు. అతడు క్షమించుమని ప్రార్థించగా యదువంశంలో కృష్ణుని పుత్రుడవై జన్మించినపుడు శాపమోక్షమవుతుందని అనుగ్రహించాడు.

ఆపై మనువు యదువంశాన్ని గురించి చెప్పమని అడుగగా భగవానుడు ఆ వంశం పుట్టు పుర్వోత్తరాలను విశదీకరించాడు. దక్షసృష్టినీ, దేవదానవ గంధర్వాదుల పుట్టుకనూ, కశ్యపసంతతినీ వివరించాడు. ఈ కథాకథన క్రమంలో దితిపుత్రులైన మరుత్తుల వృత్తాంతం, మదనద్వాదశీవ్రతానుష్ఠానం వల్ల పుత్రశోకవిముక్తి గల్గే విధానం మున్నగు విషయాలు నిరూపితాలయ్యాయి.

ఋషులు ప్రతిసర్గాన్నీ, దాని అధిపతులనూ గురించి చెప్పమనగా సూతుడు, పృథువును పృథ్వీపతిగా దిక్పాలకులు అభిషేకించిన విధానాన్నీ, మన్వంతరాలు, మనువుల చరిత్ర, కాలప్రమాణం ఇత్యాది విషయాలను మనువుకు మత్స్యదేవుడు చెప్పినరీతిగా వివరిస్తాడు.

పృథుచక్రవర్తి వంశాన్ని చెప్పి ఆ వంశంలోని వేనుని దుర్వృత్తిని వర్ణిస్తాడు. అతని శరీరాన్ని మథించగా పృథువు పుట్టిన వైనాన్ని చెబుతాడు. పృథువు రాజై గోరూపం దాల్చిన భూమినుండి ఓషధులను పిండిన విషయాన్నీ

అతని పరిపాలన సక్రమంగా సాగిన సంగతినీ, పృథువు పాలించబట్టే భూమికి పృథ్వి అనే పేరు కలిగిందనీ విశదీకరిస్తాడు.

పిదప ఋషుల ప్రశ్ననుసరించి సూతుడు సూర్యచంద్రవంశాలను గూర్చి చెబుతాడు. కశ్యపునికి అదితివల్ల జనించినవాడు ఆదిత్యుడు. అతనికి సంజ్ఞ, రాజ్ఞి, ప్రభ అని ముగ్గురు భార్యలుండేవారు. వారికి క్రమంగా మనువు, రైవతుడు, ప్రభాతుడు జన్మించారు.

సంజ్ఞకు యముడు, యమున అనే అమడలు గూడా కలిగారు. ఆమె సూర్యుని తేజస్సు భరించలేక తన్ను పోలిన ఛాయను సృష్టించి భర్తను సేవించమన్నది. ఛాయకు 'సావర్ణి' పుట్టాడు. ఛాయ తన బిడ్డపై ఎక్కువ ప్రీతి చూపి తక్కినవారిపై అనాదరం చూపగా యముడది సహించలేక ఆమెను బెదరించి ఆమె శాపానికి గురి అయ్యాడు. తండ్రికి జరిగిన సంగతి తెలుపగా అతడు కర్మఫలం అనుభవించక తప్పదన్నాడు. యముడు గోకర్ణంలో తపస్సుచేసి శివుని ఆరాధించి తదనుగ్రహంతో లోకానికీ, పితృలోకానికీ పాలకుడయ్యాడు.

తరువాత సూర్యుడు త్వష్టకు జరిగిన సంగతి చెప్పాడు. అతడు సూర్యుని తేజస్సుయొక్క తీక్ష్ణతను సానబెట్టి తగ్గించాడు. అలా తరిగిన సూర్య తేజోంశమే విష్ణుచక్ర మయింది. తదుపరి సూర్యునితో సంజ్ఞ సంగమించగా ఆమె నాసాపుటాలనుండి అశ్వినీదేవతలుద్భవించారు.

తరువాత వైవస్వతమను పుత్రులైన ఇలుడు మున్నగు పదిమంది కుమారులను, వారి సంతతిని గూర్చి సూతుడు వివరించాడు. ఈ క్రమంలో ఇలుడు స్త్రీగా రూపొందిన చరిత్రను గూడా అభివర్ణించాడు.

ఇలుని కుమారుడు పురూరవుడు. పలువురు రాజులావంశంలో సంభవించారు. వారిలో భగీరథుడు, రఘువు, దశరథుడు, రామలక్ష్మణాదుల ప్రస్తావనగూడా వస్తుంది. ఇలా వైవస్వతవంశం ఇక్కడ పేర్కొనబడింది. తదుపరి మనువుకు మత్స్యభగవానుడు పితృవంశాన్ని వివరిస్తాడు. ప్రజాపతులు వైరాజులుగా ప్రసిద్ధి పొందారనీ, కాలాంతరంలో వారు బ్రహ్మవాదులుగా జన్మిస్తారనీ చెబుతాడు.

ఈ క్రమంలో దక్షుని పుత్రిక సతీదేవి దక్షయజ్ఞకాలంలో, యజ్ఞానికి శివుని ఆహ్వానించలేదని తండ్రిమీద కోపంతో తన్ను తాను దహించుకొన్న ప్రస్తావన కూడా వస్తుంది. పశ్చాత్తప్తుడైన దక్షుణ్ణి మరల ఆమె కనికరిస్తుంది. తన అనుగ్రహం పొందడానికి తన్ను ఏ యే తీర్థాలలో దర్శించాలి? ఏ యే నామాలతో కీర్తించాలి? అన్న విషయం తెలిపి తన 108 నామాలను ప్రకటిస్తుంది. ఆమెయే మరుజన్మలో పార్వతిగా అవతరించి శివుని చేపట్టింది.

తరువాత పితృవంశానికి చెందిన అచ్ఛోదమనే సరస్సు యొక్క వృత్తాంతం చెప్పబడింది. దివ్యరూపధారులగు పితరులను కామించి యోగభ్రష్టత పొందిన ఆమె తపస్వినియై 28వ ద్వాపరంలో మత్స్యయోనిలో జన్మించనున్నదనీ, పరాశరుని వీర్యం వల్ల పుత్రుణ్ణి పొందగలదనీ పితృగణం ఆమెను అనుగ్రహిస్తుంది.

పిదప మనువు కోరికమేరకు మత్స్య భగవంతుడు శ్రాద్ధకాలం, శ్రాద్ధభేదాలు, శ్రాద్ధంలో భుజింపజేయ దగినవారు, వర్జింపదగినవారు, శ్రాద్ధం పితరులకెలా ప్రీతి కల్గిస్తుంది మున్నగు విషయాలను విశదీకరిస్తాడు. భుక్తిముక్తి ఫలప్రదమగు శ్రాద్ధవిధినీ, పిదప ఆశౌచవిధినీ, ఏకోద్దిష్టాదివిధినీ పేర్కొంటాడు. శ్రాద్ధం పితృప్రీతి కారకం. పూర్వం కౌశిక పుత్రులు శ్రాద్ధకర్మతోనే విష్ణుపదం చేరుకోగలిగారు. వారికథ ఇక్కడ ప్రస్తావింపబడుతుంది.

తదుపరి బ్రహ్మదత్తుని కథ వర్ణితమయింది. బ్రహ్మదత్తుడు సకలప్రాణుల సంభాషణం గ్రహించ శక్తి గలవాడు. అతడొకసారి చీమల మాటలు విని ఆశ్చర్యం పొందాడు అని సూతుడనగా ఆ శక్తి అతని కెలావచ్చిందో చెప్పమన్నారు మునులు.

సూతుడిలా చెప్పాడు–పూర్వం అనఘుడనేవాడు పుత్రార్థియై హరినారాధించాడు. దేవుడు సాక్షాత్కరించి వరం కోరుకొమ్మనగా సర్వప్రాణి సంభాషణం గ్రహించగల తనయుణ్ణి ప్రసాదించమన్నాడు. శ్రీహరి అనుగ్రహంతో అతనిపుత్రుడైన బ్రహ్మదత్తునికి ఆశక్తి అబ్బింది.

పిదప పితరులకు ప్రీతి కలిగించే తీర్థ కాలాలను సూతుడు చెప్పాడు. ఇక్కడ పలుతీర్థాల ప్రస్తావన ఉన్నది. తదుపరి చంద్రుని ఉత్పత్తి, చంద్రవంశవర్ణన ప్రస్తావింపబడినాయి. పూర్వం బ్రహ్మ సృష్టి కుపక్రమించుమని అత్రినాదేశించాడు. అత్రి తపస్సు చేశాడు. ఆయన కన్నులలో ఆనందదాయకమైన తత్త్వం చూచి శివుడు తన అష్టమాంశంచే అత్రినేత్రాన్ని ఆశ్రయించాడు. ఆనందాశ్రువులవెంట నీటినుండి పుట్టిన శివుని అష్టమాంశం అత్రినేత్రాల నుండి స్రవించి సోముడనే శిశువయింది. ఆ తేజస్సు వెన్నెలచే విశ్వాన్ని దీపింప జేసింది. దిక్కులు పుత్రవాంఛతో ఆ తేజస్సును గ్రహించాయి. అది గర్భమై వాటి ఉదరంలో 30 సంవత్సరాలు ఉండిపోయింది. ఇక భరించలేక దిక్కులు దాన్ని త్యజించాయి. బ్రహ్మ ఆ తేజస్సునంతా ఏకీకరించి ఒక యువకునిగా రూపొందించాడు. ఆ తేజం నుండే ఓషధీగణం జనించింది. ఆ ఓషధీశుడే చంద్రుడు. శుక్లపక్షంలో వృద్ధిపొంది కృష్ణపక్షంలో క్షీణించే లక్షణమతనికి కల్గింది.

చంద్రుడు, బృహస్పతి భార్య తార ఒకరినొకరు ప్రేమించుకొన్నారు. తార ఇల్లు వీడి చంద్రునితో వెళ్ళిపోయింది. బృహస్పతి అర్థించినా చంద్రుడామెను విడువలేదు. అంత శివుడు కోపించి చంద్రునితో యుద్ధానికి సిద్ధమైనాడు. ఆ యుద్ధాన్ని తుదకు బ్రహ్మ నివారించాడు. బ్రహ్మ మాట విని చంద్రుడు తారను బృహస్పతి కప్పగించాడు. ఇది చంద్రోత్పత్తి కథ.

తారాగర్భంనుండి బుధుడు పుట్టాడు. తార బుధుడు చంద్రుని పుత్రుడని సిగ్గుతో పలికింది. చంద్రుడా బిడ్డకు 'బుధుడు' అని నామకరణం చేశాడు. ఆ బుధునికి ఇలా గర్భంలో జన్మించినవాడే పురూరవుడు.

స్వర్గంలో ఊర్వశి నృత్యం చేస్తూ (అభినయం మరచి) పురూరవుణ్ణిచూచి కామపీడితురాలయింది. భరతుడామెను లతగా జన్మించమని శపించాడు. శాపం తీరగానే ఆమె పురూరవుని ద్వారా ఆయువు మున్నగు ఎనిమిది మంది పుత్రులను కన్నది. వారివంశమే చంద్రవంశం. ఆ వంశంలోనే యయాతి జన్మించాడు. వృషపర్వునికుమార్తె శర్మిష్ఠ, శుక్రాచార్యుని పుత్రిక దేవయాని అతని భార్యలు. నహుషుని పుత్రుడైన యయాతి శుక్రునిచే శపింపబడి అకాలంలో వృద్ధత్వం పొందాడు. శర్మిష్ఠాసుతుడైన పూరుడు అతని వార్ధక్యం తాను గ్రహించాడు. యయాతి చివరి దశలో పూరుణ్ణి పట్టాభిషిక్తుని కావించాడు. ఆ వంశమే పౌరవవంశంగా ప్రసిద్ధి కెక్కింది.

పూర్వం సురాసురులు త్రిలోకాధిపత్యం కోరి పరస్పరం యుద్ధం కావించారు. సురలకు బృహస్పతి, అసురులకు శుక్రుడు పురోహితులైనారు. శుక్రుడు మృతసంజీవనీ విద్యతో సమరంలో హతులైన రక్కసులను బ్రతికించేవాడు. బృహస్పతి కావిద్య తెలియదు.

దేవతలు బృహస్పతి పుత్రుడైన కచుణ్ణి శుక్రునినుండి ఆ విద్యను పరిగ్రహించుకొని రమ్మని పంపారు. కచుడు శుక్రుని చెంతకు పోయి ఆయన అనుమతితో శిష్యుడైనాడు. శుక్రుని పుత్రిక దేవయాని కతనిపై ప్రేమ జనించింది. దానవులు కచునిపై పగబూని అతడు అడవిలో గోవులు మేపుతుండగా వధించారు. శరీరాన్ని ముక్కలు చేసి మృగాలకు వేశారు. గోవులు తిరిగివచ్చినా కచుడు రాకపోవడం చూచి దేవయాని విషణ్ణురాలయింది. శుక్రుడు సంజీవనీవిద్యతో కచుణ్ణి మరల బ్రదికించాడు. రాక్షసులు చేసిన పనిని కచుడాయన కెరిగించాడు.

రాక్షసులు మరొకసారి కచుణ్ణి హతమార్చి కాల్చి బూడిదజేసి ఆ బూడిదని సురలో కలిపి శుక్రునిచే త్రాగించారు. దేవయాని కచుడు లేకుంటే తాను జీవించజాలనన్నది. శుక్రుడు సంజీవనీ విద్యతో ఆహ్వానించగా అతని గర్భంలో తానున్నానని కచుడు చెప్పాడు. రక్కసుల దుష్కృత్యం వివరించాడు. అంతట శుక్రుడు కచునికి మృతసంజీవనీ విద్య నేర్పాడు. కచుడు గురుని గర్భం చీల్చుకొని వచ్చి తన విద్యతో గురువును బ్రదికించాడు. అలా కచుని కోరిక తీరింది. సురాపానం చేయడం బ్రహ్మహత్యాసదృశమని శుక్రుడు పానం చేసేవారిని శపించాడు.

కచుడు తిరిగి స్వర్గానికి పోతాననగా దేవయాని అడ్డుపడింది. తన్ను చేపట్టమని కోరింది. 'గురుపుత్రివి నాకు పూజ్యురాలివి' అని అతడామె అభ్యర్థనను తిరస్కరించాడు. ఆమె నీ విద్య ఫలించదని శపించింది. 'నేను ఎవనికి నేర్పుతానో వానికి ఫలిస్తుందిలే' అని చెప్పి అతడు స్వర్గానికి వెళ్ళిపోయాడు. దేవతలు సంతసించారు. ఇలా కచదేవయానుల చరిత్ర ఈ పురాణంలో నిబద్ధమయింది.

ఒకసారి రాక్షసవనితలు ఒకబావిలో జలక్రీడలాడటానికి వెళ్ళారు. వారు బావిగట్టున విడిచిపెట్టిన వస్త్రాలను గాలి వేగంగా వీచి ఒకటికొకటి కలసిపోయేటట్లు చేసింది. నీటినుండి వెలికి వచ్చిన స్త్రీలు వారివారి వస్త్రాలు తీసుకొనే సమయంలో శర్మిష్ఠ దేవయాని వస్త్రాన్ని తీసుకొని ధరించింది. అది చూచి దేవయాని శర్మిష్ఠను తూలనాడింది. ఒకరినొకరు తీవ్రంగా వాదులాడుకొన్నారు. ఆ ఘర్షణలో శర్మిష్ఠ దేవయానిని బావిలో త్రోసివేసింది.

పిమ్మట వేటకై ఆ దారిలో వచ్చిన యయాతి ఆమె కుడిచేయి పట్టుకొని బావినుండి వెలికితీసి నగరానికి తీసుకెళ్ళాడు. దేవయాని తండ్రితో తనకు జరిగిన అవమానం గురించి చెప్పింది. శుక్రుడెంతగా ఓదార్చినా ఆమె శాంతించలేదు.

తదుపరి శుక్రుడు వృషపర్వునికి జరిగిన సంగతి చెప్పి శర్మిష్ఠ దుశ్చేష్టలనెందుకు ఉపేక్షిస్తున్నావన్నాడు. నేను నిన్ను విడిచి వెళ్తానని చెప్పాడు. వృషపర్వుడు దేవయానిని శాంతింపజేయటానికి ఏమైనా చేస్తానని రాజుతో అన్నాడు. శర్మిష్ఠను తనకు దాసిగా చేయమని దేవయాని కోరింది. రాజు శర్మిష్ఠను అందుకంగీకరింపజేస్తాడు. అంతటితో దేవయాని శాంతిస్తుంది. తరువాత దేవయాని తండ్రి అంగీకారంతో యయాతిని వివాహం చేసుకొంటుంది. శర్మిష్ఠగూడా ఆమెకు దాసిగా యయాతి నగరానికి వెళ్ళి రాజగృహం ప్రవేశిస్తుంది.

కాలక్రమంలో దేవయాని పుత్రుణ్ణి ప్రసవిస్తుంది. శర్మిష్ఠ యౌవనం పొంది ఋతుమతి అవుతుంది. రాజు అశోకవనికాసమీపంలో శర్మిష్ఠను చూస్తాడు. ఆమె తన్ను చేపట్టమని అభ్యర్థిస్తుంది. మొదట కాదన్నా, చివరికి రాజు ఆమె కోరిక తీరుస్తాడు. కాలక్రమంలో దేవయానికి యదువు, తుర్వసుడన్న ఇరువురు కుమారులు, శర్మిష్ఠకు ద్రుహ్యుడు, అణువు, పూరుడు అన్న ముగ్గురు పుత్రులు కలుగుతారు.

శర్మిష్ఠకూ, యయాతికీ మధ్య కుదిరిన అనుబంధాన్ని గ్రహించి కోపించిన దేవయాని "నా అధీనంలో ఉంటూ నాకప్రియం చేశావు? అసురధర్మం పాటించి కూడా నిర్భయంగా ఉన్నావేల"? అని శర్మిష్ఠను గద్దించింది. రాజును నీవు వరిస్తే నేనూ వరించినట్లే" అని శర్మిష్ఠ నిర్భయంగా సమాధానం చెబుతుంది.

దేవయాని కోపంతో నేనిక్కడ ఉండజాలనంటూ రాజగృహం వీడి పితృగృహానికి వెళ్తుంది. యయాతి సైతం ఆమెతోగూడా వెళ్ళాడు. రాజు తనకు అప్రియం చేశాడని దేవయాని తండ్రితో జరిగిన విషయం చెబుతుంది. శుక్రుడు రాజును "నిన్ను త్వరలో వార్ధక్యం ఆక్రమించుగాక!" అని శపిస్తాడు. వెంటనే రాజు వృద్ధుడై పోతాడు. మరల రాజు శుక్రుణ్ణి ప్రార్థించగా, "నీవీ జరను మరొకరికి సంక్రమింపజేసుకోవచ్చు" అని శాపవిముక్తిమార్గం చెబుతాడు.

యయాతి నగరానికి పోయి పుత్రులలో ఏ ఒక్కరైనా తన వార్ధక్యం తీసుకోవలసినదిగా కోరుతాడు. అతని కుమారులు ఐదుమందిలో ఒక పూరుడు తప్ప తక్కినవారు తండ్రిమాటను తిరస్కరిస్తారు. పూరునినుండి యౌవనం గ్రహించిన రాజు వెయ్యేండ్లు కామసుఖాలనుభవించి విరక్తుడై తిరిగి కుమారునికి యౌవనం సమర్పించి వార్ధక్యం పుచ్చుకొంటాడు. అతణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేస్తాడు. ఆపై దీక్షబూని అరణ్యవాసం చేస్తాడు.

యదువు సంతతివారు యాదవులుగా, తుర్వసు సంతానం యవనులుగా, ద్రుహ్యుని సంతానంవారు భోజులుగా, అనువు సంతతివారు మ్లేచ్ఛులుగా రూపొందారు. పూరుని వంశం పౌరవవంశంగా ప్రసిద్ధి గాంచింది.

యయాతి తపస్సుచేసి స్వర్గం చేరుకొన్నాడు. కాని కాలాంతరంలో అక్కడనుండి భ్రంశం పొందాడు. భ్రంశానికి కారణం 'తపస్సులో తనకు సాటి రాగలవాడెవడూ లేదు' అనే అహంకారమే అని శౌనకుడు శతానీకునితో చెప్పాడు. తదుపరి కథనంలో అష్టకునికీ, యయాతికీ జరిగిన సంవాదం మిక్కిలి ఆసక్తిదాయకంగా ఉన్నది. యయాతి చివరికి తన పౌత్రులచే తరింపజేయబడి మరల స్వర్గం చేరుకొన్నాడు.

ఆపై సూతుడు యదువంశాన్ని విస్తరించి వివరించాడు. ఈ వంశంలో ఉద్భవించిన పెక్కుమంది నరపతులలో కార్తవీర్యార్జునుడు సుప్రసిద్ధుడు. బాహుసహస్రం కలిగి మహా పరాక్రమం చూపించిన యతని సహస్రబాహువులను చివరికి పరశురాముడు ఛేదించాడు.

ఆపై యదువంశజుడైన శ్రీకృష్ణుని వంశక్రమాన్ని సూతుడు విస్తృతంగా పేర్కొన్నాడు. ఇందులో భగవానుని వివిధావతారాలు వర్ణింపబడినాయి. తుర్వసునివంశం, పురువంశం, అజామీఢాది భవిష్యద్రాజుల వంశం- అగ్నివంశం- వీటిని క్రమంగా పేర్కొనడం జరిగింది.

సూతుడు పిదప కర్మజ్ఞానయోగాల కలయికవల్ల కలిగే ప్రయోజనాన్ని ఋషులకు వివరించాడు. ఆపై పురాణాల సంఖ్య, పురాణదానఫలం చెప్పి ధర్మార్థకామమోక్షాలు పురాణప్రయోజనాలని చెప్పాడు. పిదప దానధర్మాలను వివరిస్తూ 52నుండి 54వ అధ్యాయంవరకూ నక్షత్రపురుషవ్రతం మున్నగు వ్రతాలను నిరూపించడం జరుగుతుంది. తటాకాదుల ప్రతిష్ఠ, ఆరామప్రతిష్ఠ, సౌభాగ్యశయనవ్రతం వివరించబడ్డాయి. తదుపరి అగస్త్యజన్మవృత్తాంతం పేర్కొనబడింది.

62వ అధ్యాయం నుండి 102వ అధ్యాయం వరకు అనంతతృతీయాదులైన వ్రతాలు, గ్రహణస్నానవిధి, దానప్రభావం, వివిధదానాలు నిర్దేశించబడ్డాయి. 103 నుండి 112వ అధ్యాయంవరకు ప్రయాగతీర్థ ప్రభావం కీర్తితమయింది.

భారతయుద్ధం తరువాత బంధుమరణానికి దుఃఖించిన ధర్మజుడు తనకెవరు దుఃఖశమనం కలిగిస్తారని చింతించాడు. అప్పుడు మార్కండేయుడు వచ్చి క్షత్రధర్మాన్ని చెప్పి రణమరణం పాపకారణం కాదంటాడు. పాపపరిహారం చెప్పమని ధర్మజుడడుగగా ప్రయాగ గమనం, అందలి స్నానం సకలపాపపరిహారకమంటాడు. ప్రయాగమాహాత్మ్యం విని ధర్మజుడు శోకవిముక్తుడై ప్రయాగను సేవించి ధన్యుడవుతాడు.

ఆపై ద్వీపాలు, సాగరాలు, కొండలు, వర్షాలు–ఎన్ని? నదులేవి? అని ఋషులడుగుతారు. సూతుడు తగిన సమాధానాలు చెబుతాడు. మహాభూత ప్రమాణం, లోకాలోకాచలం, సూర్యచంద్రుల గమనం–ఇత్యాదులను గూడా వివరిస్తాడు. తదనంతరం మత్స్యభగవానుడు చెప్పిన పురూరవ చరిత్రను గూడ నిర్దేశిస్తాడు. ఈ చరిత్రలో గంధర్వులతో అచ్చరలు కావించిన శృంగారరసభరితమైన క్రీడావిహార వర్ణనం మిక్కిలి మనోజ్ఞంగా వున్నది.

తదుపరి కైలాసాది గిరులు, జంబూద్వీపం వర్ణితాలయ్యాయి. భగీరథప్రయత్నంతో జనపదాలను పావనం చేసిన గంగావతరణం కూడా పేర్కొనబడింది. శాకద్వీపం, గోమేద ద్వీపంగూడా నిర్దేశించబడ్డాయి.

తదుపరి ఐదు అధ్యాయాలలో ఖగోళం, ధ్రువసంచారం, సూర్యాదిగమనం, గ్రహరథవర్ణన, ధ్రువప్రశంస, ఖగోళసంస్థాన వర్ణనం అన్న విషయాలున్నాయి.

పిదప ఋషులు "శివుడు పురారి ఎలా అయ్యాడు? త్రిపురాలను ఎలా దహించాడో చెప్పు"మనగా సూతుడిలా అన్నాడు.

"పూర్వం మయుడనే మాయావి గొప్ప తపస్సు చేశాడు. వానితో గూడ విద్యున్మాలి, తారకాక్షుడనేవారు గూడా తపస్సు కుపక్రమించారు. వారి తపస్సు లోకాలను క్షోభింపజేసింది. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. మయుడు దేవతలకు దుస్తరం, అందరికీ అలంఘనీయమైన ఒక దుర్గం వరంగా ఇమ్మన్నాడు. అందుకు బ్రహ్మ "దుర్వృత్తి గలవారికి సర్వామరత్వం అసాధ్యం, దుర్గం నిర్మించుకో" అన్నాడు. మయుడు "శివుడు మాత్రమే ఒకే బాణంతో ఆ దుర్గాన్ని దహించగలగాలి. 'ఆయన సమరంలో ఒకేసారి నన్ను చంపాలి, మరొక రీతిగా మేము వధ్యులం కారాదు" అన్నాడు. బ్రహ్మ 'సరే' అన్నాడు.

అంతట దనుజులు గర్వంతో చెలరేగారు. త్రిపురదుర్గ నిర్మాణం చేసుకొని అందులో ప్రవేశించారు. ఎన్నో అకృత్యాలు చేశారు. మయుడు నివారించినా తగ్గలేదు. వారి ఆగడాలు సహించలేక సురులు శివుణ్ణి శరణుజొచ్చారు. ఆ దేవుడు దుర్గాన్ని దగ్ధం చేస్తానని మాట యిచ్చాడు. యుద్ధానికి తనకొక రథం సిద్ధం చేయమన్నాడు. ఆ దేవుని మాటప్రకారమే దేవత లొక రథం సిద్ధం చేశారు. అదొక అద్భుతమైన కనీ, వినీ ఎఱుగని రథం. 133వ అధ్యాయంలో ఈ రథవర్ణన చూడవచ్చు. బ్రహ్మదేవుడే ఈ రథానికి సారథ్యం వహించాడు.

అప్పుడు త్రిపురాలలో ఉత్పాతాలు సంభవించాయి. తన చెంతకు వచ్చిన నారదుణ్ణి ఉత్పాతాలకు హేతువేమి? అని మయుడడిగాడు. నారదుడు "నీ అధర్మప్రవృత్తియే ఇందుకు హేతువు. రుద్రుడు రౌద్ర రథమెక్కి త్రిపురదహనానికి వస్తున్నాడు. శివుణ్ణి శరణు పొందు" అని చెప్పి వెళ్ళాడు.

తదుపరి దేవదానవయుద్ధం భీకరంగా సాగింది. మయుడు శివుణ్ణి ఆరాధించి నిర్భయుడై చరించాడు. శివుడు పుష్యయోగంలో త్రిపురాలను దహిస్తానన్నాడు. తీవ్ర యుద్ధంలో నంది ప్రయోగించిన వజ్రాయుధంతో విద్యున్మాలి హతుడైనాడు. తారకాక్షునికీ నందికీ పోరు జరిగింది. సమరంలో మరణించే అసురులను రక్షించడానికి

మయుడు అమృత జలపూర్ణమైన ఒక నడబావిని మాయాబలంతో సృష్టించాడు. విద్యున్మాలిని అందులో పడవేయగా వాడు పునర్జీవితుడైనాడు. బావి రాక్షసమరణనివారణ కావించింది.

నడబావిలోని అమృతజలాన్ని వృషరూపధారియైన శ్రీహరి త్రాగివేశాడు. అంతటితో దానవప్రతాపం నీరసించింది. మయుడు సముద్రంపైకి వెళ్ళి శత్రువుల నెదుర్కొనడానికి రక్కసులను పురికొల్పాడు. దేవసైన్యం కూడా సాగరం వైపు వెళ్ళింది. తరువాతి సమరంలో దేవగణాధిపులు తారకాక్షుణ్ణి హతమార్చారు. అది తెలిసి మయుడు దేవతలపై విజృంభించాడు. నంది విద్యున్మాలిని హతమార్చాడు. దానవసైన్యం కకావికలమయింది.

శివుడు త్రిపురనగరాన్ని పుష్యయోగంలో దగ్ధం చేశాడు. దానవులు హాహాకారాలు చేశారు. నంది మయుణ్ణి తొలగి పొమ్మన్నాడు. అలా తొలగి అతడు శివానుగ్రహంతో జీవించాడు. మయుడు మహా శివభక్తుడు కాన అతని రక్షణకై శివుడే ఒక గృహం సృష్టించి అతనికిచ్చాడు. తదుపరి ఇంద్రుడు మయునిపై దండెత్తడం మానుకొన్నాడు. త్రిపురదహనం అలా జరిగింది.

తరువాత పురూరవుడు స్వర్గంలో సోమునితో కలిసి అమృతం సంపాదిస్తాడనీ, దానితో పితరులకు తృప్తి కల్గిస్తాడనీ సూతుడు ఋషులకు చెబుతాడు. ఈ సందర్భంలోనే శ్రాద్ధ విధానాన్ని గూడా వివరించాడు. తదుపరి యుగధర్మాల నిరూపణ జరిగింది. ఆపై యజ్ఞప్రాధాన్యం కల త్రేతాయుగంలో యజ్ఞప్రవృత్తి ఎలా వుండేదో ప్రతిపాదింపబడింది. పిమ్మట ద్వాపరయుగధర్మాలు, దేవతలు, దానవులు, యక్షులు, గంధర్వులు, మనుష్యులు మున్నగువారి పరిణామక్రమం చెప్పబడింది. ఆ యా యుగాలలోని ధర్మస్వరూపం నిరూపితమయింది.

ఆపై సూతుడు కుమారస్వామి అవతారాన్నీ, తారకాసుర వధనూ చెప్పదలచి తారకుని తండ్రి వజ్రాంగుని ప్రస్తావన తెస్తాడు. వజ్రాంగుడు దేవతలకు కంటకంగా తయారైనాడు. వారిని స్వర్గంనుండి వెళ్ళగొట్టాడు. వారు బ్రహ్మచెంత మొరపెట్టుకొనగా, ఆయన "భయం వలదు. శంకరుని కుమారుడు వాణ్ణి చంపుతాడు" అని వారి నోదారుస్తాడు.

శంకరుడు పార్వతిని చూచి తన రేతస్సును అగ్నిపై వదలగా, అగ్ని దాన్ని దేవతల కర్పించాడు. అది దేవతల గర్భంనుండి గంగలోనూ, అటనుండి రెల్లు పొదలోనూ పడగా అందుండి గుహుడు జనించాడు. ఆ బిడ్డ ఏడు దినాల ప్రాయంలోనే తారకుని సంహరించాడు. ఆ కథను విస్తరించి చెప్పమని ఋషులడుగగా, సూతుడు వారితో ఇలా చెప్పాడు.

దక్షునికి అరువదిమంది కుమార్తెలు కలిగారు. అతడు కశ్యపుడు, చంద్రుడు మున్నగువారికి వారినిచ్చి పెండ్లి చేశాడు. కశ్యపుని పత్నులనుండి చరాచరలోకాలు ఉద్భవించాయి. దితికి హిరణ్యకశిపుడు మున్నగు దైత్యులు కలిగారు. విష్ణువు హిరణ్యకశిపుడు మున్నగువారిని హతమార్చాడు. దితి సమరంలో ఇంద్రుణ్ణి చంపగల పుత్రుణ్ణి ప్రసాదించుమని భర్తను కోరింది. ఆయన అట్లే అంటూ వ్రతనిష్ఠలో ఉండమని చెప్పాడు.

ఆమె నిష్ఠలో వుండగా ఇంద్రుడు వచ్చి వ్రతనిష్ఠకు విరుద్ధంగా నిద్రిస్తున్న ఆమె గర్భాన్ని వజ్రాయుధంతో 49 ఖండాలుగా చీల్చివేశాడు. అదితి మరల భర్తను ఇంద్ర విజేతయగు కొడుకును అనుగ్రహించుమని వేడుకొన్నది.

ఆయన అనుగ్రహించాడు. తదుపరి ఆమెకు దుర్జయుడైన పుత్రుడు కలిగాడు. అతడే వజ్రాంగుడు. అతడు పెరిగి పెద్దయై తల్లికోరిక మేరకు ఇంద్రుణ్ణి బంధించి ఆమె వద్దకు తెచ్చాడు. తరువాత బ్రహ్మ, కశ్యపుల మాటవిని అతణ్ణి విడిచి పుచ్చి తపోనిష్ఠుడయ్యాడు.

బ్రహ్మ ఒక కన్యను సృష్టించి అతనికి పత్నిగా ఇచ్చాడు. ఆమెపేరు వరాంగి. వజ్రాంగుడు తపస్సులో ఉండగా ఇంద్రుడు కోతిరూపంలో వచ్చి ఆమెను భయపెట్టాడు. పలువిధాల హింసించాడు.

వెయ్యి సంవత్సరాలు తపస్సులో గడవగానే బ్రహ్మ వజ్రాంగుని వద్దకు వచ్చి అతణ్ణి అనుగ్రహించాడు. వజ్రాంగుడు భార్య ఆశ్రమంలో లేకపోవడంతో ఆమెను వెదుకుతూ ఒకచోట ఏడుస్తూ ఉన్న ఆమెను చూచి "ఏమి జరిగింది" అన్నాడు.

వరాంగి జరిగిన సంగతి చెప్పింది. ఇంద్రునిపై పగ తీర్చుకోదలచి అతడు బ్రహ్మనుద్దేశించి మరల తపస్సుచేసి ఆయన అనుగ్రహంతో తారకుడనే పుత్రుణ్ణి పొందుతాడు, ఇది తెలిసి దేవతలు విషణ్ణులు కాగా, రక్కసులు హర్షం పొందారు. కాలక్రమంలో తారకుడు రాజ్యాభిషిక్తుడయ్యాడు.

అతడు బలసంపత్తికై తీవ్రతపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షం కాగా ఎవరిచేతా చావరాదు, అన్న వరం కోరాడు. బ్రహ్మ అది సాధ్యం కాదనగా, అలా జరగదన్న విశ్వాసంతో 7 దినాల ప్రాయంకల శిశువునుండి మాత్రమే మరణం కోరుకొన్నాడు. బ్రహ్మ ఆ వరం ప్రసాదించాడు. తారకుడు వరగర్వంతో సురల పట్ల మహా భయంకరంగా ప్రవర్తించాడు. దిక్పాలకులనే తన బంట్లుగా చేసుకొన్నాడు. రాక్షసులతని నాయకత్వంలో దేవతలపై సమరాని కాయత్తమయ్యారు.

ఇంద్రుడు యుద్ధం తప్పదని గ్రహించి 'కర్తవ్య' మేమి అని బృహస్పతి నడుగగా, దండోపాయమే కర్తవ్యమని దేవగురువు పలికాడు. దేవతలు యుద్ధానికి సిద్ధమయ్యారు. సురాసురులకు భీకరసంగ్రామం జరిగింది. రణధ్వనులు రోదసినంటాయి. ఆయుధవర్షంతో దిక్కులలో చీకట్లు క్రమ్ముకొన్నాయి. భటులు, గజాలు, అశ్వాలు విగతజీవులై నేలకొరిగాయి.

దైత్యసేనాధిపతి గ్రసనునికీ, దేవసేనాపతి యమునికీ ఘోరమైన పోరు జరిగింది. అట్లే జంభునికీ, కుబేరునికీ జరిగిన పోరాటంలో జంభుడు మూర్ఛితుడయ్యాడు. ఆపై కుజంభుడు కుబేరునితో తలపడ్డాడు. కుబేరుడు మూర్ఛిల్లగా నిరృతి కుజంభుని మార్కొన్నాడు. అంతట మూర్ఛనుండి తేరుకొన్న జంభుడు గూడా రణంలో పాల్గొన్నాడు.

తుదకు యుద్ధంనుండి పరుగెత్తిన కుబేరుని శిరస్సు నుండి రత్నకిరీటం క్రిందపడింది. జంభుడతని ధనాన్ని అపహరించాడు. కుజంభుడు మాయతో జగత్తును తమోమయం చేయగా, మహిషుడు సావిత్రాస్త్రంతో తమస్సును తొలగించాడు. కుజంభుడు నిరృతి శిరస్సును ఖండింపబోతుండగా, వరుణుడు వాని భుజాలు బంధించాడు. ఇంతలో మహిషాసురుడు నిరృతివరుణులను మ్రింగబోయాడు. వారు భయంతో పారిపోయారు.

నిరృతి ఇంద్రుని శరణు పొందగా, చంద్రుడు వాయవ్యాస్త్రం ప్రయోగించి వరుణుణ్ణి మహిషుని బారినుండి రక్షించాడు. చంద్రునివల్ల ఏర్పడిన శైత్యవాతావరణానికి రక్కసులు పరాజితులయ్యారు.

అంతట కాలనేమి రాక్షసులను పౌరుషవంతులను చేసే వచనాలు పలికాడు. తన శరీరం పెంచి గగనమంతా వ్యాపింపజేసి 10వేల సూర్యులను సృష్టించాడు. దానితో శైత్యం తొలగి చంద్రుడు శమించాడు.

సూర్యుడు కాలనేమిపై కురికి దేవదానవరూపాలలో విపర్యయం కల్గించాడు. కాలనేమి తనవారినే దేవత లనుకొని వారిపై అస్త్రశస్త్రాలు ప్రయోగించాడు. నిమి కాలనేమికి రూపం మార్పును గురించి చెప్పగా అతడు తన పొరబాటు గుర్తించి బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు.

సూర్యుడు తేజోవిహీనుడై తన శరీరాన్ని కోటిరెట్లు పెంచగా దనుజులు తపించిపోయారు. కాలనేమి మేఘరూపియై రవిని నిరోధించి వర్షం కురియించాడు. మరియు అస్త్రశస్త్రవర్షంతో సురలను బాధించాడు.

అంతట అశ్వినీదేవతలు కోపించి కాలనేమిని అరువది శరాలతో కొట్టారు. వాడు వారి రథకూబరాన్ని చక్రంతో ధ్వంసంచేసి శరవృష్టి కురిపించాడు. అతని ముద్గర ప్రయోగం దెబ్బకు అశ్వినులు పారిపోగా వారిరథాలు చూర్ణమయ్యాయి. వారు వజ్రాస్త్రం ప్రయోగించి వాని రథాన్ని ముక్కలు ముక్కలు చేశారు. కాలనేమి నారాయణాస్త్రం ప్రయోగించి వజ్రాస్త్రాన్ని శమింపజేశాడు. పిదప కాలనేమి వారిని పట్టుకోబోగా, వారు ఇంద్రుని చెంతకు పరుగెత్తారు.

ఈ స్థితిలో మహావిష్ణువు యోగనిద్ర నుండి మేల్కొని గరుడుని అధిష్ఠించి సురల చెంతకు పోయి ఇంద్రుని దుఃస్థితి గమనించాడు. ఇంతలో దానవులు గగనంలో ఒక జ్యోతిర్మండలం చూచారు. గరుడు నధిష్ఠించిన అచ్యుతుణ్ణి దర్శించారు. “ఇతడు ఓడితే దేవతలంతా ఓడినట్లే ” అని సంతసించారు. కాలనేమి అరువది శరాలతో విష్ణుని కొట్టగా ఇతరదైత్యులు గూడా శస్త్రవృష్టి కురియించారు. విష్ణువు వారిలో ఒక్కొక్కరినీ ఆరేసి బాణాలతో కొట్టాడు.

కాలనేమి మరల 3 బాణాలు ప్రయోగించగా విష్ణువు ముద్గరంతో వాణ్ణి ప్రహరించాడు. దానిని దారిలోనే వాడు తునకలు చేశాడు. విష్ణువు ప్రాసం ప్రయోగించగా వాడు శక్తిచే వెన్నుని భుజంపై రక్తం స్రవించేటట్లు కొట్టాడు. విష్ణువు ధనువు చేపట్టి 17 బాణాలు ప్రయోగించేసరికి వాడు చలించిపోయాడు. ఆ పై అచ్యుతుడు గద చేపట్టి కాలనేమి రథంపై ప్రయోగించాడు. అది వాని తలపై పడింది. దీనితో అతడు సంజ్ఞ కోల్పోయి ప్రాణావశిష్టుడై రథంపై పడ్డాడు.

“రాక్షసా! వెళ్ళు. కాలం తీరినపుడు నిన్ను నేను హతమారుస్తాను” అని వెన్ను డన్నాడు. అపుడు కాలనేమి రథాన్ని సారథి దూరంగా మరలించుకొని వెళ్ళాడు.

(ఇది మత్స్యపురాణం ప్రథమసంపుటంలోని కథాసంగ్రహం. ద్వితీయ సంపుటం కథాసారాన్ని ఆ గ్రంథం మొదట చూడగలరు.)

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

ఓమ్ శ్రీగురుభ్యో నమః

శ్రీమద్ద్వైపాయనముని ప్రణీతమ్

మత్స్యపురాణమ్ – మత్స్యపురాణం

ప్రథమభాగమ్ – ప్రథమభాగం

ప్రథమోఽధ్యాయః – ఒకటవ అధ్యాయం

మనువిష్ణుసంవాదః – మనువిష్ణు సంవాదం

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥1॥

నారాయణునికీ, నరులలో శ్రేష్ఠుడైన నరునికీ, సరస్వతీదేవికీ, వ్యాసునికీ నమస్కరించి తరువాత 'జయ' మనబడే పురాణాన్ని పఠించాలి (ప్రవచించాలి).

అజోఽపి యః క్రియాయోగాన్నారాయణ ఇతి స్మృతః ।
త్రిగుణాయ త్రివేదాయ నమస్తస్మై స్వయంభువే ॥ 2॥

ఎవడు పుట్టుక లేనివాడైనా, తాను చేసే క్రియలను బట్టి నారాయణుడు, (నీరు ఆధారంగా కలవాడు లేదా జీవుల కాధారమైనవాడు) అని భావించబడుతున్నాడో, అట్టి సత్త్వరజస్తమస్సు లనే, మూడు గుణాలు కలవాడు, ఋగ్యజుస్సామాత్మకమగు వేదత్రయమూర్తీ అయిన స్వయంభువునకు (తనకు తానుగా జన్మించేవానికి) నమస్కారము.

సూతమేకాగ్రమాసీనం నైమిశారణ్యవాసినః ।
మునయో దీర్ఘసత్రాంతే పప్రచ్ఛుర్దీర్ఘసంహితామ్ ॥3॥

ప్రవృత్తాసు పురాణేషు ధర్మ్యాసు లలితాసు చ ।
కథాసు శౌనకాద్యాస్త మభినంద్య ముహుర్ముహుః ॥4॥

కథితాని పురాణాని యాన్యస్మాకం త్వయాఽనఘ! ।
తాన్యేవామృతకల్పాని శ్రోతుమిచ్ఛామహే పునః ॥5॥

ఒకప్పుడు నైమిశారణ్యంలో నివసించే శౌనకాది మునులు ద్వాదశవార్షికబ్రహ్మసత్త్రం అనే దీర్ఘసత్రయాగం నిర్వహించారు. యాగం పూర్తి కాగానే విరామసమయంలో ఏకాగ్రచిత్తంతో కూర్చొనియున్న సూతుని చెంతకు వారు వెళ్ళారు. యాగవిరామకాలంలో ఆ మునులు మనోహరాలూ, ధర్మప్రతిపాదకాలూ అయిన పురాణకథలు వినిపించినందుకు ఆయనను మాటిమాటికీ అభినందించి ఇలా అన్నారు– అనఘా! మీరు మాకు ఇంతవరకు అనేక పురాణాలు వివరించారు. మేము అమృతతుల్యములైన ఆ కథలనే మళ్ళీ వినాలని అభిలషిస్తున్నాము.

కథం ససర్జ భగవాన్ లోకనాథశ్చరాచరమ్ ।
కస్మాచ్చ భగవాన్విష్ణుర్మత్స్యరూపత్వమాశ్రితః ॥6॥

లోకప్రభువైన భగవంతుడు స్థావరజంగమాత్మకమైన ఈ జగత్తును ఎలా సృష్టించాడు? భగవంతుడైన విష్ణువు మత్స్యరూపాన్ని ఎందుకు ధరించాడు?

భైరవత్వం భవస్యాపి పురారిత్వం చ కేన హి ।
కస్య హేతోః కపాలిత్వం జగామ వృషభధ్వజః ॥7॥

శివుడు పురారి స్వరూపాన్నీ, భైరవస్వరూపాన్నీ ఎందుకు పొందాడు? వృషభధ్వజుడైన శివునికి ఏ కారణంతో కపాలిత్వం కలిగింది?

సర్వమేతత్సమాచక్ష్వ సూత! విస్తరశః క్రమాత్ ।
త్వద్వాక్యేనామృతస్యేవ న తృప్తిరిహ జాయతే ॥8॥

సూతా! ఇదంతా క్రమంగా విస్తరించి మాకు వివరించు. అమృతం వంటి నీ ప్రవచనంతో మాకు తనివి దీరడం లేదు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

పుణ్యం పవిత్రమాయుష్య మిదానీం శృణుత ద్విజాః ।
మాత్స్యం పురాణమఖిలం యజ్జగాద గదాధరః ॥9॥

విప్రులారా! పూర్వం గదాధరుడైన విష్ణువు చెప్పిన మాత్స్యపురాణాన్ని ఇప్పుడు సమగ్రంగా వినండి. ఇది పుణ్యప్రదమైనది, పవిత్రమైనది, ఆయువును వృద్ధి చేసేది.

పురా రాజా మనుర్నామ చీర్ణవాన్విపులం తపః ।
పుత్రే రాజ్యం సమారోప్య క్షమావాన్ రవినందనః ॥10॥

మలయస్యైకదేశే తు సర్వాత్మగుణసంయుతః ।
సమదుఃఖసుఖో వీరః ప్రాప్తవాన్యోగముత్తమమ్ ॥11॥

పూర్వం వైవస్వతమనువనే రాజు ఉండేవాడు. అతడు సూర్యుని కుమారుడు, గొప్ప ఓర్పుగలవాడు. అన్నివిధాలా ఆత్మగుణములచే సంపన్నుడైన ఆ రాజు పుత్రునికి రాజ్యభార మప్పగించి మలయాచలానికి వెళ్ళాడు. అక్కడ వీరుడైన అతడు సుఖదుఃఖాల పట్ల సమభావం వహించినవాడై ఉత్తమ తపస్సు కావించి యోగసాధన అవలంబించాడు.

బభూవ వరదశ్చాస్య వర్షాయుతశతే గతే ।
వరం వృణీష్వ ప్రోవాచ ప్రీతః స కమలాసనః ॥12॥

అలా అతడు తపస్సు చేస్తుండగా పది లక్షల సంవత్సరాలు గడిచాయి. అంతట కమలాసనుడైన బ్రహ్మ అతని తపోనిష్ఠకు ప్రీతి చెంది వరప్రదానం చెయ్యాలని అతని ఎదుట సాక్షాత్కరించాడు. 'వరం కోరుకొమ్ము' అని పలికాడు.

ఏవముక్తోఽబ్రవీద్రాజా ప్రణమ్య స పితామహమ్ ।
ఏకమేవాహమిచ్ఛామి త్వత్తో వరమనుత్తమమ్ ॥ 13॥

భూతగ్రామస్య సర్వస్య స్థావరస్య చరస్య చ ।
భవేయం రక్షణాయాలం ప్రలయే సముపస్థితే ॥ 14॥

ఆ విధంగా బ్రహ్మ చెప్పేసరికి ఆ రాజు పితామహునికి ప్రణమిల్లి ఇలా అన్నాడు. నేను మీనుండి సర్వోత్తమమైన ఒకే వరం కోరుకొంటున్నాను. ప్రళయకాలం వచ్చినపుడు నేను స్థావరాలు, జంగమాలు అయిన ప్రాణులను రక్షించగల శక్తి కలవాడను కావాలి.

ఏవమస్త్వితి విశ్వాత్మా తత్రైవాంతరధీయత ।
పుష్పవృష్టిః సుమహతీ ఖాత్పపాత సురార్పితా ॥ 15॥

విశ్వానికంతటికీ ఆత్మరూపుడైన బ్రహ్మ 'అట్లే కానిమ్ము' అని చెప్పి అక్కడే అంతర్ధానమయ్యాడు. అప్పుడు ఆకసం నుండి దేవతలు పెద్ద పూలవాన కురిపించారు.

కదాచిదాశ్రమే తస్య కుర్వతః పితృతర్పణమ్ ।
పపాత పాణ్యోరుపరి శఫరీ జలసంయుతా ॥ 16॥

దృష్ట్వా తచ్ఛఫరీరూపం స దయాలుర్మహీపతిః ।
రక్షణాయాకరోద్యత్నం స తస్మిన్కరకోదరే ॥ 17॥

పిమ్మట కొంతకాలానికి మనువు తన ఆశ్రమంలో పితృతర్పణం చేస్తూ ఉండగా ఒక ఆడుచేప జలసహితంగా అతని దోసిట పడింది. ఆ భూపతి ఆ చేపరూపం చూచి జాలి కలిగి దానిని తనకమండలు జలంలో వుంచి కాపాడాలని ప్రయత్నించాడు.

అహోరాత్రేణ చైకేన షోడశాంగులవిస్తృతః ।
సోఽభవన్మత్స్యరూపేణ పాహి పాహీతి చాబ్రవీత్ ॥18॥

అంతట ఆ చేప ఒక్క అహోరాత్రంలో పదహారు అంగుళాల పొడవు పెరిగి 'కాపాడు, కాపాడు' అని ప్రార్థించింది.

స తమాదాయ మణికే ప్రాక్షిపజ్జలచారిణమ్ ।
తత్రాపి చైకరాత్రేణ హస్తత్రయమవర్ధత ॥19॥

ఆ రాజు ఆజలచరాన్ని తీసుకొని ఒక వెడల్పైన మూతిగల నీరు నింపిన మట్టిపాత్రలో వుంచాడు. అక్కడ కూడా అది ఒక్క రాత్రిలోనే మూడు మూరల పొడవు పెరిగింది.

పునః ప్రాహార్తనాదేన సహస్రకిరణాత్మజమ్ ।
స మత్స్యః పాహి పాహీతి త్వామహం శరణం గతః ॥20॥

అలా పెరిగి సూర్యపుత్రుడైన మనువును ఆ చేప ఆర్తనాదం కావిస్తూ 'ఓరాజా! నేను నిన్ను శరణుజొచ్చాను. నన్ను రక్షించు, రక్షించు' అని వేడుకొన్నది.

తతః స కూపే తం మత్స్యం ప్రాహిణో ద్రవినందనః ।
యదా న మాతి తత్రాపి కూపే మత్స్యః సరోవరే ॥21॥

క్షిప్తోఽసౌ పృథుతామాగాత్పునర్యోజనసమ్మితామ్ ।
తత్రాప్యాహ పునర్దీనః పాహి పాహి నృపోత్తమ ॥22॥

తతః స మనునా క్షిప్తో గంగాయామప్యవర్ధత ।
యదా తదా సముద్రే తం ప్రాక్షిపన్మేదినీపతిః ॥23॥

ఆ పై వైవస్వతుడు ఆ చేపను ఒక బావిలో వదిలాడు. కాని అక్కడ కూడా అది ఇమడలేదు. పిదప ఒక మడువులో విడిచాడు. అక్కడ అది యోజనం పొడవు పెరిగి దీనావస్థలో 'రాజోత్తమా! రక్షించు, రక్షించు' అని ప్రార్థించింది. ఆ పై మనువు దానిని గంగానదిలో వదిలాడు. అక్కడ కూడా అది మితిమించి పెరిగింది. అప్పుడు భూపతి దానిని సముద్రంలోకి విడిచిపెట్టాడు.

యదా సముద్రమఖిలం వ్యాప్యాసౌ సముపస్థితః ।
తదా ప్రాహ మనుర్భీతః కోఽపి త్వమసురేశ్వరః ॥24॥

అథవా వాసుదేవస్త్వమన్య ఈదృక్కథం భవేత్ ।
యోజనాయుతవింశత్యా కస్య తుల్యం భవేద్వపుః ॥25॥

ఆ చేప సముద్రమంతటా వ్యాపించేసరికి మనువు భీతి చెంది ఇలా అన్నాడు :- "నీవు ఎవరవు? రాక్షసరాజువా! లేక వాసుదేవుడవా! లేకపోతే మరొకడు ఇలా ఎలా రూపొందగలడు? రెండు లక్షల యోజనాల పొడవు గల శరీరం ఎవరికి వుంటుంది?"

జ్ఞాతస్త్వం మత్స్యరూపేణ మాం ఖేదయసి కేశవ ।
హృషీకేశ! జగన్నాథ! జగద్ధామ! నమోఽస్తు తే ॥26॥

కేశవా! నేను నిన్ను గ్రహించాను. నీవు మత్స్యరూపం దాల్చి నాకు ఖేదం కలిగించావు. హృషీకేశా! జగన్నాథా! జగన్నివాసా! నీకు నమస్కారం.

ఏవముక్తః స భగవాన్మత్స్యరూపీ జనార్దనః ।
సాధు సాధ్వితి చోవాచ సమ్యగ్ జ్ఞాతస్త్వయాఽనఘ! ॥27॥

మనువు అలా చెప్పేసరికి మత్స్యరూపం దాల్చిన జనార్దనుడైన ఆ భగవంతుడిలా అన్నాడు – "బాగు, బాగు! అనఘా! నీవు నన్ను చక్కగా గుర్తించావు".

అచిరేణైవ కాలేన మేదినీ మేదినీపతే! ।
భవిష్యతి జలే మగ్నా సశైలవనకాననా ॥28॥

ఓ రాజా! సమీపకాలంలోనే ఈ భూమి కొండలు, వనాలు, అరణ్యాలతో సహా నీట మునిగిపోనున్నది.

నౌరియం సర్వదేవానాం నికాయేన వినిర్మితా ।
మహాజీవనికాయస్య రక్షణార్థం మహీపతే ॥29॥

ఓ భూపతీ! ఇదిగో ప్రాణికోట్లను రక్షించడానికై సర్వదేవతలు ఈ నౌకను నిర్మించారు.

స్వేదాండజోద్భిదో యే వై యే చ జీవా జరాయుజాః ।
అస్యాం నిధాయ సర్వాంస్తానసాథాన్పాహి సువ్రత ॥30॥

సువ్రతా! స్వేదజాలు (చెమటనుండి పుట్టేవి), అండజాలు (గ్రుడ్డునుండి పుట్టేవి), ఉద్భిజ్జాలు (నేలను చీల్చుకొని పుట్టేవి), జరాయుజాలు(మావినుండి పుట్టేవి) అయిన రక్షణలేని ఈ ప్రాణుల నన్నింటినీ ఈ నౌకయందు నిలిపి ఏ కీడూ లేకుండా కాపాడు.

యుగాంతవాతాభిహతా యదా భవతి నౌర్నృప ।
శృంగేఽస్మిన్ మమ రాజేంద్ర తదేమాం సంయమిష్యసి ॥31॥

రాజా! ఎప్పుడు ఈ పడవ ప్రళయకాలపు గాలి తాకిడికి కదులుతుందో అప్పుడు దీనిని నా కొమ్మునకు కట్టివేయి.

తతో లయాంతే సర్వస్య స్థావరస్య చరస్య చ ।
ప్రజాపతిస్త్వం భవితా జగతః పృథివీపతే! ॥32॥

ఏవం కృతయుగస్యాదౌ సర్వజ్ఞో ధృతిమాన్నృపః ।
మన్వంతరాధిపశ్చాపి దేవపూజ్యో భవిష్యసి ॥33॥

భూపతీ! ఆ తర్వాత ప్రళయాంతంలో ఈ చరాచరప్రాణికోట్లతో కూడిన జగత్తుకు నీవు ప్రజాపతివౌతావు. అంతట కృతయుగప్రారంభంలో సర్వజ్ఞుడవు, ధీరుడవగు నీవు మన్వంతరాధిపతివై దేవతలకు పూజ్యుడ వవుతావు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఆదిసర్గే మనువిష్ణుసంవాదే ప్రథమోఽధ్యాయః ॥ 1 ॥

శ్రీమత్స్యమహాపురాణంలో ప్రథమసర్గలోని మనువిష్ణుసంవాదంలో ఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్వితీయోఽధ్యాయః - రెండవ అధ్యాయం
మత్స్యమనుసంవాదః - మత్స్యమనుసంవాదం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఏవముక్తో మనుస్తేన పప్రచ్ఛ మధుసూదనమ్ ।
భగవన్ కియద్భిర్వర్షైర్భవిష్యత్యంతరక్షయః ॥1॥

సత్త్వాని చ కథం నాథ రక్షిష్యే మధుసూదన! ।
త్వయా సహ పునర్యోగః కథం వా భవితా మమ ॥2॥

మత్స్యము మనువును ఉద్దేశించి యిలా చెప్పగా మనువు మధుసూదనునితో ఇలా అన్నాడు. "భగవానుడా! ఎన్ని సంవత్సరాల తర్వాత అవాంతరప్రళయం సంభవిస్తుంది? ప్రభూ! నేను ప్రాణులను ఎలా రక్షించగలను? నీతో నాకు మళ్ళీ కలయిక ఎలా జరుగుతుంది?

మత్స్య ఉవాచ:-మత్స్యము చెప్పింది.

అద్యప్రభృత్యనావృష్టిర్భవిష్యతి మహీతలే ।
యావద్వర్షశతం సాగ్రం దుర్భిక్షమశుభావహమ్ ॥3॥

తతోఽల్పసత్త్వక్షయదా రశ్మయః సప్త దారుణాః ।
సప్తసప్తేర్భవిష్యంతి ప్రతప్తాంగారవర్షిణః ॥4॥

ఇప్పటినుండి భూతలంలో అనావృష్టి సంభవిస్తుంది. నూరేండ్లవరకు అమంగళకరమైన కరువు ఏర్పడుతుంది. తదుపరి అల్పప్రాణులను నశింపజేసే దారుణమైన ఏడు సూర్యునికిరణాలు కాలే నిప్పుకణికలను వర్షిస్తాయి.

ఔర్వానలోఽపి వికృతిం గమిష్యతి యుగక్షయే ।
విషాగ్నిశ్చాపి పాతాలాత్సంకర్షణముఖచ్యుతః ।
భవస్యాపి లలాటోత్థతృతీయనయనానలః ॥5॥

ఆ యుగక్షయకాలంలో బడబానలం కూడా విజృంభిస్తుంది. పాతాళం నుండి, సంకర్షణుని వదనమునుండి విషాగ్ని వెలువడుతుంది. అట్లే శివుని యొక్క లలాటంలోని మూడవకంటినుండి అగ్ని వెలువడుతుంది.

త్రిజగన్నిర్దహన్ క్షోభం సమేష్యతి మహామునే! ।
ఏవం దగ్ధా మహీ సర్వా యదా స్యాద్భస్మసన్నిభా ॥6॥

ఆకాశమూష్మణా తప్తం భవిష్యతి పరంతప ।
తతః సదేవనక్షత్రం జగద్యాస్యతి సంక్షయమ్ ॥7॥

ఈ అగ్నులు ముల్లోకాలనూ దహించి క్షోభం కలిగిస్తాయి. మహామునీ! ఈవిధంగా సమస్తభూమండలం కాలి బూడిదలావుతుంది. ఆకాశం పూర్తిగా వేడెక్కుతుంది. పరంతపా! ఆపైన దేవతలతోనూ, నక్షత్రాలతోనూ కూడిన జగమంతా నశించిపోతుంది.

సంవర్తో భీమనాదశ్చ ద్రోణశ్చండో బలాహకః ।
విద్యుత్పతాకః శోణస్తు సప్తైతే లయవారిదాః ॥8॥

అగ్నిప్రస్వేదసంభూతాః ప్లావయిష్యంతి మేదినీమ్ ।

సంవర్తము, భీమనాదము, ద్రోణము, చండము, వలాహకము, విద్యుత్పతాకము, శోణము – అనే ఏడు మేఘాలు అగ్ని వేడిమికి ఉద్భవిస్తాయి. అవి ఎడతెగకుండా వర్షించి భూమిని ముంచివేస్తాయి.

సముద్రాః క్షోభమాగత్య చైకత్వేన వ్యవస్థితాః ॥9॥

ఏతదేకార్ణవం సర్వం కరిష్యంతి జగత్త్రయమ్ ।
వేదనావమిమాం గృహ్య సత్త్వబీజాని సర్వశః ॥10॥

ఆరోప్య రజ్జుయోగేన మత్ప్రదత్తేన సువ్రత ।
సంయమ్య నావం మచ్ఛృంగే మత్ప్రభావాభిరక్షితః ॥11॥

సముద్రాలన్నీ ఒకటిగా కలిసిపోయి ముల్లోకాలనూ ఏకార్ణవంగా రూపొందిస్తాయి. అప్పుడు నీవు ఈ వేదనావను స్వాధీనం చేసుకొని సజీవంగా వున్న ప్రాణులనన్నింటినీ ఆ నావలో ఎక్కించు, సువ్రతా! ఈ నావను నేనిచ్చిన దారముతో నా కొమ్ముకు కట్టివేస్తే నాప్రభావంతో నీవు రక్షింపబడుతావు.

ఏకః స్థాస్యసి దేవేషు దగ్ధేష్వపి పరంతప ।
సోమసూర్యావహం బ్రహ్మా చతుర్లోకసమన్వితః ॥12॥

నర్మదా చ నదీ పుణ్యా మార్కండేయో మహానృషిః ।
భవో వేదాః పురాణాని విద్యాభిః సర్వతోవృతమ్ ॥13॥

త్వయా సార్ధమిదం విశ్వం స్థాస్యత్యంతరసంక్షయే ।
ఏవమేకార్ణవే జాతే చాక్షుషాంతరసంక్షయే ॥14॥

వేదాన్ప్రవర్తయిష్యామి త్వత్సర్గాదౌ మహీపతే! ।
ఏవముక్త్వా స భగవాంస్తత్రైవాంతరధీయత ॥15॥

శత్రుతాపనా! దేవతలందరూ దగ్ధులైనా నీవు ఒక్కడవు సురక్షితుడవై వుంటావు. ఈ ప్రళయకాలంలో చంద్రుడు, సూర్యుడు, నేను, బ్రహ్మ, నాలుగులోకాలు(స్వర్గ, మర్త్య, పాతాళ, బ్రహ్మలోకాలు) పవిత్రమైన నర్మదానది, మార్కండేయమహర్షి, శివుడు, వేదాలు, పురాణాలు, ఇతరవిద్యలు నీతో సహా అన్నీ సురక్షితంగా వుంటాయి.

రాజా! ఈ రీతిగా చాక్షుషమన్వంతరం తర్వాత లోకమంతా ఏకార్ణవం కాగా నీ సృష్టిప్రారంభంలో నేను వేదాలను ప్రవర్తిల్లజేస్తాను. ఇలా చెప్పి ఆ భగవంతుడు అక్కడే అంతర్ధానమయ్యాడు.

మనురప్యాస్థితో యోగం వాసుదేవప్రసాదజమ్ ।
అభ్యసన్యావదాభూతసంప్లవం పూర్వసూచితమ్ ॥16॥

పూర్వం సూచింపపడిన ప్రళయం సంభవించేంతవరకు మనువు కూడా వాసుదేవుని అనుగ్రహంతో సిద్ధించిన యోగాన్ని అభ్యసిస్తూ వుండిపోయాడు.

కాలే యథోక్తే సంజాతే వాసుదేవముఖోద్గతే ।
శృంగీ ప్రాదుర్బభూవాథ మత్స్యరూపీ జనార్దనః ॥17॥

భుజంగో రజ్జురూపేణ మనోః పార్శ్వముపాగమత్ ।
భూతాన్సర్వాన్సమాకృష్య యోగేనారోప్య ధర్మవిత్ ॥18॥

భుజంగరజ్జ్వా మత్స్యస్య శృంగే నావమయోజయత్ ।
ఉపర్యుపస్థితస్తస్యాః ప్రణిపత్య జనార్దనమ్ ॥19॥

తర్వాత వాసుదేవుడు చెప్పినట్లు ప్రళయం సంభవించింది. ఆ పై చేప రూపు దాల్చిన జనార్దనుడు కొమ్ముతో సహా ఆవిర్భవించాడు. ఆదిశేషుడు త్రాటిరూపంలో మనువు చెంతకు వచ్చాడు. ఆ ధర్మవేత్త యోగబలంతో సమస్తప్రాణులను తన దగ్గరకు లాగుకొని పడవనెక్కించి దానిని సర్పరజ్జువుతో మత్స్యముయొక్క కొమ్ముకు కట్టివేశాడు. ఆ పై జనార్దనునికి నమస్కరించి అతడు పడవను అధిష్ఠించాడు.

ఆభూతసంప్లవే తస్మిన్నతీతే యోగశాయినా ।
పృష్టేన మనునా ప్రోక్తం పురాణం మత్స్యరూపిణా ।
తదిదానీం ప్రవక్ష్యామి శృణుధ్వమృషిసత్తమాః ॥20॥

యద్భవద్భిః పురా పృష్టః సృష్ట్యాదికమహం ద్విజాః ।
తదేవైకార్ణవే తస్మిన్మనుః పప్రచ్ఛ కేశవమ్ ॥21॥

అవాంతరప్రళయం గడవగానే మనువు ప్రశ్ననుసరించి మత్స్యరూపుడైన జనార్దనుడు ఈ పురాణం ప్రవచించాడు. ఋషిశ్రేష్ఠులారా! ఇప్పుడు దానిని నేను ప్రవచిస్తాను. వినండి, ద్విజులారా! ఇంతకు ముందు మీరు నన్ను ఏ సృష్ట్యాదికాన్ని గురించి అడిగారో ఆ విషయాన్నే లోకమంతా ఏకార్ణవమైనప్పుడు మనువు కేశవుణ్ణి అడిగాడు.

మనురువాచ :– మనువు ఇలా చెప్పాడు

ఉత్పత్తిం ప్రలయం చైవ వంశాన్మన్వంతరాణి చ ।
వంశానుచరితం చైవ భువనస్య చ విస్తరమ్ ॥22॥

దానధర్మమిదం చైవ శ్రాద్ధకల్పం చ శాశ్వతమ్ ।
వర్ణాశ్రమవిభాగం చ తథేష్టాపూర్తసంజ్ఞితమ్ ॥23॥

దేవతానాం ప్రతిష్ఠాది యచ్చాన్యద్విద్యతే భువి ।
తత్సర్వం విస్తరేణ త్వం ధర్మం వ్యాఖ్యాతుమర్హసి ॥24॥

ప్రపంచముయొక్క ఉత్పత్తినీ, ప్రళయాన్నీ, వంశాలనూ, మన్వంతరాలనూ, వంశానుచరితమునూ, భువనవిస్తారాన్నీ, దానధర్మాల విధానాన్నీ, శాశ్వతమైన శ్రాద్ధకల్పాన్నీ, వర్ణాశ్రమవిభాగాన్నీ, ఇష్టాలు పూర్తాలు అనే సత్కర్మలనూ, దేవతల ప్రతిష్ఠలు మొదలైన విషయాలనూ మరియు లోకంలో యే యే ధర్మాలు వున్నవో అవన్నీ విస్తారంగా నాకు వివరించి చెప్పవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

మత్స్య ఉవాచ :- మత్స్యము ఇలా చెప్పింది

మహాప్రలయకాలాంత ఏతదాసీత్తమోమయమ్ ।
ప్రసుప్తమివ చాతర్క్యమప్రజ్ఞాతమలక్షణమ్ ॥25॥

అవిజ్ఞేయమవిజ్ఞాతం జగత్స్థాస్ను చరిష్ణు చ ।
తతః స్వయంభూరవ్యక్తః ప్రభవః పుణ్యకర్మణామ్ ॥26॥

వ్యంజయన్నేతదఖిలం ప్రాదురాసీత్తమోనుదః ।

కల్పప్రారంభానికి ముందు మహాప్రళయం జరిగిన సందర్భంలో చరాచరాత్మకమైన ఈ జగత్తంతా గాఢనిద్రలో మునిగిందా అన్నట్లు చీకటితో నిండిపోయింది. ఊహించడానికి వీలుగాకుండా ఏమాత్రము ఎరుగరానిదై, గుర్తింపరానిదై ఉండినది. ఇదమిత్థమని చెప్పటానికి వీలుగానిదై, అనుభవానికి అందనిదై ఉండినది. తరువాత నామరూపాలతో వ్యక్తం కానివాడు, పుణ్యకర్మలకు కారణమైనవాడు అయిన స్వయంభువు తన స్వభావాన్ని వ్యక్తం కావిస్తూ చీకట్లను తొలగిస్తూ ప్రాదుర్భవించాడు.

యోఽతీంద్రియః పరోఽవ్యక్తాదణుర్జ్యాయాన్సనాతనః ।
నారాయణ ఇతి ఖ్యాతః స ఏకః స్వయముద్బభౌ ॥27॥

ఇంద్రియాలకు గోచరం కానివాడు, అవ్యక్తం కంటె పరుడూ(శ్రేష్ఠుడు), అణువుల్లో అణువూ, మహత్తులలో మహత్స్వరూపుడూ, సనాతనుడూ, నారాయణుడూ అని ప్రసిద్ధమైన దేవుడొకడు స్వయంగా ఉద్భవించాడు.

యః శరీరాదభిధ్యాయ సిసృక్షుర్వివిధం జగత్ ।
అప ఏవ ససర్జాదౌ తాసు బీజమవాసృజత్ ॥28॥

ఆ దేవుడు తన శరీరంనుండి నానావిధమైన జగత్తును సృష్టింపగోరి ధ్యానమగ్ను డయ్యాడు. ఆపై మొదట జలమునే సృష్టించాడు. ఆ జలంలో బీజరూపమైన వీర్యాన్ని నిలిపాడు.

తదేవాండం సమభవద్ధేమరూప్యమయం మహత్ ।
సంవత్సరసహస్రేణ సూర్యాయుతసమప్రభమ్ ॥29॥

తరువాత ఆ బీజమే అవ్యయమైన పెద్ద బంగారు గ్రుడ్డుగా మారింది. వెయ్యి సంవత్సరాలకు దాని కాంతి పదివేల సూర్యకాంతులతో సమానంగా భాసిల్లింది.

ప్రవిశ్యాంతర్మహాతేజాః స్వయమేవాత్మసంభవః ।
ప్రభావాదపి తద్వ్యాప్త్యా విష్ణుత్వమగమత్పునః ॥30॥

మహాతేజస్స్వరూపుడైన ఆ పరమాత్ముడు ఆ గ్రుడ్డులో తానే ప్రవేశించాడు. తన ప్రభావంతో దానిలో వ్యాపించి విష్ణుత్వం పొందాడు.

తదంతర్భగవానేష సూర్యః సమభవత్పురా ।
ఆదిత్యశ్చాదిభూతత్వాద్బ్రహ్మా బ్రహ్మ పఠన్నభూత్ ॥31॥

కాలక్రమంలో మొదట సూర్యభగవానుడు ఆ గ్రుడ్డునుండి ఉద్భవించాడు. అతడే ఆదిభూతం కాబట్టి ఆదిత్యుడుగా, వేదపఠనం చేయడం వల్ల అతడే బ్రహ్మగా కూడా విలసిల్లాడు.

దివం భూమిం సమకరోత్తదండశకలద్వయమ్ ।
స చాకరోద్దిశః సర్వా మధ్యే వ్యోమ చ శాశ్వతమ్ ॥32॥

అతడు ఆ గ్రుడ్డును రెండు శకలాలుగా విభజించి అందులో దివినీ, భువినీ సృష్టించాడు. ఆరెండింటి మధ్య సమస్త దిక్కులనూ, నాశరహితమైన ఆకాశాన్నీ కల్పించాడు.

జరాయుర్మేరుముఖ్యాశ్చ శైలాస్తస్యాభవంస్తదా ।
యదుల్బం తదభూన్మేఘస్తడిత్సంఘాతమండలమ్ ॥33॥

నద్యోఽండనామ్నః సంభూతాః పితరో మనవస్తథా ।
సప్త యేఽమీ సముద్రాశ్చ తేఽపి చాంతర్జలోద్భవాః ।
లవణేక్షుసురాద్యాశ్చ నానారత్నసమన్వితాః ॥34॥

అప్పుడు మేరువు మొదలగు పర్వతాలు దాని మావినుండి ఉద్భవించాయి. ఆ గర్భము విద్యుత్తుగా, మేఘాలుగా రూపొందింది. అందునుండే నదులు, పితరులు, మనువులు జనించారు. మరియు నానారత్నాలతో కూడి, ఉప్పునీరు, ఇక్షురసం, సుర యిత్యాదులతో నిండినవి అయిన సప్తసముద్రాలు ఆ అండములోని జలభాగమునుండే ఉద్భవించాయి.

స సిసృక్షురభూద్దేవః ప్రజాపతిరరిన్దమ ।
తత్తేజసాఽభూత్తత్రైవ మార్తాణ్డస్సమజాయత ॥35॥

శత్రువులను నాశనం చేసేవాడా! దేవుడైన ఆ ప్రజాపతి సృష్టి చేయదలచుకున్నాడు. వెంటనే అక్కడే ఆయన తేజస్సునుండి మార్తాండుడు (సూర్యుడు) పుట్టాడు.

మృతేఽండే జాయతే యస్మాన్మార్తండస్తేన సంస్మృతః ।
రజోగుణమయం యత్తద్రూపం తస్య మహాత్మనః ।
చతుర్ముఖః స భగవానభూల్లోకపితామహః ॥36॥

అండము మరణించిన పిమ్మట అందుండి జనించాడు కాబట్టి సూర్యుణ్ణి మార్తండుడు అన్నారు. ఆ మహాత్ముని రజోగుణమయమైన రూపమే భగవంతుడు, లోకపితామహుడు అయిన చతుర్ముఖబ్రహ్మగా రూపొందింది.

యేన సృష్టం జగత్ సర్వం సదేవాసురమానుషమ్ ।
తమవేహి రజోరూపం మహత్స(త్త)త్త్వముదాహృతమ్ ॥37॥

దేవతలు, అసురులు, మానవులతో కూడిన ఈ జగత్తునంతటినీ సృష్టించిన ఆ రజోరూపమే మహత్సత్త్వమని (మహత్తత్త్వము) గ్రహించుము.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఆదిసర్గే మత్స్యమనుసంవాదే బ్రహ్మాండదలనం నామ ద్వితీయోఽధ్యాయః ॥ 2 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని ఆదిసర్గంలో మత్స్యమనుసంవాదంలో బ్రహ్మాండదళనమనే రెండవ అధ్యాయం సంపూర్ణం.

తృతీయో౽ధ్యాయః - మూడవ అధ్యాయం

ముఖోత్పత్తిః - ముఖోత్పత్తి

మనురువాచ :- మనువు చెప్పాడు.

చతుర్ముఖత్వమగమత్కస్మాల్లోకపితామహః ।
కథం తు లోకానసృజద్బ్రహ్మా బ్రహ్మవిదాం వరః ॥ 1॥

లోకపితామహుడు ఎందుకు నాలుగుముఖాలు కలవా డయ్యాడు? వేదవేత్తలలో శ్రేష్ఠుడైన బ్రహ్మ లోకాలను ఎలా సృష్టించాడు?

మత్స్య ఉవాచ:- మత్స్యము ఇలా చెప్పింది.

తపశ్చచార ప్రథమమమరాణాం పితామహః ।
ఆవిర్భూతాస్తతో వేదాః సాంగోపాంగపదక్రమాః ॥ 2॥

దేవతలకు గూడా పితామహుడైన బ్రహ్మ మొదట తపస్సు చేశాడు. అప్పుడు తపః ప్రభావంతో అంగములు, ఉపాంగములు, పదక్రమాదిపాఠాలతో సహా వేదాలు ఆవిర్భవించాయి.

పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్ ।
నిత్యం శబ్దమయం పుణ్యం శతకోటిప్రవిస్తరమ్ ॥ 3॥

శాస్త్రా లన్నింటినీ సృష్టించడానికి ముందు నిత్యమూ, శబ్దమయమూ, పుణ్యమూ, శతకోటిగ్రంథవిస్తరం కలదీ అయిన పురాణాన్ని బ్రహ్మ మొదట స్మరించాడు.

అనంతరం చ వక్త్రేభ్యో వేదాస్తస్య వినిస్సృతాః ।
మీమాంసాన్యాయవిద్యాశ్చ ప్రమాణాష్టకసంయుతాః ॥ 4॥

వేదాభ్యాసరతస్యాస్య ప్రజాకామస్య మానసాః ।
మనసః పూర్వసృష్టా వై జాతా యత్తేన మానసాః ॥ 5॥

తర్వాత బ్రహ్మముఖములనుండి వేదాలు, ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, ఆగమం, అర్థాపత్తి, అసంభవం, ఐతిహ్యం, పురాణం అనే ఎనిమిది ప్రమాణాలతో కూడిన మీమాంసా, న్యాయవిద్యలు ఉద్భవించాయి. తదుపరి వేదాభ్యాసమునందు ఆసక్తి కలవాడు, ప్రజలను సృష్టించాలనే సంకల్పం కలవాడు అగు అతని మనస్సు నుండి మొదట సృష్టించబడినవారు ఆకారణం వల్లనే ఆతని మానసపుత్రులుగా ప్రసిద్ధులయ్యారు.

మరీచిరభవత్పూర్వం తతో౽త్రిర్భగవానృషిః ।
అంగిరాశ్చాభవత్పశ్చాత్పులస్త్యస్తదనంతరమ్ ॥ 6॥

ఆ మానసపుత్రులలో మరీచి మొదటివాడు. తర్వాత భగవంతుడైన అత్రి మహర్షి, అంగిరసుడు, ఆ పై పులస్త్యుడు కలిగారు.

తతః పులహ నామా వై తతః క్రతురజాయత ।
ప్రచేతాశ్చ తతః పుత్రో వసిష్ఠశ్చాభవత్పునః ॥7॥

ఆ తర్వాత పులహుడు, క్రతువు జనించారు. వారి పిమ్మట ప్రచేతనుడు ఆపైన వసిష్ఠుడు పుత్రు లయినారు.

పుత్రో భృగురభూత్తద్వన్నారదోఽ ప్యచిరాదభూత్ ।
దశేమాన్మానసాన్బ్రహ్మా మునీన్పుత్రానజీజనత్ ॥8॥

అట్లే భృగువు అతని వెంటనే నారదుడు జనించారు. ఈ విధంగా బ్రహ్మ ఈ పదిమంది మానసపుత్రులను ఉద్భవింపజేశాడు.

శారీరానథ వక్ష్యామి మాతృహీనాన్ప్రజాపతేః ।
అంగుష్ఠాద్దక్షిణాద్దక్షః ప్రజాపతిరజాయత ॥9॥

ధర్మః స్తనాంతాదభవద్ధృదయాత్కుసుమాయుధః ।
భ్రూమధ్యాదభవత్క్రోధో లోభశ్చాధరసంభవః ॥10॥

బుద్ధేర్మోహః సమభవదహంకారాదభూన్మనః ।
ప్రమోదశ్చాభవత్కంఠాన్మృత్యుర్లోచనతో నృప ॥11॥

ఏతే నవ సుతా రాజకన్యా చ దశమీ పునః ।
అంగజా ఇతి విఖ్యాతా దశమీ బ్రహ్మణః సుతా ॥12॥

ఇప్పుడు ప్రజాపతియొక్క శరీరమునుండి తల్లి లేకయే జన్మించిన కుమారులను గూర్చి చెబుతాను. దక్షప్రజాపతి ఆ దేవుని కుడిచేతి బొటన వ్రేలినుండి జన్మించాడు. ధర్ముడు ఆయన స్తన ప్రదేశమునుండి, మన్మథుడు హృదయమునుండి, క్రోధుడు కనుబొమలనుండి, లోభుడు పెదవి నుండి జన్మించారు. అట్లే రాజా! బుద్ధినుండి మోహము, అహంకారమునుండి మనస్సు, కంఠమునుండి ప్రమోదము, నేత్రాలనుండి మృత్యువు ఉద్భవించారు. ఈ తొమ్మిదిమంది కుమారులే కాక అంగజ అని ప్రసిద్ధికెక్కిన ఒక రాజకన్యక పదవసంతానమై కలిగింది.

మనురువాచ :– మనువు చెప్పాడు

బుద్ధేర్మోహూ హ్యహంకారాన్మనోఽ భూదితికీర్తితమ్ ।
అహంకారసుతః కో వా? బుద్ధిర్నామ కిముచ్యతే ॥13॥

బుద్ధినుండి మోహము పుట్టినదన్నారు. అహంకారంనుండి మనస్సు పుట్టినదని చెప్పబడింది. అహంకార పుత్రుడగు మనస్సు ఎట్టిది? బుద్ధి అనగా నేమో వివరించండి.

మత్స్య ఉవాచ:– మత్స్యము ఇలా చెప్పింది.

సత్త్వం రజస్తమశ్చైవ గుణత్రయముదాహృతమ్ ।
సామ్యావస్థితిరేతేషాం ప్రకృతిః పరికీర్తితా ॥14॥

కేచిత్ప్రధానమిత్యాహురవ్యక్తమపరే జగుః ।
ఏతదేవ ప్రజాసృష్టిం కరోతి వికరోతి చ ॥15॥

సత్త్వము, రజస్సు, తమస్సు అనేవి మూడుగుణాలు. ఈ గుణాల సమత్వస్థితిని ప్రకృతి అంటారు. కొందరు దానిని ప్రధానమని, మరికొందరు దానిని అవ్యక్తమని వ్యవహరిస్తారు. ఈ ప్రకృతియే ప్రజాసృష్టికి అందలి పరిమాణానికి, విలయానికి కారణమవుతున్నది.

గుణేభ్యః క్షోభమాణేభ్యస్త్రయో దేవా విజజ్ఞిరే ।
ఏకా మూర్తిస్త్రయో భాగా బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ॥16॥

క్షోభము పొందిన మూడు గుణాలముండి ముగ్గురు దేవతలు ఉద్భవించారు. ఒకే మూర్తి మూడుభాగాలై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా రూపొందారు.

సవికారాత్ప్రధానాత్తు మహత్తత్త్వం ప్రజాయతే ।
మహానితి యతః ఖ్యాతిర్లోకానాం జాయతే సదా ॥17॥

వికారంతోకూడిన ప్రధానమునుండి మహత్తత్త్వం జనిస్తుంది. అందువల్లనే లోకాలకు 'మహాన్' (పెద్దపరిమాణము కలది) అనే ప్రసిద్ధి కలుగుతున్నది.

అహంకారశ్చ మహతో జాయతే మానవర్ధనః ।
ఇంద్రియాణి తతః పంచ వక్ష్యే బుద్ధివశాని తు ।
ప్రాదుర్భవంతి చాన్యాని తథా కర్మవశాని తు ॥18॥

మహత్తత్త్వం నుండి గర్వాన్ని పెంపొందించే అహంకారం పుడుతున్నది. అందునుండి బుద్ధివశములైన ఐదు జ్ఞానేంద్రియాలు, కర్మకు వశమైన ఐదు కర్మేంద్రియాలు ప్రాదుర్భవిస్తున్నవి.

శ్రోత్రం త్వక్ చక్షుషీ జిహ్వా నాసికా చ యథా క్రమమ్ ।
పాయూపస్థం హస్తపాదం వాక్చేతీంద్రియసంగ్రహః ॥19॥

ఇంద్రియాలలో చెవి, చర్మం, కన్ను, నాలుక, ముక్కు అనునవి జ్ఞానేంద్రియాలు, మాట, చేతులు, కాళ్ళు, విసర్జనావయవం, మర్మావయం అనునవి కర్మేంద్రియాలు.

శబ్దః స్పర్శశ్చ రూపం చ రసో గంధశ్చ పంచమః ।
ఉత్సర్గానందనాదానగత్యాలాపాశ్చ తత్క్రియాః ॥20॥

మన ఏకాదశం తేషాం కర్మబుద్ధిగుణాన్వితమ్ ।
ఇంద్రియావయవాః సూక్ష్మాస్తస్య మూర్తి ర్మనీషిణః ॥21॥

శబ్దము, స్పర్శము, రూపము, రసము ఐదవదైన గంధము జ్ఞానేంద్రియాలకు గోచరమయ్యే విషయాలు. మలినాన్ని వదులుట, ఆనందించుట, తీసుకొనుట, వెళ్ళుట, మాట్లాడుట (ఉత్సర్గము, ఆనందము, ఆదానము,

గమనము, వచనము)అనేవి కర్మేంద్రియాలు చేసే పనులు. కర్మజ్ఞాన లక్షణాలతోకూడిన మనస్సు పదకొండవ ఇంద్రియము. సూక్ష్మములైన ఇంద్రియావయవములు పంచతన్మాత్రలను ఆశ్రయించి వుంటాయి. ఈ ఇంద్రియతన్మాత్రల సంఘాతమే సూక్ష్మశరీరము.

శ్రయంతి యస్మాత్తన్మాత్రాః శరీరం తేన సంస్మృతమ్ ।
శరీరయోగాజ్జీవోఽపి శరీరీ గద్యతే బుధైః ॥22॥

తన్మాత్రలకు ఆశ్రయమైనందు వల్లనే శరీరమంటారు. ఆ శరీరములో కలిసిన కారణంగా జీవుణ్ణి కూడా పండితులు శరీరి అంటారు.

మనస్సృష్టిం వికురుతే చోద్యమానం సిసృక్షయా ।
ఆకాశం శబ్దతన్మాత్రాదభూచ్ఛబ్దగుణాత్మకమ్ ॥23॥

ఆకాశవికృతేర్వాయుః శబ్దస్పర్శగుణోఽభవత్ ।
వాయోశ్చ స్పర్శతన్మాత్రాత్తేజశ్చావిరభూత్తతః ॥24॥

సృష్టించాలి అనే కోరికతో ప్రేరేపించబడిన చిత్తము సృష్టికి ఉపక్రమిస్తుంది. శబ్దమే గుణముగాగల ఆకాశం శబ్దతన్మాత్రనుండి రూపొందింది. వికారము పొందిన ఆకాశమునుండి శబ్దస్పర్శాలను గుణములుగా గల వాయువు జనించింది. వాయువులో పరిణామం కలుగగా ఆపై శబ్దస్పర్శరూపాలనే గుణాలు గల అగ్ని జనించింది.

త్రిగుణం తద్వికారేణ తచ్ఛబ్దస్పర్శరూపవత్ ।
తేజోవికారాదభవద్వారి రాజంశ్చతుర్గుణమ్ ॥25॥

రసతన్మాత్రసంభూతం ప్రాయో రసగుణాత్మకమ్ ।
భూమిస్తు గంధతన్మాత్రాదభూత్పంచగుణాన్వితా ॥26॥

ప్రాయో గంధగుణా సా తు బుద్ధిరేషా గరీయసీ ।

అగ్నిలో పరిణామం కలుగగా శబ్దస్పర్శరూపరసాలు గల జలం జనించింది. ఈ జలం రసగుణాత్మకమై వుంటుంది. దానిలో పరిణామం ఏర్పడగా శబ్దస్పర్శరూపరసగంధాలు గుణములుగాగల భూమి ఉద్భవించింది. అది గంధగుణప్రధానమైనది. ఈ చెప్పిన అన్నింటిలోను బుద్ధి శ్రేష్ఠమైనది.

ఏభిః సంపాదితం భుంక్తే పురుషః పంచవింశకః ॥27॥

ఈశ్వరేచ్ఛావశః సోఽపి జీవాత్మా కథ్యతే బుధైః ॥
ఏవం షడ్వింశకం ప్రోక్తం శరీరమిహ మానవే ॥28॥

ఈ ఇరువదినాలుగు తత్త్వములకు ఆవలివాడై ఇరువది అయిదవవాడైన పురుషుడు ఈ ఇరువదినాలుగింటిచే కలిగే సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. అతడు ఈశ్వరుని ఇచ్ఛకు అధీనమై వుంటాడు. బుధులు అతనిని జీవాత్మ అంటారు. ఈ రీతిగా మానవశరీరము జీవాత్మతో సహా ఇరువది ఆరుతత్త్వములతో కూడి వున్నది. ఇలా ఈ

మానవశరీరం షడ్వింశకం అని చెప్పబడింది.

సాంఖ్యం సంఖ్యాత్మకత్వాచ్చ కపిలాదిభిరుచ్యతే ।
ఏతత్తత్త్వాత్మకం కృత్వా జగద్వేధా అజీజనత్ ॥29॥

ఇది సంఖ్యాత్మకం కాబట్టి దీనిని కపిలాదులు 'సాంఖ్య' మన్నారు. (సంఖ్యా అనగా జ్ఞానము) బ్రహ్మదేవుడు ఈ తత్త్వాలు ఆధారంగా జగత్తును సృష్టించాడు.

సావిత్రీం లోకసృష్ట్యర్థం హృది కృత్వా సమాస్థితః ।
తతః సంజపతస్తస్య భిత్త్వా దేహమకల్మషమ్ ॥30॥

స్త్రీరూపమర్ధమకరోదర్ధం పురుషరూపవత్ ।
శతరూపా చ సా ఖ్యాతా సావిత్రీ చ విగద్యతే ॥31॥

సరస్వత్యథ గాయత్రీ బ్రహ్మాణీ చ పరంతప ।
తతః స్వదేహసంభూతామాత్మజామిత్యకల్పయత్ ॥32॥

బ్రహ్మ లోకసృష్టికొరకై తన మనస్సులో సావిత్రిని నిలిపి సమాధిస్థితిని పొందాడు. సావిత్రిని జపించుచుండగా అతని శరీరము నిష్కల్మషమై రెండుగా విడివడింది. అందొకటి పురుషరూపంగాను, మరొకటి స్త్రీరూపంగాను భాసించింది. ఆ స్త్రీరూపమే 'శతరూప' అనియు 'సరస్వతి' అనియు 'గాయత్రి' అనియు 'బ్రహ్మాణి' అనియు ప్రసిద్ధి పొందింది. పరంతపా! బ్రహ్మ తన శరీరంనుండి పుట్టిన ఆమెను తన పుత్రికగా కల్పించుకొన్నాడు.

దృష్ట్వా తాం వ్యథితస్తావత్ కామబాణార్దితో విభుః ।
అహో రూపమహో రూపమితి చాహ ప్రజాపతిః ॥33॥

తతో వసిష్ఠప్రముఖా భగినీమితి చుక్రుశుః ।
బ్రహ్మా న కిం చిద్దదృశే తన్ముఖాలోకనాదృతే ॥ 34॥

అహో రూపమహో రూపమితి ప్రాహ పునః పునః ।
తతః ప్రణామనమ్రాం తాం పునరేవాభ్యలోకయత్ ॥35॥

కాని ఆమెను చూచి కామబాణములచే పీడింపబడి వ్యథనొంది ప్రజాపతి ఏమి రూపము! ఎట్టి రూపము! ఆశ్చర్యము! అని పలికాడు. అంతట వసిష్ఠుడు మున్నగువారు 'భగిని' అని అరచారు. ఆమె ముఖమును తప్ప బ్రహ్మ మరి దేనినీ చూడలేదు. మాటిమాటికీ 'ఔరా! సౌందర్యం! 'ఔరా! సౌందర్యం! అని అన్నాడు. ఆమె తనకు వంగి ప్రణమిల్లగా మళ్ళీ ఆమెవైపే చూచాడు.

అథ ప్రదక్షిణం చక్రే సా పితుర్వరవర్ణినీ ।
పుత్రేభ్యో లజ్జితస్యాస్య తద్రూపాలోకనేచ్ఛయా ॥36॥

ఆవిర్భూతం తతో వక్త్రం దక్షిణం పాండుగండవత్ ।

విస్మయస్ఫురదోష్ఠం చ పాశ్చాత్యముదగాత్తతః ॥37॥

చతుర్థమభవత్పశ్చాద్వామం కామశరాతురమ్ ।
తతోఽన్యదభవత్తస్య కామాతురతయా తథా ॥38॥

పిదప సావిత్రి తన తండ్రి ఐన బ్రహ్మకు ప్రదక్షిణం చేసింది. కొడుకులముందు సిగ్గుపడికూడా ఆమె వైపు మరల చూడగోరుతున్న బ్రహ్మకు తెల్లబోయిన చెక్కిళ్ళు గల దక్షిణముఖం ఉద్భవించింది. తదుపరి ఆశ్చర్యంతో వణకే పెదవులుగల పశ్చిమముఖం జనించింది. ఆ పైన కామబాణపీడితమైన ఎడమప్రక్క మరొక ముఖం జనించింది. అదే నాల్గవ ముఖము, అప్పుడు సావిత్రి అతని కామప్రవృత్తిని చూచి పైకి గంతు వేస్తూ ఆకసంవైపు చూస్తూ వుండినది.

ఉత్పతన్త్యాస్తదాకారా ఆలోకనకుతూహలాత్ ।
సృష్ట్యర్థం యత్కృతం తేన తపః పరమదారుణమ్ ॥39॥

తత్సర్వం నాశమగమత్స్వసుతోపగమేచ్ఛయా ।
తేనోర్ధ్వం వక్త్రమభవత్పంచమం తస్య ధీమతః ।
ఆవిర్భవజ్జటాభిశ్చ తద్వక్త్రం చావృణోత్ప్రభుః ॥40॥

తన కుమార్తె పట్ల కామదృష్టి కలిగి వుండడం వల్ల బ్రహ్మదేవుడు సృష్టికొరకై చేసిన తీవ్రమైన తపస్సంతా నశించిపోయింది. ఆ కారణంగా ధీమంతుడైన అతనికి ఐదవదైన ఊర్ధ్వముఖం ఒకటి జనించింది. ఆ శిరస్సునుండి జడలు ఉద్భవించాయి. అప్పుడు బ్రహ్మ ఆ శిరస్సును కూడా అంగీకరించాడు.

తతస్తానబ్రవీద్బ్రహ్మా పుత్రానాత్మసముద్భవాన్ ।
ప్రజాః సృజధ్వమభితః సదేవాసురమానుషీః ॥41॥

తన మానసపుత్రులను చూచి దేవతలు, అసురులు మనుష్యులతో కూడిన ప్రజలను సృష్టించండి అని ఆజ్ఞాపించాడు.

ఏవముక్తాస్తతః సర్వే ససృజుర్వివిధాః ప్రజాః ।
గతేషు తేషు సృష్ట్యర్థం ప్రణామావనతామిమామ్ ॥42॥
ఉపయేమే స విశ్వాత్మా శతరూపామనిందితామ్ ।
సంబభూవ తయా సార్ధమతికామాతురో విభుః ।
సలజ్జాం చకమే దేవః కమలోదరమందిరే ॥43॥

యావదబ్దశతం దివ్యం యథాన్యః ప్రాకృతో జనః ।
తతః కాలేన మహతా తస్యాః పుత్రోఽభవన్మనుః ॥44॥

అలా ఆదేశించబడినవా రందరూ వివిధప్రజలను, సృష్టింపపూనుకున్నారు. అలా సృష్టికొరకై వారు వెళ్ళిపోగా

విశ్వాత్మకుడైన బ్రహ్మ తలవంచి తనకు ప్రణమిల్లి ఉన్న పవిత్రురాలగు ఆ శతరూపను వివాహమాడాడు.

లోకవిభుడై కూడా అతడు ఆమె పట్ల అతికామాతురుడై ప్రవర్తించాడు. ఒక ప్రాకృతమానవునిలాగా నూరేండ్లపాటు తన నివాసమైన పద్మగృహంలో లజ్జితులారైన ఆమెను అనుభవించాడు. తదుపరి చాలాకాలానికి ఆమెకు 'మనువు' అనే పుత్రుడు జన్మించాడు.

స్వాయంభువ ఇతి ఖ్యాతః స విరాడితి నః శ్రుతమ్ ।
తద్రూపగుణ సామాన్యాదధిపూరుష ఉచ్యతే ॥45॥

ఆతడే స్వాయంభువుడు 'విరాట్' అని ప్రసిద్ధి పొందాడు. అతడు బ్రహ్మరూపగుణములతో సమానుడుగా వుండుటవలన అధిపూరుషుడు అని కూడా వ్యవహరింపబడినాడు.

వైరాజా యత్ర తే జాతా బహువః శంసితవ్రతాః ।
స్వాయంభువా మహాభాగాః సప్త సప్త తథాఽపరే ॥46॥

స్వారోచిషాద్యాః సర్వే తే బ్రహ్మ తుల్యస్వరూపిణః ।
ఔత్తమిప్రముఖాస్తద్వద్యేషాం త్వం సప్తమోఽధునా ॥47॥

ఆ బ్రహ్మవంశం పరంపరగా వృద్ధి పొందగా మహాభాగులైన స్వాయంభువులు పదునాలుగుమంది జన్మించారు. వైరాజులు వారే. బ్రహ్మతో ఏడుగురు, ఉత్తముడు మున్నగువారు ఏడుగురు మొత్తము పదునాలుగుమంది మనువులైనారు. ఉత్తమాదులలో నీవు ఇప్పుడు ఏడవవాడవు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఆదిసర్గే ముఖోత్పత్తిర్నామ తృతీయోఽధ్యాయః ॥ 3 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని ఆదిసర్గంలో ముఖోత్పత్తి అనే మూడవ అధ్యాయం సంపూర్ణం

చతుర్థోఽధ్యాయః - నాల్గవ అధ్యాయం

బ్రహ్మణః స్వపుత్రీ గమనదోషాభావకథనమ్ - బ్రహ్మకు స్వపుత్రీగమనదోషం లేదనుట.

మనురువాచ:- మనువు చెప్పాడు

అహో! కష్టతరం చైతదఙ్గజాగమనం విభో!
కథం న దోషమగమత్కర్మణాఽనేన పద్మభూః॥1॥

ప్రభూ! పుత్రికతో సంగమించడ మనేది ఎంత నీచకృత్యం! ఈ హీనమైన పని చేసి బ్రహ్మ దోషం పొందకుండా ఎలా వుండినాడు?

పరస్పరం చ సంబంధః సగోత్రాణామభూత్కథమ్?
వైవాహిక స్తత్సుతానాం ఛింధి మే సంశయం విభో! ॥2॥

అతని కుమారులు ఒకరి కొకరు సగోత్రు లవుతారు. వారిలో వారికి వైవాహికసంబంధం ఎలా జరిగింది? ప్రభూ! ఈ నా సందేహం తీర్చండి!

మత్స్య ఉవాచ:- మత్స్యం చెప్పింది

దివ్యేయ మాదిసృష్టిస్తు రజోగుణసముద్భవా।
అతీన్ద్రియేన్ద్రియా తద్వదతీన్ద్రియశరీరికా ॥3॥

దివ్యతేజోమయీ భూప! దివ్యజ్ఞానసముద్భవా।
న మర్త్యైరభితః శక్యా వక్తుం వై మాంసచక్షుభిః ॥4॥

రాజా! రజోగుణ సంభవమైన ఈ ఆదిసృష్టి దివ్యమైనది. అది ఇంద్రియాల కందనిది. ఇంద్రియాలకు గోచరించని శరీరం కలది. దివ్యతేజోమయమైనది. దివ్యజ్ఞానం వల్ల కల్గినది. మాంసనేత్రాలుగల మానవులు దానిని చూడజాలరు గాన వర్ణించలేరు.

యథా భుజఙ్గాస్సర్వేషామాకాశే విశ్వపక్షిణామ్।
విదన్తి మార్గం దివ్యానాం వేదా ఏవ న మానవాః॥5॥

సర్పాలు ఆకాశంలో సంచరించే పక్షుల త్రోవను చూడలేవు. అట్లే దివ్యుల మార్గాన్ని వేదాలే కాని మానవులు తెలుసుకోలేరు.

కార్యాకార్యే న దేవానాం శుభాశుభ ఫలప్రదే।
యస్మాత్తస్మాన్న రాజేన్ద్ర! తద్విచారో నృణాం శుభః॥6॥

రాజేంద్ర! దేవతలొనరించే కార్యాలూ, అకార్యాలూ శుభాశుభ ఫలప్రదాలు కావు. అందువల్ల వాటిని గూర్చి మానవులు విచారించడం శుభకరం కాదు.

విశే– 'కార్యాకార్యే న' అనుటకు బదులు 'కార్యాకార్యే చ' అనీ, 'యస్మాత్తస్మాన్న రాజేన్ద్ర' అనుటకు బదులు 'యస్మాత్తస్మాత్తు' అనీ పాఠాంతరాలు ఆర్ష భారతి ట్రస్ట్ వారి ప్రచురణలో కనిపిస్తున్నాయి. అందు వలన "వారి తత్త్వమును విచారణ చేయుటయే మానవులకు శుభకరము" అని ఆ పాఠాల కనుగుణంగా ఆ ప్రచురణలో వారు తాత్పర్యం వివరించి వున్నారు.

అన్యచ్చ సర్వవేదానా మధిష్ఠాతా చతుర్ముఖః ।
గాయత్రీ బ్రహ్మణస్తద్వదఙ్గజాతా నిగద్యతే ॥ 7॥

అమూర్తం మూర్తిమద్వాఽపి మిథునం తత్ప్రచక్షతే।
విరిఞ్చిర్యత్ర భగవాంస్తత్ర దేవీ సరస్వతీ।
భారతీ యత్ర యత్రైవ తత్ర తత్ర ప్రజాపతిః॥ 8॥

మరొక విషయం గూడా గ్రహించు. సకల వేదాలకూ ఈ చతుర్ముఖుడు అధిష్ఠాత. గాయత్రి ఆయన శరీరం నుండి పుట్టిందని చెప్పబడుతున్నది. వారికి మూర్తి ఉన్నా లేకున్నా వారు దంపతులే. ఎక్కడ భగవంతుడైన బ్రహ్మ ఉంటాడో, అక్కడ సరస్వతి ఉంటుంది. ఎక్కడెక్కడ సరస్వతి ఉంటుందో అక్కడక్కడ ప్రజాపతి తప్పక ఉంటాడు.

యథాఽఽతపో న రహితశ్ఛాయయా దృశ్యతే క్వచిత్।
గాయత్రీ బ్రహ్మణః పార్శ్వం తథైవ న విముఞ్చతి॥ 9॥

ఛాయలేని సూర్యుడు (నీడలేని ఎండ) ఎక్కడా కనిపించడు. అట్లే గాయత్రి ఎప్పుడూ బ్రహ్మసాన్నిధ్యం విడిచి ఉండదు.

వేదరాశిః స్మృతో బ్రహ్మా సావిత్రీ తదధిష్ఠితా।
తస్మాన్న కశ్చిద్దోషః స్యాత్సావిత్రీగమనే విభోః॥ 10॥

వేదాల రాశియే బ్రహ్మ. సావిత్రి ఆ దేవుని ఆశ్రయించి వుంటుంది. అందువల్ల బ్రహ్మ సావిత్రిని పొందడంలో దోష మేదీ లేదు.

తథాఽపి లజ్జావనతః ప్రజాపతిరభూత్పురా।
స్వసుతోపగమాద్బ్రహ్మా శశాప కుసుమాయుధమ్॥ 11॥

అయినప్పటికీ తన కుమార్తెను పొందడంచేత బ్రహ్మ పూర్వం సిగ్గుచే కుంచించుకుపోయాడు. మన్మథుణ్ణి శపించాడు.

యస్మాన్మమాపి భవతా మనః సంక్షోభితం శరైః।
తస్మాత్త్వద్దేహమచిరాద్రుద్రో భస్మీకరిష్యతి ॥ 12॥

మన్మథా। నా మనస్సుకు సైతం నీవు నీ బాణాలతో సంక్షోభం కలిగించావు. అందుచేత త్వరలోనే రుద్రుడు నీ శరీరాన్ని బూడిద చేస్తాడు.

తతః ప్రసాదయమాస కామదేవశ్చతుర్భుజమ్।
న మామకారణే శప్తుం త్వమిహార్హసి మానద! ॥13॥

అంతట మన్మథుడు బ్రహ్మను ప్రసన్నుణ్ణి చేసుకోవడానికి ఇలా అన్నాడు. "ప్రభూ! నిష్కారణంగా మీరు నన్ను శపించడం తగదు.

అహమేవంవిధః సృష్ట స్త్వయైవ చతురానన! ।
ఇన్ద్రియక్షోభజనకః సర్వేషామేవ దేహినామ్॥14॥

చతుర్ముఖా! సకలప్రాణులకు ఇంద్రియక్షోభ కల్గించువాణ్ణిగా పూర్వం మీరే నన్ను సృష్టించారు.

స్త్రీపుంసో రవిచారేణ మయా సర్వత్ర సర్వదా।
క్షోభ్యం మనః ప్రయత్నేన త్వయైవోక్తం పురా విభో! ॥15॥

ప్రభూ! యుక్తాయుక్త విచారణ లేకుండా ఎల్లవేళలా ఎల్లచోట్లా స్త్రీ పురుషుల చిత్తానికి ప్రయత్న పూర్వకంగా క్షోభ కల్గించుమని పూర్వం మీరే నాకానతిచ్చారు.

తస్మాదనపరాధోఽహం త్వయా శప్తస్తథా విభో!
కురు ప్రసాదం భగవన్! స్వశరీరాప్తయే పునః ॥16॥

అందుచేత నిరపరాధినైన నన్ను మీరు భస్మ మయ్యేటట్లు శపించారు. భగవానుడా! మళ్ళీ నాకు శరీరం ప్రాప్తించేటట్లు అనుగ్రహించండి।

బ్రహ్మో ఉవాచ:- బ్రహ్మ చెప్పాడు

వైవస్వతేఽన్తరే ప్రాప్తే యాదవాన్వయసంభవః।
రామో నామ యదా మర్త్యో మత్సత్త్వబలమాశ్రితః॥17॥

అవతీర్యాసురధ్వంసీ ద్వారకామధివత్స్యతి।
తద్భ్రాతుస్తత్సమస్య త్వం తదా పుత్రత్వమేష్యసి॥18॥

ఓ మన్మథా! వైవస్వతమన్వంతరం ప్రాప్తించినప్పుడు నా సత్త్వంబలం కల్గిన రాము డనేవాడు యదువంశంలో అవతరిస్తాడు. అలా అవతరించి ద్వారకానగరంలో ఉండి రాక్షసులను సంహరిస్తాడు. అతనితో సమానుడైన అతని సోదరునకు నీవప్పుడు పుత్రుడవై జన్మిస్తావు.

ఏవం శరీరమాసాద్య భుక్త్వా భోగానశేషతః।
తతో భరతవంశాన్తే భూత్వా వత్సనృపాత్మజః॥19॥

విద్యాధరాధిపత్యం చ యావదాభూతసంప్లవమ్।
సుఖాని ధర్మతః ప్రాప్య మత్సమీపం గమిష్యసి 20॥

అలా మళ్ళీ శరీరం పొంది సకలభోగా లనుభవిస్తావు. తదుపరి భరతవంశం సమాప్తం కాగానే వత్సదేశపు రాజుకు పుత్రుడవై జన్మిస్తావు. తదుపరి విద్యాధరుల కధిపతివై ప్రళయకాలం వరకూ ధర్మబద్ధంగా సుఖా లనుభవించి నా సన్నిధికి చేరుకొంటావు.

ఏవం శాపప్రసాదాభ్యా ముపేతః కుసుమాయుధః।
శోకప్రమోదాభియుతో జగామ స యథాగతమ్॥21॥

ఇలా శాపాన్నీ, అనుగ్రహాన్నీ పొందిన మన్మథుడు శోకానికీ, హర్షానికీ గురి అయినవాడై తాను వచ్చిన త్రోవనే వెళ్ళాడు.

మనురువాచ:– మనువు చెప్పాడు

కోఽసౌ యదురితి ప్రోక్తో యద్వంశే కామసంభవః।
కథం చ దగ్ధో రుద్రేణ కిమర్థం కుసుమాయుధః॥22॥

ఎవని వంశంలో మన్మథుడు జన్మిస్తా డన్నారో ఆ యదు వెవరు! రుద్రుడు ఎందుకు ఎలా మన్మథుణ్ణి దగ్ధుణ్ణి కావించాడు?

భరతస్యాన్వయే కస్య కా చ సృష్టిః పురాఽభవత్।
ఏతత్సర్వం సమాచక్ష్వ మూలతః సంశయో హి నః॥23॥

భరతుని వంశంలో పూర్వం ఎవరి సృష్టి ఎలా జరిగింది? ఈ విషయాన్ని మొదటినుండి పూర్తిగా తెలియజేయండి! మాకీ విషయంలో సంశయమున్నది.

మత్స్య ఉవాచ:– మత్స్యం చెప్పింది

యా సా దేహార్ధసంభూతా గాయత్రీ బ్రహ్మవాదినీ।
జననీ యా మనోర్దేవీ శతరూపా శతేంద్రియా ॥24॥

బ్రహ్మ శరీరార్ధ భాగంనుండి జనించిన గాయత్రి బ్రహ్మవాదిని. ఆ దేవి మనువుకు తల్లి. ఆమెను శతరూప, శతేంద్రియ అని కూడా వ్యవహరిస్తారు.

రతిర్మనస్తపో బుద్ధిర్మహాన్ దిక్ సంభ్రమస్తథా।
తతః స శతరూపాయాం సప్తాపత్యాన్యజీజనత్॥25॥

బ్రహ్మ ఆ శతరూపయందు రతి, మనస్సు, తపస్సు, బుద్ధి, మహత్తు, దిక్కు, సంభ్రమం – అనే ఏడుగురు బిడ్డలను కన్నాడు.

యే మరీచ్యాదయః పుత్రా మానసాస్తస్య ధీమతః।
తేషామయమభూల్లోకః సర్వజ్ఞానాత్మకః పురా॥26॥

సర్వజ్ఞానాత్మకమైన ఈ లోకం ఆ బుద్ధిశాలియైన బ్రహ్మకు మానసపుత్రులైన మరీచి మున్నగు ప్రజాపతులకు సంబంధించిన దయింది.

తతోఽసృజద్వామదేవం త్రిశూలవరధారిణమ్।
సనత్కుమారం చ విభుః పూర్వేషామపి పూర్వజమ్॥27॥

తరువాత లోకప్రభుడైన బ్రహ్మ శ్రేష్ఠమైన త్రిశూలమును ధరించిన వామదేవుని, మొదటివారికంటె మొదటివాడైన సనత్కుమారుని గూడా సృష్టించాడు.

వామదేవస్తు భగవానసృజన్ముఖతో ద్విజాన్।
రాజన్యానసృజద్బాహ్వోర్విట్ఛూద్రానూరుపాదయోః॥28॥

విద్యుతోఽశనిమేఘాంశ్చ రోహితేంద్రధనూంషి చ।
ఛందాంసి చ ససర్జాదౌ పర్జన్యం చ తతః పరమ్॥29॥

భగవానుడైన వామదేవుడు ముఖంనుండి ద్విజులనూ, బాహువులనుండి క్షత్రియులనూ, ఊరువులనుండి వైశ్యులనూ, పాదాలనుండి శూద్రులనూ సృష్టించాడు. అట్లే మెఱపులనూ, పిడుగులనూ, మేఘాలనూ, వివిధ వర్ణాలుగల ఇంద్రధనువులనూ, ఛందస్సులనూ సృష్టించి తరువాత పర్జన్యుణ్ణి సృష్టించాడు.

తతఃసాధ్యగణానీశ స్త్రినేత్రాదసృజత్ప్రభుః।
కోటిశశ్చతురాశీతిం జరామరణవర్జితాన్॥30॥

వామోఽసృజదమర్త్యాంస్తాన్ బ్రహ్మణా వినివారితః।
నైవంవిధా భవేత్సృష్టి ర్జరామరణవర్జితా॥31॥

తరువాత మూడవ కంటినుండి సాధ్యగణాలనూ, జరామరణాలు లేని ఎనుబదినాల్గుకోట్ల దేవతలను గూడ సృష్టించాడు. బ్రహ్మదేవుడు వామదేవుణ్ణి అట్టి సృష్టికర్మ నుండి నివారిస్తూ జరామరణాలు లేని అలాంటి సృష్టి తగదని చెప్పాడు.

శుభాశుభాత్మికా యా తు సైవ సృష్టిః ప్రశస్యతే।
ఏవం స్థితః స తేనాదౌ సృష్టేః స్థాణురతోఽభవత్॥32॥

శుభాశుభాలతో గూడిన సృష్టియే మేలైనది. ఈ విధంగా బ్రహ్మమాట ప్రకారం సృష్టిచెయ్యటం ఆపాడు. చలనం లేకుండా ఉన్నాడు. పిదప సృష్టికార్యం నిల్చిపోయింది. అందువలన వామదేవుడు స్థాణువు అనే పేరు పొందాడు.

స్వాయంభువో మనుర్ధీమాంస్తపస్తప్త్వా సుదుశ్చరమ్।
పత్నీమేవాప రూపాఢ్యామనన్తాం నామ నామతః।
ప్రియవ్రతోత్తానపాదౌ మనుస్తస్యామజీజనత్॥33॥

బుద్ధిమంతుడైన స్వాయంభువమనువు తీవ్రమైన తపస్సు చేసి 'అనంత' అనే సౌందర్యవతిని ధర్మ పత్నిగా పరిగ్రహించాడు. అత డామెయందు ప్రియవ్రతుణ్ణీ, ఉత్తానపాదుణ్ణీ జనింపజేశాడు.

ధర్మస్య కన్యాం చతురాం సూనృతాం నామ భామినీమ్।
ఉత్తానపాదస్తనయామాప మంథరగామినీమ్॥34॥

ధర్ముని పుత్రికయగు 'సూనృత' అను కన్యను ఉత్తానపాదుడు చేపట్టాడు. ఆమె నేర్పరి, మందగామిని, సౌందర్యవతి.

అపస్యతి మపస్యన్తం కీర్తిమన్తం ధ్రువం తథా।
ఉత్తానపాదోఽ జనయ త్సూనృతాయాం ప్రజాపతిః॥35॥

ఉత్తానపాద ప్రజాపతి సూనృత యందు అపస్యతి, అపస్యంతుడు, కీర్తిమంతుడు, ధ్రువుడు అను పుత్రులను కన్నాడు.

(విశేః– "అయం పతిరయం మత్తః కీర్తిమాన్ ధ్రువమేవ చ" అను పాఠాంతరమును బట్టి 'ఇతడు నాకు భర్త, ఇతడు నావలన కీర్తిశాలి కావాలి', అను భావము ఉత్తానపాదునియందు సూనృత కున్నదని కొందరు వివరించారు. అయంపతి, అయంమత్తుడు, కీర్తి మంతుడు, ధ్రువుడు–అను నల్వురు ఉత్తానపాదుని పుత్రులని మరికొందరి భావన.)

ధ్రువో వర్ష సహస్రాణి త్రీణి కృత్వా తపః పురా।
దివ్యమాప తతః స్థానమచలం బ్రహ్మణో వరాత్॥
తమేవ పురతః కృత్వా ధ్రువం సప్తర్షయః స్థితాః॥36॥

ధ్రువుడు పూర్వం మూడువేల సంవత్సరాలు తపస్సు చేసి తపఃప్రభావంవల్ల బ్రహ్మవరంతో దివ్యమైన ధ్రువస్థానం పొందాడు. అట్టి ధ్రువుణ్ణే ముందుగా ఉంచుకొని సప్తర్షులు నభోమండలంలో ఉన్నారు.

(విశే – మరీచి, అత్రి, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు మరియు వసిష్ఠుడు సప్తర్షులు)

ధన్యా నామ మనోః కన్యా ధ్రువాచ్ఛిష్ట మజీజనత్।
అగ్నికన్యా తు సుచ్ఛాయా శిష్టాత్సా సుషువే సుతాన్॥37॥

మనువు పుత్రిక అయిన ధన్య ధ్రువునికి పత్నిగా వుండి శిష్టుడనే కుమారుణ్ణి కనింది. అగ్ని కుమార్తె అయిన సుచ్ఛాయను శిష్టుడు భార్యగా స్వీకరించి పుత్రులను కన్నాడు.

కృపం రిపుంజయం వృత్రం వృకం చ వృకతేజసమ్।
చాక్షుషం బ్రహ్మదౌహిత్ర్యాం వైరిణ్యాం స రిపుంజయః॥38॥

సుచ్ఛాయయందు శిష్టునికి కృపుడు, రిపుంజయుడు, వృత్రుడు, వృకుడు, వృకతేజుడు అనే కుమారులు కలిగారు. బ్రహ్మ మనుమరాలైన వైరిణియందు రిపుంజయుడు చాక్షుషుణ్ణి కన్నాడు.

వీరణస్యాత్మజాయాం తు నడ్వలాయాం చ చాక్షుషః ।
జనయామాస తనయాన్ దశ శూరానకల్మషాన్।
ఊరుః పురః శతద్యుమ్న స్తపస్వీ సత్యవాక్కవిః॥40॥

అగ్నిష్టోమోఽతిరాత్రశ్చ సుద్యుమ్నశ్చాపరాజితః।
అభిమన్యుస్తు దశమో నడ్వలాయాంతు చాక్షుషాః॥41॥

చాక్షుషమనువుకు వీరణుని పుత్రిక అయిన నడ్వలయందు శూరులు, కల్మషరహితులు అయిన ఊరువు, పురుడు, శతద్యుమ్నుడు, తపస్వియగు సత్యవాక్కు, కవి, అగ్నిష్టోముడు, అతిరాత్రుడు, సుద్యుమ్నుడు, అపరాజితుడు, పదవ వాడైన అభిమన్యుడు జనించారు.

ఊరో రజనయత్పుత్రాన్ షడాగ్నేయీ తు సుప్రభాన్॥
అఙ్గం సుమనసం ఖ్యాతిం క్రతుమంగిరసం శిబిమ్॥42॥

ఊరువు ఆగ్నేయి యందు అంగుడు, సుమనసుడు, ఖ్యాతి, క్రతువు, అంగిరసుడు, శిబి అనే తేజోవంతులైన ఆరుగురు పుత్రులను పొందాడు.

పితృకన్యా సునీథా తు వేనమంగాదజీజనత్।
వేనమన్యాయినం విప్రా మమన్థుస్తత్కరాదభూత్॥43॥
పృథుర్నామ మహాతేజాస్స పుత్రౌ ద్వావజీజనత్ ॥44॥

పితృదేవతల కన్యయగు సునీథ అంగునివల్ల వేనుణ్ణి పుత్రుడుగా పొందింది. అధర్మపరుడైన వేనుణ్ణి విప్రులు మథించారు. అతని చేతినుండి మహాతేజస్వి అయిన పృథు వనే రాజు సంభవించాడు. అతడు అంతర్ధానుడు, హవిర్ధానుడు అను ఇరువురు పుత్రులను కన్నాడు.

అంతర్ధానస్తు మారీచం శిఖండిన్యామజీజనత్।
హవిర్ధానాత్ షడాగ్నేయీ ధిషణాఽజనయత్సుతాన్।

ప్రాచీనబర్హిషం సాంగం యమం శుక్రం బలం శుభమ్॥45

అంతర్ధానుడు శిఖండిని అనే పత్నియందు మారీచుడనే పుత్రుని కన్నాడు. అగ్ని పుత్రికయైన ఆగ్నేయి హవిర్ధానుని ద్వారా ప్రాచీనబర్హి, సాంగుడు, యముడు, శుక్రుడు, బలుడు, శుభుడు అనే ఆరుగురు కుమారులను పొందింది.

ప్రాచీన బర్హిర్భగవాన్ మహానాసీత్ప్రజాపతిః।
హవిర్ధానాః ప్రజాస్తేన బహవః సంప్రవర్తితాః॥46॥

భగవానుడైన ప్రాచీనబర్హి గొప్ప ప్రజాపతి అయ్యాడు. అతడు అనేక ప్రజలను హవిర్ధానులుగా ప్రవర్తింపజేశాడు.

సవర్ణాయాం తు సాముద్ర్యాం దశాధత్త సుతాన్ ప్రభుః।
సర్వే ప్రాచేతసా నామ ధనుర్వేదస్య పారగాః॥47॥

ఆప్రాచీనబర్హి సముద్రుని కూతురైన సవర్ణయందు పదిమంది సుతులను ప్రభవింపజేశాడు. వారందరూ ప్రాచేతసులను పేర ప్రసిద్ధులై ధనుర్వేదంలో నిష్ణాతులయ్యారు.

తత్తపోరక్షితా వృక్షా బభుర్లోకే సమంతతః।
దేవాదేశాచ్చ తానగ్ని రదహద్రవినందన! ॥48॥

సూర్యపుత్రా! ప్రాచేతసుల తపోబలంతో రక్షించబడిన వృక్షాలు లోకంలో నలువైపులా విస్తరించాయి. కాని ఇంద్రుని ఆజ్ఞ వల్ల అగ్ని ఆ చెట్లను దహించివేశాడు.

(విశే ః- అగ్ని దహించిన వృక్షాలను వారు తపోబలంతో మరల విస్తరింప జేశారనుట సముచితం)

సోమకన్యాఽభవత్పత్నీ మానసా నామ విశ్రుతా।
తేభ్యస్తు దక్షమేకం సా పుత్రమగ్ర్యమజీజనత్॥49॥

చంద్రుని పుత్రిక మానస అనే కన్య ప్రాచేతసులకు పత్ని అయింది. ఆమె వారి కలయికతో దక్షుడనే ఒక శ్రేష్ఠుడైన కుమారునికి జన్మనిచ్చింది.

దక్షా దనన్తరం వృక్షాన్ ఔషధాని చ సర్వశః।
అజీజనత్సోమకన్యా నదీం చంద్రవతీం తథా॥50॥

దక్షుని తరువాత ఆ సోముని పుత్రిక వృక్షాలను, ఔషధాలను నలువైపుల ఉద్భవింప జేసింది. అట్లే చంద్రవతి అనే నదిని గూడా ప్రసరింపజేసింది

సోమాంశస్య చ తస్యాపి దక్షస్యాశీతికోటయః।
తాసాం తు విస్తరం వక్ష్యే లోకే యః సుప్రతిష్ఠితః॥51॥

చంద్రాంశంతో జన్మించిన ఆ దక్షునికి ఎనుబది కోట్లమంది సంతానం కలిగారు. లోకమంతటా వ్యాపించి ప్రతిష్ఠితమైయున్న వారి వివరాలను విశదీకరిస్తాను.

ద్విపదాశ్చాభవన్ కేచిత్కేచిద్బహుపదా నరాః।
వలీముఖాశ్శంకుకర్ణాః కర్ణ ప్రావరణాస్తథా ॥52॥

వారిలో కొందరు రెండు పాదాలు కలవారు. మరికొందరు పెక్కుపాదాలు కల్గివుండినారు. కొందరు కోతి మొగము వారు కాగా మరికొందరు శంకువు వంటి చెవులు గలవారు. మరికొందరు కప్పబడిన చెవులతో ఉండినారు.

అశ్వబుక్షముఖాః కేచిత్కేచిత్సింహాననా స్తథా।
శ్వసూకరముఖాః కేచిత్కేచిదుష్ట్రముఖా స్తథా॥ 53॥

కొందరు గుఱ్రపు మొగమువారు, మరికొందరు ఎలుగుబంటి మొగమువారు. కొందరు సింహముఖులు కాగా ఇంక కొందరు కుక్క, పంది, ఒంటెల ముఖం కలవా రైనారు.

ధర్మాత్మా జనయామాస మ్లేచ్ఛాన్ సర్వాననేకశః।
స సృష్ట్వా మనసా దక్షః స్త్రియః పశ్చాదజీజనత్॥ 54॥

ధర్మాత్ముడైన ఆదక్షుడు పెక్కుమంది మ్లేచ్ఛజాతి వారిని మనస్సుతో సృష్టించాడు. ఆ తరువాత స్త్రీలను సృష్టించాడు.

దదౌ స దశ ధర్మాయ కశ్యపాయ త్రయోదశ।
సప్తవింశతి సోమాయ దదౌ నక్షత్ర సంహితాః॥

దేవాసురమనుష్యాది తాభ్యః సర్వమభూజ్జగత్ ॥ 55॥

ఆ స్త్రీలలో పదిమందిని దక్షుడు యమధర్మ రాజుకిచ్చాడు. పదమూడు మందిని కశ్యపునికిచ్చాడు. నక్షత్ర సంహితలుగా ప్రసిద్ధి కెక్కిన ఇరువదేడుమందిని చంద్రుని కిచ్చాడు.

దేవతలు, రాక్షసులు, మనుష్యులు మున్నగు వారితో నిండిన జగత్తంతా ఆస్త్రీలనుండి ఉత్పన్నమయింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఆదిసర్గే సరస్వత్యుపాఖ్యానే బ్రహ్మణః స్వపుత్రీ

గమనదోషాభావకథనమితి చతుర్థోఽధ్యాయః ॥ 4 ॥

శ్రీమత్స్య మహాపురాణంలో ఆదిసర్గంలో సరస్వత్యుపాఖ్యానంలో బ్రహ్మకు
స్వపుత్రీగమనదోషం లేదనుట అనే నాల్గవ అధ్యాయం సంపూర్ణం

పఞ్చమోఽధ్యాయః - ఐదవ అధ్యాయం

దక్షసృష్ట్యాది వివరణమ్ - దక్షసృష్ట్యాదుల వివరణం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

దేవానాం దానవానాం చ గన్ధర్వోరగరక్షసామ్ ।
ఉత్పత్తిం విస్తరేణైవ సూత బ్రూహి యథాతథమ్॥ 1॥

సూతా! దేవతలు, దానవులు, గంధర్వులు, పన్నగులు, రాక్షసులు-వీరి యొక్క పుట్టుకను ఉన్నదున్నట్లు విస్తృతంగా చెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

సంకల్పాద్దర్శనా త్స్పర్శాత్పూర్వేషాం సృష్టిరుచ్యతే ।
దక్షాత్ప్రాచేతసా దూర్ధ్వం సృష్టిర్మైథునసంభవా॥ 2॥

ప్రచేతుసుని పుత్రుడైన దక్షునికి ముందు సృష్టి సంకల్పంతోనూ, దర్శనంతోనూ, స్పర్శతోనూ జరిగేది. దక్షుని తరువాత స్త్రీపురుషుల కలయికతోనే సృష్టి సంభవించింది.

ప్రజాః సృజేతి వ్యాదిష్టః పూర్వం దక్షః స్వయంభువా ।
యథా ససర్జ చైవాదౌ తథైవ శృణుత ద్విజాః! ॥3॥

ద్విజులారా! పూర్వం బ్రహ్మ ప్రజలను సృష్టించుమని దక్షుణ్ణి ఆదేశించాడు. అంతట ఆదికాలంలో దక్షు డెలా సృష్టి చేశాడో అది వివరిస్తాను వినండి.

యదా తు సృజతస్తస్య దేవర్షిగణపన్నగాన్ ।
న వృద్ధి మగమల్లోక స్తదా మైథునయోగతః ।
దక్షః పుత్రసహస్రాణి పాఞ్చజన్యామజీజనత్ ॥4॥

దక్షుడు దేవర్షిగణాలను, పన్నగాలను సంకల్పదర్శనస్పర్శాలతో సృష్టింప బూనుకొన్నప్పుడు లోకం వృద్ధి పొందలేదు. అప్పుడతడు మైథునయోగంతో పాంచజనియందు వెయ్యి మంది కుమారులను కన్నాడు.

తాంస్తు దృష్ట్వా మహాభాగాన్ సిసృక్షూన్వివిధాః ప్రజాః ।
నారదః ప్రాహ హర్యశ్వాన్ దక్షపుత్రాన్ సమాగతాన్ ॥5॥

దక్షునికుమారులైన హర్యశ్వులు వివిధ ప్రజలను సృష్టింపగోరి సృష్టికార్యాభిముఖులై ఉండడం చూచి నారదుడు వారితో ఇలా అన్నాడు.

భువః ప్రమాణం సర్వత్ర జ్ఞాత్వోర్ధ్వమధ ఏవ చ ।
తతః సృష్టిం విశేషేణ కురుధ్వ మృషిసత్తమాః॥ 6॥

ఋషిశ్రేష్ఠులారా! ఈ భూమియొక్క ప్రమాణం ఎంతటిదో క్రిందా, పైనా అంతటా పరిశీలించి ఆపైన సృష్టికార్యాన్ని విశేషంగా నిర్వహించండి.

తే తు తద్వచనం శ్రుత్వా ప్రయాతాః సర్వతో దిశమ్।
అద్యాపి న నివర్తన్తే సముద్రాదివ సింధవః॥ 7॥

వారు నారదుని మాట విని అన్ని దిక్కులకూ పయనమైపోయారు. కాని నేటి వరకు సముద్రంలో ప్రవేశించిన నదుల వలె తిరిగిరాలేదు.

హర్యశ్వేషు ప్రణష్టేషు పునర్దక్షః ప్రజాపతిః।
వైరిణ్యామేవ పుత్రాణాం సహస్రమసృజత్ప్రభుః॥ 8॥

అలా హర్యశ్వులు నశించిపోయే సరికి ప్రభువైన దక్షప్రజాపతి మళ్ళీ వైరిణియందు వెయ్యి మంది పుత్రులను ప్రభవింపజేశాడు.

శబలా నామ తే విప్రా స్సమేతాః సృష్టిహేతవః।
నారదోఽనుగతాన్ ప్రాహ పునస్తాన్ పూర్వవత్సుతాన్॥ 9॥

శబలులు అనే పేరుగల ఆ విప్రులు సృష్టికార్యానికి సమాయత్తమయ్యారు. అప్పుడు నారదుడు ఆదక్షసుతులను చూచి ఇంతకు ముందు లాగానే వారితో ఇలా అన్నాడు.

భువః ప్రమాణం సర్వత్ర జ్ఞాత్వా భ్రాతౄనథో పునః।
ఆగత్య చాథ సృష్టిం చ కరిష్యథ విశేషతః॥ 10॥

మునులారా! ముందు భూమియొక్క ప్రమాణం అన్ని వైపులా తెలుసుకోండి, తదుపరి మీ సోదరుల ఉనికిని గూడా తెలుసుకొని తిరిగి వచ్చి సృష్టికి విశేషంగా ఉపక్రమించండి!

తేఽపి తేనైవ మార్గేణ జగ్ముర్భ్రాతృపథా తదా!
తతఃప్రభృతి న భ్రాతుః కనీయాన్మార్గమిచ్ఛతి।
అన్విష్యన్ దుఃఖమాప్నోతి తేన తత్పరివర్జయేత్॥ 11॥

ఆ శబలులుగూడా తమ సోదరులు పోయిన త్రోవనే పోయారు. మళ్ళీ తిరిగి రాలేదు. అప్పటినుండి తమ్ముడు అన్న నన్వేషిస్తూ అతని జాడను బట్టి పోవడం లేదు. ఒక వేళ పోయినా దుఃఖానికి గురి అవుతాడు. అంచేత ఆ పని చేయదగదు.

తతస్తేషు వినష్టేషు షష్టిం కన్యాః ప్రజాపతిః।
వైరిణ్యాం జనయామాస దక్షః ప్రాచేతసస్తదా ॥12॥

ఆ శబలులు అలా నశించిపోయేసరికి ప్రాచేతసుడైన దక్షప్రజాపతి వైరిణియందు మరల అరువది మంది కన్యలను ప్రభవింప చేశాడు.

ప్రాదాత్స దశ ధర్మాయ కశ్యపాయ త్రయోదశ।
సప్తవింశతి సోమాయ చతస్రోఽరిష్టనేమయే॥13॥

ద్వే చైవ భృగుపుత్రాయ ద్వే కృశాశ్వాయ ధీమతే।
ద్వే చైవాఙ్గిరసే తద్వత్తాసాం నామాని విస్తరాత్॥14॥

శృణుధ్వం దేవమాతౄణాం ప్రజా విస్తరమాదితః।

వారిలో పదిమంది నతడు ధర్ముని కిచ్చాడు. పదుముగ్గురిని కశ్యపునికీ, ఇరువదేడుగురిని చంద్రునికీ, నలుగురిని అరిష్టనేమికీ, ఇరువురిని భృగుకుమారునికీ, ఇద్దరిని బుద్ధి మంతుడైన కృశాశ్వునికీ, ఇద్దరిని అంగిరసునికీ ఇచ్చాడు. ఆ దేవమాతలనుండి పుట్టిన ప్రజాసంతతిని మొదటినుండీ విస్తరించి చెబుతాను, వినండి!

మరుత్వతీ వసుర్యామీ లంబా భానురరున్ధతీ॥15॥

సంకల్పా చ మూహూర్తా చ సాధ్యా విశ్వా చ భామినీ।
ధర్మపత్న్యః సమాఖ్యాతా స్తాసాం పుత్రాన్నిబోధత॥16॥

మరుత్వతి, వసువు, యామి, లంబ, భానువు, అరుంధతి, సంకల్ప, ముహూర్త, సాధ్య, విశ్వ అనువారు పదిమంది ధర్ముని ధర్మపత్నులు. వీరి పుత్రులను గురించి వినండి.

విశ్వేదేవాస్తు విశ్వాయాః సాధ్యా సాధ్యానజీజనత్।
మరుత్వత్యాం మరుత్వన్తో వసోస్తు వసవస్తథా॥17॥

విశ్వకు విశ్వేదేవులు జనించారు. సాధ్య సాధ్యులను కనింది. మరుత్వతికి మరుత్వంతులు, వసువుకు వసువులు పుట్టారు.

భానోస్తు భానవస్తద్వన్ముహూర్తాయాం ముహూర్తకాః।
లమ్బాయాం ఘోషణామానో నాగవీథీ తు యామిజా॥18॥

భానువుకు భానువులు, ముహూర్తయందు ముహూర్తకులు, లంబకు ఘోషనాములు, యామికి నాగవీథ్యాదులు సంతాన మయ్యారు.

పృథివీతలసంభూత మరున్ధత్యామజాయత।
సఙ్కల్పాయాస్తు సఙ్కల్పో వసుసృష్టిం నిబోధత ॥19॥

భూతలంలోని సకలప్రాణులూ అరుంధతికి పుట్టాయి. సంకల్పకు సంకల్పనాములు జనించారు. ఇక వసువుల సృష్టిని గూర్చి తెలుసుకోండి.

జ్యోతిష్మన్తస్తు యే దేవా వ్యాపకా సర్వతోదిశమ్ ।
వసవస్తే సమాఖ్యాతాస్తేషాం సర్గం నిబోధత॥20॥

సర్వదిక్కులా వ్యాపించిన జ్యోతిష్మంతులనే దేవతలే వసువులుగా ఖ్యాతి పొందారు. వారి సృష్టిని గూర్చి తెలుసుకోండి.

ఆపో ధ్రువశ్చ సోమశ్చ ధరశ్చైవానిలో౽నలః।
ప్రత్యూషశ్చ ప్రభాసశ్చ వసవో౽ష్టౌ ప్రకీర్తితాః॥21॥

ఆపుడు, ధ్రువుడు, సోముడు,ధరుడు, అనిలుడు, అనలుడు, ప్రత్యూషుడు, ప్రభాసుడు-వీరు అష్టవసువులని పేర్కొనబడ్డారు.

ఆపస్య పుత్రాశ్చత్వారః శాన్తో వై దణ్డ ఏవ చ।
శామ్బో౽థ మణివక్త్రశ్చ యజ్ఞరక్షాధికారిణః॥22॥

శాంతుడు, దండుడు, శాంబుడు, మణి వక్త్రుడు-అనే నలుగురు ఆపుని పుత్రులు. వీరు యజ్ఞ రక్షణ నిర్వహించే అధికారులు.

ధ్రువస్య కాలః పుత్రస్తు వర్చాః సోమాదజాయత।
ద్రవిణో హవ్యవాహశ్చ ధరపుత్రా వుభౌ స్మృతౌ॥23॥

ధ్రువుని కుమారుడు కాలుడు. సోమునికి వర్చసుడు, ధరునికి ద్రవిణుడు, హవ్యవాహుడు అనే ఇద్దరు కుమారులూ పుట్టారు.

కల్పానీకస్తతః ప్రాణో రమణః శిశిరో౽పి చ।
మనోహరా ధరాత్పుత్రా నవాపాథ హరేః సుతా॥24॥

హరి పుత్రికయైన మనోహర ధరుని సంయోగంతో కల్పానీకుడు, ప్రాణుడు, రమణుడు, శిశిరుడు అనే పుత్రులను పొందింది.

శివా మనోజవం పుత్రమవిజ్ఞాతగతిం తథా।
అవాప చానలాత్పుత్రా వగ్నిప్రాయగుణౌ పునః॥25॥

శివ అనలుని సంయోగంతో మనోజవుడు, అవిజ్ఞాతగతి అనే అగ్ని సదృశులైన ఇద్దరు పుత్రులను పొందింది.

అగ్నిపుత్రః కుమారస్తు శరస్తమ్బే వ్యజాయత।
తస్య శాఖో విశాఖశ్చ నైగమేయశ్చ పృష్ఠజాః॥26॥

అగ్నిపుత్రుడైన కుమారుడు రెల్లు పొదలలో ఉద్భవించాడు. శాఖుడు, విశాఖుడు, నైగమేయుడు- అతని అనుజులు.

అపత్యం కృత్తికానాం తు కార్తికేయ స్తతః స్మృతః।
ప్రత్యూషస్య ఋషిః పుత్రో విభుర్నామ్నాథ దేవలః।
విశ్వకర్మా ప్రభాసస్య పుత్రః శిల్పీ ప్రజాపతేః ॥27॥

కృత్తికల బిడ్డడే కార్తికేయు డయ్యాడు. విభువు, దేవలుడనే ఋషులు ప్రత్యూష ఋషిపుత్రులు. ప్రభాసునకు శిల్పి, ప్రజాపతి అయిన విశ్వకర్మ కుమారుడయ్యాడు.

ప్రాసాదభవనోద్యాన ప్రతిమా భూషణాదిషు।
తడాగారామకూపేషు స్మృతః సోఽమరవర్ధకిః ॥28॥

దేవతలకు ప్రాసాదాలు, భవనాలు, ఉద్యానాలు, ప్రతిమలు, ఆభరణాలు, తటాకాలు, తోటలు, బావులు నిర్మించే దేవశిల్పిగా అతడు ప్రఖ్యాతి పొందాడు.

అజైకపాదహిర్బుధ్న్యో విరూపాక్షోఽథ రైవతః।
హరశ్చ బహురూపశ్చ త్ర్యంబకశ్చ సురేశ్వరః ॥29॥

సావిత్రశ్చ జయన్తశ్చ పినాకీ చాపరాజితః।
ఏతే రుద్రాః సమాఖ్యాతా ఏకాదశ గణేశ్వరాః॥30॥

అజైకపాత్తు, అహిర్బుధ్న్యుడు, విరూపాక్షుడు, రైవతుడు, హరుడు, బహురూపుడు, త్ర్యంబకుడు, సురేశ్వరుడు, సావిత్రుడు, జయంతుడు, అపరాజితుడైన పినాకి–వీరు గణాధిపతులైన ఏకాదశరుద్రులు.

ఏతేషాం మానసానాం తు త్రిశూలవరధారిణామ్।
కోటయశ్చతురాశీతి స్తత్పుత్రాశ్చాక్షయాః స్మృతాః॥31॥

బ్రహ్మమానసపుత్రులు, శ్రేష్ఠములైన త్రిశూలాలను ధరించేవారు నగు వీరికి ఎనుబదినాల్గు కోట్ల మంది సంతతి కాగా వారి పుత్రులు క్షయం లేనివారుగా విరాజిల్లారు.

దిక్షు సర్వాసు యే రక్షాం ప్రకుర్వన్తి గణేశ్వరాః।
పుత్రపౌత్రసుతాశ్చైతే పురాణా గర్భసంభవాః॥32॥

ఈ గణేశ్వరులు అన్ని దిక్కులలోనూ రక్షకులుగా ఉన్నారు. సంకల్పాదులనుండి కాక గర్భమునుండి పుట్టిన ప్రాచీన ప్రజాపతుల పుత్ర పౌత్రాదుల వివరణ మిది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే దక్షసృష్ట్యాది వివరణం నామ పఞ్చమోఽధ్యాయః ॥ 5 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని మత్స్యమను సంవాదంలో దక్షసృష్ట్యాదుల వివరణం అనే

అయిదవ అధ్యాయం సంపూర్ణం.

షష్ఠోఽధ్యాయః – ఆరవ అధ్యాయం

కశ్యపసంతతి కథనమ్ – కశ్యపుని సంతతి కథనం

సూత ఉవాచః :– సూతుడు చెప్పాడు.

కశ్యపస్య ప్రవక్ష్యామి పత్నీభ్యః పుత్రపౌత్రకాన్।
అదితిర్దితిర్దనుశ్చైవ అరిష్టా సురసా తథా॥1॥

సురభి ర్వినతా తద్వత్తామ్రా క్రోధవశా ఇరా।
కద్రూర్విశ్వా ముని స్తద్వత్ తాసాం పుత్రాన్నిబోధత॥2॥

శౌనకాదులారా! కశ్యపుని పత్నులనుండి కల్గిన పుత్రులను, మనుమలను గురించి వివరిస్తాను. కశ్యపునకు అదితి, దితి, దనువు, అరిష్ట, సురస, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, ఇర, కద్రువ, విశ్వ, ముని–అని పదముగ్గురు పత్నులున్నారు. వారి కొడుకులను గురించి తెలుసుకోండి.

తుషితా నామ యే దేవా శ్చాక్షుషస్యాన్తరే మనోః।
వైవస్వతేఽన్తరే చైతే హ్యాదిత్యా ద్వాదశ స్మృతాః॥3॥

చాక్షుష మన్వంతరంలో తుషితులని ప్రసిద్ధులైన దేవతలుండేవారు. వైవస్వత మన్వంతరంలో వారు అదితి పుత్రులై ద్వాదశాదిత్యులుగా పేర్కొనబడ్డారు.

ఇన్ద్రో ధాతా భగస్త్వష్టా మిత్రోఽథ వరుణో యమః।
వివస్వాన్ సవితా పూషా అంశుమాన్ విష్ణురేవ చ॥4॥

ఏతే సహస్రకిరణా ఆదిత్యా ద్వాదశ స్మృతాః।
మారీచాత్కశ్యపాదాప పుత్రానదితి రుత్తమాన్ ॥5॥

ఇంద్రుడు, ధాత, భగుడు, త్వష్ట, మిత్రుడు, వరుణుడు, యముడు, వివస్వంతుడు, సవిత, పూషుడు, అంశుమంతుడు, మరియు విష్ణువు–అని వారి పేర్లు. వారందరూ వెయ్యి కిరణాలుగల ద్వాదశాదిత్యులుగా ప్రసిద్ధులు. మరీచిపుత్రుడైన కశ్యపుని ద్వారా అదితి ఈ ఉత్తమ పుత్రులను పొందింది.

కృశాశ్వస్య ఋషేః పుత్రా దేవప్రహరణాః స్మృతాః।
ఏతే దేవగణా విప్రాః ప్రతిమన్వన్తరేషు చ ॥6॥

ఉత్పద్యన్తే ప్రలీయన్తే కల్పే కల్పే తథైవ చ ।

కృశాశ్వఋషికుమారులకు దేవప్రహరణు లని పేరు. దేవగణాలకు చెందిన ఈ విప్రులు ప్రతిమన్వంతరంలోనూ ఉద్భవించి అంతర్ధానం చెందుతుంటారు. ప్రతికల్పంలోనూ ఇలా జరుగుతుంది.

దితిః పుత్రద్వయం లేభే కశ్యపాదితి నః శ్రుతమ్॥7॥

హిరణ్యకశిపుం చైవ హిరణ్యాక్షం తథైవ చ।

దితి కశ్యపప్రజాపతి ద్వారా హిరణ్యకశిపుడు, హిరణ్యాక్షుడు అనే ఇద్దరు పుత్రులను కన్నదని విన్నాము.

హిరణ్యకశిపోస్తద్వజ్జాతం పుత్రచతుష్టయమ్।
ప్రహ్లాదశ్చానుహ్లాదశ్చ సంహ్లాదో హ్లాద ఏవ చ ॥8॥

అట్లే హిరణ్య కశిపునికి ప్రహ్లాదుడు, అనుహ్లాదుడు, సంహ్లాదుడు, హ్లాదుడు-అనే నల్గురు కుమారులు సంభవించారు.

ప్రహ్లాద పుత్ర ఆయుష్మాన్ శిబిర్బాష్కల ఏవ చ।
విరోచనశ్చతుర్థశ్చ స బలిం పుత్రమాప్తవాన్॥9॥

బలేః పుత్రశతం త్వాసీత్ బాణజ్యేష్ఠం తతో ద్విజాః॥10॥

ప్రహ్లాదునికి ఆయుష్మంతుడు, శిబి, బాష్కలుడు, విరోచనుడు అనే నల్గురు పుత్రులు జన్మించారు. విరోచనుని పుత్రుడు బలి. ద్విజులారా! అతనికి బాణుడు మున్నగు నూరుమంది కొడుకులు పుట్టారు.

ధృతరాష్ట్రస్తథా సూర్యశ్చన్ద్రశ్చన్ద్రాంశుతాపనః।
నికుమ్భనాభో గుర్వక్షః కుక్షిభీమో విభీషణః ॥11॥

ఏవమాద్యాస్తు బహవో బాణజ్యేష్ఠా గుణాధికాః।
బాణస్సహస్రబాహుశ్చ సర్వాస్త్ర గణసంయుతః ॥12॥

ధృతరాష్ట్రుడు, సూర్యుడు, చంద్రుడు, చంద్రాంశుతాపనుడు, నికుంభనాభుడు, గుర్వక్షుడు, కుక్షి, భీముడు, విభీషణుడు ఇత్యాదులు బాణుని అనుజులు. వారందరూ గుణాలచే గొప్పవారే. జ్యేష్ఠుడగు బాణుడు వెయ్యి చేతులు గలవాడై సమస్తాస్త్రాలూ కలిగి యుండేవాడు.

తపసా తోషితో యస్య పురే వసతి శూలభృత్।
మహాకాలత్వమగమత్సామ్యం యస్య పినాకినః॥13॥

బాణుని తపస్సుకు సంతోషించి శూలధారియైన శివుడు అతని నగరంలో నివసించాడు. బాణుడు మహాకాలత్వ స్థితిపొంది శివునితో సముడుగా వాసికెక్కాడు.

హిరణ్యాక్షస్య పుత్రోఽభూ దులూకశ్శకుని స్తథా।
భూతసన్తాపనశ్చైవ మహానాభస్తథైవ చ॥14॥

హిరణ్యాక్షునికి ఉలూకుడు, శకుని, భూతసంతాపనుడు, మహానాభుడు-అని నల్గురు పుత్రులు.

ఏతేభ్యః పుత్రపౌత్రాణాం కోటయస్సప్తసప్తతిః।
మహాబలా మహాకాయా నానారూపా మహౌజసః॥15॥

వారికి కల్గిన పుత్రపౌత్ర సంతానం డెబ్బదియేడు కోట్లకు విస్తరించింది. వారందరూ మహాబలవంతులు. మహాకాయులు, నానారూపాలు ధరించగలవారు, గొప్ప తేజోవంతులు.

దనుః పుత్రశతం లేభే కశ్యపాద్బలదర్పితమ్।
విప్రచిత్తిః ప్రధానోఽభూద్యేషాం మధ్యే మహాబలః॥16॥

దనువు కశ్యపుని నుండి బలగర్వితులైన నూరుమంది పుత్రులను కన్నది. వారిలో మహాబలవంతుడైన విప్రచిత్తి ముఖ్యుడు.

ద్విమూర్ధా శకునిశ్చైవ తథా శంకుశిరోధరః।
అయోముఖశ్శంబరశ్చ కపిశో వామనస్తథా॥17॥

మారీచి ర్మేఘవాంశ్చైవ ఇరాగర్భశిరాస్తథా।
విద్రావణశ్చ కేతుశ్చ కేతువీర్యః శతహ్రదః॥18॥

ఇంద్రజిత్సప్తజిచ్చైవ వజ్రనాభస్తథైవ చ।
ఏకవక్త్రో మహాబాహు ర్వజ్రాక్షస్తారకస్తథా ॥19॥

అసిలోమా పులోమా చ బిందుర్బాణో మహాసురః।
స్వర్భానుర్వృషపర్వా చ ఏవమాద్యా దనో స్సుతాః ॥20॥

ద్విమూర్ధుడు, శకుని, శంకుశిరోధరుడు, అయోముఖుడు, శంబరుడు, కపిశుడు, వామనుడు, మారీచి, మేఘవంతుడు, ఇరాగర్భశిరుడు, విద్రావణుడు, కేతువు, కేతువీర్యుడు, శతహ్రదుడు, ఇంద్రజిత్తు, సప్తజిత్తు, వజ్రనాభుడు, ఏకవక్త్రుడు, మహాబాహువు, వజ్రాక్షుడు, తారకుడు, అసిలోముడు, పులోముడు, బిందువు, గొప్ప అసురుడైన బాణుడు, స్వర్భానుడు, వృషపర్వుడు మున్నగువారు దనువుయొక్క కుమారులు.

స్వర్భానోస్తు ప్రభా కన్యా శచీ చైవ పులోమజా।
ఉపదానవీ మయస్యాసీత్తథా మండోదరీ కుహూః॥21॥

శర్మిష్ఠా సుందరీ చైవ చంద్రా చ వృషపర్వణః।
పులోమా కాలకా చైవ వైశ్వానరసుతే హితే ॥22॥

వీరిలో స్వర్భానువు యొక్క పుత్రిక ప్రభ, పులోముని కుమార్తె శచి. ఉపదానవి, మండోదరి, కుహూ–అనువారు మయుని పుత్రికలు. శర్మిష్ఠ, సుందరి, చంద్ర–అనువారు వృషపర్వునికీ, పులోమ, కాలక వైశ్వానరునికీ హితప్రదలైన పుత్రిక లయ్యారు.

బహ్వపత్యే మహాసత్త్వే మారీచస్య పరిగ్రహే।
తయోష్షష్టి సహస్రాణి దానవానామభూత్పురా॥23॥

పులోమ, కాలక మహాబలవతులై మారీచుని భార్యలై బహుసంతానం కలవారయ్యారు. వారినుండి పూర్వం అరువది వేలమంది దానవులు సంభవించారు.

పౌలోమాన్ కాలకేయాంశ్చ మారీచోఽజనయత్పురా।
అవధ్యా యేఽమరాణాం వై హిరణ్యపురవాసినః॥24॥

మారీచుడు పూర్వం పౌలోములను, కాలకేయులను జనింపజేశాడు. వారు హిరణ్యపురంలో నివసించేవారు. బ్రహ్మ వారికి దేవతలచే అవధ్యులుగా వరమిచ్చాడు.

చతుర్ముఖాల్లబ్ధవరా స్తే హతా విజయేన తు।
విప్రచిత్తిః సైంహికేయాన్ సింహికాయామజీజనత్॥25॥

ఆ విధంగా బ్రహ్మనుండి వరం పొందిన ఆ రాక్షసులను విజయుడు వధించాడు. విప్రచిత్తి సింహిక ద్వారా సైంహికేయు లనువారిని జనింపజేశాడు.

హిరణ్యకశిపోర్యే వై భాగినేయాస్త్రయోదశ।
వ్యయః కల్పశ్చ రాజేన్ద్రో నలో వాతాపిరేవ చ॥26॥

ఇల్వలో నముచిశ్చైవ శ్వసృపశ్చాజన స్తథా।
నరకః కాలనాభశ్చ సరమాణస్తథైవ చ॥27॥

కాలవీర్యశ్చ విఖ్యాతో దనువంశ వివర్ధనాః।
సంహ్లాదస్య తు దైత్యస్య నిరాతకవచాః స్మృతాః॥28॥

హిరణ్యకశిపుని చెల్లెలి కొడుకులు పదముగ్గురు ప్రసిద్ధులు, వారు వ్యయుడు, కల్పుడు, రాజేంద్రుడు, నలుడు, వాతాపి, ఇల్వలుడు, నముచి, శ్వసృపుడు, అజనుడు, నరకుడు, కాలనాభుడు, సరమాణుడు, విఖ్యాతుడైన కాలవీర్యుడు-అనువారు. వీరు దనువంశాన్ని పెంపొందజేశారు. సంహ్లాదుడనే దైత్యుని కుమారులు నివాతకవచులు.

అవధ్యాః సర్వదేవానాం గంధర్వోరగ రక్షసామ్।
యే హతా భర్గమాశ్రిత్య త్వర్జునేన రణాజిరే ॥29॥

వారు సకల దేవతలకు, గంధర్వులకు, ఉరగులకు, రాక్షసులకు వధింపరానివారై చెలరేగారు. కాని అర్జునుడు శివుని అనుగ్రహంతో వారిని వధించాడు.

షట్కన్యా జనయామాస తామ్రా మారీచబీజతః।
శుకీ శ్యేనీ చ భాసీ చ సుగ్రీవా గృధ్రికా శుచిః॥30॥

తామ్ర మారీచుని బీజంనుండి ఆరుగురు పుత్రికలను ప్రసవించింది. వారు శుకి, శ్యేని, భాసి, సుగ్రీవ, గృధ్రిక, శుచి అనువారు.

శుకీ శుకానులూకాంశ్చ జనయామాస ధర్మతః।
శ్యేనీ శ్యేనాం స్తథా భాసీ కురరానప్యజీజనత్ ॥31॥

శుకి ధర్మునితో గూడి చిలుకలనూ, గ్రుడ్లగూబలను కన్నది. అట్లే శ్యేని డేగలనూ, భాసి కురరాలనూ జనింప జేసింది.

గృధ్రీ గృధ్రాన్ కపోతాంశ్చ పారావత విహంగమాన్।
హంససారస క్రౌంచాంశ్చ ప్లవాఞ్ఛుచిరజీజనత్॥32॥

గృధ్రి గ్రద్దలనూ, పావురాలనూ, పావురపు జాతి పక్షులనూ ప్రసవింపజేసింది. శుచి హంసలకూ, సారస పక్షులకూ, క్రౌంచములకూ, నీటి కోళ్ళకూ జన్మ నిచ్చింది.

అజాశ్వమేషోష్ట్రఖరాన్ సుగ్రీవా చాప్యజీజనత్।
ఏష తామ్రాన్వయః ప్రోక్తో వినతాయా నిబోధత॥33॥

సుగ్రీవ మేకలు, గుర్రాలు, గొర్రెలు, ఒంటెలు, గాడిదలను ప్రసవించింది. ఇది తామ్రయొక్క వంశం. ఇక వినతావంశాన్ని తెలుసుకోండి!

గరుడః పతతాం నాథః అరుణశ్చ పతత్రిణామ్।
సౌదామనీ తథా కన్యా యేయం నభసి విశ్రుతా॥34॥

పక్షులకు నాథుడైన గరుడుడు, అరుణుడు(అనూరుడు), ఆకాశంలో ప్రసిద్ధురాలైన సౌదామని (మెఱపు) అనువారు వినతకు జనించారు.

సంపాతిశ్చ జటాయుశ్చ అరుణస్య సుతావుభౌ।
సంపాతిపుత్రా బభ్రుశ్చ శీఘ్రగశ్చాపి విశ్రుతః॥35॥

సంపాతి, జటాయువు అనువా రిరువురు అరుణుని కుమారులు, బభ్రుడు, శీఘ్రగుడు సంపాతి కుమారులు.

జటాయుః కర్ణికారశ్చ శతగామీ చ విశ్రుతః।
సారసో రజ్జుపాలశ్చ భేరుండశ్చాపి తత్సుతాః॥36॥

జటాయువు, కర్ణికారుడు, శతగామి, సారసుడు, రజ్జుపాలుడు, భేరుండుడు అను వారు సంపాతిపుత్రులు.

తేషామనన్తమభవత్పక్షిణాం పుత్రపౌత్రకమ్।
సురసాయాః సహస్రం తు సర్పాణామభవత్పురా॥37॥

వారందరి పుత్రపౌత్ర సంతతి లెక్కకు మిక్కిలిగా వృద్ధి పొందింది. సురసకు పూర్వం వెయ్యి సర్పాలు సంతాన మయ్యాయి.

సహస్రశిరసాం కద్రూః సహస్రం చాపి సువ్రత।
ప్రధానాస్తేషు విఖ్యాతాః షడ్వింశతి రరిందమ॥38॥

ఓ సువ్రతా! కద్రువ గూడా వెయ్యి సర్పాలకు తల్లి అయింది. శత్రువులను నిగ్రహించే రాజా! వారిలో ఇరువది యారు మంది ముఖ్యులైయున్నారు.

శేషవాసుకి కర్కోట శఙ్ఖైరావృత కంబలాః।
ధనఞ్జయ మహానీల పద్మాశ్వతరతక్షకాః॥39॥

ఏలాపత్ర మహాపద్మ ధృతరాష్ట్ర బలాహకాః।
శఙ్ఖపాల మహాశఙ్ఖ పుష్పదంష్ట్ర శుభాననాః॥40॥

శఙ్కురోమా చ బహులో వామనః పాణినస్తథా।
కపిలో దుర్ముఖశ్చాపి పతఞ్జలిరితి స్మృతాః॥41॥

శేషుడు,వాసుకి, కర్కోటకుడు, శంఖుడు, ఐరావతుడు, కంబళుడు, ధనంజయుడు, మహానీలుడు, పద్మడు, అశ్వతరుడు, తక్షకుడు, ఏలాపత్రుడు, మహాపద్మడు, ధృతరాష్ట్రుడు, బలాహకుడు, శంఖపాలుడు, మహాశంఖుడు, పుష్పదంష్ట్రుడు, శుభాననుడు, శంకురోముడు, బహుళుడు, వామనుడు, పాణినుడు, కపిలుడు, దుర్ముఖుడు, పతంజలి- అనువారు వారు.

ఏషామనన్త మభవత్సర్వేషాం పుత్రపౌత్రకమ్।
ప్రాయశో యత్పురా దగ్ధం జనమేజయమన్దిరే॥42॥

వీరందరి పుత్రపౌత్ర సంతాన మనంత మయింది. వీరిలో చాలా మంది పూర్వం జనమేజయుని యింట సర్పయాగంలో కాలిపోయారు.

రక్షోగణం క్రోధవశా స్వనామానమజీజనత్।
దంష్ట్రిణాం నియుతం తేషాం భీమసేనాదగాత్క్షయమ్॥43॥

క్రోధవశ తన పేరిటి క్రోధవశులు అనే రాక్షసగణాన్ని అపరిమితంగా ప్రభవింపజేసింది. వారందరూ కోరలు గలవారే. వారిలో లక్షమందిని భీమసేనుడు హతమార్చాడు.

రుద్రాణాం చ గణం తద్వద్గో మహిష్యో వరాంగనాః।
సురభిర్జనయామాస కశ్యపాత్ సంయతవ్రతా॥44॥

వ్రతనియమం కల సురభి కశ్యప సంయోగంతో రుద్రగణాన్నీ, గోవులనూ, గేదెలనూ ప్రసవించింది.

మునిర్మునీనాం చ గణం గణమప్సరసాం తథా।
తథాకిన్నరగంధర్వానరిష్టాஉజనయద్బహూన్॥45॥

ముని అనే సాధ్వి మునిగణాన్నీ, అప్సరసల బృందాన్నీ కనింది. అరిష్ట అనేకులైన కిన్నరులనూ, గంధర్వులనూ ప్రసవించింది.

తృణవృక్షలతా గుల్మ మిరా సర్వమజీజనత్।
విశ్వా తు యక్ష రక్షాంసి జనయామాస కోటిశః॥46॥

ఇర సకల తృణాలనూ, చెట్లనూ, తీగలనూ, పొదలనూ జనింపజేసింది. విశ్వ కోట్లకొలది యక్షులకూ, రాక్షసులకూ జన్మ నిచ్చింది.

తత ఏకోనపఞ్చాశన్మరుతః కశ్యపాద్దితిః।
జనయామాస ధర్మజ్ఞాన్ సర్వానమరవల్లభాన్॥47॥

దితి కశ్యపుని కలయికతో నలుబది తొమ్మిది మంది మరుత్తులను ప్రసవించింది. వారందరూ ధర్మం తెలిసినవారు, దేవతలకు ప్రియమైనవారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మత్స్యమను సంవాదే మత్స్య ప్రోక్త కశ్యపసన్తతి కథనం నామ షష్ఠోఽధ్యాయః ॥6॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని మత్స్యమనుసంవాదంలో మత్స్యము చెప్పిన కశ్వపసంతతికథనమనే ఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తమోఽధ్యాయః - ఏడవ అధ్యాయం
మరుదుత్పత్తిః, మదన ద్వాదశీ వ్రతమ్ - మరుదుత్పత్తి, మదన ద్వాదశీ వ్రతం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

దితేః పుత్రాః కథం జాతా మరుతో దేవవల్లభాః।
దేవైర్జగ్ముశ్చ సాపత్న్యైః కస్మాత్తే సఖ్యముత్తమమ్॥ 1॥

సూతా! దితి పుత్రులైన మరుత్తులు దేవతల కెల్లా ప్రీతి పాత్రు లయ్యారు? సవతి బిడ్డలైన దేవతలతో వారికి ఉత్తమమైన చెలిమి ఎలా ఏర్పడింది?

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

పురా దేవాసురే యుద్ధే హతేషు హరిణా సురైః।
పుత్రపౌత్రేషు శోకార్తా గత్వా భూలోకముత్తమమ్॥ 2॥

స్యమన్త పంచకే క్షేత్రే సరస్వత్యా స్తటే శుభే।
భర్తురారాధనపరా తప ఉగ్రం చకార హ॥ 3॥

తదా దితిర్దైత్యమాతా ఋషిరూపేణ సువ్రతా।
ఫలాహారా తపస్తేపే కృచ్ఛ్రం చాన్ద్రాయణాదికమ్॥ 4॥

పూర్వం దేవతలకూ, రాక్షసులకూ యుద్ధం జరిగింది. అందులో శ్రీహరి, దేవతలు కూడి దితి పుత్రులనూ, పౌత్రులనూ హతమార్చారు. దితి శోకార్తురాలై భూలోకంలో సరస్వతీ నదీ తీరంలోని స్యమంతపంచక క్షేత్రానికి పోయింది. అక్కడ భర్తయైన కశ్యపుణ్ణి ఆరాధిస్తూ తీవ్ర తపస్సు చేసింది. అలా దైత్యుల మాత ఋషిరూపంలో వుంటూ ఫలాలు మాత్రమే ఆహారంగా గ్రహిస్తూ కృచ్ఛ్రచాంద్రియాణాది వ్రతాలు ఆచరించింది.

యావద్వర్షశతం సాగ్రం జరాశోకసమాకులా।
తతస్సా తపసా తప్తా వసిష్ఠాదీనపృచ్ఛత॥ 5॥

వార్ధక్యంతోనూ, శోకంతోనూ కూడి వంద సంవత్సరాలు తపస్సు పూర్తి చేసి వసిష్ఠాది మహర్షుల నిలా అడిగింది.

కథయన్తు భవన్తో మే పుత్రశోకవినాశనమ్।
వ్రతం సౌభాగ్య ఫలద మిహ లోకే పరత్ర చ॥ 6॥

ఋషులారా! ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సౌభాగ్యఫలం ప్రసాదించేదీ, పుత్రశోకం నశింపజేసేదీ అయిన వ్రతాన్ని నాకు ఉపదేశించండి.

ఊచుర్వసిష్ఠ ప్రముఖా మదన ద్వాదశీ వ్రతమ్।
యస్య ప్రసాదాదభవత్సుతశోకవివర్జితా॥ 7॥

వసిష్ఠాదులు ఆమెకు మదన ద్వాదశీ వ్రతం అనుష్ఠించుమని ఉపదేశించారు. దాని ప్రభావంవల్ల ఆమె పుత్ర శోకంనుండి విముక్తి పొందింది.

ఋషయ ఊచుః :– ఋషులు చెప్పారు

శ్రోతుమిచ్ఛామహే సూత! మదన ద్వాదశీవ్రతమ్।
సుతానేకోనపఞ్చాశ ద్యేన లేభే దితిః పునః॥ 8॥

సూతా! దితికి నలుబదితొమ్మిదిమంది పుత్రులను మళ్ళీ లభింపజేసిన మదనద్వాదశీవ్రతాన్ని వినగోరుతున్నాము.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు

యద్వసిష్ఠాదిభిః పూర్వం దితేః కథితముత్తమమ్ ।
విస్తరేణ తదేవేదం మత్సకాశాన్నిబోధత ॥ 9॥

పూర్వం వసిష్ఠాదులు దితికి తెలిపిన మదనద్వాదశీవ్రతాన్ని మీకు నేను వివరంగా తెలుపుతాను, తెలుసుకోండి.

చైత్రే మాసి సితే పక్షే ద్వాదశ్యాం నియతవ్రతః।
స్థాపయేదవ్రణం కుంభం సితతండులపూరితమ్॥ 10॥

చైత్రమాస శుక్లపక్షంలో ద్వాదశినాడు వ్రతనిష్ఠాపరుడై తెల్లని బియ్యం నింపిన రంధ్రాలు లేని ఒక కుంభాన్ని ప్రతిష్ఠించాలి.

నానాఫలయుతం తద్వదిక్షుదణ్డసమన్వితమ్।
సితవస్త్రయుగచ్ఛన్నం సితచందనచర్చితమ్॥ 11॥

నానా భక్ష్యసమోపేతం సహిరణ్యం తు శక్తితః।
తామ్రపాత్రం గుడోపేతం తస్యోపరి నివేశయేత్॥ 12॥

దానిపై ఒకరాగి పాత్రను నిలపాలి. అందులో రకరకాల పండ్లు, చెఱకుముక్కలు, నానావిధాలైన తినుబండారాలు, బెల్లం ఉంచాలి. తెల్లని రెండు వస్త్రాలతో దానిని కప్పాలి. తెల్లని చందనంతో దానిని పూయాలి. శక్తికొలది బంగారం గూడా అందులో ఉంచాలి.

తస్మాదుపరి కామం తు కదలీదళ సంస్థితమ్।
కుర్యాచ్ఛర్కరయోపేతాం రతిం తస్య చ వామతః॥ 13॥

దానిపై అరటి ఆకునుంచి ఆ ఆకుమీద కుడివైపున చక్కరతో చేసిన కామదేవుణ్ణీ, ఎడమప్రక్క రతీదేవినీ నిలపాలి.

గన్ధం ధూపం తతో దద్యా ద్గీతం వాద్యం చ కారయేత్।
తదభావే కథాం కుర్యాత్కామకేశవయోర్నరాః॥14॥

ఆపై గంధధూపాదాలు సమర్పించాలి. గీత వాద్యాలను వినిపించాలి.లేదా కామునికీ, విష్ణుదేవునికీ చెందిన కథలు చెప్పించాలి.

కామనామ్నో హరేరర్చాం స్థాపయేద్గన్ధవారిణా ॥
శుక్లపుష్పాక్షతతిలై రర్చయే న్మధుసూదనమ్ ॥15॥

విష్ణుదేవుణ్ణి కామరూపంలో అర్చిస్తూ గంధజలంతో అభిషేకించాలి. తెల్లనిపూలు, అక్షతలు, నువ్వులతో విష్ణువు నర్చించాలి.

కామాయ పాదౌ సంపూజ్య జఙ్ఘే సౌభాగ్యదాయ చ।
ఊరూ స్మరాయేతి పునర్మన్మథాయేతి వై కటిమ్॥16॥

స్వచ్ఛోదరాయేత్యుదరమనఙ్గాయేత్యురో హరేః।
ముఖం పద్మముఖాయేతి బాహూ పఞ్చశరాయ వై ॥17॥

నమః సర్వాత్మనే మౌలిమర్చయేదితి కేశవమ్।
తతఃప్రభాతే తం కుంభం బ్రాహ్మణాయ నివేదయేత్॥18॥

పూజాకాలంలో కామాయ నమః పాదౌ పూజయమామి, సౌభాగ్యదాయ నమః జంఘే పూజయామి, స్మరాయ నమః ఊరూ పూజయామి, మన్మథాయ నమః కటిం పూజయామి, స్వచ్ఛోదరాయ నమః ఉదరం పూజయామి, అనఙ్గాయ నమః ఉరః పూజయామి, పద్మముఖాయ నమః ముఖం పూజయామి, పఞ్చశరాయ నమః బాహూ పూజయామి, సర్వాత్మనే నమః మౌళిం పూజయామి అని కామనామంతో విష్ణువును పూజించాలి. తెల్లవారగానే ఆ కుంభాన్ని విప్రునికి దానం చేయాలి.

(విశే ః- 'హృదయం పంచభూతాయ', 'ప్రసూన ధనుషే భ్రువౌ' అన్న అధిక పాఠం ఆర్ష భారతి వారి ప్రచురణలో ఉన్నది)

బ్రాహ్మణాన్ భోజయే ద్భక్త్యా స్వయం చ లవణాదృతే।
భుక్త్వా తు దక్షిణాం దద్యాదిమం మన్త్రముదీరయేత్॥19॥

తదుపరి బ్రాహ్మణులకు భోజనం పెట్టాలి. ఆపై తాను కూడా ఉప్పు లేకుండా భుజించాలి. తరువాత దక్షిణ యిస్తూ ఈ మంత్రం పఠించాలి.

ప్రీయతామత్ర భగవాన్ కామరూపీ జనార్దనః।
హృదయే సర్వభూతానాం య ఆనన్దోఽభిధీయతే॥20॥

సర్వప్రాణుల హృదయంలో ఎవడు ఆనంద స్వరూపుడని చెప్పబడుతున్నాడో, అట్టి కామరూపుడైన జనార్దనుడు నా అనుష్ఠానంతో సంతుష్టు డగుగాక!

అనేన విధినా సర్వం మాసి మాసి వ్రతం చరేత్।
ఉపవాసీ త్రయోదశ్యామర్చయేద్విష్ణుమవ్యయమ్॥
ఫలమేకం చ సంప్రాశ్య ద్వాదశ్యాం భూతలే స్వపేత్॥21॥

ఈ విధానంతో ప్రతినెలా మదన ద్వాదశీవ్రతం అనుష్ఠించాలి. ద్వాదశినాడు ఒక పండు మాత్రమే తిని నేలపై శయనించాలి. త్రయోదశి నాడు ఉపవసించి అవ్యయుడైన విష్ణువును అర్చించాలి.

తతస్త్రయోదశే మాసి ఘృత ధేను సమన్వితామ్ ।
శయ్యాం దద్యాదనఙ్గాయ సర్వోపస్కారసంయుతామ్॥22॥

కాఞ్చనం కామదేవం చ శుక్లాం గాం చ పయస్వినీమ్॥23॥

ఇలా చేసి పదమూడవ నెలలో నేతితోనూ, ఆవుతోనూ, సర్వోపకరణాలతోనూ మదనునికి శయ్యను సమర్పించాలి. ఆపై మన్మథుని బంగారు ప్రతిమను, తెల్లని పాడి ఆవును గూడా సమర్పించాలి.

వాసోభి ర్ద్విజదాంపత్యం పూజ్యం శక్త్యా విభూషణైః ।
శయ్యా గన్ధాదికం దద్యాత్ప్రీయతా మిత్యుదీరయేత్॥24॥

ఆపై బ్రాహ్మణ దంపతుల నర్చించి యథాశక్తి ఆభరణాలతో, వస్త్రాలతో, శయ్యాగంధాదుల సమర్పణతో "ప్రీయతాం కామరూపో హరిః" అంటూ సంతుష్టులను చేయాలి

హోమః శుక్లతిలైః కార్యః కామనామాని కీర్తయేత్।
గవేన హవిషా తద్వత్పాయసేన చ ధర్మవిత్॥25॥

విప్రేభ్యో భోజనం దద్యా ద్విత్తశాఠ్యం వివర్జయేత్।
ఇక్షుదండానథో దద్యాత్పుష్పమాలాశ్చ శక్తితః॥26॥

తదుపరి తెల్ల నువ్వులతో కాముణ్ణి ఉద్దేశించి హోమం చేయాలి. కాముని నామాలు కీర్తించాలి. ఆవు నేయితో, పాయసంతో ద్విజులకు భోజనం పెట్టాలి. వ్యయానికి వెనుదీయరాదు. ఆపై చెఱకుగడలనూ, పూమాలలనూ యథాశక్తి వారికివ్వాలి.

యః కుర్యాద్విధినాఽనేన మదన ద్వాదశీమిమామ్।
స సర్వపాపనిర్ముక్తః ప్రాప్నోతి హరి సామ్య(త్మ)తామ్॥27॥

ఈ రీతిగా ఎవడు మదనద్వాదశీ వ్రతం ఆచరిస్తాడో, వాడు సమస్తపాపాలూ తొలగిపోయినవాడై శ్రీహరితో సామ్యం పొందుతాడు.

ఇహ లోకే వరాన్ పుత్రాన్ సౌభాగ్యఫల మశ్నుతే॥28॥

ఈ లోకంలో అతడు శ్రేష్ఠులైన పుత్రులనూ, సౌభాగ్య ఫలాన్నీ పొందుతాడు.

యః స్మరః సంస్తుతో విష్ణురానన్దాత్మా మహేశ్వరః।
సుఖార్థీ కామరూపేణ స్మరేదఙ్గజ మీశ్వరమ్॥29॥

ఎవడు స్మరుడు, విష్ణువు, మహేశ్వరుడు, ఆనందాత్ముడు అని వర్ణింపబడినాడో, అట్టి దేవుణ్ణి, అంగజరూపుడైన ఈశ్వరుణ్ణి సుఖాపేక్ష గలవాడు స్మరించి ఆరాధించాలి.

ఏతచ్ఛ్రుత్వా చకారాసౌ దితిః సర్వ మశేషతః॥29

ఇది విని దితి ఏ లోపం లేకుండా ఈ వ్రతం సమగ్రంగా ఆచరించింది.

కశ్యపో వ్రతమాహాత్మ్యాదాగత్య పరయా ముదా।
చకార కర్కశాం భూయో రూపయౌవనశాలినీమ్॥30॥

ఈ వ్రత ప్రభావం వల్ల కశ్యపుడు సంతోషంతో ఆమె చెంతకు వచ్చి చిక్కి సగమై యున్న ఆమెను మరల రూపయౌవనసంపన్నురాలిని చేశాడు.

వరై రాచ్ఛందయామాస సా తు వవ్రే తతో వరమ్।
పుత్రం శక్రవధార్థాయ సమర్థమమితౌజసమ్॥31॥
వరయామి మహాత్మానం సర్వామరనిషూదనమ్।

ఆపై వరాలు కోరుకొమ్మని చెప్పాడు. ఆమె ఇంద్రుణ్ణి వధించగల గొప్ప తేజస్వియైన వాణ్ణి, దేవతల నందరినీ హతమార్చ గలవాణ్ణి, మహానుభావుణ్ణి పుత్రుణ్ణిగా ప్రసాదించుమని వరం కోరుకొంటున్నా నన్నది.

ఉవాచ కశ్యపో వాక్యమిన్ద్రహన్తార మూర్జితమ్।
ప్రదాస్యామ్యహమేవేహ కిన్త్వేతత్క్రియతాం శుభే॥32॥

అప్పుడు కశ్యపు డామెతో ఇంద్రుణ్ణి చంపునట్టి బలవంతుడైన కుమారుణ్ణి, ప్రసాదించగలను. కల్యాణీ! అయితే నీవు ఈపని చేయాలి.

ఆపస్తంబః కరోత్విష్టిం పుత్రీయామద్య సువ్రతే।
విధాస్యామి తతో గర్భమిన్ద్రశత్రునిషూదనమ్॥33॥

ఇందుకై ఆపస్తంబుని ద్వారా పుత్రేష్టిని జరిపించు. అప్పుడు ఇంద్రుణ్ణి చంపగల గర్భం నీవు ధరించేటట్లు నేను చేస్తాను.

ఆపస్తమ్బస్తతశ్చక్రే పుత్రేష్టిం ద్రవిణాధికామ్।
ఇంద్ర శత్రుం లభస్వేతి జుహావ చ సవిస్తరమ్॥34॥

దేవా ముముదిరే దైత్యా విముఖాః స్యుశ్చ దానవాః॥35॥

తదుపరి ఆపస్తంబుడు ఎక్కువ వ్యయంతో కూడిన పుత్రేష్టిని నిర్వర్తించాడు. ఇంద్రశత్రుం లభస్వ, (ఇంద్రశత్రువును పొందుము) అని విస్తృతంగా హోమం చేశాడు. అంతట దేవతలు దానవులు విముఖులు కాగలరని సంతోషించారు.

దిత్యాం గర్భమథాదత్త కశ్యపః ప్రాహ తాం పునః।
త్వయా యత్నో విధాతవ్యో హ్యస్మిన్ గర్భే వరాననే॥36॥

అనంతరం కశ్యపుడు దితికి గర్భం ప్రసాదించి ఆమెతో ఇలా అన్నాడు– ఓ సుముఖీ! నీవు ఈ గర్భ రక్షణ విషయంలో ప్రయత్నపరురాలివై ఉండాలి.

సంవత్సరశతం త్వేక మస్మిన్నేవ తపోవనే।
సన్ధ్యాయాం నైవ భోక్తవ్యం గర్భిణ్యా వరవర్ణిని!॥37॥

వరవర్ణినీ! నూరు సంవత్సరాలు ఈ తపోవనంలో తపస్సు చేయాలి. సంధ్యాకాలంలో గర్భిణివైన నీవు భుజించరాదు.

న స్థాతవ్యం న గన్తవ్యం వృక్షమూలేషు సర్వదా।
నోపస్కరేషూపవిశే న్ముసలోలూఖలాదిషు॥38॥

ఎప్పుడూ చెట్ల మొదళ్ళ వద్ద ఉండరాదు, అక్కడికి పోరాదు. రోలు, రోకలి మున్నగు గృహపరికరాలపై కూర్చోరాదు.

జలే చ నావగాహేత శూన్యాగారం చ వర్జయేత్।
వల్మీకేషు న తిష్ఠేత న చోద్విగ్నమనా భవేత్॥39॥

నీట మునుగరాదు. శూన్యగృహంలో ప్రవేశించకూడదు. పుట్టలపై నిలువరాదు. మనస్సులో ఉద్వేగం చెందకూడదు.

విలిఖేన్న నఖైర్భూమిం నాఙ్గారేణ న భస్మనా।
న శయాలుః సదా తిష్ఠేద్వ్యాయామం చ వివర్జయేత్॥40॥

గోళ్ళతోనూ, బొగ్గులతోనూ, బూడిదతోనూ నేలపై గీయరాదు. ఎల్లవేళలా సోమరితనంతో నిద్రాళువై ఉండరాదు. వ్యాయామం చేయరాదు.

న తుషాఙ్గార భస్మాస్థి కపాలేషు సమావిశేత్।
వర్జయేత్కలహం లోకై ర్గాత్రభఙ్గం తథైవ చ॥41॥

ధాన్యంపొట్టు, బొగ్గులు, బూడిద, ఎముకలు, పుర్రెలు–వీటిపై కూర్చోరాదు. లోకులతో కలహించకూడదు. ఒడలు విరుచుకొనరాదు.

న ముక్తకేశా తిష్ఠేత నాశుచిః స్యాత్కదాచన।
న శయీతోత్తరశిరా న చాపరశిరాః క్వచిత్॥42॥

వెంట్రుకలు విరబోసుకోని ఉండకూడదు. ఎప్పుడూ అశుచిగా ఉండకూడదు. ఉత్తరం వైపు గాని, పడమర వైపు గాని, తలబెట్టి నిద్రించుట తగదు.

న వస్త్రహీనా నోద్విగ్నా న చార్ద్రచరణా సతీ।
నామఙ్గల్యాం వదేద్వాచం న చ హాస్యాధికా భవేత్॥43॥

వస్త్రరహితంగా కానీ, ఉద్వేగంతో కానీ, తడికాళ్ళతో గానీ ఉండరాదు. అమంగళకరమైన మాట పలుకగూడదు. అధికహాస్యవచనాలు తగవు.

కుర్యాత్తు గురుశుశ్రూషాం నిత్యం మాఙ్గల్యతత్పరా।
సర్వౌషధీభిః కోష్ణేన వారిణా స్నానమాచరేత్॥44॥

సదా శుభకార్యాల పట్ల ఆసక్తి గల్గి గురుశుశ్రూష చేయాలి. అన్ని ఓషధులు గల గోరువెచ్చని నీటిలో స్నానం చేయాలి.

కృతరక్షా సుభూషా చ వాస్తుపూజనతత్పరా।
తిష్ఠేత్ప్రసన్నవదనా భర్తుః ప్రియహితే రతా॥45॥

తన దేహరక్షణ చేసుకొంటూ మంచి ఆభరణాలు దాల్చి గృహదేవతలను పూజిస్తూ ప్రసన్నమైన ముఖం కల్గి, భర్తకు ప్రీతినీ, హితాన్నీ కల్గిస్తూ వుండాలి.

దానశీలా తృతీయాయాం పార్వత్యా నక్తమాచరేత్।
ఇతివృత్తా భవేన్నారీ విశేషేణ తు గర్భిణీ॥46॥

దానాలు చేస్తూ శుక్ల పక్షతృతీయనాడు పార్వతిని పూజించి నక్త వ్రతమనుష్ఠించాలి. ప్రతిస్త్రీ ఇట్టి వర్తన కల్గి ఉండాలి. విశేషించి గర్భిణి ఈ ధర్మాలను పాటించాలి.

యస్తు తస్యా భవేత్పుత్రః శీలాయుర్వృద్ధిసంయుతః।
అన్యథా గర్భపతన మవాప్నోతి న సంశయః॥47॥

ఇలా చేస్తే ఆమెకు కలిగే పుత్రుడు శీలవంతుడు, ఆయుర్వృద్ధి కలవాడూ అవుతాడు. లేకుంటే గర్భపాతం జరుగుతుంది. ఇందులో సందేహం లేదు.

తస్మాత్త్వమనయా వృత్త్యా గర్భేఽస్మి న్యత్నమాచర।
స్వస్త్యస్తు తే గమిష్యామి తథేత్యుక్త స్తయా పునః॥48॥

పశ్యతాం సర్వభూతానాం తత్రైవాన్తరధీయత।
తతః సా కశ్యపోక్తేన విధినా సమతిష్ఠత॥49॥

అందువల్ల నీవు ఈ గర్భరక్షణలో ప్రయత్న పరురాలివి కమ్ము. నీకు శుభమగు గాక! నేను వెళ్ళి వస్తాను.”

ఇందు కంగీకరించి దితి అలాగే చేస్తానన్నది. అంతట సమస్తభూతాలూ చూస్తూ ఉండగానే ఆకశ్యపు దక్కడే అంతర్హితు డయ్యాడు. దితి కశ్యపోక్త విధిని పాటించింది.

అథ భీతస్తథేన్ద్రోఽపి దితేః పార్శ్వముపాగమత్।
విహాయ దేవసదనం తచ్ఛుశ్రూషు రవస్థితః॥50॥

ఈ విషయం తెలుసుకొన్న ఇంద్రుడు భయపడ్డాడు. దేవసదనం వదలి దితికి శుశ్రూష చేయగోరి ఆమె చెంతకు వచ్చాడు.

దితేశ్ఛిద్రాన్తరప్రేప్సురభవత్పాకశాసనః।
వినీతోఽభవ దవ్యగ్రః ప్రశాన్తవదనో బహిః॥51॥

పైకి ప్రశాంతముఖుడుగా, వినీతుడుగా, వ్యగ్రత లేనివాడుగా ఉంటూనే అతడు ఆమెపట్ల ఛిద్రాన్వేషణ చేయడాని కుదుక్తుడయ్యాడు.

ఆజ్ఞామనుసర న్సర్వామాత్మనా శుభమాచరన్।
తతో వర్షశతాన్తే సా న్యూనే తు దివసై స్త్రిభిః॥52॥

అతడు ఆమె ఆజ్ఞను పాటిస్తూ శుభకార్యాలే చేస్తూవచ్చాడు. అలా మూడు దినాలు తక్కువగా నూరు సంవత్సరాలు గడచాయి.

మేనే కృతార్థామాత్మానం ప్రీత్యా విస్మితమానసా।
అకృత్వా పాదయోః శౌచం ప్రసుప్తా ముక్తమూర్ధజా॥53॥

నిద్రాభరసమాక్రాన్తా దివా పరవశా క్వచిత్॥

దితి తాను కృతార్థురాల నని భావించింది. ప్రీతిగల మనస్సుతో విస్మయానికి గురి అయింది. అప్పుడామెను నిద్రాభారం ఆక్రమించింది. ఆస్థితిలో పరవశురాలై కాళ్ళు కడుగుకోకుండా జుట్టు విరబోసుకొని ఒకచోట పడుకొని నిద్రించింది.

తతస్తదన్తరం లబ్ధ్వా ప్రవిష్టస్తు శచీపతిః॥
వజ్రేణ సప్తధా చక్రే తం గర్భం త్రిదశాధిపః॥54॥

ఆ అవకాశం చూచుకొని ఇంద్రుడు ప్రవేశించి ఆమె గర్భాన్ని వజ్రాయుధంతో ఏడు ముక్కలుగా విచ్ఛిన్నం చేశాడు.

తతస్సప్తేవ తే జాతాః కుమారాః సూర్యవర్చసః॥55

రుదన్తః సప్త తే బాలా నిషిద్ధా గిరిధారిణా।
భూయోఽపి రుదతశ్చైతా న్నైకైకం సప్తధా హరిః॥56॥

చిచ్ఛేద వృత్రహన్తా వై పునస్తదుదరే స్థితః।
ఏవమేకోనపఞ్చాశద్భూత్వా తే రురుదుర్భృశమ్॥ 57॥

అప్పుడా ఏడు ముక్కలనుండి సూర్య తేజస్సులైన ఏడుగురు శిశువులు జన్మించారు. వారంతా ఏడువ సాగారు. ఇంద్రుడు వారి నేడువకుండా అడ్డుకో బోయాడు కాని వారు ఏడవడం మానలేదు. అది చూచి ఆమె గర్భస్థుడైన ఇంద్రుడు ఒక్కొక్క శిశువును మళ్ళీ ఏడు ముక్కలుగా నరికాడు. ఇలా ఏడేళ్ళు నలుబదితొమ్మిది మందిగా ఏర్పడిన వారంతా ఉచ్చైఃస్వరంతో ఏడువసాగారు.

ఇన్ద్రో నివారయమాస మారోదిష్ట పునః పునః।
తతస్స చిన్తయామాస కిమేతదితి వృత్రహా॥ 58॥

ఇంద్రుడు వారిని ఏడవకండి అని మళ్ళీ మళ్ళీ నివారింపజూచాడు. కాని వారు శాంతించలేదు. 'ఇదేమిటి' అని ఇంద్రుడు చింతింప సాగాడు.

ధర్మస్య కస్య మాహాత్మ్యాత్పునః సఞ్జీవితాస్త్వమీ।
విదిత్వా ధ్యానయోగేన మదన ద్వాదశీఫలమ్॥ 59॥

నూనమేత త్పరిణత మధునా కృష్ణపూజనాత్।
వజ్రేణాపి హతాః సన్తో న వినాశ మవాప్నుయుః॥ 60॥

"ఏ ధర్మముయొక్క ప్రభావం వల్ల వీరు ముక్కలు ముక్కలుగా నరికినా మళ్ళీ జీవిస్తున్నారు?" అని చింతించి ధ్యానయోగంతో మదన ద్వాదశీవ్రత ఫలమిది అని గ్రహించాడు. నిజంగా కృష్ణ పూజవల్ల ఇలా ఇది పరిణమించింది. వజ్రంతో చీల్చినా వీరు వినాశం లేకుండా ఉన్నారు.

ఏకోఽప్యనేకతామాప యస్మాదుదరగోఽప్యలమ్।
అవధ్యా నూనమేతే వై తస్మాద్దేవా భవన్త్వితి॥ 61॥

ఉదరంలో ఉన్నవా డొక్కడైనా అనేకంగా రూపొందాడు. వీరు నిజంగా అవధ్యులే. వీరు దేవతలే అగుదురు గాక!

యతస్మాన్మారుదతేత్యుక్తా రుదన్తో గర్భసంస్థితాః।
మరుతో నామ తే నామ్నా భవన్తు మఖభాగినః॥ 62॥

గర్భంలో వుంటూ 'మారుదత!. అని సంబోధింపబడిన కారణాన వీరు మరుత్తులుగా వ్యవహరింపబడి యజ్ఞ భాగస్వీకర్త లగుదురుగాక!

తతః ప్రసాద్య దేవేశః క్షమస్వేతి దితిం పునః।
అర్థశాస్త్రం సమాస్థాయ మయైతద్దుష్కృతం కృతమ్॥ 63॥

పిమ్మట ఇంద్రుడు దితిని తన్ను క్షమించమని వేడుకొన్నాడు. "అమ్మా! అర్థశాస్త్రోక్తమైన రాజనీతి ననుసరించి నేను ఈపాపకార్యం చేశాను" అని తన అపరాధాన్ని అంగీకరించాడు.

కృత్వా మరుద్గణం దేవై స్సమానమమరాధిపః।
దితిం విమాన మారోప్య ససుతా ననయద్దివమ్॥64॥

తదుపరి ఇంద్రుడు మరుద్గణాలను దేవతలతో సమానులనుగా చేశాడు. దితిని బిడ్డలతో సహా విమాన మెక్కించుకొని దేవలోకానికి తీసుకుపోయాడు.

యజ్ఞభాగభుజో జాతా మరుతస్తే తతో ద్విజాః।
న జగ్మురైక్యమసురైరతస్తే సురవల్లభాః॥65॥

ద్విజులారా! అందువల్ల మరుత్తులు యజ్ఞ భాగస్వీకర్త లయ్యారు. వారు అసురులతో సాంగత్యం చేయలేదు. అందుచేత దేతలకు ప్రీతిపాత్రు లయ్యారు.

ఇతి మాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే మరుదుత్పత్తౌ మదనద్వాదశీవ్రతం నామ సప్తమోఽధ్యాయః ॥7॥

శ్రీమత్స్య మహాపురాణంలో మత్స్యమను సంవాదంలో మరుదు త్పత్తియందు మదనద్వాదశీవ్రతమనే ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టమోఽధ్యాయః – ఎనిమిదవ అధ్యాయం

విరిఞ్చికృత పృథురాజ్యాభిషేకాది – బ్రహ్మ చేసిన పృథురాజ్యాభిషేకాదులు

ఋషయ ఊచుః :– ఋషులు చెప్పారు.

ఆదిసర్గశ్చ యస్సూత! కథితో విస్తరేణ తు।
ప్రతిసర్గం చ యే యేషా మధిపాస్తా న్వదస్వ నః॥ 1॥

సూతా! ఆదిసర్గాన్ని గురించి విస్తృతంగా వివరించావు. ఇక ప్రతిసర్గాన్నీ, దానికి సంబంధించిన అధిపతులనూ గూర్చి మాకు చెప్పు.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

యదాఽభిషిక్త స్సకలాధిరాజ్యే పృథుర్ధరిత్ర్యా మమరాధిపేన।
తదౌషధీనామధిపం చకార యజ్ఞవ్రతానాం తపసాం చ చన్ద్రమ్॥ 2॥

అమరాధిపతి యైన బ్రహ్మ సమస్తభూమికి పృథు చక్రవర్తిని అధిపతిగా చేశాడు. అట్లే ఓషధులకూ, యజ్ఞకర్మలకూ, తపస్సులకూ చంద్రుణ్ణి అధిపతిగా చేశాడు.

నక్షత్ర తారాద్విజ వృక్ష గుల్మ లతావితానస్య చ రుక్మగర్భమ్।
అపామధీశం వరుణం ధనానాం రాజ్ఞాం ప్రభుం వైశ్రవణం చ తద్వత్॥ 3॥

నక్షత్రాలు, తారలు, పక్షులు, చెట్లు, పొదలు, లతలు మున్నగువాటికి హిరణ్యగర్భుణ్ణి అధిపతిగా చేశాడు. జలాలకు వరుణిణ్ణీ, ధనాలకూ, రాజులకూ కుబేరుణ్ణీ అధిపతిగా చేశాడు.

విష్ణుం రవీణామధిపం వసూనామగ్నిం చ లోకాధిపతిశ్చకార।
ప్రజాపతీనామధిపం చ దక్షం చకార శక్రం మరుతామధీశమ్॥ 4॥

ఆదిత్యులకు విష్ణువునూ, వసువుల కగ్నినీ, ప్రజాపతులకు దక్షుణ్ణీ, దేవతలకు ఇంద్రుణ్ణీ అధీశ్వరులుగా లోకాధిపతి నియమించాడు.

దైత్యాధిపానా మథ దానావానాం ప్రహ్లాద మీశం చ యమం పితౄణామ్।
పిశాచరక్షఃపశుభూత యక్షవేతాలరాజం త్వథ శూలపాణిమ్॥ 5॥

అట్లే దైత్యదానవులకు ప్రహ్లాదుణ్ణీ, పితృదేవతలకు యముణ్ణీ, పిశాచాలకు, రక్షస్సులకు, పశువులకూ, భూతాలకూ, యక్షులకూ, వేతాళాలకూ అధిపతిగా శూలపాణిని చేశాడు.

ప్రాలేయశైలం చ పతిం గిరీణా మీశం సముద్రం స సరిన్నదీనామ్।
గన్ధర్వ విద్యాధర కిన్నరాణా మీశం పునశ్చిత్రరథం చకార॥ 6॥

పర్వతాలకు హిమాద్రినీ, సరిత్తులకూ నదులకూ సముద్రుణ్ణి, గంధర్వులు, విద్యాధరులు, కిన్నరులు – వీరికి చిత్రరథుణ్ణీ అధిపతులుగా నియమించాడు.

నాగాధిపం వాసుకి ముగ్రవీర్యం సర్పాధిపం తక్షక మాదిదేశ।
దిశాం గజానామధిపం చకార గజేన్ద్ర మైరావత నామధేయమ్॥ 7॥

నాగులకు ఉగ్రపరాక్రముడైన వాసుకినీ, సర్పాలకు తక్షకుణ్ణీ, దిగ్గజాలకు ఐరావతాన్నీ అధీశ్వరులనుచేశాడు.

సుపర్ణమీశం పతతా మథాశ్వరాజానముచ్చైఃశ్రవసం చకార।
సింహం మృగాణాం వృషభం గవాం చ ప్లక్షం పున స్సర్వవనస్పతీనామ్॥ 8॥

పక్షులకు గరుడుణ్ణీ, గుర్రాలకు ఉచ్చైఃశ్రవాన్నీ, మృగాలకు సింహాన్నీ, గోవులకు వృషభాన్నీ, సకలవనస్పతులకూ జువ్వి చెట్టునూ అధిపతులుగా నియమించాడు.

పితామహః పూర్వమథాభ్యషిఞ్చ చ్చైతాన్ పునః సర్వదిశాధినాథాన్।
పూర్వేణ దిక్పాల మథాభ్యషిఞ్చ న్నామ్నా సుధర్మాణ మరాతికేతుమ్॥ 9॥

పితామహుడు సృష్ట్యాదిలో దిక్కుల కధిపతులను గూడా అభిషేకించాడు. శత్రుహంతయైన సుధర్ముణ్ణి పూర్వ దిశాధిపతిగా స్థాపించాడు.

తతోఽధిపం దక్షిణతశ్చకార సర్వేశ్వరం శంఖపదాభిధానమ్।
స కేతుమన్తం చ దిగీశమీశ శ్చకార పశ్చాద్భువనాణ్డగర్భః॥ 10

తర్వాత సర్వేశ్వరుడైన శంఖుణ్ణి దక్షిణ దిశాధీశుణ్ణి కావించాడు. పిదప కేతుమంతుణ్ణి ఆయన పశ్చిమదిశకు అధిపతిని కావించాడు.

హిరణ్యరోమాణ ముదగ్దిగీశం ప్రజాపతిర్దేవసుతం చకార।
అద్యాపి కుర్వన్తి దిశామధీశాః శత్రూన్దహన్తస్తు భువోఽభిరక్షామ్॥ 11॥

పిదప హిరణ్యరోముణ్ణి ఉత్తదిగధిపతిని చేశాడు. ఈ దిగధీశ్వరులు ఇప్పుడు గూడా శత్రువులను దహిస్తూ భూమికి రక్షణ చేకూరుస్తున్నారు.

చతుర్భిరేభిః పృథునామధేయో నృపోఽభిషిక్తః ప్రథమం పృథివ్యామ్।
గతేఽన్తరే చాక్షుషనామధేయే వైవస్వతాఖ్యే చ పునః ప్రవృత్తే।
ప్రజాపతి స్సోఽస్య చరాచరస్య బభూవ సూర్యాన్వయవంశచిహ్నః॥ 12॥

ఈ నలుగురు దిక్పాలకులు కలిసి పృథువును మొదటి పృథ్వీపతిగా అభిషేకించారు. అలా చాక్షుషమన్వంతరం గడచిపోయింది. వైవస్వతమన్వంతరం ప్రారంభం కాగానే సూర్యవంశానికి చెందిన వైవస్వత మనువు చరాచరప్రపంచానికి ప్రజాపతి అయ్యాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమను సంవాదే విరిఞ్చికృత పృథురాజ్యాభిషేకాదికథనం నామ అష్టమోఽధ్యాయః.॥ 8॥

శ్రీమత్స్యమహా పురాణంలోని మత్స్య మను సంవాదంలో బ్రహ్మ కావించిన పృథురాజ్యాభిషేకాది కథనమనే ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం.

నవమోఽధ్యాయః – తొమ్మిదవ అధ్యాయం

మన్వన్తర వివరణమ్ – మన్వంతర వివరణం

సూత ఉవాచ :– సుతుడు చెప్పాడు

ఏవం శ్రుత్వా మనుః ప్రాహ పునరేవ జనార్దనమ్।
పూర్వేషాం చరితం బ్రూహి మనూనాం మధుసూదన!॥1॥

మనువు ఈ రీతిగా సృష్టిని గూర్చి విని జనార్దనునితో 'మధుసూదనా! పూర్వులైన మనువుల చరిత్ర చెప్పండి!" అని మళ్ళీ అడిగాడు.

మత్స్య ఉవాచ :– మత్స్యం చెప్పింది

మన్వన్తరాణి రాజేన్ద్ర! మనూనాం చరితం చ తే।
ప్రమాణం చైవ కాలస్య తాం సృష్టిం చ సమాసతః॥2॥

ఏకచిత్తః ప్రశాన్తాత్మా శృణు మార్తణ్డవందన।
యామానామ పురా దేవా ఆసన్స్వాయంభువాన్తరే॥3॥

ఓ రాజ శ్రేష్ఠా! మన్వంతరాలు, మనువులచరిత్ర, కాల ప్రమాణం, సృష్టి–వీటిని గూర్చి ప్రశాంతమైన ఏకాగ్రచిత్తంతో విను. సూర్య పుత్రా! స్వాయంభువ మన్వంతరంలో యాములు అనే దేవత లుండేవారు.

సప్తైవ ఋషయః పూర్వే యే మరీచ్యాదయః స్మృతాః।
ఆగీధ్రశ్చాగ్నిబాహుశ్చ సహ స్సవన ఏవ చ॥4॥

జ్యోతిష్మాన్ ద్యుతిమాన్ హవ్యో మేధా మేధాతిథిర్వసుః ।
స్వాయంభువస్యాస్యమనో ర్దశైతే వంశవర్ధనాః॥5॥

మరీచిమున్నగువారు ఏడుగురు ఋషులున్న కాలమది. స్వాయంభువమనువు యొక్క వంశవృద్ధికారకులైన పుత్రులు పదిమంది. వారు ఆగ్నీధ్రుడు, అగ్నిబాహువు, సహుడు, సవనుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, మేధ, మేధాతిథి, వసువు అనువారు.

ప్రతిసర్గమిమే కృత్వా జగ్ముర్యత్పరమం పదమ్।
ఏతత్స్వాయంభువం ప్రోక్తం స్వారోచిషమతః పరమ్॥6॥

వీరు ప్రతిసర్గం (పాంచభౌతిక శరీరాలుగల ప్రాణుల సృష్టి) కావించి పరమపదం చేరుకొన్నారు. ఇది స్వాయంభువ మన్వంతర వృత్తాంతం. ఇక స్వారోచిషమన్వంతరం గూర్చి విను.

స్వారోచిషస్య తనయాశ్చత్వారో దేవవర్చసః।
నభో నభస్య ప్రసృతి భానవః కీర్తి వర్ధనాః॥7॥

స్వారోచిషమనువుకు దేవతేజస్సుగల నభుడు, నభస్యుడు, ప్రసృతి, భానుడు –అని కీర్తివర్ధనులైన నల్గురు పుత్రులు కలిగారు.

దత్తో నిశ్చ్యవనః స్తమ్బః ప్రాణః కశ్యప ఏవ చ।
ఔర్వో బృహస్పతిశ్చైవ సప్తైతే ఋషయః స్మృతాః॥8॥

దత్తుడు, నిశ్చ్యవనుడు, స్తంబుడు, ప్రాణుడు, కశ్యపుడు, ఔర్వుడు, బృహస్పతి–అనే ఏడుగురు ఈ మన్వంతరంలోని ఋషులు.

దేవాశ్చ తుషితా నామ స్మృతాః స్వారోచిషేఽన్తరే।
హస్తీన్ద్రః సుకృతో మూర్తి రాపో జ్యోతిరయః స్మయః॥9॥

వసిష్ఠస్య సుతాః సప్త యే ప్రజాపతయః స్మృతాః।
ద్వితీయ మేత త్కథితం మన్వన్తరమతః పరమ్॥10॥

ఈ స్వారోచిషమన్వంతరంలో దేవతలకు తుషితు లని పేరు. హస్తీంద్రుడు, సుకృతుడు, మూర్తి, ఆపుడు, జ్యోతి, అయుడు, స్మయుడు–అని వసిష్ఠుని పుత్రు లేడుగురు ప్రజాపతులు. ఇది ద్వితీయ మన్వంతర వృత్తాంతం.

ఔత్తమీయం ప్రవక్ష్యామి తథా మన్వన్తరం శుభమ్।
మనుర్నామౌత్తమిర్యత్ర దశ పుత్రానజీజనత్॥11॥

ఇక శుభావహమైన ఔత్తమీయమన్వంతరాన్ని గూర్చి చెబుతాను. ఈ మన్వంతరంలోని మనువుకు ఔత్తమి అని పేరు. అతనికి పదిమంది కుమారులు.

ఈష ఊర్జశ్చ తర్జశ్చ శుచిః శుక్రస్తథైవ చ।
మధుశ్చ మాధవశ్చైవ నభస్యోఽథ నభాస్తథా॥12॥

సహః కనీయానేతేషాముదారః కీర్తివర్ధనః।
భావనాస్తత్ర దేవాః స్యురూర్జాః సప్తర్షయః స్మృతాః॥13॥

వారు ఈషుడు, ఊర్జుడు, తర్జుడు, శుచి, శుక్రుడు, మధువు, మాధవుడు, నభస్యుడు, నభుడు, సహుడనువారు. వీరిలో చిన్నవాడైన సహుడు ఉదారుడు, కీర్తి వృద్ధిచేయువాడు. ఆకాలపు దేవతలకు 'భావను' లని వ్యవహారం. ఊర్జగణానికి చెందినవారు సప్తర్షులు.

కౌకురుండిశ్చ దాల్భ్యశ్చ శఙ్ఖః ప్రవహణ శ్శివః।
సితశ్చ సస్మితశ్చైవ సప్తైతే యోగవర్ధనాః ॥14॥

కౌకురుండి, దాల్భ్యుడు, శంఖుడు, ప్రవహణుడు, శివుడు, సితుడు, సస్మితుడు అనువారేడుగురూ యోగాన్ని వృద్ధి చేశారు.

మన్వన్తరం చతుర్థం తు తామసం నామ విశ్రుతమ్।
కవిః పృథుస్తథైవాగ్ని రకపిః కపిరేవ చ॥15॥

తథైవ జల్పధీమన్తౌ మునయః సప్త తామసే।
సాధ్యా దేవగణా యత్ర కథితాస్తామసేఽన్తరే॥16॥

ఇక తామసమనే నాల్గవ మన్వంతరం సుప్రసిద్ధమైనది. ఈ మన్వంతరంలో కవి, పృథువు, అగ్ని, అకపి, కపి, జల్పుడు, ధీమంతుడు అనే వారు సప్తర్షులు. దేవగణాలు సాధ్యులు.

అకల్మషస్తథా ధన్వీ తపోమూలస్తపోధనః।
తపోరతి స్తపస్యశ్చ తపోద్యుతి పరన్తపౌ॥17॥

తపోభోగీ తపోయోగీ ధర్మాచార రతాస్సదా।
తామసస్య సుతాః సర్వే దశ వంశవివర్ధనాః॥18॥

అకల్మషుడు, ధన్వి, తపోమూలుడు, తపోధనుడు, తపోరతి, తపస్యుడు, తపోద్యుతి, పరంతపుడు, తపోభోగి, తపోయోగి-అను వారు పదిమంది తామసుని కుమారులు. వీరందరూ సదా ధర్మాచారపరులే, వంశవృద్ధి కారకులే.

పఞ్చమస్య మనో స్తద్వ ద్రైవతస్యాన్తరం శృణు।
దేవబాహుస్సుబాహుశ్చ పర్జన్యః సోమపో మునిః॥19॥

హిరణ్యరోమా సప్తాక్షః సప్తైతే ఋషయః స్మృతాః।
దేవాశ్చాభూతరజస స్తథా ప్రకృతయః శుభాః ॥20॥

ఇక ఐదవ మనువైన రైవతుని మన్వంతరం విను. దేవబాహుడు, సుబాహుడు, పర్జన్యుడు, సోమపుడు, ముని, హిరణ్యరోముడు, సప్తాక్షుడు అనువా రాకాలంలోని సప్తర్షులు, అభూతరజసులు దేవతలు. ప్రజలందరూ శుభాచారరతులు.

అరుణస్తత్త్వదర్శీ చ విత్తవాన్ హవ్యపః కపిః।
యుక్తో నిరుత్సుకః సత్త్వో నిర్మోహోఽథ ప్రకాశకః॥21॥

ధర్మవీర్యబలోపేతా దశైతే రైవతాత్మజాః॥

అరుణుడు, తత్త్వదర్శి, విత్తవంతుడు, హవ్యపుడు, కపి, యుక్తుడు, నిరుత్సుకుడు, సత్త్వుడు, నిర్మోహుడు, ప్రకాశకుడు-ఈ పదిమంది రైవతుని కుమారులు, ధర్మబలం వీర్యబలం కల్గినవారు.

భృగుః సుధామా విరజాః సహిష్ణుర్నాద ఏవ చ।
వివస్వానతినామా చ షష్ఠే సప్తర్షయోఽపరే॥22॥

చాక్షుషస్యాన్తరే దేవా లేఖా నామ పరిశ్రుతాః॥23॥

ఆరవదైన చాక్షుష మన్వంతరంలో భృగువు, సుధాముడు, విరజుడు, సహిష్ణువు, నాదుడు, వివస్వంతుడు, అతినాముడు-అనువారు సప్తర్షులు. ఈ కాలపు దేవతలు లేఖగణానికి చెందినవారు.

ఋభవోఽథ ఋభాద్యాశ్చ వారిమూలా దివౌకసః।
చాక్షుషస్యాంతరే ప్రోక్తా దేవానాం పంచ యోనయః॥24

ఈచాక్షుష మన్వంతరంలో ఐదువర్గాలకు చెందిన లేఖులు (దేవతలు) ఋభువులు, ఋభాద్యులు, వారి మూలులు, దివౌకసులు అనువారుండేవారు.

రురుప్రభృతయస్తద్వచ్చాక్షుషస్య సుతా దశ।
ప్రోక్తాః స్వాయంభువే వంశే యే మయా పూర్వమేవ తు॥25॥

రురుడు మున్నగువారు చాక్షుషుని పుత్రులు పదిమంది. వీరిని గూర్చి స్వాయంభువవంశమును గురించి చెప్పే సమయంలో ముందే చెప్పివున్నాను.

అన్తరం చాక్షుషం చైతన్మయా తే పరికీర్తితమ్।
సప్తమం తత్ప్రవక్ష్యామి యద్వైవస్వత ముచ్యతే॥26॥

చాక్షుష మన్వంతరం గూర్చి నీకు నేను వివరించాను. ఇప్పుడు ఏడవదైన వైవస్వత మన్వంతరం గూర్చి వివరిస్తాను.

అత్రిశ్చైవ వసిష్ఠశ్చ కశ్యపో గౌతమస్తథా।
భరద్వాజ స్తథా యోగీ విశ్వామిత్రః ప్రతాపనాన్॥27॥

జమదగ్నిశ్చ సప్తైతే సామ్ప్రతం యే మహర్షయః।
కృత్వా ధర్మవ్యవస్థానం ప్రయాన్తి పరమం పదమ్॥28॥

అత్రి, వసిష్ఠుడు, కశ్యపుడు, గౌతముడు, యోగియగు భరద్వాజుడు, ప్రతాపశాలియగు విశ్వామిత్రుడు, జమదగ్ని-ఈ కాలంలో మహర్షులైయున్నారు. వీరు ధర్మాన్ని వ్యవస్థాపించి తుదకు పరమ పదప్రాప్తి పొందగలరు.

సాధ్యా విశ్వే చ రుద్రాశ్చ మరుతో వసవోఽశ్వినౌ।
ఆదిత్యాశ్చ సురాస్తద్వత్సప్త దేవగణాః స్మృతాః॥29॥

సాధ్యులు, విశ్వదేవులు, రుద్రులు, మరుత్తులు, వసువులు, అశ్వినీ కుమారులు, ఆదిత్యులు-అను దేవతలు ఏడు దేవగణాలుగా కీర్తింపబడినారు.

ఇక్ష్వాకు ప్రముఖాశ్చాస్య దశ పుత్రాః స్మృతా భువి।
మన్వన్తరేషు సర్వేషు సప్త సప్త మహర్షయః॥30॥

కృత్వా ధర్మవ్యవస్థానం ప్రయాన్తి పరమం పదమ్।
సావర్ణేస్తు ప్రవక్ష్యామి మనోర్భావి తథాఽన్తరమ్॥31॥

వైవస్వతమనువుకు ఇక్ష్వాకువు మున్నగు పదిమంది కుమారులు ప్రఖ్యాతులు, అన్ని మన్వంతరాలలోనూ ఏడుగు రేడుగురు మహర్షు లుంటారు. వీరందరూ ధర్మాన్ని సుస్థిరంచేసి పరమ పదానికి పోతారు. ఇక రానున్న సావర్ణి మన్వంతరం గూర్చి చెబుతాను.

అశ్వత్థామా శరద్వాంశ్చ కౌశికో గాలవస్తథా।
శతానన్దః కాశ్యపశ్చ రామశ్చ ఋషయః స్మృతాః॥32॥

అశ్వత్థామ, శరద్వంతుడు, కౌశికుడు, గాలవుడు, శతానందుడు, కాశ్యపుడు, రాముడు– ఈమన్వంతరమందలి ఋషులు.

ధృతిర్వరీయాన్ యవసః సువర్ణో వృష్టిరేవ చ।
చరిష్ణురీడ్యః సుమతిర్వసుః శుక్రశ్చ వీర్యవాన్॥33॥

భవిష్యా దశ సావర్ణేర్మనోః పుత్రాః ప్రకీర్తితాః।
రౌచ్యాదయస్తథాన్యేఽపి మనవః సంప్రకీర్తితాః॥34॥

సావర్ణి మనువుకు ధృతి, వరీయుడు, యవసుడు, సువర్ణుడు, వృష్టి, చరిష్ణువు, ఈడ్యుడు, సుమతి, వసువు వీర్యవంతుడైన శుక్రుడు – ఈ పదిమంది పుత్రులు కానున్నారు. రౌచ్యుడు మున్నగువారు మరికొందరు గూడ మనువులుగా పేర్కొనబడినారు.

రుచేః ప్రజాపతేః పుత్రో రౌచ్యో నామ భవిష్యతి।
మనుర్భూతిసుతస్తద్వద్భౌత్యో నామ భవిష్యతి॥35॥

రుచి అనే ప్రజాపతి పుత్రుడగు రౌచ్యుడు మనువు గాగలడు, అట్లే భూతిసుతుడైన భౌత్యుడు గూడా మను వవుతాడు.

తతస్తు మేరుసావర్ణి ర్బ్రహ్మసూ నుర్మనుః స్మృతః।
ఋతశ్చ ఋతధామా చ విష్వక్సేనో మనుస్తథా॥36॥

అతీతానాగతాశ్చైతే మనవః పరికీర్తితాః।
షడూనం యుగసాహస్ర మేభిర్వ్యాప్తం నరాధిప!॥37॥

తరువాత బ్రహ్మపుత్రుడు మేరుసావర్ణి మనుమవుతాడు. ఋతుడు, ఋతుధాముడు, విష్వక్సేనుడు, అను ముగ్గురూ మనువులే. గతించిన రానున్న మనువుల వివర మిది. రాజా! ఆరు తక్కువగా వెయ్యి యుగాలు (994) వీరు తమ ఆధిపత్యంలో ఉంటారు.

స్వే స్వేఽన్తరే సర్వమిద ముత్పాద్య సచరాచరమ్।
కల్పక్షయే వినిర్వృత్తే ముచ్యన్తే బ్రహ్మణా సహ॥38॥

వీరు తమతమ మన్వంతర కాలాలలో చరాచరాత్మకమైన సర్వాన్నీ సృష్టించి కల్పక్షయం కాగానే బ్రహ్మతో సహా విముక్తు లవుతారు.

ఏతే యుగసహస్రాన్తే వినశ్యన్తి పునః పునః।
బ్రహ్మాద్యా విష్ణుసాయుజ్యం యాతా యాస్యన్తి వై ద్విజాః ॥39॥

ద్విజులారా! వీరు వెయ్యి యుగాలు ముగియగానే మరల మరల నశించిపోతారు. ఆక్రమంలో బ్రహ్మ మున్నగువారు విష్ణుసాయుజ్యం పొందారు, పొందగలరు.

ఇతి మాత్స్యే మహాపురాణే మత్స్యమను సంవాదే మన్వంతరవివరణం నామ నవమోఽధ్యాయః ॥ 9 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని మత్స్యమను సంవాదంలో మన్వంతరవివరణమనే తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

దశమోఽధ్యాయః - పదవ అధ్యాయం

పృథ్వాదికృతధరణీదోహనమ్ - పృథువు మున్నగువారు భూమిని గోవుగా చేసి పిదుకుట.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు

బహుభిర్ధరణీ భుక్తా భూపాలైః శ్రూయతే పురా।
పార్థివాః పృథివీయోగాత్పృథివీ కస్య యోగతః?॥ 1॥

సూతా! ఈ భూమిని పూర్వం అనేకులు పరిపాలించినారని విన్నాము. పృథివి కారణంగా వారు పార్థివులయ్యారు. భూమికి 'పృథివి' అన్న పేరు ఎవరి సంబంధంవల్ల ఏర్పడింది?.

కిమర్థం చ కృతా సంజ్ఞా భూమేః కిం పారిభాషికీ।
గౌరితీయం చ విఖ్యాతా సూత! కస్మాద్బ్రవీహి నః॥ 2॥

భూమికి ఆ పేరు ఏ అర్థానికి సంకేతంగా వ్యవస్థిత మయింది?. అట్లే దీనికి 'గౌః' (గోవు) అన్న పేరు ఏర్పడడానికి హేతు వేమి? దీనిని మాకు వివరించు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు

వంశే స్వాయంభువస్యాసీదఙ్గో నామ ప్రజాపతిః।
మృత్యోస్తు దుహితా తేన పరిణీతా సుదుర్ముఖా॥ 3॥

సునీథా నామ తస్యాస్తు వేనో నామ సుతః పురా।
అధర్మనిరతశ్చాసీత్ బలవాన్వసుధాధిపః॥ 4॥

స్వాయంభువవంశంలో అంగు డనే ప్రజాపతి ఉండేవాడు. అతడు మృత్యువు పుత్రిక, వికృతముఖం కలది అయిన సునీథను పరిణయం చేసుకొన్నాడు. ఆ సునీథకు వేనుడనే కుమారుడు కలిగాడు. ఆ రాజు బలవంతుడు, కాని అధర్మనిరతుడు.

లోకేఽప్యధర్మకృజ్జాతః పరభార్యాపహారకః।
ధర్మాచారస్య సిద్ధ్యర్థం జగతోఽథ మహర్షిభిః॥ 5॥

అనునీతోఽపి న దదావనుజ్ఞాం స యదా తతః।
శాపేన మారయిత్వైన మరాజకభయార్దితాః॥ 6॥

మమన్థు ర్బ్రాహ్మణాస్తస్య బలాద్దేహమకల్మషాః।
తత్కాయాన్మథ్యమానాత్తు నిపేతుర్మ్లేచ్ఛ జాతయః॥ 7॥

లోకంలో అతడు అధర్మకార్యాలు చేశాడు. పరుల భార్యలను అపహరించేవాడు. ధర్మబద్ధంగా ఉండుమని మహర్షులు అతణ్ణి అనునయించారు. దాని కతడు సమ్మతించలేదు. అప్పుడు వారతణ్ణి శాపంతో హతమార్చారు.

కాని అరాజకస్థితి కల్గుతుందన్న భయంతో కల్మషరహితులైన అవిప్రులు ఆవేనుని శరీరాన్ని బలంకొద్దీ మథించారు. అలా మథింపబడిన అతని శరీరంనుండి మ్లేచ్ఛజాతికి చెందినవా రుద్భవించారు.

శరీరే మాతురంశేన కృష్ణాఞ్జనసమప్రభాః।
పితురంగస్య చాంశేన ధార్మికో ధర్మచారిణః॥ 8॥

ఉత్పన్నో దక్షిణాద్ధస్తాత్సధనుః సశరో గదీ।
దివ్యతేజోమయవపుః సరత్నకవచాఙ్గదః॥ 9॥

పృథో రేవాభవద్యత్నా త్తస్మాత్పృథురజాయత॥

ఆ పుట్టినవారు మాత్రంశజులు కావడంవల్ల నల్లని కాటుకవంటి శరీరం కల్గివుండినారు. ధర్మాచరణపరుడైన తండ్రి అంగుని అంశమునుండి ధార్మికుడు, ధనుర్బాణధారి, గద దాల్చినవాడు, దివ్యతేజోమయమైన దేహం కలవాడు, రత్న ఖచిత కవచాంగదములు గలవాడు అయిన ఒక పుత్రుడు వేనుని దక్షిణహస్తంనుండి జనించాడు. పృథుప్రయత్నంవల్ల పుట్టిన వాడు కాబట్టి అతడు పృథువు అని వ్యవహరింపబడినాడు.

(విశే– "పృథురోమాఽభవత్తస్మాత్తతః పృథురజాయత"– అను పాఠం ప్రకారం అతడు పెద్ద రోమాలు కల్గి వుండడం వల్ల పృథువయ్యాడు.)

స విప్రై రభిషిక్తః సన్ తపః కృత్వా సుదారుణమ్।
విష్ణోర్వరేణ సర్వస్య ప్రభుత్వమగమత్పునః॥ 10॥

అతడు విప్రులచేత అభిషిక్తుడై తీవ్ర తపస్సు చేసి విష్ణుదేవుని వరంచేత సర్వజగతీతలానికి ప్రభు వయ్యాడు.

నిఃస్వాధ్యాయవషట్కారం నిర్ధనం వీక్ష్య భూతలమ్।
దగ్ధుమేవోద్యతః కోపాచ్ఛరేణామితవిక్రమః॥
తతో గోరూపమాస్థాయ భూః పలాయితుముద్యతా॥ 12॥

లోకంలో వేదాధ్యయనం, యజ్ఞాదిక్రియలు, ధనసంపత్తి లేకుండడం చూచి అతడు కోపించాడు. మహాపరాక్రమవంతుడైన ఆ పృథువు శరప్రయోగంతో లోకాన్ని దహించడాని కుద్యుక్తు డయ్యాడు. అంతట భూమి గోరూపం ధరించి పరుగిడడం ప్రారంభించింది.

పృష్ఠతోఽనుగత స్తస్యాః పృథుర్దీప్తశరాసనః॥
తతః స్థిత్వైకదేశే తు కిం కరోమీతి చాబ్రవీత్॥ 13॥

దనుర్బాణాలు చేబూని పృథువు దాని వెన్నంటి పోయాడు. అప్పుడు భూమి ఒక్కచో నిలిచి 'నే నిప్పుడేమి చేయాలి?' అని అతణ్ణి ప్రశ్నించింది.

పృథురప్యవద ద్వాక్యమీప్సితం దేహి సువ్రతే।
సర్వస్య జగతః శీఘ్రం స్థావరస్య చరస్య చ॥ 14॥

అంతట పృథువు "సువ్రతా! చరాచరాత్మకమైన ఈ సమస్త జగత్తుయొక్క అభీప్సితం శీఘ్రంగా నెరవేర్చు" అని చెప్పాడు.

తథైవ సాఽబ్రవీద్భూమిం దుదోహ స నరాధిపః।
స్వకే పాణౌ పృథుర్వత్సం కృత్వా స్వాయంభువం మనుమ్॥15॥

గోవు 'సరే!' అన్నది. అప్పుడు రాజు స్వాయంభువమనువును దూడగా చేసి గోరూపయైన భూమిని తన చేతియందే పిదికాడు.

తదన్న మభవచ్ఛుద్ధం ప్రజా జీవన్తి యేన వై।
తతస్తు ఋషిభిర్దుగ్ధా వత్సః సోమస్తదాఽభవత్॥16॥

దోగ్ధా బృహస్పతి రభూ త్పాత్రం వేదస్తపో రసః।
దేవైశ్చ వసుధా దుగ్ధా దోగ్ధా మిత్రస్తదాఽభవత్॥17॥

ఇన్ద్రో వత్స స్సమభవత్ క్షీరమూర్జస్కరం బలమ్।
దేవానాం కాంచనం పాత్రం పితౄణాం రాజతం తథా॥18॥

అంతట ప్రజాజీవనానికి హేతువైన శుద్ధాన్నం ఆవిర్భవించింది. తదుపరి ఋషులు సోముని దూడగానూ, బృహస్పతిని పిదుకువానిగానూ, వేదం పాత్రగానూ, చేసుకొని పిదుకగా తపస్సు క్షీరంగా వచ్చింది. మిత్రుడు పిదుకువాడుగానూ, ఇంద్రుడు దూడగానూ ఉండగా దేవతలు గోవును పిదికారు. సామర్థ్యము నిచ్చే బలం క్షీరమయింది. దేవతలు బంగారు పాత్రలోనూ,పితరులు వెండి పాత్రలోనూ పాలు పిదికారు.

అన్తకశ్చాభవద్దోగ్ధా యమో వత్సస్స్వధా రసః।
అలాబు పాత్రం నాగానాం తక్షకో వత్సకోఽభవత్॥19

విషం క్షీరం తతో దోగ్ధా ధృతరాష్ట్రోఽభవత్పునః।

వారికి అంతకుడు పిదుకువాడుగా, యముడు దూడగా కాగా స్వధాకారంలో ఇచ్చే ద్రవ్యం క్షీరమయింది. నాగులకు సొరకాయబుర్ర పాత్ర కాగా, తక్షకుడు దూడయ్యాడు. ధృతరాష్ట్రుడు పిదుకువాడు కాగా విషమనే క్షీరం పిదుకబడింది.

అసురైరపి దుగ్ధేయమాయసే శత్రుపీడనమ్ ॥20॥

పాత్రే మాయా మభూద్వత్సః ప్రాహ్లాదిస్తు విరోచనః ।
దోగ్ధా ద్విమూర్ధా తత్రాసీ న్మాయా యేన ప్రవర్తితా॥21॥

అసురులు గూడా ఇనుపపాత్రలో ఇంద్రుణ్ణి పీడించే మాయను క్షీరంగా పిదికారు. ప్రహ్లాదుని కుమారుడైన విరోచనుడు వారికి దూడ, ద్విమూర్ధుడు దోగ్ధ, వాడు మాయకు ప్రవర్తకుడు.

యక్షైశ్చ వసుధా దుగ్ధా పురాఽన్తర్ధానమీప్సుభిః।
కృత్వా వైశ్రవణం వత్సమామపాత్రే మహీపతే॥22॥

రాజా! యక్షులు గూడా అదృశ్యత్వాన్ని కోరి కుబేరుణ్ణి దూడగా చేసుకొని కాలని మట్టి పాత్రలో అంతర్ధానమనే క్షీరాన్ని పిదికారు.

ప్రేతరక్షోగణైర్దుగ్ధా ధారా రుధిర ముల్బణమ్।
రౌప్యనాభోఽభవద్దోగ్ధా సుమాలీ వత్స ఏవ తు॥23॥

ప్రేతాలు, రక్షోగణాలు రౌప్యనాభుని దోగ్ధగా, సుమాలిని దూడగా చేసుకొని భీకరమైన రక్తాన్ని క్షీరంగా పిదికారు.

గన్ధర్వైశ్చ పురా దుగ్ధా వసుధా సాప్సరోగణైః।
వత్సం చైత్రరథం కృత్వా గన్ధాన్ పద్మదలే తథా॥24॥
దోగ్ధా వరరుచిర్నామ నాట్యవేదస్య పారగః।

గంధర్వులు అచ్చరలతో గూడి చైత్రరథుణ్ణి దూడగా, నాట్యవేదంలో నిష్ణాతుడైన వరరుచిని దోగ్ధగా చేసుకొని పద్మదళమనే పాత్రలో సుగంధాలనే పాలను పిదికారు.

గిరిభిర్వసుధా దుగ్ధా రత్నాని వివిధాని చ॥25॥

ఔషధాని చ దివ్యాని దోగ్ధా మేరుర్మహాచలః।
వత్సోఽభూద్ధిమవాంస్తత్ర పాత్రం శైలమయం పునః॥26॥

పర్వతాలు మేరుపర్వతాన్ని దోగ్ధగా, హిమవంతుణ్ణి దూడగా చేసి వివిధరత్నాలు, దివ్యౌషధులు అనే పాలను పిదికారు. వారి పాత్ర శైలమయమైనది.

వృక్షైశ్చ వసుధా దుగ్ధా క్షీరం ఛిన్నప్రరోహణమ్।
పాలాశపాత్రే దోగ్ధా తు శాలః పుష్పలతాకులః॥27॥

ప్లక్షోఽభవత్తతో వత్సః సర్వవృక్ష వనాధిపః।
ఏవమన్యైశ్చ వసుధా తదా దుగ్ధా యథేప్సితమ్॥28॥

వృక్షాలు పూలు, తీగలు గల ఏపి చెట్టు దోగ్ధగా, అన్ని చెట్లకు వనాలకు అధిపతియైన జువ్విచెట్టు దూడగా, మోదుగాకు పాత్రలో నరికినా మొలచుట అనే క్షీరం పిదికాయి. ఇంకా ఇలాగే భూమిని ఇతరులు ఇష్టం వచ్చినట్లు పిదికి వినియోగించుకొన్నారు.

ఆయుర్ధనాని సౌఖ్యం చ పృథౌ రాజ్యం ప్రశాసతి।
న దరిద్రస్తదా కశ్చి న్న రోగీ న చ పాపకృత్॥29॥

నోపసర్గభయం కిఞ్చిత్పృథౌ రాజని శాసతి।
నిత్యం ప్రముదితా లోకా దుఃఖశోక వివర్జితాః॥30॥

పృథు చక్రవర్తి రాజ్యం పాలిస్తూ వుండగా ప్రజలకు ఆయువు, సంపదలు, సౌఖ్యం, పుష్కలంగా ఉండేవి. దరిద్రుడు గాని, పాపి గాని, రోగి గాని ఒక్కడూ లేడు. ఎట్టి ఉపద్రవాలూ లేవు. దుఃఖశోకాలు లేనివారై ప్రజలు సదా సంతుష్టులై వుండేవారు.

ధనుష్కోట్యా చ శైలేన్ద్రానుత్సార్య స మహాబలః।
భువస్తలం సమం చక్రే లోకానాం హితకామ్యయా॥31॥

ఆ మహాబలవంతుడైన పృథుచక్రవర్తి లోకాలకు హితం కలిగించాలన్న కోరికతో వింటికొనతో కొండలను పెకలించి భూతలాన్ని సమతలం చేశాడు.

నగరగ్రామదుర్గాణి న చాయుధధరా నరాః।
పుత్రాదిభిర్న దుఃఖం చ న త్వశాస్త్రస్య చాదరః॥32॥

నగరాలను,గ్రామాలను, దుర్గాలను సమతలంపై ఉండేటట్లు చేశాడు. ప్రజలు (అవసరం లేక పోబట్టి) ఆయుధాలు ధరించేవారు కారు. పుత్రులు మొదలగువారివల్ల పెద్దల కెట్టి దుఃఖం కలిగేది కాదు. శాస్త్ర జ్ఞానం లేనివానిపై ఆదరముండేది కాదు.

ధర్మైకవాసనా లోకాః పృథౌ రాజ్యం ప్రశాసతి।
కథితాని చ పాత్రాణి యత్ క్షీరం చ మయా తవ॥33॥

పృథుపాలనలో జనులు ధర్మమే ప్రవృత్తిగా కల్గివుండేవారు. ఎవరెవరి కేదేది పాత్రయో, ఏయే క్షీరాన్ని వారు పిదికారో మీకు నేను వివరించాను.

యేషాం యత్ర రుచి స్తత్త త్తేభ్యో దేయం విజానతా।
యజ్ఞశ్రాద్ధేషు సర్వేషు మయా తుభ్యం నివేదితమ్॥34॥

యజ్ఞాలలోనూ, శ్రాద్ధాలలోనూ ఎవరెవరికి ఏ యే వస్తువుపై అభిరుచి వుంటుందో ఆ వస్తువులను తెలుసుకొని వారికివ్వాలి. ఈ విషయం నేను మీకు తెలిపాను.

దుహితృత్వం గతా యస్మాత్పృథోర్ధర్మవతీ మహీ।
తదానురాగయోగాచ్చ పృథివీ విశ్రుతా బుధైః॥35॥

పృథు చక్రవర్తికి ధర్మవతియైన భూమి దుహితృభావాన్ని పొందింది. అందుచేత ఆ అనురాగ సంబంధాన్ని బట్టి భూమిని పృథివిగా బుధులు కీర్తించారు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే పృథ్వాదికృతధరణీదోహనం నామ దశమోఽధ్యాయః ॥ 10 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని పృథువు మున్నగువారు భూమిని గోవుగా చేసి పిదుకుట అనే
పదవ అధ్యాయం సంపూర్ణం.

ఏకాదశోఽధ్యాయః - పదకొండవ అధ్యాయం

సూర్యవంశానువర్ణనమ్ - సూర్యవంశానువర్ణనం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

ఆదిత్య వంశమఖిలం వద సూత యథాక్రమమ్।
సోమవంశం చ తత్త్వజ్ఞ! యథావద్వక్తుమర్హసి॥ 1॥

తత్త్వం తెలిసిన ఓ సూతా! సూర్యవంశాన్నీ, అట్లే చంద్రవంశాన్నీ క్రమం తప్పక ఉన్న దున్నట్లు చెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

వివస్వాన్ కశ్యపాత్పూర్వమదిత్యామభవత్సుతః।
తస్య పత్నీత్రయం తద్వత్ సంజ్ఞా రాజ్ఞీ ప్రభా తథా॥ 2॥

పూర్వం కశ్యప ప్రజాపతికి అదితి యందు సూర్యుడు పుత్రుడుగా పుట్టాడు. అతనికి సంజ్ఞ, రాజ్ఞి, ప్రభ అని ముప్వురు భార్య లుండేవారు.

రేవతస్య సుతా రాజ్ఞీ రైవతం సుషువే సుతమ్।
ప్రభా ప్రభాతం సుషువే త్వాష్ట్రీ సంజ్ఞా తథా మనుమ్॥ 3॥

రేవతుని పుత్రికయైన రాజ్ఞి రైవతుడనే కుమారుని కన్నది. ప్రభ కుమారుడు ప్రభాతుడు. విశ్వకర్మ పుత్రికయైన సంజ్ఞ మనువనే పుత్రుణ్ణి ప్రసవించింది.

యమశ్చ యమునాచైవ యమలౌ తు బభూవతుః।
తతస్తేజోమయం రూపమసహన్తీ వివస్వతః॥ 4॥

యముడు, యమున అని ఇరువురు అమడ బిడ్డలు సంజ్ఞకు కలిగారు. ఆమె సూర్యుని తేజోమయమైన రూపాన్ని సహించలేకపోయింది.

నారీముత్పాదయామాస స్వశరీరాదనిన్దితామ్।
త్వాష్ట్రీ స్వరూపరూపేణ నామ్నా ఛాయేతి భామినీ॥ 5॥

అందుచేత ఆమె తన శరీరంనుండి ఛాయ అనే సుందరస్త్రీని ప్రభవింపజేసింది. ఆ ఛాయ రూపంలో సంజ్ఞనే పోలి ఉండింది.

పురతః సంస్థితాం దృష్ట్వా సంజ్ఞా తాం ప్రత్యభాషత।
ఛాయే! త్వం భజ భర్తార మస్మదీయం వరాననే॥ 6॥

ఎదుటనున్న ఛాయను జూచి సంజ్ఞ "ఛాయా ! వరాననా! నీవు నా భర్తను సేవించు.

అపత్యాని మదీయాని మాతృస్నేహేన పాలయ।
తథేత్యుక్త్వా తు సా దేవమగాద్ధర్మాయ సువ్రత॥7॥

సువ్రతా! నా బిడ్డలను మాతృప్రేమతో పరిపాలించు అని చెప్పింది. అట్లే అని ఛాయ అందు కంగీకరించి ధర్మబుద్ధితో సూర్యుని చెంతకు పోయింది.

కామయామాస దేవోఽపి సంజ్ఞేయమితి చాదరాత్।
జనయామాస సావర్ణిం మనుం మానుషరూపిణమ్॥8॥

ఛాయను చూచి సంజ్ఞ అనుకొని సూర్యుడు ఆమెను కామించాడు. ఆమెయందు మనుష్యరూపుడైన 'సావర్ణి' అనే మనువును పుత్రునిగా పొందాడు.

సవర్ణత్వాచ్చ సావర్ణిర్మనో ర్వైవస్వతస్య చ।
తతః శనిం చ తపతీం విష్టిం చైవ క్రమేణ తు॥9॥

అతడు తండ్రితో సమానమైన వర్ణం కలిగి యుండినాడు కాన 'సావర్ణి' అన్న పేరు కల్గింది. తరువాత సూర్యుడు ఛాయద్వారా క్రమంగా శని, తపతి, విష్టి అనే ముగ్గురు బిడ్డలను కన్నాడు.

ఛాయాయాం జనయామాస సంజ్ఞేయమితి భాస్కరః।
ఛాయా స్వపుత్రేఽభ్యధికం స్నేహం చక్రే మనౌ తథా॥10॥

సూర్యుడు ఆమె సంజ్ఞ అన్న భావనతోనే ఆ బిడ్డలను ఛాయయందు కన్నాడు. ఛాయ ఇతర సంతానం కన్నా తన బిడ్డయైన మనువునందు ఎక్కువ ప్రేమ జూపింది.

పూర్వో మనుస్తు చక్షామ న యమః క్రోధ మూర్ఛితః।
సన్తర్జయమాస తదా పాదముద్యమ్య దక్షిణమ్॥11॥

మొదటి మనువు దీనిని సహించాడు. కాని కోపోద్దీపితుడైన యముడు అది సహింపక కుడిపాదం ఎత్తి తంతానని ఆమెను బెదిరించాడు.

శశాప చ యమం ఛాయా భక్షితః కృమిసంయుతః।
పాదోఽయ మేకో భవితా పూయశోణిత విస్రవః॥12॥

అంతట ఛాయ "ఈ నీ ఒక్క పాదం చీము, నెత్తురు కారుతూ క్రిమిభక్షిత మగుగాక!" అని శపించింది.

నివేదయామాస పితుర్యమః శాపాదమర్షితః।
నిష్కారణమహం శస్తో మాత్రా దేవ! సకోపయా॥13॥

యముడు శాపం సహించనివాడై తండ్రి చెంతకు పోయి "దేవా! తల్లి కోపంతో నిష్కారణంగా నన్ను శపించింది.

బాలభావాన్మయా కించిదుద్యతశ్చరణం సకృత్।
మనునా వార్యమాణాఽపి మమ శాపమదాద్విభో॥14॥

ప్రభూ! నేను బాల్యచాపల్యంతో కాలు కొంచెం పైకెత్తాను. ఇంతలో మనువు వద్దని వారిస్తున్నా వినకుండా నన్ను తల్లి శపించింది.

ప్రాయో న మాతా సాఽస్మాకం శాపేనాహం యతో హతః।
దేవోఽప్యాహ యమం భూయః కిం కరోమి మహామతే!॥15॥

మౌర్ఖ్యా త్కస్య న దుఃఖం స్యాదథవా కర్మసన్తతిః।
అనివార్యా భవస్యాపి కా కథాఽన్యేషు జన్తుషు॥ 16॥

అప్పుడు సూర్యుడా యమునితో "మహామతీ! ఇందుకు నేనేమి చేయుదును? మూర్ఖత్వం వల్ల దుఃఖం పొందనివా డెవడు? కర్మఫలం శివునికి సైతం అనివార్యమై ఉన్నది. ఇక ఇతర ప్రాణులను గురించి చెప్పేదేమున్నది?.

కర్తారం కర్మపాకస్తు స క్రిమీన్ భక్షయిష్యతి।
క్లేదం చ రుధిరంచైవ పుంసోఽయమపనేష్యతి॥17॥

కర్మ విపాకం కర్తను క్రిములచే భక్షింప జేస్తుంది. కర్మఫలానుభవం వల్ల చీము, రక్తం కారడమనే పాపం క్షీణించి పోతుంది".

ఏవముక్తస్తపస్తేపే యమస్తీవ్రం మహాయశాః।
గోకర్ణతీర్థే వైరాగ్యా త్ఫలపత్రానిలాశనః॥18॥

అరాధయన్మహాదేవం యావద్వర్షాయుతాయుతమ్।
వరం ప్రాదాన్మహాదేవః సన్తుష్టః శూలభృత్తదా॥19॥

తండ్రి ఇలా చెప్పగా మహాకీర్తిమంతుడైన యముడు వైరాగ్యంతో పండ్లూ, ఆకులూ, గాలీ ఆహారంగా గోకర్ణతీర్థంలో తీవ్రతపస్సు చేశాడు. అలా ఒక కోటిసంవత్సరాలు శివుణ్ణి ఆరాధిస్తూ తపస్సు చేయగా సంతుష్టుడై మహాదేవుడైన శివుడు ప్రత్యక్షమై అతనికి వరమిచ్చాడు.

వవ్రే స లోకపాలత్వం పితృలోకస్య పాలనమ్।
ధర్మాధర్మాత్మకస్యాపి జగతస్తు పరీక్షణమ్॥20॥

యముడప్పుడు శివుణ్ణి లోకపాలత్వాన్ని, పితృలోకాధిపత్యాన్నీ ప్రసాదించమని ప్రార్థించాడు. ధర్మాధర్మాత్మకమైన జగత్తుయొక్క పరీక్షకత్వాన్ని గూడా ప్రసాదించుమన్నాడు.

ఏవం స లోకపాలత్వ మగమ చ్ఛూలపాణినః।
పితౄణాం చాధిపత్యం చ ధర్మాధర్మస్య చానఘ! ॥21॥

అనఘా! ఈ విధంగా అర్థించి యముడు శూలపాణినుండి లోకపాలకత్వాన్నీ, పితృలోకాధిపత్యాన్నీ, ధర్మాధర్మాలపై పరీక్షణాధికారాన్నీ పొందాడు.

వివస్వానథ తత్జ్ఞాత్వా సంజ్ఞాయాః కర్మ చేష్టితమ్।
త్వష్టుః సమీపమగమదాచచక్షే చ రోషవాన్॥22॥

సంజ్ఞాదేవి చేసిన పనికి రోషించిన సూర్యుడు ఆమె తండ్రి త్వష్ట చెంతకు వెళ్ళి ఆమె చేసిన పనిని గురించి చెప్పాడు.

తమువాచ తతస్త్వష్టా సాన్త్వపూర్వం ద్విజోత్తమాః।
తవాసహన్తీ భగవన్ మహస్తీవ్రం తమోనుదమ్॥23॥

బడబారూపమాస్థాయ మత్సకాశమిహాగతా

ద్విజశ్రేష్ఠులారా! అప్పుడు త్వష్ట సూర్యునితో సాంత్వపూర్వకంగా ఇలా అన్నాడు– "భగవాన్! చీకటిని తొలగించే తీవ్రమైన నీ తేజస్సును సహించలేక సంజ్ఞ ఆడు గుర్రం రూపంలో నా చెంతకు వచ్చింది.

నివారితా మయా సా చ త్వద్భయేన దివాకర।24॥

యస్మాదవిజ్ఞాతతయా మత్సకాశమిహాగతా।
తస్మాన్మదీయం భవనం ప్రవేష్టుం న త్వమర్హసి॥25॥

అప్పు డామెకు నేను నీకు భయపడి ఇంటిలో ప్రవేశం కల్పించలేదు. "నీవు నీ భర్తకు తెలియకుండా నా వద్దకు వచ్చావు. అంచేత నాయింట ప్రవేశించదగవు" అని నేనన్నాను.

ఏవముక్తా జగామాథ మరుదేశమనిన్దితా।
బడబారూపమాస్థాయ భూతలే సంప్రతిష్ఠితా॥26॥

ఇలా నేను చెప్పేసరికి గుణవతియైన సంజ్ఞ బడబారూపంతో మరుదేశానికి పోయి భూతలంలో నిలకడ లేకుండా తిరుగుతున్నది.

తస్మాత్ప్రసాదం కురు మే యద్యనుగ్రహభాగహమ్।
అపనేష్యామి తే తేజో యన్త్రే కృత్వా దివాకర!॥27॥

సూర్యభగవానుడా! నేను నీ అనుగ్రహానికి పాత్రుడనైతే నాపట్ల ప్రపన్నుడవు కమ్ము. యంత్రంలో పెట్టి నేను నీ తేజస్సుయొక్క తీక్ష్ణతను తొలగిస్తాను.

రూపం తవ కరిష్యామి లోకానన్దకరం ప్రభో।
తథేత్యుక్తః స రవిణా భ్రమౌ కృత్వా దివాకరమ్॥28॥

పృథక్చకార తత్తేజశ్చక్రం విష్ణోరకల్పయత్।
త్రిశూలం చాపి రుద్రస్య వజ్రమిన్ద్రస్య చాధికమ్॥29॥

దైత్యదానవసంహర్తుః సహస్రకిరణాత్మకమ్।
రూపం చాప్రతిమం చక్రే త్వష్టా పద్భ్యామృతే మహత్॥30॥

పాదాలు లేకుండా సహస్రకిరణాలు మాత్రం కల్గిన సాటిలేని వెయ్యికిరణాల రూపాన్ని త్వష్ట దైత్య దానవులను సంహరించు సూర్యునికి కల్గించాడు.

ప్రభూ! నీ రూపాన్ని లోకానికి ఆహ్లాదం కలిగించేదిగా చేస్తాను" అన్నాడు. అందుకు సూర్యుడనుమతించాడు. అతడు సూర్యుణ్ణి యంత్రంలో పెట్టి ఆ తేజస్సును వేరుచేశాడు. అలా విడిపోయిన తేజోభాగంతో విష్ణువుకు సుదర్శన చక్రం నిర్మించాడు. రుద్రునికి త్రిశూలాన్నీ, దైత్యదానవ సంహారకుడైన ఇంద్రునికి వజ్రాయుధాన్నీ తయారుచేశాడు.

న శశాకాథ తద్ద్రష్టుం పాదరూపం రవేః పునః।
అర్చాస్వపి తతః పాదౌ న కశ్చిత్కారయేత్క్వచిత్॥31॥

యః కరోతి స పాపిష్ఠాం గతిమాప్నోతి నిన్దితామ్।
కుష్ఠరోగమవాప్నోతి లోకేఽస్మిన్ దుఃఖసంయుతః॥32॥

పాదాలతో గూడిన సూర్యుని రూపాన్ని అతడు చూడలేకపోయాడు. అందుచేత పూజలలో గూడా ఎవడూ పాదసహితమైన సూర్యరూపాన్ని ప్రతిష్ఠించరాదు. అలా చేస్తే నిందితమైన పాపగతిని పొందుతాడు. దుఃఖితుడై కుష్ఠరోగానికి గురి అవుతాడు.

తస్మాచ్చ ధర్మకార్యార్థీ చిత్రేష్వాయతనేషు చ।
న క్వచిత్కారయేతాదౌ దేవదేవస్య ధీమతః॥33॥

అందుచేత ధర్మకార్యాపేక్షగలవాడు చిత్రాలలోనూ, మందిరాలలోనూ, ధీమంతుడు, దేవదేవుడూ అయిన సూర్యునికి పాదాలు ఏర్పాటు చేయరాదు.

తతస్స భగవాన్ గత్వా భూలోకమమరాధిపః।
కామయామాస కామార్తో ముఖమేవ దివాకరః॥34॥

అశ్వరూపేణ మహతా తేజసా చ సమావృతః।
సంజ్ఞా చ మనసా క్షోభమగమద్భయవిహ్వలా॥35॥

తరువాత దేవాధిపుడు, భగవానుడైన ఆ సూర్యుడు అశ్వరూపుడై గొప్పతేజస్సుతో గూడి భూలోకానికి పోయాడు. అక్కడ కామార్తుడై సంజ్ఞాదేవి ముఖమునే కామప్రవృత్తికి లక్ష్యం చేసుకొన్నాడు. సంజ్ఞ తన మగని గుర్తించజాలక అతడు పరాయివాడని భయపడి మానసికంగా ఎంతో క్షోభ చెందింది.

నాసాపుటాభ్యాముత్సృష్టః పరోఽయమితి శఙ్కయా।
తస్య రేతస్స్రవాజ్జాతావశ్వినావితి నః శ్రుతమ్॥36॥

సంజ్ఞ సూర్యుని రేతస్సును తన ముక్కు పుటాల ద్వారా వదలివేయగా ఆ రేతఃస్రావం వల్ల అశ్వినీ దేవతలు జనించారని వింటున్నాము.

దస్రౌ సుతత్వాత్సంజాతౌ నాసత్యౌ నాసికాగ్రతః।
జ్ఞాత్వా చిరాచ్చ తం దేహం సంతోషమగమత్పరమ్॥37॥

విమానేనాగమమత్స్వర్గం పత్యా సహ ముదాన్వితా।

అశ్వసుతులు కాన దస్రులనీ, నాసికలనుండి పుట్టడం వల్ల నాసత్యులనీ వారికి పేరు కలిగింది. కడకు సంజ్ఞాదేవి అతణ్ణి తన భర్తగా గుర్తించి ఎంతో సంతసించింది. భర్తతో గూడి విమానంలో సంతోషంతో స్వర్గలోకానికి వెళ్ళింది.

సావర్ణోఽపి మనుర్మేరావద్యాప్యాస్తే తపోధనః।
శనిస్తపోబలాదాప గ్రహసామ్యం తతః పునః॥38॥

సావర్ణిమనువు తపోనిష్ఠుడై ఇప్పుడు గూడా మేరు పర్వతంపై ఉన్నాడు. శని తపోబలంతో గ్రహాలలో ఒకడుగా స్థితి పొందాడు.

యమునా తపతీ చైవ పునర్నద్యౌ బభూవతుః।
విష్టిర్ఘోరాత్మికా తద్వత్కాలత్వేన వ్యవస్థితా॥39॥

యమున, తపతి అనువారు నదులైనారు. మూడవ కుమార్తె విష్టి మాత్రం భయంకరరూపం కలదై కాలరూప అయింది.

మనోర్వైవస్వతస్యాసన్ దశపుత్రా మహాబలాః।
ఇలస్తు ప్రథమస్తేషాం పుత్రేషు సమజాయత॥40॥

వైవస్వతమనువుకు మహాబలవంతులైన పదిమంది పుత్రులు కలిగారు. వారిలో మొదటివాడు ఇలుడు.

ఇక్ష్వాకుః కుశనాభశ్చ అరిష్టో ధృష్ట ఏవ చ।
నరిష్యన్తః కరూషశ్చ శర్యాతిశ్చ మహాబలః॥
పృషధ్రశ్చాథ నాభాగః సర్వే తే దివ్యమానుషాః॥41॥

ఇక్ష్వాకువు, కుశనాభుడు, అరిష్టుడు, ధృష్టుడు, నరిష్యంతుడు, కరూషుడు, శర్యాతి, పృషధ్రుడు, నాభాగుడు–అను వారందరూ మహాబలవంతులు, దివ్యమానవులు.

అభిషిచ్య మనుః పుత్రమిలం జ్యేష్ఠం స ధార్మికః।
జగామ తపసే భూయః స మహేన్ద్రవనాలయమ్॥42॥

ధార్మికుడైన ఆ మనువు జ్యేష్ఠపుత్రుడైన ఇలుణ్ణి రాజ్యంలో అభిషిక్తుణ్ణి చేశాడు. ఆపై మహేంద్ర వనాలయంలో తపస్సు చేయడానికి వెళ్ళాడు.

అథ దిగ్జయసిద్ధ్యర్థమిలః ప్రాయాన్మహీమిమామ్।
భ్రమన్ ద్వీపాని సర్వాణి క్ష్మాభృతః సంప్రధర్షయన్॥43॥

జగామోపవనం శంభోరశ్వాకృష్టః ప్రతాపవాన్।
కల్పద్రుమలతాకీర్ణం నామ్నా శరవణం మహత్॥44॥

పిదప ఇలుడు దిగ్జయ మభిలషించాడు. భూవలయంలోని రాజులను పరాజితులను కావిస్తూ తన వాహనమైన అశ్వానికి వశుడై ప్రతాపశాలి యయిన ఆ రాజేంద్రుడు కల్పతరువులూ, లతలూ వ్యాపించిన శరవణ మనే శివునిదైన ఒక గొప్ప ఉద్యానవనంలో ప్రవేశించాడు.

రమతే యత్ర దేవేశః శంభుః సోమార్ధశేఖరః।
ఉమయా సమయస్తత్ర పురా శరవణే కృతః॥45॥

పున్నామ సత్త్వం యత్కిఞ్చిదాగమిష్యతి తే వనే।
స్త్రీత్వమేష్యతి తత్సర్వం దశయోజనమణ్డలే॥46॥

అక్కడ దేవతావిభుడు, చంద్రార్ధశేఖరుడైన శివుడు పార్వతితో క్రీడిస్తూ వుంటాడు. ఆ శరవణంలో ఏదైనా పురుష ప్రాణి దశయోజన వలయం గల ప్రదేశంలో ప్రవేశిస్తే అది స్త్రీగా మారిపోతుందని ఉమాదేవి పూర్వం ఒక వ్యవస్థను చేసింది.

అజ్ఞాతసమయో రాజా ఇలః శరవణే పురా।
స్త్రీత్వమాప విశన్నేవ బడబాత్వం హయస్తదా॥47॥

ఆ కట్టడి విషయం తెలియని రాజు ఇలుదు శరవణంలో ప్రవేశించగానే స్త్రీ గా మారిపోయాడు. ఆ మగగుర్రం ఆడుగుర్రమైపోయింది.

పురుషత్వం హృతం సర్వం స్త్రీరూపే విస్మితో నృపః।
ఇలేతి సాఽభవన్నారీ పీనోన్నతఘనస్తనీ॥48॥

మగతనం నశించి స్త్రీత్వం కలగటం పట్ల విస్మయం పొందిన రాజు ఉన్నతమైన పీనకుచాలు గల 'ఇల' అనే నారీమణిగా మారిపోయాడు.

ఉన్నతశ్రోణిజఘనా పద్మపత్రాయతేక్షణా।
పూర్ణేన్దువదనా తన్వీ విలాసోల్లసితేక్షణా॥49॥

మూలోన్నతాయతభుజా నీలకుఞ్చితమూర్ధజా।
తనులోమా సుదశనా మృదుగమ్భీరభాషణీ॥50॥

ఉన్నతమైన పిఱుదులు, కటిస్థలం కలదీ, పద్మదళాలవలె విశాలమైన నేత్రాలు కలదీ, పున్నమి చంద్రుని బోలిన ముఖం కలదీ, సన్నని మైదీగ గలదీ, విలాసవంతములైన చూపులు గలదీ, ఉన్నతమై విశాలమైన బాహుమూలములు గలది, నల్లని వక్రమైన శిరోజాలు గలదీ, సూక్ష్మ రోమాలు గలదీ, మంచి పలువరుస గలదీ, మృదువుగానూ, గంభీరంగానూ మాట్లాడేదీ అయిన స్త్రీ గా ఆ రాజు మారిపోయాడు.

శ్యామగౌరేణ వర్ణేన హంసవారణగామినీ।
కార్ముక భ్రూయుగోపేతా తనుతామ్రనఖాఙ్కురా ॥51॥

నలుపు, తెలుపు కలిసిన శరీరచ్ఛాయ గలదీ, హంసను, ఏనుగును బోలిన నడక గలదీ, ధనుస్సువంటి రెండు కనుబొమ్మలు గలదీ, సన్నని ఎఱ్ఱనైన నఖాంకురాలు గలదిగా ఆమె ఉండినది.

భ్రమన్తీ చ వనే తస్మింశ్చిన్తయామాస భామినీ।
కో మే పితాఽథ వా భ్రాతా కా మే మాతా భవేదిహ॥52॥

ఆమె ఆ వనంలో సంచరిస్తూ ఇలా చింతించింది. "నా తండ్రి ఎవరు? నా సోదరుడు , నాతల్లి ఎవరై యుందురు?

కస్య భర్తురహం దత్తా కియద్వత్స్యామి భూతలే।
చిన్తయన్తీతి దదృశే సోమపుత్రేణ సాఽఙ్గనా॥53॥

ఏ భర్తకు నన్నిచ్చారో! ఈ భూతలంలో నేనెంత కాలం ఉంటాను"? ఇలా చింతిస్తున్న ఆ వనితను చంద్రుని కుమారుడైన బుధుడు చూచాడు.

ఇలారూపసమాక్షిప్తో మనసా వరవర్ణినీమ్।
బుధస్తు కామయామాస తాం వనే కామపీడితః॥54॥

ఆమె సౌందర్యం అతని చిత్తాన్ని ఆకర్షించింది. బుధుడు ఆ రమణిని ఆ వనంలో కామపీడితుడై కామించాడు.

విశిష్టాకారవాన్ దణ్డీ సకమణ్డలుపుస్తకః।
వేణుదణ్డకృతానేకపవిత్రకగణో నృప! ॥55॥

రాజా! అతడొక విశిష్టమైన ఆకారం ధరించాడు. దండం, కమండలువు, పుస్తకం చేబూనాడు. అతడు చేబూనిన వేణుదండంలో పవిత్రకగణం తగిలించబడివున్నది.

ద్విజరూపః శిఖీ బ్రహ్మ నిగదన్ కర్ణకుణ్డలః।
వటుభిశ్చాన్వితో యుక్తైః సమిత్పుష్పకుశోదకైః॥56॥

అతడు విప్రరూపం ధరించి శిఖ పెట్టుకొని వేదపఠనం చేస్తూవున్నాడు. చెవులకు కుండలాలు పెట్టుకొన్నాడు. సమిధలు, దర్భలు, పుష్పాలు, ఉదకములు చేబూనిన అనేక బ్రహ్మచారు లతని వెంటనున్నారు.

కిలాన్విష్యన్ వనే తస్మిన్నాజుహావ స తామిలామ్।
బహిర్వనస్యాన్తరితః కిల పాదపమణ్డలే॥57॥

అతడు ఇళ తప్పి పోగా ఆమెను అన్వేషిస్తున్నాడా అన్నట్లు నటించాడు. ఆ వనంలో వెలుపలనే చెట్ల మధ్య దాగినవాడై ఆమెను పిలిచాడు.

స సంభ్రమమకస్మాత్తాం సోపాలంభమివావదత్ ।
త్యక్త్వాఽగ్ని హోత్రశుశ్రూషాం క్వ గతా మన్దిరాన్మమ॥58॥

సంభ్రమంతో అకస్మాత్తుగా ఆమెను మందలించినట్లుగా ఇలా అన్నాడు– "ఏమే! అగ్ని హోత్ర శుశ్రూష వదలిపెట్టి నాయింటినుండి ఎక్కడికి వెళ్ళావు?

ఇయం విహారవేళా తే హ్యతిక్రామతి సామ్ప్రతమ్।
ఏహ్యేహి పృథు సుశ్రోణి! సమ్భ్రాన్తా కేన హేతునా?॥59॥

ఇప్పుడు నీవిహారవేళ అతిక్రమించిపోతున్నది. సుందరీ! రా రా! ఎందుకలా సంభ్రమంతో ఉన్నావు?

ఇయం సాయన్తనీ వేళా విహారస్యాతివర్తతే ।
కృత్వోపలేపనం పుష్పైరలఙ్కురు గృహం మమ॥60॥

నీ సాయంకాల విహారసమయం అతిక్రమిస్తున్నది.వెంటనే ఇల్లు అలికి పూలతో ఇంటిని అలంకరించు".

సా త్వబ్రవీ ద్విస్మృతాऽహం సర్వమేతత్తపోధన! ।
ఆత్మానం త్వాం చ భర్తారం కులం చ వద మేऽనఘ! ॥61॥

అది విని ఆమె " ఓతపోధనా! ఇదంతా నేను మరచిపోయాను. అనఘా! నేనెవరో! నీ వెవరో! నా భర్తను, కులాన్ని గురించి నా కంతా వివరంగా తెలియపరచండి!" అని అడిగింది.

బుధః ప్రోవాచ తాం తన్వీమిలా త్వం వరవర్ణిని।
అహం చ కాముకో నామ బహువిద్యో బుధః స్మృతః॥62॥

అప్పుడు బుధు డామెతో ఇలా అన్నాడు. "ఓ సుందరీ! నీవు ఇలవు. నేను కాముకుడను, బహువిద్యా నివుణుడనైన బుధుడను.

తేజస్వినః కులే జాతః పితా మే బ్రాహ్మణాధిపః।
ఇతి సా తస్య వచనాత్ప్రవిష్టా బుధమన్దిరమ్॥63॥

నేను తేజస్వి (చంద్రుని), కులంలో పుట్టాను. నా తండ్రి ద్విజాధిపుడు (చంద్రుడు)" అని అతడు చెప్పగా ఆమె అది నమ్మి బుధుని యింట ప్రవేశించింది.

రత్నస్తమ్భసమాయుక్తం దివ్యమాయావినిర్మితమ్।
ఇలా కృతార్థమాత్మానం మేనే తద్భవనస్థితా ॥64॥

ఆ యిల్లు రత్న స్తంభాలతో కూడియున్నది. అది దివ్యమాయతో నిర్మించబడినది. అందులోకి వెళ్ళి ఇల తన్ను కృతార్థురాలినిగా భావించింది.

అహో గేహ మహో రూపమహోధనమహో కులమ్।
మమ చాస్య చ మే భర్తురహో లావణ్యముత్తమమ్॥65॥

ఓహో! ఎంత అందమైన ఇల్లు! ఏమి రూపం! ఎంత ఐశ్వర్యం! ఎంత గొప్ప వంశం? నాకూ, నా మగనికీ గల సౌందర్యం ఉత్తమమైనది గదా!

రేమే చ సా తేన సమమతికాలమిలా తతః।
సర్వభోగమయే గేహే యథేన్ద్రభవనే తథా॥66॥

ఇలా అనుకొని ఆ ఇల ఆ బుధునితో ఎంతో కాలం అక్కడ సర్వభోగ సంపన్నమైన ఆ గృహంలో ఇంద్రభవనంలో లాగా రమించింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే సూర్య వంశవర్ణనం నామ ఏకాదశోऽధ్యాయః ॥ 11 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని మత్స్యమను సంవాదంలో సూర్యవంశ వర్ణనమనే పదకొండవ అధ్యాయం సంపూర్ణం

ద్వాదశోఽధ్యాయః - పన్నెండవ అధ్యాయం

ఇలా వృత్తాంతః ఇక్ష్వాకువంశవర్ణనం చ - ఇలా వృత్తాంతం మరియు ఇక్ష్వాకువంశవర్ణన

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అథాన్విషన్తో రాజానం భ్రాతరస్తస్య మానవాః।
ఇక్ష్వాకుప్రముఖా జగ్ముస్తదా శరవణాన్తికమ్॥ 1॥

పిదప ఇలుని అన్వేషిస్తూ మనుకుమారులైన ఇక్ష్వాకువు మున్నగు అతని సోదరులు శరవణసమీపానికి వెళ్ళారు.

తతస్తే దదృశుస్సర్వే బడబామగ్రతః స్థితామ్।
రత్నపర్యాణకిరణదీప్తకాయామనుత్తమామ్॥ 2॥

అక్కడ వారు ఎదుటనున్న ఆడు గుర్రాన్ని చూచారు. అది రత్నఖచితమైన జీనునుండి వెలువడే కాంతులతో వెలుగొందే శరీరం కల ఉత్తమమైన గుర్రం.

పర్యాణప్రత్యభిజ్ఞానాత్సర్వే విస్మయమాగతాః।
అయం చన్ద్రప్రభో నామ వాజీ తస్య మహాత్మనః॥ 3॥
అగమద్బడబారూపముత్తమం కేన హేతునా?

దాని జీనును గుర్తించి వారందరూ ఆశ్చర్యపడ్డారు. ఇది ఆ మహానుభావుని 'చంద్రప్రభ' మనే గుర్రం. ఇది ఆడు రూపాన్ని ఎందుకు పొందింది?

తతస్తు మైత్రావరుణిం పప్రచ్ఛుస్తే పురోధసమ్॥ 4॥

కిమేతదిత్యభూచ్చిత్రం వద యోగవిదాం వర।
వసిష్ఠశ్చాబ్రవీత్సర్వం దృష్ట్వాంతర్ధ్యానచక్షుషా॥ 5॥

తరువాత వారు పురోహితుడైన వసిష్ఠుని "యోగజ్ఞులలో శ్రేష్ఠుడవైన మునీంద్రా! ఏమిటిది? ఈ చిత్రమెలా జరిగింది? వివరించండి" అని అడిగారు. వసిష్ఠుడు ధ్యానదృష్టితో అంతా తెలుసుకొని జరిగినదంతా వారికి తెలియజేశాడు.

సమయః శమ్భుదయితాకృతః శరవణే పురా।
యః పుమాన్ ప్రవిశేదత్ర స నారీత్వమవాప్స్యతి ॥ 6॥

"పార్వతి పూర్వం ఈ శరవణంలో చేసిన కట్టడి ననుసరించి ఇక్కడ ప్రవేశించిన పురుషు డెవడైనా స్త్రీగా మారిపోతాడు.

అయమశ్వోఽపి నారీత్వమగాద్రాజ్ఞా సహైవ తు।
పునః పురుషతామేతి యథాఽసౌ ధనదోపమః॥ 7॥

తథైవ యత్నః కర్తవ్యశ్చారాధ్యైవ పినాకినమ్।
తతస్తే మానవా జగ్ముర్యత్ర దేవో మహేశ్వరః॥ 8॥

రాజుతో పాటు ఈ గుర్రం కూడా ఆడుదిగా మారిపోయింది. కుబేరునితో సమానుడైన ఇలమహారాజు మళ్ళీ ఎలా మగతనం పొందుతాడో, అట్టి ప్రయత్నం చేయాలి. ఇది ఈశ్వరారాధనతోనే సాధ్యం కాగలదు". అంతట ఆ మనుకుమారులందరూ మహేశ్వరుడున్న చోటికి వెళ్ళారు.

తుష్టువుర్వివిధైః స్తోత్రైః పార్వతీపరమేశ్వరౌ।
తావూచతురలఙ్ఘ్యోఽయం సమయః కిన్తు సామ్ప్రతమ్॥ 9॥

వెళ్ళి పార్వతీ పరమేశ్వరులను వివిధ స్తోత్రాలతో స్తుతించారు. అప్పుడు శివాశివులు వారితో ఇలా అన్నారు. "ఈ వ్యవస్థ అతిక్రమించరానిది.

ఇక్ష్వాకో రశ్వమేధేన యత్ఫలం స్యాత్తదావయోః।
దత్వా కింపురుషో వీరః స భవిష్యత్యసంశయమ్॥ 10॥

కాని ఇప్పు డిక్ష్వాకువు అశ్వమేధం చేయగా కలిగే ఫలం మాకు సమర్పిస్తే ఇలుడు వీరుడైన కింపురుషుడుగా రూపొందుతాడు. ఇందులో సందేహం లేదు".

తథేత్యుక్తాస్తతస్తే తు జగ్ముర్వైవస్వతాత్మజాః।
ఇక్ష్వాకోశ్చాశ్వమేధేన చేలః కిమ్పురుషోఽభవత్॥ 11॥

అందుకు అట్లే అని ఆ వైవస్వతుని పుత్రులు అందురూ సమ్మతించి తిరిగి వెళ్ళారు. తర్వాత ఇక్ష్వాకువు చేసిన అశ్వమేధంవల్ల ఇలుడు కింపురుష డయ్యాడు.

మాసమేకం పుమాన్ వీరః స్త్రీ చ మాసమభూత్పునః।
బుధస్య భవనే తిష్ఠన్నిలో గర్భధరోఽభవత్॥ 2॥

అతడు ఒక నెల మగవాడుగా, మరొక నెల మగువగా వుండేవాడు. అట్లు బుధుని ఇంటనే వుంటూ ఇలుడు గర్భం ధరించాడు.

అజీజనత్పుత్రమేక మనేకగుణసంయుతమ్।
బుధశ్చోత్పాద్య తం పుత్రం స్వర్లోకమగమత్పునః॥ 13॥

అనేక గుణాలుగల ఒక పుత్రుణ్ణి కన్నాడు. బుధు డాబిడ్డను జనింపజేసిన తర్వాత మరల స్వర్గలోకానికి వెళ్ళాడు.

ఇలస్య నామ్నా తద్వర్ష మిలావృతమభూత్తథా।
సోమార్కవంశయోరాదావిలోఽభూన్మనునందనః॥ 14॥

ఇలుని పేరుతోనే ఆ వర్షానికి ఇలావృతవర్ష మన్న పేరు కల్గింది. ఇలా సోమసూర్య వంశాలకు రెండింటికీ మనుపుత్రుడైన ఇలుడు మొదటి రాజయ్యాడు.

ఏవం పురూరవాః పుంసో రభవద్వంశవర్ధనః।
ఇక్ష్వాకోరర్క వంశస్య తథైవోక్తస్తపోధనాః॥15॥

తపోధనులారా! ఇలుని పుత్రుని పేరు పురూరవుడు. అతడు చంద్రవంశానికి వృద్ధికారకుడు కాగా ఇక్ష్వాకువు సూర్యవంశ వర్ధనుడయ్యాడు.

ఇలః కిమ్పురుషత్వే చ సుద్యుమ్న ఇతి చోచ్యతే।
పునః పుత్రత్రయమభూత్సుద్యుమ్నస్యాపరాజితమ్॥16॥

ఇలుడు కింపురుషుడుగా ఉన్నప్పుడు అతనిపేరు సుద్యుమ్నుడు. అతని కప్పుడు అవిజేయులైన ముగ్గురు కొడుకులు పుట్టారు.

ఉత్కలో వై గయస్తద్వద్ధరితాశ్వశ్చ వీర్యవాన్।
ఉత్కలస్యోత్కలా నామ గయస్య తు గయా మతా ॥17॥

వారి పేర్లు ఉత్కలుడు, గయుడు, వీర్యశాలి అయి హరితాశ్వుడు. ఉత్కలునికి ఉత్కల దేశము, గయునికి గయ పాలనార్హదేశా లయ్యాయి.

హరితాశ్వస్య దిక్పూర్వా విశ్రుతా కురుభిస్సహ।

హరితాశ్వుడు కురుదేశాలతో కూడిన పూర్వదేశానికి పరిపాలకు డయ్యాడు.

ప్రతిష్ఠానేஉభిషిచ్యాథ స పురూరవసం సుతమ్॥8॥

జగామేలావృతం భోక్తుం వర్షం దివ్యఫలాశనమ్।
ఇక్ష్వాకుర్జ్యేష్ఠదాయాదో మధ్యదేశమవాప్తవాన్॥19॥

ఇలుడు స్త్రీగా ఉన్నప్పుడు పుట్టిన కుమారుడు పురూరవుని ప్రతిష్ఠాననగరాధిపతిగా అభిషేకించాడు. తాను దివ్యఫలాహారంతో వానప్రస్థవ్రతాన్ని అనుష్ఠించడానికై ఇలావృతవర్షానికి పోయాడు. మనువు పెద్దకుమారుడైన ఇక్ష్వాకువు మధ్యదేశానికి ప్రభువయ్యాడు.

నరిష్యన్తస్య పుత్రోஉభూచ్ఛపో నామ మహాబలః ।
నాభాగస్యామ్బరీషస్తు ధృష్టస్య చ సుతత్రయమ్।
ధృతకేతుశ్చిత్రనాథో రణధృష్టశ్చ వీర్యవాన్॥20॥

మహాబలశాలి అయిన శపుడు నరిష్యంతుని కుమారుడు. నాభాగుని పుత్రుడు అంబరీషుడు. ధృతకేతువు, చిత్రనాథుడు, వీర్యశాలి అయిన రణధృష్టుడు ధృష్టునికి కల్గిన ముగ్గురు కుమారులు.

ఆనర్తో నామ శర్యాతేః సుకన్యా చైవ దారికా॥21॥

ఆనర్తస్యాభవత్పుత్రో రోచమానః ప్రతాపవాన్।
ఆనర్తో నామ దేశోஉభూ న్నగరీ చ కుశస్థలీ॥22॥

శర్యాతికి ఆనర్తుడనే కుమారుడు, సుకన్య అనే కుమార్తె కలిగారు. ఆనర్తుని పుత్రుడు ప్రతాపవంతుడైన రోచమానుడు. ఆనర్తుడు పాలించిన దేశానికి ఆనర్తమనీ, నగరానికి కుశస్థలి అనీ పేర్లు.

రోచమానస్య రేవోఽభూద్రేవాద్రైవత ఏవ చ।
కకుద్మీ చాపరో నామ్నా జ్యేష్ఠః పుత్రశతస్య చ ॥23॥

రోచమానుని పుత్రుని పేరు రేవుడు. రేవుని పుత్రుడు రైవతుడు. అతణ్ణి 'కకుద్మి' అని కూడా అంటారు. అతడు రేవుని నూరుమంది పుత్రులలో జ్యేష్ఠుడు.

రేవతీ తస్య సా కన్యా భార్యా రామస్య విశ్రుతా।
కరూషస్యతు కారూషా బహవః ప్రథితా భువి॥24॥

అతనికి రేవతి అనే కన్య కలదు. ఆమె బలరాముని భార్యగా ప్రసిద్ధురాలు. కరూషుని పుత్రులనేకులు కారూషులుగా లోకంలో విఖ్యాతులు.

పృషధ్రో గోవధాచ్ఛూద్రో గురుశాపాదజాయత।
ఇక్ష్వాకువంశం వక్ష్యామి శృణుధ్వమృషిసత్తమాః! ॥25॥

పృషధ్రు డనేవాడు గోవధ చేసి గురుశాపంవల్ల శూద్రు డయ్యాడు. ఋషివర్యులారా! ఇక ఇక్ష్వాకు వంశాన్ని వివరిస్తాను. వినండి!

ఇక్ష్వాకోః పుత్రతామాప వికుక్షిర్నామ దేవరాట్ ।
జ్యేష్ఠః పుత్రశతస్యాసీద్దశ పఞ్చ చ తత్సుతాః॥26॥

దేవరాజైన వికుక్షి ఇక్ష్వాకుని పుత్రుడు. అతడు ఇక్ష్వాకుని నూరుమంది కుమారులలో జ్యేష్ఠుడు. అతని పుత్రులు పదునైదుమంది.

మేరోరుత్తరతస్తే తు జాతాః పార్థివసత్తమాః।
చతుర్దశోత్తరం చాన్యచ్ఛతమస్య తథాఽభవత్॥27॥

వారు మేరుగిరికి ఉత్తరాన గల దేశానికి ప్రభువు లయ్యారు. వీరే కాక వికుక్షికి వేరుగా నూటపదనల్గురు కుమారు లుండేవారు.

మేరోర్దక్షిణతో యేవై రాజానః సంప్రకీర్తితాః।
జ్యేష్ఠః కకుత్స్థో నామ్నాఽభూత్ తత్సుతస్తు సుయోధనః॥28॥

వారు మేరువునకు దక్షిణ దిశలో గల రాజ్యాలకు రాజు లయ్యారు. వారిలో జ్యేష్ఠుడు కకుత్స్థుడు. అతని కుమారుని పేరు సుయోధనుడు.

తస్య పుత్రః పృథుర్నామ విశ్వగశ్చ పృథోః సుతః।
ఇందుస్తస్యచ పుత్రోఽభూద్యువనాశ్వస్తతో ఽభవత్॥29॥

సుయోధనుని పుత్రుడు పృథువు. అతని కుమారుడు విశ్వగుడు. అతని పుత్రుడు ఇందుడు. ఇందుని కుమారుడు యువనాశ్వుడు.

శ్రావస్తశ్చ మహాతేజా వత్సకస్తత్సుతోఽభవత్।
నిర్మితా యేన శ్రావస్తీ గౌడదేశే ద్విజోత్తమాః! ॥30॥

యువనాశ్వుని పుత్రుడు గొప్ప తేజస్వి యయిన శ్రావస్తుడు. అతని కొడుకు వత్సకుడు. విప్రోత్తములారా! శ్రావస్తుడు గౌడదేశములో శ్రావస్తీ నగరాన్ని నిర్మించాడు.

శ్రావస్తాద్బృహదశ్వోఽభూత్కువలాశ్వస్తతోఽభవత్।
ధున్ధుమారత్వమగమద్ధున్ధోర్నాశేన యః పురా॥31॥

శ్రావస్తుని కొడుకు బృహదశ్వుడు. అతని పుత్రుడు కువలాశ్వుడు. పూర్వం అతడు ధుంధు వనువానిని చంపి ధుంధుమారు డన్న పేరు గాంచాడు.

తస్య పుత్రాస్త్రయో జాతా దృఢాశ్వో దణ్డ ఏవ చ।
కపిలాశ్వశ్చ విఖ్యాతో ధౌంధుమారిః ప్రతాపవాన్॥32॥

అతని పుత్రులు దృఢాశ్వుడు, దండుడు, ప్రతాపశాలి,దౌంధుమారి అయిన కపిలాశ్వుడు అనువారు.

దృఢాశ్వస్య ప్రమోదశ్చ హర్యశ్వస్తస్య చాత్మజః।
హర్యశ్వస్య నికుమ్భోఽభూత్సంహతాశ్వస్తతోఽభవత్॥33॥

దృఢాశ్వుని పుత్రుడు ప్రమోదుడు. అతని కొడుకు హర్యశ్వుడు. అతని సుతుడు నికుంభుడు. నికుంభుని కొడుకు సంహతాశ్వుడు.

అకృతాశ్వో రణాశ్వశ్చ సంహతాశ్వసుతావుభౌ ।
యువనాశ్వో రణాశ్వస్య మాన్ధాతా చ తతోఽభవత్॥34॥

సంహతాశ్వుని కుమారులు అకృతాశ్వుడు రణాశ్వుడు అని ఇద్దరు. రణాశ్వుని సుతుడు యువనాశ్వుడు, అతని కొడుకు మాంధాత.

మాన్ధాతుః పురుకుత్సోఽభూద్ధర్మసేనశ్చ పార్థివః।
ముచుకున్దశ్చ విఖ్యాతః శత్రుజిచ్చ ప్రతాపవాన్॥35॥

మాంధాతకు పురుకుత్సుడు. రాజైన ధర్మసేనుడు, ప్రఖ్యాతి గాంచిన ముచుకుందుడు, ప్రతాపవంతుడైన శత్రుజిత్తు – ఈనల్గురు కుమారులు.

పురుకుత్సస్య పుత్రోఽభూద్వసుదో నర్మదాపతిః।
సమ్భూతిస్తస్య పుత్రోఽభూత్త్రిధన్వా చ తతోఽభవత్॥36॥

పురుకుత్సుని పుత్రుడైన వసుదుడు నర్మదకు పతి. అతని కుమారుడు సంభూతి, సంభూతి సుతుడు త్రిధన్వుడు.

త్రిధన్వనః సుతో జాతస్త్రయ్యారుణ ఇతి స్మృతః।
తస్మాత్సత్యవ్రతో నామ తస్మాత్సత్యరథః స్మృతః॥37॥

త్రిధన్వుని పుత్రుడు త్రయ్యారుణుడని ప్రసిద్ధుడు. అతని కొడుకు సత్యవ్రతుడు. అతని కుమారుడు సత్యరథుడు.

తస్య పుత్రో హరిశ్చన్ద్రో హరిశ్చన్ద్రాచ్చ రోహితః।
రోహితాచ్చ వృకో జాతో వృకాద్బాహురజాయత॥38॥

సత్యరథునికి హరిశ్చంద్రుడు, అతనికి రోహితుడు, రోహితునికి వృకుడు, వృకునికి బాహుడు కుమారులయ్యారు.

సగరస్తస్య పుత్రోఽభూద్రాజా పరమధార్మికః।
ద్వే భార్యే సగరస్యాపి ప్రభా భానుమతీ తథా॥39॥

బాహుని కుమారుడు పరమధార్మికుడైన సగరుడు. సగరునికి ప్రభ, భానుమతి అని ఇద్దరు భార్యలు.

తాభ్యా మారాధితః పూర్వమౌర్వో వై పుత్రకామ్యయా।
ఔర్వస్తుష్టస్తయోః ప్రాదాద్యథేష్టం వరముత్తమమ్॥40॥

వారిద్దరూ పూర్వం పుత్రేచ్ఛతో ఔర్వముని నారాధించారు. తన ఆరాధనకు సంతోషించిన ఔర్వుడు వారి కోరిక మేరకు ఉత్తమవరప్రదానం చేశాడు.

ఏకా షష్టిసహస్రాణి సుత మేకం తథాఽపరా।
గృహ్ణాతు వంశకర్తారం ప్రభాఽగృణ్ణీద్బహూంస్తదా॥41॥

వారిలో ఒకరు అరువది వేలమందినీ, మరొకరు ఒక పుత్రుణ్ణీ కోరుకోవలసినదిగా ఔర్వుడనుగ్రహించాడు. అప్పుడు ప్రభ అరువదివేలమంది బిడ్డలను కోరుకొన్నది.

ఏకం భానుమతీ పుత్ర మగృహ్ణాదసమఞ్జసమ్।
తతః షష్టి సహస్రాణి సుషువే యాదవీ ప్రభా॥42॥

భానుమతి అసమంజసుడనే ఒక కుమారుణ్ణి గ్రహించింది. పిదప యదువంశానికి చెందిన ప్రభ అరువదివేలమంది బిడ్డలను ప్రసవించింది.

ఖనన్తః పృథివీం దగ్ధా విష్ణునా యేఽశ్వమార్గణే।
అసమఞ్జస్య తనయో యోంశుమాన్నామవిశ్రుతః॥43॥

వారు పెరిగి పెద్ద వారైన తరువాత గుర్రాన్ని అన్వేషిస్తూ పోయి భూమిని త్రవ్వారు. కపిలముని రూపంలో ఉన్న విష్ణువు వారిని దగ్ధులను చేశాడు. అసమంజసుని కుమారుడు అంశుమంతుడుగా ప్రసిద్ధ డయ్యాడు.

తస్య పుత్రో దిలీపస్తు దిలీపాత్తు భగీరథః।
యేన భాగీరథీ గఙ్గా తపః కృత్వాఽవతారితా॥44॥

అతని కొడుకు దిలీపుడు, దిలీపుని పుత్రుడు భగీరథుడు. ఇతడే తపస్సు చేసి గంగను దివినుండి భువికి తెచ్చాడు. ఆమె భాగీరథిగా ప్రసిద్ధి పొందింది.

భగీరథస్య తనయో నాభాగ ఇతి విశ్రుతః।
నాభాగస్యామ్బరీషోఽభూత్ సిన్ధుద్వీపస్తతోఽభవత్॥45॥

భగీరథుని కొడుకు నాభాగుడుగా ప్రసిద్ధుడు. నాభాగునికి అంబరీషుడు సుతుడు. అతని కుమారుడు సింధుద్వీపుడు.

తస్యాయుతాయుః పుత్రోఽభూదృతుపర్ణస్తతోఽభవత్।
తస్య కల్మాషపాదస్తు సర్వకర్మా తతః స్మృతః ॥46॥

అతని కుమారుడు అయూతాయుడు, అతని కుమారుడు ఋతుపర్ణుడు. అతని కొడుకు కల్మాషపాదుడు. అతని కుమారుడు సర్వకర్మ.

తస్యానరణ్యః పుత్రోఽభూన్నిఘ్నస్తస్య సుతోఽభవత్।
నిఘ్నపుత్రావుభౌ జాతావనమిత్రరఘూ నృపౌ॥47॥

సర్వకర్మ కుమారుడు అనరణ్యుడు. అతని పుత్రుడు నిఘ్నుడు. నిఘ్నునికి అనమిత్రుడు, రఘువు అని ఇద్దరు పుత్రులు కలిగారు.

అనమిత్రో వనమగాద్భవితా స కృతే నృపః।
రఘోరభూద్దిలీపస్తు దిలీపాదజకస్తథా॥48॥

అనమిత్రుడు అరణ్యానికి వెళ్ళాడు. అతడు కృతయుగంలో రాజు కానున్నాడు. రఘువుకు దిలీపుడు, దిలీపునికి అజుడు కుమారులు.

దీర్ఘబాహురజాజ్జాతశ్చాజపాలస్తతో నృపః।
తస్మాద్దశరథో జాత స్తస్య పుత్రచతుష్టయమ్॥49॥

అజుని కుమారుడు దీర్ఘ బాహువు. అతని కుమారుడు అజపాలుడు. అతని సుతుడు దశరథుడు దశరథునికి నల్గురు పుత్రులు కలిగారు.

నారాయణాత్మకాస్సర్వే రామస్తేష్వగ్రజోఽభవత్।
రావణాన్తకరస్తద్వద్రఘుణాం వంశవర్ధనః॥50॥

వారందరూ నారాయణ స్వరూపులే. వారిలో పెద్దవాడు రాముడు. అతడు రావణుణ్ణి వధించినాడు. మరియు రఘువంశవృద్ధికరుడు.

వాల్మీకి స్తస్య చరితం చక్రే భార్గవసత్తమః।
తస్య పుత్రౌ కుశలవావిక్ష్వాకుకులవర్ధనౌ॥51॥

భార్గవవంశజుడైన వాల్మీకి మహర్షి శ్రీరాముని చరిత్ర రచించాడు. రాముని కుమారులు కుశలవులు. వారు ఇక్ష్వాకువంశవృద్ధి కల్గించారు.

అతిథిస్తు కుశాజ్జజ్ఞే నిషధస్తస్య చాత్మజః।
నలస్తు నిషధాత్తస్మాన్నభస్తస్మాదజాయత॥52॥

కుశుని పుత్రుడు అతిథి. అతని కుమారుడు నిషధుడు. నిషధుని కుమారుడు నలుడు. నభుడు నలుని పుత్రుడు.

నభసః పుణ్డరీకోఽభూత్ క్షేమధన్వా తతః స్మృతః।
తస్య పుత్రోఽభవద్వీరో దేవానీకః ప్రతాపవాన్॥53॥

నభునికి పుండరీకుడు, అతనికి క్షేమధన్వుడు పుత్రు లయ్యారు. క్షేమధన్వుని కుమారుడు వీరుడు, ప్రతాపశాలి అయిన దేవానీకుడు.

అహీనగస్తస్య సుతః సహస్రాశ్వస్తతః పరః।
తతశ్చన్ద్రావలోకస్తు తారాపీడస్తతోఽభవత్॥54॥

దేవానీకునకు అహీనగుడు, అతనికి సహస్రాశ్వుడు, అతనికి చంద్రావలోకుడు, అతనికి తారాపీడుడు–క్రమంగా పుత్రు లయ్యారు.

తస్యాత్మజశ్చంద్రగిరి ర్భానుచన్ద్ర స్తతోఽభవత్।
శ్రుతాయురభవత్తస్మాద్భారతే యో నిపాతితః॥55॥

తారాపీడుని సుతుడు చంద్రగిరి, అతని కుమారుడు భానుచంద్రుడు, అతని కుమారుడు శ్రుతాయువు, భారత యుద్ధంలో అతడు చంపబడినాడు.

నలౌ ద్వావేవ విఖ్యాతౌ వంశే కశ్యపసమ్భవే।
వీరసేనసుతస్తద్వ న్నైషధశ్చ నరాధిపః॥56॥

కశ్యపుని వంశంలో నలులు ఇద్దరే ప్రసిద్ధులు. ఒకడు వీరసేనుని కుమారుడు కాగా మరొకడు నైషధు డన్న రాజు.

ఏతే వైవస్వతే వంశే రాజానో భూరిదక్షిణాః।
ఇక్ష్వాకువంశప్రభవాః ప్రాధాన్యేన ప్రకీర్తితాః॥57॥

వైవస్వత వంశంలో పుట్టిన యీ రాజులు భూరి దక్షిణ లిచ్చి యజ్ఞాలు నిర్వహించారు. ఇలా ఇక్ష్వాకు వంశజులైన నరపతులను ఇక్కడ పేర్కొనడ మయింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే ఇలా వృత్తాంతః ఇక్ష్వాకువంశవర్ణనం చ ఇతి ద్వాదశోఽధ్యాయః ॥ 12 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని మత్స్యమనుసంవాదంలో ఇలా వృత్తాంతం మరియు ఇక్ష్వాకువంశవర్ణన అనే పన్నెండవ అధ్యాయం సంపూర్ణం

త్రయోదశో௨ధ్యాయః - పదమూడవ అధ్యాయం

శ్రాద్ధకల్పః, పితృవంశానువర్ణనమ్ - శ్రాద్ధకల్పం, పితృవంశానువర్ణనం

మనురువాచ :- మనువు చెప్పాడు.

భగవచ్ఛ్రోతుమిచ్ఛామి పితౄణాం వంశముత్తమమ్।
రవేశ్చ శ్రాద్ధదేవత్వం సోమస్య చ విశేషతః॥ 1॥

భగవానుడా! ఉత్తమమైన పితృవంశాన్ని గురించి వినగోరుతున్నాను. సూర్యచంద్రులు శ్రాద్ధ దేవతలుగా ఎలా రూపొందారో చెప్పండి.

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

హన్త తే కథయిష్యామి పితౄణాం వంశముత్తమమ్।
స్వర్గే పితృగణాః సప్త త్రయస్తేషా మమూర్తయః॥ 2॥

రాజర్షీ! ఉత్తమమైన పితృవంశాన్ని గూర్చి నీకు వివరిస్తాను. స్వర్గంలో ఏడు పితృగణా లున్నాయి. అందులో మూడు మూర్తి లేనివి.

మూర్తిమన్తో௨థ చత్వారః సర్వేషామమితౌజసః।
అమూర్తయః పితృగణా వైరాజస్య ప్రజాపతేః॥ 3॥

తక్కిన నాలుగూ మూర్తి కలవి. ఈ యేడు గణాలకు చెందిన వారు పితరులుగా ప్రాణికోటిలో అమితతేజస్సు గలవారై ఉన్నారు. మూర్తిలేని పితృ గణాలు మూడు వైరాజప్రజాపతికి చెందినవి.

యజన్తి యాన్ దేవగణా వైరాజా ఇతి విశ్రుతాః।
యే చైతే యోగవిభ్రష్టాః ప్రాప్య లోకాన్ సనాతనాన్॥ 4॥

పునర్బ్రహ్మదినాన్తే తు జాయన్తే బ్రహ్మవాదినః।
సమ్ప్రాప్య తాం స్మృతిం భూయో యోగం సాంఖ్య మనుత్తమమ్॥ 5॥

దేవగణాలు పూజించే ప్రజాపతులు వైరాజ ప్రజాపతులుగా ప్రసిద్ధి పొందారు.

ఈ వైరాజులు యోగభ్రష్టులై సనాతన లోకాలను పొంది మళ్ళీ బ్రహ్మదినం పూర్తి కాగానే బ్రహ్మవాదులుగా జన్మిస్తారు. వారికప్పుడు పూర్వస్మృతి కల్గుతుంది. వారు మరల సర్వోత్తమమైన యోగసాధనను సంకల్పిస్తారు.

సిద్ధిం ప్రయాన్తి యోగేన పునరావృత్తిదుర్లభామ్।
యోగినామేవ దేయాని తస్మాచ్ఛ్రాద్ధాని దాతృభిః॥ 6॥

ఆస్మృతి ప్రభావంతో వారు పునరావృత్తి లేని సిద్ధిని పొందుతారు. అందుచేత దాతలు తాము చేసే శ్రాద్ధకాలదానాలను యోగులకే చేయాలి.

ఏతేషాం మానసీకన్యా పత్నీ హిమవతో మతా।
మైనాకస్తస్య దాయాదః క్రౌఞ్చస్తస్య సుతోఽ భవత్॥
క్రౌఞ్చద్వీపః స్మృతో యేన చతుర్థో ఘృతసంవృతః॥ 7॥

ఈ పితరుల మనస్సంకల్పంచే పుట్టిన కన్యయే మేన. ఆమె హిమవంతుని భార్య. మైనాకుడు హిమవంతుని కుమారుడు. అతని కొడుకు క్రౌంచుడు. అతని పేరుతోనే క్రౌంచద్వీపం ఏర్పడింది. ద్వీపాలలో అది నాల్గవది. అది ఘృతసాగరంతో చుట్టబడియున్నది.

మేనా చ సుషువే తిస్రః కన్యా యోగవతీస్తతః।
ఉమైకపర్ణాఽ పర్ణా చ తీవ్రవ్రతపరాయణాః॥ 8॥

మేన యోగసాధన తత్పరలైన ముగ్గురు కన్యలను ప్రసవించింది. ఉమ, ఏకపర్ణ, అపర్ణ అను వారు తీవ్రవ్రతనిష్ఠ కలవారు.

రుద్రస్యైకా భృగోశ్చైకా జైగీషవ్యస్య చాపరా।
దత్తా హిమవతా బాలాస్సర్వా లోకే తపోఽ ధికాః॥ 9॥

హిమవంతుడు వారిలో ఒకరిని రుద్రునికీ, మరొకరిని భృగువుకూ, ఇంకొకరిని జైగీషవ్యునికీ ఇచ్చి పెండ్లి చేశాడు. ఆ కన్యలందరూ లోకంలో తపోనిష్ఠ గలవారుగా ప్రసిద్ధి పొందినవారే.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

కస్మాద్దాక్షాయణీ పూర్వం దదహాత్మాన మాత్మనా।
హిమవద్దుహితా తద్వత్కథం జాతా మహీతలే॥ 10॥

పూర్వం దక్షపుత్రిక సతి తన్ను తాను ఎందుకు దహింపజేసికొన్నది? ఆమె ఆపైన భూతలంలో హిమవంతుని కుమార్తెగా ఎలా జనించింది?

సంహరన్తీ కిముక్తాఽ సౌ సుతా వా బ్రహ్మసూనునా।
దక్షేణ లోకజననీ సూత! విస్తరతో వద॥ 11॥

తన్ను తాను సంహరించుకొంటున్న లోకజననియగు పుత్రికను చూచి బ్రహ్మకుమారుడైన దక్షు డేమన్నాడు? సూతా! దీన్ని వివరంగా చెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

దక్షస్య యజ్ఞే వితతే ప్రభూతవరదక్షిణే।
సమాహూతేషు దేవేషు ప్రోవాచ పితరం సతీ॥ 12॥

పూర్వం దక్షుడు ఒక గొప్ప యజ్ఞం చేశాడు. అందులో గొప్ప గొప్ప దక్షిణలిచ్చే ఏర్పాటు జరిగింది. ఆ యజ్ఞానికి దేవతలందరూ ఆహూతులయ్యారు. (శివునికి ఆహ్వానం లేదు) అప్పుడు సతి తండ్రితో ఇలా అన్నది.

కిమర్థం తాత! భర్తా మే యజ్ఞేఽస్మిన్నాభిమన్త్రితః।
అయోగ్య ఇతి తామాహ దక్షో యజ్ఞేషు శూలభృత్॥13॥

ఉపసంహారకృద్రుద్రస్తేనామఙ్గళభాగయమ్।
చుకోప చ సతీ దేహం త్యక్ష్యామీతి త్వదుద్భవమ్॥14॥

"తండ్రీ! 'ఈయజ్ఞానికి నా భర్త నెందుకు ఆహ్వానించలేదు?" అందుకు దక్షుడామెతో "నీ భర్త అయోగ్యుడు. అతడు శూలధారి, లోక సంహారకుడైన రుద్రుడు కావడం వల్ల అశుభకారి" అని అన్నాడు. అందుకు సతి కోపించి "నీనుండి పుట్టిన ఈ నా శరీరాన్ని పరిత్యజిస్తున్నాను.

దశానాం త్వం చ భవితా పితౄణామేకపుత్రకః।
క్షత్రియత్వేఽశ్వమేధే చ రుద్రాత్త్వం నాశమేష్యసి॥15॥

నీవు పదిమంది పితరులకు ఒకే కుమారుడవై జనిస్తావు. క్షత్రియుడుగా జన్మించి అశ్వమేధ యాగం చేసినపుడు నిన్ను రుద్రుడు నశింపజేస్తాడు".

ఇత్యుక్త్వా యోగమాస్థాయ స్వదేహోద్భవతేజసా।
నిర్దహన్తీ తదాత్మానం సదేవాసురకిన్నరైః॥16॥

కిం కిమేతదితి ప్రోక్తో గన్ధర్వగణగుహ్యకైః।
ఉపగమ్యాబ్రవీద్దక్షః ప్రణిపత్యాథ దుఃఖితః॥17॥

ఇలా చెప్పి సతీ దేవి యోగం పూని తన దేహంనుండి పుట్టిన అగ్నిలో తన్ను దగ్ధం చేసుకొన్నది. అప్పుడు దేవతలు, అసురులు, కిన్నరులు, గంధర్వగణాలు, గుహ్యకులు, 'ఏమిది? ఏమిటిది' అని ఆక్రోశించారు. అంతట దక్షుడు దుఃఖితుడై సతి వద్దకు పోయి నమస్కరించి ఇలా అన్నాడు.

త్వమస్య జగతో మాతా జగత్సౌభాగ్యదేవతా।
దుహితృత్వం గతా దేవి! మమానుగ్రహకామ్యయా॥18॥

"దేవీ! నీవీ లోకానికి తల్లివి. జగత్తుకు సౌభాగ్యం ప్రసాదించే దేవతవు, నన్ను అనుగ్రహించాలన్న దృష్టితో నాకు పుత్రికవై జన్మించావు.

న త్వయా రహితం కిఞ్చిత్ బ్రహ్మాణ్డే సచరాచరమ్।
ప్రసాదం కురు ధర్మజ్ఞే! న మాం త్యక్తుమిహార్హసి ॥19॥

ఈ బ్రహ్మాండంలోని చరాచరాలలో నీవు లేని దేదీ లేదు. ధర్మజ్ఞురాలా! నన్ను అనుగ్రహించు, నన్ను వదలిపోకు"!

ప్రాహ దేవీ యదారబ్ధం తత్కార్యం మే న సంశయః।
కిం త్వవశ్యమహం మన్యే హతో యజ్ఞశ్చ శూలినా॥20॥

ప్రసాద్య లోకసృష్ట్యర్థం తపః కార్యం మమాన్తికే।
ప్రజాపతిస్త్వం భవితా దశానాం మఙ్గళ ప్రదః॥21॥

అప్పుడు సతీదేవి "నేను ప్రారంభించిన పని జరిగి తీరవలసినదే. నాసంకల్పాను సారమే శివుడు నీ యజ్ఞాన్ని ధ్వంసం చేశాడు. ఇక లోకసృష్టికై నీవు నన్ను ప్రసన్నురాలిని గావించి నా చెంత తపస్సు అనుష్ఠించు. నీవు పదిమంది ప్రజాపతులలోనూ శుభకరుడ వవుతావు.

మదంశేనాఙ్గనాషష్టిర్భవిష్యన్త్య ఙ్గజా స్తవ ।
మత్సన్నిధౌ తపః కుర్వన్ ప్రాప్యసే యోగ ముత్తమమ్॥22॥

అప్పుడు నా అంశంలో నీకు అరువది మంది పుత్రిక లుద్భవిస్తారు "నావద్ద తపస్సు చేయడం వల్ల నీవు ఉత్తమయోగసిద్ధి పొందగలవు".

ఏవముక్తోఽ బ్రవీద్దక్షః కేషు కేషు మయాఽ నఘే।
తీర్థేషు చ త్వం ద్రష్టవ్యా స్తోతవ్యా కైశ్చ నామభిః॥23॥

సతీ దేవి అలా చెప్పగా దక్షుడు "నిన్ను నేను ఏయే తీర్థాలలో దర్శించాలి? ఏయే నామాలతో కీర్తించాలి?" అని ప్రశ్నించాడు.

దేవ్యువాచ :- దేవి ఇలా చెప్పింది.

సర్వదా సర్వభూతేషు ద్రష్టవ్యా సర్వతో భువి।
సర్వలోకేషు యత్కిఞ్చిద్రహితం న మయా హి తత్ ॥24॥

భూవలయ మంతటా సర్వభూతాలతో సదా నన్నుదర్శించాలి. ఈ సమస్తలోకాలలోనూ నేనులేని దేదీలేదు.

తథాఽపి యేషు స్థానేషు ద్రష్టవ్యా సిద్ధిమీప్సుభిః।
స్మర్తవ్యా భూతికామైర్వా తాని వక్ష్యామి తత్త్వతః॥25॥

అయినా సిద్ధిని కోరేవారు, ఐశ్వర్యాన్ని అభిలషించేవారు ఏయే చోట్ల ఎలా దర్శించాలో యథాతథంగా చెబుతాను.

వారాణస్యాం విశాలాక్షీ నైమిషే లింగ ధారిణీ।
ప్రయాగే లలితా దేవీ కామాక్షీ గన్ధమాదనే॥26॥

మానసే కుముదా నామ విశ్వకాయా తథాఽమ్బరే॥27॥

గోమన్తే గోమతీ నామ మన్దరే కామచారిణీ।
మదోత్కటా చైత్రరథే జయన్తీ హస్తినాపురే॥28॥

వారాణసిలో విశాలాక్షి, నైమిశంలో లింగధారిణి, ప్రయాగలో లలితా దేవి, గంధమాదనంలో కామాక్షి, మానససరః క్షేత్రంలో కుముద, అంబరక్షేత్రంలో విశ్వకాయ, గోమన్తంలో గోమతి, మన్దరంలో కామచారిణి, చైత్రరథంలో మదోత్కట, హస్తినాపురంలో జయింతి అనియు,

కాన్యకుబ్జే తథా గౌరీ రమ్భా మలయపర్వతే।
ఏకామ్బకే కీర్తిమతీ విశ్వా విశ్వేశ్వరే విదుః॥29॥

పుష్కరే పురుహూతేతి కేదారే మార్గదాయినీ।
నన్దా హిమవతః పృష్ఠే గోకర్ణే భద్రకర్ణికా॥30॥

మరియు కాన్యకుబ్జంలో గౌరి, మలయాద్రిలో రంభ, ఏకాంబకంలో కీర్తిమతి, విశ్వేశ్వరక్షేత్రంలో విశ్వ, పుష్కరంలో పురుహూత, కేదారంలో మార్గదాయిని, హిమవత్పృష్ఠంలో నంద, గోకర్ణంలో భద్రకర్ణిక, అనియు

స్థానేశ్వరే భవానీ తు బిల్వలే బిల్వపత్రికా ।
శ్రీశైలే మాధవీ నామ భద్రా భద్రేశ్వరే తథా॥31॥

జయా వరాహశైలే తు కమలా కమలాలయే।
రుద్రకోట్యాం చ రుద్రాణీ కాలీ కాలంజరే గిరౌ ॥32॥

మరియు స్థానేశ్వరంలో భవాని, బిల్వలంలో బిల్వ పత్రిక, శ్రీశైలంలో మాధవి, భద్రేశ్వరంలో భద్ర, వరాహాద్రిలో జయ, కమలాలయంలో కమల, రుద్ర కోటిలో రుద్రాణి, కాలంజరగిరిలో కాలి–అనియు

మహాలిఙ్గే తు కపిలా మర్కోటే మకుటేశ్వరీ।
సాలగ్రామే మహాదేవీ శివలిఙ్గే జలప్రియా॥33॥

మాయాపుర్యాం కుమారీ తు సంతానే లలితా తథా।
ఉత్పలాక్షీ సహస్రాక్షే కమలాక్షే మహెూత్పలా॥34॥

మహాలింగతీర్థంలో కపిల, మర్కోటంలో ముకుటేశ్వరి, సాలగ్రామతీర్థంలో మహాదేవి, శివలింగ క్షేత్రంలో జలప్రియ, మాయాపురిలో కుమారి, సంతాన తీర్థంలో లలిత, సహస్రాక్షతీర్థంలో ఉత్పలాక్షి, కమలాక్షతీర్థంలో మహెూత్పల అనియు

గంగాయాం మఙ్గలా నామ విమలా పురుషోత్తమే।
విపాశాయామమోఘాక్షీ పాటలీ పుండ్రవర్ధనే॥35॥

నారాయణీ సుపార్శ్వే తు త్రికూటే భద్రసున్దరీ।
విపులే విపులా నామ కల్యాణీ మలయాచలే॥36॥

గంగాతీర్థంలో మంగళ, పురుషోత్తమతీర్థంలో విమల, విపాశాతీర్థంలో అమోఘాక్షి, పుండ్రవర్ధనంలో పాటలి, సుపార్శ్వతీర్థంలో నారాయణి, త్రికూటంలో భద్రసుందరి, విపులాక్షేత్రంలో విపుల, మలయాచలంలో కల్యాణి అనియు

కోటవీ కోటితీర్థేతు సుగన్ధా మాధవే వనే।
గోదాశ్రమే త్రిసన్ధ్యా తు గఙ్గాద్వారే రతిప్రియా॥37॥

శివకుణ్డే శివానన్దా నన్దినీ దేవికాతటే।
రుక్మిణీ ద్వారవత్యాం తు రాధా బృందావనే వనే॥38॥

కోటితీర్థంలో కోటవి, మాధవవనంలో సుగంధ, గోదాశ్రమంలో త్రిసంధ్య, గంగాద్వారంలో రతిప్రియ, శివకుండంలో శివానంద, దేవికాతటంలో నందిని, ద్వారావతిలో రుక్మిణి, బృందావనంలో రాధ–అనియు

దేవకీ మథురాయాం తు పాతాళే పరమేశ్వరీ।
చిత్రకూటే తథా సీతా విన్ధ్యే విన్ధ్యాధివాసినీ॥39॥

సహ్యాద్రావేకవీరాతు హరిశ్చన్ద్రే తు చన్ద్రికా।
రమణా రామతీర్థే తు యమునాయాం మృగావతీ॥40॥

మథురలో దేవకి, పాతాళంలో పరమేశ్వరి, చిత్రకూటంలో సీత, వింధ్యగిరిలో వింధ్యాధివాసిని, సహ్యాద్రిలో ఏకవీర, హరిశ్చంద్ర తీర్థంలో చంద్రిక, రామతీర్థంలో రమణ, యమునలో మృగావతి అనియు

కరవీరే మహాలక్ష్మీరుమాదేవీ వినాయకే।
అరోగా వైద్యనాథే తు మహాకాలే మహేశ్వరీ॥41॥

అభయాత్యుష్ణతీర్థే తు చామృతా విన్ధ్యకన్దరే।
మాణ్డవ్యే మాణ్డవీ నామ స్వాహా మాహేశ్వరే పురే॥42॥

కరవీరపురంలో మహాలక్ష్మి, వినాయకతీర్థంలో ఉమాదేవి, వైద్యనాథంలో అరోగ, మహాకాల క్షేత్రంలో మహేశ్వరి, ఉష్ణతీర్థంలో అభయ, వింధ్యకందరంలో అమృత, మాండవ్యతీర్థంలో మాండవి, మహేశ్వర పురంలో స్వాహా, అనియు

ఛాగలాణ్డే ప్రచణ్డాతు చణ్డికా మకరన్దకే।
సోమేశ్వరే వరారోహా ప్రభాసే పుష్కరావతీ॥43॥

దేవమాతా సరస్వత్యాం పారావారతటే మతా।
మహాలయే మహాభాగా పయోష్ణ్యాం పింగలేశ్వరీ॥44॥

ఛాగలాండంలో ప్రచండ, మకరందంలో చండిక, సోమేశ్వరతీర్థంలో వరారోహ, ప్రభాసతీర్థంలో పుష్కరావతి, సాగరతీరంలోని సరస్వతీ తీర్థంలో దేవమాత, మహాలయంలో మహాభాగ, పయోష్ణీతీర్థంలో పింగళేశ్వరి–అనియు

సింహికా కృతశౌచే తు కార్తికేయే యశస్కరీ।
ఉత్పలావర్తకే లోలా సుభద్రా శోణసఙ్గమే॥45॥

మాతా సిద్ధపురే లక్ష్మీ రఙ్గనా భరతాశ్రమే।
జాలన్ధరే విశ్వముఖీ తారా కిష్కిన్ధపర్వతే॥46॥

కృతశౌచతీర్థంలో సింహిక, కార్తికేయ తీర్థంలో యశస్కరి, ఉత్పలావర్తకంలో లోల, శోణ సంగమంలో సుభద్ర, సిద్ధపురంలో లక్ష్మీ మాత, భరతాశ్రమంలో అంగన, జాలంధరక్షేత్రంలో విశ్వముఖి, కిష్కింధాద్రిలో తార అనియు

దేవదారువనే పుష్టిర్మేధా కాశ్మీరమణ్డలే।
భీమాదేవీ హిమాద్రౌ తు షష్ఠే వస్త్రేశ్వరీ తథా॥47॥

కపాలమోచనే శుద్ధిర్మాతా కాయావరోహణే।
శఙ్ఖద్వారే ధ్వనిర్నామ ధృతిః పిండారకే తథా॥48॥

దేవదారు వనంలో పుష్టి, కాశ్మీరంలో మేధ, హిమాద్రిలో భీమాదేవి, షష్ఠక్షేత్రంలో వస్త్రేశ్వరి (విశ్వేశ్వరి), కపాలమోచనంలో శుద్ధి, కాయావరోహణంలో మాత, శంఖద్వారంలో ధ్వని, పిండారక తీర్థంలో ధృతి,–అనియు

కాలీ తు చన్ద్రభాగాయామచ్ఛోదే శివకారిణీ।
వేణాయామమృతా నామ బదర్యామూర్వశీ తథా॥49॥

ఓషధీ చోత్తరకురౌ కుశద్వీపే కుశోదకా।
మన్మథా హేమకూటేతు కుముదే సత్యనాదినీ॥50॥

చంద్రబాగాతీర్థంలో కాళి, అచ్ఛోదతీర్థంలో శివకారిణి, వేణలో అమృత, బదరిలో ఊర్వశి, ఉత్తరకురుక్షేత్రంలో ఓషధి, కుశద్వీపంలో కుశోదక, హేమకూటంలో మన్మథ, కుముదక్షేత్రంలో సత్యవాదిని–అనియు

అశ్వత్థే వన్దనీయా తు నిధిర్వైశ్రవణాలయే।
గాయత్రీ వేదవదనే పార్వతీ శివసన్నిధౌ॥51॥

దేవలోకే తథేన్ద్రాణీ బ్రహ్మాస్యేషు సరస్వతీ।
సూర్యబింబే ప్రభా నామ మాతౄణాం వైష్ణవీ తథా॥52॥

అశ్వత్థంలో వందనీయ, వైశ్రవణాలయంలో నిధి, వేదముఖంలో గాయత్రి, శివసన్నిధిలో పార్వతి, దేవలోకంలో ఇంద్రాణి, బ్రహ్మముఖాలలో సరస్వతి, సూర్యబింబంలో ప్రభ, సప్తమాతృకలలో వైష్ణవి–అనియు

అరుంధతీ సతీనాం తు రామాసు చ తిలోత్తమా।
చిత్తే బ్రహ్మకళా నామ శక్తిః సర్వశరీరిణామ్॥53॥

పతివ్రతలలో అరుంధతి, సుందరస్త్రీలలో తిలోత్తమ, సకల ప్రాణుల చిత్తంలో బ్రహ్మకళ అనే శక్తి – అనీ (నూటయెన్మిది తీర్థాలలో నూటయెన్మిది పేర్లతో దేవిని స్మరించాలి.)

ఏతదుద్దేశతః ప్రోక్తం నామాష్టశతముత్తమమ్।
అష్టోత్తరం చ తీర్థానాం శత మేతదుదాహృతమ్॥54॥

ఇలా శ్రీ దేవికి సంబంధించిన నూటయెన్మిది నామాలను, ఆమె కావాసమైన నూటయెన్మిది తీర్థాలను మాత్రమే పేర్కొన్నాను.

యః స్మరేచ్ఛృణుయాద్వాఽపి సర్వపాపైః ప్రముచ్యతే।
ఏషు తీర్థేషు యః కృత్వా స్నానం పశ్యతి మాం నరః॥55॥

సర్వపాపవినిర్ముక్తః కల్పం శివపురే వసేత్ ।

ఈ నామాలను ఎవడు స్మరిస్తాడో, లేక వింటాడో వాడు సర్వపాపాలనుండీ విముక్తు డవుతాడు. ఈ తీర్థాలలో స్నానం చేసి నన్ను దర్శించిన మానవుడు సకలపాపవిముక్తి నొంది శివపురంలో కల్పాంతం వరకు నివసిస్తాడు.

యస్తు మత్పరమం కాలం కరోత్యేతేషు మానవః॥56॥

స భిత్వా బ్రహ్మసదనం పదమభ్యేతి శాఙ్కరమ్।

ఎవడు నాయందే తత్పరత గలవాడై ఈ తీర్థాలలో కాలం గడుపుతాడో, అతడు బ్రహ్మలోకం దాటి శివలోకం చేరుకొంటాడు.

నామ్నామష్టశతం యస్తు శ్రావయేచ్ఛివసన్నిధౌ॥57॥

తృతీయాయామథాష్టమ్యాం బహుపుత్రో భవేన్నరః।

శుక్ల తృతీయా తిథియందు గాని, అష్టమియందు గాని శివసన్నిధిలో ఈ అష్టోత్తరశతనామావళిని వినిపించువాడు అనేకపుత్రులు గలవా డవుతాడు.

గోదానే శ్రాద్ధదానే వా అహన్యహని వా బుధః॥58॥

దేవార్చనవిధౌ విద్వాన్ పఠన్ బ్రహ్మాధిగచ్ఛతి।
ఏవం వదన్తీ సా తత్ర దదాహాఽఽత్మాన మాత్మనా॥59॥

గోదానం, శ్రాద్ధదానం చేసే సమయంలో గానీ, అను నిత్యముగానీ, దేవతార్చనావిధిలో ఈ నామావళిని పఠించు విద్వాంసుడు బ్రహ్మపదం పొందుతాడు".

ఇలా చెబుతూ ఆ సతీదేవి అక్కడ తన్ను తాను దహింపజేసుకొన్నది.

స్వాయంభువోఽపి కాలేన దక్షః ప్రాచేతసోఽభవత్।
పార్వతీ సాఽభవద్దేవీ శివదేహార్ధధారిణీ॥60॥

మేనాగర్భ సముత్పన్నా భుక్తిముక్తిఫలప్రదా।

కాలక్రమంలో స్వాయంభువుడైన దక్షుడు ప్రచేతసుల పుత్రుడై జన్మించాడు. ఆ సతీదేవి పార్వతిగా పుట్టింది.

మేనాగర్భంలో పుట్టిన ఆ దేవి శివుని దేహంలో అర్ధం ధరించి భక్తులకు భుక్తి, ముక్తి అనే ద్వివిధ ఫలాలను ప్రసాదించింది.

అరున్ధతీ జపన్త్యేతత్ప్రాపయోగమనుత్తమమ్॥ 61॥

పురూరవాశ్చ రాజర్షిర్లోకానిష్టానగాత్పరాన్।
యయాతిః పుత్రలాభం చ ధనలాభం చ భార్గవః॥ 62॥

అరుంధతి ఈ అష్టోత్తర శతనామాలను జపించి మహోత్తమమైన యోగసిద్ధి పొందింది. రాజర్షి పురూరవుడు దీనిని జపించి ఇష్టమైన శ్రేష్ఠలోకాలను చేరుకొన్నాడు. భార్గవుడైన యయాతి పుత్రలాభాన్నీ, ధనలాభాన్నీ పొందాడు.

తథాఽన్యే దేవదైత్యాశ్చ బ్రాహ్మణాః క్ష త్రియాస్తథా।
వైశ్యాః శూద్రాశ్చ బహవః సిద్ధిమీయుర్యథేప్సితామ్॥ 63॥

అట్లే ఇతర దేవతలు, దైత్యులూ, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులూ, శూద్రులు అనేకులు ఇష్టసిద్ధిని పొందారు.

యత్రైతల్లిఖితం తిష్ఠేత్పూజ్యతే దేవసన్నిధౌ।
న తత్ర శోకో దౌర్గత్యం కదాచిదపి జాయతే॥ 64॥

ఎక్కడ ఈ నామావళిని లిఖించి ఉంచుతారో, దేవతా సన్నిధిలో పూజిస్తారో, అక్కడ దుఃఖం, దుర్గతి అనేవి ఎప్పుడూ ఉండనేరవు.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే శ్రాద్ధకల్పః, పితృవంశానువర్ణనం నామ త్రయోదశోఽధ్యాయః॥ 13॥

శ్రీమత్స్యమహాపురాణంలోని మత్స్యమనుసంవాదంలో శ్రాద్ధకల్పం, పితృవంశానువర్ణన మనే
పదమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుర్దశోఽధ్యాయః - పద్నాల్గవ అధ్యాయం
పితృవంశీయాచ్ఛోదోపాఖ్యానమ్ - పితృవంశానికి చెందిన అచ్ఛోదోపాఖ్యానం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

లోకాస్సోమపథా నామ యత్ర మారీచనన్దనాః।
వర్తన్తే దేవపితరో యాన్దేవా భావయన్త్యలమ్॥ 1॥

ఋషులారా! మరీచి ప్రజాపతి కుమారులైన పితృదేవత లుండే లోకాలకు సోమపథములని పేరు. వారిని దేవత లారాధిస్తుంటారు.

అగ్నిష్వాత్తా ఇతి ఖ్యాతా యజ్వానో యత్ర సంస్థితాః।
అచ్ఛోదా నామ తేషాం తు మానసీ కన్యకా నదీ॥ 2॥

యజ్ఞానుష్ఠానపరులైన ఆపితృదేవతలు అగ్నిష్వాత్తులుగా ప్రసిద్ధులు. (అగ్నులయందు హవిస్సులు వ్రేల్చి యజ్ఞం చేసినవారు) వారి మానసిక పుత్రిక అచ్ఛోద అనే కన్య నదీరూపం పొందింది.

అచ్ఛోదం నామ చ సరః పితృభిర్నిర్మితం పురా।
అచ్ఛోదా తు తపశ్చక్రే దివ్యం వర్షసహస్రకమ్॥ 3॥

పూర్వం పితరులు అచ్ఛోదం అనే ఒక సరస్సును నిర్మించారు. ఆ సరస్తీరంలో అచ్ఛోద వేయి దివ్య సంవత్సరాలు తపస్సు చేసింది.

ఆజగ్ముః పితరస్తుష్టాః కిల దాతుం చ తాం వరమ్।
దివ్యరూపధరాః సర్వే దివ్యమాల్యానులేపనాః॥ 4॥

ఆ తపస్సుకు సంతోషించిన పితరులు ఆమెకు వరమివ్వాలని ఆమె చెంతకు వచ్చారు. వారందరూ దివ్యరూపాలతో దివ్యమాల్యాలు, అనులేపనాలు ధరించి ఉండినారు.

సర్వే యువానో బలినః కుసుమాయుధసన్నిభాః।
తన్మధ్యే మావసుం నామ పితరం వీక్ష్య సాఽఙ్గనా॥ 5॥

వారందరూ యువకులు, బలవంతులు మన్మథునితో సమానులు. వారిలో మావసుడు అనే పితరుని ఆమె చూచింది.

వవ్రే వరార్థినీ సఙ్గం కుసుమాయుధపీడితా।
యోగభ్రష్టా తు సా తేన వ్యభిచారేణ భామినీ॥ 6॥

ధరాం తు నాస్పృశత్పూర్వం పపాతాథ భువస్తలే।

చూచి వరార్థినియైన అచ్ఛోద మన్మథ పీడితురాలై అతని సంగం కోరింది. ఆ వ్యభిచారరదోషం చేత ఆమె యోగభ్రష్టురా లయింది. అంతవరకు భూమిని స్పృశించని ఆమె భూమిపై పడిపోయింది.

తిథౌ చ మావసుర్యస్యామిచ్ఛాం చక్రే న తాం ప్రతి॥ 7॥

ధైర్యేణ తపసా లోకే అమావాస్యేతి విశ్రుతా।

ధీరుడైన మావసువుకు ఆమెపై ఏ తిథియందు కోరిక కల్గలేదో ఆతిథి అమావాస్య అని లోకంలో ప్రసిద్ధి పొందింది.

పితృణాం వల్లభా తస్మాత్తస్యామక్షయ కారకమ్॥ 8॥

అందువల్లనే అమావాస్యాతిథి పితరుల కిష్టమైన దయింది. ఆనాడు పితరుల కర్పించినది అక్షయమవుతుంది.

అచ్ఛోదాఽధోముఖీ దీనా లజ్జితా తపసః క్షయాత్।

సా పితౄన్ ప్రార్థయామాస పునరాత్మసమృద్ధయే॥ 9॥

తపస్సు క్షీణించడం వల్ల సిగ్గుపడిన ఆ అచ్ఛోద తలవంచి దీనురా లయింది. ఆమె మళ్ళీ తనకు తపస్సమృద్ధి కలగాలని పితృదేవతలను ప్రార్థించింది.

విలప్యమానా పితృభిరిదముక్తా తపస్వినీ।

భవిష్యదర్థమాలోక్య దేవకార్యం చ తే తదా॥ 10॥

దేవకార్యాన్నీ, జరుగనున్న కార్యాన్నీ చూచిన పితరులు విలపిస్తున్న ఆతపస్వినితో ఇలా అన్నారు.

ఇదమూచుర్మహాభాగాః ప్రసాదశుభయా గిరా।

దివి దివ్యశరీరేణ యత్కిఞ్చిత్క్రియతే బుధైః॥ 11॥

తేనైవ తత్కర్మ ఫలం భుజ్యతే వరవర్ణిని।

సద్యః ఫలన్తి కర్మాణి దేవత్వే ప్రేత్య మానుషే॥ 12॥

వారు అనుగ్రహించే శుభప్రదమైన వాక్కుతో ఆమెను గూర్చి ఇలా అన్నారు –

"ఓ రమణీయమైన పుత్రీ! వివేక సంపన్నులు దివ్యశరీరంతో చేసే పనులకు తగిన ఫలాన్ని ఆశరీరంలోనే అనుభవిస్తారు. దేవత్వస్థితిలో కర్మలు వెనువెంటనే ఫలిస్తాయి. మానవులకుమాత్రం దేహ పతనానంతరమే మరొక జన్మలో అవి ఫలప్రదా లవుతాయి.

తస్మాత్త్వం పుత్రి! తపసః ప్రాప్స్యసే ప్రేత్య తత్ఫలమ్।

అష్టావింశే భవిత్రీ త్వం ద్వాపరే మత్స్యయోనిజా॥ 13॥

ఓ పుత్రీ! అందువల్ల నీవు నీతపస్సుకు ఫలాన్ని మరణానంతరమే పొందనున్నావు. ఇరువదెనిమిదవ ద్వాపరయుగంలో నీవు మత్స్యయోనిలో జన్మించనున్నావు.

వ్యతిక్రమాత్పితౄణాం త్వం కష్టం కులమవాప్స్యసి।

తస్మాద్రాజ్ఞో వసోః కన్యా త్వమవశ్యం భవిష్యసి॥ 14॥

పితృదేవతల పట్ల కలిగిన దోషం వల్ల నీ కాకష్ట జన్మ వస్తుంది. ఆ తరువాత నీవు వసురాజుకు పుత్రికగా ఉద్భవిస్తావు.

కన్యా భూత్వా చ లోకాన్ స్వాన్ పునః పశ్యసి దుర్లభాన్।
పరాశరస్యవీర్యేణ పుత్రమేక మవాప్స్యసి॥15॥

కన్యగా ఉండి కూడా నీవు దుర్లభమైన లోకాలు పొందగలవు. పరాశరమునీంద్రుని వీర్యంవల్ల నీవొక పుత్రుణ్ణి కంటావు.

ద్వీపే తు బదరీప్రాయే బాదరాయణమచ్యుతమ్।
స వేదమేకం బహుధా విభజిష్యతి తే సుతః॥16॥

బదరీమయమైన ద్వీపంలో అచ్యుతుడైన బాదరాయణుడనే పుత్రుడు కలుగుతాడు. ఆ నీకుమారుడు ఒక వేదాన్ని అనేకంగా విభజిస్తాడు.

పౌరవస్యాత్మజౌ ద్వౌ తు సముద్రాంశస్య శంతనోః।
విచిత్రవీర్యస్తనయస్తథా చిత్రాఙ్గదో నృపః॥17॥

పిదప పురువంశీయుడు, సముద్రాంశుడూ అయిన శంతనుమహారాజు వల్ల నీకు ఇరువురు కుమారులు జన్మిస్తారు. విచిత్ర వీర్యుడు, చిత్రాంగదుడు అని వారు పేర్లు.

ఇమా వుత్పాద్య తనయౌ క్షత్రియావస్య ధీమతః।
ప్రోష్ఠపద్యష్టకారూపా పితృలోకే భవిష్యసి॥18॥

బుద్ధిమంతుడైన ఈ శంతనునికి ఇద్దరు క్షత్రియ సుతులను కని ప్రోష్ఠపదీ–అష్టకా (భాద్ర శుద్ధ పూర్ణిమ అనంతరం వచ్చే సప్తమి) రూపంలో నీవు పితృలోకంలో ఉంటావు.

నామ్నా సత్యవతీ లోకే పితృలోకేఽ తథాఽ ష్టకా।
ఆయురారోగ్యదా నిత్యం సర్వకామఫలప్రదా॥19॥

భూలోకంలో 'సత్యవతి' గానూ, పితృలోకంలో అష్టకగానూ నీవు ప్రసిద్ధి పొంది ప్రాణులకు నిత్యం ఆయురారోగ్యాలనూ, సకలకామఫలాలనూ ప్రసాదిస్తావు.

భవిష్యసి పరే కాలే నదీత్వం చ గమిష్యసి।
పుణ్యతోయా సరిచ్ఛ్రేష్ఠా లోకే హ్యచ్ఛోదనామికా॥20॥

ఆ తరువాత నీవు లోకంలో నదీరూపం పొంది పవిత్రజలాలు గల అచ్ఛోద మనే మేలైన నది వవుతావు.

ఇత్యుక్త్వా స గణస్తేషాం తత్రైవాన్తరధీయత।
సాఽ ప్యవాప చ తత్సర్వం ఫలం యదుదితం పురా॥21॥

ఇలా చెప్పి ఆపితృగణం అక్కడే అంతర్ధానమయింది. పైన చెప్పిన ప్రయోజనాల నన్నింటినీ అచ్ఛోదపొందింది.

ఇతి శ్రీ మాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే పితృవంశీయాచ్ఛోదోపాఖ్యానం వర్ణనం నామ చతుర్దశోఽ ధ్యాయః॥14॥

శ్రీమత్స్యమహాపురాణంలోని మత్స్యమను సంవాదంలో పితృవంశానికి చెందిన అచ్ఛోద యొక్క ఉపాఖ్యానవర్ణనమనే పద్నాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచదశోఽధ్యాయః - పదిహేనవ అధ్యాయం

దానవాదిపితృగణాః - దానవాది పితృగణాలు

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

విభ్రాజా నామ చాన్యే తు దివి సన్తి సువర్చసః।
లోకా బర్హిషదో యత్ర పితరః సన్తి సువ్రతాః॥ 1॥

మునులారా! స్వర్లోకంలో శోభనమైన కాంతి గల మరికొన్ని లోకా లున్నాయి. వాటిని విభ్రాజము లంటారు. బర్హిషదులు అనే వ్రతనిష్ఠులైన పితరు లక్కడ ఉంటారు.

యత్ర బర్హిణయుక్తాని విమానాని సహస్రశః।
సంకల్ప్యా బర్హిషో యత్ర తిష్ఠన్తి ఫలదాయినః ॥2॥

అక్కడ నెమళ్ళు మోసే వేలకొలది విమానాలుంటాయి. వారు సంకల్పమాత్రం చేతనే ఫలదాతలై అక్కడ ఉన్నారు.

యత్రాభ్యుదయశాలాసు మోదన్తే శ్రాద్ధదాయినః।
యాంశ్చ దేవాసురగణా గన్ధర్వాప్సరసాం గణాః॥3॥

యక్షరక్షగణాశ్చైవ యజన్తి దివి దేవతాః।
పులస్త్య పుత్రాశ్శతశః తపోయోగసమన్వితాః॥4॥

శ్రాద్ధక్రియలు ఆచరించేవారు అక్కడ ప్రాపంచిక సుఖాలకు నిలయాలైన అభ్యుదయశాలల్లో సంతోషంగా ఉంటారు. అక్కడి శ్రాద్ధదాతలను దేవతలు, అసురులు, గంధర్వులు, అచ్చరలు, యక్షులు, రాక్షసులు, దేవతలు ఆరాధిస్తారు. వారు పులస్త్య ప్రజాపతి పుత్రులు. తపస్సు, యోగసాధన అనుష్ఠించి అనేక శక్తులు సంపాదించినవారు.

మహాత్మానో మహాభాగా భక్తానామభయప్రదాః।
ఏతేషాం పీవరీ కన్యా మానసీ దివి విశ్రుతా॥5॥

మహాత్ములు, మహాభాగులునైన వీరు భక్తులకు అభయమిచ్చేవారు. వీరి మానసపుత్రిక 'పీవరి' అనే కన్య ద్యులోకంలో ప్రసిద్ధురాలై యుండేది.

యోగినీ యోగమాతా చ తపశ్చక్రే సుదారుణమ్।
ప్రసన్నో భగవాంస్తస్యా వరం వవ్రేచ సా హరేః॥6॥

యోగిని, యోగమాత అయిన ఆ పీవరి తీవ్రమైన తపస్సు చేసింది. విష్ణుభగవాను డామెపట్ల ప్రసన్ను డయ్యాడు. ఆమె ఆ దేవుణ్ణి ఇలా వరం కోరింది.

యోగవన్తం సురూపం చ భర్తారం విజితేన్ద్రియమ్।
దేహి దేవ! ప్రసన్నస్త్వం పతింమే వదతాం వరమ్॥7॥

"దేవా! నీవు నాపట్ల ప్రసన్నుడవయ్యావు. యోగసంపన్నుడు, అందమైనవాడు, ఇంద్రియాలను జయించినవాడూ, వక్తల్లో శ్రేష్ఠుడు అయిన వరుణ్ణి నాకు భర్తగా ప్రసాదించు".

ఉవాచ దేవో భవితా వ్యాసపుత్రో యదా శుకః।
భవితా తస్య భార్యా త్వం యోగాచార్యస్య సువ్రతే॥8॥

అప్పుడు భగవంతుడు "సద్వ్రతనిష్ఠురాలా! వ్యాసుని కుమారుడుగా యోగాచార్యుడైన శుకుడు జనింపనున్నాడు. అతనికి నీవు భార్యవు కాగలవు.

భవిష్యతి చ తే కన్యా కృత్తి ర్నామ్నా చ యోగినీ।
పాఞ్చలాధిపతే ర్దేయా మానుషస్య తదా త్వయా॥9॥

అప్పుడు నీకు 'కృత్తి' అనే కుమార్తె కల్గుతుంది. యోగిని అయిన ఆమెను నీవప్పుడు పాంచాలాధిపతియైన మనుజుని కివ్వాలి.

జననీ బ్రహ్మదత్తస్య యోగసిద్ధాశ్చ యత్సుతాః।
కృష్ణో గౌరః ప్రభుశ్శమ్భుర్భవిష్యన్తి చ తే సుతాః॥10॥

ఆ నీ పుత్రిక బ్రహ్మదత్తునికి తల్లి అవుతుంది. అతని కుమారులు యోగసిద్ధులు కాగలరు. నీకు కృష్ణుడు, గౌరుడు, ప్రభువు, శంభుడు అనే నల్గురు పుత్రులు కల్గుతారు.

మహాత్మానో మహాభాగా గమిష్యన్తి పరం పదమ్।
తానుత్పాద్య పునర్యోగా త్సవరా మోక్షమేష్యసి॥11॥

మహాత్ములు, మహానుభావులూ అయిన నీకు కుమారులు గూడా తుదకు పరమపదం పొందగలరు. అట్టి కుమారులను కని నీవు యోగబలంతో నీ భర్తతో గూడా మోక్షం పొందగలవు.

యే మూర్తిమన్తః పితరో వసిష్ఠస్య సుకాలినః।
నామ్నా తు మానసాస్సర్వే సర్వే తే ధర్మమూర్తయః॥12॥

ఇక మూర్తిమంతులైన పితృదేవతలు వసిష్ఠుని మానసపుత్రులు. వీరికి 'సుకాలునులు' అని పేరు. వారంతా ధర్మమూర్తులే.

జ్యోతిర్భాసిషు లోకేషు యే వసన్తి దివః పరమ్।
విరాజమానాః క్రీడన్తి యత్ర తే శ్రాద్ధదాయినః॥13॥

సర్వకామసమృద్ధేషు విమానేష్వపి పాదజాః।
కిం పునః శ్రాద్ధదా విప్రా భక్తిమన్తః క్రియాన్వితాః॥14॥

స్వర్గలోకాని కవతల జ్యోతిర్భాసి లోకాలున్నాయి. అక్కడ శ్రాద్ధం చేసేవారు శూద్రులైనా సమస్తకామాలతో సంపూర్ణాలైన విమానాలలో విలసిల్లుతూ క్రీడిస్తుంటారు. ఇక భక్తితో శ్రాద్ధం చేసే క్రియా పరులైన విప్రులను గురించి ఏమి చెప్పాలి?

గౌర్నామ కన్యా యేషాం తు మానసీ దివి రాజతే।
శుక్రస్య దయితా పత్నీ సాధ్యానాం కీర్తివర్ధనీ॥15॥

వారి మానస పుత్రిక పేరు గౌరి. ఆమె ద్యులోకంలో విరాజిల్లుతుంటుంది. శుక్రుని పత్ని అయిన ఆమె సాధ్యుల కీర్తిని వర్ధిల్ల జేస్తూ ఉంటుంది.

మరీచిగర్భా నామ్నా తు లోకా మార్తాణ్డమణ్డలే।
పితరో యత్ర తిష్ఠన్తి హవిష్మన్తోఽ ఙ్గిరః సుతాః॥16॥

సూర్య మండలంలో మరీచిగర్భాలు అనే లోకాలున్నాయి. హవిష్మంతులనే అంగిరసుని పుత్రులు ఆ లోకాలలో ఉంటారు.

తీర్థశ్రాద్ధప్రదా యాన్తి యే చ క్షత్రియసత్తమాః।
రాజ్ఞాం తు పితర స్తే వై స్వర్గమోక్షఫల ప్రదాః॥17॥

తీర్థ స్థలాలలో శ్రాద్ధాలు చేసే క్షత్రియ శ్రేష్ఠులు ఈ లోకాలకు పోతారు. ఈ పితరులు క్షత్రియులకు స్వర్గాన్నీ, మోక్షాన్నీ యిస్తారు.

ఏతేషాం మానసీ కన్యా యశోదా లోకవిశ్రుతా।
పత్నీ హ్యంశుమతః శ్రేష్ఠా స్నుషా పఞ్చజనస్య చ॥18॥

వీరి మానస పుత్రిక యశోదగా లోక ప్రసిద్ధి పొందింది. ఈమె పంచజనుని కోడలు, అంశుమంతుని ఉత్తమశీలయైన భార్య.

జనన్యథ దిలీపస్య భగీరథపితామహీ।
లోకాః కామదుహోనామ కామభోగఫలప్రదాః॥19॥

ఆమె దిలీపుని తల్లి, భగీరథుని నాయనమ్మ. కామభోగఫలాలను ఇచ్చే 'కామదుఘాలు' అనే పితృలోకాలు గూడా ఉన్నాయి.

సుస్వధానామ పితరో యత్ర తిష్ఠన్తి సువ్రతాః।
ఆజ్యపా నామ లోకేషు కర్దమస్య ప్రజాపతేః॥20॥

అక్కడ మంచి వ్రతనిష్ఠగల సుస్వధులు అనే పితరులు నివసిస్తారు. కర్దమప్రజాపతికి చెందిన లోకాలలో వీరు 'ఆజ్యపులుగా' ప్రసిద్ధి చెందారు.

పులహాఙ్గజదాయదా వైశ్యాస్తాన్ భావయిన్తి చ।
యత్ర శ్రాద్ధకృతః సర్వే పశ్యన్తి యుగపద్గతాః॥21॥

మాతృభ్రాతృపితృస్వస్పసఖిసమ్బన్ధిబాన్ధవాన్।
అపి జన్మాయుతైర్దృష్టాననుభూతాన్ సహస్రశః॥22॥

పులహుని పుత్రులైన వారిని వైశ్యులు ఆరాధిస్తారు. శ్రాద్ధక్రియలు చేసే వైశ్యులందరూ ఈ లోకాలకు పోతారు. అక్కడ ఒకేచోట ఒకేసారి వేలకొలది గతజన్మలకు చెందిన తల్లులు, సోదరులు, పితరులు, స్వసలు, మిత్రులు, సంబంధులు, బాంధవులను దర్శిస్తారు.

ఏతేషాం మానసీ కన్యా విరజా నామ విశ్రుతా।
యా పత్నీ నహుషస్యాసీద్యయాతేర్జననీ తథా॥23॥

ఈ పితరుల మానసకన్య 'విరజ' అను పేర ప్రసిద్ధి చెందింది. ఆమె నహుషునికి భార్య, యయాతికి తల్లి.

ఏకాఽష్టకాభవత్పశ్చాద్బ్రహ్మలోకం గతా సతీ।
త్రయ ఏతే గణాః ప్రోక్తాశ్చతుర్థంతు వదామ్యతః॥24॥

ఆమె భర్తృభక్తి చేత బ్రహ్మలోకం పొంది 'ఏకాష్టక' అన్న పేర ప్రసిద్ధురా లయింది. ఇలా ఇంతవరకూ మూడు పితృగణాలను వివరించాను. ఇక నాల్గవగణాన్ని గూర్చి విశదీకరిస్తాను.

లోకాస్తు మానసా నామ బ్రహ్మణః పురి సంస్థితాః।
యేషాం తు మానసీ కన్యా నర్మదా నామ విశ్రుతా॥25॥

సోమపా నామ పితరో యత్ర తిష్ఠన్తి శాశ్వతాః।
ధర్మమూర్తిధరాస్సర్వే పరతో బ్రహ్మణః స్థితాః॥26॥

బ్రహ్మదేవుని నగరంలో మానసలోకాలు అనే లోకాలున్నాయి. అక్కడ సోమపులనే శాశ్వతులైన పితరులు ఉన్నారు. వారి మానసకన్య పేరు నర్మద. ఆసోమపులందరూ ధర్మమూర్తులు.వారు బ్రహ్మకు పైస్థానంలోఉన్నారు.

ఉత్పన్నాః స్వధయా తే తు బ్రహ్మత్వం ప్రాప్య యోగినః।
కృత్వా సృష్ట్యాదికం సర్వం మానసే సాంప్రతం స్థితాః॥27॥

వారు స్వధనుండి జనించారు. యోగానుష్ఠానపరులై బ్రహ్మత్వం పొందారు. సమస్త సృష్ట్యాది కార్యాలు నిర్వర్తించి ఇప్పుడు మానసలోకాలలో ఉన్నారు.

నర్మదా నామ తేషాం తు కన్యా తోయవహా సరిత్ ।
భూతాని యా పావయతి దక్షిణాపథగామినీ॥28॥

వారి కన్య నర్మద జలప్రవాహరూపమైన నదిగా ఉన్నది. ఆమె దక్షిణాపథానికి పోతూ ప్రాణులను పవిత్రులను చేస్తున్నది.

తేభ్యః సర్వే తు మనవః ప్రజాసర్గేషు నిర్మితాః।
జ్ఞాత్వా శ్రాద్ధాని కుర్వీత ధర్మాభావేఽపి సర్వదా॥29॥

ఈ పితృ దేవతలనుండే ప్రజాపతులు తమ ప్రజాసృష్టులలో ఈ మనువుల నందరినీ సృష్టించారు. అందుచేత తత్త్వం తెలుసుకొని యజ్ఞాది ధర్మాలాచరించకున్నా సరే, సదా శ్రాద్ధ కార్యాలు మాత్రం నిర్వర్తించాలి.

తేభ్య ఏవ పునః ప్రాప్తుం ప్రసాదాద్యోగసన్తతిమ్।
పితౄణామాదిసర్గే తు శ్రాద్ధమేవ వినిర్మితమ్॥30॥

వారి అనుగ్రహంతోనే మరల యోగసంప్రదాయాన్ని పునరుద్ధరించడానికి ఆదిసృష్టి సమయంలో శ్రాద్ధకర్మానుష్ఠానం ఆచరణలోకి వచ్చింది.

సర్వేషాం రాజతం పాత్రమథవా రజతాన్వితమ్।
దత్తం స్వధా పురోధాయ పితౄన్ ప్రీణాతి సర్వదా॥31॥

ఈ పితరుల కొరకై రజతపాత్రగానీ, లేక రజతమిశ్రితమైన ఇతర పాత్రగానీ స్వధాకారపూర్వకంగా దానం చేస్తే పితరులు ఎల్లవేళలా సంతసిస్తారు.

అగ్నీషోమ యమాభ్యాం తు కార్యమాప్యాయనం బుధః।
అగ్న్యభావేఽపి విప్రస్య పాణావథజలేఽపి వా॥32॥

అజాకర్ణేఽశ్వకర్ణే వా గోష్ఠే వా సలిలాన్తికే।
పితౄణాముత్తమం స్థానం దక్షిణా దిక్ప్రశస్యతే॥33॥

అగ్నీషోములకు, యమునకు ఆరాధన చేసి పితరులను సంతృప్తులను చేయాలి. అగ్ని లేకున్నా విప్రుని చేతిలో గానీ, నీటిలో గానీ, మేకచెవిలో గానీ, గుర్రపుచెవిలో గానీ, గోవుల కొట్టములో గానీ, నదీజలసమీపంలో గానీ పితరులకిచ్చే కవ్యాన్ని వదిలిపెట్టాలి. పితరులకు దక్షిణదిక్కు ప్రశస్తమైన స్థానమవుతుంది.

ప్రాచీనావీతముదకం తిలాస్సవ్యాఙ్గమేవ చ।
దర్భా మాంసం చ పాఠీనం గోక్షీరం మధురా రసాః॥34॥

ఖడ్గవార్ధ్రామిషమధుకుశశ్యామాకశాలయః।
యవనీవారముద్గేక్షు శుక్లపుష్పఘృతాని చ॥35॥

ప్రాచీనావీతం (కుడి భుజంపై ధరించిన యజ్ఞోపవీతం) నీరు, నువ్వులు, ఎడమవైపు గల అంగం, దర్భలు, కూర్మమాంసం గోక్షీరం, మధుర రసాలు, ఖడ్గమృగమాంసం, తేనె, చామలు, వరిబియ్యం, యవలు, నివ్వరిబియ్యం, పెసలు, చెరకురసం, తెల్లనిపూలు, నెయ్యి–ఇవి సదా పితరులకు ప్రియమైనవి, ప్రశస్తమైనవి.

ద్వేష్యాణి సంప్రవక్ష్యామి శ్రాద్ధే వర్జ్యాని యాని తు॥36॥

మసూరశణనిష్పావరాజమాషకుసుంభికాః।
పద్మబిల్వార్కధత్తూరపారిభద్రాటరూషకాః॥37॥

న దేయాః పితృకార్యేషు పయశ్చాజావికం తథా।
కోద్రవోద్దాలకరకకపిత్థం మధుకాతసీ॥38॥

పితరులు ద్వేషించేవీ, శ్రాద్ధంలో వర్జింపదగినవీ ఏవో ఇప్పుడు వివరిస్తారు. చిరుసెనగలు, సెనగలు, అనుములు, బొబ్బరలు, ఉలవలు, తామరపూలు, బిల్వము, జిల్లేడు, ఉమ్మెత్త, వేప, అడ్డసరము, మేకల గొర్రెల పాలు, కొర్రలు, అడవి కొర్రలు, దానిమ్మ, వెలగ, ఇప్ప, అవిశెగింజలు-ఇవి పితృకార్యాలకు ఇవ్వదగవు.

ఏతాన్యపి న దేయాని పితృభ్యః ప్రియమిచ్ఛతా।
పితౄన్ ప్రీణాతి యో భక్త్యాతే పునః ప్రీణయన్తి తమ్॥39॥

ఎవడు పితరులకు ప్రియం చేయాలనుకుంటాడో, వాడావస్తువులను వారి కీరాదు. ఎవడు వారికి ప్రీతి కలిగిస్తాడో, వానికి వారు ప్రీతి కల్గిస్తారు.

యచ్ఛన్తి పితరః పుష్టిం స్వర్గారోగ్యం ప్రజాఫలమ్।
దేవకార్యాదపి పునః పితృకార్యం విశిష్యతే॥40॥

పితరులు శ్రాద్ధ కర్మలకు పుష్టినీ, స్వర్గాన్నీ, ఆరోగ్యాన్నీ సంతానాన్నీ కల్గిస్తారు. దేవకార్యంకంటే పితృకార్యం విశిష్టమైనది.

దేవతానాం పితౄణాం తు పూర్వమాప్యాయనం స్మృతమ్।
శీఘ్రప్రసాదాస్త్వక్రోధా నిశ్శస్త్రాః స్థిరసౌహృదాః॥41॥

శాన్తాత్మానః శౌచపరాః సతతం ప్రియవాదినః।
భక్తానురక్తాస్సుఖదాః పితరః పూర్వదేవతాః॥42॥

దేవతలకంటె ముందే పితృదేవతలకు తృప్తి చేకూర్చాలి. వారు త్వరగా ప్రసన్ను లవుతారు. కోపం లేనివారు, శస్త్రం చేబూనరు, స్థిరమైన సౌహార్దం కల్గి వుంటారు. శాంతచిత్తులు, శౌచపరులు, సదా ప్రియంగా మాట్లాడతారు. భక్తులపై అనురక్తి కలవారు, సుఖం కల్గించేవారు, పితృదేవతలు దేవతలందరిలో మొదటివారు.

హవిష్మతా మాధిపత్యే శ్రాద్ధదేవః స్మృతో రవిః।
ఏతద్వః సర్వమాఖ్యాతం పితృవంశానుకీర్తనమ్॥
పుణ్యం పవిత్ర మాయుష్యం కీర్తనీయం సదా నృభిః॥43॥

హవిష్మంతులనే పితరుల కధిపతియైన సూర్యుడు శ్రాద్ధకర్మల కధిష్ఠాన దేవతగా ఉన్నారు. మహర్షులారా! ఇలా మీకు పితృవంశం మొత్తం మీకు వివరించాను. ఇది పుణ్యమైనది, పవిత్రమైనది, ఆయుర్వర్ధకమైనది. మనుజులు ఎల్లవేళలా కీర్తింపదగినది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే ద్విజాదిపితృగణగణనం నామ పఞ్చదశోఽధ్యాయః ॥ 15 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని మత్స్యమనుసంవాదంలో ద్విజాతులైన పితృగణాలగణనమనే
పదునైదవ అధ్యాయం సంపూర్ణం.

షోడశోఽధ్యాయః – పదహారవ అధ్యాయం

శ్రాద్ధకల్పే నిమన్త్రణాదికథనమ్ – శ్రాద్ధకల్పంలో నిమన్త్రణాదుల కథనం

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

శ్రుత్వైతత్సర్వమఖిలం మనుః పప్రచ్ఛ కేశవమ్।
శ్రాద్ధకాలం చ వివిధం శ్రాద్ధభేదం తథైవ చ॥ 1॥

శ్రాద్ధేషు భోజనీయా యే యే చ వర్జ్యా ద్విజాతయః।
కస్మిన్ వాసరభాగే వా పితృభ్యః శ్రాద్ధమాచరేత్॥ 2॥

కస్మిన్ దత్తం కథంయాతి శ్రాద్ధం తు మధుసూదన।
విధినా కేన కర్తవ్యం కథం ప్రీణాతి తత్పితౄన్॥ 3॥

ఈ విషయమంతా విని మనువు కేశవుణ్ణి ఇలా ప్రశ్నించాడు.

మధుసూదనా! శ్రాద్ధానికి సంబంధించిన కాలం, శ్రాద్ధాలలో ఉన్న భేదాలు, శ్రాద్ధాలలో భుజింప జేయదగినవారు లేక వర్జించదగినవారైన ద్విజాతులు, దినంలోని ఏ సమయంలో పితరులకు శ్రాద్ధం నిర్వర్తించాలి, ఎప్పు డిచ్చిన శ్రాద్ధం ఎలా ఆయా పితరులకు అందుతుంది? ఏ విధిననసరించి శ్రాద్ధం నిర్వహించాలి? అది పితరుల కెలా ప్రీతి కల్గిస్తుంది? ఈ విషయాన్ని తెలియజేయండి”–

మత్స్య ఉవాచ :– మత్స్యం చెప్పింది

కుర్యాదహరహః శ్రాద్ధ మన్నాద్యేనోదకేన వా।
పయోమూలఫలైర్వాఽపి పితృభ్యః ప్రీతిమావహన్॥ 4॥

అన్నాదులైన పదార్థాలతో గాని, ఉదకంతో గాని అనుదినం శ్రాద్ధకర్మ నిర్వర్తించాలి. పాలు, పండ్లు, దుంపలతోనైనా పితరులకు ప్రీతి కల్గిస్తూ శ్రాద్ధం పెట్టాలి.

నిత్యం నైమిత్తికం కామ్యం త్రివిధం శ్రాద్ధమాచరేత్।
నిత్యం తావత్ప్రవక్ష్యామి అర్ఘ్యావాహనవర్జితమ్॥ 5॥

నిత్యం, నైమిత్తికం, కామ్యం–అని శ్రాద్ధం మూడు విధాలు. ఇప్పుడు నిత్యశ్రాద్ధాన్ని గూర్చి వివరిస్తాను. ఇందులో అర్ఘ్యం ఆవాహనం ఉండవు.

అదైవం తద్విజానీయాత్ పార్వణం పర్వసు స్మృతమ్।
పార్వణం త్రివిధం ప్రోక్తం శృణు తావన్మహీపతే॥ 6॥

నిత్యశ్రాద్ధంలో విశ్వదేవార్చన విధి లేదు. పర్వదినాలలో చేసే శ్రాద్ధాన్ని పార్వణమంటారు. రాజా! దీన్ని విను. పార్వణం (పార్వణ శ్రాద్ధం, సాధారణ శ్రాద్ధం, అభ్యుదయ శ్రాద్ధం అని) మూడు విధాలుగా చెప్పబడివున్నది.

పార్వణే యే నియోజ్యాస్తు తాఞ్ఛృణుష్వ నరాధిప।
పఞ్చాగ్నిః స్నాతకశ్చైవ త్రిసుపర్ణః షడఙ్గవిత్॥ 7॥

శ్రోత్రియః శ్రోత్రియసుతో విధివాక్యవిశారదః।
సర్వజ్ఞో వేదవిత్సత్రీ జ్ఞాతవంశకులాన్వితః॥ 8॥

రాజా! పర్వదినాలలో చేసే శ్రాద్ధంలో నియోగించ దగిన వారెవరో వివరిస్తాను, విను. పంచాగ్నిహోత్ర కర్మలు చేసేవాడు, వేదాధ్యయనం పూర్తి చేసి స్నాతకవ్రతం కావించినవాడు, త్రిసుపర్ణాలను అధ్యయనం చేసినవాడు, ఆరు వేదాంగాలు తెలిసివాడు, శ్రోత్రియుడు, అతని కుమారుడు, విధివాక్యాలు చక్కగా ఎరిగినవాడు, సర్వం తెలిసినవాడు, వేదవేత్తయైన సత్రయాగకర్త, ప్రసిద్ధవంశంలో పుట్టినవాడు.

పురాణవేత్తా ధర్మజ్ఞః స్వాధ్యాయజపతత్పరః।
శివభక్తః పితృపరః సూర్యభక్తోఽథ వైష్ణవః॥ 9॥

పురాణాలు, ధర్మశాస్త్రాలు తెలిసినవాడు, స్వాధ్యాయం జపం చేసేవాడు, శివభక్తుడు, పితృభక్తుడు, సూర్యభక్తుడు, విష్ణుభక్తుడు.

బ్రహ్మణ్యో యోగవిచ్ఛాన్తో విజితాత్మా చ శీలవాన్।
భోజయేచ్చాపి దౌహిత్రం యత్నతః స్వసుహృద్గురూన్॥ 10॥

బ్రహ్మతత్త్వం తెలిసినవాడు, యోగవేత్త, శాంతుడు, మనస్సును జయించినవాడు, శీలవంతుడు–వీరిని మరియు పుత్రికా పుత్రుణ్ణి, తనకు మిత్రుడు గురువు– వీరిని ప్రయత్నపూర్వకంగా నైనా భుజింపజేయాలి.

విట్పతిం మాతులం బన్ధుమృత్విగాచార్యసోమపాన్।
యశ్చ వ్యాకురుతే వాక్యం యశ్చ మీమాంసతేఽధ్వరమ్॥ 11॥

సామస్వరవిధిజ్ఞశ్చ పఙ్క్తిపావనపావనః।
సామగో బ్రహ్మచారీ చ దేవభక్తోఽథ బ్రహ్మవిత్॥ 12॥

కులపు పెద్ద, మేనమామ, బంధువు, ఋత్విక్కు, ఆచార్యుడు, సోమయాజి, భాషాతత్త్వజ్ఞుడు, యజ్ఞ ప్రక్రియను చర్చించి వివరించ గలవాడు, సామవేదస్వర ప్రక్రియ తెలిసివాడు, పంక్తిని పావనం కావించే వారిలో శ్రేష్ఠుడు, సామవేదవేత్త, బ్రహ్మచారి, దేవభక్తుడు, బ్రహ్మవేత్త.

యత్రైతే భుఞ్జతే శ్రాద్ధే తదేవ పరమార్థవత్।
ఏ తే భోజ్యాః ప్రయత్నేన వర్జనీయాన్నిబోధ మే॥ 13॥

వీరు ఏ శ్రాద్ధంలో భుజిస్తారో, అదే పరమార్థఫలాన్ని ప్రసాదిస్తుంది. అందుచేత వీరిని ప్రయత్న పూర్వకంగా భుజింప జేయాలి. ఇక త్యజించదగిన వారెవరో వివరిస్తాను, విను.

పతితస్తత్సుతః క్లీబః పిశునవ్యఙ్గరోగిణః।
కునఖీ శ్యావదన్తశ్చ కుండగోలాశ్వపాలకాః॥ 14॥

పరివిత్తిర్నియుక్తాత్మా ప్రమత్తోన్మత్తదారుణాః।
బైడాలీ బకవృత్తిశ్చ దమ్భీ దేవలకాదయః॥15॥

పతితుడు,అతని కొడుకు, నపుంసకుడు, చాడీలు చెప్పువాడు, అంగవికలుడు, రోగగ్రస్తుడు, పుప్పి గోళ్ళవాడు, పచ్చబారిన దంతాలు గలవాడు, స్త్రీకి భర్తఉండగ గానీ, మరణించిన పిదపగానీ, పరునకు పుట్టినవాడు, అశ్వపాలకుడు, అన్నకు ముందే పెండ్లిచేసుకొన్నవాడు, ఇతర సేవకుడు, ప్రమత్తుడు, ఉన్మత్తుడు, క్రూరుడు, పిల్లిలాగా కొంగవలె మోసంతో జీవించువాడు, దాంభికుడు, పూజారి మున్నగువారు శ్రాద్ధ భోజనానికి అనర్హులు.

కృతఘ్నాన్నాస్తి కాంస్తద్వన్మ్లేచ్ఛదేశనివాసినః।
త్రిశఙ్కుబర్బరోఢ్రాన్ధ్రచీనద్రవిడకోఙ్కణాన్॥16॥

వర్జయేల్లిఙ్గినస్సర్వాన్ శ్రాద్ధకాలే విశేషతః।

కృతఘ్నులు, నాస్తికులు, మ్లేచ్ఛదేశవాసులు, త్రిశంకు–బర్బర–ఉత్కళ–ఆంధ్ర–కొంకణదేశీయులు, సంప్రదాయ చిహ్నాలు ధరించి తిరిగేవారు–వీరిని విశేషించి శ్రాద్ధకాలంలో వర్జించాలి.

పూర్వేద్యురపరేద్యుర్వా వినీతాత్మా నిమన్త్రయేత్॥17॥

నిమన్త్రితాన్హి పితర ఉపతిష్ఠన్తి తాన్ ద్విజాన్।
వాయురూపాశ్చ గచ్ఛన్తి, తథాఽఽసీనానుపాసతే॥18॥

శ్రాద్ధసమయానికి ఒకటి రెండు దినాలు ముందే వినయపూర్వకంగా నిమన్త్రణం చేయాలి. అలా నిమంత్రితులైన ద్విజులలో పితరులు ప్రవేశిస్తారు. వాయురూపులై వారి ననుసరిస్తారు. వారిలోనే ఉండి వారు కూర్చునప్పుడు వారితోపాటు కూర్చుంటారు.

దక్షిణం జానుమాలభ్య త్వం మయా తు నిమన్త్రితః।
ఏవం నిమన్త్ర్య నియమం శ్రావయేత్పితృబాంధవాన్॥19॥

శ్రాద్ధకర్త బ్రాహ్మణుని కుడి మోకాలు తాకి 'నేను మిమ్మల్ని నిమంత్రిస్తున్నాను' అని చెప్పి నిమంత్రించాలి. ఆపై పితృ బాంధవులైన వారికి నియమం వినిపించాలి.

అక్రోధనైః శౌచపరైః సతతం బ్రహ్మావాదిభిః।
భవితవ్యం భవద్భిశ్చ మయా చ శ్రాద్ధకారిణా॥20॥

"మీరు కోపంలేనివారు, శుచిగలవారు సదా బ్రహ్మావాదులుగానూ ఉండాలి. నేను గూడా అట్లే ఉంటాను".

పితృయజ్ఞం వినిర్వర్త్య పార్వణ్యస్య తు యోఽగ్నిమాన్।
పిండాన్వాహార్యకం కుర్యాచ్ఛ్రాద్ధ మిన్దుక్షయే తథా॥21॥

పార్వణ శ్రాద్ధక్రియ జరిపే నిత్యాగ్నిహోత్రి అమావాస్యాది దినాలలో పితృ యజ్ఞం జరపాలి. అలాగే పితరులకు పిండసమర్పణ అనే అన్వాహార్యకమును నిర్వర్తించాలి.

గోమయేనోపలిప్తే తు దక్షిణా ప్రవణే స్థలే।
శ్రాద్ధం సమాచరేద్భక్త్యా గోష్ఠే వా జలసన్నిధౌ॥ 22॥

గోమయంతో అలికిన ప్రదేశంలో దక్షిణంవైపు వాలుగా వున్నచోట గోవుల కొట్టములో గానీ, జలసన్నిధిలో గానీ భక్తితో శ్రాద్ధం ఆచరించాలి.

అగ్నిమాన్నిర్వపేత్పిత్ర్యం చరుం చ సమముష్టిభిః।
పితృభ్యో నిర్వపామీతి సర్వం దక్షిణతో న్యసేత్॥ 23॥

అగ్నికార్యం చేయువాడు పితరుల కర్పించడానికై సిద్ధం చేసిన పక్వ పదార్థాన్ని సమభాగాలుగా గల పిడికిళ్ళుగా పాత్రలో వడ్డించుకోవాలి. 'ఇది పితృ దేవతలకు వడ్డిస్తున్నాను' అని చెప్పుతూ చరువును తనకు దక్షిణం వైపుగా ఉంచాలి.

అభిఘార్య తతః కుర్యార్నిర్వాపత్రయమగ్రతః।
తేవిత్తస్త్వాయతాః కార్యాశ్చతురంగులవిస్తృతాః॥ 24॥

ఆ పై దానిమీద నెయ్యి అభిఘరించి తనముందు మూడు వడ్డనలు చేయాలి. ఆ చరుపిండాల పరిమాణం నాలుగంగుళాల వెడల్పు, నాలుగంగుళాల మందం కల్గి పంద్రెండంగుళాల నిడివి గలదిగా ఉండాలి.

దర్వీత్రయం ప్రకుర్వీత ఖాదిరం రజతాన్వితమ్।
రత్నిమాత్రం పరిశ్లక్ష్ణం హస్తాగ్రాకారముత్తమమ్॥ 25॥

చంద్ర కొయ్యతో మూడు గరిటెలు తయారుచేయాలి. వాటిపై వెండి రేకులు బిగించాలి. అవి పిడికిలి మూసినప్పుడు మూరెడు పొడవుతో చేతిముందు భాగపు ఆకృతితో ఉండాలి.

ఉదపాత్రం చ కాంస్యం తు మేక్షణం చ సమిత్కుశాన్।
తిలపాత్రాణి సద్వాసో గన్ధధూపానులేపనమ్॥ 26॥

ఆహరేదపసవ్యం తు సర్వం దక్షిణతః శనైః।
ఏవమాసాద్య తత్సర్వం భవనస్యాగ్రతో భువి॥ 27॥

గోమయేనోపలిప్తాయాం గోమూత్రేణ తు మణ్డలమ్।
అక్షతాభిః స పుష్పాభి స్తదభ్యర్చ్యాపసవ్యవత్॥ 28॥

విప్రాణాం క్షాళయేత్పాదావభినన్ద్య పునః పునః।
ఆసనేషూపక్లృప్తేషు దర్భవత్సు విధానవత్॥ 29॥

ఉపస్పృష్టోదకాన్ విప్రానుపవేశ్యానుమన్త్రయేత్॥

ద్వౌ దైవే పితృకృత్యే త్రీనేకైకముభయత్ర చ।
భోజయేదీశ్వరోఽపీహ న కుర్యాద్విస్తరం బుధః॥ 30॥

కంచుతో చేసిన నీటి పాత్ర, వైదిక కర్మల్లో ఉపయోగించే ద్రవమును వడ్డించే మేక్షణమనే ఉపకరణం, సమిధలు, దర్భలు, తిలపాత్రలు, మడుగు వస్త్రాలు, గంధం, ధూపద్రవ్యాలు, అనులేపనాలు సిద్ధం చేసుకోవాలి. ఇందులో ప్రతివస్తువునూ అపసవ్యముతో నెమ్మదిగా దక్షిణపు దిశకు తెచ్చి ఉంచుకోవాలి. ఆపైన తన యింటి ముందుభాగంలో గోమయంతో అలకిన నేలపై గోమూత్రంతో మండలం చేయాలి. అక్కడ ద్విజులను అక్షతలతో పూలతో కర్త, జన్నిదాన్ని అపసవ్యం చేసుకొని పూజించాలి. వారికి పునః పునః అభివందనములు చేసి వారి పాదాలు కడగాలి. తదుపరి ఉదకోపస్పర్శనం చేసిన ఆ విప్రులను చక్కగా పరచిన దర్భలుగల ఆసనాలపై కూర్చుండ బెట్టి అనుమంత్రణం ఆచరించాలి. విశ్వదేవస్థానంలో ఇద్దరినీ, పితృదేవస్థానంలో ముగ్గురినీ, లేదా ఒక్కొక్క స్థానంలో ఒక్కొక్కరినీ భుజింప జేయాలి. ఎంత సంపన్నుడైనా ఇంతకన్నా ఎక్కువమందిని శ్రాద్ధంలో భోక్తలుగా చేయరాదు.

దైవపూర్వం నియోజ్యాథ విప్రానర్ఘ్యాదినా బుధః।
అగ్నౌ కుర్యాదనుజ్ఞాతో విప్రైర్విప్రో యథా విధి॥31॥

స్వగృహ్యోక్తవిధానేన కాంస్యే కృత్వా చరుం తతః।
అగ్నీషోమయమాభ్యాం తు కుర్యాదాప్యాయనం బుధః॥32॥

శ్రాద్ధకర్త పిమ్మట దేవపూర్వకంగా విప్రులను అర్ఘ్యాదులతో అర్చించాలి. అనంతరం వారి అనుమతితో చరువును కంచుపాత్రలోకి తీసుకోవాలి. గృహ్యసూత్రంలో చెప్పినట్లు దానిని అగ్నిలో వ్రేల్చాలి. సంప్రదాయజ్ఞుడైన గృహస్థుడు అలా అగ్నిషోమయములను తృప్తులను చేయాలి.

దక్షిణాగ్నౌ ప్రణీతే చ య ఏకాగ్నిర్ద్విజోత్తమః॥33॥

యజ్ఞోపవీతీ నిర్వర్త్య తత్ర పర్యుక్షణాదికమ్।
ప్రాచీనావీతినా కార్యమతః సర్వం విజానతా॥34॥

శ్రాద్ధకర్త ఏకాగ్ని అయ్యే పక్షంలో దక్షిణాగ్నిని ప్రజ్వలింపజేసి దానిలో అగ్నౌకరణం చేయాలి. ఆ సందర్భంలో పర్యుక్షణం (అగ్ని చుట్టూ నీరు చిలకరించడం) యజ్ఞోపవీతియై అనుష్ఠించాలి. మిగిలిన ప్రక్రియనంతా ప్రాచీనావీతియై (కుడి భుజంపై యజ్ఞోపవీతం ధరించినవాడై) చేయాలి.

షట్ చ తస్మాద్ధవిశ్శేషాత్పిండాన్ కృత్వా తథోదకమ్।
దద్యాదుదక పాత్రం తు సలిలం సవ్యపాణినా॥35॥

అగ్నిలో వ్రేల్చగా మిగిలిన దానినుండి ఆరు పిండాలను చేయాలి. ఎడమచేతిలో నువ్వులు గల ఉదక పాత్రను గ్రహించాలి.

కృత్వాపసవ్యం దత్త్వైత ద్దర్భయుక్తో విమత్సరః।
విధాయ లేఖాం యత్నేన నిర్వపేదవనేజనమ్॥36॥

దక్షిణాభిముఖః కుర్యాత్కరే దర్వీం నిధాయ వై।

అనంతరం అపసవ్యం చేసుకొని దర్భలతో రేఖను (నిలువుగానూ, దక్షిణాగ్రం గాను దర్భలు పరచుట) చేయాలి. పిదప దర్విని చేపట్టి దానితో ఆ చోటును నీటితో తడపాలి. ఇదంతా దక్షిణముఖంగా ఉండి చేయాలి.

నిధాయ పిణ్డ మేకైకం సర్వాన్ దర్భోపరిక్రమాత్॥37॥

నినయేదథ దర్భేషు నామగోత్రానుకీర్తనైః ।
తేషు దర్భేషు తం హస్తం విమృజ్యాల్లేపభాగినామ్॥38॥

తదుపరి దర్భలమీద ఒక్కొక్క పిండాన్నే వారివారి గోత్రనామాలు చెప్పుతూ ఉంచాలి. తరువాత లేపభాక్కుల (చేతికంటిన పిండపు అంటు అర్పించడంతో తృప్తి చెందేవారు) ప్రీతి కొరకై ఆ దర్భలమీద తన చేతులను కొంచెం నీటితో కడుక్కోవాలి.

తథైవ చ తతః కుర్యాత్పునః ప్రత్యవనేజనమ్।
పిణ్డా నేతాన్నమస్కృత్య గన్ధధూపార్హణాదిభిః॥39॥

ఆ పిమ్మట మరల ప్రత్యవనేజనం (మరల నీటితో తడపడం) చేయాలి. తదుపరి గంధం, ధూపం, నైవేద్యం మున్నగు వాటితో పిండాలను పూజించి వాటికి నమస్కరించాలి.

ఏవమావాహ్య తత్సర్వం వేదమన్త్రైర్యథోదితైః।
ఏకాగ్నేరేక ఏవస్యాన్నిర్వాపో దర్వికా తథా॥40॥

ఈ రీతిగా దేవతలను, పితరులను యథోక్తమైన వేదమంత్రాలతో ఆవాహనం చేసి నిర్వహించాలి. ఏకాగ్ని అయిన శ్రాద్ధకర్త మాత్రం గరిటెతో ఒక వడ్డన చేస్తే సరిపోతుంది.

తతః కృత్వాఽ_న్తరైర్దద్యాత్తత్పత్నీభ్యః కుశాన్ బుధః।
తద్వత్పిణ్డాదికం కుర్యా దావాహన విసర్జనమ్॥41॥

ఇలా పురుష పితృదేవతలకు పిండప్రదానం చేసి తరువాత వారి పత్నులకు దర్భలపై పిండప్రదానం కావించాలి. ఆవాహన విసర్జవాదులనూ అట్లే నిర్వహించాలి.

తతో గృహీత్వా పిణ్డేభ్యో మాత్రాః సర్వాః క్రమేణ తు।
తానేవ విప్రాన్ ప్రథమం ప్రాశయేద్యత్నతో నరః॥42॥

ఆపై పిండాంశాలను క్రమంగా పరిగ్రహించి ప్రతిభాగాన్నీ ప్రయత్న పూర్వకంగా విప్రులచే శ్రాద్ధకర్త మొదట భుజింప జేయాలి.

యస్మాదగ్నౌ ధృతా మాత్రా భక్షయన్తి ద్విజాతయః।
అన్వాహార్యకమిత్యుక్తం తస్మాదన్నం న భక్షయేత్॥43॥

ద్విజులు అగ్నిలో వ్రేల్చగా మిగిలిన అన్నాన్నే భుజిస్తారు. ఆ అగ్నిహవనశేషాన్ని అన్వాహార్యకమంటారు. అందుచేత హవనశేషం కాని అన్నాన్ని భక్షింప జేయరాదు.

పూర్వం దత్వా తు తద్ధస్తే సపవిత్రం తిలోదకమ్।
తత్పిణ్డాగ్రం ప్రయచ్ఛేత స్వధైషామస్త్వితిబ్రువన్॥44॥

మొదట భోక్తల హస్తమునందు పవిత్ర సహితమైన తిలోదకం వదలాలి. తదుపరి పిండాంశాన్ని 'స్వధా ఏషామస్తు' అంటూ వారి చేతిలో ఉంచాలి.

వర్ణయన్ భోజయేదన్నం మిష్టం పూతంచ సర్వదా।
వర్జయేత్క్రోధపరతాం స్మరన్నారాయణం హరిమ్॥45॥

అన్నం పవిత్రంగా, మధురంగా ఉన్నదని వర్ణిస్తూ భోక్తలచే తినిపింప జేయాలి. కోపం లేకుండా హరినామస్మరణ చేస్తూ భుజింప జేయాలి.

తృప్తాన్ జ్ఞాత్వా తతః కుర్యాద్వికిరన్సర్వమన్తికే।
సోదకం చాన్న ముద్ధృత్య సలిలం ప్రక్షిపేద్భువి॥46॥

వారు భోజనంతో తృప్తి చెందినారని గ్రహించి ఆపై వికిరాన్నమును వారి చెంత ఉంచాలి. నీటితో సహా అన్నం తీసుకొని నీటిని భూమిపై వదలాలి.

ఆచాన్తేషు పునర్దద్యాజ్జలపుష్పాక్షతోదకమ్।
స్వస్తి వాచనకం సర్వం పిణ్డోపరి సమాహరేత్॥47॥

వారు ఆచమించిన పిమ్మట మరల వారి చేతులలో జల సహితంగా పూలను, అక్షతలనూ వదలాలి. ఈ స్వస్తి వాచనిక ప్రక్రియనంతా పిండాలమీదనే ఆచరించాలి.

దేవాద్యన్తం ప్రకుర్వీత శ్రాద్ధనాశో౽న్యథాభవేత్।
విసృజ్య బ్రాహ్మణాంస్తద్వత్తేషాం కృత్వా ప్రదక్షిణమ్॥48॥

దక్షిణాం దిశమాకాంక్షన్ పితౄన్ యాచేత మానవః।
దాతారో నో౽భివర్ధన్తాం వేదసన్తతిరేవ చ॥49॥

శ్రద్ధా చ నో మా వ్యగమద్బహు దేయం చ నో౽స్త్వితి।
అన్నం చ నో బహు భవే దతిథీంశ్చ లభేమహి॥50॥

యాచితారశ్చ నః సన్తు మా చ యాచిష్మ కంచన॥

ఈ ప్రక్రియ నంతటినీ విశ్వేదేవతలలో ప్రారంభించి వారితోనే పూర్తి అయ్యేటట్లు చేయాలి. అలా చేయకపోతే శ్రాద్ధనాశం కల్గుతుంది. తదుపరి భోక్తలకు ప్రదక్షిణం కావించి వారికి వీడ్కోలు చెప్పాలి. ఆపై దక్షిణదిశ వైపుతిరిగి పితృదేవతల నిలా ప్రార్థించాలి.

"మాదాతలు వృద్ధి పొందుదురు గాక! వేదసంతతి వర్ధిల్లు గాక! మాశ్రద్ధ తొలగకుండుగాక! మేము అధికంగా దానం చేయుదము గాక! మాకు పుష్కలంగా అన్నం లభించు గాక! అతిథులు మాకు లభింతురు గాక! మమ్ము యాచించేవారుందురు గాక! మేమెవరినీ యాచించకుందుము గాక!".

ఏతచ్చ సతతం ప్రోక్త మన్వాహార్యంతు పార్వణమ్॥51॥

ఇది అన్వాహార్య పూర్వకమైన పార్వణ శ్రాద్ధవిధానం.

యథేన్దుసంక్షయే తద్వదన్యత్రాపి నిగద్యతే।
పిండాంస్తు గోऽజ విప్రేభ్యో దద్యాదగ్నౌ జలేऽపి వా॥52॥

విప్రాగ్రతో వా వికిరేద్వయోభిరభిరాశయేత్।
పత్నీతు మధ్యమం పిణ్డం ప్రాశయే ద్వినయాన్వితా॥53॥

ఇది అమావాస్యనాడు జరిపిన రీతిగానే ఇతరపర్వ దినాలలో కూడా ఈ పార్వణ శ్రాద్ధము నిలాగే నిర్వహించాలి. శ్రాద్ధప్రక్రియ ముగియగానే పిండాలను గోవులకు, లేదా మేకలకు, లేదా బ్రాహ్మణులకు తినుటకై ఇవ్వాలి. లేదా అగ్నిలోనో జలంలోనో వేయాలి. విప్రుల ముందట నైనా చల్లాలి. పక్షులకైనా (వయోభిః) ఆహారంగా వేయాలి. శ్రాద్ధ కర్త భార్యమాత్రం మధ్యమ పిండాన్ని సవినయంగా తినాలి.

ఆధత్తపితరో గర్భమత్ర సన్తానవర్ధనమ్।
తావదుచ్ఛేషణం తిష్ఠేద్యావద్విప్రా విసర్జితాః॥54॥

ఆమె తినే సమయంలో "పితృదేవతలారా" సంతానవర్ధకమైన గర్భం నాకు కల్గించండి"! అని ప్రార్థించాలి. భోక్తలు ఆచోటు వీడి వెళ్ళు వరకూ ఎంగిళ్లు అలాగే ఉండాలి. (తరువాత శుద్ధి చేయవచ్చు).

వైశ్వదేవం తతః కుర్యాన్నివృత్తం పితృకర్మణి।
ఇష్టైః సహ తతః శాన్తో భుఞ్జీత పితృసేవితమ్॥55॥

ఇలా పితృ కర్మ ముగిసిన పిదప వైశ్వదేవం జరపాలి. ఆపై శ్రాద్ధకర్త ఇష్టులైన వారితో గూడి శాంతచిత్తుడై పితృభుక్త శేషం భుజించాలి.

పునర్భోజనమధ్వానం యానమాయాసమైథునమ్।
శ్రాద్ధకృచ్ఛ్రాద్ధభుక్చైవ సర్వమేత ద్వివర్జయేత్॥56॥

శ్రాద్ధదినాన శ్రాద్ధకర్తగాని, శ్రాద్ధ భోక్తగాని మళ్ళీ భుజించడం, దారి నడక, వాహనాలపై పయనించడం, శ్రమ కల్గించే పనులు చేయిడం, మైథునం ఇదంతా చేయరాదు.

స్వాధ్యాయం కలహం చైవ దివాస్వప్నం చ సర్వదా।
అనేన విధినా శ్రాద్ధం నరస్త్విబ్దే వినిర్వపేత్॥57॥

అట్లే స్వాధ్యాయం, కలహం, పగటి నిద్ర-ఇవి చేయరాదు. ఈ రీతిగానే మానవుడు ఆబ్దిక శ్రాద్ధ క్రియను సైతం నిర్వర్తించాలి.

కన్యాకుమ్భవృషస్థేఽర్కే కృష్ణపక్షేషు సర్వదా।
యత్ర యత్ర ప్రదాతవ్యం సపిణ్డీకరణాత్మకమ్॥
తత్రానేన విధానేన దేయమగ్నిమతా సదా॥58॥

సూర్యుడు కన్యా-కుంభ-వృషభ రాసులలో ఉన్నప్పుడు కృష్ణపక్షాలలో సదా సపిండీకరణం చేసే సందర్భంలో అగ్నిమంతుడైనవాడు ఇలాగే శ్రాద్ధక్రియ నిర్వహించాలి. (ఈ ప్రక్రియ సన్యాసికి లేదు)

ఇతి శ్రీమత్స్యమహాపురాణే మత్స్యమనుసంవాదే శ్రాద్ధకల్పే నిమన్త్రణాదికథనం నామ

షోడశోఽధ్యాయః ॥16॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని మత్స్య మను సంవాదంలో శ్రాద్ధకల్పంలో నిమంత్రణాదికథనమనే
పదహారవ అధ్యాయం సంపూర్ణం

❋ ❋ ❋

సప్తదశోఽధ్యాయః - పదిహేడవ అధ్యాయం

సాధారణశ్రాద్ధకాలనిర్ణయః - సాధారణ శ్రాద్ధకాల నిర్ణయం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అతః పరః ప్రవక్ష్యామి విష్ణునా యదుదీరితమ్।
శ్రాద్ధం సాధారణం నామ భుక్తిముక్తిఫలప్రదమ్॥ 1॥

ఋషులారా! ఇక మీదట నేను మీకు విష్ణుదేవుడు చెప్పిన సాధారణ శ్రాద్ధమును గూర్చి వివరిస్తాను. అది భుక్తి ముక్తి ఫలాలను ప్రసాదించేది.

అయనే విషువే యుగ్మే సామాన్యే చార్కసంక్రమే।
అమావాస్యాష్టకా చైవ కృష్ణపక్షే చతుర్దశీ॥ 2॥

ఆర్ద్రామఖారోహిణీషు ద్రవ్యబ్రాహ్మణసంగమే।
గజచ్ఛాయావ్యతీపాతే విష్టివైధృతివాసరే॥ 3॥

వైశాఖస్య తృతీయాయాం నవమ్యాం కార్తికస్య తు।
పఞ్చదశ్యాంచ మాఘస్య నభస్యే చ త్రయోదశీ॥ 4॥

యుగాదయః స్మృతాహ్యేతా దత్తస్యాక్షయకారకాః।
తథా మన్వన్తరాదౌ చ దేయం శ్రాద్ధం విజానతా॥ 5॥

ఉత్తర దక్షిణాయన కాలాలు ప్రవేశించే పుణ్యకాలాలు, రాత్రింబవళ్లు సమంగా ఉండే రెండు విషువదినాలు, సూర్యుడు ఆయారాసులలో ప్రవేశించే దినాలు. అమావాస్య, అష్టకా (కృష్ణ పక్షసప్తమి) కృష్ణ పక్ష చతుర్దశీతిథులు, ఆర్ద్రామఖారోహిణీ నక్షత్రదినాలు, శ్రాద్ధానికి తగిన ద్రవ్యాలు బ్రాహ్మణులు దొరికిన దినాలు. గజచ్ఛాయా వ్యతీపాత విష్టి వైధృతి యోగాలు, (జ్యోతి శ్శాస్త్రం నుండి వీటి వివరణ గ్రహించాలి) వైశాఖమాసంలో తృతీయ, కార్తికంలో నవమి, మాఘమాసంలో పంచదశి, భాద్రపదంలో త్రయోదశి-అనేవి యుగాదులుగా ప్రసిద్ధాలు. ఈ రోజుల్లో జరిపే శ్రాద్ధం అక్షయఫలం కల్గిస్తుంది. అట్లే మన్వంతరాది దినాలు గూడా విజ్ఞులకు గ్రాహ్యములు.

ఆశ్వయుక్ఛుక్లనవమీ ద్వాదశీ కార్తికే తథా।
తృతీయా చైత్రమాసస్య తథా భాద్రపదస్య చ॥ 6॥

అమావాస్యా ఫల్గునస్య పౌషస్యైకాదశీ తథా।
ఆషాఢస్యాపి దశమీ మాఘమాసస్య సప్తమీ॥ 7॥

శ్రావణస్యాష్టమీ కృష్ణా తథాఽఽషాఢే చ పూర్ణిమా।
కార్తికీ ఫాల్గుణీ చైత్రీ జ్యైష్ఠీ పంచదశీ తథా ।
మన్వన్తరాదయశ్చైతా దత్తస్యాక్షయకారకాః॥ 8॥

అశ్వయుజశుక్ల నవమి, కార్తికద్వాదశి, చైత్రతృతీయ, భాద్రపదతృతీయ, ఫాల్గుణామావాస్య, పుష్య-ఏకాదశి, ఆషాఢ దశమి, మాఘ సప్తమి, శ్రావణ కృష్ణాష్టమి, ఆషాడ పూర్ణిమ, కార్తిక ఫాల్గుణ చైత్ర జ్యేష్ఠ మాసాలలోని పూర్ణిమలు మన్వంతరాల ఆదిదినాలుగా గణింపబడుతున్నాయి. (ఇక్కడ కొన్నితిథులకు పక్షములు చెప్పబడలేదు. పంచాంగాలలో మన్వంతరాదులు కొంత భిన్నంగా పేర్కొనబడినవి.)

యస్మాన్మన్వంతరస్యాదౌ రథమాప దివాకరః।
మాఘమాసస్య సప్తమ్యామథ సా రథసప్తమీ॥9॥

వైవస్వత మన్వంతారాదియైన మాఘశుక్ల సప్తమినాడు సూర్యుడు రథమధిరోహించాడు. అందువల్ల ఈ తిథికి 'రథసప్తమి' అని పేరు.

పానీయమప్యత్ర తిలైర్విమిశ్రం దద్యాత్పితృభ్యః ప్రయతో మనుష్యః।
శ్రాద్ధంకృతం తేన సమాః సహస్రం రహస్యమేత త్పితరో వదన్తి॥10॥

ఈ దినమున మనుజుడు ప్రయతుడై తిలలతో గూడిన నీటినైనా పితరులు కర్పిస్తే, వెయ్యి సంవత్సరాలు శ్రద్ధతో విధ్యుక్తంగా శ్రాద్ధం పెట్టిన ఫలం కల్గుతుంది. ఈ రహస్యాన్ని పితృదేవతలు చెప్పారు.

వైశాఖ్యాముపరాగేషు తథోత్సవమహాలయే।
తీర్థాయతనగోష్ఠేషు ద్వీపోద్యానగృహేషు చ ॥
వివిక్తేషూపలిప్తేషు శ్రాద్ధం దేయం విజానతా॥11॥

వైశాఖామావాస్యాదినాన, గ్రహణ దినాలలోను, ఉత్సవ దినాలలోను, మహాలయదినాలలోనూ, తీర్థాలలో, క్షేత్రాలలో, గోవులు నిలిచే కొట్టాలలో, ద్వీపములందునూ, ఉద్యానగృహలలోనూ, తనకనుకూలమైన గృహాలయందునూ వివిక్త ప్రదేశాలలో చక్కగా అలికిన చోట్ల శ్రాద్ధం నిర్వహించడం సంప్రదాయజ్ఞులు చేయదగినపని.

విప్రాన్ పూర్వేఽపరే చాహ్ని వినీతాత్మా నిమంత్రయేత్।
శీలవృత్తగుణోపేతాన్ వయోరూప సమన్వితాన్॥12॥

శ్రాద్ధకర్త ఒకటి రెండు దినాలకు ముందుగనే వినయంతో విప్రులను శ్రాద్ధ భోక్తలుగా నిమంత్రించాలి. ఆ విప్రులు శీలము, మంచి నడవడి, గుణం కల్గి వయోరూపసమేతులుగా ఉండాలి.

ద్వౌ దైవే పితృకార్యే త్రీ నేకైకముభయత్ర వా।
భోజయేత్సుసమృద్ధోఽపి న ప్రసజ్యేత విస్తరే॥13॥

విశ్వదేవ స్థానంలో ఇద్దరినీ, పితృస్థానంలో ముగ్గురినీ మాత్రమే నిమంత్రించాలి. లేదా ఒక్కొక్క స్థానంలో ఒక్కొక్కరైనా చాలు. కర్త ఐశ్వర్యవంతుడైనప్పటికీ అంతకన్నా ఎక్కువమందిని పిలువరాదు.

విశ్వాన్ దేవాన్ యవైః పుష్పై రభ్యర్చ్యాఽఽసన పూర్వకమ్।
పూరయేత్పాత్రయుగ్మంతు స్థాప్య దర్భపవిత్రకమ్॥14॥

శం నో దేవీత్యపః కుర్యాద్యవో౽సీతి యవానపి।
గన్ధపుష్పైశ్చ సమ్పూజ్య వైశ్వదేవం ప్రతి న్యసేత్॥15॥

విశ్వేదేవాస ఇత్యాభ్యామావాహ్య వికిరేద్యవాన్।
గన్ధపుష్పైరలఙ్కృత్య యా దివ్యేత్యర్ఘ్యముత్సృజేత్॥16॥

అభ్యర్చ్య తాభ్యాముత్సృష్టం పితృకార్యం సమారభేత్॥17॥

విశ్వదేవతల కాసనమిచ్చి వారిని యవలతో పూలతో పూజించాలి. దర్భ పవిత్రాలు ధరించి రెండు పాత్రలను నీటిలో నింపాలి. 'శంనో దేవీ' అను మంత్రంతో నీటిని ఆ పాత్రల్లో పోయాలి. 'యవో౽సి' అనే మంత్రంతో పాత్రల్లో యవలు వేయాలి. గంధపుష్పాలతో ఆ పాత్రలను పూజించి విశ్వేదేవుల ముందుంచాలి. 'విశ్వేదేవా సః'అనే మంత్రంతో విప్రులలో విశ్వేదేవతల నావాహనం చేసి వారిపై యవలు చల్లాలి. విప్రులను గంధపుష్పాలతో అలంకరించి 'యా దివ్యా' అను మంత్రంతో వారి చేతుల్లో అర్ఘ్యం వదలాలి. మళ్ళీ వారి నర్చించి వారినుండి 'వీడ్కోలు–అనుమతి పొంది పితృకార్యం ప్రారంభించాలి.

దర్భాసనాని కృత్వా౽౽దౌ త్రీణి పాత్రాణి పూరయేత్।
స పవిత్రాణికృత్వా౽౽దౌ శం నో దేవీత్యపః క్షిపేత్॥18॥

దర్భలతోడి ఆసనాలు సిద్ధం చేసి విప్రుల ముందుంచిన పాత్రలు మూడింటినీ నీటితో నింపాలి. పవిత్రాలు వాటిలో వేసి 'శంనో దేవీ' అనే మంత్రంతో పాత్రలలో నీరు పోయాలి.

తిలో౽సీతి తిలాన్కుర్యాద్గన్ధపుష్పాదికం పునః।
పాత్రం వనస్పతిమయం తథా పర్ణమయం పునః॥19॥

జలజం వా౽థ కుర్వీత తథా సాగరసమ్భవమ్।
సౌవర్ణం రాజతం వా౽పి పితౄణాం పాత్ర ముచ్యతే॥20॥

'తిలో౽సి' అనే మంత్రంతో పాత్రల్లో తిలలు వేయాలి. ఆపై గంధపుష్పాదులు వేయాలి. అర్ఘ్య పాత్రలు 'రావి'వంటి కొయ్యవిగానీ, లేదా ఆకుదొన్నెలు గానీ, సముద్రంలో లభించే శంఖం గానీ అయివుండాలి. లేదా బంగారు పాత్రగానీ, వెండి పాత్రగానీ కావచ్చు. అవి పితృదేవతలకు ప్రీతికరమైనవి.

రజతస్య కథా వా౽పి దర్శనం దానమేవ వా ।
రాజతైర్భాజనైరేషామథవా రజతాన్వితైః॥21॥

వార్యపి శ్రద్ధయా దత్తమక్షయాయోపకల్పతే।
తథార్ఘ్యపాత్రే పిణ్డే౽పి పితౄణాం రాజతం మతమ్॥22॥

'రజతం' అని చెప్పడం, దాన్ని చూపడం, దానం చేయడం, వెండి పాత్రలతో, లేదా వెండి కలిసిన లోహపాత్రలతో శ్రద్ధతో పితరులకు ఇచ్చేది అక్షయఫలం ప్రసాదిస్తుంది. వెండి పాత్రతో శ్రద్ధ గల్గి నీరిచ్చినా

అక్షయఫలం లభిస్తుంది. అర్ఘ్యమివ్వడానికి, పిండాలకు, భోజ్యాదులకు వినియోగించే వెండి వస్తువులు పితరుల కమిత ప్రీతి కల్గిస్తాయి.

శివనేత్రోద్భవం యస్మాత్తస్మాత్తత్పితృవల్లభమ్ ।
అమఙ్గళం తద్యత్నేన దేవకార్యేషు వర్జయేత్ ॥23॥

వెండి శివుని కంటినుండి పుట్టింది. అందువల్ల అది పితరుల కిష్టమైనది. అయితే దేవపూజాదికార్యాలలో అది అమగంళకర మవుతుంది. కాన అక్కడ వినియోగించరాదు.

ఏవం పాత్రాణి సంకల్ప్య యథాలాభం విమత్సరః ।
యా దివ్యేతి పితుర్నామ గోత్రైర్దర్భకరో న్యసేత్ ॥24॥

ఇలా తనకు వీలైనంతలో పాత్రలు సమకూర్చుకోవాలి. మాత్సర్యాది దోషాలు లేనివాడు కావాలి. 'యా దివ్యా' అనే మంత్రంతో పితరుల నామగోత్రాలు చెబుతూ దర్భలు చేబూనాలి.

పితౄనావాహయిష్యామి కుర్విత్యుక్తస్తు తైః పునః।
ఉశన్తస్త్వా తథాఽయంతు ఋగ్భ్యామావాహయేత్పితౄన్ ॥25॥

అలా దర్భలు చేతబట్టి 'పితరులను మీయందు ఆవాహనం చేస్తున్నాను', అనే మంత్రముచ్చరిస్తూ ఆదర్భలు వారి చేతికివ్వాలి. వారు 'అలాగే చేయుము' అని అంటారు. అప్పుడు 'ఉశన్తస్త్వా' అన్న మంత్రంతో కాని 'ఆయన్తు' అన్న మంత్రంతో కానీ వారియందు పితృదేవతల నావాహనం చేయాలి.

యా దివ్యేత్యర్ఘ్యముత్సృజ్య దద్యాద్గన్ధాదికం తతః ।
వస్త్రోత్తరం దేవపూర్వం గత్వా సంస్రవణాదితః ॥26॥

పితృపాత్రే నిధాయాథ శేషముత్తరతో న్యసేత్ ।
పితృభ్యఃస్థానమసీతి నిధాయ పరిషేచయేత్ ॥

తత్రాపి పూర్వవత్కుర్యాదగ్నికార్యం విమత్సరః ॥27॥

అనంతరం 'యా దివ్యా' అనే మంత్రంతో వారి చేతియందు అర్ఘ్యం వదలాలి. గంధ పుష్పవస్త్రా లివ్వాలి. మొదట విశ్వేదేవతలకు, తరువాత పితరులకు సంస్రవణామంత్రం ఉచ్చరిస్తూ అర్ఘ్యప్రదానం చేయాలి. తరువాత కాస్త ముందుకు వంగి ఆ పాత్రను భోక్తకు ఉత్తర దిశగా ఉంచాలి. 'పితృభ్యః స్థానమసి' అన్న మంత్రంతో ఆ పాత్రను భోక్తకు ఎడమ వైపున నుంచి నీటితో శుచియైన ప్రదేశంలో పరిషేచనం చేయాలి. ఈ సాధారణ శ్రాద్ధలలో కూడా పార్వణశ్రాద్ధంలో లాగానే నిర్మలచిత్తంతో అగ్నికార్యం నిర్వహించాలి.

ఉభాభ్యామపి హస్తాభ్యామాహృత్య పరివేషయేత్ ।
ప్రశాన్త చిత్తః సతతం దర్భపాణిరశేషతః॥28॥

ఆ తరువాత ప్రశాంత చిత్తంతో దర్భలను చేత ధరించియే రెండు చేతులతో సర్వాపదార్థాలు తెచ్చి భోక్తల పాత్రల్లో వడ్డించాలి.

గుణాఢ్యైః సూపశాకైస్తు నానాభక్ష్యైర్విశేషతః ।
అన్నం తు సదధిక్షీరం గోఘృతం శర్కరాన్వితమ్ ।
మాంసం ప్రీణాతి వై సర్వాన్ పితౄనిత్యాహ కేశవః ॥30॥

పితృ దేవతలనుద్దేశించి పెట్టే అన్నం గుణవంతమైనదిగా ఉండాలి. పప్పు, కూరలు కలదై నానా భక్ష్యాలతో సంపన్నమై వుండాలి. పెరుగు, పాలు, నెయ్యి, చక్కెరతో కలిసి వుండాలి. ఇలాంటి అన్నం, మాంసం సకల పితరులకు ప్రీతిదాయకమని కేశవుడే చెప్పాడు.

ద్వౌ మాసౌ మత్స్యమాంసేన త్రీన్ మాసాన్ హారిణేన తు ।
ఔరభ్రేణాథ చతురః శాకునేనాథ పంచ వై ॥31॥

షణ్మాసం ఛాగమాంసేన తృప్యన్తి పితరస్తథా ।
సప్త పార్షతమాంసేన తథాష్టావేణజేన తు ॥32॥

మాంసాలలో రెండు మాసాల వరకూ చేపమాంసము, మూడు మాసాలవరకూ లేడిమాంసం, నాల్గు మాసాలు పొట్టేలు మాంసం, ఐదు మాసాల వరకు పాలపిట్ట మాంసం, ఆరు నెల్ల వరకూ మేకమాంసం, పితరులకు తృప్తి కల్గిస్తాయి. అట్లే ఏడు నెల్లవరకు ఎఱ్రమేకమాంసం, ఎనిమిది నెల్ల వరకూ ఇర్రిమాంసం తృప్తికరాలు.

దశ మాసాస్తు తృప్యన్తి వరాహమహిషామిషైః ।
శశకూర్మజమాంసేన మాసానే కాదశైవ తు ॥33॥

అడవిపంది, అడవి దున్నల మాంసంతో పది మాసాల వరకు తృప్తి చెందుతారు. కుందేలు, తాబేలు మాంసాలు పదనొకండు నెలల వరకు తృప్తినిస్తాట.

సంవత్సరం తు గవ్యేన పయసా పాయసేన చ ।
రౌరవేణ చ తృప్యన్తి మాసాన్ పఞ్చదశైవ తు ॥34॥

ఆవుపాలతో చేసిన పాయసం ఒక సంవత్సరకాలం తృప్తి కల్గిస్తుంది. రురు మృగమాంసం పదునైదు మాసాల వరకు తృప్తినిస్తుంది.

వార్ధ్రాణకస్య మాంసేన తృప్తిర్ద్వాదశవార్షికీ ।
కాలశాకేన వాఽనన్త్యం ఖడ్గమాంసేన చైవ తు ॥35॥

పొడవు చెవుల అడవి మేక మాంసం పంద్రెండు సంవత్సరాల వరకు, ఖడ్గమృగమాంసం గాని, బలుసాకు కూరగాని అనంతకాలం వరకూ తృప్తి కల్గిస్తుంది.

యత్కిఞ్చిన్మధుసమ్మిశ్రం గోక్షీరం ఘృతపాయసమ్ ।
దత్తమక్షయమిత్యాహుః పితరః పూర్వదేవతాః ॥

ఆవుపాలు, తేనె కలిపి ఆవు నేతితో సంస్కరించిన పాయసం పితరులకు పెట్టితే అది అక్షయమవుతుందని తొల్లిటి దేవతలైన పితరులే చెప్పారు.

స్వాధ్యాయం శ్రావయేత్పిత్ర్యం పురాణాన్యఖిలాని చ ।
బృహద్విష్ణ్వర్కరుద్రాణాం సూక్తాని వివిధాని చ ॥37॥

భోజన కాలంలో వేదంలోని పితృదేవతావిషయం ప్రతిపాదించే భాగాలను వినిపించాలి. అట్లే సమస్త పురాణాలను, వివిధములైన బ్రహ్మవిష్ణు రుద్రసూర్యుల సూక్తాలను వినిపించాలి.

ఇన్ద్రాగ్నిసోమసూక్తాని పావనాని స్వశక్తితః ।
బృహద్రథన్తరం తద్వజ్జ్యేష్ఠసామ సరౌహిణమ్ ॥38॥

ఇంద్రాగ్ని సోమదేవతల సూక్తాలనూ, పవమానసూక్తాలను, బృహద్రథంతరం, రౌహిణం, జ్యేష్ఠం అనబడే సామవేద భాగాలను వినిపింపజేయాలి.

తథైవ శాన్తికాధ్యాయం మధుబ్రాహ్మణమేవ చ ।
మణ్డలబ్రాహ్మణం తద్వత్ప్రీతికారి తు యత్పునః ॥39॥

శాంతికాధ్యాయం, మధుబ్రాహ్మణం, మండల బ్రాహ్మణం మరియు ఏదేది తనకూ, పితరులకూ ప్రీతి కల్గిస్తుందో దానినంతా వారికి వినిపించాలి.

భుక్తవత్సు తతస్తేషు భోజనోపాన్తికే నృప!
సార్వవర్ణిక మన్నాద్యం సన్నీయాఽఽప్లావ్య వారిణా ॥40॥

సముత్సృజే ద్భుక్తవతామగ్రతో వికిరేద్భువి ।

వారు భుజించిన పిదప ఆ భోజన ప్రదేశానికి సమీపమందే భోజనపుటాకుల్లో శేషించిన అన్నాదులలో భాగాలు తీసుకొని జలం ప్రోక్షించి భోక్తల ముందుభాగంలో నేలపై ఉచ్ఛిష్టభాక్కుల నుద్దేశించి వెదజల్లినట్లు వేయాలి.

అగ్నిదగ్ధాస్తు యే జీవా యేఽప్యదగ్ధాః కులే మమ ॥41॥

భూమౌ దత్తేన తృప్యన్తు ప్రయాన్తు పరమాం గతిమ్ ॥42॥

"నా వంశంలో పూర్వం అగ్నిదగ్ధులైన వారు గాని, అగ్ని సంస్కారం పొందనివారు గాని భూమిపై వేసిన ఈ అన్నంతో తృప్తిపడి పరమగతి పొందుదురు గాక!" అని చెప్పాలి.

యేషాం న మాతా న పితా న బన్ధు ర్న గోత్రశుద్ధిర్న తథాఽన్నమస్తి ।
తత్తృప్తయేఽన్నం భువి దత్తమేతత్ ప్రయాన్తు లోకేషు సుఖాయ తద్వత్ ॥43॥

ఎవరికి తల్లిదండ్రులు, బంధువులు లేరో, గోత్రశుద్ధి, అన్నము లేదో వారి తృప్తికై నేలపై ఈయన్నం వేయబడింది. వారు కూడా దీనిచే తృప్తిపొంది పరమగతి పొందుదురుగాక!

అసంస్కృత ప్రమీతానాం త్యక్తానాం కులయోషితామ్ ।
ఉచ్ఛిష్టభాగధేయ స్సదర్భేషు వికిరేచ్చ యః ॥44॥

అట్లే సంస్కారం లేకుండానే మరణించినవారు, గృహబహిష్కారం పొందిన కులస్త్రీలు - అవశిష్టాన్నం చేత, దర్భలలో వేసిన ఈ వికిరాన్నముచేత తృప్తులై ఉత్తమగతి పొందుదురుగాక!

తృప్తాన్ జ్ఞాత్వోదకం దద్యాత్సకృద్విప్రకరే తథా ।
ఉపలిప్తే మహీపృష్ఠే గోశకృన్మూత్రవారిణా ॥45॥

నిధాయ దర్భాన్విధివద్దక్షిణాగ్రాన్ప్రయత్నతః ।
సర్వవర్ణేన చాన్నేన పిణ్డాంస్తు పితృయజ్ఞవత్ ॥46॥

అవనేజనపూర్వం తు నామగోత్రేణ మానవః ।
గన్ధధూపాదికం దద్యాత్కృత్వా ప్రత్యవనేజనమ్ ॥47॥

భోక్తలు తృప్తిగా తిన్నారని తెలిసిన తరువాత వారి చేతిలో ఒక్కసారిగా మాత్రమే నీరు వేయాలి. తదుపరి గోమయ గోమూత్రాలతో నేల అలకాలి. అలికిన నేలమీద కొనలు దక్షిణంగా ఉండేటట్లు దర్భలు పరచాలి. ఆపై పదార్థాలన్నీ కలిపి చేసిన పిండాలను పితరుల నామగోత్రాలతో అవనేజనపూర్వకంగా ఉంచాలి. వాటిని గంధధూపాదులతో అర్చించాలి.

కృత్వాఽపసవ్యం సవ్యేన పాణినాఽథ ప్రదక్షిణమ్ ।
పిత్ర్యమానీయ తత్కార్యం విధివద్దర్భపాణినా ॥48॥

ఆ పిమ్మట పిండాలను దర్భలపై అపసవ్యంగా ఉంచాలి. ఆపై సవ్యం చేసుకొని వాటికి ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించాలి. ఆ పిండాలను ఆయా పితరులకు చెందుగాక! అని సమంత్రకంగా చెప్పాలి.

దీపప్రజ్వాలనం తద్వత్కుర్యాత్పుష్పార్చనం బుధః ।
అథాచాన్తేషు చాచమ్య వారి దద్యాత్సకృత్సకృత్ ॥49॥

తదుపరి దర్భలు చేతపట్టుకొని పిండాలను ధూపదీప పుష్ప నైవేద్యాలతో అర్చించాలి. భోక్తలు ఆచమనం చేసిన పిదప శ్రాద్ధ కర్త తానూ ఆచమనం చేయాలి. ఒక్కొక్క సారి మాత్రమే వారి హస్తాలపై నీరు పోయాలి.

అథ పుష్పాక్షతాన్ పశ్చాదక్షయ్యోదకమేవ చ ।
సతతం నామగోత్రేణ దద్యాచ్ఛక్త్యా చ దక్షిణామ్ ॥50॥

పూలు, అక్షతలు, అక్షయోదకాన్ని వారిచేతిపై వదలాలి. తన గోత్రనామాలు చెబుతూ శక్తికొలది వారికి దక్షిణ సమర్పించాలి.

గోభూహిరణ్యవాసాంసి భవ్యాని శయనాని చ ।
దద్యాద్యదిష్టం విప్రాణామాత్మనః పితురేవ చ ॥51॥

తనకూ, పితరులకూ, ఆ విప్రులకూ ఇష్టమైన గోవులు, భూమి, స్వర్ణం, వస్త్రాలు, మంచి శయనాలు వారికి దక్షిణలుగా ఇవ్వాలి.

విత్తశాఠ్యేన రహితః పితృభ్యః ప్రీతిమాహరేత్ ।
తతః స్వధావాచనికం విశ్వదేవేషు చోదకమ్ ॥52॥

పిసనారితనం లేకుండా పితరులకు ప్రీతి కల్గేవిధంగా దక్షిణలివ్వాలి. తరువాత పితృదేవతల స్థానంలో భుజించిన విప్రులచెంత స్వధావాచనికమును (స్వధోచ్యతాం ఇత్యాదిమంత్ర పఠనం), విశ్వదేవస్థానంలో భుజించినవారిచెంత ఉదకదానమును నిర్వహించాలి.

దత్త్వాశీః ప్రతిగృహ్ణీయాద్ద్విజేభ్యః ప్రాఙ్ముఖో బుధః ।
అఘోరాః పితరః సన్తు సన్త్విత్యుక్తః పునర్ద్విజైః ॥53॥

ఆపై తూర్పుముఖంగా కూర్చుండి ద్విజుల నుండి ఆశీస్సులు పరిగ్రహించాలి. 'పితృదేవతలు మాపట్ల ప్రీతి కలవారగుదురుగాక' అని కర్త అనగా బ్రాహ్మణుల 'తథాஉస్తు' అనాలి.

గోత్రం తథా వర్ధతాం నస్తేథేత్యుక్తశ్చ తైః పునః ।
దాతారో నోஉభివర్ధన్తామితి చైవముదీరయేత్ ॥54॥

'మా గోత్రం వర్ధిల్లుగాక' అని కర్త అనగా వారు 'అట్లే' అనాలి. 'దాతలు మాలో వర్ధిల్లుదురు గాక' అని అతడనగా వారు 'తథాஉస్తు' అనాలి.

ఏతాః సత్యాశిషః సన్తు సన్త్విత్యుక్తశ్చ తైః పునః ।
స్వస్తివాచనికం కుర్యాత్పిణ్డానుద్ధృత్య భక్తితః ॥55॥

'ఈ ఆశీస్సులు సత్యము లగుగాక' అని అతడనగా వారు 'అట్లే అగు గాక' అనాలి. పిదప భక్తితో పిండాలు పైకెత్తి స్వస్తివాచనికం జరపాలి.

ఉచ్ఛేషణం తు తత్తిష్ఠేద్యావద్విప్రా విసర్జితాః ।
తతో గ్రహబలిం కుర్యాదితి ధర్మవ్యవస్థితిః ॥56॥

భోక్తలు అక్కడే ఉన్నంతవరకూ ఎంగిళ్ళు తీయరాదు. (తర్వాత తీసి వేయాలి) పిదప గ్రహబలి నిర్వర్తించాలి. ఇది ధర్మవ్యవస్థ.

ఉచ్ఛేషణం భూమిగతమజిహ్మస్యాஉஉస్తికస్య చ ।
దాసవర్గస్య తత్పిత్ర్యం భాగధేయం ప్రచక్షతే ॥57॥

భోక్తలు భుజించినప్పుడు నేలపై బడిన అవశిష్టపదార్థం కపటం లేని ఆస్తికులైన సేవకులకు పితృశేషంగా భుజించుట కివ్వాలి. అది వారి భాగధేయమని పెద్దలంటున్నారు.

పితృభిర్నిర్మితం పూర్వమేతదాప్యాయనం సదా ।
అపుత్రాణాం సపుత్రాణాం స్త్రీణామపి నరాధిప! ॥58॥

రాజా! ఈ రీతిగా శ్రాద్ధం నిర్వహిస్తే అది వారి బంధువర్గములో పుత్రు లున్నవారికి, లేనివారికి, స్త్రీలకూ అందరకూ తృప్తి కల్గిస్తుందని పూర్వం పితృదేవతలే ఈ వ్యవస్థ కల్పించినారు.

**తతస్తానగ్రతః స్థిత్వా పరిగృహ్యోదపాత్రకమ్ ।
వాజే వాజే ఇతి జపన్ కుశాగ్రేణ విసర్జయేత్ ॥59॥**

ఇట్లు శ్రాద్ధ క్రియ సమాప్తం చేసి శ్రాద్ధకర్త బ్రాహ్మణులు తన ముందు నిలబడగా ఉదకపాత్ర చేతబట్టి 'వాజే వాజే' అను మంత్రం చెబుతూ దర్భకొసలతో వారిని తాకుతూ వారికి వీడ్కోలు చెప్పాలి.

**బహిః ప్రదక్షణం కుర్యాత్పదాన్యష్టావనువ్రజన్ ।
బన్ధువర్గేణ సహితః పుత్రభార్యాసమన్వితః ॥60॥**

వారికి ప్రదక్షిణం చేసి నమస్కరించాలి. వారు బయలుదేరినప్పుడు వారితో సహా ఎనిమిది అడుగులు బంధు పుత్ర భార్యాసహితుడై నడవాలి.

**నివృత్య ప్రణిపత్యాథ పర్యుక్ష్యాగ్నిం సమన్త్రవత్ ।
వైశ్వదేవం ప్రకుర్వీత నైత్యకం బలిమేవ చ ॥61॥**

తదుపరి వారి కొకసారి నమస్కరించి వెనుకకు మరలి వచ్చి అగ్ని పూజచేసి వైశ్వదేవాన్నీ, నిత్యబలినీ నిర్వహించాలి.

**తతస్తు వైశ్వదేవాన్తే సభృత్యసుతబాన్ధవః ।
భుఞ్జీతాతిథిసంయుక్తః సర్వం పితృనిషేవితమ్ ॥62॥**

వైశ్యదైవం పూర్తి యైన పిదప శ్రాద్ధకర్త అతిథులు, గురువులు, బంధువులు, సేవకులు సగోత్రులతో కూడి పితృశేషాన్ని భుజించాలి.

**ఏతచ్చానుపనీతోఽపి కుర్యాత్సర్వేషు పర్వసు ।
శ్రాద్ధం సాధారణం నామ సర్వకామఫలప్రదమ్ ॥63॥**

దీనిని ఉపనయనం కాని వాడైనా సర్వపర్వదినాలలో జరుపవచ్చు. ఇది సాధారణశ్రాద్ధం. సర్వకామఫలాలను ప్రసాదించేది.

**భార్యావిరహితోఽప్యేతత్ప్రవాసస్థోఽపి భక్తిమాన్ ।
శూద్రోఽప్యమన్త్రవత్కుర్యాదనేన విధినా బుధః ॥64॥**

భార్య లేనివాడు, ప్రవాసంలో ఉండేవాడు కూడా దీన్ని నిర్వహించవచ్చు. అమంత్రకంగా శూద్రుడు గూడా ఈ ప్రక్రియ ననుసరించి దీన్ని నిర్వహించవచ్చు.

**తృతీయమాభ్యుదయికం వృద్ధిశ్రాద్ధం తదుచ్యతే ।
ఉత్సవానన్దసంభారే యజ్ఞోద్వాహాదిమఙ్గలే ॥65॥**

ఇక ఆభ్యుదయికవృద్ధిశ్రాద్ధమనే మూడవ రకం శ్రాద్ధాన్ని గురించి వివరిస్తాను. దీనిని ఉత్సవ దినాలలో, ఆనందదాయకములైన కార్యాలు జరుగునప్పుడు, యజ్ఞాలు, పెండిండ్లు మున్నగు శుభకార్యాల ముందు జరపాలి.

మాతరః ప్రథమం పూజ్యాః పితరస్తదనన్తరమ్ ।
తతో మాతామహా రాజన్విశ్వేదేవా స్తథైవ చ ॥66॥

రాజా! ముందు తల్లులను అర్చించాలి. తర్వాత తండ్రులను, ఆపై మాతామహులను ఆరాధించాలి. తదనంతరం విశ్వేదేవతల నర్చించాలి.

ప్రదక్షిణోపచారేణ దధ్యక్షతఫలోదకైః ।
ప్రాఙ్ముఖో నిర్వపేత్పిణ్డాన్ దూర్వయా చ కుశైర్యుతాన్ ॥67॥

ప్రదక్షిణోపచారాలు చేయాలి. పెరుగు, అక్షతలు, ఫలాలు, నీరు సమర్పించాలి. తూర్పు మొగంగా వుంటూ గరికతోనూ, దర్భలతోనూ, గూడిన పిండాలను నిర్వపణం చేయాలి.

సంపన్నమిత్యభ్యుదయే ప్రీయతామిత్యుదీరయేత్ ।
యుగ్మా ద్విజాతయః పూజ్యా వస్త్రకార్తస్వరాదిభిః ॥68॥

'సంపన్నం' అని మంత్రం చెబుతూ సరిసంఖ్యలోనే ఇద్దరేసి చొప్పున ద్విజుల నర్చించాలి. 'ప్రీయతాం' అని మంత్రోచ్చారణం చేస్తూ వారికి వస్త్రాలు, స్వర్ణం మున్నగునవి సమర్పించాలి.

తిలార్థస్తు యవైః కార్యో నాన్దీశబ్దానుపూర్వకః ।
మాఙ్గల్యాని చ సర్వాణి వాచయేద్ద్విజపుఙ్గవైః ॥69॥

నువ్వులకు బదులుగా యవల నుపయోగించాలి. 'నాందీ' శబ్దాన్ని ఉచ్చరిస్తూ ఈ కార్యం జరపాలి. ద్విజశ్రేష్ఠుల చేత శుభావహాలైన స్తోత్రాలను, మంత్రాలను పఠింపచేయాలి.

ఏవం శూద్రోఽపి సామాన్యవృద్ధిశ్రాద్ధేఽపి సర్వదా ।
నమస్కారేణ మన్త్రేణ కుర్యాన్మన్త్రం వినా బుధః ॥70॥

ఇట్లు ఈ వృద్ధి శ్రాద్ధాన్ని శూద్రుడు కూడా ఇతర మంత్రాలు లేకుండా కేవలం నమస్కారమంత్రంతో జరుపవచ్చు.

(విశే – 'కుర్యాన్మంత్రం వినా బుధః' అనుటకు బదులు 'కుర్యాదామాన్నతః సదా' అన్న పాఠం స్వీకరిస్తే పక్వాన్నం కాకుండా ఆమాన్నంతో జరపాలని అర్థం చెప్పాలి.)

దానప్రధానః శూద్రః స్యాదిత్యాహ భగవాన్ ప్రభుః ।
దానేన సర్వకామాప్తిరస్య సఞ్జాయితే యతః ॥71॥

శూద్రుడు దాన ప్రధానుడని ప్రభువైన భగవంతుడు చెప్పాడు. దానంతోనే అతనికి సర్వాభీష్టాలూ సిద్ధిస్తాయి.

ఇతి శ్రీమత్స్యమహాపురాణే మత్స్యమనుసంవాదే శ్రాద్ధకల్పే సాధారణశ్రాద్ధవిధిర్నామ సప్తదశోఽధ్యాయః ॥17॥

శ్రీమత్స్య మహాపురాణంలోని మత్స్యమను సంవాదంలో శ్రాద్ధకల్పంలో సాధారణశ్రాద్ధవిధి అనే పదిహేడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టాదశోఽధ్యాయః - పద్దెనిమిదవ అధ్యాయం

బ్రాహ్మణాదీనా మాశౌచనిర్ణయః, ఏకోద్దిష్టాదివిధిశ్చ - బ్రాహ్మణాదుల ఆశౌచనిర్ణయం, ఏకోద్దిష్టాదివిధి

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఏకోద్దిష్టమథో వక్ష్యే యదుక్తం చక్రపాణినా ।
మృతే పుత్రైర్యథా కార్యమాశౌచం చ పితర్యపి ॥1॥

ఋషులారా! విష్ణుదేవుడు చెప్పిన తండ్రి మరణానంతరం పుత్రులు చేయవలసిన ఏకోద్దిష్ట శ్రాద్ధవిధానాన్ని, ఆశౌచం పాటించవలసిన పద్ధతినీ ఇప్పుడు వివరిస్తాను.

దశాహం శావమాశౌచం బ్రాహ్మణేషు విధీయతే ।
క్షత్రియేషు దశ ద్వే చ పక్షం వైశ్యేషు చైవ హి ॥2॥

బ్రాహ్మణులకు మృతాశౌచం పది దినాలు, క్షత్రియులకు పండ్రెండు దినాలు, వైశ్యులకు పదునైదు దినాలుగా విధించడమయింది.

శూద్రేషు మాసమాశౌచం సపిణ్డేషు విధీయతే ।
నైశం వాఽకృతచూడస్య త్రిరాత్రం పరతః స్మృతమ్ ॥3॥

శూద్రులకు ఆశౌచం ముప్పది దినాలవరకూ ఉంటుంది. చూడాకర్మ జరుగని శిశువు మరణిస్తే ఒక దినంవరకూ, మూడేండ్లు నిండి ఉపనయనం కానంత వరకూ, ద్విజేతరులైతే వివాహం జరుగునంతవరకూ మూడు దినాలు మృతాశౌచం పాటించాలి.

జననేఽప్యేవమేవ స్యాత్సర్వవర్ణేషు సర్వదా ।
తథాఽస్థిసఞ్చయాదూర్ధ్వమఙ్గస్పర్శో విధీయతే ॥4॥

జాతాశౌచం కూడా అన్ని వర్ణాలవారికీ ఇలాగే వుంటుంది. పిత్రాదుల మరణానంతరం అస్థిసంచయనం జరిగిన తరువాతనే అంగస్పర్శం (మృతుని కుమారుడు మున్నగు శ్రాద్ధకర్తలను సన్నిహితులు స్పృశించుట) విధించబడినది.

ప్రేతాయ పిణ్డదానం తు ద్వాదశాహం సమాచరేత్ ।
పాథేయం తస్య తత్ప్రోక్తం యతః ప్రీతికరం మహత్ ॥5॥

ప్రేతానికి పిండప్రదానం పండ్రెండు దినాలవరకూ చేయాలి. దానికది దారిబత్తెమై ఎంతో ప్రీతి కలిగిస్తుంది.

తస్మాత్ప్రేతపురం ప్రేతో ద్వాదశాహం న నీయతే ।
గృహం పుత్రం కలత్రం చ ద్వాదశాహం ప్రపశ్యతి ॥6॥

ప్రేతం ఆ పండ్రెండు దినాల వరకూ ప్రేతపురానికి తీసుకుపోబడదు. మృతప్రాణి అంతవరకూ తన ఇంటిని, పుత్రుణ్ణి, భార్యనూ తదితరులనూ చూస్తూ వుంటుంది.

తస్మాన్నిధేయమాకాశే దశరాత్రం పయస్తథా ।
సర్వదాహోపశాన్త్యర్థమధ్వశ్రమ వినాశనమ్ ॥7॥

అందువల్ల పది దినాలవరకూ ఆకాశంలో వ్రేలాడే విధంగా ప్రేతము నుద్దేశించి దాని తాపముపశమింప జేయడానికై నీటితో నింపిన పాత్రను వ్రేలాడదీయాలి. ఇందుచేత ఆ ప్రేతానికి తాపశాంతి, మార్గశ్రమవినాశం జరుగుతాయి.

తత ఏకాదశాహే తు ద్విజానేకాదశైవ తు ।
క్షత్రాదిః సూతకాన్తే తు భోజయేదయుజో ద్విజాన్ ॥8॥

ఆపై పదునొకండవరోజున పదునొకండు మంది ద్విజులను భోక్తలుగా పిలిచి శ్రాద్ధం జరపాలి. క్షత్రియులు మున్నగు వారు కూడా బేసి సంఖ్య గల ద్విజులను భుజింపచేయాలి.

ద్వితీయేఽహ్ని పునస్తద్వదేకోద్దిష్టం సమాచరేత్ ।
ఆవాహనాగ్నౌకరణం దైవహీనం విధానతః ॥9॥

ఆపై రెండవ దినాన ప్రేతమునుద్దేశించి ఏకోద్దిష్టం నిర్వహించాలి. (ప్రేతాన్ని మాత్రమే ఉద్దేశించి చేసేది ఏకోద్దిష్టం). ఇందులో ఆవాహనం, అగ్నౌకరణం విధిననుసరించి వుంటాయి. విశ్వేదేవార్చన వుండదు.

ఏకం పవిత్రమేకార్ఘ్యమేకః పిణ్డో విధీయతే ।
ఉపతిష్ఠతామిత్యేతద్దేయం పశ్చాత్తిలోదకమ్ ॥10॥

ఒకే పవిత్రం, ఒక అర్ఘ్యం, ఒకే పిండం – ఇందులో విధింపబడివున్నాయి. 'ఇదముపతిష్ఠతామ్' (ఇది ఈ ప్రేతానికి సన్నిహితమై వుండుగాక) అని చెప్పాలి. పిండదానానంతరం తిలోదక మివ్వాలి.

స్వదితం వికిరేద్ బ్రూయాద్విసర్గే చాభిరమ్యతామ్ ।
శేషం పూర్వవదత్రాపి కార్యం వేదవిదా పితుః ॥11॥

వికిర పిండం ఇచ్చేటప్పుడు 'స్వదితం' (చక్కగా భుజింపబడింది) అనీ, బ్రాహ్మణులకు వీడ్కోలు పలుకునప్పుడు 'అభిరమ్యతామ్' (సుఖించుగాక!) అనీ చెప్పాలి. వేదవేత్త తక్కిన పితృ క్రియాకలాపమంతా ఇప్పుడు కూడా పూర్వం లాగే చేయాలి.

అనేన విధినా సర్వమనుమాసం సమాచరేత్ ।
సూతకాన్తే ద్వితీయేఽహ్ని శయ్యాం దద్యాద్విలక్షణామ్ ॥12॥

ఈ రీతిగా ఏకోద్దిష్టం ప్రతినెలా జరపాలి. ఆశౌచం తీరిన పిదప రెండవ రోజున ప్రేతము నుద్దేశించి విలక్షణమైన శయ్యనూ ప్రదానం చేయాలి.

కాంచనం పురుషం తద్వత్ఫలవస్త్రసమన్వితమ్ ।
సంపూజ్య ద్విజదామ్పత్యం నానాభరణభూషణైః ॥13॥

అట్లే ఒక బంగారు ప్రతిమను, ఫలాలను, వస్త్రాలను, నానాభరణభూషణాలతో సహా ద్విజదంపతులను పూజించి వారికి సమర్పించాలి.

వృషోత్సర్గం ప్రకుర్వీత దేయా చ కపిలా శుభా ।
ఉదకుమ్భశ్చ దాతవ్యో భక్ష్యభోజ్యసమన్వితః ॥14॥

మరియు ఒక ఆబోతును విడువాలి. మంగళకరమైన కపిల గోవును దానమివ్వాలి. భక్ష్య భోజ్యసమన్వితంగా ఒక ఉదకుంభాన్ని దానం చేయాలి.

యావదబ్దం నరశ్రేష్ఠ స తిలోదకపూర్వకమ్ ।
తతః సంవత్సరే పూర్ణే సపిణ్డీకరణం భవేత్ ॥15॥

రాజా! ఇలా ఒక సంవత్సరకాలం పూర్తి అయ్యే వరకూ తిలోదకపూర్వకంగా ఆయాక్రియలను నిర్వర్తించాలి. సంవత్సరం పూర్తికాగానే సపిండీకరణం జరపాలి.

సపిణ్డీకరణాదూర్ధ్వం ప్రేతః పార్వణభాగ్భవేత్ ।
వృషోత్సర్గం సుతః కుర్యాత్ పిత్రోశ్చైకాదశేఽహని ॥16॥

సపిండీకరణం జరిగిన పిమ్మట చనిపోయిన మనిషికి ప్రేతత్వం తీరిపోతుంది. అప్పుడా ప్రేతానికి పార్వణశ్రాద్ధం పెట్టడానికి అర్హత కల్గుతుంది. మాతాపితలు గతించిన తరువాత వారి పుత్రుడు పదునొకండవ దినాన ఆబోతును విడిచిపెట్టాలి.

అథవా పుణ్యదివసే విధినా వృషముత్సృజేత్ ।
వృషోత్సర్గం సుతో మాసి కుర్యాదేకాదశేఽహని ॥17॥

సహోమం విధివచ్చైవ పితర్యపి చ జీవతి ।
వృద్ధిపూర్వేషు యోగ్యశ్చ గృహస్థశ్చ భవేత్తతః ॥18॥

ఈ వృషోత్సర్గాన్ని ఏదైనా పుణ్యదినమునందు కూడా జరుపవచ్చును. తండ్రి జీవించి వుండగా తల్లి మరణించినప్పుడు పదునొకండవదినాన గాని, పుణ్యదినాన గాని వృషోత్సర్గం చేయాలి. తండ్రి జీవించివున్నప్పుడు కూడా ఈ పని చేయవచ్చును. ఇలా చేసిన కుమారులు వృద్ధిపూర్వకాలైన కార్యాలు జరుపుటకు యోగ్య లవుతారు. గృహస్థుడయ్యే యోగ్యత గూడా కల్గుతుంది.

(విశే – ఇందలి 16వ శ్లోకము యొక్క ఉత్తరార్థము 17వ శ్లోకము, 18వ శ్లోకము యొక్క పూర్వార్థము ఆర్షభారతి వారి ప్రచురణ నుండి గ్రహించడమైనది.)

సపిణ్డీకరణ శ్రాద్ధం దేవపూర్వం నియోజయేత్ ।
పితౄనేవాశ్రయేత్తత్ర పృథక్ప్రేతం వినిర్దిశేత్ ॥19॥

సపిండీకరణమైన శ్రాద్ధకార్యాన్ని విశ్వేదేవార్చన పూర్వకంగా నిర్వర్తించాలి. ఇందులో పితృత్వాని కర్హతగల వారిని మాత్రమే స్వీకరించాలి. ప్రేతను వేరుగా గ్రహించాలి.

గన్ధోదకతిలైర్యుక్తం కుర్యాత్పాత్రచతుష్టయమ్ ।
అర్ఘ్యార్థం పితృపాత్రేషు ప్రేతపాత్రం ప్రసేచయేత్ ॥20॥

పితృస్థానములో నాల్గు పాత్రల నుంచాలి. గంధం, ఉదకం, తిలలతో వాటిని వేరు వేరుగా నింపాలి. తదుపరి ప్రేతపాత్రములోని గంధతిలకయుక్తమైన నీటిని మూడు భాగాలుగా తక్కిన మూడు పాత్రలలో కలిపి వేయాలి.

తద్వత్సంకల్ప్య చతురః పిణ్డాన్ పిండప్రదస్తథా ।
యే సమానా ఇతి ద్వాభ్యామన్త్యం తు విభజేత్రిధా ॥21॥

తదుపరి పిండప్రదాత పితరులకు మూడు, ప్రేతకు ఒకటిగా నాల్గు పిండాలు చేయాలి. 'యే సమానా' అని ప్రారంభమయ్యే రెండు మంత్రాలతో నాల్గవ పిండాన్ని మూడుగా విభజించి ఆ పిండాలను పితృపిండాలతో కలిపి వేయాలి.

చతుర్థస్య పునః కార్యం న కదాచిదతో భవేత్ ।
తతః పితృత్వమాపన్నః సర్వతఃపుష్టమాగతః ॥22॥

అగ్నిష్వాత్తాదిమధ్యత్వం ప్రాప్నోత్యమృతముత్తమమ్ ।
సపిణ్డీకరణాదూర్ధ్వం తస్మై తస్మాన్న దీయతే ॥23॥

పితృష్వేవ హి దాతవ్యం తత్పిణ్డో యేషు సంస్థితః ।
తతః ప్రభృతి సంక్రాన్తావుపరాగాదిపర్వసు ॥24॥

త్రిపిండమాచరేచ్ఛ్రాద్ధమేకోద్దిష్టే మృతేఽహని ।
ఏకోద్దిష్టం పరిత్యజ్య మృతాహే యః సమాచరేత్ ॥25॥

తథైవ పితృహా స స్యాన్మాతృభ్రాతృవినాశకః ।
మృతాహే పార్వణం కుర్వన్నధోఽధో యాతి మానవః ॥26॥

నాల్గవ పిండానికి అంతకంటే వేరుగా వినియోగములేదు. ఇలా చేయడం వల్ల మృతజీవుడు ప్రేతత్వం వీడి పితృత్వం పొంది పుష్టిమంతు డవుతాడు. అగ్నిష్వాత్తాది పితృదేవతల వద్ద ఉత్తమము, శాశ్వతమూ అయిన స్థానం పొందుతాడు. అందువల్ల సపిండీకరణానంతరం జీవుడు వర్గత్రయంలోనివా డవుతాడు. అతనికి వేరుగా పితృకార్యాలు జరుపబడవు. ప్రేతానికి చెందిన పిండమిప్పుడు పై పెద్దల పిండములోనికి చేరిపోయింది. కనుక ప్రేతం పితరులలో ఒకడైనాడు. అందుచేత అదిమొదలు సంక్రాంతి, చంద్రగ్రహణం మొదలైన పర్వదినాలలోనూ, మృతిచెందిన దినమునందునూ మూడు పిండాలతో శ్రాద్ధం నిర్వహించాలి. మరణదినాన ప్రేతమునుద్దేశించి చేసే శ్రాద్ధం ఏకోద్దిష్టంగానే వుండాలి. అలాకాక మరణదినాన ఏకోద్దిష్టాన్ని విడిచిపెట్టి వేరేరకంగానే చేసినవాడు తల్లి దండ్రులను, సోదరులను చంపినవాడవుతాడు. మిక్కిలి అధోగతికి పోతాడు.

సంపర్కే త్వాకులీభావః ప్రేతేషు తు యతో భవేత్ ।
ప్రతిసంవత్సరం తస్మాదేకోద్దిష్టం సమాచరేత్ ॥27॥

ప్రేతలకు పితరులతో సంపర్కం కలిగితే కలవరం చెందుతారు. కావున సంవత్సరంలో వారికి ఏకోద్దిష్టమైన శ్రాద్ధమునే జరపాలి.

యావదబ్దం తు యో దద్యాదుదకుమ్భం విమత్సరః ।
ప్రేతాయాన్నసమాయుక్తం సోఽశ్వమేధఫలం లభేత్ ॥28॥

మత్సరం వీడి సంవత్సరం నిండే వరకూ ప్రేతానికి అన్నంతో కూడిన ఉదకుంభాన్ని ఇచ్చేవాడు అశ్వమేధం చేసినంత పుణ్యం పొందుతాడు.

ఆమశ్రాద్ధం యదా కుర్యాద్విధిజ్ఞః శ్రాద్ధదస్తథా ।
తేనాగ్నౌకరణం కుర్యాత్పిణ్డాంస్తేనైవ నిర్వపేత్ ॥29॥

శాస్త్రవిధి నెఱింగినవాడు ఆమశార్ధ్రం చేసేటప్పుడు అగ్నౌకరణమైనా, పిండదానమైనా ఆమపదార్థాలతోనే చేయాలి. పక్వపదార్థంతో చేయరాదు.

త్రిభిస్సపిండీకరణే అశేషత్రితయే పితా ।
యదా ప్రాప్స్యతి కాలేన తదా ముచ్యేత బన్ధనాత్ ॥30॥

ప్రేతకు పై పెద్దలతో సపిండీకరణం జరుగగానే అతడు పితృవర్గంలో ఒకడైపోతాడు. ప్రేతత్వమనే బంధమునుండి విడుదలపొందుతాడు.

ముక్తోఽపి లేపభాగిత్వం ప్రాప్నోతి కుశమార్జనాత్ ।
లేపభాజశ్చతురాద్యాః పిత్రాద్యాః పిండభాగినః ॥
పిణ్డదః సప్తమస్తేషా సాపిణ్డ్యం సాప్తపౌరుషమ్ ॥31॥

ఇలా ముక్తిపొందిన నాడు కూడా తన పుత్రుడు గాక మిగిలిన వారి నుండి కుశమార్జన పూర్వకమైన లేపాన్ని (పిండములలో మిగిలి అంటును) ఆహారంగా పొందుట కర్హుడవుతాడు.

మూడు తరాలకు పైన నాల్గవతరం నుండి పైవారు లేపభాక్కులు. తండ్రి, తాత, ముత్తాత–వీరు పిండభాక్కులు. ఏడుతరాలవరకూ ఎవరైనా పూర్వులకు పిండాలు వేయవచ్చు.ఎందుకంటే సపిండత్వం ఏడుతరాలవరకూఉంటుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే బ్రాహ్మణాదీనా మాశౌచనిర్ణయః, ఏకోద్దిష్టాదివిధిశ్చేతి అష్టాదశోఽధ్యాయః॥18॥

శ్రీమత్స్యమహాపురాణంలోని మత్స్యమనుసంవాదంలో బ్రాహ్మణాదుల ఆశౌచనిర్ణయం, ఏకోద్దిష్టాదివిధి అనే పద్దెనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనవింశోఽధ్యాయః - పందొమ్మిదవ అధ్యాయం

ద్విజాదికృతశ్రాద్ధేన పితృతృప్తివిషయః - ద్విజాదులు చేసిన శ్రాద్ధముతో పితరులకు తృప్తి గల్గు విషయం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

కథం కవ్యాని దేయాని హవ్యాని చ జనైరిహ ।
గచ్ఛన్తి పితృలోకస్థాన్ ప్రాపకః కోఽత్ర గద్యతే ॥1॥

పితృదేవతల కిచ్చిన కవ్యాలు, విశ్వే దేవులు మున్నగు వారికిచ్చిన హవ్యాలు పితృలోకంలో ఉన్నవారి కెలా చేరుతాయి? అలా వారిదగ్గరికి వాటిని చేర్చేవారెవరు?

యది మర్త్యో ద్విజో భుంక్తే హూయతే యది వాఽనలే ।
శుభాశుభాత్మకం ప్రేతైర్దత్తం తద్భుజ్యతే కథమ్ ॥2॥

భుజించువాడు మానవుడైన విప్రుడు. హెూమము చేసేది అగ్నిహెూత్రములో. ప్రేతల నుద్దేశించి యిచ్చిన ఈ పదార్థాలు శుభాశుభరూపములైన హవ్యకవ్యాలు ప్రేతలచే ఎలా అనుభవింపబడుతున్నాయి?

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

వసూన్వదన్తి చ పితౄన్ రుద్రాంశ్చైవ పితామహాన్ ।
ప్రపితామహాంస్తథాఽఽదిత్యానిత్యేవం వైదికీ శ్రుతిః ॥3॥

శ్రాద్ధప్రక్రియలో తల్లినీ తండ్రినీ వసువు లంటారు. పితామహులను రుద్రులంటారు. ప్రపితామహులను ఆదిత్యు లంటారు. ఇది శ్రుతినిర్ణయం.

నామగోత్రం పితౄణాం తు ప్రాపకం హవ్యకవ్యయోః ।
శ్రాద్ధస్య మన్త్రాః శ్రద్ధా చ ఉపయోజ్యాఽతిభక్తితః ॥4॥

పితరులను పేర్కొనునప్పుడు వారి నామాన్నీ, గోత్రాన్నీ గూడా పేర్కొంటారు. ఆ నామగోత్రాలే హవ్యకవ్యాలను వారి వద్దకు చేరుస్తున్నాయి. అంతేకాక శ్రాద్ధమంత్రాలు, శ్రద్ధ భక్తితో శ్రాద్ధంలో ఉపయోగించదగివున్నాయి.

అగ్నిష్వాత్తాదయస్తేషామాధిపత్యే వ్యవస్థితాః ।
నామగోత్రం కాలదేశా భవాన్తరగతానపి ॥5॥

ప్రాణినః ప్రీణయన్త్యేతే తదాహారత్వమాగతాన్ ।
దేవో యది పితా జాతః శుభకర్మానుయోగతః ॥6॥

తస్యాన్నమమృతం భూత్వా దివ్యత్వేఽప్యనుగచ్ఛతి ।
దైత్యత్వే భోగరూపేణ పశుత్వే చ తృణం భవేత్ ॥7॥

అగ్నిష్వాత్తాదులు మున్నగు పితృదేవతాగణాలకు చెందినవారు పితరులకూ, వారికుద్దేశించిన ద్రవ్యాలకూ అధిపతులైయున్నారు. నామ గోత్రాలు, దేశకాలాలు పేర్కొంటూ పితరుల నుద్దేశించి చెప్పే వసురుద్రాదిత్యరూపాలైన నిర్దేశాలు వారి వారి ఆహారాన్ని వారి వారికి జన్మాంతరాలలో గూడా అందజేసి తృప్తి కల్గిస్తాయి. ఒక శ్రాద్ధ కర్త తండ్రి పుణ్యబలంతో దేవతగా అయితే అతని అన్నం అమృతమై దివ్యత్వదశలో గూడా అతణ్ణి చేరుతుంది. అతడు దైత్యుడైతే భోగరూపంలో అందుతుంది. అతడు పశువైతే గడ్డిగా అతణ్ణి చేరుతుంది.

శ్రాద్ధాన్నం వాయురూపేణ సర్పత్వేఽప్యుపతిష్ఠతి ।
పానం భవతి యక్షత్వే రాక్షసత్వే తథాఽఽమిషమ్ ॥8॥

అతడు పామైతే శ్రాద్ధాన్నం వాయురూపంలోనూ, యక్షుడైతే పానీయంగానూ, రాక్షసుడైతే మాంసంగానూ అందుతుంది.

దనుజత్వే తథా మాయా ప్రేతత్వే రుధిరోదకమ్ ।
మనుష్యత్వేఽన్నపానాని నానాభోగరసం భవేత్ ॥9॥

దనుజుడైతే మాయారూపంలోనూ, పిశాచమైతే రక్తోదకంగానూ, మనుజుడైతే అన్నపానాలుగానూ, వివిధ భోగరసాలుగా వారి వారిని చేరుతాయి.

రతిశ్శక్తిః స్త్రియః కాన్తిర్భోజ్యం భోజనశక్తితా ।
దానశక్తి స్సవిభవరూప మారోగ్యమేవ చ ॥10॥
శ్రాద్ధపుష్పమిదం ప్రోక్తం ఫలం బ్రహ్మసమాగతః ।

రతి, శక్తి, స్త్రీలు, కాంతి, భోజ్యం, భోజనశక్తి, దానశక్తి, సంపద, రూపం, ఆరోగ్యం ఇవన్నీ శ్రాద్ధం పూచిన పూలు, ఫలం బ్రహ్మత్వసిద్ధి.

ఆయుః పుత్రాన్ ధనం విద్యాం స్వర్గం మోక్షం సుఖాని చ ।
రాజ్యం చైవ ప్రయచ్ఛన్తి ప్రీతాః పితృగణా నృణామ్ ॥11॥

శ్రాద్ధంతో ప్రీతినొందిన పితృదేవతలు ఆయువును, పుత్రులను, ధనాన్ని, విద్యనూ, స్వర్గాన్నీ, మోక్షాన్నీ, సుఖాలనూ, రాజ్యమును కూడా ప్రసాదిస్తారు.

శ్రూయతే చ పురా మోక్షం ప్రాప్తాః కౌశికసూనవః ।
పఞ్చభిర్జన్మసమ్బన్ధైర్గతా విష్ణోః పరం పదమ్ ॥12॥

పూర్వం కౌశికుని పుత్రులు పితృదేవతలను తృప్తిపరచి ఐదు జన్మలలో మోక్షం పొంది విష్ణుపదం చేరుకొన్నారని వింటున్నాము.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే ద్విజాదికృతశ్రాద్ధేన పితృతృప్తివిషయో నామ ఏకోనవింశోఽధ్యాయః॥19॥

శ్రీమత్స్యమహాపురాణంలోని మత్స్యమనుసంవాదంలో ద్విజాదులు చేసిన శ్రాద్ధముతో పితరులకు తృప్తి గల్గు విషయం అనే పందొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

వింశోఽధ్యాయః - ఇరవైయవ అధ్యాయం

కౌశికదాయాదకృతశ్రాద్ధాత్తేషాం విష్ణులోకప్రాప్తిః-కౌశికుని దాయాదులు శ్రాద్ధం చేసి విష్ణులోకం పొందుట

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

కథం కౌశికదాయాదాః ప్రాప్తాస్తే యోగముత్తమమ్ ।
పఞ్చభిర్జన్మసమ్బన్ధైః కథం కర్మక్షయోఽభవత్ ॥1॥

కౌశికుని దాయాదులు శ్రాద్ధం చేసి ఎలా ఉత్తమమైన యోగం పొందగలిగారు? ఐదు జన్మల సంబంధంతో వారికి కర్మక్షయ మెలా సంభవించింది?

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

కౌశికో నామ ధర్మాత్మా కురుక్షేత్రే మహాన్ ఋషిః ।
నామతః కర్మతస్తస్య సుతాన్సప్త నిబోధత ॥2॥

కురుక్షేత్రంలో పూర్వం గొప్ప ధర్మాత్ముడైన ఋషి ఉండేవాడు. అతనికేడుగురు కొడుకులు. పేరుకు తగ్గ ఆచరణ కల్గిన వారినిగూర్చి వివరిస్తాను, తెలుసుకోండి.

స్వసృపః క్రోధనో హింస్రః పిశునః కవిరేవ చ ।
వాగ్దుష్టః పితృవర్తీ చ గర్గశిష్యాస్తదాఽభవన్ ॥3॥

స్వసృపుడు, క్రోధనుడు, హింస్రుడు, పిశునుడు, కవి, వాగ్దుష్టుడు, పితృవర్తి అని వారి పేర్లు. వీరు గర్గాచార్యునివద్ద శిష్యరికం చేశారు.

(విశే - వారి పేర్లకు క్రమంగా అర్థాలు - తనయిష్టప్రకారం నడచుకొనేవాడు, కోపిష్ఠి, ఇతరులను అకారణంగా హింసించేవాడు, చాడీలు చెప్పువాడు, కవిత్వం చెప్పువాడు, దుష్టవచనాలు పలికేవాడు, తండ్రి మార్గాన్ని అనుసరించేవాడు)

పితర్యుపరతే తేషామభూద్దుర్భిక్షముల్బణమ్ ।
అనావృష్టిశ్చ మహతీ సర్వలోకభయంకరీ ॥4॥

కొంత కాలానికి వారి తండ్రి మరణించాడు. అంతట తీవ్రమైన కరవు సంభవించింది. సమస్త లోకానికీ భయంకరమైన గొప్ప వర్షాభావం ఏర్పడింది.

గర్గాదేశాద్వనే దోగ్ధ్రీం రక్షన్తస్తే తపోధనాః ।
ఖాదామః కపిలామేతాం వయం క్షుత్పీడితా భృశమ్ ॥5॥

గర్గాచార్యుని ఆదేశము ననుసరించి వారు ఒకపాడియావును మేపుతూ వుండినారు. వారిలో కొందరు “మనం మిక్కిలి ఆకలితో పరితపిస్తున్నాము. ఈ కపిలగోవును చంపి తిందాము” అని చెప్పారు.

ఇతి చిన్తయతాం పాపం లఘుః ప్రాహ తదాఽనుజః ।
యద్యవశ్యమియం వధ్యా శ్రాద్ధరూపేణ యోజ్యతామ్ ॥6॥

అని వారలా ఆలోచిస్తుండగా కడపటివాడు ఇది పాపకార్యమన్నాడు. దీనిని చంపక తప్పని స్థితిలో పితృశ్రాద్ధమునకై దీనిని వధించడం తగునన్నాడు.

శ్రాద్ధే నియోజ్యమానేయం పాపం నశ్యతి నో ధ్రువమ్ ।
తతః కుర్విత్యనుజ్ఞాతః పితృవర్తీ తదాఽనుజః ॥7॥

దీనిని శ్రాద్ధంలో వినియోగిస్తే గోవధ పాపం మనకంటదని వాడు చెప్పేసరికి "సరే అలాగే చెయ్" అని తక్కినవా రతని కనుమతి నిచ్చారు.

చక్రే సమాహితః శ్రాద్ధముపయుజ్య చ తాం పునః ।
ద్వౌ దేవే భ్రాతరౌ కృత్వా పిత్రే త్రీనప్యనుక్రమాత్ ॥8॥

అప్పుడాపితృవర్తి దానిని శ్రాద్ధములో ఉపయోగించి శ్రద్ధతో శ్రాద్ధం నిర్వర్తించాడు. దేవస్థానంలో ఇద్దరు సోదరులనూ, పితృస్థానములో ముగ్గురినీ ఏర్పాటు చేశారు.

తథైకమతిథిం కృత్వా శ్రాద్ధదః స్వయమేవ తు ।
చకార మన్త్రవచ్ఛ్రాద్ధం స్మరన్ పితృపరాయణః ॥9॥

మరొకణ్ణి అతిథి స్థానంలో ఉంచి తాను శ్రాద్ధకర్తయై మంత్రపూర్వకంగా పితృభక్తితో శ్రాద్ధం చేశాడు.

వినా గవా వత్సకోఽపి గురవే వినివేదితః ।
వ్యాఘ్రేణ నిహతా ధేనుర్వత్సోఽయం ప్రతిగృహ్యతామ్ ॥10॥

తదుపరి వారు గోవులేని దూడను గురువు గారి కప్పగించారు. "పులి ఆవును చంపివేసింది, దూడను స్వీకరించండి" అని నివేదించారు.

ఏవం సా భక్షితా ధేనుస్సప్తభిస్తైస్తపోధనైః ।
వైదికం బలమాశ్రిత్య క్రూరే కర్మణి నిర్భయాః ॥11॥

ఈ రీతిగా ఆతపోధను లేడుగురు వైదిక బలమునాశ్రయించి నిర్భయులై క్రూరకర్మచేసి ఆధేనువును భక్షించారు.

తతః కాలావకృష్టాస్తే వ్యాధా దాశపురేఽభవన్ ।
జాతిస్మరత్వం ప్రాప్తాస్తే పితృభావేన భావితాః ॥12॥

తరువాత వారు కాలవశులై కొంతకాలానికి మరణించి జన్మాంతరంలో దాశపురంలో బోయలై పుట్టారు. పితృశ్రాద్ధం శ్రద్ధతో జరపడం వల్ల వారికి పూర్వస్మృతి సిద్ధించింది.

యత్కృతం క్రూరకర్మాపి శ్రాద్ధరూపేణ తైస్తదా ।
తేన తే భవనే జాతా వ్యాధానాం క్రూరకర్మణామ్ ॥13॥

శ్రాద్ధరూపమైన కర్మ ఐనా అది క్రూరకర్మ కావడం వల్ల వారు క్రూరకర్ములైన వ్యాధుని యింట జన్మించారు.

పితౄణాం చైవ మాహాత్మ్యాజ్జాతా జాతిస్మరాస్తు తే ।
తేన వైరాగ్య యోగేన ఆస్థాయానశనం పునః ॥14॥

జాతిస్మరాస్సప్త జాతా మృగాః కాలంజరే గిరౌ ।
నీలకణ్ఠస్య పురతః పితృభావానుభావితాః ॥15॥

తత్రాపి జ్ఞానవైరాగ్యాత్ప్రాణానుత్సృజ్య ధర్మతః ।
లోకైరవేక్ష్యమాణాస్తే తీర్థాన్తేఽనశనేన తు ॥16॥

పితృప్రభావం వల్ల వారు పూర్వజన్మస్మరణ గలవారయ్యారు. తమ స్థితిని గమనించి వైరాగ్యంతో నిరాహారదీక్షపూని శరీర పరిత్యాగం చేశారు. తరువాతి పుట్టకలో వారేడుగురూ జాతిస్మృతి గల మృగాలుగా కాలంజర పర్వతంలో జన్మించారు. అక్కడ శివుని ఎదుట పితృభావప్రభావితులై జ్ఞానవైరాగ్యాలతో ధర్మబద్ధంగా జీవించి ప్రాణపరిత్యాగం చేశారు. వారు నిరాహారులై తీర్థవాసులై శరీరపరిత్యాగం చేయడాన్ని లోకులు ప్రత్యక్షంగా చూచారు.

మానసే చక్రవాకాస్తే సంజాతాః సప్త యోగినః ।
నామతః కర్మతః సర్వాన్ శృణుధ్వం ద్విజసత్తమాః ॥17॥

తరువాత వారు మానస సరస్సులో యోగనిష్ఠ గల చక్రవాకపక్షులుగా జన్మించారు. ద్విజవర్యులారా! అప్పట్లో వారి నామకర్మ లెట్టివో వినండి!

సుమనాః కుముదః శుద్ధశ్ఛిద్రదర్శీ సునేత్రకః ।
అనేత్రశ్చాంశుమాంశ్చైవ సప్తైతే యోగపారగాః ॥18॥

సుమనస్కుడు, కుముదుడు, శుద్ధుడు, ఛిద్రదర్శి, సునేత్రకుడు, అనేత్రుడు, అంశుమంతుడు – అను పేర్లతో వారు యోగవిద్యానిష్ణాతులై విరాజిల్లారు.

(విశే – క్రమంగా వారిపేర్ల అర్థాలు – మంచి మనస్సు కలవాడు, లోకానికి సంతోషం కల్గించేవాడు, నిర్మలుడు, ఇతరుల దోషాలు చూచేవాడు, మంచి చూచేవాడు, ఏమీ చూడనివాడు, కిరణ ప్రకాశవంతుడు)

యోగభ్రష్టాస్త్రయస్తేషాం బభ్రుముశ్చాల్పచేతనాః ।
దృష్ట్వా విభ్రాజనామానముద్యానే స్త్రీభిరన్వితమ్ ॥19॥

క్రీడన్తం వివిధైర్భావైర్మహాబలపరాక్రమమ్ ।
పాఞ్చాలాన్వయసంభూతం ప్రభూతబలవాహనమ్ ॥20॥

రాజ్యకామోఽభవత్త్వేకస్తేషాం మధ్యే జలౌకసామ్ ।
పితృవర్తీ చ సో విప్రః శ్రాద్ధకృత్పితృవత్సలః ॥21॥

వారిలో ముగ్గురు యోగభ్రష్టులై అల్పబుద్ధి గలవారై పరిభ్రమించారు. ఒకసారి వారు ఒక ఉద్యానంలో స్త్రీలతో సహా క్రీడిస్తున్న విభ్రాజుడు అనే రాజును చూచారు. అతడు వివిధ విలాసాలు గలవాడు, పాంచాల వంశంలో పుట్టినవాడు, గొప్ప సైన్యం, వాహనాలు గలవాడు. అలా చూచిన ఆ పక్షులలో ఒక పక్షికి రాజ్యంపై కోరిక కల్గింది. పితృవత్సలుడు, పితృశ్రాద్ధం చేసినవాడూ అయిన పితృవర్తియే ఆ కోరిక గల్గినవాడు.

అపరౌ మన్త్రిణౌ దృష్ట్వా ప్రభూతబలవాహనౌ ।
మన్త్రిత్వే చక్రతుశ్చేచ్ఛామస్మిన్మర్త్యే ద్విజోత్తమాః ॥22॥

ద్విజోత్తములారా! తక్కిన వారిలో ఇద్దరు మహాబలవాహనాదులు గల మంత్రులను చూచి మర్త్య లోకంలో మంత్రిపదవిపై కోరికగలవారయ్యారు.

తన్మధ్యే యే తు నిష్కామాస్తే బభూవుర్ద్విజోత్తమాః ।
విభ్రాజపుత్రస్త్వేకోఽభూద్బ్రహ్మదత్త ఇతి స్మృతః ॥23॥

వారిలో ఏ కోరికా లేనివారు ద్విజోత్తములుగా జన్మించారు. యోగభ్రష్టులలో ఒకడు భ్రాజుని పుత్రుడుగా పుట్టి బ్రహ్మదత్తుడని ప్రసిద్ధి వహించాడు.

మన్త్రిపుత్రౌ తథా చోభౌ కణ్డరీకసుబాలకౌ ।
బ్రహ్మదత్తోఽభిషిక్తః సన్పురోహితవిపశ్చితా ॥24 ॥

తక్కిన వారిరువురు కండరీక సుబాలకులన్న పేరుతో విభ్రాజుని మంత్రికి పుత్రులై జనించారు. ఆపై కొంత కాలానికి బ్రహ్మదత్తుడు కండరీక పండితునిచేత పాంచాలరాజుగా పట్టాభిషిక్తు డయ్యాడు.

పఞ్చాలరాజో విక్రాన్తః సర్వశాస్త్రవిశారదః ।
యోగవిత్సర్వజన్తూనాం రుతవేత్తాఽభవత్తదా ॥25॥

అతడు పరాక్రమశాలి, సకల శాస్త్రాలలో నిష్ణాతుడు, యోగవేత్త, సమస్త ప్రాణుల ధ్వని విశేషాలు తెలిసినవాడుగా శోభిల్లాడు.

తస్య రాజ్ఞోఽభవద్భార్యా దేవలస్యాఽఽత్మజా శుభా ।
సన్నతిర్నామ విఖ్యాతా కపిలా యాఽభవత్పురా ॥26॥

పూర్వం శ్రాద్ధంలో వినియుక్తమైన కపిల గోవు దేవలుడనే రాజుకు పుత్రికగా జన్మించి బ్రహ్మదత్తుని భార్య అయింది. ఆమె పేరు 'సన్నతి'.

పితృకార్యే నియుక్తత్వాదభవద్బ్రహ్మవాదినీ ।
తయా చకార సహితః స రాజ్యం రాజనన్దనః ॥27॥

పూర్వం పితృకార్యం నియోగింపబడడం వల్ల ఆమె బ్రహ్మవాదినిగా రూపొందింది. ఆమెతో గూడి ఆరాజకుమారుడు రాజ్యం పరిపాలించాడు.

కదాచిదుద్యానగత స్తయా సహ స పార్థివః ।
దదర్శ కీటమిథున మనఙ్గకలహాకులమ్ ॥28॥

ఒకనాడు భార్యతో కూడా ఉద్యానములో ఉండిన రాజు మదన ప్రవృత్తితో కలహించుకుంటున్న చీమల దంపతులను చూచాడు.

పిపీలికా మనునయన్ పరితః కీటకాముకః ।
పఞ్చబాణాభితప్తాఙ్గః సగద్గదమువాచ హ ॥29॥

మన్మథబాణపీడితమైన శరీరంగల మగచీమ ఆడుచీమను అనునయిస్తూ గద్గదస్వరంతో ఇలా అన్నది –

న త్వయా సదృశీ లోకే కామినీ విద్యతే క్వచిత్ ।
మధ్యే క్షామాఽతిజఘనా బృహద్వక్షోభిగామినీ ॥30॥

సువర్ణవర్ణా సుశ్రోణీ మద్భక్తా చారుహాసినీ ।
సులక్ష్యనేత్రరదనా గుడశర్కరవత్సలా ॥31॥

"నీతో సమానురాలైన వనిత ఈ లోకంలో ఎక్కడా లేదు. నీవు సన్నని నడుము, విశాలమైన కటి ప్రదేశం, పెద్ద వక్షోజాలు కలిగి మందగమనవై వున్నావు. బంగారు మేనిఛాయతో, చక్కని పిరుదులతో నున్నావు. నాపై భక్తి గలదానివి. చక్కని చిరునవ్వు, అందంగా కనిపించే కన్నులు, దంతాలు గల దానవు. నీకు చక్కెరపైనా, బెల్లం మీదా ప్రీతి ఎక్కువ.

భోక్ష్యసే మయి భుక్తే త్వం స్నాసి స్నాతే తథా మయి ।
ప్రోషితే సతి దీనా త్వం క్రుద్ధేఽపి భయచఞ్చలా ॥32॥

నేను భుజించిన పిదపనే నీవు భుజిస్తావు. నేను స్నానం చేసిన తరువాతనే నీవు స్నానం చేస్తావు. నేను దేశాంతరం పోతే దీనురాలివై ఉంటావు. నేను కోపిస్తే భయంతో వణకిపోతావు.

కిమర్థం వద కల్యాణి! సరోషవదనా స్థితా ।
సా తమాహ సకోపా తు కిమాలపసి మాం శఠ ॥33॥

త్వయా మోదకచూర్ణం తు మాం విహాయ వినేష్యతా ।
ప్రమత్తేన వ్యతిక్రాన్తే దినేఽన్యస్యాః సమర్పితమ్ ॥34॥

కల్యాణీ! నీవెందుకు నాపై రోషం కలముఖంతో ఉన్నావు!" అలా అన్న మగచీమతో ఆడ చీమ కోపంతో ఇలా అన్నది – "శఠుడా! ఏమంటున్నావు? నిన్న నీవు లడ్డుపొడి తీసుకుపోతూ ప్రమత్తుడవై నన్ను వదలి మరొకతెకు ఇచ్చావు గదా"!

పిపీలిక ఉవాచ :- అందుకు మగచీమ ఇలా సమాధానం చెప్పింది.

త్వత్సాదృశ్యాన్మయా దత్తమన్యస్యై వరవర్ణిని ।
తదేకమపరాధం మే క్షన్తుమర్హసి భామిని ॥35॥

నైతదేవం కరిష్యామి పునః క్వాపీహ సువ్రతే ।
స్పృశామి పాదౌ సత్యేన ప్రసీద ప్రణతస్య మే ॥36॥

"ఓ రమణీ! నిన్ను పోలివుంటే నీవే అనుకొని నేను లడ్డుపొడిని మరొకతెకిచ్చాను. భామినీ! ఈ నా ఒక్క తప్పును క్షమించు. ఇంకమీదట ఎప్పుడూ ఎక్కడా ఇలా చేయను. నీ కాళ్లు పట్టుకొని నిజంగా నీకు నమస్కరిస్తున్నాను. నన్ను అనుగ్రహించు".

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఇతి తద్వచనం శ్రుత్వా సా ప్రసన్నాఽభవత్తతః ।
ఆత్మానమర్పయామాస మోహనాయ పిపీలికా ॥37॥

ఇలా చెబుతున్న మగచీమ మాటలు విని ఆడు చీమ ప్రసన్నురాలైంది. తన్ను తన ప్రియునికి సమర్పించుకొన్నది.

బ్రహ్మదత్తోఽప్యశేషం తత్ జ్ఞాత్వా విస్మయమాగమత్ ।
సర్వసత్త్వరుతజ్ఞత్వాత్ప్రసాదాచ్చక్రపాణినః ॥38॥

విష్ణుదేవుని అనుగ్రహం వల్ల సమస్త ప్రాణుల సంభాషణను తెలిసి వున్న వాడైన బ్రహ్మదత్తుడు ఆ చీమలమధ్య జరిగినదంతా గ్రహించి ఆశ్చర్యం పొందాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే కౌశికదాయాదకృతశ్రాద్ధాత్తేషాం విష్ణులోకప్రాప్తిః నామ వింశతితమోఽధ్యాయః ॥ 20 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని మత్స్యమను సంవాదంలో కౌశికుని దాయాదులు శ్రాద్ధం చేసి విష్ణులోకం పొందుటఅనే ఇరవైయవ అధ్యాయం సంపూర్ణం

ఏకవింశోఽధ్యాయః - ఇరవైఒకటవ అధ్యాయం

చక్రవాక చతుష్టయస్య బ్రాహ్మణ జన్మ ప్రాప్తిః - చక్రవాకములు నాల్గింటికి బ్రాహ్మణ జన్మ ప్రాప్తి

ఋషయ ఊచు :- ఋషులు చెప్పారు.

కథం సత్త్వరుతజ్ఞోఽభూ ద్బ్రహ్మదత్తో ధరాతలే ।
తచ్చాభవత్కస్య కులే చక్రవాకచతుష్టయమ్ ॥1॥

భూతలంలో బ్రహ్మదత్తుడు ప్రాణుల ధ్వనులను ఎలా తెలుసుకోగలిగాడు? ఆ చక్రవాక పక్షులు నాలుగూ ఎవని కులంలో జన్మించాయి?

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

తస్మిన్నేవ పురే జాతాస్తే చ చక్రాహ్వయాస్తదా ।
వృద్ధద్విజస్య దాయాదా విప్రా జాతిస్మరాః పురా ॥2॥

అప్పు డాచక్రవాకపక్షులు ఆ పట్టణమునందే ఒక వృద్ధబ్రాహ్మణుని దాయాదులుగా జన్మించాయి. వారు పూర్వజన్మ స్మరణ కలిగిన విప్రులయ్యారు.

ధృతిమాంస్తత్త్వదర్శీ చ విద్యాచణ్డస్తథో(పో)త్సుకః ।
నామతః కర్మతశ్చైతే సుదరిద్రస్య తే సుతాః ॥3॥

ఆ వృద్ధద్విజుడు తన కర్మకూ, విద్యాచండుడు అను తన పేరుకూ తగినట్లు విద్యలలో సమర్థుడు, ధైర్యం కలవాడు, తత్త్వజ్ఞుడు, ఔత్సుక్యం కలవాడు. కాని మిక్కిలి దరిద్రుడు. ఆ నలుగురూ అతని కుమారులై జన్మించారు. (ధృతిమంతుడు, తత్త్వదర్శి, విద్యాచండుడు, తపోత్సుకుడు అని ఆ నలుగురి పేర్లు అనీ, వారి తండ్రిపేరు సుదరిద్రుడనీ కొందరు వివరించారు.)

తపసే బుద్ధిరభవ త్తదా తేషాం ద్విజన్మనామ్ ।
యాస్యామః పరమాం సిద్ధిమిత్యూచుస్తే ద్విజోత్తమాః ॥4॥

ఆ నలుగురు ద్విజోత్తములకూ తపస్సు చేయాలనే సంకల్పం కల్గింది. వారు తండ్రితో "మేము తపస్సు చేసి ఉత్తమసిద్ధిని పొందదలచినాము" అని చెప్పారు.

తతస్తద్వచనం శ్రుత్వా సుదరిద్రో మహాతపాః ।
ఉవాచ దీనయా వాచా కిమేతదితి పుత్రకాః! ॥5॥

అధర్మ ఏష ఇతి వః పితా తానభ్యవారయత్ ।
వృద్ధం పితరముత్సృజ్య దరిద్రం వనవాసినః ॥6॥

కో ను ధర్మోఽత్ర భవితా మత్త్యాగాద్గతిరేవ వా ।

వారి మాటలు విని మహాతపస్సంపన్నుడైన ఆ పండితుడు (సుదరిద్రుడు) దీనమైన మాటలతో "పుత్రులారా! ఏమిటిది?" అంటూ అధర్మకాములైన వారిని తండ్రి విధ్యుక్తవిధానంతో నివారించాడు. దరిద్రుడను, వృద్ధుడనైన తండ్రిని నన్ను వదలి వనవాసులగుటలో ధర్మ మేమున్నది? నన్ను త్యజించడం వల్ల మీకు ఎట్టి సద్గతి కలుగగలదు?"

ఊచుస్తే కల్పితా వృత్తిస్తవ తాత వదస్వ తత్ ॥7॥

విత్తమేతత్పురో రాజ్ఞ స్స తే దాస్యతి పుష్కలమ్ ।
ధనం గ్రామసహస్రాణి ప్రభాతే పఠతస్తవ ॥8॥

అందుకు వారతనితో ఇలా అన్నారు. "తండ్రీ! నీకు మేము జీవనవృత్తి కల్పించాము గదా! ఈ విషయం రాజుతో చెప్పు. ఉదయసమయంలో పఠించేటట్లు ఏర్పాటు గావించి రాజు నీకు పుష్కలంగా ధనమిస్తాడు. వేలకొలది గ్రామాలను నీకు జీవనానికై సమర్పిస్తాడు.

యే విప్రముఖ్యాః కురుజాఙ్గలేషు దాశాస్తథా దాశపురే మృగాశ్చ ।
కాలంజరే సప్త చ చక్రవాకా యే మానసే తే వయమత్ర సిద్ధాః ॥9॥

మొదట కురుక్షేత్రంలో ఏడుగురు బ్రాహ్మణులుగా, తరువాత దశపురంలో బోయలుగా, ఆపై కాలంజరంలో లేళ్ళుగా, పిదప మానససరస్సులో చక్రవాకపక్షులుగా ఉండిన మేము ఈ జన్మలలో ఇలా సిద్ధి పొందివున్నాము".

ఇత్యుక్త్వా పితరం జగ్ము స్తే వనం తపసే పునః ।
వృద్ధో౽పి రాజభవనం జగామా౽౽త్మార్థసిద్ధయే ॥10॥

అని తండ్రితో చెప్పి వారు నలుగురూ తపస్సు చేయడానికై అరణ్యానికి వెళ్ళారు. ఆ వృద్ధుడు తన కార్యం నెరవేర్చుకోవడానికై రాజభవనానికి పోయాడు.

అనఘో నామ వైభ్రాజః పాఞ్చాలాధిపతిః పురా ।
పుత్రార్థీ దేవదేవేశం హరిం నారాయణం ప్రభుమ్ ॥11॥

ఆరాధయామాన విభుం తీవ్రవ్రతపరాయణః ।
తతః కాలేన మహతా తుష్టస్తస్య జనార్దనః ॥12॥

(ఇక్కడ బ్రహ్మదత్తుని జన్మవృత్తాంతం చెప్పబడుతున్నది) పూర్వం విభ్రాజవంశంలో అనఘుడు(అణుహుడు) అనే రాజుండేవాడు. అతడు పాంచాలదేశానికి అధిపతి. అతడు పుత్రసంతానం కోరి దేవదేవేశ్వరుడు, ప్రభుడు, విభుడు, హరి అయిన నారాయణుని తీవ్రవ్రతతత్పరుడై ఆరాధించాడు. అలా చేయగా చాలా కాలానికి జనార్దను డారాజుపట్ల సంతోషించాడు.

వరం వృణీష్వ భద్రం తే హృదయేనేప్సితం నృప! ।
ఏవముక్తస్తు దేవేన వవ్రే స వరముత్తమమ్ ॥13॥

"రాజా! నీ హృదయంలో నీ వభిలషించిన వరం కోరుకొమ్ము. నీకు శుభమగు గాక!". ఇలా దేవుడు చెప్పగా ఆ రాజు ఉత్తమమైన వరము నిలా కోరాడు.

పుత్రం మే దేహి దేవేశ మహాబలపరాక్రమమ్ ।
పారగం సర్వశాస్త్రాణాం ధార్మికం యోగినాం పరమ్ ॥14॥

సర్వసత్త్వరుతజ్ఞం మే దేహి యోగినమాత్మజమ్ ।
ఏవమస్త్వితి విశ్వాత్మా తమాహ పరమేశ్వరః ॥15॥

"దేవప్రభూ! నాకు మహాబలపరాక్రమాలు గల పుత్రుణ్ణి ప్రసాదించు. అతడు సర్వశాస్త్రపారంగతుడుగా, శ్రేష్ఠయోగిగా ఉండాలి. సర్వప్రాణుల ధ్వనుల అర్థం తెలిసినవాడు కావాలి. అట్టి యోగిని కుమారునిగా అనుగ్రహించు". విశ్వాత్మకుడైన పరమేశ్వరుడు "అట్లే అగు గాక!" అని అతడు కోరిన వర మనుగ్రహించాడు.

పశ్యతాం సర్వదేవానాం తత్రైవాన్తరధీయత ।
తతస్స తస్య పుత్రోభూ౽ద్బ్రహ్మదత్తః ప్రతాపవాన్ ॥16॥

అలా అనుగ్రహించి దేవతలందరూ చూస్తూ వుండగానే ఆ దేవుడక్కడే అంతర్ధానమైపోయాడు. ఆ పై ఆ రాజుకు ప్రతాపశాలి అయిన బ్రహ్మదత్తుడు పుత్రుడుగా ఉద్భవించాడు.

సర్వసత్త్వానుకమ్పీ చ సర్వసత్త్వబలాధికః ।
సర్వసత్త్వరుతజ్ఞశ్చ సర్వసత్త్వేశ్వరేశ్వరః ॥17॥

ఆ బ్రహ్మదత్తుడు సర్వప్రాణుల పట్ల కరుణ గలవాడు, బలంలో సకలప్రాణులను మించినవాడు, సర్వప్రాణుల ధ్వనులను, వాటి అర్థాలనూ తెలిసినవాడు, సర్వప్రాణుల అధిపతులకూ అధిపతి.

అహసత్తేన యోగాత్మా స పిపీలికరాగతః ।
యత్ర తత్కీటమిథునం రమమాణమవస్థితమ్ ॥18॥

తతస్సా సన్నతిర్దృష్ట్వా తం హసన్తం సువిస్మితా ।
కిమప్యాశఙ్క్య మనసా తమపృచ్ఛన్నరేశ్వరమ్ ॥19॥

అతడు యోగాత్ముడు కావడంవల్ల చీమల జంట రమించుచుండగా చూచి వాటి భాషణం గ్రహించి నవ్వినాడు. అతడు నవ్వడం చూచి ఆశ్చర్యపడిన అతని భార్య సన్నతి మనస్సులో ఏదో శంకించి ఆ రాజునిలా అడిగింది.

సన్నతి రువాచ :– సన్నతి చెప్పింది.

అకస్మా దతిహాసస్తే కిమర్థమభవన్నృప! ।
హాస్యహేతుం న జానామి యదకాలే కృతం త్వయా ॥20॥

రాజా! అకస్మాత్తుగా మీరేల అతిగా నవ్వితిరి? మీరు అకాలంలో ప్రదర్శించిన ఈ నవ్వుకు కారణం నాకు తెలియదు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అవదద్రాజపుత్రో౽పి స పిపీలికభాషితమ్ ।
రాగవాగ్భిః సముత్పన్నమేతద్ధాస్యం వరాననే! ॥21॥

న చాన్యత్కారణం కిఞ్చిద్ధాస్యహేతౌ శుచిస్మితే! ।

ఆమెకు రాజు చీమల మాటలు తెలిపి "వరాననా! అనురాగం కల చీమల మాటలు విన్నందుకు నాకు నవ్వు వచ్చింది. నా నవ్వుకు మరేమీ కారణం లేదు" అని చెప్పాడు.

న సా౽మన్యత్తదా దేవీ ప్రాహాలీకమిదం వచః ॥22॥

అహమేవాద్య హసితా న జీవిష్యే త్వయా౽ధునా ।
కథం పిపీలికాలాపం మర్త్యో వేత్తి వినా సురాన్ ॥23॥

తస్మాత్త్వయా౽హమేవేహ హసితా కిమతః పరమ్ ।
తతో నిరుత్తరో రాజా జిజ్ఞాసుస్తత్పురో హరేః ॥24॥

కాని ఆ సన్నతి భర్తమాటలు విశ్వసించలేదు. "నీవు చెప్పినది నిజం కాదు. నన్నుద్దేశించే నీవు నవ్వావు. నీతో కలిసి నేను జీవించలేను. దేవతలు తప్ప చీమల మాటలు మానవు డెలా తెలుసుకోగలడు? ఇప్పుడు నీవు నన్ను గురించే నవ్వావు. ఇంతకంటే ఏమున్నది?" అందుకు నిరుత్తరుడైన రాజు ఈ విషయమును విష్ణుదేవునిముందే తెలుసుకోవాలనుకొన్నాడు.

ఆస్థాయ నియమం తస్థౌ సప్తరాత్రమకల్మషః ।
స్వప్నే ప్రాహ హృషీకేశః ప్రభాతే పర్యటన్పురమ్ ॥25॥

వృద్ధద్విజో యస్తద్వాక్యాత్సర్వం జ్ఞాస్యస్యశేషతః ।
ఇత్యుక్త్వా౽న్తర్దధే విష్ణుః ప్రభాతే౽థ నృపః పురాత్ ॥26॥

నియమం పూని ఏడురాత్రుల కాలం పాపరహితుడై హరిని ధ్యానించాడు. అప్పుడు శ్రీహరి కలలో కనిపించి "తెల్లవారగానే నగరంలో పర్యటించు. అప్పుడు ఒక వృద్ధ ద్విజుడు నీకు కనిపిస్తాడు. అతని మాటలద్వారా సర్వం గ్రహించగలవు" అని చెప్పి అంతర్హితుడయ్యాడు.

నిర్గచ్ఛన్మన్త్రి సహిత స్సభార్యో వృద్ధమగ్రతః ।
తతస్తం విప్రమాయాన్తం తం వృద్ధం సన్దదర్శ హ ॥27॥

మరునాడు తెల్లవారగానే రాజు పురంనుండి భార్యతోనూ, మిత్రులతోనూ కూడి వెలికి వచ్చాడు. అక్కడ ఎదురుగా వస్తున్న వృద్ధుడైన విప్రుణ్ణి చూచాడు.

బ్రాహ్మణ ఉవాచ :- బ్రాహ్మణుడు చెప్పాడు.

యే విప్రముఖ్యాః కురుజాఙ్గలేషు దాసాస్తథా దాశపురే మృగాశ్చ ।
కాళఞ్జరే సప్త చ చక్రవాకా యే మానసే తే వయమత్ర సిద్ధాః ॥28॥

ఆ విప్రుడు రాజును సమీపించి ఇలా అన్నాడు "కురుక్షేత్రంలో బ్రాహ్మణులుగా మొదట జన్మించినవారే దశపురంలో వ్యాధులుగా సంభవించారు. వారి పిదప కాలింజరగిరిలో లేళ్ళుగా ఉద్భవించారు. ఆ పై మానససరోవరంలో ఏడు చక్రవాకపక్షులుగా జన్మించారు. ఆ మేమే ఇప్పుడిక్కడ యోగసిద్ధి పొందియున్నాము.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఇత్యాకర్ణ్య వచస్తాభ్యాం స పపాత శుచా తతః ।
జాతిస్మరత్వమగమత్తౌ చ మన్త్రివరావుభౌ ॥29॥

బ్రాహ్మణుడు చెప్పిన ఆ మాటవిని రాజు శోకాకులుడై తన ఇద్దరు మంత్రులతో గూడ మూర్ఛితుడై క్రిందపడిపోయాడు. ఆ రాజుతోపాటు ఆ మంత్రులకు గూడా పూర్వజన్మ స్మరణ కలిగింది.

కామశాస్త్రప్రణేతా చ బాభ్రవ్యస్తు సుబాలకః ।
పాఞ్చాల ఇతి లోకేషు విశ్రుత స్సర్వశాస్త్రవిత్ ॥30॥

ఈ ఇరువురిలో సుబాలకుడు బాభ్రవ్య గోత్రంలో పుట్టినవాడు. పంచాలదేశంలో సర్వశాస్త్రజ్ఞుడుగా ప్రసిద్ధుడు. కామశాస్త్రమును ప్రవర్తింపజేసినవాడు.

కణ్డరీకోఽపి ధర్మాత్మా వైద్యశాస్త్రప్రవర్తకః ।
భూత్వా జాతిస్మరౌ శోకాత్పతితావగ్రతస్తదా ॥31॥

హా వయం యోగవిభ్రష్టాః కామతః కర్మబన్ధనాః ।
ఏవం విలప్య బహుశ స్త్రయస్తే యోగపారగాః ॥32॥

విస్మయాచ్ఛ్రాద్ధమాహాత్మ్యమభినన్ద్య పునః పునః ।
తతస్తస్మై ధనం దత్వా ప్రభూత గ్రామసంయుతమ్ ॥33॥

విసృజ్య బ్రాహ్మణం తం చ వృద్ధం ధనముదాఽన్వితమ్ ।
ఆత్మీయం నృపతిః పుత్రం నృపలక్షణసంయుతమ్ ॥34॥

విష్వక్సేనాభిధానం తు రాజా రాజ్యేఽభ్యషేచయత్ ।
మానసే మిళితా స్సర్వే తతస్తే యోగినాం వరాః ॥35॥

రెండవవాడైన కండరీకుడు ధర్మాత్ముడు, వైద్యశాస్త్రప్రవర్తకుడు. ఈ యిరువురికీ పూర్వజన్మస్మృతి గల్గి శోకంతో నేలపై పడిపోయారు. ఇలా విలపించారు. "అయ్యో! మేము యోగభ్రష్టుల మైనాము. కోరికలకు లోనై కర్మబద్ధుల మయ్యామే" ఇలా యోగపారంగతులైన ఆ ముగ్గురూ అనేకరీతుల విలపించారు. పూర్వజన్మలో కావించిన శ్రాద్ధముయొక్క ప్రభావాన్ని పునఃపునః అభినందించారు. ఆ పై రాజు ఆ విప్రునికి అనేకగ్రామాలతో గూడా వలసినంత ధనం అర్పించాడు. ధనలాభంతో సంతసించిన ఆ బ్రాహ్మణునికి వీడ్కోలు పలికాడు. ఆ రాజు పిమ్మట

సకలనృపలక్షణాలు గల తన విష్వక్సేనుడనే కుమారుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు. తదనంతరం యోగివర్యులైన బ్రహ్మదత్తులుగా ఆ ముప్వురూ మానససరస్సునందు కలుసుకొన్నారు.

బ్రహ్మదత్తాదయస్తస్మిన్పితృభక్త్యా విమత్సరాః ।
సన్నతిశ్చావదద్దృష్ట్వా మయైతత్కిల కారితమ్ ॥36॥

రాజ్యత్యాగఫలం సర్వం యదేతదభిలష్యతే ।
తథేతి ప్రాహ రాజా తు పునస్తామభినన్దయన్ ॥37॥

త్వత్ప్రసాదాదిదం సర్వం మయైతత్ప్రాప్యతే ఫలమ్ ।
తతస్తే యోగమాస్థాయ సర్వ ఏవ వనౌకసః ॥38॥

బ్రహ్మరంధ్రేణ పరమం పరమాపుస్తపోబలాత్ ।
ఏవమాయుర్ధనం విద్యాం స్వర్గం మోక్షం సుఖాని చ ॥39॥

ప్రయచ్ఛన్తి సుతాన్రాజ్యం నృణాం ప్రీతాః పితామహాః ।

పితృభక్తి గల బ్రహ్మదత్తుడు మున్నగువారు మాత్సర్యము లేనివారై మానససరస్సునందు పరస్పరం కలుసుకొన్నారు. సన్నతి ఇదంతా చూచి ఏ రాజ్యత్యాగఫలాన్ని మీరు అభిలషిస్తున్నారో అది నావల్లనే జరిగిందని చెప్పింది. అట్లే అని రాజు అందుకు సమ్మతించి మళ్ళీ ఆమెను అభినందించాడు. నీ అనుగ్రహంవల్లనే నాకీ ఫలం లభించిందని ఆమెను ప్రశంసించాడు. పిదప వారందరూ వనవాసులై యోగాన్ని ఆశ్రయించారు. తపోబలంతో బ్రహ్మరంధ్రం ద్వారా పరమపదప్రాప్తి పొందారు. ఇట్లే ప్రీతి పొందిన పితృపితామహాదులు ఆయువును, ధనమును, విద్యను, స్వర్గాన్నీ, తుదకు మోక్షాన్నీ ఇతరసుఖాలనూ ప్రసాదిస్తారు. ప్రీతి జెందిన పితామహులు నరులకు సుతులనూ, రాజ్యాన్నీ అనుగ్రహిస్తారు.

య ఇదం పితృమాహాత్మ్యం బ్రహ్మదత్తస్య చ ద్విజాః ॥40॥
ద్విజేభ్య శ్రావయేద్యో వా శృణోత్యథ పఠేత్తు వా ।
కల్పకోటిశతం సాగ్రం బ్రహ్మలోకే మహీయతే ॥41॥

ఈ పితృమాహాత్మ్యాన్నీ, బ్రహ్మదత్తుని చరిత్రనూ, యే ద్విజుడు ద్విజులకు వినిపిస్తాడో, ఎవ్వరు వింటారో, ఎవరు పఠిస్తారో వారు నూరుకోట్ల కల్పాల కాలం బ్రహ్మలోకంలో సుఖిస్తారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే చక్రవాక చతుష్టయస్య బ్రాహ్మణ జన్మ ప్రాప్తిః నామ ఏకవింశతితమోఽధ్యాయః ॥21॥

శ్రీమత్స్యమహాపురాణంలోని మత్స్యమనుసంవాదంలో చక్రవాకములు నాల్గింటికి బ్రాహ్మణ జన్మ ప్రాప్తి అనే ఇరవైఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్వావింశోఽధ్యాయః - ఇరవైరెండవ అధ్యాయం

పితృప్రీతికర తీర్థకాలకథనమ్ - పితరులకు ప్రీతి కలిగించు తీర్థకాలములను చెప్పుట.

ఋషయ ఊచు :- ఋషులు చెప్పారు.

కస్మిన్కాలే చ తచ్ఛ్రాద్ధమనన్తఫలదం భవేత్ ।
కస్మిన్వాసరభాగే తు శ్రాద్ధకృచ్ఛ్రాద్ధమాచరేత్ ।
తీర్థేషు కేషు చ కృతం శ్రాద్ధం బహుఫలం భవేత్ ॥1॥

"సూతా! ఏ కాలంలో చేసిన శ్రాద్ధం అనంతఫల మిస్తుంది? శ్రాద్ధకర్త దినంలో ఏ సమయంలో శ్రాద్ధం ఆచరించాలి? ఏయే తీర్థాలలో చేసిన శ్రాద్ధం ఎక్కువ ఫలప్రద మవుతుంది?

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అపరాహ్ణే తు సమ్ప్రాప్తే హ్యభిజిద్రౌహిణోదయే ।
యత్కించిద్దీయతే తత్ర తదక్షయముదాహృతమ్ ॥2॥

అపరాహ్ణకాలంలో అభిజిన్ముహూర్తంలో రౌహిణముహూర్తం ప్రారంభమయ్యేటప్పుడు జరిపిన శ్రాద్ధం అక్షయఫలం ప్రసాదిస్తుంది.

తీర్థాని యాని శస్తాని పితౄణాం వల్లభాని చ ।
నామతస్తాని వక్ష్యామి సంక్షేపేణ ద్విజోత్తమాః! ॥3॥

విప్రోత్తములారా! ప్రసిద్ధమైనవీ, పితరులకు ప్రీతిపాత్రమైనవీ అయిన తీర్థాలను సంగ్రహంగా వివరిస్తాను.

పితృతీర్థం గయా నామ సర్వతీర్థవరం శుభమ్ ।
యత్రాఽఽస్తే దేవదేవేశస్స్వయమేవ పితామహః ॥4॥

గయ అనే పితృతీర్థం సర్వతీర్థాలలోనూ మేలైనది. అక్కడ దేవతలకు ప్రభువైన పితామహుడున్నాడు.

తత్రైషా పితృభిర్గీతా గాథా భాగమభీప్సుభిః ॥5॥

ఈ విషయమై తమ పితృభాగం అనుభవించగోరే పితృదేవతలు గానం చేసిన గాథ ఇలా ఉన్నది.

ఏష్టవ్యా బహవః పుత్రా యద్యేకోఽపి గయాం వ్రజేత్ ।
యజేత వాఽశ్వమేధేన నీలం వా వృషముత్సృజేత్ ॥6॥

అనేకులగు పుత్రులు కలగాలని కోరుకోవాలి. అందులో ఒకడైనా గయకు పోయి పితృశ్రాద్ధం జరుపునేమో గదా! లేక అశ్వమేధయాగమైనా అనుష్ఠిస్తాడేమో? లేక నీలవృషభాన్ని విసర్జిస్తాడేమో!

తథా వారాణసీ పుణ్యా పితౄణాం వల్లభా సదా ।
యత్రావిముక్తసాన్నిధ్యం భుక్తిముక్తిఫలప్రదమ్ ॥7॥

అట్లే పవిత్రమైన కాశీక్షేత్రం పితరులకు ఎల్లవేళలా ప్రియమైనది. అది అవిముక్తక్షేత్రం. ఆ క్షేత్రసాన్నిధ్యం శ్రాద్ధకర్తకు భుక్తిముక్తిఫలాలనిస్తుంది.

పితౄణాం వల్లభం తద్వత్పుణ్యం చ విమలేశ్వరమ్ ।
పితృతీర్థం ప్రయాగం తు సర్వకామఫలప్రదమ్ ॥8॥

ఇక విమలేశ్వరం పితరులకు మిక్కిలి ప్రియమైనది, పుణ్యప్రదమైనది. పితృతీర్థమైన ప్రయాగక్షేత్రం సమస్తకామఫలాలనూ ప్రసాదిస్తుంది.

వటేశ్వరస్తు భగవాన్మాధవేన సమన్వితః ।
యోగనిద్రాశ్రయస్తద్వత్సదా వసతి కేశవః ॥9॥

మాధవునితో గూడిన భగవంతుడగు వటేశ్వరుడు అక్కడ సదా సన్నిహితుడై వుంటాడు. యోగనిద్రాశ్రితుడైన కేశవుడు సదా ఆ క్షేత్రంలో నివసిస్తాడు.

దశాశ్వమేధికం పుణ్యం గఙ్గాద్వారం తథైవ చ ।
నన్దాఽథ లలితా తద్వత్తీర్థం మాయాపురీ శుభా ॥10॥

తథా మిత్రపదం నామ తతః కేదారముత్తమమ్ ।
గంగాసాగరమిత్యాహుః సర్వతీర్థమయం శుభమ్ ॥11॥

దశాశ్వమేధం, గంగాద్వారం(హరిద్వారం), అట్లే నంద, లలిత మరియు శుభప్రదమైన మాయాపురి. అట్లే మిత్రపదతీర్థం, కేదారనాథక్షేత్రం ముఖ్యమైనవి. గంగాసాగరం సర్వతీర్థమయమైన శుభప్రదతీర్థమై వుంది.

తీర్థం బ్రహ్మసరస్తద్వ చ్ఛతద్రుసలిలే హ్రదః ।
తీర్థం తు నైమిశం నామ సర్వతీర్థఫలప్రదమ్ ॥12॥

అట్లే బ్రహ్మసరస్సు, శతద్రువులోని జలహ్రదమూ (సట్లెజ్) సకలతీర్థముల ఫలమిచ్చే నైమిశం, పితృప్రియమైనవి.

గఙ్గోద్భేదస్తు గోమత్యాం యత్రోద్భూతస్సనాతనః ।
తథా యజ్ఞవరాహస్తు దేవదేవశ్చ శూలభృత్ ॥13॥

గోమతిలో గంగోద్భేదం సంభవించింది. ఆ గంగా గోమతీ సంగమంలోనే యజ్ఞవరాహస్వామి, శూలం ధరించిన శివుడు గూడా సదా సన్నిహితులై వుంటారు.

యత్ర తత్కాఞ్చనం ద్వార మష్టాదశభుజో హరః ।
నేమిస్తు హరిచక్రస్య శీర్ణా యత్రాభవత్పురా ॥14॥

అక్కడనే బంగారుద్వారం కూడా ఉన్నది. అక్కడి శివుడు పదునెనిమిది భుజాలు గలిగి వుంటాడు. విష్ణుచక్రముయొక్క అంచు శిథిలమై పడిన స్థలమే నైమిశారణ్యం.

తదేతన్నైమిశారణ్యం సర్వతీర్థనిషేవితమ్ ।
దేవదేవస్య తత్రాపి వారాహస్య చ దర్శనమ్ ॥15॥

అది సర్వతీర్థములచే సేవింపబడినది. దేవదేవుడైన యజ్ఞవరాహస్వామి దర్శనం అక్కడే సిద్ధిస్తుంది.

యః ప్రయాతి స పూతాత్మా నారాయణపదం వ్రజేత్ ।
కృతశౌచం మహారణ్యం సర్వపాపనిషూదనమ్ ॥16॥

ఆ దర్శనం పొందినవాడు పవిత్రాత్ముడై నారాయణపదం పొందుతాడు. ఆ నైమిశం అన్ని పాపాలూ పోగొట్టే పవిత్రమైన గొప్ప అరణ్యం.

యత్రాఽఽస్తే నరసింహస్తు స్వయమేవ జనార్దనః ।
తీర్థమిక్షుమతీ నామ పితౄణాం వల్లభం సదా ॥17॥

జనార్దనుడైన నరసింహస్వామి స్వయంగా అక్కడ నెలకొని వున్నాడు. అక్కడి ఇక్షుమతీతీర్థం పితృదేవతల కెంతో ప్రియమైనది.

సఙ్గమే యత్ర తిష్ఠన్తి గఙ్గాయాః పితర స్సదా ।
కురుక్షేత్రం మహాపుణ్యం సర్వతీర్థసమన్వితమ్ ॥18॥

ఇక్షుమతీ గంగా సంగమస్థలంలో సదా పితృదేవతలు నివసిస్తారు. మహాపుణ్యమైన కురుక్షేత్రం సకలతీర్థాలతో కూడిన పవిత్రస్థలం.

తథా చ సరయూః పుణ్యా సర్వదేవనమస్కృతా ।
ఇరావతీ నదీ తద్వత్పితృతీర్థసమన్వితా ॥19॥

అట్లే సర్వదేవతలూ నమస్కరించే పవిత్రమైన సరయూనది అక్కడ ఉన్నది. అట్లే పితృతీర్థముల అధివాసస్థానమైన పవిత్రమైన ఇరావతీనది కూడా ఉన్నది.

యమునా దేవికా కాళీ చన్ద్రభాగా దృషద్వతీ ।
నదీ వేణుమతీ పుణ్యా పారా వేత్రవతీ తథా ॥20॥

అలాగే యమున, దేవిక, కాళి, చంద్రభాగ, దృషద్వతి, పవిత్రమైన ఇక్షుమతీనది, పార, వేత్రవతీ నదులున్నాయి.

పితౄణాం వల్లభా హ్యేతాః శ్రాద్ధే కోటిగుణా మతాః ।
జమ్బూమార్గం మహాపుణ్యం యత్ర మార్గో హి లక్ష్యతే ॥21॥

ఇవి పితృదేవతలకు చాలా ఇష్టమైనవి. అక్కడ శ్రాద్ధం నిర్వహిస్తే కోటిరెట్లు ఎక్కువ ఫలితముంటుంది. జంబూమార్గం మిక్కిలి పుణ్యప్రదమైనది. ఆ మార్గం నుండి పితృమార్గం గోచరిస్తుంది.

అద్యాపి పితృతీర్థం తత్సర్వకామఫలప్రదమ్ ।
నీలకుణ్డమితి ఖ్యాతం పితృతీర్థం ద్విజోత్తమాః! ॥22॥

దానిని పితృతీర్థమంటారు. అది అన్ని కోరికలు తీర్చే పవిత్రక్షేత్రం. ద్విజశ్రేష్ఠులారా! నీలకుండమనే పితృతీర్థం కూడా మిక్కిలి విఖ్యాతమైనది.

తథా రుద్రసరః పుణ్యం సరో మానసమేవ చ ।
మన్దాకినీ తథాఽచ్ఛోదా విపాశాఽథ సరస్వతీ ॥23॥

అట్లే పుణ్యప్రదమైన రుద్రసరస్సు, మానససరస్సు, మందాకిని, అచ్ఛోదానది విపాశ, సరస్వతి అనే నదులు పవిత్రాలు.

పూర్వమిత్రపదం తద్వద్వైద్యనాథం మహాఫలమ్ ।
క్షిప్రానదీ మహాకాలః తథా కాలఞ్జరం శుభమ్ ॥24॥

పూర్వమిత్రపదం అట్లే వైద్యనాథం గొప్ప ఫలాలను ప్రసాదించేవి. క్షిప్రానది, మహాకాలుడు కాలంజరగిరి శుభప్రదాలు.

వంశోద్భేదం హరోద్భేదం గంగోద్భేదం మహాఫలమ్ ।
భద్రేశ్వరం విష్ణుపదం నర్మదాద్వారమేవ చ ॥25॥

వంశోద్భేదం, హరోద్భేదం, మహాఫలప్రదమైన గంగోద్భేదం, భద్రేశ్వరం, విష్ణుపదం, నర్మదాద్వారం అనేవి అత్యంత పవిత్రాలు.

గయాపిణ్డప్రదానేన సమాన్యాహుర్మహర్షయః ।
ఏతాని పితృతీర్థాని సర్వపాపహరాణి చ ॥26॥

ఈ తీర్థాలలో పిండప్రదానం గయాక్షేత్రంలో పిండప్రదానం చేసినంత ఫలాన్నిస్తుందని మహర్షులు చెప్పారు. ఈ పితృతీర్థాలు సర్వపాపాలనూ పరిహరించేవి.

స్మరణాదపి లోకానాం కిము శ్రాద్ధకృతాం నృణామ్ ।
ఓఙ్కారం పితృతీర్థం చ కావేరీ కపిలోదకమ్ ॥27॥

సమ్భేదశ్చణ్డవేగాయాస్తథైవామరకణ్టకమ్ ।
కురుక్షేత్రాచ్ఛతగుణం తస్మిన్స్నానాదికం భవేత్ ॥28॥

ఈ తీర్థాలను స్మరిస్తేనే సకలపాపాలూ నశిస్తాయి. ఇక అక్కడ శ్రాద్ధకర్మలు ఆచరిస్తే కలిగే ఫలాన్ని గూర్చి చెప్పేదేమున్నది? ఓంకారం, పితృతీర్థం, కావేరీనది, కపిలోదకం, చండవేగాసంగమం, అమరకంటకం ఈ తీర్థాలలో స్నానం చేయడం కురుక్షేత్రంలో చేసినదానికంటే నూరురెట్లధిక ఫలమిస్తుంది.

శుక్రతీర్థం చ విఖ్యాతం తీర్థం సోమేశ్వరం పరమ్ ।
సర్వవ్యాధిహరం పుణ్యం శతకోటిఫలాధికమ్ ॥29॥

ఇక శుక్రతీర్థం ప్రసిద్ధం. సోమేశ్వరతీర్థం శ్రేష్ఠమైనది. ఇక్కడ స్నానం చేసినా, శ్రాద్ధం నిర్వహించినా సకలవ్యాధులూ నశిస్తాయి. నూరుకోట్ల రెట్లు అధికఫలం కల్గుతుంది.

శ్రాద్ధే దానే తథా హోమే స్వాధ్యాయే జలసన్నిధౌ ।
కాయావరోహణం నామ తథా చర్మణ్వతీ నదీ ॥30॥

గోమతీ వరణా తద్వత్తీర్థమౌశనసం పరమ్ ।
భైరవం భృగుతుఙ్గం చ గౌరీతీర్థమనుత్తమమ్ ॥31॥

తీర్థం వైనాయకం నామ భద్రేశ్వరమతః పరమ్ ।
తథా పాపహరం నామ పుణ్యాఽథ తపతీ నదీ ॥32॥

మూలతాపీ పయోష్ణీ చ పయోష్ణీసఙ్గమ స్తథా ।
మహోమ్భోధిః పాటలా చ నాగతీర్థమవన్తికా ॥33॥

తథా వేణునదీ పుణ్యా మహాశాలం తథైవ చ ।
మహారుద్రం మహాలిఙ్గం దశార్ణా చ నదీ శుభా ॥34॥

శతరుద్రా శతాహ్వా చ తథా విశ్వపదం పరమ్ ।
అఙ్గారవాహికా తద్వన్నదౌ తౌ శోణఘర్ఘరౌ ॥35॥

కాళికా చ నదీ పుణ్యా వితస్తా చ నదీ తథా ।
ఏతాని పితృతీర్థాని శస్యన్తే స్నానదానయోః ॥36॥

కాయావరోహణ క్షేత్రం, చర్మణ్వతీనది, గోమతి, వరణ, ఉత్కృష్టమైన ఔశనసతీర్థం, భైరవం, భృగుతుంగం, మహోత్తమమైన గౌరీతీర్థం, వైనాయకతీర్థం, భద్రేశ్వరం, పాపహరతీర్థం, పవిత్రమైన తపతీనది, మూలతాపి, పయోష్ణి, పయోష్ణీసంగమం, మహామ్భోధి, పాటల, నాగతీర్థం, అవంతిక, వేణునది, మహాశాలం, మహారుద్రం, మహాలింగం, దశార్ణానది శుభమైనవి. శతరుద్ర, శతాహ్వానది, విశ్వపదం, అంగారవాహిక, శోణఘర్ఘరనదాలు, కాలికానది, పుణ్యవతి ఐన వితస్తానది ఈతీర్థాలు స్నానాదులకు ప్రశస్తమైనవిగా కీర్తింపబడివున్నాయి.

శ్రాద్ధమేతేషు యద్దత్తం తదనన్తఫలప్రదమ్ ।
ద్రోణీ వాటనదీ ధారా సరిత్క్షీరనదీ తథా ॥37॥

గోకర్ణం గజకర్ణం చ తథా చ పురుషోత్తమమ్ ।
ద్వారం చ కర్ణద్వారం చ కృష్ణతీర్థం సరస్వతీ ॥38॥

నదీ మణిమతీ నామ తథా చ గిరికర్ణికా ।
ధూతపాపం తథా తీర్థం సముద్రో దక్షిణస్తథా ॥39॥

ఏతేషు పితృతీర్థేషు శ్రాద్ధమానన్త్యమశ్నుతే ।

ఈతీర్థాలలో ఇచ్చిన శ్రాద్ధం అనంతఫలాలను ప్రసాదిస్తుంది. ద్రోణీనది, వాటనది, ధారానది, క్షీరనది అట్లే గోకర్ణం, గజకర్ణం, పురుషోత్తమక్షేత్రం(జగన్నాథం), ద్వారమూ, కర్ణద్వారమూ, కృష్ణతీర్థం, సరస్వతీ తీర్థం, మణిమతీనది, గిరికర్ణిక, ధూతపాపతీర్థం, దక్షిణసముద్రం ఈ పితృతీర్థాలలో చేసిన శ్రాద్ధం అనంతఫల మిస్తుంది.

తీర్థం మేఘకరం నామ స్వయమేవ జనార్దనః ।।40।।

యత్ర శార్ఙ్గధరో విష్ణుర్మేఖలాయామవస్థితః ।
తథా మన్దోదరీతీర్థం తీర్థం చంపా నదీ తథా ।।41।।

తథా చామరనాథశ్చ మహాశాలనదీ తథా ।
చిత్రకూటం చ మర్కోటం తథా జన్మేశ్వరం మహత్ ।।42।।

అర్జునం త్రిపురం చైవ సిద్ధేశ్వరమతఃపరమ్ ।
శ్రీశైలం శాంకరం తీర్థం నారసింహమతఃపరమ్ ।।43।।

మహేన్ద్రం చ తథా పుణ్యం తథా శ్రీరంగసంజ్ఞితమ్ ।
ఏతేష్వపి సదా శ్రాద్ధమనన్తఫలదం స్మృతమ్ ।।44।।

దర్శనాదపి చైతాని సద్యః పాపహరాణి వై ।
తుఙ్గభద్రా నదీ పుణ్యా తథా భీమరథీ సరిత్ ।।45।।

మేఘకరమనే తీర్థంలో శార్ఙ్గధనువు ధరించిన విష్ణువు గిరిమేఖలా భాగంలో వున్నాడు. అట్లే మండోదరీతీర్థం, చంపానది, అమరనాథం, మహాశాలనది, చిత్రకూటం, మర్కోటం, జన్మేశ్వరం, అర్జునం, త్రిపురం, సిద్ధేశ్వరం, శ్రీశైలం, శాంకరతీర్థం, నారసింహతీర్థం, పుణ్యప్రదమైన మహేంద్రం, శ్రీరంగం ఈ క్షేత్రాలలో సైతం చేసిన శ్రాద్ధం అనంతఫలమిస్తుంది. వీటిని దర్శించినంతమాత్రాన పాపాలు హరించిపోతాయి. తుంగభద్రానది పుణ్యప్రదమైనది. అట్లే భీమరథీనది.

భీమేశ్వరం కృష్ణవేణీ కావేరీ కుడ్మలా (వఞ్జులా)నదీ ।
నదీ గోదావరీ పుణ్యా త్రిసన్ధ్యాతీర్థ ముత్తమమ్ ।।46।।

భీమేశ్వరం, కృష్ణవేణి, కావేరి, కుడ్మలానది, (వంజుల) గోదావరి, త్రిసంధ్యాతీర్థం ఉత్తమమైనవి.

తీర్థం త్రైయమ్బకం నామ సర్వతీర్థనమస్కృతమ్ ।
యత్రాస్తే భగవానీశస్స్వయమేవ త్రిలోచనః ।।47।।

సర్వతీర్థాలచే నమస్కృతమైన త్ర్యంబకతీర్థంలో త్రినేత్రుడైన శివుడు స్వయంగా కొలువుదీరి వుంటాడు.

శ్రాద్ధమేతేషు సర్వేషు కోటికోటిగుణం భవేత్ ।
స్మరణాదపి పాపాని నశ్యన్తి శతధా ద్విజాః! ।।48।।

ద్విజులారా! ఈ సకల తీర్థాలలోనూ చేసిన శ్రాద్ధం కోటికోటిగుణం కలిగి వుంటుంది. ఈతీర్థాలను స్మరించినా చాలు. పాపాలు శతధా పటాపంచలై పోతాయి.

శ్రీపర్ణీ తామ్రపర్ణీ చ జయతీర్థమనుత్తమమ్ ।
తథా మత్స్యనదీ (వంశనదీ)ధారా శివధారం తథైవ చ ॥49॥

భద్రతీర్థం చ విఖ్యాతం పంపాతీర్థం చ శాశ్వతమ్ ।
పుణ్యం రామేశ్వరం తద్వదేలాపురమలమ్పురమ్ ॥50॥

అఙ్గభూతం చ విఖ్యాతమామర్దకమలమ్బుషమ్ ।
ఆమ్రాతకేశ్వరం తద్వ దేకామ్బక (ఏకామ్రక)మతఃపరమ్ ॥51॥

గోవర్ధనం హరిశ్చన్ద్రం కృపుచంద్రం పృథూదకమ్ ।
సహస్రాక్షం హిరణ్యాక్షం తథా చ కదలీ నదీ ॥52॥
(రామచిత్రాఽజితా చైవ తథా చ కదలీనదీ) ।

రామాధివాసస్తత్రాపి తథా సౌమిత్రిసఙ్గమః ।
ఇన్ద్రకీలం మహానాదం తథా చ ప్రియమేలకమ్ ॥53॥

ఏతాన్యపి సదా శ్రాద్ధే ప్రశస్తాన్యధికాని తు ।
ఏతేషు సర్వదేవానాం సాన్నిధ్యం విదితం యతః ॥54॥

శ్రీపర్ణి, తామ్రపర్ణి, మహోత్తమమైన జయతీర్థం, మత్స్యనది (వంశనది), శివధారతీర్థం ప్రశస్తమైన భద్రతీర్థం, శాశ్వతమైన పంపాతీర్థం, పుణ్యకరమైన రామేశ్వరం, ఏలాపురం, అలంపురం, అంగభూతం, అమర్దకం, అలంబుషం, అమ్రాతకేశ్వరం, ఏకామ్బకం (ఏకామ్రకం), గోవర్ధనం, హరిశ్చంద్రం, పుణ్యప్రదమైన పృథూదకసరస్సు, సహస్రాక్షం, హిరణ్యాక్షం, కదళీనది, (రామచిత్ర, అజితానది కదలీనది) రామాధివాసం, సౌమిత్రి సంగమం, ఇంద్రకీలం, మహానాదం, ప్రియమేలకం– ఇవి కూడా ఎల్లవేళలా శ్రాద్ధమనుష్ఠించడానికి ప్రశస్తములైనవి. ఈ తీర్థాలలో సకలదేవతలూ సన్నిహితులై వుంటారు.

దానమేతేషు సర్వేషు దత్తం కోటిశతాధికమ్ ।

ఈ సర్వక్షేత్రాలలో చేసినదానం వందలకోట్లదానం (కోటిశతదానం)కంటే అధికమైనది.

బాహుదా చ నదీ పుణ్యా తథా సిద్ధవనం శుభమ్ ॥55॥

తీర్థం పాశుపతం నామ నదీ పార్వతికా తథా ।
శ్రాద్ధమేతేషు సర్వేషు దత్తం కోటిశతోత్తరమ్ ॥56॥

తథైవ పితృతీర్థంతు యత్ర గోదావరీ నదీ ।
యుతా లిఙ్గసహస్రేణ సర్వాన్తరజలావహా ॥57॥

పుణ్యప్రదమైన బాహుదానది, శుభప్రదమైన సిద్ధవనం, పాశుపతతీర్థం, పార్వతికానది వీటిలో శ్రాద్ధం ఇస్తే కోటిశతాధికఫలప్రదమౌతుంది. గోదావరీనది ప్రవహించే పితృతీర్థం కూడా అలాంటిదే. ఈ నది వెయ్యిలింగాలతో కూడినది. ఇక్కడ గోదావరి అన్ని చోట్లకంటే లోతుగా ప్రవహిస్తున్నది.

జామదగ్న్యస్య తత్తీర్థం క్రమాదాయాతముత్తమమ్।
ప్రతీకస్య భయాద్భిన్నం యత్ర గోదావరీ నదీ ॥58॥

తత్తీర్థం హవ్యకవ్యానా మప్సరోయుగసంజ్ఞితమ్ ।
శ్రాద్ధాగ్నికార్యదానేషు తథా కోటిశతాధికమ్ ॥59॥

దీనిని జామదగ్న్య తీర్థమని కూడా అంటారు. ఇది శ్రాద్ధకర్తలకు దీర్ఘాయువును ప్రసాదిస్తుంది. ఇక్కడ ప్రతీకుడనే ఋషివల్ల భయపడి గోదావరి రెండుగా చీలింది. ఈ తీర్థం దేవతలకు హవ్యం ఇవ్వడానికి పితృదేవతలకు కవ్యం ఇవ్వడానికీ ప్రశస్తమైనది. దీనికి అప్సరోయుగతీర్థమని కూడా పేరు. శ్రాద్ధాలు, అగ్నికార్యాలూ, దానాలూ చేస్తే నూరుకోట్ల రెట్లు అధికఫలం కల్గుతుంది.

తథా సహస్రలిఙ్గం చ రాఘవేశ్వరముత్తమమ్ ।
సేన్ద్రఫేనా నదీ పుణ్యా యత్రేన్ద్రః పతితః పురా ॥60॥

నిహత్య నముచిం శక్రస్తపసా స్వర్గమాప్తవాన్ ।
తత్ర దత్తం నరైశ్శ్రాద్ధమనన్తఫలదం భవేత్ ॥61॥

సహస్రలింగక్షేత్రం, రామేశ్వరం పితృకార్యానికి ప్రశస్తములైనవి. అక్కడ ఇంద్రఫేనానది పుణ్యప్రదమైనది. నముచిని వధించి పూర్వం పతితుడైన ఇంద్రుడు ఇక్కడ తపస్సుచేసి మరల స్వర్గం చేరాడు. అక్కడ నిర్వహించిన శ్రాద్ధం అనంతఫలప్రదమవుతుంది.

తీర్థం తు పుష్కరం నామ సాలగ్రామం తథైవ చ ।
సోమపానం చ విఖ్యాతం యత్ర వైశ్వానరాలయమ్ ॥62॥

తీర్థం సారస్వతం నామ స్వామితీర్థం తథైవ చ ।
మలందరా నదీ పుణ్యా కౌశికీ చన్ద్రికా తథా ॥63॥

విదర్భా వాఽథ వైరా చ పయోష్ణీ ప్రాఙ్ముఖా పురా ।
కావేరీ చోత్తరా పుణ్యా తథా జాలన్ధరో గిరిః ॥64॥

ఏతేషు శ్రాద్ధతీర్థేషు శ్రాద్ధమానన్త్యమశ్నుతే ।

పుష్కరతీర్థం, సాలగ్రామతీర్థం వైశ్వానరాగ్నికి నిలయమైన సోమపానతీర్థం మరియు సారస్వతతీర్థం, స్వామితీర్థం, మలందరానది, కౌశికీనది, చంద్రికానది, విదర్భానది, వైరానది ఉత్తరాభిముఖంగా ప్రవహించే కావేరీనది, జాలంధరపర్వతం ఈ ప్రదేశాలలో చేసిన పితృశ్రాద్ధం అనంతఫలప్రదం

లోహదణ్డం తథా తీర్థం చిత్రకూట స్తథైవ చ ॥65॥

విన్ధ్యయోగశ్చ గఙ్గాయాస్తథా నదీతటం శుభమ్ ।
కుబ్జాభ్రం తు తథా తీర్థమూర్వశీపులినం తథా ॥66॥

సంసారమోచనం తీర్థం తథైవ ఋణమోచనమ్ ।
ఏతేషు పితృతీర్థేషు శ్రాద్ధమానన్త్యమశ్నుతే ॥67॥

లోహదండతీర్థం, చిత్రకూటం, వింధ్యయోగేశ్వరం, గంగానదీతటం, కుబ్జాభ్రకం, ఊర్వశీపులినం, సంసారమోచనతీర్థం, ఋణమోచనతీర్థం – ఈ తీర్థాలలో శ్రాద్ధం అనంతఫలాన్నిస్తుంది.

అట్టహాసం తథా తీర్థం గౌతమేశ్వరమేవ చ ।
తథా వసిష్ఠతీర్థం తు హారీతం తు తతఃపరమ్ ॥68॥

బ్రహ్మావర్తం కుశావర్తం హయతీర్థం తథైవ చ ।
పిణ్డారకం చ విఖ్యాతం శంఖోద్ధారం తథైవ చ ॥69॥

ఘంటేశ్వరం బిల్వకం చ నీలపర్వతమేవ చ ।
తథా చ ధరణీతీర్థం రామతీర్థం తథైవ చ ॥70॥

అశ్వతీర్థం చ విఖ్యాతమనన్తం శ్రాద్ధదానయోః ।

అట్టహాసతీర్థం, గౌతమేశ్వరం, వసిష్ఠతీర్థం, హారీతం, బ్రహ్మావర్తం, కుశావర్తం, హయతీర్థం, ప్రసిద్ధమైన పిండారకం, శంఖోద్ధారం అట్లే ఘంటేశ్వరం, బిల్వకం, నీలపర్వతం, సుగ్రీవం, ధరణీతీర్థం, రామతీర్థం, విఖ్యాతమైన అశ్వతీర్థం, ఈ తీర్థాలు శ్రాద్ధానికీ, దానానికీ ప్రశస్తాలు, అనంతఫలప్రదాలు.

తీర్థం వేదశిరో నామ తథైవౌఘవతీ నదీ ॥71॥

తీర్థం వసుప్రదం నామ చ్ఛాగలాణ్డం తథైవ చ ।
ఏతేషు శ్రాద్ధదాతారః ప్రయాన్తి పరమం పదమ్ ॥72॥

వేదశిరస్తీర్థం, ఓఘవతీనది, వసుప్రదతీర్థం, ఛాగలాండం ఈ తీర్థాలలో శ్రాద్ధం చేసినవారు పరమపదప్రాప్తి పొందుతారు.

తథా చ బదరీతీర్థం గణతీర్థం తథైవ చ ।
జయంతం విజయం చైవ శక్రతీర్థం తథైవ చ ॥73॥

శ్రీపతేశ్చ తథా తీర్థం తీర్థం రైవతకం తథా ।
తథైవ శారదాతీర్థం భద్రకాళేశ్వరం తథా ॥74॥

వైకుణ్ఠతీర్థం చ పరం భీమేశ్వరమథాపి వా ।
ఏతేషు శ్రాద్ధదాతారః ప్రయాన్తి పరమాం గతిమ్ ॥75॥

అట్లే బదరీతీర్థం, గణతీర్థం, జయంతం, విజయం, శక్రతీర్థం అట్లే శ్రీపతితీర్థం, రైవతకతీర్థం, శారదాతీర్థం, భద్రకాళేశ్వరం, వైకుంఠతీర్థం, భీమేశ్వరతీర్థం ఈ తీర్థాలలో శ్రాద్ధకర్మ చేసినవారు పరమగతి పొందుతారు.

తీర్థం మాతృగృహం నామ కరవీరపురం తథా ।
కుశేశయం చ విఖ్యాతం గౌరీశిఖరమేవ చ ॥76॥

నకులేశస్య తీర్థం తు కర్దమాలం తథైవ చ ।
దిణ్డిపుణ్యకరం తద్వత్పుణ్డరీకపురం తథా ॥77॥

సప్తగోదావరీతీర్థం సర్వతీర్థేశ్వరేశ్వరమ్ ।
తత్ర శ్రాద్ధం ప్రదాతవ్యమనన్తఫలమీప్సుభిః ॥78॥

మాతృగృహమనే తీర్థం, కరవీరపురం, ప్రసిద్ధమైన కుశేశయం, గౌరీశిఖరం, నకులేశతీర్థం, కర్దమాలం, దిండిపుణ్యకరం, పుండరీకపురం, సర్వతీర్థాలకు తీర్థరాజమైన సప్తగోదావరీతీర్థం – ఈ తీర్థాలలో అనంతఫలం కోరేవారు శ్రాద్ధం చేయాలి.

ఏష తూద్దేశతః ప్రోక్త స్తీర్థానాం సఙ్గ్రహో మయా ।
వాగీశోఽపి న శక్నోతి విస్తరాత్ కిము మానుషః ॥79॥

ఈ తీర్థసంగ్రహాన్ని పేరుకు మాత్రం సంగ్రహించి మీకు నేను వివరించాను. వీటిని విస్తరంగా చెప్పడానికి బ్రహ్మకు కూడా వీలు కాదు. ఇక మనుజుని కెలా సాధ్యం?

సత్యం తీర్థం దయా తీర్థం తీర్థమిన్ద్రియనిగ్రహః ।
వర్ణాశ్రమాణాం గేహేఽపి తీర్థం తు సముదాహృతమ్ ॥80॥

ముఖ్యంగా సత్యం, దయ, ఇంద్రియనిగ్రహ మనేవి శ్రేష్ఠమైన తీర్థాలు. ఈ గుణాలు గల్గి తమ తమ వర్ణాశ్రమాల ప్రకారం ప్రవర్తిస్తే ఇంటిలోనే పితృతీర్థస్థానం ఉంటుంది.

ఏషు తీర్థేషు యచ్ఛ్రాద్ధం తత్కోటిగుణమిష్యతే ।
యస్మాత్తస్మాత్ప్రయత్నేన తీర్థే శ్రాద్ధం సమాచరేత్ ॥81॥

ఈ పై జెప్పిన తీర్థాలలో శ్రాద్ధం చేస్తే కోటిరెట్లు అధికఫలమిస్తుంది. అందువల్ల ప్రయత్నంతోనైనా తీర్థస్థలంలో శ్రాద్ధం నిర్వర్తించాలి.

ప్రాతఃకాలే ముహూర్తాం స్త్రీ న్పూర్వాహ్ణే తావదేవ తు ।
మధ్యాహ్న స్త్రిముహూర్తస్స్యాదపరాహ్ణస్తతఃపరమ్ ॥82॥

సాయాహ్నస్త్రిముహూర్తస్స్యాచ్ఛ్రాద్ధం తత్ర న కారయేత్ ।
రాక్షసీ నామ సా వేలా గర్హితా సర్వకర్మసు ॥83॥

ఒక పగటికాల నిర్ణయంలో మొత్తం పదునైదు ముహూర్తాలుంటాయి. ప్రాతఃకాలంలో మూడు ముహూర్తాలు, పూర్వాహ్ణంలో మూడు, మధ్యాహ్నం మూడు, అపరాహ్ణం మూడు, సాయంత్రం మూడు ఇలా ఒక్కొక్కటికి మూడు ముహూర్తాల చొప్పున మొత్తం పదునైదు ముహూర్తాలు. సాయాహ్నంలో శ్రాద్ధం పెట్టరాదు. ఎందుకంటే దానికి 'రాక్షసహోరా' అన్న పేరున్నది. సర్వకర్మలకు అది నింద్యమే.

అహ్నో ముహూర్తా విఖ్యాతా దశ పఞ్చ చ సర్వదా ।
తత్రాష్టమో ముహూర్తో యస్స కాలః కుతపః స్మృతః ॥84॥

దినములో సదా ప్రసిద్ధములైనవి పదునైదు ముహూర్తాలు. ఈ పదునైదు ముహూర్తాలలో ఎనిమిదవ ముహూర్తానికి కుతపకాలమని పేరు.

మధ్యాహ్నే సర్వదా యస్మాన్మన్దీభవతి భాస్కరః ।
తస్మాదనన్తఫలదస్తదారమ్భో విశిష్యతే ॥85॥

మధ్యాహ్నం ఏ సమయంనుండి సూర్యుడు చల్లబడడం ఆరంభమౌతుందో అప్పటినుండి సాయాహ్నం ప్రారంభమయ్యేలోగా శ్రాద్ధం జరిపేవారు అనంతఫలం పొందుతారు.

మధ్యాహ్నః ఖడ్గపాత్రం చ తథా నేపాలకమ్బలః ।
దీపో దర్భాస్తిలా గావో దౌహిత్రశ్చాష్టమః స్మృతః ॥86॥

ఇంతేకాక మధ్యాహ్నకాలం ఖడ్గం ఉంచే ఒర (ఒరకలిగినచాకు) ఒక నేపాళ కంబళం, దీపం, దర్భలు, తిలలు, ఆవులు ఎనిమిదవవాడైన దౌహిత్రుడు ఈ ఎనిమిదింటికి 'కుతపం' అని పేరు.

పాపం కుత్సిత మిత్యాహుస్తస్య సన్తాపకారిణః ।
అష్టావేతే యతస్తస్మాత్కుతపా ఇతి విశ్రుతాః ॥87॥

పాపాన్ని కుత్సిత మంటారు. దానిని సంతపింపజేసేవి కాబట్టి ఈ ఎనిమిదీ కుతపాలు అని ప్రసిద్ధి పొందాయి.

ఊర్ధ్వం ముహూర్తాత్కుతపాద్యన్ముహూర్తచతుష్టయమ్ ।
ముహూర్తపఞ్చకం చైతత్స్వధాభవనమిష్యతే ॥88॥

పగటిముహూర్తంలో అష్టమమైన కుతప ముహూర్తం, ఆ తరువాత వచ్చే నాలుగు ముహూర్తాలూ ఈ ఐదు ముహూర్తాలకు స్వధాభవనములని పేరు.

విష్ణోర్దేహసముద్భూతాః కుశాః కృష్ణా స్తిలా స్తథా ।
శ్రాద్ధస్య రక్షణాయాలమేతత్ప్రాహుర్దివౌకసః ॥89॥

దర్భలు, నల్లని నువ్వులు విష్ణువుయొక్క శరీరంనుండి పుట్టాయి. శ్రాద్ధం సుఖప్రదం కావాలంటే వీటిని శ్రాద్ధంలో వినియోగించాలి అని ద్యులోకంలోని పితృదేవతలు చెప్పారు.

తిలోదకాఞ్జలి ర్దేయో జలస్థై స్తీర్థవాసిభిః ।
సదర్భహస్తైనైకేన శ్రాద్ధమేవం విశిష్యతే ॥90॥

అందుచేత శ్రాద్ధకాలంలో చేతియందు దర్భలు ధరించి తిలోదకాన్ని తీర్థవాసులు పితరులనుద్దేశించి యివ్వాలి. అలా చేస్తే ఆ శ్రాద్ధం విశిష్టమవుతుంది.

శ్రాద్ధసాధనకాలే తు పాణినైకేన దీయతే ।
తర్పణం తూభయేనైవ విధిరేష స్సదా స్మృతః ॥91॥

శ్రాద్ధసాధనకాలంలో ఒకచేతితోనే పిండం పెట్టాలి. తర్పణం మాత్రం రెండు చేతులతో విడవాలి అనే విధిని సదా పాటించాలి.

పుణ్యం పవిత్ర మాయుష్యం సర్వపాపవినాశనమ్ ।
పురా మత్స్యేన కథితం తీర్థశ్రాద్ధానుకీర్తనమ్ ।
శృణోతి యః పఠేద్వాఽపి శ్రీమాన్సంజాయతే నరః ॥92॥

పుణ్యప్రదం, పవిత్రం, ఆయుఃప్రదం, సకలపాపవినాశకం అగు ఈ శ్రాద్ధానుకీర్తనం పూర్వం మత్స్యముచే చెప్పబడినది. ఎవడు దీన్ని వింటాడో, లేక చదువుతాడో వాడు శ్రీమంతు డౌతాడు.

శ్రాద్ధకాలే చ వక్తవ్యం తథా తీర్థనివాసిభిః ।
సర్వపాపోపశాన్త్యర్థమలక్ష్మీనాశనం పరమ్ ॥93॥

తీర్థనివాసులు తీర్థశ్రాద్ధసమయంలో దీన్ని పాపాలన్నీపోవడానికి చదవాలి. ఇది అశుభమును నశింపజేస్తుంది.

ఇదం పవిత్రం యశసో నిధానమిదం మహాపాపహరం చ పుంసామ్ ।
బ్రహ్మార్కరుద్రైరపి పూజితం చ శ్రాద్ధస్య మాహాత్మ్యముశన్తి తద్జ్ఞాః ॥94॥

పవిత్రమైనది, కీర్తినిధానమైనది, ఇది జనుల మహాపాపాలను హరిస్తుంది. బ్రహ్మ, సూర్యుడు, రుద్రుడు గూడా దీనిని ఆదరించారు. ఈ శ్రాద్ధప్రభావాన్ని దాని తత్త్వం తెలిసినవారు చెప్పారు.

ఇతి శ్రీమాత్స్యమహాపురాణే మత్స్యమనుసంవాదే శ్రాద్ధకల్పే పితృప్రీతికరతీర్థకాలకథనం నామ ద్వావింశతితమోఽధ్యాయః ॥ 22 ॥

శ్రీ మాత్స్యే మహాపురాణంలోని మత్స్యమను సంవాదంలో శ్రాద్ధకల్పంలో పితరులకు ప్రీతి కలిగించు తీర్థకాలములను చెప్పుట అను ఇరవైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్రయోవింశోఽధ్యాయః - ఇరవైమూడవ అధ్యాయం

చన్ద్రవంశవర్ణనప్రారమ్భశ్చన్ద్రోత్పత్తిశ్చ - చన్ద్రవంశ వర్ణనప్రారంభం, చన్ద్రోత్పత్తి

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

సోమః పితౄణామధిపః కథం శాస్త్రవిశారద ।
తద్వంశ్యా యే చ రాజానో బభూవుః కీర్తివర్ధనాః ॥1॥

శాస్త్రనిపుణుడవైన ఓ సూతా! సోముడు పితృదేవతల కెలా అధిపతి అయ్యాడు? అతని వంశంలో కీర్తివర్ధనులైన రాజు లెవరెవరు జన్మించారు?

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఆదిష్టో బ్రహ్మణా పూర్వ మత్రిస్సర్గవిధౌ పురా ।
అనుత్తమం నామ తపః సృష్ట్యర్థం తప్తవాన్ప్రభుః ॥2॥

పూర్వం బ్రహ్మ అత్రిమహర్షిని సృష్టికార్యానికి ఉపక్రమించుమని ఆదేశించాడు. అందుకు సమర్థుడైన అత్రి సృష్టికొరకై మహోత్తమమైన తపస్సు చేశాడు.

యదానన్దకరం బ్రహ్మ జగతః క్లేశనాశనమ్ ।
బ్రహ్మవిష్ణ్వర్కరుద్రాణామభ్యన్తరమతీన్ద్రియమ్ ॥3॥

శాన్తికృచ్ఛాన్తమనసాం తదంతర్నయనే స్థితమ్ ।
మాహాత్మ్యాత్తపసా విప్రాః పరమానన్దకారకమ్ ॥4॥

విప్రులారా! లోకక్లేశాన్ని నశింపజేసే పరబ్రహ్మతత్త్వం ఆనందకరమైనది. బ్రహ్మకూ, విష్ణునికీ, సూర్యునికీ, రుద్రునికీ అది అంతరంగరూపమైనది. అతీంద్రియమైనది. శాంతచిత్తులకు శాంతి కల్గించేదీ, తపఃఫలమైన పరమానందం కల్గించేదీ అయిన అట్టి తత్త్వం అత్రి తపఃప్రభావంవల్ల అతని కన్నులలోనే ఉంది.

యస్మాదుమాపతిస్సార్ధం ఉమయా తమధిష్ఠితః ।
తం దృష్ట్వా చాష్టమాంశేన తస్మాత్సోమోఽభవచ్ఛిశుః ॥5॥

ఉమాపతియైన శంకరుడు దానిని చూచి ఉమతో గూడా జలంనుండి కల్గిన తన అష్టమాంశంచే అత్రినేత్రాన్ని ఆశ్రయించాడు. ఆ ప్రభావంవల్ల కల్గిన ఆనందాశ్రువులవెంట నీటినుండి పుట్టిన ఆ శివుని ఎనిమిదవ అంశమైన తేజస్సు అత్రిముని నేత్రాలనుండి స్రవించింది. అందుండి సోముడనే శిశువు ఉద్భవించాడు.

అథః సుస్రావ నేత్రాభ్యాం ధామ తచ్చామ్బుసమ్భవమ్ ।
దీపయన్విశ్వమఖిలం జ్యోత్స్నయా సచరాచరమ్ ॥6॥

జలంనుండి జనించిన ఆ తేజస్సు చరాచరాత్మకమైన విశ్వాన్ని తన వెన్నెలచే దీపింపజేస్తూ నేత్రాలనుండి క్రిందికి ప్రసరించింది.

తద్దిశో జగృహుర్ధామ స్త్రీరూపేణ సుతేచ్ఛయా ।
గర్భో భూత్వోదరే తాసామాస్థితశ్చాయుతత్రయమ్ ॥7॥

అప్పుడు దిక్కులు పుత్రవాంఛతో స్త్రీరూపం దాల్చి ఆ తేజస్సును పరిగ్రహించాయి. ఆ తేజస్సు గర్భమై వారి ఉదరాలలో ముప్పదివేల సంవత్సరాలు ఉండిపోయింది.

ఆశాస్తం ముముచు ర్గర్భమశక్తా ధారణే తతః ।
సమాదాయాథ తం గర్భమేకీకృత్య చతుర్ముఖః ॥8॥

యువానమకరోద్బ్రహ్మా సర్వాయుధధరం నరమ్ ।
స్యన్దనేఽథ సహస్రాశ్వే వేదశక్తిమయే ప్రభుః ॥9॥

ఆరోప్య లోకమనయదాత్మనస్స పితామహః ।
తతో బ్రహ్మర్షిభిః ప్రోక్తమస్మత్స్వామీ భవత్వయమ్ ॥10॥

ఋషిభి ర్దేవగన్ధర్వైరోషధీభిస్తథైవ చ ।
తుష్టువుస్సోమదైవత్యైర్బ్రహ్మాద్యా మన్త్రసఙ్ఘకైః ॥11॥

తదుపరి ఆ దిక్కులు గర్భధారణకు శక్తి లేక ఆ గర్భాన్ని త్యజించాయి. అప్పుడు బ్రహ్మ దిశలలో వ్యాపించిన ఆ తేజస్సునంతా ఒక్కటిగా చేసి సకలాయుధధారియైన యువకునిగా రూపొందించాడు. ఆ పై శక్తిమంతుడగు బ్రహ్మ వెయ్యిగుర్రాలు పూంచిన దేవశక్తిసంపన్నమైన రథంలో అతణ్ణి కూర్చోబెట్టి తన లోకానికి తీసుకుపోయాడు. అప్పుడు బ్రహ్మర్షులు, ఋషులు, దేవతలు, గంధర్వులు, ఓషధులు "అతడు మాకు ప్రభువగు గాక!" అని కోరుకొన్నారు. బ్రహ్మాదులు సోమదైవత్యమంత్రాలచే అతణ్ణి స్తుతించారు.

స్తూయమానస్య తస్యాభూదధికో ధామసఞ్చయః ।
తేజోవితానాదభవద్భువి దివ్యౌషధీగణః ॥12॥

అలా స్తుతింపబడుతున్న అతని తేజస్సు మిక్కిలిగా పెంపొందింది. ఆ తేజోరాశినుండి భూలోకంలో దివ్యమైన ఓషధీగణం జనించింది.

తద్దీప్తిరధికా తస్మాద్రాత్రౌ భవతి సర్వదా ।
తేనౌషధీశ స్సోమోఽభూద్ద్విజేశశ్చ నిగద్యతే ॥13॥

అందువల్లనే అతనినుండి జనించిన ప్రకాశం రాత్రివేళ సదా అత్యధికమయింది. ఆ ఓషధీశ్వరుడే సోముడయ్యాడు. అతణ్ణి ద్విజుల కధిపతి అని కూడా అంటారు.

వేదధామ రసం చాపి యదిదం చన్ద్రమణ్డలమ్ ।
క్షీయతే వర్ధతే చైవ శుక్లే కృష్ణే చ సర్వదా ॥14॥

ఈ చంద్రమండలం వేదాలకు స్థానంగా, రసాత్మకంగా రూపొందింది. ఇది శుక్లపక్షంలో వృద్ధిపొంది కృష్ణపక్షంలో క్షీణిస్తూ ఉంటుంది.

వింశతిం చ తథా సప్త దక్షః ప్రాచేతసో దదౌ ।
రూపలావణ్యసంయుక్తాస్తస్మై కన్యాస్సువర్చసః ॥15॥

పిదప దక్షుడు రూపలావణ్యవతులు, తేజస్సుకలవారూ అయిన ఇరవైయేడుమంది కన్యలను సోమునకిచ్చాడు.

తతః పద్మసహస్రాణాం సహస్రాణి దశైవ తు ।
తపశ్చచార శీతాంశుర్విష్ణుధ్యానైకతత్పరః ॥16॥

తదుపరి చంద్రుడు విష్ణుధ్యానైకాసక్తుడై దశసహస్రపద్మసహస్రసంవత్సరాల కాలం ($10 \times 1000 \times 1000 \times 1000000000$) తపస్సు చేశాడు.

తతస్తుష్టస్తు భగవాంస్తస్మై నారాయణో హరిః ।
వరం వృణీష్వ ప్రోవాచ పరమాత్మా జనార్దనః ॥17॥

అతని తపస్సుకు మెచ్చిన భగవంతుడూ, శ్రీమన్నారాయణుడూ, జనార్దనుడూ అయిన శ్రీహరి అతనిని వరం కోరుకొమ్మన్నాడు.

తతో వవ్రే వరాన్ సోమః శక్రలోకం జయామ్యహమ్ ।
ప్రత్యక్షమేవ భోక్తారో భవన్తు మమ మన్దిరే ॥18॥

రాజసూయే సురగణా బ్రహ్మాద్యా స్సన్తు మే ద్విజాః ।
రక్షఃపాలశ్శివోఽస్మాకమాస్తాం శూలధరో హరః ॥19॥

అంతట చంద్రుడు విష్ణువును ఈ విధంగా వరాలిమ్మని కోరాడు. “నేను ఇంద్రలోకాన్ని జయించగలగాలి. నేను నిర్వహించే రాజసూయంలో దేవతలందరూ ప్రత్యక్షంగా వచ్చి హవిస్సు గ్రహించాలి. బ్రహ్మాదులు నా యజ్ఞమునందు ఋత్విక్కులుగా ఉండాలి. శూలధారియగు శివుడు నా యజ్ఞానికి రక్షకుడు కావాలి”.

తథేత్యుక్తస్సహాజహ్రే రాజసూయం తు విష్ణునా ।
హోతాత్రి ర్భృగురధ్వర్యు రుద్గాతాఽభూచ్చతుర్ముఖః ॥20॥

బ్రహ్మత్వ మగమత్తస్య ఉపద్రష్టా హరి స్స్వయమ్ ।
సదస్యాస్సనకాద్యాస్తు రాజసూయవిధౌ స్మృతాః ॥21॥

ఇలా కోరగా విష్ణువు ‘సరే’ అని ఆ వరాల ననుగ్రహించాడు. ఆ వరము ననుసరించి చంద్రుని రాజసూయయాగంలో అత్రి హోతగా, భృగువు అధ్వర్యుడుగా, బ్రహ్మ ఉద్గాతగా పాల్గొన్నారు. శ్రీహరి స్వయంగా ఉపద్రష్ట బ్రహ్మత్వాన్ని పొంది, (పర్యవేక్షకుడు)అయ్యాడు. సనకసనందనాదులు సదస్యులుగా వచ్చారు.

చమసాధ్వర్యవస్తత్ర విశ్వేదేవా దశైవ తు ।
త్రైలోక్యం దక్షిణా తేన ఋత్విగ్భ్యః ప్రతిపాదితమ్ ॥22॥

విశ్వేదేవతలు పదిమంది చమసాధ్వర్యులయ్యారు. చంద్రుడు మూడు లోకాలనూ ఋత్విక్కులకు దక్షిణగా ఇచ్చాడు.

తతస్సమాప్తేఽవభృథే తద్రూపాలోకనేచ్ఛవః ।
కామబాణాభితప్తాంగ్యో నవ దేవ్యః సిషేవిరే ॥23॥

అలా ఆ యజ్ఞం సమాప్తమై అవభృథం ముగిసింది. అప్పుడు అతణ్ణి చూడడానికి వచ్చిన తొమ్మిదిమంది దేవీగణం చూచి మదనబాణతప్తలై అతణ్ణి సేవించారు.

లక్ష్మీ ర్నారాయణం త్యక్త్వా సినీవాలీ చ కర్దమమ్ ।
ద్యుతిర్విభావసుం తద్వత్తుష్టిర్ధాతారమవ్యయమ్ ॥24॥

ప్రభా ప్రభాకరం త్యక్త్వా హవిష్మన్తం కుహూః స్వయమ్ ।
కీర్తిర్జయన్తం భర్తారం వసుర్మారీచకశ్యపమ్ ॥25॥

ధృతిస్త్యక్త్వా పతిం నందిం సోమమేవాభజం స్తదా ।
స్వకీయా ఇవ సోమోఽపి కామయామాస తాంస్తదా ॥26॥

లక్ష్మీదేవి నారాయణుణ్ణి వదలి వచ్చింది. సినీవాలి కర్దముణ్ణీ, ద్యుతి సూర్యుణ్ణీ అట్లే తుష్టి అవ్యయుడైన ధాతనూ విడిచి వచ్చారు. ప్రభ ప్రభాకరుణ్ణీ, కుహువు హవిష్మంతుణ్ణీ, కీర్తి జయంతుణ్ణీ, వసువు మారీచకశ్యపుణ్ణీ, ధృతి పతి యగు నందినీ విడిచి సోముణ్ణి ఆశ్రయించారు. సోముడు గూడా అప్పుడు వారందరినీ తనవారినిగా గ్రహించి కామించాడు.

ఏవం కృతాపచారస్య తాసాం భర్తృగణ స్తదా ।
న శశాకాపచారాయ శాపై శ్శస్త్రాదిభిః పునః ॥27॥

ఈరీతిగా తమకు అపచారం చేసినా వారి భర్తలు చంద్రుణ్ణి శాపశస్త్రాదులతో ఏమీ చేయలేకపోయారు.

తథాఽప్యరాజత విధుర్దశధా భావయన్దిశః ।
సోమః ప్రాప్యాథ దుష్ప్రాప్యమైశ్వర్యమృషిసంస్తుతమ్ ।
సురలోకైకనాథత్వమాప్త స్స తపసా తదా ॥28॥

వారు తనకెన్ని విధాల హాని కల్గించపూనుకొన్నా అతడు శక్తాసంపన్నుడై పది దిక్కులను ప్రకాశింపజేస్తూ ఋషులచే పూజితమైన పొందరాని ఐశ్వర్యాన్ని పొంది తన తపఃప్రభావంతో అమర లోకైకనాథుడుగా రూపొందాడు.

కదాచిదుద్యానగతామపశ్యదనేకపుష్పాభరణైశ్చ శోభితామ్ ।
బృహన్నితమ్బస్తనభారఖేదాత్ పుష్పావతంసామతిదుర్మదాంగీమ్ ॥29॥

ఒకసారి చంద్రుడు ఉద్యానవనంలో ఉన్న తారను చూచాడు. ఆమె పెక్కు పుష్పాభరణాలతో శోభిస్తున్నది. పెద్దపిరుదులు గలిగి స్తనాలభారంతో వంగియున్నది. పూలను తలలో ధరించివున్నది. మిక్కిలి మదించిన దేహం కల్గి ఉన్నది.

భార్యాం చ తాం దేవగురోరనఙ్గబాణాభిరామాయతచారునేత్రామ్ ।
తారాం స తారాధిపతిః స్మరార్తః కేశేషు జగ్రాహ వివిక్తభూమౌ ॥30॥

ఆమె దేవగురువైన బృహస్పతి భార్య. మదనబాణాలైన పూలవలె అందమైన విశాలనేత్రాలతో అలరారుతున్నది. అప్పటికే అశ్విన్యాదితారల కధిపతిగా నుండిన చంద్రుడు ఆమెను చూచి మదనపీడితుడై, ఏకాంతంలో ఆమె కేశాలు పట్టుకొన్నాడు.

సాఽపి స్మరార్తా సహ తేన రేమే తద్రూపకాన్త్యా హృతమానసేన ।
చిరం విహృత్యాథ జగామ తారాం విధు ర్గృహీత్వా స్వగృహం తతోఽపి ॥31॥

న తృప్తిరాసీచ్చ గృహేఽపి తస్య తారానురక్తస్య సుఖాగమేషు ।
బృహస్పతిస్తద్విరహాగ్నిదగ్ధస్తద్ధ్యాననిష్ఠైకమనా బభూవ ॥32॥

ఆమె గూడా అతని సౌందర్యముచే తన చిత్తం అపహరింపబడగా స్మరపీడితురాలై చిరకాలం అతనితో విహరించింది. పిదప తారతోగూడా చంద్రుడు తన గృహానికి వెళ్ళాడు. ఆమెపై అనురక్తుడైన సోమునికి ఇంటిలోగూడా సుఖానుభవంతో తనివి తీరలేదు. బృహస్పతి తారావియోగానలదగ్ధుడై చిత్తాన్ని ఆమెయందే లగ్నం చేసి తదేకధ్యానపరు డయ్యాడు.

శశాక శాపం న చ దాతుమస్మై న మన్త్రశస్త్రాగ్నివిషైరశేషైః ।
తస్యాపకర్తుం వివిధైరుపాయైర్నైవాభిచారైరపి వాగధీశః ॥33॥

అతడు శాపంతో గాని, మంత్రశస్త్రాగ్ని విషాదుల బలంతో గాని చంద్రుణ్ణి నిగ్రహించలేకపోయాడు. ఆభిచారిక క్రియలతో గానీ, వివిధో పాయాలతో గానీ అతని కపకారం చేయలేకపోయాడు.

స యాచయామాస తతస్తు దైన్యాత్సోమం స్వభార్యార్థ మనఙ్గతప్తః ।
స యాచ్యమానోఽపి దదౌ న తారాం బృహస్పతేస్తత్సుఖపాశబద్ధః ॥34॥

మదనతప్తుడైన బృహస్పతి దీనుడై చంద్రుణ్ణి తన భార్యను విడిచిపెట్టమని యాచించాడు.కాని ఆమెతోడి సుఖాలతో బద్ధుడైన సోముడు బృహస్పతి యాచించినా ఆమె నతని కీలేదు.

మహేశ్వరేణాథ చతుర్ముఖేన సాధ్యైర్మరుద్భిస్సహ లోకపాలైః ।
దదౌ యదా తాం న కథఞ్చిదిన్దుస్తదా శివః క్రోధపరో బభూవ ॥35॥

మహేశ్వరుడు, బ్రహ్మ, సాధ్యులు, మరుత్తులు, లోకపాలురు వీరు చెప్పినప్పటికీ చంద్రుడు వారి మాటలను లెక్కింపలేదు. అంతట శివుడు చంద్రునిపట్ల క్రోధావిష్టుడయ్యాడు.

యో వామదేవః ప్రథితః పృథివ్యామనేకరుద్రార్చితపాదపద్మః ।
తత స్సశిష్యో గిరిశః పినాకీ బృహస్పతిస్నేహవశానుబద్ధః ॥36॥

ఆయన లోకప్రసిద్ధుడైన వామదేవుడు. అనేకరుద్రులచే అర్చించబడిన పాదపద్మాలు కలవాడు. శిష్యులతో గూడిన ఆ గిరీశ్వరుడు బృహస్పతితోడి స్నేహంతో బద్ధుడైనాడు.

ధనుర్గృహీత్వా஽జగవం పురారిర్జగామ భూతేశ్వరసిద్ధజుష్టః ।
యుద్ధాయ సోమేన విశేషదీప్తస్తృతీయనేత్రానలభీమవక్త్రః ॥37॥

ఆ పురారి అజగవమనే ధనువు చేపట్టి భూతేశ్వరులతో, సిద్ధులతోగూడి ఎక్కువగా ప్రకాశించే మూడవకంటి అనలంచే భీకరవదనుడై సోముని పైకి యుద్ధానికి వెళ్ళాడు.

సహైవ జగ్ముశ్చ గణేశకాద్యా వింశచ్చతుష్షష్టి రథాశ్వయుక్తాః ।
యక్షేశ్వరః కోటి శతైరనేకైర్యుతో஽న్వగాత్స్యందన సంస్థితానామ్ ॥38॥

ఆ శివునితోగూడ గణేశుడు, రథాలతో అశ్వాలతో సహా ఇరువదిమంది అరువదినాల్గు కోట్లమంది పరివారంతో యుద్ధసన్నద్ధులై పోయారు. అట్లే కుబేరుడు అనేకరథాలనధిష్ఠించిన వీరులు అనేకశతకోట్ల సంఖ్యలతోకూడి వెళ్ళాడు.

వేతాలయక్షోరగకిన్నరాణాం పద్మేన చైకేన తథా஽ర్బుదేన ।
లక్షైస్త్రిభిర్ద్వాదశభీ రథానాం సోమో஽ప్యగాత్తత్ర వివృద్ధమన్యుః ॥39॥

నక్షత్ర దైత్యాసురసైన్యయుక్త శ్శనైశ్చరాంగారకవృద్ధతేజాః ।
జగ్ముర్భయం సప్త తథైవ లోకాశ్చచాల భూర్ద్వీపసముద్రగర్భాః ॥40॥

వేతాళులు, యక్షులు, నాగులు, కిన్నరులు, పద్మం, అర్బుదం కుబేరునికి వెంట వచ్చారు. (పద్మం100,0000000 – అర్బుదం 10,00,00,000) చంద్రుడు కూడా కోపోద్దీపితుడై 15 లక్షలరథాలపై నక్షత్రాలు, దైత్యులు తనవెంటరాగా, శని, అంగారకుడు తన తేజాన్ని పెంపొందిస్తుండగా సమరానికి వచ్చాడు. ఈ యుద్ధసంరంభం చూచి సప్తలోకాలూ భీతి చెందాయి. ద్వీపాలూ, సముద్రాలతో గూడిన భూమి చలించింది.

స సోమమేవాభ్యగమత్పినాకీ గృహీతదీప్తాస్త్రవిశాలవహ్నిః ।
అథాభవద్భీషణభీమసోమ సైన్యద్వయస్యాపి మహాహవో஽సౌ ॥41॥

ప్రదీప్తమైన అస్త్రాలనుండి అగ్ని వెలువడుతుండగా పినాకి చంద్రుని కెదురుగా నడిచాడు. పిదప ఆ యిరుసైన్యాలకూ భీకరమైన సంగరం జరిగింది.

అశేషసత్త్వక్షయకృత్ప్రవృద్ధ స్తీక్ష్ణాయుధాస్త్రజ్వలనైకరూపః ।
శస్త్రైరథాన్యోన్యమశేషసైన్యం ద్వయోర్జగామ క్షయముగ్రతీక్ష్ణైః ॥42॥

ఆ యుద్ధం సకలప్రాణులకూ క్షయం కల్గించింది. వాడి వేడి అస్త్రశస్త్రాలమంటల మయమయింది. ఉగ్రతీక్ష్ణశస్త్రాలతో వారు పరస్పరం తమ సేనలకు క్షయం కల్గించుకొన్నారు.

పతన్తి శస్త్రాణి తథోజ్జ్వలాని స్వర్భూమిపాతాలమథో దహన్తి ।
రుద్రః కోపాద్బ్రహ్మశీర్షం ముమోచ సోమో஽పి సోమాస్త్రమమోఘవీర్యమ్ ॥43॥

యుద్ధరంగంలో పడే ఉజ్జ్వలమైన శస్త్రాలు స్వర్గాన్నీ, భూమినీ, పాతాళాన్నీ దహింపసాగాయి. కోపావిష్టుడైన రుద్రుడు బ్రహ్మశిరోనామకమైన అస్త్రాన్ని ప్రయోగించాడు. సోముడు కూడా అమోఘవీర్యమైన సోమాస్త్రాన్ని ప్రయోగించాడు.

తయోర్నిపాతేన సముద్రభూమ్యోరథాన్తరిక్షస్య చ భీతిరాసీత్ ।
తదస్త్రయుగ్మం జగతాం క్షయాయ ప్రవృద్ధమాలోక్య పితామహోఽపి ॥44॥

అన్తఃప్రవిశ్యాథ కథం కథఞ్చిన్నివారయామాస సురైః స్సహైవ ।
అకారణం కిం క్షయకృజ్జనానాం సోమ! త్వయాఽపీత్థమకారి కార్యమ్ ॥45॥

ఆ రెండు అస్త్రాల ప్రయోగంతో సముద్రాలు, భూమి, అంతరిక్షంలోని వారందరికీ భీతి కల్గింది. జగత్క్షయంకొరకై ఉజ్జృంభించిన ఆ అస్త్రద్వయాన్ని చూచి బ్రహ్మదేవుడు గూడా యుద్ధభూమిలో ఇతరదేవతలతో సహా ఎట్లో ప్రవేశించి యుద్ధనివారణ గావించాడు. "సోమా! నిష్కారణంగా నీవు జగత్క్షయకారణమైన ఈ యుద్ధకార్యానికి ఎందుకు పూనుకొన్నావు?

యస్మాత్పరస్త్రీహరణాయ సోమ త్వయా కృతం యుద్ధమతీవ భీమమ్ ।
పాపగ్రహస్త్వం భవితా జనేషు శాన్తోఽప్యలం నూనమభీప్సితం తే ।
భార్యామిమామర్పయ వాక్పతేస్త్వం న చావమానోఽస్తి పరస్వహారే ॥46॥

పరదారాపహరణానికై నీ వీభీకరయుద్ధం చేశావు. అందువల్ల నీవు శాంతుడవైనా జనులలో పాపగ్రహమన్న అపకీర్తి పొందుతావు. బృహస్పతి భార్యను తిరిగి అప్పగించు. పరధనాపహారులు పరులధనాన్ని వారికివ్వడం అవమానకరం కాదు."

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

తథేతి చోవాచ హిమాంశుమాలీ యుద్ధాదపాక్రామదతః ప్రశాన్తః ।
బృహస్పతిః స్వామపగృహ్య తారాం హృష్టో జగామ స్వగృహం సరుద్రః ॥47॥

అంతట అట్లే అని అంగీకరించి సోముడు ప్రశాంతుడై యుద్ధం విరమించాడు. బృహస్పతి తన తారను పరిగ్రహించి సంతుష్టుడై రుద్రునితో గూడా తన యింటికి వెళ్ళాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మత్స్యమనుసంవాదే చన్ద్రవంశ వర్ణనే చన్ద్రోత్పత్త్యాది కథనం నామ త్రయోవింశతితమోఽధ్యాయః ॥ 23 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని మత్స్యమను సంవాదంలో చన్ద్రవంశాను వర్ణనమందు చన్ద్రోత్పత్త్యాదుల కథనమనే ఇరవైమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుర్వింశోఽధ్యాయః - ఇరవైనాల్గవ అధ్యాయం

బుధోత్పత్తిః - బుధుని పుట్టుక

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

తత స్సంవత్సరస్యాన్తే ద్వాదశాదిత్యసన్నిభః ।
దివ్యపీతామ్బరధరో దివ్యాభరణభూషితః ॥1॥

తారోదరాద్వినిష్క్రాన్తః కుమారశ్చంద్రసన్నిభః ।
సర్వార్థశాస్త్రవిద్ధీమాన్హస్తిశాస్త్రప్రవర్తకః ॥2॥

తదుపరి సంవత్సరం గడిచేసరికి పండ్రెండు మంది సూర్యులతో సమానుడూ, దివ్యమైన పీతాంబరాలు ధరించినవాడూ, దివ్యాభరణాలచే భూషితుడూ, చంద్రునితో సాటియైనవాడూ, అర్థశాస్త్రం సమగ్రంగా గ్రహించినవాడూ, ధీమంతుడూ, గజశాస్త్రప్రవర్తకుడూ అయిన కుమారుడు తారాగర్భంనుండి ఉదయించాడు.

నామ్నా యద్రాజపుత్రీయం విశ్రుతం గజవైద్యకమ్ ।
రాజ్ఞ స్సోమస్య పుత్రత్వాత్ రాజపుత్రో బుధస్స్మృతః ॥3॥

అతడు ప్రవర్తింపజేసిన గజశాస్త్రమే 'రాజపుత్రీయ'మన్న పేరుతో ప్రశస్తమయింది. సోముడు రాజు, అతని కుమారుడు గాన బుధుడు 'రాజపుత్రుడు' గా ప్రసిద్ధుడయ్యాడు.

జాతమాత్ర స్స తేజాంసి సర్వాణ్యేవాజయద్బలీ ।
బ్రహ్మాద్యా స్తత్ర చాజగ్ముర్దేవా దేవర్షిభి స్సహ ॥4॥

పుట్టగానే అతడు బలవంతుడై సకలతేజస్సులనూ తన తేజస్సుతో జయించాడు. బ్రహ్మాదులు దేవర్షులతో గూడి ఆ కుమారుని కడకు వచ్చారు.

బృహస్పతిగృహే సర్వే జాతకర్మోత్సవే తదా ।
అపృచ్ఛంస్తే సురాస్తారాం కేన జాతః కుమారకః ॥5॥

అంతట బృహస్పతిగృహంలో జాతకర్మోత్సవం జరిగింది. అక్కడ చేరిన దేవతలందరూ "అతడు ఎవరికి కల్గిన కుమారుడు?" అని తారను ప్రశ్నించారు.

తత స్సా లజ్జితా తేషాం న కిఞ్చిదవదత్తదా ।
పునః పున స్తదా పృష్టా లజ్జయన్తీ వరాఙ్గనా ॥6॥

సిగ్గుపడిన తార వారికేమీ బదులు పలకలేదు. వారు మరల మరల ఆమెను ఆ విషయమే ప్రశ్నించారు.

సోమస్యేతి చిరాదాహ తతోఽగృహ్ణాద్విధు స్సుతమ్ ।
బుధ ఇత్యకరోన్నామ్నా ప్రాదాద్రాజ్యం చ భూతలే ॥7॥

చివరికి 'సోమునికి పుట్టినవాడు' అని చాలాసేపటికి ఆమె చెప్పింది. వెంటనే సోముడు వచ్చి ఆ బిడ్డను గ్రహించాడు. అతనికి 'బుధుడు' అని నామకరణం చేశాడు. భూతలంలో రాజ్యాన్ని గూడా ఇచ్చాడు.

అభిషేకం తతః కృత్వా ప్రధానమకరోద్విభుః ।
గ్రహసామ్యం ప్రదాయాథ బ్రహ్మా బ్రహ్మర్షిసంయుతః ॥8॥

పశ్యతాం సర్వదేవానాం తత్రైవాన్తరధీయత ।
ఇలోదరే తు ధర్మిష్ఠం బుధః పుత్రమజీజనత్ ॥9॥

తదుపరి రాజ్యాభిషిక్తుణ్ణి చేసి యువరాజును గావించాడు. తదుపరి బ్రహ్మర్షులతో గూడిన బ్రహ్మ అతనికి గ్రహత్వము ప్రసాదించి దేవతలందరూ చూస్తూ వుండగానే అంతర్ధానమయ్యాడు. బుధుడు ఇలా గర్భమునందు ధర్మిష్ఠుడైన పుత్రుణ్ణి కన్నాడు.

అశ్వమేధశతం సాగ్రమకరో ద్యస్స్వతేజసా ।
పురూరవా ఇతి ఖ్యాత స్సర్వలోక నమస్కృతః ॥10॥

ఆ పుత్రుడు సర్వలోకనమస్కృతుడై పురూరవుడని ప్రసిద్ధి చెందాడు. తన తేజోబలంతో సమగ్రంగా నూరు అశ్వమేధయాగాలు చేశాడు.

హిమవచ్ఛిఖరే రమ్యే సమారాధ్య జనార్దనమ్ ।
లోకైశ్వర్యమగాద్రాజా సప్తద్వీపపతిస్తదా ॥11॥

అతడు రమ్యమైన హిమాద్రిశిఖరంపై జనార్దనుణ్ణి ఆరాధించి లోకాధిపత్యం పొంది సప్తద్వీపాలకూ అధిపతి అయ్యాడు.

కేశిప్రభృతయో దైత్యాః కోటిశో యేన దారితాః ।
ఊర్వశీ యస్య పత్నీత్వ మగమద్రూపమోహితా ॥12॥

అతడు కేశి మున్నగు కోట్లకొలది దైత్యులను మట్టుబెట్టాడు. అతని సౌందర్యాన్ని మెచ్చి మోహించి ఊర్వశి అతని భార్య అయింది.

సప్తద్వీపా వసుమతీ సశైలవనకాననా ।
ధర్మేణ పాలితా తేన సర్వలోకహితైషిణా ॥13॥

సకలలోకహితం కోరిన ఆ పురూరవుడు కొండలు అడవులతో కూడిన సప్తద్వీపాలు గల ఈ వసుమతిని ధర్మబద్ధంగా పరిపాలించాడు.

చామరగ్రాహిణీ కీర్తి స్సదా చైవాఙ్గవాహికా ।
విష్ణోః ప్రసాదాద్దేవేన్ద్రో దదావర్ధాసనం తదా ॥14॥

కీర్తి అతనికి వింజామర వీచు సేవకురాలుగా ఒడలు పట్టుసేవికగా అయింది. విష్ణుని అనుగ్రహంవల్ల దేవేంద్రు డతనికి అర్ధాసన మిచ్చాడు.

ధర్మార్థకామాన్ధర్మేణ సమమేవాభ్యపాలయత్ ।
ధర్మార్థకామాస్సంద్రష్టుమాజగ్ముః కౌతుకాత్పురా ॥15॥

జిజ్ఞాసవస్తచ్చరితం కథం పశ్యతి న స్సమమ్ ।
భక్త్యా చక్రే తత స్తేషా మర్ఘ్యపాద్యాదికం నృపః ॥16॥

ఆ పురూరవుడు ధర్మార్థకామాలను ధర్మబద్ధంగా ఆచరించాడు. ధర్మం, అర్థం, కామం అనే మూడు పురుషార్థాలూ అతడెలా తమ్ము సమంగా చూడగలడో పరీక్షించాలన్న కౌతుకంతో అతని చెంత జేరాయి. అతని సచ్చరిత్రను తెలుసుకోగోరిన ఆ పురుషార్థాలకు రాజు భక్తితో అర్ఘ్యపాద్యాదులు సమర్పించాడు.

ఆసనత్రయమానీయ దివ్యం కనకభూషితమ్ ।
నివేశ్యాథాకరోత్పూజామీషద్ధర్మేఽధికాం పునః ॥17॥

జగ్మతుస్తేన కామార్థావతికోపం నృపం ప్రతి ।
అర్థశ్శాపమదాత్తస్మై లోభాత్త్వం నాశమేష్యసి ॥18॥

కనకభూషితాలైన మూడు ఆసనాలు తెచ్చి వారిని కూర్చోబెట్టి పూజించాడు. ధర్మాన్ని మాత్రం కాస్తా ఎక్కువ భక్తితో అర్చించాడు. అందుకు అర్థకామాలు రెండూ అతనిపట్ల కోపం చూపాయి. అర్థం "నీవు లోభంతో నశిస్తావు" అని శపించింది.

కామోఽప్యాహ తవోన్మాదో భవితా గన్ధమాదనే ।
కుమారవనమాశ్రిత్య వియోగాదూర్వశీభవాత్ ॥19॥

కామం కూడా "నీకు గంధమాదనగిరిలో ఊర్వశీవియోగంతో కుమారవనంలో ఉన్మాదం కల్గుగాక!" అని శపించింది.

ధర్మోఽప్యాహ చిరాయుస్త్వం ధార్మికశ్చ భవిష్యసి ।
సన్తతిస్తవ రాజేంద్ర యావచ్చన్ద్రార్కతారకమ్ ॥20॥

శతశో వృద్ధి మాయాతు న నాశం భువి యాస్యతి ।
ఇత్యుక్త్వాఽన్తర్దధు స్సర్వే రాజా రాజ్యం తదన్వభూత్ ॥21॥

అంతట ధర్మం రాజుతో "నీవు ధార్మికుడవై చిరాయువగుదువు గాక! రాజేంద్రా! నీ సంతానం శతశః వృద్ధినందుగాక!" అని చెప్పింది. ఇలా చెప్పి ఆ పురుషార్థాలు మూడూ అంతర్ధానమయ్యాయి. రాజు రాజ్యాన్ని అనుభవించాడు.

అహన్యహని దేవేన్ద్రం ద్రష్టుం యాతి స రాజరాట్ ।
కదాచిదారుహ్య రథం దక్షిణామ్బరచారిణమ్ ॥22॥

సార్ధమర్కేణ సోఽ పశ్యన్నీయమానామథామ్బరే ।
కేశినా దానవేన్ద్రేణ చిత్రలేఖామథోర్వశీమ్ ॥23॥

ఆ పురూరవుడు రోజూ దేవేంద్రుణ్ణి చూడడానికి వెళ్లేవాడు. ఒకరోజు తన రథమెక్కి సూర్యునితోపాటు దక్షిణాకాశంలో అతడు చరిస్తూ వుండగా 'కేశి' అనే రాక్షసరాజు అపహరించి తీసుకుపోతున్న ఊర్వశినీ, చిత్రలేఖనూ చూచాడు.

తం వినిర్జిత్య సమరే వివిధాయుధపాణినా ।
బుధపుత్రేణ వాయవ్యమస్త్రం ముక్త్వా యశోఽర్థినా ॥24॥

తథా శక్రోఽపి సమరే యేన చైవం వినిర్జితః ।
మిత్రత్వమగమద్దేవై ర్దదావిన్ద్రాయ చోర్వశీమ్ ॥25॥

వివిధాయుధాలు చేతబూనిన బుధుని కుమారుడు కీర్తినర్థించినవాడై యుద్ధంలో వాయవ్యాస్త్రం ప్రయోగించి కేశిని జయించాడు. పూర్వం 'కేశి' ఇంద్రుని గూడా జయించియుండినాడు. అంతట దేవేంద్రునితో పురూరవునికి మైత్రి ఏర్పడింది. అతడు ఊర్వశిని అలా విడిపించి ఇంద్రునికి సమర్పించాడు.

తతః ప్రభృతి మిత్రత్వమగమత్పాకశాసనః ।
సర్వలోకాతిశాయిత్వం బలమూర్జోయశశ్శ్రియమ్ ॥26॥

ప్రాదాద్వజ్రీ తు సన్తుష్టో గేయతాం భరతేన చ ।
సా పురూరవసః ప్రీత్యా గాయన్తీ చరితం మహత్ ॥27॥

నాటినుండి యింద్రు డతనికి మిత్రుడయ్యాడు. ఇంద్రు డతనికి సర్వలోకాతిశాయిత్వాన్నీ, బలాన్నీ, తేజస్సునూ, కీర్తినీ, సంపదనూ ఇచ్చాడు. భరతునిచే అతని కీర్తిని గానం చేయించాడు. ఊర్వశి పురూరవుని పట్ల ప్రేమతో అతని ఘనమైన కీర్తిని గానం చేయసాగింది.

లక్ష్మీస్వయంవరం నామ భరతేన ప్రవర్తితమ్ ।
మేనకామూర్వశీం రమ్భాం నృత్యతేతి తదాఽఽదిశత్ ॥28॥

భరతు డొకసారి లక్ష్మీస్వయంవరమనే నాటకం ప్రదర్శింపజేశాడు. అందులో మేనకనూ, ఊర్వశినీ, రంభనూ నృత్యం చేయమని ఆదేశించాడు.

ననర్త సలయం తత్ర లక్ష్మీరూపేణ చోర్వశీ ।
సా పురూరవసం దృష్ట్వా నృత్యన్తీ కామపీడితా ॥29॥

విస్మృతాఽభినయం సర్వం తత్పురా భరతోదితమ్ ।
శశాప భరతః క్రోధాద్వియోగాదస్య భూతలే ॥30॥

పఞ్చపఞ్చాశదబ్దాని లతా సూక్ష్మా భవిష్యసి ।
పురూరవాః పిశాచత్వం తత్రైవానుభవిష్యతి ॥31॥

అందులో ఊర్వశి లక్ష్మీరూపంలో నృత్యం చేసింది. నృత్యం చేస్తూనే పురూరవుణ్ణి చూచి కామపీడితురాలై భరతుడు నేర్పిన అభినయం విస్మరించింది. అందుకు భరతుడు కోపించి నీవు భూతలంలో పురూరవుని వియోగంతో 55 సంవత్సరాలు ఒక తీగనై జన్మింతువుగాక! అని శపించాడు. పురూరవుడు గూడా అక్కడే పిశాచత్వాన్ని అనుభవిస్తా డన్నాడు.

తతస్తమూర్వశీ గత్వా భర్తారమకరోచ్చిరమ్ ।
శాపాన్తే భరతస్యాథ ఊర్వశీ బుధసూనుతః ॥32॥

అజీజనత్సుతానష్టౌ నామతస్తాన్నిబోధత ।
ఆయుర్దృఢాయురశ్వాయుర్ధనాయుర్ధృతిమాన్వసుః ॥33॥

శుచివిద్యః శతాయుశ్చ సర్వే దివ్యబలౌజసః ।

అంతట ఊర్వశి పురూరవుని చెంతకు వెళ్ళి అతణ్ణి భర్తగా పొందింది. శాపానుభవం పూర్తి కాగానే ఆమె అతనినుండి ఎనిమిదిమంది పుత్రులను ప్రసవించింది. వారిపేర్లు 1. ఆయువు 2. దృఢాయువు 3. అశ్వాయువు 4. ధనాయువు 5. ధృతిమంతుడు 6.వసువు 7. శుచివిద్యుడు 8. శతాయువు – వీరందరూ బలతేజస్సంపన్నులే.

ఆయుషో నహుషః పుత్రో వృద్ధశర్మా తథైవ చ ॥34॥

రజిర్దంభో విపాప్మా చ వీరాః పఞ్చ మహారథాః ।
రజేః పుత్రశతం జజ్ఞే రాజేయమితి విశ్రుతమ్ ॥35॥

ఆయువు కుమారులు నహుషుడు, వృద్ధశర్మ, రజి, దంభుడు, విపాప్మ అనేవారు ఐదుగురు. అందరూ వీరులే మహారథులే. రజికి 'రాజేయ' మన్న పేరుగల నూరుమంది పుత్రులు కలిగారు.

రజిరారాధయామాస నారాయణమకల్మషమ్ ।
తపసా తోషితో విష్ణుర్వరాన్ ప్రాదాన్మహీపతేః ॥36॥

రజి కల్మషరహితుడగు శ్రీమన్నారాయణుని భజించాడు. అతని తపస్సుచే సంతుష్టుడైన విష్ణు వారాజుకు వరాలను ప్రసాదించాడు.

దేవాసురమనుష్యాణామభూత్స విజయీ తదా ।
అథ దేవాసురం యుద్ధమభూద్వర్షశతత్రయమ్ ॥37॥

ఆ వరప్రభావంతో అతడు, దేవతలు, అసురులు, మనుజులపై విజయం సాధించువాడయ్యాడు. పిదప దేవతలకూ, అసురులకూ మూడువందలసంవత్సరాల కాలం యుద్ధం సంభవించింది.

ప్రహ్లాదశక్రయోర్భీమం న కశ్చిద్విజయీ తయోః ।
తతో దేవాసురైః పృష్టః ప్రాహ దేవశ్చతుర్ముఖః ॥38॥

ఈ యుద్ధం ప్రహ్లాదునికీ, ఇంద్రునికీ మధ్య భీకరమై కొనసాగింది. వారిలో ఏ ఒక్కడూ విజయం సాధించలేకపోయాడు. దేవాసురులీ విషయమై ప్రశ్నించగా బ్రహ్మ ఇలా అన్నాడు.

అనయో ర్విజయీ క స్స్యా ద్రజిర్యత్రేతి సోఽబ్రవీత్ ।
జయాయ ప్రార్థితో రాజా సహాయ స్త్వం భవస్వ నః ॥39॥

వీరిలో ఎవరు జయిస్తారని చెప్పగలను? రజి ఏ పక్షంలో ఉంటాడో, ఆ పక్షానికి విజయం సిద్ధిస్తుంది అన్నాడు. అంతట రాక్షసులు రజివద్దకు వెళ్ళి "మాకు నీవు సహాయపడు" మని ప్రార్థించారు.

దైత్యైః ప్రాహ యది స్వామీ వో భవామి తతస్త్వలమ్ ।
నాసురైః ప్రతిపన్నం తత్ప్రతిపన్నం సురై స్తథా ॥40॥

అందు కతడు "మీకు నేను ప్రభువును కాగల్గితే సాయం చేస్తాను" అని చెప్పాడు. అందుకు రాక్షసు లంగీకరించలేదు. దేవత లంగీకరించారు.

స్వామీ భవ త్వమస్మాకం సఙ్గ్రామే నాశయ ద్విషః ।
తతో వినాశితా స్సర్వే యేఽవధ్యా వజ్రపాణినా ॥41॥

"రాజా! మాకు ప్రభుడవు కమ్ము.యుద్ధంలో శత్రువులను నశింపజేయు"మని వారు కోరారు. ఆ పై ఇంద్రునికి అవధ్యులైన రక్కసులను రజి సంహరించాడు.

పుత్రత్వమగమత్తుష్ట స్తస్యేన్ద్రః కర్మణా విభుః ।
దత్త్వేన్ద్రాయ తదా రాజ్యం జగామ తపసే రజిః ॥42॥

సంతుష్టుడైన దేవేంద్రుడు అతనికి పుత్రుడుగా ఉండడాని కంగీకరించాడు. అప్పుడు రజి ఇంద్రునికి రాజ్యం అప్పగించి తపస్సు చేయడానికి వెళ్ళాడు.

రజిపుత్రై స్తదాచ్ఛిన్నం బలాదిన్ద్రస్య వైభవమ్ ।
యజ్ఞభాగం చ రాజ్యం చ తపో గుణబలాన్వితైః ॥43॥

ఆ పై రజికుమారులు తపోగుణబలంతో బలాత్కారంగా ఇంద్రునివైభవాన్ని విచ్ఛిన్నం చేశారు. యజ్ఞభాగాన్నీ, రాజ్యాన్నీ ఆక్రమించారు.

రాజ్యాద్భ్రష్ట స్తదా శక్రో రజిపుత్రైర్నిపీడితః ।
ప్రాహ వాచస్పతిం దీనః పీడితోఽస్మి రజేస్సుతైః ॥44॥

న యజ్ఞభాగో రాజ్యం మే నిర్జితం చ బృహస్పతే! ।
రాజ్యలాభాయ మే యత్నం విధత్స్వ ధిషణాధిప! ॥45॥

రాజ్యభ్రష్టుడైన ఇంద్రుడు రజిపుత్రులచే పీడింపబడి దీనదశనొంది బృహస్పతితో ఇలా అన్నాడు. "బృహస్పతీ! నేను రజిపుత్రులచే పీడింపబడినాను. ఇప్పుడు నాకు యజ్ఞభాగం లేదు. నారాజ్యం గూడా వారు జయించారు. గురుదేవా! మళ్ళీ నారాజ్యలాభానికై ప్రయత్నం చేయుము".

తతో బృహస్పతి శ్శక్రమకరోద్బలదర్పితమ్ ।
గ్రహశాన్తివిధానేన పౌష్టికేన చ కర్మణా ॥46॥

అంతట బృహస్పతి ఇంద్రుణ్ణి గ్రహశాంతివిధానంతోనూ, పౌష్టికకర్మతోనూ బలగర్వితుణ్ణి కావించాడు.

గత్వాఽథ మోహయామాస రజిపుత్రా న్బృహస్పతిః ।
జినధర్మం సమాస్థాయ వేదబాహ్యం స వేదవిత్ ॥47॥

పిదప వేదవేత్తయగు దేవగురువు రజి పుత్రుల కడకు వెళ్ళి వేదబాహ్యమైన జినధర్మం పాటించి వారిని మోహితులను కావించాడు.

వేదత్రయీపరిభ్రష్టాం శ్చకార ధిషణాధిపః ।
వేదబాహ్యాన్పరిజ్ఞాయ హేతువాదసమన్వితాన్ ॥48॥

జఘాన శక్రో వజ్రేణ సర్వాన్ధర్మబహిష్కృతాన్ ।

అతడు వారిని వేదత్రయభ్రష్టులను చేశాడు. హేతువాదం చేస్తూ వారు వేదబాహ్యులైనారని గ్రహించి ధర్మబహిష్కృతులైన వారందరినీ ఇంద్రుడు వజ్రాయుధంతో కొట్టాడు.

నహుషస్య ప్రవక్ష్యామి పుత్రాన్సప్తైవ ధార్మికాన్ ॥49॥

యతిర్యయాతి స్సంయాతిరుద్భవః పాచిరేవ చ ।
శర్యాతిర్మేఘ జాతిశ్చ సప్తైతే వంశవర్ధనాః ॥50॥

ఇక ధార్మికులైన నహుషుని ఏడుగురు పుత్రులను గూర్చి వివరిస్తాను. యతి, యయాతి, సంయాతి, ఉద్భవుడు, పాచి, శర్యాతి, మేఘజాతి అనువా రేడుగురు వంశవర్ధను లయ్యారు.

యతిః కుమారభావేఽపి యోగీ వైఖానసోఽభవత్ ।
యయాతి శ్చాకారోద్రాజ్యం ధర్మైకశరణస్సదా ॥51॥

యతి కౌమారదశలోనే వైఖానస యోగిగా రూపొందాడు. సదా ధర్మశరణ్యుడైన యయాతి ధర్మబద్ధంగా రాజ్యం పాలించాడు.

శర్మిష్ఠా తస్య భార్యాఽభూద్దుహితా వృషపర్వణః ।
భార్గవస్యాఽఽత్మజా తద్వద్దేవయానీ చ సువ్రతా ॥52॥

వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ, అట్లే వ్రతతత్పరయగు శుక్రాచార్యుని పుత్రిక దేవయాని అతనికి పత్ను లయ్యారు.

యయాతేః పఞ్చ దాయాదాస్తాన్ప్రవక్ష్యామి నామతః ।
దేవయానీ యదుం పుత్రం తుర్వసుం చాప్యజీజనత్ ॥53॥

యయాతికి ఐదుగురు కుమారులు. వారి పేర్లు వివరిస్తాను. దేవయాని యదువు, తుర్వసుడు అను పుత్రులను కన్నది.

తథా ద్రుహ్యు మనుం పూరుం శర్మిష్ఠాஉజనయత్సుతాన్ ।
యదుః పూరుశ్చాభవతాం తేషాం వంశవర్ధనౌ ॥54॥

అట్లే శర్మిష్ఠ ద్రుహ్యుడు, అనువు, పూరువు అనువారిని ప్రసవించింది. యదువు, పూరువు వారి వంశవృద్ధికి కారకులయ్యారు.

యయాతి ర్నాహుషశ్చాసీద్రాజా సత్యపరాక్రమః ।
పాలయామాస చ మహీమీజే చ విధివన్మఖైః ॥55॥

నహుషుని పుత్రుడైన యయాతి సత్యపరాక్రముడైన రాజయ్యాడు. అతడు భూమిని పరిపాలించి శాస్త్రవిధి ననుసరించి యజ్ఞాలు చేశాడు.

అతిభక్త్యా పితౄనర్చ్య దేవాంశ్చ ప్రయత స్సదా ।
అథాஉజయత్ప్రజా స్సర్వా యయాతి రపరాజితః ॥56॥

మరియు అతడతిభక్తితో పితరులను పూజించాడు. నియమనిష్ఠలతో దేవతలను అర్చించాడు. పరాజయం ఎఱుగనివాడై ప్రజలనందరినీ లోగొన్నాడు.

స శాశ్వతీస్సమా రాజా ప్రజా ధర్మేణ పాలయన్ ।
జరామార్ఛన్మహాఘోరాం నాహుషో రూపనాశినీమ్ ॥57॥

అనేక సంవత్సరాలు ఆ నృపుడు ప్రజలను పాలించి తుదకు రూపవినాశకమై మహాభీకరమైన వార్ధక్యం పొందాడు.

జరాభిభూతః పుత్త్రా న్స రాజా వచనమబ్రవీత్ ।
యదుం పూరుం తుర్వసుం చ ద్రుహ్యుం చానుం చ పార్థివః ॥58॥

జరాగ్రస్తుడైన ఆ రాజు యదువు, పూరుడు, తుర్వసుడు, ద్రుహ్యుడు, అనువు అనే ఐదుగురు పుత్రులతో ఇలా అన్నాడు.

యౌవనేన చ వః కామాన్యువా యువతిభిస్సహ ।
విహర్తుమహమిచ్ఛామి సాహ్యం కురుత పుత్రకాః! ॥59॥

“నేను యువకుడనై యువతులతోగూడి మీరనుభవించే కామసుఖాల ననుభవించగోరుతున్నాను. పుత్రులారా! నాకు మీరు సాయం చేయండి” అని అర్థించాడు.

తం పుత్త్రో దేవయానేయః పూర్వజో యదురబ్రవీత్ ।
కిం సాహ్యం భవతః కార్యమస్మాభిర్యౌవనేన తు ॥60॥

అప్పుడు దేవయాని పుత్రుడైన యదువు ‘మేము మీకు యౌవనంతో ఎట్టి సాయం చేయాలి? అని ప్రశ్నించాడు.

యయాతి రబ్రవీ త్పుత్రాన్జరా మే ప్రతిగృహ్యతామ్ ।
యౌవనేనాథ భవతాం చరేయం విషయానహమ్ ॥61॥

అందుకు యయాతి "నా వార్ధక్యాన్ని మీరు తీసుకోండి. నేను మీ యౌవనంతో విషయసుఖా లనుభవిస్తాను.

యజతో దీర్ఘసత్రైర్మే శాపాచ్చోశనసో మునేః ।
కామార్థః పరిహీనో మేఽ తృప్తోహం తేన పుత్రకాః ॥62॥

దీర్ఘసత్రాల ఆచరణతోనూ, శుక్రాచార్యుని శాపంవల్లనూ నాకు కామపురుషార్థం దూరమయింది. పుత్రులారా! అందువల్ల నేను తృప్తి లేకుండా వున్నాను.

స్వకీయేన శరీరేణ జరామేకః ప్రశాస్తు వః ।
అహం తన్వాఽ భినవయా యువా కామానవాప్నుయామ్ ॥63॥

మీలో ఎవరైనా నా ముసలితనాన్ని శరీరంతో గ్రహించండి. నేను నూతనశరీరంతో యువకుడనై కామసుఖా లనుభవిస్తాను.

న తేఽ స్య ప్రత్యగృహ్ణంస్త యదుప్రభృతయో జరామ్ ।
చతురస్తా న్స రాజర్షి రశపచ్చేతి నశ్శ్రుతమ్ ॥64॥

యదువు మున్నగు నలుగురు పుత్రులు అతని వార్ధక్యాన్ని పరిగ్రహించడాని కంగీకరించలేదు. అందుకై ఆ రాజు నలుగురునీ శపించాడని వింటున్నాము.

తమబ్రవీ త్తతః పూరుః కనీయా న్సత్యవిక్రమః ।
జరాం మా దేహి నవయా తన్వా మే యౌవనాత్ సుఖీ ॥65॥

సత్యపరాక్రముడైన పూరుడు మాత్రం తండ్రిని చూచి " నాకు నీ వార్ధక్యాన్ని ఇమ్ము. క్రొత్త శరీరంతో యౌవనసుఖా లనుభవించు.

అహం జరాం తవాదాయ రాజ్యే స్థాస్యామి చాజ్ఞయా ।
ఏవముక్తస్స రాజర్షి స్తపోవీర్యసమాశ్రయాత్ ॥66॥

సంస్థాపయామాస జరాం తదా పుత్రే మహాత్మని ।
పౌరవేణాథ వయసా రాజా యౌవనమాస్థితః ॥67॥

నేను నీ జరను పరిగ్రహించి నీ ఆజ్ఞతో రాజ్యపాలన చేస్తాను." అలా కుమారుడు చెప్పాడు. యయాతి తన తపోబలంతో మహానుభావుడైన ఆ పుత్రునియందు తన వార్ధక్యాన్ని నిలిపాడు. పూరుని యౌవనం తాను స్వీకరించి యువకు డయ్యాడు.

యాయాతేశ్చాథ వయసా రాజ్యం పూరురకారయత్ ।
తతో వర్షసహస్రాన్తే యయాతిరపరాజితః ॥68॥

అతృప్త ఇవ కామానాం పూరుం పుత్త్రమువాచ హ ।
త్వయా దాయాదవానస్మి త్వం మే వంశకర స్సుతః ॥69॥

యయాతి వార్ధక్యాన్ని గ్రహించిన పూరుడు రాజ్యపాలన కావించాడు. అలా వెయ్యి సంవత్సరాలు గడచాయి. యయాతి అపరాజితుడై కామతృప్తిని పొందక పుత్రుడైన పూరునితో ఇలా అన్నాడు. నీవల్ల నేను పుత్రవంతుడ నయ్యాను. నీవు నాకు వంశవర్ధనుడవైన కుమారుడవు.

పౌరవో వంశ ఇత్యేష ఖ్యాతిం లోకే గమిష్యతి ।
తత స్స నృపశార్దూలః పూరుం రాజ్యేఽభిషిచ్య చ ॥70॥

కాలేన మహతా పశ్చాత్కాలధర్మముపేయివాన్ ।
పూరువంశం ప్రవక్ష్యామి శృణుధ్వమృషిసత్తమాః! ।
యత్ర తే భారతా జాతా భరతాన్వయవర్ధనాః ॥71॥

ఈ వంశం పౌరవవంశమన్న ఖ్యాతిని పొందగలదు. ఆ పై ఆ రాజశ్రేష్ఠుడు పూరుణ్ణి రాజ్యంలో ప్రతిష్ఠించి చిరకాలానికి కాలధర్మం చెందాడు. ఋషిశ్రేష్ఠులారా! ఇక పూరువంశాన్ని వివరిస్తాను, వినండి. భరతవంశవివర్ధనులైన భారతులు ఆ వంశంలోనే జన్మించారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే బుధోత్పత్తిః చతుర్వింశోఽధ్యాయః ॥ 24 ॥

శ్రీమత్స్యమహాపురాణంలో సోమవంశమున బుధుని పుట్టుక అనే ఇరవైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచవింశతితమోఽధ్యాయః - ఇరవైఅయిదవ అధ్యాయం

యయాతిచరితే కచవృత్తాంత కథనమ్ - యయాతిచరితలో కచుని వృత్తాంతం చెప్పుట

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

కిమర్థం పౌరవో వంశ శ్రైష్ఠత్వం ప్రాప భూతలే ।
జ్యేష్ఠస్యాపి యదోర్వంశః కిమర్థం హీయతే శ్రియా ॥1॥

పౌరవవంశం భూతలంలో ఎందుకు శ్రేష్ఠమయింది? జ్యేష్ఠుడైన యదువు వంశం ఏల సంపద్విహీన మయింది?

అన్యద్యయాతి చరితం సూత! విస్తరతో వద ।
యస్మాత్తత్పుణ్యమాయుష్యమభినన్ద్యం సురైరపి ॥2॥

సూతా! అంతే కాదు. తక్కిన యయాతి చరిత్రను గూడా మాకు విస్తృతంగా చెప్పు. అది పుణ్యప్రదమూ, ఆయుర్వర్ధకమూ, దేవతలకు సైతం అభినందనీయం కదా!

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఏతదేవ పురా పృష్టశ్శతానీకేన శౌనకః ।
పుణ్యం పవిత్ర మాయుష్యం యయాతిచరితం మహత్ ॥3॥

పూర్వం శతానీకుడు శౌనకుణ్ణి పుణ్యం, పవిత్రం, ఆయుర్వర్ధకమైన ఈ యయాతి చరిత్రనే చెప్పుమనిఅడిగాడు.

శతానీక ఉవాచ :- శతానీకుడు చెప్పాడు.

యయాతిః పూర్వకోఽస్మాక మష్టమో యః ప్రజాపతేః ।
కథం స శుక్రతనయాం లేభే పరమదుర్లభామ్ ॥4॥

ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం విస్తరేణ తపోధన ।
ఆనుపూర్వ్యాచ్చ మే శంస పూరోర్వంశధరాన్నృపాన్ ॥5॥

యయాతి మాకు పూర్వజుడు. అతడు ప్రజాపతికి ఎనిమిదవ తరంవాడు. అతడు మిక్కిలి దుర్లభ యైన శుక్రుని పుత్రిక నెలా చేపట్టగలిగాడు? తపోధనా? ఈ విషయం వివరంగా వినా లనుకొంటున్నాను. పూరువంశజులగు రాజులను వంశక్రమానుసారంగా నాకు వివరించు.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

యయాతిరాసీద్రాజర్షిర్దేవరాజసమద్యుతిః ।
తం శుక్రవృషపర్వాణౌ వవ్రాతే వై యథా పురా ॥6॥

ఇంద్రునితో సమమైన తేజస్సుగల యయాతి రాజర్షి. శుక్రుడు, వృషపర్వుడు అతణ్ణి పూర్వం తమకు అల్లుడుగా పరిగ్రహించారు.

తత్తే౽హం సమ్ప్రవక్ష్యామి పృచ్ఛతో రాజసత్తమ! ।
దేవయాన్యాశ్చ సంయోగం యయాతేర్నాహుషస్య చ ॥7॥

రాజశ్రేష్ఠా! నీవు ఆ విషయమే అడుగుతున్నావు గాన నేనా సంగతి వివరిస్తాను. దేవయానితో నహుషుని పుత్రుడైన యయాతికి ఎలా సంయోగం కలిగిందో చెబుతాను.

సురాణామసురాణాం చ సమజాయత వై మిథః ।
ఐశ్వర్యం ప్రతి సంఘర్ష స్త్రైలోక్యే సచరాచరే ॥8॥

పూర్వం చరాచరాత్మకమైన ఈ త్రిలోకాలలో ఐశ్వర్యాన్ని గురించి దేవతలకూ, రాక్షసులకూ పరస్పరం సంఘర్షణ కలిగింది.

జిగీషయా తతో దేవాః వవ్రురాఙ్గిరసం మునిమ్ ।
పౌరోహిత్యే చ యజ్ఞార్థే కావ్యం తూశనసం పరే ॥9॥

దేవతలు రాక్షసులను జయించాలన్న కాంక్షతో అంగిరసుని కుమారుడైన బృహస్పతిని పురోహితునిగా యజ్ఞంకొరకై వరించారు. రాక్షసులుగూడా శుక్రాచార్యుణ్ణి యజ్ఞపురోహితునిగా అందుకే వరించారు.

బ్రాహ్మణౌ తావుభౌ నిత్యమన్యోన్యం స్పర్ధినౌ భృశమ్ ।
తత్ర దేవా నిజఘ్నుర్యాన్దానవాన్యుధి సఙ్గతాన్ ॥10॥

తాన్పునర్జీవయామాస కావ్యో విద్యాబలాశ్రయాత్ ।
తతస్తే పునరుత్థాయ యోధయాఞ్చక్రిరే సురాన్ ॥11॥

పురోహితులిరువురూ బ్రాహ్మణులే. నిత్యం వారు పరస్పరస్పర్ధ కలిగి వుండేవారు. యుద్ధంలో దేవతలు వధించిన దానవులను శుక్రుడు తన విద్యాబలంతో మళ్ళీ బ్రదికించేవాడు. వారు మళ్ళీ లేచి దేవతలతో యుద్ధం కొనసాగించేవారు.

అసురాస్తు నిజఘ్ను ర్యాన్ సురాన్సమరమూర్ధని ।
న తాన్సఞ్జీవయామాస బృహస్పతి రుదారధీః ॥12॥

రాక్షసులు సంగరంలో వధించిన అమరులను ఉదారమతియైన బృహస్పతి శుక్రునిలాగా మళ్ళీ బ్రదికించలేకపోయాడు.

న హి వేద స తాం విద్యాం యాం కావ్యో వేద వీర్యవాన్ ।
సంజీవనీం తతో దేవా విషాదమగమన్పరమ్ ॥13॥

వీర్యవంతుడైన శుక్రు డెరిగిన సంజీవనీవిద్య బృహస్పతికి తెలియదు. అందుచేత దేవతలు మిక్కిలిగా విషణ్ణు లయ్యారు.

అథ దేవా భయోద్విగ్నాః కావ్యాదుశనస స్తదా ।
ఊచుః కచముపాగమ్య జ్యేష్ఠం పుత్త్రం బృహస్పతేః ॥14॥

ఆ పై శుక్రునికి భయపడిన దేవతలు బృహస్పతి జ్యేష్ఠకుమారుడైన కచుని సమీపించి ఇలా అన్నారు.

భజమానా న్భజస్వాస్మాన్కురు సాహాయ్యముత్తమమ్ ।
యాఽసౌ విద్యా నివసతి బ్రాహ్మణేఽమితతేజసి ॥15॥

శుక్రే తామాహర క్షిప్రం భాగభాఙ్నో భవిష్యసి ।
వృషపర్వణ స్సమీపేఽసౌ శక్యో ద్రష్టుం త్వయా ద్విజః ॥16॥

నీ చెంతకు వచ్చిన మాకు ఉపకరించు. మాకు ఉత్తమసహాయం అందించు. అమితతేజోవంతుడైన బ్రాహ్మణుడు శుక్రునిలో ఏ విద్య కలదో, ఆ విద్యను శీఘ్రంగా నీ స్వాధీనం చేసుకో. అలా చేస్తే నీవు మాలో ఒక భాగస్వామి వవుతావు. అతణ్ణి నీవు వృషపర్వుని వద్ద చూడవచ్చు.

రక్షేత్స దానవాంస్తత్ర న స రక్షత్యదానవాన్ ।
తమారాధయితుం శక్తో నాన్యః కశ్చిదృతే త్వయా ॥17॥

ఆ శుక్రుడు దానవులను కాపాడుతున్నాడే కాని దేవతలను రక్షించడం లేదు. నీవు తప్ప మరొకడు అతణ్ణి ఆరాధించగలవాడు లేడు.

దేవయానీ చ దయితా సుతా తస్య మహాత్మనః ।
తామారాధయితుం శక్తో నాన్యః కశ్చన విద్యతే ॥18॥

ఆ మహాత్ముని కుమార్తె దేవయాని అతనికి చాలా ప్రియమైనది. ఆమెను ఆరాధించగలవాడు మరొకడులేడు.

శీలమాధుర్యదాక్షిణ్యైరాచారేణ దమేన చ ।
దేవయాన్యాం చ తుష్టాయాం విద్యాం తాం ప్రాప్స్యసి ధ్రువమ్ ॥19॥

నీ శీలంతో, మాధుర్యంతో, దాక్షిణ్యంతో, ఆచారంతో, ఇంద్రియనిగ్రహంతోనూ దేవయాని సంతసిస్తే నీవు తప్పక ఆ విద్యను పొందగలవు.

తథా హి ప్రేషితో దేవై స్సమీపే వృషపర్వణః ।
తథేత్యుక్త్వా తు స ప్రాయా ద్బృహస్పతిసుత స్తదా ॥20॥

అలా దేవతలు వృషపర్వుని వద్దకు పొమ్మని కోరగా బృహస్పతిసుతుడైన కచుడు అందు కంగీకరించాడు. అతడు వృషపర్వుని చెంతకు వెళ్ళాడు.

స గత్వా త్వరితో రాజన్ దేవై స్సమ్పూజితః కచః ।
అసురేన్ద్రపురే శుక్రం ప్రణమ్యేదమువాచ హ ॥21॥

దేవతల సత్కారమందుకొని కచుడు త్వరగా వెళ్ళి అసురేంద్రుని పట్టణంలో శుక్రాచార్యునికి ప్రణమిల్లి ఇలా అన్నాడు.

ఋషేరఙ్గిరసః పౌత్రం పుత్రం సాక్షాద్బృహస్పతేః ।
నామ్నా కచ ఇతి ఖ్యాతం శిష్యం గృహ్ణాతు మాం భవాన్ ॥22॥

నేను అంగిరసుని మనుమడను, బృహస్పతి తనయుడను. నాపేరు కచుడు. నన్ను మీరు శిష్యునిగా స్వీకరించ ప్రార్థన.

బ్రహ్మచర్యం చరిష్యామి త్వయ్యహం పరమం గురో ।
అనుమన్యస్వ మాం బ్రహ్మన్సహస్రపరివత్సరాన్ ॥23॥

గురూ! నేను మీవద్ద బ్రహ్మచర్యం చరిస్తాను. బ్రహ్మన్! నన్ను మీరు ఒక వెయ్యి సంవత్సరాలు మీదగ్గర శిష్యుడుగా ఉండడాని కనుమతించండి.

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

కచ! సుస్వాగతం తేఽస్తు ప్రతిగృహ్ణామి తే వచః ।
అర్చయిష్యేఽహమర్చ్యం త్వామర్చితోఽస్తు బృహస్పతిః ॥24॥

“కచా! నీకు సుస్వాగతం! నీ మాటకు అంగీకరిస్తున్నాను. గౌరవింపదగిన నిన్ను నేను గౌరవిస్తాను. ఈ రీతిగా బృహస్పతిని నేను అర్చింతును గాక!

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

కచస్తు తం తథేత్యుక్త్వా ప్రతిజగ్రాహ తద్వ్రతమ్ ।
ఆదిష్టం కవిపుత్రేణ శుక్రేణోశనసా స్వయమ్ ॥25॥

కచుడు అట్లే అని చెప్పి బ్రహ్మచర్యవ్రతం పరిగ్రహించాడు. అతడు శుక్రుడు స్వయంగా ఆదేశించిన రీతిగానే వ్రతం నిర్వహించాడు.

వ్రతం చ వ్రతకాలం చ యథోక్తం ప్రత్యగృహ్ణత ।
ఆరాధయన్నుపాధ్యాయం దేవయానీం చ భారత ॥26॥

భారతా! కచుడు ఉపాధ్యాయుణ్ణీ, దేవయానినీ ఆరాధిస్తూ వ్రతాన్నీ, వ్రతకాలాన్నీ ఆయన చెప్పినట్లే అనుసరించాడు.

నిత్య మారాధయిష్యం స్తాం యువా యౌవనగోచరామ్ ।
గాయ న్నృత్యైశ్చ వాద్యైశ్చ దేవయానీ మతోషయత్ ॥27॥

యువకుడైన కచుడు యౌవనవతియైన దేవయానికి హర్షం కల్గించడానికై నిత్యమూ, పాడుతూ, నృత్యం చేస్తూ, వాద్యాలు వాయిస్తూ ఆమెకు సంతోషం చేకూర్చాడు.

సంశీలయ న్దేవయానీం కన్యాం సమ్ప్రాప్తయౌవనామ్ ।
పుష్పైః ఫలైః ప్రేషణైశ్చ తోషయామాస భార్గవీమ్ ॥28॥

యుక్తవయస్కురాలైన కన్య ఆ దేవయాని ఇష్టానుసారం నడుచుకుంటూ పూలు, పండ్లు తెచ్చి ఆమెకిస్తూ, ఆమె చెప్పిన పనులు చేస్తూ ఆమెను సంతోషపెట్టాడు.

దేవయాన్యపి తం విప్రం నియమవ్రతచారిణమ్ ।
అనుగాయన్తీ లలనా రహః పర్యచరత్తదా ॥29॥

దేవయాని కూడా నియమవ్రతం పాటిస్తున్న ఆవిప్రుణ్ణి అనుసరించి పాడుతూ ఏకాంతంలో అతనికి పరిచర్యలు చేసింది.

పఞ్చవర్షశతాన్యేవం కచస్య చరతో వ్రతమ్ ।
తత్ర తీవ్రవ్రతం బుద్ధ్వా దానవాస్తం తతః కచమ్ ॥30॥

గా రక్షన్తం వనే దృష్ట్వా రహస్యేనమమర్షితాః ।
జఘ్నుర్బృహస్పతే ర్ద్వేషా న్నిజరక్షార్థమేవ చ ॥31॥

ఇలా కచుడు వ్రత మాచరిస్తుండగా ఐదువందల సంవత్సరాలు గడచాయి. అతని తీవ్ర వ్రతవిధానాన్ని గ్రహించి దానవు లతనిపై పగబూనారు. అతడు గోవులను మేపుతూ అరణ్యంలో ఉండగా బృహస్పతిపై ద్వేషం వల్లా, తమ రక్షణ కోరి రహస్యంగా అతణ్ణి వధించారు.

హత్వా సాలావృకేభ్యశ్చ ప్రాయచ్ఛంస్తిలశః కృతమ్ ।
తతో గావో నివృత్తాస్తా అగోపా స్స్వనివేశనమ్ ॥32॥

అలా చంపి అతని దేహాన్ని నువ్వుగింజలంత ముక్కలుగా చేసి సాలావృకాలనే మృగాలకు (వేటకుక్కలకు తోడేళ్లకు) ఆహారంగా వేశారు. ఆపై గోవులు గోపాలకుడు లేకుండానే తిరిగి తమ స్థలం చేరాయి.

తా దృష్ట్వా రహితా గాస్తు కచేనాభ్యాగతా వనాత్ ।
ఉవాచ వచనం కాలే దేవయాన్యథ భార్గవమ్ ॥33॥

కచుడు లేకుండానే తిరిగివచ్చిన గోవులను చూచి దేవయాని సమయానుగుణంగా తండ్రితో ఇలా అన్నది.

హుతం చైవాగ్నిహోత్రం తే సూర్యశ్చాస్తజ్గతః ప్రభో ।
అగోపాశ్చాగతా గావః కచస్తాత! న దృశ్యతే ॥34॥

ప్రభూ! నీ అగ్నిహోత్రం పూర్తి అయింది. సూర్యు డస్తమించాడు. గోపాలకుడు లేకుండానే గోవులు తిరిగి వచ్చాయి. నాన్నా! కచుడు కనిపించడం లేదు.

వ్యక్తం హతో ధృతో వాఽపి కచస్తాత! భవిష్యతి ।
తం వినా నైవ జీవామి వచ స్సత్యం బ్రవీమ్యహమ్ ॥35॥

తప్పక అతణ్ణి చంపడమో, లేక బంధించడమో జరిగివుంటుంది. అతడు లేకుండా నేను జీవించలేనని నిజం చెబుతున్నాను.

శుక్ర ఉవాచ :- శుక్రుదు చెప్పాడు.

అథేహ్యేహీతి శబ్దేన మృతం సంజీవయామ్యహమ్ ।
తత స్సఙ్జీవినీం విద్యాం ప్రయుంక్త్వా కచమాహ్వయత్ ॥36॥

నేను 'ఏహి, ఏహి' (రా,రా) అన్న శబ్దంతో మరణించినవాణ్ణి జీవింపజేస్తాను". ఇలా చెప్పి సంజీవనీ విద్యను ప్రయోగించి కచుణ్ణి ఆహ్వానించాడు.

ఆహూతః ప్రాదురభవత్కచో శుక్రం ననామ సః ।
హతోఽహమితి చాచఖ్యౌ రాక్షసైర్ధిషణాత్మజః ॥37॥

పిలువగానే కచుడు ప్రాదుర్భవించి శుక్రునికి నమస్కరించాడు. 'రాక్షసులు తన్ను వధించారని గూడా అతడు నివేదించాడు.

స పునర్దేవయాన్యుక్తః పుష్పాహారే యదృచ్ఛయా ।
వనం యయౌ కచో విప్రః పఠన్బ్రహ్మ చ శాశ్వతమ్ ॥38॥

మరల ఒకసారి దేవయాని మాటను గురించి పూలు తేవడానికి కచుడు శాశ్వతమగు వేదం చదువుకొంటూ అరణ్యానికి వెళ్ళాడు.

వనే పుష్పాణి చిన్వన్తం దదృశుర్దానవాశ్చ తమ్ ।
తతోఽద్వితీయం తం హత్వా దగ్ధం కృత్వా చ చూర్ణవత్ ।
ప్రాయచ్ఛన్బ్రాహ్మణాయైవ సురాయామసురా స్తదా ॥39॥

అక్కడ పూలు కోస్తున్న కచుణ్ణి రక్కసులు గమనించారు. అత డొక్కడై ఉండడం చూచి అతణ్ణి చంపి కాల్చి బూడిద చేశారు. ఆ బూడిదను సురలో కలిపి శుక్రునికే త్రాగడాని కిచ్చారు.

దేవయాన్యథ భూయోఽపి పితరం వాక్యమబ్రవీత్ ।
పుష్పాహరప్రేషణకృత్కచస్తాత! న దృశ్యతే ॥40॥

మరల దేవయాని తండ్రిని సమీపించి "నాన్నా! పూలు కోసుకోని రావడానికి పోయిన కచుడు కనిపించడం లేదు" అని చెప్పింది.

వ్యక్తం హతో మృతో వాఽపి కచస్తాత! భవిష్యతి ।
తం వినా నైవ జీవామి వచః సత్యం బ్రవీమి తే ॥41॥

అతడు మృతుడో, హతుడో అయివుంటాడు. అతడు లేక జీవించలేను. నీకు నిజంచెబుతున్నాను" అనిఅన్నది.

శుక్ర ఉవాచ :- శుక్రుడు చెప్పాడు.

బృహస్పతేస్సుతః పుత్రి! కచః ప్రేతగతిం గతః ।
విద్యయా జీవితోఽప్యేవం హన్యతే కరవాణి కిమ్! ॥42॥

"పుత్రీ! బృహస్పతి సుతుడైన కచుడు ప్రేతగతి పొందాడు. మృతసంజీవనీ విద్యచే బ్రతికించినప్పటికీ ఇలా అతణ్ణి చంపుతున్నారు. నేనేమి చేసేది!"

మైనం శుచో మా రుద దేవయాని! న త్వాదృశీ మర్త్యమనుప్రశోచేత్ ।
యస్యా స్తవ బ్రహ్మ చ బ్రాహ్మణాశ్చ సేన్ద్రాశ్చ దేవా వసవోఽ శ్వినౌ చ ॥43॥

సురద్విషశ్చైవ జగచ్చ సర్వ ముపస్థితం మత్తపసః ప్రభావాత్ ।
అశక్యోఽ యం జీవయితుం ద్విజాతి స్సంజీవితో వధ్యతే చైవ భూయః ॥44॥

దేవయానీ! అతనికై శోకించకు. నీలాంటివారు ఒక మర్త్యుణ్ణి గూర్చి ఇలా శోకించరాదు. నాతపః ప్రభావం వల్ల బ్రహ్మ, బ్రాహ్మణులు, ఇంద్రాది దేవతలు, వసువులు, అశ్వినులు, రాక్షసులు, జగమంతా నీ యెదుట నిలుస్తున్నారు. ఈ విప్రుణ్ణి ఇక బ్రదికించడం సాధ్యం కాని పని. జీవింపజేసినా ఇతదు మళ్ళీ ఇలా వధింపబడుతున్నాడు.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

యస్యాఙ్గిరా వృద్ధతమః పితామహో బృహస్పతిశ్చాపి పితా తపోనిధిః ।
ఋషేః సుపుత్రం తమథాపి పౌత్రం కథం న శోచేయమహం న రుద్యామ్ ॥45॥

ఇతని తాత వృద్ధతముడైన అంగిరసుడు. తపోనిధియైన బృహస్పతి తండ్రి. అట్టి ఒక ఋషి పుత్రుణ్ణి, మరొక ఋషి పౌత్రుణ్ణి గూర్చి నేను ఎలా శోకించకుండా, ఏడ్వకుండా ఉండగలను?

స బ్రహ్మచారీ చ తపోధనశ్చ సదోత్థితః కర్మసు చైవ దక్షః ।
కచస్య మార్గం ప్రతిపత్స్యే న భోక్ష్యే ప్రియో హి మే తాత! కచోఽ భిరూపః ॥46॥

అతడు బ్రహ్మచారి, తపోధనుడు, సదా జాగరూకుడు, పనులలో సమర్థుడు. అట్టి కచుని మార్గాన్నే నేను అనుసరిస్తాను. నేను భోజనం మానేస్తాను, తండ్రీ! కచుదు అందగాడు, నాకు చాలా ఇష్టుడు"

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

స త్వేవముక్తో దేవయాన్యా మహర్షి స్సంరమ్భేణ వ్యాజహారాథ కావ్యః ।
అసంశయం మామసురా ద్విషన్తి యే మే శిష్యానాగతాన్ సూదయన్తి ॥47॥

దేవయాని అలా అనే సరికి మహర్షి శుక్రుడు సంరంభంతో ఇలా అన్నాడు. "నిస్సందేహంగా రాక్షసులు నన్ను ద్వేషిస్తున్నారు. నా వద్దకు వచ్చిన నా శిష్యులను సంహరిస్తున్నారు.

అబ్రాహ్మణం కర్తుమిచ్ఛన్తి రౌద్రా ఏభిర్వ్యర్థం ప్రస్తుతో దానవైర్హి ।
తత్కర్మణాఽ ప్యస్య భవేదిహాన్తః కం బ్రహ్మహత్యా న దహేదపీన్ద్రమ్ ॥48॥

వారు రౌద్రచిత్తులై బ్రాహ్మణులనే నశింప జేయగోరుతున్నారు. ఇది వ్యర్థమైన పని. అట్టి పనివల్ల వీరికి వినాశమే కల్గుతుంది. వాడు ఇంద్రుడైనా అగుగాక! ఎవనిని బ్రహ్మహత్య దహించదు?

స తేనాఽ ఽ పృష్టో విద్యయా చోపహూత శ్శనై ర్వాచం జఠరే వ్యాజహార ।
తమబ్రవీత్కేన చేహోపనీతో మమోదరే తిష్ఠసి బ్రూహి వత్స ॥49॥

పిదప శుక్రుడు కచుణ్ణి విద్యతో ఆహ్వానించాడు. జీవితుడైన కచుడు శుక్రుని ఉదరంనుండే మాట్లాడాడు. అతణ్ణి ఉద్దేశించి శుక్రుడు "వత్సా! నీవు ఎవరు చేసిన దుష్కృత్యం వల్ల ఇలా నాగర్భంలో చేరావో చెప్పు"

కచ ఉవాచ :– కచుడు చెప్పాడు.

భవత్ప్రసాదా న్న జహాతి మాం స్మృతి స్సర్వం స్మరేయం యచ్చ యథా చ వృత్తమ్ ।
న త్వేవం స్యాత్తపసః క్షయో మే తతః క్లేశం ఘోరతరం సహామి ॥50॥

కచుడు చెప్పాడు. "గురుదేవా! నేను మీ అనుగ్రహం వల్ల జరిగిన దంతా స్మరిస్తున్నాను. ఏది ఎలా జరిగిందో నాకు గుర్తున్నది. నేను నాతపోబలంతో వెలికి రాగలను. కాని అలా చేస్తే నా తపస్సు క్షయిస్తుంది. అందుకే ఈ ఘోరమైన బాధను సహిస్తున్నాను.?

అసురై స్సురాయాం భవతోఽస్మి దత్తో హత్వా దగ్ధ్వా చూర్ణయిత్వా చ కావ్య! ।
బ్రాహ్మీం మాయాం త్వాసురీ త్వత్ర మాయా త్వయి స్థితే కథమేవాభిబాధతే ॥51॥

శుక్రాచార్యా! అసురులు నన్ను చంపి కాల్చివేసి బూడిదను సురలో కలిపి మీకిచ్చారు. మీరుండగా ఆసురీ మాయ బ్రాహ్మమాయను ఎలా బాధించ గల్గుతున్నది?

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

కిం తే ప్రియం కరవాణ్యద్య వత్సే! వినైవ మే జీవితం స్యాత్కచస్య ।
నాన్యత్ర కుక్షేర్మమ భేదనాచ్చ దృశ్యేత్కచో మద్గతో దేవయాని! ॥52॥

"ప్రియపుత్రీ! దేవయానీ! నీకు నేనెలా ప్రీతి గల్గించగలను? నేను మరణిస్తేనే కచుడు జీవిస్తాడు. నా గర్భంలో ఉన్న కచుడు దాన్ని చీల్చకుండా వెలికి రావడం సాధ్యం కాదు.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

ద్వౌ మాం శోకావగ్నికల్పౌ దహేతాం కచస్య నాశస్తవ చైవోపఘాతః ।
కచస్య నాశే మమ నాస్తి ధర్మ స్తవోపఘాతే జీవితుం నాస్మి శక్తా ॥53॥

"తండ్రీ! నన్ను అగ్నితుల్యాలైన రెండు పరిస్థితులు కాల్చివేస్తున్నవి. ఒకటి కచుని వినాశం, రెండు నీకు ఉపఘాతం. కచుడు మరణిస్తే నాకు ధర్మహాని. నీవు లేకుంటే నేను జీవించలేను.

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

సంసిద్ధరూపోఽసి బృహస్పతేస్సుత! యత్త్వాం భక్తం భజతే దేవయానీ ।
విద్యామిమాం ప్రాప్నుహి జీవనీం త్వం నచేదిన్ద్రః కచరూపీ త్వమద్య ॥54॥

బృహస్పతిపుత్రా! కచా! నీవు సిద్ధపురుషుడ వయ్యావు. ఎందుకంటే భక్తుడవైన నిన్ను దేవయాని భజిస్తున్నది. నీవు కచరూపంలో ఉన్న ఇంద్రుడివి కాకుంటే సంజీవనీ విద్యను ఇప్పుడు నానుండి గ్రహించు.

న నివర్తేత్ పునర్జీవన్ కశ్చిదన్యో మమోదరాత్ ।
బ్రాహ్మణం వర్జయిత్వైకం తస్మాద్విద్యామవాప్నుహి ॥55॥

ఒక బ్రాహ్మణుడు తప్ప నా గర్భం నుండి తిరిగి జీవించి వచ్చువాడు మరొకడు లేడు. అందువల్ల విద్యను పొందుము.

పుత్త్రో భూత్వా నిష్క్రమస్వోదరాన్మే భిత్త్వా కుక్షిం జీవయ మాం చ తాత ।
అవేక్షేథా ధర్మవతీమవేక్షాం గురో స్సకాశాత్ప్రాప్య విద్యాం సవిద్యః ॥56॥

నీవు నాకు పుత్రుడవై నాగర్భం చీల్చుకొని వెలికిరమ్ము. నాయనా! ఆ పై నన్ను బ్రతికించు. గురువునుండి విద్యను పొంది విద్యావంతుడవై ధర్మ పద్ధతిలో నాపట్ల భక్తి గల్గి యుండు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

గురో స్సకాశాత్సమవాప్య విద్యాం భిత్త్వా కుక్షిం నిర్విచక్రామ విప్రః ।
ప్రాలేయాద్రేశ్శుక్ల ముద్భిద్య శృఙ్గం రాత్ర్యాగమే పౌర్ణమాస్యామివేన్దుః ॥57॥

అంతట మంచుకొండ యొక్క తెల్లని శిఖరాన్ని భేదించుకొని రాత్రివేళ పున్నమినాడు చంద్రుడు వెలికి వచ్చు విధంగా ఆ విప్రుడు గురువు నుండి విద్యను పొంది గురుగర్భాన్ని చీల్చుకొని వెలుపలికి వచ్చాడు.

దృష్ట్వా చ తం పతితం వేదరాశిం ఉత్థాపయామాస తతః కచోఽపి ।
విద్యాం సిద్ధాం తామవాప్యాభివాద్య తతః కచస్తం గురుమిత్యువాచ ॥58॥

తరువాత క్రిందపడిన వేదరాశివలె పడియున్న గురువును సిద్ధమైన విద్యను పొంది కచుడు విద్యాబలంతో లేపాడు. అప్పుడు కచుడు గురువుతో ఇలా అన్నాడు.

వ్రతస్య దాతారమనుత్తమస్య నిధిం నిధీనాం చ వరం వరాణామ్ ।
యే నాఽఽద్రియన్తే గురుమర్చనీయం పాపాన్లోకాం స్తే వ్రజన్త్యప్రతిష్ఠాన్ ॥59॥

మహోత్తమవ్రతప్రదాతా, నిధులకు నిధీ, వరాలకు వరదుడూ, పూజనీయుడూ అయిన గురువునెవరు అర్చించరో వారు అయోగ్యాలూ, పాపానుభవం కల్గించేవీ అగు లోకాలను పొందుతారు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

సురాపానాద్వంచనాం ప్రాపయిత్వా సంజ్ఞానాశం చేతసశ్చాపి ఘోరమ్ ।
దృష్ట్వా కచం చాపి తథాభిరూపం పీతం తథా సురయా మోహితేన ॥60॥

శుక్రుడు సురాపానం చేసి రాక్షసుల వంచనకు గురి అయ్యాడు. తన చిత్తానికి గల వివేకం గూడా నశించింది. అందమైన కచుడు సైతం సురామోహితుడైన తనచే త్రాగబడినాడు.

సమన్యురుత్థాయ మహానుభావస్తదోశనా విప్రహితం చికీర్షుః ।
కావ్యస్స్వయం వాక్యమిదం జగాద సురాపానం ప్రత్యసౌ జాతశఙ్కః ॥61॥

అందుచే మహానుభావుడగు శుక్రుడు కోపించి లేచి విప్రులకు హితం చేయగోరి స్వయంగా సురాపాన విషయంలో సంశయం కల్గి ఇలా అన్నాడు.

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

యో బ్రాహ్మణోఽద్యప్రభృతీహ కశ్చిన్మోహాత్సురాం పాస్యతి మన్దబుద్ధిః ।
అపేతధర్మా బ్రహ్మహా చైవ స స్యాదస్మిన్లోకే గర్హిత స్స్యాత్పరే చ ॥62॥

"ఏ బ్రాహ్మణుడు నేటినుండి మోహంతో మంద బుద్ధియై సురాపానం చేస్తాడో, అతడు ధర్మం తప్పినవాడై బ్రహ్మహత్య చేసినవాడునై ఇహపరలోకాలలో నిందకు పాత్రుడవుతాడు.

మయా చేమాం విప్రధర్మోక్తసీమాం మర్యాదాం వై స్థాపితాం సర్వలోకే ।
సన్తో విప్రాశ్శుశ్రువాంసో గురూణాం దేవా దైత్యాశ్చోపశృణ్వన్తు సర్వే ॥63॥

బ్రాహ్మణులు ఆచరించదగిన ధర్మ విషయంలో నేను చెప్పిన ధర్మమర్యాదను లోకంలోని విప్రులందరూ నిల్పుకొందురురు గాక! వేద శాస్త్రాలలో, పెద్దలపట్ల ప్రామాణ్య బుద్ధి గల విప్రులు, గురువుల నుండి వేదశాస్త్రాధ్యయనం చేసినవారు, దేవతలు, దైత్యులు, అందరూ దీనిని విందురు గాక!"

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

ఇతీదముక్త్వా స మహాప్రభావస్తపోనిధీనాం నిధిరప్రమేయః ।
తాన్దానవాంశ్చైవ నిగూఢబుద్ధీనిదం సమాహూయ వచోఽభ్యువాచ ॥64॥

తపోనిధులకు నిధీ, అప్రమేయుడు, మహాప్రభావసంపన్నుడూ, అయిన శుక్రుడు అలా చెప్పి నిగూఢమతులైన దానవులను పిలిచి ఈ రీతిగా చెప్పాడు.

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

ఆచక్షే వో దానవా బాలిశాః స్థ శిష్యః కచో వత్స్యతి మత్సమీపే ।
సఞ్జీవినీం ప్రాప్య విద్యాం మయాఽయం తుల్యప్రభావో బ్రాహ్మణో బ్రహ్మభూతః ॥65॥

బాలిశులైన దానవులారా! మీకు ఒకమాట చెబుతున్నాను. కచుడు నా శిష్యుడు, నా వద్దనే వుంటాడు. నా సంజీవనీ విద్యను పొంది నాతో సముడై బ్రాహ్మణుడై బ్రహ్మభూతుడయ్యాడు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

గురోరుష్య సకాశే చ దశవర్షశతాని సః ।
అనుజ్ఞాతః కచో గన్తుమియేష త్రిదశాలయమ్ ॥66॥

ఆ కచుడు గురుని వద్ద వెయ్యి సంవత్సరాలు నివసించి ఆయన అనుమతితో తిరిగి స్వర్గానికి పోదలచాడు.

ఇతి శ్రీమత్స్యమహాపురాణే చన్ద్రవంశానువర్ణనే యయాతి చరితే కచవృత్తాన్త కథనం నామ పంచవింశతి తమోఽధ్యాయః ॥ 25 ॥

శ్రీమత్స్యమహాపురాణములోని చన్ద్రవంశానువర్ణనంలో యయాతి చరిత్రయందు కచవృత్తాంత కథనమనే ఇరవైఅయిదవ అధ్యాయం సంపూర్ణం

షడ్వింశతి తమోఽధ్యాయః - ఇరవైఆరవ అధ్యాయం
కచదేవయానీ సంవాదః - కచదేవయానీ సంవాదం

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

సమాపితవ్రతం తం తు విసృష్టం గురుణా తతః ।
ప్రస్థితం త్రిదశావాసం దేవయానీదమబ్రవీత్ ॥1॥

కచుడు వ్రతనిర్వహణం పూర్తి చేశాడు. గురువు అనుమతితో దేవలోకానికి పయనమయ్యాడు. అప్పుడు దేవయాని అతనితో ఇలా అన్నది-

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

ఋషేరఙ్గిరసః పౌత్ర! వృత్తేనాభిజనేన చ ।
భ్రాజసే విద్యయా చైవ తపసా చ దమేన చ ॥2॥

"అంగిరసర్షి మనుమడా పౌత్రా! శీలంచేతా, వంశంచేతా, విద్యచేతా, తపస్సుచేతా, ఇంద్రియనిగ్రహంచేతా ప్రకాశిస్తున్నావు.

ఋషిర్యథాఙ్గిరా మాన్యః పితుర్మమ మహాయశాః ।
తథా మాన్యశ్చ పూజ్యశ్చ మమ భూయో బృహస్పతిః ॥3॥

నా తండ్రికి మహాశక్తిమంతుడైన అంగిరసుడెలా మాన్యుడో, అట్లే మీ తండ్రి బృహస్పతి నాకు మాన్యుడు, పూజ్యుడు.

ఏవం జ్ఞాత్వా విజానీహి యద్బ్రవీమి తపోధన ।
వ్రతస్థే నియమోపేతే యథా వర్తామ్యహం త్వయి ॥4॥

స సమాపితవిద్యో మాం భక్తాం న త్యక్తుమర్హసి ।
గృహాణ పాణిం విధివన్మమ మన్త్రపురస్కృతమ్ ॥5॥

తపోధనా! ఈ విషయం గ్రహించి ఇప్పుడు నేనేమి చెప్పదలచుకోన్నానో, విను. నీవు వ్రతం పాటిస్తూ నియమవంతుడవై ఉన్నప్పుడు నేను నీ పట్ల ఎలా ఉండేదాననో స్మరించు. అట్టి నీవు విద్య పూర్తి చేసుకొని నీపట్ల భక్తి గల నన్ను విడుచుట న్యాయం కాదు. మంత్ర పురస్సరంగా శాస్త్రోక్తవిధితో నా పాణిని గ్రహించు.

కచ ఉవాచ :- కచుడు చెప్పాడు.

పూజ్యో మాన్యశ్చ భగవాన్యథా మమ పితా తవ ।
తథా త్వమనవద్యాఙ్గి! పూజనీయతమా మతా ॥6॥

"అనవద్యాంగీ! భగవంతుడగు నీ తండ్రి నాకెట్లు పూజ్యుడో, మాన్యుడో, అట్లే నీవు కూడా నాకు పూజ్యురాలవు.

ఆత్మప్రాణైః ప్రియతమా భార్గవస్య మహాత్మనః ।

త్వం భద్రే! ధర్మతః పూజ్యా గురుపుత్రీ సదా మమ ॥7॥

యథా మమ గురుర్నిత్యం మాన్యశ్శుక్రః పితా తవ ।
దేవయాని! తథైవ త్వం నైవం మాం వక్తుమర్హసి ॥8॥

మహాత్ముడగు శుక్రాచార్యునకు ప్రాణంకంటే నీవు ప్రియమైనదానవు. పైగా నాకు గురుపుత్రివి. ధర్మపద్ధతి ననుసరించి నాకు పూజ్యురాలవు.నా గురువగు నీ తండ్రి నాకెట్లు నిత్యమూ మాన్యుడో, అట్లే నీవు గూడ నాకు మాన్యురాలవు. అందువల్ల నీవిలా చెప్పడం తగదు.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

గురుపుత్రస్య పుత్రో మే న తు త్వమసి మే పితుః ।
తస్మాన్మాన్యశ్చ పూజ్యశ్చ మమాపి త్వం ద్విజోత్తమ ॥9॥

అసురైర్హన్యమానే తు కచే త్వయి పునః పునః ।
తదాప్రభృతి యా ప్రీతిస్తాం త్వమేవ స్మరస్వ మే ॥10॥

అసురులు మాటిమాటికి నిన్ను చంపబూనినప్పుడు నేను నీ పట్ల ఎంత ప్రీతి గలిగి యుంటినో, దానిని స్మరించు. ద్విజోత్తమా! నీవు గురువగు అంగిరసుని పుత్రుడు బృహస్పతికి పుత్రుడవే కాని నా తండ్రికి పుత్రుడవు కావు. అందువల్ల నీవు నాకు మాన్యుడవు, పూజ్యుడవు.

సౌహార్దే చానురాగే చ వేత్థ మే భక్తిముత్తమామ్ ।
న మామర్హసి ధర్మజ్ఞ! త్యక్తుం భక్తామనాగసమ్ ॥11॥

సౌహార్దంలోగానీ, రాగంలోగానీ నీవు నా భక్తి ఎట్టిదో తెలిసినవాడవు. ధర్మజ్ఞా! భక్తురాలను, నిరపరాధిని అయిన నన్ను నీవు విడిచిపెట్టడం తగదు.

కచ ఉవాచ :– కచుడు చెప్పాడు.

అనియోజ్యే నియోగే మాం నియునక్షి శుభవ్రతే ।
ప్రసీద సుభ్రూర్మహ్యం త్వం గురోర్గురుతరా శుభే ॥12॥

శుభవ్రతం కలదానా! నీవు నన్ను నియోగించరాని నియోగంలో నియోగిస్తున్నావు. సుభ్రూ! నా పట్ల అనుగ్రహం చూపు. శుభప్రదా! నీవు నాకు గురువు కంటె గొప్పదానివి.

యత్రోషితం విశాలాక్షి త్వయా చన్ద్రనిభాననే! ।
తత్రాహముషితో భద్రే! కుక్షౌ కావ్యస్య భామిని! ॥13॥

చంద్రముఖీ! విశాలాక్షీ! నీవు ఏ గర్భంలో నివసించావో, నేను శుక్రుని ఆ గర్భంలోనే నివసించాను.

భగినీ ధర్మతో మే త్వం మైవం వోచశ్శుభాననే! ।
సుఖేనాధ్యుషితో భద్రే న మన్యుర్విద్యతే మమ ॥14॥

అందుచేత ధర్మపద్ధతిలో నీవు నాకు సోదరివి. శుభవదనా! ఇలా చెప్పకు. నేనిక్కడ సుఖంగా ఇంతకాల మున్నాను. నీ యెడల నాకు కోపం లేదు.

అప్రమత్తోద్యతా నిత్యమారాధయ గురుం మమ ॥15॥

ఏమాత్రం ఏమరుపాటు లేకుండా నీవు నా గురువును నిత్యం ఆరాధించు.

ఆపృచ్ఛే త్వాం గమిష్యామి శివమస్త్వథ మే పథి ।
అవిరోధేన ధర్మస్య స్మర్తవ్యోఽస్మి కథాన్తరే ॥16॥

నేనిక పోయి వస్తాను. నా మార్గం శుభకర మగుగాక! ధర్మవిరోధం లేకుండా మాటల సందర్భంలో నన్ను గుర్తుంచుకో.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

దైత్యైర్హతస్త్వం యద్భర్తృబుద్ధ్యా త్వం రక్షితో మయా ।
యది మాం ధర్మకామార్థాం ప్రత్యాఖ్యాస్యే న ధర్మతః ।
తతః కచ న తే విద్యా సిద్ధిమేషా గమిష్యతి ॥17॥

దైత్యులు నిన్ను చంపినప్పుడు నేను నిన్ను 'భర్త' వన్న బుద్ధితో రక్షించాను. నీవు ధర్మకామార్థిని నైన నన్ను ధర్మతః తిరస్కరిస్తే అపుడు ఈ విద్య నీకు ఫలించదు.

కచ ఉవాచ :– కచుడు చెప్పాడు.

గురుపుత్రీతి కృత్వాఽహం ప్రత్యాఖ్యాస్యే న దోషతః ।
గురుణా చాభ్యనుజ్ఞాతః కామమేవం శపస్వ మామ్ ॥18॥

నేను నిన్ను గురుపుత్రి వని వలదంటున్నానే కాని నీలో ఏదో దోషమున్నదని కాదు. గురువుచే అనుజ్ఞాతుడనైన నన్ను శపిస్తే శపించు.

ఆర్షం ధర్మం బ్రువాణోఽహం దేవయాని! యథా త్వయా ।
శప్తుం నార్హోఽస్మి కళ్యాణి! కామతోఽద్య న ధర్మతః ॥19॥

తస్మాద్భవత్యా యః కామో న తథా సంభవిష్యతి ।
ఋషిపుత్రో న తే కశ్చిజ్జాతు పాణిం గ్రహీష్యతి ॥20॥

దేవయానీ! నేను ఆర్షధర్మం చెబుతున్నాను. కల్యాణీ! కామంతోగానీ, ధర్మంతో గానీ నీవు నన్ను శపించదగవు. నీ కోరిక తీరునది కాదు. ఋషిపుత్రుడు మరొక్కడెవడూ ఎప్పుడూ నీ పాణిగ్రహణం చేయకుండుగాక!

ఫలిష్యతి న మే విద్యా త్వద్వచశ్చేతి తత్తథా ।
అధ్యాపయిష్యామి చ యం తస్య విద్యా ఫలిష్యతి ॥21॥

నీవు చెప్పినట్లు నావిద్య నాకు ఫలించని పక్షంలో, నేను ఎవనికి ఈ విద్య నేర్పుతానో అతనికి ఫలిస్తుంది.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

ఏవముక్త్వా నృపశ్రేష్ఠ! దేవయానీం కచస్తదా ।
త్రిదశేశాలయం శీఘ్రం జగామ ద్విజసత్తమః ॥22॥

రాజా! ద్విజశ్రేష్ఠుడగు కచుడు దేవయానితో ఇలా చెప్పి శీఘ్రంగా దేవలోకంలోని తన యిల్లు చేరాడు.

తమాగతమభిప్రేక్ష్య దేవాస్స్వేన్ద్రపురోగమాః ।
బృహస్పతిం సభాజ్యేదం కచమాహు ర్ముదాఽన్వితాః ॥23॥

అలా వచ్చిన కచుణ్ణి చూచి ఇంద్రాది దేవతలు బృహస్పతిని సత్కరించారు, సంతోషించి కచునితో ఇలా అన్నారు.

దేవా ఊచుః :- దేవతలు చెప్పారు.

త్వం కచాస్మద్ధితం కర్మ కృతవాన్మహదద్భుతమ్ ।
న తే యశః ప్రణశితా భాగభాక్చ భవిష్యసి ॥24॥

కచా! నీవు మాకు హితమైన పని చేశావు. ఇది చాలా అద్భుతం. నీ కీర్తి తరగదు. యజ్ఞంలో నీకు గూడా భాగముంటుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే దేవయానీకచసంవాదో నామ షడ్వింశతితమోఽధ్యాయః॥ 26 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని యయాతి చరిత్రలో కచదేవయానీ సంవాదమనే ఇరవైఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తవింశతితమోఽధ్యాయః - ఇరవైఏడవ అధ్యాయం

శర్మిష్ఠాదేవయాన్యోర్విరోధకారణమ్ - శర్మిష్ఠాదేవయానుల విరోధకారణం

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

కృతవిద్యే కచే ప్రాప్తే హృష్టరూపా దివౌకసః ।
కచాదవేత్య తాం విద్యాం కృతార్థా భరతర్షభ! ॥1॥

భరతశ్రేష్ఠా! సంజీవనీ విద్య నభ్యసించి కచుడు తిరిగి రాగా దేవతలందరూ సంతోషించారు. ఆ విద్యను కచుని ద్వారా అభ్యసించి కృతార్థులయ్యారు.

సర్వ ఏవ సమాగమ్య శతక్రతుమథాబ్రువన్ ।
కాలస్త్వద్విక్రమస్యాద్య జహి శత్రూన్పురందర! ॥2॥

దేవతలందరూ కూడి వచ్చి ఇంద్రునితో ఇలా అన్నారు- "పురందరా! నీ పరాక్రమానికిది సమయం. ఇప్పుడు శత్రువులను చెండాడు".

ఏవముక్తస్తు సహితై స్త్రిదశైర్మఘవాంస్తదా ।
తథేత్యుక్త్వోపచక్రామ సోఽపశ్య ద్విజనే స్త్రియః ॥3॥

క్రీడన్తీనాం తు కన్యానాం వనే చైత్రరథోపమే ।
వాయుర్భూత స్స వస్త్రాణి సర్వాణ్యేవ వ్యమిశ్రయత్ ॥4॥

ఇలాదేవతలనగా ఇంద్రుడు 'అట్లే' అని అంగీకరించాడు. అతడు చైత్రరథంతో సమానమైన విజన ప్రదేశంలో జలక్రీడలాదే రాక్షసస్త్రీలను చూచాడు. అక్కడ వాయువుగా మారి ఆవనితల వస్త్రాలన్నీ కలిసిపోయేటట్లు చేశాడు.

తతో జలాత్సముత్తీర్య తాః కన్యాః సహితా స్తదా ।
వస్త్రాణి జగృహుస్తాని యథాసంస్థాన్యనేకశః ॥5॥

తదుపరి ఆ కన్యలందరూ జలమునుండి వెలికి వచ్చారు. చాలా వరకూ వారి వారి వస్త్రాలను వారు ధరించారు.

తత్ర వాసో దేవయాన్యా శ్శర్మిష్ఠా జగృహే తదా ।
వ్యతిక్రమమజానన్తీ దుహితా వృషపర్వణః ॥6॥

వారిలో వృషపర్వుని పుత్రిక శర్మిష్ఠ దేవయాని వస్త్రాన్ని అది మారి పోయిందని తెలియక గ్రహించి ధరించింది.

తత స్తయోర్మిథస్తత్ర విరోధ స్సమజాయత ।
దేవయాన్యాశ్చ రాజేన్ద్ర! శర్మిష్ఠాయాశ్చ తత్కృతే ॥7॥

రాజేంద్రా! ఆపై అక్కడ శర్మిష్ఠా దేవయానులకు ఆ వస్త్రం కారణంగా అన్యోన్యకలహం కలిగింది.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

కస్మాద్గృహ్ణాసి మే వస్త్రం శిష్యా భూత్వా మమాఽసురి ।
సముదాచారహీనాయా న తే శ్రేయో భవిష్యతి ॥8॥

రాక్షసీ! శిష్యురాలవైయుండి నీవు నా వస్త్రమేల గ్రహించావు? సదాచారం పాటించని నీకు శ్రేయస్సు కలుగకుండుగాక!

శర్మిష్ఠోవాచ :- శర్మిష్ఠ చెప్పింది.

ఆసీనం చ శయానం చ పితా తే పితరం మమ ।
స్తౌతి పృచ్ఛతి చాభీక్ష్ణం నీచస్థస్సువినీతవత్ ॥9॥

మా తండ్రి కూర్చొని ఉన్నా, శయనించి వున్నా మీ తండ్రి వినయంతో మాటి మాటికీ క్రిందనుండి స్తుతిస్తాడు. యాచిస్తాడు.

యాచతస్త్వం చ దుహితా స్తువతః ప్రతిగృహ్ణతః ।
సుతాఽహం స్తూయమానస్య దదతో న తు గృహ్ణతః ॥10॥

అలా యాచించి, స్తుతించి, గ్రహించి జీవించే వాని కూతురివి నీవు. నేను స్తుతింపబడి ఇచ్చేవాని కుమార్తెనే కాని పుచ్చుకొనేవాని కూతురిని కాను.

అనాయుధా సాయుధాయాః కిం త్వం కుప్యసి భిక్షుకి! ।
లప్స్యసే ప్రతియోద్ధారం న చ త్వాం గణయామ్యహమ్ ॥11॥

నేను ఆయుధాలు గలదానను, నీవు ఆయుధం లేనిదానవు. బిచ్చగత్తెవైన నీవు నా పట్ల కోపిస్తావెందుకు? నీకు సాటియైన ప్రతియోద్ధ లభిస్తాడు పో, నీవు నాకు సరిదానవు కావు. 'నేను' నిన్ను లెక్కపెట్టను.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

సా విస్మయం దేవయానీం గతాం సక్తాం చ వాససి ।
శర్మిష్ఠా ప్రాక్షిపత్కూపే తత స్స్వపురమావిశత్ ॥12॥

ఆ మాటలు విని. విస్మితురాలై తన వస్త్రానికై పట్టు పట్టిన దేవయానిని శర్మిష్ఠ ఆ ప్రక్కనే ఉన్న బావిలో త్రోసివేసింది. తరువాత తన నగరానికి వెళ్ళిపోయింది.

హతేయమితి విజ్ఞాయ శర్మిష్ఠా పాపనిశ్చయా ।
అనవేక్ష్య యయౌ తస్మాత్క్రోధవేగపరాయణా ॥13॥

దేవయాని మరణించిందని భావించి పాపనిశ్చయం కల శర్మిష్ఠ క్రోధావేశంలో ఆమె వైపు చూడకుండా వెళ్ళిపోయింది.

అథ తం దేశమభ్యాగాద్యయాతిర్నహుషాత్మజః ।
శ్రాన్తయుగ్యః శ్రాన్తరూపో మృగలిప్సుః పిపాసితః ॥14॥

తదుపరి నహుషుని కుమారుడైన యయాతి ఆ ప్రదేశానికి వచ్చాడు. మృగాన్ని వేటాడుతూ వచ్చిన అతడు అలసిపోయాడు. దప్పికతో అలసిన గుర్రాలతో అతడక్కడికి చేరాడు.

నాహుషిః ప్రేక్షమాణో హి స నిపానే గతోదకే ।
దదర్శ కన్యాం తాం తత్ర దీప్తా మగ్నిశిఖామివ ॥15॥

యయాతి నీరు లేని ఆపాడుబావిలో జ్వలించే అగ్నిశిఖ లాగా ఉన్న ఆ కన్యను చూచాడు.

తా మపృచ్ఛత్సదృష్ట్వైవ కన్యామమరవర్ణినీమ్ ।
సాన్త్వయిత్వా నరశ్రేష్ఠస్సామ్నా పరమవల్గునా ॥16॥

ఆ నృపవర్యుడు అమర వర్ణయగు (దేవతాతేజం కలది) ఆ కన్యను చూచి ఓదార్చాడు. ప్రశాంత వచనాలతో ఆమె నిలా అడిగాడు.

కా త్వం చారుముఖీ శ్యామా సుమృష్టమణికుణ్డలా ।
దీర్ఘం ధ్యాయసి చాత్యర్థం కస్మాచ్ఛ్వసిషి చాతురా ॥17॥

చారుముఖీ! నీవెవరు? మంచి మణికుండలాలు ధరించినదానవు, యౌవన మధ్యస్థవు, మిక్కిలి దీర్ఘంగా ఆలోచిస్తున్నావే! ఎందుకిలా శోకిస్తున్నావు?

కథం చ పతితా హ్యస్మి న్కూపే వీరుత్తృణావృతే ।
దుహితా చైవ కస్య త్వం వద సర్వం సుమధ్యమే! ॥18॥

గడ్డితో కప్పబడిన ఈబావిలో ఎలా పడ్డావు? నీ వెవరి పుత్రికవు? సుమధ్యమా! అంతా నాకు చెప్పు.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

యోఽసౌ దేవై ర్హతాన్దైత్యానుత్థాపయతి విద్యయా ।
తస్య శుక్రస్య కన్యాఽహం త్వం మాం నూనం న మన్యసే ॥19॥

దేవతలు చంపిన రాక్షసులను మృత సంజీవనీ విద్యతో పునర్జీవితులను చేసే శుక్రాచార్యుని పుత్రికను నేను. నన్ను నీవెఱుగవు.

ఏష మే దక్షిణో రాజన్పాణి స్తామ్రనఖాఙ్గులిః ।
సముద్ధర గృహీత్వా మాం కులీన స్త్వం హి మే మతః ॥20॥

రాజా! ఎఱ్ఱని గోళ్ళు, వ్రేళ్ళు గల నా దక్షిణహస్త మిదిగో, దీనిని పట్టుకొని నన్ను ఉద్ధరించు. నీవు కులీనుడవని నేను భావిస్తున్నాను.

జానామి త్వాం చ సంశాన్తం వీర్యవన్తం యశస్వినమ్ ।
తస్మాన్మాం పతితాం కూపాదస్మాదుద్ధర్తుమర్హసి ॥21॥

నీవు శాంతుడవు, పరాక్రమశాలివి, కీర్తిమంతుడవని నేను గ్రహించాను. అందువల్ల బావిలో పడిన నన్ను ఉద్ధరించదగినవాడవు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

తామథ బ్రాహ్మణీం స్త్రీం చ విజ్ఞాయ నహుషాత్మజః ।
గృహీత్వా దక్షిణే పాణావుజ్జహార తతోఽవటాత్ ॥22॥

పిదప నహుషుని కుమారుడు ఆమెను బ్రాహ్మణస్త్రీగా గుర్తించి ఆమె కుడి చేయి పట్టుకొని ఆ పాడుపడినబావి నుండి పైకి లేపాడు.

ఉద్ధృత్య చైనాం తరసా తస్మాత్కూపాన్నరాధిపః ।
ఆమన్త్రయిత్వా సుశ్రోణీం యయాతి స్స్వపురం యయౌ ॥23॥

శీఘ్రంగా ఆమెను ఆ కూపం నుండి లేపి రాజు ఆ సుశ్రోణికి వీడ్కోలు చెప్పాడు. ఆపై తన నగరానికి వెళ్ళాడు.

గతే తు నాహుషే తస్మిన్దేవయాన్యపి నిన్దితా ।
ఉవాచ శోకసంతప్తా చూర్ణికామాగతాం పునః ॥24॥

యయాతి వెళ్ళిన తరువాత శోకసంతప్తయైన దేవయాని అక్కడకు వచ్చిన దాసిని చూచి ఇలా అన్నది–

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

త్వరితం చూర్ణికే! గచ్ఛ సర్వమాచక్ష్వ మే పితుః ।
నేదానీం తు ప్రవేక్ష్యామి నగరం వృషపర్వణః ॥25॥

చూర్ణికా! త్వరగా వెళ్ళు. నా తండ్రి కిదంతా చెప్పు. నేనిక వృషపర్వుని నగరంలో అడుగు పెట్టను.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

సా తు వై త్వరితం గత్వా చూర్ణికాఽసురమన్దిరమ్ ।
దృష్ట్వా కావ్యమువాచేదం కమ్పమానా విచేతనా ॥26॥

ఆచఖ్యౌ చ మహాభాగా దేవయానీ వనే హతా ।
శర్మిష్ఠయా మహాప్రాజ్ఞ దుహిత్రా వృషపర్వణః ॥27॥

ఆ చూర్ణిక త్వరత్వరగా అసురమందిరానికి పోయి శుక్రుణ్ణి చూచి కంపిస్తూ గద్గదస్వరంలో ఇలా చెప్పింది. "మహాభాగా! మహా ప్రాజ్ఞా! అడవిలో వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ దేవయానిని శిక్షించింది."

శ్రుత్వా దుహితరం కావ్యస్తదా శర్మిష్ఠయా హతామ్ ।
త్వరయా నిర్యయౌ దుఃఖాన్మార్గమాణః సుతాం వనే ॥28॥

శర్మిష్ఠచే దెబ్బలుదిన్న కుమార్తెను గూర్చి విని దుఃఖంతో శుక్రాచార్యుడు ఆమెనన్వేషిస్తూ అడవికి పోయాడు.

దృష్ట్వా దుహితరం కావ్యో దేవయానీం తపోవనే ।
బాహుభ్యాం సమ్పరిష్వజ్య దుఃఖితో వాక్యమబ్రవీత్ ॥29॥

అక్కడి తపోవనంలో కుమార్తె దేవయానిని చూచి చేతులతో కౌగలించుకొని దుఃఖించి ఇలా అన్నాడు–

ఆత్మదోషై ర్నియచ్ఛన్తి సర్వే దుఃఖసుఖే జనాః ।
మన్యే దుశ్చరితం తేఽస్తి తస్యేయం నిష్కృతిః కృతా ॥30॥

పుత్రీ! జనులందరూ తమ గుణదోషాలతోనే సుఖదుఃఖా లనుభవిస్తున్నారు. నీలో ఏదో దోషమున్నది. అందువల్లనే నీకీ తిరస్కారం జరిగింది.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

నిష్కృతిర్వాఽస్తు వా మాఽస్తు శృణుష్వావహితో మమ ।
శర్మిష్ఠయా యదుక్తాఽస్మి దుహిత్రా వృషపర్వణః ॥31॥

ఇది నిష్కృతికానీ, కాక పోనీ, నా మాట సావధానంగా విను. వృషపర్వుని కూతురు శర్మిష్ఠ నన్ను గూర్చి ఏమన్నదో చెబుతాను.

సత్యం కిలైతత్సా ప్రాహ హీనా చాస్మి న చాధికా ।
ఏవం హి మే కథయతి శర్మిష్ఠా వార్షపర్వణీ ॥32॥

ఆమె చెప్పిన మాటలివి– నేను దానికంటె హీనురాలనే కాని అధికురాలను కానట. వృషపర్వుని కూతురు శర్మిష్ఠ ఇలా నన్ను తూలనాడింది.

వచనం తీక్ష్ణపరుషం క్రోధరక్తేక్షణం భృశమ్ ।
స్తువతో దుహితాఽసి త్వం యాచతః ప్రతిగృహ్ణతః ॥33॥

ఇంకా పరుషంగా తీక్ష్ణంగా క్రోధంతో ఎర్రబడిన కన్నులతో నన్ను చూచి మాట్లాడింది. "వృషపర్వుని స్తుతించి, యాచించి గ్రహించి జీవించే వాని కూతురవు నీవు" అన్నది.

సుతాఽహం స్తూయమానస్య దదతోఽప్రతిగృహ్ణతః ।
ఇతి మామాహ శర్మిష్ఠా దుహితా వృషపర్వణః ।
క్రోధసంరక్తనయనా దర్పపూర్ణాననా తతః ॥34॥

'నేను దానం పట్టనట్టి స్తుతింపబడి దానం చేసేవాని కూతురినన్నది. క్రోధరక్త నేత్రాలలో గర్వితవదనంతో నన్ను దూషించింది.

యద్యహం స్తువతస్తాత దుహితా ప్రతిగృహ్ణతః ।
ప్రసాదయిష్యే శర్మిష్ఠామిత్యుక్తా హి సఖీ మయా ॥35॥

తండ్రీ! నేను స్తుతించి, యాచించి వసుగ్రహణం చేసేవాని పుత్రికనా? అది నిజమైతే నేను శర్మిష్ఠను వేడుకొని అనుగ్రహింపజేసుకొంటాను అని నేను సఖితో చెప్పాను.

శుక్ర ఉవాచ :–శుక్రుడు చెప్పాడు

స్తువతో దుహితా న త్వం భద్రే న ప్రతిగృహ్ణతః ।
అతస్త్వం స్తూయమానస్య దుహితా దేవయాన్యసి ॥36॥

భద్రా! నీవు స్తుతించి గ్రహించేవాని పుత్రికవు కావు. నీవు స్తుతింపబడే వాని పుత్రిక దేవయానివి.

వృషపర్వైవ తద్వేద శక్రో రాజా చ నాహుషః ।
అచిన్త్యం బ్రహ్మనిర్ద్వన్ద్వ మైశ్వరం హి బలం మమ ॥37॥

ఈ సంగతి వృషపర్వునికి తెలుసు. ఇంద్రుడు గూడా ఎఱుగును. యయాతి కూడా ఎరుగును. అచింత్యమూ, నిర్ద్వంద్వమూ, ఈశ్వరసంబంధమూ అయిన బ్రహ్మబలం కదా నాది!"

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే చన్ద్రవంశానువర్ణనే యయాతిచరితే శర్మిష్ఠాదేవయాన్యోః విరోధకథనం నామ సప్తవింశతితమోఽధ్యాయః ॥ 27 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని చన్ద్రవంశ వర్ణనంలో యయాతిచరిత్ర యందు శర్మిష్ఠాదేవయానుల విరోధకథనమనే ఇరువది ఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టావింశతితమోఽధ్యాయః - ఇరవైఎనిమిదవ అధ్యాయం
శుక్రదేవయానీసంవాదః - శుక్రదేవయానుల సంవాదం

శుక్ర ఉవాచ :- శుక్రుడు చెప్పాడు.

యః పరేషాం నరో నిత్యమతివాదాంస్తితిక్షతి ।
దేవయాని! విజానీహి తేన సర్వమిదం జితమ్ ॥1॥

దేవయానీ! ఎవడు నిత్యం పరుల అతివాదాలను సహిస్తాడో, అతడు విశ్వమంతటికీ విజేత అని గ్రహించు.

యస్సముత్పతితం క్రోధం నిగృహ్ణాతి హయం యథా ।
స యన్తేత్యుచ్యతే సద్భిర్న యో రశ్మిషు లంబతే ॥2॥

ఎవడు పెల్లుబికిన కోపాన్ని గుర్రాన్ని నిగ్రహించినట్లు నిగ్రహిస్తాడో, వాణ్ణి సజ్జనులు నిజమైన 'యన్త' అంటారు గాని పగ్గాలు పట్టుకొని వ్రేలాడినంతమాత్రాన యంత అనరు.

యస్సముత్పతితం క్రోధమక్రోధేన నియచ్ఛతి ।
దేవయాని! విజానీహి తేన సర్వమిదం జితమ్ ॥3॥

దేవయానీ! ఎవడు తన కోపాన్ని కోపరాహిత్యంతో నియమిస్తాడో, అతణ్ణి సర్వవిజేతగా గుర్తించు.

యస్సముత్పతితం కోపం క్షమయైవ నిరస్యతి ।
యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే ॥4॥

ఎవడు పొంగిన కోపాన్ని క్షమతో పాము కుబుసాన్ని నిరసించినట్లు నిరసిస్తాడో, అతడు నిజంగా పురుషుడనబడతాడు.

యస్తు భావయతే ధర్మం యోఽతిమాత్రం తితిక్షతి ।
యశ్చ తప్తో న తపతి భృశం సోఽర్థస్య భాజనమ్ ॥5॥

ఎవడు ధర్మాన్ని అనుసరిస్తాడో, ఎవడు ఎక్కువ ఓరిమి గల్గి వుంటాడో, తప్తుడైనా ఎవడు తపించడో వాడు కోరిన ప్రయోజనం పొందగలడు.

యో యజేదశ్వమేధేన మాసి మాసి శతం సమాః ।
యస్తు కుప్యేన్న సర్వస్య తయోరక్రోధనో వరః ॥6॥

ఎవడు ప్రతినెలా క్రమం తప్పక నూరు సంవత్సరాలు అశ్వమేధయాగం అనుష్ఠిస్తాడో, ఎవడు ఎవని పట్లా కోపించడో, - వీరిరువురిలో కోపం లేనివాడే మేలైనవాడు.

యే కుమారాః కుమార్యశ్చ వైరం కుర్యురచేతసః ।
నైతత్ప్రాజ్ఞస్తు కుర్వీత విదుస్తే న బలాబలమ్ ॥7॥

కుమారీ కుమారులు తెలివి లేనప్పుడు పరస్పరం కలహిస్తారు. వారికి బలాబలాలు తెలియవు. కాని ప్రాజ్ఞులలా చేయరు.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది

వేదాహం తాత బాలాఽపి కార్యాణాం తు గతాగతమ్ ।
క్రోధే చైవాతివాదే వా కార్యస్యాపి బలాబలే ॥8॥

తండ్రీ! నేను బాలికనైనా కార్యము యొక్క గతాగతాలు తెలిసినదాననే. క్రోధంలో, అతివాదంలో కార్యబలాబలాలు ఎఱిగినదాననే.

శిష్యస్యాశిష్యవృత్తం హి న క్షన్తవ్యం బుభూషుణా ।
అసత్సజీర్ణవృత్తేషు వాసో మమ న రోచతే ॥9॥

కాని శుభాభిలాషి యయిన గురువు శిష్యుని దుష్ప్రవృత్తిని సహించరాదు. సత్ప్రవృత్తి లేక ధర్మాధర్మాలు తెలియక ప్రవర్తించువారి మధ్య ఉండడం నా కిష్టం లేదు.

పుంసో యే నాభినన్దన్తి వృత్తేనాభిజనేన చ ।
న తేషు నివసేత్ప్రాజ్ఞశ్శ్రేయోఽర్థీ పాపబుద్ధిషు ॥10॥

సత్ప్రవృత్తిగల సద్వంశజులను మెచ్చని పాపాత్ముల చెంత శ్రేయస్సు కోరే ప్రాజ్ఞుడుండరాదు.

యే నైనమభిజానన్తి వృత్తేనాభిజనేన చ ।
తేషు సాధుషు వస్తవ్యం స వాసశ్శ్రేష్ఠ ఉచ్యతే ॥11॥

సత్ప్రవృత్తి చేత, వంశం చేత శ్రేష్ఠులైన వారి నెవరు గుర్తిస్తారో, అట్టి సజ్జనుల చెంత నివసించాలి. అట్టి నివాసం శ్రేష్ఠమైనది.

తన్మే మథ్నాతి హృదయమగ్నికామ ఇవారణిమ్ ।
వాగ్దురుక్తం మహాఘోరం దుహితుర్వృషపర్వణః ॥12॥

అందువల్ల అగ్నిని కోరినవాడు అరణిని మథించినట్లు, వృషపర్వునికూతురు పలికిన మహాఘోరమైన దుర్వచనాలు నా హృదయాన్ని మథిస్తున్నాయి.

న హ్యతో దుష్కరం మన్యే తాత! లోకేష్వపి త్రిషు ।
యః సపత్నశ్రియం దీప్తాం హీనశ్రీః పర్యుపాసతే ॥13॥

తన సిరి తరిగి పోగా శత్రుశ్రీని ఉపాసించి జీవిస్తున్నాడనే మాటకంటె దుష్టవచనం ముల్లోకాలలోనూ లేదని నా భావన.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే శుక్రదేవయానీసంవాదకథనం నామ అష్టావింశతితమోఽధ్యాయః॥28॥

శ్రీమత్స్య మహాపురాణంలోని యయాతిచరిత్రలో శుక్ర దేవయానీ సంవాద కథనమనే ఇరవైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనత్రింశత్తమోఽధ్యాయః - ఇరవైతొమ్మిదవ అధ్యాయం

శుక్రవృషపర్వసంవాదః - శుక్రవృషపర్వసంవాదం

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

తతః కావ్యో భృగుశ్రేష్ఠస్సమన్యురుపగమ్య హ ।
వృషపర్వాణమాసీనమిత్యువాచావిచారయన్ ॥1॥

తరువాత భృగుశ్రేష్ఠుడైన శుక్రుడు కోపంతో ఏమీ విచారించకుండా సింహాసనాసీనుడైన వృషపర్వుని వద్దకు పోయి ఇలా అన్నాడు-

నాధర్మశ్చరితో రాజన్ సద్యః ఫలతి గౌరివ ।
శనైరావర్త్యమానస్తు మూలాన్యపి నికృన్తతి ॥2॥

రాజా! ఆచరించిన అధర్మం భూమిలాగా వెంటనే ఫలించదు. మెల్లమెల్లగా మరల మరల చేసిన అధర్మం వ్రేళ్ళను గూడా పెకలించివేస్తుంది.

యది నాత్మని పుత్రేషు న చేత్పశ్యతి నప్తృషు ।
పాపమాచరితం కర్మ త్రివర్గమతివర్తతే ॥3॥

చేసిన పాపం తనలో, పుత్రులలో, మనుమలలో ఫలించకన్నా మూడు తరాలను దాటి తరువాతివారిలో ఫలిస్తుంది.

ఫలత్యేవ ధ్రువం పాపం గురుభుక్తమివోదరే ।
యదా ఘాతయసే విప్రం కచమాఙ్గిరసం తదా ॥4॥

అపాపశీలం ధర్మజ్ఞం శుశ్రూషుం మద్గృహే రతమ్ ।
వధాదనర్హతస్తస్య వధాచ్చ దుహితుర్మమ ॥5॥

వృషపర్వన్నిబోధ త్వం త్యక్ష్యామి త్వాం సబాన్ధవమ్ ।
స్థాతుం త్వద్విషయే రాజన్న శక్ష్యామి త్వయా సహ ॥6॥

మితి మించిన బరువైన తిండి ఉదరంలో కొంతసేపు తరువాత బాధావహమైనట్లే ఇది జరుగుతుంది. పాపరహితుడు, ధర్మజ్ఞుడు, సేవారతుడు, నా యింటనున్నవాడూ, ఆంగిరసుడూ అయిన కచుణ్ణి వధించినందుకు, నా పుత్రికను కొట్టినందుకు ఓ వృషపర్వా! నిన్ను నేను బంధు సహితంగా త్యజించనున్నానని తెలుసుకో. రాజా! నీ రాజ్యంలో ఇక నీతో సహా ఉండడం నా వల్ల కాదు.

అద్యైవమభిజానామి దైత్యం మిథ్యాప్రలాపినమ్ ।
యతస్త్వమాత్మనోదీర్ణాం దుహితాం కిముపేక్షసే ॥7॥

మిథ్యా ప్రతాపం చూపేవారు దైత్యులని నేడు గ్రహించాను. కాకపోతే నీవు నీ కుమార్తె దుశ్చేష్టలనెందుకు ఉపేక్షిస్తున్నావు?

వృషపర్వోవాచ :- వృషపర్వుడు చెప్పాడు.

నావద్యం న మృషావాదం త్వయి జానామి భార్గవ! ।
త్వయి సత్యం చ ధర్మం చ తత్ప్రసీదతు మాం భవాన్ ॥8॥

భార్గవా! మీరెప్పుడూ నింద్యమైన, అసత్యమైన మాటలు చెప్పినవారు కారు. మీలో సత్యం, ధర్మం ఎప్పుడూ వుంటాయి. నన్ను మీరు అనుగ్రహించండి!

అద్యాస్మానపహాయ త్వమితో యాస్యసి భార్గవ! ।
సముద్రం సంప్రవేక్ష్యామి నాన్యదస్తి పరాయణమ్ ॥9॥

భార్గవా! మీరు మమ్ము వీడి యిక్కడ నుండి వెళ్ళే పక్షంలో నేను సముద్రంలో ప్రవేశిస్తాను. నాకు మరో మార్గం లేదు.

శుక్ర ఉవాచ :- శుక్రుడు చెప్పాడు.

సముద్రం ప్రవిశధ్వం వా దిశో వా వ్రజతాసురాః ।
దుహితుర్నాప్రియం సోఢుం శక్తోఽహం దయితా హి మే ॥10॥

రాక్షసులు సముద్రంలోనైనా ప్రవేశించండి, దిక్కుల బట్టియైనా వెళ్ళండి. నేను నా కుమార్తెకు జరిగిన అప్రియం సహించలేను. ఆమె నాకు అత్యంతం ఇష్టురాలు.

ప్రసాద్యతాం దేవయానీ జీవితం యత్ర మే స్థితమ్ ।
యోగక్షేమకరస్తేఽహమిన్ద్రస్యేవ బృహస్పతిః ॥11॥

నా జీవితం ఆమె అధీనంలో వున్నది. నేను బృహస్పతి ఇంద్రునికి లాగా నీకు యోగక్షేమాలు కల్గించేవాణ్ణి. కాన దేవయానిని ప్రసన్నురాలిని కావించు.

వృషపర్వోవాచ :- వృషపర్వుడు చెప్పాడు.

యత్కిఞ్చిదసురేన్ద్రాణాం విద్యతే వసు భార్గవ! ।
భువి హస్తిరథాశ్వం వా తస్య త్వం మమ చేశ్వరః ॥12॥

భార్గవా! అసురేంద్రుల ఐశ్వర్యం ఏనుగులు, రథాలు, గుర్రాలు మున్నగువాటికీ, నాకూ నీవే అధిపతివి.

శుక్ర ఉవాచ :- శుక్రుడు చెప్పాడు.

యత్కిఞ్చిదస్తి ద్రవిణం దైత్యేన్ద్రాణాం మహాసుర! ।
తస్యేశ్వరోఽస్మి యద్యేతద్దేవయానీ ప్రసాద్యతామ్ ॥13॥

మహాసురా! నీవన్నట్లు దైత్య ప్రభువుల ఐశ్వర్యమంతా నా అధీనంలోనే వుంటే నా దేవయానికి సంతోషం కల్గించండి.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

తతస్తు త్వరితశ్శుక్రస్స రాజ్ఞా సమమాయయౌ ।
ఉవాచ చైనాం సుభగే ప్రతిపన్నం వచస్తవ ॥14॥

తరువాత శుక్రుడు రాజుతో సహా త్వర త్వరగా వెళ్ళి దేవయానిని చూచి "సుందరీ! నీవు చెప్పే మాట పాటించగలము" అని అన్నాడు.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

యది త్వమీశ్వరస్తాత రాజ్ఞో విత్తస్య భార్గవ ।
నాభిజానామి తత్తేఽహం రాజా వదతు మాం స్వయమ్ ॥15॥

భార్గవా! మీరు రాజధనానికి ప్రభువులని మీరంటే నాకు నమ్మకం లేదు. ఈ రాజే స్వయంగా ఆ మాట నాతో చెప్పాలి.

వృషపర్వోవాచ :- వృషపర్వుడు చెప్పాడు.

యం కామమభిజానాసి దేవయాని! శుచిస్మితే! ।
తత్తేఽహం సమ్ప్రదాస్యామి యద్యపి స్యాత్సుదుర్లభమ్ ॥16॥

శుచిస్మితవైన దేవయానీ! నీవు ఏది కోరుతావో, అది మిక్కిలి దుర్లభమైనా నీకు నేనిస్తాను.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

దాసీం కన్యాసహస్రేణ శర్మిష్ఠామభికామయే ।
అనుయాస్యతి మాం తత్ర యత్ర దాస్యతి మే పితా ॥17॥

నేను వేయిమంది కన్యలతో సహా శర్మిష్ఠ నాకు దాసిగా కావాలని కోరుతున్నాను. నన్ను నా తండ్రి ఎక్కడ ఇచ్చి వివాహం చేస్తాడో, అక్కడకామె నాతో గూడ దాసిగా రావాలి.

వృషపర్వోవాచ :- వృషపర్వుడు చెప్పాడు.

ఉత్తిష్ఠ ధాత్రి గచ్ఛ త్వం శర్మిష్ఠాం శీఘ్రమానయ ।
యం చ కామయతే కామం దేవయానీ కరోతు తమ్ ॥18॥

అప్పుడు చెంతనే ఉన్న ధాత్రితో రాజు "ధాత్రీ! లెమ్ము. నీవు పోయి శర్మిష్ఠ నిక్కడికి పిలుచుకొనిరా. దేవయాని ఏది కోరుతున్నదో అది ఆమె నెరవేర్చనీ!

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

తతో ధాత్రీ తత్ర గత్వా శర్మిష్ఠామిదమబ్రవీత్ ।
ఉత్తిష్ఠ భద్రే శర్మిష్ఠే జ్ఞాతీనాం సుఖమావహ ॥19॥

ఆపై ధాత్రి శర్మిష్ఠ చెంతకు వెళ్ళి ఇలా అన్నది. "భద్రా! శర్మిష్ఠా! లెమ్ము. బంధువులకు సుఖం కలిగించు".

త్యజతి బ్రాహ్మణశ్శిష్యాన్దేవయాన్యా ప్రచోదితః ।
యం సా కామయతే కామం స కార్యోఽ త్ర త్వయాఽ నఘే ।
దాసీత్వమభిజానాసి దేవయాన్యా స్సుశోభనే ॥20॥

ఆ బ్రాహ్మణుడు దేవయాని ప్రేరణతో శిష్యులను విడిచిపెట్టాలనుకొంటున్నాడు. అనఘా! ఆమె ఏ కోరిక కోరుతున్నదో, దాన్ని నీవు తీర్చాలి. నీవు దేవయానికి దాసిగా ప్రకటించబడినావు.

శర్మిష్ఠోవాచ :- శర్మిష్ఠ చెప్పింది.

యం చ కామయతే కామం కరవాణ్యహమద్య తామ్ ।
మా గాన్మన్యువశం శుక్రో దేవయానీ చ మత్కృతే ॥21॥

దేవయాని కోరికను నేను నెరవేరుస్తాను. శుక్రుడు, దేవయాని నా వల్ల కోపగించకుందురు గాక!

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

తతః కన్యాసహస్రేణ వృతా శిబికయా తదా ।
పితుర్నిదేశాత్త్వరితా నిశ్చక్రామ పురోత్తమాత్ ॥22॥

తదుపరి శర్మిష్ఠ తండ్రిమాట మేరకు వెయ్యి మంది కన్యలతో సహా పల్లకి నెక్కి త్వరగా నగరంనుండి బయలుదేరి దేవయాని వద్దకు వెళ్ళింది.

శర్మిష్ఠోవాచ :- శర్మిష్ఠ చెప్పింది.

అహం కన్యాసహస్రేణ దాసీభిః పరివారితా ।
ధ్రువం త్వాం తత్ర యాస్యామి యత్ర దాస్యతి తే పితా ॥23॥

నేను కన్యాసహస్రంతో సహా నీకు పరిచారిక నయ్యాను. నీ తండ్రి నిన్నెవరి కిస్తాడో, అక్కడికి నేను తప్పక వస్తాను.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

స్తువతో దుహితా చాహం యాచతః ప్రతిగృహ్ణతః ।
స్తూయమానస్య దుహితా కథం దాసీ భవిష్యసి ॥24॥

నేను స్తుతించి యాచించి ప్రతిగ్రహం చేసేవాని పుత్రికను, నీవు స్తుతింపబడే రాజు కూతురిని. నాకెలా నీవు దాసివి కాగలవు?

శర్మిష్ఠోవాచ :- శర్మిష్ఠ చెప్పింది.

యేన కేనచిదార్తానాం జ్ఞాతీనాం సుఖమావహేత్ ।
అనుయాస్యామ్యహం తత్ర యత్ర దాస్యతి తే పితా ॥25॥

ఎట్లైనా ఆర్తులైన బంధువులకు సుఖం కలిగించాలి. నేను నిన్ను నీ తండ్రి యిచ్చిన చోటికి తప్పక నీ వెంట రాగలను.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

ప్రతిశ్రుతే దాసభావే దుహిత్రా వృషపర్వణః ।
దేవయానీ నరశ్రేష్ఠ పితరం వాక్యమబ్రవీత్ ॥26॥

వృషపర్వుని పుత్రిక ఆ రీతిగా దాస్యం అంగీకరించే సరికి దేవయాని తండ్రితో ఇలా చెప్పింది.

ప్రవిశామి పురం తాత! హృష్టాఽస్మి ద్విజసత్తమ! ।
అమోఘం తవ విజ్ఞానమస్తి విద్యాబలం చ తే ॥27॥

'నాన్నా! ఇప్పుడు నగరం ప్రవేశిస్తాను. ద్విజోత్తమా! సంతోషించాను. నీ విజ్ఞానం విద్యాబలం అమోఘమైనవి.

ఏవముక్తో ద్విజశ్రేష్ఠో దుహిత్రా సుమహాయశాః ।
ప్రవివేశ పురం హృష్టం పూజిత స్సర్వదానవైః ॥28॥

కీర్తిమంతుడైన శుక్రుడు అలా పుత్రిక చెప్పేసరికి దానవులందరూ తన్ను పూజిస్తుండగా నగర ప్రవేశం కావించాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే శుక్రవృషపర్వసంవాదో నామ ఏకోనత్రింశోఽధ్యాయః ॥ 29 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని యయాతి చరిత్రలో శుక్ర వృషపర్వ సంవాదమనే
ఇరవై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

త్రింశోఽధ్యాయః - ముప్పైయవ అధ్యాయం
దేవయానీవనవిహారః - దేవయాని వనవిహారం

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

అథ దీర్ఘేణ కాలేన తస్మిన్నేవ నృపోత్తమ ।
వనం తదేవ నిర్యాతా క్రీడార్థం వరవర్ణినీ ॥1॥

రాజవర్యా! ఆపై బహుకాలం గడచిన పిదప వరవర్ణినియైన దేవయాని క్రీడించుటకై ఆ అడవికే వెళ్ళింది.

తేన దాసీసహస్రేణ సార్ధం శర్మిష్ఠయా తదా ।
తమేవ దేశం సమ్ప్రాప్తా యథాకామం చచార సా ॥2॥

దాసీ సహస్రంతోనూ, శర్మిష్ఠతోనూ అక్కడికే వెళ్ళి యథేచ్ఛగా విహరించింది.

తాభిస్సఖీభిస్సహితా సర్వాభిర్ముదితా భృశమ్ ।
క్రీడన్త్యోఽభిరతాస్సర్వాః పిబన్త్యో మధు మాధవమ్ ॥3॥

అక్కడ అందరు చెలికత్తెలూ కూడి సంతోషంతో ఆడుతూ, మధుపానం చేస్తూ ఆనందంతో విహరించారు.

ఖాదన్త్యో వివిధాన్భక్ష్యాన్ ఫలాని వివిధాని చ ।
పునశ్చ నాహుషో రాజా మృగలిప్సుర్యదృచ్ఛయా ॥4॥

తమేవ దేశం సమ్ప్రాప్తో జలలిప్సుః స కర్శితః ।
దదర్శ దేవయానీం చ శర్మిష్ఠాం తాశ్చ యోషితః ॥5॥

నానాభక్ష్యాలు, వివిధ ఫలాలు ఆరగిస్తూ వారు క్రీడించారు. మరల నహుషుని పుత్రుడగు యయాతి వేటాడుతూ అలసి నీటికోసం తలవని తలంపుగా ఆ చోటికే వచ్చాడు. అతడక్కడ దేవయానినీ, శర్మిష్ఠనూ, ఆ వనితలనూ చూచాడు.

పిబన్త్యో లలనాస్తాశ్చ దివ్యాభరణభూషితాః ।
ఉపవిష్టాం చ దదృశే దేవయానీం శుచిస్మితామ్ ॥6॥

దివ్యాభరణాలు దాల్చి మధుపానం చేస్తున్న ఆ వనితలనూ, శుచిస్మితయై కూర్చొని వున్న దేవయానినీ విలోకించాడు.

రూపేణాప్రతిమాం తాసాం స్త్రీణాం మధ్యే వరాఙ్గనామ్ ।
శర్మిష్ఠయా సేవ్యమానాం పాదసంవాహనాదిభిః ॥7॥

అందంలో పోటీలేనిదై ఆ స్త్రీల మధ్యనున్న ఆ వరాంగన శర్మిష్ఠ పాదసంవాహనాదులతో తన్ను సేవిస్తుండగా అక్కడ ఉన్నది.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

ద్వాభ్యాం కన్యాసహస్రాభ్యాం ద్వే కన్యే పరివారితే ।
గోత్రే చ నామనీ చైవ ద్వయోః పృచ్ఛామ్యతో హ్యహమ్ ॥8॥

ఇద్దరు కన్యలు రెండు వేల కన్యకలతో గూడి యున్నారు. మీ యిద్దరి గోత్ర నామాలనూ నేనడుగుతున్నాను.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

ఆఖ్యాస్యామ్యనుమోదస్వ వచనం మే నరాధిప!
శుక్రో నాగాసురగురుస్సుతాం జానీహి తస్య మామ్ ॥9॥

రాజవర్యా! నేను చెబుతాను విను. నాగాసురుల గురువు శుక్రాచార్యుడు. నేనతని పుత్రికను.

ఇయం చ మే సఖీ దాసీ యత్రాహం తత్ర గామినీ ।
దుహితా దానవేన్ద్రస్య శర్మిష్ఠా వృషపర్వణః ॥10॥

ఈమె నా దాసి, నేనెక్కడికి వెళ్ళినా నా వెంటనే వస్తుంది. ఈ దానవాధిపుడైన వృషపర్వుని పుత్రిక శర్మిష్ఠ.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

కథం ను తే సఖీ దాసీ కన్యేయం వరవర్ణినీ ।
అసురేన్ద్రసుతా సుభ్రూః పరం కౌతూహలం హి మే ॥11॥

ఈమె అసురేంద్రుని పుత్రిక, సౌందర్యవతియైన ఈ వరవర్ణిని నీకెలా దాసి అయింది? నాకు వినాలని కుతూహలంగా ఉన్నది చెప్పు.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

సర్వమేవ నరవ్యాఘ్ర విధానమనువర్తతే ।
విధినా విహితం జ్ఞాత్వా మా విచిత్రం మనః కృథాః ॥12॥

నరశ్రేష్ఠా! అంతా విధి ననుసరించి జరుగుతుంది. విధివిహితాన్ని గ్రహించి ఆశ్చర్యపడవద్దు.

రాజవద్రూపవేషౌ తే బ్రాహ్మీం వాచం బిభర్షి చ ।
కిం నామా త్వం కుతశ్చాసి కస్య పుత్రోఽసి శంస మే ॥13॥

నీ రూపవేషాలు రాజులాగా ఉన్నాయి. చక్కని సంస్కృత వాక్కుతో మాట్లాడుతున్నావు. నీ పేరేమి? ఎక్కడనుండి వచ్చావు? ఎవరి సుతుడవో నాకు చెప్పు.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

బ్రహ్మచర్యేణ వేదో మే కృత్స్నః శ్రుతిపథం గతః ।
రాజాఽహం రాజపుత్రశ్చ యయాతిరితి విశ్రుతః ॥14॥

నేను బ్రహ్మచర్యం పాటించి వేదమంతా అభ్యసించాను. నేను రాజ పుత్రుడను, రాజును. నా పేరు యయాతి.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

కేన చార్థేన నృపతే! హ్యేనం దేశం సమాగతః ।
జిఘృక్షుర్వారి యత్కిఞ్చిదథవా మృగలిప్సయా ॥15॥

రాజా! ఏ పనిగా ఈ ప్రదేశానికి వచ్చావు? నీటి కోసమా? లేక మృగం కోసమా?

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

మృగలిప్సురహం భద్రే పానీయార్థమిహాగతః ।
బహుధాఽప్యనుయుక్తోఽస్మి తదనుజ్ఞాతుమర్హసి ॥16॥

నేను మృగార్థమై వచ్చి నీటి కొరకై ఇక్కడికి వచ్చాను. నీవడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాను. ఇక నేను వెళ్లి వస్తాను. అనుజ్ఞ యిమ్ము.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

ద్వాభ్యాం కన్యాసహస్రాభ్యాం దాస్యా శర్మిష్ఠయా సహ ।
త్వదధీనాఽస్మి భద్రం తే సఖా భర్తా చ మే భవ ॥17॥

రెండు వేల మంది కన్యలతోనూ, శర్మిష్ఠతోనూ గూడిన నేను నీకు అధీనురాల నయ్యాను. నీకు శుభమగుగాక! నాకు నీవు భర్తవు గమ్ము!

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

విద్ధ్యౌశనసి! భద్రం తే న త్వదర్హోఽస్మి భామిని! ।
అవివాహ్యాః స్మ రాజానో దేవయాని! పితుస్తవ ॥18॥

శుక్రాచార్యుని పుత్రీ! నీకు శుభమగుగాక! నేను నీకు తగను. ఇది తెలుసుకో. నీ తండ్రికి క్షత్రియులు అవివాహ్యులు (అల్లురు కాదగనివారు) కారు.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

సంసృష్టం బ్రహ్మణా క్షత్రం క్షత్రం బ్రహ్మణి సంశ్రితమ్ ।
ఋషిశ్చ ఋషిపుత్రశ్చ నాహుషాద్య భజస్వ మామ్ ॥19॥

నహుషపుత్రా! బ్రహ్మచే క్షత్రం సృష్టించబడింది. క్షత్రం బ్రహ్మము నాశ్రయించి ఉన్నది. నీవు ఋషివి, ఋషి పుత్రుడవు. కాన ఈ దినమే నన్ను పరిగ్రహించు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

ఏకదేహోద్భవా వర్ణాశ్చత్వారోఽపి వరాననే ।
పృథగ్ధర్మాః పృథక్శౌచాస్తేషాం వై బ్రాహ్మణో వరః ॥20॥

వరాననా! నాలుగు వర్ణాలూ ఒకే చోట పుట్టాయి. కాని వారి వారి ధర్మాలు, శౌచాలు వేరువేరుగా ఉన్నాయి. వారిలో బ్రాహ్మణుడు శ్రేష్ఠుడు.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

పాణిగ్రహో నాహుషాయం న పుమ్భిస్సేవితః పురా ।
త్వం పాణిమగ్రహీదగ్రే వృణోమి త్వామహం తతః ॥21॥

నాహుషా! పాణిగ్రహణం స్త్రీల ధర్మం. పురుషు లెవరూ ఇంతకు ముందు నా పాణిని గ్రహించలేదు. మొదట నీవే నా పాణిని గ్రహించావు. అందుకే నిన్ను నేను వరిస్తున్నాను.

కథం తు మే మనస్విన్యాః పాణిమన్యః పుమాన్స్పృశేత్ ।
గృహీతమృషిపుత్రేణ స్వయం వాఽప్యృషిణా త్వయా ॥22॥

మనస్విని యైన నా పాణిని మరొకడెలా స్పృశించగలడు? ఋషి పుత్రుడవు, స్వయంగా ఋషివీ అయిన నీవు గ్రహించిన పాణి గదా యిది!

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

క్రుద్ధాదాశీవిషాత్సర్పాజ్జ్వలనాత్సర్వతోముఖాత్ ।
దురాధర్షతరో విప్రః పురుషేణ విజానతా ॥23॥

విజ్ఞుడైనవాడు కోపించిన పాముకంటె, సర్వతోముఖమైన అగ్నికంటె విప్రుడు దారుణమైనవాడని గ్రహించాలి.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

కథమాశీవిషాత్సర్పాజ్జ్వలనాత్సర్వతోముఖాత్ ।
దురాధర్షతరో విప్ర ఇత్యర్థే పురుషర్షభ ॥24॥

పురుషశ్రేష్ఠా! విషోదగ్రమైన సర్పంకంటె, సర్వతోముఖమైన అనలంకంటె విప్రుడు దారుణమైనవాడని ఎలా చెప్పగలుగుతున్నావు?

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

దశేదాశీవిషస్త్వేకం శస్త్రేణైకశ్చ వధ్యతే ।
హన్తి విప్రస్సరాష్ట్రాణి పురాణ్యపి హి కోపితః ॥25॥

పాము ఒక్కణ్ణే కరుస్తుంది. శస్త్రంతో ఒక్కణ్ణి చంపవచ్చు. కాని కోపించిన విప్రుడు రాష్ట్రాలతో సహా పట్టణాలను కాల్చివేస్తాడు.

దురాధర్షతరో విప్రస్తస్మాద్భీరు మతో మమ ।
అతోఽదత్తాం చ పిత్రా త్వాం భద్రే న వివహామ్యహమ్ ॥26॥

భీరూ! ఈ కారణంగానే విప్రుణ్ణి దారుణమైనవాడని నేను భావిస్తున్నాను. అందువల్ల మీ తండ్రి సమ్మతించి ఇవ్వకపోతే నేను నిన్ను వివాహం చేసుకోను.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

దత్తాం వహస్వ పిత్రా మాం త్వం హి రాజన్వృతో మయా ।
అయాచతో భయం నాస్తి దత్తాం చ ప్రతిగృహ్ణతః ॥27॥

రాజా! నేను నిన్ను వరించాను. తండ్రి ఇస్తే నన్ను వరించు. తాను యాచించకుండా ఇచ్చిన వస్తువును గ్రహించేవానికి భయం లేదు.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

త్వరితం దేవయాన్యాఽథ ప్రేషితా పితురాశ్రమమ్ ।
సర్వం నివేదయామాస ధాత్రీ తస్మై యథాతథమ్ ॥28॥

పిదప త్వరగా దేవయాని ధాత్రిని తండ్రి చెంతకు పంపింది. ఆమె పోయి అతనికి జరిగినది జరిగినట్లు వివరించింది.

శ్రుత్వైవ చ స రాజానం దర్శయామాస భార్గవః ।
దృష్ట్వైవమాగతం విప్రం యయాతిః పృథివీపతిః ॥29॥
వవన్దే బ్రాహ్మణం కావ్యం ప్రాఞ్జలిః ప్రణతస్థితః ।
తం చాప్యభ్యవదత్కావ్యస్సామ్నా పరమవల్గునా ॥30॥

అది విన్నంతనే భార్గవుడు రాజును చూడాలని వచ్చాడు. రాజైన యయాతి అలా వచ్చిన ఆ విప్రుణ్ణి చూచి అతనికి ప్రణతుడై ప్రాంజలియై నిలిచాడు. శుక్రుడు మధురవచనాలతో అతణ్ణి ఆశ్వాసింప జేశాడు.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

రాజాఽయం నాహుషస్తాత దుర్గమే పాణిమగ్రహీత్ ।
నమస్తే దేహి మామస్మై లోకే నాన్యం పతిం వృణే ॥31॥

నాన్నా! ఈ రాజు నహుషుని పుత్రుడు. అరణ్యంలో నా చేయి పట్టుకొన్నాడు. నీకు నమస్కారం, నన్నితని కిమ్ము. లోకంలో మరొక పతిని వరించను.

శుక్ర ఉవాచ :- శుక్రుడు చెప్పాడు.

వృతోఽనయా పతిర్వీర సుతయా త్వం మమేష్టయా ।
గృహాణేమాం మయా దత్తాం మహిషీం నహుషాత్మజ! ॥32॥

వీరా! నా కిష్టురాలగు ఈ పుత్రిక నిన్ను వరించింది. నహుషపుత్రా! నేనీమెను నీకిస్తున్నాను. మహిషిగా పరిగ్రహించు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

అధర్మో మాం స్పృశేదేవం పాపమస్యాశ్చ భార్గవ ।
వర్ణసఙ్కరతో బ్రహ్మన్నితి త్వాం ప్రావృణోమ్యహమ్ ॥33॥

భార్గవా! అలా జరిగితే నేను అధార్మికుడ నవుతాను. ఈమెకు పాపమంటుతుంది. ఇది వర్ణసాంకర్యమని నిన్ను నేను ప్రార్థిస్తున్నాను. ఈ దోషమంటకుండా వరం ప్రసాదించు.

శుక్ర ఉవాచ :- శుక్రుడు చెప్పాడు.

అధర్మాత్త్వాం విముంచామి వరం వరయ చేప్సితమ్ ।
అస్మిన్వివాహే త్వం శ్లాఘ్యో రహః పాపం తుదామి తే ॥34॥

వహస్వ భార్యాం ధర్మేణ దేవయానీం శుచిస్మితామ్ ।
అనయా సహ సమ్ప్రీతిమతులాం సమవాప్నుహి ॥35॥

“నేను నిన్ను అధర్మంనుండి తప్పిస్తున్నాను. నీకిష్టమైన వరం కోరుకో. ఈ వివాహంతో నీవు కీర్తనీయుడవవుతావు. నేను నీ పాపాన్ని తొలగిస్తున్నాను. శుచిస్మితయైన దేవయానిని ధర్మబద్ధమైన పత్నిగా పరిగ్రహించు. ఈమెతో గూడి సాటిలేని ప్రీతిపొంది సుఖించు.

ఇయం చాపి కుమారీ తే శర్మిష్ఠా వార్షపర్వణీ ।
సమ్పూజ్యా సతతం రాజన్న చైనాం శయనే హ్వయ ॥36॥

వృషపర్వుని పుత్రికయగు ఈ కుమారి శర్మిష్ఠ గూడా నీకు సదా గౌరవింపదగియున్నది. కాని ఈమెతో నీవు శయనించవద్దు.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

ఏవముక్తో యయాతిస్తు శుక్రం కృత్వా ప్రదక్షిణమ్ ।
జగామ స్వపురం హృష్టస్సోఽనుజ్ఞాతో మహాత్మనా ॥37॥

ఇలా శుక్రుడు చెప్పేసరికి యయాతి ఆయనకు ప్రదక్షిణ నమస్కారం చేశాడు. ఆ మహాత్ముని అనుమతితో తన నగరానికి పయన మయ్యాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే దేవయానీవనవిహారో నామ త్రింశోఽధ్యాయః ॥ 30 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని యయాతి చరిత్రలో దేవయాని వనవిహారమనే ముప్పైయవఅధ్యాయం సంపూర్ణం

ఏకత్రింశత్తమోఽధ్యాయః - ముప్పైఒకటవ అధ్యాయం

శర్మిష్ఠాయయాతిసంవాదః - శర్మిష్ఠయయాతి సంవాదం

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

యయాతిస్స్వపురం ప్రాప్య మహేన్ద్రపురసన్నిభమ్ ।
ప్రవిశ్యాన్తఃపురం తత్ర దేవయానీం న్యవేశయత్ ॥1॥

యయాతి అమరావతి నగరంవంటి తన నగరానికి వెళ్ళాడు. అక్కడ అంతఃపురంలో దేవయానిని నిలిపాడు.

దేవయాన్యాశ్చానుమతే సుతాం తాం వృషపర్వణః ।
అశోకవనికాభ్యాశే గృహం కృత్వా న్యవేశయత్ ॥2॥

ఆమె అనుమతితో అశోకవనికా సమీపంలో గృహం నిర్మించి శర్మిష్ఠనందులో నివసింప జేశాడు.

వృతాం దాసీసహస్రేణ శర్మిష్ఠామాసురాయణీమ్ ।
వాసోభిరన్నపానైశ్చ సంవిభజ్య సుసంవృతామ్ ॥3॥

వెయ్యిమంది దాసీజనంతో సహా అసురరాజ పుత్రికకు వస్త్రాలు, అన్నపానాదుల ఏర్పాట్లు ప్రత్యేకంగా చేశాడు.

దేవయాన్యా తు సహితస్స నృపో నహుషాత్మజః ।
విజహార బహూనబ్దాన్దేవవన్ముదితో భృశమ్ ॥4॥

నహుషుని కుమారుడగు ఆ యయాతి దేవయానితో గూడి సంతోషంతో అనేక సంవత్సరాలు దేవతవలె గడిపాడు.

ఋతుకాలే తు సమ్ప్రాప్తే దేవయానీ వరాఙ్గనా ।
లేభే గర్భం ప్రథమతః కుమారం చ వ్యజాయత ॥5॥

శ్రేష్ఠవనితయైన దేవయాని ఋతుకాలం వచ్చేసరికి గర్భం ధరించింది. ఆమె మొదటి గర్భంలో కుమారుడు జన్మించాడు.

గతే వర్షసహస్రే తు శర్మిష్ఠా వార్షపర్వణీ ।
దదర్శ యౌవనం ప్రాప్తా ఋతుం సా కమలేక్షణా ॥6॥

అలా వెయ్యి సంవత్సరాలు గడచిపోగా పద్మనేత్ర యగు వృషపర్వుని పుత్రి శర్మిష్ఠ యౌవనం పొంది ఋతుమతి అయింది.

చిన్తయామాస ధర్మజ్ఞా ఋతౌ ప్రాప్తే చ భామినీ ।
ఋతుకాలశ్చ సమ్ప్రాప్తో న చ కశ్చిత్పతిర్వృతః ॥7॥

ఋతు ప్రాప్తి కావడంతో ధర్మజ్ఞురాలైన ఆమె ఇలా చింతించింది- నాకు ఋతుకాలం వచ్చింది. నేను పతిని వరించలేదు.

కిం ప్రాప్తం కిఞ్చ కర్తవ్యం కథం కృత్వా సుఖం భవేత్ ।
దేవయానీ ప్రసూతాఽసౌ వృథాఽహం ప్రాప్తయౌవనా ॥8॥

నా పరిస్థితి 'ఏమిటి'? నేనేమి చేసేది? ఎలా చేస్తే నాకు సుఖం కల్గుతుంది దేవయానికి పుత్రోదయ మయింది. నేను వ్యర్థంగా యౌవనవతి నయ్యాను.

యథా తయా వృతో భర్తా తథైవాహం వృణోమి తమ్ ।
రాజ్ఞా పుత్రఫలం దేయమితి మే నిశ్చితా మతిః ।
అపీదానీం స ధర్మాత్మా రహో మే దర్శనం వ్రజేత్ ॥9॥

ఆమె రాజును భర్తగా వరించినట్లే నేను గూడా అతణ్ణి వరిస్తాను. రాజునుండి పుత్రఫలం పొందాలని నా మనస్సులో నిశ్చయించుకొన్నాను. ఆ ధర్మాత్ముడు ఏకాంతంలో ఇపుడు నాకు కనిపిస్తాడా!"

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

అథ నిష్క్రమ్య రాజాఽసౌ తస్మిన్కాలే యదృచ్ఛయా ।
అశోకవనికాభ్యాశే శర్మిష్ఠాం ప్రాప్య విస్మితః ॥10॥

అంతట రాజు ఆ సమయంలో యాదృచ్ఛికంగా రాచనగరి నుండి వెలికి వచ్చి అశోకవనికా సమీపంలో శర్మిష్ఠను చూచి ఆశ్చర్యానికి లోనయ్యాడు.

తమేకం రహసి దృష్ట్వా శర్మిష్ఠా చారుహాసినీ ।
ప్రత్యుద్గమ్యాఞ్జలిం కృత్వా రాజానం వాక్యమబ్రవీత్ ॥11॥

అందమైన చిరునవ్వుగల శర్మిష్ఠ ఏకాంతంలో ఆ నరపతిని చూచి ముందుకు నడచి అంజలి గావించి రాజుతో ఇలా విన్నవించింది.

శర్మిష్ఠోవాచ :- శర్మిష్ఠ చెప్పింది.

సోమశ్చేన్ద్రశ్చ వాయుశ్చ యమశ్చ వరుణశ్చ వా ।
తవ వా నాహుష గృహే కః స్త్రియం ద్రష్టుమర్హతి ॥12॥

నహుష పుత్రా! చంద్రుడైనా, ఇంద్రుడైనా, వాయువైనా, యముడైనా, వరణుడైనా సరే ఎవరు నీ గృహంలోని స్త్రీని కన్నెత్తి చూడగలరు?

రూపాభిజనశీలైర్హి త్వం రాజన్వేత్థ మాం సదా ।
సా త్వాం యాచే ప్రసాద్యేహ రన్తుమేహి నరాధిప! ॥13॥

రాజా! నా రూపం, కులం, శీలం నీకు తెలియనివి కావు. నరాధిపా! నేను నిన్ను ప్రార్థిస్తున్నాను. నన్ను అనుగ్రహించి, నాతో రమించు.

యయాతిరువాచ :-యయాతి చెప్పాడు.

వేద్మి త్వాం శీలసమ్పన్నాం దైత్యకన్యామనిన్దితామ్ ।
రూపం తు తే న పశ్యామి సూచ్యగ్రమపి నిన్దితమ్ ॥14॥

దైత్యకన్యవగు నిన్ను మచ్చలేని శీలవతినిగా నేనెరుగుదును.. నీ రూపంలో సూది మొన మోపినంత కళంకం లేదు.

మామబ్రవీత్తదా శుక్రో దేవయానీం యదాఽవహమ్ ।
నేయమాహ్వాయితవ్యా తే శయనే వార్షపర్వణీ ॥15॥

నేను దేవయానిని చేపట్టినపుడు శుక్రాచార్యుడు ఈ వృషపర్వుని పుత్రికను శయనానికి ఆహ్వానించరాదు" అని చెప్పియున్నాడు.

శర్మిష్ఠోవాచ :- శర్మిష్ఠ చెప్పింది.

న నర్మయుక్తం వచనం హినస్తి న స్త్రీషు రాజన్న వివాహకాలే ।
ప్రాణాత్యయే సర్వధనాపహారే పఞ్చానృతాన్యాహురపాతకాని ॥16॥

రాజా! హాస్యవచనం బాధకం కాదు. స్త్రీల విషయంలోనూ, వివాహకాలంలోనూ, ప్రాణాపాయ సమయంలోనూ, ఉన్న విత్తమంతా నశించిపోయేటప్పుడునూ, ఈ అయిదు సందర్భాలలో చెప్పే అసత్యాలు పాపాలు కావు.

పృష్టాస్తు సాక్ష్యే ప్రవదన్తి చాఽన్యథా భవన్తి మిథ్యావచనా నరేన్ద్ర తే ।
ఏకార్థతాయాం తు సమాహితాయాం మిథ్యావదన్తం హ్యనృతం హినస్తి ॥17॥

నరేంద్రా! సాక్ష్యమడిగినపుడు అబద్ధమాడేవారు అసత్యవచను లవుతారు. ఒకే ప్రయోజనం సమాహితమైనప్పుడు అసత్యమాడే వాణ్ణి అనృతం బాధిస్తుంది.

యయాతిరువాచ:-యయాతి చెప్పాడు.

రాజా ప్రమాణం భూతానాం స వినశ్యేన్మృషా వదన్ ।
అర్థకృచ్ఛ్రమనుప్రాప్య న మిథ్యా కర్తుముత్సహే ॥18॥

ప్రజలకు రాజే ప్రమాణం. అసత్యం పలికే రాజు నశిస్తాదు. కాబట్టి క్లిష్ట పరిస్థితులలో సైతం నేను దారి దప్పి నడవ నుత్సహించను.

శర్మిష్ఠోవాచ :– శర్మిష్ఠ చెప్పింది.

సమావేతౌ మతౌ రాజన్పతి స్సఖ్యాశ్చ యః పతిః ।
సమం వివాహ ఇత్యాహు స్సఖ్యా మేఽసి పతిర్యతః ॥19॥

రాజా! ఒక స్త్రీ యొక్క భర్త, ఆమె చెలికత్తె భర్త, ఈ యిరువురూ సమానమైనవారే. నా సఖికి నీవు పతివి కాబట్టి నాకూ పతివే.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

దాతవ్యం యాచమానస్య ఇతి మే వ్రతమాహితమ్ ।
త్వం చ యాచసి కామం మాం బ్రూహి కిం కరవాణి తే ॥20॥

అర్థించేవారికి దానం చేయాలనేది నా వ్రతం. నీవు నన్ను యాచిస్తున్నావు. నేను నీకు ఏమి చేయాలో చెప్పు.

శర్మిష్ఠోవాచ:– శర్మిష్ఠ చెప్పింది.

అధర్మాత్రాహి మాం రాజన్ధర్మం చ ప్రతిపాదయ ।
త్వత్తోఽపత్యవతీ లోకే చరేయం ధర్మముత్తమమ్ ॥21॥

రాజా! అధర్మం నుండి నన్ను రక్షించు. నాకు ధర్మం ప్రసాదించు. నీవల్ల సంతానవతినై లోకంలో ఉత్తమ ధర్మం పాటించేదాని నవుతాను.

త్రయ ఏవాధనా రాజన్భార్యా దాసస్తథా సుతః ।
యత్తే సమధిగచ్ఛన్తి యస్య తే తస్య తద్ధనమ్ ॥22॥

రాజా! భార్య, దాసుడు, కుమారుడు– వీరు ముగ్గురే నిర్ధనులు. ఎందుకంటే వారు ఏ ధనాన్ని పొందుతారో, ఆ ధనం వారి యజమానులకే చెందుతుంది. అనగా భార్యాధనం భర్తకూ, దాసుని ధనం యజమానునికీ, పుత్రుని ధనం తండ్రికీ చెందుతుంది.

దేవయాన్యా భుజిష్యాఽస్మి వశ్యా చ తవ భార్గవీ ।
సా చాహం తు త్వయా రాజన్భరణీయా భజస్వ మామ్ ॥23॥

నేను దేవయానికి దాసిని. దేవయాని నీకు భార్య. అదే నేనూ, భార్గవీ ఇరువురమూ నీవారమే. అందువల్ల నీవు నన్ను అంగీకరించు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

ఏవముక్తస్తయా రాజా తథ్యమిత్యభిజజ్ఞివాన్ ।
పూజయామాస శర్మిష్ఠాం ధర్మం చ ప్రతిపాదయన్ ॥24॥

రాజు ఆమె చెప్పిన మాటలను అంగీకరించాడు. అట్లే అని ఆమెను గౌరవించి ధర్మప్రదానం చేశాడు.

స సమాగమ్య శర్మిష్ఠాం యథాకామమవాప్య చ ।
అన్యోన్యం చాభిసమ్పూజ్య జగ్మతుస్తౌ యథాగతమ్ ॥25॥

అతడు శర్మిష్ఠతో కూడి ఇష్టకామం అనుభవించాడు. వారు అలా ఒకరినొకరు సంభావించుకొని వారి వారి నెలవులు చేరుకొన్నారు.

తస్మిన్సమాగమే సుభ్రూశ్శర్మిష్ఠా వార్షపర్వణీ ।
లేభే గర్భం ప్రథమతస్తస్మాచ్చ నృపసత్తమాత్ ॥26॥

ప్రజజ్ఞే చ తతః కాలే రాజ్ఞీ రాజీవలోచనా ।
కుమారం దేవగర్భాభమాదిత్యసమతేజసమ్ ॥27॥

రాజుతోడి ఆ కలయికతో వృషపర్వుని కుమార్తె అయిన శర్మిష్ఠ గర్భవతి అయింది. కాలక్రమంలో ఆ పద్మనయన సూర్యతేజుడూ, దేవసముడైన కుమారుణ్ణి ప్రసవించింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే శర్మిష్ఠాయయాతి సంవాదో నామ ఏకత్రింశోఽధ్యాయః ॥31॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని యయాతి చరిత్రలో శర్మిష్ఠ యయాతి సంవాదమనే
ముప్పైఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్వాత్రింశోఽధ్యాయః - ముప్పైరెండవ అధ్యాయం

శర్మిష్ఠాదేవయాన్యోః పుత్రవిషయకసంల్లాపః - శర్మిష్ఠదేవయానుల పుత్రవిషయకమైన సంల్లాపం.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

శ్రుత్వా కుమారం జాతం సా దేవయానీ శుచిస్మితా ।
చిన్తయామాస దుఃఖార్తా శర్మిష్ఠాం ప్రతి భారత! ॥1॥

భారతా! శర్మిష్ఠకు కుమారుడు కలిగాడని విని శుచిస్మితయైన దేవయాని ఆమె విషయంలో చింతకు లోనై దుఃఖార్తురా లయింది.

తతోఽభిగమ్య శర్మిష్ఠాం దేవయాన్యబ్రవీదిదమ్ ।
కిమర్థం వృజినం సుభ్రూః కృతం తే కామలుబ్ధయా ॥2॥

అంతట ఆమె శర్మిష్ఠ చెంతకు వెళ్ళి ఇలా అన్నది- అందమైన కనుబొమ్మలు గల ఓ శర్మిష్ఠా! కామలోభంతో ఎందుకు పాపం చేశావు?

శర్మిష్ఠోవాచ :- శర్మిష్ఠ చెప్పింది.

ఋషిరభ్యాగతః కశ్చిద్ధర్మాత్మా వేదపారగః ।
స మయా తు వరః కామం యాచితో ధర్మసంహితమ్ ॥3॥

దేవయానీ! ధర్మాత్ముడు, వేద పారంగతుడూ అయిన ఒక ఋషి వచ్చాడు. ధర్మబద్ధంగా ఆయనను నేనొక వరమడిగాను.

నాహమన్యాయతః కామమాచరామి శుచిస్మితే! ।
తస్మాదృషేర్మమాపత్యమితి సత్యం బ్రవీమి తే ॥4॥

శుచిస్మితా! నేను అన్యాయంగా దుర్వృత్తికి పాల్పడలేదు. ఆ ఋషివల్లనే నాకీబిడ్డ కలిగాడు. నేను నీతో నిజం చెబుతున్నాను.

దేవయాన్యువాచ :- దేవయాని చెప్పింది.

యద్యేతదేవం శర్మిష్ఠే న మన్యుర్విద్యతే మమ ।
అపత్యం యది తే లబ్ధం జ్యేష్ఠాచ్ఛ్రేష్ఠాత్తు వై ద్విజాత్ ॥5॥

శర్మిష్ఠా! జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడూ అయిన విప్రునినుండి నీకు సంతానం కలగినది నిజమైతే, నాకు నీపై కోపం లేదు.

శోభనం భీరు సత్యం చేత్కథం స జ్ఞాయతే ద్విజః ।
గోత్రనామాభిజనతః శ్రోతుమిచ్ఛామి తం ద్విజమ్ ॥6॥

చాలా మంచిది. ఆ ద్విజు డెవరు? ఆ విప్రుని గోత్రం, పేరు, అభిజనం ఏమిటో వినగోరుతున్నాను.

శర్మిష్ఠోవాచ :– శర్మిష్ఠ చెప్పింది.

ఓజసా తేజసా చైవ దీప్యమానం రవిం యథా।
తం దృష్ట్వా మమ సంప్రష్టుం శక్తిర్నాఽఽసీచ్ఛుచిస్మితే! ॥7॥

దేవయానీ! ఓజస్సుతోనూ, తేజస్సుతోనూ సూర్యునిలా ప్రకాశించే ఆ ఋషిని చూచిన నాకు అతని గోత్ర నామాలు అడిగే శక్తి లేకపోయింది.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

అన్యోన్యమేవ ముక్త్వా చ సమ్ప్రహస్య చ తే మిథః ।
జగామ భార్గవీ వేశ్మ తథ్యమిత్యభిజానతీ ॥8॥

వారిరువురూ పరస్పరం ఇలా సంభాషించుకొని నవ్వుకొన్నారు. అది నిజమని భావించి భార్గవి ఇంటికి వెళ్ళింది.

యయాతి ర్దేవయాన్యాం తు పుత్రావజనయన్నృప ।
యదుం చ తుర్వసుం చైవ శక్రవిష్ణూ ఇవాపరౌ ॥9॥

రాజా! నరపతి యైన యయాతి దేవయానియందు యదువు, తుర్వసుడు అనే ఇంద్రవిష్ణువుల వంటి ఇరువురు పుత్రులను కన్నాడు.

తస్మాదేవ తు రాజర్షేః శర్మిష్ఠా వార్షపర్వణీ ।
ద్రుహ్యుం చానుం చ పూరుం చ త్రీన్కుమారానజీజనత్ ॥10॥

వృషపర్వుని పుత్రికయగు శర్మిష్ఠ గూడ ఆ రాజర్షి వల్లనే ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనే ముప్వురు పుత్రలను కన్నది.

తతః కాలే తు కస్మింశ్చిద్దేవయానీ శుచిస్మితా ।
యయాతిసహితా రాజన్జగామ రహితం వనమ్ ॥11॥

రాజా! పిదప కొంతకాలానికి శుచిస్మిత యైన దేవయాని యయాతితో గూడి ఏకాంత వనానికి వెళ్ళింది.

దదర్శ చ తదా తత్ర కుమారాన్దేవరూపిణః ।
క్రీడమానా న్సువిస్రబ్ధాన్విస్మితా చేదమబ్రవీత్ ॥12॥

అక్కడ అప్పుడామె దేవతల వంటి రూపం కల్గి నిర్భయంగా ఆడుకొంటున్న కుమారులను చూచింది. ఆశ్చర్యపడి ఇలా అన్నది –

కస్యైతే దారకా రాజన్దేవపుత్రోపమాశ్శుభాః ।
వర్చసా రూపతశ్చైవ దృశ్యన్తే సదృశాస్తవ ॥13॥

రాజా! దేవపుత్రతుల్యులైన ఈ శుభమూర్తులు ఎవరి పిల్లలు? తేజస్సుతోనూ, రూపంతోనూ వీరు నీకు సమానంగా కనిపిస్తున్నారు.

ఏవం పృష్ట్వా తు రాజానం కుమారాన్పర్యపృచ్ఛత ।
కిం నామధేయగోత్రే వః పుత్రకాః బ్రాహ్మణః పితా ॥14॥

అలా రాజునడిగి కుమారులను చూచి ఇలా ప్రశ్నించింది." పుత్రకులారా! మీ నామధేయ గోత్రా లేవి? మీ తండ్రియైన బ్రాహ్మణుడెవడు?

విబ్రూత మే యథా తథ్యం శ్రోతుకామాஉస్మ్యహమ్ ।
తేஉదర్శయన్ప్రదేశిన్యా తమేవ నృపసత్తమమ్ ॥15॥

ఉన్నదున్నట్లు చెప్పండి. నేను వినగోరుతున్నాను. అందుకు వారు ఆ నృపోత్తముని వైపు వ్రేలుచూపారు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

శర్మిష్ఠాం మాతరం చైవ తస్యా ఊచుః కుమారకాః ।
ఇత్యుక్త్వా సహితాస్తే తు రాజానముపచక్రముః 16
నాభ్యనన్దత తాన్రాజా దేవయాన్యాస్తదాஉన్తికే।
రుదన్తస్తేஉథ శర్మిష్ఠామభ్యయుర్బాలకాస్తదా ॥17॥

శర్మిష్ఠ తమ తల్లి అని గూడా ఆమెతో చెప్పారు. అలా చెప్పి వారు రాజు చెంతకు వెళ్ళారు. కాని ఆ దేవయాని చెంత రాజు వారిని అభినందించలేదు. అందుకు ఆ బాలకులు ఏడుస్తూ శర్మిష్ఠ చెంతకు వెళ్ళిపోయారు.

దృష్ట్వా తేషాం తు బాలానాం ప్రణయం పార్థివం ప్రతి ।
బుద్ధ్వా చ తత్త్వతో దేవీ శర్మిష్ఠామిదమబ్రవీత్ ॥18॥

రాజుపట్ల ఆ బాలకుల ప్రణయాన్ని జూచి నిజం గ్రహించిన దేవయాని శర్మిష్ఠతో ఇలా అన్నది –

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

మదధీనా సతీ కస్మాదకార్షీర్విప్రియం మమ ।
తమేవాసురధర్మం త్వమాస్థితా న బిభేషి కిమ్ ॥19॥

నాకు దాసివై వుంటూ ఎందుకిలా నాకు అప్రియం చేశావు? నీవు నీ ఆసుర ధర్మమే పాటించి నిర్భయంగా ఉన్నావేల?

శర్మిష్ఠోవాచ :– శర్మిష్ఠ చెప్పింది.

యదుక్తమృషిరిత్యేవ తత్సత్యం చారుహాసిని ।
న్యాయతో ధర్మతశ్చైవ చరన్తీ న బిభేమి తే ॥20॥

చారుహాసినీ! దేవయానీ! నేను ఋషి అని చెప్పినది నిజం. న్యాయంగానూ, ధర్మబద్ధంగానూ ప్రవర్తించాను. కాబట్టి నీకు భయపడలేదు.

యదా త్వయా వృతో రాజా వృత ఏవ తదా మయా ।
సఖీభర్తా హి ధర్మేణ భర్తా భవతి శోభనే! ॥21॥

నీవు రాజును వరించినపుడే నేను గూడ వరించినట్లే. శోభనా! చెలికత్తెకు గల భర్త ధర్మ పద్ధతిలో తనకూ భర్తే.

పూజ్యాఽసి మమ మాన్యా చ జ్యేష్ఠా చ బ్రాహ్మణీ హ్యసి ।
త్వత్తో హి మే పూజ్యతరో రాజర్షిః కిం న వేత్సి తత్ ॥22॥

నీవు నాకు పూజ్యురాలవు, మాననీయవు, జ్యేష్ఠురాలివి. శ్రేష్ఠురాలవు, బ్రాహ్మణివి. ఈ రాజర్షి నీకంటే నాకు పూజ్యతముడు. ఈ సంగతి నీకు తెలియదా!

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

శ్రుత్వా తస్యాస్తతో వాక్యం దేవయాన్యబ్రవీదిదమ్ ।
రాజన్నాద్యేహ వత్స్యామి విప్రియం మే త్వయా కృతమ్ ॥23॥

ఆ మాట విని దేవయాని రాజుతో రాజా! నీవు నాకు విప్రియం చేశావు. ఇక నేనిక్కడ ఉండను" అని చెప్పింది.

సహసోత్పతితాం శ్యామాం దృష్ట్వా తాం సాశ్రులోచనామ్ ।
తూర్ణం సకాశం కావ్యస్య ప్రస్థితాం వ్యథిత స్తదా ॥24॥

అలా చెప్పి చివాలున లేచి కన్నీరు కారుస్తూ వెంటనే శుక్రుని వద్దకు బయలుదేరిన దేవయానిని చూచి, రాజు వ్యథ చెందాడు.

అనువవ్రాజ సమ్భ్రాన్తః పృష్ఠతస్సాన్త్వయన్నృపః ।
న్యవర్తత న సా చైవ క్రోధసంరక్తలోచనా ॥25॥

ఆమెను ఓదారుస్తూ సంభ్రాంతుడై ఆమె వెంటనే వెళ్ళాడు. కోపంతో ఎర్రబారిన నేత్రాలు గల ఆ దేవయాని మరలి రాలేదు.

అవిబ్రువన్తీ కిఞ్చిచ్చ రాజానం సాశ్రులోచనా ।
అచిరాదేవ సమ్ప్రాప్తా కావ్యస్యోశనసోఽన్తికమ్ ॥26॥

రాజునుద్దేశించి ఏమీ మాట్లాడకుండా సాశ్రునేత్రయగు దేవయాని త్వరగా శుక్రాచార్యుని చెంతకు చేరుకొన్నది.

సా తు దృష్ట్వైవ పితరమభివాద్యాగ్రతస్స్థితా ।
అనన్తరం యయాతిస్తు పూజయామాస భార్గవమ్ ॥27॥

ఆమె తండ్రిని చూచి అభివాదం చేసి ఎదురుగా నిలబడింది. వెంటవచ్చిన యయాతి శుక్రుణ్ణి పూజించాడు.

దేవయాన్యువాచ :– దేవయాని చెప్పింది.

అధర్మేణ జితో ధర్మః ప్రవృత్తమధరోత్తరమ్ ।
శర్మిష్ఠయాஉతివృత్తాస్మి దుహిత్రా వృషపర్వణః ॥28॥

అధర్మం ధర్మాన్ని జయించింది. మర్యాద క్రిందుమీదయింది. వృషపర్వుని కుమార్తె శర్మిష్ఠ మర్యాదనతిక్రమించి ప్రవర్తించింది.

త్రయోஉస్యాం జనితాః పుత్రా రాజ్ఞాஉనేన యయాతినా ।
దుర్భగాయా మమ ద్వౌ తు పుత్రౌ తాత! బ్రవీమి తే ॥29॥

ఈ యయాతిరాజు వల్ల ఆమెకు ముగ్గురు కుమారులు కలిగారు. దౌర్భాగ్యవతి నైన నాకు కుమారు లిద్దరే. నాన్నా! నీకీ విషయం చెబుతున్నాను.

ధర్మజ్ఞ ఇతి విఖ్యాత ఏష రాజా భృగూద్వహ! ।
అతిక్రాన్తశ్చ మర్యాదాం కావ్యైతత్కథయామి తే ॥30॥

భార్గవా! ఈ రాజు ధర్మజ్ఞుడని విఖ్యాతి చెందాడు. కాని మర్యాద నతిక్రమించాడు. నేను నీకీవిషయం చెబుతున్నాను.

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

ధర్మజ్ఞ స్త్వం మహారాజ! యోஉధర్మమకృథాః ప్రియమ్ ।
తస్మాజ్జరా త్వామచిరాద్ధర్షయిష్యతి దుర్జయా ॥31॥

మహారాజా! నీవు ధర్మజ్ఞుడవు నీకు అధర్మం ప్రియమైంది. అందుచేత జయింప వీలుగాని వార్ధక్యం త్వరలోనే నిన్ను ఆక్రమిస్తుంది.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

ఋతుం వై యాచమానాయా న దదాతి పుమాన్వృతః ।
భ్రూణహేత్యుచ్యతే బ్రహ్మన్స చేహ బ్రహ్మవాదిభిః ॥32॥

ఓ బ్రాహ్మణుడా! ఋతుకాలంలో యాచించే వనితను తిరస్కరించేవాణ్ణి బ్రహ్మవాదులు భ్రూణహంత అన్నారు.

ఋతుకామాం ప్రియాం యస్తు గమ్యాం రహసి యాచితః ।
నోపైతి హి స ధర్మేణ బ్రహ్మహేత్యుచ్యతే బుధైః ॥33॥

ఋతుకామ యగు స్త్రీ రహస్యంగా యాచించినప్పుడు ఎవడు ధర్మవిధిననుసరించి ఆమెను పొందడో, అతణ్ణి ఋషులు బ్రహ్మహంత అన్నారు.

ఇత్యేతాని సమీక్ష్యాహం కారణాని భృగూద్వహ! ।
అధర్మభయసంవిగ్నః శర్మిష్ఠాముపజగ్మివాన్ ॥34॥

భృగుశ్రేష్ఠా! ఈ కారణాలను పరిశీలించి నేను అధర్మానికి భయపడి శర్మిష్ఠను పొందాను.

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

న త్వహం ప్రత్యవేక్ష్యస్తే మదధీనోఽసి పార్థివ ।
మిథ్యాచారేణ ధర్మేషు చౌర్యం భవతి నాహుష! ॥35॥

రాజా! నీవు నా అధీనంలో ఉన్నావు. నా ఆదేశం పాటించవద్దా! ఓ నాహుషా! మిథ్యాచారపరుడు ధర్మచౌర్యం చేసిన వాడవుతాడు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

క్రోధేనోశనసా శప్తో యయాతిర్నాహుషస్తదా ।
పూర్వం వయః పరిత్యజ్య జరాం సద్యోఽన్వపద్యత ॥36॥

కోపంతో శుక్రునిచే శపించబడిన యయాతి పూర్వవయస్సు వదలి అప్పుడే వృద్ధదశను పొందాడు.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

అతృప్తో యౌవనస్యాహం దేవయాన్యాం భృగూద్వహ ।
ప్రసాదం కురు మే బ్రహ్మన్జరేయం న విశేత మామ్ ॥37॥

భృగూద్వహా! దేవయాని విషయంలో నాకు తృప్తి కల్గలేదు. బ్రాహ్మణా! నన్ను కరుణించు. ఈ వృద్ధాప్యం నాకు లేకుండుగాక!

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

నాహం వృథా వదామ్యేతజ్జరాం ప్రాప్తోఽసి పార్థివ ।
జరాం త్వేతాం త్వమన్యస్మిన్ సంక్రామయ యదీచ్ఛసి ॥38॥

నా మాట అసత్యం కాదు. రాజా! నీవు వార్ధక్యం పొందక తప్పదు. కావాలంటే నీవీ వార్ధక్యాన్ని మరొకరికి సంక్రమింపజేసుకోవచ్చు.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

రాజ్యభాక్స భవేద్బ్రహ్మన్ పుణ్యభాక్కీర్తిభాక్తథా ।
యో దద్యాన్మే వయః పుత్రస్తద్భవాననుమన్యతామ్ ॥39॥

పూజ్యుడా! ఏ కుమారుడు నాకు తన వయస్సు నిస్తాడో, వాడు నా రాజ్యం, పుణ్యం, కీర్తి పొందేటట్లు అనుగ్రహించండి!

శుక్ర ఉవాచ :- శుక్రుడు చెప్పాడు.

సంక్రామయిష్యసి జరాం యథేష్టం నహుషాత్మజ! ।
మామనుధ్యాయ తత్త్వేన న చ పాపమవాప్స్యసి ॥40॥

నహుషపుత్రా! నీవు కోరినట్లే నీ వార్ధక్యాన్ని నన్ను ధ్యానించి ఇతరులకు సంక్రమింప జేయగలవు. దీనివల్ల నీకు పాపం కల్గదు.

వయో దాస్యతి తే పుత్రో యః స రాజా భవిష్యతి ।
ఆయుష్మాన్కీర్తిమాంశ్చైవ బహ్వపత్యస్తథైవ చ ॥41॥

ఏ పుత్రుడు నీకు వయస్సు నిస్తాడో, అతడు రాజు కాగలడు. అట్లే ఆయుష్మంతుడు, కీర్తిమంతుడు, బహు సంతానవంతుడు కాగలడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే శర్మిష్ఠాదేవయాన్యోః పుత్రవిషయకసంల్లాపో నామ ద్వావింశతితమోఽధ్యాయః ॥ 32 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని యయాతి చరిత్రలో శర్మిష్ఠాదేవయానుల పుత్రవిషయకమైన సంల్లాపమనే ముప్పైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్రయస్త్రింశోఽధ్యాయః - ముప్పైమూడవ అధ్యాయం

పుత్రైస్సహ యయాతేః జరాప్రదాన నిమిత్తక సంవాదః

పుత్రులతో యయాతికి వార్ధక్యప్రదాన నిమిత్తకమైన సంవాదం

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

జరాం ప్రాప్య యయాతిస్తు స్వపురం ప్రాప్య చైవ హి ।
పుత్రం జ్యేష్ఠం వరిష్ఠం చ యదుమిత్యబ్రవీద్ద్విజః ॥1॥

శతానీకా! యయాతిని ముసలితనం ఆవహించింది. అతడు నగరానికి వెళ్ళాడు. శ్రేష్ఠుడైన జ్యేష్ఠ పుత్రుడు యదువుతో ఇలా అన్నాడు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

జరా వలీ చ మాం తాత పలితాని చ పర్యగుః ।
కావ్యస్యోశనసశ్శాపాన్న చ తృప్తోఽస్మి యౌవనే ॥2॥

త్వం యదో! ప్రతిపద్యస్వ పాప్మానం జరయా సహ ।
యౌవనేన త్వదీయేన చరేయం విషయానహమ్ ॥3॥

నాయనా! శుక్రాచార్యుని శాపం వల్ల వార్ధక్యం, ముడుతలు నన్ను పైకొన్నాయి. వెంద్రుకలు తెల్లబడ్డాయి. నాకింకా యౌవన సుఖాల పట్ల తనివి తీరలేదు. ఓ యదూ! ఈ ముసలితనంతో సహా నా పాపాన్ని గూడా నీవు అంగీకరించు. నీ యౌవనం పరిగ్రహించి నేను విషయసుఖా లనుభవిస్తాను.

పూర్ణే వర్షసహస్రే తు త్వదీయం యౌవనం త్వహమ్ ।
దత్వా సంప్రతిపత్స్యామి పాప్మానం జరయా సహ ॥4॥

వేయేండ్లు పూర్తికాగానే నేను నీ యౌవనం నీకిస్తాను. పాపాన్ని వార్ధక్యంతో గూడా స్వీకరిస్తాను.

యదురువాచ :- యదువు చెప్పాడు.

సితశ్మశ్రుధరో దీనో జరసా శిథిలీకృతః ।
వలీసన్తతగాత్రశ్చ దుర్దర్శో దుర్బలః కృశః ॥5॥

నెరసిన మీసాలు గల్గి, దీనుడై, ముసలితనంలో శిథిలమైనదీ, ముడుతలు బడ్డదీ అయిన శరీరం గలవాడు చూడదగని వాడవుతాడు. దుర్బలుడై కృశించిపోతాడు.

అశక్తః కార్యకరణే పరిభూత స్స యౌవనైః ।
సహోపజీవిభిశ్చైవ తజ్జరాం నాభికామయే ॥6॥

ఏ పనీ చేయడానికి శక్తిలేనివాడవుతాడు. యువకులచేతా, అనుచరులచేతా అవమానానికి గురి అవుతాడు. అందువల్ల ముసలితనాన్ని నేను అంగీకరించను.

సన్తి తే బహవః పుత్త్రా మత్తః ప్రియతరా నృప ।
జరాం గ్రహీతుం ధర్మజ్ఞ! పుత్త్రమన్యం వృణీష్వ వై ॥7॥

రాజా! నా కంటే నీకు ఎక్కువ ప్రియమైన అనేక పుత్రులున్నారు. ధర్మం తెలిసినవాడా! నీ వార్ధక్యం గ్రహించుమని మరొక కుమారుని అర్థించు.

యయాతిరువాచ :–యయాతి చెప్పాడు.

యస్త్వం మే హృదయాజ్జాతో వయః స్వం న ప్రయచ్ఛసి ।
పాపాన్మాతులసంబన్ధాద్దుష్ప్రజా తే భవిష్యతి ॥8॥

నీవు నా హృదయంనుండి జనించి కూడా నీ వయస్సును నాకీయ నన్నావు. మేనమాన సంబంధమైన పాపం వల్ల నీ సంతానం దుష్టులుగా రూపొందుతారు.

తుర్వసో ప్రతిపద్యస్వ పాప్మానం జరయా సహ ।
యౌవనేన చరేయం వై విషయాంస్తవ పుత్త్రక ॥9॥

తుర్వసూ! పుత్రకా! నా ముసలి తనంతో సహా నా పాపం స్వీకరించు. నీ విచ్చే యౌవనంతో నేను విషయ సుఖాలనుభవిస్తాను.

పూర్ణే వర్షసహస్రే తు పునర్దాస్యామి యౌవనమ్ ।
తథైవ ప్రతిపత్స్యామి పాప్మానం జరయా సహ ॥10॥

వెయ్యేండ్లు పూర్తికాగానే నేను నీ యౌవనాన్ని నీకిస్తాను. పాపంతో సహా ముసలితనాన్ని తిరిగి తీసుకొంటాను.

తుర్వసురువాచ :– తుర్వసుడు చెప్పాడు.

న కామయే జరాం తాత కామభోగప్రణాశినీమ్ ।
బలరూపాన్తకరిణీం బుద్ధిమానవినాశినీమ్ ॥11॥

తండ్రీ! కామ భోగాలను నశింపజేసేదీ, బలాన్నీ, రూపాన్నీ అంత మొందించేదీ, బుద్ధినీ, మానాన్నీ నశింపజేసేదీ అగు వార్ధక్యం నే నొల్లను.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

యస్త్వం మే హృదయాజ్జాతో వయస్స్వం న ప్రయచ్ఛసి ।
తస్మాత్ప్రజా సముచ్ఛేదం తుర్వసో తవ యాస్యతి ॥12॥

నీవు నా హృదయంనుండి పుట్టినవాడవు. నీ వయస్సును ఇవ్వడానికి సిద్ధంగా లేవు. అందుచేత తుర్వసూ! నీ సంతతి నశించిపోతుంది.

సఙ్కీర్ణాశ్చోరధర్మేషు ప్రతిలోమచరేషు చ ।
పిశితాశిషు లోకేషు నూనం రాజా భవిష్యసి ॥13॥

చోరధర్మ పరులు, ప్రతిలోమచారులు, మాంసాశనులు అయిన చండాలురకు నీవు ప్రభువవుతావు.

గురుదారప్రసక్తేషు తిర్యగ్యోనిరతేషు చ ।
మ్లేచ్ఛేషు పశుధర్మేషు పాపేషు ప్రభవిష్యసి ॥14॥

గురుపత్నులను కామించేవారు, పశుపక్ష్యాదుల యందు రమించువారు, పశుధర్ములు అయిన పాపాత్ములలో నీవు జన్మించనున్నావు.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

ఏవం తు తుర్వసుం శప్త్వా యయాతిస్సుతమాత్మనః ।
శర్మిష్ఠాయాస్సుతం జ్యేష్ఠం ద్రుహ్యుం వచనమబ్రవీత్ ॥15॥

ఇలా అతడు తుర్వసుని శపించాడు. తదుపరి శర్మిష్ఠయొక్క జ్యేష్ఠకుమారుడైన ద్రుహ్యునితో ఇలా అన్నాడు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

ద్రుహ్యో! త్వం ప్రతిపద్యస్వ వర్ణరూపవినాశినీమ్ ।
జరాం వర్షసహస్రం మే యౌవనం సంప్రయచ్ఛ తమ్ ॥16॥

ద్రుహ్యో! వర్ణాన్నీ, రూపాన్నీ నశింపజేసే నా వార్ధక్యాన్ని నీ వంగీకరించు. నీ యౌవనం నాకిమ్ము,

పూర్ణే వర్షసహస్రే తు తే ప్రదాస్యామి యౌవనమ్ ।
స్వం చాఽఽదాస్యామి భూయోఽపి పాప్మానం జరయా సహ ॥17॥

వెయ్యేండ్లు గడవగానే నీ యౌవనం నీకిచ్చివేస్తాను. మరల పాపంతో సహా నా వార్ధక్యం నేను తీసుకొంటాను.

ద్రుహ్యురువాచ :- ద్రుహ్యుడు చెప్పాడు.

న రాజ్యం న రథం నాశ్వం జీర్ణో భుంక్తే న చ స్త్రియమ్ ।
న రాగశ్చాస్య భవతి తజ్జరాం తే న కామమే ॥18॥

వృద్ధుడు రాజ్యాన్నీ, రథాన్నీ, గుర్రాలనూ, స్త్రీనీ అనుభవించలేడు. వానికి వాటిపై ప్రేమ జనించదు. అందుచేత నీ వార్ధకాన్ని నేనిష్టపడను.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

యస్త్వం మే హృదయాజ్జాతో వయః స్వం న ప్రయచ్ఛసి ।
తద్ద్రుహ్యో వై ప్రియః కామో న తే సమ్పత్స్యతే క్వచిత్ ॥19॥

నీవు నా హృదయంనుండి పుట్టావు. నీ వయస్సును నాకివ్వడానికి తిరస్కరించావు. అందుచే ఓ ద్రుహ్యూ నీ కిష్టమైన కోరికలు నీకెక్కడా తీరవు.

ఉడుపప్లవసంచారో యత్ర నిత్యం భవిష్యతి ।
అరాజ్యభాగభ్రష్టత్వం తత్ర ప్రాప్స్యసి సాన్వయః ॥20॥

నిత్సమూ, నీవు పడవలలో నీటిపై సంచారం చేసేవాడవవుతావు. రాజ్యభ్రష్టుడవై జీవిస్తావు. నీ సంతతికి గూడ రాజ్యాధికారం కలగదు.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

అనో త్వం ప్రతిపద్యస్వ పాప్మానం జరయా సహ ।
ఏవం వర్షసహస్రం తు చరేయం యౌవనేన తే ॥21॥

అనూ! నీవు నా పాపంతో సహ వార్ధక్యం స్వీకరించు. వెయ్యేండ్లు నేను నీ యౌవనంతో చరిస్తాను.

అనురువాచ :–అనువు చెప్పాడు

జీర్ణశ్శిశురివాఽఽదత్తే కాలేఽన్నమశుచిర్యథా ।
న జుహోతి చ కాలేఽగ్నిం తాం జరాం నాభికామయే ॥22॥

శిశువు లాగా వృద్ధుడు అశుచియై సమయానికి అన్నం కూడా తిన లేనివాడవుతాడు. కాలంలో హెూమం కూడా చేయడు. అట్టి వార్ధక్యం నేను కోరను.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

యస్త్వం మే హృదయాజ్జాతో వయస్స్వం న ప్రయచ్ఛసి ।
జరాదోషస్త్వయోక్తో యస్తస్మాత్త్వం ప్రతిపద్యసే ॥23॥

నీవు నా హృదయం నుండి పుట్టి గూడా నీ వయస్సు నివ్వనన్నావు. నీవు చెప్పిన జరా దోషాలను నీవు పొందుతావు.

ప్రజాశ్చ యౌవనం ప్రాప్తా వినశిష్యన్త్యనో తవ ।
అగ్నిప్రస్కన్దనగతస్త్వం చాప్యేవం భవిష్యసి ॥24॥

అనూ! నీ సంతతివారు యౌవనం రాగానే నశిస్తారు. నీవు గూడా అగ్నిపై దూకువాడవై నశిస్తావు.

పూరో త్వం ప్రతిపద్యస్వ పాప్మానం జరయా సహ ।
త్వం మే ప్రియతరః పుత్రస్త్వం వరీయాన్భవిష్యసి ॥25॥

పూరూ! నీవు నా పాపంతో సహా నా జరనంగీకరించు. నీవు నాకిష్టతరమైన పుత్రుడువు. నీవు శ్రేష్ఠుడవవుతావు.

జరా వలీ చ మే తాత పలితాని చ పర్యగుః ।
కావ్యస్యోశనసశ్శాపాన్న చ తృప్తోఽస్మి యౌవనే ॥26॥

కావ్యుని శాపం వల్ల వార్ధకం, ముడుతలు, నెరసిన తెల్ల వెంట్రుకలు నన్ను పై కొన్నాయి. యౌవనంలో నాకింకా తృప్తి కలుగలేదు.

కిఞ్చిత్కాలం చరేయం వై విషయాన్వయసా తవ ।
పూర్ణే వర్షసహస్రే తు ప్రతిదాస్యామి యౌవనమ్ ।
స్వం చైవ ప్రతిపత్స్యేఽహం పాప్మానం జరయా సహ ॥27॥

నీ వయస్సుతో కొంతకాలం విషయ భోగాలనుభవిస్తాను. వెయ్యేండ్లు కాగానే నీ యౌవనం నీకిస్తాను. నా జరనూ, పాపాన్నీ నేను తిరిగి తీసుకొంటాను.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

ఏవముక్తః ప్రత్యువాచ పూరుః పితరమంజసా ।
యథాఽఽత్థ త్వం మహారాజ తత్కరిష్యామి తే వచః ॥28॥

తండ్రి అలా చెప్పగా పూరుడిలా అన్నాడు. "మహారాజా! నీవెలా చెప్పావో, అలాగే నీ మాట పాటిస్తాను.

ప్రతిపత్స్యామి తే రాజన్పాప్మానం జరయా సహ ।
గృహాణ యౌవనం మత్తశ్చర కామాన్యథేప్సితాన్ ॥29॥

రాజా! నీ పాపాన్ని జరతో సహా అంగీకరిస్తాను. ఇదిగో నా యౌవనం తీసుకో. యథేష్ట కామా లనుభవించు!

జరయాఽహం ప్రతిచ్ఛన్నో వయోరూపధరస్తవ ।
యౌవనం భవతే దత్త్వా చరిష్యామి యథేచ్ఛయా ॥30॥

నీ వయస్సునూ, రూపాన్నీ పొంది జరాక్రాంతుడనై నా యౌవనం నీకిచ్చి నేను యథేచ్ఛగా చరిస్తాను.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

పూరో! ప్రీతోఽస్మి తే వత్స! వరం చేమం దదామి తే ।
సర్వకామసమృద్ధార్థా భవిష్యతి తవ ప్రజా ॥31॥

వత్సా! పూరూ! నీ పట్ల ప్రీతి గలిగింది. ఈ వరం కూడా నీ కిస్తున్నాను. నీ సంతతి సమస్త కామాలూ పొంది అర్థ సమృద్ధి గల్గి జీవించగలదు.

శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే పుత్రైస్సహ యయాతేః జరాప్రదాననిమిత్తకసంవాదో నామ త్రయస్త్రింశోఽధ్యాయః ॥ 33 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలో యయాతిచరిత్రలో పుత్రులతో యయాతికి వార్ధక్యప్రదాన నిమిత్తకమైన సంవాదమనే ముప్పైమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుస్త్రింశోఽధ్యాయః - ముప్పైనాల్గవ అధ్యాయం
పూరు పట్టాభిషేచనం - పూరుని పట్టాభిషేకం

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

ఏవ ముక్త స్స రాజర్షిః కావ్యం స్మృత్వా మహావ్రతమ్ ।
సఙ్క్రామయామాస జరాం తదా పుత్రే మహాత్మని ॥1॥

ఓ శతానీకా! పూరువు అలా చెప్పగానే ఆ రాజర్షి మహావ్రతుడైన శుక్రాచార్యుణ్ణి స్మరించి మహాత్ముడైన ఆ పుత్రునికి తన వార్ధక్యాన్ని సంక్రమింపజేశాడు.

పౌరవేణాథ వయసా యయాతి ర్నహుషాత్మజః ।
ప్రీతియుక్తో నరశ్రేష్ఠశ్చచార విషయాన్ప్రియాన్ ॥2॥

పూరువు వయస్సు పొందిన నహుషుని సుతుడైన యయాతి ప్రీతితో ప్రియమైన విషయసుఖాల ననుభవించాడు.

యథాకామం యథోత్సాహం యథాకాలం యథాసుఖమ్ ।
ధర్మావిరుద్ధాన్ రాజేన్ద్రో యథాఽర్హతి స ఏవ హి ॥3॥

కోరిక ప్రకారం ఉత్సాహానుగుణంగా కాలము ననుసరించి సుఖంగా ధర్మానికి విరుద్ధములు కాని కామాలను తన అర్హతకు తగినట్లు ఆ రాజేంద్రు డనుభవించాడు.

దేవానతర్పయద్యజ్ఞైశ్శ్రాద్ధైరపి పితామహాన్ ।
దీనాననుగ్రహైరిష్టైః కామైశ్చ ద్విజసత్తమాన్ ॥4॥

యజ్ఞాలతో దేవతలను, శ్రాద్ధకార్యాలతో పితామహులనూ, అనుగ్రహంతో దీనులనూ, ఇష్టకామాలతో విప్రశ్రేష్ఠలనూ తృప్తులను చేశాడు.

అతిథీనన్నపానైశ్చ విశశ్చ ప్రతిపాలనైః ।
ఆనృశంస్యేన శూద్రాంశ్చ దస్యూన్నిగ్రహణేన చ ॥5॥

ధర్మేణ చ ప్రజా స్సర్వా యథావదనురఞ్జయన్ ।
యయాతిః పాలయామాస సాక్షాదిన్ద్ర ఇవాపరః ॥6॥

మరొక దేవేంద్రుడుగా విరాజిల్లుతూ అన్నపానాలతో అతిథులనూ, ప్రతిపాలనతో వైశ్యులనూ, దయతో శూద్రులనూ, నిగ్రహంతో చోరులనూ, ధర్మంతో సకల ప్రజలనూ రంజింపజేస్తూ యయాతి పరిపాలించాడు.

స రాజా సింహవిక్రాన్తో యువా విషయగోచరః ।
అవిరోధేన ధర్మస్య చచార సుఖముత్తమమ్ ॥7॥

సింహపరాక్రముడైన ఆ రాజు విషయ సుఖాల ననుభవించే యువకుడై ధర్మానికి విరోధం లేకుండా ఉత్తమసుఖాల ననుభవించాడు.

స సమ్ప్రాప్య శుభాన్ కామాన్ తృప్తః ఖిన్నశ్చ పార్థివః ।
కాలం వర్షసహస్రాంతం సస్మార మనుజాధిపః ॥8॥

ఆ రాజు శుభావహాలైన కామాల ననుభవించి తృప్తి పొందాడు. చివరకు ఖిన్నుడై వెయ్యి సంవత్సరాలు గడచిపోవడాన్ని స్మరించాడు.

పరిచిన్త్య స కాలజ్ఞః కాలాకాంక్షీ చ వీర్యవాన్ ।
పూర్ణం మత్వా తతః కాలం పూరుం పుత్రమువాచ హ ॥9॥

వీరుడు, కాలజ్ఞుడు, కాలసమాప్తిని కోరువాడూ అయిన ఆ రాజు తన కాలం పూర్తైనదని గ్రహించి తన పుత్రుడు పూరునితో ఇలా అన్నాడు.

న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥10॥

కామములను అనుభవించడం వల్ల కామమెన్నటికీ శాంతించదు. హవిస్సుచే అగ్నిలాగా ఇంకా అది అభివృద్ధి పొందుతుంది.

యత్పృథివ్యాం వ్రీహియవం హిరణ్యం పశవస్స్రియః ।
నాలమేకస్య తత్సర్వం ఇతి మత్వా శమం వ్రజేత్ ॥11॥

భూవలయంలో ఉన్న వడ్లు, యవలు మొ॥ ధాన్యాలు, బంగారం, పశువులు, స్త్రీలు–ఇవన్నీ ఒక్క వ్యక్తికి గూడా సరిపోవు అని గమనించి శాంతి పొందాలి.

యథాసుఖం యథోత్సాహం యథాకామమరిన్దమ ।
సేవితా విషయాః పుత్ర యౌవనేన మయా తవ ॥12॥

పుత్రా! సుఖానుగుణంగా, ఉత్సాహాన్ని బట్టి, యథేచ్ఛగా నీ యౌవనంతో నేను విషయసుఖాలను అనుభవించాను.

పూరో! ప్రీతోఽస్మి భద్రం తే గృహాణేదం స్వయౌవనమ్ ।
రాజ్యం చైవ గృహాణేదం త్వం హి మే ప్రియకృత్సుతః ॥13॥

పూరూ! నేను ప్రీతుడనైనాను. నీకు శుభ మగుగాక! నీ యౌవనాన్ని నీవే తీసుకో. ఈ రాజ్యాన్ని గూడా పరిగ్రహించు, నీవే నాకు ప్రియము గల్గించిన కుమారుడివి.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

ప్రతిపేదే జరాం రాజా యయాతి ర్నాహుషస్తదా ।
యౌవనం ప్రతిపేదే స పూరుస్స్వం పునరాత్మజః ॥14॥

అప్పుడు నహుషపుత్రుడైన ఆ రాజు యయాతి వృద్ధత్వం పొందాడు. ఆ పూరువు తన యౌవనాన్ని తాను మరల గ్రహించాడు.

రాజ్యేఽభిషేక్తుకామం తం పూరుం పుత్త్రం కనీయసమ్ ।
బ్రాహ్మణప్రముఖా వర్ణా ఇదం వచనమబ్రువన్ ॥15॥

కనిష్ఠ కుమారుడైన పూరుణ్ణి రాజు రాజ్యాభిషిక్తుణ్ణి చేయదలచాడు. అపుడు బ్రాహ్మణాది వర్ణాలవారు ఇలా అన్నారు.

కథం శుక్రస్య దౌహిత్రం దేవయాన్యాస్సుతం ప్రభో ।
జ్యేష్ఠం యదుమతిక్రమ్య రాజ్యం పూరోః ప్రదాస్యసి ॥16॥

ప్రభూ! దేవయాని కుమారుడు, శుక్రుని మనుమడు, జ్యేష్ఠుడు అయిన యదువును కాదని రాజ్యాన్ని పూరునకెలా ఇవ్వగలవు?

జ్యేష్ఠో యదుస్తవ సుతస్తుర్వసుస్తదనన్తరమ్ ।
శర్మిష్ఠాయాస్సుతో ద్రుహ్యస్తథాఽనుః పూరురేవ చ ॥17॥

నీ కుమారులలో పెద్దవాడు యదువు. తరువాతివాడు తుర్వసుడు. శర్మిష్ఠ పుత్రులు ద్రుహ్యుడు, అనువు, పూరుడు – అనువారు.

కథం జ్యేష్ఠమతిక్రమ్య కనీయాన్రాజ్యమర్హతి ।
ఏతత్సమ్బోధయామస్త్వాం స్వధర్మమనుపాలయ ॥18॥

జ్యేష్ఠుణ్ణతిక్రమించి చిన్నవాడు రాజ్యాని కర్హుడెలా కాగలడు? ఈ సంగతి మీ దృష్టికి తెస్తున్నాము– నీవు స్వధర్మం పాలించు.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

బ్రాహ్మణప్రముఖా వర్ణాస్సర్వే శృణ్వన్తు మే వచః ।
జ్యేష్ఠం ప్రతి యతో రాజ్యం న దేయం మే కథఞ్చన ॥19॥

బ్రాహ్మణ ప్రముఖ వర్ణస్థులారా! మీరంతా నా మాట వినండి! జ్యేష్ఠునికి నేను ఎలాగూ రాజ్య మివ్వలేను.

మమ జ్యేష్ఠేన యదునా నియోగో నానుపాలితః ।
ప్రతికూలః పితుర్యశ్చ న స పుత్త్రస్సతాం మతః ॥20॥

నా ఆజ్ఞను జ్యేష్ఠసుతుడైన యదువు పాలించలేదు. తండ్రికి ప్రతికూలుడైనవాడు కొడుకు కాజాలడని పెద్దల అభిప్రాయం.

మాతాపిత్రోర్వచనకృద్ధితః పథ్యశ్చ యస్సుతః ।
స పుత్రః పుత్రవద్యశ్చ వర్తతే పితృమాతృషు ॥21॥

తల్లిదండ్రుల మాటను పాటించేవాడు, వారికి హితంగా, పథ్యంగా ప్రవర్తించేవాడు, తల్లి దండ్రులకు నిజమైన పుత్రునిలాగా వ్యవహరించేవాడే నిజమైన పుత్రుడు.

యదునాఽహమవజ్ఞాతస్తథా తుర్వసునాఽపి వా ।
ద్రుహ్యుణా చానునా చైవమప్యవజ్ఞా కృతా భృశమ్ ॥22॥

యదువు, తుర్వసుడు– వీరు నన్ను ధిక్కరించారు. అట్లే ద్రుహ్యుడు, అనువు కూడా నా పట్ల మిక్కిలిగా అవజ్ఞ చూపారు.

పూరుణా మే కృతం వాక్యం మానితం చ విశేషతః ।
కనీయాన్మమ దాయాదో జరా యేన ధృతా మమ ॥23॥

పూరుడు నా మాట పాటించి నన్ను విశేషంగా సంభావించాడు. ఈ కనిష్ఠసుతుడు నా వార్ధక్యాన్ని తాను ధరించాడు.

మమ కామస్స చ కృతః పూరుణా పుత్రరూపిణా ।
శుక్రేణ చ వరో దత్తః కావ్యేనోశనసా స్వయమ్ ॥24॥

పుత్రరూపి యైన పూరుడు నా కోరిక తీర్చాడు. శుక్రుడు గూడా నాకు తానుగా వరం ప్రసాదించాడు.

పుత్త్రో యస్త్వనువర్తేత స రాజా పృథివీపతిః ।
భవన్తః ప్రతిజానన్తు పూరూ రాజ్యేఽభిషిచ్యతామ్ ॥25॥

ఏ పుత్రుడు నిన్ను అనుసరిస్తాడో, అతడే భూభర్త అయిన రాజు అని శుక్రుని వరం. దీనిని మీరు అనుమతించండి. పూరుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేయండి.

ప్రకృతయ ఊచుః :– ప్రజలు చెప్పారు.

యః పుత్త్రో గుణసమ్పన్నో మాతాపిత్రోర్హితస్సదా ।
సర్వం సోఽర్హతి కల్యాణం కనీయానపి స ప్రభుః ॥26॥

ఏ పుత్రుడు గుణవంతుడో, తల్లిదండ్రులకు సదా హితం చేకుర్చువాడో, అట్టివాడు సర్వసుఖాలకూ అర్హుడు. చిన్నవాడైనా అతడే రాజు.

అర్హం పూరోరిదం రాజ్యం యః ప్రియః ప్రియకృత్తవ ।
వరదానేన శుక్రస్య న శక్యం వక్తుముత్తరమ్ ॥27॥

నీకు ప్రియకారి అయిన పూరునకు ఈ రాజ్య మర్హమైనది. ఇది శుక్రుడిచ్చిన వరం కాన దీనికి విరుద్ధంగా బదులు చెప్పవీలుగాదు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

పౌరజానపదైస్తుష్టై రిత్యుక్తో నాహుషస్తదా ।
అభిషిచ్య తతః పూరుం రాజ్యే స్వం సుతమాత్మజమ్ ॥28॥

పౌరులు, జానపదులు ఇలా చెప్పగా యయాతి తన పుత్రుడైన పూరుణ్ణి రాజ్యాషిక్తుణ్ణి చేశాడు.

దత్వా చ పూరవే రాజ్యం వనవాసాయ దీక్షితః ।
పురాత్స నిర్యయౌ రాజా బ్రాహ్మణైస్తాపసైస్సహ ॥29॥

అతనికి రాజ్యమిచ్చి ఆ రాజు వనవాసం చేయ దీక్షబూని బ్రాహ్మణులతో, తాపసులతో గూడ పుట్టణం నుండి వెళ్ళిపోయాడు.

యదోస్తు యాదవా జాతాస్తుర్వసోర్యవనాస్సుతాః ।
ద్రుహ్యోస్సుతా వై భోజాస్తు అనోస్తు మ్లేచ్ఛజాతయః ॥30॥

యదువుకు యాదవులు పుట్టారు. తుర్వసునకు యవనులు సుతులయ్యారు. ద్రుహ్యుని కుమారులే భోజులు. అనువు కుమారులు మ్లేచ్ఛ జాతులయ్యారు.

పూరోస్తు పౌరవో వంశో యత్ర జాతోఽసి పార్థివ! ।
ఇదం వర్షసహస్రం యో రాజ్యం కారయితుం వశీ ॥31॥

పూరువునుండి కల్గిన వంశం పౌరవవంశం. రాజా! నీవా వంశంలో జనించావు. ఈ రాజ్యమును వేయి సంవత్సరాలు పాలించువాడవయ్యావు.

శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే పూరు పట్టాభిషేచనం నామ చతుస్త్రింశోఽధ్యాయః ॥ 34 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని యయాతిచరిత్రలో పూరు పట్టాభిషేకమనే ముప్పైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచత్రింశోఽధ్యాయః - ముప్పైఅయిదవ అధ్యాయం
యయాతేస్తపశ్చర్యా స్వర్గప్రాప్తిశ్చ - యయాతి తపస్సు, స్వర్గప్రాప్తి

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

ఏవం స నాహుషో రాజా యయాతిః పుత్రమీప్సితమ్ ।
రాజ్యేఽభిషిచ్య ముదితో వానప్రస్థోఽభవన్మునిః ॥1॥

ఇలా నహుషుని కుమారుడైన యయాతి తన కిష్టుడైన పుత్రుణ్ణి రాజ్యమందు అభిషేకించి సంతోషించినవాడై వానప్రస్థాశ్రమం గ్రహించి ముని అయ్యాడు.

ఉషిత్వా వనవాసం స బ్రాహ్మణైస్సహ సంశ్రితః ।
ఫలమూలాశనో దాన్తో యథా స్వర్గమితో గతః ॥2॥

బ్రాహ్మణులతో గూడి వనవాసం చేస్తూ అతడు ఫలమూలాలు ఆహారంగా గైకొని ఇంద్రియనిగ్రహపరుడై చివరకు స్వర్గం చేరుకున్నాడు.

స గతః స్వర్గవాసం తు న్యవసన్ముదితస్సుఖీ ।
కాలస్య నాతిమహతః పునశ్శక్రేణ పాతితః ॥3॥

అతడు స్వర్గం చేరి ఎంతగానో సుఖించాడు. కొంత కాలం పిదప ఇంద్రుడతణ్ణి స్వర్గంనుండి పతితుణ్ణి చేశాడు.

వివశః ప్రచ్యుతస్స్వర్గాదప్రాప్తో మేదినీతలమ్ ।
స్థితశ్చాఽసీదన్తరిక్షే స తదేతి శ్రుతం మయా ॥4॥

అతడు వశం తప్పి స్వర్గభ్రష్టుడై భూతలానికి రాకుండా అలా అంతరిక్షంలోనే ఉండిపోయాడని నేను విన్నాను.

తత ఏవ పునశ్చాపి గతస్స్వర్గమితి శ్రుతిః ।
రాజ్ఞా వసుమతా సార్ధమష్టకేన చ వీర్యవాన్ ।
ప్రతర్దనేన శిబినా సమేత్య కిల సంసది ॥5॥

అక్కడనుండి వీరుడైన యయాతి వసుమంతుడు, అష్టకుడు, ప్రతర్దనుడు, శిబి అనే రాజులతో గూడి మరల స్వర్గానికి వెళ్ళాడని వింటున్నాను.

శతానీక ఉవాచ :- శతానీకుడు చెప్పాడు.

కర్మణా కేన స దివం పునః ప్రాప్తో మహీపతిః ।
కథమిన్ద్రేణ భగవన్పాతితో మేదినీతలే ॥6॥

భగవంతుడా! ఆ రాజు మళ్ళీ ఏ పని చేసి స్వర్గం చేరుకొన్నాడు? ఇంద్రుడతణ్ణి ఎలా భూతలం పై పడవేశాడు?

సర్వమేతదశేషేణ శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ।
కథ్యమానం త్వయా విప్ర దేవర్షిగణసన్నిధౌ ॥7॥

ఓ బ్రాహ్మణుడా! దేవతల, ఋషుల గణసన్నిధిలో నీవు వివరిస్తే ఇదంతా పుర్తిగా నేను వినా లనుకొంటున్నాను.

దేవరాజసమో హ్యాసీద్యయాతిః పృథివీపతిః ।
వర్ధనః కురువంశస్య విభావసుసమద్యుతిః ॥8॥

ఆ రాజు యయాతి ఇంద్రసదృశుడు కదా! సూర్యునితో సమమైన కాంతి గల అతడు కురువంశ వర్ధనుడు కదా!

తస్య విస్తీర్ణయశసః సత్యకీర్తేర్మహాత్మనః ।
శ్రోతుమిచ్ఛామి దేవేశ దివి చేహ చ సర్వశః ॥9॥

మాహాకీర్తిమంతుడు, సత్యకీర్తి, మహాత్ముడు అయిన యయాతికి సంబంధించిన భూలోకానికీ, స్వర్గలోకానికీ చెందిన వృత్తాంతం వినగోరుతున్నాను.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

హన్త తే కథయిష్యామి యయాతేరుత్తమాం కథామ్ ।
దివి చేహ చ పుణ్యార్థాం సర్వపాపప్రణాశనీమ్ ॥10॥

శతానీకా! యయాతి యొక్క ఉత్తమమైన కథను నీకు వివరిస్తాను. అది స్వర్గానికీ, భూలోకానికీ చెందిన పుణ్యప్రదమైన, పాపాలన్నిటినీ పోగొట్టే కథ.

యయాతిర్నాహుషో రాజా పూరుం పుత్రం కనీయసమ్ ।
రాజ్యేఽభిషిచ్య ముదితః ప్రవవ్రాజ వనం తదా ॥11॥

నహుషసుతుడైన యయాతి కనిష్ఠ సుతుడైన పుత్రుణ్ణి రాజ్యంలో అభిషేకించి సంతోషంతో వనానికి వెళ్ళాడు.

అన్తేషు స వినిక్షిప్య పుత్రాన్యదుపురోగమాన్ ।
ఫలమూలాశనో రాజా వనేఽసౌ న్యవసచ్చిరమ్ ॥12॥

యదుముఖ్యులైన కుమారులను అతడు రాజ్యం చివరి సరిహద్దులలో నిల్పినాడు. వనంలో ఫలమూలాలు తింటూ చాలా కాలం నివసించాడు.

స జితాత్మా జితక్రోధస్తర్పయన్పితృదేవతాః ।
అగ్నీంశ్చ విధివజ్జుహ్వన్వానప్రస్థవిధానతః ॥13॥

మనోనిగ్రహశాలియై, కోపాన్ని జయించి, పితృదేవతలకు తృప్తి గల్గిస్తూ, వానప్రస్థవిధి ననుసరించి హోమ కార్యాలు నిర్వర్తిస్తూ అక్కడ కాలం గడిపాడు.

అతిథీన్పూజయన్నిత్యం వన్యేన హవిషా విభుః ।
శిలోఞ్ఛవృత్తిమాస్థాయ శేషాన్నకృతభోజనః ॥14॥

నిత్యమూ వనంలో లభించే ఫలాదులు అర్పించి అతిథులను పూజించాడు. పొలాల్లో ధాన్యాన్ని ఏరుకొంటూ, యజ్ఞశేషమైన అన్నాన్ని స్వీకరించేవాడు.

పూర్ణం సహస్రం వర్షాణామేవం వృత్తిరభూన్నృపః ।
అమ్బుభక్షస్స చాబ్దాంస్త్రీనాసీన్నియతవాఙ్మనాః ॥15॥

ఇలా ఆ రాజు వెయ్యేండ్లు ఓపికగా గడిపి, తర్వాత నీరు మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ వాఙ్మనస్సులు నిరోధించి మూడు వత్సరాలు గడిపాడు. (మాసాంస్త్రీన్ = మూడు నెలలు అని యస్. వి. భారతీ ట్రస్టువారి గ్రంథపాఠం)

తతస్తు వాయుభక్షోఽభూత్సంవత్సరమతన్ద్రితః ।
పఞ్చాగ్నిమధ్యే చ తపస్తేపే సంవత్సరం పునః ॥16॥

తదుపరి గాలినే ఆహారంగా స్వీకరిస్తూ ఒక సంవత్సరకాలం పంచాగ్ని మధ్యంలో తపస్సు చేశాడు.

ఏకపాదస్థితశ్చాఽఽసీత్షణ్మాసాననిలాశనః ।
పుణ్యకీర్తిస్తతః స్వర్గం జగామాఽఽవృత్య రోదసీ ॥17॥

అలాగే ఆరు నెలలు గాలి మాత్రమే స్వీకరిస్తూ ఒంటికాలిపై నిలిచి ఉండినాడు. ఆపైన పుణ్యకీర్తి అయిన ఆ రాజు భూమ్యాకాశాలలో తన వైభవాన్ని వ్యాపింపజేసుకొని స్వర్గాన్ని చేరాడు.

శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే యయాతేస్తపశ్చర్యా స్వర్గప్రాప్తిర్నామ పంచత్రింశోఽధ్యాయః ॥35॥

శ్రీమత్స్య మహాపురాణంలోని యయాతిచరిత్రలో యయాతి తపశ్చర్య – స్వర్గప్రాప్తి అనే
ముప్పైఅయిదవ అధ్యాయం సంపూర్ణం

షట్ త్రింశోఽధ్యాయః - ముప్పైఆరవ అధ్యాయం
ఇంద్ర యయాతి సంవాదః - ఇంద్ర యయాతి సంవాదం

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

స్వర్గతస్తు స రాజేన్ద్రో నివసన్దేవసద్మని ।
పూజితస్త్రిదశైస్సాధ్యైర్మరుద్భిర్వసుభిస్తథా ॥1॥

స్వర్గానికి పోయిన ఆ రాజేంద్రుడు అక్కడ దేవ భవనంలో నివసించాడు. అక్కడ అతణ్ణి దేవతలు, సాధ్యులు, మరుత్తులు, అలాగే వసువులు పూజించారు.

దేవలోకాద్బ్రహ్మలోకం సఞ్చరన్పుణ్యకృద్వశీ ।
అవసత్పృథివీపాలో దీర్ఘకాలమితి శ్రుతిః ॥2॥

పుణ్యం కావించినవాడు, మానోనిగ్రహపరుడూ అయిన ఆ రాజు దేవలోకం నుండి బ్రహ్మలోకానికి సంచరిస్తూ చాలా కాలం నివసించాడని ప్రతీతి.

స కదాచిన్నృపశ్రేష్ఠో యయాతిశ్శక్రమాగతః ।
కథాన్తే తత్ర శక్రేణ పృష్టస్స పృథివీపతిః ॥3॥

ఒకసారి యయాతి ఇంద్రనివద్దకు పోయాడు. ఉభయులూ సంభాషణ కొనసాగించిన పిదప ఆ రాజును ఇంద్రు డిలా ప్రశ్నించాడు.

శక్ర ఉవాచ :- ఇంద్రుడు చెప్పాడు.

యదా పూరుస్తవ రూపేణ రాజఞ్జరాం గృహీత్వా ప్రచచార లోకే ।
తదా స రాజ్యం సమ్ప్రదాయైవ తస్మై త్వయా కిముక్తః కథయేహ సత్యమ్. ॥4॥

రాజా! పూరుడు నీ రూపంతో వార్ధక్యం పరిగ్రహించి లోకంలో చరించాడు గదా! అప్పుడు నీవతనికి రాజ్యమిచ్చి ఏమని ఉపదేశించావో నిజం చెప్పు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

ప్రకృత్యనుమతే పూరుం రాజ్యే కృత్వేదమబ్రువమ్ ।
గఙ్గాయమునయోర్మధ్యే కృత్స్నోఽయం విషయస్తవ ।
మధ్యే పృథివ్యాస్త్వం రాజా భ్రాతరోఽన్తేఽధిపాస్తవ ॥5॥

ఇంద్రా! ప్రజల అనుమతితో నేను పూరుణ్ణి రాజ్యంలో ప్రతిష్ఠితుణ్ణి చేసి ఇలా చెప్పాను. "నాయనా! గంగా యమునల మధ్య నున్న ఈ దేశమంతా నీది. ఈ పృథివీ మధ్య భాగానికి నీవు రాజు. నీ సోదరులు ఈ దేశపు సరిహద్దు ప్రాంతాలకు అధిపతు లవుతారు.

అక్రోధనః క్రోధనేభ్యో విశిష్టస్తథా తితిక్షురతితిక్షోర్విశిష్టః ।
అమానుషేభ్యో మానుషశ్చ ప్రధానో విద్వాంస్తథైవావిదుషః ప్రధానః ॥6॥

కోపం కలవారికంటె కోపరహితుడు విశిష్టుడు. సహనంలేని వానికంటె అది కలవాడు శ్రేష్ఠుడు. మనుష్యులు కాని ప్రాణులకంటె మనుష్యుడు ప్రధానుడు. పండితుడు కానివానికంటె పండితుడు ముఖ్యుడు.

ఆక్రుశ్యమానో నాక్రోశేన్మన్యురేవం తితిక్ష్యతే ।
ఆక్రోష్టారం నిర్దహతి సుకృతం చాస్య విన్దతి ॥7॥

నిందింపబడినవాడు నిందించినవానిని తిరిగి నిందించరాదు. అలా చేస్తే కోపం నిగ్రహించబడుతుంది. ఆ కోపం నిందించినవారిని దహిస్తుంది. వీడు ఆ నిందించిన వాని సుకృతాన్ని గూడా పొందుతాడు.

నారున్తుదస్స్యాన్న నృశంసవాదీ న హీనతః పరమప్యాదదీత ।
యయాఽస్య వాచా పర ఉద్విజేత న తాం వదేద్రుశతీం పాపలౌల్యామ్ ॥8॥

ఇతరులకు బాధ కల్గించువాడు కారాదు. క్రూరవచనాలు పలుకరాదు. హీనుని నుండి గొప్ప వస్తువు గ్రహించరాదు. ఇతరునికి ఉద్వేగం కల్గించే పాపభూయిష్ఠమైన మాట పలుకరాదు.

అరున్తుదం పరుషం తీక్ష్ణవాచం వాక్కంటకైర్వితుదన్తం మనుష్యాన్ ।
విద్యాదలక్ష్మీకతమం జనానాం ముఖే నిబద్ధం నిరృతిం వహన్తమ్ ॥9॥

ఇతరులకు బాధ కలిగిస్తూ నిందావాక్యాలు పలికేవాడు, మాటలనే ముళ్ళతో మనుష్యులను హింసించేవాడూ, జనులలో పరమ దరిద్రుడు. వాడు పిశాచిని నోట వహించువాడు.

సద్భిః పురస్తాదభిపూజితస్స్యాత్సద్భిస్తథా పృష్ఠతో రక్షితస్స్యాత్ ।
సదా సతామతివాదాంస్తితిక్షేత్సతాం వృత్తం పాలయన్సాధువృత్తః ॥10॥

సజ్జనుల నడవడిని పాలించేవాడగు సాధువర్తనుడు సజ్జనులచే ముందూ పూజింపబడతాడు, వెనుకా పూజింపబడుతాడు, సజ్జనుల అతివాదాలను సదా సహించాలి.

వాక్సాయకా వదనాన్నిష్పతన్తి తైరాహతశ్శోచతి వా త్ర్యహాని ।
పరస్య నో మర్మసు తే పతన్తి తాన్పణ్డితో నావసృజేత్పరేషు ॥11॥

దుర్జనుల వదనంనుండి వెలువడే మాటలనే బాణాలు తగిలితే మూడు దినాలు శోకం కల్గిస్తాయి. ఇతరుల మర్మాలను తాకే మాటలను పండితుడు ఇతరుల పట్ల ప్రయోగించరాదు.

నాస్తీదృశం సంవననం త్రిషు లోకేషు కిఞ్చన ।
యథా మైత్రీ న లోకేషు దానం చ మధురా చ వాక్ ॥12॥

లోకుల పట్ల మైత్రి, దానం, మధురవచనం వంటి ఇతరులను తనవైపు త్రిప్పుకొను మార్గం ముల్లోకాలలోనూ మరొకటి లేదు.

తస్మాత్సాన్త్వం సదా వాచ్యం న వాచ్యం పరుషం క్వచిత్ ।
పూజ్యాన్సంపూజయేద్దద్యాన్నాభిశాపం కదాచన ॥13॥

అందువల్ల సాన్త్వవచనాలు పలకాలే గాని ఎక్కడా పరుషవచనాలు పలుకరాదు. పూజ్యులను పూజించాలి. వారిపట్ల అభిశాపవచనాలు పలుకరాదు.

శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే ఇంద్రయయాతి సంవాదో నామ షట్త్రింశోఽధ్యాయః ॥ 36 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని యయాతిచరిత్రలో ఇంద్రయయాతి సంవాదమనే ముప్పైఆరవ అధ్యాయం సంపూర్ణం

సప్తత్రింశోఽధ్యాయః - ముప్పై ఏడవ అధ్యాయం

యయాత్యష్టక సంవాదః - యయాతి-అష్టకుల సంవాదం

ఇన్ద్ర ఉవాచ :- ఇంద్రుడు చెప్పాడు.

సర్వాణి కర్మాణి సమాప్య రాజన్గృహాన్పరిత్యజ్య వనం గతోఽసి ।
తత్త్వాం పృచ్ఛామి నహుషస్య పుత్ర! కేనాపి తుల్యస్తపసా యయాతే! ॥1॥

రాజా! అన్ని కార్యాలు పూర్తి చేసి గృహం వదలి అరణ్యానికి వెళ్ళావు. నహుషపుత్రా! యయాతీ! నేను నిన్ను అడుగుతున్నాను, తపస్సులో ఎవరితోనైనా నీవు సమానుడవా?

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

నాహం దేవమనుష్యేషు న గన్ధర్వమహర్షిషు ।
ఆత్మనస్తపసా తుల్యం కఞ్చిత్పశ్యామి వాసవ! ॥2॥

వాసవా! దేవతలలో, మనుష్యులలో, గంధర్వులలో, మహర్షులలోనూ, తపస్సులో నాతో సమానుడైన మరొకణ్ణి చూడలేదు.

ఇన్ద్ర ఉవాచ :- ఇంద్రుడు చెప్పాడు.

యదాఽవమంస్థాః సదృశశ్శ్రేయసశ్చ పాపీయసశ్చావిదితప్రభావః ।
తస్మాల్లోకా హ్యన్తవన్తస్తవేమే క్షీణే పుణ్యే పతితోఽస్యద్య రాజన్! ॥3॥

రాజా! వారి వారి ప్రభావం తెలియకనే నీవు నీతో సములనూ, అధికులనూ, పాపాత్ములనూ, తక్కువ వారని అవమానించావు. అందువల్ల నీ లోకాలు నశించిపోయాయి. రాజా! పుణ్యం క్షీణమై నీవు నేడు పతనం చెందావు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

సురర్షిగన్ధర్వనరావమానాత్ క్షయం గతా మే యది శక్ర! లోకాః ।
ఇచ్ఛామ్యహం సురలోకాద్విహీనస్సతాం మధ్యే పతితుం దేవరాజ! ॥4॥

దేవరాజా! ఇంద్రా! సురలనూ, ఋషులనూ, గంధర్వులనూ, నరులనూ అవమానించడం వల్ల నా లోకాలు క్షీణమయ్యే పక్షంలో, నేను సురలోకంనుండి తొలగి సజ్జనుల మధ్యలో పడాలని కోరుకొంటున్నాను.

ఇన్ద్ర ఉవాచ :- ఇంద్రుడు చెప్పాడు.

సతాం సకాశే పతితోఽసి రాజంశ్చ్యుతః ప్రతిష్ఠాం యత్ర లబ్ధాఽసి భూయః ।
ఏవం విదిత్వా తు పునర్యయాతే న తేఽవమాన్యాస్సదృశశ్శ్రేయసశ్చ ॥5॥

రాజా! ఇక్కడనుండి పోయి సజ్జనుల మధ్యలో పడుతావు. అక్కడ మరల ప్రతిష్ఠ పొందగలవు. యయాతీ! ఇది గ్రహించి మళ్ళీ నీతో సములనూ, నీకంటే పెద్దలనూ అవమానించవద్దు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

తతః పపాతామరరాజజుష్టాత్పుణ్యాల్లోకాత్పతమానం యయాతిమ్ ।
సమ్ప్రేక్ష్య రాజర్షివరోఽష్టక స్తమువాచ సద్ధర్మవిధానగోప్తా ॥6॥

అంతట యయాతి దేవరాజభోగ్యమైన అమర లోకంనుండి పడిపోయాడు. అలా పడే యయాతిని అష్టకుడనే రాజర్షి చూచాడు. చూచి మంచి ధర్మవిధానాన్ని రక్షించే అష్టకు డతనితో ఇలా అన్నాడు.

అష్టక ఉవాచ :– అష్టకుడు చెప్పాడు.

క స్త్వం యువా వాసవతుల్యరూపస్స్వతేజసా దీప్యమానో యథాఽగ్నిః ।
పతస్యుదీర్ణామ్బుధరాంధకారాత్ఖాత్ఖేచరాణాం ప్రవరో యథాఽర్కః ॥7॥

యువకుడవు, ఇంద్రునితో సమానమైన రూపం కల్గినవాడవు, అగ్నివలె తేజస్సుతో ప్రకాశించేవాడవు, మేఘావరణంతో విజృంభించిన అంధకారం వ్యాపించిన ఆకాశంనుండి గ్రహశ్రేష్ఠుడయిన సూర్యునిలాగా పడుతున్నావు. నీవు ఎవడవు?

దృష్ట్వా చ త్వాం సూర్యపథాత్పతన్తం వైశ్వానరార్కద్యుతిమప్రమేయమ్ ।
కిన్నుస్విదేతత్పతతీవ సర్వే వితర్కయన్తః పరిమోహితా స్మః ॥8॥

సూర్యుని వంటి, అగ్నివంటి తేజం కల్గి అప్రమేయుడవై సూర్యమార్గంనుండి పడుతున్న నిన్ను చూచి 'ఆ పడే పదార్థం ఏమైయుంటుంది?, అని అందరమూ వితర్కించుకొంటూ పరిపరివిధాల మోహితుల మయ్యాము.

దృష్ట్వా చ త్వాఽధిష్ఠితం దేవమార్గే శక్రార్కవిష్ణుప్రతిమప్రభావమ్ ।
ప్రత్యుద్గతాస్త్వాం వయమేవ సర్వే తస్మాత్పాతే తవ జిజ్ఞాసమానాః ॥9॥

ఇంద్రుడు, సూర్యుడు, విష్ణువువంటి ప్రభావం కల్గి దేవమార్గము నధిష్ఠించి వున్న నిన్ను చూచి మేమందరం నీ పతనం గురించి తెలుసుకోగోరి నీకు అభిముఖంగా లేచి వచ్చాము.

న చాపి త్వాం ధృష్ణవః ప్రష్టుమగ్రే న చ త్వమస్మాన్పృచ్ఛసి కే వయం స్మ ।
తత్త్వాం పృచ్ఛామి స్పృహణీయరూపం కస్య త్వం వా కిం నిమిత్తం త్వమాగాః ॥10॥

నిన్ను గూర్చి ముందుగా అడిగే ధైర్యం మాకు లేదు. మేమెవరమో నీవూ అడగడం లేదు. కోరదగిన రూపం కల నిన్ను నేను 'నీ వెవరివాడవు? ఏల ఇలా వస్తున్నావు?" అని అడుగుతున్నాను.

భయం తు తే వ్యేతు విషాదమోహౌ త్యజాఽఽశు దేవేంద్రసమానరూప! ।
త్వాం వర్తమానం హి సతాం సకాశే శక్రో న సోఢుం బలహాఽపి శక్తః ॥11॥

నీకు భయం తొలగుగాక! విషాద మోహాలు వదలిపెట్టు. దేవేంద్రునితో సదృశమైన రూపం కలవాడా! నీ విప్పుడు సజ్జనుల సన్నిధిలో ఉన్నావు. నిన్ను బలాసురుని చంపిన ఇంద్రుడు కూడా ఎదురుకోలేదు.

సన్తః ప్రతిష్ఠా హి సుఖచ్యుతానాం సతాం సదైవామరరాజకల్ప! ।
తే సజ్గతాస్థావరజజ్గమేశాః ప్రతిష్ఠితస్త్వం సదృశేషు సత్సు ॥12॥

అమరేంద్ర సదృశుడా! సుఖానికి దూరమైన సజ్జనులకు ఎల్లవేళలా సజ్జనులే ఆధారం. వారు అన్యోన్యం కలుసుకొన్నపుడు స్థావరజంగమాలకు ప్రభువులు కాగలరు. ఆ సాధువులలో నీవు ఇపుడు నెలకొని ఉన్నావు.

ప్రభురగ్నిః ప్రతపనే భూమిరావపనే ప్రభుః ।
ప్రభుస్సూర్యః ప్రకాశే చ సతాం చాభ్యాగతః ప్రభుః ॥13॥

మండుటలో సమర్థుడు అగ్ని, బీజావాపం చేయడానికి భూమి సమర్థమైనది. ప్రకాశానికి సూర్యుడే సమర్థుడు, సజ్జనులకు అభ్యాగతుడే ప్రభువు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే యయాత్యష్టకసంవాదో నామ
సప్తవింశతితమోఽధ్యాయః ॥37॥

శ్రీమత్స్య మహాపురాణంలోని యయాతిచరిత్రలో యయాతి అష్టకులసంవాదమనే

ముప్పైఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టత్రింశోఽధ్యాయః - ముప్పైఎనిమిదవ అధ్యాయం
యయాత్యష్టక సంవాదః - యయాతి-అష్టకుల సంవాదం

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

అహం యయాతిర్నహుషస్య పుత్త్రః పూరోః పితా సర్వభూతావమానాత్ ।
ప్రభ్రంశితోఽహం సురసిద్ధలోకాత్ పరిచ్యుతః ప్రపతామ్యల్పపుణ్యః ॥1॥

నేను నహుషుని పుత్రడనగు యయాతిని. పూరుని తండ్రిని. సకల ప్రాణుల నవమానించడంవల్ల సురసిద్ధలోకంనుండి భ్రష్టుడనయ్యాను. అల్పపుణ్యుడనై జారి పడుతున్నాను.

అహం హి పూర్వో వయసా భవద్భ్యస్తేనాభివాదం భవతాం న యుంజే ।
యో విద్యయా తపసా జన్మనా వా వృద్ధస్స వై సంభవతి ద్విజానామ్ ॥2॥

నేను వయస్సులో మీకంటె పెద్దను. అందువల్ల మీకభివాదం చేయను, ద్విజులలో విద్య చేతగానీ, తపస్సు చేతగానీ, జన్మచే గానీ ఎవడు వృద్ధుడో, అతడే పూజ్యుడు.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

అవాదీస్త్వం వయసాఽస్మి ప్రవృద్ధ ఇతి వై రాజన్నధికః కథంచిత్।
యో వై విద్వాంస్తపసా సమ్ప్రవృద్ధస్స ఏవ పూజ్యో భవతి ద్విజానామ్ ॥3॥

రాజా! నీవు వయస్సులో పెద్దనని, అందుచేత అధికుడనని అన్నావు. కాని, నీవెలా అధికుడవౌతావు? ద్విజులలో ఎవడు విద్వాంసుడో, తపస్సుచే పెద్దవాడో, అతడే పూజ్యుడవుతాడు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

ప్రతికూలం కర్మణాం పాపమాహుస్తద్వర్తినాం ప్రవణః పాపలోకః ।
సన్తోఽసతో నానువర్తన్తి తే వై యదాత్మనైషాం ప్రతికూలవాదీ ॥4॥

కర్మలలో ప్రతికూలమైనదాన్ని పాపమంటారు. పాపాచారం కలవారికి పాపలోక ప్రాప్తి కల్గుతుంది. సజ్జనులు దుర్జనుల మార్గాన్ని అనుసరించరు. అందువల్లనే వారి కతడు ప్రతికులవాది.

అభూద్ధనం మే విపులం మహద్వై విచేష్టమానో నాధిగన్తా తదస్మి ।
ఏవం ప్రధార్యాత్మహితే నివిష్టో యో వర్తతే స విజానాతి ధీరః ॥5॥

పూర్వం నాకు ఎంతో పుణ్య ధనముండేది. కుచేష్టలచే దానిని పోగొట్టుకొన్నాను. ఈ సత్యం గ్రహించి ఆత్మహితమున ప్రవర్తించు ధీరుడు నిజంగా విజ్ఞుడు.

నానాభావా బహవో జీవలోకే దైవాధీనా నష్టచేష్టాధికారాః ।
తత్త్రప్రాప్య న విహన్యేత ధీరో దిష్టం బలీయ ఇతి మత్వాఽఽత్మబుద్ధ్యా ॥6॥

ఈ జీవలోకంలో నానాస్వభావాలు గల జీవులున్నారు. వారందరూ దైవాని కధీనులే. అందువల్లనే వారి చేష్టలు, అధికారాలు నశించిపోయాయి. అందువల్ల ధీరుడు ఆత్మబుద్ధితో దైవం బలీయమైనదని గ్రహించి, సుఖదుఖాలలో చలించకుండా ఉండాలి.

సుఖం హి జన్తుర్యది వాऽపి దుఃఖం దైవాధీనం విన్దతి నాత్మశక్త్యా ।
తస్మాద్దిష్టం బలవన్మన్యమానో న సఞ్జ్వరేన్నాపి హృష్యేత్కదాచిత్ ॥7॥

ప్రాణి దైవాధీనమైన సుఖమో, దుఃఖమో పొందుతాడు. అది ఆత్మశక్తితో సిద్ధించదు. అంచేత దైవం బలవంతమైనదని భావించువానికి ఎపుడూ దుఃఖించడం, సంతోషించడం తగదు.

దుఃఖే న తప్యేత సుఖే న హృష్యేత్సమేన వర్తేత సదైవ ధీరః ।
దిష్టం బలీయ ఇతి మన్యమానో న సఞ్జ్వరేన్నాపి హృష్యేత్కదాచిత్ ॥8॥

దుఃఖం కల్గితే తపించరాదు, సుఖం కల్గితే హర్షించరాదు. సదా ధీరుడైనవాడు సమభావంతో ఉండాలి. దైవం బలీయమని గ్రహించి శోకహర్షాలకు గురి కారాదు.

భయే న ముహ్యామ్యష్టకాహం కదాచిత్సన్తాపో మే మనసో నాస్తి కశ్చిత్ ।
ధాతా యథా మాం విదధాతి లోకే ధ్రువం తథాऽహం భవితేతి మత్వా ॥9॥

అష్టకా! భయం కల్గినా నేను ఎప్పుడూ మోహానికి గురికాను. నా చిత్తాని కే సంతాపమూ లేదు. విధాత లోకంలో నన్నెలా ఉంచా లనుకొంటాడో, నేను అలాగే ఉంటానని భావించి అలా ఉండిపోతున్నాను.

సంస్వేదజా హ్యండజా హ్యుద్భిదశ్చ సరీసృపాః క్రిమయోऽప్యప్సు మత్స్యాః ।
తథాऽశ్మానస్తృణకాష్ఠం చ సర్వం దిష్టక్షయే స్వాం ప్రకృతిం భజన్తే ॥10॥

అనిత్యతాం సుఖదుఃఖస్య బుద్ధ్వా కస్మాత్సన్తాపమష్టకాహం భజేయమ్ ।
కిం కుర్యాం వై కిఞ్చ కృత్వా న తప్యే తస్మాత్సన్తాపం వర్జయామ్యప్రమత్తః ॥11॥

స్వేదజాలు, అండజాలు, ఉద్భిజ్జాలు, సరీసృపాలు, క్రిములు, నీటిలోని చేపలు, అలాగే! రాళ్లు, తృణాలు కట్టెలు– ఇదంతా దైవబలం క్షీణించగానే తమ సహజావస్థ పొందుతుంటాయి. అష్టకా! సుఖదుఃఖాలు అనిత్యాలని తెలిసీ నేనెందుకు సంతాపం చెందాలి? నేనేమి చేయగలను? ఏమి చేసి తపించను? అందువల్ల జాగరూకుడనై సంతాపాన్ని త్యజిస్తున్నాను.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

ఏవం బ్రువాణం నృపతిం యయాతిమథాష్టకః పునరేవాన్వపృచ్ఛత్ ।
మాతామహం సర్వగుణోపపన్నం యత్ర స్థితం స్వర్గలోకే యథావత్ ॥12॥

మాతామహుడు, సర్వగుణసంపన్నుడూ, స్వర్గలోకంలో ఉండినవాడూ – అయిన యయాతి అలా చెప్పగా, అష్టకు దతణ్ణి మళ్ళీ ఇలా ప్రశ్నించాడు.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

యే యే లోకాః పార్థివేన్ద్ర ప్రధానాస్త్వయా భుక్తా యం చ కాలం యథా చ ।
తన్మే రాజన్బ్రూహి సర్వం యథావత్ క్షేత్రజ్ఞవద్భాషసే త్వం హి ధర్మమ్ ॥13॥

రాజేంద్రా! నీవు ఏయే ప్రధానమైన లోకాలలో ఉన్నావు? ఎంతకాలం ఎలా అక్కడ సుఖా లనుభవించావు? నీవు క్షేత్రజ్ఞునిలాగా మాట్లాడుతున్నావు కాన నా కదంతా ఉన్నదున్నట్లు వివరించు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

రాజాఽహమాసం త్విహ సార్వభౌమస్తతో లోకాన్మహతశ్చార్జయం వై ।
తత్రావసం వర్షసహస్రమాత్రం తతో లోకాన్పరమానభ్యుపేతః ॥14॥

తతః పురీం పురుహూతస్య రమ్యాం సహస్రద్వారాం శతయోజనాన్తామ్ ।
అధ్యావసం వర్షసహస్రమాత్రం తతో లోకాన్ పరమానభ్యుపేతః ॥15॥

"నేనిక్కడ సార్వభౌముడైన రాజై ఉండినాను. తదుపరి గొప్పలోకాలను ఆర్జించాను. అక్కడ వేయ్యేండ్లు నివసించాను. ఆపై పరమలోకాలు పొందాను. ఆపై ఇంద్రుని రమ్యమైన నగరం చేరాను. అది వెయ్యి ద్వారాలు గలది, శతయోజన విస్తీర్ణమైనది. అక్కడ వెయ్యేండ్లు ఉన్నాను. ఆపై ఇంకా ఉన్నతమైన లోకాలు చేరాను.

తతో దివ్యమజరం ప్రాప్య లోకం ప్రజాపతేర్లోకపతేర్దురాపమ్ ।
తత్రావసం వర్షసహస్రమాత్రం తతో లోకాన్పరమానభ్యుపేతః ॥16॥
దేవస్య దేవస్య నివేశనే చ విజిత్య లోకానవసం యథేష్టమ్ ।
సమ్పూజ్యమానస్త్రిదశైస్సమస్తైస్తుల్యప్రభావద్యుతిరీశ్వరాణామ్ ॥17॥

ఆపై ప్రజాపతికీ, లోకాపాలకులకూ గూడా దుర్లభమైన దివ్యలోకం పొందాను. అక్కడ ముసలితనం ఉండదు. అక్కడ వెయ్యేండ్లుండి ఇంకా ఉన్నతలోకాలు పొందాను. దేవదేవుడైన బ్రహ్మయొక్క లోకం జయించి యథేచ్ఛగా అక్కడ నివసించాను. దేవతలందరూ నన్ను పూజిస్తుండగా ఈశ్వరసదృశప్రభావం కల్గి అక్కడ ఉండినాను.

తథాఽవసం నన్దనే కామరూపీ సంవత్సరాణామయుతం శతానామ్ ।
సహాప్సరోభిర్విచరన్పుణ్యగన్ధాన్ పశ్యన్నగాన్పుష్పితాంశ్చారురూపాన్ ॥18॥

అట్లే నందన వనంలో కామరూపినై అచ్చరలతో విహరిస్తూ, సువాసన గల పుష్పిత వృక్షాలను చూస్తూ పదిలక్షల సంవత్సరాలు (10,000 x 100) అక్కడ ఉన్నాను.

తత్ర స్థితం మాం దేవసుఖేషు సక్తం కాలేఽతీతే మహతి తతోఽతిమాత్రమ్ ।
దూతో దేవానామబ్రవీదుగ్రరూపో ధ్వంసేత్యుచ్చై స్త్రిః ప్లుతేన స్వరేణ ॥19॥

అలా నేనక్కడే చాలా కాలం దేవసుఖాలలో ఆసక్తి గలి ఉండిపోయాను. ఆపై దేవదూత నా వద్దకు వచ్చి- ఉచ్చైఃస్వరంతో 'పతనం పొందుము' అని మూడుసార్లు అన్నాడు.

ఏతావన్మే విదితం రాజసింహ! తతో భ్రష్టోఽహం నన్దనాత్ క్షీణపుణ్యః ।
వాచోఽశ్రౌషం చాన్తరిక్షే సురాణామనుక్రోశాచ్ఛోచతాం మాం నరేన్ద్ర! ॥20॥

రాజశ్రేష్ఠా! అంత వరకూ నాకు ఎఱుక గల్గియుండినది. ఆపై పుణ్యం క్షయించి నేను నందనంనుండి పతనం పొందాను. నరేంద్రా! అప్పుడు అంతరిక్షంలో దేవతలు, నాకై శోకించి నన్నుద్దేశించి పలికిన సానుభూతి వచనాలు నాకు ఇలా వినిపించాయి.

అకస్మాద్వై క్షీణపుణ్యో యయాతిః పతత్యసౌ పుణ్యకృత్పుణ్యకీర్తిః ।
తానబ్రువం పాత్యమాన స్తదాఽహం సతాం మధ్యే నిపతేయం కథం ను ॥21॥

"పుణ్యకర్త, పుణ్యకీర్తి అయిన ఈ యయాతి అకస్మాత్తుగా పుణ్యం క్షీణించినవాడై పడిపోతున్నాడు". అప్పుడలా పడిపోతున్న నేను వారినుద్దేశించి "సజ్జనుల మధ్య ఎలా పడగలను" అని అన్నాను.

తైరాఖ్యాతాం భవతాం యజ్ఞభూమిం సమీక్ష్య చైనామహమాగతోఽస్మి ।
హవిర్గన్ధైర్దర్శితాం యజ్ఞభూమిం ధూమాపాఙ్గం పరిగృహ్య ప్రతీతామ్ ॥22॥

వారప్పుడు మీ యజ్ఞభూమిని నాకు నిర్దేశించారు. ఈ యజ్ఞభూమి ధూమాగ్రం కల్గి హవిర్గంధంచేత గుర్తింపదగివున్నది. దాన్ని చూచి నేనిక్కడికి వచ్చాను.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే యయాత్యష్టక సంవాదో నామ అష్టత్రింశతితమోఽధ్యాయః ॥ 38॥

శ్రీమత్స్యపురాణంలోని యయాతి చరిత్రలో యయాతి అష్టకుల సంవాదమనే ముప్పైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనచత్వారింశోఽధ్యాయః - ముప్పైతొమ్మిదవ అధ్యాయం

యయాత్యష్టక సంవాదః - యయాతి-అష్టకుల సంవాదం

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

యదావసన్నన్దనే కామరూపీ సంవత్సరాణామయుతం శతానామ్ ।
కిం కారణం కార్తయుగప్రధాన! హిత్వా తద్వై వసుధామన్వపద్యః ॥1॥

కృతయుగ రాజులలో ముఖ్యుడవైన యయాతీ! నందనవనంలో కామరూపివై పదిలక్షల సంవత్సరాలు నివసించిన నీవు హఠాత్తుగా దాన్ని వీడి భూలోకానికి రావడానికి కారణమేమి?

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

జ్ఞాతిస్సుహృత్స్వజనో యో యథేహ క్షీణే విత్తే మానవైస్త్యజ్యతే హి ।
తథా స్వర్గే క్షీణపుణ్యం మనుష్యం త్యజన్తి సద్యఃఖేచరా దేవసఙ్ఘాః ॥2॥

ఈ లోకంలో దాయాది, మిత్రుడు, తనవాడు, ఎవడైనా ధనహీనుడైతే మనుజులు వాణ్ణి త్యజిస్తారు. అలాగే స్వర్గంలో పుణ్యం క్షీణించిన వాణ్ణి ఖేచరులగు దేవసంఘాలు వెంటనే త్యజిస్తాయి.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

కథం తస్మిన్ క్షీణపుణ్యా భవన్తి సంముహ్యతే మేఽత్ర మనోఽతిమాత్రమ్ ।
కిం విశిష్టాః కస్య ధామోపయాన్తి తద్వై బ్రూహి క్షేత్రవిత్త్వం మతో మే ॥3॥

ఆ లోకంలోనివారు ఎలా క్షీణపుణ్యు లవుతారు? ఈ విషయంలో నా చిత్తం సమ్మోహం పొందుతున్నది. నీవు క్షేత్రజ్ఞుడవని నేను భావిస్తాను. ఏమేమి కలవారు ఎక్కడెక్కడికి చేరుకొంటారు? ఆ సంగతి వివరించు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

ఇమం భౌమం నరకం తే పతన్తి లాలప్యమానా నరదేవ! సర్వే ।
తే కఙ్కగోమాయు పలాశనార్థం క్షితౌ వివృద్ధిం బహుధా ప్రయాన్తి ॥4॥

రాజా! తమ గొప్పతనాన్ని ప్రశంసించుకొనే వారెల్లరు ఈ భౌమమైన నరకంలో పడిపోతారు. వారు నానా ప్రాణులుగా వృద్ధిపొంది భూలోకంలో గ్రద్దలు, నక్కలు, మొదలగు జంతువుల ఆహారార్థం వృద్ధి పొందుతారు.

తస్మాదేవం వర్జనీయం నరేన్ద్ర దుష్టం లోకే గర్హణీయం చ కర్మ ।
ఆఖ్యాతం తే పార్థివ సర్వమేతత్ భూయశ్చేదానీం వద కిం తే వదామి ॥5॥

అందుచేత రాజా! ఈ లోకంలో నింద్యమైన చెడ్డపని చేయరాదు. నీకీవిషయమంతా చెప్పాను. మళ్లీ ఇప్పుడేమి చెప్పాలో చెప్పు.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

యథా తు తాన్ వితుదన్తే వయాంసి తథా గృధ్రాశ్శితికణ్ఠాః పతఙ్గాః ।
కథం భవన్తి కథం మా భవన్తి త్వత్తో భౌమం నరకమహం శృణోమి ॥6॥

పక్షులు, గ్రద్దలు, నెమళ్లు వగైరాలు వారిని భక్షించినప్పుడు వారు ఏమవుతారో, ఎలా ఉంటారో, ఎలా ఉండరో నీనుండి నేను భౌమనరకాన్ని గూర్చి వినగోరుతున్నాను.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

ఊర్ధ్వం దేహాత్కర్మణో జృమ్భమాణాద్వ్యక్తం పృథివ్యామనుసఞ్చరన్తి ।
ఇమం భౌమం నరకం తే పతన్తి నావేక్షన్తే వర్షపూగాననేకాన్ ॥7॥

కర్మప్రభావం వల్ల జనించిన దేహం కారణంగా జీవులు భూమిపై సంచరిస్తారు. ఈ భౌమనరకంలో పడినవారు అనేక సంవత్సరాలవరకు కాలం తెలియకుండానే గడపుతారు. వెనుదిరిగి చూడరు.

షష్టిం సహస్రాణి పతన్తి వ్యోమ్ని తథాఽశీతిం పరిసంవత్సరాణి ।
తాన్వై తుదన్తే పతతః ప్రపాతం భీమా భూమౌ రాక్షసాస్తీక్ష్ణదంష్ట్రాః ॥8॥

అరవై వేల ఎనుబది వత్సరాల వరకు స్వర్గంలో ఉండి తరువాత భూమిపై పడిపోతారు. తీక్ష్ణమైన కోరలు గల భీకర రాక్షసులు అలా పడేవారిని బాధిస్తారు.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

యదేతాంస్తే సమ్పతతస్తుదన్తి భీమా భౌమా రాక్షసాస్తీక్ష్ణదంష్ట్రాః ।
కథం భవన్తి కథం మా భవన్తి కథమ్భూతా గర్భభూతా భవన్తి ॥9॥

ఆ రాక్షసులు బాధించేటప్పుడు వారేమవుతారు? ఎలా జీవిస్తారు? గర్భంనుండి ఎలా వెలికి వస్తారు?

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

అసృగ్రేతః పుష్పరసానుయుక్తమన్వేతి సద్యః పురుషేణ సృష్టమ్ ।
తద్వై తస్యా రజ ఆపద్యతే చ స గర్భభూతస్సముపైతి తత్ర ॥10॥

పురుషుడు వదలిన తేజస్సు స్త్రీ యొక్క రజోరక్తంతో స్త్రీ రక్తంలో ప్రవేశిస్తుంది. అలా జీవుడు రజస్సును చేరుతాడు. అక్కడ గర్భరూపం పొందుతాడు.

వనస్పతీనోషధీంశ్చాఽఽవిశన్తి అపో వాయుం పృథివీం చాన్తరిక్షమ్ ।
చతుష్పదం ద్విపదం చాపి సర్వమేవంభూతా గర్భభూతా భవన్తి ॥11॥

మరికొందరు జీవులు వనస్పతులనూ, ఓషధులనూ, జలమునూ, వాయువునూ, భూమినీ, పృథివినీ, అంతరిక్షాన్నీ నాల్గు పాదాలు, రెండు పాదాలు గల ప్రాణులనూ ప్రవేశిస్తారు.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

అన్యద్వపుర్విదధాతీహ గర్భ ఉతాహోస్విత్స్వేన కామేన యాతి ।
ఆపద్యమానో నరయోనిమేతామాచక్ష్వ మే సంశయాత్పృచ్ఛతస్త్వమ్ ॥12॥

శరీరభేదాదిసముచ్ఛ్రయాంశ్చ చక్షుఃశ్రోత్రే లభతే కేన సంజ్ఞామ్ ।
ఏతత్త్వం నస్సర్వమాచక్ష్వ పృష్టః క్షేత్రజ్ఞం త్వాం తాత మన్యామ సర్వే॥ 13

రాజా! మనుజలోకంలో జీవులు ఆ యా శరీరాలను పొందడానికి వారి సంకల్పం కారణమా? లేక మరొక హేతువు కలదా? ఎందువల్ల హెచ్చుతగ్గులు గల నానాశరీరాలను, చక్షుఃశ్రోత్రాదులగు ఇంద్రియభేదాలను పొందుతున్నారు? ఈ విషయాలు నాకు చెప్పు. మేము నిన్ను క్షేత్రజ్ఞుడవని భావిస్తున్నాము.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

వాయుస్సముత్కర్షతి గర్భయోనిమృతౌ రేతః పుష్పరసానుయుక్తమ్ ।
స తత్ర తన్మాత్రకృతాధికారః క్రమేణ సంవర్ధయతీహ గర్భమ్ ॥14॥

ఋతుకాలంలో పుష్పరసంతో కూడిన గర్భయోనిని వాయువు ఆకర్షిస్తుంది. అది అక్కడ క్రమంగా ఆయా రూపాలతోడి గర్భాన్ని వృద్ధి పొందిస్తుంది.

స జాయమానోఽథ గృహీతమాత్రః సంజ్ఞామధిష్ఠాయ తతో మనుష్యః ।
స శ్రోత్రాభ్యాం వేదయతీహ శబ్దం స వై రూపం పశ్యతి చక్షుషా చ ॥15॥

ఘ్రాణేన గన్ధం జిహ్వయాఽథో రసం చ త్వచా స్పర్శం మనసా దేవభావమ్ ।
ఇత్యష్టకేహోపచితం హి విద్ధి మహాత్మనః ప్రాణభృతశ్శరీరే ॥16॥

ఆపై జీవుడు వ్యక్తమై అంగాలు స్పష్టంగా ఆవిర్భవించగా అనుభవజ్ఞానం పొందుతాడు. పిదప ప్రాణధారియైన జీవుని శరీరంలో చెవులతో శబ్దాన్నీ, కంటితో రూపాన్నీ, ఘ్రాణంతో గంధాన్నీ, జిహ్వతో రసాన్నీ, చర్మంతో స్పర్శాన్నీ, మనసుతో దేవత్వాన్నీ పొందుతాడు. ఇలా అవయవాలన్నీ రూపొందుతాయి. అష్టకా! ప్రాణియొక్క దేహం ఇలా వృద్ధి పొందుతుంది.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

యస్సంస్థితః పురుషో దహ్యతే వా నిఖన్యతే వాఽపి నికృష్యతే చ ।
అభావభూతస్స వినాశమేత్య కేనాऽऽత్మానం చేతయతే పురస్తాత్ ॥17॥

మనుజుడు చనిపోయినపుడు శరీరాన్ని పూడ్చడమో, దహించడమో, ప్రాణులు తినడమో జరుగుతుంది. అలా అది నశించి రూపులేనిదై ఆపైన తన్ను తాను చేతనపదార్థంగా ఎలా వ్యక్తం చేసుకొంటుంది?

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

హిత్వా సోఽసూన్సుప్తవన్నిష్ఠితత్వాత్ పురోధాయ సుకృతం దుష్కృతం చ ।
అన్యాం యోనిం పుణ్యపాపానుసారం హిత్వా దేహం భజతే రాజసింహ! ॥18॥

రాజశ్రేష్ఠా! మరణించినవాడు ప్రాణాలు వదలి దేహం వీడి సుప్తునివలె ఉంటాడు. సుకృతాన్నో దుష్కృతాన్నో ముందుంచుకొని పుణ్యపాపానుగుణమైన మరొక యోనిని పొందుతాడు.

పుణ్యాం యోనిం పుణ్యకృతో విశన్తి పాపాం యోనిం పాపకృతో వ్రజన్తి ।
కీటాః పతఙ్గాశ్చ భవన్తి పాపాన్ న మే వివక్షాఽస్తి మహానుభావ! ॥19॥

పుణ్యం చేసినవారు పుణ్యయోనినీ, పాపం చేసినవారు పాపయోనినీ పొందుతారు. పాపంవల్ల కీటకాలుగా, పక్షులుగా గూడా జనిస్తారు. మహానుభావా! వాటినంతా వివరించే ఉద్దేశం నాకు లేదు.

చతుష్పదా ద్విపదాష్షట్పదాశ్చ తథాభూతా గర్భభూతా భవన్తి ।
ఆఖ్యాతమేతన్నిఖిలేన సర్వం భూయస్తు కిం పృచ్ఛసి రాజసింహ! ॥20॥

నాల్గుకాళ్ల జంతువులు, రెండుకాళ్ల ప్రాణులు, ఆరుకాళ్లు గల ప్రాణులు ఇలా ఆ యా గర్భరూపాలు గల వారవుతారు. ఇదంతా మీకు చెప్పాను. రాజవర్యా! మళ్ళీ ఏమి అడుగనున్నావు?

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

కింస్విత్కృత్వా లభతే తాత సంజ్ఞాం మర్త్యశ్శ్రేష్ఠాం తపసా విద్యయా వా ।
తన్మే పృష్టశ్శంస సర్వం యథావచ్ఛుభాన్లోకాన్యేన గచ్ఛేత్క్రమేణ ॥22॥

తండ్రీ! మానవుడు ఏమి చేసి కీర్తి ప్రతిష్ఠలకు పాత్రుడవుతాడు? తపస్సు చేతనా! విద్యచేతనా? క్రమంగా పుణ్యలోకాలకు ఎలా పోగలడో, నాకు చెప్పు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

తపశ్చ దానం చ శమో దమశ్చ హ్రీరార్జవం సర్వభూతానుకమ్పా ।
స్వర్గస్య లోకస్య వదన్తి సన్తో ద్వారాణి సప్తైవ మహాన్తి పుంసామ్ ॥23॥

తపస్సు, దానం, శమం, దమం, లజ్జ, ఋజుత్వం, సర్వభూతదయ-అనేవి ఏడూ మనుజులకు స్వర్గ ద్వారాలని పెద్దలు చెప్పారు.

సర్వాణి చైతాని యథోదితాని తపఃప్రధానాన్యభిమర్షకేణ ।
నశ్యన్తి మానేన తమోఽభిభూతాః పుంసస్సదైవేతి వదన్తి సన్తః ॥24॥

ఈ చెప్పిన తపస్సు మొదలగు ఏడుగుణాలూ తమోగుణం వల్ల కలిగే దురభిమానంవల్ల నశించి పోతాయని పెద్దలు చెబుతున్నారు.

అధీయానః పణ్డితం మన్యమానో యో విద్యయా హన్తి యశః పరస్య ।
తస్యాన్తవన్తః పురుషస్య లోకా న చాస్య తద్బ్రహ్మ ఫలం దదాతి ॥25॥

చదువుకొన్నవాడు తానే పండితుడనని గర్వించి తనవిద్యచే ఇతరుల యశస్సుకు భంగం కల్గిస్తే వాని పుణ్యలోకాలు నశిస్తాయి. మరియు వానికి బ్రహ్మఫలం దక్కదు.

చత్వారి కర్మాణి భయంకరాణి భయం ప్రయచ్ఛన్త్యయథాకృతాని ।
మానాగ్నిహోత్రముత మానమౌనం మానేనాధీతముత మానయజ్ఞః ॥26॥

మానంతో కూడిన అగ్నిహోత్రం, మౌనం, అధ్యయనం, యజ్ఞం– ఈ నాలుగు స్వతః మంచివే అయినా మానం కారణంగా విరుద్ధచర్యలుగా మారి భయంకరా లవుతాయి.

న మానమాన్యో ముదమాదదీత న సన్తాపం ప్రాప్నుయాచ్చావమానాత్ ।
సన్తస్తతః పూజయన్తీహ లోకే నాసాధవస్సాధుబుద్ధిం లభన్తే ॥27॥

గౌరవం కల్గితే సంతోషించరాదు. అవమానం కల్గితే సంతాపం పొందరాదు. సజ్జనులు లోకంలో సాధువులను పూజిస్తారు. అసాధువులకు సాధుబుద్ధి కలుగదు.

ఇతి దద్యాదితి యజేదిత్యధీయాత మే శ్రుతమ్ ।
ఇత్యేతాన్యభయాన్యాహుస్తాన్యవర్జ్యాని నిత్యశః ॥28॥

దానం, యజనం, అధ్యయనం అనేవి శ్రేష్ఠములని విన్నాను. ఇవి అభయ ప్రదాలు, కాన వీటిని వదలరాదు.

యేనాఽఽశ్రయం వేదయన్తే పురాణం మనీషిణో మానసే మానయుక్తమ్ ।
తన్నిఃశ్రేయస్తేన సంయోగమేత్య పరాం శాన్తిం ప్రాప్నుయుః ప్రేత్య చేహ ॥29॥

మనీషులు మనస్సులో ప్రమాయుక్తమైన పురాణాన్ని (సనాతనుడగు పరమాత్మను) గ్రహింపదగినదిగా గ్రహించడం శ్రేయస్కరం. దానితో యోగం పొందితే ఐహికాముష్మికశాంతి పొందుతారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే యయాత్యష్టక సంవాదో నామ ఏకోనచత్వారింశోఽధ్యాయః ॥39॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని యయాతి చరిత్రలో యయాతి–అష్టకుల సంవాదమనే ముప్పైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

❊ ❊ ❊ ❊

చత్వారింశోఽధ్యాయః - నలబైయవ అధ్యాయం

అష్టకాయ యయాత్యుపదిష్టగృహస్థాదిధర్మాః

అష్టకునకు యయాతి ఉపదేశించిన గృహస్థాదిధర్మాలు

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

చరన్గృహస్థః కథమేతి దేవాన్కథం భిక్షుః కథమార్యకర్మా ।
వానప్రస్థః సత్పథే సన్నివిష్టో బహూన్యస్మిన్సమ్ప్రతి వేదయన్తి ॥1॥

గృహస్థుడు ఏమి ఆచరిస్తే దేవతలను పొందగలడు? ఎటువంటి సన్మార్గంలో వుంటే సన్న్యాసి, బ్రహ్మచారి, వానప్రస్థుడు ఎలా సిద్ధి పొందగలరు? తత్త్వవేత్తలు ఈ విషయంలో అనేక విధాలుగా చెబుతున్నారు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

ఆహూతాధ్యాయీ గురుకర్మస్వచోద్యః పూర్వోత్థాయీ చరమం చోపశాయీ ।
మృదుర్దాన్తో ధృతిమానప్రమత్తస్స్వాధ్యాయశీలస్సిద్ధ్యతి బ్రహ్మచారీ ॥2॥

గురువునుండి పిలుపు రాగానే వెళ్ళి అధ్యయనం చేసేవాడు, గురుకార్యాలు చెప్పకనే చక్కబెట్టేవాడు, గురువు కంటె ముందే నిద్రనుండి లేచేవాడు, గురువు తరువాత శయినించేవాడు, మృదుస్వభావి, ఇంద్రియనిగ్రహీత, ధైర్యవంతుడు, జాగరూకుడు, స్వాధ్యయన ప్రవృత్తుడు - ఐన బ్రహ్మచారి సిద్ధి పొందుతాడు.

ధర్మాగతం ప్రాప్య ధనం యజేత దద్యాత్సదైవాతిథీన్భోజయేచ్చ ।
అనాదదానశ్చ పరైరదత్తం సైషా గృహస్థోపనిషత్పురాణీ ॥3॥

ధర్మంతో సంపాదించిన ధనంతో యాగం చేయాలి. అర్హులకు దానం చేయాలి, సదా అతిథులకు భోజనం పెట్టాలి. ఇతరులు ఇవ్వని దానిని పరిగ్రహింపరాదు, ఇది సనాతనమైన గృహస్థధర్మం.

స్వవీర్యజీవీ వృజినాన్నివృత్తో దాతా పరేభ్యో న పరోపతాపీ ।
తాదృఙ్మునిస్సిద్ధిముపైతి ముఖ్యాం వసన్నరణ్యే నియతాహారచేష్టః ॥4॥

తన సంపాదనతో జీవించువాడు, పాపదూరుడు, ఇతరులకు దానం చేసేవాడు, ఇతరులను బాధ పెట్టనివాడు, నియతాహారము, నియత కార్యము గల అరణ్యవాసియైన వానప్రస్థుడగు ముని ముఖ్యమైన సిద్ధిని పొందుతాడు.

అశిల్పజీవీ విగృహశ్చ నిత్యం జితేన్ద్రియస్సర్వతో విప్రముక్తః ।
అనోకశాయీ లఘు లిప్సమానశ్చరన్దేశానేకచరస్స భిక్షుః ॥5॥

విద్యలతో జీవించనివాడు, అనికేతనుడు, సదా జితేంద్రియుడు, అన్ని అనుభవాలనుండి విముక్తుడు కావాలి. ఎక్కడనైనా శయనించువాడూ, లఘువుగా అవసరమైన దానినే గ్రహించేవాడు, దేశ సంచారి, ఒంటరి అయినవాడు సన్న్యాసి.

రాత్ర్యా యయా చాభిహితాశ్చ లోకా భవన్తి కామాభిజితాస్సుఖాశ్చ ।
తామేవ రాత్రిం ప్రయతేత విద్వానరణ్యసంస్థో భవితుం యతాత్మా ॥6॥

ఏ రాత్రియందు ఈ లోకాలతో నాకిక పనిలేదనే భావన, కామసుఖాలు జయింపబడిన వను నిశ్చయం కలుగునో, ఆ రాత్రియే మనుజుడు మనస్సును నిగ్రహించి అరణ్యనివాసి కావాలి.

దశైవ పూర్వాన్దశ చాపరాంస్తు జ్ఞాతీంస్తథాత్మానమథైకవింశమ్ ।
అరణ్యవాసీ సుకృతం దదాతి ముక్త్వా త్వరణ్యే స్వశరీరధాతూన్ ॥7॥

అరణ్యంలో వుండి అక్కడే తన శరీర ధాతువులను విడిచినవాడు, తన వంశంలో పూర్వపు పది తరాలవారికి, తరువాతి పది తరాలవారినీ, ఇరుదొకటవ వాడగు తనకూ సుకృతం కలిగించినవాడు అవుతాడు.

అష్టక ఉవాచ :– అష్టకుడు చెప్పాడు.

కతిస్విదేవ మునయో మౌనాని కతి చాప్యుత ।
భవన్తీతి తదాచక్ష్వ శ్రోతుమిచ్ఛామహే వయమ్ ॥8॥

మునులు ఎంత మంది? మౌనము లెన్ని విధాలు? ఈ వివరం మేము వినగోరుతున్నాము, అది చెప్పండి.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

అరణ్యే వసతో యస్య గ్రామో భవతి పృష్ఠతః ।
గ్రామే వా వసతోఽరణ్యం స మునిస్స్యాజ్జనాధిప! ॥9॥

రాజా! అడవిలో నివసించే ఎవనికి గ్రామం వెనకబడిన దవుతుందో, గ్రామంలో నివసించేవానికి అరణ్యం వెనకటి దవుతుందో అట్టివాడు ముని అవుతాడు.

అష్టక ఉవాచ :– అష్టకుడు చెప్పాడు.

కథంస్విద్వసతోఽరణ్యే గ్రామో భవతి పృష్ఠతః ।
గ్రామే వా వసతోఽరణ్యం కథం భవతి పృష్ఠతః ॥10॥

గ్రామంలో ఉన్నవానికి అరణ్యం వెనుకనున్నదెలా అవుతుంది? గ్రామస్థునికి అడవి వెనుకటిది ఎలా అవుతుంది?

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

న గ్రామ్యముపయుఞ్జీత యశ్చారణ్యో మునిర్భవేత్ ।
తథాఽస్య వసతోఽరణ్యే గ్రామో భవతి పృష్ఠతః ॥11॥

ముని అరణ్యంలో వుంటూ గ్రామ్యపదార్థాల నుపయోగించరాదు. అట్టి మునికి గ్రామం వెనుకటి దవుతుంది.

అనగ్నిరనికేతశ్చాప్యగోత్రచరణో మునిః ।
కౌపీనాచ్ఛాదనం యావత్తావదిచ్ఛేచ్చ చీవరమ్ ॥12॥

అగ్నికార్యం, గృహం లేనివాడు, గోత్రాచరణం లేనివాడూ, కౌపీనం మాత్రం ఆచ్ఛాదనం కొరకు దాల్చి అంత మాత్రమే వస్త్రములు కల్గినవాడు,

యావత్ప్రాణాభిసన్ధానం తావదిచ్ఛేచ్చ భోజనమ్ ।
తదాఽస్య వసతో గ్రామేఽరణ్యం భవతి పృష్ఠతః ॥13॥

ప్రాణధారణ కొర కవసరమైన భోజనం మాత్రం చేసేవాడు అయిన ముని గ్రామంలో ఉన్నా అరణ్యం అతనికి వెనకటి దవుతుంది.

యస్తు కామాన్పరిత్యజ్య త్యక్తకర్మా జితేన్ద్రియః ।
ఆతిష్ఠేత మునిర్మౌనం స లోకే సిద్ధిమాప్నుయాత్ ॥14॥

ఎవడు కోరికలు వీడి, కర్మలు త్యజించి, జితేంద్రియుడై మౌనంగా వుంటాడో, అట్టి ముని లోకంలో సిద్ధి పొందుతాడు.

ధౌతదన్తం కృత్తనఖం సదా స్నాతమలఙ్కృతమ్ ।
అసితం సితకర్మస్థం కస్తం నార్చితుమర్హతి ॥15॥

శుభ్రమైన తెల్లని పలువరుస కలవాడు, గోళ్లు కత్తిరించినవాడు, సదా స్నానం చేసి అలంకరించుకొనేవాడు, నల్లవాడు (ఎండకు నల్లబడిన శరీరం కలవాడు) సత్కర్మలు చేసేవాడు అయినవాణ్ణి ఎవడు పూజించడు?

తపసా కర్శితః క్షామః క్షీణమాంసాస్థిశోణితః ।
యదా భవతి నిర్ద్వన్ద్వో మునిర్మౌనం సమాస్థితః ॥16॥

అథ లోకమిమం జిత్వా లోకం చాపి జయేత్పరమ్ ।
ఆస్యేన తు యదాహారం గోవన్మృగయతే మునిః ।
అథాస్య లోకః సర్వో య స్సోఽమృతత్వాయ కల్పతే ॥17॥

తపస్సుచే కృశించి సన్నబడినవాడు, క్షీణమైన మాంసం, ఎముకలు, రక్తం కలవాడు, ద్వంద్వసహిష్ణువు, మౌనం పాటించేవాడు ఐన ముని ఈ లోకాన్ని జయించి పరలోకాన్ని గూడా జయిస్తాడు. గోవులాగా నోటితో ఆహారం భక్షించే ముని అన్ని లోకాలూ జయించినవాడే (అన్ని లోకాలూ అతనివే). అటువంటి ముని అమృతత్వప్రాప్తి కర్హుడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే అష్టకాయ యయాత్యుపదిష్ట గృహస్థాది ధర్మో నామ చత్వారింశోఽధ్యాయః ॥ 40 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని యయాతి చరిత్రలో అష్టకునకు యయాతి ఉపదేశించిన గృహస్థధర్మాలనే నలబైయవ అధ్యాయం సంపూర్ణం

ఏకచత్వారింశోఽధ్యాయః - నలబైఒకటవ అధ్యాయం

యయాత్యష్టకాదిసంవాదః - యయాతి-అష్టకాదుల సంవాదం

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

కతరస్త్వేతయోః పూర్వం దేవానామేతి సామ్యతామ్ ।
ఉభయోర్ధావతో రాజన్సూర్యాచన్ద్రమసోరివ ॥1॥

వానప్రస్థ సన్న్యాసుల్లో ఎవరు దేవతలతో మొదట సామ్యం పొందగలరు? సూర్యచంద్రుల్లాగా ఇరువురూ లక్ష్యం వైపు పరుగిడేవారే కదా!

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

అనికేతం గృహస్థేషు కామవృత్తేషు సంయతః ।
గ్రామ ఏవ చరన్భిక్షుస్తయోః పూర్వతరం గతః ॥2॥

కామవర్తనులైన గృహస్థ సన్న్యాసులలో ఇంద్రియనిగ్రహపరుడై గ్రామంలో చరించే భిక్షువే శ్రేష్ఠుడు. ముందుగా అతడే దేవతాసామ్యం పొందుతాడు.

అప్రాప్యం దీర్ఘమాయుశ్చ యః ప్రాప్తో వికృతిం చరేత్ ।
తప్యేత యది తత్కృత్వా చరేత్సోఽగ్రం తపస్తతః ॥3॥

దుర్లభమైన దీర్ఘాయువును పొంది ఎవడు వికారానికి లోనవుతాడో, అటువంటివాడు పశ్చాత్తాపం పొంది ఉగ్రమైన తపస్సు చేయాలి.

యద్వై నృశంసం తదపథ్యమాహుర్యస్సేవతేఽధర్మమనర్థబుద్ధిః ।
అసావనీశస్స తథైవ రాజంస్తదార్జవం స సమాధిస్తదార్యమ్ ॥4॥

ఎవడు అనర్థబుద్ధియై అధర్మం ఆచరిస్తాడో, వాని చర్య క్రూరమూ, అనుచితమూ అంటారు. అట్టిదానిని వదలుట, ఋజువర్తనము, చిత్తస్థైర్యము పెద్దల మెప్పు పొందుతుంది.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

కేనాద్య త్వం తు ప్రహితోఽసి రాజన్ యువా స్రగ్వీ దర్శనీయస్సువర్చాః ।
కుత ఆగతః కతమస్యాం దిశి త్వముతాహోస్విత్పార్థివస్థానమస్తి ॥5॥

రాజా! నిన్నిక్కడి కెవరు పంపారు? యువకుడవు, మాలాలంకృతుడవు, సుందరుడవు, తేజస్వివి, నీవెక్కడనుండి వచ్చావు. ఏ దిక్కునందు నీకు రాజ స్థానమున్నది?

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

ఇమం భౌమం నరకం క్షీణపుణ్యః ప్రవిష్ట ఊర్ధ్వం గగనాద్విప్రకీర్ణః ।
ఉక్త్వాఽహం వః ప్రపతిష్యామ్యనన్తరం త్వరన్త్యమీ బ్రహ్మణో లోకపా యే ॥6॥

నేను స్వర్గంనుండి పుణ్యం క్షీణించినవాడనై ఈ భౌమనరకం పొందడానికి ఈ భూమికి వచ్చాను. మీతో సంభాషణం కాగానే నేను మళ్ళీ క్రిందికి పోతాను. బ్రహ్మకు చెందిన లోకపాలకులు నన్ను త్వరపెడుతున్నారు.

సతాం సకాశే తు వృతః ప్రపాతస్తే సఙ్గతా గుణవన్తస్తు సర్వే ।
శక్రాచ్చ లబ్ధో హి వరో మయైష పతిష్యతా భూమితలం నరేన్ద్ర! ॥7॥

రాజా! నేను సజ్జనుల సన్నిధిలో పడిపోవాలని కోరుకొన్నాను. గుణవంతులైన వారందరితో కలిశాను. నరేంద్రా! భూతలం నుండి పడేటప్పుడు ఇంద్రునినుండి ఈ వరం కోరుకున్నాను.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

పృచ్ఛామి త్వాం ప్రపతన్తం ప్రపాతం యది లోకాః పార్థివ సన్తి మేఽత్ర ।
యద్యన్తరిక్షే యది వా దివి స్థితాః క్షేత్రజ్ఞం త్వాం తస్య ధర్మస్య మన్యే ॥8॥

రాజా! నీవు ధర్మతత్త్వజ్ఞుడ వని భావిస్తున్నాను. పతనం చెందే నిన్ను ప్రశ్నిస్తున్నాను. అంతరిక్షంలో గాని, స్వర్గంలోగాని నాకు పొందదగిన లోకా లున్నాయా?

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

యావత్పృథివ్యాం విహితం గవాశ్వం సహారణ్యైః పశుభిః పక్షిభిశ్చ ।
తావల్లోకా దివి తే సంస్థితా వై తథా విజానీహి నరేన్ద్రసింహ! ॥9॥

రాజవర్యా! భూలోకంలో గోవులు, గుర్రాలు, ఆరణ్యమృగాలు, పక్షులు ఎన్ని ఉన్నవో, అన్ని లోకాలు నీకున్నాయి అని తెలుసుకో.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

తాంస్తే దదామి మా ప్రపత ప్రపాతం యే మే లోకా దివి రాజేన్ద్ర సన్తి ।
యద్యన్తరిక్షే యది వా దివి శ్రితాస్తానాక్రమ క్షిప్రమమిత్రసింహ! ॥10॥

శత్రువినాశకుడవైన రాజా! నీవు క్రిందికి పడవద్దు. స్వర్గంలో, అంతరిక్షంలో నాకున్న లోకాలన్నిటినీ నీకిస్తాను, వాటిని ఆక్రమించుకో.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

నాస్మద్విధోఽబ్రాహ్మణో బ్రహ్మవిచ్చ ప్రతిగ్రహే వర్తతే రాజముఖ్య! ।
యథా ప్రదేయం సతతం ద్విజేభ్యస్తదాఽదదం పూర్వమహం నరేన్ద్ర! ॥11॥

రాజవర్యా! నాలాంటి అబ్రాహ్మణుడు ప్రతిగ్రహానికి తగడు. వేదవేత్త అయిన బ్రాహ్మణుడందుకు తగినవాడు. నరేంద్రా! ద్విజులకేది ఎలా ఇవ్వాలో, అలా నేను పూర్వం ఇచ్చేవాణ్ణి.

నాబ్రాహ్మణః కృపణో జాతు జీవేద్యద్యపి స్యాద్బ్రాహ్మణీ వీరపత్నీ ।
సో౽హం యదేవాకృతపూర్వం చరేయం వివిత్సమానః కిము తత్ర సాధుః ॥12॥

అబ్రాహ్మణుడు ఎప్పుడూ కృపణుడై జీవించరాదు. నాకు బ్రాహ్మణి వీరపత్నిగా ఉన్నా సరే, నేను పూర్వం చేయని దాన్ని చేయను? వివేకినై గూడ చేయరాని పనినెలా చేయగలను? అదేమి బాగుంటుంది?

ప్రతర్దన ఉవాచ :- ప్రతర్దనుడు చెప్పాడు.

పృచ్ఛామి త్వాం స్పృహణీయరూప! ప్రతర్దనో౽హం యది మే సన్తి లోకాః ।
యద్యన్తరిక్షే యది వా దివి శ్రితాః క్షేత్రజ్ఞం త్వాం తస్య ధర్మస్య మన్యే ॥13॥

దర్శనీయరూపం కలవాడా! నేను ప్రతర్దనుడను. నీవు ధర్మజ్ఞుడవు కాన నిన్ను అడుగుతున్నాను, దివిలో, అంతరిక్షంలో నాకు లోకాలున్నాయా?

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

సన్తి లోకా బహవస్తే నరేన్ద్ర! అప్యేకైకస్సప్తసప్తాన్యహాని ।
మధుచ్యుతో ఘృతవన్తో విశోకాస్తేనాన్తవన్తః ప్రతిపాలయన్తి ॥14॥

నరేంద్రా! నీకు అనేకలోకా లున్నాయి. అవి ఒక్కొక్క లోకంలో ఏడేసి దినాలు అనుభవింపదగినవి. ఆ లోకాలన్నీ అమృతం స్రవించునవి, నేతితో తడిసినవి, శోక దూరమైనవి. అంతం లేనివి. అవి నీ కొరకై ఎదురు చూస్తున్నాయి.

ప్రతర్దన ఉవాచ :- ప్రతర్దనుడు చెప్పాడు.

తాంస్తే దదామి పతమానస్య రాజన్ యే మే లోకాస్తవ తే వై భవన్తు ।
యద్యన్తరిక్షే యది వా దివి శ్రితాస్తానాక్రమ క్షిప్రమపేతమోహః ॥15॥

రాజా! దేవలోకంలో, అంతరిక్షంలో ఉన్న నాలోకా లన్నింటినీ పతనం చెందుతున్న నీకు ఇస్తాను. నీవు విగతమోహుడవై ఆ లోకాలను ఆక్రమించు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

న తుల్యతేజాస్సుకృతం హి కామయే యోగక్షేమం పార్థివ పార్థివస్సన్ ।
దైవాదేశాదాపదం ప్రాప్య విద్వాంశ్చరేన్నృశంసం హి న జాతు రాజా ॥16॥

రాజా! నీతో సమ తేజస్కుడనైన రాజునై వుండి నేను మరొకరాజునుండి యోగ క్షేమాలు అర్థించను. దైవాదేశం వల్ల ఆపద పొందిన విద్వాంసుడగు రాజు ఎన్నటికీ అధర్మమార్గంలో చరించరాదు.

ధర్మ్యం మార్గం చిన్తయానో యశస్యం కుర్యాత్తపో ధర్మమవేక్షమాణః ।
న మద్విధో ధర్మబుద్ధిర్హి రాజా హ్యేవం కుర్యాత్కృపణం మాం యథాఽఽత్థ ॥17॥

ధర్మబద్ధమైన, కీర్తికరమైన మార్గాన్ని, ఎరిగి ధర్మఫలం కోరేవాడు తపస్సు చేయాలి. నావంటి ధర్మబుద్ధి ఎప్పుడూ నీవు చెప్పిన దీనమైన పని చేయరాదు.

కుర్యామపూర్వం న కృతం యదాన్యైర్వివిత్సమానః కిము తత్ర సాధు ।
బ్రువాణమేవం నృపతిం యయాతిం నృపోత్తమో వసుమానబ్రవీత్తమ్ ॥18॥

వివేకియైన నావంటి రాజు పూర్వం రాజు లెవరూ చేయని అకృత్యం ఎలా చేస్తాడు? ఇలా చెబుతున్న యయాతిని చూచి నృపోత్తముడగు వసుమంతుడు చెప్పాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితే యయాత్యష్టకాది సంవాదో నామ ఏకచత్వారింశోఽధ్యాయః ॥41॥

శ్రీమత్స్యమహాపురాణంలోని యయాతి చరిత్రలో యయాత్యష్టకాదుల సంవాదమనే
నలభైఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్విచత్వారింశోఽధ్యాయః - నలభైరెండవ అధ్యాయం

యయాతిచరితసమాప్తిః - యయాతిచరిత్రసమాప్తి

వసుమానువాచ :- వసుమంతుడు చెప్పాడు.

పృచ్ఛామ్యహం వసుమానౌషదశ్విర్యద్యస్తి లోకో దివి మహ్యం నరేన్ద్ర ।
యద్యన్తరిక్షే ప్రథితో మహాత్మన్ క్షేత్రజ్ఞం త్వాం తస్య ధర్మస్య మన్యే ॥1॥

రాజా! నేను ఉషదశ్వుని కుమారుడనైన వసుమంతుడను. దేవలోకంలో, అంతరిక్షంలో నాకు చేరదగిన లోకాలున్నాయా? నీవు క్షేత్రజ్ఞుడవని భావిస్తున్నాను, నిన్ను అడుగుతున్నాను.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

యదన్తరిక్షం పృథివీ దిశశ్చ యత్తేజసా తపతే భానుమాంశ్చ ।
లోకాస్తావన్తో దివి సంస్థితా వై తే త్వాం భవన్తః ప్రతిపాలయన్తి ॥2॥

అంతరిక్షం, భూమి, దిక్కులు, సూర్యుడు తేజస్సుతో భాసింప జేసే లోకాలు ఎన్ని ఉన్నవో, అన్ని లోకాలు దివిలో ఉన్నాయి, అవి నీ కొరకై ప్రతీక్షిస్తున్నాయి.

వసుమానువాచ :- వసుమంతుడు చెప్పాడు.

తాంస్తే దదామి మా ప్రపత ప్రపాతం యే మే లోకా స్తవ తే వై భవన్తు ।
క్రీణీష్వైనాంస్తృణకేనాపి రాజన్ప్రతిగ్రహస్తే యది సమ్యక్ప్రదుష్టః ॥3॥

రాజా! నీవు పడిపోవద్దు. నా లోకాలను నీకిస్తున్నాను. ఆ లోకాలన్నీ నీకే అగుగాక! ప్రతిగ్రహం దోషమని భావించే పక్షంలో. తృణమిచ్చియైనా ఈ లోకాలను కొను.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

న మిథ్యాఽహం విక్రయం వై స్మరామి మయా కృతం శిశుభావేఽపి రాజన్! ।
కుర్యాం న చైవాకృత పూర్వమన్యైర్వివిత్సమానో వసుమన్న సాధు ॥4॥

రాజా! శైశవంలో గూడా అలాంటి మిథ్యాపూర్వకమైన విక్రయం నేను చేయలేదు. పూర్వం ఇతరులు చేయని అట్టి పనిని నేను చేయను. వసుమంతుడా! వివేకవంతుడనై యున్ననేను ఈ పని చేయరాదు.

వసుమానువాచ :- వసుమంతుడు చెప్పాడు.

తాన్త్వం లోకాన్ప్రతిపద్యస్వ రాజన్ మయా దత్తాన్యది నేష్టః క్రయస్తే ।
నాహం తాన్వై ప్రతిగన్తా నరేన్ద్ర సర్వే లోకాస్తావకా వై భవన్తు ॥5॥

రాజా! క్రయం నీ కిష్టం లేకుంటే నీవాలోకాలను నానుండి పుచ్చుకో. నరేంద్రా! నేనాలోకాలకు పోను. ఆ లోకాలన్నీ నీవే అగుగాక!

శిబిరువాచ :– శిబి చెప్పాడు.

పృచ్ఛామి త్వాం శిబిరౌశీనరోఽహం మమాపి లోకా యది సన్తి తాత ।
యద్యన్తరిక్షే యది వా దివి శ్రితాః క్షేత్రజ్ఞం త్వాం తస్య ధర్మస్య మన్యే ॥6॥

నేను ఉశీనరుని పుత్రుడనైన శిబిని. నీవు క్షేత్రజ్ఞుడవని నిన్ను అడుగుతున్నాను. తండ్రీ! నాకు గూడా దివిలో, అంతరిక్షంలో లోకాలున్నాయా?

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

యత్త్వం వాచా హృదయేనాపి రాజన్ పరీప్సమానాన్నావమంస్థా నరేన్ద్ర! ।
తేనానన్తా దివి లోకాస్శ్రితా వై విద్యుద్రూపాస్స్వనవన్తో మహాన్తః ॥7॥

రాజా! నీవు వాక్కుతోగాని, హృదయంతోగాని ఎవరినీ అవమానించలేదు. అంచేత నీకు దివిలో అనంతమైన లోకాలున్నాయి. అవి విద్యుద్రూపాలై, ధ్వనిస్తున్న గొప్ప లోకాలు.

శిబిరువాచ :– శిబి చెప్పాడు.

తాంస్త్వం లోకాన్ప్రతిపద్యస్వ రాజన్మయా దత్తాన్యది నేష్టః క్రయస్తే ।
న చాహం తాన్ప్రతిపత్స్యేఽథ దత్త్వా యత్ర త్వం తాత! గన్తాసి లోకాన్ ॥8॥

రాజా! నీకు క్రయం అభిమతం కాకుంటే నేనాలోకాలు నీకిస్తాను, పరిగ్రహించు. ఇచ్చిన లోకాలకు నేను పోను, నీవే పోతావు.

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

యథా త్వమిన్ద్రప్రతిమప్రభావస్తే చాప్యనన్తా నరదేవ! లోకాః ।
తథాఽద్య లోకే న రమేఽన్యదత్తే తస్మాచ్ఛిబే నాభినన్దామి వాచమ్ ॥9॥

నరదేవా! నీవు ఇంద్రునితో సమానమైన ప్రభావం కలవాడవు, నీ లోకాలు అనంతమైనవి. ఇతరులిచ్చిన లోకంలో నేను రమించను, అందువల్ల ఓ శిబీ! నీ మాట నభినందించజాలను.

అష్టక ఉవాచ :– అష్టకుడు చెప్పాడు.

న చేదేకైకశో రాజన్ లోకాన్నః ప్రతినన్దసి ।
సర్వే ప్రదాయ తాన్ లోకాన్ గన్తారో నరకం వయమ్ ॥10॥

రాజా! నీవు విడివిడిగా మేమిచ్చే లోకాలు అంగీకరించని పక్షంలో అందరమూ కలిసి మా లోకాలను నీకిచ్చి మేము నరకానికి పోవడానికి సిద్ధంగా ఉన్నాము.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

యదర్హో౽హం తద్వదధ్వం సన్తః సత్యాదిదర్శినః ।
అహం తు నాభిగృహ్ణామి యత్కృతం న మయా పురా ॥11॥

నాకు ఏది అర్హమో అదే మీరు చెప్పండి. సజ్జనులు సత్యదర్శనులు గదా! నేను పూర్వం చేయని ప్రతి గ్రహాత్మకమైన పనిని చేయలేను.

అలిప్సమానస్య తు మే యదుక్తం న తత్తథా౽స్తీహ నరేన్ద్రసింహ! ।
అస్య ప్రదానస్య యదేవ యుక్తం తస్యైవ చానన్తఫలం భవిష్యమ్ ॥12॥

నరేంద్రశ్రేష్ఠా! ప్రతిగ్రహేచ్ఛలేని నావిషయంలో మీరేమి చెప్పారో అది అలా లేదు. ఈ ప్రదానానికి ఏది తగునో, దానికే అనంతఫలం కలుగుతుంది.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

కస్యైతే ప్రతిదృశ్యన్తే రథాః పఞ్చ హిరణ్మయాః ।
ఉచ్చైస్సన్తః ప్రకాశన్తే జ్వలన్తో౽గ్నిశిఖా ఇవ ॥13॥

స్వర్ణమయమైన ఈ ఐదు రథాలు ఎవరివి? మండే అగ్ని శిఖలలాగా ఇవి ఉన్నతంగా భాసిస్తున్నాయి.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

భవతాం మమ చైవైతే రథా భాన్తి హిరణ్మయాః ।
ఆరుహ్యైతేషు గన్తవ్యం భవద్భిశ్చ మయా సహ ॥14॥

ఈ హిరణ్మయరథాలు మీవీ, నావీ కూడా. వీటి నెక్కి మీరూ నాతో రావాలి.

అష్టక ఉవాచ :- అష్టకుడు చెప్పాడు.

ఆతిష్ఠస్వ రథం రాజన్విక్రమస్వ విహాయసా ।
వయమప్యనుయాస్యామో యదా కాలో భవిష్యతి ॥15॥

రాజా! రథమధిరోహించు, ఆకాశంలో పయనించు. కాలక్రమంలో నిన్ను మేము అనుసరించి వస్తాము.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

సర్వైరిదానీం గన్తవ్యం సహ స్వర్గజితో వయమ్ ।
ఏష వో విరజాః పన్థా దృశ్యతే దేవసద్మగః ॥16॥

మనమందరమూ స్వర్గవిజేతలమే. కాన మన మందరం కలిసివెళ్ళాలి. దేవగృహానికి పోయే దారి రజోగుణరహితమై కనిపిస్తున్నది.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

తేఽభిరుహ్య రథాన్సర్వే ప్రయాతా నృపతే! నృపాః ।
ఆక్రామన్తో దివం భాన్తి ధర్మేణాఽఽవృత్య రోదసీ ॥17॥

నృపతీ! ఆ రాజులందరూ కలసి రథాలెక్కి దివి నాక్రమించి ధర్మంతో భూమ్యాకాశాల మధ్య వెలుగులు విరజిల్లుతూ భాసించారు.

అష్టక ఉవాచ :– అష్టకుడు చెప్పాడు

అహం మన్యే పూర్వమేకోఽభిగన్తా సఖా చేన్ద్రస్సర్వథా మే మహాత్మా ।
కస్మాదేవం శిబిరౌశీనరోఽయం ఏకోఽత్యయాత్సర్వవేగేన వాహాన్ ॥18॥

రాజా! ఇంద్రుడు నా మిత్రుడు. నేను అందరికంటే ముందు స్వర్గం చేరెదననుకున్నాను. కాని ఈ ఔశీనరుడైన శిబి ఒక్కడే మహావేగంతో అందరినీ దాటి పోతున్నాడు– ఇది ఎలా సంభవం?

యయాతిరువాచ :– యయాతి చెప్పాడు.

అదదాద్దేవయానాయ యావద్విత్తమనిన్దితః ।
ఉశీనరస్య పుత్త్రోఽయం తస్మాచ్ఛ్రేష్ఠో హి వశ్శిబిః ॥19॥

దేవయానానికి తగినట్లు ఈ శిబి సర్వము దానం చేశాడు. అంచేత అతడు మీలో శ్రేష్ఠుడు.

దానం శౌచం సత్యమథో హ్యహింసా హ్రీశ్శ్రీస్తితిక్షా సమతాఽఽనృశంస్యమ్ ।
రాజన్నేతాన్యప్రమేయాణి రాజ్ఞి శిబౌ స్థితాన్యప్రతిమే సుబుద్ధ్యా ।
ఏవం వృత్తం హ్రీనిషేవీ బిభర్తి తస్మాచ్ఛిబిరభిగన్తా రథేన ॥20॥

మంచిబుద్ధితో సాటిలేని ఈ శిబియందు దానం, శౌచం, సత్యం, అహింస, లజ్జ, సిరి, సహనం, సమత్వం, క్రౌర్యాభావం – ఈ గుణాలన్నీ – అపరిమితంగా ప్రకాశిస్తున్నాయి. ఇతడు మంచి బుద్ధిశాలి, సాటిలేనివాడు, బిడియంతో కర్తవ్యాకర్తవ్యాలు ఆలోచించేవాడు –ఈ గుణాలు కలవానిని అవి రక్షిస్తాయి. శిబి అట్టివాడు కాన మనకంటే ముందు రథంలో పోగలిగాడు.

శౌనక ఉవాచ :– శౌనకుడు చెప్పాడు.

అథాష్టకః పునరేవాన్వపృచ్ఛన్మాతామహం కౌతుకాదిన్ద్రకల్పమ్ ।
పృచ్ఛామి త్వాం నృపతే! బ్రూహి సత్యం కుతశ్చ కశ్చాసి కథం త్వమాగాః ।
కృతం త్వయా యద్ధి న తస్య కర్తా లోకే త్వదన్యో బ్రాహ్మణః క్షత్త్రియో వా ॥21॥

ఆపైన అష్టకుడు ఇంద్రతుల్యుడైన మాతామహుణ్ణి కౌతుకంతో ఇలా అడిగాడు. "రాజా! నిన్ను అడుగుతున్నాను, నిజం చెప్పు? నీ వెవడివి? ఎక్కడ నుంచి వచ్చావు? ఎలా వచ్చావు? నీవేం చేశావో, ఆ పనిని బ్రాహ్మణుడు గానీ, క్షత్రియుడు గానీ మరొకడు చేయలేదు.

యయాతిరువాచ :- యయాతి చెప్పాడు.

యయాతిరస్మి నహుషస్య పుత్త్రః పూరోః పితా సార్వభౌమస్త్విహాఽ ఽసమ్ ।
గుహ్యం మన్త్రం మామకేభ్యో బ్రవీమి మాతామహో భవతాం సుప్రకాశః ॥22॥

నేను నహుషుని పుత్రుడనగు యయాతిని. పూరుని తండ్రిని, ఇక్కడ సార్వభౌముడుగా ఉంటిని, మావారికి రహస్యమంత్రం చెబుతున్నా. మీకు మాతామహుడను.

సర్వామిమాం పృథివీం నిర్జిగాయ బుద్ధాం మహీమదదాం బ్రాహ్మణేభ్యః ।
మేధ్యానశ్వాన్నైకశస్తాన్సురూపాంస్తదా దివః పుణ్యభాజో భవన్తి ॥23॥

ఈ భూమినంతా జయించి బ్రాహ్మణుల కిచ్చాను. పవిత్రమైన సుందరమైన అశ్వాలను అనేకమైనవాటి నిచ్చాను. అలా చేసినవారు పుణ్యభాజనులవుతారు.

అదామహం పృథివీం బ్రాహ్మణేభ్యః పూర్ణామిమామఖిలాన్నైః ప్రశస్తామ్ ।
గోభిస్సువర్ణైశ్చ ధనైశ్చ ముఖ్యైరశ్వాః సనాగాః శతశస్త్వర్బుదాని ॥24॥

అఖిలాన్నములతో ప్రశస్తమైన ఈ పృథివిని నేను, విప్రుల కిచ్చాను. బంగారం, ధనం, గుర్రాలు, ఏనుగులు, వందలాది అర్బుద సంఖ్యలుగలవాని నిచ్చాను.

సత్యేన మే ద్యౌశ్చ వసున్ధరా చ తథైవాగ్నిర్జ్వలతే మానుషేషు ।
న మే వృథా వ్యాహృతమేవ వాక్యం సత్యం హి సన్తః ప్రతిపూజయన్తి ॥25॥

నా సత్యంతోనే ఆకాశం, భూమి, అగ్ని జ్వలిస్తున్నాయి. నేను వ్యర్థంగా మాట్లాడడం లేదు. సజ్జనులు సత్యాన్నే పూజిస్తారు.

సాధ్వష్టకం ప్రబ్రవీమీహ సత్యం ప్రతర్దనం వసుమన్తం శిబిం చ ।
సర్వే దేవా మునయశ్చ లోకాస్సత్యేన పూజ్యా ఇతి మే మనోగతమ్ ॥26॥

అష్టకుని, ప్రతర్దనుని, వసుమంతుని, శిబిని ఉద్దేశించి నేను సత్యం చెబుతున్నాను. దేవతలందరూ, మునులు, లోకాలూ సత్యంతోనే పూజనీయులవుతారని నా అభిప్రాయం.

యో నః స్వర్గజితం సర్వం యథావృత్తం నివేదయేత్ ।
అనసూయుర్ద్విజాగ్రేభ్యస్స భజేన్నస్సలోకతామ్ ॥27॥

ఎవడు స్వర్గ జయానికి చెందిన ఈ వృత్తాంతమంతా ద్విజశ్రేష్ఠులకు అసూయ లేకుండా చెబుతాడో వాడు మాతోటి సమానమగు లోకాలు పొందుతాడు.

శౌనక ఉవాచ :- శౌనకుడు చెప్పాడు.

ఏవం రాజన్స మహాత్మా యయాతిః స్వదౌహిత్రైస్తారితో మిత్రవర్యః ।
త్యక్త్వా మహీం పరమోదారకర్మా స్వర్గం గతః కర్మభిర్వ్యాప్య పృథ్వీమ్ ॥28॥

రాజా! ఈ విధంగా మహాత్ముడైన ఆ యయాతి తన మిత్రవర్యులైన దౌహిత్రులచే తరింపజేయబడ్డాడు, భూమిని వీడి పరమోదార కర్మలు చేసినవాడై సత్కర్మములతో భూతలమంతటా ప్రశస్తి పొంది స్వర్గం చేరుకున్నాడు.

ఏవం సర్వం విస్తరతో యథావదాఖ్యాతం తే చరితం నాహుషస్య ।
వంశో యస్య ప్రథితం పౌరవేయో యస్మిన్జాతస్త్వం మనుజేంద్రకల్పః ॥29॥

నహుషపుత్రుని చరిత్రనంతా విస్తృతంగా ఇట్లు నీకు వివరించాను. అతని పౌరవేయవంశం ప్రసిద్ధమైనది. మను జేంద్రకల్పుడవైన నీవు ఆ వంశంలోనే జనించావు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యయాతిచరితసమాప్తిర్నామ ద్విచత్వారింశోఽధ్యాయః ॥ 42 ॥

శ్రీమత్స్యమహాపురాణంలో యయాతిచరిత్ర సమాప్తి అనే నలభైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్రిచత్వారింశోఽధ్యాయః - నలభైమూడవ అధ్యాయం

యదువంశానువర్ణనమ్ - యదువంశానువర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఇత్యేతచ్ఛౌనకాద్రాజా శతానీకో నిశమ్య తు ।
విస్మితః పరయా ప్రీత్యా పూర్ణచన్ద్ర ఇవాబభౌ ॥1॥

శతానీకుడు శౌనకునినుండి ఈ వృత్తాంత మంతా విని ఆశ్చర్యపడినాడు. పరమప్రీతితో పూర్ణచంద్రునిలా ప్రకాశించాడు.

పూజయామాస నృపతిర్విధివచ్చాథ శౌనకమ్ ।
రత్నైర్గోభిస్సువర్ణైశ్చ వాసోభిర్వివిధైస్తథా ॥2॥

తదుపరి ఆ రాజు శౌనకుణ్ణి వివిధములైన రత్నాలతో, గోవులతో, స్వర్ణంతో, వస్త్రాలతో విధ్యుక్త ప్రకారం పూజించాడు.

ప్రతిగృహ్య తతస్సర్వం యద్రాజ్ఞా ప్రహితం ధనమ్ ।
దత్వా చ బ్రాహ్మణేభ్యశ్చ శౌనకోఽన్తరధీయత ॥3॥

రాజు సమర్పించిన ఆ కానుక లనన్నిటినీ ప్రతిగ్రహించి శౌనకుడు బ్రాహ్మణులకు దానం చేసి అంతర్ధానం చెందాడు.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

యయాతేర్వంశమిచ్ఛామః శ్రోతుం విస్తరతోఽనఘ! ।
యదుప్రభృతిభిః పుత్త్రై ర్యథా లోకే ప్రతిష్ఠితమ్ ॥4॥

అనఘా! యదువు మున్నగు పుత్రులతో లోకంలో ప్రతిష్ఠితమైన యయాతివంశాన్ని విస్తరంగా వినగోరుతున్నాము.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

యదోర్వంశం ప్రవక్ష్యామి జ్యేష్ఠస్యోత్తమతేజసః ।
విస్తరేణాఽఽనుపూర్వ్యాచ్చ గదతో మే నిబోధత ॥5॥

జ్యేష్ఠుడు, ఉత్తమ తేజస్వి అయిన యదువు వంశాన్ని క్రమంగానూ, విస్తృతంగానూ చెబుతాను, తెలుసుకోండి!

యదోః పుత్త్రా బభూవుర్హి పఞ్చ దేవసుతోపమాః ।
మహారథా మహేష్వాసా నామతస్తాన్నిబోధత ॥6॥

యదువుకు దేవ పుత్ర సమానులు, మహారథులు, వరధానుష్కులు, అయిన ఐదుగురు పుత్రులు జన్మించారు, వారి పేర్లు తెలుసుకోండి.

సహస్రజిరథో జ్యేష్ఠః క్రోష్టుర్నీలోఽన్తికో లఘుః ।
సహస్రజేస్తు దాయాదో శతజిర్నామ పార్థివః ॥7॥

వారిలో జ్యేష్ఠుడు సహస్రజి, క్రోష్టువు, నీలుడు, అన్తికుడు, లఘువు అనువారు అతని సోదరులు. సహస్రజియొక్క దాయాది శతజి అను రాజు.

శతజేరపి దాయాదాస్త్రయః పరమకీర్తయః ।
హైహయశ్చ హయశ్చైవ తథా వేణుహయశ్చ యః ॥8॥

శతజియొక్క దాయాదులు ముప్వరు– హైహయుడు, మయుడు, వేణుహయుడు– అనువారు. అందరూ గొప్ప కీర్తిమంతులే.

హైహయస్య తు దాయాదో ధర్మనేత్రః ప్రతిశ్రుతః ।
ధర్మనేత్రస్య కున్తిస్తు సంహతస్తస్య చాఽఽత్మజః ॥9॥

హైహయుని దాయాది ధర్మనేత్రుడని ప్రసిద్ధుడు. ధర్మనేత్రుని కుమారుడు కున్తి, అతని కుమారుడు సంహతుడు.

సంహతస్య చ దాయాదో మహిష్మాన్నామ పార్థివః ।
ఆసీన్మహిష్మతః పుత్రో భద్రశ్రేణ్యః ప్రతాపవాక్ ॥ 10॥

మహిష్మంతుడనే రాజు సంహతుని పుత్రుడు. ప్రతాపశాలి అయిన భద్రశ్రేణ్యుడు మహిష్మంతుని పుత్రుడు.

వారాణస్యామభూద్రాజా ప్రథితః పూర్వమేవ తు ।
భద్రశ్రేణ్యస్య పుత్రోఽభూద్దుర్దమో నామ పార్థివః ॥11॥

పూర్వమే అతడు వారాణసీనరాధిపతిగా ప్రసిద్ధుడై ఉండినాడు. దుర్దముడను రాజు భద్రశ్రేణ్యుని కుమారుడు.

దుర్దమస్య సుతో ధీమాన్ కనకో నామ వీర్యవాన్ ।
కనకస్య తు దాయాదాశ్చత్వారో లోకవిశ్రుతాః ॥12॥

దుర్దముని సుతుడు బుద్ధిమంతుడూ, పరాక్రమవంతుడూ అయిన కనకుడు. కనకునికి లోకప్రసిద్ధులైన కుమారులు నలుగురుండేవారు.

కృతవీర్యః కృతాగ్నిశ్చ కృతధర్మా తథైవ చ ।
కృతౌజాశ్చ చతుర్థోఽభూత్కృతవీర్యాత్తతోఽర్జునః ॥13॥

కృతవీర్యుడు, కృతాగ్ని, కృతధర్ముడు, నాల్గవవాడు కృతౌజుడు– అనేవారు. కృతవీర్యునికి అర్జునుడు జనించాడు.

జాతః కరసహస్రేణ సప్తద్వీపేశ్వరో నృపః ।
వర్షాయుతం తపస్తేపే దుశ్చరం పృథివీపతిః ॥14॥

ఆ రాజు వెయ్యిచేతులతో జనించాడు. సప్తద్వీపాలకూ ప్రభువయ్యాడు, పదివేల సంవత్సరాలు దుష్కరమైన తపస్సు చేశాడు.

దత్తమారాధయామాస కార్తవీర్యోఽత్రిసమ్భవమ్ ।
తస్మై దత్తా వరాస్తేన చత్వారః పురుషోత్తమ! ॥15॥

పురుషశ్రేష్ఠా! అలా చేసి ఆ కార్తవీర్యుడు అత్రికుమారుడైన దత్తాత్రేయుణ్ణి ఆరాధించాడు. దత్తగురుడతనికి నాలుగు వరాలిచ్చాడు.

పూర్వం బాహుసహస్రం తు స వవ్రే రాజసత్తమః ।
అధర్మం చరమాణస్య సద్భిశ్చాపి నివారణమ్ ॥16॥

ఆ రాజశ్రేష్ఠుడు మొదట వెయ్యి చేతులు వరంగా కోరాడు. అధర్మం అచరించే పక్షంలో సజ్జనులచే నివారింపబడునట్లుగా కూడా అర్థించాడు.

యుద్ధేన పృథివీం జిత్వా ధర్మేణైవానుపాలనమ్ ।
సఙ్గ్రామే వర్తమానస్య వధశ్చైవాధికాద్భవేత్ ॥17॥

యుద్ధంలో భూమిని జయించి ధర్మంతో పాలించడం, యుద్ధంలో ఉన్నపుడు తనకంటే బలాధికునిచేత మరణం- అనే వరాలను కోరాడు.

తేనేయం పృథివీ సర్వా సప్తద్వీపా సపర్వతా ।
సప్తోదధిపరిక్షిప్తా క్షాత్రేణ విధినా జితా ॥18॥

సప్తసాగరవలయితమై, సప్తద్వీపాలతో, పర్వతాలతో గూడిన ఈ భూమినంతా అతడు క్షాత్రవిధితో జయించాడు.

జజ్ఞే బాహుసహస్రం వై ఇచ్ఛతస్తస్య ధీమతః ।
రథే ధ్వజశ్చ సంజజ్ఞే ఇత్యేవమనుశుశ్రుమ ॥19॥

అతని కోరిక ననుసరించి అతనికి వెయ్యి చేతులు కలిగాయి. రథంపై ధ్వజం కూడా సంభవించిందని వింటున్నాము.

దశ యజ్ఞసహస్రాణి రాజ్ఞాం ద్వీపేషు వై తదా ।
నిరర్గళాని వృత్తాని శ్రూయన్తే తస్య ధీమతః ॥20॥

అంతే కాకుండా, ఆ ధీమంతుడు పదివేల యజ్ఞాలు ఆయా రాజుల ద్వీపాలలో నిరాటంకంగా నిర్వర్తించాడని గూడా తెలుస్తున్నది.

సర్వే యజ్ఞా మహారాజ్ఞస్తస్యాసన్ భూరిదక్షిణాః ।
సర్వే కాఞ్చనయూపాస్తే సర్వాః కాఞ్చనవేదికాః ॥21॥

ఆ మహారాజు చేసిన యజ్ఞాలన్నీ భూరి దక్షిణలతో విలసిల్లాయి. అన్నీకాంచన యూపాలుగలవే, అన్నీ కాంచన వేదికలుగలవే.

సర్వదేవైస్సమం ప్రాప్తైర్విమానస్థైరలఙ్కృతః ।
గన్ధర్వైరప్సరోభిశ్చ నిత్యమేవోపశోభితః ॥22॥

అన్ని యజ్ఞాల్లో విమానస్థులైన దేవతలచేత అతలంకృతుడయ్యాడు. గంధర్వులు, అచ్చరలు గూడా ఆయజ్ఞాలను శోభావంతం చేశారు.

తస్య యజ్ఞే జగౌ గాథాం గన్ధర్వో నారదస్తథా ।
కార్తవీర్యస్య రాజర్షేర్మహిమానం నిరీక్ష్య సః ॥23॥

కార్యవీర్యరాజర్షి యొక్క మహిమ చూచి ఆతనియజ్ఞంలో నారదుడనే గంధర్వుడు గాథనిలా ఆలపించాడు.

న నూనం కార్తవీర్యస్య గతిం యాస్యన్తి క్షత్రియాః ।
యజ్ఞైర్దానై స్తపోభిశ్చ విక్రమేణ శ్రుతేన చ ॥24॥

యజ్ఞదానతపస్సులలో, పరాక్రమంలో, శాస్త్రజ్ఞానంలో కార్తవీర్యునికి సములైన రాజులు ఇతరులు లేరు.

స హి సప్తసు ద్వీపేషు ఖడ్గీ చక్రీ శరాసనీ ।
రథీ ద్వీపాన్యనుచరన్యోగీ పశ్యతి తస్కరాన్ ॥25॥

అతడు సప్తద్వీపాలలోనూ, ఖడ్గం, చక్రం, ధనువు చేపట్టి రథస్థుడై ద్వీపాలన్నింటా సంచరిస్తూ యోగియై దొంగలను కనిపెట్టేవాడు.

పఞ్చాశీతిసహస్రాణి వర్షాణాం స నరాధిపః ।
స సర్వరత్నసమ్పూర్ణశ్చక్రవర్తీ బభూవ హ ॥26॥

ఆ రాజు అలా ఎనుబదియైదువేల సంవత్సరాలు రాజ్యం పాలించాడు. సర్వరత్నసమృద్ధిగల చక్రవర్తిగా రాణించాడు.

స ఏవ పశుపాలోఽభూత్ క్షేత్రపాలస్స ఏవ హి ।
స ఏవ వృష్ట్యా పర్జన్యో యోగిత్వాదర్జునోఽభవత్ ॥27॥

అతడే పశుపాలకుడుగా, అతడే క్షేత్రపాలకుడుగా, అతడే వర్షించే పర్జన్యుడుగా, యోగి గాన అర్జునుడుగా మారినాడు.

యోఽసౌ బాహుసహస్రేణ జ్యాఘాతకఠినత్వచా ।
భాతి రశ్మిసహస్రేణ శారదేనేవ భాస్కరః ॥28॥

శరదృతువులో వెయ్యి కిరణాలతో భాసించే సూర్యునిలాగా అల్లెత్రాటి తాకిడిచే కఠిన చర్మం కల బాహు సహస్రంతో అతడు వెలుగొందాడు.

ఏష నాగం మనుష్యేషు మాహిష్మత్యాం మహాద్యుతిః ।
కర్కోటకసుతం జిత్వా పురం తత్ర న్యవేశయత్ ॥29॥

అతడు మనుజులలో మహాద్యుతిమంతుడై కర్కోటక సుతుడైన నాగుని జయించి, అతని మహిష్మతీనగరాన్ని తన రాజధానిగా చేసుకొన్నాడు.

ఏష వేగం సముద్రస్య ప్రావృట్కాలే భజే(జ్యే)త వై ।
క్రీడన్నివ సుఖోద్భిన్నః ప్రతిస్రోతో మహీపతిః ॥30॥

వర్షాకాలంలో అతడు జలప్రవాహాని కెదురుగా పోయి క్రీడించువానివలె అవలీలగా సముద్రపు పోటులను వెనక్కు నెట్టి సాగరవేగాన్ని తగ్గించేవాడు.

లలనాః క్రీడితాస్తేన ప్రతిస్రగ్దామమాలికాః ।
యస్య భ్రుకుటిసన్త్రాసాచ్చకితాఽభ్యేతి నర్మదా ॥31॥

ఆ రాజు కనుబొమ్మల ముడికి భీతిల్లి నర్మదానది అతని చెంతకు రాగా దానియందు అతడు పూమాలలు దాల్చిన స్త్రీలతో క్రీడించేవాడు.

ఏకో బాహుసహస్రేణ వగాహే స మహార్ణవమ్ ।
కరోత్యుద్వృత్తవేగాం తు నర్మదాం ప్రావృడుద్ధతామ్ ॥32॥

తానొక్కడే వెయ్యి చేతులతో మహాసముద్రంలో స్నానం చేసేవాడు. అప్పుడు వర్షాకాలంలో పొంగిన నర్మదను మితిమించిన వేగం కలదిగా చేసేవాడు.

తస్య బాహుసహస్రేణ క్షోభ్యమాణే మహోదధౌ ।
భవన్త్యతీవ నిశ్చేష్టాః పాతాలస్థా మహాసురాః ॥33॥

అతని బాహుసహస్రంచే మహాసముద్రం క్షోభపెట్టబడుతుండగా పాతాలంలోని మహాసురులు మిక్కిలి భయపడి నిశ్చేష్టులయ్యేవారు.

చూర్ణీకృతమహావీచిలీనమీనమహాతిమిమ్ ।
మారుతావిద్ధఫేనౌఘమావర్తాక్షిప్తదుస్సహమ్ ॥34॥
కరోత్యాలోడయన్నేవ దోస్సహస్రేణ సాగరమ్ ।

సముద్రంలోని పెద్ద అలల మధ్య దాగిన పెద్ద పెద్ద చేపలను చూర్ణం చేస్తూ, గాలితాకిడికి నురుగు గట్టగా, పెద్ద పెద్ద సుడులతో దుస్సహమైన సాగరాన్ని వెయ్యిచేతులతో కలత చెందించేవాడు.

మన్దరక్షోభచకితా హ్యమృతోత్పాదశఙ్కితాః ॥35॥
తదా నిశ్చలమూర్ధానో భవన్తి చ మహోరగాః ।
సాయాహ్నే కదలీఖణ్డా నిర్వాతస్తిమితా ఇవ ॥36॥

మందరాద్రిక్షోభంతో చలితమై అమృతం ఉద్భవించునని శంకించిన మహా సర్పాలు సాయంసమయంలో గాలి లేకపోవడం మూలాన నిశ్చలమైన కదలీఖండాలవలె నిశ్చలమైన శిరస్సులు గలవయ్యేవి.

ఏవం బద్ధ్వా ధనుర్జ్యాయాముత్సిక్తం పఞ్చభిశ్శరైః ।
లఙ్కాయాం మోహయిత్వా తు సబలం రావణం బలాత్ ॥37॥

నిర్జిత్య బద్ధ్వా చాఽఽనీయ మాహిష్మత్యాం బబన్ధ చ ।

అట్లే ధనుస్సును అల్లెత్రాటిలో బద్ధం కావించి ఐదు బాణాలు సంధించి సైన్యంతో సహా లంకలో గర్వితుడైన రావణుణ్ణి తన బలప్రభావంతో మూర్ఛాగతుణ్ణి చేశాడు. ఆ రాక్షసుణ్ణి జయించి బంధించి తెచ్చి మాహిష్మతీనగరంలో బంధించాడు.

తతో గత్వా పులస్త్యస్తు అర్జునం సమ్ప్రసాదయన్ ॥38॥
ముమోచ రక్షః పౌలస్త్యం పులస్త్యేనేహ సాన్త్వితమ్ ।
తస్య బాహుసహస్రేణ బభూవ జ్యాతలస్వనః ॥39॥
యుగాన్తాభ్రసహస్రస్య ఆస్ఫోటస్త్వశనేరివ ।

పిదప పులస్త్యుడు వెళ్ళి అర్జునుణ్ణి ప్రసన్నుణ్ణి చేస్తూ ప్రార్థించగా–అతని కోరిక మేరకు రావణుణ్ణి విడిచి పెట్టాడు. అతని బాహుసహస్రంచేత యుగాంతంలో వెయ్యి మేఘాల ధ్వని లాగా పిడుగు పాటువంటి ధ్వనికల్గింది.

అహో బత విధేర్వీర్యం భార్గవోఽయం యదాచ్ఛినత్ ॥40॥
తద్వై సహస్రం బాహూనాం హైమతాలవనం యథా ।
యద్భార్గవస్తు సఙ్క్రుద్ధో హ్యర్జునం శప్తవాన్ప్రభుః ॥41॥

విధిబలం ఆశ్చర్యావహం. అట్టి బాహుసహస్రాన్ని హైమతాళవనాన్నివలె పరశురాముడు ఛేదించాడు. కారణమేమనగా కోపించిన పరశురాముడు కార్తవీర్యార్జునుణ్ణి ఇలా శపించాడు.

యస్మాద్వనం ప్రదగ్ధం వై విశ్రుతం మమ హైహయ ।
తస్మాత్తే దుష్కరం కర్మ కృతమన్యో హరిష్యతి ॥42॥

కోపించిన వసిష్ఠుడు హైహయా! ప్రఖ్యాతమైన నా వనాన్ని దగ్ధం చేశావు, అట్టి నీ దుష్కరకర్మను మరొకడు హరించగలడు" అని శపించాడు.

ఛిత్త్వా బాహుసహస్రం తే ప్రథమం తరసా బలీ ।
తపస్వీ బ్రాహ్మణశ్చ త్వాం స వధిష్యతి భార్గవః ॥43॥

నీ బాహుసహస్రాన్ని ఛేదించి బలవంతుడు, తపస్వి, బ్రాహ్మణుడైన భార్గవుడు నిన్ను వధించగలడు అని.

సుత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

తస్య రామ స్తదా త్వాసీన్మృత్యుశ్శాపేన ధీమతః ।
వరశ్చైవ తు రాజర్షేస్స్వయమేవ వృతః పురా ॥44॥

ఆ శాపం చేత భార్గవరాముడు అర్జునుని పాలిటి మృత్యువైనాడు. అట్టి వరం ఆ రాజుకూడా పూర్వం స్వయంగా కోరుకొన్నాడు గదా!

తస్య పుత్రశతం త్వాసీ త్పంచ తత్ర మహారథాః ।
కృతాస్త్రా బలిన శ్శూరా ధర్మాత్మానో మహాబలాః ॥45॥

ఆ అర్జునునికి నూరుమంది కుమారులు గలరు. వారిలో ఐదుగురు మహారథులు. వారు అస్త్రనిపుణులు, బలవంతులు, శూరులు, ధర్మాత్ములు, మహా బలశాలురు.

శూరసేనశ్చ శూరశ్చ వృష్ణిః కృష్ణస్తథైవ చ ।
జయధ్వజశ్చ వై కర్తా అవన్తేశ్చ విశామ్పతే ॥46॥

జయధ్వజస్య పుత్రస్తు తాలజఙ్ఘో మహాబలః ।
తస్య పుత్రశతాన్యేవ తాలజఙ్ఘా ఇతి శ్రుతాః ॥47॥

(1) శూరసేనుడు (2) శూరుడు (3) వృష్ణి (4) కృష్ణుడు, (5)అవంతీనగర నిర్మాత యగు జయధ్వజుడు. జయధ్వజుని పుత్రుడు మహాబలుడైన తాలజంఘుడు. అతని నూరుగురు కుమారులూ తాలజంఘులుగానే ప్రసిద్ధులయ్యారు.

తేషాం పఞ్చ కులాః ఖ్యాతా హైహయానాం మహాత్మనామ్ ।
వీతిహోత్రాశ్చ పార్యాతా భోజాశ్చావన్తయ స్తథా ॥48॥
కుణ్డికేరాశ్చ విక్రాన్తాస్తాలజఙ్ఘా స్తథైవ చ ।

ఆ హైహయులకు సంబంధించిన కులాలు ఐదు ప్రసిద్ధాలు. వారు పర్యాతివంశంలోని వీతిహోత్రులు, భోజులు, ఆవన్తులు, కుండికేరులు, తాలజంఘులు – అందరూ పరాక్రమశాలురే.

వీతిహోత్రసుతశ్చాపి ఆనర్తో నామ వీర్యవాన్ ।
దుర్జయస్తస్య పుత్రస్తు బభూవామిత్రకర్శనః ॥49॥

సద్భావేన మహారాజః ప్రజా ధర్మేణ పాలయన్ ।
కార్తవీర్యార్జునో నామ రాజా బాహుసహస్రవాన్ ॥50॥

వీతిహోత్రుని కుమారుడు ఆనర్తుడు. ఇతడు వీర్యశాలి. అతని కుమారుడు దుర్జయుడు. అతడు శత్రువిజేత. ఆ మహారాజు సద్భావంతో ప్రజలను దర్మబద్ధంగా పాలించాడు. ఇలా కార్తవీర్యార్జునుడు వెయ్యిచేతులు గల రాజుగా ప్రసిద్ధుడు.

యేన సాగరపర్యన్తా ధనుషా నిర్జితా మహీ ।
యస్తస్య కీర్తయేన్నామ కల్యముత్థాయ మానవః ॥51॥
న తస్య విత్తనాశస్స్యాన్నష్టం చ లభతే పునః ।

అతడు తన ధనుస్సుతో సాగరపర్యంతమైన భూమిని జయించాడు. ఎవడు ఉదయిం లేచి అతని పేరు కీర్తిస్తాడో– అతని విత్తం నశించదు. నష్టమైనదాన్ని సైతం తిరిగి పొందుతాడు.

కార్తవీర్యస్య యో జన్మ కథయేదిహ ధీమతః ।
యథావత్స్విష్టపూతాత్మా స్వర్గలోకే మహీయతే ॥52॥

ధీమంతుడైన కార్యవీర్యుని జన్మ వృత్తాంతం చెప్పినవాడు, యథావిధిగా యజ్ఞాలు చేసి పవిత్రుడై స్వర్గంలో పూజింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యదువంశానువర్ణనం నామ త్రిచత్వారింశోఽధ్యాయః ॥ 43 ॥

శ్రీమత్స్య పురాణంలోని యదువంశానువర్ణనమనే నలభైమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుశ్చత్వారింశో௨ధ్యాయః - నలబైనాల్గవ అధ్యాయం

అర్జునం ప్రతి ద్విజరూపసూర్యాగమనమ్ - అర్జునుని కడకు ద్విజరూపసూర్యుని రాక

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

కిమర్థం తద్వనం దగ్ధం భార్గవస్య మహాత్మనః ।
కార్తవీర్యేణ విక్రమ్య సూత! ప్రబ్రూహి తత్త్వతః ॥1॥

సూతా! మహాత్ముడగు భార్గవుని వనాన్ని కార్తవీర్యుడు విక్రమించి ఎందుకు దహించాడు? జరిగిన సంగతి వివరించు.

రక్షితా స తు రాజర్షిః ప్రజానామితి నశ్శ్రుతమ్ ।
స కథం రక్షితా భూత్వా అదహత్తత్తపోవనమ్ ॥2॥

ఆ రాజర్షి ప్రజారక్షకుడని విన్నాం. అతడు రక్షకుడైయుండీ ఆ తపోవనాన్ని ఎలా దగ్ధం చేశాడు?

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఆదిత్యో ద్విజరూపేణ కార్తవీర్యముపస్థితః ।
తృప్తిమేకాం ప్రయచ్ఛస్వ ఆదిత్యో௨హం నరేశ్వర! ॥3॥

ఒకసారి ఆదిత్యుడు ద్విజరూపంతో కార్తవీర్యుని చెంతకు వచ్చాడు. "రాజా! నేను ఆదిత్యుడను. నాకు తృప్తి కల్గించు" అని కోరాడు.

కార్తవీర్య ఉవాచ :- కార్తవీర్యుడు చెప్పాడు.

భగవన్కేన తృప్తిస్తే భవత్యేవ దివాకర! ।
కీదృశం భోజనం దద్మి శ్రుత్వా తు విదధామ్యహమ్ ॥4॥

దివాకరా! భగవంతుడా! నీకు ఏమి చేస్తే, తృప్తి కల్గుతుంది! నీకెట్టి భోజనం కావాలో చెప్పు, అది విని తగిన రీతిగా చేస్తాను.

ఆదిత్య ఉవాచ :- ఆదిత్యుడు చెప్పాడు.

స్థావరం దేహి మే సర్వమాహారం దదతాం వర! ।
తేన తృప్తో భవేయం వై సా మే తృప్తిర్హి పార్థివ! ॥5॥

దాతలలో శ్రేష్ఠుడా! స్థావరమైన సర్వాన్నీ నాకు ఆహారంగా ఇమ్ము. దానితో తృప్తుడ నవుతాను. రాజా! అదే నాకు తృప్తికరం.

కార్తవీర్య ఉవాచ :– కార్తవీర్యుడు చెప్పాడు.

న శక్యా స్థావరాస్సర్వే తేజసా చ బలేన చ ।
నిర్దగ్ధుం తపతాం శ్రేష్ఠ! త్వామేవ ప్రణమామ్యహమ్ ॥6॥

తపస్సు చేయు వారిలో శ్రేష్ఠుడవైన సూర్యా! సర్వస్థావరాలను తేజస్సుతో, బలంతో దహించడం సాధ్యం కాని పని. నీకు నమస్కరిస్తున్నాను.

ఆదిత్య ఉవాచ :– ఆదిత్యుడు చెప్పాడు.

తుష్టస్తేఽహం శరాన్దాస్యామ్యక్షయాన్సర్వతోముఖాన్ ।
యే ప్రక్షిప్తా జ్వలిష్యన్తి మమ తేజస్సమన్వితాః ॥7॥

నీ భక్తికి నేను సంతసించాను. నీకు అక్షయమైనవీ, సర్వతోముఖాలూ అయిన బాణాలిస్తాను. ప్రయోగిస్తే అవి నా తేజస్సుతో కలిసి మండుతాయి.

ఆవిష్టా మమ తేజోభి శ్శోషయిష్యన్తి స్థావరాన్ ।
శుష్కాన్భస్మీకరిష్యన్తి తేన తృప్తిర్నరాధిప! ॥8॥

నా తేజస్సుచే ఆవేశింపబడిన ఆశరాలు స్థావరాలను శుష్కింపజేస్తాయి. శుష్కమైనవాటిని భస్మీకరిస్తాయి. రాజా! దానితో నాకు తృప్తి కల్గుతుంది.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

తతశ్శరాంస్తదాదిత్యస్త్వర్జునాయ ప్రయచ్ఛత ।
తతో దదాహ సమ్ప్రాప్తాన్ స్థావరాన్సర్వమేవ చ ॥9॥

పిదప ఆదిత్యుడు అర్జునునికి శరాలను ఇచ్చాడు. వాటితో ఆ రాజు ఎదురుపడిన స్థావరాలనన్నిటినీ దహించాడు.

గ్రామాంస్తథాఽశ్రమాంశ్చైవ ఘోషాణి నగరాణి చ ।
తపోవనాని రమ్యాణి వనాన్యుపవనాని చ ॥10॥

గ్రామాలను, ఆశ్రమాలనూ, పల్లెలనూ, నగరాలనూ, రమ్యమైన తపోవనాలనూ, ఉపవనాలనూ దహించాడు.

ఏవం సర్వం సమదహత్తతః సర్వాంశ్చ పక్షిణః ।
నిర్వృక్షా నిస్తృణా భూమిః కృతా ఘోరేణ తేజసా ॥11॥

ఇలా సర్వాన్నీ కాల్చివేశాడు. ఆపై పక్షుల నన్నిటినీ దగ్ధం చేశాడు. ఆ భయంకరమైన తేజస్సుచేత భూమి చెట్లు లేనిదిగా, తృణాలు లేనిదిగా అయింది.

ఏతస్మిన్నేవ కాలే తు భార్గవో జలమాస్థితః ।
దశవర్షసహస్రాణి తత్రాఽఽస్తే స మహానృషిః ॥12॥

ఆ సమయంలోనే నీట ప్రవేశించిన మహర్షి వసిష్ఠుడు పదివేల సంవత్సరాలు తపస్సుచేస్తూ ఉండినాడు.

పూర్ణే వ్రతే మహాతేజా ఉదతిష్ఠత్తపోధనః ।
సోఽపశ్యదాశ్రమం దగ్ధమర్జునేన మహామునిః ॥13॥

వ్రతం పూర్తి కాగానే మహాతేజస్వి అయిన ఆ తపోధనుడు లేచాడు. ఆ మహాముని అర్జునుడు దహించివేసిన ఆశ్రమాన్ని చూచాడు.

క్రోధాచ్ఛశాప రాజర్షిం కీర్తితం వో యథా మయా ।
క్రోష్టోః శృణుత రాజర్షేర్వంశముత్తమపౌరుషమ్ ॥14॥

కోపంతో ఆ ముని నేనింతకు ముందు చెప్పినట్లు ఆరాజర్షిని శపించాడు. ఇక క్రోష్టుడనే రాజర్షి యొక్క ఉత్తమ పౌరుషం గల వంశాన్ని గూర్చి వినండి.

యస్యాన్వవాయే సమ్భూతో విష్ణుర్వృష్ణికులోద్వహః ।
క్రోష్టోరేవాభవత్పుత్రో వృజినీవాన్మహారథః ॥15॥

వృష్ణికులరక్షకుడైన విష్ణువు ఆతని వంశంలో జనించాడు, క్రోష్టువుకు మహారథుడైన వృజనీవంతుడు పుత్రుడుగా జనించాడు.

వృజినీవతశ్చ పుత్రోఽభూత్స్వాహో నామ మహాబలః ।
స్వాహపుత్రోఽభవద్రాజన్ ఉషఙ్గో వదతాం వరః ॥16॥

వృజనీవంతునికి స్వాహుడనే మహాబలవంతుడైన సుతుడు కలిగాడు. స్వాహుని పుత్రుడు వక్తలలో శ్రేష్ఠుడైన ఉషంగుడు.

తతః ప్రసూతిమిచ్ఛన్వై ఉషఙ్గః సౌమ్యమాత్మజమ్ ।
చిత్రీ చిత్రరథశ్చాస్య పుత్రః కర్మభిరన్వితః ॥17॥

అతడు సౌమ్యుడైన సుతుని పొందాలని తపస్సు చేసి కర్మనిపుణుడగు చిత్రరథుడనేవాణ్ణి కన్నాడు.

అథ చైత్రరథిర్వీరో జజ్ఞే విపులదక్షిణః ।
శశిబిన్దురితి ఖ్యాతశ్చక్రవర్తీ బభూవ హ ॥18॥

చిత్రరథుని కుమారుడు శశిబిందువు. అతడు వీరుడు, ఎక్కువ దక్షిణలిచ్చి యజ్ఞాలు చేసినవాడై గొప్పచక్రవర్తి అయినాడు.

అత్రానువంశశ్లోకోఽయం గీతస్తస్మిన్పురాఽభవత్ ।
శశిబిన్దోస్తు పుత్రాణాం శతానామభవచ్ఛతమ్ ॥19॥

అతనిని గూర్చి అనువంశశ్లోకం గానం చేయబడింది. శశిబిందువుకు నూర్నూర్లమంది పుత్రులు కలిగారు.

ధీమతాం చాభిరూపాణాం భూరిద్రవిణతేజసామ్ ।
తేషాం శమప్రధానానాం పృథుసత్త్వో మహాబలః ॥20॥

పృథుశ్రవాః పృథుయశాః పృథుధర్మా పృథుఞ్జయః ।
పృథుకీర్తిః పృథుమనా రాజానశ్శశిబిన్దవః ॥21॥

ధీమంతులు, అభిరూపులు, గొప్ప ఐశ్వర్య తేజస్సులు గలవారు, అయిన వారిలో పృథుసత్త్వుడనువాడు, పృథుశ్రవుడు, పృథుయశుడు, పృథుధర్ముడు, పృథుంజయుడు, పృథుకీర్తి, పృథుమనసుడు అనువారు – వారందరూ శశిబిందువంశజులే.

శంసన్తి చ పురాణజ్ఞాః పృథుశ్రవసముత్తమమ్ ।
అనన్తరం సుయజ్ఞశ్చ ప్రజ్ఞస్య తనయోఽభవత్ ॥22॥

పురాణం తెలిసినవారు పృథుశ్రవుణ్ణి ఉత్తముడంటారు. అతని సుతుడు ప్రజ్ఞునికి 'సుయజ్ఞుడు' కుమారుడైనాడు.

ఉశనా తు సుయజ్ఞస్య యో రక్షన్పృథివీమిమామ్ ।
ఆజహారాశ్వమేధానాం శతముత్తమధార్మికః ॥23॥

సుయజ్ఞుని కుమారుడు ఉశనసుడు. అతడు ఉత్తమ ప్రవృత్తి గల ధార్మికుడు. పృథివీరక్షణ కావిస్తూ ఆ రాజు నూరు అశ్వమేధాలు నిర్వహించాడు.

తితిక్షురభవత్పుత్ర ఔశనశ్శత్రుతాపనః ।
మరున్తస్తస్య తనయో రాజర్షీణామనుత్తమః ॥24॥

ఉశనసుని పుత్రుడు శత్రుబలాన్ని తపింపజేసే తితిక్షువు. రాజర్షులలో మిక్కిలి ఉత్తముడైన మరుంతుడు అతని పుత్రుడు.

ఆసీన్మరున్తతనయో వీరః కమ్బళబర్హిషః ।
పుత్రస్తు రుక్మకవచో విద్వాన్కమ్బళబర్హిషః ॥25॥

మరుంతుని తనయుడు వీరుడైన కంబలబర్హిషుడు. అతని సుతుడు విద్వాంసుడైన రుక్మకవచుడు.

నిహత్య రుక్మకవచః పరాన్కవచధారిణః ।
ధన్వినో వివిధైర్బాణైరవాప్య పృథివీమిమామ్ ॥26॥

అశ్వమేధే దదౌ రాజా బ్రాహ్మణేభ్యస్తు దక్షిణామ్ ।
యజ్ఞే తు రుక్మకవచః కదాచిత్పరవీరహా ॥27॥

వివిధ బాణాలతో కవచధారులైన ధనుర్ధారులగు శత్రువులను హతమార్చి పృథివీవలయానికంతటికీ రుక్మకవచుడు రాజైనాడు. పరవీరులను హతమార్చిన ఆ రుక్మకవచుడు ఒకసారి అశ్వమేధయజ్ఞంలో బ్రాహ్మణులకు భూమినంతా దక్షిణగా ఇచ్చాడు.

జజ్ఞిరే పఞ్చ పుత్రాస్తు మహావీర్యా ధనుర్భృతః ।
రుక్మేషుః పృథురుక్మశ్చ జ్యామేఘః పరిఘో హరిః ॥28॥

అతనికి రుక్మేషుడు, పృథురుక్ముడు, జ్యామేఘుడు, పరిఘుడు, హరి – అనే మహా పరాక్రమవంతులైన ఐదుగురు ధానుష్కులు కుమారులైనారు.

పరిఘం చ హరిం చైవ విదేహేఽస్థాపయత్పితా ।
రుక్మేషురభవద్రాజా పృథురుక్మస్తదాశ్రయః ॥29॥

తండ్రి పరిఘుణ్ణీ, హరినీ విదేహ దేశంలో పాలకులుగా నెలకొల్పాడు. రుక్మేషువు రాజయ్యాడు. పృథరుక్ముడతణ్ణి ఆశ్రయించి వుండేవాడు.

తేభ్యః ప్రవ్రాజితో రాజా జ్యామేఘస్తు తదాశ్రమే ।
ప్రశాన్తశ్చాఽశ్రమస్థశ్చ బ్రాహ్మణేనావబోధితః ॥30॥

రాజు జ్యామేఘుడు వారినుండి ప్రవ్రజించి దూరమయ్యాడు, ఆశ్రమంలో నివసించాడు. ఒక బ్రాహ్మణునిచే తత్త్వం బోధింపబడినవాడై, అతడు ప్రశాంతంగా ఉండువాడు.

జగామ ధనురాదాయ దేశమన్యం ధ్వజీ రథీ ।
నర్మదాం నృప ఏకాకీ కేవలం వృత్తికామతః ॥31॥

అతడు కేవలం జీవనవృత్తికై ధనువు గ్రహించి ధ్వజంకల రథమధిష్ఠించి మరొకదేశానికి వెళ్ళాడు. ఏకాకియై నర్మదానదీతీరానికి పోయాడు.

ఋక్షవన్తం గిరిం గత్వా భుక్తమన్యైరుపావిశత్ ।
జ్యామేఘస్యాభవద్భార్యా చైత్రా పరిణతా సతీ ॥32॥

అతడక్కడ ఇతరుల పాలనలోని ఋక్షవన్తమనే కొండ చేరాడు. జ్యామేఘుని భార్య చైత్ర ఆమె మధ్యవయస్క.

అపుత్రో న్యవసద్రాజా భార్యామన్యాం న విన్దత ।
తస్యాఽఽసీద్విజయో యుద్ధే తత్ర కన్యామవాప సః ॥33॥

భార్యా తూవాచ సన్త్రాసాత్కైషా కన్యా సులోచనా ।
భార్యార్థే తు సమానీతా కథయస్వేతి లంపటా ॥

అతనికి సంతతి లేదు. అతడు మరొక భార్యను పరిగ్రహించలేదు. ఒకసారి యుద్ధంలో అతడు జయించాడు. అక్కడ ఒక కన్యను గెలిచి ఇంటికి తెచ్చాడు. ఈ సులోచనయగు కన్య ఎవరు? భార్యగా తీసుకొచ్చావా, అని అతని భార్య అడిగింది.

భార్యామువాచ సత్రాసం స్నుషేయం తే సువిశ్రుతా ।
ఏవముక్తాఽబ్రవీదేనం కస్య చేయం స్నుషేతి చ ॥34॥

నాహం ప్రసూతా పుత్రేణ నాన్యా పత్న్యభవత్తవ ।
స్నుషా సంబంధకస్తేన కతమేన సుతేన తే ॥35॥

యం త్వం జనిష్యసే పుత్రం తస్య భార్యా భవిష్యతి ।
తస్మాత్సా తపసోగ్రేణ కన్యాయాం సమ్ప్రసూయతే ॥36॥

పుత్రం విదర్భం సుభగా శైబ్యా పరిణతా సతీ ।

రాజు భార్యతో భయంగా ఈమె నీ కోడలు అని అనగా ఆమె ఎవరి కోడలు అని అడిగింది. నీకు కలగబోయే కుమారుని కీమె భార్యకానున్నది అని అతడు చెప్పాడు. భార్య – నాకు కుమారులు లేరు. నీకు వేరే భార్య లేదు. ఈమె మనకెలా కోడలు కాగలదు? ఆపైన ఆమె ఉగ్ర తపస్సుచేసి విదర్భుడనే పుత్రుణ్ణి ప్రసవించింది.

రాజపుత్ర్యాం చ విద్వాంసౌ స్నుషాయాం క్రథకైశికౌ ।
లోమపాదం తృతీయం తు పుత్రం పరమధార్మికమ్ ॥37॥

తస్యాం విదర్భోఽజనయచ్ఛూరాన్రణవిశారదాన్ ।
లోమపాదాన్మనుః పుత్రో జ్ఞాతిస్తస్య తు చాత్మజః ॥38॥

కైశికస్య చిదిః పుత్ర స్తస్మాచ్చైద్యా నృపా స్మృతాః ।
క్రథో విదర్భపుత్రస్తు కున్తిస్తస్యాఽఽత్మజోఽభవత్ ॥39॥

విద్యాంసుడైన ఆ విదర్భుడు ఆ రాజపుత్రి యందు క్రథుచు, కైశికుడు, లోమపాదుడు అనే శూరులైన యుద్ధవిశారదులను కన్నాడు. మూడవవాడైన లోమపాదుడు పరమధార్మికుడు. లోమపాదుని కుమారుడు మనువు. అతని సుతుడు జ్ఞాతి. కైశికుని సుతుడు చిది. అతని పుత్రులే చైద్యులు. విదర్భుని పుత్రుడు క్రథుడు, అతని సుతుడు కుంతి.

కున్తేర్ధృష్టః సుతో జజ్ఞే రణధృష్టః ప్రతాపవాన్ ।
ధృష్టస్య పుత్రో ధర్మాత్మా నివృత్తిః పరవీరహా ॥40॥

కుంతి కుమారుడు ధృష్టుడు, అతడు రణధృష్టుడు, ప్రతాపశాలి. ధృష్టుని పుత్రుడు ధర్మాత్ముడైన నివృత్తి. అతడు వీర శత్రువులను పరిమార్చువాడు.

తదేకో నిర్వృతేః పుత్రో నామ్నా స తు విదూరథః ।
దశార్హస్తస్య వై పుత్రో వ్యోమస్తస్య చ వై స్మృతః ।
దాశార్హాచ్చైవ వ్యోమాత్తు పుత్రో జీమూత ఉచ్యతే ॥41॥

నివృత్తి పుత్రుడు ఒక్కడే, వాని పేరు విదూరథుడు. అతని కుమారుడు దశార్హుడు. అతని సుతుడు వ్యోముడు. దాశార్హుడైన వ్యోముని కుమారుడు జీమూతుడు.

జీమూతపుత్రో విమలస్తస్య భీమరథ స్సుతః ।
సుతో భీమరథస్యాసీత్స్మృతో నవరథః కిల ॥42॥

జీమూని పుత్రుడు విమలుడు, అతని కొడుకు భీమరథుడు, అతని కుమారుడు నవరథుడు.

తస్య చాసీద్దృఢరథశ్శకునిస్తస్య చాత్మజః ।
తస్మాత్కరమ్భః కారమ్భో దేవరాతో బభూవ హ ॥43॥

అతని కొడుకు దృఢరథుడు, అతని కుమారుడు శకుని. అతని కుమారుడు కరంభుడు, అతని పుత్రుడు దేవరాతుడు.

దేవక్షత్రోఽభవద్రాజా దేవరాతేర్మహాయశాః ।
దేవగర్భసమో జజ్ఞే దేవనక్షత్రనన్దనః ॥44॥

మధుర్నామ మహాతేజాః మధోః పురవస స్తథా ।
ఆసీత్పురవసాత్పుత్రః పురుద్వాన్పురుషోత్తమః ॥45॥

దేవరాతుని సుతుడు దేవక్షత్రుడు గొప్ప కీర్తిగలవాడు. దేవగర్భసదృశుడైన, దేవక్షత్రుని కుమారుడు మధువు. అతడు మహాతేజస్వి. అతని సుతుడు పురవసుడు. పురవసుని సుతుడు పురుషశ్రేష్ఠుడైన పురుద్వంతుడు.

జన్తుర్జజ్ఞేఽథ వైదర్భ్యాం భద్రసేన్యాం పురుద్వతః ।
ఐక్ష్వాకీ చాభవద్భార్యా జంతోస్తస్యామజాయత ॥46॥
సాత్వతస్సత్త్వసంయుక్తస్సాత్వతాం కీర్తివర్ధనః ।

అతనికి వెదర్భియైన భద్రసేనయందు జన్తువనువాడు జన్మించాడు. అతని భార్య ఐక్ష్వాకి. ఆమెయందు జంతువునకు, సత్త్వ సంయుక్తుడు, సాత్వతుల కీర్తిని పెంచిన వాడైన సాత్వతుడు కలిగాడు.

ఇమాం విసృష్టిం విజ్ఞాయ జ్యామేఘస్య మహాత్మనః ।
ప్రజావానేతి సాయుజ్యం రాజ్ఞస్సోమస్య ధీమతః ॥47॥

మహాత్ముడైన జ్యామేఘుని వంశాభివృద్ధిని తెలిసికొన్నవాడు పుత్రవంతుడై ధీమంతుడైన సోముని సాయుజ్యం పొందుతాడు.

సాత్వతాత్సత్త్వసమ్పన్నాత్కౌసల్యా సుషువే సుతాన్ ।
భజినం భజమానం తు దివ్యం దేవావృథం నృప ॥48॥

రాజా! సత్త్వసంపన్నుడైన సాత్వతునుండి కౌసల్య – భజి, భజమానుడు, దివ్యుడైన దేవావృథుని కన్నది.

అన్ధకం చ మహాభోజం వృష్ణిం చ యదునన్దనమ్ ।
తేషాం తు సర్గాశ్చత్వారో విస్తరేణైవ తాన్ఛృణు ॥49॥

అంధకుని, మహాభోజుని, యదునందనుడైన వృష్టిని కన్నది. వారి సృష్టులు నాలుగు, వాటిని వివరంగా విను.

భజమానస్య సృఞ్జయ్యాం వాహ్యకాయాం చ వాహ్యకాః ।
సృఞ్జయస్య సుతే ద్వే తు వాహ్యకాస్తు తదాఽభవన్ ॥50॥
తస్య భార్యే భగిన్యౌ ద్వే సుషువాతే బహూన్సుతాన్ ।

భజమానునికి సృంజయుని పుత్రికలైన సృంజయియందు, వాహ్యకయందు వాహ్యకులు కల్గినారు. వీరేకాక వారిరువురికి పలువురు సుతులు జన్మించారు.

నిమిం చ కృమిలం చైవ వృష్ణిం పరపురఞ్జయమ్ ।
తే బాహ్యకాయాం సృఞ్జయ్యాం భజమానాద్విజజ్ఞిరే ॥51॥

నిమి, కృమిలుడు, పరపుర విజేత అయిన వృష్ణి – అనువారు కూడా బాహ్యకయందు భజమానునికి కల్గారు.

జజ్ఞే దేవావృధో రాజా బన్ధూనాం మిత్రవర్ధనః ।
అపుత్రస్త్వభవద్రాజా చచార పరమం తపః ।
పుత్ర స్సర్వగుణోపేతో మమ భూయాదితి స్పృహన్ ॥52॥

దేవా! దేవావృధుడను రాజు బంధువులతో మైత్రి పెంపొందించుకొన్నాడు– అతనికి సంతతి లేదు. అతడు నాకు సర్వగుణోపేతుడైన పుత్రుడు కలగాలని కోరి గొప్ప తపస్సు చేశాడు.

సంయోజ్య మన్త్రమేవాథ పర్ణాశాజలమస్పృశత్ ।
తదోపస్పర్శనాత్తస్య చకార ప్రియమాపగా ॥53॥

మంత్రసమేతంగా అతడు పర్ణాశానదీ జలాన్ని స్పృశించాడు. ఆ ఉపస్పర్శనం వల్ల నది అతనికి ప్రియం కల్గించింది.

కల్యాణత్వాన్నరపతేస్తస్మై సా నిమ్నగోత్తమా ।
చిన్తయాఽథ పరీతాత్మా జగామాథ వినిశ్చయమ్ ॥54॥

ఆ నరపతి కల్యాణగుణసంపన్నుడు. ఆ ఉత్తమనది అతనికి ప్రియం కల్గించాలని ఆలోచించింది.

నాధిగచ్ఛామ్యహం నారీం యస్యామేవంవిధస్సుతః ।
జాయేత తస్మాదద్యాహం భవామ్యథ సహప్రజాః ॥55॥

ఏ స్త్రీయందు ఇట్టి కొడుకు కలుగునో అట్టి స్త్రీ మరొకతె లేదు. కాన నేనే ఇతనివల్ల సంతానవతినవుతానని నిశ్చయించింది.

అథ భూత్వా కుమారీ సా బిభ్రతీ పరమం వపుః ।
జ్ఞాపయామాస రాజానం తామియేష మహావ్రతః ॥56॥

పిదప ఆ నది కుమారీ రూపంతో శ్రేష్ఠశరీరం ధరించి రాజు కెరుక పరచింది. మహావ్రతుడైన రాజామెను వరించాడు.

అథ సా నవమే మాసి సుషువే సరితాం వరా ।
పుత్త్రం సర్వగుణోపేతం బభ్రుం దేవావృధాన్నృపాత్ ॥57॥

ఆ నదీమతల్లి తొమ్మిదవ నెలలో సర్వగుణ సమన్వితుడైన బభ్రుడనే పుత్రుణ్ణి ఆ దేవావృధనృపతి ద్వారా జనింపజేసింది.

అనువంశే పురాణజ్ఞా గాయ న్తీతి పరిశ్రుతమ్ ।
గుణాన్దేవావృధస్యాపి కీర్తయన్తో మహాత్మనః ॥58॥

పురాణజ్ఞులు అనువంశగీతమును గానం చేస్తారని విన్నాము. వారు మహాత్ముడైన దేవావృధుని గుణాలను కీర్తించారు.

యథైవ శృణుమో దూరాత్సంపశ్యామస్తథాఽన్తికాత్ ।
బభ్రుశ్శ్రేష్ఠో మనుష్యాణాం దేవైర్దేవావృధస్సమః ॥59॥

దూరంనుండి విన్నట్లు సమీపం నుండి చూస్తున్నాము. మనుష్యులలో బభ్రుడు శ్రేష్ఠుడు, దేవావృధుడు దేవతలతో సమానుడు.

పురుషాః పంచ షష్టిశ్చ షట్సహస్రాణి చాష్ట చ ।
ఏతేఽమృతత్వం సమ్ప్రాప్తా బభ్రో ర్దేవావృధాన్నృప ॥60॥

యజ్వా దానపతిర్వీరో బ్రహ్మణ్యశ్చ దృఢవ్రతః ।
రూపవాన్సుమహాతేజాశ్శ్రుతవీర్యధరస్తథా ॥61॥

రాజా! బభ్రుని వల్లా, దేవావృధుని వల్లా వారి వంశంలో యోగానుష్ఠానంతో 14,065 (పదునాలుగు వేలా అరవై అయిదు) మంది పూర్వులు అమృతత్వం పొందారు.

బభ్రువు యాగం జేయువాడు, దానపతి, వీరుడు, బ్రహ్మణ్యుడు, దృఢవ్రతుడు, రూపవంతుడు, గొప్ప తేజస్వి, గొప్ప వీర్యం కలవాడు.

అథ కంకస్య దుహితా సుషువే చతురస్సుతాన్ ।
కుకురం భజమానం చ శశిం కమ్బళబర్హిషమ్ ॥62॥

పిదప కంకుని కుమార్తె కుకురుడు, భజమానుడు, శశి, కంబలబర్హి అనే నలుగురు కుమారులను కన్నది.

కుకురస్య సుతో వృష్ణిః వృష్ణేస్తు తనయో ధృతిః ।
కపోతరోమా తస్యాథ తైత్తిరిస్తస్య చాత్మజః ॥63॥

కుకురుని సుతుడు వృష్ణి, అతని సుతుడు ధృతి, అతని కుమారుడు కపోతరోముడు, అతని కుమారుడు తైత్తిరి.

తస్యాసీత్తనుజః సర్పో విద్వాన్పుత్రో నలః కిల ।
ఖ్యాయతే తస్య నామ్నా స నన్దనో దరదున్దుభిః ॥64॥

అతని తనుజుడు సర్పుడు, అతని సుతుడు విద్యాంసుడైన నలుడు. నలుని కుమారుడు దరదుందుభి.

తస్మిన్ప్రవర్తితే యజ్ఞే అభిజాతః పునర్వసుః ।
అశ్వమేధం చ పుత్రార్థమాజహార నరోత్తమః ॥65॥

తస్య మధ్యేఽతిరాత్రస్య సభామధ్యాత్సముత్థితః ।
అతస్తు విద్వాన్కర్మజ్ఞో యజ్వా దాతా పునర్వసుః ॥66॥

అతడు యజ్ఞం చేయగా పునర్వసువు అనే కుమారుడు పుట్టాడు. ఆ నరోత్తముడు పుత్రార్థం అశ్వమేధం చేశాడు. అతిరాత్రయజ్ఞం చేయగా సభామధ్యనుండి సముత్థితుడై పునర్వసువు జనించాడు. కాన అతడు విద్యాంసుడు, కర్మజ్ఞుడు, యాగకర్త, దాతగా రాణించాడు.

తస్యాసీత్ పుత్రమిథునం బభూవావర్జితం కిల ।
ఆహుకశ్చాఽహుకీ చైవ ఖ్యాతం మతిమతాం వర! ॥67॥

బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవైన రాజా! ఆపునర్వసువునకు ఆహుకుడు, ఆహుకి అని విఖ్యాతమైన అమడ బిడ్డలు (కవల పిల్లలు) కలిగారు.

ఇమాంశ్చోదాహరన్త్యత్ర శ్లోకాన్ప్రతి తమాహుకమ్ ।
ఆ ఆహుకుని గూర్చి ఈ శ్లోకాల నుదాహరిస్తారు.
సోపాసంగానుకర్షాణాం సధ్వజానాం వరూథినామ్ ॥68॥

రథానాం మేఘఘోషాణాం సహస్రాణి దశైవ తు ।
నాసత్యవాదీ నాతేజా నాయజ్వా నాసహస్రదః ॥69॥
నాశుచిర్నాప్యవిద్వాన్హి యో భోజేష్వభ్యజాయత ।

అతనికి మేఘధ్వని గల పదివేల రథాలుండేవి. అవి అమ్ముల పొదులు, ధనువులు మున్నగు పరికరాలు, సైన్యాలు కలిగి ఉండేవి. ఆ భోజులలో అసత్యవాది, తేజోరహితుడు, యజ్వ కానివాడు, వేయి యివ్వనివాడు, శుచి కానివాడూ, అవిద్వాంసుడూ ఎవడూ జనించలేదు.

ఆహుకస్య భృతిం ప్రాప్తా ఇత్యేతద్వై తదుచ్యతే ॥70॥

ఆహుకుని నుండి భృతి పొందినవారి మాటలివి.

ఆహుకశ్చాప్యవన్తీషు స్వసారం చాహుకీం దదౌ ।
ఆహుకాత్కాశ్యపసుతా ద్వౌ పుత్రౌ సమసూయత ॥71॥

ఆహుకుడు తన చెల్లెలు ఆహుకిని అవన్తీదేశంలో ఇచ్చాడు. అతని నుండి కాశ్యపుని పుత్రిక ఇద్దరు సుతులను ప్రసవించింది.

దేవకశ్చోగ్రసేనశ్చ దేవగర్భసమావుభౌ ।
దేవకస్య సుతా వీరా జజ్ఞిరే త్రిదశోపమాః ॥72॥

దేవగర్భసములైన వారిద్దరూ దేవకుడూ, ఉగ్రసేను డనేవారు. దేవకుని కుమారులు వీరులు, దేవతుల్యులు

దేవవానుపదేవశ్చ సుదేవో దేవరక్షితః ।
తేషాం స్వసారస్సప్తాఽఽసన్వసుదేవాయ తా దదౌ ॥73॥

దేవకీ శ్రుతదేవీ చ మిత్రదేవీ యశోధరా ।
శ్రీదేవీ సత్యదేవీ చ సుతాపీ చేతి సప్తమీ ॥74॥

వీరులు దేవతుల్యులు– దేవవంతుడూ, ఉపదేవుడు, సుదేవుడు, దేవరక్షితుడు, అనే నల్గురు. వారి చెల్లెండ్రు ఏడుగురుండేవారు. అతడు వారిని వసుదేవుని కిచ్చాడు. వారు దేవకి, శ్రుతదేవి, మిత్రదేవి, యశోధర, శ్రీదేవి, సత్యదేవి, ఏడవ అమ్మాయి సుతాపి అనునది.

నవోగ్రసేనస్య సుతాః కంసస్తేషాం తు పూర్వజః ।
న్యగ్రోధశ్చ సునామా చ కఙ్కశ్శఙ్కుశ్చ భూయసః ॥75॥

అజభూ రాష్ట్రపాలీ చ యుద్ధముష్టిస్సుముష్టిదః ।
తేషాం స్వసారః పఞ్చాఽఽసన్కంసా కంసవతీ తథా ॥76॥
సుతన్తూ రాష్ట్రపాలీ చ కఙ్కా చేతి వరాఙ్గనాః ।

ఉగ్రసేనుని కుమారులు తొమ్మండుగురు. కంసుడు వారిలో జ్యేష్ఠుడు. తక్కినవారు న్యగ్రోధుడు, సునాముడు, కంకుడు, శంకువు, అజభువు, రాష్ట్రపాలుడు, యుద్ధముష్టి, సుముష్టిదుడు అనువారు. వారి చెల్లెండ్రు ఐదుగురు, కంస, కంసవతి, సుతంతువు, రాష్ట్రపాలి, కంక అనువారు.

ఉగ్రసేన స్సహాపత్యో వ్యాఖ్యాతః కుకురోద్భవః ॥77॥

అపత్యసమేతుడైన ఉగ్రసేనుడు. కుకురవంశంలో జన్మించాడని చెప్పడమైనది.

భజమానస్య పుత్రోఽథ రథిముఖ్యో విదూరథః ।
రాజాధిదేవశ్శూరశ్చ విదూరథసుతోఽభవత్ ॥78॥

భజమానుని కుమారుడు రథికులలో శ్రేష్ఠుడైన విధూరథుడు, శూరుడైన రాజాధిదేవుడు విదూరథుని సుతుడు.

రాజాధిదేవస్య సుతౌ జజ్ఞాతే దేవసమ్మతౌ ।
నియమవ్రతప్రధానౌ శోణాశ్వః శ్వేతవాహనః ॥79॥

రాజాధిదేవుని కుమారులు శోణాశ్వుడు, శ్వేతవాహనుడు. వారు దేవతుల్యులు, నియమవ్రతం పాటించేవారు.

శోణాశ్వస్య సుతాః పఞ్చ శూరా రణవిశారదాః ।
శమీ చ దేవశర్మా చ నికున్త శ్శక్రశత్రుజిత్ ॥80॥

శోణాశ్వుని కుమారులు శూరులు, రణవిశారదులు అయిన ఐదుగురు. శమి, దేవశర్మ, నికుంతుడు, శక్రుడు, శత్రుజిత్తు అనువారు.

శమిపుత్రః ప్రతిక్షత్రః పరిక్షత్ర స్తదాత్మజః ।
పరిక్షేత్రసుతో భోజో హృదీకస్తస్య చాత్మజః ॥81॥

శమి కుమారుడు ప్రతిక్షత్రుడు, అతని కొడుకు పరిక్షత్రుడు. అతని కొడుకు భోజుడు, భోజుని కొడుకు హృదీకుడు.

హృదీకస్యాభవన్పుత్రా దశ భీమపరాక్రమాః ।
కృతవర్మాగ్రజస్తేషాం శతధన్వా చ మధ్యమః ॥82॥

హృదీకునికి భీమ విక్రములైన పదిమంది కుమారులు కలిగారు. వారిలో కృతవర్మ జ్యేష్ఠుడు, శతధన్వుడు మధ్యముడు.

దేవార్హశ్చైవ నాభశ్చ భీషణశ్చ మహాబలః ।
అజాతో వనజాతశ్చ కనీయకకరమ్భకౌ ॥83॥

దేవార్హుడు, నాభుడు, భీషణుడు, మహాబలుడు, అజాతుడు, వనజాతుడు. కనీయకుడు, కరంభకుడు అనేవారు తక్కినవారు.

దేవార్హస్య సుతో విద్వాన్జజ్ఞే కమ్బలబర్హిషః ।
అసమఞ్జాస్సుతస్తస్య తమోజాస్తస్య చాఽత్మజః ॥84॥

దేవార్హుని పుత్రుడు విద్యాంసుడైన కంబలబర్హిషుడు. అతని కుమారుడు అసమంజుడు, అతని కొడుకు తమోజుడు.

అజాతపుత్రా విక్రాన్తాస్త్రయః పరమకీర్తయః ।
సుదంష్ట్రశ్చ సునాభశ్చ కృష్ణ ఇత్యంధకా మతాః ॥85॥

అజాతుని పుత్రులు విక్రాంతులు పరమకీర్తులైన ముగ్గురు సుదంష్ట్రుడు, సునాభుడు, కృష్ణుడు అనువారు. వీరే అంధకులు.

అన్ధకానామిమం వంశం కీర్తయన్తి చ నిత్యశః ।
ఆత్మనో విపులం వంశం ప్రజావానాప్నుతే నరః ॥86॥

ఎవడు ఈ అంధకుల వంశాన్ని నిత్యం కీర్తిస్తాడో, వాడు సంతతి కలవాడై తన విపులవంశానికి కర్త అవుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అర్జునం ప్రతి ద్విజరూపసూర్యాగమనం నామ చతుశ్చత్వారింశోऽధ్యాయః ॥ 44॥

శ్రీమత్స్యమహాపురాణంలో అర్జునుని కడకు ద్విజరూప సూర్యుని రాక అనే నలభైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచచత్వారింశో௨ధ్యాయః – నలభైఅయిదవ అధ్యాయం

వృష్ణివంశ కథనమ్ – వృష్ణివంశ కథనం

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

గాన్ధారీ చైవ మాద్రీ చ వృష్ణిభార్యే బభూవతుః ।
గాన్ధారీ జనయామాస సుమిత్రం మిత్రనందనమ్ ॥1॥

గాంధారి, మాద్రి వృష్ణికి భార్యలయ్యారు. గాంధారి సుమిత్రుడు, మిత్రనందనుడు అనే ఇద్దరు కుమారులకు జన్మనిచ్చింది.

మాద్రీ యుధాజితం పుత్రం తతో వై దేవమీఢుషమ్ ।
అనమిత్రం శిబిం చైవ పఞ్చమం కృతలక్షణమ్ ॥2॥

మాద్రి యుధాజిత్తును, దేవమీఢుని, అనమిత్రుని, శిబిని, ఐదవ వాడైన కృతలక్షణుని కన్నది.

అనమిత్రసుతో నిఘ్నో నిఘ్నస్యాపి తు ద్వౌ సుతౌ ।
ప్రసేనశ్చ మహావీర్యః శక్తిసేనశ్చ తావుభౌ ॥3॥

అనమిత్రుని పుత్రుడు నిఘ్నుడు. విఘ్నుని సుతులు మహాపరాక్రమవంతులైన ప్రసేనుడు, శక్తిసేనుడు అనే వారిరువురు.

స్యమన్తకం ప్రసేనస్య మణిరత్నమనుత్తమమ్ ।
పృథివ్యాం సర్వరత్నానాం రాజా చాసావభూన్మణిః ॥4॥

ప్రసేసుని శ్రేష్ఠమైన మణిరత్నం స్యమంతకం. భూవలయంలో సకల రత్నాలకూ ఆ మణి రాజు.

హృది కృత్వా తు బహుశో మణిం తమభియాచితః ।
గోవిన్దో௨పి న తం లేభే శక్తో௨పి న జహార సః ॥5॥

దానిపై మనసుపడి గోవిందుడు అది తనకు కావాలని పలుసార్లు అడిగినా, అతనికది దొరకలేదు. గోవిందుడు సమర్థుడైయుండి కూడా దాన్ని అపహరించలేదు.

కదాచిన్మృగయాం యాతః ప్రసేనస్తేన భూషితః ।
యథాశబ్దం స శుశ్రావ బిలే సత్త్వేన పూరితే ॥6॥

ఒకసారి ప్రసేనుడు ఆ మణిని అలంకరించుకొని వేటకు వేళ్ళాడు. అక్కడ ఒక సత్త్వపూరితమైన ఒకబిలం నుండి వచ్చిన పెద్ద శబ్దం విన్నాడు.

తతః ప్రవిశ్య స బిలం ప్రసేనో ఋక్షమైక్షత ।
ఋక్షః ప్రసేనం చ తథా చైవ ప్రసేనజిత్ ॥7॥

ఆపై ప్రసేనుడు బిలంలో ప్రవేశించాడు. అక్కడ ఎలుగుబంటి ప్రసేనుణ్ణి చూచింది. అతడు గూడా ఋక్షాన్ని చూచాడు.

హత్వా ఋక్షః ప్రసేనం తు తతస్తం మణిమాదదౌ ।
అదృష్టస్తు హతస్తేన అన్తర్బిలమగాత్తతః ॥8॥

ఎలుగుబంటి ప్రసేనుణ్ణి వధించి ఆ మణిని తీసుకున్నది. ఈ దృశ్యాన్ని బిలంలో ఎవరూ చూచినవారు లేరు. ఎలుగుబంటి మరల బిలంలోకి వెళ్ళింది.

ప్రసేనం తు హతం జ్ఞాత్వా గోవిన్దః పరిశఙ్కితః ।
గోవిన్దేన హతో వ్యక్తం ప్రసేనో మణికారణాత్ ॥9॥

ప్రసేనుడు నిహతుడైనాడని తెలసికొని గోవిందుణ్ణి గూర్చి సందేహం కల్గింది. మణి కారణంగా గోవిందుడు ప్రసేనుణ్ణి వధించాడని అపకీర్తి కలిగింది.

ప్రసేనస్తు గతోऽరణ్యం మణిరత్నేన భూషితః ।
తం దృష్ట్వా సంహతస్తేన గోవిన్దః ప్రత్యువాచ హ ।
హన్మి చైనం దురాచారం శత్రుభూతం హి వృష్ణిషు ॥10॥

"ప్రసేనుడు మణి ధరించి అడవికి వెళ్ళాడు. అతణ్ణి అక్కడ ఎవరో చంపారు" అని గోవిందుడు బదులు చెప్పాడు. వృష్ణులకు శత్రువైన దురాచారుణ్ణి నేను చంపుతాను.

అథ దీర్ఘేణ కాలేన మృగయాం నిర్గతః పునః ।
యదృచ్ఛయా చ గోవిన్దో బిలస్యాభ్యాశమాగమత్ ॥11॥

తదుపరి కొంత కాలానికి గోవిందుడు వేటకు వెళ్ళాడు. యాదృచ్ఛికంగా అతడు బిలసమీపానికి పోయాడు.

తం దృష్ట్వా తు మహాశబ్దం స చక్రే ఋక్షరాడ్బలీ ।
శబ్దం శ్రుత్వా తు గోవిన్దః ఖడ్గపాణిః ప్రవిశ్య సః ।
అపశ్యజ్జామ్బవన్తం తమృక్షరాజం మహాబలమ్ ॥12॥

అతణ్ణి చూచి బలవంతుడైన ఋక్షరాజు, పెద్ద శబ్దం చేశాడు. ఆ శబ్దం విని గోవిందుడు ఖడ్గం చేపట్టి బిలంలోకి వెళ్ళి మహాబలవంతుడైన జాంబవంతుణ్ణి అక్కడ చూచాడు.

తతస్తూర్ణం హృషీకేశ స్తమృక్షపతిమంజసా ।
జామ్బవన్తం స జగ్రాహ క్రోధసంరక్తలోచనః ॥13॥

వెంటనే కోపంతో ఎఱ్ఱబారిన కనులు గలవాడై 'హృషీకేశుడు' ఆ ఋక్షపతి యగు జాంబవంతుణ్ణి పట్టుకొన్నాడు.

తుష్టావైనం తదా ఋక్షః కర్మభిర్వైష్ణవైః ప్రభుమ్ ।
తతస్తుష్టస్తు భగవాన్వరేణైనమరోచయత్ ॥14॥

అపుడు జాంబవంతుడు, వైష్ణవకర్మలతో, స్తోత్రాలతో ఆయనను స్తుతించాడు. అందుకు సంతోషించిన గోవిందుడు వరం కోరుకొమ్మన్నాడు.

జాంబవానువాచ :- జాంబవంతుడు చెప్పాడు.

ఇచ్ఛే చక్రప్రహారేణ త్వత్తోఽహం మరణం ప్రభో ।
కన్యా చేయం మమ శుభా భర్తారం త్వామవాప్నుయాత్ ।
యోఽయం మణిః ప్రసేనం తు హత్వా ప్రాప్తో మయా విభో ॥15॥

తత స్స జామ్బవన్తం తం హత్వా చక్రేణ వై ప్రభుః ।
కృతకర్మా మహాబాహుస్సకన్యం మణిమాహరత్ ॥16॥

ప్రభూ! చక్రప్రహారంతో నీనుండి నేను మరణం కోరుకొంటున్నాను. ఈ నా కన్యక నిన్ను భర్తగా బడయుగాక! ప్రభూ! ప్రసేనుణ్ణి చంపి ఈ మణిని నేను గ్రహించాను. పిదప మహాబాహుడైన గోవిందుడు జాంబవంతుణ్ణి చక్రంతో చంపి కృతకృత్యుడై కన్యతో సహా మణిని గైకొన్నాడు.

దదౌ సత్రాజితాయైనం సర్వసాత్వతసంసది ।
తేన మిథ్యాప్రవాదేన విముక్తస్స తథా విభుః ॥17॥

జనార్దనుడు సర్వ సాత్వతసభలో ఆ మణిని సత్రాజితునికి సమర్పించాడు. అట్లు మిథ్యాప్రవాదం నుండి విముక్తు డయ్యాడు.

తతస్తే యాదవా స్సర్వే వాసుదేవమథాబ్రువన్ ।
అస్మాకం తు మతిర్హ్యాసీత్ప్రసేనస్తు త్వయా హతః ॥18॥

అవుడు యాదవులందరూ వాసుదేవునితో "ప్రసేనుణ్ణి నీవు చంపావని మేమనుకొన్నాము!" అని అన్నారు.

కేకయస్య సుతా భార్యా దశ సత్రాజిత శ్శుభాః ।
తాసూత్పన్నా సుతాస్తస్య శతమేకం తు విశ్రుతాః ।
ఖ్యాతిమంతో మహావీర్యా భఙ్గకారస్తు పూర్వజః ॥19॥

కేకయుని పదిమంది కుమార్తెలు సత్రాజితుని భార్యలు. వారి యందతనికి నూరుమంది విశ్రుతులైన పుత్రులు కలిగారు. వారు మహాపరాక్రమశాలురు. వారిలో భంగకారుడు జ్యేష్ఠుడు.

అథ తు బ్రువతీ తస్మాద్భఙ్గకారాత్తు పూర్వజాత్ ।
సుషువే సా కుమారీస్తు తిస్రః కమలలోచనాః ॥20॥

ఆ జ్యేష్ఠుడైన భంగకారుని ద్వారా బ్రువతీ ముగ్గురు పద్మనేత్రలైన కుమార్తెలను ప్రసవించింది.

సత్యభామా వరా స్త్రీణాం వ్రతినీ చ దృఢవ్రతా ।
తథా పద్మవతీ చైవ తాశ్చ కృష్ణాయ సోఽదదాత్ ॥21॥

స్త్రీలలో మేలైనది సత్యభామ. దృఢవ్రతయైన వ్రతిని, పద్మావతి అనే వారిని అతడు కృష్ణునికిచ్చాడు.

అనమిత్రాచ్ఛినిర్జజ్ఞే కనిష్ఠాద్వృష్ణినన్దనాత్ ।
సత్యకస్తస్య పుత్రస్తు సాత్యకిస్తస్య చాత్మజః ॥22॥

సత్యవాన్యుయుధానస్తు శినేర్నప్తా ప్రతాపవాన్ ।
అనఙ్గో యుయుధానస్య ధునిస్తస్యాత్మజోఽభవత్ ॥23॥

ధునేర్యుగంధరః పుత్ర ఇతి శైన్యాః ప్రకీర్తితాః ।
అనమిత్రాన్వయో హ్యేష వ్యాఖ్యాతో వృష్ణివంశజః ॥24॥

కనిష్ఠ వృష్ణి కుమారుడైన అనమిత్రునికి శిని జనించాడు. అతని పుత్రుడు సత్యకుడు. అతని సుతుడు సాత్యకి. సాత్యకి పుత్రుడు సత్యవంతుడు, సత్యవంతుని కుమారుడు యుయుధానుడు. అతని కుమారుడు అనంగుడు. అతని కుమారుడు ధుని. ధుని పుత్రుడు యుగంధరుడు అని శైన్యులను గూర్చి చెప్పడమయింది. వృష్ణివంశసంభవమైన ఈ అనమిత్రాన్వయాన్ని వివరించాను.

అనమిత్రస్య సంజజ్ఞే పృథ్వ్యాం వీరో యుధాజితః ।
అన్యౌ తు తనయౌ వీరౌ వృషభః క్షత్ర ఏవ చ ॥25॥

అనమిత్రునికి పృథ్వియందు వీరుడైన యుధాజితుడు సంభవించాడు. వృషభుడూ, క్షత్రుడు అనేవారు తక్కిన ఇద్దరు కుమారులు.

వృషభః కాశిరాజస్య సుతాం భార్యామవిన్దత ।
జయన్తస్య జయన్త్యాం తు పుత్రాః సమభవంస్త తః ॥26॥

సదాయజ్ఞోఽతివీరశ్చ శ్రుతవానతిథిప్రియః ।
అక్రూరః సుషువే తస్మాత్సదాయజ్ఞోఽతిదక్షిణః ॥27॥

వృషభుదు కాశిరాజసుతను జయంతిని భార్యగా గైకొన్నాడు. జయంతునకు జయంతియందు సదాయజ్ఞుడు, అతివీరుడు, శ్రుతవంతుడు, అతిథిప్రియుడు అనే కుమారులు కలిగారు.

సదాయజ్ఞుని కుమారుడు అక్రూరుడు. అతడూ సదా యజ్ఞాలు చేస్తూ – అతిగా దక్షిణలిచ్చేవాడు.

రత్నాం కన్యాం చ శైబ్యస్య అక్రూరస్తామవాప్తవాన్ ।
పుత్రానుత్పాదయామాస ఏకాదశ మహాబలాన్ ॥28॥

శైబ్యుని కన్యయగు రత్నను అక్రూరుడు పరిణయమాడాడు. ఆమెయందు పదునొకండు మంది మహాబలశాలులైన పుత్రులను కన్నాడు.

ఉపలమ్భః సదాలమ్భో వృకలో వీర్య ఏవ చ ।
సవీతరః సదాపక్షః శత్రుఘ్నో వారిమేజయః ॥29॥

ధర్మభృద్ధర్మవర్మాణౌ ధృష్టమానస్తథైవ చ ।
సర్వే చ ప్రతిహోతారో రత్నాయాం జజ్ఞిరే చ తే ॥30॥

వారు ఉపలంభుడు, సదాలంభుడు, వృకలుడు, వీర్యుడు. సవీతరుడు, సదాపక్షుడు, శత్రుఘ్నుడు, వారిమేజయుడు. ధర్మభృత్తు, ధర్మవర్మ, ధృష్టమానుడు అనువారు వారందరూ యజ్ఞకర్తలే, రత్నయొక్క కుమారులే.

అక్రూరాదుగ్రసేనాయాం సుతౌ ద్వౌ కులవర్ధనౌ ।
దేవవానుపదేవశ్చ జజ్ఞాతే దేవసన్నిభౌ ॥31॥

అక్రూరునికి ఉగ్రసేనయందు కులవర్ధనులైన ఇరువురు కుమారులు కలిగారు. దేవదంతుడు, ఉపదేవుడు అను వారు దేవ సదృశులై వుండేవారు.

అశ్విన్యాం చ తతః పుత్రాః పృథుర్విపృథురేవ చ ।
అశ్వత్థామా సుబాహుశ్చ సుపార్శ్వకగవేషణః ॥32॥

వృష్టినేమిః సుధర్మా చ తథా శర్యాతిరేవ చ ।
అభూమిర్వజ్రభూమిశ్చ శ్రమిష్ఠః శ్రవణ స్తథా ॥33॥

అక్రూరునికి అశ్వినియందు పృథువు, విపృథువు, అశ్వత్థామ, సుబాహువు, సుపార్శ్వకుదు, గవేషణుడు. వృష్టినేమి, సుధర్ముడు, శర్యాతి, అభూమి, వజ్రభూమి, శ్రమిష్ఠుడు, శ్రవణుడు అనే వారు జనించారు.

ఇమాం మిథ్యాభిశస్తిం యో వేద కృష్ణాదపోహితామ్ ।
న స మిథ్యాభిశాపేన అభిశాప్యోఽథ కేనచిత్ ॥34॥

కృష్ణుని అపఖ్యాతి తొలగించుటను వివరించిన ఈ కథను తెలుసుకొన్నవాడు ఎవని చేతను మిథ్యాభిశాపం పొందదు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే వృష్ణివంశ కథనం నామ పంచచత్వారింశోఽధ్యాయః ॥ 45 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని వృష్ణివంశ కథనం అనే నలభై అయిదవ అధ్యాయం సంపూర్ణం

షట్చత్వారింశోఽధ్యాయః - నలబైఆరవ అధ్యాయం
యదువంశే శూరవంశ వృత్తాంతః - యదువంశమున శూరవంశ వృత్తాంతం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఐక్ష్వాకీ సుషువే శూరం ఖ్యాతమద్భుతమీఢుషమ్ ।
పౌరుష్యాం జజ్ఞిరే శూరాద్భోజాయాం పురుషా దశ ॥1॥

ఇక్ష్వాకువంశసంభూత అయిన రాజపుత్రి శూరుడను కుమారుని ప్రసవించింది. అతడు ఈఢుషుడుగా ఖ్యాతి చెందాడు. ఆ శూరునినుండి పురుషుడను రాజు యొక్క కూతురగు భోజకు పది మంది సుతులు కలిగారు.

వసుదేవో మహాబాహుః పూర్వమానకదున్దుభిః ।
దేవమార్గస్తతో జజ్ఞే తతో దేవశ్రవాః పునః ॥2॥

వారిలో మహాబాహుడైన వసుదేవుడు, ఆనక దుందుభిగా విఖ్యాతుడు జ్యేష్ఠుడు. తరువాత దేవమార్గుడు, దేవశ్రవుడు కలిగారు.

అనాధృష్టిశ్శినిశ్చైవ నన్దశ్చైవ సస్పంజయః ।
శ్యామః శమీకస్సంయూపః పంచ చాస్య వరాంగనాః ॥3॥

అనాధృష్టి, శిని, నందుడు, సస్పంజయుడు,శ్యాముడు,శమీకుడు,సంయూపుడు-అనువారు,తరువాతివారు.

శ్రుతకీర్తిః పృథా చైవ శ్రుతదేవీ శ్రుతశ్రవాః ।
రాజాధిదేవీ చ తథా పఞ్చైతా వీరమాతరః ॥4॥

తదుపరి శ్రుతకీర్తి, పృథ, శ్రుత దేవి, శ్రుతశ్రవ, రాజాధిదేవి అనే వీరమాతలగు ఐదుగురు కుమార్తెలు కలిగారు.

కృతస్య తు శ్రుతాదేవీ సుగ్రీవం సుషువే సుతమ్ ।
కైకేయ్యాం శ్రుతకీర్త్యాం తు జజ్ఞే సోఽనువ్రతో నృపః ॥5॥

కృతుని పత్ని శ్రుతదేవి సుగ్రీవుడనే కుమారుని కన్నది. కేకయిదేశానికి చెందిన శ్రుతకీర్తికి అనువ్రతుడనే రాజు జనించాడు.

శ్రుతశ్రవసి చైద్యస్య సునీథః సమపద్యత ।
బహుశో ధర్మచారీ స సమ్బభూవారిమర్దనః ॥6॥

చైద్యునికి శ్రుతశ్రవ యందు సునీథుడు కలిగాడు. అతడు ధర్మానువర్తి, అరిమర్దనుడుగా విలసిల్లాడు.

అథ సఖేన వృద్ధోఽసౌ కున్తిభోజే సుతాం దదౌ ।
ఏవం కున్తీ సమాఖ్యాతా వసుదేవస్వ సా పృథా ॥7॥

వృద్ధుడైన శూరుడు తన మిత్రుడగు కుంతిభోజునకు పృథను కూతురుగా ఇచ్చాడు. అందుచేత వసుదేవుని సోదరియగు పృథకు కుంతి అనే పేరు కలిగింది.

వసుదేవేన సా దత్తా పాణ్డోర్భార్యా హ్యనిన్దితా ।
పాణ్డోరర్థేన సా జజ్ఞే దేవపుత్త్రాన్మహారథాన్ ॥8॥

వసుదేవుడు అనిందితయైన కుంతిని పాండురాజుకు కులపత్నిగా ఇచ్చాడు. పాండువంశవ్యాప్తికై ఆమె మహారథులైన దేవతలకు కల్గిన పుత్రులను కన్నది.

ధర్మాద్యుధిష్ఠిరో జజ్ఞే వాయోర్జజ్ఞే వృకోదరః ।
ఇన్ద్రాద్ధనంజయశ్చైవ శక్రతుల్యపరాక్రమః ॥9॥

ధర్మునివల్ల యుధిష్ఠిరుడు, వాయువునుండి భీముడు, ఇంద్రునినుండి ఇంద్రసదృశపరాక్రముడైన ధనంజయుడు కలిగారు.

మాద్రవత్యాం తు జనితావశ్విభ్యామితి శుశ్రుమ ।
నకులస్సహదేవశ్చ రూపశీలగుణాన్వితౌ ॥10॥

మాద్రియందు అశ్వినీ దేవతలమూలంగా నకులసహదేవులు కలిగారని విన్నాము. వారు రూపశీల గుణసంపన్నులు.

రోహిణీ పౌరవీ చైవ ఖ్యాతమానకదున్దుభేః ।
లేభే జ్యేష్ఠం సుతం రామం సారణం చ రణప్రియమ్. 11

దుర్దమం దమనం సుభ్రుం పిణ్డారకమహాహనూ ।
చిత్రాక్షేత్రే కుమార్యౌ తు రోహిణ్యాం జజ్ఞిరే తథా ॥12॥

ఆనకదుందుభి భార్య పురువంశానికి చెందిన రోహిణి జ్యేష్ఠసుతుడైన రాముణ్ణి పొందింది. తరువాత రణప్రియుడైన సారణుడు, దుర్దముడు, దమనుడు, సుభ్రువు, పిండారకుడు, మహాహనువు అనే ఆర్గురు పుత్రులను కన్నది. చిత్ర – క్షేత్ర అనే ఇరువురు కుమార్తెలు గూడా రోహిణికి కలిగారు.

దేవక్యాం జజ్ఞిరే శౌరేస్సుషేణః కీర్తిమానపి ।
ఉదాసీ భద్రసేనశ్చ ఋషిదాసస్తథైవ చ ।
షష్ఠో భద్రవిదేహశ్చ కంసస్సర్వానఘాతయత్ ॥13॥

శౌరికి దేవకియందు సుషేణుడు, కీర్తిమంతుడు, ఉదాసి, భద్రసేనుడు, ఋషిదాసుడు, ఆరవవాడగు భద్రవిదేహుడు– అన్నవారు జన్మించారు– కంసుడు వారందరినీ వధించాడు.

ప్రథమా యా అమావాస్యా వార్షికీ తు భవిష్యతి ।
తస్యాం జజ్ఞే మహాబాహుః పూర్వం కృష్ణః ప్రజాపతిః ॥14॥

సంవత్సరంలో వచ్చే మొదటి అమావాస్యనాడు మహాబాహువు, పూర్వ ప్రజాపతి అయిన కృష్ణుడుజన్మించాడు.

అనుజా త్వభవత్కృష్ణా సుభద్రా కలభాషిణీ ।
దేవక్యాం తు మహాతేజా జజ్ఞే శూరో మహాయశాః ॥15॥

కృష్ణుని తరువాత. భద్రభాషిణి అయిన సుభద్ర పుట్టింది. దేవకియందు మహాతేజస్వి అయిన శూరుడనే గొప్ప కీర్తిమంతుడు జన్మించాడు.

సహదేవస్తు తామ్రాయాం జజ్ఞే శౌరిః కులోద్వహః ।
ఉపాసంగధరం లేభే తనయం దేవరక్షితా ।
ఏకాం కన్యాం చ సుభగాం కంసస్తామభ్యఘాతయత్ ॥16॥

తామ్రయొక్క గర్భంలో శౌరికులోద్వహుడైన సహదేవుడు జనించాడు. దేవరక్షిత ఉపాసంగధరుణ్ణి, ఒక సుందరమైన కన్యను ప్రసవించింది. ఆమెను కంసుడు హతమార్చాడు.

విజయం రోచమానం చ వర్ధమానం తు దేవలమ్ ।
ఏతే సర్వే మహాత్మానో హ్యుపదేవ్యాం ప్రజజ్ఞిరే ॥17॥

విజయుడు, రోచమానుడు, వర్ధమానుడు, దేవలుడు. అనేవారు వసుదేవునికి ఉపదేవియందు కలిగారు.

అవగాహో మహాత్మా చ వృకదేవ్యామజాయత ।
వృకదేవ్యా స్స్వయం జజ్ఞే నన్దకో నామ నామతః ॥18॥

మహాత్ముడగు అవగాహుడు వృకదేవికి పుట్టాడు. నందకుడన్న పేరుగలవాడు ఆమెయందే జన్మించాడు.

సప్తమం దేవకీ పుత్రం మదనం సుషువే నృప ।
గవేషణం మహాభాగం సఙ్గ్రామేష్వపరాజితమ్ ॥19॥

దేవకి మహాభాగుడైన గవేషణుణ్ణి, సంగ్రామంలో ఓటమిలేని మదనుడనే సప్తమసుతుని ప్రసవించింది.

శ్రద్ధాదేవ్యా విహారే తు వనే హి విచరన్ పురా ।
వైశ్యాయామదదాచ్ఛౌరిః పుత్రం కౌశికమగ్రజమ్ ॥20॥

వన విహారసమయంలో శ్రద్ధాదేవి అనే వైశ్యవనితనుండి వసుదేవుడు కౌశికుడు అనే జ్యేష్ఠసుతుని పొందాడు.

సుతనూ రథరాజీ చ శౌరేరాస్తాం పరిగ్రహే ।
పుణ్డ్రశ్చ కపిలశ్చైవ వసుదేవాత్మజౌ బలౌ ॥21॥

సుతనువు, రథరాజి అనేవారు శౌరి భార్యలు. వారికి క్రమంగా వసుదేవాత్మజులైన పుండ్రుడు, కపిలుడు అనువారు జనించారు.

జరో నామ నిషాదోఽభూత్ప్రథమః స ధనుర్ధరః ।
సౌభద్రశ్చ భవశ్చైవ మహాసత్త్వౌ బభూవతుః ॥22॥

కపిలుని తరువాత జరుడు అనే ధనుర్ధారియగు నిషాదుడు జనించాడు. ఆపైన వైశ్యవనితకు సౌభద్రుడు, భవుడు అనే మహాసత్త్వులు కలిగారు.

దేవభాగసుతశ్చాపి నామ్నా౽సావుద్ధవస్స్మృతః ।
పణ్డితం ప్రథమం ప్రాహుః దేవశ్రవసముత్తమమ్ ॥23॥

దేవభాగుని కుమారునిపేరు ఉద్ధవుడు. దేవశ్రవసుడుగా ప్రసిద్ధమైన ప్రథమ పండితుడు.

ఐక్ష్వాక్యలభతాపత్యమనాధృష్టేర్యశస్వినీ ।
నిధూతసత్త్వం శత్రుఘ్నం శ్రాద్ధస్తస్మాదజాయత ॥24॥

అనాధృష్టి ద్వారా ఐక్ష్వాకి శత్రుహన్త అయిన నిధూతసత్త్వుడనే పుత్రుని పొందింది. అతని కుమారుడు శ్రాద్ధుడు.

కరూషాయానపత్యాయ కృష్ణస్తుష్టస్సుతం దదౌ ।
సుచంద్రం తు మహాభాగం వీర్యవంతం మహాబలమ్ ॥25॥

సంతానం లేని కరూషునికి సంతోషంతో కృష్ణుడు సుచంద్రుడనే కుమారుణ్ణి ఇచ్చాడు. ఆ కుమారుడు వీర్యవంతుడు, బలవంతుడు.

జామ్బవత్యాస్సుతావేతౌ ద్వౌ చ సత్కృతలక్షణౌ ।
చారుదేష్ణశ్చ సామ్బశ్చ వీర్యవన్తౌ మహాబలౌ ॥26॥

జాంబవతి కుమారులు ఇరువురు చారుదేష్ణుడు, సాంబుడు మంచి లక్షణం కలవారు. వీర్యవంతులు, మహాబలం కలవారు.

తన్త్రిపాలశ్చ తన్తిశ్చ నన్దనస్య సుతావుభౌ ।
శమీకపుత్రాశ్చత్వారో విక్రాన్తాః సుమహాబలాః ।
విరజశ్చ ధనుశ్చైవ శ్యామశ్చ సృఞ్జయస్తథా ॥27॥

నందనునికి తంత్రి పాలుడు, తంతి అను ఇరువురు పుత్రులు. శమీకుని సుతులు పరాక్రమవంతులు, బలవంతులు నల్గురు. వారు విరజుడు, ధనువు, శ్యాముడు, సృంజయు డనువారు.

అనపత్యో౽భవచ్ఛ్యామస్సృఞ్జయస్తు వనం యయౌ ।
జుగుప్సమానో భోజత్వం రాజర్షిత్వమవాప్తవాన్ ॥28॥

శ్యామునికి సంతానం లేదు. సృంజయుడు అడవికి వెళ్ళాడు. అతడు భోజరాజ్యం పట్ల జుగుప్స గల్గి అడవిలో తపస్సు చేసి రాజర్షిత్వం పొందాడు.

కృష్ణస్య జన్మాభ్యుదయం యః కీర్తయతి నిత్యశః ।
శృణోతి మానవో నిత్యం సర్వపాపైః ప్రముచ్యతే ॥29॥

ఎవడు ఈ కృష్ణుని జన్మాభ్యుదయాన్ని నిత్యమూ కీర్తిస్తాడో, ఎవడు వింటాడో వాడు సర్వపాపనిర్ముక్తుడవుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యదువంశే శూరవంశవృత్తాంతో నామ షట్చత్వారింశో౽ధ్యాయః ॥46 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని యదువంశంలో శూరవంశవృత్తాంతం అనే నలబైఆరవ అధ్యాయం సంపూర్ణం

సప్తచత్వారింశోఽధ్యాయః - నలభైఏడవ అధ్యాయం
శ్రీకృష్ణవంశానువర్ణనమ్ - శ్రీకృష్ణవంశానువర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అథ దేవో మహాదేవః పురా కృష్ణః ప్రజాపతిః ।
విహారార్థం స దేవేశో మానుషేష్విహ జాయతే ॥1॥

దేవాధిదేవుడు, మహాదేవుడు, ప్రజాపతి అయిన కృష్ణుడు విహారం కొరకై ఈలోకంలో మానవులలో అవతరిస్తాడు.

దేవక్యాం వసుదేవస్య తపసా పుష్కరేక్షణః ।
చతుర్బాహుస్తదా జాతో దివ్యరూపోజ్జ్వలశ్రియా ॥2॥

వసుదేవుని తపస్సుచేత పద్మలోచనుడు, నాల్గు భుజాలవాడు అయిన ఆ దేవుడు దివ్యరూపంతో ఉజ్జ్వలమైన సిరితో దేవకియందు జన్మించాడు.

శ్రీవత్సలక్షణం దేవం దృష్ట్వా దివ్యైశ్చ లక్షణైః ।
ఉవాచ వసుదేవస్తం రూపం సంహర వై ప్రభో ॥3॥

వసుదేవుడు శ్రీమత్సాంకుడూ, దివ్యలక్షణ సంపన్నుడూ ఐన ఆ దేవుని చూచి "ప్రభూ! ఈ రూపం సంహరించు", అని ప్రార్థించాడు.

భీతోఽహం దేవ! కంసస్య తతస్త్వేతద్బ్రవీమి తే ।
మమ పుత్రా హతాస్తేన జ్యేష్ఠాస్తే భీమవిక్రమాః ॥4॥

దేవా! నేను కంసుడికి భయపడుతున్నాను. అందుకే ఇలా అంటున్నాను. నీకంటే జ్యేష్ఠులు, భయంకర పరాక్రమం కలవారూ అయిన నా పుత్రులను ఆ కంసుడు చంపాడు.

వసుదేవవచశ్శృత్వా రూపం సంహరతేఽచ్యుతః ।
అనుజ్ఞాప్య తతశ్శౌరిం నన్దగోపగృహేఽనయత్ ॥5॥

వసుదేవుని మాట విని అచ్యుతుడు రూపం సంహరించాడు. పిదప శౌరిని సమ్మతింపజేసి అతడు నందగోప గృహానికి తీసుకుపోయాడు.

దత్త్వైనం నన్దగోపస్య రక్ష్యతామితి చాబ్రవీత్ ।
అతస్తు సర్వకల్యాణం యాదవానాం భవిష్యతి ।
అయం తు గర్భే దేవక్యాం జాతః కంసం హనిష్యతి ॥6॥

నందగోపకుని కప్పగించి ఈ బిడ్డను రక్షించు, ఇలా చేస్తే యాదవులకు అన్ని విధాలా శుభం కల్గుతుంది. దేవకి గర్భమందు పుట్టిన ఈ బిడ్డడు కంసుణ్ణి హతమారుస్తాడు అని చెప్పాడు.

ఋషయ ఊచుః :– ఋషులు చెప్పారు.

క ఏష వసుదేవస్తు దేవకీ చ యశస్వినీ ।
నన్దగోపశ్చ కస్త్వేష యశోదా చ మహావ్రతా ॥7॥

ఈ వసుదేవు డెవడు? కీర్తిమంతురాలైన ఈ దేవకి ఎవరు? ఈ నందగోపు డెవడు? మహావ్రత యయిన యశోద ఎవతె?

యో విష్ణుం జనయామాస యం చ తాతేత్యభాషత ।
యా గర్భం జనయామాస యా చైనం త్వభ్యవర్ధయత్ ॥8॥

ఎవడు విష్ణువును జనింపజేశాడో, ఎవణ్ణి భగవంతుడు? 'తండ్రీ' అని సంబోధించాడో. ఎవతె గర్భం దాల్చిందో, ఎవతె ఈతణ్ణి పెంచిందో– వీరందరూ ఎవరు?

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

పురుషః కశ్యపస్త్వాసీదదితిస్తు ప్రియా స్మృతా ।
బ్రహ్మణః కశ్యపస్త్వంశః పృథివ్యాస్త్వదితిస్తథా ॥9॥

కశ్యపుడు అనే పురుషుడు, అతనికి ప్రియమైన అదితి ఉండేవారు. కశ్యపుడు బ్రహ్మయొక్క అంశం, అదితి భూదేవి అంశం.

అథ కామాన్మహాబాహుర్దేవక్యాస్సమపూరయత్ ।
యే తయా కాంక్షితా నిత్యమజాతస్య మహాత్మనః ॥10॥

మహాభుజుడైన వసుదేవుడు దేవకి నిత్యం కాంక్షించిన కోరికలు తీర్చాడు.

సోఽవతీర్ణో మహీం దేవః ప్రవిష్టో మానుషీం తనుమ్ ।
మోహయన్సర్వభూతాని యోగాత్మా యోగమాయయా ॥11॥

ఆ యోగాత్ముడు యోగమాయతో సకల ప్రాణులనూ సమ్మోహితులను చేస్తూ ఎప్పుడూ పుట్టుకలేని ఆ మహాత్ముడు ఆమె కోరిక మేరకు భూమికి దిగివచ్చి మానుష శరీరం ప్రవేశించాడు.

నష్టే ధర్మే తథా జజ్ఞే విష్ణుర్వృష్ణికులే ప్రభుః ।
కర్తుం ధర్మస్య సంస్థానమసురాణాం ప్రణాశనమ్ ॥12॥

ధర్మం నశించగా ధర్మరక్షణకు, అసురవినాశానికి ప్రభువగు విష్ణువు వృష్ణికులంలో సంభవించాడు.

రుక్మిణీ సత్యభామా చ సత్యా నాగ్నజితీ తథా ।
సుభామా చ తథా శైబ్యా గాన్ధారీ లక్షణా తథా ॥13॥

మిత్రవిందా చ కాలిందీ దేవీ జాంబవతీ తథా ।
సుశీలా చ తథా మాద్రీ కౌశల్యా విజయా తథా ।
ఏవమాదీని దేవీనాం సహస్రాణి చ షోడశ ॥14॥

రుక్మిణి, సత్యభామ, సత్య, నాగ్నజితి, సుభామ, శైబ్య, గాంధారి, లక్షణ, మిత్రవింద, కాలింది. జాంబవతీదేవి, సుశీల, మాద్రి, కౌశల్య, విజయ, వీరు మొదలైన 16వేల మంది దేవేరులు ఆయనకుండినారు.

రుక్మిణీ జనయామాస పుత్త్రాన్ రణవిశారదాన్ ।
చారుదేష్ణం రణే శూరం ప్రద్యుమ్నం చ మహాబలమ్ ॥15॥

రుక్మిణి పుత్రులు యుద్ధ నిపుణులు. వారిలో చారుదేష్ణుడు రణశూరుడు, ప్రద్యుమ్నుడు. మహాబలవంతుడు,

సుచారుం భద్రచారుం చ సుదేష్ణం భద్రమేవ చ ।
పరశుం చారుగుప్తం చ చారుభద్రం సుచారుకమ్ ।
చారుహాసం కనిష్ఠం చ కన్యాం చారుమతీం తథా ॥16॥

సుచారుడు, భద్రచారుడు. సుదేష్ణుడు, భద్రుడు, పరశువు, చారుగుప్తుడూ, చారు భద్రుడు, సుచారుకుడు, కనిష్ఠుడైన చారుహాసుడు, చారుమతి అనే కన్య – వీరిని రుక్మిణి కన్నది.

జజ్ఞిరే సత్యభామాయాం భానుర్భ్రమరతేక్షణః ।
రోహితో దీప్తిమాంశ్చైవ తామ్రశ్చక్రో జలన్ధమః ॥17॥

సత్యభామకు భానుడు, భ్రమరతేక్షణుడు, రోహితుడు, దీప్తిమంతుడు, తామ్రుడు, చక్రుడు, జలంధముడు అనేవారు కలిగారు.

చతస్రో జజ్ఞిరే తేషాం స్వసారస్తు యవీయసీః ।
జామ్బవత్యాస్సుతో జజ్ఞే సామ్బస్సమితిశోభనః ॥18॥

వారికి నల్గురు చెల్లెండ్రు జన్మించారు. యుద్ధశూరుడైన సాంబుడు జాంబవతికి పుత్రుడుగా పుట్టాడు.

మిత్రవాన్మిత్రవిన్దశ్చ మిత్రవిన్దా వరాఙ్గనా ।
మిత్రబాహుస్సునీథశ్చ నాగ్నజిత్యాః ప్రజా హి సా ॥19॥

వరాంగనయగు మిత్రువిందకు మిత్రవంతుడు, మిత్రవిందుడు కల్గారు. నాగ్నజితికి మిత్రబాహువు, సునీథుడు జన్మించారు.

ఏవమాదీని పుత్త్రాణాం సహస్రాణి నిబోధత ।
శతం శతసహస్రాణాం పుత్త్రాణాం తస్య ధీమతః ॥20॥

అశీతిశ్చ సహస్రాణి వాసుదేవసుతాస్తథా ।
లక్షమేకం తథా ప్రోక్తం పుత్రాణాం చ ద్విజోత్తమాః! ॥21॥

ఇట్లే ఇతర భార్యలద్వారా ఇట్టి పుత్రులు వేలకొలది కలిగారు. ధీమంతుడైన కృష్ణునికి లక్షమంది పుత్రులు జన్మించారు. ద్విజోత్తములారా! వాసుదేవుని పుత్రులు ఒక లక్ష ఎనుబది వేలమంది ఉన్నారు.

ఉపసఙ్గస్య తు సుతౌ వజ్రస్సంక్షిప్త ఏవ చ ।
భూరీన్ద్రసేనో భూరిశ్చ గవేషణసుతావుభౌ ॥22॥

ఉపసంగుని పుత్రులు వజ్రుడు, సంక్షిప్తుడు అని ఇద్దరు. గవేషణునికి భూరీంద్రసేనుడు, భూరి అని ఇద్దరు పుత్రులు.

ప్రద్యుమ్నస్య తు దాయాదో వైదర్భ్యాం బుద్ధిసత్తమః ।
అనిరుద్ధో రణేఽరుద్ధో జజ్ఞేఽస్య మృగకేతనః ॥23॥

ప్రద్యుమ్నునికి వైదర్భియందు బుద్ధిమంతుడు, రణంలో అడ్డు లేనివాడైన అనిరుద్ధుడు కలిగాడు. అతని సుతుడు మృగకేతనుడు. యజ్ఞశ్చ మృగకేతనః అను పాఠంలో యజ్ఞుడు, మృగకేతనుడు అను సుతులు అనిఅర్థం.

కాశ్యా సుపార్శ్వతనయా సామ్బాల్లేభే తరస్వినః ।
సత్యప్రకృతయో దేవాః పఞ్చ వీరాః ప్రకీర్తితాః ॥24॥

సుపార్శ్వుని పుత్రి కాశ్య వేగమంతుడైన సాంబుని ద్వారా ఐదుగురు సుతులను పొందింది. వారు వీరులు, సత్యస్వభావులుగా ప్రశస్తికెక్కారు.

తిస్రః కోట్యః ప్రవీరాణాం యాదవానాం మహాత్మనామ్ ।
షష్టిశ్శతసహస్రాణి వీర్యవన్తో మహాబలాః ॥25॥

వీరులు, మహాత్ములైన యాదవులు మూడు కోట్లు. వారిలో అరువది లక్షల మంది వీర్యవంతులు, మహాబలశాలురు.

దేవాంశాస్సర్వ ఏవేహ హ్యుత్పన్నాస్తే మహౌజసః ।
దేవాసురే హతా యే చ త్వసురా యే మహాబలాః ॥26॥

దేవతల అంశం కల్గి ఈ మహాతేజస్వులంతా జన్మించారు. దేవాసుర సంగ్రామంలో మహాబలు లయిన రక్కసులు హతులయ్యారు.

ఇహోత్పన్నా మనుష్యేషు బాధన్తే సర్వమానవాన్ ।
తేషాముత్సాదనార్థాయ ఉత్పన్నో యాదవే కులే ॥27॥

మరల ఇక్కడ వారు మనుష్యులలో పుట్టి సర్వమానవులను బాధింపసాగారు. వారిని హతమార్చడానికి యాదవకులంలో భగవంతుడు జనించాడు.

కులానాం శత మేకం చ యాదవానాం మహాత్మనామ్ ।
సర్వమేతత్కులం యావద్వర్తతే వైష్ణవే కులే ॥28॥

మహాత్ములైన యాదవులవి నూటొక్క కులాలుగా ఉన్నాయి. ఈ కులాలన్నీ వైష్ణవకులం క్రిందికే వస్తాయి.

విష్ణు స్తేషాం ప్రణేతా చ ప్రభుత్వే చ వ్యవస్థితః ।
నిదేశస్థాయినస్తస్య కథ్యన్తే సర్వయాదవాః ॥29॥

విష్ణువు వారికి నాయకుడు, ప్రభుత్వంలో ఉన్నవాడు. ఆయన ఆదేశంలోనే సర్వయాదవులూ ఉండినారని చెబుతున్నారు.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

సప్తర్షయః కుబేరశ్చ యక్షో మాణిచరస్తథా ।
శాలాకి ర్నారదశ్చైవ సిద్ధో ధన్వన్తరిస్తథా ॥30॥

ఆదిదేవస్తథావిష్ణు రేభిస్తు సహ దైవతైః ।
కిమర్థం సంఘశో భూతాః స్మృతాస్సమ్భూతయః కతి ॥31॥

సప్తర్షులు, కుబేరుడు, యక్షుడైన మాణిచరుడు, శాలాకి, నారదుడు, సిద్ధుడైన ధన్వంతరి, ఆదిదేవుడైన విష్ణువు వీరితో కలిసినవాడు. వీరంతా గుంపులుగా ఎందుకు పుట్టారు? అవతారాలు ఎన్ని?

భవిష్యాః కతి చైవాన్యే ప్రాదుర్భావా మహాత్మనః ।
బ్రహ్మక్షత్రేషు శాన్తేషు కిమర్థమిహ జాయతే ॥32॥

ఆ మహాత్ముని భవిష్యదవతారాలు ఎన్ని? శాంతులైన బ్రహ్మక్షత్రులలో ఎందుకు పుట్టుతున్నాడు?

యదర్థమిహ సమ్భూతో విష్ణుర్వృష్ణ్యన్ధకోత్తమః ।
పునః పునర్మనుష్యేషు తన్నః ప్రబ్రూహి పృచ్ఛతామ్ ॥33॥

వృష్ణులలో, అంధకులలో ఉత్తముడైన విష్ణుడు మాటిమాటికి ఏల మనుష్యులలో జన్మిస్తాడో, జిజ్ఞాసతో అడుగుతున్న మాకు విశదీకరించు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

త్యక్త్వా దివ్యాం తనుం విష్ణుర్మానుషేష్విహ జాయతే ।
యుగే త్వథ పరావృత్తే కాలే ప్రశిథిలే విభుః ॥34॥

యుగం మారిపోయినప్పుడు, కాలం మిక్కిలిగా శిథిలమైనప్పుడు విష్ణువు దివ్యతనువు వీడి మనుజులలో అవతరిస్తాడు.

దేవాసురవిమర్దేషు జాయతే హరిరీశ్వరః ।
హిరణ్యకశిపౌ దైత్యే త్రైలోక్యం ప్రాక్ప్రశాసతి ॥35॥

పూర్వం హిరణ్యకశిపుడనే రాక్షసుడు ముల్లోకాలూ పాలిస్తుండగా, దేవాసుర సంగ్రామం జరిగినప్పుడు ఈశ్వరుడైన హరి అవతరించాడు.

బలినాఽధిష్ఠితే చైవ పురా లోకత్రయే క్రమాత్ ।
సంఖ్యమాసీత్పరమకం దేవానామసురై స్సహ ॥36॥

పూర్వం క్రమంగా బలిచక్రవర్తి ముల్లోకాలూ ఆక్రమించినప్పుడు దేవతలకు, అసురులతో గొప్ప యుద్ధం సంభవించింది.

యుగాఖ్యా దశసమ్పూర్ణా హ్యాసీదత్యాకులం జగత్ ।
నిదేశస్థాయినశ్చాపి తయోర్దేవాసురాస్సమమ్ ॥37॥

పది దివ్యయుగాలకాలం అది కొనసాగింది. జగత్తు వ్యాకుల మయింది. దేవతలు విష్ణుని నిదేశం కిందా, రాక్షసులు బలిహిరణ్యకశిపుల నిదేశం కిందా నిలిచి పోరాడారు.

మృధో బలివిమర్దాయ సమ్ప్రవృద్ధః సుదారుణః ।
దేవానామసురాణాం చ ఘోరః క్షయకరో మహాన్ ॥38॥

అప్పుడు బలినిగ్రహానికి దేవాసురుల మధ్య దారుణమైన యుద్ధం జరిగింది. ఆ యుద్ధం భీకరంగానూ, క్షయకరంగానూ సాగింది.

కర్తుం ధర్మవ్యవస్థానం జాయతే మానుషేష్విహ ।
భృగో శ్శాపనిమిత్తం తు దేవాసురకృతే తదా ॥39॥

అప్పుడు దేవాసురులపట్ల భృగువు శాపం కారణంగాను, ధర్మస్థాపన కొరకూ, హరి మనుజుల్లో జన్మించాడు.

మునయ ఊచుః :– మునులు చెప్పారు.

కథం దేవాసురకృతే వ్యాపారం ప్రాప్తవాన్ స్వతః ।
దేవాసురం యథా వృత్తం తన్నః ప్రబ్రూహి పృచ్ఛతామ్ ॥40॥

దేవాసురుల కొరకై భగవంతుడు స్వతః ప్రయత్నపరుడెలా అయ్యాడు? అడుగుతున్న మాకు దేవాసుర వృత్తాంతం వివరించు.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

తేషాం దాయనిమిత్తం తైస్సఙ్గ్రామస్తు సుదారుణః ।
వారాహాద్యా దశ ద్వౌ చ చణ్డామర్కాన్తరే స్మృతాః ॥41॥

ఋషులారా! వారికి దాయనిమిత్తమై మిక్కిలి దారుణమైన వారాహం మొదలైన పంద్రెండు యుద్ధాలు చండుడు, అమర్కుడు వీరి సమయంలో జరిగాయి.

నామతస్తు సమాసేన శృణుతైషాం వివక్షతామ్ ।

మొత్తంమీద ఈ యుద్ధాలను గూర్చి నామతః సంగ్రహంగా చెపుతాను వినండి.

ప్రథమో నారసింహస్తు ద్వితీయశ్చాపి వామనః ॥42॥

తృతీయస్తు వరాహశ్చ చతుర్థోఽమృతమన్థనః ।
సఙ్గ్రామః పఞ్చమశ్చైవ సఞ్జాతస్తారకామయః ॥43॥

షష్ఠో హ్యాడీవకాఖ్యస్తు సప్తమస్త్రైపుర స్తథా ।
అన్ధకాఖ్యోఽష్టమస్తేషాం నవమో వృత్రఘాతకః ॥44॥

ధాత్రశ్చ దశమశ్చైవ తతో హాలాహలః స్మృతః ।
ప్రథితో ద్వాదశస్తేషాం ఘోరః కోలాహలస్తథా ॥45॥

మొదటిది నారసింహం, రెండవది వామనం, మూడవది వరాహం, నాల్గవది అమృతమంథనం, ఐదవది తారకామయం, ఆడీబకాఖ్యం ఆరవది. త్రైపురం ఏడవది, అంధకాఖ్యం ఎనిమిదవది, వృత్రఘాతకం తొమ్మిదవది, ధాత్రం పదవది, తరువాతిది హాలాహలం, పండ్రెండవది ఘోరమైన కోలాహలంగా ప్రసిద్ధం.

హిరణకశిపుర్దైత్యో నారసింహేన పాతితః ।
వామనేన బలిర్బద్ధస్త్రైలోక్యాక్రమణే పురా ॥46॥

నరసింహుడు హిరణ్యకశిపుని వధించాడు, వామనుడు త్రైలోక్యం ఆక్రమించి పూర్వం బలిని బంధించాడు.

హిరణ్యాక్షో హతో ద్వంద్వే ప్రతిఘాతే తు దైవతైః ।
దంష్ట్రయా తు వరాహేణ సముద్రస్తు ద్విధా కృతః ॥47॥

ద్వంద్వయుద్ధంలో దేవతలచే హిరణ్యాక్షుడు హతుడైనాడు, అపుడు వరాహుడు కోరతో సముద్రాన్ని రెండుగా విభజించాడు.

ప్రహ్లాదో నిర్జితో యుద్ధే ఇన్ద్రేణామృతమన్థనే ।
విరోచనస్తు ప్రాహ్లాదిర్నిత్యమిన్ద్రవధోద్యతః ॥48॥

ఇంద్రుడు అమృతమంథనయుద్ధంలో ప్రహ్లాదుణ్ణి జయించాడు. ప్రహ్లాదుని సుతుడు విరోచనుడు నిత్యం ఇంద్రుణ్ణి వధించే యత్నంలో ఉండేవాడు.

ఇన్ద్రేణైవ తు విక్రమ్య నిహతస్తారకామయే ।
అశక్నువన్ స దేవానాం సర్వం సోఢుం సదైవతమ్ ॥49॥

విరోచనుడు దేవతలను ఏమాత్రం సహించేవాడు కాదు. కాని తారకాసురునితో జరిగిన యుద్ధంలో ఇంద్రుడే పరాక్రమించి అతణ్ణి వధించాడు.

నిహతా దానవా స్సర్వే త్రైలోక్యే త్ర్యమ్బకేణ తు ।
అసురాశ్చ పిశాచాశ్చ దానవాశ్చాన్ధకాహవే ॥50॥

హతా దేవమనుష్యే స్వే పితృభిశ్చైవ సర్వశః ।
సంపృక్తో దానవైర్ధాత్రో ఘోరో హాలాహలో మతః ॥51॥

ముల్లోకాలలోని రాక్షసులందరినీ త్ర్యంబకుడు హతమార్చాడు. అప్పుడు అంధకయుద్ధంలో, అసురులు, పిశాచులు, దానవులు అందరూ చచ్చారు. అప్పుడు దేవతలు, పితృగణాలు, మనుజులు అందరూ ఆయుద్ధంలో హతులైనారు. దానవులతో గూడిన భీకరమైన దాత్రమనే యుద్ధం జరిగింది. హాలహల సంగ్రామం కూడా భీకరమే.

తదా విష్ణుసహాయేన మహేన్ద్రేణ నివర్తితః ।
తతో ధ్వజో మహేన్ద్రేణ మాయాచ్ఛన్నస్తు యోగవిత్ ।
ధ్వజలక్షణమావిశ్య విప్రచిత్తిస్సహానుజః ॥52॥

విష్ణుసహాయం కల ఇంద్రుడు విప్రచిత్తిని యుద్ధం నుండి విడగొట్టాడు. యోగవేత్త అయిన విప్రచిత్తి మాయతో దాగినవాడై ధ్వజరూపం ధరించగా వాణ్ణి అనుజసహితంగా ఇంద్రుడు పరిమార్చాడు.

దైత్యాంశ్చ దానవాంశ్చైవ సంయతాన్ కిల సంయుతాన్ ।
జయన్కోలాహలే సర్వాన్ దేవైః పరివృతో వృషా ॥53॥

దైత్యులు, దానవులు ఒక్కటిగా సంగ్రామానికి రాగా ఇంద్రుడు దేవతలతో గూడి కోలాహలయుద్ధంలో జయించాడు.

యజ్ఞస్యావభృథే దృష్టౌ చణ్డామర్కౌ తు దైవతైః ।
ఏతే దేవాసురా వృత్తాస్సఙ్గ్రామా ద్వాదశైవ తు ॥54॥

అప్పుడు చండుడు, అమర్కుడు అనే ఇద్దరు రాక్షసపురోహితులు దేవతలకు యజ్ఞముయొక్క అవభృథ సమయంలో కనిపించారు. ఇవి దేవాసురుల మధ్య జరిగిన వారి వినాశకరమైన ద్వాదశయుద్ధాలు.

దేవాసురక్షయకరాః ప్రజానాం తు హితాయ వై ।
హిరణ్యకశిపూ రాజా వర్షాణామర్బుదం విభో! ॥55॥

ప్రభో! ప్రజల హితంకొరకు దేవానురక్షయకరమైన ఆ యుద్ధాలు సంభవించాయి. హిరణ్యకశిపుడనే రాజు అర్బుదవర్షాలు ప్రజాపాలకుడైనాడు.

ద్విసప్తతి తథాఽన్యాని నియుతాన్యధికాని తు ।
అశీతిం చ సహస్రాణి త్రైలోక్యైశ్వర్యతాం గతః ॥56॥

అతడు డెబ్బదిరెండు నియుతాలపై ఎనుబదివేల సంవత్సరాలు త్రిలోకాలకూ ఈశ్వరుడైనాడు.

పర్యాయేణ తు రాజాఽభూద్బలిర్వర్షాయుతం పునః ।
షష్టివర్షసహస్రాణి నియుతాని చ వింశతిః ॥57॥

అనంతరం బలిచక్రవర్తి రాజై పది వేలసంవత్సరాలు ఏలికగా ఉండినాడు. ప్రహ్లాదుడు, బలి ఒక్కొక్కరు ఇరువది నియుతాలు డెబ్బదివేల వత్సరాలు రాజ్యం నిర్వహించారు.

బలే రాజ్యాధికారస్తు యావత్కాలం బభూవ హ ।
తావత్కాలం తు ప్రహ్లాదో నివృత్తో హ్యసురైః స్సహ ॥58॥

ఇన్ద్రాస్త్రయస్తే విజ్ఞేయా అసురాణాం మహౌజసః ।
దైత్యసంస్థమిదం సర్వమాసీద్దశయుగం పునః ॥59॥

బలి రాజ్యాధికారం ఉన్నంతవరకు ప్రహ్లాదుడు దైత్యులతో సహా నివృత్తుడై ఉండినాడు. వారు ముగ్గురు రాక్షసులు మహాతేజం కల ఇంద్రులై భాసించారు. దైత్యుల అధీనమై ఇదంతా దశయుగాల కాలం కొనసాగింది.

త్రైలోక్యమిదమవ్యగ్రం మహేన్ద్రేణానుపాల్యతే ।
అసపత్నమిదం సర్వమాసీద్దశయుగం పునః ॥60॥

ఆ తరువాత మహేంద్రుడు త్రైలోక్యాన్ని అవ్యగ్రంగా పాలించాడు. వారికి పదియుగాలవరకూ రాజ్యం శత్రురహితమైంది.

ప్రహ్లాదస్య హృతే తస్మింస్త్రైలోక్యే కాలపర్యయాత్ ।
పర్యాయేణ తు సమ్ప్రాప్తే త్రైలోక్యం పాకశాసనే ।
తతోऽసురాన్పరిత్యజ్య శుక్రో దేవానగచ్ఛత ॥61॥

ప్రహ్లాదుడు నిహతుడైన పిదప కాలపర్యాయం వల్ల ఇంద్రునికి రాజ్యపాలన ప్రాప్తమయింది. అప్పుడు అసురులను వీడి శుక్రాచార్యుడు దేవతలనాశ్రయించాడు.

యజ్ఞే దేవానథ గతం దితిజాః కావ్యమాహ్వయన్ ।
కిం త్వం నో మిషతాం రాజ్యం త్యక్త్వా యజ్ఞం పునర్గతః ॥62॥

స్థాతుం న శక్నుమో హ్యత్ర ప్రవిశామో రసాతలమ్ ।
ఏవముక్తోऽబ్రవీద్దైత్యాన్విషణ్ణాన్సాన్త్వయన్గిరా ॥63॥

శుక్రుడు దేవతల యజ్ఞానికి పోగా, అసురులతని పిలిచి "మేము చూస్తుండగానే రాజ్యం వీడి ఏల దేవతల యజ్ఞానికి పోయావు? మేమిక్కడ ఇక ఉండలేము, రసాతలం వెళ్ళి పోతాము," అని అన్నారు. ఇలా వారనగానే శుక్రుడు వారి నోదారుస్తూ విషణ్ణులైన ఆ రాక్షసులతో ఇలా చెప్పాడు.

మా భైష్ట ధారయిష్యామి తేజసా స్వేన వోऽసురాః ।
మన్త్రాశ్చౌషధయశ్చైవ రసా వసు చ యత్పరమ్ ॥64॥

కృత్స్నాని మయి తిష్ఠన్తి పాదస్తేషాం సురేషు వై ।
తత్సర్వం వః ప్రదాస్యామి యుష్మదర్థే భృతం మయా ॥65॥

అసురులారా! భయపడకండి. నా తేజంతో మిమ్మల్ని భరిస్తాను. మంత్రాలు, ఓషధులు, రసాలు, ధనం ఇవన్నీ నాకున్నాయి. ఇందులో పాతిక భాగమే దేవతలకూ కలదు. మీ కొరకై నేను ధరించిన దంతా మీకే ఇస్తాను" అని చెప్పాడు.

తతో దేవాస్తు తాన్దృష్ట్వా వృతాన్కావ్యేన ధీమతా ।
సమ్మన్త్రయన్తి దేవా వై సంవిగ్నాస్తు జిఘృక్షయా ॥66॥

కావ్యో హ్యేష ఇదం సర్వం వ్యావర్తయతి నో బలాత్ ।
సాధు గచ్ఛామహే తూర్ణం యావన్నాధ్యాపయిష్యతి ॥67॥

ప్రసహ్య హత్వా శిష్టాంస్తు పాతాళం ప్రాపయామహే ।

ధీమంతుడైన శుక్రుని రక్ష పొందిన రాక్షసులను చూచి దేవతలు రాజ్యగ్రహణేచ్ఛతో ఇలా ఆలోచించారు. ఈ కావ్యుడు బలాత్కారంగా మన స్థితినంతా మార్చివేస్తున్నాడు. అతడు రాక్షసులకు అన్నీ అందించేలోగా త్వరగా మనం పోదాం రండి. చంపే వీలున్న రాక్షసులను చంపి తక్కిన వారిని పాతాళానికి తరిమివేద్దాం."

తతో దేవాస్తు సంరబ్ధా దానవానుపసృత్య హ ॥68॥

తరువాత దేవతలు దానవులను సమీపించి దాడి చేశారు.

తతస్తే వధ్యమానాస్తు కావ్యమేవాభిదుద్రువుః ।
తతః కావ్యస్తు తాన్దృష్ట్వా తూర్ణం దేవైరభిద్రుతాన్ ॥69॥

రక్షాం కావ్యేన సంహృత్య దేవాస్తేఽప్యసురార్దితాః ।
కావ్యం దృష్ట్వా స్థితం దేవా నిశ్శఙ్కమసురాన్జహుః ॥70॥

అలా దేవతలచే చావుకు గురియగుచున్న దైత్యులు శుక్రుని చెంతకు పరుగెత్తారు. దేవతలచే తరుమబడుతున్న దైత్యులను చూచి శుక్రుడు వారికి రక్ష కల్గించాడు. పిదప అసురులచే దేవతలు పీడింపబడినారు. తమపట్ల శుక్రుడు ఏమీ చేయకుండా ఉండడం చూచి దేవతలు రాక్షసులను వదిలివేశారు.

తతః కావ్యోఽనుచిన్త్యాథ బ్రాహ్మణో వచనం హితమ్ ।
తానువాచ తతః కావ్యః పూర్వం వృత్తమనుస్మరన్ ॥71॥

ఆపై బ్రాహ్మణుడైన కావ్యుడు హితవచనమాలోచించి పూర్వం జరిగిన విషయం స్మరించివారితో ఇలాఅన్నాడు.

త్రైలోక్యం వో హృతం సర్వం వామనేన త్రిభిః క్రమైః ।
బలిర్బద్ధో హతో జమ్భో నిహతశ్చ విరోచనః ॥72॥

'వామనుడు ముల్లోకాలనూ మూడడుగులతో హరించాడు. బలిని బంధించాడు, జంభుడు, విరోచనుడు నిహతులైనారు.

మహాసురా ద్వాదశసు సఙ్గ్రామేషు సురైర్హతాః ।
తైస్తైరుపాయైర్భూయిష్ఠం నిహతా వః ప్రధానతః ॥73॥

ద్వాదశ సంగ్రామాలలో మహాసురు లనేకులు దేవతలచే హతులయ్యారు. ఆయాఉపాయాలను వారలాచేశారు.

కిఞ్చిచ్ఛిష్టాస్తు యూయం వై యుద్ధం మాఽస్త్వితి మే మతమ్ ।
నీతిం యాం వోఽభిధాస్యామి తిష్ఠధ్వం కాలపర్యయాత్ ॥74॥

మీరింక కొందరే శేషించివున్నారు. యుద్ధం తగదని నా అభిప్రాయం. కాల పర్యయంవల్ల మీకు నేను ఏ నీతిని విధిస్తానో దాన్ని పాటించండి.

యాస్యామ్యహం మహాదేవం మన్త్రార్థం విజయావహమ్ ।
అప్రతీపాంస్తతో మన్త్రాన్దేవాత్ప్రాప్య మహేశ్వరాత్ ।
యుధ్యామహే పునర్దేవాంస్తతః ప్రాప్స్యథ వై జయమ్ ॥75॥

మంత్రాలకొరకై నేను విజయప్రదుడైన మహాదేవుని చెంతకు పోతాను. దేవుడైన మహేశ్వరునుండి తిరుగు లేని మంత్రాలను పొంది దేవతలతో మళ్ళీ యుద్ధం చేద్దాము. అప్పుడు మీరు జయం పొందగలరు".

తతస్తే కృతసంవాదా దేవానూచుస్తదాఽసురాః ।
న్యస్తశస్త్రా వయం సర్వే నిస్సన్నాహా రథైర్వినా ॥76॥

పిదప వారంతా దేవతలతో మాట్లాడుతూ ఇలా అన్నారు. "మేమంతా శస్త్రాలను వదిలేశాము. రథాలు వీడి సన్నాహం లేనివార మయ్యాము.

వయం తపశ్చరిష్యామస్సంవృతా వల్కలైర్వనే ।
ప్రహ్లాదస్య వచశ్శ్రుత్వా సత్యాభివ్యాహృతం తు తత్ ॥77॥

తతో దేవా న్యవర్తన్త విజ్వరా ముదితాశ్చ తే ।
న్యస్తశస్త్రేషు దైత్యేషు వినివృత్తాస్తదా సురాః ॥78॥

మేము వనంలో నార చీరలు కట్టి తపస్సు చేస్తాము" అలా సత్యంగా చెప్పిన ప్రహ్లాదుని మాట విని భీతి వీడి దేవతలు సంతోషంతో తిరిగి వెళ్ళారు. రాక్షసులు శస్త్రాలు వీడే సరికి దేవతలు నిర్భయంగా సంతోషంతో తిరిగి వెళ్ళారు.

తతస్తానబ్రవీత్కావ్యః కఞ్చిత్కాలముపాస్యథ ।
నిరుత్సిక్తాస్తపోయుక్తాః కాలం కార్యార్థసాధకమ్ ॥79॥

అపుడు కావ్యుడు రాక్షసులతో "కొంత కాలం ఉపాసించండి. గర్వం వీడండి! తపోయుక్తులై యుండండి! కాలం సర్వార్థాలకూ సాధకం.

పితుర్మమాఽఽశ్రమస్థా వై మాం ప్రతీక్షత దానవాః ।
తత్సందిశ్యాసురాన్కావ్యో మహాదేవం ప్రపద్యత ॥80॥

మా తండ్రి భృగుమహర్షి ఆశ్రమంలో ఉండి నా కొరకై రాక్షసులు ఎదురు చూడండి". ఇలా చెప్పి కావ్యుడు మహాదేవుని సన్నిధికి పోయాడు.

శుక్ర ఉవాచ :- శుక్రుడు చెప్పాడు.

మన్త్రానిచ్ఛామ్యహం దేవ యే న సన్తి బృహస్పతౌ ।
పరాభవాయ దేవానామసురాణాం జయాయ చ ॥81॥

దేవా! బృహస్పతి వద్ద లేని మంత్రాలను నేను కోరుతున్నాను. దేవతల పరాభవానికి, అసురుల విజయానికి అవి కావాలి.

ఏవముక్తోఽబ్రవీద్దేవో వ్రతం త్వం చర భార్గవ ।
పూర్ణం వర్షసహస్రం తు కణధూమమవాక్శిరాః ।
యది పశ్యసి భద్రం తే తతో మన్త్రానవాప్స్యసి ॥82॥

ఇలా కావ్యుడు ప్రార్థించగా దేవు డతనితో "భార్గవా! నీవు వ్రత మాచరించు. వెయ్యేండ్లు తల్లక్రిందులుగా ధూమపానం కావిస్తూ చేస్తే నీవప్పుడు మంత్రాలను పొందగలవు.

తథేతి సమనుజ్ఞాప్య శుక్రస్తు భృగునన్దనః ।
పాదౌ సంస్పృశ్య దేవస్య బాఢమిత్యబ్రవీద్వచః ।
వ్రతం చరామ్యహం దేవ త్వయాదిష్టోఽద్య వై ప్రభో ॥83॥

భృగునందనుడైన శుక్రుడు 'సరే' అని మహాదేవుని పాదాలు స్పృశించి అట్లే చేస్తానన్నాడు. "ప్రభూ! నీ ఆదేశం మేరకు నేను వ్రతం చరిస్తాను" అని అన్నాడు.

తతోఽనుసృష్టో దేవేన కుణ్డధారోఽస్య ధూమకృత్ ।
తదా తస్మిన్గతే శుక్రే హ్యసురాణాం హితాయ వై ।
మన్త్రార్థం తస్య వసతి బ్రహ్మచర్యం మహేశ్వరే ॥84॥

పిదప దేవునిచే అనుజ్ఞాతుడై కుండధారుడై ధూమకృత్ కాకవ్రతం చేశాడు. శుక్రుడు అసురులకొరకై మంత్రాలు కోరి ఈశ్వరుని వద్ద బ్రహ్మచర్యవ్రతం చేస్తున్నారని దేవతలు గ్రహించారు.

తద్బుద్ధ్వా నీతిపూర్వం తు రాజ్యే న్యస్తే తదాఽసురైః ।
అస్మింశ్ఛిద్రే తదాఽమర్షాద్దేవాస్తాన్సముపాద్రవన్ ॥85॥

అది గ్రహించి రాక్షసులు రాజనీత్యనుసారంగా రాజ్యం వదలి వెళ్ళారని తెలుసుకొని ఆ సందర్భంలోనే అసూయతో దేవతలు వారి పైకి దాడి వెడలారు.

ధన్వినోఽస్త్రాయుధా స్సర్వే బృహస్పతిపురస్సరాః ॥86॥
దృష్ట్వాఽసురగణా దేవాన్ ప్రగృహీతాయుధాన్పునః ।
ఉత్పేతుస్సహసా తే వై సన్త్రస్తాస్తాన్వచోఽబ్రువన్ ॥87॥

బృహస్పతి పురస్సరంగా వారు ఆయుధాలు చేపట్టి యుద్ధానికి వచ్చారు. మళ్ళీ ఆయుధధారులై వచ్చిన దేవతలను చూచి ఆ రాక్షసగణాలు భీతి చెంది లేచి ఇలా అన్నారు.

న్యస్తే శస్త్రేఽభయే దత్త ఆచార్యే వ్రతమాస్థితే ।
దత్త్వా భవన్తో హ్యభయం సమ్ప్రాప్తా నో జిఘాంసయా ॥88॥

మేము శస్త్రం వదలగా, మీకు అభయమీగా, ఆచార్యుడు వ్రతస్థుడై యుండగా ముందు అభయమిచ్చి ఇప్పుడు మమ్మల్ని వధించడానికి మీరు వచ్చారా?

అనాచార్యా వయం దేవాస్త్యక్తశస్త్రాస్త్వవస్థితాః ।
చీరకృష్ణాజినధరా నిష్క్రియా నిష్పరిగ్రహాః ॥89॥

రణే విజేతుం దేవాంశ్చ న శక్ష్యామః కథఞ్చన ।
అయుద్ధేన ప్రపత్స్యామశ్శరణం కావ్యమాతరమ్ ॥90॥

దేవతలారా! మేము ఆచార్యుడు లేనివారం. ఆయుధాలు వదిలియున్నాము. పరిగ్రహం వీడి క్రియా రహితులమై చీరకృష్ణాజినాలు ధరించినాము. ఇప్పుడు యుద్ధంలో ఏవిధంగానూ దేవతలను జయించలేము. యుద్ధం లేకుండా కావ్యుని మాతను శరణు పొందుతున్నాము.

యాపయామః కృచ్ఛ్రమిదం యావదభ్యేతి నో గురుః ।
నివృత్తే చ తథా శుక్రే యోత్స్యామస్స్వీకృతాయుధాః ॥91॥

మాగురువు వచ్చేవరకూ ఈ కష్టకాలం ఇలా గడపుతాము. శుక్రాచార్యుడు రాగానే ఆయుధధారులమై మీతో యుద్ధం చేయగలం.

ఏవముక్త్వా తతోఽన్యోన్యం శరణం కావ్యమాతరమ్ ।
ప్రాపద్యన్త తతో భీతా స్తేభ్యోఽదాదభయం తు సా ॥92॥

ఇలా చెప్పి రాక్షసులు భీతితో కావ్యమాతను శరణం పొందారు. ఆమె వారి కభయ మిచ్చింది.

న భేతవ్యం న భేతవ్యం భయం త్యజత దానవాః ।
మత్సన్నిధౌ వర్తతాం వో న భీర్భవితుమర్హతి ॥93॥

దానవులారా! భయపడవద్దు, భయవడవద్దు. భయం వీడండి! నా వద్ద ఉన్న మీకు భయం లేదు.

తయా చాభ్యుపపన్నాంస్తాన్దృష్ట్వా దేవాస్తతోఽసురాన్ ।
అభిజగ్ముః ప్రసహ్యైతానవిచార్య బలాబలమ్ ॥94॥

అలా శుక్రుని మాతచే అంగీకృతులయిన ఆరాక్షసులను చూచి బలాబలాలు ఆలోచించకనే దేవతలు బలాత్కారంగా వారి పైకురికారు.

తతస్తాన్వధ్యమానాంస్తు దేవైర్దృష్ట్వాఽసురాంస్తదా ।
దేవీ క్రుద్ధాఽబ్రవీద్దేవాననిన్ద్రాన్వః కరోమ్యహమ్ ॥95॥

అలా దేవతలచే బాధింపబడుతున్న రాక్షసులను చూచి దేవి కోపించి దేవతలతో "నేను మిమ్ము ఇంద్రరహితులను చేస్తాను." అని చెప్పింది.

సంభృత్య సర్వసమ్భారానిన్ద్రం సాఽభ్యచరత్తదా ।
తస్తంభ దేవీ బలవద్యోగయుక్తా తపోధనా ॥96॥

అంతట సర్వసంభారాలు సేకరించి యోగయుక్త తపోధనయైన ఆదేవి ఇంద్రుని పై ఆభిచారిక మంత్రం ప్రయోగించి స్తంభింపజేసింది.

తతస్తం స్తమ్భితం దృష్ట్వా ఇన్ద్రం దేవాశ్చ మూకవత్ ।
ప్రాద్రవన్త తతో భీతా ఇన్ద్రం దృష్ట్వా వశీకృతమ్ ॥97॥

అలా స్తంభించి మూగవానివలె వశీకృతుడైన ఇంద్రుణ్ణి చూచి దేవతలు భీతులై పారిపోయారు.

గతేషు సురసఙ్ఘేషు శక్రం విష్ణురభాషత ।
మాం త్వం ప్రవిశ భద్రం తే నయిష్యే త్వాం సురోత్తమ! ॥98॥

సురసంఘాలు అలా పారిపోగా విష్ణువు ఇంద్రునితో "నీవు నాలో ప్రవేశించు. నేను నీకు శుభం కల్గిస్తాను' అని చెప్పాడు.

ఏవముక్తస్తతో విష్ణుం ప్రవివేశ పురన్దరః ।
విష్ణునా రక్షితం దృష్ట్వా దేవీ క్రుద్ధా వచోఽబ్రవీత్ ॥99॥

ఇలా చెప్పిన విష్ణువులో ఇంద్రుడు ప్రవేశించాడు. విష్ణువుచే రక్షించబడిన ఇంద్రుణ్ణి చూచి దేవి కోపించి ఇలా అన్నది.

ఏషా త్వాం విష్ణునా సార్ధం దహామి మఘవన్బలాత్ ।
మిషతాం సర్వభూతానాం దృశ్యతాం మే తపోబలమ్ ॥100॥

ఇంద్రా! నేను సర్వప్రాణులు చూస్తూ వుండగా విష్ణునితో సహా బలాత్కారంగా నిన్ను దహిస్తాను. నా తపోబలమెట్టిదో చూడు.

తథాఽభిభూతౌ తౌ దేవావిన్ద్రావిష్ణూ బభూవతుః ।
కథం ముచ్యేవ సహితౌ విష్ణురిన్ద్రమభాషత ॥101॥

ఆ విధంగా ఇంద్రుడూ– విష్ణువూ పరాభూతులయ్యారు. విష్ణువు ఇంద్రునితో 'మనం ఎలా కలసి విడుదల కాగలము' అని అన్నాడు.

ఇన్ద్రోఽబ్రవీజ్జహి హ్యేనాం యావన్నౌ న దహేత్ ప్రభో ।
విశేషేణాభిభూతోఽస్మి త్వత్తోఽహం జహి మా చిరమ్ ॥102॥

అపుడు ఇంద్రుడు "ప్రభూ? ఇది మనల్ని దహించివేయక మునుపే దీనిని చంపు. నేను నీకంటే ఎక్కువగా అభిభూతుడ నయ్యాను. వధించు ఆలసించకు' అని చెప్పాడు.

తత స్సమీక్ష్య విష్ణుస్తాం స్త్రీవధే కృచ్ఛ్రమాస్థితః ।
అభిధ్యాయ తతశ్చక్రమాపదుద్ధరణే తు తత్ ॥103॥

అంతట విష్ణుదామెను చూచి 'స్త్రీ వధ' విషయంలో క్లేశం పొందాడు. కాని ఆమె దౌష్ట్యం చూచి ఆపదుద్ధరణార్థం చక్రం చేబూనాడు.

తతస్తు త్వరయా యుక్తశ్శీఘ్రకారీ భయాన్వితః ।
జ్ఞాత్వా విష్ణుస్తతస్తస్యాః క్రూరం దేవ్యాశ్చికీర్షితమ్ ।
క్రుద్ధ స్స్వమస్త్రమాదాయ శిరశ్చిచ్ఛేద వై భియా ॥104॥

తదుపరి భయంతో, వేగంగా శీఘ్రకారియై ఆ దేవి యొక్క క్రూరచేష్టను గ్రహించి కోపించి తన అస్త్రం చేపట్టి భయంతో ఆమె శిరస్సు ఖండించాడు.

తం దృష్ట్వా స్త్రీవధం ఘోరం చుక్రోధ భృగురీశ్వరః ।
తతోఽభిశప్తో భృగుణా విష్ణుర్భార్యావధే తదా ॥105॥

ఆ ఘోరమైన స్త్రీవధను విలోకించి భృగువు కోపించాడు. భార్యావధనిమిత్తంగా భృగువు అప్పుడు విష్ణువును శపించాడు.

యస్మాత్తే జానతో ధర్మమవధ్యా స్త్రీ నిషూదితా ।
తస్మాత్త్వం సప్తకృత్వేహ మానుషేషూపపత్స్యసే ॥106॥

"నీవు ధర్మం తెలిసికూడా అవధ్యయైన స్త్రీని వధించావు గాన ఏడుసార్లు మనుష్యులలో జన్మిస్తావు".

తతస్తేనాభిశాపేన నష్టే ధర్మే పునః పునః ।
లోకస్య చ హితార్థాయ జాయతే మానుషేష్విహ ॥107॥

ఆ అభిశాపం చేతనే ధర్మనాశం కల్గినపుడు మాటిమాటికీ లోకహితార్థం భగవంతుడు మనుష్యులలో జన్మిస్తున్నాడు.

అనువ్యాహృత్య విష్ణుం స తదాదాయ శిరస్స్వరన్ ।
సమానీయ తతః కాయమసౌ గృహ్యేదమబ్రవీత్ ॥108॥

అలా విష్ణువునూ శపించి ఆమె శిరస్సును తీసుకొని వెంటనే శరీరంతో దాన్ని చేర్చి ఇలా అన్నాడు-

ఏషా త్వం విష్ణునా దేవి హతా సంజీవయామ్యహమ్ ।
తతస్తాం యోజ్య శిరసా అభిజీవేతి సోఽబ్రవీత్ ॥109॥

'ఓ దేవీ! నీవు విష్ణువుచే చంపబడితివి. నిన్ను నేను బ్రతికిస్తున్నాను' అంటూ శిరస్సుతో మొండెం చేర్చి 'జీవించు' అని అన్నాడు.

యది కృత్స్నో మయా ధర్మో జ్ఞాయతే చరితోఽపి వా ।
తేన సత్యేన జీవస్వ యది సత్యం వదామ్యహమ్ ॥110॥

నేను సమస్త ధర్మాన్నీ తెలసికొన్నవాడనైతే, ఆచరించినవాడనైతే, నేను సత్యం పలికేవాడనైతే నిజంగా జీవించు అన్నాడు.

తతస్తాం ప్రోక్ష్య శీతాభిరద్భిర్జీవేతి సోఽబ్రవీత్ ।
తతోఽభివ్యాహృతే తస్య దేవీ సఞ్జీవితా తదా ॥111॥

ఆపై చల్లని నీటితో ఆమెను (ఖ్యాతిని) ప్రోక్షించి జీవించు అన్నాడు. అతడలా అనగానే అప్పుడామె జీవించింది.

తతస్తాం సర్వభూతాని దృష్ట్వా సుప్తోత్థితామివ ।
సాధు సాధ్వితి చక్రుస్తే వచసా సర్వతోదిశమ్ ॥112॥

నిద్రనుండి లేచిన దానివలె సర్వదిక్కులలోని ప్రాణులన్నీ ఆమెను చూచి సాధు సాధు అని పలికాయి.

ఏవం ప్రత్యాహృతా తేన దేవీ సా భృగుణా తదా ।
మిషతాం దేవతానాం హి తదద్భుతమివాభవత్ ॥113॥

నలభైఏడవ అధ్యాయం

ఇలా భృగుమహర్షి అనే సరికి దేవత లందరూ చూస్తుండగానే ఆ అద్భుతం జరిగింది.

అసమ్భ్రాన్తేన భృగుణా పత్నీ సఞ్జీవితా పునః ।
దృష్ట్వా చేన్ద్రో నాలభత శర్మ కావ్యభయాత్పునః ।
ప్రజాగరే గతశ్చేన్ద్రో జయన్తీమిదమబ్రవీత్ ॥114॥

సఞ్చిన్త్య మతిమాన్వాక్యం స్వాం కన్యాం పాకశాసనః ।

సంభ్రాంతుడు కాని భృగువు పత్నిని బ్రదికించాడు. అది చూచి కావ్యభయం వల్ల ఇంద్రుడు సుఖంగా ఉండలేకపోయాడు. అతనికి నిద్రపట్ట లేదు. ఆలోచించి బుద్ధిమంతుడైన అతడు పిదప తన కుమార్తె జయంతితో ఇలా అన్నాడు.

ఏష కావ్యో హ్యమిత్రాయ వ్రతం చరతి దారుణమ్ ।
తేనాహం వ్యాకులః పుత్రి కృతో మతిమతా భృశమ్ ॥115॥

గచ్ఛ సంసాధయస్వైనం శ్రమాపనయనైశ్శుభైః ।
తైస్తైర్మనోఽనుకూలైశ్చ హ్యుపచారైరతన్ద్రితా ॥116॥

కావ్యమారాధయస్వైనం యథా తుష్యేత స ద్విజః ।
గచ్ఛ త్వం తస్య దత్తాఽసి ప్రయత్నం కురు మత్కృతే ॥117॥

ఈ కావ్యుడు శత్రువు కొరకై దారుణవ్రతం చేస్తున్నాడు. పుత్రీ! అందుచే నేను వ్యాకులతకు గురి అయ్యాను. నీవు వెళ్ళు, అతనికి మనోనుకూలమైన శుభమగు ఉపచారాలతో అతణ్ణి ఆతాధించు. నీవు కావ్యుడు సంతోషించునట్లు అతణ్ణి ఆరాధించు. వెళ్ళు, అతనికి నిన్ను ఇస్తున్నాను. నా కొరకు ప్రయత్నించు.

ఏవముక్తా జయన్తీ సా వచస్సఙ్గృహ్య వై పితుః ।
అగచ్ఛద్యత్ర ఘోరం స తప ఆరభ్య తిష్ఠతి ॥118॥

తండ్రి ఇలా చెప్పగానే జయంతి అతని మాట గ్రహించి కావ్యుడు ఘోర తపస్సు చేస్తున్న చోటికి వెళ్ళింది.

తం దృష్ట్వా తు పిబన్తం సా కణధూమమవాఙ్ముఖమ్ ।
యక్షేణ పాత్యమానం చ కుణ్డధారేణ పాతితమ్ ॥119॥

తల్లక్రిందులుగా ఉండి యక్షుడు కుండధారుడు వదులుతున్న కణధూమం త్రాగుతూ తపస్సు చేస్తున్న ఆతణ్ణి చూచింది.

దృష్ట్వా చ తం పాత్యమానం దేవీ కావ్యమవస్థితా ।
స్వస్వరూపధరం దృష్ట్వా దుర్బలం భూతిమాస్థితమ్ ।
పిత్రా యథోక్తాం వాక్యం సా కావ్యే కృతవతీ తదా ॥120॥

తల్లక్రిందులుగ అలా ఉన్న కావ్యుని ఆమె చూచింది. అతడు స్వస్వరూపం ధరించి ఉన్నాడు. దుర్బలుడై బూదిపూసిన శరీరం కల్గియున్నాడు. తండ్రి చెప్పినట్లే ఆమె కావ్యుని విషయంలో సేవ చేసింది.

గీర్భిశ్చైవానుకూలాభిస్తువతీ వల్గుభాషిణీ ।
గాత్రసంవాహనైః కాలే సేవమానా త్వచస్సుఖైః ।
వ్రతచర్యానుకూలాభిరువాస బహులాస్సమాః ॥121॥

పూర్ణే ధూమ్రవ్రతే తస్మిన్ఘోరే వర్షసహస్రకే ।
వరేణ ఛన్దయామాస కావ్యం ప్రీతో భవస్తదా ॥122॥

మధురంగా మాట్లాడుతూ అనుకూలమైన వచనాలతో అతణ్ణి స్తుతిస్తూ, కాలానుగుణంగా చర్మానికి సుఖం కల్గించే గాత్ర సంవాహనాదులు చేస్తూ అతని వ్రతచర్యకనుకూలంగా పలు సంవత్సరా లుండిపోయింది. వెయ్యేండ్ల ఆధూమవ్రతం పూర్తి కాగానే ప్రీతి చెందిన శివుడు కావ్యునికి వరం ప్రసాదించాడు.

మహాదేవ ఉవాచ :– మహాదేవుడు చెప్పాడు.

ఏతద్వ్రతం త్వయైకేన చీర్ణం నాన్యేన కేనచిత్ ।
తస్మాద్వై తపసా బుద్ధ్యా శ్రుతేన చ బలేన చ ॥123॥

తేజసా చ సురాన్సర్వాంస్త్వమేకోఽభిభవిష్యసి ।
యచ్చాభిలషితం బ్రహ్మన్విద్యతే భృగునన్దన! ॥124॥

ఈ వ్రతం నీవొక్కడనే నిర్వర్తించావు, మరెవరూ చేయలేదు. అందువల్ల తపస్సులో, బుద్ధిలో, విద్యలో, బలంలో, తేజస్సులో, నీ వొక్కడవే సకల దేవతలను జయంచగలవు. భృగునందనా! బ్రహ్మన్! నీ కోరిక ఏదైనా వుంటే అదంతా పొందగలవు.

ప్రపత్స్యసే తు తత్సర్వం నానువాచ్యం తు కస్యచిత్ ।
సర్వాభిభావీ తేన త్వం భవిష్యసి ద్విజోత్తమ! ॥125॥

విప్రోత్తమా! ఈ మంత్రం ఎవరికీ చెప్పవద్దు. అందువల్ల నీవు సర్వులనూ తిరస్కరించు వాడవవుతావు.

ఏతాన్దత్త్వా వరాంస్తస్మై భార్గవాయ భవః పునః ।
ప్రజేశత్వం ధనేశత్వమవధ్యత్వం చ వై దదౌ ॥126॥

భవుడు భార్గవునికి ఈ వరాలిచ్చి మరుల ప్రజేశత్వం, ధనేశత్వం, అవధ్యత్వం కూడా ఇచ్చారు.

ఏతాన్లబ్ధ్వా వరాన్కావ్యస్సమ్ప్రహృష్టతనూరుహః ।
హర్షాత్ప్రాదుర్బభౌ తస్య దివ్యస్తోత్రం మహేశ్వరే ।
తథా తిర్యక్థితశ్చైవ తుష్టువే నీలలోహితమ్ ॥127॥

ఈ వరాలు పొంది కావ్యుడు హృష్టరోమాంచితుడైనాడు. అపుడు హర్షాతిరేకంలో ఈశ్వరుని విషయంలో ఒక దివ్య స్తోత్రముదయించింది. అలా తల్లక్రిందులుగా ఉండే అతడు శివుణ్ణి ఇలా వినుతించాడు.

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

నమోఽస్తు శితికణ్ఠాయ కనిష్ఠాయ సువర్చసే ।
లేలిహానాయ కావ్యాయ వత్సరాయాన్ధసః పతే ॥128॥

నీలకంఠుడు, కనిష్ఠుడు, మంచి తేజస్సు గలవాడు. సర్వభక్షకుడు, కావ్యుడు, సంవత్సరస్వరూపుడు అన్ధఃపతీ అగు నీకు సమస్కారం.

కపర్దినే కరాలాయ హర్యక్ష్ణే వరదాయ చ ।
సంస్తుతాయ సుతీర్థాయ దేవదేవాయ రంహసే ॥129॥

ఉష్ణీషిణే సువక్త్రాయ బహురూపాయ వేధసే ।
వసురేతాయ రుద్రాయ తపసే చిత్రవాససే ॥130॥

హ్రస్వాయ ముక్తకేశాయ సేనాన్యే రోహితాయ చ ।
కవయే రాజవృక్షాయ తక్షకక్రీడనాయ చ ॥131॥

కపర్ది, కరాళుడు, హర్యక్షుడు, వరదుడు, చక్కగా స్తుతింపబడినవాడు, సుతీర్థుడు, దేవదేవుడు, వేగవంతుడు, తలపాగా ధరించినవాడు, సువదనుడు, నానారూపుడూ, విధాత, అగ్ని, రుద్రుడు, తపోరూపుడు, చిత్రవస్త్రధారి, పొట్టివాడు, ముక్తకేశుడు, సేనాని, రోహితుడు, కవి, రుద్రాక్షరూపుడు, తక్షకునితో క్రీడించు వాడునగు శివునకు నమస్కారం.

సహస్రశిరసే చైవ సహస్రాక్షాయ మీఢుషే ।
వరాయ భవ్యరూపాయ శ్వేతాయ పురుషాయ చ ॥132॥

వెయ్యితలలు, వెయ్యినేత్రాలు గలవాడు, కోరికల నిచ్చువాడు, శ్రేష్ఠుడు, భవ్యరూపుడు, శ్వేతుడు, పురుషుడు.

గిరీశాయ నమోఽర్కాయ బలినే ఆజ్యపాయ చ ।
సన్తృప్తాయ సువస్త్రాయ ధన్వినే భార్గవాయ చ ॥133॥

గిరీశుడు, అర్కుడు, బలవంతుడు, ఆజ్యం త్రాగువాడూ, చక్కగా తృప్తి నొందినవాడూ, మంచి వస్త్రాలు కలవాడు, ధనుర్ధారి, భార్గవుడు.

నిషఙ్గిణే చ తారాయ సాక్షాయ క్షపణాయ చ ।
తామ్రాయ చైవ భీమా య ఉగ్రాయ చ శివాయ చ ॥134॥

అంబుల పొది గలవాడూ, నక్షత్రరూపుడు, ఇంద్రియాలతో కూడినవాడు, లోకనాశకుడు, ఎర్రనివాడు, భయంకరుడు, తీవ్రరూపుడు, శుభకరుడు శివునకు నమస్కారం.

మహాదేవాయ శర్వాయ విరూపాయ శివాయ చ ।
హిరణ్యాయ విశిష్టాయ జ్యేష్ఠాయ మధ్యమాయ చ ॥135॥

మహాదేవుడు, శర్వుడు, వికృతరూపుడు, శుభరూపుడు, ప్రకాశించేవాడు, శ్రేష్ఠుడు, జ్యేష్ఠుడు, మధ్యముడు.

వాస్తోష్పతే పినాకాయ ముక్తయే కేవలాయ చ ।
మృగవ్యాధాయ దక్షాయ స్థాణవే భీషణాయ చ ॥136॥

బహునేత్రాయ పథ్యాయ త్రినేత్రాయేశ్వరాయ చ ।
కపాలినే చ వీరాయ మృత్యవే త్ర్యమ్బకాయ చ ॥137॥

బభ్రవే చ పిశఙ్గాయ పిఙ్గళాయారుణాయ చ ।
పినాకినే చేషుమతే చిత్రాయ రోహితాయ చ ॥138॥

దున్దుభ్యాయైకపాదాయ అజాయ బుధ్నియాయ చ ।
ఆరణ్యాయ గృహస్థాయ యతయే బ్రహ్మచారిణే ॥139॥

సాఙ్ఖ్యాయ చైవ యోగాయ వ్యాపినే దీక్షితాయ చ ।
అంతర్హితాయ శర్వాయ భవ్యేశాయ శమాయ చ ॥140॥

గృహమునకు అధిపతి, పినాక ధనుఃస్వరూపుడు, ముక్తి రూపుడు, కేవలరూపుడు, మృగములను వెంటాడు వ్యాధరూపం కలవాడు, దక్షుడు, స్థాణుస్వరూపుడు, భయంకరుడు. అనేకనేత్రాలు కల్గినవాడు, హితకారి, మంచికనులు కలవాడు, ఈశ్వరుడు, కపాలధారి, వీరుడు, మృత్యురూపుడు, మూడు నేత్రాలు కలవాడు, బభ్రువర్ణం కలవాడు, ఎరుపుపసుపు వన్నెవాడు, పింగళుడు, ఎర్రనివాడు, పినాకధారి, బాణాలు కలవాడు, వివిధవర్ణములు కలవాడు, ముదురు ఎరుపువర్ణం కలవాడు, దుందుభియందుండువాడు, ఒకేపాదం కలవాడు, పుట్టుక లేనివాడు, అహిర్బుధ్నీయుడు, వానప్రస్థుడు, గృహస్థుడు, యతి, బ్రహ్మచారి, సాంఖ్యస్వరూపుడు, యోగస్వరూపుడు, వ్యాపించినవాడు, దీక్ష స్వీకరించినవాడు, అంతర్ధానమునొందినవాడు, శర్వుడు, శుభమగు ఈశ్వరుడు, శమస్వరూపుడు అగు శివునకు నమస్కారం.

రోహితే చేకితానాయ బ్రహ్మిష్ఠాయ మహర్షయే ।
చతుష్పదాయ మేధ్యాయ రక్షిణే శీఘ్రగాయ చ ॥141॥

శిఖణ్డినే కరాళాయ దంష్ట్రిణే విశ్వవేధసే ।
భాస్కరాయ ప్రదీప్తాయ సుదీప్తాయ సుమేధసే ॥142॥

క్రూరాయ వికృతాయైవ భీషణాయ శివాయ చ ।
సౌమ్యాయ చైవ పుణ్యాయ ధార్మికాయ శుభాయ చ ॥143॥

రోహితవర్ణం కలవాడు, తెలివైనవాడు, బ్రహ్మర్షులలో గొప్పవాడు, మహర్షి చతుష్పదుడు, పవిత్రుడు, రక్షకుడు, శీఘ్రంగా పోవువాడు, జుట్టుముడి దాల్చినవాడు, ఎగుడు దిగుడు రూపం కలవాడు, కోరలు కలవాడు,

విశ్వములను సృష్టించువాడు, భాస్కరుడు, మిక్కిలిగా ప్రకాశించువాడు, మంచి దీప్తి కలవాడు, మంచి మేధ కలవాడు, క్రూరుడు, వికృతరూపుడు, భీకరుడు, శివుడు, సౌమ్యుడు, పుణ్యాత్ముడు, ధార్మికుడు, శుభుడు.

అవధ్యాయామృతాయైవ నిత్యాయ శాశ్వతాయ చ ।
వ్యావృత్తాయ యవిష్ఠాయ భరతాయ చ సాక్షిణే ॥144॥

అవధ్యుడు, అమృతుడు, నిత్యుడు, శాశ్వతుడు, తన లక్షణాలు ఇంకెక్కడా లేనివాడు, అందరికంటే చిన్నవాడు, అందరినీ భరించేవాడు, సాక్షి స్వారూపుడు అగు శివునకు నమస్కారం.

క్షేమాయ సహమానాయ సత్యాయ చ ఋతాయ చ ।
కర్త్రే పరశవే చైవ శూలినే దివ్యచక్షుషే ॥145॥

క్షేమం కలిగించేవాడు, సర్వం సహించేవాడు, సత్యస్వరూపుడు, ఋత స్వరూపుడు, సర్వానికి కర్త, పరశు స్వరూపుడు, శూలధారి, దివ్యనేత్రుడు,

సోమపాయాఽఽజ్యపాయైవ ధూమపాయోష్మపాయ చ ।
శుచయే పరిధానాయ సద్యోజాతాయ మృత్యవే ॥146॥

సోమపానం చేసేవాడు, ఆజ్యపానం చేసేవాడు, ధూమపానం చేసేవాడు, ఊష్మపానం చేసేవాడు, శుచి యైన వాడు, వస్త్ర స్వరూపుడు, వెంటనే సాక్షాత్కరించువాడు, మృత్యురూపుడు.

పిశితాశాయ శర్వాయ మేఘాయ విద్యుతాయ చ ।
వ్యావృత్తాయ వరిష్ఠాయ భరతాయ చ రక్షసే ॥147॥

మాంసం తినువాడు, శర్వుడు, మేఘ స్వరూపుడు, విద్యుద్రూపుడు, అన్నిటినుండి మరలినవాడు, శ్రేష్ఠుడు, అందరినీ భరించేవాడు, అందరికీ రక్షకుడు.

త్రిపురఘ్నాయ దీప్తాయ చక్రాయ రోమశాయ చ ।
తిగ్మాయుధాయ దక్షాయ సమిద్ధాయ పులస్తయే ॥148॥

త్రిపురాలను సంహరించువాడు, ప్రకాశించేవాడు, చక్రస్వరూపుడు, రోమాలు కలవాడు, తీక్ష్ణమైన ఆయుధాలు కలవాడు, సమర్థుడు, బాగా జ్వలించువాడు, భక్తుల ఎదుట నిలిచేవాడు.

రోచమానాయ చణ్డాయ స్థితాయ ఋషభాయ చ ।
వ్రతినే యుఞ్జమానాయ శుచయే చోర్ధ్వరేతసే ॥149॥

ప్రకాశించువాడు, భయం గొల్పువాడు, భక్తరక్షణకై నిలుచుండువాడు, ఋషభమునిరూపుడు, వ్రతములనుష్ఠించువాడు, పూనికగలవాడు, శుచి యైనవాడు, ఊర్ధ్వరేతస్కుడు.

అసురఘ్నే మఖఘ్నాయ మృత్యుఘ్నే చాంతకాయ చ ।
కృశానవే ప్రశాన్తాయ వహ్నయే నిర్మలాయ చ ॥150॥

రాక్షసులను చంపువాడు, యజ్ఞమును ధ్వంసం చేసేవాడు. మృత్యువును చంపువాడు, అంతటినీ అంతం చేసేవాడు, అగ్ని రూపుడు, ప్రశాంతుడు, హవిస్సును మోయువాడు, నిర్మలుడు.

రక్షోఘ్నాయ పశుఘ్నాయ విఘ్నాయ శ్వసితాయ చ ।
అనాహతాయ సర్వాయ వ్యాపినే తాపనాయ చ ॥151॥

రాక్షసులను చంపువాడు, పశువులను హరించువాడు, విఘ్నరూపుడు, శ్వాసరూపుడు, అనాహత నాదస్వరూపుడు, సర్వరూపుడు, అంతటా వ్యాపించినవాడు, తపింపజేయువాడు.

అనాశ్రితాయ దేవాయ సమిత్యధిష్ఠితాయ చ ।
కృష్ణాయ చ జయన్తాయ లోకానామీశ్వరాయ చ ॥152॥

దేనినీ అశ్రయించకుండా ఉండువాడు, దేవుడు, సమితులను అధిష్ఠించి ఉండువాడు, కృష్ణుడు, జయన్తుడు, లోకేశ్వరుడు.

హిరణ్యబాహవే చైవ వ్యాప్తాయ చ సమాయ చ ।
సుకర్మణే సుసస్యాయ చేశానాయ సుచక్షుషే ॥153॥

హిరణ్యబాహుడు, వ్యాపించినవాడు, సమస్వరూపుడు, మంచి పనులు చేయువాడు, మంచి పైరుల రూపంలో ఉండువాడు, ఈశ్వరుడు, మంచినేత్రములు కలవాడు.

క్షిప్రేషవే సదశ్వాయ శివాయ మోక్షదాయ చ ।
కపిలాయ పిశఙ్గాయ మహాదేవాయ ధీమతే ॥154॥

వేగవంతమైన బాణములు కలవాడు, మంచి గుర్రాలు కలవాడు, శివుడూ, మోక్షమునిచ్చువాడు, కపిల వర్ణుడు, పిశంగవర్ణుడు, మహాదేవుడు, ధీమంతుడు.

మహాకాయాయ దీప్తాయ రోదనాయ సహాయ చ ।
దృఢధన్వినే కవచినే రథినే చ వరూథినే ॥155॥

గొప్ప శరీరం కలవాడు, ప్రకాశ స్వరూపుడు, దుర్జనులను ఏడిపించువాడు, అందరినీ ఓడించువాడు, దృఢమైన ధనువు కలవాడు, కవచం, రథం, రథభాగం కలవాడు.

భృగునాథాయ శుక్రాయ గహ్వరేష్ఠాయ వేధసే ।
అమోఘాయ ప్రశాన్తాయ అమృతాయ వృషాయ చ ॥156॥

భృగువంశనాథుడు, శుక్రాచార్యస్వరూపుడు, గుహలో ఉండువాడు, శాస్త్రవిధిని చేయువాడు, సఫల ప్రయత్నం కలవాడు, ప్రశాంతుడు, అమృతస్వరూపుడు, ప్రాణులను అమృతంతో తడుపువాడు.

నమోఽస్తు తుభ్యం భగవన్విశ్వాయ కృత్తివాససే ।
పశూనాం పతయే తుభ్యం భూతానాం పతయే నమః ॥157॥

ఓ భగవానుడా! గొప్పవాడవు, గజచర్మధారివి, పశుపతివి, భూతపతివి అగు నీకు నమస్కారం.

ప్రణమ్య ఋగ్యజుస్సామ్నే స్వాహాయ చ స్వధాయ చ ।
వషట్కారాత్మనే చైవ తుభ్యం మన్త్రాత్మనే నమః ॥158॥

ఋగ్యజుస్సామస్వరూపుడు, స్వాహారూపుడు, స్వధారూపుడు, వషట్కార స్వరూపుడు, మంత్రాత్ముడు అగు నీకు నమస్కారం.

త్వష్ట్రే ధాత్రే తథా కర్త్రే హర్త్రే చ కృపణాయ చ ।
భూతభవ్యభవేశాయ తుభ్యం కర్మాత్మనే నమః ॥159॥

సృష్టించువాడు, పోషించువాడు, కర్త, హర్త, కృపణుడు, భూతవర్తమాన భవిష్యత్కాలములలో ఉండువాడు కర్మాత్ముడవైన నీకు నమస్కారం.

వసవే చైవ సాధ్యాయ రుద్రాదిత్యాశ్వినాయ చ ।
విశ్వాయ మారుతాయైవ తుభ్యం దేవాత్మనే నమః ॥160॥

వసురూపుడు, సాధ్యరూపుడు, రుద్రరూపుడు, ఆదిత్యరూపుడు, అశ్వినరూపుడు, విశ్వరూపుడు, మారుతస్వరూపుడు దేవాత్మకుడవైన నీకు నమస్కారం.

అగ్నీషోమవిధిజ్ఞాయ పశుమంత్రౌషధాయ చ ।
స్వయమ్భువే హ్యజాయైవ అపూర్వప్రథమాయ చ ।
ప్రజానాం పతయే చైవ తుభ్యం బ్రహ్మాత్మనే నమః ॥161॥

అగ్నీషోమవిధి తెలిసినవాడు, పశుమంత్రౌషధస్వూరూపుడు, స్వయంభువు, అజుడు, అపూర్వప్రథముడు, ప్రజాపతి, బ్రహ్మాతకుడవగు నీకు నమస్కారం.

ఆత్మేశాయాఒ ఒత్మవశ్యాయ సర్వస్యాతిశయాయ చ ।
సర్వభూతాంగభూతాయ తుభ్యం భూతాత్మనే నమః ॥162॥

ఆత్మేశుడు, ఆత్మవశ్యుడు, సర్వాన్ని అతిశయించినవాడు, సర్వభూతాలకు అంగమైనవాడు. భూతాత్ముడైన నీకు నమస్కారం.

నిర్గుణాయ గుణజ్ఞాయ వ్యాకృతాయాఒమృతాయ చ ।
నిరుపాఖ్యాయ మిత్రాయ తుభ్యం సాఙ్ఖ్యాత్మనే నమః ॥163॥

నిర్గుణుడు, గుణజ్ఞుడు, వ్యాకృతుడు, అమృతుడు, నిరుపాఖ్యుడు, మిత్రుడు, సాంఖ్యస్వరూపుడవగు నీకు నమస్కారం.

పృథివ్యై చాన్తరిక్షాయ దివ్యాయ చ మహాయ చ ।
జనస్తపాయ సత్యాయ తుభ్యం లోకాత్మనే సమః ॥164॥

పృథివి, అంతరిక్షం, ద్యులోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం, అనే లోకాలరూపంలో ఉండు నీకు నమస్కారం.

అవ్యక్తాయ మహాన్తాయ భూతాదేరిన్ద్రియాయ చ।
ఆత్మజ్ఞాయ విశిష్టాయ తుభ్యం సర్వాత్మనే నమః ॥165॥

వ్యక్తము కానివాడు, మహద్రూపుడు, భూతములకు ఆదియగువాడు, ఇంద్రియస్వరూపుడు, ఆత్మ స్వరూపం తెలిసినవాడు, అన్నిటికంటె విశిష్టుడు, సర్వాత్మకుడవగు నీకు నమస్కారం.

నిత్యాయ చాత్మలిఙ్గాయ సూక్ష్మాయ చేతనాయ చ।
శుద్ధాయ విభవే చైవ తుభ్యం మోక్షాత్మనే నమః ॥166॥

నిత్యుడు, ఆత్మలింగరూపుడు, సూక్ష్ముడు, చేతనరూపుడు, శుద్ధుడు, విభువు, మోక్షాత్మకుడవగు నీకు నమస్కారం.

నమస్తే త్రిషు లోకేషు నమస్తే పరతస్త్రిషు।
సత్యాన్తేషు మహాద్యేషు చతుర్షు చ నమోఽస్తు తే ॥167॥

ముల్లోకాలలో నీకు నమస్కారం, ముల్లోకాల కావల నీకు నమస్కారం, సత్యాన్తం, మహాది అయిన నాల్గు లోకాలలో నీకు నమస్కారం.

నమః స్తోత్రే మయా హ్యస్మిన్యది న వ్యాహృతం భవేత్।
మద్భక్త ఇతి బ్రహ్మణ్య తత్సర్వం క్షన్తుమర్హసి ॥168॥

బ్రహ్మణ్యా! ఈ స్తోత్రంలో నేను చెప్పవలసింది చెప్పకుంటే నా భక్తుడు కదా అని అదంతా క్షమించు.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

ఏవమాభాష్య దేవేశమీశ్వరం నీలలోహితమ్।
ప్రహ్వోఽభిప్రణతస్తస్మై ప్రాఞ్జలిర్వాగ్యతోఽభవత్ ॥169॥

కావ్యస్య గాత్రం సంస్పృశ్య హస్తేన ప్రీతిమాన్భవః।
నికామం దర్శనం దత్వా తత్రైవాన్తరధీయత ॥170॥

ఇలా భాషించి ఈశ్వరుడు, నీలలోహితుడు, అగు దేవేశ్వరునికి ప్రణమిల్లి మౌనం వహించాడు. ప్రీతితో శివుడు కావ్యుని శరీరాన్ని చేతితో స్పృశించాడు. స్పష్టంగా దర్శనమిచ్చి అంతర్హితుడయ్యాడు.

తత స్సోఽన్తర్హితే తస్మిన్ దేవేశేనుచరీం తదా।
తిష్ఠన్తీం పార్శ్వతో దృష్ట్వా జయన్తీమిదమబ్రవీత్ ॥171॥

దేవేశ్వరుడంతర్హితుడు కాగా, ప్రక్కనే ఉన్న అనుచరిని జయింతిని చూచి కావ్యుడు ఇలా అన్నాడు.

కస్య త్వం సుభగే! కా వా దుఃఖితే మయి దుఃఖితా ।
మహతా తపసా యుక్తా కిమర్థం మాం నిషేవసే ॥172॥

అనయా సంస్తుతో భక్త్యా ప్రశ్రయేణ దమేన చ ।
స్నేహేన చైవ సుశ్రోణి ప్రీతోఽస్మి వరవర్ణిని! ॥173॥

సుందరీ! నీవు ఎవ్వరిదానవు, ఎవ్వతెవు? నేను దుఃఖిస్తే దుఃఖిస్తున్నావు. గొప్ప తపస్సు చేస్తూ ఏల నన్ను సేవిస్తున్నావు? వరవర్ణినీ! ఈ నీ భక్తితో, వినయంతో, దమంతో, స్నేహంతో నేను ప్రీతుడనయ్యాను.

కిమిచ్ఛసి వరారోహే కస్తే కామస్సమృధ్యతామ్ ।
తత్తే సమ్పాదయామ్యద్య యద్యపి స్యాత్సుదుష్కరః ॥174॥

వరారోహా! నీవేమి కోరుతున్నావు? నీ కోరిక ఏమిటో చెప్పు. అది మిక్కిలి దుష్కరమైనా నీకు సంపాదిస్తాను.

ఏవముక్తాఽబ్రవీదేనాం తపసా జ్ఞాతుమర్హసి ।
చికీర్షితం హి మే బ్రహ్మంస్త్వం హి వేత్థ యథాతథమ్ ॥175॥

శుక్రుడలా చెప్పగా ఆమె "నీవు తపస్సుతోనే నా కోరిక ఏమిటో తెలుసుకో గలవు. నీకు ఉన్నదున్నట్లు అంతా తెలుస్తుంది".

ఏవముక్తోఽబ్రవీదేనాం దృష్ట్వా దివ్యేన చక్షుషా ।
మయా సహ త్వం సుశ్రోణి దశ వర్షాణి భామిని ॥176॥

సర్వభూతైరదృశ్యా చ సమ్ప్రయోగమిహేచ్ఛసి ।
దేవి చేన్దీవరశ్యామే! వరార్హే ! వామలోచనే! ।
ఏవం వృణోమి కామం త్వాం యది చేద్వల్గుభాషిణి! ॥177॥

ఏవం భవతు గచ్ఛామో గృహాన్నో మత్తకాశిని! ।
తత స్స్వగృహమాగత్య జయన్త్యాః పాణిముద్వహత్ ॥178॥

అపుడు దివ్యనేత్రంలో చూచి విషయం గ్రహించి శుక్రుడు "భామినీ నాతో నీవు పది సంవత్సరాల కాలం సమస్త ప్రాణులకు కనిపించకుండా కలయిక కోరుతున్నావు. దేవీ! నల్లగలువను బోలిన శరీర కాంతిగలదానా! చారులోచనా! వరార్హా! నీవిట్టి కోరిక కల్గియుంటివి. అట్లే అగుగాక! మత్తకాశినీ! ఇంటికి పోదాం!" అలా చెప్పి స్వగృహం చేరి శుక్రుడు జయంతిని పెండ్లి చేసుకొన్నాడు.

తయా సహావసద్దేవ్యా దశ వర్షాణి భార్గవః ।
అదృశ్యస్సర్వభూతానాం మాయయా సంవృతః ప్రభుః ॥179॥

ఆ దేవితో గూడా శుక్రుడు పది సంవత్సరాలు అక్కడ నివసించాడు! మాయాసంవృతుడై ఎవరికీ కనిపించకుండా ఉండినాడు.

కృతార్థమాగతం దృష్ట్వా కావ్యం సర్వే దితేస్సుతాః ।
అభిజగ్ము ర్గృహం తస్య ముదితాస్తే దిదృక్షవః ॥180॥

దితిసుతు లందరూ కావ్యుడు కృతార్థుడై తిరిగివచ్చాడని సంతోషంతో అతణ్ణి చూడగోరి అతని గృహానికి వెళ్ళారు.

యదా గతా న పశ్యన్తి మాయయా సంవృతం గురుమ్ ।
లక్షణం తస్య తద్బుద్ధ్వా ప్రతిజగ్ముర్యథాగతమ్ ॥181॥

కాని మాయాసంవృతుడైన గురువును వారక్కడ దర్శించలేక పోయారు. అతని స్థితి చూచి వారు వచ్చినట్లే నిరుత్సాహంతో తిరిగి వెళ్ళారు.

బృహస్పతిస్తు సంరుద్ధం కావ్యం జ్ఞాత్వా వరేణ తు ।
తుష్ట్యర్థం దశ వర్షాణి జయన్త్యా హితకామ్యయా ॥182॥

బృహస్పతి జయంతి కిచ్చిన వరంతో ఆమెను సంతోషింపజేయడానికై శుక్రుడు పది సంవత్సరాలు నిరోధింపబడినాడని గ్రహించాడు.

బుద్ధ్వా తదన్తరం సోఽపి దైత్యానామిన్ద్రచోదితః ।
కావ్యస్య రూపమాస్థాయ అసురాన్సముపాహ్వయత్ ॥183॥

తతస్తానాగతాన్దృష్ట్వా బృహస్పతిరువాచ హ ।
స్వాగతం మమ యాజ్యానాం ప్రాప్తోఽహం వో హితాయ చ ॥184॥

ఇంద్రుని ప్రేరణతో అతడు శుక్రుని రూపం దాల్చి అసురుల నాహ్వానించాడు. వారతని చెంతకు వచ్చారు. వారిని చూచి నా యాజ్యులకు స్వాగతం. మీహితం కోరి నేను తిరిగి వచ్చాను.

అహం వోఽధ్యాపయిష్యామి విద్యాః ప్రాప్తాస్తు యా మయా ।
తతస్తే హృష్టమనసో విద్యార్థముపపేదిరే ॥185॥

నేను నేర్చిన విద్యలను మీకు బోధిస్తాను అని చెప్పాడు. అందుకు వారు సంతసించి విద్యలభ్యసించడానికి అతని వద్దకు వచ్చారు.

పూర్ణే కావ్యస్తదా తస్మిన్సమయే దశవార్షికే ।
సమయాన్తే దేవయానీ తదోత్పన్నా ఇతి శ్రుతిః ।
బుద్ధిం చక్రే తత స్సోఽథ యాజ్యానాం ప్రత్యవేక్షణే ॥186॥

ఇంతలో శుక్రుడు పెట్టిన గడువు పది సంవత్సరాలు పూర్తి అయింది. ఆ సమయంలోనే దేవయాని పుట్టినదని విన్నాము. తరువాత శుక్రుడు తన వారికోసం ఆలోచించాడు.

దేవి గచ్ఛామ్యహం ద్రష్టుం మమ యాజ్యాఞ్శుచిస్మితే ।
విభ్రాన్తవీక్షితే సాధ్వి త్రివర్ణాయతలోచనే ॥187॥

విభ్రమేక్షణములు గలదానా? త్రివర్ణాయతనేత్రా! శుచిస్మితా! నేను నా వారిని చూడడానికి వెళ్తున్నాను.

ఏవముక్త్వాఽబ్రవీదేనం భజ భక్తాన్మహావ్రత! ।
ఏష ధర్మస్సతాం బ్రహ్మన్న ధర్మం లోపయామి తే ॥188॥

అతడలా అనగానే ఆమె "మహావ్రతా! నీ భక్తులవద్దకు వెళ్ళు. ఇది సజ్జనుల ధర్మం, ఈ ధర్మానికి లోపం కల్గించను".

తతో గత్వాఽసురాన్దృష్ట్వా దేవాచార్యేణ ధీమతా ।
వఞ్చితాన్కావ్యరూపేణ తతః కావ్యోఽబ్రవీత్తు తాన్ ॥189॥

తర్వాత శుక్రుడు వెళ్ళి ధీమంతుడైన దేవగురువుచేత కావ్యరూపంతో మోసగింపబడిన అసురులను చూచి ఇలా అన్నాడు.

కావ్యం మాం వో విజానీధ్వం తోషితో గిరిశో విభుః ।
వఞ్చితా బత యూయం వై సర్వే శృణుత దానవాః ॥190॥

"నేను మీ శుక్రుడనని తెలుసుకోండి! శివుడు నా తపస్సుచే సంతసించాడు. మీరు మాత్రం వంచింపబడితిరి– దానవులంతా వినండి.

శ్రుత్వా తథా బ్రువాణం తం సమ్భ్రాన్తాస్తే తదాఽభవన్ ।
ప్రేక్షన్తస్తావుభౌ తత్ర స్థితాసీనౌ సువిస్మితాః ॥191॥

అతడలా చెప్పగా విని వారందరూ సంభ్రమానికి లోనయ్యారు. అక్కడ ఉన్న ఇరువురు కావ్యులను చూచి ఆశ్చర్యపడ్డారు.

సంప్రమూఢాస్తత స్సర్వే న ప్రాబుధ్యన్త కిఞ్చన ।
అబ్రవీత్సమ్ప్రమూఢేషు కావ్యస్తానసురాంస్తదా ॥192॥

మిక్కిలి మోసానికి గురియైన వారికి ఏమీ అవగతం కాలేదు. అలా మూఢులైనవారితో కావ్యుడిలా అన్నాడు.

ఆచార్యో వో హ్యహం కావ్యో దేవాచార్యోఽయమఙ్గిరాః ।
అనుగచ్ఛత మాం దైత్యాస్త్యజతైనం బృహస్పతిమ్ ॥193॥

నేను మీ ఆచార్యుడనైన కావ్యుడను. ఇతడు దేవాచార్యుడైన బృహస్పతి. దైత్యులు నన్ను అనుసరించండి. ఈ బృహస్పతిని త్యజించండి.

ఇత్యుక్తా హ్యసురాస్తేన తావుభౌ సమవేక్ష్య చ ।
యథాఽసురా విశేషం తు న జానన్త్యుభయోస్తయోః ॥194॥

ఇలా చెప్పిన మాటలు విన్న అసురులు ఆ యిరువురినీ చూచి వారుభయలలో భేదం గ్రహించలేక పోయారు.

బృహస్పతిరువాచైనానసమ్భ్రాన్తస్తపోధనః ।
కావ్యో వో౽హం గురుర్దైత్యా మద్రూపో౽యం బృహస్పతిః ॥195॥

తపోధనుడు, సంభ్రమం లేనివాడు అయిన బృహస్పతి దైత్యులారా! నేను మీ గురువు కావ్యుడను. ఇతడు నా రూపంతో వచ్చిన బృహస్పతి.

సమ్మోహయతి రూపేణ మామకేనైష వో౽సురాః ।
శ్రుత్వా తస్య తతస్తే వై సమేత్య తు తతో౽బ్రువన్ ॥196॥

అసురులారా! ఇతడు నా రూపంతో మిమ్మల్ని మోహింపజేస్తున్నాడు. అది విని వారందరూ కలిసి ఇలాఅన్నారు.

అయం నో దశ వర్షాణి సతతం శాస్తి వై ప్రభుః ।
ఏష వై గురురస్మాకమన్తరేప్సురయం ద్విజః ॥197॥

ఇతడు మాకు పదిసంవత్సరాలుగా శిక్షణ యిస్తున్నాడు. ఈయనే మా గురువు. ఈ ద్విజుడు మధ్యలో రాగోరుతున్నాడు.

తత స్తే దానవా స్సర్వే ప్రణిపత్యాభినంద్య చ ।
వచనం జగృహుస్తస్య చిరాభ్యాసేన మోహితాః ॥198॥

పిదప దానవులెల్లరూ ఆయనకు నమస్కరించారు. ఆయన నభినందించి చిరాభ్యాసం వల్ల మోహితులై బృహస్పతి మాటను నిజమనుకున్నారు.

ఊచుస్తమసురాస్సర్వే క్రోధసంరక్తలోచనాః ।
అయం గురుర్హితో౽స్మాకం గచ్ఛ త్వం నాసి నో గురుః ॥199॥

క్రోధరక్త నేత్రులై శుక్రునితో వారు "ఈయన మాకు హితం కోరే గురువు. నీవు కావు. వెళ్ళు".

భార్గవో వా౽ఙ్గిరా వా౽పి భగవానేష నో గురుః ।
స్థితా వయం నిదేశే౽స్య సాధు త్వం గచ్ఛ మా చిరమ్ ॥200॥

ఇతడు శుక్రుడైనా, బృహస్పతియైనా ఈ భగవానుడే మాగురువు. ఆయన ఆనతిలో మేమున్నాము. మంచిది నీవు ఇట నుండి త్వరగా వెళ్ళిపొమ్ము.

ఏవముక్త్వా౽సురాస్సర్వే ప్రాపద్యన్త బృహస్పతిమ్ ।
యదా న ప్రతిపద్యన్త కావ్యేనోక్తం మహద్ధితమ్ ॥201॥

ఇలాచెప్పి అసురులందరూ బృహస్పతినే అనుసరించారు. కావ్యుడు చెప్పిన హితవచనాలను పెడచెవినిబెట్టారు.

చుకోప భార్గవస్తేషామవలేపేన తేన తు ।
బోధితా హి మయా యస్మాన్న మాం భజథ దానవాః! ॥202॥

భార్గవునికి వారి తిరస్కరణ వల్ల కోపం వచ్చింది. దానవులారా! నేను చెప్పినా నా మాట మీరు వినలేదు.

తస్మాత్త్వనష్టసంజ్ఞా వై పరాభవమవాప్స్యథ ।
ఇతి వ్యాహృత్య తాన్కావ్యో జగామాథ యథాగతమ్ ॥203॥

అందుచే మీ సంజ్ఞ నశించి పరాభవం పొందుదురు గాక! అని చెప్పి కావ్యుడు వచ్చినదారినే తిరిగిపోయాడు.

శప్తాంస్తానసురాన్ జ్ఞాత్వా కావ్యేన స బృహస్పతిః ।
కృతార్థః స తదా హృష్టస్స్వరూపం ప్రత్యపద్యత ॥204॥

కావ్యుడు వారిని శపించినాడని తెలసికొన్న బృహస్పతి కృతార్థుడై సంతోషించి నిజరూపం దాల్చాడు.

బుద్ధ్వాఽసురాన్హతాన్ జ్ఞాత్వా కృతార్థోఽన్తరధీయత ।
తతః ప్రనష్టే తస్మింస్తు విభ్రాన్తా దానవాఽభవన్ ॥205॥

ఇక అసురులను హతులైనవారుగా గ్రహించి కృతార్థుడై అతర్ధానం చెందాదు. అతడు మాయం కాగానే రాక్షసులు విభ్రాంతులైనారు.

అహెూ వివఞ్చితా స్మేతి పరస్పరమథాబ్రువన్ ।
పృష్ఠతోఽభిముఖాశ్చైవ తాడితాఙ్గిరసేన తు ॥206॥

"అయ్యో! మోస పోయినామే!" అని అన్యోన్యం చెప్పుకొన్నారు. అంగిరసుడు అవ్యక్తంగానూ, వ్యక్తంగానూ, మమ్మల్ని దెబ్బదీశాడు.

వఞ్చితాః సోపధానేన స్వే స్వే వస్తుని మాయయా ।
తతస్త్వపరితుష్టాస్తే తమేవ త్వరితా యయుః ।
ప్రహ్లాదమగ్రతః కృత్వా కావ్యస్యానుపదం పునః ॥207॥

మాయతో అలా వంచితులైనవారు అపరితుష్టులై ప్రహ్లాదుణ్ణి ముందిడుకొని త్వరగా ఆ శుక్రాచార్యుని చెంతకు పోయారు.

తతః కావ్యం సమాసాద్య ఉపతస్థురవాఙ్ముఖాః ।
సమాగతాన్పునర్దృష్ట్వా కావ్యో యాజ్యానువాచ హ ॥208॥

కావ్యుని చెంతకు పోయి తలలు వంచి నిలబడ్డారు. మళ్ళీ తనవద్దకు వచ్చిన వారిని చూచి కావ్యుడిలాఅన్నాడు.

మయా సమ్బోధితా స్సర్వే యస్మాన్మా నాభినన్దథ ।
తతస్తేనావమానేన గతా యూయం పరాభవమ్ ॥209॥

నేను బోధించినా మీరందరూ నన్ను అభినందించలేదు గాన, నన్ను అవమానించడంవల్ల మీరు పరాభవం పాలయ్యారు.

ఏవం బ్రువాణం శుక్రం తు బాష్పసన్దిగ్ధయా గిరా ।
ప్రహ్లాదస్తం తదోవాచ మా నస్త్వం త్యజ భార్గవ ॥210॥

ఇలా చెప్పే శుక్రుణ్ణి చూచి బాష్పరుద్ధమైన వాక్కుతో ప్రహ్లాదుడు "భార్గవా! నీవు మమ్మల్ని వదలవద్దు".

స్వాశ్రయాన్భజమానాంశ్చ భక్తాంస్త్వం భజ భార్గవ ।
త్వయ్యదృష్టే వయం తేన దేవాచార్యేణ మోహితాః ।
భక్తానర్హసి వై జ్ఞాతుం తపోదీర్ఘేణ చక్షుషా ॥211॥

నిన్నాశ్రయించి సేవించే భక్తులను మమ్మల్ని ఆదరించు. నీవు! కనిపించక పోయే సరికి మేము దేవాచార్యుని మోసానికి లోనయ్యాము. తపోదీర్ఘమైన నేత్రంతో నీవు భక్తులను గమనించదగుదువు.

యది నస్త్వం న కురుషే ప్రసాదం భృగునన్దన! ।
అవజ్ఞాతాస్త్వయా హ్యద్య ప్రవిశామో రసాతలమ్ ॥212॥

భృగునందనా! నీవు మమ్ములను అనుగ్రహించకపోతే మేము అవమానితులమై పాతాళం ప్రవేశిస్తాము.

జ్ఞాత్వా కావ్యో యథా తత్త్వం కారుణ్యాదనుకమ్పయా ।
ఏవం ప్రత్యనునీతో వై తతః కోపం నియమ్య సః ।
ఉవాచైతాన్న భేతవ్యం న గన్తవ్యం రసాతలమ్ ॥213॥

కావ్యుడు జరిగిన విషయాన్ని గ్రహించాడు. వారిచే అనునీతుడై వారిపై దయగలవా డయ్యాడు. తదుపరి కోపం నిగ్రహించుకొన్నాడు. మీరు భయపడవద్దు, పాతాళం పోవద్దు అని చెప్పాడు.

అవశ్యం భావినో హ్యర్థాః ప్రాప్తవ్యా మయి జాగ్రతి ।
న శక్యమన్యథా కర్తుం దిష్టం హి బలవత్తరమ్ ॥214॥

జరుగవలసినవి తప్పక జరుగుతాయి. నేను జాగరూకుడనైనా బలవత్తరమైన దైవం మార్చ వీలు కాదు.

సంజ్ఞా ప్రణష్టా యా వోఽద్య తామేతాం ప్రతిపత్స్యథ ।
దేవాన్జిత్వా సకృచ్చాపి పాతాళం ప్రతిపత్స్యథ ॥215॥

మీరు నష్టపోయిన సంజ్ఞ నిప్పుడు తిరిగి పొందండి! దేవతలను జయించినా ఒక్కసారి యైనా మీరు పాతాళానికి పోతారు.

ప్రాప్తః పర్యయకాలో వ ఇతి బ్రహ్మాఽభ్యభాషత ।
మత్ప్రసాదాచ్చ త్రైలోక్యం భుక్తం యుష్మాభిరూర్జితమ్ ॥216॥

కాలం మారితే తప్పదు అని బ్రహ్మ నిర్దేశమిది. నా అనుగ్రహం వల్ల మీరు సంపన్నమైన త్రైలోక్యాన్ని అనుభవించితిరి.

యుగాఖ్యా దశ సమ్పూర్ణా దేవానాక్రమ్య మూర్ధని ।
ఏతావన్తం చ కాలం వై బ్రహ్మా రాజ్యమభాషత ॥217॥

దేవతల నెత్తిపై ఆక్రమించి పదియుగాలు నిండినాయి. మీ రాజ్యపాలన ఇంతకాలముండునట్లు బ్రహ్మ చెప్పాడు.

రాజ్యం సావర్ణికే తుభ్యం పునః కిల భవిష్యతి ।
లోకానామీశ్వరో భావ్యస్తవ పౌత్రః పునర్బలిః ॥218॥

ఏవం కిల మిథః ప్రోక్తః పౌత్రస్తే విష్ణునా స్వయమ్ ।
తదా హృతేషు లోకేషు తాస్తాస్తస్యాభవన్కిల ॥219॥

యస్మా త్ప్రవృత్తయ శ్చాస్య సకాశాదభిసన్ధితాః ।
తస్మాద్వృత్తేన ప్రీతేన తుభ్యం దత్తం స్వయమ్భువా ॥220॥

సావర్ణిక మన్వంతరంలో మీకు మళ్ళీ రాజ్యం రాగలదు. నీ మనుమడు బలి లోకములకు ప్రభువు కాగలడు అని విష్ణువు స్వయంగా నీ మనువడికి చెప్పినాడు. విష్ణువు బలినుండి వంచనచే లోకాలను అపహరించిన సమయాన బలి పాలించిన చోట్ల ప్రవర్తిల్లచేసిన లోకప్రవృత్తులను కూడా మోసంతో తీసుకొన్నాడు. అందుకు ప్రీతి జెంది బలికి ఈ వరమిచ్చాడు.

దేవరాజ్యే బలిర్భావ్య ఇతి మామీశ్వరోఽబ్రవీత్ ।
తస్మాదదృశ్యో భూతానాం కాలాపేక్షస్స తిష్ఠతి ॥221॥

దేవరాజ్యంలో బలి ఉంటాడని ఈశ్వరుడు నాతో చెప్పాడు. అందుచేత అతడు ప్రాణులకు కనిపించకుండా కాలాపేక్షుడై ఉన్నాడు.

ప్రీతేన చాపరో దత్తో వరస్తుభ్యం స్వయమ్భువా ।
తస్మాన్నిరుత్సుకస్త్వం వై పర్యాయం సహితో సురైః ॥222॥

ప్రీతినొందిన బ్రహ్మ మరొక వరం గూడా మీకు ఇచ్చాడు. కాన నీవు ఆందోళన లేకుండా అసురులలోవుండు.

న హి శక్యం మయా తుభ్యం పురస్తాద్విప్రభాషితుమ్ ।
బ్రహ్మణా ప్రతిషిద్ధోఽహం భవిష్య జ్జానతా విభో! ॥223॥

విభూ! నేను మీముందట అన్ని విషయాలు చెప్పజాలను. భవిషత్తు నెరిగిన బ్రహ్మ నన్నా విషయంలో నిషేధించాడు.

ఇమౌ చ శిష్యౌ ద్వౌ మహ్యం సమావేతౌ బృహస్పతేః ।
దైవతైస్సహ సంసృష్టాన్ సర్వాన్వో ధారయిష్యతః ॥224॥

ఈనా యిద్దరు శిష్యులు చండామర్కులు బృహస్పతి సదృశులు. వీరు దేవతలతో సహా సృష్టింపబడిన మిమ్మల్ని ధరించనున్నారు.

ఇత్యుక్తా హ్యసురా స్సర్వే కావ్యేనాక్లిష్టకర్మణా ।
హృష్టాస్తేన యయుస్సార్ధం ప్రహ్లాదేన మహాత్మనా ॥225॥

క్లేశం లేని కర్మలు గలవాడగు కావ్యు డిలా చెప్పగా అసురులు సంతసించి మహాత్ముడైన ఆ ప్రహ్లాదునితో కలసి వెళ్ళిపోయారు.

అవశ్యం భావ్యమర్థం తు శ్రుత్వా శుక్రేణ భాషితమ్ ।
సకృదాశంసమానాస్తు భయం శుక్రేణ భాషితమ్ ।
దంశితాస్సాయుధాస్సర్వే తతో దేవాన్సమాహ్వయన్ ॥226॥

అవశ్యం జరుగనున్న విషయాలను శుక్రుడు చెప్పగా విని కొంత కాలం తరువాత శుక్రుడు చెప్పినట్లు భయం కలుతుందని భావించి రాక్షసులందరూ సాయుధులై దేవతలను సమరానికి ఆహ్వానించారు.

దేవాస్తదాఽసురాన్దృష్ట్వా సఙ్గ్రామే సముపస్థితాన్ ।
సర్వే సమ్భృతసమ్భారా దేవాస్తాన్సమయోధయన్ ॥227॥

అప్పుడు దేవతలు యుద్ధానికి వచ్చిన అసురులను చూచి అన్ని సంభారాలను చేకూర్చుకొని యుద్ధానికి సిద్ధమయ్యారు.

దేవాసురే తదా తస్మిన్వర్తమానే శతం సమాః ।
అజయన్నసురా దేవాంస్తతో దేవాహ్యమన్త్రయన్ ॥228॥

అలా దేవాసురుల సంగ్రామం నూరేండ్లు కొనసాగింది. అసురులు దేవతలను జయించారు. దేవతలు ఇలా ఆలోచించారు.

యజ్ఞేనోపాహ్వాయామస్తౌ తతో జేష్యామహేఽసురాన్ ।
తదోపామన్త్రయన్ దేవాశ్చణ్డామర్కౌ తు తావుభౌ ॥229॥

"యజ్ఞం పేరిట చండామర్కులను ఆహ్వానిద్దాం. అప్పుడు అసురులను జయించగలం". అలా అనుకొని చండామర్కుల నిరువురినీ ఆహ్వానించారు.

యజ్ఞే చాహూయ తౌ ప్రోక్తౌ త్యజేతామసురాన్ ద్విజౌ ।
వయం యువాం భజిష్యామస్సహ జిత్వా తు దానవాన్ ॥230॥

యజ్ఞానికాహ్వానించి ఆ ద్విజులను ఓ ద్విజులారా! అసురులను త్యజించండి. మీ సాయంతో అసురులను జయించి మీకు మేము సేవ చేస్తాము" అన్నారు.

ఏవం కృత్వాఽభిసంధీతౌ చణ్డామర్కౌ సురాస్తథా ।
తతో దేవా జయం ప్రాపుః దానవాశ్చ పరాజితాః ॥231॥

అలా చండామర్కులతో సంధి కుదిరే సరికి, దేవతలు జయించారు, దానవులు పరాజితులయ్యారు.

చణ్డామర్కపరిత్యక్తా దానవా హ్యబలా స్తథా ।
ఏవం దైత్యాః పురా కావ్యశాపేనాభిహతా స్తదా ॥232॥

చండామర్కులు తమ్ము వీడడంతో అసురులు బలహీను లయ్యారు. ఈ రీతిగా పూర్వం అసురులు కావ్యుని శాపంతో అభిహతులైనారు.

కావ్యశాపాభిభూతాస్తే నిరాధారాశ్చ సర్వశః ।
నిరస్యమానా దేవైశ్చ వివిశుస్తే రసాతలమ్ ॥233॥

కావ్యశాపం వల్ల అభిభూతులైనవారు సర్వత్రా నిరాధారులై దేవతలచే నిరసింపబడి రసాతలం ప్రవేశించారు.

ఏవం నిరుద్యమా దేవైః కృతాః కృచ్ఛ్రేణ దానవాః ।
తతః ప్రభృతి శాపేన భృగోర్నైమిత్తికేన తు ॥234॥

ఇలా దేవతలచే యత్నహీనులుగా చేయబడి దానవులు నైమిత్తికమైన భృగుశాపంచేత కష్టాలపాలయ్యారు.

జజ్ఞే పునః పునర్విష్ణుర్ధర్మే ప్రశిథిలే ప్రభుః ।
కుర్వన్ధర్మవ్యవస్థానమసురాణాం ప్రణాశనమ్ ॥235॥

ధర్మం శిథిలమైనప్పుడెల్లా విష్ణువు మాటిమాటికీ అవతరించాడు. ధర్మస్థాపనమూ, రాక్షసవినాశమూ కావించాడు.

ప్రహ్లాదస్య నిదేశే తు న స్థాస్యంత్యసురాశ్చ యే ।
మనుష్యవధ్యాస్తే సర్వే బ్రహ్మేతి వ్యాహరన్ప్రభుః ॥236॥

ప్రహ్లాదుని ఆజ్ఞను పాటించని అసురులు మనుష్యులచే వధ్యులవుతారని బ్రహ్మ చెప్పాడు.

ధర్మాన్నారాయణస్యాంశః సమ్భూతశ్చాక్షుషేఽన్తరే ।
యజ్ఞం వై వర్తయామాసుర్దేవా వైవస్వతేఽన్తరే ॥237॥

చాక్షుషమన్వంతరంలో శ్రీనారాయణుడు ధర్ముని అంశంలో జన్మించాడు. వైవస్వత మన్వంతరంలో దేవతలు యజ్ఞం చేశారు.

ప్రాదుర్భావే తతస్తస్య బ్రహ్మా హ్యాసీత్పురోహితః ।
యుగాఖ్యాయాం చతుర్థ్యాం తు ఆపన్నేషు సురేషు వై ॥238॥

హిరణ్యాక్ష వధార్థాయ హిరణ్యకశిపోస్తథా ।
ద్వితీయే నారసింహాఖ్యే రుద్రో హ్యాసీత్పురోహితః ॥239॥

ఆ యజ్ఞంలో బ్రహ్మయే పురోహితుడు. నాల్గవదైన తామసమన్వంతరంలో దేవతలు కష్టాలపాలు కాగా హిరణ్యాక్షుణ్ణి అట్లే హిరణ్యకశిపుణ్ణి వధించుటకై విష్ణువు నరసింహుడుగా ఆవిర్భవించాడు. నరసింహుని ద్వితీయావతారంలో రుద్రుడే పురోహితుడు.

బలిసంస్థేషు లోకేషు త్రేతాయాం సప్తమం ప్రతి ।
తృతీయే వామనస్యార్థే ధర్మేణ తు పురోధసా ॥240॥

ఏడవ వైవస్వతమన్వంతరంలో త్రేతాయుగంలో లోకాలు బలి అధీనంలో ఉండగా, విష్ణువు వామనుడుగా అవతరించాడు. అపుడు ఆయనకు ధర్ముడు పురోహితుడు.

ఏతాస్తిస్రస్స్మృతాస్తస్య దివ్యాస్సమ్భూతయో ద్విజాః! ।
మానుషాస్సప్త యాఽన్యాస్తు శాపజాస్తా నిబోధత ॥241॥

ద్విజులారా! ఈ మూడు విష్ణువు యొక్క దివ్యావతారాలు. శాపం వల్ల కల్గిన తక్కిన ఏడు మానుషావతారాలు, వాటిని తెలుసుకోండి.

త్రేతాయుగే తు ప్రథమో దత్తాత్రేయో బభూవ హ ।
నష్టే ధర్మే చతుర్థాంశే మార్కణ్డేయపురస్సరః ॥242॥

త్రేతాయుగంలో ధర్మం నశించినప్పుడు ప్రథమమైన దత్తాత్రేయావతరంగా విష్ణువు వచ్చాడు. అపుడు మార్కండేయుడు పురోహితుడు. ఇదే నాల్గవ అవతారం.

పఞ్చమః పఞ్చదశ్యాం చ త్రేతాయాం సమ్బభూవ హ ।
మాన్ధాతా చక్రవర్తీ తు తస్య రైభ్యః పురోహితః ॥243॥

పదునైదవ త్రేతాయుగంలో ఆయన మాంధాతృ చక్రవర్తిగా జనించాడు. అతనికి రైభ్యుడు పురోహితుడు.

ఏకోనవింశ్యాం త్రేతాయాం సర్వక్షత్రాన్తకృద్విభుః ।
జామదగ్న్యస్తథా షష్ఠో విశ్వామిత్రపురస్సరః ॥244॥

పందొమ్మిదవ త్రేతాయుగంలో సర్వక్షత్రియాన్తకరుడైన విభుడు జమదగ్నిసుతుడైనాడు. ఇది ఆరవ అవతారం అప్పుడు విశ్వామిత్రుడు సహాయకుడు.

చతుర్వింశే యుగే రామో వసిష్ఠేన పురోధసా ।
సప్తమో రావణస్యార్థే యజ్ఞే దశరథాత్మజః ॥245॥

ఇరువదినాల్గవ యుగంలో వసిష్ఠుడనే పురోహితునితో రాముడు సప్తమావతారంగా రావణుని సంహరించడానికి యజ్ఞంలో దశరథసుతుడై అవతరించాడు.

అష్టమో ద్వాపరే విష్ణురష్టావింశే పరాశరాత్ ।
వేదవ్యాసస్తథా జజ్ఞే జాతూకర్ణ్యపురస్సరః ॥246॥

ఇరవైఎనిమిదవ ద్వాపరంలో విష్ణువు పరాశరునినుండి వేదవ్యాసుడుగా అవతరించాడు. ఇది ఎనిమిదవ అవతారం. అప్పుడు జాతూకర్ణ్యుడు పురోహితుడు.

కర్తుం ధర్మవ్యవస్థానమసురాణాం ప్రణాశనమ్ ।
కృష్ణో నవమకో జజ్ఞే తపసా పుష్కరేక్షణః ।
దేవక్యాం వసుదేవేన ద్వైపాయనపురస్సరః ॥247॥

ధర్మస్థాపనకూ, అసురవినాశానికి కృష్ణుడు నవమావతారమయ్యాడు. అతడు పద్మనేత్రుడు. దేవకీవసుదేవుల కుమారుడు. అప్పుడు ద్వైపాయనుడు పురోహితుడు.

తస్మిన్నేవ యుగే క్షీణే సన్ధ్యాశిష్టే భవిష్యతి ।
కల్కీ తు విష్ణుయశసః పారాశర్యపురస్సరః ॥248॥

ఆ యుగంలోనే చివర సంధ్యమాత్రం మిగిలి యుండగా విష్ణుయశునికి కల్కిగా పారాశర్యుని ముందిడుకొని భగవానుడు రానున్నాడు.

దశమో భావిసమ్భూతో యాజ్ఞవల్క్యపురస్సరః ।
సర్వాంశ్చ భూతాన్ ప్రమితాన్ పాషణ్డాంశ్చైవ సర్వతః ।
ప్రగృహీతాయుధైర్విప్రైర్వృతశ్శతసహస్రశః ॥249॥

ఇది దశమావతారం. ఇతనికి యాజ్ఞవల్క్యుడు పురోహితుడు. ఆయుధాలు ధరించిన లక్షలకొలది విప్రులితనికి సైనికులవుతారు. ఇతడు దుష్టులైన అనేక భూతములను, పాషండులను, శూద్రరాజులను, బ్రహ్మద్వేషులను సంహరిస్తాడు.

నిశ్శేషాఞ్ఛూద్రరాజ్ఞస్తు తదా స తు కరిష్యతి ।
బ్రహ్మద్విషస్సపత్నాంస్తు సంహృత్యైవ చ తద్వపుః ॥250॥

సాయుధులైన విప్రులతో కూడి శూద్రరాజులను సంహరిస్తాడు. బ్రహ్మద్వేషులను వధిస్తాడు.

పఞ్చవింశే స్థితః కల్కిశ్చరితార్థస్ససైనికః ।
శూద్రాన్సంశోధయిత్వా తు సముద్రాన్తం చ వై స్వయమ్ ॥251॥

ప్రవృత్తచక్రో బలవాన్సంహారం తు కరిష్యతి ।
ఉత్సాదయిత్వా వృషలాన్ప్రాయశస్తానధార్మికాన్ ॥252॥

కల్కి సైనిక సమేతంగా చరితార్థుడై ఇరువదైదవ యుగంలో ఉండగలడు. సముద్రాంతం వరకూ శూద్రాదులను శోధిస్తాడు. ప్రవృత్త చక్రుడై బలవంతుడై దుర్జనులను సంహరించి అధార్మికులైన వృషలులను వధిస్తాడు.

తతస్తదా స వై కల్కిశ్చరితార్థస్ససైనికః ।
ప్రజాస్తం సాధయిత్వా తు సమృద్ధాస్తేన వై స్వయమ్ ॥253॥

అపుడు కల్కిచరితార్థుడు, సైనికసమేతుడై ఉంటాడు. ప్రజలతణ్ణి ఆరాధించి సమృద్ధులవుతారు.

అకస్మాత్కోపితాఽన్యోఽన్యం భవిష్యన్తీహ మోహితాః ।
క్షపయిత్వాతు తేఽన్యోఽన్యం భావినాఽర్థేన చోదితాః ॥254॥

ఆ తరువాత కాలప్రభావం వల్ల జనులు పరస్పరం కోపించి మోహితులై భవిష్యదర్థప్రేరితులై అన్యోన్యసంహారం కావిస్తారు.

తతః కాలే వ్యతీతే తు స దేవోఽన్తరధీయత ।
నృపేష్వథ ప్రణష్టేషు ప్రజానాం సఙ్గ్రహోత్తదా ॥255॥

రక్షణే వినివృత్తే తు హత్వా చాన్యోన్యమాహవే ।
పరస్పరం చ హత్వా తు నిరాక్రన్దాస్సుదుఃఖితాః ॥256॥

తరువాత కొంతకాలానికి కల్కిదేవుడు అంతర్ధానమవుతాడు. రాజులు నశించగా ప్రజలకు రక్షణ లేకుండా పోతుంది. అన్యోన్యం చంపుకొని చెప్పుకొనుటకు దిక్కులేనివారై వారు దుఃఖితులవుతారు.

పురాణి హిత్వా గ్రామాంశ్చ తుల్యత్వే నిష్పరిగ్రహాః ।
ప్రణష్టాశ్రమధర్మాశ్చ నష్టవర్ణాశ్రమాస్తథా ॥257॥

జనులు నగరాలనూ, గ్రామాలను వదలి ఏదీ పరిగ్రహించకుండా ఆశ్రమధర్మాలు, వర్ణధర్మాలు నశించిన వారుగా అయిపోతారు.

అట్టశూలా జానపదాశ్శివశూలాశ్చతుష్పథాః ।
ప్రమదాః కేశశూలాశ్చ భవిష్యన్తి యుగక్షయే ॥258॥

జానపదులు ఆహారధాన్యాలను అమ్ముతారు. చతుష్పథాలలో శివప్రతిమల నమ్ముతారు. స్త్రీలు శీలాన్ని అమ్ముకొంటారు. యుగక్షయం జరిగినపుడు సంభవించే పరిణామాలివి.

హ్రస్వదేహాయుషశ్చైవ భవిష్యన్తి వనౌకసః ।
సరిత్పర్వతవాసిన్యో మూలపత్రఫలాశనాః ॥259॥

పొట్టి శరీరాలు, అల్పాయుస్సు గలవారై జనులు అడవికి వెళ్తారు. నదీ పర్వత ప్రాంతాలలో నివసిస్తారు, మూలపత్ర ఫలాలను తిని జీవిస్తారు.

చీరచర్మాజినధరాస్సంకరం ఘోరమాశ్రితాః ।
ఉత్పాతదుఃఖాః స్వల్పార్థా బహుబాధాశ్చ తాః ప్రజాః ॥260॥

ఘోరసంకరాన్ని ఆశ్రయించి చీరలు, చర్మము అజినము ధరించినవారై ప్రజలు ఉత్పాత దుఃఖాలు, ఎక్కువై బహుబాధలు గలిగి స్వల్పైశ్వర్యం కలవారవుతారు.

ఏవం కష్టమనుప్రాప్తాః కాలే సంధ్యంశకే తదా ।
తతః క్షయం గమిష్యన్తి సార్ధం కలియుగేన తు ॥261॥

ఇలా సంధ్యంశకమైన సమయంలో కష్టాల పాలై కలియుగంతో గూడా క్షయం పొందుతారు.

క్షీణే కలియుగే తస్మింస్తతః కృతమవర్తత ।
ఇత్యేతత్కీర్తితం సమ్యగ్దేవాసురవిచేష్టితమ్ ॥262॥

కలియుగం క్షీణించిన పిదప కృతయుగం వస్తుంది. ఇలా దేవాసురుల చర్యలను వివరించడమయింది.

యదువంశప్రసంగేన సమాసాద్వైష్ణవం యశః ।
తుర్వసోస్తు ప్రవక్ష్యామి పూరోర్ద్రుహ్యోస్తథా హ్యనోః ॥272 ॥

యదువంశ ప్రసంగంలో విష్ణుకీర్తి గూడా ప్రస్తుతమయింది. ఇక తుర్వసుడు, పూరువు, ద్రుహ్యుడు అనువుల చరిత్రలు వివరిస్తాను.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శ్రీకృష్ణవంశానువర్ణనం నామ సప్తచత్వారింశోఽధ్యాయః ॥ 47 ॥

శ్రీమత్స్య పురాణంలోని శ్రీకృష్ణవంశానువర్ణనమనే నలబైఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టచత్వారింశోఽధ్యాయః - నలబైఎనిమిదవ అధ్యాయం

తుర్వసుప్రభృతీనాం సంతతికథనమ్ - తుర్వసుడు మున్నగువారి సంతతిని చెప్పుట

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

తుర్వసోస్తు సుతో గర్గో గోభానుస్తస్య చాత్మజః ।
గోభానోస్తు సుతో వీరస్త్రిశరిశ్చాపరాజితః ॥1॥

తుర్వసుని కుమారుడు గర్గుడు. అతని సుతుడు గోభానుడు. అతని కుమారుడు వీరుడు, అపరాజితుడైన త్రిశరి.

కరన్ధమస్తు త్రిశరేర్భరతస్తస్య చాత్మజః ।
దుష్యన్తః పౌరవశ్చాపి తస్య పుత్త్రో హ్యకల్మషః ॥2॥

త్రిశరిసుతుడు కరంధముడు. అతని కుమారుడు భరతుడు. పూరువంశజుడైన దుష్యంతుని అతడు దత్తపుత్రుడుగా గ్రహించాడు. అతని సుతుడు అకల్మషుడు?

ఏవం యయాతిశాపేన జరాసఙ్క్రమణే పురా ।
తుర్వసోః పౌరవం వంశం ప్రవివేశ పురా కిల ॥3॥

ఇలా యయాతి శాపం వల్ల పూర్వం వార్ధక్యం సంక్రమణం చెందగా తుర్వసుని వంశంలో పౌరవవంశం ప్రవేశించింది.

దుష్యన్తస్య తు దాయాదో వరూథో నామ పార్థివః ।
వరూథాత్తు తథాఽణ్డీరశ్చత్వారస్తస్య చాత్మజాః ॥4॥

పాణ్డ్యశ్చ కేరళశ్చైవ చోళః కర్ణస్తథైవ చ ।
తేషాం జనపదా స్స్ఫీతాః పాణ్డ్యాశ్చోలా స్సకేరళాః ॥5॥

దుష్యన్తుని కుమారుడు వరూథుడను రాజు. అతనికి అండీరుడు జన్మించాడు. అతనికి పాండ్యుడు, కేరళుడు, చోలుడు, కర్ణుడు-అనే నలుగురు పుత్రులు. పాండ్య-చోళ-కేరళాలనే వారి జనపదాలు సమృద్ధిగావుండేవి.

ద్రుహ్యోస్తు తనయౌ శూరౌ సేతుః కేతుస్తథైవ చ ।
సేతుపుత్త్రస్తు భద్రశ్చ గాన్ధార స్తస్య చాత్మజః ॥6॥

ద్రుహ్యుని సుతులు సేతువు, కేతువు అనువారు శూరులు. సేతుపుత్రుడు భద్రుడు, అతని కుమారుడు గాంధారుడు.

ఖ్యాయతే యస్య నామ్నాఽసౌ గాన్ధార విషయో మహాన్ ।
అరాట్టదేశజా స్తస్య తురగా వాజినాం వరాః ॥7॥

అతని పేరుతోనే గాంధారదేశం విఖ్యాతి చెందింది. ఆరట్ట దేశజాలైన అతని గుర్రాలు అశ్వములలోశ్రేష్ఠాలు.

గాన్ధారపుత్రో ధర్మస్తు ఘృతస్తస్యాత్మజోఽభవత్ ।
ఘృతాచ్చ విద్రుమో జజ్ఞే ప్రచేతాస్తస్య చాత్మజః ॥8॥

గాంధారుని కొడుకు ధర్ముడు, అతని కొడుకు ఘృతుడు. ఘృతుని కొడుకు విద్రుముడు. అతనికి ప్రచేతుడు కుమారుడు.

ప్రచేతసః పుత్రశతం రాజాన స్సర్వ ఏవ తే ।
మ్లేచ్ఛరాష్ట్రాధిపా స్సర్వే ఉదీచీం దిశమాశ్రితాః ॥9॥

ప్రచేతునికి నూరుమంది పుత్రులు. వారందరూ రాజులే. వారు మ్లేచ్ఛ రాష్ట్రాధిపతులైనారు. ఉత్తర దిశ నాశ్రయించారు.

అనోశ్చైవ సుతా వీరా స్త్రయః పరమధార్మికాః ।
సభానరశ్చాక్షుషశ్చ పరమేషు స్తథైవ చ ॥10॥

అనువు కుమారులు వీరులు ముగ్గురు. వారు పరమధార్మికులు, సభానరుడు, చాక్షుషుడు, పరమేషు డనువారు.

సభానరస్య పుత్రస్తు విద్వాన్కోలాహలో నృపః ।
కోలాహలస్య ధర్మాత్మా సఞ్జయో నామ విశ్రుతః ॥11॥

సభానరుని కొడుకు విద్యాంసుడైన కోలాహలుడను రాజు. కోలాహలునికి దర్మాత్ముడుగు సంజయుడు సుతుడు.

సఞ్జయస్యాభవత్పుత్రో వీరో రాజా పురఞ్జయః ।
జనమేజయో మహారాజా పురఞ్జయసుతోఽభవత్ ॥12॥

సంజయుని సుతుడు వీరుడైన పురంజయుడు. అతని కొడుకు జనమేజయమహారాజు.

జనమేజయస్య రాజర్షేర్మహాశాలోఽభవత్సుతః ।
ఆసీదిన్ద్రసమో రాజా ప్రతిష్ఠితయశా బభౌ ॥13॥

మహామనా స్సుతస్తస్య మహాశాలస్య ధార్మికః ।
సప్తద్వీపేశ్వరో జజ్ఞే చక్రవర్తీ మహామనాః ॥14॥

రాజర్షియగు జనమేజయుని సుతుడు మహాశాలుడు. అతడింద్రతుల్యుడు, ప్రతిష్ఠిత కీర్తి. ఆ మహాశాలుని కొడుకు మహామనుడు ధార్మికుడు. అతడు గొప్ప మనస్సు గలవాడై సప్తద్వీపాలకూ ప్రభువయ్యాడు.

మహామనాస్తు ద్వౌ పుత్రౌ జనయామాస విశ్రుతౌ ।
ఉశీనరంచ ధర్మజ్ఞం తితిక్షుం చైవ తావుభౌ ॥15॥

అతడు ఇరువురు కుమారులను కన్నాడు. ధర్మజ్ఞుడైన ఉశీనరుడు, తితిక్షువు అనువారే వారు.

ఉశీనరస్య పత్న్యస్తు పంచ రాజర్షిసమ్భవాః ।
భృశా కృశా నవా దర్శా యా చ దేవీ దృషద్వతీ ॥16॥

ఉశీనరుని పత్నులు రాజర్షుల కుమార్తెలు– భృశ, కృశ, నవ, దర్శ, దృషద్వతీ అను ఐదుగురు.

ఉశీనరస్య పుత్రాస్తు తాసు జాతాః కులోద్వహాః ।
తపసా తే తు మహతా జాతా వృద్ధస్య ధార్మికాః ॥17॥

వారియందు ఉశీనరునికి కులోద్వహులైన కుమారులు కలిగారు. అతడు వృద్ధుడు. గొప్పతపస్సుతో వారిని కన్నాడు.

భృశాయాస్తు నృగః పుత్రో నవాయా నర ఏవ చ ।
కృశాయాస్తు కృశో జజ్ఞే దర్శాయా సువ్రతోఽభవత్ ।
దృషద్వత్యా స్సుతశ్చాపి శిబిరౌశీనరో నృపః ॥18॥

భృశపుత్రుడు నృగుడు. నవ పుత్రుడు నరుడు. కృశకు కృశుడు. దర్శకు సువ్రతుడు. దృషద్వతికి ఔశీనరుడైన శిబి కుమారులయ్యారు.

శిబేస్తు శిబయః పుత్రా శ్చత్వారో లోకవిశ్రుతాః ।
పృథుదర్భశ్చ సౌవీరః కేకయో భద్రక స్తథా ॥19॥

శిబి కుమారులు పృథుదర్భుడు, సౌవీరుడు, కేకయుడు, భద్రకుడు అనువారు నల్గురు లోకప్రసిద్ధులు.

తేషాం జనపదా స్స్ఫీతాః కేకయా భద్రకాస్తథా ।
సౌవీరాశ్చైవ పౌరాశ్చ నృగస్య కేకయా స్తథా ॥20॥

వారి కేకయ – భద్రక సౌవీర పౌర జనపదాలు, నృగుని కేకయదేశం సమృద్ధి గలిగి ఉండేవి.

సౌవీరస్య సుతోఽమ్బష్ఠః కృశేస్తు కృశలాః సుతాః ।
నవస్య నవరాష్ట్రస్తు తితిక్షోస్తు ప్రజాం శృణు ॥21॥

సౌవీరుని కుమారుడు అంబష్ఠుడు. కృశి కుమారులు కృశలులు. నవుని కుమారుడు నవరాష్ట్రుడు తితిక్షువుయొక్క సంతతిని విను.

తితిక్షురభవద్రాజా పూర్వస్యాం దిశి విశ్రుతః ।
బృహద్రథ స్సుతస్తస్య తస్య సేనోఽభవత్సుతః ॥22॥

తితిక్షువు పూర్వ దిక్పరిపాలకుడుగా విఖ్యాతుడైనాడు. అతనికి బృహద్రథుడు, అతనికి సేనుడు సుతులు.

సేనస్య సుతపా జజ్ఞే సుతపస్తనయో బలిః ।
జాతో మానుషయోన్యాం తు క్షీణే వంశే ప్రజేచ్ఛయా ॥23॥

మహాయోగీ తు స బలిర్బద్ధో బంధైర్మహాత్మనా ।
పుత్రానుత్పాదయామాస క్షేత్రజాన్పఞ్చ పార్థివాన్ ॥24॥

సేనుని కుమారుడు సుతపుడు, అతని తనయుడు బలి. అతడు మహాయోగి, వంశం క్షీణించగా సంతానేచ్ఛతో మానుషయోనిలో జన్మించాడు. ఆమహాయోగి అయిన బలి మహాత్ముడైన వామనునిచే బద్ధుడైనాడు. అతడు ఐదుగురు క్షేత్రజులైన సుతులను కన్నాడు.

అఙ్గం స జనయామాస వఙ్గం సుహ్యం తథైవ చ ।
పుణ్డ్రం కలిఙ్గం చ తథా బాలేయం క్షేత్రముచ్యతే ।
బాలేయా బ్రాహ్మణాశ్చైవ తస్య వంశకరాః ప్రభో ॥25॥

అంగుడు, వంగుడు, సుహ్యుడు, పుండ్రుడు, కలింగుడు- అనువారిని జనింపజేశాడు. వీరు బాలేయక్షేత్రజమైన సంతానం. బలిసంతతియైన వీరు బ్రాహ్మణులుగానే పెంపొంది వంశకరులయ్యారు.

బలేశ్చ బ్రహ్మణా దత్తో వరః ప్రీతేన ధీమతః ।
మహాయోగిత్వమాయుశ్చ కల్పస్య పరిమాణకమ్ ॥26॥

ధీమంతుడైన బలికి ప్రీతుడైన బ్రహ్మ మహాయోగిత్వం, కల్పాంతం వరకూ ఆయువు వరాలుగా ఇచ్చాడు.

సంగ్రామే చాప్యజేయత్వం ధర్మే చైవోత్తమా మతిః ।
త్రైకాల్యదర్శనం చైవ ప్రాధాన్యం ప్రసవే తథా ॥27॥

జయం చాప్రతిమం యుద్ధే ధర్మే తత్త్వార్థదర్శనమ్ ।
చతురో నియతాన్వర్ణాన్స వై స్థాపయితా ప్రభుః ॥28॥

సంగ్రామంలో అజేయత్వం, ధర్మంలో ఉత్తమమతి, త్రికాలజ్ఞత, ప్రసవంలో ప్రాధాన్యం. యుద్ధంలో సాటిలేని జయం, ధర్మంలో తత్త్వార్థదర్శనం, ఇవి ఆ వరాలు. నాల్గు వర్ణాలను అతడు ప్రభువై స్థాపింప గలవాడని అనుగ్రహించాడు.

తేషాం చ పంచ దాయాదా వఙ్గాఙ్గా స్సుహ్యకా స్తథా ।
పుణ్డ్రాః కలింగాశ్చ తథా అంగస్య తు నిబోధత ॥29॥

వంగ- అంగ- సుహ్యక- పుండ్ర- కళింగులుగా వారి సంతతివారు ప్రసిద్ధులయ్యారు. అంగుని వంశమును తెలుసుకోండి.?

ఋషయ ఊచుః :- మునులు చెప్పారు.

కథం బలే స్సుతాః జాతాః పఞ్చ తస్య మహాత్మనః ।
కింనామ్నీ మహిషీ తస్య జనితా కతమో మునిః ॥30॥

మహాత్ముడైన బలికి ఐదుగురు కుమారులు ఎలా కలిగారు? అతని మహిషి పేరేమి? ఆ సంతతిని ప్రసాదించిన ముని ఎవరు?

కథం చోత్పాదితాస్తేన తన్నః ప్రబ్రూహి పృచ్ఛతామ్ ।
మాహాత్మ్యం చ ప్రభావం చ నిఖిలేన వదస్వ నః ॥31॥

వారు ఎలా జనింప జేయిబడ్డారు అది మాకు వివరించు, ఆ మాహాత్మ్యాన్నీ, ప్రభావాన్నీ పూర్తిగా మాకుచెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అథోశిజ ఇతి ఖ్యాత ఆసీద్విద్వానృషిః పురా ।
పత్నీ వై మమతా నామ బభూవాస్య మహాత్మనః ॥32॥

పూర్వం ఉశిజుడు అనే విద్వాంసుడైన ఋషి ప్రఖ్యాతుడై వుండేవాడు. ఆ మహాత్మునికి 'మమత' అనే పత్ని ఉండినది.

ఉశిజస్య యవీయాన్వై భ్రాతృపత్నీమకామయత్ ।
బృహస్పతి ర్మహ్మాతేజా మమతామేత్య కామతః ॥33॥

ఉశిజుని తమ్ముడు బృహస్పతి అన్న భార్యను కామించాడు. మహాతేజస్వి అయిన అతడు కామంతో మమత చెంతకు వెళ్ళాడు.

ఉవాచ మమతా తం తు దేవరం వరవర్ణినీ ।
అన్తర్వత్న్యస్మి తే భ్రాతు ర్జ్యేష్ఠస్య చ విరమ్యతామ్ ॥34॥

వరవర్ణినియైన మమత అతనితో నేను గర్భవతిని, మీ అన్న భార్యను – ఈ పని విరమించు.

అయం తు మే మహాభాగ గర్భః కుక్ష్యేద్బృహస్పతే ।
ఔశిజో భ్రాతృజన్యస్తే సోపాఙ్గం వేదముద్గిరన్ ॥35॥

అమోఘరేతా స్త్వం చాపి న మాం భజితుమర్హసి ।
అస్మిన్నేవం గతే కాలే యథా వా మన్యసే ప్రభో ॥36॥

బృహస్పతీ! మహాభాగా! ఈ నాగర్భం కోపిస్తుంది. నీ భ్రాతృ సుతుడైన ఔశిజుడు సాంగ వేదం తెలసినవాడు. అమోఘ రేతస్కుడవగు నీవు నన్ను కామించదగవు. ప్రభూ! ఈ కాలానికి ఇదే తగినది. నీవేమైనా అనుకో.

ఏవముక్త స్తథా సమ్యగ్బృహత్తేజా బృహస్పతిః ।
కామాత్మా స మహాత్మాఽపి న మనః సోఽభ్యవారయత్ ॥37॥

ఇలా ఆమె చెప్పగా బృహత్తేజుడైన బృహస్పతి కామాత్ముడు గాన మహాత్ముడైయుండి కూడా మనస్సును అరికట్టలేక పోయాడు.

సమ్బభూవైవ ధర్మాత్మా తయా సార్ధమకామయా ।
ఉత్సృజన్తం తు తద్రేతో వాచం గర్భోఽభ్యభాషత ॥38॥

ఆమెకు కోరిక లేకున్నా ఆధర్మాత్ముడు సంగమించినాడు. రేతస్సు విడుస్తున్న అతణ్ణి చూచి గర్భం ఇలాఅన్నది.

భో తాత! వాచామధిప! ద్వయోర్నాస్తీహ సంస్థితిః ।
అమోఘరేతా స్త్వం చాపి పూర్వం చాహ మిహాఽఽగతః ॥39॥

ఓ తాతా! వాగధిపా' ఇక్కడ ఇద్దరికి చోటు లేదు. నీవు అమోఘరేతస్కుడవు, నేను ముందే ఇక్కడికివచ్చాను.

సోఽశపత్తం తతః క్రుద్ధ ఏవముక్తో బృహస్పతిః ।
పుత్రం జ్యేష్ఠస్య వై భ్రాతు ర్గర్భస్థం భగవానృషిః ॥40॥

ఇలా గర్భస్థు డనగానే కోపించిన భగవంతుడగు బృహస్పతి గర్భస్థుడైన జ్యేష్ఠ సోదరునిపుత్రుని శపించాడు.

యస్మాత్త్వమీదృశే కాలే గర్భస్థోఽపి నిషేధసి ।
మామేవముక్తవాంస్తస్మాత్తమో దీర్ఘం ప్రవేక్ష్యసి ॥41॥

ఇట్టికాలంలో గూడా నన్ను నీవు గర్భస్థుడవై నిషేధిస్తున్నావు, నన్నిలా అన్నావు కాన నీవు దీర్ఘతమస్సు ప్రవేశించగలవు. (గ్రుడ్డివాడవు కాగలవు.)

తతో దీర్ఘతమా నామ శాపాదృషిరజాయత ।
అతోఽంశజో బృహత్కీర్తి ర్బృహస్పతిరివౌజసా ॥42॥

ఆ శాపంవల్ల అతడు దీర్ఘతముడుగా జన్మించాడు. అతడు మహాకీర్తి. తేజస్సులో బృహస్పతిసముడుఐనాడు.

ఊర్ధ్వరేతాస్తతోఽసౌ వై వసతే భ్రాతురాశ్రమే ।
స ధర్మాన్ సౌరభేయాంస్తు వృషభాచ్ఛ్రుతవాంస్తతః ॥43॥

పిదప దీర్ఘతముడు తన సోదరుని ఆశ్రమంలో బ్రహ్మచారియై నివసించాడు. పిదప అతడు సౌరభేయి ధర్మాలను వృషభంనుండి అధ్యయనం చేశాడు.

తస్య భ్రాతా పితృవ్యో యశ్చకార భరణం తదా ।
తస్మిన్నివసతస్తస్య యదృచ్ఛాతస్తు వై వృషః ॥44॥

యజ్ఞార్థమాహృతాన్దర్భాంశ్చచార సురభీసుతః ।
జగ్రాహ తం దీర్ఘతమా శ్శృఙ్గయోస్తు చతుష్పదమ్ ॥45॥

అతణ్ణి పితృవ్యుదు, సోదరుడు ఇరువురూ పోషించేవారు. అక్కడ అతడు నివసిస్తూవుండగా యాదృచ్ఛికంగా ఒక సురభీసుతుడైన వృషభం యజ్ఞార్థం తెచ్చిన దర్భలను మేసింది. ఆ చతుష్పదముయొక్క కొమ్ములను దీర్ఘతముడు పట్టుకొన్నాడు.

తేనాసౌ నిగృహీతశ్చ న చచాల పదాత్పదమ్ ।
తతోఽబ్రవీద్వృషస్తం వై ముఞ్చ మాం బలినాం వర! ॥46॥

అలా నిగ్రహింపబడినదై అది ఒక్క అడుగు గూడా అక్కడనుండి కదలలేదు. తరువాత బలవంతులలో శ్రేష్ఠుడా నన్ను వదలు అని ఆ వృషభ మతనితో చెప్పింది.

న మయాఽఽసాదిత స్తాత బలవాంస్త్వత్సమః క్వచిత్ ।
మమ చాన్యః సమో వాపి న హి మే బలసంఖ్యయా ।
ముఞ్చ తాతేతి చ పునః ప్రీతస్తేఽహం వరం వృణు ॥47॥

నాయనా! నాకెక్కడా నీ వంటి బలవంతుడు తటస్థపడలేదు. బలంలో నాతో సముడు గూడా మరొకడు లేడు. నీ పట్ల ప్రీతుడనయ్యాను నన్ను విడువువరం కోరుకో!

ఏవముక్తోఽబ్రవీదేనం జీవన్మే త్వం క్వ యాస్యసి ।
ఏష త్వాం న విమోక్ష్యామి పరస్వాదం చతుష్పదమ్ ॥48॥

ఇలా చెప్పిన వృషభాన్ని చూచి దీర్ఘతముడు సజీవంగా నీవు నా నుండి తప్పించుకొని ఎక్కడికి పోతావు? పరుల సొమ్ము తిను నాల్గుకాళ్ళ జంతువగు నిన్ను నేను వదలను.

ఋషభ ఉవాచ :- ఋషభుడు చెప్పాడు.

నాస్మాకం విద్యతే తాత పాతకం స్తేయమేవ వా ।
భక్ష్యాభక్ష్యం తథా చైవ పేయాపేయం తథైవ చ ॥49॥

నాయనా! మాకు పాపం, దొంగతన మన్నవి లేవు. తినదగింది తినదగని దంటూ ఏదీ లేదు, అట్లే త్రాగదగినది త్రాగదగనిది కూడా లేదు.

ద్విపదాం బహవో హ్యేతే ధర్మా ఏష గవాం స్మృతః ।
కార్యాకార్యే న వాగమ్యాగమనం చ తథైవ చ ॥50॥

ఈ ధర్మాలన్నీ ద్విపాదులకే, ఇది గోవుల ధర్మం. కార్యాకార్యాలు, అట్లే గమ్యాగమ్యాలు మాకు లేవు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

గవాం ధర్మం తు వై శ్రుత్వా సమ్భ్రాన్తస్తు విసృజ్య తమ్ ।
శక్త్యాన్నపానదానాత్తు గోపతిం సంప్రసాదయత్ ॥51॥

పశుధర్మం విని దీర్ఘతముడు సంభ్రాంతుడై దాన్ని విడిచాడు. అన్నపానాదులిచ్చి ఆ గోపతిని ప్రసన్నం కావించుకొన్నాడు.

ప్రసాదితే గతే తస్మి న్గోధర్మం భక్తితస్తు సః ।
మనసైవ సమాదధ్యౌ తన్నిష్ఠ స్తత్పరో హి సః ॥52॥

ప్రసన్నమైన వృషభం వెళ్ళిపోగానే అతడు భక్తితో పశుధర్మాన్ని మనస్సులో ధ్యానం చేశాడు. తన్నిష్ఠుడై తత్పరుడైనాడు.

తతో యవీయసః పత్నీం గౌతమస్యాభ్యపద్యత ।
కృతావలేపాం మత్వా తు సోఽనడ్వానివ న క్షమః ॥53॥

గోధర్మం తు పరం మత్వా స్నుషాం తామభ్యపద్యత ।
నిర్భర్త్స్య చైనాం రుద్ధ్వా చ బాహుభ్యాం సమ్ప్రగృహ్య చ ॥54॥

పిదప తన తమ్ముడు గౌతముని పత్నిని కామించాడు. ఆమె గర్వించియున్నదని అని తెలిసికొని వృషభం లాగా సహనం లేనివాడై గోధర్మమే గొప్పదని తలంచి కోడలివంటి ఆమెను బెదిరించి నిరోధించి చేతులతో బంధించి భోగించాడు.

భావ్యమర్థం తు తం జ్ఞాత్వా మాహాత్మ్యాత్తమువాచ సా ।
విపర్యయం తు త్వం లబ్ధ్వా అనడ్వానివ వర్తసే ॥55॥

మాహాత్మ్యంవల్ల జరుగనున్నది గ్రహించి ఆమె అతనితో "నీవు విపరీత ప్రవృత్తితో ఎద్దులాగా ప్రవర్తించావు.

గమ్యాగమ్యం న జానీషే గోధర్మాత్ప్రార్థయన్సుతామ్ ।
దుర్వృత్తం త్వాం త్యజామ్యద్య గచ్ఛ త్వం స్వేన కర్మణా ॥56॥

గోధర్మం ఆశ్రయించి గమ్యగమ్యాలు లేకుండ కూతురివంటి దానిని నిర్బంధించావు. దుర్వృత్తుడవైన నిన్ను విడిచి పెడుతున్నాను. నీ కర్మతో నీవు వెళ్ళు. (నీకర్మ నీవనుభవించు).

కాష్ఠే సముద్గే ప్రక్షిప్య గఙ్గామ్భసి సముత్సృజత్ ।
యస్మాత్త్వమంధో వృద్ధశ్చ భర్తవ్యో దురధిష్ఠితః ॥57॥

నీవు వృద్ధుడవు, గ్రుడ్డివికాన- నిన్ను మేము భరించవలసి ఉన్నాము" అని అన్నది. అలా చెప్పి కొయ్యపెట్టిలో అతణ్ణి పెట్టి గంగానదిలోకి నెట్టి వేసింది.

తముహ్యమానం వేగేన స్రోతసోఽభ్యాశమాగతః ।
జగ్రాహ తం స ధర్మాత్మా బలిర్వైరోచని స్తదా ॥58॥

ప్రవాహ వేగంతో సమీపానికి కొట్టుకు వచ్చిన అతణ్ణి ధర్మాత్ముడైన వైరోచనబలి పట్టుకొన్నాడు.

అన్తఃపురే జుగోపైనం భక్ష్యభోజ్యైశ్చ తర్పయన్ ।
ప్రీతశ్చైవ వరేణైవ చ్ఛన్దయామాస వై బలిమ్ ॥59॥

అన్తఃపురంలో దాచి భక్ష్యభోజ్యాలతో తృప్తి గావించాడు. అంతట తృప్తుడై అతడు బలిని వరంకోరుకొమ్మన్నాడు.

తస్మాచ్చ స వరం వవ్రే పుత్రార్థే దానవర్షభః ।
సన్తానార్థం మహాభాగ భార్యాయాం మమ మానద ।
పుత్రా న్ధర్మార్థతత్త్వజ్ఞా నుత్పాదయితుమర్హసి ॥60॥

అప్పుడు దానవ శ్రేష్ఠుడైన బలి పుత్రులకొరకై వరం కోరుకున్నాడు. "మహాభాగా? నాభార్యయందు సంతానం కొరకై ధర్మార్థతత్త్వజ్ఞులైన పుత్రులను కల్గించు" అని.

ఏవముక్తోఽథ దేవర్షి స్తథాఽస్త్విత్యుక్తవాన్ప్రభుః ।
స తస్య రాజా స్వాం భార్యాం సుదేష్ణాం నామ ప్రాహిణోత్ ।
అన్ధం వృద్ధం చ తం జ్ఞాత్వా న సా దేవీ జగామ హ ॥61॥

అలా బలి చెప్పగా దేవర్షి 'సరే' అట్లే అగుగాక అన్నాడు. తన భార్య సుదేష్ణను రాజతని వద్దకు పంపాడు. అతడు గ్రుడ్డివాడు, వృద్ధుడని గ్రహించి ఆమె అతని చెంతకు పోలేదు.

శూద్రాం ధాత్రేయికాం తస్మాదన్ధాయ ప్రాహిణోత్తదా ।
తస్యాం కాక్షివదాదీంశ్చ శూద్రయోనావృషిర్వశీ ॥62॥

జనయామాస ధర్మాత్మా శూద్రానిత్యేవమాదికాన్ ।
ఉవాచ తం బలీ రాజా దృష్ట్వా కాక్షీవదాదికాన్ ॥63॥

దాది కూతురగు ఒక శూద్రవనితను ఆమె అతని చెంతకు పంపింది. ఆ శూద్ర స్త్రీయందు ఆ ధర్మాత్ముడైన ముని కాక్షీవంతుడు మున్నగు శూద్రులను కల్గించాడు. ఆ కాక్షీవదాదులను చూచి రాజు దీర్ఘతమునితో ఇలాఅన్నాడు.

రాజు ఉవాచ:- రాజు చెప్పాడు.

ప్రవీణానృషిధర్మస్య చేశ్వరాన్బ్రహ్మవాదినః ।
విద్వాన్ప్రత్యక్షధర్మాణాం బుద్ధిమాన్శుచిమాన్ శుచీన్ ॥64॥

మమైవ చేతి హోవాచ తం దీర్ఘతమసం బలిః ।
నేత్యువాచ మునిస్తం వై మమైవమితి చాబ్రవీత్ ॥65॥

ఋషి ధర్మ ప్రవీణులు, ఈశ్వరులు, బ్రహ్మవాదులు నగువారు తన వారేనా అని దీర్ఘతముణ్ణి అడిగాడు. అందుకు ముని కాదు వారు నా కుమారులు అన్నాడు.

ఉత్పన్నా శ్శూద్రయోనౌ తు నతేక్షేత్రేఽ సురోత్తమ ।
అన్ధం వృద్ధం చ మాం జ్ఞాత్వా సుదేష్ణా మహిషీ తవ ।
ప్రాహిణోదవమానాన్మే శూద్రాం ధాత్రేయికాం నృప ॥66॥

అసురోత్తమా! వీరు శూద్రయోనిలో జన్మించారు. నీ క్షేత్రంలో జన్మించలేదు అంధుడను, వృద్ధుడనని నన్ను తెలిసికొని రాణి సుదేష్ణ నామీద అగౌరవంతో శూద్రయగు ధాత్రేయిని నా వద్దకు పంపింది.

తతః ప్రసాదయామాస బలిస్తమృషిసత్తమమ్ ।
బలి స్సుదేష్ణాం తాం భార్యాం భర్త్సయామాస దానవః ॥67॥

పిదప బలి ఆ ఋషిశ్రేష్ఠుణ్ణి ప్రసన్నుణ్ణి కావించాడు. దానవుడగు బలి తన భార్య సుదేష్ణను తర్జించాడు.

పునశ్చైనామలఙ్కృత్య ఋషయే ప్రత్యపాదయత్ ।
తాం స దీర్ఘతమా దేవీం తథా కృతవతీం తదా ॥68॥

దధ్నా లవణమిశ్రేణ అభ్యక్తం మధుకేన తు ।
లిహ మామజుగుప్సన్తీ ఆపాదతలమస్తకమ్ ।
తతస్త్వం ప్రాప్స్యసే దేవి పుత్త్రాన్వై మనసేప్సితాన్ ॥69॥

మరల ఆమెను అలంకరించి ఋషిచెంతకు పంపాడు. అలా వచ్చిన దేవిని దీర్ఘతముడు ఉప్పు కలిపిన పెరుగుతోనూ, తేనెతోనూ నా శరీరం పూసి జుగుప్స లేకుండ ఆపాదతలమస్తకం నాకు. అపుడు నీవు కోరుకున్న పుత్రులు జన్మిస్తారు అని చెప్పాడు.

తస్య సా తద్వచో దేవీ సర్వం కృతవతీ తదా ।
తస్య సాఽపానమాసాద్య దేవీ పరిహరత్తదా ॥70॥

అపుడు ఆ దేవి అతడు చెప్పినట్లే అంతా చేసింది. కాని అపానస్థానం వద్ద మాత్రం అలా చేయకుండా వదిలేసింది.

తామువాచ తత స్సోఽథ యత్తే పరిహృతం శుభే ।
వినాఽపానం కుమారం తు జనయిష్యసి పూర్వజమ్ ॥71॥

అపుడు అత డామెతో దేవీ! అపానం వదిలేశావు కాన అపానస్థానం లేని జ్యేష్ఠసుతుని నీవు కంటావు' అని అన్నాడు.

సుదేష్ణోవాచ :- సుదేష్ణ చెప్పింది.

నార్హసి త్వం మహాభాగ పుత్త్రం మే దాతుమీదృశమ్ ।
తోషితశ్చ యథాశక్తి ప్రసాదం కురు మే ప్రభో! ॥72॥

మహాభాగా! ఇట్టి పుత్రుణ్ణి నాకు ఇవ్వడం తగదు. యథాశక్తి నిన్ను సంతసింపజేశాను. కాన ప్రభూ!, నన్ను అనుగ్రహించు.

దీర్ఘతమా ఉవాచ :- దీర్ఘతముడు చెప్పాడు.

తవాపచారాద్దేవ్యేష నాన్యథా భవితా శుభే ।
దేవ్యపానం వినా జాతః పుత్త్ర స్తే దాస్యతే ఫలమ్ ॥73॥
తస్యాపానం వినా చైవ యోగ్యభావో భవిష్యతి ।

శుభే! నీ అపచారం వల్ల ఇది ఇట్లే అవుతుంది. కాని మరొక విధంగా కాదు. అపానస్థానం లేనివాడైనా నీకు కలిగే పుత్రుడు యోగ్యుడే అవుతాడు.

తస్యా దీర్ఘతమాఽఙ్గేషు కుక్షౌ స్పృష్ట్వేదమబ్రవీత్ ॥74॥

తదుపరి ఆమె అంగాలు, కుక్షి స్పృశించి దీర్ఘతముడు ఇలా అన్నాడు.

ప్రాశితం దధి యద్యగ్రే మమాంగస్థం శుచిస్మితే ।
తేన తిష్ఠతి తే గర్భే పౌర్ణమాస్యామివోడురాట్ ॥75॥

భవిష్యన్తి కుమారాస్తే పఞ్చ దేవసుతోపమాః ।
తేజస్వినః సువృత్తాశ్చ యజ్వానో ధార్మికాశ్చ తే ॥76॥

శుచియగు చిరునవ్వు గల దేవీ! నీవు మొదట నా అంగమందలి పెరుగు తింటివి. గావున అంగాలన్నీ నాకావు కాన నీకు నీ గర్భంలో పున్నమినాటి చంద్రునిలాగా దేవపుత్రతుల్యులైన ఐదుగురు కుమారులు కల్గుతారు. వారు తేజోవంతులు, సద్వర్తనులు, యాగకర్తలు, ధార్మికులు కాగలరు.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

అంగాదంగస్సుదేష్ణాయా జ్యేష్ఠః పుత్రో వ్యజాయత ।
వఙ్గ స్తథా కలిఙ్గశ్చ పుణ్డ్రస్సుహ్య స్తథైవ చ ॥77॥

పిదప సుదేష్ణ యొక్క అంగమునుండి అంగుడనే జ్యేష్ఠకుమారుడు కలిగాడు. అట్లే వంగుడు, కలింగుడు, పుండ్రుడు, సుహ్యుడు అన్నవారు గూడా జన్మించారు.

అఙ్గాదయస్తు పఞ్చైతే బలేః పుత్రాస్తు క్షేత్రజాః ।
ఇత్యేతే దీర్ఘతమసా బలేర్దత్తాః సుతా స్తథా ॥78॥

ఈ యైదుగురూ బలిపుత్రులైన క్షేత్రజులు. వీరు దీర్ఘతమునిచే బలికి ఇవ్వబడిన కుమారులు.

ప్రతిష్ఠామాగతానాం హి బ్రాహ్మణ్యం కారయంస్తతః ।
తతో మానుషయోన్యాం స జనయామాస వై ప్రజాః ॥79॥

ప్రతిష్ఠితులైన వారికి బ్రాహ్మణ్యం కల్గిస్తూ ఆ ఋషి మానుష యోనియందు సంతతిని కల్గించాడు.

తతస్తు దీర్ఘతమసం సురభిర్వాక్యమబ్రవీత్ ।
విచార్య యస్మాద్గోధర్మం ప్రమాణం తే కృతం ప్రభో! ॥80॥

తరువాత సురభి దీర్ఘతమునితో ఇలా చెప్పింది. ప్రభూ! నీవు గోధర్మం విచారించి దానిని ప్రమాణీకరించావు.

శక్త్యా చానన్యయాఽస్మాసు తేన ప్రీతాస్మి తేఽనఘ! ।
తస్మాత్తుభ్యం తమో దీర్ఘమాఘ్రాయాపనుదామి వై ॥81॥

అనన్యమైన శక్తితో నీ వీపని చేశావు. అనఘా! అందుచే నేను నీపట్ల ప్రీతి చెందాను. అందువల్ల నీ దీర్ఘ తమస్సును, ఆఘ్రాణించి నీనుండి తొలగిస్తాను.

బార్హస్పత్యస్తథైవైష పాప్మా వై తిష్ఠతి త్వయి ।
జరాం మృత్యుం తమశ్చైవ ఆఘ్రాయాపనుదామి తే ॥82॥

నీలో బృహస్పతి చేసిన పాపమున్నది. ఆఘ్రాణించి వృద్ధత్వాన్నీ, మృత్యువునూ, తమస్సునూ ఆఘ్రాణించి నీ నుండి తొలగిస్తున్నాను.

సద్యః స ఘ్రాతమాత్రస్తు హృతే తమసి వై మునేః ।
ఆయుష్మాంశ్చ వపుష్మాంశ్చ చక్షుష్మాంశ్చ తతోఽభవత్ ॥83॥

అలా చెప్పి సురభి ఆఘ్రాణించగానే, ఆ మునిసత్తముడు తమస్సు వీడినవాడై ఆయుష్మంతుడు, సుందరశరీరుడు, నేత్రవంతుడు అయ్యాడు.

గవా హృతే తమసి వై గౌతమస్తు తతోఽభవత్ ।
కాక్షీవాంస్తు తతో గత్వా సహ పిత్రా గిరివ్రజమ్ ॥84॥

గోవుచే తమస్సు దూరం చేయబడగానే అతడు 'గౌతముడుగా' పేరొందాడు. ఆ పై కాక్షీవంతుడు తండ్రితో గూడా గిరివ్రజానికి వెళ్ళాడు.

దృష్ట్వా స్పృష్ట్వా పితుర్వై స హ్యుపవిష్టశ్చిరం తపః ।
తతః కాలేన మహతా తపసా భావితస్తు సః ॥85॥

విధూయ మాతృజం కాయం బ్రాహ్మణ్యం ప్రాప్తవాన్విభుః ।
తతోఽబ్రవీత్పితా తం వై పుత్రవానస్మ్యహం త్వయా ॥86॥

అక్కడ తండ్రిని చూచి స్పృశించి కూర్చొని చిరకాలం తపస్సు చేసి చాలా కాలానికి మాతృజశరీరం వదలి బ్రాహ్మణశరీరం పొందాడు. అంతట తండ్రి అతనితో నీచే నేనిప్పుడు పుత్రవంతుడ నయ్యానని అన్నాడు.

సత్పుత్రేణ తు ధర్మజ్ఞ కృతార్థోఽహం యశస్వినా ।
ముక్త్వాఽఽత్మానం తతోఽసౌ వై ప్రాప్తవాన్బ్రహ్మణః క్షయమ్ ॥87॥

ధర్మజ్ఞా! యశస్వి యైన సత్పుత్రునిచే నేను కృతార్థుడనైతిని అని చెప్పి తన పూర్వ శరీరం వదలి అతడు బ్రహ్మస్థానం పొందాడు.

బ్రాహ్మణ్యం ప్రాప్య కాక్షీవాన్సహస్రమసృజత్సుతాన్ ।
కౌష్మాణ్డా గౌతమాశ్చైవ స్మృతాః కాక్షీవత స్సుతాః ॥88॥

బ్రాహ్మణ్యం పొందిన కాక్షీవతుడు వెయ్యిమంది కొడుకులను కన్నాడు. కాక్షీవంతుని సుతులు కౌష్మాండులు, గౌతములుగా ఖ్యాతి చెందారు.

ఇత్యేష దీర్ఘతమసో బలేర్వైరోచనస్య చ ।
సమాగమో వః కథిత స్సన్తతిశ్చోభయో స్తథా ॥89॥

ఇలా దీర్ఘతముడు, వైరోచరుడైన బలియొక్క సమాగమం ఎలా జరిగిందో అట్లే వారి సంతతి ఎట్టిదో మీకు చెప్పాను.

బలిస్తానభినంద్యాఽఽహ పఞ్చ పుత్త్రానకల్మషాన్ ।
కృతార్థ స్సోఽపి ధర్మాత్మా యోగమాయాఽఽవృత స్స్వయమ్ ॥90॥

అకల్మషులైన ఐదుగురు పుత్రుల నభినందించి బలి వారిచేత తాను గూడా కృతార్థుడనైతి నన్నాడు. తదుపరి అతడు యోగమాయావృతుడై వుండిపోయాడు.

అదృశ్య స్సర్వభూతానాం కాలాపేక్షః స వై ప్రభుః ।
తత్రాఙ్గస్య తు దాయాదో రాజాఽఽసీద్దధివాహనః ॥91॥

ప్రాణుల కెవరికీ కనిపించనివాడై కాలం అపేక్షిస్తూ ఉండిపోయాడు. అక్కడ అంగుని కొడుకు దధివాహనుడు రాజైనాడు.

దధివాహనపుత్త్రస్తు రాజా దివిరథ స్స్మృతః ।
ఆసీద్దివిరథాపత్యం విద్వాన్ధర్మరథో నృపః ॥92॥

అతని కొడుకు దివిరథుడు. అతని సుతుడు విద్యాంసుడైన ధర్మరథుడనే రాజు.

స హి ధర్మరథ శ్శ్రీమాంస్తేన విష్ణుపదే గిరౌ ।
సోమ శ్శక్రేణ వై రాజ్ఞా సహ పీతో మహాత్మనా ॥93॥

శ్రీమంతుడైన ఆ ధర్మరథుడు విష్ణుపదమనే పర్వతంలో మహాత్ముడైన శుక్రునితో గూడి సోమరసం (అమృతం) త్రాగాడు.

అథ ధర్మరథస్యాభూత్పుత్రశ్చిత్రరథః కిల ।
తస్య సత్యరథః పుత్రస్తస్మాద్దశరథః కిల ॥94॥

లోమపాద ఇతి ఖ్యాతస్తస్య శాంతా సుతాఽభవత్ ।
అథ దాశరథి ర్వీర శ్చతురఙ్గో మహాయశాః ॥95॥

ఆ ధర్మరథుని సుతుడు చిత్రరథుడు. అతనికి సత్యరథుడు, అతనికి దశరథుడు కలిగారు. అతడు లోమపాదుడని ఖ్యాతి నొందాడు. అతని పుత్రిక శాంత. దశరథసుతుడు మహావీరుడైన చతురంగుడు, మహాకీర్తిమంతుడయ్యాడు.

ఋశ్యశృఙ్గ ప్రసాదేన జజ్ఞే స్వకులవర్ధనః ।
చతురఙ్గస్య పుత్త్రస్తు పృథులాక్ష ఇతి స్మృతః ॥96॥

ఋష్యశృంగుని అనుగ్రహం వల్ల కులవర్ధనుడైన పృథులాక్షుడనే సుతుడు చతురంగునికి కలిగాడు.

పృథులాక్షసుతశ్చాపి చమ్పో నామ బభూవ హ ।
చమ్పస్య తు పురీ చమ్పా పూర్వం యా మాలినీ భవత్ ॥97॥

అతని కొడుకు చంపుడు.. అతని నగరమే చంప. పూర్వం దానిని మాలిని అనేవారు.

పూర్ణభద్రప్రసాదేన హర్యఙ్గోఽస్య సుతోఽభవత్ ।
జజ్ఞే విభాణ్డకాచ్చాస్య వరణ శ్శత్రువారణః ॥98॥

అవతారయామాస మహీం మన్త్రైర్వాహనముత్తమమ్ ।

పూర్ణభద్రముని అనుగ్రహంతో అతనికి హర్యంగుడు సుతుడయ్యాడు. అతని సుతుడు విభాండకుడు, అతని కొడుకు శత్రునివారణుడైన వరణుడు. అతడు మంత్రశక్తితో ఒక ఉత్తమ వాహనాన్ని (విమానాన్ని) భూమిపై దిగేటట్లు చేశాడు.

హర్యఙ్గస్య తు దాయాదో జాతో భద్రరథః కిల ॥99॥

అథ భద్రరథస్యాసీద్బృహత్కర్మా జనేశ్వరః ।
బృహద్భాను స్సుత స్తస్య తస్మా జ్జజ్ఞే మహాత్మవాన్ ॥100॥

హర్యంగుని కుమారుడు భద్రరథుడు. అతని సుతుడు బృహత్కర్మ. అతని సుతుడు మహాత్ముడైన బృహద్భానుడు.

బృహద్భానుస్తు రాజేన్ద్రో జనయామాస వై సుతమ్ ।
నామ్నా జయద్రథం నామ తస్మా జ్జాతో బృహద్రథః ॥101॥

రాజేంద్రుడైన బృహద్భానుడు జయద్రథుడనే కుమారుని కన్నాడు. అతని కొడుకు బృహద్రథుడు.

ఆసీద్బృహద్రథాచ్చైవ విశ్వజిజ్జనమేజయః ।
దాయాదస్తస్య చాఙ్గో వై తస్మాత్కర్ణోఽభవన్నృపః ॥102॥

విశ్వజిత్తైన జనమేజయుడు అతని కుమారుడు. అతనికి అంగుడు, అతనికి కర్ణుడు కుమారులు.

కర్ణస్య వృషసేనస్తు పృథుసేన స్తథాఽఽత్మజః ।
ఏతేఽఙ్గస్యాఽఽత్మజాః సర్వే రాజానః కీర్తితా మయా ।
విస్తరేణానుపూర్వ్యాచ్చ పూరోస్తు శృణుత ద్విజాః ॥103॥

కర్ణునికి వృషసేనుడు, అతనికి పృథుసేనుడు ఆత్మజులు. వీరందరూ అంగుని సంతానమే. అందరూ రాజులే. వారిని గూర్చి చెప్పాను. ద్విజులారా! ఇపుడు విస్తరంగాను, క్రమంగానూ పూరుని వంశాన్ని గూర్చి వినండి.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

కథం సూతాత్మజః కర్ణః కథమఙ్గస్య చాత్మజః ।
ఏతదిచ్ఛామహే శ్రోతుమత్యన్తకుశలో హ్యసి ॥104॥

సూతాత్మజుడైన కర్ణుడు అంగుని కుమారుడెలా అయ్యాడు? నీవు నిపుణుడవు- నీనుండి ఇది వినగోరుతున్నాము.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

బృహద్భానుసుతో జజ్ఞే రాజా నామ్నా బృహన్మనాః ।
తస్య పత్నీద్వయం హ్యాసీ చ్ఛైబ్యస్య తనయే హ్యుభే ।
యశోదేవీ చ సత్యా చ తయోర్వంశం చ మే శృణు ॥105॥

బృహద్భానుని కుమారుడు బృహన్మనుడు. అతనికి ఇద్దరు భార్యలు, వారిద్దరు శైబ్యుని పుత్రికలు. వారు యశోదేవి, సత్యాదేవి అనువారు. వారి వంశం చెబుతాను వినండి.

జయద్రథం తు రాజానం యశోదేవీ హ్యజీజనత్ ।
సా బృహన్మనస స్సత్యా విజయం నామ విశ్రుతమ్ ॥106॥
విజయస్య బృహత్పుత్ర స్తస్య పుత్రో బృహద్రథః ।
బృహద్రథస్య పుత్రస్తు సత్యకర్మా మహామనాః ॥107॥

యశోదేవి జయిద్రథుడనే రాజును కన్నది. ఆ బృహన్మనుని రెండవభార్య సత్య విజయుణ్ణి కన్నది. విజయునికి బృహత్పుత్రుడు కలిగాడు, అతని కుమారుడు బృహద్రథుడు అతని సుతుడు మహామనుడైన సత్యకర్మ.

సత్యకర్మణోఽధిరథః సూతశ్చాధిరథ స్స్మృతః ।
యః కర్ణం ప్రతిజగ్రాహ తేన కర్ణస్తు సూతజః ।
తచ్చేదం సర్వమాఖ్యాతం కర్ణం ప్రతి యథోదితమ్ ॥108॥

సత్యకర్మకు అధిరథుడు కల్గాడు. అతణ్ణి సూతు డనేవారు. అతడు కర్ణుని ప్రతిగ్రహించాడు. కాన కర్ణుడు సూతజుడైనాడు. కర్ణుని గూర్చిన వృత్తాంతమంతా చెప్పాను.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తుర్వసుప్రభృతీనాం సంతతికథనం నామ అష్టచత్వారింశోఽధ్యాయః ॥ 48 ॥

శ్రీమత్స్య పురాణంలోని తుర్వసుడు మున్నగువారి సంతతిని చెప్పుట అనే నలభైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనచత్వారింశోఽధ్యాయః - నలబైతొమ్మిదవ అధ్యాయం

పూరువంశః - పూరువంశం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

పూరోః పుత్రో మహాతేజా రాజా స జనమేజయః ।
ప్రాచీత్వత స్సుతస్తస్య యః ప్రాచీమకరోద్దిశమ్ ॥1॥

పూరుని పుత్రుడు మహాతేజస్వి అయిన జనమేజయుడు. అతని సుతుడు ప్రాచీత్వతుడు, అతనివల్ల పాలింపబడి తూర్పుదిక్కు ప్రాచీత్వం పొందింది.

ప్రాచీత్వతస్య తనయో మనస్యుశ్చ తథాఽభవత్ ।
రాజా వాతాయుధో నామ మనస్యోరభవత్సుతః ॥2॥

ప్రాచీత్వతుని తనయుడు మనస్యుడు. మనస్యుని కొడుకు వాతాయుధుడు.

దాయాద స్తస్య చాప్యాసీచ్ఛంకుర్నామ మహీపతిః ।
శంకోర్బహువిధః పుత్ర స్సమ్పాతి స్తస్య చాఽత్మజః ॥3॥

శంకుడనే రాజు మనస్యుని కుమారుడు, శంకుని కుమారుడు బహువిధుడు, అతని సుతుడు సంపాతి.

సమ్పాతేస్తు రహంవర్చా భద్రాశ్వ స్తస్య చాఽత్మజః ।
భద్రాశ్వస్య ఘృతాచ్యాం తు దశాప్సరసి సూనవః ॥4॥

సంపాతిసుతుడు రహంవర్చుడు, అతని కొడుకు భద్రాశ్వుడు. అతనికి 'ఘృతాచి' అన్న అప్సరస ద్వారా పదిమంది సుతులు కలిగారు.

ఋచేపుశ్చ విలేపుశ్చ కక్షేపుశ్చ తథైవ చ ।
ఘృతేపుశ్చ విచేపుశ్చ స్థండిలేపు ర్బలేపు చ (శ్చ) ॥
ధర్మేపు స్సంతతేపుశ్చ పుణ్యేపుశ్చేతి వై దశ ॥5॥

ఋచేపుడు, విలేపుడు, కక్షేపుడు, ఘృతేపుడు, విచేపుడు, స్థండిలేపుడు, బలేపుడు, ధర్మేపుడు, సంతతేపుడు, పుణ్యేపుడు అనేవారు పదిమంది.

ఋచేపోర్జ్వలనా నామ భార్యా వై తక్షకాత్మజా ॥6॥

తస్యాం స జనయామాస అన్తినారం మహీపతిమ్ ।
అన్తినారో మనస్విన్యాం పుత్రాన్సజ్జే పరాఞ్ఛుభాన్ ॥7॥

తక్షకుని కూతురు జ్వలన ఋచేపుని పత్ని. ఆమెయందతడు అన్తినారుడన్న రాజును కన్నాడు. అన్తినారుడు మనస్వినియందు శుభావహులైన సుతులను కన్నాడు.

అంశుం నరపతిం వీరం త్రిహనుం చాపి ధార్మికమ్ ।
గౌరీ కన్యా తృతీయా చ మాన్ధాతుర్జననీ శుభా ॥8॥

అంశునరపతి వీరుడు, త్రిహనుడు ధార్మికుడు. వారిలో మూడవ కన్య గౌరి, ఆమె మాంధాతను కన్నతల్లి.

ఆసీదంశోరథ సతీ యాఽస్మాత్పుత్రానజీజనత్ ।
బ్రహ్మవాదపరీతాంస్తు ఉపదానా తథాఽపి చ ॥9॥

అంశునకు ఉపదానయను భార్యయందు బ్రహ్మవాదులైన పుత్రులు జన్మించారు.

ఉపదానా సుతాన్లేభే చతురస్తు నిజాత్మజాన్ ।
రుష్యన్తమథ దుష్యన్తం ప్రవీరమనఘం తథా ॥10॥

ఉపదాన రుష్యంతుడు, దుష్యంతుడు, ప్రవీరుడు, అనఘుడు అనే నలుగురు సుతులను కన్నది.

చక్రవర్తీ తతో జజ్ఞే దుష్యన్తాత్సమితిఞ్జయః ।
శకున్తలాయాం భరతో యస్య నామ్నా తు భారతాః ॥11॥

దుష్యన్తుని నుండి శకుంతల యందు భరతుడను చక్రవర్తి పుట్టాడు– అతని పేరువల్లనే ప్రజలు భారతులయ్యారు. (దేశం భరత మనబడింది)

దుష్యంతం ప్రతి రాజానం వాగువాచాశరీరిణీ ।
మాతా భస్త్రా పితుః పుత్త్రో యేన జాత స్స ఏవ సః ॥12॥

దుష్యంతుడు శకుంతలను తిరస్కరించగా ఆకాశవాణి దుష్యంతునితో తల్లి తోలు తిత్తి. కుమారుడు తండ్రికి చెందుతాడు. అత డెవనికి పుట్టాడో అతడే అవుతాడు.

భరస్వ పుత్త్రం దుష్యన్త మావమంస్థాః శకున్తలామ్ ।
రేతోధాస్త్రాయతే పుత్త్రః పరేతం యమసాదనాత్ ।
త్వం చాస్య ధాతా గర్భస్య నావమంస్థా శ్శకున్తలామ్ ॥13॥

పుత్రుడైన భరతుని భరించు. శంకుంతల నవమానించకు. పుత్రుడు రేతస్సును నిలిపిన తండ్రిని యమ గృహం నుండి కాపాడుతాడు. ఈ గర్భానికి ధాతవు నీవే, శకుంతలను అవమానించకు అని చెప్పింది.

భరతస్య వినష్టేషు తనయేషు పురా కిల ।
పుత్త్రాణాం మాతృకాత్కోపాత్ సుమహాన్సంక్షయః కృతః ॥14॥

తతో మరుద్భిరానీయ పుత్త్ర స్స తు బృహస్పతేః ।
సఙ్క్రామితో భరద్వాజో మరుద్భిర్భరతస్య తు ॥15॥

భరతుని పుత్రులందరు పూర్వం తల్లి కోపం వల్ల చనిపోయారు. వంశానికి పెద్ద సంక్షయం కలిగింది. మరుత్తులు బృహస్పతి పుత్రుడైన భరద్వాజుణ్ణి తీసుకు వచ్చి భరతుని కిచ్చారు.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

భరతస్య భరద్వాజః పుత్రార్థం మారుతైః కథమ్ ।
సఙ్క్రామితో మహాతేజా స్త న్నో బ్రూహి యథాతథమ్ ॥16॥

మరుత్తులు మహాతేజుడైన భరద్వాజుణ్ణి భరతుని కెలా సంక్రమింపజేశారు? అది జరిగింది జరిగినట్లు మాకు చెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

పత్న్యామాపన్నసత్త్వాయాముచథ్యే సంస్థితే భువి ।
భ్రాతుర్భార్యాం స దృష్ట్వా తు బృహస్పతిరువాచ హ ॥17॥

ఉచథ్యుడు తన భార్య గర్భవతియై యుండగా మరణించాడు. అతని సోదరుడైన బృహస్పతి సోదరుని భార్యను చూచి ఇలా అన్నాడు.

ఉపతిష్ఠ స్వలఙ్కృత్య మైథునాయ చ మే శుభే! ।
ఏవ ముక్తాఽబ్రవీదేనం స్వయమేవ బృహస్పతిమ్ ॥18॥

గర్భః పరిణతశ్చాయం బ్రహ్మ వ్యాహరతే గిరా ।
అమోఘరేతా స్త్వం చాపి ధర్మం చైవం విగర్హితమ్ ॥19॥

లెమ్ము! బాగా అలంకరించుకొని నాతో మైథునానికి సిద్ధం కమ్ము" అని చెప్పాడు. అలా చెప్పిన బృహస్పతితో ఆమె, "నా గర్భం పరిణత మైయున్నది. అది వేదాలను ఉచ్చరిస్తున్నది. నీవు అమోఘరేతస్కుడవు. ఇలా ఈమైథునం ధర్మవిగర్హితం" అని అన్నది.

ఏవముక్తోఽబ్రవీదేనాం స్వయమేవ బృహస్పతిః ।
నోపదేష్టవ్యో వినయ స్త్వయా మే వరవర్ణిని ॥20॥

ఆమె అలా చెప్పేసరికి బృహస్పతి ఆమెతో "వరవర్ణినీ! నీవు నాకు వినయం ఉపదేశించవలదు" అని చెప్పాడు.

కర్షమాణః ప్రసహ్యైనాం మైథునాయోపచక్రమే ।
తతో బృహస్పతిం గర్భో ధర్షమాణమువాచ హ ॥21॥

అలా చెప్పి బలాత్కారంగా ఆమెతో మైథునానికి ఉపక్రమించాడు. ఘర్షణ చేసే బృహస్పతితో గర్భం ఇలా చెప్పింది-

సన్నివిష్టో హ్యహం పూర్వమిహ నామ బృహస్పతే! ।
అమోఘరేతాశ్చ భవాన్నావకాశ ఇహ ద్వయోః ॥22॥

బృహస్పతీ! నేను ముందే ఇక్కడ ప్రవేశించి వున్నాను. నీవు అమోఘరేతస్కుడవు. ఇక్కడ ఇద్దరికి చోటు లేదు.

ఏవ ముక్త స్స గర్భేణ కుపితః ప్రత్యువాచ హ ।
యస్మాత్త్వమీదృశే కాలే సర్వభూతేప్సితే సతి ।
ప్రతిషేధసి తస్మాత్త్వం తమో దీర్ఘం ప్రవేక్ష్యసి ॥23॥

అని గర్భం చెప్పగా కోపించిన బృహస్పతి " సర్వప్రాణులకు ఇష్టమైన ఈ సమయంలో నీవు నన్ను నిషేధిస్తున్నావు. కాన చూపు లేనివాడ వవుతావు.

తతః కామం సన్నివర్త్య తస్యాఽఽనన్దం బృహస్పతిః ।
తద్రేతస్త్వపతద్భూమౌ నివృత్తం శిశుకోఽభవత్ ॥24॥

అపుడు బృహస్పతి తన కామమును, ఆనందమును మరలించుకొన్నాడు. అతని రేతస్సు భూమిపై పడింది. వెంటనే శిశువయింది.

సద్యోజాతం కుమారం తు దృష్ట్వా తం మమతాఽబ్రవీత్ ।
గమిష్యామి గృహం స్వం వై భరస్వైనం బృహస్పతే! ॥25॥

సద్యోజాతుడైన, ఆకుమారుని చూచి మమత "నేను నా యింటికి పోతాను. బృహస్పతీ! నీవే ఈ శిశువును భరించు" అని చెప్పింది.

ఏవముక్త్వా గతా సా తు గతాయాం సోఽపి తం త్యజత్ ।
మాతాపితృభ్యాం త్యక్తం తు దృష్ట్వా తం మరుత శ్శిశుమ్ ॥
జగృహుస్తం భరద్వాజం మరుతః కృపయా స్థితాః ॥26॥

అని చెప్పి ఆమె వెళ్ళిపోయింది. బృహస్పతి గూడా ఆ శిశువును వదిలేశాడు. మాతా పితరులు వదిలేసిన ఆ శిశువును చూచి మరుత్తులు కృపతో గ్రహించారు.

తస్మిన్కాలే తు భరతో బహుభిః క్రతుభిర్విభుః ।
పుత్రనైమిత్తికై ర్యజ్ఞైరయజత్పుత్ర లిప్సయా ॥27॥

ఆ కాలంలోనే భరతుడు అనేక క్రతువులు, యజ్ఞాలు పుత్రాపేక్షతో నిర్వహించాడు.

యత స్స యజమానస్తు పుత్రం నాసాదయత్ప్రభుః ।
తతః క్రతుం మరుత్సోమం పుత్రార్థే సముపాహరత్ ॥28॥

అలా యజ్ఞం చేసినప్పటికీ పుత్ర ప్రాప్తి కలగలేదు. అపుడు మరుత్సోమం, అనే ఒక యజ్ఞం చేశాడు.

తేన తే మరుత స్తస్య మరుత్సోమేన తుష్టువుః ।
ఉపనిన్యుర్భరద్వాజం పుత్రార్థం భరతాయ వై ॥29॥

అపుడు మరుత్తులు ఆ యజ్ఞంచే సంతుష్టి పొంది భరద్వాజుడనే ఆ శిశువును పుత్రుడుగా భరతునికిచ్చారు.

దాయాదోఽఙ్గిరస స్సూనో రౌరసస్తు బృహస్పతేః ।
సఙ్క్రామితో భరద్వాజో మరుద్భిర్భరతం ప్రతి ॥30॥

అలా అంగిరసుని కొడుకు, బృహస్పతికౌరసపుత్రుడు అయిన భరద్వాజుడు మరుత్తుల ద్వారా భరతునిచేరాడు.

భరతస్తు భరద్వాజం పుత్త్రం ప్రాప్య విభుర్బ్రవీత్ ।
ఆదాయ త్వాం హితార్థాయ కృతార్థోఽహం త్వయా విభో ॥31॥

భరతుడు భరద్వాజుని పుత్రునిగా బడసి – ఆతనితో "విభూ! ఆత్మహితం కొరకు నిన్ను బడసి నేను కృతార్థుడనయ్యాను."

పూర్వం తు వితథే తస్మిన్కృతే వై పుత్త్రజన్మని ।
తతస్సువితథో నామ భరద్వాజో నృపోఽభవత్ ॥32॥

పూర్వం భరతుడు పుత్రార్థం కావించిన కర్మలన్నీ వితథం (వ్యర్థం) అయ్యాయి. కాన భరద్వాజుడు అవితథుడు, అని ప్రసిద్ధి పొందాడు.

తస్మాదపి భరద్వాజాద్బ్రాహ్మణాః క్షత్రియా భువి ।
ద్వ్యాముష్యాయణకౌలీనా స్స్మృతాస్తే ద్వివిధా హి తే ॥33॥

ఆ భరద్వాజునినుండి బ్రాహ్మణులు, క్షత్రియులు లోకంలో 'ద్వ్యాముష్యాయణులు'గా, అనగా రెండు జాతుల ధర్మములను అనుసరించేవారుగా ప్రసిద్ధులైనారు.

తతో జాతే హ్యవితథే భరతశ్చ వనం యయౌ ।
భరద్వాజాభిదం పుత్రమభిషిచ్యచతం నృపః ॥34॥

అలా అవితథుడు కొడుకు కాగా భరతుడు భరద్వాజుడనే సుతుని అభిషేకించి తాను వనానికి పోయాడు.

దాయాదోఽవితథస్యాభూద్భువమన్యుర్మహాయశాః ।
మహాభూతోపమాః పుత్త్రాశ్చత్వారో భువమన్యవః ॥35॥

అవితథుని కుమారుడు కీర్తిమంతుడైన భువమన్యుడు. అతనికి మహాభూత సదృశులు నల్గురు భువమన్యులు కుమారులయ్యారు.

బృహత్క్షత్రో మహావీర్యో నరో గర్గశ్చ వీర్యవాన్ ।
నరస్య సఙ్కృతిః పుత్త్ర స్తస్య పుత్త్రో మహాయశాః ॥36॥

గురుశ్చ రన్తిదేవశ్చ సంకృతేస్తావుభౌ స్మృతౌ ।
గర్గస్య చైవ దాయాద శ్శిబిర్విద్వానజాయత ॥37॥

వారు బృహత్ క్షత్రుడు, మహావీర్యుడు, నరుడు, పరాక్రమ శాలియైన గర్గుడు. నరుని పుత్రుడు సంకృతి. అతని పుత్రులు గురువు, రంతిదేవుడు అనువారు. గర్గుని కుమారుడు విద్వాంసుడైన శిబి.

స్మృతా శ్శైబ్యాస్తతో గార్గ్యాః క్షత్రోపేతా ద్విజాతయః ।
ఆహార్యతనయశ్చైవ ధీమానాసీత్తరక్షకః ॥38॥

అందువల్ల క్షాత్రసహాయులైన ద్విజాతులు శైబ్యులయ్యారు. ఆహార్యుని తనయుడు ధీమంతుడైన తరక్షకుడు.

తస్య భార్యా విశాలా తు సుషువే పుత్త్రకత్రయమ్ ।
త్ర్యూషణం పుష్కరం చైవ కవిం చైవ మహాయశాః ॥39॥

తరక్షకుని భార్య విశాల. ముగ్గురు పుత్రులను కన్నది. త్ర్యూషణుడు, పుష్కరుడు, కవి అనువారు వారు.

తరక్షుక సుతా హ్యేతే సర్వే బ్రాహ్మణతాం గతాః ।
కావ్యానాం తు వరా హ్యేతే త్రయః ప్రోక్తా మహర్షయః ॥40॥

తరక్షుకుని సుతులైన వీరందరూ బ్రాహ్మణత్వం పొందారు. కావ్యులలో ఈ ముగ్గురు మహర్షులు శ్రేష్ఠులుగా పేర్కొనబడినారు.

గర్గాస్సఙ్కృతయః కావ్యాః క్షత్త్రోపేతా ద్విజాతయః ।
సంవృతాఙ్గిరసః పుత్రో బృహత్క్షత్త్రశ్చ వక్ష్యతే ॥41॥

గర్గులు, సంకృతులు, కావ్యులు క్షాత్రులైన ద్విజాతులు. వీరిలో సంవృతాంగిరసుని కుమారుడు బృహత్క్షత్రుడు.

బృహత్క్షత్త్రస్య దాయాదో హస్తినామా బభూవ హ ।
తేనేదం నిర్మితం పూర్వం పురం తు గజసాహ్వయమ్ ॥42॥

బృహత్ క్షత్రుని దాయాది హస్తి అనేవాడు వుండేవాడు. అతడే 'హస్తిన' అను పేరుగల నగరాన్ని పూర్వం నిర్మించాడు.

హస్తినశ్చైవ దాయాదాస్త్రయః పరమకీర్తయః ।
అజామీఢో ద్విమీఢశ్చ పురుమీఢ స్తథైవ చ ॥43॥

హస్తి కుమారులు గొప్ప కీర్తిమంతులు– అజామీఢుడు, ద్విమీఢుడు, పురుమీఢుడు– అనువారు ముగ్గురు.

అజామీఢస్య పత్న్యస్తు తిస్రః కురుకులోద్వహాః ।
నీలినీ భూమినీ చైవ కేశినీ చైవ విశ్రుతాః ॥44॥

అజమీఢుని భార్యలు కురుకులోద్వహలైన ముగ్గురు నీలిని, భూమిని, కేశిని – అను ప్రసిద్ధిగలవారు.

స తాసు జనయామాస పుత్త్రాన్వై దేవవర్చసః ।
తపసోఽన్తే సుమహతో జాతా వృద్ధస్య ధార్మికాః ॥45॥

భరద్వాజప్రసాదేన విస్తరం తేషు మే శృణు ।
అజామీఢస్య కేశిన్యాం కణ్వ స్సమభవత్కిల ।।46।।

అతడు వారియందు దేవ తేజస్కులైన పుత్రులను కన్నాడు. వృద్ధుడైన తండ్రి మహాతపోబలంతో వారు జన్మించారు. భరద్వాజుని అనుగ్రహం వల్ల వారు కలిగారు. వారికి సంబంధించిన విస్తృతచరిత్ర విను. అజామీఢునికి కేశినియందు కణ్వుడు పుట్టాడు.

మేధాతిథి స్సుత స్తస్య తస్మాత్కాణ్వాయనా ద్విజాః ।
అజామీఢస్య భూమిన్యాం బృహద్వానభవన్నృపః ।।47।।

బృహద్బృహద్వతఃపుత్రోబృహతశ్చ బృహన్మనాః ।
బృహన్మన స్సుతశ్చాపి బృహద్ధనురితి స్మృతః ।।48।।

బృహద్ధనోర్ బృహదిషుః పుత్ర స్తస్య జయద్రథః ।
అశ్వజిత్తనయస్తస్య సేనజిత్తస్య చాత్మజః ।।49।।

కణ్వుని సుతుడు మేధాతిథి. అతనికి కాణ్వాయనులైన ద్విజులు కలిగారు. అజామీఢునికి భూమినియందు బృహద్వంతుడు అను రాజు జనించాడు. బృహద్ధనునికి బృహంతుడు, అతనికి బృహన్మనుడు, అతనికి బృహద్ధనుడు కుమారులయ్యారు. బృహద్ధను సుతుడు బృహదిషుడు. అతని కుమారుడు జయద్రథుడు. అతనికి అశ్వజిత్తూ, అతనికి సేనజిత్తూ కలిగారు.

అథ సేనజితః పుత్రా శ్చత్వారో లోకవిశ్రుతాః ।
రుచిరాశ్వశ్చ కావ్యశ్చ రాజా దృఢరథ స్తథా ।।50।।

వత్సశ్చావన్తికో రాజా యస్యైతే పరివత్సకాః ।
రుచిరాశ్వస్య దాయాదః పృథుసేనో మహాయశాః ।।51।।

సేనజితుని పుత్రులు లోకవిఖ్యాతులు నల్వురు. రుచిరాశ్వుడు, కావ్యుడు, దృఢరథుడు, వత్సావన్తికుడు. అతని సంతతివారు పరివత్సకులు. రుచిరాశ్వుని కుమారుడు మహాకీర్తిగల పృథుసేనుడు.

పృథుసేనస్య పౌరస్తు పౌరాన్నీపోఽథ జజ్ఞివాన్ ।
నీపస్యైకశతం త్వాసీత్పుత్రాణామమితౌజసామ్ ।।52।।

పృథసేనునికి పౌరుడు, అతనికి నీపుడు పుట్టారు. నీపునికి నూరుమంది అమిత తేజోవంతులు సుతులైనారు.

నీపా ఇతి సమాఖ్యాతా రాజాన స్సర్వ ఏవ తే ।
తేషాం వంశకర శ్శ్రీమాన్నీపానాం కీర్తివర్ధనః ।।53।।

వారంతా నీపులుగా ప్రఖ్యాతులయ్యారు. వారి వంశకరుడు శ్రీమంతుడు, నీపుల కీర్తివర్ధనుడు.

కావ్యాచ్చ సమరో నామ సదేష్టసమరోఽభవత్ ।
సమరస్య పారసంపారౌ సదశ్వ ఇతి తే త్రయః ॥54॥

కావ్యునికి సదా యుద్ధమంటే ఇష్టపడే సమరుడు పుట్టాడు. ఆ సమరునికి పారుడు, సంపారుడు, సదశ్వుడు అని ముగ్గురు సుతులు.

పుత్త్రా స్సర్వగుణోపేతాః జాతా వై విశ్రుతా భువి ।
పారపుత్రః పృథుర్జాతః పృథోస్తు సుకృతోఽభవత్ ॥55॥

వారంతా సర్వగుణోపేతులు, లోకవిఖ్యాతులు- పారుని సుతుడు పృథువు, అతనికి సుకృతుడు కల్గాడు.

జజ్ఞే సర్వగుణోపేతో విభ్రాజస్తస్య చాత్మజః ।
విభ్రాజస్య తు దాయాదస్త్వణుహో నామ వీర్యవాన్ ॥56॥

అతనికి సర్వగుణోపేతుడైన విభ్రాజుడు కలిగాడు. వీర్యవంతుడైన అణుహుడు విభ్రాజుని సుతుడు.

బభూవ శుకజామాతా కృత్వా భర్తా మహాయశాః ।
అణుహస్య తు దాయాదో బ్రహ్మదత్తో మహీపతిః ॥57॥

అతడు శుకునికి జామాత, కృత్వకు భర్త అయ్యాడు. అణుహుని సుతుడు బ్రహ్మదత్తుడనే రాజు.

యుగదత్త స్సుతస్తస్య విష్వక్సేనో మహాయశాః ।
విభ్రాజః పునరాజాతో సుకృతేనేహ కర్మణా ॥58॥

అతని సుతుడు యుగదత్తుడు. అతని కొడుకు గొప్పకీర్తిగల విష్వక్సేనుడు. సుకృతములవల్ల విభ్రాజుడే విష్వక్సేనుడుగా పుట్టాడన్న ప్రశస్తి ఇతనికి కలిగింది.

విష్వక్సేనస్య పుత్త్రస్తు ఉదక్సేనో బభూవ హ ।
భల్లాటస్తస్య పుత్త్రస్తు తస్యాఽఽసీజ్జనమేజయః ।
ఉగ్రాయుధేన తస్యార్థే సర్వే నీపాః ప్రణాశితాః ॥59॥

విష్వక్సేనుని కుమారుడు ఉదక్సేనుడు, అతని కొడుకు భల్లాటుడు, అతని సుతుడు జనమేజయుడు. ఇతనికొరకై నీపవంశీయులైన వారందరినీ ఉగ్రాయుధుడు నశింపజేశాడు.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

ఉగ్రాయుధః కస్య సుతః కస్య వంశే స కథ్యతే ।
కిమర్థం తేన తే నీపా స్సర్వే చైవ ప్రణాశితాః ॥60॥

ఉగ్రాయుధు డెవని సుతుడు? అతని వంశమేది? అతడు ఎందుకు నీపుల నందరినీ సంహరించాడు?

సూత ఉవాచ :- సూతుడు చెప్పారు

ఉగ్రాయుధ స్సూర్యవంశ్య స్తప స్తేపే వరాశ్రమే ।
స్థాణుభూతోఽబ్దసాహస్రం తం భేజే జనమేజయః ॥61॥

ఉగ్రాయుధుడు సూర్యవంశజుడు. అతడు ఒక ఆశ్రమంలో స్థాణువులాగా ఉంటూ వెయ్యేండ్లు తపస్సు చేశాడు. జనమేజయుడతణ్ణి ఆశ్రయించాడు.

తస్య రాజ్యం ప్రతిశ్రుత్య నీపానాజఘ్నివాన్ప్రభుః ।
ఉవాచ సాన్త్వం వివిధం జఘ్నుస్తే వై హ్యుభావపి ॥62॥

హన్యమానా గతా నోచేద్యస్మాద్ధేతో ర్న మే వచః ।
శరణాగతరక్షార్థం తస్మాదేవం శపామి వః ॥63॥

అతనికి రాజ్యం ఇప్పిస్తానని చెప్పాడు. ఉగ్రాయుధుడు నీపులపై దాడికి వెడలాడు. ఉగ్రాయుధుడు ముందు శాంతవచనాలు చెప్పాడు, కాని వారు? ఇరువురిమీదికి దండెత్తారు. అలా వచ్చిన వారితో ఉగ్రాయుధుడు మీరు నా మాట వినలేదు కాన చంపదగినవారు ఐతిరి. శరణాగతుడగు జనమేజయుని రక్షణకై నేను మిమ్ము శపిస్తున్నాను.

యది మేఽ స్తి తపస్తప్తం సర్వాన్నయతు వో యమః ।
తతస్తాన్ కృష్యమాణాంస్తు యమేన పురత స్స తు ॥64॥

కృపయా పరయాఽఽవిష్టో జనమేజయమూచివాన్ ।
అజానత ఇమాన్వీరాంస్త్వం మే రక్షితుమర్హసి ॥65॥

నేను గొప్ప తపస్సు చేసినవాడ నైతే, వచ్చి మిమ్మల్నందరినీ యముడు తీసుకుపోవును గాక! అంతట యముడు వచ్చి తన ఎదుటనే వారిని లాక్కుపోతువుండగా చూచి దయామయుడై - జనమేజయునితో జనమేజయా! వీరేమీ తెలియనివారు. నీవు ఈ వీరులను రక్షింపదగుదువు అని చెప్పాడు.

జనమేజయ ఉవాచ :- జనమేజయుడు చెప్పాడు.

అరే పాపా దురాచారా భవితారోఽస్య కిఙ్కరాః ।
తథేత్యుక్త స్తతో రాజా యమేన యయుధే చిరమ్ ॥66॥

అంతట జనమేజయుడు యమకింకరులతో "అరే పాపులారా! దురాచారులారా! ఈ ఉగ్రాయుధునికి కింకరులు కండి. వీరిని వదలండి! లేకుంటే శిక్షపడుతుంది?" వారా మాట వినలేదు. ఇక జనమేజయుడు చిరకాలం వారితో యుద్ధం చేశాడు.

వ్యాధిభిర్నారకైః ఘోరైర్యమేన సహ తాన్బలాత్ ।
విజిత్య మునయే ప్రాదాత్తదద్భుతమివాభవత్ ॥67॥

ఘోరవ్యాధులతో, నారకులతో, యమునితో గూడా పోరాడి వారిని జయించి జనమేజయుడు వారిని ఉగ్రాయుధుని కప్పగించాడు. అది అద్భుతచర్య.

యమస్తుష్ట స్తతస్తస్మై ముక్తిజ్ఞానం దదౌ పరమ్ ।
సర్వే యథోచితం కృత్వా జగ్ముస్తే కృష్ణమవ్యయమ్ ॥68॥

ఆపై యముడు సంతసించి అతనికి ముక్తి జ్ఞానం ప్రసాదించాడు. అందరూ తగిన రీతిని ప్రవర్తించి అవ్యయుడైన కృష్ణుణ్ణి చేరుకొన్నారు.

ఏషాం తు చరితం గృహ్య హన్యతే నాపమృత్యుభిః ।
ఇహలోకే పరే చైవ సుఖమక్షయ్యమశ్నుతే ॥69॥

ఈ చరిత్ర గ్రహించినవారు అపమృత్యువుపాలు కారు. ఇహ పరలోకాలలో అక్షయసుఖం పొందుతారు.

అజామీఢస్య ధూమిన్యాం విద్వాఞ్జజ్ఞే యవీనరః ।
ధృతిమాంస్తస్య పుత్రస్తు తస్య సత్యధృతి స్స్మృతః ।
అథ సత్యధృతేః పుత్రో దృఢనేమిః ప్రతాపవాన్ ॥70॥

అజామీఢునికి ధూమినియందు యవీనరుడనే విజ్ఞుడు జనించాడు! అతనికి ధృతిమంతుడు, అతనికి సత్యధృతి సుతులయ్యారు. సత్యధృతి సుతుడు ప్రతాపశాలి అయిన దృఢనేమి.

దృఢనేమిసుతశ్చాపి సుధర్మా నామ పార్థివః ।
ఆసీత్సుధర్మతనయ స్సార్వభౌమః ప్రతాపవాన్ ॥71॥

సార్వభౌమేతి విఖ్యాతః పృథివ్యామేకరాడ్బభౌ ।
తస్యాన్వవాయే మహతి మహాపౌరవనన్దనః ॥72॥

అతనికొడుకు సుధర్ముడనురాజు. సుధర్ముని తనయుడు ప్రతాపశాలియైన సార్వభౌముడు. అతడు సార్వభౌముడన్న ఖ్యాతి కలిగి పృథ్వీతలంలో ఏకైకనరపతిగా భాసించాడు. అతని గొప్ప వంశంలో మహాపౌరవుడు నందను డయ్యాడు.

మహాపౌరవపుత్రస్తు రాజా రుక్మరథ స్స్మృతః ।
అథ రుక్మరథస్యాఽఽసీ త్సుపార్శ్వో నామ పార్థివః ॥73॥

సుపార్శ్వతనయశ్చాపి సుమతిర్నామ ధార్మికః ।
సుమతేరపి ధర్మాత్మా రాజా సన్నతిమానపి ॥74॥

ఆ మహాపౌరవుని సుతుడు రుక్మరథుడనే రాజు. అతనికి సుపార్శ్వుడు, సుపార్శ్వునికి ధార్మికుడైన సుమతి అనే కొడుకు పుట్టాడు. ధర్మాత్ముడైన సన్నతిమంతుడు సుమతి తనయుడైనాడు.

తస్యాఽఽసీత్సన్నతిమతః కృతో నామ సుతో మహాన్ ।
హిరణ్యానాభిన శ్శిష్యః కౌసల్యస్య మహాత్మనః ॥75॥

ఆ సన్నతిమంతుని కొడుకు కృతుడు. కోసలదేశీయుడైన హిరణ్యానాభికి శిష్యుడు.

చతుర్వింశతిధా యేన ప్రోక్తా వై సామసంహితాః ।
సుతాస్తే ప్రాచ్యసామానః కార్తిర్నామేహ సామగః ॥76॥

ఆ రాజు సామసంహితలను 24 శాఖలుగా విభజించాడు. అతని పుత్రులు ప్రాచ్యసామలుగా ప్రఖ్యాతులు. వారిలో కార్తియనువాడు ప్రసిద్ధుడు.

కార్తేరుగ్రాయుధస్యాఽసౌ మహాపౌరవవర్ధనః ।
బభూవ యేన విక్రమ్య పృథుకస్య పితా హతః ॥77॥

నీలో నామ మహారాజా పాఞ్చాలాధిపతిర్వశీ ।
ఉగ్రాయుధస్య దాయాదః క్షేమో నామ మహాయశాః ॥78॥

మహా పౌరవ వర్ధనుడైన కార్తి ఉగ్రాయుధుని పుత్రుడు. అతడు పృథుకుని తండ్రి అయిన నీలుణ్ణి చంపాడు– ఆ నీలుడు పాంచాలాధిపతి. క్షేముడు ఉగ్రాయుధుని సుతుడు. పెద్ద కీర్తి గలవాడు.

క్షేమాత్సునీథ స్సంజజ్ఞే సునీథస్య నృపఞ్జయః ।
నృపఞ్జయాచ్చ విరథ ఇత్యేతే పౌరవా స్స్మృతాః ॥79॥

క్షేమునికి సునీథుడు, అతనికి నృపంజయుడు, అతనికి విరథుడు– కలిగారు. వీరంతా పౌరవులు–

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే పూరువంశో నామ ఏకోనచత్వారింశోఽధ్యాయః ॥ 49 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని పూరువంశమను నలబైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

పంచాశోऽధ్యాయః - యాభైయవ అధ్యాయం

అజామీఢాదీనాం భవిష్యన్నరపతీనాం చ వంశవర్ణనమ్ - అజామీఢాదులగు భవిష్యద్రాజుల వంశవర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అజామీఢస్య నీలిన్యాం నీలస్సమభవన్నృపః ।
నీలస్య తపసోగ్రేణ సుశాన్తిరుదపద్యత ॥1॥

అజామీఢునికి నీలినియందు నీలుడనే రాజు ఉద్భవించాడు. అతని ఉగ్రతపఃఫలంగా సుశాంతి ఉదయించాడు.

పురజిచ్చ సుశాన్తేస్తు పృథుస్తు పురజిత్సుతః ।
భద్రాశ్వః పృథుదాయాదో భద్రాశ్వతనయాన్శృణు ॥2॥

సుశాన్తికి పురజిత్తు పుట్టాడు. అతని కొడుకు పృథువు. పృథుని కుమారుడు భద్రాశ్వుడు ఇక భద్రాశ్వుని తనయులను గూర్చి విను.

ముద్గలశ్చ జయశ్చైవ వారాహశ్చ పృథుస్తథా ।
యవీయానతివిక్రాన్తః కపిలశ్చైవ పఞ్చమః ॥3॥

ముద్గలుడు, జయుడు, వారాహుడు, పృథువు, పరాక్రమవంతుడైన ఐదవవాడు కపిలుడు- వీరాతని సుతులు.

పంచానాం చైవ పంచాలానేతాన్జనపదాన్విదుః ।
పంచాలరక్షిణో హ్యేతే దేశానామితి న శ్రుతమ్ ॥4॥

ఈ ఐదుగురు పాలించిన దేశాలకు పాంచాల దేశాలని పేరు. ఈ దేశాలను వారు రక్షించారని విన్నాము.

ముద్గలస్యాపి మౌద్గల్యాః క్షత్త్రోపేతా ద్విజాతయః ।
ఏతే హ్యఙ్గిరసః పక్షం సంశ్రితాః కాణ్వముద్గలాః ॥5॥

ముద్గలునికి క్షాత్రముతో గూడిన ద్విజాతులు పుత్రులై మౌద్గల్యులయ్యారు. కణ్వముద్గల గోత్రజులైన వీరు అంగిరసుల పక్షములో చేరిపోయారు.

ముద్గలస్య సుతో జజ్ఞే బ్రహ్మిష్ఠ స్సుమహాయశాః ।
ఇన్ద్రసేనసుతస్తస్య విన్ధ్యాశ్వ స్తస్య చాత్మజః ॥6॥

ముద్గలునికి బ్రహ్మతత్త్వవేత్తలలో ఉత్తముడు, కీర్తిమంతుడు, ఇంద్రసేనుడు - అతనికి వింధ్యాశ్వుడు కుమారులైరి.

విన్ధ్యాశ్వాన్మిథునం జజ్ఞే మేనకాయామితి శ్రుతిః ।
దివోదాసశ్చ రాజర్షిరహల్యా చ యశస్వినీ ॥7॥

వింధ్యాశ్వునికి మేనకయందు రాజర్షియగు దివోదాసుడు, యశస్విని అగు అహల్య- అనే కవలలు జన్మించారు.

శరద్వతస్తు దాయాదమహల్యా సంప్రసూయత ।
శతానన్దమృషిశ్రేష్ఠం తస్యాపి సుమహాతపాః ॥8॥

సుతః సత్యధృతి ర్నామ ధనుర్వేదస్య పారగః ।
ఆసీత్సత్యధృతే శ్శుక్రమమోఘం ధార్మికస్య తు ॥9॥

అహల్య శరద్వతునికి శతానందుడనే ఋషి శ్రేష్ఠుని కన్నది. అతనికి మహాతపస్వి, సత్యధృతి జన్మించాడు. అతడు ధనుర్వేదపారంగతుడు. ధార్మికుడైన సత్యదృతి వీర్య మమోఘమైనది.

స్కన్నం రేత స్సత్యధృతే ర్దృష్ట్వా చాప్సరసం జలే ।
మిథునం తత్ర సంభూతం తస్మిన్సరసి సంభృతమ్ ॥10॥

అప్సరసను చూస్తూ సత్యధృతి నీటిలో వదలిన రేతస్సు ఆ సరస్సులోనే సంభృతం కాగా అక్కడ మిథునం జనించింది.

తత స్సరసి తస్మింస్తు క్రమమాణం మహీపతిః ।
దృష్ట్వా జగ్రాహ కృపయా శన్తనుర్మృగయాం గతః ॥11॥

అంతట వేటకు వెళ్ళిన శంతనుమహారాజు సరస్సులో ప్రాకుతున్న శిశువులను చాచి కృపతో వారిని గ్రహించాడు.

ఏతే శరద్వతః పుత్రా ఆఖ్యాతా గౌతమా వరాః ।
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి దివోదాసస్య వై ప్రజాః. 12

వీరు శరద్వంతుని పుత్రులు- గౌతమ గోత్రజులను గూర్చి చెప్పాను. ఇకపై దివోదాసుని సంతతిని గూర్చి వివరిస్తాను.

దివోదాసస్య దాయాదో ధర్మో మిత్రాయతిర్నృపః ।
మైత్రాయణావరస్సోఽథ మైత్రేయస్తు తతః స్మృతః ॥13॥

దివోదాసుని కుమారుడు ధర్మిష్ఠుడైన రాజు మిత్రాయతి. మైత్రాయణుడు, మైత్రేయుడు తరువాతివారు.

ఏతే వంశధృతో దక్షాః క్షత్రభేదాస్తు భార్గవాః ।
రాజా చైద్యవరో నామ మైత్రేయస్య సుత స్స్మృతః ॥14॥

ఈ వంశస్థులంతా అతి సమర్థులు. క్షత్ర సంబంధంచేత భార్గవులైనారు. మైత్రేయుని సుతుడు చైద్యవరుడు.

అథ చైద్యవరాద్విద్వాన్ సుదాసస్తస్య చాత్మజః ।
అజమీఢః పునర్జాతః క్షీణే వంశే తు సోమకః ॥15॥

చైద్య వరుని కుమారుడు సుదానుడు. వంశమంతరించిన పిదప సుదాసుని కుమారుడుగా అజమీఢుడు మళ్ళీ జనించాడు. అతడే సోమకుడు.

సోమకస్య సుతో జన్తు ర్హతే తస్మిన్ఛతం బభౌ ।
పుత్రాణామజమీఢస్య సోమకస్య మహాత్మనః ॥16॥

సోమకుని కుమారుడు జంతువు. అతని మరణానంతరం మరల మహాత్ముడగు సోమకునికి కుమారులు నూరుగురు కలిగారు.

మహిషీ త్వాజమీఢస్య ధూమినీ పుత్రగర్ధినీ ।
పుత్రాభావే తపస్తేపే శతం వర్షాణి దుశ్చరమ్ ॥17॥

ఆజమీఢుని రాణి ధూమిని పుత్రాపేక్ష కలదై జన్తువు మరణించిన పిదప, నూరుసంవత్సరాలు తీవ్ర తపస్సు చేసింది.

హుత్వాఽగ్నిం విధివత్సమ్యక్పవిత్రీకృతభోజనా ।
అగ్నిహోత్రక్రమేణైవ సా సుష్వాప మహావ్రతా ॥18॥

ధూమిని హోమం చేసి నిత్యం హోమశేషం భుజించేది. ఒకసారి ఆమహావ్రత హోమం చేస్తూనే నిద్రపోయింది.

తస్యాం వై ధూమవర్ణాయామజమీఢః సమీయివాన్ ।
క్షత్రం సా జనయామాస ధూమవర్ణం శతాగ్రజమ్ ॥19॥

ఆమె అవయవాలు హోమధూమం సోకి ధూమమయమై పోయాయి. అప్పుడు ఆజమీఢుడగు సోమకుడు వచ్చి ఆమెతో సంగమించాడు. అప్పుడు ధూమ్రవర్ణుడైన కుమారుడు నూరు మందిలో అగ్రజుడై క్షత్రఋషి జన్మించాడు.

ఋషిస్సంవరణో జజ్ఞే కురు స్సంవరణాత్తతః ।
యః ప్రయాగమతిక్రమ్య కురుక్షేత్రమకల్పయత్ ॥20॥

అట్లే సంవరణుడు, అతనికి కురువు పుట్టారు. అతడు ప్రయాగనతిక్రమించి కురుక్షేత్రాన్ని స్థాపించాడు.

కృష్యతస్తు మహారాజో వర్షాణి సుబహూన్యథ ।
కృష్యమాణ స్తత శ్శక్రః భయాత్తస్మై వరం దదౌ ॥21॥

ఆ మహారాజు అనేక సంవత్సరాలు క్షేత్రాన్ని (స్వహస్తాలతో) దున్నగా, కృష్యమాణుడైన (దున్నబడుతున్న) ఇంద్రుడు భయపడి అతనికి వరమిచ్చాడు.

పుణ్యం చ రమణీయం చ కురుక్షేత్రం చ తత్స్మృతమ్ ।
తస్యాన్వవాయ స్సుమహాన్యస్య నామ్నా తు కౌరవాః ॥22॥

ఆ వరంవల్ల అది పావనము, రమణీయము అయిన కురుక్షేత్రమయింది. అతని వంశం చాలా విస్తారమయింది. ఆ వంశంవారు అతని పేరుతోనే కౌరవులయ్యారు.

కురోస్తు దయితాః పుత్రా స్సుధన్వా జహ్నురేవ చ ।
పరీక్షిచ్ఛ మహాతేజాః ప్రజనశ్చారిమర్దనః ॥23॥

కురునియొక్క ప్రియమైన పుత్రులు సుధన్వుడు, జహ్నుడు, మహాతేజస్వి పరీక్షిత్తు, అరిమర్దనుడైన ప్రజనుడు.

సుధన్వనస్తు దాయాదః పుత్రో మతిమతాం వరః ।
చ్యవనస్తస్య పుత్రస్తు రాజా ధర్మార్థతత్త్వవిత్ ॥24॥

త్యాగశీలః క్రిమిర్నామ ఈష్టే యజ్ఞాన్మహాతపాః ।
క్రిమేః పుత్రో మహావీర్యః ఖ్యాతస్త్విన్ద్రసమో విభుః ॥25॥

బుద్ధిమంతులలో శ్రేష్ఠుడైన చ్యవనుడు సుధన్వుని సుతుడు. అతని సుతుడు ధర్మార్థ తత్త్వం తెలిసిన రాజు క్రిమి అనువాడు.

అతడు త్యాగశీలుడు, మహాతపస్వి, యజ్ఞకర్త, క్రిమి పుత్రుడు మహావీర్యుడు, ఇంద్రసముడైన ప్రభువు.

చైద్యోపరిచరో వీరో వసుర్నామాన్తరిక్షగః ।
చైద్యోపరిచరాజ్జజ్ఞే గిరికా సప్త వై సుతాన్ ॥26॥

మహారథో మగధరాడ్విశ్రుతో యో బృహద్రథః ।
ప్రత్యశ్రవః కుశశ్చైవ చతుర్థో హరివాహనః ॥27॥

పఞ్చమశ్చ యజుశ్చైవ మత్స్యః కాలస్తు సప్తమః ।
బృహద్రథస్య దాయాదః కుశాగ్రో నామ విశ్రుతః ॥28॥

అంతరిక్షంలో పయనించేవాడు కావటం వల్ల చైద్యోపరిచరుడు అన్న పేరు గల వసువయ్యాడు. ఈ వసువు ద్వారా గిరిక ఏడుగురు కుమారులను కన్నది. మగధదేశాధిపతీ, మహావీరుడూ అయిన బృహద్రథుడు వారిలో పెద్దవాడు. తరువాత ప్రత్యశ్రవుడు, కుశుడు, నాల్గవవాడైన హరివాహనుడు, ఐదవవాడు యజువు, తరువాత మత్స్యుడు, ఏడవవాడు కాళుడు. బృహద్రథుని కుమారుడు కుశాగ్రుడని విఖ్యాతుడు.

కుశాగ్రస్యాఽఽత్మజశ్చైవ వృషభో నామ వీర్యవాన్ ।
వృషభస్య తు దాయాదః పుణ్యవాన్నామ పార్థివః ॥29॥

అతని కుమారుడు వీర్యవంతుడైన వృషభుడు. వృషభుని కుమారుడు పుణ్యవంతుడన్న రాజు.

పుణ్యః పుణ్యవతశ్చైవ రాజా సత్యధృతిస్తతః ।
సుధన్వా తస్య దాయాదః తస్మాత్సర్వశ్చ జజ్ఞివాన్ ॥30॥

పుణ్యవంతునికి పుణ్యుడు, అతనికి సత్యధృతి కలిగారు. అతని కొడుకు సుధన్వుడు, అతని కుమారుడు సర్వుడు.

సర్వస్య భువనః పుత్ర స్తస్మాద్రాజా బృహద్రథః ।
ద్వే తస్య శకలే జాతే జరయా సన్ధితశ్చ సః ॥31॥

సర్వుని పుత్రుడు భువనుడు. అతని కొడుకు బృహద్రథ మహారాజు. అతనికి రెండు శరీరార్ధభాగాలు పుట్టాయి. వాటిని జర సంధించింది.

జరయా సన్ధితో యస్మాజ్జరాసన్ధస్తతస్మృతః ।
జేతా సర్వస్య క్షత్త్రస్య జరాసన్ధో మహాబలః ॥32॥

జర సంధించడం వల్ల వాడు జరాసంధు డయ్యాడు. మహాబలుడై ఆ జరాసంధుడు సర్వక్షత్రియులను జయించాడు.

జరాసన్ధస్య పుత్త్రస్తు సహదేవః ప్రతాపవాన్ ।
సహదేవాత్మజ శ్రీమాన్ సోమవిత్స మహాతపాః ॥33॥

జరాసంధుని కొడుకు ప్రతాపవంతుడగు సహదేవుడు. సహదేవుని కుమారుడు శ్రీమంతుడు, మహాతపస్సి అయిన సోమవిత్తు.

శ్రుతశ్రవాస్సోమవిదో మాగధాః పరికీర్తితాః ।
యజుస్త్వజనయత్పుత్త్రం సురథం నామ భూమిపమ్ ॥34॥

సురథస్య తు దాయాదో వీరో రాజా విదూరథః ।
విదూరథసుతశ్చాపి సార్వభౌమ ఇతి స్మృతః ॥35॥

సోమవిత్తు సుతుడు శ్రుతశ్రవుడు. వీరు మగధ దేశపాలకులు కాన మాగధు లయ్యారు. యజువు సురథుడనే రాజును కన్నాడు. అతని కొడుకు వీరుడైన విధూరథుడు. అతని సుతుడు సార్వభౌముడు.

సార్వభౌమా జ్జయత్సేనో రుచిరస్తస్య చాత్మజః ।
రుచిరాత్తు తతో భౌమస్త్వయుతాయుస్తతోఽభవత్ ॥36॥

సార్వభౌమునికి జయత్సేనుడు, అతనికి రుచిరుడు, అతనికి భౌముడు, అతనికి అయుతాయువు కలిగారు.

అక్రోధనోఽయుతాయోశ్చ తస్మాద్దేవాతిథిః స్మృతః ।
దేవాతిథేస్తు దాయాదో దక్ష ఏవ బభూవ హ ॥37॥

అయుతాయుధుని కుమారుడు అక్రోధనుడు. అతని సుతుడు దేవాతిథి. దేవాతిథి కుమారుడు దక్షుడు.

భీమసేనస్తతో దక్షాద్దిలీప స్తస్య చాత్మజః ।
దిలీపస్య ప్రతీపస్తు తస్య పుత్త్రా స్త్రయ స్మృతాః ॥38॥

దక్షునికి భీమసేనుడు, అతనికి దిలీపుడు, అతనికి ప్రతీపుడు కలిగారు. ప్రతీపునికి పుత్రులు ముగ్గురు.

దేవాపి శ్శన్తనుశ్చైవ బాహ్లీకశ్చైవ తే త్రయః ।
బాహ్లీకస్య తు దాయాదా స్సప్త బాహ్లీశ్వరాః నృపాః ।
దేవాపిస్తు హ్యపధ్యాతః ప్రజాభిరభవన్మునిః ॥39॥

దేవాపి, శంతనుడు, బాహ్లీకుడన్నవారు ఆ ముగ్గురు కుమారులు. బాహ్లీకుని కుమారులు ఏడుగురు బాహ్లీకాధిపతులు. దేవాపిని ప్రజలు తిరస్కరించారు. అతడు సింహాసనానికి దూరమై ముని అయ్యాడు.

మునయ ఊచుః :–మునులు చెప్పారు

ప్రజాభి స్తు కిమర్థం వై హ్యపధ్యాతో జనేశ్వరః ।
కో దోషో రాజపుత్రస్య ప్రజాభి స్సముదాహృతః ॥40॥

ప్రజలు దేవాపిని ఎందుకు అసహ్యించుకొన్నారు. అతని పట్ల ప్రజలు ఏమి దోషం చూపారు?

సూత ఉవాచ :–సూతుడు చెప్పాడు

కిలాఽఽసీద్రాజపుత్రస్తు కుష్ఠీ తం నాభ్యపూజయన్ ।
కార్యం చైవ తు దేవానాం క్షత్రం ప్రతి ద్విజోత్తమాః ।
భవిష్యం కీర్తయిష్యామి శన్తనోస్తు నిబోధత ॥41॥

దేవాపి కుష్ఠరోగ పీడితుడైనాడు కాన అతణ్ణి ప్రజలాదరించలేదు. ద్విజోత్తములారా! ఇప్పుడు శంతనుని భవిష్యత్తును, క్షత్రం పట్ల దేవతల కార్యమును వివరిస్తాను – వినండి!

శన్తనుస్త్వభవద్రాజా విద్వాంసో వై మహాభిషక్ ।
ఇమం చోదాహరన్త్యత్ర శ్లోకం ప్రతి మహాభిషక్ ॥42॥

దేవాపి పిమ్మట శంతనుడు రాజయ్యాడు. అతడు విద్యావంతుడు, మరియు గొప్ప వైద్యుడు, అతని వైద్యవిజ్ఞానాన్ని గురించి ఈ శ్లోకాన్ని ఉదాహరిస్తారు.

యం యం కరాభ్యాం స్పృశతి జీర్ణం రోగిణమేవ చ ।
పునర్యువా చ భవతి తస్మాత్తం శన్తనుం విదుః ॥43॥

ఎవరెవరిని రోగిని గానీ, వృద్ధుని గానీ అతడు తన చేతులతో స్పృశిస్తాడో, అతడు మరల అరోగ్యవంతుడైన యువకుడవుతాడు. అందుకే అతణ్ణి శంతనుడన్నారు.

తత్తస్య శన్తనుత్వం హి ప్రజాభిరిహ కీర్త్యతే ।
తతోఽవృణత భార్యార్థం శన్తనుర్జాహ్నవీం నృపః ॥44॥

అందువల్లనే ప్రజలు అతని శంతనుత్వాన్ని కీర్తించారు. ఆ శంతనుడు జాహ్నవిని భార్యగా వరించాడు.

తస్యాం దేవవ్రతం నామ కుమారం జనయద్విభుః ।
కాలీ విచిత్రవీర్యం తు దాశేయీ జనయత్సుతమ్ ॥45॥

శన్తనో ర్దయితం పుత్త్రం శాన్తాత్మానమకల్మషమ్ ।
కృష్ణద్వైపాయనో నామ క్షేత్రే వైచిత్రవీర్యకే ॥46॥

ధతరాష్ట్రం చ పాండుం చ విదురం చాప్యజీజనత్ ।
ధృతరాష్ట్రస్తు గాన్ధార్యాం పుత్త్రానజనయచ్ఛతమ్ ॥47॥

అతడామెయందు దేవవ్రతుడన్న సుతుణ్ణి కన్నాడు. అట్లే దాశేయి అయిన కాళిద్వారా విచిత్రవీర్యుణ్ణికన్నాడు. అతడు శంతనునికి ప్రియమైనవాడు, శాన్తచిత్తుడు, కల్మషరహితుడు. విచిత్రవీర్యుని క్షేత్రంలో, కృష్ణద్వైపాయనుడు ధృతరాష్ట్ర- పాండు- విదురులను జనింపజేశారు. ధృతరాష్ట్రుడు గాంధారియందు నూర్గురు కుమారులను కన్నాడు.

తేషాం దుర్యోధనో జ్యేష్ఠ స్సర్వక్షత్త్రస్య వై ప్రభుః ।
మాద్రీ కుంతీ తథా చైవ పాణ్డో ర్భార్యే బభూవతుః ॥48॥

వారిలో దుర్యోధనుడు జ్యేష్ఠుడు. సర్వక్షత్ర జాతికతడు ప్రభువు. మాద్రి, కుంతి పాండురాజుకు ఇరువురు భార్యలు.

దేవదత్తా స్సుతాః పఞ్చ పాణ్డోరర్థేఽభిజజ్ఞిరే ।
ధర్మాద్యుధిష్ఠిరో జజ్ఞే మారుతాచ్చ వృకోదరః ॥49॥
ఇన్ద్రాద్ధనఞ్జయశ్చైవ ఇంద్రతుల్యపరాక్రమః ।
నకులం సహదేవం చ మాద్ర్యశ్విభ్యామజీజనత్ ॥50॥

పాండురాజుకు దేవత లిచ్చిన సుతులు ఐదుగురు. ధర్మునివల్ల యుధిష్ఠిరుడు, వాయువువల్ల భీముడు.ఇంద్రుని వల్ల ఇంద్రసమాన పరాక్రముడైన అర్జునుడు కలిగారు. అశ్వినీ దేవతల ద్వారా మాద్రి నకుల సహదేవులను కన్నది.

పఞ్చైతే పాణ్డవేభ్యస్తు ద్రౌపద్యాం జజ్ఞిరే సుతాః ।
ద్రౌపద్యజనయచ్ఛ్రేష్ఠం ప్రతివిన్ధ్యం యుధిష్ఠిరాత్ ॥51॥

ఈ పై చెప్పబోవు ఐదుగురు ద్రౌపదియందు పాండవులకు పుట్టారు. యుధిష్ఠిరుని ద్వారా ద్రౌపది ప్రతివింధ్యుణ్ణి కన్నది.

శ్రుతసేనం భీమసేనాచ్ఛ్రుతకీర్తిం ధనఞ్జయాత్ ।
చతుర్థం శ్రుతవర్మాణం నకులాత్సంప్రసూయత ॥52॥

భీమసేనునినుండి శ్రుతసేనుణ్ణీ, అర్జునునినుండి శ్రుతకీర్తినీ, నకులునినుండి నాల్గవవాడైన శ్రుతవర్మను కన్నది.

సహదేవాచ్ఛతానీకం ద్రౌపదేయాః ప్రకీర్తితాః ।
తేభ్యోఽపరే పాణ్డవేయాః షడేవాన్యే మహారథాః ॥53॥

మరియు సహదేవుని నుండి శతానీకుణ్ణి కన్నది. వీరు ద్రౌపదేయులు. వీరు కాక ఇతర పాండవేయులు, మహారథులైన ఆరుమంది ఉన్నారు.

హైడమ్బో భీమసేనాత్తు పుత్రో జజ్ఞే ఘటోత్కచః ।
కాశ్యా జలధరాద్భీమాజ్జజ్ఞే వై సర్వగం సుతమ్ ॥54॥

భీమసేనునికి హిడింబ ద్వారా ఘటోత్కచుడనే పుత్రుడు జనించాడు. కాశీరాజ పుత్రియగు జలధర అతనినుండి సర్వగుడను పుత్రుని కన్నది.

సుహోత్రం తనయం మాద్రీ సహదేవాదసూయత ।
కరేణుమత్యాం చైద్యాయాం నిరమిత్రస్తు నాకులిః ॥55॥

మాద్రి సహదేవునినుండి సుహోత్రుణ్ణి కన్నది. చైద్యయగు కరేణుమతికి నకులనివల్ల నిరమిత్రుడు జన్మించాడు.

సుభద్రాయాం రథీ పార్థాదభిమన్యురజాయత ।
యౌధేయం దేవకీ చైవ పుత్రం జజ్ఞే యుధిష్ఠిరాత్ ॥56॥

అర్జునుని ద్వారా సుభద్రకు రథికుడైన అభిమన్యుడు కలిగాడు. దేవకి యుధిష్ఠిరునివల్ల యౌధేయుడనే పుత్రుణ్ణి ప్రసవించింది.

అభిమన్యోః పరీక్షిత్తు పుత్రః పరపురఞ్జయః ।
జనమేజయః పరీక్షితః పుత్రః పరమధార్మికః ॥57॥

అభిమన్యునికి శత్రునగర జేత అయిన పరీక్షిత్తు జనించాడు. పరమధార్మికుడైన జనమేజయుడు పరీక్షితుని కొడుకు.

బ్రహ్మాణం కల్పయామాస స వై వాజసనేయకమ్ ।
స వైశమ్పాయనేనైవ శప్తః కిల మహర్షిణా ॥58॥

న స్థాస్యతీహ దుర్బుద్ధే తవైతద్వచనం భువి ।
యావత్స్థాస్యసి త్వం లోకే తావదేవ ప్రవత్స్యసి ॥59॥

అతడు వాజసనేయకుడైన బ్రాహ్మణుణ్ణి బ్రహ్మగా కల్పించాడు. అందుకు కోపించిన వైశంపాయనుడు అతణ్ణి శపించాడు. "దుర్బుద్ధీ! నీ మాట భూమిపై నిలవదు. నీవు లోకంలో జీవించిఉన్నప్పుడే దేశం విడిచి ప్రవాసం పోదువు గాక!" అని.

క్షత్త్రస్య విజయం జ్ఞాత్వా తతః ప్రభృతి సర్వశః ।
అభిగమ్య స్థితాశ్చైవ నృపం చ జనమేజయమ్ ॥60॥

క్షత్రియుని గెలుపు తెలుసుకొని నాటినుండి అన్ని ప్రాంతాలవారు జనమేజయుణ్ణి ఆశ్రయించి వుండినారు.

తతః ప్రభృతి శాపేన క్షత్త్రియస్య తు యాజినః ।
ఉత్పన్నా యాజినో యజ్ఞే తతః ప్రభృతి సర్వశః ॥61॥

యాభైయవ అధ్యాయం

వైశంపాయనుని శాపం వల్ల నాటినుండి క్షత్రియ యజ్ఞాలలో పురోహితులుగా బ్రాహ్మణులు పని చేయడం తగ్గిపోయింది.

క్షత్రస్య యాజినః కేచిచ్ఛాపాత్తస్య మహాత్మనః ।
పౌర్ణమాసేన హవిషా ఈజే తస్మిన్ప్రజాపతిమ్ ।
స వైశమ్పాయనేనైవ ప్రవిశన్వారిత స్తతః ॥62॥

జనమేజయుడు ప్రజాపతియజ్ఞం పూర్తి చేసి పౌర్ణమాసినాడు పౌర్ణమాసీ హవిస్సును సమర్పింపగా వైశంపాయనుడు ప్రజాపతినడ్డుకొన్నాడు.

పరీక్షిత స్సుతోఽసౌ వై పౌరవో జనమేజయః ।
ద్విరశ్వమేధమాహృత్య మహావాజసనేయకః ॥63॥

ఈ జనమేజయుడు పరీక్షితుని పుత్రుడు. వాజసనేయకవిధానంతో రెండు అశ్వమేధా లాచరించాడు. మహావాజసనేయుడన్న ప్రశస్తి పొందాడు.

ప్రవర్తయిత్వా తం సర్వమృషి వాజసనేయకమ్ ।
వివాదే బ్రాహ్మణై సార్ధమభిశప్తో వనం యయౌ ॥64॥

అలా ఆ అశ్వమేధ కార్యక్రమాన్ని ప్రవర్తింపజేసి బ్రాహ్మణులతో వివాదం రాగా శపింపబడి అడవికి వెళ్ళి పోయాడు.

జనమేజయాచ్ఛతానీకస్తస్మాజ్జజ్ఞే సువీర్యవాన్ ।
జనమేజయః శతానీకం పుత్త్రం రాజ్యేఽభిషిక్తవాన్ ॥65॥

జనమేజయుని కుమారుడు వీర్యవంతుడైన శతానీకుడు. జనమేజయుడు అడవికి పోతూ శతానీకుణ్ణి రాజ్యంలో అభిషేకించాడు.

అథాశ్వమేధేన తత శ్శతానీకస్య వీర్యవాన్ ।
జజ్ఞేఽధిసీమకృష్ణాఖ్య స్సామ్ప్రతం యో మహాయశాః ॥66॥

వీర్యవంతుడైన శతానీకుడు అశ్వమేధం చేయగా అధిసీమకృష్ణుడు జనించాడు. నేటికీ ఆకీర్తిమంతుడు రాజ్యాన్ని పాలిస్తున్నాడు.

తస్మిన్ శాసతి రాష్ట్రం తు యుష్మాభిరిదమాహృతమ్ ।
దురాపం దీర్ఘసత్రం వై త్రీణి వర్షాణి పుష్కరే ।
వర్షద్వయం కురుక్షేత్రే దృషద్వత్యాం ద్విజోత్తమాః ॥67॥

ద్విజవర్యులారా! అతడు రాజ్యం పాలిస్తుండగా మీరిక్కడ దురాపమైన దీర్ఘ సత్రం చేస్తున్నారు. ఇది పుష్కర క్షేత్రంలో మూడు సంవత్సరాలుగా సాగుతున్నది. పూర్వం కురుక్షేత్రంలోనూ, దృషద్వతిలోను రెండేండ్లు జరిగినది.

మునయ ఊచుః :- మునులు చెప్పారు.

భవిష్యచ్ఛ్రోతుమిచ్ఛామః ప్రజానాం రౌమహర్షణే! ।
పురా కిల యదేతద్వై వ్యతీతం కీర్తితం త్వయా ॥68॥

రౌమహర్షణీ! ప్రజల భవిష్యద్వృత్తాంతం వినగోరుతున్నాము. పూర్వం జరిగిందంతా నీవు మాకు చెప్పావు.

యేషు వై స్థాస్యతే క్షత్రముత్పత్స్యన్తే నృపాశ్చ యే ।
తేషామాయుః ప్రమాణం చ నామతశ్చైవ తాన్నృపాన్ ॥69॥

ఎవరిలో క్షాత్రం ఉంటుందో, భావికాలంలో పుట్టనున్న రాజులెవరో, వారి ఆయుః ప్రమాణం చెప్పు, వారి పేర్లు గూడా వివరించు.

కృతయుగప్రమాణం చ త్రేతాద్వాపరయోస్తథా ।
కలియుగప్రమాణం చ యుగదోషం యుగక్షయమ్ ॥70॥

సుఖదుఃఖప్రమాణం చ ప్రజాదోషం యుగస్య తు ।
ఏతత్సర్వం ప్రసఙ్ఖ్యాయ పృచ్ఛతాం బ్రూహి నః ప్రభో! ॥71॥

అట్లే కృతయుగ ప్రమాణం, త్రేతాద్వాపరాల ప్రమాణం, కలియుగ ప్రమాణం, యుగ దోషం, యుగక్షయం, సుఖదుఃఖ ప్రమాణం, యుగానికి చెందిన ప్రజాదోషం - ఇదంతా అడుగుతున్న మాకు వివరించు.

సూతః :- సూతుడు చెప్పాడు.

యథా మే కీర్తితం పూర్వం వ్యాసేనాక్లిష్టకర్మణా ।
భావ్యం కలియుగం చైవ తథా మన్వన్తరాణి చ ॥72॥
అనాగతాని సర్వాణి బ్రువతో మే నిబోధత ।
అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి భవిష్యా యే నృపాస్తథా ॥73॥

క్లేశం లేని కార్యములొనర్చు వ్యాసుడు చెప్పినట్లు నేను మీకు కలిగయుగ మెలా వుంటుందో, మన్వంతరాల స్థితి గతులూ - జరుగనున్న సకల విషయాలూ వివరిస్తాను, ఇక రానున్న రాజులను గూర్చి చెబుతాను. భావికాలంలో రాజు లెవరో వివరిస్తాను తెలుసుకోండి.

ఇక్ష్వాకోరన్వయే చైవ పౌరవే చాన్వయే తథా ।
యేషు సంస్థాస్యతే తద్వద్యదిక్ష్వాకుకులం శుభమ్ ।
తాన్సర్వా న్కీర్తయిష్యామి భవిష్యే కథితాన్నృపాన్ ॥74॥

ఇక్ష్వాకువంశంలో పౌరవవంశంలో ఎవరిలో ఈ శుభమైన ఈయిక్ష్వాకు కులం ప్రతిష్ఠితమౌతుందో ఆ వంశపు రాజులనందరినీ చెప్పబోతున్నాను.

తేభ్యోఽపరేఽపి యే త్వన్యే హ్యుత్పత్స్యన్తే నృపాః పునః ।
క్షత్రాః పారశవాః శూద్రాస్తథాఽన్యే యే బహిశ్చరాః ॥75॥

అన్ధాః శకాః పులింద్రాశ్చ చూళికా యవనా స్తథా ।
కైవర్తాభీరశబరా యే చాన్యే మ్లేచ్ఛసంభవాః ।
పర్యాయతః ప్రవక్ష్యామి నామతశ్చైవ తాన్నృపాన్ ॥76॥

వారేకాక తక్కిన నరపతులు గూడా ఎవరెవరు జన్మించనున్నారో క్షత్రియులు, పారశవులు, శూద్రులు, బహిశ్చరులు, అంధసులు, శకులు, పులిందులు, చూలికులు, యవనులు, కైవర్తులు, ఆభీరులు, శబరులు, ఇతరులైన మ్లేచ్ఛవంశీయులు వారిని క్రమంగానూ, నామ నిర్దేశ పూర్వకంగానూ చెబుతాను.

అధిసీమకృష్ణశ్చైతేషాం ప్రథమం వర్తతే నృపః ।
తస్యాన్వవాయే వక్ష్యామి భవిష్యే కథితాన్నృపాన్ ॥77॥

వీరిలో అధిసీమకృష్ణుడు మొదటిరాజు అతని వంశంలో రానున్న రాజులను వివరిస్తాను.

అధిసీమకృష్ణపుత్రస్తు విచక్షుర్భవితా నృపః ।
గఙ్గయా తు హృతే తస్మిన్నగరే నాగసాహ్వయే ॥78॥

త్యక్త్వా విచక్షుర్నగరం కౌశామ్బ్యాం తు నివత్స్యతి ।
భవిష్యాఽష్టౌ సుతాస్తస్య మహాబలపరాక్రమాః ॥79॥

అధిసీమకృష్ణుని పుత్రుడు విచక్షుడు అనేవాడు రాజు కాగలడు. గంగానదీ ప్రవాహంలో హస్తిన నగరం కొట్టుకు పోయిన పిదప వివక్షుడు నగరం వదలి కౌశాంబిలో నివసించగలడు. మహా బలపరాక్రమశాలు రతనికి ఎనిమిది మంది పుత్రులు కలుగుతారు.

భూరిశ్రేష్ఠ స్సుత స్తస్య తత శ్చిత్రరథ స్స్మృతః ।
శుచిద్రవశ్చిత్రరథాద్వృష్ణిమాంశ్చ శుచిద్రవాత్ ॥80॥

అతని కుమారుడు భూరిశ్రేష్ఠుడు. అతని సుతుడు చిత్రరథుడు. అతనికి శుచిద్రవుడు కుమారుడు. శుచిద్రవునికి వృష్ణిమంతుడు సుతుడు.

వృష్ణిమత స్సుషేణశ్చ భవిష్యతి శుచిర్నృపః ।
తస్మాత్సుషేణాద్భవితా సునీథో నామ పార్థివః ॥81॥

వృష్ణిమంతుని కుమారుడు సుషేణుడు రాజవుతాడు. అతని కుమారుడు సునీథుడు రాజు కానున్నాడు.

నృపాత్సునీథాద్భవితా నృచక్షు స్సుమహాయశాః ।
నృచక్షుషస్తు దాయాదో భవితా వై సుఖీబలః ॥82॥

సునీథునికి కీర్తిమంతుడగు నృచక్షువు కుమారుడు కాగలడు. అతని కుమారుడు సుఖీబలుడు.

సుఖీబలసుతశ్చాపి భావీ రాజా పరిప్లవః ।
పరిప్లవసుతశ్చాపి భవితా సుతపా నృపః ॥83॥

అతని సుతుడు పరిప్లవుడు రాజవుతాడు. అతని కొడుకు సుతపుడు రాజు కాగలడు.

మేధావీ తస్య దాయాదో భవిష్యతి న సంశయః ।
మేధావిన స్సుతశ్చాపి భవిష్యతి పురఞ్జయః ॥84॥

సుతపునికి మేధావి కలుగుతాడు. సంశయం లేదు. మేధావి కుమారుడు పురంజయుడు.

కురు భావ్య స్సుత స్తస్య నిర్మమస్తస్య చాత్మజః ।
బృహద్రథో నిర్మమాద్వై వసుదామా బృహద్రథాత్ ॥85॥

అతని సుతుడు కురుభావ్యుడు, అతనికి నిర్మముడు, నిర్మమమునికి బృహద్రథుడు, బృహద్రథునికి వసుదాముడు జన్మించి రాజు లవుతారు.

వసుదామ్నః శతానీకో భవిష్యోదయనస్తతః ।
భవిష్యతే చోదయనాద్వీరో రాజా వహీనరః ॥86॥

వసుదామునికి శతానీకుడు, అతనికి ఉదయనుడు, అతనికి వీరుడైన వహీనరుడు – పుత్రులవుతారు.

వహీనరాత్మజశ్చైవ దణ్డపాణిర్భవిష్యతి ।
దణ్డపాణే ర్నిరమిత్రో నిరమిత్రాత్తు క్షేమకః ॥87॥

వహీనరుని కుమారుడు దండపాణి. అతనికి నిరమిత్రుడు, అతనికి క్షేమకుడు సుతులు.

అస్యానువంశశ్లోకోఽయం గీతో విప్రైః పురాతనైః ।
బ్రహ్మక్షత్రస్య యా యోనిర్వంశో దేవర్షిసత్కృతః ।
క్షేమకం ప్రాప్య రాజానం సంస్థాస్యతి కలౌ యుగే ॥88॥

ఈ విషయంలో పురాతన విప్రులు అనువంశ శ్లోకం చెప్పారు. దాని భావమిది. "దేవర్షులు సత్కరించిన బ్రాహ్మణ క్షత్రియ యోని అయిన వంశం కలియుగంలో క్షేమకుడు రాజయ్యేంతవరకూ ఉంటుంది."

ఇత్యేష పౌరవో వంశో యథావదిహ కీర్తితః ।
ధీమతః పాణ్డుపుత్రస్య చార్జునస్య మహాత్మనః ॥89॥

ఇలా పౌరవవంశాన్ని యథాతథంగా వివరించాను. అట్లే ధీమంతుడైన పాండుపుత్రుడు, మహాత్ముడగు అర్జునుని వంశం కూడా వివరించాను.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అజామీఢాదీనాం భవిష్యన్నరపతీనాం చ వంశవర్ణనం నామ పంచాశోఽధ్యాయః॥50॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని అజామీఢాదులను భవిష్యద్రాజులవంశవర్ణనమనే యాభైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకపంచాశోఽధ్యాయః - యాభైఒకటవ అధ్యాయం

అగ్నివంశక్రమః - అగ్నివంశక్రమం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

యే పూజ్యాః స్యుర్ద్విజాతీనామగ్నయః సూత! సర్వదా ।
తానిదానీం సమాచక్ష్వ తద్వంశం చానుపూర్వశః ॥1॥

సూతా! సదా ద్విజాతులకు పూజనీయములైన అగ్నులగూర్చి, ఆ అగ్నులవంశమునుగురించి క్రమంగా ఇప్పుడు వివరించు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

యోఽసావగ్న్యభిమానీ తు స్మృతః స్వాయంభువేంఽతరే ।
బ్రహ్మణో మానసః పుత్ర స్తస్మాత్స్వాహాఽప్యజీజనత్ ॥2॥

పావకం పవమానం చ శుచిరగ్నిశ్చ యః స్మృతః ।
నిర్మథ్యః పవమానోఽగ్ని ర్వైద్యుతః పావకాత్మజః ॥3॥

స్వాయంభువమన్వంతరంలో అగ్నికి అధిష్ఠానంగా ఉండే దేవత బ్రహ్మయొక్క మనస్సునుండి పుత్రుడుగా జనించాడు. అతనినుండి స్వాహా అన్న భార్య పావకునికీ, పవమానునికీ జన్మ నిచ్చింది. 'శుచి' అను అగ్ని గూడా ఆమెకు కలిగింది. పవమానాగ్ని ఒరపిడి వల్ల కలిగేది. పావకునినుండి వైద్యుతాగ్ని పుట్టింది.

శుచి రగ్నిః స్మృతః సౌరః స్థావరాశ్చైవ తే స్మృతాః ।
పవమానాత్మజో హ్యగ్ని ర్హవ్యవాహః స ఉచ్యతే ॥4॥

'శుచి' అనే అగ్ని సూర్యసంబంధి. ఈ అగ్నులు స్థావరాలని చెప్పబడ్డాయి. పవమానునినుండి పుట్టిన అగ్నిని హవ్యవాహను డంటారు.

పావకిః సహరక్షస్తు హవ్యవాహముఖః శుచిః ।
దేవానాం హవ్యవాహోఽగ్నిః పితౄణాం కవ్యవాహనః ॥5॥

పావకి, సహరక్షుడు, హవ్యవాహముఖుడు అనువారు పావకుని సంతానం. దేవతలకు హవ్యవాహనుడు హవ్యం అందిస్తాడు. పితరులకు కవ్యం అందించివాడు కవ్యవాహనుడు.

సహరక్షోఽసురాణాం తు త్రయాణాం తే త్రయోఽగ్నయః ।
ఏతేషాం పుత్రపౌత్రాశ్చ చత్వారింశన్నవైవ చ ॥6॥

సహరక్షుడు రాక్షసులకు హవ్యం అందించువాడు. పై ముగ్గురికీ ఈ మూడు అగ్నులూ (పావక, పవమాన, శుచులు) చెందుతాయి. వీరి పుత్ర పౌత్రులు - నలుబది తొమ్మిది మంది కలరు.

ప్రవక్ష్యే నామత స్తా న్వై ప్రవిభాగేన తాన్ పృథక్ ।
పావనో లౌకికో హ్యగ్నిః ప్రథమో బ్రహ్మణశ్చ యః ॥7॥

ప్రవిభాగంతో సహా విడివిడిగా వారి పేర్లు పేర్కొంటాను. పావనుడు లౌకికాగ్ని, అతడు బ్రహ్మకు మొదటి కుమారుడు.

బ్రహ్మౌదనాగ్ని స్తత్పుత్రో భరతో నామ విశ్రుతః ।
వైశ్వానరో హవ్యవాహో వహన్హవ్యం మమార సః ॥8॥

అతని పుత్రుడు బ్రహ్మౌదనాగ్నిని భరతుడంటారు. వైశ్వానరుణ్ణి హవ్యవాహనుడంటారు. అతడు హవ్యమును దేవతలకు తీసుకుపోతూ మరణించాడు.

సమృతోఽథర్వణః పుత్రో మథితః పుష్కరోదధిః ।
యోఽథర్వా లౌకికో హ్యగ్ని ర్దక్షిణాగ్ని స్స ఉచ్యతే ॥9॥

అలా మరణించి పుష్కరాన్ని మథించి అగ్నిని అథర్వుడనే ఆలౌకికాగ్ని దక్షణాగ్నిగా కీర్తింపబడింది.

భృగోః ప్రజాతో వచనాద్దక్షిణాథర్వణస్తథా ।
తస్మాత్స లౌకికో హ్యగ్నిః ప్రాచ్యః సోఽథర్వణస్తథా ॥10॥

అథర్వుడు భృగుని సుతుడు. అంగిరుడు అథర్వుని కుమారుడు. ఆలౌకికాగ్ని అతనివల్ల జనించింది. దానినే ప్రాచ్యాగ్ని అంటారు.

అథ యః పవమానస్తు నిర్మథ్యోఽగ్నిః స ఉచ్యతే ।
స చ వై గార్హపత్యోఽగ్నిః ప్రథమో బ్రహ్మణః స్మృతః ।
తతః సభ్యావసథ్యౌ చ శంసన్యాస్తౌ సుతావుభౌ ।
తతః షోడశ నద్యస్తు చకమే హవ్యవాహనః ॥11॥

యః ఖల్వాహవనీయోగ్నిరభిమానీ ద్విజైః స్మృతః ॥12॥

పవమానాగ్నిని నిర్మథ్యాగ్ని అని అంటారు. గార్హపత్యాగ్ని బ్రహ్మ మొదటి సంతానం. అతనికి సభ్యుడు, అవసథ్యుడు అనువారు శంసని ద్వారా కలిగారు. తదుపరి హవ్యవాహనుడు పదునారు నదులను కామించాడు. వీనిని ద్విజులు ఆహవనీయాగ్ని, అభిమాని అంటారు.

కావేరీం కృష్ణవేణీం చ నర్మదాం యమునాం తథా ।
గోదావరీం వితస్తాం చ చంద్రభాగామిరావతీమ్ ॥13॥

విపాశాం కౌశికీం చైవ శతద్రుం సరయూం తథా ।
సీతాం మనస్వినీం చైవ హ్రాదినీం పావనాం తథా ॥14॥

కావేరి, కృష్ణవేణి, నర్మద, యమున, గోదావరి, వితస్త, చంద్రభాగ, ఇరావతి, విపాశ, కౌశికి, శతద్రువు, సరయువు, సీత, మనస్విని, హ్లాదిని, పావన- అనేవే హవ్యవాహనుడు కామించిన నదులు.

తాసు షోడశధాఽఽత్మానం ప్రవిభజ్య పృథక్పృథక్ ।
తదా తు విహరంస్తాసు ధిష్ణ్యేశః స బభూవ హ ॥15॥

ఆ నదులలో అతడు తన్ను పదునారు విభాగాలుగా విడివిడిగా విభజించుకొని వారితో విహరిస్తూ తన ధిష్ణ్యములకు అనగా విహరణ స్థానములకు ప్రభువైనాడు.

స్వాభిచారాత్ స్మృతోదిష్ణ్యస్తాసూత్పన్నాస్తు ధిష్ణియాః ।
ధిష్ణ్యేశా జజ్ఞిరే యస్మాత్తతస్తే ధిష్ణ్యజాః స్మృతాః ॥16॥

అతను విహరించిన స్థానాలు దిష్ణ్యాలు. దిష్ణ్యములు అనే నదులలో దిష్ణ్యుడు అనే అగ్నివల్ల జనించినవారికి దిష్ణ్యజులని వ్యవహారం.

ఇత్యేతే వై నదీపుత్రా ధిష్ణ్యేషు ప్రతిపేదిరే ।
తేషాం విహరణీయా యే ఉపస్థేయాశ్చ తాన్ శృణు ।
విభుః ప్రవాహణోఽగ్నీధ్రస్తత్రస్థా ధిష్ణవోఽపరే ॥17॥

దిష్ణ్యుడు అనే అగ్నివల్ల జనించిన 16 మంది కుమారులకు ధిష్ణ్యజులు అనే వ్యవహారం కలిగింది. ఆహవనీయపుత్రులైన అగ్నులు నదీపుత్రులై ధిష్ణ్యవంశంలో కలిసిపోయారు. వారు విహరణీయులు, ఉపస్థేయులు అని ఇరు తెగలుగా నున్నారు. (ఒకేచోట ఉండువారు ఉపస్థేయులు, విహరించేవారు విహరణీయులు) విభువు ప్రవాహణుడు, అగ్నీధ్రుడు స్థిరంగా ఉండేవారు.

విహరన్తి యథా స్థానం పుణ్యాహే సముపక్రమే ।
అనిర్దేశ్యానివార్యాణామగ్నీనాం శృణుత క్రమమ్ ॥18॥

ఇతరధిష్ణ్యువులు పుణ్యాహం ప్రారంభమైనపుడు. స్థానానుగుణంగా విహరిస్తారు. ఇక అనిర్దేశ్యులు, అనివార్యులు అను అగ్నుల క్రమం వినండి.

వాసవోఽగ్నిః కృశానుర్యో ద్వితీయోత్తరవేదికః ।
సమ్రాడగ్నిసుతో హ్యష్టావుపతిష్ఠన్తి తాన్ద్విజాః ॥19॥

వాసవాగ్ని, కృశానువు, రెండవ ఉత్తరవేదికి చెందినవి. సమ్రాట్ అగ్నిసుతుడు వారిని ఎనిమిది ద్విజులు పూజిస్తారు.

పర్జన్యః పవమానస్తు ద్వితీయః సోఽనుదృశ్యతే ।
పావకోష్ణః సమూహ్యస్తు వోత్తరే సోఽగ్నిరుచ్యతే ॥20॥

పర్జన్యుడు, పవమానుడు ద్వితీయవేదిలో ఉంటారు. పావకోష్ణుడు, సమూహ్యుడు- ఉత్తరవేదిక వారు.

హవ్యసూదో హ్యసంమృజ్యః శామిత్రః స విభావ్యతే ।
శతధామా సుధాజ్యోతీ రౌద్రైశ్వర్య స ఉచ్యతే ॥21॥

హవ్యసూదుడు, అసంమృజ్యుడు శామిత్రులుగా ప్రసిద్ధులు. శతధాముడు, సుధాజ్యోతి, రౌద్రైశ్వరాగ్నులుగా విఖ్యాతి గావించినవారు.

బ్రహ్మజ్యోతిః సువర్ధామా బ్రహ్మస్థానీయ ఉచ్యతే ।
అజైకపాదుపస్థేయః స వై శాలాముఖో యతః ॥22॥

బ్రహ్మజ్యోతి సువర్ధాములను బ్రహ్మస్థానీయులంటారు. అజైకపాదుడు, ఉపస్థేయుడు శాలాముఖులుగా ప్రసిద్ధులు.

అనిర్దేశ్యో హ్యహిర్బుధ్న్యో సోఽగ్నిర్గృహపతిః స్మృతః ।
పుత్రా హ్యేతే తు సర్వస్య ఉపస్థేయా ద్విజైః స్మృతాః ॥23॥

అనిర్దేశ్యుడు, అహిర్బుధ్నుడు గృహపతిగా ప్రసిద్ధుడు. ద్విజులు ఈ ఉపస్థేయాగ్నుల నన్నింటినీ అందరూ పూజించాలంటారు.

తతో విహరణీయాంస్తు వక్ష్యామ్యష్టౌ తు తత్సుతాన్ ।
విభుః ప్రవాహణోఽగ్నీధ్రస్తేషాం ధిష్ణ్యాః తథాపరే ॥24॥

ప్రశాస్త్రగ్నిః ప్రచేతాస్తు తృతీయః స్వాత్రనామకః ।
తుథోగ్నిర్విశ్వవేదాస్తు బ్రాహ్మణాచ్ఛంసిరుచ్యతే ॥25॥

ఇక విహరణీయులను, వారి సుతుల నెనిమిది మందిని గూర్చి చెబుతాను. అగ్నీధ్రస్థానీయుడు విభువు మొదటివాడు. హవ్యవాహనుడు రెండవవాడు. స్వాత్రుడు మూడవవాడు. తుథుడు నాల్గవవాడు, ఇతడు బ్రాహ్మణాచ్ఛంసిస్థానీయుడు.

ఉసిగగ్నిః కవిర్యస్తు పోత్రగ్నిః స విభావ్యతే ।
అంబారిరగ్నిర్భంభార్నేష్ట్రీయః స విభావ్యతే ॥26॥

ఉసిక్ అను అగ్ని అయిదవవాడు. ఇతడు పోత్రియ స్థానీయుడు. అంబారి అనువాడు ఆరవవాడు. ఇతడు నేష్ట్రియస్థానీయుడు.

అవస్యుర్యో దువస్వాంస్తు అర్ఛావాకీయ ఉచ్యతే ।
అష్టమః శుంధ్యుర్యగ్నిర్యో మార్జాలీయ స్స ఉచ్యతే ॥27॥

దువస్వాన్ అనువాడు ఏడవవాడు. ఇతడు అర్ఛావాకీయ స్థానీయుడు. శుంధ్యుడు అనువాడు ఎనిమిదవ వాడు. ఇతడు మార్జాలీయ స్థానీయుడు.

అపాం యోనిః స్మృతశ్చాసీత్ సోతుర్నామ విభావ్యతే ।
ధిష్ణ్య ఆహరణా హ్యేతే సోమేనేజ్యన్త వై ద్విజైః ॥28॥

నీటికి ఉత్పత్తిస్థానం సోతువంటారు. ఈ ధిష్ణ్యులు సోమయాగంలో సోమునితో కూడ పూజింపబడుతారు.

తతో యః పావకో నామ్నా యః సద్భిర్యోగ ఉచ్యతే ।
అగ్నిః సోఽవభృథే జ్ఞేయో వరుణేన సహేజ్యతే ॥29॥

పావకుడనే అగ్నిని యోగః అని సుజను లంటారు. ఆ అగ్ని వరుణునితో గూడా అవభృథంలో పూజింపబడుతున్నాడు.

హృదయస్య సుతో హ్యగ్నే ర్జఠరేఽసౌ నృణాం పచన్ ।
మన్యుమాన్ జాఠరశ్చాగ్నిః దేవపాగ్నిసుతః స్మృతః ॥30॥

మానవుల జఠరంలో ఆహారాన్ని పచనం చేసే హృదయుని సుతుడైన అగ్నిని మన్యుమాన్ అంటారు. జఠరాగ్ని, దేవపుని కుమారుడు అని కూడా అంటారు.

పరస్పరోత్థితో హ్యగ్నిః భూతానీహ విభుర్దహన్ ।
అగ్నేర్మన్యుమతః పుత్త్రో ఘోరః సంవర్తకః స్మృతః ॥31॥

ఒరపిడినుండి పుట్టి భూతాలను దహించే అగ్ని మన్యుమంతుని సుతుడు, అతణ్ణి ఘోరసంవర్తకు డంటారు.

పిబన్నపః స వసతి సముద్రే వడవాముఖే ।
సముద్రవాసినః పుత్త్రః సహరక్షో విభావ్యతే ॥32॥

అతడు సముద్రంలో బడభాముఖరూపంలో ఉండి అందలి నీటిని త్రాగుతుంటాడు. సముద్రవాసి యగు అతని సుతుడు సహరక్షుడు.

సహరక్షసుతః క్షామో గేహే స వసతే నృణామ్ ।
క్రవ్యాదాగ్నిః సుతస్తస్య పురుషాన్యోఽత్తి వై మృతాన్ ॥33॥

సహరక్షుని సుతుడు క్షాముడు అతడు నరుల గృహాల్లో ఉంటాడు. అతని కుమారుడు క్రవ్యాదాగ్ని. అతడు మరణించిన పురుషులను తింటాడు.

ఇత్యేతే పావకస్యాగ్నే ర్ద్విజైః పుత్త్రాః ప్రకీర్తితాః ।
తతః శుచిస్తు యః సూర్యాద్గంధర్వై వసురాహృతః ॥34॥

వీరు పావకాగ్ని పుత్రులుగా ద్విజులచే పేర్కొనబడ్డారు. పూర్వం గంధర్వులు సూర్యునినుండి తెచ్చిన వసురూపాగ్నిని శుచి అంటారు.

మథితో యస్త్వరణ్యాం తు సోఽగ్నిమగ్నిం సమింధతే ।
ఆయుర్నామ్నా తు భగవాన్ పశౌ యస్తు ప్రణీయతే ॥35॥

అరణి మథనంలో లభించే అగ్ని మరొక అగ్గిని జ్వలింపజేస్తుంది. అది భగవాన్ ఆయువు అనబడుతుంది. ఆవహనీయాగ్ని అదే. పశుయజ్ఞాలలో అది ప్రణయనం చేయబడుతుంది.

ఆయుషో మహిషః పుత్రో సహసో నామ తత్సుతః ।
పాకయజ్ఞేష్వభీమానీ హుతం హవ్యం భునక్తి యః ॥36॥

ఆయువు పుత్రుడు మహిషుడు. అతని పుత్రుడు సహసుడు. ఇతడు పాకయజ్ఞంలో అభిమానియై అందరి హవ్యాన్ని భుజిస్తాడు.

సర్వస్మాద్దేవలోకాచ్చ హవ్యం కవ్యం భునక్తి యః ।
పుత్రోఽస్య సహసస్యాగ్నిరద్భుతః స మహాయశాః ॥37॥

దేవలోకానికి చెందిన హవ్యకవ్యాలను గూడా ఇతడు ఆహారిస్తాడు. అతని పుత్రుడు అద్భుతుడు, అతడు గొప్పకీర్తిగలవాడు.

అద్భుతస్య సుతో వీరో దేవాంశస్తు మహాన్ స్మృతః ।
ప్రాయశ్చిత్తే ష్వభీమానీ వివిధాగ్నిస్తు తత్సుతః ॥38॥

అద్భుతుని కుమారుడు గొప్పవీరుడైన దేవాంశుడు. ప్రాయశ్చిత్తాభిమానియైన వివిధాగ్ని అతని కుమారుడు

వివిధాగ్నిస్తతో హ్యర్కో వహ్నేస్తస్య సుతాష్టకమ్ ।
వివిధాగ్నిసుతాదర్కాదగ్నయోఽష్టౌ సుతాః స్మృతాః ॥39॥

వివిధాగ్ని కుమారుడు అర్కుడు. అర్కునికి ఎనిమిదిమంది కుమారులున్నారు.

కామ్యాదీష్టిష్వభీమానీ రక్షో హా ప్రతికృచ్చ యః ।
సురభిర్వసుమర్యాదో హర్యశ్వశ్చైవ రుక్మవాన్ ॥40॥

ప్రవర్గ్యః క్షేమవాంశ్చైవ ఇత్యష్టౌ చ ప్రకీర్తితాః ।
శుచ్యగ్నేస్తు ప్రజా హ్యేషా అగ్నయశ్చ చతుర్దశ ॥41॥

కామ్యాదికాలైన ఇష్టులకు అభిమానియైన రక్షోహ (రాక్షసహంతా) ప్రతికృత్, సురభి, వసుమర్యాదుడు, హర్యశ్వుడు, రుక్మవంతుడు, ప్రవర్గ్యుడు, క్షేమవంతుడు వీరు ఎనిమిదిమంది. శుచ్యగ్నికి సంతానమైన వారు పదునలుగు రగ్నులు కలరు.

ఇత్యేతే హ్యగ్నయః ప్రోక్తాః ప్రణీతా యే హి చాధ్వరే ।
సమతీతే తు సర్గే యే యామై స్సహ సురోత్తమైః ॥42॥

అలా గతయుగాలలో యాగాలలో వినియోగింపబడిన అగ్నులను పేర్కొనడమైనది. వీరు యాములనే సురోత్తములతో సహా కూడి ఉంటారు.

స్వాయంభువేఽంతరే పూర్వమగ్నయస్తేఽభిమానినః ।
ఏతే విహరణీయా యే చేతనా చేతనేష్విహ ॥43॥

పూర్వం స్వాయంభువమన్వంతరంలో ఈ అగ్నులు అభిమానులై వైదికకర్మానుష్ఠానములో విహరణీయులై సృష్టిలోని చేతనాచేతనపదార్థాలలో స్థానాభిముఖులై ఉండేవారు.

స్థానాభిమానినోఽగ్నీధ్రాః ప్రాగాసన్ హవ్యవాహనాః ।
కామ్యనైమిత్తికే యజ్ఞే ప్రేతకర్మస్వవస్థితాః ॥44॥

పూర్వే మన్వంతరేఽతీతే శుక్రైర్యామైశ్చ తై స్సహ ।
ఏతే దేవగణై స్సార్ధం ప్రథమస్యాంతరే మనోః ॥45॥

ప్రథమమన్వంతరం తర్వాత కామ్యనైమిత్తికాది కర్మలలోనూ, ప్రేతకర్మయలయందును అభిమానులైన అగ్నులు ఏర్పడ్డాయి. అవి యాములను దేవతలతో సహా మద్రులనే అగ్నులతో సమన్వయం పొందాయి.

ఇత్యేతా యోనయో హ్యుక్తాః స్థానాఖ్యా జాతవేదసామ్ ।
స్వారోచిషాదిషు జ్ఞేయాః సావర్ణ్యాస్తేషు సప్తసు ॥46॥

తైరేవం తు ప్రసంఖ్యాతం స్సాంప్రతానాగతేష్విహ ।
మన్వంతరేషు సర్వేషు లక్షణం జాతవేదసామ్ ॥47॥

ఇలా అగ్నుల యోనులు, స్థానాలపేర్లు చెప్పడమయింది. స్వారోచిషుడు మొదలు సావర్ణి వరకు ఏడు మన్వంతరాలలో వలెనే గత మన్వంతరాలను గూర్చి, సర్వమన్వంతరాలలో అగ్నుల లక్షణం చెప్పబడింది. ఇక రాబోవు మన్వంతరాలలో కూడా ఇట్లే అగ్ని ఉపాసన జరుగునున్నది.

మన్వంతరేషు సర్వేషు నానారూపప్రయోజనైః ।
వర్తంతే వర్తమానైశ్చ యామై ర్దేవై స్సహాగ్నయః ।
అనాగతైః సురైః సార్ధం వత్స్యంతోఽనాగతాగ్నయః ॥48॥

సకలమన్వంతరాలలో నానావిధ ప్రయోజనాలతో కూడా ఆనాటి యామదేవతలతో సహా అగ్నులు ఉండగలవు. ఇక అనాగతమన్వంతరాలలో రాబోవు ఆయాదేవగణాలలోని వారితో కలిసి రాబోవు అగ్నులు ఉపాసింపబడతారు.

ఇత్యేష ప్రచయోఽగ్నీనాం మయా ప్రోక్తో యథాక్రమమ్ ।
విస్తరేణాఽఽనుపూర్వ్యా చ్చ కిమన్యచ్ఛ్రోతుమిచ్ఛథ ॥49॥

ఇలా అగ్ని ప్రచయం మీకు విస్తరంగా, క్రమంగా చెప్పాను. మీరు ఇంకా ఏమి వినగోరుతున్నారు?

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అగ్నివంశక్రమో నామ ఏకపంచాశోఽధ్యాయః ॥ 51 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని అగ్నివంశక్రమమనే యాభైఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్విపంచాశోఽధ్యాయః - యాభైరెండవ అధ్యాయం

కర్మయోగః - కర్మయోగం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

ఇదానీం ప్రాహ యద్విష్ణుః పృష్టః పరమముత్తమమ్ ।
తదిదానీం సమాచక్ష్వ ధర్మాధర్మస్య విస్తరమ్ ॥ 1॥

పూర్వం విష్ణువు వైవస్వతమనువు కోరగా వివరించిన పరమోత్తమమైన ధర్మాధర్మముల విస్తరమునుచెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఏవమేకార్ణవే తస్మిన్మత్స్యరూపీ జనార్దనః ।
విస్తారమాదిమార్గస్య ప్రతిసర్గస్య చాఖిలమ్ ॥2॥
కథయామాస విశ్వాత్మా మనవే సూర్యసూనవే ।
కర్మయోగం చ సాఙ్ఖ్యం చ యథావద్విస్తరాన్వితమ్ ॥3॥

పూర్వం విశ్వం ఏకార్ణవమైనపుడు మత్స్యరూపం దాల్చిన విశ్వాత్ముడైన విష్ణుదేవుడు ఆది సృష్టి, ప్రతి సృష్టుల విస్తారమంతా సూర్యుని పుత్రుడైన మనువుకు చెప్పాడు. అట్లే కర్మయోగాన్నీ, సాంఖ్యాన్ని గూడా విస్తృతంగా వివరించాడు.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

శ్రోతుమిచ్ఛామహే సూత! కర్మయోగస్య లక్షణమ్ ।
యస్మాదవిదితం లోకే న కిఞ్చిత్తవ సువ్రత ॥4॥

సూతా! సువ్రతా! లోకంలో నీకు తెలియనిది లేదు. నీనుండి మేము కర్మయోగ లక్షణం వినగోరుతున్నాము.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

కర్మయోగం చ వక్ష్యామి యథా విష్ణువిభాషితమ్ ।
జ్ఞానయోగసహస్రాద్ధి కర్మయోగః ప్రశస్యతే ॥5॥

విష్ణువు చెప్పినట్లే కర్మయోగం చెబుతాను. వెయ్యి జ్ఞానయోగాల కంటే కర్మయోగం ప్రశస్తమైనది.

కర్మయోగోద్భవం జ్ఞానం తస్మాత్తత్పరమం పదమ్ ।
కర్మజ్ఞానోద్భవం బ్రహ్మ న చ జ్ఞానమకర్మణః ॥6॥

జ్ఞానం కర్మయోగంనుండి కల్గుతుంది. ఆ జ్ఞానంవల్ల పరమ పదం సిద్ధిస్తుంది. బ్రహ్మం కర్మజ్ఞానయోగాల వల్ల కల్గునది. కర్మ లేకుంటే జ్ఞానం కల్గదు.

తస్మాత్కర్మణి యుక్తాత్మా తత్త్వమాప్నోతి శాశ్వతమ్ ।
వేదోஉఖిలో ధర్మమూలమాచారశ్చైవ తద్విదామ్ ॥7॥

అందుచేత కర్మయోగమున సంసక్తమైన చిత్తం కలవాడు శాశ్వతమైన తత్త్వం పొందుతాడు. వేదమంతా ధర్మమూలమైనది. వేదజ్ఞులైన వారి ఆచారం కూడా ధర్మమూలకమే.

అష్టావాత్మగుణాస్తస్మిన్ప్రధానత్వేన సంస్థితాః ।
దయా సర్వేషు భూతేషు క్షాన్తీ రక్షాஉஉతురస్య తు ॥8॥

అనసూయా తథా లోకే శౌచమన్తర్బహి ర్ద్విజాః
అనాయాసేషు కార్యేషు మాఙ్గల్యాచారసేవనమ్ ॥9॥

న చ ద్రవ్యేషు కార్పణ్యమార్తేషూపార్జితేషు చ ।
తథాஉస్పృహా పరద్రవ్యే పరస్త్రీషు చ సర్వదా ॥10॥

ధర్మములో ఎనిమిది ఆత్మగుణాలు ప్రధానమై వున్నాయి. ద్విజులారా! (1) సకల ప్రాణులపట్ల దయ, (2) క్షమ, (3) కష్టాలలో ఉన్నవారిని రక్షించడం (4) అసూయ లేకుండా వుండడం (5) అంతశ్శౌచబహిశ్శౌచాలు (6) అనాయాసమైన కార్యాలలో మాంగళ్యాచారములను పాటించడం (7) అలా ద్రవ్యములపట్ల కృపణత్వం లేకుండడం (8)పరస్త్రీలయందు అట్లే పరుల ద్రవ్యమునందు కోరిక లేకుండడం అనేవి ఈ ఎనిమిది ఆత్మ గుణాలు.

అష్టావాత్మగుణాః ప్రోక్తాః పురాణస్య తు కోవిదైః ।
అయమేవ క్రియాయోగో జ్ఞానయోగస్య సాధకః ॥11॥

పురాణజ్ఞులు ఈ ఎనిమిదీ ఆత్మగుణాలని చెప్పారు. జ్ఞానయోగ సాధనకుపకరించే క్రియాయోగమిదే.

కర్మయోగం వినా జ్ఞానం కస్యచిన్నేహ దృశ్యతే ।
శ్రుతిస్మృత్యుదితం ధర్మముపతిష్ఠేత్ప్రయత్నతః ॥12॥

కర్మయోగం లేకుండా ఈ లోకంలో ఎవరికీ జ్ఞానం కల్గదు. అందుచే శ్రుతులు, స్మృతులు ప్రతిపాదించిన ధర్మాన్ని ప్రయత్న పూర్వకంగా ఆచరించాలి.

దేవతానాం పితౄణాం చ మనుష్యాణాం చ సర్వదా ।
కుర్యాదహరహర్యజ్ఞైః భూతర్షిగణతర్పణమ్ ॥13॥

నిత్యము యజ్ఞాలతో దేవతలను, పితరులనూ, మనుష్యులనూ సదా తృప్తి పరచాలి. భూతాలకు, ఋషిగణాలకూ తృప్తి కలిగించాలి.

స్వాధ్యాయైరర్చయేచ్చర్షీన్ హోమై ర్దేవాన్యథా విధి ।
పితౄన్ శ్రాద్ధైరన్నదానై ర్భూతాని బలికర్మభిః ॥14॥

స్వాధ్యాయాలతో ఋషుల నర్చించాలి. విధ్యుక్త విధిననుసరించి హోమాలతో దేవతల నారాధించాలి. పితరులను శ్రాద్ధాలతో, అన్నదానాలతో అతిథులను, బలికర్మలతో ప్రాణులను ఆరాధించాలి.

పఞ్చైతే విహితా యజ్ఞాః పంచసూనాపనుత్తయే ।
కణ్డనీ పేషణీ చుల్లి జలకుమ్భీ ప్రమార్జనీ ॥15॥

పంచసూనా నివృత్తి కొరకై ఈ పంచయజ్ఞాలూ విధించబడి వున్నాయి. కండని, పేషణి, చుల్లి, జలకుంభి, ప్రమార్జని – అనేవి పంచసూనాలు. (అయిదు రూపాలు)

పఞ్చ సూనా గృహస్థస్య తేన స్వర్గం న గచ్ఛతి ।
తత్పాపనాశనాయామీ పఞ్చ యజ్ఞాః ప్రకీర్తితాః ॥16॥

పైజెప్పిన పంచసూనలవల్ల గృహస్థుడు స్వర్గం చేరలేకున్నాడు. ఆ పాపం నశింపజేయడానికే ఈ పంచయజ్ఞాలు చెప్పబడివున్నాయి.

ద్వావింశతిస్తథా చాష్టౌ చ యే సంస్కారాః ప్రకీర్తితాః ।
తద్యుక్తోఽపి న మోక్షాయ యస్త్వాత్మగుణవర్జితః ॥17॥

అట్లే ఇరవై రెండు మరియు ఎనిమిది సంస్కారాలు ఏవి కలవో, అవి కలవాడైనా ఆత్మగుణాలు లేనివాడు మోక్షం పొందలేడు.

తస్మాదాత్మగుణోపేతః శ్రుతికర్మ సమాచరేత్ ।
గోబ్రాహ్మణానాం విత్తేన సర్వదా భద్రమాచరేత్ ॥18॥

అందుచేత ఆత్మగుణోపేతుడైనవాడు వేద విహిత కర్మ చేయాలి. తన ధనంతో సర్వదా గోబ్రాహ్మణులకు శ్రేయస్సు కల్గించాలి.

గోభూహిరణ్యవాసోభి ర్గన్ధమాల్యోదకేన చ ।
పూజయేద్బ్రహ్మవిష్ణ్వర్కరుద్రవస్వాత్మకం శివమ్ ॥19॥

బ్రహ్మ, విష్ణువు, సూర్యుడు, రుద్రుడు– వసువులు వీరి స్వరూపమైన శివుణ్ణి గోవులు, భూమి, స్వర్ణం, వస్త్రాలు, గంధం, మాల్యం– ఉదకం– వీటితో పూజించాలి.

వ్రతోపవాసై ర్విధివచ్ఛ్రద్ధయా చ విమత్సరః ।
యోఽసావతీన్ద్రియః శాన్తః సూక్ష్మోఽవ్యక్త స్సనాతనః ।
వాసుదేవో జగన్మూర్తిస్తస్య సమ్భూతయో హ్యమీ ॥20॥

బ్రహ్మా విష్ణుశ్చ భగవాన్మార్తాండో వృషవాహనః ।
అష్టౌ చ వసవస్తద్వదేకాదశ గణాధిపాః ।
లోకపాలాధిపాశ్చైవ పితరో మాతరస్తథా ॥21॥

మాత్సర్యం లేనివాడై విధి ప్రకారం వ్రతాలు, ఉపవాసాలు శ్రద్ధతో ఆచరించాలి. ఇంద్రియాతీతుడు, శాంతుడు, సూక్ష్ముడు, అవ్యక్తుడు, సనాతనుడూ, జగన్మూర్తి, అయిన వాసుదేవుని సంభూతులే బ్రహ్మ, విష్ణువు,

భగవంతుడగు సూర్యుడు, వృషభవాహనుడు, అష్టవసువులు, ఏకాదశ గణాధిపులు, లోకపాలురు, అట్లే మాతా పితరులు.

ఇమా విభూతయః ప్రోక్తాశ్చరాచరసమన్వితాః ।
బ్రహ్మాద్యాశ్చతురో మూలమవ్యక్తాధిపతేః స్మృతాః ॥22॥

ఇవి భగవద్విభూతులుగా పేర్కొనబడినవి. చరాచరాలతో కూడిన బ్రహ్మాదులైన నల్గురు అవ్యక్తాధిపతికి మూలమని చెప్పబడింది.

బ్రహ్మణా చాథ సూర్యేణ విష్ణునాఽథ శివేన వా ।
అభేదాత్పూజితేన స్యాత్పూజితం సచరాచరమ్ ॥23॥

భేదం లేకుండా బ్రహ్మను, సూర్యుని, విష్ణువును, శివుణ్ణీ పూజిస్తే చరాచరాత్మకమైన సర్వమునూ పూజించినట్లే.

బ్రహ్మాదీనాం పరం ధామ త్రయాణామపి సంస్థితిః ।
వేదమూర్తావతః పూషా పూజనీయః ప్రయత్నతః ॥24॥

బ్రహ్మాదుల పరమధామము, మూడు వేదాల ఉనికి, వేదమూర్తియైన సూర్యభగవానుడే. అందుచే ఆ దేవుని ప్రయత్నంలో పూజించాలి.

తస్మాదగ్నిద్విజముఖాన్ కృత్వా సమ్పూజయేదిమాన్ ।
దానై ర్వ్రతోపవాసైశ్చ జపహోమాదినా నరః ॥25॥

అందువల్ల మనుజుడు దానములతో, వ్రతోపవాసాలతో, జపహోమాదులతో అగ్నిద్విజముఖులైన ఈ దేవతలను పూజించాలి.

ఇతి క్రియాయోగపరాయణస్య వేదాన్తశాస్త్రస్మృతివత్సలస్య ।
వికర్మభీతస్య సదా న కిఞ్చిత్ ప్రాప్తవ్యమస్తీహ పరే చ లోకే ॥26॥

ఈ రీతిగా క్రియాయోగం ఆచరించేవాడూ, వేదాంతశాస్త్రమునందు, స్మృతులయందు ప్రీతిగలవాడూ, పాపకర్మలపట్ల భీతి గల్గినవాడు అయినవానికి ఇహలోకంలో గాని, పరలోకంలో గాని – పొందరాని దేదీ లేదు. అనగా వారు సర్వమూ పొందగలరని భావం.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే కర్మయోగో నామ ద్విపంచాశోఽధ్యాయః ॥ 52 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని కర్మయోగమను యాభైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్రిపంచాశోఽధ్యాయః - యాభైమూడవ అధ్యాయం

పురాణదాన ప్రశస్తిః - పురాణదాన ప్రశస్తి

మునయ ఊచుః -మునులు చెప్పారు

పురాణసంఖ్యామాచక్ష్వ సూత విస్తరశః క్రమాత్ ।
దానధర్మమశేషం తు యథావదనుపూర్వశః ॥1॥

సూతా! క్రమంగానూ, విస్తరంగానూ పురాణాల సంఖ్యను చెప్పు- అట్లే సమగ్రమైన దానధర్మాన్నీ క్రమపద్ధతిలో వివరించు.

సూత ఉవాచ -సూతుడు చెప్పాడు.

ఇదమేవ పురాణేషు పురాణపురుష స్తదా ।
యదుక్తవాన్స విశ్వాత్మా మనవే తన్నిబోధత ॥2॥

విశ్వాత్ముడైన ఆ పురాణ పురుషుడు మనువుకు పూర్వం చెప్పిన పురాణాలలోని విషయమిది. ఇది తెలిసికోండి.

మత్స్య ఉవాచ -మత్స్యం చెప్పింది

పురాణం సర్వశాస్త్రాణాం ప్రథమం బ్రహ్మణా స్మృతమ్ ।
అనన్తరం చ వక్త్రేభ్యో వేదా స్తస్య వినిర్గతాః ॥3॥

సర్వశాస్త్రాలలో మొదటిదిగా పురాణమే బ్రహ్మచే స్మరించబడింది. ఆ తరువాతనే ఆయిన ముఖాలనుండి వేదాలు వెలువడ్డాయి.

పురాణమేక మేవాఽఽసీ త్తదా కల్పాన్తరేఽనఘ ।
త్రివర్గసాధనం పుణ్యం శతకోటిప్రవిస్తరమ్ ॥4॥

అనఘా! కల్పాంతరంలో త్రివర్గ సాధనంగా పవిత్రమైన పురాణ మొక్కటే ఉండినది- అది శతకోటి శ్లోకాలకు విస్తరించింది.

నిర్దగ్ధేషు చ లోకేషు వాజిరూపేణ వై మయా ।
అఙ్గాని చతురో వేదాన్ పురాణం న్యాయవిస్తరమ్ ॥5॥
మీమాంసాం ధర్మశాస్త్రం చ పరిగృహ్య మయా కృతమ్ ।
మత్స్యరూపేణ చ పునః కల్పాదావుదకార్ణవే ॥6॥

లోకాలన్నీ కాలిపోగా నేను హయగ్రీవరూపంతో వచ్చి నాలుగు వేదాలను, ఆరు వేదాంగాలను, పురాణాలను, న్యాయశాస్త్రాన్నీ, మీమాంసనూ, ధర్మ శాస్త్రాన్నీ పరిగ్రహించి రక్షించాను.

అశేషమేతత్కథిత ముదకాన్తర్గతేన చ ।
శ్రుత్వా జగాద చ మునీన్ప్రతి దేవాంశ్చతుర్ముఖః ॥7॥

కల్పాదియందు మత్స్యరూపంలో ఉదకసాగరంలో నీటిలోనే ఉండి మునులను ఉద్దేశించి పై వేదాదుల నన్నింటిని బోధించాను. అది విని దేవతలను, మునులను ఉద్దేశించి చతుర్ముఖుడు చెప్పాడు.

ప్రవృత్తి స్సర్వశాస్త్రాణాం పురాణస్యాభవత్తతః ।
కాలేనాగ్రహణం దృష్ట్వా పురాణస్య తతో నృప! ॥8॥

వ్యాసరూప మహం కృత్వా సంహరామి యుగే యుగే ।
చతుర్లక్షప్రమాణేన ద్వాపరే ద్వాపరే సదా ॥9॥

సర్వశాస్త్ర ప్రవృత్తి, పురాణ ప్రవృత్తి అపుడు సంభవించింది. రాజా! కాలక్రమంలో పురాణాన్ని పిదప విస్మరించడం చూచి, నేను వ్యాసరూపం ధరించి, ప్రతియుగంలో వాటిని సంగ్రహిస్తాను, ప్రతి ద్వాపరంలో నాల్గు లక్షల శ్లోకాలలో ఇది నిర్మితమవుతుంది.

తథాఽష్టాదశధా కృత్వా భూలోకేఽస్మిన్ప్రకాశ్యతే ।
అద్యాపి దేవలోకేఽస్మిన్ శతకోటిప్రవిస్తరమ్ ॥10॥

అది ఈ భూలోకంలో పదునెన్మిది విభాగాలుగా ప్రకాశింపజేయబడుతున్నది. ఇపుడు గూడా దేవలోకంలో అది శతకోటి ప్రవిస్తరంగా ఉన్నది.

తదర్థోఽత్ర చతుర్లక్షం సంక్షేపేణ నివేశితమ్ ।
పురాణాని దశాష్టౌ చ సామ్ప్రతం తదిహోచ్యతే ॥11॥

అందలి అర్థమే ఇక్కడ సంగ్రహంగా నాలుగు లక్షల ప్రమాణంతో నిరూపించడ మయింది. మొత్తం పురాణాలు పదునెనిమిది, వాటినిక్కడ వివరిస్తాను.

నామతస్తాని వక్ష్యామి శృణుధ్వ మృషిసత్తమాః ।
బ్రహ్మణాఽభిహితం పూర్వం యావన్మాత్రం మరీచయే ॥12॥

వాటిని పేర్లతో పేర్కొంటాను, మునివర్యులారా! వినండి! పూర్వం మరీచిమహర్షికి బ్రహ్మ ఎంత మాత్రం చెప్పాడో అదే ఇక్కడ చెప్పడమయింది.

బ్రాహ్మం తద్దశసాహస్రం పురాణం పరికీర్త్యతే ।
లిఖిత్వా తచ్చ యో దద్యాజ్జలధేనుసమన్వితమ్ ।
వైశాఖపూర్ణిమాయాం చ బ్రహ్మలోకే మహీయతే ॥13॥

బ్రహ్మ పురాణం పదివేల గ్రంథ పరిమాణం గల పురాణమని చెప్పబడుతున్నది. ఎవడు దీనిని వ్రాసి వైశాఖ పూర్ణిమనాడు జలంతో, గోవుతో దానమిస్తాడో అతడు బ్రహ్మలోకంలో పూజింపబడతాడు.

ఏతదేవ యదా పద్మమభూద్ధైరణ్మయం జగత్ ।
తద్వృత్తాన్తాశ్రయం తద్వత్పాద్మమిత్యుచ్యతే బుధైః ।
పాద్మం తత్పఞ్చ పఞ్చాశ త్సహస్రాణీహ కథ్యతే ॥14॥

ఈ విశ్వమావిర్భవించినపుడు స్వర్ణపద్మరూపంలో ఆవిర్భవించింది. అపుడు ఆవృత్తాంతము నాశ్రయించి ఏర్పడిన పురాణం పద్మ పురాణమయిందని బుధులు చెప్పారు. ఇందులో ఏబదియైదు వేల శ్లోకాలున్నాయి.

తత్పురాణం చ యో దద్యాత్సువర్ణకమలాన్వితమ్ ।
జ్యేష్ఠే మాసి తిలైర్యుక్తం అశ్వమేధఫలం లభేత్ ॥15॥

తిలసహితంగా సువర్ణపద్మంతో కలిపి జ్యేష్ఠమాసంలో ఎవడు దీన్ని దానం చేస్తాడో, అతడు అశ్వమేధ ఫలం పొందుతాడు.

వారాహకల్పవృత్తా నన్తమధికృత్య పరాశరః ।
యత్ప్రాహ ధర్మానఖిలాంస్తదుక్తం వైష్ణవం విదుః ॥16॥

పరాశరుడు వారాహవృత్తాంతాన్ని అధికరించి ఎందులో అన్ని ధర్మాలనూ చెప్పాడో అది విష్ణు పురాణం.

తదాషాఢే చ యో దద్యా ద్ఘృతధేనుసమన్వితమ్ ।
పౌర్ణమాస్యాం విపూతాత్మా స పదం యాతి వారుణమ్ ।
త్రయోవింశతిసాహస్రం తత్ప్రమాణం విదుర్బుధాః ॥17॥

నెయ్యితో, ఆవుతో గూడా దానిని ఆషాఢమాసంలో పూర్ణిమనాడు దానం చేస్తే వాడు పవిత్రాత్ముడై వరుణ పదం చేరుకొంటాడు. దాని శ్లోకసంఖ్య ఇరువది మూడు వేలని బుధు లెరుగుదురు.

శ్వేతకల్పప్రసఙ్గేన ధర్మాన్వాయురిహాబ్రవీత్ ।
యత్ర తద్వాయవీయం స్యాద్రుద్రమాహాత్మ్యసంయుతమ్ ।
చతుర్వింశత్సహస్రాణి పురాణం తదిహోచ్యతే ॥18॥

శ్వేతకల్ప ప్రసంగంలో వాయుదేవుడు చెప్పిన ధర్మాలు గలది వాయవీయ పురాణం. ఇందులో రుద్రమాహాత్మ్యం చెప్పడమయింది. ఇరువది నాలుగు వేల శ్లోకాలు గల పురాణమిది.

శ్రావణ్యాం శ్రావణే మాసి గుడధేనుసమన్వితమ్ ।
యో దద్యాద్వృషసంయుక్తం బ్రాహ్మణాయ కుటుంబినే ।
శివలోకే స పూతాత్మా కల్పమేకం వసే న్నరః ॥19॥

శ్రావణమాసంలో పూర్ణిమనాడు బెల్లం, గోవు, వృషభంతో, సహా దీనినెవడు కుటుంబియైన ద్విజునికి దానమిస్తాడో. అట్టి వాడు శివలోకంలో ఒక కల్పకాలం నివసిస్తాడు.

యత్రాధికృత్య గాయత్రీం వర్ణ్యతే ధర్మవిస్తరః ।
వృత్రాసురవధోపేతం తద్భాగవత ముచ్యతే ॥20॥

ఎందులో గాయత్రినధికరించి వృత్రాసురవధసహితంగా ధర్మవిస్తరం చెప్పబడిందో,దాన్ని భాగవతమంటారు.

సారస్వతస్య కల్పస్య మధ్యే యే స్యుర్నరోత్తమాః ।
తద్వృత్తాన్తోద్భవం లోకే తద్భాగవతముచ్యతే ॥21॥

సారస్వతకల్ప మధ్యంలో ఉండిన నరశ్రేష్ఠుల వృత్తాంతం వివరించేది ఈ భాగవతం.

లిఖిత్వా తచ్చ యో దద్యాద్ధేమసింహసమన్వితమ్ ।
పౌర్ణమాస్యాం ప్రోష్ఠపద్యాం స యాతి పరమాం గతిమ్ ।
అష్టాదశ సహస్రాణి పురాణం తత్రృచక్షతే ॥22॥

ఎవడు దాన్ని వ్రాసి స్వర్ణసింహంతో సహా ప్రోష్ఠ భాద్రపదం పూర్ణిమనాడు ఇస్తాడో అతడు పరమగతిని పొందుతాడు. ఇందులో పదునెనిమిది వేల శ్లోకాలున్నాయి.

యత్రాహ నారదో ధర్మాన్బృహత్కల్పాశ్రయానిహ ।
పఞ్చవింశత్సహస్రాణి నారదీయం తదుచ్యతే ॥23॥

నారదుడు బృహత్కల్పాశ్రయ ధర్మాలను, వృత్తాంతాన్ని చెప్పినది నారదీయం. ఇరువది అయిదు వేల శ్లోకాలు గలదిది.

ఆశ్వినే పఞ్చదశ్యాం తు దద్యాద్ధేనుసమన్వితమ్ ।
పరమాం సిద్ధిమాప్నోతి పునరావృత్తిదుర్లభామ్ ॥24॥

ఆశ్విన మాసంలో పూర్ణిమనాడు ధేనుసమేతంగా దీని నిచ్చినవాడు పునరావృత్తిలేని పరమసిద్ధినిపొందుతాడు.

యత్రాధికృత్య శకునీన్ధర్మాధర్మవిచారణా ।
వ్యాఖ్యాతా వై మునిప్రశ్నే మునిభిః ధర్మచారిభిః ॥25॥

మార్కణ్డేయేన కథితం తత్సర్వం విస్తరేణ తు ।
పురాణం నవసాహస్రం మార్కణ్డేయమిహోచ్యతే ॥26॥

ఎక్కడ పక్షుల నుద్దేశించి మునుల ప్రశ్నలో ధర్మాచారులైన మునులచే ధర్మాధర్మ విచారణ విస్తరంగా చేయబడిందో, అది విస్తరంగా మార్కండేయుడు చెప్పిన మార్కండేయపురాణం. ఇందులో 9వేల శ్లోకాలున్నాయి.

ప్రతిలిఖ్య చ యో దద్యాత్సౌవర్ణ కరిసంయుతమ్ ।
కార్తిక్యాం పుణ్డరీకస్య యజ్ఞస్య ఫలభాగ్భవేత్ ॥27॥

దీన్ని వ్రాసి స్వర్ణగజ సహితంగా ఎవడు కార్తికమాసంలో ఇస్తాడో వాడు పుండరీకయజ్ఞఫలం పొందుతాడు.

యత్తదీశానకం కల్పం వృత్తాంతమధికృత్య చ ।
వసిష్ఠాయాగ్నినా ప్రోక్తమాగ్నేయం తత్రృచక్షతే ॥28॥

ఈశానకల్పానికి చెందిన వృతాంతం వివరించేదీ, అగ్ని వసిష్ఠునికి చెప్పినదీ ఆగ్నేయపురాణం.

లిఖిత్వా తచ్చ యో దద్యా ద్ధేమపద్మసమన్వితమ్ ।
మార్గశీర్ష్యాం విధానేన తిలధేనుసమన్వితమ్ ॥29॥

తచ్చ షోడశసాహస్రం సర్వక్రతుఫలప్రదమ్ ।
యః ప్రదద్యాన్నరః సోఽథ స్వర్గలోకే మహీయతే ॥30॥

స్వర్ణకమల సహితంగా ఎవడు దీన్ని మార్గశీర్షంలో తిలధేను సమన్వితంగా ఇస్తాడో, వాడు స్వర్గలోకంలో పూజింపబడతాడు. ఇందులో పదునారువేల శ్లోకాలున్నాయి. ఇది సర్వయజ్ఞఫలప్రదం.

యత్రాధికృత్య మాహాత్మ్యమాదిత్యస్య చతుర్ముఖః ।
అఘోరకల్పవృత్తాన్త ప్రసంగేన జగత్స్థితిమ్ ।

మనవే కథయామాస భూతగ్రామస్య లక్షణమ్ ॥31॥
చతుర్దశ సహస్రాణి తథా పఞ్చ శతాని చ ।
భవిష్యచరితప్రాయం భవిష్యం తదిహోచ్యతే ॥32॥

ఎందులో బ్రహ్మ ఆదిత్యమాహాత్మ్యము నధికరించి అఘోరకల్పవృత్తాంత ప్రసంగంలో జగత్ స్థితినీ, భూతగ్రామలక్షణాన్నీ మనువుకు చెప్పాడో, అది భవిష్యపురాణం. ఇందులో 14వేల ఐదువందల శ్లోకాలున్నాయి. ఇది భవిష్యచ్చరిత్రతో కూడినది గాన భవిష్యపురాణం అయ్యింది.

తత్పౌషే మాసి యో దద్యాత్పౌర్ణమాస్యాం విమత్సరః ।
గుడకుమ్భసమాయుక్త మగ్నిష్టోమఫలం భవేత్ ॥33॥

దాన్ని పుష్యమాసంలో పూర్ణిమనాడు గుడకుంభంతో సహా ఇస్తే అగ్నిష్టోమఫలం కలుగుతుంది.

రథన్తరస్య కల్పస్య వృత్తాన్తమధికృత్య చ ।
సావర్ణినా నారదాయ కృష్ణమాహాత్మ్యముత్తమమ్ ॥34॥

యత్ర బ్రహ్మవరాహస్య చోదన్తం వర్ణితం ముహుః ।
తదష్టాదశసాహస్రం బ్రహ్మవైవర్త ముచ్యతే ॥35॥

రథంతరకల్పానికి చెందిన వృత్తాంతమును అధికరించి సావర్ణి నారదునికి ఉత్తమమైన కృష్ణమాహాత్మ్యం చెప్పాడు. అక్కడే బ్రహ్మవరాహవృత్తాంతం కూడ బహుళంగా వర్ణించబడింది. 18వేల శ్లోకాలు గల ఈ పురాణాన్ని బ్రహ్మవైవర్త మంటారు.

పురాణం బ్రహ్మవైవర్తం యో దద్యాన్మాఘమాసి చ ।
పౌర్ణమాస్యాం శుభదినే బ్రహ్మలోకే మహీయతే ॥36॥

ఎవడు మాఘమాసంలోని పున్నమినాడు శుభదినాన బ్రహ్మ వైవర్త ప్రదానం చేస్తాడో అతడు బ్రహ్మలోకంలో పూజింపబడతాడు.

యత్రాగ్ని లిఙ్గమధ్యస్థః ప్రాహ దేవో మహేశ్వరః ।
యత్తదీశానకల్పస్య వృత్తాంతమధికృత్య చ ॥37॥

కల్పితం లైంగమిత్యుక్తం పురాణం బ్రహ్మణా స్వయమ్ ।
తదేకాదశసాహస్రం ఫాల్గున్యాం యః ప్రయచ్ఛతి ।
తిలధేనుసమాయుక్తం స యాతి శివసామ్యతామ్ ॥38॥

ఎక్కడ మహేశ్వరదేవుడు అగ్నిలింగమధ్యలోనుండి ఈశానకల్పవృత్తాంతాన్ని గురించి చెప్పాడో అది లింగ పురాణమని బ్రహ్మ స్వయంగా చెప్పాడు. అందులో పదునొకండు వేల శ్లోకాలున్నాయి. దాన్ని ఫాల్గుణ మాసంలో తిలధేనువులతో సహా ఇచ్చువాడు శివసామ్యం పొందుతాడు.

మహావరాహస్య పునర్మాహాత్మ్యమధికృత్య చ ।
విష్ణునాఽభిహితం క్షోణ్యై తద్వారాహ మిహోచ్యతే ॥39॥

మహావరాహ మాహాత్మ్యమును గురించి విష్ణువు భూదేవికి చెప్పినది వరాహపురాణం.

మానవస్య ప్రసంగేన కల్పస్య మునిసత్తమాః ।
చతుర్వింశత్సహస్రాణి తత్పురాణమిహోచ్యతే ॥40॥

మునిశ్రేష్ఠులారా! మానవకల్ప ప్రసంగంతో కూడిన ఈ పురాణంలో ఇరువదినాలుగు వేల శ్లోకాలున్నాయి.

కాఞ్చనం గరుడం కృత్వా తిలధేనుసమన్వితమ్ ।
పౌర్ణమాస్యాం మధౌ దద్యాద్బ్రాహ్మణాయ కుటుంబినే ।
వరాహస్య ప్రసాదేన పదమాప్నోతి వైష్ణవమ్ ॥41॥

బంగారంతో గరుడుణ్ణి చేసి తిలగోసమేతంగా చైత్రమాసంలో పూర్ణిమనాడు కుటుంబియైన విప్రునికి ఈ పురాణాన్నిస్తే- వరాహస్వామి అనుగ్రహంతో వైష్ణవపదం పొందుతాడు.

యత్ర మాహేశ్వరా న్ధర్మానధికృత్య చ షణ్ముఖః ।
కల్పే తత్పురుషం వృత్తం చరితైరుపబృంహితమ్ ॥42॥

షణ్ముఖుడు మహేశ్వరధర్మాలను గురించి, సత్పురుష కల్పవృత్తాన్నిచేర్చి చరిత్రప్రధానంగా చెప్పినది స్కాందం.

స్కాన్దం నామ పురాణం స నిర్మమే స త్రయోదశమ్ ।
సహస్రాణాం శతం చైకమితి మర్త్యేషు గద్యతే ॥43॥

ఇందులో ఒక లక్షా వెయ్యి శ్లోకాలున్నాయి. ఇది పదమూడవ పురాణం

పరిలిఖ్య చ యో దద్యాద్ధేమశూలసమన్వితమ్ ।
శైవం పదమవాప్నోతి మీనే చోపాగతే రవౌ ॥44॥

దీన్ని లిఖించి స్వర్ణశూల సమేతంగా మీనంలో రవి ఉన్నప్పుడిస్తే శైవపద ప్రాప్తి కల్గుతుంది.

త్రివిక్రమస్య మాహాత్మ్యమధికృత్య చతుర్ముఖః ।
త్రివర్గమభ్యధాత్తచ్చ వామనం పరికీర్తితమ్ ॥45॥

బ్రహ్మ త్రివిక్రముని మహిమను, త్రివర్గాన్ని కూడా చేర్చి చెప్పినది వామనపురాణం.

పురాణం దశసాహస్రం కూర్మకల్పానుగం శివమ్ ।
యః శరద్విషువే దద్యాద్వైష్ణవం యాత్యసౌ పదమ్ ॥46॥

ఇక్కడ పదివేల శ్లోకాలున్నాయి. ఇది కూర్మకల్పాన్ని అనుసరించినది. శుభకరమైనది. దీన్ని శరదృతు విషువత్కాలంలో ఇచ్చువాడు వైష్ణవపదం చేరుతాడు.

యత్ర ధర్మార్థకామానాం మోక్షస్య చ రసాతలే ।
మాహాత్మ్యం కథయామాస కూర్మరూపీ జనార్దనః ॥47॥

ఇన్ద్రద్యుమ్నప్రసఙ్గేన ఋషిభ్యః శక్రసన్నిధౌ ।
అష్టాదశ సహస్రాణి లక్ష్మీకల్పానుషఙ్గికమ్ ॥48॥

జనార్దనుడు కూర్మరూపంతో రసాతలంలో ధర్మార్థ కామమోక్షాల మాహాత్మ్యాన్ని గురించి – ఇంద్రద్యుమ్నుని ప్రసంగ సందర్భంలో ఋషులకు ఇంద్ర సన్నిధిలో చెప్పినది కూర్మ పురాణం– పదునెనిమిది వేల శ్లోకాలిందులో వున్నాయి. ఇది లక్ష్మీ కల్పానికి సంబంధించినది.

యో దద్యాదయనే కూర్మం హేమకూర్మసమన్వితమ్ ।
గోసహస్రప్రదానస్య ఫలం సమ్ప్రాప్నుయాన్నరః ॥49॥

ఎవడు స్వర్ణకూర్మంతో సహా అయనప్రవేశ పుణ్యకాలంలో దీన్ని దానమిస్తాడో, అతడు వెయ్యి గోవులు దానం చేసిన ఫలం పొందుతాడు.

శ్రుతీనాం యత్ర కల్పాదౌ ప్రవృత్త్యర్థం జనార్దనః ।
మత్స్యరూపేణ మనవే నరసింహోపవర్ణనమ్ ॥50॥

అధికృత్యాబ్రవీత్సప్త కల్పవృత్తం మునీశ్వరాః! ।
తన్మాత్స్యమితి జానీధ్వం సహస్రాణి చతుర్దశ! ॥51॥

మునీశ్వరులారా! వేదాల ప్రవృత్తికొరకై మహావిష్ణువు కల్పాదిలో మత్స్యరూపం దాల్చి మనువు నుద్దేశించి నరసింహోపవర్ణనమునధికరించి ఏడు కల్పాల వృత్తాంతం ఎందులో చెప్పాడో, అది మత్స్యపురాణమని తెలిసికోండి. ఇందలి శ్లోకసంఖ్య పదునాలుగు వేలు.

విషువే హేమమత్స్యేన ధేన్వా చైవ సమన్వితమ్ ।
యో దద్యా త్పృథివీ తేన దత్తా భవతి చాఖిలా ॥52॥

స్వర్ణమత్స్యంతో, గోవుతో సహా విషువత్కాలంలో ఎవడీ పురాణం దానమిస్తాడో, వాడు సమస్త భూమిని దానం చేసినవా డవుతాడు.

యదా చ గారుడే కల్పే విశ్వాణ్డా ద్గరుడోద్భవమ్ ।
అధికృత్యాఽబ్రవీత్కృష్ణో గారుడం తదిహోచ్యతే ॥53॥

గారుడకల్పంలో విశ్వాండంనుండి గరుడోద్భవాన్ని అధికరించి కృష్ణుడు చెప్పినది గరుడ పురాణం.

తదష్టాదశకం చైకం సహస్రాణీహ పఠ్యతే ।
సౌవర్ణహంససంయుక్తం యో దదాతి పుమానిహ ।
స సిద్ధిం లభతే ముఖ్యాం శివలోకే చ సంస్థితిమ్ ॥54॥

ఇందులో పదునెనిమిది వేల శ్లోకాలు గలవు. సువర్ణ హంసయుక్తంగా ఈ పురాణం దానం చేసేవాడు ముఖ్య సిద్ధినందుకొని శివలోకస్థితిని పొందుతాడు.

బ్రహ్మా బ్రహ్మాణ్డమాహాత్మ్య మధికృత్యాఽబ్రవీత్పునః ।
తచ్చ ద్వాదశసాహస్రం బ్రహ్మాణ్డం ద్విశతాధికమ్ ॥55॥

బ్రహ్మాండ మాహాత్మ్యాన్ని ఉద్దేశించి పూర్వం బ్రహ్మ చెప్పిన తత్త్వం పంద్రెండు వేల రెండువందల శ్లోకాలు గల బ్రహ్మాండ పురాణం.

భవిష్యాణాం చ కల్పానాం శ్రూయతే యత్ర విస్తరః ।
తద్బ్రహ్మాణ్డపురాణం చ బ్రహ్మణా సముదాహృతమ్ ॥56॥

ఇందులో భవిష్యత్కల్పాల వృత్తాంతం గూడా వినవచ్చు. ఇది బ్రహ్మ చెప్పిన బ్రహ్మాండపురాణం.

యో దద్యాత్తద్వ్యతీపాతే పీతోర్ణాయుగసంయుతమ్ ।
రాజసూయసహస్రస్య ఫలమాప్నోతి మానవః ।
హేమధేన్వా యుతం తచ్చ బ్రహ్మలోకఫలప్రదమ్ ॥ 57॥

ఎవడీ పురాణాన్ని వ్యతీపాత సమయంలో పసుపు రంగు ఉన్ని శాలువలు రెండింటితో స్వర్ణగోవుతో సహా దానమిస్తాడో, వాడు వెయ్యి రాజసూయయాగాల ఫలం పొందుతాడు.

చతుర్లక్షమిదం ప్రోక్తం వ్యాసేనాద్భుతకర్మణా ।
మత్పితు ర్మమ పిత్రా చ మయా తుభ్యం నివేదితమ్ ॥58॥

అద్భుతకర్ముడైన వ్యాసుడు నాల్గులక్షల శ్లోకాలు గల ఈ పురాణచయాన్ని మాతండ్రికి చెప్పాడు. మాతండ్రి నాకు చెప్పగా, అది మీకు నేను ఇపుడు చెప్పాను.

ఇహ లోకహితార్థాయ సంక్షిప్తం పరమర్షిణా ।
ఇదమద్యాపి దేవేషు శతకోటిప్రవిస్తరమ్ ॥59॥

ఈ లోకహితం కొరకు మహర్షివ్యాసుడు దీనిని సంక్షేపించి చెప్పాడు. ఇప్పుడు గూడా ఇది దేవతలలో శతకోటి ప్రవిస్తరంగానే ఉన్నది.

ఉపభేదాన్ప్రవక్ష్యామి లోకే యే సమ్ప్రతిష్ఠితాః ।
పాద్మే పురాణే యత్రోక్తం నరసింహోపవర్ణనమ్ ।
తచ్చాష్టాదశసాహస్రం నారసింహమిహోచ్యతే ॥60॥

లోకంలో ప్రతిష్ఠితాలై వున్న ఉపపురాణాలను గురించి చెబుతాను. పాద్మ పురాణంలో నరసింహుని వర్ణన ఎక్కడ చెప్పబడిందో, అది పదునెనిమిది వేల శ్లోకాలు గల నారసింహపురాణం.

నన్దాయా యత్ర మాహాత్మ్యం కార్తికేయేన వర్ణ్యతే ।
నన్దాపురాణం తల్లోకైరాఖ్యాతమితి కీర్త్యతే ॥61॥

కార్తికేయుడు నందామాహాత్మ్యాన్ని వివరించే పురాణాన్ని జనులు నందాపురాణ మంటారు.

యత్ర సామ్బం పురస్కృత్య భవిష్యతి కథానకమ్ ।
ప్రోచ్యతే తత్పునర్లోకే సామ్బమేవ శుచివ్రతాః ॥62॥

శుచివ్రతులారా! ఎందులో సాంబుణ్ణి ఉద్దేశించిన కథలుంటాయో, అది లోకంలో సాంబపురాణంగాప్రసిద్ధం.

పురాతనస్య కల్పస్య పురాణాని విదుర్బుధాః ।
ధన్యం యశస్యమాయుష్యం పురాణానామనుక్రమమ్ ।
ఏవమాదిత్యసంజ్ఞం చ తత్రైవ పరిగద్యతే ॥63॥

పురాతన కాలానికి చెందిన పురాణాల అధ్యయనం– ధన్యతను, కీర్తినీ, ఆయువునూ, – వర్ధిల్లజేస్తుంది. ఇది పురాణాల అనుక్రమం. ఆదిత్య పురాణం గూడా ఇందులో ఒకటిగా పేర్కొనబడింది. ఇందులో చెప్పినట్లే.

అష్టాదశభ్యస్తు పృథక్ పురాణం యత్ర దృశ్యతే ।
విజానీధ్వం ద్విజశ్రేష్ఠా స్తదేతేభ్యో వినిర్గతమ్ ॥64॥

ద్విజవర్యులారా! అష్టాదశ పురాణాల కంటే వేరుగా ఏ పురాణం చెప్పబడిందో, అది ఈ పురాణాలనుండి వచ్చినదే అని గ్రహించండి!

పంచాంగాని పురాణస్య వ్యాఖ్యానమితరత్ స్మృతమ్ ।
సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చైవ పురాణం పఞ్చలక్షణమ్ ॥65॥

పురాణం ఐదు లక్షణాలు గల్గి వుంటుంది. సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరాలు, వంశానుచరితం అని ఆ పురాణం ఐదు లక్షణాలు గలదై ఉంటుంది. తదితరమైనది దాని వ్యాఖ్యానమె.

బ్రహ్మవిష్ణ్వర్కరుద్రాణాం మాహాత్మ్యం భువనస్య చ ।
ససంహారప్రదానం చ పురాణే పఞ్చవర్ణకే ॥66॥

పంచలక్షణోపేతమైన ఈ పురాణాలు, బ్రహ్మ– విష్ణువు, సూర్యుడు, రుద్రుడు–వీరి మాహాత్మ్యాన్నీ భువన సృష్టిసంహారాలనూ వర్ణిస్తాయి.

ధర్మశ్చార్థశ్చ కామశ్చ మోక్షశ్చైవ వాత్ర కీర్త్యతే ।
సర్వేష్వపి పురాణేషు తద్విరుద్ధం చ యత్ఫలమ్ ॥67॥

అన్ని పురాణాలలోనూ ధర్మార్థకామమెక్షాలు కీర్తింపబడి వున్నాయి, దానికి విరుద్ధమైన ప్రవృత్తికి గల ఫలం గూడా ఇక్కడ పేర్కొనబడింది.

సాత్త్వికేషు పురాణేషు మాహాత్మ్యమధికం హరేః ।
రాజసేషు చ మహాత్మ్యమధికం బ్రహ్మణో విదుః ॥68॥

సాత్త్విక పురాణాలలో విష్ణువుయొక్క మాహాత్మ్యం అధికంగానూ, రాజసపురాణాలలో బ్రహ్మయొక్క మాహాత్మ్యం ఎక్కువగానూ గ్రహించవచ్చు.

తద్వదగ్నేశ్చ మాహాత్మ్యం తామసేషు శివస్య చ ।
సఙ్కీర్ణేషు సరస్వత్యాః పితౄణాం చ నిగద్యతే ॥69॥

అట్లే తామస పురాణాలలో అగ్ని, శివుడు– వీరి మాహాత్మ్యం ప్రధానంగా చెప్పడమయింది. సంకీర్ణ పురాణాలలో సరస్వతి, పితృదేవతల మాహాత్మ్యం చెప్పబడుతుంది.

అష్టాదశ పురాణాని కృత్వా సత్యవతీసుతః ।
భారతాఖ్యానమతులం చక్రే తదుపబృంహితమ్ ।
లక్షేణైకేన యత్ప్రోక్తం పదార్థపరిబృంహితమ్ ॥70॥

సత్యవతీపుత్రుడైన వ్యాసుడు పదునెన్మిది పురాణాలు రచించి వాటిచే ఉపబృంహితమైన సాటిలేని భారతాఖ్యానం మొత్తం చెప్పాడు. వేదార్థ విస్తృతమైన ఆ భారతం ఒక లక్ష శ్లోకాలు గలది.

వాల్మీకినా తు యత్ప్రోక్తం రామోపాఖ్యానముత్తమమ్ ।
బ్రహ్మణాఽభిహితం యచ్చ శతకోటిప్రవిస్తరమ్ ॥71॥

వాల్మీకి చెప్పిన ఉత్తమమైన రామచరిత్ర బ్రహ్మ చెప్పినపుడు శతకోటి ప్రవిస్తరమయింది.

ఆహృత్య నారదశ్చైవ తేన వాల్మీకయే పునః ।
వాల్మీకినా చ లోకేషు ధర్మకామార్థసాధనమ్ ।
ఏవం సపాదాః పఞ్చైతే లక్షా మర్త్యే ప్రకీర్తితాః ॥72॥

బ్రహ్మ ముందు నారదునికి చెప్పగా, నారదుడు వాల్మీకికి చెప్పగా, వాల్మీకి ధర్మకామార్థసాధనమైనదిగా చెప్పాడు. ఇలా సపాద పంచలక్ష శ్లోకాలు ఈ పురాణాలలో కలవు.

పురాతనస్య కల్పస్య పురాణాని విదుర్బుధాః ।
ధన్యం యశస్యమాయుష్యం పురాణానామనుక్రమమ్ ।
యః పఠేచ్ఛృణుయాద్వాఽపి స యాతి పరమాం గతిమ్ ॥73॥

బుధులు పురాతన కల్పానికి చెందిన ఈ పురాణాలను తెలిసికొని వున్నారు. ధన్యం, యశస్యం, ఆయుష్యం– ఐన పురాణాల అనుక్రమాన్ని విన్నవాడు, చదివినవాడు పరమగతి పొందుతారు.

ఇదం పవిత్రం యశసో నిధానమిదంపితౄణామతివల్లభం చ ।
ఇదం చ దేవేష్వమృతాయితం చ నిత్యం త్విదం పాపహరం చ పుంసామ్ ॥74॥

ఈ పురాణపఠనం పవిత్రం, కీర్తికరం, పితృదేవతలకు ప్రియం, దేవతలలో గూడా అమృతతుల్యంగా విదితం, జనులకు నిత్యమూ ఇది పాపహరమైయున్నది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే పురాణదానప్రశస్తిర్నామ త్రిపంచాశోఽధ్యాయః ॥ 53 ॥

శ్రీమత్స్యపురాణంలోని పురాణదానప్రశస్తి అను యాభై మూడవ అధ్యాయం సంపూర్ణం

చతుఃపంచాశోఽధ్యాయః - యాభైనాల్గవ అధ్యాయం

నక్షత్రపురుషవ్రతం - నక్షత్ర పురుషవ్రతం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అతఃపరం ప్రవక్ష్యామి దానధర్మానశేషతః ।
వ్రతోపవాససంయుక్తాన్యథా మత్స్యోదితానిహ ॥1॥

మహాదేవస్య సంవాదే నారదస్య చ ధీమతః ।
యథావృత్తం ప్రవక్ష్యామి ధర్మకామార్థసాధకమ్ ॥2॥

ఇకపై మత్స్యం చెప్పినట్లు వ్రతాలతో, ఉపవాసాలతో గూడిన దాన ధర్మాలను సమగ్రంగా వివరిస్తాను. మహాదేవుడు, బుద్ధిమంతుడైన నారదుని మధ్య జరిగిన సంవాదం ధర్మకామార్థసాధకమైనది- దానిని చెబుతాను.

కైలాసశిఖరాసీనమపృచ్ఛన్నారదః పురా ।
త్రిశూలినమనఙ్గారిమనఙ్గాఙ్గహరం హరమ్ ॥3॥

కైలాస శిఖరంపై కూర్చున్నవాడు, త్రిశూలధారి, మదనారి, మదనుని శరీరమును భస్మీకరించినవాడు అయిన హరుణ్ణి పూర్వం నారదుడిలా అడిగాడు.

నారద ఉవాచ :- నారదుడు చెప్పాడు.

భగవన్దేవదేవేశ! బ్రహ్మవిష్ణ్విన్ద్రనాయక! ।
శ్రీమదారోగ్యరూపాయుర్భాగ్యసౌభాగ్య సమ్పదా ॥
సంయుక్త స్తవ విష్ణోర్వా పుమాన్భక్తః కథం భవేత్? ॥4॥

దేవదేవా! ప్రభూ! భగవన్! బ్రహ్మ, విష్ణువు, ఇంద్రులకు నాయకుడా! శ్రీమంతుడై ఆరోగ్యం, సౌందర్యం, ఆయువు, భాగ్యం, సౌభాగ్యం కల పురుషుడు విష్ణువు కైనా, నీకైనా ఎలా భక్తుడు కాగలడు?

నారీ వాఽవిధవా సర్వగుణసౌభాగ్యసంయుతా ।
క్రమాన్ముక్తిప్రదం దేవ కిఞ్చిద్వ్రతమిహోచ్యతామ్ ॥5॥

దేవా! సువాసినియగు స్త్రీ సర్వగుణ సౌభాగ్యం గలదియై క్రమంగా ముక్తిప్రదమైన ఏ వ్రతం అనుష్ఠించాలో అట్టి వ్రతాన్ని వివరించు.

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

సమ్యక్పృష్టం త్వయా బ్రహ్మన్సర్వలోకహితావహమ్ ।
శ్రుతమప్యత్ర యచ్ఛాన్త్యై స్తద్వ్రతం శృణు నారద ॥6॥

నారదా! బ్రహ్మన్! నీవు సర్వలోకానికీ హితం కల్గించే విషయం చక్కగా అడిగావు. ఇట్టి వ్రతం ఒకటి ఉన్నది. పూర్వం విన్నదే అయినా మరలా వినదగిన – అ వ్రతాన్ని గూర్చి విను.

నక్షత్రపురుషం నామ వ్రతం నారాయణాత్మకమ్ ।
పాదాదికుర్యాద్విధివద్విష్ణునామానుకీర్తనమ్ ॥7॥

దానిని నక్షత్రపురుషవ్రత మంటారు. అది నారాయణాత్మకమైనది. అందులో వాసుదేవుని ప్రతిమ నర్చించి పాదం మొదలుకొని క్రమంగా విష్ణనామ కీర్తనం చెయ్యాలి.

ప్రతిమాం వాసుదేవస్య మూలర్క్షాది ప్రపూజయేత్ ।
చైత్రమాసం సమాసాద్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ॥8॥

వాసుదేవుని ప్రతిమను చైత్రశుక్ల పక్షమున చంద్రుడు మూలనక్షత్రంతో కూడిఉన్ననాడు ఈ వ్రతమనుష్ఠించాలి. బ్రాహ్మణుల నాహ్వానించి పుణ్యాహవాచనం చేయించాలి.

మూలే నమో విశ్వధరాయ పాదౌ గుల్ఫావనన్తాయ చ రోహిణీషు ।
జఙ్ఘేఽభిపూజ్యే వరదాయ చైవ ద్వే జానునీ విశ్వకుమార ఋక్షే ॥9॥

'విశ్వధరాయ నమః' – అని మూలనక్షత్రంలో పాదాలను పూజించాలి. 'అనన్తాయ నమః' అని రోహిణీనక్షత్రంలో గుల్ఫాలను పూజించాలి. 'వరదాయ నమః' పిక్కలను, రెండు మోకాళ్లను అశ్వినీ నక్షత్రంలో అర్చించాలి.

పూర్వోత్తరాషాఢయుగే తథోరూ నమశ్శివాయేత్యభిపూజనీయౌ ।
పూర్వోత్తరాఫల్గునియుగ్మకే చ మేఢ్రం నమః పఞ్చశరాయ పూజ్యమ్ ॥10॥

'నమఃశివాయ' అంటూ పుర్వాషాఢ, ఉత్తరాషాఢ నక్షత్రాలలో తొడలను 'నమః పంచశరాయ' అంటూ పుర్వోత్తరఫల్గునీ నక్షత్రాలలో మేఢ్రాన్ని అర్చించాలి.

కటిం నమశ్శార్ఙ్గధరాయ విష్ణో స్సమ్పూజయేన్నారద కృత్తికాసు ।
తథాఽర్చయేద్భాద్రపదాద్వయే చ పార్శ్వే నమః కేశినిషూదనాయ ॥11॥

నారదా! 'శార్ఙ్గధరాయ నమః' అని కృత్తికలలో విష్ణువు యొక్క కటిని పూజించాలి. 'కేశినిషూదనాయ నమః' అని పూర్వాభాద్ర ఉత్తరాభాద్రలలో రెండు పార్శ్వాలనూ అర్చించాలి.

కుక్షిద్వయం నారద రేవతీషు దామోదరాయేత్యభిపూజనీయమ్ ।
ఋక్షేఽనురాధాసు చ మాధవాయ నమస్తథోరఃస్థలమేవ పూజ్యమ్ ॥12॥

'దామోదరాయ నమః' అంటూ రేవతిలో కుక్షిద్వయాన్నీ, 'మాధవాయ నమః' అంటూ అనూరాధా నక్షత్రంలో ఉరఃస్థలాన్నీ అర్చించాలి.

పృష్ఠం ధనిష్ఠాసు చ పూజనీయ మఘౌఘవిధ్వంసకరాయ తచ్చ ।
శ్రీశఙ్ఖచక్రాసిగదాధరాయ నమో విశాఖాసు భుజాశ్చ పూజ్యాః ॥13॥

'అఘౌఘ విధ్వంసకరాయ నమః' అంటూ ధనిష్ఠలో పృష్ఠాన్నీ 'శ్రీశంఖచక్రాసిగదాధరాయ నమః, అని విశాఖలో భుజాలను పూజించాలి.

హస్తే తు హస్తౌ మధుసూధనాయ నమోఽభిపూజ్యౌ ఇతి కైటభారేః ।
పునర్వసావఙ్గుళిపూర్వభాగా స్సామ్నామధీశాయ నమోఽభిపూజ్యాః ॥14॥

'మధుసూదనాయ నమః'- అంటూ హస్తానక్షత్రంలో కైటభారిహస్తాలనూ, 'సామ్నామధీశాయ నమః' అంటూ పునర్వసువులో అంగుళీ పూర్వభాగాలనూ పూజించాలి.

భుజఙ్గనక్షత్రదినే నఖాని సమ్పూజయేన్మత్స్యశరీరభాజః ।
కూర్మస్య పాదౌ శరణం వ్రజామి జ్యేష్ఠాసు కణ్ఠే హరిరర్చనీయః ॥15॥

'నమో మత్స్యాయ' అంటూ మత్స్యావతార దేవునియొక్క నఖాలను ఆశ్లేషా నక్షత్రంలో పూజించాలి. 'కూర్మస్య పాదౌ శరణం వ్రజామి' అంటూ జ్యేష్ఠానక్షత్రంలో హరిని కంఠంలో అర్చించాలి.

శ్రోత్రే వరాహాయ నమోఽభిపూజ్యౌ జనార్దనస్య శ్రవణేన సమ్యక్ ।
పుష్యే ముఖం దానవసూదనాయ నమో నృసింహాయ చ పూజనీయమ్ ॥16॥

'వరాహాయ నమః' అంటూ జనార్దనుని శ్రవణాలను శ్రవణానక్షత్రంలోను, 'దానవసూదనాయ నృసింహాయ నమః' అంటూ పుష్యంలో ముఖాన్నీ పూజించాలి.

నమో నమః కారణవామనాయ స్వాతీషు దన్తాగ్రమథార్చనీయమ్ ।
ఆస్యం హరేర్భార్గవనన్దనాయ సమ్పూజనీయం ద్విజ వారుణే తు ॥17॥

'కారణవామనాయ నమో నమః' అంటూ స్వాతినక్షత్రంలో దన్తాగ్రాన్ని అర్చించాలి. 'భార్గవనందనాయ నమః' అని హరి ముఖాన్ని శతభిషలో పూజించాలి.

నమోఽస్తు రామాయ మఘాసు నాసా సమ్పూజనీయా రఘునందనస్య ।
మృగోత్తమాఙ్గే నయనేఽభిపూజ్యే నమోఽస్తు తే రామ విఘూర్ణితాక్ష ॥18॥

'రామాయ నమః' అంటూ మఘా నక్షత్రంలో రఘునందనుని ముక్కును అర్చించాలి. 'విఘూర్ణితాక్షాయ' అంటూ మార్గ శిరంలో పరశురాముని నేత్రాలను పూజించాలి.

బుద్ధాయ శాన్తాయ నమో లలాటం చిత్రాసు సమ్పూజ్యతమం మురారేః ।
శిరోఽభిపూజ్యం భరణీషు విష్ణో ర్నమోఽస్తు విశ్వేశ్వర కల్కిరూపిణే ॥19॥

'శాంతాయ బుద్ధాయ నమః' అంటూ చిత్రా నక్షత్రంలో మురారి లలాట పూజ చేయాలి. 'విశ్వేశ్వరాయ కల్కిరూపిణే నమః' అంటూ భరణిలో విష్ణువు శిరస్సును పూజించాలి.

ఆర్ద్రాసు కేశాః పురుషోత్తమస్య సమ్పూజనీయా హరయే నమస్తే ।
ఉపోషితేనర్క్షదినేషు భక్త్యా సమ్పూజనీయా ద్విజపుఙ్గవా స్స్యుః ॥20॥

'హరయే నమః' అంటూ ఆర్ద్రా నక్షత్రంలో పురుషోత్తముని కేశాలను అర్చించాలి. ఆ యా నక్షత్ర దినాలలో భక్తితో ద్విజశ్రేష్ఠులను అర్చించాలి.

పూర్ణే వ్రతే సర్వగుణాన్వితాయ వాగ్రూపశీలాయ చ సామగాయ ।
హైమీం విశాలాయతబాహుదణ్డాం ముక్తాఫలేన్ద్రోపలవజ్రయుక్తామ్ ॥21॥

గుడస్య పూర్ణే కలశే నివిష్టా మర్చాం హరేర్వస్త్రగవా సహైవ ।
శయ్యాం తథోపస్కరభాజనాదియుక్తాం ప్రదద్యాద్ద్విజపుఙ్గవాయ ॥22॥

వ్రతం పూర్తికాగానే, సకల గుణాన్వితుడూ, వాగ్రూపశీలుడూ, సామగానపరుడూ, అయిన ద్విజపుంగవునికి విశాలమూ- విస్తృతమూ అయిన బాహుదండం కలది, ముత్యాలు - ఇంద్రనీలాలు వజ్రాలు కలది అయిన హరి అర్చా ప్రతిమను గుడపూర్ణకలశంలో ఉంచి వస్త్రాలతో, గోవుతో సహా ఇవ్వాలి. శయ్యను, ఉపస్కర పాత్రలతో సహా దానం చేయాలి.

యద్యస్తి యత్కించిదిహాస్తి దేయం తత్త ద్విజాయాత్మహితాయ సర్వమ్ ।
మనోరథం నః సఫలీకురుష్వ హిరణ్యగర్భాచ్యుత రుద్రరూపిన్ ॥23॥

ఇంకా ఇవ్వదగినదేదైనా వుంటే అదంతా ఆత్మహితం కోరే ద్విజునికి దానం చేయాలి. హిరణ్యగర్భా! అచ్యుతా! రుద్రరూపా! మా మనోరథాన్ని సఫలీకరించు. అంటూ ప్రార్థించాలి.

సలక్ష్మీకం సభార్యాయ కాఞ్చనం పురుషోత్తమమ్ ।
శయ్యాం చ దద్యాన్మన్త్రేణ గ్రన్థిభేదవివర్జితామ్ ॥24॥

లక్ష్మితో గూడిన కాంచన విష్ణు ప్రతిమను భార్యా సమేతుడైన ద్విజునికి ముడులు పగుళ్ళు లేని మంచాన్ని గూడా ఇవ్వాలి.

యథా న విష్ణుభక్తానాం వృజినం జాయతే క్వచిత్ ।
తథానురూపమారోగ్యమర్ఘ్యం దద్యాచ్చ కేశవే ॥25॥

"విష్ణు భక్తులకు ఎక్కడనూ పాపం కలగదు. అట్లే అనురూపమైన ఆరోగ్యం కల్గునట్లు కేశవునికి అర్ఘ్యమివ్వాలి.

యథా న లక్ష్మ్యా శయనం తవ శూన్యం జనార్దన ।
శయ్యామమాఽప్యశూన్యాస్తు కృష్ణ జన్మని జన్మని ॥26॥

జనార్దనా! నీ శయ్యాగృహం లక్ష్మి లేనిదిగా ఉండదు, అట్లే నా శయనం కూడా జన్మజన్మలయందు అశూన్యంగా ఉండుగాక!" అన్న అర్థం కల మంత్రం చెప్పాలి.

ఏవం నివేద్య తత్సర్వం వస్త్రమాల్యానులేపనమ్ ।
నక్షత్రపురుషజ్ఞాయ విప్రాయాథ విసర్జయేత్ ॥27॥

భుంజీతాతైలలవణం సర్వర్క్ష్వేష్వప్యుపోషితః ।
భోజనం చ యథాశక్తి విత్తశాఠ్యం వివర్జయేత్ ॥28॥

అని చెప్పి వస్త్రమాల్యానులేపనాదులు సర్వం నివేదించి నక్షత్ర పురుష స్వరూపం తెలిసిన విప్రుని కివ్వాలి. ప్రతి నక్షత్రకాలంలోనూ ఉపవసించాలి. వ్రతకాలంలో ఉప్పు నూనె లేని ఆహారం గైకొనాలి. అన్నదానం చెయ్యాలి. పిసినారి తనం లేకుండా చెయ్యాలి.

ఇతి నక్షత్రపురుషముపాస్య విధివత్స్వయమ్ ।
సర్వాన్కామానవాప్నోతి విష్ణులోకే మహీయతే ॥29॥

ఇలా నక్షత్రపురుషుణ్ణి విధివిధానంతో ఉపాసించి సకలకామాలనూ పొందుతాడు. విష్ణులోకంలో పూజింపబడతాడు.

బ్రహ్మహత్యాదికం కించిదిహ వాఽముత్ర వా కృతమ్ ।
ఆత్మనా వాఽథ పితృభి స్తత్సర్వం క్షయమాప్నుయాత్ ॥30॥

దీనిచే ఇక్కడ కాని, ఇతరత్ర కాని చేసిన బ్రహ్మహత్యాదికమగు పాపం తొలగిపోతుంది. తాను గానీ, పితరులు గానీ చేసిన పాపమంతా కూడా నశిస్తుంది.

ఇతి పఠతి శృణోతి యశ్చ భక్త్యా పురుషవరో వ్రతమఙ్గనాఽథ కుర్యాత్ ।
కలికలుషవిదారణం మురారేః సకలవిభూతిఫలప్రదం చ పుంసామ్ ॥31॥

ఇది భక్తితో చదివేవానికి వినేవానికి మగవాడు గాని, అంగన గాని, మురారివ్రతం చేసేవారికి కలి కలుషం తొలగి సకలవిభూతులూ లభిస్తాయి.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే నక్షత్ర పురుష వ్రతంనామ చతుఃపంచాశోఽధ్యాయః ॥ 54 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని నక్షత్ర పురుష వ్రతమనే యాభైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచపంచాశోஉధ్యాయః – యాభైఅయిదవ అధ్యాయం

ఆదిత్యశయనవ్రతమ్ – ఆదిత్యశయనవ్రతం

నారద ఉవాచ :– నారదుడు చెప్పాడు.

ఉపవాసేష్వశక్తస్య తదేవ ఫలమిచ్ఛతః ।
అనభ్యాసేన రోగాద్వా కిమిష్టం వ్రతముత్తమమ్ ॥1॥

అభ్యాసం లేకపోవడంవల్లనో, రోగంవల్లనో ఉపవాసం అనుష్ఠించడంలో శక్తి లేనివానికి అదే ఫలం కోరినపుడు అనుష్ఠింపదగిన ఉత్తమమైన వ్రతమేది?

ఈశ్వర ఉవాచ :– ఈశ్వరుడు చెప్పాడు.

ఉపవాసేஉప్యశక్తానాం నక్తం భోజనమిష్యతే ।
యస్మిన్వ్రతే తదప్యస్తి శ్రూయతామక్షయం మహత్ ॥2॥

ఉపవాసం చేసే శక్తి లేనివారు రాత్రిభోజనం చేయడానికి అవకాశమిచ్చే వ్రతం కలదు. అక్షయమైన ఆ మహావ్రతం గూర్చి చెబుతాను విను.

ఆదిత్యశయనం నామ యథావచ్ఛఙ్కరార్చనమ్ ।
యేషు నక్షత్రయోగేషు పురాణజ్ఞాః ప్రచక్షతే ॥3॥

ఇది ఆదిత్యశయన వ్రతం. ఇందులో యథావిధిగా శంకరార్చనం ఆ యా నక్షత్రయోగాలలో కర్తవ్యమని పురాణజ్ఞులు చెప్పారు.

యదా హస్తేన సప్తమ్యామాదిత్యస్య దినం భవేత్ ।
సూర్యస్య చాథ సంక్రాన్తి స్తిథిః సా సార్వకామికీ ॥4॥

సప్తమినాడు ఆదివారమైనపుడు హస్తా నక్షత్రయోగంలో, సూర్యసంక్రమణం గూడా ఉండే తిథినాడు ఈ వ్రతం చేస్తే అది సార్వకామికి – అనగా అన్ని కోరికలు తీర్చేదిగా ఉంటుంది.

ఉమామహేశ్వరస్యార్చామర్చయేత్సూర్యనామభిః ।
సూర్యార్చాం శివలింగం చ న గృహే పూజయేద్వ్రతః ॥5॥

అపుడు సూర్యుని నామాలతో ఉమామహేశ్వరార్చన కావించాలి. తన గృహంలో సూర్యప్రతిమను, శివలింగాన్ని పూజించరాదు. ఏదో ఒక దానిని పూజించవచ్చు.

ఉమాపతే రవేర్వాపి న భేదో దృశ్యతే క్వచిత్ ।
యస్మా త్తస్మాన్మునిశ్రేష్ఠ గృహే శంభుం సమర్చయేత్ ॥6॥

ఉమాపతికీ, శివునికీ ఎక్కడా భేదం కనిపించదు. మునివర్యా! అందువల్ల ఇంటిలో శంభుని అర్చించాలి.

హస్తే చ సూర్యాయ నమోఽస్తు పాదావర్కాయ చిత్రాసు చ గుల్ఫదేశమ్ ।
స్వాతీషు జఙ్ఘే పురుషోత్తమాయ ధాత్రే విశాఖాసు చ జానుదేశమ్ ॥7॥

'సూర్యాయ నమః' అని హస్తనక్షత్రంలో పాదాలను పూజించాలి. 'అర్కాయ నమః' అంటూ చిత్రానక్షత్రంలో గుల్ఫాలను అర్చించాలి. 'పురుషోత్తమాయ నమః' అంటూ స్వాతిలో పిక్కలనూ, ధాత్రే నమః' అంటూ విశాఖలో జానుదేశాలనూ అర్చించాలి.

తథాఽనురాధాసు నమోఽభిపూజ్య మూరుద్వయం చైవ సహస్రభానోః ।
జ్యేష్ఠాస్వనఙ్గాయ నమోఽస్తు గుహ్యమిన్ద్రాయ సోమాయ కటీ చ మూలే ॥8॥

'సహస్రభానవే నమః' అని అనురాధా నక్షక్షంలో ఊరుద్వయాన్నీ, 'అనంగాయ నమః – అంటూ జ్యేష్ఠలో గుహ్యంగాన్నీ – ఇంద్రాయ సోమాయ నమః' అంటూ మూలానక్షత్రంలో కటినీ ఆరాధించాలి.

పూర్వోత్తరాషాఢయుగే చ నాభిం త్వష్ట్రే నమఃసప్తతురఙ్గమాయ ।
తీక్ష్ణాంశవే చ శ్రవణే చ కుక్షిం పృష్ఠం ధనిష్ఠాసు వికర్తనాయ ॥9॥

'త్వష్ట్రే సప్తతురంగమాయ నమః', అంటూ పురోత్తరాషాఢాలలో నాభిని పూజించాలి. 'తీక్ష్ణాంశవే నమః' అంటూ శ్రవణ నక్షత్రంలో కుక్షినీ, 'వికర్తనాయ నమః' అంటూ ధనిష్ఠలో పృష్ఠాన్నీ ఆరాధించాలి.

చక్షుః స్థలం ధ్వాన్తవినాశనాయ జలాధిపర్క్షే పరిపూజనీయమ్ ।
పూర్వోత్తరాభాద్రపదాద్వయే చ బాహూ నమశ్చణ్డకరాయ పూజ్యౌ ॥10॥

'ధ్వాన్త వినాశనాయ నమః' అని శతభిషలో నేత్రాలనూ, 'చండకరాయ నమః,' అంటూ పూర్వోత్తరా భాద్రలలో బాహువులనూ పూజించాలి.

సామ్నామధీశాయ కరద్వయం చ సమ్పూజనీయం ద్విజ రేవతీషు ।
నఖాని పూజ్యాని తథాశ్వినీషు నమోఽస్తు సప్తాశ్వధురన్ధరాయ ॥11॥

ఓ బ్రాహ్మణా! 'సామ్నామధీశాయ నమః' అని రేవతిలో కరద్వయాన్నీ, 'సప్తాశ్వధురంధరాయ నమః' అని అశ్వినిలో నఖాలనూ పూజించాలి.

కఠోరధామ్నే భరణీషు కణ్ఠం దివాకరాయేత్యభిపూజనీయమ్ ।
గ్రీవాగ్నిఋక్షేఽధరమమ్బుజేశం సమ్పూజయేన్నారద రోహిణీషు ॥12॥

నారదా! కఠోరధామ్నే నమః, అంటూ భరణిలో కంఠాన్నీ, 'దివాకరాయ నమః' అంటూ కృత్తికలో గ్రీవనూ, 'అంబుజేశాయ నమః' అని రోహిణిలో అధరాన్నీ పూజించాలి.

మృగోత్తమాఙ్గే దశనా మురారేః సంపూజనీయా హరయే నమస్తే ।
నమః సవిత్రే రసనాం శాంకరే చ నాసాభిపూజ్యాఽథ పునర్వసౌ చ ॥13॥

(శాంకరే చ) ఇక్కడ ఛందోదోషం వుంది. (చ రౌద్రే) అంటే సరిపోతుంది. మృగశిరానక్షత్రంలో హరయే నమస్తే అని పురారి (శివుని) పండ్లనీ ఆర్ద్రానక్షత్రంలో నమస్సవిత్రే అంటూ జిహ్వని పూజించాలి. పునర్వసూ నక్షత్రంలో ముక్కుని పూజించాలి.

లలాటమమ్భోరుహవల్లభాయ పుష్యేఽలకా వేదశరీరధారిణే ।
సార్పేఽథ మౌలిం విబుధప్రియాయ మఘాసు కర్ణావితి గోగణేశ! ॥14॥

'అంభోరుహ వల్లభాయ నమః' అంటూ పునర్వసువులో లలాటాన్నీ, 'వేదశరీరధారిణే నమః' అంటూ పుష్యంలో అలకలను, 'విబుధ ప్రియాయ నమః' అంటూ ఆశ్లేషలో శిరస్సునూ, గ్రహగణేశాయ నమః' అంటూ మఖలో చెవులనూ పూజించాలి.

పూర్వాసు గోబ్రాహ్మణవన్దనాయ నేత్రాణి సమ్పూజ్యతమాని శమ్భోః ।
అథోత్తరాఫల్గుని వై భ్రువౌ చ విశ్వేశ్వరాయేతి చ పూజనీయౌ ॥15॥

'గో బ్రాహ్మణ వందనాయ నమః' అంటూ పూర్వఫల్గుణిలో నేత్రాలనూ, 'విశ్వేశ్వరాయ నమః' అని ఉత్తరాఫల్గునిలో కనుబొమ్మలను పూజించాలి.

నమోఽస్తు పాశాఙ్కుశ శూలపద్మ కపాల సర్పేన్దుధనుర్ధరాయ ।
గజాసురానఙ్గపురాన్ధకాది వినాశమూలాయ నమః శివాయ ॥16॥

పాశం,అంకుశం,శూలం,పద్మం,కపాలం,సర్పం, చంద్రుడు, ధనువు – వీటిని ధరించినవానికి, గజాసురుడు, మన్మథుడు, త్రిపురాలు, అంధకుడు మొదలగువారి వినాశానికి కారణమైన శివునికి నమస్కారం అనాలి.

ఇత్యాది శస్త్రాణి చ పూజ్యయిత్వా విశ్వేశ్వరాయేతి శివోఽభిపూజ్యః ।
భోక్తవ్యమత్రైవమతైలశాక మమాంస మక్షార మభుక్తశేషమ్ ॥17॥

అర్చకుడు శస్త్రాలను గూడా పూజించాలి. నిత్యం 'విశ్వేశ్వరాయ నమః' అంటూ శివుణ్ణి అర్చించాలి. తైలం, శాకం, మాంసం, కారం లేని భుక్తశేషం కాని భోజనం గ్రహించాలి.

ఇత్యేవం ద్విజ నక్తాని కృత్వా దద్యాత్పునర్వశీ ।
శాలేయతండులప్రస్థ మౌదుమ్బరమయే ఘృతమ్ ॥18
సంస్థాప్య పాత్రే విప్రాయ సహిరణ్యం నివేదయేత్ ।
సప్తమే వస్త్రయుగ్మం చ పారణే త్వధికం భవేత్ ॥19॥

ఇలా రాత్రిపూట భుజించి కుంచెడు మంచి వరి బియ్యాన్నీ, ఘృతాన్నీ మేడి కొయ్య పాత్రలో ఉంచి కొంత బంగారం గూడా అందుంచి విప్రునికి సమర్పించాలి. ఏడవ రోజున పారణకాలంలో వస్త్రయుగ్మం గూడా అధికంగా ఇవ్వాలి.

చతుర్దశే తు సమ్ప్రాప్తే పారణే నారదాబ్దికే ।
బ్రాహ్మణాన్భోజయేద్భక్త్యా గుడక్షీరఘృతాదిభిః ॥20॥

నారదా! 14వ సంవత్సరం రాగానే ఆబ్దికపారణలో భక్తితో బ్రాహ్మణులను బెల్లం, పాలు, నెయ్యి మొదలగు భక్ష్యాలతో భక్తితో భుజింపజేయాలి.

కృత్వా తు కాఞ్చనం పద్మమష్టపత్రం సకర్ణికమ్ ।
శుద్ధమష్టాఙ్గుళం తచ్చ పద్మరాగదళాన్వితమ్ ॥21॥

శయ్యాం విలక్షణాం కృత్వా విరుద్ధగ్రన్థివర్జితామ్ ।
సోపధానకవిశ్రామస్వాస్తరవ్యజనాని చ ॥22॥

భాజనోపానహచ్ఛత్రచామరాసనదర్పణైః ।
భూషణైరపి సంయుక్తాం ఫలవస్త్రానులేపనైః ॥23॥

తస్యాం విధాయ తత్పద్మమలంకృత్య గుణాన్వితమ్ ।
కపిలాం వస్త్రసంయుక్తాం సుశీలాం చ పయస్వినీమ్ ॥24॥

రౌప్యఖురీం హైమశృంగీం సవత్సాం కాంస్యదోహనామ్ ।
దద్యాన్మంత్రేణ పూర్వాహ్ణే న చైనామభిలంఘయేత్ ॥25॥

బంగారు పద్మాన్ని అష్టదళాలను దుద్దుతో సహా తయారు చేసి శుద్ధంగా ఎనిమిది అంగుళాలలో పద్మరాగ దళాలతో నిర్మించి విలక్షణమైన– అతుకులు లేని శయ్యను తయారుచేసి దిండు, దుప్పటి, విసన కర్రలు, పాత్రలు చెప్పులు, గొడుగు, చామరం, ఆసనం, అద్దం, భూషణాలతో సహా ఫలాలు, వస్త్రాలు, అనులేపనాలను గూడా కలిపి అందులో పెట్టి ఆ పద్మదళాన్ని గుణాన్వితంగా అలంకరించి వస్త్రాలతో గూడినదీ, శీలం గలదీ, పయస్విని యైనదీ, వెండి గిట్టలు కలదీ, బంగారుకొమ్ములు గలదీ అగు ధేనువును సమంత్రకంగా పూర్వాహ్ణంలో ఇవ్వాలి' – ఈ నియమాన్ని వదలరాదు.

యథైవాదిత్య! శయనమశూన్యం తవ సర్వదా ।
కాంత్యా ధృత్యా శ్రియా రత్యా తథా మే సన్తు సిద్ధయః ॥26॥

ఆదిత్యదేవా! నీ శయనం సదా కాంతి చేత, ధృతిచేత, సిరిచేత, రతిచేత అశూన్యమైనట్లే నాకు గూడా సిద్ధులు అన్నీ కలుగుగాక!

యథా న దేవా శ్రేయాంసం త్వదన్యమనఘం విదుః ।
తథా మాముద్ధరాశేషదుఃఖసంసారసాగరాత్ ॥27॥

దేవతలు సైతం నీకంటే ఇతరుని ఎవరినీ పూజ్యునిగా భావించరు. కాన అశేష దుఃఖ సంసార సాగరం నుండి నన్ను ఉద్ధరించు అని ప్రార్థించాలి.

తతః ప్రదక్షిణీకృత్య ప్రణిపత్య విసర్జయేత్ ।
శయ్యాగవాది తత్సర్వం ద్విజస్య భవనం నయేత్ ॥28॥

తదుపరి ప్రదక్షిణంగా పోయి నమస్కరించాలి. ఆపై బ్రాహ్మణుణ్ణి పంపివేయాలి. శయ్య, గోవు ఇత్యాదికాలు అతని యింటికి పంపాలి.

నైతద్విశీలాయ న దాంభికాయ కుతర్కదుష్టాయ వినిన్దకాయ ।
ప్రకాశనీయం వ్రత మిన్దుమౌళే ర్యశ్చాపి నిన్దామధికాం విధత్తే ॥29॥

శీలరహితుడు, దాంభికుడు, కుతర్క దుష్టుడు నిందకుడు ఐనవానికి ఈ చంద్రశేఖరుని వ్రతం చెప్పరాదు- ఇది విని ఎక్కువగా నిందించేవానికి చెప్పరాదు.

భక్తాయ దాన్తాయ చ గుహ్యా మేతదాఖ్యేయమానన్దకరం శివస్య ।
ఇదం మహాపాతకభిన్నరాణామప్యక్షరం వేదవిదో వదన్తి ॥30॥

భక్తుడు, దాంతుడు అయిన వానికి శివునికి చెందిన ఆనందకరమైన ఈ రహస్యాన్ని చెప్పాలి. ఇది మానవులకు మహా పాతకనాశనమనీ, వినాశరహితమనీ వేదవేత్తలు చెబుతున్నారు.

న బన్ధుపుత్రేణ బలైర్వియుక్తః పత్నీభిరానన్దకర స్సురాణామ్ ।
నాభ్యేతి రోగం న చ శోకదుఃఖం యా చాథ నారీ కురుతేఽతిభక్త్యా ॥31॥

ఏ స్త్రీ, ఏ పురుషుడు అతిభక్తితో ఈ వ్రతం చేస్తారో వారు ఆమె బంధువులతో, బలగాలతో వియుక్తులు కారు. పత్నీవియోగం ఉండదు. ఇది సురలకు అనందకరమైనది. ఈ వ్రతం చేసేవాడు రోగం, శోకం, దుఃఖం పొందదు. అతి భక్తితో చేసే స్త్రీకి కూడా ఫలమిదే.

ఇదం వసిష్ఠేన పురాఽర్జునేన కృతం కుబేరేణ పురన్దరేణ ।
యత్కీర్తనేనాప్యఖిలాని నాశమాయాన్తి పాపాని న సంశయోఽస్తి ॥32॥

పూర్వం వసిష్ఠుడు, అర్జునుడు, కుబేరుడు, ఇంద్రుడు ఈ వ్రతం చేశారు. దీనిని పేర్కొన్నా చాలు, అఖిల పాపాలూ నశిస్తాయి, సందేహం లేదు.

ఇతి పఠతి శృణోతి వా య ఇత్థం రవిశయనం పురుహూతవల్లభ స్స్యాత్ ।
అపి నరకగతాన్పితౄనశేషానపి దివమానయతీహ యః కరోతి ॥33॥

ఈ రవిశయన వ్రతాన్ని పఠించువాడు, విన్నవాడు - అనుష్ఠించువాడు ఇంద్రునికి ప్రీతి పాత్రుడవుతాడు. నరకంలో ఉన్న అశేష పితరులను స్వర్గానికి చేరుస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఆదిత్యశయన వ్రతం నామ పంచపంచాశోఽధ్యాయః ॥ 55 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని ఆదిత్యశయనవ్రతమనే యాభై అయిదవ అధ్యాయం సంపూర్ణం

షట్పంచాశోఽధ్యాయః - యాభైఆరవ అధ్యాయం

కృష్ణాష్టమీ వ్రతమ్ - కృష్ణాష్టమీ వ్రతం

శ్రీభగవానువాచ :- శ్రీభగవంతుడు చెప్పాడు

కృష్ణాష్టమీమథో వక్ష్యే సర్వపాపప్రణాశనీమ్ ।
శాన్తిర్ముక్తిశ్చ భవతి జయః పుంసాం విశేషతః ॥1॥

ఇకపై సకల పాపాలను నశింపజేసే కృష్ణాష్టమిని గురించి చెబుతాను. దీనివల్ల జనులకు శాంతి, ముక్తి విశేషించి సర్వకార్యజయమూ కల్గుతాయి.

శఙ్కరం మార్గశిరసి శమ్భుం పౌషేఽభిపూజయేత్ ।
మాఘే మహేశ్వరం దేవం మహాదేవం చ ఫాల్గునే ॥2॥

మార్గ శీర్షంలో కృష్ణాష్టమినాడు శంకరుణ్ణి అర్చించాలి. పౌషమాసం (పుష్యమాసం) కృష్ణాష్టమినాడు శంభుని పూజించాలి. మాఘంలో దేవుడైన మహేశ్వరుణ్ణి, పాల్గుణంలో మహాదేవుణ్ణి పూజించాలి.

స్థాణుం చైత్రే శివం తద్వద్వైశాఖే త్వర్చయేన్నరః ।
జ్యేష్ఠే పశుపతిం చార్చేదాషాఢే హ్యుగ్రమర్చయేత్ ॥3॥

పూజయేచ్ఛ్రావణే శర్వం నభస్యే త్ర్యమ్బకం తథా ।
హరమాశ్వయుజే మాసి తథేశానం చ కార్తికే ॥4॥

చైత్రంలో స్థాణువునూ, అట్లే వైశాఖంలో శివుణ్ణీ నరుడు అర్చించాలి. జ్యేష్ఠమాసంలో పశుపతినీ, ఆషాడంలో ఉగ్రుణ్ణీ అర్చించాలి. శ్రావణంలో శర్వుణ్ణి, అట్లే భాద్రపదంలో త్ర్యంబకుణ్ణి, ఆశ్వయుజంలో హరుణ్ణి, కార్తికంలో ఈశానుణ్ణీ అర్చించాలి.

కృష్ణాష్టమీషు సర్వాసు శక్తః సమ్పూజయే ద్ద్విజాన్ ।

గోభూహిరణ్యవాసోభిః శివభక్తానుపోషితః ॥5॥

అన్ని కృష్ణాష్టమీదినాలలోనూ శక్తి కొలది ద్విజులను పూజించాలి. ఉపవాసముండి శివభక్తులను గోవులు, భూమి, స్వర్ణం, వస్త్రాలతో సత్కరించాలి.

గోమూత్రఘృతగోక్షీర తిలాన్యథ కుశోదకమ్ ।

గోశృంగోదకరీషార్కబిల్వపత్రదధీని చ ।
పఞ్చగవ్యం చ సంప్రాశ్య శఙ్కరం పూజయేన్నిశి ॥6॥

గోమూత్రం, గోఘృతం, గోక్షీరం, తిలలు, యవలు, దర్భలుంచిన నీరు, గోవు కొమ్ములను కడిగిననీరు, గోమయం, అర్కపత్రాలు, బిల్వ పత్రాలు, పెరుగు, పంచగవ్యం - వీటిని భుజించి శంకరుణ్ణి రాత్రివేళ పూజించాలి.

అశ్వత్థం చ వటం చైవోదుమ్బరం ప్లక్షమేవ చ ।
పలాశం జమ్బువృక్షం చ విదుష్షష్ఠం మహర్షయః ॥7॥

మార్గశీర్షాషాఢమాసాభ్యాం ద్వాభ్యాం ద్వాభ్యామితి క్రమాత్ ।
ఏకైకం దన్తపవనం వృక్షేష్వేతేషు భక్షయేత్ ॥8॥

అర్చకుడు మార్గశీర్ష ఆషాఢమాసాలలో రెండు రెండు నెలల కొకసారి రావి, మర్రి, మేడి, జువ్వి, మోదుగ, నేరేడు చెట్ల క్రింద భుజింపజేయాలి. ఈ చెట్ల పుల్లలతో దంతధావనం చేసి భుజించాలి..

దేవాయ దద్యాదర్ఘ్యం చ కృష్ణాం గాం కృష్ణవాససమ్ ।
దద్యాత్సమాప్తే దధ్యన్నం వితానధ్వజచామరమ్ ॥9॥

దేవతకు అర్ఘ్యజలాన్ని, నల్లగోవును, నీలవస్త్రాన్ని ఇవ్వాలి- వ్రత సమాప్తిలో వితానం, ధ్వజం, చామరసహితంగా దధ్యన్న మివ్వాలి.

ద్విజానాముదకుమ్భాంశ్చ పఞ్చరత్నసమన్వితాన్ ।
గావః కృష్ణాః సువర్ణం చ వాసాంసి వివిధాని చ ।
అశక్తస్తు పునర్దద్యాద్గామేకామపి శక్తితః ॥10॥

పంచరత్నాలతో గూడా, ద్విజులకు ఉదకకుంభాలను, నల్లగోవులను, స్వర్ణాన్ని, వివిధవస్త్రాలను – ఇవ్వాలి. శక్తి లేనివాడు యథాశక్తి ఒక గోవునైనా దానం చేయాలి.

న విత్తశాఠ్యం కుర్వీత కుర్వన్ దోషమవాప్నుయాత్ ।
కృష్ణాష్టమీముపోష్యైవ సప్తకల్పశతత్రయమ్ ।
పుమాన్సమ్పూజితో దేవైః శివలోకే మహీయతే ॥11॥

ధనం విషయంలో పిసినారితనం తగదు. అది ఉంటే దోషం పొందుతాడు. కృష్ణాష్టమీ వ్రతానుష్ఠానంలో ఉపవసించినవాడు 700 కల్పాల కాలం శివలోకంలో దేవతలచే పూజింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే కృష్ణాష్టమీ వ్రతం నామ షట్పంచాశోఽధ్యాయః. ॥ 56 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని కృష్ణాష్టమీవ్రతమనే యాభైఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తపంచాశోఽధ్యాయః - యాభైఏడవ అధ్యాయం
రోహిణీ చంద్రశయనవ్రతమ్ - రోహిణీ చంద్రశయనవ్రతం

నారద ఉవాచ :- నారదుడు చెప్పాడు.

దీర్ఘాయురారోగ్యకులాభివృద్ధియుక్తః పుమాన్ సర్వగుణాన్వితః స్యాత్ ।
ముహుర్ముహుర్జన్మని యేన సమ్యగ్వ్రతం సమాచక్ష్వ తదిన్దుమౌళే! ॥1॥

చంద్రమౌళీ! జన్మజన్మల్లో మాటిమాటికీ దీర్ఘాయువు, ఆరోగ్యం, కులాభివృద్ధి, సకలగుణసంపదలు - వీటిని ప్రసాదించే వ్రత మేదో, దాన్ని చెప్పు.

శ్రీ భగవానువాచ :- శ్రీ భగవానుడు చెప్పాడు.

త్వయా పృష్టమిదం సమ్యగ్వ్రతం చాక్షయకారకమ్ ।
రహస్యం తవ వక్ష్యామి యత్పురాణవిదో విదుః ॥2॥

నీవు చక్కగా అడిగావు, ఇది అక్షయకారకమైనది. పూరాణవేత్త లెరింగిన ఈ రహస్యం నీకు వివరిస్తాను.

రోహిణీచన్ద్రశయనం నామ వ్రతమిహోత్తమమ్ ।
తస్మిన్నారాయణస్యార్చామర్చయేదిన్దునామభిః ॥3॥

రోహిణీ చంద్రశయనం అనే ఉత్తమవ్రతమున్నది. ఆ వ్రతంలో చంద్రనామాలతో నారాయణుని అర్చామూర్తిని అర్చించాలి.

యదా సోమదినే శుక్లా భవేత్పఞ్చదశీ క్వచిత్ ।
అథవా బ్రహ్మనక్షత్రం పౌర్ణమాస్యాం ప్రజాయతే ॥4॥

తదా స్నానం నరః కుర్యాత్పఞ్చగవ్యేన సర్షపైః ।
ఆప్యాయస్వేతి తు జపేద్విద్వానష్టశతం పునః ॥5॥

పౌర్ణమి సోమవారంనాడు వచ్చినపుడు, లేదా రోహిణితో పూర్ణిమ కలిసిన దినానగాని మానవుడు పంచగవ్యాలతో, ఆవాలతో స్నానం చేయాలి. 108సార్లు ద్విజుడు 'ఆప్యాయస్వ' అనే మంత్రం పఠించాలి.

శూద్రోఽపి పరయా భక్త్యా పాషణ్డాలాపవర్జితః ।
సోమాయ వరదాయాథ విష్ణవే చ నమో నమః ॥6॥

పాషండుల మాటలను వర్జించి శూద్రుడైనా శ్రేష్ఠమైన భక్తితో దీన్ని ఆచరించవచ్చు. వరదులైన చంద్రునికీ, విష్ణునికీ నమస్కారం అనాలి. వైదిక మంత్రానికి బదులు "సోమాయ వరదాయ విష్ణవే నమో నమః" అని చెప్పాలి.

కృతజప్య స్స్వభవన మాగత్య మధుసూదనమ్ ।
పూజయేత్ఫలపుష్పైశ్చ సోమనామాని కీర్తయన్ ॥7॥

జపం పూర్తి చేసి తన యింటికి పోయి ఫలపుష్పాలతో సోమనామాలు కీర్తిస్తూ మధుసూదనుణ్ణి అర్చించాలి.

సోమాయ శాన్తాయ నమోఽస్తు పాదావనన్తధామ్నేతి చ జానుజఙ్ఘే।
ఊరుద్వయం చాపి జలోదరాయ సమ్పూజయేన్మేఢ్ర మనంగబంధో ॥8॥

నమో నమః కామసుఖప్రదాయ కటిః శృశాంకస్య సదార్చనీయా।
తథోదరం చాప్యమృతోదరాయ నాభిః శశాఙ్కాయ నమోఽభిపూజ్యా ॥9॥

'సోమాయ శాంతాయ నమః' అని జపించి పాదాలు పూజించాలి. 'అనంతధామ్నే నమః' అని జానువులనూ, జంఘలను పూజించాలి. 'జలోదరాయ నమః' అని రెండు తొడలను, 'కామ సుఖ ప్రదాయ నమః' అని మేఢ్రాన్ని పూజించాలి. 'శశాంకాయ నమః' అంటూ కటిని పూజించాలి. 'అమృతోదరాయ నమః' అంటూ ఉదరాన్ని పూజించాలి. “శశాంకాయ నమః' నాభిని పూజించాలి.

నమోఽస్తు చన్ద్రాయ ముఖం చ పూజ్యం దన్తా ద్విజానామధిపాయ పూజ్యా।
ఆస్యం నమశ్చన్ద్రమసేఽభిపూజ్య మోష్ఠౌ కుముత్షండవనప్రియాయ ॥10॥

'చన్ద్రాయ నమః' అని ముఖాన్నీ, 'ద్విజానామధిపాయ నమః' అంటూ దంతాలనూ, 'చంద్రమసే నమః' అని ఆస్యాన్ని, కుముద షండ వన ప్రియాయ' అని పెదవులనూ అర్చించాలి.

నాసాం చ నాథాయ వనౌషధీనామానన్దబీజాయ పునర్భ్రువౌ చ।
నేత్రద్వయం పద్మవిభంజనాయ ఇన్దీవరశ్యామకరాయ శౌరేః ॥11॥

'వనౌషధీనాం నాథాయ నమః' అంటూ ముక్కునూ, 'ఆనంద బీజాయ నమః' అంటూ కనుబొమ్మలనూ' 'ఇందీవరశ్యామకరాయ పద్మవిభంజనాయ నమః' అంటూ నేత్రాలను పూజించాలి.

నమః సమస్తాధ్వరవన్దితాయ కర్ణద్వయం దైత్యనిషూదనాయ।
లలాటమిన్దో రుదధిప్రియాయ కేశాః సుషుమ్నాధిపతేః ప్రపూజ్యాః ॥12॥

'సమస్తాధ్వరవందితాయ దైత్యనిషూదనాయ నమః' అంటూ కర్ణద్వయాన్నీ 'ఉదధిప్రియాయ నమః,' అని లలాటాన్నీ, 'సుషుమ్నాధిపతయే నమః అంటూ కేశాలనూ అర్చించాలి.

శిరః శశాఙ్కాయ నమో మురారే ర్విశ్వేశ్వరాయేతి నమః కిరీటినే।
పద్మప్రియే రోహిణి నామ లక్ష్మీః సౌభాగ్యసౌఖ్యామృతచారుకాయే ॥13॥

దేవీం చ సమ్పూజ్య సుగన్ధపుష్పై ర్నైవేద్యధూపాదిభిరిన్దుపత్నీమ్।
సుప్త్వాథ భూమౌ పునరుత్థితేన స్నాత్వా చ విప్రాయ హవిష్యయుక్తః ॥14॥

దేయః ప్రభాతే సహిరణ్యవారి కుమ్భో నమః పాపవినాశనాయ।
సమ్ప్రాశ్య గోమూత్రమమాంస మన్నమక్షారమష్టావథ వింశతిం చ
గ్రాసాన్పయ స్సర్పియుతానుపోష్య భుక్త్వేతిహాసం శృణుయాన్ముహూర్తమ్ ॥15॥

'శశాంకాయ నమః' అని మురారి శిరస్సును, 'విశ్వేశ్వరాయ నమః' అని కిరీటాన్నీ అర్చించాలి. 'పద్మప్రియా, రోహిణీ, లక్ష్మీ, సౌభాగ్య సౌఖ్యము గల అమృత ప్రాయమైన సుందరశరీరం కలదానా! అని దేవిని కీర్తించి

సుగంధిపుష్పాలతో, నైవేద్యధూపాదులతో, రోహిణీదేవిని అర్చించాలి. వ్రతదినాన హవిష్యాన్నం భుజించి నేలపై పడుకొని లేచి స్నానం చేసి బ్రాహ్మడికి స్వర్ణం, పాపనాశార్థం నీటికుంభం ఇవ్వాలి – (నమః పాపవినాశనాయ, అంటూ ఇవ్వాలి.) గోమూత్రం, అమాంసమైన అన్నం కారంలేనిదానిని, 28 ముద్దలు గైకొని ముహూర్తకాలం ఇతిహాసం వినాలి.

కదమ్బనీలోత్పలకేతకాని జాతీ సరోజం శతపత్రకం చ ।
అమ్లానకుబ్జాన్యథ సిన్ధువారం పుష్పం పునర్నారద మల్లికాయాః ।
శుక్లం చ విష్ణోః కరవీరపుష్పం శ్రీచమ్పకం చన్ద్రమసః ప్రదేయమ్ ॥16॥

నారదా! తదుపరి కదంబాలు, నల్లగలువలు, మొగలి, జాజి, తామర, శత పత్రపద్మం, వాడిపోని కుబ్జాలు, సింధువారం, మల్లెపూలు, తెల్లగన్నేరుపూలు, శ్రీచంపకం – ఈ పూలను సమర్పించి చంద్రుణ్ణి అర్చించాలి.

శ్రావణాదిషు మాసేషు క్రమాదేతాని సర్వదా ।
యస్మిన్మాసే వ్రతాదిః స్యాత్తత్పుష్పై రర్చయేద్ధరిమ్ ॥17॥

శ్రావణాది మాసాలలో క్రమంగా సదా వీటిని ఏ మాసంలో వ్రతం ప్రారంభమగునో, – అప్పుడా పూలతో హరి నర్చించాలి.

ఏవం సంవత్సరం యావదుపాస్య విధివన్నరః ।
వ్రతాన్తే శయనం దద్యా ద్దర్పణోపస్కరాన్వితమ్ ॥18॥

ఇలా నరుడు ఒక సంవత్సరకాలం ఉపాసించి వ్రతాంతంలో అద్దం మొదలైన వస్తువులతో గూడిన శయ్యను దానంగా ఇవ్వాలి.

రోహిణీచన్ద్రమిథునం కారయిత్వా తు కాఞ్చనమ్ ।
చన్ద్రః షడఙ్గులః కార్యో రోహిణీ చతురఙ్గులా ॥19॥

స్వర్ణంతో రోహిణీచంద్ర మిథునాన్ని తయారు చేయించాలి. చంద్రుడు ఆరంగుళాలు, రోహిణి నాల్గు అంగుళాలుండునట్లు చేయాలి.

ముక్తాఫలాష్టకయుతం సితనేత్రపటావృతమ్ ।
క్షీరకుమ్భోపరి పునః కాంస్యపాత్రాక్షతాన్వితమ్ ।
దద్యాన్మన్త్రేణ పూర్వాహ్ణే శాలీక్షుఫలసంయుతమ్ ॥20॥

ఎనిమిది ముత్యాలు, శుభవస్త్రాలు కప్పిన క్షీరకుంభం – అక్షతలు గల కంచుపాత్ర వీటిని శాలి – ఇక్షు ఫలాలతో గూడా పూర్వాహ్ణములో మంత్ర సహితంగా దానమివ్వాలి.

శ్వేతామథ సువర్ణాస్యాం ఖుర రౌప్యైః సమన్వితామ్ ।
సవస్త్రభాజనాం ధేనుం దద్యాన్మంత్రేణ శోభనామ్ ॥21॥

మంగళకరమైన ముఖాన బంగరుబిళ్ళ వెండిగిట్టలలుగల తెల్లనిగోవును వస్త్రభాజనసహితంగా దానమివ్వాలి.

భూషణైర్ద్విజదామ్పత్యమలఙ్కృత్య గుణాన్వితమ్ ।
చన్ద్రోఽయం ద్విజరూపేణ సభార్య ఇతి కల్పయేత్ ॥22॥

గుణాన్వితులైన ద్విజదంపతులను భూషణాలతో అలంకరించి ఇతడు భార్యాసహితుడైన చంద్రుడే' అని భావించాలి.

యథా న రోహిణీ కృష్ణశయ్యాం సన్త్యజ్య గచ్ఛతి ।
సోమరూపస్య తే తద్వన్మమాభేదోఽస్తు భూతిభిః ॥23॥

"దేవా! సోమరూపుడవైన కృష్ణా! రోహిణి నీ ఇల్లు వదలిపోనట్లే నా ఇల్లు గూడా ఐశ్వర్య హీనం కాకుండుగాక! అని పూజించాలి.

యథా త్వమేవ సర్వేషాం పరమానన్దముక్తిదః ।
భుక్తిర్ముక్తి స్తథా భక్తి స్త్వయి చన్ద్రాస్తు మే సదా ॥24॥

చంద్రా! అందరికీ పరమానందముక్తి నిచ్చువాడు నీవే అయినట్లు భుక్తి, ముక్తి, భక్తి నాకు నీయందే సదా ఉండుగాక!

ఇతి సంసారభీతస్య ముక్తికామస్య చానఘ ।
రూపారోగ్యాయుషా మేతద్విధాయకమనుత్తమమ్ ॥25॥

అనఘా! సంసారభీతుడు, ముక్తికాముడు అయినవానికి ఈ వ్రతం అనుత్తమమైనరూపం, ఆరోగ్యం, ఆయుష్యం – కల్గిస్తుంది.

ఇదమేవ పితౄణాం చ సర్వదా వల్లభం మునే ।
త్రైలోక్యాధిపతి ర్భూత్వా సప్తకల్పశతత్రయమ్ ।
చన్ద్రలోకమవాప్నోతి విద్వాన్భూత్వా విముచ్యతే ॥26॥

మునీ! పితరులకు సదా ప్రియమైనదిదే. ముల్లోకాలకూ అధిపతియై ఇరవై ఒక్క కల్పముల కాలం చంద్రలోకం పొంది – బ్రహ్మజ్ఞానం కలిగి ముక్తుడౌతాడు.

నారీ వా రోహిణీ చన్ద్రశయనం యా సమాచరేత్ ।
సాఽపి తత్ఫలమాప్నోతి పునరావృత్తి దుర్లభమ్ ॥27॥

స్త్రీ అయినా రోహిణీ చంద్రశయన వ్రతం చేస్తే పునరావృత్తి లేని ముక్తి ఫలం పొందుతుంది.

ఇతి పఠతి శృణోతి వా య ఇత్థం మధుమథనార్చనమిన్దుకీర్తనేన ।
మతిమపి చ దదాతి సోఽపి శౌరే ర్భవనగతః పరిపూజ్యతేఽమరౌఘైః ॥28॥

ఇలా చంద్రకీర్తనతో కూడిన ఈ మధు మథన పూజను ఎవడు చదువుతాడో, నిత్యం వింటాడో అతడు శుభమతిని పొంది, విష్ణుభవనం చేరి దేవతలచే పూజింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే రోహిణీ చంద్రశయన వ్రతం నామ సప్తపంచాశోఽధ్యాయః. ॥ 57 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని రోహిణీ చంద్రశయనవ్రతమనే యాభైఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టపంచాశోఽధ్యాయః - యాభైఎనిమిదవ అధ్యాయం

తటాకాది ప్రతిష్ఠా విధిః - తటాకాదుల ప్రతిష్ఠా విధి

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

జలాశయగతం విష్ణుమువాచ రవినన్దనః ।
తటాకారామకూపేషు వాపీషు నళినీషు చ ॥1॥

విధిం పృచ్ఛామి దేవేశ దేవతాయతనేషు చ ।
కే తత్ర చర్త్విజో నాథ వేదీ వా కీదృశీ భవేత్ ॥2॥

జలాశయంలో మత్స్యరూపంలో ఉన్న విష్ణువును వైవస్వతమనువు ఇలా ప్రశ్నించాడు. "దేవేశా! తటాకము, ఉద్యానాలు, బావులు, నడబావులు, సరస్సులు, దేవాలయాలు- వీటి విధిని గూర్చి అడుగుతున్నాను. ఋత్విక్కులెవ్వరు? వేది ఎలా వుండాలి?

దక్షిణా బలయః కాలః స్థానమాచార్య ఏవ చ ।
ద్రవ్యాణి కాని శస్తాని సర్వమాచక్ష్వ తత్త్వతః ॥3॥

దక్షిణలు, బలులు, స్థానం, ఆచార్యుడు - వీరి వివరాలు, ప్రశస్తమైన ద్రవ్యాలు - ఇదంతా చెప్పు.

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

శృణు రాజన్మహాబాహూ! తటాకాదిషు యో విధిః ।
పురాణేష్వితిహాసోఽయం పఠ్యతే వేదవాదిభిః ॥4॥

మహాబాహూ! రాజా! తటాకస్థాపనాదులలోని విధిని విను. పురాణాలలో, వేదవాదులు ఈ ఇతిహాసం పఠిస్తారు.

ప్రాప్య పక్షం శుభం శుక్లమతీతే చోత్తరాయణే ।
పుణ్యేఽహ్ని విప్రకథితే కృత్వా బ్రాహ్మణవాచనమ్ ॥5॥

ప్రాగుదక్ప్రవణే దేశే తటాకస్య సమీపతః ।
చతుర్హస్తాం శుభాం వేదీం చతురస్రాం చతుర్ముఖామ్ ॥6॥

ఉత్తరాయణం గడచిన పిదప శుభమైన శుక్లపక్షంలో విప్రుడు చెప్పిన పవిత్రమైన దినాన- బ్రాహ్మణవాచనం చేయాలి. బ్రాహ్మణులతో సంప్రదించాలి. తడాకం వద్ద తూర్పు ఉత్తరాలకు వాలుగానున్న ప్రదేశంలో, నాల్గు చేతుల ప్రమాణం, చతురస్రం, చతుర్ముఖమైన వేదికను నిర్మింపజేయాలి.

తథా షోడశహస్తః స్యాన్మండపశ్చ చతుర్ముఖః ।
వేద్యాశ్చ పరితో గర్తా రత్నిమాత్రాస్సమేఖలాః ॥7॥

రాజకుమారా! అట్లే నాల్గు ముఖాలు గల 16 మూరలు గల మండపం నిర్మించాలి. వేది చుట్టూ మేఖలలు గల మూర లోతు గల గుంటలు త్రవ్వాలి.

నవ సప్తాథవా పంచ నాతిరిక్తా నృపాత్మజ ।
వితస్తిమాత్రా యోనిః స్యాత్ షట్సప్తాఙ్గులివిస్తృతా ॥8॥

నృపకుమారా! అవి తొమ్మిది లేక ఏడు, లేక ఐదు కంటే మించరాదు. పండ్రెండగుళాల పొడవు, ఎనిమిదిగుళాలు వెడల్పు గల యోనిని నిర్మించాలి.

గర్తాశ్చతస్రః శస్తాస్త్స్యుస్త్రిపర్వోచ్ఛ్రితమేఖలాః ।
సర్వతః సర్వవర్ణాః స్యుః పతాకాధ్వజసంయుతాః ॥9॥

అలా నాలుగు గుంట లేర్పరచాలి. ఆ గుంటల్లో ప్రతిదాని చుట్టూ మూడు వరుసల్లో ఎత్తైన మేఖలలుండాలి. అన్ని వైపుల అన్ని వర్ణాలూ గల పతాకలు, ధ్వజాలూ ఉండాలి.

అశ్వత్థోదుమ్బరప్లక్ష వటశాఖాకృతాని తు ।
మండపస్య ప్రతిదిశం ద్వారాణ్యేతాని కారయేత్ ॥10॥

రాగి, మేడి, జువ్వి, మర్రికొయ్యలతో చేసిన ద్వారాలు మండపానికి ప్రతిదిక్కులోనూ ఏర్పాటు చేయాలి.

శుభాస్తత్రాష్ట హెూతారో ద్వారపాలా స్తథాష్ట వై ।
అష్టౌ తు జాపకాః కార్యా బ్రాహ్మణా వేదపారగాః ॥11॥

అక్కడ శుభులైన ఎనిమిదిమంది హెూతలు, అట్లే ఎనిమిది మంది ద్వారపాలకులు, జపం చేసేవారు ఎనిమిదిమంది- బ్రాహ్మణులు వేద పారంగతులైన వారిని నియమించాలి.

సర్వలక్షణసంపూర్ణో మన్త్రవిద్విజితేన్ద్రియః ।
కులశీలసమాయుక్తః పురోధాః స్యాద్ద్విజోత్తమః ॥12॥

సర్వలక్షణాలు కలవాడు, మంత్రవేత్త, ఇంద్రియాలను జయించినవాడు, కులం శీలం కలవాడు అయిన ద్విజోత్తముడు పురోహితుడుగా ఉండాలి.

ప్రతిగర్తేషు కలశా యజ్ఞోపకరణాని చ ।
వ్యజనం చామరే శుభ్రే తామ్రపాత్రం సువిస్తృతమ్ ॥13॥

అన్ని గుంటలలో కలశాలు, యజ్ఞోపకరణాలు, విసనకర్ర, తెల్లని చామరాలు, విస్తృతమై శుభ్రమైన తామ్రపాత్ర ఉంచాలి.

తతస్త్వనేకవర్ణైః స్యుశ్చరవః ప్రతిదైవతమ్ ।
ఆచార్యః ప్రక్షిపేద్భూమావనుమన్త్రం విచక్షణః ॥14॥

తదుపరి అనేకవర్ణాలు గల చరువులు ఉండాలి. ప్రతి దేవతనూ మంత్రపూర్వకంగా విచక్షణుడైన ఆచార్యుడు. భూమిలో ఉంచాలి.

త్ర్యరత్నిమాత్రే యూపః స్యాత్క్షీరవృక్షవినిర్మితః ।
యజమానప్రమాణో వా సంస్థాప్యో భూతిమిచ్ఛతా ॥15॥

యూపస్తంభం మూడు పిడి మూరల పొడవు గలిగి ఉండాలి. అది పాలకొయ్యతో చేయాలి. యజమాని ఎత్తునసైనా ఉండాలి. ఐశ్వర్యం కోరువాడు దానినలా స్థాపించాలి.

హేమాలంకారిణః కార్యాః పఞ్చవింశతి ఋత్విజః ।
కుణ్డలాని చ హైమాని కేయూరకటకాని చ ॥16॥

తథాఙ్గుళ్యః పవిత్రాణి వాసాంసి వివిధాని చ ।
పూజయేత్తు సమం సర్వానాచార్యో ద్విగుణం పునః ॥
దద్యాచ్ఛయనసంయుక్తమాత్మనశ్చాపి యత్ప్రియమ్ ॥17॥

ఇరువది అయిదు మంది ఋత్విక్కులను స్వర్ణభూషితులను చేయాలి. వారిని స్వర్ణకుండలాలు, స్వర్ణకేయూరాలు, కటకాలు, ఉంగరాలు, పవిత్రాలు, వివిధ వస్త్రాలు కలవారిని చేయాలి. శయనసంయుక్తంగా ఆచార్యునకు ఇతరఋత్విక్కుల కంటే రెండు రెట్లెక్కువగా తనకేది ప్రియమో దానిని ఇవ్వాలి.

సౌవర్ణకూర్మమకరౌ రాజతౌ మత్స్యదుందుభౌ ।
తామ్రౌ కులీరమణ్డూకావాయసః శిశుమారకః ।
ఏవమాసాద్య తత్సర్వమాదావేవ విశామ్పతే ॥18॥

రాజా! స్వర్ణమయ కూర్మమకరాలు, వెండిచేప, నీటిపామును, రాగి ఎండ్రి, కప్పలు, ఇనుపశిశుమారకం ఇదంతా ముందే సిద్ధం చేసుకోవాలి.

శుక్లమాల్యామ్బరధరః శుక్లగన్ధానులేపనః ।
సర్వౌషధ్యుదకైస్తత్ర స్నాపితో వేదపుఙ్గవైః ॥19॥

ఆ తరువాత తెల్లమాలలు, వస్త్రాలు, శుక్లగంధానులేపనాలు గల్గినవాడై, వేదపారగులచే సర్వౌషధులుగల నీటితో యజమానుడు స్నానం చేయించబడాలి.

యజమానః సపత్నీకః పుత్రపౌత్రసమన్వితః ।
పశ్చిమం ద్వారమాసాద్య ప్రవిశేద్యాగమండపమ్ ॥20॥

అట్టి యజమానుడు భార్యతో, పుత్ర పౌత్రులతోనుండి యాగమండపం పశ్చిమద్వారం ద్వారా ప్రవేశించాలి.

తతో మఙ్గళశబ్దేన భేరీణాం నిఃస్వనేన చ ।
అంజసా మణ్డలం కుర్యాత్పఞ్చవర్ణేన తత్త్వవిత్ ॥21॥

తదుపరి మంగళ శబ్దంతో, భేరీధ్వనులతో వెంటనే ఐదురంగుల ముగ్గు పొడితో ఆవిషయతత్త్వం తెలిసిన పురోహితుడు మండలం గీయాలి.

షోడశారం తతశ్చక్రం పద్మగర్భం చతుర్ముఖమ్ ।
చతురస్రం చ పరితో వృత్తం మధ్యే సుశోభనమ్ ॥22॥

ఆ పొడితో చతురస్రాన్ని వృత్తసమేతంగా లిఖించాలి. దానిలో పదహారుకోణాలు గల ఒక చక్రం గీయాలి. దానినడుమ పద్మంలో బ్రహ్మను లిఖించాలి.

వేద్యాశ్చోపరి తత్కృత్వా గ్రహాన్ లోకపతీంస్తతః ।
స న్యసేన్మంత్రతః సర్వాన్ప్రతిదిక్షు విచక్షణః ॥23॥

ఆపై పురోహితుడు వేది పైభాగంలో లోకపాలకులైన గ్రహాలనన్నిటిని మన్త్రపూర్వకంగా ప్రతి దిక్కులోనిలపాలి.

కూర్మాది స్థాపయేన్మధ్యే వారుణం మన్త్రమాశ్రితః ।
బ్రహ్మాణం చ శివం విష్ణుం తత్రైవ స్థాపయేద్బుధః ॥24॥

తదుపరి వరుణ మంత్రంతో తాబేలు మొదలగు జంతువుల ప్రతిమల నుంచాలి. మధ్యలో బ్రహ్మను, శివుణ్ణి, విష్ణువును అక్కడే నిలపాలి.

వినాయకం చ విన్యస్య కమలామమ్బికాం తథా ।
శాన్త్యర్థం సర్వలోకానాం భూతగ్రామం న్యసేత్తతః ॥25॥

గణేశుడు, లక్ష్మి, పార్వతి వీరిప్రతిమలు నిలిపి సర్వలోకాల శాంతికొరకు సర్వభూతగ్రామ ప్రతిమలునిలపాలి.

పుష్పభక్ష్యఫలైర్యుక్తమేవం కృత్వాధివాససా ।
కుంభాన్సజలగర్భాంస్తాన్వాసోభిః పరివేష్టయేత్ ॥26

మండపంలో వస్త్రం పరచి దానిపై పూలు, భక్ష్యాలు, పండ్లతో గూడినట్లు చేసి జలగర్భాలైన కుంభాలను గుడ్డలతో చుట్టాలి.

పుష్పగంధైరలంకృత్య ద్వారపాలాన్సమన్తతః ।
పఠధ్వమితి తాన్బ్రూయాదాచార్యస్త్వభిపూజయేత్ ॥27॥

నలువైపుల ఉన్న ద్వారపాలకులను పుష్పగంధాలతో అలంకరించి ఆచార్యుడు 'పఠధ్వం' (చదవండి) అని వేదపఠనకు పురికొల్పితాను- పూజించాలి.

బహ్వృచౌ పూర్వతః స్థాప్యౌ దక్షిణేన యజుర్విదౌ ।
సామగౌ పశ్చిమే తద్వదుత్తరేణ త్వథర్వణౌ ॥28॥

ఇద్దరు బహ్వృచశాఖీయులను తూర్పున ఉంచాలి. ఇద్దరు యజుర్వేత్తలను దక్షిణాన, ఇద్దరు సామగాయకులను పడమట, ఇద్దరు ఆథ్వర్వణికులను ఉత్తరాన కూర్చోబెట్టాలి.

ఉదఙ్ముఖో దక్షిణతో యజమాన ఉపావిశేత్ ।
యజధ్వమితి తాన్బ్రూయా ద్యాత్రికాన్పునరేవ తు ॥29॥

మండపం దక్షిణదిశలో ఉత్తరాభిముఖుడై యజమానుడు కూర్చోవాలి. హోతలను చూచి 'యజధ్వం' అని మళ్ళీ చెప్పాలి.

ఉత్కృష్టమన్త్రజాపేన తిష్ఠధ్వమితి జాపకాన్ ।
ఏవమాదిశ్య తాన్సర్వా న్పర్యుక్ష్యాగ్నిం స మంత్రవిత్ ॥30॥

జప పరులను ఉత్కృష్ట మంత్రం జపించండి అని, హోతలను యజనం చేయండి అని ఋత్విగ్వరణం చేయాలి. ఇలా వారినందరినీ ఆదేశించి మంత్రవేత్త అయిన ఆచార్యుడు అగ్నికి పర్యుక్షణం పర్యుక్షణ-అగ్నిప్రదక్షిణ చేసి అర్చించాలి.

జుహుయాద్వారుణైర్మన్త్రైరాజ్యం చ సమిధస్తథా।
ఋత్విగ్భిశ్చాథ హోతవ్యం వారుణైరేవ సర్వతః ॥31॥

వారుణ మంత్రాలతో ఆజ్యమును, సమిధలను హోమం చేయాలి. ఇతర ఋత్విక్కులు గూడా వరుణ మంత్రంతోనే హోమం చేయాలి.

గ్రహేభ్యో విధివద్ధుత్వా తథేన్ద్రాయేశ్వరాయ చ ।
మరుద్భ్యో లోకపాలేభ్యో విధివద్విశ్వకర్మణే ॥32॥

శాస్త్రంలో చెప్పినట్లు గ్రహాలకు, ఇంద్రునికీ, ఈశ్వరునికీ, మరుత్తులకూ, లోకపాలురకూ, విశ్వకర్మకూ, హవ్యం సమర్పించాలి.

రాత్రిసూక్తం చ రౌద్రం చ పావమానం సుమఙ్గలమ్ ।
జపేయుః పౌరుషం సూక్తం పూర్వతో బహ్వృచః పృథక్ ॥33॥

తూర్పున బహ్వృచశాఖీయులు (ఋగ్వేదులు) రాత్రిసూక్తం, రుద్రసూక్తం, మంగళకరమైన పావమాన సూక్తం, పురుష సూక్తం - విడివిడిగా వీటిని పఠించాలి.

శాక్రం రౌద్రం చ సౌమ్యం చ కూష్మాణ్డం జాతవేదసమ్ ।
సౌరసూక్తం జపేన్మంత్రం దక్షిణేన యజుర్విదః ॥34॥

దక్షిణదిశలోని యజుర్వేదులు ఇంద్ర, రుద్ర, సోమకూష్మాండ అగ్ని సౌరసూక్తాలు పఠించాలి.

వైరాజ్యం పౌరుషం సూక్తం సౌవర్ణం రుద్రసంహితామ్ ।
శ్యైతం చ పఞ్చ నిధనం గాయత్రం జ్యేష్ఠసామ చ ॥35॥

వామదేవ్యం బృహత్సామ రౌరవం సరథన్తరమ్ ।
గవాం వ్రతం వికర్ణం చ రక్షోఘ్నం వయనం తథా ।
గాయేయుః సామగా రాజన్ పశ్చిమం ద్వారమాశ్రితాః ॥36॥

అట్లే సామవేదగాయకులు పశ్చిమద్వారంలో ఉన్నవారు వైరాజ పౌరుష సౌవర్ణ రుద్రసూక్తాలను శ్యైత, పంచనిధన, గాయత్ర, జ్యేష్ఠ సామ సూక్తాలను వామదేవ్య, బృహత్సామ, రౌరవ, రథంతరసూత్రాలను, గోవ్రతం వికర్ణ, రక్షోఘ్న, వయన సూక్తాలను పఠించాలి.

అథర్వాణశ్చోత్తరతః శాన్తికం పౌష్టికం తథా ।
జపేయుర్మనసా దేవమాశ్రిత్య వరుణం ప్రభుమ్ ॥37॥

ఉత్తరాననున్న ఆథర్వణికులు శాన్తికపౌష్టికాలను వరుణ ధ్యాన పూర్వకంగా పఠించాలి.

పూర్వేద్యురభితో మంత్రైరేవం కృత్వాధివాసనమ్ ।
గజాశ్వరథ్యావల్మీకాత్సఙ్గమహ్రదగోకులాత్ ।
మృదమాదాయ కుమ్భేషు ప్రక్షిపేచ్చత్వరాత్తథా ॥38॥

తటాక ప్రతిష్ఠకు ముందుదినాన ఈ విధంగా మంత్రాలతో అధివాసనం చేసి ఏనుగులు, గుర్రాలు, రథాలు నిల్చే ప్రదేశంనుండి పుట్ట, ఆలమంద, చత్వరం, నదీసంగమం, మడుగు – ఈ ప్రదేశాలనుండి మట్టిని తెచ్చి, కుంభాలలో ఉంచాలి.

రోచనాం చ ససిద్ధార్థాం గన్ధం గుగ్గులమేవ చ ।
స్నపనం తస్య కర్తవ్యం పఞ్చగవ్యసమన్వితమ్ ॥39॥

అందు నింపిన గోరోచనం, ఆవాలు, గంధం, గుగ్గిళు, చూర్ణాలతో పంచగవ్యాలతో ఆయామంత్రాలతో వరుణునకు స్నపనం చేయించాలి.

ప్రత్యేకం తు మహామన్త్రైరేవం కృత్వా విధానతః ।
ఏవం క్షపాఽతివాహ్యాఽథ విధియుక్తేన కర్మణా ॥40॥

తతః ప్రభాతే విమలే సంజాతేఽథ శతం గవామ్ ।
బ్రాహ్మణేభ్యః ప్రదాతవ్యమష్టషష్టిశ్చ వా పునః ।
పంచాశద్వాఽథ షట్త్రింశత్పంచ వింశతిరప్యథ ॥41॥

విడివిడిగా మహామంత్రాలతో విధివిధానానుసారం ఇలా చేసి రాత్రి గడపాలి. ఆపై విధి యుక్తమైన కర్మతో తెల్లవారగానే నూరు గోవులను బ్రాహ్మణుల కివ్వాలి లేక అరువది ఎనిమిది గోవులనైనా ఇవ్వాలి. లేదా ఏబది లేక ముప్పది ఆరు లేదా ఇరువది అయిదు గోవులను ఇవ్వాలి.

తత స్సాంవత్సరప్రోక్తే శుభే లగ్నే సుశోభనే ।
వేదశబ్దైశ్చ గాన్ధర్వైర్వాద్యైశ్చ వివిధైః పునః ॥42॥

కనకాలంకృతాం కృత్వా జలే గామవతారయేత్ ।
సామగాయ చ సా దేయా బ్రాహ్మణాయ విశాంపతే! ॥43॥

తరువాత జ్యోతిషికుడు చెప్పిన శోభనాత్మకమైన శుభలగ్నమున వేదశబ్దాలతో, వివిధ గాంధర్వ వాద్యాలతో, కనకంతో అలంకరించిన గోవును నీటిలో ప్రవేశపెట్టాలి. రాజా! ఆ గోవును సామగానం చేసిన ద్విజుని కివ్వాలి.

పాత్రీమాదాయ సౌవర్ణీం పఞ్చరత్నసమన్వితామ్ ।
తత్ర నిక్షిప్య మకరమత్స్యాదీంశ్చైవ సర్వశః ।
ధృతాం చతుర్భిర్విప్రేంద్రై ర్వేదవేదాఙ్గపారగైః ॥44॥

మహానదీజలోపేతాం దధ్యక్షతసమన్వితామ్ ।
ఉత్తరాభిముఖీం ధేనుం జలమధ్యే తు కారయేత్ ॥45॥

ఆపై పంచరత్నాలు గల సువర్ణ పాత్రను గ్రహించి అందు మకరమత్స్యాదుల ప్రతిమలను నలు వైపులా ఉంచి వేద వేదాంగ పారంగతులైన నలుగురు విప్రులచేత పట్టుకొనబడిన పాత్రను మహానదీ జలాలతోను, దధ్యక్షతలతోను నింపి, పూజించి ఉత్తరాభిముఖులైన విప్రులచే జలమధ్యంలో ప్రవేశింపజేయాలి.

ఆథర్వణేన సామ్నా చ పునర్మామేత్యథేతి చ ।
ఆపోహిష్ఠేతి మన్త్రేణ క్షిప్త్వాఽఽగత్య చ మణ్డపమ్ ॥46॥

తరువాత అథర్వవేద పండితుడు 'పునర్మామేతి, అథేతి' ఇత్యాదిమంత్రోచ్చారణ పూర్వకంగా ఆ పాత్రను నీటనుంచి ఆపోహిష్ఠ అను మంత్రంతో పూజించి యజమాని మండపం వద్దకు పోవాలి.

పూజయిత్వా సదస్తత్ర బలిం దద్యాత్ సమన్తతః ।
పునర్దినాని హోతవ్యం చత్వారి మునిసత్తమాః! ॥47॥

అప్పుడు సదస్సులోని పెద్దలను పూజించాలి. నలువైపుల బలి నివేదన పెట్టాలి. మునివర్యులారా! ఆపై నాల్గు దినాలు హోమాలు నిర్వహించాలి.

చతుర్థే కర్మ కర్తవ్యం దేయా తత్రాపి శక్తితః ।
దక్షిణా రాజశార్దూల వరుణస్య క్షమాపణమ్ ॥48॥

నాల్గవరోజు చివర కర్తవ్యకర్మ చేయాలి. శక్తికొలది దానం చేయాలి. రాజశార్దూలా! వరుణనకు క్షమాపణం చెప్పాలి.

కృత్వా తు యజ్ఞపాత్రాణి యజ్ఞోపకరణాని చ ।
ఋత్విగ్భ్యస్తు సమం దత్వా మణ్డపం విభజేత్పునః ।
హేమపాత్రీం చ శయ్యాం చ స్థాపకాయ నివేదయేత్ ।49॥

అలా చేసి యజ్ఞ పాత్రలను, యజ్ఞోపకరణాలను ఋత్విక్కులకు సమంగా ఇచ్చి మండపసామగ్రిని విభజించాలి. స్వర్ణపాత్రను, శయ్యను – ముఖ్యపురోహితునికి ఇవ్వాలి.

తతః సహస్రం విప్రాణా మథవాఽష్టశతం తథా ।
భోజనీయం యథాశక్తి పంచాశద్వాథ వింశతిః ।
ఏవమేష పురాణేషు తడాగవిధిరుచ్యతే ॥50॥

తదుపరి వెయ్యిమంది విప్రులకు, లేదా ఎనిమిది వందలు లేదా ఏబది, ఇరువదిమందికి యథాశక్తి భోజనం పెట్టాలి. ఇలా పురాణాలలో తటాకవిధి చెప్పడమయింది.

కూపవాపీషు సర్వాసు తథా పుష్కరణీషు చ ।
ఏష ఏవ విధిర్దృష్టః ప్రతిష్ఠాసు తథైవ చ ॥51॥

అట్లే అన్ని కూపాలు, నడబావులు, పుష్కరిణుల విషయాలలో గూడా, ప్రతిష్ఠలలో సైతం ఇదే విధానం చెప్పబడింది.

మన్త్రతస్తు విశేషః స్యాత్ప్రాసాదోద్యానభూమిషు ।
అయం త్వశక్తావర్ధేన విధిర్దృష్ట స్స్వయమ్భువా ।
అల్పేష్వేకాగ్నివత్కుర్యాద్విత్తశాఠ్యాదృతే నృణామ్ ॥52॥

ప్రాసాదాదులు ఉద్యానభూమిలో మన్త్రపరంగా విశేషాలుంటాయి. శక్తి లేకపోతే ఇందులో సగం కార్యక్రమమైనా చెయ్యాలని బ్రహ్మ నిర్దేశించాడు. చిన్న కార్యాలలో ఏకాగ్ని (వానప్రస్థునివలె) చేయవచ్చు. పిసినారితనం లేకుండా కార్యాన్ని చేయాలి.

ప్రావృట్కాలే స్థితం తోయమగ్నిష్టోమసమం స్మృతమ్ ।
శరత్కాలే స్థితం యత్స్యాత్తదుక్థ్య ఫలదాయకమ్ ।
వాజపేయాతిరాత్రాభ్యాం హేమన్తే శిశిరే స్థితమ్ ॥53॥

అలా ప్రతిష్ఠించిన జలాశయంలో జలం వర్షాకాలంలో అగ్నిష్టోమరూపం ధరిస్తుంది. శరత్కాలంలో ఈ ప్రతిష్ఠ జరిపితే ఉక్థ్యయజ్ఞఫలాన్ని ఇస్తుంది. హేమన్తంలో వాజపేయఫలాన్ని, శిశిరంలో అతిరాత్ర ఫలాన్ని ప్రసాదిస్తుంది.

అశ్వమేధసమం ప్రాహు ర్వసన్తసమయే స్థితమ్ ।
గ్రీష్మేఽ ప్యవస్థితం తోయం రాజసూయాద్విశిష్యతే ॥54॥

వసన్తర్తువులో ఐతే అశ్వమేధఫలం చెప్పారు. గ్రీష్మంలో గూడా ఆనీటివల్ల రాజసూయంకంటె ఎక్కువ ఫలమే కల్గుతుంది.

ఏతాన్మహారాజ విశేషధర్మాన్ కరోతి యోఽ ప్యాగమశుద్ధబుద్ధిః ।
స యాతి రుద్రాలయమాశు పూతః కల్పానేకాన్దివి మోదతే చ ॥55॥

మహారాజా! ఆగమశుద్ధబుద్ధియై ఈ విశేష ధర్మాలను ఎవడు నిర్వహిస్తాడో, వాడు పవిత్రాత్ముడై శీఘ్రంగా రుద్రాలయం చేరుతాడు. అనేక కల్పాలు స్వర్గంలో సంతోషంతో ఉంటాడు.

అనేకలోకాన్సమహర్జనాదీన్ భుక్త్వా పరార్ధద్వయమఙ్గనాభిః ।
సహైవ విష్ణోః పరమం పదం యత్ ప్రాప్నోతి తద్యోగఫలేన భూయః ॥56॥

అక్కడ అతడు మహర్జనాది లోకాలలో రెండు పరార్ధాల కాలం స్త్రీలతో సహా ఉండి యోగసిద్ధివల్ల కలిగే విష్ణువు యొక్క పరమపదం పొందుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తటాకాది ప్రతిష్ఠావిధిర్నామ అష్టపంచాశోఽ ధ్యాయః ॥ 58 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని తటాకాది ప్రతిష్ఠావిధి అనే యాభైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనషష్టితమోఽధ్యాయః - యాభైతొమ్మిదవ అధ్యాయం

ఆరామ ప్రతిష్ఠావిధిః - ఆరామ ప్రతిష్ఠావిధి

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

పాదపానాం విధిం సూత! యథావద్విస్తరాద్వద ।
విధినా కేన కర్తవ్యం పాదపోద్యాపనం బుధైః ॥1॥

సూతా! వృక్షాల విధిని సవిస్తరంగా చెప్పు. బుధులు చెట్లతో ఉద్యాన వనాన్ని ఎలా ఏర్పరచాలి?

యే చ లోకాః స్మృతాస్తేషాం తానిదానీం వదస్వ నః ।
యత్ఫలం లభతే ప్రేత్య తత్సర్వం వక్తుమర్హసి ॥2॥

దాని వల్ల ప్రయోజనమేమి? అందువల్ల కలిగే లోకాలు ఎట్టివి? వాటిని మాకిప్పుడు వివరించు. ఇలా చేస్తే మరణానంతరం ఏ ఫలం దొరకునో దాన్ని చెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

పాదపానాం విధిం వక్ష్యే తథైవోద్యానభూమిషు ।
తడాకవిధివత్సర్వమాసాద్య జగదీశ్వర! ॥3॥

ఋత్విఙ్మండపసమ్భారానాచార్యం స్థాపయేద్బుధః ।
పూజయేద్బ్రాహ్మణాంస్తద్వద్ధేమవస్త్రానులేపనైః ॥4॥

జగదీశ్వరా! చెట్లకు సంబంధించిన, అట్లే ఉద్యాన వన స్థాపనకు చెందిన విధిని చెబుతాను- తటాక స్థాపనలో వలె సర్వం సమకూర్చుకోవాలి. ఋత్విక్కులు, మండపం, సంభారాలు చేకూర్చుకొని అట్టివాడే అయిన ఆచార్యుణ్ణి ఆహ్వానించాలి. స్వర్ణవస్త్రానులేపనాలతో బ్రాహ్మణులను అర్చించాలి.

సర్వౌషధ్యుదకైః సిక్తాన్పిష్టాతక విభూషితాన్ ।
వృక్షాన్మాల్యైరలఙ్కృత్య వాసోభిర్వేష్టయేత్తతః ॥5॥

సకలములైన ఓషధుల నీటితో తడిపినవి, పట్టవాసకంతో అలంకృంతాలూ అయిన చెట్లను మాల్యాలతో అలంకరించి తరువాత వస్త్రాలతో చుట్టాలి.

సూచ్యా సౌవర్ణయా కార్యం సర్వేషాం కర్ణవేధనమ్ ।
అఞ్జనం చాపి దాతవ్యం తద్వద్ధేమశలాకయా ॥6॥

బంగారు సూదితో అన్ని చెట్లకు కర్ణవేధనం చేయాలి. స్వర్ణశలాకతో కాటుక పూయాలి.

ఫలాని సప్త చాష్టౌ వా కలధౌతాని కారయేత్ ।
ప్రత్యేకం సర్వవృక్షాణాం వేద్యాం తాన్యధివాసయేత్ ॥7॥

బంగారుతో ఏడు లేక ఎనిమిది పండ్లు తయారు చేసి వాటిని ప్రతిచెట్టు మొదట వేదికలో అధివసింపజేయాలి.

ధూపోఽత్ర గుగ్గులః శ్రేష్ఠస్తామ్రపాత్రైరధిష్ఠితాన్ ।
సప్తధాన్యస్థితాన్ కృత్వా వస్త్రగన్ధానులేపనైః ॥8॥

ఇక్కడ గుగ్గులధూపం శ్రేష్ఠమైనది. వస్త్రాలతో గంధానులేపనాలతో అలంకరించి పొగ వేసిన తామ్ర పాత్రలలో సప్తధాన్యాలు ఉంచాలి.

కుమ్భాన్సర్వేషు వృక్షేషు స్థాపయిత్వా నరేశ్వర ।
సహిరణ్యానశేషాంస్తాన్ కృత్వా బలినివేదనమ్ ॥9॥

రాజా! ఆ కుంభాలను సకల వృక్షాలలో ఉంచి బంగారంతో కూడిన వాటికన్నింటికీ దేవతలనుద్దేశించి బలి నివేదనం చేయాలి.

యథా స్వం లోకపాలానామిన్ద్రాదీనాం విశేషతః ।
వనస్పతేశ్చ విధివద్ధోమః కార్యో ద్విజాతిభిః ॥10॥

తన సంపదననుసరించి లోకపాలురైన ఇంద్రాదులకు, విశేషించి వనస్పతికి, విద్వాంసులైన ద్విజాతులు హోమం చేయించాలి.

తతః శ్శుక్లామ్బరధరాం సౌవర్ణకృతభూషణామ్ ।
సకాంస్య దోహాం సౌవర్ణ శృఙ్గాభ్యామతిశాలినీమ్ ।
పయస్వినీం వృక్షమధ్యాదుత్సృజేద్గాముదఙ్ముఖీమ్ ॥11॥

తరువాత తెల్లవస్త్రాలు ధరించినదీ, బంగారు భూషణాలచే అలంకరింపబడినది, కంచుతో చేసిన పాలు పితుకు పాత్ర గలదీ, బంగారు కొమ్ములతో శోభిల్లునది, అగు పాలిచ్చే ఆవును చెట్లనడుమనుండి ఉత్తరాభిముఖంగా విసర్జించాలి.

తతోఽభిషేకమన్త్రేణ వాద్యమఙ్గళగీతకైః ।
ఋగ్యజుః స్సామమన్త్రైశ్చ వారుణైరభితస్తథా ।
తైరేవ కుమ్భైః స్నపనం కుర్యాద్బ్రాహ్మణపుఙ్గవః ॥12॥

తరువాత అభిషేక మంత్రాలతో, వాద్యమంగళ గీతాలతో, వరుణదేవతాకాలైన ఋగ్యజస్సామ మంత్రాలతో– బ్రాహ్మణ శ్రేష్ఠుడు ఆ కుంభాలతోనే స్నపనం చేయాలి.

స్నాతః శుక్లామ్బరధరో యజమానోఽభిపూజయేత్ ।
గోభిర్విభవత స్సర్వానృత్విజస్తాన్సమాహితః ॥13॥

అట్లు స్నానం చేసి తెల్లవస్త్రాలు ధరించిన యజమానుడు ఋత్విక్కుల నందరినీ శ్రద్ధతో విభవం కొలదీ గోవులతో సహా అర్చించాలి.

హేమసూత్రై స్సకటకైరఙ్గులీయైః పవిత్రకైః ।
వాసోభిః శయనీయైశ్చ తథోపస్కరపాదుకైః ।
క్షీరేణ భోజనం దద్యాద్యావద్దినచతుష్టయమ్ ॥14॥

కటకసహిత స్వర్ణసూత్రాలతో, అంగులీయక పవిత్రకాలతో, వస్త్రాలతో, శయ్యలతో, ఉపస్కర పాదుకలతో సమ్మానించాలి. ఆపై నాల్గురోజులు క్షీరంతో వారికి భోజనం పెట్టాలి.

హోమశ్చ సర్షపైః కార్యో యవైః కృష్ణతిలైస్తథా ।
పలాశసమిధః శస్తాశ్చతుర్థేఽహ్ని తథోత్సవః ।
దక్షిణా చ పునస్తద్వద్దేయా తత్రాపి శక్తితః ॥15॥

ఆవాలతో, యవలతో, నల్ల నువ్వులతో హోమం చేయాలి. హోమానికి మోదుగ కర్రలు ప్రశస్తాలు. నాల్గవరోజున ఉత్సవం నిర్వహించాలి. శక్తి కొలది అప్పుడు కూడా ఋత్విక్కులైన విప్రులకు దక్షిణలివ్వాలి.

యద్యదిష్టతమం కిఞ్చిత్ తత్తద్దద్యాదమత్సరీ ।
ఆచార్యే ద్విగుణం దద్యాత్ ప్రణిపత్య విసర్జయేత్ ॥16॥

ఏదేది మిక్కిలి ఇష్టమైనదో, అదంతా మాత్సర్యం లేకుండా ఇవ్వాలి. ఆచార్యునికి ఇతరుల కిచ్చిన దానికంటే రెండింతలెక్కువ ఇవ్వాలి. తదుపరి నమస్కరించి వారిని పంపివేయాలి.

అనేన విధినా యస్తు కుర్యాద్వృక్షోత్సవం బుధః ।
సర్వాన్కామానవాప్నోతిత ఫలం చానన్త్యమశ్నుతే ॥17॥

ఇలా ఏ బుధుడు వృక్షోత్సవం చేస్తాడో, వాడు సర్వకామాలనూ పొందుతాడు, అనంత ఫలాలు పొందుతాడు.

యశ్చైకమపి రాజేన్ద్ర వృక్షం సంస్థాపయేన్నరః ।
సోఽపి స్వర్గే వసేద్రాజన్ యావదిన్ద్రశతత్రయమ్ ॥18॥

రాజవర్యా! ఒక్క చెట్టునైనా ఎవడు స్థాపిస్తాడో, వాడు గూడా స్వర్గంలో మూడు వందలమంది ఇంద్రులున్నంతకాలం ఉంటాడు.

భూతాన్భవ్యాంశ్చ మనుజాంస్తారయేద్ద్రుమసమ్మితాన్ ।
పరమాం సిద్ధిమాప్నోతి పునరావృత్తిదుర్లభామ్ ॥19॥

కడచిన, రానున్న మనుజులను పితరులను తాను నాటిన చెట్లెన్నో అంతమందిని తరింపజేస్తాడు. పునర్జన్మరహితమైన పరమసిద్ధిని పొందుతాడు.

య ఇదం శృణుయాన్నిత్యం శ్రావయేద్వాఽపి మానవః ।
సోఽపి సమ్పూజితో దేవై ర్బ్రహ్మలోకే మహీయతే ॥20॥

ఎవడు దీన్ని నిత్యం వింటాడో, వినిపిస్తాడో, వాడు దేవతలచే పూజింపబడి బ్రహ్మలోకంలో సుఖిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఆరామ ప్రతిష్ఠావిధిర్నామ ఏకోనపంచాశోఽధ్యాయః ॥ 59 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ఆరామ ప్రతిష్ఠావిధి అనే యాభైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

షష్టితమోऽధ్యాయః - అరవైయవ అధ్యాయం

సౌభాగ్య శయనవ్రతమ్ - సౌభాగ్య శయనవ్రతం

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

తథైవాన్యత్ ప్రవక్ష్యామి సర్వకామఫలప్రదమ్ ।
సౌభాగ్యశయనం నామ యత్పురాణవిదో విదుః ॥1॥

అట్లే మరొక సమస్తకామ ఫలాలను ప్రసాదించే వ్రతం చెబుతాను. పురాణజ్ఞులు దాన్ని సౌభాగ్య శయన వ్రత మంటారు.

పురా దగ్ధేషు లోకేషు భూర్భువః స్వర్మహాదిషు ।
సౌభాగ్యం సర్వభూతానామేకస్థమభవత్తదా ।
తచ్చ వైకుంఠమాస్థాయ విష్ణోర్వక్షస్థలే స్థితమ్ ॥2॥

పూర్వం భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం- మున్నగు లోకాలు తగలబడిపోయాయి. అప్పుడు సర్వప్రాణులయొక్క సౌభాగ్యం ఒక్కచో చేరి వైకుంఠానికి పోయి విష్ణువక్షఃస్థలంపై ఉండిపోయింది.

తతః కాలేన మహతా పునః సర్గవిధౌ నృప! ।
అహఙ్కారావృతే లోకే ప్రధానపురుషాత్మకే ॥ 3॥

తరువాత చాలా కాలానికి మళ్ళీ సృష్టికార్యక్రమం ప్రారంభమయింది. రాజా! లోకం ప్రధానపురుషమయమై అహంకారావృతమయ్యింది.

స్పర్ధాయాం చ ప్రవృత్తాయాం కమలాసనకృష్ణయోః ।
లిఙ్గాకార సముద్భూతా వహ్నేర్జ్వాలాऽతిభీషణా ।
తయాభితప్తస్య హరేర్వక్షసస్తద్వినిస్సృతమ్ ॥4॥

బ్రహ్మవిష్ణువులకు స్పర్ధ ఏర్పడింది. అప్పుడు అతిభయంకరమై లింగాకారంతో అగ్నిజ్వాల ఉద్భవించింది. దానితో నలువైపులా తప్తమైన హరి వక్షంనుండి లోకసౌభాగ్యం వెలికి వచ్చింది.

వక్షఃస్థలం సమాశ్రిత్య విష్ణో స్సౌభాగ్యమాస్థితమ్ ।
రసరూపం తతో యావత్ ప్రాప్నోతి వసుధాతలమ్ ॥5॥

ఉత్క్షిప్తమన్తరిక్షే తద్బ్రహ్మపుత్రేణ ధీమతా ।
దక్షేణ పీతమాత్రం తద్రూపలావణ్యకారణమ్ ॥6॥

విష్ణువక్షః స్థలమునాశ్రయించి వుండిన ఆసౌభాగ్యం రసరూపం పొంది భూతలానికి చేరకముందే అంతరిక్షంలోనే బుద్ధిమంతుడు, బ్రహ్మపుత్రుడైన దక్షుడు రూపలావణ్యహేతువైన దాన్ని త్రాగివేశాడు.

బలం తేజో మహజ్జాతం దక్షస్య పరమేష్ఠినః ।
శేషం యదపతద్భూమావష్టధా సమజాయత ॥7॥

దక్షునికి దానివల్ల బలం, తేజస్సు పెరిగాయి. దానిలో మిగిలినది కొంత భూమిపై బడి ఎనిమిది విభాగా లయింది.

తతస్త్వోషధయో జాతాః సప్త సౌభాగ్యదాయకాః ।
ఇక్షవో రసరాజాశ్చ నిష్పావో జాతిధాన్యకమ్ ॥8॥

వికారవచ్చ గోక్షీరం కుసుమ్భం కుంకుమం తథా ।
లవణం చాష్టమం తద్వత్ సౌభాగ్యాష్టకముచ్యతే ॥9॥

తదుపరి జనులకు సౌభాగ్యమిచ్చే ఏడు ఓషధులు ఏర్పడ్డాయి. (1) చెరకు (2) చక్కెర (3) జాజికాయ (4) ధనియాలు (5)విరిగిన ఆవుపాలు (6)కుంకుమ పువ్వు (బొబ్బరలు) (8)లవణం– వీటిని సౌభాగ్యాష్టకమంటారు.

పీతం యద్బ్రహ్మపుత్రేణ యోగజ్ఞానవిదా పునః ।
దుహితా సాఽభవత్తస్య యా సతీత్యభిధీయతే ॥10॥

యోగజ్ఞానవేత్త, బ్రహ్మ పుత్రుడైన దక్షుడు త్రాగినభాగం అతనికి కూతురై పుట్టింది. ఆమెకు 'సతి' అనిపేరు.

లోకానతీత్య లాలిత్యాల్లలితా తేన చోచ్యతే ।
త్రైలోక్యసున్దరీమేనాముపయేమే పినాకధృక్ ॥11॥

లాలిత్యంలో లోకాతీతమైనది కాన ఆమెను 'లలిత' అని కూడా అంటారు. త్రైలోక్యసుందరి అయిన ఆమెను శివుడు చేపట్టాడు.

సా సౌభాగ్యమయీ దేవీ భుక్తిముక్తి ఫలప్రదా ।
తామారాధ్య పుమాన్ భక్త్యా నారీ వా కిం న విన్దతి ॥12॥

ఆ దేవి సౌభాగ్యమయి, భుక్తముక్తి ఫలాలిస్తుంది. ఆమెను భక్తితో ఆరాధించిన స్త్రీయైనా, పురుషుడైనా పొందరాని దేమున్నది?

మనురువాచ :– మనువు చెప్పాడు.

కథమారాధనం తస్యా జగద్ధాత్ర్యా జనార్దన! ।
తద్విధానం జగన్నాథ! తత్ సర్వం త్వం వదస్వ మే ॥13॥

జనార్దనా! ఆ జగన్మాత యొక్క ఆరాధన మెలా ఉండాలి? జగన్నాథా? ఆ విధానమంతా నాకు చెప్పు.

మత్స్య ఉవాచ :– మత్స్యం చెప్పింది.

వసన్తమాసమాసాద్య తృతీయాయాం జనప్రియ! ।
శుక్లపక్షస్య పూర్వాహ్ణే తిలైస్స్నానం సమాచరేత్ ॥14॥

జనప్రియా! వసన్తమాసం రాగానే చైత్ర శుక్లపక్ష తృతీయనాడు పూర్వాహ్ణంలో నువ్వులతో స్నానం చేయాలి.

తస్మిన్నహని సా దేవీ కిల విశ్వాత్మనా సతీ ।
పాణిగ్రహణకైర్మన్త్రై రుదూఢా వరవర్ణినీ ॥15॥

ఎందుకంటే ఆదినమే వరవర్ణినియైన ఆదేవి విశ్వాత్ముని పాణిగ్రహణ మంత్రాలతో పెండ్లాడింది.

తయా సహైవ దేవేశం తృతీయాయామథార్చయేత్ ।
ఫలైర్నానావిధై ర్ధూపైర్దీపనైవిద్యసంయుతైః ॥16॥

అందువల్ల ఆమెతో గూడా దేవేశుణ్ణి ఆతృతీయనాడు నానావిధఫలాలతో, ధూపాలతో, దీపనైవేద్యాలతో అర్చించాలి.

ప్రతిమాం పఞ్చగవ్యేన తథా గన్ధోదకేన తు ।
స్నాపయిత్వాஉర్చయే ద్గౌరీం చన్ద్రశేఖరసంయుతామ్ ॥17॥

చంద్రశేఖరునితో గూడిన గౌరీ ప్రతిమను పంచగవ్యంతో, గంధోదకంతో– స్నానం చేయించి అర్చించాలి.

నమోஉస్తు పాటలాయై తు పాదౌ దేవ్యాః శివస్య తు ।
శివాయేతి చ సఙ్కీర్త్య జయాయై గుల్ఫయోర్ద్వయోః ॥18॥

'పాటలాయై నమః' అంటూ శివుని పాదాలు, దేవిపాదాలు పూజించాలి. 'జయాయై, శివాయ చ నమః' అని ఇరువురి గుల్ఫాలు పూజించాలి.

త్ర్యంబకాయేతి రుద్రస్య భవాన్యై జంఘయోర్యుగమ్ ।
శివం భద్రేశ్వరాయేతి విజయాయై చ జానునీ ।
సఙ్కీర్త్య హరికేశాయ తథోరూ వరదే నమః ॥19॥

'త్ర్యంబకాయ భవాన్యై నమః' అని ఇద్దరి జంఘలను, 'విజయాయై భద్రేశ్వరాయ చ' అని వారి మోకాళ్ళను, 'వరదాయై హరికేశాయ నమః' అంటూ ఊరువులను పూజించాలి.

ఈశాయై చ కటిం దేవ్యాః శంకారాయేతి శంకరమ్ ।
కుక్షిద్వయం చ కౌశిన్యై శూలినే శూలపాణయే ॥20॥

'ఈశాయై శంకరాయ చ నమః' అని కటిని పూజించాలి. 'కౌశిన్యై శూలినే శూలపాణయే నమః' అని కుక్షిద్వయాన్ని అర్చించాలి.

మఙ్గళాయై నమస్తుభ్యముదరం చాభిపూజయేత్ ।
సర్వాత్మనే నమో రుద్రమీశాన్యై చ కుచద్వయమ్ ॥21॥

'మంగళాయై మంగళాయ చ నమః' అని ఉదరాన్ని పూజించాలి. 'సర్వాత్మనే నమః' అని రుద్రుణ్ణి, 'ఈశాన్యై నమః' అని ఆమె కుచద్వయాన్ని పూజించాలి.

శివం వేదాత్మనే తద్వద్రుద్రాణ్యై కణ్ఠమర్చయేత్ ।
త్రిపురఘ్నాయ విశ్వేశమనన్తాయై కరద్వయమ్ ॥22॥

'రుద్రాణ్యై వేదాత్మనే చ నమః' అని కంఠాన్ని, 'త్రిపురఘ్నాయ' అని విశ్వేశ్వరుణ్ణి, 'అనన్తాయై నమః' అని కరద్వయాన్ని పూజించాలి.

త్రిలోచనాయ చ హరం బాహూ కాలానలప్రియే ।
సౌభాగ్యభవనాయేతి భూషణాని సదార్చయేత్ ।
స్వాహా స్వధాయై చ ముఖమీశ్వరాయేతి శూలినమ్ ॥23॥

'కాలానలప్రియాయై త్రిలోచనాయ నమః' అని వారి బాహువులను పూజించాలి. 'సౌభాగ్య భవనాయై సౌభాగ్య భవనాయ నమః' అని భూషణాలను పూజించాలి. 'స్వాహాయై నమః, స్వధాయై నమః, అని ఈశ్వరాయ నమః, అని ముఖాన్ని అర్చించాలి.

అశోకమధువాసిన్యై పూజ్యావోష్ఠౌ చ భూతిదౌ ।
స్థాణవే తు హరం తద్వదాస్యం చన్ద్రముఖప్రియే ॥24॥

'అశోకమధువాసిన్యై అశోకమధువాసినే నమః' అని ఓష్ఠాలను, 'చంద్రముఖప్రియాయై స్థాణవే నమః'అని ఆస్యాన్ని పూజించాలి.

నమోఽర్ధనారీశహరమసితాఙ్గీతి నాసికామ్ ।
నమ ఉగ్రాయ లోకేశం లలితేతి పునర్భ్రువౌ ॥25॥

'అసితాంగ్యై అర్ధనారీశహరాయ నమః' అని ఇరువురి నాసికలను, 'లలితాయై ఉగ్రాయ నమః' అని కనుబొమ్మలను పూజించాలి.

శర్వాయ పురహన్తారం వాసవ్యై తు తథాలకాన్ ।
నమః శ్రీకణ్ఠనాథాయ శివం కేశాంస్తతోఽర్చయేత్ ।
భీమోగ్రసమరూపిణ్యై శిర స్సర్వాత్మనే నమః ॥ 26॥

శర్వాయ నమః, వాసవ్యై నమః, అని త్రిపురాదేవి అలకలను పూజించాలి. శ్రీకంఠనాథాయ నమః అని శివకేశాలను, భీమోగ్రరూపిణ్యై నమః అని 'సర్వాత్మనే నమః" అని శిరస్సును పూజించాలి.

శివమభ్యర్చ్య విధివ త్సౌభాగ్యాష్టకమగ్రతః ।
స్థాపయేద్ఘృతనిష్పావ కుసుమ్భ క్షీరజీరకాన్ ॥27॥

రసరాజేక్షు లవణం కుసుమ్భకమథాష్టకమ్ ।
దత్తం సౌభాగ్యకృద్యస్మాత్ సౌభాగ్యష్టకమిత్యుత ॥28॥

ఇలా విధ్యుక్తవిధితో శివుణ్ణి అర్చించి– శివుని ముందర సౌభాగ్యాష్టకాన్ని స్థాపించాలి. ఘృతం, నిష్పావం,

కుసుంభం, క్షీరం, జీరకం, రసరాజం, లవణం, కుసుంభం – ఇవి సౌభాగ్యాష్టకాలు. సౌభాగ్యము ఇచ్చునని గాన సౌభాగ్యాష్టకాలని ప్రసిద్ధి పొందాయి.

ఏవం నివేద్య తత్సర్వమగ్రతః శివయోః పునః ।
రాత్రౌ శృఙ్గోదకం ప్రాశ్య స్వపేద్భూమావరిన్దమ! ॥29॥

శత్రువినాశకా! ఇలా శివాశివులముందు నివేదనం చేసి రాత్రి పూట గోవు కొమ్ములు కడిగిన నీరుత్రాగి-భూమిపై శయనించాలి.

పునః ప్రభాతే తు తథా కృతస్నానజపః శుచిః ।
సమ్పూజ్య ద్విజదామ్పత్యం వస్త్రమాల్యవిభూషణైః ॥30॥

మరలప్రభాతకాలంలో స్నాన జపాదులు చేసి శుచియై ద్విజదంపతులను వస్త్రమాంగల్య భూషణాలతో అర్చించాలి.

సౌభాగ్యాష్టకసంయుక్తం సువర్ణచరణద్వయమ్ ।
ప్రీయతామత్ర లలితా బ్రాహ్మణాయ నివేదయేత్ ॥31॥

సౌభాగ్యాష్టకసమేతంగా బంగారుతో చరణద్వయం తయారు చేసి 'లలితా ప్రీయతాం' అంటూ బ్రాహ్మణునికి నివేదించాలి.

ఏవం సంవత్సరం యావత్తృతీయాయాం సదా మనో ।
కర్తవ్యం విధివద్భక్త్యా సర్వసౌభాగ్యమీప్సుభిః ॥32॥

మనూ! ఇలా ఒక సంవత్సరకాలం శుక్లపక్షతృతీయనాడు విధిప్రకారం భక్తితో సర్వసౌభాగ్యాలు కోరువారు ఆచరించాలి.

ప్రాశనే దానమన్త్రే చ విశేషోఽయం నిబోధ మే ।
శృఙ్గోదకం చైత్రమాసే వైశాఖే గోమయం పునః ॥33॥

జ్యేష్ఠే మన్దారకుసుమం బిల్వపత్రం శుచౌ స్మృతమ్ ।
శ్రావణే దధి సమ్ప్రాశ్యం నభస్యే తు కుశోదకమ్ ॥34॥

ఆహారస్వీకారం, దానమంత్రం – వీటిలో తేడాలు, విశేషం గూడా చెబుతాను గ్రహించు. చైత్రంలో గోశృంగం కడిగిన నీరు, వైశాఖంలో గోమయం, జ్యేష్ఠంలో మందార పుష్పం, ఆషాఢంలో బిల్వపత్రం, శ్రావణంలో పెరుగు, భాద్రపదంలో దర్భనీరు స్వీకరించాలి.

క్షీరమాశ్వయుజే మాసి కార్తికే పృషదాజ్యకమ్ ।
మార్గే మాసే తు గోమూత్రం పౌషే సంప్రాశయేత్ఘృతమ్ ॥35॥

ఆశ్వయుజలో క్షీరం, కార్తికంలో మీగడపెరుగు, మార్గశిరంలో గోమూత్రం, పౌష్యంలో ఘృతం ఆహారంగా స్వీకరించాలి.

మాఘే కృష్ణతిలాం స్తద్వత్పఞ్చగవ్యం చ ఫాల్గునే ।
లలితా విజయా భద్రా భవానీ కుముదా శివా ॥36॥

వాసుదేవీ తథా గౌరీ మఙ్గళా కమలా సతీ ।
ఉమా చ దానకాలే తు ప్రీయతామితి కీర్తయేత్ ॥37॥

మాఘంలో నల్లనూగులు, ఫాల్గుణంలో పంచగవ్యం స్వీకరించాలి. దానకాలంలో "లలితా, విజయా, భద్రా, భవానీ, కుముదా, శివా, వాసుదేవీ, గౌరీ, మంగలా, కమలా, సతీ, ఉమా చ దానకాలే ప్రీయతాం' అని దేవీనామాలను కీర్తించాలి. 12నెలలు 12నామాలు కీర్తించాలి.

మల్లికాశోక కమలం కదమ్బోత్పలమాలతీః ।
కుబ్జకం కరవీరం చ బాణమామ్లానకుఙ్కుమమ్ ॥38॥

సిన్ధువారం చ సర్వేషు మాసేషు క్రమశః స్మృతమ్ ।
జపాకుసుమ్భకుసుమం మాలతీ శతపత్రికా ॥39॥

యథాలాభం ప్రశస్తాని కరవీరం చ సర్వదా ।
ఏవం సంవత్సరం యావదుపోష్య విధివన్నరః ॥40॥

క్రమంగా ఈ నెలలో వరుసగా అర్పించవలసిన పూలు– మల్లిక, అశోకం, కమలం, కడిమి, కలువ, మాలతి, కుబ్జకం, కరవీరం, రెల్లు, వాడగన్నేరు, కుంకుమం, సింధువారం – ఇవి క్రమంగా ఆయా మాసాలలో అర్పణ యోగ్యాలు. వీటిలో జపా కుసుంబకుసుమం, మాలతి, శతపత్రిక, యథాలాభంగా ప్రశస్తాలు. సదా కరవీరం యోగ్యమే. ఇలా ఒక సంవత్సరకాలం ఉపవసించాలి.

స్త్రీ భక్తా వా కుమారీ వా శివం చాభ్యర్చ్య భక్తితః ।
వ్రతాన్తే శయనం దద్యా త్సర్వోపస్కరసంయుతమ్ ॥41॥

భక్తితో కన్య గానీ, వివాహిత గానీ, శివుని అర్చించి వ్రతాంతంలో సర్వోపస్కారాలతో కూడిన శయనాన్ని దానం చేయాలి.

ఉమామహేశ్వరం హైమం వృషభం చ గవా సహ ।
స్థాపయిత్వాఽథ శయనే బ్రాహ్మణాయ నివేదయేత్ ॥42॥

స్వర్ణశివుణ్ణి, గోవుతో సహా స్వర్ణవృషభాన్ని శయనంలో ఉంచి బ్రాహ్మణునికివ్వాలి.

అన్యాన్యపి యథాశక్తి మిథునాన్యమ్బరాదిభిః ।
ధాన్యాలఙ్కారగోదానై రభ్యర్చ్యేద్ధనసంచయైః ।
విత్తశాఠ్యేన రహితః పూజయేద్గతవిస్మయః ॥43॥

యథాశక్తి ఇతరవస్తువులను గూడా దంపతులకు ధాన్యాలు, అలంకారాలు, గోవులు వగైరాలను ధనసంచయాలతో పూజించి ఇవ్వాలి. విత్తశాఠ్యం తగదు - సందేహం పనికిరాదు.

ఏవం కరోతి యః సమ్యక్ సౌభాగ్యశయనవ్రతమ్ ।
సర్వాన్కామానవాప్నోతి పదం చానన్త్యమశ్నుతే ।
ఫలస్యైకస్య త్యాగేన వ్రతమేతత్సమాచరేత్ ॥44॥

ఇలా ఎవరు సౌభాగ్యశయనవ్రతం చేస్తారో, వారు సర్వకామాలు పొంది అనంతఫలం పొందుతారు. ఫలత్యాగ బుద్ధితో ఈ వ్రతమనుష్ఠించాలి.

య ఇచ్ఛన్ కీర్తిమాప్నోతి ప్రతిమాసం నరాధిప ।
సౌభాగ్యారోగ్యరూపాయు ర్వస్త్రాలఙ్కారభూషణైః ।
న వియుక్తో భవేద్రాజ్యాద్వర్షార్బుద శతత్రయమ్ ॥45॥

రాజా! ప్రతి మాసం ఈ వ్రతం చేసేవాడు కీర్తిపొందుతాడు. సౌభాగ్యం, ఆరోగ్యం, సౌందర్యం, వస్త్రాలంకారాలు భూషణాలతో అతడు మూడువందల అర్బుదాల సంవత్సరాలు రాజ్యం చేస్తాడు.

యస్తు ద్వాదశవర్షాణి సౌభాగ్యశయనవ్రతమ్ ।
కరోతి సప్త చాష్టౌ వా శ్రీకణ్ఠభవనేఽమరైః ।
పూజ్యమానో వసేత్సమ్యక్ యావత్కల్పాయుతం నరః ॥46॥

ఎవడు ఈ వ్రతం - పంద్రెండు సంవత్సరాలు లేదా ఏడు లేక ఎనిమిది సం॥లు చేశాడో, వాడు- శ్రీకంఠమందిరంలో దేవతలచే పూజింపబడుతూ పదివేల కల్పాల నివసిస్తాడు.

నారీ వా కురుతే యత్ర కుమారీ వా నరేశ్వర ।
సాఽపి తత్ఫలమాప్నోతి దేవ్యనుగ్రహలాలితా ॥47॥

రాజా! స్త్రీ గానీ, కుమారి గానీ ఈ వ్రతం చేస్తే దేవి అనుగ్రహం పొంది అలాంటి ఫలం పొందుతుంది.

శృణుయాదపి యశ్చైవ ప్రదద్యాదథవా మతిమ్ ।
సోఽపి విద్యాధరో భూత్వా స్వర్గలోకే చిరం వసేత్ ॥48॥

ఎవడు దీన్ని వింటాడో, దీనిపై మతి నిల్పుతాడో వాడుగూడా విద్యాధరుడై స్వర్గలోకంలో చిరకాలంనివసిస్తాడు.

ఇదమిహ మదనేన పూర్వమిష్టం శతధృతినా కృతవీర్యసూనునా చ ।
కృతమథ వరుణేన నన్దినాఽన్యైః కిము జననాథ తదద్భుతం మహత్స్యాత్ ॥49॥

జననాథా! పూర్వం ఈ వ్రతాన్ని మదనుడు చేశాడు. బ్రహ్మ, కార్తవీర్యార్జునుడు, వరుణుడు, నంది, నిర్వహించారు. ఇక తక్కినవారిని గూర్చి ఏమి చెప్పాలి. ఇది మహాద్భుతం.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే సౌభాగ్య శయనవ్రతం నామ షష్టితమోఽధ్యాయః ॥ 60 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని సౌభాగ్య శయనవ్రతమనే అరవైయవ అధ్యాయం సంపూర్ణం

ఏకషష్టితమోఽధ్యాయః – అరవైఒకటవ అధ్యాయం

అగస్త్యోత్పత్త్యాది కథనం – అగస్త్యోత్పత్త్యాదుల కథనం

నారద ఉవాచ :– నారదుడు చెప్పాడు.

భూర్లోకోఽథ భువర్లోకః స్వర్లోకోఽథ మహర్జనః ।
తపః సత్యం చ సప్తైతే దేవలోకాః ప్రకీర్తితాః ॥1॥

భూలోకం, భువర్లోకం, స్వర్లోకం, మహర్లోకం, జనలోకం, తపోలోకం, సత్యలోకం– అనే ఈ యేడూ దేవలోకాలుగా చెప్పబడ్డాయి.

పర్యాయేణ తు సర్వేషామాధిపత్యం కథం భవేత్ ।
ఇహ లోకే శుభం రూపమాయుః సౌభాగ్యమేవ చ ।

లక్ష్మీశ్చ విపులా నాథ కథం స్యాత్ పురసూదన! ।
ఏతన్మే భగవన్! సర్వం యథావద్వక్తుమర్హసి ॥2॥

త్రిపుర సంహారకా! నాథా! అన్నిలోకాలకూ పర్యాయక్రమంలో ఆధిపత్యం ఎలా సిద్ధిస్తుంది? ఈ లోకంలో శుభరూపం, ఆయువు, సౌభాగ్యం, విస్తృతమైన సిరి ఎలా లభిస్తాయి? భగవన్! ఇదంతా నాకు యథాతథంగా వివరించు.

మహేశ్వర ఉవాచ :– మహేశ్వరుడు చెప్పాడు.

పురా హుతాశనః సార్ధం మారుతేన మహీతలే ।
ఆదిష్టః పురుహూతేన వినాశాయ సురద్విషామ్ ॥3॥

పూర్వం ఇంద్రుడు భూతలంలో రాక్షసులను సంహరించవలసినదిగా వాయువుతో గూడా అగ్ని నాదేశించాడు.

నిర్దగ్ధేషు తతస్తేన దానవేషు సహస్రశః ।
తారకః కమలాక్షశ్చ కాలదంష్ట్రః పరావసుః ।
విరోచనశ్చ సఙ్గ్రామాదపయాతాస్తపోధన ॥4॥

అగ్ని ప్రతాపానికి వేలాదిగా రక్కసులు కాలిపోయారు. తపోధనా! అపుడు తారకుడు, కమలాక్షుడు, కాలదంష్ట్రుడు, పరావసువు, విరోచనుడనే అసురులు యుద్ధంనుండి పారిపోయారు.

అంభః సాముద్రమావిశ్య సన్నివేశమకుర్వత ।
అశక్యా ఇతి తేఽప్యగ్నిమారుతాభ్యాముపేక్షితాః ॥5॥

వారు సముద్రజలాలలో ప్రవేశించి అక్కడ నివసించారు. ఇక వీరు జయింప వీలు గానివా రని అగ్ని వాయువులు వారి నుపేక్షించారు.

తతః ప్రభృతి తే దేవాన్ మనుష్యాన్ సహ జఙ్గమాన్ ।
సంపీడ్య చ మునీన్ సర్వాన్ ప్రవిశన్తి పునర్జలమ్ ॥6॥

నాటినుండి ఆ రాక్షసులు దేవతలను, మనుష్యులను, జంగమప్రాణులను, మునులనందరినీ బాధించి మళ్ళీ జలాలలో ప్రవేశించసాగారు.

ఏవం వర్షసహస్రాణి వీరాః పంచ చ సప్త చ ।
జలదుర్గబలాద్బ్రహ్మన్ పీడయన్తి జగత్త్రయమ్ ॥7॥

బ్రహ్మన్! ఇలా ఆ వీరులు 12సంవత్సరాల కాలం జలదుర్గబలంతో ముల్లోకాలనూ పీడించారు.

తతః పరమథో వహ్నిమారుతావమరాధిపః ।
ఆదిదేశ చిరాదమ్బునిధిరేష విశోష్యతామ్ ॥8॥

ఆపై ఇంద్రుడు అగ్ని వాయువులను "ఈ సముద్రాన్ని శుష్కింపజేయండి" అని ఆదేశించాడు.

యస్మాదస్మద్విషామేష శరణం వరుణాలయః ।
తస్మాద్భవద్భ్యామద్యైవ శోషమేష ప్రణీయతామ్ ॥9॥

ఈ వరుణాలయుడు మన శత్రువులకే రక్షకుడైనాడు గాన మీరు ఈ దినమే ఇతణ్ణి శుష్కింపజేయండి.

తావూచతుస్తతః శక్రముభౌ శమ్బరసూదనమ్ ।
అధర్మ ఏష దేవేన్ద్ర సాగరస్య వినాశనమ్ ॥10॥

అప్పుడు వారిద్దరూ శంబరారియగు ఇంద్రునితో ఇలా అన్నారు– దేవేంద్రా? సముద్రాన్ని నశింపజేయడం అధర్మమవుతుంది.

యస్మాజ్జీవనికాయస్య మహతః సంక్షయో భవేత్ ।
తస్మాన్న పాపమద్యావాం కరవావః పురన్దర! ॥11॥

ఇలా చేస్తే గొప్ప జీవసముదానికి సంక్షయం కల్గుతుంది పురందరా! అందువల్ల మేము ఆ పాపం చేయలేము.

అస్య యోజనమాత్రేఽపి జీవకోటిశతాని చ ।
నివసన్తి సురశ్రేష్ఠ! స కథం నాశమర్హతి ॥12॥

ఈ సాగరంలో ప్రతియోజనంలోనూ వందలాదిగా జీవకోట్లు నివసిస్తున్నాయి. దేవేంద్రా! అట్టి సముద్రానికి వినాశం తగునా!

ఏవముక్తః సురేన్ద్రస్తు కోపాత్సంరక్తలోచనః ।
ఉవాచేదం వచో రోషాన్నిర్దహన్నివ పావకమ్ ॥13॥

వారలా అనేసరికి కోపంతో ఎర్రబారిన నేత్రాలుగల ఇంద్రుడు అగ్నిని కాల్చేస్తున్నాడా అన్నట్లు ఇలా చెప్పాడు.

న ధర్మాధర్మసంయోగం ప్రాప్నువంత్యమరాః క్వచిత్ ।
భవతస్తు విశేషేణ మాహాత్మ్యం చాధితిష్ఠతి ॥14॥

దేవత లెక్కడా ధర్మాధర్మచర్చతో సంయోగం పొందరు. నీ ప్రాభవం విశేషించి చాలా గొప్పగా ఉన్నది.

మదాజ్ఞాలఙ్ఘనం యస్మాన్మారుతేన సమన్వితః ।
మునివ్రతమహింసాది పరిగృహ్య న కిం కృతమ్ ।
ధర్మార్థశాస్త్రరహితం శత్రుం ప్రతి విభావసో! ॥15॥

అగ్నీ! నీవు వాయువుతో గూడి నా ఆజ్ఞ నుల్లంఘించావు. అహింసాదికమైన మునివ్రతం పరిగ్రహించి అలా చేశావు. శత్రువు పట్ల ఇది ధర్మార్థశాస్త్ర విరుద్ధము.

తస్మాదేకేన వపుషా మునిరూపేణ మానుషే ।
మారుతేన సమం లోకే తవ జన్మ భవిష్యతి ॥16॥

అందువల్ల నీవు వాయువుతో కూడి ఒకే శరీరంగల మునిరూపంతో మానుషలోకంలో జన్మిస్తావు.

యదా చ మానుషత్వేఽపి త్వయాఽగస్త్యేన శోషితః ।
భవిష్యత్యుదధిర్వహ్నే తదా దేవత్వమాప్స్యసి ॥17॥

అగ్నీ! మనుష్యత్వ మున్నప్పటికీ అగస్త్యరూపంతో ఉన్న నీచే ఈ సాగరం శోషింపజేయబడినపుడు మరల నీవు దేవత్వం పొందగలవు.

ఇతీన్ద్రశాపాత్పతితౌ తత్క్షణాత్తౌ మహీతలే ।
అవాప్తావేకదేహేన కుమ్భాజ్జన్మ తపోధన ॥18॥

తపోధనా! ఇలా ఇంద్రుడు శపించగా తత్క్షణమే వారిరువురూ భూతలంలో పడి ఒకే శరీరంతో కుంభంనుండి జన్మించారు.

మిత్రావరుణయోర్వీర్యాద్వసిష్ఠస్యానుజోఽభవత్ ।
అగస్త్య ఇత్యుగ్రతపాః సమ్బభూవ పునర్మునిః ॥19॥

మిత్రావరుణుల వీర్యంనుండి వసిష్ఠుని అనుజుడై అగస్త్యుడను పేర ఉగ్రతపుడైన ముని అలా జన్మించాడు.

నారద ఉవాచ :– నారదుడు చెప్పాడు.

సమ్భూతః స కథం భ్రాతా వసిష్ఠస్యాభవన్మునిః ।
కథం చ మిత్రావరుణౌ పితరావస్య తౌ స్మృతౌ ।
జన్మ కుమ్భాదగస్త్యస్య కథం స్యాత్పురసూదన! ॥20॥

పురనిషూదనా! అలా పుట్టిన ముని వసిష్ఠుని సోదరు డెలా అయ్యాడు? మిత్రావరుణు లెలా అతనికి తండ్రు లయ్యారు? కుంభం నుండి అగస్త్యు డెలా జన్మించాడు?

ఈశ్వర ఉవాచ :– ఈశ్వరుడు చెప్పాడు.

పురా పురాణపురుషః కదాచిద్గన్ధమాదనే ।
భూత్వా ధర్మసుతో విష్ణుశ్చచార విపులం తపః ॥ 21॥

పూర్వం ఒకప్పుడు గంధమాదన పర్వతంలో పురాణ పురుషుడైన విష్ణువు ధర్మసుతుడైన నారాయణుడై విపులతపస్సు చేశాడు.

తపసా తస్య భీతేన విఘ్నార్థం ప్రేషితావుభౌ ।
శక్రేణ మాధవానఙ్గావప్సరోగణసంయుతౌ ॥22॥

అతని తపస్సుకు ఇంద్రుడు భయపడ్డాడు. తపోవిఘ్నం కల్గించడానికై అప్సరోగణాలతో గూడా వసంతుణ్ణీ, మదనుణ్ణీ పంపాడు.

యదా న గీతవాద్యేన నాఙ్గరాగాదినా హరిః ।
న కామమాధవాభ్యాం చ విషయాన్ప్రతి చుక్షుభే ॥23॥

వారి గీతావాద్యాలచేత, అంగరాగాదులచేత, వసంత కాములకు హరి లొంగలేదు. విషయక్షోభ పొందలేదు.

తదా కామమధుస్త్రీణాం విషాదమగమద్గణః ।
సంక్షోభాయ తతస్తేషాం స్వోరుదేశాన్నరాగ్రజః ।
నారీముత్పాదయామాస త్రైలోక్యజనమోహినీమ్ ॥24॥

అపుడు మదనుడు, వసంతుడు, స్త్రీల గణం దుఃఖానికి గురి అయింది. అపుడు వారిని సంక్షోభింప జేయడానికి విష్ణువు తన ఊరు దేశంనుండి ముల్లోకాలలోని జనులను మోహింపజేసే స్త్రీని జనింపజేశాడు.

సంక్షుబ్ధాస్తు తథా దేవాస్తౌ తు దేవవరావుభౌ ।
అప్సరోభిః సమక్షం హి దేవాంస్తానబ్రవీద్ధరిః ॥25॥

అప్సరా ఇతి సామాన్యా దేవానామబ్రవీద్ధరిః ।
ఊర్వశీతి చ నామ్నేయం లోకే ఖ్యాతిం గమిష్యతి ॥26॥

అపుడు దేవతలందరూ ఆమెను చూచి సంక్షోభం పొందారు. అచ్చరల యెదుట హరి కామవసంతులతో ఇలా అన్నాడు. ఈమె దేవతలందరకూ గౌరవించతగినది. ఈమె అప్సర, లోకంలో ఊర్వశి అన్న పేరులో ప్రసిద్ధి పొందగలదు–

తతః కామయమానేన మిత్రేణాహూయ సోర్వశీ ।
ఉక్తా మాం రమయస్వేతి బాఢమిత్యబ్రవీత్తు సా ॥27॥

పిదప ఆమెను కామించిన మిత్రుడు ఆమెను పిలిచి నాతో రమించు అని అడుగగా ఆమె అంగీకరించింది.

గచ్ఛన్తీ చామ్బరం తద్వత్స్తోకమిన్దీవరేక్షణా ।
వరుణేన ధృతా పశ్చాద్వరుణం నాభ్యనన్దత ॥28॥

తరువాత ఆకసంలో పోతూ ఆ ఇందీవరనేత్ర వరుణునిచే ధరించబడింది. కాని ఆమె అతణ్ణి అభినందించలేదు.

మిత్రేణాహం వృతా పూర్వ మద్య భార్యా న తే విభో ।
ఉవాచ వరుణశ్చిత్తం మయి విన్యశస్య గమ్యతామ్ ॥29॥

"నేను మిత్రునిచే వరింపబడ్డాను. కాన విభూ! నీకు భార్య కాలేను" అని ఆమె అన్నది. వరుణుడందుకు "నాపై చిత్తం నిలిపి వెళ్ళిపో" అని ఆమెతో చెప్పాడు.

గతాయాం బాధమిత్యుక్త్వా మిత్రః శాపమదాత్తదా ।
తస్యై మానుషలోకే త్వం గచ్ఛ సోమ సుతాత్మజమ్ ॥30॥

భజస్వేతి యతో వేశ్యాధర్మ ఏష త్వయా కృతః ।
జలకుమ్భే తతో వీర్యం మిత్రేణ వరుణేన చ ।
ప్రక్షిప్తమథ సంజాతౌ ద్వావేవ మునిసత్తమౌ ॥31॥

అందుకామె 'సరే' అని వెళ్ళింది. అది తెలిసి మిత్రు డామెను శపించాడు "నీవు మనుజలోకానికి పొమ్ము సోముని పౌత్రుని పొందుము. నీవు పాటించినది వేశ్యాధర్మం. ఆపై మిత్రుడు, వరుణుడు తమ వీర్యాన్ని జలకుంభంలో ఉంచారు. అందుండి ఇరువురు ముని సత్తములు జన్మించారు. వారే వసిష్ఠుడు, అగస్త్యుడు.

నిమిర్నామ సహ స్త్రీభిః రాజా ద్యూతమదీవ్యత ।
తత్రాన్తరేఽ భ్యాజగామ వసిష్ఠో బ్రహ్మసంభవః ।32॥

ఒకసారి నిమి అనే రాజు స్త్రీలతో పాచికలాడుతుండినాడు. అక్కడికి బ్రహ్మ సంభవుడైన వసిష్ఠుడు వచ్చాడు.

తస్య పూజామకుర్వంతం శశాప స మునిర్నృపమ్ ।
విదేహస్త్వం భవస్వేతి తతస్తేనాప్యసౌ మునిః ॥33॥

అతణ్ణి నిమి అర్చించలేదు. ఆ ముని రాజును నీవు విదేహుడవు కమ్ము' అని శపించాడు. రాజు కూడా అతణ్ణి శపించాడు.

అన్యోన్యశాపాచ్చ తయోర్విగతే ఇవ చేతసీ ।
జగ్మతుః శాపనాశాయ బ్రహ్మాణం జగతః పతిమ్ ॥34॥

అన్యోన్య శాపం వల్ల వారిరువురూ చేతనారహితులైనారు. ఆపై జగత్పిత యగు బ్రహ్మ చెంతకు శాపనాశం కొరకై వెళ్ళారు.

అథ బ్రహ్మణ ఆదేశాల్లోచనేష్వవసన్నిమిః ।
నిమేషాః స్యుశ్చ లోకానాం తద్విశ్రామాయ నారద ॥35॥

నారదా! ఆపై బ్రహ్మ ఆదేశానుసారం నిమి లోకుల నేత్రాలలో నివసించాడు. అతని విశ్రాంతి నుద్దేశించి లోకులకు రెప్పపాట్లు కలుగుతాయి.

వసిష్ఠోఽ ప్యభవత్తస్మిన్ జలకుమ్భే చ పూర్వవత్ ।
తతః శ్వేతశ్చతుర్బాహుః సాక్షసూత్రకమణ్డలుః ।
అగస్త్య ఇతి శాన్తాత్మా బభూవ ఋషిసత్తమః ॥36॥

వసిష్ఠుడు ముందు మాదిరిగా జలకుంభంలో ప్రవేశించాడు. ఆపై తెల్లనివాడు, నాల్గు భుజాలుగలవాడు, అక్ష సూత్రకమండలు ధారి, శాంతాత్ముడు- ఋషిసత్తముదైన అగస్త్యుడనే ఋషి జన్మించాడు.

మలయస్యైకదేశే తు వైఖానసవిధానతః ।
సభార్యః సంవృతో విప్రైస్తపశ్చక్రే సుదుశ్చరమ్ ॥37॥

ఆ అగస్త్యుడు మలయాద్రిలో ఒకచోట భార్యతో గూడా వైఖానసవిధి ప్రకారం విప్రులతో గూడి దుష్కరమైన తపస్సు చేశాడు.

తతఃకాలేన మహతా తారకాదతిపీడితమ్ ।
జగద్వీక్ష్య స కోపేన పీతవాన్వరుణాలయమ్ ॥38॥

ఆపై చిరకాలానికి తారకునిచే మిక్కిలిగా పీడింపబడిన జగత్తును చూచి ఆ ముని కోపంతో సముద్రాన్ని త్రాగి వేశాడు.

తతోఽ స్య వరదాః సర్వే బభూవుః శంకరాదయః ।
బ్రహ్మా విష్ణుశ్చ భగవాన్వరదానాయ జగ్మతుః ।
వరం వృణీష్వ భద్రం తే యదభీష్టం చ వై మునే! ॥39॥

తదుపరి శంకరాదులైన దేవతలందరూ వరప్రదాతలయ్యారు. బ్రహ్మ, విష్ణువు వరదానానికై అతని చెంతకు పోయారు. మునీ! నీకేది శ్రేయఃప్రదమో, ఆ వరం కోరుకో అన్నారు.

అగస్త్య ఉవాచ :- అగస్త్యుడు చెప్పాడు.

యావద్బ్రహ్మసహస్రాణాం పఞ్చవింశతికోటయః ।
వైమానికో భవిష్యామి దక్షిణాచలవర్త్మని ॥40॥

ఇరువదియైదు కోట్ల బ్రహ్మలు వచ్చి పోయేటంతవరకూ నేను దక్షిణ పర్వత మార్గంలో విమానంలో (అంతరిక్షంలో జ్యోతిర్గోళమునై) సంచరించాలి.

మద్విమానోదయే కుర్యాద్యః కశ్చిత్పూజనం మమ ।
స సప్తలోకాధిపతిః పర్యాయేణ భవిష్యతి ॥41॥

నా విమానోదయకాలంలో ఎవడు నన్ను పూజిస్తాడో, వాడు సప్తలోకాలకూ అధిపతిగా పర్యాయక్రమంలో కావాలి" అన్న వరం కోరాడు.

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

ఏవమస్త్వితి తేఽప్యుక్త్వా జగ్ముర్దేవా యథాగతమ్ ।
తస్మాదర్ఘ్యః ప్రదాతవ్యో హ్యగస్త్యస్య సదా బుధైః ॥42॥

'అట్లే అగుగాక!', అని చెప్పి వారు వచ్చినట్లే తిరిగి వెళ్ళారు. అందువల్ల బుధులు సదా అగస్త్యునికి అర్ఘ్య మివ్వాలి".

నారద ఉవాచ :- నారదుడు చెప్పాడు.

కథమర్ఘ్యప్రదానం తు కర్తవ్యం తస్య వై విభో! ।
విధానం యదగస్త్యస్య పూజనే తద్వదస్వ మే ॥43॥

విభూ! అర్ఘ్య ప్రదానం ఆ మునికి ఏవిధంగా చేయాలి? అగస్త్య పూజనంలోని విధానం నాకు చెప్పు".

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

ప్రత్యూషసమయే విద్వాన్ కుర్యాదస్యోదయే నిశి ।
స్నానం శుక్లతిలై స్తద్వచ్ఛుక్లమాల్యామ్బరో గృహీ ॥44॥

విద్వాంసుడైన గృహస్థుడు రాత్రి ప్రత్యూషకాలంలో అగస్త్యోదయమైనప్పుడు తెల్లనువ్వులు కలిపిన నీళ్ళలో స్నానం చేయాలి. శుక్లమాల్యాలు వస్త్రాలు ధరించాలి.

స్థాపయేదవ్రణం కుమ్భం మాల్యవస్త్రవిభూషితమ్ ।
పఞ్చరత్నసమాయుక్తం ఘృతపాత్ర సమన్వితమ్ ॥45॥

పగిలిపోని కుంభాన్ని స్థాపించాలి, దాన్ని మాల్య వస్త్రాలతో అలంకరించాలి. అందులో పంచరత్నాలుంచాలి. ఘృత పాత్రతో సహితంగా దాన్ని సిద్ధం చేయాలి.

అఙ్గుష్ఠమాత్రం పురుషం తథైవ సౌవర్ణమత్యాయతబాహుదండమ్ ।
చతుర్భుజం కుమ్భముఖే నిధాయ ధాన్యాని రత్నామ్బరసంయుతాని ॥46॥

విశాల బాహుదండాలు కల సువర్ణ పురుషుణ్ణి అంగుష్ఠ పరిమాణం కలవానిని నాలుగు భుజాలతో తయారు చేసి కుంభముఖంపై ఉంచి రత్నవస్త్రసహితంగా సిద్ధం చేయాలి.

సకాంస్యపాత్రాక్షతశుక్తియుక్తం మన్త్రేణ దద్యాద్ద్విజపుఙ్గవాయ ।
ఉత్క్షిప్య లమ్బోదరదీర్ఘబాహు మనన్యచేతా యమదిఙ్ముఖస్సన్ ॥47॥

కంచుపాత్ర - అక్షతలు - శుక్తియుక్తంగా ద్విజశ్రేష్ఠునికి దీర్ఘ బాహువులు పైకెత్తినవాడై మంత్రసహితంగా ఇవ్వాలి. ఇచ్చేటపుడు ఉత్తరాభిముఖుడై చిత్త చాంచల్యం లేకుండా ఉండాలి.

శ్వేతాం చ దద్యాద్యది శక్తిరస్తి రౌప్యైః ఖురైర్హేమముఖీం సవత్సామ్ ।
ధేనుం నరః క్షీరవతీం ప్రణమ్య సవత్సఘణ్టాభరణాం ద్విజాయ ॥48॥

శక్తి ఉంటే వెండి గిట్టలు తొడిగినదిబంగారు మొగం పట్టెడ కల్గి దూడ గలది అయిన తెల్లగోవును దానం చేయాలి. క్షీరవతి అయిన ఆ ధేనువునకు ప్రణమిల్లి దూడతో ఘంటాభరణంతో సహా ద్విజుని కివ్వాలి.

ఆసప్తరాత్రాదుదయేఽర్ఘ్యమస్య దాతవ్యమేతత్సకలం నరేణ ।
యావత్సమాః సప్తదశాథవా స్యు రథోర్ధ్వమప్యత్ర వదన్తి కేచిత్ ॥49॥

ఈ వ్రతాన్ని యజమానుడు అగస్త్యోదయం మొదలు ఏడు దినాలు చేయాలి. కొందరు పదునేడేండ్ల చేయా లంటారు. ఇంకా ఎక్కువ కాలమనే వారూ ఉన్నారు.

కాశపుష్పప్రతీకాశ! అగ్నిమారుతసమ్భవ! ।
మిత్రావరుణయోః పుత్ర! కుమ్భయోనే నమోఽస్తు తే ॥50॥

కాశ పుష్ప సమానా? అగ్ని వాయుసంభవా? మిత్రా వరుణుల పుత్రుడా! అగస్త్యా! నీకు నమస్కారం.

విన్ధ్యవృద్ధిక్షయకర! మేఘతోయవిషాపహ! ।
రత్నవల్లభ దేవేశ లంకావాసిన్నమోఽస్తుతే ॥51॥

వింధ్య పర్వతానికి వృద్ధి క్షయాలు గల్గించినవాడా! మేఘజల విషం తొలగించువాడా! రత్నప్రియా! దేవేశా! లంకావాసీ! నీకు నమస్కారం.

వాతాపీ భక్షితో యేన సముద్రః శోషితః పురా ।
లోపాముద్రాపతిః శ్రీమాన్యోఽసౌ తస్మై నమో నమః ॥52॥

ఎవడు వాతాపిని పూర్వం భక్షించాడో, సముద్రాన్ని శుష్కింపజేశాడో, అట్టి లోపాముద్రాపతి, శ్రీమంతుడైన అగస్త్యునికి నమస్కారం.

రాజపుత్రి మహాభాగే ఋషిపత్ని వరాననే ।
లోపాముద్రే నమస్తుభ్యమర్ఘ్యో మే ప్రతిగృహ్యతామ్ ॥
ప్రత్యబ్దం తు ఫలత్యాగమేవం కుర్వన్న సీదతి ॥53॥

రాజపుత్రీ! మహాభాగా! ఋషిపత్నీ! వరాననా! లోపాముద్రా! నీకు నమస్కారం. నా అర్ఘ్యం స్వీకరించు. ప్రతి సంవత్సరం ఇలా ఫలత్యాగం చేసినవాడు దుఃఖించడు.

హోమం కృత్వా తతః పశ్చాద్వర్జయేన్మానవః ఫలమ్ ।
అనేన విధినా యస్తు పుమానర్ఘ్యం నివేదయేత్ ॥54॥

ఇమం లోకం స చాప్నోతి రూపారోగ్యసమన్వితః ।
ద్వితీయేన భువర్లోకం స్వర్లోకం చ తతః పరమ్ ॥55॥

ఆపై హోమం చేసి మానవుడు ఫలత్యాగం చేయాలి. ఈ రీతిగా ఏ పురుషుడు అర్ఘ్యం నివేదిస్తాడో, అతడు ఈ లోకంలో జన్మిస్తాడు, అందం, ఆరోగ్యం కల్గి వుంటాడు. రెండవసారి చేస్తే భువర్లోకాన్నీ, ఆపై స్వర్గలోకాన్నీ పొందుతాడు.

సప్తైవ లోకానాప్నోతి సప్తార్ఘ్యాన్ యః ప్రయచ్ఛతి ।
యావదాయుశ్చ యః కుర్యాత్పరం బ్రహ్మాధిగచ్ఛతి ॥56॥

ఇలా సప్తార్ఘ్యాలను ఇచ్చేవాడు సప్తలోకాలనూ పొందుతాడు. ఆయువున్నంత కాలం చేసేవాడు పరబ్రహ్మ ప్రాప్తి పొందుతాడు.

ఇహ పఠతి శృణోతి వా య ఏతద్వసుయుగళాంగభవస్య సంప్రదానమ్ ।
మతిమపి చ దదాతి సోఽపి విష్ణోర్భవనగతః పరిపూజ్యతేఽమరౌఘైః 57॥

అష్టవసువులలోని వారైన అగ్నివాయువులు వల్ల కల్గిన అగస్త్యునికి అర్ఘ్యసంప్రదానం వివరించే దీన్ని ఎవడు చదువునో, వినునో, దాని పై మనస్సు పెట్టునో వాడు విష్ణు భవనం చేరి దేవతలచే పూజింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అగస్త్యోత్పత్త్యాది కథనం నామ ఏకషష్టితమోఽధ్యాయః. ॥ 61 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని అగస్త్యోత్పత్త్యాదుల కథనమనే అరవైఒకటవ అధ్యాయం సంపూర్ణం.

❊ ❊ ❊

ద్విషష్టితమోఽధ్యాయః - అరవైరెండవ అధ్యాయం
అనంత తృతీయావ్రతమ్ - అనంత తృతీయావ్రతం

మనురువాచ :- మనువు చెప్పాడు.

సౌభాగ్యారోగ్యఫలదమముత్రాక్షయ్యకారకమ్ ।
భుక్తిముక్తి ప్రదం దేవ తన్మే బ్రూహి జనార్దన ॥1॥

జనార్దనా! దేవా! సౌభాగ్యాన్నీ, ఆరోగ్యాన్నీ ప్రసాదించేదీ, పరలోకంలో అక్షయఫలం కల్గించేదీ, భుక్తినీ, ముక్తినీ సమకూర్చేదీ అయిన వ్రతాన్ని వివరించు.

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

యదుమాయాః పురా దేవ ఉవాచ పురసూదనః ।
కైలాసశిఖరాసీనో దేవ్యా పృష్ట స్తదా కిల ॥2॥

కథాసు సమ్ప్రవృత్తాసు ధర్మ్యాసు లలితాసు చ ।
తదిదానీం ప్రవక్ష్యామి భుక్తిముక్తిఫలప్రదమ్ ॥3॥

ఒకసారి కైలాసశిఖరం పైకూర్చున్న త్రిపురారి ఉమా దేవి అడుగగా ఏది చెప్పాడో, ధర్మబద్ధంగా, లలితంగా జరిగిన కథలలో ఒకటీ, భుక్తిముక్తిఫలదాయకమైనదీ అయిన ఆ వ్రతాన్ని గూర్చి చెబుతాను.

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

శృణుష్వావహితా దేవి! తథైవానన్తపుణ్యకృత్ ।
నరాణామథ నారీణామారాధనమనుత్తమమ్ ॥4॥

దేవీ! సావధానురాలవై అనంతపుణ్యం కల్గించేదీ, స్త్రీలకూ, పురుషులకూ కర్తవ్యమైన మహోత్తమమైన ఆరాధన గూర్చి విను.

నభస్యే వాఽథ వైశాఖే పుణ్యమార్గశిరస్య చ ।
శుక్లపక్షే తృతీయాయాం సుస్నాతో గౌరసర్షపైః ॥5

గోరోచనం స గోమూత్రముష్ణం గోశకృతం తథా ।
దధిచన్దనసమ్మిశ్రం లలాటే తిలకం న్యసేత్ ।
సౌభాగ్యారోగ్యదం యస్మాత్సదా చ లలితాప్రియమ్ ॥6॥

భాద్రపదంలో లేదా వైశాఖంలో, లేదా మార్గశీర్షంలో, శుక్లపక్ష తృతీయనాడు తెల్ల ఆవాలు గల జలంలో స్నానం చేయాలి. గోరోచనం, గోమూత్రంతో కలిసినది, ఉష్ణమైనది, గోవుపేడ, దధిచందన సమేతమైనదాన్ని లలాటంలో తిలకంగా ధరించాలి. ఇది సౌభాగ్యాన్నీ, ఆరోగ్యాన్నీ ఇచ్చేదీ, సదా లలితా దేవికి ప్రియమైనది కూడా.

ప్రతిపక్షం తృతీయాసు దధానః పీతవాససీ ।
ధారయేదథ రక్తాని నారీ చేత్పతిసంయుతా ॥7॥

విధవా వా త్వరక్తాని కుమారీ శుక్లవాససీ ।
దేవీం చ పఞ్చగవ్యేన తతః క్షీరేణ కేవలమ్ ।
స్నాపయేన్మధునా తద్వత్ పుష్పగన్ధోదకేన చ ॥8॥

ప్రతిపక్షంలోనూ తృతీయాతిథులలో పురుషుడైతే పసుపు వస్త్రాలు, పతితో కూడిన స్త్రీ అయితే ఎర్రని వస్త్రాలూ ధరించి నియమబద్ధయై ఉండాలి. విధవ ఎర్రనివి కాని వస్త్రాలు, కుమారి తెల్ల వస్త్రాలు ధరించాలి. దేవిని పంచగవ్యంతో, ఆ పైన కేవలం క్షీరంతో, తేనెతో, పుష్పగంధోదకంతో స్నానం చేయించాలి.

పూజయేచ్ఛుక్లపుష్పైస్తు ఫలైర్నానావిధైరపి ।
ధాన్యకాజాజిలవణైర్గుడక్షీరఘృతాన్వితైః ॥9॥

శుక్లాక్షతతిలైరర్చ్యాం తతో దేవీం సదార్చయేత్ ।
పాదాద్యభ్యర్చనం కుర్యాత్ప్రతిపక్షం వరాననే ॥10॥

ఆపై తెల్లని పూలతో, వివిధ ఫలాలతో పూజించాలి. అట్లే ధాన్యకం, జాజి, లవణం, బెల్లం, క్షీరం, ఘృతంతో కూడిన తెల్లని అక్షతలతో, నూగులతో దేవిని సదా అర్చించాలి. వరాననా! పాదం మొదలుకొని అభ్యర్చనం ప్రతిపక్షంలోనూ అనుష్ఠించాలి.

వరదాయై నమః పాదౌ తథా గుల్ఫౌ నమః శ్రియై।
అశోకాయై నమో జఙ్ఘే పార్వత్యై జానునీ తథా ॥11॥

ఊరూ మఙ్గళకారిణ్యై వామదేవ్యై తథా కటిమ్ ।
పద్మోదరాయై జఠరమురః కామశ్రియై నమః ॥12॥

'వరదాయై నమః అని పాదాలను, 'శ్రియై నమః' అని గుల్ఫాలను, 'అశోకాయై నమః' అని జంఘలను, 'పార్వత్యై నమః' అని మోకాళ్లను, 'మంగళకారిణ్యై నమః'– అని తొడలను, 'వామదేవ్యై నమః' అని కటినీ, 'పద్మోదరాయై నమః' అని జఠరాన్నీ, 'కామశ్రియై నమః' అని ఉరఃస్థలమును,

కరౌ సౌభాగ్యదాయిన్యై బాహూదరముఖం శ్రియై ।
ముఖం దర్పణవాసిన్యై స్మరదాయై స్మితం నమః ॥13॥

గౌర్యై నమస్తథా నాసాముత్పలాయై చ లోచనే ।
తుష్ట్యై లలాటమలకాన్ కాత్యాయన్యై శిరస్తథా ॥14॥

'సౌభాగ్యదాయిన్యై నమః' అని చేతులనూ, 'శ్రియై నమః' అని బాహూదరముఖాలను అర్చించాలి. 'దర్పణవాసిన్యై నమః' అని ముఖాన్ని, 'స్మరదాయై నమః' అని స్మితాన్నీ, 'గౌర్యై నమః', అని ముక్కును, 'ఉత్పలాయై నమః' అని లోచనాలను, 'తుష్ట్యై నమః' అని లలాటాన్నీ, కాత్యాయన్యై నమః' అని అలకలను, శిరస్సునూ అర్చించాలి.

నమో గౌర్యై నమో ధృత్యై నమః కాళ్యై నమ(శ్శ్రియై ।
రమ్భాయై లలితాయై చ వామదేవ్యై నమో నమః ॥15॥

ఏవం సమ్పూజ్య విధివదగ్రతః పద్మమాలిఖేత్ ।
పత్త్రైర్ద్వాదశభిర్యుక్తం కుఙ్కుమేన సకర్ణికమ్ ॥16॥

గౌర్యై నమః, ధృత్యై నమః, కాళ్యై నమః, శ్రియై నమః, రంభాయై నమః, లలితాయై నమః, వామదేవ్యై నమః – అంటూ ఇలా విధివిధానంతో పూజించి ఎదుట పద్మాన్ని లిఖించాలి. అది పండ్రెండు పత్రాలు గల్గి కుంకుమతో దుద్దు గలదిగా ఉండాలి.

పూర్వేణ విన్యసేద్గౌరీమపర్ణాం చ తతః పరమ్ ।
భవానీం దక్షిణే తద్వద్రుద్రాణీం చ తతః పరమ్ ॥17॥

విన్యసేత్పశ్చిమే సౌమ్యాం సదా మదనవాసినీమ్ ।
వాయవ్యే పాటలాముగ్రామంతరేణ తతోఽప్యుమామ్ ॥18॥

పూర్వభాగంలో గౌరినీ, ఆపైన అపర్ణనూ, దక్షిణంలో భవానినీ, ఆపైన రుద్రాణినీ, పశ్చిమంలో మదన వాసినియైన సౌమ్యనూ, వాయవ్యంలో పాటలనూ, మధ్యంలో ఉగ్రనూ, ఆపైన ఉమనూ ఉంచాలి.

సాధ్యాం సత్యాం శుభాం సౌమ్యాం మఙ్గళాం కుముదాం సతీమ్ ।
రుద్రం చ మధ్యే సంస్థాప్య లలితాం కర్ణికోపరి ।
కుసుమై రక్షతై ర్వాపి నమస్కారేణ విన్యసేత్ ॥19॥

సాధ్య, సత్య, శుభ, సౌమ్య, మంగళ, కుముద, సతీదేవులను నిలిపి నడుమ రుద్రుణ్ణి స్థాపించాలి. కర్ణికపై అక్షతలను నిలపాలి. వారిని పూలతో, అక్షతలతో నమస్కార పూర్వకంగా విన్యసించాలి.

గీతమఙ్గళనిర్ఘోషాన్ కారయిత్వా సువాసినీః ।
పూజయేద్రక్తవాసోభీ రక్తమాల్యానులేపనైః ।
సిన్దూరం స్నానచూర్ణం చ తాసాం శిరసి పాతయేత్ ॥20॥

గీతమంగళ శబ్దాలు వినిపించాలి. సువాసినులను రక్త వస్త్రాలతో, రక్తమాల్యానులేపనాలతో పూజించాలి. వారి శిరసుపై సిందూరం, స్నానచూర్ణం ఉంచాలి.

సిన్దూరకుఙ్కుమస్నాన ముపదిష్టం యతస్తతః ।
తథోపదేష్టారమపి పూజయేద్యత్నతో గురుమ్ ।
న పూజ్యతే గురు ర్యత్ర సర్వాస్తత్రాఫలాః క్రియాః ॥21॥

సిందూర కుంకుమల స్నానం శాస్త్రముచే ఉపదిష్టమైనది కాన ఉపదేశించిన గురువును యత్న పూర్వకంగా పూజించాలి. ఎక్కడ గురువును పూజించరో, అక్కడ చేసే క్రియలన్నీ నిష్ఫలాలే.

నభస్యే పూజయేద్గౌరీముత్పలై రసితై స్సదా ।
బన్ధుజీవైరాశ్వయుజే కార్తికే శతపత్రకైః ॥22॥

చైత్రే తు మల్లికాశోకై ర్వైశాఖే గన్ధపాటలైః ।
జ్యేష్ఠే కమలమన్దారైరాషాఢే చ నవామ్బుజైః ।
కదమ్బైరథ మాలత్యా శ్రావణే పూజయేత్సదా ॥23॥

భాద్రపదంలో గౌరిని నల్లకలువలతో సదా పూజించాలి. ఆశ్వయుజంలో మంకిన పూలతో, కార్తికంలో శతపత్రాలతోనూ అర్చించాలి. చైత్రంలో మల్లికాశోకాలతో, విశాఖలో గంధపాటలాలతో, జ్యేష్ఠంలో కమలమందారాలతో, ఆషాఢంలో క్రొత్త పద్మాలతో, శ్రావణంలో కదంబాలు, మాలతీపూలతో సదా పూజించాలి.

జాతీపుష్పైర్మార్గశీర్షే పౌషే పీతైః కురణ్టకైః ।
కున్దకుఙ్కుమపుష్పైస్తు దేవీం మాఘే తు పూజయేత్ ।
సిన్ధువారేణ జాత్యా వా ఫాల్గునేఽ ప్యర్చయేదుమామ్ ॥24॥

మార్గశిరంలో జాజిపూలతో, పుష్యంలో పసుపు పచ్చని గోరింటకాలతో, మాఘంలో మల్లెలు, కుంకుమ పూలతో – దేవిని పూజించాలి. సిందువారంతోగానీ, జాతీపుష్పంతోగానీ ఫాల్గుణంలో ఉమాదేవిని పూజించాలి.

గోమూత్రం గోమయం క్షీరం దధి సర్పిః కుశోదకమ్ ।
బిల్వపత్రార్కపుష్పం చ యవాన్ గోశృఙ్గవారి చ ॥25॥

ఒకటి తర్వాత ఒకటిగా క్రమంగా గోమూత్రం, గోమయం, క్షీరం, పెరుగు, నెయ్యి, దర్భనీరు, బిల్వపత్రం, అర్కపుష్పం, యవలు, గోవు కొమ్ముల నీళ్లు స్వీకరించాలి.

పుంసః పీతామ్బరే దద్యాత్ స్త్రియై కౌసుమ్భవాససీ ।
నిష్పావా ఆజిలవణమిక్షుదణ్డగుడాన్వితమ్ ।
తస్యై దద్యాత్ఫలం పుష్పం సువర్ణోత్పలసంయుతమ్ ॥26॥

పురుషునికి పీతాంబరాలు, స్త్రీకి (దేవికి) కౌసుంభ వస్త్రాలూ– ఇవ్వాలి. అట్లే నిష్పావలు, చెరిగిన ధాన్యం ఆజి, లవణం, ఇక్షుదండం, గుడం, ఫలం, పుష్పం, సువర్ణోత్పల సహితంగా ఆమె కివ్వాలి.

పఞ్చగవ్యం చ బిల్వం చ ప్రాశయేత్క్రమశ స్తదా ।
ఏతద్భాద్రపదాద్యం తు ప్రాశనం సముదాహృతమ్ ॥27॥

పంచగవ్యం, బిల్వం క్రమంగా ఆహారంగా ఇవ్వాలి. భాద్రపదం నుండి ఈ ఆహార స్వీకారం చెప్పబడింది.

ప్రతిపక్షంచ మిథునం తృతీయాయాం వరాననే! ।
భోజయిత్వాఽ ర్చయేద్భక్త్యా వస్త్రమాల్యానులేపనైః ॥28॥

వరాననా! ప్రతిపక్షంలోను తృతీయనాడు పార్వతీ పరమేశులను, భక్తితో పూజించాలి, వస్త్రమాల్యాను లేపనాలు సమర్పించాలి.

యథా న దేవి! దేవేశస్త్వాం పరిత్యజ్య గచ్ఛతి ।
తథా మాముద్ధరాశేషదుఃఖసంసారసాగరాత్ ॥29॥

దేవీ! దేవేశుడు నిన్ను వదలి పోనట్లే, నన్ను, సకలదుఃఖసహిత సంసారసాగరంనుండి ఉద్ధరించు అని ప్రార్థించాలి.

పూర్వం దత్త్వా తు గురవే శేషాఽనభ్యర్చయేద్బుధః ।
ఉక్తాఽనన్తతృతీయైషా సదాఽనన్తఫలప్రదా ॥30॥

ముందు గురువుకు సమర్పించి తక్కిన వారిని గూడా తరువాత బుధుడు అర్చించాలి. సదా అనంత ఫలాలిచ్చే అనంత తృతీయను వివరించాను.

కుముదా విమలాఽనన్తా భవానీ వసుదా శివా ।
లలితా కమలా గౌరీ సతీ రమ్భాఽథ పార్వతీ ॥32॥

నభస్యాదిషు మాసేషు ప్రీయతామిత్యుదీరయేత్ ।
వ్రతాన్తే శయనం దద్యా త్సువర్ణకమలాన్వితమ్ ॥33॥

కుముద, విమల, అనంత, భవాని, వసుద, శివ, లలిత, కమల, గౌరి, సతి, రమ్భ. పార్వతి– వీరిని భాద్రపదాది పండ్రెండు మాసములయందు 'కుముదా ప్రీయతాం, విమలా ప్రీయతాం' అని అంటూ ఆ యా దేవతలను అర్చించాలి. వ్రతం ముగియగానే స్వర్ణపద్మంతో గూడిన శయనాన్ని దానం చేయాలి.

సర్వపాపహరాం దేవీం సౌభాగ్యారోగ్యవర్ధనీమ్ ।
న చైనాం విత్తశాఠ్యేన కదాచిదపి లఙ్ఘయేత్ ।
నరో వా యది వా నారీ విత్తశాఠ్యాత్పతత్యధః ॥34॥

సకల పాపాలు తొలగించునదీ, సౌభాగ్యారోగ్యాలు పెంపొందించునదీ అగు ఈ దేవీ వ్రతాన్ని విత్తశాఠ్యంతో (పిసినారితనంతో) ఎప్పుడూ అతిక్రమించరాదు. పురుషుడుగాని, స్త్రీగాని విత్తశాఠ్యంవల్ల అధఃపతనం చెందుతారు.

గర్భిణీ సూతికా నక్తం కుమారీ వాఽథ రోగిణీ ।
యద్యశుద్ధా తదాన్యేన కారయేత్ప్రయతా స్వయమ్ ॥35॥

గర్భిణి, సూతిక, కన్య, రోగంతో ఉన్నవారు– రాత్రి వేళ భుజింపవచ్చు. స్త్రీ తాను అశుద్ధంగా ఉన్నప్పుడు ప్రయత్నించి ఇతరులచేత ఆ కార్యక్రమమును చేయించవచ్చు.

మిథునాని చతుర్వింశద్ద్వాదశాథ సమర్పయేత్ ।
అష్టౌ షడ్వాఽ ప్యథ పునశ్చానుమాసం సమర్చయేత్ ॥36॥

మరియు ప్రతిమాసం ద్విజదంపతులను యథాశక్తి ఇరువదినాలుగుమందిని లేదా పండ్రెండుమందిని లేదా ఎనిమిదిమందిని లేదా ఆరుగురిని పూజించాలి.

ఇమామనన్తఫలదాం యస్తృతీయాం సమాచరేత్ ।
కల్పకోటిశతం సాగ్రం శివలోకే మహీయతే ॥37॥

అనంతఫలమునిచ్చే ఈ తృతీయావ్రతమును ఎవడు ఆచరిస్తాడో వాడు శత కల్పకోటికాలం శివలోకంలో పూజింపబడతాడు.

విత్తహీనోఽపి కురుతే వర్షత్రయముపోషణైః ।
పుష్పై ర్మన్త్రవిధానైశ్చ సోపి తత్ఫలమాప్నుయాత్ ॥38॥

ధనము లేనివాడైనా మూడు సంవత్సరాలు ఉపవాసాలతో, పూలతో, మంత్ర విధానాలతో ఈ వ్రతం చేసినవాడు గూడా ఆ ఫలం పొందుతాడు.

నారీ వా కురుతే యా తు కుమారీ విధవాఽథవా ।
సాఽపి తత్ఫలమాప్నోతి గౌర్యనుగ్రహలాలితా ॥39॥

కుమారిగాని, విధవగాని లేదా ఏ స్త్రీ అయినా ఈ వ్రతం అనుష్ఠిస్తే గౌరీదేవి అనుగ్రహానికి పాత్రురాలై ఆ ఫలమునే పొందుతుంది.

ఇతి పఠతి శృణోతి వా య ఇత్థం గిరితనయావ్రతముగ్రలోకసంస్థః ।
మతిమపి చ దదాతి సోఽపి దేవైరమరవధూజనకిన్నరైశ్చ పూజ్యః ॥40॥

ఎవ్వడు ఈ గిరితనయా వ్రతాన్ని ఇలా చదువుతాడో, వింటాడో ఇతరులకు దీనికి సంబంధించిన విజ్ఞానం కలిగిస్తాడో వాడు గూడా శివలోకంలో దేవతలచేత, దేవతాస్త్రీల చేత, కిన్నరులచేత పూజింపదగినవా డవుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అనంత తృతీయావ్రతం నామ ద్విషష్టితమోఽధ్యాయః ॥ 62 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని అనంత తృతీయావ్రతమనే అరవైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్రిషష్టితమోఽధ్యాయః – అరవైమూడవ అధ్యాయం

రసకల్యాణవ్రతమ్ – రసకల్యాణవ్రతం

ఈశ్వరోవాచ :– ఈశ్వరుడు చెప్పాడు.

అథాన్యామపి వక్ష్యామి తృతీయాం పాపనాశినీమ్ ।
రసకల్యాణినీమేతాం పురాకల్పవిదో విదుః ॥1॥

తదుపరి మరొక తృతీయావ్రతాన్ని గూడా చెబుతాను. పాపనాశిని అయిన దీన్ని పురాకల్పవేత్తలు 'రసకల్యాణిని' అంటారు.

మాఘమాసే తు సమ్ప్రాప్తే తృతీయాం శుక్లపక్షతః ।
ప్రాతర్గవ్యేన పయసా తిలై స్స్నానం సమాచరేత్ ॥2॥

మాఘమాసం రాగానే శుక్ల పక్షం తృతీయనాడు ఉదయాన గోవు పాలతో తిలలతో స్నానం చేయాలి.

స్నాపయేన్మధునా దేవీం తథైవేక్షురసేన చ ।
దక్షిణాఙ్గాని సమ్పూజ్య తతో వామాని పూజయేత్ ॥3॥

అట్లే తేనెతో, చెరకురసంతో దేవిని స్నానం చేయించాలి. ముందు కుడివైపు అవయవాలను పూజించి తరువాత ఎడమ వైపున అంగాలను అర్చించాలి.

లలితాయై నమో దేవ్యాః పాదౌ గుల్ఫౌ తతోఽర్చయేత్ ।
జఙ్ఘాం జానుం తథేశాన్యై తథైవోరుం శ్రియై నమః ॥4॥

"లలితాయై నమః" అంటూ దేవి యొక్క పాదాలను, గుల్ఫాలను అర్చించాలి. తరువాత 'ఈశాన్యై నమః' అని జంఘను, జానువులను, 'శ్రియై నమః' అని ఊరువులనూ అర్చించాలి.

మదాలసాయై తు కటిమమలాయై తథోదరమ్ ।
స్తనౌ మదనవాసిన్యై కుముదాయై చ కన్ధరామ్ ॥5॥

'మదాలసాయై నమః' అని కటినీ, 'అమలాయై నమః' అని ఉదరాన్నీ, మదనవాసిన్యై నమః – అని స్తనాలనూ, కుముదాయై నమః అని మెడనూ అర్చించాలి.

భుజం భుజాగ్రం మాధవ్యై కమలాయై ముఖస్మితే ।
భ్రూలలాటే చ రుద్రాణ్యై శఙ్కరాయై తథాఽలకాన్ । ॥6॥

'మాధవ్యై నమః,' అని భుజాలనూ, భుజాగ్రాలనూ, 'కమలాయై నమః' అని ముఖస్మితాలను, 'రుద్రాణ్యై నమః' అని భ్రూలలాటాలను, శంకరాయై నమః అని అలకలనూ అర్చించాలి.

మకుటం విశ్వవాసిన్యై శిరః కాన్త్యై తథార్చయేత్ ।
మదనాయై లలాటంతు మోహనాయై పునర్భ్రువమ్ ॥7॥

'విశ్వవాసిన్యై నమః,' అని మకుటాన్నీ, 'కాన్త్యై నమః' అని శిరస్సునూ, 'మదనాయై నమః' అని లలాటన్నీ, 'మోహనాయై నమః' అని కనుబొమలనూ పూజించాలి.

నేత్రే చన్ద్రార్ధధారిణ్యై తుష్ట్యై చ వదనం పునః ।
ఉత్కణ్ఠిన్యై నమః కణ్ఠ మమృతాయై నమః స్తనౌ ॥8॥

'చంద్రార్ధధారిణ్యై నమః' అని నేత్రాలను, 'తుష్ట్యై నమః' అని వదనాన్ని, 'ఉత్కంఠిన్యై నమః' అని కంఠాన్నీ, 'అమృతాయై నమః' అని స్తనాలనూ అర్చించాలి.

అభయాయై నమో బాహుం విశోకాయై నమః కరమ్ ।
హృదయం మన్మథాధిష్ఠ్యై పాటలాయై తథోదరమ్ ॥9॥

'అభయాయై నమః' అని బాహువులను, 'విశోకాయై నమః' అని కరమునూ, మన్మథాధిష్ఠ్యై నమః అని హృదయాన్నీ, పాటలాయై నమః అని ఉదరాన్నీ,

కటిం సురతవాసిన్యై తథోరుం చమ్పకప్రియే ।
జానుజఙ్ఘే నమో గౌర్యై గాయత్ర్యై ఘుటికే నమః ॥10॥

'సురతవాసిన్యై నమః' అని కటినీ, 'చంపకప్రియాయై నమః' అని ఊరువును, 'గౌర్యై నమః' అని జానుజంఘలనూ, గాయత్ర్యై నమః - అని ఘుటికలను అర్చించాలి.

ధరాధరాయై పాదౌ తు విశ్వకార్యై నమశ్శిరః ।
నమో భవాన్యై కామిన్యై కామదేవ్యై జగత్ప్రియే ॥11॥

'ధరాధరాయై నమః' అని పాదాలనూ, 'విశ్వకార్యై నమః' అని శిరస్సునూ, 'నమో భవాన్యై, కామిన్యై, కామదేవ్యై, జగత్ప్రియాయై నమః" అని కూడా నామకీర్తనం చేయాలి.

ఏవం సమ్పూజ్య విధివ ద్ద్విజదామ్పత్యమర్చయేత్ ।
భోజయిత్వాఽన్నపానేన మధురేణ విమత్సరః ॥12॥

జలపూరితం తథా కుమ్భం శుక్లామ్బరయుగద్వయమ్ ।
దత్వా సువర్ణకమలం గన్ధమాల్యై రథార్చయేత్ ॥13॥

ఇలా విధివిధానంతో పూజించి ద్విజదంపతుల నర్చించాలి. మాత్సర్యం వీడి మధురమైన అన్న పానాదులతో వారి నాదరించాలి. జలపూరితఘటాన్నీ, శుక్ల వస్త్రద్వయాన్నీ, స్వర్ణకమలాన్నీ ఇచ్చి ద్విజుణ్ణి గంధమాల్యాలతో అర్చించాలి.

ప్రీయతా మత్ర కుముదా గృహ్ణీయాల్లవణవ్రతమ్ ।
అనేన విధినా దేవీం మాసిమాసి సదార్చయేత్ ॥14॥

ఆపై 'కుముద ప్రీతినొందుగాక! లవణ వ్రతమునంగీకరించు గాక అని చెప్పాలి. ఇలా దేవిని ప్రతి మాసంలోనూ అర్చించాలి.

లవణం వర్జయేన్మాఘే ఫాల్గుణే తు గుడం పునః ।
తైలం రాజిం తథా చైత్రే వర్జ్యే చ మధు మాధవే ॥15॥

మాఘంలో ఉప్పు వదలాలి, ఫాల్గుణంలో బెల్లం, చైత్రంలో తైలం, ఆవాలు వైశాఖంలో తేనె వదలాలి.

పానకం జ్యేష్ఠమాసే తు ఆషాఢే చాథ జీరకమ్ ।
శ్రావణే వర్జయేత్ క్షీరం దధి భాద్రపదే తథా ॥16॥

జ్యేష్ఠంలో పానకం, ఆషాఢంలో జీరకం, శ్రావణంలో క్షీరం, భాద్రపదంలో దధి వదలాలి.

ఘృతమాశ్వయుజే తద్వదూర్జే వర్జ్యం చ మాక్షికమ్ ।
ధాన్యకం మార్గశీర్షే తు పౌషే వర్జ్యా చ శర్కరా ॥17॥

ఆశ్వయుజంలో ఘృతం, కార్తికంలో తేనె, మార్గశిరలో ధాన్యకం, పుష్యంలో చక్కెరను త్యజించాలి.

వ్రతాన్తే కరకం పూర్ణమేతేషాం మాసి మాసి చ ।
దద్యాద్ద్వికాలవేలాయాం పూర్ణపాత్రేణ సంయుతామ్ ॥18॥

వ్రతం పూర్తి కాగానే ప్రతిమాసంలోనూ జలపూరిత కమండలువును, మధ్యాహ్న వేళానంతరం పూర్ణ పాత్రతో సహా ఇవ్వాలి.

లడ్డుకాశ్శ్వేతవర్ణాంశ్చ సంయావమథ పూరికాః ।
ఘూటికాఘృతపూరాంశ్చ పిష్టాపూతాంశ్చ మణ్డకాన్ ॥19॥

క్షీరం శాకం చ దధ్యన్నమిణ్డర్యోఽ శోకవర్తితాః ।
మాఘాదిక్రమశో దద్యాదేతాని కరకోపరి ॥20॥

లడ్డుకలూ, తెల్లని, సంయావములూ, (గోధురవ్వ వంటకము) పూరీలు, ఘాటికం, ఘృతపూరమూ, బూరెలు, మండిగలు (పూతరేకులు), క్షీరము, శాకము=ఆకుకూర, దధ్యన్నం = పెరుగుఅన్నం, ఇండర్యాలు = తియ్యని రొట్టెలు వీటిని మాఘమాసం మొదలు ప్రతిమాసం కమండలుపై ఉంచి శోకరహితుడై ఇవ్వాలి.

కుముదా మాధవీ గౌరీ రమ్భా భద్రా జయా శివా ।
ఉమా రతిః సతీ తద్వన్మఙ్గలా రతిలాలసా ॥21॥

క్రమాన్మాఘాది సర్వత్ర ప్రీయతామితి కీర్తయేత్ ।

మాఘమాసం మొదలు ప్రతినెలా "కుముద, మాధవి, గౌరి, రంభ, భద్ర, జయ, శివ, ఉమ, రతి, సతి, మంగళ, రతిలాలస- ప్రీయతామ్" అని కీర్తించాలి.

సర్వత్ర పఞ్చగవ్యం చ ప్రాశనం సముదాహృతమ్ ।
ఉపవాసీ భవేన్నిత్యమశక్తౌ నక్తమిష్యతే ॥22॥

ఎల్లకాలాలలోను పంచగవ్య ప్రాశనం చేయించాలి. భక్తుడు నిత్యం ఉపవసించాలి. అశక్తుడైతే రాత్రి ఏమైనా తినవచ్చు.

పునర్మాఘే తు సమ్ప్రాప్తే శర్కరాం కరకోపరి ।
కృత్వా తు కాఞ్చనీం గౌరీం పఞ్చరత్నసమన్వితామ్ ॥23॥

హైమీమఙ్గుష్ఠమాత్రాం చ సాక్షసూత్రకమణ్డలుమ్ ।
చతుర్భుజా మిన్దుయుతాం సితనేత్రపటావృతామ్ ॥24॥

మాఘం మళ్ళీ రాగానే కమండలువు పై శర్కరను ఉంచి బంగారు గౌరిని పంచరత్న సమన్వితంగా స్వర్ణమయమై అంగుష్ఠమాత్రమైన సాక్షసూత్రకమండులువునూ, నాల్గు భుజాలు కల్గి చంద్రాంకితయై తెల్లని నేత్ర పటంతో కప్పబడిన కాంచనగౌరిని బ్రాహ్మడికి దానం చేయాలి.

తద్వద్గోమిథునం శుక్లం సువర్ణాస్యం సితామ్బరమ్ ।
సవస్త్రభాజనం దద్యాద్భవానీ ప్రీయతామితి ॥25॥

అట్లే తెల్లని గోమిథునాన్ని స్వర్ణంతో అలంకరించి తెల్లనివస్త్రం కప్పి వస్త్రాలతో, పాత్రలతో "భవానీ ప్రీయతామ్" అని దానం చేయాలి.

అనేన విధినా యస్తు రసకల్యాణినీవ్రతమ్ ।
కుర్యా త్స సర్వపాపేభ్య స్తత్క్షణాదేవ ముచ్యతే ॥26॥

ఇలా ఈ రస కల్యాణినీ వ్రతం చేసినవాడు సర్వపాపాలనుండి వెంటనే విముక్తు డవుతాడు.

నవార్బుదసహస్రం తు న దుఃఖీ జాయతే నరః ।
సువర్ణకమలం గౌరీం మాసి మాసి దదన్నరః ।
అగ్నిష్టోమసహస్రస్య యత్ఫలం తదవాప్నుయాత్ ॥27॥

నవార్బుదసహస్రసంవత్సరాలు (తొమ్మిదివేల అర్బుద సంవత్సరముల కాలం) అతడు దుఃఖం పొందదు. స్వర్ణకమలాన్నీ, గౌరినీ– ప్రతిమాసం ఇచ్చేవాడు వెయ్యి అగ్నిష్టోమాల ఫలం పొందుతాడు.

నారీ వా కురుతే యాతు కుమారీ వా వరాననే! ।
విధవా యా తథా నారీ సాఽపి తత్ఫలమాప్నుయాత్ ।
సౌభాగ్యారోగ్యసమ్పన్నా గౌరీలోకే మహీయతే ॥28॥

వరాననా! నారిగాని, కుమారిగాని, విధవగాని, ఎవరైనా ఇది అనుష్ఠిస్తే ఆఫలం పొందుతారు. అట్లే సౌభాగ్యారోగ్యాలు కలిగి గౌరీలోకంలో పూజింపబడుతారు.

ఇతి పఠతి య ఇత్థం యః శృణోతి ప్రసఙ్గా త్స కలికలుషముక్తః పార్వతీలోకమేతి ।
మతిమపి చ నరాణాం యో దదాతి ప్రియార్థం విబుధపతివిమానే నాయక స్స్యాదమోఘః॥31॥

దీన్ని చదివి, విని, ప్రసంగంలో విన్నవాడు కలికలుషం వీడి పార్వతీలోకం పొందుతాడు, దీనిపై ప్రీతి కలగడానికి ఇతరులలో ప్రేరణ కల్గిస్తే ఇంద్రుని విమానంలో అమోఘమైన నాయకుడై రాణిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే రసకల్యాణ వ్రతం నామ త్రిషష్టితమోఽధ్యాయః ॥ 63 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని రసకల్యాణవర్ణనమనే అరవైమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుఃషష్టితమోఽధ్యాయః - అరవైనాల్గవ అధ్యాయం

ఆర్ద్రానందకరీ వ్రతమ్ - ఆర్ద్రానందకరీ వ్రతం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

తథైవాన్యాం ప్రవక్ష్యామి తృతీయాం పాపనాశినీమ్ ।
నామ్నా చ లోకే విఖ్యాతామార్ద్రానన్దకరీమిమామ్ ॥1॥

ఇక లోకంలో ఆర్ద్రానందకరీవ్రతం పేరుతో ప్రఖ్యాతమైన, పాపనాశకమైన మరొక తృతీయావ్రతాన్ని చెబుతాను.

యదా శుక్లతృతీయాయామాషాఢర్క్షం భవేత్క్వచిత్ ।
బ్రహ్మర్క్షం వా మృగర్క్షం వా హస్తో మూలమథాపి వా ।
దర్భగన్ధోదకైః స్నానం తదా సమ్యక్సమాచరేత్ ॥2॥

చంద్రుడు పూర్వాషాడ, ఉత్తరాషాడ, రోహిణి, మృగశిర, హస్త లేక మూలా నక్షత్రరాసులతో కలిసినపుడు శుక్లతృతీయనాడు - ఈ వ్రతం చేయువాడు దర్భగంధోదకాలతో చక్కగా స్నానమాచరించాలి.

శుక్లమాల్యామ్బరధర శ్శుక్లగన్ధానులేపనః ।
భవానీ మర్చయే ద్భక్త్యా శుక్లపుష్పై స్సుగన్ధిభిః ।
మహాదేవేన సహితాముపవిష్టాం మహాసనే ॥3॥

తెల్ల వస్త్రాలు, మాల్యాలు ధరించి శుక్ల గంధం పూసుకొని మహాదేవునితో గూడి మహాసనంలో కూర్చున్న భవానిని సుగంధం గల తెల్లపూలతో భక్తితో అర్చించాలి.

వామదేవ్యై నమః పాదౌ శఙ్కరాయ నమో హరమ్ ।
జఙ్ఘే శోకవినాశిన్యై ఆనన్దాయ నమః ప్రభోః ॥4॥

'వామదేవ్యై నమః అని పార్వతి పాదాలను, 'శంకరాయ నమః' అని శంకరుని పాదాలను, 'శోకవినాశిన్యై నమః' 'ఆనందాయ నమః' అని వారిరువురి జంఘలనూ అర్చించాలి.

రమ్భాయై పూజయేదూరూ శివాయ చ పినాకినః ।
ఆనందిన్యై కటిం దేవ్యా శ్శూలినః శూలపాణయే ॥5॥

'రంభాయై నమః' అని 'శివాయ నమః' అని వారిరువురి ఊరువులనూ, "ఆనందిన్యై నమః", 'శూలపాణయే నమః", అని దేవియొక్క కటిని, శివుని యొక్క కటిని పూజించాలి.

మాధవ్యై చ తథా నాభిమథ శమ్భోర్భవాయ చ ।
స్తనావానన్దకారిణ్యై శఙ్కరస్యేన్దుధారిణే ॥6॥

'మాధవ్యై నమః' 'భవాయ నమః' అని ఇరువురి నాభిని, ఆనంద కారిణ్యై నమః, 'ఇందుధారిణే నమః', అని స్తనాలను పూజించాలి.

ఉత్కణ్ఠిన్యై నమః కణ్ఠం నీలకణ్ఠాయ వై హరమ్ ।
కరా వుత్పలధారిణ్యై భద్రాయ జగతాం పతేః ।
బాహూ చ పరిరమ్భిణ్యై నృత్తశీలాయ వై హరమ్ ॥7॥

'ఉత్కంఠిన్యై నమః, నీలకంఠాయ నమః,' అని ఇరువురి కంఠాలను, 'ఉత్పలధారిణ్యై నమః, భద్రాయ నమః' అని ఇద్దరి కరములను, "పరిరంభిణ్యై నమః", "నృత్తశీలాయ నమః" ఇరువురి బాహువులనూ పూజించాలి.

దేవ్యా ముఖం విలాసిన్యై వృషేశాయ పునర్విభోః ।
స్మితం సస్మేరలీలాయై విశ్వవక్త్రాయ వై విభోః ॥8॥

'విలాసిన్యై నమః, వృషేశాయ నమః' అని ఇరువురి ముఖాలనూ, 'సస్మేర లీలాయై నమః' 'విశ్వవక్త్రాయ నమః' అని ఇరువురి చిరునవ్వును అర్చించాలి.

నేత్రే మదనవాసిన్యై విశ్వధామ్నే త్రిశూలినః ।
భ్రువౌ నృత్తప్రియాయైచ తాణ్డవేశాయ కాలినమ్ ॥9॥

'మదనవాసిన్యై నమః, విశ్వధామ్నే నమ' అని ఇరువురి నేత్రాలనూ, నృత్తప్రియాయై నమః, తాండవేశాయ అని వారి కనుబొమ్మలనూ అర్చించాలి.

దేవ్యా లలాట మిన్ద్రాణ్యై హవ్యవాహాయ వై విభోః ।
స్వాహాయై ముకుటం దేవ్యా విభోర్గఙ్గాధరాయ వై ॥10॥

'ఇంద్రాణ్యై నమః', హవ్యవాహాయ నమః" అని ఇరువురు లలాటాలను, 'స్వాహాయై నమః – గంగా ధరాయ నమః' అని ఇరువురి ముకుటాన్నీ అర్చించాలి.

విశ్వకాయౌ విశ్వముఖౌ విశ్వపాదకరౌ శివౌ ।
ప్రసన్నవదనౌ వన్దే పార్వతీపరమేశ్వరౌ ॥11॥

విశ్వశరీరులు, విశ్వముఖులు, విశ్వపాదకరులు, శివులు, ప్రసన్నవదనులు అయిన పార్వతీ పరమేశ్వరులకు ప్రణమిల్లుతున్నాను.

ఏవం సమ్పూజ్య విధివదగ్రత శ్శివయోః పునః ।
పద్మోత్పలాని రజసా నానావర్ణేన కారయేత్ ॥12॥

శంఖచక్రే సకటకే స్వస్తికాఙ్కుశచామరాన్ ।
యావన్తః పాంసవస్తత్ర రజసః పతితా భువి ।
తావద్వర్షసహస్రాణి శివలోకే మహీయతే ॥13॥

ఇలా విధిప్రకారం పూజించి శివా శివులయెదుట నానావర్ణం కల పరాగంతో పద్మాలనూ, ఉత్పలాలనూ లిఖింపజేయాలి. శంఖం, చక్రం, కటకం, స్వస్తికం, అంకుశం, చామరం– ఈ బొమ్మలను గూడా లిఖించాలి. ఎన్ని రజఃకణాలు భూమి మీద పడతాయో, అన్ని వేల సంవత్సరాలు శివలోకంలో భక్తుడు పూజింపబడుతాడు.

చత్వారి ఘృతపాత్రాణి సహిరణ్యాని శక్తితః ।
దత్వా ద్విజాయ కరకముదకాన్నసమన్వితమ్ ।
ప్రతిపక్షం చతుర్మాసం యావదేతన్నివేదయేత్ ॥14॥

తతస్తు చతురో మాసాన్పూర్వవత్కరకోపరి ।
చత్వారి సక్తుపాత్రాణి తిలపాత్రాణ్యతఃపరమ్ ॥15॥

గన్ధోదకం పుష్పవారి చన్దనం కుఙ్కుమోదకమ్ ।
అపక్వం దధి దుగ్ధం చ గోశృఙ్గోదక మేవ చ ॥16॥

పిష్టోదకం తథా వారి కుష్ఠచూర్ణాన్వితం పునః ।
ఉశీరసలిలం తద్వద్యవచూర్ణోదకం పునః ॥17॥

తిలోదకం చ సమ్ప్రాశ్య స్వపేన్మార్గశిరాదిషు ।
మాసేషు పక్షద్వితయం ప్రాశనం సముదాహృతమ్ ॥18॥

స్వర్ణ సమేతంగా శక్తికొలది నాల్గు నెలలు ప్రతి పక్షంలోను నాలుగు ఘృత పాత్రలు, ఉదకాన్న సహితమైన కమండలువును ద్విజుని కివ్వాలి. తదుపరి నాల్గు నెలలు ముందు మాదిరి కమండలువు పైన నాలుగు సత్తుపాత్రలు, ఆపై తిలపాత్రలు, గంధోదకం, పుష్పజలం, చందనం, కుంకుమోదకం, అపక్వమైన దధి, పచ్చిపాలు, గోశృంగోదకము, పిష్టోదకం, కుష్ఠ చూర్ణ సమేతమైన నీరు, ఉశీరజలం, యవచోర్ణోదకం తిలోదకం, ఆహారంగా స్వీకరించి నిద్రించాలి. మార్గ శీర్షాది మాసాలలో రెండు పక్షాలలో ఇట్టి నైవేద్యం దేవతలకు నివేదించాలి.

సర్వత్ర శుక్లపుష్పాణి ప్రశస్తాని సదార్చనే ।
దానకాలే చ సర్వత్ర మన్త్ర మేతదుదీరయేత్ ॥19॥

అర్చనంలో అంతటా తెల్లపూలు ప్రశస్తాలు. దానకాలంలో అంతటా ఈ మంత్రం చెప్పాలి.

గౌరీ మే ప్రీయతాం నిత్యమఘనాశాయ మంగళా ।
సౌభాగ్యాయాఽస్తు లలితా భవానీ సర్వసిద్ధయే ॥20॥

నాపట్ల పాపనాశం కొరకు మంగళ యైన గౌరి ప్రీతినొందుగాక! లలిత సౌభాగ్యాన్నీ, భవాని సర్వసిద్ధినీ ప్రసాదింతురుగాక.

సంవత్సరాన్తే లవణం కుసుమ్భం కుఙ్కుమం తథా ।
చన్దనం నేత్రపట్టం చ సహిరణ్యామ్బుజేన తు ॥21॥

ఉమామహేశ్వరం హైమం తద్వదిక్షుఫలైర్యుతమ్ ।
సతూలావరణాం శయ్యాం సవిశ్రామాం నివేదయేత్ ।
సపత్నీకాయ విప్రాయ గౌరీ మే ప్రీయతామితి ॥22॥

సంవత్సరాంతంలో లవణం, కుసుంభం, కుంకుమం, చందనం, నేత్రపట్టం, స్వర్ణపద్మం, స్వర్ణ ఉమామహేశ్వరుణ్ణి, చెరకుఫలసమేతమైన తూలావరణంతో గూడిన శయ్యను, విశ్రాంతితో గూడిన దానిని భార్యతో గూడిన విప్రునకు 'గౌరీ మే ప్రీయతాం' అంటూ దానమివ్వాలి.

ఆర్ద్రానన్దకరీ నామ్నా తృతీయైషా సనాతనీ ।
యాముపోష్య నరో యాతి శమ్భోర్యత్పరమం పదమ్ ॥23॥

'ఆర్ద్రానందకరీ' అన్న పేరు గల ఈ తృతీయ సనాతని. ఇందులో ఉపవసించినవాడు శివుని పరమ పదం చేరుకొంటాడు.

నారీ వా కురుతే యా తు కుమారీ విధవా చ యా ।
సాఽపి తత్ఫలమాప్నోతి దేవ్యనుగ్రహలాలితా ॥24॥

నారి గాని, కుమారి గాని, విధవ గాని, ఈ వ్రతం చేస్తే దేవ్యనుగ్రహం పొంది ఆమె గూడా ఆ ఫలం పొందుతుంది.

ప్రతిపక్ష ముపోష్యైవం మన్త్రార్చన విధానవిత్ ।
రుద్రాణీలోకమభ్యేతి పునరావృత్తిదుర్లభమ్ ॥25॥

మంత్రార్చన విధానం తెలిసినవాడై ప్రతిపక్షంలో ఇలా ఉపవసించి వ్రతం చేస్తే పునరావృత్తి లేని రుద్రాణీలోకం చేరుకొంటాడు.

య ఇదం శృణుయాన్నిత్యం శ్రావయేద్వాఽపి మానవః ।
శక్రలోకే స గన్ధర్వైః పూజ్యతేఽపి యుగత్రయమ్ ॥26॥

ఎవడు దీనిని నిత్యం వింటాడో, వినిపిస్తాడో అట్టి మానవుడు మూడు యుగాల కాలం ఇంద్రలోకంలో గంధర్వులచే పూజింపబడతాడు.

ఇహలోకే సదానన్దమాప్నోతి ధనసమ్పదః ।
ఆయురారోగ్యసంపత్యా న కశ్చిచ్ఛోకమాప్నుయాత్ ॥27॥

ఈ లోకంలో సదానందాన్ని, ధనసంపదలను పొందుతాడు. ఆయురారోగ్య సంపద కల్గి శోకం లేనివాడై ఉంటాడు.

ఆనందదాం సకలదుఃఖహరాం తృతీయాం యా స్త్రీ కరోత్యవిధవా విధవాఽథవాఽపి ।
సా స్వే గృహే సుఖశతాన్యనుభూయ భూయో గౌరీపదం సదయితా దయితా ప్రయాతి ॥28॥

ఆనంద మిచ్చేది, సకల దుఃఖాలు తొలగించేది, అయిన ఈ తృతీయను విధవగాని, సుమంగళిగాని, ఏ వనిత అనుష్ఠిస్తుందో, ఆమె తన గృహంలో అనేక సుఖాలు పొంది మరల దయితునితో గూడి గౌరీ పదం పొందుతుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఆర్ద్రానందకరీవ్రతం నామ చతుఃషష్టితమోఽధ్యాయః ॥ 64 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ఆర్ద్రానందకరీవ్రతమనే అరవైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచషష్టితమోఽధ్యాయః - అరవైఅయిదవ అధ్యాయం

అక్షయతృతీయా వ్రతమ్ - అక్షయతృతీయావ్రతం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అథాన్యామపి వక్ష్యామి తృతీయాం సర్వకామదామ్ ।
యస్యాం దత్తం హుతం జప్తం సర్వం భవతి చాక్షయమ్ ॥1॥

ఇక సర్వకామప్రదమైన మరొక తృతీయను గురించి చెబుతాను. ఇందులో చేసిన దానం, హోమం, జపం మొదలగునది సర్వమూ అక్షయమే అవుతుంది.

వైశాఖశుక్లపక్షే తు తృతీయా యైరుపోషితా ।
అక్షయం ఫలమాప్నోతి సర్వస్య సుకృతస్య చ ॥2॥

వైశాఖశుక్ల పక్షంలోని తృతీయనాడు ఎవరు ఉపవసిస్తారో, వారు సకల సుకృతాలు చేసినందుకు కలిగే అక్షయఫలం పొందుతారు.

సా తథా కృత్తికోపేతా విశేషేణ సుపూజితా ।
తత్ర దత్తం హుతం జప్తం సర్వమక్షయముచ్యతే ॥3॥

ఆ తృతీయ కృత్తికతో కూడినదైవుండినప్పుడు విశేషపూజ చేస్తే ఆ పూజా సమయములో నిర్వర్తించే దాన హోమజపా లన్నీ అక్షయమవుతాయని కీర్తింపబడ్డాయి.

అక్షయా సన్తతిస్తస్యాస్తస్యాం సుకృతమక్షయమ్ ।
అక్షతైః పూజ్యతే విష్ణుః తేన సాఽప్యక్షయా స్మృతా ॥4॥

ఆ వ్రతం ఆచరించేవారి సంతానం అక్షయమవుతుంది. సుకృతం అక్షయమవుతుంది. విష్ణువును అక్షతలతో పూజించటం వల్ల ఇది అక్షయ తృతీయ అయింది.

అక్షతైస్తు నరః స్నాతో విష్ణోర్దత్వా తదాక్షతాన్ ।
విప్రేషు దత్వా తానేవ తథా సక్తూన్సుసంస్కృతాన్ ।
యథాన్నభుఙ్మహాభాగ ఫలమక్షయ్యమశ్నుతే ॥5॥

అక్షతలతో స్నానం చేసి విష్ణువుకు అక్షతలు సమర్పించి చక్కగా సంస్కరింపబడిన ఆ అక్షతలను విప్రుల కివ్వడమేకాక అవి వండుకుని తినేవాడు అక్షయఫలం పొందుతాడు.

ఏకామప్యుక్తవత్కృత్వా తృతీయాం విధివన్నరః ।
ఏతాసామపి సర్వాసాం తృతీయానాం ఫలం లభేత్ ॥6॥

విధిప్రకారం మానవుడు ఒక అక్షయతృతీయవ్రతమైనా చెప్పినట్లు ఆచరిస్తే అన్ని తృతీయలను అనుష్ఠించినఫలం వానికి చేకూరుతుంది.

తృతీయాయాం సమభ్యర్చ్య సోపవాసో జనార్దనమ్ ।
రాజసూయఫలం ప్రాప్య గతిమగ్ర్యాం చ విన్దతి ॥7॥

ఉపవాసం పాటించి ఈ తృతీయనాడు జనార్దనుని అర్చించేవాడు రాజసూయ ఫలాన్నీ, శ్రేష్ఠగతినీ పొందుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అక్షయతృతీయవ్రతం నామ పంచషష్టితమోఽధ్యాయః ॥ 65 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని అక్షయతృతీయావ్రతమనే అరవైఅయిదవ అధ్యాయం సంపూర్ణం

షట్షష్టితమోఽధ్యాయః - అరవైఆరవ అధ్యాయం

సారస్వతవ్రతానుష్ఠానమ్ - సారస్వతవ్రతానుష్ఠానం

మనురువాచ :- మనువు చెప్పాడు.

మధురా భారతీ కేన వ్రతేన మధుసూదన! ।
తథైవ జనసౌభాగ్యం మతిం విద్యాసు కౌశలమ్ ॥1॥

అభేదశ్చాపి దమ్పత్యోస్తథా బన్ధుజనేన చ ।
ఆయుశ్చ విపులం పుంసాం తన్మే కథయ మాధవ! ॥2॥

మధుసూదనా! మధురమైన వాక్కు ఏ వ్రతం చేస్తే లభిస్తుంది? మాధవా! అట్లే జనసౌభాగ్యం, బుద్ధి, విద్యా నైపుణ్యం, దంపతుల అభేదం, బంధుజనులతో అభేదం, దీర్ఘాయువు, జనులకెలా కలుగుతాయో అది నాకుచెప్పు.

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

సమ్యక్పృష్టం త్వయా రాజన్ శృణు సారస్వతం వ్రతమ్ ।
యస్య సఙ్కీర్తనాదేవ తుష్యతీహ సరస్వతీ ॥3॥

రాజా! చక్కగా అడిగావు. సారస్వతవ్రతాన్ని గూర్చి విను. ఆ వ్రతాన్ని పేర్కొన్న మాత్రాన సరస్వతి సంతోషిస్తుంది.

యో యద్భక్తః పుమాన్కుర్యాదేతద్వ్రతమనుత్తమమ్ ।
తద్వాసరాదౌ సమ్పూజ్య విధానేన సమాచరేత్ ॥4॥

ఈ వ్రతం చేయదలచిన భక్తులు దినారంభంలో శాస్త్ర విధానాన్ననుసరించి ఈ వ్రతం అనుష్ఠించాలి.

అథవాఽఽదిత్యవారేణ గ్రహతారాబలేన చ ।
పాయసం భోజయేద్విప్రా న్కృత్వా బ్రాహ్మణవాచనమ్ ॥5॥

లేదా ఆదివారం నాడు గ్రహతారాబలం చూచుకొని విప్రులచే పాయసాన్నం భుజింపచేయాలి. పుణ్యాహవాచనం చేయించి.

శుక్లవస్త్రాణి దత్త్వా చ సహిరణ్యాని శక్తితః ।
గాయత్రీం పూజయేద్భక్త్యా శుక్లమాల్యానులేపనైః ॥6॥

స్వర్ణసహితంగా శక్తిననుసరించి వారికి శుక్లవస్త్రాలిచ్చి శుక్లమాల్యానులేపనాలతో ఆదరించి గాయత్రిని భక్తితో పూజించాలి.

యథా న దేవి! భగవాన్బ్రహ్మలోకే పితామహః ।
త్వాం పరిత్యజ్య సన్తిష్ఠే త్తథా భవ వరప్రదా ॥7॥

'దేవీ! భగవంతుడైన బ్రహ్మ, బ్రహ్మలోకంలో ఎప్పుడూ నిన్ను వదలివుండదు. అట్టి నీవు మాకు అలాంటివరము ప్రసాదించు.

వేదాఃశాస్త్రాణి సర్వాణి గీతనృత్యాదికం చ యత్ ।
న విహీనం త్వయా దేవి! తథా మే సన్తు సిద్ధయః ॥8॥

దేవీ! వేదాలు, సర్వశాస్త్రాలు, గీతం మొదలైనవి నీవు లేకుండా లేవు. అట్టి సిద్ధులే మాకు కలుగుగాక!

లక్ష్మీ ర్మేధా ధరా పుష్టిర్గౌరీ తుష్టిః ప్రభా మతిః ।
ఏతాభిః పాహి అష్టాభి స్తనుభి ర్మాం సరస్వతి ॥9॥

సరస్వతీ! లక్ష్మి, మేధ, ధర, పుష్టి, గౌరి, తుష్టి, ప్రభ, మతి– ఈ ఎనిమిది తనువులతో కూడిన నీవు నాకు – వాటిని ప్రసాదించి నన్ను రక్షించు.

ఏవం సమ్పూజ్య గాయత్రీం వీణాక్షమాలాధారిణీమ్ ।
శుక్లపుష్పాక్షతై ర్భక్త్యా సకమణ్డలుపుస్తికామ్ ।
మౌనవ్రతేన భుఞ్జీత సాయం ప్రాతస్తు ధర్మవిత్ ॥10॥

వీణ, అక్షమాల, కమండలువు, పుస్తకము ధరించిన గాయత్రిని ఈరీతిగా భక్తితో శుక్ల పుష్పాక్షతలతో పూజించి, ధర్మం తెలిసినవాడు సాయం, ప్రాతఃసమయాలలో మౌనవ్రతంతో భుజించాలి.

పఞ్చమ్యాం ప్రతిపక్షం చ పూజయేద్బ్రహ్మవాసినీమ్ ।
తథైవ తణ్డులప్రస్థం ఘృతపాత్రేణ సంయుతమ్ ।
క్షీరం దద్యాద్ధిరణ్యం చ గాయత్రీం ప్రీయతామితి ॥11॥

ప్రతిపక్షంలోనూ పంచమినాడు గాయత్రిని, (సువాసినిని) అర్చించాలి. అట్లే ఘృత పాత్రతో గూడిన బియ్యపు పాత్రనూ, క్షీరాన్నీ, స్వర్ణాన్నీ, "గాయత్రీ ప్రీయతామ్" అని సమర్పించాలి.

సన్ధ్యాయాం చ తథా మౌనమేతత్కుర్వ న్సమాచరేత్ ।
నాన్తరా భోజనం కుర్యాద్యావన్మాసాంస్త్రయోదశ ॥12॥

సంధ్యాసమయంలో గూడా ఇలా చేస్తూ మౌనం పాటించాలి. పదమూడు నెలలవరకూ నియతకాలములో తప్ప ఇతర వేళల్లో భుజించరాదు.

సమాప్తే తు వ్రతే దద్యాద్భాజనం శుక్లతణ్డులైః ।
పూర్వం సవస్త్రయుగ్మం చ దద్యాద్విప్రాయ భోజనమ్ ॥13॥

వ్రతం సమాప్తమైనప్పుడు తెల్లని బియ్యంతో గూడిన పాత్రనూ, వస్త్ర యుగ్మాన్నీ ముందు విప్రునకు సమర్పించాలి. ఆ పై అతనికి భోజనం పెట్టాలి.

దేవ్యా వితానం ఘంటాం చ సితనేత్రే పయస్వినీమ్ ।
చన్దనం వస్త్రయుగ్మం చ దధ్యన్న కరకం పునః ॥14॥

ఆ తరువాత దేవిని పూజించిన చాందినీవస్త్రాన్నీ, ఘంటనూ, వెండి కన్నులు గల పాడియావునూ, చందనాన్ని, వస్త్రయుగ్మాన్నీ, పెరుగన్నముతో నిండిన గరిగ పాత్రనూ దానమివ్వాలి.

తథోపదేష్టారమపి భక్త్యా సమ్పూజయేద్గురుమ్ ।
విత్తశాఠ్యేన రహితో వస్త్రమాల్యానులేపనైః ॥15॥

అట్లే తనకు ఉపదేశించిన గురువును విత్త శాఠ్యం లేకుండా భక్తితో వస్త్రమాల్యానులేపనాదులతో పూజించాలి.

అనేన విధినా యస్తు కుర్యాత్సారస్వతం వ్రతమ్ ।
విద్యావానర్థసంయుక్తో రక్తకణ్ఠశ్చ జాయతే ॥16॥

ఈ రీతిగా ఎవడు సారస్వతవ్రతం చేస్తాడో వాడు విద్యావంతుడూ, ధనవంతుడూ, మధురకంఠధ్వని గలవాడూ అవుతాడు.

సరస్వత్యాః ప్రసాదేన బ్రహ్మలోకే మహీయతే ।
నారీ వా కురుతే యా తు సాఽపి తత్ఫలగామినీ ।
బ్రహ్మలోకే వసేద్రాజన్యావత్కల్పాయుతత్రయమ్ ॥17॥

రాజా! సరస్వతీదేవి అనుగ్రహంవల్ల అతడు బ్రహ్మలోకంలో పూజింపబడతాడు. స్త్రీయైనా ఈ వ్రతం చేస్తే ఆ ఫలమే పొందుతుంది. అట్టి భక్తుడు ముప్పదివేల కల్పములంత కాలం బ్రహ్మలోకంలో నివసిస్తాడు.

సారస్వతం వ్రతం యస్తు శృణుయాదపి యః పఠేత్ ।
విద్యాధరపురే సోఽపి వసేత్కల్పాయుతత్రయమ్ ॥18॥

ఎవడు ఈ సారస్వత వ్రతాన్ని గూర్చి వింటాడో, పఠిస్తాడో, వాడు విద్యాధరపురంలో ముప్పదివేల కల్పాల కాలం నివసిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే సారస్వతవ్రతానుష్ఠానం నామ షట్షష్టితమోఽధ్యాయః ॥ 66 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని సారస్వతవ్రతమనే అరవైఆరవ అధ్యాయం సంపూర్ణం

సప్తషష్టితమోఽధ్యాయః - అరవైఏడవ అధ్యాయం
సూర్యచంద్రగ్రహణ స్నానవిధిః - సూర్యచంద్రగ్రహణ స్నానవిధి

మనురువాచ :- మనువు చెప్పాడు.

చన్ద్రాదిత్యోపరాగే తు యత్స్నానమభిధీయతే ।
తదహం శ్రోతుమిచ్ఛామి ద్రవ్యమన్త్రవిధానవిత్! ॥1॥

ద్రవ్యమంత్రాల విధానం తెలిసిన ఓ భగవానుడా! చంద్ర గ్రహణ సూర్యగ్రహణ సమయాలలో చెప్పబడిన స్నానాన్ని గురించి నేను వినగోరుతున్నాను.

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

యస్య రాశిం సమాసాద్య భవేద్గ్రహణసంప్లవః ।
తత్ర స్నానం ప్రవక్ష్యామి మన్త్రౌషధవిధానతః ॥2॥

సూర్యుడుగానీ, చంద్రుడుగానీ ఏ రాశిలో ప్రవేశించినప్పుడు గ్రహణం సంభవిస్తుందో, దానికి సంబంధించిన మంత్రౌషధవిధానంతో కూడిన స్నానాన్ని వివరిస్తాను.

చన్ద్రోపరాగం సమ్ప్రాప్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
సమ్పూజ్య చతురో విప్రాన్ శుక్లమాల్యానులేపనైః ॥3॥

చంద్రగ్రహణం ఏర్పడినప్పుడు బ్రాహ్మణులచే స్వస్తివాచనం చేయించాలి. నలుగురు విప్రులను శుక్లమాల్యానులేపనాలతో పూజించాలి.

పూర్వమేవోపరాగస్య సమాసాద్యౌషధాదికమ్ ।
స్థాపయేచ్చతురః కుమ్భానవ్రణాన్సాగరానితి ॥4॥

గ్రహణకాలానికి ముందే ఓషధులు మున్నగువాటిని చేకూర్చుకోవాలి. రంధ్రంలేని నాలుగు కుంభాలను నాలుగు సాగరాలుగా భావించి స్థాపించాలి.

గజాశ్వరథ్యావల్మీక సఙ్గమాత్ హ్రదగోకులాత్ ।
రాజద్వారప్రదేశాచ్చ మృదమానీయ చాక్షిపేత్ ॥5॥

ఏనుగులు, గుర్రాలు నిలుచు తావులు, వీథులు, పుట్ట, మడుగు, గోకులం రాజద్వారం- ఈ ప్రదేశాలనుండి మట్టినితెచ్చి ఆ కుండల్లో వేయాలి.

పఞ్చగవ్యం చ కుమ్భేషు శుద్ధముక్తాఫలాని చ ।
రోచనాం పద్మశఙ్ఖౌ చ పఞ్చరత్నసమన్వితమ్ ॥6॥

స్ఫటికం చన్దనం శ్వేతం తీర్థవారి ససర్షపమ్ ।
గజదన్తం సకుముదం తథైవోశీరగుగ్గులమ్ ।
ఏతత్సర్వం వినిక్షిప్య కుమ్భేష్వావాహయేత్సురాన్ ॥7॥

ఆ కడవలలో పంచగవ్యం, శుద్ధ ముత్యాలు, గోరోచనం, పద్మశంఖాలు, పంచరత్నాలతో గూడిన స్ఫటికం, శ్వేతచందనం, ఆవాలుగల గంగాజలం, గజదంతం, కుముదం, ఉశీరం, గుగ్గళం ఇవన్నీ వేసి ఆ కుంభాలలో దేవతల నావాహింపజేయాలి.

సర్వే సముద్రాస్సరిత స్తీర్థాని జలదా నదాః ।
ఆయాన్తు యజమానస్య దురితక్షయకారకాః ॥8॥

యజమాని పాపం పోగొట్టునట్టి సకల సాగరాలు, నదులు, తీర్థాలు, మబ్బులు, నదాలు ఈ కలశాలలోనికి వత్తురు గాక!

యోఽసౌ వజ్రధరో దేవ ఆదిత్యానాం ప్రభుర్మతః ।
సహస్రనయనశ్చేన్ద్రో గ్రహపీడాం వ్యపోహతు ॥9॥

వజ్రాయుధధారీ, దేవతల ప్రభువూ, సహస్రనేత్రుడూ అయిన ఇంద్రుడు గ్రహపీడను తొలగించుగాక!

ముఖం య స్సర్వదేవానాం సప్తార్చిరమితద్యుతిః ।
చన్ద్రోపరాగసమ్భూతామగ్నిః పీడాం వ్యపోహతు ॥10॥

సకలదేవతలకూ ముఖమైనవాడూ, అమితమైన ప్రకాశం కలవాడూ అగు అగ్నిదేవుడు చంద్రగ్రహణం వల్ల కల్గిన పీడను తొలగించుగాక!

యః కర్మసాక్షీ భూతానాం ధర్మో మహిషవాహనః ।
యమశ్చన్ద్రోపరాగోత్థాం మమ పీడాం వ్యపోహతు ॥11॥

ప్రాణుల కర్మసాక్షీ, మహిషవాహనుడూ అయిన యమధర్మరాజు చంద్రగ్రహణంవల్ల నాకు గల్గిన పీడను తొలగించుగాక!

నాగపాశధరో దేవః సాక్షాన్మకరవాహనః ।
స జలాధిపతిశ్చన్ద్రగ్రహపీడాం వ్యపోహతు ॥12॥

నాగపాశధారి, సాక్షాత్తూ మకరవాహనుడూ, జలాధిపతీ అయిన ఆ వరుణదేవుడు చంద్రగ్రహ పీడను పోగొట్టుగాక!

ప్రాణరూపేణ యో లోకాన్పాతి కృష్ణమృగప్రియః ।
వాయుశ్చన్ద్రోపరాగోత్థాం పీడామత్ర వ్యపోహతు ॥13॥

ఎవడు ప్రాణరూపంతో లోకాలను రక్షిస్తూన్నాడో, అట్టి కృష్ణ మృగ (నల్లజింక)ప్రియుడైన వాయుదేవుడు చంద్రోపరాగం వల్ల కల్గిన పీడను నివారించుగాక!

యోఽసౌ నిధిపతిర్దేవః ఖడ్గశూలగదాధరః ।
చన్ద్రోపరాగకలుషం ధనదో మే వ్యపోహతు ॥14॥

నిధులకు పతీ, ఖడ్గశూలగదలను ధరించినవాడూ అగు కుబేరుడు నా చంద్రగ్రహణ పాపాన్ని పోగొట్టుగాక!

యోఽసావిన్దుధరో దేవః పినాకీ వృషవాహనః ।
చన్ద్రోపరాగజాం పీడాం వినాశయతు శంకరః ॥15॥

చంద్రుని ధరించినవాడూ, పినాకాయుధుడూ, వృషభవాహనుడూ అయిన శంకరుడు చంద్రగ్రహణంచే కల్గిన పీడను నశింపజేయుగాక!

త్రైలోక్యే యాని భూతాని స్థావరాణి చరాణి చ ।
బ్రహ్మావిష్ణ్వర్కయుక్తాని తాని పాపం దహన్తు వై ॥16॥

ముల్లోకాలలో చరాచరాత్మకాలూ, బ్రహ్మ, విష్ణువు, సూర్యుడు వీరితో గూడినవీ అయిన ప్రాణులన్నీ నా పాపమును దహించి వేయుగాక!"

ఏవమామన్త్ర్య తైః కుమ్భైరభిషిక్తో గుణాన్వితైః ।
ఋగ్యజుస్సామమన్త్రైశ్చ శుక్లమాల్యానులేపనైః ।
పూజయేద్వస్త్రగోదానై ర్బ్రాహ్మణానిష్టదేవతాః ॥17॥

ఇలా దేవతలను ఆమంత్రణం చేసి గుణాన్వితాలైన ఆ కడవలచే స్నానం చేయాలి. ఆపై ఋగ్యజుస్సామమంత్రాలతో, శుక్లమాల్యానులేపనాలతో, వస్త్రగోదానాలతో బ్రాహ్మణులనూ, ఇష్టదేవతలనూ అర్చించాలి.

ఏతానేవ తతో మన్త్రాన్విలిఖేత్కరకాన్వితాన్ ॥
వస్త్రపట్టేఽథవా పద్మే పద్మరత్నసమన్వితాన్ ॥18॥

యజమానస్య శిరసి నిదధ్యుస్తే ద్విజోత్తమాః ।
తతోఽతివాహయేద్వేలాముపరాగానుగామినీమ్ ॥19॥

పిదప ఈ మంత్రాలనే వస్త్ర పట్టంపైగానీ, పద్మ పత్రం పై గానీ వ్రాసి గరిగయందుంచి పంచరత్నాలతో గూడా ద్విజోత్తములు యజమాని శిరస్సు పై వుంచాలి. ఆపై గ్రహణకాల వేళ అతిక్రమించునట్లు చూడాలి.

ప్రాఙ్ముఖః పూజయిత్వా తు నమస్యన్నిష్టదేవతామ్ ।
చన్ద్రగ్రహే వినిర్వృత్తే కృతగోదానమఙ్గలః ।
కృతస్నానాయ తం పట్టం బ్రాహ్మణాయ నివేదయేత్ ॥20॥

తూర్పుదిశకు అభిముఖుడై ఇష్టదేవతకు నమస్కరిస్తూ పూజించి చంద్రగ్రహణకాలం దాటిపోగానే గోదానమంగళం (కేశఖండనం) చేసి స్నానం చేసిన విప్రునికి ఆ పట్టాన్ని సమర్పించాలి.

అనేన విధినా యస్తు గ్రహస్నానం సమాచరేత్ ।
న తస్య గ్రహపీడా స్యాన్న చ బన్ధుజనక్షయః ॥21॥

ఈ రీతిగా గ్రహస్నానం చేసిన యజమానునికి గ్రహపీడ గానీ, బంధుజనక్షయం గానీ వుండవు.

పరమాం సిద్ధిమాప్నోతి పునరావృత్తి దుర్లభామ్ ।
సూర్యగ్రహే సూర్యనామ సదా మన్త్రేషు కీర్తయేత్ ॥22॥

పునరావృత్తి లేని పరమసిద్ధిని అతడు పొందుతాడు. సూర్యగ్రహణ కాలంలో సూర్యుని పేరు ఆ మంత్రాలతో కూడా సర్వదా కీర్తించాలి.

అధికాః పద్మరాగాః స్యుః కపిలాం చ సుశోభనామ్ ।
ప్రయచ్ఛేద్విత్తసంపన్నశ్చన్ద్రసూర్యోపరాగయోః ॥23॥

పద్మరాగాలు మేలైనవి. అట్లే వాటితో గూడ మంచి శోభనమైన కపిలగోవునూ చంద్రసూర్యగ్రహణ కాలాలలో ధనికుడు దానం చేయాలి.

య ఇదం శృణుయాన్నిత్యం శ్రావయేద్వాపి మానవః ।
సర్వపాపవినిర్ముక్తో శక్రలోకే మహీయతే ॥24॥

ఎవడు దీన్ని నిత్యం వింటాడో, వినిపిస్తాడో, వాడు సర్వపాపనిర్ముక్తుడై ఇంద్రలోకంలో ఆదరింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే సూర్యచంద్రగ్రహణ స్నానవిధిర్నామ సప్తషష్టితమోऽధ్యాయః ॥ 67 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని సూర్యచంద్రగ్రహణ స్నానవిధి అనే అరవైఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టషష్టితమోఽధ్యాయః – అరవైఎనిమిదవ అధ్యాయం

శుక్లపక్ష సప్తమీ స్నపనవ్రతమ్ – శుక్లపక్ష సప్తమీ స్నపనవ్రతం

నారద ఉవాచ :– నారదుడు చెప్పాడు.

కిముద్వేగాద్భుతే కృత్యమలక్ష్మీః కేన హన్యతే ।
మృతవత్సాభిషేకాదికార్యేషు చ కిమిష్యతే ॥1॥

ఉద్వేగం కల్గించే అద్భుతాలు సంభవించినపుడు వాటి నివారణకై ఏమి చేయాలి? దారిద్ర్యాన్ని ఎలా తొలగించుకోవాలి? శిశుమరణం మున్నగు అశుభాలు కల్గినప్పుడు, అభిషేకాదికార్యాలలో ఏమి చేయాలి?

శ్రీభగవానువాచ :– భగవానుడు చెప్పాడు.

పురా కృతాని పాపాని ఫలన్త్యస్మింస్తపోధన ।
రోగదౌర్గత్యరూపేణ తథైవేష్టవధేన చ ॥2॥

తపోధనా! పూర్వం చేసిన పాపాలు రోగం, దుర్గతిరూపాలలోనూ, ఇష్టవధరూపంలోనూ ఫలిస్తాయి.

తద్విఘాతాయ వక్ష్యామి సదా కల్యాణకారకమ్ ।
సప్తమీస్నపనం నామ జనపీడావినాశనమ్ ॥3॥

దానిని తొలగించుకోవడానికై సదా శుభకారకము, జనపీడావినాశకమూ ఐన సప్తమీ స్నానమనే వ్రతాన్ని చెబుతాను.

బాలానాం మరణం యత్ర క్షీరపాణాం ప్రదృశ్యతే ।
తద్వద్వృద్ధాతురాణాం చ యౌవనే చాపి వర్తతామ్ ॥4॥

శాన్తయే తత్ర వక్ష్యామి మృతవత్సాభిషేచనమ్ ।
ఏతదేవాద్భుతోద్వేగచిత్తభ్రమవినాశనమ్ ॥5॥

పాలు త్రాగే పిల్లల మరణం ఎక్కడ సంభవిస్తుందో, అట్లే వృద్ధుల, ఆతురుల, యువకుల మృతి ఎక్కడ ఏర్పడుతుందో, అక్కడ అట్టి అశుభనివారణకై మృతవత్సాభిషేచనవ్రతాన్ని వివరిస్తాను. ఉద్వేగాన్నీ, చిత్తభ్రమలనూ పోగొట్టునది అదే.

భవిష్యతి చ వారాహో యత్ర కల్పస్తపోధన ।
వైవస్వతశ్చ తత్రాపి యదా తు మనురుత్తమః ॥6॥

తపోధనా! రానున్న వరాహకల్పంలో ఉత్తముడైన వైవస్వతమనువు రాజు కాగలడు.

భవిష్యతి చ తత్రైవ పఞ్చవింశతమం యదా ।
కృతం నామ యుగం తత్ర హైహయాన్వయవర్ధనః ।
భవితా నృపతిర్వీరః కృతవీర్యః ప్రతాపవాన్ ॥7॥

తదుపరి ఇరువది అయిదవ సత్యయుగం సంభవించినప్పుడు హైహయవంశానికి వృద్ధి కల్గించువాడూ, ప్రతాపవంతుడూ అయిన కృతవీర్యుడనేవాడు రాజు కానున్నాడు.

స సప్తద్వీపమఖిలం పాలయిష్యతి భూతలమ్ ।
యావద్వర్షసహస్రాణి సప్తసప్తతి నారద ॥8॥

నారదా! ఆ రాజు సప్త ద్వీపాత్మకమైన సకల భూతలాన్నీ డెబ్బదియేడు వేల సంవత్సరాలు పరిపాలిస్తాడు.

జాతమాత్రం చ తస్యాపి యావత్పుత్రశతం తథా ।
చ్యవనస్య తు శాపేన వినాశముపయాస్యతి ॥9॥

అతనికి కల్గిన నూరుమంది కుమారులూ పుట్టిన వెంటనే చ్యవనుని శాపంవల్ల మరణిస్తారు.

సహస్రబాహుశ్చ యదా భవితా తస్య వై సుతః ।
కురంగనయనః శ్రీమాన్ సంభూతో నృపలక్షణైః ॥10॥

అతని పుత్రుడు సహస్రబాహువు అనువాడు జన్మించినప్పుడు జింకవంటి నేత్రాలతో శ్రీమంతుడై నృపలక్షణాలతో జన్మిస్తాడు.

కృతవీర్య స్తదాఽఽరాధ్య సహస్రాంశుం దివాకరమ్ ।
ఉపవాసైర్వ్రతై ర్దివ్యై ర్వేదసూక్తైశ్చ నారద ।
పుత్రస్య జీవనాయాలమేతత్స్నానమవాప్స్యతి ॥11॥

అప్పుడు కృతవీర్యుడు సహస్రకిరణాలు గల సూర్యుణ్ణి ఉపవాసాలతో, దివ్యవ్రతాలతో, వేదసూక్తాలతో ఆరాధించి పుత్ర జీవనం కొరకై ఈ స్నానం చేయగలడు.

కృతవీర్యేణ వై పృష్ట ఇదం వక్ష్యతి భాస్కరః ।
అశేషదుష్టశమనం సదా కల్మషనాశనమ్ ॥12॥

కృతవీర్యుడు అడుగగా సూర్యుడు సకలదుష్టులను శమింపజేసేదీ, సదా పాపనాశకమైనదీ అయిన ఈ వ్రతాన్ని ఇలా చెప్పనున్నాడు.

సూర్యః ఉవాచ :– సూర్యుడు చెప్పాడు.

అలం క్లేశేన మహతా పుత్ర స్తవ నరాధిప! ।
భవిష్యతి చిరంజీవీ కిన్తు కల్మషనాశనమ్ ॥13॥

సప్తమీస్నపనం వక్ష్యే సర్వలోకహితాయ వై ।
జాతస్య మృతవత్సాయాః సప్తమే మాసి నారద! ।
అథవా శుక్లసప్తమ్యామేతత్సర్వం ప్రశస్యతే ॥14॥

నరాధిపా! నీవు ఎక్కువ క్లేశం పొందనక్కర లేదు నీ కొడుకు చిరంజీవి కాగలడు. సర్వలోక హితం కొరకై నీకు కల్మషనాశకమైన సప్తమీ స్నానాన్ని గురించి చెబుతాను. నారదా! పుట్టిన బిడ్డ చనిపోయే తల్లి ఏడవ నెలలో గానీ, లేక శుక్లసప్తమినాడు గానీ ఈ వ్రతం చేయడం మంచిది.

గ్రహతారాబలం లబ్ధ్వా కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
బాలస్య జన్మనక్షత్రం వర్జయేత్తాం తిథిం బుధః ।
తద్వద్వృద్ధేతరాణాం చ కృత్యం స్యాదితరేషు చ ॥15॥

గ్రహతారాబలం చూచుకొని బాలుని జన్మ నక్షత్రమునందు సంప్రదాయానుసారంగా బ్రాహ్మణులచే స్వస్తివాచకం చేయించాలి. 1. పిల్లవాని జన్మనక్షత్రాన్ని జన్మతిథినీ వదిలివెయ్యాలి. 2. గ్రహబలం తారాబలం బాగున్నరోజున దేవతల నారాధించాలి. వృద్ధులకూ, రోగులకూ, ఇతరులకు కూడా ఈ విధానం అనుసరించాలి.

గోమయేనానులిప్తాయాం భూమావేకాగ్రవత్తదా ।
తణ్డులై రక్తశాలీయైశ్చరుం గోక్షీరసంయుతమ్ ।
నిర్వపేత్సూర్యరుద్రాభ్యాం తన్మన్త్రాభ్యాం విధానతః ॥16॥

కీర్తయేత్సూర్యదైవత్యం సప్తర్చం చ ఘృతాహుతీః ।
జుహుయాద్రుద్రసూక్తేన తద్వద్రుద్రాయ నారద ॥17॥

నారదా! గోమయంతో అలికిన చోట ఏకాగ్రభావంతో ఎఱ్ఱవడ్లనుండి చేసిన బియ్యంతో చేసిన ఆవుపాలతో గూడిన చరువును సూర్యదేవతాకము, రుద్రదేవతాకము అయిన మంత్రాలతో సూర్యరుద్రులకు అగ్నిలో ఆహుతులు వ్రేల్చాలి. ఆపై సూర్య రుద్ర దేవతాకములైన సూక్తాలతో ఘృతాహుతులివ్వాలి.

హోతవ్యా స్సమిధ శ్చాత్ర తథైవార్కపలాశయోః ।
యవకృష్ణతిలైర్హోమః కర్తవ్యోఽ ష్టశతం పునః ॥18॥

వ్యాహృతీభిస్తథాజ్యేన తథైవాష్టశతం పునః ।
హుత్వా స్నానం చ కర్తవ్యం మఙ్గలం యేన ధీమతా ॥19॥

జిల్లేడు, మోదుగ సమిధలతో, యవలతో, నల్ల నువ్వులతో నేతిలో నూటఎనిమిది సార్లు ఆహుతులు చేయాలి. అట్లే వ్యాహృతులతో 108 సార్లు చేయాలి. తరువాత మంగళద్రవ్యాలతో మంగళస్నానం జరిపి మంగళాలంకారాలు ధరించాలి.

విప్రేణ వేదవిదుషా విధివద్దర్భపాణినా ।
స్థాపయిత్వా తు చతురః కుమ్భాన్కోణేషు శోభనాన్ ॥20॥

వేదజ్ఞుడు, దర్భపాణి అయిన విప్రునిచేత విధివిధానాన్ని అనుసరించి, నాలుగు మూలలలో నాలుగు శోభనమైన కుంభాలను స్థాపించాలి.

పఞ్చమం చ పునర్మధ్యే దధ్యక్షతసమన్వితమ్ ।
స్థాపయేదవ్రణం కుమ్భం సప్తర్చేనాభిమన్త్రితమ్ ॥21॥

దధి, అక్షతలతో అలంకరించిన అయిదవ కుంభాన్ని వాటి మధ్య నిలపాలి. ఆ కుంభం లోపం (బెజ్జం) లేనిదై యుండాలి. ఆపై అగ్ని దేవతాకములైన సప్తర్చమంత్రాలతో దాన్ని అభిమంత్రించాలి.

సౌరేణ తీర్థతోయేన పూర్ణం రత్నసమన్వితమ్ ।
సర్వాన్ సర్వౌషధైర్యుక్తాన్ పంచగవ్యసమన్వితాన్ ।
పంచరత్నఫలైః పుష్పైర్వాసోభిః పరివేష్టయేత్ ॥22॥

దాన్ని సూర్యతీర్థంతో నింపి రత్నసమేతమైనదిగా చేయాలి. అన్ని కుంభాలనూ సకలములైన ఔషధులతోనూ, పంచగవ్యములతోనూ సమన్వితం చేసి పంచరత్నాలతో, పూలతో, వస్త్రాలతో పరివేష్టింపజేయాలి.

గజాశ్వరథ్యావల్మీకా త్సఙ్గమాద్ధ్రదగోకులాత్ ।
సంశుద్ధాం మృదమానీయ సర్వేష్వేవ వినిక్షిపేత్ ॥23॥

ఏనుగులు, గుర్రాలున్ననేల, వీథి, పుట్ట, మడుగు, గోకులం – ఈ ప్రదేశాలనుండి శుద్ధమైన మట్టిని తెచ్చి ఆ కుంభా లన్నింటిలో ఉంచాలి.

చతుర్ష్వపి చ కుమ్భేషు రత్నగర్భేషు మధ్యమమ్ ।
గృహీత్వా బ్రాహ్మణస్తత్ర సౌరాన్మన్త్రానుదీరయేత్ ॥24॥

రత్న గర్భాలైన ఆ నాల్గు కుంభాల మధ్య గల కుంభాన్ని బ్రాహ్మణుడు గ్రహించి సౌరమంత్రాలు పఠించాలి.

నారీభిః సప్తసంఖ్యాభిరవ్యఙ్గాఙ్గీభిరత్ర చ ।
పూజితాభిర్యథాశక్త్యా మాల్యవస్త్రవిభూషణైః ।
సవిప్రాభిశ్చ కర్తవ్యం మృతవత్సాభిషేచనమ్ ॥25॥

అంగవైకల్యం లేని ఏడుగురు బ్రాహ్మణజాతికి చెందిన ముత్తైదువులను వారి భర్తలతో సహా యథాశక్తి మాల్యవస్త్ర విభూషణాలతో పూజించాలి. అలా పూజితలైన వారిచేత మరణకారణమైన వ్యాధులకు లోనైన శిశువుకు స్నానం చేయించాలి. (పూర్వం మరణించిన శిశువులు గల స్త్రీకి స్నానం చేయించాలి.) తరువాత ఈ క్రింది మంత్రాలు పఠించాలి.

దీర్ఘాయురస్తు బాలోఽయం జీవత్పుత్రా చ భామినీ ।
ఆదిత్యశ్చన్ద్రమా స్సార్ధం గ్రహనక్షత్రమణ్డలైః ॥26॥

సశక్రా లోకపాలా వై బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।
తే తే చాన్యే చ దేవౌఘా స్సదా పాన్తు కుమారకమ్ ॥27॥

"ఈ బాలుడు దీర్ఘాయువగు గాక! ఈ స్త్రీ జీవించిన పుత్రులు గలది అగుగాక! గ్రహ నక్షత్రమండల సమేతులైన సూర్యచంద్రులు, ఇంద్ర సహితులైన లోక పాలకులు, బ్రహ్మ విష్ణుమహేశ్వరులు, అన్యదేవతలు ఈ కుమారుణ్ణి సదా కాపాడుదురు గాక!

మిత్రః శనిర్వా హుతభుగ్ యే చ వారగ్రహాః క్వచిత్ ।
పీడాం కుర్వన్తు బాలస్య మా మాతుర్జనకస్య వై ॥28॥

మిత్రుడు, శని, అగ్ని, వార గ్రహాలూ, తల్లి దండ్రులకూ, బాలునికీ పీడ కల్గించకుందురుగాక!

తత శ్శుక్లామ్బరధరా కుమారపతిసంయుతా ।
పద్మజం పూజయేద్భక్త్యా సదస్యాంశ్చ గురుం పునః ॥29॥

తరువాత తెల్లని వస్త్రాలు ధరించి పిల్లలతో, భర్తలతో గూడిన శిశుమాత బ్రహ్మదేవుని, సభలోని పెద్దలనూ, గురువులనూ భక్తితో పూజించాలి.

కాఞ్చనీం చ తతః కుర్యాత్తామ్రపాత్రోపరి స్థితామ్ ।
ప్రతిమాం ధర్మరాజస్య గురవే వినివేదయేత్ ॥30॥

తదుపరి రాగిపాత్రపై ఉంచిన స్వర్ణంతో చేసిన యమ ధర్మరాజుయొక్క ప్రతిమను గురువుకు నివేదించాలి.

వస్త్రకాఞ్చనరత్నౌఘై ర్భక్ష్యై స్సఘృతపాయసైః ।
పూజయేద్బ్రాహ్మణాంస్తద్వద్విత్తశాఠ్యవివర్జితః ॥31॥

అట్లే విత్తశాఠ్యం లేకుండా వస్త్రాలు, స్వర్ణం, రత్నాలు సమర్పించి ఘృతపాయసాలు గల భక్ష్యాలతో విప్రులను భుజింపజేసి పూజించాలి.

భుక్త్వా చ గురుణా చేయముచ్చార్యా మంత్రసన్తతిః ।
దీర్ఘాయురస్తు బాలోఽయం యావద్వర్షశతం సుఖీ ॥32॥

భోజనానంతరం గురువు ఈ మంత్రం ఉచ్చరించాలి– “ఈ బాలుడు దీర్ఘాయువగు గాక! నూరేండ్లు సుఖంగా వర్ధిల్లుగాక!”

యత్కిఞ్చిదస్య దురితం తత్క్షిప్తం బడబానలే ।
బ్రహ్మా రుద్రో వసు స్స్కన్దో విష్ణుః శక్రో హుతాశనః ॥33॥

రక్షన్తు సర్వే దుష్టేభ్యో వరదా స్సన్తు సర్వదా ।
ఏవమాదీని వాక్యాని వదన్తం పూజయేద్గురుమ్ ॥34॥

ఇతని పాపమేదైనా ఉంటే దాన్ని బడబాగ్నిలో వేయడమైనది బ్రహ్మ, రుద్రుడు, వసువు, స్కందుడు, విష్ణువు, శక్రుడు, అగ్ని– వీరందరూ దుష్టుల నుండి వీణ్ణి కాపాడుదురు గాక! సదా వరము లిత్తురు గాక! ఇలాంటి వాక్యాలు పలుకుతున్న గురువును పూజించాలి.

శక్తితః కపిలాం దద్యాత్ప్రణమ్య చ విసర్జయేత్ ।
చరుం చ పుత్రసహితా ప్రణమ్య రవిశఙ్కరౌ ॥35॥

హుతశేషం తదాఽశ్నీయాదాదిత్యాయ నమోఽస్త్వితి ।
ఇదమేవాద్భుతోద్వేగదుస్స్వప్నేషు చ ప్రశస్యతే ॥36॥

శక్తి ఉంటే ఆ గురువుకు కపిల ధేనువును దానం చేయాలి. తరువాత సమస్కరించి గురువును సాగనంపాలి. తల్లి పుత్రునితో గూడి రవిశంకరులకు నమస్కరించాలి. హుతశేషమైన చరువును అప్పుడు "ఆదిత్యాయ నమోఽస్తు" అంటూ భుజించాలి. అద్భుతోద్వేగ దుఃస్వప్నాలకు చేయదగిన ప్రశస్త వ్రతమిదే.

కర్తు ర్జన్మాదిఋక్షాణాం దేవాన్ సమ్పూజయేత్తదా ।
శాన్త్యర్థం శుక్లసప్తమ్యామేతత్కుర్వన్న సీదతి ॥37॥

యజమానుని జన్మ నక్షత్రం మొదలైనవి కల దినమునందు ఆ యా నక్షత్రాది దేవతలను అర్చించాలి. శాన్తికొరకు శుక్ల సప్తమీ తిథినాడు ఇలా పూజించవచ్చు. ఇలా చేసేవాడు బాధకు గురికాడు.

సదానేన విధానేన దీర్ఘాయురభవన్నృపః ।
సంవత్సరాణామయుతం శశాస పృథివీమిమామ్ ॥38॥

సదా ఈ విధానం పాటించి కృతవీర్యుని కుమారుడు దీర్ఘాయు వయ్యాడు. అతడు పదివేల సంవత్సరాలు ఈ భూమిని పాలించాడు.

పుణ్యం పవిత్రమాయుష్యం సప్తమీస్నపనం రవిః ।
కథయిత్వా ద్విజశ్రేష్ఠ! తత్రైవాన్తరధీయత ॥39॥

ద్విజశ్రేష్ఠా! సూర్యుడు పుణ్యమూ, పవిత్రమూ, ఆయుష్యమూ అయిన ఈ వ్రతాన్ని ఉపదేశించి అక్కడే అంతర్ధానమై పోయాడు.

ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేద్ధనమిచ్ఛేద్ధుతాశనాత్ ।
ఈశ్వరాత్జ్ఞానమన్విచ్ఛే న్మోక్షమిచ్ఛే జ్జనార్దనాత్ ॥40॥

సూర్యునినుండి ఆరోగ్యాన్నీ, అగ్నినుండి ఐశ్వర్యాన్నీ, ఈశ్వరునినుండి జ్ఞానాన్ని, జనార్దనునినుండి మోక్షాన్నీ కోరుకోవాలి.

ఏతన్మహాపాతక నాశనం స్యాత్పరం హితం బాలవివర్ధనం చ ।
శృణోతి యశ్చైన మనన్యచేతా స్తస్యాపి సిద్ధిం మునయో వదన్తి ॥41॥

ఇది మహా పాతకనాశనము, మిక్కిలి హితకరము, బాలవృద్ధికరమూ అయిన వ్రతం. అనన్యమనస్కుడై ఎవడు దీన్ని వింటాడో, అతనికి కూడా సిద్ధి కల్గుతుందని మునులు చెబుతున్నారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శుక్లపక్ష సప్తమీ స్నపనవ్రతం నామ అష్టషష్టితమోఽధ్యాయః ॥ 68 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని శుక్లపక్షసప్తమీ స్నపనవ్రతమనే అరవైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనసప్తతితమోऽధ్యాయః - అరవైతొమ్మిదవ అధ్యాయం

కల్యాణ భీమద్వాదశీవ్రతమ్ - కల్యాణ భీమద్వాదశీవ్రతం

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

పురా రథన్తరే కల్పే పరిపృష్టో మహాత్మనా ।
మన్దరస్థో మహాదేవః పినాకీ బ్రహ్మణా స్వయమ్ ॥1॥

పూర్వం రథంతరకల్పంలో మహాత్ముడగు బ్రహ్మ మందరాద్రిలో ఉన్న శివుణ్ణి స్వయంగా ఇలా అడిగాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ చెప్పాడు.

కథమారోగ్య మైశ్వర్య మనన్త మమరేశ్వర ।
స్వల్పేన తపసా దేవ భవేన్మోక్షోऽథవా నృణామ్ ॥2॥

అమరేశ్వరా! దేవా! స్వల్పమైన తపస్సుతోనే నరులకు ఆరోగ్యం, అనంతమైన ఐశ్వర్యం, లేదా మోక్షం ఎలా సిద్ధిస్తాయి?

కిమజ్ఞాతం మహాదేవ! త్వత్ప్రసాదాదధోక్షజ! ।
స్వల్పకేనాథ తపసా మహత్ఫలమిహోచ్యతామ్ ॥3॥

మహాదేవా! నీ అనుగ్రహం ఉంటే తెలియరాని దేమున్నది? అధోక్షజ! స్వల్పమైన తపస్సుతో కలిగే మహా ఫలం గూర్చి చెప్పు.

మత్స్య ఉవాచ :-మత్స్యం చెప్పింది

ఏవం పృష్ట స్సవిశ్వాత్మా బ్రహ్మణా లోకభావనః ।
ఉమాపతి రువాచేదం మనసః ప్రీతికారకమ్ ॥4॥

ఇలా బ్రహ్మ ప్రశ్నించగా విశ్వాత్ముడూ, లోకభావనుడూ అయిన పార్వతీపతి మనస్సుకు ప్రీతి కల్గించే ఈ విషయం చెప్పాడు.

ఈశ్వర ఉవాచ :-ఈశ్వరుడు చెప్పాడు

అస్మాద్రథన్తరాత్కల్పాత్త్రయోవింశాత్పునర్యదా ।
వారాహో భవితా కల్ప స్తస్య మన్వన్తరే శుభే ॥5॥

వైవస్వతాఖ్యే సఞ్జాతే సప్తమే సప్తలోకకృత్ ।
ద్వాపరాఖ్యం యుగం తచ్చ సప్తవింశత్తమం యదా ॥6॥

ఈ ఇరువది మూడవ రథంతర కల్పం పిదప వారాహకల్పం వస్తుంది. ఆ కల్పానికి చెందిన శుభప్రదమైన ఏడవ మన్వంతరంలో ఇరవై యేడవ ద్వాపరయుగం రాగలదు.

తస్యాన్తే స మహాదేవో వాసుదేవో జనార్దనః ।
భారావతరణార్థాయ త్రిధా విష్ణుర్భవిష్యతి ॥7॥

దాని చివర వాసుదేవుడు, జనార్దనుడు, ఆ మహాదేవుడు అయిన విష్ణువు భూభారం దించడానికి మూడు విధాల రూపాలతో అవతరించనున్నాడు.

ద్వైపాయన ఋషిస్తద్వ ద్రౌహిణేయోఽథ కేశవః ।
కంసాదిదర్పమథనః కేశవః క్లేశనాశనః ॥8॥

ద్వైపాయనముని అయిన వ్యాసుడు, రోహిణీ సుతుడైన బలరాముడు, కేశవుడు అనేవి ఈ మూడవతారాలు. కంసాదుల దర్పం మథించే కేశవుడు క్లేశాలను నశింపజేయువాడు.

పురీ ద్వారవతీ నామ సామ్ప్రతం యా కుశస్థలీ ।
దివ్యానుభావసంయుక్తా సా నివాసాయ శార్ఙ్గిణః ।
త్వష్టా మమాజ్ఞయా తద్వత్కరిష్యతి జగత్పతేః ॥9॥

ఇపుడు కుశస్థలి అని వ్యవహరింపబడుతున్న ప్రదేశం అప్పుడు దివ్య ప్రభావంతో కూడిన ద్వారావతీ అవుతుంది. ఆ పురిని నా ఆజ్ఞతో అలాగే విష్ణునివాసానికి అనుగుణంగా త్వష్ట నిర్మిస్తాడు.

తస్యాం కదాచిదాసీన స్సభాయామమితద్యుతిః ।
భార్యాభిర్వృష్ణిభిశ్చైవ భూభృద్భిర్భూరిదక్షిణైః ॥10॥
కురుభి ర్దేవగన్ధర్వైరభితః కైటభార్దనః ।
ప్రవృత్తాసు పురాణీషు ధర్మసంవర్ధినీషు చ ॥11॥

ఆ నగరంలో ఒకసారి సభలో మిక్కిలి ప్రకాశం కల్గి కైటభారి (విష్ణువు) ఆసీనుడయ్యాడు. ఆయన భార్యలూ, వృష్ణులూ, భూరి దక్షిణలు సమర్పించిన రాజులూ, కురువంశజులూ, దేవగంధర్వులూ ఆయన చుట్టూ కూర్చున్నారు. అప్పుడు ధర్మవర్ధకమైన పురాణగోష్ఠి జరిగింది.

కథాన్తే భీమసేనేన పరిపృష్టః ప్రతాపవాన్ ।
త్వయా పృష్టస్య ధర్మస్య రహస్యస్యాస్య భేదకృత్ ॥12॥

భవితా స తదా బ్రహ్మ న్కర్తా చైవ వృకోదరః ।
ప్రవర్తకోఽస్య ధర్మస్య పాణ్డుపుత్రో మహాబలః ॥13॥

అప్పుడు కథ చివర భీమసేనుడు నీవు నన్ను అడిగిన రహస్యాన్ని భేదించగల కేశవుణ్ణి ప్రశ్నిస్తాడు. ఓ బ్రహ్మ! మహా బలవంతుడూ, పాండుసుతుడూ అయిన వృకోదరుడు అప్పుడు ఈ ధర్మానికి ప్రవర్తకుడైన కర్తకాగలడు.

యస్య తీక్ష్ణో వృకో నామ జఠరే హవ్యవాహనః ।
మయా దత్త స్స ధర్మాత్మా తేన చాసౌ వృకోదరః ॥14॥

అతని జఠరంలో నేనిచ్చిన వృకమనే అగ్ని తీక్షణంగా ఉంటుంది. అందుచేతనే ఆ ధర్మాత్ముడు వృకోదరుడయ్యాడు.

మతిమాన్దానశీలశ్చ నాగాయుతబలో మహాన్ ।
భవిష్యత్యజరః శ్రీమాన్కన్దర్ప ఇవ రూపవాన్ ॥15॥

మతిమంతుడు, దానశీలుడు, పదివేల ఏనుగుల బలం కలవాడు, శ్రీమంతుడు, మన్మథుని వలె సుందరుడు, వార్ధక్యం లేనివాడు, రూపవంతుడు అయిన భీముడు ధార్మికుడే.

ధార్మికస్యాప్యశక్తస్య తీవ్రాగ్నిత్వాదుపోషణే ।
ఇదం వ్రతమశేషాణాం వ్రతానామధికం యతః ॥16॥

అయినా అతడు తన జఠరంలోని తీవ్రాగ్నివలన ఉపవాసం చేయటానికి శక్తిలేని వాడయ్యాడు. కాన అన్ని వ్రతాలలోకి గొప్పదయిన ఈ వ్రతాన్ని అనుష్ఠించడం యుక్తమని భావించాడు.

కథయిష్యతి విశ్వాత్మా వాసుదేవో జగద్గురుః ।
అశేషయజ్ఞఫలద మశేషాఘవినాశనమ్ ॥17॥

అశేషదుష్టశమనమశేషసురపూజితమ్ ।
పవిత్రాణాం పవిత్రం చ మఙ్గళానాం చ మఙ్గళమ్ ।
భవిష్యం చ భవిష్యాణాం పురాణానాం పురాతనమ్ ॥18॥

విశ్వాత్ముడు, జగద్గురుడయిన వాసుదేవుడు – సమస్త యజ్ఞఫలాలను ప్రసాదించేది, సర్వపాపవినాశకము, సకల దుష్టులను శమింపచేయునది, సర్వదేవతలచే పూజింపబడినది, పవిత్రాలలో పవిత్రమైనది, మంగళాలలో మంగళమైనది, భవిష్యాలలో భవిష్యమైనది, పురాతనాలలో పురాతనమైనది అయిన ఈ వ్రతాన్ని వివరిస్తాడు.

వాసుదేవ ఉవాచ :–వాసుదేవుడు చేప్పాడు

యద్యష్టమీ చతుర్దశ్యో ర్ద్వాదశీష్వథ భారత ।
అన్యేష్వపి దినర్క్షేషు న శక్తస్త్వ ముపోషితుమ్ ॥19॥

తతః పుణ్యామిమాం భీమ తిథిం సర్వపాపప్రణాశినీమ్ ।
ఉపోష్య విధినాऽనేన గచ్ఛ విష్ణోః పరం పదమ్ ॥20॥

భరతవంశీయుడయిన భీమా! శుక్లపక్షంలోని అష్టమి, చతుర్దశుల యందు, ద్వాదశీతిథులందు, ఇతరములైన శుభనక్షత్ర తిథులందు ఉపవాసముండటానికి నీకు వీలుకాని పక్షంలో సర్వపాపాలను నశింపజేసే ఈ విధానంతో ఉపవసించి ఈ తిథిని పాటించి విష్ణుపదం చేరుకో!

మాఘమాసస్య దశమీ యదా శుక్లా భవేత్తదా ।
ఘృతేనాభ్యఞ్జనం కృత్వా తిలైః స్నానం సమాచరేత్ ॥21॥

మాఘమాసంలోని శుక్లదశమినాడు నెయ్యితో అభ్యంజనం చేసి తిలలు కలిపిన నీటిలో స్నానం చేయాలి.

తథైవ విష్ణుమభ్యర్చ్య నమో నారాయణేతి చ ।
కృష్ణాయ పాదౌ సమ్పూజ్య శిరస్సర్వాత్మనే నమః ॥22॥

వైకుణ్ఠాయేతి వైకుణ్ఠముర శ్రీవత్సధారిణే ।
శఙ్ఖినే చక్రిణే తద్వద్గదినే వరదాయ వై ।
సర్వే నారాయణస్యైవం సమ్పూజ్యా బాహవః క్రమాత్ ॥23॥

అట్లే 'నమో నారాయణాయ' అంటూ విష్ణువు నర్చించాలి. 'కృష్ణాయ నమః' అని పాదాలను, 'సర్వాత్మనే నమః' అని శిరస్సును, 'వైకుంఠాయ నమః' అని వైకుంఠుని, 'శ్రీవత్సధారిణే నమః' అని ఉరమును, 'శంఖినే నమః', 'చక్రిణే నమః', 'గదినే నమః' 'వరదాయ నమః' అని అంటూ నారాయణుని చతుర్బాహువులను క్రమంగా పూజించాలి.

దామోదరాయేత్యుదరం మేఢ్రం పఞ్చశరాయ వై ।
ఊరూ సౌభాగ్యనాథాయ జానునీ భూతధారిణే ॥24॥

నమో నీలాయ వై జఙ్ఘే పాదౌ విశ్వసృజే నమః ।
నమో దేవ్యై నమ శ్శాన్త్యై నమో లక్ష్మ్యై నమశ్శ్రియై ॥25॥

నమః పుష్ట్యై నమ స్తుష్ట్యై ధృష్ట్యై హృష్ట్యై నమో నమః ।

'దామోదరాయ నమః' అని ఉదరాన్ని, 'పంచశరాయ నమః' అని మేఢ్రాన్ని, 'సౌభాగ్య నాథాయ నమః' అని ఊరువులను, 'భూతధారిణే నమః' అని మోకాళ్ళను, 'నీలాయ నమః' అని జంఘలను, 'విశ్వసృజే నమః' అని పాదాలను, దేవ్యై నమః' 'శాంత్యై నమః', 'లక్ష్మ్యై నమః', 'శ్రియై నమః', పుష్ట్యై నమః', 'తుష్ట్యై నమః', ధృష్ట్యై నమః, హృష్ట్యై నమః అంటూ లక్ష్మీదేవిని పూజించాలి.

నమో విహఙ్గనాథాయ వాయువేగాయ పక్షిణే ।
విషప్రమాథినే నిత్యం గరుడం చాభిపూజయేత్ ॥26॥

విహగనాథుడు, వాయువేగుడు, పక్షి, విషప్రమాథి అయిన గరుడునికి నమః అంటూ నిత్యం గరుడుని పూజించాలి.

ఏవం సమ్పూజ్య గోవిన్దముమాపతివినాయకౌ ।
గన్ధైర్మాల్యై స్తథా ధూపై ర్భక్ష్యై ర్నానావిధైరపి ॥27॥

ఇలా గోవిందుని పూజించి ఉమాపతిని, వినాయకుని, గంధ మాల్యాదులతో, ధూపాలతో, నానావిధ భక్ష్యాలతో గోక్షీరంతో అర్చించాలి.

గవ్యేన పయసా సిద్ధాం కృసరామథ వాగ్యతః ।
సర్పిషా సహ భుక్త్వా చ గత్వా శతపదం బుధః ॥28॥

మౌనం పాటిస్తూ ఆవుపాలతో వండినపులగమును నెయ్యితో భుజించాలి. ఆ తరువాత నూరడుగులునడవాలి.

న్యగ్రోధం దన్తకాష్ఠం స్యాదథవా ఖాదిరం బుధః ।
గృహీత్వా ధావయేద్దన్తా నాచాన్తః ప్రాగుదఙ్ముఖః ॥29॥

బ్రూయాత్సాయన్తనీం కృత్వా సన్ధ్యామస్తమితే రవౌ ।
నమో నారాయణాయేతి త్వామహం శరణం గతః ॥30॥

తదుపరి మర్రి లేక చంద్రపుల్లతో పళ్లుతోమి తూర్పుగా గాని ఉత్తరంగా గాని అభిముఖుడై కూర్చుండి ఆచమనం చేయాలి. సూర్యాస్తమయానంతరం సాయం సంధ్య నుద్దేశించి ఇలా చెప్పాలి. "నమో నారాయణాయ, త్వాం అహం శరణంగతః' నారాయణునికి నమస్కారం. నేను నిన్ను శరణు పొందాను."

ఏకాదశ్యాం నిరాహార స్సమభ్యర్చ్య చ కేశవమ్ ।
రాత్రిం చ సకలాం స్థిత్వా స్నానం చ పయసా తథా ॥31॥

సర్పిషా చాపి దహనం హుత్వా బ్రాహ్మణపుఙ్గవైః ।
సహైవ పుణ్డరీకాక్ష! ద్వాదశ్యాం క్షీరభోజనమ్ ॥32॥

కరిష్యామి యతాత్మాఽహం నిర్విఘ్నేనాస్తు తచ్చ మే ।
ఏవముక్త్వా స్వపేద్భూమావితిహాసకథాం పునః ॥33॥

శ్రుత్వా ప్రభాతే సఞ్జాతే నదీం గత్వా విశాంపతే ।
స్నానం కృత్వా మృదా తద్వత్పాషణ్డానభివర్జయేత్ ॥34॥

"ఏకాదశినాడు నిరాహారుడనై కేశవుణ్ణి అర్చిస్తాను. ఆ రాత్రి అంతా అలాగే వుండి, ప్రాతఃకాలములో స్నానం చేస్తాను, ఘృతంతో హెూమం చేస్తాను. బ్రాహ్మణ వర్యులతో గూడి ద్వాదశినాడు క్షీరభోజనం చేస్తాను. మనోనిగ్రహంతో వుంటాను. నా ఈ పని నిర్విఘ్నంగా నెరవేరుగాక!" రాజా! ఇలా చెప్పి నేలపై నిద్రించాలి. తెల్లవారగానే ఇతిహాస కథలు వినాలి. నదికి వెళ్ళి మట్టితో స్నానం చేయాలి. పాషండులతో కలవరాదు.

ఉపాస్య సన్ధ్యాం విధివత్కృత్వా చ పితృతర్పణమ్ ।
ప్రణమ్య చ హృషీకేశం సప్తలోకైకమీశ్వరమ్ ॥35॥

సంధ్య నుపాసించి, విధి విధానంతో పితృతర్పణం చేయాలి. సప్తలోకాధినాథుడు, ఈశ్వరుడయిన ఋషీకేశు నికి ప్రణమిల్లాలి.

గృహస్య పురతో భక్త్యా మణ్డపం కారయేద్బుధః ।
దశహస్తమథాష్టౌ వా కరాన్కుర్యాద్విశాంపతే! ॥36॥

రాజా! ఇంటి ముందు భక్తితో ఎనిమిది మూరలుగాని, పదిమూరలుగాని భుజం వుండే విధంగా మంటప నిర్మాణం జరగాలి.

చతుర్హస్తాం శుభాం కుర్యాద్వేదీ మరినిషూదన! ।
చతుర్హస్తప్రమాణం చ విన్యసేత్తత్ర తోరణమ్ ॥37॥

శత్రుసంహారకా! నాలుగు చేతుల కొలతతో శుభప్రదమైన వేదికను నిర్మించాలి. అదే ప్రమాణముగల తోరణమును కూడా ఏర్పాటు చేయాలి.

ఆరోప్య కలశం తత్ర మాషమాత్రేణ సంయుతమ్ ।
ఛిద్రేణ జలసమ్పూర్ణ మధః కృష్ణాజినే స్థితః ।

తస్య ధారాం చ శిరసా ధారయేత్సకలాం నిశామ్ ।
ధారాభిర్బహుభిర్భూరి ఫలం వేదవిదో విదుః ॥38॥

ఆ వేదికపైన మినపగింజంత పరిమాణపు రంధ్రము కలిగి నీరు నింపిన కలశాన్ని వ్రేలాడదీయాలి. ఆ పై కృష్ణాజినంపై కూర్చుండి కలశఛిద్రం నుండి జారే సన్నని జలధార రాత్రి సమయమంతా తన శిరస్సుపై పడునట్లు చేసుకోవాలి. ఎక్కువ ధారలు పడడంవల్ల ఎక్కువ ఫలం కలగుతుందని వేదవేత్తలు గ్రహించారు.

తథైవ విష్ణో శ్శిరసి క్షీరధారాం ప్రపాతయేత్ ।
అరత్నిమాత్రం కుణ్డం చ కుర్యాత్తత్ర త్రిమేఖలమ్ ॥39॥

అట్లే విష్ణువు శిరస్సుపై క్షీరధారను ప్రసరింపజేయాలి. పిదప పిడిమూరకొలతతో చతురస్రమైన కుండాన్ని, దాని చుట్టూ మూడు అంచులు (మేఖలలు) వుండేటట్లు చేయాలి.

యోనిచక్రం తు తత్కృత్వా బ్రాహ్మణైర్యవసర్పిషీ ।
తిలాంశ్చ విష్ణుదైవత్యై ర్మన్త్రై రేకాగ్నివత్తదా ॥40॥

దాని ముందు యోనిచక్రం ఏర్పాటుచేసి, బ్రాహ్మణులచే విష్ణుదేవతాకమైన మంత్రాలతో యవలు, నెయ్యి, తిలలు వినియోగించి ఏకాగ్నిలో వలె హోమము చేయించాలి.

హుత్వా చ వైష్ణవం సమ్యక్చరుం గోక్షీరసంయుతమ్ ।
మాషమాత్రప్రమాణం తు ధారామాజ్యస్య పాతయేత్ ॥41॥

తదుపరి గోక్షీరం కలిసిన ఘృతధారను మినపగింజంత పరిమాణం వుండే విధంగా ప్రసరింపచేయాలి.

జలకుమ్భాన్మహావీర్య! స్థాపయిత్వా త్రయోదశ ।
భక్ష్యైర్నానావిధైర్యుక్తాన్ సితవస్త్రైరలఙ్కృతాన్ ॥42॥

యుక్తానౌదుమ్బరైః పత్రైః పఞ్చరత్నసమన్వితాన్ ।
చతుర్భిర్బహ్వృచైర్హోమ స్తత్ర కార్య ఉదఙ్ముఖైః ॥43॥

మహాపరాక్రమశాలీ! పదమూడు జలకుంభాలను నిలిపి వాటిని వివిధ భక్ష్యాలతో నింపాలి. తెల్లని వస్త్రాలతో మేడి చిగురుటాకులతో పంచరత్నాలతో వాటిని అలంకరించాలి. ఉత్తరముఖులైన నలుగురు ఋగ్వేదీయుల చేత హోమం చేయించాలి.

రుద్రజాపశ్చతుర్భిశ్చ యజుర్వేదపరాయణైః ।
వైష్ణవాని తు సామాని చతుర స్సామవేదినః ।
అరిష్టవర్గసహితాన్యభితః పరిపాఠయేత్ ॥44॥

యజుర్వేద పరాయణులు నల్గురు రుద్రజపం చేయాలి. సామవేదులు నల్గురు అరిష్టవర్గంతో సహా వైష్ణవసామగానం కావించాలి.

ఏవం ద్వాదశ తాన్విప్రాన్వస్త్రమాల్యానులేపనైః ।
పూజయేదఙ్గులీయైశ్చ కటకై ర్హేమసూత్రకైః ॥45॥

వాసోభిశ్శయనీయైశ్చ విత్తశాఠ్యవివర్జితః ।
ఏవం క్షపాఽతివాహ్యా చ గీతమఙ్గలనిస్స్వనైః ॥46॥

ఇలా పండ్రెండుమంది విప్రులను వస్త్రమాల్యానులేపనాలు, అంగుళీయకాలు, కటకాలు, హేమసూత్రాలు, వస్త్రాలు, పడకలు వీటిని సమర్పించి పూజించాలి. విత్తశాఠ్యం తగదు. ఇట్లే గీతమంగళవాద్యాలతో రాత్రి గడపాలి.

ఉపాధ్యాయస్య చ పునర్ద్విగుణం సర్వమేవ తు ।
తతః ప్రభాతే విమలే సముత్థాయ త్రయోదశ ॥47॥

గా వై దద్యాత్కురుశ్రేష్ఠ సౌవర్ణముఖసంయుతాః ।
పయస్విన్య శ్శీలవత్యః కాంస్యదోహసమన్వితాః ॥48॥

రౌప్యఖురా స్సవస్త్రాశ్చ చన్దనేనాభిషేచితాః ।
తాస్తు తేషాం తతో భక్త్యా భక్ష్యభోజ్యాన్నతర్పితాన్ ॥49॥

ఉపాధ్యాయునికైతే పైవన్నీ రెండింతలుగా సమర్పించాలి. తదుపరి ప్రభాతవేళ లేచి పదమూడు గోవులను సమర్పించాలి. ఆ గోవులు పాడివి, శీలం కలవి, కంచు పాత్రలతో గూడినవి, వెండిగిట్టలు కలవి, వస్త్రాలు కప్పినవి, చందనాభిషేకం చేసినవిగా ఉండాలి. భక్తితో ఆ గోవులను భక్ష్య భోజ్యాదులచే తర్పితులైనవారి కివ్వాలి.

కృత్వా వై బ్రాహ్మణాన్సర్వానన్నైర్నానావిధైస్తథా ।
భుక్త్వా చాక్షారలవణమాత్మనా చ విసర్జయేత్ ॥50॥

అలా బ్రాహ్మణులను నానావిధాలైన అన్నాలతో సంతృప్తులను కావించి క్షారం, లవణంలేని భోజనం తాను భుజించి వారిని సాగనంపాలి.

అనుగమ్య పదాన్యష్టౌ పుత్రభార్యాసమన్వితః ।
ప్రీయతామత్రదేవేశః కేశవః క్లేశనాశనః ॥51॥

పుత్రులతో, భార్యతో గూడా వారిని ఎనిమిది అడుగులు మేర అనుగమించాలి. "దేవేశుడు, కేశవుడు, క్లేశనాశకుడు ప్రీతినొందుగాక!

శివస్య హృదయం విష్ణుర్విష్ణోశ్చ హృదయం శివః ।
యథాఽన్తరం న పశ్యామి తథా మే స్వస్తి చాయుషః ॥52॥

శివుని హృదయం విష్ణువు, విష్ణుని హృదయం శివుడు, వీరిరువురికీ తేడాను నేను గమనించడం లేదు. నాకు శుభం, దీర్ఘాయువు కలుగుగాక!"

ఏవ ముచ్చార్య తాన్కుమ్భాన్గాశ్చైవ శయనాని చ ।
వాసాంసి చైవ సర్వేషాం గృహాణి ప్రాపయేద్బుధః ॥53॥

ఈ రీతిగా చెప్పి ఆ కుంభాలను, గోవులను, శయనాలను, వస్త్రాలనూ వారందరి గృహాలకు చేర్చాలి.

అభావే బహుశయ్యానా మేకామపి సుసంస్కృతామ్ ।
శయ్యాం దద్యాద్ద్విజాతేశ్చ సర్వోపస్కరసంయుతామ్ ॥54॥

ఎక్కువ పడకలు లేని పక్షంలో, చక్కగా సంస్కరింపబడినదాని నొక్కదానినైనా సర్వోపస్కారసహితంగా ద్విజులకివ్వాలి.

ఇతిహాసపురాణాని వాచయిత్వాఽతివాహయేత్ ।
తద్దినం నరశార్దూల! య ఇచ్ఛేద్విపులాం శ్రియమ్ ॥55॥

నరశ్రేష్ఠా! గొప్ప సంపదను కోరినవాడు ఆ దినం ఇతిహాసపురాణాదులు చదివించి వింటూ గడపాలి.

తస్మాత్త్వం సత్త్వమాలమ్బ్య భీమసేన విమత్సరః ।
కురు వ్రతమిదం సమ్యక్స్నేహాత్తవ మయేరితమ్ ॥56॥

భీమసేనా! అందువల్ల నీవు సాత్త్వికతను అవలంబించి మాత్సర్యం వీడి ఈ వ్రతం చక్కగా నిర్వర్తించు. నీమీది ప్రీతితో దీన్ని నీకు చెప్పాను.

త్వయా కృత మిదం వీర త్వన్నామాఖ్యం భవిష్యతి ।
సా భీమద్వాదశీ హ్యేషా సర్వపాపహరా శుభా ।
యా తు కల్యాణినీ నామ పురా కల్పేషు పఠ్యతే ॥57॥

నీవు చేసిన ఈ వ్రతం నీపేరుతోనే ప్రసిద్ధ మవుతుంది. ఇది భీమద్వాదశి, సకల పాపాలూ హరించేది. శుభప్రదమైనది, దీన్ని పురాకల్పంలో 'కల్యాణిని' అనేవారు.

త్వమాదికర్తా భవ సౌకరేఽస్మి న్కల్పే మహావీరవరప్రధాన ।
యస్యాః స్మరన్కీర్తనమప్యశేషం వినష్టపాపస్త్రిదశాధిప స్స్యాత్ ॥58॥

మహావీరులలో శ్రేష్ఠుడా! నీవు దీనికి ఈ వరాహకల్పంలో మొదటి కర్తవు కమ్ము. దీన్ని స్మరిస్తూ కీర్తించినవాడు పాపాలు నశించి దేవలోకాధిపతి అవుతాడు.

కృత్వా చ యామప్సరసామధీశా వేశ్యా కృతా హ్యన్యభవాన్తరేషు ।
ఆభీరకన్యాఽతికుతూహలేన సైవోర్వశీ సమ్ప్రతి నాకపృష్ఠే ॥59॥

అచ్చరలలో మేటి అయిన ఊర్వశి పూర్వకల్పంలో ఒక వేశ్య. ఆ ఆభీరకన్య కుమార్తె కుతూహలంతో ఈ వ్రతం చేసి స్వర్గలోకంలో ఇప్పుడు ఊర్వశి అయింది.

జాతాఽథవా వైశ్యకులోద్భవాఽపి పులోమకన్యా పురుహూతపత్నీ ।
తత్రాపి తస్యాః పరిచారికేయం మమ ప్రియా సమ్ప్రతి సత్యభామా ॥60॥

వైశ్యకులంలో పుట్టినా పులోమకన్య ఇంద్రుని పత్ని అయింది. అక్కడ ఆమెకు పరిచారికగా ఉండినదే నాకిప్పుడు ప్రియమైన సత్యభామ.

స్నాతః పురా మణ్డలమేష తద్వత్తేజోమయం వేదశరీరమాప ।
అస్యాం చ కల్యాణతిథౌ వివస్వా న్సహస్రధారేణ సహస్రరశ్మిః ॥61॥

పూర్వం సూర్యుడు కల్యాణద్వాదశినాడు సహస్ర జలధారలతో మండలకాలం స్నానం చేసి తేజోమయమైన వేదశరీరం పొంది ప్రకాశిస్తున్నాడు.

ఇదమేవ కృతం మహేన్ద్రముఖ్యై ర్వసుభిర్దేవసురారిభిస్తథా తు ।
ఫలమస్య న శక్యతేఽభివక్తుం యది జిహ్వాయుతకోటయో ముఖే స్యుః ॥62॥

మహేంద్రాదులు, వసువులు, దేవసురారులు ఈ వ్రతమే చేశారు. నోట పదివేల కోట్ల నాలుకలున్నా, దీని ఫలం చెప్పశక్యం కానిది.

కలికలుషవిదారిణీమనన్తామితి కథయిష్యతి యాదవేన్ద్రసూనుః ।
అపి నరకగతా న్పితౄనశేషానలముద్ధర్తుమిహైవ యః కరోతి ॥63॥

ఇది కలికాలుష్యం తొలగించేదీ, అనంతమైనదీ, అని యదు కుమారుడు దీనిని గూర్చి చెప్పనున్నాడు. ఎవడు దీన్ని ఆచరిస్తాడో, వాడు ఈ లోకంలో ఉంటూనే నరకంలో ఉన్న సమస్త పితరులనూ ఉద్ధరించగలడు.

య ఇద మఘవిదారణం శృణోతి భక్త్యా పరిపఠతీహ పరోపకారహేతోః ।
తిథిమిహ సకలార్థభాఙ్నరేన్ద్ర స్తవ చతురానన! సామ్యతాముపైతి ॥64॥

ఎవడు పాపనాశకమైన ఈ తిథిని గూర్చి భక్తితో వింటాడో, పరోపకారం చేయగోరి పఠిస్తాడో, వాడు సకలార్థాలూ పొందుతాడు. చతుర్ముఖా! నీతో సమానుడవుతాడు.

కల్యాణినీ నామ పురా బభూవ యా ద్వాదశీ మాఘదినేషు పూజ్యా ।
సా పాండుపుత్రేణ కృతా భవిష్యత్యనన్తపుణ్యాఽనఘ భీమపూర్వా ॥65॥

మాఘమాసపు దినాలలో ఏది పూజ్యమైన 'కల్యాణిని' అని వ్యవహరింపబడినదో, ఆ ద్వాదశిని భీముడు అనుష్ఠించడంవల్ల అనంతపుణ్యం కల 'భీమద్వాదశి' గా వినుతి కెక్కగలదు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే భీమద్వాదశీవ్రతం నామ ఏకోనషష్టితమోఽధ్యాయః ॥ 69 ॥

శ్రీ మత్స్యపురాణంలోని భీమద్వాదశీ వ్రతమనే అరవైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

సప్తతితమోऽధ్యాయః – డెబ్బైయవ అధ్యాయం

అనంగశయనవ్రతమ్ – అనంగశయనవ్రతం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ చెప్పాడు.

> **వర్ణాశ్రమాణాం ప్రభవః పురాణేషు మయా శ్రుతః ।**
> **సదాచారస్య భగవన్ ధర్మశాస్త్ర వినిశ్చయః ।**
> **పుణ్యస్త్రీణాం సదాచారం శ్రోతుమిచ్ఛామి తత్త్వతః ॥1॥**

భగవన్! పురాణాలలో పేర్కొన్న వర్ణాశ్రమాల ఉత్పత్తిని గూర్చి నేను విన్నాను. ధర్మశాస్త్రాలలో పేర్కొనబడిన సదాచార నిర్ణయాలను గూర్చి కూడా విన్నాను. ఇప్పుడు పుణ్యస్త్రీలు ఆచరించవలసిన సదాచారములను, పతివ్రతల సదాచారాన్ని తత్త్వతః వినగోరుతున్నాను.

ఈశ్వర ఉవాచ :– ఈశ్వరుడు చెప్పాడు.

> **తస్మిన్నేవ యుగే బ్రహ్మన్సహస్రాణి తు షోడశ ।**
> **వాసుదేవస్య నారీణాం భవిష్యత్యమ్బుజోద్భవ ॥2॥**

బ్రహ్మన్! పద్మసంభవా! రానున్న ఆ యుగంలోనే పదహారు వేలమంది వనితలు వాసుదేవుని భార్యలు కానున్నారు.

> **తాభిర్వసన్తసమయే కోకిలాలికులాకులే ।**
> **పుష్పితే పవనోత్ఫుల్లకల్హారసరస స్తటే ॥3॥**

> **నిర్భరాపానగోష్ఠీషు ప్రసక్తాభిరలంకృతః ।**
> **కురఙ్గనయన శ్రీమాన్మాలతీకృతశేఖరః ॥4॥**

> **గచ్ఛన్సమీపమార్గేణ సామ్బః పరపురఞ్జయః ।**
> **రూపేణ సాక్షాత్కన్దర్పః సర్వాభరణభూషితః ॥5॥**

> **అనఙ్గశరతప్తాభి స్సాభిలాషమవేక్షితః ।**
> **ప్రవృద్ధో మన్మథస్తాసాం భవిష్యతి యదాऽऽత్మని ॥6॥**

కోకిల కూతలతోను, తుమ్మెదల ఝుంకారాలతోను, ఆకులమై పుష్పితమైన వసంతకాలంలో పూచిన కలువలుగల ఒక మడుగుగట్టున పానగోష్ఠులలో నిమగ్నలైన ఆ వనితల సమీపంలోకి కృష్ణుని పుత్రుడైన సాంబుడు వస్తాడు. ఆ వనితలు అతణ్ణి అలంకరిస్తారు. జింకలవంటినేత్రాలు కలిగినవాడు, శ్రీమంతుడు, మాలతీపుష్పాలు సిగపై చుట్టినవాడు, పరపురంజయుడు అయిన సాంబుడు వారి సమీపానికి వస్తాడు. రూపంలో అతడు సాక్షాత్తు

మన్మథుని పోలినవాడై సర్వాభరణాలచేత అలంకృతుడై వుండినాడు. అతణ్ణి చూచిన వనితలందరు మన్మథతాపానికి గురియై అతనివైపు సాభిలాషంగా చూస్తారు. అప్పుడు వారి హృదయాలలో మదనుడు వృద్ధి పొందుతాడు.

తదాఽవేక్ష్య జగన్నాథ స్సర్వతో ధ్యానచక్షుషా ।
శాపం వక్ష్యతి తా స్సర్వా వో హరిష్యన్తి దస్యవః ।
మత్పరోక్షం యతః కామలౌల్యాదీదృగ్విధం కృతమ్ ॥7॥

జగన్నాథుడైన కృష్ణుడు ధ్యాననేత్రంతో చూచి వారినిలా శపిస్తాడు. 'నా పరోక్షంలో కామచాపల్యంతో మీరిలా చేశారు గాన దొంగలు భవిష్యత్తులో మిమ్ములనందరినీ అపహరించగలరు'.

తతః ప్రసాదితో దేవ ఇదం వక్ష్యతి శార్ఙ్గభృత్ ।
తాభి శ్శాపాభితప్తాభి ర్భగవాన్భూతభావనః ॥8॥

శాపాభితప్తలైన వనితలు అనేక విధాల ప్రార్థించగా ప్రసన్నుడైన కృష్ణభగవానుడు వారితో ఇలా అంటాడు.

ఉత్తారభూతం దాసీత్వం సముద్రాద్బ్రాహ్మణప్రియః ।
ఉపదేక్ష్యత్యనంతాత్మా భావికల్యాణ కారకమ్ ॥9॥

భవతీనామృషిర్దాల్భ్యో యద్వ్రతం కథయిష్యతి ।
తదేవోత్తారణాయాలం దాసత్వేఽపి భవిష్యతి ।
ఇత్యుక్త్వా తాః పరిత్యజ్య గతో ద్వారవతీశ్వరః ॥10॥

ఈ శాపం వల్ల మీకు దాసీత్వం సంభవిస్తుంది. దానినుండి తరించే ఉపాయాన్ని బ్రాహ్మణ ప్రియుడు అనంతాత్ముడు అయిన దాల్భ్యుడు అనే ఋషి మీకుపదేశిస్తాడు. అది భావికాలంలో మీకు శుభం కలిగిస్తుంది. ఆయన ఉపదేశించిన వ్రతం దాసత్వంతో వుండినా మీకు ఉత్తారకం కాగలదు. ఇలా చెప్పి ద్వారకానాథుడు వారిని పరిత్యజించి వెళ్లాడు.

తతః కాలేన మహతా భారావతరణే కృతే ।
నివృత్తే మౌసలే తద్వత్కేశవే దివమాగతే ॥11॥

ఆపైన బహుకాలానికి భూభారం తొలగింపబడింది. యదువంశవినాశకమైన మౌసలఘట్టం గడిచింది. కేశవుడు వైకుంఠం వెళ్ళిపోయాడు.

శూన్యే యదుకులే సర్వైశ్చోరైరపి జితేఽర్జునే ।
హృతాసు కృష్ణపత్నీషు దాసభోగ్యాసు చాంబుధౌ ॥12॥

యదుకులం శూన్యమయింది. చోరులు అర్జునుని జయించి శ్రీకృష్ణుని పత్నులను అపహరించారు. వారు సాగరతీరంలో దాసభోగ్యలయ్యారు.

తిష్ఠన్తీషు చ దౌర్గత్య సన్తప్తాసు చతుర్ముఖ ।
ఆగమిష్యతి యోగాత్మా దాల్భ్యో నామ మహాతపాః ॥13॥

దౌర్గత్యంతో సంతాపం చెందుతారు. చతురాననా! అప్పుడు యోగాత్ముడగు దాల్భ్యుడనే మహాతపస్వి అక్కడికి వస్తాడు.

తాస్తమర్ఘ్యేణ సమ్పూజ్య ప్రణిపత్య పునః పునః ।
లాలప్యమానా బహుశో బాష్పపర్యాకులేక్షణాః ॥14॥

ఆ వనితలు ఆ ఋషికి అర్ఘ్యమిచ్చి పూజించి, మరల మరల ప్రణమిల్లారు. విలపిస్తూ కన్నీరు కార్చారు.

స్మరన్త్యో విపులాన్భోగాన్ దివ్యమాల్యానులేపనమ్ ।
భర్తారం జగతామీశమనన్తమపరాజితమ్ ॥15॥

దివ్యానుభావాం చ పురీం నానారత్నగృహాణి చ ।
ద్వారకావాసిన స్సర్వాన్ దేవరూపాన్కుమారకాన్ ।
ప్రశ్నమేవం కరిష్యన్తి మునేరభిముఖం స్థితాః ॥16॥

గతించిన కాలంలో తామనుభవించిన గొప్ప భోగాలను స్మరిస్తూ, దివ్యమాల్యానులేపనాలను గుర్తుకు తెచ్చుకుంటూ, జగదీశ్వరుడు, అనంతుడు, అపరాజితుడు, అయిన భర్తను దివ్యప్రభావం కల ఆ ద్వారకానగరాన్ని అందలి రత్నగృహాలను ద్వారకావాసులైన జనులను, దేవరూపులైన కుమారుకులను స్మరిస్తూ ముని ఎదుట ఇలా ప్రశ్నిస్తారు.

స్త్రియ ఊచుః :– స్త్రీలు చెప్పారు.

దస్యుభిర్భగవన్సర్వాః పరిభుక్తా వయం బలాత్ ।
స్వధర్మచ్యవనేఽస్మాకమస్మిన్న శ్శరణం భవ ॥17॥

ఆదిష్టోఽసి పురా బ్రహ్మన్ కేశవేన చ ధీమతా ।
కస్మాదీశేన సంయోగం ప్రాప్య వేశ్యాత్వమాగతాః ॥18॥

భగవన్! మేమందరము బలాత్కారంగా దస్యులచే అనుభవించబడినాము. స్వధర్మచ్యుతి పొందాము. ఇట్టి మాకు నీవు శరణము కమ్ము. పూర్వం ధీమంతుడు, భగవంతుడైన కేశవుడు నీవే మాకు శరణ్యమని ఆదేశించి వున్నాడు. మేము ఈశ్వరసంయోగం పొంది కూడా ఎందుకు వేశ్యల మయ్యాము?

వేశ్యానామపి యో ధర్మ స్తన్నో బ్రూహి తపోధన! ।
కథయిష్యత్యతస్తాసాం స దాల్భ్యశ్చకితాననః ॥19॥

తపోధనా! వేశ్యల ధర్మమేదో అది మాకు పదేశించు. అది విని చకితవదనుడయిన దాల్భ్యుడు వారికిలా వుపదేశిస్తాడు.

దాల్భ్య ఉవాచ :– దాల్భ్యుడు చెప్పాడు.

జలక్రీడావిహారేషు పురా సరసి మానసే ।
భవతీనాం చ సర్వాసాం నారదోఽభ్యాశమాగతః ॥20॥

హుతాశన సుతా స్సర్వా భవన్త్యోఽప్సరసః పురా ।
అప్రణమ్యావలేపేన పరిపృష్ట స్స యోగవిత్ ।
కథం నారాయణోఽస్మాకం భర్తా స్యాదిత్యుపాదిశ ॥21॥

పూర్వం మానససరస్సులో జలక్రీడా విహారం చేసేటప్పుడు మీ అందరి సమీపానికి నారదుడు వచ్చాడు. మీరప్పుడు అగ్ని పుత్రికలయిన అప్సరసలై యుంటిరి. గర్వంతో మునికి నమస్కరించకుండా ఆ యోగవేత్తను మాకు నారాయణుడు ఎలా భర్త కాగలడో ఉపదేశించు అని అడిగారు.

తస్మాద్వరప్రదానం వః శాపశ్చాయమభూత్పురా ।
శయ్యాద్వయప్రదానేన మధుమాధవమాసయోః ॥22॥

సువర్ణోపస్కరాత్సర్గాద్ద్వాదశ్యాం శుక్లపక్షతః ।
భర్తా నారాయణో నూనం భవిష్యత్యన్యజన్మని ॥23॥

ఆ కారణం చేత ఆ వరప్రదానం మీకు శాపంగా కూడా పరిణమించింది. మధుమాధవ మాసాలలో రెండుశయ్యలు దానం చేసి శుక్లపక్షం ద్వాదశినాడు స్వర్ణోపస్కరప్రదానం చేస్తే మీకు తప్పక నారాయణుడు మరుజన్మలో భర్త కాగాలడు.

యదకృత్వా ప్రణామం మే రూపసౌభాగ్యమత్సరాత్ ।
పరిపృష్టోఽస్మి తేనాశు వియోగో వో భవిష్యతి ।
చోరైరపహృతా స్సర్వా వేశ్యాత్వం సమవాప్స్యథ ॥24॥

రూప సౌభాగ్యమాత్సర్యంవల్ల నాకు నమస్కరించకుండా మీరు నన్ను ప్రశ్నించారు. కాన మీకు నారాయణునితో వియోగం త్వరలో కలుగుతుంది. చోరులచే అపహరించబడిన మీరందరూ వేశ్యాత్వం పొందగలరు అని శపించాడు.

ఏవం నారదశాపేన కేశవస్య చ ధీమతః ।
వేశ్యాత్వమాగతా స్సర్వా భవన్త్యః కామమోహితాః ।
ఇదానీమపి యద్వక్ష్యే తచ్ఛృణుధ్వం వరాఙ్గనాః ॥25॥

ఈ రీతిగా నారదునియొక్క, ధీమంతుడైన శ్రీకృష్ణునియొక్క శాపాలచేత కామమోహితలైన మీరందరూ వేశ్యాత్వం పొందితిరి. వరాంగనలారా! ఇప్పుడు నేను చెప్పబోవునది వినండి.

దాల్భ్య ఉవాచ :- దాల్భ్యుడు చెప్పాడు.

పురా దైవాసురే యుద్ధే హతేషు శతశస్సురైః ।
దానవాసురదైత్యేషు రాక్షసేషు తతస్తతః ॥26॥

తేషాం నారీసహస్రాణి శతశోఽథ సహస్రశః ।
పరిణీతాని యాని స్యు ర్బలాద్భుక్తాని యాని వై ।
తాని సర్వాణి దేవేశః ప్రోవాచ వదతాం వరః ॥27॥

పూర్వం దేవతలకు రాక్షసులకు జరిగిన యుద్ధంలో నూర్లకొలదిగా దేవతలచే రాక్షసులు చంపబడినారు. అప్పుడు వారిస్త్రీలు వందలు వేలుగా అపహరింపబడి బలత్కారవివాహాలకు లోనై ఉపభుక్తలైనారు. ఆ వనితలందరినీ చూచి ప్రవక్తయైన ఇంద్రుడు ఇలా చెప్పాడు.

ఇంద్ర ఉవాచ :– ఇంద్రుడు చెప్పాడు.

వేశ్యాధర్మేణ వర్తధ్వమధునా నృపమన్దిరే ।
భక్తిమత్యో వరారోహా స్తథా దేవకులేషు చ ॥28॥

ఇప్పుడు మీరు రాజమందిరంలో వేశ్యాధర్మం పాటిస్తూ వుండండి. వరారోహలైన మీరు భక్తి గలిగి దేవకులాలలో కూడా ఇలాగే వుండండి.

రాజానస్స్వామినస్తుభ్యం సూతకం చాపి తత్సమమ్ ।
భవిష్యతి చ సౌభాగ్యం సర్వాసామపి శక్తితః ॥29॥

రాజులు మీకు ప్రభువులుగా వుంటారు. వారికి కలిగే సూతకం మీకు కూడా వర్తిస్తుంది. మీరు శక్తి కొలదీ సౌభాగ్యం కలిగి వుంటారు.

యః కశ్చిచ్ఛుల్కమాదాయ గృహమేష్యతి వః సదా ।
అచ్ఛద్మనైవోపచార్యః స తదాఽన్యత్ర దామ్భికాత్ ॥30॥

దేవతానాం పితౄణాం చ పుణ్యాహే సముపస్థితే ।
గోభూహిరణ్యధాన్యాని ప్రదేయాని స్వశక్తితః ।
బ్రాహ్మణానాం వరారోహాః కార్యాణి వచనాని చ ॥31॥

దాంభికుడు కానివాడు ఎవడైనా శుల్కం తీసుకొని మీయింటికి వస్తే వానికి మీరు ఉపచారాలు చేయండి. పుణ్యదినాలలో దేవతలకు పితరులకు శక్తికొలది గోభూహిరణ్యాదానాలు ఇవ్వండి. సుందరీజనులారా బ్రాహ్మణుల మాటలను కూడా పాటించండి.

యచ్చాప్యన్యద్వ్రతం సమ్యగుపదేక్ష్యామ్యహం తతః ।
అవిచారేణ సర్వాభిరనుష్ఠేయం చ తత్పునః ॥32॥

సంసారోత్తారణాయాలమేతద్వేదవిదో విదుః ।
యదా సూర్యదినే హస్తః పుష్యో వాథ పునర్వసుః ॥33॥

మరొక వ్రతాన్ని కూడా మీకు ఉపదేశిస్తాను. ఆలోచించకుండా మీరంతా దానిని అనుష్ఠించాలి. సంసారం నుండి తరించడానికి ఇది చాలునని వేదవేత్తలు తెలుసుకొని వున్నారు.

భవేత్సర్వౌషధీస్నానం సమ్యఙ్నారీ సమాచరేత్ ।
తదా పఞ్చశరస్యాపి సన్నిధాతృత్వమేష్యతి ।
అర్చయేత్పుణ్డరీకాక్షమనఙ్గస్యానుకీర్తనైః ॥34॥

ఆదివారం హస్తగాని, పుష్యంగాని, పునర్వసువుగాని వస్తే ఆనాడు సకలౌషధులు కలిపిన నీట స్నానం చేయాలి. అప్పుడు మన్మధుడు గూడా సన్నిహితుడవుతాడు. అనంగుణ్ణి కీర్తిస్తూ పద్మాక్షుణ్ణి అర్చించాలి.

కామాయ పాదౌ సమ్పూజ్య జఙ్ఘే వై మోహకారిణే ।
మేఢ్రం కన్దర్పనిధయే కటిం ప్రీతిమతే నమః ॥35॥

నాభిం సౌఖ్యసముద్రాయ రామాయ చ తథోదరమ్ ।
హృదయం హృదయేశాయ స్తనావాహ్లాదకారిణే ॥36॥

'కామాయ నమః' అని ఆ దేవదేవుని పాదాలనూ, మోహకారిణే నమః' అని జంఘలనూ, 'కందర్ప నిధయే నమః' అని మేఢ్రాన్నీ, ప్రీతిమతే నమః' అని కటినీ, సౌఖ్యసముద్రాయ నమః' అని నాభినీ, 'రామాయ నమః' అని ఉదరాన్నీ, హృదయేశాయ నమః' అని హృదయాన్నీ, 'ఆహ్లాదకారిణే నమః' అని స్తనాలను పూజించాలి.

ఉత్కణ్ఠాయేతి వైకుణ్ఠమాస్యమానన్దకారిణే ।
వామాఙ్గం పుష్పచాపాయ పుష్పబాణాయ దక్షిణమ్ ॥37॥

మానసాయేతి వై మౌళిం విలోలాయేతి మూర్ధనమ్ ।
సర్వాత్మనే చ సర్వాఙ్గం దేవదేవస్య పూజయేత్ ॥38॥

'ఉత్కంఠాయ నమః అని వైకుంఠునీ, 'ఆనంద కారిణే నమః' అని ఆస్యాన్నీ, 'పుష్పచాపాయ నమః' అని వామాంగాన్నీ, 'పుష్పబాణాయ నమః' అని దక్షిణాంగాన్నీ, మానసాయ నమః' అని మౌళినీ, 'విలోలాయ నమః' అని మూర్ధాన్నీ, 'సర్వాత్మనే నమః' అని దేవదేవుని సర్వాఙ్గాన్నీ పూజించాలి.

నమశ్శివాయ శాన్తాయ పాశాఙ్కుశధరాయ చ ।
గదినే పీతవస్త్రాయ శఙ్ఖచక్రధరాయ చ ॥39॥

నమో నారాయణాయేతి కామదేవాత్మనే నమః ।
సర్వశాన్త్యై నమః ప్రీత్యై నమో రత్యై నమః శ్రియై ॥40॥

నమః పుష్ట్యై నమస్తుష్ట్యై నమస్సర్వార్థసమ్పదే ।
ఏవం సమ్పూజ్య దేవేశమనఙ్గాత్మకమీశ్వరమ్ ।
గన్ధైర్మాల్యై స్తథా ధూపై ర్నైవేద్యేన చ కామినీ ॥41॥

శివునకూ, శాంతునకూ, పాశాంకుశధారికీ, గదికీ, పీతాంబరునకూ, శంఖచక్రధారికీ, నారాయణునకూ, కామదేవాత్మునికీ 'నమః' అనీ 'సర్వశాన్త్యై నమః' ప్రీత్యై నమః' రత్యై నమః, శ్రియై నమః అని వారికందరికీ ప్రణమిల్లాలి. పుష్టికీ, తుష్టికీ సర్వార్థసంపద కలవానికి నమస్కారం అంటూ అర్చించాలి. అనంగాత్మకుడూ, దేవేశుడూ అయిన ఈశ్వరుణ్ణి ఇలా గంధంతో, మాల్యాలతో, ధూపనైవేద్యాలతో పూజించాలి.

తత ఆహూయ ధర్మజ్ఞం బ్రాహ్మణం వేదపారగమ్ ।
అవ్యఙ్గావయవం పూజ్యం గన్ధపుష్పార్చనాదిభిః ॥42॥

ఆపై ధర్మజ్ఞుడూ, వేదపారగుడూ, అవయవలోపం లేనివాడూ, పూజ్యుడూ అయిన బ్రాహ్మణుని పిలిచి గంధపుష్పాదులతో అర్చించాలి.

శాలేయతణ్డులప్రస్థం ఘృతపాత్రేణ సంయుతమ్ ।
తస్మై విప్రాయ సా దద్యాన్మాధవః ప్రీయతామితి ॥43॥

కుంచెడు మంచిరాజనాల వరిబియ్యాన్ని ఘృతపాత్ర సమేతంగా "మాధవః ప్రీయతామ్' అంటూ ఆ విప్రునికి సమర్పించాలి.

యథేష్టాహారయుక్తం వై తమేవ ద్విజసత్తమమ్ ।
రత్యర్థం కామదేవోఽయమితి చిత్తేఽవధార్య తమ్ ॥44॥

ఆ ద్విజశ్రేష్ఠునికి యథేష్టాహారమిచ్చి 'ఇతడు కామదేవుడు' అని రతికొరకు మనస్సులో నిర్ణయించుకోవాలి.

యద్యదిచ్ఛతి విప్రేన్ద్ర స్తత్తత్కుర్యాద్విలాసినీ ।
సర్వభావేన చాత్మానమర్పయేత్స్మితభాషిణీ ॥45॥

ఆ విప్రశ్రేష్ఠుడు ఏమేమి కోరుకొంటాడో, అదంతా ఆ విలాసిని సర్వాత్మనా ఇస్తూ స్మితభాషిణియై తన్ను తానర్పించుకోవాలి.

ఏవమాదిత్యవారేణ సర్వమేతత్సమాచరేత్ ।
తణ్డులప్రస్థదానం చ యావన్మాసాస్త్రయోదశ ॥46॥

తత స్త్రయోదశే మాసి సమ్ప్రాప్తే తస్య భామినీ ।
విప్రస్యోపస్కరైర్యుక్తాం శయ్యాం దద్యాద్విలక్షణామ్ ॥47॥

ఇలా ఆదివారంనాడు ఇదంతా చేయాలి. పదమూడవ మాసం వరకు బియ్యం పాత్ర ఇయ్యాలి. ఆ తరువాత అతని కామె అలంకారాలతో కూడిన, విలక్షణమైన శయ్యనివ్వాలి.

సోపధానకవిశ్రామాం సాస్తరావరణాం శుభామ్ ।
ప్రదీపోపానహచ్ఛత్రపాదుకాసనసంయుతామ్ ॥48॥

శయ్యను, విశ్రాంతి కనుకూలంగా దిండు, పైన పరిచే దుప్పటి, ప్రదీపం, చెప్పులు, గొడుగు, పాదుకాసమేతంగా ఇవ్వాలి.

సపత్నీకమలఙ్కృత్య హేమసూత్రాఙ్గులీయకైః ।
సూక్ష్మవస్త్రై స్సకటకై ర్ధూపమాల్యానులేపనైః ॥49॥

ఆ విప్రుణ్ణి భార్యతో సహా హేమసూత్రంతో, ఉంగరాలతో, సూక్ష్మ వస్త్రాలతో, కటకాలతో, ధూప మాల్యాది లేపనాలతో అలంకరించి గౌరవించాలి.

కామదేవం సపత్నీకం గుడకుమ్భోపరి స్థితమ్ ।
తామ్రపాత్రాసనగతం హేమనేత్రపటావృతమ్ ॥50॥

సకాంస్యభాజనోపేతమిక్షుదణ్డసమన్వితమ్ ।
దద్యాదేతేన మన్త్రేణ తథైకాం గాం పయస్వినీమ్ ॥51॥

గుడకుంభం మీద భార్యతో సహా కామదేవుణ్ణి తామ్ర పాత్రాసనంపై కూర్చుండబెట్టి బంగారు వస్త్రం కప్పి కంచుపాత్రతో, ఇక్షుదండంతో సహా ఈ క్రింది మంత్రం ఉచ్చరిస్తూ ఇవ్వాలి. అట్లే ఒక పాడి ఆవును కూడా సమర్పించాలి.

యథాన్తరం న పశ్యామి కామకేశవయో స్సదా ।
తథైవ సర్వకామాప్తిరస్తు విష్ణో సదా మమ ॥52॥

"కామునికీ, కేశవునికీ నేను భేదం చూడడం లేదు. విష్ణుదేవా! నాకు సదా సమస్తాభీష్టాలు నెరవేరుగాక!"

యథా న కమలా దేహాత్ప్రయాతి తవ కేశవ ।
తథా మమాపి దేవేశ శరీరే స్వే కురు ప్రభో ॥53॥

కేశవా! దేవేశా! లక్ష్మి నీనుండి విడిపోనట్లే నా శరీరం నుండి గూడ విడిపోకుండునట్లు అనుగ్రహించు.

తథా చ కాఞ్చనం దేవం ప్రతిగృహ్ణన్ద్విజోత్తమః ।
కోఽదాత్ కామో దదాతీతీతి వైదికం మన్త్రమీరయేత్ ॥54॥

అలా కాంచనదేవుణ్ణి స్వీకరించే ద్విజోత్తముడు 'కోఽదాత్ కామో దదాతి' అనే వైదిక మంత్రం చెప్పాలి.

తతః ప్రదక్షిణీకృత్య విసృజ్య ద్విజపుఙ్గవమ్ ।
శయ్యాసనాదికం సర్వం బ్రాహ్మణస్య గృహం నయేత్ ॥55॥

తదుపరి వ్రతకర్త్రి ద్విజవర్యునికి ప్రదక్షిణ కావించి సాగనంపాలి. శయ్య, ఆసనాదికం అంతా ఆ బ్రాహ్మణుని యింటికి పంపాలి.

తతఃప్రభృతి యోఽన్యో వై రత్యర్థం గృహమాగతః ।
స మాన్యశ్చోపచారేణ స సంపూజ్యో భవేత్తదా ॥56॥

నాటినుండి ఇతరుడెవడైనా రతి కోరి ఇంటికి వస్తే, వాణ్ణి ఉపచారంతో గౌరవించాలి. పూజించాలి.

ఏవం త్రయోదశం యావన్మాసమేకం ద్విజోత్తమమ్।
తర్పయేత యథాకల్పం ప్రోషితేఽన్యం సమర్చయేత్ ॥57॥

తదనుజ్ఞయా చ వస్తవ్యం యావదబ్బాగమో భవేత్ ।
ఆత్మనోఽపి తథావిఘ్నో గర్భసూతకరాజితః ॥58॥

దైవో వా మానుషో వా స్యాదుపరాగేణ పాతతః ।
సా వత్సరానష్టపఞ్చాష్టసంఖ్యా సమాపయేత్ ।
తథాపి చ ద్విజం దేవం యథా శక్త్యా సమర్చయేత్ ॥59॥

ఇలా పదమూడు నెలలు ఒక ద్విజసత్తముని యథాకామంగా తృప్తిపరచాలి. వాడు గ్రామాంతరం వెళ్తే వాని అనుమతితో మరొకణ్ణి సమర్చించాలి. తాను గర్భవతి అగుట, పురుడు వచ్చుట, అశౌచం ఏర్పడుట, దైవికంగా మానుషంగా వచ్చే విఘ్నాలు, గ్రహణం, వ్యతీపాతం ఇత్యాది దోషాలు కలిగినా పదమూడు మాసాలు కొన్ని సంవత్సరాలపాటు ఈ వ్రతం ఆచరించాలి. యథాశక్తి ద్విజుణ్ణి అర్చించాలి.

ఏతద్ధి కథితం సమ్య గ్భవతీనాం విశేషతః ।
అధర్మోఽయం తతో న స్యాద్వేశ్యానామిహ సర్వదా ॥60॥

ఇది మీకు విశేషించి చెప్పాను. ఇట్టిది వేశ్యలకు ఎప్పటికీ అధర్మం కాదు.

పురుహూతేన యత్ప్రోక్తం దానవేషు పురా మయా ।
తదిదం సాంప్రతం సర్వం భవతీష్వపి యుజ్యతే ॥61॥

పూర్వం ఇంద్రుడు రాక్షస స్త్రీలకు ఏది చెప్పాడో, అదంతా చెప్పాను. ఇది మీకు గూడా సరిపడుతుంది.

సర్వపాపప్రశమనమనన్తఫలదాయకమ్ ।
కల్యాణీనాం చ కథితం తత్కురుధ్వం వరాననాః! ॥62॥

సకలపాపాలు తొలగించేదీ, అనంతఫలాలనిచ్చేదీ, కల్యాణినులు అనబడు వారి గురించి చెప్పిన వ్రతమిది. వరాననలారా! ఇది ఆచరంచండి.

కరోతి యాఽశేషమఖణ్డమేతత్కల్యాణినీ మాధవలోకసంస్థా ।
సా పూజితా దేవగణైరశేషై రానన్దకృత్స్థాన ముపైతి విష్ణోః ॥63॥

ఏ స్త్రీ ఇదంతా అఖండంగా చేస్తుందో, అట్టి కల్యాణి మాధవలోకం చేరి సకల దేవగణాలచే పూజింపబడుతుంది. ఆనందదాయకమైన విష్ణుస్థానం పొందుతుంది.

శ్రీభగవానువాచ :- శ్రీభగవానుడు చెప్పాడు.

తపోధన స్సోఽప్యభిధాయ చైవం తదా చ తాసాం వ్రతమఙ్గనానామ్ ।
స్వస్థానమేష్యన్యథ తాస్సమస్తా వ్రతం చరిష్యన్తి చ దేవయోనే! ॥64॥

ఆ అంగనలకు ఈ వ్రతాన్ని ఆ తపోధనుడు ఈ విధంగా చెప్పి స్వస్థానానికి పోతాడు. నారదా! తదుపరి ఆ వనితలు దైవమూలకమైన ఈ అనంగశయనవ్రతాన్ని అనుష్ఠిస్తారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అనంగశయనవ్రతం నామ సప్తతితమోఽధ్యాయః ॥ 70 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని అనంగశయనవ్రతమనే డెబ్బైయవ అధ్యాయం సంపూర్ణం

ఏకసప్తతితమోఽధ్యాయః - డెబ్బైఒకటవ అధ్యాయం
అశూన్యశయన వ్రతమ్ - అశూన్యశయన వ్రతం

బ్రహ్మోవాచ :- బ్రహ్మ చెప్పాడు.

మోహాద్వాఽపి మదాద్వాఽపి యః పరస్త్రీం సమాశ్రయేత్ ।
తస్యాపి నిష్కృతిం దేవ! వద సర్వకృపాకర! ॥1॥

దేవా! సర్వకృపాకరా! మోహంవల్ల కానీ, మదంవల్ల కానీ ఎవడు పరస్త్రీని ఆశ్రయిస్తాడో, వానికి గూడా నిష్కృతిని చెప్పండి!

భగవన్పురుషస్యేహ స్త్రియాశ్చ విరహాదికమ్ ।
శోకవ్యాధిభయం దుఃఖం న భవేద్యేన తద్వద ॥2॥

పరమాత్మా! పురుషునికీ, స్త్రీకీ వియోగాదికమూ, శోకవ్యాధిభయాలవల్ల కలిగే దుఃఖమూ ఎలా తొలగి పోతాయో, దాన్ని వివరించండి.

శ్రీభగవానువాచ :- భగవానుడు చెప్పాడు.

శ్రావణస్య ద్వితీయాయాం కృష్ణాయాం మధుసూదనః ।
క్షీరార్ణవే సపత్నీక స్సదా వసతి కేశవః ॥3॥

మధురాక్షసుని హతమార్చిన కేశవుడు శ్రావణ మాస కృష్ణపక్ష ద్వితీయనాడు భార్యతో సహా పాలసముద్రంలో సదా నివస్తాడు.

తస్యాం సమ్పూజ్య గోవిన్దం సర్వాన్కామానసమశ్నుతే ।
గోభూహిరణ్యదానాది సప్తకల్పశతానుగమ్ ॥4॥
అశూన్యశయనం నామ ద్వితీయా సంప్రకీర్తితా ।
తస్యాం సమ్పూజయేద్విష్ణుమేభిర్మన్త్రై ర్విధానతః ॥5॥

ఆ తిథియందు గోవిందుణ్ణి పూజిస్తే సకలకామాలూ సిద్ధిస్తాయి. గోవు, భూమి, బంగారం వీటి దానాదులతోకూడిన ఈ ద్వితీయావ్రతానికి 'అశూన్య శయనద్వితీయ' అని పేరు. వ్రతకర్త ఏడువందల కల్పాల కాలం విష్ణులోకంలో ఉంటాడు. విధి విధానానుసారంగా ఈ క్రింది మంత్రాలతో ఆ తిథినాడు విష్ణువును పూజించాలి.

శ్రీవత్సధారిన్! శ్రీకాన్త! శ్రీధామన్! శ్రీపతేఽవ్యయ! ।
గార్హస్థ్యం మా ప్రణాశం మే యాతు ధర్మార్థకామదమ్ ॥6॥

"శ్రీవత్సధారీ! శ్రీకాంతా! శ్రీధామా! శ్రీపతీ, అవ్యయా! ధర్మార్థ కామాలను ప్రసాదించే నా గార్హస్థ్యం నశించకుండుగాక!

అగ్నయో మా ప్రణశ్యన్తు దేవతాః పురుషోత్తమ! ।
పితరో మా ప్రణశ్యన్తు మాఽస్తు దామ్పత్యభేదనమ్ ॥7॥

పురుషోత్తమా! నా అగ్నులు నశించకుండుగాక! దేవతలు నశించకుందురు గాక! పితరులు నశించకుందురు గాక! దాంపత్యానికి విచ్ఛిత్తి కలుగకుండు గాక!

లక్ష్మ్యా వియుజ్యతే దేవ! న కదాచిద్యథా భవాన్ ।
తథా కళత్రసమ్బన్ధో దేవ మా మే వియుజ్యతామ్ ॥8॥

దేవా! నీవు లక్ష్మితో ఎప్పుడూ వియోగం పొందవుకదా! అట్లే నాకు నా దాంపత్యసంబంధం విచ్ఛిన్నం కాకుండుగాక!

లక్ష్మ్యా న శూన్యో వరద! శయ్యాం త్వం శయనం గతః ।
శయ్యా మమాప్యశూన్యాఽస్తు తథైవ మధుసూదన! ॥9॥

వరదా! శయ్య నధిష్ఠించిన నీవు లక్ష్మిలేనివాడవు కావు కదా! మధుసూదనా! అట్లే నా శయ్యగూడా అశూన్యమగును గాక!"

గీతవాదిత్రనిర్ఘోషైః దేవదేవస్య కీర్తయేత్ ।
ఘణ్టా భవేదశక్తస్య సర్వవాద్యమయీ యతః ॥10॥

ఈ ప్రార్థన చేసిన తరువాత దేవదేవుని గీతాలను వాద్యాలతో సహా గానం చేయాలి. ఘంట సర్వవాద్యమయమైనది కాన శక్తి లేనివాడు ఘంట వినియోగించాలి.

ఏవం సమ్పూజ్య గోవిన్దమశ్నీయా త్తైలవర్జితమ్ ।
నక్తమక్షారలవణం యావద్యామచతుష్టయమ్ ॥11॥

ఇలా గోవిందుణ్ణి అర్చించి తైలం లేకుండా కారం, ఉప్పు లేకుండా భుజించి ఆ రాత్రంతా గడపాలి.

తతః ప్రభాతే సంజాతే లక్ష్మీపతిసమన్వితామ్ ।
దీపాన్నభాజనై ర్యుక్తాం శయ్యాం దద్యాద్విలక్షణామ్ ॥12॥

ఆపై తెల్లవారగానే లక్ష్మీపతితో గూడిన దీపాన్నీ, భోజనపాత్రలనూ, అన్ని ఉపకరణాలుగల విలక్షణమైన శయ్యనూ దానం చేయాలి.

పాదుకోపానహచ్ఛత్ర చామరాసనసంయుతామ్ ।
అభీష్టోపస్కరైర్యుక్తాం శుక్లపుష్పాంబరావృతామ్ ॥13॥

ఆ శయ్య పాదుక, చెప్పులు, గొడుగు, చామరంతో అభీష్టమైన ఉపకరణాలతో గూడినదై, తెల్లనిపుష్పాలు, వస్త్రం కప్పినదై యుండాలి.

సోపధానకవిశ్రామాం ఫలైర్నానావిధైర్యుతామ్ ।
తథాభరణధాన్యైశ్చ యథాశక్త్యా సమన్వితామ్ ॥14॥

మరియు ఆ శయ్య విశ్రాంతి చేకూర్చే దిండు, నానావిధఫలాలు, యథాశక్తి, అభరణాలు, ధాన్యాలతో గూడినదిగా ఉండాలి.

అవ్యఙ్గాఙ్గాయ విప్రాయ వైష్ణవాయ కుటుమ్బినే ।
దాతవ్యా వేదవిదుషే సర్వక్రతుకృతే క్వచిత్ ॥15॥

అంగలోపం లేని వైష్ణవ కుటుంబికి, వేదవేత్తకు, సర్వక్రతువులు చేయువానికి ఆ శయ్యను సమర్పించాలి.

తత్రోపవేశ్య దామ్పత్య మలఙ్కృత్య విధానతః ।
పత్న్యాస్తు భాజనం దద్యా ద్భక్ష్యభోజ్యసమన్వితమ్ ॥16॥

దానకాలంలో బ్రాహ్మణదంపతులను ఆ శయ్యపై కూర్చోబెట్టి విధివిధానంలో అలంకరించాలి. బ్రాహ్మణ పత్నికి భక్ష్యభోజ్యసమన్వితమైన పాత్రనివ్వాలి.

బ్రాహ్మణస్యాపి సౌవర్ణీముపస్కరసమన్వితామ్ ।
ప్రతిమాం దేవదేవస్య సోదకుంభాం నివేదయేత్ ॥17॥

స్వర్ణమయమైనదీ, అలంకరింపబడినదీ అయిన దేవదేవుని ప్రతిమను బ్రాహ్మణునికి గూడా జలకుంభంతో సహా సమర్పించాలి.

ఏవం యస్తు పుమాన్కుర్యాదశూన్యశయనం హరేః ।
విత్తశాఠ్యేన రహితో నారాయణపరాయణః ॥18॥

నారీ వా విధవా బ్రహ్మన్యావచ్చన్ద్రార్కతారకమ్ ।
న విరూపౌ న శోకార్తౌ దమ్పతీ భవతః క్వచిత్ ॥19॥

బ్రహ్మ! ఇలా ఎవడు హరి యొక్క అశూన్యశయనవ్రతం విత్తశాఠ్యం చూపకుండా నారాయణ పరాయణుడై చేస్తాడో, వాడు మరియు స్త్రీ లేక విధవ, ఎవరైనా ఈ వ్రతం చేస్తే సూర్యచంద్రు లున్నంతవరకూ ఆ దంపతులు, విరూపులు శోకార్తులు కారు.

న పుత్రపశురత్నాని క్షయం యాన్తి పితామహ! ।
సప్తకల్పసహస్రాణి సప్తకల్పశతాని చ ।
కుర్వన్నశూన్యశయనం విష్ణులోకే మహీయతే ॥20॥

పితామహా! అలాంటివారికి పుత్రులు, పశువులూ, రత్నాలూ క్షీణించవు. అశూన్యశయన వ్రతకర్త ఏడువేల ఏడు వందల కల్పాలు విష్ణులోకంలో పూజింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అశూన్యశయనవ్రతం నామ ఏకసప్తతితమోఽధ్యాయః ॥ 71 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని అశూన్యశయన వ్రతమనే డెబ్బైఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్విసప్తతితమోఽధ్యాయః - డెబ్బైరెండవ అధ్యాయం

అంగారకవ్రతమ్ - అంగారక వ్రతం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

శృణు చాన్యద్భవిష్యం యద్రూపసమ్పద్విధాయకమ్ ।
భవిష్యతి యుగే తస్మిన్ ద్వాపరాన్తే పితామహ! ।
పిప్పలాదస్య సంవాదో యుధిష్ఠిరపురస్సరైః ॥1॥

మరొక వ్రతాన్ని గురించి విను. ఇది రూపసంపదను ప్రసాదిస్తుంది. పితామహా! రానున్న ద్వాపరాంత యుగంలో యుధిష్ఠిరాదులకు, పిప్పలాదునితో జరిగిన సంవాదరూపంలో ఇది ఉన్నది.

వసన్తం నైమిశారణ్యే పిప్పలాదం మహామునిమ్ ।
అభిగమ్య తదా చైనం ప్రశ్నమేకం కరిష్యతి ।
యుధిష్ఠిరో ధర్మపుత్రో ధర్మయుక్తస్తపోధనమ్ ॥2॥

ధర్మపుత్రుడూ, ధర్మయుక్తుడూ అయిన ధర్మరాజు నైమిశారణ్యంలో ఉన్న తపోధనుడగు పిప్పలాదమునిని సమీపించి ఇలా ఒక ప్రశ్న వేయగలడు.

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

కథమారోగ్యమైశ్వర్యం మతిర్ధర్మే గతి స్తథా ।
అవ్యఙ్గతా శివే భక్తి ర్వైష్ణవో వా భవేత్కథమ్ ॥3॥

ఆరోగ్యం, ఐశ్వర్యం, ధర్మబుద్ధి, ధర్మగతి, అంగలోపం లేకుండా ఉండడం, శివభక్తి, వైష్ణవుడు కావడం అనేవి ఎలా సిద్ధిస్తాయి?

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

తస్యోత్తరమిదం బ్రహ్మన్! పిప్పలాదస్య ధీమతః ।
శృణుష్వ యద్వక్ష్యతి స ధర్మపుత్రాయ ధార్మికః ॥4॥

పితామహా! ధార్మికుడగు పిప్పలాదుడు ధర్మపుత్రునికి ఇందుకేమి సమాధానం చెప్పాడో, విను-

పిప్పలాద ఉవాచ :- పిప్పలాదుడు చెప్పాడు.

సాధు పృష్టం త్వయా భద్ర! ఇదానీం కథయామి తే ।
అఙ్గారవ్రతమిత్యేతత్సర్వం వక్ష్యామి తే నృప! ॥5॥

భద్రా! చక్కగా అడిగావు. రాజా! ఇప్పుడు నీకు అంగారకవ్రతమును గురించి అంతా చెబుతాను.

అత్రాప్యుదాహరన్తీమమితిహాసం పురాతనమ్ ।
విరోచనస్య సంవాదం భార్గవస్య చ ధీమతః ॥6॥

ఈ విషయంలో ఒక పురాతనమైన ఇతిహాసం ఉదాహరిస్తాను. విరోచనునికీ, ధీమంతుడగు భార్గవునికీ మధ్య జరిగిన సంవాదమది.

ప్రహ్లాదస్య సుతం దృష్ట్వా ద్విరష్టపరివత్సరమ్ ।
రూపేణాప్రతిమం కాన్త్యా సోఽహసద్భృగునన్దనః ॥7॥

ప్రహ్లాదుని కుమారుడు, పదునారేండ్ల ప్రాయంవాడు, అతిసుందరుడు, కాంతిమంతుడైన విరోచనుణ్ణి చూచి భార్గవుడు నవ్వాడు.

సాధు సాధు మహాబాహో! విరోచన! శివం తవ ।
తత్తథా హసితం తస్య పప్రచ్ఛ సురసూదనః ॥8॥

"విరోచనా! బాగు బాగు! మహాబాహూ! నీకు శుభమగుగాక!" అని అన్నాడు. అంతట విరోచనుడు అతని నవ్వును చూచి ఇలా ప్రశ్నించాడు.

బ్రహ్మన్కిమర్థమేతత్తే హాస్యమాకస్మికం కృతమ్ ।
సాధు సాధ్వితి మామేవముక్తవాంస్త్వం వదస్వ మే ॥9॥

భార్గవా! ఎందు కిలా నన్ను చూచి అకస్మాత్తుగా నవ్వారు? 'బాగు బాగు' అని పలికారు? ఇందుకు కారణం నాకు చెప్పండి!"

తమేవంవాదినం శుక్ర ఉవాచ వదతాం వరః ।
విస్మయాద్వ్రతమాహాత్మ్యాద్ధాస్యమేతత్కృతం మయా ॥10॥

వక్తలలో శ్రేష్ఠుడైన భార్గవుడగు శుక్రుడు అలా అడిగిన విరోచనుణ్ణి చూచి "విస్మయంవల్లా, వ్రత ప్రభావం వల్లా నేనిలా నవ్వాను.

పురా దక్షవినాశాయ కుపితస్య తు శూలినః ।
అథ తద్భీమవక్త్రస్య స్వేదబిన్దుర్లలాటజః ॥11॥

పూర్వం దక్షుణ్ణి నశింపజేయడానికి కోపించిన శివుని యొక్క భీకరమైన ముఖంపైని లలాటం మీద చెమట బిందువు పుట్టింది.

భిత్త్వా స సప్తపాతాలానదహత్సప్తసాగరాన్ ।
అనేకవక్త్రనయనో జ్వలజ్జ్వలనభీషణః ॥12॥

వీరభద్ర ఇతి ఖ్యాతః కరపాదాయుతైర్యుతః ।
కృత్వాఽసౌ యజ్ఞమథనం పునర్భూతలసంభవః ।
త్రిజగన్నిర్దహన్భూయ శ్శివేన వినివారితః ॥13॥

అది సప్తపాతాళాలనూ, సప్త సాగరాలనూ దహించింది. అందుండి అనేకముఖాలు, పెక్కు కన్నులు గలవాడూ, మండే అగ్నివలె భీకరుడూ, వీరభద్రుడని ఖ్యాతి గన్నవాడూ, పదివేల హస్తపాదాలు గలవాడు జనించాడు. అతడు యజ్ఞమథనం చేసి మళ్ళీ భూతలంపై జనించి ముల్లోకాలూ దహింపసాగాడు. అప్పుడతణ్ణి శివుడు నివారించాడు.

కృతం త్వయా వీరభద్ర దక్షయజ్ఞవినాశనమ్ ।
ఇదానీమలమేతేన లోకదాహేన కర్మణా ॥14॥

వీరభద్రా! దక్షయజ్ఞధ్వంసం చేశావు. లోకదాహకమైన ఈ పని ఇప్పుడింక చాలు.

శాన్తిప్రదాతా సర్వేషాం గ్రహాణాం ప్రథమో భవ ।
ప్రేక్షిష్యంతే జనాః పూజాం కరిష్యన్తి వరా న్మమ ॥15॥

సకలగ్రహాలకూ మొదటి శాంతిప్రదాతవు కమ్ము! నావరంవల్ల జనులు నిన్ను చూచి నీకు పూజలు చేస్తారు.

అఙ్గారక ఇతి ఖ్యాతిం గమిష్యసి ధరాత్మజ! ।
దేవలోకేఽద్వితీయం చ తవ రూపం భవిష్యతి ॥16॥

భూమిపుత్రా! నీవు అంగారకుడన్న ఖ్యాతి పొందగలవు. దేవలోకంలో నీ రూపం సాటిలేనిది కాగలదు.

యే చ త్వాం పూజయిష్యన్తి చతుర్థ్యాం త్వద్దినే నరాః ।
రూపమారోగ్య మైశ్వర్యం తేష్వనన్తం భవిష్యతి ॥17॥

ఎవరు చతుర్థినాడు మంగళవారం నిన్ను పూజిస్తారో, వారి రూపం, ఆరోగ్యం, ఐశ్వర్యం, అనంత మవుతుంది.

ఏవముక్తస్తదా శాన్తిమగమత్కామరూపధృక్ ।
సంజాతస్తత్‌క్షణాద్రాజన్ గ్రహత్వమగమత్పునః ॥18॥

రాజా! ఇలా శివుడు చెప్పగా కామరూపధారి అయిన వీరభద్రుడు శాంతించాడు. మరియు గ్రహత్వం పొందాడు.

స కదాచిద్భవాంస్తస్య పూజార్ఘ్యాదికముత్తమమ్ ।
దృష్టవాన్క్రియమాణం చ శూద్రేణ చ వ్యవస్థితః ॥19॥

నీవొకసారి ఒక శూద్రుడు అంగారకునికి ఉత్తతమమైన పూజ, అర్ఘ్యం మొదలైన క్రియలు చేయడాన్ని ప్రక్కనుండి చూచావు.

తేన త్వం రూపవాన్జాత స్సురశత్రుకులోద్వహ! ।
వివిధా చ రుచిర్జాతా యస్మాత్తవ విదూరగా ॥20॥

రాక్షసకుల శ్రేష్ఠా! ఆ కారణంవల్ల నీవు రూపవంతుడవయ్యావు. నీకు దూరంగా వ్యాపించగల కాంతి గూడా కల్గింది.

విరోచన ఇతి ప్రాహు స్తస్మాత్త్వాం దేవదానవాః ।
శూద్రేణ క్రియమాణస్య వ్రతస్య తవ దర్శనాత్ ।
ఈదృశీం రూపసమ్పత్తిం దృష్ట్వా విస్మితవానహమ్ ॥21॥

అందువల్లనే దేవతలు, దానవులు నిన్ను 'విరోచను' డన్నారు. శూద్రు డాచరించు వ్రతాన్ని చూడడంవల్ల నీకు కల్గిన ఇట్టి రూపసంపదను చూచి నేను ఆశ్చర్యపడ్డాను.

సాధు సాధ్వితి తేనోక్త మహెూ మాహాత్మ్యముత్తమమ్ ।
పశ్యతోఽపి భవేద్రూపమైశ్వర్యం కిము కుర్వతః ॥22॥

అందుకే 'సాధు! సాధు' అన్నాను. అహెూ! దీని ఉత్తమమైన మాహాత్మ్యం ఎట్టిది? చూచిన వానికే ఇట్టి రూపం, ఐశ్వర్యం సిద్ధిస్తే ఇక చేసిన వానిని గూర్చి ఏమి చెప్పాలి?

యస్మాచ్చ భక్త్యా ధరణీసుతస్య వినింద్యమానేన గవాదిదానమ్ ।
ఆలోకితం తేన సురారిగర్భసమ్భూతిరేషా తవ దైత్య! జాతా ॥23॥

దైత్యా! ఒక నింద్యుడైన శూద్రుడు చేసిన అంగారక వ్రతంలో భక్తితో గవాదిదానం చూచినందువల్ల నీకు అసురరాజ గర్భజననం జరిగింది".

ఈశ్వర ఉవాచ :– ఈశ్వరుడు చెప్పాడు.

అథ తద్వచనం శ్రుత్వా భార్గవస్య మహాత్మనః ।
ప్రహ్లాదనన్దనో వీరః పునః పప్రచ్ఛ విస్మితః ॥24॥

మహాత్ముడైన ఆ భార్గవుని మాట విని వీరుడగు ప్రహ్లాదకుమారుడు ఆశ్చర్యం పొంది మరల ఇలా అడిగాడు.

విరోచన ఉవాచ :– విరోచనుడు చెప్పాడు.

భగవంస్తద్వ్రతం సమ్యక్ఛ్రోతుమిచ్ఛామి తత్త్వతః ।
దీయమానం తు యద్దానం మయా దృష్టం భవాన్తరే ॥25॥

భార్గవా! ఏ వ్రతంలో ఇచ్చిన దానాన్ని నేను జన్మాంతరంలో చూచానో, ఆ వ్రతాన్ని తత్త్వతః మీ నుండి వినగోరుతున్నాను.

మాహాత్మ్యం చ విధిం తస్య యథావద్వక్తుమర్హసి ।
ఇతి తద్వచనం శ్రుత్వా పునః ప్రోవాచ విస్తరాత్ ॥26॥

ఆ వ్రతమాహాత్మ్యాన్నీ, విధినీ ఉన్నదునట్లు చెప్పండి". ఆ మాట విని భార్గవుడు విస్తరంగా మళ్ళీ ఇలాచెప్పాడు.

శుక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

చతుర్థ్యఙ్గారకదినే యదా భవతి దానవ! ।
మృదా స్నానం తదా కుర్యాత్పద్మరాగవిభూషితః ॥27॥

దానవా! అంగారకదినంలో ఎప్పుడు చతుర్థి వస్తుందో, అప్పుడు మట్టితో స్నానం చేసి పద్మరాగాలతో అలంకరించుకోవాలి.

అగ్నిర్మూర్ధా దివో మన్త్రం జపన్నాస్తే ఉదఙ్ముఖః ।
శూద్రస్తూష్ణీం స్మరన్భౌమమాస్తే భోగవివర్జితః ॥28॥

ఉత్తరాభిముఖుడై 'అగ్ని ర్మూర్ధా దివో' అన్న మంత్రాన్ని జపించాలి. శూద్రుడైతే నిశ్శబ్దంగా అంగారకుని స్మరిస్తూ ఉండాలి, భోగాలు వర్జించాలి.

తథాఽస్తమిత ఆదిత్య గోమయేనానులేపయేత్ ।
ప్రాఙ్గణం పుష్పమాలాభిరక్షతాభిస్సమన్తతః ॥29॥

సూర్యుడస్తమించగానే గోమయంతో అలికి గృహప్రాంగణాన్ని పూమాలలతో అలంకరించి నలువైపులా అక్షతలు చల్లాలి.

అభ్యర్చ్యాభిలిఖేత్పద్మం కుఙ్కుమేనాష్టపత్రకమ్ ।
కుఙ్కుమస్యాప్యభావే తు రక్తచన్దనమిష్యతే ॥30॥

తదుపరి అంగారకుణ్ణి అర్చించి మొగ్గరూపంలో ఎనిమిది దళాలు గల పద్మాన్ని కుంకుమతో లిఖించాలి. కుంకుమ లేకుంటే రక్తచందనంతో లిఖించవచ్చు.

చత్వారః కరకాః కార్యాః భక్ష్యభోజ్యసమన్వితాః ।
తణ్డులై రక్తశాలీయైః పద్మరాగైశ్చ సంయుతాః ॥31॥

భక్ష్య భోజ్యాలతో కూడిన నాలుగు పాత్రలు సిద్ధం చేసి ఎర్ర వడ్ల బియ్యంతో, పద్మరాగాలతో కూడినవిగా వాటిని సిద్ధం చేయాలి.

చతుష్కోణేషు తాన్కృత్వా ఫలాని వివిధాని చ ।
గన్ధమాల్యాదికం సర్వం తథైవ వినివేదయేత్ ॥32॥

నాల్గు కోణాలలోనూ వాటిని నిలిపి వివిధ ఫలాలు, గంధమాల్యాదికాలు మొత్తం అట్లే నివేదన చేయాలి.

సువర్ణశృఙ్గీం కపిలామథార్చ్య రౌప్యైః ఖురైః కాంస్యదోహాం సవత్సామ్ ।
ధురన్ధరం రక్తమతీవ సౌమ్యం ధాన్యాని సప్తాంబరసంయుతాని ॥33॥

బంగారుకొమ్ములూ, వెండిగిట్టలు, కంచుపాత్ర, దూడతో సహా కపిలగోవునూ, అట్లే బరువు మోయగల ఎర్రని ఎద్దునూ, మూటలుగా కట్టిన ఏడు రకాల ధాన్యాన్ని సిద్ధం చేసుకోవాలి.

అఙ్గుష్ఠమాత్రం పురుషం తథైవ సౌవర్ణమత్యాయతబాహుదణ్డమ్ ।
చతుర్భుజం హేమమయే నివిష్టం పాత్రే గుడస్యోపరి సర్పియుక్తమ్ ॥34॥

స్వర్ణంతో దీర్ఘమైన భుజదండాలు గల అంగుష్ఠ మాత్రుడైన ఒక నాలుగు చేతుల పురుషుణ్ణి తయారు చేసి స్వర్ణమయమైన పాత్రలో బెల్లంపైన నెయ్యి పోసి ఆ విగ్రహాన్ని అందులో ఉంచాలి. 'సర్పియుక్తం':-అనుచోట 'ధాన్యయుక్తే' అని పాఠాంతరం.

సమస్తయజ్ఞాయ జితేన్ద్రియాయ పాత్రాయ శీలాన్వయసంయుతాయ ।
దాతవ్యమేతత్సకలం ద్విజాయ కుటుమ్బినే నైవ తు దామ్భికాయ ।
సమర్పయేద్విప్రవరాయ భక్త్యా కృతాంజలిః పూర్వముదీర్య మంత్రమ్ ॥35॥

దాన్ని యజ్ఞ క్రియలూ తెలిసినవాడూ, జితేంద్రియుడు, యోగ్యుడు, శీలవంతుడు, కులవంతుడు, అయిన కుటుంబియగు ద్విజునికి దానం చేయాలి. దాంభికునికీరాదు. ద్విజవర్యునికి భక్తితో అంజలిసేసి పూర్వమంత్రం పఠించి సమర్పించాలి.

భూమిపుత్ర! మహాభాగ! స్వేదోద్భవ పినాకినః ।
రూపార్థీ త్వాం ప్రపన్నోఽహం గృహాణార్ఘ్యం నమోఽస్తు తే ॥36॥

"మహాభాగా! భూమిసుతా! శివుని చెమట నుండి పుట్టినవాడా! రూపం కోరి నేను నిన్ను శరణు జొచ్చాను. ఈ అర్ఘ్యం గ్రహించు, నీకు నమస్కారం.

మన్త్రేణానేన దత్వార్ఘ్యం రక్తచన్దనవారిణా ।
తతోఽర్చయేద్విప్రవరం రక్తమాల్యామ్బరాదిభిః ॥37॥

ఈ మంత్రం ఉచ్చరిస్తూ ఎర్రచందనం నీటితో అర్ఘ్యమిచ్చి ఆపై రక్తమాల్యవస్త్రాదులచే విప్రశ్రేష్ఠుని పూజించాలి.

దద్యాత్తేనైవ మంత్రేణ భౌమం గోమిథునాన్వితమ్ ।
శయ్యాం చ శక్తితో దద్యాత్ సర్వోపస్కరసంయుతామ్ ॥38॥

తదుపరి ఆ మంత్రంతోనే, గోమిథునాన్ని, సకలోపస్కారాలు (అలంకారాలు) గల శయ్యనూ, శక్తికొలది దానం చేయాలి.

యద్యదిష్టతమం లోకే యచ్చాస్య దయితం గృహే ।
తత్తద్గుణవతే దేయం తదేవాక్షయమిచ్ఛతా ॥39॥

ఆ గృహంలో ఏదేది ఆ విప్రునికిష్టమో, ప్రియమైనదో, దాన్ని అక్షయైశ్వర్యం కోరేవాడు గుణవంతుడగు ద్విజునికి దానం చెయ్యాలి.

ప్రదక్షిణం తతః కృత్వా విసృజేద్ద్విజపుఙ్గవమ్ ।
నక్తమక్షారలవణమశ్నీయా ద్ఘృతసంయుతమ్ ॥40॥

ఆపై ప్రదక్షిణం కావించి విప్రుణ్ణి సాగనంపాలి. ఆ రాత్రి ఉప్పుకారాలులేని నేతితో కూడిన భోజనం స్వీకరించాలి.

భక్త్యా యస్తు పునః కుర్యాదేవమఙ్గారకాష్టకమ్ ।
చతురో వాఽథ వా తస్య యత్పుణ్యం తద్వదామి తే ॥41॥

ఇలా ఎవడు భక్తితో అంగారకవ్రతాన్ని ఎనిమిదిసార్లు గానీ లేక నాలుగు సార్లు గానీ చేస్తాడో, వానికి కలిగే పుణ్యం ఎట్టిదో నీకు వివరిస్తాను.

రూపసౌభాగ్యసమ్పన్నః పునర్జన్మని జన్మని ।
విష్ణౌవాఽథ శివే భక్త స్సప్తద్వీపాధిపో భవేత్ ॥42॥

రూపసౌభాగ్యాలు కలిగి మరల జన్మ జన్మల్లో విష్ణువుపైగానీ, శివునిపైగానీ భక్తిగలవాడై సప్తద్వీపాలకూ అధిపతి అవుతాడు.

సప్తకల్పసహస్రాణి రుద్రలోకే మహీయతే ।
తస్మాత్త్వమపి దైత్యేన్ద్ర! వ్రతమేతత్సమాచర ॥43॥

రుద్రలోకంలో ఏడువేల కల్పాల కాలం పూజలందుకొంటాడు. అంచేత ఓ విరోచనా! నీవు గూడా ఈ వ్రతం అనుష్ఠించు.

పిప్పలాద ఉవాచ :– పిప్పలాదుడు చెప్పాడు.

ఇత్యేవ ముక్త్వా భృగునన్దనోఽపి జగామ దైత్యశ్చ చకార సర్వమ్ ।
త్వం చాపి రాజన్కురు సర్వమేతద్యతోఽక్షయం వేదవిదో వదన్తి ॥44॥

ఇలా చెప్పి భార్గవుడు వెళ్ళి పోయాడు. దైత్యుడు ఆయన చెప్పినట్లే అంతా చేశాడు. రాజా! నీవు కూడా ఇదంతా చేయాలి. ఎందుకంటే వేదవిదులు దీనిని అక్షయమన్నారు.

ఈశ్వర ఉవాచ – ఈశ్వరుడు చెప్పాడు.

తథేతి సమ్పూజ్య స పిప్పలాదం వాక్యం చకారాద్భుతవీర్యకర్మా ।
శృణోతి యశ్చైనమనన్యచేతాస్తస్యాపి సిద్ధిం భగవాన్విధత్తే ॥45॥

అందుకు అట్లే అని చెప్పి అద్భుత వీర్యకర్ముడైన ధర్మజుడు పిప్పలాదుని పూజించి ఆయన ఉపదేశాన్ని అనుష్ఠించాడు. అనన్యచిత్తంతో దీన్ని విన్నవానికి గూడా భగవానుడు సిద్ధిని ప్రసాదిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే అంగారకవ్రతం నామ ద్విసప్తతితమోఽధ్యాయః. ॥ 72 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని అంగారక వ్రతమనే డెబ్బైరెండవ అధ్యాయం సంపూర్ణం.

త్రిసప్తతితమోఽధ్యాయః - డెబ్బైమూడవ అధ్యాయం

శుక్ర పూజావిధిః - శుక్ర పూజావిధి

పిప్పలాద ఉవాచ :- పిప్పలాదుడు చెప్పాడు.

అథాత శ్శృణు భూపాల ప్రతిశుక్ర ప్రశాన్తయే ।
యాత్రారమ్భేఽవసానే చ తథా శుక్రోదయే త్విహ ॥1॥

రాజతే వాఽథ సౌవర్ణే కాంస్యపాత్రేఽథవా పునః ।
శుక్లపుష్పామ్బరయుతే సితతణ్డులపూరితే ॥2॥

భూపాలకా! ఇక శుక్ర ప్రశాంతికై చేయదగిన వ్రతాన్ని గూర్చి విను. ఈ వ్రతం యాత్ర మొదట గానీ, చివర గానీ, శుక్రోదయ సమయంలో గానీ చేయాలి. తెల్లని వస్త్రం చుట్టిన వెండి లేదా బంగారు, లేదా కంచు పాత్రను తెల్లని బియ్యంతో నింపాలి.

విధాయ రాజతం శుక్రం శుచిముక్తాఫలాన్వితమ్ ।
మన్త్రేణానేన తత్సర్వం సామగాయ నివేదయేత్ ॥3॥

వెండితో శుక్రుని ప్రతిమను చేసి తెల్లని ముత్యాలతో గూడా ఈ క్రింది మంత్రోచ్చారణతో దాన్ని సామగానపరుని కివ్వాలి.

నమస్తే సర్వలోకేశ! నమస్తే భృగునన్దన! ।
కవే సర్వార్థసిద్ధ్యర్థం గృహాణార్ఘ్యం నమోఽస్తు తే ॥4॥

"సర్వలోకేశా! నీకు నమస్కారం. భృగునన్దనా నీకు నమస్కారం. కవీ! సర్వార్థసిద్ధికై ఈ పూజను గ్రహించు, నీకు నమస్కారం".

ఏవమస్యోదయే కుర్వన్యాత్రాదిషు చ భారత ।
సర్వాన్కామానవాప్నోతి విష్ణులోకే మహీయతే ॥5॥

భారతా! ఇలా శుక్రోదయకాలంలో యాత్రాదులలో చేసినవాడు సకలాభీష్టాలూ పొందుతాడు. విష్ణులోకంలో ఆదరింపబడతాడు.

యావచ్ఛుక్రస్య న హృతా పూజా సా మాల్యకై శ్శుభైః ।
వటకైః పూరికాభిశ్చ గోధూమైశ్చణకై రపి ।
తావదన్నం న చాశ్నీయాత్ స్త్రీభిః కామార్థసిద్ధయే ॥6॥

శుభప్రదమైన మాల్యాలతో, వటుకాలతో, పూరీలతో, గోధుమలతో, సెనగలతో, శుక్రునికి చేసే పూజ పూర్తి అయ్యేంతవరకూ కామార్థసిద్ధి కోరువారు స్త్రీలతో సహా భుజించరాదు.

తద్వద్వాచస్పతేః పూజాం ప్రవక్ష్యామి యుధిష్ఠిర! ।
సువర్ణపాత్రే సౌవర్ణమమరేశపురోహితమ్ ॥7॥

పీతపుష్పామ్బరయుతం కృత్వా స్నాత్వాథ సర్షపైః ।
పలాశాశ్వత్థయోగేన పఞ్చగవ్యజలేన చ ॥8॥

యుధిష్ఠిరా! ఈ రీతిగానే బృహస్పతి పూజను గూడా వివరిస్తాను. స్వర్ణపాత్రలో స్వర్ణబృహస్పతిని పీతపుష్పాంబరయుతుణ్ణిగా చేయాలి. ఆపై మోదుగ, రావి చిగుళ్ల మొక్కలతో గూడ ఆవాలు కలిపిన పంచగవ్యమిశ్రితజలంతో స్నానం చేయాలి.

పీతాఙ్గరాగవసనో ఘృతహోమం తు కారయేత్ ।
ప్రణమ్య చ గవా సార్ధం బ్రాహ్మణాయ నివేదయేత్ ॥9॥

పీతవర్ణమైన వస్త్రం, అంగరాగం కలవాడై ఘృతంతో హోమం చేయాలి. నమస్కరించి గోవుతో గూడా ఆ ప్రతిమను బ్రాహ్మణునికి సమర్పించాలి.

నమస్తేఽఙ్గిరసాం నాథ వాక్పతే చ బృహస్పతే ।
క్రూరగ్రహైః పీడితానామమృతాయ నమో నమః ॥10॥

"అంగిరోనాథా! వాక్పతీ! బృహస్పతీ! క్రూరగ్రహపీడితులకు రక్ష చేకూర్చు దేవా! నీకు నమస్కారం!"

సఙ్క్రాన్తావస్య కౌన్తేయ యాత్రాస్వభ్యుదయేషు చ ।
కుర్వన్బృహస్పతేః పూజాం సర్వాన్కామాన్సమశ్నుతే ॥11॥

కుంతీకుమారా! సంక్రమణ కాలంలో గానీ, యాత్రలలో గానీ, అభ్యుదయం కల్గినప్పుడు గానీ బృహస్పతిని పూజించినవాడు సకలకామాలూ పొందుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శుక్రపూజా విధిర్నామ త్రిసప్తతితమోఽధ్యాయః ॥ 73 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని శుక్రపూజావిధి అనే డెబ్బై మూడవ అధ్యాయం సంపూర్ణం

చతుఃసప్తతితమోఽధ్యాయః – డెబ్బైనాల్గవ అధ్యాయం

కల్యాణసప్తమీ వ్రతమ్ – కల్యాణసప్తమీ వ్రతం

బ్రహ్మోవాచ :– బ్రహ్మ చెప్పాడు.

భగవన్భవ! సంసారసాగరోత్తారకారకమ్ ।
కిఞ్చిద్వ్రతం సమాచక్ష్వ స్వర్గారోగ్యసుఖప్రదమ్ ॥1॥

దేవా! శివా! సంసారసాగరం నుండి తరింపజేయునదీ, స్వర్గాన్నీ, ఆరోగ్యాన్నీ, సుఖాన్నీ ఇచ్చేదీ అగు ఏదైనా వ్రతాన్ని గూర్చి చెప్పు.

ఈశ్వర ఉవాచ :– ఈశ్వరుడు చెప్పాడు.

సౌరం ధర్మం ప్రవక్ష్యామి నామ్నా కల్యాణసప్తమీమ్ ।
విశోకసప్తమీ తద్వత్ఫలాఢ్యా పాపనాశినీ ॥2॥

శర్కరాసప్తమీ పుణ్యా తథా కమలసప్తమీ ।
మన్దారసప్తమీ తద్వచ్ఛుభదా శుభసప్తమీ ॥3॥

సర్వానన్తఫలాః ప్రోక్తా స్సర్వా దేవర్షిపూజితాః ।
విధానమాసాం పక్ష్యామి యథావదనుపూర్వశః ॥4॥

సౌరధర్మాన్ని వివరిస్తాను. అందులో పాపములను నశింపజేసి ఫలప్రదములగు కల్యాణసప్తమి, విశోక సప్తమి, శర్కరాసప్తమి, కమలసప్తమి, మందారసప్తమి అట్లే శుభప్రదమైన 'శుభసప్తమి' ఇవన్నీ అనంతమైన ఫలాలను ప్రసాదించేవే. అన్నీ దేవర్షులచే పూజింపబడినవే. వీటి విధానాన్ని క్రమంగా వివరిస్తాను.

యదా తు శుక్లసప్తమ్యామాదిత్యస్య దినం భవేత్ ।
సా తు కల్యాణినీ నామ విజయా చ నిగద్యతే ॥5॥

శుక్లసప్తమినాడు ఆదివారమైతే దాన్ని 'కల్యాణినీ' అనీ, 'విజయా' అనీ అంటారు.

ప్రాతర్గవ్యేన పయసా స్నానమస్యాం సమాచరేత్ ।
తత శ్శుక్లామ్బరః పద్మమక్షతాభిః ప్రకల్పయేత్ ॥6॥

ఇందులో ఉదయాన గోవు పాలతో స్నానం చేయాలి. పిదప తెల్లని వస్త్రాలు ధరించి అక్షతలతో అష్ట దళపద్మాన్ని లిఖించాలి.

ప్రాఙ్ముఖోఽష్టదలం మధ్యే తద్వద్వృత్తాం చ కర్ణికామ్ ।
పుష్పాక్షతాభిర్దేవేశం విన్యసేత్సర్వతః క్రమాత్ ॥7॥

తూర్పుముఖంగా కూర్చొని అష్టదళాల మధ్య గుండ్రని దుద్దును, పుష్పాక్షతలతో దాని నలువైపులా నారాయణాకృతిని గీయాలి.

పూర్వేణ తపనాయేతి మార్తణ్డాయేతి చానలే ।
యామ్యే దివాకరాయేతి విధాత్రేతి చ నైరృతే ॥8॥

పశ్చిమే వరుణాయేతి భాస్కరాయేతి చానిలే ।
సౌమ్యే వికర్తనాయేతి రవయే చాష్టమే దళే ॥9॥

'తపనాయ నమః' అని తూర్పున, 'మార్తాండాయ నమః' అని ఆగ్నేయాన, 'దివాకరాయ నమః' అని దక్షిణాన, విధాత్రే నమః' అని నైరుతిలో, 'వరుణాయ నమః' అని పశ్చిమదిశలో, 'భాస్కరాయ నమః' అని వాయవ్యంలో, 'వికర్తనాయ నమః' అని ఉత్తరాన, ఈశాన్యంలో 'రవయే నమః' అని పూజించాలి.

ఆదావన్తే చ మధ్యే చ నమోఽస్తు పరమాత్మనే ।
మన్త్రై రేభి స్సమభ్యర్చ్య నమస్కారాన్తదీపితైః ॥10॥

ఆదిలో, మధ్యలో, అంతంలోనూ 'నమోఽస్తు పరమాత్మనే' అని ఈ మంత్రాలతో నమస్కారాంతంగా అర్చించాలి.

శుక్లవస్త్రైః ఫలైర్భక్ష్యైర్ధూపమాల్యానులేపనైః ।
స్థండిలే పూజయేద్భక్త్యా గుడేన లవణేన చ ॥11॥

శుక్లవస్త్రాలు, పలాలు, భక్ష్యాలు, ధూపం, మాల్యం, అనులేపనాలతో అర్చించి వేదికపై నున్న సూర్యుని బెల్లంతో మరియు ఉప్పుతో భక్తియుతుడై పూజించాలి.

తతో వ్యాహృతిమన్త్రేణ విసర్జేద్ద్విజపుఙ్గవాన్ ।
శక్తితః పూజయేద్భక్త్యా గుడక్షీరఘృతాదిభిః ।
తిలపాత్రం హిరణ్యం చ బ్రాహ్మణాయ నివేదయేత్ ॥12॥

పిమ్మట వ్యాహృతిమంత్రాలతో ద్విజవర్యులను సాగనంపాలి. గుడ క్షీర ఘృతాదులతో శక్తి కొలది వారిని అర్చించాలి. తిలపాత్రను, స్వర్ణాన్ని బ్రాహ్మణునికి దానం చెయ్యాలి.

ఏవం నియమకృత్సుప్త్వా ప్రాతరుత్థాయ మానవః ।
కృతస్నానజపో విప్రై స్సహైవ ఘృతపాయసమ్ ॥13॥

భుక్త్వా చ వేదవిదుషే బిడాలవ్రతవర్జితమ్ ।
ఘృతపాత్రం సకనకం సోదకుమ్భం నివేదయేత్ ॥14॥

ఇలా నియమం పాటించి నిద్రించి తెల్లవారగానే లేవాలి. స్నానజపాదులు అనుష్ఠించాలి. విప్రులతో గూడి ఘృతపాయసాన్నం భుజించాలి. ఆ పై వేదవేత్త, బిడాలవ్రతరహితుడైన విప్రునికి ఘృతపాత్రను, కనకంతో, జలకుంభంతో సహా నివేదించాలి.

ప్రీయతామత్ర భగవాన్పరమాత్మా దివాకరః ।
అనేన విధినా సర్వం మాసి మాసి వ్రతం చరేత్ ॥15॥

"భగవానుడు, పరమాత్మ అయిన సూర్యుడు ప్రీతినొందుగాక!" అని చెప్పాలి. ఈ విధంగా ప్రతిమాసం వ్రతం చేయాలి.

తతస్త్రయోదశే మాసి గా వై దద్యాత్త్రయోదశ ।
వస్త్రాలఙ్కారసంయుక్తాః సువర్ణాస్యాః పయస్వినీః ॥16॥

తరువాత త్రయోదశమాసంలో పదమూడు పాడిగోవులను వస్త్రాలంకారయుతంగా, సువర్ణాలంకృతంగా ఇవ్వాలి.

ఏకామపి ప్రదద్యాద్వా విత్తహీనో విమత్సరః ।
న విత్తశాఠ్యం కుర్వీత యతో మోహాత్పతత్యధః ॥17॥

విత్తం లేకుంటే మత్సరం లేకుండా ఒక్క గోవునైనా ఇవ్వాలి. విత్తశాఠ్యం తగదు. మోహం వల్ల అధఃపతనం తప్పదు.

అనేన విధినా యస్తు కుర్యాత్కల్యాణసప్తమీమ్ ।
సర్వపాపవినిర్ముక్త స్సూర్యలోకే మహీయతే ।
ఆయురారోగ్యమైశ్వర్యమనన్త మిహ జాయతే ॥18॥

ఇలా ఎవడు కల్యాణసప్తమీ వ్రతం ఆచరిస్తాడో, వాడు సర్వపాపనిర్ముక్తుడై సూర్యలోకంలో అనంతమైన ఆయురారోగ్యైశ్వర్యాలతో వర్ధిల్లుతాడు.

సర్వపాపహరా నిత్యం సర్వదైవతపూజితా ।
సర్వదోషోపశమనీ సదా కల్యాణసప్తమీ ॥19॥

సర్వపాపాలు హరించునదీ, సర్వదేవతలచే పూజింపబడినదీ, సర్వదుష్టులనూ శమింపజేసేదీ అయిన కల్యాణసప్తమీ వ్రత మిది.

ఇమామనన్తఫలదాం యస్తు కల్యాణసప్తమీమ్ ।
శృణోతి పఠతే చేహ సర్వపాపైః ప్రముచ్యతే ॥20॥

అనంతఫలప్రదమైన ఈ కల్యాణసప్తమిని విన్నవాడు, చదివినవాడు గూడ సర్వపాపవిముక్తుడవుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే కల్యాణ సప్తమీ వ్రతం నామ చతుస్సప్తతితమోఽధ్యాయః ॥ 74 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని కళ్యాణసప్తమీ వ్రతమనే డెబ్బైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచసప్తతితమోஉధ్యాయః - డెబ్బైఅయిదవ అధ్యాయం
విశోకసప్తమీ వ్రతమ్ - విశోకసప్తమీ వ్రతం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

విశోకసప్తమీం తద్వద్వక్ష్యామి మునిపుఙ్గవ! ।
యాముపోష్య నరశ్శోకం న కదాచిదిహాశ్నుతే ॥1॥

మునివర్యా! అట్లే విశోకసప్తమీ వ్రతాన్ని గురించి వివరిస్తాను. ఈ వ్రతం చేస్తూ ఉపవసించిన నరుడు ఎన్నడూ శోకం పొందదు.

మాఘే కృష్ణతిలై స్స్నాత్వా షష్ఠ్యాం వై శుక్లపక్షతః ।
కృతాహారః కృసరయా దన్తధావనపూర్వకమ్ ।
ఉపవాసవ్రతం కృత్వా బ్రహ్మచారీ భవేన్నిశి ॥2॥

మాఘశుక్ల షష్ఠినాడు దన్తధావనపూర్వకంగా నల్ల నువ్వులు కలిపిన జలాలతో స్నానం చేయాలి. పులగం మాత్రం భుజించి రాత్రి ఉపవాసముండి బ్రహ్మచర్యం పాటించాలి.

తతః ప్రభాత ఉత్థాయ కృతస్నానజపశ్శుచిః ।
కృత్వా తు కాఞ్చనం పద్మమర్కాయేతి చ పూజయేత్ ।
కరవీరేణ రక్తేన రక్తవస్త్రయుగేన చ ॥3॥

యథా విశోకం భువనం త్వయి చాదిత్య సర్వదా ।
తథా విశోకతా మేஉస్తు త్వద్భక్తిః ప్రతిజన్మ చ ॥4॥

ఆపై తెల్లవారగనే లేచి స్నానజపాదులు చేసి శుచియై కాంచనపద్మం తయారు చేయాలి. 'అర్కాయ నమః' అంటూ ఎర్ర గన్నేరు పూలతో, ఎర్రని వస్త్రద్వయంతో అర్చించాలి. ఆదిత్యా! సదా ఈ లోకం నిన్నాశ్రయించి శోకరహితంగా ఉన్నది. అట్లే "నాకు ప్రతి జన్మలో దుఃఖంలేకుండుటను గాక! నీ పై భక్తి కల్గుగాక!"అని ప్రార్థించాలి.

ఏవం సమ్పూజ్య షష్ఠ్యాం తు భక్త్యా సమ్పూజయేద్ద్విజాన్ ।
సుప్త్వా సమ్ప్రాశ్య గోమూత్రముత్థాయ కృతనైత్యకః ॥5॥

ఇలా పూజించి షష్ఠినాడు ద్విజులను గూడా అర్చించాలి. ఆ రాత్రి నిద్రించి లేచి గోమూత్రం స్వీకరించి నిత్యకర్మ లాచరించాలి.

సమ్పూజ్య విప్రానన్నేన గుడపాత్రసమన్వితమ్ ।
తద్వస్త్రయుగ్మం పద్మం చ బ్రాహ్మణాయ నివేదయేత్ ॥6॥

విప్రులను అన్నాదులతో అర్చించి గుడపాత్ర సమన్వితంగా ఆ రెండు వస్త్రాలనూ, పద్మాన్నీ బ్రాహ్మణునికి సమర్పించాలి.

అతైలలవణం భుక్త్వా సప్తమ్యాం మౌనసంయుతః ।
తతః పురాణశ్రవణం కర్తవ్యం భూతిమిచ్ఛతా ॥7॥

సప్తమినాడు నూనె, ఉప్పు లేకుండా భుజించి మౌనం పాటించి ఐశ్వర్యం కోరేవాడు పురాణశ్రవణం చేయాలి.

అనేన విధినా సర్వముభయోరపి పక్షయోః ।
కృత్వా యావత్పునర్మాఘశుక్లపక్షస్య సప్తమీ ॥8॥

ఈ రీతిగా ఉభయపక్షాలలోనూ, మళ్లీ మాఘ శుక్లసప్తమి వచ్చేవరకూ ఆచరించాలి.

వ్రతాన్తే కలశం దద్యాత్సువర్ణకమలాన్వితమ్ ।
శయ్యాం సోపస్కరాం దద్యాత్కపిలాం చ పయస్వినీమ్ ॥9॥

వ్రతాంతంలో స్వర్ణకమలం గల కలశాన్నీ, అందంగాతీర్చిన శయ్యనూ, కపిలవర్ణం కల పాడి ఆవునూ దానం చెయ్యాలి.

అనేన విధినా యస్తు విత్తశాఠ్యవివర్జితః ।
విశోకసప్తమీం కుర్యా త్స యాతి పరమాం గతిమ్ ॥10॥

ఈ విధంగా ధనలోభం లేకుండా విశోకసప్తమిని ఆచరించినవాడు పరమగతిని పొందుతాడు.

యావజ్జన్మసహస్రాణాం సాగ్రం కోటిశతం భవేత్ ।
తావన్నశోకమభ్యేతి రోగదౌర్గత్యవర్జితః ॥11॥

వేయినూరు కోట్ల జన్మల కాలం వరకూ అతడు రోగం, దౌర్గత్యం లేనివాడై శోకం పొందడు.

యం యం ప్రార్థయతే కామం తం తమాప్నోతి పుష్కలమ్ ।
నిష్కామః కురుతే యస్తు స పరం బ్రహ్మ గచ్ఛతి ॥12॥

సకాముడై ఏ కోరిక కోరినా అది నెరవేరుతుంది. నిష్కామునికి బ్రహ్మప్రాప్తి సిద్ధిస్తుంది.

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి విశోకాఖ్యాం చ సప్తమీమ్ ।
సోఽపీన్ద్రలోకమాప్నోతి న దుఃఖీ జాయతే క్వచిత్ ॥13॥

ఈ విశోకమనే సప్తమిని గురించి చదివినవాడు, విన్నవాడు ఇంద్రలోకం చేరుకొంటాడు, ఎక్కడా దుఃఖం పొందడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే విశోకసప్తమీవ్రతమనే పంచసప్తతితమోఽధ్యాయః. ॥ 75 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని విశోకసప్తమీవ్రతమనే డెబ్బైఅయిదవ అధ్యాయం సంపూర్ణం.

షట్సప్తతితమోఽధ్యాయః – డెబ్బైఆరవ అధ్యాయం

ఫలసప్తమీ వ్రతమ్ – ఫలసప్తమీ వ్రతం

ఈశ్వర ఉవాచ :– ఈశ్వరుడు చెప్పాడు.

అన్యామపి ప్రవక్ష్యామి నామ్నా తు ఫలసప్తమీమ్ ।
యాముపోష్య నరః పాపాద్విముక్త స్స్వర్గభాగ్భవేత్ ॥1॥

మరొక వ్రతమైన ఫలసప్తమిని గురించి గూడా చెబుతాను. దానినాచరించినవాడు పాపరహితుడై స్వర్గానికి వెళ్తాడు.

మార్గశీర్షే శుభే మాసి సప్తమ్యాం నియతవ్రతః ।
తముపోష్యాథ కమలం కారయిత్వా తు కాఞ్చనమ్ ॥2॥

శర్కరాసంయుతం దద్యాద్బ్రాహ్మణాయ కుటుమ్బినే ।
రవిం కాఞ్చనకం కృత్వా పలస్యైకస్య ధర్మవిత్ ।
దద్యాద్ద్వికాలవేలాయాం భాను ర్మే ప్రీయతామితి ॥3॥

శుభప్రదమగు మార్గశీర్ష మాసంలో సప్తమినాడు నియతవ్రతుడై ఉపవాసముండాలి. బంగారు కమలం తయారు చేయించి చక్కెరతో సహా గృహస్థుడగు బ్రాహ్మణుని కివ్వాలి. ఒక పలం తూగే బంగారుతో సూర్యుణ్ణి చేయించి ధర్మజ్ఞుడై అపరాహ్ణవేళలో 'భానుర్మే ప్రీయతామ్' అంటూ సమర్పించాలి.

భక్త్యా తు విప్రాన్సమ్పూజ్య చాష్టమ్యాం క్షీరభోజనమ్ ।
దత్త్వా కుర్యాత్ఫలయుతం యావత్స్యాత్కృష్ణసప్తమీ ॥4॥

భక్తితో అష్టమినాడు బ్రాహ్మణులను పూజించి వారికి ఫలసమేతంగా క్షీరభోజనం పెట్టాలి. కృష్ణసప్తమి వరకూ ఇలాగే చేయాలి.

తామప్యుపోష్య విధివదనేనైవ క్రమేణ తు ।
తద్వ ద్ధైమఫలం దత్త్వా సువర్ణకమలాన్వితమ్ ॥5॥

శర్కరాపాత్రసంయుక్తం వస్త్రమాల్యసమన్వితమ్ ।
సంవత్సరం చ తేనైవ విధినోభయసప్తమీమ్ ॥6॥

కృష్ణ సప్తమినాడు ఉపవసించి విధ్యుక్తవిధానంతో పైరీతిగానే సువర్ణ కమలం, స్వర్ణఫలం, చక్కెరపాత్ర, వస్త్రమాల్యాలు సమర్పించాలి. ఒక సంవత్సరకాలం ఇలాగే ఉభయ పక్షాలలోని సప్తమీతిథులలో అనుష్ఠించాలి.

ఉపోష్య దత్త్వా క్రమశస్సూర్యమన్త్రముదీరయేత్ ।
భానురర్కో రవిర్బ్రహ్మా సూర్యశ్శక్రో హరి శ్శివః ।
శ్రీమాన్విభావసుస్త్వష్టా వరుణః ప్రీయతామితి ॥7॥

ఆ తిథులలో ఉపవసించి ఇలా దానం చేసి క్రమంగా సూర్యమంత్రం ఉచ్చరించాలి. ప్రతినెలా "భానుః ప్రీయతామ్, అర్కః ప్రీయతమ్, రవిః ప్రీయతామ్, బ్రహ్మా ప్రీయతామ్, సూర్యః ప్రీయతామ్, శక్రః ప్రీయతామ్, హరిః ప్రీయతామ్, శివః ప్రీయతామ్, శ్రీమాన్ ప్రీయతామ్, విభావసుః ప్రీయతామ్, త్వష్టా ప్రీయతామ్, వరుణః ప్రీయతామ్" అని సూర్యమంత్రం ఉచ్చరించాలి.

ప్రతిమాసం చ సప్తమ్యామేకైకం నామ కీర్తయేత్ ।
ప్రతిపక్షం ఫలత్యాగమేతత్కుర్వన్సమాచరేత్ ॥8॥

ప్రతిమాసం సప్తమినాడు ఒక్కొక్క పేరు ఉచ్చరించాలి. ప్రతి పక్షంలోను ఇలాగే చేసి ఫలత్యాగం చేయాలి.

వ్రతాన్తే విప్రమిథునం పూజయేద్వస్త్రభూషణైః ।
శర్కరాకలశం దద్యాద్ధేమపద్మఫలాన్వితమ్ ॥9॥

వ్రతం పూర్తి కాగానే వస్త్ర భూషణాదులతో బ్రాహ్మణదంపతుల్ని పూజించాలి. చక్కెర నింపిన పాత్రనూ, సువర్ణ పద్మంతో సహా వారికి సమర్పించాలి.

యథా న విఫలాః కామాస్త్వద్భక్తానాం సదా రవే! ।
తథాఽనన్తఫలావాప్తిరస్తు మే సప్తజన్మసు ॥10॥

"రవీ! నీ భక్తుల కోరికలు విఫలం కాకుండునట్లు నాకు ఏడు జన్మలలో అనంతఫలావాప్తి కలుగుగాక!

ఇమామనన్తఫలదాం యః కుర్యాత్ఫలసప్తమీమ్ ।
సర్వపాపవిశుద్ధాత్మా సూర్యలోకే మహీయతే ॥11॥

అనంతఫల ప్రదమగు ఈ ఫలసప్తమి నెవడు ఆచరిస్తాడో, వాడు సకలపాపాలూ తొలగి శుద్ధాత్ముడై సూర్యలోకంలో పూజింపబడతాడు.

సురాపానాదికం కించిద్యదత్రాముత్ర వా కృతమ్ ।
తత్సర్వం నాశమాయాతి యః కుర్యాత్ఫలసప్తమీమ్ ॥12॥

ఈ ఫలసప్తమీ వ్రతం అనుష్ఠించినవానికి ఈ లోకంలో, లేదా పరలోకంలోగాని ఏదైనా సురాపానాదికమైన దుష్కృతం చేసి ఉంటే అదంతా నశించిపోతుంది.

కుర్వాణ స్సప్తమీం చేమాం సతతం రోగవర్జితః ।
భూతాన్భవ్యాంశ్చ పురుషాంస్తారయేదేకవింశతిమ్ ।
యశ్శృణోతి పఠేద్వాఽపి సోఽపి కల్యాణభాగ్భవేత్ 13॥

సప్తమీవ్రతకర్త సదా రోగం లేనివాడై గతించిన, రానున్న ఇరువదొక్కతరాల వారిని తరింపజేస్తాడు. దీన్ని విన్నా చదివినా అట్టివాడుగూడా కల్యాణం పొందుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఫలసప్తమీ వ్రతం నామ షట్సప్తతితమోఽధ్యాయః. ॥ 76 ॥

శ్రీమత్స్య పురాణంలోని ఫలసప్తమీవ్రతమనే డెబ్బైఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తసప్తతితమోఽధ్యాయః - డెబ్బైఏడవ అధ్యాయం
శర్కరా సప్తమీ వ్రతమ్ - శర్కరా సప్తమీ వ్రతం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

శర్కరాసప్తమీం వక్ష్యే తద్వత్కల్మషనాశినీమ్ ।
ఆయురారోగ్యమైశ్వర్యం యయాఽనన్తం ప్రజాయతే ॥1॥

ఇక పాపపరిహారకమైన శర్కరాసప్తమిని గురించి చెబుతాను. దీనివల్ల ఆయురా రోగ్యైశ్వర్యాదులు అనంతంగా సిద్ధిస్తాయి.

మాధవస్య సితే పక్షే సప్తమ్యాం నియతవ్రతః ।
ప్రాతస్స్నాత్వా తిలై శ్శుక్లై శ్శుక్లమాల్యానులేపనైః ॥2॥

వైశాఖమాసంలోని శుక్లపక్షంలో సప్తమినాడు నియతవ్రతం కలవాడై తెల్లనువ్వులు కలిపిన నీట స్నానం చేయాలి. తెల్లనిపూమాలలూ, అనులేపనం కల్గియుండాలి.

స్థణ్డిలే పద్మమాలిఖ్య కుఙ్కుమేన సకర్ణికమ్ ।
తస్మిన్నమస్సవిత్రే తు గన్ధధూపౌ నివేదయేత్ ॥3॥

కుంకుమతో వేదికపై దుద్దుగల పద్మాన్ని లిఖించాలి. అక్కడ 'నమః సవిత్రే' అంటూ గంధం, ధూపం నివేదించాలి.

స్థాపయేదుదకుమ్భం చ శర్కరాపాత్రసంయుతమ్ ।
శుక్లవస్త్రైరలఙ్కృత్య శుక్లమాల్యానులేపనైః ।
సువర్ణేన సమాయుక్తం మన్త్రేణానేన పూజయేత్ ॥4॥

చక్కెరపాత్రతో గూడిన జలకుంభాన్ని స్థాపించాలి. శుక్ల వస్త్రాలతో, శుక్లమాల్యానులేపనాలతో స్వర్ణ సమేతమైన దాని నలంకరించి ఈ మంత్రంతో అర్చించాలి.

విశ్వవేదమయో యస్మాద్వేదవాదీతి పఠ్యసే ।
సర్వస్యామృతమేవ త్వమతః శాంతిం ప్రయచ్ఛ మే ॥5॥

"విశ్వవేదమయుడవు కాన నీవు వేదవాది అని కీర్తింపబడుతున్నావు. కాన అందరికీ నీవు అమృత స్వరూపుడవే. అందుచేత నాకు శాంతిని ప్రసాదించు".

పఞ్చగవ్యం తతః పీత్వా స్వపేత్తత్పార్శ్వతః క్షితౌ ।
సౌరసూక్తం స్మరన్నాస్తే పురాణశ్రవణేన చ ॥6॥

తదుపరి పంచగవ్యం త్రాగి దాని ప్రక్కనే నేలపై శయనించాలి. సౌరసూక్తం స్మరిస్తూ పురాణం వినాలి.

అహోరాత్రే గతే పశ్చాదష్టమ్యాం కృతనైత్యకః ।
తత్సర్వం విదుషే తద్వద్బ్రాహ్మణాయ నివేదయేత్ ॥7॥

ఒక పగలు, రాత్రి గడచిన పిదప అష్టమినాడు నిత్యకృత్యాలు పూర్తిచేసి అదంతా విద్యావంతుడైన విప్రునికి నివేదించాలి.

భోజయేచ్ఛక్తితో విప్రాఞ్ఛర్కరాఘృతపాయసైః ।
భుఞ్జీతాతైలలవణం స్వయమప్యథ వాగ్యతః ॥8॥

బ్రాహ్మణులను శర్కరాఘృతపాయసాలతో శక్తి కొలది భుజింపజేయాలి. తాను తైలలవణాలు లేకుండా మౌనంతో భుజించాలి.

అనేన విధినా సర్వం మాసి మాసి సమాచరేత్ ।
సంవత్సరాన్తే శయనం శర్కరాకలశాన్వితమ్ ॥9॥

సర్వోపస్కరసంయుక్తం తథైకాం గాం పయస్వినీమ్ ।
గృహం చ శక్తిమాన్దద్యాత్సమస్తోపస్కరాన్వితమ్ ॥10॥

ఇలా ప్రతినెలా సర్వం ఆచరించాలి. సంవత్సరాంతంలో చక్కెర పాత్రనూ, అన్ని ఉపస్కరాలూ కల శయనమునూ, ఒక పాడి ఆవునూ, శక్తి ఉంటే అన్ని ఉపకరణాలూ గల గృహాన్నీ దానమివ్వాలి.

సహస్రేణాథ నిష్కాణాం కృత్వా దద్యాచ్ఛతేన వా ।
దశభిర్వాథ నిష్కేణ తదర్ధం వాపి శక్తితః ॥11॥

వెయ్యిగాని, నూరుగాని, పదిగాని, ఒకటిగాని స్వర్ణ నిష్కాలను చివరికి అర్ధ నిష్కాన్ని గాని శక్తి కొలది సమర్పించాలి.

సువర్ణాశ్వః ప్రదాతవ్యః పూర్వవన్మంత్రవాదనమ్ ।
న విత్తశాఠ్యం కుర్వీత కుర్వన్దోషం సమశ్నుతే ॥12॥

స్వర్ణంతో చేసిన అశ్వాన్ని ఇవ్వాలి. మంత్రోచ్చారణం ముందువలెనే చేయాలి. విత్తశాఠ్యం తగదు, దానివల్ల దోషం కల్గుతుంది.

అమృతం పిబతో వక్త్రాత్సూర్యస్యామృతబిన్దవః
నిపేతుర్యే ధరాయాం వై శాలిముద్గేక్షవ స్మృతాః ॥13॥

సూర్యుడు అమృతం త్రాగే వేళ ఏ అమృతబిందువులు ఆయన నోటినుండి క్రింద నేలపై పడినవో, అవియే శాలిధాన్యంగా, పెసలు, చెరుకుగా అయ్యాయి.

శర్కరా తు పరా తస్మాదిక్షుసారోఽమృతాత్మవాన్ ।
ఇష్టా రవేరతః పుణ్యా శర్కరా హవ్యకవ్యయోః ॥14॥

అందువల్ల చక్కెర మిక్కిలి శ్రేష్ఠమైనది. అది ఇక్షుసారం, అమృతాత్మకం, సూర్యుని కిష్టమైనది, అందుచే హవ్యకవ్యాలలో పవిత్రమైనది.

శర్కరా సప్తమీ చేయం వాజిమేధఫలప్రదా ।
సర్వదుష్టప్రశమనీ పుత్రపౌత్ర ప్రవర్ధినీ ॥15॥

ఈ శర్కరాసప్తమీ వ్రతం వాజపేయ ఫలం ప్రసాదిస్తుంది. సర్వదుష్టులనూ శమింపజేస్తుంది. పుత్ర పౌత్రులను వృద్ధి చేస్తుంది.

యః కుర్యాత్పరయా భక్త్యా స వై సద్గతిమాప్నుయాత్ ।
కల్పమేకం వసేత్స్వర్గే తతో యాతి పరం పదమ్ ॥16॥

మిక్కిలి భక్తితో దీని నాచరించినవాడు సద్గతి పొందుతాడు. ఒక కల్పకాలం స్వర్గంలో వుంటాడు. తదుపరి పరమపదం చేరుకొంటాడు.

ఇద మనఘ! శృణోతి య స్స్మరేద్వా పరిపఠతీహ సురేశ్వరస్య లోకే ।
మతిమపి చ దదాతి సోఽపి దేవైరమరవధూజనమాలయాఽభిపూజ్యః ॥17॥

అనఘా! ఎవడు లోకంలో అకల్మషమైన, దివాకరునికి చెందిన ఈ వ్రతాన్ని వింటాడో స్మరిస్తాడో, పఠిస్తాడో, ఇతరులకు బోధిస్తాడో వాడు సూర్యలోకం చేరుతాడు. దేవతలచేత, అమరస్త్రీలచేత పూజింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శర్కరా సప్తమీ వ్రతమ్ నామ సప్తసప్తతితమోఽధ్యాయః ॥ 77 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని శర్కరా సప్తమీ వ్రతమనే డెబ్బైఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టసప్తతితమోఽధ్యాయః - డెబ్బైఎనిమిదవ అధ్యాయం

కమలసప్తమీ వ్రతమ్ - కమలసప్తమీవ్రతం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అతఃపరం ప్రవక్ష్యామి తద్వత్కమలసప్తమీమ్ ।
యస్యా స్సఙ్కీర్తనాదేవ తుష్యతీహ దివాకరః ॥1॥

ఇకమీదట కమల సప్తమీవ్రతాన్ని చెబుతాను. దాన్ని కీర్తిస్తే చాలు సూర్యుడు సంతసిస్తాడు.

వసన్తామలసప్తమ్యాం స్నాతః సన్గౌరసర్షపైః ।
తిలపాత్రే చ సౌవర్ణే విధాయ కమలం శుభమ్ ॥2॥

వసంతంలోని శుక్లసప్తమినాడు తెల్ల ఆవాలు కలిపిన నీళ్ళలో స్నానం చేసి సువర్ణ తిలపాత్రలో శుభప్రదమైన కమలాన్ని ఉంచాలి.

వస్త్రయుగ్మావృతం కృత్వా గన్ధపుష్పైః సమర్చయేత్ ।
నమః కమలహస్తాయ నమస్తే విశ్వధారిణే ॥3॥

దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోఽస్తు తే ।
తతో ద్వికాలవేలాయాముదకుమ్భసమన్వితామ్ ॥4॥

విప్రాయ దద్యాత్సమ్పూజ్య వస్త్రమాల్యవిభూషణైః ।
శక్త్యా చ కపిలాం దద్యాదలంకృత్య విధానతః ॥5॥

దాన్ని రెండు వస్త్రాలతో కప్పి గంధపుష్పాలతో అర్చించాలి. 'కమల హస్తాయ నమః' (పద్మంచేతిలో ధరించినవాడా! నమస్సు) 'విశ్వధారిణే నమః' 'దివాకర నమస్తుభ్యం' ప్రభాకర! నమోఽస్తు తే, అని ఉచ్చరించాలి. తదనంతరం సంధ్యాసమయంలో ఉదకకుంభంతో, వస్త్రమాల్యవిభూషణాలతో కూడిన కపిల గోవు నలంకరించి పూజించి విప్రునికి విధ్యుక్త విధానంతో సమర్పించాలి.

అహోరాత్రే గతే పశ్చాదష్టమ్యాం భోజయేద్ద్విజాన్ ।
యథాశక్త్యథ భుఞ్జీత మాంసతైలవివర్జితమ్ ॥6॥

అహోరాత్రాలు గడవగానే యథాశక్తి అష్టమినాడు విప్రులకు భోజనం పెట్టాలి. మాంసతైలవర్జితంగా తానూ భుజించాలి.

అనేన విధినా శుక్లసప్తమ్యాం మాసి మాసి చ ।
సర్వం సమాచరేద్భక్త్యా విత్తశాఠ్యవివర్జితః ॥7॥

ఈ ప్రకారం శుక్లసప్తమినాడు ప్రతిమాసం ద్రవ్యలోభం లేకుండా అంతా భక్తితో అనుష్ఠించాలి.

వ్రతాన్తే శయనం దద్యాత్సువర్ణం కమలాన్వితమ్ ।
గాం చ దద్యాత్స్వశక్త్యా తు సువర్ణాఢ్యాం పయస్వినీమ్ ॥8॥

వ్రతాంతంలో స్వర్ణ కమల సమన్వితమైన శయనాన్ని ఇవ్వాలి. తన శక్తికొలది స్వర్ణాలంకృతమైన పాడియావును గూడ దానం చేయాలి.

భోజనాసనదీపాదీన్ దద్యాదిష్టానుపస్కరాన్ ।
అనేన విధినా యస్తు కుర్యాత్కమలసప్తమీమ్ ।
లక్ష్మీమనన్తామభ్యేతి సూర్యలోకే మహీయతే ॥9॥

భోజనం, ఆసనం, దీపం మొదలగు ఇష్టమైన ఉపకరణాలను గూడా ఇవ్వాలి. ఇలా ఎవడైతే కమల సప్తమిని ఆచరిస్తాడో, వాడు అనంతమైన లక్ష్మిని పొంది సూర్యలోకంలో ఆదరింపబడతాడు.

కల్పే కల్పే తతో లోకాన్సప్త గత్వా పృథక్పృథక్ ।
అప్సరోభిః పరివృత స్తతో యాతి పరాం గతిమ్ ॥10॥

తదుపరి ప్రతికల్పంలోనూ సప్తలోకాలకు విడివిడిగా పోయి అచ్చరలతో గూడి ఆపై ఉత్తమ గతిని పొందుతాడు.

యః పశ్యతీదం శృణుయాచ్చ మర్త్యః పఠేచ్చ భక్త్యాఽథ మతిం దదాతి ।
సోఽప్యత్ర లక్ష్మీమచలామవాప్య గన్ధర్వవిద్యాధరలోకభాక్స్యాత్ ॥11॥

ఎవడీ వ్రతాన్ని భక్తితో చూస్తాడో, వింటాడో, చదువుతాడో, దానిపై మతినుంచుతాడో, (ఇతరులకు బోధిస్తాడో) అతడు ఇహలోకంలో నిశ్చలమైన లక్ష్మిని పొంది గంధర్వవిద్యాధరలోకాలు చేరుకొంటాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే కమలసప్తమీవ్రతం నామ అష్ట సప్తతితమోఽధ్యాయః ॥ 78 ॥

శ్రీమత్స్య పురాణంలోని కమలసప్తమీవ్రతమనే డెబ్బైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనాశీతితమోఽధ్యాయః - డెబ్బైతొమ్మిదవ అధ్యాయం

మందారసప్తమీ వ్రతమ్ - మందార సప్తమీ వ్రతం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అథాత స్సమ్ప్రవక్ష్యామి సర్వపాపప్రణాశినీమ్ ।
సర్వకామప్రదాం రమ్యాం నామ్నా మన్దారసప్తమీమ్ ॥1॥

ఇక సకలపాపాలనూ నశింపజేసేదీ,సర్వకామాలనూ సమకూర్చేదీ అయిన మందారసప్తమీవ్రతంవివరిస్తాను.

మాఘస్యామలపక్షే తు పఞ్చమ్యాం లఘుభుఙ్నరః ।
దన్తకాష్ఠం తతః కృత్వా షష్ఠీముపవసేద్బుధః ॥2॥

మాఘమాసంలో శుక్లపక్షం పంచమినాడు తేలికపాటి ఆహారం గ్రహించి రాత్రి నిద్ర నుండి లేచి దంతధావనం కావించుకొని షష్ఠినాడు ఉపవసించాలి.

విప్రాన్సమ్పూజయిత్వా తు మన్దారం ప్రాశయేన్నిశి ।
తతఃప్రభాత ఉత్థాయ కృతస్నానః పునర్ద్విజాన్ ॥3॥

భోజయేచ్ఛక్తితః కృత్వా మన్దారకుసుమాష్టకమ్ ।
సౌవర్ణం పురుషం తద్వత్పద్మహస్తం సుశోభనమ్ ॥4॥

విప్రులను పూజించి ఆ రాత్రి మందారకుసుమ భక్షణం చేయాలి. తరువాత ఉదయాన లేచి స్నానం చేసి మళ్ళీ ద్విజులను శక్తి కొలది భుజింప జేయాలి. ఆ మీదట ఎనిమిది మందార పుష్పాలను సంపాదించి సువర్ణంతో పద్మహస్తునిగా సూర్యపురుషుణ్ణి చేయించాలి.

పద్మం కృష్ణతిలైః కృత్వా తామ్రపాత్రేఽష్టపత్రకమ్ ।
హేమమన్దారకుసుమై ర్భాస్కరాయేతి పూర్వతః ॥5॥

నమస్కారేణ తద్వచ్చ సూర్యాయేత్యానలే దలే ।
దక్షిణే తద్వదర్కాయ తథార్యమ్ణేతి నైరృతే ॥6॥

పశ్చిమే వేదధామ్నే చ వాయవ్యే చణ్డభానవే ।
పూష్ణేత్యుత్తరతః పూజ్యమానన్దాయేత్యతఃపరమ్ ॥7॥

కృష్ణతిలలతో అష్టదళపద్మం చేసి, తామ్రపాత్రలో ఉంచి స్వర్ణమందారకుసుమాలతో 'భాస్కరాయ నమః' అని తూర్పున, 'సూర్యాయ నమః' అని ఆగ్నేయాన, 'అర్కాయ నమః' అని దక్షిణాన, అర్యమ్ణే నమః' అని నైఋతిలో, 'వేదధామ్నే నమః' అని పడమట, 'చండభానవే నమః' అని వాయవ్యంలో, పూష్ణే నమః' అని ఉత్తరాన, 'ఆనందాయ నమః' అని ఈశాన్యంలో పూజించాలి.

కర్ణికాయాం చ పురుషం స్థాప్య సర్వాత్మనేతి చ ।
శుక్లవస్త్రై స్సమావేష్ట్య భక్ష్యైర్మాల్యఫలాదిభిః ॥8॥

దుద్దునందు పురుషుని నిలిపి 'సర్వాత్మనే నమః' అని శుక్లవస్త్రాలతో, భక్ష్యాలతో, పుష్పమాలలతో, పండ్లతో చుట్టాలి.

ఏవమభ్యర్చ్య తత్సర్వం దద్యాద్వేదవిదే పునః ।
భుఞ్జీతాతైలలవణం వాగ్యతః ప్రాఙ్ముఖో గృహీ ॥9॥

ఇలా పూజించి అదంతా వేదవేత్త అయిన విప్రునికివ్వాలి. తూర్పుముఖంగా ఉండి మౌనంగా రహిత తైలలవణ భోజనం చేయాలి.

అనేన విధినా సర్వం సప్తమ్యాం మాసి మాసి చ ।
కుర్యాత్సంవత్సరం యావద్విత్తశాఠ్యవివర్జితః ॥10॥

ఇలా ప్రతినెలా సప్తమినాడు సంవత్సరకాలం విత్తశాఠ్యం లేకుండా చేయాలి.

ఏతదేవ వ్రతాన్తే తు నిధాయ కలశోపరి ।
గోభిర్విభవతస్సార్థం దాతవ్యం భూతిమిచ్ఛతా ॥11॥

వ్రతం సమాప్తం కాగానే ఆ కలశమును గోవులతో, విభవంతో ఐశ్వర్య కామియైనవాడు దానం చేయాలి.

నమో మన్దారనాథాయ మన్దారభవనాయ చ ।
త్వం రవే తారయస్వాస్మాన్సంసారభయసాగరాత్ ॥12॥

మందారనాథునికి నమస్కారం, మందార భవనానికి నమస్కారం, రవీ! నీవు సంసారభయసాగరం నుండి మమ్ము తరింపజేయుము" అని ప్రార్థించాలి.

అనేన విధినా యస్తు కుర్యాన్మన్దారసప్తమీమ్ ।
విపాప్మా స సుఖీ మర్త్యః కల్పం చ దివి మోదతే ॥13॥

ఈ రీతిగా ఎవడు మందారసప్తమిని నిర్వర్తిస్తాడో, అతడు పాపరహితుడై సుఖంగా ఒక కల్పకాలం స్వర్గంలో సుఖిస్తాడు.

ఇమామమౌఘపటలభీషణధ్వాన్తదీపికామ్ ।
గచ్ఛన్ప్రగృహ్య సంసారే సర్వార్థాంశ్చ లభేన్నరః ॥14॥

పాపసమూహమనే గాఢమైన చీకటికి దీపికయైన దీన్ని గ్రహించి ఆచరించేవాడు సంసారంలో సర్వార్థాలూ పొందుతాడు.

మన్దారసప్తమీమేతామీప్సితార్థఫలప్రదామ్ ।
యః పఠేచ్ఛృణుయాద్వాఽపి సర్వపాపైః ప్రముచ్యతే ॥15॥

ఈ ప్రీతార్థఫలాలిచ్చే ఈ మందార సప్తమిని ఎవడు పఠిస్తాడో, వింటాడో, వాడు సర్వపాపవిముక్తు డవుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే మందార సప్తమీవ్రతం నామ ఏకోనాశీతితమోఽధ్యాయః ॥ 79 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని మందారసప్తమి వ్రతం అనే డెబ్బైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

అశీతితమోఽధ్యాయః - ఎనభైయవ అధ్యాయం

శుభసప్తమీ వ్రతమ్ - శుభసప్తమీ వ్రతం

శ్రీభగవానువాచ :- భగవానుడు చెప్పాడు.

అథాన్యామపి వక్ష్యామి శోభనాం శుభసప్తమీమ్ ।
యాముపోష్య నరో రోగశోకదుఃఖైః ప్రముచ్యతే ॥1॥

ఇక మరొక శుభప్రదమైన శుభసప్తమీ వ్రతాన్ని చెబుతాను. దాని ననుష్ఠించిన నరుడు రోగ శోక దుఃఖాదులనుండి విముక్తు డవుతాడు.

పుణ్యే చాశ్వయుజే మాసి కృతస్నానజపశ్శుచిః ।
వాచయిత్వా తతో విప్రానారభే చ్ఛుభసప్తమీమ్ ॥2॥

పుణ్యప్రదమైన ఆశ్వయుజమాసంలో స్నానం జపం చేసి శుచియై బ్రాహ్మణులచే స్వస్తివాచనం చేయించి శుభసప్తమీ వ్రతమారంభించాలి.

కపిలాం పూజయేద్భక్త్యా గన్ధమాల్యానులేపనైః ।
నమామి సూర్యసమ్భూతామశేషభువనాలయామ్ ।
త్వామహం శుభకల్యాణశరీరాం సర్వసిద్ధయే ॥3॥

గంధమాల్యానులేపనాదులతో కపిలగోవును భక్తితో అర్చించాలి. "సూర్యుని నుండి పుట్టినదానవూ, అశేషభువనం ఆలయంగా కలదానవూ, శుభశరీరం కల్గిన దానవగు నిన్ను నేను, సర్వసిద్ధికై నమస్కరిస్తున్నాను" అని ఆ గోవును ప్రార్థించాలి.

అథ కృత్వా తిలప్రస్థం తామ్రపాత్రేణ సంయుతమ్ ।
కాఞ్చనం వృషభం తద్వద్గన్ధమాల్యగుడాన్వితైః ॥4॥

ఫలైర్నానావిధై ర్భక్ష్యై ర్ఘృతపాయససంయుతైః ।
దద్యాద్ద్వికాలవేలాయా మర్యమా ప్రీయతామితి ॥5॥

పిదప తామ్ర పాత్రలోని తిలప్రస్థముంచి, గంధమాల్యగుడాదులతో, నానావిధ ఫలాలతో, భక్ష్యాలతో, ఘృతపాయసాదులతో సహా కాంచనవృషభాన్ని సాయంవేళలో 'అర్యమా ప్రీయతామ్' అని దానం చేయాలి.

పఞ్చగవ్యం చ సమ్ప్రాశ్య స్వపేద్భూమౌ విమత్సరః ।
తతః ప్రభాతే సఞ్జాతే భక్త్యా సంపూజయేద్ద్విజాన్ ॥6॥

పంచగవ్యప్రాశనం చేసి మత్సరం లేకుండా భూమిపై శయనించాలి. తదుపరి తెల్లవారగానే భక్తితో ద్విజులను అర్చించాలి.

అనేన విధినా దద్యాన్మాసి మాసి సదా నరః ।
వాససీ వృషభం హైమం తద్వద్గాం కాంచనోద్భవామ్ ॥7॥

సంవత్సరాన్తే శయనమిక్షుదణ్డగుడాన్వితమ్ ।
సోపధానకవిశ్రామం భాజనాసనసంయుతమ్ ॥8॥

ఈ విధంగా ప్రతి మాసంలోనూ వ్రతకర్త వస్త్రాలూ, బంగారుఎద్దునూ, కాంచనధేనువునూ ఇవ్వాలి. సంవత్సరాంతంలో చెరకుగడ, బెల్లంతో గూడ శయనాన్ని దిండు మున్నగా ఉపకరణాలతో, పాత్రలు, ఆసనాలతో సహా ఇవ్వాలి!

తామ్రపాత్రే తిలప్రస్థం సౌవర్ణం వృషభం తథా ।
దద్యాద్వేదవిదే సర్వం విశ్వాత్మా ప్రీయతామితి ॥9॥

తామ్రపాత్రలో తిలప్రస్థాన్ని (శేరునువ్వులు) శేరునువ్వులు స్వర్ణవృషభాన్ని ఉంచి వేదజ్ఞుడైన విప్రునికి 'విశ్వాత్మా ప్రీయతామ్' అంటూ ఇవ్వాలి.

అనేన విధినా విద్వాన్కుర్యాద్యశ్శుభసప్తమీమ్ ।
తస్య శ్రీర్విపులా కీర్తిర్భవేజ్జన్మని జన్మని ॥10॥

ఇలా ఏ విద్యావంతుడు శుభసప్తమీ వ్రతం చేస్తాడో, అతడు విపులమైన సిరినీ, కీర్తినీ, జన్మజన్మల్లో పొందుతాడు.

అప్సరోగణగంధర్వైః పూజ్యమానస్సురాలయే ।
వసేద్గణాధిపో భూత్వా యావదాభూతసమ్ప్లవమ్ ।
కల్పాదావవతీర్ణస్తు సప్తద్వీపాధిపో భవేత్ ॥11॥

సురాలయంలో అప్సరోగణగంధర్వులచేత పూజింపబడుతూ గణాధిపుడై భూతప్రళయం కలిగే వరకూ నివసిస్తాడు. మరల కల్పాది కాలాన అవతరించి సప్తద్వీపాలకు అధిపతి అవుతాడు.

బ్రహ్మహత్యాసహస్రస్య భ్రూణహత్యాశతస్య చ ।
నాశాయాలమియం పుణ్యాం పఠ్యతే శుభసప్తమీ ॥12॥

పవిత్రమైన ఈ శుభ సప్తమీ వ్రతాన్ని పఠిస్తే వేయి బ్రహ్మహత్యలు, నూరు భ్రూణహత్యలు నశిస్తాయి.

ఇమాం పఠేద్యశ్శృణుయాన్ముహూర్తం పశ్యేత్ప్రసఙ్గాదపి దీయమానమ్ ।
సోఽప్యత్ర సర్వాఘవిముక్తదేహః ప్రాప్నోతి విద్యాధరనాయకత్వమ్ ॥13॥

దీన్ని చదివినవాడూ, విన్నవాడూ, ప్రసంగవశాన దానం చేస్తూ వుండగా ముహూర్తకాలం చూచినవాడు, సకల పాపవిముక్తమైన శరీరం కలవాడై విద్యాధరనాయకత్వం పొందుతాడు.

యావత్సమాస్సప్త నరః కరోతి యస్సప్తమీం సప్తవిధానయుక్తామ్ ।
స సప్తలోకాధిపతిః క్రమేణ భూత్వా పదం యాతి పరం మురారేః ॥14॥

ఎవడీ సప్తమీ వ్రతాన్ని ఏడు సంవత్సరాలు సప్తవిధానయుక్తంగా చేస్తాడో, అతడు సప్తలోకాధిపతి అయి క్రమంగా వైష్ణవపదం పొందుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శుభసప్తమీ వ్రతం నామ అశీతితమోఽధ్యాయః ॥ 80 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని శుభసప్తమీ వ్రతం అనే ఎనబైయవ అధ్యాయం సంపూర్ణం

ఏకాశీతితమోఽధ్యాయః - ఎనబైఒకటవ అధ్యాయం
విశోకద్వాదశీ వ్రతమ్ - విశోక ద్వాదశీ వ్రతం

మను రువాచ :- మనువు చెప్పాడు.

కిమభీష్టవియోగశోకసఙ్ఘాదలముద్ధర్తుముపోషణవ్రతం చ ।
విభవోద్భవకారి భూతలేఽస్మి న్భవభూతేరపి సూదనం చ పుంసః ॥1॥

దేవా! ఇష్టమైన వారి వియోగంవల్ల కలిగే శోకసంతతినుండి ఉద్ధరించగల, వ్రతమేది? ఉపవాస మేది? ఈ లోకంలో విభవాన్ని కల్గించేదీ, సంసారభయాన్ని నశింపజేసేదీ అగు వ్రతమేది?

శ్రీమత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

పరిపృష్టమిదం జగత్ప్రియం తే విబుధానామపి దుర్లభం మహత్త్వాత్ ।
తవ భక్తిమత స్తథాపి వక్ష్యే వ్రతమిన్ద్రాసురమానవేషు గుహ్యమ్ ॥2॥

జగత్తుకు ప్రియమైన విషయం అడిగావు. ఇది మహత్త్వం కలది కాన దేవతలకు గూడా దుర్లభమైనది. అయినా భక్తుడవైన నీకు చెబుతాను. ఇది ఇంద్రునకు, అసురులకు మానవులకూ గుహ్యమై వున్నది.

పుణ్య మాశ్వయుజే మాసి విశోక ద్వాదశీవ్రతమ్ ।
దశమ్యాం లఘుభుగ్విద్వానారభేన్నియమేన తు ॥3॥

ఈ పావనమైన విశోక ద్వాదశీ వ్రతాన్ని ఆశ్వయుజంలో ఆరంభించాలి. దశమినాడు లఘువుగా భుజించి నియమం కల్గి దీనిని ప్రారంభించాలి.

ఉదఙ్ముఖః ప్రాఙ్ముఖో వా దన్తధావనపూర్వకమ్ ।
ఏకాదశ్యాం నిరాహార స్సమభ్యర్చ్య చ కేశవమ్ ।

శ్రియం చాభ్యర్చ్య విధివద్భోజ్యమేవ పరేఽహని ॥4॥
ఏవం నియమకృత్సుప్త్వా ప్రాతరుత్థాయ మానవః ।

స్నానం సర్వౌషధైః కుర్యాత్పఞ్చగవ్యజలేన చ ।
శుక్లమాల్యామ్బర స్తద్వ త్పూజయేచ్ఛ్రీశముత్పలైః ॥5॥

ఉత్తరముఖంగా కానీ, లేక తూర్పు ముఖంగా కానీ ఉండి దంతధావనం చేసుకోవాలి. ఏకాదశినాడు నిరాహారుడై కేశవుణ్ణి పూజించాలి, లక్ష్మిని గూడ అర్చించాలి. “నేను రేపు నా భోజనం స్వీకరిస్తాను” అని నియమం గైకొనాలి. ఆ రాత్రి నిద్రించి ఉదయాన లేచి సర్వౌషధ సమేతమైన జలాలతో, పంచగవ్యంతో స్నాన మాడాలి. శుక్లమాల్యాలనూ, వస్త్రాలనూ ధరించి నల్ల కలువలతో లక్ష్మీనాథుణ్ణి అర్చించాలి.

విశోకాయ నమః పాదౌ జఙ్ఘే చ వరదాయ వై ।
శ్రీశాయ జానునీ తద్వదూరూ చ జలశాయినే ॥6॥

కన్దర్పాయ నమో గుహ్యం మాధవాయ నమఃకటిమ్ ।
దామోదరాయేత్యుదరం పార్శ్వే తు విపులాయ వై ॥7॥

నాభిం చ పద్మనాభాయ హృదయం మన్మథాయ వై ।
శ్రీధరాయ నమో వక్షః కరౌ మధుజితే నమః ॥8॥

చక్రిణే వామబాహుం చ దక్షిణం గదినే నమః ।
వైకుణ్ఠాయ నమః కణ్ఠమాస్యం యజ్ఞముఖాయ వై ॥9॥

'విశోకాయ నమః' అని పాదాలను పూజించాలి. 'వరదాయ నమః' అని పిక్కలనూ, 'శ్రీశాయ నమః' అని మోకాళ్లనూ, జలశాయినే నమః' అని ఊరువులనూ, 'కందర్పాయ నమః' అని గుహ్యాన్నీ, 'మాధవాయ నమః' అని కటినీ, 'దామోదరాయ నమః' అని ఉదరాన్నీ 'విపులాయ నమః' అని పార్శ్వాలనూ, 'పద్మనాభాయ నమః' అని నాభినీ, 'మన్మథాయ నమః' అని హృదయాన్నీ, 'శ్రీధరాయ నమః' అని వక్షాన్నీ, 'మధుజితే నమః' అని చేతుల్నీ, 'చక్రిణే నమః' అని వామ బాహువునూ,'గదినే నమః' అని దక్షిణబాహువునూ, 'వైకుంఠాయ నమః' అని కంఠాన్ని, 'యజ్ఞముఖాయ నమః', అని ముఖాన్ని అర్చించాలి.

నాసా మశోకనిధయే వాసుదేవాయ చాక్షిణీ ।
లలాటం వామనాయేతి హరయేతి పునర్భ్రువౌ ॥10॥

అలకాన్మాధవాయేతి కిరీటం విశ్వరూపిణే ।
నమస్సర్వాత్మనే తద్వచ్ఛిర ఇత్యభిపూజయేత్ ॥11॥

'అశోక నిధయే నమః' అని నాసికనూ, వాసుదేవాయ నమః' అని కన్నులనూ, 'వామనాయ నమః' అని లలాటాన్నీ, 'హరయే నమః' అని కనుబొమ్మలనూ, 'మాధవాయ నమః' అని ముంగురులనూ, 'విశ్వరూపిణే నమః' అని కిరీటాన్నీ, 'సర్వాత్మనే నమః' అని శిరస్సునూ పూజించాలి.

ఏవం సమ్పూజ్య గోవిన్దం ధూపమాల్యానులేపనైః ।
తతస్తు మణ్డపం కృత్వా స్థణ్డిలం కారయేన్ముదా ॥12॥

చతురస్రం సమన్తాచ్చ రత్నిమాత్రముదక్ప్లవమ్ ।
సూక్ష్మం హృద్యం చ పరితో వప్రత్రయసమావృతమ్ ॥13॥

ఇలా ఫలమాల్యానులేపనాలతో గోవిందుణ్ణి అర్చించి ఆపై సంతోషంతో మండపం లిఖించి దానిపై వేదిక ఏర్పాటు చేయాలి. ఆ వేదిక చతురస్రంగానూ, మూరెడు ప్రమాణంతో, ఉత్తరానికి వాలుగానూ, మృదువుగానూ, మనోహరంగానూ, చుట్టూ మూడు మట్టిగోడలతో పరివృతంగానూ ఏర్పాటు చేయాలి.

అంగుళేనోచ్ఛ్రితా వప్రాస్తద్విస్తారస్తు ద్వ్యంగులః ।
స్థణ్డిలస్యోపరిష్టాచ్చ భిత్తిరష్టాంగుళా భవేత్ ॥14॥

వప్రాలు అంగుళం ఎత్తు, రెండంగుళాల మందం ఉండాలి. వేదికపై గోడ ఎనిమిదంగుళాల ఎత్తుండాలి.

నదీవాలుకయా శూర్పే లక్ష్మ్యాః ప్రతికృతిం న్యసేత్ ।
స్థణ్డిలే శూర్పమారోప్య లక్ష్మీమిత్యర్చయేద్బుధః ॥15॥

నమో దేవ్యై నమశ్శాన్త్యై నమో లక్ష్మ్యై నమశ్శ్రియై ।
నమః పుష్ట్యై నమస్తుష్ట్యై వృష్ట్యై హృష్ట్యై నమో నమః ॥16॥

చేటలో నది యిసుకపోసి దానిపై లక్ష్మీదేవి ప్రతికృతి నుంచాలి. ఆ చేటను వేదిక పైనుంచి లక్ష్మిని బుధుడు అర్చించాలి. దేవికి నమస్కారం, శాంతికి, లక్ష్మికి, శ్రీకి, పుష్టికి, తుష్టికి, వృష్టికి, హృష్టికి నమో నమః అని అందరికీ విడివిడిగా నమస్కరించాలి.

విశోకా దుఃఖనాశాయ విశోకా వరదాఽస్తు మే ।
విశోకా చాస్తు సమ్పత్త్యై విశోకా సర్వసిద్ధయే ॥17॥

విశోక నా దుఃఖనాశానికి, విశోక నా వరదానానికి, విశోక సంపదకొరకు, విశోక సర్వసిద్ధికి అగుగాక! అని ప్రార్థనాపూర్వకంగా చెప్పాలి.

తతశ్శుక్లామ్బరై శ్శూర్పం వేష్ట్య సమ్పూజయేత్ఫలైః ।
భక్ష్యైర్నానావిధై స్తద్వత్సువర్ణకలశేన చ ॥18॥

రజనీషు చ సర్వాసు పిబేద్దర్భోదకం పునః ।
తతస్తు గీతనృత్యాది కారయేత్సకలాం నిశామ్ ॥19॥

తదుపరి తెల్లవస్త్రాలతో చేటను చుట్టి దానిని ఫలాలతో, వివిధ భక్ష్యాలతో పూజించి దేవికి సువర్ణకలశమును అర్పించాలి. అన్ని రాత్రులందూ బుధుడు దర్భోదకం త్రాగాలి. తర్వాత రాత్రి అంతా గీత నృత్యాదుల నేర్పాటు చేయాలి.

యామత్రయే వ్యతీతే తు తత ఉత్థాయ మానవః ।
అభిగమ్య చ విప్రాణాం మిథునాని సమర్చయేత్ ॥20॥

మూడు జాములు గడచిన పిదప నిద్రించి మళ్ళీ లేచి జనుడు ఎదురుగా వెళ్ళి విప్రమిథునాలను పూజించాలి.

శక్తితస్త్రీణి చైకం చ వస్త్రమాల్యానులేపనైః ।
శయనానిచ పూజ్యాని నమోఽస్తు జలశాయినే ॥21॥

శక్తి కొలది మూడు లేదా ఒకటి శయ్యలను వస్త్రమాల్యానులేపనాలతో, నమోఽస్తు జలశాయినే' అంటూ పూజించాలి.

తతస్తు గీతవాదాద్యై రాత్రౌ జాగరణే కృతే ।
ప్రభాతే చ తతః స్నానం కృత్వా దామ్పత్యమర్చయేత్ ॥22॥

ఆపై గీత వాద్యాలతో జాగరణం చేసి ప్రభాతవేళ స్నానం చేసి ద్విజదంపతుల నర్చించాలి.

భోజనం చ యథాశక్త్యా విత్తశాఠ్యవివర్జితః ।
భుక్త్వా శ్రుత్వా పురాణాని తద్దినం చాతివాహయేత్ ॥23॥

విత్తశాఠ్యం లేకుండా యథాశక్తి భోజనం పెట్టాలి. తానూ తిని పురాణాలు విని ఆ దినమంతా అలా గడపాలి.

అనేన విధినా సర్వం మాసిమాసి సమాచరేత్ ।
వ్రతాన్తే శయనం దద్యాద్గుడధేనుసమన్వితమ్ ।
సోపధానకవిశ్రామ సాస్తరావరణం శుభమ్ ॥24॥

ఇలా ప్రతిమాసం కార్యమంతా నిర్వర్తించాలి. వ్రతాంతంలో గుడధేను సమన్వితంగా దిండు మొదలైన పరికరాలతో ఆవరణతో గూడిన శుభమైన శయనాన్ని దానమివ్వాలి.

యథా న లక్ష్మీ ర్దేవేశ! త్వాం పరిత్యజ్య గచ్ఛతి ।
తథా సురూప మారోగ్య మశోకశ్చాస్తు మే సదా ॥25॥

'దేవేశా! లక్ష్మి ఎలా నిన్ను వదలి పోదో, అట్లే నన్ను గూడా వదలక ఉండి నాకు సురూపం, ఆరోగ్యం, అశోకం నాకు సదా కల్గుగాక!

యథా దేవేన రహితా న లక్ష్మీర్జాయతే క్వచిత్ ।
తథా విశోకతా మేఽస్తు భక్తిరగ్ర్యా చ కేశవే ॥26॥

లక్ష్మి ఎలా విష్ణువు లేకుండా ఉండదో, అట్లే నాకు దుఃఖంలేని స్థితి ఉండుగాక! ఉత్తమమైన కేశవ భక్తి కల్గుగాక!"

మన్త్రేణానేన శయనం గుడధేనుసమన్వితమ్ ।
శూర్పం చ లక్ష్మ్యా సహితం దాతవ్యం భూతిమిచ్ఛతా ॥27॥

ఉత్పలం కరవీరం చ బాణమమ్లానకుంకుమమ్ ।
కేతకీ సింధువారం చ మల్లికా గంధపాటలమ్ ।
కదంబం మాలతీ చాపి శస్తాన్యేతాని సర్వదా ॥28॥

ఈ మంత్రంతో గుడ ధేను సమన్వితమైన శయనాన్నీ, లక్ష్మీసమేతమైన చేటనూ సంపద కోరేవాడు దానం చేయాలి. ఈ పూజలో సర్వదా నల్లగలువ, గన్నేరు, వాడిపోని మొగ్గ గల తెల్లుపువ్వు, కుంకుమపువ్వు, మొగలి, సింధువారం, మల్లిక, సంపంగి, మంకెన, కడిమ, మాలతి, జాతిపుష్పాలు వరుసగా ప్రశస్తాలు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే విశోకద్వాదశీ వ్రతం నామ ఏకాశీతితమోఽధ్యాయః ॥ 81 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని విశోకద్వాదశీవ్రతమనే ఎనబ్బైఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్వ్యశీతితమో௨ధ్యాయః - ఎనభైరెండవ అధ్యాయం

గుడధేను ప్రతిమా దాన వైశిష్ట్యమ్ - గుడధేను ప్రతిమా దానవైశిష్ట్యం

మనురువాచ :- మనువు చెప్పాడు.

గుడధేనువిధానం మే సమాచక్ష్వ జగత్పతే ।
కింరూపం కేన మన్త్రేణ దాతవ్యం తదిహోచ్యతామ్ ॥1॥

జగత్పతీ! గుడధేను విధాన మనగా నేమో నాకు చెప్పు. దాని స్వరూపం ఎలా ఉండాలి, ఏ మంత్రంతో ఆరాధించాలి, వివరించు.

శ్రీమత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

గుడధేనువిధానస్య యద్రూపమిహ యత్ఫలమ్ ।
తదిదానీం ప్రవక్ష్యామి సర్వపాపవినాశనమ్ ॥2॥

గుడధేను విధానానికి, రూపమేదో, ఫలమేదో సర్వపాపప్రణాశకమైన దాని నిప్పుడు చెప్పబోతున్నాను.

కృష్ణాజినం చతుర్హస్తం ప్రాగగ్రం విన్యసేద్భువి ।
గోమయేనానులిప్తాయాం దర్భానాస్తీర్య సర్వతః ॥3॥

భూమిని గోమయంతో అలికి అంతటా దర్భలు పరచాలి. నాల్గు చేతుల కొలతలు గల కృష్ణాజినాన్ని (నల్లలేడిచర్మాన్ని)తూర్పు ముఖంగా భూమిపై పరచాలి.

లఘ్వేణకాజినం తద్వ ద్వత్సం చ పరికల్పయేత్ ।
ప్రాఙ్ముఖీం కల్పయేద్ధేను ముదక్పాదాం సవత్సకామ్ ॥4॥

చిన్న జింక చర్మాన్నీ, అట్లే దూడనూ కల్పించాలి. ధేనువును తూర్పు ముఖంగానుంచి ఉత్తరంవైపు పాదాలున్నట్లుగా దూడను నిలపాలి.

ఉత్తమా గుడధేనుస్స్యాత్తదా భారచతుష్టయమ్ ।
వత్సం భారేణ కుర్వీత ద్వాభ్యాం వై మధ్యమా స్మృతా ॥5॥

అర్ధభారేణ వత్సస్స్యా త్కనిష్ఠా భారకేణ తు ।
చతుర్థాంశేన వత్సస్స్యా ద్గృహవిత్తానుసారతః ॥6॥

నాల్గు బారువుల బెల్లంతో గుడధేనువును తయారు చేయాలి. దూడను ఒక బారువతో చేయాలి. ఇది ఉత్తమం. రెండు బారువుల ధేనువైతే దూడ అర్ధ బారువుండాలి ఇది మధ్యమం. ఉన్న సంపదను బట్టి ఒక్క బారువుతో ధేనువును చేస్తే కనిష్ఠం. అపుడు 1/4 బారువుతో దూడను కల్పించాలి. (20 మణుగులు=1బారువా)

ధేనువత్సౌ ఘృతాస్యౌ చ సితసూక్ష్మామ్బరావృతౌ ।
శుక్తికర్ణావిక్షుపాదౌ శుచిముక్తాఫలేక్షణౌ ॥7॥

గోవు దూడల ముఖాలు నెయ్యితో చేసి తెల్ల సన్నని వస్త్రాలతో కప్పాలి. శుక్తితో చెవులు, చెరకుతో పాదాలు, తెల్లముత్యాలతో కన్నులు కల్పించాలి.

సితసూత్రసిరాలౌ తౌ సితకమ్బళకమ్బళౌ ।
తామ్రగండకపృష్ఠౌ తౌ సితచామరరోమకౌ ॥8॥

నరాలు తెల్ల దారాలతో చేయాలి. తెల్ల కంబళితో గంగడోలు చేయాలి. గండభాగం, పృష్ఠం రాగితో చేయాలి. తెల్లని చామర రోమాలుండాలి.

విద్రుమభ్రూయుగోపేతౌ నవనీతస్తనాన్వితౌ ।
క్షౌమపుచ్ఛౌ కాంస్యదోహావిన్ద్రనీలకతారకౌ ॥9॥

సువర్ణశృఙ్గాభరణౌ రాజతైః ఖురసంయుతైః ।
నానాఫలసమాయుక్తౌ ఘ్రాణగన్ధ కరణ్డకౌ ।
ఇత్యేవం రచయిత్వా తౌ ధూపదీపై రథార్చయేత్ ॥10॥

పగడాలతో రెండు కనుబొమ్మలు, నవనీతంతో స్తనాలు, పట్టుగుడ్డతో తోకలు, కంచుతో దోహ పాత్రలు, ఇంద్రనీలాలతో కనుగ్రుడ్లు, స్వర్ణంతో శృంగాభరణాలు, వెండితో గిట్టలు, వివిధ ఫలాలతో గూడిన ఘ్రాణ గంధ కరండకాలు. ఇలా ఆవును దూడను తయారు చేసి ధూపదీపాలతో అర్చించాలి.

యా లక్ష్మీ స్సర్వభూతానాం యాచ దేవేష్వవస్థితా ।
ధేనురూపేణ సా దేవీ మమ శాంతిం ప్రయచ్ఛతు ॥11॥

ఏ దేవి సర్వప్రాణులకూ లక్ష్మియో, దేవతలలో నెలకొని ఉన్నదో, ఆ దేవి ధేనురూపంలో నాకు శాంతినిచ్చుగాక!

దేహస్థా యా చ రుద్రాణీ శఙ్కరస్య సదా ప్రియా ।
ధేనురూపేణ సా దేవీ మమ పాపం వ్యపోహతు ।

శంకరునికి ప్రియమై ఆయన దేహంలో వున్న రుద్రాణి ఈ ధేనురూపంలో నాపాపం పోగొట్టుగాక!

విష్ణోర్వక్షసి యా లక్ష్మీ స్స్వాహా యా చ విభావసోః ॥12॥

చన్ద్రార్కశక్రశక్తిర్యా ధేనురూపాఽస్తు సా శ్రియమ్ ॥13॥

విష్ణువక్షఃస్థలాన ఏ లక్ష్మి వున్నదో, అగ్నికి ఏదేవి స్వాహాయో, చంద్రుడు, సూర్యుడు, ఇంద్రుడు – వీరి శక్తి ఏ ధేనురూపంలో వున్నదో ఆదేవి నాకు సంపదను అనుగ్రహించుగాక!

చతుర్ముఖస్య యా లక్ష్మీర్యాలక్ష్మీర్ధనదస్య చ ।
యాలక్ష్మీర్లోకపాలానాం సా ధేనుర్వరదాఽస్తు మే ॥14॥

ఏదేవి చతుర్ముఖుని లక్ష్మియో, కుబేరుని లక్ష్మియో, లోకపాలురకు లక్ష్మియో ఆ ధేనువు నాకు వరములిచ్చుగాక!

స్వధా యా పితృముఖ్యానాం స్వాహా యజ్ఞభుజాం చ యా ।
సర్వపాపహరా ధేనుస్తస్మాచ్ఛాన్తిం ప్రయచ్ఛ మే ॥15॥

పితృముఖ్యులకు ఏది స్వధయో, యజ్ఞభోక్తలకు ఏది స్వాహయో, అట్టి సకల పాపహారిణి అయిన ఓ ధేనువా! నీవు నాకు శాంతినిమ్ము".

ఏవమామన్త్ర్య తాం ధేనుం బ్రాహ్మణాయ నివేదయేత్ ।
విధానమేతద్ధేనూనాం సర్వాసామభిపఠ్యతే ॥16॥

యాస్తాః పాపవినాశిన్యః పఠ్యన్తే దశ ధేనవః ।
తాసాం స్వరూపం వక్ష్యామి నామాని చ నరాధిప ॥17॥

ఇలా ఆధేనువును ఆమంత్రణం చేసి బ్రాహ్మణునకు సమర్పించాలి. ఈ ధేనువుల విధానం ధేనువులకన్నిటికి వర్తిస్తుంది. రాజా ఏ పది ధేనువులు పాపమును నశింపజేయునవిగా చెప్పబడినవో వాటి స్వరూపాన్ని, నామాలను చెబుతాను.

ప్రథమా గుడధేనుస్స్యాద్ఘృతధేనుస్తథాఽపరా ।
తిలధేనుస్తృతీయా తు చతుర్థీ జలసంజ్ఞితా ॥18॥

మొదటిది గుడధేనువు, రెండవది ఘృతధేనువు, మూడవది తిలధేనువు, నాల్గవది జలధేనువు.

క్షీరధేనుశ్చ విఖ్యాతా మధుధేనుస్తథాఽపరా ।
సప్తమీ శర్కరాధేనురష్టమీ లవణస్య చ ॥19॥

ఐదవది క్షీరధేనువు, ఆరవది మధుధేనువు, ఏడవది శర్కరాధేనువు, ఎనిమిదవది లవణధేనువు,

రత్నధేనుశ్చ నవమీ దశమీ స్యాత్స్వరూపతః ।
కుమ్భాః స్యుర్ద్రవధేనూనా మితరాసాం తు రాశయః ॥20॥

తొమ్మిదవది రత్నధేనువు, పదవది అసలు ధేనువు. ద్రవధేనువులను కుంభాలలో, ఇతర ధేనువులను రాసులలో పెట్టాలి.

సువర్ణధేనుం చాప్యత్ర కేచిదిచ్ఛన్తి మానవాః ।
నవనీతేన తైలేన తథాఽన్యేపి మహర్షయః ॥21॥

కొంతమంది స్వర్ణ ధేనువును కూడా అభిలషిస్తున్నారు. వెన్నతో, రత్నాలతో చేయాలని వేరే కొందరు మహర్షు లన్నారు.

ఏతదేవ విధానం స్యా త్త ఏవోపస్కరా స్స్మృతాః ।
మన్త్రావాహనసంయుక్తాస్సదా పర్వణి పర్వణి ॥22॥

యథాశ్రద్ధం ప్రదాతవ్యా భుక్తిముక్తిఫలప్రదాః ।
గుడధేనుప్రసఙ్గేన సర్వాస్తావన్మయోదితాః ॥23॥

అశేషయజ్ఞఫలదాస్సర్వాః పాపహరాశ్శుభాః ।
వ్రతానా ముత్తమం యస్మాద్విశోకద్వాదశీవ్రతమ్ ॥24॥

తదఙ్గత్వేన చైవాత్ర గుడధేనుః ప్రశస్యతే ।
అయనే విషువే పుణ్యే వ్యతీపాతేఽథవా పునః ॥25॥

గుడధేన్వాదయో దేయాస్తూపరాగాదిపర్వసు ।
విశోకద్వాదశీ చైషా పుణ్యా పాపహరా శుభా ॥26॥

విధానం ఇదే. ఉపస్కరాలు పూర్వం చెప్పినవే. అవి మంత్రావాహన సంయుక్తాలుగా వుండాలి. సదా ప్రతి పండుగనాడు శ్రద్ధానుసారంగా భుక్తిముక్తి ఫలాలను చేకూర్చే వీటిని దానం ఇవ్వాలి. గుడధేను ప్రసంగంలో ఇవన్నీ నేను చెప్పాను. ఇవి సమస్త యజ్ఞ ఫలాలిచ్చేవి, పాపాలు పోగొట్టేవి, శుభావహమైనవి, వ్రతాలలో విశోక ద్వాదశీ ఉత్తమం. కావున దానికి అంగంగా ఇక్కడ గుడధేను ప్రశంస చేయడం జరిగింది. ఉత్తరాయణంలో (మకరసంక్రమణం), దక్షిణాయానంలో (కర్కాటక సంక్రమణం) విషువంలో వ్యతీపాతంలో, గ్రహణాది సందర్భాలలో గాని గుడధేన్వాదులను ఇవ్వాలి. ఈ విశోక ద్వాదశి పవిత్రమైనది. పాపహరమైనది, శుభమైనది.

యాముపోష్య నరో యాతి తద్విష్ణోః పరమం పదమ్ ।
ఇహలోకే చ సౌభాగ్యమాయురారోగ్యమేవ చ ॥27॥

ఈ వ్రతంలో ఉపవాసం వుండేవారు ఆ విష్ణువు యొక్క పరమపదం చేరుకుంటారు. ఈ లోకంలో సౌభాగ్యం, ఆయురారోగ్యాలు పొందుతారు.

వైష్ణవం పదమాప్నోతి మరణే చ స్మరన్హరిమ్ ।
నవార్బుదసహస్రాణి దశ చాష్టౌ చ ధర్మవిత్ ॥28॥

న శోకదుఃఖదౌర్గత్యం తస్య సఞ్జాయతే నృప ।

ధర్మవేత్త అయినవాడు ఈ వ్రతం నిర్వహించి మరణకాలంలో హరిని స్మరిస్తే వైష్ణవపదం పొందుతాడు. ఇరువది ఏడువేల అర్బుద సంవత్సరాలు శోకము, దుఃఖము, దౌర్గత్యము వానికి కలగవు.

నారీ వా కురుతే యా తు విశోకద్వాదశీవ్రతమ్ ।
నృత్యగీతపరా నిత్యం సాఽపి తత్ఫలమాప్నుయాత్ ॥29॥

తస్మాదగ్రే హరే ర్నిత్యమనన్తం గీతవాదనమ్ ।
కర్తవ్యం భూతికామేన భక్త్యా తు పరయా నృప ॥30॥

స్త్రీయైన నృత్యగీతపరురాలై ఈ విశోక ద్వాదశీవ్రతం చేస్తే ఆమె కూడా ఈ ఫలం పొందుతుంది. అందువల్ల రాజా హరి యెదుట భూతి కోరేవాడు అనంతంగా మిక్కిలి భక్తితో గీతవాదనం చేయాలి.

ఇతి పఠతి య ఇత్థం యః శృణోతీహ సమ్యక్ మధుమురనరకారేరర్చనం యశ్చ పశ్యేత్ ।
మతిమపి చ జనానాం యో దదాతీన్ద్రలోకే వసతి స విబుధౌఘైః పూజ్యతే కల్పమేకమ్ ॥31॥

దీనిని ఎవడు చదువుతాడో, వింటాడో మధుసూదనుడు, మురారీ, నరకారీ అయిన విష్ణువు యొక్క పూజను ఎవడు దర్శిస్తాడో, ఇతరులకు దీనిని గురించిన జ్ఞానాన్ని కలిగిస్తాడో వాడు ఇంద్రలోకంలో దేవతలతో గూడి నివసిస్తాడు. ఒక కల్పకాలం పూజింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే గుడధేను ప్రతిమా దాన వైశిష్ట్యమ్ నామ ద్వ్యశీతితమోఽధ్యాయః ॥ 82 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని గుడధేను ప్రతిమా దానవైశిష్ట్య మనే ఎనభైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్ర్యశీతితమోऽధ్యాయః - ఎనభైమూడవ అధ్యాయం

దాన ప్రభావః - దాన ప్రభావం

నారద ఉవాచ :- నారదుడు చెప్పాడు.

భగవన్! శ్రోతుమిచ్ఛామి దానమాహాత్మ్యముత్తమమ్ ।
యదక్షయం పరే లోకే దేవర్షిగణసేవితమ్ ॥1॥

స్వామి! ఏది పరలోకంలో అక్షయమో, దేవర్షిగణాలచేత పూజింపబడినదో అట్టి ఉత్తమమైన దాన ప్రభావాన్ని వినగోరుతున్నాను.

ఈశ్వర ఉవాచ :- ఉమాపతి చెప్పాడు.

మేరోః ప్రదానం వక్ష్యామి దశధా మునిసత్తమ ।
యత్ప్రదానాన్నరో లోకా నాప్నోతి సురపూజితాన్ ॥2॥

మునిపుంగవా! పదిరకాల మేరుప్రదానం గురించి చెబుతాను. దానివల్ల నరుడు దేవపూజితమైన లోకాలు పొందుతాడు.

పురాణేషు చ వేదేషు యజ్ఞేష్వాయతనేషు చ ।
న తత్ఫలమధీతేషు కృతేష్విహ యదశ్నుతే ॥3॥

ఈ దానాలు చేయడం వల్ల కలిగే ఫలం పురాణాలు, వేదాలు చదివినా కలగదు. యజ్ఞాలు చేసినా, ఆయతనాలు (ఆలయాలు) నిర్మించినా కలగదు.

తస్మాద్విధానం వక్ష్యామి పర్వతానామనుక్రమాత్ ।
ప్రథమో ధాన్యశైలస్స్యాద్ద్వితీయో లవణాచలః ॥4॥

అందుచేత ఆయా పర్వతాల దాన విధానానికి చెందిన క్రమం చెబుతాను. మొదటిది ధాన్యశైలం, రెండవది లవణాచలం,

గుడాచలస్తృతీయస్తు చతుర్థో హేమపర్వతః ।
పఞ్చమ స్తిలశైలస్స్యాత్షష్ఠః కార్పాసపర్వతః ॥5॥

మూడవది గుడాచలం, నాల్గవది హేమపర్వతం, ఐదవది తిలశైలం, ఆరవది కార్పాస పర్వతం.

సప్తమో ఘృతశైలశ్చ రత్నశైలస్తథాऽష్టమః ।
రాజతో నవమస్తద్వద్దశమశ్శర్కరాచలః ॥6॥

ఏడవది ఘృతశైలం, ఎనిమిదవది రత్నశైలం, తొమ్మిదవది వెండి శైలం, పదవది శర్కరాచలం. (చక్కెరగిరి)

వక్ష్యే విధానమేతేషాం యథావదనుపూర్వశః ।
అయనే విషువే పుణ్యే వ్యతీపాతే దినక్షయే ॥7॥

అయనములు, విషువము, వ్యతీపాతము, దినక్షయము ఈ సమయములలో ఈ దానాల విధానం క్రమంగా వివరిస్తాను.

శుక్లపక్షే తృతీయాయాముపరాగే శశిక్షయే ।
వివాహోత్సవయజ్ఞేషు ద్వాదశ్యామథవా పునః ॥8॥

శుక్లాయాం పంచదశ్యాం వా పుణ్యర్క్షేవా విధానతః ।
ధాన్యశైలాదయో దేయా యథాశాస్త్రం విధానతః ॥9॥

శుక్లపక్ష తృతీయనాడు, గ్రహణంలో చంద్రుడు క్షీణించినప్పుడు, వివాహోత్సవయజ్ఞాలలో, లేదా ద్వాదశినాడు. శుక్ల పంచదశినాడు పుణ్యనక్షత్రంలో విధి ప్రకారం శాస్త్రానుసారంగా ధాన్యశైలాదులను దానమివ్వాలి.

తీర్థేష్వాయతనే వాఽపి గోష్ఠే వా భవనాంగణే ॥10॥
మణ్డపం కారయేద్భక్త్యా చతురస్రముదఙ్ముఖమ్ ।

తీర్థాలలో, ఆయతనాలలో, కొట్టాలలో, భవనప్రాంగణంలో, చతురస్రంగా (నాలుగుభుజాలు సమంగా ఉండేలా) ఉత్తరాభిముఖంగా, భక్తితో మండపం నిర్మించాలి.

ప్రాగుదక్ప్రవణం తద్వత్ చ ప్రాఙ్ముఖం వా విధానతః ॥11॥

గోమయేనానులిప్తాయాం భూమావాస్తీర్య వై కుశాన్ ।
తన్మధ్యే పర్వతం కుర్యాద్విష్కమ్భపర్వతాన్వితమ్ ॥12॥

ధాన్యద్రోణసహస్రేణ భవేద్గిరిరిహోత్తమః ।
పఞ్చశతై ర్మధ్యమస్స్యాత్కనిష్ఠస్స్యాత్త్రిభిశ్శతైః ॥13॥

అది ఈశాన్యం వైపు మొగ్గు చూపునదిగాను ప్రాఙ్ముఖంగాను వుండాలి. గోమయంతో అలికిన నేలపై దర్భలు పరచి దానిమధ్యలో విష్కంభపర్వత సహితంగా పర్వతం నిలపాలి. వెయ్యి ద్రోణాల (4శేర్లు= 1ద్రోణం) ధాన్యంతో ఉత్తమ పర్వతం ఏర్పడుతుంది. అయిదువందల ద్రోణం అయితే మధ్యమం. మూడువందలయితే కనిష్ఠం.

విశేషం:- అష్టముష్టి ర్భవేత్ కుఞ్చిః కుఞ్చయోఽష్టౌ తు పుష్కలమ్
పుష్కలాని చ చత్వారి ఆఢకః పరికీర్తితః
చతురాఢకో భవేద్ద్రోణః-ఇత్యేతన్మానలక్షణమ్ (వాచస్పత్యమ్)

మేరుర్మహావ్రీహిమయశ్చ మధ్యే సువర్ణశృంగత్రయసంయుత స్స్యాత్ ।
పూర్వేణ ముక్తాఫలవజ్రయుక్తో యామ్యేన గోమేధికపుష్యరాగైః ॥14॥

పశ్చాచ్చ గారుత్మతనీలరత్నైస్సౌమ్యేన వైడూర్యసరోజరాగైః ।
శ్రీఖణ్డఖణ్డైరభితః ప్రవాళైర్లతాన్విత శ్శుక్తిశిలాతల స్స్యాత్ ।।15।।

మహా వ్రీహిమయమయినది మేఋవు. దానిమధ్య బంగారు శిఖరాలు మూడు వుండాలి. తూర్పున ముత్యాలు, వజ్రాలతో, దక్షిణాన గోమేధిక పుష్యరాగాలతో, పడమట గారుత్మత నీలరత్నాలతో, ఉత్తరాన వైడూర్యపద్మరాగాలతో అలంకరించాలి. శ్రీఖండ ఖండాలతో నలువైపులా పగడాలతో లతాన్వితమైన శుక్తి శిలాతలంగా వుండాలి.

బ్రహ్మా చ విష్ణుర్భగవాన్పురారిర్దివాకరోఽ ప్యత్ర హిరణ్మయస్స్యాత్ ।
మూర్ధన్యవస్థానమమత్సరేణ కార్యం త్వనేకైశ్చ పునర్ద్విజౌఘైః ।।16।।

బ్రహ్మ, విష్ణువు, శివుడు, సూర్యుడు ఇక్కడ స్వర్ణమయంగా వుండాలి. శిరోభాగంలో మత్సరం లేకుండా అనేక ద్విజులను నిలపాలి.

చత్వారి శృఙ్గాణి చ రాజతాని నితమ్బభాగేష్వపి రాజతస్స్యాత్ ।
తథేక్షువంశావృతకన్దరస్తు ఘృతోదక ప్రస్రవణశ్చ దిక్షు ।।17।।

వెండి శిఖరాలు నాలుగు, నితంబభాగాలు కూడా వెండివే కావాలి. అట్లే చెరకు వెదురులతో ఆవృతమైన గుహలు గల ఘృతోదక ప్రస్రవణాలు దిక్కులలో వుండాలి.

శుక్లామ్బరాణ్యమ్బుధరావళి స్స్యాత్పూర్వేణ పీతాని చ దక్షిణేన ।
వాసాంసి పశ్చాదథ కర్బురాణి రక్తాని చైవోత్తరతో ఘనాలీ ।।18।।

రౌప్యాన్మహేన్ద్ర ప్రముఖాంస్తథాష్టౌ సంస్థాప్య లోకాధిపతీన్క్రమేణ ।

తూర్పున తెల్లవస్త్రాలు, దక్షిణాన పచ్చనివస్త్రాలు, పడమటివైపున కలగలుపు వర్ణాల వస్త్రములు, ఉత్తరాన ఎర్రని వస్త్రములు మేఘావళిగా అమర్చాలి. వెండితో మహేంద్రుడు మున్నగు ఎనిమిదిమంది దిక్పాలకులనునిలపాలి.

నానాఫలాలీ చ సమన్తతస్స్యాన్మనోరమం మాల్యవిలేపనం చ ।।19।।
వితానకం చోపరి పఞ్చవర్ణమమ్లానపుష్పాభరణం సితం చ ।

నలువైపులా నానాఫలాలు వుంచాలి. మనోజ్ఞమైన మాల్యం విలేపనం కూడా వుండాలి. పైన ఐదు రంగులు గల చాందినీ వస్త్రం, వాడని తెల్లని పూలు, ఆభరణాలు కలది ఏర్పాటు చేయాలి.

ఇత్థం నివేశ్యామర శైలమగ్ర్యం మేరోస్తు విష్కమ్భగిరీ న్క్రమేణ ।।20।।
తురీయభాగేన చతుర్దిశం వై సంస్థాపయే త్పుష్పవిలేపనాఢ్యాన్ ।

ఇలా సుమేరుశైలాన్ని నిలిపి మేరువును, విష్కంభగిరులను క్రమంగా నిలపాలి. నాలుగు దిక్కులలో నాలుగవ భాగాన పుష్పవిలేపనాలతో కూడినవి అయిన వాటిని స్థాపించాలి.

పూర్వేణ మన్దర మనేకఫలావలీభిర్యుక్తం యవైః కనకభద్రకదమ్బచిహ్నైః ॥21॥

కామేన కాఞ్చనమయేన విరాజమానమాకారయేత్కుసుమవస్త్రవిలేపనాఢ్యమ్ ।

తూర్పున అనేక ఫలావళీ సమన్వితమైనదగు మందరమును, కాంచనమయమైన మన్మథునితో భాసించేది, పూలచేతను, విలేపనాల చేతను శ్రేష్ఠమైనది, వివిధ ఫలాలతో కూడినదీ, కనక భద్రకదంబ చిహ్నములతో కూడినదిగా విరాజిల్లునట్లు చేయాలి.

క్షీరారుణోదసరసాఽథ వనేన చైవం రౌప్యేణ శుక్తిఘటితేన విరాజమానమ్ ॥22॥

యామ్యే చ గన్ధమదనశ్చ నివేశనీయో గోధూమసఞ్చయమయః కలధౌతయుక్తః ।

పాలవలె తెల్లగానూ, ఎర్రగానూ ఉన్న నీరుకల చెరువులు కల వనంలో శక్తికొలది వెండితో చేసిన దానితో నిర్మించాలి. దక్షిణాన గోధుమ సంచయమయమై, వెండితో కూడిన గంధమాదనగిరిని నిలపాలి.

హైమేన యజ్ఞపతినా ఘృతమానసేన వస్త్రైశ్చ రాజతవనేన చ సంయుతస్స్యాత్ ॥23॥

పశ్చాత్తిలాచల మనేకసుగన్ధపుష్పసౌవర్ణపిప్పలహిరణ్మయహంసయుక్తమ్ ।

హైమయజ్ఞపతితో, ఘృతంతో మానససరస్సు, వస్త్రాలు, రాజతవనంతో కూడి వుండాలి. ఆపైన అనేక సుగంధపుష్పాలతో, సువర్ణ పిప్పలములతో, స్వర్ణహంసలతో కూడినట్లుగా తిలాచలాన్ని ఏర్పాటు చేయాలి.

ఆకారయే ద్రజతపుష్పవనేన తద్వ ద్వస్త్రాన్వితం దధిసితోదసరస్తథాగ్రే ॥24॥

సంస్థాప్య తం విపులశైలమథోత్తరేణ శైలం సుపార్శ్వమపి మాషమయం సువస్త్రమ్ ।

రజత పుష్పవనంతో అట్లే వస్త్రాన్వితమైన తెల్లని పెరుగుసరస్సును ఎదుట వుంచాలి. అలా విపులమైన శైలమును స్థాపించి, ఉత్తరాన మాషమయమై వస్త్రంతో కూడిన శైలం నిలపాలి.

పుష్పైశ్చ హేమపటపాదపశేఖరం తమాకారయేత్కనకధేనువిరాజమానమ్ ॥25॥

మాక్షీకభద్ర సరసా చ వనేన తద్వద్రౌప్యేణ భాస్వరవతా చ యుతం నిధాయ ।

ఆ శైలం మీద బంగారు పూల మొక్కలు మరిచ్రెట్టు, బంగారు గోవు, వెండి చెట్ల అడవి, తేనెతో భద్రమనే సరస్సును ఏర్పాటు చేయాలి.

హోమశ్చతుర్భిరథ వేదపురాణవిద్భిర్దాన్తైరనిన్ద్యచరితాకృతిభిర్ద్విజేన్ద్రైః ॥26॥

పూర్వేణ హస్తమితమత్ర విధాయ కుణ్డం కార్యస్తిలైర్యవఘృతేన సమిత్కుశైశ్చ ।

వేదపురాణవేత్తలు, దాంతులు, అనింద్యచరిత్రులైన నల్గురు విప్రశ్రేష్ఠులచేత హోమం చేయించాలి. తూర్పున ఒక చేతి పరిమాణం కల కుండం నిర్మించి తిలలు, యవలు, ఘృతం, సమిధలు, దర్భలు– వీటితో హోమం చేయాలి.

రాత్రౌ చ జాగర మనుద్ధత గీతతూర్యై రావాహనం చ కథయామి శిలోచ్చయానామ్ ॥27॥

త్వం సర్వదేవగణధామనిధే విరుద్ధ మస్మద్గృహేష్వమర పర్వతనాశయాశు ।

క్షేమం విధత్స్వ కురు శాన్తి మనుత్తమాం న స్సంపూజితః పరమభక్తిమతా మయా హి॥28॥

రాత్రివేళ జాగరణకై ఉద్ధృతం కాని గీతతూర్యాలతో శిలోచ్చయం ఆవాహనం చెబుతూ "సమస్త దేవగణధామముల నిధివగు ఓ దేవపర్వతమా! మాయిండ్లలో అశుభాలను నశింపజేయుము. నాచే పరమభక్తితో పూజింపబడిన నీవు క్షేమం కల్గించుము. మహోత్తమమగు శాంతి చేకూర్చుము.

త్వమేవ భగవా నీశో బ్రహ్మా విష్ణు ర్దివాకరః ।

మూర్తామూర్తాత్పరం బీజమతః పాహి సనాతన! ॥29॥

నీవే భగవంతుడవైన ఈశ్వరుడవు, బ్రహ్మవు, విష్ణుడవు, సూర్యుడవు. మూర్తామూర్తములకు పరమైన బీజం నీవు. సనాతనా! అందుచేత మమ్మల్ని రక్షించు.

యస్మాత్త్వం లోకపాలానాం విశ్వమూర్తేశ్చ మన్దిరమ్ ।

రుద్రాదిత్యవసూనాం చ తస్మాచ్ఛాన్తిం ప్రయచ్ఛ మే ॥30॥

నీవు లోకపాలురకూ, విశ్వమూర్తికీ, రుద్రాదిత్య వసువులకూ నిలయమైన వాడవు. నాకు శాంతినిమ్ము.

యస్మా దశూన్య మమరైర్నారీభిశ్చ శివేన చ ।

తస్మాన్మాముద్ధరాశేషదుఃఖసంసారసాగరాత్ ॥31॥

నీవు ఎప్పుడు అమరులతో, స్త్రీలతో, శివునితో, శూన్యుడవు కావు. అందువల్ల సమస్తసంసార సాగరం నుండి నన్ను ఉద్ధరించు.

ఏవ మభ్యర్చ్య తం మేరుం మన్దరం చాపి పూజయేత్ ।

ఇలా మేరువును అర్చించి మందరాన్ని గూడా పూజించాలి.

యస్మాచ్చైత్రరథేన త్వం భద్రాశ్వేన చ వర్షతః ॥32॥

శోభసే మన్దర క్షిప్ర మతస్తుష్టికరో భవ ।

"నీవు చైత్రరథవనంతోనూ, భద్రాశ్వవర్షంతోనూ కూడియున్నావు. అందువల్ల మాకు త్వరగా తుష్టి కల్గించు.

యస్మాచ్చూడామణిర్జమ్బుద్వీపే త్వం గన్ధమాదన ॥33॥

గన్ధర్వవనశోభావానతః కీర్తిర్దృఢాఽస్తు మే ।

ఓ గంధమాదనా! నీవు జంబూద్వీపానికి చూడామణివి. గంధర్వవనశోభగలవాడవు. అందుచే నీవల్ల నా కీర్తి దృఢమగుగాక!

యస్మా త్త్వం కేతుమాలేన వైభ్రాజేన వనేన చ ॥33॥

హిరణ్మయాశ్వత్థశిరాస్తస్మాత్పుష్టిర్ధ్రువాఽస్తు మే ।

ఓ హిరణ్మయాద్రీ! నీవు కేతుమాలంతో, వైభ్రాజవనంతోనూ శోభిల్లుతున్నావు. స్వర్ణమయమైన అశ్వత్థ శిరస్సు కలవాడవు. అందువల్ల నా పుష్టి గట్టిపడుగాక!

ఉత్తరైః కురుభిర్యస్మా త్సావిత్రేణ వనేన చ ॥34॥

సుపార్శ్వ రాజసే నిత్య మతశ్రీరక్షయాఽస్తు మే ।

సుపార్శ్వ పర్వతమా! ఉత్తరకురువులతో, సావిత్రవనముతో నీవు నిత్యమూ విరాజిల్లుతున్నావు. అందుచేత నా సిరి అక్షయమగుగాక!

ఏవ మామన్త్ర్య తాన్సర్వాన్ప్రభాతే విమలే పునః ॥35॥

స్నాత్వాఽథ గురవే దద్యా న్మధ్యమం పర్వతోత్తమమ్ ।

ఇలా వారినందరినీ ఆమంత్రించి తెల్లవారగానే మరల స్నానం చేసి నడుమనున్న పర్వతోత్తమాన్ని గురువు కివ్వాలి.

విష్కమ్భపర్వతాన్ దద్యా దృత్విగ్భ్యః క్రమశో మునే! ॥36॥

గాశ్చ దద్యాచ్చతుర్వింశత్యథవా దశ నారద ॥37॥

మునీ! నారదా! క్రమంగా విష్కంభ పర్వతాలను ఋత్విక్కుల కివ్వాలి. 24 లేక 10 గోవులను దానం చేయాలి.

నవసప్త తథాష్టౌ వా పఞ్చ దద్యాదశక్తిమాన్ ॥38॥

ఏకాం చ గురవే దద్యాత్కపిలాం చ పయస్వినీమ్ ।

శక్తి లేనివాడు 9,8,7 లేక 5 గోవులను దానం చేయాలి. పాడిగల కపిల గోవును ఒక్కటైనా గురువు కివ్వాలి.

పర్వతానామశేషాణామేష ఏవ విధి స్స్మృతః ॥39॥

త ఏవ పూజనే మన్త్రా స్త ఏవోపస్కరా మతాః ।
గ్రహాణాం లోకపాలానాం బ్రహ్మాదీనాం చ సర్వదా ॥40॥

అన్ని పర్వతవ్రతాలలోనూ ఇదే విధిగా చెప్పడమైనది. గ్రహాలకూ, లోకపాలకులకూ, బ్రహ్మాదులకు సైతం అవే పూజలు, అవే మంత్రాలు, అవే ఉపకరణాలు.

స్వమన్త్రేణైవ సర్వేషు హోమశ్శైలేషు పఠ్యతే ।
ఉపవాసీ భవేన్నిత్యమశక్తౌ నక్తమిష్యతే ॥41॥

స్వమంత్రంతోనే సర్వశైలాలలో హోమం చెప్పడమయింది. నిత్యం ఉపవసించాలి. శక్తి లేకుంటే రాత్రివేళ భుజించవచ్చు.

విధానం సర్వశైలానాం క్రమశశ్శృణు నారద! ।
దానకాలేషు చ యే మన్త్రాః పర్వతేషు చ యత్ఫలమ్ ॥42॥

నారదా! సకల పర్వతాల విధానం క్రమంగా విను. దానకాలంలోని మంత్రాలు, పర్వతాలలో కలిగే ఫలం వివరిస్తాను.

అన్నం బ్రహ్మ యతః ప్రోక్త మన్నే ప్రాణాః ప్రతిష్ఠితాః ।

అన్నం బ్రహ్మ. అందువల్ల అన్నంలో ప్రాణాలు ప్రతిష్ఠితాలైనవి.

అన్నా ద్భవన్తి భూతాని జగదన్నేన వర్తతే ॥43॥

అన్నమేవ తతో లక్ష్మీ రన్నమేవ జనార్దనః ।
ధాన్యపర్వతరూపేణ పాహి తస్మాన్నగోత్తమ ॥44॥

అనేన విధినా యస్తు దద్యాద్ధాన్యమయం గిరిమ్ ।
మన్వన్తరశతం సాగ్రం దేవలోకే మహీయతే ॥45॥

అన్నం నుండి జగత్తు నడుస్తున్నది. అందుచే అన్నమే లక్ష్మి. అన్నమే విష్ణువు. నగోత్తమా! ధాన్య పర్వతరూపంలో ఉన్న నీవు మమ్ము రక్షించు. ఇలా ఎవడు ధాన్యమయ పర్వతాన్ని దాన మిస్తాడో, వాడు నూరు మన్వంతరాలకు పైగా దేవలోకంలో పూజింపబడతాడు.

అప్సరోగణగన్ధర్వైరాకీర్ణేన విరాజతా ।
విమానేన దివః పృష్ఠమాయాతి ఋషిసేవితమ్ ॥46॥

ధర్మక్షయే రాజరాజ్యమాప్నోతీహ న సంశయః ॥47॥

అచ్చరలు, గంధర్వులతో నిండి ఋషిసేవితమై విరాజిల్లే విమానంలో సేవలందు కొంటూ స్వర్గపృష్ఠం చేరుతాడు. పుణ్యక్షయం కాగానే రాజరాజ్యం పొందుతాడు. ఇందులో సందేహం లేదు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే దాన ప్రభావం నామ త్ర్యశీతితమోఽధ్యాయః. ॥ 83 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని దానప్రభావమనే ఎనభైమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతురశీతితమోఽధ్యాయః - ఎనబైనాల్గవ అధ్యాయం

లవణపర్వతదానవర్ణనమ్ - లవణపర్వత దాన వర్ణన

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అథాతస్సమ్ప్రవక్ష్యామి లవణాచలముత్తమమ్ ।
యత్ప్రసాదాన్నరో లోకా నాప్నోతి శివసంయుతాన్ ॥1॥

దేన్ని దానమిస్తే మనుజుడు శివసమేతలోకాలను పొందుతాడో, ఉత్తమమైన ఆ లవణాచలాన్ని గురించి చెబుతాను.

ఉత్తమష్షోడశద్రోణైః కర్తవ్యో లవణాచలః ।
మధ్యమస్స్యా త్తదర్ధేన చతుర్భి రధమస్స్మృతః ॥2॥

పదునారు ద్రోణాల పరిమితితో ఉత్తమమైన లవణాచలాన్ని ఏర్పాటు చేయాలి. అందులో సగమైతే మధ్యమం, నాల్గవ భాగమైతే అధమం.

విత్తహీనో యథాశక్త్యా ద్రోణాదూర్ధ్వం తు కారయేత్ ।
చతుర్థాంశేన విష్కమ్భ పర్వతాన్కారయేత్పృథక్ ॥3॥

ధనం లేనివాడు శక్తిననుసరించి ఒక ద్రోణానికంటే అధికంగా చేయవచ్చు. నాలుగవ అంశంతో విడిగా విష్కంభపర్వతాలను చేయవచ్చు.

విధానం పూర్వవత్కుర్యాద్బ్రహ్మాదీనాం చ సర్వదా ।
తద్వద్ధేమమయాన్సర్వాన్ లోకపాలాన్నివేశయేత్ ॥4॥

విధానమంతా ఇంతకు ముందులాగే ఉండాలి. బ్రహ్మాదులగు ఇతరదేవతలను గూడా ఏర్పాటు చేయాలి. లోకపాలకులనందరినీ స్వర్ణంతో తయారు చేసి నివేశింపజేయాలి.

సరాంసి వనవృక్షాదీంస్తద్వదత్రాపి కారయేత్ ।
కుర్యాజ్జాగరణం రాత్రౌ దానమన్త్రాన్నిబోధత ॥5॥

సరస్సులనూ, వనవృక్షాదులనూ పూర్వం వలెనే ఇక్కడ కూడా కల్పించాలి. రాత్రిపూట జాగరణం కూడా చేయాలి. ఇక దానమంత్రాలను తెలుసుకోండి!

సౌభాగ్యరససమ్భూతో యతోఽయం లవణో రసః ।
తద్దానకర్తృకత్వేన మాం పాహి త్వం నగోత్తమ ॥6॥

“నగోత్తమా! లవణరసం సౌభాగ్య సారమయింది. కాన తద్దానకర్తనైన నన్ను నీవు రక్షించు.

యస్మా దన్నరసాస్సర్వే నోత్కటా లవణం వినా ।
ప్రియం చ శివయోర్నిత్యం తస్మాచ్ఛాన్తిం ప్రయచ్ఛ మే ॥7॥

అన్నరసాలన్నీ లవణం లేకుంటే రుచించవు. పార్వతీపరమేశ్వరుల కది చాలా ప్రియమైనది. అందుచే నాకు శాంతిని ప్రసాదించు.

విష్ణుదేహసముద్భూతం యస్మాదారోగ్యవర్ధనమ్ ।
తస్మాత్పర్వతరూపేణ పాహి సంసారసాగరాత్ ॥8॥

విష్ణుని దేహం నుండి పుట్టిన లవణం ఆరోగ్యవర్ధనమైనది. కాన పర్వతరూపంలో నీవు సంసారసాగరం నుండి నన్ను రక్షించు.

అనేన విధినా యస్తు దద్యా ల్లవణపర్వతమ్ ।
ఉమాలోకే వసేత్కల్పం తతో యాతి పరాం గతిమ్ ॥9॥

ఇలా ఎవడు లవణ పర్వతాన్ని దానం చేస్తాడో, వాడు కల్పకాలం ఉమాలోకంలో నివసిస్తాడు. ఆపై పరాగతిని పొందుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే లవణపర్వత దాన వర్ణనం నామ చతురశీతితమోఽధ్యాయః. ॥ 84 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని లవణపర్వతదానవర్ణనమనే ఎనభైనాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచాశీతితమోఽధ్యాయః - ఎనబైఅయిదవ అధ్యాయం

గుడపర్వతదానమ్ - గుడపర్వతదానం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అతఃపరం ప్రవక్ష్యామి గుడపర్వతముత్తమమ్ ।
యత్రప్రదానాన్నర స్స్వర్గ మాప్నోతి సురపూజితమ్ ॥1॥

ఇక మీదట ఉత్తమమగు గుడపర్వతం గురించి వివరిస్తాను. దాని దానం వల్ల నరుడు దేవ పూజితమైన స్వర్గానికి పోతాడు.

ఉత్తమో దశభి ర్భారై ర్మధ్యమః పఞ్చభిర్మతః ।
త్రిభిర్భారైః కనిష్ఠస్స్యాత్తదర్ధే నాల్పవిత్తవాన్ ॥2॥

పది బారువులైతే ఉత్తమం, ఐదైతే మధ్యమం, మూడైతే కనిష్ఠం, దానిలో సగంతో ధనహీనుడు చేయవచ్చు.

తద్వదామంత్రణం పూజాం హేమవృక్షసురార్చనమ్ ।
విష్కమ్భపర్వతాం స్తద్వ త్సరాంసి వనదేవతాః ॥3॥

హోమం జాగరణం తద్వల్లోకపాలాధివాసనమ్ ।
ధాన్యపర్వతవత్కుర్యాదిమం మన్త్రముదీరయేత్ ॥4॥

పూర్వంలాగానే ఆమంత్రణం, పూజ, స్వర్ణవృక్ష సురపూజ, విష్కంభపర్వత కల్పనం, సరస్సులు, వనదేవతలు, హోమం, జాగరణం, లోకపాలకుల అధివాసనం, ధాన్యపర్వతంలో లాగానే చేయాలి. ఈ క్రింది మంత్రంచెప్పాలి.

యథా దేవేషు విశ్వాత్మా ప్రవరోఽయం జనార్దనః ।
సామవేదస్తు వేదానాం మహాదేవస్తు యోగినామ్ ॥5॥

ప్రణవ స్సర్వమన్త్రాణాం నారీణాం పార్వతీ యథా ।
తథా రసానాం ప్రవర స్సదైవేక్షురసో మతః ॥6॥

దేవతలలో విశ్వాత్ముడైన జనార్దనుడెలా శ్రేష్ఠుడో, వేదాలలో సామవేదం ఎలా శ్రేష్ఠమో, యోగులలో మహాదేవుడెట్టివాడో, సర్వమంత్రాలలో ఓంకార మెలా ఉత్తమమో, స్త్రీలలో పార్వతి ఎలాగో, అలా రసాలలో ఇక్షురసం శ్రేష్ఠమని భావింపబడినది.

మమ తస్మా త్పరాం లక్ష్మీం దేహి వై గుడపర్వత! ।
యస్మాత్సౌభాగ్యదాయీ చ భ్రాతా త్వం గుడపర్వత! ।
నివాసశ్చాపి పార్వత్యా స్తస్మా చ్ఛాన్తిం ప్రయచ్ఛ మే ॥7॥

గుడపర్వతమా! అందుచే నాకు శ్రేష్ఠమైన లక్ష్మినిమ్ము. ఎందుకనగా, గుడాద్రీ! సౌభాగ్యదాయివైన నీవు నా సోదరుడవు. పార్వతికి గూడా నివాసం నీవే. అందుచేత నాకు శాంతి ప్రసాదించు.

అనేన విధినా యస్తు దద్యాద్గుడమయం గిరిమ్ ।
పూజ్యమాన స్స గన్ధర్వై ర్గౌరీలోకే మహీయతే ॥8॥

ఇలా ఎవడు గుడమయమైన పర్వతాన్నిస్తాడో వాడు గంధర్వులచే పూజింపబడువాడై గౌరీలోకంలో పూజింపబడతాడు.

తతః కల్పశతాన్తే తు సప్తద్వీపాధిపో భవేత్ ।
ఆయురారోగ్యసమ్పన్నశ్శత్రుభి శ్చాపరాజితః ॥9॥

ఆ మీదట కల్పశతాంతంలో సప్తద్వీపాలకూ రాజవుతాడు, ఆయురారోగ్య సంపన్నుడై శత్రువులచే ఓడిపోనివాడవుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే గుడపర్వతదానం నామ పంచాశీతితమోఽధ్యాయః ॥ 85 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని గుడపర్వతదానమనే ఎనభైఅయిదవ అధ్యాయం సంపూర్ణం

షడశీతితమోఽధ్యాయః - ఎనబైఆరవ అధ్యాయం

స్వర్ణ పర్వతదానమ్ - స్వర్ణ పర్వతదానం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అథ పాపహరం వక్ష్యే సువర్ణాచలముత్తమమ్ ।
యస్య ప్రదానాద్భవనం వైరిఞ్చం యాతి మానవః ॥1॥

ఇక పాపహరమైన సువర్ణాచలాన్ని గురించి వివరిస్తాను. దాన్ని దానం చేయడం వల్ల మనుజుడు బ్రహ్మభవనం చేరుకొంటాడు.

ఉత్తమః పలసాహస్రం మధ్యమః పఞ్చభిశ్శతైః । తదర్ధేనాధమస్తద్వదల్పవిత్తోఽపి శక్తితః ।
దద్యా దేకపలాదూర్ధ్వం యథాశక్త్యా విమత్సరః ॥2॥

వెయ్యి పలాలైతే ఉత్తమం, అయిదువందల పలాలైతే మధ్యమం, రెండువందల యాబది పలాలైతే అధమం, అట్లే అల్పవిత్తం కలవాడు కూడా శక్తిననుసరించి ఒక పలం కంటే పైన ఎంతైనా మత్సరం లేనివాడై యివ్వవచ్చు.

ధాన్యపర్వతవత్సర్వం విదధ్యాన్మునిపుఙ్గవ! ।
విష్కమ్భశైలాం స్తద్వచ్చ ఋత్విగ్భ్యః ప్రతిపాదయేత్ ॥3॥

మునిపుంగవా! ధాన్యపర్వతంలో లాగానే ఇందులో గూడా అంతా చేయాలి. విష్కంభశైలాలను గూడా అట్లే ఋత్విక్కుల కివ్వాలి.

నమస్తే బ్రహ్మబీజాయ బ్రహ్మగర్భాయ తే నమః ।
యస్మాదనన్తఫలదస్తస్మాత్పాహి శిలోచ్చయ! ॥4॥

"బ్రహ్మబీజమైన నీకు నమస్కారం! బ్రహ్మగర్భమైన నీకు నమస్కారం! నీవు అనంతఫలాలిచ్చే దానవు కాన పర్వతమా! నన్ను కాపాడు.

యస్మా దగ్నే రపత్యం త్వం యస్మా దల్పం జగత్పతేః ।
హేమపర్వతరూపేణ తస్మా త్పాహి నగోత్తమ! ॥5॥

నీవు అగ్ని సంతానమవు. నీవు పరమాత్ముని అల్పాంశవు. ఓ జగత్పతీ! నగోత్తమా! హేమ పర్వత రూపంలో ఉన్న నీవు నన్ను కాపాడు.

అనేన విధినా యస్తు దద్యాత్కనకపర్వతమ్ । స యాతి పరమం బ్రహ్మలోకమానన్దకారకమ్ ।
తత్ర కల్పశతం తిష్ఠే త్తతో యాతి పరాం గతిమ్ ॥6॥

ఇలా ఎవడు కనకాద్రిని దానం చేస్తాడో, వాడు ఆనందహేతువగు, పరబ్రహ్మ లోకానికి పోతాడు. అక్కడ నూరు కల్పాలుంటాడు. ఆపై పరాగతి పొందుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే స్వర్ణపర్వతదానం నామ షడశీతితమోఽధ్యాయః. ॥ 86 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని స్వర్ణపర్వతదానమనే ఎనబై ఆరవ అధ్యాయం సంపూర్ణం.

సప్తాశీతితమోఽధ్యాయః - ఎనబైఏడవ అధ్యాయం

తిలపర్వత దానమ్ - తిలపర్వతదానం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అతఃపరం ప్రవక్ష్యామి తిలశైలం విధానతః ।
యత్ప్రదానపరో యాతి విష్ణులోకం సనాతనమ్ ॥1॥

ఇకపై తిలపర్వతం గురించి విధివిధానంతో సహా చెబుతాను. దానిని దానమిచ్చిన నరుడు సనాతనమైన విష్ణులోకానికి పోతాడు.

ఉత్తమో దశభిర్ద్రోణైర్మధ్యమః పఞ్చభిర్మతః ।
త్రిభిః కనిష్ఠో విప్రేన్ద్ర తిలశైలః ప్రకీర్తితః ॥2॥

విప్రేంద్రా! పది ద్రోణాల తిలలతో చేసేది ఉత్తమం. ఐదింటితో అయితే మధ్యమం. మూడయితే కనిష్ఠం. ఇలా తిలశైలాన్ని పేర్కొన్నారు.

పూర్వవచ్చాపరాన్సర్వాన్విష్కమ్భానభితో గిరీన్ ।
దానమన్త్రాన్ ప్రవక్ష్యామి యథావన్మునిపుఙ్గవ ॥3॥

మిగతా కార్యక్రమం అంతా పూర్వం లాగే చేయాలి. గిరుల ప్రక్కన విష్కంభ గిరులను ఏర్పాటుచేసి దానమియ్యాలి. మునిపుంగవా! దానమంత్రాలు యథావత్తుగా వివరిస్తాను.

యస్మాన్మధువధే విష్ణో ర్దేహస్వేద సముద్భవాః ।
తిలాః కుశాశ్చ మాషాశ్చ తస్మాచ్ఛాన్త్యై భవన్త్విహ ॥4॥

"మధు రాక్షసవధ సమయంలో విష్ణుని దేహంనుండి ఉద్భవించిన చెమటనుండి పుట్టినవి తిలలు, దర్భలు, మినుములు. అందువల్ల అవి శాంతిహేతువులగు గాక!

హవ్యే కవ్యే చ యస్మాచ్చ తిలా ఏవాభిరక్షణమ్ ।
భవాదుద్ధర శైలేన్ద్ర తిలాచల! నమోఽస్తు తే ॥5॥

శైలేన్ద్ర! తిలాచల! హవ్యంలోగాని, కవ్యంలోగాని తిలలే రక్షకాలు. తిలరూప పర్వతేంద్రా! నన్ను సంసారంనుండి ఉద్ధరించు, నీకు నమస్కారం.

ఇత్యామన్త్ర్య చ యో దద్యాత్తిలాచలమనుత్తమమ్ ।
స వైష్ణవపదం యాతి పునరావృత్తిదుర్లభమ్ ॥6॥

ఇలా ఆమంత్రణం చేసి ఎవడు మహెూత్తమమైన తిలాచల ప్రదానం చేస్తాడో వాడు పునరావృత్తి దుర్లభమైన వైష్ణవస్థానం చేరుకుంటాడు.

దీర్ఘాయుష్యం సమాప్నోతి పుత్త్రపౌత్త్రైశ్చ మోదతే ।
పితృభిర్దేవగన్ధర్వైః పూజ్యమానో దివం వ్రజేత్ ॥7॥

దీర్ఘాయుష్యం పొందుతాడు. పుత్రపౌత్రులతో సంతోషిస్తాడు. పితరులచే, దేవగంధర్వులచే పూజింపబడువాడై స్వర్గానికి పోతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తిలపర్వతదానం నామ సప్తాశీతితమోఽధ్యాయః. ॥ 87 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని తిలపర్వతదానమనే ఎనబైఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టాశీతితమోఽధ్యాయః - ఎనబైఎనిమిదవ అధ్యాయం

కార్పాస పర్వతదానమ్ - కార్పాస పర్వతదానం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి కార్పసాచలముత్తమమ్ ।
యత్ప్రదానాన్నరో నిత్యమాప్నోతి పరమం పదమ్ ॥1॥

ఇక ఉత్తమమైన కార్పాసాచలాన్ని గురించి చెబుతాను. దానిని ఇచ్చిన నరుడు శాశ్వతమైన పరమపదం పొందుతాడు.

కార్పాసపర్వతస్తద్వద్వింశద్భారై రిహోత్తమః ।
దశభిర్మధ్యమః ప్రోక్తః పంచభిస్త్వధమః స్మృతః ।
భారేణాల్పధనో దద్యా ద్విత్తశాఠ్య వివర్జితః ॥2॥

ఇరువది బారువులతోనే నిర్మించే కార్పాస పర్వతం ఉత్తమం. పది బారువలతో చేసేది మధ్యమం. ఐదు బారువలతో చేసేది అధమం. అల్పమైన ధనం గలవాడు విత్తశాఠ్యం చూపకుండా ఒక బారువతోనే చేయవచ్చు.

ధాన్యపర్వతవత్సర్వమాసాద్య మునిపుఙ్గవ! ।
ప్రభాతాయాం తు శర్వర్యాం దద్యాదిదముదీరయేత్ ॥3॥

మునిపుంగవా! ధాన్యపర్వతం లాగానే అంతా సిద్ధం చేయాలి. రాత్రి గడచి తెల్లవారగానే దానం చేయాలి. అప్పుడు ఇలా చెప్పాలి.

త్వమేవావరణం యస్మా ల్లోకానామిహ సర్వదా ।
కార్పాసాద్రే! నమస్తుభ్యం అఘౌఘధ్వంసనో భవ ॥4॥

ఇతి కార్పాసశైలేన్ద్రం యో దద్యాచ్ఛర్వ సంనిధౌ ।
రుద్రలోకే వసేత్కల్పం తతో రాజా భవేదిహ ॥5॥

"లోకులకు సదా నీవు ఆవరణమై వున్నావు. ఓ కార్పాసాచలమా! నీకు నమస్కారం. మా పాపరాశిని ధ్వంసం చేయుము." అని ఈ రీతిగా శివుని సన్నిధిలో ఎవడు కార్పాస శైలోత్తమాన్ని దానం చేస్తాడో వాడు ఒక కల్పకాలం రుద్రలోకంలో నివసిస్తాడు. ఆ మీదట ఈ లోకంలో రాజు అవుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే కార్పాస పర్వతదానం నామ అష్టాశీతితమోఽధ్యాయః ॥ 88 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని కార్పాసపర్వతదానమనే ఎనబైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోననవతితమోఽధ్యాయః - ఎనబైతొమ్మిదవ అధ్యాయం

ఘృతాచలవ్రతమ్ - ఘృతాచలవ్రతం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అతఃపరం ప్రవక్ష్యామి ఘృతాచలమనుత్తమమ్ ।
తేజోమయం ఘృతం దివ్యం మహాపాతకనాశనమ్ ॥1॥

ఇక అనుత్తమమైన ఘృతాచలాన్ని గూర్చి వివరిస్తాను. తేజోమయమూ, దివ్యమూ అయిన ఘృతం అన్ని మహాపాపాల్నీ పోగొడుతుంది.

వింశత్యా ఘృతకుమ్భానా ముత్తమ స్స్యాద్ఘృతాచలః ।
దశభిర్మధ్యమః ప్రోక్త స్త్వధమః పఞ్చభి స్స్మృతః ॥2॥

ఇరువది ఘృతకుంభాలతో చేస్తే ఉత్తమం, పదితో అయితే మధ్యమం, ఐదింటితో అయితే అధమం అని చెప్పబడింది.

అల్పవిత్తోఽపి కుర్వీత ద్వాభ్యామిహ విధానతః ।
విష్కమ్భపర్వతాంస్తద్వచ్చతుర్భాగేన కల్పయేత్ ॥3॥

స్వల్ప ధనం కలవాడైనా ఎవడు రెండు కుంభాలతో విధి విధానంగా చేస్తాడో వాడు విష్కంభ పర్వతాలను అట్లే నాల్గవ వంతుతో కల్పించాలి.

శాలితణ్డులపాత్రాణి కుమ్భోపరి నివేశయేత్ ।
కారయే త్సంహతా నుచ్చాన్యథాశోభం విధానతః ॥4॥

కుంభాలమీద వరిబియ్యం పాత్రలుంచాలి. ఒకటికొకటి ఆనించి ఎత్తుగా వచ్చేటట్లు విధానానుసారంగా ఏర్పాటు చేయాలి.

వేష్టయే చ్ఛుక్లవాసోభి రిక్షుదండఫలాదికైః ।
ధాన్యపర్వతవచ్ఛేషం విధానమిహ పఠ్యతే ॥5॥

తెల్ల వస్త్రాలతో, చెరకుగడలతో, ఫలాదులతో వాటిని చుట్టాలి. తక్కినదంతా ధాన్యపర్వతం లాగే చేయాలి.

అధివాసనపూర్వం చ తద్వద్ధోమం సురార్చనమ్ ।
ప్రభాతాయాం తు శర్వర్యాం గురవే తన్నివేదయేత్ ।
విష్కమ్భపర్వతాంస్తద్వదృత్విగ్భ్యశ్శాన్తమానసః ॥6॥

అధివాసన పూర్వకంగా హోమం దేవతార్చనలు జరపాలి. తెల్లవారగానే గురువుకు దానిని నివేదించాలి. అట్లే శాంతచిత్తంతో విష్కంభ పర్వతాలను ఋత్విక్కులకు ఇవ్వాలి.

సంయోగా ద్ఘృతముత్పన్నం యస్మాదమృతతేజసోః ।
తస్మాద్ఘృతార్చిర్విశ్వాత్మా ప్రీయతామత్ర శఙ్కరః ॥7॥

అమృత తేజస్సుల సంయోగంతో ఘృతం ఏర్పడింది. అందుచేత విశ్వాత్ముడు, ఘృతార్చి అయిన శంకరుడు ప్రీతి నొందుగాక!

యస్మాత్తేజోమయం బ్రహ్మ ఘృతే తద్వద్వ్యవస్థితమ్ ।
ఘృత!పర్వతరూపేణ తస్మా త్త్వం పాహి నోఽనిశమ్ ॥8॥

తేజోమయమయిన బ్రహ్మం ఘృతమునందున్నది. కావున ఘృతమా! పర్వతరూపంలో నీవు మమ్ము సదా కాపాడుము.

అనేన విధినా దద్యాద్ఘృతాచలమనుత్తమమ్ ।
మహాపాతకయుక్తోఽపి లోకమాప్నోతి శాఙ్కరమ్ ॥9॥

ఇలా అనుత్తమమైన ఘృతాచలాన్ని దానమిచ్చేవాడు మహాపాపి అయినా శంకరలోకం చేరుకుంటాడు.

హంససారసయుక్తేన కిఙ్కిణీజాలమాలినా ।
విమానేనాప్సరోభిశ్చ సిద్ధవిద్యాధరై ర్వృతః ।
విహరేత్పితృభిస్సార్ధం యావదాభూతసమ్ప్లవమ్ ॥10॥

హంస సారసాలతో కూడి కింకిణీజాలాలు గల విమానంలో అప్సరసలతోను, సిద్ధులతోను, విద్యాధరులతోను కూడినవాడై ప్రళయకాలం వరకు పితరులతో సహా ఘృతపర్వతదాత విహరిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఘృతాచలవ్రతం నామ ఏకోననవతితమోఽధ్యాయః ॥ 89 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని ఘృతాచలవ్రతమనే ఎనబైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

నవతితమోఽధ్యాయః – తొంబైయవ అధ్యాయం

రత్నపర్వతదానమ్ – రత్నపర్వతదానం

ఈశ్వర ఉవాచ :– ఈశ్వరుడు చెప్పాడు.

అతఃపరం ప్రవక్ష్యామి రత్నాచలమనుత్తమమ్ ।
యత్ప్రదానాన్నరో యాతి విష్ణులోకమనుత్తమమ్ ॥1॥

ఇక మీదట మిక్కిలి ఉత్తమమైన రత్నాచలాన్ని గూర్చి చెబుతాను. దాని దానంచేత మనుజులు మహోత్తమమైన విష్ణులోకం చేరుకుంటారు.

ముక్తాఫలసహస్రేణ పర్వత స్స్యాదనుత్తమః ॥1॥

మధ్యమః పఞ్చశతిక స్త్రిశతేనాధమ స్స్మృతః ।
చతుర్థాంశేన విష్కమ్భపర్వతా స్స్యు స్సమన్తతః ॥2॥

వెయ్యిముత్యాలతో ఉత్తమోత్తమమైన పర్వతం అవుతుంది. అయిదువందల ముత్యాలు అయితే మధ్యమం, మూడు వందలయితే అధమం అని చెప్పారు. చతుర్థాంశంతో నాలుగు వైపుల విష్కంభపర్వతాలు ఉండాలి.

పూర్వేణ వజ్రగోమేధై ర్దక్షిణేనేన్ద్రనీలకైః ।
పద్మరాగయుతః కార్యో విద్వద్భిర్గన్ధమాదనః ॥3॥

వజ్రగోమేధాలతో తూర్పున, ఇంద్రనీలాలతో దక్షిణాన విద్వాంసులు పద్మరాగాలతో కూడిన గంధమాదనం కల్పించాలి.

వైడూర్యవిద్రుమైః పశ్చాత్సమ్మిశ్రో విమలాచలః ।
పద్మరాగై స్ససౌవర్ణై రుత్తరేణ చ విన్యసేత్ ॥4॥

ధాన్యపర్వతవత్సర్వ మత్రాపి పరికల్పయేత్ ।
తద్వదావాహనం కుర్యాద్వృక్షాన్దేవాంశ్చ కాంచనాన్ ॥5॥

వైడూర్యాలు, పగడాల సమ్మిశ్రణమైన విమలాచలాన్ని పడమరవైపు, సువర్ణ సహిత పద్మరాగాలను ఉత్తరం వైపున నిలపాలి. తక్కినదంతా ధాన్యపర్వతంలో చేసినట్లే చేయాలి. అదేవిధంగా చెట్లను, కాంచన దేవతలను ఆవాహనం చేయాలి.

పూజయేత్పుష్పగన్ధాద్యైః ప్రభాతే చ విమత్సరః ।
పూర్వవద్గురుఋత్విగ్భ్య ఇమాన్మన్త్రానుదీరయేత్ ॥6॥

తెల్లవారగానే మాత్సర్యం లేకుండా పుష్పగంధాదులచేత పూర్వం మాదిరిగానే గురువులను, ఋత్విక్కులను పూజించాలి. అప్పుడు ఈ క్రింది మంత్రాలను వినియోగించాలి.

యదా దేవగణాస్సర్వే సర్వరత్నేష్వవస్థితాః ।
త్వం చ రత్నమయో నిత్యం నమస్తేఽస్తు సదాఽచల! ॥7॥

"దేవగణాలందరూ సర్వరత్నాలలో వున్నారు. నీవు రత్నమయుడవు. రత్నాచలమా! నీకు సదా నమస్కారం.

యస్మాదన్నప్రదానేన వృష్టిం ప్రకురుతే హరిః ।
సదా రత్నప్రదానేన తస్మాన్నః పాహి పర్వత! ॥8॥

పర్వతమా! అన్న (హవిస్సు) ప్రదానంతో ఇంద్రుడు సంతసించి వర్షం కురిపిస్తాడు. అట్లే నా ఈ రత్నప్రదానంతో శ్రీహరి సంతసించి నాకు కోరికలు కురియునట్లు నన్నుగ్రహించు.

అనేన విధినా యస్తు దద్యాద్రత్నమయం గిరిమ్ ।
న యాతి విష్ణుసాలోక్యమమరేశ్వరపూజితః ॥9॥

ఇలా ఎవడు రత్నమయమయిన గిరిని ప్రదానం చేస్తాడో వాడు ఇంద్ర పూజితుడై విష్ణులోకం చేరుకుంటాడు.

యావత్కల్పశతం సాగ్రం వసేచ్చేహ నరాధిప! ।
రూపారోగ్యగుణోపేతస్సప్తద్వీపాధిపో భవేత్ ॥10॥

నరాధిపా! అక్కడ నూరు కల్పాలకంటే అధికకాలం నివసిస్తాడు. తదుపరి రూపం, ఆరోగ్యం, గుణం కలిగి సప్తద్వీపాలకు ప్రభువు అవుతాడు.

బ్రహ్మహత్యాదికం కించి ద్యదత్రాముత్ర వా కృతమ్ ।
తత్సర్వం నాశమాయాతి గిరిర్వజ్రహతో యథా ॥11॥

ఈ లోకంలో లేదా పరలోకంలో చేసిన బ్రహ్మహత్యాదికమైన పాపం అంతా వజ్రాయుధపుదెబ్బకు కొండలాగా రత్నప్రదానంతో నశించిపోతుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే రత్నపర్వతదానం నామ నవతితమోఽధ్యాయః. ॥ 90 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని రత్నపర్వతదానమనే తొంబైయవ అధ్యాయం సంపూర్ణం.

ఏకనవతితమోఽధ్యాయః - తొంబైఒకటవ అధ్యాయం

రౌప్యపర్వతదానమ్ - రౌప్యపర్వతదానం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అతఃపరం ప్రవక్ష్యామి రౌప్యాచలమనుత్తమమ్ ।
యత్ప్రదానాన్నరో యాతి సోమలోకం ద్విజోత్తమ! ॥1॥

ఇకపై అనుత్తమమయిన రౌప్యాచలం గురించి చెబుతాను. విప్రోత్తమా! దానిని దానం చేసినవాడు సోమలోకం చేరుకుంటాడు.

దశభిః పలసాహస్రైరుత్తమో రజతాచలః ।
పఞ్చభిర్మధ్యమః ప్రోక్త స్తదర్ధేనాధమ స్స్మృతః ॥2॥

పదివేల పలాల వెండితో చేసిన రజతాచలం ఉత్తమం. ఐదు వేలతో మధ్యమం, రెండువందల ఏబది పలాలతో అధమమని చెప్పారు.

అశక్తో వింశతేరూర్ధ్వం కారయేచ్ఛక్తిత స్సదా ।
విష్కమ్భపర్వతాంస్తద్వ త్తురీయాంశేన కల్పయేత్ ॥3॥

శక్తిలేనివాడు ఇరువదికిపైన ఎన్ని పలాలతోనైనా చేయించవచ్చు. అట్లే నాల్గవభాగంతో విష్కంభపర్వతాలను చేయించాలి.

పూర్వవద్రాజతాన్కుర్వన్మన్దరాదీన్విధానతః ।
కలధౌతమయాంస్తద్వ ల్లోకేశాన్కారయేద్బుధః ॥4॥

పూర్వం లాగానే విధిప్రకారం బుధుడు మందరాదులను వెండితో చేయాలి. అట్లే లోకపాలకులను బుధుడు బంగారుతో చేయాలి.

బ్రహ్మవిష్ణ్వర్కవాన్కార్యో నితమ్బోఽత్ర హిరణ్మయః ।
రాజతం స్యాద్యదన్యేషాం సర్వం తదిహ కాఞ్చనమ్ ॥5॥

బంగారుతో నెత్తం చేయించి దానిపై బ్రహ్మ-విష్ణు-సూర్యుల స్వర్ణప్రతిమలు ఉంచాలి. ఇతరత్రా వెండితో చేయాలని చెప్పిన వాటినిక్కడ స్వర్ణంతో చేయాలి.

శేషం తు పూర్వవత్కుర్యాద్ధోమజాగరణాదికమ్ ।
దద్యాత్తతః ప్రభాతే తు గురవే రౌప్యపర్వతమ్ ॥6॥

హోమం, జాగరణ మొదలైన తక్కినదంతా ముందులాగానే చేయాలి. తదుపరి ప్రాతఃకాలంలో రౌప్యపర్వతాన్ని గురువుకు సమర్పించాలి.

విష్కమ్భశైలానృత్విగ్భ్యః పూజ్య వస్త్రవిభూషణైః ।
ఇమం మన్త్రం పఠన్దద్యాద్దర్భపాణిర్విమత్సరః ॥7॥

విష్కంభశైలాలను పూజ్యవస్త్ర విభూషణాదులతో ఋత్విక్కుల కివ్వాలి. మత్సరం లేకుండా దర్భలు చేపట్టి ఈ మంత్రం పఠిస్తూ దానమివ్వాలి.

పితౄణాం వల్లభో యస్మా ద్విష్ణోర్వా శంకరస్య చ ।
పాహి రాజత తస్మాత్త్వం శోకసంసారసాగరాత్ ॥8॥

"ఓ రజతమా! నీవు పితరులకూ, విష్ణువుకూ, ఇంద్రునికీ, శివునికీ ఇష్టమైన దానివి. మమ్ములను శోకసాగరం నుండి కాపాడు."

ఇత్థం నివేద్య యో దద్యాద్రజతాచలముత్తమమ్ ।
గవామయుతదానస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥9॥

ఈ రీతిగా నివేదించి ఎవడు ఉత్తమ రజతాచలాన్ని దానం చేస్తాడో వాడు పదివేల గోవులను దానం చేసినంత ఫలం పొందుతాడు.

సోమలోకే స గన్ధర్వైః కిన్నరాప్సరసాం గణైః ।
పూజ్యమానో వసేద్విద్వా న్యావదాభూతసంప్లవమ్ ॥10॥

అతడు చంద్రలోకంలో గంధర్వులు, కిన్నరులు, అచ్చరలు – వీరిచే పూజితుడై కల్పాంతం వరకూ అక్కడ నివసిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే రౌప్యపర్వతదానం నామ ఏకనవతితమోఽధ్యాయః ॥ 91 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని రౌప్యపర్వతదానమనే తొంభైఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్వినవతితమోఽధ్యాయః - తొంబైరెండవ అధ్యాయం

శర్కరాపర్వత దానమ్ - శర్కరాపర్వత దానం

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

అథాత స్సంప్రవక్ష్యామి శర్కరాశైలముత్తమమ్ ।
యస్య ప్రదానాద్విష్ణ్వర్కరుద్రాస్తుష్యన్తి సర్వదా ॥1॥

ఇంక ఉత్తమమగు శర్కరాశైలం గురించి చెబుతాను. దాన్ని దానం చేస్తే, విష్ణువు, సూర్యుడు, రుద్రుడు సంతసిస్తారు.

అష్టాభిశ్శర్కరాభారైరుత్తమస్స్యాన్మహాచలః ।
చతుర్భిర్మధ్యమః ప్రోక్తో భారాభ్యామధమ స్స్మృతః ॥2॥

ఎనిమిది బారువుల చక్కెరతో ఉత్తమశైలమవుతుంది. నాలుగైతే మధ్యమం, రెండైతే అధమం అని చెప్పబడింది.

భారేణ వార్ధభారేణ కుర్యాద్యస్స్వల్పవిత్తవాన్ ।
విష్కమ్భపర్వతాన్కుర్యా త్తురీయాంశేన మానవః ॥3॥

ఒక బారువతోగాని, సగం బారువతోగాని అల్పధనవంతుడు చేయవచ్చు. విష్కంభపర్వతాలను దానిలో నాల్గవభాగంతో చేయాలి.

ధాన్యపర్వతవత్సర్వ మాసాద్యామరసంయుతమ్ ।
మేరోరుపరి తద్వచ్చ స్థాప్య హేమతరుత్రయమ్ ॥4॥

మన్దారః పారిజాతశ్చ తృతీయః కల్పపాదపః ।
ఏతద్వృక్షత్రయం మూర్ధ్ని సర్వేష్వపి నియోజయేత్ ॥5॥

ధాన్యపర్వతంలో లాగానే ఆ యా పర్వతాలనూ, దానిపై దేవతలనూ నిలపాలి. అందులో మందారం, పారిజాతం మూడవదైన కల్పవృక్షం అనే వృక్షాలను బంగారంతో చేయించి మేరుపర్వతం మీద మిగిలిన పర్వతాలపైన అమర్చాలి.

హరిచన్దనసన్తానౌ పూర్వపశ్చిమభాగయోః ।
నివేశ్యౌ సర్వశైలేషు విశేషాచ్ఛర్కరాచలే ॥6॥

ఆ పర్వతాలకు తూర్పుపడమర దిశలలో హరిచందన సంతాన వృక్షాల నుంచాలి. శైలా లన్నింటిలోనూ ఈ పద్ధతినే పాటించాలి. విశేషించి శర్కరాచలంలో సైతం పాటించాలి.

మన్దరే కామదేవస్తు ప్రత్యగ్వక్త్రస్సదా భవేత్ ।
గన్ధమాదనశృంగే తు ధనదస్స్యాదుదఙ్ముఖః ॥7॥

ప్రాఙ్ముఖో వేదమూర్తిస్తు హంసస్స్యాద్విపులాచలే ।
హైమీ సుపార్శ్వే సురభిర్దక్షిణాభిముఖీ భవేత్ ॥8॥

మందరాచలంలో మదనుడు సదా పశ్చిమ దిఙ్ముఖుడై వుండాలి. గంధమాదనశిఖరంలో కుబేరుడు ఉత్తరముఖుడుగా, విపులాచలంలో వేదమూర్తియైన హంస తూర్పుముఖంగా, సుపార్శ్వాచలంలో స్వర్ణధేనువు దక్షిణాభిముఖంగానూ ఉండునట్లు నిలపాలి.

ధాన్యపర్వతవత్సర్వ మావాహనవిధానకమ్ ।
కృత్వా తు గురవే దద్యాన్మధ్యమం పర్వతోత్తమమ్ ।
ఋత్విగ్భ్యశ్చతురశ్శైలానిమాన్మన్త్రానుదీరయన్ ॥9॥

ఆవాహనాది విధానాలన్నీ ధాన్య పర్వతంలో లాగానే చేయాలి. మధ్యమ పర్వతోత్తమాన్ని గురువుకివ్వాలి. ఋత్విక్కులకు ఈ మంత్రాలు పఠిస్తూ నాల్గు శైలాలనివ్వాలి.

సౌభాగ్యామృతసారోఽయం పర్వతశ్శర్కరాయుతః ।
తస్మాదానన్దకారీ త్వం భవ శైలేన్ద్ర! సర్వదా ॥10॥

ఈ శర్కరాయుతమైన ఈ పర్వతం సౌభాగ్యామృతసారమైనది. అందువల్ల శైలేంద్రా! నీవు సదా ఆనందకారివి గమ్ము!

అమృతం పిబతాం యే తు నిపేతుర్భువి శీకరాః ।
దేవానాం తత్సముత్థస్త్వం పాహి నశ్శర్కరాచల ॥11॥

అమృతం త్రాగే దేవతలనుండి యే తుంపురులు క్రింద పడినవో, అందుండి నీవు ఉదయించావు. ఓ శర్కరాచలా! మమ్ము కాపాడు.

మనోభవధనుర్మధ్యాదుద్భూతా శర్కరా యతః ।
తన్మయోఽసి మహాశైల పాహి సంసారసాగరాత్ ॥12॥

మన్మథుని ధనుర్మధ్యం నుండి శర్కర పుట్టింది కాన మహాశైలా! నీవు ఆ ధనువైన చెరకుయొక్క స్వరూపం కలదానవు. సంసారసాగరంనుండి మమ్ము రక్షించు.

యో దద్యాచ్ఛర్కరాశైలమనేన విధినా నరః ।
సర్వపాపైర్వినిర్ముక్త స్స యాతి పరమం పదమ్ ॥13॥

ఎవడీరీతిగా శర్కరాశైల మిస్తాడో, వాడు సకలపాపవిముక్తుడై పరమపదం పొందుతాడు.

చన్ద్రతారార్కసఙ్కాశమధిరుహ్యానుజీవిభిః ।
సహైవ యానమాతిష్ఠేత్ తత్ర విష్ణుప్రచోదితః ॥14॥

అనుచరులతో సహా చంద్రుడు, తారలు, సూర్యునితో సమానంగా భాసించే విమానమెక్కి విష్ణుప్రేరితుడై అతడు పయనిస్తాడు.

తతః కల్పశతాన్తే తు సప్తద్వీపాధిపో భవేత్ ।
ఆయురారోగ్యసమ్పన్నో యావజ్జన్మాయుతత్రయమ్ ॥15॥

తదుపరి నూరు కల్పాల తరువాత సప్తద్వీపాలకూ అధిపతి అవుతాడు. ఆయురారోగ్య సంపన్నుడై ముప్పదివేల జన్మలవరకూ అలాగే సుఖంగా ఉంటాడు.

భోజనం శక్తితః కుర్యాత్సర్వశైలేష్వమత్సరః ।
సర్వత్రాక్షారలవణమశ్నీయాత్తదనుజ్ఞయా ।
పర్వతోపస్కరాన్సర్వా న్ప్రాపయే ద్బ్రాహ్మణాలయమ్ ॥16॥

సమస్త శైలాలలోనూ మాత్సర్యం లేకుండా శక్తికొలది విప్రులకు భోజనాలు ఏర్పాటు చేయాలి. అంతటా వారి అనుమతితో కారం, లవణం లేని భోజనం తినాలి, పర్వతోపస్కారాలన్నింటినీ బ్రాహ్మణుల యింఢ్లకు పంపాలి.

ఈశ్వర ఉవాచ :- ఈశ్వరుడు చెప్పాడు.

ఆసీత్పురా బృహత్కల్పే ధర్మమూర్తిర్జనాధిపః ।
సుహృచ్ఛక్రస్య నిహతా యేన దైత్యా స్సహస్రశః ॥17॥

పూర్వం బృహత్కల్పంలో ధర్మమూర్తి అనే రాజుండేవాడు. అతని మిత్రుడైన ఇంద్రుని పక్షాన వేలాదిగా దైత్యుల నారాజు వధించాడు.

సోమసూర్యాదయో యస్య తేజసా విగతప్రభాః ।
భవన్తి శతశో యేన శత్రవశ్చ పరాజితాః ॥

యథేచ్ఛారూపధారీ చ మనుష్యోఽ ప్యపరాజితః ॥18॥

తస్య భానుమతీ నామ భార్యా త్రైలోక్యసున్దరీ ॥19॥

సోమసూర్యాదులు అతని కాంతి ముందు కాంతివిహీనులయ్యారు. వందలకొలదిసార్లు అతడు శత్రువులను జయించాడు, మానవుడైనా యథేచ్ఛారూపం దాల్చి అపరాజితుడై వుండేవాడు. అతనికి త్రైలోక్యసుందరియైన భానుమతి అనే భార్య ఉండేది.

రాజ్ఞ స్తస్యాగ్ర్యమహిషీ ప్రాణేభ్యోఽ పి గరీయసీ ।
దశనారీసహస్రాణాం మధ్యే శ్రీరివ రాజతే ॥20॥

ఆమె ఆరాజుకు పట్టపురాణి. ప్రాణాలకంటేగొప్పది.పదివేలమంది స్త్రీలనడుమ ఆమె లక్ష్మీదేవిలాగాభాసించేది.

నృపకోటిసహస్రేణ న కదాచిత్స ముచ్యతే ।
కదాచిదాస్థానగతః పప్రచ్ఛ స పురోధసమ్ ।
విస్మయేనావృతో రాజా వసిష్ఠమృషిసత్తమమ్ ॥21॥

ఆరాజును కోట్లకొలది రాజులు ఎప్పుడూ విడిచి ఉండేవారు కారు. అతడొకసారి ఆ స్థానంలో ఉండి, ఆశ్చర్యం పొంది వసిష్ఠుడనే ఋషిసత్తముడైన పురోహితుణ్ణి ఇలా అడిగాడు.

రాజోవాచ :– రాజు చెప్పాడు.

భగవన్! కేన ధర్మేణ మమ లక్ష్మీరనుత్తమా ।
కస్మాచ్చ విపులం తేజో మచ్ఛరీరే సదోత్తమమ్ ॥22॥

మహర్షీ! ఏ ధర్మాన్ని పాటించడంవల్ల నాకు మహోత్తమమైన లక్ష్మి కలిగింది? ఉత్తమమూ, విపులమూ అయిన ఈ తేజస్సు నా శరీరంలో ఎలా సంభవించింది?

వసిష్ఠ ఉవాచ :– వసిష్ఠుడు చెప్పాడు.

పురా లీలావతీ నామ వేశ్యా శివపరాయణా ।
తయా దత్తశ్చతుర్దశ్యాం గురవే లవణాచలః ।
హేమవృక్షాదిభిస్సార్ధం యథావద్విధిపూర్వకమ్ ॥23॥

పూర్వం శివభక్తురాలైన లీలావతి అను ఒక వేశ్య ఉండేది. ఆమె విధిపూర్వకంగా స్వర్ణ వృక్షాదులతో గూడా గురువుకు చతుర్దశినాడు లవణాచలదానం చేసింది.

శూద్రస్సువర్ణకారశ్చ నామ్నా శౌణ్డోఽభవత్తదా ।
భృత్యో లీలావతీగేహే తేన హేమ్నా వినిర్మితాః ॥24॥

తరవః సురముఖ్యాశ్చ శ్రద్ధాయుక్తేన పార్థివ ।
అతిరూపేణ సమ్పన్నా ఘటయిత్వా వినా భృతిమ్ ।
ధర్మకార్యమితి జ్ఞాత్వా న గృహ్ణాతి కథంచన ॥25॥

అప్పుడు శౌండుడు అనే ఒక శూద్రసువర్ణకారుడుండేవాడు. అతడు లీలావతీ గృహంలో భృత్యుడు. అతడు స్వర్ణంతో చెట్లను, ముఖ్య దేవతలనూ శ్రద్ధతో నిర్మించాడు. భృతి తీసుకోకుండా మిక్కిలి అందంగా వాటిని తయారు చేశాడు. ధర్మకార్యమని కూలీ తీసుకోలేదు.

ఉజ్జ్వాలితాశ్చ తత్పత్న్యా సౌవర్ణామరపాదపాః ।
లీలావతీ గిరేః పార్శ్వే పరిచర్యాం చ పార్థివ! ॥26॥

కృత్వా తాభ్యామశాఠ్యేన గురుశుశ్రూషణాదికమ్ ।
సా చ లీలావతీ వేశ్యా కాలేన మహతాఽపి చ ॥27॥

కాలధర్మమనుప్రాప్తా కర్మయోగేన నారద ।
సర్వపాపవినిర్ముక్తా జగామ శివమన్దిరమ్ ॥28॥

రాజా! వాని భార్య స్వర్ణామరవృక్షాలకు మెరుగు పెట్టింది. లీలావతి గిరిపార్శ్వంలో పరిచర్య కావించింది. వారిద్దరూ కపటం లేకుండా గురుశుశ్రూషణాదికం చేశారు. చాలా కాలానికి ఆ వేశ్య లీలావతి కర్మయోగంతో కాలధర్మం చెందింది. నారదా! ఆమె సకల పాపరహితయై శివమందిరం చేరుకొన్నది.

యోఽసౌ సువర్ణకారస్తు దరిద్రోఽప్యతిసత్త్వవాన్ ।
న మౌల్యమాదాద్వేశ్యాత స్స భవానిహ సామ్ప్రతమ్ ॥29॥

దరిద్రుడైనా, అతిసత్త్వగుణం కలవాడైన స్వర్ణకారుడు ఆ వేశ్యనుండి మూల్యం తీసుకోలేదు. అతడే ఇప్పుడు నీవుగా ఉన్నావు.

సప్తద్వీపపతిర్జాతస్సూర్యాయుతసమప్రభః ।
యయా సువర్ణకారస్య తరవో హేమనిర్మితాః ।
సమ్యగుజ్జ్వాలితాః పత్న్యా సేయం భానుమతీ తవ ॥30॥

నీవు సప్తద్వీపాధిపతి వయ్యావు. పదివేల సూర్యుల కాంతి గలిగి వున్నావు. స్వర్ణకారుని హేమనిర్మిత తరువులకు మెరుగు పెట్టిన అతని భార్యయే భానుమతి.

ఉజ్జ్వాలనాదుజ్జ్వలరూపమస్యాస్సఞ్జాతమస్మి న్భువనాధిపత్యమ్ ।
యస్మాత్కృతం తత్పరికర్మ రాత్రావనుద్ధతాభ్యాం లవణాచలస్య ॥31॥

బంగారుకు మెరుగుపెట్టడంవల్ల ఈమెకు ఉజ్జ్వలమైన రూపం కల్గింది. నీకు భువనాధిపత్యం సిద్ధించింది. మీరు గర్వం లేకుండా లవణాద్రికి అలా పరిచారకర్మ చేశారు కాబట్టి ఈ స్థితి సంభవించింది.

తస్మాచ్చ లోకేష్వపరాజితత్వమారోగ్యసౌభాగ్యయుతా చ లక్ష్మీః ।
తస్మాత్త్వమప్యత్ర విధానపూర్వం ధాన్యాచలాదీన్దశధా కురుష్వ ॥32॥

అందుచేతనే లోకాలలో అపరాజితత్వం కలిగింది. ఆరోగ్య సౌభాగ్యలతోపాటు లక్ష్మీగూడా సంభవించింది. కాన నీవు ఇక్కడ కూడా విధిపూర్వకంగా దశవిధాలైన ధాన్యాచలాదుల దానమాచరించు.

తథేతి సత్కృత్య స ధర్మమూర్తిః వచో వసిష్ఠస్య దదౌ చ సర్వాన్ ।
ధాన్యాచలాదీన్ శతశో మురారే ర్లోకం జగామామరపూజ్యమానః ॥33॥

'అట్లే' అని ఆ ధర్మమూర్తి వసిష్ఠుని వచనం ఆదరించాడు. సకల ధాన్యాచలాదులను వందలకొలదులుగా ఇచ్చాడు. చివర అమర పూజితుడై విష్ణులోకం పొందాడు.

పశ్యేదపీమానధనోఽతిభక్త్యా స్పృశేన్మనుష్యైరపి దీయమానాన్ ।
శృణోతి భక్త్యాఽథ మతిం దదాతి వికల్మష స్సోఽపి దివం ప్రయాతి ॥34॥

ధనం లేనివాడైనా ఈ కార్యాలను భక్తితో చూస్తే, మనుజులిచ్చే వస్తువులను తాకితే, భక్తితో ఇది వింటే, ఇతరులకు తెలిపితే, వాడు పాపరహితుడై స్వర్గానికి పోతాడు.

దుఃస్వప్నం ప్రశమముపైతి పఠ్యమానైః శైలేన్ద్రైర్భవభయభేదనై ర్మనుష్యః ।
యః కుర్యాత్కిము మునిపుఙ్గవేహ సమ్యక్ శాన్తాత్మా సకలగిరీన్ద్ర సమ్ప్రదానమ్ ॥35॥

మునివర్యా! భవభయం తొలగించే ఈ శైల దానాలను గూర్చి చదివితే దుస్స్వప్నం శమిస్తుంది. ఇక శాంతాత్ముడై సకలగిరిశ్రేష్ఠాలను దానం చేసేవానికి కలిగే ఫలాన్ని గూర్చి ఏమి చెప్పాలి.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శర్కరాపర్వత దానం నామ ద్వినవతితమోఽధ్యాయః ॥ 92 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని శర్కరాపర్వత దానమనే తొంబైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్రినవతితమోఽధ్యాయః – తొంబైమూడవ అధ్యాయం
గ్రహయజ్ఞవిధానాదీని – గ్రహయజ్ఞవిధానాదులు

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

వైశమ్పాయన మాసీన మపృచ్ఛ చ్ఛౌనకః పురా ।
సర్వకామాప్తయే నిత్యం కథం శాన్తికపౌష్టికమ్ ॥1॥

పూర్వం శౌనకుడు ఆసీనుడై యున్న వైశంపాయనుణ్ణి నిత్యం సర్వకామ సిద్ధికొరకు శాన్తిక – పౌష్టికక్రియలు ఎలా చేయాలి అని ప్రశ్నించాడు.

వైశమ్పాయన ఉవాచ :- వైశంపాయనుడు చెప్పాడు.

శ్రీకామ శ్శాన్తికామో వా గ్రహయజ్ఞం సమారభేత్ ।
వృద్ధ్యాయుఃపుష్టికామో వా తథైవాభిచర న్పునః ।
యేన బ్రహ్మన్విధానేన తన్మే నిగదత శ్శృణు ॥2॥

సిరిని కోరేవాడు గాని, శాంతిని కోరువాడు గాని గ్రహయజ్ఞం ప్రారంభించాలి. వృద్ధినీ, ఆయువునూ, పుష్టినీ కోరువాడు గూడ అట్లే చేయాలి. బ్రహ్మన్! ఆభిచారిక కర్మల నిర్వహించగోరేవాడు ఏవిధానంతో ఇది చేయాలో చెబుతాను విను.

సర్వశాస్త్రాణ్యనుక్రమ్య సంక్షిప్య గ్రన్థవిస్తరమ్ ।
గ్రహశాన్తిం ప్రవక్ష్యామి పురాణశ్రుతిచోదితామ్ ॥3॥

సర్వశాస్త్రాలను పరిశీలించి గ్రంథవిస్తరాన్ని సంక్షేపించి పురాణాలూ, వేదాలూ బోధించిన గ్రహశాంతిని వివరిస్తాను.

పుణ్యేఽహ్ని విప్రకథితే కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
గ్రహాన్గ్రహాధిదేవాంశ్చ స్థాప్య హోమం సమారభేత్ ॥4॥

విప్రులు చెప్పిన పవిత్రదినాన బ్రాహ్మణులచే స్వస్తివాచనం చేయించాలి. గ్రహాలనూ, గ్రహాధిదేవతలనూ స్థాపించి వారినుద్దేశించి హోమం ప్రారంభించాలి.

గ్రహయజ్ఞ స్త్రిధా ప్రోక్తః పురాణశ్రుతికోవిదైః ।
ప్రథమోఽయుతహోమ స్స్యా ల్లక్షహోమ స్తతఃపరమ్ ॥5॥

తృతీయః కోటిహోమస్తు సర్వకామఫలప్రదః ।
అయుతేనాహుతీనాం చ నవగ్రహమఖ స్స్మృతః ॥6॥

పురాణశ్రుతికోవిదులు గ్రహయజ్ఞాన్ని మూడు విధాలుగా చెప్పారు. మొదటిది అయుతహోమం, రెండవది లక్షహోమం, మూడవది కోటిహోమం. ఇవన్నీ ఆయా విషయాలలో సకలకామఫలాలను ప్రసాదిస్తాయి. ఆహుతులు పదివేలైతే నవగ్రహయజ్ఞ మంటారు.

తస్య తావద్విధిం వక్ష్యే పురాణ శ్రుతిభాషితమ్ ।
గృహస్యోత్తర పూర్వేణ మండపం కారయేద్బుధః ॥
గర్తం చోత్తరపూర్వేణ వితస్తిద్వయవిస్తృతామ్ ॥7॥

వప్రద్వయయుతాం వేదిం వితస్త్యుచ్ఛ్రయసమ్మితామ్ ।
సంస్థాపనాయ దేవానాం చతురస్రాముదఙ్ముఖామ్ ॥8॥

అగ్నిప్రణయనం కృత్వా తస్యామావాహయేత్సురాన్ ।
దేవతానాం తతఃస్థాప్యా వింశతిర్ద్వాదశాధికా ॥9॥

పురాణాలు వేదాలు చెప్పిన ఆ యజ్ఞవిధిని చెబుతాను. యజమానుడు ఇంటికి ఈశాన్యదిశలో మండపం నిర్మించాలి. అట్లే అదే దిశలో రెండు జానల పొడవు అంతే వెడల్పు గల గుంటను ఏర్పాటు చేయాలి. రెండు జానలు ఎత్తు కల్గిన వేదికను సిద్ధం చేయాలి. ఈ వేదిక చతురస్రంగా ఉత్తరముఖంగా ఉండాలి. అది దేవతల సంస్థాపనకు అవసరం. గుంటయందు అగ్నిప్రణయనం చేసి ముప్పదిరెండు దేవతలకు ఆవాహన ప్రతిష్ఠాపనాలు చేయాలి.

సూర్య స్సోమ స్తథా భౌమో బుధజీవసితార్కజాః ।
రాహుః కేతురితి ప్రోక్తా గ్రహా లోకహితావహాః ॥10॥

సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, శని, రాహువు, కేతువు అనేవి లోకహితం కల్గించే గ్రహాలని పేర్కొనబడినవి.

మధ్యే తు భాస్కరం వింద్యాల్లోహితం దక్షిణేన తు ।
ఉత్తరేణ గురుం వింద్యాద్బుధం పూర్వోత్తరేణ తు ॥11॥

పూర్వేణ భార్గవం వింద్యాత్సోమం దక్షిణపూర్వకే ।
పశ్చిమేన శనిం వింద్యాద్రాహుం పశ్చిమదక్షిణే ।
పశ్చిమోత్తరతః కేతుం స్థాపయేచ్ఛుక్లతణ్డులైః ॥12॥

సూర్యుణ్ణి మధ్య నిలపాలి. అంగారకుని దక్షిణాన, గురువును ఉత్తర దిశలోనూ, బుధుని ఈశాన్యంలోనూ, శుక్రుణ్ణి తూర్పున, సోముణ్ణి ఆగ్నేయంలోనూ, శనిని పడమరగానూ, రాహువును నైరుతిలోనూ, కేతువును వాయవ్యంలోనూ, తెల్లని బియ్యం పిండితో ప్రతిష్ఠించాలి.

భాస్కరస్యేశ్వరం విద్యాదుమాం చ శశిన స్తథా ।
స్కన్దమఙ్గారకస్యాపి బుధస్య చ తథా హరిమ్ ॥13॥

బ్రహ్మాణం చ గురోర్విద్యాచ్ఛుక్రస్యాపి శచీపతిమ్ ।
శనైశ్చరస్య తు యమం రాహోః కాలం తథైవ చ ॥14॥

సూర్యునికి శివుడు, చంద్రునికి పార్వతి, అంగారకునికి స్కందుడు, బుధునికి హరి, గురువుకు బ్రహ్మ, శుక్రునికి ఇంద్రుడు, శనికి యముడు, రాహువుకు కాలుడు,

కేతోర్వై చిత్రగుప్తం చ సర్వేషామధిదేవతాః ।
అగ్నిరాపః క్షితి ర్విష్ణురిన్ద్ర ఐన్ద్రీ చ దేవతాః ॥15॥

ప్రజాపతిశ్చ సర్పాశ్చ బ్రహ్మా ప్రత్యధిదేవతాః ।

కేతువుకు చిత్రగుప్తుడు అధిదేవతలు. అగ్ని, నీరు, భూమి, విష్ణువు, ఇంద్రుడు, శచి దేవతలు ప్రజాపతి, సర్పాలు, బ్రహ్మ – ప్రత్యధిదేవతలు.

వినాయకం తథా దుర్గాం వాయుమాకాశమేవ చ ।
ఆవాహయేద్వ్యాహృతిభి స్తథైవాశ్వికుమారకౌ ॥16॥

వినాయకుణ్ణీ, దుర్గనూ, వాయువునీ, ఆకాశాన్నీ, అశ్వికుమారులనూ అట్లే వ్యాహృతులతో ఆవాహనం చేయాలి.

సంస్మరేద్రక్తమాదిత్యమఙ్గారకసమన్వితమ్ ।
సోమశుక్రౌ తథా శ్వేతౌ బుధజీవౌ చ పిఙ్గలౌ ।
మన్దరాహూ తథా కృష్ణౌ ధూమ్రం కేతుగణం విదుః ॥17॥

అంగారకసమేతంగా ఎర్రని సూర్యుని స్మరించాలి. సోమశుక్రులు తెల్లనివారు, బుధ బృహస్పతులు పింగళవర్ణం కలవారు, శని రాహువులు నల్లనివారు. కేతుగణం ధూమ్రవర్ణం కలదిగా చెప్పడమయింది.

గ్రహవర్ణాని దేయాని వాసాంసి కుసుమాని చ ।
ధూపామోదోఽత్ర సురభిరుపరిష్టాద్వితానికమ్ ।
శోభనం స్థాపయేత్ప్రాజ్ఞః ఫలపుష్పసమన్వితమ్ ॥18॥

ఆ యా గ్రహవర్ణం కల వస్త్రాలు, పూలు సమర్పించాలి. ప్రాజ్ఞుడైనవాడు సురభిధూపం, పైన చాందినీ, ఫలపుష్ప సమన్వితంగా మంగళకరంగా స్థాపించాలి.

గుడౌదనం రవేర్దద్యాత్సోమాయ ఘృతపాయసమ్ ।
అఙ్గారకాయ సంయావం బుధాయ క్షీరషిష్టకమ్ ॥19॥

దధ్యోదనం చ జీవాయ శుక్రాయ చ ఘృతోదనమ్ ।
శనైశ్చరాయ కృసరం మాషం మాంసం చ రాహవే ।
చిత్రౌదనం చ కేతుభ్య స్సర్వైర్భక్ష్యైరథాఽర్చయేత్ ॥20॥

సూర్యునికి గుడౌదనం, చంద్రునికి ఘృతపాయసం, అంగారకునికి పాలతో వండిన గోధుమరవ్వ, బుధునికి పాలతో ఉడికించిన పిండి, బృహస్పతికి దధ్యోదనం, శుక్రునికి నేతి అన్నం, శనికి పులగం, రాహువుకు మినపవంట, (అజామాంసం)మేకమాంసం, కేతువుకు చిత్రౌదనం ఇచ్చి సర్వభక్ష్యాలతో అర్చించాలి.

ప్రాగుత్తరేణ తస్మాచ్చ దధ్యక్షతవిభూషితమ్ ।
చూతపల్లవసఞ్ఛన్నం ఫలవస్త్రయుగాన్వితమ్ ॥21॥

పఞ్చరత్నసమాయుక్తం పఞ్చపూగసమన్వితమ్ ।
స్థాపయేదవ్రణం కుంభం వరుణం తత్ర విన్యసేత్ ॥22॥

వేదికకు ఈశాన్యదిశలో పెరుగు, అక్షతలతో అలంకృతమై మామిడి చివుళ్లు కప్పినదీ, పండ్లు, రెండు వస్త్రాలతో గూడినదీ, ఐదురత్నాలతో కూడినదీ, అయిదు పోకకాయలు గలదీ, లోపం లేనిదీ అయిన కుంభాన్ని నిలపాలి. అక్కడ వరుణుణ్ణి ఆవాహనం చేయాలి.

గఙ్గాద్యా స్సరిత స్సర్వా స్సముద్రాంశ్చ సరాంసి చ ।
గజాశ్వరథ్యావల్మీకసఙ్గమాద్ధ్రదగోకులాత్ ॥23॥

మృదమానీయ విప్రేన్ద్ర సర్వౌషధిజలాన్వితామ్ ।
స్నానార్థం విన్యసేత్తత్ర యజమానస్య ధర్మవిత్ ॥24॥

విప్రేంద్రా! గంగాది సకలనదులూ, సముద్రాలనుండి నీటిని తెచ్చి అందులో పోయాలి. ఏనుగులు, గుర్రాలు తిరిగే వీథిమార్గం, పుట్ట, సంగమం, మడుగు, గోకులం వీటినుండి మట్టిని తెచ్చి సర్వౌషధి జలాన్వితం కావించాలి. ధర్మజ్ఞుడు దానిని యజమానుని స్నానం కొరకై అక్కడ ఉంచాలి.

సర్వే సముద్రా స్సరితః సరాంసి చ నదాస్తథా ।
ఆయాన్తు యజమానస్య దురితక్షయకారకాః ॥25॥

"అన్ని సాగరాలు, నదులూ, సరస్సులూ, నదాలూ యజమానుని పాపక్షయం కల్గించునవై ఇక్కడకి వచ్చుగాక!"

ఏవమావాహయేదేతానమరాన్మునిసత్తమ ।
హోమం సమారభేత్సర్పిర్యవవ్రీహితిలాదినా ॥26॥

మునివర్యా! ఈ రీతిగా చెప్పి అమరులను ఆవాహనం చేయాలి. తదుపరి నెయ్యి, యవలు, వడ్లు, తిలలు మొదలైనవానిచే హోమం ప్రారంభించాలి.

అర్కః పలాశ ఖదిరా వపామార్గోஉథ పిప్పలః ।
ఔదుమ్బర శ్శమీ దూర్వా కుశాశ్చ సమిధః క్రమాత్ ॥27॥

జిల్లేడు, మోదుగ, చండ్ర, ఉత్తరేణి, పిప్పలం, మేడి, జమ్మి, గరిక, దర్భలు – ఇవి క్రమంగా నవగ్రహాలకు సమిధలుగా ఉపయోగించాలి.

ఏకైకకస్యాష్టకశతమష్టావింశతిరేవ వా ।
హోతవ్యా మధుసర్పిర్భ్యాం దధ్నా చైవ సమన్వితాః ॥28॥

ఇందులో ఒక్కొక్కటీ నూటఎనిమిది లేదా ఇరువది ఎనిమిది దళాలు తేనె నెయ్యి పెరుగుతో కలిపి హోమం చేయాలి.

ప్రాదేశమాత్రా అశిఫా అశాఖా అపలాశినీః ।
సమిధః కల్పయేత్ప్రాజ్ఞ స్సర్వకర్మసు సర్వదా ॥29॥

సమిధలు సదా అన్ని కర్మలలోనూ ప్రాదేశమాత్రాలు (లొడితెడు పొడుగు కలవి), వ్రేళ్లు లేనివి, కొమ్మలు లేనివి, ఆకులు లేనివిగా ఉండాలి.

దేవానామపి సర్వేషాముపాంశు పరమార్థవిత్ ।
స్వేన స్వేనైవ మన్త్రేణ హోతవ్యా స్సమిధః పృథక్ ॥30॥

పరమార్థం తెలిసినవాడు అందరు దేవతలకు ఆ యా దేవతలకు చెందిన మంత్రాలను అల్పకంఠంతో, (దగ్గరి నున్నవారికి మాత్రమే వినపడునట్లు) ఉచ్చరిస్తూ సమిధలు విడివిడిగా హోమించాలి.

హోతవ్యం చ ఘృతాభ్యక్తం చరుభక్ష్యాదికం పునః ।
మన్త్రై ర్దశాహుతీర్హుత్వా హోమం వ్యాహృతిభి స్తతః ॥31॥

నెయ్యితో తడిపిన చరుభక్ష్యాదికాన్ని హోమించాలి. మంత్రాలతో పది ఆహుతులు హోమించి తరువాత వ్యాహృతులతో హోమించాలి.

ఉదఙ్ముఖాః ప్రాఙ్ముఖా వా కుర్యుర్బ్రాహ్మణపుఙ్గవాః ।
మన్త్రవన్తశ్చ కర్తవ్యాశ్చరవః ప్రతిదైవతమ్ ॥32॥

ద్విజపుంగవులు ఉత్తరాభిముఖంగా కానీ, తూర్పుముఖంగా కానీ ఉండి హోమం చేయాలి. చరువులు ప్రతి దేవతకూ చెందిన మంత్రాలు కలవిగా అనుష్ఠించాలి.

హుత్వా చ తాంశ్చరూంన్సమ్య క్తతో హోమం సమాచరేత్ ।
ఆకృష్ణేతి చ సూర్యాయ హోమః కార్యో ద్విజన్మనా ॥33॥

ఆప్యాయస్వేతి సోమాయ మన్త్రేణ జుహుయాత్పునః ।
అగ్నిర్మూర్ధా దివో మన్త్ర ఇతి భౌమాయ కీర్తయేత్ ॥34॥

చక్కగా ఆ చరువులను హోమం చేయాలి. ఆకృష్ణేతి మంత్రంతో ద్విజుడు సూర్యునికి హోమం చేయాలి. 'ఆప్యాయస్వ' అన్న మంత్రంతో చంద్రుడికి హోమం చేయాలి. 'అగ్ని ర్మూర్ధా దివో' అన్న మంత్రంతో అంగారకుడికి హోమం చేయాలి.

అగ్నే వివస్వదుషస ఇతి సోమసుతాయ వై ।
బృహస్పతే పరిదీయా రథేనేతి గురోర్మతః ॥35॥

'అగ్నే వివస్వదుషసే' అన్న మంత్రంతో బుధునికీ, 'బృహస్పతే పరిదీయారథేన' అన్న మంత్రంతో బృహస్పతికీ హోమం చేయాలి.

శుక్రం తే అన్యదితి చ శుక్రస్యాపి నిగద్యతే ।
శనైశ్చరాయేతి పునః శన్నో దేవీతి హోమయేత్ ॥36॥

'శుక్రం తే అన్యదితి' అన్నమంత్రంతో శుక్రునికీ, 'శన్నో దేవీ' అన్న మంత్రంతో శనికి హోమం చేయాలి.

కయానశ్చిత్ర ఆభువ ఇతి రాహోరుదాహృతః ।
కేతుం కృణ్వన్నపి బ్రూయాత్కేతూనామపి శాన్తయే ॥37॥

'కయానశ్చిత్ర ఆభువః' అన్న మంత్రంతో రాహువుకూ, 'కేతుం కృణ్వన్న' అన్న మంత్రంతో కేతువుకూ, శాంతినుద్దేశించి హోమం చేయాలి.

ఆవో రాజేతి రుద్రస్య బలిహోమం సమాచరేత్ ।
ఆపోహిష్ఠేత్యుమాయాస్తు స్యోనేతి స్వామినస్తథా ॥38॥

'ఆవో రాజా' అని రుద్రునికి బలిహోమం అనుష్ఠించాలి. 'ఆపో హిష్ఠ' అన్న మంత్రంతో ఉమాదేవికీ, 'స్యోనా' అన్న మంత్రంతో కుమారస్వామికీ –

విష్ణోరిదం విష్ణురితి త్వామిచ్ఛేతి స్వయమ్భువః ।
ఇన్ద్రమిద్దేవతాయేతి ఇన్ద్రాయ జుహుయాత్తతః ॥39॥

'ఇదం విష్ణుః' అని విష్ణువుకూ, 'త్వామిచ్ఛేతి' అని బ్రహ్మకూ, 'ఇంద్రమిద్దేవతాయ' అని ఇంద్రునికీ హోమం చేయాలి.

తథా యమస్య చాయం గౌరితి హోమః ప్రకీర్తితః ।
కాలస్య బ్రహ్మజజ్ఞానమితి మన్త్రః ప్రశస్యతే ॥40॥

'అయం గౌః' అని యమునికీ, 'బ్రహ్మ జజ్ఞానం' అని కాలునికీ హోమించాలి. ఆ మంత్రం అక్కడ ప్రశస్తమైనది.

చిత్రగుప్తస్య రాజానమితి మన్త్రవిదో విదుః ।
అగ్నిం దూతం వృణీమహ ఇతి వహ్నేరుదాహృతః ॥41॥

'రాజానమ్' అన్న మంత్రంతో చిత్రగుప్తునికి హోమం చేయాలని మంత్రవేత్తలు చెప్పారు. అగ్నికి 'అగ్నిం దూతం వృణీమహే' అన్న మంత్రం చెప్పాలి.

ఉదుత్తమం వరుణమిత్యపాం మన్త్రః ప్రకీర్తితః ।
భూమేః పృథివ్యన్తరిక్షమితి వేదేషు పఠ్యతే ॥42॥

'ఉదుత్తమం వరుణం' అని జలాలకు (వరుణినికి) మంత్రం చెప్పబడినది. 'పృథివ్యంతరిక్ష'మితి భూమికి మంత్రం వేదాలలో పఠింపబడినది.

సహస్రశీర్షా పురుష ఇతి విష్ణోరుదాహృతః ।
ఇన్ద్రాయేన్ద్ర మరుత్వత ఇతి శక్రస్య శస్యతే ॥43॥

'సహస్రశీర్షా పురుషః' అని విష్ణునకు మంత్రం 'ఇంద్రాయేంద్ర మరుత్వత' అని ఇంద్రునికీ చెప్పడం ప్రశస్తం.

ఉత్తానపర్ణే సుభగే ఇతి దేవ్యాః సమాచరేత్ ।
ప్రజాపతేః పునర్హోమః ప్రజాపత ఇతి స్మృతః ॥44॥

'ఉత్తానపర్ణే సుభగే' అని దేవికీ, 'ప్రజాపత ఇతి' అని ప్రజాపతికీ హోమం చేయాలి.

నమోఽస్తు సర్పేభ్య ఇతి సర్పాణాం మన్త్ర ఉచ్యతే ।
ఏష బ్రహ్మ య ఋత్విజః ఇతి బ్రహ్మణ్యుదాహృతః ॥45॥

'నమోఽస్తు సర్పేభ్యః' అన్నది సర్పాలకు మంత్రం. ఏష బ్రహ్మయ ఋత్విజః, అని బ్రహ్మకు మంత్రం పేర్కొనబడింది.

వినాయకస్య చానూనమితి మన్త్రో బుధై స్స్మృతః ।
జాతవేదసే సునవామ ఇతి దుర్గా మన్త్రోఽయముచ్యతే ॥46॥

'అనూనం', అన్న మంత్రం వినాయకునికీ, 'జాతవేదసే సునవామ,' అన్నది దుర్గకు మంత్రమని చెప్పబడినది.

ప్రాణానాం గ్రంథిరసీతి ప్రాణస్య పరికీర్తితః ।
ఆదిప్రత్నస్య రేతస ఆకాశస్య ఉదాహృతః ।
క్రాణా శిశుర్మహీనాం చ వాయోర్మంత్రః ప్రకీర్తితః ॥47॥

ఏషో ఉషా అపూర్వ్యా ఇత్యశ్వినోర్మన్త్ర ఉచ్యతే ।
పూర్ణాహుతిస్తు మూర్ధానం దివ ఇత్యభిపాతయేత్ ॥48॥

'ప్రాణానాం గ్రంథిరసి' అని ప్రాణానికి మంత్రం. 'ఆది ప్రత్నస్య రేతసః', అని ఆకాశానికీ, 'క్రాణాశిశు ర్మహీనాం చ' అని వాయుమంత్రం. 'ఏషో ఉషా అపూర్వ్యా' అని అశ్వినులకు మూర్ధానం దివః అని పూర్ణాహుతికి సమర్పించాలి.

అథాభిషేకమన్త్రేణ వాద్యమఙ్గళగీతకైః ।
పూర్ణకుమ్భేన తేనైవ హోమాన్తే ప్రాగుదఙ్ముఖైః ॥49॥

అవ్యఙ్గావయవైర్బ్రహ్మన్ హేమస్రగ్దామభూషితైః ।
యజమానస్య కర్తవ్యం చతుర్భి స్స్నపనం ద్విజైః ॥50॥

పిదప వాద్యమంగళ గీతాలతో అభిషేకమంత్రంతో హెూమం చివర ఆపూర్ణకుంభంతోనే ఈశాన్యాభిముఖులు అవయవలోపం లేనివారు, హేమమాలంకృతులూ, అయిన నల్గురు ద్విజులచే యజమానికి స్నానం చేయించాలి.

సురాస్త్వామభిషిఞ్చన్తు బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।
వాసుదేవో జగన్నాథ స్తథా సఙ్కర్షణో విభుః ।
ప్రద్యుమ్నశ్చానిరుద్ధశ్చ భవన్తు విజయాయ తే ॥51॥

"సురలు నిన్ను అభిషేకింతురుగాక! బ్రహ్మ విష్ణుమహేశ్వరులు, వాసుదేవుడు, జగన్నాథుడు అట్లే సంకర్షణ విభుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు నీకు విజయం చేకూర్తురు గాక!"

ఆఖణ్డలోఽగ్నిర్భగవాన్యమో వై నిర్ఋతిస్తథా ।
వరుణః పవనశ్చైవ ధనాధ్యక్ష స్తథా శివః ।
బ్రహ్మణా సహితా స్సర్వే దిక్పాలాః పాన్తు తే సదా ॥52॥

ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, పవనుడు, కుచేలుడు, శివుడు, బ్రహ్మసహితులైన ఈ సమస్త దిక్పాలకులు నిన్ను రక్షింతురు గాక!

కీర్తి ర్లక్ష్మీ ర్ధృతి ర్మేధా పుష్టి శ్శ్రద్ధా క్రియా మతిః ।
బుద్ధిర్లజ్జా వపు శ్శాన్తి స్తుష్టిః కాన్తిశ్చ మాతరః ।
ఏతాస్త్వామభిషిఞ్చన్తు ధర్మపత్న్య స్సమాగతాః ॥53॥

కీర్తి, లక్ష్మి, ధృతి, మేధ, పుష్టి, శ్రద్ధ, క్రియ, మతి, బుద్ధి, లజ్జ, వపువు, శాంతి, తుష్టి, కాంతి – అనే తల్లులు – ధర్మపత్నులైన వీరు వచ్చి నిన్ను అభిషేకింతురు గాక!

ఆదిత్యశ్చన్ద్రమా భౌమో బుధో జీవస్సితోఽర్కజః ।
గ్రహాస్త్వామభిషిఞ్చన్తు రాహుః కేతుశ్చ తర్పితాః ॥54॥

సూర్యుడు, చంద్రుడు, అంగారకుడు, బుధుడు, బృహస్పతి, శుక్రుడు, రాహువు, కేతువు ఈ గ్రహాలు తృప్తి పొందినవారై నిన్ను అభిషేకింతురు గాక!

దేవదానవగన్ధర్వా యక్షరాక్షసపన్నగాః ।
ఋషయో మునయో గావో దేవమాతర ఏవ చ ॥55॥

దేవపత్న్యో ద్రుమా నాగా దైత్యాశ్చాప్సరసాం గణాః ।
అస్త్రాణి సర్వశస్త్రాణి రాజానో వాహనాని చ ॥56॥

ఔషధాని చ రత్నాని కాలస్యావయవాశ్చ తే ।
సరిత స్సాగరా శ్శైలాస్తీర్థాని జలదా నదాః ।
ఏతే త్వామభిషిఞ్చన్తు సర్వకామార్థసిద్ధయే ॥57॥

దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, పన్నగులు, ఋషులు, మునులు, గోవులు, దేవమాతలు, దేవపత్నులు, వృక్షాలు, నాగులు, దైత్యులు, అచ్చరలు, అస్త్రాలు, సర్వశస్త్రాలు, రాజులు, వాహనాలు ఓషధులు, రత్నాలు, కాలుని అవయవాలు, నదులు, సముద్రాలు, కొండలు, తీర్థాలు, మబ్బులు, నదాలూ –వీరందరూ సకల కామాలూ సిద్ధించుటకు నిన్ను అభిషేకింతురు గాక!

తత శ్శుక్లామ్బరధర శ్శుక్లగంధానులేపనః ।
సర్వౌషధై స్సర్వగన్ధై స్స్నాపితో ద్విజపుఙ్గవైః ॥58॥

యజమాన స్సపత్నీక ఋత్విజ స్సుసమాహితాన్ ।
దక్షిణాభిః ప్రయత్నేన పూజయేద్గతవిస్మయః ॥59॥

ఆపై తెల్లవస్త్రాలు ధరించినవాడు, తెల్ల గంధానులేపనాలు గలవాడు, ద్విజశ్రేష్ఠులచే, సర్వౌషధులచేత, సర్వగంధాలచేత స్నానం చేయింపబడినవాడూ ఐన యజమానుడు భార్యతో గూడి సమాహితులైన ఋత్విక్కులను విస్మయం లేకుండా ప్రయత్నంతో దక్షిణలిచ్చి పూజించాలి.

సూర్యాయ కపిలాం ధేనుం శఙ్ఖం దద్యాత్తథేన్దవే ।
రక్తం ధురంధరం దద్యాద్భౌమాయ చ కకుద్మినమ్ ॥60॥

సూర్యునికి కపిలధేనువునూ, చంద్రునికి శంఖాన్నీ, భౌమునికి భారవహమైన ఎర్రని వృషభాన్నీ సమర్పించాలి.

బుధాయ జాతరూపం తు గురవే పీతవాససీ ।
శ్వేతాశ్వం దైత్యగురవే కృష్ణాం గామర్కసూనవే ॥61॥

ఆయసం రాహవే దద్యాత్కేతుభ్యశ్ఛాగముత్తమమ్ ।
సువర్ణేన సమాః కార్యా యజమానేన దక్షిణాః ॥62॥

బుధునికి స్వర్ణాన్నీ, గురువుకు పసుపు పచ్చని వస్త్రాలనూ, శుక్రునికి తెల్లగుర్రాన్ని, శనికి నల్లగోవునూ, రాహువుకు ఇనుమునూ, కేతువుకు ఉత్తమమైన మేకపోతునూ, ద్రవ్యరూపంలో దక్షిణగా ఋత్విజులకు సమపరిమాణంలో బంగారాన్నీ ఇవ్వాలి.

సర్వేషామథవా గావో దాతవ్యా హేమభూషితాః ।

సువర్ణమథవా దద్యాద్గురుర్వా యేన తుష్యతి ।
సమన్త్రేణైవ దాతవ్యా స్సర్వాస్సర్వత్ర దక్షిణాః ॥63॥

లేదా హేమ భూషితాలైన గోవులను అందరికీ ఇవ్వాలి. గురువుకు స్వర్ణమో, లేక దేనితో తృప్తి గలుగునో దానినివ్వాలి. అన్ని దక్షిణలూ సమంత్రకంగా ఉండాలి.

కపిలే సర్వదేవానాం పూజనీయాఽసి రోహిణీ ।
తీర్థదేవమయీ యస్మాదతశ్శాన్తిం ప్రయచ్ఛ మే ॥64॥

"ఓ కపిలధేనువా! నీవు సకల దేవతలకూ, పూజనీయవు. నీవు రోహిణివి, తీర్థదేవ స్వరూపిణివి, కాన నాకు శాంతినిమ్ము.

పుణ్యస్త్వం శఙ్ఖ! పుణ్యానాం మఙ్గళానాం చ మఙ్గళమ్ ।
విష్ణునా విధృతశ్చాసి తతః శాన్తిం ప్రయచ్ఛ మే ॥65॥

ఓ శంఖమా! పుణ్యులలో నీవు పుణ్యుడవు, మంగళములో మంగళమవు. విష్ణువుచే ధరింపబడితివి. అందువల్ల నాకు శాంతి నిమ్ము!

ధర్మస్త్వం వృషరూపేణ జగదానన్దకారక! ।
అష్టమూర్తేరధిష్ఠాన మత శ్శాన్తిం ప్రయచ్ఛ మే ॥66॥

ఓ వృషభమా! నీవు ధర్మమవు. జగత్తుకు ఆనందం కల్గించే దానవు. అష్టమూర్తియైన శివునికి వాహనమైన దానవు. అందువల్ల నాకు శాంతినిమ్ము.

హిరణ్యగర్భ! గర్భస్త్వం హేమబీజం విభావసోః ।
అనన్తపుణ్యఫలదమత శ్శాన్తిం ప్రయచ్ఛ మే ॥67॥

ఓ స్వర్ణమా! నీవు హిరణ్యగర్భుని గర్భమవు. సూర్యునికి బీజమైనదానివి. నీవు అనంతపుణ్య ఫలమిచ్చుదానవు. కాన నాకు శాంతినిమ్ము.

పీతవస్త్రయుగం యస్మాద్వాసుదేవస్య వల్లభమ్ ।
ప్రదానాత్తస్య మే విష్ణో! హ్యత శ్శాన్తిం ప్రయచ్ఛ మే ॥68॥

పీతవస్త్రయుగ్మం వాసుదేవునికి ప్రీతికరమైనదిగాన దానినివ్వడం వల్ల ఓ విష్ణూ! నాకు శాంతినిమ్ము.

విష్ణుస్త్వమశ్వరూపేణ యస్మాదమృతసమ్భవః ।
చన్ద్రార్కవాహనో నిత్యమతశ్శాన్తిం ప్రయచ్ఛ మే ॥69॥

విష్ణూ! నీవు అశ్వరూపంతో ఉన్నావు. అమృతం నుండి పుట్టితివి. సూర్యచంద్రులు నీకు వాహనాలు అందుచే నాకు శాంతినిమ్ము.

యస్మాత్త్వం పృథివీ సర్వా ధేనుః కేశవసన్నిభా ।
సర్వపాపహరా నిత్య మత శ్శాన్తిం ప్రయచ్ఛ మే ॥70॥

ఓ ధేనువా! నీవు పృథివివి, విష్ణుసదృశవు. నిత్యం సకలపాపాలూ పోగొట్టుదానవు. అందుచే నాకు శాంతినిమ్ము.

యస్మాదాయస కర్మాణి తవాధీనాని సర్వదా ।
లాంగలాద్యాయుధాదీని తస్మాచ్ఛాన్తిం ప్రయచ్ఛ మే ॥71॥

ఓ ఇనుమా! పనులన్నీ సదా నీవల్లనే జరుగుతాయి. నాగలి మొదలైన ఆయుధాలు నీవే. అందువల్ల నాకు శాంతినిమ్ము.

యస్మా త్త్వం సర్వయజ్ఞానా మఙ్గత్వేన వ్యవస్థితః ।
యానం విభావసో ర్నిత్య మత శ్శాన్తిం ప్రయచ్ఛ మే ॥72॥

ఓ ఛాగమా! నీవు సకల యజ్ఞాలకూ అంగమై యున్నావు. అగ్నికి వాహనమవు. అందువల్ల నాకు శాంతినిమ్ము.

గవామఙ్గేషు తిష్ఠన్తి భువనాని చతుర్దశ ।
యస్మాత్తస్మాచ్ఛ్రియే మే స్యాదిహ లోకే పరత్ర చ ॥73॥

ఓ ధేనువా! గోవు అంగాలలో పదునాల్గు లోకాలున్నాయి. కాన ఈ లోకంలో, పరలోకంలో నాకు శ్రీసిద్ధి గలిగించుటకై నీవున్నావు.

యస్మాదశూన్యం శయనం కేశవస్య చ సర్వదా ।
శయ్యా మమాప్యశూన్యాஉస్తు దత్తా జన్మని జన్మని ॥74॥

కేశవుని శయనం సర్వదా అశూన్యం కాన నేను ఇచ్చే ఈ శయ్య జన్మజన్మల్లో నాకు గూడ అశూన్యమగుగాక!

యథా రత్నేషు సర్వేషు సర్వే దేవాః ప్రతిష్ఠితాః ।
తథా రత్నాని యచ్ఛన్తు రత్నదానేన మే సురాః ॥75॥

రత్నాలన్నిటా సర్వదేవతలూ ప్రతిష్ఠితులైయున్నారు. అందుచేత రత్నదానంవల్ల దేవతలు నాకు రత్నాలిత్తురు గాక!

యథా భూమిప్రదానస్య కలాం నార్హన్తి షోడశీమ్ ।
దానాన్యన్యాని మే శాన్తిర్భూమిదానాద్భవత్విహ ॥76॥

భూదానంలో పదునారవవంతు పూజ్యత గూడా ఇతరదానాలకు లేదు. నాకు భూమి దానంవల్ల శాంతి కల్గు గాక!"

ఏవం సమ్పూజయేద్భక్త్యా విత్తశాఠ్యేన వర్జితః ।
రత్నకాంచనవస్త్రౌఘైర్ధూపమాల్యానులేపనైః ॥77॥

ఈ విధంగా విత్తశాఠ్యం లేకుండా భక్తితో, రత్నకాంచన వస్త్రాలతో, ధూపమాల్యానులేపనాలతో గ్రహపూజ నిర్వహించాలి.

అనేన విధినా యస్తు గ్రహపూజాం సమాచరేత్ ।
సర్వాన్కామానవాప్నోతి ప్రేత్య స్వర్గే మహీయతే ॥78॥

ఈ రీతిగా గ్రహపూజలు చేసేవాడు సకలకామాలూ పొందుతాడు. మరణానంతరం స్వర్గంలో పూజింపబడతాడు.

యస్తు పీడాకరో నిత్యమల్పవిత్తస్య వా గ్రహః ।
తం చ యత్నేన సమ్పూజ్య శేషానప్యర్చయేద్బుధః ॥79॥

స్వల్పధనం కలవాడైనా తనకు పీడాకరమైన గ్రహానికి ప్రయత్న పూర్వకంగా పూజలు చేయాలి. తరువాత ఇతరగ్రహాలను పూజించాలి.

గ్రహా గావో నరేన్ద్రాశ్చ బ్రాహ్మణాశ్చ విశేషతః ।
పూజితాః పూజయన్త్యేతే నిర్దహన్త్యవమానితాః ॥80॥

గ్రహాలు, గోవులు, రాజులు, విశేషించి బ్రాహ్మణులు పూజిస్తే పూజిస్తారు. అవమానిస్తే దహిస్తారు.

యథా బాణప్రహారాణాం కవచం భవతి వారణమ్ ।
తద్వద్దైవోపఘాతానాం శాన్తిర్భవతి వారణమ్ ॥81॥

బాణాల దెబ్బలకు కవచం నివారణ మవుతుంది. అట్లే దేవతల వల్ల కల్గే విపత్తులకు శాంతి కర్మ నివారణ మవుతుంది.

తస్మాన్న దక్షిణాహీనం కర్తవ్యం భూతిమిచ్ఛతా ।
సమ్పూర్ణయా దక్షిణయా యస్మాద్దేవోఽపి తృప్యతి ॥82॥

అందువల్ల భూతికాముకుడు దక్షిణాహీనంగా క్రియలు చేయరాదు. సంపూర్ణ దక్షిణతో దేవుడు గూడా తృప్తి పొందుతాడు.

సదైవాయుతహోమోఽయం నవగ్రహమఖే స్థితః ।
వివాహోత్సవయజ్ఞేషు ప్రతిష్ఠాదిషు కర్మసు ॥83॥

ఎల్లవేళలా ఈ అయుతహోమం నవగ్రహయజ్ఞంలో ఉన్నది. వివాహం, ఉత్సవం, యజ్ఞం, ప్రతిష్ఠ మొదలైన కర్మలలో గూడా దీన్ని నిర్వహించాలి.

నిర్విఘ్నార్థం మునిశ్రేష్ఠ! తథోద్వేగాద్భుతేషు చ ।
కథితోఽయుతహోమోఽయం లక్షహోమమతశ్శృణు ॥84॥

మునివర్యా! కార్యాలలో నిర్విఘ్నత కొరకూ, ఉద్వేగాద్భుతాలలోనూ ఈ అయుతహోమం కర్తవ్యంగా నిర్దేశింపబడింది. ఇక లక్షహోమం చెబుతాను.

సర్వకామాప్తయే యస్మాల్లక్షహోమం విదుర్బుధాః ।
పితౄణాం వల్లభం సాక్షాద్భుక్తిముక్తిఫలప్రదమ్ ॥85॥

బుధులు సర్వకామసిద్ధికై లక్షహోమం కర్తవ్యమంటారు. ఇది పితరుల కిష్టమైనది, భుక్తిముక్తి ఫలాలు ప్రసాదించేది.

గ్రహతారాబలం లబ్ధ్వా కృత్వా బ్రాహ్మణవాచనమ్ ।
గృహస్యోత్తరపూర్వేణ మణ్డపం కారయేద్బుధః ॥86॥

గ్రహతారాబలం పొంది బ్రాహ్మణులచే స్వస్తివాచనం చేయించాలి. గృహానికి ఈశాన్యంలో పుణ్యాహవాచనం చేయించాలి. మండపం నిర్మించాలి.

రుద్రాయతనభూమౌ వా చతురస్రముదఙ్ముఖమ్ ।
దశహస్తమథాష్టౌ వా హస్తాన్కుర్యాద్విధానతః ॥87॥

లేదా శివాలయభూమిలోగాని, చతురస్రంగానూ, ఉత్తరముఖంగానూ పదిచేతులకొలత, లేదా ఎనిమిది చేతుల కొలతతో విధి ప్రకారం మండపముండాలి.

ప్రాగుదక్ప్లవనాం భూమిం కారయేద్యత్నతో బుధః ।
ప్రాగుత్తరం సమాసాద్య ప్రదేశం మణ్డపస్య తు ॥88॥

శోభనం కారయేత్కుణ్డం యథావల్లక్షణాన్వితమ్ ।
చతురస్రం సమన్తాత్తు యోనివక్త్రం సమేఖలమ్ ॥89॥

ప్రయత్నంతో బుధుడు ఈశాన్యానికి ఏటవాలుగా భూమి నేర్పాటు చేయాలి. మండపానికి ఈశాన్యంలో ప్రదేశం సరిచూచి శోభనమైన కుండం ఏర్పాటు చేయించాలి. అది లక్షణ సమన్వితంగా ఉండాలి. చతురస్రంగా, త్రిభుజాకృతితో, అంచుకట్లతో కూడినట్లు ఏర్పాటు చేయాలి.

చతురఙ్గుళవిస్తారా మేఖలా తద్వదుచ్ఛ్రితా ।
ప్రాగుదక్ప్లవనా కార్యా సర్వత స్సమవస్థితా ॥90॥

నాలుగంగుళాల వెడల్పు, అంతే ఎత్తు ఈశాన్యమునకు ఏటవాలు అంచుకట్టకు ఉండాలి.

శాన్త్యర్థం సర్వలోకానాం నవగ్రహమఖ స్స్మృతః ।
మానహీనాధికం కుణ్డమనేకభయదం భవేత్ ।
యస్మాత్తస్మాత్సుసమ్పూర్ణం శాన్తికుణ్డం విధీయతే ॥91॥

సర్వలోకాల శాంతి కొరకూ, నవగ్రహయజ్ఞం చెప్పడమయింది. కొలతలు ఎక్కువ తక్కువగా గల కుండం అనేక భయాలు కల్గిస్తుంది. అందువల్ల సంపూర్ణమైన శాంతికుండం ఏర్పాటుచేయాలి.

అస్మాద్దశగుణః ప్రోక్తో లక్షహోమ స్స్వయమ్భువా ।
ఆహుతీభిః ప్రయత్నేన దక్షిణాభిస్తథైవ చ ॥92॥

బ్రహ్మ అయుతహోమంకంటె లక్షహోమాన్ని దశ గుణాధికంగా చెప్పాడు. దీనిలో ఆహుతులు, దక్షిణలు ప్రయత్నపూర్వకంగా దశగుణాధికాలుగా వుండాలి.

ద్విహస్తవిస్తృతం తద్వచ్చతుర్హస్తాయతం పునః ।
లక్షహోమే భవేత్కుణ్డం యోనివక్త్రం త్రిమేఖలమ్ ॥93॥

లక్షహోమంలో కుండం రెండు చేతుల విస్తృతిగల్గి నాల్గు చేతుల విశాలంగా త్రిభుజాకృతితో మూడు అంచు కట్టలు గల్గి యుండాలి.

తస్య చోత్తరపూర్వేణ వితస్తిత్రయసంస్థితమ్ ।
ప్రాగుదక్ప్లవనం తద్వచ్చతురస్రం సమన్తతః ॥94॥

దానికి ఈశాన్యంలో మూడు వితస్తులతో కూడినది, ఈశాన్యానికి వాలుగా ఉండేదీ, నలువైపులా చతురస్రంగా కుండాన్ని ఏర్పాటు చేయాలి.

విష్కమ్భార్ధోచ్ఛ్రితం ప్రోక్తం స్థణ్డిలం విశ్వకర్మణా ।
సంస్థాపనాయ దేవానాం వప్రత్రయసమావృతమ్ ॥95॥

విశ్వకర్మ $1^1/2$ విష్కంభాల ఎత్తుగా వేదిక ఉండాలనీ, అది మూడు ప్రాకారాలతో చుట్టబడి యుండాలనీ చెప్పాడు. దేవతలను స్థాపించడానికై ఇలా దీన్ని సిద్ధం చేయాలి.

ద్వ్యఙ్గులోచ్ఛ్రితో వప్రః ప్రథమః స ఉదాహృతః ।
అఙ్గులోచ్ఛ్రయసంయుక్తం వప్రద్వయమథోపరి ॥96॥

మొదటి ప్రాకారం రెండంగుళాల ఎత్తూ, ఆపై రెండు ప్రాకారాలూ ఒక్క అంగుళం ఎత్తూ ఉండాలి.

త్ర్యఙ్గులస్య చ విస్తార స్సర్వేషాం కథ్యతే బుధైః ।
దశాఙ్గులోచ్ఛ్రితా భిత్తిస్థణ్డిలస్య తథోపరి ।
తస్మిన్నావాహయేద్దేవాన్పూర్వవత్పుష్పతణ్డులైః ॥97॥

ప్రతి ఒక్కటీ మూడంగుళాల విస్తారం కల్గి వుండాలని బుధులన్నారు. వేదికపై దాని బయటి అంచుమీద పది అంగుళాల ఎత్తున ప్రాకారం ఉండాలి. వెడల్పు మూడంగుళాలే. దానిపై దేవతలను పూర్వం లాగా పుష్పతండులాలతో ఆవాహనం చేయాలి.

ఆదిత్యాభిముఖా స్సర్వా స్సాధిప్రత్యధిదేవతాః ।
స్థాపనీయా మునిశ్రేష్ఠ నాంతరేణ పరాఙ్ముఖాః ॥98॥

మునివర్యా! ఈ అధిదేవతలూ, ప్రత్యధిదేవతలూ అందరూ ఆదిత్యాభిముఖులుగా ఉండాలి. తూర్పుముఖంగా దేవతలను నిల్పాలి. అంతేకాని సూర్యునికి పెడముఖంగా ఉండరాదు.

గరుత్మానధిక స్తత్ర సమ్పూజ్య శ్శ్రియమిచ్ఛతా ।
సామధ్వనిశరీరస్త్వం వాహనం పరమేష్ఠినః ।
విషపాపహరో నిత్యమతశ్శాన్తిం ప్రయచ్ఛ మే ॥99॥

వారిలో గరుత్మంతుడు అధికుడు. సిరి కోరేవాడు గరుడుని పూజించాలి. నీవు సామధ్వని శరీరుడవు, పరమేష్ఠికి వాహనమవు, విషాన్నీ, పాపాలనూ హరించువాడవు గాన నాకు శాంతినిమ్ము.

పూర్వవత్కుమ్భమామన్త్ర్య తద్వద్ధోమం సమాచరేత్ ।
సహస్రాణాం శతం హుత్వా సమిత్సఙ్ఖ్యాదికం పునః ।
ఘృతకుమ్భం వసోర్ధారాం పాతయేదనలోపరి ॥100॥

పూర్వం లాగానే కుంభాన్ని ఆమంత్రణం చేసి అట్లే హోమం చేయాలి. లక్షసార్లు హోమం చేసి మిగిలిన సమిధలను లెక్కించి అందులో వేయాలి. ఘృతకుంభం నుండి వసుధార (నాణ్యాలు, వెండి, బంగారు, రత్నాలు గల్గినది) ను అగ్నిపై పడేటట్లు చేయాలి.

ఔదుమ్బరీం తథార్ద్రాం చ ఋజ్వీం కోటరవర్జితామ్ ।
బాహుమాత్రాం స్రుచం కృత్వా తతఃస్తమ్భద్వయోపరి ।
ఘృతధారాం తతః సమ్యగగ్నేరుపరి పాతయేత్ ॥101॥

పచ్చిమేడికొయ్యతో వంకరలేనిదిగా, తొర్రలు లేనిదిగా బాహువంత పొడవు స్రుక్కును చేయాలి. రెండు స్తంభాలపై దానిని నిల్పి ఘృతధారను చక్కగా అగ్నిపై పడునట్లు చేయాలి.

శ్రావయేత్సూక్తమాగ్నేయం వైష్ణవం రుద్రమైన్దవమ్ ।
మహావైశ్వానరం సామ జ్యేష్ఠసామ చ వాచయేత్ ॥102॥

అగ్ని – విష్ణు– రుద్ర– ఇందు సూక్తాలను వినిపించాలి. మహావైశ్వానర జ్యేష్ఠసామలను చదివించాలి.

స్నానం చ యజమానస్య పూర్వవత్స్వస్తివాచనమ్ ।
దాతవ్యా యజమానేన పూర్వవద్దక్షిణాః పృథక్ ॥103॥

కామక్రోధవిహీనేన ఋత్విగ్భ్యశ్శాన్తచేతసా ।

యజమానునికి స్నానం, స్వస్తివాచనం, పూర్వం వలెనే చేయాలి. ముందులాగానే కామక్రోధాలు లేనివాడు. శాంతచిత్తుడు అయిన యజమానునిచే ఋత్విక్కులకు విడివిడిగా దక్షిణలందజేయాలి.

నవగ్రహమఖే విప్రాశ్చత్వారో వేదవేదినః ॥104॥
అథవా ఋత్విజౌ శాన్తౌ ద్వావేవ శ్రుతికోవిదౌ ।
కార్యావయుతహోమే తు న ప్రసజ్యేత విస్తరే ॥105॥

నవగ్రహయజ్ఞంలో వేదవేత్తలైన నల్గురు విప్రులు లేదా ఇద్దరు శ్రుతికోవిదులు శాంతులు అయినవారిని ఋత్విక్కులుగా ఎన్నుకోవాలి. అయుతహోమంలో ఇంతకంటే ఎక్కువమందిని వినియోగించరాదు.

తద్వచ్చ దశ చాష్టౌ చ లక్షహోమే తు ఋత్విజః ।
కర్తవ్యా శ్శక్తిత స్తద్వచ్చతురో వా విమత్సరాః ॥106॥

అదేరీతిగా లక్షహోమంలో పదిమంది లేక ఎనిమిదిమంది ఋత్విక్కులను పిలవాలి. లేదా శక్తికొలది విమత్సరుడై నల్గురినైనా వినియోగించాలి.

నవగ్రహమఖాత్సర్వం లక్షహోమే దశోత్తరమ్ ।
భక్ష్యాన్ దద్యాన్మునిశ్రేష్ఠ భూషణాన్యపి శక్తితః ॥107॥

మునివర్యా! నవగ్రహయజ్ఞంకంటే లక్షహోమంలో పదిరెట్లు ఎక్కువగా అన్ని భక్ష్యాల నివ్వాలి. శక్తికొలది భూషణాలు గూడా ఇవ్వాలి.

శయనాని సవస్త్రాణి హైమాని కటకాని చ ।
కర్ణాఙ్గులిపవిత్రాణి కణ్ఠసూత్రాణి శక్తిమాన్ ॥108॥

వస్త్రాలతో గూడా శక్తిగలవాడు శయనాలు, స్వర్ణకటకాలు కర్ణాంగుళి పవిత్రాలు, కంఠసూత్రాలు ఇవ్వాలి.

న కుర్యాద్దక్షిణాహీనం విత్తశాఠ్యేన మానవః ।
అదదల్లోభతో మోహాత్ కులక్షయమవాప్నుతే ॥109॥

విత్తశాఠ్యంతో దక్షిణలలో లోపం చేయరాదు. లోభంతోనో, మోహంతోనో ఇవ్వనివాడు కులక్షయం పొందుతాడు.

అన్నదానం యథాశక్త్యా కర్తవ్యం భూతిమిచ్ఛతా ।
అన్నహీనః కృతో యస్మాద్దుర్భిక్షఫలదో భవేత్ ॥110॥

భూతికాముడు యథాశక్తి ఇక్కడ దానం చేయాలి. అన్నహీనంగా చేస్తే దుర్భిక్షఫలం ఇచ్చినవా డవుతాడు.

అన్నహీనో దహేద్రాష్ట్రం మన్త్రహీనస్తు ఋత్విజః ।
యష్టారం దక్షిణాహీనం నాస్తి యజ్ఞసమో రిపుః ॥111॥

అన్నహీనయజ్ఞం రాష్ట్రాన్ని దహిస్తుంది. మంత్రహీనయజ్ఞం ఋత్విక్కులను దహిస్తుంది. దక్షిణాహీనమైనది యజమానుణ్ణి దహిస్తుంది. కాన యజ్ఞంతో సమానమైన శత్రువు లేదు.

న వాప్యల్పధనః కుర్యాల్లక్షహోమం నరః క్వచిత్ ।
యస్మాత్పీడాకరో నిత్యం య ఏవ భవతి గ్రహః ॥112॥

తమేవ పూజయేద్భక్త్యా ద్వౌ వా త్రీన్వా యథావిధి ।
ఏకమభ్యర్చయేద్భక్త్యా బ్రాహ్మణం వేదపారగమ్ ।
దక్షిణాభిః ప్రయత్నేన బహూనల్పవిత్తవాన్ ॥113॥

అల్పధనుడు లక్షహోమం చేయరాదు. ఎందుకంటే యజ్ఞంలో యే గ్రహం పీడాకరమై ఉంటుందో దానిని భక్తితో పూజించాలి. లేదా ఒకరినైనా వేదపారగుడైన బ్రాహ్మణుణ్ణి దక్షిణతో పూజించాలి. (పీడాకరమైన

ఒకటి లేక రెండు మూడు (గ్రహాలను అర్చించాలి.) అంతేకాని ధనహీనుడు చాలామందిని పూజించడానికి యత్నించరాదు.

లక్షహోమస్తు కర్తవ్యో యదా విత్తం భవేద్బహు ।
యత స్సర్వానవాప్నోతి కుర్వన్కామాన్విధానతః ॥114॥

బహు విత్తం కల్గినపుడే లక్షహోమం చేయాలి. విధి ప్రకారం దీన్ని చేసేవాడు సమస్తమైన కామాలనూ పొందుతాడు.

పూజ్యతే శివలోకే చ వస్వాదిత్యమరుద్గణైః ।
యావత్కల్పశతాన్యష్టావథ మోక్షమవాప్నుయాత్ ॥115॥

అతడు ఎనిమిది కల్పశతాల కాలం శివలోకంలో వసువులు, ఆదిత్యులు, మరుద్గణాలచే పూజలందుకొని ఆ తరువాత మోక్షం పొందుతాడు.

సకామో యస్త్విమం కుర్యాల్లక్షహోమం యథావిధి ।
స తం కామమవాప్నోతి పదమానన్త్యమశ్నుతే ॥116॥

ఎవడు సకాముడై యథావిధిగా ఈ లక్షహోమం చేస్తాడో, వాడు ఆ కామం పొంది అనంతపదం చేరుకొంటాడు.

పుత్రార్థీ లభతే పుత్రాన్ ధనార్థీ లభతే ధనమ్ ।
భార్యార్థీ శోభనాం భార్యాం కుమారీ చ శుభం పతిమ్ ॥117॥

పుత్రార్థి పుత్రులనూ, ధనార్థి ధనాన్నీ, భార్యార్థి మంచి భార్యనూ, కుమారి మంచి భర్తనూ పొందగలరు.

భ్రష్టరాజ్యస్తథా రాజ్యం శ్రీకామశ్శ్రియమాప్నుయాత్ ।
యం యం ప్రార్థయతే కామం స వై భవతి పుష్కలః ।
నిష్కామః కురుతే యస్తు స పరం బ్రహ్మ గచ్ఛతి ॥118॥

రాజ్యభ్రష్టుడు రాజ్యాన్నీ, శ్రీకాముడు సిరినీ పొందుతాడు. ఏయే కోరికలున్నవో, అవన్నీ పుష్కలంగా లభిస్తాయి. నిష్కాముడై చేస్తే పరబ్రహ్మ ప్రాప్తి కల్గుతుంది.

అస్మాచ్ఛతగుణః ప్రోక్తః కోటిహోమ స్స్వయమ్భువా ।
ఆహుతీభిః ప్రయత్నేన దక్షిణాభిః ఫలేన చ ॥119॥

లక్షహోమం కంటే కోటిహోమంలో ఆహుతులు, దక్షిణలు శతగుణాధికంగా ఉంటాయని బ్రహ్మ చెప్పాడు.

పూర్వవద్గ్రహదేవానామావాహనవిసర్జనే ।
హోమమన్త్రా స్త ఏవోక్తా స్స్నానదానే తథైవ చ ।
కుణ్డమణ్డపవేదీనాం విశేషోఽయం నిబోధ మే ॥120॥

ఇందులో గ్రహాలు, దేవతల ఆవాహన, విసర్జనాలు పూర్వం మాదిరిగానే వుంటాయి. హోమమంత్రాలూ అవే, స్నానదానాలూ అవే. ఇక కుండం, మండపం, వేదిక- వీటిలోని విశేషాలు తెలుసుకో

కోటిహోమే చతుర్హస్తం చతురస్రం తు సర్వతః ।
యోనిచక్రద్వయోపేతం తదప్యాహుస్త్రిమేఖలమ్ ॥121॥

కోటిహోమంలో కుండం చతురస్రంగా ఉండాలి. నాల్గు హస్తాల పొడవు, వెడల్పు, లోతులు కల్గి ఉండాలి. దానికి అంగాలుగా యోనిచక్రాలు రెండుండాలి. దానికి మూడు అంచు కట్లుండాలి.

ద్వ్యఙ్గుళాభ్యుచ్ఛ్రితా కార్యా ప్రథమా మేఖలా బుధైః ।
త్ర్యఙ్గుళాభ్యుచ్ఛ్రితా తద్వద్ద్వితీయా పరికీర్తితా ॥122॥

ఉచ్ఛ్రాయవిస్తరాభ్యాం చ తృతీయా చతురఙ్గలా ।
ద్వ్యఙ్గులశ్చేతి విస్తారః పూర్వయోరేవ శస్యతే ॥123॥

మొదటి అంచు రెండంగుళాల ఎత్తుగలదిగా చేయాలి. రెండవదాని ఎత్తు మూడంగుళాలు కలదని చెప్ప బడింది. మూడవది నాలుగంగుళాలు ఎత్తు విస్తారం కలిగి ఉంటుంది. రెండంగుళాల విస్తృతి ముందు చెప్పినవాటికే ప్రశస్తం.

వితస్తిమాత్రా యోని స్స్యాత్షట్సప్తాఙ్గులవిస్తృతా ।
కూర్మపృష్ఠోన్నతా మధ్యే పార్శ్వయోశ్చాఙ్గులోచ్ఛ్రితాః ॥124॥

యోని జానెడు మాత్రముండాలి. ఒక్కొక్క భుజం కొలత ఆరు లేక ఏడంగుళాల విస్తృతి గల్గి కూర్మ పృష్ఠంలాగా మధ్యలో ఉన్నతమై ప్రక్కలలో అంగుళం ఎత్తు కలదిగా ఏర్పాటు కావాలి.

గజాస్యసదృశీ తద్వదాయతా ఛిద్రసంయుతా ।
ఏతత్సర్వేషు కుణ్డేషు యోనిలక్షణముచ్యతే ॥125॥

ఏనుగు ముఖంలాగా త్రిభుజాకారం ఛిద్రం కల్గి అంతే ఆయతంగా ఉండాలి. ఇది అన్ని కుండాలలోనూ యోని లక్షణమని చెప్పబడినది.

మేఖలోపరి సర్వత్ర అశ్వత్థదలసన్నిభమ్ ।
వేదీ చ కోటిహోమే స్యాద్వితస్తీనాం చతుష్టయమ్ ॥126॥

ప్రతిమేఖలమీద రావి ఆకు ఆకృతిని ఏర్పరచాలి. కోటిహోమంలో వేదిక నాల్గు వితస్తుల కొలత గలదై ఉండాలి.

చతురస్రా సమన్తాచ్చ త్రిభిర్వప్రైస్తు సంయుతా ।
వప్రప్రమాణం పూర్వోక్తం వేదీనాం చ తథోచ్ఛ్రయః ॥127॥

ఆ వేది నలువైపులా చతురస్రాకారమై ఉండాలి. మూడు వప్రాలు గలిగి యుండాలి. వప్రపుకొలత, వేదిక ఎత్తు పూర్వం చెప్పడమైంది.

తథా షోడశ హస్తస్స్యాన్మణ్డపశ్చ చతుర్ముఖః ।
పూర్వద్వారే చ సంస్థాప్య బహ్వృచం వేదపారగమ్ ॥128॥

యజుర్విదం తథా యామ్యే పశ్చిమే సామవేదినమ్ ।
అథర్వవేదినం తద్వదుత్తరే స్థాపయేద్బుధః ॥129॥

అట్లే మండపం చతుర్ముఖమై పదునారు హస్తాలభుజాలతో చతురస్రంగా ఉండాలి. బహ్వృచుడైన (ఋగ్వేది) వేద పండితుణ్ణి తూర్పు ద్వారంవద్ద నిల్పాలి. యజుర్వేదిని దక్షిణాన, సామవేదిని పడమట, అథర్వవేదిని ఉత్తరాన స్థాపించాలి.

అష్టౌ తు హౌమకాః కార్యా వేదవేదాఙ్గవేదినః ।
ఏవం ద్వాదశ తాన్విప్రాన్ వస్త్రమాల్యానులేపనైః ।
పూర్వవత్పూజయేద్భక్త్యా వస్త్రాభరణభూషణైః ॥130॥

వేదవేదాంగవేత్తలగు ఎనిమిదిమంది హోమకర్తలను నియమించాలి. ఇలా మొత్తం పండ్రెండుమంది విప్రులవుతారు. వారిని వస్త్ర మాల్యానులేపనాలతో, వస్త్రాభరణ భూషణాలతో పూర్వం వలెనే భక్తితో పూజించాలి.

రాత్రిసూక్తం చ రౌద్రం చ పావమానం సుమఙ్గలమ్ ।
పూర్వతో బహ్వృచ శ్శాన్తిం పఠన్నాస్తే హ్యుదఙ్ముఖః ॥131॥

రాత్రిసూక్తం, రుద్రసూక్తం, పవమాన సూక్తం, సుమంగళ సూక్తాలను చదవాలి. తూర్పున బహ్వృచుడు ఉదఙ్ముఖుడై శాంతిపాఠం చెప్పాలి.

శాక్తం రౌద్రం చ సౌమ్యం చ కౌష్మాణ్డం శాన్తిమేవ చ ।
పాఠయే ద్దక్షిణద్వారి యజుర్వేదినముత్తమమ్ ॥132॥

శక్తి – రుద్ర – సోమ – కూష్మాండమంత్రాలను, శాంతిని దక్షిణ ద్వారాన యజుర్వేదిచే పఠింపజేయాలి.

సుపర్ణమథ వైరాజమాగ్నేయం రుద్రసంహితామ్ ।
జ్యేష్ఠసామ తథా శాన్తిం ఛన్దోగః పశ్చిమే జపేత్ ॥133॥

సుపర్ణ – వైరాజ – ఆగ్నేయ – రుద్ర – సంహితలను జ్యేష్ఠ – సామ – శాంతి మంత్రాలను సామవేది పశ్చిమాన పఠించాలి.

శాన్తిసూక్తం చ సౌరం చ తథా సంవరణం శుభమ్ ।
పౌష్టికం చ మహారాజ్యముత్తరేణాప్యథర్వవిత్ ॥134॥

శాన్తి – సౌర – సంవరణ – పౌష్టిక – మహారాజ్య మంత్రాలను అథర్వవేత్త ఉత్తర ద్వారాన పఠించాలి.

పఞ్చభిస్సప్తభి ర్వాఽపి హోమః కార్యోఽత్ర పూర్వవత్ ।
స్నానే దానే చ మన్త్రాః స్యుస్త ఏవ మునిసత్తమ! ॥135॥

ఐదుగురు లేక ఏడుమంది విప్రులచే పూర్వం వలెనే హోమం చేయించాలి. మునివర్యా! స్నానదానాలలో అవే మంత్రాలు పఠించాలి.

వసోర్ధారా విధానం చ లక్షహోమవదిష్యతే ।
అనేన విధినా యస్తు కోటిహోమం సమాచరేత్ ।
సర్వాన్కామానవాప్నోతి తతో విష్ణుపదం వ్రజేత్ ॥136॥

వసోర్ధారావిధానం లక్షహోమంలో లాగానే ఉంటుంది. ఈ పద్ధతిలో ఎవడు చేస్తాడో వాడు సర్వకామాలూ పొందుతాడు. ఆపై విష్ణుపదం చేరుకుంటాడు.

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి గ్రహయజ్ఞత్రయం నరః ।
సర్వపాపవిశుద్ధాత్మా పదమిన్ద్రస్య గచ్ఛతి ॥137॥

ఎవడు ఈ గ్రహయజ్ఞాలు మూడింటిని పఠిస్తాడో, వింటాడో, వాడు సకల పాపశుద్ధాత్ముడై ఇంద్రపదం పొందుతాడు.

అశ్వమేధసహస్రాణి దశ చాష్టౌ చ ధర్మవిత్ ।
కృత్వా యత్ఫలమాప్నోతి కోటిహోమా త్తదశ్నుతే ॥138॥

పదునెనిమిది వేల అశ్వమేధాలు చేస్తే ఏ ఫలమో ఆ ఫలం ధర్మజ్ఞుడైన కోటి కర్త పొందుతాడు.

బ్రహ్మహత్యాసహస్రాణి భ్రూణహత్యార్బుదాని చ ।
కోటిహోమేన నశ్యన్తి యథావచ్ఛివభాషితమ్ ॥139॥

వెయ్యి బ్రహ్మహత్యలు, అర్బుదభ్రూణహత్యలు, కోటిహోమంతో నశిస్తాయని శివుని వచనం.

వశ్యకర్మాభిచారాది తథైవోచ్చాటనాదికమ్ ।
నవగ్రహమఖం కృత్వా తతః కామ్యం సమాచరేత్ ॥140॥

నవగ్రహయజ్ఞం చేసిన తరువాతనే వశ్యకర్మాభిచారాదులు, అట్లే ఉచ్చాటనాది కామ్యకర్మలు చేయాలి.

అన్యథా ఫలదం పుంసాం న కామ్యం జాయతే క్వచిత్ ।
తస్మాదయుతహోమస్య విధానం పూర్వమాచరేత్ ॥141॥

లేనిచో కామ్యకర్మ ఫల ప్రదం కాదు. కాన అయుతహోమం ముందు ఆచరించాలి.

వృత్తం చోచ్చాటనే చాపి తథా చ వశకర్మణి ।
త్రిమేఖలం చైకవక్త్రం త్ర్యరత్నిం విస్తరేణ తు ॥142॥

ఉచ్చాటన కర్మలో కుండం గుండ్రంగా, వశ్యకర్మలో గూడా అట్లే ఉండాలి. ఒకే ముఖం, మూడు మేఖలులు కలది, మూడు పిడి మూరల వ్యాసం కలదిగా ఉండాలి.

పలాశసమిధ శ్శస్తా మధుగోరోచనాన్వితాః ।
చన్దనాగురుణా తద్వత్కుఙ్కుమేనాభిషించితాః ॥143॥

ఇందులో మోదుగసమిధలు ప్రశస్తాలు. తేనెలో గోరోచనంతో వాటిని తడపాలి. మరియు అవి చందనాగురు చేత, కుంకుమంచేత అభిషించితాలు కావాలి.

హోమయేన్మధుసర్పిర్భ్యాం బిల్వాని కమలాని చ ।
సహస్రాణి దశైవోక్తం సర్వదైవ స్వయమ్భువా ॥144॥

తేనెతో, ఘృతంతో బిల్వాలను, కమలాలను హోమించాలి. పదివేల సమర్పణలు చేయాలని బ్రహ్మవచనం.

వశ్యకర్మణి బిల్వానాం పద్మానాం చైవ ధర్మవిత్ ।
సుమిత్రియా న ఆప ఓషధయ ఇతి హోమయేత్ ॥145॥

వశ్యకర్మలో ధర్మజ్ఞుడు బిల్వాలు, పద్మాలు 'సుమిత్రియా న ఆప ఓషధయః' అంటూ హోమించాలి.

న చాత్ర స్థాపనం కార్యం న చ కుమ్భాభిషేచనమ్ ।
స్నానం సర్వౌషధైః కృత్వా శుక్లపుష్పామ్బరో గృహీ ॥146॥

ఇక్కడ స్థాపనం చేయరాదు. కుంభాభిషేచనం తగదు. సర్వౌషధాల జలంతో స్నానం చేసి గృహస్థుడు శుక్లపుష్పాలు, శుక్లవస్త్రాలు ధరించాలి.

కణ్ఠసూత్రై స్సకనకైర్విప్రాన్ సమభిపూజయేత్ ।
సూక్ష్మవస్త్రాణి దేయాని శుక్లా గావ స్సకాఞ్చనాః ॥147॥

కనకకంఠ సూత్రాలతో విప్రులను పూజించాలి. సూక్ష్మవస్త్రాలు, తెల్ల గోవులు, బంగారంతో సహా దానం చేయాలి.

అవశ్యాని వశీకుర్యా త్సర్వశత్రుబలాన్యపి ।
అమిత్రాణ్యపి మిత్రాణి హోమాఽ యం పాపనాశనః ॥148॥

దీనితో అవశములైన సకలశత్రు బలాలనూ అలా వశం చేసుకోవచ్చు. అమిత్రులను మిత్రులుగా చేసుకోవచ్చు. ఈ హోమం పాపనాశకమైనది.

విద్వేషణాభిచారే చ త్రికోణం కుణ్డమిష్యతే ।
ద్విమేఖలం ద్రోణముఖం హస్తమాత్రం చ సర్వశః ॥149॥

విద్వేషంతో చేసే అభిచారక్రియలో త్రికోణమైన కుండం కావాలి. అది రెండు మేఖలలు కలిగి ద్రోణ(ఒకవిధమైన జలపాత్ర)ముఖంతో హస్తమాత్రంగా అన్ని వైపులా ఉండాలి.

హోమం కుర్యు స్తతో విప్రా రక్తమాల్యానులేపనాః ।
నివీతా లోహితోష్ణీషా లోహితామ్బరధారిణః ॥150॥

ఆ పై రక్తమాల్యానులేపనం గల విప్రులు హోమం చేయాలి. నివీతంగా ధరించిన ఎర్రని యజ్ఞ సూత్రం, ఎర్రని ఉష్ణీషం, ఎర్రటి వస్త్రాలు వారు ధరించాలి.

నరవాహనయుక్తాః స్యుః జపాకుసుమసన్నిభాః ।
సమిధో వామహస్తేన శ్యేనాస్థిలవసంయుతాః ।
హోతవ్యా ముక్తకేశైస్తు ధ్యాయద్భిరశివం రిపౌ ॥151॥

వారు దాసానిపూలవలె భాసిస్తూ నరవాహనులై హోమం చేయాలి. డేగ ఎముక ముక్కలతో జత చేసిన సమిధలను ఎడమచేత్తో దిగవిడిచి హోమం చేయాలి. శత్రువులకు అమంగళం ధ్యానిస్తూ వెంట్రుకలు దిగవిడిచి హోమించాలి.

దుర్మిత్ర్యాస్తస్మై సన్తు తథా హుంఫడితీతి చ ।
శ్యేనాభిచారమన్త్రేణ క్షురం సమభిమన్త్ర్య చ ॥152॥

'దుర్మిత్ర్యా స్తస్మై సంతు' – హుం ఫట్ అంటూ శ్యేనాభిచారమంత్రంతో కత్తిని అభిమంత్రించాలి.

ప్రతిరూపం రిపోః కృత్వా క్షురేణ పరికర్తయేత్ ।
రిపురూపస్య శకలాన్యథైవాగ్నౌ వినిఃక్షిపేత్ ॥153॥

శత్రువుయొక్క ప్రతిరూపం కల్పించి కత్తితో నరకాలి. రిపురూపంయొక్క శకలాలను అగ్నిలో పడవేయాలి.

గ్రహయజ్ఞవిధానాన్తే సదైవాభిచరన్పునః ।
విద్వేషిణం తథా కుర్వన్నేతదేవం సమాచరేత్ ॥154॥

గ్రహయజ్ఞ విధానం చివర సదా అభిచారక్రియ చేసేవాడు ఇదే చేయాలి, విద్వేషి పట్ల చేయు క్రియ గూడా ఇట్టిదే.

ఇహైవ ఫలదం పుంసామేతన్నాముత్ర శోభనమ్ ।
తస్మాచ్ఛాన్తికమేవాత్ర కర్తవ్యం భూతిమిచ్ఛతా ॥155॥

ఈ లోకంలోనే ఇది జనులకు ఫలప్రదం కాని పరలోకంలో శోభనం కాదు. కాన భూతిని కోరువాడు శాంతిక్రియనే చేయాలి.

గ్రహయజ్ఞత్రయం కుర్యాద్యస్త్వకామ్యేన మానవః ।
స విష్ణోః పదమాప్నోతి పునరావృత్తిదుర్లభమ్ ॥156॥

నిష్కామంగా గ్రహయజ్ఞాలు మూడు చేసేవాడు విష్ణుపదం చేరుకొంటాడు. అది పునరావృత్తి లేనిది.

య ఇదం శృణుయాన్నిత్యం శ్రావయేద్వాపి మానవః ।
న తస్య గ్రహపీడా స్యాన్న చ బన్ధుజనక్షయః ॥157॥

ఎవడు దీన్ని నిత్యం వింటాడో, మరియు వినిపిస్తాడో, అతనికి గ్రహపీడ, బంధుజన క్షయం ఉండవు.

గ్రహయజ్ఞత్రయం గేహే లిఖితం యత్ర తిష్ఠతి ।
న పీడా తత్ర బాలానాం న రోగో న చ బన్ధనమ్ ॥158॥

ఏ యింట ఈ గ్రహయజ్ఞాలు మూడూ వ్రాసివుంచబడునో అక్కడ బాలురకు పీడ, రోగం, బంధనం ఉండవు.

అశేషయజ్ఞఫలదం నిశ్శేషాఘవినాశనమ్
కోటిహోమం విదుః ప్రాజ్ఞాః భుక్తిముక్తి ఫలప్రదమ్ ॥159॥

సమస్త యజ్ఞఫలాలను ప్రసాదించేదీ, సకల పాపాలనూ నశింప జేసేదీ, భుక్తి ముక్తి ప్రదమూ అని కోటి హోమాన్ని ప్రాజ్ఞు లెరిగియున్నారు.

అశ్వమేధఫలం ప్రాహు ర్లక్షహోమం సురోత్తమాః ।
ద్వాదశాహసమస్తద్వన్నవగ్రహమఖ స్స్మృతః ॥160॥

దేవోత్తములు లక్షహోమం అశ్వమేధ ఫలప్రద మంటారు. నవగ్రహయజ్ఞం ద్వాదశాహ యజ్ఞమనే శ్రౌతయజ్ఞంతో సమానమైనది.

ఇతి కథితమిదానీముత్సవానన్దహేతో స్సకలకలుషహారీ దేవయజ్ఞాభిషేకః ॥
పరిపఠతి య ఇత్థం యశ్శృణోతి ప్రసఙ్గాదభిభవతి స శత్రూనాయురారోగ్యయుక్తః ॥161॥

ఇలా ఉత్సవానందంకొరకు, సమస్త పాపాలనూ హరించే దేవయజ్ఞాభిషేక మిప్పుడు చెప్పడమైనది. దీనిని చదువువాడు, ప్రసంగాన్ని బట్టి వినువాడు ఆయురారోగ్యవంతుడై శత్రువులను పరాభవిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే గ్రహయజ్ఞవిధానాదీని త్రినవతితమోఽధ్యాయః ॥ 93 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని గ్రహయజ్ఞవిధానాదులనే తొంబైమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుర్నవతితమోఽధ్యాయః – తొంబైనాల్గవ అధ్యాయం

నవగ్రహస్వరూప కథనమ్ – నవగ్రహస్వరూప కథనం

ఈశ్వర ఉవాచ :– శివుడు చెప్పాడు.

పద్మాసనః పద్మకరః పద్మగర్భసమద్యుతిః ।
సప్తాశ్వ స్సప్తరజ్జుశ్చ ద్విభుజః స్యాత్సదా రవిః ॥1॥

పద్మం ఆసనంగా కలవాడు, పద్మాన్ని చేత పట్టినవాడు, పద్మగర్భంతో సమానమైన కాంతి గలవాడు, ఏడు గుర్రాలు గలవాడు, ఏడు పగ్గాలు గలవాడు, రెండు భుజాలు గలవాడుగా సూర్యుడు సదా ఉండాలి.

శ్వేతః శ్వేతామ్బరధరః శ్వేతాశ్వః శ్వేతవాహనః ।
గదాపాణిర్ద్విబాహుశ్చ కర్తవ్యో వరదః శశీ ॥2॥

తెల్లనివాడు, తెల్ల వస్త్రాలు దాల్చినవాడు, తెల్లగుర్రాలు గలవాడు, శ్వేతమైనరథం (వాహనం) కలవాడు, చేత గద దాల్చినవాడు, రెండు బాహువులు గలవాడు, వరదుడుగా చంద్రుని రూపొందించాలి.

రక్తమాల్యామ్బరధరః శక్తిశూలగదాధరః ।
చతుర్భుజో మేషగమో వరదః స్యాద్ధరాసుతః ॥3॥

ఎఱ్ఱని మాల్యాలు, వస్త్రాలు దాల్చినవాడు, శక్తి శూలం, గద – వీటిని ధరించినవాడు, నాలుగు భుజాలవాడు, మేకపై పయనించువాడు, వరదుడుగా అంగారకు డుండాలి.

పీతమాల్యామ్బరధరః కర్ణికారసమద్యుతిః ।
ఖడ్గచర్మగదాపాణిః సింహస్థో వరదో బుధః ॥4॥

పీతమాల్యాలు, పీతవస్త్రాలు దాల్చినవాడు, గన్నేరుతో సమమైన కాంతిగలవాడు, ఖడ్గచర్మ – గదలను చేపట్టినవాడు, సింహవాహనుడు, వరదుడుగా బుధు డుండాలి.

దేవదైత్యగురూ తద్వత్పీతశ్వేతౌ చతుర్భుజౌ ।
దణ్డినౌ వరదౌ కార్యౌ సాక్షసూత్రకమణ్డలూ ॥5॥

పీతవస్త్రాలు గలవారు, నాల్గు భుజాలు గలవారు, దండధారులు, అక్షసూత్ర కమండలులను దాల్చినవారు, వరదులుగా బృహస్పతి శుక్రులు ఉండాలి.

ఇంద్రనీలద్యుతిః శూలీ వరదో గృధ్రవాహనః ।
బాణబాణాసనధరః కర్తవ్యోఽర్కసుతస్తథా ॥6॥

ఇంద్రనీలంవంటి కాంతి గలవాడు, శూలధారి, వరదుడు, గ్రద్దను వాహనంగా కలవాడు, బాణాలు ధనువు దాల్చినవాడుగా శనిని రూపొందించాలి.

కరాలవదనః ఖడ్గచర్మశూలీ వరప్రదః ।
నీలసింహాసనస్థశ్చ రాహురత్ర ప్రశస్యతే ॥7॥

భీకరమగు ముఖం కలవాడు, ఖడ్గ - చర్మ శూలాలు ధరించినవాడు, వరదుడు, నల్లని సింహంపై కూర్చున్నవాడుగా, రాహువును రూపొందించాలి.

ధూమ్రా ద్విబాహవః సర్వే గదినో వికృతాననాః।
గృధ్రాసనగతా నిత్యం కేతవః స్యుర్వరప్రదాః ॥8॥

ధూమ్రవర్ణులు, రెండు చేతులు గలవారు, అన్ని చేతులలో గదలు దాల్చినవారు, వికృతముఖులు, గృధ్రం ఆసనంగా కలవారు వరప్రదాతలుగా కేతువులను రూపొందించాలి.

సర్వే కిరీటినః కార్యా గ్రహా లోకహితావహాః ।
ద్వ్యఙ్గులేనోచ్ఛ్రితాః సర్వే శతమష్టోత్తరం సదా ॥9॥

గ్రహాల కన్నింటికీ కిరీటాలుండాలి. లోకహితం కలిగించువారు, రెండు అంగుళాల ఎత్తు గలవారుగా వారుండాలి. వీరికి నూటయెనిమిది పర్యాయాలు మంత్రజపం సాగాలి.?

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే నవగ్రహస్వరూప కథనం నామ చతుర్నవతితమోఽధ్యాయః ॥ 94 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని నవగ్రహస్వరూపకథనమనే తొంబైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

❋ ❋ ❋

పంచనవతితమోఽధ్యాయః - తొంబైఅయిదవ అధ్యాయం
శివచతుర్దశీ వ్రతమ్ - శివచతుర్దశీ వ్రతం

నారద ఉవాచ :- నారదుడు చెప్పాడు.

భగవన్ భూతభవ్యేశ తథాఽన్యదపి యచ్ఛ్రుతమ్ ।
భుక్తిముక్తిఫలాయాలం తత్పునర్వక్తుమర్హసి ॥1॥

భగవన్! భూత భవిష్యత్తుల కధిపతీ! మరొకవ్రత మేదైనా విన్నంతమాత్రాన భుక్తిముక్తి ఫలప్రదమైన దానిని చెప్పు.

ఏవముక్తోఽబ్రవీచ్ఛంభురయం వాఙ్మయపారగః ।
మత్సమస్తపసా బ్రహ్మన్పురాణశ్రుతివిస్తరే ॥2॥

ధర్మోఽయం వృషరూపేణ నన్దీ నామ గణాధిపః ।
ధర్మాన్మాహేశ్వరాన్వక్ష్యత్యతః ప్రభృతి నారద! ॥3॥

ఇలా నారదు డడుగగా శివుడు చెప్పాడు. "బ్రహ్మన్! నారదా! ఈ నంది వాఙ్మయపారం ముట్టినవాడు. తపస్సులోనూ, పూరాణవేద విజ్ఞానంలోనూ నాతో సమానుడు. వృషభరూపంలో ఉన్న ధర్మమే ఇతడు. ఇతడు గణాల కధిపతి, ఇతని పేరు నంది. ఇప్పటి నుండి ఇతడు మాహేశ్వరధర్మాలను చెప్పగలడు."

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

ఇత్యుక్త్వా దేవదేవేశస్తత్రైవాన్తరధీయత ।
నారదోఽపి చ శుశ్రూషురపృచ్ఛన్నందికేశ్వరమ్ ।
ఆదిష్టస్త్వం శివేనేహ వద మాహేశ్వరం వ్రతమ్ ॥4॥

అని చెప్పి శివుడు అక్కడే అంతర్ధానమయ్యాడు. నారదుడు గూడా వినగోరి నందికేశ్వరుణ్ణి ఇలా అడిగాడు. శివుడు నిన్ను ఆదేశించాడు. మాహేశ్వరవ్రతాన్ని వివరించు.

నన్దికేశ్వర ఉవాచ :- నందికేశ్వరుడు చెప్పాడు.

శృణుష్వావహితో బ్రహ్మన్! వక్ష్యే మాహేశ్వరం వ్రతమ్ ।
త్రిషు లోకేషు విఖ్యాతా నామ్నా శివచతుర్దశీ ॥5॥

బ్రహ్మన్! సావధానుడవై విను, మాహేశ్వరవ్రతం చెబుతాను. ఇది ముల్లోకాలలోనూ 'శివచతుర్దశీవ్రతం' అన్న పేరుతో విఖ్యాతమైనది.

మార్గశీర్షే త్రయోదశ్యాం సితాయామేకభోజనః ।
ప్రార్థయేద్దేవదేవేశం త్వామహం శరణం గతః ॥6॥

మార్గశీర్షశుక్ల త్రయోదశినాడు ఒంటిపూట భుజించి దేవదేవేశుణ్ణి "నిన్ను నేను శరణు పొందుతున్నాను" అని ప్రార్థించాలి.

చతుర్దశ్యాం నిరాహారః సమ్యగభ్యర్చ్య శంకరమ్ ।
సువర్ణవృషభం దత్త్వా భోక్ష్యామీతి పరేఽహని ॥7॥

ఏవం నియమకృత్సుప్త్వా ప్రాతరుత్థాయ మానవః ।
కృతస్నానజపః పశ్చాదుమయా సహ శంకరమ్ ।
పూజయేత్కమలైః శుభ్రైర్గన్ధమాల్యానులేపనైః ॥8॥

చతుర్దశినాడు ఉపవసించి నిరాహారుడై శంకరుణ్ణి చక్కగా పూజింజాలి. "సువర్ణ వృషభాన్ని దానమిచ్చి మరునాడు భుజిస్తాను" అని నియమం చేసుకొని ఆ రాత్రి నిద్రించాలి. మరునాడు ఉదయాననే లేచి స్నాన జపాలు చేసి పిదప ఉమాదేవితో గూడిన శంకరుణ్ణి నిర్మలమైన పద్మాలతో, గంధమాల్యానులేపనాలతో పూజించాలి.

పాదౌ నమః శివాయేతి శిరః సర్వాత్మనే నమః ।
లలాటం తు త్రినేత్రాయ నేత్రాణి హరయే నమః ॥9॥

'నమః శివాయ' అని పాదాలనూ, 'సర్వాత్మనే నమః' అని శిరస్సునూ, 'త్రినేత్రాయ నమః' అని నేత్రాలనూ, 'హరయే నమః' అని లలాటాన్నీ

ముఖమిన్దుముఖాయేతి శ్రీకణ్ఠాయేతి కన్ధరామ్ ।
సద్యోజాతాయ కర్ణౌ తు వామదేవాయ వై భుజౌ ॥10॥

'ఇందుముఖాయ నమః' అని ముఖాన్నీ, 'శ్రీకంఠాయ నమః' అని మెడనూ, 'సద్యోజాతాయ నమః' అని చెవులనూ, 'వామదేవాయ నమః' అని భుజాలనూ

అఘోరహృదయాయేతి హృదయం చాభిపూజయేత్ ।
స్తనౌ తత్పురుషాయేతి తథేశానాయ చోదరమ్ ॥11॥

పార్శ్వే చానన్తధర్మాయ జ్ఞానరూపాయ వై కటిమ్ ।
ఊరూ చానన్తవైరాగ్యసింహాయేత్యభిపూజయేత్ ॥12॥

'అఘోరహృదయాయ నమః' అని హృదయాన్నీ పూజించాలి. 'తత్పురుషాయ నమః' అని స్తనాలనూ, 'ఈశానాయ నమః' అని ఉదరాన్నీ, 'అనంతధర్మాయ నమః' అని పార్శ్వాలనూ, 'జ్ఞానరూపాయ నమః, అని కటినీ, 'అనంతవైరాగ్య సింహాయ నమః' అని ఊరువులనూ అర్చించాలి.

అనన్తైశ్వర్యనాథాయ జానునీ చార్చయేద్బుధః ।
ప్రధానాయ నమో జంఘే గుల్ఫౌ వ్యోమాత్మనే నమః॥13॥

'అనంతైశ్వర్యనాథాయ నమః' అని జానువులనూ అర్చించాలి. 'ప్రధానాయ నమః' అని జంఘలనూ, 'వ్యోమాత్మనే నమః' అని గుల్ఫాలనూ

వ్యోమకేశాత్మరూపాయ కేశాన్ పృష్ఠం చ పూజయేత్ ।
నమః పుష్ట్యై నమస్తుష్ట్యై పార్వతీం చాపి పూజయేత్ ॥14॥

'వ్యోమకేశాత్మరూపాయ నమః' అని కేశాలనూ, పృష్ఠాన్నీ పూజించాలి. 'పుష్ట్యై నమః', 'తుష్ట్యై నమః' అని పార్వతిని గూడా అర్చించాలి.

తతస్తు వృషభం హైమముదకుంభసమన్వితమ్ ।
శుక్లమాల్యామ్బరధరం పంచరత్నసమన్వితమ్ ।
భక్ష్యైర్నానావిధైర్యుక్తం గురవే వినివేదయేత్ ॥15॥

తదుపరి స్వర్ణవృషభాన్ని ఉదకకుంభ సమేతంగా శుక్లమాల్యాంబరాలు ధరింపజేసి పంచరత్నాలతో గూడా నానావిధ భక్ష్యాలతో కూడిన బ్రాహ్మణునికి నివేదించాలి.

తతో విప్రాన్సమాహూయ తర్పయేద్భక్తితః శుభాన్ ।
పృషదాజ్యం చ సంప్రాశ్య స్వపేద్భూమావుదఙ్ముఖః ॥16॥

తర్వాత శుభప్రదులైన విప్రులనాహ్వానించి భక్తితో తృప్తిపరచాలి. పృషదాజ్యం (గట్టిపరచిన పాలు నేయి కలిపిన మిశ్రమం) తిని ఉదఙ్ముఖంగా భూమిపై శయనించాలి.

పంచదశ్యాం తతః పూజ్య విప్రాన్ భుంజీత వాగ్యతః ।
తద్వత్కృష్ణచతుర్దశ్యామేతత్ సర్వం సమాచరేత్ ॥17॥

ఆపై పంచదశినాడు విప్రులను పూజించి మౌనంతో భుజించాలి. అట్లే కృష్ణచతుర్దశినాడు గూడా ఇదంతా చేయాలి.

చతుర్దశీషు సర్వాసు కుర్యాత్పూర్వవదర్చనమ్ ।
యే తు మాసే విశేషాః స్యుస్తాన్నిబోధ క్రమాదిహ ॥18॥

అన్ని చతుర్దశీ తిథులలోనూ ముందులాగానే అర్చనలు కావించాలి. ఇక క్రమంగా ఆ యా మాసాలలోని విశేషాలను వివరిస్తాను, తెలుసుకో.

మార్గశీర్షాదిమాసేషు క్రమాదేతదుదీరయేత్ ।
శంకరాయ నమస్తేఽస్తు నమస్తే కరవీరక ॥19॥

త్ర్యమ్బకాయ నమస్తేఽస్తు మహేశ్వర! తతః పరమ్ ।
నమస్తేఽస్తు మహాదేవ స్థాణవే చ తతః పరమ్ ॥20॥

నమః పశుపతే నాథ నమస్తే శంభవే పునః ।
నమస్తే పరమానన్ద నమః సోమార్ధధారిణే ॥21॥

మార్గశీర్షాదిమాసాలలో క్రమంగా ఇలా చెప్పాలి. 1. శంకరాయ నమః, 2. కరవీరాయ నమః, 3. త్ర్యంబకాయ నమః, 4. మహేశ్వరాయ నమః 5. మహాదేవాయ నమః, 6. స్థాణవే నమః 7. పశుపతయే నమః, 8. నాథాయ నమః 9. శంభవే నమః, 10. పరమానందాయ నమః, 11. సోమార్ధధారిణే నమః.

నమో భవాయ భీమాయ త్వామహం శరణం గతః।
గోమూత్రం గోమయం క్షీరం దధి సర్పిః కుశోదకమ్ ॥22॥

పంచగవ్యం తతో బిల్వం కర్పూరం చాగురుం యవాః ।
తిలాః కృష్ణాశ్చ విధివత్ప్రాశనం క్రమశః స్మృతమ్ ।
ప్రతిమాసం చతుర్దశ్యోరేకైకం ప్రాశనం స్మృతమ్ ॥23॥

12. 'భీమాయ భవాయ నమః' అంటూ నిన్ను నేను శరణం పొందుతున్నాను. గోమూత్రం, గోమయం, గోక్షీరం, పెరుగు, నెయ్యి, దర్భోదకం, పంచగవ్యం, బిల్వం, కర్పూరం, అగరు, యవలు, నల్లనువ్వులు–వీటినిక్రమంగా విధి ప్రకారం భుజించాలి. ప్రతిమాసం చతుర్దశినాడు ఇందులో ఒక్కొక్కటి ఆహారమని నైవేద్యమని చెప్పబడింది.

మన్దారైర్మాలతీభిశ్చ తథా బంధూకకైరవైః ।
సింధువారైరశోకైశ్చ మల్లికాభిశ్చ పాటలైః ॥24॥

అర్కపుష్పైః కదమ్బైశ్చ శతపత్రైస్తథోత్పలైః।
ఏకైకేన చతుర్దశ్యోరర్చయేత్పార్వతీపతిమ్ ॥25॥

మందారాలు, మాలతీ పుష్పాలు, మంకెనలు, కలువలు, సింధువారాలు, అశోకాలు, మల్లికలు, పాటలాలు, అర్కపుష్పాలు, కదంబాలు, శతపత్రాలు, నల్లకలువలు ఇందులో ఒక్కొక్క దానితో చతుర్దశీ తిథులలో శివుణ్ణి అర్చించాలి.

పునశ్చ కార్తికే మాసే ప్రాప్తే సంప్రాప్తే తర్పయేద్ద్విజాన్ ।
అన్నైర్నానావిధైర్భక్ష్యైర్వస్త్రమాల్యవిభూషణైః ॥26॥

మరల కార్తికమాసం రాగానే నానావిధాలైన అన్నాలతో భక్ష్యాలతో, వస్త్రమాల్య విభూషణాలతో ద్విజ సంతర్పణ చేయాలి.

కృత్వా నీలవృషోత్సర్గం శ్రుత్యుక్త విధినా నరః ।
ఉమామహేశ్వరం హైమం వృషభం చ గవా సహ ॥27॥

వేదోక్త విధిననుసరించి మనుజుడు నల్లని వృషభాన్ని విసర్జించాలి. పిదప స్వర్ణ ఉమా మహేశ్వరుణ్ణి, గోవుతో సహా వృషభాన్ని దానమివ్వాలి.

ముక్తాఫలాష్టకయుతాం సితనేత్రపటావృతామ్ ।
సర్వోపస్కరసంయుక్తాం శయ్యాం దద్యాత్సుశోభనామ్ ॥28॥

ఎనిమిది ముత్యాలతో కూడినది. తెల్లని నేత్రవస్త్రంతో కూడినది. అన్ని ఉపకరణాలు కలది అయిన శోభనమైన శయ్యను దానమియ్యాలి.

తామ్రపాత్రోపరి పునః శాలితండులసంయుతమ్ ।
స్థాప్య విప్రాయ శాన్తాయ వేదవ్రతపరాయ చ ॥29॥

జ్యేష్ఠసామవిదే దేయం న వక్రమతయే క్వచిత్ ।
గుణజ్ఞే శ్రోత్రియే దద్యాదాచార్యే తత్త్వవేదిని ॥30॥

మరల రాగి పాత్రపైన శాలి తండులాలతో కూడ శాంతుడు, వేదవ్రతపరుడు, జ్యేష్టసామవేత్త, గుణజ్ఞుడు, శ్రోత్రియుడు, ఆచార్యుడు, తత్త్వవేత్త అయినవాని కివ్వాలి. వక్రబుద్ధికి ఇయ్యరాదు.

అవ్యంగాంగాయ సౌమ్యాయ సదా కల్యాణకారిణే ।
సపత్నీకాయ సంపూజ్య వస్త్రమాల్యవిభూషణైః ॥31॥

అంగలోపము లేనివాడు, సౌమ్యుడు, సదా శుభం కలిగించేవాడు, భార్యాసమేతుడు అయిన వానికి వస్త్రమాల్య విభూషణాలను పూజించి సమర్పించాలి.

గురౌ సతి గురోర్దేయం తదభావే ద్విజాతయే ।
న విత్తశాఠ్యం కుర్వీత కుర్వన్దోషాత్పతత్యధః ॥32॥

గురువు సన్నిహితుడై ఉంటే అతని కివ్వాలి. లేకుంటే విప్రుని కియ్యాలి. విత్తశాఠ్యం చేయరాదు. చేస్తే దోషం వల్ల అధఃపతితుడౌతాడు.

అనేన విధినా యస్తు కుర్యాచ్ఛివచతుర్దశీమ్ ।
సోఽశ్వమేధసహస్రస్య ఫలం ప్రాప్నోతి మానవః ॥33॥

ఇలా ఎవడు శివ చతుర్దశీ వ్రతం అనుష్ఠిస్తాడో అట్టి మనుజుడు అశ్వమేధసహస్రఫలం పొందుతాడు.

బ్రహ్మహత్యాదికం కించిద్యదత్రాముత్ర వా కృతమ్ ।
పితృభిర్భ్రాతృభిర్వాపి తత్సర్వం నాశమాప్నుయాత్ ॥34॥

ఇహపరలోకాలలో, చేసిన బ్రహ్మ హత్యాది దోషాలేవైనా ఉంటే అవి, పితరులచే, భ్రాతలచే చేయబడిన నేరాలు, అన్నీ నశిస్తాయి.

దీర్ఘాయురారోగ్యకులాన్నవృద్ధిరత్రాక్షయాముత్ర చతుర్భుజత్వమ్ ।
గణాధిపత్యం దివి కల్పకోటిశతాన్యుషిత్వా పదమేతి శంభోః ॥35॥

దీర్ఘాయువు, ఆరోగ్యం, కులం, అన్న సమృద్ధి దీనివల్ల ఈ లోకంలో అక్షయమౌతాయి. పరత్ర చతుర్భుజత్వం, గణాధిపత్యం పొంది నూరుకోట్ల కల్పాలు, స్వర్గంలో ఉండి చివరికి ఈ వ్రతం చేసినవాడు శంభుపదం చేరుకొంటాడు.

న బృహస్పతిరప్యనన్తమస్యాః ఫలమింద్రో న పితామహోఽపి వక్తుమ్ ।
న చ సిద్ధగణోఽప్యలం న చాహం యది జిహ్వాయుతకోటయోఽపి వక్త్రే ॥36॥

బృహస్పతి, ఇంద్రుడు, బ్రహ్మ – వీరు గూడ అనంతమైన ఈ వ్రతఫలాన్ని వర్ణించలేరు. సిద్ధగణాలు, నేను కూడ పదివేల కోట్ల నాలుకలున్నా నోటితో వర్ణించజాలము.

భవత్యమరవల్లభః పఠతి యః స్మరేద్వా సదా శృణోత్యపి విమత్సరః సకలపాపనిర్మోచనీమ్।
ఇమాం శివచతుర్దశీమమరకామినీకోటయః స్తువన్తి తమనిందితం కిము సమాచరేద్యః సదా॥37॥

సకలపాపాలూ హరించే ఈ శివచతుర్దశీ వ్రతాన్ని ఎవడు పఠిస్తాడో, సదా స్మరిస్తాడో, మాత్సర్యం లేకుండా వింటాడో, వాడు అమరవల్లభుడౌతాడు. వాణ్ణి కోట్లకొలది అమరస్త్రీలు స్తుతిస్తారు. ఇక దీన్ని ఆచరించే వారిని గూర్చి ఏమి చెప్పేది!

యా వాఽథ నారీ కురుతేఽతిభక్త్యా భర్తారమాపృచ్ఛ్య సుతాన్ గురూన్వా ।
సాఽపి ప్రసాదాత్పరమేశ్వరస్య పరం పదం యాతి పినాకపాణేః ॥38॥

ఏ స్త్రీ అతిభక్తితో, భర్త అనుమతితో సుతులకూ, గురువులకూ చెప్పి ఈ వ్రతం అనుష్ఠిస్తుందో, ఆమె పరమేశ్వరుని అనుగ్రహంవల్ల పినాకపాణియగు పరమేశ్వరుని పరమపదం చేరుకొంటుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శివచతుర్దశీవ్రతం నామ పంచనవతితమోఽధ్యాయః ॥ 95 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని శివచతుర్దశీవ్రతమనే తొంబైఅయిదవ అధ్యాయం సంపూర్ణం

షణ్ణవతితమోఽధ్యాయః - తొంబైఆరవ అధ్యాయం

ఫలత్యాగవ్రతమ్ - ఫలత్యాగవ్రతం

నన్దికేశ్వర ఉవాచ :- నందికేశ్వరుడు చెప్పాడు.

ఫలత్యాగస్య మాహాత్మ్యం యద్భవేచ్ఛృణు నారద ।
యదక్షయం పరం లోకే సర్వకామఫలప్రదమ్ ॥1॥

నారదా! ఫలత్యాగము యొక్క మాహాత్మ్యమును గూర్చి విను. అది అక్షయము, సర్వోత్కృష్టము, సర్వకామ ఫలప్రదము.

మార్గశీర్షే శుభే మాసి తృతీయాయాం మునే! వ్రతమ్ ।
ద్వాదశ్యామథవాఽష్టమ్యాం చతుర్దశ్యామథాపి వా ।
ఆరభేచ్ఛుక్లపక్షస్య కృత్వా బ్రాహ్మణవాచనమ్ ॥2॥

మునీ! మార్గశీర్ష మనే శుభమాసంలో శుక్ల పక్ష తృతీయనాడు, లేదా ద్వాదశినాడు, లేదా అష్టమి లేదా చతుర్దశినాడు - ఈ తిథులలో బ్రాహ్మణులచే స్వస్తివాచనం చేయించి ఈ వ్రతం ఆరంభించాలి.

అన్యేష్వపి హి మాసేషు పుణ్యేషు మునిసత్తమ! ।
సదక్షిణం పాయసేన భోజయేచ్ఛక్తితో ద్విజాన్ ॥3॥

మునివర్యా! ఇతర పవిత్రమాసాలలో గూడా దక్షిణలతో సహా ద్విజులను శక్తి కొలది పాయసంతో భుజింపజేయాలి.

అష్టాదశానాం ధాన్యానామన్యచ్చ ఫలమూలకమ్ ।
వర్జయేదబ్దమేకం తు వినైవౌషధకారణమ్ ।
సవృషం కాంచనం రుద్రం ధర్మరాజం చ కారయేత్ ॥4॥

అష్టాదశధాన్యాలు తప్ప ఇతరఫలమూలాలతో సహా అన్నీ ఒక సంవత్సరకాలం వరకూ వర్జించాలి. ఇది ఔషధకారణం లేకుండానే చేయాలి. స్వర్ణంతో వృషభాన్నీ, రుద్రుణ్ణీ, ధర్మరాజునూ చేయించాలి.

కూష్మాణ్డం మాతులుంగం చ వార్తాకం పనసం తథా ।
ఆమ్రాతక కపిత్థాని కలింగమథ వాలుకమ్ ॥5॥
శ్రీఫలాశ్వత్థబదరం జమ్బీరం కదలీఫలమ్ ।
కాశ్మీరం దాడిమం శక్త్యా కాలధౌతాని షోడశ ॥6॥

గుమ్మడి, మాదీఫలం, వంకాయ, పనస, మామిడి, వెలగ, కలింగం, వాలుకం, శ్రీఫలం, రావి, రేగు, నిమ్మ, అరటి, కాశ్మీరం, దానిమ్మ - ఇవి శక్తికొలది ఈ పదునారింటిని బంగారంతో చేయించాలి.

మూలకామలకం జంబూతింత్రిణీ కరమర్దకమ్ ।
తక్కోలైలాక తుండీర కరీర కుటజం శమీ ॥7॥

ఉదుంబరం నారికేలం ద్రాక్షాఽథ బృహతీద్వయమ్ ।
రౌప్యాణి కారయేచ్ఛక్త్యా ఫలానీమాని షోడశ ॥8॥

మూలకం, ఉసిరి, నేరేడు, చింత, కరమర్దకం, తక్కోలం, ఏలాక, తుండీరం, కరీరం, కుటజం, జమ్మి, మేడి, టెంకాయ, ద్రాక్ష, పందిరి వంకాయ, వాకుడు కాయ – వీటిని వెండితో శక్తికొలది చేయించాలి.

తామ్రం తాలఫలం కుర్యాదగస్తిఫలమేవ చ ।
పిణ్డీతకాశ్మర్యఫలం తథా సూరణకన్దకమ్ ॥9॥

రక్తాలుకాకన్దకం చ కనకాహ్వం చ చిర్భిటమ్ ।
చిత్రవల్లీఫలం తద్వత్కూటశాల్మలిజం ఫలమ్ ॥10॥

ఆమ్రనిష్పావమధుకవటముద్రపటోలకమ్ ।
తామ్రాణి షోడశైతాని కారయేచ్ఛక్తితో నరః ॥11॥

తాటి, అవిశికాయ ఫలాలను రాగితో చేయాలి. పొగడ పండు, కపిలద్రాక్ష, కందదుంప, చిలకడ దుంప, మొగలిపువ్వు, చిద్భటం, మంజిష్ఠ, కొండబూరుగు, గంధపుకాయ, బొబ్బరకాయ, విప్పకాయ, మట్టి, గారకాయ, పొట్లకాయ ఈ పదునారింటిని శక్తికొలది తామ్రంతో చేయించాలి.

ఉదకుంభద్వయం కుర్యాద్ధాన్యోపరి సవస్త్రకమ్ ।
తతశ్చ కారయేచ్ఛయ్యాం తథోపరి సువాససీ ॥12॥

ధాన్యాలపై రెండు నీటి కుండలు వస్త్రసహితంగా సిద్ధంచేసి మంచివస్త్రాలు గల శయ్యను చేయించాలి.

భక్ష్యపాత్రత్రయోపేతం యమరుద్రవృషాన్వితమ్ ।
ధేన్వా సహైవ శాన్తాయ విప్రాయాథ కుటుంబినే ।
సపత్నీకాయ సంపూజ్య పుణ్యేఽహ్ని వినివేదయేత్ ॥13॥

మూడు భక్ష్యపాత్రలు, యమ–రుద్ర–వృష సహితంగా ఆవుతో సహా శాంతుడు, కుటుంబి, సపత్నీకుడు – అయిన విప్రునికి పూజ గావించి పుణ్యదినాన నివేదించాలి.

తథా ఫలేషు సర్వేషు వసన్త్యమరకోటయః ।
తథా సర్వఫలత్యాగవ్రతాద్భక్తిః శివేఽస్తు మే ॥14॥

అన్ని ఫలాలలో అమరకోటులున్నారు. కాన సర్వఫలత్యాగవ్రతంతో నాకు శివునిపై భక్తి కల్గుగాక!

యథా శివశ్చ ధర్మశ్చ సదానన్తఫలప్రదౌ ।
తద్యుక్తఫలదానేన తౌ స్యాతాం మే వరప్రదౌ ॥15॥

శివుడు, ధర్ముడు సదా అనంతఫలాలిచ్చు వారు. అందుచే వారితో కలిపి ఫలాలివ్వడంవల్ల వారు నాకు వరప్రదు లగుదురు గాక!

యథా ఫలాన్యనన్తాని శివభక్తేషు సర్వదా ।
తథానన్తఫలావాప్తిరస్తు జన్మని జన్మని ॥16॥

సదా శివభక్తులలో అనంతఫలాలున్నాయి. కాన నాకు జన్మ జన్మలలో అనంతఫలప్రాప్తి కలుగుగాక!

యథా భేదం న పశ్యామి శివవిష్ణ్వర్కపద్మజాన్ ।
తథా మమాస్తు విశ్వాత్మా శంకరః శంకరః సదా ॥17॥

శివుడు, విష్ణువు, సూర్యుడు, బ్రహ్మ – వీరిలో నేను భేదం చూచుట లేదు. కాన విశ్వాత్ముడైన శంకరుడు సదా నాకు శంకరుడగుగాక!"

ఇతి దత్త్వా చ తత్సర్వమలంకృత్య చ భూషణైః ।
శక్తిశ్చేచ్ఛయనం దద్యాత్ సర్వోపస్కరసంయుతమ్ ॥18॥

అని చెప్పి పై చెప్పినదంతా ఇచ్చి, భూషణాలతో అలంకరించి శక్తి ఉంటే సర్వోపకరణాలతో శయనం కూడా ఇవ్వాలి.

అశక్తస్తు ఫలాన్యేవ యథోక్తాని విధానతః ।
తథోదకుంభసంయుక్తౌ శివధర్మౌ చ కాంచనౌ ॥19॥

శక్తి లేని పక్షంలో పై జెప్పిన ఫలాలనే విధిప్రకారం ఇవ్వాలి. ఉదకుంభంతో సహా కాంచన నిర్మిత శివధర్మరాజ మూర్తులను గూడా ఇవ్వాలి.

విప్రాయ దత్త్వా భుంజీత వాగ్యతస్తైలవర్జితమ్ ।
అన్యానపి యథాశక్త్యా భోజయేచ్ఛక్తితో ద్విజాన్ ।ఇ20॥

విప్రునికివి యిచ్చి మౌనంతో తైలరహితంగా భుజించాలి. అన్యద్విజులను గూడా యథాశక్తి భుజింపజేయాలి.

ఏతద్భాగవతానాం తు సౌరవైష్ణవయోగినామ్ ।
శుభం సర్వఫలత్యాగవ్రతం వేదవిదో విదుః ॥21॥

ఇది భాగవతుల యొక్క, సౌరవైష్ణవయోగుల యొక్క శుభకరమైన సర్వఫల త్యాగవ్రతమని వేదజ్ఞు లెరిగి యున్నారు.

నారీభిశ్చ యథాశక్త్యా కర్తవ్యం ద్విజపుంగవ! ।
ఏతస్మాన్నాపరం కించిదిహ లోకే పరత్ర చ ।
వ్రతమస్తి మునిశ్రేష్ఠ! యదనన్తఫలప్రదమ్ ॥22॥

ద్విజవర్యా! స్త్రీలు గూడా దీన్ని యథాశక్తి అనుష్ఠించవచ్చు. మునిశ్రేష్ఠా! ఈ లోకంలో గానీ, పరలోకంలో గాని ఈ వ్రతంకంటే అనంత ఫలప్రదమైన వ్రతం మరొకటి లేదు.

సౌవర్ణరౌప్యతామ్రేషు యావన్తః పరమాణవః॥
భవన్తి చూర్ణ్యమానేషు ఫలేషు మునిసత్తమ ।
తావద్యుగసహస్రాణి రుద్రలోకే మహీయతే ॥23॥

మునివర్యా! బంగారు, వెండి, రాగి వీటి ఫలాలను పొడి చేసినప్పుడు ఎన్ని పరమాణువులుండునో అన్ని వేల యుగాలు ఈ వ్రతకర్త రుద్రలోకంలో పూజింపబడతాడు.

ఏతత్సమస్తకలుషాపహరం జనానా-మాజీవనాయ మనుజేషు చ సర్వదా స్యాత్ ।
జన్మాన్తరేష్వపి న పుత్రవియోగదుఃఖమాప్నోతి ధామ చ పురందర లోకజుష్టమ్ ॥24॥

ఇది జనులకు సర్వదా సకలపాపహరమై ఆ జీవనానికుపకరిస్తుంది. జన్మాంతరాలలో గూడా పుత్రవియోగ దుఃఖం వుండదు. ఇంద్రలోకజుష్టమైన పదం చివర చేరుతాడు.

యో వా శృణోతి పురుషోఽల్పధనః పఠేద్వా దేవాలయేషు భవనేషు చ ధార్మికాణామ్ ।
పాపైర్వియుక్త వపురత్ర పురం మురారే రానన్దకృత్పదముపైతి మునీంద్ర! సోఽపి ॥25॥

మునీంద్రా! అల్పధనుడైనా ఎవడు దీన్ని ధార్మికుల ఆలయాలలో, గృహాలలో, వింటాడో, చదువుతాడో, వాడు గూడా ఇక్కడ పాపవియుక్తశరీరుడై అపరత్ర మరల ఆనందకారకమైన విష్ణుపదం పొందుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఫలత్యాగవ్రతం నామ షణ్ణవతితమోఽధ్యాయః ॥ 96 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని ఫలత్యాగవ్రతమనే తొంబైఆరవ అధ్యాయం సంపూర్ణం

సప్తనవతితమోఽధ్యాయః - తొంభైఏడవ అధ్యాయం

ఆదిత్యవార నక్తవ్రతమ్ - ఆదిత్యవార నక్తవ్రతం

నారద ఉవాచ :- నారదుడు చెప్పాడు.

యదారోగ్యకరం పుంసాం యదనన్తఫలప్రదమ్ ।
యచ్ఛాన్తయే చ మర్త్యానాం వద నన్దీశ! తద్వ్రతమ్ ॥1॥

నందీశా! ఏది ఆరోగ్యకరమో, ఏది అనంత ఫలమిస్తుందో, మర్త్యుల కేది శాంతిని ప్రసాదిస్తుందో, ఆ వ్రతాన్ని చెప్పు.

నన్దికేశ్వర ఉవాచ :- నందీశ్వరుడు చెప్పాడు.

యత్తద్విశ్వాత్మనో ధామ పరం బ్రహ్మ సనాతనమ్ ।
సూర్యాగ్నిచంద్రరూపేణ తత్త్రిధా జగతి స్థితమ్ ॥2॥

ఆ విశ్వాత్ముని తేజమైనది (ఉనికి యైనది) సనాతన పరబ్రహ్మం. అది సూర్యాగ్ని చంద్రరూపాలతో జగత్తులో మూడు విధాలుగా ఉన్నది.

తదారాధ్య పుమాన్ విప్ర! ప్రాప్నోతి కుశలం సదా ।
తస్మాదాదిత్యవారేణ సదా నక్తాశనో భవేత్ ॥3॥

విప్రా! దానినారాధించి పురుషుడు సదా కుశలం పొందుతాడు. దానివల్ల ఆదివారం నాడు సదా రాత్రిపూటే భుజించాలి.

యదా హస్తేన సంయుక్తమాదిత్యస్య చ వాసరమ్ ।
తదా శనిదినే కుర్యాదేకభుక్తం విమత్సరః ॥4॥

ఆదివారం హస్తానక్షత్రంతో కూడినప్పుడు శనివారమునాడు మాత్సర్యం వదలి ఏకభుక్తం చేయాలి.

నక్తమాదిత్యవారేణ భోజయిత్వా ద్విజోత్తమాన్ ।
పత్త్రైర్ద్వాదశసంయుక్తం రక్తచందనపంకజమ్ ॥5॥

విలిఖ్య విన్యసేత్సూర్యం నమస్కారేణ పూర్వతః।
దివాకరం తథాగ్నేయ్యాం వివస్వన్తమతః పరమ్ ॥6॥

ఆదివారంనాడు ద్విజశ్రేష్ఠులను రాత్రిపూట భుజింపజేసి ద్వాదశపత్రాలతో గూడిన రక్తచందన పద్మాన్ని లిఖించాలి. లిఖించి సూర్యుణ్ణి తూర్పున నమస్కారపూర్వకంగా ఉంచాలి. దివాకరుణ్ణి ఆగ్నేయంలో, వివస్వంతుణ్ణి ఆప్రక్కన నిలపాలి.

భగం తు నైరృతే దేవం వరుణం పశ్చిమే దలే ।
మహేంద్రమనిలే తద్వదాదిత్యం చ తథోత్తరే ॥7॥

శాన్తమీశానభాగే తు నమస్కారేణ విన్యసేత్ ।
కర్ణికాపూర్వపత్రే తు సూర్యస్య తురగాన్న్యసేత్ ॥8॥

భగుణ్ణి నైఋతిలో, వరుణుణ్ణి పశ్చిమదళంలో, మహేంద్రుని వాయవ్యంలో, ఆదిత్యుని ఉత్తరంలో, శాన్తుని ఈశాన్యంలో నమస్కారంతో నిలపాలి. కర్ణికా పూర్వదళంలో సూర్యాశ్వాలను ఉంచాలి.

దక్షిణే యమనామానం మార్తాణ్డం పశ్చిమే దలే ।
ఉత్తరే తు రవిం దేవం కర్ణికాయాం చ భాస్కరమ్ ॥9॥

యముణ్ణి దక్షిణాన, మార్తాండుణ్ణి పశ్చిమదళాన, రవిని ఉత్తరదళాన, కర్ణికలో భాస్కరుణ్ణి ఉంచాలి.

రక్తపుష్పోదకేనార్ఘ్యం సతిలారుణచన్దనమ్ ।
తస్మిన్పద్మే తతో దద్యాదిమం మంత్రముదీరయేత్ ॥10॥

రక్తపుష్పదళంతో అర్ఘ్యం, తిలలతో అరుణచందనంతో గూడ ఆ పద్మమున కివ్వాలి. ఈ మంత్రం ఉచ్చరించాలి.

కాలాత్మా సర్వభూతాత్మా వేదాత్మా విశ్వతోముఖః ।
యస్మాదగ్నీంద్రరూపస్త్వమతః పాహి దివాకర! ॥11॥

'కాలాత్ముడు, సర్వభూతాత్ముడు, వేదాత్ముడు, విశ్వతోముఖుడు అయిన నీవు అగ్నీంద్రరూపుడవు కాన దివాకరా! నన్ను కాపాడు.

అగ్నిమీలే నమస్తుభ్యమిషేత్వోర్జేతి భాస్కరమ్ ।
అగ్న ఆయాహి వరద నమస్తే జ్యోతిషాంపతే! ॥12॥

భాస్కరా! 'అగ్నిమీళే నమస్తుభ్యం' 'ఇషేత్వోర్జే చ' 'అగ్ని ఆయాహి వరద,' 'నమస్తే జ్యోతిషాం పతే" అనిచెప్పాలి.

అర్ఘ్యం దత్త్వా విసృజ్యాథ నిశి తైలవివర్జితమ్ ।
భుంజీత వత్సరాన్తే తు కాంచనం కమలోత్తమమ్ ।
పురుషం చ యథాశక్త్యా కారయేద్ద్విభుజం తథా ॥13॥

అలా అర్ఘ్యమిచ్చి విసర్జించి రాత్రితైలం లేకుండా భుజించాలి. సంవత్సరం చివర కాంచననిర్మితమైన కమలోత్తమాన్ని, యథాశక్తి ద్విభుజుడైన పురుషుణ్ణీ చేయించాలి.'

సువర్ణశృంగీం కపిలాం మహార్ఘ్యాం రౌప్యాం ఖురైః కాంస్యదోహాం సవత్సామ్ ।
పూర్ణే గుడస్యోపరి తామ్రపాత్రే నిధాయ పద్మం పురుషం చ దద్యాత్ ॥14॥

సువర్ణ శృంగాలు గల పూజ్యమైన కామధేనువును వెండి గిట్టలతో అలంకరించి పాలు పితుకు కంచుపాత్ర, దూడతో సహా, తామ్రపాత్రం గుడం మీద ఉంచి పద్మాన్నీ, పురుషుణ్ణీ దానం చేయాలి.

సంపూజ్య శయ్యామ్బరమాల్యధూపైర్ద్విజం చ రక్తైరథవా పిశంగైః ।
సంకల్పయిత్వా పురుషం సపద్మం దద్యాదనేకవ్రతదానకాయ
అవ్యంగరూపాయ జితేంద్రియాయ కుటుంబినే దేయమనుద్ధతాయ ॥15॥

రక్తాంబరమాల్య ధూపాలతో ద్విజుణ్ణి పూజించి ఎర్రని హేమశృంగాలతో పద్మసహిత పురుషుణ్ణి సంకల్పించి అంగలోపం లేని జితేంద్రియుడైన, నిగర్వియైన కుటుంబికి అనేక వ్రత దానయోగ్యునికివ్వాలి.

నమో నమః పాపవినాశనాయ విశ్వాత్మనే సప్తతురంగమాయ।
సామర్గ్యజుర్ధామనిధే విధాత్రే భవాబ్ధిపోతాయ జగత్పవిత్ర ॥16॥

"పాపనాశకుడగు నీకు నమస్సు, విశ్వాత్మునికి సప్తాశ్వునికి నమస్సు, ఋక్సామయజుస్తేజోనిధికీ, విధాతకూ నమస్సు, సంసారసాగరం దాటించే ఓడకూ, జగత్పవిత్రా! నమస్సు".

ఇత్యనేన విధినా సమాచరేదబ్దమేకమిహ యస్తు మానవః।
సోఽధిరోహతి వినష్టకల్మషః సూర్యధామ సకలామరావృతః ॥17॥

అని ఈ పద్ధతిలో ఒక సంవత్సరకాలం ఎవడు ఆచరిస్తాడో, వాడు పాపాలు నశించినవాడై, సకల దేవతాసమేతుడై సూర్యలోకం చేరుతాడు.

కర్మసంక్షయమవాప్య భూపతిః శోకదుఃఖభయరోగవర్జితః।
ద్వీపసప్తకపతిః పునః పునర్ధర్మమూర్తిరమితౌజసా యుతః ॥18॥

రాజైనవాడు మొదట కర్మక్షయం పొంది ఈ వ్రతాంతంలో శోకం, దుఃఖం, భయం, రోగం లేనివాడవుతాడు. సప్తద్వీపాలకూ అధిపతియై మాటిమాటికీ మరింత తేజోవంతుడై విరాజిల్లుతాడు.

యా చ భర్తృగురుదేవతత్పరా వేదకర్తురిహ నక్తమాచరేత్ ।
సాఽపి లోకమమరేశవన్దితా యాతి నారద! రవేర్న సంశయః ॥19॥

నారదా! స్త్రీ అయినా భర్తృగురుదేవ భక్తి కలిగినదై, ఆదిత్యవార నక్తవ్రతాన్ని ఆచరిస్తే ఆమె ఇంద్రవందితయై రవిలోకం చేరుతుంది, సందేహం లేదు.

యః పఠేదపి శృణోతి మానవః పాఠ్యమానమథ వాఽనుమోదతే ।
సోఽపి శక్రభువనస్థితోఽమరైః పూజ్యతే వసతి చాక్షయం దివి ॥20॥

ఎవడు దీన్ని చదువుతాడో, వింటాడో, చదువుతుండగా అనుమోదిస్తాడో, అతడు గూడ ఇంద్రభువనస్థుడై దేవతలచే పూజింపబడతాడు, అక్షయంగా స్వర్గంలో నివసిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ఆదిత్యవార నక్తవ్రతం నామ సప్తనవతితమోఽధ్యాయః ॥97॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని ఆదిత్యవార నక్తవ్రతమనే తొంబైఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టనవతితమోఽధ్యాయః – తొంబైఎనిమిదవ అధ్యాయం

సంక్రాంతి సమాప్త్యుత్సవః – సంక్రాంతి సమాప్త్యుత్సవం

నన్దికేశ్వర ఉవాచ :– నందికేశ్వరుడు చెప్పాడు.

అథాన్యదపి వక్ష్యామి సంక్రాన్త్యుద్యాపనే ఫలమ్ ।
తదక్షయం పరే లోకే సర్వకామఫలప్రదమ్ ॥1॥

పరలోకంలో అక్షయమూ, సర్వకామఫలప్రదమూ అయిన సంక్రాంత్యుద్యాపనోత్సవంలో గల మరొక ఫలం గురించి చెబుతాను విను.

అయనే విషువే వాపి సంక్రాతివ్రతమాచరేత్ ।
పూర్వేద్యురేకభక్తేన దన్తధావనపూర్వకమ్ ।
సంక్రాన్తివాసరే ప్రాతస్తిలైః స్నానం విధీయతే ॥2॥

అయనపుణ్యకాలంలోగాని, విషువం (రాత్రింబవళ్లు సమమైనది) లోగాని సంక్రాంత్యుత్సవం చేయాలి. ముందు రోజు దంతధావనపూర్వకంగా ఒంటి పూట భుజించాలి. సంక్రాంతి నాటి ఉదయాన తిలమిశ్రితజలంలో స్నానం విధింపబడింది.

రవిసంక్రమణే భూమౌ చందనేనాష్టపత్రకమ్ ।
పద్మం సకర్ణికం కుర్యాత్తస్మిన్నావాహయేద్రవిమ్ ॥3॥

రవిసంక్రాంతినాడు భూమిపై చందనంతో అష్టదళమూ, కర్ణిక గలదీ అయిన పద్మాన్ని లిఖించాలి. దానిపై రవిని ఆవహింపజేయాలి.

కర్ణికాయాం న్యసేత్సూర్యమాదిత్యం పూర్వతస్తతః ।
నమస్సప్తార్చిషే యామ్యే నమో ఋఙ్మణ్డలాయ చ ॥4॥

తతః సవిత్రే వారుణ్యే మారుతే తపనాయ వై ।
మార్తాణ్డముత్తరే విష్ణుమైశాన్యాం విన్యసేత్సదా ।
వాయవ్యే తు భగం న్యస్య పునః పునరథార్చయేత్ ॥5॥

కర్ణికపై సూర్యుణ్ణి, దానికి తూర్పున ఆదిత్యుణ్ణి ఉంచాలి. 'నమస్సప్తార్చిషే' అని ఆగ్నేయమున 'అర్యమ్ణే నమః' అని దక్షిణమున, 'ఋఙ్మండలాయ నమః అని నైరుతమున, 'సవిత్రే నమః' అని పడమరన, 'తపనాయ నమః' అని వాయవ్యమున,' మార్తాండాయ నమః అని ఉత్తరమున, విష్ణవే నమః అని ఈశాన్యమున ఉంచాలి.

గన్ధమాల్యఫలైర్భక్ష్యైః స్థణ్డిలే పూజయేత్తతః ॥6॥

ఆపై గంధమాల్యఫలాదులతో భక్ష్యాలతో వేదికపై పూజ నిర్వహించాలి.

ద్విజాయ సోదకుంభం చ ఘృతపాత్రం హిరణ్మయమ్ ।
కమలం చ యథాశక్త్యా కారయిత్వా నివేదయేత్ ॥7॥

ఉదకుంభంతో సహా స్వర్ణఘృతపాత్రను, స్వర్ణకమలాన్నీ యథాశక్తి నిర్మింపజేసి ద్విజునికి నివేదించాలి.

చన్దనోదకపుష్పైశ్చ దేవాయార్ఘ్యం న్యసేద్భువి ।
విశ్వాయ విశ్వరూపాయ విశ్వధామ్నే స్వయంభువే ।
నమోఽనన్తాయ ధాత్రే చ యజుషాం పతయే నమః ॥8॥

దేవునికీ, (దేవికీ) చందనోదకపుష్పాలతో అర్ఘ్య మివ్వాలి. విశ్వుడు, విశ్వరూపుడు, విశ్వధాముడు, స్వయంభువు, అనంతుడు, ఋక్సామయజుర్వేదాలకు పతి అగు ధాతకు నమస్సులు అని చెప్పాలి.

అనేన విధినా సర్వం మాసి మాసి సమాచరేత్ ।
వత్సరాన్తేఽథవా కుర్యాత్సర్వం ద్వాదశధా నరః ॥9॥

ఈ రీతిగా ప్రతినెలా అంతా ఆచరించాలి. సంవత్సరాంతంలో అన్నింటినీ పంద్రెండు విభాగాలుగా (వ్రతాలుగా) చేయాలి.

సంవత్సరాంతే ఘృతపాయసేన సన్తర్ప్య వహ్నిం ద్విజపుంగవాంశ్చ ।
కుంభాన్పునర్ద్వాదశధేనుయుక్తాన్ సరత్నహైరణ్మయపద్మయుక్తాన్ ॥10॥

సంవత్సరాంతంలో ఘృతపాయసంతో అగ్నికీ, ద్విజపుంగవులకూ, తృప్తి గావించి పంద్రెండు ధేనువులతో గూడ కుంభాలను, రత్నస్వర్ణపద్మయుక్తంగానూ

పయస్వినీః శీలవతీశ్చ దద్యాద్ధైమైః శృంగై రౌప్యఖురైశ్చ యుక్తాః ।
గావోఽష్ట వా సప్త సకాంస్యదోహా మాల్యామ్బరా వా చతురోఽప్యశక్తః ।
దౌర్గత్యయుక్తః కపిలామథైకాం నివేదయేద్బ్రాహ్మణపుంగవాయ ॥11॥

శీలముగల పాడి ఆవులనూ హేమ శృంగాలతో, వెండి గిట్టలతో అలంకరించిన వాటిని, ఎనిమిది లేక ఏడింటిని కంచుపాత్రతో గూడా మాల్యాంబర సమేతంగా ఇవ్వాలి. శక్తిలేనివాడు నాల్గింటినైనా, దుర్గతిలోనున్నవాడు కడకు ఒక్క కపిలగోవునైనా బ్రాహ్మణపుంగవుని కివ్వాలి.

హైమీం చ దద్యాత్పృథివీం సశేషా-మాకార్య రూప్యామథ వా చ తామ్రీమ్ ।
పైష్టీమశక్తః ప్రతిమాం విధాయ సౌవర్ణసూర్యేణ సమం ప్రదద్యాత్ ।
న విత్తశాఠ్యం పురుషోఽత్ర కుర్యాత్ కుర్వన్నధో యాతి న సంశయోఽత్ర ॥12॥

అశక్తుడు స్వర్ణం లేక వెండి, లేక రాగితో నువ్వుల పిండితో చేసిన భూప్రతిమను బంగారు రవి ప్రతిమతోపాటు దానం చేయాలి. విత్తశాఠ్యం చేయరాదు. చేస్తే అధోగతి తప్పదు. సందేహం లేదు.

యావన్మహేంద్రప్రముఖాచలేంద్రాః పృథ్వీ చ సప్తాబ్ధియుతేహ తిష్ఠేత్ ।
తావత్ స గన్ధర్వగణైరశేషైః సంపూజ్యతే నారద! నాకపృష్ఠే ॥13॥

నారదా! ఎంతవరకూ మహేంద్రాది పర్వతాలతో భూమి సప్తసాగరవలయితమై వుంటుందో అంతవరకూ సమస్త గంధర్వ గణాలతో నాకపృష్ఠంలో అతడు పూజింపబడతాడు.

తతస్తు కర్మక్షయమాప్య సప్తద్వీపాధిపః స్యాత్ కులశీలయుక్తః ।
సృష్టేర్ముఖేఽ వ్యంగవపుః సభార్యః ప్రభూతపుత్రాన్వయ వన్దితాంఘ్రిః ॥14॥

తదుపరి కర్మక్షయం పొంది కులశీలయుక్తుడై సప్తద్వీపాధిపతి అవుతాడు. సృష్ట్యారంభంలో అంగ లోపరహితుడు, భార్యాసమేతుడు ఎక్కువ సంతతి, వంశంచే నమస్కరింపబడిన పాదాలు గలవాడుగా విరాజిల్లుతాడు.

ఇతి పఠతి శృణోతి వాఽథ భక్త్యా విధిమఖిలం రవిసంక్రమస్య పుణ్యమ్ ।
మతిమపి చ దదాతి సోఽపి దేవైరమరపతేర్భవనే ప్రపూజ్యతే చ ॥15॥

ఇలా పుణ్యప్రదమైన సూర్యసంక్రమణవిధిని భక్తితో చదివినవాడు, విన్నవాడు, ఇతరులకు బోధించువాడు (బుద్ధి దానిపై నిల్పినవాడు) దేవతలచే ఇంద్రభవనంలో పూజింపబడతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే సంక్రాంతి సమాప్త్యుత్సవం నామ అష్టనవతితమోఽధ్యాయః ॥ 98 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని సంక్రాంతి సమాప్త్యుత్సవమనే తొంబైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనశతతమోऽధ్యాయః - తొంభైతొమ్మిదవ అధ్యాయం

విభూతి ద్వాదశీవ్రతమ్ - విభూతి ద్వాదశీవ్రతం

నన్దికేశ్వర ఉవాచ :- నందికేశ్వరుడు చెప్పాడు.

శృణు నారద వక్ష్యామి విష్ణోర్వ్రతమనుత్తమమ్ ।
విభూతిద్వాదశీ నామ సర్వదేవనమస్కృతమ్ ॥1॥

నారదా! మహోత్తమమైన విష్ణువ్రతం వివరిస్తాను, విను. దీన్ని 'విభూతి ద్వాదశీ వ్రతం' అని కూడా అంటారు. ఇది సర్వదేవతలచే నమస్కరింపబడింది.

కార్తికే చైత్రవైశాఖే మార్గశీర్షే చ ఫాల్గునే ।
ఆషాఢే వా దశమ్యాం తు శుక్లాయాం లఘుభుఙ్నరః
కృత్వా సాయన్తనీం సన్ధ్యాం గృహ్ణీయాన్నియమం నరః ॥2॥

కార్తికం, చైత్రం, వైశాఖం, మార్గశీర్షం, ఫాల్గుణం, ఆషాఢం - ఈ నెలల్లో శుక్లదశమినాడు లఘు భోజనం చేసిన నరుడు సాయంసంధ్యను ఉపాసించి ఈ నియమాన్ని చేపట్టాలి.

ఏకాదశ్యాం నిరాహారః సమభ్యర్చ్య జనార్దనమ్ ।
ద్వాదశ్యాం ద్విజసంయుక్తః కరిష్యే భోజనం విభో ॥3॥

తదవిఘ్నేన మే యాతు సఫలం స్యాచ్చ కేశవ ।
నమో నారాయణాయేతి వాచ్యం చ స్వపతా నిశి ॥4॥

"విభో! ఏకాదశినాడు నిరాహారుడనై జనార్దనుణ్ణి అర్చించి ద్వాదశినాడు ద్విజులతోగూడి భుజిస్తాను". కేశవా! ఈ వ్రతం నాకు నిర్విఘ్నంగా సఫలమగుగాక! 'నమో నారాయణాయ' అని రాత్రి నిద్రించే ముందు చెప్పాలి.

తతః ప్రభాత ఉత్థాయ కృతస్నానజపః శుచిః ।
పూజయేత్ పుణ్డరీకాక్షం శుక్లమాల్యానులేపనైః ॥5॥

తదుపరి ప్రభాతకాలంలో లేచి స్నానజపాలు చేసి శుచియై శుక్లమాల్యానులేపనాలతో పుండరీకాక్షుణ్ణి పూజించాలి.

విభూతయే నమః పాదౌ విశోకాయ చ జానునీ ।
నమః శివాయేత్యూరూ చ విశ్వమూర్తే నమః కటిమ్ ॥6॥

కన్దర్పాయ నమో మేఢ్రమాదిత్యాయ నమః కరౌ ।
దామోదరాయేత్యుదరం వాసుదేవాయ చ స్తనౌ ॥7॥

మాధవాయేత్యురో విష్ణోః కణ్ఠం వైకుణ్ఠినే నమః ।
శ్రీధరాయ ముఖం కేశాన్కేశవాయేతి నారద ॥8॥

పృష్ఠం శార్జ్గధరాయేతి శ్రవణే వరదాయ వై ।
స్వనామ్నా శంఖచక్రాసి గదాజలజపాణయే ।
శిరః సర్వాత్మనే బ్రహ్మన్నమ ఇత్యభిపూజయేత్ ॥9॥

'విభూతయే నమః' అని పాదాలనూ, 'విశోకాయ నమః' అని మోకాళ్ళనూ, 'నమశ్శివాయ' అని తొడలనూ, 'విశ్వమూర్తయే నమః, అని కటినీ, 'కందర్పాయ నమః' అని మేఢ్రాన్నీ, 'ఆదిత్యాయ నమః' అని కరములనూ, 'దామోదరాయ నమః' అని ఉదరాన్నీ,'వాసుదేవాయ నమః' అని స్తనాలనూ, 'మాధవాయ నమః' అని విష్ణువక్షాన్నీ, 'ఉత్కంఠినే నమః' అని కంఠాన్నీ, 'శ్రీధరాయ నమః' అని ముఖాన్నీ. కేశవాయ నమః' అని కేశాలనూ, 'శార్జ్గధరాయ నమః' అని శ్రవణాలనూ, 'వరదాయ నమః' అని స్వనామంతో శంఖపాణయే నమః, చక్రపాణయే నమః, ఖడ్గపాణయే నమః, గదాపాణయే నమః అని శంఖాదులనూ జలజపాణయే నమః, సర్వాత్మనే నమః అని శిరస్సునూ పూజించాలి.

మత్స్యముత్పలసంయుక్తం హైమం కృత్వా తు శక్తితః ।
ఉదకుంభసమాయుక్తమగ్రతః స్థాపయేద్బుధః ॥10॥

బుధుడు నల్ల గలువతో సహా శక్తికొలది స్వర్ణంతో మత్స్యాన్ని నిర్మించి ఉదకుంభ సమేతంగా దేవుని ముందట స్థాపించాలి.

గుడపాత్రం తిలైర్యుక్తం పీతవస్త్రాభివేష్టితమ్ ।
రాత్రౌ జాగరణం కుర్యాదితిహాసకథాదినా ॥11॥

తిలలతో గూడిన గుడపాత్రపై పీతవస్త్రం వేష్టించి రాత్రి ఇతిహాసకథాదులతో జాగరణం చేయాలి.

ప్రభాతాయాం తు శర్వర్యాం బ్రాహ్మణాయ కుటుంబినే ।
సకాంచనోత్పలం దేవం సోదకుంభం నివేదయేత్ ॥12॥

తెల్లవారగనే కుటుంబియగు విప్రునికి కాంచనోత్పల సమేతంగా దేవుణ్ణి ఉదకుంభంతో సహా నివేదించాలి.

యథా న ముచ్యసే దేవ సదా సర్వవిభూతిభిః ।
తథా మాముద్ధరాశేషదుఃఖసంసారకర్దమాత్ ॥13॥

"దేవా! నీవు ఎట్లు సదా సర్వైశ్వర్యాలతో విడువబడవో, అట్లే నన్ను సకలదుఃఖసంసారకర్దమంనుండి ఉద్ధరించు".

దశావతారరూపాణి ప్రతిమాసం క్రమాన్మునే ।
దత్తాత్రేయం తథా వ్యాసముత్పలేన సమన్వితమ్ ।
దద్యాదేవం సమా యావత్పాషణ్డానభివర్జయేత్ ॥14॥

మునీ! ప్రతి నెలా దశావతారరూపాలనూ, దత్తాత్రేయుణ్ణీ, ఉత్పలసమేత వ్యాసుణ్ణీ సంవత్సరమంతా దానం చేయాలి. పాషండులతో ఏలాటి సంబంధం పెట్టుకోరాదు.

సమాప్యైవం యథాశక్త్యా ద్వాదశ ద్వాదశీః పునః।
సంవత్సరాన్తే లవణపర్వతేన సమన్వితామ్ ।
శయ్యాం దద్యాన్మునిశ్రేష్ఠ గురవే ధేనుసంయుతామ్ ॥15॥

మునివర్యా! ఇలా యథాశక్తి పండ్రెండు ద్వాదశులు పూర్తిచేసి మరల సంవత్సరాంతంలో లవణపర్వతంతో గూడిన శయ్యను ధేనుసహితంగా గురువు కివ్వాలి.

గ్రామం చ శక్తిమాన్దద్యాత్క్షేత్రం వా భవనాన్వితమ్ ।
గురుం సంపూజ్య విధివద్వస్త్రాలంకారభూషణైః ॥16॥

శక్తి కలవాడు ఒక గ్రామాన్ని ఇవ్వవచ్చు. ఇండ్లతో గూడిన పొలాన్ని గానీ, ఇవ్వవచ్చు. గురువును వస్త్రాలంకార భూషణాలతో అర్చించాలి.

అన్యానపి యథాశక్త్యా భోజయిత్వా ద్విజోత్తమాన్ ।
తర్పయేద్వస్త్రగోదానై రత్నాదిధనసంచయైః।
అల్పవిత్తో యథాశక్త్యా స్తోకం స్తోకం సమాచరేత్ ॥17॥

ఇతర ద్విజపుంగవులను గూడా యథాశక్తి భుజింపజేసి వస్త్రదాన గోదానాలతో రత్నాలు మొదలైన ధన సంచయాలతో వారిని తృప్తి పరచాలి. అల్ప ధనవంతుడు కొంచెం కొంచెం యథాశక్తి ఆచరించాలి.

యశ్చాప్యతీవ నిఃస్వః స్యాద్భక్తిమాన్మాధవం ప్రతి ।
పుష్పార్చనవిధానేన స కుర్యాద్వత్సరత్రయమ్ ॥18॥

ఒకడు నిరుపేదయై గూడా మాధవునిపై భక్తికలవాడైతే పుష్పార్చన విధానంతో అతడు మూడు సంవత్సరాలు చేయాలి.

అనేన విధినా యస్తు విభూతిద్వాదశీవ్రతమ్ ।
కుర్యాత్పాపవినిర్ముక్తః పితౄణాం తారయేచ్ఛతమ్ ॥19॥
జన్మనాం శతసాహస్రం న శోకఫలభాగ్భవేత్ ।
న చ వ్యాధిర్భవేత్తస్య చ దారిద్ర్యం న బన్ధనమ్ ।
వైష్ణవో వాఽథ శైవో వా భవేజ్జన్మని జన్మని ॥20॥

ఇలా ఎవడు విభూతి ద్వాదశీ వ్రతం చేస్తాడో వాడు పాపవిముక్తుడై నూరుమంది పితరులను తరింపజేస్తాడు. లక్ష జన్మలవరకూ శోకఫలం పొందడు. వ్యాధి, పేదరికం, బంధనం అతని కుండవు. జన్మజన్మల్లో వైష్ణవుడో లేక శైవుడో అవుతాడు.

యావద్యుగసహస్రాణాం శతమష్టోత్తరంభవేత్ ।
తావత్స్వర్గే వసేద్బ్రహ్మన్ భూపతిశ్చ పునర్భవేత్ ॥21॥

బ్రహ్మన్! నూటయెనిమిది యుగసహస్రాలవరకూ అతడు స్వర్గంలో వుంటాడు. ఆపై భూపతి అవుతాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే విభూతి ద్వాదశీవ్రతం నామ ఏకోనశతతమోఽధ్యాయః. ॥ 99 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని విభూతి ద్వాదశీవ్రత మనే తొంబైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

శతతమోఽధ్యాయః – నూరవ అధ్యాయం

విభూతి ద్వాదశీవ్రతమ్ – విభూతి ద్వాదశీవ్రతం

(పుష్పవాహనోపాఖ్యానం)

నన్దికేశ్వర ఉవాచ :– నందికేశ్వరుడు చెప్పాడు.

పురా రథన్తరే కల్పే రాజాఽఽసీత్ పుష్పవాహనః ।
నామ్నా లోకేషు విఖ్యాతస్తేజసా సూర్యసన్నిభః ॥1॥

నారదా! పూర్వం రథంతరకల్పంలో పుష్పవాహను డన్న పేరుతో లోకఖ్యాతి గన్న రాజు ఒకడుండేవాడు. అతడు తేజస్సులో సూర్యునితో సమానుడు.

తపసా తస్య తుష్టేన చతుర్వక్త్రేణ నారద ।
కమలం కాంచనం దత్తం యథా కామగమం మునే! ॥2॥

నారదమునీ! అతని తపస్సుకు సంతసించిన చతుర్ముఖుడు అతనికి కాంచనకమల మొకటి యిచ్చాడు. అది ఇచ్ఛానుసారంగా గమన శక్తి కలిగినది.

లోకైః సమస్తైర్నగరవాసిభిః సహితో నృపః ।
ద్వీపాని సురలోకాంశ్చ యథేష్టం వ్యచరత్తదా ॥3॥

అప్పుడు సమస్త లోకులతోనూ, నగర వాసులతోనూ గూడి ఆ రాజు ద్వీపాలు, దేవలోకాలు యథేష్టంగా విహరించాడు.

కల్పాదౌ సప్తమం ద్వీపం తస్య పుష్కరవాసినః ।
లోకేన పూజితం యస్మాత్ పుష్కరద్వీపముచ్యతే ॥4॥

కల్పాదిలో ఆ రాజు సప్తమ ద్వీపమైన పుష్కరద్వీపంలో నివసించేవాడు. అందువల్ల అది లోకపూజితమై పుష్కర ద్వీపంగా ప్రసిద్ధమయింది.

తదేవ బ్రహ్మణా దత్తం యానమస్య యతోఽమ్బుజమ్ ।
పుష్పవాహనమిత్యాహుస్తస్మాత్ తం దేవదానవాః ॥5॥
నాగమ్యమస్యాస్తి జగత్ త్రయేఽపి బ్రహ్మాంబుజస్థస్య తపోఽనుభావాత్ ।

బ్రహ్మ యిచ్చిన పద్మం అతనికి ప్రయాణ సాధనమైంది. అందువల్ల మునీంద్రా! అతణ్ణి దేవతలు, దానవులు పుష్పవాహనుడనేవారు. అందుచే ఆ రాజుకు తపఃప్రభావంవల్ల పోరానిచోటు ముల్లోకాలలో ఏదీ లేదు.

పత్నీ చ తస్యాప్రతిమా మునీంద్ర! నారీసహస్రైరభివన్ద్యమానా ।
నామ్నా చ లావణ్యవతీ బభూవ సా పార్వతీవేష్టతమా భవస్య ॥6॥

మునీంద్రా! అతని పత్ని గూడా సాటిలేనిది. వేలకొలది స్త్రీలచే అభినందింపబడినది. ఆమె పేరు లావణ్యవతి. ఆమె శివునికి పార్వతి లాగా రాజుకు ఇష్టురాలై ఉండేది.

తస్యాత్మజానామయుతం బభూవ ధర్మాత్మనామగ్ర్యధనుర్ధరాణామ్ ।
తదాఽఽత్మజాంస్తానథ వీక్ష్య రాజా ముహుర్ముహుర్విస్మయమాససాద ।
సోఽభ్యాగతం వీక్ష్య మునిప్రవీరం ప్రాచేతసం వాక్యమిదం బభాషే ॥7॥

ఆ నృపునికి పదివేలమంది పుత్రులు కలిగారు. అందరూ ధర్మాత్ములు, శ్రేష్ఠధనుర్ధారులు. ఆ రాజు తన కుమారులను చూచి మాటిమాటికి విస్మయం చెందేవాడు. ఒకనాడు తనచెంతకు వచ్చిన ప్రాచేతసమునిని చూచి రాజు ఇలా అన్నాడు.

రాజోవాచ :– రాజు చెప్పాడు.

కస్మాద్విభూతిరమలాఽమరమర్త్యపూజ్యా జ్యాయా చ రూపవిజితామరసున్దరీయమ్ ।
భార్యా మమాల్పతపసా పరితోషితేన దత్తం మమాంబుజగృహం చ మునీంద్ర! ధాత్రా ॥8॥

మునీంద్రా! అమలమూ, అమరపూజితమూ ఐన ఈ ఐశ్వర్యం నాకెలా కల్గింది? సౌందర్యముచే అమర స్త్రీల జయించిన ఈ భార్య నాకెలా లభించింది? అల్పతపస్సుకే సంతోషించిన బ్రహ్మ నాకీ పద్మగృహం ఎలా ఇచ్చాడు?

యస్మిన్ప్రవిష్టమపి కోటిశతం నృపాణాం సామాత్యకుంజర రథౌఘజనావృతానామ్ ।
నో లక్ష్యతే క్వ గతమమ్బరమధ్య ఇందుస్తారాగణైరివ గతః పరితః స్ఫురద్భిః ॥9॥

ఇందులో నూరుకోట్ల మంది రాజులు అమాత్య–గజ–రథ–జన సమేతంగా ప్రవేశించినా నక్షత్ర పరివృతమైన ఆకసంలోని చంద్రునిలాగా ఉన్న నాముందు వారు కాంతిహీనులై ఉన్నారు.

తస్మాత్ కిమన్యజననీజఠరోద్భవేన ధర్మాదికం కృతమశేషఫలాప్తిహేతు ।
స్వామిన్మయాఽథ తనయైరథవాఽనయాఽపి భద్రం యదేతదఖిలం కథయ ప్రచేతః! ॥10॥

ఓ ప్రచేతోమునీ! నేను జన్మాంతరంలో మరొక తల్లిగర్భంలో పుట్టి అశేషఫలాలు ప్రసాదించే ఎట్టి ధర్మాదికం అనుష్ఠించాను? స్వామీ! ఈ పుత్రులు, ఈ భార్య ఏమి సుకృతం చేశారు? ఇదంతా నాకు చెప్పండి?

మునిరభ్యధాదథ భవాన్తరితం సమీక్ష్య పృథ్వీపతేః ప్రసభమద్భుతహేతువృత్తమ్ ।
జన్మాభవత్ తవ తు లుబ్ధకులేఽతిఘోరే జాతస్త్వమప్యనుదినం కిల పాపకారీ ॥11॥

అప్పుడు ముని అతని పూర్వజన్మను ధ్యానదృష్టితో చూచి ఆ రాజుకు కలిగిన సర్వసంపదలకు హేతువైన వృత్తాన్ని గురించి ఇలా చెప్పాడు. రాజా! పూర్వం నీకు అతిఘోరమైన బోయకులంలో పుట్టుక సంభవించింది. అక్కడ పుట్టి నీవు నిత్యం పాపకృత్యం చేశావు.

వపురప్యభూత్తవ పునః పురుషాఙ్గసంధిదుర్గంధిసత్త్వభయతాపకరం సమన్తాత్ ।
న చ తే సుహృన్న సుతబంధువర్గో న చ తే పితా న జననీ తథా ॥12॥
అభిసంగతా పరమభీష్టతమా విముఖీ మహీశ తవ యోషిదియమ్ ।

అప్పుడు నీ శరీరం గూడా కఠినమై దుర్గంధభూయిష్ఠమై, ప్రాణులకు భయతాపకరంగా ఉండేది. నీకప్పుడు మిత్రులు, పుత్రులు, బంధువులు, తండ్రి, తల్లి మొదలగువారెవరూ లేరు. నీకు అభీష్టతమయైన నీభార్య కూడా నీపట్ల విముఖురాలుగా ఉండేది.

అభూదనావృష్టిరతీవ రౌద్రా కదాచిదాహారనిమిత్తమస్మిన్ ॥
క్షుత్పీడితేనాథ తదా న కించిదాసాదితం ధాన్యఫలామిషాద్యమ్ ॥13॥

ఈ పరిస్థితిలో ఒకసారి వర్షం లేక భీకరదుర్భిక్షం ఏర్పడింది. అప్పు డాహారం కొరకు నీవు క్షుత్పీడితుడవై తిరిగావు. కాని నీకు ధాన్యం, ఫలం, ఆమిషాదికం ఏదీ లభించలేదు.

అథాభిదృష్టం మహదంబుజాఢ్యం సరోవరం పంకపరీతరోధః ।
పద్మాన్యథాదాయ తతో బహూని గతః పురం వైదిశనామధేయమ్ ॥14॥

అప్పుడు ఒక పెద్దమడుగు బురద నిండిన గట్లు గలది, పద్మాలతో ప్రశస్తమైనది నీకు కనిపించింది. అందలి పద్మా లనేకం గ్రహించి నీవు వైదిశ నగరానికి వెళ్ళావు.

తన్మౌల్యలాభాయ పురం సమస్తం భ్రాన్తం త్వయాఽశేషమహస్తదాసీత్ ।
క్రేతా న కశ్చిత్ కమలేషు జాతః శ్రాన్తో భృశం క్షుత్పరిపీడితశ్చ॥15॥

ఆ పద్మాలనమ్మి లబ్ధి పొందడానికై నగరమంతా తిరిగావు. అప్పుడు ఆదినమంతా తిరిగినా పద్మాలు కొనేవా డెవడూ లభించలేదు. నీవు అలసి మిక్కిలిగా క్షుత్పీడితుడవయ్యావు.

ఉపవిష్టస్త్వమేకస్మిన్సభార్యో భవనాఙ్గణే ।
అథ మఙ్గలశబ్దశ్చ త్వయా రాత్రౌ మహాన్శ్రుతః ॥16॥

నీ భార్యతో సహా ఒక భవనాంగణంలో కూర్చున్నావు. ఆ రాత్రి పెద్ద మంగళశబ్దం నీకు వినిపించింది.

సభార్యస్తత్ర గతవాన్యత్రాసౌ మఙ్గలధ్వనిః ।
తత్ర మణ్డపమధ్యస్థా విష్ణోరర్చాఽవలోకితా ॥17॥

ఆ ధ్వని వచ్చినచోటికి భార్యతో గూడా వెళ్ళావు. అక్కడ మండపం మధ్యలో గల విష్ణువు యొక్క అర్చామూర్తిని చూచావు.

వేశ్యాఽనంగవతీ నామ విభూతిద్వాదశీవ్రతమ్ ।
సమాప్య మాఘమాసస్య లవణాచలముత్తమమ్ ॥18॥

నివేదయన్తీ గురవే శయ్యాం చోపస్కారాన్వితామ్ ।
అలంకృత్య హృషీకేశం సౌవర్ణామరపాదపమ్ ॥19॥

అక్కడ మాఘమాసం చివర అనంగవతి అన్న వేశ్య విభూతి ద్వాదశీవ్రతం నిర్వహించింది. వ్రతం చివర హృషీకేశుని అలంకరించి గురువుకు ఉత్తమమైన లవణాచలాన్నీ, ఉపస్కారసమేతమైన శయ్యనూ, స్వర్ణ కల్పతరువునూ ఇస్తూ ఉన్నది.

తాం తు దృష్ట్వా తతస్తాభ్యామిదం చ పరిచిన్తితమ్ ।
కిమేభిః కమలైః కార్యం వరం విష్ణురలంకృతః ॥20॥

ఆమెను చూచి వారిలా అనుకొన్నారు. "ఈ కమలాలవల్ల చేసేదేమున్నది, వీటితో ఈ విష్ణువు నలంకరించడం మంచిది".

ఇతి భక్తిస్తదా జాతా దమ్పత్యోస్తు నరాధిప ।
తత్రప్రసంజ్ఞాత్సమభ్యర్చ్య కేశవం లవణాచలమ్ ।
శయ్యాం చ పుష్పప్రకరైః పూజయిత్వా చ సర్వశః ॥21॥

రాజా! ఈ రీతిగా మీ దంపతుల కప్పుడు భక్తి కలిగింది. ఆ ప్రసంగంతో కేశవుణ్ణీ, లవణాచలాన్నీ మీరు పూజించావు. శయ్యనూ, భూమినీ నలువైపులా పూలతో అర్చించారు.

అథానఙ్గవతీ తుష్టా తయోర్ధేనుశతత్రయమ్ ।
దీయతామాదిదేశాథ కలధౌతఫలత్రయమ్ ॥22॥

అందుకు అనంగవతి సంతసించి వారిద్దరికీ మూడు వందలు పాడి యావులు, మూడు ఫలాల సువర్ణమూ ఇమ్మని భృత్యుల నాదేశించింది.

న గృహీతం తతస్తాభ్యాం బహుసత్త్వావలంబనాత్ ।
అనంగవత్యా చ పునస్తయోరన్నం చతుర్విధమ్ ।
ఆనీయ వ్యాహృతం చాత్ర భుజ్యతామితి భూపతే! ॥23॥

అధికసత్త్వగుణావలంబనంవల్ల వారు ఆ ధనాన్ని గ్రహించలేదు. రాజా! అనంగవతి మరల మీకు చతుర్విధాన్నం తెచ్చిపెట్టి 'భుజించండి' అని చెప్పింది.

తాభ్యాం తు తదపి త్యక్తం భోక్ష్యా వో వై వరాననే! ।
ప్రసఙ్గాదుపవాసేన గతా రాత్రిః శుభావహా ॥24॥

వారు ఆ భోజనం కూడా గ్రహించక "వరాననా! తరువాత భుజిస్తాములే అని చెప్పారు. ఆ రాత్రి ఉపవాసంతో శుభావహంగా గడచిపోయింది.

జన్మప్రభృతి పాపిష్ఠౌ కుకర్మాణౌ దృఢవ్రతే ।
తత్రప్రసంగాత్తయోర్మధ్యే ధర్మలేశస్తు తేఽనఘః ॥25॥

దృఢవ్రతం కలదానా! మేము పుట్టిన నాటినుండి పాపిష్ఠులం, చెడుపనులు చేసినవాళ్ళం అని చెప్పారు. ఆ వేశ్యాసంబంధంవల్ల మీకప్పుడు పుణ్యప్రదమైన ధర్మలేశం కలిగింది.

ఇతి జాగరణం తాభ్యాం తత్ప్రసఙ్గాదనుష్ఠితమ్ ।
ప్రభాతే చ తయా దత్తా శయ్యా సలవణాచలా ॥26॥

గ్రామశ్చ గురవే భక్త్యా విప్రేషు ద్వాదశైవ తు ।
వస్త్రాలంకారసంయుక్తా గావశ్చ కరకాన్వితాః ॥27॥

అలా చెప్పి మీరు జాగరణం చేశారు. ప్రభాతం కాగానే అనంగవతి గురువుకు భక్తితో శయ్య, లవణాచలం, గ్రామాలు, విప్రులకు వస్త్రాలంకారయుతమైన కమండలంతో సహా కల గోవులను సమర్పించింది.

భోజనం చ సుహృన్మిత్రదీనాన్ధకృపణైః సమమ్ ।
తచ్చ లుబ్ధకదామ్పత్యం పూజయిత్వా విసర్జితమ్ ॥28॥

మిత్రులకు, దీనులకు, అంధులకు, కృపణులకూ ఆమె భోజనం పెట్టింది. ఆ బోయదంపతుల నలా పూజించి ఆమె పంపివేసింది.

స భవాంల్లుబ్ధకో జాతః సపత్నీకో నృపేశ్వరః ।
పుష్కరప్రకరాత్తస్మాత్కేశవస్య చ పూజనాత్ ॥29॥

ఆ బోయడవే నీవు. ఆ పద్మాలతో కేశవుణ్ణి పూజించిడంవల్ల భార్యాసహితంగా నృపుడ వయ్యావు.

వినష్టాశేషపాపస్య తవ పుష్కరమందిరమ్ ।
తస్య వ్రతస్య మాహాత్మ్యాదల్పేన తపసా నృప! ॥30॥

యథాకామగమం జాతం లోకనాథశ్చతుర్ముఖః ।
సన్తుష్టస్తవ రాజేంద్ర బ్రహ్మరూపీ జనార్దనః ॥31॥

సకల పాపాలూ నశించిన నీకు అల్పతపస్సుతోనే ఆ వ్రతమాహాత్మ్యంచే పద్మమందిరం లభించింది. రాజేంద్రా! ఆ పద్మం యథేచ్ఛాగమనం కల పద్మమయింది. లోకనాథుడు, చతుర్ముఖుడు, బ్రహ్మరూపియగు జనార్దనుడు నీపట్ల సంతసించి నీకా ప్రయాణసాధనం ఇచ్చాడు.

సాఽప్యనఙ్గవతీ వేశ్యా కామదేవస్య సాంప్రతమ్ ।
పత్నీసపత్నీ సంజాతా రత్యాః ప్రీతిరితి శ్రుతా ।
లోకేష్వానన్దజననీ సకలామరపూజితా ॥32॥

ఆ వేశ్య అనంగవతి ఇప్పుడు మన్మథుని భార్య రతీదేవికి సవతి అయిందని విన్నాము. ఆమె ఇప్పటిపేరు ప్రీతి. లోకాలకు ఆనందం కలిగించే ఆమె సకలదేవతలచే పూజింపబడింది.

తస్మాదుత్సృజ్య రాజేంద్ర పుష్కరం త్వం మహీతలే ।
గఙ్గాతటం సమాశ్రిత్య విభూతిద్వాదశీవ్రతమ్ ।
కురు రాజేంద్ర! నిర్వాణమవశ్యం సమవాప్స్యసి ॥33॥

రాజేంద్రా! అందువల్ల ఆ పద్మమందిరాన్ని భూతలంలో విసర్జించి గంగాతీరం పోయి నీవు విభూతి ద్వాదశీవ్రతం అనుష్ఠించు. తప్పక నిర్వాణం పొందుతావు.

నన్దికేశ్వర ఉవాచ :- నందికేశ్వరుడు.

ఇత్యుక్త్వా స మునిర్బ్రహ్మంస్తత్రైవాన్తరధీయత ।
రాజా యథోక్తం చ పునరకరోత్పుష్పవాహనః ॥34॥

బ్రహ్మన్! అలా చెప్పి ఆ ముని అక్కడే అంతర్ధానమై పోయాడు. పుష్పవాహను డాయన చెప్పినట్లే చేశాడు.

ఇదమాచరతో బ్రహ్మన్నఖణ్డఫలభాగ్భవేత్ ।
యథాకథంచిత్ కమలైర్ద్వాదశ ద్వాదశీర్మునే ॥35॥

కర్తవ్యాః శక్తితో దేయా విప్రేభ్యో దక్షిణాఽపి ।
న విత్తశాఠ్యం కుర్వీత భక్త్యా తుష్యతి కేశవః ॥36॥

మునీ! ఈ వ్రతం అనుష్ఠించేవాడు అఖండ ఫలం పొందుతాడు. ఎట్లైనా పద్మాలతో పండ్రెండు ద్వాదశీవ్రతాలు చేయాలి. శక్తిని బట్టి విప్రులకు దక్షిణలివ్వాలి. విత్తశాఠ్యం తగదు. భక్తితో కేశవుడు హర్షిస్తాడు.

ఇతి కలుషవిదారణం జనానా మపి పఠతీహ శృణోతి చాథ భక్త్యా ।
మతిమపి చ దదాతి దేవలోకే వసతి స కోటిశతాని వత్సరాణామ్ ॥37॥

జనులకు కలుషవిదారణమైన దీన్ని భక్తితో చదువువాడు, వినువాడు, దీనిపై బుద్ధి నిలిపినవాడు దేవలోకంలో నూరుకోట్ల సంవత్సరాలు నివసిస్తాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే విభూతి ద్వాదశీవ్రతం నామ శతతమోఽధ్యాయః ॥ 100 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని విభూతిద్వాదశీవ్రతమనే నూరవ అధ్యాయం సంపూర్ణం

ఏకశతతమోఽధ్యాయః - నూటఒకటవ అధ్యాయం

వ్రతషష్టి కథనమ్ - వ్రతషష్టి కథనం

నన్దికేశ్వర ఉవాచ :- నందికేశ్వరుడు చెప్పాడు.

అథాతః సంప్రవక్ష్యామి వ్రతషష్టిమనుత్తమామ్ ।
రుద్రేణాభిహితాం దివ్యాం మహాపాతకనాశినీమ్ ॥1॥

ఇక మీదట మహెూత్తమాలైన అరువది వ్రతాలను వివరిస్తాను. ఇది రుద్రుడు చెప్పిన దివ్యమైన విషయం, మహాపాతకాలను నశింపజేసేది.

నక్తమబ్దం చరిత్వా తు గవా సార్ధం కుటుంబినే ।
హైమం చక్రం త్రిశూలం చ దద్యాద్విప్రాయ వాససీ ॥2॥

ఒక సంవత్సరకాలం నక్తవ్రతం నిర్వహించి కుటుంబియైన ద్విజునికి గోవుతో సహా స్వర్ణచక్రం, స్వర్ణ త్రిశూలం, వస్త్రాలూ ఇవ్వాలి.

శివోరుద్రోఽహ మస్మీతి శివలోకే మహీయతే ।
ఏతద్దేవవ్రతం నామ మహాపాతకనాశనమ్ ॥3॥

నేను శివుడను రుద్రుడను అన్న భావనతో అలా ఇచ్చేవాడు శివలోకంలో పూజింపబడతాడు. దీన్ని దేవవ్రతమంటారు. ఇది మహాపాపాలను నశింపజేస్తుంది.

యస్త్వేకభక్తేన సమాం శివం హైమవృషాన్వితమ్ ।
ధేనుం తిలమయీం దద్యాత్స పదం యాతి శాంకరమ్ ।
ఏతద్రుద్రవ్రతం నామ పాపశోకవినాశనమ్ ॥4॥

ఎవడు సంవత్సరకాలం రోజుకొకపూట మాత్రమే భుజిస్తూ స్వర్ణ వృషభంతో సహా శివుణ్ణీ, తిలమయమైన ధేనువునూ దానమిస్తాడో, వాడు శాంకరపదం చేరుకొంటాడు. ఇది పాపశోకాలు తొలగించే రుద్రవ్రతం.

యస్తు నీలోత్పలం హైమం శర్కరాపాత్రసంయుతమ్ ।
ఏకాన్తరితనక్తాశీ సమాన్తే వృషసంయుతమ్ ।
స వైష్ణవం పదం యాతి లీలావ్రతమిదం స్మృతమ్ ॥5॥

ఎవడు చక్కెరపాత్రతో సహా స్వర్ణ నిర్మితమైన నల్లగలువనూ, వృషభాన్నీ రెండు దినాల కొక్కసారి భుజిస్తూ సంవత్సరాంతంలో ఇస్తాడో, వాడు విష్ణుపదం చేరుకొంటాడు. ఇది లీలావ్రతం.

ఆషాఢాది చతుర్మాసమభ్యఙ్గం వర్జయేన్నరః ।
భోజనోపస్కరం దద్యాత్స యాతి భవనం హరేః ।
జనప్రీతికరం నృణాం ప్రీతివ్రతమిహోచ్యతే ॥6॥

ఆషాఢం మొదలు నాల్గు నెలలు అభ్యంగస్నానం చేయకుండా భోజనోపస్కరం ఇచ్చేవాడు హరిభవనం చేరుకొంటాడు. జనులకు ప్రీతికరం కాన ఇది ప్రీతివ్రత మనబడింది.

వర్జయిత్వా మధౌ యస్తు దధిక్షీరఘృతైక్షవమ్ ।
దద్యాద్వస్త్రాణి సూక్ష్మాణి రసపాత్రైశ్చ సంయుతమ్ ॥7॥

సంపూజ్య విప్రమిథునం గౌరీ మే ప్రీయతామితి ।
ఏతద్గౌరీవ్రతం నామ భవానీలోకదాయకమ్ ॥8॥

చైత్రంలో దధి, క్షీరం, ఘృతం, చెరకురసం – వీటిని వదలి విప్రమిథునాన్ని పూజించి సూక్ష్మవస్త్రాలు, రసపాత్రలతో సహా 'గౌరీ మే ప్రీయతామ్', అని చెప్పి ఎవడు దానమిస్తాడో వాడు భవానీలోకం పొందుతాడు. ఇది గౌరీ వ్రతం.

పుష్యాదౌ యస్త్రయోదశ్యాం కృత్వా నక్తం మధౌ పునః।
అశోకం కాంచనం దద్యాదిక్షుయుక్తం దశాంగులమ్ ॥9॥

విప్రాయ వస్త్రసంయుక్తం ప్రద్యుమ్నః ప్రీయతామితి ।
కల్పం విష్ణుపదే స్థిత్వా విశోకః స్యాత్పునర్నరః ।
ఏతత్కామవ్రతం నామ సదా శోకవినాశనమ్ ॥10॥

ఎవడు పుష్యాదిలో త్రయోదశినాడు రాత్రివేళ భుజించి చైత్రంలో దశాంగుళమైన స్వర్ణంతో చేసిన చెరకుగడను, అశోకాన్ని 'ప్రద్యుమ్నః ప్రీయతామ్' అని విప్రునికి దానం ఇస్తాడో, అతడు కల్పకాలం శోకరహితుడై విష్ణుపదంలో ఉంటాడు. ఇది కామవ్రతం, సదా శోకం తొలగించునది.

ఆషాఢాదౌ వ్రతాద్యే తు వర్జయేన్నఖకృన్తనమ్ ।
వార్తాకం చ చతుర్మాసం మధుసర్పిర్గుడాన్వితమ్ ॥11॥

కార్తిక్యాం తత్పునర్హైమం బ్రాహ్మణాయ నివేదయేత్ ।
స రుద్రలోకమాప్నోతి శివవ్రతమిదం స్మృతమ్ ॥12॥

ఆషాఢం మొదలుకొని నాల్గునెలలు గోళ్ళు కత్తిరించకుండా తేనె నెయ్యితో కూడిన వంకాయను వర్జించాలి. కార్తికంలో బంగారు వంకాయను విప్రునికి దానమివ్వాలి, అలా చేసేవాడు రుద్రలోకం చేరుకొంటాడు. ఇది శివవ్రతం.

వర్జయేద్యస్తు పుష్పాణి హేమన్తశిశిరావృతూ ।
పుష్పత్రయం చ ఫాల్గుణ్యాం కృత్వా శక్త్యా చ కాంచనమ్ ॥13॥

దద్యాత్త్రికాలవేలాయాం ప్రీయేతాం శివకేశవౌ ।
దత్వా పరం పదం యాతి సౌమ్యవ్రతమిదం స్మృతమ్ ॥14॥

ఎవడు హేమంత శిశిరఋతువులలో పూలు వదలి ఫాల్గుణమాసంలో ఆ ఋతువులలో పూచే మూడు కాంచన పుష్పాలు చేయించి మూడు వేళలందు మూటిని వేరువేరుగా 'శివకేశవౌ ప్రీయేతాం' అని విప్రుని కిస్తాడో వాడు పరమపదం చేరుతాడు. ఇది సౌమ్యవ్రతం.

ఫాల్గునాది తృతీయాయాం లవణం యస్తు వర్జయేత్ ।
సమాప్తే శయనం దద్యాద్గృహం చోపస్కరాన్వితమ్ ॥15॥

సంపూజ్య విప్రమిథునం భవానీ ప్రీయతామితి ।
గౌరీలోకే వసేత్కల్పం సౌభాగ్యవ్రతముచ్యతే ॥16॥

ఫాల్గుణం తృతీయనుండి ఎవడు లవణం వదలి సంవత్సరాంతంలో శయనాన్ని ఉపస్కరాలతో సహా గృహాన్నీ, విప్రమిథునాన్ని అర్చించి 'భవానీ ప్రీయతామ్' అని యిస్తాడో వాడు కల్పకాలం గౌరీ లోకంలో నివసిస్తాడు, ఇది సౌభాగ్యవ్రతం.

సంధ్యామౌనం నరః కృత్వా సమాప్తే ఘృతకుంభకమ్ ।
వస్త్రయుగ్మం తిలాన్ఘణ్టాం బ్రాహ్మణాయ నివేదయేత్ ॥17॥

సారస్వతం పదం యాతి పునరావృత్తిదుర్లభమ్ ।
ఏతత్సారస్వతం నామ రూపవిద్యాప్రదాయకమ్ ॥18॥

సంధ్యాసమయాలలో మౌనం పాటించి వ్రతాంతమందు ఘృతకుంభాన్నీ, వస్త్రయుగ్మాన్నీ, తిలలనూ, ఘంటనూ, విప్రునికిస్తాడో వాడు పునర్మర్జన్మలేని సారస్వతపదవికి పోతాడు. ఇది రూపవిద్యలను ప్రసాదించే సారస్వతవ్రతం.

లక్ష్మీమభ్యర్చ్య పంచమ్యాముపవాసీ భవేన్నరః ।
సమాప్తే హేమకలశం దద్యాద్ధేనుసమన్వితమ్ ॥19॥

స వైష్ణవం పదం యాతి లక్ష్మీవాన్జన్మజన్మని ।
ఏతత్సమ్పద్వ్రతం నామ సదా పాపవినాశనమ్ ॥20॥

పంచమినాడు లక్ష్మిని పూజించి నరుడు ఉపవసించాలి. వ్రతాంతంలో ధేనువుతో సహా స్వర్ణకలశాన్నిఇవ్వాలి. అట్టివాడు వైష్ణవపదం చేరుకొంటాడు. జన్మజన్మలలో లక్ష్మీసంపన్నుడవుతాడు. ఇది సదా పాపం పోగొట్టే సంపద్వ్రతం.

కృత్వానులేపనం శంభోరగ్రతః కేశవస్య వా ।
యావదబ్దం పునర్దద్యాద్ధేనుం జలఘటాన్వితామ్ ॥21॥

జన్మాయుతం స రాజా స్యాత్తతః శివపురం వ్రజేత్ ।
ఏతచ్ఛుద్ధి వ్రతం నామ సర్వకామప్రదాయకమ్ ॥22॥

శివుడు లేదా కేశవుని ముంగిట సంవత్సరకాలం అలికి గంధానులేపనాదులు చేసి జలఘట సహితంగా ధేనువును దానం చేస్తే పదివేల జన్మలు రాజుగా వుంటాడు. ఆపై శివపురం చేరుకొంటాడు. ఇది సర్వకామదాయకమైన శుద్ధివ్రతం.

అశ్వత్థం భాస్కరం గంగాం ప్రణమ్యైకత్ర వాగ్యతః ।
ఏకభుక్తం నరః కుర్యాదబ్దమేకం విమత్సరః ॥23॥

ఒక సంవత్సర కాలం ఒంటిపూట భుజించి మాత్సర్యం లేకుండా రావిచెట్టుకూ, సూర్యునికీ, గంగకూ ప్రణమిల్లుతూ మౌనం పాటించాలి.

వ్రతాన్తే విప్రమిథునం పూజ్యం ధేనుత్రయాన్వితమ్ ।
వృషం హిరణ్మయం దద్యాత్సోఽశ్వమేధఫలం లభేత్ ।
ఏతత్కీర్తివ్రతం నామ భూతికీర్తిఫలప్రదమ్ ॥24॥

వ్రతం పూర్తికాగానే విప్రమిథునాన్ని పూజించి మూడు పాడి ఆవులతో గూడా బంగారు వృషభాన్ని ఇస్తే వాడు అశ్వమేధపలం పొందుతాడు. ఇది ఐశ్వర్యకీర్తిఫలమిచ్చే కీర్తివ్రతం.

ఘృతేన స్నపనం కుర్యాచ్ఛంభోర్వా కేశవస్య వా ।
అక్షతాభిః సపుష్పాభిః కృత్వా గోమయమణ్డలమ్ ॥25॥

సమాప్తే హేమకమలం తిలధేనుసమన్వితమ్ ।
శుద్ధమష్టాఙ్గులం దద్యాచ్ఛివలోకే మహీయతే ।
సామగాయ తతశ్చైతత్సామవ్రతమిహోచ్యతే ॥26॥

గోమయంతో మండలం లిఖించి శివునికి గానీ, కేశవునికి గానీ ఘృతస్నపనం చేయించాలి. పూలతో కూడిన అక్షతలతో అర్చించాలి. సంవత్సరాంతంలో తిలధేను సమన్వితంగా ఎనిమిదంగుళాలు పొడవు గల స్వర్ణ కమలాన్ని సామగానపరునికి ఇస్తే శివలోకంలో పూజింపబడతాడు. ఇది సామవ్రతం.

నవమ్యామేకభుక్తం తు కృత్వా కన్యాం చ శక్తితః ।
భోజయిత్వాఽఽసనం దద్యాద్ధేమకంచుకవాససీ ॥27॥

హైమం సింహం చ విప్రాయ దత్త్వా శివపదం వ్రజేత్ ।
జన్మార్బుదం సురూపః స్యాచ్ఛత్రుభిశ్చాపరాజితః ।
ఏతద్వీరవ్రతం నామ నారీణాం చ సుఖప్రదమ్ ॥28॥

నవమినాడు ఏకభుక్తం చేసి కన్యను శక్తి కొలది భుజింపజేయాలి. ఆమెకు బంగారు జరీ రవికను, చీరను ఇవ్వాలి. హేమసింహాన్ని విప్రునికిస్తే శివపురం చేరుతాడు. అర్బుద జన్మలు సురూపుడై శత్రువులచే అపరాజితుడై భాసిస్తాడు. ఇది స్త్రీలకు సుఖమిచ్చే నారీవ్రతం.

ఏతత్సమాచరేద్యస్తు పంచదశ్యాం పయోవ్రతమ్ ।
సమాన్తే శ్రాద్ధకృద్దద్యాత్పంచ గాస్తు పయస్వినీః ॥29॥

వాసాంసి చ పిశఙ్గాని జలకుంభయుతాని చ ।
స యాతి వైష్ణవం లోకం పితౄణాం తారయేచ్ఛతమ్ ।
కల్పాన్తే రాజరాజః స్యాత్పితృవ్రతమిదం స్మృతమ్ ॥30॥

ఒక సంవత్సరకాలం పంచదశినాడు క్షీరం స్వీకరించి సంవత్సరాంతంలో శ్రాద్ధం చేసి అయిదు పాడి గోవులను, పిశంగవస్త్రాలనూ, జలకుంభసమేతంగా ఇస్తే వైష్ణవలోకానికి పోతాడు. నూరుమంది పితరులను తరింపజేస్తాడు. కల్పాంతంలో రాజరాజవుతాడు. ఇది పితృవ్రతం

చైత్రాదిచతురో మాసాన్జలం దద్యాదయాచితమ్ ।
వ్రతాన్తే మణికం దద్యాదన్నవస్త్రసమన్వితమ్ ॥31॥

తిలపాత్రం హిరణ్యం చ బ్రహ్మలోకే మహీయతే ।
కల్పాన్తే భూపతిర్న్యానమానన్దవ్రతముచ్యతే ॥32॥

చైత్రం మొదలు నాలుగు నెలలు అయాచితంగా జలమివ్వాలి. వ్రతాంతంలో అన్న వస్త్రసమన్వితంగా దుత్త అనే మట్టిపాత్రను, తిలపాత్రను, బంగారాన్నీ ఇవ్వాలి. అట్టివాడు బ్రహ్మలోకంలో పూజింపబడతాడు. కల్పాంతంలో భూపతి అవుతాడు. ఇది ఆనందవ్రతం.

పంచామృతేన స్నపనం కృత్వా సంవత్సరం విభోః।
వత్సరాన్తే పునర్దద్యాద్ధేనుం పంచామృతేన హి ॥33॥

విప్రాయ దద్యాంచ్ఛఖం చ స పదం యాతి శాంకరమ్ ।
రాజా భవతి కల్పాన్తే ధృతివ్రతమిదం స్మృతమ్ ॥34॥

ఒక సంవత్సరకాలం శివుని ప్రతిమకు పంచామృతస్నానం చేయించి వత్సరాంతంలో పంచామృతంతోగూడా ధేనువును, శంఖాన్నీ విప్రునికిచ్చేవాడు శాంకరపదం చేరుకొంటాడు. కల్పాంతంలో రాజవుతాడు. ఇది ధృతివ్రతం.

వర్జయిత్వా పుమాన్మాంసమబ్దాన్తే గోప్రదో భవేత్ ।
తద్వద్ధేమమృగం దద్యాత్సోఽశ్వమేధఫలం లభేత్ ।

అహింసావ్రతమిత్యుక్తం కల్పాన్తే భూపతిర్భవేత్ ॥35॥
బ్రహ్మలోకమవాప్నోతి పునరావృత్తి దుర్లభమ్ ।

మాంసం వర్జించి సంవత్సరం చివర హేమ మృగాన్నీ, గోవునూ ఇచ్చేవాడు అశ్వమేధఫలం పొందుతాడు. కల్పాంతంలో రాజవుతాడు. ఇది అహింసావ్రతం. దీన్ని పాటిస్తే పునరావృత్తి లేని బ్రహ్మలోకం చేరుతాడు.

మాఘమాస్యుషసి స్నానం కృత్వా దామ్పత్యమర్చయేత్ ।
భోజయిత్వా యథాశక్తి మాల్యవస్త్రవిభూషణైః ।
సూర్యలోకే వసేత్కల్పం సూర్యవ్రతమిదం స్మృతమ్ ॥36॥

మాఘమాసంలో ఉషఃకాలంలో స్నానం చేయాలి. ద్విజదంపతులను యథాశక్తి భుజింపజేసి మాల్య వస్త్రవిభూషణాదులతో అర్చించాలి. అట్టివాడు కల్పకాలం సూర్యలోకంలో నివసిస్తాడు ఇది సూర్యవ్రతం.

ఆషాఢాది చతుర్మాసాన్ ప్రాతః స్నాయీ భవేన్నరః ।
విప్రేషు భోజనం దద్యాత్కార్తిక్యాం గోప్రదో భవేత్ ।

స వైష్ణవం పదం యాతి విష్ణువ్రతమిదం శుభమ్ ॥37॥
నిత్యమేవార్చనం విష్ణోః కల్పాంతే రాజరాడ్భవేత్ ।

ఆషాఢమాదిగా నాల్గు నెలలు ఉదయాన స్నానం చేయాలి. కార్తికారంభంలో విప్రులకు భోజనం పెట్టాలి. గోవుల నివ్వాలి. అలా ఇచ్చేవాడు వైష్ణవపదం చేరుతాడు. ఇది శుభ ప్రదమైన విష్ణువ్రతం. రోజూ విష్ణుపూజ చేయాలి. అట్టివాడు రాజరాట్ అవుతాడు.

అయనాదయనం యావద్వర్జయేత్పుష్పసర్పిషీ ।
తదన్తే పుష్పదామాని ఘృతధేన్వా సహైవ తు ॥38॥

దత్త్వా శివపదం గచ్ఛేద్విప్రాయ ఘృతపాయసమ్।
ఏతచ్ఛీలవ్రతం నామ శీలారోగ్యఫలప్రదమ్ ॥39॥

అయనం నుండి అయనం వరకూ పూలూ, నెయ్యీ వర్జించాలి. ఆపై విప్రునికి ఘృతపాయసం పెట్టాలి. ఘృతధేనువుతో సహా పుష్పదామాలను ఇవ్వాలి. అలా చేస్తే శివపదం చేరుతాడు. ఇది శీలవ్రతం. శీలాన్నీ, ఆరోగ్యాన్నీ ప్రసాదించేది.

సన్ధ్యాదీపప్రదో యస్తు సమాం తైలం వివర్జయేత్ ।
సమాన్తే దీపికాం దద్యాచ్చక్రశూలే చ కాంచనే ॥40॥

వస్త్రయుగ్మం చ విప్రాయ తేజస్వీ స భవేదిహ ।
రుద్రలోకమవాప్నోతి దీపవ్రతమిదం స్మృతమ్ ॥41॥

ఒక సంవత్సరకాలం తైలం వర్జించాలి. ఇంతకాలం సంధ్యాదీపం దానం చేయాలి. సంవత్సరాంతంలో స్వర్ణ చక్ర శూలాలనూ, వస్త్ర యుగ్మాన్నీ విప్రునికిచ్చేవాడు ఈ లోకంలో తేజస్వి అవుతాడు. కడపట రుద్రలోకం పోతాడు. దీనిని దీపవ్రతమంటారు.

కార్త్యిక్యాది తృతీయాయాం ప్రాశ్య గోమూత్రయావకమ్ ।
నక్తం చరేదబ్దమేకమబ్దాన్తే గోప్రదో భవేత్ ॥42॥

గౌరీలోకే వసేత్కల్పం తతో రాజా భవేదిహ ।
ఏతద్గౌరీవ్రతం నామ సదా కల్యాణకారకమ్ ॥43॥

కార్తికం మొదలు తృతీయనాడు గోమూత్రాన్నీ, గోధుమరవ్వను భుజించి ఒక సంవత్సరకాలం రాత్రివ్రతం చేయాలి. వ్రతాంతంలో గోవును దానమిచ్చేవాడు కల్పకాలం గౌరీలోకంలో నివసిస్తాడు. ఆ పై ఈ లోకంలో రాజవుతాడు. ఇది గౌరీవ్రతం, సదా కల్యాణ కారకమైనది.

వర్జయేచ్చైత్రమాసే చ యశ్చ గన్ధానులేపనమ్ ।
శుక్తిం గన్ధభృతం దత్త్వా విప్రాయ సితవాససీ ।
వారుణం పదమాప్నోతి దృఢవ్రతమిదం స్మృతమ్ ॥44॥

చైత్రంలో గంధానులేపనం వర్జించి విప్రునికి గంధం నింపిన ముత్యెపుచిప్పను, తెల్లనివస్త్రాలనూ దానమిచ్చేవాడు వారుణపదం చేరుకొంటాడు. దీన్ని దృఢవ్రత మంటారు.

వైశాఖే పుష్పలవణం వర్జయేద్ఘట గోప్రదః ।
భుక్త్వా విష్ణుపదే కల్పం స్థిత్వా రాజా భవేదిహ ।
ఏతత్కాన్తివ్రతం నామ కాన్తికీర్తిఫలప్రదమ్ ॥45॥

వైశాఖంలో పూలూ, ఉప్పు లవణ ఘటమును గాని లవణ గోవును గాని దానం చేసినవాడు విష్ణుస్థానంలో కల్పకాలం ఉండి ఈ లోకంలో రాజవుతాడు. ఇది కాంతివ్రతం. కాంతికీర్తిఫలాల నిచ్చునది.

బ్రహ్మాణ్డం కాంచనం కృత్వా తిలరాశిసమన్వితమ్ ।
త్ర్యహం తిలప్రదో భూత్వా వహ్నిం సన్తర్ప్య చ ద్విజాన్ ॥46॥

సంపూజ్య విప్రదామ్పత్యం మాల్యవస్త్రవిభూషణైః
శక్తితస్త్రిపలాదూర్ధ్వం విశ్వాత్మా ప్రీయతామితి ॥47॥

పుణ్యేఽహ్ని దద్యాత్ స పరం బ్రహ్మ యాత్యపునర్భవమ్ ।
ఏతద్బ్రహ్మవ్రతం నామ నిర్వాణపదదాయకమ్ ॥48॥

తిలరాశిసమేతంగా మూడు పలాలకు తక్కువగాని బంగారుతో బ్రహ్మాండం నిర్మించాలి. మూడు దినాలు తిలహోమం చేయాలి. ద్విజులను అన్నదానంతో తృప్తిపరచాలి. ఆపై విప్రదంపతులను అన్నదానంతో తృప్తిపరచాలి. ఆపై విప్ర దంపతులను మాల్యవస్త్ర విభూషణాలతో పూజించి శక్తికొలది 'విశ్వాత్మా ప్రీయతామ్' అని పుణ్యదినాన విప్రునికివ్వాలి. అలా చేస్తే పునరావృత్తి లేని పరబ్రహ్మను చేరుతాడు. ఇది బ్రహ్మవ్రతం, సదా నిర్వాణాన్ని ఇచ్చేది.

యశ్చోభయముఖీం దద్యాత్ ప్రభూతకనకాన్వితామ్ ।
దినం పయోవ్రతస్తిష్ఠేత్స యాతి పరమం పదమ్ ।
ఏతద్ధేనువ్రతం నామ పునరావృత్తిదుర్లభమ్ ॥49॥

ఎవడు రెండు ముఖాల గోవును ఎక్కువ స్వర్ణంతో చేసి దానమిస్తాడో, ఆ రోజు పాలు సేవిస్తాడో, వాడు పరమపదం పొందుతాడు. ఇది పునరావృత్తి లేని ధేనువ్రతం.

త్ర్యహం పయోవ్రతే స్థిత్వా కాంచనం కల్పపాదపమ్ ।
పలాదూర్ధ్వం యథాశక్త్యా తణ్డులైశ్చోపసంయుతమ్ ।
దత్త్వా బ్రహ్మపదం యాతి కల్పవ్రతమిదం స్మృతమ్ ॥50॥

మూడు దినాలు పాలుత్రాగి ఒక పలం కంటె ఎక్కువ స్వర్ణంతో చేసిన కాంచన కల్పవృక్షాన్ని యథాశక్తి బియ్యంతో సహా ఇచ్చేవాడు బ్రహ్మపదం పొందుతాడు. ఇది కల్పవ్రతం.

మాసోపవాసీ యో దద్యాద్ధేనుం విప్రాయ శోభనామ్ ।
స వైష్ణవం పదం యాతి భీమవ్రతమిదం స్మృతమ్ ॥51॥

ఒక నెల ఉపవాసముండి ఎవడు శోభనమైన ఆవును విప్రునికిస్తాడో, వాడు వైష్ణవపదం పొందుతాడు. ఇది భీమవ్రతం.

దద్యాద్వింశత్పలాదూర్ధ్వం మహీం కృత్వా తు కాంచనీమ్ ।
దినం పయోవ్రతస్తిష్ఠేద్రుద్రలోకే మహీయతే ।
ధరావ్రతమిదం ప్రోక్తం సప్తకల్పశతానుగమ్ ॥52॥

ఇరువది పలాలకంటె ఎక్కువ స్వర్ణంతో భూమిని తయారు చేయించి ఒక దినం పాలుమాత్రం త్రాగి వుండి దానం చేస్తే, రుద్రలోకంలో పూజింపబడతాడు. ఇది ధరావ్రతం. ఏడు కల్పశతాలకాలం దీని ప్రభావముంటుంది.

మాఘే మాసేఽథవా చైత్రే గుడధేనుప్రదో భవేత్ ।
గుడవ్రతస్తృతీయాయాం గౌరీలోకే మహీయతే ।
మహావ్రతమిదం నామ పరమానన్దకారకమ్ ॥53॥

మాఘంలో లేదా చైత్రంలో తృతీయనాడు గుడధేనువును దానం చేయువాడు గుడవ్రతుడు. వాడు గౌరీలోకంలో ఆదరింపబడతాడు. ఇది పరమానందదాయకమైన మహావ్రతం.

పక్షోపవాసీ యో దద్యాద్విప్రాయ కపిలాద్వయమ్ ।
బ్రహ్మలోకమవాప్నోతి దేవాసురసుపూజితమ్ ।
కల్పాన్తే రాజరాజః స్యాత్ప్రభావ్రతమిదం స్మృతమ్ ॥54॥

ఒక పక్షం దినాలు ఉపవసించి విప్రునికి రెండు కపిల ధేనువుల నిచ్చేవాడు. దేవాసురపూజితమైన బ్రహ్మలోకానికి పోతాడు. కల్పాంతంలో రాజ రాజవుతాడు. ఇది ప్రభావ్రతం.

వత్సరం త్వేకభక్తాశీ సభక్ష్యజలకుమ్భదః ।
శివలోకే వసేత్కల్పం ప్రాప్తివ్రతమిదం స్మృతమ్ ॥55॥

ఒక సంవత్సరకాలం ఒంటి పూట తిని భక్ష్యాలతో సహా జలకుంభం ఇచ్చేవాడు శివలోకంలో ఒక కల్పకాలం నివసిస్తాడు. ఇది ప్రాప్తి వ్రతం.

నక్తాశీ చాష్టమీషు స్యాద్వత్సరాన్తే చ ధేనుదః ।
పౌరన్దరం పదం యాతి సుగతివ్రతముచ్యతే ॥56॥

అష్టమీ తిథులలో రాత్రి భోజనం చేస్తూ వత్సరాంతంలో గోవునిచ్చేవాడు ఇంద్రపదానికి పోతాడు. ఇది సుగతివ్రతం.

విప్రాయేన్ధనదో యస్తు వర్షాదిచతురో ఋతూన్ ।
ఘృతధేనుప్రదోఽన్తే చ స పరం బ్రహ్మ గచ్ఛతి ।
వైశ్వానరవ్రతం నామ సర్వపాపవినాశనమ్ ॥57॥

వర్షాకాలంలో నాల్గు నెలలు విప్రునికి ఇంధన మిచ్చువానికి, ఘృతం, ధేనువును సమర్పించేవానికి పరబ్రహ్మ ప్రాప్తి కల్గుతుంది. ఇది సకలపాపవినాశకమైన వైశ్వానరవ్రతం.

ఏకాదశ్యాం చ నక్తాశీ యశ్చక్రం వినివేదయేత్ ।
సమాన్తే వైష్ణవం హైమం స విష్ణోః పదమాప్నుయాత్ ।
ఏతత్కృష్ణవ్రతం నామ కల్పాన్తే రాజ్యభాగ్భవేత్ ॥58॥

ఏకాదశినాడు రాత్రి భోజనం చేసి ఎవడు స్వర్ణచక్రాన్నీ, సంవత్సరాంతంలో స్వర్ణ విష్ణుమూర్తినీ ఇస్తాడో వాడు విష్ణుపదం చేరుతాడు. ఇది కృష్ణవ్రతం. కల్పాంతంలో ఆ దాత రాజ్యం పొందుతాడు.

పాయసాశీ సమాన్తే తు దద్యాద్విప్రాయ గోయుగమ్ ।
లక్ష్మీలోకమవాప్నోతి హ్యేతద్దేవీవ్రతం స్మృతమ్ ॥59॥

సంవత్సరకాలం పాయసం తిని వ్రతాంతంలో విప్రునికి రెండుగోవుల నిచ్చేవాడు లక్ష్మీలోకం చేరుకొంటాడు. ఇది దేవీవ్రతం.

సప్తమ్యాం నక్తభుగ్దద్యాత్సమాన్తే గాం పయస్వినీమ్ ।
సూర్యలోకమవాప్నోతి భానువ్రతమిదం స్మృతమ్ ॥60॥

సప్తమినాడు రాత్రిపూట తిని సంవత్సరాంతంలో పాడి ఆవునిచ్చేవాడు సూర్యలోకం చేరుతాడు. ఇది భానువ్రతం.

చతుర్థ్యాం నక్తభుగ్దద్యాదబ్దాన్తే హేమవారణమ్ ।
వ్రతం వైనాయకం నామ శివలోకఫలప్రదమ్ ॥61॥

చతుర్థినాడు రాత్రి భుజించి వత్సరాంతంలో స్వర్ణగజమునిచ్చేవాడు శివలోకం పొందుతాడు. ఇది వైనాయకవ్రతం.

మహాఫలాని యస్త్యక్త్వా చతుర్మాసం ద్విజాతయే ।
హైమాని కార్తికే దద్యాద్గోయుగేన సమన్వితమ్ ।
ఏతత్ ఫలవ్రతం నామ విష్ణులోకఫలప్రదమ్ ॥62॥

ఎవడు నాలుగు మాసాలు మహాఫలాలు వదలి విప్రునికి కార్తికంలో స్వర్ణ ఫలాలిస్తాడో; వాడు విష్ణులోకఫలం పొందుతాడు. ఇది ఫలవ్రతం.

యశ్చోపవాసీ సప్తమ్యాం సమాన్తే హైమపఙ్కజమ్ ।
గాశ్చ వై శక్తితో దద్యాద్ధేమాన్నఘటసంయుతాః ।
ఏతత్ సౌరవ్రతం నామ సూర్యలోకఫలప్రదమ్ ॥63॥

ఎవడు సప్తమినాడు ఉపవసించి వత్సరాంతంలో శక్తికొలది స్వర్ణపద్మాన్నీ, గోవులనూ స్వర్ణాన్నఘట సంయుతంగా ఇస్తాడో, వాడు సూర్యలోకఫలం పొందుతాడు. ఇది సౌరవ్రతం.

ద్వాదశ ద్వాదశీర్యస్తు సమాప్యోపోషణేన చ ।
గోవస్త్రకాంచనైర్విప్రాన్ పూజయేచ్ఛక్తితో నరః।
పరమం పదమాప్నోతి విష్ణువ్రతమిదం స్మృతమ్ ॥64॥

ఎవడు పండ్రెండు ద్వాదశులను ఉపవాసంతో పూర్తిచేసి గోవులు, వస్త్రాలు, స్వర్ణముతో శక్తికొలది విప్రులను అర్చిస్తాడో, వాడు పరమపదం పొందుతాడు. ఇది విష్ణువ్రతం.

కార్తిక్యాం చ వృషోత్సర్గం కృత్వా నక్తం సమాచరేత్ ।
శైవం పదమవాప్నోతి వృషవ్రతమిదం స్మృతమ్ ॥65॥

కార్తికంలో వృషోత్సరం చేసి నక్తవ్రతం చేసినవాడు శైవపదం పొందుతాడు. ఇది వృషవ్రతం.

కృచ్ఛ్రాన్తే గోప్రదః కుర్యాద్భోజనం శక్తితః పదమ్ ।
విప్రాణాం శాంకరం యాతి ప్రజాపత్యమిదం వ్రతమ్ ॥66॥

చాంద్రాయణం వంటి కృచ్ఛ్రవ్రతం పూర్తి కాగానే గోదానం చేయాలి. యథాశక్తి విప్రులకు భోజనం పెట్టాలి. అలా చేసేవాడు శాంకర పదం చేరుకొంటాడు. ఇది ప్రాజాపత్యవ్రతం.

చతుర్దశ్యాం తు నక్తాశీ సమాన్తే గోధనప్రదః ।
శైవం పదమవాప్నోతి త్రైయమ్బకమిదం వ్రతమ్ ॥67॥

చతుర్దశినాడు రాత్రి భుజించి సంవత్సరాంతంలో గోదానం చేసేవాడు శైవపదం పొందుతాడు. ఇది త్రైయంబకవ్రతం.

సప్తరాత్రోషితో దద్యాద్ఘృతకుంభం ద్విజాతయే ।
ఘృతవ్రతమిదం ప్రాహుర్బ్రహ్మలోకఫలప్రదమ్ ॥68॥

ఏడు రాత్రులు ఉపవసించి ద్విజునికి ఘృతకుంభమివ్వాలి. ఇది ఘృతవ్రతం. బ్రహ్మలోక ఫలమిస్తుంది.

కుశశాయీ సమాం దద్యాద్ధేనుమన్తే పయస్వినీమ్ ।
శక్రలోకే వసేత్కల్పమింద్రవ్రతమిదం స్మృతమ్ ॥69॥

సంవత్సరకాలం దర్భసలపై శయనిస్తూ కడపట పాడి ఆవును ప్రదానం చేసేవాడు ఇంద్రలోకంలో కల్పకాలం నివసిస్తాడు. ఇది ఇంద్రవ్రతం.

అనగ్నిపక్వమశ్నాతి తృతీయాయాం తు యో నరః ।
గాం దత్త్వా శివమభ్యేతి పునరావృత్తిదుర్లభమ్ ।
ఇహ చానన్దకృత్ పుంసాం శ్రేయోవ్రతమిదం స్మృతమ్ ॥70॥

తృతీయనాడు ఎవడు ఉడకని పదార్థం తింటాడో, వాడు గోదానం చేసి శివుని పొందుతాడు. ఇది పునరావృత్తి లేనిది, జనులకు ఆనందం కల్గించేది. దీన్ని శ్రేయోవ్రతమంటారు.

హైమం పలద్వయాదూర్ధ్వం రథమశ్వయుగాన్వితమ్ ।
దత్వా కృతోపవాసః స్యాద్దివి కల్పశతం వసేత్ ।
కల్పాన్తే రాజరాజః స్యాదశ్వవ్రతమిదం స్మృతమ్ ॥71॥

రెండు పలాల తూకం కంటే ఎక్కువతూకం కల బంగారుతో చేసిన రెండు గుఱ్ఱాలు గల రథాన్ని ఇచ్చి ఉపవాసం చేసినవాడు దేవలోకంలో నూరు కల్పాలుంటాడు. కల్పాంతంలో రాజరాజవుతాడు. ఇది అశ్వవ్రతం.

తద్వద్ధేమరథం దద్యాత్ కరిభ్యాం సంయుతం నరః ।
సత్యలోకే వసేత్ కల్పసహస్రమథ భూపతిః ।
భవేదుపోషితో భూత్వా కరివ్రతమిదం స్మృతమ్ ॥72॥

అట్లే రెండు ఏనుగులతో గూడిన స్వర్ణ రథమిచ్చేవాడు వెయ్యికల్పాలు సత్యలోకంలో నివసిస్తాడు. అనంతరం రాజవుతాడు. ఇది కరివ్రతం.

ఉపవాసం పరిత్యజ్య సమాన్తే గోప్రదో భవేత్ ।
యక్షాధిపత్యమాప్నోతి సుఖవ్రతమిదం స్మృతమ్ ॥73॥

ఉపవాసం వీడి సంవత్సరాంతంలో గోదానం చేసేవాడు యక్షులకు అధిపతి అవుతాడు. ఇది సుఖవ్రతం.

నిశి కృత్వా జలే వాసం ప్రభాతే గోప్రదో భవేత్ ।
వారుణం లోకమాప్నోతి వరుణవ్రతముచ్యతే ॥74॥

రాత్రివేళ పూర్తిగా నీటిలో ఉండి తెల్లవారగనే గోదానం చేసినవాడు వారుణలోకం పొందుతాడు. ఇది వరుణవ్రతం.

చాంద్రాయణం చ యః కుర్యాద్ధేమచంద్రం నివేదయేత్ ।
చంద్రవ్రతమిదం ప్రోక్తం చంద్రలోకఫలప్రదమ్ ॥75॥

చాంద్రాయణం చేసి స్వర్ణచంద్రుణ్ని దానం ఇచ్చినవాడు చంద్రలోక ఫలం పొందుతాడు. ఇది చంద్రవ్రతం.

జ్యేష్ఠే పంచతపాః సాయం హేమధేనుప్రదో దివమ్ ।
యాత్యష్టమీ చతుర్దశ్యో రుద్రవ్రతమిదం స్మృతమ్ ॥76॥

జ్యేష్ఠమాసంలో అష్టమీ, చతుర్దశీ తిథులలో పంచాగ్ని మధ్యములోనుండి తపస్సుచేసి స్వర్ణధేనువు సాయింకాలాన నిచ్చినవాడు స్వర్గానికి పోతాడు. ఇది రుద్రవ్రతం.

సకృద్వితానకం కుర్యాత్ తృతీయాయాం శివాలయే ।
సమాన్తే ధేనుదో యాతి భవానీవ్రతముచ్యతే ॥77॥

శివాలయంలో తృతీయనాడు వితానం (చాందినీ) ఏర్పాటు చేసినవాడు వ్రతాంతంలో ధేనువునిచ్చి భవానీపదం చేరుతాడు. ఇది భవానీవ్రతం.

మాఘే నిశ్యార్ద్రవాసాః స్యాత్ సప్తమ్యాం గోప్రదో భవేత్ ।
దివి కల్పముషిత్వేహ రాజా స్యాత్ స్నాపకవ్రతమ్ ॥78॥

మాఘమాసంలో రాత్రివేళ తడిగుడ్డలతో ఉండి సప్తమినాడు గోదానమిచ్చేవాడు స్వర్గంలో కల్పకాలం నివసించి తరువాత రాజవుతాడు. ఇది స్నాపకవ్రతం.

త్రిరాత్రోపోషితో దద్యాత్ ఫాల్గున్యాం భవనం శుభమ్ ।
ఆదిత్యలోకమాప్నోతి ధామవ్రతమిదం స్మృతమ్ ॥79॥

మూడు రాత్రులు ఉపవసించి ఫాల్గుణంలో శుభప్రదమైన గృహమును దానమిచ్చేవాడు ఆదిత్యలోకం చేరుకుంటాడు. ఇది ధామవ్రతం.

త్రిసన్ధ్యం పూజ్య దామ్పత్యముపవాసీ విభూషణైః ।
అన్నం గాశ్చ సమాప్నోతి మోక్షమింద్రవ్రతాదిహ ॥80॥

ఒకరోజు ఉపవసించి ఆనాడు త్రిసంధ్యలలోనూ ద్విజదంపతులను భూషణాలతో పూజించినవాడు అన్నం, గోవులు సమృద్ధిగా పొంది చివరికి మోక్షం పొందుతాడు. ఇది ఇంద్రవ్రతం.

దత్త్వా సితద్వితీయాయామిన్దోర్లవణభాజనమ్ ।
సమాన్తే గోప్రదో యాతి విప్రాయ శివమన్దిరమ్ ।
కల్పాన్తే రాజరాజః స్యాత్ సోమవ్రతమిదం స్మృతమ్ ॥81॥

చంద్రుని శుక్లద్వితీయనాడు లవణపాత్రను వ్రతాంతంలో గోవును విప్రునికిచ్చువాడు శివమందిరం చేరుకుంటాడు. కల్పాంతంలో రాజరాజవుతాడు. ఇది సోమవ్రతం.

ప్రతిపత్స్వేకభక్తాశీ సమాన్తే కపిలాప్రదః ।
వైశ్వానరపదం యాతి శివవ్రతమిదం స్మృతమ్ ॥82॥

పాడ్యమినాడు ఒకపూట భుజించి వ్రతాంతంలో కపిలగోవులను ఇచ్చినవాడు వైశ్వానర పథం చేరుతాడు. ఇది శివవ్రతం.

దశమ్యామేకభక్తాశీ సమాన్తే దశధేనుదః ।
దిశశ్చ కాంచనైర్దద్యాద్బ్రహ్మాణ్డాధిపతిర్భవేత్ ।
ఏతద్విశ్వవ్రతం నామ మహాపాతకనాశనమ్ ॥83॥

దశమినాడు ఒకపూట భుజించి వ్రతాంతంలో బంగారుతో చేసిన దశదిశలతో సహా పది ధేనువుల నిచ్చినవాడు బ్రహ్మాండానికి అధిపతి అవుతాడు. ఇది మహాపాతక నాశకమైన విశ్వవ్రతం. (దశదిశలనగా దశదిక్పాలకులు కావచ్చు)

యః పఠేచ్ఛృణుయాద్వాఽపి వ్రతషష్టిమనుత్తమామ్ ।
మన్వన్తరశతం సోఽపి గన్ధర్వాధిపతిర్భవేత్ ॥84॥

ఎవడు అనుత్తమమైన ఈ అరువది వ్రతాల వివరణను చదువుతాడో లేక వింటాడో వాడు నూరు మన్వంతరాలు గంధర్వాధిపతి అవుతాడు.

షష్టివ్రతం నారద పుణ్యమేతత్ తవోదితం విశ్వజనీనమన్యత్ ।
శ్రోతుం తవేచ్ఛా తదుదీరయామి ప్రియేషు కిం వాఽకథనీయమస్తి ॥85॥

నారదా! ఈ షష్టివ్రతం పవిత్రమైనది. విశ్వజనీనమైన దీనిని నీకు నేను చెప్పాను. ఇంకా నీవు వేరే వినాలని కోరితే అది కూడా చెబుతాను. ఇష్టమైన వారికి చెప్పరానిది ఏమున్నది?

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే వ్రతషష్టి కథనం నామైకాధికశతతమోఽధ్యాయః ॥ 101 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలో వ్రతషష్టి కథనం అనే నూటఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్వ్యధికశతతమో஽ధ్యాయః - నూటరెండవ అధ్యాయం

స్నానవిధి - స్నానవిధి

నన్దికేశ్వర ఉవాచ :- నందికేశ్వరుడు చెప్పాడు.

నైర్మల్యం భావశుద్ధిశ్చ వినా స్నానం న విద్యతే ।
తస్మాన్మనోవిశుద్ధ్యర్థం స్నానమాదౌ విధీయతే ॥1॥

నిర్మలత్వం, భావశుద్ధి స్నానం లేకుండా కలుగదు. అందువల్ల మనశ్శుద్ధి కొరకు స్నానం మొదట విధించబడింది.

అనుద్ధతైరుద్ధతైర్వా జలైః స్నానం సమాచరేత్ ।
తీర్థం చ కల్పయేద్విద్వాన్ మూలమంత్రేణ మంత్రవిత్ ।
నమో నారాయణాయేతి మూలమంత్ర ఉదాహృతః ॥2॥

భావినుండి చేదిన నీటితో గాని లేదా మడుగులు, నదులలోని నీటితోగాని స్నానం చేయాలి. మంత్రవేత్త అయిన విద్వాంసుడు ఆ జలాన్ని మూలమంత్రంతో తీర్థంగా మార్చుకోవాలి. 'నమో నారాయణాయ' అన్నదే మూలమంత్రం.

దర్భపాణిస్తు విధినా ఆచాన్తః ప్రయతః శుచిః।
చతుర్హస్తసమాయుక్తం చతురస్రం సమన్తతః ।
ప్రకల్ప్యావాహయేద్గంగామేభిర్మంత్రైర్విచక్షణః ॥3॥

దర్భలు చేబూని విధిప్రకారం ఆచమించి నిగ్రహపరుడై శుచియై నాలుగు మూరలు కొలతగల చతురస్రంగా నలువైపుల తీర్థప్రకల్పనం చేసుకొని విచక్షణుడై ఈ క్రింది మంత్రాలతో గంగను ఆవాహనం చేయాలి.

విష్ణుపాదప్రసూతా஽సి వైష్ణవీ విష్ణుదేవతా ।
త్రాహి నస్త్వేనసస్తస్మాదాజన్మమరణాన్తికాత్ ॥4॥

"నీవు విష్ణు పాదం నుండి జనించినదానవు, వైష్ణవివి, విష్ణుదేవతవు. అందువల్ల మమ్ము ఆ జన్మ మరణాంతమైన పాపం నుండి కాపాడు.

తిస్రః కోట్యో஽ర్ధకోటీ చ తీర్థానాం వాయురబ్రవీత్ ।
దివి భూమ్యన్తరిక్షే చ తాని తే సన్తి జాహ్నవి! ॥5॥

వాయుదేవుడు దివిలో, భువిలో, అంతరిక్షంలో మూడున్నరకోటి తీర్థాలను పేర్కొన్నాడు. జాహ్నవీ! అవన్నీ నీలోనే వున్నాయి.

నన్దినీత్యేవ తే నామ దేవేషు నలినీతి చ ।
దక్షా పృథ్వీ చ విహగా విశ్వకాయా஽మృతా శివా ॥6॥

విద్యాధరీ సుప్రశాన్తా తథా విశ్వప్రసాదినీ ।
క్షేమా చ జాహ్నవీ చైవ శాన్తా శాన్తిప్రదాయినీ ॥7॥

నిన్ను దేవతలు నందిని, నళిని అని వ్యవహరిస్తారు. అంతేకాక నీకు దక్ష, పృథ్వి, విహగ, విశ్వకాయ, అమృత, శివ, విద్యాధరి, సుప్రశాంత, విశ్వప్రసాదిని, క్షేమ, జాహ్నవి, శాంత, శాంతి ప్రదాయిని – అన్న పేర్లు గూడా వున్నాయి.

ఏతాని పుణ్యనామాని స్నానకాలే ప్రకీర్తయేత్ ।
భవేత్సన్నిహితా తత్ర గంగా త్రిపథగామినీ ॥8॥

ఈ పుణ్యనామాలను స్నానసమయంలో కీర్తించాలి. అప్పుడు త్రిపథ గామిని అయిన గంగ అక్కడ సాన్నిధ్యం వహిస్తుంది.

సప్తవారాభిజప్తేన కరసంపుటయోజితః ।
మూర్ధ్ని కుర్యాజ్జలం భూయస్త్రిచతుఃపంచసప్తకమ్ ।
స్నానం కుర్యాన్మృదా తద్వదామన్త్ర్య తు విధానతః ॥9॥

చేతులు మూసి ఏడుసార్లు ఈ నామాలను ఉచ్చరించాలి. ఆపై జలం తలపై చల్లుకోవాలి. మూడుసార్లు, నాలుగుసార్లు, ఐదుసార్లు, ఏడుసార్లు అలా చేయాలి. మృత్తికతో విధిప్రకారం ఆమంత్రణ చేసి స్నానం చేయాలి.

అశ్వక్రాంతే! రథక్రాన్తే! విష్ణుక్రాన్తే! వసున్ధరే! ।
మృత్తికే హర మే పాపం యన్మయా దుష్కృతం కృతమ్ ॥10॥

ఆ మంత్రమిది. "అశ్వములచే, రథములచే, విష్ణువుచే పాదములు మోపబడినదైన వసుంధరా! మృత్తికా! నేను చేసిన పాపం ఏదైనా వుంటే దాన్ని హరించు.

ఉద్ధృతాసి వరాహేణ కృష్ణేన శతబాహునా ।
మృత్తికే! బ్రహ్మదత్తాఽసి కాశ్యపేనాభిమంత్రితా ॥
ఆరుహ్య మమ గాత్రాణి సర్వం పాపం ప్రచోదయ ॥11॥

నూరు చేతులుగల కృష్ణ వరాహంచేత నీవు ఉద్ధరించబడ్డావు. మృత్తికా! నీవు బ్రాహ్మణులకు కశ్యపునితో అభిమంత్రితవై దత్తమైనదానవు. నా అవయవాలను ఆరోహించి పాపమంతా తొలగించు.

మృత్తికే! దేహి నః పుష్టిం త్వయి సర్వం ప్రతిష్ఠితమ్ ।
నమస్తే సర్వలోకానాం ప్రభవారణి! సువ్రతే! ॥12॥

మృత్తికా మాకు పుష్టినిమ్ము. నీలో అంతా ప్రతిష్ఠితమై యున్నది. సర్వలోకాలకూ ఉత్పత్తిస్థానమైన అరణీ! సువ్రతా! నీకు నమస్కారం".

ఏవం స్నాత్వా తతః పశ్చాదాచమ్య చ విధానతః।
ఉత్థాయ వాససీ శుక్లే శుద్ధే తు పరిధాయ వై ।
తతస్తు తర్పణం కుర్యాత్ త్రైలోక్యాప్యాయనాయ వై ॥13॥

ఇలా స్నానంచేసి ఆపై విధి ప్రకారం ఆచమించి లేచి తెల్లని శుద్ధమైన వస్త్రాలు ధరించి ముల్లోకాల తృప్తి కొరకు పిదప తర్పణం చేయాలి.

దేవా యక్షాస్తథా నాగా గన్ధర్వాప్సరసోஉసురాః।
క్రూరాః సర్పాః సుపర్ణాశ్చ తరవో జంబుకాః ఖగాః ॥14॥

వాయ్వాధారా జలాధారాస్తథైవాకాశగామినః ।
నిరాధారాశ్చ యే జీవాః పాపే ధర్మే రతాశ్చ యే ॥15॥

తేషామాప్యాయనాయైతద్దీయతే సలిలం మయా ।
కృతోపవీతీ దేవేభ్యో వినీతీ చ భవేత్తతః ॥16॥

దేవతలు, యక్షులు, నాగులు, గంధర్వులు, అచ్చరలు, అసురులు, క్రూరసర్పాలు, గరుడులు, చెట్లు, నక్కలు, పక్షులు, వాయువు ఆధారంగా గల ప్రాణులు, జలమాధారమైన ప్రాణులు, ఆకాశచరాలు, ఆధారం లేని జీవులు, పాపంలో పుణ్యంలో ఆసక్తి గలవి – వీటన్నిటి తృప్తి కొరకు నేనీ జలం ఇస్తున్నాను" అని చెప్పి జంధ్యం సవ్యము గావించినవాడై దేవతర్పణం చేసి పిదప జంధ్యమును తావళంగా వేసికోవాలి.

మనుష్యాంస్తర్పయేద్భక్త్యా బ్రహ్మపుత్రానృషీంస్తథా ।
సనకశ్చ సనన్దశ్చ తృతీయశ్చ సనాతనః ॥17॥

కపిలశ్చాసురిశ్చైవ వోఢుః పంచశిఖస్తథా ।
సర్వే తు తృప్తిమాయాన్తు మద్దత్తేనాంబునా సదా ॥18॥

ఆపై మనుష్యులకు తర్పణం చేయాలి. భక్తితో బ్రహ్మ పుత్రులకు, ఋషులకు, సనకుడు, సనందనుడు, మూడవవాడైన సనత్కుమారుడు, కపిలుడు, ఆసురి, ఓడుడు, పంచశిఖుడు వీరందరూ నేనిచ్చిన జలంతో సదా పరితృప్తులవుదురు గాక!

మరీచిమత్ర్యంగిరసం పులస్త్యం పులహం క్రతుమ్ ।
ప్రచేతసం వసిష్ఠం చ భృగుం నారదమేవ చ ।
దేవబ్రహ్మఋషీన్సర్వాంస్తర్పయేదక్షతోదకైః ॥19॥

మరీచి, అత్రి, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, ప్రచేతసుడు, వసిష్ఠుడు, భృగువు, నారదుడు, దేవబ్రహ్మ ఋషులు – వీరికందరికి అక్షతోదకాలతో తర్పణమివ్వాలి.

అపసవ్యం తతః కృత్వా సవ్యం జాన్వాచ్య భూతలే ।
అగ్నిష్వాత్తాస్తథా సౌమ్యా హవిష్మన్తస్తథోష్మపాః ॥20॥

సుకాలినో బర్హిషదస్తథాన్యే వాజ్యపాః పునః ।
సన్తర్ప్యాః పితరో భక్త్యా సతిలోదకచన్దనైః ॥21॥

ఆపై యజ్ఞోపవీతాన్ని అపసవ్యంగా వేసుకొని నేలపై ఎడమ మోకాలిపై నిల్చి అగ్నిష్వాత్తులు, సౌమ్యులు, హవిష్మంతులు, ఊష్మపులు, సుకాలులు, బర్హిషదులు, ఆజ్యపులు మున్నగువారికి తర్పణమివ్వాలి. భక్తితో పితరులకు తిలోదక చందనోదకాలు సమర్పించాలి.

యమాయ ధర్మరాజాయ మృత్యవే చాన్తకాయ చ ।
వైవస్వతాయ కాలాయ సర్వభూతక్షయాయ చ ॥22॥

ఔదుమ్బరాయ దణ్డాయ నీలాయ పరమేష్ఠినే ।
వృకోదరాయ చిత్రాయ చిత్రగుప్తాయ వై నమః ।
దర్భపాణిస్తు విధినా పితౄన్సన్తర్పయేద్బుధః ॥23॥

దర్భలు చేతబట్టి యమధర్మరాజు, మృత్యువు, అంతకుడు, వైవస్వతుడు, కాలుడు, సర్వభూతక్షయకరుడు, ఔదుంబరుడు, దండుడు, నీలుడు, పరమేష్ఠి, వృకోదరుడు, చిత్రుడు, చిత్రగుప్తుడు – ఇన్ని నామాలతో వ్యవహరింపబడే నీకు తర్పణం అంటూ ఈ పదునలుగురికి, దివ్యపితరులకు నమస్కరించి బుద్ధిమంతుడు విధిప్రకారం వారిని సంతృప్తులను కావించాలి.

పిత్రాదీన్నామగోత్రేణ తథా మాతామహానపి ।
సన్తర్ప్య విధినా భక్త్యా ఇమం మంత్రముదీరయేత్ ॥24॥

పిత్రాదులను, మాతా మహాదులను, నామగోత్రాలతో విధిప్రకారం భక్తితో సంతృప్తులను చేసి ఈ క్రింది మంత్రం చెప్పాలి.

యేఽబాన్ధవా బాన్ధవా వా యేఽన్యజన్మని బాన్ధవాః ।
తే తృప్తిమఖిలాం యాన్తు యశ్చాస్మత్తోఽభివాంఛతి ॥25॥

"ఎవరు బంధువులో, ఎవరు బంధువులు కానివారో, అన్య జన్మలలో బంధువులో, వారూ మరియు మా నుండి తృప్తి నాశించే వారందరూ సకల తృప్తిని పొందుదురుగాక"

తతశ్చాచమ్య విధివదాలిఖేత్పద్మమగ్రతః ।
అక్షతాభిః సపుష్పాభిః సజలారుణచన్దనమ్ ।
అర్ఘ్యం దద్యాత్ప్రయత్నేన సూర్యనామాని కీర్తయేత్ ॥26॥

ఆపై విధి ప్రకారం ఆచమించి ఎదుట పద్మాన్ని లిఖించి అక్షతలతో, పూలతో సజలారుణచందనంగా ప్రయత్నపూర్వకంగా అర్ఘ్యమివ్వాలి. సూర్యనామాలు కీర్తించాలి.

నమస్తే విష్ణురూపాయ నమో విష్ణుముఖాయ వై ।
సహస్రరశ్మయే నిత్యం నమస్తే సర్వతేజసే ॥27॥

విష్ణురూపుడైన నీకు నమస్కారం! విష్ణుముఖునకు నమస్కారం. సహస్రరశ్మికి నిత్యం నమస్కారం. సర్వ తేజస్సుకు నమస్కారం.

నమస్తే శివ సర్వేశ నమస్తే సర్వవత్సల ।
జగత్స్వామిన్నమస్తేఽస్తు దివ్యచన్దనభూషిత! ॥28॥

శివా! సర్వేశా! నీకు నమస్కారం, సర్వవత్సలా! జగత్ప్రభూ! దివ్యచందన భూషితా! నీకు నమస్కారం.

పద్మాసన నమస్తేఽస్తు కుణ్డలాంగదభూషిత ।
మనస్తే సర్వలోకేశ జగత్సర్వం విబోధసే ॥29॥

పద్మాసనా! కుండలాంగదభూషితా! సర్వలోకేశ్వరా! సర్వజగద్విబోధకుడవగు నీకు నమస్కారం.

సుకృతం దుష్కృతం చైవ సర్వం పశ్యసి సర్వగ ।
సత్యదేవ నమస్తేఽస్తు ప్రసీద మమ భాస్కర ॥30॥

సర్వదా సంచరించువాడా! నీవు సుకృత దుష్కృతాలన్నీ చూస్తున్నావు. సత్యదేవా! నీకు నమస్కారం. భాస్కరా! నాకు ప్రసన్నుడవు కమ్ము.

దివాకర నమస్తేఽస్తు ప్రభాకర నమోఽస్తు తే।
ఏవం సూర్యం నమస్కృత్య త్రిఃకృత్వాథ ప్రదక్షిణమ్ ।
ద్విజం గాం కాంచనం స్పృష్ట్వా తతో విష్ణుగృహం వ్రజేత్ ॥31॥

దివాకరా! నీకు నమస్కారం. ప్రభాకరా! నీకు నమస్కారం. ఇలా సూర్యుడికి నమస్కరించి మూడుసార్లు ప్రదక్షిణం చేసి బ్రాహ్మణ్ణి, గోవును, స్వర్ణాన్ని స్పృశించి తదుపరి విష్ణుగృహానికి పోవాలి.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే స్నానవిధిర్నానామ ద్వ్యధికశతతమోఽధ్యాయః ॥ 102 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని స్నానవిధి అనే నూటరెండవ అధ్యాయం సంపూర్ణం

త్ర్యధికశతతమోఽధ్యాయః – నూటమూడవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ – ప్రయాగమాహాత్మ్యం

నన్దికేశ్వర ఉవాచ :– నందికేశ్వరుడు చెప్పాడు.

అతః పరం ప్రవక్ష్యామి ప్రయాగస్యోపవర్ణనమ్ ।
మార్కణ్డేయేన కథితం యత్పురా పాణ్డుసూనవే ॥1॥

ఇకపై ప్రయాగక్షేత్రాన్ని వర్ణిస్తాను. పూర్వం దీనిని మార్కండేయుడు ధర్మపుత్రునికి చెప్పియున్నాడు.

భారతే తు యదా వృత్తే ప్రాప్తరాజ్యే పృథాసుతే ।
ఏతస్మిన్నన్తరే రాజా కున్తీపుత్రో యుధిష్ఠిరః ॥2॥

భ్రాతృశోకేన సన్తప్తశ్చిన్తయన్స పునః పునః ।

భారతంలో వర్ణింపబడిన వృత్తాంతం జరిగిన పిదప కుంతీకుమారుడు రాజ్యం చేజిక్కించుకొన్నాడు. ఆ ధర్మరాజు సోదరులు గతించారన్న శోకంతో మాటిమాటికి సంతాపం చెంది ఇలా చింతించాడు.

ఆసీత్ సుయోధనో రాజా ఏకాదశచమూపతిః ॥3॥

అస్మాన్ సన్తాప్య బహుశః సర్వే తే నిధనం గతాః ।
వాసుదేవం సమాశ్రిత్య పంచ శేషాస్తు పాణ్డవాః ॥4॥

'దుర్యోధనుడు పదునొకండు అక్షౌహిణులసేనకు ప్రభువైన భూపాలుడుగా ఉండినాడు. వారంతా మాకు అనేకవిధాల సంతాపం కలిగించి తుదకు మరణించారు. వాసుదేవుణ్ణి ఆశ్రయించి మేము పాండవుల మైదుగురము మిగిలియున్నాము.

హత్వా భీష్మం చ ద్రోణం చ కర్ణం చైవ మహాబలమ్ ।
దుర్యోధనం చ రాజానం పుత్రభ్రాతృసమన్వితమ్ ॥5॥

భీష్ముణ్ణి, ద్రోణుణ్ణి, మహాబలశాలి కర్ణుణ్ణి, పుత్రులతో, సోదరులతో సహా రాజైన దుర్యోధనుణ్ణి వధించాము.

రాజానో నిహతాః సర్వే యే చాన్యే శూరమానినః ।
కిం నో రాజ్యేన గోవిన్ద కిం భోగైర్జీవితేన వా ॥6॥

ఆ రాజులందరూ, ఇంకా మేము శూరులమని భావించిన ఇతరులూ హతులయ్యారు. గోవిందా! ఇక ఈ రాజ్యంవల్లా, భోగాలవల్లా, జీవితం వల్లా లాభమేమి?

ధిక్ కష్టమితి సంచిన్త్య రాజా వైక్లవ్యమాగతః ।
నిర్విచేష్టో నిరుత్సాహః కించిత్తిష్ఠత్యధోముఖః ॥7॥

అయ్యో! కష్టం! అని ఎంతో చింతించి ధర్మరాజు వైక్లబ్యం పొందాడు. నిశ్చేష్టుడు, నిరుత్సాహుడునై ముఖం క్రిందికి వాలిపోగా అలా ఉండిపోయాడు.

లబ్ధసంజ్ఞో యదా రాజా చిన్తయన్ స పునః పునః ।
కతరో వినియోగో వా నియమం తీర్థమేవ చ ॥8॥

మరల చైతన్యం పొంది మాటిమాటికీ ఇదే చింతించసాగాడు. ఇప్పుడు నాకు అనుష్ఠించదగిన విధానమేది? అవలంబించదగిన నియమమేది? సేవించదగిన తీర్థమేది?

యేనాహం శీఘ్రమాముచ్యే మహాపాతకకిల్బిషాత్ ।
యత్ర స్థిత్వా నరో యాతి విష్ణులోకమనుత్తమమ్ ॥9॥

దేనివల్ల నేను త్వరగా ఈ మహాపాతకమనే కిల్బిషనుండి విడివడగలను? ఏ క్షేత్రంలో నివసించి జనుడు మహోత్తమమైన విష్ణులోకం చేరగలడు?

కథం పృచ్ఛామి వై కృష్ణం యేనేదం కారితోఽస్మ్యహమ్ ।
ధృతరాష్ట్రం కథం పృచ్ఛే యస్య పుత్రశతం హతమ్ ॥10॥

శ్రీకృష్ణుడే నాచే ఈ పని చేయించాడు, నేనీవిషయం ఆయననెలా ప్రశ్నించేది, ఎవని నూరుగురు పుత్రులు హతులయిరో, అట్టి ధృతరాష్ట్రుణ్ణి ఎలా ప్రశ్నించేది?

ఏవం వైక్లవ్యమాపన్నో ధర్మరాజో యుధిష్ఠిరః ।
రుదన్తి పాణ్డవాః సర్వే భ్రాతృశోకపరిప్లుతాః ॥11॥

ఇలా ధర్మరాజు విక్లబత్వం పొందాడు. ఈ స్థితిలో పాండవులందరూ భ్రాతృమరణశోకోపహతులై ఏడువసాగారు.

యే చ తత్ర మహాత్మానః సమేతాః పాణ్డవాః స్మృతాః ।
కున్తీ చ ద్రౌపదీ చైవ యే చ తత్ర సమాగతాః ।
భూమౌ నిపతితాః సర్వే రుదన్తస్తు సమన్తతః ॥12॥

అక్కడ చేరిన మహాత్ములైన పాండుకుమారులు, కుంతి, ద్రౌపది మున్నగువారు అందరూ ఏడుస్తూ భూమిపై పడిపోయారు.

వారాణస్యాం మార్కణ్డేయస్తేన జ్ఞాతో యుధిష్ఠిరః ।
యథా వైక్లవ్యమాపన్నో రోదమానస్తు దుఃఖితః ॥13॥

అప్పుడు కాశీక్షేత్రంలో ఉండిన మార్కండేయమహర్షి ధర్మరాజు వైక్లవ్యం పొంది దుఃఖితుడై వున్నాడని గ్రహించాడు.

అచిరేణైవ కాలేన మార్కణ్డేయో మహాతపాః ।
సంప్రాప్తో హస్తినపురం రాజద్వారే హ్యతిష్ఠిత ॥14॥

మహాతపస్వి అయిన ఆ మార్కండేయముని వెంటనే హస్తిన నగరానికి వచ్చి రాజద్వారంలో నిలిచాడు.

ద్వారపాలోఽపి తం దృష్ట్వా రాజ్ఞః కథితవాన్ ద్రుతమ్ ।
త్వాం ద్రష్టుకామో మార్కణ్డో ద్వారి తిష్ఠత్యసౌ మునిః ।
త్వరితో ధర్మపుత్రస్తు ద్వారమాగాదతః పరమ్ ॥15॥

ద్వారపాలకుడు ఆయనను చూచి ధర్మజునకు వెంటనే తెలియజేశాడు. "మిమ్మల్ని చూడగోరి మార్కండేయముని ద్వారం వద్ద ఉన్నాడు" అని నివేదించాడు. వెనువెంటనే ధర్మసుతుడు ద్వారం చెంతకు వెళ్ళాడు.

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు.

స్వాగతం తే మహాభాగ స్వాగతం తే మహామునే ।
అద్య మే సఫలం జన్మ అద్య మే తారితం కులమ్ ॥16॥

అద్య మే పితరస్తుష్టాస్త్వయి దృష్టే మహామునే! ।
అద్యాహం పూతదేహోఽస్మి యత్త్వయా సహ దర్శనమ్ ॥17॥

"మహాభాగా! నీకు స్వాగతం! మహామునీ! నీకు స్వాగతం! నేడు నా జన్మ సఫలమయింది, నా కులం తరించింది. నిన్ను దర్శించడంతో నేడు నా పితరులు సంతుష్టులయ్యారు. మహామునీ! నీ దర్శనసిద్ధితో నేడు నా దేహం పవిత్రమయింది".

నన్దికేశ్వర ఉవాచ :- నన్దికేశ్వరుడు చెప్పాడు.

సింహాసనే సమాస్థాప్య పాదశౌచార్చనాదిభిః ।
యుధిష్ఠిరో మహాత్మా వై పూజయామాస తం మునిమ్ ॥18॥

తదుపరి మహాత్ముడైన ధర్మపుత్రు డామునిని సింహాసనంపై కూర్చోబెట్టి పాదశౌచం, అర్చన మున్నగు సత్క్రియలతో ఆయనను పూజించాడు.

తతః స తుష్టో మార్కణ్డః పూజితశ్చాహ తం నృపమ్ ।
ఆఖ్యాహి త్వరితం రాజన్కిమర్థం రుదితం త్వయా ।
కేన వా విక్లవీభూతః కా బాధా తే కిమప్రియమ్? ॥19॥

అలా పూజితుడై సంతసించిన మార్కండేయుడు ఆ రాజుతో ఇలా అన్నాడు. "రాజా! త్వరగా చెప్పు. ఎందుకు నీవు శోకిస్తున్నావు! దేనివల్ల నీకీ వైక్లబ్యం కల్గింది? నీ బాధ ఏమిటి? నీకు కల్గిన అప్రియమేమి?

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

అస్మాకం చైవ యద్వృత్తం రాజ్యస్యార్థే మహామునే! ।
ఏతత్సర్వం విదిత్వా తు చిన్తావశముపాగతః ॥20॥

మహామునీ! రాజ్యంకొరకై మాలో మాకు ఏమి జరిగిందో, అదంతా ఆలోచించి నేను చింతకు లోనయ్యాను.

మార్కణ్డేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్! మహాబాహో! క్షత్రధర్మవ్యవస్థితమ్ ।
నైవం దృష్టం రణే పాపం యుధ్యమానస్య ధీమతః ॥21॥

కిం పునా రాజధర్మేణ క్షత్రియస్య విశేషతః ।
తదేవ హృదయం కృత్వా తస్మాత్పాపం న చిన్తయేత్ ॥22॥

"మహాబాహూ! రాజా! క్షత్రధర్మ వ్యవస్థ ఎట్టిదో విను. ఇక యుద్ధం చేసే ధీమంతునికి యుద్ధంవల్ల పాపం లేనే లేదు. ఇక క్షత్రియుడైనవాడో రాజధర్మం పాటించి యుద్ధం చేస్తే పాపం ఎలా కల్గుతుంది? ఈ విషయం హృదయంతో భావించి పాపాన్ని గూర్చి చింతించదగదు".

తతో యుధిష్ఠిరో రాజా ప్రణమ్య శిరసా మునిమ్ ।
పప్రచ్ఛ వినయోపేతః సర్వపాతకనాశనమ్ ॥23॥

ఆపై యుధిష్ఠిరుడు శిరస్సుతో మునికి ప్రణమిల్లి వినయసమేతుడై సర్వపాపపరిహారమార్గాన్ని గురించి ప్రశ్నించాడు.

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

పృచ్ఛామి త్వాం మహాప్రాజ్ఞ! నిత్యం త్రైలోక్యదర్శినమ్ ।
కథయ త్వం సమాసేన యేన ముచ్యేత కిల్బిషాత్ ॥24॥

మహాప్రాజ్ఞా! నిత్యం ముల్లోకాలూ దర్శించే నిన్ను నేను అడుగుతున్నాను. పాపం నుండి విడివడే మార్గాన్ని సంగ్రహంగా నాకు మీరు చెప్పండి.

మార్కణ్డేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్మహాబాహో! సర్వపాతకనాశనమ్ ।
ప్రయాగగమనం శ్రేష్ఠం నరాణాం పుణ్యకర్మణామ్ ॥25॥

మహాబాహూ! రాజా! విను. పుణ్యకర్మలాచరించే జనులకు సకలపాపాలనూ నశింపజేసేది ప్రయాగతీర్థగమనం. అది చాలా శ్రేష్ఠమైనది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యం నామ త్రినవతితమోఽధ్యాయః ॥ 103 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ప్రయాగమాహాత్మ్యమనే నూటమూడవ అధ్యాయం సంపూర్ణం

చతురుత్తరశతతమోఽధ్యాయః - నూటనాల్గవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ - ప్రయాగమాహాత్మ్యం

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

భగవన్! శ్రోతుమిచ్ఛామి పురా కల్పే యథా స్థితమ్ ।
బ్రహ్మణా దేవముఖ్యేన యథావత్కథితం మునే! ॥1॥

భగవన్! మునీ! పూర్వకల్పంలో స్థితులెలా వుండేవో, దేవతలలో ముఖ్యుడైన బ్రహ్మ ఏమి చెప్పాడో- వినగోరుతున్నాను.

కథం ప్రయాగే గమనం నరాణాం తత్ర కీదృశమ్ ।
మృతానాం కా గతిస్తత్ర స్నాతానాం తత్ర కిం ఫలమ్ ॥2॥

ప్రయాగతీర్థగమనం నరులు ఎలా చేయాలి? ఏమి చేయాలి? అక్కడ మరణించినవారు పొందే గతి ఎలాంటిది? అక్కడ స్నానం చేస్తే ఏ ఫలం పొందుతారు?

యే వసన్తి ప్రయాగే తు బ్రూహి తేషాం చ కిం ఫలమ్ ।
ఏతన్మే సర్వమాఖ్యాహి పరం కౌతూహలం హి మే ॥3॥

ప్రయాగనివాసులైన జనులు ఏ ఫలం పొందుతారో, అది చెప్పండి. ఇదంతా నాకు వివరించండి! దీన్ని వినాలనే కౌతూహలం నాకు ఎక్కువగా ఉన్నది.

మార్కణ్డేయ ఉవాచ :-మార్కండేయుడు చెప్పాడు

కథయిష్యామి తే వత్స! యచ్ఛ్రేష్ఠం తత్ర యత్ఫలమ్ ।
పురా హి సర్వవిప్రాణాం కథ్యమానం మయా శ్రుతమ్ ॥4॥

వత్సా! అక్కడ ఏ ఫలం లభిస్తుందో, ఏది శ్రేష్ఠమైనదో అది నీకు వివరిస్తాను. పూర్వం విప్రులందరూ చెప్పగా నేను విన్న విషయమిది.

ఆ ప్రయాగప్రతిష్ఠానాదాపురాద్వాసుకేర్హ్రదాత్ ।
కమ్బలాశ్వతరౌ నాగౌ నాగశ్చ బహుమూలకః ।
ఏతత్ప్రజాపతేః క్షేత్రం త్రిషు లోకేషు విశ్రుతమ్ ॥5॥

ప్రయాగ ప్రతిష్ఠానం మొదలుకొని వాసుకి హ్రదం వరకూ కంబలుడు, అశ్వతరుడు, బహుమూలకుడు- అన్న నాగులు నివసించే ఆ ప్రాంతం ప్రజాపతిక్షేత్రంగా ముల్లోకాలలో ప్రసిద్ధి పొందింది.

తత్ర స్నాత్వా దివం యాన్తి యే మృతాస్తేఽపునర్భవాః ।
తతో బ్రహ్మాదయో దేవా రక్షాం కుర్వన్తి సంగతాః ॥6॥

అక్కడ స్నానం చేసినవారు స్వర్గానికి పోతారు. అక్కడ మరణించినవారికి పునర్జన్మ లేదు. అక్కడ బ్రహ్మాది దేవతలెల్లరూ రక్షణ కల్పిస్తారు.

అన్యే చ బహవస్తీర్థాః సర్వపాపహరాః శుభాః ।
న శక్యాః కథితుం రాజన్! బహువర్షశతైరపి ।
సంక్షేపేణ ప్రవక్ష్యామి ప్రయాగస్య తు కీర్తనమ్ ॥7॥

ఇంకా అనేక తీర్థాలు శుభప్రదాలై సర్వపాపాలను పరిహరించేవి అక్కడ ఉన్నాయి. వందలకొలది సంవత్సరాలైనా అవి వర్ణించడానికి వీలుగానివి. నేను నీకు ప్రయాగకీర్తనాన్ని సంగ్రహంగా చెబుతాను.

షష్టిర్ధనుఃసహస్రాణి యాని రక్షన్తి జాహ్నవీమ్ ।
యమునాం రక్షతి సదా సవితా సప్తవాహనః ॥8॥

అరువదివేలమంది ధనుర్ధారులు గంగను రక్షిస్తుంటారు. సప్తాశ్వవాహనుడైన సూర్యుడు సర్వదా యమునను రక్షిస్తూ వుంటాడు.

ప్రయాగం తు విశేషేణ సదా రక్షతి వాసవః ।
మణ్డలం రక్షతి హరిర్దేవతైః సహ సఙ్గతః ॥9॥

ప్రయాగను ఇంద్రుడు ఎల్లవేళలా విశేషించి కాపాడుతాడు. దేవతాసహితుడగు శ్రీహరి ఆ ప్రయాగ మండలాన్ని రక్షిస్తూ వుంటాడు.

తం వటం రక్షతి సదా శూలపాణిర్మహేశ్వరః ।
స్థానం రక్షన్తి వై దేవాః సర్వపాపహరం శుభమ్ ॥10॥

శూలపాణి అయిన శివుడు సదా అక్కడి వటవృక్షాన్ని కాపాడుతుంటాడు. సకలపాపహరమూ, శుభమూ అయిన ఆ స్థానాన్ని దేవతలు రక్షిస్తుంటారు.

అధర్మేణావృతో లోకే నైవ గచ్ఛతి తత్పదమ్ ।
స్వల్పమల్పతరం పాపం యదా తే స్యాన్నరాధిప ।
ప్రయాగం స్మరమాణస్య సర్వమాయాతి సంక్షయమ్ ॥11॥

లోకంలో అధర్మపరుడు ఆస్థానం చేరలేదు. నరాధిపా! కొంచెం పాపం నీకు కల్గినా, ప్రయాగను స్మరిస్తే ఆ పాపమంతా పోతుంది.

దర్శనాత్తస్య తీర్థస్య నామసంకీర్తనాదపి ।
మృత్తికాలమ్భనాద్వాపి నరః పాపాత్ప్రముచ్యతే ॥12॥

ఆ తీర్థాన్ని దర్శించినా, నామకీర్తనం చేసినా, అక్కడి మృత్తికను స్పృశించినా నరుడు పాపవిముక్తుడవుతాడు.

పంచ కున్డాని రాజేంద్ర! తేషాం మధ్యే తు జాహ్నవీ ।
ప్రయాగస్య ప్రవేశే తు పాపం నశ్యతి తత్‌క్షణాత్ ॥13॥

రాజేంద్రా! అక్కడ ఐదు కుండాలున్నాయి. వాటిమధ్య గంగ ఉన్నది. ఆ ప్రయాగలో ప్రవేశిస్తే పాపం వెంటనే నశిస్తుంది.

యోజనానాం సహస్రేషు గంగాయాః స్మరణాన్నరః ।
అపి దుష్కృతకర్మా తు లభతే పరమాం గతిమ్ ॥14॥

వేలకొలది యోజనాల దూరంనుండియైనా నరుడు గంగను స్మరిస్తే, అతడెంత దుష్కృతం చేసివుండినా పరమగతి పొందుతాడు.

కీర్తనాన్ముచ్యతే పాపాద్దృష్ట్వా భద్రాణి పశ్యతి ।
అవగాహ్య చ పీత్వా తు పునాత్యాసప్తమం కులమ్ ॥15॥

కీర్తనవల్ల పాపవిముక్తి కల్గుతుంది. దర్శనంతో మంగళాలు కల్గుతాయి. స్నానం చేసి జలపానం చేసినవాడు ఏడుతరాలవారిని పవిత్రులను చేస్తాడు.

సత్యవాదీ జితక్రోధో హ్యహింసాయాం వ్యవస్థితః ।
ధర్మానుసారీ తత్త్వజ్ఞో గోబ్రాహ్మణహితే రతః ॥16॥

గంగాయమునయోర్మధ్యే స్నాతో ముచ్యేత కిల్బిషాత్ ।
మనసా చిన్తయన్కామానవాప్నోతి సుపుష్కలాన్ ॥17॥

సత్యం చెప్పువాడు, కోపాన్ని జయించినవాడు, అహింసాధర్మం పాటించేవాడు, ధర్మము ననుసరించే వాడు, తత్త్వం తెలిసినవాడు, గోబ్రాహ్మణహితంలో ఆసక్తుడు, గంగాయమునలమధ్య స్నానం చేసినవాడై కిల్బిషం నుండి విముక్తుడవుతాడు. మనస్సుతో చింతిస్తే పుష్కలంగా ఇష్టకామాలను పొందుతాడు.

తతో గత్వా ప్రయాగం తు సర్వదేవాభిరక్షితమ్ ।
బ్రహ్మచారీ వసేన్మాసం పితౄన్దేవాంశ్చ తర్పయేత్ ।
ఈప్సితాన్ లభతే కామాన్యత్ర యత్రాభిజాయతే ॥18॥

అందువల్ల సకల దేవతలు రక్షించునట్టి ప్రయాగకుపోయి బ్రహ్మచారి ఒక మాసం నివసించాలి, పితరులకు, దేవతలకు అట్టివాడు ఎక్కడెక్కడ జన్మించినా ఈప్సితకామాలు పొందుతాడు.

తపనస్య సుతా దేవీ త్రిషు లోకేషు విశ్రుతా ।
సమాగతా మహాభాగా యమునా తత్ర నిమ్నగా ।
తత్ర సన్నిహితో నిత్యం సాక్షాద్దేవో మహేశ్వరః ॥19॥

సూర్యపుత్రి, ముల్లోకాలలో ప్రఖ్యాతి పొందిన దేవి, మహాభాగ అయిన యమున అక్కడ గంగతో కలిసినది. అక్కడ మహేశ్వరుడు సాక్షాత్తూ సన్నిహితుడై వున్నాడు.

దుష్ప్రాప్యం మానుషైః పుణ్యం ప్రయాగం తు యుధిష్ఠిర! ।
దేవదానవగన్ధర్వా ఋషయః సిద్ధచారణాః ।
తదుపస్పృశ్య రాజేంద్ర స్వర్గలోకముపాసతే ॥20॥

యుధిష్ఠిరా! పవిత్రమైన ప్రయాగక్షేత్రం మనుజులకు దుష్ప్రాప్యమైన పుణ్యం కల్గిస్తుంది. రాజేంద్రా! దేవతలు, దానవులు, గంధర్వులు, ఋషులు, సిద్ధులు, చారణులు దానిని ఆచమించి స్వర్గం చేరుకుంటారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యం నామ చతురధికశతతమోఽధ్యాయః. ॥ 104 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని ప్రయాగమాహాత్మ్యమనే నూటనాల్గవ అధ్యాయం సంపూర్ణం.

పంచోత్తరశతతమోఽధ్యాయః - నూటఅయిదవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ - ప్రయాగమాహాత్మ్యం

మార్కణ్డేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్! ప్రయాగస్య మాహాత్మ్యం పునరేవ తు ।
యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥1॥

రాజా! ప్రయాగక్షేత్ర మాహాత్మ్యం ఇంకా విను. దీన్ని వింటే సకలపాపాలనుండీ విముక్తుడవుతాడు, ఇందులో సందేహం లేదు.

ఆర్తానాం హి దరిద్రాణాం నిశ్చితవ్యవసాయినామ్ ।
స్థానముక్తం ప్రయాగం తు నాఖ్యేయం తు కదాచన ॥2॥

ఆర్తులు, దరిద్రులు, ఒక నిశ్చితకార్యరంగంలో ఉన్నవారు- వీరికి ప్రయాగ శ్రేష్ఠస్థానంగా పేర్కొనబడింది. ఈ సంగతి బహిరంగంగా ప్రకటించరాదు. (వీరికి మాత్రమే ప్రయాగ సేవింపదగినదని చెప్పరాదు?)

వ్యాధితో యది వా దీనో వృద్ధో వాఽపి భవేన్నరః ।
గంగాయమునయోర్మధ్యే యస్తు ప్రాణాన్పరిత్యజేత్ ॥3॥
దీప్తకాంచనవర్ణాభైర్విమానైః సూర్యసన్నిభైః ।
గన్ధర్వాప్సరసాం మధ్యే స్వర్గే క్రీడతి మానవః ।
ఈప్సితాన్ లభతే కామాన్వదన్తి ఋషిపుఙ్గవాః ॥4॥

వ్యాధిగ్రస్తుడు, దీనుడు, వృద్ధుడూ అయిన నరుడు ఒకవేళ గంగాయమునల మధ్య ప్రాణపరిత్యాగం చేస్తే ఉజ్జ్వలమైన స్వర్ణవర్ణం కల సూర్యసదృశమైన విమానంలో స్వర్గానికి పోయి గంధర్వులు, అచ్చరల మధ్య అక్కడ క్రీడిస్తాడు. అభీష్టకామాలను పొందుతాడు. ఈ విషయం ఋషిపుంగవులు చెప్పారు.

సర్వరత్నమయైర్దివ్యైర్నానాధ్వజసమాకులైః ।
వరాంగనాసమాకీర్ణైర్మోదతే శుభలక్షణైః ॥5॥

సకలరత్నమయాలు, దివ్యాలు, నానాధ్వజాలతో కూడినవీ, శ్రేష్ఠవనితలతో వ్యాప్తమైనవీ అయిన శుభలక్షణాలతో అక్కడ ఆనందిస్తాడు.

గీతవాద్యవినిర్ఘోషైః ప్రసుప్తః ప్రతిబుధ్యతే ।
యావన్న స్మరతే జన్మ తావత్స్వర్గే మహీయతే ॥6॥

అక్కడ నిద్రించినవాడు గీతవాద్యధ్వనులతో మేల్కొంటాడు. జన్మను స్మరించనంతవరకూ స్వర్గంలో ప్రతిష్ఠితుడై పూజింపబడతాడు.

తతః స్వర్గాత్పరిభ్రష్టః క్షీణకర్మా దివశ్చ్యుతః ।
హిరణ్యరత్నసంపూర్ణే సమృద్ధే జాయతే కులే ।
తదేవ స్మరతే తీర్థం స్మరణాత్తత్ర గచ్ఛతి ॥7॥

ఆపై క్షీణపుణ్యుడగువాడు స్వర్గభ్రష్టుడై స్వర్ణంతో, రత్నాలతో నిండిన సంపన్నమైన కులంలో జన్మిస్తాడు. కాలక్రమంలో ఆ తీర్థాన్నే స్మరించి అక్కడికే వెళ్తాడు.

దేశస్థో యది వాऽరణ్యే విదేశస్థోऽథవా గృహే ।
ప్రయాగం స్మరమాణోऽపి యస్తు ప్రాణాన్పరిత్యజేత్ ।
బ్రహ్మలోకమవాప్నోతి వదన్తి ఋషిపుంగవాః ॥8॥

స్వదేశంలో ఉన్నా, అడవిలో ఉన్నా, విదేశంలో ఉన్నా, ఇంటిలో ఉన్నా ప్రయాగను స్మరిస్తూ ప్రాణాలు వీడితే బ్రహ్మలోకానికి పోతాడని ఋషిపుంగవులు చెబుతున్నారు.

సర్వకామఫలా వృక్షా మహీ యత్ర హిరణ్మయీ ।
ఋషయో మునయః సిద్ధాస్తత్ర లోకే స గచ్ఛతి ॥9॥

వృక్షాలు ఎక్కడ సర్వకామాలూ ఫలిస్తాయో, భూమి స్వర్ణమయమో, ఋషులు, మునులు, సిద్ధులు నివసిస్తారో, ఆ లోకాని కతడు పోతాడు.

స్త్రీసహస్రావృతే రమ్యే మన్దాకిన్యాస్తటే శుభే ।
మోదతే ఋషిభిః సార్ధం సుకృతేనేహ కర్మణా ॥10॥

వేలకొలది నారీమణులు గల, మనోజ్ఞమైన శుభప్రదమైన గంగాతీరంలో అతడు ఋషులతో గూడా సుకృతం వల్ల ఆనందిస్తాడు.

సిద్ధచారణగన్ధర్వైః పూజ్యతే దివి దైవతైః ।
తతః స్వర్గాత్పరిభ్రష్టో జంబూద్వీపపతిర్భవేత్ ॥11॥

సిద్ధులు, చారణులు, గంధర్వులు, దేవతలు వీరిచే స్వర్గంలో పూజింపబడతాడు. ఆపై స్వర్గభ్రంశం పొంది జంబూద్వీపానికి అధిపతి అవుతాడు.

తతః శుభాని కర్మాణి చిన్తయానః పునః పునః ।
గుణవాన్విత్తసమ్పన్నో భవతీహ న సంశయః ॥12॥

ఆపై సత్కర్మలను మాటిమాటికి చింతిస్తూ గుణవంతుడై, ధనవంతుడై రాణిస్తాడు. ఇందులో సందేహంలేదు.

కర్మణా మనసా వాచా ధర్మసత్యప్రతిష్ఠితః ।
గంగాయమునయోర్మధ్యే యస్తు గాం సంప్రయచ్ఛతి ॥13॥

గంగా యమునల మధ్య గోదానం చేసేవాడు మనోవాక్కాయాలచేత (త్రికరణశుద్ధిగా) ధర్మంలో, సత్యంలో ప్రతిష్ఠితు డవుతాడు.

సువర్ణమణిముక్తాశ్చ యదివాఽన్యత్పరిగ్రహమ్ ।
స్వకార్యే పితృకార్యే వా దేవతాభ్యర్చనేఽపి వా ।
సఫలం తస్య తత్తీర్థం యథావత్పుణ్యమాప్నుయాత్ ॥14॥

తన కార్యంలో గానీ, పితృకార్యంలో గానీ, దేవతాపూజలో గానీ జరిగే కర్మకలాపం స్వర్ణం, మణులు, తదితర పరిగ్రహం ఆ తీర్థ ప్రభావంచేత సఫలమై పుణ్యప్రాప్తి కల్గిస్తుంది.

ఏవం తీర్థే న గృహ్ణీయాత్పుణ్యేష్వాయతనేషు చ ।
నిమిత్తేషు చ సర్వేషు హ్యప్రమత్తో భవేద్ ద్విజః ॥15॥

కాన తీర్థంలో, పుణ్యాలయాలలో, అన్ని నిమిత్తాలలోనూ ద్విజుడు దానపరిగ్రహంలో జాగరూకుడై వుండాలి. ప్రతిచోటా పరిగ్రహం తగదు. గ్రహించే పక్షంలో దానిని ప్రయాగగా భావించాలి.

కపిలాం పాటలావర్ణాం యస్తు ధేనుం ప్రయచ్ఛతి ।
స్వర్ణశృంగీం రౌప్యఖురాం కాంస్యదోహాం పయస్వినీమ్ ॥16॥

ప్రయాగే శ్రోత్రియం సన్తం గ్రాహయిత్వా యథావిధి ।
శుక్లాంబరధరం శాన్తం ధర్మజ్ఞం వేదపారగమ్ ॥17॥

సా గౌస్తస్మై ప్రదాతవ్యా గంగాయమునసంగమే ।
వాసాంసి చ మహార్హాణి రత్నాని వివిధాని చ ॥18॥

ఎవడు ప్రయాగలో శుక్లవస్త్రధారి,శాంతుడు, ధర్మవేత్త, వేదపారంగతుడూ అయిన శ్రోత్రియునికి కపిలమైన, లేక పాటలమైన వర్ణం కల్గి స్వర్ణశృంగాలతో, వెండి గిట్టలతో అలంకరించిన పాడి ఆవును కంచుపాత్రతో గూడా దానమిస్తాడో, వాడు గంగాయమునా సంగమంలో ఆ గోవును దానమివ్వాలి. దానితోపాటు విలువైన వస్త్రాలు, వివిధ రత్నాలు గూడా ఇవ్వాలి.

యావద్రోమాణి తస్యా గోః సన్తి గాత్రేషు సత్తమ ।
తావద్వర్షసహస్రాణి స్వర్గలోకే మహీయతే ॥19॥

రాజేంద్రా! ఆ గోవుకు అవయవాలపై ఎన్ని రోమాలున్నవో అన్ని వేల సంవత్సరాలు ఆ దాత స్వర్గంలో పూజింపబడతాడు.

యత్రాసౌ లభతే జన్మ సా గౌస్తస్యాభిజాయతే ।
న చ పశ్యతి తం ఘోరం నరకం తేన కర్మణా ।
ఉత్తరాన్ స కురూన్ ప్రాప్య మోదతే కాలమక్షయమ్ ॥20॥

అతడు జన్మించిన చోటనే ఆ గోవు జన్మిస్తుంది. ఆ సత్కర్మవల్ల అతడు ఘోరనరకం దర్శించడు. ఉత్తరకురుదేశాలు పొంది అక్కడ అక్షయకాలపర్యంతం సంతసిస్తాడు.

గవాం శతసహస్రేభ్యో దద్యాదేకాం పయస్వినీమ్ ।
పుత్రాన్దారాంస్తథా భృత్యాన్ గౌరేకా ప్రతితారయేత్ ॥21॥

లక్షగోవుల కన్నా ఒక్కపాడి యావునివ్వడం మేలు. అట్టి ఆవు పుత్రులనూ, భార్యలనూ, భృత్యులనూ తరింపజేస్తుంది.

తస్మాత్సర్వేషు దానేషు గోదానం తు విశిష్యతే ।
దుర్గమే విషమే ఘోరే మహాపాతకసమ్భవే ।
గౌరేవ రక్షాం కురుతే తస్మాద్దేయం ద్విజోత్తమే ॥22॥

కావున దానాలన్నింటిలోనూ గోదానం విశిష్టమైనది. దుర్గమం, విషమం, ఘోరం అయిన మహాపాతకం నుండి గోవే రక్షిస్తుంది. కాన ద్విజోత్తమునికి గోదానం చేయాలి.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యే పంచాధికశతతమోఽధ్యాయః ॥ 105 ॥

శ్రీమత్స్య పురాణంలోని ప్రయాగమాహాత్మ్యం అనే నూటఅయిదవ అధ్యాయం సంపూర్ణం.

షడుత్తరశతతమోఽధ్యాయః - నూటఆరవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ - ప్రయాగమాహాత్మ్యం

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

యథా యథా ప్రయాగస్య మాహాత్మ్యం కథ్యతే త్వయా ।
తథాతథా ప్రముచ్యేఽహం సర్వపాపైర్న సంశయః ॥1॥

నీవు ప్రయాగప్రభావాన్ని ఎంతెంతగా చెబుతున్నావో, అంతంతగా నేను సకల పాపాలనుండి విడుదల పొందుతున్నాను, సందేహం లేదు.

భగవన్! కేన విధినా కర్తవ్యో ధర్మనిశ్చయః ।
ప్రయాగే యో విధిః ప్రోక్తస్తన్మే బ్రూహి మహామునే! ॥2॥

భగవన్! ధర్మనిశ్చయం ఏ విధానంతో చేయాలి? ఆ క్షేత్రంలో విధి ఎట్టిది? మహామునీ! ఆ విధానం నాకు వివరించు.

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

కథయిష్యామి తే రాజంస్తీర్థయాత్రావిధిక్రమమ్ ।
ఆర్షేణ చైవ విధినా యథాదృష్టః యథాశ్రుతః ॥3॥

రాజా! నీకు తీర్థయాత్రావిధి క్రమం చెబుతాను. ఆర్ష విధి ననుసరించి నేను విన్నట్లు, చూచినట్లు వివరిస్తాను.

ప్రయాగతీర్థయాత్రార్థీ యః ప్రయాతి నరః క్వచిత్ ।
బలీవర్దసమారూఢః శృణు తస్యాపి యత్ఫలమ్ ॥4॥

ప్రయాగతీర్థానికి యాత్ర చేయదలచినవాడు ఎక్కడైనా ఎద్దుపై నెక్కి పోతే వాని కే ఫలం కల్గుతుందో విను.

నరకే వసతే ఘోరే గవాం క్రోశో హి దారుణః ।
సలిలం న చ గృహ్ణన్తి పితరస్తస్య దేహినః ॥5॥

గోవులకు కలిగే ఆక్రోశం దారుణమైనది. అలా గోవులను హింసించువాడు నరకంలో నివసిస్తాడు. అతడిచ్చిన జలాన్ని పితరులు స్వీకరించరు.

యస్తు పుత్రాంస్తథా బాలాన్స్నాపయేత్పాయయేత్తథా ।
యథాత్మనా తథా సర్వం దానం విప్రేషు దాపయేత్ ॥6॥

తన్ను, తనపుత్రులను, బాలురను స్నానపానాదులతో కాపాడినంత శ్రద్ధతో యాత్ర చేసి, స్నానమాడి విప్రులకు సర్వమూ దానం చేయాలి.

ఐశ్వర్యలోభమోహాద్వా గచ్ఛేద్యానేన యో నరః ।
నిష్ఫలం తస్య తత్సర్వం తస్మాద్యానం వివర్జయేత్ ॥7॥

ఐశ్వర్యమోహంతో గాని, లోభంతో గాని ఎవడు వాహనమెక్కి యాత్ర చేస్తాడో, వాడు చేసినదంతా నిష్ఫలమవుతుంది. కాన వాహనాన్ని వర్జించాలి.

గంగాయమునయోర్మధ్యే యస్తు కన్యాం ప్రయచ్ఛతి ।
ఆర్షేణైవ విధానేన యథావిభవసమ్భవమ్ ॥8॥

న స పశ్యతి తం ఘోరం నరకం తేన కర్మణా ।
ఉత్తరాన్స కురూన్గత్వా మోదతే కాలమక్షయమ్ ।
పుత్రాన్దారాంశ్చ లభతే ధార్మికాన్ రూపసంయుతాన్ ॥9॥

గంగా యమునలనదుమ ఎవదు కన్యాదానం ఆర్షవిధానంతో, తన విభవం కొద్దీ చేస్తాడో వాడు నరకాన్ని దర్శించదు. వాడు ఉత్తరకురు భూములకు వెళ్ళి అక్షయకాలం సుఖిస్తాడు. ధార్మికులూ, రూపవంతులూ అయిన పుత్రులను, భార్యను పొందుతాడు.

తత్ర దానం ప్రకర్తవ్యం యథావిభవసంభవమ్ ।
తేన తీర్థఫలం చైవ వర్ధతే నాత్ర సంశయః ।
స్వర్గే తిష్ఠతి రాజేంద్ర యావదాభూతసంప్లవమ్ ॥10॥

అక్కడ తన విభవంకొద్దీ దానం చేయాలి. దానిచే తీర్థయాత్రా ఫలం కూడా పెరుగుతుంది, సందేహం లేదు. రాజేంద్రా! అట్టివాడు భూతప్రళయ కాలంవరకూ స్వర్గంలో వుంటాడు.

వటమూలం సమాసాద్య యస్తు ప్రాణాన్విముంచతి ।
సర్వలోకానతిక్రమ్య రుద్రలోకం స గచ్ఛతి ॥11॥

అక్కడి వటవృక్షమూలానికి వెళ్ళి ప్రాణాలను త్యజించేవాడు సకలలోకాలూ దాటి రుద్రలోకం చేరుకొంటాడు.

తత్ర తే ద్వాదశాదిత్యాస్తపన్తే రుద్రసంశ్రితాః ।
నిర్దహన్తి జగత్సర్వం వటమూలం న దహ్యతే ॥12॥

అక్కడ ద్వాదశాదిత్యులు రుద్రసంశ్రితులై జగత్తునంతా దహిస్తారు. కాని వటమూలం దగ్ధం కాదు.

నష్టే చంద్రార్కపవనే యదా చైకార్ణవం జగత్ ।
స్వపతే తత్ర వై విష్ణుః పరమాత్మా పునః పునః ॥13॥

లోకంలో సూర్యచంద్రులు, వాయువు నశించి జగత్తు ఏకార్ణవమైన వేళ విష్ణు వక్కడ మాటిమాటికి నిద్రిస్తాడు.

దేవదానవగన్ధర్వా ఋషయః సిద్ధచారణాః ।
సదా సేవన్తి తత్తీర్థం గంగాయమునసంగమే ॥14॥

దేవతలు, దానవులు, గంధర్వులు, ఋషులు, సిద్ధులు, చారణులు, ఆ గంగాయమునాసంగమంలోని తీర్థాన్ని సదా సేవిస్తుంటారు.

తతో గచ్ఛేత్తు రాజేంద్ర ప్రయాగం సంస్తువంశ్చ యత్ ।
యత్ర బ్రహ్మాదయో దేవా ఋషయః సిద్ధచారణాః ॥15॥

లోకపాలాశ్చ సాధ్యాశ్చ పితరో లోకసమ్మతాః ।
సనత్కుమారప్రముఖాస్తథైవ పరమర్షయః ॥16॥

అంగిరః ప్రముఖాశ్చైవ తథా బ్రహ్మర్షయోఽపరే ।
యక్షా నాగాః సుపర్ణాశ్చ సిద్ధాశ్చక్రచరాశ్చ యే ॥17॥

సరితః సాగరాః శైలాస్తథా విద్యాధరాశ్చ యే ।
హరిశ్చ భగవానాస్తే ప్రజాపతిపురఃసరః ॥18॥

అందువల్ల రాజేంద్రా! ప్రయాగను స్తుతిస్తూ పోవాలి. అక్కడ బ్రహ్మాదిదేవతలు, ఋషులు, సిద్ధులు, చారణులు, లోకపాలురు, సాధ్యులు, పితరులు, లోక సమ్మతులైన సనత్కుమారప్రముఖులు, పరమర్షులు, అంగిరుడు మున్నగువారు, బ్రహ్మర్షులు, నాగులు, సుపర్ణులు, సిద్ధులు, చక్రచరులు, నదులు, సాగరాలు, కొండలు, నాగులు, విద్యాధరులు ఉన్నారు. ప్రజాపతి పురుస్సరుడైన శ్రీహరి కూడా ఉన్నాడు.

గంగాయమునయోర్మధ్యం పృథివ్యా జఘనం స్మృతమ్ ।
ప్రయాగం రాజశార్దూల! త్రిషు లోకేషు విశ్రుతమ్ ।
తతః పుణ్యతమం నాస్తి త్రిషు లోకేషు భారత! ॥19॥

గంగాయమునల మధ్యభాగం పృథ్వికి జఘనమని చెప్పబడింది. రాజేంద్రా! ప్రయాగ ముల్లోకాలలోను ప్రసిద్ధి పొందింది. భారతా! దాన్ని మించిన పుణ్యప్రదేశం త్రిలోకాలలో మరొకటి లేదు.

శ్రవణాత్ తస్య తీర్థస్య నామసఙ్కీర్తనాదపి ।
మృత్తికాలమ్భనాద్వాఽపి నరః పాపాత్ ప్రముచ్యతే ॥20॥

ఆ తీర్థాన్ని గూర్చి విన్నా, దాని నామాలను కీర్తించినా, అందలి మృత్తికను పూసికొన్నా, నరుడు పాపవిముక్తుడవుతాడు.

తత్రాభిషేకం యః కుర్యాత్ సంగమే శంసితవ్రతః ।
స తుల్యం ఫలమాప్నోతి రాజసూయాశ్వమేధయోః ॥21॥

ఆ సంగమంలో శంసితవ్రతుడై స్నానం చేసినవాడు రాజసూయం, అశ్వమేధం నిర్వహించినంత ఫలం పొందుతాడు.

న వేదవచనాత్ తాత! న లోకవచనాత్ తథా ।
మతిరుత్క్రమణే యాతి ప్రయాగగమనం ప్రతి ॥22॥

నాయనా! వేదవచనం వల్లగానీ, అట్లే లోకవచనం వల్లగానీ ఇలా చెప్పడం లేదు. ఇది అనుభవసిద్ధం. ప్రాణోత్క్రమణ కాలంలోనైనా ప్రయాగగమనసంకల్పం మేలు.

కోటితీర్థసహస్రాణి షష్టి కోట్యస్తథాఽపరాః ।
తేషాం సాన్నిధ్యమత్రైవ సతతం కురునన్దన! ॥23॥

కురునందనా! కోటి వేల తీర్థాలు, అరువదికోట్ల ఇతర తీర్థాలు అన్నీ ఈ ప్రయాగలోనే ఉన్నాయి.

యా గతిర్యోగయుక్తస్య సత్యస్థస్య మనీషిణః ।
సా గతిస్త్యజతః ప్రాణాన్ గంగాయమునసంగమే ॥24॥

యోగయుక్తుడు, సత్యనిష్ఠుడు పొందేగతినే గంగాయమునాసంగమంలో ప్రాణం వదలినవాడు గూడా పొందుతాడు.

న తే జీవన్తి లోకేఽస్మింస్తత్ర తత్ర యుధిష్ఠిర! ।
యే ప్రయాగం న సంప్రాప్తాస్త్రిషు లోకేషు విశ్రుతమ్ ॥25॥

యుధిష్ఠిరా! ముల్లోకాలలో ప్రసిద్ధమైన ప్రయాగను సేవించనివారు ఈ లోకంలో జీవించినవారు కారు.

ఏవం దృష్ట్వా తు తత్ తీర్థం ప్రయాగం పరమం పదమ్ ।
ముచ్యతే సర్వపాపేభ్యో శశాంక ఇవ రాహుణా ॥26॥

ఇలా ఆ పరమపదమైన ఆ ప్రయాగతీర్థాన్ని దర్శించి రాహువిముక్తుడైన చంద్రునివలె జనుడు సర్వపాపవిముక్తుడవుతాడు.

కంబలాశ్వతరౌ నాగౌ యమునాదక్షిణే తటే ।
తత్ర స్నాత్వా చ పీత్వా చ సర్వపాపైః ప్రముచ్యతే ॥27॥

విపులమైన యమునానదీ దక్షిణతీరంలో కంబలుడు, అశ్వతరుడు అనే ఇద్దరు నాగులు నివసిస్తారు. అక్కడ స్నానపానాలు చేసివాడు సకలపాపవిముక్తుడవుతాడు.

తత్ర గత్వా చ సంస్థానం మహాదేవస్య విశ్రుతమ్ ।
నరస్తారయతే సర్వాన్ దశ పూర్వాన్ దశాపరాన్ ॥28॥

ప్రయాగకు యాత్రచేసి మహాదేవుని విఖ్యాత సంస్థానానికి పోయినవాడు పది పూర్వతరాల వారినీ, పది తరువాతి తరాలవారినీ తరింపజేస్తాడు.

కృత్వాభిషేకం తు నరః సోఽశ్వమేధఫలం లభేత్ ।
స్వర్గలోకమవాప్నోతి యావదాభూతసంప్లవమ్ ॥29॥

అక్కడ స్నానమొనర్చినవాడు అశ్వమేధ ఫలం పొందుతాడు. ప్రళయకాలంవరకూ స్వర్గంలో నివసిస్తాడు.

పూర్వభాగే తు గంగాయాస్త్రిషు లోకేషు భారత ।
కూపం చైవ తు సాముద్రం ప్రతిష్ఠానం చ విశ్రుతమ్ ॥30॥

భారతా! గంగకు తూర్పున ముల్లోకాలలో ప్రసిద్ధమైన సముద్రకూపం, ప్రతిష్ఠాననగరం ఉన్నాయి.

బ్రహ్మచారీ జితక్రోధస్త్రిరాత్రం యది తిష్ఠతి ।
సర్వపాపవిశుద్ధాత్మా సోఽశ్వమేధఫలం లభేత్ ॥31॥

బ్రహ్మచారియై కోపాన్ని జయించినవాడు అక్కడ మూడు రాత్రులు నివసిస్తే సర్వపాపవిముక్తుడై అశ్వమేధఫలం పొందుతాడు.

ఉత్తరేణ ప్రతిష్ఠానాద్భాగీరథ్యాస్తు పూర్వతః ।
హంసప్రపతనం నామ తీర్థం త్రైలోక్యవిశ్రుతమ్ ॥32॥

ప్రతిష్ఠానానికి ఉత్తరాన, భాగీరథికి తూర్పున త్రిలోకప్రసిద్ధమగు హంసప్రపతనమనే తీర్థమున్నది.

అశ్వమేధఫలం తస్మిన్ స్నానమాత్రేణ భారత ।
యావచ్చంద్రశ్చ సూర్యశ్చ తావత్స్వర్గే మహీయతే ॥33॥

భారతా! అక్కడ స్నానం చేసినంతమాత్రాన అశ్వమేధఫలం కల్గుతుంది. సూర్యచంద్రు లున్నంతవరకూ అతడు స్వర్గంలో ఆదరింపబడతాడు.

ఊర్వశీపులినే రమ్యే విపులే హంసపాణ్డురే ।
పరిత్యజతి యః ప్రాణాన్ శృణు తస్యాపి యత్ఫలమ్ ॥34॥

రమ్యమైన ఊర్వశీపులినంలో మరియు విపులమైన హంసపాండురంలో ప్రాణాలు వదలినవానికి కలిగే ఫలమేమిటో విను.

షష్టిర్వర్షసహస్రాణి షష్టివర్షశతాని చ ।
వసతే పితృభిః సార్ధం సూర్యలోకే నరాధిప! ॥35॥

రాజా! అరువది ఆరువేల సంవత్సరాలు వాడు పితరులతో గూడ స్వర్గంలో సేవింపబడతాడు.

ఊర్వశీం తు సదా పశ్యేత్ దేవలోకే నరోత్తమ! ।
పూజ్యతే సతతం తత్ర ఋషిగన్ధర్వకిన్నరైః ॥36॥

రాజా! సదా వాడు స్వర్గంలో ఊర్వశిని చూస్తాడు. అక్కడ ఋషి గంధర్వకిన్నరు లతణ్ణి పూజిస్తారు.

తతః స్వర్గాత్పరిభ్రష్టః క్షీణకర్మా దివశ్చ్యుతః ।
ఊర్వశీసదృశీనాం తు కన్యానాం లభతే శతమ్ ॥37॥
గవామశ్వసహస్రాణాం మహాభోగపతిర్భవేత్ ।

ఆపై కర్మక్షయం కాగా స్వర్గభ్రష్టుడై ఊర్వశివంటి వందమంది కన్యలను పొందుతాడు. మరియు వేలకొలది గోవులు, గుఱ్ఱాలు కల్గి మహాభోగపతి అవుతాడు.

మధ్యే నారీసహస్రాణాం బహూనాం చ పతిర్భవేత్।
దశగ్రామసహస్రాణాం భోక్తా భవతి భూమిపః ॥38॥

అనేకనారీసహస్రాలమధ్యనుండి వారికి పతి అవుతాడు. పదివేల గ్రామాలకు అతడు పరిపాలకుడవుతాడు.

కాంచీనూపురశబ్దేన సుప్తోఽసౌ ప్రతిబుధ్యతే ।
భుక్త్వా తు విపులాన్ భోగాంస్తత్తీర్థం భజతే పునః ॥39॥

వాడు నిద్రనుండి కాంచీనూపురశబ్దాలతో మేలుకొంటాడు. విస్తృతభోగాలనుభవించి మరల ఆ తీర్థాన్ని సేవిస్తాడు.

శుక్లాంబరధరో నిత్యం నియతః సంయతేంద్రియః ।
ఏకం కాలం తు భుంజానో మాసం భూమిపతిర్భవేత్ ॥40॥

ప్రయాగను సేవించినవాడు తెల్లని వస్త్రాలు ధరించి నిత్యం ఇంద్రియనిగ్రహం కల్గి వ్రతతత్పరుడై ఒక్కనెల ఒకే పూట భుజిస్తే భూమిపతి అవుతాడు.

సువర్ణాలంకృతానాం తు నారీణాం లభతే శతమ్ ।
పృథివ్యామాసముద్రాయాం మహాభూమిపతిర్భవేత్ ॥41॥

సువర్ణభూషితలైన నూరుమంది వనితలను పొందుతాడు. సముద్రాంతమైన భూమికి మహారాజవుతాడు.

ధనధాన్యసమాయుక్తో దాతా భవతి నిత్యశః ।
భుక్త్వా తు విపులాన్ భోగాంస్తత్తీర్థం లభతే పునః ॥42॥

ధనధాన్యసమృద్ధి గలవాడై నిత్యమూ దాత అవుతాడు. విపుల భోగాలనుభవించి మరల ఆ తీర్థం సేవిస్తాడు.

అథ సన్ధ్యావటే రమ్యే బ్రహ్మచారీ జితేంద్రియః ।
ఉపాసీత శుచిః సన్ధ్యాం బ్రహ్మలోకమవాప్నుయాత్ ॥43॥

పిదప సంధ్యావటంలో బ్రహ్మచర్యం పాటిస్తూ జితేంద్రియుడై శుచియై సంధ్యోపాసన చేసినవాడు బ్రహ్మలోక ప్రాప్తి పొందుతాడు.

కోటితీర్థం సమాసాద్య యస్తు ప్రాణాన్పరిత్యజేత్ ।
కోటివర్షసహస్రాణాం స్వర్గలోకే మహీయతే ॥44॥

కోటి తీర్థానికి వెళ్ళి ప్రాణాలు వీడినవాడు వేయి కోట్ల సంవత్సరాలు స్వర్గంలో వుంటాడు.

తతః స్వర్గాత్పరిభ్రష్టః క్షీణకర్మా దివశ్చ్యుతః ।
సువర్ణమణిముక్తాఢ్యకులే జాయేత రూపవాన్ ॥45॥

ఆపై క్షీణకర్ముడై స్వర్గభ్రంశం పొంది స్వర్ణం, మణులు, ముత్యాలు, సమృద్ధిగా గల కులంలో సౌందర్యవంతుడై జన్మిస్తాడు.

తతో భోగవతీం గత్వా వాసుకేరుత్తరేణ తు ।
దశాశ్వమేధకం నామ తీర్థం తత్రాపరం భవేత్ ॥46॥

వాసుకిహ్రదానికి ఉత్తరాన భోగవతీతీర్థం ఉన్నది. దశాశ్వమేధమనే మరొక తీర్థం కూడా ఉన్నది.

కృతాభిషేకస్తు నరః సోఽశ్వమేధఫలం లభేత్ ।
ధనాఢ్యో రూపవాన్ దక్షో దాతా భవతి ధార్మికః ॥47॥

అక్కడ స్నాన మాచరించినవాడు అశ్వమేధఫలం పొందుతాడు. ధనాఢ్యుడు, రూపవంతుడు, సమర్థుడు, దాత, ధార్మికుడూ అవుతాడు.

చతుర్వేదేషు యత్పుణ్యం యత్పుణ్యం సత్యవాదిషు ।
అహింసాయాం తు యో ధర్మో గమనాదేవ తత్ఫలమ్ ॥48॥

నాల్గువేదాల అధ్యయనం వల్ల ఎంత పుణ్యమో, సత్యవాదుల కెంత పుణ్యమో, అహింసావ్రతంవల్ల ఎట్టి ధర్మమో, అదంతా ప్రయాగగమనం వల్ల సిద్ధిస్తుంది.

కురుక్షేత్రసమా గంగా యత్ర యత్రావగాహితా ।
కురుక్షేత్రాద్దశగుణా కళింద్యా యత్ర సంగతా ॥49॥

ఎక్కడెక్కడ స్నానం చేస్తామో, అక్కడంతా గంగ కురుక్షేత్రంతో సదృశమైనది. యమునతో కలిసినచోట అది కురుక్షేత్రం కంటే పదిరెట్లు గొప్పది.

యత్ర గంగా మహాభాగా బహుతీర్థా తపోధనా ।
సిద్ధిక్షేత్రం హి తత్ జ్ఞేయం నాత్ర కార్యా విచారణా ॥50॥

ఎక్కడ మహాభాగ, బహుతీర్థ, తపోధన అయిన గంగ ఉంటుందో, ఆ క్షేత్రం సిద్ధిక్షేత్రమని గ్రహించాలి. ఇందులో వేరే భావన తగదు.

క్షితౌ తారయతే మర్త్యాన్నాగాంస్తారయతేఽప్యధః।
దివి తారయతే దేవాంస్తేన త్రిపథగా స్మృతా ॥51॥

ఆ గంగ భూమిపై మానవులనూ, పాతాళంలో నాగులనూ, దేవలోకంలో దేవతలనూ తరింపజేస్తుంది. అందువల్లనే అది త్రిపథగ అని చెప్పబడింది.

యావదస్థీని గంగాయాం తిష్ఠన్తి హి శరీరిణః ।
తావద్వర్షసహస్రాణి స్వర్గలోకే మహీయతే ॥52॥

గంగలో శరీరి యొక్క ఎముకలున్నంతకాలం అన్ని వేల సంవత్సరాలు వాడు స్వర్గంలో ప్రతిష్ఠితుడవుతాడు.

తతః స్వర్గాత్పరిభ్రష్టో జంబూద్వీపపతిర్భవేత్ ।
తీర్థానాం తు పరం తీర్థం నదీనాం తు మహానదీ ।
మోక్షదా సర్వభూతానాం మహాపాతకినామపి ॥53॥

ఆపైన స్వర్గభ్రష్టుడై జంబూద్వీపానికి అధిపతి అవుతాడు. గంగ తీర్థాలలో పరమతీర్థం, నదుల్లో మహానది, మహాపాతకం చేసినా సర్వప్రాణులకూ మోక్షప్రదమైనది.

సర్వత్ర సులభా గంగా త్రిషు స్థానేషు దుర్లభా ।
గంగాద్వారే ప్రయాగే చ గంగాసాగరసంగమే ।
తత్ర స్నాత్వా దివం యాన్తి యే మృతాస్తేఽ పునర్భవాః ॥54॥

అన్నిచోట్ల సులభమైన గంగ మూడు చోట్ల మాత్రం దుర్లభయైనది. గంగాద్వారం, ప్రయాగ, గంగాసాగర సంగమం అనేవే ఆ మూడు ప్రదేశాలు. అక్కడ స్నానం చేసినవారు స్వర్గానికి పోతారు, అక్కడ మరణించినవారు జన్మరహితులవుతారు.

సర్వేషామేవ భూతానాం పాపోపహతచేతసామ్ ।
గతిమన్వేషమాణానాం నాస్తి గంగాసమా గతిః ॥55॥

పాపం చుట్టుకొన్న చిత్తం గల సకల ప్రాణులకూ, గతి నన్వేషించేవారికి గంగతో సమమైన గతి లేదు.

పవిత్రాణాం పవిత్రం చ మంగలానాం చ మఙ్గలమ్ ।
మహేశ్వరశిరోభ్రష్టా సర్వపాపహరా శుభా ॥56॥

పవిత్రాలలో పవిత్రమూ, మంగళాలలో మంగళమూ, మహేశుని శిరస్సునుండి జారినదీ అయిన గంగ సర్వపాప పరిహారిణి, శుభదాయిని అయినది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యం నామ షడధికశతతమోఽ ధ్యాయః ॥ 106 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ప్రయాగమాహాత్మ్యమనే నూటఆరవ అధ్యాయం సంపూర్ణం

సప్తోత్తరశతతమోఽధ్యాయః - నూటఏడవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ - ప్రయాగమాహాత్మ్యం

మార్కణ్డేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్ ప్రయాగస్య మాహాత్మ్యం పునరేవ తు ।
యచ్ఛ్రుత్వా సర్వపాపేభ్యో ముచ్యతే నాత్ర సంశయః ॥1॥

రాజా! ఇంకా ప్రయాగక్షేత్రమాహాత్మ్యం విను. దాన్ని వింటే సకల పాపాలనుండి విముక్తి కల్గుతుంది. ఇందులో సందేహం లేదు.

మానసం నామ తత్ తీర్థం గంగాయా ఉత్తరే తటే ।
త్రిరాత్రోపోషితః స్నాత్వా సర్వకామానవాప్నుయాత్ ॥2॥

గంగకు ఉత్తరతీరంలో మానసమనే తీర్థం ఉన్నది. అక్కడ మూడు రాత్రులు రాత్రి పూట ఉపవసించి స్నానం చేసి సర్వకామాలూ పొందుతాడు.

గోభూహిరణ్యదానేన యత్ఫలం ప్రాప్నుయాన్నరః ।
న తత్ఫలమవాప్నోతి తత్తీర్థం లభతే పునః ॥3॥

గోవులు, భూమి, స్వర్ణం - వీటిదానంచేత మానవుడు ఏ ఫలం పొందుతాడో, ఆ ఫలాన్ని అతడు పొందుతాడు. ఆ తీర్థాన్ని మరల సేవిస్తాడు.

అకామో వా సకామో వా గంగాయాం యోఽభిపద్యతే ।
మృతస్తు లభతే స్వర్గం నరకం చ న పశ్యతి ॥4॥

అకాముడు గానీ, సకాముడు గానీ ఎవడు గంగలో మునిగి మరణిస్తాడో, వాడు స్వర్గానికి పోతాడు, నరకం చూడడు.

అప్సరోగణసంగీతైః సుప్తోఽసౌ ప్రతిబుధ్యతే ।
హంససారసయుక్తేన విమానేన స గచ్ఛతి ।
బహువర్షసహస్రాణి స్వర్గం రాజేంద్ర భుంజతే ॥5॥

వాడు అచ్చరల సంగీతాలతో నిద్రనుండి మేల్కొంటాడు. హంసలూ, సారసాలూ గల విమానంలో ప్రయాణిస్తాడు. రాజేంద్రా! అతడనేక సహస్ర సంవత్సరాలు స్వర్గాన్ని అనుభవిస్తాడు.

తతః స్వర్గాత్పరిభ్రష్టః క్షీణకర్మా దివశ్చ్యుతః ।
సువర్ణమణిముక్తాఢ్యే జాయతే మహితే కులే ॥6॥

ఆపై కర్మ క్షయించి స్వర్గంనుండి జారిపడి స్వర్ణం, మణులు, ముత్యాలతో సంపన్నమైన శ్రేష్ఠకులంలో జన్మిస్తాడు.

షష్టితీర్థసహస్రాణి షష్టికోట్యస్తథాపగాః ।
మాఘమాసే గమిష్యన్తి గంగాయమునసంగమమ్ ॥7॥

అరువదివేల తీర్థాలూ, అరువది కోట్లనదులూ మాఘమాసంలో గంగాయమునా సంగమంలో సంగమిస్తాయి.

గవాం శతసహస్రస్య సమ్యగ్దత్తస్య యత్ఫలమ్ ।
ప్రయాగే మాఘమాసే తు త్ర్యహస్నానాత్తు తత్ఫలమ్ ॥8॥

విధివిధానంతో లక్ష గోవులనిస్తే ఏ ఫలమో, ఆ ఫలం ప్రయాగలో, మాఘంలో మూడు రోజులు స్నానం చేస్తే కల్గుతుంది.

గంగాయమునయోర్మధ్యే కాష్ఠాగ్నిం యస్తు సాధయేత్ ।
అహీనాంగో హ్యరోగశ్చ పంచేంద్రియసమన్వితః ॥9॥

గంగాయమునల మధ్య అరణి మథనముచే కలిగిన కాష్ఠాగ్నిని సాధించి తపస్సు చేసినవాడు. అంగలోపం లేకుండా రోగరహితుడై చక్కని పంచేంద్రియాలు గల్గి వుంటాడు.

యావన్తి రోమకూపాణి తస్య గాత్రేషు దేహినః ।
తావద్వర్షసహస్రాణి స్వర్గలోకే మహీయతే ॥10॥

ఆ దేహికి అవయవాలలో ఎన్ని రోమ కూపాలున్నాయో, అన్నివేల సంవత్సరాలు అతడు స్వర్గంలో వుంటాడు.

తతః స్వర్గాత్ పరిభ్రష్టో జంబూద్వీపపతిర్భవేత్ ।
స భుక్త్వా విపులాన్ భోగాంస్తత్తీర్థం లభతే పునః ॥11॥

ఆపై స్వర్గభ్రష్టుడై జంబూద్వీపానికి పాలకు డవుతాడు. విస్తృత భోగా లనుభవించి మళ్ళీ ఆ తీర్థాన్నే పొందుతాడు.

జలప్రవేశం యః కుర్యాత్ సంగమే లోకవిశ్రుతే ।
రాహుగ్రస్తో యథా సోమో విముక్తః సర్వకిల్బిషైః ॥12॥

లోకప్రసిద్ధమైన గంగాయమునా సంగమంలో ఎవడు జలప్రవేశం చేస్తాడో, వాడు రాహుగ్రస్తుడైన చంద్రునిలాగా సర్వపాపవిముక్తుడవుతాడు.

సోమలోకమవాప్నోతి సోమేన సహ మోదతే ।
షష్టివర్షసహస్రాణి స్వర్గలోకే మహీయతే ॥13॥

ఆ పై సోమలోకానికి పోయి చంద్రునితో గూడి సుఖిస్తాడు. రాజేంద్రా! అరువది వేల వత్సరాలు స్వర్గంలో పూజింపబడతాడు.

స్వర్గే చ శక్రలోకేఽస్మిన్నృషిగన్ధర్వసేవితే ।
పరిభ్రష్టస్తు రాజేంద్ర! సమృద్ధే జాయతే కులే ॥14॥

రాజేంద్రా! ఋషులూ, గంధర్వులూ సేవించిన శక్రలోకమైన స్వర్గంలో ఉండి పిదప పరిభ్రష్టుడై సమృద్ధమైన కులంలో జన్మిస్తాడు.

అధఃశిరాస్తు యో జ్వాలామూర్ధ్వపాదః పిబేన్నరః ।
శతవర్షసహస్రాణి స్వర్గలోకే మహీయతే ॥15॥

ఎవడు శిరస్సు క్రిందికీ, కాళ్ళు పైకీ పెట్టి అగ్నిజ్వాలను త్రాగునో, అతడు ఒక లక్షసంవత్సరాలు స్వర్గంలో సుఖిస్తాడు.

పరిభ్రష్టస్తు రాజేంద్ర సోஉగ్నిహోత్రీ భవేన్నరః ।
భుక్త్వా తు విపులాన్ భోగాంస్తత్తీర్థం భజతే పునః ॥16॥

రాజవర్యా! అక్కడనుండి భ్రష్టుడై అతడు అగ్నిహోత్రి అవుతాడు. విపులభోగా లనుభవించి మళ్ళీ ఆ తీర్థాన్ని సేవిస్తాడు.

యః స్వదేహం తు కర్తిత్వా శకునిభ్యః ప్రయచ్ఛతి ।
విహగైరుపభుక్తస్య శృణు తస్యాపి యత్ఫలమ్ ॥17॥

తన శరీరాన్ని ఖండించి పక్షులకు వేసి పక్షులచే తినబడే వానికేఫలమో చెబుతాను, విను.

శతం వర్షసహస్రాణాం సోమలోకే మహీయతే ।
తస్మాదపి పరిభ్రష్టో రాజా భవతి ధార్మికః ॥18॥

వాడు ఒక లక్ష సంవత్సరాలు చంద్రలోకంలో సుఖిస్తాడు. అటనుండి పరిభ్రష్టుడై ధార్మికుడైన రాజవుతాడు.

గుణవాన్ రూపసమ్పన్నో విద్వాంశ్చ ప్రియవాచకః ।
భుక్త్వా తు విపులాన్భోగాంస్తత్తీర్థం భజతే పునః ॥19॥

గుణవంతుడు, సుందరుడు, విద్వాంసుడు, ప్రియంగా భాషించేవాడుగా ఉండి విపులభోగా లనుభవించి మళ్ళీ ఆ తీర్థం సేవిస్తాడు.

యామునే చోత్తరే కూలే ప్రయాగస్య తు దక్షిణే ।
ఋణప్రమోచనం నామ తత్తీర్థం పరమం స్మృతమ్ ॥20॥

యమునానదికి ఉత్తరతీరంలో ప్రయాగకు దక్షిణాన ఋణప్రమోచనమనే తీర్థం చాలా శ్రేష్ఠమైనదిగా పేర్కొనబడింది.

ఏకరాత్రోషితః స్నాత్వా ఋణైః సర్వైః ప్రముచ్యతే ।
స్వర్గలోకమవాప్నోతి హ్యనృణీ చ సదా భవేత్ ॥21॥

అక్కడ స్నానం చేసి ఒకరాత్రి ఉపవసిస్తే సర్వఋణవిముక్తుడవుతాడు. ఆపై స్వర్గానికి పోతాడు. సదా ఋణరహితుడై వుంటాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యం నామ సప్తోత్తరశతతమోஉధ్యాయః. ॥ 107 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ప్రయాగమాహాత్మ్యమనే నూటఏడవ అధ్యాయం సంపూర్ణం.

అష్టోత్తరశతతమోఽధ్యాయః – నూటఎనిమిదవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ – ప్రయాగమాహాత్మ్యం

యుధిష్ఠిర ఉవాచ :– యుధిష్ఠిరుడు చెప్పాడు.

ఏతచ్ఛ్రుత్వా ప్రయాగస్య యత్త్వయా పరికీర్తితమ్ ।
విశుద్ధం మేఽద్య హృదయం ప్రయాగస్య తు కీర్తనాత్ ॥1॥

మునీంద్రా! మీరు చెప్పిన ప్రయాగక్షేత్రప్రభావం విని ప్రయాగకీర్తనం చేయడంతో నా హృదయం విశుద్ధ మయింది.

అనాశకఫలం బ్రూహి భగవంస్తత్ర కీదృశమ్ ।
యం చ లోకమవాప్నోతి విశుద్ధః సర్వకిల్బిషైః ॥2॥

భగవన్! ఆ తీర్థ సేవనం వల్ల కలిగే ఎప్పుడూ నశించనిఫలం (ఉపవాసంవల్ల పాటించటం వల్ల కలిగే ఫలం) ఎలాంటిందో చెప్పండి. ఆ తీర్థసేవి సకల పాపవిముక్తుడై ఏలోకం చేరుకొంటాడో వివరించండి.

మార్కణ్డేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్! ప్రయాగే తు అనాశకఫలం విభో ।
ప్రాప్నోతి పురుషో ధీమాన్ శ్రద్దధానో జితేంద్రియః ॥3॥

అహీనాంగోఽప్యరోగశ్చ పంచేంద్రియసమన్వితః ।
అశ్వమేధఫలం తస్య గచ్ఛతస్తు పదే పదే ॥4॥

కులాని తారయేద్రాజన్ దశ పూర్వాన్ దశాపరాన్ ।
ముచ్యతే సర్వపాపేభ్యో గచ్ఛేత్తు పరమం పదమ్ ॥5॥

ప్రభూ! రాజా! ప్రయాగలో అనాశకఫలం ఎట్టిదో విను. ధీమంతుడైనవాడు శ్రద్ధగలిగి జితేంద్రియుడై, అవయవలోపరహితుడై, రోగరహితుడై, లోపం లేని ఇంద్రియాలు గల్గి ఉంటాడు. అట్టివాని కడుగడుగునా అశ్వమేధఫలం సిద్ధిస్తుంది. రాజా! అతడు పది పూర్వకులాలనూ, పది ఉత్తరకులాలనూ తరింపజేస్తాడు. సకల పాపముక్తు డవుతాడు. కడకు పరమపదం పొందుతాడు.

యుధిష్ఠిర ఉవాచ :– యుధిష్ఠిరుడు చెప్పాడు.

మహాభాగ్యం హి ధర్మస్య యత్త్వం వదసి మే ప్రభో! ।
అల్పేనైవ ప్రయత్నేన బహూన్ధర్మానవాప్నుతే ॥6॥

ప్రభూ! మీరు చెబుతున్న ఈ ధర్మం మహాభాగ్యం కలది కదా! అల్పప్రయత్నంతోనే అనేక ధర్మాలను పొందవచ్చు.

అశ్వమేధైస్తు బహుభిః ప్రాప్యతే ప్రాకృతైరపి ।
ఇమం మే సంశయం ఛిన్ధి పరం కౌతూహలం హి మే ॥7॥

అనేకాశ్వమేధాలవల్ల, పొందబడునది ప్రాకృత జనులకు ఎలా సాధ్యమైతున్నది? ఏ విధంగా సాధ్యమౌవుతున్నది? ఈ నా సంశయం తొలగించండి! ఇది తెలుసుకోవాలని నాకెంతో కుతూహలంగా వున్నది.

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్మహావీర యదుక్తం బ్రహ్మయోనినా ।
ఋషీణాం సన్నిధౌ పూర్వం కథ్యమానం మయా శ్రుతమ్ ॥8॥

రాజా! మహావీరా! పూర్వం బ్రహ్మయోని చెప్పిన వృత్తాంతం విను. ఋషుల సన్నిధిలో చెబుతుండగా నేను విన్నాను.

పంచయోజనవిస్తీర్ణం ప్రయాగస్య తు మణ్డలమ్ ।
ప్రవిష్టమాత్రే తద్భూమావశ్వమేధః పదే పదే ॥9॥

ప్రయాగక్షేత్ర మండలం ఐదుయోజనాల విస్తీర్ణం కలది. అందులో ప్రవేశించినమాత్రాన అడుగడుగునా అశ్వమేధ నిర్వహణఫలం లభిస్తుంది.

వ్యతీతాన్పురుషాన్ సప్త భవిష్యాంశ్చ చతుర్దశ ।
నరస్తారయతే సర్వాన్యస్తు ప్రాణాన్పరిత్యజేత్ ॥10॥

ఏవం జ్ఞాత్వా తు రాజేంద్ర సదా శ్రద్ధాపరో భవ ।
అశ్రద్దధానాః పురుషాః పాపోపహతచేతసః ।
న ప్రాప్నువన్తి తత్స్థానం ప్రయాగం దేవరక్షితమ్ ॥11॥

గడచిన ఏడు తరాలవారినీ, రానున్న పదునాల్గు తరాలవారినీ అందరినీ అక్కడ ప్రాణాలు వీడినవాడు తరింపజేస్తాడు. రాజేంద్రా! ఇలా ఇది గ్రహించి సర్వదా శ్రద్ధపరుడవు కమ్ము. శ్రద్ధలేనివారు, పాపాత్ములైన జనులు ఆ స్థానం పొందలేరు. ప్రయాగక్షేత్రం దేవతలచే రక్షింపబడినది.

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

స్నేహాద్వా ద్రవ్యలోభాద్వా యే తు కామవశం గతాః ।
కథం తీర్థఫలం తేషాం కథం పుణ్యఫలం భవేత్ ॥12॥

స్నేహం వల్లగానీ, ద్రవ్యలోభం వల్లగానీ ఎవరు కామానికి వశులవుతారో, అట్టివారు యాత్ర చేస్తే, వారికి తీర్థఫలం, పుణ్యఫలం ఎలా కల్గుతుంది?

విక్రేతుః సర్వభాణ్డానాం కార్యాకార్యమజానతః ।
ప్రయాగే కా గతిస్తస్య తన్మే బ్రూహి పితామహ! ॥13॥

కార్యాకార్యాలు తెలియకుండా సకలద్రవ్యాల అమ్మకం చేసేవానికి ప్రయాగలో గతి ఏమి? పితామహా! అది నాకు చెప్పండి!

మార్కండేయ ఉవాచ:- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్మహాగుహ్యం సర్వపాపప్రణాశనమ్ ।
మాసమేకం తు యః స్నాయాత్ప్రయాగే నియతేంద్రియః ।
ముచ్యతే సర్వపాపేభ్యః స గచ్ఛేత్పరమం పదమ్ ॥14॥

రాజా! మహారహస్యమూ, సకలపాపనాశకమూ అయిన దీన్ని విను. ప్రయాగలో ఒక నెల నిగ్రహింపబడిన ఇంద్రియాలతో స్నానం చేసేవాడు సర్వపాపవిముక్తు డవుతాడు. అతడు పరమపదం పొందుతాడు.

విస్రంభపాతకానాం తు ప్రయాగే శృణు యత్ఫలమ్ ।
త్రికాలమేవ స్నాయీత ఆహారం భైక్ష్యమాచరేత్ ।
త్రిభిర్మాసైః ప్రముచ్యేత ప్రయాగే తు న సంశయః ॥15॥

రహస్యంగా ఇతరులను నమ్మించి పాపం చేసేవానికి ప్రయాగలో కలిగే ఫలం విను. వాడు ముప్పూటలా స్నానం చేస్తూ భిక్షాహారం గ్రహించాలి. మూడు నెలల్లో వాడు ప్రయాగలో విముక్తు డవుతాడు. సంశయం లేదు.

అజ్ఞానేన తు యస్యేహ తీర్థయాత్రాదికం భవేత్ ।
సర్వకామసమృద్ధే తు స్వర్గలోకే మహీయతే ।
స్థానం చ లభతే నిత్యం ధనధాన్యసమాకులమ్ ॥16॥

తీర్థమహిమ తెలియకనే ఎవడు తీర్థయాత్ర చేస్తాడో, వాడు సర్వకామసంపన్నమైన స్వర్గంలో ఆదరింపబడతాడు. ధనధాన్యసమృద్ధి గల స్థానం పొందుతాడు.

ఏవం జ్ఞానేన సంపూర్ణః సదా భవతి భోగవాన్ ।
తారితాః పితరస్తేన నరకాత్ప్రపితామహాః ॥17॥

ఇట్లే తీర్థయాత్ర మహిమ కలదన్న జ్ఞానంతో యాత్ర చేస్తే సంపూర్ణత పొంది సదా భోగవంతుడవుతాడు. అతడు నరకం నుండి ప్రపితామహులను తరింపజేస్తాడు.

ధర్మానుసారిన్! తత్త్వజ్ఞ! పృచ్ఛతస్తే పునః పునః॥
త్వత్ప్రియార్థం సమాఖ్యాతం గుహ్యమేతత్సనాతనమ్ ॥18॥

ధర్మానుసారివగు తత్త్వజ్ఞా! నీవు మాటిమాటికి అడుగగా నీప్రీతికై ఈ గుహ్యమైన సనాతనతత్త్వం నీకుచెప్పాను.

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

అద్య మే సఫలం జన్మ అద్య మే తారితం కులమ్ ।
ప్రీతోఽస్మ్యనుగృహీతోఽస్మి దర్శనాదేవ తే మునే! ॥19॥

మునీ! నేడు నాజన్మ సఫలమయింది. నాకులం తరించింది. నీ దర్శనంతో నేను సంప్రీతుడనై అనుగ్రహింపబడ్డాను.

త్వద్దర్శనాత్తు ధర్మాత్మన్ ముక్తోఽహం చాద్య కిల్బిషాత్ ।
ఇదానీం వేద్మి చాత్మానం భగవన్ గతకల్మషమ్ ॥20॥

ధర్మాత్మా! నీ దర్శనంవల్ల నేను నేడు కిల్బిషం నుండి ముక్తుడ నయ్యాను. ఇప్పుడు నేను నన్ను గతకల్మషుణ్ణిగా తెలుసుకొన్నాను.

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

దిష్ట్యా తే సఫలం జన్మ దిష్ట్యా తే తారితం కులమ్ ।
కీర్తనాద్వర్ధతే పుణ్యం శ్రుతాత్పాపప్రణాశనమ్ ॥21॥

అదృష్టవశాన నీజన్మ సఫల మయింది. నీకులం తరించింది. దీన్ని కీర్తిస్తే పుణ్యం పెరుగుతుంది. వింటే పాపం నశిస్తుంది.

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

స్నానేన యమునాయాం తు కిం ఫలం వై మహామునే! ।
ఏతన్మే సర్వమాఖ్యాహి యథాదృష్టం యథాశ్రుతమ్ ॥22॥

మహామునీ! యమునానదిలో స్నానం చేస్తే ఎట్టి పుణ్యం, ఏమి ఫలం కల్గుతుంది? మీరు చూచినట్లు, విన్నట్లుగా ఇది నాకు వివరించండి!

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

తపనస్య సుతా దేవీ త్రిషు లోకేషు విశ్రుతా ।
సమాఖ్యాతా మహాభాగా యమునా తత్ర నిమ్నగా ॥23॥
యేనైవ నిఃసృతా గంగా తేనైవ యమునా గతా ।
యోజనానాం సహస్రేణ కీర్తనాత్ పాపనాశినీ ॥24॥

సూర్యుని పుత్రిక, ముల్లోకాలలో ప్రసిద్ధమైననది, మహాభాగ, యమునాదేవి. గంగ వచ్చిన చోటినుండే యమున గూడా వెలువడింది. వెయ్యి యోజనాల దూరం నుండి కీర్తించినా ఆ దేవి పాపాలను నశింపజేస్తుంది.

తత్ర స్నాత్వా చ పీత్వా చ యమునాయాం యుధిష్ఠిర ।
కీర్తనాల్లభతే పుణ్యం దృష్ట్వా భద్రాణి పశ్యతి ॥25॥

యుధిష్ఠిరా! అక్కడ స్నానపానాలు చేసి కీర్తిస్తే పుణ్యప్రాప్తి కల్గుతుంది. దర్శిస్తే శుభాలు సిద్ధిస్తాయి.

అవగాహ్య చ పీత్వా చ పునాత్యాసప్తమం కులమ్ ।
తస్యాం స్నానఫలాదేవ స యాతి పరమాం గతిమ్ ॥26॥

ఆ జలంలో స్నానపానాలు చేస్తే యేడు తరాలవరకూ కులం పవిత్రమవుతుంది. అక్కడ చేసిన స్నానఫలంతో పరమగతి పొందుతాడు.

అగ్నితీర్థమితి ఖ్యాతం యమునాదక్షిణే తటే ।
పశ్చిమే ధర్మరాజస్య తీర్థం తు నరకం స్మృతమ్ ॥27॥

యమునకు దక్షిణాన అగ్ని తీర్థం, పశ్చిమాన నరకమనే ధర్మరాజ తీర్థం ఉన్నాయి.

తత్ర స్నాత్వా దివం యాన్తి యే మృతాస్తేఽపునర్భవాః ।
ఏవం తీర్థసహస్రాణి యమునాదక్షిణే తటే ॥28॥

అక్కడ స్నానం చేసినవారు స్వర్గానికి పోతారు. మరణిస్తే మళ్ళీ జన్మించరు. ఇలా యమునాదక్షిణతీరంలో వేలకొలది తీర్థాలున్నాయి.

ఉత్తరేణ ప్రవక్ష్యామి ఆదిత్యస్య మహాత్మనః ।
తీర్థం నిరంజనం నామ యత్ర దేవాః సవాసవాః ॥29॥

ఉపాసతే సదా సన్ధ్యాం నిత్యం కాలే యుధిష్ఠిర! ।
దేవాః సేవన్తి తత్ తీర్థం యే చాన్యే విబుధా జనాః ॥30॥

ఇప్పుడు ఉత్తరదిశలో గల తీర్థాలను వివరిస్తాను. ఆదిత్యతీర్థం నిరంజనతీర్థంగా ప్రశస్తం. అక్కడ ఇంద్రాది దేవతలు నిత్యం సంధ్యోపాసన చేస్తారు. దేవత లాతీర్థాన్ని సేవిస్తారు. ధర్మజా! ఇతర విబుధులు గూడా సేవిస్తారు.

సదా దానపరో భూత్వా కురు తీర్థాభిషేచనమ్ ।
అన్యే చ బహవస్తీర్థాః సర్వపాపహరాః స్మృతాః ।
తేషు స్నాత్వా దివం యాన్తి యే మృతాస్తేఽపునర్భవాః ॥31॥

సదా దానపరుడవై అభిషేచనం అనుష్ఠించు. అక్కడ ఇంకా పలుతీర్థాలు పాపవినాశకాలు ఉన్నాయి. అక్కడ స్నానం చేసేవారు స్వర్గానికి పోతారు, మరణిస్తే మరుజన్మ లేదు.

గంగా చ యమునా చైవ ఉభే తుల్యఫలే స్మృతే ।
కేవలం జ్యేష్ఠభావేన గంగా సర్వత్ర పూజ్యతే ॥32॥

గంగాయమునలు రెండూ సమానఫలం కలవే. జ్యేష్ఠ ప్రభావం వల్ల గంగ సర్వత్రా పూజింపబడుతున్నది.

ఏవం కురుష్వ కౌన్తేయ! సర్వతీర్థాభిషేచనమ్ ।
యావజ్జీవకృతం పాపం తత్క్షణాదేవ నశ్యతి ॥33॥

కుంతీకుమారా! ఇలా సర్వతీర్థాలలో స్నానమాచరించు. జీవించినంత వరకూ చేసిన పాపమంతా వెనువెంటనే నశిస్తుంది.

య ఇదం కల్య ఉత్థాయ పఠతే చ శృణోతి చ ।
ముచ్యతే సర్వపాపేభ్యః స్వర్గలోకం స గచ్ఛతి ॥34॥

ఎవడు దీన్ని ఉదయాన లేచి చదువుతాడో, వింటాడో, వాడు సకల పాపవిముక్తు డవుతాడు. స్వర్గలోకం చేరుకొంటాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యం నామ అష్టోత్తరశతతమోఽధ్యాయః ॥ 108 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని ప్రయాగ మాహాత్మ్యమనే నూటఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

నవోత్తరశతతమోఽధ్యాయః – నూటతొమ్మిదవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ – ప్రయాగమాహాత్మ్యం

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు చెప్పాడు.

శ్రుతం హి బ్రహ్మణా ప్రోక్తం పురాణం పుణ్యకీర్తనమ్ ।
తీర్థానాం తు సహస్రాణి శతాని నియుతాని చ ।।
సర్వే పుణ్యాః పవిత్రాశ్చ గతిశ్చ పరమా స్మృతా ।।1।।

బ్రహ్మ చెప్పిన పురాణవాఙ్మయంలోని తీర్థ ప్రభావం నేను విన్నాను. తీర్థాలు వందలు, వేలు, లక్షలు ఉన్నాయి. అన్నీ పవిత్రాలే, అన్నీ పుణ్యాలే. అవి పరమగతిగా నిర్దిష్టాలై వున్నాయి.

సోమతీర్థం మహాపుణ్యం మహాపాతకనాశనమ్ ।
స్నానమాత్రేణ రాజేంద్ర! పురుషాంస్తారయేచ్ఛతమ్ ।
తస్మాత్సర్వప్రయత్నేన తత్ర స్నానం సమాచరేత్ ।।2।।

సోమతీర్థం మహాపుణ్యప్రదం, మహాపాపాలను నశింపజేయునది. రాజవర్యా! అది స్నానమాత్రంతో నూరు తరాలవారిని తరింపజేస్తుంది. అంచేత అన్ని విధాలా ప్రయత్నంతో అక్కడ స్నానం చేయాలి.

యుధిష్ఠిర ఉవాచ :– యుధిష్ఠిరుడు.

పృథివ్యాం నైమిషం పుణ్యమన్తరక్షే చ పుష్కరమ్ ।
త్రయాణామపి లోకానాం కురుక్షేత్రం విశిష్యతే ।।3।।

భూవలయంలో నైమిశం పుణ్యమైనది. పుష్కరం అంతరిక్షంలో పుణ్యమైనది. ముల్లోకాలలోనూ కురుక్షేత్రం విశిష్టమైనది.

సర్వాణి తాని సన్త్యజ్య కథమేకం ప్రశంససి ।
అప్రమాణం తు తత్రోక్తమశ్రద్ధేయమనుత్తమమ్ ।।4।।

అవన్నీ వదలి నీవు ఒక్క ప్రయాగనే ఎందుకు ప్రశంసిస్తున్నావు? ఇది నాకు విశ్వసనీయంగా, ప్రమాణంగా, మహోత్తమంగా తోచడం లేదు.

గతిం చ పరమాం దివ్యాం భోగాంశ్చైవ యథేప్సితాన్ ।
కిమర్థమల్పయోగేన బహుధర్మాన్ ప్రశంససి ।
ఏతన్మే సంశయం బ్రూహి యథాదృష్టం యథాశ్రుతమ్ ।।5।।

పరమగతి, ఇష్టభోగాలు ఇక్కడ కల్గుతాయంటున్నావు. అల్పయోగంతో ఎక్కువ పుణ్యప్రాప్తినెందుకు ప్రశంసిస్తున్నావు? ఈ విషయం విన్నట్లు, కన్నట్లు నాకు చెప్పి నా సంశయం తీర్చండి.

మార్కండేయ ఉవాచ :– మార్కండేయుడు.

అశ్రద్ధేయం న వక్తవ్యం ప్రత్యక్షమపి యద్భవేత్ ।
నరస్యాశ్రద్దధానస్య పాపోపహతచేతసః ॥6॥

శ్రద్ధార్హం కాని దాన్ని శ్రద్ధలేనివానికి పాపోహతమైన చిత్తం కలవానికి ప్రత్యక్షమైనదైనా చెప్పరాదు.

అశ్రద్దధానో హ్యశుచిర్దుర్మతిస్త్యక్తమంగలః ।
ఏతే పాతకినః సర్వే తేనేదం భాషితం త్వయా ॥7॥

శ్రద్ధారహితుడు, అశుచి, దుర్బుద్ధి, మంగళకార్యాలు వదలినవాడు– వీరందరూ పాపాత్ములు– అందువల్ల నేనిలా చెప్పాను.

శృణు ప్రయాగమాహాత్మ్యం యథాదృష్టం యథాశ్రుతమ్ ।
ప్రత్యక్షం చ పరోక్షం చ యథా తథ్యం భవిష్యతి ॥8॥

నేను విన్నట్లు–కన్నట్లు ప్రత్యక్షమెనదీ, పరోక్షమైనదీ ఉన్నది ఉన్నట్లు ప్రయాగ మాహాత్మ్యాన్ని చెబుతాను,విను.

యథైవాన్యదదృష్టం చ యథాదృష్టం యథాశ్రుతమ్ ।
శాస్త్రం ప్రమాణం కృత్వా చ యుజ్యతే యోగమాత్మనా ॥9॥

శాస్త్రమును ప్రమాణంగా చేసుకొని, చిత్తాన్ని యోగంలో నిల్పినవానికి పరోక్షం కూడా ప్రత్యక్షమవుతుంది. యోగికి అదృష్టమైన దేదీ లేదు.

క్లిశ్యతే చాపరస్తత్ర నైవ యోగమవాప్నుయాత్ ।
జన్మాన్తరసహస్రేభ్యో యోగో లభ్యేత మానవైః ॥10॥

ఇతరుడు ఆ విషయం తెలుసుకోవడానికి ఎంతో శ్రమపడతాడు. వాడు యోగం పొందలేడు. వేలకొలది జన్మాంతరాలచేత మాత్రమే మానవులు యోగం పొందగలరు.

యథా యోగసహస్రేణ యోగో లభ్యేత మానవైః ।
యస్తు సర్వాణి రత్నాని బ్రాహ్మణేభ్యః ప్రయచ్ఛతి ॥11॥

తేన దానేన దత్తేన యోగం నాభ్యేతి మానవః ।
ప్రయాగే తు మృతస్యేదం సర్వం భవతి నాన్యథా ॥12॥

తనకున్న సర్వరత్నాలనూ బ్రాహ్మణులకు దానం చేసినా యోగం పొందలేరు. ప్రయాగలో మాత్రం మరణించినవానికి వెంటటే యోగసిద్ధి కలుగుతుంది.

ప్రయాగహేతుం వక్ష్యామి శ్రద్దధానస్య చ భారత ।
యథా సర్వేషు భూతేషు బ్రహ్మ సర్వత్ర దృశ్యతే ॥13॥

భారతా! విశ్వసించేవాని ప్రయాగ శ్రేష్ఠత్వానికి హేతువును చెబుతాను. సమస్త ప్రాణులలోనూ వానికి బ్రహ్మచైతన్యం సర్వత్రా కనిపిస్తుంది.

బ్రహ్మ నైవాస్తి యత్కించిదబ్రహ్మమితి బోధ్యతే ।
ఏవం సర్వేషు భూతేషు బ్రహ్మ సర్వత్ర పూజ్యతే ॥14॥

నాస్తికునికి ఎందునా బ్రహ్మ గోచరించదు. అది లేదని వాని భావన. ఆస్తికులచే సర్వప్రాణులలో కల బ్రహ్మ సర్వత్రా పూజింపబడుతున్నది.

తథా సర్వేషు లోకేషు ప్రయాగః పూజ్యతే బుధైః ।
పూజ్యతే తీర్థరాజస్తు సత్యమేవ యుధిష్ఠిర! ॥15॥

యుధిష్ఠిరా! అట్లే సర్వలోకాలలోనూ ప్రయాగను బుధులు శ్రేష్ఠమని పూజిస్తున్నారు. ఇది నిజం, ఈ తీర్థరాజం పూజార్హమైనది.

బ్రహ్మాఽపి స్మరతే నిత్యం ప్రయాగః పూజ్యతే బుధైః ।
తీర్థరాజమనుప్రాప్య న చాన్యత్కించిదర్హతి ॥16॥

బ్రహ్మ కూడా ప్రయాగను నిత్యం ఉత్తమ తీర్థమని స్మరిస్తున్నాడు. దీన్ని పొందినవాడు ఇంకేదీ ఒల్లడు.

కో హి దేవత్వమాసాద్య మనుష్యత్వం చికీర్షతి ।
అనేనైవోపమానేన త్వం జ్ఞాస్యసి యుధిష్ఠిర! ।
యథా పుణ్యతమం చాస్తి తథైవ కథితం మయా ॥17॥

దైవత్వం పొందిన తరువాత ఎవడు మనుజత్వం కోరుతాడు? యుధిష్ఠిరా! ఈ ఉపమానంతో నీవు నిజం గ్రహించగలవు. ఏది మహా పుణ్యతమమైనదో, దానినే నేను నీకు చెప్పాను.

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

శ్రుతం చేదం త్వయా ప్రోక్తం విస్మితోఽహం పునః పునః ।
కథం యోగేన తత్ప్రాప్తిః స్వర్గవాసస్తు కర్మణా ॥18॥

నీవు చెప్పినది నేను విన్నాను. నేను మాటిమాటికీ ఆశ్చర్యానికి లోనవుతున్నాను. యోగంతో ఆ తీర్థప్రాప్తి ఎలా సిద్ధిస్తుంది? కర్మతో స్వర్గం ఎలా లభిస్తుంది?

దాతా వై లభతే భోగాన్ కథం వై కర్మణః ఫలమ్ ।
తాని కర్మాణి పృచ్ఛామి పునర్వై ప్రాప్యతే మహీ ॥19॥

దాతయే భోగా లనుభవిస్తాడు. ఎలా కర్మఫలం పొందుతాడు? ఏ కర్మలతో భూమి లభిస్తుందో, ఆ కర్మలను అడుగుతున్నాను చెప్పండి.

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్మహాబాహో యథోక్తకరణీం మహీమ్ ।
గామగ్నిం బ్రాహ్మణం శాస్త్రం కాంచనం సలిలం స్త్రియః ॥20॥

మాతరం పితరం చైవ యే నిన్దన్తి నరాధమాః ।
న తేషామూర్ధ్వగమనమిదమాహ ప్రజాపతిః ॥21॥

మహాబాహూ! రాజా! విను. భూమిని, గోవును, అగ్నిని, బ్రాహ్మణుణ్ణి, శాస్త్రాన్ని, కాంచనాన్ని నీటిని, స్త్రీలను, తల్లిని, తండ్రిని- ఏ నరాధములు నిందిస్తారో, వారికి ఊర్ధ్వలోకప్రాప్తి లేదని బ్రహ్మ చెప్పాడు.

ఏవం యోగస్య సంప్రాప్తిస్థానం పరమదుర్లభమ్ ।
గచ్ఛన్తి నరకం ఘోరం యే నరాః పాపకర్మిణః ॥22॥

ఇలా యోగ సిద్ధిప్రదమైన స్థానం పరమదుర్లభమైనది. పాపకర్మ చేసేవారు ఘోరనరకం పాలవుతారు.

హస్త్యశ్వం గామనడ్వాహం మణిముక్తాదికాంచనమ్ ।
పరోక్షం హరతే యస్తు దానం నైవ ప్రయచ్ఛతి ॥23॥

న తే గచ్ఛన్తి వై స్వర్గం దాతారో యత్ర భోగినః ।
అనేకకర్మణా యుక్తాః పచ్యన్తే నరకే పునః ॥24॥

ఏనుగును, గుర్రాన్ని, గోవును, వృషభాన్ని, మణులను, ముత్యాలను, స్వర్ణాన్ని, పరోక్షంగా దొంగలించువాడు స్వర్గానికి పోలేడు. మరియు దానం చేయకపోతే దాతలు పోయే లోకాలకు పోలేరు. అక్కడ భోగాలు అనుభవించరు. అనేక కర్మల కలవాటుపడినవారు నరకంలో బాధింపబడతారు.

ఏవం యోగం చ ధర్మం చ దాతారం చ యుధిష్ఠిర ।
యథా సత్యమసత్యం వా అస్తి నాస్తీతి యత్ఫలమ్ ।
నిరుక్తం తు ప్రవక్ష్యామి యథాహ స్వయమబ్జజః ॥25॥

యుధిష్ఠిరా! ఇలా యోగాన్నీ, ధర్మాన్నీ, దాతనూ, అందలి సత్యాసత్యాలనూ, ఆస్తికత్వ నాస్తికత్వాలను, ఆ పదాల నిర్వచనాన్ని బ్రహ్మ చెప్పిన రీతిగా నీకు నేను చెబుతాను.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యే నవాధికశతతమోఽధ్యాయః ॥ 109 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ప్రయాగమాహాత్మ్యమనే నూటతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

దశాధికశతతమోఽధ్యాయః - నూటపదవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ - ప్రయాగమాహాత్మ్యం

మార్కండేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్! ప్రయాగస్య మాహాత్మ్యం పునరేవ తు ।
నైమిశం పుష్కరం చైవ గోతీర్థం సింధుసాగరమ్ ॥1॥

గయా చ చైత్రకం చైవ గంగాసాగరమేవ చ ।
ఏతే చాన్యే చ బహవో యే చ పుణ్యాః శిలోచ్చయాః ॥2॥

దశ తీర్థసహస్రాణి త్రింశత్కోట్యస్తథా పరాః ।
ప్రయాగే సంస్థితా నిత్యమేవమాహుర్మనీషిణః ॥3॥

రాజా! ప్రయాగక్షేత్రమాహాత్మ్యాన్ని ఇంకా వివరిస్తాను విను. నైమిశం, పుష్కరం, గోతీర్థం, సింధుసాగరం, గయ, చైత్రం, గంగాసాగర సంగమం, ఇంకా పవిత్రాలైన పర్వతాలు, ముప్పది కోట్ల పదివేల తీర్థాలు - ఇవన్నీ ప్రయాగతీర్థంలోనే ఉన్నాయని విద్వాంసులు చెబుతున్నారు.

త్రీణి చాప్యగ్నికుండాని యేషాం మధ్యే తు జాహ్నవీ ।
ప్రయాగాదభినిష్క్రాన్తా సర్వదేవనమస్కృతా ॥4॥

సర్వదేవతలచే నమస్కరింపబడే గంగ మూడు అగ్నికుండాల మధ్యనుండి ప్రయాగ క్షేత్రంలోనే ముందుకు వచ్చింది.

తపనస్య సుతా దేవీ త్రిషు లోకేషు విశ్రుతా ।
యమునా గంగయా సార్ధం సంగతా లోకపావనీ ॥5॥

సూర్యుని పుత్రిక, లోకపావని, ముల్లోకాలలో ప్రసిద్ధురాలైన యమునానది ఈ క్షేత్రంలోనే గంగతో సంగమిస్తున్నది.

గంగాయమునయోర్మధ్యే పృథివ్యా జఘనం స్మృతమ్
ప్రయాగం రాజశార్దూల కలాం నార్హన్తి షోడశీమ్ ॥6॥

తిస్రః కోట్యోఽర్ధకోటిశ్చ తీర్థానాం వసురబ్రవీత్ ।
దివి భువ్యన్తరిక్షే చ తత్సర్వం జాహ్నవీ స్మృతా ॥7॥

గంగాయమునల మధ్యదేశం భూమికి జఘనమని చెప్పబడింది. లోకంలో మూడున్నరకోట్ల తీర్థాలు ప్రయాగ తీర్థంలోని షోడశాంశంతో సరిపోలవని వసువు చెప్పాడు. భూర్భువస్వర్లోకాలలోని తీర్థాలన్నీ గంగలోనే ఉన్నాయి.

ప్రయాగసమధిష్ఠానౌ కంబలాశ్వతరావుభౌ ।
భోగితల్పగతస్త్యైషా వేదిరేషా ప్రజాపతేః ॥8॥

నాగప్రభువులైన కంబళాశ్వతరులిరువురు ప్రయాగ క్షేత్రంలోనే ఉంటారు. శేషశాయి అయిన ప్రజాపతి విష్ణునకు ఇది శయనవేదిక.

తత్ర వేదాశ్చ యజ్ఞాశ్చ మూర్తిమన్తో యుధిష్ఠిర ।
ప్రజాపతిముపాసన్తే ఋషయశ్చ తపోధనాః ॥9॥

ధర్మజా! వేదాలు, యజ్ఞాలు మూర్తిమంతములై అక్కడ ఉంటాయి. తపోధనులైన ఋషులు అచట ప్రజాపతిని ఉపాసిస్తూ ఉంటారు.

యజన్తే క్రతుభిర్దేవాస్తథా చక్రధరా నృపాః ।
తతః పుణ్యతమం నాస్తి త్రిషు లోకేషు భారత ॥10॥

దేవతలు, చక్రవర్తులు అచట క్రతువులతో ప్రజాపతి నారాధిస్తారు. భారతా! ముల్లోకాలలోనూ ప్రయాగను మించిన పుణ్యతమక్షేత్రం లేదు.

ప్రభావస్సర్వతీర్థేభ్యః ప్రభవత్యధికం విభో! ।
యత్ర గంగా మహాభాగా స దేశస్తత్ర పావనః ॥11॥

సిద్ధక్షేత్రం చ విజ్ఞేయం గంగాతీరసమన్వితమ్ ॥12॥
ఇదం సత్యం విజానీయాత్సాధూనామాత్మజస్య చ ।

సుహృదశ్చ విశేషేణ శిష్యస్యానుగతస్య చ ॥13॥

ప్రభూ! గంగవల్లనే ఆ ప్రదేశం సర్వతీర్థాలకన్న అధికప్రభావం కలదైంది. మహాభాగయగు గంగ ఉన్నచోటు పావనమైంది. గంగాతీరంతో కూడిన ఈ తీర్థం సిద్ధక్షేత్రమని గ్రహించాలి. ఈ సత్యం గ్రహించి సాధువులకూ, పుత్రులకూ, మిత్రులకూ, విశేషించి శిష్యులకూ, ఆశ్రితులకు తెలియపరచాలి.

ఇదం ధన్యమిదం స్వర్గ్యమిదం సత్యమిదం సుఖమ్ ।
ఇదం పుణ్యమిదం కీర్త్యం పావనం ధర్మముత్తమమ్ ॥14॥

ఇది ధన్యం, ఇది స్వర్గప్రదం, ఇది సేవింపదగినది, ఇది సుఖప్రదమైనది. ఇది పుణ్యప్రదం, ఇది కీర్తింపదగింది, పావనమైనది. ధర్మనిలయమైనది. ఇది ఉత్తమమైనది.

మహర్షీణామిదం గుహ్యం సర్వపాపప్రణాశనమ్ ।
అధీత్య చ ద్విజోఽ ప్యేతన్నిర్మలః స్వర్గమాప్నుయాత్ ॥15॥

య ఇదం శృణుయాన్నిత్యం తీర్థం పుణ్యం సదా శుచిః ।
జాతిస్మరత్వం లభతే నాకపృష్ఠే చ మోదతే ॥16॥

ఇది మహర్షులకు గూడా ఎరుగరాని గుహ్యతత్త్వం. సకలపాపాపలను నశింపజేసేది. నిర్మలమైన ఈ తీర్థ మాహాత్మ్యాన్ని అధ్యయనం చేసిన ద్విజుడు స్వర్గానికి పోతాడు. శుచియై ఈ పుణ్యతీర్థాన్నిగురించి విన్నవాడు పూర్వజన్మస్మృతి గలవాడౌతాడు. స్వర్గంలో సుఖిస్తాడు.

ప్రాప్య చైతాని తీర్థాని సద్భిః శిష్టానుదర్శిభిః ।
స్నాహి తీర్థేషు కౌరవ్య! న చ వక్రగతిర్భవేత్ ॥17॥

శిష్టులైన సుజనులతో కూడి నీవు ఈ తీర్థాలకు పొమ్ము. కౌరవ్యా! అక్కడ స్నానమాచరించు. నీకు వక్రగతి ఉండదు.

త్వయా చ సమ్యక్ పృష్టేన కథితం వై మయా విభో ।
పితరస్తారితాః సర్వే తథైవ చ పితామహాః ॥18॥

నీవు చక్కగా అడిగావు. కాన నీకు ఈ విషయాలు చెప్పాను. దీనివల్ల నీ పితృపితామహులు తరించారు.

ప్రయాగస్య తు సర్వే తే కలాం నార్హన్తి షోడశీమ్ ॥19॥
ఏవం జ్ఞానం చ యోగశ్చ తీర్థం చైవ యుధిష్ఠిర ।

బహుక్లేశేన యుజ్యన్తే న తేషామితరా గతిః ।
త్రికాలం చ జపన్ జ్ఞానం స్వర్గలోకం గమిష్యతి ॥20॥

ఈ ప్రయాగతో ఇతర తీర్థాలు పదునారవ వంతుకు కూడా సరిపోవు. ధర్మరాజా! తీర్థం, జ్ఞానం, యోగం ఈ మూడూ ఒకచోట దొరకవు. బహుక్లేశంతోనే లభిస్తాయి. అవి పొందడానికి తరగతి లేదు. ఈక్షేత్రమాహాత్మ్యాన్ని త్రికాలాలలో జపిస్తే స్వర్గం లభిస్తుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యే దశాధికశతతమోఽధ్యాయః ॥ 110 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని ప్రయాగ మాహాత్మ్యమనే నూటపదవ అధ్యాయం సంపూర్ణం

ఏకాదశాధికశతతమోఽధ్యాయః - నూటపదకొండవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ - ప్రయాగమాహాత్మ్యం

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

కథం స్వర్గమిదం ప్రోక్తం ప్రయాగస్య మహామునే! ।
ఏతన్మే సర్వమాఖ్యా హి యథా హి మమ తారయేత్ ॥1॥

మహామునీ! ప్రయాగక్షేత్ర ప్రభావం స్వర్గప్రదం ఎలా అవుతుంది? ఇది నా పూర్వుల నెలా తరింపజేస్తుంది? ఇది నాకు చెప్పండి.

మార్కణ్డేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

శృణు రాజన్! ప్రయాగే తు ప్రోక్తం సర్వమిదం జగత్ ।
బ్రహ్మా విష్ణుస్తథేశానో దేవతాః ప్రభురవ్యయః ॥2॥

రాజా! విను. ఈ జగమంతా ప్రయాగలో ఉన్నదంటారు. అవ్యయ ప్రభువులైన బ్రహ్మ, విష్ణువు, శివుడు, దేవతలందరూ ఇక్కడ నివసిస్తారు. వారంతా అవ్యయుడైన ఆ పరమాత్మయే.

బ్రహ్మా సృజతి భూతాని స్థావరం జంగమం చ యత్ ।
తాన్యేతాని పరే లోకే విష్ణుః సంవర్ధతే ప్రజాః ॥3॥

కల్పాన్తే తత్ సమగ్రం హి రుద్రః సంహరతే జగత్ ।
తదా ప్రయాగతీర్థం తు న కదాచిద్వినశ్యతి ॥4॥

బ్రహ్మ చరాచరప్రాణికోటిని సృష్టిస్తాడు. విష్ణువు లోక ప్రజాసంతతిని వృద్ధి చేస్తాడు. కల్పాంతంలో ఈ సమస్త జగత్తునూ రుద్రుడు సంహరిస్తాడు. కాని ప్రయాగతీర్థం ఎప్పుడూ నశించేది కాదు.

ఈశ్వరః సర్వభూతానాం యః పశ్యతి స పశ్యతి ।
యత్నేనానేన తిష్ఠన్తి తే యాన్తి పరమాం గతిమ్ ॥5॥

సర్వప్రాణులలోనూ ఎవడు ఈశ్వరుని దర్శిస్తాడో, వాడే తత్త్వజ్ఞుడు. ఈ యత్నంచేసేవారు పరమగతి పొందుతారు.

యుధిష్ఠిర ఉవాచ :- యుధిష్ఠిరుడు చెప్పాడు.

ఆఖ్యాహి మే యథాతత్త్వం యథైషా తిష్ఠతి శ్రుతిః ।
కేన వా కారణేనైవ తిష్ఠన్తే లోకసత్తమాః ॥6॥

మునీంద్రా! మాకు ఈ తత్త్వాన్ని యథాతథంగా వేదోక్తమైనట్లు చెప్పండి. ప్రయాగలో ఎందుకు లోకశ్రేష్ఠులైన త్రిమూర్తులుంటారు.

మార్కణ్డేయ ఉవాచ :- మార్కండేయుడు చెప్పాడు.

ప్రయాగే నివసన్త్యేతే బ్రహ్మవిష్ణుమహేశ్వరాః ।
కారణం తత్ ప్రవక్ష్యామి శృణు తత్త్వం యుధిష్ఠిర! ॥7॥

ప్రయాగలో బ్రహ్మవిష్ణు మహేశ్వరులు నివసిస్తారు. అందుకు కారణం చెబుతాను. యుధిష్ఠిరా! తత్త్వంవిను.

పంచయోజనవిస్తీర్ణం ప్రయాగస్య తు మణ్డలమ్ ।
తిష్ఠన్తి రక్షణాయాత్ర పాపకర్మనివారణాత్ ॥8॥

ప్రయాగమండలం ఐదు యోజనాల దూరం విస్తరించి వున్నది. పాపకర్మ నివారణ కొరకు, రక్షణకొరకూ ఆ త్రిమూర్తు లిక్కడ ఉండారు.

ఉత్తరేణ ప్రతిష్ఠానాచ్ఛద్మనా బ్రహ్మ తిష్ఠతి ।
వేణీమాధవరూపీ తు భగవాంస్తత్ర తిష్ఠతి ॥9॥

ప్రతిష్ఠానానికి ఉత్తరదిశలో మారురూపంతో బ్రహ్మ ఉంటాడు. వేణీమాధవరూపంతో అక్కడ భగవంతుడైన విష్ణువు నివసిస్తాడు.

మాహేశ్వరో వటో భూత్వా తిష్ఠతే పరమేశ్వరః ।
తతో దేవాః సగన్ధర్వాః సిద్ధాశ్చ పరమర్షయః ।
రక్షన్తి మణ్డలం నిత్యం పాపకర్మనివారణాత్ ॥10॥

మాహేశ్వర వటరూపంలో అక్కడ పరమేశ్వరుడున్నాడు. అందుచేత గంధర్వులతో గూడిన దేవతలూ, సిద్ధులూ, పరమర్షులూ పాపకర్మనివారణార్థం ఈ మండలాన్ని నిత్యం రక్షిస్తున్నారు.

యస్మిన్ జుహ్వన్ స్వకం పాపం నరకం చ న పశ్యతి ।
ఏవం బ్రహ్మ చ విష్ణుశ్చ ప్రయాగే స మహేశ్వరః ॥11॥

సప్తద్వీపాః సముద్రాశ్చ పర్వతాశ్చ మహీతలే ।
రక్షమాణాశ్చ తిష్ఠన్తి యావదాభూతసంప్లవమ్ ॥12॥

ఇక్కడ తన పాపాన్ని హోమం చేసేవాడు నరకం చూడడు. ఇట్లే ప్రయాగలో బ్రహ్మ, విష్ణువు, ఆ మహేశ్వరుడు, సప్తద్వీపాలు, సముద్రాలు, భూతలంలోని కొండలు, భూతప్రళయకాలంవరకూ ఇక్కడ రక్షకులై ఉంటారు.

యే చాన్యే బహవః సర్వే తిష్ఠన్తి చ యుధిష్ఠిర! ।
పృథివీం తత్సమాశ్రిత్య నిర్మితా దైవతైస్త్రిభిః ॥13॥

యుధిష్ఠిరా! ఇంకా అనేకులు ఇక్కడ ఈ పృథివి నాశ్రయించి వుంటారు. ముగ్గురు దేవతలచే వారిచ్చట ఈ భూమి ఆధారంగా సృష్టింపబడ్డారు.

ప్రజాపతేరిదం క్షేత్రం ప్రయాగమితి విశ్రుతమ్ ।
ఏతత్ పుణ్యం పవిత్రం వై ప్రయాగం చ యుధిష్ఠిర ॥
స్వరాజ్యం కురు రాజేంద్ర భ్రాతృభిః సహితోఽనఘ॥14॥

ప్రజాపతికి చెందిన ఈ క్షేత్రం ప్రయాగమని ప్రసిద్ధ మయింది. యుధిష్ఠిరా! ఇది పుణ్యమూ, పవిత్రమూ అయిన ప్రయాగక్షేత్రం. అనఘా! రాజవర్యా! నీవు నీ సోదరులతో గూడా ఈ ప్రయాగను సేవించి రాజ్యపాలనం నిర్వహించు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యే ఏకాదశాధికశతతమోఽధ్యాయః ॥ 111 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ప్రయాగమాహాత్మ్యమనే నూటపదకొండవ అధ్యాయం సంపూర్ణం

ద్వాదశోత్తరశతతమోఽధ్యాయః – నూటపన్నెండవ అధ్యాయం

ప్రయాగమాహాత్మ్యమ్ – ప్రయాగమాహాత్మ్యం

నన్దికేశ్వర ఉవాచ :–నందికేశ్వరుడు చెప్పాడు

భ్రాతృభిః సహితః సర్వైర్ద్రౌపద్యా సహ భార్యయా ।
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య గురూన్ దేవానతర్పయత్ ॥1॥

సోదరులందరితోనూ, భార్య ద్రౌపదితోనూ గూడి ధర్మరాజు బ్రాహ్మణులకు నమస్కరించి గురువులనూ, దేవతలనూ తృప్తి పరచాడు.

వాసుదేవోఽపి తత్రైవ క్షణేనాభ్యాగతస్తదా ।
పాణ్డవైః సహితైః సర్వైః పూజ్యమానస్తు మాధవః ॥2॥

అంతట ఒక క్షణంలో వాసుదేవుడు గూడా అక్కడికి వచ్చాడు. ఆ మాధవుణ్ణి పాండుసుతులందరూ పూజించారు.

కృష్ణేన సహితైః సర్వైః పునరేవ మహాత్మభిః ।
అభిషిక్తః స్వరాజ్యే చ ధర్మపుత్రో యుధిష్ఠిరః ॥3॥

కృష్ణసమేతులైన మహాత్ములందరూ ధర్మపుత్రుడైన యుధిష్ఠిరుణ్ణి స్వరాజ్యంలో అభిషిక్తుణ్ణి చేశారు.

ఏతస్మిన్నన్తరే చైవ మార్కణ్డేయో మహామునిః ।
తతః స్వస్తీతి చోక్త్వా తు క్షణాదాశ్రమభ్యగాత్ ॥4॥

ఇంతలో మహాముని మార్కండేయుడు 'స్వస్తి' అని చెప్పి క్షణంలో తన ఆశ్రమానికి వెళ్ళాడు.

యుధిష్ఠిరోఽపి ధర్మాత్మా భ్రాతృభిః సహితోఽవసత్ ।
మహాదానం తతో దత్త్వా ధర్మపుత్రో మహామనాః ॥5॥

ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు సోదరులతో గూడి మహామనస్కుడై మహాదానం చేసి అక్కడ నివసించాడు.

యస్త్విదం కల్య ఉత్థాయ మాహాత్మ్యం పఠతే నరః ।
ప్రయాగం స్మరతే నిత్యం స యాతి పరమం పదమ్ ।
ముచ్యతే సర్వపాపేభ్యో రుద్రలోకం స గచ్ఛతి ॥6॥

ఎవడీ ప్రయాగమాహాత్మ్యం ఉదయాననే లేచి పఠిస్తాడో, నిత్యం ప్రయాగను స్మరిస్తాడో, అతడు పరమపదం చేరుకొంటాడు. సకల పాపవిముక్తినొంది రుద్రలోకానికి పోతాడు.

వాసుదేవ ఉవాచ :–వాసుదేవుడు చెప్పాడు

మమ వాక్యం చ కర్తవ్యం మహారాజ! బ్రవీమ్యహమ్ ।
నిత్యం జపస్వ జుహ్వస్వ ప్రయాగే విగతజ్వరః ॥7॥

మహారాజా! నేను చెబుతున్నాను, నామాట పాటించు. నిత్యం నీవు ప్రయాగలో చింతారహితుడవై జపం, హోమం అనుష్ఠించు.

ప్రయాగం స్మర వై నిత్యం సహాస్మాభిర్యుధిష్ఠిర! ।
స్వయం ప్రాప్స్యసి రాజేంద్ర స్వర్గలోకం న సంశయః ॥8॥

యుధిష్ఠిరా! మాతోగూడి నీవునిత్యం ప్రయాగనుస్మరించు. నీవు స్వయంగా స్వర్గానికి పోతావు. సంశయంలేదు.

ప్రయాగమనుగచ్ఛేద్వా వసతే వాఽపి యో నరః ।
సర్వపాపవిశుద్ధాత్మా రుద్రలోకం స గచ్ఛతి ॥9॥

ప్రయాగకు పోయేవాడు, అక్కడ నివసించేవాడు సకలపాప విముక్తుడై రుద్రలోకం చేరుకొంటాడు.

ప్రతిగ్రహాదుపావృత్తః సన్తుష్టో నియతః శుచిః।
అహంకారనివృత్తశ్చ స తీర్థఫలమశ్నుతే ॥10॥

ప్రతిగ్రహం పరిహరించి సంతుష్టుడై, నియమవంతుడై, శుచియై, అహంకారం నుండి నివృత్తి పొందినవాడు ఆ తీర్థఫలం పొందుతాడు.

అకోపనశ్చ సత్యశ్చ సత్యవాదీ దృఢవ్రతః ।
ఆత్మోపమశ్చ భూతేషు స తీర్థఫలమశ్నుతే ॥11॥

కోపరహితుడు, సత్యం పాటించేవాడు, సత్యవచనుడు, దృఢవ్రతం కలవాడు, ప్రాణులను తనతో సమంగా చూచుకొనువాడు ఆ తీర్థఫలం పొందుతాడు.

ఋషిభిః క్రతవః ప్రోక్తా దేవైశ్చాపి యథాక్రమమ్ ।
న హి శక్యా దరిద్రేణ యజ్ఞాః కర్తుం మహీపతే! ॥12॥

మహీపతీ! ఋషులు, దేవతలూ ఎన్నో క్రతువులను చెప్పారు. దరిద్రుడు ఆ యజ్ఞాలు చేయలేడు గదా!

బహూపకరణా యజ్ఞా నానాసంభారవిస్తరాః ।
ప్రాప్యన్తే పార్థివైరేతైః సమృద్ధైర్వా నరైః క్వచిత్ ॥13॥

యజ్ఞాలను నిర్వహించడానికి పలు ఉపకరణాలు ఉండాలి. అవి నానాసంభారాలు గలవి. రాజులు, ఒక్కొక్కచో సంపన్నులైన ఇతరనరులు మాత్రం వాటిని సంపాదించగలరు.

యో దరిద్రైరపి విధిః శక్యః ప్రాప్తుం నరేశ్వర! ।
తుల్యో యజ్ఞఫలైః పుణ్యైస్తన్నిబోధ వదామి తే ॥14॥

నరేశ్వరా! ఏ విధి దరిద్రులకు గూడా అనుష్ఠింపశక్యమో, ఏది యజ్ఞఫలాలైన పుణ్యాలతో సమమైనదో, దాన్ని చెబుతాను తెలుసుకో.

ఋషీణాం పరమం గుహ్యమిదం భరతసత్తమ! ।
తీర్థానుగమనం పుణ్యం యజ్ఞేభ్యోఽపి విశిష్యతే ॥15॥

భరతసత్తమా! ఇది ఋషులు చెప్పిన పరమరహస్యం. పుణ్యమైన ఈ తీర్థయాత్ర యజ్ఞాలకంటే మేలైనది.

దశ తీర్థసహస్రాణి త్రింశత్కోట్యస్తథాఽ ఽపగాః ।
మాఘమాసే గమిష్యన్తి గంగాయాం భరతర్షభ ॥16॥

భరతర్షభా! పదివేల తీర్థాలు, ముప్పదికోట్ల నదులు, మాఘమాసంలో గంగలో ప్రవేశిస్తాయి.

స్వస్థో భవ మహారాజ! భుంక్ష్వ రాజ్యమకణ్టకమ్ ।
పునర్ద్రక్ష్యసి రాజేంద్ర యజమానో విశేషతః ॥17॥

మహారాజా! స్వస్థచిత్తుడవై వుండు. నిష్కంటకంగా రాజ్యం అనుభవించు. రాజేంద్రా! మళ్ళీ యజమానుడవై నన్ను (ప్రయాగను) దర్శించగలవు.

నన్దికేశ్వర ఉవాచ :-నందికేశ్వరుడు చెప్పాడు.

ఇత్యుక్త్వా స మహాభాగో మార్కండేయో మహాతపాః ।
యుధిష్ఠిరస్య నృపతేస్తత్రైవాన్తరధీయత ॥18॥

ఇలా మహాతపస్వి అయిన మార్కండేయుడు యుధిష్ఠిరునికి చెప్పి అక్కడే అంతర్హితుడయ్యాడు.

తతస్తత్ర సమాప్లావ్య గాత్రాణి సగణో నృపః ।
యథోక్తేనాథ విధినా పరాం నిర్వృతిమాగమత్ ॥19॥

పిదప ధర్మజుడు సపరివారంగా ప్రయాగలో స్నానమాడి విధిప్రకారం గొప్ప నిర్వృతిని పొందాడు.

తథా త్వమపి దేవర్షే! ప్రయాగాభిముఖో భవ ।
అభిషేకం తు కృత్వాద్యః కృతకృత్యో భవిష్యసి ॥20॥

దేవర్షీ! నీవు గూడా అలా ప్రయాగాభిముఖుడవు కమ్ము. అక్కడ స్నానం చేసిన కృతకృత్యుడవు కమ్ము!

సూత ఉవాచ :-సూతుడు చెప్పాడు.

ఏవముక్త్వాఽథ నన్దీశస్తత్రైవాన్తరధీయత ।
నారదోఽపి జగామాశు ప్రయాగాభిముఖస్తథా ॥21॥

ఇలా చెప్పి నందికేశ్వరుడు అక్కడ అంతర్హితుడయ్యాడు. అట్లే నారదుడు గూడా ప్రయాగాభిముఖుడైవెళ్ళాడు.

తత్ర స్నాత్వా చ జప్త్వా చ విధిదృష్టేన కర్మణా ।
దానం దత్త్వా ద్విజాగ్ర్యేభ్యో గతః స్వనిలయం తదా ॥22॥

విధిదృష్టవిధానంతో అక్కడ స్నానం, జపం చేసి ద్విజశ్రేష్ఠులకు దానం చేసి ధర్మరాజు తన నిలయానికి పోయాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ప్రయాగమాహాత్మ్యం నామ ద్వాదశాధికశతతమోఽధ్యాయః ॥ 112 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ప్రయాగమాహాత్మ్యమనే నూటపన్నెండవ అధ్యాయం సంపూర్ణం

త్రయోదశాధికశతతమోఽధ్యాయః – నూటపదమూడవ అధ్యాయం

ద్వీపాదిపరిమాణ కథనమ్ – ద్వీపాదిపరిమాణ కథనం

ఋషయ ఊచుః :– ఋషులు చెప్పారు.

కతి ద్వీపాః సముద్రా వా పర్వతా వా కతి ప్రభో! ।
కియన్తి చైవ వర్షాణి తేషు నద్యశ్చ కాః స్మృతాః ॥1॥

ప్రభూ! ద్వీపాలెన్ని? సముద్రాలెన్ని? కొండలెన్ని? వర్షాలు ఎన్ని? అందలి నదు లేవేవి?

మహాభూతప్రమాణం చ లోకాలోకస్తథైవ చ ।
పర్యాప్తిం పరిమాణం చ గతిశ్చంద్రార్కయోస్తథా ॥2॥

ఏతద్బ్రవీహి నః సర్వం విస్తరేణ యథార్థవిత్ ।
త్వదుక్తమేతత్సకలం శ్రోతుమిచ్ఛామహే వయమ్ ॥3॥

మహాభూతప్రమాణము, లోకాలోకపర్వతము, సూర్యచంద్రుల భ్రమణక్రమం, వారి పరిమాణం ఇదంతా యథాతథంగా తెలిసిన నీవు, విస్తరంగా మాకు చెప్పు. నీవు చెప్పేదంతా వినాలని అభిలషిస్తున్నాము.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

ద్వీపభేదసహస్రాణి తథా ఖండశతాని చ ।
న శక్యతే క్రమేణైవ వక్తుం వై సకలం జగత్ ॥4॥

వేలకొలది ద్వీపభేదాలు, అట్లే ఖండాలతో కూడిన ఈ సకలజగత్తునూ క్రమం చెప్పకుండా చెప్పడం వీలు కానిపని.

సప్తైవ తు ప్రవక్ష్యామి చంద్రాదిత్యగ్రహైః సహ ।
తేషాం మనుష్యాస్తర్కేణ ప్రమాణాని ప్రచక్షతే ॥5॥

ఈ భూమిలోని సప్తద్వీపాలను చంద్రసూర్యగ్రహాలతో సహా చెప్పగలను. మానవులు తర్కంతో వాటి ప్రమాణాలను చెబుతున్నారు.

అచిన్త్యాః ఖలు యే భావాస్తాంస్తు తర్కేణ సాధయేత్ ।
ప్రకృతిభ్యః పరం యచ్చ తదచిన్త్యస్య లక్షణమ్ ॥6॥

ఏ భావాలు ఆలోచన కందవో, వాటిని తర్కంతో సాధించాలి. ప్రకృతికి పరమైనదేదో అది అచింత్యలక్షణం కలది.

సప్త వర్షాణి వక్ష్యామి జంబూద్వీపం యథావిధమ్ ।
విస్తరం మణ్డలం యచ్చ యోజనైస్తన్నిబోధత ॥7॥

ఏడు వర్షాలను వివరిస్తాను. జంబూద్వీపానికి చెందిన యథాతథమైన దాని విస్తారాన్నీ, మండలాన్నీ యోజనాలతో తెలుసుకోండి.

యోజనానాం సహస్రాణి శతం ద్వీపస్య విస్తరః ।
నానాజనపదాకీర్ణం పురైశ్చ వివిధైః శుభైః ॥8॥

జంబూద్వీపం లక్షయోజనాలకు విస్తరించి వున్నది. అది వివిధ జనపదాలతో, శుభమైన నానా నగరాలతో కూడివున్నది.

సిద్ధచారణసంకీర్ణం పర్వతైరుపశోభితమ్ ।
సర్వధాతుపినద్ధైస్తైః శిలాజాలసముద్గతైః ॥9॥

సిద్ధులు, చారణులచే పరివ్యాప్తమైయున్న ద్వీపమది. పర్వతాలచే శోభితమై శిలాజాలాలనుండి ఏర్పడిన సకల ధాతువులచే ఆవృతమై శోభిల్లే ద్వీపమది.

పర్వతప్రభవాభిశ్చ నదీభిస్తు సమన్తతః ।
ప్రాగాయతా మహాపార్శ్వా షడిమే వర్షపర్వతాః ॥10॥

పర్వతాలలో ఉద్భవించే నదులు అక్కడ నలువైపులా ఉన్నాయి. అందలి ఆరు వర్షపర్వతాలు మహాపార్శ్వములై విస్తృతములై ఉన్నవి.

అవగాహ్య హ్యుభయతః సముద్రౌ పూర్వపశ్చిమౌ ।
హిమప్రాయశ్చ హిమవాన్ హేమకూటశ్చ హేమవాన్ ॥11॥

చాతుర్వర్ణస్స సౌవర్ణో మేరుశ్చోల్బమయః స్మృతః॥
చతుర్వింశత్సహస్రాణి విస్తీర్ణస్స చతుర్దిశమ్ ॥12॥

పూర్వపశ్చిమ సాగరాలలో ఉభయతః చొచ్చుకొని ఉన్న హిమవత్పర్వతం మంచుతో నిండినది. హేమకూటపర్వతం స్వర్ణమయం. సౌవర్ణమేరువు నాల్గు వర్ణాలు కలిగి రాళ్ళతో నిండి ఉన్నది. నాల్గు దిక్కులా దాని విస్తీర్ణం ఇరువదినాల్గువేల యోజనాలు.

వృత్తాకృతిప్రమాణశ్చ చతురస్రః సమాహితః ।
నానావర్ణైః సమః పార్శ్వే ప్రజాపతిగుణాన్వితః ॥13॥

అది వృత్తాకారప్రమాణమై, చతురస్రమై సమాహితమై ఉన్నది. ప్రజాపతిగుణాలతో ఒప్పారి పార్శ్వంలో నానావర్ణాలు కల్గివున్నది.

నాభీబన్ధనసంభూతో బ్రహ్మణోఽ వ్యక్తజన్మనః ।
పర్వతః శ్వేతవర్ణస్తు బ్రాహ్మణ్యం తస్య తేన వై ॥14॥

మేరువు అస్పష్టజన్మ గల బ్రహ్మ యొక్క నాభీబంధనంనుండి పుట్టినది. శ్వేతవర్ణం కలిగి వున్నది. అందువల్లనే దానికి బ్రాహ్మణ్యం (బ్రహ్మ) సంబంధం సిద్ధించింది.

పార్శ్వముత్తరతస్తస్య రక్తవర్ణం స్వభావతః ।
తేనాస్య క్షత్రభావస్తు మేరోః నానార్థకారణాత్ ॥15॥

మేరుపర్వతం యొక్క ఉత్తరపార్శ్వం స్వభావతః రక్తవర్ణం కలిగి ఉన్నది. అందుచేత దీనికి క్షత్రభావం నానాకారణాలవల్ల కలిగింది.

పీతశ్చ దక్షిణేనాసౌ తేన వైశ్యత్వమిష్యతే ।
భృంగపత్రనిభశ్చాపి పశ్చిమేన సమార్చితః
తేనాస్య శూద్రభావస్స్యాత్ ఇతి వర్ణాః ప్రకీర్తితాః ॥16॥

మేరుగిరికి దక్షిణాన పీతవర్ణం కల్గివుండడంవల్ల వైశ్యత్వం, పడమర తుమ్మెదరెక్కలతో సమానం కావడంవల్ల శూద్రత్వం సంభవించింది. ఇలా నామ అర్థ కర్మల వల్ల నాలుగు వర్ణాలు పేర్కొనబడ్డాయి.

నీలశ్చ వైదూర్యమయః శ్వేతః పీతో హిరణ్మయః ।
మయూరబర్హవర్ణశ్చ శాతకౌంభః స శృంగవాన్ ॥17॥

నీలం, వైదూర్యమయం, శ్వేతం, పీతం, హిరణ్మయవర్ణం, మయూరపింఛ వర్ణం, స్వర్ణవర్ణం కల ఏడు కొండలమధ్య మేరుపర్వతం విలసిల్లుతున్నది.

ఏతే పర్వతరాజానః సిద్ధచారణసేవితాః ।
తేషామన్తరవిష్కంభో నవసాహస్ర ఉచ్యతే ॥18॥

ఈ పర్వతరాజాలను సిద్ధులు, చారణులు సేవిస్తున్నారు. వాటి ఆంతరవిష్కంభం (అంతర్వ్యాసం!) తొమ్మిది వేల యోజనాలు.

మధ్యే త్విలావృతం నామ మహామేరోః సమన్తతః ।
చతుర్వింశత్సహస్రాణి విస్తీర్ణో యోజనైః సమః ॥19॥

వాటి మధ్య ఇలా వృతమనే వర్షం మహామేరువు నలువైపులా ఉన్నది. దాని విస్తీర్ణం ఇరువదినాల్గువేల యోజనాలు.

మధ్యే తస్య మహామేరుర్విధూమ ఇవ పావకః ।
వేద్యర్థం దక్షిణే మేరురుత్తరార్ధస్తథోత్తరే ॥20॥

దాని మధ్య మహామేరువు పొగ లేని నిప్పులాగా ఉన్నది. దాని దక్షిణభాగం దక్షిణమేరువనీ, ఉత్తరభాగం ఉత్తరమేరువనీ వ్యవహరింపబడుతున్నాయి.

వర్షాణి యాని సప్తాత్ర తేషాం వై వర్షపర్వతాః ।
ద్వే ద్వే సహస్రే విస్తీర్ణా యోజనైర్దక్షిణోత్తరమ్ ॥21॥

ఇక్కడి ఏడు వర్షాలకూ ఏడు వర్ష పర్వతాలున్నాయి. అవి దక్షిణోత్తరంగా రెండు రెండు వేల యోజనాలు విస్తీర్ణం కల్గి వున్నాయి.

జంబూద్వీపస్య విస్తారస్తేషామాయామ ఉచ్యతే ।
నీలశ్చ నిషధశ్చైవ తేషాం హీనాశ్చ యే పరే ॥22॥

జంబూద్వీపముయొక్క విస్తారం వాటి నిడివి అని చెబుతారు. ఇక్కడి నీలం, నిషధ పర్వతాలకంటే తక్కినవి చిన్నవే.

శ్వేతశ్చ హేమకూటశ్చ హిమవాన్ శృంగవాంశ్చ యః ।
జంబూద్వీపప్రమాణేన ఋషభః పరికీర్త్యతే ॥23॥

శ్వేతం, హేమకూటం, హిమవంతుడు, శృంగవంతుడు అనేవి తక్కిన పర్వతాలు. ఋషభం మాత్రం జంబూద్వీపమంత పరిమాణం కల్గివున్నది.

తస్మాద్ ద్వాదశభాగేన హేమకూటోఽపి హీయతే ।
హిమః పశ్చిమభాగేన తస్మాదేవ ప్రహీయతే ।
అష్టాశీతిసహస్రాణి హేమకూటో మహాగిరిః ॥24॥

దానికంటే హేమకూటం పంద్రెండవ వంతు చిన్నది. దానికంటె హిమాద్రి ఇంకా చిన్నది. హేమకూటమహాగిరి ఎనుబదిఎనుమిది వేల యోజనాల పరిమాణం కలిగి ఉన్నది.

అశీతిర్హిమవాన్ శైల ఆయతః పూర్వపశ్చిమే ।
ద్వీపస్య మణ్డలీభావాద్ధ్రాసవృద్ధీ ప్రకీర్తితే ॥25॥

హిమాద్రి ఎనుబది యోజనాలున్నది. అది పూర్వ పశ్చిమ దిశలకు వ్యాపించివున్నది. ద్వీపముయొక్క మండలీభావంవల్ల (గుండ్రంగా వుండడంవల్ల) ఇక్కడ హెచ్చు తక్కువలు చెప్పడమయింది.

వర్షాణాం పర్వతానాం చ యథాభేదం తథోత్తరమ్ ।
తేషాం మధ్యే జనపదాస్తాని వర్షాణి సప్త వై ॥26॥

వర్షాలకు లాగానే పర్వతాలకూ ఎక్కువ తక్కువల విభాగం ఉన్నది. వాటి మధ్య జనపదాలున్నాయి. ఈ జనపదాల సముదాయాలైన వర్షాలు ఏడు కలవు.

ప్రపాతవిషమైస్తైస్తు పర్వతైరావృతాని తు ॥
సప్త తాని నదీభేదైరగమ్యాని పరస్పరమ్ ॥27॥

నిట్టనిలువైన శిలామయ ప్రదేశాలతో ఎగుడు దిగుడుగా ఉన్న కొండలతో ఆవరింపబడియున్న ఆ ఏడు వర్షాలు నదీ భేదాలతో అన్యోన్యం అగమ్యాలై వున్నాయి.

వసన్తి తేషు సత్త్వాని నానాజాతీని సర్వశః ।
ఇమం హైమవతం వర్షం భారతం నామ విశ్రుతమ్ ॥28॥

వాటిలో అనేక జాతులకు చెందిన ప్రాణులు అంతటా నివసిస్తున్నాయి. హైమవతవర్షం భారతవర్షమని ప్రసిద్ధి గాంచింది.

హేమకూటం పరం తస్మాన్నామ్నా కింపురుషం స్మృతమ్ ।
హేమకూటాచ్చ నిషధం హరివర్షం తదుచ్యతే ॥29॥

దానికంటె ఆవలిది హేమకూటం, దానిని కింపురుషవర్ష మంటారు. హేమకూటానికి అవతల నిషధమున్నది. దానికి హరివర్షమనిపేరు.

హరివర్షాత్పరం చాపి మేరోస్తు తదిలావృతమ్ ।
ఇలావృతాత్పరం నీలం రమ్యకం నామ విశ్రుతమ్ ॥30॥

హరివర్షాని కావల మేరువు నాశ్రయించి ఉన్నది ఇలావృత వర్షం. దానికావల నున్న నీలం రమ్యకమని ప్రసిద్ధమయింది.

రమ్యకాదపరం శ్వేతం విశ్రుతం తద్ధిరణ్యకమ్ ।
హిరణ్యకాత్పరం వర్షం శృంగవంతం కురు స్మృతమ్ ॥31॥

రమ్యకానికావల శ్వేతవర్షం కలదు. దాన్ని హిరణ్యక మంటారు. దాని కావలనున్న శృంగవత్పర్వతము ఉత్తరకురుపర్వతమని పేర్కొనబడింది.

ధనుఃసంస్థే తు విజ్ఞేయే ద్వే వర్షే దక్షిణోత్తరే ।
దీర్ఘాణి తస్య చత్వారి మధ్యమం తదిలావృతమ్ ॥32॥

ధనుస్సును పోలి వుండే రెండు ఖండాలు దక్షిణోత్తరాలలో ఉన్నాయి. ఇలావృతం వాటిమధ్య నాల్గువందల యోజనాల దీర్ఘమై వున్నది.

పూర్వతో నిషధస్యేదం వేద్యర్ధం దక్షిణం స్మృతమ్ ।
పరన్త్విలావృతం పశ్చాద్వేద్యర్ధం తు తదుత్తరమ్ ॥33॥

నిషధానికి తూర్పున కల సగం దక్షిణవేది అంటారు. ఇలావృతానికి పశ్చిమభాగాన్ని ఉత్తరవేది అంటారు.

తయోర్మధ్యే తు విజ్ఞేయో మేరుర్యత్ర త్విలావృతమ్ ।
దక్షిణేన తు నీలస్య నిషధస్యోత్తరేణ తు ॥34॥

వాటి మధ్య మేరువు, అందులోని ఇలావృతం, నీలానికి దక్షిణాన, నిషధానికి ఉత్తరాన ఉన్నది.

ఉదగాయతో మహాశైలో మాల్యవాన్నామ పర్వతః ।
ద్వాత్రింశతా సహస్రేణ ప్రతీచ్యాం సాగరానుగః ॥35॥

ఉత్తరానికి విస్తరించిన మహాపర్వతం మాల్యవత్పర్వతం, ఇది ముప్పదిరెండు వేలయోజనాలు పడమటి సముద్రాన్ని అనుగమించి వున్నది.

మాల్యవాన్వై సహస్రైక ఆనీలనిషధాయతః ।
ద్వాత్రింశత్త్వేవమప్యుక్తః పర్వతో గన్ధమాదనః ॥36॥

నీలంనుండి నిషధంవరకూ వెయ్యి యోజనాలు విస్తరించిన కొండ మాల్యవంతం. గంధమాదనం ముప్పది రెండు వేల యోజనాలున్నది.

పరిమణ్డలయోర్మధ్యే మేరుః కనకపర్వతః ।
చాతుర్వర్ణ్యసమో వర్ణైశ్చతురస్రః సముచ్ఛ్రితః ॥37॥

ఈ వలయాల మధ్య కనకాద్రి మేరువున్నది. ఇది నాలుగు వర్ణములు కలిగి చాతుర్వర్ణ్యసదృశమై ఉన్నది, చతురస్రమై ఎత్తుగా ఉన్నది.

నానావర్ణః స పార్శ్వేషు పూర్వాన్తే శ్వేత ఉచ్యతే ।
పీతం తు దక్షిణం తస్య భృంగిపత్రనిభం పరమ్ ।
ఉత్తరం తస్య రక్తం వై ఇతి వర్ణసమన్వితః ॥38॥

ఇది పార్శ్వాలలో నానా వర్ణాలు కల్గివున్నది. పూర్వాంతంలో తెలుపు, దక్షిణాన పీతం, దాని కావల తుమ్మెద రెక్కల లాగా నీలం, ఉత్తరాన ఎరుపు ఇలా వర్ణాలతో గూడినది.

మేరుస్తు శుశుభే దివ్యో రాజవత్స తు వేష్టితః ।
ఆదిత్యతరుణాభాసో విధూమ ఇవ పావకః ॥39॥

మేరువు దివ్యమైన రాజులాగా పరివేష్టితమై భాసిస్తున్నది. అది తరుణ సూర్యుని కాంతి కలదై పొగలేని అగ్నిలాగా ఉన్నది.

భూమేర్మధ్యస్థితో మేరుశ్చతురాశీతిరుచ్ఛ్రితః ।
ప్రవిష్టః షోడశాధస్తాదష్టావింశతివిస్తృతః ॥40॥

భూమి మధ్యలో నున్న మేరువు ఎనుబది నాలుగువేల యోజనాలు ఎత్తు కలది. పదునారువేల యోజనాల లోతుగల్గి ఇరవై ఎనిమిది వేల యోజనాల వెడల్పుకు విస్తరించినది.

విస్తరాద్ద్విగుణశ్చాస్య పరీణాహః సమన్తతః ।
స పర్వతో మహాదివ్యో దివ్యౌషధిసమన్వితః ॥41॥

దాని పరిధి నలువైపులా వెడల్పుకంటే రెండు రెట్లెక్కువ. ఆ కొండ మహాదివ్యమై దివ్యౌషధులు కల్గి ఉన్నది.

భువనైరావృతః సర్వైర్జాతరూపపరిష్కృతైః ।
తత్ర దేవగణాశ్చైవ గన్ధర్వాసురరాక్షసాః ।
శైలరాజే ప్రమోదన్తే సర్వతోఽప్సరసాం గణైః ॥42॥

అది స్వర్ణాలంకృతమైన సకలభువనాలతో ఆవరింపబడినది. ఆ పర్వతరాజమునందు దేవగణాలు, గంధర్వులు, అసురులు, రాక్షసులు, అందరూ అంతటా అచ్చరలతో గూడి సుఖిస్తారు.

స తు మేరుః పరివృతో భువనైర్భూతభావనైః ।
యస్యేమే చతురో దేశా నానాపార్శ్వేషు సంస్థితాః ॥43॥

భూతసృష్టికి హేతువులయిన భువనాలచే ఆ మేరువు పరివృతమై ఉన్నది. దాని నానాపార్శ్వాలలో ఈ నాల్గు దేశాలూ ఉన్నాయి.

భద్రాశ్వో భారతశ్చైవ కేతుమాలశ్చ పశ్చిమే ।
ఉత్తరాశ్చైవ కురవః కృతపుణ్యప్రతిశ్రయాః ॥44॥

తూర్పున భద్రాశ్వం, దక్షిణాన భారతం, పడమట కేతుమాలం, ఉత్తరాన పుణ్యాత్ములకు ఆశ్రయమైన ఉత్తర కురుదేశాలు ఉన్నాయి.

విష్కంభపర్వతాస్తద్వన్మన్దరో గన్ధమాదనః ।
విపులశ్చ సుపార్శ్వశ్చ సర్వరత్నవిభూషితాః ॥45॥

ఈ వర్షాలకు అట్లే విష్కంభపర్వతాలయిన మందరం, గంధమాధనం, విపులం, సుపార్శ్వం అన్నవి సర్వరత్నాలంకృతాలై వున్నాయి.

అరుణోదం మానసం చ సితోదం భద్రసంజ్ఞితమ్ ।
తేషాముపరి చత్వారి సరాంసి చ వనాని చ ॥46॥

అరుణోదం, మానసం, సితోదం, భద్రం అనే నాల్గు సరస్సులు, అడవులూ ఆ కొండలపై వున్నాయి.

తథా భద్రకదమ్బస్తు పర్వతే గన్ధమాదనే ।
జంబూవృక్షస్తథాశ్వత్థో విపులే వా వటః పరమ్ ॥47॥

అట్లే విపులమైన గంధమాదన పర్వతంలో భద్రకదంబం, నేరేడు, రాగి, విపులం, మఱ్ఱి అనే మహావృక్షాలు కలవు.

గన్ధమాదనపార్శ్వే తు పశ్చిమే వరమణ్డపః ।
ద్వావింశత్తు సహస్రాణి యోజనైః సర్వతః సమః ॥48॥

గంధమాదనం పడమటి పార్శ్వంలో మేలైన మండపం ఒకటి ఉన్నది. అది ఇరువది రెండువేల యోజనాలు అన్ని వైపులా సమంగా విస్తరించి వున్నది.

తత్ర తే శుభకర్మాణః కేతుమాలాః పరిశ్రుతాః ।
తత్ర కాలా నరాః సర్వే మహాసత్త్వా మహాబలాః ॥49॥

అక్కడ శుభకర్మలు చేసే కేతుమాలులు ఉన్నారు. అక్కడి నరులందరూ నీలవర్ణులు మరియు మహాసత్త్వులయిన బలవంతులు.

స్త్రియశ్చోత్పలవర్ణాభాః సున్దర్యః ప్రియదర్శనాః ।
తత్ర దివ్యో మహావృక్షః పనసః పత్రభాసురః ॥50॥

అక్కడి స్త్రీలు నల్ల గలువలవంటి శరీర కాంతి గల్గి ప్రియదర్శనలైన సుందరీమణులు. అక్కడ దివ్యమైన మహాపనసవృక్షం ఆకులతో విరాజిల్లుతూ వుంటుంది.

తస్య పీత్వా ఫలరసం జీవన్తి హి సమాయుతమ్ ।
తస్య మాల్యవతః పార్శ్వే పూర్వే పూర్వా తు గండికా ।
ద్వాత్రింశత్త్రిసహస్రాణి యోజనానాం తదుచ్యతే ॥51॥

ఆ చెట్టు ఫలరసం త్రాగితే పదివేల సంవత్సరాలు జీవిస్తారు. ఆ మాల్యవత్పర్వతము యొక్క తూర్పుదిశలో 'గండికా' అనే అపూర్వనది ప్రవహిస్తున్నది. అది ముప్పది రెండువేల యోజనాల పొడవైనది.

భద్రాశ్వస్తత్ర విజ్ఞేయో నిత్యం ముదితమానసః ।
భద్రమాలవనం తత్ర కాలామ్రశ్చ మహాద్రుమః ॥52॥

అక్కడ ఉండే భద్రాశ్వం, (మేలుజాతి గుఱ్ఱం) నిత్యసంతుష్టమై ఉంటుంది. అక్కడ 'భద్రమాలం' అనే ఒక వనమున్నది. అందులో కాలామ్రమనే ఒక మహావృక్షం కలదు.

తత్ర తే పురుషాః శ్వేతా మహాసత్త్వా మహాబలాః ।
స్త్రియః కుముదవర్ణాభాః సున్దర్యః ప్రియదర్శనాః ॥53॥

అచ్చట పురుషులు తెల్లగా మహాబలం కల్గి మహాసత్త్వులై వుంటారు. స్త్రీలు కుముదవర్ణం కల్గి ప్రియదర్శనలై అందంగా వుంటారు.

చంద్రప్రభాశ్చంద్రవర్ణాః పూర్ణచంద్రనిభాననాః ।
చంద్రశీతలగాత్రాశ్చ స్త్రియో హ్యుత్పలగన్ధికాః ॥54॥

చంద్రునివంటి కాంతిగలవారు, చంద్రవర్ణం కలవారు, పూర్ణచంద్రునివంటి ముఖం కలవారు. చంద్రునిలాగా చల్లని శరీరాలు గలవారు, నల్లకలువలవంటి సుగంధం కలవారుగా స్త్రీలున్నారు.

దశవర్షసహస్రాణి ఆయుస్తేషామనామయమ్ ।
కాలామ్రస్య రసం పీత్వా తే సర్వే స్థిరయౌవనాః ॥55॥

వారి ఆయువు ఏ రోగమూ లేకుండా పదివేల సంవత్సరాలుంటుంది. కాలామ్ర ఫలరసం త్రాగి వారందరూ స్థిరమైన యౌవనం కలవారయ్యారు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఇత్యుక్తవానృషీన్ బ్రహ్మే వర్షాణి చ నిసర్గతః ।
పూర్వం మమానుగ్రహకృత్ భూయః కిం వర్ణయామి వః? ॥56॥

ఇలా బ్రహ్మ ఋషులకు వర్షాలను గురించి నిసర్గసిద్ధంగా వర్ణించి చెప్పాడు. నాపట్ల అనుగ్రహం చూపిన మీకు నేను ఇంకా ఏమి వర్ణించేది?

ఏతచ్ఛ్రుత్వా వచస్తే తు ఋషయః సంశితవ్రతాః ।
జాతకౌతూహలాః సర్వే ప్రత్యూచుస్తే ముదాన్వితాః ॥57॥

ఈ మాట విని సంశితవ్రతులైన ఆ ఋషులందరూ కౌతూహలం కలవారై సంతషంతో సూతునికి ఇలా బదులు పలికారు.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

పూర్వాపరౌ సమాఖ్యాతౌ యౌ దేశౌ తౌ త్వయా మునే ।
ఉత్తరాణాం చ వర్షాణాం పర్వతానాం చ సర్వశః ॥58॥

ఆఖ్యాహి నో యథాతథ్యం యే చ పర్వతవాసినః ।
ఏవముక్తస్తు ఋషిభిస్తేభ్యస్త్వాఖ్యాతవాన్పునః ॥59॥

మునీ! పూర్వాపరదేశాలను గురించి చెప్పావు. ఉత్తరదిశలోని వర్షాలు, నలుదెసల గల కొండలు, ఆ కొండలలో నివసించేవారు వారిని గురించి ఉన్న సమాచారం మాకు చెప్పు. ఇలా ఆ ఋషు లడుగగా సూతుడు మరల వారితో ఇలా అన్నాడు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

శృణుధ్వం యాని వర్షాణి పూర్వం నోక్తాని వై మయా ।
దక్షిణేన తు నీలస్య నిషధస్యోత్తరేణ తు ॥60॥

వర్షం రమణకం నామ జాయన్తే యత్ర వై ప్రజాః ।
రతిప్రధానా విమలా జాయన్తే యత్ర మానవాః।
శుక్లాభిజనసమ్పన్నాః సర్వే తే ప్రియదర్శనాః ॥61॥

నేను పూర్వం చెప్పని వర్షాలను ఇప్పుడు చెబుతాను వినండి. నీలవర్షానికి దక్షిణాన, నిషధానికి ఉత్తరాన రమణక మనే వర్షం ఉన్నది. అక్కడి మానవులు రతిప్రధానులు, నిర్మలులుగా వుంటారు. శుద్ధవంశజులైన వారందరూ ప్రియదర్శనులే.

తత్రాపి చ మహావృక్షో న్యగ్రోధో రోహిణో మహాన్ ।
తస్యాపి తే ఫలరసం పిబన్తో వర్తయన్తి హి ॥62॥

అక్కడ గూడా 'రోహిణి' మనే ఒక పెద్ద వటవృక్షమున్నది. దాని ఫలరసం త్రాగి జనులు జీవిస్తారు.

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ ।
జీవన్తి తే మహాభాగాః సదా హృష్టా నరోత్తమాః ॥63॥

అక్కడివారు సదా సంతుష్టులై మహాభాగులైన నరశ్రేష్ఠులుగా వుంటూ పదకొండువేల సంవత్సరాలు పదివందల యేండ్లు జీవిస్తారు.

ఉత్తరేణ తు శ్వేతస్య పార్శ్వే శృంగస్య దక్షిణే ।
వర్షం హిరణ్యకం నామ యత్ర హైరణ్యకా నదీ ॥64॥

శ్వేతాచలానికి ఉత్తరాన, శృంగగిరికి దక్షిణాన హిరణ్వకమనే వర్షమున్నది. అక్కడ హైరణ్యకనది ప్రవహిస్తుంది.

మహాబలా మహాసత్త్వా నిత్యం ముదితమానసాః ।
శుక్లాభిజనసంపన్నాః సర్వే చ ప్రియదర్శనాః ॥65॥

అక్కడి జనులు మహాబలవంతులు, మహాసత్త్వులు, నిత్య సంతుష్టచిత్తులు, శుద్ధ వంశంలో జన్మించినవారు అందరూ ప్రియదర్శనులు.

ఏకాదశ సహస్రాణి వర్షాణాం తే నరోత్తమాః ।
ఆయుఃప్రమాణం జీవన్తి శతాని దశ పంచ చ ॥66॥

ఆ నరశ్రేష్ఠులు పదునొకండు వేల అయిదు వందల సంవత్సరాలు ఆయుఃప్రమాణం కలిగి వుంటారు.

తస్మిన్వర్షే మహావృక్షో హ్యశ్వత్థః పత్రశాఖవాన్ ।
తస్య పీత్వా ఫలరసం తత్ర జీవన్తి మానవాః ॥67॥

ఆ వర్షంలో కొమ్మలు రెమ్మలు గల ఒక పెద్ద అశ్వత్థవృక్షమున్నది. దాని ఫలరసం త్రాగి అక్కడి మనుజులు జీవిస్తారు.

శృంగసాహ్వస్య శృంగాణి త్రీణి తాని మహాన్తి వై ।
ఏకం మణియుతం తత్ర ఏకం తు కనకాన్వితమ్ ।
సర్వరత్నమయం చైకం భవనైరుపశోభితమ్ ॥68॥

శృంగపర్వతానికి పెద్ద పెద్ద శిఖరాలు మూడు ఉన్నాయి. ఒకటి మణిమయం, మరొకటి స్వర్ణమయం, మూడవది సర్వరత్నమయం, అది భవనశోభితమైనదిగా ఉన్నది.

ఉత్తరే చాస్య శృంగస్య సముద్రాన్తే చ దక్షిణే ।
కురవస్తత్ర తద్వర్షం పుణ్యం సిద్ధనిషేవితమ్ ॥69॥

ఈ శృంగగిరికి ఉత్తరాన దక్షిణసముద్రం చివర కురువర్షమున్నది. అది పవిత్రమైనది, సిద్ధులచే సేవింపబడేది.

తత్ర వృక్షా మధుఫలా దివ్యామృతజలాఽఽ పగాః ।
వస్త్రాణి తే ప్రసూయన్తే ఫలాన్యాభరణాని చ ॥70॥

ఇక్కడి చెట్లు తీయనిఫలాలు గలవి. నదులు దివ్యామృతజలమయాలు. ఆ చెట్లు వస్త్రాలను, ఫలాలతోకూడ ఆభరణాలను కూడ ప్రసవిస్తాయి.

సర్వకామప్రదాతారః కేచిద్వృక్షా మనోరమాః ।
అపరే క్షీరిణో నామ వృక్షాస్తత్ర మనోరమాః ।
యే వర్షన్తి సదా క్షీరం షడ్రసం చామృతోపమమ్ ॥71॥

కొన్ని మనోజ్ఞమైన చెట్లు కోరిక లన్నింటినీ తీరుస్తాయి. మరికొన్ని మనోహరమైన క్షీరవృక్షాలు క్షీరాన్ని పంచామృతం వంటి షడ్రసాలను వర్షిస్తాయి.

సర్వా మణిమయీ భూమిః సూక్ష్మా కాంచనవాలుకా ।
సర్వత్ర సుఖసంస్పర్శా నిఃశబ్దాః పవనాః శుభాః ॥72॥

అక్కడి నేలంతా మణిమయం, బంగారు ఇసుకతో నిండినది. అక్కడి గాలులు సుఖ స్పర్శగలిగి నిశ్శబ్దంగా వీస్తాయి.

దేవలోకచ్యుతాస్తత్ర జాయన్తే మానవాః శుభాః ।
శుక్లాభిజనసంపన్నాః సర్వే తే స్థిరయౌవనాః ॥73॥

దేవలోకభ్రష్టులైన పుణ్యాత్ములు అక్కడ జన్మిస్తారు. వారు శుద్ధవంశజులు, స్థిరయౌవనులు.

మిథునాని ప్రజాయన్తే స్త్రియశ్చాప్సరసోపమాః ।
తేషాం తే క్షీరిణాం క్షీరం పిబన్తి హ్యమృతోపమమ్ ॥74॥

అక్కడ మిథునాలు (అమడలు) జన్మిస్తారు. స్త్రీలు అచ్చరలవలె ఉంటారు. వారు అమృతంవంటి వృక్షక్షీరం త్రాగుతారు.

ఏకాహాజ్జాయతే యుగ్మం సమం చైవ వివర్ధతే ।
సమం రూపం చ శీలం చ సమం చైవ మ్రియన్తి వై ॥75॥

అమడబిడ్డలు (కవలలు) ఒక్కరోజే జన్మిస్తారు, సమంగా పెరుగుతారు, వారి రూప శీలాలు సమంగా వుంటాయి. ఒకే సమయంలో మరణిస్తారు.

ఏకైకమనురక్తాశ్చ చక్రవాకా ఇవ ధ్రువమ్ ।
అనామయా హ్యశోకాశ్చ నిత్యం ముదితమానసాః ॥76॥

వారు ఒకరికొకరు చక్రవాకాలవలె అనురక్తులై వుంటారు. రోగ శోకాలు లేక నిత్యం సంతోషంగా వుంటారు.

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ ।
జీవన్తి చ మహాసత్త్వా న చాన్యా స్త్రీ ప్రవర్తతే ॥77॥

వారు మహాసత్త్వులై పదివేలా పదివందల సంవత్సరాలు జీవిస్తారు. ఇతరస్త్రీ వారిమధ్య ప్రవేశించదు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఏవమేవ నిసర్గో వై వర్షాణాం భారతాదినామ్ ।
దృష్టః పరమధర్మజ్ఞైః కిం భూయః కథయామి వః ॥78॥

ఇలా భారతాదివర్షాల స్థితిగతులున్నాయి. పరమతత్త్వజ్ఞులైనవారు వీటిని దర్శించినారు. ఇంకా నేను మీకు ఏమి చెప్పేది!

ఆఖ్యాతాస్త్వేవమృషయః సూతపుత్రేణ ధీమతా ।
ఉత్తరశ్రవణే భూయః పప్రచ్ఛుః సూతనన్దనమ్ ॥79॥

బుద్ధిమంతుడైన సూతపుత్రుడు ఇలా చెప్పగా విని ఋషులు ఇంకా వినగోరి మళ్ళీ అతణ్ణి అడిగారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ద్వీపాదిపరిమాణకథనం నామ త్రయోదశాధికశతతమోఽధ్యాయః ॥ 113 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని ద్వీపాదిపరిమాణకథనమనే నూటపదమూడవ అధ్యాయం సంపూర్ణం.

చతుర్దశాధికశతతమోఽధ్యాయః - నూటపదునాల్గవ అధ్యాయం

భారతవర్షవర్ణనమ్ - భారతవర్షవర్ణనం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

యదిదం భారతం వర్షం యస్మిన్స్వాయంభువాదయః ।
చతుర్దశైవ మనవః ప్రజాసర్గం ససర్జిరే ॥1॥

ఇది భారతవర్షం. ఇందులో స్వాయంభువుడు మున్నగు పదునలుగురు మనువులు ప్రజాసృష్టి చేశారు.

ఏతద్వేదితుమిచ్ఛామః సకాశాత్తవ సువ్రత! ।
ఉత్తరశ్రవణం భూయః ప్రబ్రూహి వదతాం వర! ॥2॥

సువ్రతా! నీ నుండి ఈ వివరాలు వినగోరుతున్నాము. వక్తలలో శ్రేష్ఠుడా! ఆ తరువాతి వృత్తాంతం వివరించు.

ఏతచ్ఛ్రుత్వా ఋషీణాం తు ప్రాబ్రవీద్రౌమహర్షణిః ।
పౌరాణికస్తదా సూతో ఋషీణాం భావితాత్మనామ్ ॥3॥

భావితాత్ములగు ఈ ఋషుల మాటలు విని పౌరాణికుడైన రోమహర్షణుని సుతుడు సూతుడు ఇలా అన్నాడు.

బుద్ధ్వా విచార్య బహుధా విమృశ్య చ పునః పునః ।
తేభ్యస్తు కథయామాస ఉత్తరశ్రవణం తదా ॥4॥

బుద్ధితో అనేకవిధాల విచారించి మాటి మాటికి విమర్శించి వారికి తదనంతరవృత్తాంతాన్ని ఈ రీతిగా చెప్పాడు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఇదం తు మధ్యమం వర్షం శుభాశుభఫలోదయమ్ ।
దక్షిణం తు హిమాహ్వస్య సముద్రస్యాపి చోత్తరమ్ ॥

వర్షం తద్భారతం నామ యత్రేమా భారతాః ప్రజాః ॥5॥

అథాహం వర్ణయిష్యామి వర్షేఽస్మిన్ భారతే ప్రజాః ।
భరణాత్తు ప్రజానాం వై నను భారతముచ్యతే ॥6॥

ఇది మధ్యమ వర్షం. శుభాశుభఫలాలు కల్గిస్తుంది. హిమాలయానికి దక్షిణాన సముద్రానికి ఉత్తరాన ఉన్న వర్షమే భారతం. అక్కడి ప్రజలే భారతీయులు. ఇక నేను భారతవర్షంలోని ప్రజలనుగూర్చి వర్ణిస్తాను. ప్రజలను భరించడంవల్ల, ఇది భారత మనుబడుతున్నది.

నిరుక్తవచనైశ్చైవ వర్షం తద్భారతం స్మృతమ్ ।
యతః స్వర్గశ్చ మోక్షశ్చ మధ్యమశ్చాపి హి స్మృతః ॥7॥

నిరుక్తవచనాలవల్ల గూడా ఇది భారతమనబడింది. ఇక్కడివారికి కర్మఫలానుసారంంగా స్వర్గం, సాధనానుసారంగా మోక్షం సిద్ధిస్తాయి. ఈలోకం మధ్యమలోకమని చెప్పబడింది.

న ఖల్వన్యత్ర మర్త్యానాం భూమౌ కర్మవిధిః స్మృతః ।
భారతస్యాస్య వర్షస్య నవ భేదాన్నిబోధత ॥8॥

ఈ భూమిలో తప్ప ఇతరత్ర మనుజులకు కర్మవిధి లేదు. ఈ భారతవర్షానికి తొమ్మిది ద్వీపభేదాలు కలవని తెలుసుకోండి!

ఇంద్రద్వీపః కశేరుశ్చ తామ్రపర్ణీ గభస్తిమాన్ ।
నాగద్వీపస్తథా సౌమ్యో గన్ధర్వస్త్వథ వారుణః ॥9॥

అయం తు నవమస్తేషాం ద్వీపః సాగరసంవృతః ।
యోజనానాం సహస్రం తు ద్వీపోऽయం దక్షిణోత్తరః ॥10॥

ఇంద్రద్వీపం, కశేరుద్వీపం, తామ్రపర్ణీద్వీపం, గభస్తిద్వీపం, నాగద్వీపం, సౌమ్యద్వీపం, గంధర్వద్వీపం, వారుణద్వీపం, – తొమ్మిదవది భారతద్వీపం. ఇది సాగర పరివృతమైనది. ఇది దక్షిణోత్తరాలకు వెయ్యి యోజనాల కొలత గల్గియున్నది.

ఆయతస్తు కుమారీతో గంగాయాః ప్రవహావధిః ।
తిర్యగూర్ధ్వం తు విస్తీర్ణః సహస్రాణి దశైవ తు ॥11॥

కన్యాకుమారినుండి గంగవరకు దీని వైశాల్యం పొడవు వెడల్పులు గుణిస్తే పదివేల యోజనాలు.

ద్వీపో హ్యుపనివిష్టోऽయం మ్లేచ్ఛైరన్తేషు సర్వశః ।
యవనాశ్చ కిరాతాశ్చ తస్యాన్తే పూర్వపశ్చిమే ॥12॥

ఈ ద్వీపం నలువైపులా సరిహద్దులలో మ్లేచ్ఛులున్నారు. యవనులు, కిరాతులు దానికావల పూర్వపశ్చిమ దిశలలో ఉన్నారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా మధ్యే శూద్రాశ్చ భాగశః।
ఇజ్యాయుధవణిజ్యాది వర్తయన్తో వ్యవస్థితాః ॥13॥

మధ్యలో బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు యజనం, ఆయుధవృత్తి, వ్యాపారం మొదలగు వృత్తులతో జీవిస్తున్నారు.

తేషాం సంవ్యవహారోऽయం వర్తతే చ పరస్పరమ్ ।
ధర్మార్థకామసంయుక్తో వర్ణానాం చ స్వకర్మసు ॥14॥

ఆ వర్ణాల పరస్పరవ్యవహారం ధర్మార్థకామయుక్తమై స్వకర్మనియతమై ఉన్నది.

సంకల్పపచ్యమానానామాశ్రమాణాం యథావిధి ।
ఇహ స్వర్గాపవర్గార్థం ప్రవృత్తిరిహ మానుషీ ॥15॥

సత్సంకల్పంతో పరిణితమైన ఆశ్రమాలకు చెందిన మానుషప్రవృత్తి స్వర్గాన్నీ, మోక్షాన్నీ సాధించడానికే గాని ఇహలోక జీవనానికి పరిమితం కాదు.

యస్త్వయం మానవో ద్వీపస్తిర్యగ్గ్రామః ప్రకీర్తితః ।
య ఏనం జనయేత్ కృత్స్నం స సమ్రాడితి కీర్తితః ॥16॥

ఈ మానవద్వీపం తూర్పు పడమరలుగా వ్యాపించిన వీథులుగల గ్రామాలు కల్గి ఉన్నది. దీనిని మొత్తం సృష్టించినవాడు సమ్రాట్ అని చెప్పబడినాడు.

అయం లోకస్తు వై సమ్రాడన్తరిక్షం విరాట్ స్మృతః ।
స్వరాడసౌ స్మృతో లోకః పునర్వక్ష్యామి విస్తరాత్ ॥17॥ ।

ఈ మధ్యమలోకానికి సమ్రాట్ అని వ్యవహారం. అంతరిక్షానికి విరాట్ అని, ద్యులోకానికి స్వరాట్ అని వ్యవహారమున్నది. ఈ లోకాన్ని గురించి ఇంకా విస్తరించి చెబుతాను.

సప్త చాస్మిన్మహావర్షే విశ్రుతాః కులపర్వతాః ।
మహేంద్రో మలయః సహ్యః శుక్తిమానృక్షవానపి ॥18॥

విన్ధ్యశ్చ పారియాత్రశ్చ ఇత్యేతే కులపర్వతాః ।
తేషాం సహస్రశశ్చాన్యే పర్వతాస్తు సమీపతః ॥19॥

ఈ మహావర్షంలో సప్తకుల పర్వతాలు ప్రసిద్ధాలు అవి మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, ఋక్షవంతం, వింధ్యం, పారియాత్రం అనేవి ఇవి కులగిరులు. వాటి సన్నిధిలో వేలకొలది గిరులున్నాయి.

అభిజ్ఞాతాస్తతశ్చాన్యే విపులాశ్చిత్రసానవః ।
అన్యే తేభ్యః పరిజ్ఞాతా హ్రస్వాః స్వల్పోపజీవినః ॥20॥

మరియు చిత్రమైన సానువులు గల పెద్ద పెద్ద శాఖాపర్వతాలు గూడా ఉన్నాయి. మరికొన్ని వాటికంటే పొట్టివి, వృద్ధిని బట్టి శిలల గట్టితనాన్ని బట్టి అవి స్వల్పోపజీవులుగా ఉన్నాయి.

తైర్విమిశ్రా జానపదా ఆర్యా మ్లేచ్ఛాశ్చ సర్వతః ।
పిబన్తి బహులా నద్యో గంగా సిన్ధుః సరస్వతీ ॥21॥

శతద్రుశ్చంద్రభాగా చ యమునా సరయూస్తథా ।
ఐరావతీ వితస్తా చ విశాలా దేవికా కుహూః ॥22॥

వాటితో కలిసిపోయిన జానపదులు ఆర్యులు, మ్లేచ్ఛులు, అంతటా ఉన్నారు. వారంతా గంగ, సింధువు, సరస్వతి, శతద్రువు, చంద్రభాగ, యమున, సరయువు, ఐరావతి, వితస్త, విశాలా, దేవిక, కుహూ అనే నదుల జలం త్రాగి జీవిస్తున్నారు.

గోమతీ ధౌతపాపా చ బాహుదా చ దృషద్వతీ ।
కౌశికీ తు తృతీయా చ నిశ్చలా గణ్డకీ తథా ।
ఇక్షుర్లోహితమిత్యేతా హిమవత్పార్శ్వనిఃసృతాః ॥23॥

మరియు గోమతి, ధౌతపాప, బాహుద, దృషద్వతి, కౌశికీ, తృతీయ, నిశ్చల, గండకి, ఇక్షువు, లోహిత, అనేవి హిమవత్పార్శ్వంనుండి కల్గిన నదులు.

వేదస్మృతిర్వేత్రవతీ వృత్రఘ్నీ సిన్ధురేవ చ ।
పర్ణాశా నర్మదా చైవ కావేరీ మహతీ తథా ॥24॥

పారా చ ధన్వతీరూపా విదుషా వేణుమత్యపి ।
శిప్రా హ్యవన్తీ కున్తీ చ పారియాత్రాశ్రితాః స్మృతాః ॥25॥

వేదస్మృతి, వేత్రవతి, వృత్రఘ్ని, సింధువు, పర్ణాశ, నర్మద, కావేరి, మహతి, పారా, ధన్వతి, రూప, విదుష, వేణుమతి, శిప్ర, అవంతి, కుంతి, – ఇవి పారియాత్రగిరి నాశ్రయించిన నదులు.

మన్దాకినీ దశార్ణా చ చిత్రకూటా తథైవ చ ।
తమసా పిప్పలీ శ్యేనీ తథా చిత్రోత్పలాఽపి చ ॥26॥

విమలా చంచలా చైవ తథా చ ధూతవాహినీ ।
శుక్తిమన్తీ శునీ లజ్జా ముకుటా హ్రాదికాపి చ ।
ఋష్యవన్తప్రసూతాస్తా నద్యోఽమలజలాః శుభాః ॥27॥

మందాకిని, దశార్ణ, చిత్రకూట, తమస, పిప్పలి, శ్యేని, చిత్రోత్పల, విమల, చంచల, ధూతవాహిని, శుక్తి మంతి, శుని, లజ్జ, ముకుట, హ్రాదిక ఈ నదులు శుభమైనవి, నిర్మలజలం కలవి, ఋష్యవంతంనుండి పుట్టినవి.

తాపీ పయోష్ణీ నిర్విన్ధ్యా క్షిప్రా చ ఋషభా నదీ ।
వేణా వైతరణీ చైవ విశ్వమాలా కుముద్వతీ ॥28॥

తోయా చైవ మహాగౌరీ దుర్గమా తు శిలా తథా ।
విన్ధ్యపాదప్రసూతాస్తాః సర్వాః శీతజలాః శుభాః ॥29॥

తాపి, పయోష్ణి, నిర్వింధ్య, క్షిప్ర, ఋషభ, వేణా, వైతరణి, విశ్వమూల, కుముద్వతి, తోయ, మహాగౌరి, దుర్గమ, శిల – ఇవన్నీ చల్లని నీరు గలవి, శుభప్రదమైనవి, వింధ్యపాదం నుండి పుట్టినవి.

గోదావరీ భీమరథీ కృష్ణవేణీ చ వంజులా ।
తుంగభద్రా సుప్రయోగా వాహ్యా కావేరీ చైవ తు ।
దక్షిణాపథనద్యస్తాః సహ్యపాదాద్వినిః సృతాః ॥30॥

గోదావరి, భీమరథి, కృష్ణవేణి, వంజుల, తుంగభద్ర, సుప్రయోగ, వాహ్య, కావేరి – ఇవి సహ్యపాదం నుండి జనించి దక్షిణాపథమున ప్రవహించేవి.

కృతమాలా తామ్రపర్ణీ పుష్పజా హ్యుత్పలావతీ ।
మలయప్రసూతా నద్యస్తాః సర్వాః శీతజలాః శుభాః ॥31॥

కృతమాల, తామ్రపర్ణి, పుష్పజ, ఉత్పలావతి – చల్లనినీరు గల ఈ శుభనదులన్నీ మలయాద్రిలో పుట్టినవి.

త్రిభాగా ఋషికుల్యా చ ఇక్షుదా త్రిదివాచలా ।
తామ్రపర్ణీ తథా మూలీ శరవా విమలా తథా ।
మహేంద్రతనయాః సర్వాః ప్రఖ్యాతాః శుభగామినీః ॥32॥

త్రిభాగ, ఋషికుల్య, ఇక్షుద, త్రిదివాచల, తామ్రపర్ణి, మూలి, శరవా, విమల, ఇవి శుభగమనం కల్గినవి, మహేంద్రాద్రిలో జనించినవి.

కాశికా సుకుమారీ చ మన్దగా మన్దవాహినీ ।
కృపా చ పాశినీ చైవ శుక్తిమన్తాత్మజాస్తు తాః ॥33॥

కాశిక, సుకుమారి, మందగ, మందవాహిని, కృప, పాశిని – ఇవి శుక్తిమత్పర్వతం నుండి ప్రభవించినవి.

సర్వాః పుణ్యజలాః పుణ్యాః సర్వగాశ్చ సముద్రగాః ।
విశ్వస్య మాతరః సర్వాః సర్వపాపహరాః శుభాః ॥34॥

ఇవన్నీ పుణ్య జలాలు గలవి. పుణ్యమైనవి, సర్వగమనలై సముద్రం చేరేవి. ఇవన్నీ విశ్వానికి మాతలు, సర్వపాపాలు హరించునవి, శుభప్రదాలు.

తాసాం నద్యుపనద్యశ్చ శతశోఽథ సహస్రశః ।
తాస్విమే కురుపాంచాలాః సాల్వాశ్చైవ సజాఙ్గలాః ॥35॥

వాటికి నదులు, ఉపనదులు వందలు, వేలు ఉన్నాయి. వాటి తీరాలలో కురుపాంచాలాలు, సాల్వాలు, జాంగలసహితాలై (జాంగలాలనగా పంటకు పనికిరాని భూములు) ఉన్నాయి.

శూరసేనా భద్రకారా వాహ్యాః సహపటచ్చరాః ।
మత్స్యాః కిరాతాః కుల్యాశ్చ కున్తలాః కాశికోశలాః ॥36॥

ఆవన్తాశ్చ కలిఙ్గాశ్చ మూకాశ్చైవాన్ధకైః సహ ।
మధ్యదేశా జనపదాః ప్రాయశః పరికీర్తితాః ॥37॥

శూరసేన, భద్రకార, బాహ్య, పటచ్చరదేశాలు. మత్స్య, కిరాత, కుల్య, కుంతల, కాశి, కోసలాలు. ఆవంత, కళింగ, మూక, అంధక, మధ్య దేశాలు జనపదాలుగా కీర్తింపబడ్డాయి.

సహ్యస్యానన్తరే చైతే తత్ర గోదావరీ నదీ ।
పృథివ్యామపి కృత్స్నాయాం స ప్రదేశో మనోరమః ॥38॥

సహ్యపర్వతానికి, ఆవల గోదావరీనదికి మధ్యనున్న దేశాలివి. సకల భూతలంలోనూ ఈ ప్రదేశం మనోజ్ఞమైనది.

యత్ర గోవర్ధనో నామ మన్దరో గన్ధమాదనః ।
రామప్రియార్థం స్వర్గీయా వృక్షా దివ్యాస్తథౌషధీః ॥39॥

అక్కడ గోవర్ధనం, మందరం, గంధమాదనం ఉన్నాయి. స్వర్గీయదివ్య వృక్షాలూ, దివ్యౌషధులు, రాముని ప్రీతికొరకున్నాయి.

భరద్వాజేన మునినా ప్రియార్థమవతారితాః ।
తతః పుష్పవరో దేశస్తేన జజ్ఞే మనోరమః ॥40॥

అవి రాముని ప్రీతికై భరద్వాజమునిచే అవతరింపజేయబడినవి. అక్కడ మనోహరమైన పుష్పవరదేశం అతనిచే సృష్టింపబడింది.

బాహ్లీకా వాటధానాశ్చ ఆభీరాః కాలతోయకాః ।
పురంధ్రాశ్చైవ శూద్రాశ్చ పల్లవాశ్చాత్తఖణ్డికాః ॥41॥

గాంధారా యవనాశ్చైవ సింధుసౌవీరమద్రకాః ।
శకా ద్రుహ్యాః పులిన్దాశ్చ పారదాహారమూర్తికాః ॥42॥

బాహ్లీకాలు, వాటధానాలు, ఆభీరాలు, కాలతోయకాలు, పురంధ్రాలు, శూద్రాలు, పల్లవాలు, ఆత్తఖండికలు, గాంధారాలు, యవనాలు, సింధుసౌవీరమద్రకాలు, శకద్రుహ్యపులిందపారదహారమూర్తికాలు.

రామఠాః కణ్టకారాశ్చ కైకేయా దశ నామకాః ।
క్షత్రియోపనివేశ్యాశ్చ వైశ్యాః శూద్రకులాని చ ॥43॥

అత్రయోఽథ భరద్వాజాః ప్రస్థలాః సదసేరకాః ।
లంపకాస్తలగానాశ్చ సైనికాః సహ జాంగలైః ।
ఏతే దేశా ఉదీచ్యాస్తు ప్రాచ్యాన్దేశాన్నిబోధత ॥43॥

రామఠ కంటకార కైకేయ దేశాలు, దశనామకాలు, క్షత్రియులకు వైశ్యులకు, శూద్రకులాలకు ఆశ్రయాలు. ఆత్రేయాలు, భారద్వాజాలు, ప్రస్థలాలు, సదసేరకాలు, లంపకతలగానాలు, జాంగలాలతో కూడిన సైనికాలు ఇవన్నీ ఉత్తర దేశాలు. ఇక ప్రాచ్యదేశాలు తెలుసుకోండి.

అంగా వంగా మద్గురకా అన్తర్గిరిబహిర్గిరీ ।
సహ్యోత్తరాః ప్రవిజయా మార్గవాగ్గేయమాలవాః ॥44॥

ప్రాగ్జ్యోతిషాశ్చ పుంద్రాశ్చ విదేహాస్తామ్రలిప్తకాః ।
శాల్వమాగధగోనర్దాః ప్రాచ్యా జనపదాః స్మృతాః ॥45॥

అంగ, వంగ, మద్గురకాలు, అంతర్గిరులు, బహిర్గిరులు, సహ్యోత్తరాలు, ప్రవిజయాలు. మార్గవాగ్గేయ మాళవాలు, ప్రోగ్జ్యోతిష పుంద్ర విదేహాలు, తామ్రలిప్తకాలు, శాల్వమాగధగోనర్దాలు – ఇవి ప్రాచ్యజనపదాలు.

తేషాం పరే జనపదా దక్షిణాపథవాసినః ।
పాణ్డాశ్చ కేరలాశ్చైవ చోలాః కుల్యాస్తథైవ చ ॥46॥

వాటి కావల దక్షిణాపథంలో ఉండే దేశాలు. పాండ్య, కేరళ, చోళ, కుల్యాలు.

సేతుకాః సూతికాశ్చైవ కుపథా వాజివాసికాః ।
నవరాష్ట్రా మాహిషికాః కలింగాశ్చైవ సర్వశః ॥47॥

కారూషాశ్చ సహైషీకా ఆటవ్యాః శబరాస్తథా ।
పులిన్దా విన్ధ్యపుషికా వైదర్భా దణ్డకైః సహ ॥ 48॥

కులీయాశ్చ సిరాలాశ్చ రూపసాస్తాపసైః సహ ।
తథా తైత్తిరికాశ్చైవ సర్వే కారస్కరాస్తథా ॥49॥

వాసిక్యాశ్చైవ యే చాన్యే యే చైవాన్తరనర్మదాః ।
భారుకచ్చాః సమాహేయాః సహ సారస్వతైస్తథా ॥50॥

సేతుక, సూతిక, కుపథాలు, వాజివాసికలు, నవరాష్ట్ర, మాహిషికాలు, కలింగాలు, కారూష ఇషీక అటవీ శబరదేశాలు. పులింద, వింధ్యపుషిక, వైదర్భ, దండకాలు, కులీయ, సిరాల, రూపస తాపసాలు అట్లే తైత్తిరిక కారస్కారాలు. వాసిక్యాలు, ఆంతరనర్మదాలు, భారుకచ్చ సమాహేయ సారస్వతాలు,

కాచ్ఛీకాశ్చైవ సౌరాష్ట్రా ఆనర్తా అర్బుదైః సహ ।
ఇత్యేతే అపరాన్తాస్తు శృణు విన్ధ్యవాసినః ॥51॥

కాచ్ఛీక, సౌరాష్ట్ర, ఆనర్త, అర్బుదాలు ఇవి అపరాంత దేశాలు, ఇక వింధ్యగిరిలో కలవి విను

మాలవాశ్చ కరూషాశ్చ మేకలాశ్చోత్కలైః సహ ।
ఔండ్రా మాషా దశార్ణాశ్చ భోజాః కిష్కింధకైః సహ ॥52॥

మాళవ, కరూష, మేకల, ఉత్కలాలు, ఔండ్ర, మాష, దశార్ణ, భోజ కిష్కింధకాలు.

స్తోశలాః కోసలాశ్చైవ త్రైపురా వైదిశాస్తథా ।
తుమురాస్తుమ్బురాశ్చైవ పద్గమా నైషధైః సహ ॥53॥

స్తోశల, కోసల, త్రైపుర, వైదిశాలు, తుమురా, తుంబుర, పద్గమ, నైషధాలు

అరూపాః శౌండికేరాశ్చ వీతిహోత్రా అవన్తయః ।
ఏతే జనపదాః ఖ్యాతా విన్ధ్యపృష్ఠనివాసినః ॥54॥

అరూప, శౌండికేర, వీతిహోత్ర, ఆవన్తులు – ఈ జనపదాలు వింధ్య పృష్ఠమున నున్నవిగా విఖ్యాత పొందినవి.

అతో దేశాన్ ప్రవక్ష్యామి పర్వతాశ్రయిణశ్చ యే ।
నీహారాః హిమవర్గాశ్చ కుంతోదా కుశలావహాః ॥55॥

కర్ణప్రావరణాశ్చైవ ఊర్ణాదర్వాః సముద్గకాః ।
త్రిగర్తా మండలాశ్చైవ కిరాతాశ్చామరైః సహ ॥56॥

ఇక పర్వతాశ్రయం కల దేశాలను చెబుతాను. నీహారాలు, హిమవర్గాలు, కుంతోదాలు, కుశలావహాలు, కర్ణప్రావరణాలు, ఊర్ణాదర్వాలు, సముద్గకాలు, త్రిగర్త మండల కిరాత అమర జనపదాలు కలవు.

చత్వారి భారతే వర్షే యుగాని మునయోఽబ్రువన్ ।
కృతం త్రేతా ద్వాపరం చ కలిశ్చేతి చతుర్యుగమ్ ।
తేషాం స్వరూపం వక్ష్యామి హ్యుపరిష్టాచ్చ కృత్స్నశః ॥57॥

మునులు భారతదేశంలో నాల్గు యుగాలను చెప్పారు. కృతం, త్రేత, ద్వాపరం, కలి – అవి యుగచతుష్టయం పేర్లు, ఇక వాటి స్వరూపాలను సమగ్రంగా చెబుతాను.

మత్స్య ఉవాచ :– మత్స్యం చెప్పింది.

ఏతచ్ఛ్రుత్వా తు ఋషయ ఉత్తరం పునరేవ తే ।
శుశ్రూషవో ముదా యుక్తా హ్యబ్రువన్ రౌమహర్షణిమ్ ॥58॥

ఇది విని ఋషులు ఆపై సంతోషంతో ఇంకా వినగోరినవారై రౌమహర్షణితో ఇలా అన్నారు.

ఋషయః ఊచుః :– ఋషులు చెప్పారు.

యచ్చ కింపురుషం వర్షం హరివర్షం తథైవ చ ।
ఆచక్ష్వ నో యథాతత్త్వం కీర్తితం భారతం త్వయా ॥59॥

కింపురుషవర్షం, హరివర్షం – వీటిని గురించి చెప్పు. నీవు భారతవర్షం గురించి చక్కగా చెప్పావు.

జంబూఖండస్య విస్తారం తథాఽన్యేషాం విదాంవర! ।
ద్వీపానాం వాసినాం తేషాం వృక్షాణాం ప్రబ్రవీహి నః ॥60॥

విజ్ఞులలో శ్రేష్ఠుడవగు సూతా! జంబూఖండం, తదితరఖండాల విస్తారాన్ని, ద్వీపాలనూ, అక్కడ నివసించేవారిని, అక్కడి చెట్లను గురించి మాకు వివరించు.

పృష్టస్త్వేవం తదా విప్రైర్యథాప్రశ్నం విశేషతః ।
ఉవాచ ఋషిభిర్దృష్టం పురాణాభిమతం తథా ॥61॥

ఇలా విప్రు లడుగగా వారి ప్రశ్నల కనుగుణంగా విశేషించి, ఋషులు దర్శించినవి, పురాణాభిమతాలు అయిన విషయాల నిలా సూతుడు చెప్పాడు.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

శుశ్రూషవస్తు యద్విప్రాః శుశ్రూషధ్వమతంద్రితాః ।
జంబూషండః కింపురుషః సుమహాన్నన్దనోపమః ॥62॥

విప్రులారా! మీరు వినగోరియున్నారు కాన జాగరూకులై వినండి, జంబూవర్షంలోని కింపురుష వర్షమందు జంబూవనం మిక్కిలి పెద్దది. అది నందనంతో సమానమైనది.

దశ వర్షసహస్రాణి స్థితిః కింపురుషే స్మృతా ।
జాయన్తే మానవాస్తత్ర సుతప్తకనకప్రభాః ॥63॥

కింపురుష వర్షంలో జనులు పదివేల సంవత్సరాలు జీవిస్తారు. అక్కడి మనుజులు బాగా తప్తమైన కనకంవంటి కాంతి గల్గివుంటారు.

వర్షే కింపురుషే పుణ్యే ప్లక్షో మధువహః స్మృతః ।
తస్య కింపురుషాః సర్వే పిబన్తో రసముత్తమమ్ ॥64॥

పుణ్యప్రదమైన కింపురుష వర్షంలో మధువును స్రవించే జువ్విచెట్టు ఉన్నది. కింపురుషులందరూ ఉత్తమమైన దానిరసం త్రాగుతారు.

అనామయా హ్యశోకాశ్చ నిత్యం ముదితమానసాః ।
సువర్ణవర్ణాశ్చ నరాః స్త్రియశ్చాప్సరసః స్మృతాః ॥65॥

రోగం శోకం లేనివారై నిత్యం సంతోషంగా ఉంటారు, స్వర్ణవర్ణులూ అయిన నరులక్కడ ఉన్నారు. స్త్రీలు అప్సరసలవంటివారు.

తతః పరం కింపురుషాద్ధరివర్షం ప్రచక్షతే ।
మహారజతసంకాశా జాయన్తే యత్ర మానవాః ॥66॥

కింపురుషవర్షాని కావలి వర్షాన్ని హరివర్షమంటారు. అచ్చటి మనుజులు మహారజత కాంతిగల్గి జన్మిస్తారు.

దేవలోకచ్యుతాః సర్వే బహురూపాశ్చ సర్వశః ।
హరివర్షే నరాః సర్వే పిబన్తీక్షురసం శుభమ్ ॥67॥

వారంతా దేవలోక భ్రష్టులు, నానారూపాలు కలవారు, అక్కడి నరులందరూ శుభమైన ఇక్షురసం త్రాగుతారు.

న జరా బాధతే తత్ర తేన జీవన్తి తే చిరమ్ ।
ఏకాదశ సహస్రాణి తేషామాయుః ప్రకీర్తితమ్ ॥68॥

అక్కడ వార్ధకం బాధించదు, అందుచేత వారు చిరకాలం జీవిస్తారు. వారి ఆయువు పదునొకండువేల సంవత్సరాలని అంటున్నారు.

మధ్యమం తన్మయా ప్రోక్తం నామ్నా వర్షమిలావృతమ్ ।
న తత్ర సూర్యస్తపతి న చ జీర్యన్తి మానవాః ॥69॥

మధ్యమవర్షం పేరు ఇలావృతమని నేను చెప్పాను. అక్కడ సూర్యుడు ప్రకాశించడు. అక్కడి నరులు శైథిల్యం పొందరు.

న చంద్రసూర్యౌ న క్షత్రం న తత్ర పవనానలౌ ।
పద్మప్రభాః పద్మవర్ణాః పద్మపత్రనిభేక్షణాః ॥70॥

పద్మగన్ధాశ్చ జాయంతే తత్ర సర్వే చ మానవాః ।
జంబూఫలరసాహార మశ్నంతస్తే సుగన్ధినః ॥71॥

ఇలావృతంలో చంద్రసూర్యులు, చుక్కలు ప్రకాశించవు. పద్మకాంతి సంపన్నులు, పద్మవర్ణులు, పద్మపత్రనేత్రులు పద్మగంధులుగా అక్కడి మనుజులంతా జన్మిస్తారు. జంబూఫలరసం వారి ఆహారం, వారు సుగంధం కల్గి వుంటారు.

దేవలోకచ్యుతాః సర్వే మహారజతవాససః ।
దశ పంచ సహస్రాణి వర్షాణాం తే నరోత్తమాః ॥72॥

ఆయుష్ప్రమాణం జీవన్తి యే తు వర్ష ఇలావృతే ।
మేరోస్తు దక్షిణే పార్శ్వే నిషధస్యోత్తరేణ వా ॥73॥

సుదర్శనో నామ మహాంజంబూవృక్షః సనాతనః ।
నిత్యపుష్పఫలోపేతః సిద్ధచారణసేవితః ॥74॥

వారందరూ దేవలోకభ్రష్టులే. మహారజతంవంటి వస్త్రాలు వారు ధరిస్తారు. వారు పదునైదు వేల సంవత్సరాలు జీవిస్తారు. ఇలావృతవర్షంలో పై ఆయుష్ప్రమాణం జీవిస్తారు. మేరువు దక్షిణపార్శ్వంలో నిషధానికి ఉత్తరాన'సుదర్శన' మనే ఒకపెద్ద సనాతన జంబూవృక్షం ఉన్నది. అది నిత్యం పుష్పఫలసమేతమై యుంటుంది. సిద్ధచారణులు దాన్ని సేవిస్తారు.

తస్య నామ్నా సమాఖ్యాతో జంబూద్వీపో వనస్పతేః ।
యోజనానాం సహస్రం చ శతధా చ మహాన్పునః ॥75॥

ఆ చెట్టు పేరుతోనే జంబూద్వీపం పేర్కొనబడింది. వెయ్యి యోజనాలు, మరల వందలరెట్లు పెద్దది.

ఉత్సేధో వృక్షరాజస్య దివమావృత్య తిష్ఠతి ।
తస్య జంబూఫలరసో నదీ భూత్వా ప్రసర్పతి ॥76॥

ఆ వృక్షరాజపు టౌన్నత్యం స్వర్గాన్ని ఆవరించి వున్నది. దాని ఫలరసం నదియై ప్రవహిస్తున్నది.

మేరుం ప్రదక్షిణం కృత్వా జంబూమూలగతా పునః ।
తం పిబన్తి సదా హృష్టా జంబూరసమిలావృతే ॥77॥

మేరుప్రదక్షిణంచేసి మరల ఆ నది జంబూవృక్షం మొదటికి పోయి వున్నది. ఇలావృతవాసులు సంతోషంగా జంబూఫలరసం త్రాగుతారు.

జంబూఫలరసం పీత్వా న జరా బాధతేఽపి తాన్ ।
న క్షుధా న క్లమో వాపి న దుఃఖం చ తథావిధమ్ ॥78॥

ఆ రసం త్రాగినవారిని జర బాధించదు. ఆకలి, అలసట, దుఃఖం అనేవి వారికుండవు. అది అలాంటిచెట్టు.

తత్ర జాంబూనదం నామ కనకం దేవభూషణమ్ ।
ఇంద్రగోపకసంకాశం జాయతే భాసురం చ యత్ ॥79॥

అక్కడ జాంబూనదమనే దేవతల కలంకారమైన కనకం ఇంద్రగోపకులవంటి కాంతి గలిగి ప్రకాశవంతమై జనిస్తుంది.

సర్వేషాం వర్షవృక్షాణాం శుభః ఫలరసస్తు సః ।
స్కన్నం తు కాంచనం శుభ్రం జాయతే దేవభూషణమ్ ॥80॥

అన్ని వర్షవృక్షాల ఫలరసాలకంటే ఆ ఫలరసం శ్రేష్ఠమైనది. దానిజిగురు శుభ్రకాంచనమై దేవతలకు భూషణ మవుతున్నది.

తేషాం మూత్రం పురీషం వా దిక్ష్వష్టాసు చ సర్వశః ।
ఈశ్వరానుగ్రహాద్భూమిర్మృతాంశ్చ గ్రసతే తు తాన్ ॥81॥

ఈశ్వరానుగ్రహంవల్ల అక్కడి జనుల మూత్ర పురీషాలు అష్టదిక్కులలో సువర్ణమై భాసిస్తాయి. మరియు అక్కడ మరణించినవారిని భూమి మ్రింగివేస్తుంది.

రక్షః పిశాచా యక్షాశ్చ సర్వే హైమవతాస్తు తే ।
హేమకూటే తు విజ్ఞేయా గన్ధర్వాః సాప్సరోగణాః ॥82॥

రక్షః పిశాచులు, యక్షులు, హిమవంతంలోనూ, గంధర్వులు, అచ్చరలు – హేమకూటంలోనూ ఉంటారు.

సర్వే నాగా నిషేవన్తే శేషవాసుకితక్షకాః ।
మహామేరౌ త్రయస్త్రింశత్ క్రీడన్తే యజ్ఞియాః శుభాః ॥83॥

శేషుడు, వాసుకి, తక్షకుడు, సర్వనాగులూ దాన్ని సేవిస్తారు. మహామేరువులో ముప్పది ముగ్గురు దేవతలు శుభప్రదులై క్రీడిస్తారు.

నీలవైదూర్యయుక్తేఽస్మిన్ సిద్ధా బ్రహ్మర్షయోఽవసన్ ।
దైత్యానాం దానవానాం చ శ్వేతః పర్వత ఉచ్యతే ॥84॥

నీలవైదూర్యాలకు నిలయమైన ఇచ్చట సిద్ధులు, బ్రహ్మర్షులు నివసించారు. దైత్యదానవులకు శ్వేతపర్వతం నివాసమైవుంది.

శృంగవాన్ పర్వతశ్రేష్ఠః పితౄణాం ప్రతిసంచరః ।
ఇత్యేతాని మయోక్తాని నవవర్షాణి భారతే ॥85॥

శృంగవంతమనే పర్వతరాజం పితరులకు అశ్రయమైనది. ఇలా భారతవర్షంలోని తొమ్మిది వర్షాలను గురించి వివరించాను.

భూతైరపి నివిష్టాని గతిమన్తి ధ్రువాణి చ ।
తేషాం వృద్ధిర్బహువిధా దృశ్యతే దేవమానుషైః ।
అశక్యా పరిసంఖ్యాతుం శ్రద్ధేయా వై మయోదితాః ॥86॥

అవి ప్రాణులకు నివేశనాలు, గమనం కలవి, స్థిరమైనవి వాటి వృద్ధి నానావిధాలుగా వుంటుంది. దేవతల చేతా, మనుజులచేతా ఇదమిత్థమని లెక్కించడం సాధ్యం కాదు. నేను చెప్పిన ఈ విషయాలను విశ్వసించవలసినదే.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే భారతవర్షవర్ణనం నామ చతుర్దశాధికశతతమోఽధ్యాయః ॥ 114 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని భారతవర్షవర్ణనమనే నూటపదునాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచదశాధిక శతతమోఽధ్యాయః – నూటపదిహేనవ అధ్యాయం

పురూరవః పూర్వచరిత్రమ్ – పురూరవుని పూర్వచరిత్ర

మనురువాచ :– మనువు చెప్పాడు.

చరితం బుధపుత్రస్య జనార్దన! మయా శ్రుతమ్ ।
శ్రుతః శ్రాద్ధవిధిః పుణ్యః సర్వపాపప్రణాశనః ॥1॥

జనార్దనా! బుధుని పుత్రుడైన పురూరవుని చరిత్ర విన్నాను. పుణ్యప్రదమై సర్వపాపాలనూ హరించే శ్రాద్ధవిధిని విన్నాను.

ధేన్వాః ప్రసూయమానాయాః ఫలం దానస్య మే శ్రుతమ్ ।
కృష్ణాజినప్రదానం చ వృషోత్సర్గస్తథైవ చ ॥2॥

ప్రసవించే ఆవును దానమిచ్చినందుకు కలిగే ఫలమును గూర్చి విన్నాను. అలాగే కృష్ణాజినం దానం చేయడం, వృషభాన్ని వదలిపెట్టడం గూర్చి కూడా విన్నాను.

శ్రుత్వా రూపం నరేంద్రస్య బుధపుత్రస్య కేశవ! ।
కౌతూహలం సముత్పన్నం తన్మమాచక్ష్వ పృచ్ఛతః ॥3॥

కేశవా! బుధుని పుత్రుడైన పురూరవ నరేంద్రుని రూపాన్ని గురించి వినగా నాకు కౌతూహలం కల్గింది. ఆ సంగతి అడుగుతున్నాను. నాకు చెప్పు.

కేన కర్మవిపాకేన స తు రాజా పురూరవాః ।
అవాప తాదృశం రూపం సౌభాగ్యమపి చోత్తమమ్ ॥4॥

దేవాంస్త్రిభువనశ్రేష్ఠాన్ గన్ధర్వాంశ్చ మనోరమాన్ ।
ఉర్వశీ సజ్జతా త్యక్త్వా సర్వభావేన తం నృపమ్ ॥5॥

ఏ కర్మవిపాకం చేత ఆ పురూరవరాజు అట్టి రూపాన్నీ, ఉత్తమమైన సౌభాగ్యాన్నీ పొందాడు? త్రిభువనశ్రేష్ఠులైన మనోహరులైన దేవతలనూ, గంధర్వులనూ, వదలి ఊర్వశి సర్వభావంతో పురూరవుణ్ణి పొందింది.

మత్స్య ఉవాచ :– మత్స్యం చెప్పింది.

శృణు కర్మవిపాకేన యేన రాజా పురూరవాః ।
అవాప తాదృశం రూపం సౌభాగ్యమపి చోత్తమమ్ ॥6॥

ఏ కర్మవిపాకంతో రాజైన పురూరవుడు అట్టి రూపాన్నీ, ఉత్తమ సౌభాగ్యాన్నీ పొందాడో చెబుతాను విను.

అతీతే జన్మని పురా యోఽయం రాజా పురూరవాః ।
మద్రదేశే మహేష్వాసో భూమిపశ్చాక్షుషేంతరే ॥7॥

ఈ పురూరవుడనే రాజు పూర్వజన్మలో మద్రదేశాధిపతి. చాక్షుషమన్వంతరంలో గొప్ప ధానుష్కుడైన నరపతిగా ఉండినాడు.

పూర్వం సర్వైర్నృపగుణైః యుక్తః పరపురంజయః ।
నృపోఽసౌ ధనవాన్జాతః కేవలం రూపవర్జితః ॥8॥

పూర్వము ఈ రాజు సమస్తమైన రాజగుణాలతో కూడినవాడై శత్రునగరాలను జయించినవాడై ధనికుడై ఉండినాడు. కాని రూపము లేనివాడుగా ఉండేవాడు.

ఋషయ ఊచుః :– ఋషులు చెప్పారు.

పురూరవా మద్రపతిః కర్మణా కేన పార్థివః ।
బభూవ కర్మణా కేన రూపవాంశ్చైవ సూతజ! ॥9॥

సూతపుత్రా! మద్రపతి అగు పురూరవ రాజు ఏ కర్మచేసి మరల రూపవంతుడైనాడు?

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

ద్విజగ్రామే ద్విజశ్రేష్ఠో నామ్నా చాసీత్పురూరవాః ।
నద్యాః కూలే మహారాజః పూర్వజన్మని పార్థివః ॥10॥

ఈ మహారాజు నదీతీరంలో ఒకద్విజగ్రామంలో జన్మించాడు. అప్పుడు కూడా అతని పేరు పురూరవుడు.

స తు మద్రపతీ రాజా యస్తు నామ్నా పురూరవాః ।
తస్మిన్ జన్మన్యసౌ విప్రో ద్వాదశ్యాం తు సదాఽనఘ! ॥11॥

ఉపోష్య పూజయామాస రాజ్యకామో జనార్దనమ్ ।
చకార సోపవాసశ్చ స్నానమభ్యఙ్గపూర్వకమ్ ॥12॥

ఆ మద్రపతియగు రాజు పూర్వజన్మలో విప్రుడై ప్రతిద్వాదశినాడు ఉపవసించి రాజ్యం కోరి జనార్దనుణ్ణి పూజించేవాడు. అలా ఉపవాసం ఉంటూ అభ్యంగనస్నానం చేశాడు.

ఉపవాసఫలాత్ప్రాప్తం రాజ్యం మద్రేష్వకణ్టకమ్ ।
ఉపోషితస్తథాభ్యంగాద్రూపహీనో వ్యజాయత ॥13॥

ఉపవాసఫలంగా అతనికి నిష్కంటకమైన రాజ్యం లభించింది. ఉపవసించి అభ్యంగనస్నానం చేయడం వల్ల రూపహీనుడై జన్మించాడు.

ఉపోషితైర్నరైస్తస్మాత్స్నానమభ్యఙ్గపూర్వకమ్ ।
వర్జనీయం ప్రయత్నేన రూపఘ్నం తత్పరం నృప ॥14॥

అంచేత ఉపవసించినవాడు అభ్యంగపూర్వక స్నానం చేయరాదు. రాజా! అది మిక్కిలి రూపవినాశకమైనచర్య.

ఏతద్వః కథితం సర్వం యద్వృత్తం పూర్వజన్మని ।
మద్రేశ్వరత్వచరితం శృణు తస్య మహీపతేః ॥15॥

పూర్వజన్మలో ఏమి జరిగినదో అదంతా మీకు చెప్పాను. ఇక మద్రమహీపతిగా ఉన్నపుడు అతని చరిత్ర వినండి.

తస్య రాజగుణైః సర్వైః సముపేతస్య భూపతేః ।
జనానురాగో నైవాసీద్రూపహీనస్య తస్య వై ॥16॥

అతడు అన్ని రాజగుణాలూ కల్గిన భూపతియే కాని రూపహీనుడు కావడంవల్ల అతని పట్ల జనులకు అనురాగం లేకుండా పోయింది.

రూపకామః స మద్రేశస్తపసే కృతనిశ్చయః ।
రాజ్యం మంత్రిగతం కృత్వా జగామ హిమపర్వతమ్ ॥17॥

రూపం కోరి ఆ మద్రరాజు తపస్సు చేయాలనుకొని నిశ్చయించుకొని రాజ్యాన్ని మంత్రికధీనం చేసి హిమాద్రికి వెళ్ళాడు.

వ్యవసాయద్వితీయస్తు పద్భ్యామేవ మహాయశాః।
ద్రష్టుం స తీర్థసదనం విషయాన్తే స్వకే నదీమ్ ।
ఐరావతీతి విఖ్యాతాం దదర్శాతిమనోరమామ్ ॥18॥

తన నిశ్చయమే తోడుగా కాలినడకతోనే తీర్థసదనం చూడడానికి పోయి ఆ మహాకీర్తిమంతుడు తన రాజ్యం చివర 'ఐరావతి' అని ప్రసిద్ధమైన అతిమనోజ్ఞమైన నదిని చూచాడు.

తుహినగిరిభవాం మహౌఘవేగాం తుహినగభస్తిసమానశీతలోదామ్ ।
తుహినసదృశహైమవర్ణపుంజాం తుహినయశాః సరితం దదర్శ రాజా ॥19॥

హిమాలయంనుండి జనించినదీ, గొప్ప ప్రవాహవేగం కలదీ, చంద్రకిరణాలవంటి చల్లని నీరు గలదీ, మంచుతో సమానమైన హేమవర్ణం కలదైన ఆ నదిని మంచులాగా తెల్లని కీర్తి గల ఆ రాజు దర్శించాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే పురూరవః పూర్వచరిత్రం నామ పంచదశాధికశతతమోఽధ్యాయః ॥ 115 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని పురూరవుని పూర్వచరిత్రమనే నూటపదిహేనవ అధ్యాయం సంపూర్ణం

షోడశాధికశతతమోఽధ్యాయః - నూటపదహారవ అధ్యాయం

ఐరావతీనదీ వర్ణనమ్ - ఐరావతీ నది వర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

స దదర్శ నదీం పుణ్యాం దివ్యాం హైమవతీం శుభామ్ ।
గన్ధర్వైశ్చ సమాకీర్ణాం నిత్యం శక్రేణ సేవితామ్ ॥1॥

ఆ రాజు పవిత్రమూ, దివ్యమూ, హిమవంతంనుండి పుట్టినదీ, శుభమైనదీ, నిత్యం గంధర్వులతో వ్యాప్తమైనదీ, ఇంద్రునిచే సేవింపబడినదీ అయిన ఐరావతీనదిని చూచాడు.

సురేభమదసంసిక్త వరగంధ సమన్వితామ్ ।
మధ్యేన శక్రచాపాభాం తస్మిన్వహతి సర్వదా ॥2॥

ఐరావత గజముయొక్క మదజలముచే తడుపబడి మంచి గంధముతో కూడినదీ, మదజలస్పర్శచే సదా ప్రవాహమధ్యమున ఇంద్రచాపమువంటి కాంతి గలదీ అయిన నది అది.

తపస్విశరణోపేతాం మహాబ్రాహ్మణసేవితామ్ ।
దదర్శ తపనీయాభాం మహారాజాః పురూరవాః ॥3॥

దాని తీరంలో తపోధనుల కుటీరాలున్నాయి. మహాబ్రాహ్మణులు దాన్ని సేవిస్తున్నారు. బంగారం వంటి ప్రకాశం కల ఆ నదిని పురూరవమహారాజు దర్శించాడు.

సితహంసావలిచ్ఛన్నాం కాశచామరరంజితామ్ ।
సాభిషిక్తామివ స తాం పశ్యన్ ప్రీతిం పరాం యయౌ ॥4॥

తెల్లనిహంసలచే ఆవృతమై కాశమనే చామరలచే రంజిల్లునదై, అభిషేకించబడినదా అన్నట్లున్న ఆ నదిని చూచి అతడెంతో ప్రీతి పొందాడు.

పుణ్యాం సుశీతలాం హృద్యాం మనసః ప్రీతివర్ధినీమ్ ।
క్షయవృద్ధియుతాం రమ్యాం సోమమూర్తిమివాపరామ్ ॥5॥

పుణ్యమైనది, చల్లనిది, మనోహరమైనది, మనస్సుకు ప్రీతి కల్గించేదీ, పెరుగుదల- తరుగుదలలు గలదై మరొక చంద్రుని మూర్తియా అన్నట్లు భాసించునదీ,

సుశీతశీఘ్రపానీయాం ద్విజసఙ్ఘనిషేవితామ్ ।
సుతాం హిమవతః శ్రేష్ఠాం చంచద్వీచివిరాజితామ్ ॥6॥

అమృతస్వాదుసలిలాం తాపసైరుపశోభితామ్ ।
స్వర్గారోహణనిఃశ్రేణీం సర్వకల్మషనాశినీమ్ ॥7॥

వడిగా పారే శీతలజలం కలదీ, పక్షుల గుంపులచే సేవింపబడునదీ, హిమాద్రి యొక్క శ్రేష్ఠమైన పుత్రిక, చలించే అలలచే ఒప్పారేదీ, అమృతంలాగా రుచికరమైన జలం కలదీ, తాపసులచే శోభిల్లునదీ, స్వర్గారోహణకు నిచ్చెన యైనదీ, సకలపాపాలూ నశింపజేసేదీ,

అగ్ర్యాం సముద్రమహిషీం మహర్షిగణసేవితామ్ ।
సర్వలోకస్య చౌత్సుక్యకారిణీం సుమనోహరామ్ ॥8॥

సముద్రునికి అగ్రమహిషియైనదీ, మహర్షి గణముచే సేవింపబడునదీ, సకల లోకానికీ ఔత్సుక్యం కలిగించేదీ, అతిమనోజ్ఞమైనదీ,

హితాం సర్వస్య లోకస్య నాకమార్గప్రదాయికామ్ ।
గోకులా కులతీరాన్తాం రమ్యాం శైవాలవర్జితామ్ ॥9॥

సర్వలోకానికీ హితం చేకూర్చునదీ, స్వర్గానికి మార్గం చూపేదీ, గోకుల వ్యాప్తమైన తీరాంతం కలదీ, రమ్యమైనదీ, పాచి లేనిదీ–

హంససారససంఘుష్టాం జలజైరుపశోభితామ్ ।
ఆవర్తనాభిగంభీరాం ద్వీపోరుజఘనస్థలీమ్ ॥10॥

హంసలచే, సారసములచే వ్యాప్తమైనదీ, పద్మాలతో శోభిల్లునదీ, సుడి అను నాభిచే గంభీరమైనదీ, ద్వీపమనే పెద్ద జఘనం కలదీ–

నీలనీరజనేత్రాభాముత్ఫుల్లకమలాననామ్ ।
హిమాభఫేనవసనాం చక్రవాకస్తనీం శుభామ్ ।
బలాకాపంక్తిదశనాం చలన్మత్స్యావలిభ్రువమ్ ॥11॥

నల్ల గలువలనే నేత్రాలు కలదీ, వికసితకమలాలనే ముఖం కలదీ, మంచువంటి నురుగు వలువలు గలదీ, చక్రవాకమనే కుచాలు కలదీ, శుభావహమైనదీ, కొంగల వరుస అనే దంతాలు గలదీ, కదిలే చేపలనే భ్రూలత గలదీ–

స్వజలోద్భూతమాతఙ్గరమ్యకుంభపయోధరామ్ ।
హంసనూపురసంఘుష్టాం మృణాలవలయావలీమ్ ॥12॥

తన జలంలో ఉద్భూతమైన ఏనుగుల రమ్యమైన కుంభాలనే స్తనాలు గలదీ, హంసనూపుర వ్యాప్తమైనదీ, తామర తూడులనే గొలుసు కలదీ, అయిన ఆ నదిని రాజు చూచాడు.

తస్యాం రూపమదోన్మత్తా గన్ధర్వానుగతాః సదా ।
మధ్యాహ్నసమయే రాజన్ క్రీడన్త్యప్సరసాం గణాః ॥13॥

రాజా! ఆ నదిలో రూపమదముచే ఉన్మత్తలూ, గంధర్వులచే సదా అనుగమింపబడువారూ అయిన అచ్చరలు మధ్యాహ్నకాలంలో క్రీడిస్తారు.

తామప్సరో వినిర్ముక్తం వహన్తీం కుంకుమం శుభమ్ ।
స్వతీరద్రుమసంభూతనానావర్ణసుగన్ధినీమ్ ॥14॥

అచ్చరలు వదలిన కుంకుమ వహించేదీ, శుభప్రదమైనదీ, తన తీరంలోని చెట్లకు పూచిన నానావర్ణాల పూల సౌందర్యంచే శోభితమైనదీ,

తరఙ్గవ్రాతసంక్రాన్తసూర్యమణ్డలదుర్దృశామ్ ।
సురేభజనితాఘాత వప్రద్వయవిభూషితామ్ ॥15॥

అలలశ్రేణిపై ప్రతి ఫలించిన సూర్యమండలముచే చూచుటకు వీలుగానిదీ, ఐరావతగజముచే కలిగిన దెబ్బలు గల రెండు గట్లచే అలంకృతమైనదీ.

శక్రేభగణ్డసలిలైర్దేవస్త్రీకుచచన్దనైః ।
సంయుతం సలిలం తస్యాః షట్పదైరుపసేవ్యతే ॥16॥

ఐరావతగండజలాలచేతా, సురవనితలకుంచచందనాలచేతా కూడిన ఆ నదినీరు తుమ్మెదలచే సేవింపబడుతున్నది.

తస్యాస్తీరభవా వృక్షాః సుగన్ధకుసుమాంచితాః ।
మరందాకృష్టసంభ్రాన్తభ్రమరస్తనితాకులాః ॥17॥

దాని గట్టున పుట్టిన చెట్లు సుగంధం కల పూలుగలవై మకరందముయొక్క ఆకర్షణకులోనై సంభ్రాంతములైన భ్రమరాల ధ్వనిచేత ఆకులములైనవి.

యస్యాస్తీరే రతిం యాన్తి సదా కామవశా మృగాః ।
తపోధనాశ్చ ఋషయస్తథా దేవాః సహాప్సరాః ॥18॥

ఆనది గట్టున కామవశమైన మృగాలు రమిస్తాయి. అట్లే తపోధనులు, ఋషులు, అచ్చరలతో గూడి దేవతలు రమిస్తారు.

లభన్తే యత్ర పూతాఙ్గా దేవేభ్యః ప్రతిమానితాః ।
స్త్రియశ్చ నాకబహులాః పద్మేన్దుప్రతిమాననాః ॥19॥

అక్కడ స్నానం చేసి పవిత్రమైన శరీరాలు గల స్వర్గవనితలు పద్మాలతోనూ, చంద్రునితోనూ సమానమైన ముఖాలు గలవారై దేవతలచే ఆదరింపబడుతున్నారు.

యా బిభర్తి సదా తోయం దేవసంఘైర్నిషేవితమ్ ।
పులిన్దైర్నృపసఙ్ఘైశ్చ వ్యాఘ్రవృన్దైరపీడితమ్ ॥20॥

అది దేవసంఘాలచే సేవింపబడినవి, పులిందులు, నృపసంఘాలు, వ్యాఘ్రబృందాలచే పీడింపబడనివగు జలాలు గలదై యున్నది.

సతామరసపానీయాం సతారగగనామలామ్ ।
స తాం పశ్యన్యయౌ రాజా సతామీప్సితకామదామ్ ॥21॥

పద్మాలతో గూడిన జలం కలది, నక్షత్రసహితమైన ఆకాశం లాగా నిర్మలమైనది, సజ్జనులకు ఈప్సితాలను బడగూర్చునదీ అయిన ఆ నదిని చూస్తూ ఆ రాజు పయనించాడు.

యస్యాస్తీరరుహైః కాశైః పూర్ణైశ్చంద్రాంశుసన్నిభైః ।
రాజతే వివిధాకారై రమ్యం తీరం మహాద్రుమైః ।
యా సదా వివిధైర్విప్రైర్దేవైశ్చాపి నిషేవ్యతే ॥22॥

ఆ నది గట్టున మొలచిన రెల్లుచెట్లు పూర్ణచంద్రునిలా ఉన్నాయి. వివిధాకారాలు గల ఆ చెట్లచేతా, మహా వృక్షాలచేతా దాని తీరం మనోజ్ఞంగా వున్నది. విప్రులు, దేవతలు దాన్ని సదా సేవిస్తారు.

యా చ సదా సకలౌఘవినాశం భక్తజనస్య కరోత్యచిరేణ ।
యాఽనుగతా సరితాం హి కదంబైర్యాఽనుగతా సతతం హి మునీంద్రైః॥23॥

ఆ నది భక్తుల పాపాలను అచిరకాలంలో నశింపజేస్తుంది. దాన్ని సరిత్సమూహాలు అనుగమిస్తాయి. సదా మునీంద్రులు దాన్ని అనుసరిస్తారు.

యా హి సుతానివ పాతి మనుష్యాన్ యా చ యుతా సతతం హిమసంఘైః ।
యా చ యుతా సతతం సురవృన్దైర్యా చ జనైః స్వహితాయ శ్రితా వై ॥24॥

అది పుత్రులను వలె మనుజులను రక్షిస్తుంది. సదా హిమసంఘాలచే కూడి వుంటుంది. సుర బృందాలతో, జనులతో తమ హితం కొరకై ఆ నది సంయుక్తమై వుంటుంది.

యుక్తా చ కేసరిగణైః కరివృన్దజుష్టా సన్తానయుక్తసలిలాఽపి సువర్ణవర్ణా।
సూర్యాంశుతాపపరివృద్ధివివృద్ధశీతా శీతాంశుతుల్యయశసా దదృశే నృపేణ ॥25॥

సింహగణాలతో కూడినది, ఏనుగుల గుంపులు గలదీ, సంతాన వృక్షాలతో గూడిన జలం కలదై, సువర్ణ వర్ణసమేతమైనదీ, సూర్యకిరణాల వేడిమికి కరిగిన మంచుచే చల్లనైనది అయిన ఆ నదిని చంద్రునితో సమానమైన కీర్తి గల ఆ రాజు చూచాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే భువనకోషే ఐరావతీ నదీవర్ణనం నామ షోడశాధికశతతమోఽధ్యాయః ॥ 116 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని ఐరావతీ నదీవర్ణనమనే నూటపదునారవ అధ్యాయం సంపూర్ణం

సప్తదశాధికశతతమోఽధ్యాయః - నూటపదిహేడవ అధ్యాయం

హిమవద్వర్ణనమ్ - హిమవద్వర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఆలోకయన్ నదీం పుణ్యాం తత్సమీరహృతశ్రమః ।
స గచ్ఛన్నేవ దదృశే హిమవన్తం మహాగిరిమ్ ॥1॥

పవిత్రమైన ఆ నదిని చూస్తూ దాని గాలిచే శ్రమ దీరినవాడై అలా పోతూ పోతూ ఆ రాజు హిమవంతమనే మహాపర్వతాన్ని చూచాడు.

ఖముల్లిఖద్భిర్బహుభిర్వృతం శృంగైస్తు పాణ్డురైః ।
పక్షిణామథ సంచారైః ఋషీణాం సిద్ధిదం శుభమ్ ॥2॥

తెల్లనైన దాని అనేక శిఖరాలు ఆకాశాన్ని అంటి వున్నాయి. పక్షిసంచారంతో అది రమ్యమైనది. ఋషులకు సిద్ధి కలిగించేది, శుభప్రదమైనది.

నదీప్రవాహసంజాతమహాశబ్దైః సమన్తతః ।
అసంశ్రుతాన్యశబ్దం తం శీతతోయం మనోరమమ్ ॥3॥

నదీ ప్రవాహంవల్ల కలిగిన పెద్ద శబ్దాలచేత నలు ప్రక్కలా వేరే శబ్దాలేవీ అక్కడ వినిపించలేదు. అది చల్లని నీటితో మనోజ్ఞంగా వున్నది.

దేవదారువనైర్నీలైః కృతాధోవసనం శుభమ్ ।
మేఘోత్తరీయకం శైలం దదృశే స నరాధిపః ॥4॥

నీలవర్ణం కల దేవదారువృక్షాలు ఆ గిరికి క్రింది వస్త్రాలయ్యాయి. అది మేఘాలనే ఉత్తరీయం కల్గి ఉన్నది. అట్టి గిరిని రాజు చూచాడు.

శ్వేతమేఘకృతోష్ణీషం చంద్రార్కముకుటం క్వచిత్ ।
హిమానులిప్తసర్వాఙ్గం క్వచిద్ధాతువిమిశ్రితమ్ ॥5॥

ఒకచో ఆ పర్వతం తెల్లమేఘాలను తలపాగాగా కల్గి, సూర్యచంద్రులనే మకుటంగా ధరించిఉన్నది. మంచుచే ఆవృతమైన సకలశరీరం కలదై అది ఒక్కొక్కచోట ధాతువులచే మిశ్రితమై ఉన్నది.

చన్దనేనానులిప్తాంగం దత్తపంచాంగులం యథా ।
శీతప్రదం నిదాఘేఽపి శిలావికటసంకటమ్ ।
సాలక్తకైరప్సరసాం ముద్రితం చరణైః క్వచిత్ ॥6॥

అయిదు వ్రేళ్ళతో రాసుకొన్న చందనరేఖలతో ఒప్పారిన దన్నట్లు చందనానులిప్తమైన అంగం కలదై, ఎండకాలంలో సైతం చల్లదనం కల్గిస్తూ శిలలచే వికటంగా వ్యాప్తమైయున్నది. ఒక్కొక్కచో లత్తుక పూసిన అచ్చరల చరణాలచే ముద్రితమైనది.

క్వచిత్సంస్పృష్టసూర్యాంశుం క్వచిచ్చ తమసావృతమ్ ।
దరీముఖైః క్వచిద్భీమైః పిబన్తం సలిలం మహత్ ॥7॥

ఒకచోట సూర్యకిరణాలను స్పృశిస్తూ, మరొకచోట చీకటిచే వ్యాప్తమైయున్నది. ఒక్కొక్కచో భీకరమైన గుహాముఖాలతో మహాజలాన్ని త్రాగుతున్నట్లున్నది.

క్వచిద్విద్యాధరగణైః క్రీడద్భిరుపశోభితమ్ ।
ఉపగీతం తథా ముఖ్యైః కిన్నరాణాం గణైః క్వచిత్ ॥8॥

ఒక్కచో క్రీడించే విద్యాధరుల బృందంచే అలరారుతున్నది. ఒకచో ముఖ్య కిన్నరగణాల గానం వినబడుతున్నది.

ఆపానభూమౌ గలితైర్గన్ధర్వాప్సరసాం క్వచిత్ ।
పుష్పైః సన్తానకాదీనాం దివ్యైస్తముపశోభితమ్ ॥9॥

ఒక్కొక్కచో గంధర్వాప్సరసలు ఆపానభూమిలో అనుభవించి విడిచిన సంతానకాది వృక్షాల దివ్య పుష్పాలచే శోభితమైనది.

భుక్తోజ్ఝితాభిర్మాలాభిః కుసుమానాం తథా క్వచిత్ ।
మృదితాభిః సమాకీర్ణం గన్ధర్వాణాం మనోరమమ్ ॥10॥

ఒక్కొక్కచో గంధర్వులు అనుభవించి విడవడంవల్ల నలిగిన పూమాలలచే మనోజ్ఞమైనది.

నిరుద్ధపవనైర్దేశైర్నీలశాద్వలమణ్డితైః ।
క్వచిచ్చ కుసుమైర్యుక్తమత్యన్తరుచిరం శుభమ్ ॥11॥

ఒక్కొక్కచో అడ్డగించబడిన గాలిగలవీ, నీలమైన పచ్చికబీళ్ళచే అలంకరింపబడిన ప్రదేశాలతో ఒప్పారుచున్నది. మరొక్కచో పూలతో కూడినదై మిక్కిలి రమ్యంగానూ, శుభప్రదంగానూ ఉన్నది.

తపస్విశరణం శైలం కామినామతిదుర్లభమ్ ।
మృగైర్యథానుచరితం దన్తిభిన్నమహాద్రుమమ్ ॥12॥

తపోధనులకు రక్షకమైనది, కాముకులకు మిక్కిలి దుర్లభమైనది, మృగసంచారం గలది, ఏనుగులు విరిచిన మహాతరువులు గలదిగా ఉన్నది.

యత్ర సింహనినాదేన త్రస్తానాం భైరవం రవమ్ ।
దృశ్యతే న చ సంత్రాన్తం గజానామాకులం కులమ్ ॥13॥

సింహగర్జారవము వ్యాపించుటచేత భయపడి, ఎక్కడా విశ్రమించక వ్యాకులత చెందిన గజబృందాలచే ఆ వనం ఆకులమైయున్నది.

తపద్భిః తాపసైర్యత్ర కుంజదేశోప్యలంకృతః ।
రత్నైర్యస్య సముత్పన్నైస్త్రైలోక్యం సమలంకృతమ్ ॥14॥

అక్కడ తపస్సు చేసే తాపసుల చేత, కుంజదేశం అలంకృతమై యున్నది. అక్కడ పుట్టిన రత్నాలచేత ముల్లోకాలూ అలంకరింపబడి ఉన్నాయి.

అహీనశరణం నిత్యమహీనజనసేవితమ్ ।
అహీనః పశ్యతి గిరిమహీనం రత్నసమ్పదా ॥15॥

పాములకు శరణమై నిత్యంపెద్దలచే సేవితమై రత్నసంపన్నమైన ఆ గిరిని మహామహుడే చూడగలడు.

అల్పేన తపసా యత్ర సిద్ధిం ప్రాప్స్యన్తి తాపసాః ।
యస్య దర్శనమాత్రేణ సర్వకల్మషనాశనమ్ ॥16॥

అక్కడ అల్పతపస్సుతోనే తాపసులు సిద్ధి పొందుతారు. దాన్ని చూచినంతమాత్రాన సకల పాపాలూనశిస్తాయి.

మహాప్రపాతసమ్పాత నదీభిర్వేగితాంబుభిః ।
వాయునీతైః సదా తృప్తీకృతదేశం క్వచిత్క్వచిత్ ॥17॥

మహాజలపాతాలు గల్గి, వేగవంతమైన జలం కల నదులచేత గాలికి కొట్టుకొని వచ్చే జలబిందువుల చేత ఆ ప్రదేశం తృప్తిదాయకంగా చేయబడుతున్నది.

అనంబుజలదైః శృంగైః క్వచిచ్చాపి సముచ్ఛ్రితైః ।
నిత్యార్కతాపవిషమైరగమ్యైర్మనసా యుతమ్ ॥18॥

ఒక్కొక్కచో నీరు లేని మబ్బులు కలవై మిక్కిలి ఎత్తైనవై నిత్యం సూర్యతాపంచే విషమములై చిత్తానికి కూడా అగమ్యమైన శిఖరాలు కల్గి ఉన్నది.

దేవదారుమహావృక్షవ్రజశాఖా నిరన్తరైః ।
వంశైశ్చ స్తమ్భసాకార పాదపైరుపశోభితమ్ ॥19॥

దేవదారు వృక్షాల కొమ్మలచే దట్టమైనదై, స్తంభాలవంటి వెదుళ్ళతోనూ, చెట్లతోనూ అది భాసిస్తున్నది.

సింహానునాదితగుహం మహాశృంగాగ్ర నిర్ఝరమ్ ।
హిమచ్ఛత్రమహాశృంగం ప్రపాతశతనిర్ఝరమ్ ।
శబ్దలభ్యాంబువిషమం హిమసంరుద్ధకన్దరమ్ ॥20॥

అందలిగుహల్లో సింహనాదం ప్రతిధ్వనిస్తున్నది. మంచుగొడుగుల వంటివైనగొప్పశిఖరాలు గలిగిఉన్నది, వందల కొలది జలపాతాలు గలిగినది, శబ్దబహుళమైన నీటిచే విషమమై మంచుకప్పిన గుహలు కలిగి యున్నది.

దృష్ట్వా తు తాం చారు నితమ్బభూమిం మహానుభావః స తు మద్రనాథః ।
బభ్రామ తత్రైవ ముదా సమేతః స్థానం తదా కించిదథాససాద ॥21॥

అట్టి అందమైన నితంబప్రదేశం కల పర్వతాన్ని చూచిన మహానుభావుడైన ఆ మద్రరాజు సంతోషంతో అక్కడే సంచరించసాగాడు. ఆపై అక్కడ ఒక సమున్నతస్థానం చేరాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే హిమవద్వర్ణనం నామ సప్తదశాధికశతతమోఽధ్యాయః ॥ 117 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని హిమవద్వర్ణనమనే నూటపదిహేడవ అధ్యాయం సంపూర్ణం

అష్టాదశాధికశతతమోఽధ్యాయః - నూటపద్దెనిమిదవ అధ్యాయం

హిమవత్పర్వతవృక్షాది వర్ణనమ్ - హిమవత్పర్వతవృక్షాది వర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

తస్యైవ పర్వతేంద్రస్య ప్రదేశం సుమనోరమమ్ ।
అగమ్యం మానుషైరన్యైర్దైవయోగాదుపాగతః ॥1॥

ఆ పర్వతరాజముయొక్క అతిమనోజ్ఞమూ, ఇతర మానవులకు చేరరానిదీ అయిన ఒక ప్రదేశాన్ని పురూరవుడు దైవయోగం వల్ల చేరాడు.

ఇరావతీ సరిచ్ఛ్రేష్ఠా యస్మాద్దేశాద్వినిర్గతా ।
మేఘశ్యామం చ తం దేశం ద్రుమషణ్డైరనేకశః ॥2॥

ఎక్కడ నుండి నదీమతల్లిక ఇరావతి బయలు వెడలిందో, ఆ చోటు వృక్ష సమూహపరివ్యాప్తమై మేఘశ్యామలంగా కనిపించింది.

సాలైస్తాలైస్తమాలైశ్చ కర్ణికారైః సశాల్మలైః ।
న్యగ్రోధైశ్చ తథాశ్వత్థైః శిరీషైః శింశుపాద్రుమైః ॥3॥
శ్లేష్మాతకైరామలకైర్హరీతకవిభీతకైః ।
భూర్జైః సముంజకైర్బాణైర్వృక్షైః సప్తచ్ఛదద్రుమైః ॥4॥
మహానింబైస్తథా నింబైర్నిర్గుణ్డీభిర్హరిద్రుమైః ।
దేవదారుమహావృక్షైస్తథా కాలేయకద్రుమైః ॥5॥
పద్మకైశ్చన్దనైర్బిల్వైః కపిత్థై రక్తచందనైః ।
వాతామరిష్టకా క్షీరైరశ్వ కర్ణైస్తథార్జునైః ॥6॥

సాలవృక్షాలు, తాళాలు, తమాలాలు, కర్ణికారాలు, బూరుగుచెట్లు, మర్రిచెట్లు, రాగి, దిరిసెన, శింశుపా వృక్షాలు, శ్లేష్మాతకాలు, ఉసిరకలు, కరకలు, తాండ్రచెట్లు, భూర్జవృక్షాలు, ముంజకాలు, బాణవృక్షాలు, సప్తచ్ఛదాలు, పెద్ద వేప చెట్లు, నింబ వృక్షాలు, నిర్గుండులు, హరిద్రుమాలు, దేవదారు మహావృక్షాలు, కాలేయక వృక్షాలు, పద్మకాలు, చందనాలు, బిల్వాలు, కపిత్థాలు, రక్తచందనాలు, వాతామరిష్టకాలు, క్షీరకాలు, మద్దిచెట్లు, అబ్దకాలు, అర్జున తరువులు.

హస్తికర్ణైః సుమనసైః కోవిదారైః సుపుష్పితైః ।
ప్రాచీనామలకైశ్చాపి ధనకైః సవరాటకైః ॥7॥

హస్తికర్ణాలు, సుమనసాలు, పుష్పించిన కోవిదారాలు, ప్రాచీనామలకాలు, ఇప్పలు, వరాటకాలు,

ఖర్జూరైర్నారికేలైశ్చ ప్రియాలామ్రాతకేంగుదైః ।
తన్తుమాలైర్ధవైర్భవ్యైః కాశ్మీరైర్పర్ణిభిస్తథా ॥8॥

ఖర్జూరాలు, నారికేళాలు, ప్రియాళాలు, ఆమ్రాతకాలు, ఇంగుదులు, తంతుమాలాలు, భవ్యమైనధవలు, పర్ణముగల కాశ్మీరాలు

జాతీఫలైః పూగఫలైః కట్ఫలైలావలీఫలైః ।
మన్దారైః కోవిదారైశ్చ కింశుకైః కుసుమాంశుకైః ॥॥9॥

జాతీఫలాలు, పూగఫలాలు, కట్ఫలాలు, ఐలావలీఫలాలు, మందారాలు, కోవిదారాలు, మోదుగులు, కుసుమాంశుకాలు,

పలాశైః శాల్మలీభేదైః వేతసైర్జలవేతసైః ।
రక్తాతిరఙ్గనారఙ్గైరింగుభిః సప్రియంగుభిః ॥10॥

పలాశాలు, శాల్మలీ భేదాలు, ప్రబ్బలి, నీటి ప్రబ్బలు, రక్తాతిరంగాలు, నారంగాలు, ఇంగుదులు. ప్రియంగులు

రక్తాశోకైస్తథాశోకైః కురుకైః భువిరూఢకైః ।
ముచుకున్దైస్తథా కున్దైః కోటరూషసరూషకైః ।
సపర్ణాకైశ్చ శయనైర్ద్రుమశ్రేష్ఠైః తదాసనైః ॥11॥

రక్తాశోకాలు, అశోకాలు, కురుకాలు, భువిరూఢకాలు, ముచుకుందాలు, కుందాలు, కోటరూషాలు, సరూుషకాలు, పర్ణాకాలు, శయనాలు, ఆసనాలు.

కిరాతైః కింకిరాతైశ్చ కేతకైః శ్వేతకేతకైః ।
సౌభాంజనైరంజనైశ్చ సుకలిఙ్గనికచోళకైః ॥12॥

కిరాతాలు, కింకిరాతాలు, కేతకాలు, శ్వేతకేతకాలు, సౌభాంజనాలు, అంజనాలు, సుకలింగాలు, నిచోళకాలు,

సువర్ణచారువసనైర్ద్రుమశ్రేష్ఠైస్తథాసనైః ।
మన్మథస్య శరాకారైః సహకారైర్మనోరమైః ॥13॥

సువర్ణంలాగా అందమైన వసనాలుగల వృక్షరాజాలు, ఆసనాలు, మన్మథ శరాలు, మనోహరమైన సహకారాలు.

పీతయూథికయా చైవ శ్వేతయూథికయా తథా ।
జాత్యా చమ్పకజాత్యా చ తుమ్బరైశ్చాప్యతుమ్బరైః ॥14॥
మోచైశ్చోచైస్తు లికుచైస్తిలపుష్పకుశేశయైః ।
తథా సుపుష్పావరణైశ్చవ్యకైః కామివల్లభైః ॥15॥

పీతయూదికాలు, శ్వేతయూథికాలు, జాతి, చంపకజాతి, తుంబరాలు, అతుంబరాలు, మోచాలు, లోచాలు, లికుచాలు, తిలపుష్పాలు, కుశేశయాలు, మంచి పుష్పావరణం కల కామివల్లభాలైన చవ్యకాలు

పుష్పాంకురైశ్చ బకులైః పారిభద్రహరిద్రకైః ।
ధారాకదంబైః కుటజైః కదమ్బైర్గిరికూటజైః ॥16॥

పుష్పాంకురాలు గల వకుళాలు, పారిభద్రాలు, హరిద్రకాలు, ధారాకదంబాలు, కుటజాలు, కదంబాలు, గిరికూటజాలు,

ఆదిత్యముస్తకైః కుంభైః కుంకుమైః కామవల్లభైః।
కట్ఫలైర్బదరైర్నీపైర్దీపైరివ మహోజ్జ్వలైః ॥17॥

ఆదిత్యముస్తకాలు, కుంభాలు, కుంకుమాలు, కామవల్లభాలైన, కట్ఫలాలు, బదరాలు, దీపంవలె మహోజ్జ్వలమైన నీపాలు.

రక్తైః పాలీవనైః శ్వేతైర్దాడిమైశ్చంపకద్రుమైః ।
బంధూకైశ్చ సుబన్ధూకైః కుంజకానాం తు జాతిభిః ॥18॥

రక్తపాలీవనాలు, శ్వేత దాడిమాలు, చంపకవృక్షాలు, బంధూకాలు, సుబంధూకాలు, కుంజక జాతులు.

కుసుమైః పాటలాభిశ్చ మల్లికాకరవీరకైః ।
కురవకైర్హిమవంజీరైః జంబూభిర్మృదుజంబుభిః ॥19॥

కుసుమాలు, పాటలములు, మల్లికలు, కరవీరకాలు, కురవకాలు, హిమవంజీరాలు, జంబూవృక్షాలు, మృదుజంబువులు,

బీజపూరైః సకర్పూరైర్గురుభిశ్చాగురుద్రుమైః ।
బింబైశ్చ ప్రతిబింబైశ్చ సన్తానకవితానకైః ॥20॥

బీజపురాలు, కర్పూరాలు, పెద్ద అగరు చెట్లు, బింబాలు, ప్రతిబింబాలు, సంతానకాలు.

తథా గుగ్గులువృక్షైశ్చ హిన్తాలధవలేక్షుభిః ।
తృణశూన్యైః కరవీరైః శాక్తైశ్చ మదనైస్తథా ॥21॥

గుగ్గళు వృక్షాలు, హింతాళాలు, ధవళేక్షువులు, తృణశూన్యకరవీరాలు, శాక్తాలు, మదనాలు.

పీలుభిర్ధాతకీభిశ్చ చిరిబిల్వ సవాలుకైః ।
తింత్రిణీకైస్తథా లోధ్రైర్విడఙ్గైః క్షీరికాద్రుమైః ॥22॥

పీలువులు, ధాతకీవృక్షాలు, కాలువలతో కూడిన చిరిబిల్వాలు, తింత్రిణీకాలు, లోధ్రాలు, విడంగాలు, క్షీరికాద్రుమాలు –

అశ్మాతకైస్తథాంకూలై స్తథా చ మధుకద్రుమైః ।
భల్లాతకైరింద్రవనైర్వల్మీకైః సింధువారకైః ॥23॥

అశ్మంతకాలు, అంకూలాలు, మధూకాలు, భల్లాతకాలు, ఇంద్రవనాలు, వల్మీకాలు, సింధువారకాలు.

కరమర్దైః కాసమర్ధైరరిష్టకవరిష్టకైః ।
రుద్రాక్షైర్ద్రాక్షసంభూతైః సనింబైః పుత్రజీవకైః॥24॥

కరమర్దాలు, కాసమర్దాలు, అరిష్టకాలు, వరిష్టకాలు, రుద్రాక్షలు, ద్రాక్షసంభూతాలు, సనింబాలు, పుత్రజీవకాలు.

కంకోలకైర్లవంగైశ్చ త్వగ్ద్రుమైః పారివేతసైః ।
ప్రతానైః పిప్పలీనాం చ నాగవల్లీభిరుత్తమైః ॥25॥

కంకోలాలు, లవంగాలు, త్వగ్ద్రుమాలు, పారివేతసాలు, పిప్పలీసమూహాలు, ఉత్తమమైన నాగవల్లులు,

మరీచానాం తథా గుల్మైర్నవమల్లికయా తథా ।
మృద్వీకామణ్డలైర్ముఖ్యైరతిముక్తకమణ్డలైః ॥26॥

మరీచగుల్మాలు, నవమల్లికలు, మృద్వీకామండలాలు, అతిముక్తకమండలాలు,

వకులైర్వక్రకీనాం చ ప్రతానైః సఫలైః శుభైః ।
కూష్మాణ్డానాం ప్రతానైశ్చ అలాబూనాం తథా క్వచిత్ ॥27॥

వకుళాలు, వక్రకీ సమూహాలు, సఫలమై శుభప్రదమైన కూష్మాండాలు, అలాబులు,

చిరంటస్య ప్రతానైశ్చ పటోలీకారవేల్లకైః ।
కర్కోటకీవితానైశ్చ వార్తాకైర్బృహతీఫలైః ॥28॥

చిరంటాలు, పటోలీలు, కారవేల్లకాలు, కర్కోటకీవితానాలు, వార్తాకాలు, బృహతీఫలాలు,

కణ్టకైర్మూలకైర్మూలశాకైస్తు వివిధైస్తథా ।
కందైర్విదార్యైశ్చ తథా కరోటైః స్వాదుసంయుతైః ॥29॥

కంటకాలు, మూలకాలు, వివిధ మూలశాకాలు, కందాలు, విదార్యాలు, తీపి కరోటాలు,

సబిడారీ విష్ణుసారా జతువత్త్వగ్వివర్ధితైః ।
సునిష్పావక వృక్షైశ్చ గవిక్షువక వాస్తుకైః ॥30॥

సువర్చలాభిస్సర్వాభిస్సర్షపాభిస్తథైవచ ।
కాకోలీ క్షీరకాకోలీ వృక్షైశ్చ సుమనోహరైః ।

కాసుమర్దై స్తథాసాలైః తథా కట్పలచక్రకైః ॥31॥
తథా క్షీరికశాకైశ్చ కాలశాకేన చాప్యథ।

శింబీధాన్యైస్తథా ధాన్యైః సర్వైర్నిరవశేషతః ॥32॥

బిడారీలు, విష్ణుసారాలు, జిగురు గల పట్టతో వర్ధిల్లిన నిష్పావక వృక్షాలు, గవిక్షువకాలు, వాస్తుకాలు, సువర్చలాలు, సర్షపాలు, అట్లే

కాకోలి, క్షీరకాకోలి అనే మరోహరమైన వృక్షాలు, కాసమర్దాలు, సాలవృక్షాలు, కట్ఫలాలు, చక్రకాలు, క్షీరికశాకాలు, కాలసాకాలు, శింబీధాన్యాలు తదితరాలు.

ఔషధీభిర్విచిత్రాభిర్దీప్యమానాభిరేవ చ ।
ఆయుష్యాభిర్యశస్యాభిర్వన్యాభిశ్చ నరాధిప ॥33॥

రాజా! ప్రకాశించే విచిత్రమైన ఓషధులు, ఆయుర్వర్ధకాలు, కీర్తికరాలు, వనంలో పుట్టినవి.

జరామృత్యుభయఘ్నీభిః క్షుద్భయఘ్నీభిరేవ చ ।
సౌభాగ్యజననీభిశ్చ లతాభిశ్చాప్యనేకశః ॥34॥

జరామరణభయం తొలగించేవి, ఆకలిభయం పోగొట్టేవి, సౌభాగ్యం కలిగించేవి, అగు అనేక లతలు,

తత్ర వేణులతాభిశ్చ తథా కీచకవేణుభిః ।
కాశైః శశాంకకాశైశ్చ కాశీగుల్మైస్తథైవ చ ॥35॥

వెదురులతలు, కీచక వేణువులు, రెల్లులు, శశాంకకాశాలు, రెల్లు పొదలు,

కుశగుల్మైస్తథా రమ్యైర్గుల్మైశ్చేక్షోర్మనోరమైః ।
కార్పాసజాతివర్గేణ దుర్లభేన శుభేన చ ॥36॥

మనోహరమైన కుశగుల్మాలు, రమ్యమైన ఇక్షు గుల్మాలు, దుర్లభము, శుభకరమూ అయిన కార్పాసజాతివృక్షాలు.

తథా చ కదలీషణ్డైర్మనోహారిభిరుత్తమైః ।
తథా మరకతప్రఖ్యైః ప్రదేశైః శాద్వలాన్వితైః ॥37॥

అట్లే అయిన, కదలీసమూహాలు, పచ్చిక కల్గిన మరకతాలవంటి మనోహరప్రదేశాలు.

హరిత్పుష్పసమాయుక్తైః కుంకుమస్య చ భాగశః ।
భృంగరాజ జటామాంసీ గ్రంథికైస్తుమురాంగదైః ॥38॥

పచ్చని పుష్పాలతో కూడినవి, భాగశః కుంకుమాంకితాలు, అయిన భృంగరాజాలు, జటామాంసీలు, గ్రంథికాలు, మురాంగదాలు,

సువర్ణపుష్పైశ్చ తథా భూమిపుష్పైస్తథాపరైః ।
జంబీరకైర్భూస్తృణకైః సరసైః కుకుభైస్తథా ॥39॥

సువర్ణపుష్పాలు, భూమి పుష్పాలు, జంబీరకాలు, భూతృణకాలు. సరసములైన కకుభాలు,

శృంగవేరాజమోదాభిః కుహకైశ్చ ప్రియాలుకైః ।
జలజైశ్చ తథావర్ణైర్నానావర్ణైః సుగన్ధిభిః ॥40॥

శృంగవేరాజమోదాలు, కుహకాలు, ప్రియాలుకాలు, నానావర్ణాలు గల్గి మంచి వాసన గల జలజాలు.

ఉదయాదిత్యసంకాశైః పూర్ణచంద్రనిభైస్తథా ।
తపనీయసవర్ణైశ్చ అతసీపుష్పసన్నిభైః ॥41॥

ఉదయించే సూర్యునివంటివి, పూర్ణచంద్ర సదృశాలు, స్వర్ణవర్ణాలు, అతసీ పుష్పాలవంటివి.

శుకపత్రనిభైశ్చాన్యైః స్థలపాలైశ్చ భాగశః ।
పంచవర్ణైః సమాకీర్ణైర్బహువర్ణైస్తథైవ చ ॥42॥

చిలుకరెక్కలబోలినవి, భాగశః స్థలపత్రాలు, పంచవర్ణాలు గల వాటిచే సమాకీర్ణములైనవి, బహువర్ణాలుగలవి,

ద్రష్టుర్దృష్ట్యాహితముదైః కుసుమైశ్చంద్రసన్నిభైః ।
తథా వహ్నిశిఖాకారైర్గజవక్త్రోత్పలైః శుభైః ॥43॥

చూచువారి చూపులకు ఆనందం కల్గించేవి, చంద్రసదృశములైన కుముదాలూ, అట్లే అగ్ని శిఖాకారం కల శుభములైన గజవక్త్రోత్పలాలు,

నీలోత్పలైః సకర్పూరైరుజ్జాతకకసేరుకైః ।
శృంగాటకశృగాలైశ్చ కరటైశ్చ స్థలోత్పలైః ॥44॥

కర్పూరాలతో కూడిన నీలోత్పలాలు, ఉజ్జాతకాలు, కసేరుకాలు, శృంగాటకాలు, శృగాలాలు, స్థలోత్పలాలు,

జలజైః స్థలజైర్మూలైః ఫలైః పుష్పైర్విశేషతః ।
వివిధైశ్చైవ నీవారైర్మునిభోజ్యైర్నరాధిప! ॥45॥

రాజా! జలజాలు, స్థలజాలు, మూలాలు, ఫలాలు, విశేషించి పూలు, ముని భోజ్యాలైన వివిధ నీవారాలు – కల్గి వున్నది.

న తద్ధాన్యం న తత్సస్యం న తచ్ఛాకం న తత్ ఫలమ్ ।
న తన్మూలం న తత్ కన్దం న తత్ పుష్పం నరాధిప! ॥46॥

రాజా! ఏది అక్కడ లేదో ఆ ధాన్యం, ఆ సస్యం, ఆ శాకం, ఆ ఫలం, ఆ మూలం, ఆ కందం, ఆ పుష్పం, అక్కడ లేదు. అన్నీ ఉన్నాయని భావం.

నాకలోకోద్భవం నిత్యం నరలోకభవం చ యత్ ।
అనూపోత్థం వనోత్థం చ తత్ర యన్నాస్తి పార్థివ ॥47॥

రాజా! నాకలోకంలో పుట్టినది, నిత్యమైనది, నరలోకంలో పుట్టినది, అనూపంలోనూ, వనంలోనూ పుట్టినది – అన్నీ అక్కడ ఉన్నాయి. అక్కడ లేనిది లేదు.

సదా పుష్పఫలం సర్వమజర్యమృతుయోగతః ।
మద్రేశ్వరః స దదృశే తపసా హ్యతియోగతః ॥48॥

సదా పూలూ, పండ్లూ కల్గి ఋతుయోగం వల్ల జీర్ణభావం లేనిదిగా ఉన్న ఆ కొండను తపస్సు యొక్క అతిశయం చేత ఆ మద్రరాజు చూడగలిగాడు.

దదృశే చ తథా తత్ర నానారూపాన్ పతత్రిణః ।
మయూరాన్ శతపక్షాంశ్చ కలవింకాంశ్చ కోకిలాన్ ॥49॥

అట్లే అతడు నానారూపాలు గల మయూరాలు, శతపక్షాలు, కలవింకాలు(పిచ్చుకలు), కోకిలలు, మున్నగు పక్షులనూ విలోకించాడు.

బకాన్ కాదంబకాన్ హంసాన్ కోయష్టీన్ ఖంజరీటకాన్ ।
కుర్కుటాన్ కాష్టకూటాంశ్చ ఖట్వాంగాన్ లుబ్ధకాంస్తథా ॥50॥

బకాలు, కాదంబకాలు, హంసలు, కోయష్టికాలు, ఖంజరీటాలు, కుర్కుటాలు, కాష్టకూటాలు, ఖట్వాంగాలు, లుబ్ధకాలు,

గోక్ష్వేదకాంస్తథా కుంభాన్ ధార్తరాష్ట్రాన్ శుకాన్ బకాన్ ।
ధాతుకాంశ్చక్రవాకాంశ్చ కటుకాన్ టిట్టిభాన్ దృభాన్ ॥51॥

గోక్ష్వేదకాలు, కుంభాలు, ధార్తరాష్ట్రాలు, శుకాలు, బకాలు, ధాతుకాలు, చక్రవాకాలు, కటుకాలు, టిట్టిభాలు, దృభాలు,

పుత్రప్రియాన్ లోహపృష్ఠాన్ గోచర్మగిరివర్తకాన్ ।
పారావతాంశ్చ కమలాన్ సారికా జీవజీవకాన్ ॥52॥

పుత్ర ప్రియాలు, లోహ పృష్ఠాలు, గోచర్మాలు, గిరివర్తకాలు, పావురాలు, కమలాలు, సారికలు, జీవజీవకాలు,

లావవర్తకవర్తాంశ్చ రక్తవత్సప్రభద్రకాన్ ।
తామ్రచూడాన్ స్వర్ణచూడాన్ కుక్కుటాన్ కాష్ఠకుబ్జకాన్ ॥53॥

లావాలు, వర్తకాలు, వర్తాలు, రక్తవత్సాలు, ప్రభద్రకాలు, తామ్రచూడాలు, స్వర్ణచూడాలు, కుక్కుటాలు, కాష్ఠకుబ్జకాలు,

కపింజలాన్ కలవింకాంస్తథా కుంకుమచూడకాన్ ।
భృంగరాజాన్ సారపాదాన్ భూలింగాన్ పిండమానవాన్ ॥54॥

కపింజలాలు, కలవింకాలు, కుంకమచూడకాలు, భృంగరాజాలు, సారపాదాలు, భూలింగాలు, పిండమానవాలు,

మంజులీతకదాత్యూహాన్ వ్యాధాన్యాత్రాన్ సపక్షకాన్ ।
భరద్వాజాంస్తథా చాషాన్ సుపర్ణానంజలీకాన్ ।
ఏతాంశ్చాన్యాంశ్చ సుబహూన్ పక్షిసంఘాన్ మనోహరాన్ ॥55॥

మంజలీతకాలు, దాత్యూహాలు, వ్యాధాలు, యాత్రాలు, భారద్వాజాలు, చాషాలు, సుపర్ణకాలు, అంజలీకాలు వీటినీ ఇంకా అనేకాలైన మనోహర పక్షి సంఘాలనూ అవలోకించాడు.

శ్వాపదాన్ వివిధాకారాన్ మృగాంశ్చైవ మహామృగాన్ ।
వ్యాఘ్రాన్ కేసరిణః సింహాన్ ద్వీపినః శరభాన్ వృకాన్ ॥56॥

వివిధాకారాలు గల శ్వాపదాలనూ, మృగాలనూ, మహామృగాలనూ, వ్యాఘ్రాలనూ, సింహాలనూ, ద్వీపులనూ, శరభాలనూ, వృకాలనూ,

ఋక్షాంస్తరక్షూంశ్చ బహూన్ గోలాంగూలాన్ సవానరాన్ ।
శశకాన్ మశకాన్ దంశాన్ మార్జారాన్ వాయువేగినః ॥57॥

ఋక్షాలనూ, తరక్షులనూ, గోలాంగూలనూ, వానరాలనూ, శశకాలనూ, మశకాలనూ, దంశాలనూ, వాయువేగం కల పిల్లులనూ,

తథా మత్తాంశ్చ మాతంగాన్ మహిషాన్ గవయాన్ వృకాన్ ।
చామరాన్ సృమరాంశ్చైవ తథా గౌరముఖానపి ॥58॥

అట్లే మత్తమాతంగాలనూ, మహిషాలనూ, గవయాలనూ, వృకాలనూ, చామరాలనూ, సృమరాలనూ, గౌరముఖాలనూ,

మూషికాన్ నకులాన్ కాంశ్చిత్ శివనోడవ కాలకాన్ ।
ఉరభ్రాంశ్చ తథా మేషాన్ సారంగానథ కుక్కుటాన్ ।
నీలాన్ మృగాన్ మర్కటకాన్ మహానీలాంశ్చ రావకాన్ ॥59॥

ఎలుకలనూ, ముంగిసలనూ, శివనోడవ కాలకాలనూ, పొట్టేళ్ళనూ, మేకలనూ, సారంగాలనూ, కుక్కుటాలనూ, నీలమృగాలనూ, కోతులనూ, మహానీలమైన రావకాలనూ చూచాడు.

సద్దంష్ట్రారామశరభాన్ క్రౌంచాకారకసంచరాన్ ।
కరాలాన్ కృతమాలాంశ్చ కాలపుచ్ఛాంశ్చ తోరణాన్ ॥60॥

సద్దంష్ట్రాలనూ, రామశరభాలనూ, క్రౌంచాకారం కల సంచరాలనూ, కరాలమైన కృతమాలాలనూ, కాలపుచ్ఛాలనూ, తోరణాలనూ,

ఉష్ట్రాన్ఖడ్గాన్వరాహాంశ్చ తురంగ వరగర్దభాన్ ।
ఏతానన్వీక్ష్య మద్రేశో విరుద్ధాంశ్చ పరస్పరమ్ ॥61॥

ఒంటెలనూ, ఖడ్గాలనూ, వరాహాలనూ, తురగాలనూ, మేలైన గర్దభాలనూ, వీటినీ ఇంతకు మునుపు చూడని వాటినీ, పరస్పర విరుద్ధమైన జంతుజాలాన్నీ మద్రనరపతి చూచాడు.

అవిరుద్ధాన్వనే దృష్ట్వా విస్మయం పరమం యయౌ ।
తచ్చాశ్రమపదం పుణ్యం బభూవాత్రేః పురా నృప ॥62॥

అట్లే అన్యోన్య విరుద్ధం కాని వాటిని వనంలో చూచి విస్మయం పొందాడు. రాజా! పూర్వం అక్కడ అత్రి ఆశ్రమం ఉండేది.

తత్ప్రసాదాత్ప్రభాయుక్తం స్థావరైర్జంగమైస్తథా ।
హింసన్తి హి న చాన్యోన్యం హింసకాస్తు పరస్పరమ్ ॥63॥

ఆ ఆశ్రమం ముని అనుగ్రహం వల్ల ప్రభావంతమైనది. అన్యోన్య హింసకాలైన (స్థావర) జంగమప్రాణులు సైతం అక్కడ పరస్పరం హింసించుకోవు.

క్రవ్యాదాః ప్రాణినస్తత్ర సర్వే క్షీరఫలాశనాః ।
నిర్మితం తచ్చ తద్వద్వై చాత్రిణా తు మహాత్మనా ॥64॥

అక్కడ మాంసభక్షణచేసే ప్రాణులన్నీ క్షీరఫలాలు తింటాయి. ఆ మహాత్ముడైన అత్రి వాటి నలా తీర్చిదిద్దాడు.

శైలాన్నితంబదేశేషు న్యవసచ్చ స్వయం నృపః ।
పయః క్షరన్తి తే దివ్యమమృతస్వాదుసన్నిభమ్ ॥65॥

ఆ రాజు శైలాలలో, శైలనితంబ ప్రదేశాలలో స్వయంగా నివసించాడు. అవి అమృతం వలె రుచిమంతమైన జలాలను స్రవిస్తున్నాయి.

క్వచిద్గ్రామ్య మహిష్యశ్చ క్వచిద్గావశ్చ సర్వశః ।
గోక్షీరేణ చ సంపూర్ణా దధ్నా చాన్యత్ర వా బహు ॥66॥

అక్కడ ఒకచో గ్రామ్య మహిషీ బృందాలు, మరొకచో క్షీరం గల గోవులు, పెరుగుతో నిండినవి మరికొన్నిటిని చూచాడు.

సంపశ్యన్పరమాం ప్రీతిమవాప వసుధాధిపః ।
సరాంసి తత్ర దివ్యాని నద్యశ్చ విమలోదకాః ॥67॥

ఆ రాజు వాటిని చూస్తూ ఎంతో సంతసించాడు. అక్కడి మడుగులు దివ్యమైనవి. నదులు నిర్మలోదకంకలవి.

ప్రణాలికాని చోష్ణాని శీతలాని చ భాగశః ।
కన్దరాణి చ శైలస్య సుసేవ్యాని పదే పదే ॥68॥

ప్రణాళికలు వేడిగానూ, భాగశః చల్లగానూ ఉన్నాయి. అక్కడి కొండగుహలు పదే పదే సేవింపదగినవై వున్నాయి.

హిమపాతో న తత్రాస్తి సమన్తాత్ పంచయోజనమ్ ।
ఉపత్యకాసు శైలస్య శిఖరస్య న విద్యతే ॥69॥

అక్కడ నలువైపులా ఐదుయోజనాల వరకూ మంచు పడదు. కొండయొక్క ఉపత్యకలపైనా, శిఖరోపత్యకలలోనూ మంచు పడదు.

తత్రాస్తి రాజన్ శిఖరం పర్వతేంద్రస్య పాణ్డురమ్ ।
హిమపాతం ఘనా యత్ర కుర్వన్తి సహితాః సదా ॥70॥

రాజా! అక్కడి ఆ పర్వతరాజు యొక్క తెల్లని శిఖరం ఉన్నది. అక్కడ మేఘాలు సంతోషంతో గూడి హిమపాతం కల్గిస్తాయి.

తత్రాస్తి చాపరం శృంగం యత్ర తోయఘనావృతమ్ ।
నిత్యమేవాభివర్షన్తి శిలాభిః శిఖరం పరమ్ ॥71॥

అక్కడ శిలలలో శ్రేష్ఠమైన శిఖరమున్నది. దానిపై జలపూర్ణమైన మబ్బులు నిత్యం మంచువాన గురుస్తాయి.

తదాశ్రమం మనోహారి యత్ర కామహరో హరః ।
సురముఖ్యోపయోగిత్వాచ్ఛాఖినాం సఫలాః సదా ॥72॥

ఆ ఆశ్రమం మనోహరమైనది. అక్కడ శివుడు మన్మథుణ్ణి హరించాడు. దేవముఖ్యులకు ఉపయోగపడడం వల్ల అక్కడి చెట్లు సఫలాలు.

సదోపగీతభ్రమరాః సురస్త్రీసేవితాః సురాః ।
సర్వపాపక్షయకరం శైలస్యైవం ప్రహారకమ్ ॥73॥

సదా అక్కడ తుమ్మెదల గానముంటుంది. సురస్త్రీలు సురలను సేవిస్తారు. ఆ పర్వతశిఖరం సర్వపాపక్షయకరం.

వానరైః క్రీడమానాశ్చ దేశాద్దేశాన్నరాధిప ।
హిమపుంజాః కృతాస్తత్ర పూర్ణబింబసమప్రభాః ॥74॥

నరాధిపా! అక్కడ క్రీడిస్తూ వానరాలు ఒకచోటినుండి మరొకచోటికి ఎగరడంవల్ల చంద్రబింబ సదృశకాంతిగల మంచుగుట్టలు నిర్మించబడ్డాయి.

తదాశ్రమం సమన్తాచ్చ హిమసంరుద్ధకన్దరైః ।
శైలవాటైః పరివృతమగమ్యం మనుజైః సదా ॥75॥

ఆ ఆశ్రమం నలు ప్రక్కలా మంచుచే కప్పబడిన గుహలు గల శైలవాటాలతో పరివృతమై మనుజులకు సదా అగమ్యమై ఉన్నది.

పూర్వారాధితభాగ్యోఽసౌ మహారాజః పురూరవాః ।
తదాశ్రమపదం ప్రాప్తో దేవదేవప్రసాదతః ॥76॥

పూర్వమే ఆరాధించిన భాగ్యం కల ఆ పురూరవమహారాజు దేవదేవుని అనుగ్రహంవల్ల ఆ ఆశ్రమపదంచేరాడు.

తదాశ్రమం శ్రమశమనం మనోహరం మనోహరైః కుసుమశతైరలంకృతమ్ ।
కృతం స్వయం రుచిరమథాత్రిణా శుభం శుభావహం చ హి దదృశే స మద్రరాట్ ॥77॥

ఆ ఆశ్రమం శ్రమను పోగొట్టునది, మనోజ్ఞమైనది. మనోహర పుష్పరాశిచే అలంకరించబడినది. అత్రిమునిచే స్వయంగా ఆకర్షకంగా తయారు చేయబడినది, శుభప్రదమైనది. అట్టి మంగళకరమైన ఆశ్రమాన్ని మద్రరాజు దర్శించాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే హిమవత్పర్వత వృక్షాది వర్ణనం నామాష్టాదశాధికశతతమోఽధ్యాయః ॥ 118 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని హిమవత్పర్వత వృక్షాది వర్ణనమనే నూటపద్దెనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనవింశత్యుత్తరశతతమోఽధ్యాయః – నూటపందొమ్మిదవ అధ్యాయం

పురూరవసః అత్ర్యాశ్రమ గమనమ్ – పురూరవుని అత్ర్యాశ్రమ గమనం

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

తత్రాయతే మహాశృంగే మహావర్ణే మహాహిమే ।
తృతీయం తు తయోర్మధ్యే శృంగమత్యన్తముచ్ఛ్రితమ్ ॥1॥

అక్కడ మహావర్ణం కల్గి మంచుతో నిండిన రెండు శిఖరాలున్నాయి. వాటి మధ్య మూడవ శిఖరం మిక్కిలి ఎత్తైనది కలదు.

నిత్యాతపోత్తప్తశిలం తథాఽపి శ్రమవర్జితమ్ ।
తస్యాధస్తాద్వృక్షషండే దేశే భాగే చ పశ్చిమే ॥2॥

ఆ శిఖరం పైన ఉన్న శిలాజాలం నిత్యం ఎండకు కాలిపోతూ వుంటుంది. అయినా అక్కడ శ్రమ కలగదు. దాని క్రింద పశ్చిమభాగంలో వృక్షగణం ఉన్నది.

జాతీలతాపరిక్షిప్తం వివరం చారుదర్శనమ్ ।
దృష్ట్వైవ కౌతుకావిష్టస్తం వివేశ మహీపతిః ॥3॥

అక్కడ జాతీలతలతో పరిక్షిప్తమై అందంగా కనిపించే వివర మొకటి ఉన్నది. దాన్ని చూచిన ఆ రాజు కౌతుకంతో అందులో ప్రవేశించాడు.

తమసా చాతినిబిడం నల్వమాత్రం సుసఙ్కటమ్ ।
నల్వమాత్రమతిక్రమ్య సుప్రభాభరణోజ్జ్వలమ్ ॥4॥
తముచ్ఛ్రితమథాత్యన్తం గంభీరం పరివర్తులమ్ ।
న తత్ర సూర్యస్తపతి న విరాజతి చంద్రమాః ॥5॥

అది చీకటిచే నిబిడమై ఉన్నది. దానికి నాలుగు వందల ధనువుల పొడవగు దారి కలదు. అది మిక్కిలి ఇరుకై యున్నది. మంచి ఆభరణ ప్రభలచే ప్రకాశించు ఆదారిని దాటి పోగా ఒక చోటున్నది. అది ఎత్తైనది, గంభీరమైనది. గుండ్రనిది. అక్కడ సూర్యుడు తపించడు, చంద్రుడు ప్రకాశించడు.

తథాఽపి దివసాకారం ప్రకాశం తదహర్నిశమ్ ।
క్రోశాధికపరీణాహసరసా చ విరాజితమ్ ॥6॥

అయినా రాత్రింబవళ్లు అది పగటివలె ఉజ్జ్వలమై యున్నది. క్రోశంకంటె అధికపరిమాణం కల ఒక సరస్సుచే విరాజిల్లుతున్నది.

సమన్తాత్ సరసస్తస్య శైలలగ్నా తు వేదికా ।
సౌవర్ణై రాజతైర్వృక్షైర్విద్రుమైరుపశోభితమ్ ॥7॥

ఆ సరస్సు వద్ద కొండకు సంబద్ధమైన ఒక వేదిక ఉన్నది. సువర్ణమయాలూ, రాజతములూ అయిన వృక్షాలచేతనూ, పగడాల చేతనూ అది శోభిల్లుతున్నది.

నానామాణిక్యకుసుమైః సుప్రభాభరణోజ్జ్వలైః ।
తస్మిన్సరసి పద్మాని పద్మరాగచ్ఛదాని తు ॥8॥

వివిధ మాణిక్య పుష్పాలతో, ప్రభాభరణోజ్జ్వలమైన ఆ సరస్సులోని పద్మాలు పద్మరాగంవంటి పత్రాలు కలిగివున్నాయి.

వజ్రకేశరజాలాని సుగన్ధీని తథా యుతమ్ ।
పత్రైర్మరకతైర్నీలైర్వైదూర్యస్య మహీపతే! ॥9॥

రాజా! వజ్రాలవంటి కేసరాలు, మరకత నీలాలైన ఆకులూ అవి సుగంధభరితాలైయున్నది.

కర్ణికాశ్చ తథా తేషాం జాతరూపస్య పార్థివ ।
తస్మిన్సరసి యా భూమిర్న సా పఙ్కసమాకులా ॥10॥

నృపా! వాటి దుద్దులు వైడూర్యాలతో బంగారుతో ఏర్పడినట్లు ఉన్నవి. ఆ సరస్సులోని నేల బురదచే కలుషితం కాలేదు.

నానారత్నైరుపచితా జలజానాం సమాశ్రయా ।
కపర్దికానాం శుక్తీనాం శంఖానాం చ మహీపతే ॥11॥
మకరాణాం చ మత్స్యానాం జలజానాంచ కచ్ఛపైః ।
తత్ర మరకతఖణ్డాని వజ్రాణి చ సహస్రశః ॥12॥
పద్మరాగేంద్రనీలాని మహానీలాని పార్థివ ।
పుష్యరాగాణి సర్వాణి తథా కార్కోటకాని చ ॥13॥
తుబుకస్య తు ఖణ్డాని తథా విష్ణుమణేరపి ।
రాజావర్తక ముఖ్యాని రుధిరాక్షస్య చాప్యథ ॥14॥
సూర్యేందుకాన్తయోశ్చైవ పీలోర్వైరాతలస్య చ ।
జ్యోతీరసస్య రమ్యస్య నమకస్య చ భాగశః ॥15॥
పురోరగబలాక్షాణాం స్ఫటికస్య తథైవ చ ।
గోమేదపిత్తకానాం చ ధూలీమరకతస్య చ ॥16॥

వైదూర్యసౌగన్ధికయోస్తథా రాజమణేర్నృప ।
వజ్రస్యైవ చ ముఖ్యస్య తథా బ్రహ్మమణేరపి ॥17॥
ముక్తాఫలానాం శుద్ధానాం తారావిగ్రహధారిణామ్ ॥18॥

అది వివిధ రత్నాలతో వృద్ధి పొందినది. జలజములు కలది. కపర్దికలకు, శుక్తులకు, శంఖాలకు, మకరాలకు, చేపలకు, కచ్ఛపాలకు ఆశ్రయమైనది. అందులో వేలకొలది మరకతాల, వజ్రాల ఖండాలు, పద్మరాగాలు, ఇంద్రనీలాలు, మహానీలాలు, అన్ని రకాల పుష్యరాగాలు, కర్కోటకాలు, తుబుక, విష్ణుమణి, రాజావర్తక, రుధిరాక్ష, సూర్యకాంత, చంద్రకాంత, పీలు, వైరాతల, జ్యోతీరస, నమక, పురోరగ, బలాక్ష, స్ఫటిక, పిత్థక, మరకత, వైదూర్య, సౌగంధిక, రాజమణి, బ్రహ్మమణి, తారాసదృశముక్తాఫల, రత్నఖండాలున్నాయి.

సుఖోష్ణం చైవ తత్ తోయం స్నానాచ్ఛీతవినాశనమ్ ।
వైదూర్యస్య శిలా మధ్యే సరస్తస్య శోభనా ॥19॥

అందలి నీరు సుఖోష్ణమైనది. స్నానంతో శైత్యాన్ని తొలగిస్తుంది. ఆ సరస్సు నడుమ ఒక శోభనమైన వైదూర్య శిల కలదు.

ప్రమాణేన తథా భూతా ద్వే చ రాజన్! ధనుఃశతే ।
చతురస్రా తథా రమ్యా తపసా నిర్మితాఽత్రిణా ॥20॥

రాజా! అది చతురస్రమై, రమ్యమై, అత్రితపస్సుచే నిర్మితమై రెండు ధనుఃశతాల ప్రమాణంతో ఉన్నది.

బిలద్వారసమో దేశస్తత్ర చాపి హిరణ్మయః ।
ప్రదేశః స తు రాజేంద్ర! ద్వీపే తస్మిన్ మనోహరే ॥21॥

రాజేంద్రా! మనోహరమైన ఆ ద్వీపంలో స్వర్ణమయమైన బిలద్వార దేశం ఒకటి ఉన్నది.

తథా పుష్కరిణీ రమ్యా తస్మిన్ రాజచ్ఛిలాతలే ।
సుశీతామలపానీయా జలజైశ్చ విరాజితా ॥22॥

రాజా! ప్రకాశించే ఆ శిలాతలంలో రమ్యమైన ఒక పుష్కరిణి కలదు. అది చల్లని, నిర్మలమైనజలం కల్గి, పద్మాలతో కూడినది.

ఆకాశప్రతిమా రాజంశ్చతురస్రా మనోహరా ।
తస్యాస్తదుదకం స్వాదు లఘు శీతం సుగన్ధి చ ॥23॥

చతురస్రమై మనోహరమైన అది ఆకాశంతో సమానమైనది. అందలి నీరు రుచికరం, చల్లనిది, లఘువు, సుగంధభరితమైనది.

న క్షిణోతి యథా కణ్ఠం కుక్షిం నాపూరయత్యపి ।
తృప్తిం విధత్తే పరమాం శరీరే చ మహత్ సుఖమ్ ॥24॥

అది కంఠాన్ని కుంఠితం చేయదు. కడుపు ఉబ్బనీదు, పరమతృప్తి కల్గిస్తుంది. శరీరానికి సుఖం కల్గిస్తుంది.

మధ్యే తు తస్యాశ్చ కృతః ప్రాసాదః తపసాఽత్రిణా ।
రుక్మసేతుప్రదేశశ్చ సర్వరత్నమయః శుభః ॥25॥

దాని మధ్యలో అత్రిమునిచే ఒక ప్రాసాదం నిర్మింపబడింది. బంగారు సేతువు ద్వారా ప్రవేశం కల్గి సకల రత్న మయమైన ఆ ప్రాసాదం శుభప్రదమైనది.

శశాంకరశ్మిసంకాశః ప్రాసాదో రాజతో హి సః ।
రమ్యవైడూర్యసోపానో విద్రుమామలసాలకః ॥26॥

చంద్రకిరణాల వంటి ఆ భవనం రజత నిర్మితమై హితకరమైనది. రమ్యమైన వైడూర్యాల మెట్లు గలది. పగడాలవలె నిర్మలమైన సాలకములు కలది.

ఇంద్రనీలమహాచక్రో జాతరూపవిభూషితః ।
వజ్రాంశుజాలైః స్ఫురితో రమ్యో దృష్టిమనోహరః ॥27॥

ఇంద్రనీల మహాచక్రం కలది. బంగారుచే అలంకృతమైనది. వజ్రాంశు జాలముచే ప్రకాశించునది. దృష్టి కింపైనది.

ప్రాసాదే తత్ర భగవాన్ దేవదేవో జనార్దనః ।
భోగిభోగావలీసుప్తః సర్వాలంకారభూషితః ॥28॥

ఆ భవనంలో భగవానుడు, దేవదేవుడైన జనార్దనుడు శేష శయనంపై నిద్రిస్తాడు, సర్వాభరణ భూషితు డాదేవుడు.

జాన్వా చ కుంచితస్త్వేకో దేవదేవస్య చక్రిణః ।
ఫణీంద్రసన్నివిష్టోంఽఘ్రిర్ద్వితీయశ్చ తథానఘ! ॥29॥

అనఘా! దేవదేవుడైన ఆ చక్రి ఒక అంఘ్రి జానుకుంచితమై యుండగా మరొకటి శేషునిపై సన్నివిష్టమై యుంటుంది.

లక్ష్మ్యుత్సఙ్గతోంఽఘ్రిస్తు శేషభోగప్రశాయినః ।
ఫణీంద్రభోగసంన్యస్తబాహుః కేయూరభూషణః ॥30॥
అంగులీపృష్ఠవిన్యస్త దేవశీర్షధరం భుజమ్ ।
ఏకం వై దేవదేవస్య ద్వితీయం తు ప్రసారితమ్ ॥31॥

శేషశయనుని అంఘ్రి లక్ష్మి ఉత్సంగంలో ఉన్నది. శేషుని పడగలపై చేతులుంచి కేయూరభూషణం కల్గి ఒక భుజం దేవదేవుని అంగుళి వెనుక ఉంచిన శిరస్సును ధరిస్తుంది. రెండవది ముందుకు చాచి యుంటుంది.

సమాకుంచితజానుస్థ మణిబంధేన శోభితమ్ ।
కించిదాకుంచితైశ్చైవ నాభిదేశే తథా స్థితః ॥32॥

సమంగా ఆకుంచితమైన జానువుపై ఉన్న మణిబంధంతో శోభితమైనది. కించిదాకుంచితమై నాభిదేశంలో అలా ఉన్నది.

తృతీయం తు భుజం తస్య చతుర్థం తు తథా శృణు ।
ఆత్తసన్తానకుసుమం ఘ్రాణదేశానుసర్పిణమ్ ॥33॥

ఆయన మూడవభుజం అలా వుండగా నాల్గవది సంతాన కుసుమం పట్టుకొని ఘ్రాణదేశం వద్దకు వచ్చియున్నది.

లక్ష్మ్యా సంవాహ్యమానాంఘ్రిః పద్మపత్రనిభైః కరైః ।
సన్తానమాలాముకుటం హారకేయూరభూషితమ్ ॥34॥

భూషితం చ తథా దేవమఙ్గదైరంగులీయకైః ।
ఫణీంద్రఫణవిన్యస్త చారురత్నశిరోజ్జ్వలమ్ ॥35॥

జ్ఞానినామప్యగమ్యం తం ప్రతిష్ఠితమథాత్రిణా ।
సిద్ధాభిపూజ్యం సతతం సతతం కుసుమార్చితమ్ ॥36॥

దివ్యగన్ధానులిప్తాంగం దివ్యధూపేన ధూపితమ్ ।
సరసైః సుఫలైర్హృద్యైః సిద్ధైరుపహృతైః సదా ॥37॥

శోభితోత్తమపార్శ్వం తం దేవముత్పలశీర్షకమ్ ।
తతః సమ్ముఖముద్వీక్ష్య వవన్దే స నరాధిపః ॥38॥

లక్ష్మీదేవి యొక్క పద్మపత్రసదృశాలైన చేతులచే ఒత్తబడే పాదాలు గల వాడూ, కిరీటంపై సంతాన పుష్పములు కలిగి, హారాలు, కేయూరాలచే అలంకరింపబడినవాడూ, అంగుళీయకాలు, అంగదాలచే భూషితుడైనవాడూ, శేషుని పడగలపై వుంచిన అందమైన రత్నాలు గల శిరస్సుచే ఉజ్జ్వలమైనవాడూ, అజ్ఞాతమైన వాస్తవ చరిత్రగలవాడు, అత్రిచే ప్రతిష్ఠింపబడినవాడూ, సిద్ధులచే సదా పూజింపదగినవాడూ, సదా పుష్పాలచే అర్చింపబడినవాడూ, దివ్య గంధానులిప్తశరీరం కలవాడూ, దివ్యధూపముచే ధూపితుడు, సరసాలు, మనోజ్ఞాలు, సిద్ధులు తెచ్చినవి అగు మంచిఫలాలచే శోభించు ఉత్తమపార్శ్వం కలవాడూ, కలువులచే శోభిల్లే శిరస్సు కలవాడూ అగు దేవదేవుని ఎదుట ఆ రాజు వందనం కావించాడు.

జానుభ్యాం శిరసా చైవ గత్వా భూమిం యథావిధి ।
నామ్నాం సహస్రేణ తదా తుష్టావ మధుసూదనమ్ ॥39॥

విధి ప్రకారం మోకాళ్లు, శిరస్సు భూమిపై మోపి సహస్రనామాలతో అప్పుడతడు మాధవుణ్ణి స్తుతించాడు.

ప్రదక్షిణమథో చక్రే స తూత్థాయ పునః పునః ।
రమ్యమాయతనం దృష్ట్వా తత్రోవాసాశ్రమే పునః ॥40॥

ఆ పై లేచి మాటిమాటికి ప్రదక్షిణం చేశాడు. రమ్యమైన నిలయం చూచి అక్కడే ఆశ్రమంలో నివసించాడు.

జలాద్బహిర్గుహాం కాంచిదాశ్రిత్య సుమనోహరామ్ ।
తపశ్చకార తత్రైవ పూజయన్మధుసూదనమ్ ॥41॥

జలం వెలువల ఒక మనోజ్ఞమైన గుహ నాశ్రయించి అక్కడే మధుసూదనుణ్ణి పూజిస్తూ తపస్సు చేశాడు.

నానావిధైస్తథా పుష్పైః ఫలమూలైః సగోరసైః ।
నిత్యం త్రిషవణస్నాయీ వహ్నిపూజాపరాయణః ॥42॥

నానా విధ కుసుమాలతో, ఫలమూలాలతో, గోరసాలతో, నిత్యం త్రిసంధ్యలలో స్నానం చేస్తూ అగ్నిపూజా పరాయణుడైనాడు.

దేవవాపీజలైః కుర్వన్సతతం ప్రాణధారణమ్ ।
సర్వాహారపరిత్యాగం కృత్వా తు మనుజేశ్వరః ॥43॥

దేవవాపీ జలాలతో నిత్యం ప్రాణధారణంచేస్తూ ఆరోజు అన్నివిధాల ఆహారమూ త్యజించాడు.

అనాస్తృతగుహాశాయీ కాలం నయతి పార్థివః ।
త్యక్తాహారక్రియశ్చైవ కేవలం తోయతో నృపః ।
న తస్య గ్లానిమాయాతి శరీరం చ తదద్భుతమ్ ॥44॥

ఆవరణ లేని గుహలో శయనించి కాలం గడుపుతున్నాడు. ఆహారం, క్రియాకలాపాలు వర్జించి కేవలం నీటితో జీవించివున్నాడు. కాని ఆతని శరీరం ఆయాసానికి గురి కాలేదు. అది అద్భుతం.

ఏవం స రాజా తపసి ప్రసక్తః సంపూజయన్దేవవరం సదైవ ।
తత్రాశ్రమే కాలమువాస కంచిత్ స్వర్గోపమే దుఃఖమవిన్దమానః॥45॥

ఇలా రాజు తపోనిష్ఠుడై సదా ఆ దేవాధిదేవుణ్ణి అర్చిస్తూ స్వర్గతుల్యమైన ఆ ఆశ్రమంలో ఏ దుఃఖమూ లేనివాడై కొంతకాలం నివసించాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే పురూరవసః అత్ర్యాశ్రమ గమనం నామైకోనవింశత్యధికశతతమోఽధ్యాయః ॥ 119॥

శ్రీ మహామహామత్సపురాణంలోని పురూరవుని అత్ర్యాశ్రమ గమనమనే నూటపందొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

వింశత్యుత్తరః శతతమోఽధ్యాయః – నూటఇరవైయవ అధ్యాయం

గంధర్వైస్సహ అప్సరసాం క్రీడావిహార వర్ణనమ్ – గంధర్వులతో అప్సరసల క్రీడావిహార వర్ణనం

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

స త్వాశ్రమపదే రమ్యే త్యక్తాహారపరిచ్ఛదః ।
క్రీడావిహారం గన్ధర్వైః పశ్యత్యప్సరసాం సహ ॥1॥

ఆ రాజు రమ్యమైన ఆశ్రమంలో ఆహారాన్నీ, పరిజనులనూ విడనాడి గంధర్వులతో అప్సరసల క్రీడావిహారమును చూస్తున్నాడు.

కృత్వా పుష్పోచ్చయం గుర్వీం గ్రథయిత్వా తథా స్రజమ్ ।
అగ్రం నివేద్య దేవాయ గన్ధర్వేభ్యస్తదా దదౌ ॥2॥

దండిగా పూలుగోసి పెద్ద మాల కట్టి ముందు దేవునికి సమర్పించి తరువాత గంధర్వుల కిచ్చేవాడు.

పుష్పోచ్చయప్రసక్తానాం క్రీడన్తీనాం యథాసుఖమ్ ।
చేష్టా నానావిధాకారాః పశ్యన్నపి న పశ్యతి ॥3॥

అక్కడ పూలు గోస్తూ యథా సుఖంగా క్రీడించే అచ్చరల నానా విధాలైన చేష్టలు చూచి కూడా చూడని వానిలా ఉండేవాడు.

కాచిత్ పుష్పోచ్చయే సక్తా లతాజాలేన వేష్టితా ।
సఖీజనేన సంత్యక్తా కాన్తేనాభిసముజ్ఝితా ॥4॥

ఒకతె పూలు గోస్తూ తీగలతో చుట్టబడి పోయింది. సఖీజను లామెను వదలి వెళ్ళారు. అప్పుడామె కాంతుడు వచ్చి ఆమెను విడిపించాడు.

కాచిత్కమలగన్ధాభా నిఃశ్వాసపవనాహృతైః ।
మధుపైరాకులముఖీ కాన్తేన పరిమోచితా ॥5॥

మరొకతె కమలగంధం కలదై నిట్టూర్పు గాలికి వచ్చిన తుమ్మెదలచే వ్యాకులమైన వదనం కలదయింది. అప్పుడు వచ్చి కాంతు డామెను కాపాడాడు.

మకరన్దసమాక్రాన్తనయనా కాచిదఙ్గనా ।
కాన్తనిఃశ్వాసవాతేన నీరజస్క కృతేక్షణా ॥6॥

పుప్పొడి కళ్ళల్లో పడిన ఒక అంగన కాంతుని నిశ్వాసవాయువుచేత ధూళి తొలగిన కన్నులు గలదయింది.

కాచిదుచ్చీయ పుష్పాణి దదౌ కాన్తస్య భామినీ ।
కాన్తసంగ్రథితైః పుష్పై రరాజ కృతశేఖరా ॥7॥

ఒకతె పూలు గోసి కాంతుని కిచ్చింది. అతడాపూలతో మాలగ్రుచ్చి ఇవ్వగా దానిని తలపై దాల్చి ఆమె విరాజిల్లింది.

ఉచ్చీయ స్వయముద్గ్రథ్య కాన్తేన కృతశేఖరా ।
కృతకృత్యమివాత్మానం మేనే మన్మథవర్ధినీ ॥8॥

ఒకడు తానే పూలుగోసి మాలలు గట్టి ప్రేయసి తలలో పెట్టగా ఆ మన్మథవర్ధిని తన్ను కృతకృత్యురాలినిగా భావించింది.

అన్యస్మిన్ గహనే కుంజే విశేషకుసుమా లతాః ।
కాచిదేవం రహో నీతా రమణేన రిరంసునా ॥9॥

పొదలో విశిష్ట పుష్పాలు గల లత ఉన్నదని చెప్పి రతి గోరిన ఒక రమణు డామెను రహఃస్థలానికి తీసుకువెళ్ళాడు.

కాన్తసన్నామితలతా కుసుమాని విచిన్వతీ ।
సర్వాభ్యః కాచిదాత్మానం మేనే సర్వగుణాధికామ్ ॥10॥

కాంతుడు వంచిన లత నుండి పూలుగోస్తూ ఒకతె ఇతరస్త్రీ లందరకంటె తాను గుణాధికనని తలంచింది.

కాశ్చిత్పశ్యంతి భూపాలం నలినీషు పృథక్ పృథక్ ।
క్రీడమానాస్తు గన్ధర్వైర్దేవరామా మనోరమాః ॥11॥

కొందరు మనోరమలు గంధర్వులతో క్రీడిస్తూనే పద్మాలమధ్య విడివిడిగా ప్రతిఫలించిన మద్రభూపాలుణ్ణి చూడసాగారు.

కాచిదతాడయత్కాన్తముదకేన శుచిస్మితా ।
తాడ్యమానాఽథ కాన్తేన ప్రీతిం కాచిదుపాయయౌ ॥12॥

ఒక శుచిస్మిత నీటితో కాంతుణ్ణి ప్రహరించింది. అతడు తిరిగి అట్లే కొట్టగా ప్రీతి పొందింది.

కాన్తం చ తాడయామాస జాతఖేదా వరాంగనా ।
అదృశ్యత వరారోహా శ్వాసనృత్యత్పయోధరా ॥13॥

కాంతుణ్ణి ప్రహరిస్తూ ప్రహరిస్తూ ఖేదం పొంది ఒక వరారోహ శ్వాసాధిక్యంచే నర్తించే పయోధరాలు గలదయ్యింది.

కాన్తాంబుతాడనాకృష్టకేశపాశనిబన్ధనా ।
కేశాకులముఖీ భాతి మధుపైరివ పద్మినీ ॥14॥

ఒకతె కాంతుడు జలతాడనం చేయగా చిక్కుపడిన కేశపాశాలు గలదై కేశాకులవదనంతో మధుపాలు మూగిన పద్మంవలె ఉండినది.

స్వచక్షుః సదృశైః పుష్పైః సంఛన్నే నలినీవనే ।
ఛన్నా కాచిచ్చిరాత్ప్రాప్తా కాన్తేనాన్విష్య యత్నతః ॥15॥

తమ కన్నులను పోలిన పూలతో నళినీవనం కప్పబడే సరికి ఒకతె కనిపించక చాలాసేపటికి కాంతుడన్వేషించగా కనిపించింది.

స్నాతా శీతాపదేశేన కాచిత్ ప్రౌఢాంగనా భృశమ్ ।
రమణాలింగనం చక్రే మనోఽభిలషితం చిరమ్ ॥16॥

స్నానం చేసి 'చలి' అన్న వ్యాజంతో ఒక ప్రౌఢవనిత ప్రియుణ్ణి ఆలింగనం చేసుకొని చిరకాల మనోవాంఛను పూర్ణం చేసుకొన్నది.

జలార్ద్రవసనం సూక్ష్మమఙ్గలీనం శుచిస్మితా ।
ధారయన్తీ జనం చక్రే కాచిత్ తత్ర సమన్మథమ్ ॥17॥

నీట తడిసిన సన్నని వస్త్రం దాల్చిన ఒక శుచిస్మిత చూచినవారికి మన్మథవికారం కల్గించింది.

కణ్ఠమాల్యగుణైః కాచిత్ కాన్తేనాకృష్యతామ్బుసి ।
త్రుట్యత్స్రగ్దామపతితం రమణం ప్రాహసచ్చిరమ్ ॥18॥

ఒకతె తన కంఠమాల్యరత్నాలతో లాగుతున్న కాంతుడు మాల తెగేసరికి నీటబడగా అతణ్ణి చూచి పరిహసించింది.

కాచిల్లగ్న సఖీదత్త జానుదేశే నఖాంతరే ।
సంభ్రాన్తాక్రాన్తరమణా కాచిద్దృష్టా హతం చిరమ్ ॥19॥

ఒకతె మోకాళ్ళపై ఆమెకు చేరువగా నున్న చెలి తన గోళ్ళతో క్షతం చేయగా ఆమె తడబాటున పోయి ప్రియునిపై బడి చిరకాలము అతనిచే చూడబడినది.

కాచిత్ పృష్ఠకృతాదిత్యా కేశనిస్తోయకారిణీ ।
శిలాతలగతా భర్త్రా దృష్టా కామార్తచక్షుషా ॥20॥

ఒకతె సూర్యుడు వెనుక వైపున్నట్లు నిల్చి వెంట్రుక లారబెట్టుకొంటూ శిలాతలంపై నిల్చి కామార్తదృష్టి గల భర్తచే చూడబడింది.

కృత్తమాల్యం విలులితం సంక్రాన్తకుచకుంకుమమ్ ।
రతిక్రీడితకాన్తేవ రరాజ తత్ సరోదకమ్ ॥21॥

తెగిన మాల్యం కలది, కలత బెట్టబడినది, సంక్రమించిన కుచకుంకుమం కలది యగు సరస్సులోని జలం రతిక్రీడలో నలిగిన కాంతవలె రాజిల్లింది.

సుస్నాతదేవగన్ధర్వ దేవరామాగణేన చ ।
పూజ్యమానం చ దదృశే దేవదేవం జనార్దనమ్ ॥22॥

చక్కగా స్నానం చేసిన దేవతలు, గంధర్వులు, దేవస్త్రీలచే పూజింపబడుతున్న దేవదేవుడైన జనార్దనుణ్ణి రాజు చూచాడు.

క్వచిచ్చ దదృశే రాజా లతా గృహగతాః స్త్రియః ।
మణ్డయన్తీః స్వగాత్రాణి కాన్తసన్న్యస్తమానసాః ॥23॥

ఒకచో లతాగృహంలోని స్త్రీలు కాంతులపై చిత్తం కల్గి తమ అవయవాలను అలంకరించుకొంటూ వుండగా రాజు చూచాడు.

కాచిదాదర్శనకరా వ్యగ్రా దూతీముఖోద్గతమ్ ।
శృణ్వతీ కాన్తవచనమధికా తు తథా బభౌ ॥24॥

ఒకతె అద్దం వైపు చూస్తూ వ్యగ్రతతో దూతి ద్వారా కాంతుని మాట వింటూ మిక్కిలిగా విలసిల్లింది.

కాచిత్ సత్వరితా దూత్యా భూషణానాం విపర్యయమ్ ।
కుర్వాణా నైవ బుబుధే మన్మథావిష్టచేతనా ॥25॥

ఒకతె తన్ను దూతి తొందరపెట్టుతుండగా మదనావేశంతో నగలను వ్యత్యస్తంగా ధరించుటను గుర్తించలేకపోయింది.

వాయునున్నాతిసురభికుసుమోత్కరమణ్డితే ।
కాచిత్ పిబన్తీ దదృశే మైరేయం నీలశాద్వలే ॥26॥

గాలి ప్రేరణచే వ్యాపించిన వాసన గల పూగుత్తులచే అలంకృతమైన నల్లని పచ్చిక బయలునందు ఒకతె మధువు త్రాగుతూ కనిపించింది.

పాయయామాస రమణం స్వయం కాచిద్వరాఙ్గనా ।
కాచిత్ పపౌ వరారోహా కాన్తపాణిసమర్పితమ్ ॥27॥

ఒకతె తానే కాంతునిచే త్రాగించగా, మరొకతె కాంతుడు తన చేతికిచ్చిన దానిని త్రాగింది.

కాచిత్ స్వనేత్రచపలనీలోత్పలయుతం పయః ।
పీత్వా పప్రచ్ఛ రమణం క్వ గతౌ తౌ మమోత్పలౌ ॥28॥

ఒకతె తన నేత్రాలు ప్రతిబింబించిన నీలోత్పల సహిత జలం త్రాగి రమణుణ్ణి నా ఉత్పలా లెక్కడ పోయాయని అడిగింది.

త్వయైవ పీతౌ తౌ నూనమిత్యుక్తా రమణేన సా ।
తథా విదిత్వా ముగ్ధత్వాద్బభూవ వ్రీడితా భృశమ్ ॥29॥

అతడు వాటిని నీవే త్రాగి వేశావని చెప్పేసరికి అది గ్రహించి ముగ్ధ కావడం వల్ల మిక్కిలిగా సిగ్గుపడింది.

కాచిత్ కాన్తార్పితం సుభ్రూః కాన్తపీతావశేషితమ్ ।
సవిశేషరసం పానం పపౌ మన్మథవర్ధనమ్ ॥30॥

ఒకతె కాంతుడు తాను త్రాగి మిగలగా అందించిన సవిశేషరసమై, మదనవర్ధనమైన పానాన్ని త్రాగింది.

ఆపానగోష్ఠీషు తథా తాసాం స నరపుఙ్గవః ।
శుశ్రావ వివిధం గీతం తంత్రీస్వరవిమిశ్రితమ్ ॥31॥

ఆ రాజు పానగోష్ఠులలో వారి వివిధ గీతాలను, తంత్రీస్వర మిశ్రితంగా విన్నాడు.

ప్రదోషసమయే తాశ్చ దేవదేవం జనార్దనమ్ ।
రాజన్ సదోపనృత్యన్తి నానావాద్యపురఃసరాః ॥32॥

వారు ప్రదోషకాలంలో దేవదేవుడైన జనార్దనుని యెదుట నానావాద్య పురస్సరంగా నృత్యం చేశారు.

యామమాత్రే గతే రాత్రౌ వినిర్గత్యః గుహాముఖాత్ ।
ఆవసంతి యుతాః కాన్తైః తత్తద్విరచితాం గుహామ్ ॥33॥

ఒక జాము రాత్రి గడిచిన పిమ్మట గుహాముఖం నుండి వెలికివచ్చిన వనితలు తమకై ఏర్పాటు చేయబడి ఉన్న గుహలను ప్రియులతో గూడి ఆవాసంగా చేసుకొన్నారు.

నానాగన్ధాన్వితలతాం నానాగన్ధసుగన్ధినీమ్ ।
నానావిచిత్రశయనాం కుసుమోత్కరమణ్డితామ్ ॥34॥

ఆ గుహ నానా గంధాలు గల లతలు గలది, నానా గంధాలచే సుగంధితమైనది, నానా విధ చిత్రశయనాలు గలది మరియు పూలచే అలంకృతమైనది.

ఏవమప్సరసాం పశ్యన్ క్రీడితాని స పర్వతే ।
తపస్తేపే మహారాజన్ కేశవార్పితమానసః ॥35॥

మహారాజా! ఆ రాజు అలా అచ్చరల క్రీడలు చూస్తూ కేశవార్పితచిత్తుడై ఆ కొండపై తపస్సు చేశాడు.

తమూచుర్నృపతిం గత్వా గన్ధర్వాప్సరసాం గణాః ।
రాజన్! స్వర్గోపమం దేశమిమం ప్రాప్తోఽస్యరిన్దమ ॥36॥

గంధర్వాప్సరోగణాలు ఆ రాజు చెంతకు పోయి "రాజా! శత్రునాశకా! స్వర్గసదృశమైన ఈ ప్రదేశానికి వచ్చావు.

వయం హి తే ప్రదాస్యామో మనసః కాంక్షితాన్ వరాన్ ।
తానాదాయ గృహం గచ్ఛ తిష్ఠేహ యది వా పునః ॥37॥

మేము నీవు కోరిన వరాలివ్వగలము. అవి గ్రహించి ఇంటికి పొమ్ము! లేదా ఇక్కడే ఉండిపో" అన్నారు.

రాజోవాచ :- రాజు చెప్పాడు.

అమోఘదర్శనాః సర్వే భవన్తస్త్వమితౌజసః ।
వరం వితరతాద్యైవ ప్రసాదం మధుసూదనాత్ ॥38॥

మీరందరూ అమోఘ దర్శనం కలవారు. గొప్ప తేజోవంతులు, మీరు నాకు మధుసూదనునుండి అనుగ్రహమనే వరమివ్వండి.

ఏవమస్త్విత్యథోక్తస్తైః స తు రాజా పురూరవాః ।
తత్రోవాస సుఖీ మాసం పూజయానో జనార్దనమ్ ॥39॥

'సరే' అని వారన్నారు. పురూరవరాజు అక్కడ సుఖంగా జనార్దనుణ్ణి పూజిస్తూ ఒక నెల ఉన్నాడు.

ప్రియ ఏవ సదైవాసీద్గన్ధర్వాప్సరసాం నృపః ।
తుతోష స జనో రాజ్ఞస్తస్యాలౌల్యేన కర్మణా ॥40॥

గంధర్వాప్సరసలకు ఆ రాజు సదా ప్రియంగా ఉండినాడు. అతని చాపల్య రహిత కర్మవల్ల వారు సంతసించారు.

మాఘస్య మధ్యే న నృపః ప్రవిష్టస్తదాశ్రమం రత్నసహస్రచిత్రమ్ ।
ఉవాస మాసం ప్రియకృత్సమగ్రం శీతోష్ణభేదైః నృపఫాల్గుణస్య ॥41॥

రత్న సహస్ర చిత్రమైన ఆ ఆశ్రమంలో రాజు మాఘమాస మధ్యమున ప్రవేశించి ఫాల్గుణ శీతోష్ణభేదాలతో ప్రీతి జెంది ఒక నెల గడిపినాడు.

ఫాల్గునామలపక్షాన్తే రాజా స్వప్నే పురూరవాః ।
తస్యైవ దేవదేవస్య శ్రుతవాన్గదితం శుభమ్ ॥42॥

ఫాల్గున శుక్లపక్షం చివర పురూరవరాజు కలలో ఆ దేవదేవుడు చెప్పిన మాట లిలా విన్నాడు.

రాత్ర్యామస్యాం వ్యతీతాయామత్రిణా త్వం సమేష్యసి ।
తేన రాజన్సమాగమ్య కృతకృత్యో భవిష్యసి ॥43॥

"ఈ రాత్రి గడవగానే నీవు అత్రిమహర్షిని కలుసుకోగలవు. రాజా! ఆయనను కలిసి కృతకృత్యుడ వవుతావు."

స్వప్నమేవం స రాజర్షిర్దృష్ట్వా దేవేంద్రవిక్రమః ।
ప్రత్యూషకాలే విధివత్ స్నాతః స ప్రయతేంద్రియః ॥44॥

దేవేంద్రుని వంటి విక్రమంకల ఆ రాజర్షి ఇట్టి స్వప్నం చూచి ప్రత్యూషకాలంలో విధివిధానంతో స్నానమాచరించి నిగ్రహించిన ఇంద్రియాలు గలవాడై

కృతకృత్యో యథాకామం పూజయిత్వా జనార్దనమ్ ।
దదర్శాత్రిం మునిం రాజా ప్రత్యక్షం తపసాం నిధిమ్ ॥45॥

కృతకృత్యుడై యథేష్టంగా జనార్దనుణ్ణి పూజించి తపోనిధి అయిన అత్రిమునిని ప్రత్యక్షంగా చూచాడు.

స్వప్నం తు దేవదేవస్య న్యవేదయత ధార్మికః ।
తతః శుశ్రావ వచనం దేవతానాం సమీరితమ్ ॥46॥

ఆ ధార్మికుడు మునికి దేవదేవుని స్వప్నాన్ని నివేదించాడు. ఆపై దేవతలు చెప్పిన ఈ మాటలను విన్నాడు.

ఏవమేతన్మహీపాల నాత్ర కార్యా విచారణా ।
ఏవం ప్రసాదం సంప్రాప్య దేవదేవాజ్జనార్దనాత్ ॥47॥
కృతదేవార్చనో రాజా తథా హుతహుతాశనః ।
సర్వాన్కామానవాప్తోఽసౌ వరదానేన కేశవాత్ ॥॥48॥

"ఇది ఇట్లే, రాజా! ఇందులో విచారణ వలదు". దేవదేవుడైన జనార్దను నుండి ఇలా అనుగ్రహం పొంది దేవార్చన కావించి అగ్నిహోత్రం అనుష్ఠించి కేశవునివరదానంతో సకల కామాలనూ పొందాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే గంధర్వైస్సహ అప్సరసాం క్రీడావిహార వర్ణనం నామ వింశత్యుత్తరశత తమోఽధ్యాయః ॥ 120 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని గంధర్వులతో అప్సరసల క్రీడావిహార వర్ణనమనే నూటఇరవైయవ అధ్యాయం సంపూర్ణం

ఏకవింశత్యుత్తరశతతమోఽధ్యాయః - నూటఇరవైఒకటవ అధ్యాయం

కైలాసాది పర్వతవర్ణనమ్ - కైలాసాది పర్వతవర్ణన

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

తస్యాశ్రమస్యోత్తరతస్త్రిపురారినిషేవితః ।
నానారత్నమయైః శృఙ్గైః కల్పద్రుమసమన్వితైః ॥1॥

మధ్యే హిమవతః పృష్ఠే కైలాసో నామ పర్వతః ।
తస్మిన్నివసతి శ్రీమాన్కుబేరః సహ గుహ్యకైః ॥2॥

ఆ ఆశ్రమానికి ఉత్తరాన శివుడు సేవించే కైలాసమనే పర్వతం ఉన్నది. కల్పవృక్షాలూ, నానారత్నమయ శిఖరాలూ గల పర్వతమది. హిమవత్పర్వతపృష్ఠమధ్యంలో ఆ పర్వత ఉన్నది. అక్కడ గుహ్యకులతో గూడి కుబేరుడు అనే శ్రీమంతుడు నివసిస్తున్నాడు.

అప్సరోఽనుగతో రాజా మోదతే హ్యలకాధిపః ।
కైలాసపాదసంభూతం పుణ్యం శీతజలం శుభమ్ ॥3॥

మన్దోదకం నామ సరః పయస్తు దధిసన్నిభమ్ ।
తస్మాత్ప్రభహతే దివ్యా నదీ మన్దాకినీ శుభా ॥4॥

అచ్చరలచే సేవింపబడుతూ ఆ రాజు అలకానగరాధిపతియై ఆనందంగా ఉన్నాడు. కైలాస పాదంలో పుట్టి చల్లని నీరు గలదై శుభావహమై పుణ్యమైన మందోదకమనే సరస్సు అక్కడ ఉన్నది. దాని జలం పెరుగులాగా వుంటుంది. అక్కడినుండే శుభావహమై దివ్యమైన మందాకినీనది ప్రవహిస్తున్నది.

దివ్యం చ నన్దనం తత్ర తస్యాస్తీరే మహచ్ఛుభమ్ ।
ప్రాగుత్తరేణ కైలాసాద్దివ్యం సౌగన్ధికం గిరిమ్ ॥5॥

సర్వధాతుమయం దివ్యం సువేలం పర్వతం ప్రతి ।
చంద్రప్రభో నామ గిరిర్యః శుభ్రో రత్నసన్నిభః ॥6॥

దాని గట్టున దివ్యమైన నందనమనే మనోహరవనమున్నది. కైలాసానికి ఈశాన్యంలో దివ్యమైన సౌగంధికగిరి, సర్వధాతుమయమైన సువేలాగిరి ఉన్నాయి. అక్కడ చంద్రప్రభమనే పర్వతం కూడా రత్నసదృశమై భాసిస్తున్నది.

తత్సమీపే సరో దివ్యమచ్ఛోదం నామ విశ్రుతమ్ ।
తస్మాత్ప్రభవతే దివ్యా నదీ హ్యచ్ఛోదికా శుభా ॥7॥

దాని వద్ద 'అచ్ఛోద' మనే దివ్యమైన సరస్సు కలదు. అందుండి శుభ ప్రదమైన అచ్ఛోదికానది ప్రభవిస్తున్నది.

తస్యాస్తీరే వనం దివ్యం మహచ్చైత్రరథం శుభమ్ ।
తస్మిన్ గిరౌ నివసతి మాణిభద్రః సహానుగః ॥8॥

యక్షసేనాపతిఃక్రూరో గుహ్యకైః పరివారితః ।
పుణ్యా మన్దాకినీ నామ నదీ హ్యచ్ఛోదకా శుభా ॥9॥

దాని గట్టున గొప్ప చైత్రరథమనే వనం ఉన్నది. ఆ కొండపై మాణిభద్రుడనే యక్షసేనాధిపతి అనుయాయులతో కూడి నివసిస్తాడు. గుహ్యక పరివారసమేతుడైన ఆతడు క్రూరచిత్తుడు. మందాకినీ నది పుణ్యమైనది, అచ్ఛోదక శుభమైనది. (మందాకినినే అచ్ఛోదక అని కొందరంటారు.)

మహీమణ్డలమధ్యే తు ప్రవిష్టా చ మహోదధిమ్ ।
కైలసదక్షిణాప్రాచ్యాం శివసర్వౌషధిం గిరిమ్ ॥10॥

మనఃశిలామయం దివ్యం శబలం పర్వతం ప్రతి ।
లోహితో హేమశృఙ్గస్తు గిరిః సూర్యప్రభో మహాన్ ॥11॥

అది భూమండలమధ్యంలో మహా సముద్రంలో ప్రవేశిస్తుంది. కైలాసానికి ఆగ్నేయాన శుభకరమగు సర్వౌషధిగిరి, మనశ్శిలామయమూ, దివ్యమూ అయిన శబలగిరి ఉన్నది. దాని సమీపాన సూర్యకాంతిగల స్వర్ణశిఖరంతో కూడిన లోహితపర్వతం విరాజిల్లుతున్నది.

తస్య పాదే మహద్దివ్యం లోహితం సుమహత్సరః ।
తస్మాత్ప్రభవతే పుణ్యో లౌహిత్యశ్చ నదో మహాన్ ॥12॥

దాని పాదంలో గొప్ప దివ్యమైన లోహితమనే సరస్సు కలదు. దాని నుండి లౌహిత్యమనే గొప్ప నదం ఉద్భవిస్తుంది.

దివ్యారణ్యమశోకం చ తస్య తీరే మహద్వనమ్ ।
తస్మిన్ గిరౌ నివసతి యక్షో మణిధరో వశీ ॥13॥

సౌమ్యైః సుధార్మికైశ్చైవ గుహ్యకైః పరివారితః ।
కైలాసాత్పశ్చిమావాచ్యాం కకుద్మానుదితో గిరిః ॥14॥

కకుద్మతి చ రుద్రస్య హ్యుత్పత్తిస్త్రికకుద్మితః ।
తదంజనం త్రైకకుదం శైలం త్రికకుదం ప్రతి ॥15॥

దాని తీరంలో దివ్యారణ్యమైన అశోకమనే మహావనం ఉన్నది. ఆ కొండమీద మణిధరుడనే యక్షుడు ఇంద్రియ నిగ్రహం కలవాడు ఉన్నాడు. అతడు సౌమ్యుడు, మంచి ధార్మికులైన యక్షులతో కూడినవాడు. కైలాసానికి నైరుతిదిశలో కకుద్మాన్ అనే ఒక ఓషధీ పర్వతం ఉన్నది. రుద్రుని ఉత్పత్తి ఈ కకుద్మద్గిరిలోనే జరిగింది. త్రికకుదగిరి చెంత అంజనగిరి ఉన్నది.

సర్వధాతుమయస్తత్ర సుమహాన్ వైద్యుతో గిరిః ।
తస్య పాదే మహద్దివ్యం మానసం సిద్ధసేవితమ్ ॥16॥

సర్వధాతుమయమైన పెద్ద వైద్యుతగిరి అక్కడ ఉన్నది. దాని పాదంలో సిద్ధ సేవితమైన దివ్యమానస సరోవరం ఉన్నది.

తస్మాత్ప్రభవతే పుణ్యా సరయూర్లోకపావనీ ।
యస్యాస్తీరే వనం దివ్యం వైభ్రాజం నామ విశ్రుతమ్ ॥17॥

దాని నుండి పుణ్యమైన, లోకపావనియైన సరయూనది జనిస్తుంది. దాని గట్టున వైభ్రాజమనే ప్రసిద్ధమగు దివ్యవనం కలదు.

కుబేరానుచరస్తస్మిన్ప్రహేతితనయో వశీ ।
బ్రహ్మయోనిర్నివసతి రాక్షసోఽనన్తవిక్రమః ॥18॥

అక్కడ కుబేరుని సేవకుడు, ప్రహేతిసుతుడు, ఇంద్రియనిగ్రహపరుడు, బ్రహ్మయోని అనే అనంత విక్రముడైన రాక్షసుడొకడు నివసిస్తున్నాడు.

కైలాసాత్పశ్చిమామాశాం దివ్యః సర్వౌషధిర్గిరిః ।
అరుణః పర్వతశ్రేష్ఠో రుక్మధాతువిభూషితః ॥19॥

కైలాసానికి పశ్చిమదిశలో దివ్యం, సకలౌషధనిలయమైన అరుణమనే పర్వతశ్రేష్ఠం ఉన్నది. అది స్వర్ణధాతువులచే విభూషితమైనది.

భవస్య దయితః శ్రీమాన్పర్వతో హైమసన్నిభః ।
శాతకుంభమయైర్దివ్యైః శిలాజాలైః సమాచితః ॥20॥

శివుని కిష్టమైన 'శ్రీమాన్' అనే గిరి హైమసన్నిభమైనది. అది స్వర్ణమయమైన దివ్యశిలాజాలాలచే ఆవృతమైనది.

శతసంఖ్యైస్తాపనీయైః శృఙ్గైర్దివమివోల్లిఖన్ ।
ముంజవాన్సుమహాదివ్యో దుర్గః శైలో మహాచితః ॥21॥

నూర్లకొలది బంగారుమయమైన శిఖరాలతో ఆకాశాన్ని ఒరసుకొంటున్నదా అన్నట్లున్న ముంజవంతమనే పర్వతం కలదు. మహాదివ్యము, దుర్గము, సువ్యాప్తమూ అయివున్నది.

తస్మిన్ గిరౌ నివసతి గిరిశో ధూమ్రలోచనః ।
తస్య పాదాత్ప్రభవతి శైలోదం నామ తత్సరః ॥22॥

ఆ కొండపై ధూమ్రలోచనుడైన శివుడు నివసిస్తున్నాడు. దాని పాదం నుండి శైలోదమనే సరస్సు ప్రభవించింది.

తస్మాత్ప్రభవతే పుణ్యా నదీ శైలోదకా శుభా ।
సా దక్ష శీతయోర్మధ్యే ప్రవిష్టా పశ్చిమోదధిమ్ ॥23॥

అందుండి 'శైలోదక' అనే పుణ్యనది ప్రవహిస్తున్నది. దక్షశీతములనే రెండు కొండల నడుమ ప్రవహించి అది పశ్చిమసముద్రంలో ప్రవేశిస్తున్నది.

అస్త్యుత్తరేణ కైలాసాచ్ఛివః సర్వౌషధిర్గిరిః ।
గౌరస్తు పర్వతశ్రేష్ఠో హరిసాలమయం ప్రతి ॥24॥

కైలాసానికి ఉత్తరాన 'శివం' అనే సర్వౌషధులు గల కొండ ఉన్నది. దాని చెంత గౌరపర్వతం శ్రేష్ఠహరితాళమయమై విలసిల్లుతున్నది.

హిరణ్యశృఙ్గః సుమహాన్దివ్యౌషధిమయో గిరిః ।
తస్య పాదే మహద్దివ్యం సరః కాంచనవాలుకమ్ ॥25॥

స్వర్ణ శిఖరాలు, దివ్యౌషధాలు గల పర్వతమది. దాని పాదంలో బంగారు ఇసుకతో కూడిన ఒక దివ్యమైన మహాసరస్సు ఉన్నది.

రమ్యం బిందుసరో నామ యత్ర రాజా భగీరథః ।
గంగార్థే స తు రాజర్షిరువాస బహులాః సమాః ॥26॥

అది మనోజ్ఞమైనది. దాని పేరు బిందు సరస్సు'. అక్కడ భగీరథుడనే రాజర్షి గంగ కొరకై చాలా సంవత్సరాలు నివసించాడు.

దివం యాస్యన్తు మే పూర్వే గంగాతోయాప్లుతాస్థికాః ।
తత్ర త్రిపథగా దేవీ ప్రథమం తు ప్రతిష్ఠితా ॥27॥

అతడు "నా పూర్వులందరూ గంగాజలంలో మునిగిన అస్థులు గలవారై స్వర్గం చేరుదురు గాక!" అని తపస్సు చేశాడు. అక్కడే త్రిపథగా దేవి మొదట ప్రతిష్ఠిత అయింది.

సోమపాదాత్ప్రసూతా సా సప్తధా ప్రవిభజ్యతే ।
యూపా మణిమయాస్తత్ర చితయశ్చ హిరణ్మయాః ॥28॥

సోమపాదంనుండి జనించిన ఆ నది ఏడు పాయలుగా విభజింపబడింది. అక్కడి యూపాలు మణిమయాలు, చితులు (యజ్ఞవేదికా విశేషాలు) స్వర్ణమయాలు.

తత్రేష్ట్వా క్రతుభిః సిద్ధాః శక్రః సురగణైః సహ ।
దివ్యశ్ఛాయాపథస్తత్ర నక్షత్రాణ్యనుమణ్డలమ్ ॥29॥

దృశ్యతే భాసురా రాత్రౌ దేవీ త్రిపథగా తు సా ।
అన్తరిక్షం దివం చైవ ప్లావయిత్వా భువంగతా ॥30॥

అక్కడ ఇంద్రుడు, సిద్ధులు సురగణాలతో గూడి క్రతువులు చేశారు. అక్కడి నక్షత్రమండలం స్వర్గానికి ఛాయా పథంగా ఉన్నది. రాత్రి గంగానది భాసురంగా కనిపిస్తుంది. అంతరిక్షాన్నీ, భూమినీ ముంచివేస్తూ గంగ అక్కడ భూమికి దిగింది.

భవోత్తమాంగే పతితా సంరుద్ధా యోగమాయయా ।
తస్యా యే బిన్దవః కేచిత్క్రుద్ధాయాః పతితా భువి ॥31॥

కృతం తు తైర్బిందుసరః తతో బిందుసరః స్మృతమ్ ।
తతస్తస్యా నిరుద్ధాయా భవేన సహసా రుషా ॥32॥

శివుని శిరస్సుపై పడి యోగమాయచే నిరోధింపబడి కోపగించిన గంగయొక్క ఏ బిందువులు భూమిపై పడినవో, అవి ఒక పెద్ద సరస్సును సృష్టించాయి. అందుకే అది బిందు సరస్సు అయింది. శివునిచే రోషంతో నిరోధింపబడిన గంగయొక్క బిందువులవి.

జ్ఞాత్వా తస్యా హ్యభిప్రాయం క్రూరం దేవ్యాశ్చికీర్షితమ్ ।
భిత్త్వా విశామి పాతాలం స్రోతసా గృహ్య శంకరమ్ ॥33॥

అథావలేపం తం జ్ఞాత్వా తస్యాః క్రుద్ధస్తు శంకరః ।
తిరోభావయితుం బుద్ధిరాసీదంగేషు తాం నదీమ్ ॥34॥

"భూమిని ఛేదించుకొని పాతాళం ప్రవేశిస్తాను. శంకరుణ్ణి గూడా ప్రవాహంతో తీసుకొని పోతాను" అని భావించిన, ఆ గంగాదేవియొక్క చేష్టనూ, క్రూరమైన అభిప్రాయాన్ని తెలిసికొని ఆమె గర్వం గ్రహించి కోపించిన శివుడు తన అంగాలలో ఆ నదిని అంతర్ధానం చేయాలనుకొన్నాడు.

ఏతస్మిన్నేవ కాలే తు దృష్ట్వా రాజానమగ్రతః ।
ధమనీసన్తతం క్షీణం క్షుధావ్యాకులితేంద్రియమ్ ॥35॥

ఇంతలో ఎదుటనున్న భగీరథుణ్ణి చూచాడు. అతడు ధమనుల ప్రోవుగా క్షీణించి ఆకలితో వ్యాకులత పొందిన ఇంద్రియాలు కల్గియున్నాడు.

అనేన తోషితశ్చాహం నద్యర్థే పూర్వమేవ తు ।
బుద్ధ్వాస్య వరదానం తు తతః కోపం న్యయచ్ఛత ॥36॥

"పూర్వమే ఈ రాజుచే ఈ నది కొరకై నేను సంతోషింపజేయబడితిని. వరదానం అంగీకరించాను" అని గ్రహించి కోపాన్ని నిగ్రహించుకొన్నాడు.

బ్రహ్మణో వచనం శ్రుత్వా యదుక్తం ధారయన్నదీమ్ ।
తతో విసర్జయామాస సంరుద్ధాం స్వేన తేజసా ॥37॥

నదిని ధరిస్తూ బ్రహ్మమాట విని తన తేజస్సుతో నిరోధించబడిన నదిని విసర్జించాడు.

నదీం భగీరథస్యార్థే తపసోగ్రేణ తోషితః ।
తతో విసర్జయామాస సప్త స్రోతాంసి గంగయా ॥38॥

రాజు చేసిన ఉగ్రతపస్సుకు సంతసించిన శివుడు భగీరథుని కొరకై నదిని విసర్జించాడు. అది ఏడు పాయలై పారింది.

త్రీణి ప్రాచీమభిముఖం ప్రతీచీం త్రీణ్యథైవ తు ।
స్రోతాంసి త్రిపథాయాస్తు ప్రత్యపద్యన్త సప్తధా ॥39॥

అందు మూడు తూర్పు ముఖంగా, మరొక మూడు పశ్చిమ ముఖంగా వెళ్ళాయి. ఇలా గంగ ఏడు విభాగాలయింది.

నలినీ హ్లాదినీ చైవ పావనీ చైవ ప్రాచ్యగా ।
సీతా చక్షుశ్చ సింధుశ్చ తిస్రస్తా వై ప్రతీచ్యగాః ॥40॥

నలిని, హ్లాదిని, పావని అనేవి తూర్పుగానూ, సీత, చక్షువు, సింధువు – అనే మూడూ పశ్చిమంగానూ వెళ్ళాయి.

సప్తమ్యనుగతా తాసాం దక్షిణేన భగీరథమ్ ।
తస్మాద్భాగీరథీ సా వై ప్రవిష్టా దక్షిణోదధిమ్ ॥41॥

ఏడవది దక్షిణదిశగా భగీరథుని అనుసరించి వెళ్ళింది. అందుకే భాగీరథిగా పేరొంది దక్షిణసాగరంలో కలిసింది.

సప్త చైతాః పావయన్తి వర్షం తు హిమసాహ్వయమ్ ।
ప్రసూతాః సప్త నద్యస్తు శుభా బిందుసరోద్భవాః ॥42॥

ఈ ఏడూ భారత హిమవర్షాన్ని పావనం చేస్తున్నాయి. ఈ రీతిగీ బిందుసరంనుండి శుభప్రదమైన ఏడు నదులు పుట్టాయి.

సీతా చక్షుశ్చ సింధుశ్చ తిస్రశ్చైవ సుశోభనాః ।
తాన్దేశాన్ పావయన్తి స్మ మ్లేచ్ఛప్రాయాంశ్చ సర్వశః ।
సశైలాన్ కుకురానంధ్రాన్బర్బరాన్యవనాన్తికాన్ ॥43॥

సీత, చక్షువు, సింధువు అనే శోభనమైన మూడు నదులు మ్లేచ్ఛప్రాయములైన ఆ దేశాలను గూడా పవిత్రం చేశాయి. కొండలు గల కుకురదేశాలు, అంధ్ర, బర్బర, యవనాంతికాలు ఆ మ్లేచ్ఛదేశాలు

పుల్కసాశ్చ కులుత్థాశ్చ అంగలోక్యాధరాశ్చ యే ।
ద్విధా కృత్వా హిమవన్తం ప్రవిష్టా దక్షిణోదధిమ్ ॥44॥

పుల్కస, కులుత్థ, అంగలోక్యాధరదేశాలను కూడా ఆ నదులు పవిత్రం చేశాయి. అవి హిమనగం చెంత రెండుగా చీలి ఆ పై దక్షిణ సాగరం చేరాయి.

అప్లాక్షాంశ్చ మరూంశ్చైవ కాలకాంశ్చైవ శూలికాన్ ।
కరానానర్తకాన్ శాఖాన్ ప్లవాన్దరదాన్ శకాన్ ॥45॥

ఏతాన్ జనపదాంశ్చైవ పావయంత్యుదధిం గతా ।
దరదాన్ కుక్కుటాంశ్చైవ గాన్ధారానౌరసాన్ కురూన్ ॥46॥

శివపౌరానింద్రమరూన్శాలీయాంశ్చైవ తేజసా ।
సైన్ధవారట్టకాంభోజాన్ ఉపధాన్భీమగౌరికాన్ ॥47॥

అప్లాక్ష, మరు, కాలక, శూలిక దేశాలను కర –ఆనర్తక, శాఖ, పల్లవ దరద శకదేశాలను ఆ దేశాలను పవిత్రం చేసి అవి సముద్రంలో ప్రవేశించాయి. మరియు దరద కుక్కుట, గాంధార – ఔరస కురుదేశాలను శివపౌర, ఇంద్రమరు, శాలీయ దేశాలను మరియు సైంధవ – ఆరట్ట కాంభోజ కుపథ భీమగౌరిక దేశాలను –

శునోముఖానుష్ట్రముఖాన్ సింధురేతాన్నిషేవతే ।
గంధర్వాన్కిన్నరాన్యక్షాంస్తథా విద్యాధరోరగాన్ ॥48॥

కలాపాన్ గ్రామకాంశ్చైవ తథా కింపురుషార్షపాన్ ।
కిరాతాంశ్చ పులిందాంశ్చ కురూన్ వై భారతానపి ॥49॥

శునోముఖ, ఉష్ట్రముఖ దేశాలను సింధునది సేవిస్తున్నది. గంధర్వ – కిన్నర – యక్ష – విద్యాధర దేశాలను కలాప, గ్రామక, కింపురుష, ఆర్షప, కిరాత, పులింద, కురు, భారత దేశాలను

పాంచాలాన్ కౌశికాన్మత్స్యాన్మాగధాంగాంస్తథైవ చ ।
బ్రహ్మోత్తరాంశ్చ వంగాంశ్చ తామ్రలిప్తాంస్తథైవ చ ॥50॥

పాంచాల – కౌశిక – మత్స్య – మాగధ – అంగదేశాలను, బ్రహ్మోత్తర – వంగ – తామ్రలిప్తదేశాలను

ఏతాంజనపదాన్ప్రాప్య గంగా పావయతే శుభా ।
తతః ప్రతిహతా విన్ధ్యే ప్రవిష్టా దక్షిణోదధిమ్ ॥51॥

ఈ దేశాలను శుభమైన గంగ పావనం కావించింది. ఆపై వింధ్యంచే అడ్డుకొనబడి దక్షిణోదధి చేరింది.

తతస్తు హ్లాదినీ పుణ్యా ప్రాచీనాభిముఖీ యయౌ ।
ప్లావయత్యుపకాంశ్చైవ నిషాదానపి సర్వశః ॥52॥

ఆ పై పుణ్యమైన హ్లాదిని గంగ తూర్పుదిశగా పోయి ఉపకనిషాద దేశాలను పావనం చేసింది.

నీవరాన్మూషికాంశ్చైవ తథా నీలముఖానపి ।
కేకరానేకకర్ణాంశ్చ కిరాతానపి చైవ హి ॥53॥
కళింగదాతికాంశ్చైవ కుశికాన్ స్వర్గభూమికాన్ ।
కాలంజరాన్వికర్ణాంశ్చ కుశికాన్ స్వర్గభౌమకాన్ ।
సా మణ్డలైస్సముద్రస్య పాదోద్భూతాంశ్చ సర్వశః ॥54॥

నీవర, మూషిక, నీలముఖదేశాలను, కేకర, ఏకకర్ణ, కిరాతాలను, కళింగ,దాతిక, కుశిక, స్వర్గభూమికలను, కాలంజర, వికర్ణ, కుశిక, స్వర్గభౌమకాలను కాలంజర–వికర్ణ, కుశికదేశాలలో వీటిని పావనం చేసి సముద్రతీరం చేరి సాగరగామిని అయింది.

తతస్తు నందినీ చాపి ప్రాచీమేవ దిశం యయౌ ।
కుపథాన్ ప్లావయన్తీ సా ఇంద్రద్యుమ్నసరః ప్రతి ॥55॥

నందిని గూడా తూర్పువైపే ప్రవహించింది. కుపథాలను పవిత్రం చేస్తూ అది ఇంద్రద్యుమ్న సరస్సువైపు వెళ్ళింది.

యథా త్వేష యథా దేశాంశ్చైత్రశంకుపదానపి ।
మధ్యేనర్క్షాసకఠరానోష్ఠ ప్రావరనానపి ॥56॥

చైత్ర –శంకుపద – ఋక్ష – కఠర ఓష్ఠప్రావరణ దేశాల నడుమగా ప్రవహించింది.

ఇంద్రద్వీపసమీపే తు ప్రవిష్టా లవణోదధిమ్ ।
తతుస్త పావనీ ప్రాయాత్ప్రాచీమాశాం జవేన తు ॥57॥

ఆపై ఇంద్రద్వీప సముద్ర సమీపంలో లవణసాగరం ప్రవేశించింది. ఆపై పావని వేగంగా తూర్పుకే ప్రవహించింది.

తోమరాన్ప్లావయన్తీ చ హంసమార్గాన్సమూహకాన్ ।
పూర్వాన్దేశాంశ్చ సేవన్తీ భిత్త్వా సా బహుధా గిరిమ్ ।
కర్ణప్రావరణాన్ ప్రాప్య గతా సాశ్వముఖానపి ॥58॥

తోమరాలు, హంసమార్గాలు, సమూహకాలు, పూర్వదేశాలనుకూడా సేవిస్తూ, కొండలు చీల్చుకొని ముందుకు సాగింది. కర్ణ ప్రావరణాలను చేరి అది అశ్వముఖాలకు గూడా పోయింది.

సిక్త్వా స పర్వతమరూన్ గత్వా విద్యాధరాన్యయౌ ।
శమీమణ్డలగోష్ఠం తు సా ప్రవిష్టా మహత్సరః ॥59॥

అది పర్వతమరుప్రదేశాలను తడుపుతూ విద్యాధర దేశాలను చేరి శమీమండలగోష్ఠమనే పెద్ద సరస్సును చేరింది.

తాసాం నద్యుపనద్యోఽన్యాః శతశోఽథ సహస్రశః ।
ఉపగచ్ఛన్తి తా నద్యో యతో వర్షతి వాసవః ॥60॥

వాటికి గల ఇతరనదులు, ఉపనదులు, వందలు వేలు కలవు. అవి ఇంద్రవర్షం కారణంగా పెరిగిన ప్రవాహం కలవై ఆయా నదుల్లో చేరుతున్నాయి.

తీరే వస్వోకసారాయా వనం సురభినామ తత్ ।
హిరణ్యశృంగో వసతి విద్వాన్ కౌబేరకో వశీ ॥61॥

వస్వోకసారాతీరాన 'సురభి' అనే వనమున్నది. అక్కడ హిరణ్యశృంగుడనే విద్వాంసుడు, ఇంద్రియ విజేత, కుబేరానుయాయి నివసిస్తున్నాడు.

యజ్ఞాదపేతః సుమహానమితౌజాః సువిక్రమః ।
తత్ర చాన్యైః పరివృతో విద్వద్భిర్బ్రహ్మరాక్షసైః ॥62॥

కుబేరానుచరా హ్యేతే చత్వారస్తత్సమాశ్రితాః ।
ఏవమేవ తు విజ్ఞేయా సిద్ధిః పర్వతవాసినామ్ ॥63॥

అతడు యజ్ఞాపేతుడు, చాలాగొప్పవాడు అమితౌజుడు, సువిక్రముడు. అతడు కుబేరానుచరులగు నల్గురితోబాటు విద్వాంసులగు బ్రహ్మరాక్షసులతో కూడి ఉంటాడు. పర్వతాలలో నివసించువారి సిద్ధి యిట్టిదని తెలుసుకోవాలి.

పరస్పరేణ ద్విగుణా ధర్మతః కామతోఽర్థతః ।
హేమకూటస్య పృష్ఠే తు సర్పాణాం తత్ సరః స్మృతమ్ ॥64॥

ధర్మార్థకామప్రవృత్తులలోవారి సిద్ధిపరస్పరం ద్విగుణంగావుంటుంది. హేమకూటపృష్ఠంలో సర్పసరస్సుకలదు.

సరస్వతీ ప్రభవతి తస్మాజ్జ్యోతిష్మతీ హ్రదాత్ ।
అవగాఢే హ్యుభయతః సముద్రౌ పూర్వపశ్చిమౌ ॥65॥

ఆ సరస్సునుండి సరస్వతి, జ్యోతిష్మతి జనించాయి. ఈ రెండూ ఇరుపార్శ్వాలా పూర్వ పశ్చిమ సాగరాలను ప్రవేశించాయి.

సరో విష్ణుపదం నామ నిషధే పర్వతోత్తమే ।
తస్మాద్ద్వయం ప్రభవతి గాన్ధారీ చ కులా చ తే ॥66॥

నిషధమనే గిరిశ్రేష్ఠమున విష్ణుపదమనే సరస్సు ఉన్నది. అందుండి గంధారి, కుల అనే రెండు నదులు ప్రభవించాయి.

మేరోః పార్శ్వాత్ప్రభవతి హ్రదశ్చంద్రప్రభో మహాన్ ।
జంబూశ్చైవ నదీ పుణ్యా యస్యాం జాంబూనదం స్మృతమ్ ॥67॥

మేరు పార్శ్వంనుండి చంద్రప్రభమన్న హ్రదం పుట్టింది. అందులో జంబూనది ప్రవహించింది. అక్కడ లభించే బంగారమే జాంబూనదం.

పయోదస్తు హ్రదో నీలః సుశుభః పుణ్డరీకవాన్ ।
పుణ్డరీకా పయోదా చ తస్మాద్వే సంప్రసూయతః ॥68॥

పయోదమనే నీలహ్రదం, అతిశుభకరమైన పుండరీక హ్రదం ఆ మేరుపార్శ్వంలో పుట్టాయి.

పరం తు శీతశైలస్య స్మృతముత్తరమానసమ్ ।
జ్యోత్స్నా చామృతకాంతా చ తస్మాద్వై సంప్రసూయతః ॥69॥

శీతశైలానికి ఆవల ఉత్తరమానసమనే సరస్సున్నది. అందుండి జ్యోత్స్న ,అమృతకాంత అనే రెండు నదులు కలిగాయి.

హ్రదాః కురుషు విఖ్యాతాః పద్మమీనకులాకులాః ।
నామ్నా తు వై జయా నామ ద్వాదశోదధిసన్నిభాః ॥70॥

పద్మాలు, చేపలచే నిండిన పండ్రెండు మడుగులు కురుదేశాలలో ప్రసిద్ధాలు. అవి జయానామకాలు, సముద్రాలలాగా వుండేవి.

తేభ్యః శాన్తిశ్చ సంధ్యా చ ద్వే నద్యౌ సంప్రసూయతః ।
కింపురుషాద్యాని యాన్యష్టౌ తేషు దేవో న వర్షతి ॥71॥

వాటినుండి శాంతి, సంధ్య – అనే రెండు నదులు పుట్టాయి. కింపురుషాదులైన ఎనిమిది సరస్సులలో దేవుడు వర్షించడు.

ఉద్భిజ్జాన్యుదకాన్యత్ర ప్రవహన్తి సరిద్వరాః ।
బలాహకశ్చ ఋషభో చక్రో మైనాక ఏవ చ ॥72॥

వినివిష్టాః ప్రతిదిశం నిమ్నగా లవణాంభసి ।
చంద్రకాంతస్తథా ద్రోణః సుమహాంశ్చ శిలోచ్చయః ॥73॥

ఉదగాయతా ఉదీచ్యాం తే హ్యవగాఢా మహోదధిమ్ ।
చక్రో రుధిరకశ్చైవ తథా నారదపర్వతః ॥74॥

భూమి నుండి ఉదయించిన ఉదకాలే సరిద్వరాలై ఇక్కడ ప్రవహిస్తున్నాయి. బలాహకం, ఋషభం, చక్రవాకం, మైనాకం అనే కొండలు నాలుగు దిక్కులకు వ్యాపించి లవణాంబుధిలో నిమగ్నమై వున్నాయి. చంద్రకాంతం, ద్రోణం అనే పెద్ద కొండలు గూడా ఉత్తరాన వ్యాపించి సముద్రంలో ప్రవేశించాయి. చక్రం, రుధిరకం, నారద పర్వతం, పడమరకు వ్యాపించి మహాసాగరంలో ప్రతిష్ఠితాలయ్యాయి.

ప్రతీచీమాగతాస్తే వై ప్రవిష్టా లవణోదధిమ్ ।
జీమూతో ద్రావణశ్చైవ మైనాకశ్చంద్రపర్వతః ॥75॥
ఆయతాస్తే మహాశైలాః సముద్రం దక్షిణం ప్రతి ।

జీమూతం, ద్రావణం, మైనాకం, చంద్రపర్వతం – మహాశైలాలు. ఇవి దక్షిణసాగరంలో ప్రవేశించి వున్నాయి.

వజ్రమైనాకయోర్మధ్యే విదిశం దక్షిణాపథే ॥76॥
తత్ర సంవర్తకో నామ సోఽగ్నిః పిబతి తజ్జలమ్ ।
అగ్నిః సముద్రవాసస్తు ఔర్వస్స బడవాముఖః ॥77॥

వజ్రం, మైనాకం అనే రెండు పర్వతాల మధ్య తిన్నగా విదిక్కునందు దక్షిణాపథ పరిసరాలలో సంవర్తకుడనే అగ్ని ఉన్నాడు. అతడు సాగర జలపానం చేస్తాడు. అతనికి ఔర్వుడు, బడబాముఖుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. సముద్రంలోనే నివసిస్తాడు.

ఇత్యేతే పర్వతావిష్టాశ్చత్వారో లవణోదధిమ్ ।
ఛిద్యమానేషు పక్షేషు పురా శక్రస్య వై భయాత్ ॥78॥

ఇందులో నాలుగు పర్వతాలు. పూర్వం ఇంద్రుడు రెక్కలు నరకబోగా భయంతో లవణసాగరంలో ప్రవేశించాయి.

తేషాం తు దృశ్యతే చంద్రః శుక్లే కృష్ణే సమాకృతిః ।
తే భారతస్య వర్షస్య సహాయేన ప్రకీర్తితాః ॥79॥

ఈ పర్వతప్రదేశాలలో చంద్రుడు శుక్లకృష్ణపక్షాలలో సమాకృతి కలిగి ఉంటాడు. ఈ కొండలు నాలుగు భారతదేశానికి సహాయకాలుగా ఉన్నాయి.

మహాంసి తత్ర దృశ్యంతే చంద్రో నాన్యత్ర చోదితః ।
ఉత్తరోత్తరమేతేషాం వర్షముద్రిచ్యతే గుణైః ॥80॥

చంద్రుడు ఉదయించకున్నా అతని కాంతులు ఇక్కడ కనిపిస్తాయి. ఈ ఎనిమిది వర్షాలు ఈ విషయంలో ఒకదానికొకటి రెండింతలు ఆధిక్యం కలిగి ఉంటాయి.

ఆరోగ్యాయుఃప్రమాణానాం ధర్మతః కామతోఽర్థతః ।
సమర్చితాని భూతాని తేషు వర్షేషు భాగశః ॥81॥

ఈ వర్షాలలో ఆరోగ్యంలో, ఆయుఃప్రమాణంలో, ధర్మార్థకామాలలో ప్రాణికోట్లు ఉత్తమస్థితిలో ఉంటాయి.

వసన్తి నానాజాతీని తేషు సర్వేషు తాని వై ।
ఇత్యేవం ధారయద్విశ్వం పృథ్వీ జగదిదం స్థితా ॥82॥

వాటిలో నానాజాతి జనులున్నారు. ఈవిధంగా విశ్వాన్ని తనచే ధరిస్తూ భూమి వర్షాది విభాగాలతో విరాజిల్లుతున్నది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే కైలాసాది పర్వత వర్ణనం నామైకవింశత్యధికశతతమోఽధ్యాయః ॥ 121 ॥

శ్రీ మత్స్యమహామహాపురాణంలో కైలాసాది పర్వత వర్ణనమనే నూటఇరవైఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్వావింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరవైరెండవ అధ్యాయం

శాకద్వీప వర్ణనమ్ - శాకద్వీప వర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

శాకద్వీపస్య వక్ష్యామి యథావదిహ నిశ్చయమ్ ।
కథ్యమానం నిబోధధ్వం శాకం ద్వీపం ద్విజోత్తమాః! ॥1॥

శాకద్వీపముయొక్క నిశ్చయస్థితిని చెబుతాను. ద్విజోత్తములారా! నేను చెప్పే శాకద్వీపాన్ని గూర్చి తెలుసుకోండి!

జంబూద్వీపస్య విస్తారాద్ద్విగుణస్తస్య విస్తరః ।
విస్తారాత్త్రిగుణశ్చాపి పరిణాహః సమన్తతః ॥2॥

జంబూద్వీపపు విస్తారం కంటె శాకద్వీప విస్తారం రెండు రెట్లెక్కువ. ఆ విస్తారం కంటే మూడు రెట్లు చుట్టు కొలత గల ద్వీపమది.

క్షీరోదధిపరిక్షిప్తో ద్వీపోఽయం ద్విగుణేన తు ।
తత్ర పుణ్యా జనపదా శ్చిరాచ్చ మ్రియతే జనః ॥3॥

దానికి రెట్టింపు పరిమాణం గల క్షీర సముద్రం దీని చుట్టూ ఉన్నది. అక్కడ పుణ్యమైన జనపదా లున్నాయి. జనులు చాలా కాలం వరకూ మరణించరు.

కుత ఏవ చ దుర్భిక్షం క్షమాతేజోయుతేష్విహ ।
తత్రాపి పర్వతాః శుభ్రాః సప్తైవ మణిభూషితాః ॥4॥

అక్కడి క్షమాతేజస్సులు గలవారికి దుర్భిక్ష మెక్కడిది? అక్కడ కూడా మణిభూషితాలైన ఏడు శుభప్రదమైన పర్వతా లున్నాయి.

శాకద్వీపాదిషు జ్ఞేయం సప్త సప్త సమాశ్రితాః ।
ఋజ్వాయతాః ప్రతిదిశం నివిష్టా వర్షపర్వతాః ॥5॥

శాకద్వీపాది సర్వద్వీపాలలోను పర్వతాలు ఏడు ఏడు కలవు. అవి వంకర్లు లేక దీర్ఘచతురస్రాకారం కలవై ప్రతి దిక్కులోనూ ఉన్న వర్ష పర్వతాలు.

రత్నాకరా ద్వినామానః సారవన్తో మహాబలాః ।
సమోదితాః ప్రతిదిశం ద్వీపవిస్తారమానతః ॥6॥

అవి రత్నాలకు ఆకరాలు. రెండు రెండు పేర్లు కలవి. సారవంతములై మహాబలం కలవి. ద్వీపవిస్తార ప్రమాణాలను బట్టి ప్రతి దిక్కులోనూ సమస్థితి కల్గి వున్నాయి.

ఉభయత్రావగాఢాశ్చ లవణక్షీరసాగరౌ ।
శాకద్వీపే తు వక్ష్యామి సప్త దివ్యాన్ మహాచలాన్ ॥7॥

అవి రెండు వైపులా లవణక్షీరసాగరాలను ప్రవేశించి ఉన్నాయి. ఇప్పుడు శాకద్వీపంలోని ఏడు మహా దివ్యాచలాలను గురించి వివరిస్తాను.

దేవర్షిగన్ధర్వయుతః ప్రథమో మేరురుచ్యతే ।
ప్రాగాయతః స సౌవర్ణ ఉదయో నామ పర్వతః ॥8॥

దేవర్షి గంధర్వులతో గూడిన మొదటి పర్వతం మేరువు. అది తూర్పుకు విస్తరించి పొడవుగా సాగినది. ఆ సువర్ణమైన పర్వతాన్ని ఉదయ పర్వతమని కూడా వ్యవహరిస్తారు.

తత్ర మేఘాస్తు వృష్ట్యర్థం ప్రభవన్తి సహస్రశః ।
తస్యాపరేణ సుమహాన్ జలధారో మహాగిరిః ॥9॥

స వై చంద్రః సమాఖ్యాతః సర్వౌషధిసమన్వితః ।
తస్మాన్నిత్యముపాదత్తే వాసవః పరమం జలమ్ ॥10॥

అక్కడ వేలకొలది మేఘాలు వానకొరకై ఉద్భవిస్తాయి. దానికి పడమట జలధారమనే గొప్ప పర్వతమున్నది. దాన్ని చంద్రపర్వత మంటారు. అది సర్వౌషధులు గలది. ఇంద్రుడు నిత్యం దానినుండే శ్రేష్ఠమైన నీరు తీసుకొంటాడు.

నారదో నామ సంప్రోక్తో దుర్గశైలో మహాచలః ।
తత్రాపి చ సముత్పన్నౌ పూర్వం నారదపర్వతౌ ॥11॥

అక్కడ 'నారద' మనే ఒక పెద్ద దుర్గశైలమున్నది. అక్కడ పూర్వం నారద పర్వతులనే గంధర్వులు జన్మించారు.

తస్యాపరేణ సుమహాన్ శ్యామో నామ మహాగిరిః ।
యత్ర శ్యామత్వమాపన్నాః ప్రజాః పూర్వమిమాః కిల ॥12॥

దానికి పశ్చిమాన 'శ్యామ'మనే మహాపర్వతం ఉన్నది. అక్కడి ప్రజలు పూర్వం శ్యామవర్ణం పొందారు.

స ఏవ దుందుభిర్నామ శ్యామః పర్వతసప్తమః ।
శబ్దమృత్యుః పురా తస్మిన్ దుందుభిస్తాడితః సురైః ॥13॥

'దుందుభి' అనేది ఆ శ్యామ పర్వతమే. పూర్వం దేవత లచట దుందుభి అనే రాక్షసుని కొట్టి చంపారు. అప్పుడు కల్గిన శబ్దమే వానికి మరణంగా పరణమించింది.

రత్నమాలాన్తరమయః శాల్మలశ్చాన్తరాలకృత్ ।
తస్యాపరేణ రజతో మహానస్తగిరిః స్మృతః ॥14॥

రత్నమాలలు అంతర్గతంగా గల ఆ చోట శాల్మలవృక్షాలు పెరుగుతాయి. దానికి పడమటి దిశలో రజతమయమైన ఒక పెద్ద అస్తగిరి ఉన్నది.

స ఏవామృత ఇత్యుక్తో దేవైర్యత్రామృతం పురా ।
సంభృతం చ హృతం చైవ మాతురర్థే గరుత్మతా ॥15॥

దానినే దేవతలు 'అమృత' మన్నారు. వారు గరుడుని ద్వారా అతని తల్లి దాస్య విమోచన కొరకై పూర్వం అక్కడ అమృతం పుట్టించి హరింపజేశారు.

తస్యాపరే చాంబికేయః సుమహాంశ్చైవ స స్మృతః ।
హిరణ్యాక్షో వరాహేణ తస్మిన్ శైలే నిషూదితః ॥16॥

దాని ప్రక్కన ఆంబికేయ పర్వతమున్నది. దాన్ని 'సుమహాన్' అని కూడా వ్యవహరిస్తారు. వరాహస్వామి హిరణ్యాక్షుణ్ణి ఆ కొండపైననే సంహరించాడు.

ఆంబికేయాత్ పరో రమ్యః సర్వౌషధినిషేవితః ।
విభ్రాజస్తు సమాఖ్యాతః స్ఫాటికస్తు మహాన్ గిరిః ॥17॥

ఆంబికేయుని కావల రమ్యమైనది, సర్వౌషధులచే సేవింపబడునది, స్ఫటికమయమైనదీ అయిన 'విభ్రాజ' మనే పెద్ద పర్వతమున్నది.

యస్మాద్విభ్రాజతే త్విడ్భిర్విభ్రాజస్తేన వై స్మృతః ।
సైవేహ కేశవేత్యుక్తో యతో వాయుః ప్రవాతి చ ॥18॥

అది కాంతులతో ప్రకాశిస్తుంది దాన్ని విభ్రాజమన్నారు. అదే అక్కడ 'కేశవ'మని చెప్పబడింది. అక్కడ నుండి వాయువు బలంగా వీస్తుంది.

తేషాం వర్షాణి వక్ష్యామి పర్వతానాం ద్విజోత్తమాః ।
శృణుధ్వం నామతస్తాని యథావదనుపూర్వశః ॥19॥

ద్విజోత్తములారా! వాటికి సంబంధించిన వర్షాలను ఇప్పుడు చెబుతాను. క్రమంగా నామతః వాటినివినండి!

ద్వినామాన్యేవ వర్షాణి యథైవ గిరయస్తథా ।
ఉదయస్యోదయం వర్షం జలధారేతి విశ్రుతమ్ ॥20॥

గిరుల వలెనే అవన్నీ రెండు, రెండు పేర్లు కలిగి వున్నాయి. ఉదయాద్రి చెందిన ఉదయ వర్షం 'జలధార' అని కూడా ప్రసిద్ధమయింది.

నామ్నా గతభయం నామ వర్షం తత్ ప్రథమం స్మృతమ్ ।
ద్వితీయం జలధారస్య సుకుమారమితి స్మృతమ్ ॥21॥

అనావృష్టి భయంలేని వర్షమది. అదే మొదటివర్షం పేర్కొనబడింది. 'జలధార'కు సుకుమారం అనే పేరు కూడా ఉన్నది.

తదేవ శైశిరం నామ వర్షం సంపరికీర్తితమ్ ।
నారదస్య చ కౌమారం తదేవ చ సుఖోదయమ్ ॥22॥

దానినే 'శైశిర' వర్షమంటారు. నారద పర్వతాన్ని 'కౌమార' మనీ, 'సుఖోదయ' మనీ పేర్కొంటారు.

శ్యామపర్వతవర్షం తదనీచకమితి స్మృతమ్ ।
ఆనన్దకమితి ప్రోక్తం తదేవ మునిభిః శుభమ్ ॥23॥

శ్యామపర్వత వర్షాన్ని 'అనీచక' మనీ, శుభమైన దానిని 'ఆనందక' మనీ మును లన్నారు.

హస్తస్యాపి శుభం వర్షం విజ్ఞేయం కుసుమోత్తరమ్ ।
తదేవ శివమిత్యుక్తం వర్షం సోమకసంజ్ఞితమ్ ॥24॥

శుభావహమైన హస్తవర్షం కుసుమోత్తరమని గూడా చెప్పబడింది. దానినే సోమక సంజ్ఞితమైన 'శివ' మంటారు.

ఆంబికేయస్య మైనాకం క్షేమకం చైవ తత్స్మృతమ్ ।
కైశోర పర్వతస్యాపి మహాద్రుమమితి స్మృతమ్ ।
తదేవ ధ్రువమిత్యుక్తం వర్షం విభ్రాజసంజ్ఞితమ్ ॥25॥

ఆంబికేయుని మైనాకం క్షేమకమని చెప్పబడింది. కైశోర పర్వతాన్ని మహాద్రుమమని కూడా అంటారు. దానినే ధ్రువమనీ, విభ్రాజమనీ అన్నారు.

ద్వీపస్య పరిణాహం చ హ్రస్వదీర్ఘత్వమేవ చ ।
జంబూద్వీపేన సంఖ్యాతస్తస్య మధ్యే వనస్పతిః ॥26॥

ద్వీపము యొక్క విస్తృతి, హ్రస్వదీర్ఘత్వాలు జంబూద్వీపంతో పోల్చి చెప్పడమయింది. దానిమధ్య వనస్పతి ఉన్నది.

శాకో నామ మహావృక్షః ప్రజాస్తస్య సహానుగాః ।
ఏతేషు దేవగన్ధర్వాః సిద్ధాశ్చ సహ చారణైః ॥27॥

విహరన్తి రమన్తే చ దృశ్యమానాశ్చ తైః సహ ।
తత్ర పుణ్యా జనపదాశ్చాతుర్వర్ణ్యసమన్వితాః ॥28॥

ఆ వనస్పతి 'శాక' మనే మహావృక్షం. ప్రజలు దాని ననుసరించి జీవిస్తారు. అక్కడ దేవగంధర్వులు, సిద్ధులు చారణులతో విహరిస్తూ, రమిస్తూ అక్కడ కనిపిస్తుంటారు. అక్కడ చతుర్వర్ణాలు గల పుణ్యమైన గ్రామాలున్నాయి.

తేషు నద్యశ్చ సప్తైవ ప్రతివర్షం సముద్రగాః ।
ద్వినామ్న్యశ్చైవ తాః సర్వా గంగాః సప్తవిధాః స్మృతాః ॥29॥

అందలి ప్రతివర్షంలోనూ ఏడు నదులు సముద్రంలో చేరేవి కలవు. అవన్నీ రెండు రెండు పేర్లు కల్గి వున్నాయి. గంగలు ఏడు విధాలు.

ప్రథమా సుకుమారీతి గంగా శివజలా శుభా ।
తపస్తప్తా చ నామ్నైషా నదీ సంపరికీర్తితా ॥30॥

మొదటిది సుకుమారి, ఇది శుభజలాలు గలది. దీన్ని 'తపస్తప్త' అని కూడా అంటారు.

సుకుమారీ తపఃసిద్ధా ద్వితీయా నామతః సతీ ।
నన్దా చ పావనీ చైవ తృతీయా పరికీర్తితా ॥31॥

రెండవది సుకుమారి, తపస్సిద్ధ, సతి అని ప్రసిద్ధి కలది, మూడవదాన్ని నంద మరియు 'పావని' అని కూడా అంటారు.

శిబికా చ చతుర్థీ స్యాద్ద్వివిధా చ పునః స్మృతా ।
ఇక్షుశ్చ పంచమీ జ్ఞేయా తథైవ చ పునః కుహూః ॥32॥

నాల్గవది శిబిక. అది రెండు విధాలు. ఇక్షువు ఐదవది. దాన్ని 'కుహూ' అంటారు.

వేణుకా చామృతా చైవ షష్ఠీ సంపరికీర్తితా ।
సుకృతా చ గభస్తిశ్చ సప్తమీ పరికీర్తితా ॥33॥

ఆరవది వేణుక, అమృత అని కూడా పరికీర్తిత మయింది. ఏడవదాన్ని 'సుకృత', 'గభస్తి' అని అంటారు.

ఏతాః సప్త మహాభాగాః ప్రతివర్షం శివోదకాః ।
పావయన్తి జనం సర్వం శాకద్వీపనివాసినమ్ ॥34॥

మహాభాగులారా! ఇవి ఏడూ ప్రతివర్షంలో శుభజలాలు కల్గి వున్నాయి. శాక ద్వీపజనులనవి పవిత్రం చేస్తున్నాయి.

అభిగచ్ఛన్తి తాశ్చాన్యా నదనద్యః సరాంసి చ ।
బహూదకపరిస్రావాద్యతో వర్షతి వాసవః ॥35॥

వాటిని ఇతర నదీనదాలు, సరస్సులు అభిగమిస్తాయి. అవి బహుజల ప్రవాహాలు గలవి. ఎందుకంటే, అక్కడ ఇంద్రుడు వర్షిస్తాడు.

తాసాం తు నామధేయాని పరిమాణం తథైవ చ ।
న శక్యం పరిసంఖ్యాతుం పుణ్యాస్తాః సరిదుత్తమాః ॥36॥

ఆ నదులు పుణ్యమైనవి. వాటి పేర్లు, పరిమాణం ఇదమిత్థ మని చెప్ప వీలుకాదు.

తాః పిబన్తి సదా హృష్టా నదీర్జనపదాస్తు తే ।
ఏతే శాన్తభయాః ప్రోక్తాః ప్రమోదా యే చ వై శివాః ॥37॥

జనపదాలలోనివారు సంతోషంతో ఆ నదులలోని నీరు త్రాగుతుంటారు. ఆ జనపదాలు భయంలేనివి, శుభకరాలు, ఆనందదాయకాలు.

ఆనన్దాశ్చ సుఖాశ్చైవ క్షేమకాశ్చ ననదైః సహ ।
వర్ణాశ్రమాచారయుతా దేశాస్తే సప్త విశ్రుతాః ॥38॥

ఆనందాలు, సుఖాలు, క్షేమకాలు, అనే దేశాలు ఏడు నదములు గలవు, వర్ణాశ్రమాచార సమేతమైనవి, విఖ్యాతి గాంచినవి.

అరోగా బలినశ్చైవ సర్వే మరణవర్జితాః ।
అవసర్పిణీ న తేష్వస్తి తథైవోత్సర్పిణీ పునః ॥39॥

అక్కడి జనులు రోగరహితులు, మరణం లేనివారు, వారిలో అవసర్పిణి, (దిగజారుడుతనం) ఉత్సర్పిణి (సన్మార్గానికి ఎదురుపోవడం) లేవు.

న తత్రాస్తి యుగావస్థా చతుర్యుగకృతా క్వచిత్ ।
త్రేతాయుగసమః కాలస్తథా తత్ర ప్రవర్తతే ॥40॥

నాల్గు యుగాల వల్ల కల్గిన యుగావస్థ అక్కడలేదు. అక్కడ ఎప్పుడూ త్రేతాయుగంతో సమమైన కాలం ప్రవర్తిస్తుంది.

శాకద్వీపాదిషు జ్ఞేయం పంచస్వేతేషు సర్వశః ।
దేశస్య తు విచారేణ కాలః స్వాభావికః స్మృతః ॥41॥

శాకద్వీపం మున్నగు ఈ ఐదింటిలోనూ అన్నివిధాలా దేశ విచారానుసారంగా కాలం స్వాభావికమై వుంటుంది.

న తేషు సంకరః కశ్చిద్వర్ణాశ్రమకృతః క్వచిత్ ।
ధర్మస్య చావ్యభీచారాదేకాన్తసుఖినః ప్రజాః ॥42॥

అందులో ఎక్కడా వర్ణాశ్రమసాంకర్యం లేదు. ధర్మవ్యభిచారం లేదు గాన ప్రజలు సదా సుఖవంతులైవుంటారు.

న తేషు మాయా లోభో వా ఈర్ష్యాసూయా భయం కుతః ।
విపర్యయో న తేష్వస్తి తద్వై స్వాభావికం స్మృతమ్ ॥43॥

వారిలో మాయ, ఈర్ష్య, లోభం, అసూయ, లేవు. ఇక భయమెక్కడిది, వారిలో విపర్యయం లేదు. స్వాభావికమంటే అదే.

విపద్భయం న తేష్వస్తి న దణ్డో న చ దాణ్డికః ।
స్వధర్మేణ చ ధర్మజ్ఞాస్తే రక్షన్తి పరస్పరమ్ ॥44॥

వారిలో ఆపద్భయం లేదు. దండం లేదు. దండించేవాడు లేదు. ధర్మజ్ఞులైన అక్కడివారు పరస్పరం స్వధర్మంతో రక్షించుకొంటారు.

పరిమణ్డలస్తు సుమహాన్ద్వీపో వై కుశసంజ్ఞకః ।
నదీజలైః పరివృతః పర్వతైశ్చాభ్రసన్నిభైః ॥45॥

పెద్దదైన కుశద్వీపం శాకద్వీపం చుట్టూ గుండ్రనై ఉన్నది. అది నదీజల పరివృతం, మేఘాలవంటి కొండలతో గూడినది.

సర్వధాతువిచిత్రైశ్చ మణివిద్రుమభూషితైః ।
అన్యైశ్చ వివిధాకారై రమ్యైర్జనపదైస్తథా ॥46॥

సర్వధాతువులచే విచిత్రితాలు, మణి విద్రుమభూషితాలు, వివిధాకారాలు గల ఇతర మనోజ్ఞ జనపదాలుగలది.

వృక్షైః పుష్పఫలోపేతైః సర్వతో ధనధాన్యవాన్ ।
నిత్యం పుష్పఫలోపేతః సర్వరత్నసమావృతః ॥47॥

నిత్య పుష్పఫలాలు గల చెట్లు, ధన ధాన్య సమృద్ధి, సకల రత్నాల సముచ్చయాలకూ అది నెలవైనది.

ఆవృతః పశుభిః సర్వైర్గ్రామ్యారణ్యైశ్చ సర్వశః ।
ఆనుపూర్వ్యాత్సమాసేన కుశద్వీపం నిబోధత ॥48॥

గ్రామ్యములు, ఆరణ్యకములైన సర్వపశువులు గలది, ఆనుపూర్వినిబట్టి సంగ్రహంగా కుశద్వీపాన్ని తెలుసుకోండి.

అథ తృతీయం వక్ష్యామి కుశద్వీపం చ కృత్స్నశః ।
కుశద్వీపే సురాంభోధిః సర్వతః పరివారితః ॥49॥

ఇక మూడవదైన కుశద్వీపాన్ని గురించి పూర్తిగా చెబుతాను. ఈ ద్వీపాన్ని నలువైపులా సురాసముద్రం చుట్టియున్నది.

శాకద్వీపస్య విస్తారాద్ద్విగుణేన సమన్వితః ।
తత్రాపి పర్వతాః సప్త విజ్ఞేయా రత్నయోనయః ॥50॥

శాకద్వీపం కంటె కుశద్వీపం విస్తారంలో రెండురెట్లుపెద్దది. అక్కడ ఏడుకొండలు రత్ననిలయాలున్నాయి.

రత్నాకరాస్తథా నద్యస్తేషాం నామాని మే శృణు ।
ద్వినామానశ్చ తే సర్వే శాకద్వీపే యథా తథా ॥51॥

అట్లే అక్కడి నదులు రత్నాకరాలు. వాటి పేర్లు వినండి. శాకద్వీపంలో లాగా అవన్నీ రెండేసి పేర్లు గలవే.

ప్రథమః సూర్యసంకాశః కుముదో నామ పర్వతః ।
విద్రుమోచ్చయ ఇత్యుక్తః స ఏవ చ మహీధరః ॥52॥

మొదటిది సూర్యునితో సమానమైనది. కుముదమనే పర్వతం. దాన్ని విద్రుమోచ్చయమని కూడా అంటారు.

సర్వధాతుమయైః శృంగై శ్శిలాజాలైస్సమన్వితైః ।
ద్వితీయః పర్వతస్తత్ర ఉన్నతో నామ విశ్రుతః ॥53॥

ఇలా జలములతో కూడి సకల ధాతుమయమైన శిఖరాలతో రెండవ పర్వతం కలదు. దానికి ఉన్నతమని కూడా ప్రసిద్ధి.

హేమపర్వత ఇత్యుక్తః స ఏవ చ మహీధరః ।
హరితాలమయైః శృంగైర్ద్వీపమావృత్య సర్వశః ॥54॥

ఆ కొండకే హేమపర్వతమని పేరు. నలువైపులా హరితాళమయాలైన శిఖరాలతో అది ద్వీపాన్ని ఆవరించి వున్నది.

బలాహకస్తృతీయస్తు కాలాంజనమయో గిరిః ।
ద్యుతిమాన్నామతః ప్రోక్తః స ఏవ చ మహీధరః ।55॥

కాలాంజనమయమైన మూడవకొండ వలాహకం. దీన్ని ద్యుతిమాన్, అని కూడా అంటారు.

చతుర్థః పర్వతో ద్రోణో యత్రౌషధ్యా మహాగిరౌ ।
విశల్యకరణీ చైవ మృతసంజీవనీ తథా ॥56॥

నాల్గవది ద్రోణపర్వతం. ఆ మహాగిరిలో విశల్యకరణి, మృతసంజీవని అనే ఓషధులున్నాయి.

పుష్పవాన్నామ స ప్రోక్తః పర్వతః సుమహాచితః ।
కంకస్తు పంచమస్తేషాం పర్వతో నామ సారవాన్ ॥57॥

ఆ కొండను 'పుష్పవంత'మని కూడ అంటారు. ఐదవది కంకపర్వతం, ఇది సారవంతమైనది.

కుశేశయ ఇతి ప్రోక్తః పునః స పృథివీధరః ।
దివ్యపుష్పఫలోపేతో దివ్యవీరుత్సమన్వితః ॥58॥

ఆ కొండను 'కుశేశయం అని కూడా అంటారు. అది దివ్యపుష్పఫలాలతో కూడినది, దివ్యలతా సహితమైనది.

షష్ఠస్తు పర్వతస్తత్ర మహిషో మేఘసన్నిభః ।
స ఏవ తు పునః ప్రోక్తో హరిరిత్యభివిశ్రుతః ॥59॥

ఆరవది మేఘతుల్యమైన పర్వతం. దీన్ని 'మహిష' మంటారు. దాన్నే 'హరి' అని కూడా పేర్కొంటారు.

తస్మిన్సోఽగ్నిర్నివసతి మహిషో నామ యోఽప్సుజః ।
సప్తమః పర్వతస్తత్ర కకుద్మాన్స హి భాషతే ॥60॥

మన్దరః సైవ విజ్ఞేయః సర్వధాతుమయః శుభః ।
మన్ద ఇత్యేష యో ధాతురపామర్థే ప్రకాశతే ॥61॥

దానిలో నీటిలో పుట్టు 'మహిష' మనే అగ్ని ఉన్నది. ఏడవ కొండను కకుద్మాన్ అంటారు. అది సర్వ ధాతుమయం, శుభమైన దాన్ని 'మందార' మని కూడా వ్యవహరిస్తారు. జలార్థ ప్రకాశకమైన 'మంద'మనే ధాతువు అక్కడ ఉన్నది.

అపాం విదారణాచ్చైవ మన్దరః స నిగద్యతే ।
తత్ర రత్నాన్యనేకాని స్వయం రక్షతి వాసవః ॥62॥

నీటిని విదారణం చేయడంవల్ల దాన్ని 'మందర'మంటారు. అక్కడి అనేక రత్నాలను ఇంద్రుడే స్వయంగా రక్షిస్తున్నాడు.

ప్రజాపతిరుపాదాయ ప్రజాభ్యో హ్యదధాత్స్వయమ్ ।
తేషామన్తరవిష్కంభో ద్విగుణః సముదాహృతః ॥63॥

ప్రజాపతి ప్రజల కొరకై ఇంద్రుని కిచ్చిన రత్నాలవి. ఈ పర్వతాల నడిమి వ్యాసం శాకద్వీప పర్వతాల వ్యాసం కంటే రెట్టింపుగా ఉన్నది.

ఇత్యేతే పర్వతాః సప్త కుశద్వీపే ప్రభాషితాః ।
తేషాం వర్షాణి వక్ష్యామి సప్తైవ తు విభాగశః ॥64॥

ఇలా ఈ యేడు కొండలు కుశద్వీపంలో పేర్కొనబడి ఉన్నాయి. వాటి వర్షాలను గూడా వివరిస్తాను. అవి కూడా విభాగాన్ని బట్టి ఏడే.

కుముదస్య స్మృతః శ్వేత ఉన్నతశ్చైవ స స్మృతః ।
ఉన్నతస్య తు విజ్ఞేయం వర్షం లోహితసంజ్ఞకమ్ ॥65॥

కుముదపర్వతమున్నచోటనే శ్వేత ద్వీపమున్నది. దాన్ని 'ఉన్నత'మని కూడా అంటారు. దానికి చెందిన వర్షం పేరు లోహితం.

వేణుమణ్డలకం చేతి తదేవ పరికీర్తితమ్ ।
బలాహకస్య జీమూతం తద్రథాకారమిత్యపి ॥66॥

దాన్ని 'వేణుమండలకం' అని అనడం కద్దు. బలాహాద్రికి చెందిన జీమూతం రథాకారమై ఉన్నది.

ద్రోణస్య హారికం నామ లింపకం చ తదేవ హి ।
కంకస్యాపి కరున్నామ మతిమచ్చైవ తత్స్మృతమ్ ॥67॥

'ద్రోణ' పర్వతానికి 'హారిక'మనీ, లింపకమని పేర్లు. కంకాన్ని 'కరు' అని 'మతిమత్' అని అంటారు.

మాహిషం మహిషస్యాపి పునశ్చాపి ప్రభాకరమ్ ।
కకుద్మతస్తు తద్వర్షం కపిలం నామ విశ్రుతమ్ ॥68॥

మహిషానికి మాహిషమనీ, ప్రభాకరమనీ, కకుద్మంతమునకు చెందిన వర్షం కపిలమనీ ప్రసిద్ధం.

ఏతాన్యుపనివిశిష్టాని సప్త సప్త పృథక్ పృథక్ ।
వర్షాణి పర్వతాశ్చైవ నదీస్తేషు నిబోధత ॥69॥

ఇవి ఏడేడు విడివిడిగా ఉన్నా వర్షాలు, పర్వతాలు, వాటిలోని నదులను వినండి.

తత్రాపి నద్యః సప్తైవ ప్రతివర్షం హి తాః స్మృతాః ।
ద్వినామవత్యస్తాః సర్వాః సర్వాః పుణ్యజలాః స్మృతాః ॥70॥

ప్రతివర్షానికీ ఏడు నదులున్నాయి. అన్నిటికీ రెండేసి పేర్లు. అవన్నీ పవిత్రజలాలు కలవే.

ధూతపాపా నదీ నామ యోనిశ్చైవ పునః స్మృతా ।
సీతా ద్వితీయా విజ్ఞేయా సా చైవ హి నిశా స్మృతా ॥71॥

'ధూతపాప' అన్న నదిని 'యోని' అంటారు. రెండవది 'సీత', దాని మరోపేరు నిశ.

తృతీయా తు వితృష్ణాహ్వా పవిత్రా సైవ చ స్మృతా ।
చతుర్థీ హ్రాదినీత్యుక్తా చంద్రమా ఇతి చ స్మృతా ॥72॥

మూడవది 'వితృష్ణ', పవిత్ర అని కూడా దానికి మరోపేరు. నాల్గవది హ్రాదిని. ఇది 'చంద్రమా' అని కూడా అనబడుతుంది.

విద్యుచ్చ పంచమీ ప్రోక్తా శుక్లా చైవ నిగద్యతే ।
షండా షష్ఠీ తు విజ్ఞేయా పునస్సైవ విభావరీ ॥73॥

ఐదవది విద్యుత్, మరియు దీన్ని 'శుక్ల' అని కూడా అంటారు. ఆరవది షండ, దాన్ని 'విభావరి' అని కూడా అంటారు.

మహతీ సప్తమీ ప్రోక్తా పునశ్చైవ ధృతిః స్మృతా ।
అన్యాస్తాభ్యోఽపి సంజాతాః శతశోఽథ సహస్రశః ॥74॥

ఏడవది 'మహతి' మరియు 'ధృతి'. ఇతర నదులు కూడా వందలు వేలు వాటినుండి కల్గినవి కలవు.

అభిగచ్ఛన్తి తా నద్యో యతో వర్షతి వాసవః ।
ఇత్యేష సన్నివేశోఽయం కుశద్వీపస్య వర్ణితః ॥75॥

వాసవుడు వర్షించే చోటు నుండి అవన్నీ వస్తున్నాయి. ఇలా మీకు కుశద్వీపసన్నివేశాన్ని గురించి వివరించాను.

శాకద్వీపస్య విస్తారః ప్రోక్తశ్చైవ సనాతనః ।
కుశద్వీపః సముద్రేణ వృతః క్షీరోదకేన తు ॥76॥

శాకద్వీపంలో దాని సనాతనవిస్తారాన్ని గూర్చి చెప్పాను. కుశద్వీపం క్షీరోదకంతో చుట్టబడియున్నది.

సర్వతః సుమహాన్ద్వీపశ్చంద్రవత్పరివేష్టితః ।
విస్తారాన్మణ్డలాచ్చైవ క్షీరోదాద్ద్విగుణో మతః ॥77॥

అలా అంతటా విస్తరించిన ఆ కుశద్వీపం చంద్రునిలాగా వున్నది. అది క్షీరసముద్ర విస్తారంలో, మండలంలో ద్విగుణమైనది.

అతః పరం ప్రవక్ష్యామి క్రౌంచద్వీపం యథాతథమ్ ।
కుశద్వీపస్య విస్తారాద్ద్విగుణస్తస్య విస్తరః ॥78॥

ఇకపై క్రౌంచద్వీపాన్ని యథాతథంగా వివరిస్తాను. కుశద్వీపం కంటె దీని విస్తారం రెండు రెట్లు పెద్దది.

ఘృతోదకః సముద్రో వై క్రౌంచద్వీపేన సంవృతః ।
చక్రనేమిక్రమేణైవ వృతో వృత్తేన సర్వశః ॥79॥

ఘృతోదకసాగరం క్రౌంచద్వీపంతో చుట్టబడియున్నది. అన్నివైపులా అది చక్రనేమి ప్రమాణం గల వృత్తంతో చుట్టబడి యున్నది.

తస్మిన్ ద్వీపే నరాః శ్రేష్ఠాః క్రౌంచస్తు ప్రథమో గిరిః ।
క్రౌంచాత్పరః పావకాఖ్యః పావకాదండకారకః ॥80॥

ఈ ద్వీపంలోని నరులు శ్రేష్ఠులు. అక్కడ మొదటిగిరిని క్రౌంచ మంటారు. దాని తరువాత 'పావక' పర్వతమున్నది. దాని కావల అండకారకమున్నది.

అండకారాత్పరశ్చాపి దేవవాన్నామ పర్వతః ।
దేవనాత్పరతశ్చాపి గోవిందో నామ పర్వతః ॥81॥

అండకారం తర్వాత దేవవాన్ అనే పర్వతమున్నది. దాని తర్వాతిది గోవింద పర్వతం.

అండకారాత్పరే చాపి దేవావృన్నామ పర్వతః ।
దేవావృతః పరేణాపి పుణ్డరీకో మహాన్ గిరిః ॥82॥

అండకారం తరువాత దేవావృతం ఉన్నది. దాని కావలనున్న పెద్ద పర్వతం పుండరీకం.

ఏతే రత్నమయాః సప్త క్రౌంచద్వీపస్య పర్వతాః ।
పరస్పరస్య ద్విగుణం విష్కంభా వర్షపర్వతాః ॥83॥

క్రౌంచద్వీపానికి చెందిన ఈ యేడు కొండలూ రత్నమయాలు. ఒక దానికంటె మరొకవర్ష పర్వతం వ్యాసం ద్విగుణమైయుంటుంది.

వర్షాణి తస్య వక్ష్యామి నామతస్తు నిబోధత ।
క్రౌంచస్య కుశలో దేశో పావకస్య మనోఽనుగః ॥84॥

మనోఽనుగాత్పరశ్చోష్ణస్తృతీయో దేశ ఉచ్యతే ।
ఉష్ణాత్పరః పావనకః పావనాదంధకారకః ॥85॥

అంధకారకదేశాత్తు మునిదేశస్తథాపరః ।
మునిదేశాత్పరో వాపి ప్రోచ్యతే చంద్రనిస్వనః ॥86॥

సిద్ధచారణసంకీర్ణో దేవప్రాయః శుచిర్జనః ।
స్మృతాస్తత్రైవ నద్యస్తు ప్రతివర్షం గతాః శుభాః ॥87॥

వాటి వర్షాలను నామతః పేర్కొంటాను, గ్రహించండి. క్రౌంచానికి కుశలం, పావకానికి మనోనుగం, దానికావల ఉష్ణం అనే దేశాలు ఉన్నాయి. అది మూడవది. ఉష్ణానికావల పావనకం, దానికావల అంధకారకం, దానికావల మునిదేశం, దానిపైన చంద్రనిస్వనం కలవు. అవి సిద్ధచారణులచే వ్యాప్తమైనవి. అక్కడి జనులు శుచిగా, తెల్లగా వుంటారు. ప్రతి వర్షంలోనూ శుభప్రదాలైన నదులున్నాయి.

గౌరీ కుముద్వతీ చైవ సన్ధ్యా రాత్రిర్మనోరమా ।
ఖ్యాతిశ్చ పుణ్డరీకా చ గంగా సప్తవిధా స్మృతా ॥88॥

గౌరి, కుముద్వతి, సంధ్య, రాత్రి, మనోరమ, ఖ్యాతి, పుండరీక – అని గంగ ఏడురకాలు

తాసాం సహస్రశశ్చాన్యా నద్యః పార్శ్వసమీపగాః ।
అభిగచ్ఛన్తి తా నద్యో బహులా స్స బహూదకాః ॥89॥

వాటికి ప్రక్కనే సమీపాన పారే నదులు వేలాదిగా ఉన్నాయి. అవి బహూదకాలై ప్రవహిస్తున్నాయి.

తేషాం నిసర్గో దేశానామానుపూర్వ్యేణ సర్వశః ।
న శక్యో విస్తరాద్వక్తుమపి వర్షశతైరపి ॥90॥
నోపసర్గః ప్రజానాం తు సంహారో యశ్చ తేషు వై ।

వాటి స్వభావం క్రమంగా మొత్తంగా విస్తారంగా నూరు సంవత్సరాలకు కూడా వర్ణించడం సాధ్యం కాదు. ప్రళయానికి ముందు అక్కడి ప్రజలకు ఏ విధమైన వినాశమూ లేదు.

అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి శాల్మలస్య నిబోధత ॥91॥

ఇక శాల్మల ద్వీపం గురించి చెబుతాను. వినండి!

శాల్మలో ద్విగుణో ద్వీపః క్రౌంచద్వీపస్య విస్తరాత్ ।
పరివార్య సముద్రం తు దధిషణ్డోదకః స్థితః ॥92॥

క్రౌంచద్వీపం కంటె శాల్మల ద్వీపం విస్తారంలో ద్విగుణమైనది. అది దధిసాగరం దాన్ని చుట్టియున్నది.

తత్ర పుణ్యా జనపదాశ్చిరాచ్చ మ్రియతే జనః ।
కుత ఏవ తు దుర్భిక్షం క్షమా తేజోయుతా హి తే ॥93॥

అక్కడి జనపదాలు పుణ్యమైనవి. జనులు చిరకాలం జీవిస్తారు. క్షమ, తేజస్సు గలవారికి దుర్భిక్షమెక్కడిది?

ప్రథమః సూర్యసంకాశః సుమనా నామ పర్వతః ।
పీతస్తు మధ్యమస్తత్ర శాతకుంభమయో గిరిః ॥94॥

అక్కడి మొదటి కొండ సూర్యసన్నిభమైన సుమనాపర్వతం. దాని కావల శాతకుంభమయమైన పర్వతమున్నది. 'అది పీతవర్ణం గలది'

నామ్నా సర్వసుఖో నామ దివ్యౌషధిసమన్వితః ।
తృతీయశ్చైవ సౌవర్ణో భృంగపత్రనిభో గిరిః ॥95॥

దాన్ని 'సర్వసుఖం' అని అంటారు. దివ్యౌషధులు కలదది. మూడవది సౌవర్ణం. తుమ్మెదరెక్కలవంటి కాంతి గల గిరి.

సుమహాన్ రోహితో నామ దివ్యో గిరివరో హి సః ।
సుమనాః కుశలో దేశః సుఖోదర్కః సుఖోదయః ॥96॥

'రోహిత' మనే పర్వతం చాలా పెద్దది. అది దివ్యమైన గిరిశ్రేష్ఠం. సుఖోదర్కం సుఖోదయం కల కుశల దేశం సుమన పర్వతానికి చెందినది.

రోహిణో యస్తృతీయస్తు రోహిణో నామ విశ్రుతః ।
తత్ర రత్నాన్యనేకాని స్వయం రక్షతి వాసవః ॥97॥

మూడవది రోహితం. రోహిణ మని కూడా అంటారు. అక్కడ పలు రత్నాలున్నాయి. వాసవుడు స్వయంగా దాన్ని రక్షిస్తాడు.

ప్రజాపతిరుపాదాయ ప్రసన్నో వ్యదదాత్స్వయమ్ ।
న తత్ర నద్యో వర్షం వా శీతోష్ణం వాఽన్యదప్రియమ్ ॥98॥

ప్రజాపతి ప్రసన్నుడై ఆ రత్నాలను ఇంద్రుని కిచ్చాడు. అక్కడ మేఘాలు వర్షించవు. శీతోష్ణాలుండవు. అక్కడ అప్రియమైనదేదీ లేదు.

వర్ణాశ్రమాణాం వార్తా వా త్రిషు ద్వీపేషు విద్యతే ।
న దీక్షా న చ దండోఽస్తి నేర్ష్యాసూయా భయం తథా ॥99॥

అక్కడ వర్ణాశ్రమాల వార్త మూడు ద్వీపాలలోనూ లేదు. దీక్ష, దండం, ఈర్ష్య, అసూయ, భయం అనేవి ఉండవు.

ఉద్భిదాన్యుదకాన్యత్ర గిరిప్రస్రవణాని చ ।
భోజనం షడ్రసం తత్ర తేషాం స్వయముపస్థితమ్ ॥100॥

ఇక్కడి జలాలు భూమినుండి పైకుబుకుతాయి. పర్వత ప్రస్రవణాలు గూడా అట్లే. షడ్రుచుల ఆహారం అక్కడివారికి స్వయంగా ప్రయత్నం లేకనే లభిస్తుంది.

అధమోత్తమో న తేష్వస్తి న లోభో న పరిగ్రహః ।
అశోకా బలవన్తశ్చ ఏకాన్తసుఖినో నరాః ॥101॥

వారిలో ఉచ్చనీచాలు లేవు. లోభం లేదు, పరిగ్రహం లేదు, నరులు శోకరహితులు, బలం కల్గి ఏకాంతసుఖులై వుంటారు.

త్రింశద్వర్షసహస్రాణి మానసీం సిద్ధిమాస్థితాః ।
సుఖమాయుశ్చ రూపం చ ధర్మైశ్వర్యం తథైవ చ ॥102॥

ముప్పది వేలేండ్లు మానససిద్ధి నాశ్రయించి వారు సుఖం, ఆయువు, రూపం, ధర్మం ఐశ్వర్యం – కల్గి వుంటారు.

శాల్మలాన్తేషు విజ్ఞేయం ద్వీపేషు త్రిషు సర్వతః ।
వ్యాఖ్యాతః శాల్మలాన్తానాం ద్వీపానాన్తు విధిః శుభః ॥103॥

శాల్మలం వరకు గల మూడు ద్వీపాల స్థితి యిది. శాల్మలాంత ద్వీపాల శుభస్థితిని చెప్పాను.

పరిమణ్డలేన ద్వీపస్య చక్రవత్పరివేష్టితః ।
స్వాదూదేన సముద్రేణ ద్విగుణేన సమన్వితః ॥104॥

ఈశాల్మలద్వీప పరిమండలం చక్రం లాగా పరివేష్టితమై యున్నది. స్వాదుజలం కల సముద్రం ద్విగుణమై దీనితో కలిసి యున్నది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శాకద్వీపవర్ణనం నామ ద్వావింశత్యధికశతతమోఽధ్యాయః ॥ 122 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని శాకద్వీప వర్ణనమనే నూటఇరవైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్రయోవింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరవైమూడవ అధ్యాయం

గోమేదద్వీప వర్ణనమ్ - గోమేదద్వీప వర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

గోమేదకం ప్రవక్ష్యామి షష్ఠం ద్వీపం తపోధనాః ॥1॥
శాల్మలస్య తు విస్తారాద్ద్విగుణస్తస్య విస్తరః ।
తస్మిన్ ద్వీపే తు విజ్ఞేయౌ పర్వతౌ ద్వౌ సమాహితౌ ॥2॥

తపోధనులారా! ఆరవదైన గోమేదక ద్వీపాన్ని గురించి చెబుతాను. శాల్మలం కంటె దీని విస్తారం రెండింత లెక్కువ. ఆ ద్వీపంలో రెండెత్తైన కొండలను గురించి తెలుసుకోవాలి.

ప్రథమః సోమకో నామ జాత్యంజనమయో గిరిః ।
ద్వితీయః కుముదో నామ సర్వౌషధిసమన్వితః ॥3॥

మొదటిది 'సోమకం'. అది జాత్యంజనమయమైన గిరి(స్వాభావికమైన కాటుకతో ఏర్పడినది). రెండవది సర్వౌషధులకు నిలయమైన 'కుముద'మనే కొండ.

శాతకుంభమయః శ్రీమాన్ విజ్ఞేయః సుమహోచ్ఛ్రితః ।
సముద్రేక్షురసోదేన వృతో గోమేదకశ్చ సః ॥4॥

చాలా పెద్దదైన ఆ పర్వతం స్వర్ణమయం. గోమేదక ద్వీపం ఇక్షుసముద్రోదకముచే ఆవృతమై యున్నది.

షష్ఠేన తు సముద్రేణ సురోదాద్ద్విగుణేన చ ।
ధాతకిః కుముదశ్చైవ హవ్యపుత్రౌ సువిస్తృతౌ ॥5॥

సురా సముద్రంకంటె రెండు రెట్లు పెద్దదైన ఆరవ సాగరమది. (హవ్యుడు అనే మనుపుత్రునికి ధాతకి కుముదుడు అనే ఇద్దరు కుమారులున్నారు. ధాతకి పాలించిన ప్రాంతం ధాతకీఖండం. కుముదుడు పాలించినది కుముద ఖండం.) హవ్యపుత్రపాలితమైన ధాతకి, కుముదం అనే రెండు ఖండాలు మిక్కిలి విస్తృతమైనవి.

సోమకం ప్రథమం వర్షం ధాతకీఖణ్డముచ్యతే ।
ధాతకేస్తు స్మృతం తద్వై ప్రథమం ప్రథమస్య తు ॥6॥

సోమకపర్వతం గల ప్రథమఖండం ధాతకీ ఖండమైనది. మొదటివాడైన ధాతకికి చెందినదిగాన దీన్ని ప్రథమవర్షం అంటారు.

గోమేదం యత్స్మృతం వర్షం నామ్నా సర్వసుఖం తు తత్ ।
కుముదస్య ద్వితీయస్య ద్వితీయం కుముదం తతః ॥7॥

గోమేదక వర్షం సర్వసుఖవర్షమని గూడా ప్రసిద్ధం. రెండవవాడైన కుముదుని పర్వతప్రాంతం 'కుముద' మని ప్రసిద్ధమయింది.

ఏతౌ ద్వౌ పర్వతౌ జ్ఞేయౌ వృత్తౌ సర్వసముచ్ఛ్రితౌ ।
పూర్వేణ తస్య ద్వీపస్య సోమకః పర్వతః స్థితః ॥8॥

సోమక, కుముద గిరులు ఈ రెండూ అన్నింటికంటె ఎత్తైన కొండలు. ఈ ద్వీపానికి తూర్పున సోమక పర్వతమున్నది.

ప్రాగాయతైః సపాదైస్తు ఆసముద్రాదితి స్థితః ।
పశ్చార్ద్వే కుముదస్తస్య ఏవమేవ స్థితస్తు తైః ॥9॥

దీని పాదాలు తూర్పు సముద్రం వరకు విస్తరించినవి. కుముదం ఆ ద్వీపానికి పశ్చిమంగా ఉన్నది.

ఏతైః పర్వతపాదైస్తు స దేశో వై ద్విధాకృత ।
ద్వీపస్య దక్షిణార్ధే తు ధాతకీఖణ్డముచ్యతే ॥10॥

కుముదం తూత్తరే తస్య ద్వితీయం వర్షముత్తమమ్ ।
ఏతౌ జనపదౌ ద్వౌ తు గోమేదస్య తు విస్తృతౌ ॥11॥

ఈ పర్వత పాదాలతో ఆదేశం రెండుగా విభక్తమయంది. ద్వీపదక్షిణార్థం ధాతకీ ఖండం. ద్వీప ఉత్తరార్ధం కుముద ఖండం. గోమేదకానికి చెందిన ఈ రెండు ప్రాంతాలూ వర్షాలు, దేశాలుగా సుప్రసిద్ధాలు.

అతఃపరం ప్రవక్ష్యామి సప్తమం ద్వీపముత్తమమ్ ।
సముద్రేక్షురసం చైవ గోమేదాద్ద్విగుణం హి సః ।
ద్వీపేన పుష్కరేణాసౌ వృతశ్చేక్షురసోదకః ॥12॥

ఇక ఏడవదైన ఉత్తమద్వీపాన్ని గురించి చెబుతాను. ఇది గోమేదకానికంటె రెండు రెట్లు పెద్దది. ఇక్షురస సముద్రంచే ఆవృతమైనది. ఇది పుష్కరావృతమైనది.

ఆవృత్య తిష్ఠతి ద్వీపః పుష్కరః పుష్కరైర్వృతః ।
పుష్కరేణ వృతః శ్రీమాంశ్చిత్రసానుర్మహాగిరిః ॥13॥

పద్మాలతో నిండిన ద్వీపం కాన దీన్ని 'పుష్కరద్వీప' మన్నారు. చిత్రసాను మహాపర్వతం ఈ పుష్కర ద్వీపంచే చుట్టబడియున్నది.

కూటైశ్చిత్రైర్మణిమయైః శిలాజాలసముద్భవైః ।
ద్వీపస్యైవ తు పూర్వార్ధే చిత్రసానుః స్థితో మహాన్ ॥14॥

పుష్కరద్వీపమునందు పూర్వార్ధమున శిలాజాలమునుండి ఉత్పన్నాలై మణిమయశిఖరాలు గల వేలకొలది గుహలతో కూడిన చిత్రసాను మహాపర్వతం కలదు.

దరీమణ్డలసాహస్రో విస్తీర్ణః పంచవింశతిః ।
ఊర్ధ్వం స వై చతుర్వింశద్యోజనానాం మహాచలః ॥15॥

వెయ్యి దరీమండలాలు గలిగిన దీని విస్తారం ఇరువది అయిదు, ఎత్తు ఇరువది నాలుగు యోజనాలు.

ద్వీపస్యార్ధే పరిక్షిప్తః పశ్చిమే మానసో గిరిః ।
స్థితో వేలాసమీపే తు నవశ్చంద్ర ఇవోదితః ॥16॥

ద్వీపానికి పశ్చిమాన ఉదయించిన నూతన చంద్రునివలె వక్రమై వేలాసమీపంలో మానసమనే పర్వతమున్నది.

యోజనానాం సహస్రాణి హ్యర్ధం పంచాశదుచ్ఛ్రితః ।
తస్య పుత్రో మహావీరః పశ్చిమార్ధస్య రక్షితా ॥17॥

దీని ఎత్తు యాబదివేల యోజనాలు. ప్రియవ్రత పుత్రుడు మహావీరుడు పశ్చిమార్ధానికి రక్షకుడు.

పూర్వార్ధే పర్వతస్యాపి ద్విధా దేశస్తు స స్మృతః ।
స్వాదూదకేనోదధినా పుష్కరః పరివారితః ॥18॥

పర్వతానికి పూర్వార్ధంలోని ఆ దేశం రెండువిధాలు స్మరింపబడింది. పుష్కరం చుట్టూ స్వాదూదకమైన సముద్ర మున్నది.

విస్తరాన్మణ్డలాచ్చైవ గోమేదాద్ద్విగుణేన తు ।
దశవర్షసహస్రాణి తేషు జీవన్తి మానవాః ॥19॥

గోమేదకం కంటె దాని విస్తారం, మండలం రెండింతలు. శాల్మల గోమేద పుష్కరద్వీపాలలో జనులు పదివేల సంవత్సరాలు జీవిస్తారు.

విపర్యయో న తేష్వస్తి ఏతత్స్వాభావికం స్మృతమ్ ।
ఆరోగ్యం సుఖబాహుల్యం మానసీం సిద్ధిమాశ్రితాః ॥20॥

అక్కడి జనులకు ఆరోగ్యాదులు సుఖాలు స్వాభావికంగా ఉంటాయి. వారు మానసిక సిద్ధి పొందినవారు. ఏ కొరతా లేనివారు.

సుఖమాయుశ్చ రూపం చ త్రిషు ద్వీపేషు సర్వశః ।
అధమోత్తమౌ న తేష్వాస్తాం తుల్యాస్తే రూపశీలతః ॥21॥

సుఖం, ఆయువు, రూపం - ఈ మూడు ద్వీపాలలో అంతటా ఉన్నాయి. అందులో హెచ్చుతక్కువలు లేవు. రూపశీలాలను బట్టి వారంతా సమానంగానే ఉంటారు.

న తత్ర వధ్యవధకౌ నేర్ష్యాసూయా భయం తథా ।
న లోభో న చ దండో వా న చ ద్వేషః పరిగ్రహః ॥22॥

అక్కడ చంపేవారూ, చంపబడేవారూ లేరు. ఈర్ష్య, అసూయ, భయం - అనేవి ఉండవు. లోభం, దండం, ద్వేషం, పరిగ్రహం ఉండవు.

సత్యానృతే న తేష్వాస్తాం ధర్మాధర్మౌ తథైవ చ ।
వర్ణాశ్రమాణాం వార్తా చ పాశుపాల్యం వణిక్ కృషిః ॥23॥

సత్యానృతాలు వారిలో లేవు. అట్లె ధర్మాధర్మాలు, వర్ణాశ్రమాల వార్త లేదు. పశుపాలకత్వం, వ్యాపారం, వ్యవసాయం లేవు.

త్రయీవిద్యా దణ్డనీతిః శూశ్రూషా దణ్డ ఏవ చ ।
న తత్ర వర్ష నద్యో వా శీతోష్ణం చ న విద్యతే ॥24॥

త్రయీవిద్య, దండనీతి, శుశ్రూష, దండం, వర్షం, నదులు, శీతోష్ణాలూ అక్కడ ఉండవు.

ఉద్భిజ్జాన్యుదకాని స్యుర్గిరిప్రస్రవణాని చ ।
తుల్యోత్తరకురూణాం తు కాలస్తత్ర తు సర్వదా ॥25॥

జలం భూమినుండి వస్తుంది. గిరి ప్రస్రవణాలైనా ఉంటాయి. ఉత్తర కురువుల కాలంతో వీరి కాలం సదా తుల్యమై వుంటుంది.

సర్వతః సుఖకాలోఽసౌ జరాక్లేశవివర్జితః ।
సర్గస్తు ధాతకీఖణ్డే మహావీరే తథైవ చ ॥26॥

అన్ని విధాలా ఇక్కడి కాలం జరాక్లేశరహితమై సుఖమయంగా వుంటుంది. గోమేదంలోని ధాతకీఖండంలోనూ, పుష్కరద్వీపంలోని మహావీర ఖండంలోనూ సృష్టి ప్రవృత్తి కలదు.

ఏతే ద్వీపాః సముద్రైస్తు సప్త సప్తభిరావృతాః ।
ద్వీపస్యానన్తరో యస్తు సముద్రస్తత్సమస్తు వై ॥27॥

ఈ సప్తద్వీపాలు సప్త సాగరాలచె ఆ వృతాలై ఉన్నాయి. ద్వీపానికి సంబంధించిన సాగరమేదైనా దానితో సమంగానే ఉంటుంది.

ఏవం ద్వీపసముద్రాణాం వృద్ధిర్జ్ఞేయా పరస్పరమ్ ।
అపాం చైవ సముద్రేకాత్సముద్ర ఇతి సంజ్ఞితః ॥28॥

ద్వీపసముద్రాల పరస్పర వృద్ధిని కూడా ఇట్లే తెలుసుకోవాలి. నీటి సముద్రేకం వల్లనే సాగరానికి 'సముద్రం' అన్ని పేరు కల్గింది.

సరిద్విసంధ్యో వర్షేషు ప్రజా యత్ర చతుర్విధాః ।
ఋషిరిత్యేవ రమణో వర్షన్యేతేన తేషు వై ॥29॥

ఉదయతీందౌ పూర్ణే చ సముద్రః పూర్యతే సదా ।
ప్రక్షీయమాణే బహులే క్షీయతేఽస్తమితే చ వై ॥30॥

జరాయుజాది చతుర్విధ ప్రాణులు ఎచ్చట ఉండి ఆనందిస్తారో అది వర్షమౌతుంది. చంద్రోదయకాలంలో సముద్రం నిండుతుంది. చంద్రుడు క్షీణించినా, అస్తమించినా క్షీణిస్తుంది.

ఆపూర్యమాణే హ్యుదధిరాత్మనైవాభిపూర్యతే ।
తతో వై క్షీయమాణే తు స్వాత్మన్యేవ హ్యపాం క్షయః ॥31॥

శుక్లపక్షంలో సముద్రం తనకు తానే పూరింపబడుతుంది. క్షీయమాణదశలో కూడా తనలోనే నీటికి క్షయం కలుగుతుంది.

ఉదయాత్పక్షసంయోగాత్పుష్ణన్త్యాపో యథా స్వయమ్ ।
తథా స తు సముద్రోఽపి వర్ధతే హ్యుదయే విధోః ॥32॥

శుక్లపక్షంలో నీటి అభ్యుదయంతో నీరు పెరుగుతుంది. సముద్రం కూడా చంద్రోదయంతో వృద్ధి పొందుతుంది.

అన్యూనానతిరిక్తాత్మా వర్ధన్త్యాపో హ్రసన్తి చ ।
ఉదయేఽస్తమయే చేన్దోః పక్షయోః శుక్లకృష్ణయోః ॥33॥

నీరు అన్యూనానతిరిక్తంగా (మరీ ఎక్కువ తక్కువలు లేకుండా) పెరుగుతూ, తరుగుతూ ఉంటుంది. చంద్రోదయాస్త మయాలలో, శుక్ల కృష్ణ పక్షాలలో ఇది జరుగుతుంది.

క్షయవృద్ధీ సముద్రస్య శశివృద్ధిక్షయే తథా ।
దశోత్తరాణి పంచాహురంగులానాం శతాని చ ॥34॥

చంద్రుని వృద్ధి క్షయాలతో సముద్రవృద్ధి క్షయాలు ఉంటాయి గాన ఈ వృద్ధి పరిమాణం అయిదు వందల పది అంగుళాలు ఉంటుంది.

అపాం వృద్ధిః క్షయో దృష్టః సముద్రాణాం తు పర్వసు ।
ద్విరాపత్వాత్స్మృతో ద్వీపో దధానాచ్చోదధిః స్మృతః ॥35॥

సముద్రాలలో నీటి వృద్ధి క్షయాలు పర్వదినాలలో కనిపిస్తాయి. రెండు వైపులా నీరు కలది కాన (ద్విరాపత్వాత్) 'ద్వీప' మన్న పేరు కల్గింది. నీటిని ధరించి వుండడం వల్ల 'ఉదధి' అని సాగరం పేర్కొనబడింది.

ఉద్గీర్ణత్వాచ్చ గిరయో పర్వవత్వాచ్చ పర్వతాః ।
శాకద్వీపే తు వై శాకః పర్వతస్తేన చోచ్యతే ॥36॥

భూమిచే వెలికి గ్రక్కబడినవి కాన కొండలను 'గిరు'లన్నారు. పర్వములు కలవి కాబట్టి పర్వతాలన్నారు. శాకద్వీపంలో పర్వతాన్ని శాకపర్వతం అంటారు.

కుశద్వీపే కుశస్తంబో మధ్యే జనపదస్య తు ।
క్రౌంచద్వీపే గిరిః క్రౌంచస్తస్య నామ్నా నిగద్యతే ॥37॥

జనపదమధ్యంలో కుశస్తంబం (దర్బదుబ్బు) ఉండడం వల్ల 'కుశద్వీప' మయింది. క్రౌంచద్వీపం క్రౌంచగిరి వల్ల ఏర్పడింది.

శాల్మలః శాల్మలద్వీపే పూజ్యతే స మహాద్రుమః ।
గోమేదకే తు గోమేదః పర్వతస్తేన చోచ్యతే ॥38॥

శాల్మల ద్వీపంలో శాల్మలీవృక్షమున్నది. అది మహాద్రుమమై పూజింపబడుతున్నది. గోమేదక ద్వీపంలో గోమేదకగిరి ఉన్నది.

న్యగ్రోధః పుష్కరద్వీపే పుష్కరస్తేన స స్మృతః ।
పూజ్యతేఽ త్ర మహాదేవో బ్రహ్మణోఽ వ్యక్తసంభవః ॥39॥

పుష్కర ద్వీపంలో మఱ్ఱిచెట్టు ఉన్నదికాన అది పుష్కరద్వీపం అయ్యింది. (పుష్కరః వటః?) బ్రహ్మమునుండి అవ్యక్తంగా జనించిన మహాదేవుణ్ణి అక్కడ పూజిస్తారు.

తస్మిన్ స వసతి బ్రహ్మా సాధ్యైః సార్ధం ప్రజాపతిః ।
తత్ర దేవా ఉపాస్యన్తే త్రయస్త్రింశన్మహర్షిభిః ॥40॥

సాధ్యులతో సహా బ్రహ్మ అక్కడ నివసిస్తున్నాడు. అక్కడ ముప్పది ముగ్గురు దేవతలను మహర్షులు ఉపాసిస్తారు.

స తత్ర పూజ్యతే దేవో దేవదేవోత్తమశ్చ సః ।
జంబూద్వీపాత్ ప్రవర్తన్తే రత్నాని వివిధాని చ ॥41॥

దేవతలు, మహర్షి సత్తములు అక్కడ నారాయణుని పూజిస్తారు. జంబూద్వీపంలో వివిధ రత్నాలు జనిస్తాయి.

ద్వీపేషు తేషు సర్వేషు ప్రజానాం క్రమశస్తు వై ।
ఆర్జవాద్బ్రహ్మచర్యేణ సత్యేన చ దమేన చ ॥42॥

ఆరోగ్యాయుః ప్రమాణాభ్యాం ద్విగుణం ద్విగుణం తతః ।
ద్వీపేషు తేషు సర్వేషు యథోక్తం వర్షకేషు చ ॥43॥

అన్ని ద్వీపాలలోనూ క్రమంగా ప్రజలు ఆర్జవం, బ్రహ్మచర్యం, సత్యం, దమం, ఆరోగ్యం, ఆయుః ప్రమాణం – ఒకదానికంటే ఒకటి ఎక్కువగా కలిగి ఉంటారు. అన్ని ద్వీపాలలోనూ, అన్ని వర్షాలలోనూ గూడా అది అలాగే వుంటుంది.

గోపాయన్తే ప్రజాస్తత్ర న జరామృత్యుపీడితాః ।
భోజనం చాప్రయత్నేన సదా స్వయముపస్థితమ్ ॥44॥

అక్కడ ప్రజలకు జరామృత్యుపీడ లేదు. వారి సద్గుణాలే వారిని రక్షిస్తాయి. వారికి భోజనం కూడా అప్రయత్నంగా తనకు తానుగా లభిస్తుంది.

షడ్రసం తన్మహావీర్యం తత్ర తే భుంజతే జనాః ।
పరేణ పుష్కరస్యాథ ఆవృత్యావస్థితో మహీమ్ ॥45॥

స్వాదూదకసముద్రస్తు స సమన్తాదవేష్టయత్ ।
స్వాదూదకస్య పరితః శైలస్తు పరిమణ్డలః ॥46॥

ప్రకాశశ్చాప్రకాశశ్చ లోకాలోకః స ఉచ్యతే ।
ఆలోకస్తత్ర చార్వాక్ చ నిరాలోకస్తతః పరమ్ ॥47॥

ఆ అన్నం మహాబలం కల్గించే షడ్రుచులు గలది. జనులు దాన్ని భుజిస్తారు. పుష్కరాని కావల భూమి నావరించిన ఒక పెద్ద స్వాదూదక సముద్రం ఉన్నది. అది నలువైపులా వేష్టించి ఉన్నది. స్వాదూదకానికి చుట్టూ ఒక కొండ ప్రకాశమూ, అప్రకాశమూ అయి యున్నది. (అంటే లోన ప్రకాశమూ, వెలుపల అప్రకాశము) దాన్ని లోకాలోక మంటారు.

లోకవిస్తారమాత్రం తు పృథ్వ్యర్ధముదకావృతమ్ ।
ప్రతిచ్ఛన్నం సమన్తాత్తు ఉదకేనావృతం మహత్ ॥48॥

దీనియందలి లోకవిస్తారం పృథివీ సంబంధియై దృఢంగా ఉన్నది. అది నలువైపులా ఉదకంచే ఆవృతమై ఉన్నది.

భూమేర్దశగుణాశ్చాపః సమన్తాత్ ప్లావయన్మహీమ్ ।
అద్భ్యో దశగుణశ్చాగ్నిః సర్వతో ధారయత్యపః ॥49॥

భూమి కంటే నీళ్లు పదిరెట్లెక్కువగా భూమిని ఆవరించి ఉన్నాయి. నీటికంటె అగ్ని పదిరెట్లెక్కువ, అది అంతటా నీటిని ధరించి వున్నది.

అగ్నేర్దశగుణో వాయుర్ధారయంజ్యోతిరావృతః ।
తిర్యక్ చ మణ్డలో వాయుర్భూతాన్యావేష్ట్య ధారయన్ ॥50॥

అగ్నికంటె వాయువు పదిరెట్లెక్కువ. అది జ్యోతిని ధరించి వున్నది. వాయువు అడ్డముగా ఇతర భూతాలను చెదరిపోకుండా పట్టుకొని ఉన్నది.

దశాధికం తథాకాశం వాతోద్ధూతాన్యధారయత్ ।
భూతాది ధారయన్ వ్యోమ తస్మాద్దశగుణస్తు వై ॥51॥

గాలికంటె ఆకాశం పదిరెట్లెక్కువ. అది గాలికి చలించే భూతాలను ధరించినది. ఆకాశం భూతాదులను ధరించినదికాన పదిరెట్లు పెద్దది.

భూతోదితో దశగుణం మహద్భూతాన్యధారయత్ ।
మహత్తత్త్వం హ్యనన్తేన అవ్యక్తేన తు ధార్యతే ॥52॥

ఆకాశం కంటే పదిరెట్లు అధికపరిమాణం కలది మహత్తు. అది ఈ పృథివ్యాది మహదంత షట్కాన్ని ధరిస్తున్నది.

ఆధారాధేయభావేన వికారాస్తే వికారిణామ్ ।
పృథ్వ్యాదయో వికారాస్తే పరిచ్ఛిన్నాః పరస్పరమ్ ॥53॥

ఆధారాధేయభావంతో వికారవంతమైన పదార్థాలను వికారాలంటారు? పృథివ్యాదులు వికారాలు, అని అన్యోన్యం పరిచ్ఛిన్నాలు. వికారాలు వికారిచే నిలుపబడి ఆధారాధేయభావంతో ఉన్నాయి.

పరస్పరాధికాశ్చైవ ప్రవిష్టాశ్చ పరస్పరమ్ ।
ఏవం పరస్పరోత్పన్నా ధార్యన్తే చ పరస్పరమ్ ॥54॥

అవి ఒకదానికంటె ఒకటి పెద్దదిగా ఈ భూతాలు పరస్పర ప్రవిష్టాలై ఉన్నాయి. ఇలాగే ఒకదానినుండి మరొకటి పుట్టినవై అవి పరస్పరం ధరిస్తున్నవి.

యస్మాత్ ప్రవిష్టాస్తేఽన్యోన్యం తస్మాత్తే స్థిరతాం గతాః ।
ఆసంస్తే హ్యవిశేషాశ్చ విశేషా అన్యవేశనాత్ ॥55॥

అవి ఒకదానిలో మరొకటి ప్రవేశించి వుండడం వల్ల స్థిరత్వం పొందాయి. వాటిలో విశేషం లేకున్నా, ఇతరత్రా ప్రవేశంవల్ల విశేషాలు ఏర్పడ్డాయి.

పృథ్వ్యాదయస్తు వాయ్వన్తాః పరిచ్ఛిన్నాస్తు తత్ర వై ।
భూతేభ్యః పరతస్తేభ్యో హ్యలోకః సర్వతః సమః ॥56॥

పృథివి మొదలు వాయువు వరకూ గల భూతాలు పరిచ్ఛిన్నాలు. ఆభూతాలకు ఆవల అలోకం అంతటా వ్యాపించి ఉన్నది. ఈ నాలిగింటికి ఆవల ఉన్న వెలుగు అన్ని వైపులా సమమే.

తథా హ్యలోక ఆకాశే పరిచ్ఛిన్నాని సర్వశః ।
పాత్రే మహతి పాత్రాణి యథా హ్యన్తర్గతాని చ ॥57॥

ఆ అలోకంలోని ఆకాశంలో పరిచ్ఛిన్నాలై పెద్ద పాత్రలో చిన్న పాత్రల్లాగా అవి అంతర్గతాలుగా వున్నాయి.

భవన్త్యన్యోన్య హీనాని పరస్పర సమాశ్రయాత్ ।
యథా హ్యాలోక ఆకాశే భేదాస్త్వన్తర్గతా మతాః ॥58॥

కృత్స్నాన్యేతాని తత్త్వాని అన్యోన్యస్యాధికాని చ ।
యావదేతాని భూతాని తావదుత్పత్తిరుచ్యతే ॥59॥

పరస్పరాశ్రయం వల్ల అవి అన్యోన్యహీనాలవుతున్నాయి. ఆకాశంలోని ప్రకాశంలో అంతర్గతంగా భేదాలున్నట్లే. ఈ తత్త్వాలన్నీ ఒకటి కొకటి అధికాలుగానూ ఉంటున్నాయి. ఈ తత్త్వా లున్నంతవరకూ, అంటే ఈ భూతాలవ్యాప్తి ఉన్నంతవరకూ ఉత్పత్తి ఉంటుంది.

జంతూనామిహ సంస్కారో భూతేష్వన్తర్గతేషు వై ।
ప్రత్యాఖ్యాయేహ భూతాని కార్యోత్పత్తిర్న విద్యతే ॥60॥

జంతువుల సంస్కారం అంతర్గత భూతాలలో ఉన్నది. ఈ భూతాలు లేకుంటే కార్యోత్పత్తి ఉండదు. ఈ సంస్కారం జడమైన భూతాలను తొక్కిపెట్టి వానిలోనే ప్రాణుల ఉత్పత్తిని కొనసాగిస్తున్నది.

తస్మాత్ పరిమితాభేదాః స్మృతాః కార్యాత్మకాస్తు వై ।
తే కారణాత్మకాశ్చైవ స్యుర్భేదా మహదాదయః ॥61॥

అందువల్ల కార్యాత్మకాలలో పరిమిత భేదాలు ఏర్పడ్డాయి. మహదాదులు కారణాత్మక భేదాలు.

ఇత్యేవం సన్నివేశోఽయం పృథివ్యాక్రాన్త భాగశః ।
సప్తద్వీపసముద్రాణాం యాథాతథ్యేన వై మయా ॥62॥

విస్తారాన్మణ్డలాచ్చైవ ప్రసంఖ్యానేన చైవ హి ।
విశ్వరూపం ప్రధానస్య పరిమాణైకదేశికమ్ ॥63॥

ఇలా పృథివిచే ఆక్రమించబడిన సప్తదీపాత్మకమైన భూమండలస్థితిని తెలిపారు. భూమండల స్థితిని పరిమాణ విస్తారాలతో గ్రహించాలి. పరిమాణ ప్రధానమైన విశ్వంలోని ఏకదేశమిది.

ఏతావత్ సన్నివేశస్తు మయా సమ్యక్ ప్రకాశితః ।
ఏతావదేవ శ్రోతవ్యం సన్నివేశస్య పార్థివ! ॥64॥

రాజా! ఈ సన్నివేశమంతా నేను చక్కగా ప్రకాశింపజేశాను. ఈ సన్నివేశానికి సంబంధించి వినదగినది ఇంత మాత్రమే.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే గోమేదద్వీపవర్ణనం నామ త్రయోవింశత్యధికశతతమోఽధ్యాయః ॥ 123 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని గోమేదద్వీపవర్ణనమనే నూటఇరవైమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుర్వింశ్యత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరవై నాల్గవ అధ్యాయం

ఖగోళవర్ణనం - ఖగోళవర్ణన

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి సూర్యాచంద్రమసోర్గతిమ్ ।
సూర్యాచంద్రమసావేతౌ భ్రాజన్తౌ యావదేవ తు ॥1॥

సప్తద్వీపసముద్రాణాం ద్వీపానాం భాతి విస్తరః ।
విస్తరార్ధం పృథివ్యాస్తు భవేదన్యత్ర బాహ్యతః ॥2॥

పరిభ్రమించే సూర్యచంద్రుల కాంతి ప్రసరించునంతవరకూ ఆ సూర్యచంద్రుల కదలికలను ఇకమీదట వివరిస్తాను. సప్తద్వీపాలూ, సప్తసాగరాలుగా కల సగం భూమి కూడా ఇందులో చేరివుంటుంది. మరియు భూమికి ఆవలనుండే ఇతర ప్రదేశాలు గూడా సూర్యకాంతి ప్రకాశానికి లోనవుతాయి.

పర్యాసపరిమాణం చ చంద్రాదిత్యౌ ప్రకాశతః ।
పర్యాసపారిమాణ్యాత్తు బుధైస్తుల్యం దివః స్మృతమ్ ॥3॥

త్రీన్ లోకాన్ ప్రతి సామాన్యాత్ సూర్యో యాత్యవిలంబతః ।
అచిరాత్తు ప్రకాశేన అవనాత్తు రవిః స్మృతః ॥4॥

భూమియొక్క పరిధిమీద సూర్యచంద్రుల కాంతి ప్రసరిస్తున్నది. విబుధులు ద్యులోకపరిధి కూడా ఇంతే అని విశ్వాసిస్తారు. సూర్యుడు శీఘ్రగతితో వెళ్తూ ఒకేసారి ముల్లోకాలను ప్రకాశింపజేస్తాడు. ప్రకాశంతో వడిగా సృష్టిని రక్షిస్తాడు గాన సూర్యునికి 'రవి' అన్న పేరు సార్థకమయింది.

భూయో భూయః ప్రవక్ష్యామి ప్రమాణం చంద్రసూర్యయోః ।
మహితత్వాన్మహచ్ఛబ్దో హ్యస్మిన్నర్థే నిగద్యతే ॥5॥

అస్య భారతవర్షస్య విష్కంభాత్తుల్యవిస్తృతమ్ ।
మణ్డలం భాస్కరస్యాథ యోజనైస్తన్నిబోధత ॥6॥

నవయోజనసాహస్రో విస్తారో మణ్డలస్య తు ।
విస్తారాత్ త్రిగుణశ్చాపి పరిణాహోఽత్ర మణ్డలే ॥7॥

సూర్యచంద్రుల విస్తారమైన ప్రమాణాన్ని మరల నేను వివరిస్తాను. వాటి ప్రమాణ మహితత్వాన్ని అనుసరించి 'మహత్' అనే శబ్దం ఈ అర్థంలో ప్రయోగించడమైనది. సూర్యుని పరిధి భారతవర్షముయొక్క వ్యాసంతో సమానమైనది. సూర్యమండల విస్తృతిని యోజనాలతో తెలుసుకోండి. దాని వ్యాసం తొమ్మిదివేల యోజనాలు. దాని పరిధి అంతకు మూడింతలు.

విష్కంభాన్మణ్డలాచ్చైవ భాస్కరాద్ద్విగుణః శశీ ।
అతః పృథివ్యా వక్ష్యామి ప్రమాణం యోజనైః పునః ॥8॥

సప్తద్వీపసముద్రాయా విస్తారో మణ్డలస్య తు ।
ఇత్యేతదిహ సంఖ్యాతం పురాణే పరిమాణతః ॥9॥

తద్వక్ష్యామి ప్రసంఖ్యాయ సాంప్రతం చాభిమానిభిః ।
అభిమానినో హ్యతీతా యే తుల్యాస్తే సాంప్రతైస్త్విహ ॥10॥

దేవదేవైరతీతాస్తు రూపైర్నామభిరేవ చ ।
తస్మాద్వై సాంప్రతైర్దేవైర్వక్ష్యామి వసుధాతలమ్ ॥11॥

సూర్యునికంటె చంద్రుడు పరిధిలోనూ, వ్యాసంలోనూ రెండు రెట్లెక్కువ. ఇప్పుడు నేను సప్తద్వీపసాగర వ్యాప్తమైన భూమండలముయొక్క విస్తృతిని పురాణోక్త పద్ధతి ననుసరించి యోజనాలలో వివరిస్తాను. సాంప్రతులు, అభిమానులను గురించి ఇప్పుడు చెబుతాను. గతానికి చెందిన అభిమాని దేవతలు సాంప్రతులతో రూపనామాలలో సామ్యం కల్గి వున్నారు. అందువల్ల ఇప్పుడు నేను భూమియొక్క ఉపరితలాన్ని సాంప్రతులను, దేవతలను అనుసరించి చెప్తాను.

దివ్యస్య సన్నివేశో వై సాంప్రతైరేవ కృత్స్నశః ।
శతార్ధకోటివిస్తారా పృథివీ కృత్స్నశః స్మృతా ॥12॥

దివ్యులు తమ వ్యాప్తిలో సాంప్రతులతో సమానులే. భూమియొక్క సంపూర్ణ విస్తృతి ఏబదికోట్ల యోజనాలు.

తస్యాశ్చార్ధప్రమాణం చ మేరోశ్చైవోత్తరోత్తరమ్ ।
మేరోర్మధ్యే ప్రతిదిశం కోటిరేకా తు సా స్మృతా ॥13॥

తథా శతసహస్రాణామేకోననవతిం పునః ।
పంచాశచ్చ సహస్రాణి పృథివ్యర్ధస్య విస్తరః ॥14॥

పృథివ్యా విస్తరం కృత్స్నం యోజనైస్తన్నిబోధత ।
తిస్రః కోట్యస్తు విస్తారాత్సంఖ్యాతాస్తు చతుర్దిశమ్ ॥15॥

తథా శతసహస్రాణామేకోనాశీతిరుచ్యతే ।
సప్తద్వీపసముద్రాయాః పృథివ్యాః స తు విస్తరః ॥16॥

భూగోళముయొక్క అర్ధభాగం మేరుగిరికి ఉత్తరాన ఉన్నది. మేరు మధ్యలో ప్రతివైపునకూ ఒక కోటియోజనాల విస్తారమున్నది. సగభాగముయొక్క విస్తృతి ఎనుబది తొమ్మిది లక్షల యేబదివేల యోజనాలు. పృథివియొక్క సంపూర్ణ విస్తృతిని యోజనాలతో తెలుసుకోండి. భూమియొక్క పూర్తి విస్తారము మూడు కోట్ల డెబ్బదితొమ్మిది లక్షల యోజనాలు. ఇది సప్తద్వీపాలు, సప్తసముద్రాలతో కూడిన పృథివియొక్క విస్తారం.

విస్తారం త్రిగుణం చైవ పృథివ్యన్తరమణ్డలమ్ ।
గణితం యోజనానాం తు కోట్యస్త్వేకాదశ స్మృతాః ॥17॥

తథా శతసహస్రాణాం సప్తత్రింశాధికాస్తు తాః ।
ఇత్యేతద్వై ప్రసంఖ్యాతం పృథివ్యన్తరమణ్డలమ్ ॥18॥

పృథివ్యంతరమండలముయొక్క పరిధి భూపరిధికి మూడు రెట్లధికంగా పదకొండుకోట్ల ముప్పదిఏడు లక్షల యోజనాలుగా చెప్పడమైనది. ఇది పృథివ్యంతరమండలపరిధిగా పరిగణింపబడింది.

తారకాసన్నివేశస్య దివి యావత్తు మణ్డలమ్ ।
పర్యాప్తసన్నివేశస్య భూమేస్తావత్తు మణ్డలమ్ ॥19॥

పర్యాసపరిమాణం చ భూమేస్తుల్యం దివః స్మృతమ్ ।

తారకల సన్నివేశానికి ద్యులోకంలో ఎంతవరకు మండలం కలదో, భూమియొక్క పర్యాప్తసన్నివేశము యొక్క మండలం కూడా అంతే వుంటుంది. అనగా భూమియొక్క పర్యాస పరిమాణం ద్యులోకంతో సమానమనిభావం.

మేరోః ప్రాచ్యాం దిశాయాం తు మానసోత్తరమూర్ధని ॥20॥
వస్త్వేకసారా మాహేంద్రీ పుణ్యా హేమపరిష్కృతా ।
దక్షిణేన పునర్మేరోర్మానసస్య తు పృష్ఠతః ॥21॥
వైవస్వతో నివసతి యమః సంయమనే పురే ।

ప్రతీచ్యాం తు పునర్మేరోర్మానసస్య తు మూర్ధని ॥22॥
సుషా నామ పురీ రమ్యా వరుణస్యాపి ధీమతః ।

దిశ్యుత్తరస్యాం మేరోస్తు మానసస్యైవ మూర్ధని ॥23॥
తుల్యా మహేంద్రపుర్యాపి సోమస్యాపి విభావరీ ।
మానసోత్తరపృష్ఠే తు లోకపాలాశ్చతుర్దిశమ్ ॥24॥
స్థితా ధర్మవ్యవస్థార్థం లోకసంరక్షణాయ చ ।

మేరువుకు తూర్పున మానసోత్తర శిఖరాన వస్త్వేకసారమైన స్వర్ణపరిష్కృతమగు మహేంద్రనగరమున్నది. మేరువుకు దక్షిణాన మానసానికి వెనుక వైవస్వతయముడు సంయమనపురంలో నివసిస్తాడు. మేరువుకు పశ్చిమాన మానసం పైన వరుణునికి చెందిన 'సుషా' అనే నగరమున్నది. మేరుగిరికి ఉత్తరదిశలో మానసం పైన మహేంద్రపురితో సమానమైన సోముని విభావరీనగరం కలదు. మానసోత్తరపృష్ఠంలో లోకపాలురు నాల్గు దిక్కులలోనూ ధర్మవ్యవస్థకొరకూ, లోకరక్షణార్థమూ ఉన్నారు.

లోకపాలోపరిష్టాత్తు సర్వతో దక్షిణాయనే ॥25॥
కాష్ఠాగతస్య సూర్యస్య గతిం తత్ర నిబోధత ।

దక్షిణోపక్రమే సూర్యః క్షిప్తేషురివ సర్పతి ॥26॥
జ్యోతిషాం చక్రమాదాయ సతతం పరిగచ్ఛతి ।

లోకపాలకులపైన సకలదిశలా దక్షిణాయనంలో కాష్ఠాగతుడైన సూర్యుడు ప్రయోగించిన బాణం వలె ముందుకు సాగుతాడు. అతడు జ్యోతిశ్చక్రాన్ని పరిగ్రహించి సదా సంచరిస్తాడు.

మధ్యగశ్చామరావత్యాం యదా భవతి భాస్కరః ॥27॥
వైవస్వతే సంయమనే ఉద్యన్సూర్యః ప్రదృశ్యతే ।

సుషాయామర్ధరాత్ర్యాం తు విభాయామస్తమేతి చ ॥28॥
వైవస్వతే సంయమనే మధ్యాహ్నే తు రవిర్యదా ।

సుషాయామథ వారుణ్యాముత్తిష్ఠన్స తు దృశ్యతే ॥29॥
విభావర్యామర్ధరాత్రం మాహేంద్ర్యామస్తమేవ చ ।

అమరావతీనగరములో మధ్యాహ్నమైన సమయములో సంయమననగరములో ఉదయిస్తూ సూర్యుడు గోచరిస్తాడు. ఆ సమయమందే సుషానగరంలో అర్ధరాత్రికాగా విభానగరంలో అస్తమయమవుతుంది. అలాగే సంయమననగరములో మధ్యాహ్నం ఐనప్పుడు సుషానగరములో ఉదయం, విభావరీనగరమునందు అర్ధరాత్రమూ, అమరావతిలో అస్తమయమూ సంభవిస్తాయి.

సుషాయామథ వారుణ్యాం మధ్యాహ్నే తు రవిర్యదా ॥30॥
విభావర్యాం సోమపుర్యాముత్తిష్ఠతి విభావసుః ।

మహేంద్రస్యామరావత్యాముద్గచ్ఛతి దివాకరః ॥31॥
అర్ధరాత్రం సంయమనే వారుణ్యామస్తమేతి చ ।

స శీఘ్రమేవ పర్యేతి భాస్కరోఽలాతచక్రవత్ ॥32॥
భ్రమన్వైభ్రమమాణాని ఋక్షాణి చరతే రవిః ।

ఏవం చతుర్షు పార్శ్వేషు దక్షిణాన్తేషు సర్పతి ॥33॥

వరుణదేవునికి సంబంధించిన సుషానగరములో సూర్యుడు మధ్యాహ్న గతుడైనప్పుడు చంద్రునినగరమైన విభావరిలో ఉదయమూ, అమరావతిలో అర్ధరాత్రి, సంయమనపురములో అస్తమయమూ సంభవిస్తాయి. విభానగరములో మధ్యాహ్నమైనప్పుడు అమరావతిలో ఉదయమూ, సంయమనపురిలో అర్ధరాత్రీ, సుషానగరమున అస్తమయమూ సంభవిస్తాయి. ఇలా సూర్యుడు కొరవి చక్రంలాగా సదా పరిభ్రమిస్తూనే వుంటాడు. దక్షిణంవరకు గల నలు పార్శ్వాలలోనూ భ్రమిస్తూ తిరిగే నక్షత్రాలను చలింపజేస్తాడు.

ఉదయేఽస్తమయే చాఽసావుత్తిష్ఠతి పునః పునః ।
పూర్వాహ్ణే చాపరాహ్ణే చ ద్వౌ ద్వౌ దేవాలయౌ తు సః ॥34॥

తపత్యేకం తు మధ్యాహ్నే తాభిరేవ చ రశ్మిభిః ।
ఉదితో వర్ధమానాభిర్మధ్యాహ్నే తపతే రవిః ॥35॥

అతఃపరం హ్రసన్తీభిర్గోభిరస్తం స గచ్ఛతి ।
ఉదయాస్తమయాఖ్యాం చ స్మృతే పూర్వాపరే తు వై ॥36॥

సూర్యుడు పూర్వార్ణాపరాహ్ణాలలో మార్పులు చెందే కిరణాలతో భూమిని తపింపజేస్తాడు. ఉదయంనుండి సూర్యకిరణాల తాపం అధిక మవుతూ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. ఆ తరువాత సాయంకాలానికి తాపం శమించిన కిరణాలతో అస్తమిస్తాడు. సూర్యుని ఉదయాస్త మయాలను బట్టే తూర్పు పడమరల వ్యవస్థ ఏర్పడింది.

యద్వత్పురస్తాత్తపతి యాదృక్పృష్ఠే తు పార్శ్వయోః ।
యత్రోదయస్తు దృశ్యేత తేషాం స ఉదయః స్మృతః ॥37॥

ప్రణాశం గచ్ఛతే యత్ర తేషామస్తః స ఉచ్యతే ।
సర్వేషాముత్తరే మేరుర్లోకాలోకస్య దక్షిణే ॥38॥

విదూరభావాదర్కస్య భూమేర్లోకాన్ గతస్య చ ।
హ్రియన్తే రశ్మయో యస్మాత్తేన రాత్రౌ న దృశ్యతే ॥39॥

సూర్యుడు ముందు ఎలా ప్రకాశిస్తాడో, అట్లే వెనుకనూ, ప్రక్కలా ప్రకాశిస్తాడు. సూర్యుడుదయించే దిక్కు తూర్పు అనీ, అస్తమించే దిక్కు పడమర అనీ అంటారు. అన్నింటికంటే ఉత్తరాన మేరుగిరి, దక్షిణాన లోకాలోకపర్వతమూ ఉంటాయి. సూర్యుడు భూమికంటే చాలా దూరంపోతాడు కాన అతని కిరణాలు భూమిపైనున్న వారికి గోచరించవు, అక్కడివారి కతడు రాత్రివేళ కనిపించడు.

ఊర్ధ్వం శతసహస్రాంశుః స్థితస్తత్ర ప్రదృశ్యతే ।
ఏవం పుష్కరమధ్యే తు యదా భవతి భాస్కరః ॥40॥

త్రింశద్భాగం చ మేదిన్యా ముహూర్తేన స గచ్ఛతి ।
యోజనానాం సహస్రస్య ఇమాం సంఖ్యాం నిబోధత ॥41॥

పూర్ణం శతసహస్రాణామేకత్రింశచ్చ సా స్మృతా ।
పంచాశచ్చ సహస్రాణి తథాన్యాన్యధికాని చ ॥42॥

మౌహూర్తికీ గతిర్హ్యేషా సూర్యస్య తు విధీయతే ।

ఇలా సూర్యుడు పుష్కరద్వీపమధ్యభాగంలో ఉన్నప్పుడు నూరువేల కిరణాలతో కనిపిస్తాడు. అతడు భూమియొక్క ముప్పదవ భాగాన్ని ఒక ముహూర్తంలో పయనిస్తాడు. యోజనసహస్రసంఖ్య నిపుణులు గ్రహించండి. ఇది ముప్పది ఒక్క లక్షల ఏబదివేల యోజనాల దూరం. ఇది సూర్యునియొక్క ముహూర్తగమనం.

ఏతేన క్రమయోగేన యదా కాష్ఠాం తు దక్షిణామ్ ॥43॥

పరిగచ్ఛతి సూర్యోఽసౌ మాసం కాష్ఠాముదగ్దినాత్ ।
మధ్యేన పుష్కరస్యాథ భ్రమతే దక్షిణాయనే ॥44॥

మానసోత్తరమేరోఽస్తు అన్తరం త్రిగుణం స్మృతమ్ ।
సర్వతో దక్షిణస్యాం తు కాష్ఠాయాం తన్నిబోధత ॥45॥

నవ కోట్యః ప్రసంఖ్యాతా యోజనైః పరిమణ్డలమ్ ।
తథా శతసహస్రాణి చత్వారింశచ్చ పంచ చ ।46॥

అహోరాత్రాత్పతఙ్గస్య గతిరేషా విధీయతే ।

ఈ గతిననుసరించి రవి దక్షిణానికి పోయి మాఘమాసమునందు దక్షిణదిశాగతిని వదలి పుష్కరద్వీపమధ్యభాగాన సంచరిస్తూ మేరుపర్వతమున మానసోత్తర శిఖరం చేరేసరికి అక్కడ క్రాంతిమండల పరిమాణం విషువమండలపరిమాణానికి మూడింతలవుతుంది. సూర్యుడు ఒక అహోరాత్రంలో పయనించే దూరం తొమ్మిది కోట్ల నలుబదిలక్షల యోజనాలు.

దక్షిణాదిఙ్నివృత్తోఽసౌ విషువస్థో యదా రవిః ॥47॥

క్షీరోదస్య సముద్రస్యోత్తరతోఽపి దిశం చరన్ ।
మణ్డలం విషువే చాపి యోజనైస్తన్నిబోధత ॥48॥

తిస్రః కోట్యస్తు సంపూర్ణం విషువస్యాపి మణ్డలమ్ ।
తథా శతసహస్రాణి వింశత్యేకాధికాని తు ॥49॥

శ్రావణే చోత్తరాం కాష్ఠాం చిత్రభానుర్యదా భవేత్ ।
గోమేదస్య పరద్వీపే ఉత్తరాం చ దిశం చరన్ ॥50॥

ఉత్తరాయాః ప్రమాణం తు కాష్ఠాయా మణ్డలస్య తు ।
యోజనానాం ప్రసంఖ్యాతా కోటిరేకా తు సా ద్విజాః ॥ 51

అశీతిర్నియుతానీహ యోజనానాం తథైవ చ ।
అష్టపంచాశతంచైవ యోజనాన్యధికాని తు ॥ 52

దక్షిణమునుండి మరలిన సూర్యుడు విషువ మండలంలోకి వచ్చి అక్కడనుండి క్షీరసాగరానికి ఉత్తరంగా పోయేటప్పుడు ఆ విషువ మండలానికి చెందిన యోజనపరిమాణం మూడుకోట్ల ఇరువదియొక్క లక్షలు. శ్రావణమాసంలో సూర్యుడు క్రాంతిమండలానికి ఉత్తరాన గల గోమేదద్వీపాన పయనించేటప్పుడు అచ్చటిమండలి పరిమాణం ఒక్కకోటి ఎనుబది లక్షల ఏబది యెనిమిది యోజనాలు.

దక్షిణోత్తరమధ్యాని తాని విన్ద్యాద్యథాక్రమమ్ ॥53॥

స్థానం జరద్గవం మధ్యే తథైరావతముత్తరమ్ ।
వైశ్వానరం దక్షిణతో నిర్దిష్టమిహ తత్త్వతః ॥54॥

నాగవీథ్యుత్తరా వీథీ హ్యజవీథిస్తు దక్షిణా ।
ఉభే ఆషాఢమూలం తు అజవీథ్యాదయస్త్రయః ॥55॥

అభిజిత్పూర్వతః స్వాతిం నాగవీథ్యుత్తరాస్త్రయః ।
అశ్వినీ కృత్తికా యామ్యా నాగవీథ్యస్త్రయః స్మృతాః ॥56॥

రోహిణ్యార్ద్రా మృగశిరో నాగవీథిరితి స్మృతా ।
పుష్యాశ్లేషా పునర్వస్వోర్వీథీ చైరావతీ చ స్మృతా ॥57॥

తిస్రస్తు వీథయో హ్యేతా ఉత్తరామార్గ ఉచ్యతే ।

అవమండలమనే నక్షత్రచక్రం దక్షిణం, ఉత్తరం, మధ్యం-అని మూడుభాగాలు. అందులో జరద్గవం మధ్యభాగం కాగా, ఐరావతస్థానం ఉత్తరం, వైశ్వానరం-దక్షిణంగా నిర్దేశించబడివున్నాయి. ఇందులో నాగవీథి ఉత్తరాన, అజవీథి దక్షిణాన ఉన్నాయి. అశ్వినీ, కృత్తిక, భరణి-అనేవి నాగవీథి, రోహిణి, ఆర్ద్ర, మృగశిర అనునవి అజవీథి. పుష్యము, ఆశ్లేష, పునర్వసు అనునవి ఐరావతవీథి. ఈ మూడు వీథులూ కలిపితే ఉత్తరమార్గమౌతుంది.

పూర్వోత్తరా చ ఫల్గున్యౌ మఘాం చైవార్షభీ భవేత్ ॥58॥

పూర్వోత్తరప్రోష్ఠపదౌ గోవీథీ రేవతీ స్మృతా ।
శ్రవణం చ ధనిష్ఠా చ వారుణం చ జరద్గవమ్ ॥59॥

ఏతాస్తు వీథయస్తిస్రో మధ్యమో మార్గ ఉచ్యతే ।

పుబ్బ, ఉత్తర, మఖ-ఇవి మూడూ ఋషభవీథి. పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, రేవతి-ఇవి గోవీథి శ్రవణ-ధనిష్ఠా-శతభిషలు జరద్గవవీథి. ఈ మూడూ కలిపి మధ్యమమార్గంగా చెప్పబడ్డాయి.

హస్తశ్చిత్రా తథా స్వాతీ హ్యజవీథిరితి స్మృతా ॥60॥

జ్యేష్ఠా విశాఖా మైత్రం చ మృగవీథీ తథోచ్యతే ।
మూలం పూర్వోత్తరాషాఢే వీథీ వైశ్వానరీ భవేత్ ॥61॥

స్మృతాస్తిస్రస్తు వీథ్యస్తా మార్గే వై దక్షిణే పునః ।

హస్త, చిత్ర, స్వాతి-అజవీథి, విశాఖ-అనూరాధ-జ్యేష్ఠమృగవీథి-మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ-వైశ్వానరవీథి అనబడతాయి. ఈ మూడింటినీ దక్షిణమార్గమంటారు. నక్షత్రాలతో సంబంధపడిన ఈ వీథుల నిర్ణయం విషయంలో ఇతర పురాణాలు భిన్నాభిప్రాయం కలిగివున్నదని పండితులు చెప్పి యున్నారు.

కాష్ఠయోరన్తరం చైతద్వక్ష్యతే యోజనైః పునః ॥62॥

ఏతచ్ఛతసహస్రాణామేకత్రింశత్తు వై స్మృతమ్ ।
శతాని త్రీణి చాన్యాని త్రయస్త్రింశత్తథైవ చ ॥63॥

కాష్ఠయోరన్తరం హ్యేతద్యోజనానాం ప్రకీర్తితమ్ ।
కాష్ఠయోర్లేఖయోశ్చైవ అయనే దక్షిణోత్తరే ॥64॥

తే వక్ష్యామి ప్రసంఖ్యాయ యోజనైస్తు నిబోధత ।
ఏకైకమన్తరం తద్వదుక్తాన్యేతాని సప్తభిః ॥65॥
సహస్రైరవియుక్తాని తతోఽన్యైః పంచవింశతిః ।

ఈ కాష్ఠల మధ్యదూరాన్ని యోజనాలతో వివరిస్తాను. ఈ అవమండలానికి చెందిన రెండంచుల మధ్య ముప్పదియొక్క లక్షలా, మూడువేల మూడువందల యోజనాలు, ఉత్తరాయణ దక్షిణాయన రేఖల మధ్య అవమండల పుటంచులు సమాంతరమైన చోట ఏడువేల ఇరువదైదు యోజనాల దూరమున్నది.

లేఖయోః కాష్ఠయోశ్చైవ బాహ్యాభ్యన్తరయోశ్చరన్ ॥66॥

అభ్యన్తరం స పర్యేతి మణ్డలాన్యుత్తరాయణే ।
బాహ్యతో దక్షిణేనైవ సతతం సూర్యమణ్డలమ్ ॥67॥

చరన్నసావుదీచ్యాం చ హ్యశీతిం మణ్డలం శతమ్ ।
అభ్యన్తరం స పర్యేతి క్రమతే మణ్డలాని తు ॥68॥

ప్రమాణం మణ్డలస్యాపి యోజనానాం నిబోధత ।
యోజనానాం సహస్రాణి దశ చాష్టౌ తథా స్మృతమ్ ॥69॥

అధికాన్యష్టపంచాశద్యోజనాని తు వై పునః ।

రవి అవమండలపుటంచులను దాటకుండా ఉత్తర–దక్షిణాయన రేఖల మధ్య ఉత్తరాయణములో మండలానికి లోపలి వైపుననూ, దక్షిణాయనాన మండలానికి వెలుపలనూ సంచరిస్తాడు. సూర్యుడు ఉత్తరాన చరిస్తూ ఎనిమిదివేల మండలాలు ఆభ్యన్తరానికి వెళ్ళి పరిక్రమిస్తాడు. దక్షిణాన గూడా అంతేదూరం ప్రయాణిస్తాడు. అతడు తిరిగే మండలవ్యాస పరిమాణం పదునెనిమిది వేల ఏబదియెనిమిది యోజనాలు.

విష్కంభో మణ్డలస్యైవ తిర్యక్ స తు విధీయతే ॥70॥

అహస్తు చరతే నాభేః సూర్యో వై మణ్డలం క్రమాత్ ।
కులాలచక్రపర్యన్తో యథా చక్రీ రవిస్తథా ॥71॥

దక్షిణే చక్రవత్సూర్యస్తథా శీఘ్రం నివర్తతే ।

తస్మాత్ప్రకృష్టాం భూమిం తు కాలేనాల్పేన గచ్ఛతి ॥72॥

సూర్యుడు పగటిపూట ధ్రువుణ్ణి చక్రనాభిగా చేసుకొని కుమ్మరి సారెలాగా తిరుగుతాడు. కులాలచక్రపుటంచు చక్రపునాభిపై ఆధారపడి ఒకప్రక్క క్రిందికి వాలుతూ, మరొకవైపు పైకిలేస్తూ భ్రమిస్తుంటుంది. దానిచే సూర్యుడు దక్షిణాయనాన ఎక్కువ దూరాన్ని తక్కువ కాలంలో పయనిస్తాడు. అనగా పదమూడున్నర నక్షత్రాల దూరాన్ని పండ్రెండు ముహూర్తాల కాలంలోనే చేరుకొంటాడు. ఉత్తరాయణంలో ఇదే దూరాన్ని గమనవేగం తగ్గడంవల్ల పదునెనిమిది ముహూర్తాల కాలంలో చేరుకొంటాడు.

సూర్యో ద్వాదశభిః శీఘ్రం ముహూర్తైర్దక్షిణాయనే ।
త్రయోదశార్ధమృక్షాణాం మధ్యే చరతి మణ్డలమ్ ॥73॥

సూర్యుడు పండ్రెండు ముహూర్తాలలోనే శీఘ్రంగా దక్షిణాయనంలో పదమూడున్నర నక్షత్రాల మధ్య మండలంలో సంచరిస్తాడు.

ముహూర్తైస్తాని ఋక్షాణి నక్తమష్టాదశైశ్చరన్ ।
కులాలచక్రమధ్యస్థో యథా మన్దం ప్రసర్పతి ॥74॥

ఆ నక్షత్రాలను రాత్రివేళ పదునెనిమిది ముహూర్తాలలో చరిస్తూ కులాల చక్రం మధ్య నున్నవానిలాగ మందంగా సాగిపోతాడు.

ఉదగ్యానే తథా సూర్యః సర్పతే మన్దవిక్రమః ।
తస్మాద్దీర్ఘేణ కాలేన భూమిం సోఽల్పాం ప్రసర్పతి ॥75॥

ఉత్తరాయణంలోని ప్రయాణంలో అట్లే సూర్యుడు మంద విక్రముడై యుంటాడు. అందువల్ల దీర్ఘకాలంలో అతడు అల్పభూమినే దాటుతున్నాడు.

సూర్యోఽష్టాదశభిరహ్నో ముహూర్తైరుదగాయనే ।
త్రయోదశానాం మధ్యే తు ఋక్షాణాం చరతే రవిః ।
ముహూర్తైస్తాని ఋక్షాణి రాత్రౌ ద్వాదశభిశ్చరన్ ॥76॥

సూర్యుడు దినంలోని పదునెనిమిది ముహూర్తాలలో ఉత్తరాయణంలో పదమూడు నక్షత్రాల మధ్య చరిస్తాడు. అదే నక్షత్రాలను రాత్రివేళ పండ్రెండు ముహూర్తాలలో సంచరిస్తాడు.

తతో మన్దతరం తాభ్యాం చక్రం తు భ్రమతే పునః ।
మృత్పిణ్డ ఇవ మధ్యస్థో భ్రమతేఽసౌ ధ్రువస్తథా ॥77॥

అతడు వారికంటె(?) మెల్లగా చక్రభ్రమణం చేస్తాడు. జ్యోతిర్మండలకేంద్రంలో చక్రపు నాభిలాగా వున్న ధ్రువుడు కుమ్మరిసారె నడుమ నాభిపై వుంచిన మట్టిముద్దవలె మిక్కిలి తక్కువ వేగంతో తిరుగుతూ వుంటాడు.

ముహూర్తైస్త్రింశతా తావదహోరాత్రం ధ్రువో భ్రమన్ ।
ఉభయోః కాష్ఠయోర్మధ్యే భ్రమతే మణ్డలాని తు ॥78॥

ధ్రువుడు అహోరాత్రాలు ముప్పది ముహూర్తాలలో చరిస్తూ ఉభయకాష్ఠల మధ్యా మండలాలు భ్రమిస్తాడు.

ఉత్తరక్రమణేఽర్కస్య దివా మన్దగతిః స్మృతా ।
తస్యైవ తు పునర్నక్తం శీఘ్రా సూర్యస్య వై గతిః ॥79॥

ఉత్తరాయణంలో సూర్యునికి పగలు మెల్లని నడక ఉంటుంది. ఆ సూర్యునికే రాత్రి వేగం ఎక్కువ.

దక్షిణప్రక్రమే వాపి దివా శీఘ్రం విధీయతే ।
గతిః సూర్యస్య వై నక్తం మన్దా చాపి విధీయతే ॥80॥

ఏవం గతివిశేషేణ విభజన్ రాత్ర్యహాని తు ।
అజవీథ్యాం దక్షిణాయాం లోకాలోకస్య చోత్తరమ్ ॥81॥

లోకసన్తానతో హ్యేష వైశ్వానరపథాద్బహిః ।
వృష్టిర్యావత్ప్రభా సౌరీ పుష్కరాత్సంప్రవర్తతే ॥82॥

ఈ విధంగా సూర్యుడు అవమండలానికి చెందిన రెండంచుల నడుమ మండలాకార గతితో కొంచెం వాలుతూ, లేస్తూ తిరుగుతుంటాడు. ఈ గమన భేదంచేతనే సూర్యుని గమనం ఉత్తరాయణాన పగలు మందంగానూ, రాత్రివేళ చురుకుగానూ, దక్షిణాయనాన పగలు చురుకుగానూ, రాత్రివేళ మందంగానూ సాగుతుంటుంది. ఇలా అహోరాత్రాలను తన గమనప్రభావంతో విభజిస్తూ సూర్యుడు అజవీథియందు, లోకాలోకపర్వతానికి ఉత్తరాన,

లోకశ్రేణికి వెలుపలా, వైశ్వానరవీథికి వెలుపల గూడా సంచరిస్తూ వుంటాడు. సూర్యుడు లోకాలోకపర్వతానికి వెనుక ఉన్నప్పుడు అతని కాంతి ముందుకు ప్రసరిస్తుంది.

పార్శ్వేభ్యో బాహ్యతస్తావల్లోకాలోకశ్చ పర్వతః ।
యోజనానాం సహస్రాణి దశోర్ధ్వం చోచ్ఛ్రితో గిరిః ॥83॥

ప్రకాశశ్చాప్రకాశశ్చ పర్వతః పరిమణ్డలః ।
నక్షత్రచంద్రసూర్యాశ్చ గ్రహాస్తారాగణైః సహ ॥84॥

అభ్యన్తరే ప్రకాశన్తే లోకాలోకస్య వై గిరేః ।
ఏతావానేవ లోకస్తు నిరాలోకస్తతః పరమ్ ॥85॥

ఈ చెప్పిన అజవీథి మున్నగువానికి ప్రక్కల అంచులకు ఆవలగా లోకాలోకపర్వతమున్నది. దాని యెత్తు పదివేలయోజనాలు. నక్షత్రాలు, సూర్యచంద్రులు, గ్రహాలు మొదలగు జ్యోతిర్గోళాలన్నీ ప్రకాశమూ, అప్రకాశము అయిన ఈ లోకాలోకానికి లోపలి వైపున మాత్రమే సంచరించగలవు. ఈ పర్వతానికావలి వైపున ఆలోకం లేదు.

లోక ఆలోకనే ధాతుర్నిరాలోకస్త్వలోకతా ।
లోకాలోకౌ తు సన్ధత్తే తస్మాత్సూర్యః పరిభ్రమన్ ॥86॥

తస్మాత్సన్ధ్యేతి తామాహురుషావ్యుష్టైర్యథాన్తరమ్ ।
ఉషా రాత్రిః స్మృతా విప్రైర్వ్యుషా చాపి దినం స్మృతమ్ ॥87॥

ఆలోకనమన్న (దర్శనం) అర్థమున్న లోకధాతువు నుండి లోక శబ్దమూ ఆ ఆలోకనం లేనిది అలోకమూ, ఇలా దీనికి ఒకవైపున 'ఆలోకం' ఉండడం వల్లా, మరొకవైపున అది లేకపోవడంవల్లా ఈ గిరికి 'లోకాలోక'మనే పేరుగల్గింది. 'లోకమంటే వెల్తురు, అలోకమనగా చీకటి, ఈ వెలుగుచీకట్ల మధ్య సూర్యుడు సంధానం కల్గిస్తాడు. అందువల్ల అతనిచే వెలుగుచీకట్ల సంధానం చేయబడే సమయాన్ని 'సంధ్య' అంటారు. 'ఉషా' అనగా రాత్రి 'వ్యుషా' అంటే పగలు, ఈ రెండింటి సంధానకాలమే సంధ్యాకాలము.

త్రింశత్కలా ముహూర్తస్తు అహస్తే దశ పంచ చ ।
హ్రాసో వృద్ధిరహర్భాగైర్దివసానాం యథా తు వై ॥88॥

సన్ధ్యాముహూర్తమాత్రాయాం హ్రాసవృద్ధీ తు తే స్మృతే ।
లేఖాప్రభృత్యథాదిత్యే త్రిముహూర్తాగతే తు వై ॥89॥

ప్రాతః స్మృతస్తతః కాలో భాగశ్చాహ్నః స పంచమః ।
తస్మాత్సంగవకాలోహి ముహూర్తాస్సంగతాస్త్రయః ॥ 90

మధ్యాహ్నాస్త్రిముహూర్తస్తు తస్మాత్కాలాదనన్తరమ్ ॥
తస్మాన్మధ్యందినాత్కాలాద్ ఆపరాహ్ణ ఇతి స్మతః ॥91॥

త్రయ ఏవ ముహూర్తాస్తు కాల ఏష స్మృతో బుధైః ।
అపరాహ్ణవ్యతీతాచ్చ కాలః సాయం స ఉచ్యతే ॥92॥

దశ పంచ ముహూర్తాహ్నో ముహూర్తాస్త్రయ ఏవ చ ।
దశ పంచ ముహూర్తం వై అహస్తు విషువే స్మృతమ్ ॥93॥

వర్ధత్యతో హ్రసత్యేవ అయనే దక్షిణోత్తరే ।
అహస్తు గ్రసతే రాత్రిం రాత్రిస్తు గ్రసతే అహః ॥94॥

ముప్పై కళల కాలాన్ని ఒక ముహూర్తమంటారు. పదునైదు ముహూర్తాలు కలిస్తే ఒక దివసం. దీన్ని విషువ దిన మంటారు. కాని పగటి పరిమాణములో హానివృద్ధులు ఉండడం వల్ల దానిలో మార్పులుంటాయి. సాధారణంగా ఒక సంధ్యాకాలం ముహూర్తకాలమవుతుంది. దాని పరిమాణమునందు కాల-దేశ-సూర్యగతి భేదాలను బట్టి మార్పులు సంభవిస్తాయి. సూర్యుడు లేఖ మీదికి వచ్చింది మొదలు మూడు ముహూర్తాలకాలం ప్రాతఃకాలం, తరువాతి మూడు ముహూర్తాలు 'సంగవ' కాలం, తదుపరి మూడు ముహూర్తాలు 'మధ్యాహ్న' కాలం, తదుపరి మూడు ముహూర్తాల కాలం 'అపరాహ్ణ' కాలం అనంతరం మూడు ముహూర్తాలు 'సాయంకాలం' అనబడతాయి. పగటి, రాత్రి పరిమాణాలలో హానివృద్ధులు వచ్చినా సాధారణదిన (విషువ) పరిమాణం ఈ చెప్పిన పదునైదు ముహూర్తాలే, ఉత్తరాయణ దక్షిణాయనాల క్రమంలో మార్పులు ముందే నిర్దేశించడమైనది. ఈ అయనబేధాల ననుసరించి పగలు రాత్రినీ, రాత్రి పగటినీ తమలోనికి తీసుకోవడం సంభవిస్తుంది.

శరద్వసన్తయోర్మధ్యం విషువం తు విధీయతే ।
ఆలోకాన్తః స్మృతో లోకో లోకాచ్చాలోక ఉచ్యతే ॥95॥

చత్వారస్తే మహాత్మానస్తిష్ఠన్త్యాభూతసంప్లవమ్ ॥96॥

సుధామా చైవ వైరాజః కర్దమశ్చ ప్రజాపతిః ।
హిరణ్యరోమా పర్జన్యః కేతుమాన్ రాజసశ్చ సః ॥97॥

శరద్వసంతాల నడుమ 'విషువ' దినం ఉంటుంది. అలోకమనగా వెలుగుగలది లోకం. ప్రకాశంలేని దానిని అలోకమంటారు. ఇట్టి రెండు స్థితులూ గలది లోకాలోక పర్వతం, దీని నడుమ నల్గురు లోకపాలకులున్నారు. ఈ మహాత్ములు ప్రాకృతిక ప్రళయం వరకూ ఉండి లోకానికి ప్రవర్తకులుగా వుంటారు. వీరు (1) వైరాజు (2) కర్దముడు (3)హిరణ్యరోముడు (4) కేతుమంతుడు విరాట్తత్త్వమునుండి కల్గిన సుధాముడు వైరాజు. కర్దముడు ప్రజాపతుల్లో ఒకడు. హిరణ్యరోముణ్ణి పర్జన్యుడంటారు. కేతుమంతుడు రాజశ్రేష్ఠుడు.

నిర్ద్వంద్వో నిరభిమానో నిస్తంద్రో నిష్పరిగ్రహః ।
లోకపాలాః స్థితాస్త్వేతే లోకాలోకే చతుర్దిశమ్ ॥98॥

వీరిలో ప్రతివాడు ద్వంద్వాలు లేనివాడు, నిరభిమాని, సోమరితనంలేనివాడు, పరిగ్రహం లేనివాడు, వీరు లోకమధ్యమున, చతుర్దిశలలోనూ ఉండి లోకప్రవృత్తిని నియమిస్తూ వుంటారు.

ఉత్తరం యదగస్త్యస్య శృంగం దేవర్షిసేవితమ్ ।
పితృయాణః స్మృతః పంథా వైశ్వానరపథాద్బహిః ॥99॥

తత్రాసతే ప్రజాకామా ఋషయో యేఽగ్నిహోత్రిణః ।
లోకస్య సన్తానకరః పితృయాణే పథి స్థితాః ॥100॥

భూతారంభకృతం కర్మ ఆశిషశ్చ విశాంపతే ।
ప్రారభన్తే లోకకామాస్తేషాం పంథాః స దక్షిణః ॥101॥

దేవతలకాశ్రయమైన అగస్త్యశృంగం ఉత్తరాన ఉన్నది. అదే వీరికాశ్రయం. వీరందరూ ప్రవృత్తిమార్గ ప్రవర్తకులై పితృయానపథప్రవృత్తి గలవారై వుంటారు. ఈ కాలవ్యవస్థ 'ఈ ప్రవృత్తికి మూలమైనదే, వైశ్వానరపథానికి వెలుపల పితృయానమార్గం ఉన్నది. సంతానార్తులు, అగ్న్యుపాసకులూ అయిన ఋషులు ఈ మార్గంలో ఉంటారు. వీరు లోకసంతానకారులు. పితృయానమార్గంలో వుండి భూతారంభకరమైన కర్మలు చేస్తూ తమకు ఇహపరలోకసుఖాలు కావాలని పైకర్మలు నిర్వహిస్తారు. వీరి మార్గం దక్షిణమార్గం.

చరంతి తే పునర్ధర్మం స్థాపయన్తి యుగే యుగే ।
సన్తత్యా తపసా చైవ మర్యాదాభిః శ్రుతేన చ ॥102॥

వీరు ప్రతియుగంలోనూ శ్రేష్ఠమగువైదిక ధర్మాన్ని ఆచరిస్తారు. దాన్ని లోకంలో ప్రతిష్ఠిస్తారు. దీనికై తపస్సునూ, కర్మానుష్ఠానమార్గాన్నీ పాటిస్తారు.

జాయమానాస్తు పూర్వే వై పశ్చిమానాం గృహేషు తే ।
పశ్చిమాశ్చైవ పూర్వేషాం జాయన్తే నిధనేష్విహ ॥103॥

ఏవమావర్తమానాస్తే వర్తన్త్యాభూతసంప్లవమ్ ।
అష్టాశీతిసహస్రాణి ఋషీణాం గృహమేధినామ్ ॥104॥

వీరి చిత్తాలలో ఇచ్ఛాద్వేషాలు, మైథున ప్రవృత్తీ ఉంటాయి. వీరు కామకర్మలకు వశులై విషయసుఖాలను భవిస్తూ ఉంటారు. మరియు ఉత్తములు అధముల యిండ్లలోనూ, అధములు ఉత్తముల యిండ్లలోనూ జన్మిస్తారు. ఈ విధంగా వీరు ప్రాకృతిక ప్రళయం సంభవించే వరకూ జననమరణచక్రంలో పరిభ్రమిస్తు వుంటారు. వీరు ఎనభై ఎనిమిదివేలమంది గృహస్థ ఋషులుగా పరిగణింపబడ్డారు.

సవితుర్దక్షిణం మార్గమాశ్రిత్యాభూతసంప్లవమ్ ।
క్రియావతాం ప్రసంఖ్యైషా యే శ్మశానాని భేజిరే ॥105॥

వీరు సూర్యుని దక్షిణమార్గాన్ని ఆశ్రయించి ప్రళయం వరకూ కర్మానుష్ఠానపరులై శ్మశానాన్ని ఆశ్రయించి, అమృతత్వస్థితికి దూరమైనారు.

లోకసంవ్యవహారార్థం భూతారంభకృతేన చ ।
ఇచ్ఛాద్వేషరతాచ్చైవ మైథునోపగమాచ్చ వై ॥106॥

తథా కామకృతేనేహ సేవనాద్విషయస్య చ ।
ఇత్యేతైః కారణైః సిద్ధాః శ్మశానానీహ భేజిరే ॥107॥

అది యెట్లన లోకవ్యవహారం ప్రవర్తింపజేసి జనులను ఉద్ధరించడానికి భూతప్రకృతిధర్మాలైన త్రిగుణాలకు వశులై, ఇచ్ఛాద్వేషాల కధీనులై, మైథునంలో ప్రవర్తించి ఆయా ఇంద్రియవృత్తుల వల్ల కలిగే కోరికలకు వశపడి వీరు విషయసుఖాలు అనుభవించారు. వీరంతా కర్మానుష్ఠానఫలమైన సిద్ధిని మాత్రం పొంది చివరికి శ్మశానం పాలైనారు. ఆ రీతిగా అమృతత్వానికి దూరమైనారు.

ప్రజైషిణః సప్తర్షయో ద్వాపరేష్విహ జజ్ఞిరే ।
సన్తతిం తే జుగుప్సన్తే తస్మాన్మృత్యుర్జితస్తు తైః ॥108॥

ఇలా ప్రజలను కోరిన మరీచి మొదలగు సప్తర్షులు నిశ్చయ రహితమైన మార్గాలలో జన్మించారు. వారు సంతతిని ఈసడించేవారు కాన వారు మృత్యుజేతలై అమృతత్వం అందుకొన్నారు.

అష్టాశీతిసహస్రాణి తేషామపూర్ధ్వరేతసామ్ ।
ఉదక్పన్థాన మత్యంతమాశ్రిత్యాభూతసంప్లవమ్ ॥109॥

అసంప్రయోగాల్లోకస్య మైథునస్య చ వర్జనాత్ ।
ఈర్ష్యాద్వేషనివృత్త్యా చ భూతారంభవివర్జనాత్ ॥110॥

తతోఽన్యకామసంయోగశబ్దాదేర్దోషదర్శనాత్ ।
ఇత్యేతైః కారణైః శుద్ధైస్తేఽమృతత్వం హి భేజిరే ॥111॥

ఆభూతసంప్లవస్థానామమృతత్వం విభావ్యతే ।
త్రైలోక్యస్థితికాలో హి న పునర్మార్గగామినామ్ ॥112॥

భ్రూణహత్యాశ్వమేధాదిపాపపుణ్యనిభై పరమ్ ।
ఆభూతసంప్లవాన్తే తు క్షీయంతే చోర్ధ్వరేతసః ॥113॥

ఊర్ధ్వోత్తరమృషిభ్యస్తు ధ్రువో యత్రానుసంస్థితః ।
ఏతద్విష్ణుపదం దివ్యం తృతీయం వ్యోమ్ని భాస్వరమ్ ॥114॥

యత్ర గత్వా న శోచంతి తద్విష్ణోః పరమం పదమ్ ।
ధర్మే ధ్రువస్య తిష్ఠంతి యే తు లోకస్య కాంక్షిణః ॥115॥

వీరు ఊర్ధ్వరేతస్కులైన వీరు గూడ ఎనుబది ఎనిమిదివేలమంది ఉండేవారు. వీరంతా లోకప్రవృత్తిహేతువైన శ్రౌతకర్మానుష్ఠానం లేకుండడం, మైథున ప్రవృత్తినీ, ఈర్ష్యాద్వేషాలనూ విడవడం, భూతారంభహేతువులైన ప్రవృత్తులను వీడుట అనే విధానాలను అనుసరించారు. తద్వారా శుద్ధులై ఉత్తరాయణమార్గమున హిరణ్యగర్భలోకం చేరి అక్కడ ప్రాకృతిక ప్రళయకాల పర్యంతం ఉండి హిరణ్యగర్భునితో పాటు ముక్తులై అమృతత్వం పొందుతారు. నిష్కామకర్మపరులైన ఊర్ధ్వరేతస్కులకు కలిగే ముక్తి ఇట్టిది. వీరు పునరావృత్తి లేనివారే. వీరికిని త్రైలోక్యస్థితికి కారణమైన కాలస్వరూపజ్ఞానం అవసరమే. ఇట్టి వారు ప్రాకృతిక ప్రళయంవరకూ ఉండినా భ్రూణహత్యాదులచే కలిగే పాపం గాని, అశ్వమేధాదులవల్ల కలిగే పుణ్యం గాని అంటవు. ఊర్ధ్వలోకాల నుడమ ధ్రువుని లోకంలో వీరు ఋషులతోపాటు శాశ్వతస్థితి పొందుతారు. ఇదే అంతరిక్షంలో ధ్రువునితో కూడిన సూర్యునిరూపాన ఉన్న స్థానం. ఇదే విష్ణుదేవుని తృతీయ పాదస్థానం. ఈ స్థానం చేరినవారు మరల జననమరణాదిశోకాలకు గురి కారు.

లోకకాంక్షులైనవారు ధ్రువుని ధర్మప్రవృత్తికి హేతువగు స్థానం చేరి సుఖిస్తారు.

శ్రీమాత్స్యే మహాపురాణే ఖగోళవర్ణనం నామ చతుర్వింశత్యధికశతతమోఽధ్యాయః ॥ 124 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని ఖగోళవర్ణనమనే నూటఇరవై నాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచవింశత్యధికశతతమోఽధ్యాయః – నూటఇరవైఅయిదవ అధ్యాయం

ధ్రువ సంచార కథనం – ధ్రువుని సంచారమును చెప్పుట

ఏవం శ్రుత్వా కథాం దివ్యామబ్రువన్రోమహర్షణిమ్ ।
సూర్యాచంద్రమసోశ్చారం గ్రహాణాం చైవ సర్వశః ॥1॥

ఋషయ ఊచుః :– ఋషులు చెప్పారు.

భ్రమంతి కథమేతాని జ్యోతీంషి రవిమణ్డలే ।
అవ్యూహేనైవ సర్వాణి తథా చాసంకరేణ వా ॥2॥

ఇలా దివ్యమైన ఈ కథనూ, సూర్యచంద్రుల గమనాన్నీ, గ్రహగతినీ విన్న ఋషులు సూతునితో ఇట్లన్నారు. సూర్యమండలంలో ఈ జ్యోతిస్సులన్నీ, సాంకర్యాం లేకుండానూ, ఏవిధమైన అమరిక లేకుండానూ ఎలా భ్రమిస్తున్నాయి?

కశ్చ భ్రామయతే తాని భ్రమంతి యది వా స్వయమ్ ।
ఏతద్వేదితుమిచ్ఛామస్తతో నిగద సత్తమ! ॥3॥

భూతసమ్మోహనం హ్యేతత్ బ్రూహి నో వదతాంవర! ।

ఎవడు వాటిని తిప్పుతున్నాడు? లేక అవి స్వయంగానే తిరుగుతున్నవా? విబుధోత్తమా? ఇది తెలుసుకోగోరుతున్నాము. ఇది ప్రాణులకు సమ్మోహనం కల్గించేదికదా? వక్తలలో శ్రేష్ఠుడా! నీవు మాకిది వివరించు.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

భూతసంమోహనం హ్యేతద్ బ్రువతో మే నిబోధత ।
ప్రత్యక్షమపి దృశ్యం తత్ సంమోహయతి వై ప్రజాః ॥4॥

మీరన్నట్లు నిజంగా ఇది భూతాలకు సమ్మోహనం కల్గించునదే. ప్రత్యక్ష దృశ్యమైనా అది ప్రాణులను సమ్మోహానికి గురిచేస్తుంది.

యోఽసౌ చతుర్దశర్క్షేషు శిశుమారో వ్యవస్థితః ।
ఉత్తానపాదపుత్రోఽసౌ మేఢీభూతో ధ్రువో దివి ॥5॥

పదునాల్గు నక్షత్రాలపై వ్యవస్థితమైన ఈ శిశుమార చక్రంలో ఉత్తానపాదుని పుత్రుడైన ధ్రువుడు ఆకాశంలో మేఢీభూతుడై కళ్ళం నడుమ పాతిన స్తంభంలాగా ఉన్నాడు.

సైష భ్రమన్ భ్రామయతే చంద్రాదిత్యౌ గ్రహైః సహ ।
భ్రమన్తమనుసర్పన్తి నక్షత్రాణి చ చక్రవత్ ॥6॥

ఇతడు తాను భ్రమిస్తూ గ్రహాలతో సహా చంద్రాదిత్యులను గూడా భ్రమింపజేస్తున్నాడు. అలా భ్రమించే ఆ ధ్రువుణ్ణి చక్రాన్ని చుట్టుతూ తిరుగుతూన్న మరొక చక్రంలాగా ఇతర నక్షత్రాలు అనుసరిస్తున్నవి.

ధ్రువస్య మనసా యో వై భ్రమతే జ్యోతిషాం గణః ।
వాతానీకమయైర్బన్ధైర్ధ్రువే బద్ధః ప్రసర్పతి॥ 7॥

ధ్రువుని మనస్సంకల్పాన్ని అనుసరించి భ్రమిస్తున్న ఈ జ్యోతిర్గణం వాయుసమూహమయా లైన పాశాలతో ధ్రువునితో బద్ధమై అతనివెంట కదలుతున్నది.

తేషాం భేదశ్చ యోగశ్చ తథా కాలస్య నిశ్చయః ।
అస్తోదయాస్తథోత్పాతా అయనే దక్షిణోత్తరే ॥ 8॥

విషువద్గ్రహవర్ణాశ్చ సర్వమేతద్ధ్రువేరితమ్ ।
జీమూతా నామ తే మేఘా యదేభ్యో జీవసంభవః ॥ 9॥

వాటి భేదం, యోగం, కాలనిశ్చయం, అస్తోదయాలు, ఉత్పాతాలు, దక్షిణోత్తరాయణాలు, విషువములు, గ్రహవర్ణాలు ఇవన్నీ ధ్రువునిచే ప్రేరితాలై తిరుగుతున్నవి. జీమూతాలనే మేఘాలనుండి జీవోత్పత్తి జరుగుతున్నది.

ద్వితీయ ఆవహన్ వాయుర్మేఘాస్తే త్వభిసంశ్రితాః ।
ఇతో యోజనమాత్రాచ్చ అధ్యర్ధవికృతా అపి ॥ 10॥

వృష్టిసర్గస్తథా తేషాం ధారాసారః ప్రకీర్తితః ।
పుష్కరావర్తకా నామ యే మేఘాః పక్షసంభవాః ॥ 11॥

సప్తవాయువులలో రెండవది ఆవహనవాయువు. మేఘాలు దాన్ని ఆశ్రయించివున్నాయి. ఈ భూమినుండి ఒకటి మ్ముప్పావు యోజనదూరంలో అవి ఉండి వర్షం కల్గిస్తాయి. వాటి వృష్టిసర్గం ధారా సారమని పేర్కొనబడింది. ఇవే కాక పక్షాలు గల పుష్కరావర్తకాలనే మేఘాలు వేరే ఉన్నాయి.

శక్రేణ పక్షాశ్ఛిన్నా వై పర్వతానాం మహౌజసా ।
కామగానాం సమృద్ధానాం భూతానాం నాశమిచ్ఛతామ్ ॥ 12॥

ఆ రెక్కలు కామగమనం గల్గి సమృద్ధాలై ప్రాణుల నాశం కోరేవి. మహాతేజస్వి అయిన ఇంద్రునిచే ఆ పర్వతాల రెక్కలు నరకబడ్డాయి.

పుష్కరా నామ తే పక్షా బృంహన్తస్తోయధారిణః ।
పుష్కరావర్తకా నామ కారణేనేహ శబ్దితాః ॥ 13॥

పుష్కరాలనే ఆ రెక్కలు పెద్దవైన జలధారలు కలవి.పుష్కరావర్తకా లనే నామం అందుకే వాటికి కల్గింది.

నానారూపధరాశ్చైవ మహాఘోరస్వరాశ్చ తే ।
కల్పాన్తవృష్టికర్తారః కల్పాన్తాగ్నేర్నియామకాః ॥ 14॥

అవి నానా రూపాలు ధరించేవి, మిక్కిలి భీకర స్వరం కల్గినవి, యుగాంతంలో వర్షం కల్గించి, కల్పాంతాగ్నిని శమింపజేసేవి.

వాయ్వాధారా వహన్తే వై సామృతాః కల్పసాధకాః ।
యాన్యస్యాణ్డస్య భిన్నస్య ప్రాకృతస్యాభవంస్తదా ॥15॥

కాని సృష్టిస్థితికాలాలలో ఇవి వాయు వాధారంగా కల్గి అమృతంతో కూడి కల్పసాధకాలై వున్నవి. భిన్నమైన ప్రాకృతమగు అండానికి అవి చెందినవి.

యస్మింబ్రహ్మా సముత్పన్నశ్చతుర్వక్త్రః స్వయం ప్రభుః ।
తాన్యేవాణ్డకపాలాని సర్వే మేఘాః ప్రకీర్తితాః ॥16॥

ఎక్కడ అండకపాలాలు చీల్చుకొని చతుర్ముఖబ్రహ్మ స్వయంప్రభుడై పుట్టాడో, ఆ అండకపాలాలన్నీ మేఘాలుగా ప్రసిద్ధా లయ్యాయి.

తేషామాప్యాయనం ధూమః సర్వేషామవిశేషతః ।
తేషాం శ్రేష్ఠశ్చ పర్జన్యశ్చత్వారశ్చైవ దిగ్గజాః ॥17॥

ఆ మేఘాలన్నిటికీ సమంగా ఆప్యాయనం కల్గించేది ధూమం. వాటిలో శ్రేష్ఠాలు పర్జన్యుడు, మరియు నాల్గు దిగ్గజాలు.

గజానాం పర్వతానాం చ మేఘానాం భోగిభిః సహ ।
కులమేకం ద్విధాభూతం యోనిరేకా జలం స్మృతమ్ ॥18॥

గజాలకూ, కొండలకూ, మేఘాలకూ, సర్పాలకూ గూడా కులం ఒక్కటే. తరువాత ఒకే కులం రెండయింది. వీటి కన్నిటికీ జన్మకారణం నీరొక్కటే.

పర్జన్యశ్చైవ వర్షాసు హేమన్తే శీతసంభవమ్ ।
తుషారవర్షం వర్షంతి వృద్ధా హ్యన్నవివృద్ధయే ॥19॥

ఈ పర్జన్యుడు, వర్షర్తువున నీరిస్తూ మేఘుడై హేమంతంలో శైత్యం కల్గించే మంచును అన్నవృద్ధి కొరకు వర్షిస్తాడు.

షష్ఠః పరివహో నామ వాయుస్తేషాం పరాయణః ।
యో౽సౌ బిభర్తి భగవాన్ గంగామాకాశగోచరామ్ ॥20॥

ఆరవదగు పరివహమనే వాయువు వాటికి ఆశ్రయమైనది. భగవత్స్వరూపమైన ఆ వాయువే ఆకాశగోచరమైన గంగను భరిస్తున్నది.

దివ్యామృతజలాం పుణ్యాం త్రిపథామితి విశ్రుతామ్ ।
యస్యా నిష్పన్దితం తోయం దిగ్గజాః పృథుభిః కరైః ॥21॥

శీకరాన్ సంప్రముంచంతి నీహార ఇతి స స్మృతః ।
దక్షిణేన గిరిర్యో౽సౌ హేమకూట ఇతి స్మృతః ॥22॥

అది దివ్యమైన అమృతజలం కలది. పావనమైనది. త్రిపథ అన్న పేరు గలది. ఆ గంగయొక్క నిశ్చలమైన నీటిని దిగ్గజాలు పెద్ద తొండాలతో పీల్చికొని నీటితుంపురుల్లాగా వదలుతాయి. దాన్ని నీహారమంటారు. దానికి దక్షిణాన గల కొండ హేమకూటం.

ఉదగ్ఘిమవతః శైలస్యోత్తరే చైవ దక్షిణే ।
పుణ్డ్రనామ్నా సమాఖ్యాతం నగరం తత్రవై స్మృతమ్ ॥23॥

హిమగిరియొక్క ఉత్తరదక్షిణాలలో పుణ్డ్ర అనే నగరమున్నది.

తస్మిన్ నివర్తతే వర్షం తత్ తుషారసముద్భవమ్ ।
తతో హిమవతో వాయుర్హిమం తత్ర సముద్భవమ్ ॥24॥

అక్కడ కురిసే వాన మంచునుండి కలిగేది. అది ఆ నగరంవరకు వచ్చి నిల్చిపోతుంది. అందుండి హిమవద్వాయువు వస్తుంది. హిమం పుట్టేది అక్కడే.

ఆనయత్యాత్మవేగేన సించమానో మహాగిరిమ్ ।
హిమవంతమతిక్రమ్య వృష్టిశేషం తతః పరమ్ ॥25॥

ఆ వాయువు తనవేగంతో మహాగిరిని తడుపుతూ వర్షాన్ని తెస్తుంది. హిమవత్పర్వతాన్ని దాటి దక్షిణానికి వస్తే ఈ వాయువు వర్షశేషమైపోతుంది.

ఇహాభ్యేతి చ తతః పశ్చాదిదం భూతవివృద్ధయే ।
మేఘాశ్చాప్యాయనం చైవం సర్వమేతత్ ప్రకీర్తితమ్ ।
సూర్య ఏవ తు వృష్టీనాం స్రష్టా సముపదిశ్యతే ॥27॥

వర్షం ఘర్మం హిమం రాత్రిం సంధ్యే చైవ దినం తథా ।
శుభాశుభఫలానీహ ధ్రువాత్ సర్వం ప్రవర్తతే ॥28॥

దాని తర్వాత ప్రాణులవృద్ధికి సహాయపడే ఒక మేఘం వస్తుంది. మేఘాలు, వాటివల్ల జనులకు కలిగే ఆప్యాయనం ఇదంతా చెప్పడమయింది. వర్షాలకు స్రష్ట సూర్యుడే. అని చెప్పబడినాడు. అయినా వర్షం, వేడి, మంచు, రాత్రి, సంధ్యలు, పగలు, శుభాశుభఫలాలు – అన్నీ ధ్రువుని వల్లనే కల్గుతున్నాయి.

ధ్రువేణాధిష్ఠితాశ్చాపః సూర్యో౽యం సంప్రవర్షతి ।
సర్వభూతశరీరేషు త్వాపో హ్యసుసమాశ్రయాః ॥29॥

నీరు ధ్రువునిచే అధిష్ఠితమైనది. సూర్యుడు దానిని వర్షిస్తున్నాడు. సర్వప్రాణుల శరీరాలకూ, ప్రాణాలకూ జలమే ఆశ్రయమై వుంటుంది.

దహ్యమానేషు తేష్వేవం జంగమస్థావరేషు చ ।
ధూమభూతాస్తు తా హ్యాపో నిష్క్రామన్తీహ సర్వశః ॥30॥

జంగమస్థావర శరీరాలు దగ్ధమైనప్పుడు ఆ జలం ఆవిరియై నలువైపులకూ నిష్క్రమిస్తుంది.

తేన సాఽభ్రాణి జాయన్తే స్థానభ్రంశమపాం స్మృతమ్ ।
తేజోభిః సర్వలోకేభ్య ఆదత్తే రశ్మిభిర్జలమ్ ॥31॥

అది మరల నీరైనప్పుడు ప్రాణులు కన్నీరుగల వవుతున్నాయి. ఇదే నీటియొక్క స్థానభ్రంశము. సూర్యుడు తన తేజస్సుతో, కిరణాలతో సర్వలోకాలనుండీ నీటిని గ్రహిస్తాడు.

సముద్రాద్వాయుసంయోగాద్వహన్త్యాపో గభస్తయః ।
తతస్త్వృతువశాత్ కాలే పరివర్తన్దివాకరః ॥32॥

నయత్యపోఽథ మేఘేభ్యః శుక్లాః శుక్లైస్తు రశ్మిభిః ।
అభ్రస్థాః ప్రపతన్త్యాపో వాయునా సముదీరితాః ॥33॥

వాయు సంయోగంతో నీటిని సముద్రంనుండి సూర్యకిరణాలు తెస్తాయి. అందువల్ల ఋతుప్రభావంతో తగిన కాలంలో మార్పు జెందుతూ సూర్యుడు మేఘాలకు శుభ్రజలాన్ని శుభ్రకిరణాలతో ఇస్తున్నాడు. మేఘాలలోని జలం వాయు ప్రేరితమై క్రిందికి పడుతున్నది.

తతో వర్షతి షణ్మాసాన్సర్వభూతవివృద్ధయే ।
వాయుభిః స్తనితం చైవ విద్యుతస్త్వగ్నిజాః స్మృతాః ॥34॥

అందుచేత సర్వభూతసమృద్ధికై సూర్యుడు ఆరునెలలు వర్షిస్తాడు. వాయువులనుండి ఉరుములు, అగ్ని నుండి మెఱుపులు కల్గుతున్నాయి.

మేహనాచ్చ మిహేర్ధాతోర్మేఘత్వం వ్యంజయన్తి చ ।
న భ్రశ్యన్తే తతో హ్యాపస్తస్మాదభ్రస్య వై స్థితిః ।
స్రష్టాఽసౌ వృష్టిసర్గస్య ధ్రువేణాధిష్ఠితో రవిః ॥35॥

తడువుట అనే అర్థంకల మిహిధాతువు నుండి కల్గిన మేఘశబ్దం మబ్బులను నిర్దేశిస్తున్నది. నీటిని క్రిందికి వదలనివి గావున మేఘాలు అభ్రాలయ్యాయి. వృష్టిని సృష్టించే సూర్యుడు ధ్రువునిచే అధిష్ఠితుడై వున్నాడు.

ధ్రువేణాధిష్ఠితో వాయుర్వృష్టిం సంహరతే పునః ।
ఖేన నిస్సృతసూర్యేణ చరతే ఋక్షమణ్డలమ్ ॥36॥

వాయువు ధ్రువునిచే అధిష్ఠితుడు. మరల అతడు వృష్టిని సంహరిస్తాడు. నక్షత్ర మండలం సదా రవి సంచరించే త్రోవలో రవి ననుసరించి సంచరిస్తుంది.

చారస్యాన్తే విశత్యర్కం ధ్రువేణ సమధిష్ఠితమ్ ।
అతః సూర్యరథస్యాపి సన్నివేశం ప్రచక్షతే ॥37॥

ధ్రువాధిష్ఠానం కారణంగానే నక్షత్రాలు తమతమ నియతరాశిలో సంచరించిన పిదప రవియందే ప్రవేశిస్తున్నాయి. ఇక సూర్యరథ సన్నివేశాన్ని పెద్దలిలా చెబుతారు.

స్థితేన త్వేకచక్రేణ పంచారేణ త్రిణాభినా।
హిరణ్మయేనాణునా వై అష్టచక్రైకనేమినా ।
చక్రేణ భాస్వతా సూర్యః స్యన్దనేన ప్రసర్పిణా ॥38॥

శతయోజనసాహస్రో విస్తారాయామ ఉచ్యతే ।
ద్విగుణా చ రథోపస్థాదీషాదణ్డః ప్రమాణతః ॥39॥

ఐదు ఆకులతో, పృథివి, అంతరిక్షం, ద్యులోకం అనే మూడు నాభులతో, హిరణ్యమయమైన చీలతో, అష్టచక్రాలకు సంబద్ధమైన ఒకే ఒక నేమితో, ప్రకాశించే ఒక్క చక్రంతో సూర్యుడు సంచరిస్తూ వుంటాడు. ఆ రథంయొక్క నడిమి విస్తారం పదివేలయోజనాలు. రథోపస్థంనుండి దానికంటె కాడి పొడవు రెండింతలు.

స తస్య బ్రహ్మణా సృష్టో రథో హ్యర్థవశేన తు ।
అసఙ్గః కాంచనో దివ్యో యుక్తః పవనగైర్హయైః ॥40॥

అది బ్రహ్మచే ప్రయోజనాపేక్షతో సృష్టింపబడిన రథం. అది దేన్నీ అంటనిది, స్వర్ణమయం, దివ్యం అయి గాలివలె పరుగెత్తే గుర్రాలతో గూడినది.

ఛందోభిర్వాజిరూపైస్తైర్యథాచక్రం సమాస్థితైః ।
వారుణస్య రథస్యేహ లక్షణైః సదృశశ్చ సః ॥41॥

తేనాసౌ చరతి వ్యోమ్ని భాస్వాననుదినం దివి ।
రథాంగాని తు సూర్యస్య ప్రత్యఙ్గాని రథస్య చ ।
సంవత్సరస్యావయవైః కల్పితాని యథాక్రమమ్ ॥42॥

వాజిరూపాలైన ఛందస్సులతో చక్రానుగుణంగా కూర్చబడిన ఆ రథం వారుణరథంతో సమమైనది. సూర్యుడు ఆ రథంపై అనుదినం ద్యులోకంలో చరిస్తున్నాడు. ఇక సూర్యుని రథాంగాలు, రథానికి చెందిన ప్రత్యంగాలు, సంవత్సరావయవాలతో క్రమంగా కల్పించబడినవి

అహర్నాభిస్తు సూర్యస్య ఏకచక్రస్య వై స్మృతః ।
అరాస్సంవత్సరాస్తస్య నేమ్యః షడృతవః స్మృతాః ॥43॥

ఏక చక్రుడైన సూర్యునియొక్క పగలు 'నాభి' అని చెప్పబడింది. సంవత్సరాలు దాని ఆకులు, నేములు ఆరు ఋతువులు.

రాత్రిర్వరూథో ధర్మశ్చ ధ్వజ ఊర్ధ్వం వ్యవస్థితః ।
అక్షకోట్యో యుగాన్యస్య అర్థకామావుభౌ స్మృతౌ ॥44॥

రాత్రి రక్షకపంజరం, ధర్మం పైనున్న ఎత్తైనధ్వజం, అర్థకామాలు రెండూ కాడికొనలు,

తస్య కాష్ఠా స్మృతా ఘోణా దన్తపంక్తిః క్షణాస్తు వై ।
నిమేషశ్చానుకర్షోఽస్య ఈషా చాస్య కలా స్మృతా ॥45॥

'కాష్ఠా' అనే కాలావయవ విశేషం రథాన్ని లాగే అశ్వపు ముక్కు' క్షణములనే కాలావయవాలు అశ్వపుదంతపంక్తి. నిమేషాలు అనుకర్షమనే రథావయవం కలా అనే కాలావయవ విశేషాలు ('ఈషా' అనేది రథావయవం. 'ఇది కాడి కట్టడాని కుపయోగించే నిలువు దూలం వంటింది.)

సప్తాశ్వరూపాశ్ఛన్దాంసి వహన్తే వాయురంహసా ॥47॥

సప్తాశ్వరూపాలైన ఛందస్సులు వాయువేగంతో పరుగెడుతున్నాయి.

గాయత్రీ చైవ త్రిష్టుప్ చ జగత్యనుష్టుప్తథైవ చ ।
పంక్తిశ్చ బృహతీ చైవ ఉష్ణిగేవ తు సప్తమః ॥48॥

గాయత్రి, త్రిష్టుప్, జగతి, అనుష్టుప్, పంక్తి, బృహతి, ఉష్ణిక్ – అనే ఛందస్సులు సప్తాశ్వాలు.

చక్రమక్షే నిబద్ధం తు ధ్రువే చాక్షః సమర్పితః ।
సహచక్రో భ్రమత్యక్షః సహాక్షో భ్రమతి ధ్రువః ॥49॥

అక్షంతో రథ చక్రం నిబద్ధమైనది, అక్షం ధ్రువంలో సమర్పితమైయున్నది, చక్రంతో సహా అక్షం తిరుగుతున్నది. అక్షంతో ధ్రువుడు భ్రమిస్తూన్నాడు.

అక్షః సహైవ చక్రేణ భ్రమతేఽసౌ ధ్రువేరితః ।
ఏవమర్థవశాత్తస్య సన్నివేశో రథస్య తు ॥50॥

ధ్రువునిచే ప్రేరితమైన అక్షం చక్రంతో సహా భ్రమిస్తున్నది. విషయప్రతిపాదనదృష్టితో సూర్యరథ సన్నివేశం – ఇలా నిరూపితమయింది.

తథా సంయోగభావేన సిద్ధో వై భాస్కరో రథః ।
తేనాఽసౌ తరణిర్దేవో నభసః సర్పతే దివమ్ ॥50॥

అలా కాలావయవాల సంయోగభావంతో సూర్యుని రథసన్నివేశం సిద్ధమయింది. దానిపై ఈ రవి ఆకాశం నుండి దివికి పయనిస్తున్నాడు.

యుగాక్షకోటీ తే తస్య దక్షిణే స్యన్దనస్య తు ।
ధ్రువేణ చ గృహీతోఽసౌ రశ్మినా భ్రమతే రవిః ॥51॥

రథముయొక్క కాడికి, అక్షానికి దక్షిణపు కొనలకు గల పగ్గాలను బట్టి ధ్రువుడు తన రథాన్ని త్రిప్పుట ననుసరించి రవి సంచరిస్తాడు.

మణ్డలాని భ్రమన్తి స్యుః ఖేచరస్య రథస్య తు ।
కులాలచక్రభ్రమవన్మణ్డలం సర్వతోదిశమ్ ॥52॥

ఇలా ఈ ఖేచరరథంలో పరిభానుమండలం అన్ని దిక్కులకూ గిరగిర తిరుగుతూ కుమ్మరి సారెలాగా కనిపిస్తుంది.

యుగాక్షకోటీ తే తస్య వాతోర్మీ స్యన్దనస్య తు ।
సంక్రామేతే ధ్రువమహో మణ్డలే సర్వతో దిశమ్ ॥53॥

ఎప్పుడూ ముందుకు పోయే సూర్యరథపుకాడి అక్షాలకొనలు వాయుతరంగప్రేరితాలై మండలరూపాన అన్ని దిక్కులకూ సంక్రమిస్తాయి.

భ్రమతస్తస్య రశ్మీ తే మణ్డలే తూత్తరాయణే ।
వర్ధేతే దక్షిణేత్వస్య భ్రమతో మణ్డలాని తు ॥54॥

భ్రమిస్తున్న రథపు పగ్గాలు ఉత్తరాయణంలో మండలభ్రమణవశాన చుట్టుకొంటూ, విప్పుకొంటూ పొట్టివై దక్షిణాయనాన పెద్దవవుతాయి.

యుగాక్షకోటీ సంబద్ధౌ ద్వే రశ్మీ స్యన్దనస్య తు ।
ధ్రువేణ ప్రగృహీతౌ తౌ తపన్తావథ తే రవిమ్ ॥55॥

ఇవి ధ్రువునిచే బిగించి పట్టుకోబడుతూ, వదలబడుతూ రథాన్ని వేడెక్కించడం వల్ల ఇలా జరుగుతుంది.

ఆకృష్యేతే యదా తే తు ధ్రువేణ సమధిష్ఠితే ।
తదా సోఽభ్యన్తరే సూర్యో భ్రమతే మణ్డలాని తు ॥56॥

అశీతిమణ్డలశతం కాష్ఠయోరుభయోశ్చరన్ ।
ధ్రువేణముచ్యమానేన పునా రశ్మియుగేన చ ॥57॥

తథైవ బాహ్యతః సూర్యో భ్రమతే మణ్డలాని తు ।
ఉద్వేష్టయన్స్వై వేగేన మణ్డలాని తు గచ్ఛతి ॥58॥

రెండు పగ్గాలూ ధ్రువునిచే పట్టుకోబడి సమస్థితికి వచ్చేటట్లు లాగడం జరుగుతుంది. పగ్గాలను ధ్రువుడు సడలించినపుడు, రవి వెలుపలా, లాగిపట్టినప్పుడు లోపలా సంచరిస్తాడు. ఉత్తర దక్షిణ దిశల అర్ధవృత్తాలు నూట ఎనిమిది మండలాలు అవుతాయి. సూర్యుని వేగంలో మార్పులకు కారణమిదే. ఉత్తరాయణ దక్షిణాయనాలు ఇందువల్లనే ఏర్పడుతున్నాయి.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ధ్రువసంచార కథనం నామ పంచవింశత్యధికశతతమోఽధ్యాయః ॥125 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని ధ్రువసంచారకథనమనే నూటఇరవై అయిదవ అధ్యాయం సంపూర్ణం

షడ్వింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరవై ఆరవ అధ్యాయం

సూర్యాది గమనం - సూర్యునిలో వివిధ దేవతల గమనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

స రథోఽధిష్ఠితో దేవైర్మాసి మాసి యథాక్రమమ్ ।
తతో వహత్యథాదిత్యం బహుభిర్ఋషిభిః సహ ॥1॥

గన్ధర్వైరప్సరోభిశ్చ సర్పగ్రామణిరాక్షసైః ।
ఏతే వసన్తి వై సూర్యే మాసౌ ద్వౌ ద్వౌ క్రమేణ చ ॥2॥

సూర్యరథాన్ని ఆయా మాసాలలో క్రమప్రకారంగా ఆయా దేవతలు అధిష్ఠిస్తారు. అందువల్ల సూర్యుడు ఆయా నెలల్లో, గంధర్వులతో, ఋషులతో, అచ్చరలతో, సర్పశ్రేష్ఠులతో, రాక్షసులతో గూడి తన రథాన్ని నడుపుతూ పోతాడని చెప్పారు. గంధర్వులు, అచ్చరలు, సర్పశ్రేష్ఠులు, రక్కసులు - వీరందరూ సూర్యునిలో రెండేసి మాసాలకాలం క్రమంగా నివసిస్తారు.

ధాతాఽర్యమా పులస్త్యశ్చ పులహశ్చ ప్రజాపతీ ।
ఉరగా వాసుకిశ్చైవ సంకీర్ణశ్చైవ తావుభౌ ॥3॥

తుంబురుర్నారదశ్చైవ గన్ధర్వౌ గాయతాం వరౌ ।
కృతస్థలాప్సరాశ్చైవ యా చ సా పుంజికస్థలీ ॥4॥

గ్రామణ్యౌ రథకృత్తస్య రథౌజాశ్చైవ తావుభౌ ।
రక్షో హేతిః ప్రహేతిశ్చ యాతుధానావుభౌ స్మృతౌ ॥5॥

బ్రహ్మ, అర్యముడు, ప్రజాపతులైన పులస్త్యుడు, పులహుడు, వాసుకి, సంకీర్ణుడు అనే ఇద్దరు ఉరగులు, తుంబురుడు, నారదుడు అనే గాయకశ్రేష్ఠులగు గంధర్వులు, అచ్చరలైన కృతస్థల, పుంజికస్థల, రథకృత్తు, రథౌజుడు అనే గ్రామణులు, రాక్షసులైన, హేతి, ప్రహేతి అనే యాతుధాను లిరువురూ -

మధుమాధవయోర్హ్యేష గణో వసతి భాస్కరే ।
వసన్ గ్రీష్మే తు ద్వౌ మాసౌ మిత్రశ్చ వరుణశ్చ వై ॥6॥

ఋషీ అత్రిర్వసిష్ఠశ్చ నాగౌ తక్షకరంభకౌ ।
మేనకా సహధన్యా చ హాహా హూహూశ్చ గాయకౌ ॥7॥

ఈ గణం చైత్రవైశాఖాలలో సూర్యునిలో నివసిస్తుంది. మిత్రుడు, వరుణుడు గ్రీష్మర్తువులో, అత్రి, వసిష్ఠుడు, తక్షకరంభకులనే నాగులు, మేనక, సహధన్య, అనే అచ్చరలు, హాహా, అనే గంధర్వులు,

రథన్తరశ్చ గ్రామణ్యౌ రథకృచ్చైవ తావుభౌ ।
పురుషాదో వధశ్చైవ యాతుధానౌ తు తౌ స్మృతౌ ॥8॥

ఏతే వసన్తి వై సూర్యే మాసయోః శుచిశుక్రయోః ।
తతః సూర్యే పునశ్చాన్యా నివసన్తి స్మ దేవతాః ॥9॥

రథంతర – రథకృత్ అనే గ్రామణులు, పురుషాదుడు, వధుడు అనే ఇరువురు రాక్షసులు వీరు సూర్యునిలో జ్యేష్ఠ ఆషాఢమాసాలలో నివసిస్తారు. ఆపై మరల ఇతర దేవతలు గూడ నివసిస్తారు.

ఇంద్రశ్చైవ వివస్వాంశ్చ అంగిరా భృగురేవ చ ।
ఏలాపత్రస్తథా సర్పః శంఖపాలశ్చ పన్నగః ॥10॥

విశ్వావసుసుషేణౌ చ ప్రాతశ్చైవ రథశ్చ హి ।
ప్రమ్లోచేత్యప్సరాశ్చైవ విమ్లోచన్తీ చ తే ఉభే ॥11॥

యాతుధానస్తథా హేతిర్వ్యాఘ్రశ్చైవ తు తావుభౌ ।
నభోనభస్యయోరేతే వసంతి తు దివాకరే ॥ 12

ఇంద్రుడు, వివస్వంతుడు, అంగిరుడు, భృగువు, సర్పమైన ఏలాపత్రుడు, పన్నగుడైన శంఖపాలుడు, విశ్వావసు సుషేణులు, ప్రాతుడు, రథుడు, ప్రమ్లోచ, విమ్లోచన్తీ అనే అచ్చరలు, హేతి, వ్యాఘ్రుడు అనే ఇద్దరు రాక్షసులు సూర్యునిలో శ్రావణ భాద్రపదాలలో నివసిస్తారు.

మాసౌ ద్వౌ దేవతాః సూర్యే వసన్తి చ శరదృతౌ ।
పర్జన్యశ్చైవ పూషా చ భరద్వాజః సగౌతమః ॥13॥

చిత్రసేనశ్చ గన్ధర్వస్తథా వా సురుచిశ్చ యః ।
విశ్వాచీ చ ఘృతాచీ చ ఉభే తే పుణ్యలక్షణే ॥14॥

నాగశ్చైరావతశ్చైవ విశ్రుతశ్చ ధనంజయః ।
సేనజిచ్చ సుషేణశ్చ సేనానీర్గ్రామణీస్తథా ॥15॥

చారో వాతశ్చ ద్వావేతౌ యాతుధానావుభౌ స్మృతౌ ।
వసన్త్యేతే చ వై సూర్యే మాసయోశ్చ త్విషోర్జయోః ॥16॥

శరదృతువులోని రెండు మాసాలలో సూర్యునిలో ఈ దేవతలుంటారు. వారు పర్జన్యుడు, పూష, భరద్వాజుడు, గౌతముడు, చిత్రసేనుడనే గంధర్వుడు, సురుచి, విశ్వాచి, ఘృతాచి అనే పుణ్య లక్షణాలు గల అచ్చరలు, ఐరావతం, ధనంజయమనే నాగులు, సేనజిత్తు, సుషేణుడు అనే సేనానీ ప్రముఖులు, చారుడు, వాతుడు అనే ఇద్దరు రాక్షసులు – వీరు సూర్యునిలో ఆశ్వయుజకార్తీకమాసాలలో ఉంటారు.

హైమన్తికౌ చ ద్వౌ మాసౌ నివసన్తి దివాకరే ।
అంశో భగశ్చ ద్వావేతౌ కశ్యపశ్చ క్రతుశ్చ తౌ ॥17॥

భుజంగశ్చ మహాపద్మః సర్పః కర్కోటకస్తథా ।
చిత్రసేనశ్చ గన్ధర్వః పూర్ణాయుశ్చైవ గాయనౌ ॥18॥

అప్సరాః పూర్వచిత్తిశ్చ గన్ధర్వా హ్యుర్వశీ చ యా ।
తక్షావారిష్టనేమిశ్చ సేనానీర్గ్రామణీశ్చ తౌ ॥19॥

విద్యుత్స్ఫూర్జశ్చ తావుగ్రౌ యాతుధానౌ తు తౌ స్మృతౌ ।
సహే చైవ సహస్యే చ వసన్త్యేతే దివాకరే ॥20॥

హేమంత ఋతువులోని మార్గశీర్ష పుష్యమాసములలో అంశుడు, భగుడు అన్న దేవతలు, కశ్యపుడు, క్రతువు అన్న ఇద్దరు ఋషులు, మహా పద్మమనే భుజంగము, కర్కోటకమనే సర్పము, చిత్రసేనుడు, పూర్ణాయువు అన్న గాయక గంధర్వులు, పూర్వచిత్తి, ఊర్వశి అన్న అప్సరలు, అరిష్టనేమి, తక్షుడు అన్న సేనానులు, విద్యుత్తు, స్ఫూర్జుడు అనే యాతుధానులు నివసిస్తారు.

తతస్తు శిశిరే చాపి మాసయోర్నివసన్తి తే ।
త్వష్టా విష్ణుర్జమదగ్నిర్విశ్వామిత్రస్తథైవ చ ॥21॥

కాద్రవేయౌ తథా నాగౌ కంబళాశ్వతరావుభౌ ।
గన్ధర్వౌ ధృతరాష్ట్రశ్చ సూర్యవర్చాశ్చ తావుభౌ ॥22॥

తిలోత్తమాప్సరాశ్చైవ దేవీ రంభా మనోరమా ।
గ్రామణీ ఋతిజిచ్చైవ సత్యజిచ్చ మహాబలః ॥23॥

బ్రహ్మోపేతశ్చ వై రక్షో యక్షోపేతస్తథైవ చ ।
ఇత్యేతే నివసన్తి స్మ ద్వౌ ద్వౌ మాసౌ దివాకరే ॥24॥

ఇక శిశిర మాసాలయిన మాఘఫాల్గుణాలలో త్వష్ట, విష్ణువు, అనే ఆదిత్యదేవతలు, జమదగ్ని, విశ్వామిత్రుడనే ఋషులు, కంబలుడు, అశ్వతరుడు, అన్న ఇద్దరు నాగులు. ధృతరాష్ట్రుడు, 'సూర్యవర్చుడు అనే ఇద్దరు గంధర్వులు. తిలోత్తమ, మనోరమయగు రంభ అనే అప్సరసలు. ఋతజిత్తు, సత్యజిత్తు అనే గ్రామణులు, బ్రహ్మోపేతుడు, యక్షోపేతుడు, అన్న రాక్షసులు వీరంతా సూర్యునిలో ఇలా రెండేసి నెలలు క్రమంగా నివసిస్తారు.

స్థానాభిమానినో హ్యేతే గణా ద్వాదశ సప్తకాః ।
సూర్యమాప్యాయయన్త్యేతే తేజసా తేజ ఉత్తమమ్ ॥25॥

ఈ ద్వాదశ సప్తక గణాలు స్థానాభిమానులు. వారు సూర్యుణ్ణి తమ తేజస్సుతో తేజోవంతుని చేస్తారు.

గ్రథితైస్తు వచోభిశ్చ స్తువన్తి ఋషయో రవిమ్ ।
గన్ధర్వాప్సరసశ్చైవ గీతనృత్యైరుపాసతే ॥26॥

కవితా రూపంతో, అల్లిన మాటలతో ఋషులు రవిని స్తుతిస్తారు. గంధర్వాప్సరసలు గీత నృత్యాలతో ఉపాసిస్తారు.

విద్యాగ్రామణినో యక్షాః కుర్వన్త్యాభీషుసంగ్రహమ్ ।
సర్పాః సర్పన్తి వై సూర్యే యాతుధానానుయాన్తి చ ॥27॥

విద్యాగ్రామణులైన యక్షులు, గుర్రపు పగ్గాలను పట్టుకుంటారు. సూర్యునిలో సర్పాలు సంచరిస్తాయి. యాతుధానులు రవిని వెంబడిస్తారు.

వాలఖిల్యా నయన్త్యస్తం పరివార్యోదయాద్రవిమ్ ।
ఏతేషామేవ దేవానాం యథా వీర్యం యథా తపః ॥28॥

యథా యోగం యథా ధర్మం యథా తత్త్వం యథా బలమ్ ।
తథా తపత్యసౌ సూర్యస్తేషామిద్ధస్తు తేజసా ॥29॥

వాలఖిల్యులు సూర్యుణ్ణి ఉదయాది అస్తమయం వరకు సేవిస్తారు. ఈ దేవతల వీర్యాన్ని, తపస్సును, యోగాన్ని, ధర్మాన్ని, తత్త్వాన్ని, బలాన్ని బట్టియే సూర్యుడు వారి తేజస్సులచే దీప్తి మంతుడై తపిస్తాడు.

భూతానామశుభం సర్వం వ్యపోహతి స్వతేజసా ।
మానవానాం శుభైర్హ్యేతైర్హ్రియతే దురితం తు వై ॥30॥

తన తేజంతో ప్రాణుల అశుభాలనన్నింటిని రవి పరిహరిస్తాడు. మానవుల పాపం ఈ శుభాలచే పరిహరింపబడుతుంది.

దురితం శుభచారాణాం వ్యపోహన్తి క్వచిత్కృతమ్ ।
ఏతే సహైవ సూర్యేణ భ్రమన్తి సానుగా దివి ॥31॥

శుభాచరణగలవారి పాపాన్ని ఈ శుభాలు తొలగిస్తాయి. దేవాదిగణాలు సపరివారంగా అనుసరించి చరిస్తూ సూర్యునితో పాటే ఆకాశంలో గోచరిస్తాయి.

తపన్తశ్చ జపన్తశ్చ హ్లాదయన్తశ్చ వై ప్రజాః ।
గోపాయన్తి స్మ భూతాని ఇహ తే హ్యనుకంపయా ॥32॥

ఈ దేవగణాలు తపిస్తూ, జపిస్తూ, ప్రజలను సంతోషపెడుతూ జనులను, ఇతరప్రాణులనూ దయతో కాపాడుతున్నారు.

స్థానాభిమానినాం హ్యేతత్స్థానం మన్వన్తరేషు వై ।
అతీతానాగతానాం చ వర్తన్తే సాంప్రతం చ యే ॥33॥

స్థానాభిమానిదేవతల ఈ స్థానం గడచిన రానున్న సర్వ మన్వంతరాలలో అలాగే ఉన్నది.

ఏవం వసన్తి వై సూర్యే సప్తకాస్తే చతుర్దశ ।
చతుర్దశసు వర్తన్తే గణా మన్వన్తరేషు వై ॥34॥

ఇలా సూర్యునిలో ఆ పదునాల్గు సప్తకాలు నివసిస్తున్నాయి. పదునాలుగు మన్వంతరాలలోను ఈ గణాలున్నాయి.

గ్రీష్మే హిమే చ వర్షాసు ముంచమానా యథా క్రమమ్ ।
ఘర్మం హిమం చ వర్షం చ యథాక్రమ మహర్నిశమ్ ॥

గచ్ఛత్యసావనుదినం పరివృత్య రశ్మీన్ దేవాన్పితౄంశ్చ మనుజాంశ్చ సుతర్పయన్వై ।
శుక్లే చ పూర్ణస్తమనుక్రమేణ కాలక్షయే చైవ సురాః పిబన్తి ॥35॥

మాసేన తచ్చామృతమస్య మృష్టం సువృష్టయే రశ్మిషు రక్షితం తు ।
సర్వేఽమృతం తత్పితరః పిబన్తి దేవాశ్చ సౌమ్యాశ్చ తథైవ కావ్యాః ॥36॥

గ్రీష్మంలో, హేమంతంలో, వర్షఋతువులో క్రమంగా వేడిని, మంచును, వర్షాన్ని కల్గిస్తూ, అహర్నిశలూ అనుదినమూ కిరణాలను పరివర్తింపజేసి, సూర్యుడు దేవతలను, మనుజులను, ఇతరులను తృప్తిపరుస్తున్నాడు. చంద్రుడు శుక్లపక్షాన రవిలోని అమృతాన్ని స్వీకరించి తనలో రక్షించుకొంటాడు. ప్రతిమాసంలో సూర్యుడు అమృతాన్ని తన కిరణాలలో ఉంచుతాడు. మంచి వర్షము కొరకై సూర్యకిరణాలచే అమృతం రక్షింపబడుతున్నది. ఇతరులందరు ఆ అమృతం తాగుతున్నారు. దేవతలు, సౌమ్యులు, కావ్యులు - అందరు అమృత పానం చేసేవారే.

సూర్యేణ గోభిర్హి వివర్ధితాభిరద్భిః పునశ్చైవ సముచ్ఛ్రితాభిః ।
వృష్ట్యాభివృష్టాభిరథౌషధీభిర్మర్త్యా అథాన్నేన క్షుధం జయన్తి ॥37॥

సూర్యుడు వర్ధిల్లచేసిన కిరణాల చేత పైకి లేపబడిన జల వృష్టిచే వర్ధిల్లే ఓషధులచేత, సిద్ధమైన అన్నంచేత మానవులు ఆకలిని జయిస్తున్నారు.

తృప్తిశ్చాప్యమృతేనార్ధమాసం సురాణాం మాసే స్వాహాభిః స్వధయా పితౄణామ్ ।
అన్నేన జీవన్త్యనిశం మనుష్యాః సూర్యః శ్రితం తద్ధి బిభర్తి గోభిః ॥38॥

అర్ధమాసం దేవతలకు అమృతంతో తృప్తి. స్వాహాస్వధాకారాలతో దేవతలను, పితరులను పూజిస్తే వారికి ఒకమాసం కాలం తృప్తి ఉంటుంది. నరులు సదా అన్నంతో జీవిస్తున్నారు. సూర్యుడు అన్నాన్ని కిరణాలతో భరిస్తున్నాడు.

ఇత్యేష ఏకచక్రేణ సూర్యస్తూర్ణం ప్రసర్పతి ।
తత్ర తైరక్రమైరశ్వైః సర్పతేఽసౌ దినక్షయే ॥39॥

ఇలా సూర్యుడు ఒకే చక్రంతో వేగంగా సంచరించుచున్నాడు. అక్కడ దినక్షయం కాగానే క్రమణములేని గుర్రాలతో చరిస్తాడు.

హరిర్హరిద్భిర్హ్రియతే తురఙ్గమైః పిబత్యథాఽపో హరిభిః సహస్రధా ।
పునః ప్రముంచత్యథ తాశ్చ యో హరిః స ముహ్యమానో హరిభిస్తురంగమైః ॥40॥

సూర్యుడు పచ్చని గుర్రాలతో తీసుకొనిపోబడుతున్నాడు. కిరణాలతో సహస్రధా జలం త్రాగుతున్నాడు. గుర్రాలచే వహింపబడుతూ మరల ఆ జలాన్ని క్రిందికి వదులుతున్నాడు.

అహోరాత్రం రథేనాసావేకచక్రేణ వై భ్రమన్ ।
సప్తద్వీపసముద్రాంశ్చ సప్తభిః సప్తభిర్ద్రుతమ్ ॥41॥

**ఛందోరూపైశ్చ తైరశ్వైర్యతశ్చక్రం తతః స్థితః ।
కామరూపైః సకృద్యుక్తైః కామగైస్తైర్మనోజవైః ॥42॥**

**హరితైరవ్యథైః పింగైరీశ్వరైర్బ్రహ్మవాదిభిః ।
వాహ్యతేऽనన్తరం చైవ మణ్డలం దివసః క్రమాత్ ॥43॥**

రేయింబగళ్ళు ఒంటి చక్రపు రథంతో భ్రమిస్తూ సప్తాశ్వాలతో, సప్త ద్వీపసప్తసాగరాలను చుట్టి వస్తూన్నాడు. సప్తచ్ఛందో రూపాలు, కామరూపాలు, ఒక్కసారి జోడింపబడినవి, కామగమనం కలవి, మనోవేగం కలవి మరియు పచ్చనివి, వ్యథ లేనివి, పింగళవర్ణం గలవి, సర్వసమృద్ధాలు, బ్రహ్మవాదులైన అశ్వాలు లాగే రథంలో సూర్యుడు దివసక్రమాన్ననుసరించి మండలరూపంలో నిరంతరంగా సాగిపోతాడు.

**కల్పాదౌ సంప్రయుక్తాశ్చ వహన్త్యాభూతసంప్లవమ్ ।
ఆవృతో వాలఖిల్యైశ్చ భ్రమతే రాత్ర్యహాని తు ॥44॥**

యుగాదిలో పూన్చబడిన ఆ గుర్రాలు ప్రళయకాలం వరకు పరిగెడుతుంటాయి. వాలఖిల్యులచే ఆవరింపబడినవాడై సూర్యుడు రాత్రింబగళ్ళు భ్రమిస్తాడు.

**గ్రథితైః స్వవచోభిశ్చ స్తూయమానో మహర్షిభిః ।
సేవ్యతే గీతనృత్యైశ్చ గంధర్వాప్సరసాం గణైః ॥45॥**

మహర్షులు రచించిన స్తుతి వచనాలచే సూర్యుడు స్తుతింపబడతాడు. గంధర్వాప్సరోగణాలు గీత నృత్యాలచే ఆయనను సేవిస్తారు.

**పతంగైః పతగైరశ్వైర్భ్రామ్యమాణో దివస్పతిః ।
వీథ్యాశ్రయాణి చరతి నక్షత్రాణి తథా శశీ ॥46॥**

పక్షివంటి అశ్వాలతో త్రిప్పబడి దివస్పతి గగన వీథి నాశ్రయించి అంతరిక్షంలోనూ, ద్యులోకంలోనూ సంచరిస్తాడు. చంద్రుడు కూడా అట్లే నక్షత్రమయమైన ఆకాశవీథియందు సంచరిస్తాడు.

**హ్రాసవృద్ధీ తథైవాస్య రశ్మయః సూర్యవత్స్మృతాః ।
త్రిచక్రోభయతోऽశ్వశ్చ విజ్ఞేయః శశినో రథః ॥47॥**

**అపాం గర్భసముత్పన్నో రథః సాశ్వః ససారథిః ।
సహారైస్తైస్త్రిభిశ్చక్రైర్యుక్తః శుక్లైర్హయోత్తమైః ॥48॥**

సూర్యునికివలె చంద్రునికి గూడా హాని వృద్ధులు సంభవిస్తాయి. మూడు చక్రాలు, ఉభయ పార్శ్వాలలో మేలైన గుర్రాలు, సారథి కల్గిన చంద్రుని రథం – నీటి గర్భంలో పుట్టినది. అశ్వసారథులు కల్గియున్నది. హారాలు గల మూడు చక్రాలు, తెల్లని గుర్రాలు ఆ రథానికి కలవు.

**దశభిస్తురగైర్దివ్యైరసంగైస్తన్మనోజవైః ।
సకృద్యుక్తే రథే తస్మిన్వహన్త్యాయుగక్షయమ్ ॥49॥**

దివ్యమైన, మనోజవాలైన, అసంగములైన పది దివ్యమగు అశ్వాలు గలిగి యుగక్షయం వరకూ ఒక్కసారి పూన్చిన గుఱ్ఱాలు ఆ రథాన్ని లాగుతూనే ఉంటాయి.

సంగృహీతా రథే తస్మిన్ శ్వేతశ్చక్రాశ్వకాంశ్చవై ।
అశ్వాస్తమేకవర్ణాశ్చ వహన్తే శంఖవర్చసః ॥50॥

ఆ రథంలో పూన్చబడినవి, ఒకే వర్ణం కలవి, శంఖంవలె తెల్లనివి అగు గుఱ్ఱాలు ప్రళయ పర్యంతం చంద్రుని రథాన్ని మోస్తున్నాయి.

అజశ్చ త్రిపథశ్చైవ వృషో వాజీ నరో హయః ।
అంశుమాన్సప్తధాతుశ్చ హంసో వ్యోమమృగస్తథా ॥51॥

ఇత్యేతే నామభిశ్చైవ దశ చంద్రమసో హయాః ।
ఏవం చంద్రమసం దేవం వహంతి స్మాయుగక్షయమ్ ॥52॥

అజము, త్రిపథము, వృషము, వాజి, నరుడు, గుఱ్ఱము, అంశుమంతుడు, సప్తధాతువు, హంస, వ్యోమమృగము అను పేర్లు గల చంద్రుని పది గుఱ్ఱాలు యుగక్షయం వరకు ఆ రథాన్ని వహిస్తాయి.

దేవైః పరివృతః సోమః పితృభిః సహ గచ్ఛతి ।
సోమస్య శుక్లపక్షాదౌ భాస్కరే పరతః స్థితే ॥53॥

ఆపూర్యతే పరో భాగః సోమస్య తు అహఃక్రమాత్ ।
తతః పీతక్షయం సోమం యుగపద్వ్యాపయన్ రవిః ॥54॥

పీతం పంచదశాహం చ రశ్మినైకేన భాస్కరః ।
ఆపూర్యతే పరో భాగః సోమస్యతు అహః క్రమాత్ ॥55॥

దేవతలచే పరివృతుడైన చంద్రుడు పితరులతో కూడా పోతున్నాడు. శుక్లపక్ష ప్రారంభంలో సూర్యుడు ప్రక్కనే ఉండగా, చంద్రునికి పరభాగం అవుతుంది. దినక్రమాన్ని అనుసరించి అపరభాగం పూరింపబడుతుంది. తరువాత దేవతలు అమృతపానం చేయగా క్షీణించిన చంద్రుని ఒకసారి సూర్యుడు ఒక్కొక్క కిరణాలతో నింపుతాడు. 15 రోజులు త్రాగి వేయబడిన చంద్రుని భాస్కరుడు ఒక కిరణంతో పూరిస్తూ అహః క్రమానుసారము భాగమిస్తాడు.

సుషుమ్నాపూర్యమాణస్య శుక్లే వర్ధన్తి వై కలాః ।
తస్మాద్హ్రసన్తి వై కృష్ణే శుక్లే హ్యాప్యాయయన్తి చ ॥56॥

సుషుమ్నచే పూరింపబడే చంద్రుని కళలు శుక్లపక్షంలో వృద్ధి పొందుతాయి. కృష్ణపక్షంలో తగ్గుతాయి. శుక్లపక్షంలోనే వాటివల్ల ఆప్యాయనం కలుగుతుంది .

ఇత్యేవం సూర్యవీర్యేణ చంద్రస్యాప్యాయతే తనుః ।
పౌర్ణమాస్యాం ప్రదృశ్యేత శుక్లః సంపూర్ణమణ్డలః ॥57॥

ఇలా సూర్యుని వీర్యంతో చంద్రుని శరీరం తృప్తి పొందినదవుతుంది. పున్నమినాడు అతడు సంపూర్ణమండలుడై తెల్లగా కనిపిస్తాడు.

ఏవమాప్యాయతే సోమః శుక్లపక్షేష్వహః క్రమాత్ ।
తతో ద్వితీయాప్రభృతి బహులస్య చతుర్దశీ ॥58॥

అపాం సారమయస్యేందో రసమాత్రాత్మకస్య చ ।
పిబన్త్యంబుమయం దేవా మధు సౌమ్యం తథాఽమృతమ్ ॥59॥

ఈ రీతిగా శుక్లపక్షాలలో చంద్రుడు అహఃక్రమానుసారంగా ఆప్యాయితుడౌతున్నాడు. తదుపరి ద్వితీయ నుండి బహుళ చతుర్దశి వరకు జలసారమయుడు, రసమాత్రాత్మకుడు అయిన చంద్రుని జలమయమైన సౌమ్య మధువును అమృతంగా దేవతలు త్రాగుతారు.

సంభృతం త్వర్ధమాసేన అమృతం సూర్యతేజసా ।
భక్షార్థమాగతం సోమం పౌర్ణమాస్యాముపాసతే ॥60॥

అర్ధమాసంలో సూర్యతేజస్సుచే పోషింపబడి అమృతమై భక్షణార్థమై వచ్చిన చంద్రుని పున్నమి నాడు దేవతలు ఉపాసిస్తారు.

ఏకరాత్రం సురైః సార్ధం పితృభిః ఋషిభిశ్చ వై ।
సోమస్య కృష్ణపక్షాదౌ భాస్కరాభిముఖస్య వై ॥61॥

ప్రక్షీయతే పరో భాగః పీయమానకలాక్రమాత్ ।
త్రయశ్చ త్రింశతా సార్ధం త్రయస్త్రింశచ్ఛతాని తు ॥62॥

త్రయస్త్రింశత్ సహస్రాణి దేవాః సోమం పిబన్తి వై ।
ఇత్యేవం పీయమానస్య కృష్ణే వర్ధన్తి తాః కలాః ॥63॥

ఒకరాత్రి దేవతలు, పితరులు, ఋషులు చంద్రుని ఉపాసిస్తారు. కృష్ణపక్షం ప్రారంభంనుండి భాస్కరాభిముఖుడై ఉండబట్టి చంద్రుని పరభాగం క్షీణిస్తుంది. 33,330 మంది దేవతలు చంద్రామృతపానం చేస్తారు. ఇలా త్రాగబడే చంద్రుని కళలు పెరుగుతూ తరుగుతూ వుంటాయి.

క్షీయన్తే చ తతః శుక్లాః కృష్ణా హ్యాప్యాయయన్తి చ ।
ఏవం దినక్రమాత్ పీతే దేవైశ్చాపి నిశాకరే ॥64॥

శుక్లకళలు దినక్రమానుసారం దేవతలచే త్రాగునపుడు క్షీణిస్తాయి. కృష్ణకళలు ఆప్యాయనం పొందుతాయి. ఇలా జరుగుతూ ఉంటుంది.

పీత్వాఽర్ధమాసం గచ్ఛన్తి అమావాస్యాం సురాశ్చ తే ।
పితరశ్చోపతిష్ఠన్తి అమావాస్యాం నిశాకరమ్ ॥65॥

అర్ధమాసం త్రాగి దేవతలు అమావాస్యనాడు వెళ్ళిపోతారు. పితరులు వచ్చి ఆనాడు చంద్రుణ్ణి సమీపిస్తారు.

తతః పంచదశే భాగే కించిచ్ఛేషే నిశాకరే ।
తతోఽపరాహ్ణే పితరో జఘన్యే దివసే పునః ॥66॥

పిబంతి ద్వికలం కాలం శిష్టాస్తాస్తు కలాస్తు యాః ।
వినిఃసృష్టం త్వమావాస్యాం గభస్తిభ్యస్తదాఽమృతమ్ ॥67॥

పితరులు అమావాస్యనాటి అపరాహ్ణమునందు రెండుకలలకాలమున చంద్రుని పదునైదవభాగంలో శేషించి జారిపడిన కళాశేషాన్ని గ్రహించి అందులో ఇంకా మిగిలిన అమృతం త్రాగి వెళ్తారు.

అర్ధమాససమాప్తౌ తు పీత్వా గచ్ఛన్తి తేఽమృతమ్ ।
సౌమ్యాః బర్హిషదశ్చైవ అగ్నిష్వాత్తాశ్చ యే స్మృతాః ॥68॥

కావ్యాశ్చైవ తు యే ప్రోక్తాః పితరః సర్వ ఏవ తే ।
సంవత్సరాశ్చ యే కావ్యాః పంచాబ్దా వై ద్విజాః స్మృతాః ॥69॥

సౌమ్యాః సుతపసో జ్ఞేయాః సౌమ్యా బర్హిషదస్తథా ।
అగ్నిష్వాత్తాస్త్రయశ్చైవ పితృసర్గస్థితా ద్విజాః ॥70॥

అర్ధమాసం పూర్తికాగానే సౌమ్యులు, బర్హిషదులు, అగ్నిష్వాత్తులు అమృతం త్రాగి వెళ్తారు. ఆ పితరులందరు కావ్యులు అనబడుతారు. సంవత్సరాది దేవతలు కూడ కావ్యులే. పంచాబ్దులు, సౌమ్యులు, బర్హిషదులు, అగ్నిష్వాత్తులు పితృసర్గంలో ద్విజులుగా గుర్తింపబడినారు.

పితృభిః పీయమానాయాం పంచదశ్యాం తు వై కలామ్ ।
యావచ్చ క్షీయతే తస్మాద్భాగః పంచదశస్తు సః ॥71॥

పితరులు పంచదశినాడు కళలను త్రాగగా ఎంతగా చంద్రుడు క్షీణిస్తాడో అందలి భాగమే పదునైదవది.

అమావాస్యాం తథా తస్య అన్తరా పూర్యతే పరః ।
వృద్ధిక్షయౌ వై పక్షాదౌ షోడశ్యాం శశినః స్మృతౌ ।
ఏవం సూర్యనిమిత్తే తే క్షయవృద్ధీ నిశాకరే ॥72॥

ఆ మధ్యలో అమావాస్యనాడు రవికిరణాలచే పరభాగం పూరింపబడుతుంది. షోడశినాడు శుక్లపక్షాదియందు చంద్రునికి వృద్ధిక్షయాలు కల్గుతాయి. ఇలా చంద్రునిలో వృద్ధి క్షయాలు సూర్యుని వల్ల ఏర్పడతాయి.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే సూర్యాదిగమనం నామ షడ్వింశత్యధికశతతమోఽధ్యాయః ॥ 126 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని సూర్యునిలో వివిధ దేవతల గమనమనే నూటఇరవై ఆరవ అధ్యాయం సంపూర్ణం

సప్తవింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరవై ఏడవ అధ్యాయం

గ్రహరథవర్ణనం - ధ్రువప్రశంసా చ - గ్రహరథవర్ణనం ధ్రువప్రశంస

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

తారాగ్రహాణాం వక్ష్యామి స్వర్భానోస్తు రథం పునః ।
అథ తేజోమయః శుభ్రః సోమపుత్రస్య వై రథః ॥1॥

తారాగ్రహాలు, (కుజబుధగురు శుక్రశని గ్రహాలు)రాహువు వీరి రథాలను గురించి చెబుతాను. సోముని పుత్రుడైన బుధుని రథం శుభ్రమై తేజోమయంగా ఉంటుంది.

యుక్తో హయైః పిశంగైస్తు దశభిర్వాతరంహసైః ।
శ్వేతః పిశంగః సారంగో నీలః శ్యామో విలోహితః ॥2॥

శ్వేతశ్చ హరితశ్చైవ పృషతో వృష్ణిరేవ చ ।
దశభిస్తు మహాభాగైరుత్తమైర్వాతసంభవైః ॥3॥

వాయువేగమూ, పిశంగవర్ణమూ కల పది గుర్రాలు కూర్చిన రథమిది. ఆ పది గుర్రాలూ తెలుపు, పిశంగం, సారంగం, నీలం, శ్యామం, విలోహితం, శ్వేతం, హరితం, చిత్రవర్ణం, వృష్ణి అనే రంగులు గల్గి వుంటాయి. ఉత్తమమైనవీ, మహాభాగాలూ, వాయుసంభవాలూ అయిన గుర్రాలవి.

తతో భౌమరథశ్చాపి అష్టాంగః కాంచనః స్మృతః ।

అష్టభిర్లోహితైరశ్వైః సధ్వజైరగ్నిసంభవైః ।
సర్పతేఽసౌ కుమారో వై ఋజువక్రానువక్రగః ॥4॥

ఆపై భూమి పుత్రుడైన కుజుని రథం అష్టాంగమై స్వర్ణవర్ణం కల్గియుంటుంది. అగ్నినుండి పుట్టినవీ, ధ్వజంతో కూడినవీ, ఎర్రనివీ అయినా ఎనిమిది గుర్రాలతో అది సాగిపోతుంది. కుజుడు ఋజువక్రానువక్రగమనాలు గలిగి పయనిస్తుంటాడు.

అతశ్చాంగిరసో విద్వాన్ దేవాచార్యో బృహస్పతిః ।
గౌరాశ్వేన తు రౌక్మేణ స్యన్దనేన విసర్పతి ॥5॥

యుక్తేనాష్టాభిరశ్వైశ్చ ధ్వజైరగ్నిసముద్భవైః ।
అబ్దం వసతి యో రాశౌ స్వదిశం తేన గచ్ఛతి ॥6॥

అంగిరసుడు, విద్వాంసుడు, దేవతలకాచార్యుడైన బృహస్పతి స్వర్ణమయమూ, తెల్లనిదీ అయిన రథం మీద పయనిస్తాడు. అగ్ని నుండి పుట్టిన ఎనిమిది గుర్రాలతో, ధ్వజంతో గూడిన రథమది. అతడొక సంవత్సరకాలం ఒకరాశిలో ఉండి ఆపై ఆ రథంతో తన దిశకు వెళ్తాడు.

యుక్తేనాష్టాభిరశ్వైశ్చ సధ్వజైరగ్నిసన్నిభైః ।
రథేన క్షిప్రవేగేన భార్గవస్తేన గచ్ఛతి ॥7॥

శుక్రుడు అగ్ని సదృశమైన ఎనిమిది గుర్రాలు, ధ్వజం గల రథంలో శీఘ్రవేగంతో పోతాడు.

తతః శనైశ్చరోఽ ప్యశ్వైః సబలైర్వాతరంహసైః ।
కార్ష్ణాయసం సమారుహ్య స్యన్దనం యాత్యసౌ శనైః ॥8॥

శని బలిష్ఠమైనవీ, వాయువేగం కలవీ అయిన అశ్వాలు గల నల్లని ఇనుప రథమధిష్ఠించి మెల్లగా పోతూ వుంటాడు.

స్వర్భానోస్తు యథాష్టాశ్వాః కృష్ణా వై వాతరంహసః ।
రథం తమోమయం తస్య వహన్తః సముదంచితాః ॥9॥

రాహువుకు ఎనిమిది నల్లని గుర్రాలు, ఉద్ధృతమైన వాయువేగం కల్గినవి. అవి తమోమయమైన అతని రథాన్ని లాగుతుంటాయి.

ఆదిత్యనిలయో రాహుః సోమం గచ్ఛతి పర్వసు ।
ఆదిత్యమేతి సోమాచ్చ తమస్సర్వేషు పర్వసు ॥10॥

రాహువు సూర్యునికి సన్నిహితుడు. పర్వదినాలలో సోముని సమీపిస్తాడు. సర్వ పర్వాలలో సోముని నుండి సూర్యుని వద్దకు వెళ్తాడు.

తతః కేతుమతస్త్వశ్వా అష్టౌ తే వాతరంహసః ।
పలాలధూమవర్ణాభాః క్షామదేహాః సుదారుణాః ॥11॥

కేతువుకు ఎనిమిది గుర్రాలున్నాయి. అవి వాయు వేగం కల్గి పలాలధూమ వర్ణం కలవై ఉంటాయి. సన్నబడిన శరీరంతో అవి అతిదారుణమై వుంటాయి.

ఏతే వాహా గ్రహాణాం వై మయా ప్రోక్తా రథైః సహ ।
సర్వే ధ్రువే నిబద్ధాస్తే నిబద్ధా వాతరశ్మిభిః ॥12॥

నేనిప్పుడు రథాలతో సహా గ్రహాల వాహనాలను గురించి చెప్పాను. వాయుమయమైన పగ్గాలతో నిబద్ధాలైన ఆ వాహనాలన్నీ ధ్రువునితో సంబద్ధములై వున్నాయి.

ఏతే వై భ్రామ్యమాణాస్తే యథాయోగం వహన్తి వై ।
వాయవ్యాభిరదృశ్యాభిః ప్రబద్ధా వాతరశ్మిభిః ॥13॥

ఇవి భ్రమిస్తూ భ్రమిస్తూ యథాయోగంగా పయనిస్తాయి. వాయవ్యాలు, కంటికి కనిపించనివీ అయిన వాతమయమైన పగ్గాలచే అవి ప్రకృష్టంగా బంధింపబడి వున్నాయి.

పరిభ్రమన్తి తద్బద్ధాశ్చంద్రసూర్యగ్రహా దివి ।
యావత్తమనుపర్యేతి ధ్రువం వై జ్యోతిషాం గణః ॥14॥

ఆ విధంగా కట్టబడిన చంద్రుడు, సూర్యుడు, గ్రహాలు దివిలో ధ్రువుణ్ణి అనుసరించి ప్రదక్షిణం కావిస్తూ అంతరిక్షంలో చరిస్తాయి.

యథా నద్యుదకే నౌస్తు ఉదకేన సహోహ్యతే ।
తథా దేవగృహాణి స్యురుహ్యన్తే వాతరంహసా ।
తస్మాద్యదత్ర దృశ్యన్తే వ్యోమ్ని దేవగృహా ఇతి ॥15॥

నదిలోని పడవ నీటితో వహింపబడినట్లు దేవ గృహాలు (జ్యోతిర్గణాలు) వాతవేగంతో వహింపబడుతున్నాయి. అందువల్ల ఆకాశంలో కనిపించేవి దేవగృహాలు.

యావన్త్యశ్చైవ తారాః స్యుస్తావన్తోఽస్య మరీచయః ।
సర్వా ధ్రువనిబద్ధాస్తా భ్రమన్త్యో భ్రామయన్తి చ ॥16॥

నక్షత్రా లెన్ని కలవో, ధ్రువుని కిరణా లన్ని వున్నాయి. తారలన్నీ ధ్రువునితో సంబంధపడినవే, అవి తాము తిరుగుతూ జ్యోతిర్గణాలను గూడా త్రిప్పుతాయి.

తైలపీడం యథా చక్రం భ్రమతే భ్రామయన్తి వై।
తథా భ్రమన్తి జ్యోతీంషి వాతబద్ధాని సర్వశః ॥17॥

నూనె గానుగ తాను తిరుగుతూ ఇతర చక్రాలను త్రిప్పుతుంది. అట్లే వాతనిబద్ధాలైన నక్షత్రాలు, గ్రహాలు అంతటా తాము భ్రమణానికి లోనవుతూ తదితరాలను గూడా భ్రమింపజేస్తున్నాయి.

అలాతచక్రవద్యాన్తి వాతచక్రేరితాని తు ।
యస్మాత్ప్రవహతే తాని ప్రవహస్తేన స స్మృతః ॥18॥

వాతచక్ర ప్రేరితాలై అవి అలాత (కొరవి) చక్రం లాగా భ్రమిస్తున్నాయి. ఆ జ్యోతిర్గణాలను త్రిప్పే గాలి ప్రవహించే స్వభావం కలది కాన 'ప్రవహ' మనబడుతున్నది.

ఏవం ధ్రువే నియుక్తోఽసౌ భ్రమతి జ్యోతిషాం గణః।
ఏష తారామయః ప్రోక్తః శిశుమారో ధ్రువో దివి ॥19॥

ఇలా ధ్రువునిలో నియుక్తమైన ఈ నక్షత్రగణం భ్రమిస్తున్నది. ఆకాశంలో ధ్రువుడు కేంద్రంగా కలిగిన తారామయమైన అమరికను శిశుమార చక్రం అంటారు.

యదహ్నా కురుతే పాపం తం దృష్ట్వా నిశి ముంచతి ।
శిశుమారశరీరస్థా యావత్యస్తారకాస్తు తాః ॥20॥

వర్షాణి దృష్ట్వా జీవేత తావదేవాధికాని తు ।
శిశుమారాకృతిం జ్ఞాత్వా ప్రవిభాగేన సర్వశః ॥21॥

పగలు చేసిన పాపం రాత్రి శిశుమార చక్రాన్ని చూస్తే పరిహరింపబడుతుంది. శిశుమార శరీరంలో ఉన్న ఎన్ని తారకలను చూస్తాడో, శిశుమారాకృతిని ప్రవిభాగంలో తెలుసుకొన్నవాడు, అన్ని సంత్సరాలు అంతకంటే ఎక్కువ కాలం జీవిస్తాడు.

**ఉత్తానపాదస్తస్యాథ విజ్ఞేయః సోత్తరా హనుః ।
యజ్ఞోఽధరస్తు విజ్ఞేయో ధర్మో మూర్ధానమాశ్రితః ॥22॥**

శిశుమారముయొక్క పై దౌడ ఉత్తానపాదుడు, యజ్ఞుడు క్రింది దౌడ, ధర్ముడు శిరస్సు.

**హృది నారాయణః సాధ్యా అశ్వినౌ పూర్వపాదయోః ।
వరుణశ్చార్యమా చైవ పశ్చిమే తస్య సక్థినీ ॥23॥**

**శిశ్నే సంవత్సరో జ్ఞేయో మిత్రశ్చాపానమాశ్రితః ।
పుచ్ఛేఽగ్నిశ్చ మహేంద్రశ్చ మరీచిః కశ్యపో ధ్రువః ॥24॥**

హృదయంలో నారాయణుడు, సాధ్యులూ ఉంటారు. పూర్వపాదాలలో అశ్వినులు, వరుణుడు, అర్యముడు, దానివెనుక తొడలు, శిశ్నంలో సంవత్సరం, అపానంలో మిత్రుడు, పుచ్ఛంలో అగ్ని, మహేంద్రుడు, మరీచి, కశ్యపుడు, ధ్రువుడు ఉంటారు.

**ఏష తారామయః స్తంభో నాస్తమేతి న చోదయమ్ ।
నక్షత్రచంద్రసూర్యాశ్చ గ్రహాస్తారాగణైః సహ ॥25॥**

**తన్ముఖాభిముఖాః సర్వే చక్రభూతా దివి స్థితాః ।
ధ్రువేణాధిష్ఠితాశ్చైవ ధ్రువమేవ ప్రదక్షిణమ్ ॥26॥**

ఈ తారామయమైన స్తంబం (దుబ్బువంటి ఆకృతి గలది) అస్తమించదు, ఉదయించదు. నక్షత్ర సూర్యచంద్రులు, తారాగణాలతోడి గ్రహాలు, అన్నీ దాని కభిముఖంగా ఉన్నాయి. చక్రస్వరూపములై దివిలో ధ్రువునిచే అధిష్ఠితములై ఉన్నాయి. ధ్రువునిచే అధిష్ఠితుములై అతనికే ప్రదక్షిణం చేస్తున్నవి.

**పరియాన్తి సురశ్రేష్ఠం మేఢీభూతం ధ్రువం దివి ।
ఆగ్నీధ్రకాశ్యపానాం తు తేషాం స పరమో ధ్రువః ॥27॥**

దేవతాశ్రేష్ఠుడు, మేఢీభూతుడైన ధ్రువుని చుట్టూ అవి పరిభ్రమిస్తున్నాయి. ఆగ్నీధ్రకాశ్యపవంశస్థులలో శ్రేష్ఠుడు ధ్రువుడు.

**ఏక ఏవ భ్రమత్యేష మేరోరన్తరమూర్ధని ।
జ్యోతిషాం చక్రమాదాయ ఆకర్షంస్తమధోముఖః ॥28॥
మేరుమాలోకయన్నేవ ప్రతియాతి ప్రదక్షిణమ్ ॥29॥**

ఇత డొక్కడే మేరువుయొక్క అంతరమూర్ధంలో పరిభ్రమిస్తున్నాడు. జ్యోతిశ్చక్రాన్ని గ్రహించి అధోముఖుడై దాన్నిఆకర్షిస్తూ మేరువును చూస్తూ ప్రదక్షిణంగా పోతున్నాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే గ్రహరథవర్ణనం ధ్రువప్రశంసా నామ సప్తవింశత్యధికశతతమోఽధ్యాయః ॥ 127 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని గ్రహరథవర్ణనం ధృవప్రశంస అనే నూటఇరవై ఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టావింశత్యధికశతతమోఽధ్యాయః - నూటఇరవైఎనిమిదవ అధ్యాయం

ఖగోళసంస్థాన వర్ణనం - ఖగోళ సంస్థానమును వర్ణించుట

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

యదేతద్భవతా ప్రోక్తం శ్రుతం సర్వమశేషతః ।
కథం దేవగృహాణి స్యుః పునర్జ్యోతీంషి వర్ణయ ॥1॥

నీవు పేర్కొన్న ఖగోళానికి చెందిన విషయమంతా పూర్తిగా విన్నాము. జ్యోతిర్గోళాలు దేవగృహాలని చెప్పావు. దాన్ని వివరించి చెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఏతత్ సర్వం ప్రవక్ష్యామి సూర్యాచంద్రమసోర్గతిమ్ ।
యథా దేవగృహాణి స్యుః సూర్యచంద్రగ్రహాస్తథా ॥2॥

సూర్యచంద్రుల గతినీ, అట్లే సూర్యచంద్రాది గ్రహాలు దేవగృహాలయ్యే విధానాన్నీ-ఇదంతా చెబుతాను.

అగ్నేర్వ్యుష్టౌ రజన్యాం వై బ్రహ్మణాఽవ్యక్తయోనినా ।
అవ్యాకృతమిదం త్వాసీన్నైశేన తమసావృతమ్ ॥3॥

కల్పాదిలో విశ్వంలో రాత్రిం బవళ్ళులేవు. అవ్యక్తమునుండి పుట్టిన బ్రహ్మకు ఒక రాత్రి ముగిసి తెల్లవారేసరికి నామరూపవిభాగం లేక రాత్రికి చెందిన చీకటితో నిండి సృష్టి అవ్యాకృతమై యుండినది.

చతుఃశ్రుతావశిష్టేఽస్మిన్ బ్రహ్మణా సమధిష్ఠితే ।
స్వయంభూర్భగవాంస్తత్ర లోకతత్త్వార్థసాధకః ॥4॥

ఖద్యోతరూపీ విచరన్నావిర్భావం వ్యచిన్తయత్ ।
జ్ఞాత్వాగ్నిం కల్పకాలాదావపః పృథ్వీం చ సంశ్రితాః ॥5॥

నాల్గువేదాల విభాగం గూడా అప్పటికి లేదు. అప్పుడు లోకసృష్టిరూపమైన కార్యం సాధింపగోరిన స్వయంభూ బ్రహ్మ మిణుగురు పురుగువలె ప్రకాశిస్తూ జగదుత్పత్తి ఎలా జరుగుతుందా అని ఆలోచించసాగాడు.అప్పుడతడు అగ్ని జలాన్నీ, పృథ్వినీ ఆశ్రయించియున్నట్లు గ్రహించాడు.

స సంభృత్య ప్రకాశార్థం త్రిధా తుల్యోఽభవత్ పునః ।
పవనో యస్తు లోకేఽస్మిన్ పార్థివః సోఽగ్నిరుచ్యతే ॥6॥

అతడు జలమునుండీ, పృథ్వినుండీ అగ్నిభూతాన్ని ఒకచోట చేర్చాడు. దానినంతటినీ మూడుగా విభజించాడు. పవనుడుగా వాయువులో కనబడేదీ, నిర్మథనంతో సంభవించేదీ అగు అగ్ని పార్థివాగ్ని అని చెప్పబడుతున్నది.

యశ్చాసౌ తపతే సూర్య శ్శుచిరగ్నిశ్చ స స్మృతః ।
వైద్యుతో జాఠరః సౌమ్యో వైద్యుతశ్చాప్యనిన్ధనః ॥7॥

తేజోభిశ్చాప్యతే కశ్చిత్ కశ్చిదేవాప్యనిన్ధనః ।
కాష్ఠేన్ధనస్తు నిర్మథ్యః సోఽద్భిః శామ్యతి పావకః ॥8॥

సూర్యుడుగా వెలిగే అగ్నికి శుచ్యగ్ని అని వ్యవహారం. వైద్యుతాగ్ని ఇంధనాలతో పనిలేకుండగనే ప్రకాశిస్తుంది. ఇందులో ఒకటి తేజస్సులతో శాంతిస్తుంది. మరొకటి ఇంధనరహితంగా ఉంటుంది. నిర్మథ్యాగ్ని కాష్ఠాలతో వెలుగుతుంది, నీటితో శమిస్తుంది.

అర్చిష్మాన్ పచనోఽగ్నిస్తు నిష్ప్రభః సౌమ్యలక్షణః ।
యశ్చాసౌ మణ్డలే శుక్లే నిరూష్మా న ప్రకాశతే ॥9॥

ప్రభా సౌరీ త్రిభాగేన అస్తం యాతి దివాకరే ।
అగ్నిమావిశతే రాత్రౌ తస్మాదగ్నిః ప్రకాశతే ॥10॥

పవమానాగ్ని (పార్థివాగ్ని) జ్వాలలతో గూడియున్నా ప్రభలు తక్కువ స్థాయిలో ఉండడంవల్ల సౌమ్యుడుగా కనిపిస్తాడు. రవిమండలంలో మరొక ఉష్ణంతో పనిలేకుండానే ప్రకాశించే అగ్నికి సంబంధించిన సౌరప్రభాంతర్గతమైన మూడు పాదాలు అగ్నిలో ప్రవేశిస్తాయి. అందువల్లనే రాత్రులలో అగ్ని రవికంటే అధికంగా ఉన్నట్లు భాసిస్తుంది.

ఉదితే తు పునః సూర్యే ఊష్మాగ్నేస్తు సమావిశత్ ।
పాదేన తేజసశ్చాగ్నేస్తస్మాత్ సన్తపతే దివా ॥11॥

ప్రాకాశ్యం చ తథౌష్ణ్యం చ సౌర్యాగ్నీ యే తు తేజసీ ।
పరస్పరానుప్రవేశాదాప్యాయేతే దివానిశమ్ ॥12॥

మరల సూర్యోదయ మయ్యేటప్పుడు ముందు అస్తమయసమయంలో రవినుండి ప్రకాశం పొందిన అగ్ని మరల రవిని ప్రవేశిస్తుంది. అందుచేతనే పగటిపూట అగ్ని నాలుగవ వంతు తేజస్సుతో మాత్రమే వెల్గుతుంది. ఇలా అన్యోన్యం అగ్ని సూర్యప్రకాశాలు రాత్రింబవళ్ళలో అన్యోన్యం అను ప్రవేశించడంవల్ల పరస్పరపూరణం చేసుకొంటూ వుంటాయి.

ఉత్తరే చైవ భూమ్యర్ధే తథా హ్యస్మింస్తు దక్షిణే ।
ఉత్తిష్ఠతి పునః సూర్యే రాత్రిమావిశతే హ్యపః ॥13॥

ఇలా భూమికి ఉత్తరార్ధదక్షిణర్ధాలలో అగ్ని స్థానపరివర్తనంతో తన తేజస్సును మార్పు చేసుకొంటూ వుంటుంది. సూర్యుడుదయించగానే రాత్రి నీటిలో ప్రవేశిస్తుంది.

తస్మాత్ తామ్రా భవన్త్యాపో దివారాత్రిప్రవేశనాత్ ।
అస్తంగతే పునః సూర్యే అహో వై ప్రవిశత్యపః॥14॥

అందువల్ల నీరు పగటిపూట అగ్నిలాగా ఎర్రగా కనిపిస్తుంది. మరల సూర్యు దస్తమించగానే పగలు (ప్రభావం) నీటిలో ప్రవేశిస్తుంది.

తస్మాన్నక్తం పునః శుక్లా హ్యాపో దృశ్యన్తి భాసురాః ।
ఏతేన క్రమయోగేన భూమ్యర్ధే దక్షిణోత్తరే ॥15॥

ఉదయాస్తమయే హ్యత్ర అహోరాత్రం విశత్యపః ।
యశ్చాసౌ తపతే సూర్యః సోఽపః పిబతి రశ్మిభిః ॥16॥

అందువల్లనే నీరు రాత్రివేళ సూర్యునిలాగా తెల్లగాకనిపిస్తుంది. ఈ క్రమాన్ని అనుసరించి భూమి దక్షిణోత్తరార్ధములలో సూర్యాగ్నుల ప్రకాశములందలి పరస్పరపరివర్తనముచేత ఉదయాస్తమయ ప్రభావాన్ని అనుసరించి సూర్యుడు, అగ్ని జలంలో ప్రవేశించి దాని రంగును మారుస్తాయి.

సహస్రపాదస్త్వేషోఽగ్నీ రక్తకుంభనిభస్తు సః ।
ఆదత్తే స తు నాడీనాం సహస్రేణ సమన్తతః ॥17॥

అపో నదీసముద్రేభ్యో హ్రదకూపేభ్య ఏవ చ ।
తస్య రశ్మిసహస్రేణ శీతవర్షోష్ణనిఃస్రవః ॥18॥

తాసాం చతుఃశతం నాడ్యో వర్షన్తే చిత్రమూర్తయః ।
చన్దనాశ్చైవ మేధ్యాశ్చ కేతనాశ్చేతనాస్తథా ॥19॥

సౌరాగ్ని సహస్రకిరణాలతో పరివృతమైనది. అది ఒక కుంభం లాగా ఉన్నది. సూర్యుడు వేయినాడులతో నదులు, సముద్రాలు, బావులు, మడుగుల నుండి నీరు పీల్చి తనలో నింపుకొంటున్నాడు. అతని వెయ్యి కిరణాలలో చిత్రాకృతిగల నాల్గువందల కిరణాలు శరద్వర్షాకాలాలలో వర్షిస్తాయి. ఆ కిరణాలు చందనంవలె చల్లగానుండి పవిత్రములై తక్కువ వేడి కల్గివుంటాయి. అవి చందన, మేధ్య, కేతన, చేతన అనునవి.

అమృతా జీవనాః సర్వా రశ్మయో వృష్టిసర్జనాః ।
హిమోద్భవాశ్చ తాన్యన్యం రశ్మయస్త్రిశతం స్మృతాః ।

చంద్రాస్తా నామతః సర్వాశ్శీతభానోర్గభస్తయః ॥ 20
ఏతా మేధ్యాస్తథాన్యాశ్చ హ్లాదిన్యో హిమసర్జనాః ।

శుక్లాశ్చ కకుభశ్చైవ గావో విశ్వసృతశ్చ యాః ॥21॥
శుక్లాస్తా నామతః సర్వాస్త్రింశత్యా ఘర్మసర్జనాః ।
సంబిభ్రతి హి తాః సర్వా మనుష్యాన్దేవతాః పితౄన్॥22॥

వాటిని అమృతకిరణాలంటారు. ఇవి కాక మూడు వందల కిరణాలు రవిలోని జలాన్ని మంచురూపంలో లోకాని కందిస్తాయి. ఈ కిరణసముదాయాన్ని చంద్రములంటారు. ఇవి పవిత్రములై ఆనందదాయకంగా

ఉంటాయి. తెల్లనైనవీ, విశ్వమంతటా వ్యాపించేవీ అయిన ఈ కిరణములు శుక్లకిరణాలనే పేరుతో ఉన్నాయి. ఆ మూడు వందల కిరణాలు వసంతగ్రీష్మాలలో ఘర్మాన్నీ, ఆవిరినీ వదలుతాయి. అవి మనుజులను, దేవతలను, పితరులను పోషిస్తాయి.

మనుష్యానౌషధీభిశ్చ స్వధయా చ పితౄనపి ।
అమృతేన సురాన్సర్వాన్సన్తతం పరితర్పయన్ ॥23॥

ఇలా రవి తన సహస్ర కిరణాలతో, ఓషధులతో మానవులనూ, లోకార్థాన్ని సాధించే స్వధాద్రవ్యంతో పితరులనూ, అమృతంతో దేవతలనూ సమంగా పోషిస్తున్నాడు.

వసన్తే చైవ గ్రీష్మే చ శతైః సన్తపతే త్రిభిః ।
వర్షాసు చ శరద్యేవం చతుర్భిః సంప్రవర్షతి ॥24॥

హేమన్తే శిశిరే చైవ హిమోత్సర్గం త్రిభిః పునః ।
ఔషధీషు బలం ధత్తే సుధాం చ స్వధయా పునః ॥25॥

వసన్తగ్రీష్మాలలో మూడువందలకిరణాలతో రవి తపిస్తాడు. శరద్వర్షాకాలాలలో నాల్గువందల కిరణాలతో వర్షిస్తాడు. హేమన్త శిశిరాలలో మూడువందల కిరణాలతో మంచుగురియిస్తాడు. ఓషధులకు బలమిస్తాడు. స్వధతో పితరులకు, సుధతో అమరులకు తృప్తి కల్గిస్తాడు.

సూర్యోఽమరత్వమమృతే త్రయస్త్రిషు నియచ్ఛతి ।
ఏవం రశ్మిసహస్రం తు సౌరం లోకార్థసాధకమ్ ॥26॥

సూర్యుడు అమరత్వాన్నీ అమృతమందు అలాగే మరి మూడిటినీ మూడిటియందు ఉంచాడు. ఇలా అతని వేయికిరణాలు, లోకాల ప్రయోజనాల్ని, తీర్చేవవుతున్నాయి.

భిద్యతే ఋతుమాసాద్య సహస్రం బహుధా పునః ।
ఇత్యేవం మణ్డలం శుక్లం భాస్వరం లోకసంజ్ఞితమ్ ॥27॥
నక్షత్రగ్రహసోమానాం ప్రతిష్ఠాయోనిరేవ చ ।

ఋతువును పొంది ఆ వెయ్యి కిరణాలు అనేక విధాలుగా భిన్నము లవుతాయి. ఇలా తెల్లని మండలం ప్రకాశవంతమై లోకసంజ్ఞ గలదయింది.

చంద్రఋక్షగ్రహాః సర్వే విజ్ఞేయాః సూర్యసంభవాః ॥28॥
సుషుమ్నా సూర్యరశ్మిర్యా క్షీణం శశినమేధతే ।

ఇలా శుక్లవర్ణం కల్గి ప్రకాశించే 'లోక' మనే ప్రసిద్ధినామం కల రవి నక్షత్రాలకు, గ్రహాలకు, చంద్రునికి గూడా జన్మస్థితికారణమై యున్నాడు. చంద్రుడు, నక్షత్రాలు, అన్ని గ్రహాలు, సూర్యరశ్మినుండి పుట్టినవని తెలుసుకోవాలి. సుషుమ్నా అనే నాడి క్షీణించిన చంద్రుణ్ణి పోషిస్తుంది.

హరికేశః పురస్తాత్తు యో వై నక్షత్రయోనికృత్ ॥29॥
దక్షిణే విశ్వకర్మా తు రశ్మిరాప్యాయయద్బుధమ్ ।

విశ్వావసుశ్చ యః పశ్చాచ్ఛుక్రయోనిశ్చ స స్మృతః ॥30॥
సంవర్ధనస్తు యో రశ్మిః స యోనిర్లోహితస్య చ ।

షష్ఠస్తు హ్యశ్వభూరశ్మిర్యోనిః స హి బృహస్పతేః ॥31॥
శనైశ్చరం పునశ్చాపి రశ్మిరాప్యాయతే సురాట్ ।
న క్షీయతే యతస్తాని తస్మాన్నక్షత్రతా స్మృతా ॥32॥

హరికేశమనే రశ్మి నక్షత్రాలనూ, విశ్వకర్మ అనే నాడి బుధుని, వెనుకనున్న విశ్వావసునాడి శుక్రుని, సంవర్ధన నాడి అంగారకుని, అర్వావసువనే ఆరవనాడి బృహస్పతిని 'స్వరాట్' అనే నాడి శనైశ్చరుని ఆప్యాయిన మొందిస్తాయి. క్షయము నొందేవి కావు గాన అవి నక్షత్రాలయ్యాయి.

క్షేత్రాణ్యేతాని వై సూర్యమాపతన్తి గభస్తిభిః ।
క్షేత్రాణి తేషామాదత్తే సూర్యో నక్షత్రతా తతః ॥33॥

ఇవి సూర్యుని యొక్క క్షేత్రస్థానాలుగా వుండి తమ కిరణాలతో అతణ్ణి తపింపజేస్తాయి.సూర్యుడు అనంతక్షేత్రాలైన ఆ నక్షత్రాలలో తానుగూడ నక్షత్రత్వం పొందియున్నాడు.

అస్మాల్లోకాదముం లోకం తీర్ణానాం సుకృతాత్మనామ్ ।
తారణాత్తారకా హ్యేతాః శుక్లత్వాచ్చైవ శుక్లికాః ॥34॥

ఈ లోకం నుండి పైలోకాలకు దాటే సుకృతాత్ములను దాటించేవి గావుననూ, తెల్లనివి కావుననూ నక్షత్రాలకు శుక్లికలు అనిపేరు.

దివ్యానాం పార్థివానాం చ వంశానాం చైవ సర్వశః ।
తపనస్తేజసో యోగాదాదిత్య ఇతి గద్యతే ॥35॥

భూమిలోని వారిలో దివ్యవంశస్థులను, వారితపోబలాన్నీ, తన తేజోబలాన్నీ ఆశ్రయించి తనలోనికి గ్రహిస్తాడు గాన సూర్యునికి 'ఆదిత్యుడు' అనిపేరు.

స్రవతిః స్యన్దనార్థే చ ధాతురేష నిగద్యతే ।
శ్రవణాత్తేజసశ్చైవ తేనాసౌ సవితా స్మృతః ॥36॥

బహ్వర్థశ్చంద్ర ఇత్యేష ప్రధానో ధాతురుచ్యతే ।
శుక్లత్వే హ్యమృతత్వే చ శీతత్వే హ్లాదనేఽపి చ ॥37॥

స్యందనము స్రవింపజేయుట అనే అర్థాన్ని ఇచ్చే 'సూ' అనే ధాతువునుండి 'సవితా' అనే పదం కల్గింది. తేజస్సును స్రవింపజేసేవాడు కాన సూర్యుడు 'సవిత' అనబడినాడు. అనేకార్థాలు గల ఛది, ధాతువునుండి 'చంద్ర' శబ్దం ఏర్పడింది. తెల్లగా ఉండి అమృతరూపుడై, చల్లనివాడై, ఆనందింపజేయువాడు గాన 'చంద్రుడ'నబడినాడు.

సూర్యాచంద్రమసోర్దివ్యే మణ్డలే భాస్వరే ఖగే ।
జలతేజోమయే శుక్లే వృత్తకుంభనిభే శుభే ॥38॥

ఇలాంటి సూర్యచంద్రమండలాలు ప్రకాశవంతములు, దివ్యములు, ఆకాశగాములు, తెల్లనివి, గుండ్రని మండలాలవంటివి. ఇందులో సూర్యుడు తేజోమయుడు, చంద్రుడు జలమయుడు. వీరు శుభప్రదులు.

వసన్తి కర్మదేవాస్తు స్థానాన్యేతాని సర్వశః ।
మన్వన్తరేషు సర్వేషు ఋషిసూర్యగ్రహాదయః ॥39॥
తాని దేవగృహాణి స్యుః స్థానాఖ్యాని భవన్తి హి ।

తమతమ సుకృతలాచే దేవత్వం పొందిన కర్మదేవులు ఆయా మన్వంతరాలలో ఈ సూర్యనక్షత్రచంద్ర గ్రహలోకాలలో తమ తమ పుణ్యానుసారంగా ప్రవేశిస్తారు. వారికివి స్థానా లవుతాయి. కావుననే ఇవి దేవగృహాలుగా, కర్మదేవుల ఇండ్లుగా వ్యవహారం పొందాయి.

సౌరం సూర్యోఽవిశత్స్థానం సౌమ్యం సోమస్తథైవ చ ॥40॥

శౌక్రం శుక్రోఽవిశత్స్థానం షోడశారం ప్రభాస్వరమ్ ।
బృహస్పతిర్బృహత్త్వం చ లోహితం చాపి లోహితః ॥41॥

శనైశ్చరోఽవిశస్థానమేవం శానైశ్చరం తథా ।
బుధోఽపి వై బుధస్థానం భానుం స్వర్భానురేవ చ ॥42॥

నక్షత్రాణి చ సర్వాణి నక్షత్రాణ్యావిశన్తి చ ।
జ్యోతీంషి సుకృతామేతే జ్ఞేయా దేవగృహాస్తు వై ॥43॥

సూర్యుడు సౌరస్థానాన్నీ, సోముడు సౌమ్యస్థానాన్నీ, శుక్రుడు షోడశచక్రప్రకాశమానమైన శౌక్రస్థానాన్నీ, బృహస్పతి బృహత్ స్థానాన్నీ, అంగారకుడు లౌహితస్థానాన్నీ, శని శనైశ్చరస్థానాన్నీ, బుధుడు బుధస్థానాన్నీ, స్వర్భానుడు భానుస్థానాన్నీ, సకలనక్షత్రాలూ నక్షత్రస్థానాన్నీ అధిష్ఠించాయి. అందువల్ల ఈ జ్యోతిర్గోళాలన్నీ సుకృతాత్ములైన కర్మదేవుల యిండ్లుకాన దేవగృహాలయ్యాయి.

స్థానాన్యేతాని తిష్ఠన్తి యావదాభూతసంప్లవమ్ ।
మన్వన్తరేషు సర్వేషు దేవస్థానాని తాని వై ॥44॥

అభిమానేన తిష్ఠన్తి తాని దేవాః పునః పునః ।
అతీతాస్తు సహాతీతైర్భావ్యాః భావ్యైః సురైః సహ ॥45॥

వర్తన్తే వర్తమానైశ్చ సురైః సార్ధం తు స్థానినః ।

ఇవి ప్రళయకాలం వరకూ ఇలాగే వుంటాయి. ప్రతిమన్వంతరంలోనూ ఆయా స్థానాభిమానులైన దేవతలు ఆయా స్థానాలను మరల మరల తమ ఇండ్లుగా చేసుకొంటారు. గడిచిన మన్వంతరాలలో గడిచిన దేవతలు, ఇప్పటి మన్వంతరాలలో ఇప్పటి దేవతలు, రానున్న మన్వంతరాలలో రానున్న కర్మదేవతలు ఇలాగా ఉండడం జరుగుతుంది.

సూర్యో దేవో వివస్వాంశ్చ అష్టమస్త్వదితేః సుతః ॥46॥
ద్యుతిమాన్ధర్మయుక్తశ్చ సోమో దేవో వసుః స్మృతః ।

ఈ దేవతల దేవతాత్వపు తీరుతెన్నులిలా వున్నాయి. అదితి పుత్రులలో ఎన్మిదవవాడైన వివస్వంతుడే సూర్యుడు, కాంతికలవాడూ, ధర్మయుక్తుడూ అయిన సోముడు వసువులలో ఒకడు.

శుక్రో దైత్యస్తు విజ్ఞేయో భార్గవోఽసురయాజకః ॥47॥
బృహస్పతిర్బృహత్తేజా దేవాచార్యోఽంగిరఃసుతః ।
బుధో మనోహరశ్చైవ శశిపుత్రస్తు స స్మృతః ॥48॥

భార్గవుడగు శుక్రుడు అసురులకు పురోహితుడు, బృహస్పతి అంగిరుని కుమారుడు, బ్రహ్మాంశ సంజాతుడు, దేవతలకు ఆచార్యుడు.బుధుడు అందమైనవాడు, చంద్రుని పుత్రుడు.

శనైశ్చరో విరూపశ్చ సంజ్ఞాపుత్రో వివస్వతః ।
అగ్నిర్వికేశ్యాం జజ్ఞే తు యువాసౌ లోహితాధిపః ॥49॥

శని విరూపుడు, రవికి సంజ్ఞయందు కల్గినవాడు. వికేశియందు అగ్నికి కేతువు జన్మించాడు.

నక్షత్రనామ్న్యః క్షేత్రేషు దాక్షాయణ్యః సుతాః స్మృతాః ।
స్వర్భానుః సింహికాపుత్రో భూతసరమోహనోఽసురః ॥50॥

చంద్రార్కగ్రహనక్షత్రేష్వభిమానీ ప్రకీర్తితః ।
స్థానాన్యేతాని చోక్తాని స్థానిన్యశ్చైవ దేవతాః ॥51॥

దక్షుని పుత్రికలు అశ్విన్యాది నక్షత్రాలు.భూతాలకు సమ్మోహనం కల్గించే రాహువు సింహికాపుత్రుడగు రాక్షసుడైనా చంద్రార్కగ్రహనక్షత్రాలలో ఒకడుగా అభిమతుడై ఆరాధింపబడుతున్నాడు. ఇలా జ్యోతి స్థానాలనూ, ఆ స్థానాల కభిమానులగు దేవతలనూ గురించి తెలిపాను.

శుక్లమగ్నిసమం దివ్యం సహస్రాంశోర్వివస్వతః ।
సహస్రాంశుత్విషః స్థానమమ్మయం తేజసం తథా ॥52॥
ఆప్యంస్థానం మనోజ్ఞస్య రవిరశ్మిగృహే స్థితమ్ ।

ఆ జ్యోతిస్థానాల భౌతిక సంస్థానాన్ని వివరిస్తాను. సహస్రకిరణుడైన సూర్యుని స్థానం అగ్నిమయ జ్యోతిర్గోళము. అలాగే వేలకాంతులు కల చంద్రుని స్థానం జలమయం. మనోజ్ఞుడైన బుధుని స్థానం సూర్యకాంతి గృహం.

శుక్రః షోడశ రశ్మిస్తు యస్తు దేవో హ్యాపోమయః ॥53॥

పదహారు కిరణాలతో ప్రకాశించే శుక్రునిది జలమయస్థానం.

లోహితో నవరశ్మిస్తు స్థానమాపంతు తస్య వై ।
బృహద్ద్వాదశ రశ్మీకం హరిద్రాభం తు వేధసః ॥54॥

తొమ్మిది కాంతులుకల ఎరుపుగ్రహమైన కుజునిదీ (మంగళః) జలమేస్థానం. 12 కాంతిమండలాలుకలిగి, పసుపురంగుతో బృహస్పతి ప్రకాశిస్తాడు .

అష్ట రశ్మి శనే స్తత్తు కృష్ణం వృద్ధ మయస్మయమ్ ।
స్వర్భానోస్త్వాయసం స్థానం భూతసంతాపనాలయమ్ ॥55॥

ఎనిమిది కాంతిపుంజాలుకల శనిగ్రహం నల్లని రంగుతో ఇనుమును కూడి ఉంటుంది. ప్రాణుల తాపానికి నిలయుడైన రాహువుకూడా ఇనుమునే స్థానంగా కలిగి ఉంటాడు.

సుకృతామాశ్రయాస్తారా రశ్మయస్తు హిరణ్మయాః ।
తారణాత్తారకాః హ్యేతాః శుక్లత్వాచ్చైవ తారకాః ॥56॥

పుణ్యాత్ములకు స్థానమైనవి నక్షత్రాలు. వానివి బంగారు కిరణాలు. అవి తరింప చేస్తాయి కనుక తారకలు అన్నపేరు కలవయ్యాయి. అంతేకాదు. అవి తెల్లగా ఉంటాయి కనుక కూడా తారకలు అయ్యాయి. నాడులు గల పచ్చని ప్రకాశం కల గోళం. శనిగోళం ఎనిమిదినాడులుగలదై నల్లనిదై ఇనుముతో నిర్మించబడింది. రాహుగోళం భూతసంతాపనం కల్గించేది. ఇతని కిరణాలు శుక్ల నామకాలు కాన తారకలనబడుతున్నవి. ఇవి సూర్యకిరణాలే ఇవి తారలకు తాపం కల్గించేవి.

నవయోజనసాహస్రో విష్కంభః సవితుః స్మృతః ।
మణ్డలం త్రిగుణం చాస్య విస్తారో భాస్కరస్య ॥57॥

ద్విగుణః సూర్యవిస్తారాద్విస్తారః శశినః స్మృతః ।
త్రిగుణం మణ్డలం చైస్య వైపుల్యాచ్ఛశినః స్మృతమ్ ॥58॥

సూర్యమండలవ్యాసం తొమ్మిదివేల యోజనాలు. దానిచుట్టు కొలత అంతకు మూడింతలు. 27000 చంద్రుని వ్యాసం సూర్యునివ్యాసం కంటే రెండు రెట్లెక్కువ(?) పరిధి ఆ వ్యాసం కంటే మూడురెట్లు ఎక్కువ.

సర్వోపరి నిసృష్టాని మణ్డలాని తు తారకాః ।
యోజనార్ధప్రమాణాని తాభ్యోఽన్యాని గణాని తు ॥59॥

తుల్యో భూత్వా తు స్వర్భానుస్తదధస్తాత్ప్రసర్పతి ।
ఉద్ధృత్య పార్థివీం ఛాయాం నిర్మితాం మణ్డలాకృతిమ్ ॥60॥

తారకలు వీటన్నికంటె పైన ఉన్నాయి. వాటివ్యాసం అర్ధయోజన పరిమితమే. రాహువు అంతే వ్యాసంకలిగి నక్షత్రాలకంటే క్రింది భాగంలో సంచరిస్తాడు. రాహువు భూమియొక్క ఛాయను మండలాకారంగా చేసుకొని ఉంటాడు.

బ్రహ్మణా నిర్మితం స్థానం తృతీయం తు తమోమయమ్ ।
ఆదిత్యాత్స తు నిష్క్రమ్య సోమం గచ్ఛతి పర్వసు ॥61॥

ఆదిత్యమేతి సోమాచ్చ పునః సౌరేషు పర్వసు ।
స్వభాసా తుదతే యస్మాత్స్వర్భానురితి స స్మృతః ॥62॥

బ్రహ్మనిర్మించిన అతని స్థానం పెద్దదే, కాని అది తమోమయమై వుంటుంది. అతడు పూర్ణిమలందు సూర్యునినుండి చంద్రుని వద్దకు పోతుంటాడు. అమావాస్యలందు చంద్రునినుండి సూర్యునివద్దకు పోతూ వుంటాడు. తన కిరణాలతో సూర్యుణ్ణి బాధిస్తాడు కాన అతనికి స్వర్భానుడని పేరు.

చంద్రతః షోడశో భాగో భార్గవస్య విధీయతే ।
విష్కంభాన్మణ్డలాచ్చైవ యోజనానాం తు స స్మృతః ॥63॥

చంద్రునిలో పదునారవవంతు శుక్రమండలం ఉంటుందని చెప్పబడింది. విస్తారం చేతా మొత్తం చుట్టుకొలత చేతా శుక్రగ్రహం అలా చెప్పబడింది.

భార్గవాత్పాదహీనశ్చ విజ్ఞేయో వై బృహస్పతిః ।
బృహస్పతేః పాదహీనౌ కేతువక్రావుభౌ స్మృతౌ ॥64॥

శుక్రునిలో నాల్గవవంతు తీసివేస్తే బృహస్పతి మండలమవుతుంది. బృహస్పతి మండలంలో నాల్గవభాగం తగ్గిస్తే కేతుగ్రహ అంగారక గ్రహాల పరిధి అవుతుంది.

విస్తారమణ్డలాభ్యాం తు పాదహీనస్తయోర్బుధః ।
తారానక్షత్రరూపాణి వపుష్మన్తీహ యాని వై ॥65॥

బుధేన సమరూపాణి విస్తారాన్మణ్డలాత్తు వై ।
తారానక్షత్రరూపాణి హీనాని తు పరస్పరమ్ ॥66॥

శతాని పంచ చత్వారి త్రీణి ద్వే చైకమేవ చ ।
సర్వోపరి నిసృష్టాని మణ్డలాని తు తారకాః ॥67॥

యోజనార్ధప్రమాణాని తేభ్యో హ్రస్వం న విద్యతే ।
ఉపరిష్టాత్తు యే తేషాం గ్రహా యే క్రూరసాత్త్వికాః ॥68॥

బృహస్పతి మండలంలో నాల్గవభాగం తగ్గిస్తే బుధమండలమవుతుంది. తారలూ, నక్షత్రాలూ అనే రెండు రకాలు బుధమండలంతో సమమగు మండలం కల్గివున్నాయి. ఇవి ఒకదానికంటే ఇంకొకటి తక్కువ తక్కువ పరిమాణం కల్గివున్నాయి. ఇవి వంద, రెండువందలూ, మూడువందలూ, నాలుగు వందల యోజనాల విస్తృతం కల్గి ఉంటాయి. ఈ మండలాలకు పైభాగంలో తారలున్నాయి. పూర్వం చెప్పిన విధంగా వీటిలో ఒక్కొక్కదాని విస్తారం అర్ధయోజనమై యున్నది (మైళ్ళు). ఇంతకంటె చిన్న మండలాలు కల జ్యోతిస్సులు లేవు. వాటిపైన ఉండే గ్రహాలు క్రూరములు, సాత్త్వికాలుగానూ ఉన్నాయి.

విశే. తారలు చిన్నవి. నక్షత్రాలు పెద్దవి.

సౌరశ్చాంగిరసో వక్రో విజ్ఞేయా మన్దచారిణః ।
తేభ్యోఽధస్తాత్తు చత్వారః పునశ్చాన్యే మహాగ్రహాః ॥69॥

సోమః సూర్యో బుధశ్చైవ భార్గవశ్చేతి శీఘ్రగాః ।
యావన్తి చైవ ఋక్షాణి కోట్యస్తావన్తి తారకాః ॥70॥

ఈ జ్యోతిస్సులకు పైగా ఉన్న శని (వక్ర), బృహస్పతి –అంగారకగ్రహాలు మంద సంచారం కలవి. ఈ నక్షత్రాలకు క్రిందుగా చంద్రుడూ, రవీ, బుధుడూ, శుక్రుడూ ఉన్నారు. వారు వేగంగా సంచరిస్తారు. ఈ గ్రహాలు గూడా నక్షత్రమండలానికి క్రిందిభాగంలోనే ఉన్నాయి. దేవత్వం పొందిన నక్షత్రాత్ము లెందరున్నారో, అన్నికోట్ల తారకలూ అంతరిక్షంలో ఉన్నాయి.

సర్వేషాం తు గ్రహణాం వై సూర్యోఽధస్తాత్ప్రసర్పతి ।
విస్తీర్ణం మణ్డలం కృత్వా తస్యోర్ధ్వం చరతే శశీ ॥71॥

నక్షత్రమణ్డలం చాపి సోమాదూర్ధ్వం ప్రసర్పతి ।

అన్నింటికంటె దిగువ సూర్యుడున్నాడు. విస్తీర్ణమైన మండలం కల చంద్రుడు సూర్యునిపైన ఉన్నాడు. చంద్రునిపైన నక్షత్రమండలం చరిస్తున్నది.

నక్షత్రేభ్యో బుధశ్చోర్ధ్వం బుధాచ్చోర్ధ్వం తు భార్గవః ॥72॥

వక్రస్తు భార్గవాదూర్ధ్వం వక్రాదూర్ధ్వం బృహస్పతిః ।
తస్మాచ్ఛనైశ్చరశ్చోర్ధ్వం దేవాచార్యోపరి స్థితః ॥73॥

శనైశ్చరాత్తథా చోర్ధ్వం జ్ఞేయం సప్తర్షిమణ్డలమ్ ।
సప్తర్షిభ్యో ధ్రువశ్చోర్ధ్వం సమస్తం త్రిదివం ధ్రువే ॥74॥

నక్షత్రాలకు పైన బుధుడు, బుధునిపైన శుక్రుడూ, అతనిపై కుజుడు, అతనిపైన బృహస్పతీ, ఆ బృహస్పతిపై శనీ, అతనిపై సప్తర్షిమండలమూ, ఆ సప్తర్షిమండలంపై ధ్రువుడూ ఉన్నారు. ఇలా ధృవమండలంలో స్వర్గంఉంది.

ద్విగుణేషు సహస్రేషు యోజనానాం శతేషు చ ।
గ్రహాన్తరమథైకైకమూర్ధ్వం నక్షత్రమణ్డలాత్ ॥75॥

తారాగ్రహాన్తరాణి స్యురుపర్యుపర్యధిష్ఠితమ్ ।

ఈ గ్రహాలన్నీ ఒకదానికొకటి రెండు వేల రెండువందల యోజనాల వ్యవధానంతో నక్షత్రమండలానికిపైన ఉంటాయి. తారలైతే ఒకదానిపైన ఒకటి ఉంటూ గ్రహాలమధ్యలో ఉంటాయి.

గ్రహాశ్చ చంద్రసూర్యౌ చ దివి దివ్యేన తేజసా ॥76॥

నక్షత్రేషు చ యుజ్యన్తే గచ్ఛన్తో నియతక్రమాత్ ।
చంద్రార్కగ్రహనక్షత్రా నీచోచ్చ గృహమాశ్రితాః ॥77॥

ఈ తారాగ్రహాలు, చంద్రసూర్యులు, ద్యులోకంలో దివ్యతేజస్సుతో భాసిస్తున్నవి. అవి అశ్విన్యాది నక్షత్రాలలో నియమాన్ని అనుసరించి సంచరిస్తూ వుంటాయి. ఈ చంద్రార్కగ్రహ నక్షత్రాలు నీచగతి, ఉచ్చగతి, మృదుగతులతో చరిస్తూ వుంటాయి.

సమాగమే చ భేదే చ పశ్యన్తి యుగపత్ ప్రజాః ।
పరస్పరం స్థితా హ్యేవం యుజ్యన్తే చ పరస్పరమ్ ॥78॥

ఇవి కలిసి ఉండుట, విడిపోవుట అన్న రెండు అవస్థల్నీ ఒకేసారి ప్రజలు చూడగలుగుతారు. అవి తమతోతాము కలిసీ ఉంటాయి. విడివిడిగానూ ఉంటాయి.

అసంకరేణ విజ్ఞేయస్తేషాం యోగస్తు వై బుధైః ।
ఇత్యేవ సన్నివేశే వై పృథివ్యా జ్యోతిషాం చ యః ॥79॥

పండితులచే ఆ గ్రహాదుల కలయిక సంకరం లేకుండా తెలియదగింది. ఇదే భూమియొక్కయూ, ప్రకాశితములయొక్కయూ సన్నివేశం. వీటికి సమాగమ భేదాలనే స్థితులు కలుగుతుంటాయి. వాటిని గణనాప్రకారం బుధులు తెలుసుకొంటారు.

ద్వీపానాముదధీనాం చ పర్వతానాం తథైవ చ ।
వర్షాణాం చ నదీనాం చ యే చ తేషు వసన్తి వై ॥80॥
ఇత్యేషో ఽర్కవశేనైవ సన్నివేశస్తు జ్యోతిషామ్ ।
ఆవర్తః సాన్తరో మధ్యే సంక్షిప్తశ్చ ధ్రువాత్తు సః ॥81॥

ఈ రీతిగా పృథివీసన్నివేశం, జ్యోతిస్సన్నివేశం, ద్వీపాలు, సాగరాలు, పర్వతాలు, వర్షాలు, జ్యోతిరాత్మక దేవగృహాలు-వీటి సన్నివేశాలు, సూర్యుణ్ణి ఆశ్రయించి యున్నవి. ధ్రువాశ్రితమైన ఆద్యంతప్రాంతమధ్య ప్రదేశాల అంతరిక్షజ్యోతిర్గోళవ్యవస్థ మీకు తెలిపాను.

సర్వతస్తేషు విస్తీర్ణో వృత్తాకార ఇవోచ్ఛ్రితః ।
లోకసంవ్యవహారార్థమీశ్వరేణ వినిర్మితః ॥82॥

ఆ గోళాలలో విస్తారమైన ఎత్తై గుండ్రని ఆకారంవలె ఉండే వ్యవస్థని లోకవ్యవహారం కొరకు ఈశ్వరుడు ఏర్పరిచాడు;

కల్పాదౌ బుద్ధిపూర్వం తు స్థాపితో ఽసౌ స్వయంభువా ।
ఇత్యేష సన్నివేశో వై సర్వస్య జ్యోతిరాత్మకః ॥83॥

తదనుగుణంగా కల్పాదియందు బ్రహ్మ బుద్ధిపూర్వకంగా ఈ వ్యవస్థ నేర్పరచాడు. ఈ జ్యోతిర్వ్యవస్థ దాని కనుగుణమైనదే.

వైశ్వరూపం ప్రధానస్య పరిణామో ఽస్య యః స్మృతః ।
తేషాం శక్యం న సంఖ్యాతుం యాథాతథ్యేన కేనచిత్ ।
గతాగతం మనుష్యేణ జ్యోతిషాం మాంసచక్షుషా ॥84॥

ప్రధానము యొక్క వైశాల్యం యేది చెప్పబడిందో అదే ఈ గోళవ్యవస్థ విశ్వరూపం. దీనిని యథాతథంగా పరిగణన చేయడానికెవనికీ శక్యం కాదు. అట్లే జ్యోతిర్గోళాల రాకపోకల సంచారం గ్రహించడానికి మాంసచక్షువు గల మనుజునికి అసాధ్యమైయున్నది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే భువనకోశే ఖగోళసంస్థానవర్ణనం నామాష్టవింశత్యధికశతతమో ఽధ్యాయః॥128॥

శ్రీ మత్స్యమహాపురాణంలో ఖగోళసంస్థానవర్ణనమనే నూటఇరవై ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోన త్రింశదుత్తరశతతమోऽధ్యాయః - నూటఇరవైతొమ్మిదవ అధ్యాయం
త్రిపురాసురోపాఖ్యాన ప్రారంభః - త్రిపురాసురోపాఖ్యాన ప్రారంభం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

కథం జగామ భగవాన్ పురారిత్వం మహేశ్వరః ।
దదాహ చ కథం దేవస్తన్నో విస్తరతో వద ॥1॥

సూతా! భగవంతుడైన మహేశ్వరుడు పురారిత్వాన్ని ఎలా పొందాడు? ఆయన పురాలను ఏలాగున దహించాడు? ఈ సంగతి మాకు విస్తృతంగా వివరించు.

పృచ్ఛామస్త్వాం వయం సర్వే బహుమానాత్పునః పునః ।
త్రిపురం తద్యథా దుర్గం మయమాయా వినిర్మితమ్ ।
దేవేనైకేషుణా దగ్ధం తథా నో వద మానద! ॥2॥

అహంకారాన్ని ఖండించేవాడా! నీమీది గౌరవంతో మేమంతా మాటిమాటికీ నిన్ను ప్రశ్నిస్తున్నాము. ఆ త్రిపురదుర్గాన్ని మాయతో మయు డేరీతిగా నిర్మించాడో, దేవుడు ఒక్క బాణంతో దాని నెలా కాల్చివేశాడో, అది మాకు చెప్పు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

శృణుధ్వం త్రిపురం దేవో యథా దారితవాన్ భవః ।
మయో నామ మహామాయో మాయానాం జనకోऽసురః ॥3॥

దేవుడైన శివుడు త్రిపురాలనూ ఎలా కూల్చాడో వినండి! మయుడనే మహామాయావి యైన మాయలమారి అసురు డొకడుండేవాడు.

నిర్జితః స తు సంగ్రామే తతాప పరమం తపః ।
తపస్యన్తం తు తం విప్రా! దైత్యేంద్రోపర్యనుగ్రహాత్ ॥4॥

తస్యైవ కృత్యముద్దిశ్య తేపతుః పరమం తపః ।
విద్యున్మాలీ చ బలవాంస్తారకాక్షశ్చ వీర్యవాన్ ॥5॥

అతడు యుద్ధంలో పరాజితుడై తీవ్రవతపస్సు చేశాడు. విప్రులారా! అతడు తపస్సు చేస్తుండగా మరి యిద్దరు దైత్యులు అతనిపై అనుగ్రహంతో సానుభూతి గలవారై - అతని కార్యాన్నే ఉద్దేశించి ఘోరతపస్సు చేశారు. వారు బలశాలియైన విద్యున్మాలి, వీర్యవంతుడైన తారకాక్షుడు అనేవారు.

మయతేజః సమాక్రాన్తౌ తేపతుర్మయపార్శ్వగౌ ।
లోకా ఇవ యథా మూర్తాస్త్రయస్త్రయ ఇవాగ్నయః ॥6॥

మయుని తేజస్సుచే ఆక్రమింపబడిన వారిరువురూ అతని చెంతనే ఉండి తపస్సు కావించారు. మూర్తీభవించిన మూడు లోకాలవలెనూ, మూడు అగ్నులు లాగానూ ఆ ముగ్గురూ కనిపించారు.

లోకత్రయం తాపయన్తస్తే తేపుర్దానవాస్తపః ।
హేమన్తే జలశయ్యాసు గ్రీష్మే పంచతపే తథా ॥7॥

వర్షాసు చ తథాఽఽకాశే క్షపయన్తస్తపఃప్రియాః ।
తేవనాత్ఫలమూలాని స్వాదూని చ మృదూని చ ॥8॥

ముల్లోకాలనూ తపింపజేస్తూ ఆ దానవులు తపస్సు కొనసాగించారు. హేమంతంలో జలశయ్యల మీదా, గ్రీష్మంలో పంచాగ్ని మధ్యంలోనూ, వర్షాకాలంలో ఆకాశంలోనూ కాలం గడుపుతూ తపఃప్రియులై రుచికరములై మృదువులైన వనం నుండి తెచ్చిన ఫలమూలాలు సేవిస్తూ తపస్సు అనుష్ఠించారు.

అన్యథా చరితాహారాః పంకేనాచితవల్కలాః ।
మగ్నాః శైవాలపంకేషు విమలా విమలేషు చ ॥9॥

ఒక్కొక్కసారి ఆహారం తీసుకొనేవారు. ఒక్కొక్కసారి బురదపై బడిన వల్కలాలతో గూడినవారై పాచిబురదలో మునిగి, మరొక్కసారి నిర్మల జలాలలో నిర్మలులుగానూ ఉంటూ తపోనిష్ఠ సాగించారు.

నిర్మాంసాశ్చ తతో జాతాః కృశా ధమనిసన్తతాః ।
తేషాం తపఃప్రభావేన ప్రభావవిధుతం యథా ॥10॥

నిష్ప్రభం తు జగత్సర్వం మన్దతేజా విభావసుః ।
దహ్యమానేషు లోకేషు త్రైస్త్రిభిర్దానవాగ్నిభిః ॥11॥

వారి శరీరాలు మాంసరహితాలై కృశించి ధమనులు మిగిలినవయ్యాయి. వారి తపః ప్రభావంతో విచలితమై జగమంతా కాంతిహీన మయింది. ఆ మూడు దానవాగ్నులచేత లోకాలు దగ్ధ మవుతుండగా ఈ దురవస్థ ఏర్పడింది.

తేషామగ్రే జగద్బంధుః ప్రాదుర్భూతః పితామహః ।
తతః సాహసకర్తారః ప్రాహుస్తే సహసాఽఽగతమ్ ॥12॥

వారి యెదుట జగద్బంధువైన బ్రహ్మదేవుడు సాక్షాత్కరించాడు. సాహసోపేతులైన వారు శీఘ్రంగా వచ్చిన బ్రహ్మతో ఇలా అన్నారు.

స్వకం పితామహం దైత్యాస్తం వై తుష్టువురేవ చ ।
అథ తాన్దానవాన్ బ్రహ్మా తపసా తపనప్రభాన్ ॥13॥

ఉవాచ హర్షపూర్ణాక్షో హర్షపూర్ణముఖస్తదా ।
వరదోఽహం హి వో వత్సాస్తపస్తోషిత ఆగతః ॥14॥

తమ పితామహుడైన బ్రహ్మను వారు స్తుతించారు. తపస్సుచే సూర్యతేజస్కులైన ఆ దానవులతో హర్షపూర్ణమైన నేత్రాలు, వదనమూ కలవాడై బ్రహ్మ ఇలా చెప్పాడు. "వత్సలారా! నేను మీకు వరదుడను.మీ తపస్సుకు సంతోషించి మీ చెంతకు వచ్చాను.

ప్రియతామీప్సితం యచ్చ సాభిలాషం తదుచ్యతామ్ ।
ఇత్యేవముచ్యమానం తం ప్రసన్నం ప్రపితామహమ్ ॥15॥

విశ్వకర్మా మయః ప్రాహ ప్రహర్షోత్ఫుల్లలోచనః ।

మీ కోరిక లేమిటో చెప్పండి. మీ అభిలాష ప్రకటించండి". అలా అంటున్న ప్రసన్నుడైన పితామహునితో సంతోషంతో వికసించిన నేత్రాలు గల విశ్వకర్మమయుడు ఇలా అన్నాడు.

దేవ! దైత్యాః పురా దేవైః సంగ్రామే తారకాహ్వయే ॥16॥
నిర్జితాస్తాడితాశ్చైవ హతాశ్చాప్యాయుధైరపి ।
దేవైర్వైరానుబన్ధాచ్చ ధావన్తో భయవేపితాః ॥17॥

దేవా! పూర్వం దేవతలతో జరిగిన తారకయుద్ధంలో దైత్యులు ఓడిపోయారు, దెబ్బలు తిన్నారు. ఆయుధాలచే నిహతులైనారు. దేవతలతో ఏర్పడిన వైరానుబంధం వల్ల పరుగెత్తి పోయినవారై భయంతో కంపించిపోయారు.

శరణం నైవ జానీమః సర్వదా శరణార్థినః ।
సోఽహం తపఃప్రభావేన తవ భక్త్యా తథైవ చ ॥18॥

ఇచ్ఛామి కర్తుం తద్దుర్గం యద్దేవైరపి దుస్తరమ్ ।
తస్మింశ్చ త్రిపురే దుర్గే మత్కృతే కృతినాం వర! ॥19॥

భూమ్యానాం జలజానాం చ శాపానాం మునితేజసామ్ ।
దేవప్రహరణానాం చ దేవానాం చ ప్రజాపతేః ॥20॥

అలఙ్ఘనీయం భవతు త్రిపురం యది తే ప్రియమ్ ।
విశ్వకర్మా ఇతి ప్రోక్తః స తదా విశ్వకర్మణా ॥21॥

ఉవాచ ప్రహసన్వాక్యం మయం దైత్యగణాధిపమ్ ।

మాకు శరణ మేమిటో తెలియలేదు. శరాణార్థుల మయ్యాము. మేము నీ పట్ల భక్తితో తపః ప్రభావంతో దేవతలకు గూడా దుస్తరమైన దుర్గాన్ని నిర్మించాలని కోరుతున్నాము. "నిపుణవర్యా! మేము నిర్మించిన ఆ త్రిపురదుర్గం భూతలస్థులకూ, జలప్రాణులకూ, శాపాలకూ, ముని తేజస్సులకూ, దేవతల ఆఘాతాలకూ, దేవతలకూ, ప్రజాపతికీ,

అలంఘనీయం అగుగాక! ఇది నీకు సమ్మతమైతే అనుగ్రహించు." ఈ రీతిగా విశ్వకర్మ చెప్పేసరికి నవ్వుతూ దైత్యగణాధిపుడైన మయునితో బ్రహ్మ ఇలా అన్నాడు–

సర్వామరత్వం నైవాస్తి అసద్వృతస్య దానవ! ॥22॥
తస్మాద్దుర్గవిధానం హి క్షణాదపి విధీయతామ్ ।

పితామహవచః శ్రుత్వా తదైవం దానవో మయః ॥23॥
ప్రాంజలిః పునరప్యాహ బ్రహ్మాణం పద్మసంభవమ్ ।

శంభురేకేషుణా దుర్గం సకృన్ముక్తేన నిర్దహేత్ ॥24॥

దానవా! దుర్వృత్తి గలవారికి సర్వామరత్వం లేదు. అందువల్ల అమరత్వం కోరక దుర్గనిర్మాణం క్షణంలో చేయుము." అలా చెప్పిన బ్రహ్మ మాట విని మయదానవుడు ప్రాంజలియై పద్మజుడైన బ్రహ్మతో మరలా ఇలా అన్నాడు. "శివుడు ఒక్కసారి ప్రయోగించిన ఒకే ఒక్కబాణంతో ఆ దుర్గాన్ని దహించాలి.

స చ నః సంయుగే హన్యాదవధ్యం శేషతో భవేత్ ।
ఏవమస్త్వితి చాప్యుక్త్వా మయం దేవః పితామహః ॥25॥

అతడు యుద్ధంలో ఒకేసారి మమ్ము చంపాలి." మరొకవిధంగా మాకు వధ్యత్వం ఉండరాదు. అది విని బ్రహ్మ అలాగే అగుగాక!' అని మయునితో చెప్పాడు.

స్వప్నే లబ్ధో యథాఽర్థో వై తత్రైవాదర్శనం యయౌ ।
గతే పితామహే దైత్యా గత్వా వహ్నిరవిప్రభాః ॥26॥

వరదానాద్విరేజుస్తే తపసా చ మహాబలాః ।
స మయస్తు మహాబుద్ధిర్దానవో ఋషిసత్తమాః ॥27॥

ఆపై స్వప్నంలో లభించిన అర్థం లాగా బ్రహ్మ అక్కడే అంతర్ధానమై పోయాడు. పితామహుడు వెళ్ళగానే అగ్నిసూర్యతేజస్కులైన దైత్యులు వరదానంవల్లా, తపస్సువల్లా మహాబలంతో చెలరేగి పోయారు. ఋషివర్యులారా! మహాబుద్ధిగల దానవుడైన ఆ మయుడు దుర్గనిర్మాణం చేయాలని నిశ్చయించుకొన్నాడు.

దుర్గం వ్యవసితః కర్తుమితి చాచిన్తయత్తదా ।
కథం నామ భవేద్దుర్గం తన్మయా త్రిపురం కృతమ్ ॥28॥

అలా నిశ్చయించుకొని దుర్గనిర్మాణం చేయాలని ఇలా ఆలోచించాడు. "నేను త్రిపుర దుర్గాన్ని ఎలా నిర్మించేది"?

వత్స్యతే తత్పురం దివ్యం మత్తో నాన్యైర్న సంశయః ।
యథా చైకేషుణా తేన తత్పురం న హి హన్యతే ॥29॥

దేవైస్తథా విధాతవ్యం మయా మతివిచారణమ్ ।
విస్తరో యోజనశతమేకైకస్య పురస్య తు ॥30॥

కార్యస్తేషాం చ విష్కంభశ్చైకైకం శతయోజనమ్ ।
పుష్యయోగేన నిర్మాణం పురాణాం చ భవిష్యతి ॥31॥

పుష్యయోగేన చ దివి సమేష్యన్తి పరస్పరమ్ ।
పుష్యయోగేన యుక్తాని యస్తాన్యాసాదయిష్యతి ॥32॥

పురాణ్యేకప్రహారేణ శతాని నిహనిష్యతి ।
ఆయసం తు క్షితితలే రాజతం తు నభస్తలే ॥33॥

రాజతస్యోపరిష్టాత్తు సౌవర్ణం భవితా పురమ్ ।
ఏవం త్రిభిః పురైర్యుక్తం త్రిపురం తద్భవిష్యతి ॥34॥

నా పురం దివ్యంగా వుండాలి, అందులో నేను తప్ప వేరెవరూ నివసించరాదు, ఒక్క బాణంచే అది దేవతలచే ఎలా దహింపబడదో, అలా ఆ పురాన్ని నిర్మించాలి. ఒక్కొక్క పురం శతయోజనాలుండాలి. దాని వ్యాసం నూరు యోజనాలుండునట్లు నిర్మించాలి. పురాలను పుష్యయోగంతో నిర్మాణం చేయాలి. పుష్యయోగ ప్రభావంతో ఆ పురాలు పరస్పరం ఆకసంలో కలుసుకోగలవు. పుష్యయోగమునందు వాటిని సమీపించినవాడు మాత్రమే ఒక్కబాణం దెబ్బతో వాటిని కొట్టగలడు. భూతలంలో ఇనుముతో చేసినది, ఆకాశంలో వెండితో చేసినది, రజత నగరానికి పైన సువర్ణనిర్మితమూ ఐన పురాలుంటాయి. ఇలా మూడు పురాలతో గూడినది. త్రిపురమనబడుతుంది.

శతయోజనవిష్కంభైరన్తరస్తైద్దురాసదమ్ ।
అట్టాలకైర్యంత్రశతఘ్నిభిశ్చ సచక్రశూలోపలకంపనైశ్చ ।

ద్వారైర్మహామన్దరమేరుకల్పైః ప్రాకారశృంగైః సువిరాజమానమ్ ॥35॥

శతయోజన విస్తీర్ణమైన అంతరాలతో, అట్టాలకాలతో, యంత్రశతఘ్నులతో, శక్తులు, శూలాలు, రాళ్ళను విసిరే యంత్రాలతో, మహాద్వారాలతో, మేరు మందరాలతో సమమైన గొప్ప ప్రాకారాలతో ఆ పురం విరాజిల్ల గలదు.

సతారకాక్షేణ మయేన గుప్తం ఖస్థం చ గుప్తం తడిమాలినాఽపి ।
కో నామ హన్తుం త్రిపురం సమర్థో ముక్త్వా త్రినేత్రం భగవన్తమేకమ్ ॥36॥

తారకాక్షునిచే గూడిన మయునిచే రక్షింపబడినదీ, విద్యున్మాలిచే గుప్తమైనదీ అగు ఆ త్రిపురాన్ని భగవంతుడైన శివుడు తప్ప మరొక డెవుడు నశింపజేయ సమర్థుడు?

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే త్రిపురాసురోపాఖ్యానం నామ ఏకోనత్రింశదధికశతతమోఽధ్యాయః ॥ 129 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని త్రిపురాసురోపాఖ్యానమనే నూటఇరవై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

త్రింశదధికశతతమోऽధ్యాయః – నూటముప్పైయవ అధ్యాయం

త్రిపురనిర్మాణ కథనమ్ – త్రిపురనిర్మాణ కథనం

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

ఇతి చిన్తాయుతో దైత్యో దివ్యోపాయప్రభావజమ్ ।
చకార త్రిపురం దుర్గం మనఃసంచారచారితమ్ ॥1॥

ఈ విధంగా ఆలోచించి ఆ దైత్యుడు దివ్యమైన ఉపాయప్రభావంవల్ల కల్గినదీ, మనఃసంచారముచేత సంచరింపజేయబడేదీ అయిన త్రిపురదుర్గాన్ని నిర్మించాడు.

ప్రాకారోऽనేన మార్గేణ ఇహ చాత్ర చ గోపురమ్ ।
ఇహ చాట్టాలకద్వారమిహ చాట్టాలగోపురమ్ ॥2॥

ప్రాకారం ఈ మార్గంలో ఉండాలి, ఇక్కడ లేదా అక్కడ గోపురం, అట్టాలక (బురుజు) ద్వారమిటు, ఈ వైపున అట్టాలకగోపురముండాలి.

రాజమార్గ ఇతశ్చాపి విపులో భవతామితి ।
రథ్యోపరథ్యాశ్చ ఇత ఇహ చత్వర ఏవ చ ॥3॥

ఈ చోట విపులమైన రాజమార్గం, రథ్యలు, ఉపరథ్యలు ఇక్కడ ఉండాలి. చత్వరం ఇక్కడ ఏర్పాటు కావాలి.

ఇదమన్తఃపురస్థానం రుద్రాయతనమత్ర చ ।
అవటాని తడాగాని హ్యత్ర వాప్యః సరాంసి చ ॥4॥

ఇది అంతఃపురస్థానం, ఇక్కడ రుద్రాయతనం, గుంతలు, తటాకాలు, నడబావులు, సరస్సులు ఇక్కడ ఉండాలి.

ఆరామాశ్చ సభాశ్చాత్ర ఉద్యానాన్యత్ర వా తథా ।
వినిర్గమో దానవానాం భవత్యత్ర మనోహరః ॥5॥

ఆరామాలు, సభలూ ఇక్కడ, ఉద్యానాలు ఇక్కడ, దానవుల మనోజ్ఞమైన వాహ్యాళికి పోయే ప్రదేశం ఇక్కడ ఉండాలి.

ఇత్యేవం మానసం తత్రాకల్పయత్ పురకల్పవిత్ ।
మయేన తత్పురం సృష్టం త్రిపురం త్వితి విశ్రుతమ్ ॥6॥

అని ఈ విధంగా పురకల్పవేత్త యయిన మయుడు మానసపురాన్ని సంకల్పించాడు. అతడు సృష్టించిన ఆ పురం 'త్రిపురం' అని ప్రసిద్ధి గాంచింది.

కార్ష్ణాయసమయం యత్తు మయేన విహితం పురమ్ ।
తారకాక్షోఽ భితస్తత్ర కృతస్థానాధిపోఽ వసత్ ॥7॥

నల్లని యినుముతో మయుడు నిర్మించిన పురంలో తారకాక్షుడనేవాడు రాజయ్యాడు, వాడు అక్కడ స్థానాధికారిగా నివసించాడు.

యత్తు పూర్ణేందుసంకాశం రాజతం నిర్మితం పురమ్ ।
విద్యున్మాలీ ప్రభుస్తత్ర విద్యున్మాలీ త్వివాంబుదః ॥8॥

నిండు చంద్రునితో సమంగా వెండితో నిర్మించిన నగరానికి విద్యున్మాలి ప్రభువైనాడు. అతడు విద్యున్మాలియైన మేఘంలాగా భాసించాడు.

సువర్ణవికృతం యచ్చ మయేన విహితం పురమ్ ।
స్వయమేవ మయస్తత్ర గతస్తదధిపః ప్రభుః ॥9॥

ఇక మయుడు నిర్మించిన స్వర్ణమయనగరానికి ఆ మయుడే స్వయంగా పాలకుడయ్యాడు.

తారకస్య పురం తత్ర శతయోజనమంతరమ్ ।
విద్యున్మాలిపురం చాపి శతయోజనకేఽ న్తరే ॥10॥

తారకాక్షుని నగరం శతయోజనాంతరంతోనూ, విద్యున్మాలి పురం ఆపై శతయోజనా వ్యవధానంతోనూ ఏర్పాటయ్యాయి.

మేరుపర్వతసంకాశం మయస్యాపి పురం మహత్ ।
పుష్యసంయోగమాత్రేణ కాలేన స మయః పురా ॥11॥

మేరుగిరి సదృశమైన మయుని మహానగరం పుష్యనక్షత్ర సంయోగం కలకాలంలో నిర్మింపబడింది.

కృతవాంస్త్రిపురం దైత్యస్త్రినేత్రః పుష్పకం యథా ।
యేన యేన మయో యాతి ప్రకుర్వాణః పురం పురాత్ ॥12॥

ప్రతస్థే తత్ర తత్రైవ ప్రచక్రే మాయయా స్వయమ్ ।
కామరూపమయాన్యత్ర శతశోఽ థ సహస్రశః ।

రత్నాన్వితాని శోభన్తే భవనాని సురద్రుహామ్ ॥13॥

త్రినేత్రుడు పుష్పకాన్ని నిర్మించినట్లే మయుడు త్రిపురాన్ని నిర్మించాడు. అతడు పోయిన దారులు అతని మాయచే దుర్గాలుగా అలాగే ఏర్పడ్డాయి. కామరూపాలు, రత్నమయాలు, వందలకొలది భవనాలు నిర్మితాలయ్యాయి.

రత్నాన్వితాని శోభన్తే పురాణ్యమరవిద్విషామ్ ।
ప్రాసాదశతజుష్టాని కూటాగారోత్కటాని చ ॥14॥

అమర శత్రువుల పురాలు వందల కొలది ప్రాసాదాలు, కూటగృహోత్కటాలు గలిగి, రత్నసమేతాలై శోభిల్లాయి.

సర్వాణి కామగాని స్యుః సర్వలోకాతిగాని చ ।
సోద్యానవాపీకూపాని సపద్మసరవన్తి చ ॥15॥

అన్నీ కామగమనం కలవే, సర్వలోకాలనూ అతిక్రమించినవే, ఉద్యానవాపీకూపాలు గలవే, పద్మసరస్సులతో కూడినవే.

అశోకవనరమ్యాణి కోకిలారుతవన్తి చ ।
చిత్రశాలావిశాలాని చతుఃశాలోత్తమాని చ ॥16॥

సప్తాష్టాదశభౌమాని సుకృతాని మయేన చ ।
బహుధ్వజపతాకాని స్రగ్దామాలంకృతాని చ ॥17॥

కోకిలాలాపాలతో కూడిన అశోకవనాలు, చిత్రశాలలచే విశాలాలైన శ్రేష్ఠమగు చతుఃశాలలు, ఏడు లేక ఎనిమిది లేక పది అంతస్తుల భవనాలు, బహుధ్వజపతాకలు కలవి. పుష్పమాలా విభూషితాలు అయిన నిర్మాణాలు మయునిచే నిర్మించబడ్డాయి.

కింకిణీజాలశబ్దాని గంధవన్తి మహాన్తి చ ।
సుసంయుక్తోపలిప్తాని పుష్పనైవేద్యవన్తి చ ॥18॥

యజ్ఞధూమాన్ధకారాణి సంపూర్ణకలశాని చ ।
గగనావరణే భాన్తి హంసపంక్తినిభాని చ ॥19॥

కింకిణీ జాల శబ్దాలు కలవి, సుగంధబంధురాలు, గొప్పవి, చక్కగా అతికిన రంగులు గలవి, పుష్పనైవేద్యాలు గలవి, యజ్ఞధూమంచే చీకటిమయమైనవి, సంపూర్ణమైన కలశాలు గలవి, హంసపంక్తులవంటివి అగు నిర్మాణాలు గగనావరణంలో భాసించాయి.

పంక్తీకృతాని రాజన్తే గృహాణి త్రిపురే పురే ।
ముక్తాకలాపైర్లంబద్భిర్హసన్తీభిః శశిశ్రియమ్ ॥20॥

ఆ త్రిపురపురంలో వరుసగా నిర్మింపబడిన అలాంటి గృహాలు విరాజిల్లాయి. అవి వ్రేలాడే ముత్యాలచే చంద్రశోభను పరిహసిస్తున్నవా అన్నట్లున్నాయి.

మల్లికాజాతిపుష్పాద్యైర్గన్ధధూపాధివాసితైః ।
పంచేంద్రియసుఖైర్నిత్యం సమైః సత్పురుషైరివ ॥21॥

మల్లికాజాతి పుష్పాదులతో, గూడి గంధ ధూపాలచే అధివాసితాలైనవై, పంచేంద్రియాలకూ సుఖం కల్గించునవై, నిత్యమూ సత్పురుషులవలె అవి సమస్థితి కలిగి ఉన్నాయి.

హేమరాజతలోహాద్యమణిరత్నాంజనాంకితాః ।
ప్రాకారాస్త్రిపురే తస్మిన్ గిరిప్రాకారసన్నిభాః ॥22॥

బంగారు, వెండి, ఇనుమూ మున్నగు వాటిచే నిర్మితాలు, మణిరత్నాంజనముచే అంకితాలైన ఆ త్రిపురంలో ప్రాకారాలు గిరిసమూహాలను పోలి వున్నాయి.

ఏకైకస్మిన్ పురే తస్మిన్ గోపురాణాం శతం శతమ్ ।
సపతాకాధ్వజపటం దృశ్యతే గిరిశృంగవత్ ॥23॥

ఒక్కొక్క పురంలోనూ వందల కొలది గోపురాలూ, పతాకలు, ధ్వజపటాలు గలవై అవి కొండ శిఖరాలలాగా కనిపించాయి.

నూపురారవరమ్యాణి త్రిపురేఽన్తఃపురాణ్యపి ।
స్వర్గాతిరిక్తశ్రీకాణి తత్ర కన్యాపురాణి చ ॥24॥

నూపుర శబ్దముచే రమణీయమైనవీ, స్వర్గాన్ని మించిన శోభ గలవియై ఆ త్రిపురంలో అంతఃపురాలు, కన్యాపురాలు విలసిల్లాయి.

ఆరామైశ్చ విహారైశ్చ తడాగవటపల్వలైః ।
సరోభిశ్చ సరిద్భిశ్చ వనైశ్చోపవనైరపి ॥25॥

దివ్యభోగోపభోగాని నానారత్నయుతాని చ ।
పుష్పోత్కరైశ్చ సుభగాస్త్రిపురస్యోపనిర్గమాః ।
పరిఖాశతగంభీరాః కృతా మాయావినా పురా ॥26॥

ఆరామాలు, విహారాలు, తటకాలు, గుంటలు, చెరువులు, చెలమలు, సరస్సులు, నదులు, వనాలు, ఉపవనాలు, దివ్యభోగాలు, ఉపభోగాలు గలవి, నానారత్న సమేతాలు, పుష్పోత్కరములతో మనోజ్ఞాలు, పరిఖాశతముచే గంభీరాలుగా ఆ మాయావిచే అక్కడ నిర్మాణాలు చేయబడ్డాయి.

నిశమ్య తద్దుర్గవిధానముత్తమం కృతం మయేనాద్భుతవీర్యకర్మణా ।
దితేః సుతా దైవతరాజవైరిణః సహస్రశః ప్రాపురనన్తవిక్రమాః ॥27॥

అద్భుతమైన వీర్యకర్మలు గల మయుని చేత 'నిర్మితమై ఉత్తమమైన దుర్గవిధానాన్ని గూర్చి విని ఇంద్రశత్రువులైన దైత్యులు అనంత విక్రములై వేలకొలదిగా వచ్చి అందులో చేరారు.

తదాసురైర్దర్పితవైరిమర్దనైః కరీంద్రశైలేంద్ర మృగేంద్రసన్నిభైః ।
బభూవ పూర్ణం త్రిపురం తథా పురా యథామ్బరం భూరిజలైర్జలప్రదైః ॥28॥

ఆకాశం విస్తారజలం గల మేఘాలచే నిండినట్లు, గజేంద్రాలు, గిరీంద్రాలు, మృగేంద్రాలతో సమానమైన అసురబృందాలచే ఆ త్రిపురం నిండిపోయింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే త్రిపురనిర్మాణ కథనం నామ త్రింశదధికశతతమోఽధ్యాయః ॥ 130 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని త్రిపురనిర్మాణ కథనమనే నూటముప్పైయవ అధ్యాయం సంపూర్ణం

ఏకత్రింశదధికశతతమోఽధ్యాయః - నూటముప్పైఒకటవ అధ్యాయం
త్రిపురే దానవ ప్రవేశః - దైత్య దానవుల త్రిపుర ప్రవేశం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

నిర్మితే త్రిపురే దుర్గే మయేనాసురశిల్పినా ।
తద్దుర్గం దుర్గతాం ప్రాప బద్ధవైరైః సురాసురైః ॥1॥

అసురశిల్పి మయుడు దుర్గం నిర్మించగా అది బద్ధశత్రుత్వం గల సురాసురులకు నిజంగా దుర్గమయింది.

సకలత్రాః సపుత్రాశ్చ శస్త్రవన్తోఽన్తకోపమాః ।
మయాదిష్టాని వివిశుర్గృహాణి హృషితాశ్చ తే ॥2॥

మయుని ఆదేశానుసారంగా శస్త్రధారులై యముని వంటివారగు అసురులు సంతోషంగా భార్యలతో, బిడ్డలతో ఆ పురంలోని గృహాలలో ప్రవేశించారు.

సింహైర్వనమివానేకైః నక్రైరివ మహార్ణవః ।
వీరాశ్చైవాతిపారుష్యైః శరీరమివ రోమభిః ॥3॥

తద్వద్బలిభిరధ్యస్తం తత్పురం దేవతారిభిః ।
త్రిపురం సంకులం జాతం దైత్యకోటిశతాకులమ్ ॥4॥

పలు సింహాలు వనంలో ప్రవేశించినట్లు, మొసళ్ళు సముద్రంలో ప్రవేశించిన విధంగా, పరుషత్వాలు వీరులలోనూ, రోమాలు శరీరంలోనూ ప్రవేశించినట్లు బలవంతులైన దేవతా శత్రువులు ప్రవేశించిన ఆ త్రిపురం దైత్య కోటిశతాలచే ఆకులమై సంకులమయింది.

సుతలాదపి నిష్పత్య పాతాలాద్దానవాలయాత్ ।
ఉపతస్థుర్నభోదుర్గం యే చ గిర్యుపజీవినః ॥5॥

సుతలంనుండీ, దానవాలయమైన పాతాళంనుండీ వెలికివచ్చినవారు, గిరిపై జీవించేవారు ఆకాశదుర్గం చేరుకొన్నారు.

యో యం ప్రార్థయతే కామం సంప్రాప్తస్త్రిపురాలయాత్ ।
తస్య తస్య మయస్తత్ర మాయయా విదధాతి సః ॥6॥

ఎవడే కోరిక కోరినా, ఆ కోరిక అతనికి ఆ పురత్రయాలయం ద్వారా తీరేది. ఆ మయుడు తనమాయతో వారివారికి ఆ కోరికలు తీరునట్లు చేశాడు.

సచంద్రేషు ప్రదోషేషు సాంబుజేషు సరస్సు చ ।
ఆరామేషు సచూతేషు తపోధనవనేషు చ ॥7॥

స్వఙ్గాశ్చందనదిగ్ధాంగా మాతఙ్గాః సమదా ఇవ ।
మృష్టాభరణవస్త్రాశ్చ మృష్టస్రగనులేపనాః ॥8॥

ప్రియాభిః ప్రియకామాభిర్హావభావప్రసూతిభిః ।
నారీభిః సతతం రేముర్ముదితాశ్చైవ దానవాః ॥9॥

చంద్రుడు గల ప్రదోషకాలాలలో, పద్మాలు గల సరస్సులలో, మామిళ్ళు గల తోటలలో, తపోధనులుండే వనాలలో, మంచి శరీరాలు గలవారు, చందనం మైపూతగా పూసుకొన్నవారు, మత్తగజాల వంటివారు, మేలిమి వస్త్రాలు, ఆభరణాలు ధరించినవారు, మాల్యగంధానులేపనాలు గలవారు అయిన అసురులు హావభావాలు గల ప్రియమైన స్త్రీలతో గూడి సంతోషిస్తూ అక్కడ సదా క్రీడించారు.

మయేన నిర్మితే స్థానే మోదమానా మహాసురాః ।
అర్థే ధర్మే చ కామే చ నిదధుస్తే మతీః స్వయమ్ ॥10॥

మయుడు నిర్మించిన స్థానంలో ఆనందించే ఆ మహారాక్షసులు ధర్మార్థకామాలలో స్వయంగా తమ బుద్ధులను నిలిపారు.

తేషాం త్రితయయుక్తానాం త్రిపురే త్రిదశారిణామ్ ।
వ్రజతిస్మ సుఖం కాలః స్వర్గస్థానాం యథా తథా ॥11॥

ఆ త్రిపురంలో దేవతల శత్రువులు, ధర్మార్థ కామాసక్తులగు రక్కసులకు స్వర్గ నివాసులకు వలెనే సుఖంగా కాలం గడచిపోయింది.

శుశ్రూషన్తే పితౄన్ పుత్రాః పత్న్యశ్చాపి పతీంస్తథా ।
విముక్తకలహాశ్చాపి సానురాగాః పరస్పరమ్ ॥12॥

పుత్రులు తండ్రులను సేవించారు. పత్నులు పతులకు సేవలు చేశారు. అన్యోన్య కలహాలు వీడి అందరూ ప్రీతిగల్గి జీవించసాగారు.

నాధర్మస్త్రిపురస్థానాం బాధతే వీర్యవానపి ।
అర్చయన్తి దితేః పుత్రాస్త్రిపురాయతనే హరమ్ ॥13॥

బలమైన అధర్మంసైతం త్రిపురవాసులను బాధించలేదు. దితి పుత్రులు త్రిపురాలయంలో హరుణ్ణి అర్చించారు.

పుణ్యాహశబ్దా విప్రాణాం ఆశీర్వాదాశ్చ సర్వశః ।
సింజన్మంజులమంజీర వేణు వీణారవా మృదు ॥14॥

విప్రులు పుణ్యాహవచనాలను వేదంలోని ఆశీర్వాదాలను ఉచ్చరించారు. మనోజ్ఞంగా ధ్వనించే మంజీరశబ్దాలు వేణువీణానాదాలు వ్యాపించాయి.

హాసశ్చ వరనారీణాం చిత్తవ్యాకులకారకః ।
త్రిపురే దానవేంద్రాణాం రమతాం శ్రూయతే సదా ॥15॥

వనితల నవ్వులు త్రిపురంలో రమించే దానవేంద్రులకు చిత్తవ్యాకులత కల్గిస్తూ సదా వినిపించేవి.

తేషామర్చయతాం దేవాన్ బ్రాహ్మణాంశ్చ నమస్యతామ్ ।
ధర్మార్థకామతంత్రాణాం మహాన్ కాలోఽభ్యవర్తత ॥16॥

దేవతల నర్చిస్తూ, ద్విజులకు నమస్కరిస్తూ ధర్మార్థకామపరతంత్రులై చరించే ఆ దానవులకు అలా చాలా కాలం గడచిపోయింది.

అథాలక్ష్మీరసూయా చ తృడ్బుభుక్షే తథైవ చ ।
కలిశ్చ కలహశ్చైవ త్రిపురం వివిశుః సహ ॥17॥

అంతట అలక్ష్మి, అసూయ, దప్పిక, ఆకలి, కలి, కలహం-ఇవన్నీ కలిసి త్రిపురంలో ప్రవేశించాయి.

సంధ్యాకాలం ప్రవిష్టాస్తే త్రిపురం చ భయావహాః ।
సమధ్యాసుః సమం ఘోరాః శరీరాణి యథాఽఽమయాః ॥18॥

సంధ్యాసమయంలో ఆ త్రిపురంలో ప్రవేశించి భయావహాలైన ఆ దుర్లక్షణాలు, భీకరరోగాలు శరీరంలో ప్రవేశించినట్లు చొచ్చుకొని పోయి ఆ త్రిపురాన్ని అధిష్ఠించాయి.

సర్వ ఏవ నిశాన్తే తు సమయే త్రిపురాసురాః ।
తానుత్పాతాంస్తథా దృష్ట్వా విమృశన్తిస్మ దానవాన్ ॥19॥

సాయం సమయంలో త్రిపురాసురులందరూ ఆ ఉత్పాతాలను చూచి పరస్పరం విమర్శించుకొన్నారు.

ఉదితే చ సహస్రాంశౌ తేజశ్శుభకరే రవౌ ।
మయః సభామావివేశ భాస్కరాభామివాంబుజమ్ ॥20॥

ఒకరోజు శుభకాంతినిలయుడైన సూర్యుడుదయించగానే మయుడు పద్మం రవితేజస్సునువలె సభాస్థలమును ప్రవేశించాడు.

మేరుకూటనిభే రమ్యే ఆసనే స్వర్ణమణ్డితే ।
ఆసీనాః కాంచనగిరేః శృంగే తోయముచో యథా ॥21॥

వారు మేరు కూటంవంటి రమ్యమైన, స్వర్ణాలంకృతమైన ఆసనం మీద మేరుగిరి శిఖరంపై మేఘాలలాగా ఆసీనులయ్యారు.

పార్శ్వయోస్తారకాక్షశ్చ విద్యున్మాలీ చ దానవః ।
ఉపవిష్టౌ మయస్యాన్తే హస్తినః కలభావివ ॥22॥

మయుని కిరువైపులా తారకుడు, దానవుడైన విద్యున్మాలి మదపుటేనుగుచెంత ఏనుగు గున్నలవలె కూర్చున్నారు.

తతః సురారయః సర్వేఽ శేషకోపా రణాజిరే ।
ఉపవిష్టా దృఢం దృష్టాః దానవా దేవశత్రవః ॥23॥

తేష్వాసీనేషు సర్వేషు సుఖాసనగతేషు చ ।
మయో మాయాభిజనక ఇత్యువాచ స దానవాన్ ॥24॥

ఆపై రణాంగణంలో కోపోద్రిక్తులైన దేవశత్రువులైన దానవులు ఎంతగానో కలతజెంది కూర్చున్నారు. వారందరూ సుఖాసనాలలో కూర్చోగా మాయకు కారణజన్ముడైన మయుడు ఆ దనుజులతో ఇలా అన్నాడు–

ఖేచరాః దైత్యరాజానో భో భో దానవసత్తమాః ।
నిశామయధ్వం స్వప్నోఽ యం మయా దృష్టో భయావహః ॥25॥

ఓ ఖేచరులారా! ఖేచరులైన దానవరాజులారా! దనుజశ్రేష్ఠులారా! నేను చూచిన భీకరమైన స్వప్నమెటువంటిదో వినండి.

త్రయశ్చతస్రః పురుషాః ప్రమదాశ్చ మహాబలాః ।
కోపానలాదీప్తముఖాః ప్రవిష్టాస్త్రిపురం దివా ॥26॥

ముగ్గురు పురుషులు, నలుగురు స్త్రీలు, మహాబలవంతులైనవారు కోపాగ్నిచే దీప్తమైన ముఖాలతో పగటిపూట త్రిపురాలను ప్రవేశించారు.

ప్రవిశ్య రుషితాస్తే చ పురాణ్యతులవిక్రమాః ।
ప్రవిష్టాశ్చ శరీరాణి భూత్వా బహుశరీరిణః ॥27॥

రోషంతో అలా వారు ప్రవేశించి అతుల పరాక్రమంతో బహుశరీరాలు ధరించి మన శరీరాలలో దూరారు.

నగరం త్రిపురం చేదం తమసా సమవస్థితమ్ ।
సగృహం సహ యుష్మాభిః సాగరాంభసి మజ్జితమ్ ॥28॥

ఈ తమోమయమైన త్రిపురనగరాన్ని మీతోపాటు, మీ యిండ్లతో సహా సాగరజలాలలో ముంచివేశారు.

ఉలూక చంచుకా నారీ నగ్నాఽ ఽ రూఢా ఖరం తథా ।
పురుషః సిందుతిలకశ్చతురంఘ్రిస్త్రిలోచనః ॥29॥

గుడ్లగూబ ముక్కు గల నగ్న వనిత గాడిదనెక్కగా చూచాను. ఒక మగవాడు సిందూరతిలకం ధరించి నాల్గు కాళ్ళు, మూడు కళ్ళతో కనిపించాడు.

యేన సా ప్రమదా నున్నా అహం చైవ విబోధితః ।
ఈదృశీ ప్రమదా దృష్టా మయా చాతిభయావహా ॥30॥

ఆ పురుషుడు ఆ స్త్రీని తరుముకొన్నాడు. నన్ను మేల్కొలిపాడు. అట్టి మిక్కిలి భయం కల్గించే స్త్రీనిచూచాను.

మయా చైవం విధస్స్వప్నః దృష్టో వై దితినన్దనాః ।
దృష్టః కథం హి కష్టాయ అసురాణాం భవిష్యతి ॥31॥

దితి పుత్రులారా! నేను ఇలాంటి కలగన్నాను. ఇది అసురులకు ఎలా కష్టాలను కల్గిస్తుందో తెలియకున్నది.

యది వోఽహం క్షమో రాజా యదిదం వేత్థ చేద్ధితమ్ ।
నిబోధధ్వం సుమనసో న చాసూయితుమర్హథ ॥32॥

నేను మీకు సమర్థుడనగు రాజునైతే – ఈ హితమును మీరు గ్రహిస్తే మంచి మనస్సుతో గ్రహించండి అసూయ జెందకండి.

కామం చేర్ష్యాం చ కోపం చ అసూయాం సంవిహాయ చ ।
సత్యే దమే చ ధర్మే చ మునివాదే చ తిష్ఠత ॥33॥

కామాన్నీ, ఈర్ష్యనూ, కోపాన్నీ, అసూయనూ వదలి సత్యం, దమం, ధర్మం, మునివాదం – వీటిని పాటించండి.

శాన్తయశ్చ ప్రయుజ్యన్తాం పూజ్యతాం చ మహేశ్వరః ।
యది నామాస్య స్వప్నస్య హ్యేవం చోపరమో భవేత్ ॥34॥

శాంతిని ప్రతిష్ఠించండి! మహేశ్వరుణ్ణి పూజించండి! ఒకవేళ ఇలా చేస్తే, ఈ స్వప్నభయం తొలగవచ్చు.

కుప్యతే నో ధ్రువం రుద్రో దేవదేవస్త్రిలోచనః ।
యత్రోత్పాతాశ్చ దృశ్యన్తే యతో నస్త్రిపురేఽసురాః! ॥35॥

అసురులారా! దేవదేవుడైన త్రినేత్రుడు మనపట్ల నిజంగా ఆగ్రహించినాడు. మన త్రిపురంలో అసురులకు ఉత్పాతాలు కనిపిస్తున్నాయి.

కలహం వర్జయన్తశ్చ అర్జయన్తస్తథార్జవమ్ ।
స్వప్నశాంతిం ప్రతీక్షధ్వం కాలోదయమథాపి చ ॥36॥

కలహం వదలి, ఆర్జవం పాటించి, స్వప్నశాంతినీ, కాలోదయాన్నీ గమనించి ప్రవర్తించండి.

శ్రుత్వా దాక్షాయణీపుత్రా ఇత్యేవం మయభాషితమ్ ।
క్రోధేర్ష్యావస్థయా యుక్తా దృశ్యన్తే చ వినాశగాః ॥37॥

దాక్షాయణీపుత్రులగు దానవులు మయుని మాటలు విని క్రోధ – ఈర్ష్యా – అవస్థలతో కూడినవారై వినాశంవైపు పయనిస్తున్నట్లు కనిపించారు.

వినాశముపపశ్యన్తో హ్యలక్ష్మ్యావ్యాపితా సురాః ।
తత్రైవ దృష్ట్వా తేఽన్యోఽన్యం సంక్రోధా పూరితేక్షణాః ॥38॥

అథ దైవపరిధ్వస్తా దానవాస్త్రిపురాలయాః ।
హిత్వా సత్యం చ ధర్మం చ అకార్యాణ్యుపచక్రముః ॥39॥

వినాశాన్ని చూస్తూ అలక్ష్మిచే ఆవేశించబడిన అసురులు అన్యోన్యం చూచుకొన్నారు. క్రోధపూరిత నేత్రాలు కలవారై దైవోపహతులైన త్రిపురంలోని దానవులు సత్యధర్మాలు వదలి అకార్యాలకు ఉపక్రమించారు.

ద్విషన్తి బ్రాహ్మణాన్ పుణ్యాన్ నార్చయన్తి చ దేవతాః ।
గురూంశ్చైవావమన్యన్తే హ్యన్యోన్యం చాపి చుక్రుధుః ॥40॥

పుణ్యాత్ములైన బ్రాహ్మణులను ద్వేషించారు. దేవతాపూజ మానివేశారు, గురువులను అవమానించారు. ఒకరినొకరు కోపగించుకొన్నారు.

కలహేషు చ సజ్జన్తే స్వధర్మేషు హసన్తి చ ।
పరస్పరం చ నిఘ్నన్తి అహమిత్యేవ వాదినః ॥41॥

కలహాలకు సిద్ధమైనారు, స్వధర్మాన్ని పరిహసించారు. నేను నేను అంటూ పరస్పరం నిందించుకొన్నారు.

ఉచ్చైర్గురూన్ ప్రభాషన్తే నాభిభాషన్తి పూజితాన్ ।
అకస్మాత్సాశ్రునయనా జాయన్తే చ సముత్సుకాః ॥42॥

గురునింద చేయసాగారు. పూజితులతో సంభాషించరు. అకారణంగా కన్నీరు కారుస్తూ 'సముత్సుకులు కాజొచ్చారు.

దధిసక్తూన్ పయశ్చైవ కపిత్థాని చ రాత్రిషు ।
భక్షయన్తి చ శేరన్త ఉచ్ఛిష్టాః సంవృతాస్తథా ॥43॥

వారు రాత్రివేళ పెరుగు, సక్తువులు, వెలగపండ్లు తినసాగారు. సంస్కార రహితులై ఎంగిలిగా ఉండియే కప్పుకొని శయనించారు.

మూత్రం కృత్వా న స్పృశన్తి చాకృత్వా పాదధావనమ్ ।
సంవిశన్తి చ శయ్యాసు శౌచాచారవివర్జితాః ॥44॥

మూత్రవిసర్జన చేసి ఉదకోపస్పర్శ చేయరు. పాదధావనం చేయకనే శౌచాచార వర్జితులై శయ్యలలో శయనింపసాగారు.

సంకుచన్తి భయాచ్చైవ మార్జారాణాం యథాఖుకః ।
భార్యాం గత్వా న శుద్ధ్యన్తి రహోవృత్తిషు నిస్త్రపాః ॥45॥

పిల్లులకు ఎలుకలవలె భయంతో సంకోచించుకుపోయారు. సిగ్గు లేకుండా రహస్య వర్తనాలలో భార్యలతో గూడి శుద్ధి చేసుకోవడం మానివేశారు.

పురా సుశీలా భూత్వా చ దుఃశీలత్వముపాగతాః ।
దేవాంస్తపోధనాంశ్చైవ బాధన్తే త్రిపురాలయాః ॥46॥

పూర్వం మంచి శీలం కలవారై యుండి ఇప్పుడు దుశ్శీలురైన త్రిపురాలయులగు దానవులు దేవతలనూ, తపోధనులనూ బాధింపసాగారు.

మయేన వార్యమాణాపి తే వినాశముపస్థితాః ।
విప్రియాణ్యేవ విప్రాణాం కుర్వాణాః కలహైషిణః ॥47॥

మయుడు వద్దంటున్నా వినాశోన్ముఖులైన ఆ దానవులు విప్రులకు విప్రియం కావించారు. కలహకాంక్షులైనారు.

వైభ్రాజం నన్దనం చైవ తథా చైత్రరథం వనమ్ ।
అశోకం చ వరాశోకం సర్వర్తుకమథాపి చ ॥48॥

స్వర్గం చ దేవతావాసం పూర్వదేవవశానుగాః ।
విధ్వంసయన్తి సంక్రుద్ధాస్తపోధనవనాని చ ॥49॥

పూర్వదేవవశులైనవారు వైభ్రాజాన్నీ, నందనవనాన్నీ, చైత్రరథాన్నీ, అశోకాన్నీ, సర్వర్తుకమైన వరాశోకాన్నీ, దేవతలకే వాసమైన స్వర్గాన్నీ, తపోధనుల వనాలనూ, క్రోధావిష్టులై ధ్వంసం చేశారు.

విధ్వస్తదేవాయతనాశ్రమాశ్చ సంభగ్నదేవధ్వజయూపకాశ్చ ।
జగద్బభూవామరరాజజుష్టమభిద్రుతం సస్యమివాలివృన్దైః ॥50॥

దేవాలయాలు, ఆశ్రమాలూ వారి దుశ్చేష్టలచే ధ్వంసమయ్యాయి. దేవద్విజపూజాదికాలు భగ్నమయ్యాయి. అమరరాజ నిలయమైన స్వర్గం దాడికి గురియై మిడుతలు పడ్డ పైరు లాగా వినాశానికి గురి అయింది. శత్రువులచే ఆక్రాంతమైనది.)

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే త్రిపురే దానవ ప్రవేశం నామ ఏకత్రింశదధికశతతమోऽధ్యాయః ॥ 131 ॥

శ్రీ మత్స్య మహాపురాణంలోని దైత్య దానవుల త్రిపుర ప్రవేశమనే నూటముప్పైఒకటవ అధ్యాయం ॥ 131 ॥

ద్వాత్రింశదధికశతతమోఽధ్యాయః - నూటముప్పైరెండవ అధ్యాయం

దేవకృత మహేశ్వరస్తుతిః - దేవతలు చేసిన మహేశ్వరస్తుతి

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

సుశీలేషు ప్రదుష్టేషు దానవేషు దురాత్మసు ।
లోకేషూత్సాద్యమానేషు తపోధనవనేషు చ ॥1॥

అంతవరకు మంచి శీలము గలిగి ఉండిన దానవులు దుష్టులు, దుశ్శీలురై ప్రవర్తించారు. అందువల్ల లోకాలు, తపోధనుల వనాలు ఉనికి కోల్పోయాయి.

సింహనాదేన దైత్యానాం తేషు భీతేషు జన్తుషు ।
త్రైలోక్యే భయసంమూఢే తమోఽన్ధత్వముపాగతే ॥2॥

ఆ రాక్షసులు సింహనాదాలు చేశారు. అందుకు ప్రాణులు భయపడి పారిపోయాయి. ముల్లోకాలూ భయసమ్మూఢా లయ్యాయి. లోకాలన్నిటా తమస్సుచే అంధత్వం వ్యాపించింది.

ఆదిత్యా వసవః సాధ్యాః పితరో మరుతాం గణాః।
భీతాః శరణమాజగ్ముః ప్రణమ్య ప్రపితామహమ్ ॥3॥

ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, పితరులు, మరుద్గణాలు భీతులై ప్రపితామహుడైన బ్రహ్మను శరణు పొందారు.

తే తం స్వర్ణోత్పలాసీనం బ్రహ్మాణం సముపాగతాః ।
నేమురూచుశ్చ సహితాః పంచాస్యం చతురాననమ్ ॥4॥

స్వర్ణమయమైన ఉత్పలం మీద ఆసీనుడైన బ్రహ్మచెంతకు పోయి నమస్కరించారు. అందరూ కూడి ప్రపితామహుని కిలా విన్నవించారు.

వరదృప్తాస్తవైవేహ దానవాస్త్రిపురాలయాః ।
బాధన్తేఽస్మాన్యథా ప్రేష్యాననుశాధి తతోఽనఘ! ॥5॥

“అనఘా! నీవిచ్చిన వరంతో గర్వించిన త్రిపుర నివాసులగు దానవులు మమ్మల్ని దాసులవలె బాధిస్తున్నారు. వారిని శిక్షించు.

మేఘాగమే యథా హంసా మృగాః సింహభయాదివ ।
దానవానాం భయాత్తద్వద్భ్రామః ప్రపితామహ! ॥6॥

ప్రపితామహా! మేఘాగమకాలంలో హంసలవలె, సింహభయంతో మృగాలరీతిగా, మేము దానవులనుండి భయపడి భ్రమిస్తున్నాము.

పుత్రాణాం నామధేయాని కలత్రాణాం తథైవ చ ।
దానవైర్భ్రామ్యమాణానాం విస్మృతాని తతోఽనఘ! ॥7॥

అనఘా! దానవులు తరుముకోగా మేము భార్యల, బిడ్డల పేర్లను మరచిపోయి ఇలా తిరుగుతున్నాము.

దేవవేశ్మ ప్రభంగాశ్చ ఆశ్రమభ్రంశనాని చ ।
దానవైర్లోభమోహాన్ధైః క్రియన్తే పాపబుద్ధిభిః ॥8॥

లోభమోహాలచే అంధులైన దానవులు పాపబుద్ధులై దేవాలయాలను భగ్నం చేశారు. ఆశ్రమాలను పాడుచేశారు.

యది న త్రాయసే లోకం దానవైర్విద్రుతం ద్రుతమ్ ।
ప్రేక్ష్యస్యకాలే నిర్దేవం నిర్మనుష్యాశ్రమం జగత్ ॥9॥

దానవులచే పీడితమైన లోకాన్ని త్వరగా రక్షించకుంటే అకాలంలో ఈ జగత్తును దేవతలూ, మనుజులూ, ఆశ్రమాలూ లేనిదానినిగా చూడగలవు.

ఇత్యేవం త్రిదశైరుక్తః పద్మయోనిః పితామహః ।
ప్రత్యాహ త్రిదశాన్సేంద్రానిందుతుల్యాననః ప్రభుః ॥10॥

ఇలా దేవతలు విన్నవించగా చంద్రముఖుడు, పద్మసంభవుడూ ఐన బ్రహ్మ ఇంద్రాది దేవతలను చూచి ఇలా అన్నాడు.

మయస్య యో వరో దత్తో మయా మతిమతాం వరాః! ।
తస్యాన్త ఏష సంప్రాప్తో యః పురోక్తో మయా సురాః ॥11॥

బుద్ధిమంతులలో శ్రేష్ఠులారా! మయునికి నేనిచ్చిన వరానికి తుది సమయం ఇప్పుడు వచ్చింది. దేవతలారా! ఇది పూర్వం నేను వారికి చెప్పి వున్నాను.

తచ్చ తేషామధిష్ఠానం త్రిపురం త్రిదశర్షభాః! ।
ఏకేషుపాతమోక్షేణ హన్తవ్యం నేషువృష్టిభిః॥12॥

దేవశ్రేష్ఠులారా! వారికి అధిష్ఠానమైన త్రిపురం ఒకే బాణంతో హతమార్చదగినదే కాని అనేక బాణవర్షం చేత కాదు.

భవతాం చ న పశ్యామి ఏకమప్యమరర్షభాః ।
యస్తు చైకప్రహారేణ పురం హన్యాత్సదానవమ్ ॥13॥

దేవతాశ్రేష్ఠులారా! మీలో ఒక్క బాణపు దెబ్బతో దానవసహితంగా త్రిపురాలను కూల్చగలవాణ్ణి నేను ఒక్కణ్ణీ చూడడం లేదు.

త్రిపురం నాల్పవీర్యేణ శక్యం హంతుం శరేణ తు ।
ఏకం ముక్త్వా మహాదేవం మహేశానం ప్రజాపతిమ్ ॥14॥

మహాదేవుడు, మహేశ్వరుడు, ప్రజాపతి తప్ప త్రిపురం అల్పవీర్యునిచే హతమార్చడానికి వీలుపడదు.

తే యూయం యది మన్యధ్వం క్రతువిధ్వంసకం హరమ్ ।
యాచామః సహితా దేవం త్రిపురం స హనిష్యతి ॥15॥

అందువల్ల మీరు సమ్మతిస్తే క్రతువిధ్వంసనం చేయగల శివుణ్ణి మనమంతా కలిసిపోయి ప్రార్థిద్దాము. ఆయన త్రిపురాలను హతమార్చగలడు.

కృతః పురాణాం విష్కంభో యోజనానాం శతం శతమ్ ।
యథా చైకప్రహారేణ హన్యేత వై భవేన తు ॥16॥

ఆ పురాల వ్యాసం నూరు నూరు యోజనాలుగా మయునిచే నిర్మితమయింది. అందువల్ల ఒక్కదెబ్బతో దానిని కొట్టటం అసాధ్యం. శివుడొక్కడే దాన్ని కొట్టగలడు.

పుష్యయోగేన యుక్తాని తాని చైకక్షణేన తు ।
పురాణ్యేక ప్రహారేణ ధక్ష్యతీతి త్రిలోచనః ।
తతో దేవైశ్చ సంప్రోక్తో యాస్యామ ఇతి దుఃఖితైః ॥17॥

ఆ పురాలను ఒక్క దెబ్బతో శివుడే పుష్యయోగసమయంలో ఒక క్షణంలో దగ్ధం చేయగలడు అని చెప్పాడు. ఆ మీదట దుఃఖితులైన ఆ దేవతలు అలాగే శివుని చెంతకు పోగలమని బ్రహ్మకు చెప్పారు.

పితామహశ్చ తైః సార్ధం భవసంసదమాగతః ।
తం భవం భూతభవ్యేశం గిరిశం శూలపాణినమ్ ॥18॥

పశ్యన్తి చోమయా సార్ధం నన్దినా చ మహాత్మనా ।
అగ్నివర్ణమజం దేవమగ్నికుణ్డనిభేక్షణమ్ ॥19॥

అగ్న్యాదిత్యసహస్రాభమగ్నివర్ణవిభూషితమ్ ।
చంద్రావయవలక్ష్మాణం చంద్రసౌమ్యతరాననమ్ ॥20॥

ఆగమ్య తమజం దేవమథ తం నీలలోహితమ్ ।
స్తువన్తో వరదం శంభుం గోపతిం పార్వతీపతిమ్ ॥21॥

అంతట పితామహుడు, ఆ దేవతలతో సహా అందరూ శివుని నిలయం చేరుకొన్నారు. భూత భవిష్యత్తులకు ప్రభువు, గిరీశుడు, శూలహస్తుడు, మహాత్ముడగు నందితోనూ, ఉమాదేవితోనూ గూడినవాడూ ఐన శివుణ్ణి దర్శించారు.అగ్ని వంటి వర్ణం కలవాడూ, పుట్టుకలేనివాడూ, అగ్నికుండం వంటి నేత్రాలు గలవాడూ, వేయి అగ్నులు, వేయిమంది సూర్యులతో సమానుడూ,అగ్ని వర్ణాలంకృతుడు, చంద్రావయవ చిహ్నం కలవాడూ, చంద్రునివలె సౌమ్యతరమైన ముఖం కలవాడూ, నీలలోహితుడూ, గోపతీ, వరదుడూ, పార్వతీపతీ – అయిన ఆ దేవుని స్తుతింప బూని ఇలా వినుతించారు దేవతలు.

నమో భవాయ శర్వాయ రుద్రాయ వరదాయ చ ।
పశూనాం పతయే నిత్యముగ్రాయ చ కపర్దినే ॥22॥

మహాదేవాయ భీమాయ త్ర్యమ్బకాయ చ శాంతయే ।
ఈశానాయ భయఘ్నాయ నమస్త్వన్ధకఘాతినే ॥23॥

నీలగ్రీవాయ భీమాయ వేధసే వేధసా స్తుతే ।
కుమారశత్రునిఘ్నాయ కుమారజనకాయ చ ॥24॥

విలోహితాయ ధూమ్రాయ వీరాయ క్రథనాయ చ ।
నిత్యం నీలశిఖణ్డాయ శూలినే దివ్యశాయినే ॥25॥

ఉరగాయ సునేత్రాయ హిరణ్యవసురేతసే ।
అచిన్త్యాయాంబికాభర్త్రే సర్వదేవస్తుతాయ చ ॥26॥

వృషధ్వజాయ ముణ్డాయ జటినే బ్రహ్మచారిణే ।
తప్యమానాయ సలిలే బ్రహ్మణ్యాయాజితాయ చ ॥27॥

భవునకు, శర్వునికి, రుద్రునకు, వరదునకు, పశుపతికి, సదా ఉగ్రుడైయున్నవానికి, కపర్దికి, మహాదేవునికి, భీమునకు, త్రినేత్రునకు, శాంతమూర్తికి, ఈశానునకు, భయం పోగొట్టువానికి, అంధకుణ్ణి చంపినవానికి, నీలకంఠునకు, భీకరునకు, వేధకు, బ్రహ్మచే స్తుతింపబడినవానికి, కుమారస్వామి శత్రువులను హతమార్చినవానికి, కుమార జనకునకు, ఎర్రనివానికి, ధూమ్రవర్ణునకు, వీరునకు, పాపులను నరకువానికి, నీలకేశునకు, శూలికి, దివ్యశయనునకు, ఉరగభూషణునకు, సునేత్రునకు, హిరణ్యమూ వసువూ రేతస్సుగా కలవానికి, అచింత్యునకు, అంబికాభర్తకు, సర్వదేవతలచే స్తుతింపబడినవానికి, వృషధ్వజునకు, ముండునకు, జటాధారికి, బ్రహ్మచారికి, జలంలో తపస్సు చేయువానికి, బ్రహ్మణ్యునకు, జయింపబడనివానికి,

అభిగమ్యాయ కామ్యాయ స్తుత్యాయార్చ్యాయ సర్వదా ।
భక్తానుకంపినే నిత్యం దిశతే యన్మనోగతమ్ ॥28॥

విశ్వాత్మనే విశ్వసృజే విశ్వమావృత్య తిష్ఠతే ।
నమోఽస్తు దివ్యరూపాయ ప్రభవే దివ్యశంభవే ॥29॥

విశ్వాత్మునకు, విశ్వస్రష్టకు, విశ్వము నావరించియున్నవానికి, దివ్యరూపునకు, ప్రభునకు, దివ్య శంభునకు, ఆశ్రయింపదగినవానికి, కోరదగినవానికి, స్తుతింపదగినవానికి, పూజ్యునకు, సదా భక్తులపట్ల దయ జూపువానికి, నిత్యం మనోగతం ప్రసాదించువానికి నమస్కారం.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే దేవకృత మహేశ్వరస్తుతిర్నామ ద్వాత్రింశదధికశతతమోఽధ్యాయః ॥ 132 ॥
శ్రీ మత్స్యమహాపురాణంలోని దేవతలు చేసిన మహేశ్వరస్తుతి అనే నూటముప్పై రెండవ అధ్యాయం సంపూర్ణం

త్రయస్త్రింశదధికశతతమోఽధ్యాయః - నూటముప్పైమూడవ అధ్యాయం

శివస్య రథనిర్మాణమ్ - శివుని రథనిర్మాణం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

బ్రహ్మాద్యైః స్తూయమానస్తు దేవైర్దేవో మహేశ్వరః ।
ప్రజాపతిమువాచేదం దేవానాం క్వ భయం మహత్ ॥1॥

బ్రహ్మాది దేవతలచే స్తుతింపబడిన ఆ దేవుడు మహేశ్వరుడు ప్రజాపతిని చూచి దేవతల కింత పెద్ద భయం ఎక్కడిది."

భో దేవాః స్వాగతం వోఽస్తు బ్రూత యద్వో మనోగతమ్ ।
యద్దేయం వాఽప్యదేయం వా నాస్త్యదేయం మయా హి వః ॥2॥

దేవతలారా! మీకు స్వాగతం! మీ మనోగతమేదో చెప్పండి. ఇవ్వదగినదైనా ఇవ్వదగనిదైనా చెప్పండి. నాకు మీకు ఇవ్వరానిదంటూ ఏదీ లేదు.

యుష్మాకం నితరాం శం వై కర్తాహం విబుధర్షభాః! ।
చరామి మహదత్యుగ్రం యచ్చాపి పరమం తపః ॥3॥

దేవతాశ్రేష్ఠులారా! మీకు మిక్కిలి సుఖం చేకూర్చగలను. అంతేకాదు, అందుకై ఉగ్రతపస్సు చేస్తున్నాను. వెంటనే మీరు కోరినదివ్వగలను.

యుష్మద్ద్వేష్యా మమ ద్వేష్యాః కష్టాః కష్టతరా మమ ।
తేషామభావః సమ్పాద్యో యుష్మాకం భవ ఏవ చ ॥4॥

మీకు ద్వేష్యులైనవారు నాకూ ద్వేష్యులే. వారు నీచులు, నీచతరులు కూడా. వారికి ఉనికి లేకుండా చేయాలి. మీకు ఉనికి (శుభం) చేకూర్చాలి.

ఏవముక్తాస్తు దేవేన ప్రేమ్ణా సబ్రహ్మకాః సురాః ।
రుద్రమాహుర్మహాభాగం భాగార్హాః సర్వ ఏవ తే ॥5॥

ఇలా దేవుడు ప్రేమతో బ్రహ్మాదిదేవతలకు చెప్పాడు. యజ్ఞభాగార్హులైన వారందరూ మహాభాగుడగు రుద్రునితో ఇలా అన్నారు.

భగవంస్తైస్తపస్తప్తం రౌద్రం రౌద్రపరాక్రమైః ।
అసురైర్వధ్యమానాః స్మ వయం త్వాం శరణం గతాః ॥6॥

భగవంతుడా! రౌద్ర పరాక్రమం కల ఆ రక్కసులు రౌద్రమైన తపస్సు చేశారు. అలాంటి అసురులచే చంపబడుతున్నాము. అందుచే మేము మిమ్ము శరణుజొచ్చాము.

మయో నామ దితేః పుత్రస్త్రినేత్ర! కలహప్రియః ।
త్రిపురం యేన తద్దుర్గం కృతం పాణ్డురగోపురమ్ ॥7॥

త్రినేత్రా! మయుడనే దితిపుత్రుడు కలహప్రియుడు. తెల్లనిగోపురంకల ఆ త్రిపురదుర్గాన్ని నిర్మించినవాడు వాడే.

తదాశ్రిత్య వరం దుర్గం దానవా వరనిర్భయాః ।
బాధన్తేఽస్మాన్మహాదేవ ప్రేష్యాన్ వై స్వామినో యథా ॥8॥

మహాదేవా! వరంతో నిర్భయులైన దానవులు ఆ వరదుర్గాన్ని ఆశ్రయించి మమ్ము యజమానులు దాసులను వలె బాధిస్తున్నారు.

ఉద్యానాని చ భగ్నాని నన్దనాదీని యాని చ ।
వరాశ్చాప్సరసః సర్వా రంభాద్యా దనుజైర్హృతాః ॥9॥

నందనం మొదలైన ఉద్యానాలు భగ్నమైపోయాయి. రంభ మున్నగు శ్రేష్ఠలైన అచ్చరలను దనుజులు అపహరించారు.

ఇంద్రస్య వాహాశ్చ గజాః కుముదాంజనవామనాః ।
ఐరావతో యదావాహ్యం దేవతానాం మహేశ్వర! ॥10॥

ఓ మహేశ్వరా! ఇంద్రునికి దేవతలకు వాహనాలైన కుముదం, అంజనం, వామనం, ఐరావతం మున్నగు గజాలు అపహరణకు గురి అయ్యాయి.

యే చేంద్రరథముఖ్యాశ్చ హయాస్తేఽపి హృతాస్తు తైః ।
జాతాశ్చ దానవానాం తే రథయోగ్యాస్తురంగమాః ॥11॥

ఇంద్రరథముఖ్యాలైన గుర్రాలు అసురులచే దొంగలింపబడ్డాయి. అవి దానవుల రథాలకు పూంచదగిన గుర్రాలయ్యాయి.

యే రథా యే గజాశ్చైవ యాః స్త్రియో వసు యచ్చ నః ।
తన్నో వ్యపహృతం దైత్యైః సంశయో జీవితే పునః ॥12॥

మా రథాలు, గజాలు, స్త్రీలు, ధనం అన్నిటినీ దైత్యులపహరించారు. మాకిప్పుడు జీవితంపైననే సంశయం కలిగింది."

త్రినేత్ర ఏవ ముక్తస్తు దేవైః శక్రపురోగమైః ।
ఉవాచ దేవాన్దేవేశో వరదో వృషవాహనః ॥13॥

ఇలా ఇంద్రాది దేవతలు చెప్పేసరికి దేవేశుడు, వరదుడు, వృషభవాహనుడూ అయిన త్రినేత్రుడు వారితో ఇలా అన్నాడు.

వ్యపగచ్ఛతు వో దేవా మహద్దానవజం భయమ్ ।
తదహం త్రిపురం ధక్ష్యే క్రియతాం యద్బ్రవీమి తత్ ॥14॥

దేవతలారా! దానవుల వల్ల మీకు కల్గిన మహాభయం తొలగిపోవు గాక! నేను త్రిపురాలను దహించి వేస్తాను. నేను చెప్పినట్లు మీరు చేయండి.

యదీచ్ఛథ మయా దగ్ధం తత్పురం సహదానవమ్ ।
రథమౌపయికం మహ్యం సజ్జయధ్వం కిమాస్యతే ॥15॥

దానవులతో సహా ఆ పురాలను నేను కాల్చివేయాలని మీరు కోరే పక్షంలో, నాకు తగిన రథాన్ని సిద్ధం చేయండి! ఎందుకు ఊరకున్నారు?

దిగ్వాససా తథోక్తాస్తే సపితామహకాః సురాః ।
తథేత్యుక్త్వా మహాదేవం చక్రుస్తే రథముత్తమమ్ ॥16॥

దిగంబరుడగు శివుడలా అనగా బ్రహ్మాదులగు దేవతలు 'అలాగే' అని చెప్పి ఆ మహాదేవునికి ఉత్తమమైన ఒక రథాన్ని నిర్మించారు.

ధరాం కూబరకౌ ద్వౌ తు రుద్రపార్శ్వచరావుభౌ ।
అధిష్ఠానం శిరో మేరోరక్షో మన్దర ఏవ చ ॥17॥

చక్రుశ్చన్ద్రం చ సూర్యం చ చక్రే కాంచనరాజతే ।
కృష్ణపక్షం శుక్లపక్షం పక్షద్వయమపీశ్వరాః ॥18॥

రథనేమిద్వయం చక్రుర్దేవా బ్రహ్మపురస్సరాః ।
ఆదిద్వయం తక్షకం చ యంత్రమేతాశ్చ దేవతాః ॥19॥

కంబలాశ్వతరాభ్యాం చ నాగాభ్యాం సమవేష్టితమ్ ।

భూమిని రథంగానూ, రుద్రుని పార్శ్వచరులనిద్దరినీ కూబరకాలు (కాడికొనలు) గానూ, మేరు శిరస్సును అధిష్ఠానంగానూ, మందరాన్ని ఇరుసుగానూ, చంద్రసూర్యులను స్వర్ణరజత చక్రాలుగానూ చేశారు. కృష్ణపక్ష శుక్లపక్షాలనే పక్షద్వయాన్ని రథనేమి ద్వయంగానూ, బ్రహ్మాది దేవతలు చేశారు. నాగులలో మొదటి యిద్దరిని, (శ్రేష్ఠుడు వాసుకి) తక్షకుణ్ణి కంబళుడు, అశ్వతరుడు అను నాగులను త్రాళ్లుగా చేసి రథబంధనానికి ఉపయోగించారు.

భార్గవశ్చాంగిరాశ్చైవ బుధోఽఙ్గారక ఏవ చ ॥20॥

శనైశ్చరస్తథా చాత్ర సర్వే తే దేవసత్తమాః ।
వరూథం గగనం చక్రుశ్చారురూపం రథస్య తే ॥21॥

శుక్రుడు, అంగిరసుడు, బుధుడు, అంగారకుడు, శని – వీరిని ఆయా రథభాగాలుగా చేసి ఈ భాగాలను ఆ త్రాళ్లతో కట్టారు. ఆ రథానికి అందమైన ఆకాశం రక్షణ పంజరమయింది.

కృత్వా ద్విజిహ్వాత్రితయం త్రివేణుం శాతకౌంభకమ్ ।
మణిముక్తేంద్రనీలైశ్చ వృతం హృష్టముఖైః సురైః ॥22॥

అలా ముగ్గురు నాగవర్యులు బంగారు త్రివేణువుగాగా, మణులు, ముత్యాలు, ఇంద్రనీలాదులతో అలంకరించి దేవతలు సంతసించారు.

గంగా సింధుః శతద్రూశ్చ చంద్రభాగా ఇరావతీ ।
వితస్తా చ విపాశా చ యమునా గణ్డకీ తథా ॥23॥

సరస్వతీ దేవికా చ తథా చ సరయూరపి ।
ఏతాః సరిద్వరాః సర్వా శృణు సజ్జీకృతా రథే ॥24॥

గంగ, సింధువు, కావేరి, శతద్రువు, చంద్రభాగ, ఇరావతి, వితస్త, విపాశ, యమున, గండకి, సరస్వతి, దేవిక, సరయువు ఈ నదిశ్రేష్ఠాలన్నీ అమ్ముల పొదులయ్యాయి రథంలో సిద్ధం చేయబడ్డాయి.

ధృతరాష్ట్రాశ్చ యే నాగాస్తే చ కర్కోటకాత్మజాః ।
వాసుకేః కులజా యే చ యే చైరావతవంశజాః ॥25॥

యే సర్పా దర్పసంపూర్ణాస్తత్ర తూణీరమాశ్రితాః ।
అవతస్థుః శరా భూత్వా నానాజాతిసముద్భవాః ॥26॥

ధృతరాష్ట్రకుటుంబనాగులు, కర్కోటక కులజులు, వాసుకి కులానికి చెందినవారు, ఐరావత వంశజులు – ఇలా నానాజాతులైన సర్పాలు దర్పంతో తూణీరము నాశ్రయించే బాణాలయ్యాయి.

సురసా సరమా కద్రూర్వినతా శుచిరేవ చ ।
తృషా బుభుక్షా సర్వోగ్రా మృత్యుః సర్వశమస్తథా ॥27॥

బ్రహ్మవధ్యా చ గోవధ్యా బాలవధ్యా భయానకాః ।
గదా భూత్వా శక్తయశ్చ తదా దేవరథేఽవ్యయాః ॥28॥

సురస, సరమ, కద్రువ, వినత, శుచి, తృష, బుభుక్ష, సర్వోగ్ర, మృత్యువు, సర్వశమం, బ్రహ్మవధ్య, గోవధ్య, బాలవధ్య భయానకమైన గదలుగా, శక్తులుగా, ఆ దేవరథంలో సిద్ధమయ్యాయి.

యుగం కృతయుగం చాత్ర చాతుర్హోత్రప్రయోజకాః ।
చతుర్వర్ణాః సలీలాశ్చ బభూవుః స్వర్ణకుణ్డలాః ॥29॥

కృతయుగం కాడి అయింది. చతుర్వర్ణాలవారు చాతుర్హోత్ర ప్రయోజకములైన విలాసవంతమగు స్వర్ణకుండలాలయ్యారు.

తద్యుగం యుగసంకాశం రథశీర్షే ప్రతిష్ఠితమ్ ।
ధృతరాష్ట్రేణ నాగేన బద్ధం బలవతా మహత్ ॥30॥

యుగ సంకాశమైన కాడి రథశీర్షంలో ప్రతిష్ఠితమయింది. బలిష్ఠుడైన ధృతరాష్ట్రుడనే నాగముచే అది బద్ధమయింది.

ఋగ్వేదః సామవేదశ్చ యజుర్వేదస్తథాపరః ।
వేదాశ్చత్వార ఏవైతే చత్వారశ్చ తురంగమాః ॥31॥

ఋగ్యజు స్సామాథర్వవేదాలు నాలుగూ నాలుగు గుర్రాలయ్యాయి.

అన్నదానపురోగాణి యాని దానాని కానిచిత్ ।
తాన్యాసన్వాజినాం తేషాం భూషణాని సహస్రశః ॥32॥

అన్నదానాదులైన దానాలు ఆ గుర్రాలకు వ్రేలాడే భూషణా లయ్యాయి.

పద్మద్వయం తక్షకశ్చ కార్కోటకధనంజయౌ ।
నాగా బభూవురేవైతే హయానాం దృఢబన్ధనాః ॥33॥

పద్మ – మహాపద్మాలు, తక్షకుడు, కర్కోటకుడు, ధనంజయుడు – అనే నాగులు గుర్రాలకు నాలుగు దృఢబంధనా లయ్యాయి.

ఓంకారప్రభావాస్తోమాస్సర్వాశ్చైవ క్రతుక్రియాః ।
ఉపద్రవాః ప్రతీకారాః పశుబన్ధేష్వవస్థితాః ॥34॥

ఓంకారం నుండి జనించిన స్తోమమంత్రాలు, యజ్ఞాలు, క్రతుక్రియలు, ఉపద్రవాలకు ప్రతీకారాలు, పశు బంధనాలయ్యాయి.

యజ్ఞోపవాహాన్యేతాని తస్మిన్ లోకరథే శుభే ।
మణిముక్తాప్రవాలైస్తు భూషితాని సహస్రశః ॥35॥

శుభప్రదమైన ఆ లోకరథంలో ఈ యజ్ఞోపకరణాలు వేలాదిగా మణిముక్తా ప్రవాళాలచే అలంకరింపబడ్డాయి.

ప్రతోదం ప్రణవశ్చాసీత్ తదగ్రం చ వషట్కృతమ్ ।
సినీవాలీ కుహూ రాకా తథా భానుమతీ శుభా ॥36॥

యోక్త్రాణ్యాసంస్తురఙ్గాణామపసర్పణవిగ్రహాః ॥37॥

ఓంకారం ప్రతోదంగా, దాని కొన శుభప్రదమైన వషట్కారంగా, సినీవాలీ, కుహూ, రాక, భానుమతి – ఇవి గుర్రాలకు యోక్త్రాలయ్యాయి.

కృష్ణాన్యథ చ పీతాని నీల మాంజిష్ఠకాని చ ।
అవదాతాః పతాకాస్తు బభూవుః పవనేరితాః ॥38॥

నల్లనివి, పసుపురంగుకలవి, మాంజిష్ఠకాలు, అవదాతాలైన పతాకలు గాలికి రెపరెపలాడాయి.

ఋతుభిశ్చ కృతః షడ్భిర్ధనుః సంవత్సరోఽభవత్ ।
అజరా జ్యాఽభవచ్చాపి సాంబికా ధనుషో దృఢా ॥39॥

షడృతువులచే నిర్మితమైన సంవత్సరం ధనుస్సు కాగా, జర లేని ఆ అంబిక ధనుస్సుకు దృఢమైన అల్లెత్రాడయింది.

కాలో హి భగవాన్ రుద్రస్తం చ సంవత్సరం విదుః ।
తస్మాదుమా కాలరాత్రిర్ధనుషో జ్యాఽజరాఽభవత్ ॥40॥

భగవంతుడైన రుద్రుడు కాలుడు. కాలమే సంవత్సరం. అందువల్ల కాళరాత్రి ఉమ ధనుస్సుకు దృఢమైన అల్లెత్రాడయింది.

సమర్థః స్త్రిపురం దగ్ధుం భగవాన్ నీలలోహితః ।
స ఇషుర్విష్ణుసోమాగ్నిత్రిదైవతమయోఽభవత్ ॥41॥

నీలలోహితుడైన శివుడు త్రిపురాన్ని దగ్ధం కావించువా డయ్యాడు. బాణం విష్ణు- సోమ - అగ్నులనే త్రిదేవతల మయమయింది.

ఆసనం హ్యగ్నిరభవచ్ఛల్యం సోమః శిఖాహరిః ।
తేజసః సమవాయేఽథ చేషోస్తేజో రథాంగధృక్ ॥42॥

అగ్ని రథికుడు కూర్చునే ఆసనమయ్యింది. సోముడు పీఠమును రథంలో బిగించే చీల అయినాడు. విష్ణువు ఆసనశిఖాభాగమైనాడు. తేజస్సమవాయంలో బాణతేజం రథాంగాన్ని ధరించింది.

తస్మింశ్చ వీర్యవృద్ధ్యర్థం వాసుకిర్నాగపార్థివః ।
తేన సంహరణార్థాయ ముమోచాశీవిషం జ్వలత్ ॥43॥

దానిలో వీర్యాతిశయం కొరకు అతివిషం కల నాగపార్థివుడను వాసుకి శుత్రుసంహారం కొరకు విషం కక్కాడు.

కృత్వా భూమిం రథం చాపి దివ్యం దివ్యప్రభావతః ।
లోకాధిపతిమభ్యేత్య ఇదం వచనమబ్రువన్ ॥44॥

ఇలా భూమిని దివ్యమైన దేవరథంగా దివ్యప్రభావంతో నిర్మించి లోకాధిపతి శివుని చెంతకు పోయి ఇలా చెప్పారు.

సుకృతోఽయం రథోఽస్మాభిస్తవ దానవశత్రుజిత్! ।
ఇమమాస్థాయ త్రిపురం దహ ప్రదహతాం వర! ॥45॥

దేవా! దానవశత్రువిజేతా! రథాన్ని చక్కగా సిద్ధం చేశాం. దాహకవర్యా! దీని నధిష్ఠించి త్రిపురాన్ని దహించు అని వేడుకొన్నారు.

తం మేరుశిఖరాకారం త్రైలోక్యరథముత్తమమ్ ।
ప్రశస్య దేవతాస్తాశ్చ రథం పశ్యతి శంకరః ॥46॥

అప్పుడు శంకరుడు మేరుశిఖరం వంటి ఆకారం కలదైన ఆ ఉత్తమ త్రైలోక్యరథాన్నీ, దేవతలనూ ప్రశంసించి రథాన్ని తిలకించాడు.

ముహుర్దృష్ట్వా రథం సాధు సాధ్వీత్యుక్త్వా ముహుర్ముహుః ।
ఉవాచ సేంద్రానమరానమరాధిపతిః స్వయమ్ ॥47॥

మాటిమాటికి రథం వైపు చూచి 'బాగు బాగు' అని చెప్పి ఇంద్రాది సురలతో దేవాధిపతి యగు శివుడు స్వయంగా ఇలా పలికాడు.

యాదృశోఽయం రథః క్లృప్తో యుష్మాభిర్మమ సత్తమాః ।
ఈదృశో రథసమ్పత్త్యా యన్తా శీఘ్రం విధీయతామ్ ॥48॥

"సత్తములారా! మీరు నా కొరకు ఎటువంటి రథాన్ని సిద్ధం చేశారో, దాని సంపత్తికి తగిన సారథిని త్వరగా సిద్ధం చేయండి.

ఇత్యుక్త్వా దేవదేవేన దేవా విద్ధా ఇవేషుభిః ।
అవాపుర్మహతీం చిన్తాం కథం కార్యం భవేదితి ॥49॥

ఇలా దేవతలతో దేవదేవుడు పలికే సరికి బాణోపహతుల్లాగా దేవతలు "ఇది ఎలా చేయడమా!" అంటూ గొప్ప చింతకు లోనయ్యారు.

మహాదేవస్య దేవోఽన్యః కో నామ సదృశో భవేత్ ।
ముక్త్వా చక్రాయుధం దేవం సోఽప్యస్య ఇషుమాశ్రితః ॥50॥

మహాదేవునికి చక్రధారి తప్ప మరొక దేవుడెవుడు సమానుడు కాగలడు". అతడు ఉపాస్యమైన బాణాన్ని ఆశ్రయించాడు.

ధురి యుక్తా ఇవోక్షాణో ఘటన్త ఇవ పర్వతైః ।
నిశ్వసన్తః సురాః సర్వే కథమేతదితి బ్రువన్ ॥51॥

భారానికి పూంచబడి పర్వతా లడ్డుకొన్న ఎద్దులవలె దేవతలందరూ నిశ్వసిస్తూ 'ఇది ఎలా' అనుకొన్నారు.

వేధాశ్చ దృశ్యతే దేవైః లోకనాథస్య ధూర్జటేః ।
అహం సారథిరిత్యుక్త్వా జగ్రాహాశ్వాంస్తతోఽగ్రజః ॥52॥

అప్పుడు లోకనాథుడైన శివుని భారం మోయడానికి సిద్ధపడి దేవతలను విలోకించి బ్రహ్మ 'నేను సారథిని' అని చెప్పి అశ్వాలను గ్రహించాడు.

తతో దేవైః సగంధర్వైః సింహనాదో మహాన్ కృతః ।
ప్రతోదహస్తం సంప్రేక్ష్య బ్రహ్మాణం సూతతాం గతమ్ ॥53॥

జాటీ చేపట్టి రథసారథి పనికి సిద్ధమైన బ్రహ్మను చూచి గంధర్వులతో సహా దేవతలు సింహనాదం కావించారు.

భగవానపి విశ్వేశో రథస్థే వై పితామహే ।
సదృశః సూత ఇత్యుక్త్వా చారురోహ రథం హరః ॥54॥

భగవంతుడైన శివుడు గూడా బ్రహ్మ రథమెక్కగానే తగిన సారథి అంటూ రథమధిష్ఠించాడు.

ఆరోహతి రథం దేవే హ్యశ్వా హరభరాతురాః ।
జానుభిః పతితా భూమౌ రజోగ్రాసశ్చ గ్రాసితః ॥55॥

దేవుడు రథమెక్కగానే ఆ హరుని భారంతో ఆతురములై తురగాలు నేలపై మోకాళ్ల మీద పడి ధూళిని గ్రాసంగా గ్రసించాయి.

దేవో దృష్ట్వాఽథ వేదాంస్తానభీమాన్ పర్వసంస్థితాన్ ।
ఉజ్జహార పితౄనార్తాన్సుపుత్ర ఇవ దుఃఖితాన్ ॥56॥

అప్పుడు ఆర్తులైన తల్లిదండ్రులను సుపుత్రునిలాగా దేవుడు నేలపైబడి ముడిగియుండిన ఆ వేదాలను ఉద్ధరించాడు.

తతః సింహరవో భూయో బభూవ రథభైరవః ।
జయశబ్దశ్చ దేవానాం సంబభూవార్ణవోపమః ॥57॥

ఆపై రథభైరవమైన సింహనాదం మళ్లీ ఉద్భవించింది. సముద్రఘోష వంటి దేవతల 'జయ' శబ్దం కూడా ఘోషించింది.

తదోంకారమయం గృహ్య ప్రతోదం వరదః ప్రభుః ।
స్వయంభూః ప్రయయౌ వాహాననుమంత్ర్య యథాజవమ్ ॥58॥

అంతట వరదుడైన బ్రహ్మదేవుడు ఓంకారమయమైన మునికోల చేపట్టి వేగానుసారంగా వాహనాలను హెచ్చరిస్తూ ముందుకు సాగాడు.

గ్రసమానా ఇవాకాశం ముష్ణన్త ఇవ మేదినీమ్ ।
ముఖేభ్యః ససృజుఃశ్వాసానుచ్ఛ్వసన్త ఇవోరగాః ॥59॥

ఆకాశాన్ని మ్రింగుతున్నవా అన్నట్లు, భూమిని అపహరిస్తున్నాయా అన్న విధంగా, ఉచ్ఛ్వసించే సర్పాలలాగా, గుర్రాలు ముఖాల నుండి శ్వాసలు వదలాయి.

స్వయంభువా చోద్యమానాశ్చోదితేన కపర్దినా ।
వ్రజన్తి తేఽ శ్వా జవనాః క్షయకాల ఇవానిలాః ॥60॥

శివుని ప్రేరణచే బ్రహ్మచే తోలబడుతున్న ఆ అశ్వాలు ప్రళయకాలంలో గాడ్పులలాగా వేగంతో ముందుకు సాగాయి.

ధ్వజోచ్ఛ్రయ వినిర్మాణే ధ్వజయష్టిమనుత్తమామ్ ।
ఆక్రమ్య నందీ వృషభస్తస్థౌ తస్మిన్ శివేచ్ఛయా ॥61॥

ధ్వజోచ్ఛ్రయనిర్మాణంలో శివాభిలాష ననుసరించి నందికేశ్వరుడు మహోత్తమమైన ధ్వజయష్టి నాక్రమించి నిలిచాడు.

భార్గవాంగిరసౌ దేవౌ దణ్డహస్తౌ రవిప్రభౌ ।
రథచక్రౌ తు రక్షేతే రుద్రస్య ప్రియకాంక్షిణౌ ॥62॥

శుక్రుడు, అంగిరసుడు దండాలు ధరించి సూర్యకాంతి సమతేజస్కులై రుద్రునికి ప్రీతిని కోరి రథ చక్రాలను రక్షించారు.

శేషశ్చ భగవాన్నాగోఽనన్తోఽనన్తకరోఽరిణామ్ ।
శరహస్తో రథం యాతి దిధక్షన్నివ దానవాన్ ॥63॥

భగవంతుడైన అనంతుడగు శేషుడు శత్రువినాశకుడై శరం చేబూని దానవులను దగ్ధం చేసే వానిలాగా రథాన్ని అనుగమించాడు.

యమస్తూర్ణం సమాస్థాయ మహిషం చాతిదారుణమ్ ।
ద్రవిణాధిపతిర్వ్యాలం సురాణామధిపో ద్విపమ్ ॥64॥

యముడు శీఘ్రంగా అతిభీకరమైన మహిషాన్ని అధిష్ఠించాడు. కుబేరుడు సర్పాన్నీ, ఇంద్రుడు గజాన్నీ అధిష్ఠించారు.

మయూరం శతచంద్రం చ కూజన్తం కిన్నరం యథా ।
గుహ ఆస్థాయ వరదో జుగోప స్వరథం పితుః ॥65॥

కిన్నరునివలె శబ్దిస్తున్న వందల పింఛాలు గల మయూరాన్ని ఎక్కి వరదుడై కుమారస్వామి తండ్రిరథాన్ని అనుగమించాడు.

నందీశ్వరశ్చ భగవాన్శూలమాదాయ దీప్తిమాన్ ।
పృష్ఠతశ్చాపి పార్శ్వాభ్యాం లోకస్య క్షయకృద్యథా ॥66॥

దీప్తిమంతుడైన భగవంతుడగు నందికేశ్వరుడు శూలం చేపట్టి లోకక్షయకారుడగు యమునివలె వెనుక, ప్రక్కలా పయనించాడు.

ప్రమథాశ్చాగ్నివర్ణాభాః సాగ్నిజ్వాలా ఇవాచలాః ।
అనుజగ్ముః రథం శార్వం నక్రా ఇవ మహార్ణవమ్ ॥67॥

అగ్నివర్ణులు, అగ్నిజ్వాలలతోడి కొండలను బోలినవారూ అయిన ప్రమథులు మహాసాగరాన్ని మొసళ్ళువలె శివుని రథాన్ని అనుసరించారు.

భృగుర్భరద్వాజవసిష్ఠగౌతమాః క్రతుః పులస్త్యః పులహస్తపోధనాః ।
మరీచిరత్రిర్భగవానథాంగిరాః పరాశరాగస్త్యముఖా మహర్షయః ॥68॥

తపోధనులైన భృగువు, భరద్వాజుడు, వసిష్ఠుడు, గౌతముడు, క్రతువు, పులస్త్యుడు, పులహుడు, మరీచి, అత్రి, అంగిరసుడు, పరాశరుడు, అగస్త్యుడు మొదలైన మహర్షులు

హరమజితమజం ప్రతుష్టువుస్తే వచనవిశేషవిచిత్రభూషణైః ।
రథవరమధిరుహ్య కాంచనం చ వ్రజతి సపక్ష ఇవాచలే హరే ॥69॥

శ్రేష్ఠమైన ఆ స్వర్ణరథమునెక్కి శివుడు ఆకాశంలో రెక్కలు గల మేరుగిరిలాగా సాగిపోతుండగా విచిత్రాలంకారాలు గల వచన విశేషాలతో శివునీ, బ్రహ్మనూ స్తుతించారు.

కరిగిరిరవిమేఘసన్నిభాః సజలపయోదనినాదనాదినః ।
ప్రమథగణాః పరివార్య దేవగుప్తం రథమభితః ప్రయయుః స్వదర్పయుక్తాః ॥70॥

గజాలతో, కొండలతో, సూర్యునితో, మేఘాలతో సమానులు, సజల జలదాలవలె గర్జించేవారు అయిన ప్రమథబృందాలవారు తమ గర్వరేఖ మెరుస్తూ ఉండగా దేవగుప్తమైన రథానికి నలువైపులా నడిచారు.

మకరతిమితిమింగిలాది సంఘాః ప్రలయ ఇవార్ణవమాప్రజంతి తూర్ణమ్ ।
త్రిపుర రథవరోఽతిభాస్వరో హ్యశనినిపాతపయోదనిఃస్వనః ॥71॥

ప్రళయకాలంలో, మకరాలు, తిమి, తిమింగిలాలచే ఆవృతమైన సముద్రంలాగా మిక్కిలి సముద్ధతమై అతిప్రకాశం గల ఆ రథశ్రేష్ఠం పిడుగులు గురిసే మేఘం వంటి గర్జనలు గలదై త్రిపురం వైపు ముందుకు సాగింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే శివస్య రథనిర్మాణం నామ త్రయస్త్రింశదధికశతతమోఽధ్యాయః ॥ 133 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని శివుని రథనిర్మాణమనే నూటముప్పైమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుస్త్రింశదధికశతతమోఽధ్యాయః - నూటముప్పైనాల్గవ అధ్యాయం

నారదస్య త్రిపురగమనం - నారదుడు త్రిపురానికి వెళ్ళుట

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

పూజ్యమానే రథే తస్మిన్ లోకైర్దేవై రథే స్థితే ।
ప్రమథేషు నదత్సూగ్రం ప్రవదత్సు చ సాధ్వితి ॥1॥

లోకులు, దేవతలు ఆ రథాన్ని అర్చించారు. ప్రమథులు బిగ్గరగా 'సాధువాదాలు' చేశారు.

ఐశ్వరే స్వరఘోషేణ నర్దమానే మహావృషే ।
జపత్సు విప్రేషు తథా గచ్ఛత్సు తురగేషు చ ॥2॥

ఈశ్వరుని మహావృషభం వేదస్వరఘోషంతో శబ్దించింది. విప్రులు వేదపఠనం కావించారు. తురంగాలు నడువ సాగాయి.

వ్యోమాంగణాత్ సముత్పత్య దేవర్షిర్నారదః ప్రభుః ।
కాన్త్యా చంద్రోపమస్తూర్ణం త్రిపురం పురమాగతః ॥3॥

దేవర్షి ప్రభువైన నారదుడు ఆకాశంనుండి దుమికి కాంతితో చంద్రతుల్యుడై వెంటనే త్రిపురానికి వచ్చాడు.

ఉత్పాతకం తు దైత్యానాం త్రిపురే వర్ధతే ధ్రువమ్ ।
నారదశ్చాత్ర భగవాన్ ప్రాదుర్భూతస్తపోధనః ॥4॥

దైత్యులకు త్రిపురంలో నిజంగా ఉత్పాతస్థితి వర్ధిల్లింది. అప్పుడు తపోధనుడైన నారదుడు అక్కడ ప్రాదుర్భవించాడు.

ఆగతం జ్వలనాభాసం సమేతాః సర్వదానవాః ।
ఉత్తస్థుర్నారదం దృష్ట్వా అభివాదనవాదినః ॥5॥

తమర్ఘ్యేణ చ పాద్యేన మధుపర్కేణ చేశ్వరాః ।
నారదం పూజయామాసుర్బ్రహ్మాణమివ వాసవః ॥6॥

అగ్నివంటి కాంతిగల్గి వచ్చిన నారదుని చూచి దానవులందరూ కలిసి 'అభివాదాలు' అంటూ లేచి నిల్చుకొన్నారు. ఆ నారదుణ్ణి అర్ఘ్యపాద్యాలతో, మధుపర్కంతో, బ్రహ్మను ఇంద్రుడు పూజించినట్లు వారు పూజించారు.

తేషాం స పూజాం పూజార్హః ప్రతిగృహ్య తపోధనః ।
నారదః సుఖమాసీనః కాంచనే పరమాసనే ॥7॥

పూజార్హుడైన ఆ తపోధనుడు వారి పూజను ప్రతిగ్రహించి శ్రేష్ఠమైన స్వర్ణాసనంలో సుఖాసీనుడయ్యాడు.

మయస్తు సుఖమాసీనే నారదే పద్మజోద్భవే ।
యథార్హం దానవైః సార్ధమాసీనో దానవాధిపః ॥8॥

బ్రహ్మ పుత్రుడైన నారదుడు సుఖాసీనుడు కాగానే దానవాధిపుడైన మయుడు దానవులతో సహా తానూ కూర్చున్నాడు.

ఆసీనం నారదం ప్రేక్ష్య మయస్త్వథ మహాసురః ।
అబ్రవీద్వచనం తుష్టో హృష్టరోమాననేక్షణః ॥9॥

ఆసనస్థుడైన నారదుణ్ణి చూచి మయమహాసురుడు సంతుష్టుడై ముఖం, నేత్రాలు హర్షం పొందగా రోమాంచితుడై ఇలా అన్నాడు.

ఔత్పాతికం పురేఽస్మాకం యథా నాన్యత్ర కుత్రచిత్ ।
వర్తతే వర్తమానజ్ఞ వద త్వం హి చ నారద ॥10॥

నారదమునీంద్రా! ఇతరత్రా ఎక్కడాలేని విధంగా మా నగరంలో ఉత్పాతం ప్రవర్తిల్లుతున్నది. వర్తమానం తెలిసినవాడా! నీవు దీని విషయం వివరించు.

దృశ్యన్తే భయదాః స్వప్నా భజ్యన్తే చ ధ్వజాః పరమ్ ।
వినా చ వాయునా కేతుః పతతే చ తథా భువి ॥11॥

భీకరస్వప్నాలు కనిపిస్తున్నాయి. ధ్వజాలు విరిగిపడుతున్నాయి. గాలి లేకుండానే కేతువు భూమిపై పడుతున్నది.

అట్టాలకాశ్చ భజ్యన్తే సపతాకాః సగోపురాః ।
హింసహింసేతి శ్రూయన్తే గిరశ్చ భయదాః పురే ॥12॥

పతాకాలు, గోపురాలతో సహా మేడలపై అంతస్తులు భగ్నమయ్యాయి. 'హింసించు, హింసించు' అని భీకరమైన మాటలు నగరంలో వినిపిస్తున్నాయి.

నాహం బిభేమి దేవానాం సేంద్రాణామపి నారద ।
ముక్త్వైకం వరదం స్థాణుం భక్తాభయకరం హరమ్ ॥13॥

నారదా! నేను ఇంద్రసహితులైనా దేవతలకు భయపడను. భక్తులకు అభయమిచ్చే వరదుడు, స్థాణువూ అయిన హరుడు వినా ఇతరులకు భయపడను.

భగవన్ నాస్త్యవిదితముత్పాతేషు తవానఘ! ।
అనాగతమతీతం చ భవాన్ జానాతి తత్త్వతః ॥14॥

భగవంతుడా! పాపరహితుడా! ఉత్పాతాలలో నీకు తెలియనిది లేదు. గడచిన, రానున్న దానినంతా నీవు ఉన్నదున్నట్లు ఎరుగుదువు.

తదేతన్నో భయస్థానముత్పాతాభినివేదితమ్ ।
కథయస్వ మునిశ్రేష్ఠ ప్రయత్నేన తు నారద ॥15॥

ఇత్యుక్తో నారదస్తేన మయేనామయవర్జితః ॥16॥

మునివర్యా! ఈ ఉత్పాతాలవల్ల తెలుపబడిన భయస్థానమేదో ప్రయత్నపూర్వకంగా చెప్పు. ఇలా ఆ దోషవర్జితుడైన నారదుణ్ణి మయుడు ప్రశ్నించాడు.

నారద ఉవాచ :- నారదుడు చెప్పాడు.

శృణు దానవ తత్త్వేన భవన్త్యౌత్పాతికా యథా ।
ధర్మేతిధారణే ధాతుర్మాహాత్మ్యే చైవ పఠ్యతే ।
ధారణాచ్చ మహత్త్వేన ధర్మ ఏష నిరుచ్యతే ॥17॥

దానవా! ఉత్పాతాలు నిజంగా ఎలా కల్గుతున్నవో, చెబుతాను విను. 'ధర్మ ధాతువు తన్ను ఆశ్రయించినవారిని ధరించునది అన్న ధారణార్థంలోనూ, మాహాత్మ్యం అన్న అర్థంలోనూ పఠింపబడుతున్నది. ధారణం వల్లా, మాహాత్మ్యం వల్లా 'ధర్మ' శబ్ద నిర్వచనం చెప్పబడింది.

స ఇష్టప్రాపకో ధర్మ ఆచార్యైరుపదిశ్యతే ।
ఇతరశ్చానిష్టఫల ఆచార్యైర్నోపదిశ్యతే ॥18॥

ఇష్ట ప్రాపకమైన ధర్మాన్ని ఆచార్యులు ఉపదేశిస్తున్నారు. అనిష్టఫలకమైన దాన్ని ఆచార్యులు ఉపదేశించుట లేదు.

ఉత్పథాన్మార్గమాగచ్ఛేన్మార్గాచ్చైవ విమార్గతామ్ ।
వినాశస్తస్య నిర్దేశ్య ఇతి వేదవిదో విదుః ॥19॥

ఉత్పథంనుండి మంచి మార్గానికి రావాలి. మార్గం నుండి అపమార్గమును పొందువారికి వినాశం నిర్దేశింపదగినదని వేదవేత్త లెరుగుదురు.

త్వమధర్మం యథా మూఢః సహైభిర్మతదానవైః ।
అపకారిషు దేవానాం కురుషే త్వం సహాయతామ్ ॥20॥

ఈ మదించిన దానవులతో గూడా నీవు మూఢునివలె అధర్మపరుడవై దేవతల కపకారం చేసేవారికి సాయపడుతున్నావు.

తదేతాన్యేవమాదీని ఉత్పాతావేదితాని చ ।
వైనాశికాని దృశ్యన్తే దానవానాం తథైవ చ ॥21॥

అందువల్ల ఇటువంటి దానవవినాశకమైన ఉత్పాతావేదితాలైన అపశకునాలు గోచరిస్తున్నాయి.

ఏష రుద్రః సమాస్థాయ రౌద్రం లోకమయం రథమ్ ।
ఆయాతి త్రిపురం దగ్ధుం మయ! త్వామసురానపి ॥22॥

మయా! ఈ రుద్రుడు మహాలోకమయమైన రౌద్ర రథమెక్కి త్రిపురాన్ని దగ్ధం చేయడానికీ, నిన్నూ, అసురులనూ నిర్మూలించడానికీ వస్తున్నాడు.

స త్వం మహౌజసం నిత్యం ప్రపద్యస్వ మహేశ్వరమ్ ।
యాస్యసే సహ పుత్రేణ దానవైః సహ మానద! ॥23॥

అందుచేత నీవు మహాతేజస్వీ, నిత్యుడూ అయిన మహేశ్వరుని శరణు పొందు. మానదా! లేకుంటే నీవు నీ పుత్రునితో, ఇతర దానవులతో కలిసి నశించిపోతావు.

ఇత్యేవమావేద్య భయం నారదః ప్రస్తుతం వచః ।
దానవానాం పునర్దేవో దేవేశపదమాగతః ॥24॥

అని ఇలా నారదుడు దనుజులకు గల్గిన భయం గురించి ప్రస్తుతవచనంతో తెలిపి తిరిగి శివుని వద్దకు వెళ్ళాడు.

నారదే తు మునౌ యాతే మయో దానవనాయకః ।
శూరసమ్మతమిత్యేవం దానవానాహ దానవః ॥25॥

నారదముని తిరిగి పోగా దానవనాయకుడైన మయుడు దానవులను పిలిచి శూర సమ్మతంగా ఇలా అన్నాడు.

శూరాశ్చ జాతపుత్రాశ్చ కృతకృత్యాశ్చ దానవాః! ।
యుధ్యధ్వం దైవతైః సార్ధం కర్తవ్యం చాపి నో భయమ్ ॥26॥

"మీరు శూరులుగా, బిడ్డలు గలవారుగా, కృతకృత్యులుగా ఉన్నారు. దానవులారా! దేవతలతో గూడా యుద్ధం చేయండి. భయపడదగదు.

జిత్వా వయం భవిష్యామస్సర్వేఽమరసభాసదః ।
దేవాంశ్చ సేంద్రకాన్ హత్వా లోకాన్ భోక్ష్యామహేఽసురాః! ॥27॥

సంగరంలో జయించి మనమందరమూ అమరసభాసదుల మవుదాం. అసురులారా! ఇంద్రాది దేవతలను హతమార్చి లోకాలను అనుభవిద్దాం.

అట్టాలకేషు చ తథా తిష్ఠధ్వం శస్త్రపాణయః ।
దంశితాయుధసంఘాశ్చ తిష్ఠధ్వం ప్రోద్యతాయుధాః ॥28॥

మీరు శస్త్రపాణులై మేడల పై అంతస్తులలో ఉండండి. యుద్ధ సన్నద్ధులై ఆయుధాలు చేబూని నిలవండి.

పురాణి త్రీణి చైతాని యథాస్థానేషు దానవాః ।
తిష్ఠంత్వలంఘనీయాని భవిష్యన్తి పురాణి చ ॥29॥

దానవులారా! ఈ మూడు పురాలు యథాస్థానంలో అట్లే ఉండుగాక! ఇవి దేవతలు చొరబడుటకు వీలు కావు.

నభోగతాస్తథా శూరా దేవాశ్చ విదితా హి వః ।
తే ప్రయత్నేన వార్యాశ్చ విదార్యాశ్చైవ సాయకైః ॥30॥

దేవతలు ఆకాశంలో ఉంటే శూరులవుతారని మీకు తెలుసు. వారిని ప్రయత్నంతో నివారించాలి. బాణాలతో చీల్చి వేయాలి.

ఇతి దనుతనయాన్మయస్తథోక్త్వా సురరణకారణవారణే వచాంసి ।
యుధి నిజమనసా విషక్తమానో గగనపురం సహసా వివేశ రాజా ॥31॥

ఇలా మయుడు దనుజులకు మనోధైర్యం కలిగించడానికి దేవగణాలను నివారించడానికి తగిన వచనాలు చెప్పాడు. మనస్సులో యుద్ధాలోచన కలవాడై త్రిపురనగరాన్ని వెంటనే ప్రవేశించాడు.

అథ రజతవిశుద్ధభావభావో భవమభిపూజ్య దిగమ్బరం చ వాగ్భిః ।
శరణముపజగామ దేవదేవం మదనార్యన్ధకయజ్ఞదేవఘాతమ్ ॥32॥

అంతట వెండిలాగా విశుద్ధభావం కలవాడై దిగంబరుడైన శివుణ్ణి మంచి స్తోత్రాలతో ఆరాధించాడు. మదన శత్రువు, అంధకారి, దక్షయజ్ఞధ్వంసకుడూ అగు దేవదేవుణ్ణి శరణుజొచ్చాడు.

మయమభయపదైషిణం ప్రపన్నం స కిల బుబోధ తృతీయదీప్తనేత్రః ।
తదభిమతమదాత్ తతః శశాంకీ స చ కిల నిర్భయ ఏవ దానవోఽభూత్ ॥33॥

అభయంకోరి శరణు జొచ్చిన మయుని దురభిమతం గమనించకుండా నిటలనేత్రుడు అతని కిష్టమైనదానిని ప్రసాదించాడు. వాడు నిర్భయుడై చరించాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే నారదస్య త్రిపురగమనం నామ చతుస్త్రింశదధికశతతమోఽధ్యాయః ॥ 134 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని నారదుడు త్రిపురానికి వెళ్ళడమనే నూటముప్పైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచత్రింశదధికశతతమోఽధ్యాయః - నూటముప్పైఅయిదవ అధ్యాయం

నారదస్య ఈశ్వరం ప్రత్యాగమనం - నారదుడు ఈశ్వరుని చెంతకు వచ్చుట

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

తతో రణే దేవబలం నారదోఽభ్యగమత్పునః ।
ఆగత్య చైవ త్రిపురాత్సభాయామాస్థితః స్వయమ్ ॥1॥

ఆపై నారదుడు రణాంగణంలో మరల దేవతలున్న చోటు చేరుకున్నాడు. త్రిపురం నుండి తిరిగి వచ్చి దేవసభ చేరాడు.

ఇలావృతమితి ఖ్యాతం తద్వర్షం విస్తృతాయతమ్ ।
యత్ర యజ్ఞో బలేర్వృత్తో బలిర్యత్ర చ సంయతః ॥2॥

ఇలావృతమనే వర్షం అతి విస్తృతమైనది. అక్కడే పూర్వం బలి యజ్ఞం చేశాడు. అతడక్కడ బంధనానికి గురి అయ్యాడు.

దేవానాం జన్మభూమిర్యా త్రిషు లోకేషు విశ్రుతా ।
వివాహాః క్రతవశ్చైవ జాతకర్మాదికాః క్రియాః ॥3॥

దేవానాం యత్ర వృత్తాని కన్యాదానాని యాని చ ।
రేమే నిత్యం భవో యత్ర సహాయైః పార్షదైర్గణైః ॥4॥

అది దేవతల జన్మభూమిగా ముల్లోకాలలో విఖ్యాతిగన్న భూమి. దేవతల వివాహాలు, క్రతువులు, జాతకర్మాది క్రియలు అక్కడే జరిగాయి. కన్యాదానాలు గూడా జరిగాయి. అక్కడ భవుడు పార్షదగణాలతో గూడి నిత్యం క్రీడించాడు.

లోకపాలాః సదా యత్ర తస్థుర్మేరుగిరౌ యథా ।
మధుపింగలనేత్రస్తు చంద్రావయవభూషణః ।
దేవానామధిపం ప్రాహ గణపాంశ్చ మహేశ్వరః ॥5॥

మేరుగిరిలో ఉన్నట్లే లోకపాలురు సదా అక్కడ ఉండేవారు. తేనెలాగా పింగళమైన నేత్రాలు గలవాడు, చంద్రరేఖను భూషణంగా దాల్చినవాడు, అయిన మహేశ్వరుడు దేవేంద్రుణ్ణీ, గణాధిపులనూ ఉద్దేశించి యిలా చెప్పాడు.

వాసవైతదరీణాం తే త్రిపురం పరిదృశ్యతే ।
విమానైశ్చ పతాకాభిర్ధ్వజైశ్చ సమలంకృతమ్ ॥6॥

వాసవా! అదిగో! శత్రువుల త్రిపురం కనిపిస్తున్నది. అది విమానాలతో, పతాకలతో, ధ్వజాలతో అలంకృతమైయున్నది.

ఇదం విత్తమిదం ఖ్యాతం వహ్నివద్భృశతాపనమ్ ।
ఏతే జనా గిరిప్రఖ్యాః సకుణ్డలకిరీటినః ॥7॥

ఇది అందరూ ఎరిగినది. విఖ్యాతమైనది మరియు అగ్నివలె బాధాకరము. ఇక్కడి జనులు కుండలకిరీటధారులై కొండలలాగా ఉన్నారు.

ప్రాకారగోపురాట్టేషు లక్ష్యన్తే దానవాః స్థితాః ।
ఇమే చ తోయదాభాసా దనుజా వికృతాననాః ॥8॥

ప్రాకారగోపురాల అంతస్తులలో దానవులున్నారు. వీరు మేఘంవంటి కాంతి గల్గి వికృతముఖులుగా ఉన్నారు.

నిర్గచ్ఛన్తి పురాద్దైత్యాః సాయుధా విజయైషిణః ॥9॥

ఎదుట దైత్యులు ఆయుధాలు ధరించి విజయార్థులై పురం నుండి వెడలి వస్తున్నారు.

స త్వం సురశతైః సార్ధం ససహాయో వరాయుధః ।
సహైవ మామకైర్భృత్యైర్వ్యాపాదయ మహాసురాన్ ॥10॥

నీవు దేవసేనతో గూడి ససహాయుడవై శ్రేష్ఠమైన ఆయుధాలు ధరించి నా భృత్యులతో గూడి మహాసురులను వధించు.

అహం చ రథవర్యేణ నిశ్చలాచలవత్స్థితః ।
పురః పురస్య రంధ్రార్థీ స్థాస్యామి విజయాయ వః ॥11॥

నేను ఈ రథశ్రేష్ఠంలో నిశ్చలమైన కొండవలె ఉంటాను. ఎదుట పురముయొక్క రంధ్రాలను అన్వేషిస్తూ మీకు విజయం కల్గించడానికై నిలుస్తాను.

యదా తు పుష్యయోగేన ఏకత్వం యాస్యతే పురమ్ ।
తదేతన్నిర్దహిష్యామి శరేణైకేన వాసవ! ॥12॥

ఇంద్రా! పుష్యయోగంలో మూడు పురాలు ఒక శ్రేణిలోకి వచ్చినప్పుడు నేను ఒకే బాణంతో వాటిని కాల్చివేస్తాను.

ఇత్యుక్తో వై భగవతా రుద్రేణేహ సురేశ్వరః ।
యయౌ తత్త్రిపురం జేతుం తేన సైన్యేన సంవృతః ॥13॥

భగవానుడగు రుద్రుడారీతిగా చెప్పగా ఇంద్రుడు ఆ సైన్యంతో సహా త్రిపురాలను జయించడానికి వెళ్ళాడు.

ప్రక్రాన్తరథభీమైస్తైః సదేవైః పార్షదాం గణైః ।
కృతసింహరవోపేతైరుద్గచ్ఛద్భిరివాంబుదైః ॥14॥

కదిలే రథాలమీద భీకరులైన దేవతలూ, పార్షదగణాలూ సింహనాదం చేస్తూ పైకెగిరి గర్జించే మేఘాల్లాగా కనిపించారు.

తేన నాదేన త్రిపురాద్దానవా యుద్ధలాలసాః ।
ఉత్పత్య దుద్రువుశ్చాపి యుయుధుః ఖే గణేశ్వరైః ॥15॥

ఆ నాదం విని యుద్ధలాలసులైన దానవులు త్రిపురాలనుండి పైకెగిరి సాయుధులై ఆకాశంలో గణాధిపతులపైకి దూకి యుద్ధం చేశారు.

అన్యే పయోధరారావాః పయోధరసమా బభుః ।
ససింహనాదం వాదిత్రం వాదయామాసురుద్ధతాః ॥16॥

మరికొందరు మబ్బుల్లాగా గర్జిస్తూ మేఘసదృశులై సింహనాదంతో పాటు ఉద్ధతులై వాద్యాలు మ్రోయించారు.

దేవానాం సింహనాదశ్చ సర్వతూర్యరవో మహాన్ ।
గ్రస్తోఽభూద్దైత్యనాదైశ్చ చంద్రస్తోయధరైరివ ॥17॥

మబ్బులచే చంద్రుడు మ్రింగబడినట్లు దేవతల సింహనాదాలు, గొప్ప తూర్యరవం దైత్యనాదాలచే గ్రసింపబడ్డాయి.

చంద్రోదయాత్సముద్భూతః పూర్యమాణ ఇవార్ణవః ।
త్రిపురం ప్రబభౌ తద్వద్భీమరూపమహాసురైః ॥18॥

చంద్రోదయంతో పొంగిన సముద్రంవలె భీమరూపులగు మహాదైత్యులచే త్రిపురం ఉప్పొంగి భాసించింది.

ప్రాకారేషు పురే తత్ర గోపురేష్వపి చాపరే ।
అట్టాలకాన్ సమారుహ్య కేచిత్తస్థుర్విలాసినః ॥19॥

కొందరు విలాసవంతులు నగర ప్రాకారాలలో, మరికొందరు గోపురాలలో, అంతస్తు లెక్కి నిలిచారు.

స్వర్ణమాలాధరాః శూరాః ప్రభాసితకృపాణికాః ।
కేచిన్నదన్తి దనుజాస్తోయమత్తా ఇవాంబుదాః ॥20॥

కొందరు శూరులు స్వర్ణమాలలు ధరించి కత్తులు చేతబూనినారు. మరికొందరు జలాధిక్యంచే మదించిన మేఘాలలాగా గర్జించారు.

ఇతశ్చేతశ్చ ధావన్తః కేచిదుద్ధూతవాససః ।
కిమేతదితి పప్రచ్ఛురన్యోన్యం గృహనిస్సృతాః ॥21॥

ఇటూ, అటూ పరుగిడుతూ చేతబట్టిన వస్త్రాలు ఊపుతూ గృహాలనుండి వెలికి వచ్చి మరికొందరు 'ఏమిటిది, ఏమిటిది' అని ఒకరినొకరు ప్రశ్నించారు.

కిమేతన్నైవ జానామి జ్ఞానమంతర్హితం హి మే ।
జ్ఞాస్యసేఽనన్తరేణేతి కాలో విస్తారతో మహాన్ ॥22॥

'ఏమో, నాకు తెలియదు, నాకు జ్ఞానం అంతర్హితం కదా'! తరువాత తెలుసుకొంటావు. కాలం విశాలమైంది, గొప్పది."

కో హ్యసౌ పృథివీపాలః సింహస్య రథమాస్థితః ।
తిష్ఠతే త్రిపురం పీడ్య దేహం వ్యాధిరివోచ్ఛ్రితః ॥23॥

ఎవడో ఒకరాజు సింహాలు లాగే రథమెక్కి శరీరాన్ని వ్యాధిలాగా ఈ త్రిపురాన్ని పీడిస్తున్నాడు.

య ఏషోఽస్తు స ఏషోఽస్తు కా చిన్తా సంభ్రమే సతి ।
ఏహ్యాయుధమథాదాయ భవితవ్యం భవిష్యతి ॥24॥

వాడెవడైనా అగుగాక! చింత ఎందుకు? సంభ్రమమైతే ఆయుధం తీసుకొని రా! జరిగేదేదో జరుగుతుందిలే.

ఇతి తేఽన్యోన్యమావిద్ధా ఉత్తరోత్తరభాషిణః ।
ఆసాద్య పృచ్ఛన్తి తదా దానవాస్త్రిపురాలయాః ॥25॥

ఇలా వారు అన్యోన్యం ఆవిద్ధులై ఉత్తరోత్తరభాషణం సాగిస్తూ త్రిపురనివాసులైన దానవులు ప్రశ్నించసాగారు.

తారకాక్షపురే దైత్యాస్తారకాక్షపురస్సరాః ।
నిర్గతాః కుపితాస్తూర్ణం బిలాదివ మహోరగాః ॥26॥

తారకాక్షపురంలోని దానవులు తారకాక్షుణ్ణి ముందు బెట్టుకొని కుపితులై బిలంనుండి పాములవలె వెలువడ్డారు.

నిర్ధావన్తస్తు తే దైత్యాః ప్రమథాధిపయూథపైః ।
నిరుద్ధా గజరాజానో యథా కేసరియూథపైః ॥27॥

అలా పరుగిడి వచ్చిన దనుజులు సింహయూథాలచే గజరాజుల్లాగా ప్రమథాధిపులచేత నిరోధింపబడ్డారు.

దర్పితానాం తతస్తేషాం దర్పితానామివాగ్నినామ్ ।
రూపాణి జజ్వలుస్తేషామగ్నీనామివ ధమ్యతామ్ ॥28॥

దర్పంతో ఉన్న వారి రూపాలు రగుల్కొల్పబడిన అగ్నులు వలె జ్వలించాయి.

తతో బృహన్తి చాపాని భీమనాదాని సర్వశః ।
నికృష్య జఘ్నురన్యోన్యమిషుభిః ప్రాణభోజనైః ॥29॥

ఆపై పెద్ద చాపాలు చేబూని భీమనాదాలు చేస్తూ వారు అన్యోన్యం అసువులు హరించే బాణాలతో కొట్టుకొన్నారు.

మార్జారమృగభీమాస్యాన్పార్షదాన్వికృతాననాన్ ।
దృష్ట్వా దృష్ట్వా హసన్త్యుచ్చైర్దానవా రూపసమ్పదః ॥30॥

పిల్లులు, మృగాలవంటి భీకరమైన, వికృతమైన ముఖాలు గల పార్షదులను చూచి చూచి రూపసంపదలతో గర్వితులైన దానవులు గట్టిగా పరిహసింపజొచ్చారు.

బాహుభిః పరిఘాకారైః కృష్యతాం ధనుషాం శరాః ।
భటవర్మాణి వివిశుస్తడాగానీవ పక్షిణః ॥31॥

పరిఘలవంటి బాహువులచే ఆకర్షింపబడి దానవులనుండి వెలువడే శరాలు మడుగులలో పక్షులవలె సైనికుల కవచాలలో దూరాయి.

మృతాః స్థ క్వ ను యాస్యేऽథ హనిష్యామో నివర్తతామ్ ।
ఇత్యేవం పరుషాణ్యుక్త్వా దానవాః పార్షదర్షభాన్ ॥32॥

బిభిదుః సాయకైస్తీక్ష్ణైః సూర్యపాదా ఇవాంబుదాన్ ।
ప్రమథా అపి సింహాక్షాః సింహవిక్రాంతవిక్రమాః ।
గణ్డశైలశిలావర్షైర్బిభిదుర్దైత్యదానవాన్ ॥33॥

చచ్చారు! ఇంకెక్కడికి పోతారు? చంపుతాము, వెనుదిరగండి అని యీరీతిగా పరుషవచనాలు పలికి దానవులు పార్షదశ్రేష్ఠులను తీక్ష్ణసాయకాలతో సూర్యకిరణాలు మబ్బులను భేదించినట్లు భేదించారు. సింహనేత్రులైన ప్రమథులు గూడా సింహవిక్రములై గండశైలాలతో, శిలా వర్షాలతో దైత్యదానవులను భేదించారు.

అంబుదైరాకులమివ హంసాకులమివాంబరమ్ ।
దానవాకులమత్యర్థం తద్బలం సంకులం బభౌ ॥34॥

అంబరం మబ్బులచే ఆకులమైనట్లు, హంసలచే వ్యాప్తమైనట్లు ఆ సేనాసముదాయం మిక్కిలిగా దానవులచే ఆక్రమింపబడి సంకులమై కనిపించింది.

వికృష్టచాపా దైత్యేంద్రాః సృజన్తి శరదుర్దినమ్ ।
ఇంద్రచాపాంకితోరస్కా జలదా ఇవ దుర్దినమ్ ॥35॥

ఇంద్రచాపాంకితమైన వక్షం కల మేఘాలు దుర్దినాన్ని సృష్టించినట్లు ధనువులు ఎక్కుపెట్టిన దైత్యేంద్రులు శరవర్షంతో దుర్దినాన్ని సృష్టించారు.

ఇషుభిస్తాద్యమానాస్తే భూయో భూయో గణేశ్వరాః ।
చక్రుస్తే దేహనిర్యాసం స్వర్ణధాతుమివాచలాః ॥36॥

మాటిమాటికీ బాణాల దెబ్బలు దిన్న గణేశ్వరులు కొండలు స్వర్ణనిర్యాసం చేసినట్లు దేహంనుండి రక్తధారలను స్రవించారు.

తథా వృక్షశిలాశైలవజ్రశూలపరశ్వథైః ।
చూర్ణ్యన్తేऽభిహతా దైత్యైః కాచాష్టంకహతా ఇవ ॥37॥

వృక్షాలు, శిలలు, కొండలు, వజ్రం, శూలాలు, పరశ్వథాలు – వీటి ప్రయోగంతో టంకహతములైన గాజుపెంకులవలె దైత్యులచే తాడితులైన వారు పొడిపొడి అయ్యారు.

చంద్రోదయాత్సముద్భూతః పౌర్ణమాస ఇవార్ణవః ।
త్రిపురం ప్రాభవత్తద్వద్భీమరూపమహాసురైః ॥38॥

చంద్రోదయంలో పున్నమినాడు పొంగే సాగరం లాగా, భీమరూపులైన మహారాక్షసులచే త్రిపురం ఉప్పొంగింది.

తారకాక్షో జయత్యేష ఇతి దైత్యా అఘోషయన్ ।
జయతీంద్రశ్చ రుద్రశ్చ ఇత్యేవ చ గణేశ్వరాః ॥39॥

'తారకాక్షో జయతి' అని దైత్యులు ఘోషించారు. గణేశ్వరులు 'జయతీంద్రశ్చ రుద్రశ్చ' అని ఘోషించారు.

వారితా దారితా బాణైర్యోధాస్తస్మిన్బలార్ణవే ।
నిఃస్వనన్త్యంబుసమయే జలగర్భా ఇవాంబుదాః ॥40॥

ఆ ఉభయ సైన్యాలలో అడ్డగింపబడిన, చీల్చబడిన యోధులు వర్షసమయాలలో జలగర్భాలైన మబ్బులవలె ధ్వనించారు.

కరైశ్ఛిన్నైః శిరోభిశ్చ ధ్వజైశ్ఛత్రైశ్చ పాండురైః ।
యుద్ధభూమిర్భయవతీ మాంసశోణితపూరితా ॥41॥

తెగిన చేతులు, తలలు, ధ్వజాలు, పాండురఛత్రాలతో మాంసరక్త పూరితమై యుద్ధభూమి భయంకర మయింది.

వ్యోమ్ని చోత్పత్య సహసా తాలమాత్రం వరాయుధైః ।
దృఢాహతాః పతన్త్యూర్ధ్వం దానవాః ప్రమథాస్తథా ॥42॥

ఆకాశంలోకి తాటిచెట్టంత పైకెగిరి శ్రేష్ఠమైన ఆయుధాలచే కొట్టబడిన దానవులు క్రిందపడ్డారు. ఆపై ప్రమథులూ అలాగే పడ్డారు.

సిద్ధాశ్చాప్సరసశ్చైవ చారణాశ్చ నభోగతాః ।
దృఢప్రహారహృషితాః సాధు సాధ్వితి చక్రుశుః ॥43॥

ఆకాశంలో వెళ్ళే సిద్ధులు, అచ్చరలు, చారణులు దృఢమైన దెబ్బలు చూచి హర్షించి 'బాగు, బాగు' అని అరచారు.

అన్వాహతాశ్చ వియతి దేవదుందుభయస్తథా ।
నదన్తో మేఘశబ్దేన శరభా ఇవ రోషితాః ॥44॥

వాయించబడిన దేవదుందుభులు ఆకసంలో మేఘశబ్దంతో ధ్వనిస్తూ శరభమృగాలవలె రోషించాయి.

తే తస్మింస్త్రిపురే దైత్యా నద్యః సింధుపతావివ ।
విశన్తి క్రుద్ధవదనా వల్మీకమివ పన్నగాః ॥45॥

ఆ దైత్యులు త్రిపురంలో నదులు సాగరంలో లాగానూ, పాములు పుట్టల్లో వలెనూ కుపితముఖాలు గలవారై ప్రవేశించారు.

తారకాక్షపురే తస్మిన్ అసురాః సురతాడితాః ।
సశస్త్రా నిపతన్తి స్మ సపక్షా ఇవ భూధరాః ॥46॥

తారకాక్షుని నగరంలో దేవతలచే దెబ్బలు తిన్న రాక్షసులు శస్త్రాలు చేతపట్టి రెక్కలు గల కొండల్లాగా వ్రాలారు.

యోధయన్తి త్రిభాగేన త్రిపురే తు గణేశ్వరాః ।
విద్యున్మాలీ మయశ్చైవ తత్రాయాతౌ సహానుగౌ ।

తాభ్యాం నిపతమానాభ్యాం దానవాభ్యాం గణేశ్వరాః ।
త్రాసితా నిహతాశ్చైవ భగ్నాశ్చ ద్రుమవద్రణే ॥47॥

త్రిపురంలో గణేశ్వరులు మూడవ వంతు దానవ సేనతో తలపడి యుద్ధం చేశారు. విద్యున్మాలి మయుడు అనుచరులతో అక్కడికి వచ్చారు. వచ్చిన ఆ రాక్షసులచేత భయపడి నిహతులైన గణేశ్వరులు రణరంగంలో చెట్లవలె భగ్నమయ్యారు.

విద్యున్మాలీ స దైత్యేంద్రో గిరీంద్రసదృశద్యుతిః ।
ఆదాయ పరిఘం ఘోరం తాడయామాస నన్దినమ్ ॥48॥

గిరీంద్రం వంటి కాంతి గల దైత్యేంద్రుడు విద్యున్మాలి ఘోరమైన పరిఘ చేబూని నందిని కొట్టాడు.

స నందీ దానవేంద్రేణ పరిఘేణ దృఢాహతః ।
భ్రమతే మధునా భగ్నః పురా నారాయణో యథా ॥49॥

అలా దేత్యేంద్రునిచే కొట్టబడిన నంది పూర్వం మధు రాక్షసునిచే భగ్నుడైన నారాయణుని లాగా భ్రమించాడు.

నన్దీశ్వరే గతే తత్ర గణపాః ఖ్యాతవిక్రమాః ।
దుద్రువుర్జాతసంరంభా విద్యున్మాలినమాసురమ్ ॥50॥

ఘణ్టాకర్ణః శంకుకర్ణో మహాకాలశ్చ పార్షదః ।
తతశ్చ సాయకైః సర్వాన్ గణపాన్ గణపాకృతీన్ ॥51॥

భూయో భూయః స వివ్యాధ గణేశ్వరమహత్తమాన్ ।
భిత్త్వా భిత్త్వా రురావోచ్చైర్నభస్యంబుధరో యథా ॥52॥

నందీశ్వరుడు యుద్ధ భూమినుండి తొలగి పోగా విఖ్యాత పరాక్రములైన గణాధిపతులు సంరంభంతో విద్యున్మాలిపైకి ఉరికారు. ఘంటాకర్ణుడు, శంకుకర్ణుడు, మహాకాలుడు పరుగెత్తిపోగా ఆ పై బాణాలతో గణపాకృతులైన గణాధిపతుల నందరినీ విద్యున్మాలి మాటిమాటికీ కొట్టాడు. అలా వారిని భేదించి, భేదించి ఆకాశంలో మేఘం లాగా గట్టిగా గర్జించాడు.

తస్య రావితశబ్దేన నందీ దినకరప్రభః ।
సంజ్ఞాం లబ్ధ్వా తతః సోఽపి విద్యున్మాలినమాద్రవత్ ॥53॥

అతని ధ్వనికి దినకరప్రభుడైన నంది మూర్ఛనుండి తేరుకొని విద్యున్మాలిపై కురికాడు.

రుద్రదత్తం తదా దీప్తం దీప్తానలసమప్రభమ్ ।
వజ్రం వజ్రనిభాఙ్గస్య దానవస్య ససర్జ హ ॥54॥

అతడు దీప్తాగ్నివంటిది, రుద్రు డిచ్చినది, ప్రదీప్త మైనదీ ఐన వజ్రాన్ని వజ్రశరీరుడైన దానవుని పైకి ప్రయోగించాడు.

నందినో భుజనిర్ముక్తం ముక్తాఫలవిభూషితమ్ ।
పపాత వక్షసి తదా వజ్రం దైత్యస్య భీషణమ్ ॥55॥

నంది భుజంనుండి ప్రయుక్తమైనదీ, ముత్యాలచే అలంకృతమైనదీ అయిన వజ్రాయుధం భీషణమైన దైత్యుని వక్షంపై పడింది.

స వజ్రనిహతో దైత్యో వజ్రసంహననోపమః ।
పపాత వజ్రాభిహతః శక్రేణాద్రిరివాహతః ॥56॥

వజ్రసంహనన సన్నిభుడైన ఆ దైత్యుడలా వజ్రాయుధనిహతుడై ఇంద్రునిచే కొట్టబడిన కొండవలె నేల గూలాడు.

దైత్యేశ్వరే వినిహతే నన్దినా కులనన్దినా ।
చుక్రుశుర్గణపాన్ ప్రేక్ష్య దుద్రువుశ్చైవ దానవాః ॥57॥

కులనందియగు నందిచే చంపబడిన దైత్యేశ్వరుణ్ణి చూచి గణపతుల నుద్దేశించి దానవులందరూ ఆక్రోశించి పరుగిడి పారిపోయారు.

దుఃఖామర్షితరోషాస్తే విద్యున్మాలిని పాతితే ।
ద్రుమశైలమహావృష్టిం పయోదాః ససృజుర్యథా ॥58॥

విద్యున్మాలి పడిపోగా దుఃఖరోషగ్రస్తులైన దనుజులు మేఘాలలాగా వృక్షశైల మహావర్షం సృష్టించారు.

తే పీడ్యమానాః గురుభిర్గిరిభిశ్చ గణేశ్వరాః ।
కర్తవ్యం న విదుః కించిద్వధ్యమానా హ్యధార్మికైః ॥59॥

అలా పెద్ద కొండలచే బాధింపబడిన గణాధిపులు అధార్మికులచే వధింపబడుతూ కర్తవ్య మేమిటో గ్రహించలేకపోయారు.

తతోఽసురవరః శ్రీమాంస్తారకాక్షః ప్రతాపవాన్ ।
స తరూణాం గిరీణాం వై తుల్యరూపధరో బభౌ ॥60॥

ఆ మీదట అసురశ్రేష్ఠుడు, ప్రతాపశాలీ అయిన తారకుడు తరువుల, గిరులవంటి శరీరాకృతి ధరించి భాసించాడు.

భిన్నోత్తమాంగాః గణపాః భిన్నపాదాననాస్తదా ।
విరేజుర్భుజగా మంత్రైర్వార్యమాణా యథా తథా ॥61॥

గణాధిపతులు శిరస్సులు పగిలి, కాళ్లు ముఖాలు భిన్నం కాగా మంత్రనిరుద్ధాలైన పాములవలె రూపొందారు.

మయేన మాయావీర్యేణ వధ్యమానా గణేశ్వరాః ।
భ్రమన్తి బహుశబ్దాలాః పంజరే శకునా ఇవ ॥62॥

మాయావీర్యుడైన మాయావిచే చంపబడే గణాధీశ్వరులు పంజరంలో చిక్కిన పక్షులవలె అరుస్తూ భ్రమించారు.

తథాఽసురవరః శ్రీమాన్ తారకాక్షః ప్రతాపవాన్ ।
దదాహ చ బలం సర్వం శుష్కేన్ధనమివానలః ॥63॥

అలా ప్రతాపశాలీ, అసురశ్రేష్ఠుడూ అయిన తారకుడు శుష్కేంధనాన్ని అగ్ని దహించినట్లు దేవసైన్యాన్ని దగ్ధం చేశాడు.

తారకాక్షేణ వార్యంతే శరవర్షైస్తదా గణాః ।
మయేన మాయానిహతాస్తారకాఖ్యేణ చేషుభిః ॥64॥

తారకుడు శరవర్షంతో గణాలను నివారించాడు. మయుడు వారిని మాయచేత నిహతులను చేశాడు. తారకుడు బాణాలతో వధించాడు.

గణేశా విధురా జాతా జీర్ణమూలా తథా ద్రుమాః ॥65॥

కృశించిన వేళ్ళుగల చెట్లవలె గణేశులు దిక్కులేనివారయ్యారు. (కూలబడ్డారు.)

భూయశ్చ సాగరం హ్యగ్నిం సింహగ్రాహ భుజఙ్గమాన్ ।
గిరీంద్రాంశ్చ హరీన్వ్యాఘ్రాన్ వృక్షాన్ భేరుండపక్షిణః ॥66॥

శరభానష్టపాదాంశ్చ ఆపః పవనమేవ చ ।
మయో మాయాబలేనైవ పాతయత్యేవ శత్రుషు ॥67॥

మరల మయుడు సాగరం, అగ్ని, సింహం, గ్రాహం, పాములు, గిరీంద్రాలు, పులులు, చెట్లు, భేరుండపక్షులు, అష్టపాదాలు గల శరభాలు, నీరు, గాలి – వీటిని మాయాబలంతో సృష్టించి శత్రువులపై ప్రయోగించాడు.

తే తారకాక్షేణ మయేన మాయయా సంముహ్యమానా వివశా గణేశ్వరాః ।
నాశక్నువంస్తే మనసాఽపి చేష్టితం యథేంద్రియార్థా మునినాఽభిసంయతాః ॥68॥

అలా తారకుని చేతా, మయుని మాయచేతా సమ్మోహితులై వివశులైన గణాధిపులు ముని నిగ్రహించిన ఇంద్రియార్థాలవలె మనసా చేష్టించడానికి సైతం శక్తి హీనులయ్యారు.

మహాజలాగ్న్యద్రికుంజరోరగైర్వరీంద్రవ్యాఘ్రర్క్షతరక్షురాక్షసైః ।
తే వధ్యమానాస్తమసా విమోహితాః సముద్రమధ్యేష్విప జీవకాంక్షిణః ॥69॥

మహాజలం, అగ్ని, ఏనుగులు, కొండలు, ఏనుగులు, పాములు, సింహాలు, పులులు, ఋక్షాలు, తరక్షులు, రాక్షసులు వీటిచే బాధింపబడి తమో విమోహితులై గణాధిపులు సముద్రమధ్యంలో పడి గట్టుకోసం పరితపించేవారిలాగా అయ్యారు.

సంమర్ద్యమానేషు గణేశ్వరేషు ప్రమర్ద్యమానేషు సురేషు తేషు ।
తతః సురాణాం ప్రవరాస్తు రక్షితుం రిపోర్బలం సంవివిశుః సహాయుధాః ॥70॥

గణేశ్వరు లారీతిగా పీడింపబడగా దేవతలు బాధకు గురికాగా సురప్రవర రక్షణ కొరకై సాయుధులైన శివసైనికులు శత్రుబలంలో ప్రవేశించారు.

యమో ధనేశో వరుణశ్చ భాస్కరస్తథా కుమారోఽమరకోటిసంయుతః ।
స్వయం చ శక్రః సితనాగవాహనః కులీశపాణిః సురలోకపుంగవః ॥71॥

స చోడునాథః సమరే దివాకరః స సాన్తకస్త్ర్యక్షపతిర్మహాద్యుతిః ।
ఏతే రిపూణాం ప్రబలాభిరక్షితం తదా బలం సంవివిశుర్మదోద్ధతాః ॥72॥

గద చేపట్టిన యముడు, కుబేరుడు, వరుణుడు, భాస్కరుడు, దేవతాబృంద సమేతుడగు కుమారుడు, తెల్ల ఏనుగుపైకెక్కి స్వయంగా వచ్చిన వజ్రపాణి, దేవశ్రేష్ఠుడైన ఇంద్రుడు, చంద్రుడు, సూర్యుడు, శని, యముడు, మహాద్యుతియైన శివుడు – వీరందరూ అభిరక్షితమై యున్న శత్రుసైన్యాన్ని మదోద్ధతులై ప్రవేశించారు.

యథా వనం దర్పితకుంజరాధిపా యథా నభః సాంబుధరం దివాకరః ।
యథా చ సింహైర్విజనేషు గోకులం తథా బలం తత్త్రిదశైరభిద్రుతమ్ ॥73॥

గర్వించిన గజరాజులు వనాన్ని వలె, మేఘావృతమైన ఆకాశాన్ని సూర్యుని వలె, విజనమైన గోకులాన్ని సింహాల వలె, అసుర సైన్యాన్ని దేవతలు ప్రవేశించి ఎదుర్కొన్నారు.

కృతప్రహారాతురదీనదానవం బలం సమేత్యాథ మయస్తమోఽసృజత్ ।
తముల్బణం ధ్వాంతమథోగ్రతేజసా విద్యోతనాస్త్రేణ తథైవ దేవరాట్ ॥74॥

విపాతయామాస యథా సదైవ నిశాకరః సంచితశార్వరం తమః ।
తతోఽపకృష్టే చ తమఃప్రభావే అస్త్రప్రభావే చ వివర్ధమానే ॥75॥

దెబ్బలచే ఆతురత నొంది దీనులైన దానవులు గల రాక్షససైన్యం భగ్నమయింది. అప్పుడు మయుడు సమీపించి తమస్సును సృష్టించాడు. గాఢమైన ఆ చీకటిని దేవప్రభువు విద్యోతనాస్త్రంతో చంద్రుడు చీకటిని నశింపచేసినట్లు నశింపజేశాడు. చీకటి ప్రభావం తొలగిపోయింది. దేవతల అస్త్రప్రభావం పెరిగింది.

దిగ్లోకపాలైర్గణనాయకైశ్చ కృతో మహాన్ సింహరవో ముహూర్తమ్ ।
సంఖ్యే విభగ్నా వికరా విపాదాశ్ఛిన్నోత్తమాంగాః శరపూరితాంగాః ॥76॥

దేవేతరా దేవవరైర్విభిన్నాః సీదన్తి పంకేషు యథా గజేంద్రాః ।
వజ్రేణ భీమేన చ వజ్రపాణిః శక్త్యా చ శక్త్యా చ మయూరకేతుః ॥77॥

దణ్డేన చోగ్రేణ చ ధర్మరాజః పాశేన చోగ్రేణ చ వారిగోప్తా ।
శూలేన కాలేన చ యక్షరాజో వీర్యేణ తేజస్వితయా సుకేశః ॥78॥

దిక్పాలకులు, లోకపాలకులు, గణనాయకులు క్షణకాలం సింహనాదాలు చేశారు. యుద్ధంలో భగ్నులై రాక్షసులు చేతులు, కాళ్ళు లేనివారు, శిరస్సులేనివారు, బాణాలతో నిండిన శరీరాలు కలవారయ్యారు. దేవశ్రేష్ఠులచే

భిన్నులైన రక్కసులు బురదలో చిక్కువడిన గజేంద్రుల్లాగా బాధనొందారు. వజ్రపాణియైన ఇంద్రుడు భీకరమైన వజ్రాయుధంతో, కుమారస్వామి శక్త్యాయుధంతో, ధర్మరాజు ఉగ్రదండంతో, వరుణుడు ఉగ్రపాశంతో, యక్షరాజు నల్లని శూలంతో, సుకేశుడు తేజోవీర్యంతో ఇలా రాక్షసులను యుద్ధంలో ఛిన్నాభిన్నం చేశారు.

గణేశ్వరాస్తే సురసన్నికాశాః పూర్ణాహుతీసిక్తశిఖిప్రకాశాః ।
ఉత్పాదయన్తే దనుపుత్రవృక్షాన్ యథైవ ఇంద్రాశనయః పతన్తః ॥79॥

సురసన్నిభులైన గణాధిపతులు పూర్ణాహుతితో తడిసిన అగ్నివంటి ప్రకాశం కలవారై జారిపడే పిడుగులు చెట్లనువలె దానవబృందాలను నశింపజేశారు.

మయస్తు దేవాన్ పరిరక్షితారముమాత్మజం దేవహరం కుమారమ్ ।
శరేణ భిత్వా స హి తారకాసుతం స తారకాక్షాసురమాబభాషే ॥80॥

దేవతలకు రక్షకుడైన పార్వతీసుతుడూ, సురశ్రేష్ఠుడూ అయిన కుమారుని మయుడు శరంతో ఛేదించి తారకాక్షునితో ఇలా అన్నాడు.

కృత్వా ప్రహారం ప్రవిశామి వీరం పురం హి దైత్యేంద్రబలేన యుక్తః ।
విశ్రామమూర్జస్కరమప్యవాప్య పునః కరిష్యామి రణం ప్రపన్నైః ॥81॥

ప్రహారం కావించి నేనిప్పుడు దైత్యబలసమేతుడనై పురంలోకి ప్రవేశిస్తాను. బలకరమైన విశ్రాంతి పొంది మరల వచ్చి వీరితో యుద్ధం చేస్తాను.

వయం హి శస్త్రక్షతవిక్షితాంగాః విశీర్ణశస్త్రధ్వజవర్మవాహాః ।
జయైషిణస్తే జయకాశినశ్చ గణేశ్వరా లోకనరాధిపాశ్చ ॥82॥

మేము శస్త్రాలచే దెబ్బతిన్న శరీరాలతో శస్త్రధ్వజ వర్మ వాహనాదులు విశీర్ణమైపోగా ఇలా వున్నాము. వారు జయం కోరి జయశోభ గల్గి గణేశులు లోకాధిపులైనారు.

మయస్య శ్రుత్వా దివి తారకాక్షో వచోఽభికాంక్షాం క్షతజోపమాక్షః ।
వివేశ తూర్ణం త్రిపురం సహైవ దితేః సుతైః యుద్ధవివృద్ధదర్పైః ॥83॥

మయుని మాటలు విని తారకాక్షుడు రక్తనేత్రుడై యుద్ధంలో గర్వించిన దితిసుతులతో గూడి వెంటనే త్రిపురం ప్రవేశించాడు.

తతః సశంఖానకభేరిభీమం ససింహనాదం హరసైన్యమాబభౌ ।
మహాబలం ఘోరసుభీమగహ్వరం యథా హిమాద్రేర్గజసింహనాదితమ్ ॥84॥

ఆపై శంఖ, ఆనక, భేరీ భీమంగా, సింహనాద సమేతంగా శివునిసైన్యం విరాజిల్లింది. మహాబలం కల ఆ సైన్యం ఏనుగుల ఘీంకారాలతో, సింహగర్జనలతో ప్రతిధ్వనించే మిక్కిలి భయంకరమైన, ఘోరమైన హిమాద్రిగుహ లాగా విరాజిల్లింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే నారదస్య ఈశ్వరం ప్రత్యాగమనం నామ పంచత్రింశదధికశతతమోఽధ్యాయః ॥135॥

శ్రీమత్స్యమహాపురాణంలోని నారదుడు ఈశ్వరుని చెంతకు వచ్చుట అనే నూటముప్పైఅయిదవ అధ్యాయం సంపూర్ణం

షట్త్రింశదధికశతతమోఽధ్యాయః – నూటముప్పై ఆరవ అధ్యాయం

నందితారక సంగ్రామః – నంది–తారక సంగ్రామం

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

మయో మహారణం కృత్వా మాయావీ దానవర్షభః ।
వివేశ తూర్ణం త్రిపురమభ్రో నీలమివాంబరమ్ ॥1॥

మాయావి, దానవశ్రేష్ఠుడూ అయిన మయుడు అలా పెద్ద యుద్ధం చేసి నీలాకాశంలో మబ్బు ప్రవేశించినట్లు త్రిపురంలో ప్రవేశించాడు.

స దీర్ఘముష్ణం నిఃశ్వస్య దానవాన్వీక్ష్య మధ్యగః ।
దధ్యౌ లోకక్షయే ప్రాప్తే కాలం కాల ఇవాపరః ॥2॥

అతడు దీర్ఘంగానూ, ఉష్ణంగానూ నిట్టూర్చి దానవుల మధ్యనుండి వారిని చూచి లోకక్షయం సమీపించినప్పుడు అపరకాలునిలాగా కాలాన్ని ధ్యానించాడు.

ఇంద్రోఽపి కంపతే యస్య స్థితో యుద్ధేష్వరగ్రతః ।
స చాపి నిధనం ప్రాప్తో విద్యున్మాలీ మహాయశాః ॥3॥

ఇంద్రుడు సైతం యుద్ధార్థియై వచ్చి ఎవని యెదుట నిలవడానికి భయపడతాడో, అటువంటి మహాకీర్తిమంతుడైన విద్యున్మాలి గూడా మరణించాడు.

దుర్గం వై త్రిపురస్యాస్య న సమం విద్యతే పురమ్ ।
తస్యాప్యేషో లయః ప్రాప్తో న దుర్గం కారణం క్వచిత్ ॥4॥

ఈ త్రిపురదుర్గానికి సమమైన పురం మరొకటి ఎక్కడా లేదు. దీనికి గూడా ఈ వినాశం సంభవించింది. అందుచేత దుర్గం ఎక్కడా రక్షణకు కారణం కాజాలదు.

కాలస్యైవ వశే సర్వం దుర్గం దుర్గాంతరం చ యత్ ।
కాలే క్రుద్ధే కథం కాలాత్త్రాణం నోఽద్య భవిష్యతి ॥5॥

దుర్గమైనా, దుర్గాంతరమైనా అంతా కాలానికి వశమై ఉన్నది. అట్టి కాలమే కోపించినప్పుడు మనకు కాలంనుండి ఎలా రక్షణ కల్గుతుంది?

లోకేషు త్రిషు యత్కించిద్బలం వై సర్వజన్తుషు ।
కాలస్య తద్వశం సర్వమితి పైతామహో విధిః ॥6॥

ముల్లోకాలలో సకల ప్రాణులలోనూ ఏ కొంచెం బలమున్నా అదంతా కాలవశంలోనే ఉంటుందని బ్రహ్మవిధి.

అస్మిన్ కః ప్రభవేద్యోగో హ్యసన్ధార్యేఽమితాత్మని ।
లంఘనే కః సమర్థః స్యాదృతే దేవం మహేశ్వరమ్ ॥7॥

ధరింపశక్యం కానిది, అమితాత్మకమూ అయిన ఈ కాలం విషయంలో ఏ ఉపాయం సమర్థం కాగలదు? దీనిని దాటడానికి దేవుడైన మహేశ్వరుడు తప్ప మరెవడు సమర్థుడు?

బిభేమి నేంద్రాద్ధి యమాద్వరుణాన్న చ విత్తపాత్ ।
స్వామీ చైషాం తు దేవానాం దుర్జయః స మహేశ్వరః ॥8॥

ఇంద్రుడు, యముడు, వరుణుడు, కుబేరుడు – వీరికి నేను భయపడడం లేదు. ఈ దేవతలకు ప్రభువు దుర్జయుడైన ఆ మహేశ్వరుడే.

ఐశ్వర్యస్య ఫలం యత్తత్ప్రభుత్వస్య చ యత్ఫలమ్ ।
తదద్య దర్శయిష్యామి యావద్వీరాః సమన్తతః ॥9॥

ఐశ్వర్యానికీ, ప్రభుత్వానికీ ఏది ఫలమో దానిని నేడు చూపుతాను. ఈ దానవ వీరులందరూ నలువైపులా ఉన్నారు కదా!

వాపీమమృతతోయేన పూర్ణాం స్రక్ష్యామి తామహమ్ ।
జీవిష్యన్తి తదా దైత్యాః సంజీవనమివౌషధమ్ ॥10॥

అమృతజలపూర్ణమైన నడబావిని సృష్టిస్తాను. అప్పుడు ఈ మరణించిన దైత్యులు సంజీవనౌషధిచేతవలె జీవించగలరు.

ఇతి సంచిత్య బలవాన్మయో మాయావినాం వరః ।
మాయయా ససృజే వాపీం రంభామివ పితామహః ॥11॥

ఇలా ఆలోచించి బలవంతుడు, మాయావి, శ్రేష్ఠుడూ అయిన మయుడు పితామహుడు రంభను సృష్టించినట్లు మాయతో ఒక నడబావిని సృష్టించాడు.

ద్వియోజనాయతాం దీర్ఘాం పూర్ణయోజనవిస్తృతామ్ ।
మాధుర్యరసవీచీభిశ్చిత్రరూపాం కథామివ ॥12॥

రెండు యోజనాల వెడల్పు, పొడవూ, ఒక యోజనం విస్తృతి గలిగి మాధుర్యరసభరితమైన అలలతో నిండిన ఒక వాపిని చిత్రరూపమైన కథను సృష్టించినట్లు సృష్టించాడు.

ఇందోః కిరణకల్పేన మృష్టేనామృతగంధినా ।
పూర్ణాం పరమతోయేన గుణపూర్ణామివాంగనామ్ ॥13॥

చంద్రకిరణ సదృశమూ, రుచికరమూ, అమృతగంధమూ అయిన పరమజలంతో నిండిన ఆ బావిని గుణవతి యయిన అంగనను వలె సృష్టించాడు.

ఉత్పలైః కుముదైః పద్మైర్వృతాం కాదమ్బకైస్తథా ।
చంద్రభాస్కరవర్ణాభైర్భ్రమరాభరణైర్వృతామ్ ॥14॥

ఖగైర్మధురరావైశ్చ చారుచామీకరప్రభైః ।
కామేషుభిరివాకీర్ణాం దీప్యతే రమణీమివ ॥15॥

చంద్రసూర్యవర్ణ శోభితములగు నల్ల గలువలు, కుముదాలు, పద్మాలు, హంసలతో కూడి తుమ్మెదలనే ఆభరణాలతో గూడినది, అందమైన స్వర్ణ కాంతి కలిగి మధురధ్వని కావించే పక్షులతో గూడినదై మదనశరాలచే దీపించిన రమణివలె నున్న నడబావిని సృష్టించాడు.

సృష్ట్వా మయస్స తాం వాపీం గంగామివ మహేశ్వరః ।
తస్యాం ప్రక్షేపయామాస విద్యున్మాలినమాదితః ॥16॥

మహేశ్వరుడు గంగను సృజించినట్లు ఆ మయుడు వాపిని సృష్టించాడు. దానిలో విద్యున్మాలి శరీరాన్ని పడవేయించాడు.

స వాప్యాం మజ్జితో దైత్యో దేవశత్రుర్మహాబలః ।
ఉత్తస్థావింధనైరిద్ధః సద్యోహుత ఇవానలః ॥17॥

దేవశత్రువు, మహాబలశాలీ అయిన ఆ రాక్షసుడు బావిలో ముంచగానే కట్టెలతో జ్వలించే సద్యోహుతమైన అగ్నివలె లేచాడు.

మయస్య చాంజలిం కృత్వా తారకాక్షోఽభివాదితః ।
విద్యున్మాలీతి వచనం మయమేవమభాషత ॥18॥

విద్యున్మాలి మయునికి అంజలి గావించి తారకునికి అభివాదం చేశాడు. మయునితో ఇలా అన్నాడు–

క్వ నన్దీ సహ రుద్రేణ వృతః ప్రమథజంబుకైః ।
యుధ్యామోఽరీన్వినిష్పిద్య దయా దేవేషు కా హి నః ॥19॥

రుద్రునితోపాటు ప్రమథులనే నక్కలతో పరివృతుడైన ఆ నంది ఎక్కడ? శత్రువులను పిండి గావించి యుద్ధం చేద్దాము. దేవతలపై మనకు దయ ఎలా వుంటుంది?

ప్రసాదేన చ రుద్రస్య భవామః ప్రభవిష్ణవః ।
తైర్వా వినిహతా యుద్ధే భవిష్యామో యమాశనాః ॥20॥

రుద్రుని అనుగ్రహంతో మనం ప్రభువుల మన్నా అవుదాం. లేదా వారిచే చచ్చి యమునికి ఆహారమవుదాం.”

విద్యున్మాలివచస్త్వేవం నిశమ్యాత్యంతమూర్జితమ్ ।
తం పరిష్వజ్య సార్ద్రాక్ష ఇదమాహ మహాసురః ॥21॥

విద్యున్మాలి చెప్పిన ఈ ఊర్జితమైన మాట విని అతణ్ణి కౌగలించుకొని చెమ్మగిల్లిన కన్నులు గలవాడై మహాసురుడైన మయుడిలా అన్నాడు.

విద్యున్మాలిన్న మే రాజ్యమభిప్రేతం న జీవితమ్ ।
త్వయా వినా మహాబాహో! కిమన్యేన మహాసుర! ॥22॥

విద్యున్మాలీ! నాకు రాజ్యం, జీవితం ఇష్టం కావు. మహారాక్షసా! నీవు లేని వేళ నాకు ఇతరులతో పనియేమి?

మయాఽ ఽమృతమయీ వాపీ హ్యేషా మాయాబలేన చ ।
సృష్టా దానవదైత్యానాం హతానాం జీవవర్ధినీ ॥23॥

అమృతమయమైన ఈ బావి నా మాయాబలంతో సృష్టించబడింది. మరణించిన దానవ దైత్యుల జీవనానికి ఇది వృద్ధి గావిస్తుంది.

దిష్ట్యా త్వాం దైత్య! పశ్యామి యమలోకాదిహాగతమ్ ।
నిర్గతం నిర్ధనస్యేహ భాగ్యాదివ వినిర్గతమ్ ॥24॥

యమలోకం నుండి ఇటకు వచ్చిన నిన్ను జారిపోయి పేదవానికి మరల చేజిక్కిన మహానిధిలాగా చూస్తున్నాను.

దృష్ట్వా దృష్ట్వా చ తాం వాపీం మాయయా మయనిర్మితామ్ ।
హృష్టాననాక్షా దైత్యేంద్రా ఇదం వచనమబ్రువన్ ॥25॥

మయుడు మాయతో చేసిన ఆ బావిని చూచి చూచి సంతసించిన ముఖాలు, కన్నులు గల దైత్యేంద్రులిలా అన్నారు–

దానవా యుధ్యతేదానీం ప్రమథైః సహ నిర్భయాః ।
మయేన నిర్మితా వాపీ హతాన్ సంజీవయిష్యతి ॥26॥

"దానవులారా! ఇప్పుడు ప్రమథులతో నిర్భయులై యుద్ధం చేయండి. మయుడు నిర్మించిన వాపి మరణించినవారిని బ్రతికిస్తుంది.

తతః క్షుబ్ధాంబుధినిభా భేరీ సా తు భయంకరీ ।
వాద్యమానా ననాదోచ్చై రౌరవీతి పునః పునః ॥27॥

ఆపై క్షోభించిన సాగరాన్ని పోలిన భీకరమైన భేరి వాదింపబడినదై మాటి మాటికి గట్టిగా ధ్వనించింది.

శ్రుత్వా భేరీరవం ఘోరం మేఘసన్నాదసన్నిభమ్ ।
న్యపతన్నసురాస్తూర్ణం త్రిపురాద్యుద్ధలాలసాః ॥28॥

భీకరమై మేఘ గర్జాసదృశమైన ఆ భేరీరవం విని త్రిపురం నుండి యుద్ధలాలసులైన దానవులు వెలికివచ్చారు.

లోహరాజతసౌవర్ణైః కటకైర్మణిరాజితైః ।
ఆముక్తైః కుణ్డలైర్హారైర్ముకుటైరపి చోత్కటైః ॥29॥

ధూమాయితా హ్యవిరతం జ్వలన్త ఇవ పావకాః ।
ఆయుధాని సమాదాయ కోటిశో దృఢవిక్రమాః ॥30॥

నృత్యమానా ఇవ నటా గర్జన్త ఇవ తోయదాః ।
కరోచ్ఛ్రయా ఇవ గజాః సింహా ఇవ చ నిర్భయాః ॥31॥

హ్రదా ఇవ చ గంభీరాః సూర్యా ఇవ చ తాపినః ।
యమా ఇవ చ దైత్యేంద్రాస్త్వరయన్తో బలం మహత్ ॥32॥

ఇనుము, వెండి, బంగారు కటకాలతో, మణిరాజితములైన ఆభరణాలతో, కుండలాలతో, హారాలతో, ఉత్కటమైన మకుటాలతో గూడిన దైత్యులు ధూమాయితమై విరామం లేకుండా జ్వలించే అగ్నులవలె ఆయుధాలు చేబూని ప్రకాశిస్తూ కోట్లకొలదిగా దృఢపరాక్రములై నృత్యం చేసే నటుల్లాగా, గర్జించే మేఘాలవలె, తొండాలు పైకెత్తిన గజాలమాదిరిగా, సింహాలవలె నిర్భయంగా గంభీరమైన మడుగులవలె, తపించే సూర్యులలాగా, యములవలె దైత్యేంద్రులు గొప్ప సైన్యాన్ని త్వరపెడుతూ నడిచారు.

ప్రమథా అపి సోత్సాహా గరుడోత్పాతపాతినః ।
యుయుత్సవోఽభిధావన్తి దానవాన్ దానవారయః ॥33॥

దానవులకు శత్రువులైన ప్రమథులు గూడా ఉత్సాహవంతులై గరుడుడెరిగిన విధంగా యుద్ధం చేయగోరి దానవుల పైకి దండెత్తారు.

నన్దీశ్వరేణ ప్రమథాస్తారకాఖ్యేణ దానవాః ।
చక్రుః సంహత్య సంగ్రామం చోద్యమానా బలేన చ ॥34॥

నందీశ్వరునితో ప్రమథులు, తారకునితో దైత్యులు, బలంతో ప్రేరితులై కూడి సంగ్రామం చేశారు.

తేఽసిభిశ్చంద్రసంకాశై శూలైశ్చానలపింగలైః ।
బాణైశ్చ దృఢనిర్ముక్తైరభిజఘ్నుః పరస్పరమ్ ॥35॥

చంద్రునివంటి కత్తులతో, అగ్ని పింగళమైన శూలాలతో, దృఢంగా వదలిన శరాలతో వారు అన్యోన్యం కొట్టుకొన్నారు.

శరాణాం సృజ్యమానానామసీనాం చ నిపాత్యతామ్ ।
రూపాణ్యాసన్ మహోల్కానాం పతన్తీనామివాంబరాత్ ॥36॥

ప్రయోగించిన శరాలు, కత్తుల యొక్క రూపాలు ఆకాశం నుండి నేలరాలే మహోల్కల రూపం దాల్చాయి.

శక్తిభిర్భిన్నహృదయా నిర్దయైరివ పాతితాః ।
నిరయేష్వివ నిర్మగ్నాః కూజన్తే ప్రమథాస్సురాః ॥37॥

శక్తులచే భిన్నహృదయులై నిర్దయులచే క్రింద పడవేయబడి నరకపతితులవలె ప్రమథులూ, దేవతలూ ఆక్రోశించారు.

హేమకుణ్డలయుక్తాని కిరీటోత్కటవన్తి చ ।
శిరాంస్యుర్వ్యాం పతన్తి స్మ గిరికూటా ఇవాత్యయే ॥38॥

ప్రళయకాలంలో గిరిశిఖరాలు పడినట్లే స్వర్ణ కుండలాలు, కిరీటాలు గల వారి శిరస్సులు నేలపై బడ్డాయి.

పరశ్వథైః పట్టిశైశ్చ ఖడ్గైశ్చ పరిఘైస్తథా ।
ఛిన్నాః కరివరాకారా నిపేతుస్తే ధరాతలే ॥39॥

గండ్రగొడ్డళ్ళు, పట్టిశాలు, ఖడ్గాలు, పరిఘలు, వీటిచే ఛిన్నాభిన్నం చేయబడి వారు భూమిపై ఛిన్నాభిన్నమైన ఏనుగుల వలె పడిపోయారు.

గర్జన్తి సహసా హృష్టాః ప్రమథా భీమగర్జనాః ।
సాధయన్త్యపరే సిద్ధా యుద్ధగాన్ధర్వమద్భుతమ్ ॥40॥

వెంటనే సంతసించిన ప్రమథులు భీకరంగా గర్జించారు. ఇతరులైన సిద్ధులు యుద్ధసంగీతసాధన అద్భుతంగా చేశారు.

బలవాన్ భాసి ప్రమథ! దర్పితో భాసి దానవ! ।
ఇతి చోచ్చారయన్ వాచం చారణాః రణభూగతాః ॥41॥

"ప్రమథా! బలవంతుడివిగా కనిపిస్తున్నావు." "దానవా! గర్వితుడవై కనిపిస్తున్నావు" అని పలుకుతూ యుద్ధభూమిలోని వారిని శ్లాఘించారు.

పరిఘైరాహతాః కేచిద్దానవైః శంకరానుగాః ।
వమన్తే రుధిరం వక్త్రైః స్వర్ణధాతుమివాచలాః ॥42॥

దానవులు పరిఘలతో కొట్టగా, శంకరుని అనుయాయులు కొందరు కొండలు స్వర్ణ ధాతువును క్రక్కినట్లు నోటినుండి రక్తం క్రక్కుకొన్నారు.

ప్రమథైరపి నారాచైరసురాః సురశత్రవః ।
ద్రుమైశ్చ గిరిశృంగైశ్చ గాఢమేవాహవే హతాః ॥43॥

యుద్ధంలో సురశత్రువులైన అసురులను గూడా ప్రమథులు బాణాలతో, చెట్లతో, గిరిశిఖరాలతో బలంగా కొట్టారు.

సూదితానథ తాన్దైత్యానన్యే దానవపుఙ్గవాః ।
ఉత్క్షిప్య చిక్షిపూర్వాప్యాం మయదానవచోదితాః ॥44॥

మృతదైత్యులను ఇతర దానవశ్రేష్ఠులు మయుని ప్రేరితులై పైకి లేపి బావిలో బడవేశారు.

తే చాపి భాస్వరైర్దేహైః స్వర్గలోక ఇవామరాః ।
ఉత్తస్థుస్తూయమానాఖ్యాః సద్రూపాభరణాంబరాః ॥45॥

అలాంటివారు స్వర్గంలో అమరుల్లాగా ప్రకాశించే శరీరాలతో బావి నుండి స్తుతింపబడు నామధేయాలు గలవారై మంచిరూపాలు, ఆభరణాలు, వస్త్రాలు గల్గి లేచారు.

అథైకే దానవాః ప్రాప్య వాపీప్రక్షేపణాదసూన్ ।
ఆస్ఫోట్య సింహనాదం చ కృత్వాఽధావంస్తథాఽసురాః ॥46॥

కొందరు దానవులు బావిలో పడి ప్రాణాలు పొంది ఆస్ఫోటనం, సింహనాదం చేసి అలాగే పరుగెత్తారు.

దానవాః! ప్రమథానేతాన్ ప్రసర్పత కిమాసథ ।
హతానపి హి నో వాపీ పునరుజ్జీవయిష్యతి ॥47॥

దానవులారా! "ప్రమథుల మీదికి దాడి వెడలండి! ఎందుకు నిలబడ్డారు? చచ్చినా మనల్ని ఈ బావి జీవింపజేస్తుంది కదా!" అని అన్నారు.

ఏవం శ్రుత్వా శంకుకర్ణో వచో హ్యశనిసన్నిభః ।
ద్రుతమేవైత్య దేవేశమిదం వచనమబ్రవీత్ ॥48॥

అది విని వజ్రసదృశుడైన శంకుకర్ణుడు శీఘ్రంగా శివుని చెంతకు పరుగిడివచ్చి ఇలా చెప్పాడు.

సూదితాః సూదితా దేవ ప్రమథైరసురా హ్యమీ ।
ఉత్తిష్ఠన్తి పునర్భీమాః సస్యా ఇవ జలోక్షితాః ॥49॥

దేవా! ప్రమథులచే మాటిమాటికి చంపబడినను ఈ రక్కసులు జలంచే తడుపబడిన సస్యాలవలె మళ్ళీ భీకరంగా లేచి వస్తున్నారు.

అస్మిన్ కిల పురే వాపీ పూర్ణామృతరసాంభసా ।
నిహతా నిహతా యత్ర క్షిప్తా జీవన్తి దానవాః ॥50॥

ఈ పురంలో ఒక బావి అమృతజల పూర్ణమైనది కలదు. చచ్చిచచ్చి గూడా అందులో బడవేసిన దనుజులు మరల జీవిస్తున్నారు.

ఇతి వ్యజ్ఞాపయద్దేవం శంకుకర్ణో మహేశ్వరమ్ ।
అభవన్దానవబల ఉత్పాతా వై సుదారుణాః ॥51॥

ఇలా శంకుకర్ణుడు మహేశ్వరునికి విన్నవించాడు. దానవసైన్యంలో అప్పుడు అతిదారుణమైన ఉత్పాతాలు సంభవించాయి.

తారకాక్షః సుభీమాక్షో దారితాస్యో హరిర్యథా ।
అభ్యధావత్సుసంక్రుద్ధో మహాదేవరథం ప్రతి ॥52॥

భీకరనేత్రాలు గల తారకుడు నోరు దెరిచిన సింహంవలె మిక్కిలి కోపించినవాడై శివుని రథం వైపు పరుగెత్తాడు.

త్రిపురే తు మహాన్ ఘోరో భేరీశంఖరవో బభౌ ।
దానవా నిఃసృతా దృష్ట్వా దేవదేవరథం ప్రతి ॥53॥

త్రిపురంలో గొప్ప భేరీధ్వని వినిపించింది. వెలికి వచ్చిన దనుజులు రథంలో దేవదేవుని చూచారు.

భూకంపశ్చాభవత్తత్ర రథాంగో భూగతోఽభవత్।
దృష్ట్వా క్షోభమగాద్రుద్రః స్వయంభూశ్చ పితామహః ॥54॥

అక్కడ భూకంపమేర్పడింది. రథచక్రం భూమిలో దిగబడింది. అది చూచి రుద్రుడు క్షోభ చెందాడు. బ్రహ్మ గూడా అట్లే క్షుభితుడయ్యాడు.

తాభ్యాం దేవవరిష్ఠాభ్యామన్వితః స రథోత్తమః ।
అనాయతనమాసాద్య సీదతే గుణవానివ ॥55॥

దేవశ్రేష్ఠులతో గూడిన ఆ రథోత్తమం తగని స్థానాన్ని పొందిన గుణవంతునిలాగా బాధకు గురి అయింది.

ధాతుక్షయే దేహ ఇవ గ్రీష్మే చాల్పమివోదకమ్ ।
శైథిల్యం యాతి స రథః స్నేహో విప్రకృతో యథా ॥56॥

ధాతుక్షయంతో దేహంలాగా, గ్రీష్మంలో అల్పోదకం లాగా, తిరస్కృతమైన స్నేహం లాగా ఆ రథం శైథిల్యం పొందింది.

రథాదుత్పత్యాత్మభూర్వై సీదన్తం తు రథోత్తమమ్ ।
ఉజ్జహార మహాప్రాణస్త్రైలోక్యం రథరూపిణమ్ ॥57॥

రథంనుండి క్రిందికి దూకి బ్రహ్మ క్రుంగుతున్న త్రైలోక్య రూపియైన ఆ రథశ్రేష్ఠాన్ని మహా ప్రాణుడై ఉద్ధరించాడు.

తదా శరాద్వినిష్పత్య పీతవాసా జనార్దనః ।
వృషరూపం మహత్కృత్వా రథం జగ్రాహ దుర్ధరమ్ ॥58॥

అప్పుడు బాణం నుండి వెలికి దూకి పీతవసనుడైన జనార్దనుడు వృషభరూపం పొంది పట్టుకోవడానికి వీలుకాని ఆ రథాన్ని నిలిపాడు.

విషాణాభ్యాం చ త్రైలోక్యం రథమేవ మహారథః ।
ప్రగృహ్యోద్వహతే సజ్జం కులం కులవహో యథా ॥59॥

కులాన్ని కులోద్ధారకుని లాగా మహారథుడైన ఆ దేవుడు కొమ్ములతో త్రైలోక్యరథాన్ని సిద్ధం కావించి గ్రహించి మోశాడు.

తారకాక్షోఽపి దైత్యేంద్రో గిరీంద్ర ఇవ పక్షవాన్ ।
అభ్యద్రవత్తదా దేవాన్ బ్రహ్మాణం హతవాంశ్చ సః ॥60॥

తారకాక్షుడు రెక్కలతోడి గిరీంద్రంలాగా దేవతలపై కురికాడు, బ్రహ్మను కొట్టాడు గూడా.

స తారకాక్షాభిహతః ప్రతోదం న్యస్య కూబరే ।
విజజ్వాల ముహుర్బ్రహ్మా శ్వాసం వక్త్రాత్సముద్గిరన్ ॥61॥

ఆ రీతిగా తారకునిచే దెబ్బతిని బ్రహ్మ జాటీని కాడిమానిపై ఉంచి ముఖంనుండి శ్వాస విడుస్తూ జ్వలించి పోయాడు.

తత్ర దైత్యైర్మహానాదో దానవైరపి భైరవః ।
తారకాక్షస్య పూజార్థం కృతో జలధరోపమః ॥62॥

అప్పుడు దైత్యులు, దానవులు తారకుని గౌరవంకొరకై మేఘగర్జనవలె మహానాదం కావించారు.

రథచరణకరోఽప్యవాపయుద్ధే మహామృధే వృషభవపుర్వృషభేంద్రపూజితః ।
దితితనయబలం విమర్ద్య సర్వం త్రిపురపురం ప్రవివేశ కేశవః ॥63॥

చక్రధారియైన కేశవు డప్పుడు వృషభశరీరుడై వృషభేంద్రపూజితుడై ఆ మహాసంగ్రామంలో సమస్త దైత్యబలాన్ని మర్దించి త్రిపురనగరంలో ప్రవేశించాడు.

సజలజలధరాశ్రితాం సమస్తాం కుముదవరోత్పలఫుల్లపంకజాఢ్యామ్ ।
సురగురురపిబత్ పయోఽమృతం తత్ రవిరివ సంచితశార్వరం తమోఽన్ధమ్ ॥64॥

అంతట సురగురుడు జలసహితమేఘాలతో విరాజిల్లేది, కుముద – ఉత్పల – వికసితపద్మాలతో ఒప్పునదీ అయిన ఆ పయోఽమృతాన్ని సూర్యుడు రాత్రివేళ చీకటిని త్రాగినట్లు త్రాగివేశాడు.

వాపీం పీత్వాఽసురేంద్రాణాం పీతవాసా జనార్దనః ।
నర్దమానో మహాబాహుః ప్రవివేశ శరం తతః ॥65॥

అసురశ్రేష్ఠుల వాపిని త్రాగి పీతవసనుడైన జనార్దనుడు పెద్దగా ధ్వనిస్తూ మరల శరంలో ప్రవేశించాడు.

తతోఽసురా భీమగణేశ్వరైర్వృతాః ప్రహారసంవర్ధితశోణితాపగాః ।
పరాఙ్ముఖా భీమముఖైః కృతా రణే యథా మృగాః కేసరిణా మహావనే ॥66॥

పిదప భీకరగణాధిపులచే కొట్టబడిన రాక్షసులు దెబ్బలకు రక్తనదులను వృద్ధి చేసినవారై రణావనిలో పరాఙ్ముఖులు గావింపబడి సింహంచే మహావనంలో తరుమబడిన మృగాలలాగా పారిపోయారు.

స తారకాక్షస్తడిమాలిరేవ చ మయేన సార్ధం ప్రమథైరభిద్రుతాః ।
పురం పరావృత్య ను తే శరార్దితా యథా శరీరం పవనాదయో గతాః ॥67॥

ఆ తారకుడు, విద్యున్మాలి, మయునితో సహా ప్రమథులచే శరపీడితులై మరలిపోయి శరీరంనుండి ప్రాణవాయువులు మున్నగు జీవధర్మాలు వెడలిపోవునట్లు పోయి పురం ప్రవేశించారు.

గణేశ్వరాభ్యుద్యతదర్పశాలినో మహేంద్రనన్దీశ్వరషణ్ముఖా యుధి ।
వినేదురుచ్చైర్జహసుశ్చ దుర్మదా జయేమ చంద్రశ్చ దిగీశ్వరైః సహ ॥68॥

గణాధిపులు గొప్ప గర్వంతో ప్రకాశించువారై మహేంద్ర, నందీశ్వర, షణ్ముఖులు చంద్రాది దిగీశ్వరులతో గూడ యుద్ధంలో గట్టిగా గర్జించి దుర్మదులై పరిహసించారు. జయించగలము అని గట్టిగా అరిచారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే నందితారక సంగ్రామం నామ షట్త్రింశదధికశతతమోఽధ్యాయః ॥ 136॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని నందితారక సంగ్రామమనే నూటముప్పైఆరవ అధ్యాయం సంపూర్ణం

సప్తత్రింశదధికశతతమోఽధ్యాయః - నూటముప్పైఏడవ అధ్యాయం
దానవానాం దైన్యం సాగరప్రవేశశ్చ - దానవుల దైన్యం - సాగరప్రవేశం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ప్రమథైః సమరే భిన్నాస్త్రైపురాస్తే సురారయః ।
పురం ప్రవివిశుర్భీతాః ప్రమథైర్భగ్నగోపురమ్ ॥1॥

సమరంలో ప్రమథులచే భిన్నులైన త్రిపురనిలయులైన అసురులు భయపడి ప్రమథులు భగ్నం చేసిన గోపురం కల త్రిపురంలో ప్రవేశించారు.

శీర్ణదంష్ట్రా యథా నాగా భగ్నశృంగా యథా వృషాః ।
యథా విపక్షాః శకునా నద్యః క్షీణోదకా యథా ॥2॥

మృతప్రాయాస్తథా దైత్యా దైన్యేన వికృతాననాః ।
బభూవుస్తే విమనసః కథం కార్యం భవేదితి ॥3॥

కోరలు దీసిన సర్పాలవలె, కొమ్ములు విరిగిన వృషభాల్లాగా, రెక్కలు లేని పక్షులు రీతిగా, నీరు లేని నదుల చందాన దేవతలచే ఉపహతులై మృతప్రాయులై దైన్యంతో దానవులు వికృతాననులై 'ఏమి చెయ్యాలి' అంటూ విమనస్కు లయ్యారు.

అథ తాన్ మ్లానమనసస్తదా తామరసాననః ।
ఉవాచ దైత్యో దైత్యానాం పరమాధిపతిర్మయః ॥4॥

ఆ రీతిగా దిగులొందిన దైత్యులతో పద్మాననుడు, దైత్యుల పరమాధిపతియైన మయదానవుడు ఇలాఅన్నాడు-

కృత్వా యుద్ధాని ఘోరాణి ప్రమథైః సహ సామరైః ।
త్రాసయిత్వా తథా యుద్ధే ప్రమథానమరైః సహ ॥5॥

యూయం యత్ప్రథమం దైత్యాః పశ్చాచ్చ బలపీడితాః ।
ప్రవిష్టా నగరం త్రాసాత్ప్రమథైర్భృశమర్దితాః ॥6॥

అమరులతో గూడిన ప్రమథులతో యుద్ధం చేసి మొదట మీరు ఆ యిరువర్గాల వారినీ భయపెట్టారు. పిదప ప్రమథుల బలంచేత మిక్కిలి పీడితులై బాధితులై భయంతో నగరం ప్రవేశించారు.

అప్రియం క్రియతే వ్యక్తం దేవైర్నాస్త్యత్ర సంశయః ।
వృషాణామివ నో భంగః శృంగభంగ సమోఽభవత్ ॥7॥

దేవతలు మనపట్ల అప్రియం చేస్తున్నారు. ఇందులో సందేహం లేదు. మనకు కలిగిన ఈ భంగపాటు వృషభాలకు కల్గిన శృంగభంగంలాగా ఉన్నది.

అహెూ హి కాలస్య బలమహెూ కాలో హి దుర్జయః ।
యత్రేదృశస్య దుర్గస్య ఉపరోధోఽయమాగతః ॥8॥

అహెూ! ఇది కాలబలం! ఆశ్చర్యం! కాలం దుర్జయమైనది. ఎందుకంటే ఇట్టి దుర్గానికి గూడా ఇలాంటి నిరోధం ఏర్పడింది.

ఏవం వదతి దైత్యేంద్రే మయే బుద్ధిమతాం వరే ।
బభూవుర్నిష్ప్రభా దైత్యా గ్రహాస్సూర్యోదయే యథా ॥9॥

బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు, రాక్షసేంద్రుడైన మయుడు అలా అంటుండగా దైత్యులు సూర్యోదయకాలంలో గ్రహాలవలె కాంతి హీనులయ్యారు.

వాపీపాలాస్తతోఽభ్యేత్య నభఃకాల ఇవాంబుదాః ।
మయమాహూర్యమప్రఖ్యం సాంజలిప్రగ్రహాః స్థితాః ॥10॥

అప్పుడు బావికి కాపలా ఉన్నవారు శ్రావణంలో మేఘాలవలె వచ్చి యముని వంటి మయునితో అంజలిబద్ధులై నిలిచి యిలా అన్నారు.

యా సాఽమృతరసా గూఢా వాపీ వై నిర్మితా త్వయా ।
సమాకులోత్పలవనా సమీనాకులపంకజా ॥11॥

పీతా సా వృషరూపేణ కేనచిద్దైత్యనాయక! ।
వాపీ సా సాంప్రతం దృష్టాఽమృతసంజ్ఞా ఇవాంగనా ॥12॥

దైత్యనాయకా! నీవు అమృతరసం నిండిన గూఢమైన ఏ బావిని నిర్మించావో, అది ఆకులమైన ఉత్పలవనం కలదిగా, చేపలతో, పంకజాలతో నిండినదిగా ఉన్న దానిని వృషభరూపుడైన ఎవడో ఒకడు త్రాగివేశాడు. ఇప్పుడది 'అమృత' అన్న పేరు మాత్రం కల్గిన స్త్రీ లాగా ఉన్నది.

వాపీపాలవచః శ్రుత్వా మయోఽసౌ దానవప్రభుః ।
కష్టమిత్యసకృత్ప్రోచ్య దితిజానిదమబ్రవీత్ ॥13॥

దానవరాజైన మయుడు వాపీపాలకుల మాట విని కష్టం కష్టం అని పలుసార్లు పలికి దైత్యుల నుద్దేశించి ఇలా అన్నాడు.

మయా మాయాబలకృతా వాపీ పీతా త్వియం యది ।
వినష్టాః స్మ న సన్దేహస్త్రిపురం దానవా! హతమ్ ॥14॥

దానవులారా! నేను మాయాబలంతో నిర్మించిన బావి త్రాగివేయబడిందంటే మనం నశించినవారమే, సందేహం లేదు. త్రిపురం హతమే.

నిహతాన్నిహతాన్దైత్యానాజీవయతి దైవతైః ।
పీతా వా యది వా వాపీ పీతా వై పీతవాససా ॥15॥

మాటి మాటికి దేవతలచే నిహతులైన దానవులను జీవింపజేసే బావి అది. అది త్రాగబడినదంటే పీతవస్త్రుడైన విష్ణువుచేతనే అలా త్రాగబడింది.

కోఽన్యో మన్మాయయా గుప్తాం వాపీమమృతతోయినీమ్ ।
పాస్యతే విష్ణుమజితం వర్జయిత్వా గదాధరమ్ ॥16॥

అజితుడు, గదాధారి అయిన విష్ణువు తప్ప మరొకడెవడు నా మాయా రక్షితమైన అమృతజల పూర్ణమగు బావిని త్రాగగలడు?

సుగుహ్యమపి దైత్యానాం నాస్త్యస్యావిదితం భువి ।
యతో మత్కౌశలం జ్ఞాతం విబుధైస్సర్వతోముఖైః ॥17॥

ఎంత దాచినా ఇతర దైత్యులసంగతి ఇతరులకు తెలియకున్నా అతనికి తప్పక తెలుస్తుంది. దేవతలు సర్వతోముఖులు కారు. అయినా విష్ణువు వల్ల సర్వతోముఖు లయ్యారు. వారికి నా కౌశలం తెలిసింది. ఇది విష్ణువు పనియే.

సమోఽయం రుచిరో దేశో నిర్ద్రుమో నిర్ద్రుమాచలః ।
తే వయం విరథాస్తస్మాత్ బాధన్తేఽస్మాన్ గణామరాః ॥18॥

రుచిరమైన ఈ దేశం సమతలమైనది, చెట్లు, చెట్టుగల కొండలు లేనిది. అందుచేత విరథుల మయిన మనల్ని అమరులు బాధిస్తున్నారు.

తే యూయం యది మన్యధ్వం సాగరోపరిధిష్ఠితాః ।
ప్రమథానాం మహావేగం సహామః శ్వసనోపమమ్ ॥19॥

కాన మీరు నా మాట పాటిస్తే సముద్రం పైకివెళ్ళి వాయువేగాన్ని పోలిన ప్రమథుల మహావేగాన్ని సహించి నిలబడదాం!

ఏతేషాం న సమారంభాస్తస్మిన్ సాగరసంప్లవే ।
నిరుత్సాహా భవిష్యంతి దుర్గే మార్గం వినాఽమరాః ॥20॥

ఆ సముద్ర సంప్లవంలో వారి ప్రయత్నాలు పనిచేయవు. దుర్గంలో మార్గంలేక వారు నిరుత్సాహు లౌతారు.

యుధ్యతాం నిఘ్నతాం శత్రూన్ భీతానాం చ ద్రవిష్యతామ్ ।
సాగరోఽమ్బరసంకాశః శరణం నో భవిష్యతి ॥21॥

యుద్ధం చేస్తూ శత్రువులను చంపుతూ భయపడి పరుగిడే మనవారికందరికీ ఆకాశంవంటి సముద్రం శరణమవుతుంది.

ఇత్యుక్త్వా స మయో దైత్యో దైత్యానామధిపస్తదా ।
త్రిపురేణ యయౌ తూర్ణం సాగరం సింధుబాంధవమ్ ॥22॥

ఇలా చెప్పి ఆ మయదైత్యాధిపతి అప్పుడు త్రిపురంతో సహా వెంటనే నదులకు బంధువైనసాగరం చేరాడు.

సాగరే జలగంభీర ఉత్పపాత పురం వరమ్ ।
అవతస్థుః పురాణ్యేవ గోపురాభరణాని చ ॥23॥

జలంతో గంభీరమైన సముద్రంలో శ్రేష్ఠమైన నగరం ప్రవేశించింది. గోపురాభరణాలైన పురాలు అలాగే చెడక అందులో నిలిచాయి.

అపక్రాంతే తు త్రిపురే త్రిపురారిస్త్రిలోచనః ।
పితామహమువాచేదం వేదవాదవిశారదమ్ ॥24॥

త్రిపురం తొలగిపోయేసరికి త్రిపురారియైన ముక్కంటి వేదవాదవిశారదుడైన బ్రహ్మతో ఇలా అన్నాడు-

పితామహ! దృఢం భీతా భగవన్! దానవా హి నః ।
విపులం సాగరం తే తు దానవాః సముపాశ్రితాః ॥25॥

పితామహా! భగవంతుడా! దానవులు మనకు మిక్కిలి భయపడ్డారు. అందువల్ల వారు విపులమైన సాగరాన్ని ఆశ్రయించారు.

యత ఏవ హి తే యాతాస్త్రిపురేణ తు దానవాః ।
తత ఏవ రథం తూర్ణం ప్రాపయస్వ పితామహ ॥26॥

పితామహా! ఆ దానవులు త్రిపురంతో సహా ఎటువైపు వెళ్ళారో, ఆ వైపే రథాన్ని శీఘ్రంగా నడిపించు".

సింహనాదం తతః కృత్వా దేవా దేవరథం చ తమ్ ।
పరివార్య యయుర్హృష్టాః సాయుధాః పశ్చిమోదధిమ్ ॥27॥

తదుపరి దేవతలు సింహనాదం చేసి దేవరథం చుట్టూ చేరి సంతోషంతో సాయుధులై పశ్చిమ సముద్రానికి పయనించారు.

తతోఽమరామరగురుం పరివార్య భవం హరమ్ ।
అనుయాన్తో యయుస్తూర్ణం సాగరం దానవాలయమ్ ॥28॥

అంతట దేవతలు అమరగురుడూ, భవుడూ అయిన హరుణ్ణి అనుగమిస్తూ దానవాలయమైన సముద్రంవైపు శీఘ్రంగా వెళ్ళారు.

అథ చారుపతాకభూషితం పటహాడమ్బరశంఖనాదితమ్ ।
త్రిపురమభిసమీక్ష్య దేవతా వివిధబలా ననదుర్యథా ఘనాః ॥29॥

ఆపై అందమైన పతాకలచే అలంకృతమై, పటహాడంబరంతో శంఖాదుల ధ్వనులతో శబ్దిస్తున్న త్రిపురాన్ని చూచి దేవతలు మేఘాల్లాగా వివిధబలయుతులై నినదించారు.

అసురవరపురేఽపి దారుణో జలధరరావమృదఙ్గహ్వారః ।
దనుతనయనినాదమిశ్రితః ప్రతినిధిసంక్షుభితార్ణవోపమః ॥30॥

త్రిపురదుర్గంలో కూడా దారుణ మృదంగ ధ్వనులు మేఘధ్వనులవలె దానవధ్వనితో కూడి వినపడ్డాయి. అవి సముద్రధ్వని సమానమై వినపడుతూ ఆ దుర్గం సముద్రానికి ప్రతినిధియా అని అనిపించాయి.

అథ భువనపతిర్గతిః సురాణామరిమృగయాం ప్రతిలబ్ధలుబ్ధబుద్ధిః ।
త్రిదశగణపతిర్బ్యువాచ శక్రం త్రిపురగతం సహసా నిరీక్ష్య శత్రుమ్ ॥31॥

ఆపై సంరక్షకుడగు శివుడు లుబ్ధ బుద్ధియై శత్రువుల వేటకు సిద్ధమైన బుద్ధిగలవాడయ్యాడు. త్రిపురంలో శత్రువులుండడం గమనించి ఇంద్రునితో ఇలా అన్నాడు–

త్రిదశగణపతే! నిశామయైతత్ త్రిపురనికేతనముత్తమం సురేంద్ర! ।
యమవరుణకుబేరషణ్ముఖైస్తైస్సహ గణపైరపి హన్మి తావదేవ ॥32॥

"ఇంద్రా! ఇది విను. దానవుల త్రిపుర గృహం ఉత్తమమైనది. యముడు, వరుణుడు, కుబేరుడు, షణ్ముఖుడు, గణాధిపతులతో కూడి నేను దానిని ఇప్పుడే నశింపజేస్తాను.

విహితపరబలాభిఘాతభూతం వ్రజ జలధేస్తు యతః పురాణి తస్థుః ।
స రథవరగతో భవః సమర్థో హ్యుదధిమగాత్త్రిపురం పునర్నిహన్తుమ్ ॥33॥

పరబలాలను నశింపజేసే ఏ ప్రదేశంలో ఈ త్రిపురదుర్గం ఉన్నదో అట్టి సముద్రానికి పోదాం పదండి. అని చెప్పి రథశ్రేష్ఠంపైనున్న సమర్థుడైన శివుడు త్రిపురసంహారార్థం సాగరానికి వెళ్ళాడు.

ఇతి పరిగణయద్దితేస్తనూజా హ్యవతస్థుర్లవణార్ణవోపరిష్టాత్ ।
అభిభవత్ త్రిపురం సదానవేంద్రం శరవర్షైర్ముసలైశ్చ వజ్రమిశ్రైః ॥34॥

ఇదంతా ఆలోచించిన దితిసుతులు లవణ సాగరంపై ఉండిపోయారు. అప్పుడు శివుడు శరవృష్టితో, వజ్రసహితముసలాలతో దానవేంద్రుడున్న త్రిపురం పై దాడికి వెడలాడు.

అహమపి రథవర్యమాస్థితః సురవరవర్య! భవామి పృష్ఠతః ।
అసురవరవధార్థముద్యతానాం ప్రతివిదధామి సుఖాయ తేఽనఘ! ॥35॥

ఇంద్రా! నేను గూడా రథశ్రేష్ఠాన్ని అధిష్ఠించి మీ వెనుకనే ఉంటాను. అనఘా! అసురశ్రేష్ఠులవధకు ప్రయత్నించి మన సైనికులకు సుఖం కల్గించే ఏర్పాట్లు చేస్తాను.

ఇతి భవవచనప్రచోదితో దశశతనయనవపుః సముద్యతః ।
త్రిపురపురజిఘాంసయా హరిః ప్రవికసితాంబుజలోచనో యయౌ ॥36॥

ఇలా శివునిమాటలతో ప్రేరణ పొందిన ఇంద్రుడు ఉద్యుక్తుడై త్రిపురవినాశం చేయాలన్న కోరికతో వికసితపద్మ నేత్రుడై వెళ్ళాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే దానవానాం దైన్యం సాగరప్రవేశం నామ సప్తత్రింశదధికశతతమోఽధ్యాయః ॥137॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని దానవుల దైన్యం, సాగర ప్రవేశమనే నూటముప్పైఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టత్రింశదధికశతతమోఽధ్యాయః – నూటముప్పైఎనిమిదవ అధ్యాయం

తారకాక్ష వధ – తారకాక్ష వధ

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

మఘవా తు నిహన్తుం తానసురానమరేశ్వరః ।
లోకపాలా యయుః సర్వే గణపాలాశ్చ సర్వశః ॥1॥

ఆ దానవులను హతమార్చడానికి అమరేశ్వరుడైన ఇంద్రుడు, లోకపాలకులు, గణపాలకులు – అన్ని వైపులనుండీ నడిచారు.

ఈశ్వరామోదితాః సర్వే ఉత్పేతుశ్చాంబరే తదా ।
ఖగతాస్తు విరేజుస్తే పక్షవన్త ఇవాచలాః ॥2॥

శివుని అనుమతితో అందరూ ఆకాశానికెగిరి అప్పుడు రెక్కలు గల కొండలలాగా గగనంలో విరాజిల్లారు.

ప్రయయుస్తత్పురం హన్తుం శరీరం వ్యాధయో యథా ।
శంఖాడమ్బరనిర్ఘోషైః పణవాన్పటహానపి ।
నాదయంతః పురో దేవా దృష్టాస్త్రి పురవాసిభిః ॥3॥

వ్యాధులు శరీరాన్ని హతమార్చడానికి పోయినట్లు శంఖాడంబరధ్వనులతో సహా పణవ పటహాలను వాయించారు. అలా దేవత లాత్రిపురాన్ని హతమార్చటానికి వెళ్ళారు. త్రిపురనివాసులు వారిని చూచారు.

హరః ప్రాప్త ఇతీవోక్త్వా బలినస్తే మహాసురాః ।
ఆజగ్ముః పరమం క్షోభమత్యయేష్వివ సాగరాః ॥4॥

బలవంతులగు ఆ మహారాక్షసులు 'శివుడు వచ్చాడు' అంటూ ప్రళయకాలంలో సముద్రాలవలె పరమక్షోభం పొందారు.

సురతూర్యరవం శ్రుత్వా దానవా భీమదర్శనాః ।
నినేదుర్వాదయన్తశ్చ నానావాద్యాన్యనేకశః ॥5॥

సురల తూర్యధ్వని విని భీకరదర్శనులైన దానవులు నానావాద్యాలను అనేకంగా వాయిస్తూ నినదించారు.

తూర్యాపూరితవీర్యాస్తే పరస్పరకృతాగసః ।
పూర్వదేవాశ్చ దేవాశ్చ సూదయన్తః పరస్పరమ్ ॥6॥

తూర్యధ్వనులతో తమ పరాక్రమాలు చాటుకొంటూ పరస్పరం అపకరించుకొనగోరినవారై దేవతలు, రాక్షసులు అన్యోన్యం హింసించుకోవడానికి ఉద్యమించారు.

ఆకాశేఽ పి సమప్రఖ్యే తేషాం దేహనికృన్తనమ్ ।
ప్రవృత్తం యుద్ధమతులం ప్రహారకృతనిఃస్వనమ్ ॥7॥

సమస్థితిగల ఆకాశంలో గూడా ప్రహారశబ్దాలతో గూడిన శరీరవినాశనాత్మకమైన సమరం నిరుపమానంగా కొనసాగింది.

ప్రతపన్త ఇవాదిత్యాః ప్రజ్వలన్త ఇవాగ్నయః ।
శ్వసన్త ఇవ నాగేంద్రా భ్రమన్త ఇవ పక్షిణః ।
గిరీంద్రా ఇవ కమ్పన్తో గర్జంత ఇవ తోయదాః ॥8॥

జృంభన్త ఇవ శార్దూలాః ప్రవాన్త ఇవ వాయవః ।
ప్రవృద్ధోర్మితరఙ్గౌఘా క్షుభ్యన్త ఇవ సాగరాః ॥9॥

ప్రమథాశ్చ మహాశూరా దానవాశ్చ మహాబలాః ।
యుయుధుర్నిశ్చలా భూత్వా వజ్రా ఇవ మహాచలైః ॥10॥

క్రిందపడే సూర్యుల వలె, జ్వలించే అగ్నులలాగా, నిట్టూర్చే నాగేంద్రుల రీతిగా, భ్రమించే పక్షుల చందాన, కంపించే కొండలలాగా, గర్జించే మేఘాలవలె, విజృంభించే పులులవలె, వీచే వాయువుల్లాగా, ఉప్పొంగిన అలలు గల క్షోభించిన సముద్రాలవలె, మహాశూరులైన ప్రమథులు, మహాబలవంతులైన దానవులు నిశ్చలంగా వుండి వజ్రాయుధాలతో మహాపర్వతాలు యుద్ధం చేసినట్లు సమరం కావించారు.

కార్ముకాణాం వికృష్టానాం బభూవుర్దారుణా రవాః ।
కాలానుగానాం మేఘానాం యథా వియతి వాయునా ॥11॥

ఆకసంలో పెనుగాలిచే ఆకర్షింపబడిన కాలానుగత మేఘాల ధ్వనులవలె ఆకర్షించిన ధనువుల నినాదాలు దారుణంగా వినిపించాయి.

ఆహుశ్చ యుద్ధే మా భైషీః క్వ యాస్యసి మృతో హ్యసి ।
ప్రహరాశు స్థితోఽ స్మ్యత్ర ఏహి దర్శయ పౌరుషమ్ ॥12॥

యుద్ధంలో "భయపడకు, ఎక్కడికి పోతావు? చచ్చావు పో! ఇక్కడ ఉన్నాను. త్వరగా కొట్టు రా! నీ పౌరుషం చూపు.

గృహాణ ఛింది భిందీతి ఖాద మారయ దారయ ।
ఇత్యన్యోఽ న్యమనూచ్చార్య ప్రయయుర్యమసాదనమ్ ॥13॥

తీసుకో, ఛేదించు, భేదించు, తిను, చంపు, చీల్చు" అని పరస్పరం పలుకుతూ వారు యమగృహానికి వెళ్ళారు.

ఖడ్గాపవర్జితాః కేచిత్కేచిచ్ఛిన్నాః పరశ్వథైః ।
కేచిన్ముద్గరచూర్ణాశ్చ కేచిద్బాహుభిరాహతాః ॥14॥

పట్టిశైః సూదితాః కేచిత్కేచిచ్ఛూలవిదారితాః ।
దానవాః శరపుష్పాభాః సవనా ఇవ పర్వతాః ।
నిపతన్త్యర్ణవజలే భీమనక్రతిమిఙ్గిలే ॥15॥

ఖడ్గాలతో ఛేదించబడినవారు, గొడ్డళ్ళతో నరకబడినవారు, ముద్గరాలతో చూర్ణం చేయబడినవారు, చేతులతో దెబ్బలు తిన్నవారు, పట్టిశాలతో హతులైనవారు, శూలాలచే చీల్చబడినవారునై దానవులు శరములనే పూలతో ప్రకాశిస్తూ వనాలతోడి కొండలవలె, భయంకరమైన మొసళ్ళు, తిమింగిలాలు గల సముద్రజలంలో పడిపోయారు.

వ్యసుభిః సునిబద్ధాంగైః పతమానైః సురేతరైః ।
సంబభూవార్ణవే శబ్దః సజలాంబుదనిస్వనః ॥16॥

ప్రాణరహితాలై సునిబద్ధ శరీరాలు గల క్రిందపడే రాక్షసులచేత సముద్రంలో సజల మేఘధ్వనిని పోలిన శబ్దం కల్గింది.

తేన శబ్దేన మకరా నక్రాస్తిమితిమిఙ్గిలాః ।
మత్తా లోహితగన్ధేన క్షోభయన్తో మహార్ణవమ్ ॥17॥

ఆ శబ్దంతో మొసళ్ళు, నక్రాలు, తిములు, తిమింగిలాలు రక్తగంధంతో మదించి మహార్ణవాన్ని కలచివేశాయి.

పరస్పరేణ కలహం కుర్వాణా భీమమూర్తయః ।
వమన్తో భక్షయన్తశ్చ దానవానాం చ లోహితమ్ ॥18॥

ఆ జలచరాలు పరస్పరం కలహించుకొంటూ భీకరమూర్తి గలవై దానవుల రక్తాన్ని క్రక్కుతూ మ్రింగుతూ భ్రమించాయి.

సరథాన్సాయుధాన్సాశ్వాన్సవస్త్రాభరణావృతాన్ ।
జగ్రసుస్తిమయో దైత్యాన్ ద్రావయంతో జలేచరాన్ ॥19॥

రథాలు, ఆయుధాలు, గుర్రాలు, గల్గి వస్త్రాలు, ఆభరణాలతో కూడిన దైత్యులను, జలచరాలను తరుముతూ వచ్చి తిములు మ్రింగివేశాయి.

మృధం యథాఽసురాణాం చ ప్రమథానాం ప్రవర్తతే ।
అంబరే చ తథా యుద్ధం యోధయంతో జలేచరాః ॥20॥

అసురులకూ, ప్రమథులకూ ఆకాశంలో ఎలా జరిగిందో, అలాగే నీటిలో అన్యోన్యం జలచరాలకు గూడా పోరు జరిగింది.

యథా భ్రమన్తి ప్రమథాః సదైత్యాస్తథా భ్రమన్తే తిమయః సనక్రాః ।
యథైవ ఛిన్దన్తి పరస్పరం తు తథైవ క్రన్దన్తి విభిన్నదేహాః ॥21॥

దైత్యులతో ప్రమథులవలెనే మొసళ్ళతో తిములు భ్రమించాయి. ఒకరినొకరు వారు ఛేదించుకొన్నట్లే జలచరాలు గూడా భిన్నమైన శరీరాలు గలవై ఆక్రందనం చేశాయి.

వ్రణాననైరజ్ఞరసం ప్రవద్భిః సురాసురైర్నక్రతిమిఙ్గిలైశ్చ ।
కృతో మూహూర్తేన సముద్రదేశః సరక్తతోయః సముదీర్ణతోయః ॥22॥

ముఖాలపై దెబ్బలు తగిలి రక్తస్రావం జరుగగా అటు సురాసురులు, ఇటు మొసళ్ళు, తిమింగిలాలు కలిసి ముహూర్తకాలంలో ఆ సముద్ర ప్రదేశాన్ని రక్తజలం కలదిగానూ, పొంగిన జలం కలదిగాను చేశాయి.

పూర్వం మహాంభోధరపర్వతాభం ద్వారం మహాన్తం త్రిపురస్య శక్రః ।
నిపీడ్య తస్థౌ మహతా బలేన యుక్తోఽమరాణాం మహతా జవేన ॥23॥

ఇంద్రుడు గొప్ప దేవసైన్యంతో మహావేగంగా వెళ్ళి గొప్ప అంభోధర పర్వతం లాగా ఉన్న త్రిపురనగరము యొక్క తూర్పు ద్వారాన్ని ఆక్రమించి నిలిచాడు.

తథోత్తరం వై తనుజో హరస్య బాలార్కజాంబూనదతుల్యవర్ణః ।
స్కన్దః పురద్వారమథారురోహ వృద్ధోఽస్త శృంగం ప్రపతన్నివార్కః ॥24॥

అలాగే ఉత్తరంవైపు బాలసూర్యుడు, స్వర్ణం వంటి వర్ణం కల హరుని పుత్రుడు స్కందుడు పురద్వారం ఎక్కి అస్తశిఖరం పై వృద్ధ సూర్యునిలాగా భాసించాడు.

యమశ్చ విత్తాధిపతిశ్చ దేవో దణ్డాన్వితః పాశవరాయుధశ్చ ।
దేవారిణస్తస్య పురస్య ద్వారం తాభ్యాం తు తత్పశ్చిమతో నిరుద్ధమ్ ॥25॥

యముడు దండంతోనూ, కుబేరుడు పాశంతోనూ దేవతల శత్రువగు మయుని పురద్వారాన్ని పడమటి వైపు నిరోధించారు.

దక్షారిరుద్రస్తపనాయుతాభః స భాస్వతా దేవరథేన దేవః ।
తద్దక్షిణద్వారమరేః పురస్య రుద్ధ్వాఽవతస్థే భగవాంస్త్రినేత్రః ॥26॥

దక్షుని శత్రువు, పదివేల సూర్యులవంటివాడు, భగవంతుడునైన త్రిలోచనుడు ప్రకాశించే దేవరథంతో వెళ్ళి నగర దక్షిణ ద్వారాన్ని నిరోధించి నిలిచాడు.

తుంగాని వేశ్మాని సగోపురాణి సువర్ణకైలాసశశిప్రభాణి ।
ప్రహ్లాదరూపాః ప్రమథావరుద్ధా జ్యోతీంషి మేఘా ఇవ చాశ్మవర్షాః ॥27॥

గోపురాలతో గూడిన ఎత్తైన గృహాలు బంగారం, కైలాసం, చంద్రుని వంటి కాంతి గలవి, ఆహ్లాదకరరూపం కలవి, వడగండ్లు వర్షించే మేఘాలచే నక్షత్రాలవలె ప్రమథులచే అవరుద్ధాలయ్యాయి.

ఉత్పాట్య చోత్పాట్య గృహాణి తేషాం సశైలమాలాసనవేదికాని ।
ప్రక్షిప్య ప్రక్షిప్య సముద్రమధ్యే కాలాంబుదాభా ప్రమథా వినేదుః ॥28॥

కాల మేఘాలవంటి ప్రమథులు దానవుల శైలమాలా సదృశ వేదికలు గల గృహాలను పెకలించి పెకలించి సముద్రమధ్యంలో విసరి విసరి వేసి నాదం కావించారు.

రక్తాని చాశేషవనైర్యుతాని సాశోకఖణ్డాని సకోకిలాని ।
గృహాణి హే నాథ పితః సుతేతి భ్రాతేతి కాన్తేతి ప్రియేతి చాపి ।
ఉత్పాట్యమానేషు గృహేషు నార్యస్త్వనార్యశబ్దాన్వివిధాం ప్రచక్రుః ॥29॥

అనేక వనాలు, అశోకఖండాలు, కోకిలలతో కూడిన, ఎఱ్ఱని దానవుల గృహాలను అలా దేవతలు పెకలించే సరికి "ఓ నాథా! నాన్నా! కుమారా! సోదరా! కాంతా! ప్రియా!" అని అసురస్త్రీలు వివిధమైన ప్రలాపాలు కావించారు.

కలత్రపుత్రక్షయజీవనాశే తస్మిన్ పురే రుద్రబలే ప్రవృత్తే ।
మహాసురాః సాగరతుల్యవేగా గణేశ్వరాః కోపవృతాః సమేయుః ॥30॥

ఆ యుద్ధంలో రుద్రబలంవల్ల భార్యలకూ, పుత్రులకూ క్షయం కల్గి ప్రాణనాశం కాగా సాగర సదృశవేగం కల గొప్ప రాక్షసులు, కోపించిన గణేశ్వరులు ఒకరినొకరు ఎదుర్కొన్నారు.

పరశ్వధైస్తత్ర శిలోపలైశ్చ త్రిశూలవజ్రోత్తమకంపనైశ్చ ।
శరీరసద్మక్షపణం సుఘోరం యుద్ధం ప్రవృత్తం దృఢవైరబద్ధమ్ ॥31॥

గొడ్డళ్ళతో, శిలోపలాలతో, త్రిశూలాలు వజ్రోత్తమాల కంపనాలతో అక్కడి వారికి దృఢశత్రుత్వబద్ధమై, ఘోరమైన, శరీరగృహధ్వంసనాత్మకమైన యుద్ధం జరిగింది.

అన్యోన్యముద్దిశ్య నినర్దతాం చ ప్రధావతాం చైవ వినిఘ్నతాం చ ।
శబ్దో బభూవామరదానవానాం యుగాన్తకాలేష్వివ సాగరాణామ్ ॥32॥

ఒకరినొకరు కొట్టుకొంటున్న, పరుగెడుతున్న, చంపుకొంటున్న అమరదానవులకు యుగాంతకేళిలో సముద్రంలో లాగా పెద్దశబ్దం సంభవించింది.

వ్రణైరజస్రం క్షతజం వమన్తః కోపోపరక్తా బహుధా నదంతః ।
గణేశ్వరాస్తేఽసురపుఙ్గవాశ్చ యుద్ధ్యన్తి శబ్దం మహదుద్గిరంతః ॥33॥

గాయాల నుండి రక్తం స్రవింపజేస్తూ కోపంతో ఎర్రబడి అనేక విధాల శబ్దిస్తూ, ఆ గణాధిపులూ, అసుర పుంగవులూ గొప్పగా అరచుకొంటూ, యుద్ధం చేశారు.

మార్గాః పురే లోహితకర్దమాశ్చ స్వర్ణేష్టకాస్ఫాటికభిన్నచిత్రాః ।
కృతా ముహూర్తేన సుఖేన గన్తుం ఛిన్నోత్తమాంగాంఘ్రికరాః కరాలాః ॥34॥

పురంలోని స్వర్ణేష్టికలతో, స్ఫటిక చిత్రాలతో విలసిల్లిన త్రోవలు రక్తంతో ఎఱ్ఱనైన బురదతో నిండాయి. ఒక్క ముహూర్తకాలం సుఖంగా నడిచిన, తదుపరి రాక్షసులు అయ్యారు. భిన్న శిరస్సులు, పాదాలు, కరాలు గలవారుగా

కోపావృతాక్షః స తు తారకాక్షః సాక్షాత్సదృక్షో గిరిణా చ వీరః।
తస్మిన్ క్షణే ద్వారవరం రరక్ష రుద్ధం భవేనాద్భుతవిక్రమేణ ॥35॥

అప్పుడు కోపోద్రిక్తనేత్రాలు గల తారకుడు కొండతో సమానుడై వచ్చి అద్భుతవిక్రముడై శివుడు నిరోధించి ఉన్న ద్వారాన్ని రక్షించాడు.

స తత్ర ప్రాకారగతాంశ్చ భూతాన్నాగాన్ సురాన్ భూతపతీంశ్చ తద్వత్ ।
ప్రకాలయన్ స ప్రియదర్పయుక్తః పురాద్వినిష్క్రమ్య రరాస ఘోరమ్ ॥36॥

వాడు పురంనుండి వెలికి వచ్చి ప్రాకారంలో ఉన్న నాగులను, సురలను, భూతపతులను తరిమివేస్తూ ఇంద్రియబలంతో గర్వితుడై ఘోరశబ్దం చేశాడు.

తతః స దైత్యోత్తమపర్వతాభో యథాంజసా నాగ ఇవాభిమత్తః।
నివారితో రుద్రరథం జిఘృక్షుర్యథార్ణవః పర్వణి చాతివేలః ॥37॥

ఆపై కొండవంటి ఆ దైత్యేంద్రుడు వెంటనే మదించిన ఏనుగు లాగా నివారితుడైనా నిలవక రుద్రుని రథం గ్రహించగోరి పర్వదినాన గట్టుదాటున సముద్రంవలె ముందుకు వచ్చాడు.

శేషః సుధన్వా గిరిశశ్చ దేవశ్చతుర్ముఖో యః స విభావసుశ్చ।
తే తారకాక్షాభిగతా గతాజౌ క్షోభం యథా వాయువశాత్సముద్రాః ॥38॥

అప్పుడు శేషుడు, సుధన్వుడైన శివుడు, చతుర్ముఖుడు, అగ్ని తారకునిపై కురికి వాయువశాన సముద్రంలాగా క్షోభ పొందారు.

తతో గిరీశః సపితామహేశఃక్షోత్క్షుభ్యమాణః స రథేంఽబరస్థః।
బిభేద సన్ధీషు బలాభిపన్నః కూజన్నినాదాంశ్చ కరోతి ఘోరాన్ ॥39॥

అప్పుడు శివుడు, బ్రహ్మ, క్షోభ పొందుతూ ఉండగా రథం ఆకాశంలో నిలబడింది. దానికి దెబ్బలు తగలడంవల్ల సంధిబంధాలు వదలి భయంకరంగా ధ్వని చేసింది.

ఏకం తు ఋగ్వేదతురంగమస్య పృష్ఠే పదం న్యస్య వృషస్య చైకమ్ ।
తస్థౌ భవః సోద్యతబాణచాపః పురస్య తత్సంగమమీక్షమాణః ॥40॥

ఒక పాదం ఋగ్వేదాశ్వపృష్ఠంపైనా, మరొకపాదం వృషభంపైన ఉంచి బాణచాపాలు పైకెత్తి పురము యొక్క ఆ సంగమం చూస్తూ నిలిచాడు.

తదా భవపదన్యాసాద్వేదస్య వృషభస్య చ।
పేతుః స్తనాశ్చ దన్తాశ్చ పీడితస్య త్రిశూలినా ॥41॥

అప్పుడు శివుని పాదన్యాసంచే పీడితాలైన అశ్వవృషభముల యొక్క స్తనాలు, దంతాలు క్రిందపడ్డాయి.

తతఃప్రభృతి చాశ్వానాం స్తనా దన్తా గవాం తదా ।
గూఢాః సమభవంస్తేన చాదృశ్యత్వముపాగతాః ॥42॥

అప్పటినుండి అశ్వాల, గోవుల దంతాలు స్తనాలు గూఢాలయ్యాయి, అందుచే అదృశ్యా లయ్యాయి.

తారకాక్షస్తు భీమాక్షో రౌద్రరక్తాన్తరేక్షణః ।
రుద్రాన్తికే సుసంక్రుద్ధో నన్దినం కులనన్దినమ్ ॥43॥

పరశ్వథేన తీక్ష్ణేన నన్దినం దానవేశ్వరః ।
తక్షయామాస వై తక్షా చన్దనం సరసం యథా ॥44॥

దనుజేశ్వరుడగు తారకాక్షుడు భీకరనేత్రుడై రౌద్రంచే రక్తమైన ఆంతరదృష్టి గల్గి రుద్రునిచెంత కులనందియైన నందీశ్వరుని చెక్కపనివాడు సరసమగు గంధపు చెక్కను చెక్కినట్లు తీక్ష్ణమైన గండ్రగొడ్డలిచే చెక్కాడు.

పరశ్వథహతః శూరః శైలాదిః శరభో యథా ।
దుద్రావ ఖడ్గం నిష్కృష్య తారకాక్ష జిఘాంసయా ॥45॥

శిలాదుని పుత్రుడగు నంది తననలా తారకాక్షుడు గాయపరచేసరికి ఖడ్గమును ఒరనుండి పెరికి ఆ రాక్షసుణ్ణి చంపదలచి శరభమృగం లాగా వానిపై కురికాడు.

యజ్ఞోపవీతమార్గేణ చిచ్ఛేద చ ననాద చ ।
తతః సింహరవో ఘోరః శంఖశబ్దశ్చ భైరవః ।
గణేశ్వరైః కృతస్తత్ర తారకాక్షే నిషూదితే ॥46॥

పదునైన ఆ గొడ్డలితో వాణ్ణి యజ్ఞోపవీతం ధరించిన మార్గాన్ననుసరించి ఛేదించి సింహనాదం చేశాడు. ఆ రాక్షసుడలా చంపబడగా గణేశ్వరులు భైరవమైన శంఖశబ్దం కావించారు.

ప్రమథారసితం శ్రుత్వా వాదిత్రస్వనమేవ చ ।
మయశ్చ స్వస్య పార్శ్వస్థం విద్యున్మాలినమబ్రవీత్ ॥47॥

ప్రమథుల గర్జన, వాద్యస్వనం విని ప్రక్కనే ఉన్న విద్యున్మాలితో మయుడిలా అన్నాడు.

బహువదనవతాం కిమేష శబ్దో నదతాం శ్రూయతి భిన్నసాగరాభః ।
వద వచనం తడిమాలిన్ కిం కిమేతద్గణపాలా రురుదుర్గజా ను కిం వా ॥48॥

విద్యున్మాలీ! ఈ ధ్వని ఏమిటి? అనేక కంఠాల నుండి ఒకేసారి వచ్చిన ధ్వనియా? క్షోభించిన సాగరాల శబ్దం లాగున్నదే! చెప్పు. గణపాలుర రోదనా లేక ఘీంకరిస్తున్న ఏనుగుల ధ్వనియా?

ఇతి మయవచనాంకుశార్దితస్తం తడిమాలీ రవిరివ సోఽంశుమాలీ ।
రణశిరసి సమాగతాన్ సురాంస్తాన్ నిజగాదేదమరిన్దమోఽతిహర్షాత్ ॥49॥

అలా చెప్పిన మయుని వచనమనే అంకుశముచేత పీడితుడై అరిందముడైన విద్యున్మాలి అంశుమాలి యగు సూర్యునిలాగా మరల యుద్ధం ముందుకు వచ్చి (అతిహర్షంతో) ఆ దేవతలతో ఇలా అన్నాడు.

యమవరుణమహేంద్రరుద్రవీర్యస్తవ నిధిరేష తారకాక్షః ।
సకలసమరశీర్షః పర్వతేంద్రాయుధో యస్తపతి హి స నిరస్తస్తారకాక్షో గణేంద్రైః ॥50॥

యమవరుణ మహేంద్ర రుద్రులవంటి విక్రమం కలవాడు, నీ కీర్తికి నిధి అయినవాడూ, సకలయుద్ధముల యందు అగ్రగామియు అయిన తారకాక్షుడు గణాధిపతులచే వధింపబడినాడు.

మృదితముపనిశమ్య తారకాక్షం రవిదీప్తానలభీషణాయతాక్షమ్ ।
హృషితసకలనేత్రలోమసత్త్వాః ప్రమథాస్తోయముచో యథా నదన్తి ॥51॥

సూర్యునివలె ప్రజ్వలించే నేత్రాలు గల తారకాక్షుడు మరణించినా డని విని సంతోషించిన నేత్రరోమ సత్త్వాలు గల ప్రమథులు సంతోషంతో మబ్బులవలె గర్జిస్తున్నారు.

ఇతి సుహృది వచో నిశమ్య తత్త్వం తడిమాలేః స మయస్సువర్ణమాలీ ।
రణశిరసి సితాంజనాచలాభో జగదే వాక్యమిదం మయో వచోఽన్యత్ ॥52॥

తారకాక్షుడు మరణించినాడని విద్యున్మాలి చెప్పగా విని మయుడు నల్లని కాటుక కొండవంటివాడై యుద్ధావనిలో విద్యున్మాలితో ఇలా అన్నాడు.

విద్యున్మాలిన్న నః కాలః సాధితుం హ్యవహేలయా ।
కరోమి విక్రమేణైతత్పురం వ్యసనవర్జితమ్ ॥53॥

విద్యున్మాలీ! ఇది మనం అవహేళనగా గడపవలసిన కాలం కాదు. నా పరాక్రమంతో ఈ త్రిపురాన్ని నేను వ్యసనం లేనిదిగా చేస్తాను.

విద్యున్మాలీ తతః క్రుద్ధో మయశ్చ త్రిపురేశ్వరః ।
గణాన్ జఘ్నుస్తు ద్రాఘిష్ఠాః సహితాస్తైర్మహాసురైః ॥54॥

అంతట క్రుద్ధుడైన విద్యున్మాలి, త్రిపురేశ్వరుడైన మయుడును మహాసురులతో గూడి ప్రమథులను చావగొట్టడానికి పూనుకొన్నారు.

యేన యేన గతస్తం తం విద్యున్మాలీ మయశ్చ సః ।
తేన తేన పురం శూన్యం ప్రమథైః ప్రహృతైః కృతమ్ ॥55॥

మయుడు, విద్యున్మాలి ఎక్కడెక్కడకు వెళ్ళారో, అక్కడక్కడ ప్రమథులు అడ్డుకొని రాక్షసులను నిశ్శేషంగా హతమార్చారు.

అథ యమవరుణమృదంగఘోషైః పణవ స డిణ్డిమ వాద్యకప్రఘోషైః ।
సకరతలపుటైశ్చ సింహనాదైః పరమభిపూజ్య సురా వితస్థుః ॥56॥

ఆపై యమవరుణులు మృదంగధ్వనులతో, పణవడిండిమజ్యాస్వనాలఘోషతో, కరతలధ్వనులతో, సింహనాదాలతో తమ హర్షం వ్యక్తం చేశారు. ఇలా సురలు శివుణ్ణి అర్చించారు.

సంపూజ్యమానో దితిజైర్మహాత్మభిః సహస్రరశ్మిప్రతిమో మయో బభౌ ।
అభిష్టుతః సత్త్వరతైస్తపోధనైర్యథాస్తశృంగాభిగతో దివాకరః ॥57॥

సూర్యసదృశతేజులూ, మహాత్ములైన దైత్యులచే అలా పూజింపబడినవాడై సత్యరతులైన తపోధనులచే నుతింపబడినవాడై అస్తశిఖరగతుడైన సూర్యునివలె మయుడు భాసించాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తారకాక్షవధో నామాష్టత్రింశదధికశతతమోఽధ్యాయః ॥ 138 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని తారకాక్షవధ అనే నూటముప్పైఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోన చత్వారింశదధికశతతమోఽధ్యాయః - నూటముప్పై తొమ్మిదవ అధ్యాయం

త్రిపురదాహే చంద్రోదయాది వర్ణనమ్ - త్రిపురదహనంలో చంద్రోదయాది వర్ణనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

తారకాక్షే హతే యుద్ధే ఉత్సార్య ప్రమథాన్మయః ।
ఉవాచ దానవాన్భూయో భూయః స తు భయావృతాన్ ॥1॥

తారకాక్షుడు యుద్ధంలో మరణించగా ప్రమథులను తరిమివైచి మయుడు భీతులైన దానవులనుద్దేశించి మాటిమాటికీ ఇలా అన్నాడు.

భోఽసురేంద్రాఽధునా సర్వే శృణుధ్వం మత్ప్రభాషితమ్ ।
యత్కర్తవ్యం మయా చైవ యుష్మాభిశ్చ మహాబలైః ॥2॥

అసురవరులారా! ఇపుడు అందరూ నా మాట వినండి. నేనూ, మహాబలం కల మీరూ ఇప్పుడు ఏమి చేయాలో చెబుతాను.

పుష్యం సమేష్యతే కాలే చంద్రశ్చంద్రనిభాననాః ।
యదైకం త్రిపురం సర్వం క్షణమేకం భవిష్యతి ॥3॥

చంద్ర సదృశముఖులారా! చంద్రుడు పుష్యనక్షత్రంతో కలిసే పుష్యయోగం వచ్చినప్పుడు క్షణకాలం త్రిపురాలు ఒక్కటి అవుతాయి.

స జన్తోర్నిహితః కాలః నో జరా గ్రసతేఽనఘాః! ।
ముహూర్తం యదయం కాలః కోకిలాశంసితేన వై ।
స కాలః పుష్యయోగస్య పురస్య చ మయా కృతః ॥4॥

అనఘులారా! అది కోకిల కూసే కుహూ ధ్వనికి సరిపడునంతకాలమే. అపుడు మనల్ని వార్ధకం మ్రింగి వేస్తుంది. ఇది నగరానికి పుష్యయోగ సమయమని నేను వ్యవస్థీకరించాను.

కాలే తస్మిన్ పురే యస్తు సంభావయతి సంహతిమ్ ।
స ఏవ దాహయేత్తూర్ణం బలినైకేషుణా సురః ॥5॥

ఆ కాలంలో ఏ దేవుడు ఇవి కలిశాయని గ్రహిస్తాడో, అతడు బలమైన ఒక్కబాణంతో దీన్ని త్వరలో నశింపజేయగలడు.

యావత్ప్రాణో బలం యచ్చ యా చ వో వైరితాఽసురాః।
తత్కృత్వా హృదయే చైవ పాలయధ్వమిదం పురమ్ ॥6॥

మీరు మీ ప్రాణం, బలం, ఉన్నంతవరకు శత్రువులతో కలిగిన వైరం ఇదంతా గుర్తుకు తెచ్చుకొని జాగ్రత్తగా ఈ పురాన్ని కాపాడండి.

మహేశ్వరరథం హ్యేకం సర్వప్రాణి విభీషణమ్ ।
విముఖీకురుతాత్యర్థం యథా నోత్సృజతే శరమ్ ॥7॥

మీరు మీ బలమంతా వినియోగించి సకలప్రాణులకు భీకరమైన మహేశ్వరుని రథాన్ని వెనక్కు మళ్ళించండి, అలా అతడు బాణం ప్రయోగించడానికి వీలు కాకుండునట్లు చేయాలి.

తత ఏవంకృతేఽస్మాభిస్త్రిపురస్యాభిరక్షణే ।
ప్రతీక్షిష్యన్తి వివశాః పుష్యయోగం దివౌకసః ॥8॥

త్రిపుర రక్షణంలో మనం అలా చేస్తే వివశులైన దేవతలు పుష్యయోగానికై ఎదురుచూస్తారు.

నిశమ్య తన్మయస్యైవం దానవాస్త్రిపురాలయాః ।
ముహుః సింహరుతం కృత్వా మయమూచుర్యమోపమాః ॥9॥

మయుని మాట విని త్రిపుర నివాసులూ, యమసదృశులూ అయిన దానవులు మరల సింహనాదం చేసి అతనితో ఇలా అన్నారు.

ప్రయత్నేన వయం సర్వే కుర్మస్తవ ప్రభాషితమ్ ।
తథా కుర్మో యథా రుద్రో న మోక్ష్యతి పురే శరమ్ ॥10॥

ప్రయత్నంతో మేమందరమూ నీ మాట పాటిస్తాము. రుద్రుడు పురంపై శరం ప్రయోగించడానికి వీలు కాకుండా చేస్తాము.

అద్య యాస్యామ సంగ్రామం రుద్రస్య తు జిఘాంసవః ।
కథయన్తి దితేః పుత్రా హృష్టా భిన్నతనూరుహాః ॥11॥

ఈ దినం రుద్రుణ్ణి సంహరింపగోరి సంగ్రామానికి పోతాము అని గగుర్పాటు చెంది సంతుష్టులైన దితిపుత్రులు చెప్పారు.

కల్పం స్థాస్యతి వా ఖస్థం త్రిపురం శాశ్వతం ధ్రువమ్ ।
అదానవం వా భవితా నారాయణపదత్రయమ్ ॥12॥

ఈ త్రిపురం శాశ్వతమై, స్థిరమై ఆకాశంలో కల్పాంతం వరకూ ఉండనైనా ఉండాలి. లేదా నారాయణుని మూడడుగులు దానవరహితాలన్నా కావాలి.

వయం న ధర్మం హాస్యామో యస్మాన్మోక్ష్యతి నో భవాన్ ।
అదైవతమదైత్యం వా లోకం ద్రక్ష్యన్తి మానవాః ॥13॥

నీవు మాకు ఏది విధిస్తున్నావో, ఆ ధర్మాన్ని మేము విడువము. నీవు మమ్ము విడువవు. కావున మానవులు నేడు లోకాన్ని అదైవతంగానైనా, లేక అదైత్యంగానైనా చూడగలరు."

ఇతి సమ్మంత్ర్య హృష్టాస్తే పురాన్తర్విబుధారయః ।
ప్రదోషే ముదితా భూత్వా చేరుర్మన్మథచారతామ్ ॥14॥

ఇలా ఆలోచించి సంతసించి ఆ అసురులు పురంలోపల ప్రదోషకాలంలో ముదితులై మన్మథుని సందేశహారుల్లాగా చరించారు.

ముహుర్ముక్తోదయోభ్రాన్త ఉదయాద్రౌ మహారుణః ।
తమాంస్యుత్సార్య భగవాంశ్చంద్రో జృంభతి సోఽంబరే ॥15॥

అస్తమించిన భగవానుడైన చంద్రుడు తిరిగి ఉదయాద్రిపై మిక్కిలి ఎర్రనై చీకట్లు పారదోలి ఆకాశంలో చరిస్తున్నాడు.

కుముదాలంకృతే హంసో యథా సరసి విస్తృతే ।
సింహో యథా చోపవిష్టో వైదూర్యశిఖరే మహాన్ ॥16॥

విష్ణోర్యథా చ విస్తీర్ణే హారశ్చోరసి సంస్థితః ।
తథా చ గాఢే తమసి చంద్రోఽత్రినయనోద్భవః ।
భ్రాజతే భ్రాజయల్లోకాన్సృజన్ జ్యోత్స్నారసం బలాత్॥17॥

కుముదాలచే అలంకృతమైన విశాలమగు మడుగులో హంసలాగానూ, వైదూర్య శిఖరంలో ఉపవిష్టమైన గొప్ప సింహం మాదిరిగానూ, విష్ణువు యొక్క విశాలమైన వక్షంపైగల హారంవలెనూ, అతినేత్రం నుండి పుట్టిన చంద్రుడు ఆకాశంలో లోకాలను వెలిగిస్తూ జ్యోత్స్నారసం సృష్టిస్తూ ప్రకాశిస్తున్నాడు.

శీతాంశావుదితే చంద్రే జ్యోత్స్నాపూర్ణే పురేఽసురాః।
ప్రదోషే లలితం చక్రుర్గృహమాత్మానమేవ చ ॥18॥

అసురులు వెన్నెల నిండిన చంద్రుడు నగరంలో ఉదయించగానే ప్రదోషకాలంలో గృహాలను, తమ శరీరాలనూ అలంకరించుకొన్నారు.

రథ్యాసు రాజమార్గేషు ప్రాసాదేషు గృహేషు చ ।
దీపాశ్చంపకపుష్పాభా యే దీప్యన్తే ప్రదీపితాః ॥19॥

వీథులలో, రాజమార్గాలలో, ప్రాసాదాలలో, ఇండ్లలోనూ ప్రదీపితాలైన దీపాలు చంపక (సంపెంగ) పుష్పాలవలె ప్రకాశించాయి.

తదా మఠేషు తే దీపాః స్నేహపూర్ణాః ప్రదీపితాః ।
గృహాణి వసుమన్త్యేషాం సర్వరత్నమయాని చ ।
జ్వలంతోఽదీపయన్దీపాంశ్చంద్రోదయ ఇవ గ్రహాః ॥20॥

అప్పుడు మఠాలలో ఆ దీపాలు నిండానూనెతో వెలిగించబడ్డాయి. ధనసంపన్నాలు, సర్వరత్నమయాలూ ఐన వీరి గృహాలు చంద్రోదయంలో గ్రహాలు దీపించినవిధంగా దీపాలను దీపింపజేశాయి.

చంద్రాంశుభిర్భాసమానమన్తర్దీపైః సుదీపితమ్ ।
ఉపద్రవైః కులమివ పీయతే త్రిపురే తమః ॥21॥

చంద్రకిరణాలచే దీప్తమై, లోపలిదీపాలచే ఇంకా ఎక్కువగా సుదీపితమై ఉపద్రవాలచేత కులంలాగా త్రిపురంలో తమస్సు త్రాగి వేయబడింది.

తస్మిన్ పురే వై తరుణప్రదోషే చంద్రాట్టహాసే తరుణప్రదోషే ।
రత్యర్థినో వై దనుజా గృహేషు సహాంగనాభిః సుచిరం విరేముః ॥22॥

ఆ తరుణ ప్రదోషకాలంలో, చంద్రుని ప్రకాశం పెంపొందగా, ఆ నగరంలో దనుజులు తమ యిండ్లలో రతి గోరి అంగనలతో చాలా సేపు రమించారు.

వినోదితా యే తు వృషధ్వజస్య పంచేషవస్తే మకరధ్వజేన ।
తత్రాసురేష్వాసురపుంగవేషు సర్వాంగనాస్వాదయితా బభూవుః ॥23॥

పూర్వం మదనునిచే శివునిపై ప్రయుక్తాలై వినోదితాలైన ఐదు బాణాలు ఇపుడు త్రిపురాసురులపై ప్రయోగింపబడినవి. అచటి స్త్రీ పురుషులకు అవి తమ రుచిని చూపాయి.

కలప్రలాపేషు చ దానవీనాం వీణాప్రలాపేషు చ మూర్ఛితేషు ।
మత్తప్రలాపేషు చ దానవానాం సచాపబాణో మదనో మమన్థ ॥24॥

దానవస్త్రీల మధురభాషణలలోనూ, మూర్ఛితాలైన (స్వరపరచబడిన) వీణానాదాలలోనూ, దానవుల మత్తప్రలాపాలలోనూ విజృంభించి మదనుడు ధనుర్బాణాలు దాల్చి వారి మనస్సులను మథించాడు.

తమాంసి నైశాని ద్రుతం నిహత్య జ్యోత్స్నావితానేన జగద్వితత్యా ।
ఖే రోహిణీం తాం చ ప్రియాం సమేత్య చంద్రః ప్రభాభిః కురుతేఽధిరాజ్యమ్ ॥25॥

రాత్రి చీకట్లను వడిగా పోదోలి, వెన్నెలతో జగమును ప్రకాశింపజేసి, ఆకాశంలో ప్రియురాలగు రోహిణిని గూడి చంద్రుడు కాంతులతో అధిరాజ్యం చేశాడు.

స్థిత్వైవ కాన్తస్య తు పాదమూలే కాచిద్వరస్త్రీ స్వకపోలమూలే ।
విశేషకం చారుతరం కరోతి తేనాననం స్వం సమలంకరోతి ॥26॥

ఒక వరవనిత కాంతుని పాదమూలంలో నిలిచి తన కపోలాలతో అందంగా విశేషకం అనే రంగుపూత అద్దింది. దానితో తన ముఖాన్ని శోభావంతం చేసుకొన్నది.

దృష్ట్వాననం మణ్డలదర్పణస్థం మహాప్రభా మే ముఖజేతి జప్త్వా ।
స్మృత్వా వరాంగీ రమణేరితాని తేనైవ భావేన రతీవ చాస ॥27॥

ఒక వనిత గుండ్రని దర్పణంలో ముఖం చూచుకొని ఈ మహాకాంతి నా ముఖంనుండి కల్గిందని జపించి రమణుడు చెప్పిన మాటలు స్మరించుకొని అందులోనే రతిని పొందింది.

రోమాంచితైర్గాత్రవరైర్యువభ్యో రతానురాగాద్రమణేన చాన్యాః ।
స్వయం ద్రుతం యాన్తి మదాభిభూతాః ద్విపా యథా ఘర్మదినావసానే ॥28॥

రోమాంచితాలైన అవయవాలతో యువకులతోడి రత్యనురాగం వల్ల చక్కగా అలంకరించుకొని కొందరు స్త్రీలు స్వయంగా మదాభిభూతలై ఉష్ణదినావసానంలో ఏనుగులవలె ఆనందంతో మిక్కిలి వడిగా వెళ్ళారు.

పేపీయతే చాతిరసానువిద్ధా విమార్గితాన్యా చ ప్రియం ప్రసన్నా ।
కాచిత్ ప్రియస్యాతిచిరాత్ ప్రసన్నా ఆసీత్ప్రలాపేషు చ సంప్రసన్నా ॥29॥

ఒకతె అతిరసానువిద్ధయై త్రాగింది. ప్రసన్నయై దారితప్పిన మరొకతె ప్రియుణ్ణి ఎక్కడ వున్నాడో అని అన్వేషించింది. మరొకతె చాలా కాలానికి ప్రియునిపట్ల ప్రసన్నురాలై మాటలతో మిక్కిలిగా ప్రసన్నురాలయింది.

గోశీర్షపద్మైర్హరిచన్దనైశ్చ పంకాంకితాక్షీరధరాఽఽసురీణామ్ ।
మనోజ్ఞరూపా రుచిరా బభూవుః పూర్ణామృతస్యేవ సువర్ణకుంభాః ॥30॥

గోశీర్ష పద్మాలతో, హరిచందనాలతో అంకితాలైన (పూయబడిన) అసురవనితల స్తనాలు అమృతపూర్ణ స్వర్ణకుంభాలవలె మనోజ్ఞరూపంతో అందంగా కనిపించాయి.

క్షతాధరోష్ఠా ద్రుతదోషరక్తా లలన్తి దైత్యా దయితాసురక్తాః ।
తంత్రీప్రలాపేషు పునస్సరక్తాః స్త్రీణాం ప్రలాపేషు పునర్విరక్తాః ॥31॥

కొందరు దానవులు ప్రియురాండ్ర క్రింది పెదవులను గాయపరచి వారు కోపింపగా ఆ రోషం తొలగించే మాటలు పలికి (లాలానచేసి) అనందింపజేశారు. వీణావాదనలందు తిరిగి ఎక్కువ ఆసక్తి కలిగి స్త్రీలప్రలాపాలలో విరక్తులయ్యారు.

క్వచిత్ప్రవృత్తం మధురాభిగానం కామస్య బాణేషు కృతం విధానమ్ ।
ఆపానభూమీషు సుఖప్రమేయం గేయం ప్రవృత్తం త్వథ సాధయన్తి ॥32॥

ఒకచో మధురగానం ప్రవర్తిల్లింది. అది కామ బాణాల సుకృత విధానంగా రూపొందింది. పానశాలల్లో సుఖోద్యోతకమైన గేయం ప్రవర్తిల్లగా కొందరు దానిని సాధిస్తున్నారు.

గేయం ప్రవృత్తం త్వథ వాదయన్తి కేచిత్ప్రియాస్తత్ర చ సాధయన్తి ।
కేచిత్ప్రియాం సంప్రతిబోధయన్తి సంబుధ్య సంబుధ్య చ రామయన్తి ॥33॥

ప్రవృత్తమైన గేయాన్ని కొందరు వాద్యాలతో అనుసరించారు. కొందరు ప్రియలను అందులో సాధించారు. కొందరు మాటిమాటికి వారిని సంబోధించి మేల్కొలిపి రమింపజేశారు.

చూతప్రసూనప్రభవః సుగన్ధః సూర్యే గతే వై త్రిపురే బభూవ ।
సమర్మరో నూపురమేఖలానాం శబ్దశ్చ సమ్బాధతి కోకిలానామ్ ॥34॥

సూర్యాస్తమయం కాగానే మామిడి పూత సువాసన త్రిపురాలలో వ్యాపించింది. నూపుర మేఖలల మర్మర ధ్వని, కోకిలల ధ్వని అంతటా వ్యాపించింది.

ప్రియోపగూఢా శయనోపగూఢా కాచిత్ప్రరూఢాంగరుహాఽపి నారీ ।
సుచారుబాష్పాంకురపల్లవాంతా నవాంబుసిక్తా ఇవ భూమిరాసీత్ ॥35॥

ప్రియునిచే ఆలింగితయై శయనమందు రోమాంచం పొందిన ఒక నారీమణి అందమైన బాష్పాంకుర పల్లవాలు కలిగి నవాంబుసిక్తమైన భూమి వలె వున్నది.

శశాంకపాదైరుపశోభితేషు ప్రాసాదవర్యేషు వరాంగనానామ్ ।
మాధుర్యభూతాభరణా మహాన్తః స్వనా బభూవుర్మదనేషుతుల్యాః ॥36॥

చంద్రకిరణాలచే శోభిల్లే వరాంగనల మేడలలో ఆభరణాల గొప్ప ధ్వనులు మదనబాణ పతనాల ధ్వనులతో తుల్యాలయ్యాయి.

పానేన ఖిన్నా దయితాఽతివేలం కపోలమాజిఘ్రసి కిం మమేదమ్ ।
ఆరోహ మే శ్రోణిమిమాం విశాలాం పీనోన్నతాం కాంచనమేఖలాఢ్యామ్ ॥37॥

ఎక్కువ పానంతో ఖిన్నురాలైన ఒకతె ప్రియునితో "ఎందుకు నాకపోలం ఆఘ్రాణిస్తావు. విశాలమూ, పీనోన్నతమూ, కాంచన మేఖలాఢ్యమూ అయిన నాశ్రోణి నధిరోహించు" అని చెప్పింది.

రథ్యాసు చంద్రోదయభాసితాసు నరేంద్రమార్గేషు చ విస్తృతేషు ।
దైత్యాంగనా యూథగతా విభాన్తి తారా యథా చంద్రమసో దివాన్తే ॥38॥

చంద్రోదయంతో ప్రకాశించే వీథులలో విస్తృతమైన రాజమార్గాలలో యూథగతాలైన దైత్యవనితలు దినాంతంలో చంద్రునితో కూడిన తారలవలె భాసించారు.

సుధాట్టహాసేషు సురాలయేషు ప్రేంఖాసు చాన్యా మదలోలభావాః ।
సన్దోలయన్తే కిలసంప్రహాసం ప్రోవాచ కాంచీగుణసూక్ష్మనాదాః ॥39॥

దానవులు తమ భవనాలలో వెన్నెల అట్టహాసాల మధ్య ఊయలలో మదలోల భావాలతో ఊగుతూ సుఖించారు. వారి చిత్తాలు ప్రియల మొలనూలులందలి చిరుగజ్జెలచే ఆకర్షింపబడ్డాయి.

అమ్లానమాలాన్వితసున్దరీణాం సముత్సుకానా మతిహర్షితానామ్ ।
శ్రూయన్తి వాచః కలధౌతకల్పా వాపీషు చాన్యే కలహంసశబ్దాః ॥40॥

వాడిపోని మాలలు గల సుందరీమణులు ఔత్సుక్యంతో ఉన్నారు. నడబావులలో కలహంస శబ్దాలు వారి మాటలు ఒకేవిధంగా వినిపించాయి.

కాంచీకలాపాశ్చ సహాంగహారాః ప్రేక్ష్యాస్సదా హాసకృతశ్చ బాలాః ।
దృశ్యంత ఏతే హ్యసురాంగనానాం ప్రియాలయా మన్మథమార్గణానామ్ ॥41॥

కాంచీకలాపాలు, అంగహారాలు, సదా హసించే బాలలు, మదనబాణాలకు నివాసాలైన దానవాంగనల సౌందర్యాలు పురంలో కనిపించాయి.

చిత్రాంబరైశ్చోద్ధృతకేశపాశైః సన్దోల్యమానాః శుశుభేఽసురీణామ్ ।
సుచారువేషాభరణైరుపేతాస్తారాగణైర్ద్యౌరివ సా సుచంద్రాః ॥42॥

చిత్రాంబరాలు, ఎత్తి పట్టిన కేశపాశాలు కలిగి సంచలించే అసురవనితల అందమైన ఆభరణాలతో గూడినదై ఆ నగరం తారకలతో గూడిన ఆకాశంలాగా భాసించింది.

సన్దోలనాధ్వానిత భిన్నసూత్రా కాంచీకలాపాంచిత రత్నకీర్ణా ।
శయ్యాభూమిశ్చిత్రితా తైర్విభాతి చంద్రస్య పార్శ్వోపగతేవ చిత్రా ॥43॥

కదలికలచే తెగిపడిన మొలనూళ్ళతో, మొలనూళ్ళ నుండి చెదరి రాలిపడిన రత్నాలతో చిత్రితమై విరాజిల్లుతూ ఆ త్రిపురాలలోని శయ్యాభూమి చంద్రుని వద్ద ప్రకాశించే చిత్రానక్షత్రం లాగా ప్రకాశించింది.

సచంద్రికే చోపవనప్రదేశే రుతేషు కాంతేషు చ కోకిలానామ్ ।
శరవ్యయం ప్రాప్య పురేఽసురాణాం ప్రక్షీణబాణో మదనశ్చచార ॥44॥

వెన్నెలలతో గూడిన ఉద్యాన ప్రదేశంలో కోకిలశబ్దాలు గల అసురపురంలో మదనుడు బాణాలు వ్యయమైపోగా ప్రక్షీణబాణుడై చరించాడు.

ఇతి తత్ర పురేఽమరద్విషాణాం సపది హ పశ్చిమకౌముదీ తదాఽఽసీత్ ।
రణశిరసి తథా భవిష్యతాం వై భవతురగైః కృతసంక్షయోఽప్యరీణామ్ ॥45॥

రాత్రి ముగిసింది. వెన్నెలలు తగ్గాయి. చంద్రుడు పడమట వాలాడు. శివుని తురగాలు కొద్దిసేపట్లో యుద్ధంలో నిలిచి దానవులకూ, చంద్రునికీ ఒకేసారి క్షయం కల్గిస్తున్నట్లు అనిపించింది.

చంద్రోఽథ కుందకుముదాకరహారవర్ణో జ్యోత్స్నావితానరహితోఽభ్రసమానవర్ణః।
విచ్ఛాయతాం హి సముపేత్య న భాతి తద్వత్ భాగ్యక్షయే ధనపతిశ్చ నరో వివర్ణః ॥46॥

అప్పుడు చంద్రుడు మొల్లలు, కలువులవంటి కాంతి కలిగి వెన్నెల తగ్గి మబ్బువంటి వర్ణం కలవాడయ్యాడు. ఐశ్వర్యం క్షీణించిన ధనికునిలాగా వివర్ణుడై కనిపించాడు.

చంద్రప్రభామరుణసారథినాఽభిభూయ సన్తప్తకాంచనరథాంగసమానబింబః ।
స్థిత్వోదయాద్రిశిఖరే ముహురేవ సూర్యో భాత్యమ్బరే తిమిరతోయవహాన్నిరస్యన్ ॥47॥

చంద్రుని కాంతిని అరుణసారథితో తిరస్కరించి కాచిన బంగారుచక్రంవంటి వర్ణం కలిగి ఉదయపర్వత శిఖరంపై నిలిచి సూర్యుడు చీకట్లు అనే మబ్బులను తొలగిస్తూ ఆకాశంలో వెలుగొందాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే త్రిపురదహనే చంద్రోదయాది వర్ణనం నామ

ఏకోనచత్వారింశదధికశతతమోఽధ్యాయః ॥ 139 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలోని త్రిపురదహనంలో చంద్రోదయాది వర్ణనమనే

నూటముప్పైతొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

చత్వారింశదధికశతతమో౽ధ్యాయః - నూటనలబైయవ అధ్యాయం
దేవదానవయుద్ధే విద్యున్మాలివధః - దేవదానవయుద్ధంలో విద్యున్మాలివధ

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

ఉదితే తు సహస్రాంశౌ మేరుభాసాంకురే రవౌ ।
ననర్ద చ బలం కృత్స్నం యుగాన్త ఇవ సాగరః ॥1॥

ఋషులారా! మేరుపర్వతప్రకాశాంకురంవంటి, వెయ్యి కిరణాలు కల సూర్యుడు ఉదయించగానే, యుగాంతంలో సాగరంలాగా దేవతల సైన్యమంతా గర్జించింది.

సహస్రనయనో దేవస్తతః శక్రః పురన్దరః ।
సవిత్తదః సవరుణస్త్రిపురం ప్రయయౌ హరః ॥2॥

సహస్రనేత్రుడైన ఇంద్రుడు, కుబేరునితో, వరుణునితో గూడిన శివుడు త్రైపురం వైపు నడిచారు.

తే నానావిధరూపాశ్చ ప్రమథాతిప్రమాథినః ।
యయుః సింహరవైర్ఘోరైర్వాదిత్రనినదైరపి ॥3॥

నానారూపాలు గల వారు అతిప్రమాథులూ అయిన ప్రమథులు గూడా ఘోరమైన సింహనాదాలతో, వాద్యనినాదాలతో ముందుకు సాగారు.

తతో వాదితవాదిత్రైస్సాతపత్రైస్సహధ్వజైః ।
బభూవ తద్బలం దివ్యం వనం ప్రచలితం యథా ॥4॥

మ్రోగిన వాద్యాలతో, ఆతపత్రాలతో, ధ్వజాలతో కూడి ఆ దేవతల సైన్యం ప్రచలితమైన వనం లాగా భాసించింది.

తదాపతన్తం సంప్రేక్ష్య రౌద్రం రుద్రబలం మహత్ ।
సంక్షోభో దానవేంద్రాణాం సముద్రప్రతిమో బభౌ ॥5॥

అలా వస్తున్న రుద్రుని రౌద్రమైన మహాబలాన్ని చూడగానే సముద్ర సమానమైన సంక్షోభం దానవేంద్రులకు సంభవించింది.

తే చాసీన్ పట్టిశాన్ శక్తీః శూలదణ్డపరశ్వథాన్ ।
శరాసనాని వజ్రాణి గురూణి ముసలాని చ ॥6॥

ప్రగృహ్యా కోపరక్తాక్షాః సపక్షా ఇవ పర్వతాః ।
నిర్జగ్ముః దానవఘటా ఘనా ఇవ తపాత్యయే ॥7॥

ఆ రాక్షసులు కత్తులు, పట్టిశాలు, శక్తులు, శూలాలు, దండాలు, గొడ్డళ్ళు, శరాసనాలు, వజ్రాలు, పెద్ద ముసలాలు చేబూని కోపారుణమైన నేత్రాలు గల్గి రెక్కలతోడి కొండల్లాగా, గ్రీష్మానంతరం కొండపై క్రమ్మే మేఘాలవలె, పురంనుండి వెలికి వచ్చారు.

సవిద్యున్మాలినస్తే వై సమయా దితినన్దనాః ।
మోదమానాః సమాసేదుర్దేవదేవైః సురారయః ॥8॥

విద్యున్మాలితో, మయునితో సహా సురారులగు ఆదైత్యులు సంతోషంతో దేవతలతో తలపడడానికి సిద్ధమయ్యారు.

మర్తవ్యకృతబుద్ధీనాం జయే చానిశ్చితాత్మనామ్ ।
అబలానాం చమూర్వ్యాసీదబలావయవా ఇవ ॥9॥

మరణించడానికి కృతనిశ్చయులై విజయ నిశ్చయంలేని బలరహిత దానవుల సైన్యం బలహీనమై అబలల అవయవాల్లాగా దుర్బలమయింది.

విగర్జన్త ఇవాంభోదా అంభోద సదృశత్విషః ।
ప్రబుద్ధా యుద్ధకుశలాః పరస్పరకృతాగసః ॥10॥

మేఘాలవలె గర్జిస్తూ, మబ్బులవంటి కాంతి కలిగి ప్రబుద్ధులు యుద్ధ నిపుణులైన వారు ఒకరి పట్ల ఒకరు అపకారకరణపరాయణులై విజృంభించారు.

ధూమాయన్తో జ్వలద్భిశ్చ ఆయుధైశ్చంద్రభాస్వరైః ।
కోపాద్వా యుద్ధలోభాద్వా చూర్ణయంతః పరస్పరమ్ ॥11॥

చంద్రకాంతి గల మండే ఆయుధాలతో పొగలు క్రక్కువారై కోపంతోనో, యుద్ధలోభంతోనో అన్యోన్యం చూర్ణమగునట్లు ప్రహరించుకొన్నారు.

వజ్రాహతాః పతన్త్యన్యే బాణైరన్యే విదారితాః ।
అన్యే విదారితాశ్చక్రైః పతన్తి హ్యుదధేర్జలే ॥12॥

కొందరు వజ్రపు దెబ్బలకు పడిపోయారు, మరికొందరు బాణాలతో చీల్చబడ్డారు. ఇంక కొందరు చక్రాలచే విదారితులైనారు. అలా నిహతులై సాగరజలాలలో పడిపోయారు.

ఛిన్నస్రగ్దామహారాశ్చ ప్రభ్రష్టాంబరభూషణాః ।
తిమినక్రముఖేష్వేవ పతన్తి ప్రమథాః సురాః ॥13॥

మాలలూ, హారాలూ తెగిపోగా తొలగిన వస్త్రాలూ, ఆభరణాలూ గలవారై ప్రమథులు, దేవతలు తిములు ముసళ్ళ నోళ్ళలో పడ్డారు.

గదానాం ముసలానాం చ తోమర ప్రాస వాజినామ్ ।
వజ్రశూలర్ష్టిపాతానాం పట్టిశానాం చ సర్వతః ॥14॥

గిరిశృంగోపలానాం చ ప్రేరితానాం ప్రమన్యుభిః ।
దేవానాం దానవానాం చ సధూమానాం రవిత్విషామ్ ।
ఆయుధానాం మహానోఘః సాగరౌఘే పతత్యపి ॥15॥

గదలు, ముసలాలు, తోమరాలు, ప్రాసాలు, గుర్రాలు, వజ్రాలు, శూలాలు, పట్టిశాలు, కుపిత సైనికులచే ప్రయోగించబడిన కొండ శిఖారాలలోని రాళ్ళు, వేగవంతులైన దానవులయొక్క, దేవతల యొక్క పొగలు క్రక్కే సూర్యకాంతి గల ఆయుధాల కట్టలు సాగరంలో పడిపోయాయి.

ప్రవృద్ధవేగైస్తైస్తత్ర సురాసురకరేరితైః ।
ఆయుధైస్తస్త నక్రాణాం క్రియతే సంక్షయో మహాన్ ॥16॥

సురాసురుల చేతులతో ప్రయోగింపబడిన సవేగమైన ఆయుధాలచేత మొసళ్ళకు అక్కడ గొప్ప సంక్షయం సంభవించింది.

క్షుద్రాణాం గజయోర్యుద్ధే యథా భవతి సంక్షయః ।
దేవాసురగణైస్తద్వత్తిమినక్రక్షయోఽభవత్ ॥17॥

ఏనుగుల యుద్ధంలో మధ్య చిక్కుకొని క్షుద్రజంతువులు చచ్చినట్లు దేవాసురగణాలచే తిములు, మొసళ్ళు హతమయ్యాయి.

విద్యున్మాలీ చ వేగేన విద్యున్మాలీ ఇవాంబుదః ।
విద్యున్మాలి ఘనాకారం నన్దీశ్వరమభిద్రుతః ॥18॥

అప్పుడు విద్యున్మాలి విద్యున్మాలి యగు మేఘంలాగా గర్జిస్తూ మెరపుతో కూడిన మేఘంవంటి నందిపైకి ఉరికాడు.

స తం తమోఽరివదనం ప్రణదన్వదతాం వరః ।
ఉవాచ యుధి శైలాదిం దానవోఽంబుధినిఃస్వనః ॥19॥

చంద్రునివంటి ముఖం గల శిలాదసుతుడైన ఆ నందితో సముద్రధ్వని గల్గి శబ్దిస్తూ ఆ యుద్ధంలో మంచివక్తయైన ఆ దానవు డిలా అన్నాడు.

యుద్ధాకాంక్షీ తు బలవాన్విద్యున్మాల్యహమాగతః ।
యుధి త్విదానీం మా జీవన్ముచ్యసే నన్దికేశ్వర ।

నేను బలవంతుడనైన విద్యున్మాలిని. నీ మీదికి యుద్ధ కాంక్షతో వచ్చాను. నందికేశ్వరా! నీవు నాచేత బడి బ్రదికి ప్రాణాలతో వదలబడవు.

తమేవంవాదినం దైత్యం నన్దీశస్తపతాం వరః ।
ఉవాచ ప్రహరంస్తత్ర వాక్యాలంకారవద్వచః ॥21॥

అలా చెప్పే దైత్యుని జూచి తపస్వులలో శ్రేష్ఠుడైన నందీశ్వరుడు దెబ్బకొడుతూ వాక్యాలంకారప్రాయమైన వచనం ఇలా పలికాడు.

దానవా దమకామానాం నైషోఽవసర ఇత్యుత ।
శక్తో హన్తుం కిమాత్మానం జాతిదోషాద్విబృంహసి ॥22॥

దానవా! దమ కాములకిది సమయం కాదు. జాతి దోషంతో చెలరేగి మాట్లాడుతున్నావు. నీవు నన్ను చంపగలవా?

యది తావన్మయా పూర్వం నిహతా దితిజా యథా ।
ఇదానీం వా కథం నామ న హింస్యే కులదూషణమ్ ॥23॥

పూర్వం నేను దైత్యులను వధించాను. అట్లే ఇప్పుడు మాత్రం కులదూషకుడవైన నిన్ను చంపకుండా వదలుతానా?

సాగరం తరతే దోర్భ్యాం పాతయేద్యో దివాకరమ్ ।
సోఽపి మాం శక్నుయాన్నైవ చక్షుర్భ్యామపి వీక్షితుమ్ ॥24॥

సముద్రాన్ని చేతులతో ఈదేవాడూ, దివాకరుణ్ణి క్రింద పడవేసేవాడూ, ఐనా సరే నన్ను కన్నులతో తేరి పార చూడలేడు.

ఇత్యేవంవాదినం తత్ర నన్దినం తన్నిభో బలే ।
బిభేదైకేషుణా దైత్యః కరేణార్క ఇవాంబుదమ్ ॥25॥

అలా అంటున్న నందిని బలంలో నందిసముడైన విద్యున్మాలి సూర్యుడు ఒక్క కిరణంతో మబ్బును వలె ఒక్క బాణంతో కొట్టాడు.

వక్షసః స శరస్తస్య పపౌ రుధిరముత్తమమ్ ।
సూర్యస్త్వాత్మప్రభావేణ నద్యర్ణవజలం యథా ॥26॥

సూర్యుడు తన తాప ప్రభావంతో నదులు, సాగరాలలోని జలం త్రాగినట్లు ఆ బాణం అతని వక్షంనుండి ఉత్తమమైన రక్తాన్ని త్రాగింది.

స తేన సుప్రహారేణ ప్రథమం చాతిరోషితః ।
హస్తేన వృక్షముత్పాట్య చిక్షేప గజరాడివ ॥27॥

నంది ఆ గట్టి దెబ్బతో అతిరోషితుడై చేతితో వృక్షాన్ని పెరికి గజరాజంలాగా వానిపై విసిరాడు.

వాయునున్నః స చ తరుః శీర్ణపుష్పో మహారవః ।
విద్యున్మాలిశరైశ్ఛిన్నః పపాత పతగేశవత్ ॥28॥

గాలిచే ప్రేరితమైన ఆ చెట్టు పూలు రాలిపోగా పెద్ద శబ్దం చేస్తూ విద్యున్మాలి ప్రయోగించిన బాణాలచే భిన్నమై పక్షిరాజులాగా నేలగూలింది.

వృక్షమాలోక్య తం ఛిన్నం దానవేన వరేషుభిః ।
రోషమాహారయత్తీవ్రం నన్దీశ్వరః సువిగ్రహః ॥29॥

ఆ దానవుడు శ్రేష్ఠ బాణాలతో ఛేదించిన చెట్టును చూచి సుశరీరుడైన నందీశ్వరుడు తీవ్రరోష గ్రస్తుడయ్యాడు.

సోద్యమ్య కరమారావీ రవేస్సదృక్కరప్రభమ్ ।
దుద్రావ హన్తుం స క్రూరం మహిషం గజరాడివ ॥30॥

అతడు సూర్యకిరణకాంతివంటి కాంతి గల కరమును పైకెత్తి గజరాజం మహిషాన్ని చంపుటకు ఉద్యమించినట్లు ఆ క్రూరుణ్ణి చంపడానికి పరుగెత్తాడు.

తమాపతన్తం వేగేన వేగవాన్ ప్రసభం బలాత్ ।
విద్యున్మాలీ శరశతైః పూరయామాస నన్దినమ్ ॥31॥

అలా వేగంతో వస్తున్న నందిపై వేగవంతుడైన విద్యున్మాలి నూర్ల కొలది శరాలు ప్రయోగించాడు.

శరకణ్టకితాంగో వై శైలాదిః సోஉభవత్ పునః ।
అరేర్గృహ్య రథం తస్య మహతః ప్రయయౌ జవాత్ ॥32॥

నంది ఆ శరాలచే కంటకిత శరీరుడయ్యాడు. ఆపై శత్రువుయొక్క రథాన్ని పట్టుకొని వేగంగా విసిరాడు.

విలంబితాశ్వో విశిరో భ్రమితశ్చ రణే రథః ।
పపాత మునిశాపేన సాదిత్యోஉర్కరథో యథా ॥33॥

అశ్వాలు వ్రేలాడగా ఆ రథం విశీర్ణమై రణభూమిలో గిర్రున తిరిగింది. మునిశాపంవల్ల సూర్యునితో సహా అర్కరథంలాగా అది నేలగూలింది.

అన్తరాన్నిర్గతశ్చైవ మాయయా స దితేః సుతః ।
ఆజఘాన తదా శక్త్యా శైలాదిం సమవస్థితమ్ ॥34॥

ఇంతలో మాయతో వెలికి వచ్చిన ఆ దైత్యుడు చెంతనే ఉన్న నందిని శక్త్యాయుధంతో బలంగా కొట్టాడు.

తామేవ తు వినిష్కృష్య శక్తిం శోణితభూషితామ్ ।
విద్యున్మాలినముద్దిశ్య చిక్షేప ప్రమథాగ్రణీః ॥35॥

రక్తాంకితమైన ఆ శక్తినే చేపట్టి ప్రమథశ్రేష్ఠుడగు నంది విద్యున్మాలి పైకి విసిరాడు.

తయా భిన్నతనుత్రాణో విభిన్నహృదయస్త్వపి ।
విద్యున్మాల్యపతద్భూమౌ వజ్రాహత ఇవాచలః ॥36॥

దానితో వాని కంచుకం భిన్నమయింది. హృదయం భిన్నమయింది. వాడు వజ్రపు దెబ్బకు కొండలాగా నేల గూలాడు.

విద్యున్మాలిని నిహతే సిద్ధచారణకిన్నరాః ।
సాధు సాధ్వితి చోక్త్వా తే యయుర్దేవముమాపతిమ్ ॥37॥

విద్యున్మాలి అలా హతుడయ్యే సరికి సిద్ధ, చారణ, కిన్నరులు 'సాధు సాధు' అనిచెప్పి ఉమాపతి చెంతకువెళ్ళారు.

నన్దినా సాదితే దైత్యే విద్యున్మాలౌ హతే మయః ।
దదాహ ప్రమథానీకం వనమగ్నిరివోద్ధతః ॥38॥

నందికేశ్వరుడారీతిగా విద్యున్మాలిని హతమార్చగా మయుడు ఉద్ధతుడై అగ్ని వనాన్ని కాల్చినట్లు ప్రమథానీకాన్ని దహించాడు.

శూలనిర్దారితోరస్కా గదాచూర్ణితమస్తకాః ।
ఇషుభిర్గాఢవిద్ధాశ్చ ప్రపతన్తి మహార్ణవే ॥39॥

శూలాలచే చీల్చబడిన వక్షం కలవారూ, గదలచే పొడి కావించబడిన తలలు గలవారు, బాణాలచే గాఢంగా కొట్టబడిన వారునై ప్రమథులు మహాసాగరంలో పడసాగారు.

అథ వజ్రధరో యమోఽర్థదః స చ నన్దీ స చ షణ్ముఖో గుహః ।
మయమాసురవీరసంప్రవృత్తం వివిధుః శస్త్రవరైర్హతారయః ॥40॥

అంతట హతశత్రులైన ఇంద్రుడు, యముడు, కుబేరుడు, నంది, షణ్ముఖుడగు కుమారుడు, అసురవీరుడగు మయుణ్ణి వివిధ శస్త్ర శ్రేష్ఠాలచే కొట్టారు.

నాగంతు నాకాధిపతేః శతాక్షం మయో విదార్యేషు వరేణ తూర్ణమ్ ।
యమం చ విత్తాధిపతిం చ భిత్వా రరాస మత్తాంబుదవత్తదానీమ్ ॥41॥

మయరాక్షసుడు ఇంద్రుని ఐరావతాన్నీ, ఇంద్రుణ్ణీ చీల్చి యముణ్ణీ, కుబేరుణ్ణీ శ్రేష్ఠమైన బాణంతో వేగంగా భేదించి వీటితో మదమెక్కిన మేఘంగా గర్జించాడు. నాగాధిపతి గరుడుని చీల్చినట్లు మయుడు వెంటనే శ్రేష్ఠమైన బాణంతో యముణ్ణి, కుబేరుణ్ణి కొట్టి మత్త జలదంలాగా అప్పుడు గట్టిగా గర్జించాడు.

తతః సురైః ప్రమథగణైశ్చ దానవా దృఢాహతాశ్చోత్తమవేగవిక్రమాః ।
భృశానువిద్ధాస్త్రిపురం ప్రవేశితా యథాఽసురాః చక్రధరేణ సంయుగే ॥42॥

ఆపై ప్రమథగణాలు ఉత్తమవేగ విక్రమాలు కల్గి శరాలతో దానవులను దృఢంగా కొట్టారు. అలా విష్ణువుచే యుద్ధంలో అసురుల్లాగా గట్టి దెబ్బలు దిని వారు త్రిపురంలోకి జొరబడ్డారు.

తతస్తు శంఖానకభేరిమర్దలాః ససింహనాదా దనుపుత్రభంగదాః ।
కపర్దిసైన్యే ప్రబభుః సమన్తతో నిపాత్యమానాశనివజ్రసన్నిభాః ॥43॥

అంతట శంఖ, ఆనక, భేరీ, మర్దలాలు సింహనాదసమేతంగానూ, దానవులకు భంగం కల్గించునవిగానూ, శివుని సైన్యంలో నలువైపులా పిడుగుపాటు వలె ఘోరంగా శబ్దించాయి. (ప్రకాశించాయి.)

అథ దైత్యపురాభావే పుష్యయోగో బభూవ హ ।
బభూవ చాపి సంయుక్తం తద్యోగేన పురత్రయమ్ ॥44॥

అంతట దైత్యనగరానికి అభావాన్ని సూచించే పుష్యయోగం సంభవించింది. దానివల్ల ఆ మూడు నగరాలూ సంయుక్త మయ్యాయి.

తతో బాణం త్రిధా దేవస్త్రిదైవతమయం హరః ।
ముమోచ త్రిపురే తూర్ణం త్రినేత్రస్త్రిపథాధిపః ॥45॥

ఆపై గంగాధిపుడు, త్రినేత్రుడైన హరుడు మూడు విధాలగు బాణాన్ని త్రిపురంపై శీఘ్రంగా ప్రయోగించాడు.

తేన ముక్తేన బాణేన బాణపుష్పసమప్రభమ్ ।
ఆకాశం స్వర్ణసంకాశం కృతం సూర్యేణ రంజితమ్ ॥46॥

ఆ విడువబడిన బాణంతో శర పుష్పసదృశమైన ఆకాశం సూర్యరంజితమై స్వర్ణసదృశమయింది.

ముక్త్వా త్రిదైవతమయం త్రిపురే తం శరోత్తమమ్ ।
దిగ్ధిఙ్మామితి చక్రన్ద కష్టం కష్టమితి బ్రువన్ ॥47॥

త్రిపురంపై త్రిదైవతమయమైన ఉత్తమశరం ప్రయోగించి శివుడు 'ధిక్ ధిక్ మాం' అనీ, కష్టం కష్టమనీ అంటూ ఆక్రందనం చేశాడు.

వైధుర్యం దైవతం దృష్ట్వా శైలాదిర్గజవద్గతః ।
కిమిదం త్వితి పప్రచ్ఛ శూలపాణిం మహేశ్వరమ్ ॥48॥

అలా దేవుని వైధుర్యం చూచి నంది గజం లాగా వెళ్ళి 'ఏమిది' అని శూలపాణియగు మహేశ్వరుణ్ణి ప్రశ్నించాడు.

తతః శశాంకతిలకః కపర్దీ పరమార్తవత్ ।
ఉవాచ నన్దినం భక్తః స మయోఽద్య వినంక్ష్యతి ॥49॥

ఆ మీదట చంద్రతిలకుడగు శివుడు పరమార్తునిలాగా నందితో "ఆ నా భక్తుడు మయుడు నేడు నశించి పోతాడే' అని అన్నాడు.

అథ నన్దీశ్వరస్తూర్ణమగాన్మారుతవద్బలీ ।
శరే త్రిపురమాయాతి త్రిపురం ప్రవివేశ సః ॥50॥

ఆపై బలశాలియగు నందీశ్వరుడు మహామారుతంలాగా శివుడు ప్రయోగించిన శరం త్రిపురానికి వస్తూ వుండగా త్రిపురం ప్రవేశించాడు.

స మయం ప్రేక్ష్య గణపః ప్రాహ కాంచనసన్నిభః ।
వినాశస్త్రిపురస్యాస్య ప్రాప్తో మయ! సుదారుణః ॥51॥

అనేనైవ గృహేణ త్వమపక్రమ బ్రవీమ్యహమ్ ।
శ్రుత్వా తన్నన్దివచనం దృఢభక్తో మయస్తదా ।
తేనైవ గృహముఖ్యేన త్రిపురాదపసర్పితః ॥52॥

కాంచన సదృశుడైన ఆ గణాధిపుడు అక్కడ మయుణ్ణి చూచి "మయా! ఈ త్రిపురాలకు అతిదారుణమైన వినాశం దాపురించింది. నేను చెబుతున్నాను, ఈ యింటితోనే నీవు ఇక్కడ నుండి తొలగిపో!" అన్నాడు. ఆ నంది మాట విని మయుడు తన గృహశ్రేష్ఠంతో సహా త్రిపురంనుండి తొలగి వెళ్ళిపోయాడు.

సోఽపీషుః పత్రపుటవద్దగ్ధ్వా తన్నగరత్రయమ్ ।
త్రిధా ఇవ హుతాశశ్చ సోమో నారాయణస్తథా ॥53॥

ఆ శరం పత్రపుటాన్నివలె ఆ నగరాలు మూడింటిని దహించింది. అది అగ్ని, చంద్రుడు, నారాయణుడు అని మూడు విధాల విడిపోయి దహించింది.

శరతేజఃపరీతాని పురాణి ద్విజపుంగవాః! ।
దుష్పుత్రదోషాద్దహ్యన్తే కులాన్యూర్ధ్వం యథా తథా ॥54॥

ద్విజపుంగవులారా! శరాగ్నిచే చుట్టబడిన ఆ పురాలు దుష్పుత్రదోషం వల్ల దగ్ధములయ్యే కులాలవలె దగ్ధ మయ్యాయి.

మేరుకైలాసకల్పాని మన్దరాగ్రనిభాని చ ।
సకవాటగవాక్షాణి వలభీ శోభితాని చ ॥55॥

ప్రాసాదాద్యాని రమ్యాణి కూటాగారోత్కటాని చ ।
ప్రమదాశతపుష్పాణి ధనధాన్యయుతాని చ ॥56॥

బద్ధధ్వజపతాకాని స్వర్ణరౌప్యమయాని చ ।
గృహాణి తస్మింస్త్రిపురే దానవానాముపద్రవే ।
దహ్యన్తే దహనాభాని దహనేన సహస్రశః ॥57॥

మేరు కైలాసాలవంటివి, కవాటాలు, గవాక్షలు గలవి, శిఖరాగ్రాల వంటి పై గృహాలు గలవి. మనోజ్ఞములైనవి, కూటగృహాలు గలవి, ప్రాసాదాలతో కూడినవి, వందల కొలది స్త్రీలతో కూడినవి, ధనధాన్యాలు కలవి, ధ్వజపతాకలు కట్టినవి, స్వర్ణరజతమయాలు, పూర్వం అగ్నిలాగా ప్రకాశిస్తూ ఉండినవీ, అయిన త్రిపురంలోని దానవుల గృహాలు వేలకొలదిగా కాలిపోయాయి.

పాసాదాగ్రేషు రమ్యేషు వనేషూపవనేషు చ ।
వాతాయనగతాశ్చాన్యాశ్చాకాశేషు తలేషు చ ॥58॥

రమణైరుపగూఢాశ్చ రమన్త్యో రమణైః సహ ।
దహ్యన్తే దానవేంద్రాణామగ్నినా హ్యపి తాః స్త్రియః ॥59॥

రమ్యాలైన ప్రాసాదాగ్రాలలో, వనాలలో, ఉద్యానాలలో, కిటికీలలో, ఆకాశ తలాలలో కాంతులచే కౌగిలింపబడి రమించే దానవేంద్రుల కాంతలు, అగ్నిలో కాలిపోజొచ్చారు.

కాచిత్ప్రియం పరిత్యజ్య అశక్తా గన్తుమన్యతః ।
పురః ప్రియస్య పంచత్వం గతాఽగ్నేర్వదనే స్వయమ్ ॥60॥

ఒకతె ప్రియుణ్ణి వదలి అన్యత్ర పోజాలక ప్రియుని ముందరే అగ్ని ముఖంలో పడి మరణించింది.

ఉవాచ శతపత్రాక్షీ సాస్రాక్షీవ కృతాంజలిః ।
హవ్యవాహన! భార్యాఽహం పరస్య పరతాపన! ।
ధర్మసాక్షీ త్రిలోకస్య న మాం స్ప్రష్టుమిహార్హసి ॥61॥

ఒక పద్మాక్షి కన్నీరు కారుస్తూ అగ్నికి నమస్కరించి అగ్నిదేవా! నేను పరుని భార్యను. పరతాపనా! త్రిలోకాలకు ధర్మసాక్షివైన నీవు నన్ను స్పృశించదగవు!"

సహితస్స్వాహయా దేవ! స్వధయా చాపి సువ్రత ।
పరేణ ప్రైహి ముక్త్వేదం గృహం చ దయితం హి మే ॥62॥

సువ్రతా! నీవు స్వాహాస్వధా పత్నులతో కూడినవాడవు. నా ఇల్లు నా భర్తను వదలి ప్రక్కకు పొమ్ము.

ఏకా పుత్రముపాదాయ బాలకం దానవాంగనా ।
హుతాశనసమీపస్థా ఇత్యువాచ హుతాశనమ్ ॥63॥

ఒక దానవవనిత బాలకుడైన పుత్రుణ్ణి తీసుకొని అగ్ని సమీపంలో ఉండి అగ్నితో ఇలా అన్నది.

బాలోఽయం దుఃఖలబ్ధశ్చ మయా పావక! పుత్రకః ।
నార్హస్యేన ముపాదాతుం దయితం షణ్ముఖప్రియ! ॥64॥

పావకా! "వీడు నా బాలుడు. కష్టం మీద లభించినవాడు. షణ్ముఖప్రియా! నీవు ఈ నా ప్రియపుత్రుణ్ణి తీసుకుపోదగవు.

కాశ్చిత్ప్రియాన్పరిత్యజ్య పీడితా దానవాంగనాః ।
నిపతన్త్యర్ణవజలే శింజమానవిభూషణాః ॥65॥

కొందరు పీడితలైన దానవాంగనలు ప్రియులను వదలి భూషణాలు శబ్దిస్తుండగా సముద్రజలాలలో పడుతున్నారు.

తాత పుత్రేతి మాతేతి మాతులేతి చ విహ్వలమ్ ।
చక్రందుస్త్రిపురే నార్యః పావకజ్వాలవేష్టితాః ॥66॥

ఆ త్రిపురంలో మరికొందరు స్త్రీలు తాతా! పుత్రా! మాతా! మాతులా! అని విహ్వలంగా అగ్ని జ్వాలలు క్రమ్ముకొన్నవారై ఆక్రందించారు.

యథా దహతి శైలాగ్నిః సామ్బుజం జలజాకరమ్ ।
తథా స్త్రీవక్త్రపద్మాని చాదహత్త్రిపురేఽనలః ॥67॥

శైలాగ్ని పద్మాలతో గూడిన మడుగును దహించినట్లు త్రిపురంలో అనలుడు స్త్రీల ముఖపద్మాలను దహించాడు.

తుషారరాశిః కమలాకారాణాం యథా దహత్యంబుజకాని శీతే ।
తథైవ సోఽగ్నిస్త్రిపురాంగనానాం దదాహ వక్త్రేక్షణ పంకజాని ॥68॥

మడుగులలో మంచు చలికాలంలో పద్మాలను ఎలా మాడ్చివేస్తుందో అలానే అగ్ని త్రిపురాంగనల వక్త్రేక్షణాలనే పద్మాలను మాడ్చివేసింది.

శరాగ్నిపాతాత్సమభిద్రుతానాం తత్రాంగనానామతికోమలానామ్ ।
బభూవ కాంచీగుణనూపురాణామాక్రన్దితానాం చ రవోఽతిమిశ్రః ॥69॥

శరాగ్ని పతనంతో పరుగెత్తే అక్కడి అతికోమల స్త్రీల మొలనూళ్ళు, నూపురాల శబ్దాలు వారి ఆక్రందనలతో మిశ్రితాలయ్యాయి.

దగ్ధార్ధచంద్రాణి సవేదికాని విశీర్ణహర్మ్యాణి సతోరణాని ।
దగ్ధాని దగ్ధాని గృహాని తత్ర పతన్తి రక్షార్థమివార్ణవౌఘే ॥70॥

కాలిన అర్ధచంద్ర నిర్మాణాలు, వేదికలు గలవి, విశీర్ణమైన మేడలు గలవి, తోరణాలు గలవి, అయిన గృహాలు కాలికాలి రక్షణ కొరకా అన్నట్లు సముద్ర జలాలలో పడుతున్నాయి.

గృహైః పతద్భిర్జ్వలనావలీఢైరాసీత్సముద్రే సలిలం ప్రతప్తమ్ ।
కుపుత్రదోషైః ప్రహతానువిద్ధం యథా కులం యాతి ధనాన్వితస్య ॥71॥

అగ్ని దగ్ధాలైన గృహాలు సాగరంలో పడడంతో సముద్రజలం వేడెక్కింది. అది ఒక ధనికుని కులం కుపుత్రదోషాలతో అనువిద్ధమై స్థితి దప్పినట్లున్నది.

గృహప్రతాపైః క్వథితం సమన్తాత్తదార్ణవే తోయముదీర్ణవేగే ।
విత్రాసయామాస తిమీన్సనక్రాంస్తిమింగిలాంస్తత్క్వథితం తథాఽన్యాన్ ॥72॥

గృహతాపాలతో ఉడికిపోయిన సాగరంలోని జలం ఉదీర్ణవేగమై అందలి తిములను, నక్రాలతోడి తిమింగిలాలను, అన్యప్రాణులను అన్నింటినీ ఉడికించి భయభ్రాంతాలను చేసింది.

సగోపురో మన్దరపాదకల్పః ప్రాకారవర్గస్త్రిపురే చ సోఽథ ।
తైరేవ సార్ధం భవనైః పపాత శబ్దం మహాన్తం జనయన్సముద్రే ॥73॥

గోపురాలతో గూడా త్రిపురనగరానికి మందరాద్రిపాద సదృశమైన ప్రాకారశ్రేష్ఠం అందలి గృహాలతో గూడా పెద్ద శబ్దం కల్గిస్తూ సముద్రంలో పడిపోయింది.

సహస్రశృంగైర్భవనైర్యదాసీత్ సహస్రశృంగః స ఇవాచలేశః ।
నామావశేషం త్రిపురం ప్రజజ్ఞే హుతాశనాహారబలిప్రయుక్తమ్ ॥74॥

సహస్రశిఖరాలు గల భవనాలతో సహస్ర శిఖరాలు గల అచలరాజం లాగా రాజిల్లుతుండిన ఆ త్రిపురనగరం అగ్నికి ఆహారార్థం బలిగా సమర్పితమైనదా అన్నట్లు నామావశేషమైంది.

ప్రదహ్యమానేన పురేణ తేన జగత్సపాతాలదివం ప్రతప్తమ్ ।
దుఃఖం మహత్ప్రాప్య జలావమగ్నం యస్మిన్మహాన్ సౌధవరో మయస్య ॥75॥

ఆ పురం తగులబడుతూ పాతాళద్యులోక సహితమైన జగత్తునంతా ప్రతప్తం కావించింది. అందులో మయుని మహాసౌధశ్రేష్ఠం మహాదుఃఖం పొంది కాలకుండా జలంలో నిమగ్నమై పోయింది.

తద్దేవేశో వచః శ్రుత్వా ఇంద్రో వజ్రధరస్తదా ।
శశాప తద్గృహం చాపి మయం చ దితినన్దనమ్ ॥76॥

దేవేశ్వరుడు, వజ్రధరుడు అయిన ఇంద్రుడు మయుని గృహం కాలిపోలేదన్న మాట విని దితినందనుడైన మయుణ్ణి అతని ఇంటిని గూడా ఇలా శపించాడు.

అసేవ్యమప్రతిష్ఠం చ భయేన చ సమావృతమ్ ।
భవిష్యతి మయగృహం నిత్యమేవ యథాఽనలః ॥77॥

ఈ మయుని గృహం సేవింపదగనిది, ప్రతిష్ఠ లేనిది, భయసమన్వితమైనదై నిత్యం అగ్నిలాగా కానున్నది.

యస్య యస్య తు దేశస్య భవిష్యతి పరాభవః ।
ద్రక్ష్యన్తి త్రిపురం ఖణ్డం తత్రేదం నాశగా జనాః ।
తదేతదద్యాపి గృహం మయస్యామయవర్జితమ్ ।
సౌఖ్యం సమాప్నుతే భూయః మయోఽసౌ స్వగృహే పరమ్ ॥78॥

ఏయే దేశానికి పరాభవం జరుగుతుందో, నశించిపోయే ఆ దేశంవారు త్రిపురఖండాన్ని చూడగలరు. మయుని గృహం మాత్రం ఇప్పుడు గూడా క్షతిలేకుండా అక్కడే ఉన్నది. మయుడు తన ఇంట సుఖంగానే ఉండిపోయాడు.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

భగవన్స మయో యేన గృహేణ ప్రపలాయితః ।
తస్య నో గతిమాఖ్యాహి మయస్య తపసోద్భవమ్ ॥79॥

భగవన్! ఆ మయుడు ఏయింటితో గూడా పారిపోయాడో, అది తపస్సుచే సిద్ధించినది గదా! దాని గతినీ, మయుని గతినీ చెప్పండి!

సూత ఉవాచ:– సూతుడు చెప్పాడు.

దృశ్యతే దృశ్యతే యత్ర ధ్రువస్తత్ర మయాస్పదమ్ ।
దేవద్విట్ తు మయశ్చాతః స తదా ఖిన్నమానసః ।
తతశ్చ్యుతోఽ న్యలోకేఽ స్మింస్త్రాణార్థం వై చకార సః ॥80॥

ఎక్కడ ధ్రువుడు కనిపిస్తాడో, అక్కడే మయుని గృహం గోచరిస్తుంది. దేవద్వేషి అయిన మయుడు అప్పుడు ఖిన్నచిత్తుడై అక్కడనుండి భ్రష్టుడై రక్షణార్థం అన్యలోకాలను నివాసంగా చేసుకొన్నాడు.

తతోఽ న్యతః శిలావేశ్మ త్రాణార్థం వై చకార సః ।
తత్రాపి దేవా యాస్యన్తి మయమాసురముత్తమమ్ ॥81॥

తదుపరి మరొకచో తన రక్షణకై అతడు శిలాగృహం నిర్మించుకొన్నాడు. అక్కడ గూడా మయునిపై దేవతలు దాడికి వెడలారు.

తదాశక్తస్తతో గంతుం తచ్చైకం పురముత్తమమ్ ।
శివః సృష్ట్వా గృహం ప్రాదాన్మయాయ చ గృహార్థినే ॥82॥

అప్పుడు అచటినుండి వెళ్ళుటకు వీలుకాని మయుని స్థితి చూచి శివుడు ఒక గృహం సృష్టించి గృహార్థియగు అతని కిచ్చాడు.

విరరామ సహస్రాక్షః పూజయామాస చేశ్వరమ్ ।
పూజ్యమానం చ భూతేశం సర్వే తుష్టువురీశ్వరమ్ ॥83॥

తరువాత ఇంద్రుడు మయునిపై దండెత్తుట విరమించుకొన్నాడు. ఈశ్వరుణ్ణి పూజించాడు. పూజ్యమానుడూ, భూతేశ్వరుడూ అయిన ఈశ్వరుణ్ణి అందరూ స్తుతించారు.

సంపూజ్యమానం త్రిదశైః సమీక్ష్య గణైర్గణేశాధిపతిం తు ముఖ్యమ్ ।
హర్షాద్వవల్గుర్జహసుశ్చ దేవా జగుశ్చ గీతం త్రిపురావధానమ్ ।
ననర్తురుచ్చైశ్చ విషక్తహస్తాః పితామహోఽ నందత తం మహేశమ్ ॥84॥

దేవతలచేతనూ, గణాలచేత పూజింపబడుతున్న గణేశాధిపతి యగు శివుణ్ణి చూచి సంతోషంతో దేవతలు కుప్పిగంతులు వేశారు, నవ్వారు, త్రిపుర చరిత్రను ప్రశంసిస్తూ పాటలు పాడారు. నృత్యం చేశారు. చేతులు దట్టుతూ శబ్దించారు. బ్రహ్మ శివుణ్ణి అభినందించాడు.

ప్రగృహ్య చాపం విససర్జ భూత్యా రథాత్సముప్లుత్య సురాం స్త్రిలోచనః ॥85॥

ఈశ్వరుడు రథమునుండి తన ధనువును పరిగ్రహించి దానినుండి క్రిందికి దూకి దేవతలకు వీడ్కోలిచ్చి వారిని పంపించాడు.

ఏవం తత్త్రిపురం దుర్గం దైవతైస్సుదురాసదమ్ ।
హరేణైకేషుణా దగ్ధం విక్షిప్తం మకరాలయే ॥86॥

ఇలా దేవతలకు అప్రాప్యమైన త్రిపురాన్ని హరుడు ఒక్కబాణంతో కాల్చివేసి సముద్రంలో పడవేశాడు.

య ఇమం రుద్రవిజయం పఠతే విజయావహమ్ ।
విజయం తస్య కృత్యేషు దదాతి వృషభధ్వజః ॥87॥

విజయావహమైన ఈ రుద్రవిజయాన్ని ఎవడు చదువుతాడో, వానికి కార్యాలలో విజయాన్ని వృషధ్వజు డిస్తాడు.

పితౄణాం వాఽపి శ్రాద్ధేషు య ఇమం శ్రావయిష్యతి ।
అనన్తం తస్య పుణ్యం స్యాత్సర్వయజ్ఞఫలప్రదమ్ ॥88॥

పితృశ్రాద్ధకాలంలో ఎవడు దీన్ని వినిపిస్తాడో వానికి సర్వయజ్ఞ ఫలప్రదమైన అనంతపుణ్యం కల్గుతుంది.

ఇదం స్వస్త్యయనం పుణ్యమిదం పుంసవనం మహత్ ।
ఇదం శ్రుత్వా పఠిత్వా చ యాన్తి రుద్రసలోకతామ్ ॥89॥

ఇది పుణ్యం, ఇది శుభావహమైనది. ఇది పుంసవన కర్మతో తుల్యమైనది. దీన్ని చదివినవారు రుద్రసాలోక్యం పొందుతారు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే దేవదానవయుద్ధే విద్యున్మాలివధోనామ చత్వారింశదధికశతతమోఽధ్యాయః ॥140॥

శ్రీమత్స్య మహాపురాణంలోని దేవదానవయుద్ధంలో విద్యున్మాలివధ అనే నూటనలభైయవ అధ్యాయం సంపూర్ణం

ఏకచత్వారింశదధికశతతమోఽధ్యాయః - నూటనలభై ఒకటవ అధ్యాయం
పురూరవస్సూర్యచంద్ర సమాగమః - పురూరవసూర్యచంద్రుల సమాగమం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

కథం గచ్ఛత్యమావాస్యాం మాసి మాసి దివం నృపః ।
ఐలః పురూరవాః సూత! తర్పయేత కథం పితౄన్।
ఏతదిచ్ఛామహే శ్రోతుం ప్రభావం తస్య ధీమతః ॥1॥

సూతా! ఐలుడయిన పురూరవుడు ప్రతిమాసం అమావాస్యనాడు స్వర్గాని కెలా పోయి పితృతర్పణం నిర్వర్తిస్తున్నాడు? ఆ ధీమంతుని ప్రభావం వినగోరుతున్నాము.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు

ఏతదేవ తు పప్రచ్ఛ మనుః స మధుసూదనమ్ ।
సూర్యపుత్రాయ చోవాచ యథా తన్మే నిబోధత ॥2॥

ఈ విషయాన్నే మనువు పూర్వం మధుసూదనుణ్ణి అడిగాడు. భగవానుడు ఆ సూర్యపుత్రునికీవిషయం చెప్పాడు. ఆయన చెప్పిన విషయం నానుండి మీరు వినండి!

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది.

తస్య చాహం ప్రవక్ష్యామి ప్రభావం విస్తరేణ తు ।
ఐలస్య దివి సంయోగం సోమేన సహ ధీమతా ॥3॥

ఐలుని ప్రభావాన్ని విస్తరంగా నేను చెబుతాను. అతడు స్వర్గంలో ధీమంతుడైన సోమునితో ఎలా కలిశాడో, వివరిస్తాను.

సోమాచ్చైవామృతప్రాప్తిః పితౄణాం తర్పణం తథా ।
సౌమ్యా బర్హిషదః కావ్యా అగ్నిష్వాత్తాస్తథైవ చ ॥4॥

పూరూరవుడు ప్రతినెలా స్వర్గానికి పోయి సోమునితో గూడి అతనినుండి అమృతం సంపాదిస్తాడు. దానితో తన పితరులకు తృప్తి కల్గిస్తాడు. అలా తృప్తి పొందే పితరులు సౌమ్యులు, బర్హిషదులు, కావ్యులు, అగ్నిష్వాత్తులు అనే వర్గాలవారు.

యదా చంద్రశ్చ సూర్యశ్చ నక్షత్రేణ సమాగతౌ ।
అమావాస్యాం నివసత ఏకరాత్రైక మణ్డలే ॥5॥

తదా స గచ్ఛతి ద్రష్టుం దివాకరనిశాకరౌ ।
అమావాస్యామమావాస్యాం మాతామహపితామహౌ ॥6॥

అమావాస్యనాడు సూర్యచంద్రు లిరువురూ ఒకే రాత్రి ఒకే నక్షత్రంతో ఒక మండలంలో కూడినప్పుడు ఆ రాజు తన మాతామహ – పితామహులైన సూర్యచంద్రులను ప్రతి అమావాస్యనాడు దర్శించడానికి పోతాడు.

అభివాద్య తు తౌ తత్ర కాలాపేక్షః స తిష్ఠతి ।
ఆస్కందమానస్సోమాద్యం పిత్రర్థే స పరిశ్రమాత్ ॥7॥

వారిద్దరికీ నమస్కరించి శ్రమవల్ల కాలాపేక్షతో విశ్రాంతి పొంది అక్కడ ఉంటాడు. తదుపరి చంద్రునినుండి ఎటూ కదలక అక్కడే ఉండి పితరుల తృప్తికొరకై పరిశ్రమిస్తాడు.

ఐలః పురూరవా విద్వానమాశ్రాద్ధచికీర్షయా ।
తతః స దివి సోమం వై హ్యుపతస్థే పితౄనపి ॥8॥

ఐలుడైన పురూరవుడు సంప్రదాయం తెలిసిన విద్వాంసుడు కాన అమావాస్యనాడు శ్రాద్ధం చేయాలన్న కోరికతో అలా వెళ్ళి స్వర్గశ్లోకంలో సోముణ్ణి, పితరులను గూడా సేవిస్తాడు.

ద్విలవం చ కుహూమాత్రం తావుభౌ తు నిధాయ సః ।
సినీవాలీ ప్రమాణాల్పకుహూమాత్రవ్రతోదయే ॥9॥

కుహూమాత్రబలోద్దేశం జ్ఞాత్వా కుహూముపాసతే ।
తముపాస్య తతః సోమకాలాపేక్షీ ప్రతీక్షతే ॥10॥

అమావాస్యనాడు చంద్రరేఖ కించిన్మాత్రమైనా కనబడితే అది 'సినీవాలి', కనపడకుంటే 'కుహూ' అనబడుతుంది. పురూరవుడు 'సినీవాలిని విడిచి' కుహులోని బలవంతమైన ద్విలవపరిమాణం కల పర్వసంధికాలానికై ప్రతీక్షిస్తుంటాడు.

సుధామృతం తు సోమాద్వై వసంతం తస్య తృప్తయే ।
దశభిః పంచభిశ్చైవ సుధామృతపరిస్రవైః ।
కృష్ణపక్షభుజాం ప్రీతిరుహ్యతే పరమాంశుభిః ॥11॥

అప్పుడు సోమునినుండి లభించే సుధ పితరులకు తృప్తి కల్గిస్తుంది. కృష్ణపక్షంలో చంద్రునినుండి లభించే పదునైదు పరిస్రవాలతో (ప్రవాహాలతో) కూడిన చంద్రుని ఉత్తమకిరణాలతో పితరులకు తృప్తి కల్గుతుంది.

సద్యోఽభిక్షరతా తేన సౌమ్యేన మధునా చ సః ।
నివాపేష్వథ దత్తేషు పిత్ర్యేణ విధినా తు వై ॥12॥

సుధామృతేన సౌమ్యేన తర్పయామాస వై పితౄన్ ।
సౌమ్యా బర్హిషదః కావ్యా అగ్నిష్వాత్తాస్తథైవ చ ॥13॥

పురూరవుడు అలా స్రవించిన సౌమ్యమధువుతో పిత్ర్యమైన విధిననుసరించి తర్పణం చేసి వారికి తృప్తి కల్గిస్తాడు. సౌమ్యమైన స్వధామృతంతో అలా తృప్తిపొందిన పితరులే సౌమ్యులు, బర్హిషదులు, కావ్యులు, అగ్నిష్వాత్తు లనువారు.

ఋతురగ్నిః స్మృతో విప్రైరృతుం సంవత్సరం విదుః ।
జజ్ఞిరే ఋతవస్తస్మాత్పితరో హ్యార్తవాఽభవన్ ॥14॥

విప్రులు ఋతువును 'అగ్ని' అనీ, 'సంవత్సర'మనీ అంటారు. ఋతువులు సంవత్సరంనుండి పుట్టాయి. ఋతువులనుండి వచ్చిన పితరులు 'ఆర్తవులు' అనబడుతారు.

పితరోఽర్తవోఽర్ధమాసా విజ్ఞేయా ఋతుసూనవః ।
పితామహాస్తు ఋతవో హ్యమావాస్యాబ్దసూనవః
ప్రపితామహాః స్మృతా దేవాః పంచాబ్దా బ్రహ్మణః సుతాః ॥15॥

ఆర్తవులు మరియు అర్ధమాసపితరులు ఋతువుయొక్క పుత్రులుగా తెలుసుకొనదగినవారు, పితామహులు ఋతువులు మరియు అమావాస్య స్వరూపులుగానూ సంవత్సరముయొక్క కుమారులుగానూ స్మరింపబడ్డారు. ప్రపితామహులు పంచాబ్దదేవతలుగాను బ్రహ్మపుత్రులుగానూ స్మరింపబడ్డారు.

సౌమ్యా బర్హిషదః కావ్యా అగ్నిష్వాత్తా ఇతి త్రిధా ।
గృహస్థా యే తు యజ్వానో హవిర్యజ్ఞార్తవాశ్చ యే ।
స్మృతా బర్హిషదస్తే వై పురాణే నిశ్చయం గతాః ॥16॥

సౌమ్యులనువారు, కావ్యులు, బర్హిషదులు, అగ్నిష్వాత్తులు అను మూడు వర్గాలకు చెందినవారు. యజ్వలైన గృహస్థులు, హవిర్యజ్ఞార్తవులు, పురాణంలో బర్హిషదులు అని నిర్ణయింపబడినారు.

గృహమేధినశ్చ యజ్వానో అగ్నిష్వాత్తార్తవాః స్మృతాః ।
అష్టకాపతయః కావ్యాః పంచాబ్దాంస్తు నిబోధత ॥17॥

పంచాబ్దులు, గృహస్థయజ్వలు, అగ్నిష్వాత్తులు, ఆర్తవులు, అష్టకాపతులు, కావ్యులు అనబడుతున్నారు.

తేషు సంవత్సరో హ్యగ్నిః సూర్యస్తు పరివత్సరః ।
సోమస్త్విద్వత్సరశ్చైవ వాయుశ్చైవానువత్సరః ॥18॥

రుద్రస్తు వత్సరస్తేషాం పంచాబ్దా యే యుగాత్మకాః ।
కాలేనాధిష్ఠితస్తేషాం చంద్రమాః స్రవతే సుధామ్ ॥19॥

వారిలో సంవత్సరం అగ్ని, సూర్యుడు పరివత్సరం, సోముడు ఇద్వత్సరం, వాయువు అనువత్సరం, రుద్రుడు వత్సరం, – వీరు పంచాబ్దులు, యుగాత్మకులు, వీరిలో కాలాధిష్ఠితుడైన చంద్రుడు సుధను స్రవిస్తాడు.

ఏతే స్మృతా దేవకృత్యాః సోమపాశ్చోష్మపాశ్చ యే ।
తాంస్తేన తర్పయామాస యావదాసీత్పురూరవాః ॥20॥

వీరు దేవకృత్యులు, పురూరవుడున్నంత కాలం వరకూ సోమపులు, ఊష్మపులు – అనువారిని చంద్రుడు తృప్తి పరుస్తాడు.

యస్మాత్ప్రసూయతే సోమో మాసి మాసి విశేషతః ।
తతః సుధామృతం తద్వై పితౄణాం సోమపాయినామ్ ।
ఏతత్తదమృతం సోమః సుధా చ మధు చైవ హి ॥21॥

ప్రతినెలా విశేషంగా సోముడు ప్రసవించే సుధామృతం సోమపానము చేయు పితరులకు ముఖ్యం, ఈ అమృతం అమృతమనీ, సోమమనీ, మధువనీ వ్యవహరింపబడుతున్నది.

తతః పీతసుధం సోమం సూర్యోఽసావేకరశ్మినా ।
అప్యాయయతి స సుధం సోమం తు సోమపాయినమ్ ॥22॥

పితురులచే అలా త్రాగివేయబడిన అమృతం గల చంద్రుణ్ణి సూర్యుడు తన సుషుమ్నా కిరణంతో మరల పూరితుణ్ణి చేస్తాడు.

నిఃశేషా వై కలాః పూర్వా యుగపద్వ్యాపయన్పురా ।
సుషుమ్నాఽఽప్యాయమానస్య భాగం భాగమహఃక్రమాత్ ॥23॥

ఇలా సూర్యుని సుషుమ్నాకిరణం ద్వారా ప్రతి రోజూ చంద్రుడు నిశ్శేషమైన కళలను మరల పొంది పూర్ణుడవుతాడు.

కలాః క్షీయన్తి కృష్ణాస్తాః శుక్లా హ్యాప్యాయయన్తి చ ।
ఏవం సా సూర్యవీర్యేణ చంద్రస్యాప్యాయితా తనుః ॥24॥

కృష్ణపక్షమున కళలు క్షీణిస్తాయి. శుక్లపక్ష కళలు ఆప్యాయనం పొందుతాయి. ఇలా సూర్యుని వీర్యంచేత చంద్రుని శరీరం పోషింపబడుతున్నది.

పౌర్ణమాస్యాం స దృశ్యేత శుక్లః సంపూర్ణమణ్డలః ।
ఏవమాప్యాయితః సోమః శుక్లపక్షేఽప్యహః క్రమాత్।
దైవేః పీతసుధం సోమం పురా పశ్చాత్పిబేద్రవిః ॥25॥

పున్నమినాడు తెల్లని చంద్రుడు సంపూర్ణమండలుడై కనిపిస్తాడు. ఇలా శుక్లపక్షంలో అహఃక్రమంగా ఆప్యాయితుడైన చంద్రుడు ముందు దేవతలచే అమృతం త్రాగబడినవాడుకాగా అట్టి సోముని తరువాత రవి త్రాగుతాడు.

పీతం పంచదశాహం తు రశ్మినైకేన భాస్కరః ।
ఆప్యాయయత్సుషమ్నేన భాగం భాగమహఃక్రమాత్ ॥26॥

పదునైదు రోజులు త్రాగబడిన చంద్రుణ్ణి సూర్యుడు భాగభాగంగా రోజువారిగా తన సుషుమ్నతో తృప్తిపడినవానినిగా చేస్తాడు.

సుషుమ్నాప్యాయమానస్య శుక్లా వర్ధన్తి వై కలాః ।
తస్మాద్ధ్రసన్తి వై కృష్ణాః శుక్లా హ్యాప్యాయయన్తి చ ॥27॥

సుషుమ్నచే ఆప్యాయితుడైన చంద్రుని తెల్ల కళలు వృద్ధి పొందుతాయి. కృష్ణకళలు క్షీణించేవి కాగా శుక్లకళలు ఆప్యాయనం కల్గించేవి.

పౌర్ణమాస్యాం స దృశ్యేత శుక్లః సంపూర్ణమండలః ।
ఏవమాప్యాయ్యతే సోమః క్షీయతే చ పునః పునః ।
సమృద్ధిరేవం సోమస్య పక్షయోః శుక్లకృష్ణయోః ॥28॥

పూర్ణిమనాడు చంద్రుడు షోడశకళలు గల్గి సంపూర్ణమండలుడై ఉంటాడు. ఇలా చంద్రుడు వృద్ధి క్షయాలకు మాటి మాటికీ లోనవుతాడు. శుక్లకృష్ణ పక్షాలలో సోముని సమృద్ధి ఇలా సంభవిస్తుంది.(దేవతలకు అమృతమునిచ్చి వారిని పోషించడం కూడా చంద్రుడి వృద్ధియే అని భావించాలి)

ఇత్యేష పితృమాన్సోమః స్మృతస్తద్వత్సుధాత్మకః ।
కాన్తః పంచదశైః సార్ధం సుధామృతపరిస్రవైః ॥29॥

ఇలా సోముడు పితృమంతుడుగా, (పితరులకు పోషకుడుగా) సుధాత్మకుడుగా, పదునైదు సుధామృత పరిగ్రహాలతో పంచదశతిథులలో సుందరుడవుతున్నాడు.

అతః పరం ప్రవక్ష్యామి పర్వణాం సన్ధయశ్చ యే ।
యథా గ్రథ్నన్తి పర్వాణి ఆవృతానీక్షువేణువత్ ॥30॥

తథాబ్దమాసాః పక్షాశ్చ శుక్లాః కృష్ణాస్తు వై స్మృతః ।
పౌర్ణమాస్యాస్తు యో భేదో గ్రన్థయః సన్ధయస్తథా ॥31॥

అర్ధమాసస్య పర్వాణి ద్వితీయాప్రభృతీని చ ।
అగ్న్యాధానక్రియా యస్మాన్నీయన్తే పర్వసన్ధిషు ॥32॥

ఇక పర్వము యొక్క సంధులను గురించి చెబుతాను. పర్వాలు చెఱకు గడలకు వలె, వెదురుగడలకు వలె ఎలా గ్రథింపబడినవో అట్లే సంవత్సరానికి మాసాలు, శుక్ల కృష్ణపక్షాలు గ్రంథింపబడినవి. పూర్ణిమ యొక్క భేదం, గ్రంథులు, సంధులుగా ఉంటున్నవి. అర్ధమాసముయొక్క ద్వితీయ మొదలుగా గల పర్వాలు, పర్వసంధులలో అగ్న్యాధానక్రియలు నడుపబడుతున్నవి.

తస్మాత్తు పర్వణో హ్యాదౌ ప్రతిపద్యాదిసన్ధిషు ।
సాయాహ్నే హ్యనుమత్యా యద్వ్యో లవౌ కాల ఉచ్యతే ।
లవౌ ద్వావేవ కాలో యః కాలో జ్ఞేయోఽపరాహ్ణికః ॥33॥

పూర్ణిమనాటి సాయాహ్నకాలంలోని రెండులవాల కాలం అనుమతి అనబడుతుంది. అపర్ణాహ్ణికమైన కాలం రాక అనబడుతుంది. అంచేత పర్వము యొక్క ప్రతిపత్తు మొదలగు సంధులలో, సాయాహ్నంలో, అనుమతికి రెండు లవాలు కాలమనబడుతుంది. రెండు లవాలే అపరాహ్ణికకాలంగా పేర్కొనబడింది.

ప్రకృతిః కృష్ణపక్షస్య కాలేఽతీతేఽపరాహ్ణికే ।
సాయాహ్నే ప్రతిపద్యేష స కాలః పౌర్ణమాసికః ॥34॥

కృష్ణపక్షంలోని అపరాహ్ణికకాలం అతీతం కాగా వచ్చే సాయాహ్నం పౌర్ణమాసేష్టికి ప్రారంభకాలంగా తగిన సమయమవుతుంది.

వ్యతీపాతే స్థితే సూర్యే లేఖాదూర్ధ్వం యుగాన్తరమ్ ।
యుగాన్తరోదితే చైవ చంద్రే లేఖోపరి స్థితే ॥35॥

సూర్యుడు వ్యతీపాతంలో ఉన్నప్పుడు చంద్రుడు యుగాన్తరంలో ఉదితుడై లేఖపైన ఉంటే అది యుగాన్తరమవుతుంది.

పూర్ణమాసవ్యతీపాతౌ యదా పశ్యేత్ పరస్పరమ్ ।
తౌ తు వై ప్రతిపద్యావత్తస్మిన్ కాలే వ్యవస్థితౌ ॥36॥

పూర్ణమాస వ్యతీపాతాలు పరస్పరం చూచుకొన్నప్పుడు అవి ప్రతిపత్తు వరకు ఆ కాలంలో ఉంటాయి.

తత్కాలం సూర్యముద్దిశ్య దృష్ట్వా సంఖ్యాతుమర్హసి ।
స చైవ సత్క్రియాకాలః షష్ఠః కాలోऽభిధీయతే ॥37॥

ఆ కాలాన్ని సూర్యునుద్దేశించి చూచి చెప్పగలవు. అదే సత్క్రియాకాలం, శ్రౌతస్మార్తసత్కర్మలు నిర్వహించడానికి తగిన కాలం. ఇదే షష్ఠకాలం.

పూర్ణేందుః పూర్ణపక్షే తు రాత్రిసంధిషు పూర్ణిమా ।
తస్మాదాప్యాయతే నక్తం పౌర్ణమాస్యాం నిశాకరః ॥38॥

పూర్ణిమనాటి అర్ధరాత్రికాలంలో చంద్రుడు నిండుగా అమృతం కల్గి వుంటాడు. అందుకే అది పూర్ణిమ అనబడింది. సూర్యుని సుషుమ్నా కిరణలతో చంద్రుడు అమృతంతో పూరింపబడతాడు. చంద్రు డపుడు ప్రాణులకు తృప్తి కల్గిస్తాడు.

యదాన్యోన్యం వ్యతీపాతే పూర్ణిమాం ప్రేక్షతే దివా ।
చంద్రాదిత్యోऽపరాహ్ణే తు పూర్ణత్వాత్పూర్ణిమా స్మృతా ॥39॥

యస్మాత్తామనుమన్యన్తే పితరో దైవతైః సహ ।
తస్మాదనుమతిర్నామ పూర్ణత్వాత్పూర్ణిమా స్మృతా ॥40॥

ఆ దినం సూర్యచంద్రులు పగలు అపరాహ్ణకాలమున పరస్పరం నిండు చూపులతో చూచు కొంటారు. అందుచే ఆ తిథి పూర్ణిమ అయినది. పితరులు దేవతలతో గూడి దాని ననుమతిస్తారు కాబట్టి దానిని అనుమతి పూర్ణిమ అంటారు. పూర్ణం కావడం వల్ల ఇది పూర్ణిమ.

అత్యర్థం రాజతే యస్మాత్పౌర్ణమాస్యాం నిశాకరః ।
రంజనాచ్చైవ చంద్రస్య రాకేతి కవయో విదుః ॥41॥

పూర్ణిమనాడు చంద్రుడు మిక్కిలిగా ప్రకాశిస్తాడు గాన, ప్రాణులను రంజిల్ల చేయడం వల్ల ఆ పూర్ణిమకు 'రాక' అని వ్యవహారం కల్గింది.

అమావసేతామృక్షే తు యదా చంద్రదివాకరౌ ।
ఏకా పంచదశీ రాత్రిరమావాస్యా తతః స్మృతా ॥42॥

సూర్యచంద్రులు ఒకటిగా కలిసివుండే తిథికి "అమావాస్య" అని పేరు. పంచదశినాటి రాత్రి అమావాస్య అవుతుంది.

ఉద్దిశ్య తామమావాస్యాం యదా దర్శం సమాగతౌ ।
అన్యోన్యం చంద్రసూర్యౌ తు దర్శనాద్దర్శ ఉచ్యతే ॥43॥

ఆ అమావాస్య నుద్దేశించి సూర్యచంద్రులు ఒకరినొకరు చూచుకొంటారు, ఒకేచోట కూడి దర్శనమిస్తారు గాన దానిని "దర్శః" అని అంటారు.

ద్వౌ ద్వౌ లవావమావాస్యాం స కాలః పర్వసన్ధిషు ।
ద్వ్యక్షరః కుహుమాత్రశ్చ పర్వకాలస్తు స స్మృతః ॥44॥

పూర్ణిమా కృష్ణ పతిపత్తుల నడుమకానీ, అమావాస్యా శుక్ల ప్రతిపత్తుల మధ్యకానీ ఉండే సంధికాలం రెండు రెండు లవాల పరిమాణం కలిగివుంటుంది. ఇది రెండక్షరాలుగల 'కుహూ' మాత్ర కాలంగా వుంటుంది. కాన దాన్ని పర్వకాలమంటారు.

దృష్టచంద్రా త్వమావాస్యా మధ్యాహ్నప్రభృతీహ వై ।
దివా తదూర్ధ్వం రాత్ర్యాం తు సూర్యే ప్రాప్తే తు చంద్రమాః ।
సూర్యేణ సహసోద్గచ్ఛేత్తతః ప్రాతస్తనాత్తు వై ॥45॥

సమాగమ్య లవౌ ద్వౌ తు మధ్యాహ్నేన్నిపతద్రవిః ।
ప్రతిపచ్ఛుక్లపక్షస్య చంద్రమాః సూర్యమణ్డలాత్ ॥46॥

నిర్ముచ్యమానయోర్మధ్యే తయోర్మణ్డలయోస్తు వై ।
స తదాన్వాహుతేః కాలో దర్శస్య చ వషట్క్రియాః।
ఏతదృతుముఖం జ్ఞేయమమావాస్యాం తు పార్వణమ్ ॥47॥

దివా పర్వ త్వమావాస్యాం క్షీణేన్దౌ ధవలే తు వై ।
తస్మాద్దివా త్వమావాస్యాం గృహ్యతే యో దివాకరః ॥48॥

కుహేతి కోకిలేనోక్తం యస్మాత్కాలాత్సమాప్యతే ।
తత్కాలసంజ్ఞితా హ్యేషా అమావాస్యా కుహూః స్మృతా ॥49॥

సినీవాలీప్రమాణం తు క్షీణశేషో నిశాకరః ।
అమావాస్యా విశత్యర్కం సినీవాలీ తదా స్మృతా ॥50॥

ఏనాడు మధ్యాహ్నకాలం అమావాస్య ప్రారంభమవుతుందో, ఆ దినం చంద్రోదయవేళకే అతనితో కూడి సూర్యుదను ఉదయిస్తాడు. అప్పుడు చంద్రకళ కనిపించదు. ఆ మరునాడు మధ్యాహ్నంమీదట చంద్రుడు రవినుండి

వేఅగును. అట్టి పర్వసంధికాలం అన్వాహుతులను (శౌతకర్మలకూ, వషట్కార కర్మలకూ తగిన సమయం. ఇట్టి అమావాస్యనాటి పర్వానికి ఋతుముఖమని పేరు. ఇట్టి ఆ దినం చంద్రుడు కళావిహీనుడైపోయే అమావాస్య శుక్లపక్షారంభమగు మధ్యాహ్నంవరకు ఉండును. ఆ సమయంలో రవి అమావాస్యకు చెందినరవిగా గ్రహింపబడతాడు. ఇది శ్రౌతకర్మకు తగినకాలం. ఏ కాలంలో కోకిల 'కుహూ' కారం సమాప్తమవుతుందో, ఆ కాలం పేరు దీనికి వచ్చి అమావాస్య 'కుహూః' అనబడింది. సినీవాలీ ప్రమాణమేమనగా – క్షీణశేషుడైన చంద్రుడు అమావాస్యనాటి సూర్యుణ్ణి ప్రవేశిస్తే అదే 'సినీవాలి'.

అనుమతిశ్చ రాకా చ సినీవాలీ కుహూస్తథా ।
ఏతాసాం ద్విలవః కాలః కుహూమాత్రా కుహూః స్మృతా ॥51॥

అనుమతి, రాక, సినీవాలి, కుహూ వీటి ద్విలవకాలం కుహూమాత్రం కాన 'కుహూ' అనబడింది.

ఇత్యేషపర్వసన్ధీనాం కాలో వై ద్విలవః స్మృతః ।
పర్వణాం తుల్యకాలస్తు తుల్యాహుతివషట్క్రియా ॥52॥

ఇలా పర్వసంధులకాలం 'ద్విలవం' అయింది. పర్వకాలాల పరిమితి వలెనే వాటి ననుసరించి చేయదగిన ఆహుతి, వషట్కారపూర్వకశ్రౌతకర్మల కాలపరిమితి గూడా సమానమై వుంటుంది.

చంద్రసూర్యవ్యతీపాతే సమే వై పూర్ణిమే ఉభే ।
ప్రతిపత్ప్రతిపన్నస్తు పర్వకాలో ద్విమాత్రకః ॥53॥

చంద్రసూర్యుల వ్యతీపాతాలవల్ల రాక, అనుమతి అనే రెండు పూర్ణిమలు సంభవిస్తున్నాయి. ప్రతిపత్తుకు చెందిన పర్వకాలం కూడా ద్విమాత్రలు కలదే.

కాలః కుహూసినీవాల్యో సమృద్ధే ద్విలవః స్మృతః ।
అర్కాగ్నినిర్మణ్డలే సోమే పర్వకాలకలాః స్మృతాః ॥54॥

కుహూ– సినీవాలుల సమృద్ధకాలం ద్విలవ మవుతుంది. చంద్రసూర్యాదుల తేజఃకళలవల్లనే పర్వసమయాలు సంభవిస్తాయి. కావున సూర్యాగ్ని తేజః కళాసంబంధం కల చంద్రుని కళలునూ, పర్వకాలానుగుణంగా సూర్యాగ్నుల సంబంధానుసారంగా వుంటాయి.

యస్మాదాపూర్యతే సోమః పంచదశ్యాం తు పూర్ణిమా ।
దశభిః పంచభిశ్చైవ కలాభిర్దివసక్రమాత్ ॥55॥

పంచదశినాడు సోముడు పూరింపబడతాడు కాన అది పూర్ణిమ. పదునైదుకళలచే దినక్రమంగా చంద్రుడు వృద్ధిక్షయాలకు లోనవుతున్నాడు.

తస్మాత్పంచదశే సోమే కలా వై నాస్తి షోడశీ ।
తస్మాత్సోమస్య విప్రోక్తః పంచదశ్యాం మయా క్షయః ॥56॥

అందువల్ల సోముని పదునైదు కళలు కనిపిస్తాయి కాని పదునారవ కళలేదు. అందువల్ల సోమునికి పంచదశినాడు క్షయమని చెప్పాను.

ఇత్యేతే పితరో దేవాః సోమపాః సోమవర్ధనాః ।
ఆర్తవా ఋతవోఽ_థాబ్దా దేవాస్తాన్ భావయన్తి హి ॥57॥

సోమపులు, సోమవర్ధనులు, అనే పితృదేవతలవిషయమిట్టిది. వీరికి ఆర్తవులు, ఋతువులు, అనే వ్యవహారంకలదు. దేవతలు వారిని కర్మానుష్ఠానంలో భావనచేస్తూ వుంటారు.

అతః పరం ప్రవక్ష్యామి పితౄన్ శ్రాద్ధభుజస్తు యే ।
తేషాం గతిం చ సత్తత్వం ప్రాప్తిం శ్రాద్ధస్య చైవ హి ॥58॥

ఇకపై శ్రాద్ధభోక్తలైన పితరులను గురించి చెబుతాను. వారి గతినీ, సత్తత్వాన్నీ, శ్రాద్ధముయొక్క ప్రాప్తినీ వివరిస్తాను.

న మృతానాం గతిః శక్యా జ్ఞాతుం వా పునరాగతిః ।
తపసా హి ప్రసిద్ధేన కిం పునర్మాంసచక్షుషా? ॥59॥

మరణించిన వారి రాకపోకలు గొప్ప తపస్సు చేత గూడా తెలుసుకొన వీలు గానివి. ఇక మాంసనేత్రంతో అది తెలుసుకొన సాధ్యమా?

అత్ర దేవాన్ ప్రితౄంశ్చైవ పితరో లౌకికాః స్మృతాః ।
తేషాం తే ధర్మసామర్థ్యాత్స్మృతాః సాయుజ్యగా ద్విజైః ॥60॥

లౌకిక పితరులు, ద్యులోకంలో ఉండే యజమానుని పితరుల నాశ్రయించి సద్గతికి పోతారు. వారు వారి ధర్మసామర్థ్యం వల్ల దేవసాయుజ్యం పొందుతారని ద్విజులు పేర్కొన్నారు.

యది చాశ్రమధర్మేణ ప్రజ్ఞానేషు వ్యవస్థితాః ।
అన్యే చాత్ర ప్రసీదన్తి శ్రద్ధాయుక్తేషు కర్మసు ॥61॥

లేదా ఆశ్రమధర్మానుసారంగా ప్రజ్ఞానంతో ఉన్నప్పుడు ఇతరులు గూడా శ్రద్ధతో గూడిన కర్మలతో ప్రసన్నులవుతారు.

బ్రహ్మచర్యేణ తపసా యజ్ఞేన ప్రజయా భువి ।
శ్రాద్ధేన విద్యయా చైవ చాన్నదానేన సప్తధా ॥62॥
కర్మస్వేతేషు యే సక్తా వర్తన్త్యాదేహపాతనాత్ ।
దేవైస్తే పితృభిః సార్ధమూష్మపైః సోమపైస్తథా ।
స్వర్గతా దివి మోదన్తే పితృమన్త ఉపాసతే ॥63॥

బ్రహ్మచర్యం, తపస్సు, యజ్ఞం, సంతానం, శ్రాద్ధం, విద్య, అన్నదానం అనే ఏడురకాల ఆశ్రమ ధర్మాలున్నాయి. ఇవి లౌకిక పితరులకు సద్గతి కల్గిస్తాయి. దేహపతనపర్యంతం ఈ కర్మలలో ఆసక్తులైతే వారు దేవతలు, పితరులు, ఊష్మపులు, సోమపులు అనువారితో గూడి స్వర్గం చేరి సంతోషిస్తారు. పితరులయందు శ్రద్ధాభక్తులు గల్గి వారి నుపాసిస్తారు.

ప్రజావతాం ప్రసిద్ధిషా ఉక్తా శ్రాద్ధకృతాం చ వై ।
తేషాం నివాపే దత్తం హి తత్కులీనైస్తు బాన్ధవైః ॥64॥

మాసశ్రాద్ధం హి భుంజానాస్తేఽ ప్యేతే సోమలౌకికాః ।
ఏతే మనుష్యాః పితరో మాసశ్రాద్ధభుజస్తు వై ॥65॥

సంతానవంతులకు, శ్రాద్ధకర్తలకు ఈ విషయం ప్రసిద్ధం. తత్కులబంధువులచేత వారికి నివాపంగా ప్రదత్తమైన మాసశ్రాద్ధం భుజిస్తూ వారు సోమలోకగతులై వుంటారు. వీరు మాస శ్రాద్ధభోజనులైన మనుష్య పితరులు.

తేభ్యోఽ పరే తు యే త్వన్యే సంకీర్ణాః కర్మయోనిషు ।
భ్రష్టాశ్చాశ్రమధర్మేషు స్వధాస్వాహా వివర్జితాః ॥66॥

భిన్నే దేహే దురాపన్నాః ప్రేతభూతా యమక్షయే ।
స్వకర్మాణ్యనుశోచన్తో యాతనాస్థానమాగతాః ॥67॥

దీర్ఘాశ్చైవాతిశుష్కాశ్చ శ్మశ్రులాశ్చ వివాససః ।
క్షుత్పిపాసాభిభూతాస్తే విద్రవన్తి త్వితస్తతః ॥68॥

సంకీర్ణకర్మలు చేసే తదితరులు ఆశ్రమధర్మభ్రష్టులై, స్వధాస్వాహాహీనులై దేవపితృకర్మలు చేయనివారు. వారు దేహం పోగానే దురాపన్నులై, ప్రేతభూతులై, యమసదనంలో తమ పూర్వకర్మలను గూర్చి శోకిస్తూ యాతనాస్థానం పొందినవారై దీర్ఘశరీరులు మిక్కిలి శుష్కించిన వారు, గడ్డాలు మీసాలు గలవారై, వస్త్రహీనులు, ఆకలి దప్పులుగలవారునై ఇటూ అటూ పరుగులు దీస్తారు.

సరిత్సరస్తడాగాని పుష్కరిణ్యశ్చ సర్వశః ।
పరాన్నాన్యభికాంక్షన్తః కాల్యమానా ఇతస్తతః ॥69॥

దప్పికతో నదులనూ, మడుగులనూ, చెరువులనూ, పుష్కరిణులనూ అంతటా అన్వేషిస్తూ పరాన్నం కోరి ఇటూ అటూ ప్రేరితులై తిరుగుతుంటారు.

స్థానేషు పాత్యమానా యే యాతనాస్థేషు తేషు వై ।
శాల్మల్యాం వైతరణ్యాం చ కుంభీపాకేఽ ధ్దవాలుకే ॥70॥

అసిపత్రవనే చైవ పాత్యమానాః స్వకర్మభిః ।
తత్ర స్థానం తు తేషాం వై దుఃఖితానామశాయినామ్ ॥71॥

తేషాం లోకాన్తరస్థానాం బాన్ధవైర్నామగోత్రతః ।
భూమావాస్తృతదర్భేషు దత్తాః పిన్డాస్త్రయస్తు వై ॥

ప్రాప్తాస్తు తర్పయన్త్యేవ ప్రేత్యస్థానేష్వధిష్ఠితాన్ ॥72॥
అప్రాప్తా యాతనాస్థానం ప్రభ్రష్టా యే చ పంచధా ।

పశ్చాద్యే స్థావరాన్తే వై భూతానీకే స్వకర్మభిః ॥73॥
నానారూపాసు జాతీనాం తిర్యగ్యోనిషు మూర్తిషు ।

యదాహారా భవన్త్యేతే తాసు తాస్విహ యోనిషు ॥74॥
తస్మింస్తస్మింస్తదాహారే శ్రాద్ధం దత్తం తు ప్రీణయేత్ ।

అలా యాతనాస్థానంలో పడవేయబడినవారు. తమ కర్మలచే శాల్మలిలో, వైతరణీనదిలో, కుంభీపాకంలో కారంభవాలుకలో, అసిపత్రవనంలో పడవేయబడినవారై, దుఃఖితులై, విశ్రాంతి లేక బాధపడతారు. లోకాంతరాలలో ఉన్నవారికి బంధువులచే, నామగోత్రాలతో భూమిపై దర్భలు పరచి మూడు పిండాలుంచగా, అవి పితృ స్థానాధిష్ఠితులకు తృప్తి కల్గిస్తాయి. యాతనాస్థానం పొందనివారు ప్రభ్రష్టులు – దేవాసురమానవ తిర్యక్‌స్థావరములనే ఐదు విధాలలో దేనియందున్నా పిదప స్థావరాంతంలో భూతానీకంలో తమకర్మలచే, జాతుల యొక్క నానారూపాలైన తిర్యగ్యోనులలో మూర్తులలో, ఉన్నావారు ఎలాంటి ఆహారం తీసుకొంటారో, దానికి తగిన యోనులలో ఆ యా ఆహారంతో శ్రాద్ధమిస్తే తృప్తి చెందుతారు.

కాలే న్యాయాగతం పాత్రే విధినా ప్రతిపాదితమ్ ।
ప్రాప్నువన్త్యన్నమాదత్తం యత్ర యత్రావతిష్ఠతి ॥75॥

ప్రేతప్రాణి తన జీవితకాలంలో న్యాయగతంగా, సత్పాత్రమునందు శాస్త్ర విధిప్రకారం అలా ఇచ్చిన అన్నం పొంది ఇచ్చిన దానఫలంకూడా దేవతలచే గ్రహింపబడి ఆ ప్రేతప్రాణి ఏ జన్మలో ఉన్నా–అందజేయ బడుతుంది.

యథా గోషు ప్రణష్టాసు వత్సో విన్దతి మాతరమ్ ।
తథా శ్రాద్ధేషు దృష్టాన్తో మంత్రః ప్రాపయతే తు తమ్ ॥76॥

తప్పిపోయిన గోవులలో దూడ తన తల్లిని పొందినట్లే శ్రాద్ధాలలో దృష్టార్థమైన మంత్రం ఆ ఫలాన్ని ఆ వ్యక్తికే అందజేస్తుంది.

ఏవం హ్యవికలం శ్రాద్ధం శ్రద్ధాదత్తం మనుర్బ్రవీత్ ।
సనత్కుమారః ప్రోవాచ పశ్యన్దివ్యేన చక్షుషా ॥77॥

గతాగతజ్ఞః ప్రేతానాం ప్రాప్తిం శ్రాద్ధస్య చైవ హి ।
కృష్ణపక్షస్త్వహస్తేషాం శుక్లః స్వప్నాయ శర్వరీ ॥78॥

ఇలా వైకల్యం లేకుండా; శ్రాద్ధం శ్రద్ధతో ఇవ్వాలని మనువు చెప్పాడు. దివ్యనేత్రంతో చూచి సనత్కుమారుడు గూడా ఇదే చెప్పాడు. ప్రేతాల గమనాగమనాలనూ, శ్రాద్ధప్రాప్తినీ ఎఱిగినవాడాయన. పితృలోకగతులైన పితరులకు – కృష్ణ పక్షం పగలుగా, శుక్లపక్షం రాత్రిగా అవుతుంది.

ఇత్యేతే పితరో దేవా దేవాశ్చ పితరశ్చ వై ।
అన్యోన్యపితరో హ్యేతే దేవాశ్చ పితరో దివి ॥79॥

ఇలా పితృదేవతలు, దేవతలు, పితరులు, అన్యోన్య పితరులు, – వీరు దేవలోకంలోని పితరులు అగు విషయం చెప్పబడింది.

ఏతే తు పితరో దేవా మనుష్యాః పితరశ్చ యే ।
పితా పితామహశ్చైవ తథైవ ప్రపితామహః ॥80॥

ఇత్యేష విషయః ప్రోక్తః పితౄణాం సోమపాయినామ్ ।
ఏతత్పితృమహత్త్వం హి పురాణే నిశ్చయం గతమ్ ॥81॥

వీరు పితృదేవతలు. మనుష్య పితరులు తండ్రి, తాత, అట్లే ముత్తాత అనేవారియొక్కయు, మరియు సోమపాయులైన పితరుల విషయమూ చెప్పబడింది. ఈ పితృమహత్త్వం పురాణాలలో నిశ్చితమైనది.

ఇత్యేష సోమసూర్యాభ్యామైలస్య చ సమాగమః ।
అవాప్తిః శ్రద్ధయా చైవ పితౄణాం చైవ తర్పణమ్ ॥82॥

పర్వణాం చైవ యః కాలో యాతనాస్థానమేవ చ ।
సమాసాత్కీర్తితస్తుభ్యం సర్గ ఏష సనాతనః ॥83॥

ఇలా సోమసూర్యులతో ఐలుని కలయిక, శ్రాద్ధావాప్తి, పితృతర్పణం–'పర్వకాలం, యాతనాస్థానం, ఇదంతా మీకొరకై చెప్పడమైనది. ఇది సనాతన వ్యవస్థావిధానం.

వైదుష్యాయ న తత్సర్వం కథితం త్వేకదేశికమ్ ।
అశక్యం పరిసంఖ్యాతుం శ్రద్ధేయం భూతిమిచ్ఛతా ॥84॥

ఇదంతా పాండిత్యం కల్గునంత విస్తృతంగా కాక ఏకదేశాత్మకంగా, చెప్పడమయింది. పూర్తిగా చెప్పడం వీలుకాదు. క్షేమం కోరేవాడు దీన్ని శ్రద్ధతో అనుష్ఠించాలి.

స్వాయంభువస్య దేవస్య ఏష సర్గో మయేరితః ।
విస్తరేణానుపూర్వ్యాచ్చ భూయః కిం కథయామి వః॥85॥

స్వాయంభువదేవుని ఈ సర్గం నేను విస్తరంగానూ, క్రమంగానూ మీకు చెప్పాను. ఇంకా మీకు ఏమి చెప్పాలి?

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే పురూరవస్సూర్యచంద్ర సమాగమః నామైకచత్వారింశదధికశతతమోఽధ్యాయః ॥141॥
శ్రీమత్స్య పురాణంలో పురూరవ సూర్యచంద్రుల సమాగమమనే నూటనలబై ఒకటవ అధ్యాయం సంపూర్ణం

ద్విచత్వారింశదధికశతతమోఽధ్యాయః - నూటనలబై రెండవ అధ్యాయం

యుగవర్ణనమ్ - యుగవర్ణన

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

చతుర్యుగాని యాని స్యుః పూర్వే స్వాయంభువేఽన్తరే ।
ఏషాం నిసర్గం సంఖ్యాం చ శ్రోతుమిచ్ఛామ విస్తరాత్ ॥1॥

సూతా! పూర్వం స్వాయంభువమన్వంతరంలో ఏ చతుర్యుగాలు వ్యవస్థీకరించబడినవో, వాటి స్వరూపాన్నీ, సంఖ్యాపరిమాణాన్నీ విస్తరంగా వినగోరుతున్నాము.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

పృథివీద్యుప్రసంగేన న మయా ప్రాగుదాహృతమ్ ।
ఏతచ్చతుర్యుగం త్వేవం తద్వక్ష్యామి నిబోధత ।
తత్ప్రమాణం ప్రసంఖ్యాయ విస్తరాచ్చైవ కృత్స్నశః ॥2॥

భూమి ద్యులోకప్రసంగం వచ్చినప్పుడు నేను మీకు ముందు ఈ చతుర్యుగవిషయాన్ని చెప్పలేదు. ఇప్పుడది చెబుతాను తెలుసుకోండి. వాటి ప్రమాణం చెప్పి విస్తరంగా, సమగ్రంగా వివరిస్తాను.

లౌకికేన ప్రమాణేన నిష్పాద్యాబ్దం తు మానుషమ్ ।
తేనాపీహ ప్రసంఖ్యాయ వక్ష్యామి తు చతుర్యుగమ్ ॥3॥

లౌకిక ప్రమాణంతో మానుషాబ్దాన్ని వివరించి దానితో గూడా లెక్కించి మీకు చతుర్యుగాలనూ విశదీకరిస్తాను.

కాష్ఠా నిమేషా దశ పంచ చైవ త్రింశచ్చ కాష్ఠా గణయేత్కలాం తు ।
త్రింశత్కలాశ్చైవ భవేన్ముహూర్తస్తైస్త్రింశతా రాత్ర్యహనీ సమేతే ॥4॥

పదునైదు నిమేషాలు ఒక కాష్ఠ, ముప్పది కాష్ఠలు ఒక కళ, ముప్పది కళలు ఒక ముహూర్తం, ముప్పది ముహూర్తాలు ఒక్క రాత్రింబవళ్ళు.

అహోరాత్రై ర్విభజతే సూర్యో మానుషలౌకికః ।
రాత్రిః స్వప్నాయ భూతానాం చేష్టాయై కర్మణామహః ॥5॥

మానుషలౌకికకాలాన్ని రాత్రింబవళ్ళుగా సూర్యుడు విభజిస్తున్నాడు. ప్రాణుల నిద్రకు రాత్రి, కర్మ చేష్టలకు పగలు ఉద్దేశింపబడ్డాయి.

పిత్ర్యే రాత్ర్యహనీ మాసః ప్రవిభాగస్తయోః పునః ।
కృష్ణపక్షస్త్వహస్తేషాం శుక్లః స్వప్నాయ శర్వరీ ॥6॥

పితరులకు ఒక మాసం ఒక రాత్రింబవళ్ళు, అందులో పై విభాగం ఎలా అంటే, కృష్ణపక్షం పగలు, శుక్లపక్షం స్వప్నానికి తగిన రాత్రి.

త్రింశద్యే మానుషా మాసాః పైత్రో మాసః స ఉచ్యతే ।
శతాని త్రీణి మాసానాం షష్ట్యా చాభ్యధికాని తు ।
పైత్రః సంవత్సరో హ్యేష మానుషేణ విభావ్యతే ॥7॥

మానుష మాసాలు ముప్పది అయితే ఒక పైత్రమాస మవుతుంది. మూడువందలా అరవై మానవ మాసాలు ఒక పైత్రసంవత్సరం, ఇది మానుషగణనలో లెక్కింపబడింది.

మానుషేణైవ మానేన వర్షాణాం యచ్ఛతం భవేత్ ।
పితౄణాం తాని వర్షాణి సంఖ్యాతాని తు త్రీణి వై ।
దశ చ ద్వ్యధికా మాసాః పితృసంఖ్యేహ కీర్తితా ॥8॥

లౌకికేన ప్రమాణేన అబ్దో యో మానుషః స్మృతః ।
ఏతద్దివ్యమహోరాత్రమిత్యేషా వైదికీ శ్రుతిః ॥9॥

మానుషమానంలో నూరు సంవత్సరాలైతే పితరులకు ఆ సంవత్సరాలు మూడవుతాయి. పంద్రెండు మాసాలు పితృసంఖ్యగా ఇక్కడ పేర్కొనబడింది. లౌకిక ప్రమాణంలో ఏది మానుషాబ్దమో అది దివ్యమైన అహోరాత్రమని వైదిక శ్రుతి.

దివ్యే రాత్ర్యహనీ వర్షం ప్రవిభాగస్తయోః పునః ।
అహస్తు యదుదక్చైవ రాత్రిర్యా దక్షిణాయనమ్ ।
ఏతే రాత్ర్యహనీ దివ్యే ప్రసంఖ్యాతే తయోః పునః ॥10॥

దివ్యమైన రాత్రింబవళ్ళు ఒక సంవత్సరం. మళ్ళీ వాటి ప్రవిభాగం - పగలు ఉత్తరాయణం, రాత్రి దక్షిణాయనం. ఇవి దివ్యమైన రాత్రింబవళ్ళుగా పేర్కొనబడ్డాయి.

త్రింశద్యాని తు వర్షాణి దివ్యో మాసస్తు స స్మృతః ।
మానుషాణాం శతం యచ్చ దివ్యా మాసాస్త్రయస్తు వై ।
తథైవ సహ సంఖ్యాతో దివ్య ఏష విధిః స్మృతః ॥11॥

ముప్పది సంవత్సరాలు దివ్యమైన ఒకమాసం. మానవుల నూరు మాసాలు దివ్యమైన మూడు మాసాలవుతాయి. ఇలా లెక్కిస్తే ఇది దివ్యవిధి అని చెప్పబడింది.

త్రీణి వర్షశతాన్యేవం షష్టిర్వర్షాస్తథైవ చ ।
దివ్యః సంవత్సరో హ్యేష మానుషేణ ప్రకీర్తితః ॥12॥

మూడువందలా అరువది సంవత్సరాలు ఒక దివ్య సంవత్సరమని మానుషంలో ప్రకీర్తితమయింది.

త్రీణి వర్షసహస్రాణి మానుషేణ ప్రమాణతః ।
త్రింశదన్యాని వర్షాణి స్మృతః సప్తర్షివత్సరః ॥13॥

మూడు వేల ముప్పది మానుష సంవత్సరాలు ఒక సప్తర్షి సంవత్సరమవుతుంది.

నవ యాని సహస్రాణి వర్షాణాం మానుషాణి చ ।
వర్షాణి నవతిశ్చైవ ధ్రువసంవత్సరః స్మృతః ॥14॥

తొమ్మిదివేల తొంబది మానుషసంవత్సరాలు ఒక ధ్రువసంవత్సరమని చెప్పడమయింది.

షట్త్రింశత్తు సహస్రాణి వర్షాణాం మానుషాణి చ ।
షష్టిశ్చైవ సహస్రాణి సంఖ్యాతాని తు సంఖ్యయా ।
దివ్యం వర్షసహస్రం తు ప్రాహుః సంఖ్యావిదో జనాః ॥15॥

ముప్పది యారువేల అరువది వత్సరాలు దివ్యవర్షసహస్రమని సంఖ్యావేత్తలు చెబుతారు.

ఇత్యేతదృషిభిర్గీతం దివ్యయా సంఖ్యయా ద్విజాః! ।
దివ్యేనైవ ప్రమాణేన యుగసంఖ్యా ప్రకల్పితా ॥16॥

ద్విజులారా! ఇది ఋషులు దివ్యసంఖ్యతో చెప్పిన విషయం. దివ్యప్రమాణంతోనే యుగసంఖ్య కల్పితమయింది.

చత్వారి భారతే వర్షే యుగాని ఋషయోఽబ్రువన్ ।
కృతం త్రేతా ద్వాపరం చ కలిశ్చైవం చతుర్యుగమ్ ॥17॥

భారతవర్షంలో నాలుగు యుగాలను ఋషులు చెప్పారు. కృతం, త్రేత, ద్వాపరం, కలి – అనేవి నాలుగు యుగాలు.

పూర్వం కృతయుగం నామ తతస్త్రేతాఽభిధీయతే ।
ద్వాపరం చ కలిశ్చైవ యుగాని పరికల్పయేత్ ॥18॥

మొదటిది కృతయుగం, తరువాతిది త్రేతాయుగం, ద్వాపరం, కలి తృతీయచతుర్థయుగాలు – అని కల్పించాలి.

చత్వార్యాహుః సహస్రాణి వర్షాణాం తత్కృతం యుగమ్ ।
తస్య తావచ్ఛతీ సన్ధ్యా సన్ధ్యాంశశ్చ తథావిధః ॥19॥

నాలుగు వేల దివ్య సంవత్సరాలు ఒక కృతయుగం, అన్ని వందల దివ్యవర్షాలు కృతత్రేతా సంధికాలం. అవే నాలుగువందల దివ్యవర్షాలు సంధ్యాంశకాలం.

ఇతరేషు ససన్ధ్యేషు ససన్ధ్యాంశేషు చ త్రిషు ।
ఏకపాదే నివర్తన్తే సహస్రాణి శతాని చ ॥20॥

ఇతర యుగాల సంధ్యలు, సంధ్యాంశాలలో ఒక పాదం తగ్గుతుంది. (వేలల్లోనూ, వందల్లోనూగూడా)?

త్రేతా త్రీణి సహస్రాణి యుగసంఖ్యావిదో విదుః ।
తస్యాపి త్రిశతీ సన్ధ్యా సంధ్యాంశః సన్ధ్యయా సమః ॥21॥

అంటే త్రేత మూడువేల దివ్యవర్షాలని యుగసంఖ్యావేత్తలమాట. మూడువందల దివ్యవర్షాలు, మరిమూడు వందల దివ్యవర్షాలు దాని సంధ్యాంశకాలము.

ద్వే సహస్రే ద్వాపరం తు సన్ధ్యాంశౌ తు చతుఃశతమ్ ।
సహస్రమేకం వర్షాణాం కలిరేవ ప్రకీర్తితః ।
ద్వే శతే చ తథాన్యే చ సన్ధ్యా సన్ధ్యాంశయోః ॥22॥

ద్వాపరం రెండువేల దివ్యవత్సరాలు, దాని సంధ్య, సంధ్యాంశాలు రెండువందలదివ్యవర్షాలు. కలి వెయ్యి దివ్యసంవత్సరాలు, దాని సంధ్య, సంధ్యాంశాలు ఒక్కొక్కటి నూరు సంవత్సరాలు.

ఏషా ద్వాదశసాహస్రీ యుగసంఖ్యా తు సంజ్ఞితా ।
కృతం త్రేతా ద్వాపరం చ కలిశ్చేతి చతుష్టయమ్ ॥23॥

ఇది పంద్రెండు వేల సంవత్సరాల యుగసంఖ్య. కృతత్రేతా ద్వాపరకలినామకాలైన చతుర్యుగాలకు చెందినదిది.

తత్ర సంవత్సరాః సృష్టా మానుషాస్తాన్నిబోధత ।
నియుతాని దశ ద్వే చ పంచ చైవాత్ర సంఖ్యయా ।
అష్టావింశత్సహస్రాణి కృతం యుగమథోచ్యతే ॥24॥

అందులో మానుషసంవత్సరాల సంఖ్యను తెలుసుకోండి. 1,728,000 సంవత్సరాలు కృతయుగం.

ప్రయుతం తు తథా పూర్ణం ద్వే చాన్యే నియుతే పునః ।
షణ్ణవతిసహస్రాణి సంఖ్యాతాని చ సంఖ్యయా ।

త్రేతాయుగస్య సంఖ్యైషా మానుషేణ తు సంజ్ఞితా ॥25॥
అష్టౌ శతసహస్రాణి వర్షాణాం మానుషాణి తు ।

చతుష్షష్టిసహస్రాణి వర్షాణాం ద్వాపరం యుగమ్ ॥26॥
చత్వారి నియుతాని స్యుర్వర్షాణి తు కలిర్యుగమ్ ।

ద్వాత్రింశచ్చ తథాన్యాని సహస్రాణి తు సంఖ్యయా ।
ఏతత్కలియుగం ప్రోక్తం మానుషేణ ప్రమాణతః ॥27॥

1,296,000సం॥ త్రేతాయుగం. ద్వాపరం 864,000 సంవత్సరాలు – కలియుగం. 4,32,000 సంవత్సరాలు ఇది మానుష సంవత్సరాల సంఖ్యనుబట్టి చెప్పడమైనది. ప్రమాణానుసారంగా చెప్పబడింది.

ఏషా చతుర్యుగావస్థా మానుషేణ ప్రకీర్తితా ।
చతుర్యుగస్య సంఖ్యాతా సన్ధ్యా సన్ధ్యాంశకైః సహ ॥28॥

మానుష ప్రమాణాన్ని బట్టి ఇది చతుర్యుగావస్థ. ఇది సంధ్యాసంధ్యాంశకాలాలతో సహా చెప్పబడింది.

ఏషా చతుర్యుగాఖ్యా తు సాధికా త్వేకసప్తతిః ।
కృతత్రేతాదియుక్తా సా మనోరన్తరముచ్యతే ॥29॥

ఈ యుగాలు డెబ్బదియొక్క సార్లు గడిచిపోతే అప్పటికి కృతత్రేతాదులతో గూడిన మన్వంతర మొక్కటి అవుతుంది.

మన్వన్తరస్య సంఖ్యా తు మానుషేణ నిబోధత ।
ఏకత్రింశత్ తథా కోట్యః సంఖ్యాతాః సంఖ్యయా ద్విజైః ॥30॥

తథా శతసహస్రాణి దశ చాన్యాని భాగశః ।
సహస్రాణి తు ద్వాత్రింశచ్ఛతాన్యష్టాధికాని చ ॥31॥

అశీతిశ్చైవ వర్షాణి మాసాశ్చైవాధికాస్తు షట్ ।
మన్వన్తరస్య సంఖ్యైషా మానుషేణ ప్రకీర్తితా ॥32॥

మన్వంతర సంఖ్యను మానుష ప్రమాణాన్ని బట్టి గ్రహించండి. మానుషప్రామాణాన్ని బట్టి మన్వంతర సంఖ్య ముప్పదిఒక్క కోట్ల, పదిలక్షల, ముప్పైరెండువేల, ఎనిమిదివందల, ఎనభై సంవత్సరాలకు (31,10,32,880)? పైన ఆరుమాసాలుగా దీనిని పరిగణించడమైనది.

దివ్యేన చ ప్రమాణేన ప్రవక్ష్యామ్యన్తరం మనోః ।
సహస్రాణాం శతాన్యాహుః స చ వై పరిసంఖ్యయా ॥33॥

ఇప్పుడు దివ్యప్రమాణాన్ని బట్టి మన్వంతరం చెబుతాను. పరిసంఖ్యతో దానిని శతసహస్రసంఖ్యలుగా చెప్పారు.

చత్వారింశత్సహస్రాణి మనోరన్తరముచ్యతే ।
మన్వన్తరస్య కాలస్తు యుగైః సహ ప్రకీర్తితః ॥34॥

నలుబదివేల సంవత్సరాలు మన్వంతరమని చెప్పబడుతున్నది. మన్వంతరకాలం యుగాలతో కలిపి చెప్పబడినది.

ఏషా చతుర్యుగాఖ్యా తు సాధికా హ్యేకసప్తతిః ।
క్రమేణ పరివృత్తా సా మనోరన్తరముచ్యతే ॥35॥

ఈ చతుర్యుగాఖ్య డెబ్బైఒకటితో గుణింపబడితే అది మన్వతరం అంటారు.

ఏతచ్చతుర్దశగుణం కల్పమాహుస్తు తద్విదః ।
తతస్తు ప్రలయః కృత్స్నః స తు సంప్రలయో మహాన్ ॥36॥

కల్పప్రమాణో ద్విగుణో యథా భవతి సంఖ్యయా ।
చతుర్యుగాఖ్యా వ్యాఖ్యాతా కృతం త్రేతాయుగం చ వై ॥37॥

దీనికన్నా పదునాల్గు రెట్లధికమైనది కల్పమని దాని నెరింగినవారి మాట. ఆపై సమగ్రకల్పప్రమాణం ఎప్పుడు సంఖ్యచే రెట్టింపవుతుందో, అప్పుడు ప్రళయమవుతుంది. అదే మహాప్రళయం. చతుర్యుగాఖ్య కృతత్రేతాదిక మైనదిగా వివరింపబడినది.

త్రేతాసృష్టిం ప్రవక్ష్యామి ద్వాపరం కలిమేవ చ ।
యుగపత్సమవేతౌ ద్వౌ ద్విధా వక్తుం న శక్యతే ॥38॥

త్రేతాసృష్టినీ, ద్వాపరాన్నీ, కలినీ వివరిస్తాను. ఒకేసారి కలిసిన రెండింటిని రెండుగా చెప్పడం వీలుగాదు.

క్రమాగతం మయాప్యేతత్తుభ్యం నోక్తం యుగద్వయమ్ ।
ఋషివంశప్రసంగేన వ్యాకులత్వాత్తథాక్రమాత్ ॥39॥

నోక్తం త్రేతాయుగే శేషం తద్వక్ష్యామి నిబోధత ।
అథ త్రేతాయుగస్యాదౌ మనుః సప్తర్షయశ్చ యే ।
శ్రౌతం స్మార్తం బ్రువన్ధర్మం బ్రహ్మణా తు ప్రచోదితాః ॥40॥

క్రమాగతమైన యుగద్వయాన్ని గురించి నేను మీకు చెప్పలేదు. ఋషివంశప్రసంగం వల్ల ఆ క్రమం వ్యాకులమయింది కాన త్రేతాయుగాన్ని చెప్పలేదు. శేషాంశమైన ఆ త్రేతాయుగవిషయాన్ని ఇప్పుడు చెపుతాను వినండి. త్రేతాయుగారంభంలో స్వయంభు బ్రహ్మ స్వాయంభువ మనువుకు, సప్తర్షులకూ శ్రౌతస్మార్తధర్మాన్ని బోధించాడు.

దారాగ్నిహోత్రసమ్బన్ధమృగ్యజుః సామసంహితాః ।
ఇత్యాదిబహులం శ్రౌతం ధర్మం సప్తర్షయోఽబ్రువన్ ॥41॥

దారాగ్నిహోత్రసంబంధాన్నీ, ఋగ్యజుస్సామసంహితలు, ఇత్యాదిగా బహుళమైన శ్రౌతధర్మాన్నీ సప్తర్షులు చెప్పారు.

పరమ్పరాగతం ధర్మం స్మార్తం త్వాచారలక్షణమ్ ।
వర్ణాశ్రమాచారయుతం మనుః స్వాయంభువోఽబ్రవీత్ ॥42॥

పరంపరాగతమైన స్మార్తమగు ఆచారలక్షణధర్మాన్ని వర్ణాశ్రమాచారయుతంగా స్వాయంభువమనువు చెప్పాడు.

సత్యేన బ్రహ్మచర్యేణ శ్రుతేన తపసా తథా ।
తేషాం సుతప్తతపసామార్షేణానుక్రమేణ హ ॥43॥

సప్తర్షీణాం మనోశ్చైవ ఆదౌ త్రేతాయుగే తతః ।
అబుద్ధిపూర్వకం తేన సకృత్పూర్వకమేవ చ ॥44॥

అభివృత్తాస్తు తే మంత్రా దర్శనైస్తారకాదిభిః ।
ఆదికల్పే తు దేవానాం ప్రాదుర్భూతాస్తు తే స్వయమ్ ॥45॥

సత్యం, బ్రహ్మచర్యం, శ్రుతం, తపస్సు, వీటితో చక్కగా తపస్సు సాధనచేసినవారికి, ఆర్షానుక్రమంతో సప్తర్షులకూ, మనువులకూ, మొదటత్రేతాయుగంలోనూ ఆపై ఒకసారి అబుద్ధిపూర్వకంగానూ, మరొకసారి బుద్ధిపూర్వకంగానూ ఇంకొకరినుండి ఉపదేశము లేకయే ఆ మంత్రాలు స్వయంగా వారివద్దకు వచ్చాయి. తారక యోగసిద్ధివల్ల అవి అలా గోచరించడమైనది. ఆదికల్పమునందు జరిగినట్లే అది ఇప్పుడు కూడా జరిగినది.

ప్రమాణేష్వథ సిద్ధానామన్యేషాం చ ప్రవర్తతే ।
మంత్రయోగో వ్యతీతేషు కల్పేష్వథ సహస్రశః ।
తే మంత్రా వై పునస్తేషాం ప్రతిమాయాముపస్థితాః ॥46॥

పూర్వకల్పాలలో ఆయా ప్రమాణంలో సిద్ధులైనవారికి, గత కల్పాలలో వలెనే మంత్రయోగం ఉండేది. గడచిన కల్పాలలో మన్త్ర యోగం వేలాదిగా ఉండేది. ఆ మంత్రాలు మళ్ళీ వారికి దేవతల ప్రతిమలలో కనిపించాయి. ఇది స్ఫురించగా వారు వాటిని ఆ కల్పాలలో లోకాలలో ప్రవర్తిల్లచేశారు. ఇవి వేలకొలది మంత్రద్రష్టలకు వేలకొలదిగా గోచరించాయి.

ఋచో యజూంషి సామాని మంత్రాశ్చాథర్వణాస్తు యే ।
సప్తర్షిభిశ్చ యే ప్రోక్తాః స్మార్తం తు మనురబ్రవీత్ ॥47॥

ఋక్కులు, యజుస్సులు, సామలు, అథర్వణమంత్రాలు సప్తర్షులు తాము దర్శించి లోకానికి చెప్పారు. స్వాయంభువమనువు స్మార్తధర్మాన్ని లోకంలో ప్రవర్తింపజేశాడు.

త్రేతాదౌ సంహతా వేదాః కేవలం ధర్మసేతవః ।
సంరోధాదాయుషశ్చైవ వ్యస్యన్తే ద్వాపరే చ తే ।
ఋషయస్తపసా వేదానహోరాత్రమధీయత ॥48॥

త్రేతాదులయందు సంహతాలైన వేదాలు కేవలం ధర్మసేతువులయ్యాయి. ఆయుఃపరిమాణాదిశక్తులు తగ్గుటవల్ల ద్వాపరంలో అవి వ్యత్యస్తాలయ్యాయి. ఋషులు తమ తపోబలంతో వేదాలను అహోరాత్రాలు అధ్యయనం చేశారు.

అనాదినిధనా దివ్యాః పూర్వం ప్రోక్తాః స్వయంభువా ।
స్వధర్మసంవృతాః సాంగా యథా ధర్మం యుగే యుగే ।
విక్రియన్తే స్వధర్మాత్తు వేదా వేదాద్యథాయుగమ్ ॥49॥

ఆద్యంతాలు లేనివి, స్వయంభూబ్రహ్మ తానుగా ప్రతిపాదించినవీ, ఆయా యుగాల కనుగుణమైనవీ, అయిన వేదాలు ప్రతియుగంలోనూ అంగసంహితంగా ధర్మానుసారంగా ప్రవచించబడ్డాయి. ఆయా యుగాలలో ధర్మస్థితిలోని మార్పుల ననుసరించి ఒకవేదం కంటే మరొక వేదం మార్పుతో కనిపిస్తుంది.

ఆరమ్భయజ్ఞాః క్షత్రియా హవిర్యజ్ఞా విశః స్మృతాః ।
పరిచారయజ్ఞాః శూద్రాశ్చ జపయజ్ఞాశ్చ బ్రాహ్మణాః ॥50॥

క్షత్రియులు ఆరంభయజ్ఞులు, వైశ్యులు హవిర్యజ్ఞులు, శూద్రులు పరిచారయజ్ఞులు, బ్రాహ్మణులు జపయజ్ఞులుగా విలసిల్లారు.

తతః సముదితాః వర్ణాస్త్రేతాయాం ధర్మశాలినః ।
క్రియావన్తః ప్రజావన్తః సమృద్ధాః సుఖినశ్చ వై ॥51॥

అందువల్ల వర్ణాలన్నీ కలిసి త్రేతాయుగంలో ధర్మం పాటిస్తూ క్రియాశీలురై సంతతి గల్గి సమృద్ధి, సుఖం కల్గియుండినారు.

బ్రాహ్మణైశ్చ విధీయన్తే క్షత్రియాః క్షత్రియైర్విశః ।
వైశ్యాన్ శూద్రానువర్తన్తే తతః పరమనుగ్రహాత్ ॥52॥

బ్రాహ్మణులు ఉపదేశించినట్లు క్షత్రియులు, క్షత్రియులు ఉపదేశించినట్లు వైశ్యులు, వైశ్యులు ఉపదేశించినట్లు శూద్రులు మిక్కిలి జనానుగ్రహబుద్ధితో ప్రవర్తించుచున్నారు.

శుభాః ప్రకృతయస్తేషాం ధర్మా వర్ణాశ్రమాశ్రయాః ।
సంకల్పితేన మనసా వాచా వా హస్తకర్మణా ॥
త్రేతాయుగే హ్యవికలే కర్మారంభః ప్రసిధ్యతి ॥53॥

ప్రజలు శుభాస్పదులై ఉండేవారు. వారి ధర్మాలు వర్ణాశ్రమాలను ఆశ్రయించి వుండేవి. అవికలమైన త్రేతాయుగంలో మనస్సంకల్పం చేతా, మాటచేతా, చేతిపని చేతా ఆరంభించిన కర్మ సిద్ధిస్తుంది.

ఆయూ రూపం బలం మేధా ఆరోగ్యం ధర్మశీలతా ।
సర్వసాధారణం హ్యేతదాసీత్ త్రేతాయుగే తు వై ॥54॥
వర్ణాశ్రమవ్యవస్థానమేషాం బ్రహ్మా తథాఽకరోత్ ।

ఆయువు, రూపం, బలం, మేధ, ఆరోగ్యం, ధర్మశీలత్వం–ఇవి త్రేతాయుగంలో సర్వసామాన్యంగా వుండేవి. వీరికి బ్రహ్మ ఆ రీతిగా వర్ణాశ్రమవ్యవస్థను ఏర్పాటు చేశాడు.

సంహితాశ్చ తథా మంత్రా ఋషిభిర్బ్రహ్మణః సుతైః ।
యజ్ఞః ప్రవర్తితశ్చైవ తదా హ్యేవ తు దైవతైః ॥56॥

యామైః శుక్లైర్జయైశ్చైవ సర్వసాధనసంభృతైః ।
సార్ధం విశ్వసృజా చైవ దేవేంద్రేణ మహౌజసా ।
స్వాయంభువేఽన్తరే దేవైస్తే యజ్ఞాః ప్రాక్ ప్రవర్తితాః ॥57॥

సంహితలు, మంత్రాలు, బ్రహ్మపుత్రులైన ఋషులచే యజ్ఞంతో కలిపి ప్రవర్తితాలయ్యాయి. దేవతలు, యాములు, శుక్లులు, జయులు అనే దేవతలు, విశ్వస్రష్ట అయిన స్వయంభూబ్రహ్మ సర్వసంభరాలతో సమృద్ధిగల

యజ్ఞాలను ప్రవర్తిల్ల చేశారు. గొప్ప తేజస్సు గల దేవేంద్రుడు స్వాయంభువ మన్వంతరంలో దేవతలతో గూడా యజ్ఞాలు ప్రవర్తిల్లజేశాడు.

సత్యం జపస్తపో దానం పూర్వధర్మో య ఉచ్యతే ।
యదా ధర్మస్య హ్రసతే శాఖాఽధర్మస్య వర్ధతే ॥58॥

జాయన్తే చ తదా శూరా ఆయుష్మన్తో మహాబలాః ।
న్యస్తదణ్డా మహాయోగా యజ్వానో బ్రహ్మవాదినః ॥59॥

పద్మపత్రాయతాక్షాశ్చ పృథువక్త్రాః సుసంహతాః ।
సింహోరస్కా మహాసత్త్వా మత్తమాతంగగామినః ॥60॥

మహాధనుర్ధరాశ్చైవ త్రేతాయాం చక్రవర్తినః ।
సర్వలక్షణపూర్ణాస్తే న్యగ్రోధపరిమణ్డలాః ॥61॥

సత్యం, జపం, తపస్సు, దానం, పూర్వయుగాలకు చెందిన ధర్మాలు. అవి క్షీణించినప్పుడు, అధర్మం వర్ధిల్లినప్పుడు అధర్మాన్ని నశింపచేయడానికి, ధర్మాన్ని పునరుద్ధరించడానికి శూరులు, ఆయుష్మంతులు, మహాబలసంపన్నులు ఉద్భవిస్తారు. వారు తప్పుచేసిన వారిని శిక్షించేవారు, మహాయోగం కలవారు, యజ్ఞకర్తలు, బ్రహ్మవాదులు, పద్మపత్రాలవలె విశాలమైన నేత్రాలు గలవారు, విశాలవదనాలు, శరీరసౌష్ఠవం కలవారు. సింహవక్షస్కులు, మహాసత్త్వులు, మదించిన గజంవంటి గమనం కలవారు, మహాధనుర్ధరులు, త్రేతాయుగంలో చక్రవర్తులై, సర్వలక్షణ సంపన్నులై, న్యగ్రోధపరిమండలులై ధర్మరక్షణ చేసేవారు.

న్యగ్రోధౌ తు స్మృతౌ బాహూ వ్యామో న్యగ్రోధ ఉచ్యతే ।
వ్యామేన తూచ్ఛ్రయో యస్య అత ఊర్ధ్వం తు దేహినః ।
సముచ్ఛ్రయః పరీణాహో న్యగ్రోధపరిమణ్డలః ॥62॥

న్యగ్రోధములు (మర్రిచెట్లు) బాహువులుగా స్మరింపబడినవి, వ్యామమనగా రెండు బాహువులు చాచగా మధ్యభాగము (బార) న్యగ్రోధముగా చెప్పబడినది. బారతో దేహి యొక్క ఊర్ధ్వం, ఎత్తు, వెడల్పు, కలిసి న్యగ్రోధపరిమండల మవుతుంది.

చక్రం రథో మణిర్భార్యా నిధిరశ్వో గజస్తథా ।
ప్రోక్తాని సప్త రత్నాని పూర్వం స్వాయంభువేఽన్తరే ॥63॥

పూర్వం స్వాయంభువమన్వంతరంలో– చక్రం, రథం, మణి, భార్య, నిధి, గుర్రం, ఏనుగు ఇవి సప్తరత్నాలుగా ఉండేవి.

విష్ణోరంశేన జాయన్తే పృథివ్యాం చక్రవర్తినః ।
మన్వన్తరేషు సర్వేషు హ్యతీతానాగతేషు వై ॥64॥

భూతభవ్యాని యానీహ వర్తమానాని యాని చ ।
త్రేతాయుగాని తేష్వత్ర జాయన్తే చక్రవర్తినః ॥65॥

భూమిలో చక్రవర్తులు, విష్ణ్వంశంతో జన్మిస్తారు. గడచిన, రానున్న సకల మన్వంతరాలలోనూ భూత భవ్యాలు ఏవి కలవో, వర్తమానాలు ఏవి ఉన్నవో, ఆ త్రేతాయుగాలలో ఇట్టి చక్రవర్తులు సంభవిస్తారు.

భద్రాణీమాని తేషాం చ విభావ్యన్తే మహీక్షితామ్ ।
అత్యద్భుతాని చత్వారి బలం ధర్మం సుఖం ధనమ్ ॥66॥

ఆ రాజులకు మంగళప్రదమైన అత్యద్భుతమైన బలం, ధర్మం, సుఖం, ధనం అనే నాల్గు లక్షణాలుండేవి.

అన్యోన్యస్యావిరోధేన ప్రాప్యన్తే నృపతేః సమమ్ ।
అర్థో ధర్మశ్చ కామశ్చ యశో విజయ ఏవ చ ॥67॥

అన్యోన్యవిరోధం లేకుండా సమంగా రాజుకు అర్థం, ధర్మం, కామం, యశస్సు, విజయం ప్రాప్తిస్తాయి.

ఐశ్వర్యేణాణిమాద్యేన ప్రభుశక్తిబలాన్వితాః ।
శ్రుతేన తపసా చైవ ఋషీంస్తేఽభిభవన్తి హి ॥68॥

అణిమాద్యైశ్వర్యం చేత ప్రభుశక్తి, బలం కలవారై శాస్త్రంతోనూ, తపస్సుతోనూ వారు ఋషులను జయించిన వారు.

బలేనాభిభవన్త్యేతే తేన దానవమానవాన్ ।
లక్షణైశ్చైవ జాయన్తే శరీరస్థైరమానుషైః ॥69॥

ఆ బలంతో వీరు దానవులను, మానవులను ఆక్రమిస్తారు. అమానుషమైన శరీరలక్షణాలుకూడా వారి కున్నంతగా ఉంటాయి.

కేశాః స్థితా లలాటేన జిహ్వా చ పరిమార్జనీ ।
శ్యామప్రభాశ్చతుర్దంష్ట్రాః సువంశాశ్చోర్ధ్వరేతసః ॥70॥

ఆజానుబాహవశ్చైవ తాలహస్తౌ వృషాకృతీ ।
పరిణాహప్రమాణాభ్యాం సింహస్కన్ధాశ్చ మేధినః ॥71॥

ఫాలభాగాన్ని కప్పిన కేశాలు, దీర్ఘమైన జిహ్వ, చామనచాయ, నాలుగుకోరలు, మంచి వంశం, అజానుబాహులు కలిగి ఊర్ధ్వరేతస్కులు, తాటికాండంవంటి చేతులు, వృషభం వంటి ఆకృతులు, సింహపు మూపువంటి మూపు గలవారై మేధావంతులై భాసిల్లేవారు.

పాదయోశ్చక్రమత్స్యౌ తు శంఖపద్మే చ హస్తయోః ।
పంచాశీతిసహస్రాణి జీవన్తి హ్యజరామయాః ॥72॥

పాదాలలో చక్రమత్స్యచిహ్నాలు, హస్తాలలో శంఖపద్మచిహ్నాలు గల్గి ఎనుబదియైదువేల సంవత్సరాలు వార్ధకం, రోగం లేకుండా జీవిస్తారు.

అసంగా గతయస్తేషాం చతస్రశ్చక్రవర్తినామ్ ।
అన్తరిక్షే సముద్రేషు పాతాలే పర్వతేషు చ ॥73॥

అన్తరిక్షంలో, సాగరాలలో, పాతాళంలో, పర్వతాలలోనూ ఆ చక్రవర్తుల నాలుగు గమనాలు అడ్డులేనివై ఉండేవి.

ఇజ్యా దానం తపః సత్యం త్రేతాధర్మాస్తు వై స్మృతాః ।
తదా ప్రవర్తతే ధర్మో వర్ణాశ్రమవిభాగశః ।
మర్యాదాస్థాపనార్థం చ దణ్డనీతిః ప్రవర్తతే ॥74॥

యాగం, దానం, తపస్సు, సత్యం– త్రేతాయుగ ధర్మాలుగా ప్రసిద్ధాలు. అప్పటి ధర్మం వర్ణాశ్రమ విభాగాన్ని బట్టి ప్రవర్తిల్లేది. దండనీతి మర్యాదాస్థాపన కొరకు పాటింపబడింది.

హృష్టపుష్టా జనాః సర్వే అరోగాః పూర్ణమానసాః ।
ఏకో వేదశ్చతుష్పాదస్త్రేతాయాం తు విధిః స్మృతః ।
త్రీణి వర్షసహస్రాణి జీవన్తే తత్ర తాః ప్రజాః ॥75॥

జనులందరూ సంతుష్టులు, పుష్టిమంతులు, రోగరహితులు, పూర్ణచిత్తులుగా ఉండేవారు. త్రేతాయుగంలో ఒకే వేదం నాలుగు పాదాలుగా విభక్తమై విధిగా చెల్లింది. ప్రజలు మూడు వేల సంవత్సరాలు జీవించేవారు.

పుత్రపౌత్రసమాకీర్ణా మ్రియన్తే చ క్రమేణ తాః ।
ఏష త్రేతాయుగే భావస్త్రేతాసంధ్యాం నిబోధత ॥76॥

పుత్రపౌత్రులతో వృద్ధి పొంది పిమ్మట క్రమంగా వారు మరణించువారు. ఇది త్రేతాయుగస్థితి. ఇక త్రేతాసంధ్యను తెలుసుకోండి.

త్రేతాయుగస్వభావేన సన్ధ్యా పాదేన వర్తతే ।
సన్ధ్యాపాదః స్వభావాచ్చ యోఽంశః పాదేన తిష్ఠతి ॥77॥

త్రేతాయుగ స్వభావం సంధ్యలో ఒక్క పాదంతోనే ఉంటుంది. సంధ్యాంశంలో ఆ ఒక్కపాదంలో నాల్గవ వంతుమాత్రమే ఉంటుంది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే యుగవర్ణనం నామ ద్విచత్వారింశదధికశతతమోఽధ్యాయః ॥ 142 ॥

శ్రీ మత్స్యమహాపురాణంలో యుగవర్ణనమనే నూటనలబైరెండవ అధ్యాయం సంపూర్ణం

త్రిచత్వారింశదధికశతతమోఽధ్యాయః – నూటనలభైమూడవ అధ్యాయం
త్రేతాయుగే యజ్ఞప్రవృత్తి కథనమ్ – త్రేతాయుగమున యజ్ఞప్రవృత్తి కథనం

ఋషయ ఊచుః :– ఋషులు చెప్పారు.

కథం త్రేతాయుగముఖే యజ్ఞస్యాసీత్ప్రవర్తనమ్ ।
పూర్వే స్వాయంభువే సర్గే యథావత్ప్రబ్రవీహి నః ॥1॥

సూతా! పూర్వ స్వాయంభువ మన్వంతరంలో త్రేతాయుగారంభంలో యజ్ఞ ప్రవృత్తి ఎలా వుండేదో చెప్పు.

అన్తర్హితాయాం సన్ధ్యాయాం సార్ధం కృతయుగేన హి ।
కాలాఖ్యాయాం ప్రవృత్తాయాం ప్రాప్తే త్రేతాయుగే తదా ॥2॥

ఓషధీషు చ జాతాసు ప్రవృత్తే వృష్టిసర్జనే ।
ప్రతిష్ఠితాయాం వార్తాయాం గ్రామేషు చ పురేషు చ ॥3॥

కృతయుగంతో సహా దాని సంధ్య ముగియగా కాలాఖ్యననుసరించిన కాలం యొక్క పేరుకుతగిన ప్రవృత్తులతో త్రేతాయుగం వచ్చింది. అప్పుడు ఓషధులు మొలవగా, వర్షం ఏర్పడగా, గ్రామాలలో, నగరాలలో జనజీవన స్థితికవసరమైన వృత్తి ధర్మం మొదలైంది.

వర్ణాశ్రమప్రతిష్ఠానం కృత్వా మంత్రైశ్చ తైః పునః ।
సంహితాస్తు సుసంహృత్య కథం యజ్ఞః ప్రవర్తితః ।
ఏతచ్ఛ్రుత్వాఽబ్రవీత్సూతః శ్రూయతాం తత్ప్రచోదితమ్ ॥4॥

వర్ణాశ్రమ ప్రతిష్ఠాపన చేసే ఆ మంత్రాలతో సంహితలను– సిద్ధం చేసి యజ్ఞాన్ని అప్పుడెలా ప్రవర్తింపజేశారు? అని ఋషులు ప్రశ్నించారు. అది విని సూతుడు ఆ ఏర్పాటుకు చెందిన వివరాలను ఇలా చెప్పాడు.

సూత ఉవాచ :– సూతుడు చెప్పాడు.

మంత్రాన్వై యోజయిత్వా తు ఇహాముత్ర చ కర్మసు ।
తథా విశ్వభుగింద్రస్తు యజ్ఞం ప్రావర్తయత్ప్రభుః ॥5॥

ఈ లోకంలోనూ, పరలోకంలోనూ కర్మానుష్ఠానానికి ఉపయోగించే మంత్రాలను యోజించి విశ్వ భోక్త, ప్రభువూ అయిన ఇంద్రుడు యజ్ఞాన్ని ప్రవర్తింపజేశాడు.

దైవతైః సహ సంహృత్య సర్వసాధనసంవృతః ।
తస్యాశ్వమేధే వితతే సమాజగ్ముర్మహర్షయః ॥6॥

దేవతలతో గూడి సకల సాధనాలు సమకూర్చుకొని ఇంద్రుడు అశ్వమేధం ప్రారంభించగా మహర్షులందరూ విచ్చేశారు.

యజ్ఞకర్మణ్యవర్తన్త కర్మణ్యగ్రే తథర్త్విజః ।
హూయమానే దేవహోత్రే అగ్నౌ బహువిధం హవిః ॥7॥

సంప్రతీతేషు దేవేషు సామగేషు చ సుస్వరమ్ ।
పరిక్రాన్తేషు లఘుషు అధ్వర్యుపురుషేషు చ ॥8॥

ఆలబ్ధేషు చ మధ్యే తు తథా పశుగణేషు వై ।
ఆహూతేషు చ దేవేషు యజ్ఞభుక్షు తతస్తదా ॥9॥

కర్మారంభంలో ఋత్విక్కులు దేవతల నుద్దేశించి హవనం చేయబూని బహువిధ హవిస్సులతో హోమం ఆరంభించారు. అప్పుడు దేవతలు సంతసించారు. సామగానపరులు సుస్వరంతో సామగానం చేశారు. అధ్వర్యుపురుషులు వడిగా అటూ ఇటూ తిరుగసాగారు. అప్పుడు మధ్యలో పశుగణాలు ఆలంభింపబడగా (సమంత్రకంగా పశువులను వధించగా) యజ్ఞభోక్తలైన దేవతలు ఆహ్వానింపబడ్డారు.

య ఇంద్రియాత్మకా దేవా యజ్ఞభాగభుజస్తు తే ।
తాన్యజన్తి తదా దేవాః కల్పాదిషు భవన్తి యే ॥10॥

ఇంద్రియాభిమాని దేవతలు మాత్రమే యజ్ఞ భాగ, భోక్తలయ్యారు. ప్రతి కల్పాదిలోనూ యజ్ఞ భాగ భోక్తలు ఈ దేవతలే. వీరినుద్దేశించి యజ్ఞాలు అనుష్ఠించారు.

అధ్వర్యుప్రైషకాలే తు వ్యుత్థితా ఋషయస్తథా ।
మహర్షయశ్చ తాన్ దృష్ట్వా దీనాన్ పశుగణాంస్తదా ।
విశ్వభుజం తే త్వపృచ్ఛన్ కథం యజ్ఞవిధిస్తవ ॥11॥

అధ్వర్యువులు ప్రైషమంత్రాలతో దేవతలనాహ్వానించే సమయాన ఋషులు, మహర్షులు లేచి నిలబడ్డారు. వధింపబడుతున్న దీనమైన పశుగణాలను చూచి విశ్వభోక్త అగు ఇంద్రుణ్ణి ఇలా ప్రశ్నించారు. 'నీయజ్ఞవిధి ఎట్టిది?' అని ప్రశ్నించారు.

అధర్మో బలవానేష హింసా ధర్మేప్సయా తవ ।
పశుబంధవధస్త్విష్టస్తవ యజ్ఞే సురోత్తమ! ॥12॥

ఈ పశుహింస పెద్ద అధర్మం, సురోత్తమా! ఇంద్రా! ఈయజ్ఞంలో ధర్మాభిలాషివగు నీకు పశువధ ఇష్టమైనట్లున్నది.

అధర్మో ధర్మఘాతాయ ప్రారబ్ధః పశుభిస్త్వయా ।
నాయం ధర్మో హ్యధర్మోఽయం న హింసా ధర్మ ఉచ్యతే ।
ఆగమేన భవాన్ ధర్మం ప్రకరోతు యదీచ్ఛతి ॥13॥

ధర్మఘాతం కొరకే నీవు ఈ పశువులతో అధర్మం చేస్తున్నట్టున్నది. ఇది ధర్మం కాదు, ఇది అధర్మం, హింస ధర్మం కానేరదు. నీకిష్టమైతే శాస్త్రవిధితో నీవు ఇది ధర్మమని నిర్ణయించు.

విధిదృష్టేన యజ్ఞేన ధర్మేణావ్యసనేన తు ।
యజ్ఞబీజైః సురశ్రేష్ఠ త్రివర్గపరిమోషితైః ॥14॥

ఏష యజ్ఞో మహానింద్ర స్వయంభువిహితః పురా ।
ఏవం విశ్వభుగింద్రస్తు ఋషిభిస్తత్త్వదర్శిభిః ।
ఉక్తో న ప్రతిజగ్రాహ మానమోహసమన్వితః ॥15॥

"సురశ్రేష్ఠా! ఇంద్రా! శాస్త్రదృష్టమైన యజ్ఞంతో వ్యసనంలేని ధర్మంతో ధర్మార్థకామాలు ప్రసాదించే యజ్ఞబీజాలతో పూర్వం ఈ యజ్ఞం స్వయంభువుచే నిర్వహింపబడింది." ఇలా తత్త్వద్రష్టలైన ఋషులచే ప్రశ్నించబడిన ఇంద్రుడు మానమోహాలకు వశపడి వారి మాటలు గ్రహించలేదు.

తేషాం వివాదః సుమహాన్ జజ్ఞే ఇంద్రమహర్షిణామ్ ।
జంగమైః స్థావరైః కేన యష్టవ్యమితి చోచ్యతే ॥16॥

అప్పు డింద్రునికీ, మహర్షులకూ పెద్ద వివాదం జరిగింది. జంగమప్రాణులగు పశువులతోనా, స్థావరాలైన కందమూలాలతోనా ఇందులో దేనితో యజ్ఞం చేయాలి అన్న విషయం పై ఈ వివాదం సంభవించింది.

తే తు ఖిన్నా వివాదేన శక్త్యా ముక్తా మహర్షయః ।
సన్ధాయ సమమింద్రేణ పప్రచ్ఛుః ఖచరం వసుమ్ ॥17॥

ఈ వాదంలో శక్తిహీనులై, ఖిన్నులైన మహర్షులు ఇంద్రునితో సంధి గావించుకొని ఖేచరుడైన వసువును మధ్యవర్తిగా ఉంచుకొని ఈ విషయమై ప్రశ్నించారు.

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు.

మహాప్రాజ్ఞ! త్వయా దృష్టః కథం యజ్ఞవిధిర్నృప! ।
ఔత్తానపాదే! ప్రబ్రూహి సంశయం నస్తుద ప్రభో! ॥18॥

ఉత్తానపాదుని పుత్రుడవు, మహాప్రాజ్ఞుడవు అగు వసురాజా! నీవు యజ్ఞవిధి నెలా దర్శించావు? ప్రభూ! ఇది చెప్పి మా సంశయం తొలగించు.

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

శ్రుత్వా వాక్యం వసుస్తేషామవిచార్య బలాబలమ్ ।
వేదశాస్త్రమనుస్మృత్య యజ్ఞతత్త్వమువాచ హ ॥19॥

వసువు వారి మాట విని వారి బలాబలాలు పరిగణించకుండా వేదశాస్త్రానుసారంగా యజ్ఞతత్త్వం చెప్పాడు.

యథోపనీతైర్యష్టవ్యమితి హోవాచ పార్థివః ।
యష్టవ్యం పశుభిర్మేధ్యై రథ మూలఫలైరపి ॥20॥

యజ్ఞకర్త శక్త్యనుసారం ఏది సమకూర్చుకొంటాడో దానితోనే యజ్ఞం చేయవలసియున్నదని రాజు చెప్పాడు. పవిత్రమైన పశువులతోనైనా, మూలఫలాలతోనైనా యజ్ఞం చేయవచ్చు.

హింసా స్వభావో యజ్ఞస్య ఇతి మే దర్శనాగమః ।
తథైతే భావితా మంత్రా హింసాలింగా మహర్షిభిః ॥21॥

'యజ్ఞ స్వభావం హింస' అని నా దర్శనాగమం. అందుకే హింసాపూరితమైన మంత్రాలు మహర్షులచే భావించబడ్డాయి.

దీర్ఘేణ తపసా యుక్తైస్తారకాదినిదర్శిభిః ।
తత్ప్రమాణం మయా చోక్తం తస్మాచ్ఛమితుమర్హథ ॥22॥

దీర్ఘతపోయుక్తులైన మహర్షులచేత, తారకాది ద్రష్టలచేత ఈ సంగతి చెప్పబడింది. ఆ ప్రమాణమే నేను చెప్పాను. అందువల్ల శాంతించండి!

యది ప్రమాణం స్వాన్యేవ మంత్రవాక్యాని వో ద్విజాః! ।
తథా ప్రవర్తతాం యజ్ఞో హ్యన్యథా మాఽనృతం వచః ॥23॥

ద్విజులారా! ఒకవేళ స్వీయమంత్ర వాక్యాలే ప్రమాణమయితే అట్లే యజ్ఞం ప్రవర్తించుగాక! కాని నా మాట లనృతాలు కావు.

ఏవం కృతోత్తరాస్తే తు యుజ్యాత్మానం తతో ధియా ।
అశపన్ భావినం దృష్ట్వా తమర్థం ఋషయస్తదా ॥24॥

ఇలా అతడిచ్చిన సమాధానం విని ధీయుతులైన ఋషులు జరుగనున్న దానిని గ్రహించి అతణ్ణి పతనం కమ్మని శపించారు.

ఇత్యుక్తమాత్రో నృపతిః ప్రవివేశ రసాతలమ్ ।
ఊర్ధ్వచారీ నృపో భూత్వా రసాతలచరోఽభవత్ ॥25॥

వారు శపించేసరికి రాజు రసాతలం ప్రవేశించాడు. అంతవరకు ఆకాశసంచారిగా ఉండిన ఆ రాజు అలా రసాతల చరుడయ్యాడు.

వసుధాతలచారీ తు తేన వాక్యేన సోఽభవత్ ।
ధర్మాణాం సంశయచ్ఛేత్తా రాజా వసురధోగతః ॥26॥

ఆ శాపవచనం వల్ల అతడు భూతలచారి గూడా అయ్యాడు. కాన ఖేచరత్వం కోల్పోయాడు. ధర్మాలలో సంశయం తొలగించే వసురాజు అధోగతి పాలయ్యాడు.

తస్మాన్న వాచ్యో హ్యేకేన బహుజ్ఞేనాపి సంశయః ।
బహుద్వారస్య ధర్మస్య సూక్ష్మా దురనుగా గతిః ॥27॥

అందువల్ల ఒక్కడు ఎంతగా తెలిసినవాడైనా బహుముఖమైన ధర్మసంశయాన్ని తేల్చి చెప్పరాదు. ధర్మం పలు త్రోవలు కలది. సూక్ష్మమైనది. దాని ననుసరించటం తేలిక కాదు.

తస్మాన్న నిశ్చయాద్వక్తుం ధర్మః శక్యో హి కేనచిత్ ।
దేవానృషీనుపాదాయ స్వాయంభువమృతే మనుమ్ ॥28॥

అందుచేత ఎవడూ నిశ్చయించి ధర్మాన్ని నిరూపించలేడు. దేవతలు, ఋషులు, స్వాయంభువమనువు తప్ప ఇతరుల కది వీలు గాని పని.

తస్మాన్న హింసా యజ్ఞే స్యాద్యదుక్తమృషిభిః పురా ।
ఋషికోటిసహస్రాణి స్వైస్తపోభిర్దివం గతాః ॥29॥

అందువల్ల యజ్ఞంలో హింస తగదని ఋషులు చెప్పిన మాట యుక్తమైనది. వేలకొలది కోట్ల ఋషులు హింసలేకుండగనే తమ తపోబలంతోనే దివి కేగారు.

తస్మాన్న హింసాయజ్ఞం చ ప్రశంసన్తి మహర్షయః ।
అంభో మూలం ఫలం శాకముదపాత్రం తపోధనాః! ॥30॥

ఏతద్దత్వా విభవతః స్వర్గలోకే ప్రతిష్ఠితాః ।
అద్రోహశ్చాప్యలోభశ్చ దమో భూతదయా తపః ॥31॥

బ్రహ్మచర్యం తపః సత్యమనుక్రోశః క్షమా ధృతిః ।
సనాతనస్య ధర్మస్య మూలమేతద్దురాసదమ్ ॥32॥

అందుచేత మహర్షులు హింసాయజ్ఞాన్ని ప్రశంసించరు. నీరు, దుంపలు, వ్రేళ్ళు, ఫలం, శాకం, జలపాత్ర విభవం కొలది ఇచ్చి స్వర్గంలో వారు ప్రతిష్ఠితులయ్యారు. అద్రోహం, అలోభం, బహిరింద్రియ నిగ్రహం, భూతదయ, బ్రహ్మచర్యం, తపస్సు, సత్యం, జాలి, క్షమ, ధృతి – ఇది సనాతన ధర్మానికి కష్టసాధ్యమైన మూలం.

ద్రవ్యమంత్రాత్మకో యజ్ఞస్తపశ్చ సమతాత్మకమ్ ।
యజ్ఞైశ్చ దేవానాప్నోతి వైరాజం తపసా పునః ॥33॥

యజ్ఞం ద్రవ్యమంత్రాత్మకమైనది, సర్వభూతసమత్వాత్మకమైనది. తపస్సు. యజ్ఞాలతో దేవతలను, తపస్సుతో విరాట్పురుషునీ (వైరాజలోకాన్ని) చేరుతారు.

బ్రహ్మణః కర్మసంన్యాసాద్వైరాగ్యాత్ప్రకృతేర్లయమ్ ।
జ్ఞానాత్ప్రాప్నోతి కైవల్యం పంచైతా గతయః స్మృతాః ॥34॥

పై చెప్పిన రెండు విధానాలతో పాటు కర్మసన్యాసంవల్ల బ్రహ్మప్రాప్తి, వైరాగ్యం వల్ల ప్రకృతిలయం, జ్ఞానం వల్ల కైవల్యం కల్గుతాయి– ఈ ఐదు గతులుగా పేర్కొనబడ్డాయి.

ఏవం వివాదః సుమహాన్యజ్ఞస్యాసీత్ప్రవర్తనే ।
ఋషీణాం దేవతానాం చ పూర్వే స్వాయంభువేఽన్తరే ॥35॥

పూర్వం ఈ రీతిగా స్వాయంభువమన్వంతరంలో ఋషులకూ, దేవతలకూ యజ్ఞ ప్రవర్తనలో పెద్ద వివాదం జరిగింది.

తతస్తే ఋషయో దృష్ట్వా హృతం ధర్మం బలేన తు ।
వసోర్వాక్యమనాదృత్య జగ్ముస్తే వై యథాగతమ్ ॥36॥

ఆపై ఋషులు బలంతో ధర్మం తొలగద్రోయబడినదని గ్రహించి వసువాక్యాన్ని అనాదరించి వచ్చిన దారినే తిరిగి వెళ్ళారు.

గతేషు ఋషిసంఘేషు దేవా యజ్ఞమవాప్నుయుః ।
శ్రూయన్తే హి తపఃసిద్ధా బ్రహ్మక్షత్రాదయో నృపాః ॥37॥

ఋషిసంఘాలు వెళ్ళిపోగా దేవతలు యజ్ఞం చేశారు. హింసామయమైన యజ్ఞాలు మాని తపస్సిద్ధులైన బ్రహ్మక్షత్రాది నృపులను గూర్చి విన్నాము.

ప్రియవ్రతోత్తానపాదౌ ధ్రువో మేధాతిథిర్వసుః ।
సుధామా విరజాశ్చైవ శంఖపాద్రాజసస్తథా ॥38॥

ప్రాచీనబర్హిః పర్జన్యో హవిర్ధానాదయో నృపాః ।
ఏతే చాన్యే చ బహవస్తే తపోభిర్దివం గతాః ॥39॥

రాజర్షయో మహాత్మానో యేషాం కీర్తిః ప్రతిష్ఠితా ।
తస్మాద్విశిష్యతే యజ్ఞాత్తపః సర్వైస్తు కారణైః ॥40॥

ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు, ధ్రువుడు, మేధాతిథి, వసువు, సుధాముడు, విరజుడు, శంఖపాదుడు, రాజసుడు, ప్రాచీనబర్హి, పర్జన్యుడు, హవిర్ధానుడు ఇత్యాదులగు రాజులు ఇంకా అనేకులు తపస్సుతోనే దేవలోకం చేరుకొన్నారు. ఎవరికీర్తి లోకంలో ప్రతిష్ఠితమైనదో, అట్టి రాజర్షులు, మహాత్ములు వారు. అంచేత అనేక కారణాలవల్ల యజ్ఞంకంటే తపస్సు విశిష్టమైనది.

బ్రహ్మణా తపసా సృష్టం జగద్విశ్వమిదం పురా ।
తస్మాన్నాప్నోతి తద్యజ్ఞాత్తపో మూలమిదం స్మృతమ్ ॥41॥

పూర్వం బ్రహ్మ తపస్సుతోనే ఈ జగత్తును సృజించాడు. అది యజ్ఞంతో జరిగే పని కాదు. ఇదంతా తపోమూలమని చెప్పబడింది.

యజ్ఞప్రవర్తనం హ్యేవమాసీత్స్వాయంభువేఽన్తరే ।
తదాప్రభృతి యజ్ఞోఽయం యుగైః సార్ధం ప్రవర్తితః ॥42॥

స్వాయంభువమన్వంతరంలో మొదట ఇలా యజ్ఞ ప్రవర్తనం సంభవించింది. ఆనాటినుండి ఈ యజ్ఞం యుగక్రమంగా ప్రవర్తిల్లుతున్నది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే త్రేతాయుగే యజ్ఞప్రవృత్తి కథనం నామ త్రిచత్వారింశదధికశతతమోఽధ్యాయః॥143॥

శ్రీమత్స్య మహాపురాణంలోని త్రేతాయుగమున యజ్ఞప్రవృతికథనమనే నూటనలభైమూడవ అధ్యాయం సంపూర్ణం

చతుశ్చత్వారింశదధికశతతమోऽధ్యాయః - నూటనలభైనాల్గవ అధ్యాయం

ద్వాపరయుగ ధర్మాః - ద్వాపరయుగ ధర్మాలు

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

అత ఊర్ధ్వం ప్రవక్ష్యామి ద్వాపరస్య విధిం పునః ।
తత్ర త్రేతాయుగే క్షీణే ద్వాపరం ప్రతిపద్యతే ॥1॥

ఇకపై ద్వాపరయుగధర్మాన్ని చెబుతాను. త్రేతాయుగం క్షీణించగానే ద్వాపరయుగం వస్తుంది.

ద్వాపరాదౌ ప్రజానాం తు సిద్ధిస్త్రేతాయుగే తు యా ।
పరివృత్తే యుగే తస్మిన్ తతః సా వై ప్రణశ్యతి ॥2॥

ఈ యుగ ప్రారంభంలో ప్రజలు త్రేతాయుగానికి చెందిన ప్రవృత్తినీ, ఫలాన్నీ కల్గి వుంటారు. యుగం కాస్తా మారిపోగానే ఆ కార్యపలసిద్ధి నశిస్తుంది.

తతః ప్రవర్తతే తాసాం ప్రజానాం ద్వాపరే పునః ।
లోభో భృతిర్వణిగ్యుద్ధం తత్త్వానామవినిశ్చయః ॥3॥

ప్రధ్వంసశ్చైవ వర్ణానాం కర్మణాం తు విపర్యయః ।
యాచ్నా వధః పరో దణ్డో మానో దర్పోऽక్షమా బలమ్ ॥4॥

ద్వాపరంలో మళ్ళీ ఆ ప్రజలకు లోభం, భృతి, (జీతంతో పనిచేయటం) వాణిజ్యం, యుద్ధం, తత్త్వనిశ్చయం లేకుండాపోవడం, వర్ణవ్యవస్థా వినాశం, కర్మల విపర్యయం, యాచన, వధం, తీవ్రదండం, అభిమానం, దర్పం, ఓర్పు లేకుండుట, బలప్రాముఖ్యం - ఇవి అధికమవుతాయి.

తథా రజస్తమో భూయః ప్రవృత్తే ద్వాపరే పునః ।
ఆద్యే కృతే నాధర్మోऽస్తి స త్రేతాయాం ప్రవర్తితః ॥5॥

అట్లే ద్వాపరం ప్రారంభం కాగానే రజస్తమఃప్రవృత్తి కలుగుతుంది. కృతయుగంలో అధర్మం లేదు. అది త్రేతాయుగంలో ప్రవర్తిస్తుంది.

ద్వాపరే వ్యాకులో భూత్వా ప్రణశ్యతి కలౌ పునః ।
వర్ణానాం ద్వాపరే ధర్మా స్సంకీర్యన్తే తథాऽऽశ్రమాః ॥6॥

ద్వాపరంలో ధర్మం వ్యాకులమై అది కలిలో నశిస్తుంది.అట్లే వర్ణాశ్రమధర్మాలు ద్వాపరంలో సంకీర్ణాలవుతాయి.

ద్వైధముత్పద్యతే చైవ యుగే తస్మిన్ శ్రుతిస్మృతౌ ।
ద్విధా శ్రుతిః స్మృతిశ్చైవ నిశ్చయో నాధిగమ్యతే ॥7॥

ఆ యుగంలో శ్రుతిస్మృతుల అర్థనిర్ణయంలో ద్వైధీభావం అంటే రెండు అభిప్రాయాలు కలుగుతాయి. శ్రుతిస్మృతులు రెండుగా చీలిపోగానే ధర్మనిశ్చయం లభించదు.

అనిశ్చయోపగమనాద్ధర్మతత్త్వం న విద్యతే ।
ధర్మతత్త్వే హ్యవిజ్ఞాతే మతిభేదస్తు జాయతే ॥8॥

అనిశ్చయస్థితిలో ధర్మతత్త్వం తెలియదు. ధర్మతత్త్వం తెలియనప్పుడు ప్రజలలో మతిభేదం కల్గుతుంది.

పరస్పరం విభిన్నాస్తే దృష్టీనాం విభ్రమేణ తు ।
అతో దృష్టివిభిన్నైస్తైః కృతమత్యాకులం త్విదమ్ ॥9॥

దృష్టి విభ్రమంవల్ల పరస్పరం జనులు విభిన్ను లవుతారు. దృష్టి భేదం కలవారివల్ల లోకం మిక్కిలిగా ఆకులమైపోతుంది.

ఏకో వేదశ్చతుష్పాదః సంహృత్య తు పునః పునః ।
సంక్షేపాదాయుషశ్చైవ వ్యస్యతే ద్వాపరేష్విహ ॥10॥

త్రేతాయుగంలో ఒక్క వేదం చతుష్పాదమై యుండేది. ప్రజల ఆయువు తగ్గడం వల్ల, వేదం మాటిమాటికి సమకూర్చబడడంవల్ల ద్వాపరంలో మరల ఋషిపుత్రులచే అందులో నాలుగుగా విభాగం చేయబడుతున్నది.

వేదశ్చైకశ్చతుర్ధా తు వ్యస్యతే ద్వాపరాదిషు ।
ఋషిపుత్రైః పునర్వేదా భిద్యన్తే దృష్టివిభ్రమైః ॥11॥

పూర్వం ఒకటిగా ఉండిన వేదం నాలుగుగా ద్వాపరాదులలో ఋషిపుత్రులచే విభక్త మవుతుంది. దృష్టి విభ్రమాలవల్ల గూడా ఈ వేదం విషయంలో భేదభావం కల్గుతుంది.

తే తు బ్రాహ్మణవిన్యాసైః స్వరక్రమవిపర్యయైః ।
సంహృత్య ఋగ్యజుః సామ్నాం సంహితాస్తైమహర్షిభిః ॥12॥

బ్రాహ్మణముల అమరికవల్ల, స్వరక్రమవిపర్యయాలవల్ల ఋగ్యజుస్సామసంహితలు మహర్షులచే విభజించబడ్డాయి.

సామాన్యాద్వైకృతాచ్చైవ దృష్టిభిన్నైః క్వచిత్క్వచిత్ ।
బ్రాహ్మణం కల్పసూత్రాణి భాష్యవిద్యాస్తథైవ చ ॥13॥

వేదశాఖల్లో సమానత ఉన్నా కొంత ఆకృతి భేదం ఏర్పడి దృష్టిభేదం కలుగుతుంది. బ్రాహ్మణాలు, కల్పసూత్రాలు, ఆ పై భాష్యాలు అనే విద్యాస్థానభేదాలు, ప్రస్థానభేదాలు ఏర్పడుతాయి.

అన్యే తు ప్రస్థితాస్తాన్వై కేచిత్తాన్ ప్రత్యవస్థితాః ।
ద్వాపరేషు ప్రవర్తన్తే భిన్నార్థైస్తైః స్వదర్శనైః ॥14॥

కొందరు వాటి ననుసరిస్తారు. ఇంక కొందరు వ్యతిరేకిస్తారు. ద్వాపరంలో భిన్నార్థాలు గల తమ దర్శనాలతోనే ప్రవర్తిస్తారు. ఇలా భిన్నభిన్నార్థాలు సంభవిస్తాయి.

ఏకమాధ్వర్యవం పూర్వమాసీద్ద్వైధం తు తత్పునః ।
సామాన్యవిపరీతార్థైః కృతం శాస్త్రాకులం త్విదమ్ ॥15॥

మొదట ఒకే యజుర్వేదశాఖ ఉండేది. అది ద్వాపరంలో రెండు విధాలయింది. సమానార్థాలు, విపరీతార్థాల ప్రకటనవల్ల శాస్త్రాలలో ఆకులత్వం సంభవించింది.

ఆధ్వర్యవం చ ప్రస్థానైర్బహుధా వ్యాకులీకృతమ్ ।
తథైవాథర్వణాం సామ్నాం వికల్పైః స్వస్య సంక్షయైః ॥16॥

యజుర్వేదం కూడా వివిధప్రస్థానాలచేత అనేక రీతులుగా వ్యాకులమయింది. అట్లే అథర్వ, సామవేదాలలో వికల్పాలచే, సంక్షయంచేత అర్థం వ్యాకులమయింది.

వ్యాకులో ద్వాపరేష్వర్థః క్రియతే భిన్నదర్శనైః ।
ద్వాపరే సన్నివృత్తే తే వేదా నశ్యన్తి వై కలౌ ॥17॥

భిన్న దర్శనాలచే ద్వాపరంలో వేదార్థాలు వ్యాకులం కావడం సంభవించింది. ద్వాపరం గడచి పోగానే ఈ వేదాలు కలిలో నశిస్తాయి.

తేషాం విపర్యయోత్పన్నా భవన్తి ద్వాపరే పునః ।
అదృష్టిర్మరణం చైవ తథైవ వ్యాధ్యుపద్రవాః ॥18॥

వాటి విపర్యయంవల్ల ద్వాపరయుగంలో అజ్ఞానం, ఆకలి, మరణం, వ్యాధులు, ఉపద్రవాలు కల్గుతాయి.

వాఙ్మనఃకర్మభిర్దుఖైర్నిర్వేదో జాయతే తతః ।
నిర్వేదాజ్జాయతే తేషాం దుఃఖమోక్షవిచారణా ॥19॥

వాఙ్మనః కర్మలచే కలిగే దుఃఖాలచేత ఆపైన నిర్వేదం కల్గుతుంది. నిర్వేదంవల్ల దుఃఖంనుండి విడుదల పొందాలనే విచారణ కల్గుతుంది.

విచారణాయాం వైరాగ్యం వైరాగ్యాద్దోషదర్శనమ్ ।
దోషాణాం దర్శనాచ్చైవ జ్ఞానోత్పత్తిస్తు జాయతే ॥20॥

విచారణ జరుగగా వైరాగ్యం, వైరాగ్యం వల్ల దోషదర్శనం, దోషదర్శనంవల్ల జ్ఞానోత్పత్తి సంభవిస్తాయి.

తేషాం మేధావినాం పూర్వం మర్త్యే స్వాయంభువేఽన్తరే ।
ఉత్పత్స్యన్తీహ శాస్త్రాణాం ద్వాపరే పరిపంథినః ॥21॥

ద్వాపరంలోని స్వాయంభువమన్వంతరంలో ఆ మేధావులకు శాస్త్రాల విషయంలో శత్రువులు కల్గుతారు.

ఆయుర్వేదవికల్పాశ్చ అంగానాం జ్యౌతిషస్య చ ।
అర్థశాస్త్రవికల్పాశ్చ హేతుశాస్త్రవికల్పనమ్ ॥22॥

ప్రక్రియా కల్పసూత్రాణాం భాష్యవిద్యావికల్పనమ్ ।
స్మృతిశాస్త్రప్రభేదాశ్చ ప్రస్థానాని పృథక్ పృథక్ ॥23॥

మనసా కర్మణా వాచా కృచ్ఛ్రాద్వార్తా ప్రసిద్ధ్యతి ।
ద్వాపరేష్వభివర్తన్తే మతిభేదాస్తథా నృణామ్ ॥24॥

ఆయుర్వేదవికల్పాలు, జ్యౌతిషము మొదలగు వేదాంగాల వికల్పాలు, అర్థశాస్త్ర వికల్పాలు, హేతుశాస్త్ర వికల్పాలు సంభవిస్తాయి. కల్పసూత్రాల ప్రక్రియలో భాష్యవిద్యలో వికల్పనం, స్మృతి శాస్త్ర ప్రభేదాలు, విడివిడిగా ప్రస్థానాలు ద్వాపరంలో ప్రవర్తిల్లుతాయి. మనోవాక్కాయ కర్మలలో ఎంతో శ్రమపడితేగాని లోకయాత్ర జరుగదు. మనుజుల్లో అలా మతిభేదాలు గూడా ఏర్పడుతాయి.

ద్వాపరే సర్వభూతానాం కాలః క్లేశపరః స్మృతః ।
లోభో భృతిర్వణిగ్యుద్ధం తత్త్వానామవినిశ్చయః ॥25॥

వేదశాస్త్రప్రణయనం వర్ణానాం సంకరస్తథా ।
వర్ణాశ్రమపరిధ్వంసః కామద్వేషౌ తథైవ చ ॥26॥

పూర్ణే వర్షసహస్రే ద్వే పరమాయుస్తదా నృణామ్ ।
నిఃశేషే ద్వాపరే తస్మింస్తస్య సన్ధ్యా తు పాదతః ॥27॥

ద్వాపరంలో సకలప్రాణులకు కాలం క్లేశపరంగానే ఉంటుంది. లోభం, భృతి, వాణిజ్యం, యుద్ధం, తత్త్వాల అనిశ్చయం, భిన్నభిన్న వేదశాస్త్రాల నిర్మాణం, వర్ణసాంకర్యం, వర్ణాశ్రమవినాశం, కామం, ద్వేషం అట్లే ఈ యుగంలో రెండువేల పూర్ణసంవత్సరాల పరమాయువు కల్గుతాయి. ద్వాపరయుగసంధ్యాకాలంలో యుగకాలధర్మంలో చతుర్థాంశం, సంధ్యాంశకాలంలో అందులో చతుర్థాంశం ధర్మం ప్రవర్తిల్లుతుంది.

గుణహీనాస్తు తిష్ఠన్తి ధర్మస్య ద్వాపరస్య తు ।
తథైవ సన్ధ్యా పాదేన అంశస్తస్యాం ప్రతిష్ఠితః ॥28॥

ద్వాపరధర్మంలో గుణహీనులుంటారు కాని అంశం గూడా సంధ్యాపాదంలో ప్రతిష్ఠితమై వుంటుంది.

ద్వాపరస్య తు పర్యాయే తిష్యస్య చ నిబోధత ।
ద్వాపరస్యాంశశేషే తు ప్రతిపత్తిః కలేరథ ॥29॥

ద్వాపరానికీ, తిష్యానికీ (కలికి) గల స్వరూపం తెలుసుకోండి! ద్వాపరాంశ శేషంలోనే కలిప్రతిపత్తి జరుగుతుంది.

హింసా స్తేయానృతం మాయా వధశ్చైవ తపస్వినామ్ ।
ఏతే స్వభావాస్తిష్యస్య సాధయన్తి చ తాః ప్రజాః ॥30॥

హింస, చౌర్యం, అసత్యం, మాయ, తపస్వుల వధ ఇవి కలిస్వభావాలు. ప్రజలు ఈ ప్రవృత్తులనుపాటిస్తారు.

ఏష ధర్మః స్మృతః కృత్స్నో ధర్మశ్చ పరిహీయతే ।
మనసా కర్మణా వాచా వార్తాః సిద్ధ్యన్తి వా న వా ॥31॥

ఇదే కలిధర్మం, సమస్త ధర్మమూ క్షీణిస్తుంది. మనోవాక్కాయాలచే లోకయాత్ర సిద్ధించునో, లేదో తెలియలేము.

కలిః ప్రమారకో రోగః సతతం చాపి క్షుద్భయమ్ ।
అనావృష్టిభయం చైవ దేశానాం చ విపర్యయః ॥32॥

కలి ప్రాణులకు అధిక మరణకారకం. రోగం, సదా ఆకలి భయం, అనావృష్టిభయం, దేశాల ఉపద్రవం ఇవి కలి లక్షణాలు.

న ప్రమాణే స్థితిర్హ్యస్తి తిష్యే ఘోరే యుగే కలౌ ।
గర్భస్థో మ్రియతే కశ్చిద్యౌవనస్తస్తథాऽపరః ॥33॥

భీకరమైన కలిలో (తిష్యంలో) ప్రమాణవిషయంలో ప్రజలకు నిలకడ ఉండదు. ఒకడు గర్భస్థుడుగానే మరణిస్తాడు, యౌవనంలోనే ఉండి మరొకడు మృతి చెందుతాడు.

స్థావిరేవాऽథకౌమారే మ్రియన్తే చ కలౌ ప్రజాః ।
అల్పతేజోబలాః పాపా మహాకోపా హ్యధార్మికాః ॥34॥

వార్ధకంలో లేదా, కౌమారంలో, కలిలో ప్రజలు మరణిస్తారు. వారు అల్పతేజోబలులు, పాపులు, మహాకోపం కలవారు, అధార్మికులుగా వుంటారు.

అనృతవ్రతలుబ్ధాశ్చ తిష్యే చైవ ప్రజాః స్థితాః ।
దురిష్టైర్దురధీతైశ్చ దురాచారైర్దురాగమైః ॥35॥

విప్రాణాం కర్మదోషైస్తైః ప్రజానాం జాయతే భయమ్ ।
హింసా మానస్తథేర్ష్యా చ క్రోధోऽసూయాऽక్షమాऽధృతిః ॥36॥

తిష్యే భవన్తి జంతూనాం లోభో మోహశ్చ సర్వశః ।
సంక్షోభో జాయతేऽత్యర్థం కలిమాసాద్య వై యుగమ్ ॥37॥

ప్రజలు అసత్యవ్రతులు, లుబ్ధులుగా వుంటారు. దుష్టవాంఛలు, దురధ్యయనాలు, దురాచారాలు, దుష్టశాస్త్రాలు, వీటి వృద్ధిచేత, విప్రుల కర్మదోషాలవల్లా, ప్రజలకు భయం కల్గుతుంది. ప్రాణులకు హింస, మానం, ఈర్ష్య, క్రోధం, అసూయ, అక్షమ, అధృతి, లోభం, మోహం, కలిలో కలుగుతాయి. కలి రాగానే మిక్కిలి సంక్షోభం కలుగుతుంది.

నాధీయన్తే తథా వేదా న యజన్తే ద్విజాతయః ।
ఉత్సీదన్తి తథా చైవ వైశ్యైః సార్ధం తు క్షత్రియాః ॥38॥

ద్విజాతులు వేదాలను చదువరు, యజ్ఞాలు చేయరు. వైశ్యులతో గూడా క్షత్రియులు క్షీణిస్తారు.

శూద్రాణాం మంత్రయోనిస్తు సంబన్ధో బ్రాహ్మణైః సహ ।
భవతీహ కలౌ తస్మిన్ శయనాసనభోజనైః ॥39॥

శూద్రులు విప్రులతో శయనాసనభోజనాలలో కలుస్తారు, మంత్రసంబంధం, కామసంబంధం కల్గివుంటారు.

రాజానః శూద్రభూయిష్ఠాః పాషణ్డానాం ప్రవృత్తయః ।
కాషాయిణశ్చ నిష్కచ్ఛాస్తథా కాపాలినశ్చ హ ॥40॥

యే చాన్యే దేవవ్రతినస్తథా యే ధర్మదూషకాః ।
దివావ్రతాశ్చ యే కేచిద్వృత్త్యర్థం శ్రుతిలింగినః ॥41॥

రాజులు శూద్రప్రధానులుగా వుంటారు. పాషండప్రవృత్తులు కల్గి సన్న్యాసులు, నిష్కచ్ఛులు, (గోచి లేక పై వస్త్రాలు ధరించేవారు) కాపాలికులు, దేవవ్రతులైన ఇతరులు, ధర్మదూషకులు, కొందరు దివావ్రతులు (పగలు వ్రతస్థులవలె నటించువారు) జీవనం కొరకు వేదాధ్యయనం చేసినట్లుండువారు వుంటారు.

ఏవంవిధాశ్చ యే కేచిద్భవన్తీహ కలౌ యుగే ।
అధీయతే తదా వేదాన్ శూద్రా ధర్మార్థకోవిదాః ॥42॥

కలిలో ఇట్టివారు అనేకులుంటారు. వారిలో శూద్రులు వేదాలను పఠిస్తారు. వారు ధర్మార్థ కోవిదులవుతారు.

యజన్తి హ్యశ్వమేధైస్తు రాజానః శూద్రయోనయః ।
స్త్రీబాలగోవధం కృత్వా హత్వా చైవ పరస్పరమ్ ॥43॥

శూద్రయోనులైన రాజులు అశ్వమేధాలు చేస్తారు. స్త్రీలను, బాలురను, గోవులను వధించి ఒకరినొకరు చంపుకొంటారు.

ఉపకృత్య తథాఽన్యోన్యం సాధయన్తి తదా ప్రజాః ।
దుఃఖప్రచురతాల్పాఽయుర్దేశోత్సాదః సరోగతాః ॥44॥

అధర్మాభినివేశిత్వం తమోవృత్తం కలౌ స్మృతమ్ ।
భ్రూణహత్యా ప్రజానాం చ తథా హ్యేవం ప్రవర్తతే ॥45॥

తస్మాదాయుర్బలం రూపం ప్రహీయన్తే కలౌ యుగే ।
దుఃఖేనాభిప్లుతానాం చ పరమాయుః శతం నృణామ్ ॥46॥

ఇలా ప్రజలు స్వార్థానికై పరోపకారం చేసి పరస్పరం మోసగించుకొని దుఃఖాధిక్యం, అల్పాయువు, దేశనాశం, రోగపీడ, అధర్మాభినివేశం, తమోవృత్తి, భ్రూణహత్య కలిగి ఉంటారు. అందువల్ల కలియుగంలో ఆయువు, బలం, రూపం క్షీణిస్తాయి. దుఃఖంలో మునిగిన వీరికి పరమాయువు నూరు సంవత్సరాలే.

భూత్వా చ న భవన్తీహ వేదాః కలియుగేఽఖిలాః ।
ఉత్సీదన్తే తథా యజ్ఞాః కేవలం ధర్మహేతవః ॥47॥

కలిలో సకలవేదాలు ఉండి కూడా ఉండనివే. కేవలం ధర్మహేతువులైన యజ్ఞాలు గూడా క్షీణిస్తాయి.

ఏషా కలియుగావస్థా సంధ్యాంశౌ తు నిబోధత ।
యుగే యుగే తు హీయన్తే త్రీంస్త్రీన్ పాదాంశ్చ సిద్ధయః ॥48॥

ఇది కలియుగావస్థ. ఇక సంధ్యా సంధ్యాంశంలోని విషయం గ్రహించండి! యుగయుగానికీ ఆ యా యుగాల సద్ధర్మాలు దాని సంధ్యాకాలంలో మూడు వంతులు నశించి నాల్గవ వంతు శేషిస్తాయి.

యుగస్వభావాః సంధ్యాసు అవతిష్ఠన్తి పాదతః ।
సంధ్యాస్వభావాః స్వాంశేషు పాదేనైవావతస్థిరే ॥49॥

యుగస్వభావాలు సంధ్యలలో పాదాంశం మిగిలివుంటాయి. అనగా కలి సంధ్యాకాలం గడచి సంధ్యాంశ కాలం వచ్చిన యుగావసానంలో ఇలా జరుగుతుంది.

ఏవం సంధ్యాంశకే కాలే సంప్రాప్తే తు యుగాంతికే ।
తేషామధర్మిణాం శాస్తా భృగూణాం చ కులే స్థితః ॥50॥

ఇలా సంధ్యాంశకమైన యుగాన్తిక కాలం రాగానే ఆ అధార్మికులను శిక్షించువాడు భృగువుల కులంలో జన్మిస్తాడు.

గోత్రేణ వై చంద్రమసో నామ్నా ప్రమతిరుచ్యతే ।
కలిసంధ్యాంశభాగేషు మనోః స్వాయంభువేఽంతరే ॥51॥

సమాస్త్రింశత్తు సంపూర్ణాః పర్యటన్వై వసుంధరామ్ ।
అస్త్రకర్మా స వై సేనాం హస్త్యశ్వరథసంకులామ్ ॥52॥

ప్రగృహీతాయుధైర్విప్రైః శతశోఽథ సహస్రశః ।
స తదా తైః పరివృతో మ్లేచ్ఛాన్ సర్వాన్నిజఘ్నివాన్ ॥53॥

అతడు చంద్రమసగోత్రజుడు. ప్రమతి అను పేరు గలవాడు. కలిసంధ్యాంశభాగాలలో స్వాయంభువ మన్వంతరంలో 30సంవత్సరాలు పూర్తిగా భూమిపై పర్యటిస్తూ అస్త్రకర్ముడై గజాశ్వరథ వ్యాప్తమైన సేనను వెంటబెట్టుకొని వందలకొలది, వేలకొలదిగా విప్రులు ఆయుధాలు ధరించి రాగా వారితో గూడి మ్లేచ్ఛుల నందరినీ సంహరిస్తాడు.

స హత్వా సర్వశశ్చైవ రాజానః శూద్రయోనయః ।
పాషండాన్ స తదా సర్వాన్నిఃశేషానకరోత్ప్రభుః ॥54॥

ఆ ప్రభువు అంతటా శూద్రయోనులగు రాజులను, పాషండులను, అందరినీ చంపి నిశ్శేషం చేస్తాడు.

అధార్మికాశ్చ యే కేచిత్తాన్ సర్వాన్ హంతి సర్వశః ।
ఉదీచ్యాన్మధ్యదేశ్యాంశ్చ పార్వతీయాంస్తథైవ చ ॥55॥

ప్రాచ్యాన్ ప్రతీచ్యాంశ్చ తథా వింధ్యపృష్ఠాపరాంతికాన్ ।
తథైవ దాక్షిణాత్యాంశ్చ ద్రవిడాన్సింహలైః సహ ॥56॥

గాంధారాన్ పారదాంశ్చైవ పహ్లావాన్యవనాన్ శకాన్ ।
తుషారాన్బర్బరాన్ శ్వేతాన్ పులిందాన్పుల్కసానథ ॥57॥

లంబకానాంధ్రకాంశ్చాపి చోరజాతీంస్తథైవ చ ।
ప్రవృత్తచక్రో బలవాంఛూద్రాణామన్తకృద్బభౌ ॥58॥

ఎవరెవరు అధార్మికులో వారందరినీ అన్ని వైపులా సంహరిస్తాడు. ఉత్తరప్రాంతీయులు, మధ్య దేశీయులు, పార్వతీయులు, ప్రాచ్యులు, ప్రతీచ్యులు, వింధ్య పృష్ఠ అపరాంతికులు, దాక్షిణాత్యులు, సింహళాదులతో సహా ద్రవిడులు, గాంధారులు, పారదులు, పల్లవులు, యవనులు, శకులు, తుషారులు, బర్బరులు, శ్వేతులు, పులిందులు, పుల్కసులు, లంబకులు, ఆంధ్రకులు, చోరజాతులు వీరిని చక్రం త్రిప్పుతూ బలవంతుడై శూద్రులను చంపుతూ భాసిస్తాడు.

విద్రావ్య సర్వభూతాని చచార వసుధామిమామ్ ।
మానవస్య తు వంశే తు నృదేవస్యేహ జజ్ఞివాన్ ॥59॥

సకల ప్రాణులనూ తరిమి ఈ వసుధాతలంలో చరిస్తాడు. అతడు నృదేవుడైన మనువువంశంలో జనించినవాడు.

పూర్వజన్మని విష్ణుశ్చ ప్రమతిర్నామ వీర్యవాన్ ।
సుతః స వై చంద్రమసః పూర్వం కలియుగే ప్రభుః ॥60॥

పూర్వజన్మలో విష్ణువు, ఇప్పుడు ప్రమతి, వీర్యసంపన్నుడు, పూర్వం కలియుగంలో స్వయం చంద్రమసుని సుతుడుగా ప్రసిద్ధుడు.

ద్వాత్రింశేఽభ్యుదితే వర్షే ప్రక్రాంతో వింశతిం సమాః ।
నిజఘ్నే సర్వభూతాని మానుషాణ్యేవ సర్వశః ॥61॥

ముప్పది రెండవ సంవత్సరం వచ్చేసరికి ఇరువది సంవత్సరాలపాటు నలువైపులా మానుషములైన సర్వప్రాణులనూ హతమార్చాడు.

కృత్వా బీజావశిష్టాం తాం పృథ్వీం క్రూరేణ కర్మణా ।
పరస్పరనిమిత్తేన కాలేనాకస్మికేన చ ॥62॥

సంస్థితా సహసా యా తు సేనా ప్రమతినా సహ ।
గంగాయమునయోర్మధ్యే సిద్ధిం ప్రాప్తా సమాధినా ॥63॥

అట్టి క్రూరకర్మతో భూమిని బీజమాత్రావశిష్టం చేశాడు. పరస్పర నిమిత్తంగానూ, కాలంచేతా, ఆకస్మికంగానూ ప్రమతితో గూడా ఉన్న సేన గంగాయమునల మధ్య సమాధిలో సిద్ధి పొందింది.

తతస్తేషు ప్రనష్టేషు సంధ్యాంశే క్రూరకర్మసు ।
ఉత్సాద్య పార్థివాన్ సర్వాంస్తేష్వతీతేషు వై తదా ॥64॥

తతః సంధ్యాంశకే కాలే సంప్రాప్తే చ యుగాన్తికే ।
స్థితా స్వల్పావశిష్టాసు ప్రజాస్విహ క్వచిత్క్వచిత్ ॥65॥

ఆ విధంగా సంధ్యాంశంలో క్రూరకర్ములగు జనులు పూర్తిగా నశించిపోగా రాజుల నందరినీ వధించాడు. వారు కడచనగా ఆపై సంధ్యాంశకకాలం రాగా, యుగాన్తం ప్రాప్తించగా ప్రజలు ఎక్కడెక్కడో కొంచెం కొంచెం మిగిలిన వారయ్యారు.

స్వప్రధానాస్తదా తే వై లోభావిష్టాస్తు వృన్దశః ।
ఉపహింసన్తి చాన్యోన్యం ప్రలుంపన్తి పరస్పరమ్ ॥66॥

స్వప్రాధాన్యం వల్ల అప్పుడు ప్రజలు లోభావిష్టులై గుంపులు గుంపులుగా ఒకరినొకరు హింసించుకొన్నారు, దోచుకొన్నారు.

అరాజకే యుగాంశే తు సంక్షయే సముపస్థితే ।
ప్రజాస్తా వై తదా సర్వాః పరస్పరభయార్దితాః ॥67॥

వ్యాకులాస్తాః పరావృత్తాస్త్యజ్య దేవగృహాణి తు ।
స్వాన్స్వాన్ ప్రాణానవేక్షన్తో నిష్కారుణ్యాత్సుదుఃఖితాః ॥68॥

యుగాంశం అరాజకం కాగా, సంక్షయం సమీపించగా ఆ మిగిలిన జనులందరూ పరస్పరం భయపీడితులయ్యారు. దేవగృహాలు వదలి వ్యాకులత చెంది తమ తమ ప్రాణాలకొరకై నిష్కారుణ్యంగా మిక్కిలి దుఃఖాలు పాలయ్యారు.

నష్టే శ్రౌతస్మృతే ధర్మే కామక్రోధవశానుగాః ।
నిర్మర్యాదా నిరానన్దా నిఃస్నేహాః నిరపత్రపాః ॥69॥

శ్రౌతస్మార్త ధర్మాలు నశించాయి. ప్రజలు కామక్రోధవశులై, మర్యాద, సంతోషం, స్నేహం, సిగ్గు లేకుండా ప్రవర్తించారు.

నష్టే ధర్మే ప్రతిహతా హ్రస్వకాః పంచవింశకాః ।
హిత్వా దారాంశ్చ పుత్రాంశ్చ విషాదవ్యాకులాఃప్రజాః ॥70॥

ధర్మం నశించేసరికి కొద్దిమంది ఇరువది ఐదేండ్లప్రాయం వారు దార పుత్రులను వదలి విషాదవ్యాకులం పాలయ్యారు.

అనావృష్టి హతాస్తే వై వార్తాముత్సృజ్య దుఃఖితాః ।
ఆశ్రయన్తి స్మ ప్రత్యన్తాన్ హిత్వా జనపదాన్స్వకాన్ ॥71॥

సరితః సాగరానూపాన్ సేవన్తే పర్వతానపి ।
చీరకృష్ణాజినధరా నిష్క్రియా నిష్పరిగ్రహాః ॥72॥

అనావృష్టితో బాధపడి జీవనోపాధివదలి దుఃఖం పాలై తమతమ గ్రామాలు వదలి కొండలను, గుట్టలను ఆశ్రయించారు. వారు చీర కృష్ణాజినాలు దాల్చి పనిలేక, పరిగ్రహంలేక నదులనూ, సాగరాలనూ, కొండలనూ సేవించారు.

వర్ణాశ్రమపరిభ్రష్టాః సంకరం ఘోరమాస్థితాః ।
ఏవం కష్టమనుప్రాప్తా హ్యల్పశేషాః ప్రజాస్తతః ॥73॥

ఇలా వర్ణాశ్రమపరిభ్రష్టులై ఘోరమైన వర్ణసాంకర్యం పొంది కష్టాలపాలై ప్రజలు అల్పావశేషులయ్యారు.

జన్తవశ్చ క్షుధావిష్టా దుఃఖాన్నిర్వేదమాగమన్ ।
సంశ్రయన్తి చ దేశాంస్తాంశ్చక్రవత్పరివర్తనాః ॥74॥

జంతువులు గూడా ఆకలితో తపించి దుఃఖంతో నిర్వేదం పొందాయి. చక్రంలాగా తిరుగుతూ తిరుగుతూ ఆయాదేశాల నాశ్రయించాయి.

తతః ప్రజాస్తు తాః సర్వా మాంసాహారా భవన్తి హి ।
మృగాన్వరాహాన్వృషభాన్ యే చాన్యే వనచారిణః ॥75॥

భక్ష్యాంశ్చైవాప్యభక్ష్యాంశ్చ సర్వాంస్తాన్ భక్షయన్తి తాః ।
సముద్రం సంశ్రితా యాస్తు నదీశ్చైవ ప్రజాస్తు తాః ॥76॥

తేఽపి మత్స్యాన్ హరన్తీహ ఆహారార్థం చ సర్వశః ।
అభక్ష్యాహారదోషేణ ఏకవర్ణగతాః ప్రజాః ॥77॥

ఆపై ఆ ప్రజలంతా మాంసాహారులయ్యారు. మృగాలను, పందులను, ఎద్దులను, ఇంకా తక్కిన వనచారులను, తినదగినవి, తగనివి అన్నింటినీ తినసాగారు. సముద్రాన్నీ, నదులనూ ఆశ్రయించినవారు మత్స్యాలను ఆహారార్థం హరించారు. అలా అభక్ష్యాహారదోషం చేత అందరూ ఒకే వర్ణస్థులయ్యారు.

యథా కృతయుగే పూర్వమేకవర్ణమభూత్ కిల ।
తథా కలియుగస్యాన్తే శూద్రీభూతాః ప్రజాస్తథా ॥78॥

కృతయుగంలో పూర్వం ప్రజలు ఏకవర్ణస్థులైనట్లే కలియుగాంతంలో జనులందరూ శూద్రులై పోయారు.

ఏవం వర్షశతం పూర్ణం దివ్యం తేషాం న్యవర్తత ।
షట్త్రింశచ్చ సహస్రాణి మానుషాణి తు తాని వై ॥79॥

ఇలా నూరు దివ్యసంవత్సరాలు పూర్తి అయ్యాయి. అవి ముప్పది ఆరువేల మానుష సంవత్సరాలు.

అథ దీర్ఘేణ కాలేన పక్షిణః పశవస్తథా ।
మత్స్యాశ్చైవ హతాః సర్వైః క్షుధావిష్టైశ్చ సర్వశః ॥80॥

ఆపై దీర్ఘకాలానికి పక్షులు, పశువులు, చేపలు – అన్నీ అంతటా ఆకలిగల వారిచే హతమైనాయి.

నిఃశేషేష్వథ సర్వేషు మత్స్యపక్షిపశుష్వథ ।
సంధ్యాంశే ప్రతిపన్నే తు నిఃశేషాస్తు తదా కృతాః ॥81॥

మత్స్యాలు, పక్షులు, పశువులు – అన్నీ నిశ్శేషమైనాయి. సంధ్యాంశం రాగానే ఏదీ మిగలని స్థితి ఏర్పడింది.

తతః ప్రజాస్తు సంభూయ కన్దమూలమథోఽఖనన్ ।
ఫలమూలాశనాః సర్వే అనికేతాస్తథైవ చ ॥82॥

ఆపై ప్రజలు కలిసి కందమూలాలు త్రవ్వుకొన్నారు. అందరూ ఫలమూలభక్షణ పరులయ్యారు. ఉండడానికి గృహాలు లేని వారయ్యారు.

వల్కలాన్యథ వాసాంసి అధఃశయ్యాశ్చ సర్వశః ।
పరిగ్రహో న తేష్వస్తి ధనశుద్ధిమవాప్నుయుః ॥83॥

నారచీరలు ధరించారు. అందరూ నేలపై శయనించేవారు. వారిలో పరిగ్రహం లేదు. వారు ధనశుద్ధి పొందారు.

ఏవం క్షయం గమిష్యన్తి హ్యల్పశిష్టా ప్రజాస్తదా ।
తాసామల్పావశిష్టానామాహారాద్వృద్ధిరిష్యతే ॥84॥

అప్పుడు అల్పావశిష్టులైన జనులు అలా క్షయం పొందుతారు. వారు చాలా తక్కువమంది మిగలిన కారణాన ఆహారం వల్ల వారిలో వృద్ధి కల్గింది.

ఏవం వర్షశతం దివ్యం సంధ్యాంశస్తస్య వర్తతే ।
తతో వర్షశతస్యాన్తే అల్పశిష్టాః స్త్రియః సుతాః ॥85॥

మిథునాని తు తాః సర్వా హ్యన్యోన్యం సంప్రజజ్ఞిరే ।
తతస్తాస్తు మ్రియన్తే వై పూర్వోత్పన్నాః ప్రజాస్తు యాః ॥86॥

జాతమాత్రేష్వపత్యేషు తతః కృతమవర్తత ।
యథా స్వర్గే శరీరాణి నరకే చైవ దేహినామ్ ॥87॥

ఇలా నూరు దివ్యవర్షాలు, దాని సంధ్యాంశమై గడచింది. వర్షశతం పూర్తికాగానే అల్పావశిష్టులైన స్త్రీలు, సుతులు, ఆ మిథునాలందరూ పరస్పరసంతతిని కన్నారు. ముందు పుట్టినవారు తమకు బిడ్డలు పుట్టగానే

మరణించారు. తర్వాత కృతయుగం ఆరంభమయింది. వారి కర్మానుసారంగా కొందరి శరీరాలు స్వర్గంలో, మరికొందరివి నరకంలో ఉత్పత్తుల ననుభవిస్తాయి.

ఉపభోగసమర్థాని ఏవం కృతయుగాదిషు ।
ఏవం కృతస్య సన్తానః కలేశ్చైవ క్షయస్తథా ॥88॥

విచారణాత్తు నిర్వేదః సామ్యావస్థాత్మనా తథా ।
తతశ్చైవాత్మసంబోధః సంబోధాద్ధర్మశీలతా ॥89॥

కృతయుగాదులలో కృతంలో సంతానం, కలిలో క్షయం జరుగుతుంది. దీనినంతా విచారించడంవల్ల నిర్వేదం కల్గుతుంది. ఆపై సామ్యావస్థ సిద్ధిస్తుంది. ఆపై ఆత్మజ్ఞానం, దానితో ధర్మశీలత కల్గుతాయి.

కలిశిష్టేషు తేష్వేవం జాయన్తే పూర్వవత్ప్రజాః ।
భావినోఽర్థస్య చ బలాత్తతః కృతమవర్తత ॥90॥

కలిలో అవశిష్టులైనవారిలో పూర్వంలాగా ప్రజాసంతతి కల్గుతుంది. జరుగనున్న అర్థము యొక్క బలంవల్ల ఆపై కృతయుగం ప్రాప్తమయింది.

అతీతానాగతాని స్యుర్యాని మన్వన్తరేష్విహ ।
ఏతే యుగస్వభావాస్తు మయోక్తాస్తు సమాసతః ॥91॥

విస్తరేణానుపూర్వ్యాచ్చ నమస్కృత్య స్వయంభువే ।
ప్రవృత్తే తు తతస్తస్మిన్ పునః కృతయుగే తు వై ॥92॥

ఉత్పన్నాః కలిశిష్టేషు ప్రజాః కార్తయుగాస్తథా ।
తిష్ఠన్తి చేహ యే సిద్ధా అదృష్టా విహరన్తి చ ॥93॥

మన్వంతరాలలో గడచినవి, రానున్న వేవి కలవో, అట్టి యుగస్వభావాలను విస్తరంగానూ, క్రమంగానూ నేను సంగ్రహించి స్వయంభువునకు నమస్కరించి చెప్పాను. అలా మరల కృతయుగం ప్రవృత్తం కాగా కలిలోమిగిలిన వారికి కృతయుగప్రజలు సంభవించారు. సిద్ధులైన వారిక్కడ ఉన్నారు. వారు కంటికి కనిపించకుండా విహరిస్తుంటారు.

సహ సప్తర్షిభిర్యే తు తత్ర యే చ వ్యవస్థితాః ।
బ్రహ్మక్షత్రవిశః శూద్రా బీజార్థే య ఇహ స్మృతాః ॥94॥

తేషాం సప్తర్షయో ధర్మం కథయన్తీహ తేషు చ ॥95॥
వర్ణాశ్రమాచారయుతం శ్రౌతస్మార్తా విధానతః ।

ఏవం తేషు క్రియావత్సు ప్రవర్తన్తీహ వై కృతే ॥96॥

సప్తర్షులతో సహా అక్కడ ఎవరున్నారో, బ్రహ్మక్షత్రవైశ్యులు, శూద్రులు ఎవరు బీజార్థం ఇక్కడ స్మరింపబడినారో. వారికి సప్తర్షులు శ్రౌతస్మార్త విధానాన్ని బట్టి వర్ణాశ్రమాచారాలలో గూడిన ధర్మాన్ని బోధిస్తారు. వారు అలా క్రియావంతులై కృతయుగంలో ప్రవర్తిస్తారు.

శ్రౌతస్మార్తస్థితానాం తు ధర్మే సప్తర్షిదర్శితే ।
తే తు ధర్మవ్యవస్థార్థం తిష్ఠన్తీహ కృతే యుగే ॥97॥

సప్తర్షులు నిర్దేశించిన శ్రౌత స్మార్తానుసారియయిన ధర్మంలో వారు ఉంటారు. ఆ సప్తర్షులు ధర్మవ్యవస్థ కొరకు కృతయుగంలో ఉన్నారు.

మన్వన్తరాధికారేషు తిష్ఠన్తి ఋషయస్తు తే ।
యథా దావప్రదగ్ధేషు తృణేష్వేవాపరం తృణమ్ ॥98॥

వనానాం ప్రథమం వృష్ట్యా తేషాం మూలేషు సంభవః ।
ఏవం యుగాద్యుగానాం వై సన్తానస్తు పరస్పరమ్ ॥99॥

ఆ ఋషులు మన్వంతరాధికారాలలో ఉంటారు. తృణాలు దావానలంలో దగ్ధం కాగా వర్షంవల్ల ఆ వ్రేళ్ళ మొక్కలనుండి మరొక తృణం సంభవించినట్లు యుగంనుండి పరస్పరం యుగాల సంభవం జరుగుతుంది.

ప్రవర్తతే హ్యవిచ్ఛేదా హ్యావన్మన్వంతరక్షయః ।
సుఖమాయుర్బలం రూపం ధర్మార్థౌ కామ ఏవ చ ॥ 100॥

యుగేష్వేతాని హీయన్తే త్రయః పాదాః క్రమేణ తు ।
ఇత్యేష ప్రతిసంధిర్వః కీర్తితస్తు మయా ద్విజాః! ॥101॥

మన్వంతర క్షయంవరకూ అవిచ్ఛిన్నంగా ఇది జరుగుతుంది. సుఖం, ఆయువు, బలం, రూపం, ధర్మం, అర్థం, కామం ఇవి యుగాలలో మూడు పాదాలు క్రమంగా క్షీణిస్తాయి. ద్విజులారా! మీకు నేను ప్రతిసంధిని గూర్చి వివరించాను.

చతుర్యుగానాం సర్వేషామేతదేవ ప్రసాధనమ్ ।
ఏషాం చతుర్యుగానాం తు గణితా హ్యేకసప్తతిః ॥102॥

క్రమేణ పరివృత్తాస్తా మనోరన్తరముచ్యతే ।
యుగాఖ్యాసు తు సర్వాసు భవతీహ యదా చ యత్ ॥103॥

నాలుగు యుగాల కన్నింటికీ ఇదే ప్రసాధనం. చతుర్యుగాలు డెబ్బది ఒక్క సార్లు గుణితమైతే క్రమంగా మారిన అవియే మన్వంతర మనబడుతాయి. యుగాఖ్య గల అన్నింటిలోనూ ఇది అనువర్తిస్తుంది.

తదేవ చ తదన్యాసు పునస్తద్వై యథాక్రమమ్ ।
సర్గే సర్గే యథా భేదా హ్యుత్పద్యన్తే తథైవ చ ॥104॥

అదే ఇతర యుగాలలో కూడా ఉంటుంది. యథాక్రమంగా ప్రతిసర్గంలో భేదాలు కల్గినట్లే, ఇక్కడ కూడా జరుగుతుంది.

చతుర్దశసు జాయన్తో జ్ఞేయా మన్వన్తరేష్విహ ।
ఆసురీ యాతుధానీ చ పైశాచీ యక్షరాక్షసీ ॥105॥

పదునాలుగు మన్వంతరాలలో ఈ పరివర్తనం గ్రహించాలి. మానవులే కాక ఆసురి, యాతుధాని, పైశాచి, యక్షరాక్షసి జాతులకు చెందినవారు కూడా జనిస్తారు.

యుగే యుగే తదా కాలే ప్రజా జాయన్తి తాః శృణు ।
యథాకల్పయుగై స్సార్ధం భవన్తే తుల్యలక్షణాః ।
ఇత్యేతల్లక్షణం ప్రోక్తం యుగానాం వై యథాక్రమమ్ ॥106॥

ప్రతియుగంలోనూ ఆయాకాలాలలో ప్రజలు కల్గుతారు, వారిని గూర్చి వినండి. కల్పానుసారంగా యుగాలతో గూడా సమానలక్షణాలు గలవారు జన్మిస్తారు. ఈ లక్షణం యుగాలకు సంబంధించి యథాక్రమంగా చెప్పడమయింది.

మన్వన్తరాణాం పరివర్తనాని చిరప్రవృత్తాని యుగస్వభావాత్ ।
క్షణం న సన్తిష్ఠతి జీవలోకః క్షయోదయాభ్యాం పరివర్తమానః ॥107॥

యుగస్వభావం వల్ల బహుకాలంనుండి సంభవించిన మన్వంతరాలయొక్క మార్పు లివి. జీవలోకం క్షణం కూడా స్థిరంగా ఉండదు. క్షయం, ఉదయం– వీటి మధ్య పరిభ్రమిస్తూ వుంటుంది.

ఏతే యుగస్వభావా వః పరిక్రాన్తా యథాక్రమమ్ ।
మన్వన్తరాణి యాన్యస్మిన్కల్పే వక్ష్యామి తాని చ ॥108॥

మీ కీయుగ స్వభావాలను యథాక్రమంగా వివరించాను. ఈ కల్పంలో ఏవి మన్వంతరాలు కలవో అవి కూడా చెబుతాను.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే ద్వాపరయుగధర్మాః ఇతి చతుశ్చత్వారింశదధికశతతమోఽధ్యాయః ॥ 144 ॥

శ్రీమత్స్య మహాపురాణంలోని ద్వాపరయుగ ధర్మాలనే నూటనలబైనాల్గవ అధ్యాయం సంపూర్ణం

పంచచత్వారింశదధికశతతమో౬ధ్యాయః - నూటనలభై అయిదవ అధ్యాయం

దేవాసుర యక్షగంధర్వ మనుష్యాది పరిమాణోత్సేధ కథనమ్

దేవాసుర యక్షగంధర్వ మనుష్యాదుల పరిమాణోత్సేధ కథనం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

మన్వన్తరాణి యాని స్యుః కల్పే కల్పే చతుర్దశ ।
వ్యతీతానాగతాని స్యుర్యాని మన్వన్తరేష్విహ ॥1॥

విస్తరేణానుపూర్వ్యాచ్చ స్థితిం వక్ష్యే యుగే యుగే ।
తస్మిన్యుగే చ సంభూతిర్యాసాం యావచ్చ జీవితమ్ ॥2॥

ప్రతి కల్పంలోనూ వచ్చే ఏయే పదునాలుగు మన్వంతరాలున్నవో ఆయా మన్వంతరాలలో కడచినవేవో, రానున్నవేవో విస్తరంగానూ, క్రమంగానూ యుగయుగంలోనూ ఉండే స్థితిని చెబుతాను. ఆ యుగాలలో పుట్టేవారు, వారి జీవిత మెంతకాలం ఇత్యాది విషయాలు వివరిస్తాను.

యుగమాత్రం తు జీవన్తి న్యూనం తత్స్యాద్ద్వయేన చ ।
చతుర్దశసు తావంతో జ్ఞేయా మన్వన్తరేష్విహ ॥3॥

పదునాలుగు మన్వంతరాలలోనూ కృతాదియుగాలలో సంధ్యా సంధ్యాంశాలు కాక దివ్యమానమునందు ఆ యుగప్రమాణం మేరకే అందలి మానవులు జీవిస్తారని తెలుసుకోవాలి.

మనుష్యాణాం పశూనాం చ పక్షిణాం స్థావరైః సహ ।
తేషామాయురుపక్రాన్తం యుగధర్మేషు సర్వశః ॥4॥

యుగధర్మాన్ని బట్టి ఆ యా యుగాలలోని మనుజులు, పశువులు, పక్షులు, స్థావరాలతో సహా వాటి ఆయుఃపరిమాణం ఏర్పడింది.

తథైవాయుః పరిక్రాన్తం యుగధర్మేషు సర్వశః ।
అస్థితిం చ కలౌ దృష్ట్వా భూతానామాయుషశ్చ వై ॥5॥

పరమాయుః శతం త్వేతన్మానుషాణాం కలౌ స్మృతమ్ ।
దేవాసురమనుష్యాశ్చ యక్షగన్ధర్వరాక్షసాః ॥6॥

పరిణాహోచ్ఛ్రయే తుల్యా జాయన్తే హ కృతే యుగే ।
షణ్ణవత్యంగులోత్సేధో హ్యష్టానాం దేవయోనినామ్ ॥7॥

నవాంగులప్రమాణేన నిష్పన్నేన తథా౬ష్టకమ్ ।
ఏతత్స్వాభావికం తేషాం ప్రమాణమధికుర్వతామ్ ॥8॥

మనుష్యా వర్తమానాశ్చ యుగసంధ్యాంశకేష్విహ ।
దేవాసురప్రమాణం తు సప్తసప్తాంగులం క్రమాత్ ॥9॥

అట్లే యుగధర్మాలలో అంతటా ఆయువు పరిక్రాంతమై ఉంటుంది. కాని కలియుగంలో ప్రాణుల అస్థిరతను, దుర్బలతను గమనించి, మనుష్యుల పరమాయువు నూరు సంవత్సరాలుగా చెప్పబడింది. దేవాసురమనుష్యుల, యక్షగంధర్వరాక్షసుల శరీరాలు ఎత్తులోనూ, చుట్టుకొలతలోనూ కృతయుగంలో సమానస్థితి కలిగి జన్మిస్తారు. విద్యాధరాదులగు ఎనిమిది దేవజాతులు, మానవులూ కృతయుగంలో తొంబదియారు అంగుళాల ఎత్తు కలవారై యుంటారు. నవాంగుళ ప్రమాణంతో ఎనిమిది మంది దేవయోనులు ఉత్పన్నమయ్యారు. ఇది వారి స్వాభావిక ప్రమాణం. ఎనిమిది రకాల దేవయోనులకు తొంబది ఆరు అంగుళాల ఎత్తు నిర్ణీతమైనది. ఇది స్వాభావిక ప్రమాణం. యుగసంధ్యాంశాలలో వీరి ఎత్తు డెబ్బది రెండంగుళాలే. దేవాసురుల ఎత్తు కలిలో నలుబది తొమ్మిది అంగుళాలే.

చతురాశీతికైశ్చైవ కలిజైరంగులైః స్మృతమ్ ।
ఆపాదతలమస్తక్యే నవతాలో భవేత్తు యః ॥10॥
సంహత్యాజానుబాహుశ్చ దైవతైరభిపూజ్యతే ।

కలికాలపు రాక్షసుల శరీరం ఎత్తు ఎనుబది నాలుగు అంగుళాలు మాత్రమే. కాలిదిగువనుండి తల చివరి వరకు తొమ్మిది తాళముల ఎత్తు కలిగి మోకాళ్ళవరకు చేతులు గల మనుజులను దేవతలు ప్రశంసిస్తారు.

*మనుజుల కూడి చేతిబొటనువేలి నడిమ కణుపువద్ద అరచేతివైపు తెల్లనిభాగపు కొలత అంగుళముగా అడ్డముగా ఉంచిన ఎనిమిది యవలు ఆక్రమించు పొడవు అంగుళమని శాస్త్రవ్యవహారం. కుడిచేతి బొటనవేలిని, ఎడమకుచూపుడు వ్రేలిని కుడికిచాపగా ఈ రెంటినడుమ గల పొడవును తాళం లొడితి అంటారు.

గవాశ్వహస్తినాం చైవ మహిషస్థావరాత్మనామ్ ॥11॥
క్రమేణైతేన విజ్ఞేయే హ్రాసవృద్ధీ యుగే యుగే ।
షట్సప్తత్యంగుంలోత్సేధః పశురాకకుదో భవేత్ ॥12॥

గోవులు, ఏనుగులు, మహిషాలు, స్థావరాలకు ఈ క్రమంలోనే యుగయుగంలోనూ తరుగుదల పెరుగుదలలు తెలుసుకోవాలి. పశువు కాలి కొసనుండి మూపురంవరకు డెబ్బది ఆరు అంగుళముల ఎత్తు ఉంటుంది.

అంగులానామష్టశతముత్సేధో హస్తినాం స్మృతః ।
అంగులానాం సహస్రం తు ద్విచత్వారింశదంగులమ్ ॥13॥
శతార్ధమంగులానాం తు హ్యుత్సేధః శాఖినాం పరః ।

ఏనుగుల ఎత్తు ఎనిమిది వందల అంగుళాలు, వృక్షాల ఎత్తు ఒక వెయ్యి తొంబది రెండు అంగుళాలు, (1000 + 42 + 50)

మానుషస్య శరీరస్య సన్నివేశస్తు యాదృశః ॥14॥

తల్లక్షణం తు దేవానాం దృశ్యతేఽ న్వయదర్శనాత్ ।
బుద్ధ్యాఽ తిశయసంయుక్తం దేవానాం కార్యముచ్యతే ॥15॥

తథా నాతిశయం చైవ మానుషం కార్యముచ్యతే ।

మానుషశరీర సన్నివేశం ఎలాంటిదో, ఆ లక్షణమే అన్వయానుసారంగా దేవతల్లో కనిపిస్తుంది. కాని దేవతల కార్యం మానవులకంటే బుద్ధ్యతిశయంతో కూడినదని చెప్పబడుతున్నది. మానుష కార్యం అంతటి అతిశయం కలది కాదు.

ఇత్యేవం హి పరిక్రాన్తాః భావా యే దివ్యమానుషాః ॥16॥
పశూనాం పక్షిణాం చైవ స్థావరాణాం చ సర్వశః ।
గావోఽ జాశ్వాశ్చ విజ్ఞేయా హస్తినః పక్షిణో మృగాః ॥17॥

ఉపయుక్తాః క్రియాస్వేతే యజ్ఞియాస్త్విహ సర్వశః ।
యథాక్రమోపభోగాశ్చ దేవానాం పశుమూర్తయః ॥18॥

ఇలా పశువులు, పక్షులు, స్థావరాలు, వీటి దివ్యమానుషభావాలు చెప్పడమైనది. మరియు గోవులు, మేకలు, గుర్రాలు, ఏనుగులు, పక్షులు, మృగాలు స్థావరాలు – ఇవి ఆ యా పనులలో ఉపయోగపడుతుంటాయి. వీనిలో కొన్ని దేవతలకు చెందిన యజ్ఞక్రియలలో ఉపయుక్తాలు. దేవతలకు పశుమూర్తులు యథాక్రమంగా ఉపభోగసాధనాలవుతాయి.

తేషాం రూపానురూపైశ్చ ప్రమాణైః స్థిరజంగమాః ।
మనోజ్ఞైస్తత్ర తే భావైః సుఖినో హ్యుపపేదిరే ॥19॥

యుగపశువులు, అచరములు (చెట్లు) వాటి రూపాల కనురూపమైన ప్రమాణాలతోనూ దేహత్యాగానంతరం ఆ భోగాలతో సుఖవంతములై పరలోకంలో స్వర్గసుఖం పొందుతాయి.

అథ శిష్టాన్ ప్రవక్ష్యామి సాధూనథ సతశ్చ వై ।
బ్రాహ్మణాః శ్రుతిశబ్దాశ్చ దేవానాం పశుమూర్తయః ।
సంయుజ్య బ్రహ్మణా హ్యన్తస్తేన సన్తః ప్రచక్షతే ॥20॥

ఇప్పుడు సజ్జనులు, సాధవులను గురించి చెబుతాను. బ్రాహ్మణులు, వేదశబ్దాలు, యాగపశువులు బ్రహ్మతో కూడి బ్రహ్మత్వం పొందుతాయి. అందుచే వాటిని సత్ అంటారు. (సత్ = బ్రహ్మం)

సామాన్యేషు చ ధర్మేషు తథా వైశేషికేషు చ ।
బ్రహ్మక్షత్రవిశో యుక్తాః శ్రౌతస్మార్తేన కర్మణా ॥21॥

సామాన్యధర్మాలలోనూ, విశేష ధర్మాలలోనూ బ్రాహ్మణ క్షత్రియవైశ్యులు శ్రౌతస్మార్త కర్మకు తగినవారు.

వర్ణాశ్రమేషు యుక్తస్య సుఖోదర్కస్య స్వర్గతౌ ।
శ్రౌతస్మార్తో హి యో ధర్మో జ్ఞానధర్మః స ఉచ్యతే ॥22॥

వర్ణాశ్రమధర్మానుసారం స్వర్గగమనం తర్వాత సుఖోదర్కమైనదీ, శ్రుతిస్మృతి విహితమైనదీ అగు ధర్మం జ్ఞానధర్మ మనబడుతుంది.

విద్యానాం సాధనాత్సాధు బ్రహ్మచారీ గురోర్హితః ।
కారణాత్సాధనాచ్చైవ గృహస్థః సాధురుచ్యతే ॥23॥

విద్యలను సాధించడం వల్లా, గురువులకు హితకారియైన కారణం వల్లా, సాధనంవల్లా బ్రహ్మచారి సాధువవుతాడు. సమాజాభివృద్ధికి కారణమై అందరికీ సుఖం అందించే గృహస్థుడు కూడా సాధువే.

తపసశ్చ తథారణ్యే సాధుర్వైఖానసః స్మృతః ।
యతమానో యతిః సాధుః స్మృతో యోగస్య సాధనాత్ ॥24॥

అరణ్యంలో తపస్సు చేయడం వల్ల వైఖానసుడు సాధువనబడతాడు. పరతత్త్వసాధనకై యత్నించే యతి యోగసాధనవల్ల సాధువవుతున్నాడు.

ధర్మో ధర్మగతిః ప్రోక్తః శబ్దో హ్యేష క్రియాత్మకః ।
కుశలాకుశలౌ చైవ ధర్మాధర్మౌ బ్రవీత్ప్రభుః ॥25॥

ధర్మమంటే ధర్మగతి. ఈ శబ్దం క్రియాత్మకమైనది. భగవంతుడు కుశలాకుశలాలను ధర్మాధర్మాలని చెప్పాడు.

అథ దేవాశ్చ పితరో ఋషయశ్చైవ మానుషాః ।
అయం ధర్మో హ్యయం నేతి బ్రువతే మౌనమూర్తినా ॥26॥

దేవతలు, పితరులు, ఋషులు, మనుష్యులు, వీరంతా 'ఇది ధర్మం, ఇది ధర్మం కాదు, అని మౌనముద్రతో మాత్రమే చెబుతున్నారు. తపోబలంతో తత్త్వం విచారించేవారికే ఇది సాధ్యం.

ధర్మేతి ధారణే ధాతుర్మహత్త్వే చైవముచ్యతే ।
ఆధారణే మహత్త్వే వా ధర్మః స తు నిరుచ్యతే ॥27॥

'ధర్మ' శబ్దానికి మూల ధాతువు ధారణంలోనూ, మహత్త్వంలోనూ ఉన్నది. ఆధారమగుటలో కాని, మహత్త్వం కలిగించుటలో గాని ధారణాపరమైనది 'ధర్మం' అని నిర్వచింపబడుతున్నది.

తత్రేష్టప్రాపకో ధర్మ ఆచార్యైరుపదిశ్యతే ।
అధర్మశ్చానిష్టఫల ఆచార్యైర్నోపదిశ్యతే ॥28॥

అందులో ఇష్టప్రాపకమైన ధర్మాన్ని ఆచార్యులు ఉపదేశిస్తారు. అనిష్టఫలకమైన అధర్మాన్ని వారు ఉపదేశించరు.

వృద్ధాశ్చాలోలుపాశ్చైవ ఆత్మవన్తో హ్యదాంభికాః ।
సమ్యగ్ వినీతా మృదవస్తానాచార్యాన్ ప్రచక్షతే ॥29॥

విద్య, వయస్సు, అనుభవం-వీటియందు వృద్ధులు, ఆశ లేనివారు, హృదయదార్ఢ్యం కలవారు, డంభం లేనివారు, చక్కగా వినీతులు, మృదుస్వభావు లగువారిని- ఆచార్యు లంటారు.

ధర్మజ్ఞైర్విహితో ధర్మః శ్రౌతస్మార్తో ద్విజాతిభిః ।
దారాగ్నిహోత్రసంబన్ధమిజ్యా శ్రౌతస్య లక్షణమ్ ॥30॥

ధర్మజ్ఞులగు ద్విజులు శ్రౌతమని, స్మార్తమనీ ధర్మాన్ని రెండుగా విభజించారు. భార్యలతో గూడి గృహస్థులు చేసే అగ్నిహోత్రాదులు, యజ్ఞాలు శ్రౌతధర్మం.

స్మార్తో వర్ణాశ్రమాచారో యమైశ్చ నియమైర్యుతః ।
పూర్వేభ్యో వేదయిత్వేహ శ్రౌతం సప్తర్షయోఽబ్రువన్ ॥31॥

స్మార్తం వర్ణాశ్రమాచార పరమైనది. ఇది యమనియమాలతో గూడినది. పూర్వులనుండి తెలుసుకొని సప్తర్షులు శ్రౌతధర్మాన్ని చెప్పారు.

ఋచో యజూంషి సామాని బ్రహ్మణోఽంగాని వై శ్రుతిః ।
మన్వన్తరస్యాతీతస్య స్మృత్వా తన్మనురబ్రవీత్ ॥32॥

గడచిన మన్వంతరకాలంలోని ఋక్కులు, యజుస్సులు, సామములు వేదాంగాలు-వీటిని చక్కగా స్మరించి మనువు చెప్పినాడు గాన ఇది స్మార్త ధర్మమైనది.

తస్మాత్స్మార్తః స్మృతో ధర్మో వర్ణాశ్రమవిభాగశః ।
ఏవం వై ద్వివిధో ధర్మః శిష్టాచారః స ఉచ్యతే ॥33॥

ఆ ధర్మం వర్ణాశ్రమాచార విభాగపూర్వకంగా స్మరింపబడినదే. ఇలా ధర్మం రెండు విధాలైనది. దీనిని శిష్టాచారమంటారు.

శిషేర్ధాతోశ్చ నిష్ఠాన్తాచ్ఛిష్టశబ్దం ప్రచక్షతే ।
మన్వన్తరేషు యే శిష్టా ఇహ తిష్ఠన్తి ధార్మికాః ॥34॥

'శిష' ధాతువు నిష్ఠాంతమైనప్పుడు 'శిష్ట' శబ్దం ఏర్పడుతుంది. మన్వంతరాలలో ఎవరు శిష్టులై వున్నారో వారే ధార్మికులు.

మనుః సప్తర్షయశ్చైవ లోకసన్తానకారిణః ।
తిష్ఠన్తీహ చ ధర్మార్థం తాన్ శిష్టాన్ సంప్రచక్షతే ॥35॥

మనువు, సప్తర్షులు, లోకసంతానకారులు - వారు ధర్మంకొరకై ఉన్నారు గాన వారిని శిష్టు లంటారు.

తైః శిష్టైశ్చలితో ధర్మః స్థాప్యతే వై యుగే యుగే ।
త్రయీ వార్తా దణ్డనీతిః ప్రజావర్ణాశ్రమేప్సయా ॥36॥

శిష్టులు ప్రజావర్ణాశ్రమధర్మాలు నిలుపగోరి శ్రౌతస్మార్త ధర్మాలను అనుష్ఠించి ప్రతియుగంలోనూ వార్త, దండనీతి మున్నగువానిని నిలుపుతారు.

శిష్టైరాచర్యతే యస్మాత్పునశ్చైవ మనుక్షయే ।
పూర్వైః పూర్వైర్మతత్వాచ్చ శిష్టాచారః స శాశ్వతః ॥37॥

శిష్టు లాచరిస్తారు కాన అది శిష్టాచారం. మనుక్షయం కల్గినప్పుడు, మరల పూర్వులచే పూర్వమతాను సారంగా సమ్మతమై ఆచరింపబడినదే శిష్టాచారం.

దానం సత్యం తపో లోకో విద్యేజ్యా పూజనం దమః ।
అష్టౌ తాని చరిత్రాణి శిష్టాచారస్య లక్షణమ్ ॥38॥

దానం, సత్యం, తపస్సు, లోకం, విద్య, యాగం, పూజ, దమం- ఈ ఎనిమిది చరిత్రములూ శిష్టాచార లక్షణాలు.

శిష్టా యస్మాచ్చరన్త్యేనం మనుః సప్తర్షయశ్చ హ ।
మన్వన్తరేషు సర్వేషు శిష్టాచారస్తతః స్మృతః ॥39॥

శిష్టులు, మనువు, సప్తర్షులు, వీరంతా మన్వంతరాలలో ఆచరించినారు కాన అది శిష్టాచారమయింది.

విజ్ఞేయః శ్రవణాచ్ఛ్రౌతః స్మరణాత్స్మార్త ఉచ్యతే ।
ఇజ్యావేదాత్మకః శ్రౌతః స్మార్తో వర్ణాశ్రమాత్మకః ॥40॥

శ్రవణం వల్ల శ్రౌతం, స్మరణం వల్ల స్మార్తం అని తెలుసుకోవాలి. యజ్ఞం, హోమం (ఇజ్యా) వేదాత్మకం శ్రౌతం, వర్ణాశ్రమాత్మకం స్మార్తం.

ప్రత్యంగాని ప్రవక్ష్యామి ధర్మస్యాహేతు లక్షణమ్ ॥41॥

హేతువాదరహితమైన ప్రత్యంగాలను అనగా ధర్మపుష్టికరప్రవృత్తులను చెబుతాను.

దృష్టానుభూతమర్థం చ యః పృష్టో న విగూహతే ।
యథాభూతప్రవాదస్తు ఇత్యేతత్సత్యలక్షణమ్ ॥42॥

చూచిన, అనుభవించిన విషయాన్ని గూర్చి ప్రశ్నించగా దాచకుండా ఉన్నదున్నట్లు చెప్పడమే సత్యలక్షణం.

బ్రహ్మచర్యం తపో మౌనం నిరాహారత్వమేవ చ ।
ఇత్యేతత్తపసో రూపం సుఘోరం తు దురాసదమ్ ॥43॥

బ్రహ్మచర్యం, తపస్సు, మౌనం నిరాహారత్వం, - అనునది తపస్సు యొక్క రూపం, ఇది అతిఘోరమైనది, సులభంగా పొందరానిది.

పశూనాం ద్రవ్యహవిషామృక్సామయజుషాం తథా ।
ఋత్విజాం దక్షిణాయాశ్చ సంయోగో యజ్ఞ ఉచ్యతే ॥44॥

పశువులు, ద్రవ్యములు, హవిస్సులు, ఋక్సామయజుస్సులు, ఋత్విజులు, దక్షిణ – వీటి సంయోగమే యజ్ఞ మనబడుతున్నది.

ఆత్మవత్సర్వభూతేషు యో హితాయ శుభాయ చ ।
వర్తతే సతతం హృష్టః క్రియా శ్రేష్ఠా దయా స్మృతా ॥45॥

తనవలెనే సకల ప్రాణులయందు హితంకొరకు, శుభంకొరకు సదా సంతోషంతో ఉండడం, శ్రేష్ఠమైన క్రియలు చేయడం 'దయ' అని చెప్పబడింది.

ఆక్రుష్టోఽభిహతో యస్తు నాక్రోశేత్ప్రహరేదపి ।
అదుష్టో వాఙ్మనఃకాయైస్తితిక్షుః సా క్షమా స్మృతా ॥46॥

తిట్టినా, కొట్టినా, తిరిగి ఎవడు తిట్టడో, కొట్టడో, వాఙ్మనః క్రియలలో దుష్టత్వం' లేనివాడో అట్టివాడు 'తితిక్షు' వనబడును. దానినే క్షమ అంటారు.

స్వామినా రక్ష్యమాణానాముత్సృష్టానాం చ సంభ్రమే ।
పరస్వానామనాదానమలోభ ఇతి సంజ్ఞితః ॥47॥

యజమానిచే రక్షింపబడువాటిని, సంభ్రమంతో వదలి వేయబడినదానిని, ఇతరుల సొమ్ములను స్వీకరించక పోవడమే 'అలోభ'మని చెప్పబడింది.

మైథునస్యాసమాచారో జల్పనాచ్చిన్తనాత్తథా ।
నివృత్తిర్బ్రహ్మచర్యం చ తదేతచ్ఛమలక్షణమ్ ॥48॥

మైథునం చేయకుండడం, దానికి సంబంధించిన మాటలు, ఆ చింతనం లేకుండా ఉండడం (మనోవాక్కాయాలలో) బ్రహ్మచర్యం, ఇది శమలక్షణం.

ఆత్మార్థే వా పరార్థే వా ఇంద్రియాణీహ యస్య వై ।
విషయే న ప్రవర్తన్తే దమస్యైతత్తు లక్షణమ్ ॥49॥

తన కొరకుగాని, ఇతరుల కొరకుగానీ ఎవని యింద్రియాలు విషయాలలో ప్రవర్తించవో అది 'దమ'లక్షణం.

పంచాత్మకే యో విషయే కారణే చాష్టలక్షణే ।
న క్రుధ్యేత ప్రతిహతః స జితాత్మా భవిష్యతి ॥50॥

శబ్దస్పర్శరూపరసగంధాలనే పంచవిషయాలలో గానీ, ధనకనకవస్తువాహనాది సుఖకారణాలు ఎనిమిదింటిలోగాని ఎవడైనా అడ్డు తగిలినా వానిపట్ల కోపగించకుండా ఉండేవాడు జితాత్ము డనబడుతాడు.

యద్యదిష్టతమం ద్రవ్యం న్యాయేనైవాగతం చ యత్ ।
తత్తద్గుణవతే దేయమిత్యేతద్దానలక్షణమ్ ॥51॥

ఏదేది మిక్కిలి ఇష్టమైన పదార్థమో, న్యాయార్జితమో దానిని గుణవంతుని కివ్వడం దానలక్షణం.

శ్రుతిస్మృతిభ్యాం విహితో ధర్మో వర్ణాశ్రమాత్మకః ।
శిష్టాచారప్రవృద్ధశ్చ ధర్మోఽయం సాధుసమ్మతః ॥52॥

శ్రుతిస్మృతి విహితమైన వర్ణాశ్రమాత్మకధర్మం శిష్టాచారంచే వృద్ధి పొందినప్పుడు, అది సాధుసమ్మతమైన ధర్మ మవుతుంది.

అప్రద్వేషో హ్యనిష్టేషు ఇష్టం వై నాభినందతి ।
ప్రీతితాపవిషాదానాం వినివృత్తిర్విరక్తతా ॥53॥

అనిష్టాలపట్ల ద్వేషం లేకుండడం, ఇష్టాన్ని అభినందించకుండా ఉండడం, ప్రీతి– తాప– విషాదాలనుండి నివృత్తి– వైరాగ్య మనబడుతుంది.

సంన్యాసః కర్మణాం న్యాసః కృతానామకృతైః సహ ।
కుశలాకుశలాభ్యాం తు ప్రహాణం న్యాస ఉచ్యతే ॥54॥

చేయబడిన, చేయబడని కర్మలను పరిత్యజించడం సన్న్యాసం. కుశలాకుశలాల పరివర్జనమే న్యాసం.

అవ్యక్తాదివిశేషాన్త వికారేఽస్మిన్నివర్తతే ।
చేతనాచేతనం జ్ఞాత్వా జ్ఞానే జ్ఞానీ స ఉచ్యతే ॥55॥

జగత్కారణమైన అవ్యక్తం మొదలు నామరూప విశేషాన్తం వరకూ గల వికారజాతంనుండి చిత్తాన్ని మరలించి చేతనాచేతనా లనే భేదం తెలుసుకొని ఆ జ్ఞానమందే నిలిచినవాడు 'జ్ఞాని'.

ప్రత్యంగాని తు ధర్మస్య చేత్యేతల్లక్షణం స్మృతమ్ ।
ఋషిభిర్ధర్మతత్త్వజ్ఞైః పూర్వైః స్వాయంభువేఽన్తరే ॥56॥

ధర్మముయొక్క ప్రత్యంగాల లక్షణం ఇలా చెప్పబడింది. స్వాయంభువమన్వంతరంలో ధర్మతత్త్వజ్ఞులైన ఋషులు, పూర్వులు చెప్పిన దిది.

అత్ర వో వర్ణయిష్యామి విధిం మన్వన్తరస్య తు ।
తథైవ చాతుర్హోత్రస్య చాతుర్వర్ణ్యస్య చైవ హి ॥57॥

ఇప్పుడు మీకు మన్వంతరవిధిని వివరిస్తాను. అట్లే చాతుర్హోత్రం, (నలుగురు హోతలచే నిర్వర్తించు కర్మ) చాతుర్వర్ణ్యవిధిని గూడా వివరిస్తాను.

ప్రతిమన్వన్తరం చైవ శ్రుతిరన్యా విధీయతే ।
ఋచో యజూంషి సామాని యథావత్ప్రతిదైవతమ్ ॥58॥

ప్రతిమన్వంతరంలోనూ వేద శ్రుతి వేరు వేరుగా విధింపబడుతుంది. అప్పుడు కూడా ఋక్కులు, యజస్సులు, సామములు, ప్రతిదేవతను ఉద్దేశించిన మంత్రాలు ఉంటాయి.

విధిస్తోత్రం తథా హౌత్రం పూర్వవత్ సంప్రవర్తతే ।
ద్రవ్యస్తోత్రం గుణస్తోత్రం కర్మస్తోత్రం తథైవ చ ॥59॥

విధిస్తోత్రం, హౌత్రస్తోత్రం పూర్వం లాగానే వుంటాయి. ద్రవ్యస్తోత్రం, గుణస్తోత్రం, కర్మస్తోత్రం గూడా అట్లే ఉంటాయి.

తథైవాభిజనస్తోత్రం స్తోత్రమేవం తు షడ్విధమ్ ।
మన్వన్తరేషు సర్వేషు యథా వేదా భవన్తి హి ॥60॥

అభిజనస్తోత్రం – ఇలా ఆరువిధాలైన స్తోత్రాలు సర్వమన్వంతరాలలోనూ వేదంనుండే తీసుకోబడుతున్నాయి.

ప్రవర్తయతి తేషాం వై బ్రహ్మా స్తోత్రం పునః పునః ।
ఏవం మంత్రగుణానాం తు సముత్పత్తిశ్చతుర్విధా ॥61॥

బ్రహ్మ ఆ యా వేదాలకు చెందిన స్తోత్రాలను ప్రతిమన్వంతరంలో వేరువేరుగా మరల ప్రవర్తింపజేస్తాడు. ఇలా మంత్రగుణాల యొక్క నాల్గువిధాల ఉత్పత్తి చెప్పబడింది.

అథర్వఋగ్యజుఃసామ్నాం వేదేష్విహ పృథక్ పృథక్ ।
ఋషీణాం తప్యతాం తేషాం తపః పరమదుశ్చరమ్ ॥62॥

మంత్రాః ప్రాదుర్భవన్త్యాదౌ పూర్వమన్వన్తరస్య హి ।
అసన్తోషాద్భయాద్దుఃఖాన్మోహాచ్ఛోకాచ్చ పంచధా ॥63॥

ఋషీణాం తారకాఖ్యేన లక్షణేన యదృచ్ఛయా ।
ఋషీణాం యాదృశత్వం హి తద్వక్ష్యామీహ లక్షణమ్ ॥64॥

అథర్వ ఋక్‌యజుస్సామవేదాల మంత్రాలు విడివిడిగా వేదాలలో చెప్పడమయింది. ఆయా మన్వంతరాలలో పరమదుష్కరమైన తపస్సు చేసిన ఋషులకు అంతకు పూర్వమన్వంతరాదిలో వలెనే ఆ వేదమంత్రాలు ప్రాదుర్భవిస్తాయి. అసంతోషం, భయం, దుఃఖం, మోహం, శోకం, ఇలా ఐదు స్థితులు పూర్వమన్వంతరాలలో అవి ప్రాదుర్భవించడానికి హేతువు లయ్యాయి. ఋషులకు తారకమనే లక్షణంచేత యాదృచ్ఛికంగానూ వేదాలు సాక్షాత్కరించడం జరుగుతుంది. ఇపుడు ఋషుల ఋషిత్వానికి లక్షణం వివరిస్తాను.

అతీతానాగతానాం చ పంచధా హ్యార్షకం స్మృతమ్ ।
తథా ఋషీణాం వక్ష్యామి ఆర్షస్యేహ సముద్భవమ్ ॥65॥

గడచిన రానున్న మన్వంతరాలలో ఆర్షకం (ఋషిత్వంలో భేదాలు) అయిదురకాలుగా ఉంటుంది. ఈ ఋషిత్వం ఏర్పడే విధానాన్నీ అందలి భేదాలనూ వివరిస్తాను.

గుణసామ్యేన వర్తన్తే సర్వసంప్రలయే తదా ।
అవిభాగేన వేదానామనిర్దేశ్యతమోమయే ॥66॥

వేదాలలో విభాగం లేనందువల్ల నిర్దేశింపరాని తమోమయమైన సర్వప్రళయం ఏర్పడినప్పుడు త్రిగుణాలు సమస్థితిలో ఉంటాయి. అది మూలప్రకృతియొక్క జడావస్థ.

అబుద్ధిపూర్వకం తద్వై చేతనార్థం ప్రవర్తతే ।
తేనార్షం బుద్ధిపూర్వం తు చేతనేనాప్యధిష్ఠితమ్ ॥67॥

అబుద్ధిపూర్వకంగా ఆచేతనార్థం ప్రవర్తిస్తుంది. అందువల్ల బుద్ధిపూర్వకమైన ఆర్షచేతనం గూడా చైతన్యాధిష్ఠితమై ప్రవర్తిస్తుంది. అనగా ఆర్షత్వం చిదాత్మక తత్త్వశక్తిచేత ప్రేరణ పొంది బుద్ధిపూర్వక చేతనతత్త్వంచే అధిష్ఠితమౌతుంది.

ప్రవర్తేతే యథా తౌ తు యథా మత్స్యోదకావుభౌ ।
చేతనాధికృతం సర్వం ప్రావర్తత గుణాత్మకమ్ ।
కార్యకారణ భావేన తథా తస్య ప్రవర్తతే ॥68॥

ఎలా అంటే చేప, నీరు లాగా విడదీయరానిదై చేతనాదికృతమైన దంతా గుణాత్మకంగా ప్రవర్తిల్లింది. జడచేతనతత్త్వాలు కార్యకారణ భావం పొంది చేతనవ్యాప్తివల్ల సృష్టికి కారణమౌతాయి.

విషయో విషయిత్వం చ తదా హ్యర్థపదాత్మకమ్ ।
కాలేన ప్రాపణీయేన భేదావై కారణాత్మకాః ॥69॥

కాలక్రమాన కారణాత్మకమైన మహదాదులు వికాసం పొందుతాయి. అట్లది కార్యకారణభావంతో ప్రవర్తిస్తున్నది. విషయం, విషయిత్వం అర్థపదాత్మకాలు. శబ్దార్థ సృష్టిలో అర్థం విషయం కాగా శబ్దం విషయి అవుతుంది. అంటే శబ్దం విన్నప్పుడు అర్థం గోచరిస్తుంది.

సాంసిద్ధికాస్తదా వృత్తాః క్రమేణ మహదాదయః ।
మహతోఽసావహంకారస్తస్మాద్భూతేంద్రియాణి చ ॥70॥

కాలక్రమాన సృష్టికారణాలైన మహదాది తత్త్వాలు అవ్యక్తం నుండి వ్యక్తమై వికసిస్తాయి. మహత్తునుండి అహంకారం, దానినుండి సూక్ష్మభూతాలు, ఇంద్రియతత్త్వాలు వ్యక్తమౌతాయి.

భూతభేదాశ్చ భూతేభ్యో జజ్ఞిరే తు పరస్పరమ్ ।
సంసిద్ధికారణం కార్యం సద్య ఏవ వివర్తతే ॥71॥

సూక్ష్మభూతాలనుండి స్థూలభూతాలు మొదలగునవి ఒకదానినుండి మరొకటి జన్మిస్తాయి. స్వయం సిద్ధమగు కారణతత్త్వంనుండి ఏర్పడిన కార్యతత్త్వం మరొకదానికి కారణమౌతూ క్రమంగా పరమాత్మ ప్రపంచరూపం పొందుతుంది.

యథోల్ముకాద్విరుచయ ఏకకాలాద్భవన్తి హి ।
తథా ప్రవృత్తాః క్షేత్రజ్ఞాః కాలేనైకేన కారణాత్ ॥72॥

కొరవికట్టె నుండి నిప్పురవ్వలు ఏకకాలంలో కల్గినట్లు ఒకే చైతన్యంనుండి ఒకే కాలంలో జీవులు దేహధారులై వస్తారు.

యథాన్ధకారే ఖద్యోతః సహసా సంప్రదృశ్యతే ।
తథా వివృత్తో హ్యవ్యక్తః ఖద్యోత ఇవ సంజ్వలన్ ॥73॥

చీకట్లో మెఱపు వెంటనే కనిపించినట్లు అవ్యక్తంనుండి వివృత్తమైన జీవసమూహం దేహధారియై ప్రకాశిస్తుంది.

స మహాత్మా శరీరస్థస్తత్రైవేహ ప్రవర్తతే ।
మహతస్తమసః పారే వైలక్షణ్యాద్విభావ్యతే ॥74॥

ఆ పరమాత్మ ప్రతిశరీరంలోనూ అంతర్యామిగా ఉంటుంది. మహాతమస్సుయొక్క ఆవల పరమాత్మ సృష్టి కతీతమై విలక్షణంగా ప్రకాశిస్తాడు.

తత్రైవ సంస్థితో విద్వాంస్తమసోఽన్త ఇతి శ్రుతమ్ ।
బుద్ధిర్వివర్ధతస్తస్య ప్రాదుర్భూతా చతుర్విధా ॥75॥

జ్ఞానం వైరాగ్యమైశ్వర్యం ధర్మశ్చేతి చతుష్టయమ్ ।
సాంసిద్ధికాన్యథైతాని అప్రతీతాని తస్య వై ॥76॥

ఇలా పరమాత్ముడు అక్కడే ఉంటాడు. తమస్సుకు ఆవల ఉంటాడు అని శ్రుతి. అతడలా భాసిస్తుండగా అతని బుద్ధి జ్ఞానం, వైరాగ్యం, ఐశ్వర్యం, ధర్మం అని నాల్గు విధాల ఆవిర్భవించింది. ఇవి స్వతస్సిద్ధాలే కాని క్రొత్తగా సంపాదించుకొన్నవి కావు.

మహాత్మనః శరీరస్య చైతన్యాత్ సిద్ధిరుచ్యతే ।
పురి శేతే యతః పూర్వం క్షేత్రజ్ఞానం తథాఽపి చ ॥77॥

పురే శయనాత్పురుషో జ్ఞానాత్క్షేత్రజ్ఞ ఉచ్యతే ।
యస్మాద్ధర్మాత్ప్రసూతే హి తస్మాద్వై ధార్మికస్తు సః ॥78॥

ఆ మహాత్మునికి మాయాశక్తికృతమగు శరీరముయొక్క ప్రాప్తివల్ల అవి సిద్ధించాయి. ప్రాణుల శరీరాలలో ఉండి వాటి తత్త్వం తెలుసుకొంటాడు గాన అతడు క్షేత్రజ్ఞుడవుతున్నాడు. పురమనే శరీరంలో శయనిచడంవల్ల పురుషుడనీ, జ్ఞానంవల్ల క్షేత్రజ్ఞుడనీ అనబడతాడు. ధర్మంతో లోకాలు సృష్టించి పాలిస్తాడు కాన ధార్మికుడు.

సాంసిద్ధికే శరీరే చ బుద్ధ్యా వ్యక్తస్తు చేతనః ।
ఏవం వివృత్తః క్షేత్రజ్ఞః క్షేత్రం హ్యనభిసంధితః ॥79॥

మాయాశక్తిచే సిద్ధించిన స్వాభావికమైన శరీరంలో పై బుద్ధిలక్షణంచేత అతడు చేతనుడౌతున్నాడు. పరమాత్మ మూలప్రకృతికి కల్గిన సృష్టి అభిముఖ ప్రవృత్తిని సఫలం చేస్తాడు. క్షేత్రవిషయమునందు జీవుల ప్రవృత్తిలోనూ, తత్ఫలాలలోనూ అతనికి అహంకారమమకారా లుండవు.

వివృత్తిసమకాలే తు పురాణం తదచేతనమ్ ।
క్షేత్రజ్ఞేన పరిజ్ఞాతం భోగ్యోఽయం విషయో మమ ॥80॥

పరమాత్మ అలా వివర్తం పొందునపుడే అనాది యగు ప్రకృతి క్షేత్రంగా భోగ్యంగా రూపొందగానే క్షేత్రజ్ఞుడు ఇది నాకు ఆశ్రయమనీ, భోగ్యమనీ భావిస్తాడు.

ఋషిర్హింసాగతౌ ధాతుర్విద్యా సత్యం తపః శ్రుతమ్ ।
ఏష సన్నిచయో యస్మాద్బ్రహ్మణస్తు తతస్త్వృషిః ॥81॥

'ఋషి' శబ్దానికి మూలం అయిన ధాతువు 'హింస, గతి' అనే అర్థాలలో ఉన్నది. విద్య, సత్యం, తపస్సు, శ్రుతం – వీటి యొక్క సముదాయస్వరూపుడు కాన బ్రహ్మదేవునికి ఋషి అనే వ్యవహారం కలిగింది.

వివృత్తిసమకాలాచ్చ బుద్ధ్యా వ్యక్తం ఋషిస్త్వయమ్ ।
ఋషతే పరమం యస్మాత్పరమర్షిస్తతః స్మృతః ॥82॥

వివర్తన సమకాలంనుండి బుద్ధిరూపాన వ్యక్తుడై పరమతత్త్వం గ్రహించినవాడు గాన అతడు 'పరమర్షి' అని చెప్పబడినాడు.

గత్యర్థాదృషతేర్ధాతోర్నామ నిర్వృతికారణమ్ ।
యస్మాదేష స్వయంభూతస్తస్మాచ్చ ఋషితా మతా ॥83॥

గత్యర్థకమైన 'ఋష' ధాతువునుండి 'ఋషి' శబ్దం ఏర్పడింది. కాన స్వయంగా తనకు తాను ఉద్భవించినందువలన పరమాత్మకి ఋషిత్వం కలిగింది.

ఈశ్వరాః స్వయముద్భూతా బ్రహ్మణో మానసాః సుతాః ।
వివర్తమానైస్తైర్బుద్ధ్యా మహాన్ పరగతః పరః ॥84॥

యస్మాదృషిర్మహత్త్వేన సహ తస్మాన్మహర్షయః ।
ఈశ్వరాణాం సుతాస్తేషాం మానసాశ్చౌరసాశ్చ వై ॥85॥

బ్రహ్మనుండి స్వయంగా పుట్టిన మరీచ్యాదు లగువారు. బ్రహ్మ మానసపుత్రులు. వారు కూడా వివర్తమానులై ఈశ్వరుని జ్ఞానంతో పొందారు కాన ఈశ్వరఋషులు. ఈశ్వరఋషులకు మానసపుత్రులు, ఔరసపుత్రులు మహాజ్ఞానం కలిగి ఉండిరి గాన మహర్షులయ్యారు.

ఋషిస్తస్మాత్ పరత్వేన భూతాదిర్ఋషయస్తతః ।
ఋషిపుత్రా ఋషీకాస్తు మైథునాద్గర్భసంభవాః ॥86॥

సృష్టికాలంలో ఔరససంతతిగా కలిగినవారు కేవల ఋషులు. మైథునంతో పుట్టినవారు ఋషీకులు.

పరత్వేన ఋషన్తే వై భూతాదీనృషికాస్తతః ।
ఋషికాణాం సుతా యే తు విజ్ఞేయా ఋషిపుత్రకాః ॥87॥

ఋషికుల ఔరసపుత్రులు ఋషిపుత్రులు. వీరు ఉత్కృష్టమైన విధానంలో భూతాది సృష్టిపరిజ్ఞానం కలవారు

శ్రుత్వా ఋషం పరత్వేన శ్రుతాస్తస్మాచ్ఛ్రుతర్షయః ।
అవ్యక్తాత్మా మహాత్మాఽహంకారాత్మా తథైవ చ ॥88॥

భూతాత్మా చేంద్రియాత్మా చ తేషాం తజ్జ్ఞానముచ్యతే ।
ఇత్యేవమృషిజాత్యస్తు పంచధా నామ విశ్రుతాః ॥89॥

పూర్వులనుండి శ్రుతితత్త్వం విని గ్రహించినవారు శ్రుతర్షులు. పరతత్త్వం అవ్యక్తాత్మ, మహాంతాత్మ, అహంకారాత్మ, భూతాత్మ, ఇంద్రియాత్మ అని అయిదువిధాలు. వారికి ఆ జ్ఞానం పరతత్త్వ పరంగా చెప్పబడింది. ఇలా ఋషిజాతి అయిదు విధాల ప్రసిద్ధమైంది.

భృగుర్మరీచిరత్రిశ్చ అంగిరాః పులహః క్రతుః ।
మనుర్దక్షో వసిష్ఠశ్చ పులస్త్యశ్చాపి తే దశ ॥90॥

భృగువు, మరీచి, అత్రి, అంగిరుడు, పులహుడు, క్రతువు, మనువు, దక్షుడు, వసిష్ఠుడు, పులస్త్యుడు, వీరు పదిమంది.

బ్రహ్మణో మానసా హ్యేతే ఉత్పన్నాః స్వయమీశ్వరాః ।
పరత్వేనర్షయో యస్మాన్మతాస్తస్మాన్మహర్షయః ॥91॥

బ్రహ్మ మనస్సునుండి పుట్టిన వీరు స్వయంగా ఈశ్వరులు. పరత్వంతో ఋషులు కాన మహర్షులైనారు.

ఈశ్వరాణాం సుతాస్త్వేషామృషయస్తాన్నిబోధత ।
కావ్యో బృహస్పతిశ్చైవ కాశ్యపశ్చ్యవనస్తథా ॥92॥

ఈశ్వర సుతులు వారు. వారికి పుట్టిన ఋషులెవరో తెలుసుకోండి– కావ్యుడు, బృహస్పతి, కాశ్యపుడు, చ్యవనుడు.

ఉతథ్యో వామదేవశ్చ అగస్త్యః కౌశికస్తథా ।
కర్దమో వాలఖిల్యాశ్చ విశ్రవాః శక్తివర్ధనః ॥93॥

ఇత్యేతే ఋషయః ప్రోక్తాస్తపసా ఋషితాం గతాః ।
తేషాం పుత్రానృషీకాంస్తు గర్భోత్పన్నాన్నిబోధత ॥94॥

ఉతథ్యుడు, వామదేవుడు, అగస్త్యుడు, కౌశికుడు, కర్దముడు, వాలఖిల్యులు, విశ్రవసుడు, శక్తివర్ధనుడు– వీరినిఋషులంటారు. వీరు తపస్సుచే ఋషిత్వం పొందినవారు. వారి పుత్రులైన ఋషీకులను, గర్భసంజాతులని తెలుసుకోండి!

వత్సరో నగ్నహూశ్చైవ భరద్వాజశ్చ వీర్యవాన్ ।
ఋషిర్దీర్ఘతమాశ్చైవ బృహద్వక్షాః శరద్వతః ॥95॥

వాజిశ్రవాః సుచిన్తశ్చ శివశ్చ సపరాశరః ।
శృంగీ చ శంఖపాచ్చైవ రాజా వైశ్రవణస్తథా ॥96॥

ఇత్యేతే ఋషికాః సర్వే సత్యేన ఋషితాం గతాః ।
ఈశ్వరా ఋషయశ్చైవ ఋషీకా యే చ విశ్రుతాః ॥97॥

వత్సరుడు, నగ్నహుడు, వీర్యవంతుడైన భరద్వాజుడు, దీర్ఘతముడు, బృహద్వక్షుడు, శరద్వంతుడు వాజశ్రవుడు, సుచింతుడు, శివుడు, పరాశరుడు, శృంగి, శంఖపాదుడు, వైశ్రవణరాజు అట్లే వీరందరూ ఋషికులు. సత్యంతో ఋషిత్వం పొందినవారు. ఈశ్వరులు, ఋషులు, విఖ్యాతులైన ఋషికులు.

ఏవం మంత్రకృతః సర్వే కృత్స్నశశ్చ నిబోధత ।
భృగుః కాశ్యపః ప్రాచేతా దధీచో హ్యాత్మవానపి ॥98॥

ఊర్వోఽథ జమదగ్నిశ్చ వేదసారస్వ తౌతథా ।
ఆర్ష్టిషేణశ్చ్యవనశ్చ వీతహవ్యః సవేధసః ॥99॥

వైన్యః పృథుర్దివోదాసో బ్రహ్మవాన్ గృత్స్నశౌనకౌ ।
ఏకోనవింశతి హ్యేతే భృగవో మంత్రకృత్తమాః ॥100॥

ఇంకా మంత్రకర్తలను, సమగ్రంగా వినండి. భృగువు, కశ్యపుడు, ప్రాచేతుడు, ఆత్మవంతుడు, దధీచుడు, ఊర్వుడు, జమదగ్ని, వేదుడు, సారస్వతుడు, ఆర్ష్టిషేణుడు, చ్యవనుడు, వీతహవ్యుడు, వేధసుడు, వైన్యుడు, పృథువు, దివోదాసుడు, బ్రహ్మవంతుడు, గృత్స్యుడు, శౌనకుడు వీరు 19 మంది భృగువులు మంత్రకృత్తములు.

అంగిరా బృహస్పతిశ్చ భరద్వాజోఽథ లక్ష్మణః ।
కృతవాచస్తథా గర్గః స్మృతిస్సంకృతిరేవ చ ॥101॥

గురువీతశ్చ మాన్ధాతా అంబరీషస్తథైవ చ ।
యువనాశ్వః పురుకుత్సః స్వశ్రవస్తు తమస్యవాన్ ॥102॥

అజమీఢోఽస్వహార్యశ్చ హ్యుత్కలః కవిరేవ చ ।
పృషదశ్వో విరూపశ్చ కావ్యశ్చైవాథ ముద్గలః ॥103॥

ఉతథ్యశ్చ శరద్వాంశ్చ తథా వాజిశ్రవా అపి ।
అపస్యోషః సుచిత్తిశ్చ వామదేవస్తథైవ చ ॥104॥
ఉబిల్లో బృహసిక్యశ్చ ఋషిర్దీర్ఘతమా అపి ।
కక్షీవాంశ్చ త్రయస్త్రింశత్స్మృతా హ్యంగిరసాం వరాః ॥105॥

అంగిరసులలో ముఖ్యులను ఇప్పుడు చెబుతాను. అంగిరుడు, బృహస్పతి, భరద్వాజుడు, లక్ష్మణుడు, కృతవాచుడు, గర్గుడు, స్మృతి, సంకృతి, గురువీతుడు, మాంధాత, అంబరీషుడు, యవనాశ్వుడు, పురుకుత్సుడు,

స్వశ్రవుడు, తమస్యవంతుడు, అజమీఢుడు, అన్వహార్యుడు, ఉత్కలుడు, కవి, పృషదశ్వుడు, విరూపుడు, కావ్యుడు, ముద్గలుడు, ఉతథ్యుడు, శరద్వంతుడు, వాజిశ్రవుడు, అపస్యౌషుడు, సుచిత్తి, వామదేవుడు, ఉబిల్లుడు, బృహసిక్యుడు, దీర్ఘతముడు, కక్షీవంతుడు – వీరు ముప్పది ముగ్గురు అంగిరస ప్రముఖులు.

ఏతే మంత్రకృతః సర్వే కాశ్యపాంస్తు నిబోధత ।
కశ్యపః సహవత్సారో నైధ్రువో నిత్య ఏవ చ ॥106॥

అసితో దేవలశ్చైవ షడేతే బ్రహ్మవాదినః ।

వీరందరూ మంత్రకర్తలు. ఇక కాశ్యపులను తెలుసుకోండి. కశ్యపుడు, సహవత్సారుడు, నైధ్రువుడు, నిత్యుడు, అసితుడు, దేవలుడు ఈ ఆరుగురు బ్రహ్మవాదులు.

అత్రిరర్ధస్వనశ్చైవ శావాస్యోఽథ గవిష్ఠిరః ॥107॥

కర్ణికశ్చ ఋషిః సిద్ధస్తథా పూర్వాతిథిశ్చ యః ॥108॥

ఇత్యేతే త్వత్రయః ప్రోక్తా మంత్రకృత్ షణ్మహర్షయః ।
వసిష్ఠశ్చైవ శక్తిశ్చ తృతీయశ్చ పరాశరః ॥109॥

అత్రి, అర్ధస్వనుడు, శావాశ్యుడు, గవిష్ఠిరుడు, కర్ణికుడు, తపస్సిద్ధుడైన పూర్వాతిథి, – వీరు అత్రులుగా పేర్కొనబడ్డారు. మంత్రకర్త లారుగురు మహర్షులు. వసిష్ఠుడు, శక్తి, మూడవవాడైన పరాశరుడు,

తతస్తు ఇంద్రప్రమితిః పంచమస్తు భరద్వసుః ।
షష్ఠస్తు మిత్రావరుణః సప్తమః కుణ్డినస్తథా ॥110॥

ఇత్యేతే సప్త విజ్ఞేయా వాసిష్ఠా బ్రహ్మవాదినః ।
విశ్వామిత్రశ్చ గాధేయో దేవరాతస్తథా బలః ॥111॥

తథా విద్వాన్మధుచ్ఛన్దా ఋషిశ్చాన్యోఽఘమర్షణః ।
అష్టకో లోహితశ్చైవ భృతకీలశ్చ తావుభౌ ॥112॥

దేవశ్రవా దేవరాతః పురాణశ్చ ధనంజయః ।
శిశిరశ్చ మహాతేజాః శాలంకాయన ఏవ చ ॥113॥

త్రయోదశైతే విజ్ఞేయా బ్రహ్మిష్ఠాః కౌశికా వరాః ।

ఆపై ఇంద్రప్రమితి, ఐదవవాడు భరద్వసువు. ఆరవవాడు మిత్రావరుణుడు, సప్తముడు కుండినుడు ఈ ఏడుగురూ వాసిష్ఠులైన బ్రహ్మవాదులు. గాధేయుడైన విశ్వామిత్రుడు, దేవరాతుడు, బలుడు, విద్వాంసుడైన మధుచ్ఛందుడు, అఘమర్షణుడు, అష్టకుడు, లోహితుడు, భృతకీలుడు, దేవశ్రవుడు, దేవరాతుడు, ప్రాచీనుడగు, ధనంజయుడు, శిశిరుడు, మహాతేజస్వియగు శాలంకాయనుడు. ఈ పదముగ్గురూ బ్రహ్మిష్ఠులైన శ్రేష్ఠకౌశికులు,

అగస్త్యోఽథ దృఢాశ్వశ్చ ఇంద్రబాహుస్తథైవ చ ॥114॥

బ్రహ్మిష్ఠాగస్తయో హ్యేతే త్రయః పరమకీర్తయః ।
మనుర్వైవస్వతశ్చైవ ఐలో రాజా పురూరవాః ॥115॥

క్షత్రియాణాం పరా హ్యేతే విజ్ఞేయా మంత్రవాదినః ।
భలన్దకశ్చ వాసాశ్వః సంకీలశ్చైవ తే త్రయః ॥116॥

ఏతే మంత్రకృతో జ్ఞేయా వైశ్యానాం ప్రవరాః సదా ।
ఇతి ద్వినవతిః ప్రోక్తా మంత్రా యైశ్చ బహిఃకృతాః ॥117॥

అగస్త్యుడు, దృఢాశ్వుడు, ఇంద్రబాహుడు–ఈ ముప్వురు బ్రహ్మిష్ఠులును, అగస్త్యగోత్రములగు మంత్రద్రష్టలు వీరు ముగ్గురూ పరమకీర్తులు. మనువు, వైవస్వతులు, ఇలా పుత్రుడైన పూరూరవుడు వీరు క్షత్రియులలో శ్రేష్ఠులు, మంత్రవాదులు. భలందకుడు, వాసాశ్వుడు, సంకీలుడు – ఈ ముప్వురు మంత్రకర్తలు వైశ్యశ్రేష్ఠులు – ఇలా తొంబది రెండుమంది పేర్కొనబడినారు, వీరు మంత్రాలను ఆవిష్కరించినవారు.

బ్రాహ్మణాః క్షత్రియా వైశ్యా ఋషిపుత్రాన్నిబోధత ।
ఋషీకాణాం సుతా హ్యేతే ఋషిపుత్రాః శ్రుతర్షయః ॥118॥

బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు ఋషిపుత్రులని తెలుసుకోండి. ఋషికులసుతులైన వీరు ఋషి పుత్రులు, శ్రుతర్షులు.

ఇతి శ్రీమాత్స్యేమహాపురాణే దేవాసురయక్షగంధర్వమనుష్యాది పరిమాణోత్సేధ కథనం నామ పంచచత్వారింశదధిక శతతమోఽధ్యాయః ॥145॥

శ్రీమత్స్య మహాపురాణంలోని దేవాసురయక్షగంధర్వమనుష్యుల పరిమాణోత్సేధ కథనమనే

నూటనలబై అయిదవ అధ్యాయం సంపూర్ణం

షట్చత్వారింశదధికశతతమోఽధ్యాయః - నూటనలబై ఆరవ అధ్యాయం
వజ్రాంగకృత తపోవర్ణనమ్ - వజ్రాంగకృత తపోవర్ణనం

ఋషయ ఊచుః :- ఋషులు చెప్పారు

కథం మత్స్యేన కథితస్తారకస్య వధో మహాన్! ।
కస్మిన్కాలే వినిర్వృత్తా కథేయం సూతనన్దన! ॥1॥

సూతనందనా! మత్స్యరూపుడైన భగవంతునిచేత తారకుని వధ ఎలా చెప్పబడింది? ఈ కథ ఏకాలంలో జరిగింది?

త్వన్ముఖక్షీరసింధూత్థా కథేయమమృతాత్మికా ।
కర్ణాభ్యాం పిబతాం తృప్తిరస్మాకం న ప్రజాయతే ।
ఇదం మునే! సమాఖ్యాహి మహాబుద్ధే! మనోగతమ్ ॥2॥

నీ ముఖక్షీరసాగరంనుండి పుట్టిన అమృతాత్మకమైన ఈ కథనం కర్ణాలతో త్రాగే మాకు తృప్తి కల్గడం లేదు. మునీ! మహాబుద్ధీ! నీ మనోగతమైన ఈ వృత్తాంతం చెప్పు.

సూత ఉవాచ :-సూతుడు చెప్పాడు

పృష్టస్తు మనునా దేవో మత్స్యరూపీ జనార్దనః ।
కథం శరవణే జాతో దేవః షడ్వదనో విభో! ॥3॥

పూర్వం మనువు మత్స్యావతారంలో ఉన్న దేవుడు జనార్దనునితో "విభూ! దేవుడగు కుమారస్వామి శరవణంలో ఎలా జన్మించాడు?" అని ప్రశ్నించాడు.

ఏతత్తు వచనం శ్రుత్వా పార్థివస్యామితౌజసః ।
ఉవాచ భగవాన్ ప్రీతో బ్రహ్మసూనుర్మహామతిమ్ ॥4॥

అధిక తేజస్వియగు రాజు చెప్పిన ఈ మాట విని బ్రహ్మను పుత్రునిగా గన్న భగవంతుడు ప్రీతినొంది మహామతి అయిన రాజుతో ఇలా అన్నాడు.

మత్స్య ఉవాచ :- మత్స్యం చెప్పింది

వజ్రాంగో నామ దైత్యోఽభూత్తస్య పుత్రస్తు తారకః ।
సురానుద్వాసయామాస పురేభ్యః స మహాబలః ॥5॥

పూర్వం వజ్రాంగుడనే రాక్షసు దుండేవాడు, వాని పుత్రుడు తారకుడు. మహాబలవంతుడయిన ఆ తారకుడు నగరాలనుండి దేవతలను వెడలగొట్టాడు.

తతస్తే బ్రహ్మణోఽ భ్యాశం జగ్ముర్భయనిపీడితాః ।
భీతాంశ్చ త్రిదశాన్దృష్ట్వా బ్రహ్మా తేషామువాచ హ ॥6॥

అంతట దేవతలు భయపడి బ్రహ్మవద్దకు పోయారు. భీతిగ్రస్తులైన వారిని చూచి బ్రహ్మ వారితో ఇలా అన్నాడు.

సన్త్యజధ్వం భయం దేవాః శంకరస్యాత్మజః శిశుః ।
తుహినాచలదౌహిత్రస్తం హనిష్యతి దానవమ్ ॥7॥

తతః కాలే తు కస్మింశ్చిద్దృష్ట్వా వై శైలజాం శివః ।
స్వరేతో వహ్నివదనే వ్యసృజత్కారణాన్తరే ॥8॥

"దేవతలారా! భయపడకండి! శంకరుని సుతుడు, హిమవంతుని కూతురు కొడుకు ఆ దానవుణ్ణి హతమార్చగలడు". ఆపై కొంతకాలానికి శివుడు పార్వతిని చూచి తన రేతస్సును కారణాంతరాల వల్ల అగ్ని ముఖాన వదిలాడు.

తత్ప్రాప్తం వహ్నివదనే రేతో దేవాన్ సమర్పయత్ ।
విదార్య జఠరాణ్యేషామజీర్ణం నిర్గతం మునే! ॥9॥

మునీ! తన ముఖం పొందిన ఆ రేతస్సును అగ్ని దేవతలకు అర్పించాడు. వారు దాన్ని మ్రింగగా అది అజీర్ణమై దేవతల జఠరాన్ని చీల్చుకొని వెలికి వచ్చింది.

పతితం తత్సరోవర్యే తతస్తు శరకాననే ।
తస్మాత్తు స సముద్భూతో గుహో దినకరప్రభః ॥10॥

ఆపై అది గంగలో పడి పిదప రెల్లుపొదలో పడింది. దానినుండే సూర్యకాంతి గల గుహుడు జన్మించాడు.

స సప్తదివసో బాలో నిజఘ్నే తారకాసురమ్ ।
ఏవం శ్రుత్వా తతో వాక్యం సమూచుర్ఋషిసత్తమాః ॥11॥

ఏడు దినాల ప్రాయం గల ఆ బాలుడు తారకాసురుణ్ణి వధించాడు. "ఇది విని ఋషిశ్రేష్ఠులు ఇలా అన్నారు–

ఋషయ ఊచుః :–ఋషులు చెప్పారు

అత్యాశ్చర్యవతీ రమ్యా కథేయం పాపనాశినీ ।
విస్తరేణ హి నో బ్రూహి యాథాతథ్యేన శృణ్వతామ్ ॥12॥

ఈ కథ మిక్కిలి మనోహరమై ఆశ్చర్యం కల్గించేది, పాపాలు తొలగించేదిగా ఉన్నది. దీనిని వింటున్న మాకు విస్తరంగానూ, యథాతథంగానూ చెప్పు.

వజ్రాంగో నామ దైత్యేంద్రః కస్య వంశోద్భవః పురా ।
యస్యాభూత్తారకః పుత్రః సురప్రమథనో బలీ ॥13॥

ఎవని కొడుకైన తారకుడు బలశాలియై దేవతలను పీడించాడో, వజ్రాంగుడనే ఆ రాక్షసేంద్రుడు పూర్వం ఎవని వంశంలో జన్మించాడు?

నిర్మితః కో వధే చాభూత్తస్య దైత్యేశ్వరస్య తు ।
గుహజన్మ తు కార్త్స్న్యేన అస్మాకం బ్రూహి మానద! ॥14॥

ఆ దైత్యేశ్వరుని చావుకు కారణమై అవతరించిన వాడెవ్వడు? మానదా! ఆ కుమారస్వామి పుట్టుకను సమగ్రంగా మాకు వివరించు.

సూత ఉవాచ :-సూతుడు చెప్పాడు

మానసో బ్రహ్మణః పుత్రో దక్షో నామ ప్రజాపతిః ।
షష్టిం సోఽజనయత్కన్యా వైరిణ్యామేవ నః శ్రుతమ్ ॥15॥

బ్రహ్మమానసపుత్రుడు దక్షుడనే ప్రజాపతి 'వైరిణి' అన్నపత్నియందు అరువదిమందికన్యలనుకన్నాడనివిన్నాం.

దదౌ స దశ ధర్మాయ కశ్యపాయ త్రయోదశ ।
సప్తవింశతి సోమాయ చతస్రోఽరిష్టనేమయే ॥16॥

వారిలో పదిమంది నతడు ధర్మరాజు కిచ్చాడు. కశ్యపునికి పదుముగ్గురి నిచ్చాడు. చంద్రునికి ఇరువది ఏడుమందిని, అరిష్టనేమికి నల్గురినిచ్చి వివాహం చేశాడు.

ద్వే చైవ భృగుపుత్రాయ ద్వే వై చాంగిరసే తథా ।
ద్వే కృశాశ్వాయ విదుషే ప్రజాపతిసుతః ప్రభుః ॥17॥

ప్రజాపతిసుతుడగు ఆ దక్షప్రభువు ఇద్దరిని భృగుపుత్రునికీ, ఇద్దరిని ఆంగిరసునకూ, మరొక యిద్దరిని విద్వాంసుడైన కృశాశ్వునికీ సమర్పించాడు.

అదితిర్దితిర్దనుర్విశ్వా హ్యరిష్టా సురసా తథా ।
సురభిర్వినతా చైవ తామ్రా క్రోధవశా ఇరా ॥18॥

కద్రూర్మునిశ్చ లోకస్య మాతరో గోషు మాతరః ।
తాసాం సకాశాల్లోకానాం జంగమస్థావరాత్మనామ్ ॥19॥

జన్మ నానాప్రకారాణాం తాభ్యోఽన్యే దేహినః స్మృతాః ।
దేవేంద్రోపేంద్రపూషాద్యాః సర్వే తేఽదితిజా మతాః ॥20॥

అదితి, దితి, దనువు, విశ్వ, అరిష్ట, సురస, సురభి, వినత, తామ్ర, క్రోధవశ, ఇర, కద్రువు, ముని అనువారు కశ్యపుని పత్నులు. వీరు లోకానికీ, గోవులకూ తల్లులు. వారినుండి చరాచరాత్మకమైన లోకాలు జనించాయి.

నానా ప్రకారాల ప్రాణుల జన్మలో ఇతరదేహధారులు కూడా వారినుండి కలిగారు. దేవేంద్రుడు, ఉపేంద్రుడూ, పూష మున్నగు దేవత లంతా అదితి సంతానమే.

దితేః సకాశాద్దైత్యా హి హిరణ్యకశిపాదయః ।
దానవాశ్చ దనోః పుత్రా గావశ్చ సురభేస్సుతాః ॥21॥

దితికి హిరణ్యకశిపుడు మున్నగు దైత్యులు జన్మించారు. దను పుత్రులు దానవులు, గోవులు సురభిసంతానం.

పక్షిణో వినతాపుత్రా గరుడప్రముఖాః స్మృతాః ।
నాగాః కద్రూసుతా జ్ఞేయాః శేషాభ్యోఽన్యేఽపి జన్తవః ॥22॥

గరుడాది పక్షులు వినతాసంతతి, నాగులు కద్రూసుతులు, తక్కిన ప్రాణులు తదితరుల సంతానమే.

త్రైలోక్యనాథం శక్రం తు సర్వామరగణప్రభుమ్ ।
హిరణ్యకశిపుశ్చక్రే జిత్వా రాజ్యం మహాబలః ॥23॥

త్రిలోకాలకూ, సకల దేవతాగణాలకూ ప్రభువైన ఇంద్రుణ్ణి జయించి మహాబలవంతుడైన హిరణ్య కశిపుడు రాజ్యం గ్రహించి పరిపాలించాడు.

తతః కేనాపి కాలేన హిరణ్యకశిపాదయః ।
నిహతా విష్ణునా సంఖ్యే శేషాశ్చేంద్రేణ దానవాః ॥24॥

ఆపై కొంతకాలానికి హిరణ్యకశిపుడు మున్నగు దానవులు విష్ణునిచేత, ఇతరులు ఇంద్రునిచేతా యుద్ధంలో నిహతు లయ్యారు.

తతో నిహతపుత్రాఽభూద్దితిర్వరమయాచత ।
భర్తారం కశ్యపం దేవం పుత్రమన్యం మహాబలమ్ ॥25॥

అలా పుత్రులందరూ మరణించగా దితి భర్త కశ్యపునితో మహాబలవంతుడైన మరొక కుమారుణ్ణి ప్రసాదించమని వరం కోరింది.

సమరే శక్రహన్తారం స తస్యా అదదాత్ప్రభుః ॥26॥

నియమే వర్త హే దేవి సహస్రం శుచిమానసా ।
వర్షాణాం లప్స్యసే పుత్రమిత్యుక్తా సా తథాఽకరోత్ ॥27॥

అత డామెకు యుద్ధంలో ఇంద్రుణ్ణి చంపగల పుత్రుణ్ణి ప్రసాదించాడు. "దేవీ! నియమంతో వెయ్యేండ్లు శుచిమానసవై వుండు. ఆపై నీవట్టి పుత్రుణ్ణి పొందుదువు' అని చెప్పాడు. ఆమె అట్లే చేసింది.

వర్తన్త్యా నియమే తస్యాః సహస్రాక్షః సమాహితః ।
ఉపాసామాచరత్తస్యాః సా చైనం చాన్వమన్యత ॥28॥

ఇంద్రుడు నియమంతో వున్న ఆమె సంగతి గ్రహించి ఆమెను సేవిస్తానంటూ వచ్చాడు. ఆమె అందు కంగీకరించింది.

దశవత్సరశేషస్య సహస్రస్య తదా దితిః ।
ఉవాచ శక్రం సుప్రీతా వరదా తపసి స్థితా ॥29॥

వెయ్యేండ్లకు ఇంకా పది సంవత్సరాలు మిగిలివుండగా తపోనిష్ఠలో ఉన్న దితి ప్రీతి నొంది వర ప్రసాదినియై ఇంద్రునితో ఇలా అన్నది-

దితిరువాచ :- దితి చెప్పింది.

పుత్రోత్తీర్ణవ్రతాం ప్రాయో విద్ధి మాం పాకశాసన! ।
భవిష్యతి చ తే భ్రాతా తేన సార్ధమిమాం శ్రియమ్ ॥30॥

భుంక్ష్వ వత్స! యథాకామం త్రైలోక్యం హతకణ్టకమ్ ।
ఇత్యుక్త్వా నిద్రయాఽఽవిష్టా చరణాక్రాన్తమూర్ధజా ॥31॥

"పాకశాసనా! పుత్రా! నేను ఇంచుమించు వ్రతం పూర్తి చేశానని తెలుసుకో. నీకు సోదరుడు కలుగనున్నాడు. అతనితో కలిసి ఈ లక్ష్మిని యథేచ్ఛగా, శత్రురహితంగా ముల్లోకాలనూ అనుభవించు." అలా చెప్పి జుట్టు వీడి శిరోజాలు కాళ్ళపై పడుతుండగా తెలియకనే నిద్రించింది.

స్వయం సుష్వాప నియతా భావినోఽర్థస్య గౌరవాత్ ।
తంతు రంధ్రం సమాసాద్య జవనాత్పాకశాసనః ॥32॥

చకార సప్తధా గర్భం కులిశేన తు దేవరాట్ ।
ఏకైకం తు పునః ఖణ్డం చకార మఘవాంస్తతః ॥33॥

సప్తధా సప్తధా కోపాత్ప్రాబుధ్యత తతో దితిః ।
విబుధ్యోవాచ మా శక్ర ఘాతయేథాః ప్రజాం మమ ॥34॥

జరుగనున్న సంఘటనల బలంవల్ల ఇన్నాళ్ళు నియతయై ఉండిన ఆమె నియమరహితయై స్వయంగా నిద్రించింది. ఆ రంధ్రం చేజిక్కించుకొని దేవప్రభువైన ఇంద్రుడు శీఘ్రంగా ఆమె గర్భాన్ని వజ్రాయుధంతో సప్తఖండాలుగా చీల్చివేశాడు. ఆపై ఒక్కొక్క ఖండాన్నీ మరల ఏడేడుగా కోపంతో ఖండించాడు. అంతట దితి నిద్ర నుండి లేచింది - లేచి "ఇంద్రా! నా సంతతిని వధించవద్దు" అని బ్రతిమాలింది.

తచ్ఛ్రుత్వా నిర్గతః శక్రః స్థిత్వా ప్రాంజలిరగ్రతః ।
ఉవాచ వాక్యం సంత్రస్తో మాతుర్ద్వై శనకైరిదమ్ ॥35॥

తల్లి మాట విని ఇంద్రుడు వెలికి వచ్చి ప్రాంజలియై ఎదుట నిలిచి భీతుడై మెల్లగా ఇలా అన్నాడు.

శక్ర ఉవాచ :– శుక్రుడు చెప్పాడు.

దివాస్వప్నపరా మాతః పాదాక్రాన్తశిరోరుహా ।
సప్తసప్తభిరేవాతస్తవ గర్భః కృతో మయా ॥36॥

తల్లీ! నీవు పాదాక్రాంతమైన వెంట్రుకలతో పగలు నిద్రించావు. ఆ దోషాన్ని పురస్కరించుకొని నీ గర్భాన్ని నేను ఏడు, ఏడు ఖండాలుగా చేశాను.

ఏకోనపంచాశద్భాగా వజ్రేణైతేన తే శుభాః ।
దాస్యామి తేషాం స్థానాని దివి దైవతపూజితే ॥37॥

మొత్తం భాగాలు నలుబది తొమ్మిదిగా నా వజ్రంచే నీ పుత్రులు విభజింపబడ్డారు. దేవతలచే పూజింపబడినదానా! వారికి దేవలోకంలో తగిన స్థానాలను ఇస్తాను".

ఇత్యుక్తా సా తదా దేవీ సైవమస్త్విత్యభాషత ।
పునశ్చ దేవీ భర్తారమువాచాసితలోచనా ॥38॥

అని ఇంద్రుడనగా ఆ దేవి 'సరే' అన్నది. మరల అసితనేత్ర యగు ఆదేవి భర్తతో మళ్ళీ ఇలా చెప్పింది.

పుత్రం ప్రజాపతే! దేహి శక్రజేతారమూర్జితమ్ ।
యో నాస్త్రశస్త్రైర్వధ్యత్వం గచ్ఛేత్త్రిదివవాసినామ్ ॥39॥

ప్రజాపతీ! ఇంద్రుణ్ణి జయించగల బలవంతుడైన పుత్రుణ్ణి ప్రసాదించు. అతడు దేవతల అస్త్ర శస్త్రాలతో మరణించరాదు.

ఇత్యుక్తః స తథోవాచ తాం పత్నీమతిదుఃఖితామ్ ।
దశవర్షసహస్రాణి తపః కృత్వా తు లప్స్యసే ॥40॥

వజ్రసారమయైరంగైరచ్ఛేద్యైరాయసైర్వృఢైః ।
వజ్రాంగో నామ పుత్రస్తే భవితా పుత్రవత్సలే! ॥41॥

అలా అలా చెప్పగా కశ్యపుడు అతిగా దుఃఖించిన సతితో "పుత్రవాత్సల్యం కలదానా! నీవు పది వేల సంవత్సరాలు తపస్సు చేస్తే వజ్రాసారమయమై అచ్ఛేద్యాలు, అయోమయాలు, దృఢాలు అయిన అవయవాలతో వజ్రాంగుడనే పుత్రుడు నీకు కలుగగలడు.

సా తు లబ్ధవరా దేవీ జగామ తపసే వనమ్ ।
దశవర్షసహస్రాణి సా తపో ఘోరమాచరత్ ॥42॥

అలా వరం పొందిన ఆ దేవి తపస్సుకై అడవికి పోయింది. పదివేల సంవత్సరాలు ఘోరతపస్సు ఆచరించింది.

తపసోఽన్తే భగవతీ జనయామాస దుర్జయమ్ ।
పుత్రమప్రతికర్మాణమజేయం వజ్రదుశ్ఛిదమ్ ॥43॥

తపస్సు పూర్తి కాగానే ఆ భగవతి దుర్జయుడు, ఎదురు లేనివాడు, అజేయుడు, వజ్రంలాగా ఛేదింపరానివాడు, అయిన పుత్రుణ్ణి కన్నది.

స జాతమాత్ర ఏవాభూత్సర్వశస్త్రాస్త్రపారగః ।
ఉవాచ మాతరం భక్త్యా మాతః కిం కరవాణ్యహమ్ ॥44॥

వాడు పుట్టగానే సకలశస్త్రాస్త్రాలలో ప్రవీణు డైనాడు. భక్తితో తల్లిని చూచి "అమ్మా! నేనేమి చేయాలి" అని అడిగాడు.

తమువాచ తతో హృష్టా దితిర్దైత్యాధిపం చ సా ।
బహవో మే హతాః పుత్రాః సహస్రాక్షేణ పుత్రక! ॥45॥

తేషాం త్వం ప్రతికర్తుం వై గచ్ఛ శక్రవధాయ చ ।
బాఢమిత్యేవ తాముక్త్వా జగామ త్రిదివం బలీ ॥46॥

అందుకు సంతసించి దితి ఆ దైత్యాధిపునితో "పుత్రా! ఇంద్రుడు నా బిడ్డల ననేకులను చంపాడు. అందుకు ప్రతీకారం చేయడానికై, ఇంద్రుణ్ణి వధించడానికి నీవు వెళ్ళు" అని చెప్పింది. అది విని ఆ బలశాలి 'అట్లే చేస్తాను' అని చెప్పి స్వర్గానికి వెళ్ళాడు.

బద్ధ్వా తతః సహస్రాక్షం పాశేనామోఘవర్చసా ।
మాతురన్తికమాగచ్ఛద్వ్యాధః క్షుద్రమృగం యథా ॥47॥

ఆపై అమోఘ తేజస్సు గల పాశంతో వ్యాధుడు క్షుద్రమృగాన్నివలె ఇంద్రుణ్ణి బంధించి తల్లివద్దకు తెచ్చాడు.

ఏతస్మిన్నన్తరే బ్రహ్మా కశ్యపశ్చ మహాతపాః ।
ఆగతౌ తత్ర యత్రాస్తాం మాతాపుత్రావభీతకౌ ॥48॥

ఇంతలో బ్రహ్మ, మహాతపస్వి అయిన కశ్యపుడు మాతాపుత్రులు నిర్భయంగా ఉన్నచోటికి వచ్చారు.

దృష్ట్వా తు తమువాచేదం బ్రహ్మా కశ్యప ఏవ చ ।
ముంచైనం పుత్ర! దేవేంద్రం కిమనేన ప్రయోజనమ్ ॥49॥

వారిని చూచి బ్రహ్మ, కశ్యపుడు ఇలా అన్నారు "పుత్రా! ఈ దేవేంద్రుణ్ణి వదలిపెట్టు. ఇతనివల్ల మీకు లాభమేమి?

అపమానో వధః ప్రోక్తః పుత్ర! సంభావితస్య చ ।
అస్మద్వాక్యేన యో ముక్తో విద్ధి తం మృతమేవ చ ॥50॥

పుత్రా! గౌరవింపబడినవానికి అవమానమే వధం. మా మాటతో వదలివేయబడినవాడు మృతుడే అని గ్రహించు.

పరస్య గౌరవాన్ముక్తః శత్రుణా స మహాహవే ।
జీవన్నేవ మృతో వత్స దివసే దివసే స తు ॥51॥

వత్సా! ఇతరుల గౌరవం మీద మహాయుద్ధంలో శత్రువుచే వదలబడినవాడు అతడు జీవించివుండగనే ప్రతిదినం మరణించినవా డవుతాడు.

మహతాం వశమాయాతే వైరం నైవాస్తి వైరిణి ।
ఏతచ్ఛ్రుత్వా తు వజ్రాంగః ప్రణతో వాక్యమబ్రవీత్ ॥52॥

పెద్దల వశానికి వచ్చిన శత్రువుతో ఇక వైరం లేదు. అది విని వజ్రాంగుడు వారికి ప్రణమిల్లి ఇలా అన్నాడు.

న మే కృత్యమనేనాస్తి మాతురాజ్ఞా కృతా మయా ।
త్వం సురాసురనాథో వై మమ చ ప్రపితామహః ॥53॥

"వీనివల్ల నాకు ప్రయోజన మేమీ లేదు. నేను నా తల్లి ఆనతి పాటించాను. నీవు సురాసురులకు ప్రభుడవు, నాకును ముత్తాతవు."

కరిష్యే త్వద్వచో దేవ ఏష ముక్తః శతక్రతుః ।
తపసే మే రతిర్దేవ నిర్విఘ్నం చైవ మే భవేత్ ॥54॥

త్వత్ప్రసాదేన భగవన్నిత్యుక్త్వా విరరామ సః ।
తస్మింస్తూష్ణీం స్థితే దైత్యే ప్రోవాచేదం పితామహః ॥55॥

దేవా! నీమాట పాటిస్తాను. ఇదిగో ఇంద్రుణ్ణి వదిలేశాను. నాకు తపస్సు అంటే ఇష్టం. భగవన్! నీ అనుగ్రహంతో అది నాకు నిర్విఘ్నంగా జరుగుగాక!" ఇలా చెప్పి వాడు విరమించాడు. వాడు మౌనం వహించగా బ్రహ్మ వానితో ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ చెప్పాడు

తపస్త్వం క్రూరమాపన్నో హ్యస్మచ్ఛాసనసంస్థితః ।
అనయా చిత్తశుద్ధ్యా తే పర్యాప్తం జన్మనః ఫలమ్ ॥56॥

"నా ఆజ్ఞకు లోబడి నీవు ఘోరతపస్సుకు పూనుకొంటున్నావు. ఈ నీ చిత్తశుద్ధి చేత నీ జన్మఫలం సమగ్రమయింది."

ఇత్యుక్త్వా పద్మజః కన్యాం ససర్జాయతలోచనామ్ ।
తామస్మై ప్రదదౌ దేవః పత్న్యర్థం పద్మసంభవః ॥57॥

ఇలా చెప్పి బ్రహ్మ విశాలనేత్ర అయిన ఒక కన్యను సృష్టించాడు. అతని కామెను పత్నిగా ఇచ్చాడు.

వరాంగీతి చ నామాస్యాః కృత్వా యాతః పితామహః ।
వజ్రాంగోఽపి తయా సార్ధం జగామ తపసే వనమ్ ॥58॥

ఆమెకు 'వరాంగి' అని నామకరణం చేసి బ్రహ్మ వెళ్ళి పోయాడు. వజ్రాంగు డామెతో గూడా వనానికి తపోనిష్ఠకై పోయాడు.

ఊర్ధ్వబాహుః స దైత్యేంద్రోఽ చరదబ్దసహస్రకమ్ ।
కాలం కమలపత్రాక్షః శుద్ధబుద్ధిర్మహాతపాః ॥59॥

ఆ దైత్యరాజు ఊర్ధ్వబాహుడు, పద్మపత్రనేత్రుడు, శుద్ధబుద్ధి, మహాతపస్వి అయి వెయ్యి సంవత్సరాల పాటు తపస్సు చేశాడు. 'అష్టసహస్రకం' అన్న పాఠం గ్రహిస్తే ఎనిమిదివేల యేండ్లని అర్థం చెప్పాలి.

తావచ్చావాఙ్ముఖః కాలం తావత్పంచాగ్నిమధ్యగః ।
నిరాహారో ఘోరతపాస్తపోరాశిరజాయత ॥60॥

అంతకాలం తల క్రిందికి వాల్చి అవాఙ్ముఖుడుగానూ, మళ్ళీ అంతకాలం పంచాగ్ని మధ్యనుండీ, నిరాహారుడై ఘోరతపస్సు చేసి 'తపోరాశి' అయ్యాడు.

తతః సోఽ న్తర్జలే చక్రే కాలం వర్షసహస్రకమ్ ।
జలాన్తరం ప్రవిష్టస్య తస్య పత్నీ మహావ్రతా ॥61॥

తస్యైవ తీరే సరసస్తప్యన్తీ మౌనమాస్థితా ।
నిరాహారా తపో ఘోరం ప్రవివేశ మహాద్యుతిః ॥62॥

మరల అతడు నీటిలోపల వెయ్యేండ్లు తపస్సు చేశాడు. అతడు నీటిలో వుండగా మహావ్రతనిష్ఠ గల అతని భార్య, ఆ మడుగు గట్టుననే మౌనం పాటిస్తూ తపస్సు చేస్తూ మహాకాంతిగలదై, నిరాహారురాలై ఘోరతపం ఆచరించింది.

తస్యాం తపసి వర్తన్త్యామింద్రశ్చక్రే విభీషికామ్ ।
భూత్వా తు మర్కటస్తత్ర తదాశ్రమమహద్వనమ్ ॥63॥

చక్రే విలోలం నిఃశేషం తుంబీఘటకరణ్డకమ్ ।
తతస్తు ఘోరరూపేణ కమ్పం తస్యాకరోన్మహాన్ ॥64॥

ఆమె అలా తపోనిష్ఠలో ఉండగా ఇంద్రుడు ఆ ఆశ్రమంలోకి పెద్దకోతి రూపంతో వచ్చి ఆమెను భయపెట్టాడు. సొరకాయ బుర్ర, కడవ, బరిణలను చెల్లాచెదరు కావించాడు. ఆపై పెద్దభీకరరూపంతో వచ్చి గొప్ప ప్రకంపం కల్గించాడు.

తతో భుజంగరూపేణ బద్ధ్వా చ చరణద్వయమ్ ।
అపాకర్షత్తతో దూరం భ్రమంస్తస్యా మహీమిమామ్ ॥65॥

ఆపై 'పాము'గా వచ్చి ఆమె కాళ్ళు రెండింటిని బంధించి తానూ తిరుగుతూ బహుదూరం నేలపై ఆమెను ఈడ్చాడు.

తపోబలాఢ్యా సా తస్య న వధ్యత్వం జగామ హ ।
తతో గోమాయురూపేణ తస్యాదూషయదాశ్రమమ్ ॥66॥

తపోబలసంపన్నురాలైన ఆమె ఇంత జరిగినా చావుకు గురి కాలేదు. ఆ తరువాత అతడు నక్కరూపంతో ప్రవేశించి ఆశ్రమాన్ని దూషితం కావించాడు.

తతస్తు మేఘరూపేణ తస్యాః క్లేదయదాశ్రమమ్ ।
భీషికాభిరనేకాభిస్తాం క్లిశ్యన్ పాకశాసనః ॥67॥

అంతట 'మేఘం'గా వచ్చి ఆమె ఆశ్రమాన్ని నీట ముంచివేశాడు. ఇలా ఇంద్రుడు అనేక విధాల భీతి గొలిపే చేష్టలతో ఆమెకు క్లేశం కల్గించాడు.

విరరామ యదా నైవం వజ్రాంగమహిషీ తదా ।
శైలస్య దుష్టతాం మత్వా శాపం దాతుం వ్యవస్థితా ॥68॥

ఇలా ఎంతకూ తన దుశ్చేష్టలు విరమించక పోయేసరికి వజ్రాంగుని భార్య అది ఆ కొండయొక్క దౌష్ట్యమని తలచి శపించడానికి సిద్ధమయింది.

స శాపాభిముఖీం దృష్ట్వా శైలః పురుషవిగ్రహః ।
ఉవాచ తాం వరారోహాం వరాంగీం భీరుచేతనః ॥69॥

ఆమె శపిస్తుందని గ్రహించి ఆ కొండ భయపడి పురుషాకారంతో వచ్చి వరారోహయగు ఆ వజ్రాంగితో ఇలా అన్నది.

నాహం వరాంగనే! దుష్టః సేవ్యోఽహం సర్వదేహినామ్ ।
విభ్రమం తు కరోత్యేష రుషితః పాకశాసనః ॥70॥

"వరాంగనా! నేను దుష్టడను కాను. నేను సర్వప్రాణులకు సేవింపదగిన వాడను. రోషించిన ఇంద్రుడు ఈ విభ్రాంతి కల్గిస్తున్నాడు".

ఏతస్మిన్నన్తరే జాతః కాలో వర్షసహస్రికః ।
తస్మిన్ గతే తు భగవాన్కాలే కమలసంభవః ।
తుష్టః ప్రోవాచ వజ్రాంగం తమాగమ్య జలాశ్రయమ్ ॥71॥

ఇంతలో వెయ్యి సంవత్సరాల కాలం పూర్తి అయింది. పూర్తి కాగానే పద్మజుడైన బ్రహ్మ సంతసించి ఆ మడుగు చెంతకు వచ్చి వజ్రాంగునితో ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ :– బ్రహ్మ చెప్పాడు

దదామి సర్వకామాంస్తే ఉత్తిష్ఠ దితినన్దన! ।
ఏవముక్తస్తదోత్థాయ దైత్యేంద్రస్తపసాం నిధిః ।
ఉవాచ ప్రాంజలిర్వాక్యం సర్వలోకపితామహమ్ ॥72॥

"దితినందనా! లెమ్ము! నీకు సకలాభీష్టాలూ ఇస్తాను". అలా బ్రహ్మ చెప్పగా తపోనిధి యగు దైత్యనాథుడు లేచి వచ్చి ప్రాంజలియై సర్వలోకానికీ పితామహుడైన బ్రహ్మతో ఇలా అన్నాడు.

వజ్రాంగ ఉవాచ :– వజ్రాంగుడు

ఆసురో మాస్తు మే భావః సన్తు లోకా మమాక్షయాః ।
తపస్యేవ రతిర్మేఽస్తు శరీరస్యాస్తు వర్తనమ్ ॥73॥

'నాభావం ఆసురంగా వుండకుండు గాక! నా లోకాలు అక్షయములగు గాక! నాకు తపస్సునందే ఆసక్తి కల్గు గాక! నా శరీరం రక్షిత మగును గాక!"

ఏవమస్త్వితి తం దేవో జగామ స్వకమాలయమ్ ।
వజ్రాంగోఽపి సమాప్తే తు తపసి స్థిరసంయమః ॥74॥

ఆహారమిచ్ఛన్ భార్యాం స్వాం న దదర్శాశ్రమే స్వకే ।
క్షుధావిష్టః స శైలస్య గహనం ప్రవివేశ హ ॥75॥

'అట్లే' అని బ్రహ్మ తన ఆలయానికి వెళ్ళిపోయాడు. వజ్రాంగుడు తపస్సు పూర్తి కాగానే స్థిరమైన నిగ్రహం కలవాడై ఆహారం కోరి భార్యను చూడబోగా ఆమె ఆశ్రమంలో కనిపించలేదు. ఆకలితో అత డాకొండయొక్క అరణ్యంలో ప్రవేశించాడు.

ఆదాతుం ఫలమూలాని స చ తస్మిన్ వ్యలోకయత్ ।
రుదతీం తాం ప్రియాం దీనాం తనుప్రచ్ఛాదితాననామ్ ।
తాం విలోక్య స దైత్యేంద్రః ప్రోవాచ పరిసాన్త్వయన్ ॥76॥

ఫలమూలాలు తేవడానికి వెళ్ళి అక్కడ అతడు ఏడుస్తున్న దీనురాలైన ప్రియురాలిని చూచి శరీరంతో ముఖం కప్పుకొనివున్న ఆమెను ఆ దైత్యేంద్రుడు ఓదారుస్తూ ఇలా చెప్పాడు–

వజ్రాంగ ఉవాచ :–వజ్రాంగుడు చెప్పాడు

కేన తేఽపకృతం భీరు! యమలోకం యియాసునా ।
కం వా కామం ప్రయచ్ఛామి శీఘ్రం మే బ్రూహి భామిని! ॥77॥

ఓ భయస్థురాలా! యమలోకం పోగోరి నీకు అపకారం చేసినది ఎవరు? నీకేమి కావాలి! భామినీ! త్వరగా నాకు విషయం చెప్పు!"

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే వజ్రాంగకృత తపోవర్ణనం నామ షట్చత్వారింశదధికశతతమోఽధ్యాయః॥146 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని వజ్రాంగకృత తపోవర్ణనమనే నూటనలబై ఆరవ అధ్యాయం సంపూర్ణం

సప్తచత్వారింశదధికశతతమోఽధ్యాయః - నూటనలబై ఏడవ అధ్యాయం

తారకజననమ్ - తారకజననం

వరాంగ్యువాచ :- వరాంగి చెప్పింది.

త్రాసితాఽస్మ్యపవిద్ధాఽస్మి తాడితా పీడితాఽపి చ ।
రౌద్రేణ దేవరాజేన నష్టనాథేవ భూరిశః ॥1॥

రౌద్రుడైన ఇంద్రునిచేత భర్త లేనిదానను వలె నానావిధాల భయపెట్టబడ్డాను. బాధింపబడి, కొట్టబడి, పీడింపబడ్డాను.

దుఃఖపారమపశ్యన్తీ ప్రాణాంస్త్యక్తుం వ్యవస్థితా ।
పుత్రం మే తారకం దేహి దుఃఖశోకమహార్ణవాత్ ॥2॥

దుఃఖాంతం చూడలేక ప్రాణపరిత్యాగానికి నిశ్చయించుకొన్నాను. ఈ దుఃఖశోకసముద్రంనుండి తరింపజేసే పుత్రుణ్ణి ప్రసాదించు."

ఏవముక్తః స దైత్యేంద్రః కోపవ్యాకులలోచనః ।
శక్తోఽపి దేవరాజస్య ప్రతికర్తుం మహాసురః ॥3॥

తపః కర్తుం పునర్దైత్యో వ్యవస్యత మహాబలః ।
జ్ఞాత్వా తు తస్య సంకల్పం బ్రహ్మా క్రూరతరం పునః ॥4॥

ఆజగామ తదా తత్ర యత్రాసౌ దితినన్దనః ।
ఉవాచ తస్మై భగవాన్ ప్రభుర్మధురయా గిరా ॥5॥

ఇలా ఆమె చెప్పగా ఆ రాక్షసేంద్రుడు కోపవ్యాకులనేత్రుడై ఇంద్రుని పట్ల ప్రతీకారం చేయడానికి శక్తుడై కూడా మళ్ళీ తపస్సు చేయడానికే ఆ మహాబలవంతుడు నిశ్చయించుకొన్నాడు. అతని క్రూరమైన సంకల్పం తెలుసుకొన్న బ్రహ్మ ఆ దితి పుత్రుడున్న చోటికి వచ్చాడు. అతనితో మధురమైన మాటలతో ఆ భగవంతుడైన ప్రభు విలా అన్నాడు.

బ్రహ్మోవాచ :- బ్రహ్మ చెప్పాడు.

కిమర్థం పుత్ర! భూయస్త్వం నియమం క్రూరమిచ్ఛసి ।
ఆహారాభిముఖో దైత్య! తన్నో బ్రూహి మహావ్రత! ॥6॥

పుత్రా! మహావ్రతా! ఆహారం తీసుకోవడానికి సిద్ధమై కూడా మళ్ళీ ఘోరమైన ఈ నియమాన్ని ఎందుకు కోరుతున్నావో, మాకు చెప్పు.

యావదబ్దసహస్రేణ నిరాహారస్య యత్ఫలమ్ ।
క్షణేనైకేన తల్లభ్యం త్యక్త్వాఽఽహారముపస్థితమ్ ॥7॥

వెయ్యి సంవత్సరాలు నిరాహారంగా ఉన్న వానికేది ఫలమో అది ఒక క్షణంలో వచ్చిన ఆహారాన్ని కాదన్నవానికి కల్గుతుంది.

త్యాగో హ్యప్రాప్తకామానాం కామేభ్యో న తథా గురుః ।
యథా ప్రాప్తం పరిత్యజ్య కామం కమలలోచన! ॥8॥

కమలనేత్రా! వచ్చిన కామాన్ని వదలి త్యాగం చేసేవారి ముందు కోరికలు తీరనివారి త్యాగం అంత గొప్పేమీ కాదు."

శ్రుత్వైతద్ బ్రహ్మణో వాక్యం దైత్యః ప్రాంజలిరబ్రవీత్ ।
చిన్తయంస్తపసా యుక్తో హృది బ్రహ్మముఖేరితమ్ ॥9॥

బ్రహ్మ మాట విని తపోయుక్తుడైన దైత్యుడు ఆ మాటను మదిలో చింతిస్తూ ప్రాంజలియై ఇలా అన్నాడు.

వజ్రాంగ ఉవాచ :–వజ్రాంగుడు చెప్పాడు

ఉత్థితేన మయా దృష్టా సమాధానాత్త్వదాజ్ఞయా ।
మహిషీ భీషితా దీనా రుదతీ శాఖినస్తలే ॥10॥

"నేను సమాధినుండి నీ ఆజ్ఞతో లేచి, భయపెట్టబడి దీనురాలై ఏడుస్తూ చెట్టుక్రింద ఉన్న నా మహిషిని చూచాను.

సా మయోక్తా తు తన్వంగీ దూయమానేన చేతసా ।
కిమేవం వర్తసే భీరు! వద త్వం కిం చికీర్షసి? ॥11॥

పరితప్తచిత్తంతో నేనామెతో "భీరూ! ఎందు కిలా వున్నావు! నీవు ఏమి చేయగోరుతున్నావో చెప్పు" అనిఅన్నాను.

ఇత్యుక్తా సా మయా దేవ! ప్రోవాచ స్ఖలితాక్షరమ్ ।
వాక్యం వాచస్పతే! భీతా తన్వంగీ హేతుసంహితమ్ ॥12॥

దేవా! వాచస్పతీ! నేనలా చెప్పగా తన్వంగి మాటలు తొట్రుపడుతుండగా భీతురాలై హేతుబద్ధమైన వాక్యం ఇలా చెప్పింది.

వరాంగ్యువాచ :–వరాంగి చెప్పింది

త్రాసితాఽస్మ్యపవిద్ధాఽస్మి కర్షితా పీడితాఽస్మి చ ।
రౌద్రేణ దేవరాజేన నష్టనాథేవ భూరిశః ॥13॥

"నేను భర్తను పోగొట్టుకొన్న విధవవలె రౌద్రుడైన ఇంద్రునిచే భయపెట్ట బడ్డాను. లాగికొట్టి నన్నతడు బహువిధాల పీడించాడు.

దుఃఖస్యాన్తమపశ్యన్తీ ప్రాణాంస్త్యక్తుం వ్యవస్థితా ।
పుత్రం మే తారకం దేహి హ్యస్మాద్దుఃఖమహార్ణవాత్ ॥14॥

దుఃఖాంతం చూడలేనిదాననై ప్రాణాలు వదలడానికి నిశ్చయించుకొన్నాను. ఈ దుఃఖ మహాసముద్రం నుండి నన్ను తరింపజేసే పుత్రుణ్ణి నాకిమ్ము".

ఏవముక్తస్తు సంక్షుభ్దస్తస్యాః పుత్రార్థముద్యతః ।
తపో ఘోరం కరిష్యామి జయాయ త్రిదివౌకసామ్ ॥15॥

ఇలా చెప్పగా సంక్షోభానికి గురి అయిన నేను ఆమెకు పుత్రుడు కల్గడానికి ఉద్యమించినవాడనై దేవతలను జయించడానికి ఘోరతపస్సు చేస్తాను.

ఏతచ్ఛ్రుత్వా వచో దేవః పద్మగర్భోద్భవస్తదా ।
ఉవాచ దైత్యరాజానం ప్రసన్నశ్చతురాననః ॥16॥

ఇది విని పద్మగర్భజాతుడైన చతుర్ముఖుడు ఆ దైత్యరాజు పట్ల ప్రసన్నుడై ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ :–బ్రహ్మ చెప్పాడు

అలం తే తపసా వత్స! మా క్లేశే దుస్తరే విశ ।
పుత్రస్తే తారకో నామ భవిష్యతి మహాబలః ॥17॥

వత్సా! ఈ తపస్సు వద్దు. దుస్తరమైన క్లేశంలో పడవద్దు. నీకు తారకుడనే మహాబలశాలి అయిన కుమారుడు కలుగగలడు.

దేవసీమన్తినీనాం తు ధమ్మిల్లస్య విమోక్షణః ।
ఇత్యుక్తో దైత్యనాథస్తు ప్రణిపత్య పితామహమ్ ॥18॥

ఆగత్యానన్దయామాస మహిషీం హర్షితాననః ।
తౌ దమ్పతీ కృతార్థౌ తు జగ్మతుః స్వాశ్రమం ముదా ॥19॥

వాడు దేవతాస్త్రీల కొప్పులను విడిపించగలవాడు అని బ్రహ్మ చెప్పగా దైత్యాధిపతి పితామహునికి ప్రణమిల్లి తిరిగి వచ్చి సంతుష్టముఖుడై తన మహిషిని సంతసింపజేశాడు. ఆ దంపతు లప్పుడు కృతార్థులై సంతోషంతో తమ ఆశ్రమానికి వెళ్ళారు.

వజ్రాంగేణాహితం గర్భం వరాంగీ వరవర్ణినీ ।
పూర్ణం వర్షసహస్రం చ దధారోదర ఏవ హి ॥20॥

వజ్రాంగునిచే ఆహితమైన గర్భాన్ని వరవర్ణినియైన వరాంగి ఉదరంలోనే వెయ్యి సంవత్సరాలు పూర్ణంగా భరించింది.

తతో వర్షసహస్రాన్తే వరాంగీ సుషువే సుతమ్ ।
జాయమానే తు దైత్యేంద్రే తస్మిన్ లోకభయంకరే ॥21॥

చచాల సకలా పృథ్వీ సముద్రాశ్చ చకంపిరే ।
చేలుర్మహీధరాః సర్వే వవుర్వాతాశ్చ భీషణాః ॥22॥

పిదప వర్షసహస్రం గడవగానే వరాంగి పుత్రుణ్ణి ప్రసవించింది. లోకభీకరుడైన ఆ దైత్యేంద్రుడు జన్మిస్తూవుండగానే. సమస్తధరాతలం చలించింది. సముద్రాలు కంపించాయి. కొండలన్నీకదలాయి. గాడ్పులు భీకరంగా వీచాయి.

జేపుర్జప్యం మునివరా నేదుర్వ్యాలమృగా అపి ।
చంద్రసూర్యౌ జహుః కాన్తిం సనీహారా దిశోఽభవన్ ॥23॥

మునివరులు మంత్రజపం చేశారు. వ్యాలమృగాలు గూడా నినాదాలు కావించాయి. చంద్రసూర్యులు కాంతిహీనులయ్యారు. దిక్కులంతటా మంచు క్రమ్మింది.

జాతే మహాసురే తస్మిన్ సర్వే చాపి మహాసురాః ।
ఆజగ్ముర్హృషితాస్తత్ర తథా చాసురయోషితః ॥24॥

ఆ మహాదానవుడు పుట్టగానే మహాసురులందరూ, అసురవనితలతో సహా హర్షం పొంది అక్కడకు వచ్చారు.

జగుర్హర్షసమావిష్టా ననృతుశ్చాసురాంగనాః ।
తతో మహోత్సవో జాతో దానవానాం ద్విజోత్తమాః! ॥25॥

అసురస్త్రీలు హర్షంతో పాడారు. నృత్యం చేశారు, ద్విజోత్తములారా! అలా అప్పుడక్కడ దానవులకు పెద్ద ఉత్సవం జరిగింది.

విషణ్ణమనసో దేవాః సమహేంద్రాస్తదాఽభవన్ ।
వరాంగీ స్వసుతం దృష్ట్వా హర్షేణాపూరితా తదా ॥26॥

మహేంద్రాది దేవత లప్పుడు విషణ్ణచిత్తు లయ్యారు. వరాంగి పుత్రుణ్ణి చూచి అప్పుడు సంతోషపూర్ణ అయింది.

బహు మేనే న దేవేంద్రవిజయం తు తదైవ సా ।
జాతమాత్రస్తు దైత్యేంద్రస్తారకశ్చణ్డవిక్రమః ॥27॥

అప్పుడామె దేవేంద్రుని విజయాన్ని గొప్పగా భావించలేదు. పుట్టగానే దైత్యేంద్రుడైన తారకుడు ప్రచండపరాక్రమం కలవాడయ్యాడు.

అభిషిక్తోఽసురైః సర్వైః కుజంభమహిషాదిభిః ।
సర్వాసురమహారాజ్యే పృథివీతులనక్షమైః ॥28॥

పృథ్విని చలింప జేయగల బలవంతులు కుజంభుడు, మహిషాసురుడు మున్నగు అసురులందరూ కలిసి సకల దానవ మహీరాజ్యానికి వాణ్ణి అభిషిక్తుణ్ణి చేశారు.

స తు ప్రాప్య మహారాజ్యం తారకో మునిసత్తమాః! ।
ఉవాచ దానవశ్రేష్ఠాన్ యుక్తియుక్తమిదం వచః ॥29॥

మునివర్యులారా! ఆ తారకుడు మహారాజ్యం పొంది దానవశ్రేష్ఠుల నుద్దేశించి యుక్తియుక్తంగా ఇలా చెప్పాడు–

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తారకజననం నామ సప్తచత్వారింశదధికశతతమోఽధ్యాయః ॥ 147 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని తారక జననమనే నూటనలభై ఏడవ అధ్యాయం సంపూర్ణం

అష్టచత్వారింశదధికశతతమోఽధ్యాయః - నూటనలబై ఎనిమిదవ అధ్యాయం
దేవాసురసంగ్రామే బలయోజనం - దేవాసురసంగ్రామంలో బలయోజనం

తారక ఉవాచ :-తారకుడు చెప్పాడు

శృణుధ్వమసురా స్సర్వే వాక్యం మమ మహాబలాః! ।
శ్రేయసే క్రియతాం బుద్ధిః సర్వైః కృత్యస్య సంవిధౌ ॥1॥

మహాబలవంతులైన అసురులందరూ నామాట వినండి. అందరూ పని చేసేటప్పుడు శ్రేయస్సు వైపు బుద్ధి మళ్ళించండి!

వంశక్షయకరా దేవాః సర్వేషామేవ దానవాః! ।
అస్మాకం జాతిధర్మో వై విరూఢం వైరమక్షయమ్ ॥2॥

దానవులారా! సకలదానవుల వంశాలను నశింపజేసేవారు దేవతలు. మన జాతిధర్మం అక్షయంగా దేవతలతో స్థిరపడిన వైరమే.

వయమద్య గమిష్యామః సురాణాం నిగ్రహాయ చ ।
స్వబాహుబలమాశ్రిత్య సర్వ ఏవమసంశయః ॥3॥

మనమిప్పుడు మన బాహుబలం ఆశ్రయించి అందరమూ సురలను నిగ్రహించడానికి పోదాం. ఇందులో సందేహం లేదు.

కిన్తు నాతపసా యుక్తో మన్యేఽహం సురసంగరమ్ ।
అహమాదౌ కరిష్యామి తపో ఘోరం దితేః సుతాః! ॥4॥

కాని తపస్సు చేయకుండా నేను సురలతో తలపడడం సరికాదని భావిస్తున్నాను. దితి సుతులారా! నేను ముందు ఘోరతపస్సు చేస్తాను.

తతః సురాన్విజేష్యామో భోక్ష్యామోఽథ జగత్త్రయమ్ ।
స్థిరోపాయో హి పురుషః స్థిరశ్రీరపి జాయతే ॥5॥

ఆపై దేవతలను జయించగలం, ముల్లోకాలనూ అనుభవించగలం. స్థిరమైన ఉపాయం కలవాడే స్థిరమైన లక్ష్మి గలవాడు గూడా అవుతాడు.

రక్షితుం నైవ శక్నోతి చపలశ్చపలాః శ్రియః ।
తచ్ఛ్రుత్వా దానవాః సర్వే వాక్యం తస్యాసురస్య తు ॥6॥

సాధు సాధ్విత్యవోచంస్తే తత్ర దైత్యాః సవిస్మయాః ।
సోఽగచ్ఛత్పారియాత్రస్య గిరేః కన్దరముత్తమమ్ ॥7॥

"చపలుడగువాడు చపలమైన సిరులను రక్షించుకోజాలడు." ఆ దానవులందరూ ఆ అసురుని మాటలు విని ఆశ్చర్యపడి 'బాగు బాగు' అని అన్నారు. అతడాపై పారియాత్రపర్వతముయొక్క ఉత్తమమైన గుహకు వెళ్ళాడు.

సర్వర్తుకుసుమాకీర్ణం నానౌషధివిదీపితమ్ ।
నానాధాతురసస్రావా చ్చిత్రం నానాగుహాగృహమ్ ॥8॥

గహనైః సర్వతో గూఢం చిత్రకల్పద్రుమాశ్రయమ్ ।
అనేకాకారబహులం నృత్యత్పక్షికులాకులమ్ ॥9॥

నానాప్రస్రవణోపేతం నానావిధజలాశయమ్ ।
ప్రాప్య తత్కన్దరం దైత్యశ్చచార విపులం తపః ॥10॥

అన్ని ఋతువుల పూలతో వ్యాప్తమైనదీ, వివిధములైన ఓషధులచే విశేషంగా దీపితమైనదీ, నానా ధాతురసాలు స్రవించుటచే విచిత్రమైనదీ, వివిధగుహలనే గృహాలు గలదీ, అడవులచే అంతటా గూఢమైనదీ, చిత్ర కల్పవృక్షాలకు ఆశ్రయమైనదీ, అనేకాకారాలచే బహుళమైనదీ, నృత్యం చేసే పక్షి సంఘాలచే ఆకులమైనదీ. వివిధ జలపాతాలు గలదీ, బహువిధ జలాశయాలకు నిలయమైనది అగు ఆ గుహను చేరి దైత్యుడు విపులతపస్సు చేశాడు.

నిరాహారః పంచతపాః పత్రభుగ్వారిభోజనః ।
శతం శతం సమానాం తు తపాంస్యేతాని సోఽకరోత్ ॥11॥

నిరాహారుడుగా, పంచాగ్ని మధ్య తపస్విగా, ఆకులు తినువాడుగా, జలాహారుడుగా, ఇలా ఒక్కొక్కవిధానంతో నూరు నూరు సంవత్సరాల కాలం అతడు తపస్సు చేశాడు.

తతః స్వదేహాదుత్కృత్య కర్షం కర్షం దినే దినే ।
మాంసస్యాగ్నౌ జుహావాసౌ తతో నిర్మాంసతాం గతః ॥12॥

ఆపైన తనదేహం నుండి కోసి దినదినమూ 1 1/4మాంసఖండాలు తీసి అగ్నిలో వ్రేల్చాడు. అంచేత నిర్మాంసంగా మిగిలాడు.

తస్మిన్నిర్మాంసతాం యాతే తపోరాశిత్వమాగతే ।
జజ్వలుః సర్వభూతాని తేజసా తస్య సర్వతః ॥13॥

అతడు నిర్మాంసంగా మిగులగా, తపోరాశిగా పరిణమించగా, అతని తేజస్సుచే సమస్త ప్రాణులూ నలువైపులా జ్వలించాయి.

ఉద్విగ్నాశ్చ సురాః సర్వే తపసా తస్య భీషితాః ।
ఏతస్మిన్నన్తరే బ్రహ్మా పరమం తోషమాగతః ॥14॥

తారకస్య వరం దాతుం జగామ త్రిదశాలయాత్ ।
ప్రాప్య తం శైలరాజానం స గిరేః కన్దరస్థితమ్ ।
ఉవాచ తారకం దేవో గిరా మధురయా యుతః ॥15॥

అతని తపస్సుకు భయపడి దేవతలంతా ఉద్వేగం పొందారు. ఇంతలో బ్రహ్మ పరమసంతోషం పొంది త్రిదశాలయంనుండి తారకునికి వరమివ్వడానికి వెళ్ళాడు. ఆ కొండను చేరి అచటి గుహలో ఉన్న తారకునితో బ్రహ్మదేవుడు మధుర వచనాలతో ఇలా అన్నాడు–

బ్రహ్మోవాచ :–బ్రహ్మ చెప్పాడు

పుత్రాలం తపసా తేఽస్తు నాస్త్యసాధ్యం తవాధునా ।
వరం వృణీష్వ రుచిరం యత్తే మనసి వర్తతే ॥16॥

"పుత్రా! చాలు, ఇక తపస్సు అక్కర లేదు, నీకిప్పుడు సాధ్యం కానిది లేదు. నీ మనసులో ఉన్నదేదో, ఆ వరం కోరుకో!

ఇత్యుక్తస్తారకో దైత్యః ప్రణమ్యాత్మభువం విభుమ్ ।
ఉవాచ ప్రాంజలిర్భూత్వా ప్రణతః పృథువిక్రమః ॥17॥

బ్రహ్మ అలా చెప్పగా మహాపరాక్రమశాలి అయిన దైత్యుడు, తారకుడు బ్రహ్మకు నమస్కరించి (ప్రాంజలియై) ఇలా అన్నాడు–

తారక ఉవాచ :–తారకుడు చెప్పాడు

దేవ భూతమనోవాస! వేత్సి జన్తువిచేష్టితమ్ ।
కృతప్రతికృతాకాంక్షీ జిగీషుః ప్రాయశో జనః ॥18॥

"ప్రాణుల మనస్సులో నివసించే దేవా! ప్రాణుల చేష్టలు నీకు తెలుసు, సాధారణంగా జయార్థియైన జనుడు చేసిన దానికి ప్రతి ఏదో చేయాలనుకొంటాడు.

వయం చ జాతిధర్మేణ కృతవైరాః సహామరైః ।
తైశ్చ నిఃశేషితా దైత్యాః క్రూరైః సన్త్యజ్య ధర్మితామ్ ।
తేషామహం సముద్ధర్తా భవేయమితి మే మతిః ॥19॥

మేము జాతిధర్మాన్ని అనుసరించి దేవతలతో శత్రుత్వం కలిగి వుండేవాళ్ళం. వారు ధర్మం వదలి క్రూరులై దైత్యులను నిశ్శేషం కావించారు. ఆ దైత్యులను సముద్ధరించాలని నా అభిప్రాయం.

అవధ్యః సర్వభూతానామస్త్రాణాం చ మహౌజసామ్ ।
స్యామహం పరమో హ్యేష వరో మమ హృది స్థితః ॥20॥

నేను సకల ప్రాణులకూ, తేజోవంతములైన అస్త్రాలకూ అవధ్యుడ నగుదును గాక! ఇది నా హృదయగతమైన ముఖ్యవరం.

ఏతన్మే దేహి దేవేశ! నాన్యో మే రోచతే వరః ।
తమువాచ తతో దైత్యం విరించిః సురనాయకః ॥21॥

దేవేశా! ఈ వరం నాకు ప్రసాదించు. ఇతర వరం నాకిష్టం కాదు." అది విని దేవతల నేత బ్రహ్మ అతనితో ఇలా అన్నాడు.

బ్రహ్మోవాచ:– బ్రహ్మ చెప్పాడు.

న యుజ్యన్తే వినా మృత్యుం దేహినో దైత్యసత్తమ! ।
యతస్తతోఽపి వరయ మృత్యుం యస్మాన్న శంకసే ॥22॥

దైత్యశ్రేష్ఠా! మృత్యువు లేకుండా శరీరధారు లుండరు. కనుక దేనినుండి శంకించవో, దానినుండే మరణం గూడా కోరుకో.

తతః సంచిన్త్య దైత్యేంద్రః శిశోర్వై సప్తవాసరాత్ ।
వవ్రే మహాసురో మృత్యుమవలేపనమోహితః ॥23॥

అంతట మహాసురుడైన ఆ దైత్యేంద్రుడు ఆలోచించి గర్వమోహితుడై ఏడు దినాల శిశువునుండి మృత్యువును కోరుకొన్నాడు.

బ్రహ్మా చాస్మై వరం దత్త్వా యత్కించిన్మనసేప్సితమ్ ।
జగామ త్రిదివం దేవో దైత్యోఽపి స్వకమాలయమ్ ॥24॥

అతడు మనస్సులో కోరుకొన్న ఆ వరమిచ్చి బ్రహ్మ త్రిదివానికి (బ్రహ్మలోకానికి) తిరిగి వెళ్ళాడు, దైత్యుడు కూడా తన నివాసానికి వెళ్ళాడు.

ఉత్తీర్ణం తపసస్తం తు దైత్యం దైత్యేశ్వరాస్తథా ।
పరివవ్రుః సహస్రాక్షం దివి దేవగణా యథా ॥25॥

తపస్సు నుండి ఉత్తీర్ణుడైన ఆ దైత్యుణ్ని దైత్యేశ్వరులు దేవలోకంలో దేవగణాలు సహస్రాక్షుణ్ణి వలె సేవించారు.

తస్మిన్మహతి రాజ్యస్థే తారకే దైత్యనన్దనే ।
ఋతవో మూర్తిమన్తశ్చ స్వకాలగుణబృంహితాః ॥26॥

అభవన్ కింకరాస్తస్య లోకపాలాశ్చ సర్వశః ॥27॥

కాంతిర్ద్యుతి ర్ధృతిర్మేధా శ్రీరవేక్ష్యచదానవమ్ ।
పరివవ్రుర్గుణాకీర్ణా నిశ్ఛిద్రాః సర్వ ఏవ హి ।
కాలాగురువిలిప్తాంగం మహాముకుటభూషణమ్ ॥28॥

రుచిరాంగదసద్ధాంగం మహాసింహాసనే స్థితమ్ ।
వీజయన్త్యప్సరఃశ్రేష్ఠా భృశం ముంచన్తి నైవ తాః ॥29॥

దైత్యనందనుడైన ఆ తారకుడు రాజ్యంలో ఉండగా ఋతువులు ఆకృతి దాల్చి స్వకాలగుణాలచే గరిష్ఠాలయ్యాయి. లోకపాలు రందరూ అన్ని వైపులా అతనికి కింకరులయ్యారు. కాంతి, ద్యుతి, ధృతి, అఖండమైన

మేధ, సిరి– ఆ దానవుణ్ణి చూచి గుణాకీర్ణలై ఛిద్రం లేనివై వరించాయి. కాలాగురువుచే పులమబడిన శరీరం కలవాడు, మహాకిరీట భూషితుడు, రుచిరమైన భుజకీర్తులు దాల్చిన శరీరం కలవాడు. మహాసింహాసనస్థుడు అయిన ఆ దైత్యాధిపతిని అచ్చరలు చామరాలతో వీచారు. అతణ్ణి వారు వదలకుండా ఉండిపోయారు.

చంద్రార్కౌ దీపమార్గేషు వ్యజనేషు చ మారుతః ।
కృతాన్తోఽగ్రేసరస్తస్య బభూవుర్మునిసత్తమాః! ॥30॥

మునివర్యులారా! దీపమార్గాలలో సూర్యచంద్రులు, వ్యజనములో వాయువు, ఎదుట యముడు నిల్చి అతణ్ణి సేవించారు.

ఏవం ప్రయాతి కాలే తు వితతే తారకాసురః ।
బభాషే సచివాన్దైత్యః ప్రభూతవరదర్పితః ॥31॥

ఇలాబహుకాలంగడచిన తరువాత తారకాసురుడు గొప్పవరముచే గర్వితుడైమంత్రులను చూచిఇలా అన్నాడు.

తారక ఉవాచ :–తారకుడు చెప్పాడు

రాజ్యేన కారణం కిం మే త్వనాక్రమ్య త్రివిష్టపమ్ ।
అనిర్యాప్య సురైర్వైరం కా శాన్తిర్హృదయే మమ ॥32॥

స్వర్గాన్ని ఆక్రమించకుంటే ఈ రాజ్యం నాకెందుకు? దేవతలతో వైరం నశింపజేయనప్పుడు నాకు హృదయంలో శాంతి ఎక్కడిది?

భుంజతేఽద్యాపి యజ్ఞాంశానమరా నాక ఏవ హి ।
విష్ణుః శ్రియం న త్యజతి తిష్ఠతే చ గతభ్రమః ॥33॥

ఇప్పుడు గూడా నాకంలో దేవతలు యజ్ఞభాగాలు భుజిస్తున్నారు గదా! విష్ణువు లక్ష్మిని వదలలేదు, భ్రమలేకుండా స్థిరంగా వున్నాడు.

స్వస్థాభిః స్వర్గనారీభిః పీడ్యన్తేఽమరవల్లభాః ।
సోత్పలా మదిరామోదా దివి క్రీడాయనేషు చ ॥34॥

హాయిగా సుఖించే స్వర్గవనితలు ఉత్పలాలు దాల్చి మదిరామోదం కల్గి దేవలోకంలోని క్రీడాగృహాలలో అమరవల్లభుల నానందింపజేస్తున్నారు.

లబ్ధ్వా జన్మ న యః కశ్చిద్ఘటయేత్పౌరుషం నరః ।
జన్మ తస్య వృథాభూతమజన్మా తు విశిష్యతే ॥35॥

జన్మించి కూడా ఏ నరుడు తన పౌరుషం చూపడో, అతని జన్మ వ్యర్థం. వానికంటే అసలు జన్మించనివాడే విశిష్టుడు కదా!

మాతాపితృభ్యాం న కరోతి కామాన్ బంధూనశోకాన్న కరోతి యో వా ।
కీర్తిం హి వా నార్జయతే హిమాభాం పుమాన్ స జాతోఽపి మృతో మతం మే ॥36॥

ఎవడు తల్లి దండ్రుల కోరికలు తీర్చడో, బంధువులను శోకరహితులను చేయడో, మంచువంటి తెల్లని కీర్తి నార్జించడో, వాడు జీవించినా మరణించినవాడే అని నా అభిప్రాయం.

తస్మాజ్జయాయామరపుంగవానాం త్రైలోక్యలక్ష్మీహరణాయ శీఘ్రమ్ ।
సంయోజ్యతాం మే రథమష్టచక్రం బలం చ మే దుర్జయదైత్యచక్రమ్ ।
ధ్వజం చ మే కాంచనపట్టనద్ధం ఛత్రం చ మే మౌక్తికజాలబద్ధమ్ ॥37॥

అందువల్ల దేవతలను జయించడానికీ, శీఘ్రంగా త్రైలోక్యలక్ష్మిని హరించడానికీ, ఎనిమిది చక్రాలు గల నా రథాన్నీ, దుర్జయమైన దైత్యసమూహం గల సైన్యాన్నీ, స్వర్ణపట్టంతో కట్టిన ధ్వజాన్నీ, ముత్యాల సరాలు కట్టిన నా ఛత్రాన్నీ సిద్ధం చేయండి,"

తారకస్య వచః శ్రుత్వా గ్రసనో నామ దానవః ।
సేనానీర్దైత్యరాజస్య తథా చక్రే బలాన్వితః ॥38॥

తారకుని మాట విని అతని సేనానాయకుడైన గ్రసనుడనే దానవుడు బలాన్వితుడై అతడు చెప్పినట్లే చేశాడు.

ఆహత్య భేరీం గంభీరాం దైత్యానాహూయ సత్వరః ।
తురగాణాం సహస్రేణ చక్రాష్టకవిభూషితమ్ ॥39॥

శుక్లాంబరపరిష్కారం చతుర్యోజనవిస్తృతమ్ ।
నానాక్రీడాగృహయుతం గీతవాద్యమనోహరమ్ ॥40॥

విమానమివ దేవస్య సురభర్తుః శతక్రతోః ।
దశకోటీశ్వరా దైత్యా దైత్యాస్తే చణ్డవిక్రమాః ॥41॥

గంభీరమైన భేరిని మ్రోగించి, సత్వరుడై దైత్యులను పిలిచి వెయ్యి గుర్రాలతో ఎనిమిది చక్రాలచే విభూషితమైనదీ, ధవళవస్త్రాల అలంకరణగలదీ, నాలుగుయోజనాల విస్తృతిగలదీ, వివిధ క్రీడా గృహాలతో కూడినదీ, గీతవాద్యాలచే మనోజ్ఞమైనదీ, సురాధిపతి యగు ఇంద్రుని విమానం వలె ఒప్పునదీ అయిన రథాన్ని సిద్ధం చేశాడు. ప్రచండపరాక్రమం కల పదికోట్ల మంది దైత్యులు ఆ రథాన్ని అనుగమించారు.

తేషామగ్రేసరో జంభః కుజంభోఽనన్తరస్తతః ।
మహిషః కుంజరో మేఘః కాలనేమిర్నిమిస్తథా ॥42॥

మథనో జంభకః శుంభో దైత్యేంద్రా దశ నాయకాః ।
అన్యేఽపి శతశస్తస్య పృథివీదలనక్షమాః ॥43॥
దైత్యేంద్రా గిరివర్ష్మాణః సన్తి చణ్డపరాక్రమాః ।
నానాయుధప్రహరణా నానాశస్త్రాస్త్రపారగాః ॥44॥

వారిలో ముందు నడచిన వాదు జంభుడు, తరువాతివాడు కుజంభుడు. ఆపై మహిషుడు, కుంజరుడు, మేఘుడు, కాలనేమి, నిమి, మథనుడు, జంభకుడు, శుంభుడు. వీరు పదిమంది దైత్యేంద్రులైన నాయకులు అనుగమించారు. ఇంకా వందలకొలదిమంది పృథివిని చీల్చగలవారు, చండవిక్రములు, పర్వతశరీరులు, వివిధాయుధ ప్రహరణాలు గలవారు, వివిధ శస్త్రాలలో, అస్త్రాలలో ఆరితేరినవారగు దైత్యేంద్రులు వారిని అనుసరించారు.

తారకస్యాభవత్ కేతూ రౌద్రః కమలభూషణః ।
కేతునా మకరేణాపి సేనానీర్గ్రసనోఽరిహా ॥45॥

తారకునికి భీకరమూ, పద్మాలంకృతమూ అయిన కేతువు గలదు. సేనాధిపతి గ్రసనుడు శత్రుహంత, వానిది మకరకేతువు.

పైశాచం యస్య వదనం జంభస్యాసీదయోమయమ్ ।
ఖరం విధూతలాంగూలం కుజంభస్యాభవ ద్ధ్వజే ॥46॥

జంభుని కేతువు పిశాచముఖంతో ఇనుముతో నిర్మించింది. కుజంభుని ధ్వజంలో తోకజాడించిన గాడిద చిహ్నామున్నది.

మహిషస్య తు గోమాయుః కేతుర్హైమస్తదాభవత్ ।
ధ్వాంక్షో ధ్వజే తు శుంభస్య కృష్ణాయోమయముచ్ఛ్రితమ్ ॥47॥

మహిషునికి బంగారునక్క ధ్వజం, శుంభుని ధ్వజం కాకి, అది నల్లని ఇనుముతో చేసినది. ఎత్తైనది.

అనేకాకారవిన్యాసాశ్చాన్యేషాం తు ధ్వజాస్తథా ।
శతేన శీఘ్రవేగాణాం వ్యాఘ్రాణాం హేమమాలినామ్ ॥48॥

గ్రసనస్య రథో యుక్తో కింకిణీజాలమాలినామ్ ।
శతేనాపి చ సింహానాం రథో జంభస్య దుర్జయః ॥49॥

కుజంభస్య రథో యుక్తః పిశాచవదనైః ఖరైః ।
రథస్తు మహిషస్యోష్ట్రైర్గజస్య తు తురంగమైః ॥50॥

అట్లే ఇతరుల ధ్వజాలు వివిధాకారాల విన్యాసం కలవి. గ్రసనుని రథం శీఘ్రవేగం కల్గినవి, బంగారు మాలలు కలవి, కింకిణీజాలంతో కూడినవి అయిన నూరు పులులతో ఒప్పారింది. జంభుని రథం నూరుసింహాలతో కూడి దుర్జయమైనది. కుజంభుని రథం పిశాచ ముఖం కల గాడిదలు పూంచినది. మహిషుని రథం ఒంటెలతోనూ, గజుని రథం గుర్రాలతోనూ కూడినది.

మేఘస్య ద్వీపిభిర్భీమైః కుంజరైః కాలనేమినః ।
పర్వతాభైః సమారూఢో నిమిర్మత్తైర్మహాగజైః ॥51॥

చతుర్దన్తైర్గన్ధవద్భిః శిక్షితైర్మేఘభైరవైః ।
శతహస్తాయతైః కృష్ణైస్తురంగైర్హేమభూషణైః ॥52॥

సితచామరజాలేన శోభితో దక్షిణాం దిశమ్ ।
సితచందనచార్వంగో నానాపుష్పస్రజోజ్జ్వలః ॥53॥

మేఘుని రథం భీకరములైన చిరుతపులులతో లాగబడినది. కాలనేమిరథాన్ని గజాలు లాగాయి. ఆ మహాగజాలు పర్వతంవంటివి, మదించినవి. నాలుగు దంతములు కలవి, సుశిక్షితమైనవి, మేఘాల వలె భీకరమైనవి, అంతేకాక నిమిరథాన్ని నూరు మూరల ఎత్తుగలిగి స్వర్ణాలంకృతాలైన నల్లని గుర్రాలు గూడా లాగాయి. మరియు నిమి తెల్లని చందనం పూసుకొని అందంగా కనిపించాడు. తెల్లని చామరాలతో శోభిల్లుతూ నానాపుష్పమాలలు దాల్చి దక్షిణదిక్కుకు పయనమయ్యాడు.

మథనో నామ దైత్యేంద్రః పాశహస్తో వ్యరాజత ।
జంభకః కింకిణీజాలమాలముష్ట్రం సమాస్థితః ॥54॥

మథనుడు అనే దైత్యేంద్రుడు పాశహస్తుడై విరాజిల్లాడు. జంభకుడు కింకిణీజాలములు గల ఒంటె నధిష్ఠించాడు.

కాలశుక్లమహామేషమారూఢః శుంభదానవః ।
అన్యేఽపి దానవా వీరా నానావాహనగామినః ॥55॥

శుంభుడనే దనుజుడు నలుపు – తెలుపురంగు గల పెద్ద మేక నధిష్ఠించాడు. ఇతర దానవవీరులు గూడా నానావాహనాలెక్కి యుద్ధానికి వెళ్ళారు.

ప్రచణ్డచిత్రవర్మాణః కుణ్డలోష్ణీషభూషణాః ।
నానావిధోత్తరాసంగా నానామాల్యవిభూషణాః ॥56॥

నానాసుగన్ధిగన్ధాఢ్యా నానావందిజనస్తుతాః ।
నానావాద్యపరిస్పన్దాశ్చాగ్రేసరమహారథాః ॥57॥

నానాశౌర్యకథాసక్తాస్తస్మిన్ సైన్యే మహాసురాః ।
తద్బలం దైత్యసింహస్య భీమరూపం వ్యజాయత ॥58॥

ప్రచండమైన చిత్రకవచాలు గలవారు, కుండలాలు, తలపాగాలు భూషణాలుగా గలవారు, నానావిధాలైన ఉత్తరీయాలు గలవారు, నానామాల్య భూషణ భూషితులు. వివిధ సుగంధి గంధంచే శోభిల్లువారు, వివిధ స్తుతిగాయక జనులచే స్తుతింపబడినవారు, వివిధ వాద్య ధ్వనులు గలవారు, అగ్రేసరమైన గొప్పరథాలు గలవారు. వివిధ శౌర్యకథలలో ఆసక్తులు అయిన మహాసురులు ఆ సైన్యంలో ఉన్నారు. ఆ దైత్యశ్రేష్ఠుని సైన్యం భీకరంగా కనిపించింది.

ప్రమత్తచణ్డ మాతఙ్గతురంగం రథసంకులమ్ ।
ప్రతస్థేఽమరయుద్ధాయ బహుపత్తిపతాకి తత్ ॥59॥

మదించిన ప్రచండమైన ఏనుగులు, గుర్రాలు గలది, రథాలతో సంకులమైనది, బహుపదాతి పతాకాదళ సమన్వితమైన ఆ సైన్యం దేవతలతో యుద్ధానికి బయలువెడలింది.

ఏతస్మిన్నన్తరే వాయుర్దేవదూతో௨ంబరాలయే ।
దృష్ట్వా స దానవబలం జగామేంద్రస్య శంసితుమ్ ॥60॥

ఇంతలో దేవదూతయైన వాయువు అంబరాలయంలో ఉండి ఆ దానవసైన్యాన్ని చూచి ఇంద్రునికి చెప్పడానికి వెళ్ళాడు.

స గత్వా తు సభాం దివ్యాం మహేంద్రస్య మహాత్మనః ।
శశంస మధ్యే దేవానాం తత్కార్యం సముపస్థితమ్ ॥61॥

అతడు దివ్యసభకు పోయి దేవతల మధ్య మహాత్ముడైన ఇంద్రునికి జరుగుతున్న ఆ కార్యాన్ని నివేదించాడు.

తచ్ఛ్రుత్వా దేవరాజస్తు నిమీలితవిలోచనః ।
బృహస్పతిమువాచేదం వాక్యం కాలే మహాభుజః ॥62॥

అది విని మహాభుజుడైన ఇంద్రుడు కనులు మూసుకొని ఆ కాలానికి తగినట్లు బృహస్పతితో ఇలా చెప్పాడు.

ఇంద్ర ఉవాచ :–ఇంద్రుడు చెప్పాడు

సంప్రాప్నోతి విమర్దో௨యం దేవానాం దానవైః సహ ।
కార్యం కిమత్ర తద్బ్రూహి నీత్యుపాయసమన్వితమ్ ॥63॥

"దేవతలకు దానవులతో గూడా సమరం వస్తున్నది. ఇప్పుడు నీతి ఉపాయాలతో గూడిన కర్తవ్యమేమిటో చెప్పండి!"

ఏతచ్ఛ్రుత్వా తు వచనం మహేంద్రస్య గిరాంపతిః ।
ఇత్యువాచ మహాభాగో బృహస్పతిరుదారధీః ॥64॥

మహేంద్రుని ఈ మాటవిని మహాభాగుడు, ఉదారబుద్ధి, వాక్పతి అయిన బృహస్పతి ఇలా అన్నాడు.

సామపూర్వా స్మృతా నీతిశ్చతురంగాం పతాకినీమ్ ।
జిగీషతాం సురశ్రేష్ఠ! స్థితిరేషా సనాతనీ ॥65॥

"దేవేంద్రా! చతురంగమైన సేనను జయించగోరువారికి నీతి సామపూర్వకంగా ఉంటుంది. ఇది సనాతనస్థితి.

సామ భేదస్తథా దానం దణ్డశ్చాంగచతుష్టయమ్ ।
నీతౌ క్రమాద్దేశకాలరిపుయోగ్యక్రమాదిదమ్ ॥66॥

సామం, భేదం, దానం, దండం– అని నీతికి నాలుగంగాలు. దేశం, కాలం, శత్రువు – వీరి యోగ్యత ననుసరించి దీన్ని ప్రయోగించాలి.

సామ దైత్యేషు నైవాస్తి యతస్తే లబ్ధసంశ్రయాః ।
జాతిధర్మేణ చాభేద్యా దానం ప్రాప్తశ్రియే చ కిమ్ ॥67॥

దైత్యులతో సామం లేదు. వారు ఆశ్రయం కలవారు గాన జాతిధర్మానుసారంగా అభేద్యులు. సంపన్నునికి దానమేల?

ఏకోఽభ్యుపాయో దణ్డోఽత్ర భవతాం యది రోచతే ।
దుర్జనేషు కృతం సామ మహద్యాతి చ వన్ధ్యతామ్ ॥68॥

నీకిష్టమైతే ఇక మిగిలినది దండోపాయమొక్కటే. దుర్జనుల పట్ల ప్రయోగించిన సామం వ్యర్థమవుతుంది.

భయాదితి వ్యవస్యన్తి క్రూరాః సామ మహాత్మనామ్ ।
ఋజుతామార్యబుద్ధిత్వం దయానీతివ్యతిక్రమమ్ ॥69॥

మన్యన్తే దుర్జనా నిత్యం సామ చాపి భయోదయాత్ ।
తస్మాద్దుర్జనమాక్రాన్తుం శ్రేయాన్ పౌరుషసంశ్రయః ॥70॥

మహాత్ములు అనుసరించే సామోపాయాన్ని క్రూరులు 'భయంతో' అని నిర్ణయిస్తారు. ఋజుత్వం, ఆర్యబుద్ధిత్వం, దయ, సామం – ఇవి భయంచే చూపే గుణాలని, నీతికి లోపమని దుర్జనులు భావిస్తారు. అందుచేత దుర్జనుణ్ణి ఆక్రమించడానికి పౌరుషాన్ని ఆశ్రయించడమే శ్రేయస్కరం.

ఆక్రాన్తే తు క్రియా యుక్తా సతామేతన్మహావ్రతమ్ ।
దుర్జనః సుజనత్వాయ కల్పతే న కదాచన ॥71॥

ఆక్రమణకు సిద్ధమైతే దానికి తగిన చర్య అవసరం. ఇది సజ్జనులకు మహావ్రతం, దుర్జనుడు ఎన్నటికీ సుజనుడు కాజాలడు.

సుజనోఽపి స్వభావస్య త్యాగం వాంఛేత్కదాచన ।
ఏవం మే విద్యతే బుద్ధిర్భవన్తోఽత్రాధ్యవస్యతామ్ ॥72॥

సుజనుడు కూడా ఒక్కొక్కసారి సౌజన్య స్వభావం వదలాలి, ఇది నా భావన, మీరీ విషయంలో నిర్ణయించండి.

ఏవముక్తః సహస్రాక్ష ఏవమేవేత్యువాచ తమ్ ।
కర్తవ్యతాం స సంచిన్త్య ప్రోవాచామరసంసది ॥73॥

ఇలా బృహస్పతి చెప్పగా దేవేంద్రుడు 'సరే' అన్నాడు. కర్తవ్యం ఆలోచించి అతడు అమరసభలో ఇలా చెప్పాడు.

ఇంద్ర ఉవాచ :– ఇంద్రుడు చెప్పాడు.

సావధానేన మే వాచం శృణుధ్వం నాకవాసినః! ।
భవన్తో యజ్ఞభోక్తారస్తుష్టాత్మానోఽతిసాత్త్వికాః ॥74॥

"స్వర్గవాసులారా! నామాటసావధానంగా వినండి! మీరందరూ యజ్ఞభోక్తలు,తుష్టాత్ములు, మిక్కిలి సాత్త్వికులు.

స్వే మహిమ్ని స్థితా నిత్యం జగతః పరిపాలకాః ।
భవతశ్చానిమిత్తేన బాధన్తే దానవేశ్వరాః ॥75॥

నిత్యం స్వమహిమలో ఉన్న మీరు జగత్పరిపాలకులు, మిమ్మల్ని నిష్కారణంగా దానవేశ్వరులు బాధిస్తున్నారు.

తేషాం సామాది నైవాస్తి దణ్డ ఏవ విధీయతామ్ ।
క్రియతాం సమరోద్యోగః సైన్యం సంయుజ్యతాం మమ ॥76॥

వారికి సామాదులు ఉపయోగపడవు. దండమే విధించాలి. యుద్ధప్రయత్నం చేయండి. నా సైన్యాన్ని సిద్ధం చేయండి!

ఆధీయన్తాం చ శస్త్రాణి పూజ్యన్తామస్త్రదేవతాః ।
వాహనాని చ యానాని యోజయన్తు మమామరాః ॥77॥

శస్త్రాలు సమాయత్తం చేయండి! అస్త్రదేవతలను పూజించండి. వాహనాలు, యానాలు సంయోజించండి.

యమం సేనాపతిం కృత్వా శీఘ్రమేవ దివౌకసః ।
ఇత్యుక్తాః సమనహ్యన్త దేవానాం యే ప్రధానతః ॥78॥

యముణ్ణి సేనాపతినిగా చేసి త్వరగా ఇలా దేవతలందరూ తయారుకండి!". ఇంద్రుడలా చెప్పేసరికి దేవతలలో ముఖ్యులు సమరానికి సన్నద్ధులైనారు.

వాజినామయుతేనాజౌ హేమఘణ్టాపరిష్కృతమ్ ।
నానాశ్చర్యగుణోపేతం సంప్రాప్తం సర్వదైవతైః ॥79॥

రథో మాతలినా క్లుప్తో దేవరాజస్య దుర్జయః ।
యమో మహిషమాస్థాయ సేనాగ్రే సమవర్తత ॥80॥

పదివేల గుఱ్ఱాలతో స్వర్ణ ఘంటలతో అలంకృతమై, నానాశ్చర్యగుణాలు గలదై, సర్వదేవతలచే సంప్రాప్తమైన రథాన్ని మాతలి సిద్ధం చేశాడు. ఆ దేవరాజు రథం దుర్జయమై కనిపించింది. యముడు మహిషాన్ని అధిష్ఠించి సేనముందు నిలిచాడు.

చండకింకరవృన్దేన సర్వతః పరివారితః ।
కల్పకాలోద్యతజ్వాలాపూరితాంబరలోచనః ॥81॥

నలువైపులా ప్రచండమైన కింకరబృందాలచే పరివారితుడై, కల్పకాలాగ్నిజ్వాలా పూరితమైన నేత్రాలు కలవాడునై యముడు కనిపించాడు.

హుతాశనశ్ఛాగరూఢః శక్తిహస్తో వ్యవస్థితః ।
పవనోఽఙ్కుశపాణిస్తు విస్తారితమహాజవః ॥82॥

అగ్ని మేకనధిష్ఠించి శక్తిని చేబూని నిలిచాడు. వాయువు అంకుశం చేతబట్టి మహావేగంతో పయనించాడు.

భుజగేంద్రసమారూఢో జలేశో భగవాన్ స్వయమ్ ।
నరయుక్తే రథే దేవో రాక్షసేశో వియచ్చరః ॥83॥

భగవంతుడైన వరుణుడు సర్పరాజాన్ని అధిష్ఠించాడు. ఆకాశచారియైన నిర్రృతి నరుడు పూంచిన రథమెక్కాడు.

తీక్ష్ణఖడ్గయుతో భీమః సమరే సమవస్థితః ।
మహాసింహరథో దేవో ధనాధ్యక్షో గదాయుధః ॥84॥

ధనాధ్యక్షుడైన కుబేరుడు తీక్ష్ణఖడ్గం చేబూని గదాయుతుడై సమరంలో నిల్చి మహాసింహరథం ఎక్కాడు.

చంద్రాదిత్యావశ్వినౌ చతురంగబలాన్వితౌ ।
రాజభిః సహితాస్తస్థుర్గన్ధర్వా హేమభూషణాః ॥85॥

చతురంగబలాలతో గూడి సూర్యచంద్రులు అశ్వినులు, గుర్రాలను అధిష్ఠించివచ్చారు. స్వర్ణభూషణాలు దాల్చిన గంధర్వులు రాజసహితులై యుద్ధరంగానికి వచ్చారు.

హేమాయుతోత్తరాసంగాశ్చిత్రవర్మ రథాయుధాః ।
నాకపృష్ఠశిఖణ్డాస్తు వైదూర్యమకరధ్వజాః ॥86॥

స్వర్ణ మయ వస్త్రాలు దాల్చి, చిత్రమైన కంచుకాలు, రథాలు, ఆయుధాలు గలవారై బంగారు ఆభరణాలతో జుట్టుల నలంకరించుకొన్నవారై వైదూర్యమకరధ్వజులై నిలిచారు.

జపారక్తోత్తరాసంగా రాక్షసా రక్తమూర్ధజాః ।
గృధ్రధ్వజా మహావీర్యా నిర్మలాయోవిభూషణాః ॥87॥

ముసలాసిగదాహస్తా రథే చోష్ణీషదంశితాః ।
మహామేఘరవా నాగా భీమోల్కాశనిహేతయః ॥88॥

యక్షాః కృష్ణామ్బరభృతో భీమబాణధనుర్ధరాః ।
తామ్రోలూకధ్వజా రౌద్రా హేమరత్నవిభూషణాః ॥89॥

జపారక్తమైన వస్త్రాలు దాల్చి ఎర్రని వెంట్రుకలు గలవారై, గ్రద్దలు ధ్వజ చిహ్నాలు కాగా, మహా పరాక్రమశాలురై నిర్మలమైన అయో విభూషణాలు దాల్చి ముసలాలు, కత్తులు, గదలు, ఆయుధాలుగా చేబూని రథంపై రాక్షసులు ఉష్ణీషధారులయ్యారు మహామేఘ ధ్వనిగల నాగులు భీకరమైన ఉల్కలు, పిడుగులు ఆయుధాలుగా పూని యుద్ధసన్నద్ధులయ్యారు. యక్షులు నల్లని వస్త్రాలు దాల్చి, భీకరబాణాలు, ధనువులు చేబూనినవారై రాగి గ్రుడ్డ గూబల ధ్వజ చిహ్నాలతో రౌద్రులై సర్వరత్న భూషణాలు దాల్చినవారయ్యారు.

ద్వీపిచర్మోత్తరాసంగం పిశాచబలమాబభౌ ।
గార్ధ్రపత్రధ్వజప్రాయమస్థిభూషణభూషితమ్ ॥90॥

పిశాచ సైన్యం చిరుతపులుల చర్మాలను ఉత్తరీయంగా ధరించింది. గ్రద్ద రెక్కల ధ్వజాలు గల్గి అస్థి భూషణాలు దాల్చింది.

ముసలాయుధదుర్ప్రేక్ష్యం నానాప్రాణిమహారవమ్ ।
కిన్నరాః శ్వేతవసనాః సితపత్రిపతాకినః ॥91॥

ఆ సైన్యం ముసలాయుధాలచే దుర్ప్రేక్ష్యమై నానా ప్రాణుల శబ్దం కలదైనది. కిన్నరులు శ్వేత వస్త్రాలు ధరించారు. తెల్లని పక్షులపతాకలు గల వారయ్యారు.

మత్తేభవాహనప్రాయాస్తీక్ష్ణతోమరహేతయః ।
ముక్తాజాలపరిష్కారో హంసో రజతనిర్మితః ॥92॥

వారిలో అనేకులు మదగజవాహనులు. వారి ఆయుధాలు వాడితోమరాలు. ముత్యముల జాలరులతో అలంకరించబడిన వెండి హంస వారికి ధ్వజచిహ్నం.

కేతుర్జలాధినాథస్య భీమధూమధ్వజానలః ।
పద్మరాగమహారత్నవిటపం ధనదస్య తు ॥93॥

వరుణుని కేతువు భీకరమైన ధూమధ్వజాగ్ని కలది. కుబేరుని ధ్వజం పద్మరాగమహారత్నముతో చేసిన వృక్షం కలది.

ధ్వజం సముచ్ఛ్రితం భాతి గన్తుకామమివామ్బరమ్ ।
వృకేణ కార్ష్ణలోహేన యమస్యాసీన్మహాధ్వజః ॥94॥

ఆ ధ్వజం మిక్కిలి ఎత్తైనదై ఆకాశానికి ఎగిరిపోగోరుతున్నదా అన్నట్లున్నది. యముని ధ్వజం నల్లని ఇనుముతో చేసిన తోడేలు కలది.

రాక్షసేశస్య కేతోర్వై ప్రేతస్య ముఖమాబభౌ ।
హేమసింహధ్వజౌ దేవౌ చంద్రార్కావమితద్యుతీ ॥95॥

రాక్షసేశ్వరుడైన కేతువుయొక్క ధ్వజంపై ప్రేతముఖం భాసించింది. అమితకాంతిగల సూర్యచంద్రులు హేమసింహధ్వజం దాల్చారు.

కుంభేన రత్నచిత్రేణ కేతురశ్వినయోరభూత్ ।
హేమమాతఙ్గరచితం చిత్రరత్నపరిష్కృతమ్ ॥96॥

ధ్వజం శతక్రతోరాసీత్ సితచామరమణ్డితమ్ ।
సనాగయక్షగన్ధర్వమహోరగనిశాచరా ॥97॥

సేనా సా దేవరాజస్య దుర్జయా భువనత్రయే ।
కోటయస్తాస్త్రయస్త్రింశద్దేవే దేవనికాయినామ్ ॥98॥

అశ్వినుల కేతువు రత్నచిత్రమైన కుంభంతో భాసించింది. స్వర్ణగజనిర్మితమై, చిత్రరత్నాలచే అలంకృతమై ఇంద్రుని ధ్వజం తెల్లని చామరంతో భాసించింది. నాగ-యక్ష-గంధర్వ- మహోరగ నిశాచరసమేతమైన ఆ యింద్రునిసేన భువనత్రయంలో దుర్జయమైనది. ముప్పది మూడు కోట్ల దేవతల సేన అది.

హిమాచలాభే సితకర్ణచామరే సువర్ణపద్మామలసున్దరస్రజి ।
కృతాభిరాగోజ్జ్వలకుంకుమాంకురే కపోలలీనాలికదమ్బసంకులే ॥99॥

స్థితస్తదైరావతనామకుంజరే మహాబలశ్చిత్రవిభూషణాంబరః ।
విశాలవస్త్రాంశువితానభూషితః ప్రకీర్ణకేయూరభుజాగ్రమణ్డలః ।
సహస్రదృగ్వన్దిసహస్రసంస్తుత స్త్రివిష్టపేఽ శోభత పాకశాసనః ॥100॥

హిమాలయం వంటిదీ, తెల్లని కర్ణచామరాలు గలదీ, సువర్ణపద్మాలతో శోభిల్లే సుందరమైన మాలలు గలదీ, రాగోజ్జ్వలమైన కుంకుమాంకురం కలదీ, కపోలంలో వ్రాలిన తుమ్మెదలచే సంకులమైనదీ, అయిన ఐరావతమనే గజం పైన నున్నవాడు, మహాబలం కలవాడు, చిత్రమైన నగలు, వస్త్రాలు గలవాడు, విశాలమైన వస్త్రమనే వితానంతో భూషితుడు, వ్యాపించే కేయురాలు గల భుజాగ్రమండలం కలవాడు, సహస్రనేత్రుడు వేలాది స్తుతి పాఠకులచే స్తుతింపబడినవాడూ అయిన ఇంద్రుడు స్వర్గంలో మిక్కిలిగా శోభిల్లాడు.

తురఙ్గమాతంగబలౌఘసంకులా సితాతపత్రధ్వజరాజిశాలినీ ।
చమూశ్చ సా దుర్జయపత్తిసన్తతా విభాతి నానాయుధయోధదుస్తరా ॥101॥

గుర్రాలు, ఏనుగుల సైన్యంచే వ్యాప్తమై తెల్లని గొడుగులు, ధ్వజాలచే శోభిల్లునదై దుర్జయమైన పదాతులతో వ్యాప్తమైనదీ, నానాయుధాలు కల యోధులచే దుస్తరమైనదై ఆ యింద్రుని సేన భాసించింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తారకోపాఖ్యానే దేవాసురసంగ్రామే బలయోజనం నామ అష్టచత్వారింశదధికశతతమోఽధ్యాయః ॥ 148 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని దేవాసుర సంగ్రామంలో బలయోజనమనే

నూటనలభై ఎనిమిదవ అధ్యాయం సంపూర్ణం

ఏకోనపంచాశదధికశతతమోఽధ్యాయః - నూటనలభై తొమ్మిదవ అధ్యాయం
దేవదానవ యుద్ధారంభః - దేవదానవ యుద్ధారంభం

సూత ఉవాచ :- సూతుడు చెప్పాడు.

సురాసురాణాం సమ్మర్దే తస్మిన్నత్యన్తదారుణే ।
తుములోఽతిమహానాసీత్సేనయోరుభయోరపి ॥1॥

అంతట సురాసురుల ఉభయ సేనలకూ మధ్య జరిగిన అతిదారుణమైన ఆ సమరములో మిక్కిలి పెద్దదైన ఘర్షణ సంభవించింది.

గర్జతాం దేవదైత్యానాం శంఖభేరీరవేణ చ ।
తూర్యాణాం చైవ నిర్ఘోషైర్మాతంగానాం చ బృంహితైః ॥2॥

హేషితైర్హయవృన్దానాం రథనేమిస్వనేన చ ।
జ్యాఘోషేణ చ శూరాణాం తుములోఽతిమహానభూత్ ॥3॥

గర్జించే దేవతలు, దైత్యులు, శంఖ భేరీశబ్దము, వాద్యాల ధ్వని, ఏనుగుల ఘీంకారాలు, అశ్వబృందాల సకిలింపులు, రథ చక్రపుటంచుల శబ్దము, శూరుల జ్యానినాదము, వీటి కలయికచే మిక్కిలి పెద్ద ధ్వని కల్గింది.

సమాసాద్యోభయే సేనే పరస్పరజయైషిణామ్ ।
రోషేణాతిపరీతానాం త్యక్తజీవితచేతసామ్ ॥4॥

సమాసాద్య తు తేఽన్యోన్యం ప్రక్రమేణ విలోమతః ।
రథేనాసక్తపాదాతో రథేన చ తురంగమః ॥5॥

హస్తీ పదాతిసంయుక్తో రథినా చ క్వచిద్రథీ ।
మాతంగేనాపరో హస్తీ తురంగైర్బహుభిర్గజః ॥6॥

పదాతిరేకో బహుభిర్గజైర్మత్తైశ్చ యుజ్యతే ।
తతః ప్రాసాశనిగదాభిన్దిపాలపరశ్వధైః ॥7॥

శక్తిభిః పట్టిశైః శూలైర్ముద్గరైః కుణపైర్గదైః ।
చక్రైశ్చ శంకుభిశ్చైవ తోమరైరంకుశైః సితైః ॥8॥

కర్ణినాలీకనారాచవత్సదన్తార్ధచంద్రకైః ।
భల్లైశ్చ శతపత్రైశ్చ శుకతుణ్డైశ్చ నిర్మలైః ॥9॥
వృష్టిరత్యద్భుతాకారా గగనే సమదృశ్యత ।
సంప్రచ్ఛాద్య దిశః సర్వాస్తమోమయమివాకరోత్ ॥10॥

అన్యోన్యం జయం కోరేవారు, మిక్కిలిరోషం కలవారు, జీవితాశ త్యజించినవారు నగు వారి ఉభయసేనలు కలబడి ప్రక్రమంగానూ, విలోమంగానూ, ఎదురుపడి, రథంతో పదాతులు, రథంతో గుర్రాలు, ఏనుగుతో పదాతులు, రథికునితో రథికుడు, ఏనుగుతో మరొక ఏనుగు, అనేకాశ్వాలతో ఒక ఏనుగు, మదించిన అనేక గజాలతో ఒక

పదాతి తలపడగా కలయిక, ఘర్షణ జరిగింది. ఆపైన ప్రాస - అశని - గదలతో, భిందిపాలాలతో, గొడ్డళ్ళతో, శక్తులతో, పట్టిశాలతో, శూలాలతో, ముద్గరాలతో, కుణపాలతో, చక్రాలతో, శంకులతో, తోమరాలతో, వాడి అంకుశాలతో– కర్ణి– నాలీక– నారాచ– వత్సదంత అర్ధచంద్రకాలతో, భల్లాలతో, శతపత్రాలతో, నిర్మలమైన శుకతుండాలతో, ఆకాశంలో అత్యద్భుతాకారం కల ఆయుధవర్షం కనిపించింది. అది దిక్కు లన్నింటినీ ఆవరించి తమోమయములా అన్నట్లు చేసింది.

న ప్రాజ్ఞాయంత తేఽన్యోన్యం తస్మింస్తమసి సంకులే ।
అలక్ష్యం విసృజన్తస్తే హేతిసంఘాతముద్ధతమ్ ॥11॥

పతితం సేనయోర్మధ్యే నిరీక్షన్తే పరస్పరమ్ ।
తతో ధ్వజైర్భుజైశ్ఛత్రైః శిరోభిశ్చ సకుణ్డలైః ॥12॥

గజైస్తురంగైః పాదాతైః పతద్భిః పతితైరపి ।
ఆకాశసరసో భ్రష్టైః పంకజైరివ భూస్తృతా ॥13॥

దట్టమైన చీకటి ఆవరించే సరికి వారు అన్యోన్యం ఎవరో తెలియరాలేదు. ఉద్ధతమైన ఆయుధ సంతతిని లక్ష్యం తెలియకుండా ప్రయోగించినవారు– ఉభయసేనల మధ్యలో పడిపోయిన వారిని పరస్పరం చూచుకొన్నారు. ఆపై ధ్వజాలు, భుజాలు, ఛత్రాలు, కుండలాలు గల తలలు, గజాలు, గుర్రాలు, పదాతులు, పడేవి కొన్ని - వీటిచే ఆకాశమనే మడుగునుండి జారిపడిన పద్మాల చేతవలె రణభూమి పరివ్యాప్తమయింది.

భగ్నదన్తా భిన్నకుంభాశ్ఛిన్నదీర్ఘమహాకరాః ।
గజాః శైలనిభాః పేతుర్ధరణ్యాం రుధిరస్రవాః ॥14॥

దంతాలు విరిగినవి, కుంభాలు పగిలినవి, ఛేదించబడిన దీర్ఘతుండాలు గలవి అయిన గజాలు రక్తం కారుతుండగా ధరణిపై కొండలవలె పడిపోయాయి.

భగ్నేషాదణ్డచక్రాక్షా రథాశ్చ శకలీకృతాః ।
పేతుః శకలతాం యాతాస్తురంగాశ్చ సహస్రశః ॥15॥

భగ్నమైన కాండ్లు, చక్రాలు, ఇరుసులు గల రథాలు ముక్కలు ముక్కలై పడ్డాయి. గుర్రాలు సైతం వేలకొలదిగా ముక్కలై పడిపోయాయి.

తతోఽసృగ్హ్రదదుస్తారా పృథివీ సమజాయత ।
నద్యశ్చ రుధిరావర్తా హర్షదా పిశితాశినామ్ ।
వేతాలక్రీడమభవత్తత్సంకులరణాజిరమ్ ॥16॥

ఆపై పృథివి రక్తపు మడుగులచే దాటరాని దయింది. నదులు రక్తపు సుడులు గలవై మాంసాశనులకు హర్షం కల్గించాయి. ఆ సంకులమైన రణ ప్రాంగణమంతా బేతాళులకు ఆటస్థల మయింది.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే తారకాసురోపాఖ్యానే దేవదానవయుద్ధారంభం నామ
ఏకోనపంచాదశధికశత తమోఽధ్యాయః ॥ 149 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని తారకాసురోపాఖ్యానంలో దేవదానవయుద్ధారంభమనే
నూటనలబై తొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం

పంచాశదధికశతతమోఽధ్యాయః - నూటయాభైయవ అధ్యాయం

దేవదానవయుద్ధమ్ - దేవదానవయుద్ధం

సూత ఉవాచ :-సూతుడు చెప్పాడు.

అథ గ్రసనమాలోక్య యమః క్రోధవిమూర్ఛితః ।
వవర్ష శరవర్షాణి గ్రసనే సూర్యవర్చసి ॥1॥

పిదప గ్రసనుణ్ణి చూచి కోపావిష్టుడైన యముడు సూర్యతేజస్కుడైన వానిపై శరవర్షాలు కురిపించాడు.

స విద్ధో బహుభిర్బాణైర్గ్రసనోఽతిపరాక్రమః ।
కృతప్రతికృతాకాంక్షీ ధనురానమ్య భైరవమ్ ॥2॥

శతైః పంచభిరత్యుగ్రైః శరాణాం యమమర్దయత్ ।

అలా పెక్కు బాణాలచే దెబ్బలు దిన్న మిక్కిలి పరాక్రమశాలి అయిన గ్రసనుడు చేసిన పనికి ప్రతీకారం చేయదలచి భీకరమైన ధనువు నెక్కుపెట్టి అత్యుగ్రములైన అయిదువందల బాణాలచే యముణ్ణి బాధించాడు.

స విచిన్త్య యమో బాణాన్ గ్రసనస్యాతిపౌరుషమ్ ॥3॥

బాణవృష్టిభిరుగ్రాభిర్యమో గ్రసనమర్దయత్ ।
కృతాన్తశరవృష్టిం తాం వియతి ప్రతిసర్పిణీమ్ ॥4॥

చిచ్ఛేద శరవర్షేణ గ్రసనో దానవేశ్వరః ।
విఫలాం తాం సమాలోక్య యమస్తాం శరసన్తతిమ్ ॥5॥

స విచిన్త్య శరవ్రాతం గ్రసనస్య రథం ప్రతి ।
ప్రాహిణోన్ముద్గరం ఘోరం తరసా తస్య చాన్తకః ॥6॥

యముడు గ్రసనుని బాణాలనూ, అతిపౌరుషాన్నీ గూర్చి భావించి ఉగ్రమైన బాణవర్షాలతో గ్రసనుణ్ణి కొట్టాడు. ఆకాశంనుండి దూసుకువచ్చిన యముని శరవర్షాన్ని దానవాధిపుడైన గ్రసనుడు శరవర్షంతో ఛేదించాడు. తాను ప్రయోగించిన శరవృష్టి విఫలం కావడాన్ని చూచి యముడు ఆలోచించి గ్రసనుని రథం మీద బాణ పరంపరను ప్రయోగించాడు. భీకరమైన ముద్గరాన్ని గూడా వెంటనే అతనిపై ప్రయోగించాడు.

స తం ముద్గరమాయాన్తముత్ప్లుత్య గగనస్థితమ్ ।
జగ్రాహ వామహస్తేన యామ్యం దానవనన్దనః ॥7॥

తనపైకి వస్తున్న ఆకాశగతమైన యముని ముద్గరాన్ని దానవులకు సంతసం కలిగిస్తూ పైకెగిరి గ్రసనుడు ఎడమచేతితో పట్టుకొన్నాడు.

తమేవ ముద్గరం గృహ్య యమస్య మహిషం రుషా ।
పాతయామాస వేగేన స పపాత మహీతలే ॥8॥

ఆ ముద్గరాన్నే పట్టుకొని రోషంతో యముని మహిషంపై వేగంగా కొట్టాడు. ఆ దెబ్బకు అది నేలగూలింది.

ఉత్ప్లుత్యాథ యమస్తస్మాన్మహిషాన్నిపతిష్యతః ।
ప్రాసేన తాడయామాస గ్రసనం వదనే దృఢమ్ ॥9॥

అలా క్రిందపడుతున్న మహిషంపైనుండి యముడు పైకెగిరి ప్రాసంతో గ్రసనుని ముఖంపై దృఢంగాకొట్టాడు.

స తు ప్రాసప్రహారేణ మూర్ఛితో న్యపతద్భువి ।
గ్రసనం పతితం దృష్ట్వా జంభో భీమపరాక్రమః ॥10॥

యమస్య భిన్దిపాలేన ప్రహారమకరోద్హృది ।
యమస్తేన ప్రహారేణ సుస్రావ రుధిరం ముఖాత్ ॥11॥

ఆ ప్రాస ప్రహారంతో గ్రసనుడు మూర్ఛితుడై, నేలపై బడ్డాడు. పడిపోయిన గ్రసనుణ్ణి చూచి భీకరవిక్రమం కల జంభుడు యముణ్ణి భిందిపాలంతో హృదయంపై కొట్టాడు. ఆ దెబ్బతో యముని నోటినుండి రక్తం స్రవించింది.

కృతాన్తమర్దితం దృష్ట్వా గదాపాణిర్ధనాధిపః ।
వృతో యక్షాయుతగణైర్జంభం ప్రత్యుద్యయౌ రుషా ॥12॥

యము డారీతిగా బాధింపబడడం చూచి గదను చేబూనిన కుబేరుడు పదివేలమంది యక్షులతో గూడి రోషంతో జంభుణ్ణి ఎదుర్కొన్నాడు.

జంభో రుషా తమాయాంతం దానవానీకసంవృతః ।
జగ్రాహ వాక్యం ప్రాజ్ఞస్తు యథా స్నిగ్ధేన భాషితమ్ ॥13॥

రాక్షససమూహంతో గూడిన జంభుడు అలా రోషంతో వస్తున్న కుబేరుణ్ణి ప్రాజ్ఞుడు మిత్రుడు చెప్పిన స్నిగ్ధవచనాన్ని గ్రహించినట్లు పట్టుకొన్నాడు.

గ్రసనో లబ్ధసంజ్ఞోఽథ యమస్య ప్రాహిణోద్గదామ్ ।
మణిహేమపరిష్కారాం గుర్వీమరివిమర్దినీమ్ ॥14॥

ఇంతలో గ్రసనుడు మూర్ఛనుండి తేరుకొని మణి స్వర్ణాలంకృతమై శత్రువిమర్దినియైన పెద్ద గదను యమునిపైకి విసిరాడు.

తామప్రతర్క్యాం సంప్రేక్ష్య గదాం మహిషవాహనః ।
గదాయాః ప్రతిఘాతార్థం జగద్దలనభైరవమ్ ॥15॥

దణ్డం ముమోచ కోపేన జ్వాలామాలాసమాకులమ్ ।
స గదాం వియతి ప్రాప్య రరాసాంబుధరో యథా ॥16॥

మహిషవాహనుడైన యముడు ఊహించకుండా తనపైకి వస్తున్న గదను చూచి దాని ప్రతిఘాతం కోసం జగత్తును చీల్చి వేసే శక్తి గలదీ, అగ్నిజ్వాలామాలా వ్యాప్తమైనదీ, అయిన దండాన్ని కోపంతో ప్రయోగించాడు. ఆకాశంలో అది గదను తాకి మేఘం లాగా ధ్వనించింది.

సంఘట్టమభవత్తాభ్యాం శైలాభ్యామివ దుఃసహమ్ ।
తాభ్యాం నిష్పేషనిర్హ్రాదజడీకృతదిగన్తరమ్ ॥17॥

ఆ రెండింటియొక్క తీవ్రమైన తాకిడి రెండు కొండలు ఢీకొన్నట్లు దుస్సహమయింది. ఆ దెబ్బకూ, దానివల్ల కలిగిన శబ్దానికీ దిగంతరాళం జడమైపోయింది.

జగద్వ్యాకులతాం యాతం ప్రలయాగమశంకయా ।
క్షణాత్ప్రశాంతనిర్హ్రాదం జ్వలదుల్కాసమాచితమ్ ॥18॥

ప్రళయం వచ్చిందేమో అని జగత్తు వ్యాకులమయింది. ఒక క్షణంలో శబ్దం శమించి మండే ఉల్కలతో నిండిపోయింది.

నిష్పేషేణ తయోర్భీమమభూద్గగనగోచరమ్ ।
నిహత్యాథ గదాం దణ్డస్తతో గ్రసనమూర్ధని ॥19॥

హృత్వా శ్రియమివానర్థో దుర్వృత్తస్యాపతద్దృఢః ।
స తు తేన ప్రహారేణ దృష్ట్వా సతిమిరా దిశః ॥20॥

వాటి రాపిడి వల్ల భీకరంగా గగనం గోచరమయింది. ఆపై దండం గదను పడగొట్టి గ్రసనుని తలపై బడింది. అనర్థం దుర్వర్తనుని సిరిని హతమార్చినట్లు ఆ దృఢమైన దండం వాని తలపై బడింది. ఆ దెబ్బతో దానవునికి దిక్కు లన్నిటా చీకట్లు క్రమ్ముకొన్నాయి.

పపాత భూమౌ నిఃసంజ్ఞో భూమిరేణువిభూషితః ।
తతో హాహారవో ఘోరః సేనయోరుభయోరభూత్ ॥21॥

వాడు సంజ్ఞ కోల్పోయి భూపరాగం శరీరాని కంటుకోగా నేలపై బడ్డాడు. అంతట ఉభయసేనల్లోనూ ఘోరమైన హాహారవం చెలరేగింది.

తతో ముహూర్తమాత్రేణ గ్రసనః ప్రాప్య చేతనామ్ ।
అపశ్యత్స్వాం తనుం ధ్వస్తాం విలోలాభరణాంబరామ్ ॥22॥

ఆపై క్షణకాలానికి గ్రసనుడు మరల చైతన్యం పొంది తన శరీరం చలించిన ఆభరణాలు, వస్త్రాలు గలిగియుండి ధ్వస్తమై యుండడం గమనించాడు.

స చాపి చిన్తయామాస కృతే ప్రతికృతిక్రియామ్ ।
మద్విధేఽవస్తుని పుంసి ప్రభోః పరిభవోదయః ॥23॥

మయ్యాశ్రితాని సైన్యాని జితే మయి వినాశినః ।
అసంభావిత ఏవాస్తు జనః స్వచ్ఛన్దచేష్టితః ॥24॥

వాడు చేసినదానికి ప్రతీకారం ఆలోచించాడు. పనికిమాలిన నావంటి వానిమూలాన ప్రభువుకు పరాభవమా? దానవ సైన్యాలు, నన్నాశ్రయించి వున్నాయి. నేనోడితే వాటికి వినాశం తప్పదు. తన యిష్టం వచ్చినట్లు ప్రవర్తించేవానికి గౌరవముండదు.

స తు వ్యర్థం సదా హృష్టః స్వభావనిధనో నరః ।
ఏవం సంచిన్త్య వేగేన సముత్తస్థౌ మహాబలః ॥25॥

ప్రాణికి మరణం సహజం. వాడు వ్యర్థుడై సదా సంతోషంతో బ్రదికి లాభమేమి? ఇలా ఆలోచించి ఆ మహాబలవంతుడు వేగంగా లేచాడు.

ముద్గరం కాలదణ్డాభం గృహీత్వా గిరిసన్నిభః ।
గ్రసనో ఘోరసంకల్పః సన్దష్టోష్ఠపుటచ్ఛదః ॥26॥

రథేన త్వరితో గచ్ఛన్నాససాదాన్తకం రణే ।
సమాసాద్య యమం యుద్ధే గ్రసనో భ్రామ్య ముద్గరమ్ ॥27॥

వేగేన మహతా రౌద్రం చిక్షేప యమమూర్ధని ।
విలోక్య ముద్గరం దీప్తం యమః సంభ్రాంతలోచనః ॥28॥

వంచయామాస దుర్ధర్షం ముద్గరం స మహాబలః ।

కాలదండాన్ని పోలిన ముద్గరం చేపట్టి కొండవంటి ఆ గ్రసనుడు భీకరసంకల్పుడై పెదవి కొరుకుతూ రథంపై త్వరగా వెళ్ళి యుద్ధభూమిలో యముని చెంతకు చేరాడు. చేరి ముద్గరం గిరగిర త్రిప్పి మహావేగంతో రౌద్రంగా యముని తలపైకి విసిరాడు. దీప్తమైన ఆ ముద్గరాన్ని చూచి మహాబలుడైన యముడు సంభ్రాంతనేత్రుడై–దుర్ధర్షమైన ఆ ముద్గరానికి దూరంగా తొలగి పోయాడు.

తస్మిన్నపసృతే దూరం చణ్డానాం భీమకర్మణామ్ ॥29॥

యామ్యానాం కింకరాణాం తు సహస్రం నిష్పిపేష హ ।
తతస్తాం నిహతాం దృష్ట్వా ఘోరాం కింకరవాహినీమ్ ॥30॥

అగమత్పరమం క్షోభం నానా ప్రహరణోద్యతః ।
గ్రసనస్తు సమాలోక్య తాం కింకరమయీం చమూమ్ ॥31॥

మేనే యమసహస్రాణి సృష్టాని యమమాయయా ।
విగ్రాహ్య గ్రసనః సేనాం వ్యసృజన్నస్త్రవృష్టయః ॥32॥

అత డలా దూరంగా తొలగిపోగా ప్రచండ భీమకర్ములైన యమకింకరులు వెయ్యిమంది ముద్గరం తాకిడికి పిండి పిండయ్యారు. అలా ఘోరమైన యముని భటసేన చావడం చూచి యముడు మిక్కిలి కలత జెందాడు. అది చూచి నానా ప్రహరణాలతో విజృంభించిన గ్రసనుడు ఆ యమకింకరసేనను విలోకించి యముని మాయతో వేలకొలది యములు సృష్టించబడ్డారని భావించాడు. తరువాత, ఆ సేనను ఎదిరించి గ్రసనుడు అస్త్ర వృష్టులు కురియించాడు.

కల్పాంతఘోరసంకాశో బభూవ క్రోధమూర్ఛితః ।
కాంశ్చిద్బిభేద శూలేన కాంశ్చిద్బాణైరజిహ్మగైః ॥33॥

వాడు యుగాంతంలో వలె ఘోరసన్నిభుడై క్రోధమూర్ఛితుడైనాడు. కొందరిని శూలంతో భేదించాడు. మరికొందరిని నేరుగా ప్రసరించిన బాణాలతో కొట్టాడు.

కాంశ్చిత్పిపేష గదయా కాంశ్చిన్ముద్గరవృష్టిభిః ।
కాంశ్చిత్ప్రాసప్రహారైశ్చ దారుణైస్తాడయన్ స తు ॥34॥

కొందరిని గదతోనూ, మరికొందరిని ముద్గరవర్షంతోనూ పిండి పిండి చేశాడు. ఇంకకొందరిని దారుణమైన ప్రాస ప్రహారాలతోనూ కొట్టాడు.

అపరే బహుశస్తస్య సలీలం బాహుమణ్డలైః ।
శిలాభిరపరే జఘ్నుర్ద్రుమైరన్యే మహోచ్ఛ్రయైః ॥35॥

ఇంకకొందరు లీలగా అతని బాహుమూలంలో వ్రేలాడారు. మరికొందరు శిలలతో, ఎత్తైన చెట్లతోనూ గ్రసనుణ్ణి కొట్టారు.

తస్యాపరే తు గాత్రేషు దశనైరప్యదంశయన్ ।
అపరే ముష్టిభిః పృష్ఠం కింకరాః ప్రహరన్తి చ ॥36॥

మరికొందరు అతని అవయవాలను కరచారు. కొందరు కింకరులు ముష్టులతో పృష్ఠంపై ప్రహరించారు.

అభిద్రుతస్తథా ఘోరైర్గ్రసనః క్రోధమూర్ఛితః ।
ఉత్సృష్ట గాత్రం భూపృష్ఠే నిష్పిపేష సహస్రశః ॥37॥

అలా ఘోరశత్రువులచే ఆక్రమింపబడిన గ్రసనుడు, క్రోధావిష్టుడై క్రిందబడవేసిన తన శరీరభారంతో వేలకొలది యమకింకరులను పిండిపిండి చేశాడు.

కాంశ్చిదుచ్ఛ్రాయ ముష్టీభిర్జఘ్నే కింకరసంచయాన్ ।
స తు కింకరయుద్ధేన గ్రసనః శ్రమమాప్తవాన్ ॥38॥

ఆ మీదట కొందరు కింకరులను పెద్ద పెద్దముష్టి ఘాతాలతో కొట్టాడు. అలా తీవ్రయుద్ధం యమకింకరులతో చేయడంవల్ల గ్రసనుడు అలసిపోయాడు.

తమాలోక్య యమః శ్రాన్తం నిహతాం చ స్వవాహినీమ్ ।
ఆజగామ సముద్యమ్య దణ్డం మహిషవాహనః ॥39॥

అలసినవాణ్ణీ, నిహతమైన తన సేననూ చూచి మహిషవాహనుడు దండం పైకెత్తి వాడిపైకి వచ్చాడు.

గ్రసనస్తు సమాయాన్తమాజఘ్నే గదయోరసి ।
అచిన్తయిత్వా తత్కర్మ గ్రసనస్యాన్తకోఽరిహా ॥40॥

జఘ్నే రథస్య మూర్ధన్యాన్ వ్యాఘ్రాన్దణ్డేన కోపనః ।
స రథో దణ్డమథితైర్వ్యాఘ్రైర్న స వికృష్యతే ॥41॥

అలా వస్తున్న యముని వక్షంపై గ్రసనుడు గదతో కొట్టాడు. వాడలా కొట్టడాన్ని లెక్కపెట్టకుండా శత్రుహంతయైన యముడు రథానికి ముందున్న వ్యాఘ్రాలను కుపితుడై దండంతో ప్రహరించాడు. దండం దెబ్బలు దిన్న పులులు ఆ రథాన్ని సరిగా లాగ లేకపోయాయి.

సంశయః పురుషస్యేవ చిత్తం దైత్యస్య తద్రథమ్ ।
సముత్సృజ్య రథం దైత్యః పదాతిర్ధరణీం గతః ॥42॥

యమం భుజాభ్యామాదాయ యోధయామాస దానవః ।
యమోఽపి శస్త్రాణ్యుత్సృజ్య బాహుయుద్ధే వ్యవర్తత ॥43॥

సంశయం పురుషుని చిత్తాన్ని వదలినట్లు ఆ రథాన్ని వదలి దైత్యుడు పదాతియై నేలకు దిగాడు. యముణ్ణి భుజాలతో పట్టుకొని దానవుడు కొట్టాడు. యముడు గూడా శస్త్రాలు వదలి బాహుయుద్ధంలో తలపడ్డాడు.

గ్రసనః కటివస్త్రైస్తు యమం గృహ్య బలోద్ధతః ।
భ్రామయామాస వేగేన విచిత్తమివ సంభ్రమః ॥44॥

గ్రసనుడు బలగర్వితుడై యముణ్ణి కటివస్త్రాలతో పట్టుకొని సంభ్రమం మతితప్పినవాణ్ణి త్రిప్పినట్లు వేగంగా గిరిగిర త్రిప్పాడు.

యమోఽపి కంఠేఽవష్టభ్య దైత్యం బాహుయుగేన తు ।
వేగేన భ్రామయామాస సముత్కృష్య మహీతలాత్ ॥45॥

యముడు గూడా ఆ దైత్యుణ్ణి రెండు బాహువులతో కంఠంలో చుట్టుకొని నేలనుండి పైకిలాగి వేగంగాత్రిప్పాడు.

తతో ముష్టిభిరాజఘ్నురర్దయన్తౌ పరస్పరమ్ ।
దైత్యేంద్రస్యాతికాయత్వాత్తతః శ్రాన్తభుజో యమః ॥46॥

ఆపై వారు పరస్పరం ముష్టిఘాతాలు కావించుకొన్నారు. దైత్యేంద్రుని శరీరం పెద్దది కావడం వల్ల యముని భుజాలు అలసిపోయాయి.

స్కన్ధే నిధాయ దైత్యస్య ముఖం విశ్రాన్తిమైచ్ఛత ।
తమాలక్ష్య తతో దైత్యః శ్రాన్తమన్తకమోజసా ॥47॥

నిష్పిపేష మహీపృష్ఠే బహుశః పార్ష్ణిపాణిభిః ।
యావద్యమస్య వదనాత్సుస్రావ రుధిరం బహు ॥48॥

దైత్యుని ముఖాన్ని స్కంధంపై ఉంచుకొని విశ్రాంతి కోరాడు. యముడు అలసినాడని గ్రహించి దైత్యుడు ఓజోబలంతో యముని వదనంనుండి ఎక్కువగా రక్తం కారేవరకూ మహీతలంలో పడవేసి మోకాళ్ళతో, హస్తాలతో పిండి పిండి చేశాడు.

నిర్జీవితం యమం దృష్ట్వా తతః సన్త్యజ్య దానవః ।
జయం ప్రాప్యోద్ధతం దైత్యో నాదం ముక్త్వా మహాస్వనః ॥49॥

యముడు నిర్జీవితుడు కావడం చూచి వాణ్ణి వదలి దానవుడు ఉద్ధత విజయం పొంది గొప్ప నినాదం చేశాడు.

స్వకం సైన్యం సమాసాద్య తస్థౌ గిరిరివాచలః ।
ధనాధిపస్య జంభేన సాయకైర్మర్మభేదిభిః ॥50॥

దిశోఽవరుద్ధాః క్రుద్ధేన సైన్యం చాస్య నికృన్తితమ్ ।
తతః క్రోధపరీతస్తు ధనేశో జంభదానవమ్ ॥51॥

హృది వివ్యాధ బాణానాం సహస్రేణాగ్నివర్చసామ్ ।
సారథిం చ శతేనాజౌ ధ్వజం దశభిరేవ చ ॥52॥

ఆపై తన సైన్యం చెంతకు వచ్చి చలించని కొండలాగా ఉండిపోయాడు. జంభుడు మర్మాన్ని భేదించగల శరాలతో కోపంతో కుబేరుని దిక్కుల నడ్డగించాడు. అతని సైన్యాన్ని గూడా తునుమాడాడు. ఆపై క్రోధపరీతుడైన కుబేరుడు జంభ రాక్షసుణ్ణి ఆ యుద్ధంలో అగ్ని వర్చస్సు గల వెయ్యి బాణాలతో వక్షః స్థలంపై కొట్టాడు. సారథిని నూరింటితో, ధ్వజాన్ని పది బాణాలతో ప్రహరించాడు.

హస్తౌ చ పంచసప్తత్యా మార్గణైర్దశభిర్ధనుః ।
మార్గణైర్బర్హిపత్రాంగైస్తైలధౌతైరజిహ్మగైః ।
తాడయామాస తం తీక్ష్ణైః శరైః వక్షసి దానవః ॥53॥

డెబ్బదియైదు శరాలతో హస్తాలనూ, పదింటితో ధనువునూ, విషతైలంతో పూసిన నెమలి ఈకలు కట్టబడిన అవక్రంగా ప్రసరించే బాణాలతో జంభుడు కుబేరుని రొమ్ముపై కొట్టాడు.

కుబేరశ్చాపి తం తీక్ష్ణైర్వివ్యాధ దశభిః శరైః ।
జంభస్తు కర్మ తద్దృష్ట్వా ధనేశస్యాతిదుష్కరమ్ ॥54॥

హృది ధైర్యం సమాలంబ్య కించిత్సంత్రస్తమానసః ।
జగ్రాహ నిశితాన్ బాణాన్ శత్రుమర్మవిభేదినః ॥55॥

కుబేరుడు గూడా అతణ్ణి పది తీక్ష్ణశరాలతో కొట్టాడు. కుబేరుని ఆ దుష్కరమైన పనిని చూచి జంభుడు కొంచెం భీతిచెందిన చిత్తం కలవాడైనా హృదయంతో ధైర్యం చిక్కబట్టుకొని శత్రుమర్మాలను భేదించే నిశితబాణాలను గ్రహించాడు.

ఆకర్ణాకృష్టచాపస్తు జంభః క్రోధపరిప్లుతః ।
వివ్యాధ ధనదం తీక్ష్ణైః శరైర్వక్షసి దానవః ॥56॥

కోపావిష్టుడైన జంభుడు చెవివరకు లాగిన చాపం గలవాడై తీక్ష్ణ శరాలతో కుబేరుణ్ని వక్షంపై కొట్టాడు.

సారథిం చాస్య బాణేన దృఢేనాభ్యహనద్ధృది ।
చిచ్ఛేద జ్యామథైకేన తైలధౌతేన దానవః ॥57॥

అతని సారథిని గూడా దృఢమైన ఒక బాణంతో హృదయంపై కొట్టాడు. తైలధౌతమైన మరొక శరంతో దానవుడు అల్లెత్రాటిని ఛేదించాడు.

తతస్తు నిశితైర్బాణైర్దారుణైర్మర్మభేదిభిః ।
వివ్యాధోరసి విత్తేశం దశభిః క్రూరకర్మకృత్ ॥58॥

పిదప నిశితములై, దారుణములై, మర్మభేదులైన పది బాణాలతో క్రూరకర్ముడైన ఆ దానవుడు కుబేరుణ్ణి వక్షఃస్థలంపై ప్రహరించాడు.

మోహం పరమతో గచ్ఛన్ దృఢవిద్ధో హి విత్తపః ।
స క్షణాద్ధైర్యమాలమ్బ్య ధనురాకృష్య భైరవమ్ ॥59॥

కిరన్ బాణసహస్రాణి నిశితాని ధనాధిపః ।
దిశః ఖం విదిశో భూమీమనీకాన్యసురస్యచ ॥60॥

పూరయామాస వేగేన సంఛాద్య రవిమణ్డలమ్ ।
జంభోఽపి శరమేకైకం శరైర్బహుభిరాహవే ॥61॥

చిచ్ఛేద లఘుసన్ధానో ధనేశస్యాతిపౌరుషాత్ ।

అలా దృఢంగా కొట్టబడిన కుబేరుడు గాఢమోహం చెందాడు. క్షణంలో ధైర్యం చక్కబెట్టుకొని భీకరధనువు నాకర్షించి– నిశితమైన వేలకొలది బాణాలను ప్రసరింపజేస్తూ కుబేరుడు దిక్కులనూ, ఆకసాన్నీ, విదిక్కులనూ, అసురుని సైన్యాలనూ పూరింపజేశాడు. ఆవేగంతో సూర్యమండలాన్ని కప్పివేశాడు. జంభుడు గూడా పలు శరాలతో రణంలో అతిపౌరుషంతో లఘుసంధానుడై ధనేశునియొక్క ఒక్కొక్క శరాన్నీ ఛేదించాడు.

తతో ధనేశః సంక్రుద్ధో దానవేంద్రస్య కర్మణా ॥62॥

వ్యధమత్తస్య సైన్యాని నానాసాయకవృష్టిభిః ।
తద్దృష్ట్వా దుష్కృతం కర్మ ధనాధ్యక్షస్య దానవః ॥63॥

గృహీత్వా ముద్గరం భీమమాయసం హేమభూషితమ్ ।
ధనదానుచరాన్యక్షాన్నిష్పిపేష సహస్రశః ॥64॥

ఆపై కుబేరుడు ఆదనుజుడు చేసిన పనికి మిక్కిలి కోపగించి నానాబాణవర్షాలతో అతని సైన్యాలను ధ్వసం చేశాడు. దుష్కరమైన ఆ కుబేరుని పని చూచి దానవుడు భీకరమైన హేమభూషితమగు ఇనుపముద్గరం చేపట్టి ధనదుని అనుచరులైన వేలకొలది యక్షులను పిండిపిండి చేశాడు.

తే వధ్యమానా దైత్యేన ముంచన్తో భైరవాన్ రవాన్ ।
రథం ధనపతేః సర్వే పరివార్య వ్యవస్థితాః ॥65॥

అలా దైత్యునిచే కొట్టబడిన వారు భైరవ శబ్దాలను చేస్తూ అందరూ ధనపతి రథం చుట్టూ మూగి నిలిచారు.

దృష్ట్వా తానర్దితాన్దేవః శూలం జగ్రాహ దారుణమ్ ।
తేన దైత్యసహస్రాణి సూదయామాస సత్వరః ॥66॥

దానవులచే పీడితులయిన వారిని చూచి కుబేరుడు దారుణమైన శూలం చేపట్టాడు. దానితో వేలకొలది దైత్యులను శీఘ్రంగా వధించాడు.

క్షీయమాణేషు దైత్యేషు దానవః క్రోధమూర్ఛితః ।
జగ్రాహ పరశుం దైత్యో మర్దనం దైత్యవిద్విషామ్ ॥67॥

దైత్యులు క్షీణించిపోతూ వుండగా క్రోధమూర్ఛితుడైన దానవుడు దైత్యశత్రువులను మర్దించే పరశువును చేపట్టాడు.

స తేన శితధారేణ ధనభర్తుర్మహారథమ్ ।
చిచ్ఛేద తిలశో దైత్యో హ్యాఖుః స్నిగ్ధమివామ్బరమ్ ॥68॥

పదునైన అంచుగల ఆ ముద్గరంతో కుబేరుని మహారథాన్ని ఎలుక సన్నని వస్త్రాన్ని ఛేదించినట్లు నువ్వుగింజలవంటి ముక్కలు ముక్కలుగా ఛేదించాడు.

పదాతిరథ విత్తేశో గదామాదాయ భైరవీమ్ ।
మహాహవవిమర్దేషు దృష్టశత్రువినాశినీమ్ ॥69॥

అధృష్యాం సర్వభూతానాం బహువర్షగణార్చితామ్ ।
నానాచన్దనదిగ్ధాంగాం దివ్యపుష్పవివాసితామ్ ॥70॥

నిర్మలాయోమయీం గుర్వీమమోఘాం హేమభూషణామ్ ।
చిక్షేప మూర్ధ్ని సంక్రుద్ధో జంభస్య తు ధనాధిపః ॥71॥

ఆపై కాలినడకతో కుబేరుడు భైరవమైన, పెద్ద యుద్ధాలలో గర్వించిన శత్రువులను మర్దించే గదను చేబూని సకలప్రాణులకూ అధృష్యమైనదీ, అనేక సంవత్సరాలు పూజింపబడినదీ, నానా చందనలిప్తమైనదీ, దివ్యపుష్పాలచే సుగంధితమైనదీ, నిర్మలమైనదీ, అయోమయమైనదీ, పెద్దదీ, అమోఘమైనదీ, స్వర్ణాలంకృతమైనదీ అయిన ఆ గదను కోపంతో ఆ జంభుని శిరసుపైకి విసరాడు.

ఆయాన్తీం తాం సమాలోక్య తడిత్సంఘాతమణ్డితామ్ ।
దైత్యో గదాభిఘాతార్థం శస్త్రవృష్టిం ముమోచ హ ॥72॥

విద్యుత్తుల గుంపుచే అలంకృతమై పైకి వస్తున్న ఆ గదను చూచి దానిని ఖండించడానికి దైత్యుడు శస్త్రవర్షాన్ని ప్రసరింపజేశాడు.

చక్రాణి కుణపాన్ ప్రాసాన్ భుశుణ్డీః పట్టిశానపి ।
హేమకేయూరనద్ధాభ్యాం బాహుభ్యాం చణ్డవిక్రమః ॥73॥

వ్యర్థీకృత్య తు తాన్ సర్వానాయుధాన్దైత్యవక్షసి ।
ప్రస్ఫురన్తీ పపాతోగ్రా మహోల్కేవాద్రికన్దరే ॥74॥

చక్రాలు, కుణపాలు, ప్రాసాలు, భుశుండులు, పట్టిశాలు, స్వర్ణకేయూరాకృతులైన దానవుని బాహువులచే ప్రయుక్తమైనవాటిని వ్యర్థం కావించి మిక్కిలిగా స్ఫురిస్తూ కొండగుహలో పడిన ఉల్క లాగా అది దైత్యుని వక్షంపైబడింది.

స తయాఽభిహతో గాఢం పపాత రథకూబరే ।
స్రోతోభిశ్చాస్య రుధిరం సుస్రావ గతచేతసః ॥75॥

గాఢమైన దానిదెబ్బకు అతడు రథం నొగలపై పడిపోయాడు. గతచేతనుడైన అతని శరీరంనుండి నెత్తురు ఏరులై పారింది.

జంభం తు నిహతం మత్వా కుజంభో భైరవస్వనః ।
ధనాధిపస్య సంక్రుద్ధో వాక్యేనాతీవ కోపితః ॥76॥

చక్రే బాణమయం జాలం దిక్షు యక్షాధిపస్య తు ।
చిచ్ఛేద బాణజాలం తదర్ధచంద్రైః శితైస్తతః ॥77॥

జంభుడు మృతుడైనాడని భావించి భైరవంగా శబ్దిస్తున్న కుజంభుడు, దనాధిపుని మాటలకు మిక్కిలి కోపగించినవాడై యక్షాధిపునికి నలుదిక్కులా శరమయమైన వలను పన్నాడు. తరువాత ఆ బాణజాలాన్ని అర్ధచంద్రశరాలతో ఛేదించాడు.

ముమోచ శరవృష్టిం తు తస్మై యక్షాధిపో బలీ ।
స తం దైత్యః శరవ్రాతం చిచ్ఛేద నిశితైః శరైః ॥78॥

ఆ రక్కసునిపై బలశాలియగు యక్షాధిపుడు శరవృష్టిని కురిపించాడు. ఆ దైత్యుడు ఆ బాణవ్రాతాన్ని నిశిత శరాలతో ఛేదించాడు.

వ్యర్థీకృతాం తు తాం దృష్ట్వా శరవృష్టిం ధనాధిపః ।
శక్తిం జగ్రాహ దుర్ధర్షాం హేమఘణ్టా విభూషితామ్ ॥79॥

తన శరవర్షం వ్యర్థం కావడం చూచి కుబేరుడు హేమఘంటలతో అలంకృతమై దుర్ధర్షమైన శక్తిని చేపట్టాడు.

బాహునా రత్నకేయూరకాన్తిసన్తానహాసినా ।
స తాం నిరూప్య వేగేన కుజంభాయ ముమోచ హ ॥80॥

రత్నకేయూరాల కాంతి సంతానమే హాసంగా కల బాహువుతో కుబేరుడు ఆ శక్తిని వేగంగా కుజంభునిపై ప్రయోగించాడు.

సా కుజంభస్య హృదయం దారయామాస దారుణమ్ ।
విత్తేహా స్వల్పసత్త్వస్య పురుషస్యావిభావితా ॥81॥

స్వల్పసత్త్వుడైన పురుషునిలో విచారణారాహిత్యంవల్ల ధనాశ ప్రవేశించినట్లు అది కుజంభుని హృదయంలో ప్రవేశించి దాన్ని దారుణంగా చీల్చి వేచింది.

అథాస్య హృదయం భిత్త్వా జగామ ధరణీతలమ్ ।
తతో ముహూర్తాదస్వస్థో దానవో దారుణాకృతిః ॥82॥

జగ్రాహ పట్టిశం దైత్యః ప్రాంశుం శితశిలీముఖమ్ ।
స తేన పట్టిశేనాజౌ ధనదస్య స్తనాంతరమ్ ॥83॥

వాక్యేన తీక్ష్ణరూపేణ మర్మాన్తరవిసర్పిణా ।
నిర్బిభేదాభిజాతస్య హృదయం దుర్జనో యథా ॥84॥

అది అతని హృదయం భేదించి భూతలంలోకి చొచ్చుకుపోయింది. ఆపై ఒక క్షణకాలం అస్వస్థుడై దానవుడు దారుణాకారుడై వాడిమొనగల పొడవైన పట్టిశాన్ని చేపట్టాడు. ఆ పట్టిశంతో యుద్ధంలో ధనదుని స్తనాంతరాన్ని, తీక్ష్ణరూపమైన మర్మాంతరం తాకే మాటతో అభిజాతుని హృదయాన్ని దుర్జనుడు భేదించు విధంగా భేదించాడు.

తేన పట్టిశఘాతేన ధనేశః పరిమూర్ఛితః ।
నిపపాత రథోపస్థే జర్జరో పర్వతో యథా ॥85॥

ఆ పట్టిశపు దెబ్బతో మూర్ఛితుడైన కుబేరుడు శిథిలమైన కొండలాగా రథోపస్థంలో పడిపోయాడు.

తథాగతం తు తం దృష్ట్వా ధనేశం నరవాహనమ్ ।
ఖడ్గాస్త్రో నిర్ఋతిర్దేవో నిశాచరబలానుగః ॥86॥

అభిదుద్రావ వేగేన కుజంభం భీమవిక్రమమ్ ।

అలా పడిపోయిన నరవాహనుడైన కుబేరుణ్ణి జూచి నిరృతి ఖడ్గాస్త్రుడై నిశాచరబలం వెంటరాగా భీమపరాక్రముడైన కుజంభుని వైపు వేగంతో పరుగెత్తాడు.

అథ దృష్ట్వా తు దుర్ధర్షం కుజంభో రాక్షసేశ్వరమ్ ॥87॥

చోదయామాస సైన్యాని రాక్షసేంద్రవధం ప్రతి ।
స దృష్ట్వా చోదితాం సేనాం భల్లనానాస్త్రభీషణామ్ ॥88॥
రథాదాప్లుత్య వేగేన భూషణద్యుతిభాస్వరః ।
ఖడ్గేన కమలానీవ వికోశేనాంబరత్విషా ॥89॥

చిచ్ఛేద రిపువక్త్రాణి విచిత్రాణి సమన్తతః ।
నియమ్య తమధశ్చోర్ధ్వం దీర్ఘబాహుర్మహాసినా ॥90॥

సన్దష్టోష్ఠపుటాటోపభ్రుకుటీవికటాననః ।
ప్రచణ్డకోపరక్తాక్షో న్యకృన్తద్దానవాన్ రణే ॥91॥

కుజంభుడు దుర్ధర్షుడైన ఆ రాక్షసేశ్వరుణ్ణి చూచి అతణ్ణి చంపడానికి తన సైన్యాలను ప్రేరేపించాడు. నానా అస్త్రాలతో భీకరమై కుజంభునిచే ప్రేరేపించబడిన ఆ సేనను చూచి రథంనుండి వేగంగా దూకి భూషణాదుల కాంతిచే ప్రకాశించువాడై నిరృతి ఒరనుండి పెరికిన కత్తితో కమలాలను వలె విచిత్రమగు రిపువదనాలను ఛేదించాడు. మహాఖడ్గంతో దీర్ఘబాహుడై నలువైపులా అడ్డంగా, వెనుక, క్రింద, పైనా పెదవి గఱచుకొని వక్రించిన కనుబొమ్మలతో వికటమైన వదనం కలవాడై ప్రచండమైన కోపంతో ఎర్రబారిన నేత్రాలు గల్గి రణరంగంలో దానవులను ఖండించాడు.

తతో నిఃశేషితప్రాయాం విలోక్య స్వామనీకినీమ్ ।
ముక్త్వా కుజంభో ధనదం రాక్షసేంద్రమభిద్రవత్ ॥92॥

ఆపై తనసేన పూర్తిగా ధ్వంసం కావడం చూచి ధనదుణ్ణి వదలి కుజంభుడు రాక్షసేంద్రుడగు నిరృతి పైకి లంఘించాడు.

లబ్ధసంజ్ఞోఽథ జంభస్తు ధనాధ్యక్షపదానుగాన్ ।
జీవగ్రాహాన్ స జగ్రాహ బద్ధ్వా పాశైః సహస్రశః ॥93॥

ఇంతలో మూర్ఛనుండి తేరుకొన్న జంభుడు వేలాదిగా కుబేరానుచరసైనికులను ప్రాణాలతో పట్టుకొని పాశాలతో బంధించాడు.

మూర్తిమన్తి తు రత్నాని వివిధాని చ దానవాః ।
వాహనాని చ దివ్యాని విమానాని సహస్రశః ॥94॥

మూర్తీభవించిన వివిధ రత్నాలను దివ్యవాహనాలను, వేలాదిగా విమానాలను, రాక్షసులు స్వాధీనం చేసుకొన్నారు.

ధనేశో లబ్ధసంజ్ఞో౾థ తామవస్థాం విలోక్య తు ।
నిఃశ్వసన్దీర్ఘముష్ణం చ రోషాత్తామ్రవిలోచనః ॥95॥

ధ్యాత్వా౾స్త్రం గారుడం దివ్యం బాణం సన్ధాయ కార్ముకే ।
ముమోచ దానవానీకే తం బాణం శత్రుదారణమ్ ॥96॥

ఇంతలో కుబేరుడు తేరుకొని తమవారి ఆ దురవస్థను చూచి దీర్ఘంగానూ, వేడిగానూ నిట్టూరుస్తూ రోషంతో ఎఱ్ఱబారిన కన్నులు గలవాడై దివ్యమైన గారుడాస్త్రాన్ని ధ్యానించి కార్ముకంలో బాణం సంధించి శత్రుదారణమైన ఆ బాణాన్ని దానవసైన్యంపై ప్రయోగించాడు.

ప్రథమం కార్ముకాత్తస్య నిశ్చేరుర్ధూమరాజయః ।
అనన్తరం స్ఫులింగానాం కోటయో దీప్తవర్చసామ్ ॥97॥

మొదట ఆ కార్ముకంనుండి పొగలు వెలువడ్డాయి. ఆపై మహాదీప్తి గల కోట్లకొలది స్ఫులింగాలు ఆవిర్భవించాయి.

తతో జ్వాలా౾౾కులం వ్యోమ చకారాస్త్రం సమన్తతః ।
తతః క్రమేణ దుర్వారం నానారూపం తదా౾భవత్ ॥98॥

ఆపై అస్త్రం ఆకాశాన్ని నలువైపులా జ్వాలాకులం కావించింది. ఆపైన వారించరానిదై క్రమంగా నానారూపాలు దాల్చింది.

ముహూర్తం చాభవల్లోకో హ్యన్ధకారసమావృతః ।
తతో౾న్తరిక్షే దృశ్యంతే తేజాంసి తు పరస్పరమ్ ॥99॥

ఒక ముహూర్తకాలం లోకం అంధకారం కప్పినదయింది. పిదప అంతరిక్షంలో పరస్పరం వ్యాపించిన తేజస్సులు కనిపించాయి.

కుజమ్భస్తత్సమాలోక్య దానవో౾తిపరాక్రమః ।
అభిదుద్రావ వేగేన పదాతిర్ధనదం నదన్ ॥100॥

అతి పరాక్రముడైన, కుజంభదానవుడు అది చూచి పదాతియై కుబేరునివైపు శబ్దిస్తూ పరుగెత్తాడు.

అథాభిముఖ మాయాన్తం దైత్యం దృష్ట్వా ధనాధిపః ।
బభూవ సంభ్రమావిష్టః పలాయనపరాయణః ॥101॥

పిదప తనకెదురుగా వస్తున్న దైత్యుణ్ణి చూచి కుబేరుడు సంభ్రాంతుడై పరుగిడ నారంభించాడు.

తతః పలాయతస్తస్య ముకుటం రత్నమణ్డితమ్ ।
పపాత భూతలే దీప్తం రవిబింబమివాంబరాత్ ॥102॥

అలా పరుగెడుతున్న అతని రత్న మండితకిరీటం దీప్తమై ఆకసం నుండి సూర్యబింబం పడినట్లు భూమిపై పడింది.

శూరాణామభిజాతానాం భర్తర్యపసృతే రణాత్ ।
మర్తుం సంగ్రామశిరసి యుక్తం తద్భూషణాగ్రతః ॥103॥

ఇతి వ్యవస్య దుర్ధర్షా నానాశస్త్రాస్త్రపాణయః ।
యుయుత్సవః స్థితా యక్షా ముకుటం పరివార్య తమ్ ॥104॥

శూరులు, అభిజాతులు ఐన వారికి యుద్ధంనుండి తమ యజమాని తొలగిపోతే యుద్ధంలో ఆయన భూషణం ముందు మరణించడం సముచితమని నిశ్చయించి, దుర్ధర్షులూ, నానాశస్త్రపరాయణులూ అయిన యక్షులు యుద్ధం చేయగోరి ఆ కిరీటం చుట్టూ చేరారు.

అభిమానధనా వీరా ధనదస్య పదానుగాః ।
తానమర్షాచ్చ సంప్రేక్ష్య దానవశ్చణ్డపౌరుషః ॥105॥

భుశుణ్డీం భైరవాకారాం గృహీత్వా శైలగౌరవామ్ ।
రక్షిణో ముకుటస్యాథ నిష్పిపేష నిశాచరాన్ ॥106॥

అభిమానధనులు, కుబేరుని అనుచరులు ఐన వారిని అమర్షంతో చూచి చండపౌరుషుడైన దానవుడు కొండవంటి బరువుగల్గి భైరవాకారం గల ఒక భుశుండిని తీసుకొని కిరీట రక్షకులైన నిశాచరులను పొడి పొడిచేశాడు.

తాన్ప్రమథ్యాథ దనుజో ముకుటం తత్స్వకే రథే ।
సమారోప్యామరరిపుర్జిత్వా ధనదమాహవే ॥107॥

ధనాని రత్నాని చ మూర్తిమన్తి తథా నిధానాని శరీరవన్తి ।
ఆదాయ సర్వాణి జగామ దైత్యో జంభః స్వసైన్యం దనుజేంద్రసింహః ।
ధనాధిపో వై వినికీర్ణమూర్ధజో జగామ దీనః సురభర్తురన్తికమ్ ॥108॥

అలా వారిని నుజ్జు గావించి అమరశత్రుడైన ఆ దనుజుడు ఆ కిరీటాన్ని తన రథంలో పెట్టుకొన్నాడు. అలా ఆహవంలో కుబేరుణ్ణి జయించి– ధనాలు, ఆకృతి దాల్చిన రత్నాలు, నిధులు, అన్నీ తీసుకొని దనుజశ్రేష్ఠుడైన జంభదైత్యుడు తన సైన్యం వైపు వెళ్ళాడు. కుబేరుడు వెంట్రుకలు విరబోసుకొని దీనుడై ఇంద్రుని చెంతకు వెళ్ళాడు.

కుజంభేనాథ సంసక్తో రజనీచరనన్దనః ।
మాయామమోఘామాశ్రిత్య తామసీం రాక్షసేశ్వరః ॥109॥

మోహయామాస దైత్యేంద్రం జగత్కృత్వా తమోమయమ్ ।
తతో విఫలనేత్రాణి దానవానాం బలాని తు ॥110॥

అక్కడ కుజంభునితో పోరాడే రాక్షసేంద్రుడైన నిరృతి అమోఘమైన తామసీమాయ నాశ్రయించి జగత్తును తమోమయం చేసి దానితో దైత్యేంద్రుణ్ణి మోహితుణ్ణి చేశాడు. అంచేత దానవుల సైన్యాలు వ్యర్థమైన నేత్రాలు కలవయ్యాయి.

న శేకుశ్చలితుం తత్ర పదాదపి పదం తదా ।
తతో నానాస్త్రవర్షేణ దానవానాం మహాచమూమ్ ॥111॥

జఘ్నుర్నీహారతిమిరపరమాతురవాహనామ్ ।
వధ్యమానేషు దైత్యేషు కుజంభే మూఢచేతసి ॥112॥

ఒక అడుగునుండి మరొకఅడుగు వరకు కూడా కదలలేనివయ్యాయి. పిమ్మట వివిధాస్త్రాల వర్షంతో గొప్ప మంచు, చీకట్లచేత పీడితమైన వాహనాలు గల ఆ సేనను శత్రువులు ప్రహరించారు. అలా సైన్యాలు వధింపబడుతుండగా కుజంభుడు విమూఢచిత్తుడయ్యాడు.

మహిషో దానవేంద్రస్తు కల్పాన్తాంభోదసన్నిభః ।
అస్త్రం చకార సావిత్రముల్కాసంఘాతమణ్డితమ్ ॥113॥

అప్పుడు మహిషుడనే దానవనాథుడు యుగాంతమేఘంవంటివాడై ఉల్కలగుంపుచే మండితమైన సావిత్రమనే అస్త్రాన్ని సిద్ధం చేశాడు.

విజృంభత్యథ సావిత్రే పరమాస్త్రే ప్రతాపిని ।
ప్రణాశమగమత్తీవ్రం తమో ఘోరమనన్తరమ్ ॥114॥

ప్రతాపం కల ఆ సావిత్రమనే పరమాస్త్రం విజృంభించగా తీవ్రమైన ఆ అంధకారం నశించింది.

తతోఽస్త్రం విస్ఫులింగాంకం నభః కృత్స్నం వ్యజాయత ।
ప్రఫుల్లారుణపద్మౌఘం శరదీవామలం సరః ॥115॥

ఆపై విస్ఫులింగాలు విరజిమ్మే ఆ అస్త్రం మొత్తం చీకటిని నశింపజేసింది. చీకటి తొలగగా శరదృతువులో వికసించిన ఎర్రని పద్మసమూహం కల నిర్మలసరస్సు లాగా ఆకాశం భాసించింది.

తతస్తమసి సంశాన్తే దైత్యేంద్రాః ప్రాప్తచక్షుషః ।
చక్రుః క్రూరేణ మనసా దేవానీకైః మహాద్రుతమ్ ॥116॥

చీకటి నశించగా దైత్యులు చూపు గలవారై, క్రూరమైన చిత్తంతో దేవతల సెన్యాన్ని తరిమారు.

శస్త్రైరమర్షాన్నిర్ముక్తైర్భుజంగాస్త్రం వినోదితమ్ ।
అథాదాయ ధనుర్ఘోరమిషూంశ్చాశీవిషోపమాన్ ॥117॥

కుజంభోఽధావత క్షిప్రం రక్షోరాజబలం ప్రతి ।
రాక్షసేంద్రస్తమాయాన్తం విలోక్య సపదానుగమ్ ॥118॥

వివ్యాధ నిశితైర్బాణైః క్రూరాశీవిషభీషణైః ।
తదాదానం చ సన్ధానం న మోక్షశ్చాపి లక్ష్యతే ॥119॥

అమర్షంతో వారు ప్రయోగించిన శస్త్రాలతో భుజంగాస్త్రం తొలగింపబడింది. పిదప భీకర ధనువు గ్రహించి సర్పసదృశ శరాలు చేపట్టి కుజంభుడు వెంటనే రక్షోరాజ బలంవైపు పరుగెత్తాడు. అనుచరులతో సహా ఆ వస్తున్న వాణ్ణి చూచి నిరృతి క్రూరమైన సర్పాలవలె భీకరాలైన నిశితశరాలతో ప్రహరించాడు. వాడు బాణాలు తీసుకోవడం, సంధించడం, విడవడం (వేగాతిశయం వల్ల) దృష్టికి గోచరించలేదు.

చిచ్ఛేద తైశ్శరవ్రాతైస్తాఞ్ఛరానతిలాఘవాత్ ।
ధ్వజం శరేణ తీక్ష్ణేన చిత్రకర్మాఽమరద్విషః ॥120॥

చిత్రకర్ముడై అతిలాఘవంతో దేవతా ద్వేషియొక్క శరాలను తన బాణాలతో ఛేదించాడు. పరమతీక్ష్ణమైన శరంతో ధ్వజాన్ని నరకివేశాడు.

సారథిం చాస్య భల్లేన రథ్యాన్బాణైరపాతయత్ ।
కుజంభః కర్మ తద్దృష్ట్వా రాక్షసేంద్రస్య సంయుగే ॥121॥

రోషరక్తేక్షణ యుతో రథాదాప్లుత్య దానవః ।
ఖడ్గం జగ్రాహ వేగేన శరదమ్బరనిర్మలమ్ ॥122॥

అతని సారథిని గూడా ఒక భల్లంతో, గుర్రాలను మరికొన్ని బాణాలతో పడవేశాడు. రణంలో ఆ రాక్షసుడు చేసిన పనిని చూచిన కుజంభుడు రోషంతో ఎర్రబడిన కన్నులు గల్గి రథంనుండి దూకి శరదాకాశం వలె నిర్మలమైన కత్తిని వేగంతో చేపట్టాడు.

చర్మ చోదయఖణ్డేన్దు దశకేన విభూషితమ్ ।
అభ్యద్రవద్రణే దైత్యో రక్షోఽధిపతిమోజసా ॥123॥

ఉదయించే ఖండచంద్రుల దశకంతో అలంకృతమైన చర్మం కూడా చేపట్టి రాక్షసాధిపతి నిరృతినుద్దేశించి ఓజస్సుతో రణభూమిలో పరుగుదీశాడు.

తం రక్షోఽధిపతిః ప్రాప్తం ముద్గరేణాహనద్ధృది ।
స తు తేన ప్రహారేణ క్షీణః సంభ్రాన్తమానసః ॥124॥

తస్థావచేష్టో దనుజో యథా ధీరో ధరాధరః ।
స ముహూర్తం సమాశ్వస్తో దానవేంద్రోఽతిదుర్జయః ॥125॥

రథమారుహ్య జగ్రాహ రక్షో వామకరేణ తు ।
కేశేషు నిర్ఋతిం దైత్యో జానునాఽఽక్రమ్య ధిష్ఠితః ॥126॥

అలా వచ్చిన వాని గుండె పైన రాక్షసాధిపతి ముద్గరంతో మోదాడు. ఆ దెబ్బతో అతడు క్షీణుడై సంభ్రాంత చిత్తుడై చేష్టలుడిగి ధీరమైన పర్వతంవలె ఊరకుండిపోయాడు. ఒక క్షణ కాలానికి సమాశ్వస్తుడై మిక్కిలి దుర్జయుడైన ఆ దానవేంద్రుడు రథమెక్కి ఎడమచేత నిరృతిని పట్టుకొని మోకాటితో ఆక్రమించి వెంట్రుకలు పట్టుకొన్నాడు.

తతః ఖడ్గేన చ శిరశ్ఛేత్తుమైచ్ఛదమర్షితః ।
ఏతస్మిన్నన్తరే దేవో వరుణోఽ_పామ్పతిర్ద్రుతమ్ ॥127॥

పాశేన దానవేంద్రస్య బబన్ధ చ భుజద్వయమ్ ।
తతో బద్ధభుజం దైత్యం విఫలీకృతపౌరుషమ్ ॥128॥

తాడయామాస గదయా దయాముత్సృజ్య పాశధృక్ ।
స తు తేన ప్రహారేణ స్రోతోభిః క్షతజం వమన్ ॥129॥

ఆపై ఖడ్గంతో నిరృతి శిరస్సు ఖండించగోరాడు. ఇంతలో వరుణదేవుడు శీఘ్రంగా పాశంతో దానవేంద్రుని రెండు భుజాలను బంధించాడు. ఆపై అలా కట్టి వేయబడ్డ భుజాలతో వ్యర్థమైపోయిన పౌరుషం గల దైత్యుణ్ణి దయలేకుండా వరుణుడు పాశాలు గట్టిగా పట్టుకొని గదతో కొట్టాడు. ఆ దెబ్బతో వాడు రక్తం క్రక్కుకొన్నాడు.

దధార రూపం మేఘస్య విద్యున్మాలిలతాభృతః ।
తదవస్థాగతం దృష్ట్వా కుజంభం మహిషాసురః ॥130॥

వ్యావృత్తవదనోఽ_గాధో గ్రస్తుమైచ్ఛత్సురావుభౌ ।
నిర్ఋతిం వరుణం చైవ తీక్ష్ణః దంష్ట్రోత్కటాననః ॥131॥

మేరపుతీగలతో గూడి మేఘరూపుడై ప్రకాశించాడు. ఆ దురవస్థలో ఉన్న కుజంభుణ్ణి మహిషాసురుడు చూచాడు. వాడు తీక్ష్ణమైన దంతాలచే ఉత్కటమైన నోరు కలవాడై అగాధంగా తెరచుకొన్న తన నోటితో దేవతాపక్షానికిజెందిన నిరృతినీ, వరుణుణ్ణీ మ్రింగగోరాడు.

తావభిప్రాయమాలక్ష్య తస్య దైత్యస్య దూషితమ్ ।
త్యక్త్వా రథపథం భీతౌ మహిషస్యాతిరంహసః ॥132॥

భృశం ద్రుతౌ జవాదుగ్రముఖాభ్యాం భయవిహ్వలౌ ।
జగామ నిర్ఋతిః క్షిప్రం శరణం పాకశాసనమ్ ॥133॥

వారు ఆ దైత్యుని నీచమైన అభిప్రాయం గ్రహించి మహిషుని రథమార్గం వదలి భయపడినవారై మిక్కిలి వేగంతో భయవిహ్వలులై పారిపోయారు. నిరృతి వెంటనే ఇంద్రుణ్ణి శరణు పొందాడు.

క్రుద్ధస్తు మహిషో దైత్యో వరుణం సమభిద్రవత్ ।
తమన్తకముఖాసన్నమాలోక్య హిమదీధితిః ॥134॥

చక్రే సోమాస్త్రనిఃసృష్టం హిమసంఘాతసఙ్కటమ్ ।
వాయవ్యం చాస్త్రమతులం చంద్రశ్చక్రే ద్వితీయకమ్ ॥135॥

కుపితుడైన మహిషాసురుడు వరుణునివెంట పరుగెత్తాడు. యమముఖాసన్నుడైన వరుణుని చూచి చంద్రుడు సోమాస్త్రం ప్రయోగించి మంచుతో సంకటం కలిగించాడు. మరియు రెండవదైన వాయవ్యాస్త్రాన్ని గూడా ప్రయోగించాడు.

వాయునా తేన చన్ద్రేణ సంశోషేణ హిమేన చ ।
వ్యథితా దానవాః సర్వే శీతోచ్ఛిన్నా విపౌరుషాః ॥136॥

న శేకుశ్చలితుం పద్భ్యాం నాస్త్రాణ్యాదాతుమేవ చ ।
మహాహిమనిపాతేన శస్త్రైశ్చంద్రప్రచోదితైః ॥137॥

చంద్రుడు ప్రయోగించిన వాయువుచేతా, మంచుచేతా వ్యథ నొందిన దానవులందరూ చలికి ఉచ్ఛిన్నులై పౌరుషం కోల్పోయి, చంద్రుని శస్త్రాలచే మహాతుషారం పడడంతో కాళ్ళతో నడవలేకపోయారు. అస్త్రాలు అందు కోవడానికి అశక్తులైనారు.

గాత్రాణ్యసురసైన్యానామదహ్యన్త సమన్తతః ।
మహిషో నిష్ప్రయత్నస్తు శీతేనాకమ్పితాననః ॥138॥

కక్షావాలమ్బ్య పాణిభ్యాముపవిష్టో హ్యధోముఖః ।
సర్వే తే నిష్ప్రతీకారా దైత్యాశ్చంద్రమసా జితాః ॥139॥

అసురసైన్యాల శరీరాలు నలువైపులా శస్త్రాలచే దహింపజేయబడ్డాయి. మహిషుడు చలితో వణకే ముఖం కలవాడై ఏ ప్రయత్నమూ చేయలేక చేతులతో చంకలు మడిచిపట్టుకొని తల వాల్చి కూర్చుండిపోయాడు. అప్పుడు వారంతా ప్రతీకారం చేయలేక చంద్రునిచే పరాజితులయ్యారు.

రణేచ్ఛాం దూరతస్త్యక్త్వా తస్థుస్తే జీవితార్థినః ।
తత్రాబ్రవీత్కాలనేమిర్దైత్యాన్కోపేన దీపితః ॥140॥

యుద్ధం చేయాలన్న కోరికను దూరంగా వదలి వారు జీవితార్థులై ఉండిపోయారు. అప్పుడు కోపోద్దీపితుడైన కాలనేమి దైత్యుల నుద్దేశించి యిలా అన్నాడు.

భో భోః శృంగారిణః! శూరాః! సర్వే శస్త్రాస్త్రపారగాః ।
ఏకైకోఽపి జగత్సర్వం శక్తస్తులయితుం భుజైః ॥141॥

"ఓ శృంగారులారా! శస్త్రాస్త్రపారంగతులైన శూరులారా! మీలో ఒక్కొక్కడు భుజశక్తిచే జగమంతా ఊపివేయగలడు.

ఏకైకోఽపి క్షమో గ్రస్తుం జగత్సర్వం చరాచరమ్ ।
ఏకైకస్యాపి పర్యాప్తా న సర్వేఽపి దివౌకసః ॥142॥

కలాం పూరయితుం యత్నాత్షోడశీమతివిక్రమాః ।
కిం ప్రయాతాశ్చ తిష్ఠధ్వం సమరేఽమరనిర్జితాః ॥143॥

చరాచరజగత్తు నంతటినీ మీలో ఒక్కొక్కడు మ్రింగివేయగలడు. మీలో ఒక్కొక్కడికీ దేవతలంతా మూకుమ్మడిగా వచ్చినా చాలరు. మీలో పదునారవ కళను గూడా దేవతలు పూరించలేరు. సమరంలో అమరులకోడి మీరు ఇలా పారిపోతున్నారేల? నిలబడండి!

న యుక్తమేతచ్ఛూరాణాం విశేషాద్దైత్యజన్మనామ్ ।
రాజా చ దితిజోఽస్మాకం తారకో లోకతారకః ॥144॥
విరతానాం రణాదస్మాత్క్రుద్ధః ప్రాణాన్ హరిష్యతి ।

శూరులకు, విశేషించి దైత్యులకు ఇది తగదు. లోకతారకుడైన దితి తనయుడు తారకుడు మనకు అండగా నున్నాడు. అతడు ఈ యుద్ధంనుండి విరమించుకొన్నవారిపట్ల కుపితుడై ప్రాణాలు తీస్తాడు అని చెప్పాడు.

శీతేన నష్టశ్రుతయో భ్రష్టవాక్పాటవాస్తథా ॥145॥

మూకాస్తదాభవన్దైత్యా రణద్దశనపంక్తయః ।
తాన్దృష్ట్వా నష్టచేతస్కాన్దైత్యాంఛీతేన సాదితాన్ ॥146॥

మత్వా కాలక్షమం కార్యం కాలనేమిర్మహాసురః ।
ఆశ్రిత్య దానవీం మాయాం వితత్య స్వం మహావపుః ॥147॥

చలికి వినికిడి శక్తి కోల్పోయి మాటలాడ శక్తిలేనివారై అప్పుడు దైత్యులు ధ్వనించే దంతపంక్తులు కలిగి మూగవారుగా ఉండిపోయారు. చలికి అణగారిపోయి నష్టచేతస్కులైన వారిని చూచి మహాసురుడైన కాలనేమి కాలోచితకార్య మాలోచించి దానవమాయ నాశ్రయించి తన మహాశరీరాన్ని ఇంకా పెంచాడు.

పూరయామాస గగనం దిశో విదిశ ఏవ చ ।
నిర్మమే దానవేంద్రేశః శరీరే భాస్కరాయుతమ్ ॥148॥

దానితో దిక్కులూ, విదిక్కులూ, గగనమంతా పూరించాడు. తన శరీరంలో పదివేలమంది సూర్యులను నిర్మించాడు.

దిశశ్చ మాయయా చణ్డైః పూరయామాస పావకైః ।
తతో జ్వాలాకులం సర్వం త్రైలోక్యమభవత్క్షణాత్ ॥149॥

ప్రచండమైన నిప్పులతో మాయతో దిక్కులను పూరించాడు. అంతట త్రైలోక్యమంతా క్షణంలో అగ్నిజ్వాలలతో ఆకులమయింది.

తేన జ్వాలాసమూహేన హిమాంశురగమచ్ఛమమ్ ।
తతః క్రమేణ విభ్రష్టం శీతదుర్దినమాబభౌ ॥150॥

ఆ జ్వాలా సమూహంతో చంద్రుడు శమించాడు. ఆపై క్రమంగా శీతమైన దుర్దినం తొలగిపోయింది.

తద్బలం దానవేంద్రాణాం మాయయా కాలనేమినః॥

తం దృష్ట్వా దానవానీకం లబ్ధసంజ్ఞం దివాకరః ।
ఉవాచ చారుణం దృష్ట్వా కోపాల్లోకైకలోచనః ॥151॥

కాలనేమి మాయవల్ల దానవేంద్రుల సైన్యం అలా తేరుకొన్నది. తేరుకొన్న దానవ సైన్యాన్ని చూచి లోకముఖ్య నేత్రుడైన సూర్యుడు సారథియైన అరుణుని చూచి కోపంతో ఇలా అన్నాడు.

దివాకర ఉవాచ :-దివాకరుడు చెప్పాడు

నయారుణ రథం శీఘ్రం కాలనేమిరథో యతః ।
విమర్దస్తత్ర విషమో భవితా శూరసంక్షయః ॥152॥

"అరుణా! మన రథాన్ని శీఘ్రంగా కాలనేమి రథమున్న చోటుకి తీసుకుపో. అక్కడి తాకిడి విషమంగా ఉన్నది. శూరుల సంక్షయం జరుగనున్నది.

జిత ఏష శశాంకోఽత్ర తద్బలం బలమాశ్రితమ్ ।
ఇత్యుక్తశ్చోదయామాస రథం గరుడపూర్వజః ॥153॥

ఈ చంద్రుడు ఓడిపోయాడు. వారి బలం బలపడింది." ఇలా సూర్యుడనేసరికి అరుణుడు రథాన్ని అటువైపు నడిపించాడు.

ప్రయత్నవిధృతైరశ్వైః సితచామరమాలిభిః ।
జగద్దీపోఽథ భగవాన్ జగ్రాహ వితతం ధనుః ॥154॥

ప్రయత్నం మీద నిగ్రహించిన సితచామరమాలలు గల గుర్రాలతో జగత్తుకు దీపమైన భగవంతుడు విస్తృతమైన ధనువును చేపట్టాడు.

శరౌ చ ద్వౌ మహాభాగో దివ్యావాశీవిషద్యుతీ ।
శంబరాస్త్రేణ సన్ధాయ బాణమేకం ససర్జ సః ॥155॥

ఆ మహాభాగుడు దివ్యములూ, సర్పద్యుతి కలవీ అయిన రెండు శరాలను శంబరాస్త్రంతో సంధించి ఒక్క బాణం విడిచాడు.

ద్వితీయమింద్రజాలేన యోజితం ప్రముమోచ హ ।
శంబరాస్త్రేణ రూపాణాం క్షణాచ్చక్రే విపర్యయమ్ ॥156॥

రెండవబాణాన్ని ఇంద్రజాలంతో జోడించి వదిలాడు. శంబరాస్త్రంతో క్షణంలో రూపవిపర్యయం కావించాడు.

దేవానాం దానవం రూపం దానవానాం చ దైవికమ్ ।
మత్వా పరాన్ స్వకానేవ జఘ్నే ఘోరాస్త్రలాఘవాత్ ॥157॥
కాలనేమీ రుషావిష్టః కృతాన్త ఇవ సంక్షయే ।

దేవతలకు దానవరూపం, దానవులకు దేవతారూపం కలిగేటట్లు చేశాడు. అంతటితో తమవారినే శత్రువులని భావించి కోపించిన కాలనేమి ఘోరాస్త్రలాఘవంతో ప్రళయకాలయముని లాగా వారిని కొట్టాడు.

కాంశ్చిత్ఖడ్గేన తీక్ష్ణేన కాంశ్చిన్నారాచవృష్టిభిః ॥158॥
కాంశ్చిద్గదాభిర్ఘోరాభిః కాంశ్చిద్ఘోరైః పరశ్వథైః ॥159॥

కాలనేమి రోషంతో కొందరిని తీక్ష్ణఖడ్గంతోనూ, మరికొందరిని బాణవర్షంతోనూ, ఇంకకొందరిని ఘోరమైన గదలతోనూ కొట్టి, కొందరిని గొడ్డళ్ళతోను ప్రతిహతులను కావించాడు.

శిరాంసి కేషాంచిదపాతయచ్చ కాంశ్చిద్రథీంశ్చోష్ట్రరథాంశ్చ వేగతః ।
కాంశ్చిత్పిపేషాథ రథాశ్వవేగాత్ కాంశ్చిత్క్రుధా చోద్ధతముష్టిపాతైః ॥160॥

ఉగ్రవేగుడై కొందరి శిరస్సులు పడగొట్టాడు. కొందరు రథికులను, కొన్ని ఒంటె రథాలను వేగంగా పడగొట్టాడు. రథాశ్వాల వేగంతో కొందరిని పిండిచేశాడు. ఉద్ధతమైన ముష్టిపాతంతో మరికొందరిని పిండిజేశాడు.

రణే వినిహతాన్దృష్ట్వా నేమిః స్వాన్ దానవాధిపః ।
రూపం స్వం తు ప్రపద్యన్త హ్యసురాః సురధర్షితాః ॥161॥

కాలనేమి తనవారైన దానవులు రణంలో హతులు కావడం చూచాడు. దేవతలచే దెబ్బలు దిన్న అసురులు అవసాన సమయంలో నిజస్వరూపం దాలుస్తూ కనిపించారు.

కాలనేమీ రుషావిష్టస్తేషాం రూపం న బుద్ధవాన్ ।
నిమిర్దైత్యస్తు తాన్దృష్ట్వా కాలనేమిమువాచ హ ॥162॥

కాలనేమి రోషావిష్టుడై వారి రూపం గ్రహించలేక పోయాడు. నిమిదైత్యుడు వారిని చూచి కాలనేమితో ఇలా అన్నాడు.

అహం నిమిః సురో నైవ కాలనేమే! విదస్వ మామ్ ।
భవతా మోహితేనాజౌ నిహతాన్యురువిక్రమ! ॥163॥

దైత్యానాం దశలక్షాణి దుర్జయానాం సురైరిహ ।
సర్వాస్త్రవారణం ముంచ బ్రాహ్మమస్త్రం త్వరాఽన్వితః ॥164॥

నేను నిమిని. నేను దేవతను కాను, గొప్ప పరాక్రమం కలవాడా! కాలనేమీ! నన్ను తెలుసుకో! మోహితుడవైన నీచే యుద్ధంలో దేవతలకు దుర్జయులైన పదిలక్షల మంది దైత్యులు చంపబడ్డారు. నీవు వెంటనే సకలాస్త్రాలను నివారించగల బ్రహ్మాస్త్రం ప్రయోగించు".

స తేన బోధితో దైత్యః సంభ్రమాకులచేతనః ।
యోజమాయాస బాణేన బ్రహ్మాస్త్రవిహితేన తు ॥165॥

ఆ విధంగా అతనిచే బోధితుడైన కాలనేమి సంభ్రమవ్యాకులమైన చిత్తం గలవాడై బ్రహ్మాస్త్రంలో బాణం సంయోజితం చేశాడు.

ముమోచ చాపి దైత్యేంద్రః స స్వయం సురకణ్టకః ।
తతోఽస్త్రతేజసా వ్యాప్తం త్రైలోక్యం సచరాచరమ్ ॥166॥

దేవతలకు కంటకమైన ఆ దైత్యేంద్రుడు స్వయంగా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. సచరాచరమైన ముల్లోకాలూ ఆ అస్త్రతేజస్సుతో వ్యాప్తమయ్యాయి.

దేవానాం చాభవత్సైన్యం సర్వమేవ భయాన్వితమ్ ।
శంబరాస్త్రం చ సంశాన్తం స్వయమాయోధనే బభౌ ॥167॥

అంతట దేవతా సైన్యమంతా భయగ్రస్తమయింది. రణరంగంలో శంబరాస్త్రం గూడా శాంతించింది.

తస్మిన్ ప్రతిహతే హ్యస్త్రే భ్రష్టతేజా దివాకరః ।
మహేంద్రజాలమాశ్రిత్య చక్రే స్వాం కోటిశస్తనుమ్ ॥168॥

ఆ అస్త్రం ప్రతిహతం కాగా సూర్యుడు తేజస్సు కోల్పోయాడు. ఆపైన మహేంద్రజాలము నాశ్రయించి తన శరీరాన్ని కోటిరెట్లు విస్తృతం చేశాడు.

విస్ఫూర్జత్కరసమ్పాతసమాక్రాన్తజగత్త్రయమ్ ।
తతాప దానవానీకం గతమజ్జౌఘశోణితమ్ ॥169॥

వెలుగొందే కిరణాల ప్రసారముచే ముల్లోకాలూ సమాక్రాంతమయ్యాయి. దానిచే ఉడికిపోయి మజ్జా రక్తం విగతమై దానవసైన్యం తపించిపోయింది.

తతశ్చావర్షదనలం సమన్తాదతిసంహతమ్ ।
చక్షూంషి దానవేంద్రాణాం చకారాంధాని చ ప్రభుః ॥170॥

సూర్యుడు ఆపై నలువైపులా దట్టమైన అగ్నివర్షం కురిపించాడు. దానవేంద్రుల నేత్రాలను అంధకారమయం చేశాడు.

గజానామగలన్మేదః పేతుశ్చాపి రథా భువి ।
తురగా నిఃశ్వసన్తశ్చ ఘర్మార్తా రథినోఽపి చ ॥171॥

ఇతస్తతశ్చ సలిలం ప్రార్థయన్తస్తృషాఽతురాః ।
ప్రచ్ఛాయ విటపాంశ్చైవ గిరీణాం గహనాని చ ॥172॥

గజాల మేదస్సు జారిపడింది. రథాలు కూడా క్రిందపడ్డాయి. గుర్రాలు వేడికి బాధపడి నిట్టూర్చాయి. రథికులు గూడ ఇటూ అటూ నీళ్లు కావాలంటూ దప్పికతో ఆతురులై నీడగలచెట్లనూ, కొండ అడవులనూ వెదికారు.

దావాగ్నిః ప్రజ్వలంశ్చైవ ఘోరార్చిర్దగ్ధపాదపః ।
తోయార్థినః పురో దృష్ట్వా తోయం కల్లోలమాలినమ్ ॥173॥

పురః స్థితమపి ప్రాప్తుం న శేకురవమర్దితాః ।
అప్రాప్య సలిలం భూమౌ వ్యాత్తాస్యా గతచేతసః ॥174॥

జ్వలించే దావానల జ్వాలలు చెట్లను కాల్చివేశాయి. నీరు కోరేవారు ఎదుట గల కల్లోలమాలిని యగు నీటిని చూచి గూడా త్రొక్కిడికి శ్రమకు లోనై దాన్ని పొందలేకపోయారు. నీరందక నేలపై నోళ్ళు దెరుచుకొని గత చేతస్కులై పడిపోయారు.

తత్ర తత్ర వ్యదృశ్యన్త మృతా దైత్యేశ్వరా భువి ।
రథా గజాశ్చ పతితాస్తురగాశ్చ సమాపితాః ॥175॥

అక్కడక్కడా చచ్చి పడివున్న దైత్యేశ్వరులు కనిపించారు. రథాలు, గజాలు పడిపోయాయి. తురగాలు క్రిందపడి మరణించాయి.

స్థితా వమన్తో ధావన్తో గలద్రక్తవసాసృజః ।
దానవానాం సహస్రాణి వ్యదృశ్యన్త మృతాని తు ॥176॥

జీవించివున్నవారు రక్తం క్రక్కుకొంటూ రక్తాన్నీ, వసనూ కార్చుకొంటూ పరుగెత్తారు. వేలకొలది దానవులు మరణించారు.

సంక్షయే దానవేంద్రాణాం తస్మిన్మహతి వర్తితే ।
ప్రకోపాద్వృత్తతామ్రాక్షః కాలనేమీ రుషాతురః ॥177॥

అభవత్కల్పమేఘాభః స్ఫురద్భూరిశతహ్రదః ।
గంభీరాస్ఫోటనిర్హ్రాదో జగద్ధృదయకంటకః ॥178॥

అలా దానవేంద్రుల మహాసంక్షయం జరుగుతుండగా ప్రకోపంతో ఎర్రనైన కళ్ళు కల్గి రోషాతురుడైన కాలనేమి పెద్ద పెద్ద మెరుపులను స్ఫురింపజేసే కల్పమేఘంలా మారిపోయాడు. గంభీరాస్ఫోటనంతో కల్గిన శబ్దంతో జగత్తు యొక్క హృదయానికి కంటకమయ్యాడు.

ప్రచ్ఛాద్య గగనాభోగం రవిమాయాం వ్యనాశయత్ ।
శీతం వవర్ష సలిలం దానవేంద్రబలప్రదమ్ ॥179॥

గగనతలాన్ని కప్పివేసి రవిమాయను నశింపజేశాడు. దానవేంద్రులకు బలప్రదమైన చల్లని నీరు వర్షించాడు.

దైత్యాస్తాం వృష్టిమాసాద్య సమాశ్వస్తాస్తతః క్రమాత్ ।
బీజాంకురా ఇవామ్లానాః ప్రాప్య వృష్టిం ధరాతలే ॥180॥

దైత్యులు ఆ వర్షాన్ని పొంది క్రమంగా సమాశ్వాసనం చెందారు. భూతలంపై వానపడినప్పుడు బీజాంకురాలవలె వారు వాడిపోనివా రయ్యారు.

తతః స మేఘరూపీ తు కాలనేమిర్మహాసురః ।
శస్త్రవృష్టిం వవర్షోగ్రాం దేవానీకేషు దుర్జయః ॥181॥

ఆపై దుర్జయుడూ, మహాసురుడూ అయిన కాలనేమి మేఘరూపం దాల్చి ఉగ్రమైన శస్త్రవర్షాన్ని దేవసేనలపై కురిపించాడు.

తయా వృష్ట్యా బాధ్యమానా దైత్యేంద్రాణాం మహౌజసామ్ ।
గతిం కాంచిదపశ్యంతో గావః శీతార్దితా ఇవ ॥182॥

పరస్పరం వ్యలీయన్త పృష్ఠేషు వ్యస్తపాణయః ।
స్వేషు బాధా వ్యలీయన్తే గజేషు తురగేషు చ ॥183॥

ఆ వృష్టికి బాధపడి మహాతేజస్కులైన దైత్యేంద్రుల గతి యేదో తెలియక చలికి బాధపడే గోవుల్లాగా పృష్ఠభాగాలలో చేతులు పెట్టుకొన్నవారై ఒకరిలో ఒకరు ఒదిగిపోయారు. ఏనుగులు, గుర్రాలు బాధాగ్రస్తాలయ్యాయి వెనుక దాక్కొన్నారు.

వప్రేషు చ భయత్రస్తాస్తత్ర తత్ర నిలిల్యిరే ।
అపరే కుంచితైర్గాత్రైః స్వహస్తపిహితాననాః ॥184॥

భీతిజెందిన దేవతలు అటనట ప్రాకారాలలో విలీనమయ్యారు. మరికొందరు కుంచిత శరీరాలతో తమ చేతులతో ముఖాలు కప్పుకొన్నారు.

ఇతశ్చేతశ్చ సంభ్రాన్తా బభ్రముర్వై దిశో దశ ।
ఏవం ప్రవృత్తే సంగ్రామే తుములే దేవసంక్షయే ॥185॥

సంభ్రాంతులై ఇటూ అటూ దశదిశలలోనూ తిరిగారు. దేవతల క్షయహేతువైన ఇట్టి తుముల సంగ్రామం జరిగింది.

దృశ్యన్తే పతితా భూమౌ శస్త్రభిన్నాంగసన్ధయః ।
విభుజా భిన్నమూర్ధానస్తథా ఛిన్నోరుజానవః ॥186॥

దేవతలు శస్త్రభిన్నాలైన అంగసంధులు గలవారు, భుజరహితులు, తలలు పగిలిన వారు, భిన్నమైన తొడలు, మోకాళ్లు గలవారునై భూమిపై పడిపోయి కనిపించారు.

విపర్యస్తరథాసంగా నిష్పిష్టధ్వజపంక్తయః ।
నిర్భిన్నాంగైస్తురంగైస్తు గజైశ్చాచలసన్నిభైః ॥187॥

స్రుతరక్తహ్రదైర్భూమిర్వికృతా వికృతా బభౌ ।
ఏవమాజౌ బలీ దైత్యః కాలనేమిర్మహాసురః ॥188॥

జఘ్నే ముహూర్తమాత్రేణ గన్ధర్వాణాం దశాయుతమ్ ।
యక్షాణాం పంచ లక్షాణి రక్షసామయుతాని షట్ ॥189॥

తిరగబడిన రథాసంగాలు గలవారు, పిండి అయిన ధ్వజశ్రేణులు గలవారయ్యారు. తురగాల అంగాలు నిర్భిన్నాలయ్యాయి. అచల సదృశాలైన గజాలనుండి రక్తపు మడుగులు స్రవించాయి. భూమి అతివికృతమై కనిపించింది.ఇలా యుద్ధంలో బలవంతుడైన దైత్యుడు కాలనేమి ఒక్క క్షణంలో పదివేల మంది గంధర్వులను హతమార్చాడు. ఐదు లక్షలమంది యక్షులనూ, అరువదివేలమంది రాక్షసులనూ పరిమార్చాడు.

త్రీణి లక్షాణి జఘ్నే స కిన్నరాణాం తరస్వినామ్ ।
జఘ్నే పిశాచముఖ్యానాం సప్తలక్షాణి నిర్భయః ॥190॥

వేగవంతులైన మూడు లక్షలమంది కిన్నరులను చంపాడు. నిర్భయుడై ఏడు లక్షల పిశాచముఖ్యులను నేలకూల్చాడు.

ఇతరేషామసంఖ్యాతాః సురజాతినికాయినామ్ ।
జఘ్నే స కోటీః సంక్రుద్ధశ్చిత్రాస్త్రైరస్త్రకోవిదః ॥191॥

అస్త్రకోవిదుడైన ఆ కాలనేమి సురజాతికి చెందిన లెక్కకు మిక్కిలిగా ఉన్న ఇతరులను కోట్లకొలదిగా చిత్రాస్త్రాలతో హతమార్చాడు.

ఏవం పరిభవే భీమే తదా త్వమరసంక్షయే ।
సంక్రుద్ధావశ్వినౌ దేవౌ చిత్రాస్త్రకవచోజ్జ్వలౌ ॥192॥

జఘ్నతుః సమరే దైత్యం కృతాన్తానలసన్నిభమ్ ।
తమాసాద్య రణే ఘోరమేకైకః షష్టిభిః శరైః ॥193॥

ఇలా భీకరంగా దేవతల వినాశం, అవమానం జరుగగా, కోపించిన అశ్వినీదేవత లిరువురూ చిత్రాస్త్రాలతో, కవచాలతో భాసించేవారై ఘోరకృతాంతాగ్ని సదృశుడైన దైత్యుణ్ణి సమరంలో కొట్టారు. ఒక్కొక్కడూ వాణ్ణి అరువదేసి బాణాలతో ప్రహరించారు.

జఘ్నతుస్తౌ తు తీక్ష్ణాగ్రైరసురం భీమదర్శనమ్ ।
తాభ్యాం బాణప్రహారైః స కించిదాయస్తలోచనః ॥194॥

తీక్ష్ణాగ్రాలైన బాణాలతో భీకరదర్శనుడైన అసురుణ్ణి వారు కొట్టారు. వారిద్దరూ ప్రయోగించిన బాణాల దెబ్బలచేత వాడు కొంచెం ఆయాసపడిన కన్నులు కలవాడైనాడు.

జగ్రాహ చక్రమష్టారం తైలధౌతం రణాన్తకమ్ ।
తేన చక్రేణ సోఽశ్విభ్యాం చిచ్ఛేద రథకూబరమ్॥195॥

ఆపై వాడు ఎనిమిది ఆకులు గల్గి, తైలధౌతమై, రణాంతకమైన చక్రం చేబూని దానితో అశ్వినుల రథకూబరాన్ని ఛేదించాడు.

జగ్రాహాథ ధనుర్దైత్యః శరాంశ్చాశీవిషోపమాన్ ।
వవర్ష భిషజోర్మూర్ధ్ని సంఛాద్యాకాశగోచరమ్ ॥196॥

ఆ మీదట దైత్యుడు ధనుస్సును, సర్ప సదృశాలైన శరాలను చేబూని ఆకాశాన్ని కప్పివేసి ఆవైద్యుల తలలపై శరవృష్టి కురియించాడు.

తావప్యస్త్రైశ్చిచ్ఛిదతుః శితైస్తైర్దైత్యసాయకాన్ ।
తచ్చ కర్మ తయోర్దృష్ట్వా విస్మితః కోపమావిశత్ ॥197॥

వారు కూడా తమ వాడి అస్త్రాలతో దైత్యుని బాణాలను ఛిన్నం కావించారు. వారు చేసిన ఆ పనిని చూచి విస్మితుడై వాడు కోపావిష్టుడైనాడు.

మహతా స తు కోపేన సంధాయాయోమయం తదా ।
జగ్రాహ ముద్గరం భీమం కాలదణ్డవిభీషణమ్ ॥198॥

మహాకోపంతో వాడు అయోమయమైన భీకరమగు కాలదండంవంటి భీషణమైన ముద్గరాన్ని చేపట్టాడు.

స తతో భ్రామ్య వేగేన చిక్షేపాశ్విరథం ప్రతి ।
తం తు ముద్గరమాయాన్తమాలోక్యాంబరగోచరమ్ ॥199॥

త్యక్త్వా రథౌ తు తౌ వేగాదాప్లుతౌ తరసాఽశ్వినౌ ।
తౌ రథౌ స తు నిష్పిష్య ముద్గరోఽచలసన్నిభః ॥200॥

ఆపై దాన్ని గిరగిర త్రిప్పి వాడు అశ్వినుల రథంపై విసిరాడు. పైకి వస్తున్న ఆ ముద్గరాన్ని ఆకాశంలోనే చూచి తమ తమ రథాలు విడిచి వారు వేగంగా ఎగిరి పోయారు. పర్వతం వంటిది, హేమజాలాలంకృతమూ అయిన ఆముద్గరం ఆ రథాలను పిండిపిండి చేసింది.

దారయామాస ధరణీం హేమజాలపరిష్కృతః ।
తస్య కర్మాశ్వినౌ దృష్ట్వా భిషజౌ చిత్రయోధినౌ ॥201॥

వజ్రాస్త్రం తు ప్రకుర్వాతే దానవేంద్రనివారణమ్ ।
తతో వజ్రమయం వర్షం ప్రావర్తదతిదారుణమ్ ॥202॥

ఆపైన భూమిని చీల్చివేసింది. అతడు చేసిన ఆపని చూచి చిత్రయోధులైన దేవవైద్యులగు అశ్వినులుదానవేంద్రుని నివారించగల వజ్రాస్త్రం ప్రయోగించారు. అంతట అతిదారుణమైన వజ్రమయ వర్షం కురిసింది.

ఘోరవజ్రప్రహారైస్తు దైత్యేంద్రః స తిరస్కృతః ।
రథో ధ్వజో ధనుశ్చక్రం కవచం చాపి కాంచనమ్ ॥203॥

క్షణేన తిలశో జాతం సర్వసైన్యస్య పశ్యతః ।

ఆ ఘోరమైన వజ్రాయుధపు దెబ్బలకు ఆ దైత్యేంద్రుడు గురి అయ్యాడు. సైన్యమంతా చూస్తూ వుండగానే అతని రథం, ధ్వజం, ధనువు, కాంచనకవచం క్షణంలో ముక్కలు ముక్కలయ్యాయి.

తద్దృష్ట్వా దుష్కరం కర్మ సోఽశ్విభ్యాం భీమవిక్రమః ॥204॥

నారాయణాస్త్రం బలవాన్ ముమోచ రణమూర్ధని ।
వజ్రాస్త్రం శమయామాస దానవేంద్రోఽస్త్రతేజసా ॥205॥

ఆ దుష్కరకృత్యం చూచి బలవంతుడు, భీమవిక్రముడైన రాక్షసుడు రణాగ్రంలో నారాయణాస్త్రం ప్రయోగించాడు. అలా దానవేంద్రుడు నారాయణాస్త్ర తేజంతో వజ్రాస్త్రాన్ని శమింపజేశాడు.

తస్మిన్ ప్రశాన్తే వజ్రాస్త్రే కాలనేమిరనన్తరమ్ ।
జీవగ్రాహం గ్రాహయితుమశ్వినౌ తు ప్రచక్రమే ॥206॥

అది శమించినంతట కాలనేమి అశ్వినులను జీవించివుండగనే పట్టుకోవాలని ప్రయత్నించాడు.

తావశ్వినౌ రణాద్భీతౌ సహస్రాక్షరథం ప్రతి ।
ప్రయాతౌ వేపమానౌ తు పదా శస్త్రవివర్జితౌ ॥207॥

ఆ అశ్వినులు భయపడి రణభూమినుండి పారిపోయి, శస్త్రాలు విడిచి, భయకంపితులయ్యారు. ఇంద్రుని రథం చెంత చేరారు.

తయోరనుగతో దైత్యః కాలనేమిర్మహాబలః ।
ప్రాప్యేంద్రస్య రథం క్రూరో దైత్యానీకపదానుగః ॥208॥

వారివెంటబడి మహాబలుడైన కాలనేమి దైత్యసేనాసమేతుడై క్రూరుడై ఇంద్రుని రథం వద్దకు చేరాడు.

తం దృష్ట్వా సర్వభూతాని విత్రేసుర్విహ్వలాని తు ।
దృష్ట్వా దైత్యస్య తత్ క్రౌర్యం సర్వభూతాని మేనిరే ॥209॥

పరాజయం మహేంద్రస్య సర్వలోకక్షయావహమ్ ।
చేలుః శిఖరిణో ముఖ్యాః పేతురుల్కా నభస్తలాత్ ॥210॥

అతణ్ణి చూచి సకలప్రాణులు విహ్వలములై భీతి చెందాయి. ఆ దైత్యుని క్రౌర్యం చూచి సకల భూతాలూ కంపించాయి. మహేంద్రునికి సర్వలోక క్షయకారకమైన పరాజయం తప్పదని భావించాయి. ముఖ్యమైన పర్వతాలు చలించాయి. ఆకాశం నుండి ఉల్కలు రాలాయి.

జగర్జుర్జలదా దిక్షు హ్యుద్భూతాశ్చ మహార్ణవాః ।
తాం భూతవికృతిం దృష్ట్వా భగవాన్ గరుడధ్వజః ॥211॥

వ్యబుధ్యతాహిపర్యంకే యోగనిద్రాం విహాయ తు ।
లక్ష్మీకరయుగాజస్రలాలితాంఘ్రిసరోరుహః ॥212॥

మేఘాలు దిక్కులలో గర్జించాయి. మహా సముద్రాలు పొంగాయి. లక్ష్మియొక్క రెండు చేతులచే సదా లాలించబడిన పాదపద్మాలు గల భగవంతుడగు మహావిష్ణువు ఆ భూతవికృతిని చూచి శేషపర్యంకంలో యోగనిద్ర వీడి మేల్కొన్నాడు.

శరదమ్బరనీలాబ్జకాన్తదేహచ్ఛవిర్విభుః ।
కౌస్తుభోద్భాసితోరస్కో కాన్తకేయూరభాస్వరః ॥213॥

విమృశ్య సురసంక్షోభం వైనతేయం సమాహ్వయత్ ।
ఆహూతేఽవస్థితే తస్మిన్ నాగావస్థితవర్ష్మణి ॥214॥

శరదాకాశంలో నల్లని ఉత్పలంవంటి దేహకాంతి గలవాడు, కౌస్తుభోద్భాసితమెన వక్షం కలవాడు, అందమైన కేయూరాలతో ప్రకాశించువాడు అయిన ఆ ప్రభువు దేవతల సంక్షోభం గమనించి గరుడుని పిలిచాడు. నాగావస్థిత శరీరం కల ఆ గరుడుడు ఆహ్వానమందుకొని రాగానే –

దివ్యనానాస్త్రతీక్ష్ణార్చిరారుహ్యాగాత్ సురాన్ స్వయమ్ ।
తత్రాపశ్యచ్చ దేవేంద్రమభిద్రుతమభిప్లవైః ॥215॥

దానవేంద్రైర్నవాంభోద సచ్ఛాయైః పౌరుషోత్కటైః ।

దివ్యమైన నానావిధాస్త్రాలచే తీక్ష్ణకాంతి గలవాడై గరుడుడినెక్కి స్వయంగా దేవతల చెంతకు పోయాడు. అక్కడ కొంగ్రొత్త మేఘాలవంటికాంతిగలవారు, పౌరుషంతో ఉద్రిక్తులైన దానవేంద్రులచే ఉపద్రవాలకు లోనైన దేవేంద్రుణ్ణి చూచాడు.

యథా హి పురుషో ఘోరైరభాగ్యైర్వంశశాలిభిః ॥216॥

పరిత్రాణాయ సుకృతం సుక్షేత్రే కర్మ నిర్మలే ।

వంశానుగతంగా వచ్చి బాధించే దురదృష్టంనుండి పురుషుని రక్షించడానికి ఉత్తమదేశకాలాలలో చేసిన పుణ్యం వచ్చినరీతిగా నారాయణుడు ఇంద్రుణ్ణి కాపాడటానికి వచ్చాడు.

అథాపశ్యంస్తు దైతేయా వియతి జ్యోతిమణ్డలమ్ ॥217॥

స్ఫురన్తముదయాద్రిస్థం సూర్యముష్ణత్విషా ఇవ ।
ప్రభావం జ్ఞాతుమిచ్ఛన్తో దానవాస్తస్య తేజసః ॥218॥
గరుత్మన్తమపశ్యన్త కల్పాన్తానలసన్నిభమ్ ।
తమాస్థితం చ మేఘౌఘద్యుతిమక్షయమచ్యుతమ్ ॥219॥

అప్పుడు రాక్షసులకు ఉదయగిరినధిష్ఠించి ఉష్ణకాంతితో స్ఫురించే సూర్యునివంటి జ్యోతిర్మండలం ఆకాశంలో కనిపించింది. ఆ తేజస్సు ప్రభావాన్ని దానవులు తెలుసుకోగోరినారు. ఇంతలో యుగాంతాగ్నివంటి గరుడుణ్ణి అధిష్ఠించిన పలు మెరపులతో భాసించే మేఘసమూహ కాంతిగల అక్షయుడైన అచ్యుతుణ్ణి చూచారు.

తమాలోక్యాసురేంద్రాస్తు హర్షసంపూర్ణమానసాః ।
అయం వై దేవసర్వస్వం జితేఽస్మిన్ నిర్జితాః సురాః ॥220॥

అయం స దైత్యచక్రాణాం కృతాన్తః కేశవోఽరిహా ।
ఏనమాశ్రిత్య లోకేషు యజ్ఞభాగభుజోఽమరాః ॥221॥

ఇత్యుక్త్వా దానవాః సర్వే పరివార్య సమన్తతః ।
నిజఘ్నుర్వివిధైరస్త్రైస్తే తమాయాన్తమాహవే ॥222॥

అప్పుడు దైత్యులు హర్షం నిండిన చిత్తంతో "ఇతడు దేవతల సర్వస్వం, ఇతడు పరాజితుడైతే దేవతలంతా జయింపబడినవారే" అనీ, వీడు దైత్యసమూహాలకు యముడు, కేశవుడు, శత్రుహంత, ఇతణ్ణి ఆశ్రయించి దేవతలు

లోకాలలో యజ్ఞభాగాలు భుజిస్తున్నారు". అని చెప్పి దానవులందరూ అతణ్ణి నలువైపులా క్రమ్ముకొని సమరంలో ఎదురుగా వస్తున్న అతణ్ణి వివిధాస్త్రాలతో ప్రహరించారు.

కాలనేమిప్రభృతయో దశ దైత్యా మహారథాః ।
షష్ట్యా వివ్యాధ బాణానాం కాలనేమిర్జనార్దనమ్ ॥223॥

కాలనేమి మున్నగు మహారథులు పదిమందిదైత్యులువారు. కాలనేమి జనార్దనుణ్ణి అరువదిబాణాలతోకొట్టాడు.

నిమిః శతేన బాణానాం మథనోఽశీతిభిః శరైః ।
జంభకశ్చైవ సప్తత్యా శుంభో దశభిరేవ చ ॥224॥

శేషా దైత్యేశ్వరాః సర్వే విష్ణుమేకైకశః శరైః ।
దశభిశ్చైవ యత్నాత్తే జఘ్నుః సగరుడం రణే ॥225॥

నిమి నూరు శరాలతోనూ, మథనుడు ఎనుబది శరాలతోనూ, జంభకుడు డెబ్బది బాణాలతోనూ, శుంభుడు పదింటితోనూ తక్కిన దైత్యేశ్వరులందరూ ఒక్కొక్కడు పది పది బాణాలతోనూ రణంలో గరుడ సమేతుడైన ఆ దేవుణ్ణి యత్నపూర్వకంగా కొట్టారు.

తేషామమృష్య తత్కర్మ విష్ణుర్దానవసూదనః ।
ఏకైకం దానవం జఘ్నే షడ్భిః షడ్భిరజిహ్మగైః ॥226॥

వారు చేసిన ఆ పనిని సహింపక దానవహంతయైన విష్ణుడు ఒక్కొక్క దనుజుణ్ణీ ఆరేసి సూటి శరాలతో ప్రహరించాడు.

ఆకర్ణకృష్టైర్భూయశ్చ కాలనేమిస్త్రిభిః శరైః ।
విష్ణుం వివ్యాధ హృదయే క్రోధాద్రక్తవిలోచనః ॥227॥

మరల కూడా కాలనేమి చెవి వరకూ లాగిన మూడు శరాలతో క్రోధరక్త నేత్రుడై విష్ణువును వక్షః స్థలంపైకొట్టాడు.

తస్యాశోభన్త తే బాణా హృదయే తప్తకాంచనాః ।
మయూఖానీవ దీప్తాని కౌస్తుభస్య స్ఫుటత్విషః ॥228॥

తప్తస్వర్ణంవంటి ఆ బాణాలు ఆ దేవుని హృదయంలోస్పష్టకాంతిగల కౌస్తుభంయొక్క కిరణాలవలెభాసించాయి.

తైర్బాణైః కించిదాయస్తో హరిర్జగ్రాహ ముద్గరమ్ ।
సతతం భ్రామ్య వేగేన దానవాయ వ్యసర్జయత్ ॥229॥

ఆ బాణాల దెబ్బకు కొంచెం ఆయాసానికి గురి అయిన శ్రీహరి ముద్గరం చేపట్టి వేగంగా గిరగిర త్రిప్పుతూ ఆ దానవుని పైకి విసిరాడు.

దానవేంద్రస్తమప్రాప్తం వియత్యేవ శితైః శరైః ।
చిచ్ఛేద తిలశః క్రుద్ధో దర్శయన్పాణిలాఘవమ్ ॥230॥

దానవనాథుడు అది తనవద్దకు రాకముందే ఆకాశంలో ఉండగానే వాడి బాణాలతో క్రుద్ధుడై హస్తలాఘవం చూపుతూ తునకలు, తునకలుగా ఛేదించాడు.

తతో విష్ణుః ప్రకుపితః ప్రాసం జగ్రాహ భైరవమ్ ।
తేన దైత్యస్య హృదయం తాడయామాస గాఢతః ॥231॥

ఆపై విష్ణువు కోపించి భైరవమగు ప్రాసం పరిగ్రహించాడు. దానితో దైత్యుని హృదయంపై గాఢంగాకొట్టాడు.

క్షణేన లబ్ధసంజ్ఞస్తు కాలనేమిర్మహాసురః ।
శక్తిం జగ్రాహ తీక్ష్ణాగ్రాం హేమఘణ్టా ప్రహాసినీమ్ ॥232॥

క్షణంలో తేరుకొన్న ఆ మహాసురుడైన కాలనేమి హేమఘంటలతో అట్టహాసం చేస్తున్న తీక్ష్ణాగ్రమైనశక్తిని గైకొన్నాడు.

తయా వామభుజం విష్ణోర్బిభేద దితినన్దనః ।
భిన్నః శక్త్యా భుజస్తస్య స్రుతశోణిత ఆబభౌ ॥233॥

పద్మరాగమయేనేవ కేయూరేణ విభూషితః ।
తతో విష్ణుః ప్రకుపితో జగ్రాహ విపులం ధనుః ॥234॥

దానితో దితి పుత్రుడు విష్ణువు యొక్క వామభుజాన్ని భేదించాడు. శక్తిచే భిన్నమైన విష్ణుని భుజం రక్తమోడుతూ పద్మరాగమయమైన కేయూరంతో అలంకరింపబడినట్లు కనిపించింది. అంతట విష్ణుదేవుడు ప్రకుపితుడై విపులమైన ధనువు నందుకొన్నాడు.

సప్త దశ చ నారాచాంస్తీక్ష్ణాన్మర్మవిభేదినః ।
దైత్యస్య హృదయం షడ్భిర్వివ్యాధ చ త్రిభిః శరైః ॥235॥

చతుర్భిః సారథించాస్య ధ్వజం చైకేన పత్రిణా ।
ద్వాభ్యాం జ్యాధనుషీ చాపి భుజం సవ్యం చ పత్రిణా ॥236॥

తీక్ష్ణములై మర్మవిభేదకాలైన పదునేడు బాణాలు సంధించి అందులో దైత్యుని హృదయాన్ని తొమ్మిదింటి (6+3=9)తోనూ, సారథిని నాల్గింటితోనూ, ధ్వజాన్ని ఒక్క శరంతోనూ, జ్యాధనువులను రెండింటితోనూ ఎడమభుజాన్ని ఒక్క శరంతోనూ కొట్టాడు.

స విద్ధో హృదయే గాఢం దైత్యో హరిశిలీముఖైః ।
స్రుతరక్తారుణప్రాంశుః పీడాకులితమానసః ॥237॥

చకమ్పే మారుతేనేవ నోదితః కింశుకద్రుమః ।
తమాకంపితమాలక్ష్య గదాం జగ్రాహ కేశవః ॥238॥

శ్రీహరి బాణాలచే గాఢంగా హృదయంపై కొట్టబడి కారే రక్తంతో అరుణకాంతి గలవాడై, పీడచే వ్యాకులమైన చిత్తం కలవాడై, గాలికి కదిలే మోదుగు చెట్టులాగా వాడు కంపించాడు. అలా కంపిస్తున్నవాణ్ణి గమనించి కేశవుడు గదను గైకొన్నాడు.

తాం చ వేగేన చిక్షేప కాలనేమిరథం ప్రతి ।
సా పపాత శిరస్యుగ్రా విపులా కాలనేమినః ॥239॥

దాన్నివేగంగాకాలనేమి రథంపైకివిసిరాడు. ఉగ్రమూ,విపులమూ అయిన ఆ గద ఆ కాలనేమితలమీదబడింది.

సంచూర్ణితోత్తమాంగస్తు నిష్పిష్టముకుటోఽసురః ।
స్రుతరక్తౌఘరంధ్రస్తు స్రుతధాతురివాచలః ॥240॥

ప్రాపతత్స్వే రథే భగ్నే విసంజ్ఞః శిష్టజీవితః ।
పతితస్య రథోపస్థే దానవస్యాచ్యుతోఽరిహా ॥241॥

స్మితపూర్ణమువాచేదం వాక్యం చక్రాయుధః ప్రభుః ।
గచ్ఛాసుర విముక్తోఽసి సాంప్రతం జీవ నిర్భయః ॥242॥

తతః స్వల్పేన కాలేన అహమేవ తవాన్తకః ।

పొడి పొడి అయిన శిరస్సు, కిరీటం కల అసురుడు కారే రక్తప్రవాహధారలు గలవాడై ధాతువులు స్రవించే కొండలాగా భగ్నమైన తన రథంపైననే సంజ్ఞ గోల్పోయి ప్రాణావశిష్టుడై పడ్డాడు. అలా రథోపస్థంలో పడిన దానవుణ్ణి చూచి శత్రుహంత, చక్రాయుధుడూ, ప్రభువూ అయిన అచ్యుతుడు చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు. “అసురా! వెళ్ళు. నిన్ను వదిలేశాను. ఇప్పుడు నిర్భయుడవై బ్రదుకు. కొంతకాలానికి నేనే నీకు అంతకుడ నవుతాను.” అని చెప్పాడు.

ఏతచ్ఛ్రుత్వా వచస్తస్య సారథిః కాలనేమినః ।
అపవాహ్య రథం దూరమనయత్కాలనేమినమ్ ॥243॥

ఈ మాట విని కాలనేమియొక్క సారథి అతని రథాన్ని తొలగదోలి ఆ కాలనేమిని దూరంగా తీసుకుపోయాడు.

ఇతి శ్రీమాత్స్యే మహాపురాణే దేవదానవయుద్ధం నామ పంచాశదధికశతతమోఽధ్యాయః ॥ 150 ॥

శ్రీమత్స్యమహాపురాణంలోని దేవదానవయుద్ధమనే నూటయాభైయవ అధ్యాయం సమాప్తం సంపూర్ణం